ఈనాడు
అల్లూరి సీతారామరాజు
సోమవారం 10 నవంబరు 2025

జల విమాన సేవలపై అధ్యయనం

సీలేరు, న్యూస్‌టుడే: అమరావతి నుంచి సీలేరు వచ్చిన ప్రత్యేక బృందం జల విమాన (సీ ప్లేన్) సేవల సాధ్యాసాధ్యాలపై ఆదివారం అధ్యయనం చేసింది. ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆపరేషన్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీలోని ఫీడ్ బ్యాక్ హైవేస్‌కు చెందిన అసోసియేట్ తన్వీ నేతృత్వంలో బృంద సభ్యులు సీలేరులోని పలు ప్రాంతాలను పరిశీలించారు. మారెమ్మ ఆలయం వద్ద స్నానాల ఘాట్, జలాశయం ప్రాంతాలను సందర్శించారు. స్నానాల ఘాట్ నుంచి జలాశయం ఎంబేక్‌మెంట్ వరకు పడవలో నాలుగు గంటలపాటు ప్రయాణించారు. నది ఎంత లోతుందని ఆరా తీశారు. జల విమాన సేవలకు అవసరమైన భవనాలు, ఎమ్యూజ్‌మెంట్ పార్క్, దుకాణాల నిర్మాణానికి ప్రతిపాదించిన రెండు ఎకరాల స్థలాన్ని సందర్శించారు. బృంద సారథి తన్వీ మాట్లాడుతూ.. ఏపీఎస్ఏడీసీ ఉడా రీజనల్ కనెక్టివిటీ స్కీమ్‌లో భాగంగా రాష్ట్రంలో ఎనిమిది చోట్ల జలవిమాన సేవలు అందించాలని నిర్ణయించారన్నారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ, గండిపేట, శ్రీశైలం, కాకినాడ, విశాఖ, అరకులోయ, జోలాపుట్, సీలేరు ప్రాంతాలు ఎంపికయ్యాయన్నారు. ఆయా చోట్ల అవసరమైన రన్‌వే, ఎయిర్‌పోర్ట్స్ నిర్మాణానికి సంబంధించిన టెండరు రావడంతో గతంలో సర్వే చేసి డీపీఆర్‌ను ఏపీఎస్ఏడీసీకి అందజేశామన్నారు. వారి సూచన మేరకు మరోసారి సర్వే చేసేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. జీ+1 నిర్మాణాలకు రెండు ఎకరాల స్థలం కేటాయించాలని ఏపీఎస్ఏడీసీ ఇప్పటికే లేఖ రాసిందన్నారు.

మారెమ్మ ఆలయానికి సమీపంలో సర్వే

పాపికొండలు చుట్టొచ్చారు

పాపికొండల విహారయాత్రకు వచ్చే పర్యాటకుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. గండిపోశమ్మ ఆలయం నుంచి ఆదివారం ఐదు బోట్లలో 345 మంది పర్యాటకులు గోదావరిలో విహరిస్తూ పాపికొండలను చుట్టొచ్చారు. తొలుత పోశమ్మగండి చేరుకున్న పర్యాటకులు కొండపై నుంచి గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారికి బోటు సిబ్బంది లైఫ్ జాకెట్లను అందించి అవగాహన కల్పించారు. పోలీసుల తనిఖీలు పూర్తయ్యాక అధికారులు బోట్లకు పచ్చ జెండా ఊపారు. పోచవరం పర్యాటక రేవు నుంచి 11 బోట్లలో 840 మంది పర్యాటకులు వెళ్లారు.
– న్యూస్‌టుడే, దేవీపట్నం, వీఆర్ పురం

మంచు కొండల్లో కోలాహలం

మన్యంలోని పర్యాటక ప్రాంతాలకు సందర్శకులు పోటెత్తారు. చింతపల్లి మండలం చెరువులవెనం కొండ, పాడేరు మండలం వంజంగి సమీపంలోని మేఘాల కొండ కోలాహలంగా మారాయి. మంచు దట్టంగా కురవడంతో పర్యాటకులు ఫిదా అయ్యారు.
- చెరువులవెనం, తాజంగి, లంబసింగి, బోడకొండమ్మ ఆలయం వద్ద వ్యూపాయింట్లు కిటకిటలాడాయి. మేఘాలకొండను 1200 మంది సందర్శించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ కుటుంబ సభ్యులతో మంచు అందాలను వీక్షించారు. ఎకో టూరిజం ద్వారా అటవీ శాఖకు రూ.65,080 ఆదాయం వచ్చిందని వన సంరక్షణ సమితి సభ్యులు తెలిపారు. కొండకు వచ్చే మార్గం వాహనాలతో నిండిపోయింది.
– న్యూస్‌టుడే, చింతపల్లి, పాడేరు

భానూదయాన..

పచ్చని చెట్టు, ఎత్తయిన కొండలు. ఏటా చూసినా ప్రకృతి అందాలే. చలికాలంలో దట్టంగా కురిసే మంచు తోడైతే మాటల్లో వర్ణించలేం. బిల్లాపుట్టు వ్యూపాయింట్ ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఇక్కడి నుంచి సూర్యోదయాన్ని వీక్షించేందుకు వచ్చే పర్యాటకుల సంఖ్య ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. అరకులోయ నుంచి చాపరాయి జలపాతం మీదుగా 18 కి.మీ. దూరం వెళ్తే బిల్లాపుట్టు చేరుకోవచ్చు. మంచు తెరల నడుమ కొండల మీదుగా భానూదయం కనువిందు చేసింది. – న్యూస్‌టుడే, డుంబ్రిగుడ

నేటి నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో సోమవారం నుంచి అర్ధ సంవత్సర (సమ్మెటివ్-1) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, 6, 7 తరగతుల వారికి మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ నెల 19 వరకు జరిగే పరీక్షల ప్రశ్నపత్రాలను విద్యాశాఖ సంబంధిత ఎమ్మార్సీలకు చేర్చింది. వాటిని ప్రధానోపాధ్యాయులు ఎమ్మార్సీ స్కూల్ కాంప్లెక్సుల నుంచి గంట ముందు పాఠశాలలకు తీసుకెళ్తారు. వచ్చే నెల 5న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 25 నాటికి మూల్యాంకనం పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

జిల్లాలోని పాఠశాలలు
ప్రభుత్వ: 2904
విద్యార్థులు: 1.69 లక్షలు

ప్రమాణాల పెంపుతో అదనపు సీట్లు

లక్ష్యం దిశగా వైద్య కళాశాల అడుగులు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

మన్యం మణిహారంగా నిలిచే పాడేరు వైద్య కళాశాల ఏర్పాటైనప్పుడు లక్ష్య సాధనలో ప్రతికూలంగా ముందుకు సాగుతూ స్థాయిని పెంచుకునేలా అడుగులు వేస్తోంది. జిల్లా కేంద్రంలో రూ.500 కోట్లతో వైద్య కళాశాల ఏర్పాటైన విషయం తెలిసిందే. వైకాపా ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన భవన నిర్మాణాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి పూర్తి చేసి కొత్తరూపు తీసుకొచ్చింది.

కళాశాలకు వంద సీట్లు మంజూరు కాగా, అన్నిట్లో ప్రమాణాలు, సామర్థ్యం లేదని కేంద్ర పరిశీలన బృందం నిర్ధారించి మొదటి దశలో 50 సీట్లకే సిఫార్సు చేసింది. 2024-25 విద్యా సంవత్సరంలో ఆలిండియా మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) 50 సీట్లకు అనుమతిచ్చింది. అదనంగా మరో 50 సీట్లు మంజూరయ్యేలా ప్రమాణాలపరంగా కళాశాల విద్యా ఒక్కో మెట్టు ఎక్కుతూ లక్ష్యానికి చేరవవుతోంది.

- వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యే సమయానికి వాస్తవంగా 40 శాతమే నిర్మాణాలు పూర్తయ్యాయి. గత ఏడాది కేంద్ర బృందం కళాశాలను సందర్శించి యాజమాన్యానికి పలు సూచనలు చేసింది. ఈ మేరకు పలు అభివృద్ధి చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏపీ టీకాప్లను పర్యవేక్షిస్తూ 60 శాతం మౌలిక సదుపాయాలు కల్పించింది. కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన 50 మంది విద్యార్థులకు అవసరమైన వసతిగృహాలు నిర్మించారు. ప్రయోగశాలలు ఏర్పాటయ్యాయి. వారంతా ప్రయోగాలు చేసేందుకు అవసరమైన సామగ్రిని విశాఖలోని ఆంధ్ర వైద్య కళాశాల నుంచి తెప్పించి స్థానికంగానే చేయిస్తున్నారు.

ఓపీ పెరిగేలా చర్యలు..
వైద్య కళాశాలకు వచ్చే రోగుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం రోజుకు 600 నుంచి 700 వరకు ఓపీ నమోదవుతోంది. అదనంగా 50 సీట్లకు అనుమతి రావాలంటే ఓపీ 800పైగా నమోదు కావాలని కేంద్ర వైద్య కళాశాలల పరిశీలన బృందం సూచించింది. ఈ మేరకు వైద్య కళాశాల యాజమాన్యం, వైద్య, ఆరోగ్యశాఖ సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. – డాక్టర్ హేమలత, ప్రిన్సిపల్

వారం రోజుల్లో నమోదైన ఓపీ							
తేదీ	30-10-25	01-11-25	02-11-25	03-11-25	04-11-25	05-11-25	06-11-25
ఓపీ	512	419	106	758	663	665	700

పవర్ కెనాల్‌లో బురద నీరు

అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి పవర్ కెనాల్ నుంచి బురద నీరు లీకైంది. పెట్రోలింగ్ సిబ్బంది సకాలంలో స్పందించడం, అధికారులు అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఇక్కడి జలవిద్యుత్కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం పొల్లూరు జల విద్యుత్కేంద్రానికి 16 కి.మీ. పొడవైన కెనాల్ ద్వారా నీరందిస్తారు. కెనాల్‌కు సంబంధించి లీకేజీ నీటిని విడుదల చేయడానికి ప్రతి అక్విడక్ట్ వద్ద రంధ్రాలు (వీప్ వాల్వ్స్) ఉంటాయి. మొదటి రీచ్‌లో ఈ రంధ్రాల నుంచి ఆదివారం ఉదయం బురదనీరు లీకవుతుండటంతో పెట్రోలింగ్‌లో ఉన్న సిబ్బంది గమనించి సివిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు అప్రమత్తమై సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజినీరు కె.రాజారావు, పర్యవేక్షక ఇంజినీరు చంద్రశేఖర్‌రెడ్డి చెప్పడంతో వారు ఇంజినీర్లు, సిబ్బందిని డొంకరాయి పంపించారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకుని విద్యుదుత్పత్తిని నిలిపివేసి కెనాల్‌లోని నీటిని పొల్లూరు జలవిద్యుత్కేంద్రానికి పంపారు. బురద నీరు లీకవుతున్న ప్రాంతాన్ని ఆదివారం మధ్యాహ్నం గుర్తించి కాంక్రీట్ పనులు ప్రారంభించారు. సీఈ రాజారావు మాట్లాడుతూ.. ఎస్‌ఈ తీసుకెళ్లి లీకవుతున్న ప్రాంతాన్ని సరిచేస్తున్నామన్నారు. కెనాల్ ఖాళీ అవడంతో కాంక్రీట్ దెబ్బతిన్న చోట మరమ్మతు పనులు చేపట్టనున్నారు. సోమవారం ఉదయం కెనాల్‌కు నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు.

నెర్రెలిచ్చి లీకవుతున్న చోట సిమెంటు పని చేస్తున్న సిబ్బంది

పేద విద్యార్థులకు 'విద్యాలక్ష్మి'

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: పిల్లలు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. ఆర్థికంగా స్థోమత లేకపోవడంతో కలలు కలగానే మిగిలిపోతున్నాయి. మెరికల్లాంటి విద్యార్థులూ మరుగునపడుతున్నారు. ఇలాంటి వారంతా ఉన్నత విద్యను అభ్యసించేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని 'పీఎం విద్యాలక్ష్మి' పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎలాంటి పూచీకత్తు, హామీదారులు లేకుండా బ్యాంకు రుణ సదుపాయం కల్పించడమే ఈ పథకం ఉద్దేశం. విద్యార్థులు ఒకే పోర్టల్ ద్వారా బహుళ బ్యాంకుల సేవలు పొందడానికి, దరఖాస్తు చేసేందుకు వీలు కల్పిస్తోంది. 2024-25 నుంచి 2030-31 వరకు పథకం అమలుకు కేంద్ర నిధులు కేటాయించింది. విదేశాల్లో ఉన్నత చదువులు చదివే వారు సైతం అర్హులుగా ప్రకటించింది.

దరఖాస్తు ఇలా..
విద్యాలక్ష్మి www.vidyalakshmai.co.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి విద్యార్థి పేరు, సెల్‌ఫోన్ నంబరు, ఈ మెయిల్ ఐడీ, చిరునామా తదితర వివరాలు నమోదు చేయాలి. పది, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, చివరిసారి చదివిన కోర్సుకు సంబంధించిన పత్రాలు, ప్రస్తుతం చదవాలనుకుంటున్న కోర్సులకు చెందిన ప్రవేశ పత్రం, ఆదాయ ధ్రువపత్రాలు జత చేయాలి.

మూడు విడతల్లో రుణం..: రుణం మంజూరు కాకపోతే కారణాలు చెబుతూ 15 రోజుల్లో ఈ-మెయిల్‌కు సందేశం వస్తుంది. అర్హులుగా ప్రకటిస్తే మూడు విడతల్లో రుణం మంజూరు చేస్తారు. మొదటి విడతలో రూ.4 లక్షలు, రెండో విడతలో రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు, మూడో విడతగా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు అందిస్తారు. దరఖాస్తుదారు వార్షిక ఆదాయం, తీసుకున్న రుణం ఆధారంగా 3 శాతం వడ్డీ రాయితీ ఇస్తారు.

అర్హులు ఎవరంటే..: ఇంజినీరింగ్, వైద్యవృత్తి విద్యా కోర్సులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, కుటుంబ వార్షికాదాయం రూ.4 లక్షల్లోపు ఉండాలి.

- ఒకసారి మాత్రమే దరఖాస్తుకు వెసులుబాటు ఉంది. ఉన్నత విద్య అభ్యసించే పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దరఖాస్తు చేసేందుకు తుది గడువంటూ లేదు.

మే.. మే.. బొప్పాయి

మటన్ షాపులో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మేక తల అనుకుంటే పొరపాటే. అనకాపల్లికి చెందిన జయవరపు శ్రీనివాసరావు ఇంటి పెరట్లో బొప్పాయి చెట్టుకు కాసిన కాయ మేక తలను పోలి ఉంది. జన్యుపరమైన కారణాలతో బొప్పాయి కాయలు పలు ఆకారాల్లో ఉంటాయని ఉద్యాన శాఖ అధికారి శరగడం పైడిరాజు చెప్పారు.
– న్యూస్‌టుడే, అనకాపల్లి

చిన్నా.. కన్ను జాగ్రత్త

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

పాఠశాల స్థాయిలోనే చిన్నారుల కంటిచూపు మసకబారుతోంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, విటమిన్ల లోపం, సెల్‌ఫోన్ తెరకు అతుక్కుపోవడం తదితర కారణాలతో బాల్యంలోనే కంటి సంబంధ సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. దృష్టి లోపాన్ని ముందే గుర్తించి చికిత్స అందించాలన్న ఉద్దేశంతో రెండేళ్ల నుంచి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని పాఠశాల స్థాయిలో ఆరు నుంచి 16 ఏళ్ల లోపు చిన్నారులకు నేత్ర పరీక్షలు చేస్తున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

- ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 36 వేల మందికిపైగా విద్యార్థులకు ఈ ఏడాది ఆగస్టు నుంచి కంటి పరీక్షలు చేశారు. దృష్టిలోప సమస్యలపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీరిలో 3,200 మందికి అద్దాలు అవసరం అవుతాయని నిర్ధారించారు.

- చిన్నారుల ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించకపోవడంతో నేత్ర సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. పోషకాహార లోపంతో ఈ సమస్య మరింత పెరుగుతోంది. బోర్డును చూసి చదివే సమయంలో వారి దృష్టి లోపాన్ని ఉపాధ్యాయులు ముందుగా గుర్తించొచ్చు. తద్వారా చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. పెద్ద తెరలపై ఎక్కువగా చూడటం వల్ల కంటి సమస్యలు పెరుగుతున్నాయి. దీనికి తగ్గట్లు జాగ్రత్తలు తీసుకుంటే చిన్నారుల్లో కంటి సంబంధ సమస్యలను తగ్గించవచ్చు.

3200 మంది గుర్తింపు

కంటి సమస్యతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించాం. 3,200 మందికి ఉచితంగా కళ్లద్దాలు ఇస్తాం. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలున్నాయి. పిల్లలకు పోషక విలువలు, విటమిన్లు ఉన్న ఆహారం అందించాలి. – డాక్టర్ డేవిడ్ వసంత్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్, అంధత్వ నివారణ సంస్థ

క్షేత్రస్థాయి పర్యటనకు శిక్షణ ఐఏఎస్‌లు

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో పరిపాలనపై అధ్యయనం చేసేందుకు వచ్చిన శిక్షణ అధికారులకు సమగ్ర సమాచారం అందించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన శిక్షణ ఐఏఎస్‌లు ఆదివారం పాడేరు చేరుకున్నారు. ముందుగా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామీణ పరిపాలన, ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలిస్తారని కలెక్టర్ చెప్పారు. క్షేత్రస్థాయి పరిశీలనతో ప్రభుత్వ పథకాల అమలుపై లోతైన అవగాహన ఏర్పడుతుందన్నారు. చామగెడ్డ, దల్లిపాడు గ్రామాలను సందర్శించి ఈ నెల 16 వరకు అధ్యయనం చేస్తారని ఇన్‌ఛార్జి ఆర్డీవో లోకేశ్వరరావు పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

రంపచోడవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అవగాహన కల్పించారు. పలు రాష్ట్రాలకు చెందిన 12 మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు నాలుగు రోజుల శిక్షణ నిమిత్తం రంపచోడవరం వచ్చారు. ఐటీడీఏలో ఆదివారం రాత్రి సెక్టోరల్ అధికారులు వారితో సమావేశమై పలు శాఖల ప్రగతిని వివరించారు. క్షేత్రస్థాయిలోనూ అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఆర్డీవో అంబేద్కర్, ఏపీవో రమణ, గిరిజన సంక్షేమశాఖ డీడీ రుక్మాంగదయ్య, ఈఈ శ్రీనివాసరావు, పీహెచ్‌వో దేవదానం, ఏడీఎంహెచ్‌వో సరిత పాల్గొన్నారు.

కలెక్టర్ దినేష్‌కుమార్‌తో సమావేశంలో బృంద సభ్యులు

DDR GROUP OF INSTITUTIONS
INSTITUTION DEGREE & DIPLOMA & VOCATIONAL COURSES OFFERED
BSC MLT ✦ BPT ✦ DIPLOMA ANESTHESIA ✦ DIPLOMA MLT ✦ DIPLOMA CATH LAB ✦ DIPLOMA DIALYSIS ✦ MPHW (VOC) ✦ MLT (VOC)
SCHOLARSHIP For SC, ST, BC, EBC, AND MINORITY STUDENTS
Practical Attached to Government Medical College
Experienced & Dedicated Faculty
AC Class Room & Digital Classes for Professional Courses
Clinical and Practical at Own and Government Hospitals.
Affiliated to Dr.NTR UHS, AP NMC, APSAHPC & INC.
LIMITED SEATS AVAILABLE
Government Recognised Courses
Estd: 1988
ADMISSIONS OPEN 2025-2026
100% Placements
DDR IS THE BEST IN HEALTH & ALLIED EDUCATION
We have limited management seats Government Fees & No Hidden Feeses
Practicals Attached to Government Medical College ✦ Bus Facility Available ✦ We have own Hospital ✦ Exclusive 2 Acres of Campus
DDR HOSPITAL
V.MADUGULA, GHAT ROAD JUNCTION
Cell: 8919624744, 9032671816
E-mail: ddrparamedicalcollege@yahoo.co.in
www.ddrgroupofinstitutions.com

అత్యవసర వైద్యం.. తెలంగాణకు పయనం

చింతూరు, రంపచోడవరం, న్యూస్‌టుడే

భౌగోళికంగా విలీన మండలాలు ఏపీలో ఉన్నా.. ఇక్కడి వారంతా అత్యవసర వైద్య సేవల కోసం తెలంగాణలోని భద్రాచలం ఆసుపత్రికి వెళ్లక తప్పడం లేదు. రాష్ట్ర విభజన అనంతరం నాటి ప్రభుత్వం కూనవరం, చింతూరులో సీహెచ్‌సీలను ఏర్పాటు చేసింది. వైద్య నిపుణులను నియమించకపోవడంతో అత్యవసర వైద్య సేవలు అందని పరిస్థితులు నెలకొన్నాయి.

- ఏపీ విభజనకు ముందు పీహెచ్‌సీగా ఉన్న చింతూరు ఆసుపత్రిని 2018లో సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేశారు. ఆసుపత్రికి స్థాయికి తగ్గట్లుగా వైద్యుల నియామకం లేకపోవడంతో వైద్య సేవలు అందడం లేదు. ఈ ఆసుపత్రికి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే రోగులు ఎక్కువగా ఉంటారు. సరిహద్దులోని గ్రామాలకు ఆసుపత్రులు దూరంగా ఉండటంతో వారంతా సమీపంలోని చింతూరు వస్తుంటారు. రోగ నిర్ధారణకు పరీక్షలు చేయించుకునేందుకు ఇబ్బంది లేకున్నా.. అత్యవసర వైద్య సేవలకు భద్రాచలం ఆసుపత్రికి రిఫర్ చేయాల్సి వస్తోంది.

- విలీన మండలాలకు భద్రాచలం 60 కిలోమీటర్ల దూరం ఉంది. జాతీయ రహదారి కావడంతో గంట సేపట్లో చేరుకోవచ్చు. రంపచోడవరంలో ప్రాంతీయ ఆసుపత్రి ఉన్నా.. ఘాట్ రోడ్డు కావడం, ప్రయాణ సమయం ఎక్కువగా ఉండటంతో రోగులను రిఫర్ చేయడం లేదని వైద్య సిబ్బంది చెబుతున్నారు.

- చింతూరు - భద్రాచలం, రాజమహేంద్రవరం, కుంట మార్గాల్లో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించే పరిస్థితి లేకపోవడంతో భద్రాచలం పంపుతున్నారు. కిడ్నీ, హృద్రోగ సంబంధ బాధితులు, జ్వర పీడితుల ఆరోగ్య పరిస్థితి విషమించేలా ఉంటే వెంటనే భద్రాచలం తరలించాల్సి వస్తోంది.

భద్రాచలం ఆసుపత్రికి విలీన మండలాల రోగులు

ఇక్కడా అదే పరిస్థితి

డివిజన్ కేంద్రంగా ఉన్న రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి ఏడు మండలాల నుంచి రోగులు వస్తుంటారు. వైద్యులు, సిబ్బంది కొరతతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. వంద పడకల ఆసుపత్రిలో 23 మంది వైద్యులకు 17 మందే ఉన్నారు. జనరల్ మెడిసిన్, డెర్మటాలజీ, రేడియాలజీ విభాగాలకు వైద్యుల్లేరు. 24 మంది స్టాఫ్‌నర్సులకు 16 మందే ఉన్నారు. కింది స్థాయి సిబ్బంది పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. రోజు ఆసుపత్రిలో 100 నుంచి 150 వరకు ఓపీ నమోదవుతోంది. వార్డులో వంద మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. రోజుకు ఇద్దరు, ముగ్గురు రోగులను రాజమహేంద్రవరం, కాకినాడ ఆసుపత్రులకు పంపుతున్నారు.

- ప్రాంతీయ ఆసుపత్రికి అంబులెన్సు లేదు. ఐటీడీఏలో అంబులెన్సు ఉన్నప్పటికీ ఒక రోగిని కాకినాడ/ రాజమహేంద్రవరం తీసుకెళ్తే ఆ వాహనం వచ్చే వరకు మరో రోగిని తరలించేందుకు వేచి ఉండాల్సి వస్తోంది. ఈలోగా కొన్నిసార్లు పరిస్థితి చేయిదాటిపోతోంది.

ఈ ఏడాది రిఫర్ చేసిన కేసులు

నెల	రోగులు
జనవరి	75
ఫిబ్రవరి	65
మార్చి	58
ఏప్రిల్	58
మే	73
జూన్	36
జూలై	48
ఆగస్టు	51
సెప్టెంబరు	42
అక్టోబరు	45

ముగిసిన రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలు

పాడేరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాడేరులో మూడు రోజులపాటు జరిగిన అండర్-14, 17, 19 బాలబాలికల రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలు ఆదివారంతో ముగిశాయి. వివాదాలకు తావు లేకుండా క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సూరిబాబు చెప్పారు. విజేతలకు జిల్లా క్రీడా సాధికార అధికారి జగన్మోహనరావు బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే..: ▸ అండర్-14 విభాగంలో నెల్లూరు బాల, బాలికల జట్లు ప్రథమ, చిత్తూరు జట్లు ద్వితీయ, కృష్ణా జిల్లా జట్లు తృతీయ స్థానాల్లో నిలిచాయి. ▸ అండర్-17 విభాగంలో: కృష్ణా, తూర్పు గోదావరి, విశాఖ జిల్లాల బాల బాలికల జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ▸ అండర్-19 విభాగంలో: శ్రీకాకుళం, చిత్తూరు, అనంతపురం బాలబాలికల జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ▸ పాడేరు మోదమాంబ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి సీహెచ్.మోహిత్‌సాయి అండర్-17 విభాగంలో జాతీయ విలువిద్య పోటీలకు ఎంపికయ్యాడు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
EENADU CLASSIFIEDS
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
లీగల్ ప్రకటనలు
జయంతి, వర్ధంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లు వేగవంతం

సదస్సు ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత పనులను సంయుక్త కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో నిర్ణీత సమయం కంటే ముందుగానే పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రధాన వేదిక, స్వాగత ద్వారాలు, అతిథుల రాక, పార్కింగ్ తదితర అంశాలపై ఆయన నిశితంగా పరిశీలించి ఇంకా చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. డీసీపీ మణికంఠ, జీవీఎంసీ అధికారి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి ఏయూ ఇంజినీరింగ్ కళాశాలకు సెలవులు

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు జరగనున్నందున ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల తరగతులు రద్దు చేస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఏయూలోని విద్యార్థులు, పరిశోధకులు, బోధన, బోధనేతర ఉద్యోగులు విధిగా ఏయూ ఇచ్చిన గుర్తింపు కార్డులు ధరించాలని ఆయన మరో ప్రకటనలో పేర్కొన్నారు.

మెండుగా అవకాశాలు.. నైపుణ్యాలే అస్త్రాలు..!

పెట్టుబడులకు గమ్యస్థానంగా విశాఖ | **యువతను సన్నద్ధం చేస్తున్న ప్రభుత్వం**

ఈనాడు, విశాఖపట్నం

జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే అనేక ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో లక్షలాది మంది ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రైవేటులోనూ వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. భవిష్యత్తులో అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. వీటిని యువత అందిపుచ్చుకునేలా ప్రభుత్వం సన్నద్ధం చేస్తోంది. ఆయా రంగాల్లో ఉద్యోగాలకు తగ్గట్టుగా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా పలు కోర్సులు అందిస్తోంది.

పర్యాటకం, ఆతిథ్య రంగం..: గమ్య నగరంగా పేరుగాంచిన విశాఖ పర్యటకులను ఆకర్షిస్తోంది. ప్రముఖ సంస్థలు నిర్మించనున్న స్టార్ హోటళ్లు, రీఫ్రెష్‌మెంట్, కన్వెన్షన్ సెంటర్లు, రిసార్టుల్లో అవకాశాలున్నాయి. పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయి. అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ ఏర్పాటుతో క్రూయిజ్ నౌకలు నగరానికి వస్తున్నాయి.

గ్రీన్ హైడ్రోజన్ ఆధారంగా..: పూడిమడక వద్ద ఎన్టీపీసీ, జెన్‌కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ పార్కును ఏర్పాటు చేయనున్నాయి. రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకు గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వాటికి అనుబంధంగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

ఐటీ, డేటా సెంటర్లు..: ఐటీ రంగంలో ప్రస్తుతం 10కి పైగా సంస్థలున్నాయి. వాటిలో 15 వేల మందికి పైగా పనిచేస్తున్నారు. ఐటీ హిల్స్‌పై వివిధ సంస్థలు ఏర్పాటు కానున్నాయి.

● టీసీఎస్, కాగ్నిజెంట్, సత్త్వ తదితర సంస్థల్లో 50 వేలకు పైగా ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి.



ఫార్మా, మెడ్‌టెక్..: ఉమ్మడి జిల్లాలో పరవాడ, అచ్యుతాపురంలోని ఫార్మా సిటీల్లో 150కు పైగా సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఆయా సంస్థల్లో ఖాళీలున్నాయి. బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన అభ్యర్థులకు దొరకడం కష్టంగా మారింది. మెడ్‌టెక్ జోన్‌లో 150కు పైగా సంస్థలు వివిధ రకాల ఉత్పత్తులు తయారుచేస్తున్నాయి. భవిష్యత్తులో ఆయా చోట్ల ఉపాధి అవకాశాలు ఉన్నాయి.

ఆటోమొబైల్, సేవా రంగం..: వేగంగా విస్తరిస్తున్న నగరంలో ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ టెక్నీషియన్లు, తదితరుల కొరత ఎక్కువగా ఉంది. స్థానికంగా ఆటోమొబైల్ ఉత్పత్తి లేకపోయినా.. ద్విచక్ర వాహనాలు, కార్ల సర్వీసు టెక్నీషియన్లకు మంచి డిమాండ్ ఉంది. వీటిని అందిపుచ్చుకోవచ్చు.

★ ఏపీఎస్‌ఎస్‌డీసీ నిర్వహిస్తున్న కోర్సులకు సంబంధించి మరిన్ని వివరాలు కావాలంటే **naipunyam.ap.gov.in** వెబ్‌సైట్‌ను సంప్రదించొచ్చు. ఇందులో పేరు నమోదు చేసుకుంటే కొత్త కోర్సులు, జాబ్ మేళాల సమాచారం తెలుసుకోవచ్చు.

వివిధ కోర్సులకు ప్రతిపాదనలు: విశాఖలో భవిష్యత్తు ఉపాధి అవకాశాలకు తగ్గట్టుగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) ద్వారా యువతకు నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రతిపాదన మేరకు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ కోర్సులు కేటాయించింది. సీఎం కేర్‌లో భాగంగా ఐటీ, ఫార్మా, సర్వీస్ టెక్నీషియన్ కోర్సులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించాం. – చాముండేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

బిగి అల్లిక.. వాలుజడ పోలిక..!

పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యానవనంలోని స్నేక్‌ప్లాంట్స్ ఇవి. మునగకాడల ఆకారంలో ఉంటాయి. వీటిని కుండీల్లో పెంచుతారు. మూడు మొక్కలను కలిపి ఇలా జడలా అల్లుతారు. అవి పడిపోని రోజుల్లో కలిసిపోయి ఆకర్షణీయంగా మారడంతోపాటు ఏపుగా పెరుగుతాయి. వీటిని ఎవరి మొక్కలు అని కూడా పిలుస్తారు. ఇవి కాండాల్లో నీటిని నిల్వ ఉంచుకుని బతుకుతాయి. రాత్రి వేళల్లో ప్రాణవాయువు వదులుతాయని ఉద్యానవనం వ్యవస్థాపకుల డాక్టర్ రామమూర్తి తెలిపారు. – ఈనాడు, విశాఖపట్నం

రామచిలుకల 'రాణి' వాసం..!

నగరంలో రణగొణధ్వనుల మధ్యలో ఉన్న ఓ ఇంటికి నిత్యం రామచిలుకలు గుంపులుగా రావడం ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. గోపాలపట్నం నాయుడు క్వార్టర్స్‌లో జెహరా ఉపాధ్యాయని ఇంటి అవసరాల కోసం బియ్యం నానబెట్టి డాబాపై ఆరబెట్టేవారు. వాటిని తినడానికి తరచూ రామచిలుకలు వచ్చేవి. దీన్ని గమనించిన ఆమె రోజూ పెట్టడం మొదలుపెట్టారు. దీంతో తినడానికి వచ్చే రామచిలుకల సంఖ్య కూడా పెరిగింది. ఇప్పుడు రోజూ 100 వరకు చిలుకలు వస్తున్నాయి. వాటిని చూసి కొన్ని పావురాలు కూడా రావడం ప్రారంభించాయి. క్రమంగా ఉపాధ్యాయని వాటితో విడదీయరాని బంధం ఏర్పడింది. ప్రస్తుతం రోజుకు రెండున్నర కిలోల బియ్యం నానబెట్టి డాబాపై పెడుతున్నారు. ఆహారం తినడానికి వచ్చే రామచిలుకలు, పావురాల కిలకిలారావాలతో ఆ ఇల్లు నిత్యం సందడిగా ఉంటోంది. – గోపాలపట్నం, న్యూస్‌టుడే

బతుకును దిద్దే భగవద్గీత

అవధూత దత్త పీఠం, వరసిద్ధి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో ఆదివారం సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వేలాది మంది భక్తులు ఇందులో పాల్గొని భగవద్గీతలోని శ్లోకాలను పఠించారు. మైసూరు దత్త పీఠం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. – న్యూస్‌టుడే, అక్కయ్యపాలెం

12 నుంచి పుట్టపర్తికి ప్రత్యేక సర్వీసులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయిబాబా జయంత్యుత్సవాల సందర్భంగా అనంతపురం జిల్లా పుట్టపర్తికి ఈనెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆర్.ఎం. బి.అప్పలనాయుడు తెలిపారు. ద్వారకా బస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఆయన పంచారామాలకు సూపర్‌లగ్జరీ, ఇంద్ర ఏసీ సర్వీసులను పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శబరిమల యాత్రకు సైతం ఆర్టీసీ సర్వీసులు నడపడానికి సిద్ధంగా ఉన్నామని, ఆన్‌లైన్‌లో అయ్యప్ప భక్తులు టికెట్లు తీసుకోవచ్చని, బృందంగా ముందుకొచ్చి ఆర్టీసీ అధికారులను సంప్రదిస్తే ప్రత్యేకంగా బస్సు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు.

పంచారామాలకు సిద్ధం చేసిన బస్సుల వద్ద ప్రయాణికులు

అప్పన్న కొండపై కొనసాగిన రద్దీ

సింహాచలం, న్యూస్‌టుడే: కార్తికమాసం, వారాంతం నేపథ్యంలో సింహగిరి అప్పన్న స్వామి కొండపై భక్తుల రద్దీ ఆదివారం కూడా కొనసాగింది. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు సింహగిరికి తరలివచ్చారు. క్యూకాంప్లెక్స్, మాడవీధుల్లోని క్యూలైన్లు కిక్కిరిశాయి. కేశఖండనశాల, ప్రసాదాల విక్రయశాల, బస్టాండ్లు భక్తులతో రద్దీగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 30 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానానికి వివిధ రూపాల్లో రూ.31.71 లక్షల ఆదాయం సమకూరగా టికెట్ల విక్రయం ద్వారా 20.18 లక్షలు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.8.86 లక్షలు ఆదాయం వచ్చింది. సుమారు 2,200 మంది భక్తులు తలనీలాల మొక్కుబడి చెల్లించుకున్నారు. ఏఈవోలు తిరుమలేశ్వరరావు, రమణమూర్తి ఆధ్వర్యంలో దర్శనాలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

సిమ్‌కార్డు కొంటున్నారా.. జర జాగ్రత్త

పీఎంపాలెం, న్యూస్‌టుడే: సైబర్ నేరాల్లో సిమ్‌కార్డు మోసాలు రోజురోజుకీ పెచ్చుమీరుతున్నాయి. ఒక సిమ్ తీసుకునేందుకు సెల్ దుకాణానికి వెళ్లగా మనకు తెలియకుండానే మన పేరు మీద రెండో సిమ్ పుట్టుకొస్తోంది. సైబర్ నేరస్థులతో చేతులు కలిపిన కొందరు వ్యాపారులు మన ఆధార్, వేలిముద్రలు తీసుకుని రెండో సిమ్‌ను యాక్టివేట్ చేసి సైబర్ ముఠాకు చేరవేస్తున్నారు. ఈ తరహా మోసాలకు పాల్పడుతూ ఇటీవల ఇద్దరు వ్యక్తులు పోలీసులకు చిక్కడంతో ఇది వెలుగు చూసింది.

9 సిమ్‌లు వరకూ తీసుకోవచ్చు..: సిమ్ కార్డులు తీసుకునేందుకు ఆధార్ లింక్‌ను కేంద్ర టెలికాం రంగ సంస్థ తప్పనిసరి చేసింది. ఒక వ్యక్తి తన ఆధార్‌తో 9 సిమ్ కార్డులు తీసుకునే వెసులుబాటు కల్పించింది.

మోసగించేది ఇలా..: కొత్త సిమ్‌కార్డు తీసుకునేందుకు సెల్ దుకాణం వద్దకు వెళ్తే వినియోగదారుల నుంచి ఆధార్ వివరాలు, వేలిముద్రలు, ఐరిస్ స్కానింగ్ చేయడం తెలిసిందే. ఇదే సమయంలో కొందరు మోసగాళ్లు మనకు తెలిసి ఒకటి.. తెలియకుండా మరొక సిమ్‌కార్డు తీసుకుంటున్నారు. వేలిముద్రలు, ఐరిస్ సేకరించే సమయంలో స్కానింగ్ ప్రక్రియను ఒకటికి రెండుసార్లు చేస్తారు. దీంతో రెండు కంపెనీలకు చెందిన సిమ్ కార్డులు మన పేరు మీద నమోదవుతాయి. మనం అడిగిన సిమ్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోతాం. రెండోది మనకు తెలియకుండా వారి వద్ద ఉంచుకుంటున్నారు.

మన పేరు మీద ఎన్ని ఉన్నాయో తెలుసుకోవచ్చు..: ఆధార్, ఐడీలతో మన పేరు మీద ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో సులువుగా తెలుసుకునేందుకు ప్రభుత్వం 'సంచార్ సాథీ' మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆండ్రాయిడ్, ఐఓస్, వెబ్ తదితర సాంకేతిక విధానాల ద్వారా యాప్‌ను వినియోగించుకోవచ్చు. ముందుగా **www.sancharsaathi.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించి దానిపై క్లిక్ చేయాలి. ఆపై సిటిజన్ సెంట్రిక్ సేవలకు సంబంధించిన పలు ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో 'నో మొబైల్ కనెక్షన్స్ ఇన్ యువర్ నేమ్'పై క్లిక్ చేయాలి. అక్కడ సూచించిన చోట పది అంకెల చరవాణి నెంబర్, కింద క్యాప్చా నమోదు చేసి క్లిక్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఆపై మన పేరుతో నమోదైన సిమ్‌కార్డు నెంబర్లు కనిపిస్తాయి. పక్కన 'నాట్ మై నంబర్, నాట్ రిక్వైర్డ్' అంటూ రెండు ఎంపికలు ఉంటాయి. అవసరం లేని నెంబరుపై క్లిక్ చేస్తే ఫిర్యాదు ఆధారంగా సంబంధిత నెంబరును మన పేరుమీద లేకుండా తొలగిస్తారు.

సైబర్ నేరస్థులకు అందిస్తూ..: మనకు తెలియకుండా తీసుకున్న రెండో సిమ్‌కార్డును సైబర్ నేర ముఠా చేతుల్లోకి వెళ్తోంది. సంబంధిత సిమ్‌లు లింక్ చేసి యూట్యూబ్, జీమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం తదితరాలకు 'యూజర్' ఐడీలు తయారు చేసి అనధికార బెట్టింగ్ యాప్‌లు ప్రచారం చేస్తున్నారు. పలువురిని మోసగించి తీసుకున్న సిమ్‌ల ద్వారా సామాజిక మాధ్యమ ఖాతాలు తెరచి థాయిలాండ్, కంబోడియా దేశాల్లో ఉన్న సైబర్ నేరస్థులకు అందిస్తున్నారు. తద్వారా వారికి సహకారం అందించి అధిక మొత్తంలో నగదు ఆర్జిస్తున్నారు.

నూకాలమ్మకు రైల్వే జీఎం పూజలు

అనకాపల్లి: నూకాలమ్మను ఆదివారం సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సందీప్ ఠాగూర్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ ఆంకుష్ గుప్తా దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ పీలా నాగశ్రీను అమ్మవారి చిత్రపటం అందజేశారు.

ఈత పోటీల్లో బాలికల విజేత విశాఖ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఈత పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి సుమారు 650 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలబాలికలను అండర్-14, అండర్-19 గ్రూపులుగా విభజించి వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఎస్జీఎఫ్ రాష్ట్ర పరిశీలకుడు రాధాకృష్ణ, కార్యదర్శి భానుమూర్తి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విశాఖ జిల్లా బాలికల బృందం, నెల్లూరు జిల్లా బాలుర జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచాయి. ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ నాగేశ్వరరావుతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

పోటీల్లో విద్యార్థులు

ఐక్యపోరాటంతో సమస్యల పరిష్కారం

రాజవొమ్మంగి, చింతూరు, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. రాజవొమ్మంగి, చింతూరు మండలం ఎర్రంపేటలలో ఆదివారం సీఐటీయూ మహాసభలు నిర్వహించారు. రాజవొమ్మంగిలో సంఘం మండల కార్యదర్శి రామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశాల్లో వెంకట్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం 25 మందితో రాజవొమ్మంగి మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా టి.శ్రీనివాస్, కో కన్వీనర్‌గా కె.వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల, సీఐటీయూ జిల్లా నాయకులు రాంబాబు, గిరిజన సంఘం మండల కార్యదర్శి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఎర్రంపేటలో అరుణ పతకాన్ని ఎగురవేశారు. ఈ నెల 16, 17 తేదీల్లో రంపచోడవరం జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. చింతూరు మండల కమిటీ కన్వీనర్‌గా లక్ష్మణ్, కో కన్వీనర్‌గా సుబ్బారావులతో పాటు 23 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాకలో సీఐటీయూ మండల మహాసభ ఆదివారం జరిగింది. నాయకులు బాలరాజు, రవి, కుమారి, రాములమ్మ, ఐద్వా నాయకురాలు పద్మావతి తదితరులు నిర్వాహకులుగా వ్యవహరించారు. సీఐటీయూ సీనియర్ నాయకులు పల్లంటి ప్రకాశ్ పార్టీ జెండా ఆవిష్కరించారు. 25 మందితో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా పులుసు బాలకృష్ణ, కో-కన్వీనర్‌గా తోట శ్రీనివాసరావుతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరంలో సీఐటీయూ మండల మహాసభ గంగవరం ప్రాజెక్టు లీడర్ కె.రాణి అధ్యక్షతన నిర్వహించారు. సీనియర్ నాయకురాలు ఎం.రెడ్డమ్మ జెండా ఆవిష్కరించారు జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామరాజు పాల్గొని కనీస వేతన చట్టంగూర్చి మాట్లాడారు. అనంతరం మండల కన్వీనర్‌గా కె.రాణి, కో కన్వీనర్‌గా మంగాయమ్మ, మరో 19మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సమావేశం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జెర్రిపోతుల రమణాజీ అన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను అనకాపల్లిలోని సంయుక్త కళాశాలలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాలల ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్యాబోధన అందిస్తునామన్నారు. యాజమాన్య సభ్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపుతామన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. సభ్యులు పైడా కృష్ణ ప్రసాద్, దాడి రత్నాకర్, దొడ్డి గోవిందరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్
... విశ్వాసానికి మరో పేరు !
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)

అస్సెట్ రికవరీ మోనిటరింగ్ బ్రాంచ్
డి.నెం. 9-13-45/2/9/1, 5వ అంతస్తు, ఎమ్‌వీఆర్ వినాయగర్ ట్రేడ్ సెంటర్, వీఐపి రోడ్డు, విశాఖపట్నం - 530003.
మొబైల్ : 98312 00669, 96409 33383

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 9(1)తో చదువుకోవలసిన రూలు 8(6) ప్రకారం సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన / ఛార్జిలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / లాంఛనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారిగారు సెక్యూర్డు క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వాటిని "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై" దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు / సెక్యూర్డు క్రెడిటార్ గారు సదరు ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

ఇ-వేలం తేది మరియు సమయం : 26-11-2025 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు

బయానా చెల్లింపుసకు ఆఖరు తేది : 26-11-2025, మధ్యాహ్నం 3 గం॥ల లోపు | బిడ్ పెంపుదల మొత్తం : 50,000/-

ఋణగ్రహీత పేరు/బ్యాంకుకు మొత్తం బకాయిలు: మెస్సర్స్ కమల్ కాఫీ వర్క్స్, (అకౌంట్ నెం.046200IN00000018 & 046200IL00000144) డి.నెం.30-11-11/1డి, కమల్ నివాస్, లక్ష్మీ వీధి, దాబా గార్డెన్స్, విశాఖపట్నం - 530020. పార్ట్‌నర్స్: 1. శ్రీ ఎస్. కమల్ కుమార్, తండ్రి : శ్రీ సుడియా రామారావు, ఇందు ఎన్‌క్లేవ్, డి.నెం.45-58-17, నరసింహ నగర్, విశాఖపట్నం - 530024. 2. శ్రీ ఎస్. రామారావు, ఇందు ఎన్‌క్లేవ్, డి.నెం.45-58-17, నరసింహ నగర్, విశాఖపట్నం - 530024. 3. శ్రీమతి ఎస్. హారిణి, భర్త : శ్రీ సుడియా కమల్ కుమార్, ఇందు ఎన్‌క్లేవ్, డి.నెం.45-58-17, నరసింహ నగర్, విశాఖపట్నం - 530024. బ్రాంచ్ ఆఫీస్ : ఎల్ఐసి బిల్డింగ్, విశాఖపట్నం. డిమాండ్ నోటీసు తేది.01-10-2024,ఈ అమ్మకం నోటీసు జారీ చేసిన ప్రకారం తేది.30.09.2024 నాటికి బకాయి రూ.74,53,226.36 పై (అక్షరాల డెబ్బై నాలుగు లక్షల యాభై మూడు వేల రెండు వందల ఇరవై ఆరు రూపాయల ముప్పై ఆరు పైసలు మాత్రమే) + తేది.01-10-2024 నుండి తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు వ్యయాలు (డిమాండ్ నోటీసు తరువాత ఏవైనా చెల్లింపు ఉన్న యెడల మినహాయించబడును). లాంఛనాత్మక స్వాధీనతా తేది : 03-02-2025.

సెక్యూరిటీ / ఆస్తుల వివరాలు మరియు ఆస్తుల యజమాని / తనఖా పెట్టిన వ్యక్తి పేరు	రిజర్వు ధర	బయానా (ఇఎమ్‌డి)
శ్రీ ఎస్. కమల్ కుమార్ గారి పేరున గల ఆస్తి: (ఏ) విశాఖపట్నం, లంకెలపాలెం, పరవాడ మండలం, రావాడ గ్రామం మరియు పంచాయితీ ఎస్.నెం.18 పార్ట్ వద్ద ఎ.0-60.8 సెంట్లు విస్తీర్ణం గల భూమి. సేల్ డీడ్ నెం.948/2016, తేది.28.03.2016 ప్రకారం హద్దులు: తూర్పు: యల్లపు రఘురామ్ (అమ్మకందారు) గారు సుడియా కమల్ కుమార్ (కొనుగోలుదారు) గారికి ఈరోజు అమ్మిన భూమి, దక్షిణం : ఇతరులకు చెందిన భూమి, పడమర : ఇతరులకు చెందిన భూమి, ఉత్తరం : గెడ్డ.	రూ. 191.52 లక్షలు	రూ. 19.15 లక్షలు
(బి) విశాఖపట్నం, లంకెలపాలెం, పరవాడ మండలం, రావాడ గ్రామం మరియు పంచాయితీ ఎస్.నెం.18 పార్ట్ వద్ద ఎ.0-39.2 సెంట్లు విస్తీర్ణం గల భూమి. సేల్ డీడ్ నెం.949/2016, తేది.28.03.2016 ప్రకారం హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం : ఇతరులకు చెందిన భూమి, పడమర : యల్లపు రఘురామ్ (అమ్మకందారు) గారు సుడియా కమల్ కుమార్ (కొనుగోలుదారు) గారికి ఈరోజు అమ్మిన భూమి, ఉత్తరం : గెడ్డ.	రూ. 123.48 లక్షలు	రూ. 12.35 లక్షలు

నియమ నిబంధనలు:
1. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును.
2. ఆస్తులను 'ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి.
3. అధీకృత అధికారి గారి వద్దగల పైన తెలిపిన షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారి సమాధానం తెలుపవలసిన అవసరం లేదు.
4. అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://BAANKNET.COM ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది.26.11.2025న ఉదయం 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు నిర్వహించబడును.
5. అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయచేసి https://BAANKNET.COM & www.pnbindia.in వెబ్‌సైటులు చూడవలెను.

SARFAESI చట్టం 2002 లోని రూలు 8(6) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

తేది : 10-11-2025, ప్రదేశం : విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

ఆటో బోల్తా.. గిరిజనులకు గాయాలు

పల్టీకొట్టడంతో ధ్వంసమైన ఆటో ముందుభాగం

చింతపల్లి గ్రామీణం, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: అంత్యక్రియలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆటో బోల్తాపడి గిరిజనులకు గాయాలయ్యాయి. చింతపల్లి మండలం చిన్నగెడ్డ గ్రామానికి చెందిన పలువురు గూడెంకొత్తవీధి మండలం తంగులగొంది గ్రామంలో సమీప బంధువు మరణించడంతో ఆదివారం ఆటోలో బయలుదేరి వెళ్లారు. తిరిగి ప్రయాణంలో ముల్లుమెట్ట వద్ద ఓ చిన్నారి అడ్డుగా రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటో డ్రైవర్ రాంబాబు, ప్రయాణికుల్లో సింహ, ధనలక్ష్మి, పాంగి సతీష్, సీత గాయపడ్డారు. వీరిని చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువచ్చారు.

ట్రాక్టర్ బోల్తా... త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మండలం లోతట్టు ప్రాంతంలో అదుపుతప్పిన ట్రాక్టర్ తొట్టె లోయలో పడిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికి, ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... గుర్తేడు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి సిమెంటు తూరలను తీసుకెళ్తున్న ట్రాక్టర్ చావడికోట పంచాయతీ పరిధిలోని ఉప్పరిగోతుల ఘాట్‌రోడ్డులో అదుపుతప్పడంతో ట్రాక్టరు తొట్టె లోయలో పడిపోయింది.

ఘాట్‌రోడ్డులో బోల్తా పడిన టాక్టర్ తొట్టె

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడి మృతి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఓ కార్మికుడు విద్యుదాఘాతానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. కొమ్మాదిలో నివాసముంటున్న నడగట్ల నాగరాజు(49) ఈనెల 7వ తేదీన ఎంవీపీ సెక్టార్-4లోని ఓ భవన నిర్మాణ పనికి వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై భవనం పైనుంచి కింద పడ్డాడు. అతడిని విమ్స్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ 9వ తేదీ ఉదయం మృతి చెందాడు. దీనిపై మృతుడి కుటుంబీకుల నుంచి అందిన సమాచారం మేరకు సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. మృతుడి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా రణస్థలం. ఉపాధి కోసం కొన్నేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో నగరానికి వచ్చి ఇక్కడ జీవనం సాగిస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ కొని యువకుడి మృతి

బుజ్జియ్య

వై.రామవరం, న్యూస్‌టుడే: వై.రామవరం మండలం దేవర మడుగుల - చవిటిదిబ్బలు గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పి.ఎర్రగొండ గ్రామానికి చెందిన జల్లి బుజ్జియ్య (19) దేవరమడుగుల గ్రామం నుంచి తన స్వగ్రామం పి.ఎర్రగొండ మోటారు బైక్‌పై వస్తున్నారు. గొడుగురాయి గ్రామానికి చెందిన కురుసం విశ్వతేజ, ఈక ఈశ్వర్‌లు చవిటిదిబ్బలు నుంచి గొడుగురాయి గ్రామానికి బైక్‌పై వెళుతున్నారు. వీరిద్దరు వాహనాలు చవిటిదిబ్బలు గ్రామం దాటిన తరువాత మలుపులో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలోమోటారు సైకిల్ నడుపుతున్న బుజియ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్ లో వస్తున్న విశ్వతేజ, ఈశ్వర్ తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని వెంటనే వై. రామవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ చైతన్య, డాక్టరు జీవన్ ఇద్దరికి చికిత్స నిర్వహించారు. ఎస్.ఐ రామకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు..

రోడ్డు ప్రమాదంలో వాహనదారుడు దుర్మరణం

విశాఖపట్నం, న్యూస్‌టుడే : జాతీయ రహదారిపై షీలానగర్ కూడలిలో లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పోర్టు రోడ్డులో నుంచి షీలానగర్ కూడలిలో బైకుపై వ్యక్తి మలుపు తిరుగుతుండగా గాజువాక నుంచి ఎన్ఏడీ వైపు వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనదారుడిని బలంగా ఢీకొంది. ప్రమాదంలో ఆ వ్యక్తి తల నుజ్జయిపోవడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. ఢీకొట్టిన లారీని ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోవడంతో పోలీసులు లారీని పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగి...

విశాఖపట్నం, న్యూస్‌టుడే: అతిగా మద్యం తాగి అనారోగ్యానికి గురై ఓ యువకుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా రామభద్రపురానికి చెందిన గణపతి కొంతకాలంగా స్థానికంగా మద్యం దుకాణంలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై ఈనెల 8న అర్ధరాత్రి దాటాక బార్ పరిసరాల్లోనే రోడ్డుపై పడి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గమనించారు. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు స్థానికంగా విచారించారు. ఎవరూ ఫిర్యాదు చేయనందున కేసు నమోదు చేయలేదు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	108	105
లైవ్	135	125
డ్రెస్‌డ్	196	220
స్కిన్‌లెస్	223	230

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 అరకులోయ: 63034 86346 రంపచోడవరం: 94908 77172

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉండేలా ఏర్పాటుచేసిన బోర్డులో తప్పులు ఉండడంతో గందరగోళానికి గురవుతున్నారు. ఆయా బోర్డుల్లోని సూచికలను సరి చేయాలి. - గణేశ్, మారేడుమిల్లి, ✓: మారేడుమిల్లిలో ఏర్పాటుచేసిన సూచికల బోర్డులో తప్పులు సరిచేస్తాం. - ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, మారేడుమిల్లి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి రామాలయం వీధిలో వీధి కుళాయికి టేప్ లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. పంచాయతీ సిబ్బంది స్పందించి తాగునీరు వృథాగాపోకుండా ట్యాప్ బిగించాలి. - రమణ, చింతపల్లి, ✓: తాగునీరు వృథాగాపోకుండా పంచాయతీ సిబ్బందితో మాట్లాడి కుళాయికి టేప్ బిగిస్తాం. - పుష్పలత, సర్పంచి, చింతపల్లి

స్పందనకు వందనం

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి నుంచి చౌడుపల్లి మీదుగా లోతుగెడ్డ వైపు వెళ్లే ప్రధాన మార్గంలో కల్వర్టుకు రంధ్రం ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇది మరింత ప్రమాదభరితంగా మారింది. దీనిపై ‘మేమున్నాం మీకు తోడుగా’ శీర్షికన అక్టోబరు 23న ‘ఈనాడు’ లో చిత్రవార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. దెబ్బతిన్న కల్వర్టుకు తాత్కాలికంగా మరమ్మతు చేపట్టారు. భారీ వాహనాల రాకపోకలపై ఈ మార్గంలో ఆంక్షలు విధిస్తూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

సమస్య: పెదబయలులో సంపద కేంద్రం కొన్నేళ్లుగా అసంపూర్తిగా మిగిలిపోయింది. దీనితో పారిశుద్ధ్య సమస్య వెంటాడుతోంది. తక్షణమే అధికారులు పూర్తిచేయాలి. - కొండబాబు, పెదబయలు

✓: ఆగిపోయిన కేంద్రాలను పూర్తిచేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పూర్తిచేస్తాం. - ఎల్.పూర్ణయ్య, ఏవో, మండల పరిషత్తు

పర్యాటక ప్రాంతాలు కళకళ

పొల్లూరు జలపాతంలో జలకాలాట

మోతుగూడెం, న్యూస్‌టుడే

కార్తికమాసం.. ఆదివారం కావడంతో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. పర్యాటకుల్లో ఎక్కువ మంది ఫోర్‌బే, పికప్, డొంకరాయి జలాశయాల్లో తెల్లవారుజామున కురిసే మంచును తిలకించడానికి ఆసక్తి చూపుతున్నారు. పొల్లూరు దారాలమ్మ, ఎగువ, దిగువ జలపాతాల్లో పర్యాటకులు జలకాలాడుతూ ఆనందంగా గడిపారు. ప్రీ వెడ్డింగ్ షూట్ల కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే భారీగా తరలివచ్చారు.

సుంకరమెట్ట ఉడెన్ బ్రిడ్జి వద్ద సందర్శకులు

అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, జి.మాడుగుల, ముంచగింపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యంలో పర్యాటక కేంద్రాలు ఆదివారం పర్యాటకులతో కళకళలాడాయి. అరకులోయలో సందర్శిత ప్రాంతాల వద్ద పండగ వాతావరణం చోటుచేసుకుంది. కార్తికమాసం కావడంతో వనభోజనాలు చేసేందుకు అధికశాతం మంది వచ్చారు. కాఫీతోటలు, పద్మాపురం ఉద్యానం, గిరిజన మ్యూజియం తదితరాల వద్ద సందర్శకుల తాకిడి కనిపించింది. సుంకరమెట్ట కాఫీ తోటల వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జి.మాడుగల మండలం కొత్తపల్లి జలపాతంలోకి పర్యాటకులు దిగి స్నానాలు చేస్తూ, ఫొటోలు దిగుతూ ఆనందంగా గడిపారు. బొర్రాగుహలను ఆదివారం 4500 మంది సందర్శించగా సుమారు రూ. 3.50 లక్షలు ఆదాయం సమకూరినట్లు మేనేజరు గౌరీశంకర్ తెలిపారు. డముకు, గాలికొండ వ్యూపాయింట్‌లు, జలపాతాలు, కాఫీతోటల వద్ద పర్యటకులు అధిక సంఖ్యలో దర్శనమిచ్చారు. చాపరాయి, అంజోడ సిల్క్‌ఫాం పీనరీ సందర్శకుల తాకిడితో కిక్కిరిసిపోయాయి. చాపరాయి జలవిహారిలో సరదాగా స్నానాలతో పాటు థింసా నృత్యంలో భాగస్వాములవుతూ ఆనందంగా గడిపారు. ముంచంగిపుట్టు మండలం డుడుమ జలపాతంలో పర్యాటకుల రద్దీ అధికంగా ఉంది.

కొత్తపల్లి జలపాతం వద్ద సందడి...

డముకు వ్యూపాయింట్‌లో పర్యాటకులు

జలపాతానికి సూచిక బోర్డు ఏర్పాటు

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు పంచాయతీ చింతవానిపాలెం సమీపంలో సుందరమైన ఇసుకుల మడుగు జలపాతం ఉంది. చింతవానిపాలెం నుంచి బూదరాళ్ల పంచాయతీ బాలరేవుల వెళ్లే రహదారి మధ్యలోంచి ఈ జలపాతానికి వెళ్లాలి. మన్యంతోపాటు మైదాన ప్రాంతానికి అధికంగా పర్యాటకులు వస్తుంటారు. కొత్తగా వచ్చే వారు ఈ దారి తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు. పర్యాటకుల ఇబ్బందులను గమనించిన స్థానిక యువకులైన ఎల్ రాజశేఖర్, ఎస్.చిన్ని, ఎస్.నర్సింహమూర్తిలు స్నేహితులతో కలిసి ప్రధాన రహదారి నుంచి జలపాతానికి వెళ్లే మార్గం దగ్గర సూచికను ఆదివారం ఏర్పాటు చేశారు. వి.అంజి, పోతురాజు, లోవరాజు, శివ తదితరులు పాల్గొన్నారు. బోర్డు ఏర్పాటు చేసిన యువతను పర్యాటకులు, స్థానికులు అభినందించారు.

ఏర్పాటు చేసిన సూచిక వద్ద యువకులు

నరేశ్‌ని సత్కరిస్తున్న కూనవరం తెదేపా నాయకులు

సమన్వయంతో సమస్యల పరిష్కారం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంగా ముందుకు సాగుదామని కూనవరం, వీఆర్‌పురం తెదేపా మండల శాఖల అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు, బొర్రా నరేశ్ అన్నారు. వీఆర్‌పురంలో ఆదివారం నరేశ్‌తో భేటీయైన తెదేపా మండల కమిటీ పోలవరం నిర్వాసితుల పరిహారం సమస్యలపై చర్చించారు. అందరికీ న్యాయం జరిగేలా అధికారులకు, అధిష్ఠానానికి క్షేత్రస్థాయి సమస్యలు వివరించాలన్నారు. నరేశ్‌ని శాలువాతో సత్కరించారు. ఉమ్మడి ప్రణాళికతో ముందుకు సాగుదామన్నారు. అప్పారావు, ఉమ, రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాల్లోనే జీసీసీ డిపోలు

అరఢకోటలో జీసీసీ డిపో

పెదబయలు, న్యూస్‌టుడే: మండలంలోని పలు జీసీసీ డిపోలు శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కొన్నేళ్లగా వీటి స్థితిని పట్టించుకునే వారే కరవయ్యారు. గత వైకాపా హయాంలో ఇంటింటికి సరకులు పేరిట జీసీసీ డిపోలను పట్టించుకోలేదు. దీంతో అయిదేళ్లలో భవనాలన్నీ దాదాపుగా మరమ్మతుకు గురై నిధులకోసం ఎదురుచూస్తున్నాయి. పెదబయలు, అరఢకోట, సీకరి, గంపరాయి, అడుగులపుట్టు, బొండాపల్లి, పెదకోడాపల్లి తదితర లక్ష్మీపేట తదితరచోట్ల ఈ డిపోలకు సొంత భవనాలున్నా మరమ్మతుకు గురవ్వడంతో చినుకుపడితే జీసీసీ నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు పూర్తిస్థాయిలో రక్షణ లేకపోవడంతో ఎప్పుడు ఏంజరుగుతుందోనని డిపోల నిర్వహణకు భయపడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ పాతపద్ధతిలో రేషన్ డిపోల ద్వారానే ప్రజలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తుండటంతో డిపోల మరమ్మతుకు నిధులు మంజూరుచేసి పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

అడుగుపడని సచివాలయ భవనాల నిర్మాణం

అరఢకోటలో మూడేళ్లుగా నిలిచిన సచివాలయ నిర్మాణం

పెదబయలు, న్యూస్‌టుడే: మండలంలోని 17 గ్రామ సచివాలయాలున్నాయి. వీటిలో కేవలం ఆరు మాత్రమే పూర్తయినా మిగిలిన వాటిలో చాలావరకు అసంపూర్తిగా మిగిలాయి. కొన్ని పనులు పూర్తయి చిన్నపాటి నిధులు వెచ్చిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్నా ఒక్క సచివాలయం పని అడుగు ముందుకు పడలేదు. దీనికి ప్రధాన కారణం గతంలో నిర్మాణ పనులు చేసిన గుత్తేదారులు పనులకు మించి నిధులు డ్రా చేసుకున్నట్లు తెలుస్తోంది. పెదబయలు మండలంలో సీతగుంట, అరఢకోట, అడుగుపుట్టు, సీకరి, రూఢకోట, గంపరాయి, పర్రెడ తదితర చోట్ల ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి ఈ కారణంగా శిథిల భవనాల్లోను, పరాయిపంచన కొనసాగుతుండటంతో ప్రజలతోపాటు సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరుచేసి వీటిని పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

కింటుకూరులో తాగునీటి ఇబ్బందులు

నిరుపయోగంగా సోలార్ మంచినీటి పథకం

రంపచోడవరం, న్యూస్‌టుడే: మండలంలో లోతట్టు గ్రామమైన కింటుకూరులో ఏళ్లు గడుస్తున్నా తాగునీటి ఇబ్బందులు పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. రంపచోడవరానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో 30 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మూడు చేతిపంపులున్నా.. ఒక్కటే పనిచేస్తోంది. గిరిజనులకు తాగునీటికి అందించాలనే ఉద్దేశంతో అయిదేళ్ల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.అయిదు లక్షలతో సోలార్ నీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. ఏర్పాటుచేసిన నెల రోజులకే చుక్కనీరు రాని పరిస్థితి నెలకొంది. దీంతో తమ గ్రామానికి తాగునీరు అందుతోందని ఎంతో ఆశపడ్డ గిరిజనులకు నిరాశే మిగిలింది. గ్రామంలో ఉన్న ఒక్క చేతిపంపు నుంచి ఎర్రనినీరు రావడంతో తాగేందుకు ఉపయోగకరంగా లేకుండా పోయింది. కొండవాగుల నుంచి నీటిని తెచ్చుకొని జీవనం సాగిస్తున్నారు. గిరిజనులకు సురక్షితమైన తాగునీరు అందడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తొలగించాలని కింటుకూరు గ్రామ గిరిజనులు కోరుతున్నారు.

అ వీ ఇ వీ

నేడు చలో రంపచోడవరం ఐటీడీఏ

గంగవరం, న్యూస్‌టుడే: మన్యంలోని దళిత మాదిగలు పడుతున్న ఇబ్బందులపై సోమవారం చలో రంపచోడవరం ఐటీడీఏ కార్యక్రమానికి ఏజెన్సీలోని మాదిగ సోదరులంతా పాల్గొని విజయవంతంచేయాలని సిటిజన్ స్వచ్ఛందసేవా సంస్థ ఛైర్మన్, నిడమిర్తి చిన్నబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో దళిత మాదిగలు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మండల సర్వసభ్య సమావేశం

హుకుంపేట, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయ మందిరంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమాదేవి ఒక ప్రకటనలతో తెలిపారు. ఉదయం 10 గంటలకు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి హాజరుకాని అధికారులపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నడింపాలెంలో గడప గడపకు ప్రచారం

కొయ్యూరు, న్యూస్‌టుడే: నడింపాలెం పంచాయతీ నల్లగొండలో సోమవారం దానధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గడప గడపకు హిందూ ధర్మప్రచారం నిర్వహిస్తామని ధార్మిక సంస్థల ప్రతినిధి డీవీడి ప్రసాద్ తెలిపారు. ముఖ్య అతిథిగా వారాహీ పీఠాధిపతి అరుణాంద స్వామి హాజరై ప్రచారం చేస్తారన్నారు. రావణాపల్లిలో మంగళవారం ధర్మప్రచారం ఉంటుందన్నారు. భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పీఎం జన్‌మన్ బిల్లులు చెల్లించండి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పేద గిరిజన పీటీజీ లబ్ధిదారులు నిర్మిస్తున్న పీఎం జన్‌మన్ గృహ నిర్మాణ బిల్లులు చెల్లించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో ఆ సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం కల్పించిన గృహ నిర్మాణాలతో ఉన్న పూరిగుడిసెలను తొలగించి నిర్మాణాలను గిరిజనులు చేపడుతున్నారన్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు డొంబు, మోహన్‌దాస్, రాంబాబు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం - గోకవరం ప్రధాన రహదారిలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా రహదారికి ఇరువైపులా పెరిగిన తుప్పలు తొలగించేందుకు ఎస్సై వెంకటేష్ చర్యలు తీసుకున్నారు. రెండు బ్లేడ్ ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌తో వీటిని తొలగించామన్నారు. ఏఎస్సైలు మహర్షి, సూర్యనారాయణ, సిబ్బంది దగ్గరుండి తుప్పల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

తుప్పలు తొలగింపును పర్యవేక్షిస్తున్న ఎస్ఐ

జూద శిబిరంపై దాడి

జి.మాడుగుల: మండలం లువ్వాసింగి పంచాయతీ శివారు ప్రాంతాల్లో జూద శిబిరంపై పోలీసులు దాడి చేశారు. జూదం, కాయిన్ ఆట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. దీంతో కొందరు అక్కడి నుంచి పరారయ్యారు. ఆట స్థలంలో రూ.3350 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొన్నారు.

గిరిజన పోరాట సమరయోధుడు బిర్సాముండా

మాట్లాడుతున్న మత్స్యకొండబాబు

పెదబయలు, న్యూస్‌టుడే: గిరిజన పోరాట స్వాతంత్య్ర సమరయోధుడు బిర్సాముండా అని బీజేవైఎం అరకు పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్యకొండబాబు అన్నారు. ఆదివారం గలగండ పంచాయతీ ఈదులపుట్టులో బిర్సాముండా జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వాతంత్య్ర ఉద్యమంలో 25 ఏళ్లకే దేశం కోసం ప్రాణాలు అర్పించారని అన్నారు. ఈనెల 16న పాడేరులో జరిగే జనజాతి గౌరవ దివాస్ బహిరంగ సభలో గిరిజనులందరూ పాల్గొనాలని కోరారు అనంతరం వైజాగ్ వాలంటీర్ల ఆధ్వర్యంలో గిరిజనులకు దుప్పట్లు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. వనవాసి కళ్యాణాశ్రమం జిల్లా సంఘటన కార్యదర్శి గణేష్, ప్రతినిధులు సింకిరాజు, చిట్టిబాబు, వైజాగ్ వాలంటీర్ల ప్రతినిధులు శివకుమార్, నర్సింగ్, తేజస్విని, సుశాంత్, గుణ, స్వామివర్ధన్ పాల్గొన్నారు.

జీసీసీలో పోషకాహారం విక్రయానికి చర్యలు

జీసీసీ స్టాల్‌లో డీఎం, మేనేజర్‌లతో మాట్లాడుతున్న పీవో స్మరణ్‌రాజ్

రంపచోడవరం, న్యూస్‌టుడే: పోషక విలువలతో కూడిన ఆహారపదార్థాలను జీసీసీ ద్వారా విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ‘జన్ జాతీయ గౌరవ దివాస్’ ను పురస్కరించుకుని ఆదివారం స్థానిక లూథరన్‌చర్చి ఎదురుగా జీసీసీ, ఐసీడీఎస్ పోషక విలువలతో కూడిన ఆహార సరకుల విక్రయించేందుకు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అటవీ ఉత్పత్తులతోపాటు పోషక విలువలతో కూడిన పప్పు దినుసులతోపాటు జీడిపప్పు, తేనె తదితర సరకులు విక్రయించేందుకు జీసీసీ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను అందజేయాలని ఆదేశించారు. ఐటీడీఏ ఏపీవో రమణ, జీసీసీ డివిజనల్ మేనేజర్ జయశ్రీ, మేనేజర్ శ్రీనివాసరావు, సిబ్బంది సుధాకర్, సీడీపీవోలు ఉమా, క్రాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 400 మందికి సేవలు

రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రామకృష్ణ మిషన్ ఆధ్వర్యాన ఆదివారం సిరిగిందలపాడులో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 400మంది రోగులకు సేవలు అందించినట్లు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహరాజ్ తెలిపారు. వైద్యులు వెంకటసుబ్బారావు, రామారావు, రాయుడు శ్రీనివాస్, ఉమామహేష్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. పరమహంస యోగానంద నేత్రాలయం వారిచే నిర్వహించిన శిబిరంలో 80మందికి కంటి పరీక్షలు చేశారు. 22మందికి కళ్లజోళ్లు అందించి శస్త్రచికిత్సలు అవరమైన వారిని వేమగిరికి తీసుకెళ్లారు. మూర్ఛవ్యాధి నిపుణులు గోపాలం శివన్నారాయణ హాజరై ప్రత్యేక వైద్యసేవలను అందించి మందులను అందజేశారు. వైద్యశిబిరం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు భక్తుల తాకిడి

కాశీపట్నం శివాలయం వద్ద భక్తుల తాకిడి

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపట్నంలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం, ఎగువ కొండపరి వైకుంఠగిరి ఆలయాలకు భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్తిక మాసంతో పాటు వారాంతం కావటంతో అధిక సంఖ్యలో జనాలు మన్యానికి చేరుకున్నారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో దర్శనమిచ్చాయి. గోస్తనీ నది వద్ద పవిత్ర స్నానాల అనంతరం కాశీపట్నం శివాలయంలో పూజలు చేశారు. వైకుంఠగిరి దేవాలయాన్ని ఒక్క రోజే సుమారు 5వేల మంది వరకు సందర్శించినట్లుగా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బాపనమ్మతల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: సీతపల్లిలో వేంచేసిన గడిబాపనమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాన్ని వీక్షేంచేందుకు వచ్చిన పర్యాటకులు ముందుగా అమ్మవారిని దర్శించుకొన్నారు. భక్తులు అన్నసంతర్పణ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు కార్యనిర్వహణ అధికారి సత్యరమేష్, ఆలయ ఛైర్మన్ కుంజం బాపన్నదొర ఆధ్వర్యంలో వంట షెడ్లను అద్దెకు ఇచ్చారు.. ఎస్సైలు వెంకటరావు, భూషణం బందోబస్తును నిర్వహించారు.

సీలేరులో వేంకటేశ్వరస్వామి కల్యాణం

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు రామాచారి స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిపూడిలో అమ్మవారి గరగలతో బోనాల ఊరేగింపు

గంగవరం: నెల్లిపూడిలో దుర్గాదేవి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని బుడ్డిగ సతీష్ గౌడు, నరసింహారావు గౌడు, రాంబాబు గౌడు ఆదివారం నిర్వహించారు. గ్రామంలో భారీ పూజ కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. గరగ నృత్యాలు, అమ్మవారి కళారుపాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై వెంకటేష్, సిబ్బంది ట్రాఫిక్ నియంత్రించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించరూ!

ట్యాంకు ఎదుట స్థానికుల ఆందోళన

అనంతగిరి, న్యూస్‌టుడే: భీంపోలు పంచాయతీ సరియాపల్లి గ్రామంలో తాగునీటి సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకుడు వెంకటరమణ అన్నారు. ట్యాంకు ఉన్నప్పటికీ మరమ్మతులకు గురవడంతో స్థానికులంతా నీటిని తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చిన్న ఊటనీటి వద్ద పైపులైను ఏర్పాటు చేసుకుని ఆ నీటితో స్థానికులు అవసరాలు తీర్చుకుంటున్నట్లు తెలిపారు. స్థానికులతో కలిసి పాడైన ట్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. అధికారులు నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

రహదారుల నిర్మాణం పూర్తిచేయరూ..

సభకు హాజరైన గ్రామస్థులు

వరరామచంద్రాపురం: మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్ పేర్కొన్నారు. జల్లివారిగూడెంలో ఆదివారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పెద్దమట్టపల్లి - నర్సింగపేట రహదారితోపాటు, మరికొన్ని దారుల నిర్మాణం నాలుగేళ్ల క్రితం నిలిచిపోయ్యాయని, అన్నవరం బ్రిడ్జి నిర్మాణం అంతే అవుతుందన్నారు. పోలవరం ముంపు సమస్యలు ఉన్నాయన్నారు ఎంపీపీ కారం లక్ష్మీ, సంతోశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండపల్లివలస ప్రధాన రహదారి

నమ్మండి.. ఇది రహదారేనండి!

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ-పాడేరు ప్రధాన రహదారి మార్గంలో పొదలు పెరిగిపోయాయి. ఎండపల్లివలస వద్ద పొదలు పెరిగిపోయి సుమారు 10 అడుగుల మేర విస్తరించాయి. దీంతో రహదారి చిన్నగా మారిపోవటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు కనీసం పట్టించుకోవటం లేదు. అధికారులు స్పందించి వీటిని తొలగించాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు ముఖ హాజరు

విద్యార్థులు, గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

అనంతగిరి, న్యూస్‌టుడే: పాఠశాలల ఉపాధ్యాయులంతా కచ్చితంగా రోజూ ముఖ ఆధారిత హాజరు నమోదు చేసుకోవలసిందేనని ఎంఈఓ బాలాజీ అన్నారు. మద్రేబు, దాయర్తి, బుడ్డిగరువు, చింతలపాలెం తదితర గ్రామాలలో పర్యటించి విద్యార్థులు, వారి తల్లితండ్రులతో మాట్లాడి ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీసినట్లు చెప్పారు. దాయార్తి గ్రామంలో ఇద్దరు ఉపాధ్యాయినులకు ఒకరు మెటర్నటీ సెలవులో ఉన్నారని, చింతలపాలెం ఉపాధ్యాయిని వైద్య సంబంధ సెలవులో ఉండగా వారి స్థానంలో మరొకరిని డిప్యుటేషన్ వేసిన విషయాలను స్థానికులకు తెలియజేసినట్లు చెప్పారు. ఎవరైనా పాఠశాలకు రాని విషయాన్ని తన దృష్టికి తీసుకుని వస్తే చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఉపాధ్యాయులు ఏ విధంగా పాఠాలు చెబుతున్నారు.. నిత్యం పాఠశాలకు వస్తున్నారా అనే విషయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పడాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల నిరసన

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి కాఫీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. జీకేవీధి మండలం ఆర్వీనగర్ డివిజన్ పరిధిలోని కార్మికులు ఆదివారం చాపగెడ్డ ఎస్టేట్ వద్ద నిరసన తెలిపారు. నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నామని యాజమాన్యం స్పందించాలని కోరారు.

చాపగెడ్డ ఎస్టేట్ వద్ద కాఫీ కార్మికుల ఆందోళన

మన్యంపై మంచుదుప్పటి

సీతపల్లి వాగు వద్ద తాళ్ల వంతెనపై...

దేవీపట్నం, న్యూస్‌టుడే: మన్యంలో రోజురోజుకి చలితీవ్రత క్రమంగా పెరుగుతోంది. దేవీపట్నం మండలం వి.రామన్నపాలెం వద్ద సీతపల్లి వాగుపై ఉన్న తాళ్ల వంతెనను ఆదివారం మంచుదుప్పటి కమ్మేసింది. వంతెనకు ఆవతల వైపున ఉన్న గిరిజనులు తాళ్ల వంతెనను దాటుకుని మైదాన ప్రాంతాలకు వెళ్తుంటారు. వి.రామన్నపాలెం నుంచి ఉదయం ఆటోలపై పనులకు వెళ్లే కూలీలు సైతం మంచు తగ్గే వరకు ఉండి ప్రయాణాలు సాగిస్తున్నారు.

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ పొగమంచు అందాలతో సందర్శకులను అలరిస్తోంది. పొగమంచు అందాలతో సొగసులీనుతున్న అరకులోయ ప్రకృతి సోయగాలను సందర్శకులు ఆస్వాదిస్తున్నారు. పొగమంచు అందాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. హైవేపై మంచు సోయగాల నడుమ పర్యాటకులు ఫొటోలు దిగుతున్నారు.

అరకులోయ హైవేపై..

హిందీ నేర్చుకుంటే మేలు

నర్సీపట్నం అర్బన్: వివిధ రాష్ట్రాలు, భిన్న సంస్కృతులు ఉన్న భారతదేశంలో హిందీభాష ప్రజలను కలుపుతోందని హిందీ అధ్యాపకుడు కోట ప్రసాద్ అన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం హిందీ ప్రాధాన్యంపై వక్తృత్వ పోటీ నిర్వహించారు. 23 పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హక్కుల సాధనకు నిరంతర పోరాటం

ఆదివాసీ జెండాను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ ఉపాధ్యాయులు

చింతూరు, న్యూస్‌టుడే: మన్యంలో ఆదివాసీ ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తామని ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం (ఏటీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్ పేర్కొన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం చింతూరులో నిర్వహించారు. తొలుత ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల క్రితం ఆదివాసీ ఉపాధ్యాయుల సమస్యలు, హక్కుల కోసం ఏటీఏ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉపాధ్యాయుల పదోన్నతుల్లో నూరు శాతం ఆదివాసీ ఉపాధ్యాయులకే దక్కేలా సాధించిన ఘనత తమకే దక్కుతుందని పేర్కొన్నారు. మన్యంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు ఆదివాసీలకే చెందేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బయ్య, డివిజన్ కార్యదర్శి నారాయణ, నాయకులు రవికుమార్, బాబురావు, కన్నమ్మ, మీనా తదితరులు పాల్గొన్నారు.

వన విహారం.. ఆహ్లాద ఆదివారం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి, తాడేపల్లి పరిసర ప్రాంతాల్లోని తోటల్లో ఆదివారం కార్తిక సమారాధనల కోలాహలం నెలకొంది. స్థానిక ఎకో పార్కుకు విజయవాడ, మంగళగిరి, గుంటూరు ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు సినీగేయాలకు నృత్యాలు చేస్తూ.. ఆటలు ఆడుతూ సందడి చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. తాడేపల్లి మండలం ఇప్పటంలో గౌడ సామాజికవర్గం, ఉండవల్లిలో ఆక్వా డెవిల్స్‌లో అసోసియేషన్ ఆధ్వర్యాన కార్యక్రమాలు జరిగాయి.

చిన్నారుల ఆటలు

ఎకో పార్కులో నృత్యాలు చేస్తూ..

కృష్ణా వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదిలో వరద ప్రవాహం ఆదివారం తగ్గుముఖం పట్టింది. ఉదయం ఆరు గంటలకు 60,150 క్యూసెక్కులను సముద్రంలోకి, 8,473 క్యూసెక్కులను కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు విడుదల చేశారు. సాయంత్రానికి క్రమేపీ వరద ప్రవాహం తగ్గింది. రాత్రి 7 గంటలకు 60 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. మిగతా 10 గేట్లను మూసివేశారు. 43,500 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. పంట కాల్వలకు 8,850 క్యూసెక్కులు వదిలారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 3,615, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 5,009, గుంటూరు ఛానల్‌కు 226 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 1,705, ఏలూరు 1,110, కేఈబీ 500, బందరు కాల్వలకు 300 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు.

మట్టిబొమ్మల తయారీలో బాలలు

జానపద నృత్యాభినయం

సృజనకు రెక్కలు.. చిరుదివ్వెల వెలుగులు..

ఘనంగా ముగిసిన బాలోత్సవం

గుంటూరు సాంస్కృతికం, పెదకాకాని, న్యూస్‌టుడే: మేధో మథనం.. కళారాధన.. రెండూ కలగలిసి నిండైన బాల్యాన్ని విరబూయిస్తున్నారు నేటి బాలలు. ఈ విషయాన్ని రుజువు చేసింది వీవీఐటీయూ బాలోత్సవం. ప్రపంచ పిల్లల పండగ పేరుతో మూడు రోజులు ముచ్చటగా నిర్వహించిన బాలోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. గుంటూరు జిల్లా నంబూరులోని వీవీఐటీయూ ప్రాంగణం ఇందుకు వేదిక అయ్యింది. సామాజిక కాలుష్యం, ప్లాస్టిక్ లాంటి వాటిని అరికట్టి, మద్యపానం, ఇతర మత్తుపదార్థాల వంటి వాటిని దూరంగా తరిమేయాలన్న ఆశాభావ ఏకపాత్రలు, లఘు నాటికలు, కథ రచనల్లో స్పష్టంగా కనబర్చారు. విచిత్ర వేషధారణలు, కాగితపు, మట్టి బొమ్మల తయారీలో చిట్టి చేతుల్లో గట్టి చమత్కారమే కనిపించింది.

శాస్త్రీయ నృత్య కౌశలం

రైతు ఎద్దులబండి బొమ్మ (గురు రాఘవేంద్ర పాఠశాల విద్యార్థులు)

మరిన్ని చిత్రాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కాగితపు ముక్కలు.. సంప్రదాయ బొమ్మలు.. వీవీఐటీయూ పోటీ అంశాల్లో 'పేపర్ కొలేజ్' ఒకటి. పనికిరానివనుకున్నవి, పక్కనపడేసిన కాగితపు, అట్ట ముక్కలను సేకరించి వాటితో ఊహకు తగ్గ బొమ్మలను తయారుచేయడం ఈ పోటీలో సారాంశం. దీనిని అనుసరించి బాలలు గ్రామం మొత్తం ఎలా ఉంటుందో అలాంటి బొమ్మ, ఎడ్లబండి, సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన బొమ్మలు రూపొందించారు.

మట్టితో కళాకృతులు.. మట్టి ముద్దలతో ఎలాంటి అచ్చులు వాడకుండా చిట్టి చేతులతో దేవతా మూర్తులను ఇతర అందమైన బొమ్మలను రూపొందించి తమ కళాకౌశలాన్ని రుజువు చేసుకున్నారు. అపురూప కళాస్రష్టలుగా ఎదుగుతారన్న ఆశాభావాన్ని ప్రకటించారు.

కాగితపు ముక్కలతో బొమ్మల తయారీ

ఇదిగో బాతు..

అర్ధ నారీశ్వర రూపం

బుట్ట బొమ్మ..

మత్స్య కన్య

నెమలికి నేర్పిన నడకలివీ..

శ్రీఆంజనేయం

పేదలకు నిస్వార్థంగా సేవ చేస్తే.. సహకరిస్తాం

- కంచి కామకోటి పీఠం సేవలు అద్వితీయం
- శంకర కంటి ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ భవనం ప్రారంభంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి-న్యూస్‌టుడే, పెదకాకాని, గుంటూరు (నగరంపాలెం): 'ధర్మం, న్యాయం, సేవ. . మూల సిద్ధాంతాలుగా కంచి పీఠాన్ని ఆది శంకరాచార్యులు తమిళనాడులో స్థాపించారు. నేటికీ హిందూ ధర్మ పరిరక్షణకు ఆ పీఠం ఎంతగానో కృషి చేస్తోంది. అన్యమతాల నుంచి హిందూ మతానికి ముప్పు వాటిల్లినప్పుడు సదాశివుని అంశగా ఆదిశంకరాచార్యులు భూలోకంలో జన్మించారని భక్తులు విశ్వసిస్తుంటారు. దేశంలో నాలుగు దిక్కుల్లో నాలుగు పీఠాల ద్వారా నాలుగు వేదాలు ఇప్పటికీ వ్యాప్తి చెందుతున్నాయి. శంకర కంటి ఆసుపత్రుల ద్వారా లక్షలాది మంది పేదలకు మేలు చేకూరుస్తున్నారు. పేదలకు నిస్వార్థంగా సేవ చేసే వారికి మా వంతుగా సహకరిస్తాం'.. అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పెదకాకాని సమీపంలోని శంకర కంటి ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. నూతన భవనంలోని వసతులు, వైద్య సదుపాయాలు పరిశీలించారు.

శంకర సూపర్ స్పెషాలిటీ ఐకేర్ బీబ్లాక్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, శంకర ఐ కేర్ ఫౌండర్ డాక్టర్ రమణి

ముమ్మందు సేవలు రెట్టింపు

అనంతరం సభావేదికపై సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఐదు దశాబ్దాల ప్రస్థానంలో కంచి కామకోటి పీఠం పరిధిలోని శంకర కంటి ఆసుపత్రులు అద్వితీయ సేవలు అందించాయన్నారు. ఒక్క గుంటూరు ఆసుపత్రిలోనే లక్షల్లో శస్త్ర చికిత్సలు, పరీక్షలు జరిగాయన్న ఆయన.. సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌ను ప్రారంభించడంతో ముమ్మందు సేవలు రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. కంచి పీఠానికి దాతల కొరత లేదని, ఒక్క పిలుపు ఇస్తే దేశ, విదేశాల నుంచి సేవలందించేందుకు చొరవ చూపుతారని సీఎం స్పష్టం చేశారు. అనంతరం చంద్రబాబుకు ఆసుపత్రి వర్గాలు తంజావూరు తైలవర్ణ చిత్రపటాన్ని బహూకరించి ఘనంగా సత్కరించాయి.

మానవుల సేవే అత్యున్నత పూజ..

కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ. . మానవులకు సేవ చేయడం అత్యున్నతమైన పూజ అన్నారు. ఈ ఆసుపత్రి అలాంటి సేవా కార్యక్రమాల ద్వారా ధర్మం, కరుణ రూపంలో ప్రదర్శితమవుతోందని చెప్పారు. శంకర కంటి ఆసుపత్రి.. విజ్ఞానం, ఆధ్యాత్మిక సమాజ హితార్థం చేస్తోన్న కృషిని అనుగ్రహ భాషణంలో వివరించారు. కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, శంకర్ ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఆర్.వి.రమణి, శంకర్ ఐ ఫౌండేషన్ (అమెరికా) వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ మురళీకృష్ణమూర్తి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు, అధికారులు, ఆసుపత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్లో జరుగుతుందని కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ఎస్‌లో సమర్పించిన అర్జీల వివరాలను 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. Meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

'వాటర్‌షెడ్ మహోత్సవ్' విజయవంతం చేయాలి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరులో ఈనెల 10, 11వ తేదీల్లో నిర్వహించనున్న వాటర్‌షెడ్ జాతీయ సదస్సు విజయవంతం చేసేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.శశిభూషణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన గుంటూరులోని ఐటీసీ వెల్‌కమ్ గ్రాండ్ హోటల్, గ్రామీణ గుంటూరు మండలం వెంగళాయపాలెంలో వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో భాగంగా అమృత్ సరోవర్ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న ఊర చెరువు పనులను, నల్లపాడు లయోలా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న జాతీయ సదస్సు వేదికను పరిశీలించారు. 21 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊర చెరువును ఆహ్లాదకరంగా తయారు చేయడమే కాకుండా చుట్టూ ఉద్యానవనంగా తీర్చిదిద్దడంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు క్రీడా పరికరాలు, యోగా, వ్యాయామం చేసేందుకు అనుగుణంగా పనులు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి నితిన్ కడే, అదనపు కమిషనర్ సి.పి.రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ, కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, వాటర్‌షెడ్ విభాగం సంచాలకులు వై.వి.కె.షణ్ముఖకుమార్, జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు, డ్వామా పీడీ వి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించేందుకు వెళుతున్న పీఆర్‌అండ్‌ఆర్డీ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ తమీమ్ అన్సారియా

దివ్యాంగులూ... మోటారు వాహనాలు కావాలా..!

25 వరకు దరఖాస్తుకు అవకాశం

కలెక్టరేట్ (గుంటూరు), ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే

జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటారు సైకిళ్లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాకు 80 వాహనాలు కేటాయించింది. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులకు అవకాశం కల్పించింది. నియమ, నిబంధనల మేరకు అర్హులైతే.. వారికి మూడు చక్రాల వాహనాలను అందించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ డి.దుర్గాబాయి తెలిపారు. వాహనాలు కావాల్సినవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

దరఖాస్తు ఇలా.. దివ్యాంగులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలు అందించనుంది. ప్రభుత్వం దివ్యాంగుల స్వతంత్ర చలనశీలత, ఆత్మ నిర్భరత, సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి అర్హులైన దివ్యాంగులకు నూరు శాతం సబ్సిడీతో రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల మంజూరు పథకం కింద ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఆంధ్రప్రదేశ్ దివ్యాంగులు, వృద్ధుల సహాయ సంస్థ (ఏపీడీఏఎస్‌సీఏసీ) అధికారిక వెబ్‌సైట్‌లో www.apdascac.ap.gov.inలో దరఖాస్తులు సమర్పించాలి.

అర్హతలివా.. దరఖాస్తుదారులు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన దివ్యాంగులై ఉండాలి. ★ వార్షిక కుటుంబ ఆదాయం రూ. 3 లక్షల కంటే ఎక్కువ ఉండకూడదు. ★ అభ్యర్థి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారై ఉండాలి. ★ వాహనం నడపడానికి చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. ★ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ద్వారా గతంలో వాహనం పొంది ఉన్నా, ఇంతకుముందే అతని పేరుపై వాహనం ఉంటే దరఖాస్తుకు అనర్హులు.

విస్తరణ పట్టాలెక్కేలా..

మాస్టర్‌ప్లాన్ ప్రకారం రహదారుల అభివృద్ధిపై దృష్టి

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ (గుంటూరు)

ఆక్రమణలు తొలగిస్తున్నారు.. రోడ్ల విస్తరణకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఏళ్ల తరబడి ఎటూ తేలకుండా ఉండిపోయిన బృహత్ ప్రణాళిక అమలు ప్రక్రియను తిరిగి పట్టాలెక్కించేందుకు జీఎంసీ అధికారులు అడుగులు వేస్తున్నారు. కౌన్సిల్ సమావేశంలో తీర్మానించిన 11 రోడ్లలో తొలి విడతలో నాలుగింటిని అభివృద్ధి చేసేందుకు సంకల్పించారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సదరు యంత్రాంగం అధ్యయనాన్ని ప్రారంభించింది.

విస్తరణకు నోచుకోనున్న శారదాకాలనీ రోడ్డు ఇదే..

గుంటూరు నగరపాలికలో డివిజన్లు	57
జనాభా (సుమారు)	10లక్షలు
వార్షిక బడ్జెట్	రూ.1500కోట్లు
ప్రధాన,అంతర్గత రోడ్లు	1900 కి.మీ

★ తూర్పు నియోజకవర్గ పరిధిలోని రెడ్డిపాలెం వైపు సంజీవయ్యనగర్ ప్రధాన రోడ్డు 2.31 కి.మీ మేర 80 అడుగులుగా విస్తరించాలని ప్రతిపాదనలున్నాయి. ప్రస్తుతం వెడల్పు 40 నుంచి 70 అడుగులే ఉంది. మాస్టర్ ప్లాన్ ప్రకారం స్థల సేకరణ, అడ్డుగా ఉన్న కట్టడాల తొలగింపు పనులు చేపట్టాల్సి ఉంది.

★ మల్లికార్జునపేట 5వ లైన్ లేబర్ వెల్ఫేర్ సొసైటీ రోడ్డు 0.60 కి.మీ. మేర 60 అడుగులుగా విస్తరించాల్సి ఉండగా ఇక్కడ 35 నుంచి 40 అడుగుల రోడ్డు మాత్రమే అందుబాటులో ఉంది.

తొలి విడతలో 4 రోడ్లు చేపట్టేలా ప్రణాళిక..

1. హిందూ కాలేజీ నుంచి శంకర్‌విలాస్ నూతన పైవంతెన మీదుగా లాడ్జి సెంటర్ వరకు 120 అడుగుల రోడ్డు.. ఉండేలా విస్తరించనున్నారు.
2. డొంక రోడ్డు నుంచి శారదాకాలనీ వరకు 60 అడుగులు
3. బృందావన్‌గార్డెన్స్ ఎన్జీరంగా విగ్రహం నుంచి హనుమయ్య కంపెనీ వరకు 80 అడుగులు
4. నెహ్రూనగర్ రోడ్డు 60 అడుగులకు విస్తరించాలన్నది లక్ష్యం.

పశ్చిమలోనూ కీలకం..

☛ పశ్చిమ నియోజకవర్గంలోని సీతయ్యడొంక 3 కి.మీ. రోడ్డు 60 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ 30 నుంచి 40 అడుగులు మాత్రమే రహదారి ఉంది.

☛ వీఐపీ రోడ్డులో గెలాక్సీ బార్ నుంచి కొత్తకాలనీ వరకు అర కి.మీ. 60 అడుగుల మేర విస్తరించాలి. ప్రస్తుతం 24 నుంచి 40 అడుగులు వెడల్పు మాత్రమే ఉంది.

☛ అన్నీ అనుకున్నట్లు జరిగితే ఏడాదిలోపే తొలి విడతలో నాలుగు రోడ్ల విస్తరణను పట్టాలెక్కించే అవకాశం ఉందని జీఎంసీ అధికారులు 'ఈనాడు'కు తెలిపారు.

64 గళ్లు... ఆకర్షించేను కళ్లు..



చదరంగం అంటే చాలా మందికి ఆట మాత్రమే.. కొందరికి మాత్రం జీవన విధానం. పొన్నూరు పట్టణ పరిధి 26వ వార్డు గాజుల పాలెంకు చెందిన చదరంగ శిక్షకుడు క్రీడపై మమకారంతో తన ఇంటి గోడపై పెద్ద చదరంగం బోర్డును ఏర్పాటు చేశారు. ఆ రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారుల అక్కడికి చేరగానే దాన్ని చూసి మంత్రముగ్ధులవుతున్నారు.

- న్యూస్‌టుడే, పొన్నూరు

ప్రత్యేక రైళ్లకు బోగీల కష్టాలు!

ఈనాడు, అమరావతి: రైళ్లకు బోగీల కష్టాలు వెంటాడుతున్నాయి. ఎన్నికల కోసం అదనపు బోగీలను బిహార్ తరలించడంతో వాటి రాక కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. శబరిమలై యాత్రికుల అవసరాలతో పాటు.. ఇతర మార్గాల్లోనూ ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో బిహార్ వెళ్లిన ర్యాకులే ప్రస్తుతం దిక్కయ్యాయి.

రైల్వేలో ప్రతి డివిజన్‌లోనూ కొన్ని స్పేర్ బోగీలు ఉంటాయి. వాటిని ఎప్పటికప్పుడు అన్ని డివిజన్లలో అవసరాల మేరకు వినియోగిస్తుంటారు. ఇటీవల జరిగిన బిహార్ ఎన్నికలకు సంబంధించి రైల్వే శాఖ పారామిలిటరీ బలగాలతో పాటు ఎన్నికల సామగ్రి తరలింపులోనూ వీటిని వినియోగించింది. ఇప్పుడు దక్షిణ మధ్య రైల్వేలో వీటి అవసరం ఏర్పడింది.

పరిస్థితి ఇదీ.. రైల్వే శాఖ అధికారులు శబరిమలై యాత్రికుల కోసం మచిలీపట్నం, చర్లపల్లి.. ఇలా అనేక ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశారు. కొన్ని రైళ్లకు ఇప్పటికే ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం కల్పించారు. ఈనెల 14 నుంచి పూర్తిస్థాయిలో వీటిని పట్టాలెక్కించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో ఇక్కడ స్పేర్ ర్యాకులు కీలకమయ్యాయి. అవి ఇప్పటికే బిహార్‌కు పంపడంతో.. వాటి రాక కోసం ఎదురుచూస్తున్నారు. శబరిమలై ప్రత్యేక రైళ్లను ఎప్పుడో ప్రకటించాల్సి ఉన్నా బోగీల కొరత కారణంగానే ఆలస్యం చేసినట్లు రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

ఆపదా.. ఫోన్ చేద్దాం..

మహిళలకు సహాయ కేంద్రాలు

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే

మహిళల భద్రత, రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా సహాయ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. రోజులో 24 గంటలూ మహిళలకు ఈ కేంద్రాల ద్వారా సహాయం చేస్తారు. గృహ హింసకు గురైనా, భౌతిక, లైంగిక దాడులకు గురైన సమయంలో బాధితులు సహాయ కేంద్రాలను సంప్రదిస్తే.. వారికి వైద్య సహాయంతో పాటు పునరావాసం కల్పిస్తారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీస్, రెవెన్యూ, వైద్యారోగ్య శాఖల అధికారులను సమన్వయం చేసుకుని బాధితులను ఆదుకుంటారు. వివరాలివీ.

బాలల కోసం: బాలలతో వెట్టి చాకిరీ చేయించడం, పారిశ్రామిక, కర్మాగారాల్లో పనుల్లో పెడితే.. వారిని రక్షించేందుకు హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేస్తే ప్రభుత్వ అధికారులు స్పందించి దాడులు చేసి వారికి విముక్తి కల్పిస్తారు. బాలలపై హింస, దాడులకు పాల్పడితే.. వారిపై చర్యలకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు.

మహిళా సహాయ కేంద్రం: మహిళలను అధిక కట్నం కోసం వేధించడం, శారీరక, మానసిక వేధింపులకు పాల్పడిన సందర్భంలో బాధితులు నేరుగా 181 నంబరుకు ఫోన్ చేయొచ్చు. గుంటూరులోని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయంలోని విభాగం అధికారులు, సిబ్బంది వివరాలు నమోదు చేసుకుని ఆయా జిల్లాల పోలీస్, ఇతర శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులను ఆదుకునేలా చూస్తారు.

సైబర్ నేరాల హెల్ప్‌లైన్: సామాజిక మాధ్యమాల్లో మహిళలతో పరిచయాలు పెంచుకుని ప్రైవేటుగా అశ్లీల చిత్రాలు తీసి బెదిరిస్తే.. 1930 నంబర్‌కు ఫోన్ చేస్తే పోలీసు అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేస్తారు. ఆన్‌లైన్‌లో ఆర్థిక మోసాలకు పాల్పడిన వారిపై కూడా ఫిర్యాదు చేయడం ద్వారా నగదు బ్యాంకు ఖాతా నుంచి లావాదేవీలను నిలిపివేస్తారు.

పోలీస్ హెల్ప్‌లైన్: మహిళలు, విద్యార్థినులను ఎవరైనా లైంగికంగా వేధించినా 100 నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే స్పందించి బాధిత మహిళలను ఆదుకుంటారు. దూరప్రాంతమైతే.. ఆ ప్రాంత పోలీసులకు సమాచారం చేరవేసి రక్షణ కల్పించేలా ఆదేశాలిస్తారు.

జాతీయ న్యాయ సహాయ కేంద్రం: న్యాయస్థానాల్లో కేసులకు సంబంధించి 15100 నంబర్‌కు ఫోన్ చేసి న్యాయ సేవలు పొందవచ్చు. కోర్టుల్లో న్యాయవాదులను పెట్టుకోలేని మహిళలకు ప్రభుత్వ న్యాయవాది ద్వారా సహాయం అందజేస్తారు.

ధాన్యం కొనుగోలుకు.. సర్వం సిద్ధం

క్షేత్రస్థాయిలో సిబ్బందికి దిశా నిర్దేశం

ఈనాడు, అమరావతి

జిల్లాలో రైతుల నుంచి ధాన్యం సేకరణకు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఖరీఫ్‌లో ప్రధాన పంట వరి అయినందున ఏటా ప్రభుత్వం కనీస మద్దతు ధరకు ధాన్యం సేకరించి మిల్లర్లకు అప్పగిస్తోంది. వారి నుంచి బియ్యం తీసుకుని కార్డుదారులకు సరఫరా చేస్తారు. ఈ ఏడాది కూడా ధాన్యం దిగుబడులు రైతు చేతి కొచ్చేసరికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. జిల్లా సంయుక్త పాలనాధికారి ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్నారు. గతేడాది తేమ శాతం నిర్ధారణలో ఇబ్బందులు, కొనుగోలు ప్రక్రియలో జాప్యం, రైతులు ధాన్యం అమ్మడానికి సిద్ధమైనా మిల్లర్లు ముందుకు రాకపోవడం, బ్యాంకు గ్యారంటీలు సమర్పించడంలో అలసత్వం వంటి సమస్యలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇలాంటివి పునరావృతం కాకుండా ఈ ఏడాది ప్రక్రియను విజయవంతం చేసేందుకు కసరత్తు పూర్తి చేశారు.

ధాన్యానికి 2025-26 సీజన్‌కు మద్దతు ధర (రూ.) ఇలా....

రకం	క్వింటాకు	75కిలోల బస్తా
గ్రేడ్-1	2389	1792
సాధారణ	2369	1,777

☛ గతేడాదితో పోలిస్తే క్వింటాకు రూ.69 అదనంగా పెంచారు.

★ రైతులు.. గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదిస్తే కొనుగోలు తేదీ, సమయం వివరాలతో ముద్రించిన కూపను ఇస్తారు. ★ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని ఆరబెట్టి తెచ్చేలా రైతులకు అవగాహన కల్పిస్తారు. ★ మద్దతు ధర, కొనుగోలు సిబ్బంది వివరాలు రైతుసేవా కేంద్రంలో ప్రదర్శిస్తారు. ★ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు ఏజెన్సీగా ఎంపికైంది. ★ జిల్లాలో 24 రైస్ మిల్లులను ఎంపిక చేసి, తనిఖీలు పూర్తి చేశారు. నిబంధనల మేరకు బ్యాంకు గ్యారంటీలు సమర్పిస్తే ధాన్యం కొనుగోలుకు ప్రక్రియ పూర్తయినట్లే. ★ తేమ శాతం కొలిచే మాయిశ్చర్ మీటర్లు 177 అవసరం కాగా అవి అందుబాటులో ఉన్నాయి.

- జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం : 61464 హెక్టార్లు
- ఈ ఏడాది సాగైన విస్తీర్ణం : 53,853 హెక్టార్లు
- ధాన్యం దిగుబడుల అంచనా : 3,89,849 టన్నులు
- పౌరసరఫరాల సంస్థ కొనుగోలు లక్ష్యం : 50,000 టన్నులు
- జిల్లాలో ధాన్యం దిగుబడులు ప్రారంభమయ్యే నెల : డిసెంబరు

రైతుసేవా కేంద్రాల పరిధిలో విభజించిన క్లస్టర్లు, రైతు సేవా కేంద్రాలు

విభాగం	క్లస్టర్లు	కేంద్రాలు
2వేల టన్నుల కంటే ఎక్కువ	35	48
1000-2000 మధ్య	7	50
1000 టన్నుల కంటే తక్కువ	3	79
మొత్తం	45	177

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541

(c) eenadu

నారీమణులై మెరిసేలా.. స్వశక్తితో ఎదిగేలా..

తుళ్లూరు, న్యూస్‌టుడే

రాజధాని మహిళల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు సీఆర్డీఏ చర్యలు తీసుకుంటోంది. అమరావతిలో ఉద్యోగ, వ్యాపారాలు చేసుకొనేలా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందిస్తోంది. రాష్ట్ర నైపుణ్య శిక్షణ సంస్థ సహకారంతో మహిళలకు వ్యాపార నిర్వహణలో 26 రోజుల పాటు శిక్షణ అందిస్తున్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. ప్రస్తుతం అనంతవరం, తుళ్లూరు, మందడం, ఉండవల్లి, యర్రబాలెం, దొండపాడు, రాయపూడి, లింగాయపాలెం గ్రామాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

ఏం నేర్పిస్తారంటే.. : చిరు ధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ, బిస్కెట్లు, సంప్రదాయ ఆహార పదార్థాలు, స్వీట్లు, టైలరింగ్, బ్యూటీ పార్లర్, గార్డెనింగ్, వివిధ రకాల అల్పాహారాల తయారీలో నిపుణలతో శిక్షణ అందిస్తారు. అదేవిధంగా అమరావతిలోని ఏపీ వీఐటీ యూనివర్సిటీ సహకారంతో రాజధాని మహిళలకు హౌస్ కీపింగ్‌లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. 15 రోజుల పాటు విజయవంతంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వనున్నారు. ఈ నెల 8న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మొత్తం 76 మంది మహిళలు శిక్షణలో పాల్గొంటున్నారు.

హౌస్ కీపింగ్‌లో శిక్షణ పొందుతూ..

నమోదు ఇలా.. : 18 నుంచి 50 సంవత్సరాల లోపు ఉన్న మహిళలు తర్ఫీదు పొందవచ్చు. శిక్షణ అనంతరం జాబ్ మేళాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. రుణాలు అందించి వ్యాపార నిర్వహణకు తోడ్పాటు అందిస్తారు. ఆసక్తి ఉన్న వారు 29 గ్రామాల్లోని సీఆర్డీఏ ఫెసిలిటేటర్లను లేదా తుళ్లూరు సిల్క్ హబ్ కార్యాలయంలోని జీవనోపాధుల విభాగం అధికారులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చు.

స్థానికంగా ఉపాధి దొరుకుతుంది..

సీఆర్డీఏ ఆధ్వర్యంలో హౌస్ కీపింగ్‌లో శిక్షణ పొందుతున్నా. తరగతులకు హాజరయ్యేందుకు రవాణా భత్యం కూడా ఇస్తున్నారు. కోర్సు పూర్తయిన తర్వాత అమరావతిలో ఏర్పాటయ్యే పలు సంస్థల కార్యాలయాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది. పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం తప్పుతుంది.

-సుజాత, ఐనవోలు

వ్యాపార నిర్వహణలో మెలకువలు నేర్చుకున్నా..

కొత్తగా వ్యాపారం పెట్టుకొని ఉపాధి పొందాలనుకునే మహిళలకు సీఆర్డీఏ అందిస్తున్న నైపుణ్య శిక్షణ చక్కగా ఉపయోగపడుతుంది. వ్యాపార నిర్వహణ, ఆహార పదార్థాల తయారీ, కొనుగోలు, అమ్మకాలు, రుణాలు పొందటం, సంస్థల నిర్వహణపై శిక్షణ ఇస్తున్నారు.

-రమాదేవి, మందడం

చదివింది ఎంఎస్సీ పీహెచ్‌డీ.. బోధించేది వైద్య విద్యార్థులకు..!

- గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగేళ్లుగా పరిస్థితిదీ
- గత వైకాపా ప్రభుత్వంలో అడ్డగోలు నియామకంపై త్రిసభ్య కమిటీ విచారణ

ఈనాడు, అమరావతి: ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ చదివింది ఎంఎస్సీ పీహెచ్‌డీ. బోధిస్తోంది మాత్రం వైద్య విద్యార్థులకు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగేళ్లుగా ఈ పరిస్థితి నెలకొనగా.. తాజాగా ఈ అంశంపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. స్పందించిన డీఎంఈ.. త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణకు ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో 2020లో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారి జీఎంసీలోని వైద్య సూక్ష్మ జీవశాస్త్ర విభాగానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాన్ని చేపట్టారు. ఎంబీబీఎస్, ఎండీ వంటి కోర్సులు చదివిన వారిని కాకుండా.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పీహెచ్‌డీ చేసిన వారిని నియమించారు. దీనిపై అభ్యంతరం తెలుపుతూ నాటి వైద్య కళాశాల ప్రిన్సిపల్.. ఎస్ఆర్, ఇతర ప్రయోజనాలు సదరు అభ్యర్థికి కల్పించలేదు. తర్వాత ఆ అభ్యర్థి న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఎస్ఆర్‌తో సహా అన్ని ప్రయోజనాలు పొందారు. వైద్య కళాశాలలో మాత్రం సహచర బోధకుల నుంచి చాలాకాలంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్ఎంసీ పరిశీలకులు జీఎంసీలో తనిఖీలు చేసినప్పుడూ ఈ విషయాన్ని స్పష్టంగా నోట్ చేశారు. ఇటీవల వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు సదరు ఉద్యోగికి ఎగ్జామినేషన్ ఎవాల్యుయేషన్ బాధ్యతలు అప్పగించడం, క్యాంప్ ఆఫీసర్‌గానూ నియమించడం వివాదాస్పదమైంది. దీంతో మరోసారి అభ్యంతరాలు తెరపైకి వచ్చాయి. వ్యవహారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, డీఎంఈ కార్యాలయాల దృష్టికి వెళ్లడంతో ఇద్దరు ప్రిన్సిపాళ్లు, ఏడీఎంఈతో ప్రత్యేకంగా త్రిసభ్య విచారణ కమిటీని నియమించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి, సమగ్ర నివేదిక ఒకటి, రెండు రోజుల్లో అందించనున్నారు.

వంతెన పనులపై అధికారులకు సూచనలు చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

వ్యాపారులు, ప్రజలు అభివృద్ధికి సహకరించాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వ్యాపారులు, ప్రజలు అర్థం చేసుకుని అభివృద్ధికి సహకరించాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. గుంటూరులోని మిర్చియార్డు వద్ద జరుగుతున్న వంతెన, శంకర విలాస్ వంతెన అభివృద్ధి పనులను మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, రోడ్లు భవనాలు, రైల్వే శాఖ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. పెమ్మసాని మాట్లాడుతూ మిర్చియార్డు వద్ద వంతెన పనులు చాలా వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇక్కడ అన్న ఎన్టీఆర్ విగ్రహం అడ్డుగా ఉన్నందున ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు పక్కకు జరిపి ఏర్పాటు చేస్తామన్నారు. శంకర విలాస్ బ్రిడ్జి జీజీహెచ్ వైపు డిసెంబర్ 15వ తేదీలోగా ఏడు పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యేలా పనులు జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడం వల్ల కొంతమేర పనులకు జాప్యం కలిగిందన్నారు. తాము నిర్దేశించుకున్న లక్ష్యానికి ఇక్కడ నిర్మాణ పనులు నెల రోజులు వెనుకబడ్డాయని తెలిపారు. రెండో వైపు వ్యాపారులకు సంబంధించిన దుకాణాలు ఉన్నాయి. కొందరు ముందుకు వచ్చారు. మరికొందరు ఎక్కువ పరిహారం అడుగుతున్నారు. వారు అడుగుతున్నంత పరిహారం ఇవ్వడం సాధ్యం కాదు. వ్యాపారులు పరిస్థితి అర్థం చేసుకుని అభివృద్ధికి సహకరించేందుకు ముందుకు రావాలని కోరారు. మేయర్, కమిషనర్ వ్యాపారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని వివరించారు.

పెదపాలెం హైస్కూలులో కలుసుకున్న 1976-81 బ్యాచ్ విద్యార్థులు

జ్ఞాపకాల దొంతరలో స్నేహ పరిమళాలు

పెదపాలెం(దుగ్గిరాల), మంగళగిరి: నాలుగున్నర దశాబ్దాల చెరగని స్నేహం వారిది. కొందరు అత్యున్నత స్థాయిలో వెళితే మరికొందరు సాధారణ జీవనంలో ఉన్నారు. అయినా స్నేహం ముందు అవేవీ అడ్డుకాదని వారు నిరూపించారు. అరేయ్, ఒరేయ్ అన్న పిలుపులే ఆత్మీయ విన్యాసం. దుగ్గిరాల మండలం పెదపాలెంలోని శ్రీవాసిరెడ్డి వెంకటప్పయ్య గార్ల ఉన్నత పాఠశాలలో 1976-81 మధ్య చదివిన వారంతా ఆదివారం కలిశారు. అంత వయసులోనూ ఆడి పాడారు. తాము చదువుకున్న బెంచీలపై కూర్చొని అనుభూతి పొందారు. తమ జీవితంలోని జ్ఞాపకాల దొంతరలో మరో అధ్యాయాన్ని చేర్చుకున్నారు. రామ్మోహన్, కొల్లి శ్రీనివాసరెడ్డి, చక్రిరాల శ్రీనివాస్, రాధాకృష్ణ మిత్ర బృందం అందరినీ సమన్వయపరిచి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మంగళగిరి సీకే ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అంతా ఆదివారం ఒకే చోటకు చేరి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మంగళగిరి డీబీఎన్ గార్డెన్‌లో నిర్వహించిన సమ్మేళనానికి కుటుంబాలతో హాజరై ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

మంగళగిరి సీకే ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

కుమ్మర శాలివాహనులకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలి

నగరంపాలెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కుమ్మర శాలివాహనులకు రాజకీయ, ఆర్థిక, విద్యా తదితర రంగాల్లో తగు ప్రాధాన్యం కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బలాపురం భాస్కర శ్రీనివాస్ కోరారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో పేరేచర్లలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు రాజవరపు ఏడుకొండలు నేతృత్వంలో రాష్ట్ర అధ్యక్షుడు బలాపురం వెంకయ్య ఆదేశాల మేరకు కార్తిక సమారాధన వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న భాస్కర శ్రీనివాస్ మాట్లాడుతూ కుమ్మర శాలివాహనులు ఐక్యతతో మెలగాలన్నారు. ముందుగా డైనందినిని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంఘం యువజన విభాగం అధ్యక్షుడు పొరళ్ల అంకమ్మరావు, సభ్యుడు రాజవరపు రవి, సంఘం సభ్యులు, పెద్ద ఎత్తున సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

డైనందినిని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భాస్కర శ్రీనివాస్, ఏడుకొండలు తదితరులు

సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు జీవన సాఫల్య పురస్కారం

గుంటూరు సాంస్కృతికం: చరిత్రకారుడు, బహుగ్రంథ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉర్దూ అకాడమీ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రకటించింది. ప్రతి ఏడాది మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే విద్యా దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ముఖ్య కార్యనిర్వహణాధికారి షేక్ మహమ్మద్ గౌస్ పీర్ నుంచి నశీర్ అహమ్మద్ లేఖ అందుకున్నారు. ఈ పురస్కారం కింద రూ.25,000 నగదు, జ్ఞాపికతో ఆయనను సత్కరించనున్నారు. నవంబరు 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తదితర ప్రముఖుల సమక్షంలో పురస్కార గ్రహీతలను సన్మానించనున్నారు.

చిన్నారులు సృజనాత్మకత.. నైపుణ్యాలపై దృష్టి

పెదకాకాని, న్యూస్‌టుడే: చిన్నారులు సృజనాత్మకత, నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ సూచించారు. గుంటూరు జిల్లా నంబూరులోని వీవీఐటీ బాలోత్సవ్-2025 ముగింపు వేడుకల్లో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 'బాలోత్సవ్‌లో చిన్నారులు ప్రదర్శించిన ప్రదర్శనలు వేరే లోకంలోకి తీసుకెళ్లాయి. చిన్నారులు జీవితంలో కళలను భాగం చేసుకుంటే ఉన్నత స్థానానికి చేరుకుంటారు' అని పేర్కొన్నారు. విద్యాసంస్థల ఛాన్స్‌లర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ 'బాల వికాసం సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసేందుకు ఈ పోటీలు ఏర్పాటు చేశాం. మూడు రోజుల పాటు 20 అంశాల్లో 61 విభాగాల్లో వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొనగా, 25 వేల మంది ప్రేక్షకులు వచ్చారు' అని చెప్పారు. వేడుకల్లో వీవీఐటీ పాలకమండలి సభ్యుడు వాసిరెడ్డి విజయ్‌కుమార్, వైస్ ఛాన్స్‌లర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి, బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ కె.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బహుమతి ప్రదానం చేస్తున్న పాపినేని శివశంకర్, వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 2 నుంచి 5 వరకు జరిగిన పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో గుంటూరు జిల్లాకు చెందిన మహిళా పవర్ లిఫ్టర్లు సత్తా చాటారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సందానీ విలేకరులకు వెల్లడించారు. క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ 76 కేజీల విభాగంలో లిఖిత బంగారు, 80 కేజీల విభాగంలో లక్ష్మీ వినయశ్రీ బంగారు పతకం సాధించారు. ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ 47 కేజీల విభాగంలో షానూన్ వెండి, ప్లస్ 84 కేజీల విభాగంలో మాగం జ్ఞానదివ్య వెండి పతకం గెలుపొందారు.

విజేతలతో అసోసియేషన్ ప్రతినిధులు

వడ్లమూడి కోటయ్య చౌదరి ఛారిటబుల్ ట్రస్ట్ దాతృత్వం

122 మంది విద్యార్థులకు రూ.22.12 లక్షల విలువైన ఉపకార వేతనాల పంపిణీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వడ్లమూడి కోటయ్య చౌదరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 122 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.22.12 లక్షల విలువైన ఉపకార వేతనాలు అందించారు. తెనాలిలోని ఎన్జీవో కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ వడ్లమూడి గోవర్ధనరావు మాట్లాడారు. 'దివంగత వడ్లమూడి కోటయ్య చౌదరి ఈ ట్రస్ట్‌ను నెలకొల్పి ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమానికి పునాది వేశారు. గత 29 సంవత్సరాలుగా ఈ ట్రస్ట్ సేవలు అందిస్తుంది. ఇప్పటి వరకు 485 మంది విద్యార్థులకు రూ.2.07 కోట్లను అందించాం' అని పేర్కొన్నారు. గౌరవ అతిథులుగా హాజరైన విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఆచార్యులు ఘంటా సుధావాణి మాట్లాడుతూ.. 'విద్యార్థి దశను సద్వినియోగం చేసుకున్న వారు జీవితాల్లో ఉన్నత లక్ష్యాలను సాధిస్తారు. ఉత్తమ పౌరులుగా అటు దేశానికి ఇటు తమ కుటుంబాలకు, సమాజానికి సేవలు అందించగలుగుతారు. ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుని తర్వాతి తరంలోని విద్యార్థులకు చేయూతనిచ్చే స్థాయికి చేరాలి' అని ఆకాంక్షించారు. ట్రస్ట్ సభ్యులు వడ్లమూడి బసవప్రసాద్, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, కుటుంబ సభ్యులు, ట్రస్ట్ శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ట్రస్ట్ ప్రతినిధులు, అతిథులు

పక్షవాత లక్షణాలపై నిర్లక్ష్యం వద్దు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: పక్షవాతంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు గుర్తించిన వెంటనే నాలుగు గంటల వ్యవధిలోనే వైద్యులను సంప్రదించాలని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ సూచించారు. మంగళగిరి ఎయిమ్స్ ఆడిటోరియంలో ఆదివారం వైద్యులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. 'దేశంలో ఏటా 18 లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, ఒత్తిడి, ధూమపానం, అధిక బరువు వంటి లక్షణాలతో యువతలో కూడా వ్యాధి పెరుగుతోంది. ప్రజల్లో అవగాహన లోపం, చికిత్సలో జాప్యం వల్ల ప్రాణ నష్టం అధికమవుతుంది. ఆకస్మిక సమతుల్యం కోల్పోవడం, చూపు మందగించడం, ముఖం ఒకవైపు వంకర పోవడం, చేయి లేదా కాలు బలహీనత, మొద్దుబారడం, మాట తడబడటం, మాట్లాడలేకపోవడం వంటి లక్షణాలను గుర్తిస్తే స్ట్రోక్ వైద్యశాలకు తరలివెళ్లాలి' అని పేర్కొన్నారు. ఆ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ అరవిందశర్మ మాట్లాడుతూ పక్షవాతం బారిన పడిన వారికి ప్రాథమిక వైద్యం అందించడంలో గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇవ్వడం ద్వారా గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించవచ్చన్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ అలెక్స్ రిబేన్లో మాట్లాడుతూ మెదడు ఆరోగ్యాన్ని ముందస్తు పరీక్షల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ఎయిమ్స్ డీన్ డాక్టర్ దేసు రామమోహన్, వైద్యులు అశోక్‌వర్ధన్‌రెడ్డి, వివేక్ లంకా, సుధీర్ చక్రవర్తి, కుమార వేలు, రాజశేఖర్, రౌనక్ కుమార్ తదితరులు మాట్లాడారు. తొలుత డాక్టర్ విజయ జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభించారు.

జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, వైద్యులు

బస్సును ఢీకొన్న లారీ

డ్రైవర్లు, పలువురు ప్రయాణికులకు గాయాలు

మేడికొండూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ అద్దె బస్సును కంకర లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ప్రాణ నష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన మేడికొండూరు మండల పరిధిలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు విజయవాడ వెళ్తోంది. మండలంలోని కొర్రపాడు శివారు ఒక పెట్రోల్ బంకు వద్దకు వచ్చింది. అదే సమయంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న కంకర లారీ ఒక్కసారిగా బస్సును ముందు భాగంలో ఢీ కొట్టింది. భారీ శబ్దం రావడంతో ప్రయాణికులు అందరూ ఉలిక్కిపడ్డారు. ఆ ధాటికి సీట్లలో నుంచి ఒకరిపై ఒకరు పడిపోయారు. ప్రయాణికురాలు చిలకా రాణి ముఖానికి రక్తపు గాయమైంది. పలువురు అతి స్వల్పంగా గాయపడ్డారు. లారీ చోదకుడు బాబావలికి గాయాలు కావడంతో సత్తెనపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో రెండు వాహనాల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 66 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు చోదకుడు శ్రీను కాలికి తీవ్ర గాయమైంది. 108 వాహనంలో ఆయన్ను సత్తెనపల్లి ప్రాంతీయ ఆసుపత్రి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. జేసీబీ సాయంతో లారీ, బస్సును రోడ్డుపై నుంచి పక్కకు తీసి రాకపోకలను క్రమబద్ధీకరించారు. బస్సు కండక్టర్ సుంకా సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలపై అవగాహన అవసరం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వసక్యూలర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన వాక్‌థాన్‌ను ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్, సర్జన్ డాక్టర్ విజయ్‌కుమార్‌లు జెండా ఊపి ప్రారంభించారు. స్టేడియం వద్ద ప్రారంభమైన ప్రదర్శన లక్ష్మీపురం మీదుగా మదర్‌థెరెసా విగ్రహం వరకు సాగింది. డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ నేటి స్పీడ్ యుగంలో యువత అవగాహన లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని అధిగమించేందుకు ఎన్నో పద్ధతులు ఉన్నాయన్నారు. సర్జన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల రక్తనాళాలకు చెందిన వ్యాధులతో ఎంతో మంది బాధపడుతున్నారన్నారు. డాక్టర్లు సురేంద్ర, రత్నశ్రీ, ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్, కార్యదర్శి డాక్టర్ సాయికృష్ణ, జీజీహెచ్ ప్రొఫెసర్ రామకృష్ణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ తదితరులు పాల్గొన్నారు.

వాక్‌థాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న డాక్టర్లు నందకిషోర్, విజయ్‌కుమార్

కృష్ణానదిలో ఇద్దరు యువకుల గల్లంతు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం రాయపూడి సమీపంలోని కృష్ణా నదిలో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుళ్లూరు మండలం నేలపాడు సమీపంలో ఎన్‌సీసీ సంస్థ నిర్మిస్తున్న 'హ్యాపీ నెస్ట్ ప్రాజెక్ట్'లో పనిచేస్తున్న ఆరుగురు సిబ్బంది ఆదివారం సాయంత్రం రాయపూడి సమీపంలోని లాంచీల రేవు వద్దకు వెళ్లారు. వారిలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన పవన్ (24), ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన దినేష్ (23), మణికంఠ, పవన్ కల్యాణ్‌లు స్నానానికి దిగగా.. మిగిలిన ఇద్దరు గట్టుపైనే ఉన్నారు. ఈ క్రమంలో పవన్, దినేష్‌లు ప్రవాహ ఉద్ధృతికి నదిలో గల్లంతయ్యారు. నీటిలో కొట్టుకుపోతున్న వారిని స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అప్పటిదాకా తమతో పాటు సందడి చేసిన సహ ఉద్యోగులు నదిలో గల్లంతవడంతో మిగిలిన వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పవన్ స్టోర్ కీపర్‌గా పనిచేస్తుండగా.. దినేష్ అకౌంటెంట్‌గా ఉన్నారు. సమాచారం అందుకున్న తుళ్లూరు సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్సై కలగయ్య, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక జాలర్లతో సాయంతో మర పడవలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు.

మర పడవలతో గాలిస్తున్న జాలర్లు

అనుమానం పెనుభూతమై..

భార్యను హత్య చేసిన భర్త

క్రిష్ణవేణి

జిన్నారం (అమీన్‌పూర్): వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో భార్యను భర్త కొట్టి చంపిన ఘటన అమీన్‌పూర్ ఠాణా పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ నరేశ్ కథనం ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన చెవుల బ్రహ్మయ్య- క్రిష్ణవేణి (37) దంపతులు కొంతకాలంగా అమీన్‌పూర్ పట్టణం కేఎస్ఆర్ నగర్‌లో నివసిస్తున్నారు. క్రిష్ణవేణి కోహిర్ డీసీసీబీ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తుండగా, బ్రహ్మయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఇంటర్ చదివే పాప, ఎనిమిదో తరగతి చదువుతున్న బాబు ఉన్నారు. భార్యభర్తలకు ఒకరిపై ఒకరికి అనుమానం ఉంది. ఈ విషయమై తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. కోపంతో బ్రహ్మయ్య.. ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో క్రిష్ణవేణిని తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, 129, 140 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 238.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును(స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FOR SALE

నరసరావుపేట, Prime ఏరియా రన్నింగ్‌లో ఉన్న కిడ్స్ క్లాత్ & టాయ్స్ షాపు మెటీరియల్, గుడ్‌విల్‌తో సహా అమ్మకానికి కలదు. 91118 79555.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9553786677/9640496677.

REAL ESTATE

PROPERTY FOR SALE

GENERAL

Gunter Skamala Nagar House Site Of 960 Yards Located Opp Sairam Water Plant Beside Dimond Towers is for sale. Genuine Buyers Contact: 7382621835, 7799580787, 9848049588.

TO LET

COMMERCIAL

గుంటూరు, అరండల్‌పేట, 11/1వ లైను D.No:6-11-39, 1st Floor Backside Office/Residence అద్దెకు కలదు. Ph.No: 93983 26564, 73828 92714.

TO.LET

విద్యా సంస్థలకు, ఆఫీసులకు 12000 వేలు చ॥అ కమర్షియల్ స్పేసు అద్దెకు ఇవ్వబడును. దాసరి కమర్షియల్ కాంప్లెక్సు జె.పి.రోడ్,భీమవరం-2 94408 70986 94403 56099

SECOND SALE

24 గుమ్మములు, 55 కిటికీలు, డోర్స్‌తో సహా (10 సం॥ముల పాతవి) అమ్మబడును. Contact: ✆ 94408 70986, 94403 56099.

JOBS

Req. of DRA & Non DRA Banking Collections, Field Exec: 16K- 22K, Telecaller: 11K-15K+ Incen. @ Vijayawada ✆ 6304056516.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజినందు Computer Operator గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Any Degree, 55 WPH Typing Speed, MS Office Skills, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్ర: 8978480429.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు SR Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35,000/- నుండి 45,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering. వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్: 8978480429.

ఆర్మీ శ్రీను బ్యాటరీస్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన హెల్పర్స్ (5) మరియు సేల్స్‌పర్సన్స్ (5) కావలెను. ✆ 62814 94701, 73820 30370.

గుంటూరులోని ప్రముఖ కంపెనీ నందు అకౌంటెంట్ కావలెను. GST & TDS నాలెడ్జ్ must. రెజ్యూమ్ వాట్సాప్. 90528 77789. goodharvestspices@gmail.com

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

91.9 FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541 ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

నేడు డయల్ యువర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి డివిజన్ పరిధిలోని తెనాలి, పొన్నూరు, మంగళగిరి నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో వైద్య సేవలు, వసతుల్లో లోపాలు, వైద్యులు, సిబ్బంది, వైద్య పరికరాల కొరత వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? సమయపాలన పాటించకపోవడంతో రోగులు నిరీక్షించి నీరసానికి గురవుతున్నారా? అయితే 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించే ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొనండి. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చేపట్టాల్సిన చర్యలపై సూచనలు తెలియజేసేందుకు తెనాలి డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ అంగీకరించారు. ఇందుకు మీరు చేయాల్సిందల్లా మీ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలపై ఫోన్ చేసి తెలియజేయడమే.

ఫోన్ నంబరు 9849366772 **తేదీ** సోమవారం (10-11-2025) **సమయం** మధ్యాహ్నం 3 నుంచి 4 వరకు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు పట్టణ పరిధిలోని 20వ వార్డులో కాలిబాట వంతెన పగుళ్లిచ్చి ప్రమాదకరంగా ఉంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- షేక్ సత్తార్, 20వ వార్డు** ✔ మరమ్మతులు చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం. **-షేక్ హసీనా, సహాయ ఇంజినీరు**

? పొన్నూరు పట్టణ పరిధి 18వ వార్డులోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయి. దుర్వాసన వస్తోంది. **- ఎ.ప్రమోద్, 18వ వార్డు** ✔ వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసులు, ప్రజారోగ్యశాఖాధికారి**

? తెనాలి పట్టణ గురవయ్య కాలనీలో గాడిదల సంచారం అధికంగా ఉంది. **- హరికృష్ణ, స్థానికులు - గురవయ్య కాలనీ** ✔ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

? తెనాలి పట్టణ రామలింగేశ్వరపేట తోటవారి వీధి -1 చివర కుక్కలు గుంపులుగా నివాసం ఉంటూ వచ్చిపోయే వారి వెంట పడుతున్నాయి. **- స్థానికులు, రామలింగేశ్వరపేట** ✔ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్** ? రామలింగేశ్వరపేట భాగవతుల వారి వీధిలో విద్యుత్తు తీగలను చెట్లకొమ్మలు ముంచెత్తడంతో గాలి వచ్చినప్పుడల్లా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. **- శంకరావు, రామలింగేశ్వరపేట** ✔ చెట్ల కొమ్మలను తొలగింపజేస్తాం. **- బి.అశోక్‌కుమార్, విద్యుత్తు విభాగ డీఈ**

స్పందనకు వందనం

పట్టణ పరిధిలోని 7వ వార్డులో చెత్త పేరుకుందని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో చెత్త తొలగింపజేశారు. ★ 26వ వార్డులో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేశారు. - న్యూస్‌టుడే, పొన్నూరు, తెనాలి టౌన్

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం అంగలకుదురు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్లస్ ఒకేషనల్ విద్యార్థులు ఈ నెల 7న తెనాలి జేఎంజే మహిళా కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కొత్త ప్రాజెక్టుల విభాగంలో తొలి స్థానం సాధించారని అధ్యాపకులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

తెనాలి

• తెనాలి • పొన్నూరు

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను సన్మానించిన ఆర్యవైశ్య సంఘ నాయకులు

పొన్నూరు, న్యూస్‌టుడే: సమాజ సేవలో ఆర్యవైశ్యులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన వనసమారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్యాణ మండపం ప్రాంగణంలో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండి పేద ప్రజలకు సేవ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అనంతరం ఆర్యవైశ్య సంఘ నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు. సంఘం అధ్యక్షుడు కారుమూరి ప్రకాష్, కోట రవిశంకర్, తాడికొండ సుధీర్, లింగమల్లు మోహన్, విజయ్, హేమ సుందర గుప్తా, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ప్లాట్లు.. అనేక పాట్లు..!

దోమలు, మురుగుతో విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని స్థానికుల ఆందోళన

29వ వార్డులోని ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ ఎం.రమేష్‌బాబు

పొన్నూరు, న్యూస్‌టుడే

పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో టీచర్స్ కాలనీ, వీవర్స్ కాలనీ, ముబారక్‌నగర్, అంబేడ్కర్ నగర్, శ్రీనగర్ కాలనీ, నిడుబ్రోలు, క్యాబిన్‌పేట, రైలుపేట తదితర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో కొన్ని అడవులను తలపిస్తున్నాయి. ఆయా స్థలాల్లో పెరిగిన పిచ్చిచెట్లను తొలగించే ప్రక్రియ నిర్వహించడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని ఖాళీ స్థలాల యజమానుల సమాచారం అందుబాటులో లేకపోవడంతో చర్యలు తీసుకోలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు.

పట్టణం:	పొన్నూరు
వార్డులు:	31
కుటుంబాలు:	19,075
జనాభా:	61,500
ఖాళీ స్థలాల సంఖ్య:	1,338

వర్షం కురిస్తే చెరువులే..

ఖాళీ స్థలాలు కొన్ని పల్లంగా ఉండడంతో వర్షాలు కురిసినప్పుడు చెరువులను తలపిస్తున్నాయి. ఆ నీరు పోయే మార్గం లేక రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దోమలు పెరుగుతున్నాయని.. విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అప్పు చేసి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. వాటిలో మట్టి తోలించే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నోటీసులు ఇస్తున్నాం..

దీనిపై పొన్నూరు పురపాలక సంఘం కమిషనర్ ఎం.రమేష్‌బాబును న్యూస్‌టుడే వివరణ కోరగా.. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని.. పల్లపు ప్రాంతాల్లో మట్టి తోలించుకోవాలని చెబుతున్నామన్నారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పేదలకు అండగా ఉంటాం

పేదలకు అండగా ఉంటామని మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు సుద్దపల్లి నాగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యుదాఘాతంతో చేతిని కోల్పోయిన మూడో తరగతి విద్యార్థికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. సాధిక్, సునీల్, దిలీప్, భూషణం, రమేష్, సతీష్, వెంకటేశ్వర్లు, నాగబాబు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

వాడవాడలా కార్తిక వనసమారాధన

కాపు ఎంప్లాయిస్ వనసమారాధనలో మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: జైగౌడ, కాపు ఎంప్లాయీస్, యాదవ, అగ్నికుల క్షత్రియ, పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పలుచోట్ల నిర్వహించిన కార్తిక వనసమారాధన కార్యక్రమాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. కౌండిన్యుని జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలనే మీ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలుకు కృషి చేస్తానని గౌడులకు మంత్రి హామీనిచ్చారు. సామాజిక భవన నిర్మాణానికి కృషి చేస్తానని యాదవ సంఘీయులకు మాటిచ్చారు. కాలనీలో స్థలం కేటాయింపునకు సహకరిస్తానని అగ్నికుల క్షత్రియులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, భాజపా నాయకుడు చందు సాంబశివరావు, పొన్నూరు వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొన్నారు. ✿ పట్టణంలోని ఆర్టీసీ డిపో పరిధిలో నిర్వహించిన రజక సంఘీయుల వనసమారాధనలో 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

✿ రాజకీయ పార్టీలు యాదవులను అణచివేతకు గురి చేస్తూ ఓటు బ్యాంకుగా మార్చాయని బీసీవై పార్టీ వ్యవస్థాపకుడు బి.రామచంద్రయాదవ్ విమర్శించారు. ఆదివారం ఏఎంసీలో నిర్వహించిన యాదవ కార్తిక వనసమారాధనలో ఆయన పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సంఘీయులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగడానికి బీసీవై పార్టీ ఒక ఆయుధమని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జైగౌడ సంఘీయులు

బీసీవై పార్టీ వ్యవస్థాపకుడు రామచంద్రయాదవ్‌కు గజమాల వేస్తూ..

సమస్య వస్తే న్యాయ సేవా కమిటీని సంప్రదించండి

మాట్లాడుతున్న సివిల్ జడ్జి పి.వివేక్‌వర్ధన్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: విద్యార్థులకు నిత్య జీవితంలో ఏదైనా సమస్య వచ్చినపుడు భయపడకుండా మండల న్యాయసేవా కమిటీని సంప్రదించాలని ఒకటో అదనపు సివిల్ జడ్జి పి.వివేక్‌వర్ధన్ సూచించారు. 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి, తెనాలి మండల న్యాయసేవా కమిటీ ఛైర్మన్ డి.శ్రీనివాసులు ఆదేశాల ప్రకారం ఆదివారం ఎస్టీ గురుకులంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. పోక్సో, బాలకార్మికుల చట్టాల గురించి తల్లిదండ్రులు తెలుసుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని పేర్కొన్నారు. సాంకేతికతను దుర్వినియోగం చేయొద్దని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, ఒకటో పట్టణ ఎస్సై కోటేశ్వరమ్మ, గురుకులం హెచ్.ఎం.నిరీక్షణరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

పూజ చేస్తున్న గురుస్వామి, మాలధారులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణంలోని సుల్తానాబాద్‌లో ఆదివారం అయ్యప్ప స్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు.. గురుస్వామి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప మాలధారులు పాటలు ఆలపించారు. చెరుకూరి సురేష్‌బాబు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం

వ్రత పూజ చేస్తున్న భక్తులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా ఆదివారం శ్రీలక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు వ్రత పూజ విశిష్టతను వివరించారు. 155 మంది దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కె.శాయిబాబు, ఈవో వి.అనుపమ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

తెనాలి పట్టణ శివారులో కాలువ గట్టు వెంబడి నివాసం ఉంటున్న నిరుపేదలకు 'పర్ ది లీస్ట్ ఆఫ్ దెమ్' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దర్శకుడు దిలీప్‌రాజా, సంస్థ డైరెక్టర్ రావూరి సురేష్‌బాబు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మహాసభ విజయవంతానికి పిలుపు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 16న గుంటూరులో నిర్వహించనున్న ఆవాజ్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని నిర్వాహక ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఈ మేరకు స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

భవన నిర్మాణాల్లో 'ఉల్లంఘనలు'

కట్టడాలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: భవనాల క్రమబద్ధీకరణ పథకం(బీపీఎస్) కింద అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు తుది గడువు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీగా ప్రభుత్వం ప్రకటించిందని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. ఆ తరవాత నిర్మించే నూతన భవనాలను ప్లాను తీసుకుని నిర్మించుకోవాలని, ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని యజమానులకు చెబుతున్నారు. బీపీఎస్ జీవో రావడమే తరువాయి క్రమబద్ధీకరణ ప్రక్రియ మొదలవుతుందని చెబుతున్నారు. అయినా యజమానులు, బిల్డర్లు నిర్మాణ సామగ్రి బిగించి ప్లాను లేకుండా భవనాలు నిర్మించడం పరిపాటి అయింది.

నిబంధనల ప్రకారం చర్యలు..
- మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు

బీపీఎస్ పథకం అమలు తేదీని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. ఈ తేదీలోపు చేపట్టిన భవనాలు బీపీఎస్ కింద క్రమబద్ధీకరణ చేసుకోవచ్చు. ప్లాను తీసుకోని వాటిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

ఎక్కువ శాతం ప్లాను లేకుండానే..

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉన్నతాధికారులు ఇటీవల పట్టణ పరిధిలోని 47 వార్డు సచివాలయాల పరిధిలో ప్లాను తీసుకుని ఉల్లంఘించిన, ప్లాను తీసుకోకుండా నిర్మించిన భవనాలను 47 బృందాలతో తనిఖీ చేయించారు. వీటిలో ఎక్కువ శాతం బీపీఎస్ తేదీ తరవాత నిర్మించినట్లు తనిఖీల్లో బహిర్గతమైంది. ప్లాను లేకుండా మూడు, నాలుగు అంతస్తులు వేసే వారిని వదిలేసి సెంటులో నిర్మాణాలను అడ్డుకుంటున్నట్లు విమర్శలు విన్పిస్తున్నాయి. ఇటీవల మంత్రి నాదెండ్ల మనోహర్ ప్లాను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు.

తాగునీటి వృథా అరికట్టరూ

పట్టణంలోని వీఎస్ఆర్ ఎన్వీఆర్ కళాశాల వద్ద రోడ్డు పక్కన మ్యాన్‌హోల్‌లో నీరు పొంగి పక్కన కాలువలోకి వృథాగా పోతున్నాయి. నీటి వృథాను అడ్డుకట్ట వేయాలని పురపాలక అధికారులు, వార్డు సచివాలయాల ఉద్యోగులను స్థానికులు కోరుతున్నారు. అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన ముక్కుబడిగా సాగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

మంత్రి యోచనతో రూ. అరకోటి విలువైన స్థలం సద్వినియోగం

బుర్రిపాలెం రోడ్డు మధ్యలోని రేకుల షెడ్డును తొలగించి వేయించిన రోడ్డు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని గాంధీ ఇర్విన్ పార్కు, రైతుబజార్ వద్ద ఉన్న పురపాలిక రోడ్డులో ఆక్రమణ తొలగించి రోడ్డు వేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ మున్సిపల్ అధికారులను ఇటీవల ఆదేశించారు. అధికారులు రంగంలోకి దిగి ఆక్రమణదారులతో షెడ్డు ఖాళీ చేయించారు. మున్సిపల్ ఇంజినీర్లు ఖాళీ స్థలంలో రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేసి సుమారు రూ.7 లక్షలకు టెండర్ పిలిచి గుత్తేదారుకు అప్పగించారు. దీంతో సదరు గుత్తేదారు రోడ్డు నిర్మించారు. సుమారు రూ.50 లక్షల విలువైన 15 సెంట్ల పురపాలిక స్థలం సద్వినియోగం అయింది. విశాలమైన రహదారి అందుబాటులోకి వచ్చింది.

లక్ష కుంకుమార్చన.. బిల్వార్చన

చేబ్రోలు: ప్రత్యేక అలంకరణలో సహస్రలింగేశ్వర స్వామి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా ఆదివారం స్థానిక రామలింగేశ్వరపేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అమ్మవారికి, అర్చకులు స్వామివారికి వేర్వేరుగా లక్ష కుంకుమార్చన, బిల్వార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చేబ్రోలు, న్యూస్‌టుడే: చేబ్రోలులోని సహస్రలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం ఆరుద్ర నక్షత్ర పర్వదినం సందర్భంగా ఆదివారం స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మారేడు దళాలతో లక్ష బిల్వార్చన నిర్వహించారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో

ప్రవర్తన మార్చుకోండి

తెనాలి టౌన్: ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రవర్తనను మార్చుకోవాలని, మంచిగా ఉంటే రౌడీషీట్లు తొలగించుకునేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చని సీఐ సాంబశివరావు చెప్పారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

బీరు సీసాతో దాడి

తెనాలి టౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మద్యం దుకాణం వద్ద శనివారం జరిగిన గొడవలో తిరుమల అనే వ్యక్తిపై హరికుమార్ బీరు సీసాతో పొడిచాడని.. బాధితుడు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సృజన చాటి.. ప్రశంసలు పొంది..

విభిన్న వేషధారణలతో అలరించిన చిన్నారులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి వెస్ట్‌బెర్రీ పాఠశాలలో శనివారం ప్రారంభమైన లిటిల్ ఐడల్స్-2025 కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఫ్యాషన్ షో, ర్యాంప్ వాక్, నృత్యం, పాటలు, కథలు చెప్పడం, చిత్రలేఖనం వంటి విభిన్న అంశాల్లో చిన్నారులు సృజన చాటారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో చిన్నారులు హాజరయ్యారు. ప్రిన్సిపల్ టీవీ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

ప్రకటన

నా క్లయింటు అయిన శ్రీ లక్కింశెట్టి రాధాకృష్ణమూర్తి గారి కుమారుడు లక్కింశెట్టి సాంబశివరావు అను వారికి తెనాలి మండలం, నేలపాడు గ్రామ సర్వే నెంబరు: 492-1Bనందు య.1.06 సెంట్లు మరియు సర్వే నెం: 492-2రు నందు య.0.10 సెంట్లు వెరశి య.1.16సెంట్లు భూమి కలదు. సదరు భూమికి అడంగల్ నందు నమోదు చేయవలసివున్నది. సదరు విషయముపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరములు ఉన్న యెడల తెనాలి తహశీల్దారు వారికి 15 రోజుల లోపల తెలియజేయగలరు.

ఇట్లు : గాదెశెట్టి హరికుమార్, అడ్వకేట్

పెదకాకాని ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నేడు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకానిలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రస్తుతం వైకాపాకు చెందిన తుల్లిమిల్లి శ్రీనివాసరావు ఎంపీపీగా ఉన్నారు. వైకాపాకు చెందిన ఏడుగురు ఎంపీటీసీలు, తెదేపాకు చెందిన 6 ఎంపీటీసీలు సంతకాలు చేసి ఆయనపై అవిశ్వాసం ప్రకటించారు. దీంతో రిటర్నింగ్ అధికారిగా ఉన్న ఆర్డీవో కె.శ్రీనివాసులు నవంబరు 10వ తేదీ ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసే అత్యవసర సమావేశంలో ఎంపీపీ బలం నిరూపించుకోవాల్సి ఉంది. ఇప్పటికే సమావేశానికి సంబంధించి పెదకాకాని మండలంలోని 21 మందికి నోటీసులు ఇచ్చారు.

వేడెక్కిన రాజకీయం..

ఇప్పటికే ముగ్గురు వైకాపా ఎంపీటీసీలు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సమక్షంలో తెదేపా కండువాలు కప్పుకున్నారు. దీంతో తెదేపాకు చెందిన ఆరుగురు ఎంపీటీసీలు, వైకాపాకు చెందిన ముగ్గురు ఎంపీటీసీలతో బలం 9కి చేరింది. అవిశ్వాసం కోసం సంతకాలు చేసిన నలుగురు మాత్రం పార్టీ మారలేదు. ఎంపీపీ పీఠం దక్కాలంటే 13 మంది అనుకూలంగా ఓటు వేయాల్సి ఉంది. ఇప్పటికే కొందరు ఎంపీటీసీలను ముందస్తుగా అధికార, ప్రతిపక్ష పార్టీల వారు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

దండాలమ్మా.. గంగానమ్మ

గంగానమ్మ తల్లి

కొల్లిపర, న్యూస్‌టుడే: గంగానమ్మ కొలుపులతో కొల్లిపరలో ఆదివారం పండగ వాతావరణం నెలకొంది. తెల్లవారుజామునే భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పక్షం రోజులుగా పూజలు అందుకున్న ఘటాన్ని తలపై పెట్టుకుని డప్పు వాయిద్యాలతో గంగానమ్మ తల్లి ఆలయానికి చేర్చారు. మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు వేలాది సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. తల్లికి ధాన్యం, పట్టు వస్త్రాలు సమర్పించారు. మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తల్లిని దర్శించుకున్నారు. భక్తులకు దాతలు, స్థానిక నేతలు పెద్దఎత్తున మజ్జిగ, భోజన వసతులు కల్పించారు.

రెండు బైక్‌ల ఢీ: నలుగురికి గాయాలు

చింతలపూడి(దుగ్గిరాల), న్యూస్‌టుడే: దుగ్గిరాల నుంచి తెనాలి వెళ్లే ప్రధాన రహదారిలో చింతలపూడి వద్ద ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఈమనికి చెందిన దుడ్డి ప్రశాంత్, కారాబత్తిని శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. మరో ద్విచక్రవాహనంపై ఉన్న నందివెలుగుకు చెందిన జాన్‌సైదా, సీతారామయ్యల చేతికి, తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను రెండు 108 వాహనాల్లో తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి రైల్వే స్టేషన్ శివారులో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు తెనాలి రైల్వే పోలీసులు ఆదివారం తెలిపారు. రైలు వస్తున్న క్రమంలో ఒక్కసారిగా వచ్చి పట్టాలపై తల పెట్టడంతో మొండెం నుంచి తల వేరైందని.. మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

14 క్వింటాళ్ల చౌక బియ్యం స్వాధీనం

చేబ్రోలు, న్యూస్‌టుడే: పేదలకు అందాల్సిన చౌక బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తుండగా చేబ్రోలు పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. తెనాలికి చెందిన శ్రీనివాసరావు, మరో మహిళ శలపాడులో డీలర్ల వద్ద కొనుగోలు చేసిన బియ్యాన్ని తరలించేందుకు 10 బస్తాలు (5క్వింటాలు) ఓ ప్రాంతంలో నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో దాడిచేసి పట్టుకున్నారు. శనివారం అర్ధరాత్రి సుబ్బారావు అనే వ్యక్తి గుంటూరు నల్లచెరువు నుంచి బాపట్ల జిల్లా చుండూరులోని ఓ రైసు మిల్లుకు స్నేహితుడి వాహనంలో 9 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

మల్లన్న సన్నిధిలో కార్తిక శోభ

దీపారాధన చేస్తున్న భక్తులు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానానికి కార్తిక మాసం పురస్కరించుకొని ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున ఆలయంలోని యజ్ఞాల బావి వద్ద మహిళలు పుణ్యస్నానం ఆచరించి కార్తిక మాస దీపారాధన పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు క్యూలైన్లో బారులుదీరారు. ఆలయ అధికారులు వారికి తాగునీరు, పాలు ఉచితంగా పంపిణీ చేశారు. భక్తుల రద్దీ ఎక్కువ ఉండడంతో ఈవో గోగినేని లీలాకుమార్ అభిషేక పూజలు నిలిపేశారు. ఉచిత అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఈవో చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ ఒక్క రోజులో వివిధ సేవా టికెట్ల ద్వారా ఆలయానికి రూ.8 లక్షలు ఆదాయం వచ్చిందని ఆయన చెప్పారు.

కుటుంబాన్ని నడిపించగల శక్తి మహిళలదే

శలపాడు(చేబ్రోలు): స్త్రీ శక్తి సమాజాన్ని ముందుకు నడుపుతుందని మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు అవ్వారు లత అన్నారు. తెనాలిలోని సుల్తానాబాద్‌కు చెందిన శిశు మందిర్ పాఠశాల ఆధ్వర్యంలో చేబ్రోలు మండలం శలపాడులోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి మహిళా మండలి సమావేశం నిర్వహించారు. శిశుమందిర్ సమితి కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ.. సమాజంలో స్త్రీ ప్రాధాన్యతను వివరించారు. మహిళలంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సుగ్గుల సీతాదేవి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రైతు సంఘం డివిజన్ మహాసభ నేడు

తెనాలి(కొత్తపేట): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డివిజన్ మహాసభ ఈ నెల 10వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఐతానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య, సరస్వతమ్మ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

www.kimssikhara.com
KIMS SIKHARA HOSPITALS

కిమ్స్ శిఖర హాస్పిటల్స్ గుంటూరుకు చెందిన ప్రముఖ సీనియర్ కార్డియాలజిస్ట్ (గుండె వైద్యనిపుణులు) కన్సల్టేషన్ కొరకు తెనాలి లో అందుబాటులో ఉంటారు.

డా॥ నాగ శ్రీ హరిత పర్వతనేని
MD (Osm), DM (SVIMS), FESC, FSCAI, FACC
Ex. Associate Professor Guntur Medical College
Sr. Interventional Cardiologist
Director – Cardiac Sciences

ప్రతి మంగళవారం నాడు
సమయం: ఉ॥ 10 గం॥ నుండి సా॥ 6 గం॥ వరకు
అందుబాటులో ఉంటారు.
ECG, 2D Echo, TMT సదుపాయం కలదు

స్థలం : ఆశ్రిత సూపర్ స్పెషాలిటి కేర్
7-5-31, లెక్చరర్స్ కాలని, ప్రకాశం రోడ్, బ్యాంక్ ఆఫ్ బరోడా దగ్గర, గంగానమ్మపేట, తెనాలి.
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి.
ఫోన్ నెం: 97057 53356 | 99661 90493

(c) eenadu

నారీమణులై మెరిసేలా.. స్వశక్తితో ఎదిగేలా..

తుళ్లూరు, న్యూస్‌టుడే

రాజధాని మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సీఆర్డీఏ చర్యలు తీసుకుంటోంది. అమరావతిలో ఉద్యోగ, వ్యాపారాలు చేసుకొనేలా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందిస్తోంది. రాష్ట్ర నైపుణ్య శిక్షణ సంస్థ సహకారంతో మహిళలకు వ్యాపార నిర్వహణలో 26 రోజుల పాటు శిక్షణ అందిస్తున్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. ప్రస్తుతం అనంతవరం, తుళ్లూరు, మందడం, ఉండవల్లి, యర్రబాలెం, దొండపాడు, రాయపూడి, లింగాయపాలెం గ్రామాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

ఏం నేర్పిస్తారంటే.. : చిరు ధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ, బిస్కెట్లు, సంప్రదాయ ఆహార పదార్థాలు, స్వీట్లు, టైలరింగ్, బ్యూటీ పార్లర్, గార్డెనింగ్, వివిధ రకాల అల్పాహారాల తయారీలో నిపుణలతో శిక్షణ అందిస్తారు. అదేవిధంగా అమరావతిలోని ఏపీ వీఐటీ యూనివర్సిటీ సహకారంతో రాజధాని మహిళలకు హౌస్ కీపింగ్‌లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. 15 రోజుల పాటు విజయవంతంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వనున్నారు. ఈ నెల 8న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మొత్తం 76 మంది మహిళలు శిక్షణలో పాల్గొంటున్నారు.

హౌస్ కీపింగ్‌లో శిక్షణ పొందుతూ..

నమోదు ఇలా.. : 18 నుంచి 50 సంవత్సరాల లోపు ఉన్న మహిళలు తర్ఫీదు పొందవచ్చు. శిక్షణ అనంతరం జాబ్ మేళాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. రుణాలు అందించి వ్యాపార నిర్వహణకు తోడ్పాటు అందిస్తారు. ఆసక్తి ఉన్న వారు 29 గ్రామాల్లోని సీఆర్డీఏ ఫెసిలిటేటర్లను లేదా తుళ్లూరు సిల్క్ హబ్ కార్యాలయంలోని జీవనోపాధుల విభాగం అధికారులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చు.

స్థానికంగా ఉపాధి దొరుకుతుంది..

సీఆర్డీఏ ఆధ్వర్యంలో హౌస్ కీపింగ్‌లో శిక్షణ పొందుతున్నా. తరగతులకు హాజరయ్యేందుకు రవాణా భత్యం కూడా ఇస్తున్నారు. కోర్సు పూర్తయిన తర్వాత అమరావతిలో ఏర్పాటయ్యే పలు సంస్థల కార్యాలయాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది. పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం తప్పుతుంది.

-సుజాత, ఐనవోలు

వ్యాపార నిర్వహణలో మెలకువలు నేర్చుకున్నా..

కొత్తగా వ్యాపారం పెట్టుకొని ఉపాధి పొందాలనుకునే మహిళలకు సీఆర్డీఏ అందిస్తున్న నైపుణ్య శిక్షణ చక్కగా ఉపయోగపడుతుంది. వ్యాపార నిర్వహణ, ఆహార పదార్థాల తయారీ, కొనుగోలు, అమ్మకాలు, రుణాలు పొందటం, సంస్థల నిర్వహణపై శిక్షణ ఇస్తున్నారు.

-రమాదేవి, మందడం

చదివింది ఎంఎస్సీ పీహెచ్‌డీ.. బోధించేది వైద్య విద్యార్థులకు..!

- గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగేళ్లుగా పరిస్థితిదీ
- గత వైకాపా ప్రభుత్వంలో అడ్డగోలు నియామకంపై త్రిసభ్య కమిటీ విచారణ

ఈనాడు, అమరావతి: ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ చదివింది ఎంఎస్సీ పీహెచ్‌డీ. బోధిస్తోంది మాత్రం వైద్య విద్యార్థులకు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగేళ్లుగా ఈ పరిస్థితి నెలకొనగా.. తాజాగా ఈ అంశంపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. స్పందించిన డీఎంఈ.. త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణకు ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో 2020లో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారి జీఎంసీలోని వైద్య సూక్ష్మ జీవశాస్త్ర విభాగానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాన్ని చేపట్టారు. ఎంబీబీఎస్, ఎండీ వంటి కోర్సులు చదివిన వారిని కాకుండా.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పీహెచ్‌డీ చేసిన వారిని నియమించారు. దీనిపై అభ్యంతరం తెలుపుతూ నాటి వైద్య కళాశాల ప్రిన్సిపల్.. ఎస్ఆర్, ఇతర ప్రయోజనాలు సదరు అభ్యర్థికి కల్పించలేదు. తర్వాత ఆ అభ్యర్థి న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఎస్ఆర్‌తో సహా అన్ని ప్రయోజనాలు పొందారు. వైద్య కళాశాలలో మాత్రం సహచర బోధకుల నుంచి చాలాకాలంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్ఎంసీ పరిశీలకులు జీఎంసీలో తనిఖీలు చేసినప్పుడూ ఈ విషయాన్ని స్పష్టంగా నోట్ చేశారు. ఇటీవల వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు సదరు ఉద్యోగికి ఎగ్జామినేషన్ ఎవాల్యుయేషన్ బాధ్యతలు అప్పగించడం, క్యాంప్ ఆఫీసర్‌గానూ నియమించడం వివాదాస్పదమైంది. దీంతో మరోసారి అభ్యంతరాలు తెరపైకి వచ్చాయి. వ్యవహారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, డీఎంఈ కార్యాలయాల దృష్టికి వెళ్లడంతో ఇద్దరు ప్రిన్సిపాళ్లు, ఏడీఎంఈతో ప్రత్యేకంగా త్రిసభ్య విచారణ కమిటీని నియమించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి, సమగ్ర నివేదిక ఒకటి, రెండు రోజుల్లో అందించనున్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, వేదికపై ధనలక్ష్మి, కృష్ణారావు, తెదేపా నాయకులు

'జగన్ అరాచకాలను ప్రజలు మరిచిపోరు'

తాడికొండ, న్యూస్‌టుడే: 'వైకాపా హయాంలో కౌలు రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుంది. అధికార గర్వంతో ఆయన చేసిన అరాచకాలను ప్రజలు మర్చిపోరు. వైకాపా హయాంలో సాగునీటి ప్రాజెక్టుల పేరుతో సినిమా సెట్టింగులు వేశారు' అని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యార్డు ఛైర్మన్‌గా నీలాల ధనలక్ష్మి, డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో రైతుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల సమస్యలపై ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. గత పాలకులు రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేశారన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులు.. అధికార బలంతో వైకాపా నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలపై దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేశారని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మండిపడ్డారు. కారు డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని కనీసం పార్టీ నుంచి సస్పెండ్ చేయలేకపోయారని ఆరోపించారు. జగన్ పాలనలో రాష్ట్రంలో 282 మంది బీసీలు హత్యకు గురయ్యారన్నారు. తనపైనా 12 కేసులు పెట్టారన్నారు. తొలుత తెదేపా కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. చింతచెట్టు సెంటర్ వద్ద ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్... మార్కెట్ యార్డు ఛైర్మన్ నీలాల ధనలక్ష్మి, కృష్ణారావు దంపతులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెదపాలెం హైస్కూల్లో కలుసుకున్న 1976-81 బ్యాచ్ విద్యార్థులు

జ్ఞాపకాల దొంతరలో స్నేహ పరిమళాలు

పెదపాలెం(దుగ్గిరాల), మంగళగిరి: నాలుగున్నర దశాబ్దాల చెరగని స్నేహం వారిది. కొందరు అత్యున్నత స్థాయిలో వెలిగే వారైతే కొందరు సాధారణ జీవనంలో ఉన్నారు. అయినా స్నేహం ముందు అవేవీ అడ్డుకాదని వారు నిరూపించారు. ఆరేయ్, ఒరేయ్ అన్న పిలుపులే ఆత్మీయ విన్యాసాలు. దుగ్గిరాల మండలం పెదపాలెంలోని శ్రీవాసిరెడ్డి వెంకటప్పయ్యగార్ల ఉన్నత పాఠశాలలో 1976-81 మధ్య చదివిన వారంతా ఆదివారం కలిశారు. అంత వయసులోనూ ఆడి పాడారు. తాము కూర్చున్న బెంచీలపై సేద తీరి తన్మయత్వం పొందారు. తమ జీవితంలోని జ్ఞాపకాల దొంతరలో మరో అధ్యాయాన్ని చేర్చుకున్నారు. రామ్మోహన్, కల్లి శ్రీనివాసరెడ్డి, చక్రిరాల శ్రీనివాస్, రాధాకృష్ణ మిత్ర బృందం అందరినీ సమన్వయపరిచి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మంగళగిరి సీకే ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఒకే చోటుకు చేరి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మంగళగిరి డీబీఎస్ గార్డెన్‌లో నిర్వహించిన సమ్మేళనానికి కుటుంబాలతో హాజరై ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

మంగళగిరి సీకే ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

కుమ్మర శాలివాహనులకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలి

నగరంపాలెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కుమ్మర శాలివాహనులకు రాజకీయ, ఆర్థిక, విద్యా తదితర రంగాల్లో తగు ప్రాధాన్యం కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బలవురం భాస్కర శ్రీనివాస్ కోరారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో పేరేచర్లలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు రాజావు ఏడుకొండలు నేతృత్వంలో రాష్ట్ర అధ్యక్షుడు బలవురం వెంకయ్య ఆదేశాల మేరకు కార్తిక సమారాధన వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న భాస్కర శ్రీనివాస్ మాట్లాడుతూ కుమ్మర శాలివాహనులు ఐక్యతతో మెలగాలన్నారు. ముందుగా డైరీని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంఘం యువజన విభాగం అధ్యక్షుడు పొర్ల అంకమ్మరావు, సభ్యుడు రాజవరపు రవి, సంఘం సభ్యులు, పెద్ద ఎత్తున సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భాస్కర శ్రీనివాస్, ఏడుకొండలు తదితరులు

చిన్నారులు సృజనాత్మకత.. నైపుణ్యాలపై దృష్టి

పెదకాకాని, న్యూస్‌టుడే: చిన్నారుల సృజనాత్మకత, నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ సూచించారు. గుంటూరు జిల్లా నంబూరులోని వీవీఐటీయూ బాలోత్సవ్-2025 ముగింపు వేడుకల్లో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 'బాలోత్సవ్‌లో చిన్నారులు ప్రదర్శించిన ప్రదర్శనలు వేరే లోకంలోకి తీసుకెళ్లాయి. చిన్నారులు జీవితంలో కళలను భాగం చేసుకుంటే ఉన్నత స్థానానికి చేరుకుంటారు' అని పేర్కొన్నారు. వీవీఐటీ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ 'బాల వికాసం సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసేందుకు ఈ పోటీలు ఏర్పాటు చేశాం. మూడు రోజుల పాటు 20 అంశాల్లో 61 విభాగాల్లో వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొనగా, 25 వేల మంది ప్రేక్షకులు వచ్చారు' అని చెప్పారు. వేడుకల్లో వీవీఐటీయూ పాలకమండలి సభ్యుడు వాసిరెడ్డి విజయ్‌కుమార్, వైస్ ఛాన్సలర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి, బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ కె.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బహుమతి ప్రదానం చేస్తున్న పాపినేని శివశంకర్, వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

వడ్లమూడి కోటయ్య చౌదరి ఛారిటబుల్ ట్రస్ట్ దాతృత్వం

122 మంది విద్యార్థులకు రూ.22.12 లక్షల విలువైన ఉపకార వేతనాల పంపిణీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వడ్లమూడి కోటయ్య చౌదరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 122 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.22.12 లక్షల విలువైన ఉపకార వేతనాలు అందించారు. తెనాలిలోని ఎన్జీవో కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ వడ్లమూడి గోవర్ధనరావు మాట్లాడారు. 'దివంగత వడ్లమూడి కోటయ్య చౌదరి ఈ ట్రస్ట్‌ను నెలకొల్పి ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమానికి పునాది వేశారు. గత 29 సంవత్సరాలుగా ఈ ట్రస్ట్ సేవలు అందిస్తుంది. ఇప్పటి వరకు 485 మంది విద్యార్థులకు రూ.2.07 కోట్లను అందించాం' అని పేర్కొన్నారు. గౌరవ అతిథులుగా హాజరైన విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఆచార్యులు ఘంటా సుధావాణి మాట్లాడుతూ.. 'విద్యార్థి దశను సద్వినియోగం చేసుకున్న వారు జీవితాల్లో ఉన్నత లక్ష్యాలను సాధిస్తారు. ఉత్తమ పౌరులుగా అటు దేశానికి ఇటు తమ కుటుంబాలకు, సమాజానికి సేవలు అందించగలుగుతారు. ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుని తర్వాతి తరంలోని విద్యార్థులకు చేయూతనిచ్చే స్థాయికి చేరాలి' అని ఆకాంక్షించారు. ట్రస్ట్ సభ్యులు వడ్లమూడి బసవప్రసాద్, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, కుటుంబ సభ్యులు, ట్రస్ట్ శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ట్రస్ట్ ప్రతినిధులు, అతిథులు

పక్షవాత లక్షణాలపై నిర్లక్ష్యం వద్దు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: పక్షవాతంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు గుర్తించిన వెంటనే నాలుగు గంటల వ్యవధిలోనే వైద్యులను సంప్రదించాలని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ సూచించారు. మంగళగిరి ఎయిమ్స్ ఆడిటోరియంలో ఆదివారం వైద్యులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. 'దేశంలో ఏటా 18 లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, ఒత్తిడి, ధూమపానం, అధిక బరువు వంటి లక్షణాలతో యువతలో కూడా వ్యాధి పెరుగుతోంది. ప్రజల్లో అవగాహన లోపం, చికిత్సలో జాప్యం వల్ల ప్రాణ నష్టం అధికమవుతుంది. ఆకస్మిక సమతుల్యం కోల్పోవడం, చూపు మందగించడం, ముఖం ఒకవైపు వంకర పోవడం, చేయి లేదా కాలు బలహీనత, మొద్దుబారడం, మాట తడబడటం, మాట్లాడలేకపోవడం వంటి లక్షణాలను గుర్తిస్తే స్ట్రోక్ వైద్యశాలకు తరలివెళ్లాలి' అని పేర్కొన్నారు. ఆ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ అరవిందశర్మ మాట్లాడుతూ పక్షవాతం బారిన పడిన వారికి ప్రాథమిక వైద్యం అందించడంలో గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇవ్వడం ద్వారా గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించవచ్చన్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ అలెక్స్ రిబెన్లో మాట్లాడుతూ మెదడు ఆరోగ్యాన్ని ముందస్తు పరీక్షల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ఎయిమ్స్ డీన్ డాక్టర్ దేసు రామమోహన్, వైద్యులు అశోక్‌వర్ధన్‌రెడ్డి, వివేక్ లంకా, సుధీర్ చక్రవర్తి, కుమార వేలు, రాజశేఖర్, రౌనక్ కుమార్ తదితరులు మాట్లాడారు. తొలుత డాక్టర్ విజయ జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభించారు.

జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, వైద్యులు

బస్సును ఢీకొన్న లారీ

డ్రైవర్లు, పలువురు ప్రయాణికులకు గాయాలు

మేడికొండూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ అద్దె బస్సును కంకర లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ప్రాణ నష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన మేడికొండూరు మండల పరిధిలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు విజయవాడ వెళ్తోంది. మండలంలోని కొర్రపాడు శివారు ఒక పెట్రోల్ బంకు వద్దకు వచ్చింది. అదే సమయంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న కంకర లారీ ఒక్కసారిగా బస్సును ముందు భాగంలో ఢీ కొట్టింది. భారీ శబ్దం రావడంతో ప్రయాణికులు అందరూ ఉలిక్కిపడ్డారు. ఆ ధాటికి సీట్లలో నుంచి ఒకరిపై ఒకరు పడిపోయారు. ప్రయాణికురాలు చిలకా రాణి ముఖానికి రక్తపు గాయమైంది. పలువురు అతి స్వల్పంగా గాయపడ్డారు. లారీ చోదకుడు బాబావలికి గాయాలు కావడంతో సత్తెనపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో రెండు వాహనాల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 66 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు చోదకుడు శ్రీను కాలికి తీవ్ర గాయమైంది. 108 వాహనంలో ఆయన్ను సత్తెనపల్లి ప్రాంతీయ ఆసుపత్రి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. జేసీబీ సాయంతో లారీ, బస్సును రోడ్డుపై నుంచి పక్కకు తీసి రాకపోకలను క్రమబద్ధీకరించారు. బస్సు కండక్టర్ సుంకా సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



రెండు బైక్‌ల ఢీ నలుగురికి గాయాలు

చింతలపూడి (దుగ్గిరాల): దుగ్గిరాల నుంచి తెనాలి వెళ్లే ప్రధాన రహదారిలో చింతలపూడి వద్ద ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఈమనికి చెందిన దుడ్డి ప్రశాంత్, కారాబత్తిని శ్రీకాంత్‌కు తీవ్రంగా గాయపడ్డారు. మరో ద్విచక్రవాహనంపై ఉన్న నందివెలుగుకు చెందిన జాన్‌సైదా, సీతారామయ్యల చేతికి, తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను రెండు 108 వాహనాల్లో తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమస్యలపై అవగాహన అవసరం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వసక్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన వాక్‌థాన్‌ను ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్, సర్జన్ డాక్టర్ విజయ్‌కుమార్‌లు జెండా ఊపి ప్రారంభించారు. స్టేడియం వద్ద ప్రారంభమైన ప్రదర్శన లక్ష్మీపురం మీదుగా మదర్‌థెరెసా విగ్రహం వరకు సాగింది. డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ నేటి స్పీడ్ యుగంలో యువత అవగాహన లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని అధిగమించేందుకు ఎన్నో పద్ధతులు ఉన్నాయన్నారు. సర్జన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల రక్తనాళాలకు చెందిన వ్యాధులతో ఎంతో మంది బాధపడుతున్నారన్నారు. డాక్టర్లు సురేంద్ర, రత్నశ్రీ, ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్, కార్యదర్శి డాక్టర్ సాయికృష్ణ, జీజీహెచ్ ప్రొఫెసర్ రామకృష్ణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ తదితరులు పాల్గొన్నారు.

వాక్‌థాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న డాక్టర్లు నందకిషోర్, విజయ్‌కుమార్

సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు జీవన సాఫల్య పురస్కారం

గుంటూరు సాంస్కృతికం: చరిత్రకారుడు, బహుగ్రంథ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉర్దూ అకాడమీ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రకటించింది. ప్రతి ఏడాది మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే విద్యా దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ముఖ్య కార్యనిర్వహణాధికారి షేక్ మహమ్మద్ గౌస్ పీర్ నుంచి నశీర్ అహమ్మద్ లేఖ అందుకున్నారు. ఈ పురస్కారం కింద రూ.25,000 నగదు, జ్ఞాపికతో ఆయనకు సత్కరించనున్నారు. నవంబరు 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితర ప్రముఖులు పాల్గొని పురస్కార గ్రహీతలను సన్మానించనున్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 2 నుంచి 5 వరకు జరిగిన పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో గుంటూరు జిల్లాకు చెందిన మహిళా పవర్ లిఫ్టర్లు సత్తా చాటారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధానీ విలేకరులకు వెల్లడించారు. క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ 76 కేజీల విభాగంలో లిఖిత బంగారు, 80 కేజీల విభాగంలో లక్ష్మీ వినయశ్రీ బంగారు పతకం సాధించారు. ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ 47 కేజీల విభాగంలో షానూన్ వెండి, ప్లస్ 84 కేజీల విభాగంలో మాగం జ్ఞానదివ్య వెండి పతకం గెలుపొందారు.

విజేతలతో అసోసియేషన్ ప్రతినిధులు

కృష్ణానదిలో ఇద్దరు యువకుల గల్లంతు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం రాయపూడి సమీపంలోని కృష్ణా నదిలో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుళ్లూరు మండలం నేలపాడు సమీపంలో ఎన్‌సీసీ సంస్థ నిర్మిస్తున్న 'హ్యాపీ నెస్ట్ ప్రాజెక్ట్'లో పనిచేస్తున్న ఆరుగురు సిబ్బంది ఆదివారం సాయంత్రం రాయపూడి సమీపంలోని లాంచీల రేవు వద్దకు వెళ్లారు. వారిలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన పవన్ (24), ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన దినేష్ (23), మణికంఠ, పవన్ కల్యాణ్‌లు స్నానానికి దిగగా.. మిగిలిన ఇద్దరు గట్టుపైనే ఉన్నారు. ఈ క్రమంలో పవన్, దినేష్‌లు ప్రవాహ ఉద్ధృతికి నదిలో గల్లంతయ్యారు. నీటిలో కొట్టుకుపోతున్న వారిని స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అప్పటిదాకా తమతో పాటు సందడి చేసిన సహ ఉద్యోగులు నదిలో గల్లంతవడంతో మిగిలిన వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పవన్ స్టోర్ కీపర్‌గా పనిచేస్తుండగా.. దినేష్ అకౌంటెంట్‌గా ఉన్నారు. సమాచారం అందుకున్న తుళ్లూరు సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్సై కలగయ్య, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక జాలర్లతో సాయంతో మర పడవలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు.

మర పడవలతో గాలిస్తున్న జాలర్లు

అనుమానం పెనుభూతమై..

భార్యను హత్య చేసిన భర్త

క్రిష్ణవేణి

జిన్నారం (అమీన్‌పూర్): వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో భార్యను భర్త కొట్టి చంపిన ఘటన అమీన్‌పూర్ ఠాణా పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ నరేశ్ కథనం ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన చెవుల బ్రహ్మయ్య- క్రిష్ణవేణి (37) దంపతులు కొంతకాలంగా అమీన్‌పూర్ పట్టణం కేఎస్ఆర్ నగర్‌లో నివసిస్తున్నారు. క్రిష్ణవేణి కోహిర్ డీసీసీబీ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తుండగా, బ్రహ్మయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఇంటర్ చదివే పాప, ఎనిమిదో తరగతి చదువుతున్న బాబు ఉన్నారు. భార్యభర్తలకు ఒకరిపై ఒకరికి అనుమానం ఉంది. ఈ విషయమై తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. కోపంతో బ్రహ్మయ్య.. ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో క్రిష్ణవేణిని తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, 129, 140 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 238.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును(స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FOR SALE

నరసరావుపేట, Prime ఏరియా రన్నింగ్‌లో ఉన్న కిడ్స్ క్లాత్ & టాయ్స్ షాపు మెటీరియల్, గుడ్‌విల్‌తో సహా అమ్మకానికి కలదు. 91118 79555.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9553786677/9640496677.

REAL ESTATE

PROPERTY FOR SALE

GENERAL

Gunter Skamala Nagar House Site Of 960 Yards Located Opp Sairam Water Plant Beside Dimond Towers is for sale. Genuine Buyers Contact: 7382621835, 7799580787, 9848049588.

TO LET

COMMERCIAL

గుంటూరు, అరండల్‌పేట, 11/1వ లైను D.No:6-11-39, 1st Floor Backside Office/Residence అద్దెకు కలదు. Ph.No: 93983 26564, 73828 92714.

TO.LET

విద్యా సంస్థలకు, ఆఫీసులకు 12000 వేలు చ॥అ కమర్షియల్ స్పేసు అద్దెకు ఇవ్వబడును. దాసరి కమర్షియల్ కాంప్లెక్సు జె.పి.రోడ్,భీమవరం-2 94408 70986 94403 56099

SECOND SALE

24 గుమ్మములు, 55 కిటికీలు, డోర్స్‌తో సహా (10 సం॥ముల పాతవి) అమ్మబడును. Contact: ✆ 94408 70986, 94403 56099.

JOBS

Req. of DRA & Non DRA Banking Collections, Field Exec: 16K- 22K, Telecaller: 11K-15K+ Incen. @ Vijayawada ✆ 6304056516.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజినందు Computer Operator గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Any Degree, 55 WPH Typing Speed, MS Office Skills, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్ర॥ 8978480429.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు SR Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35,000/- నుండి 45,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering. వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్: 8978480429.

ఆర్మీ శ్రీను బ్యాటరీస్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన హెల్పర్స్ (5) మరియు సేల్‌పర్సన్స్ (5) కావలెను. ✆ 62814 94701, 73820 30370.

గుంటూరులోని ప్రముఖ కంపెనీ నందు అకౌంటెంట్ కావలెను. GST & TDS నాలెడ్జ్ must. రెజ్యూమ్ వాట్సాప్. 90528 77789. goodharvestspices@gmail.com

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541 ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

వనసమారాధనలు ఐక్యతకు సంకేతం

తాడేపల్లి, న్యూస్‌టుడే: వన సమారాధనలు ఐక్యతకు సంకేతమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. పెనుమాకలో ఆదివారం రాజధాని పారిశుద్ధ్య కార్మికుల వన మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షురాలు పద్మ నాయకత్వంలో కార్మిక కుటుంబాలు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు ఎం.రవి, జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, ఐద్వా కార్యదర్శి అరుణ, ఎస్ఎస్ చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

పెదనందిపాడు: స్థానిక అశోక ఉన్నత పాఠశాలలో ఆదివారం శ్రీసాయి సత్య ఆసుపత్రి వైద్యులు శ్రీనివాస నాయుడు, ప్రసన్న లక్ష్మీలు 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పాఠశాల డైరెక్టర్ లక్ష్మీ నారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నైపుణ్య బాట.. ఉపాధి పూదోట

ఒకేషనల్ కోర్సులతో విద్యార్థులకు ప్రయోజనం

దుగ్గిరాల, న్యూస్‌టుడే

రేవేంద్రపాడు జడ్పీ పాఠశాల బాలికలతో ఉపాధ్యాయురాలు కల్యాణి

వీరంతా పట్టుమని పదహారేళ్లు కూడా లేని వారు. ఔరా అన్పించేలా తమలోని సృజనాత్మకతకు మెరుగులు దిద్దుకుంటున్నారు. సాధారణ విద్యకు అనుబంధంగా హైస్కూళ్లలో జరుగుతున్న వృత్తి నైపుణ్య శిక్షణలో రాటుదేలుతున్నారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక అంశంలో ప్రతిభ సాధిస్తారు కాబట్టి తమ విద్య పూర్తి అయిన వెంటనే ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకునే వీలుంటుంది. కొందరు పదో తరగతితోనే విద్యను ఆపేసే పరిస్థితులు ఉంటాయి. వారికి ఒకేషనల్ కోర్సు అయిపోయిన వచ్చే సర్టిఫికెట్‌తో స్వయం ఉపాధి పొందుతారు.

ఏంటీ ఉపయోగం..

■ రేవేంద్రపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మూడు ఒకేషనల్ కోర్సులు ఉన్నాయి. వాటిలో ఒకటి 'అపారెల్'. ఉపాధ్యాయురాలు కల్యాణి పర్యవేక్షణలో బాలబాలికలు కుట్టులో శిక్షణ పొందుతున్నారు. ఈ కోర్సుతో పాలిటెక్నిక్..దాని నుంచి బీటెక్‌లో ప్రవేశం పొందచ్చు. భవిష్యత్తులో సొంతగా బొటిక్స్ నిర్వహించుకోవచ్చు.

■ దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షకురాలు బేబీషాలిని పర్యవేక్షణలో 'బ్యూటీ అండ్ వెల్‌నెస్' చర్మ పరిరక్షణపై విద్యార్థినులు అవగాహన పెంచుకున్నారు. దీని ద్వారా భవిష్యత్తులో సొంతగా బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేసుకోవచ్చు.

■ రేవేంద్రపాడు హైస్కూలు, దుగ్గిరాల బాలుర ఉన్నత పాఠశాలల్లో ఉన్న 'ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్' లో శిక్షణ పొందడం ద్వారా ఎలక్ట్రీషియన్‌గా ఉపాధి పొందవచ్చు. 'ఆటోమోటివ్స్' కోర్సు ద్వారా వాహనాల మరమ్మతుల నిర్వహణపై పట్టు సాధిస్తారు. తద్వారా స్వయం ఉపాధికి అవకాశం ఉంటుంది. సంబంధిత పరిశ్రమల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

రాష్ట్ర పోటీలకు ఎంపిక..

రేవేంద్రపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 'ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్' విభాగం విద్యార్థులు తయారు చేసిన 'రెసిడెన్షియల్ సింగిల్ ఫేజ్ హౌస్ వైరింగ్ కనెక్షన్, కోడింగ్ ప్రాజెక్టులకు జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచాయి. *దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఒకేషనల్ టీచర్ బేబీ షాలిని శిక్షణలో 'బ్యూటీ అండ్ వెల్‌నెస్' విభాగంలో పోటీపడి ప్రథములుగా నిలిచారు. ఆయా ప్రాజెక్టులు ఈ నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. అక్కడ విజయం సాధిస్తే రూ. 50 వేలు నగదు ప్రోత్సాహకం అందుతుంది.

ఏడో సబ్జెక్టుగా మార్కులు

ఈ విద్యాసంవత్సరం నుంచి పదోతరగతి పూర్తి అయిన వారికి వచ్చే మార్కుల ధ్రువీకరణపత్రంలో సాంఘికశాస్త్రం మార్కుల తర్వాత ఏడో సబ్జెక్టుగా ఒకేషనల్ ప్రాజెక్టుకు వచ్చిన మార్కులు కూడా ఇవ్వనున్నారు. మొత్తం 100 మార్కులలో 50 మార్కులకు థియరీ, మరో 50 మార్కులకు ప్రాక్టికల్స్ ఉంటాయి.

-ఝాన్సీ, ఉపాధ్యాయురాలు, రేవేంద్రపాడు

శ్రీకృష్ణుని ఆలయ పునరుద్ధరణకు చేయూత

రూ.5 లక్షల విరాళం ఇచ్చిన మంత్రి లోకేశ్

కమిటీ ప్రతినిధులకు నగదు అందజేస్తున్న తెదేపా నాయకులు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: యర్రబాలెం శ్రీకృష్ణుడి ఆలయం పునరుద్ధరణకు మంత్రి నారా లోకేశ్ రూ.5 లక్షలు విరాళం అందజేశారు. ఈ మేరకు ఆదివారం తెదేపా నాయకులు నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, తెదేపా మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, అమరావతి జేఏసీ నాయకుడు ఉమామహేశ్వరరావు, చావలి ఉల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో సత్తా

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో చినకాకానికి చెందిన బాలుడు సుంకర్ ధరణీశ్వర్ బంగారు, వెండి పతకాలు సాధించినట్లు కోచ్ మనోహర్ ఆదివారం తెలిపారు. ఇన్‌లైన్ ఫ్రీ స్టైల్ విభాగంలోని స్పీడ్, క్లాసిక్ పోటీలలో సత్తా చాటినట్లు చెప్పారు.

ఆత్మీయ వేడుక.. అపురూప కానుక

సందడిగా వన సమారాధనలు

దుగ్గిరాలలో బ్రాహ్మణ సామాజిక వర్గీయులు

తాడేపల్లి: ఇప్పటం గ్రామంలో గౌడ సంఘీయులు

డీబీఎన్ గార్డెన్‌లో దేవాంగుల సంఘం నాయకులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాలలో బ్రాహ్మణ వన సమారాధన స్థానిక శివాలయ ప్రాంగణంలో ఆదివారం అత్యంత వేడుకగా జరిగింది. తొలుత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. తెనాలికి చెందిన బాలికలు, మహిళలు అన్నమాచార్య సంకీర్తనలు, ఆలపించారు.

మంగళగిరి, న్యూస్‌టుడే: ఇప్పటం వద్ద మంగళగిరి నియోజకవర్గ గౌడ సామాజికవర్గ వన సమారాధన మహోత్సవం ఆర్గనైజింగ్ కన్వీనర్ డాక్టర్ పలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పాల్గొని మాట్లాడారు. పేద విద్యార్థులు ఐదుగురికి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా శేషగిరి, కౌండిన్య ట్రస్ట్ అధ్యక్షుడు నారాయణ, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది వాకా రాంగోపాల్ గౌడ, గౌరవ సలహాదారు జోగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి: అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బల్ల వెంకటరమణ, వ్యవస్థాపక అధ్యక్షుడు నక్కిన చిన వెంకట్రాయుడు ఆధ్వర్యంలో మంగళగిరి, తాడేపల్లి నగర పరిధిలోని డీబీఎన్ గార్డెన్‌లో దేవాంగుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. తొలుత వన మహోత్సవ పూజా కార్యక్రమాన్ని యుద్ధం అప్పారావు, పద్మ దంపతులు నిర్వహించారు. దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆప్కో మాజీ ఛైర్మన్ సజ్జా హేమలత తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఈమని గ్రామంలో ఆదివారం పురగిరి క్షత్రియ సామాజికవర్గ కార్తిక వనసమారాధన వేడుకగా జరిగింది. వ్రతం అనంతరం మహిళలు, బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. నారాకోడూరు హెచ్ఎం ముత్తే ఏడుకొండలు అధ్యక్షతన బహుమతులు ప్రదానం చేశారు. నందివెలుగుకు చెందిన శ్రీలక్ష్మి కూచిపూడి నృత్య పాఠశాల బృందం ప్రదర్శన ఆకట్టుకుంది.

చింతపల్లిపాడు(వట్టిచెరుకూరు): చింతపల్లిపాడు శివసాయి దేవాలయంలో ఆదివారం వట్టిచెరుకూరు మండల ఆర్యవైశ్య సంఘం కార్తిక వనసమారాధన జరిగింది. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యేల సుబ్బారావు, మండల అధ్యక్షుడు నున్నా నాగయ్య, కార్యదర్శి మోటమర్రి శంకర్‌లు హాజరు అయ్యారు.

ఈమనిలో పురగిరి క్షత్రియ వర్గీయులు..

చింతపల్లిపాడులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

ఏపీఆర్డీసీ డైరెక్టర్ హరిదాసుకు సత్కారం

హరిదాసుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోతినేని శ్రీనివాసరావు, కిరణ్‌చంద్ తదితరులు

మంగళగిరి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవీ ప్రమాణం చేసిన బత్తుల హరిదాసును తెదేపా నేతలు ఆదివారం ఘనంగా సత్కరించారు. విజయవాడలోని రహదారుల, భవనాల శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావుతో కలసి హరిదాసు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వగ్రామం నిడమర్రు నుంచి విజయవాడ వరకు తెదేపా శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించారు. గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, తెదేపా తాడేపల్లి మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్, తెలుగు రైతు పార్లమెంట్ అధ్యక్షుడు కళ్లం రాజశేఖరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గాదె పిచ్చిరెడ్డి, తోట పార్థసారథి, యర్రగుంట్ల భాగ్యారావు తదితరులు పాల్గొని అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందనకు వందనం

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ అడ్డరోడ్డు సమీపంలో విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయాయి. తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా తాడికొండ విద్యుత్తు శాఖ ఏఈ నాగమల్లేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా.. స్పందించి ట్రాక్టర్ సహాయంతో పాత స్తంభాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేయించారు. కండక్టర్లను మరమ్మతులు చేయించారు.

తాగు నీటి కష్టాలు తీర్చరూ..

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం దొండపాడు వద్ద నిర్మించిన టిడ్కో గృహాలకు తాగు నీరు సరిగా అందటం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచూ సరఫరా ఆగిపోతుందని చెబుతున్నారు. శనివారం తాగునీరు అందకపోవడంతో పంచాయతీ అధికారులకు చెప్పగా.. ఆదివారం అరకొరగా సరఫరా చేశారని, శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వామ్మో... ఇదేం రోడ్డు..

దుగ్గిరాల రైలుపేట నుంచి పీహెచ్‌సీ, కళాశాల, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లే దారి దయనీయంగా ఉంది. పలు చోట్ల లోతైన గుంతలు పడ్డాయి. కళాశాలకు వెళ్లే విద్యార్థులతో పాటు, ఆస్పత్రికి వెళ్లే వారు సైతం ఇబ్బంది పడుతున్నారు. పసుపు వ్యాపార రీత్యా ప్రాముఖ్యత ఉన్న యార్డుకు పలు గ్రామాల నుంచి ఈ మార్గాన వస్తుంటారు. వీరంతా 'ఈ గుంతలు పూడ్చండి మహాప్రభో' అని విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, దుగ్గిరాల**

పొంచి ఉన్న ప్రమాదం

మండలంలోని గరుడాచలపాలెం శివారు పొలాల్లో విద్యుత్తు స్తంభాలు వరసగా పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడాల్సి వస్తోందని, సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలను సరి చేయించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, ఫిరంగిపురం గ్రామీణం

దుగ్గిరాల: యాదవపాలెం రామాలయంలో..

ఇప్పటం శివాలయం వద్ద..

కొలనుకొండ వద్ద శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి

దీపోత్సవం.. భక్తుల పరవశం

తాడేపల్లి, దుగ్గిరాల, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా తాడేపల్లి మండలం ఇప్పటంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, దుగ్గిరాల మండలం యాదవపాలెం రామాలయం వద్ద ఆదివారం సాయంత్రం దీపోత్సవాలు వైభవంగా జరిగాయి. స్వామివార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగం, శంఖం, సుదర్శన చక్రం తదితర ఆకారాల్లో చేసిన దీపాల అలంకరణలు ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తాడికొండ: బడేపురం గ్రామంలోని కొండపై శివాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అన్నాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో శివలింగం రూపంలో దీపాలను వెలిగించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కీర్తనలు ఆలపించారు.

నాగులపాడు(పెదనందిపాడు): నాగులపాడులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారలు పోసి దీపారాధనలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు విశేష అలంకరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ..

ఫిరంగిపురం గ్రామీణం: వేములూరిపాడు గరువు కొండ వద్ద ఉన్న భక్తాంజనేయ దేవస్థానంలో ఆదివారం సీతారామ, లక్ష్మణ స్వామి విగ్రహాల వాయు ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

బడేపురం శివాలయంలో ..

కంచి కామకోటి పీఠంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం కొలనుకొండ వద్ద నూతనంగా నిర్మితమైన కంచి కామకోటి పీఠాన్ని జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆదివారం సందర్శించారు. పీఠంలో నిర్మించిన అతిథిగృహ ప్రవేశ కార్యక్రమంలో స్వామీజీ పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన గణపతి ఆలయం, హోమ మండపం, గోశాల, కల్యాణ మండపం, ఉపన్యాస వేదికలను పరిశీలించారు. గణపతి ఆలయంలో జరిగిన హోమంలో పాల్గొన్నారు. భక్తులకు దర్శనమిచ్చి ఆశీస్సులు అందజేశారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తిరిగి బయలుదేరి వెళ్లారు.

(c) eenadu

గుంటూరు తూర్పు

ఆకట్టుకున్న భక్తి గీతాలాపన

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై ఆదివారం రాత్రి భక్తిమాల పేరుతో నిర్వహించిన గీతాలాపన కార్యక్రమం ఆకట్టుకుంది. తొలుత ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇమ్మడి అంజనీదేవి, చింతలపాటి రమామహేశ్వరి, సోనాముఖి, పావని, హేమకుసుమ, లక్ష్మీదేవి, జీవనజ్యోతి, దుర్గ, పార్వతి, సుభాషిణి తదితరులు పలు కీర్తనలు ఆలపించారు. వీటికి డాక్టర్ తాతా గిరిజా శేషమాంబ స్వరకల్పన చేశారు. మల్లికార్జునరావు పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

స్పందనకు వందనం

కాలువల్లో పూడికతీత: షాప్ ఎంప్లాయీస్ కాలనీ ప్రధాన రోడ్డు పైడు కాలువల్లో పూడికలు చేరి మురుగునీరు నిలిచిపోవడంతో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. సమస్యను స్థానికుడు వినోద్ 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయించారు.

చెత్త కుప్పల తరలింపు: సీతానగరం రెండో లైన్‌లో చెత్త కుప్పలు రోజులుగా వదిలేయడంతో అపరిశుభ్రంగా ఉంది. సమస్యను స్థానికుడు మోహన్ 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేశాం. ఆయన సిబ్బందిని పంపి చెత్తకుప్పలు తీయించి తరలించారు. - న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)

12, 13 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: ఈ నెల 12, 13 తేదీల్లో పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగం జాగర్లమూడి వాటర్‌వర్క్స్ నుంచి తాగునీటి సరఫరా చేసే పైపులైన్లకు సుద్దపల్లి గ్రామం వద్ద లీకేజీలకు మరమ్మతులు చేయాల్సి ఉన్నందున బుధవారం ఉదయం 8 గంటల నుంచి సంగం జాగర్లమూడి ప్లాంటు పూర్తిగా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం, గురువారం ఉదయం నగరంలోని నాజ్‌సెంటర్ ఎల్ఎల్ఆర్, ఎల్బీ నగర్, బాలాజీనగర్ రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయరూ..!

నగరపాలకసంస్థ: సంగం జాగర్లమూడి వద్ద లీకేజీల మరమ్మతుకు బుధ, గురువారాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని అధికారులు ప్రకటన ఇచ్చారు. అయితే ఆదివారమే పలు ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా రాక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రైలుపేట, సాంబశివపేట, రాజాగారితోట ప్రాంతాల్లో కొన్ని లైన్లకు నీటి సరఫరా లేకపోవడంతో ఎద్దడి ఏర్పడింది. మరమ్మతు పనులు ఉన్నందున ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఇంకా పెరిగే అవకాశముంది. ఇంజినీరింగ్ అధికారులు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నీటి ఎద్దడి నెలకొన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది దౌర్జన్యంపై ఫిర్యాదు

గుంటూరు నేరవార్తలు: నగరంలోని ఓ షాపింగ్‌మాల్ వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది దౌర్జన్యం చేశారంటూ ఓ మహిళా న్యాయవాది నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు పేర్కొన్న వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేటలోని ఓ షాపింగ్‌మాల్ సమీపంలో రోడ్డు పక్కన నిలిపిన ద్విచక్రవాహనాలకు అక్కడి ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది తాళాలు వేసి వాహన చోదకులను ఇబ్బందులు పెడుతున్నారు. అదేమని అడిగిన తమపై దౌర్జన్యం చేశారని.. ఇలా అనేక మందిని ఇబ్బంది పెడుతున్న యాజమాన్యం, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి ఆమె వాహనానికి తాళాలు తీయించి పంపించారు. విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

మొండిగేటు కాలువ ఆధునికీకరణ ఎప్పుడు?

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

ఈ ఏడాది నగరంలో సాధారణ వర్షపాతం కంటే అదనంగా నమోదైంది. పలుమార్లు కుండపోతగా కురవడంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు అవస్థలు పడ్డారు. డ్రెయిన్ల స్థాయికి మించి వరదనీరు ప్రవహించడంతో రోడ్లను ముంచెత్తింది. తూర్పు నియోజకవర్గంలో నందివెలుగు రోడ్డులోని మొండిగేటు మీదుగా వెళ్లే ఔట్‌ఫాల్ డ్రెయిన్ ప్రధానమైంది. ఇక్కడ జీఎంసీ ఆధ్వర్యంలో పూడికతీత పనులు చేపడుతున్నట్లు ఏటా రూ.లక్షల్లో ఖర్చు చూపెడుతున్నా ఉపయోగం ఉండడంలేదు. భారీ వర్షాలు వచ్చినప్పుడు ఇక్కడ డ్రెయిన్ పూర్తి స్థాయిలో నిండిపోతుంది. దీనికితోడు పూడికలు మేటలు వేయడంతో నగరం నుంచి వరదనీరు బయటకు వెళ్లలేక నిలిచిపోతుంది. దీంతో నగరంలోని వినోబానగర్, జాకీర్‌హుస్సేన్‌నగర్, మారుతీనగర్, గాంధీనగర్, మణిపురం, వెంకట్రావుపేట, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాలవాసులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

పనులు చేస్తేనే ముంపు ముప్పు తప్పేది

నందివెలుగు రోడ్డులో ప్రధాన డ్రెయిన్

ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపితేనే.. ఏళ్లుగా మొండిగేటు సమస్య పరిష్కారం కోసం కౌన్సిల్ సమావేశాల్లో కార్పొరేటర్లు ప్రస్తావిస్తున్నా అధికారులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. అనేక కాలనీలను కలిపే డ్రెయిన్లు ఇక్కడి నుంచే ఔట్‌ఫాల్‌గా నగరం బయటకు వెళ్లనున్నందున అధికారులు వెంటనే దృష్టి సారించాల్సి ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి ఇక్కడ డ్రెయిన్ ఆధునికీకరణ పనులు చేపట్టేలా చొరవ చూపాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

పనులు చేపట్టేందుకు రైల్వే శాఖ అనుమతి కీలకం.. నందివెలుగు రోడ్డులోని రైల్వే లెవల్ క్రాసింగ్ పక్కగా ఈ ప్రధాన డ్రెయిన్ నగరం బయటకు వెళ్తోంది. ఇక్కడ పనులు చేపట్టేందుకు రైల్వే శాఖ అనుమతులు తప్పనిసరి. గతంలో జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పలుమార్లు రైల్వే అనుమతుల కోసం లేఖలు రాశారు. దీనికి రైల్వే శాఖ అడిగిన మరింత సమాచారం జీఎంసీ నుంచి ఇవ్వకపోవడంతో అప్పట్లో అనుమతులు ఆగిపోయాయి. తాజాగా మొండిగేటు ప్రధాన డ్రెయిన్ ఆధునికీకరణ ప్రాధాన్యం నేపథ్యంలో అధికారులు స్పందించి వెంటనే ఇక్కడ డ్రెయిన్ ప్రధాన సైడు గోడల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇక్కడ పనులు పక్కాగా పూర్తయితే వరదనీటి ముంపు సమస్యకు పూర్తిగా అడ్డుకట్ట పడుతుంది.

వన సమారాధన నిర్వహణ అభినందనీయం

పట్టాభిపురం: స్నేహ బంధంతో వన సమారాధన నిర్వహించడం అభినందనీయమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ పేర్కొన్నారు. డీఎస్సార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోటి గార్డెన్స్‌లో వన సమారాధన నిర్వహించారు. కులమతాలకు అతీతంగా వందలాది మంది స్నేహితులు కుటుంబ సభ్యులతో తరలివచ్చి ఉత్సాహంగా గడిపారు. శ్రీశైలం దేవస్థానం డైరెక్టర్ బోడేపూడి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ మన పెద్దలు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ సమ్మేళనం నిర్వహించుకోవడం ఎంతో ఆరోగ్యకరమన్నారు. భాష్యం విద్యా సంస్థల అధినేత రామకృష్ణ మాట్లాడుతూ డీఎస్సార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ద్వారా ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తంబోలా, మ్యూజికల్‌ఛైర్, త్రోబాల్, బాల్‌బాస్కెట్, డ్యాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు, రెరా సభ్యుడు దామచర్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు కొత్తపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు యర్రగుంట్ల అప్పారావు, గుర్రం బుల్లెయ్య పాల్గొన్నారు.

కోటి గార్డెన్స్‌లో మాట్లాడుతున్న మోహనకృష్ణ, వేదికపై వెంకట సుబ్బారావు తదితరులు

ముందు తవ్వేస్తాం.. మధ్యలో వదిలేస్తాం..

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాతగుంటూరులోని ఆంజనేయస్వామి గుడి రోడ్డు అధ్వానంగా మారింది. కొద్ది రోజుల కిందట అధికారులు ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా డ్రెయినేజీ పైపుల ఏర్పాటుకు రోడ్డు మధ్యలో తవ్వకాలు చేపట్టారు. రోజులు గడుస్తున్నా అధికారులు డ్రెయినేజీ పైపులు ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యలో చేసిన తవ్వకాల కారణంగా స్థానికులు ఇంటి నుంచి బయటకు రాలేకపోతున్నారు. రాత్రి వేళల్లో ఇళ్ల ముందు ద్విచక్రవాహనాల్ని నిలుపుదల చేయడానికి కూడా వీల్లేక కొందరు ఆంజనేయస్వామి గుడి సెంటర్‌లో పెడుతున్నారు. ఇదే అదనుగా గుర్తు తెలియని వ్యక్తులు వాహనాలను అపహరించుకుపోతున్నారని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తవ్వకాలు చేసిన ప్రాంతంలో డ్రెయినేజీ పైపులు ఏర్పాటు చేసి, రోడ్డును త్వరగా నిర్మించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: జనసేన పార్టీ 56వ డివిజన్ కార్పొరేటర్ అయిబెక్టి కనకదుర్గ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లో 'చాయ్ విత్ జనసైనిక్' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జనసేన రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావులు డివిజన్‌లో సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మూడు రైల్వే గేట్లతో ట్రాఫిక్ సమస్యతో పాటు స్థానికంగా ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు పేర్కొన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని, అందరికీ చేరువయ్యేలా స్థానిక నాయకులు చూడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ వడ్రాణం మార్కండేయబాబు, కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, సంకూరి శ్రీను, ఇర్రి ధనలక్ష్మి, యర్రంశెట్టి పద్మావతి, జిల్లా ఉపాధ్యక్షులు రాజు బిట్రగుంట మల్లిక, నాయకులు కట్టగంటి త్రిపుర, యర్రగోపు నాగేశ్వరరావు, శిఖ బాలు, పులిగడ్డ నాగేశ్వరరావు, గోపి, శేషతల్పసాయి, చామర్తి ఆనంద్‌సాగర్, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు

20 నుంచి సీపీఐ శతవార్షిక వేడుకలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ శత వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం ఆదివారం నిర్వహించారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా డిసెంబరు 26న ఖమ్మంలో జరగనున్న బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నవంబరు 18 నుంచి సామాజిక న్యాయంపై అన్ని పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు మాల్యాద్రి, హనుమంతరావు, అరుణ్‌కుమార్, సత్యనారాయణ, కుమార్, రంగారెడ్డి, అంజిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అజయ్‌కుమార్‌లను సత్కరించిన నాయకులు

అంబేడ్కర్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేయడంతోనే రాజకీయ పార్టీలు సరిపెడుతున్నాయని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు కె.శ్రీనివాసులు అన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో అంబేడ్కర్, జ్యోతిబా, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ ఆధ్వర్యంలో రచయిత ఆనంద్ తేల్ తుంబ్డే రచించిన ఐకానోక్లాస్ట్ పుస్తక సమీక్ష కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆచార్యులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఐకానోక్లాస్ట్ పుస్తకం అంబేడ్కర్ జీవిత చరిత్రకు అద్దం పడుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో రాజకీయ పార్టీలు కులాల పార్టీలుగా మారాయని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, వివిధ పార్టీల నాయకులు జయసుధ, సుధ, సిరిసీకాంత్, భావన్నారాయణ, చిప్పి, కోరివి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆచార్యులు శ్రీనివాసులు, వేదికపై మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్, జూపూడి ప్రభాకర్, చంద్రశేఖర్, విల్సన్

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

నగరపాలకసంస్థ: స్థానిక సమస్యలు, ప్రజాఫిర్యాదుల అర్జీలు స్వీకరించేందుకు సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా కమిషనర్ ఛాంబరులో డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో ఒంటి గంట వరకు నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

రోడ్లపై చెట్ల కొమ్మలు.. ప్రజలకు పాట్లు

కింగ్స్ హోటల్ సెంటర్‌లోని చర్చి పక్క రోడ్డులో ఇటీవల విద్యుత్తు శాఖ అధికారులు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల్ని తొలగించారు. అనంతరం రోడ్డుకు అడ్డుగా పడేశారు. దీంతో ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో మెకానిక్ షాపులు, ఆసుపత్రులు, సినిమా థియేటర్లు ఉండడంతో ప్రజల రాకపోకలు అధికం. రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల్ని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పట్నంబజారు

వ్యర్థాలు పేరుకుపోయినా తొలగించరా..!

లాలాపేట పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దాదాపు వారం రోజుల నుంచి అధికారులు ఈ ప్రాంతంలో వ్యర్థాల్ని తొలగించడం లేదు. వీటి నుంచి వెలువడే దుర్వాసన కారణంగా దుకాణాల్లో ఉండలేకపోతున్నామని వ్యాపారులు తెలిపారు. పేరుకుపోయిన వ్యర్థాల కారణంగా దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు నరేష్ తదితరులు అంటున్నారు. వ్యర్థాల్ని తొలగించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్నారు. అధికారులు స్పందించి వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - న్యూస్‌టుడే, పట్నంబజారు

ఆక్రమణల చెంత పాతబస్టాండు సెంటర్ రోడ్డు

పాతబస్టాండు సెంటర్ ఆక్రమణలకు నిలయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో పాటు, ఇదే ప్రాంతంలో ఆటోలు నిలుపుడం కారణంగా ఈ ప్రాంతంలో గంటలకొద్దీ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఆక్రమణల కారణంగా ఛాంబర్ కార్యాలయం వైపు నుంచి వచ్చే వాహనదారులు ద్విచక్ర వాహనదారుల్ని ఢీకొడుతున్నాయి. ఈ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించాలని పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ఆక్రమణల తొలగిస్తే.. రోడ్డు ప్రమాదాలు కొంత మేరకు తగ్గుతాయని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

ధర వరలు

ఎన్టీఆర్ రైతు బజారులో నిన్నటి ధరలు (కిలో రూ.ల్లో): టమాట 26, వంగ 48, బెండ 40, పచ్చిమిర్చి 25, కాకర 33, క్యారెట్ 72, క్యాబేజీ 28, బీర 30, దొండ 48, బంగాళదుంప 28, ఉల్లిపాయలు 17, గోరుచిక్కుడు 54, దోస 23, పొట్ల 38, చామదుంప 26, మునగ 8, గోంగూర 10, తోటకూర 20, చుక్కకూర 19, కొత్తిమీర 30, బీట్‌రూట్ 44, కీర 34, క్యాప్సికం 64, అల్లం 80, ఫ్రెంచి బీన్స్ 74, సొర 28, అరటి 7.
-న్యూస్‌టుడే, పట్నంబజారు

పేదల ఉన్నతికి అందరూ కృషి చేయాలి

పట్నంబజారు, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ సాయం చేయాలని లైఫ్ టైం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రత్తి వెంకట నారాయణ అన్నారు. లైఫ్ టైం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రత్తి వెంకట నారాయణ మాట్లాడుతూ పేదలు ఈ తరహా సేవల్ని వినియోగించుకోవాలన్నారు. గౌరవ అధ్యక్షుడు మట్టుపల్లి శ్రీనివాస చరణ్ మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పేదలకు అన్నపూర్ణ పథకం కింద ఆహారంతో పాటు, నిత్యావసర సరకులు అందజేస్తున్నామన్నారు. మిగిలిన సేవా సంస్థలు ఈ తరహా సేవల్ని ఆదర్శంగా తీసుకొని పేదలకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బచ్చు గణేష్, నేరెళ్ల శ్రీనివాసరావు, వైభవ్ నాగేశ్వరరావు, సాతులూరి ప్రకాశరావు, గజవల్లి శ్యాం సుందర్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న వెంకట నారాయణ, శ్రీనివాస చరణ్

నిర్దేశిత సమయానికి పనులు పూర్తి కావాల్సిందే

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్దేశిత సమయానికి నాణ్యత, ప్రమాణాలతో పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుడంపాడు, ఏటుకూరు, పొత్తూరు, నాయుడుపేట ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం ఆయన అధికారులకు సూచనలిచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ సీసీ రహదారులు, డ్రెయిన్లను ప్రమాణాల మేరకు క్యూరింగ్ చేశాకే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించబోమని, నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లింపులు చేయబోమని తెలిపారు. పనులు పూర్తయ్యాక తప్పకుండా సదరు గుత్తేదారు నిర్మాణ వ్యర్థాలు తొలగించాలని ఆదేశించారు. ప్రతి అభివృద్ధి పనిని తామే తనిఖీ చేసి, ప్రమాణాల మేరకు ఉంటే బిల్లులు చెల్లింపు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రహదారుల ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రణాళికాధికారులను ఆదేశించారు. పర్యటనలో ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ శ్రీనివాసులు

వడ్డెర సంక్షేమ సంఘ నగర ఉపాధ్యక్షుడిగా సురేష్

గోరంట్ల, న్యూస్‌టుడే: అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడిగా తమ్మిశెట్టి సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు మహేష్‌బాబు నుంచి సురేష్ ధ్రువపత్రం అందుకున్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

పట్నంబజారు, న్యూస్‌టుడే: కొత్తపేటలోని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి ఆధ్వర్యంలో 105 మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర సరకులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ మాట్లాడుతూ సంస్థలు అందించే సేవల్ని పేదలు వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో పోలేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, మాదాల ప్రకాష్, పలకలూరి శివరావు, ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం అందిస్తున్న మామిడి మురళీకృష్ణ

చిరస్మరణీయుడు మిరియాల వెంకట్రావు

వెంకట్రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభాకర్‌రావు, నాగేశ్వరరావు, సదాశివరావు, వెంకట్రావు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కాపునాడు వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల వెంకట్రావు సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్‌రావు అన్నారు. నెహ్రూనగర్‌లో రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షుడు యర్రగోపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మిరియాల వెంకట్రావు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాపునాడు సంయుక్త కార్యదర్శి రాగం సదాశివరావు, జోన్-3 అధ్యక్షుడు బొందలపాటి వెంకట్రావు, నాయకులు మార్కెట్ శ్రీను, శేషతల్పసాయి, యర్రగోపు వాసు, వినోద్, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

వారానికో రోజు..

సందడిగా గుంటూరు నగరవనం

మారుతీనగర్(గుంటూరు), న్యూస్‌టుడే

నగర ప్రజలు వారాంతంలో మానసిక ప్రశాంతతకు కుటుంబ సభ్యులతో కలిసి శివారు ప్రాంతాలకు వెళుతున్నారు. ఉదయమే అక్కడకు చేరుకుని ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నారు. చిన్నా పెద్దా అని తేడా లేకుండా ఆటపాటలతో ఉత్సాహం నింపుకొంటున్నారు. ఎత్తయిన కొండలు, లోయలు, పచ్చని చెట్లు, పక్షుల కిలకిలారావాలతో నిండి ఉన్న గుంటూరు శివారులోని పేరేచర్ల నగరవనం వారికి స్వాగతం పలుకుతోంది. కార్తిక వన భోజనాలకు అనువైన ప్రదేశం కావడంతో ఈ ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుంటూరు శాఖ ఆధ్వర్యంలో 120 మంది ట్రెక్కింగ్, వన భోజనాలకు వెళ్లి సందడి చేశారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

తొలుత ఒకరినొకరు పరిచయం చేసుకుని ట్రెక్కింగ్ చేశారు. ఎత్తయిన కొండ ఎక్కేటప్పుడు ఒకరినొకరు సహకరించుకుంటూ ముందుకు సాగారు. స్వచ్ఛమైన గాలిని పీల్చుతూ ఉపశమనం పొందారు. స్వీయ చిత్రాలు, డార్ట్‌బాల్, మ్యూజికల్‌ఛైర్స్, డ్యాన్స్ ఫ్రీజ్ గేమ్, సిటప్‌గేమ్, నృత్యాలతో ఆహ్లాదంగా గడిపారు. ఊయ్యాల ఊగుతూ చిన్ననాటి రోజులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అనంతరం వనభోజనాలు చేశారు. శివాజీ కాలంలో ప్రాచుర్యం పొందిన లిజిమ్ అనే సంప్రదాయ నృత్యాన్ని గురువు కల్యాణ్ శిక్షణ ఇచ్చారు.


శిఖరంపై ట్రెక్కర్స్

మూడు నెలల నుంచి వెళుతున్నా..
- వికాస్, లావణ్య (దంపతులు), సమన్వి(కుమార్తె), గోరంట్ల

ప్రతి నెలా రెండో ఆదివారం యూత్ హాస్టల్స్ అసోసియేషన్ నిర్వహించే ట్రెక్కింగ్‌కు గత మూడు నెలల నుంచి వెళుతున్నాం. పరిటాల, కొండపల్లి వెళ్లాం. కొండ ఎక్కుతున్నప్పుడు వచ్చే నొప్పులు ప్రశాంతమైన గాలితో మరచిపోతున్నాం. దీని వల్ల శారీరకంగా, మానసికంగా ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. ఎప్పుడు రెండో ఆదివారం వస్తుందా? అని ఎదురు చూస్తున్నాం. పాఠాలు కూడా ఎంతో బాగా అర్థం కావడంతో పాటు అవి గుర్తుంటున్నాయని సమన్విత చెప్పింది.

భయం పోయింది:
బి.రాజ్యలక్ష్మి, కొరిటెపాడు

గృహిణిగా ఉంటూ ఈశా సంస్థకు వాలంటీర్‌గా పనిచేస్తున్నా. ఇంట్లో పని ఒత్తిడిని ఉపశమనం పొందడానికి ట్రెక్కింగ్ చక్కగా ఉపయోగపడుతోంది. ప్రకృతి అంటే నాకు చాలా ఇష్టం. ఈ అసోసియేషన్‌లో చేరిన తర్వాత ప్రతి ట్రెక్‌కు వెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నా. ఎత్తైన ప్రదేశాల నుంచి కిందకు చూస్తే ఇంతకుముందు భయం వేసేది. కానీ నిర్వాహకుల ధైర్యం చెప్పడంతో భయం పోయింది.

సమైక్యతకు వన సమారాధనలు దోహదం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కార్తిక వన సమారాధనలు ఆధ్యాత్మికతతో పాటు సమైక్యతకు దోహదపడతాయని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గుంటూరు బ్రాడీపేట బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బుచ్చిరాం ప్రసాద్ మాట్లాడుతూ సమితి పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహకాలు అందజేయడంతో పాటు పిల్లలకు ఉచితంగా ఉపనయనాలు నిర్వహిస్తుండడం ప్రశంసనీయమన్నారు. అనంతరం రుద్రాభిషేకం, బిల్వార్చన, విష్ణు, లలితా సహస్రనామ పారాయణలు నిర్వహించారు. గజల్ శ్రీనివాస్ గానాలాపన చేశారు. పిల్లలు, పెద్దలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులందించారు. సమితి అధ్యక్షుడు నందిరాజు పాండురంగరావు, కార్యదర్శి రంగావజ్ఝల లక్ష్మీపతి, సమన్వయకర్త కర్లపాలెం బాలకృష్ణ, సహ సమన్వయకర్త మాదాల వెంకటకృష్ణ, వెలగలేటి గంగాధర్ తదితరులు పర్యవేక్షించారు.


సన్మానం అందుకుంటున్న గజల్ శ్రీనివాస్

IN THE COURT OF THE XIII Addl DISTRICT JUDGE NARASARAOPET
IA 744/23, IA 745/23, IA 746/23, IN OS 40/2013

Between:
మోదడగు ఆంజనేయులు (లేట్) మరియు ఇతరులు
... పిటీషనరులు/వాదులు
And
కొప్పురావూరి వెంకటస్వామి @స్వాములు మరియు ఇతరులు
... రెస్పాండెంట్సు/డిఫెండెంట్స్

TO
1.(R13) యండ్రాప్రగడ లక్ష్మీకుమారి, భర్త: శ్రీనివాసరావు, గృహిణి, సంగడిగుంట, గుంటూరు నగరం మరియు జిల్లా.
2.(R17) బొలిశెట్టి సరస్వతి, భర్త: నాగభూషణరావు, గృహిణి, ఇంటి నెం.11-847, 2వ లైను, మురళిస్వామి నగర్, నగరాలు, గోరంట్ల, గుంటూరు నగరం మరియు జిల్లా.

సదరు పై నెంబరు దావాలోని వాదులు ప్రతివాదులుపైన దావా దాఖలు చేయగా సదరు దావాలోని పిటీషను/ IA 744/23, IA 745/23, IA 746/23 లలో శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఇప్పటికే మీకు చాలాసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున మీకు శ్రీ కోర్టువారు పేపర్ పబ్లికేషన్ ద్వారా సమను పంపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు పై కోర్టువారి ఎదుట తేది.5.12.2025న 10.30 నిమిషాలకు మీరు మీ ప్లీడరు గారి ద్వారా హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలియజేయగలరని లేని యెడల మీ పరోక్షంలో IA 744/23, IA 745/23, IA 746/23 IN OS 40/2013 లు తీర్మానించబడును.

శ్రీ M.శ్రీనివాసరావు,
అడ్వకేట్, నరసరావుపేట

(c) eenadu

గుంటూరు పశ్చిమ

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక మారుతీనగర్ కంచి కామకోటి పీఠ మారుతీ దేవాలయ ప్రాంగణంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం జరిగింది. పలువురు భక్తులు పాల్గొన్నారు. ఆలయ పాలకమండలి కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న కీర్తనల గానం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై ఆదివారం రాత్రి భక్తి మాల పేరుతో నిర్వహించిన గీతాలాపన కార్యక్రమం ఆకట్టుకుంది. తొలుత ఆలయపాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యమ్మడి అంజలీదేవి, చింతలపాటి రమామహేశ్వరి, సోనామఖి, పావని, హేమక సుమ, లక్ష్మీదేవి, జీవనజ్యోతి, దుర్గ, పార్వతి, సుభాషిణి, యశోద, ఉష, ఉమ, నాగరవళి, లోకేశ్వరి, భారతి, కామాక్షి, సుజాత, లక్ష్మీకుమారి, భారతి, మురళీకృష్ణ, బ్రహ్మేశ్వరిలు పలు కీర్తనలు ఆలపించారు. వీటికి డాక్టర్ తాతా గిరిజా శేషమాంబ స్వరకల్పన చేశారు. మల్లికార్జునరావు పర్యవేక్షించారు.

ధర వరలు

(కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 26, వంగ 68, బెండ 34, పచ్చిమిర్చి 28, కాకర 56, బీర 34, కాలీఫ్లవర్ 25, క్యాబేజీ 28, క్యారెట్ 72, దొండ 46, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 58, దోస 24, సొర 40, పొట్ల 36, అరటికాయ 7, పెద్దచిక్కుళ్లు 84, చామదుంప 26, మునగ 10, బీట్‌రూట్ 44, కీరదోసకాయ 44, బీన్స్ 70, క్యాప్సికమ్ 64, కొత్తిమీర 30, ఆకుకూరలు 20, నిమ్మకాయలు 28, అల్లం 80, వెల్లుల్లి 110.

వారానికో రోజు..

సందడిగా గుంటూరు నగరవనం

శిఖరంపై ట్రెక్కర్స్

మారుతీనగర్(గుంటూరు), న్యూస్‌టుడే: నగర ప్రజలు వారాంతంలో మానసిక ప్రశాంతతకు కుటుంబ సభ్యులతో కలిసి శివారు ప్రాంతాలకు వెళుతున్నారు. ఉదయమే అక్కడకు చేరుకుని ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నారు. చిన్నా పెద్దా అని తేడా లేకుండా ఆట పాటలతో ఉత్సాహం నింపుకొంటున్నారు. ఎత్తయిన కొండలు, లోయలు, పచ్చని చెట్లు, పక్షుల కిలకిలారావాలతో నిండి ఉన్న గుంటూరు శివారులోని పేరేచర్ల నగరవనం వారికి స్వాగతం పలుకుతోంది. కార్తీక వన భోజనాలకు అనువైన ప్రదేశం కావడంతో ఈ ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుంటూరు శాఖ ఆధ్వర్యంలో 120 మంది ట్రెక్కింగ్, వన భోజనాలకు వెళ్లి సందడి చేశారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

తొలుత ఒకరికొకరు పరిచయం చేసుకుని ట్రెక్కింగ్ చేశారు. ఎత్తయిన కొండ ఎక్కేటప్పుడు ఒకరినొకరు సహకరించుకుంటూ ముందుకు సాగారు. స్వచ్ఛమైన గాలిని పీల్చుతూ ఉపశమనం పొందారు. స్వీయ చిత్రాలు, డార్ట్‌బాల్, మ్యూజికల్‌చైర్స్, డ్యాన్స్‌ఫ్రీజ్ గేమ్, సిటప్‌గేమ్, నృత్యాలతో ఆహ్లాదంగా గడిపారు. ఉయ్యాల ఊగుతూ చిన్ననాటి రోజులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అనంతరం వనభోజనాలు చేశారు. శివాజీ కాలంలో ప్రాచుర్యం పొందిన లిఠామ్ అనే సంప్రదాయ నృత్యాన్ని గురువు కల్యాణ్ శిక్షణ ఇచ్చారు.

మూడు నెలల నుంచి వెళుతున్నా..

- వికాస్, లావణ్య (దంపతులు), సమన్విత(కుమార్తె), గోరంట్ల

ప్రతి నెలా రెండో ఆదివారం యూత్ హాస్టల్ అసోసియేషన్ నిర్వహించే ట్రెక్కింగ్‌కు గత మూడు నెలల నుంచి వెళుతున్నాం. పలకలూరు, కొండవీడు వెళ్లాం. కొండ ఎక్కుతున్నప్పుడు వచ్చే నొప్పులు ప్రశాంతమైన గాలితో మరచిపోతున్నాం. దీని వల్ల శరీరకంగా, మానసికంగా ఎంతో ఆరోగ్యంగా ఉంటుంది. ఎప్పుడు రెండో ఆదివారం వస్తుందా? అని ఎదురు చూస్తున్నాం. పాపకు కూడా ఎంతో బాగా అర్థం కావడంతో పాటు అవి గుర్తుంటున్నాయని సమన్విత చెప్పింది.

భయం పోయింది..

బి.రాజ్యలక్ష్మి, కొరిటెపాడు

గృహిణిగా ఉంటూ ఈ సంస్థ వాలంటీర్‌గా పనిచేస్తున్నా. ఇంట్లో పని ఒత్తిడి ఉపశమనం పొందడానికి ట్రెక్కింగ్ చక్కగా ఉపయోగపడుతోంది. ప్రకృతి అంటే నాకు చాలా ఇష్టం. ఈ అసోసియేషన్‌లో చేరిన తర్వాత ప్రతి ట్రెక్ వెళ్తున్నాను. ఎత్తయిన ప్రదేశాల నుంచి కిందకు చూస్తే ఇంతకుముందు భయం వేసేది. కానీ నిర్వాహకులు ధైర్యం చెప్పడంతో భయం పోయింది.

నేడు ప్రజాఫిర్యాదుల స్వీకరణ

నగరపాలకసంస్థ: స్థానిక సమస్యలు, ప్రజాఫిర్యాదుల అర్జీలు స్వీకరించేందుకు సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ (0863- 2224202) కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో ఒంటి గంట వరకు నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

12, 13 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: ఈనెల 12, 13 తేదీల్లో పలు ప్రాంతాల్లో తాగునీటి అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగం జాగర్లమూడి వాటర్‌వర్క్స్ నుంచి తాగునీటి సరఫరా చేసే పైపులైన్లకు సుద్దపల్లి గ్రామం వద్ద లీకేజీలకు మరమ్మతులు చేయాల్సి ఉన్నందున బుధవారం ఉదయం 8 గంటల నుంచి సంగం జాగర్లమూడి ప్లాంటు పూర్తిగా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. మరమ్మతులు పూర్తయిన అనంతరం, గురువారం ఉదయం నగరంలోని నాజ్‌సెంటర్ ఎల్ఎల్ఆర్, ఎల్‌బీనగర్, బాలాజీనగర్ రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

వైద్య శిబిరానికి స్పందన

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక టీజేపీఎస్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో దల్లిరాజపాలెంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సిద్ధార్థ గ్యాస్ట్రో కేర్ హాస్పిటల్, లక్ష్మీసాయి ఆస్పత్రి, కల్స్ ఉచిత కేర్ క్లినిక్ వారు ఉచిత సేవలు అందించారు. డాక్టర్ సిద్ధార్థరెడ్డి ఆళ్ల, లక్ష్మీసాయి ఉపాధ్యాయ్ పి.సతీష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జీవీ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. సేవలందించిన వైద్యులను సర్పంచ్ సాంబశివరావు, టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి బ్రహ్మయ్య అభినందించారు.

వడ్డెర సంక్షేమ సంఘం నగర ఉపాధ్యక్షుడిగా సురేష్

గోరంట్ల, న్యూస్‌టుడే: అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడిగా తమ్మిశెట్టి సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు మహేష్‌బాబు నుంచి సురేష్ ధ్రువపత్రం అందుకున్నారు.

రైతుల సంక్షేమానికి శివాజీ కృషి ఎనలేనిది

డాక్టర్ శివాజీని పరామర్శించిన గౌతు శ్యామ్‌సుందర శివాజీ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమం కోసం మాజీ ఎంపీ, రైతు నాయకుడు డాక్టర్ యలమంచిలి శివాజీ నిరంతరం కృషి చేశారని మాజీ మంత్రి గౌతు శ్యామ్‌సుందర శివాజీ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే గౌతు లచ్చన్న తనయుడు గౌతు శ్యామ్ సుందర శివాజీ.. డాక్టర్ శివాజీని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమం, రాజధాని అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు పురోగతి, సాగునీటి సదుపాయాలు, రైతుల సంక్షేమం తదితర అంశాలపై వారు చర్చించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రాష్ట్ర విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల కార్యదర్శి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటే ఆరోగ్యానికి మేలు

డాక్టర్ బ్రహ్మారెడ్డిని సత్కరిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

అరండల్‌పేట, న్యూస్‌టుడే: ప్రజలు వ్యాధుల విషయంలో తగు జాగ్రతలు పాటిస్తే 90 శాతం వ్యాధులకు వైద్యులు, ఆసుపత్రులతో పని ఉండదని జన విజ్ఞాన కేంద్రం జాతీయ అధ్యక్షుడు వి.బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్యసభ జరిగింది. సభకు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ బ్రిటన్‌లో మాదిరిగానే భారత్‌లో కూడా ఫ్యామిలీ వైద్య విధానాన్ని అమలుపరిస్తే బాగుంటుందన్నారు. గుండెపోటు వంటి సమస్యలకు సీపీఆర్ చేయడం నేర్చుకుంటే చాలా మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. చెరకు రసం, నిమ్మకాయ రసం, మజ్జిగ, కొబ్బరినీళ్లు వంటి వాటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మెడ, నడుంనొప్పి వంటి వాటిని కొన్ని వ్యాయామాలతో నివారించుకోవచ్చన్నారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా రోజూ వ్యాయామం చేస్తూ జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటే చాలావరకు అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. ఆయన్ను అవగాహన సంస్థ సభ్యులు సత్కరించారు. జన విజ్ఞాన వేదిక సభ్యులు సేతురామేశ్వర్, ఆరోగ్య అంశాల విశ్లేషకులు చలమారెడ్డి, ఎస్.కృష్ణారావు, కె.చంద్రశేఖరరావు, టీవీ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

పట్నంబజారు: కొత్తపేటలోని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి ఆధ్వర్యంలో 105 మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర సరకులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ మాట్లాడుతూ సంస్థలు అందించే సేవల్ని పేదలు వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో పోలేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, మాదాల ప్రకాష్, పలకలూరి శివరావు, ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

వన సమారాధన నిర్వహణ అభినందనీయం

కోటి గార్డెన్స్‌లో మాట్లాడుతున్న మోహనకృష్ణ, వేదికపై వెంకట సుబ్బారావు తదితరులు

పట్టాభిపురం: స్నేహ బంధంతో వన సమారాధన నిర్వహించడం అభినందనీయమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పేర్కొన్నారు. డీఎస్సార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోటి గార్డెన్స్‌లో వన సమారాధన నిర్వహించారు. కులమతాలకు అతీతంగా వందలాది మంది స్నేహితులు కుటుంబ సభ్యులతో తరలివచ్చి ఉత్సాహంగా గడిపారు. శ్రీశైలం దేవస్థానం డైరెక్టర్ బోడేపూడి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ మన పెద్దలు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ సమ్మేళనం నిర్వహించుకోవడం ఎంతో ఆరోగ్యకరమన్నారు. భాష్యం విద్యా సంస్థల అధినేత రామకృష్ణ మాట్లాడుతూ డీఎస్సార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ద్వారా ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తంబోలా, మ్యూజికల్‌ఛైర్, త్రోబాల్, బాల్‌బాస్కెట్, డ్యాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు, రెరా సభ్యుడు దామచర్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు కొత్తపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు యర్రగుంట్ల అప్పారావు, గుర్రం బుల్లెయ్య పాల్గొన్నారు.

సన్మానం అందుకుంటున్న గజల్ శ్రీనివాస్

సమైక్యతకు దోహదం.. గుంటూరు సాంస్కృతికం: కార్తిక వన సమారాధనలు ఆధ్యాత్మికతో పాటు సమైక్యతకు దోహదపడతాయని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గుంటూరు బ్రాడీపేట బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బుచ్చిరాం ప్రసాద్ మాట్లాడుతూ సమితి పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహకాలు అందజేయడంతో పాటు పిల్లలకు ఉచితంగా ఉపనయనాలు నిర్వహిస్తుండడం ప్రశంసనీయమన్నారు. అనంతరం రుద్రాభిషేకం, బిల్వార్చన, విష్ణు, లలితా సహస్రనామ పారాయణలు నిర్వహించారు. గజల్ శ్రీనివాస్ గానాలాపన చేశారు. పిల్లలు, పెద్దలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులందించారు. సమితి అధ్యక్షుడు నందిరాజు పాండురంగరావు, కార్యదర్శి రంగావజ్జుల లక్ష్మీపతి, సమన్వయకర్త కర్లపాలెం బాలకృష్ణ, సహ సమన్వయకర్త మాదాల వెంకటకృష్ణ, వెలగలేటి గంగాధర్ తదితరులు పర్యవేక్షించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయరూ..!

నగరపాలకసంస్థ: సంగం జాగర్లమూడి వద్ద లీకేజీల మరమ్మతుకు బుధ, గురువారాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని అధికారులు ప్రకటన ఇచ్చారు. అయితే ఆదివారమే పలు ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా రాక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రైలుపేట, సాంబశివపేట, రాజాగారితోట ప్రాంతాల్లో కొన్ని లైన్లకు నీటి సరఫరా లేకపోవడంతో ఎద్దడి ఏర్పడింది. మరమ్మతు పనులు ఉన్నందున ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఇంకా పెరిగే అవకాశముంది. ఇంజినీరింగ్ అధికారులు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నీటి ఎద్దడి నెలకొన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి జూడో పోటీలు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ జూడో 69వ ఛాంపియన్‌షిప్ అండర్-17 బాలబాలికల పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో ఈ నెల 7న ప్రారంభమై ఆదివారంతో ముగిశాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు సుధారాణి, శ్రీనివాసరావు తెలిపారు. బాలుర విభాగంలో అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో, కృష్ణా జిల్లా ద్వితీయ స్థానంలో, కర్నూలు జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. బాలికల విభాగంలో అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో, చిత్తూరు జిల్లా ద్వితీయ స్థానంలో, గుంటూరు జిల్లా తృతీయస్థానంలో నిలిచాయన్నారు. ఈ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథులుగా కాకినాడ రూరల్ మండల విద్యాశాధికారి టీవీఎస్ రంగారావు, ఎంఈవో-2 శ్రీనివాసకుమార్, డీఎస్‌డీవో సతీష్‌కుమార్ హాజరై విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం జూడో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా పీఈటీ సంఘం కార్యదర్శి మాచరరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, సీనియర్ పీడీ, హాకీ కోచ్ రవిరాజు, పీడీలు గిరి, ప్రసాద్‌రెడ్డి, మూర్తి, శ్రీహరిరాజు పాల్గొన్నారు.

నిర్దేశిత సమయానికి పనులు పూర్తికావాలి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్దేశిత సమయానికి నాణ్యత, ప్రమాణాలతో పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుడంపాడు, ఏటుకూరు, పొత్తూరు, నాయుడుపేట ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం ఆయన అధికారులకు సూచనలిచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ సీసీ రహదారులు, డ్రెయిన్లను ప్రమాణాల మేరకు క్యూరింగ్ చేశాకే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించబోమని, నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లింపులు చేయబోమని తెలిపారు. పనులు పూర్తయ్యాక తప్పకుండా సదరు గుత్తేదారు నిర్మాణ వ్యర్థాలు తొలగించాలని ఆదేశించారు. ప్రతి అభివృద్ధి పనిని తామే తనిఖీ చేసి, ప్రమాణాల మేరకు ఉంటే బిల్లులు చెల్లింపు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రహదారుల ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రణాళికాధికారులను ఆదేశించారు. పర్యటనలో ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్య సాధనతోనే విజయం సొంతం

మాట్లాడుతున్న శరత్‌చంద్ర

గోరంట్ల, న్యూస్‌టుడే: నిత్యం సాధనతోనే విజయం సొంతం అవుతుందని పోటీ పరీక్షల నిపుణులు తోట శరత్‌చంద్ర అన్నారు. మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏసీ కళాశాలలో ఎన్ఎంఎంఎస్ శిక్షణ కార్యక్రమం జరిగింది. శరత్‌చంద్ర మాట్లాడుతూ ఎంత చిన్న లక్ష్యమైనా రోజూ దానిని సాధించడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరిగి అవరోధాలను అధిగమించే శక్తి కలుగుతుందన్నారు. లక్ష సాధనలో ఎదురయ్యే అవమానాలకు కుంగిపోక ధైర్యంగా అడ్డంకులను ఎదుర్కొని విజయం ద్వారా సమాధానం చెప్పాలని విద్యార్థులను ఉత్సాహపర్చారు. మానవతా సంస్థ కార్యదర్శి కె.సతీష్, రిసోర్స్‌పర్సన్స్ గేరా ప్రకాష్, బేతపూడి మంగారావు, అబ్దుల్ రెహమాన్, ఆదినారాయణ, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లండి

మాట్లాడుతున్న ఆచార్యులు శ్రీనివాసులు, వేదికపై మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్, జూపూడి ప్రభాకర్, చంద్రశేఖర్, విల్సన్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేయడంతోనే రాజకీయ పార్టీలు సరిపెడుతున్నాయని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు కె.శ్రీనివాసులు అన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో అంబేడ్కర్, జాషువా, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ ఆధ్వర్యంలో రచయిత ఆనంద తేల్ తుంబడే రచించిన ఐకానోక్లాస్టు పుస్తక సమీక్ష కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆచార్యులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఐకానోక్లాస్టు పుస్తకం అంబేడ్కర్ జీవిత చరిత్రకు అద్దం పట్టిందన్నారు. ప్రస్తుతం దేశంలో పలు రాజకీయ పార్టీలు కుటుంబ పార్టీలుగా మారాయని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, వివిధ పార్టీల నాయకులు జయసుధ, సుధ, నళినీకాంత్, భావన్నారాయణ, చిప్పి, కొరివి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి



గంగాధర్‌ను సత్కరిస్తున్న ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్

అరండల్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తానని గుంటూరుకు చెందిన ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ అన్నారు. ఆదివారం విజయవాడ గొల్లపూడిలోని బ్రాహ్మణ కార్పొరేషన్ కార్యాలయంలో ఛైర్మన్ రాంప్రసాద్ సారథ్యంలో గంగాధర్ డైరెక్టర్‌గా బాధ్యత స్వీకరించారు. కార్పొరేషన్ క్రెడిట్ సొసైటీ ద్వారా బ్రాహ్మణ విద్యార్థులకు విద్యా, సంక్షేమ, స్వయం ఉపాధి పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. తనకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, భాజపా సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, భాజపా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావులకు ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేషన్ ఎండీ దొరబాబు, మేనేజర్ శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా భాజపా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, నాయకులు పాలపాటి రవికుమార్, అవ్వారు బుల్లబ్బాయి, గోవిందా, ఫణిశర్మ, శ్రీధర్‌బాబు, మాధవరెడ్డి, తాడువాయి రామకృష్ణ, పల్లపరాజు, శంకరప్రసాద్, తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది దౌర్జన్యం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని ఓ షాపింగ్‌మాల్ వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది దౌర్జన్యం చేశారంటూ ఓ మహిళా న్యాయవాది నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు పేర్కొన్న వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేటలోని ఓ షాపింగ్‌మాల్ సమీపంలో రోడ్డు పక్కన నిలిపిన ద్విచక్రవాహనాలకు అక్కడి ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది తాళాలు వేసి వాహన చోదకులను ఇబ్బందులు పెడుతున్నారు. అదేమని అడిగిన తమపై దౌర్జన్యం చేశారని. . ఇలా అనేక మందిని ఇబ్బంది పెడుతున్న యాజమాన్యం, వారి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి ఆమె వాహనానికి తాళాలు తీయించి పంపించారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న హోటల్‌పై దాడి

పట్టాభిపురం: ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఆర్గనైజింగ్ వ్యభిచారం నిర్వహిస్తున్నారని అందిన సమాచారం మేరకు నల్లపాడు పోలీసులు దాడి ఆదివారం దాడి చేశారు. ముగ్గురు మహిళలు, ఒక విటుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై..

పట్టాభిపురం: శారదా కాలనీలో పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి జరిగింది. పైపులు పని చేస్తున్న పటాన్ మస్తాన్‌కు అదే ప్రాంతానికి చెందిన పటాన్ హసన్‌కు పాత కక్షలు ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం మస్తాన్ తండ్రి బుడేపై హసన్ కత్తితో దాడి చేశాడు. దీనితో బుడే తలకు గాయాలయ్యాయి. ప్రభుత్వాసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నాడు. బుడే ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

పట్టాభిపురం: జూదం ఆడుతున్న పది మందిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. అరండల్‌పేట ఏడో లైనులో పది మంది కోతముక్క ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు.. జూద గృహంపై దాడి చేసి పది మందిని అదుపులోకి తీసుకుని రూ.2,18,000 నగదు స్వాధీనం చేసుకున్నారు.

భక్తితో అయ్యప్ప పడిపూజ

అయ్యప్ప స్వామి పూజ చేస్తున్న మాదల చైతన్య

పట్టాభిపురం, న్యూస్‌టుడే: జనచైతన్య ప్రాపర్టీస్ అధినేత మాదల చైతన్య ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి పడిపూజ కనులపండువగా జరిగింది. స్వామి థియేటర్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో మాలధారులు, భక్తులు పాల్గొన్నారు. అయిదు మండపాలు ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వామికి 18 అభిషేకాలు నిర్వహించారు. గురుస్వాములు రాంబాబు, విశ్వేశ్వరరావులు పూజ నిర్వహించారు. డప్పు శ్రీను స్వామి ఆధ్వర్యంలో భజన జరిగింది.

అసలే మలుపు.. ఆపై గుంత

నగరంలో గుంటూరు-అమరావతి రోడ్డు వాహనాలతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు చిల్లీస్ హోటల్ నుంచి జేకేసీ కళాశాల వైపు వెళ్లే రహదారి మలుపు వద్ద గుంత ఏర్పడింది. దాంతో గుంతను దాటుకుని వాహనాలను నడిపేందుకు చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. చిల్లీస్ హోటల్ ఎదురు రోడ్డు నుంచి ఆటోనగర్ వైపు వెళ్లే రహదారి మలుపు వద్ద కూడా గుంతలు ఉండడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్అండ్‌బీ, జీఎంసీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, జిల్లాపరిషత్తు(గుంటూరు)

ఇదేనా స్వచ్ఛత?

పేరుకున్న చెత్త కుప్పలు

నగరంలో స్వచ్ఛతకు అనేక కార్యక్రమాలు చేస్తున్నా జీఎంసీకి చెందిన కార్యాలయాలు, ప్రాంగణాల్లోనే పారిశుద్ధ్యం క్షీణించింది. అధికారులు మాటలు చెప్పడమే కానీ ఈ ప్రాంగణాల శుభ్రతపై దృష్టి సారించడం లేదు. ఇందుకు స్థానిక లక్ష్మీపురం హెచ్ఎల్ఆర్ ప్రాంగణం వద్ద పరిస్థితితే తార్కాణం. ఈ ప్రాంగణంలో పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది వార్డు సచివాలయాల వారీగా తొలగించిన ప్రకటన బోర్డులు, హోర్డింగ్‌లు, ఇనుప పరాడ్లు, చెత్తను కుప్పలులా పడేశారు. మరోవైపు ప్రాంగణంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించక పోవడంతో భారీగా పేరుకుంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి స్థానాల్లో నిలిపేందుకు జీఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణకు ఒక అధికారినే నియమించింది. సదరు అధికారి స్వచ్ఛతలో ముందున్న నగరాల్లో అధ్యయనానికి స్టడీ టూర్‌లకు వెళతారు. కానీ ప్రభుత్వ కార్యాలయాలు, రిజర్వాయర్ల ప్రాంగణాల వద్ద చెత్తకుప్పలు కన్పిస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ (గుంటూరు)

పేదలకు అన్నదానం

పట్నంబజారు, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ సాయం చేయాలని లైఫ్ టైం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రత్తి వెంకట నారాయణ అన్నారు. లైఫ్ టైం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట పేదలకు అన్నదానం చేశారు. ప్రత్తి వెంకట నారాయణ మాట్లాడుతూ పేదలు ఈ తరహా సేవల్ని వినియోగించుకోవాలన్నారు. గౌరవ అధ్యక్షుడు మట్టుపల్లి శ్రీనివాస చరణ్ మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పేదలకు అన్నపూర్ణ పథకం కింద ఆహారంతో పాటు, నిత్యావసర సరకులు అందజేస్తున్నామన్నారు. మిగిలిన సేవా సంస్థలు ఈ తరహా సేవల్ని ఆదర్శంగా తీసుకొని పేదలకు అండగా నిలవాలన్నారు. బచ్చు గణేష్, నేరెళ్ల శ్రీనివాసరావు, వైభవ్ నాగేశ్వరరావు, సాతులూరి ప్రకాశరావు, గజవల్లి శ్యాం సుందర్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు మిరియాల వెంకట్రావు

చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభాకర్‌రావు, నాగేశ్వరరావు, సదాశివరావు, వెంకట్రావు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కాపునాడు వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల వెంకట్రావు సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్‌రావు అన్నారు. నెహ్రూనగర్‌లో రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షుడు యర్రగోపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మిరియాల వెంకట్రావు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాపునాడు సంయుక్త కార్యదర్శి రాగం సదాశివరావు, జోన్-3 అధ్యక్షుడు బొందలపాటి వెంకట్రావు, నాయకులు మార్కెట్ శ్రీను, శేషతల్పసాయి, యర్రగోపు వాసు, వినోద్, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE XIII Addl DISTRICT JUDGE NARASARAOPET
IA 744/23, IA 745/23, IA 746/23, IN OS 40/2013

Between:
మోదడగు ఆంజనేయులు (లేట్) మరియు ఇతరులు
... పిటీషనరులు/వాదులు
And
కొప్పురావూరి వెంకటస్వామి @స్వాములు మరియు ఇతరులు
... రెస్పాండెంట్సు/డిఫడెంట్స్

TO
1.(R13) యండ్రాప్రగడ లక్ష్మీకుమారి, భర్త: శ్రీనివాసరావు, గృహిణి, సంగడిగుంట, గుంటూరు నగరం మరియు జిల్లా.
2.(R17) బొలిశెట్టి సరస్వతి, భర్త: నాగభూషణరావు, గృహిణి, ఇంటి నెం.11-847, 2వ లైను, మురళిస్వామి నగర్, నగరాలు, గోరంట్ల, గుంటూరు నగరం మరియు జిల్లా.

సదరు పై నెంబరు దావాలోని వాదులు ప్రతివాదులుపైన దావా దాఖలు చేయగా సదరు దావాలోని పిటీషను/ IA 744/23, IA 745/23, IA 746/23 లలో శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఇప్పటికే మీకు చాలాసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున మీకు శ్రీ కోర్టువారు పేపర్ పబ్లికేషన్ ద్వారా సమను పంపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు పై కోర్టువారి ఎదుట తేది.5.12.2025న 10.30 నిమిషాలకు మీరు మీ ప్లీడరు గారి ద్వారా హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలియజేయగలరని లేని యెడల మీ పరోక్షంలో IA 744/23, IA 745/23, IA 746/23 IN OS 40/2013 లు తీర్మానించబడును.

శ్రీ M.శ్రీనివాసరావు,
అడ్వకేట్, నరసరావుపేట

(c) eenadu

ఈనాడు
అమరావతి
కృష్ణా
సోమవారం నవంబరు 10, 2025 5

ఆనంద వనం

కార్తికమాసం ఆదివారం సందర్భంగా పెద్దలు, పిల్లలు కలిసి ప్రకృతి బాట పట్టారు. పచ్చని చెట్ల కింద సరదాగా గడిపారు. మ్యూజికల్ ఛైర్స్, లెమన్ స్పూన్, అంతాక్షరి వంటి పోటీల్లో ఆనందంగా పాల్గొన్నారు. అందరూ ఒకచోట కూర్చుని వన భోజనాలు చేశారు. నున్న మామిడితోటలో కనిపించిన సందడి ఇది. -ఈనాడు, అమరావతి

మామిడితోటలో వన భోజనాలు చేస్తూ..

నిరంతర త్యాగం.. స్వచ్ఛ చల్లపల్లి సాకారం

చల్లపల్లి, న్యూస్‌టుడే

స్వచ్ఛ చల్లపల్లి మహోద్యమంలో 150మందికి పైగా స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలతో ప్రతిరోజూ నిరంతరం పాటుపడుతూ త్యాగానికి చిరునామాగా డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి దంపతులు నిలిచారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం స్వచ్ఛసుందర చల్లపల్లి 11వ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో పాటు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య, కలెక్టర్ డి.కె.బాలాజీ, డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి(కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రి, హైదరాబాద్), ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కాలేషావలీ(విజయవాడ) చల్లపల్లి జాతీయ రహదారి ముఖద్వారం వద్ద డాక్టర్ టి.పద్మావతి ఆధ్వర్యంలో రూ.1.50 లక్షలతో నూతనంగా నిర్మించిన వీధిలైట్లను ప్రారంభించారు. మనకోసం మనం ట్రస్ట్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ఆసుపత్రి రోడ్డు, వాటర్ ఫౌంటైన్, శిల్పి పాయింట్, భూగర్భ డ్రెయినేజీ రహదారిని, ఎన్.టి.ఆర్.పార్కులో అధునాతన మరుగుదొడ్లను, తరిగోపుల ప్రాంగణంలో సుందరపార్కును సందర్శించారు. శ్మశానం వద్ద నందనపూల వనాన్ని చూసి డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి దంపతులను అభినందించారు. డంపింగ్ యార్డు మధ్యలో ఫొటో పాయింట్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 'మన నది- మన నుడి' కార్యక్రమాన్ని చేపట్టారని, జనసైనికులు తలచుకుంటే ప్రతి గ్రామంలోనూ గ్రామం రూపురేఖలు మారతాయన్నారు. చల్లపల్లిలో ఉపాధి నిధులు రూ.కోటితో సీసీ రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు.

చల్లపల్లి అభివృద్ధి చిత్రాలను చూపి ముఖ్య అతిథులకు వివరిస్తున్న డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి.పక్కన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మోటారుబైక్ ర్యాలీలో కార్యకర్తలు

★ **రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య** మాట్లాడుతూ స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల శ్రమదానంతో చల్లపల్లి ప్రత్యేకస్థానంతో చరిత్రలో నిలుస్తుందన్నారు. చల్లపల్లి అభివృద్ధికి దాతల నుంచి నిధుల సమీకరణకు కార్పస్‌ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. డంపింగ్‌యార్డులో కాలుతున్న వ్యర్థాలను కృష్ణయ్య పరిశీలించి గ్రామంలో చెత్తను కాల్చవద్దని సూచించారు. డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన వ్యర్థాలను నెల రోజుల లోపల బయటకు తరలించే ఏర్పాట్లను చేస్తామన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు సూచించారు. డంపింగ్‌యార్డు, గంగులవారిపాలెం రహదారులు, బస్టాండ్ ప్రాంతాల గత, ప్రస్తుత చిత్రాలను ముఖ్య అతిథులకు చూపించి వాటి గురించి డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్ వివరించారు.

★ **డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి (కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి, హైదరాబాద్)** మాట్లాడుతూ స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం నిర్విరామంగా కొనసాగడానికి కార్పస్‌ఫండ్ అవసరమని, తన వంతుగా రూ.2లక్షలు విరాళం ప్రకటించారు. విజయవాడకు చెందిన ప్రముఖ ఎముకల వైద్యులు డాక్టర్ కాలేషావలీ రూ.లక్ష వితరణను ప్రకటించారని చెప్పారు. తొలుత ప్రముఖులు, ఉద్యోగులు, వ్యాపారులు, స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు మోటారుబైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్(రాజా), స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, చల్లపల్లి సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ శ్రీనివాస్, డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు, ఆర్.ఐ.ఘంటసాల కృష్ణమోహన్, పంచాయతీ ఈవో మాధవేంద్రరావు, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్.ఐ.సుబ్రహ్మణ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుట్టుగా కన్నేస్తారు.. గుటుక్కుమనిపిస్తారు!

ఈనాడు డిజిటల్, మచిలీపటం, న్యూస్‌టుడే, కృష్ణావిశ్వవిద్యాలయం

కృష్ణా విశ్వవిద్యాలయం విస్తరణకు సరిపడ భూములు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఉన్న వాటిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రెవెన్యూ, విశ్వవిద్యాలయం అధికారులు వాటిపై దృష్టి పెట్టకపోవడం.. భూములకు సరిహద్దులు లేకపోవడంతో కొట్టేసేందుకు కొందరు కన్నేశారు. వీటి పక్కన ఉన్న భూముల సర్వే నంబర్లు చూపించి వీటి అమ్మకాలకు తెరలేపారు.

కృష్ణావర్సిటీ భూముల కబ్జాకు యత్నం

★ గూడూరులో 443/3 సర్వే నంబరు కింద గ్రామానికి చెందిన అన్ని భూములు ఉన్నాయని, దీంతో ఎక్కడ ఆక్రమణలు జరుగున్నాయో అర్థం కావట్లేదని చెబుతున్నారు. వర్సిటీ భూములు ఏవనేది తమకే ఏడాది కిందట తెలిసిందనడం గమనార్హం. పఠాన్‌పేట, కోకనారాయణపాలెంలో కలిపి 45 ఎకరాలు కృష్ణా వర్సిటీ కోసం సేకరించారు. వీటిలోనే నాలుగు ఎకరాల్లో గత ప్రభుత్వంలో జగన్న లేఔట్ ఏర్పాటుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ భూములు గ్రామకంఠం, 22ఎ కింద చేర్చడం.. రైతులు కోర్టుకు వెళ్లడంతో ఎటూ తేలకుండా 15 ఏళ్లుగా ఖాళీగా ఉన్నాయి.

విశ్వవిద్యాలయ గూడూరు స్థలంలో ఏర్పాటు చేసిన సర్వేరాళ్లు

ఖాళీగా ఉందని పాగా..

రెవెన్యూ అధికారుల సహకారంతో పఠాన్‌పేట మసీదు వద్ద 1.60 ఎకరాల్లో బందరుకు చెందిన ఓ వ్యాపారి లేఔట్ వేసేందుకు యత్నించారు. వర్సిటీ భూముల పక్కనే ఉన్న స్థలాల సర్వే నంబర్లు చూపుతూ నకిలీ పత్రాలు, సర్వే నంబర్లు సృష్టించి వర్సిటీ స్థలంలో వెంచర్ వేసేందుకు పాగా వేశారు. పొలంలోకి దారి వేస్తున్న క్రమంలో అధికారులు పత్రాలు పరిశీలించి అడ్డుకొని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎన్.ఉష కలెక్టర్ బాలాజీకి ఫిర్యాదు చేసి వర్సిటీ భూములు సర్వే చేసి అప్పగించాలని కోరారు.

ఇంకా 103 ఎకరాలు అవసరం

వర్సిటీకి 250 ఎకరాల భూమి అవసరం కాగా.. బందరు మండలం రుద్రవరంలో 102 ఎకరాలు.. గూడూరు పఠాన్‌పేట, కోకనారాయణపాలెంలో 45 ఎకరాలు కేటాయించారు. ఇంకా 103 ఎకరాలు కావాల్సి ఉంది. ప్రస్తుతం వర్సిటీ పలు సంస్థలతో ఒప్పందం చేసుకుంది. దానికి అనుగుణంగా కొత్త కోర్సులు, తరగతులు, ల్యాబ్‌ల నిర్వహణకు సరిపడా స్థలం లేక ఇబ్బందులు తప్పట్లేదు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం: గూడూరులో కేటాయించిన భూములు ఆక్రమణకు గురికాకుండా సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. దీనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుంది. - కె.రాంజీ, వీసీ

పతకాల మోత.. స్వారీలో ప్రత్యేకత!

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

సాధారణంగా గుర్రపు స్వారీలో సవారీ చేసే వాళ్లనే విజేతలుగా చూస్తుంటాం. కానీ అసలైన విజేతలం తామేనని.. తమకి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయంటున్నాయి గుర్రాలు. గన్నవరం మండలం కేసరపల్లి ఎన్టీఆర్ వెటర్నరీ ఏఆర్‌అండ్‌వీ ఎన్‌సీసీ యూనిట్ ఆవరణలోని గుర్రాలు ఎన్‌సీసీ గ్రూప్స్, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నాయి. క్యాంప్‌నకు చెందిన నీల్‌ఖాజా, గోల్డెన్ స్టార్, గూగుల్ పేర్లు గల గుర్రాలు.. గణతంత్ర వేడుకల్లో వివిధ పతకాలు సాధించాయి. 15 ఏళ్ల వయసున్న నీల్‌ఖాజా మూడు పర్యాయాలు వేడుకల్లో పాల్గొనగా రెండు బంగారు పతకాలు, 18 ఏళ్లున్న గోల్డెన్‌స్టార్ రెండు పర్యాయాలు పాల్గొనగా ఒకసారి.. ఒక్కసారే పాల్గొన్న ఏడేళ్ల వయసున్న గూగుల్ కూడా బంగారు పతకం సాధించింది. యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తీర్థప్రసాద్, సిబ్బంది అటల్‌తివారీ, బాబూరావు, గాలయ్య, సుజీత్ కుమార్‌ల పర్యవేక్షణలో తర్ఫీదు పొందుతున్నాయి.

కృష్ణా వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదిలో వరద ప్రవాహం ఆదివారం తగ్గుముఖం పట్టింది. ఉదయం ఆరు గంటలకు 60,150 క్యూసెక్కులను సముద్రంలోకి, 8,473 క్యూసెక్కులను కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు విడుదల చేశారు. సాయంత్రానికి క్రమేపీ వరద ప్రవాహం తగ్గింది. రాత్రి 7 గంటలకు 60 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. మిగతా 10 గేట్లను మూసివేశారు. 43,500 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. పంట కాల్వలకు 8,850 క్యూసెక్కులు వదిలారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 3,615, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 5,009, గుంటూరు ఛానల్‌కు 226 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 1,705, ఏలూరు 1,110, కేఈబీ 500, బందరు కాల్వలకు 300 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు.

బెజవాడలో అద్దె ఖాతాల జాడలు

- ఇద్దరు నగరవాసుల్ని అరెస్టు చేసిన తెలంగాణ పోలీసులు
- మోసగాళ్లకు సాయం చేసిన షణ్ముక శ్రీనివాస్, శ్రీధర్

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరంలో మరోసారి అద్దె ఖాతాల జాడలు బయటపడ్డాయి. ఇటీవలి కాలంలో తరచూ విజయవాడకు చెందిన వారి ప్రమేయం ఈ వ్యవహారంలో వెలుగులోకి వస్తోంది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో తాజాగా అరెస్టు చేసిన నిందితుల్లో ఇద్దరు నగరానికి చెందినవారు ఉన్నారు. వ్యాపారి అయిన కోడూరి నాగ సాయి శ్రీధర్‌తో పాటు ఫెడరల్ బ్యాంకు ఉద్యోగి షణ్ముఖ ఆంజనేయులును ఇటీవల తెలంగాణ సైబర్ పోలీసులు వచ్చి విచారణ నిమిత్తం తీసుకెళ్లినట్లు తెలిసింది. అక్కడ నమోదైన కేసుల్లో వీరి పాత్ర ఉండడమే ఇందుకు కారణం.

చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సాయం

నగరానికి చెందిన **షణ్ముఖ ఆంజనేయులు..** స్థానిక ఫెడరల్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌లో నమోదైన సైబర్ కేసులో అక్కడి పోలీసులు విచారణ చేస్తుండగా కొన్ని బ్యాంకు ఖాతాల ద్వారా డబ్బులు బదిలీ అయినట్లు దర్యాప్తులో తేలింది. ఆ ఖాతాదారులను అదుపులోకి తీసుకుని విచారించగా ఆంజనేయులు డబ్బుకు ఆశపడి చట్ట విరుద్ధంగా ఆర్థిక వ్యవహారాలు నిర్వహించినట్లు బయటకు వచ్చింది. అమాయకులను తీసుకువచ్చి, వారితో ఖాతాలు తెరిపించడం, ఆ పాస్ పుస్తకాలు, చెక్కు పుస్తకాలను ఏజెంట్లకు చేర్చడం వంటి వాటిలో క్రియాశీలక పాత్ర పోషించినట్లు వెలుగుచూసింది. నగదు, చెక్కుల ద్వారా విత్‌డ్రాయల్స్ కోసం సాయం చేసినట్లు గుర్తించారు.

★ ఇంజినీరింగ్ చదువుకుని వ్యాపారం చేస్తున్న మరో నిందితుడు **కోడూరి నాగసాయి శ్రీధర్** కూడా అరెస్టు అయ్యాడు. మొబైల్ నంబర్లు, సిమ్ కార్డులు సమకూర్చేవాడని తెలంగాణ సైబర్ పోలీసుల దర్యాప్తులో బయటకు వచ్చింది. అమాయకులను గుర్తించి, వారికి డబ్బు ఆశచూపించి వారి పేరుతో ఖాతాలు తెరిపించాడు. వారి పేరున సిమ్ కార్డులు తీసుకుని మోసగాళ్లకు చేర్చేవాడని తెలిసింది. వీటికి సంబంధించి శ్రీధర్‌కు 5 శాతం వరకు కమీషన్ అందేది.

డబ్బు ఆశచూపి

మూడు నెలల కిందట తెలంగాణ సైబర్ పోలీసులు విజయవాడకు చెందిన శరణ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. సైబర్ నేరాల్లో కొట్టేసిన సొమ్మును పలు మార్గాల్లో బదిలీ చేసేందుకు మ్యూల్ ఖాతాలు తెరవడంలో కీలక సూత్రధారి. పలు ప్రాంతాల్లో డబ్బు ఆశచూపి బ్యాంకు ఖాతాలను తెరిపించి కమీషన్ ముట్టజెప్పేవాడని తెలిసింది. శరణ్‌కు పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు హైదరాబాద్ పోలీసుల విచారణలో వెల్లడైంది. కంబోడియా, చైనా, మలేషియా, దుబాయ్, తదితర దేశాల్లో సైబర్ నేరగాళ్లకు అద్దె ఖాతాలను సమకూర్చేవాడు.

జీవన ధ్రువపత్రం అందుకోండిలా..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు ద్వారా జీవన ధ్రువపత్రాన్ని పింఛనుదార్లు వారివారి సంస్థలకు ఆన్‌లైన్‌లో సమర్పించేలా భారతీయ తపాలాశాఖ ఏర్పాట్లు చేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వారందరూ తమ పింఛన్లను పునరుద్ధరించుకునేందుకు తాము విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన కార్యాలయాల్లో ఏటా నవంబరులో జీవన ధ్రువపత్రం (లైఫ్ సర్టిఫికేట్) ఇవ్వాల్సి ఉంది. వృద్ధులైన, కుటుంబ పింఛనుదారులు ఆయా కార్యాలయాలకు వచ్చి ఈ పత్రం సమర్పించడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు భారతీయ తపాలాశాఖ తన అనుబంధ సంస్థ ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు ద్వారా బయోమెట్రిక్ ఆధారిత ఆధార్ నంబరు అనుసంధానించి లైఫ్ సర్టిఫికేట్ అందించనుంది.

ఎలా చేయాలంటే..

గూగుల్ ప్లేస్టోర్ నుంచి పోస్టు ఇన్ఫో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.. యాప్‌లో చరవాణి నంబరు, పేరు, పిన్‌కోడ్ చిరునామాలు నమోదు చేసి సంబంధిత సంస్థకు సమర్పించాల్సి ఉంది. ఓటీపీ వచ్చిన తర్వాత నిర్ధారించుకుని వారు సంబంధిత తపాలా కార్యాలయానికి పంపుతారు. అనంతరం వారి సమీప తపాలా కార్యాలయానికి చెందిన ఉద్యోగి వారి ఇంటి వద్దకు వచ్చి అతని వద్ద ఉన్న మొబైల్ కిట్ ద్వారా వేలిముద్రలు స్వీకరించి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ అందిస్తారు. బయోమెట్రిక్ విధానంలో ఆధార్‌తో అనుసంధానమై ఉంటుంది. పింఛనుదారుల సంస్థ నుంచి సర్టిఫికెట్ అందినట్లు వారి చరవాణికి సమాచారం వస్తుంది. ఇంటి వద్దనే అత్యంత సులభమైన సురక్షితమైన ఈ సేవలను వినియోగించుకోవాలని తపాలశాఖ అధికారులు సూచించారు. ఇందుకు కేవలం నామమాత్ర రుసుం ఉంటుందన్నారు.

పైసలిస్తేనే.. పాస్‌పుస్తకం

★ రూ.5వేల నుంచి రూ.20వేల వరకు వసూళ్లు
★ అడ్డంగా దోచేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఈనాడు, అమరావతి

★ **పామర్రు** నియోజకవర్గ పరిధిలోని ఓ తహసీల్దార్, ముగ్గురు వీఆర్వోలు, ఓ ప్రైవేటు వ్యక్తిని వసూళ్లు చక్కబెట్టేందుకు నియమించుకున్నారు. అన్నీ సవ్యంగా ఉన్నా కొర్రీలు పెట్టి ఒక్కో పాస్ పుస్తకం మంజూరుకు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారు. తాజాగా ఓ రైతు పాస్ పుస్తకం కోసం డబ్బులు డిమాండ్ చేయగా సదరు రైతు విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో తహసీల్దార్ బండారం బయటపడింది.

★ **ఇబ్రహీంపట్నం, జి.కొండూరు** మండలాల పరిధిలో ఆరుగురు వీఆర్వోలు వసూళ్లే పరమావధిగా పని చేస్తున్నారు. ఆరు నెలల్లో 5 పాస్ పుస్తకాలు ఇప్పించేందుకు రైతుల నుంచి ముక్కుపిండి రూ.70వేలు వసూలు చేశారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని రైతులు అంటే ఇదంతా మా కోసమే కాదు..చాలా మంది చేతులు తడపాలంటూ చెప్పడం గమనార్హం.

★ **తిరువూరు** నియోజకవర్గంలోని ఓ తహసీల్దార్ రైతులను దోచేస్తున్నారు. పాస్ పుస్తకం కోసం వస్తే సంబంధిత వీఆర్వోతో మాట్లాడండి అని చెబుతారు. రైతులు వీఆర్వోలకు ముడుపులు సమర్పిస్తేనే దస్త్రం కదులుతుంది. పుస్తకానికి రూ.10వేలు చొప్పున వసూలు చేస్తున్నారు.

పాస్ పుస్తకాల మంజూరులో రెవెన్యూ సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. పైసలిస్తే తప్ప పాస్ పుస్తకం మంజూరు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అవసరమైతే ఓ ధర, అత్యవసరమైతే మరో ధర అన్నట్లు వసూళ్లు సాగుతున్నాయి. వీఆర్వోలు కొందరు తహసీల్దార్లు కుమ్మక్కయి కథ నడిపిస్తున్నారు. రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు.

దరఖాస్తుకు ముందే ముడుపులు..

నిబంధనల ప్రకారం పాస్‌పుస్తకాల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. అన్నీ సవ్యంగా ఉంటే నెలలో మంజూరు చేయాలి. చాలా మంది రైతులకు అవగాహన లేక దరఖాస్తు చేయకుండా వీఆర్వోను కలుస్తున్నారు. వారు దరఖాస్తు చేయించకుండా బేరం తెగ్గొడుతున్నారు. ముడుపులు కూడా ముందే తీసుకుంటున్నారు. ఒక్కో పాస్ పుస్తకానికి అవసరాన్ని బట్టి రూ.5వేల-రూ.20వేల వరకు వసూలు చేసుకుంటున్నారు.

తహసీల్దార్లే సూత్రధారులు..

ముడుపులు తీసుకొస్తేనే దస్త్రం కదులుతుందని కొందరు తహసీల్దార్లు వీఆర్వోలకు అనధికారిక నిబంధనలు పెడుతున్నారు. తెలంగాణ సరిహద్దులోని ఓ మండలంలో తహసీల్దార్ లక్ష్యాలు పెట్టి మరీ వేధిస్తున్నారని కొందరు వీఆర్వోలు తలలుబాదుకుంటున్నారు. రైతులు నేరుగా దరఖాస్తు చేసినా..సిఫార్సులు చేయించినా చుక్కలు చూపిస్తున్నారు. విచారణ, సర్వే, కొలతల్లో వ్యత్యాసాలంటూ తిప్పలు పెడతారు.

★ 'విచారణ చేసి రైతులను ఇబ్బందులు పెట్టే రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని' కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.



తిరుపతమ్మ అలంకారం.. శోభాయమానం

పెనుగంచిప్రోలులోని గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారిని ఆదివారం పలు రకాల పండ్లతో సుందరంగా అలంకరించారు. కార్తికమాసం మూడో ఆదివారం సందర్భంగా గన్నవరానికి చెందిన చిలకపాటి లక్ష్మీగణేష్, గోపినేనిపాలెం గ్రామానికి చెందిన కామినేని రాంబాబు, అనిల్‌కుమార్‌ల సహకారంతో అమ్మవారిని పండ్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

పర్యాటకానికి.. ఒక్క టెండర్

✦ ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఓఅండ్‌ఎం విధానానికి ఆహ్వానం
✦ విజయవాడ క్లస్టర్ పరిధిలోని నాలుగింటికి ఒక్కటే

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) ఆధ్వర్యంలోని పర్యాటక ప్రదేశాల నిర్వహణకు ప్రైవేటు సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించగా.. విజయవాడ క్లస్టర్ పరిధిలోని నాలుగు ప్రాంతాలకు కలిపి కేవలం ఒకే ఒక్క టెండర్ దాఖలవడం గమనార్హం. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను.. ఆపరేషన్, మెయింటెనెన్స్(ఓఅండ్‌ఎం) విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఏపీటీడీసీ సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా.. విజయవాడ క్లస్టర్ పరిధిలోని భవానీద్వీపం, బరంపార్కు, సూర్యలంక బీచ్, నాగార్జునసాగర్ ఈ నాలుగు ప్రదేశాలకు ప్రైవేటు సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానించగా.. స్పందన చాలా తక్కువగా వచ్చింది. కేవలం ఒకే ఒక్క టెండర్ దాఖలైంది. పర్యాటక ప్రదేశాల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని ఇప్పటికే.. సంస్థలోని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల సంస్థ కార్యాలయం వద్ద నిరసన కూడా చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు సంస్థలు సైతం.. పర్యాటక ప్రదేశాల నిర్వహణను తీసుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపించడం లేదని స్పష్టమవుతోంది.

కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పరిష్కార వేదిక ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమీపంలోని మండల, డివిజన్ కేంద్రాల్లో అర్జీలు సమర్పిస్తే అధికారులు తగు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. కాల్ సెంటరులోని 1100 నంబరుకు ఫోన్ చేసి అర్జీలు నమోదు చేసుకోవడంతో పాటు వాటి స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

ఆదర్శమూర్తికి అశ్రునివాళి

కీ॥శే॥ మండవ జానకిరామయ్య గారు
కృష్ణా జిల్లా మిల్క్ యూనియన్ మాజీ ఛైర్మన్
ఆంధ్రా కురియన్

నిస్వార్థమైన ప్రజాసేవ, అజరామరమైన కీర్తి, అపారమైన ప్రేమ, అంతులేని ఆప్యాయత, అందరి యెడల ఆదరణ.. అన్నీ కలగలిపిన అరుదైన వ్యక్తిత్వం వారిది.. మొవ్వ గ్రామాభివృద్ధికి వారు చేసిన సేవ ఎప్పటికీ మరువలేము.. అందరి మంచి కోరే వ్యక్తి, విద్యాప్రదాత, ఆంధ్రా కురియన్ అవార్డు గ్రహీత, కృష్ణా మిల్క్ యూనియన్ మాజీ ఛైర్మన్ శ్రీ మండవ జానకిరామయ్య గారి మరణం మాకు, గ్రామమునకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు సద్గతి ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ...

మండవ గోపి చంద్రశేఖరరావు, అధ్యక్షులు & పాలకవర్గ సభ్యులు
మండవ జానకిరామయ్య - సులోచన గార్ల క్షేత్రయ్య కళ్యాణ మండపం - మొవ్వ మరియు మొవ్వ గ్రామస్తులు

(c) eenadu

కష్టం చూడాలి... కనికరించాలి

నేడు, రేపు జిల్లాల్లో కేంద్ర బృంద పర్యటన

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో అపార నష్టం జరిగింది. అప్పుడు వీచిన గాలులు పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎక్కడికక్కడ నేలవాలిన పొలాలు, దెబ్బతిన్న ఇళ్లు ఇలా వివిధ సమస్యలతో ప్రజలు ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర బృందం రానుండటంతో క్షేత్ర స్థాయిలో క్షుణ్నంగా పరిశీలించి సాధ్యమైనంత ఎక్కువ సాయం చేస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారు.

జాబితాలు అందజేశారు

జిల్లాలోని 26 మండలాలు తుపానుకు ప్రభావితమయ్యాయి. వరితో పాటు అన్ని పంటలకూ నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 46,357 హెక్టార్లలో వివిధ పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి తుది నివేదిక అందించేందుకు వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా వారంతా తమ ప్రాంతాల్లో పర్యటించి తుది జాబితాలను జిల్లా కార్యాలయానికి అందజేశారు. అలా జిల్లా వ్యాప్తంగా 33 శాతం దెబ్బతిన్న పంటలు 31,135 హెక్టార్లుగా తేలింది. తోట్లవల్లూరు, పమిడిముక్కల, ఉయ్యూరు, కంకిపాడు, మోపిదేవి, చల్లపల్లి, అవనిగడ్డ తదితర మండలాల్లో సాగు చేసిన ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అంతకు మించి నష్టం

తుపానుతో వరికి ఎక్కువ నష్టం జరిగింది. కూటమి ప్రభుత్వం గతంలో పోల్చితే ఎక్కువ పరిహారం ఇవ్వనున్నట్లు నిర్ణయించింది. వరి పంటకు హెక్టారుకు రూ.25 వేల చొప్పున సాయం అందించనుంది. ఇతర పంటలకూ సాయం అందించేలా చర్యలు తీసుకుంది.

బందరు మండలం చిట్టిపాలెంలో వాలిపోయిన వరిపైరు

అన్నింటికి కలిపి రూ.76.53 కోట్లు పరిహారంగా ఇవ్వాల్సి ఉంటుందని జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. ఈ మేరకు వరికే రూ.75.78 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. క్షేత్ర స్థాయిలో అంతకు మించి నష్టమే జరిగిందని రైతులు వాపోతున్నారు. కేవలం నేలవాలిన పొలాలే కాకుండా నిల్చున్న పొలాల్లో వరికంకులు పగిలిపోయాయని, దీనివల్ల తాలు ఎక్కువగా వస్తుందని కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇంకా చాలా చోట్ల క్షేత్ర స్థాయి సిబ్బంది దెబ్బతిన్న పొలాలను గుర్తించ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర బృందం తమను ఆదుకుంటే తప్పా కోలుకోలేని పరిస్థితి నెలకొందని, బృందం ఆదుకోవాలని కోరుతున్నారు.

రుణాల స్వాహాలో నిందితులు తేలేనా?

కొనసాగుతున్న విచారణ ● దిగులుతో చనిపోతున్న బాధితులు

గుడివాడ, న్యూస్‌టుడే

ది గుడివాడ మున్సిపల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో సభ్యులకు తెలియకుండా వారి పేరున అక్రమంగా కోట్ల రూపాయల రుణాలను స్వాహా చేసిన వ్యవహారంలో విచారణ ప్రారంభించి 10 నెలలు కావస్తున్నా అసలు నిందితులు ఎవరో బయటకు రావడంలో జాప్యం జరుగుతోంది. ఈ సంఘటనపై విచారణ కమిటీని నియమించినా నిందితులను గుర్తించడంలో తాత్సారం జరుగుతుండటంతో పురపాలక సంఘ కార్మికుల నుంచి పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మళ్లీ ఈనెల 10, 11 తేదీలలో కార్మికులను విచారణ చేస్తున్నట్లు తెలిసింది. సొసైటీ కమిటీ వారు బ్యాంకు అధికారులతో కుమ్మక్కయి గత 20 ఏళ్లుగా సభ్యుల పేరుతో అక్రమంగా సుమారు 20 కోట్ల రూపాయలను రుణాలు తీసుకుని వారి సొంతానికి వాడుకున్నారని, ఆ బకాయిలు కార్మికుల జీతం నుంచి మినహాయిస్తున్నారని గుడివాడ పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు మార్చి 14వ తేదీన ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే సూచనల మేరకు దీనిపై కృష్ణా జిల్లా కేంద్ర కో ఆపరేటివ్ బ్యాంకు వారు రాంబాబు అనే అధికారిని విచారణాధికారిగా నియమించారు. నాటి నుంచి నేటి వరకూ విచారణ సాగుతుందే కానీ, నిందితుల వివరాలు బయటకు రాలేదు. పైగా నిత్యం ఒక కొత్త కోణం బయటకు వస్తోంది.

గతంలో ఎమ్మెల్యే రాముకు విజ్ఞప్తి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

బ్యాంకు అధికారిపై నాబార్డుకు ఫిర్యాదు

గతంలో ఈ బ్యాంకు మేనేజరుగా పని చేసి పదోన్నతిలో ఉన్నత అధికారిగా ఉన్న వ్యక్తి ప్రమేయం దీనిలో ఉందని, తక్షణం విచారణ చేయాలని పురపాలక కార్మిక సంఘ నేతలు నాబార్డుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. కొంత మంది కార్మికులకు ఈకేవైసీ (ఖాతాదారుని వ్యక్తిగత గుర్తింపు ఆధారాలు) లేకుండా ఖాతాలు తెరిచిన 33 రోజులలో సదరు ఖాతాలను మొత్తంగా మూసి వేసినట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. సదరు అధికారి ఉన్నంత కాలంలో సుమారు రూ.15 కోట్ల నగదు లావాదేవీలు జరిగాయని ఈ వ్యవహారంలో ఆ బ్యాంకు అధికారి, మరో వ్యక్తిపై నాబార్డుకు ఫిర్యాదు చేశారు. కార్మికుల రుణంగా చూపుతున్న మొత్తాన్ని బినామీ ఖాతాలకు మళ్లించారని కార్మికులు చెబుతున్నారు.

దిగులుతో కార్మికుల మృతి

20 ఏళ్ల క్రితం చనిపోయిన వడ్డాది భాస్కరరావు పేరున 2022లో రూ.10 లక్షల రుణం తీసుకున్నారు. అలాగే, తన పేరున ఉన్న రూ.10 లక్షల అప్పు ఎలా తీర్చాలన్న దిగులుతో అప్పటికే క్యాన్సర్‌తో బాధపడుతున్న పెద్దవీధిలోని వడ్డాది కుమారి చనిపోయింది. ముత్యాల రాము కూడా రుణాల బాధతో చనిపోయాడు. ఇంకా చాలా మంది దిగులుతో, అప్పుల బాధతో శారీరకంగా మానసికంగా కుంగిపోతున్నారు.

విచారణ అధికారి రాంబాబు ఆగస్టు నెల నుంచి విచారణ చేస్తూనే ఉన్నారు. మళ్లీ కొంత మందిని విచారణ చేయడానికి ఈనెల 10, 11 తేదీలలో రమ్మన్నట్లు సమాచారం.

న్యాయవాదుల కార్తిక వనభోజనాలు

ఉసిరి చెట్టుకు పూజ చేసి కొబ్బరికాయ కొడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తల గోపి

పులిగడ్డ(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: పులిగడ్డలోని జలవనరుల శాఖ అతిథి గృహ ప్రాంగణంలో ఉసిరి వనంలో అవనిగడ్డ న్యాయవాదుల కార్తిక వనభోజనాలు సంప్రదాయబద్ధంగా ఆదివారం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తల గోపి ముఖ్య అతిథిగా పాల్గొని ఉసిరి చెట్టుకు పూజ చేశారు. 10వ జిల్లా అదనపు న్యాయమూర్తి బాబూనాయక్, అవనిగడ్డ 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి పాండురంగారెడ్డిలు పాల్గొన్నారు.

ద్వీపం.. ఆహ్లాదకరం..

పున్నమిఘాట్ వద్ద స్పీడ్ బోటులో పర్యాటకులు

కార్తికమాసం పురస్కరించుకుని కృష్ణానది మధ్యలో ఉన్న భవానీ ద్వీపానికి ఆదివారం సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పున్నమిఘాట్ పాయింటు వద్ద నుంచి వారంతా బోటులో ద్వీపానికి వెళ్లారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. సందర్శకుల రాకతో ద్వీపం సందడిగా మారింది. కొత్తగా తాడేపల్లిలో మామిడితోటల్లోనూ వనసమారాధనలు నిర్వహించారు.

- ఈనాడు అమరావతి, - న్యూస్‌టుడే, భవానీపురం

సమారాధనలు పూర్వీకులు అందించిన సంప్రదాయం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: మచిలీపట్నంలోని చిలకలపూడి శివారులో ఆదివారం నిర్వహించిన కాపు కుటుంబీకుల కార్తిక సమారాధనకు వేల సంఖ్యలో ఆ సామాజిక వర్గీయులు తరలివచ్చారు. ఇందులో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని మాట్లాడారు. సమారాధనలు పూర్వీకులు అందించిన మంచి సంప్రదాయమని పేర్కొన్నారు. ఆనాడు వంగవీటి మోహనరంగా కాపు సామాజిక వర్గానికి గుర్తింపు తీసుకొస్తే ఈనాడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మళ్లీ కాపులకు గుర్తింపు తీసుకొచ్చారనడానికి ఎలాంటి సందేహం లేదన్నారు. కాపు కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతుగా రూ.10 లక్షలు అందిస్తానని ప్రకటించారు. కోనేరు సెంటరులో జెండా వీరుడు తోట నరసయ్య నాయుడు విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పక్కన ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు

వేదికపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ అధికారం అనేది వస్తుంది.. పోతుంది. ఏ వర్గం అయినా ఐక్యంగా ఉండటంలో తప్పు లేదు, అయితే ఒకరికొకరు సాయపడుతూ విద్యతో అభివృద్ధి చెందాలన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ మొదటి నుంచి తమకు ఉన్న స్నేహితుల్లో కాపులే ఎక్కువన్నారు. తన రాజకీయ ఎదుగుదలలో వారి పాత్ర కీలకమన్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ కాపు కల్యాణ మండపానికి తాను కూడా రూ.10 లక్షలు ఇస్తానన్నారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ

మాట్లాడుతున్న ప్రసాద్, వేదికపై కృష్ణయ్య, శ్రీనివాసరావు, సుందరయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు

'రాష్ట్రంలో సర్వీస్‌లో ఉన్న 1.3 లక్షల మంది ఉపాధ్యాయులు టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులవ్వాలనే నిర్ణయంలో మినహాయింపు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. విద్యాహక్కు చట్టంలోని నిబంధనలను పార్లమెంట్‌లో సవరించాలి'' అని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో టెట్ ఉత్తీర్ణులవ్వాలనే తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. 12వ వేతన సవరణ కమిటీ నియామకం ఆలస్యమైనందున, ఈ లోగా 29% మధ్యంతర భృతి ఇవ్వాలని పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎక్కువ సమయం బోధనకే కేటాయించేలా, బోధనేతర పనులు అప్పగించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు ఎం.కృష్ణయ్య, కె.శ్రీనివాసరావు, సుందరయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

బంటుమిల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జాతీయ రహదారి 216పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సేకరించిన వివరాల మేరకు.. కృత్తివెన్ను మండలం ఇంతేరుకు చెందిన తిరుమాని లక్ష్మి, శ్రీను, తమ్ముడు నాగమల్లేశ్వరరావు ఆదివారం సాయంత్రం బంటుమిల్లి నుంచి కృత్తివెన్ను వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో పెందుర్రు పరిధిలోకి చేరుకోగానే ఓ ట్రాక్టర్ వీరి వాహనాన్ని ఢీకొని ఆగకుండా వెళ్లింది. దీంతో తీవ్ర గాయాలైన వారిని అంబులెన్స్‌లో మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు. వీరిలో లక్ష్మి(50) మృతి చెందారు. ఈమెకు ఇరువురు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. ఎస్సై గణేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్య పోరాటాలతోనే బీసీలకు న్యాయం

కృష్ణలంక(రాఘవయ్య పార్క్ కూడలి), న్యూస్‌టుడే: ఐక్య పోరాటాలకు బీసీలు సిద్ధం కావాలని ఆ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. శంకరరావు మాట్లాడుతూ ''రాష్ట్రవ్యాప్తంగా జనగణనతో పాటు సమగ్ర కులగణననూ శాస్త్రీయంగా చేపట్టాలి. జనాభా దామాషా ప్రకారం బీసీల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలి. కూటమి ఎన్నికల వాగ్దానమైన చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలంటే ముందుగా కులగణన తప్పనిసరి. అందుకు ఆటంకాలు తలెత్తకుండా దాన్ని సమగ్రంగా నిర్వహించాలి'' అని పేర్కొన్నారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ ''బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి. ఓబీసీల రిజర్వేషన్ల అమలుకు, వారి అభ్యున్నతికి ఆటంకంగా ఉన్న క్రీమిలేయర్‌ను పూర్తిగా ఎత్తివేయాలి'' అని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సోము మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న శంకరరావు. చిత్రంలో క్రాంతికుమార్, మూర్తి, మహేశ్వరరావు తదితరులు

ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పసిడి పతకం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : విజయవాడకు చెందిన లింగం రవీంద్రరావు ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటి పసిడి పతకంతో మెరిశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 5 నుంచి 9 వరకు జరిగిన 23వ ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 70+ పురుషుల విభాగంలో తలపడిన రవీంద్రరావు 10 కి.మీ. రోడ్డు రేస్‌ను 50 నిమిషాల, 34.70 సెకన్లలో పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచారు. 5 వేల మీటర్ల పరుగులో త్రుటిలో పతకం చేజారిందని రవీంద్రరావు తెలిపారు. ఈ విజయానికి కోచ్, ట్రైమెట్రిక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ రుషిల్, వారి బృందం కారణమని చెప్పారు. ఈ ప్రతిభ ద్వారా వచ్చే ఏడాది ఆగస్టు నెలలో దక్షిణ కొరియాలో జరిగే వరల్డ్ మాస్టర్స్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించినట్లు వెల్లడించారు.

రవీంద్రరావు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

గుండెపోటుతో చిలకలపూడి ఎస్.ఐ మృతి



ఎస్.ఐ రేపల్లె శ్రీరంగనాథరావు

అంబులెన్సులో తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న పెద్ద కుమార్తె

గుడివాడ, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని చిలకలపూడి ఎస్.ఐ రేపల్లె శ్రీరంగనాథరావు (60) రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి కాన్వాయ్ వెంట ఎస్కార్టు డ్యూటీలో గుడివాడకు వచ్చి తిరిగి వెళ్తుండగా గుండెపోటుకు గురై గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారు. సేకరించిన వివరాల ప్రకారం.. మంత్రి ఆదివారం మచిలీపట్నం నుంచి నూజివీడు వెళ్తుండగా గుడివాడ వరకూ ఎస్కార్టు వాహనంలో చిలకలపూడి ఎస్.ఐ వచ్చారు. సుమారు 1:30 గంటల సమయంలో ఆయన గుడివాడ నుంచి వెనుదిరిగి పామర్రు రోడ్డులో మచిలీపట్నం వెళుతుండగా రైలు గేటు దాటగానే గుండెపోటు వచ్చింది. తన ఆరోగ్య పరిస్థితి బాలేదని, ఏదో తెలియని బాధగా ఉందని, మూత్రానికి వెళ్తానంటూ కంగారు చేయడంతో వెంటనే సిబ్బంది గుడివాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన పరిస్థితి విషమంగా మారింది. చికిత్స చేసే సమయం కూడా లేకుండానే ఆయన మృతి చెందారు. కొంతకాలం క్రితం ఆయన గుండె సంబంధిత వ్యాధితో ఉండగా 2 స్టంట్లు వేశారు. గతంలో శ్రీరంగనాథరావు గుడివాడ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పనిచేశారు. సంఘటన జరిగిన వెంటనే ఆయన పెద్ద కుమార్తె, అల్లుడు సునీల్ కుమార్ గుడివాడ వచ్చారు. గుడివాడ ఏరియా ఆసుపత్రికి బందరు డీఎస్పీ సీహెచ్.రాజా, గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్, చిలకలపూడి సీఐ అబ్దుల్ నబీలు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మృతదేహాన్ని మచిలీపట్నంలోని వలందపాలెంలోని నివాసానికి తరలించారు. మృతుని స్వగ్రామం అవనిగడ్డ సమీపంలోని అశ్వరావుపాలెం.

☛ 'నాన్నా లే.. నిత్యం డ్యూటీ డ్యూటీ అంటూ ఉండే వాడివి. డ్యూటీలోనే చనిపోయావా. మాకు దిక్కెవరు నాన్నా..' అంటూ పెద్ద కుమార్తె రోదించడం ఆసుపత్రిలో అందరినీ కంట తడి పెట్టించింది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు ఉన్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

పామర్రు, న్యూస్‌టుడే: 104 వాహనాల్లో ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని, గత కాంట్రాక్టు కంపెనీ అరవిందో నుంచి రావాల్సిన గ్రాట్యుటీ, ఈఎల్ బకాయిలను చెల్లించేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని 104 వాహన సిబ్బంది రాష్ట్ర అధ్యక్షుడు వి.ఫణికుమార్ డిమాండ్‌చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సిబ్బందితో కలిసి నిరసన తెలియజేసి మాట్లాడారు. ప్రస్తుత యాజమాన్యం భవ్య హెల్త్ కేర్ ప్రైయివేటు కంపెనీ కూడా ఇప్పటి వరకు నియామక పత్రాలు, పే స్లిప్‌లు ఇవ్వకుండా ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడి చేస్తోందని తెలిపారు. యూనియన్ జనరల్ సెక్రటరీ వినయ్ మాట్లాడుతూ 104 సంస్థలో ఖాళీ ఉద్యోగాలను భర్తీచేయాలన్నారు. ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తిచేసిన డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐకి సంబంధించి యాజమాన్య కోటా సక్రమంగా చెల్లించి ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు ఇవ్వాలన్నారు.

నిరసన తెలియజేస్తున్న 104 సిబ్బంది

104 కార్మికుల హక్కుల సాధన కోసం వారు చేసే పోరాటాలకు సీఐటీయూ పూర్తి మద్దతు ఇస్తుందని మండల నేత గంగాధరప్రసాద్ అన్నారు.

నేత్ర దానంతో మరో ఇద్దరికి కంటి చూపు

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: మండల పరిధిలోని పిట్లల్లంక గ్రామానికి చెందిన చిరువేళ్ల పాండురంగారావు (80) వృద్ధాప్యంతో ఆదివారం తెల్లవారు జామున మరణించారు. ఆయన నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించవచ్చని సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ మృతుని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈమేరకు విజయవాడ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు సమాచారం ఇవ్వగా టెక్నీషియన్ పాండురంగారావు నేత్రాల నుంచి కార్నియాను సేకరించి తీసుకువెళ్లారు. సుదర్శి మానవతా సంస్థ ద్వారా ఇది 249వ నేత్ర దానం కావడం విశేషం.

పాండురంగారావు (పాత చిత్రం)

ఆస్తి కోసం అన్నను చంపిన తమ్ముడు

సాంకేతిక ఆధారాలతో అరెస్టు

నిందితుడు సోనూకుమార్ సహానిని అరెస్టు చేసిన పోలీసులు

గుడివాడ, న్యూస్‌టుడే: ఆస్తి కోసం ఓ తమ్ముడు తోడబుట్టిన అన్నను పథకం ప్రకారం కడతేర్చిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుడివాడ రైల్వే పోలీసు సీఐ ఎం.వి.దుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని దనియాలపేట సమీపంలోని నాగేంద్ర స్వామి పుట్ట సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని ఈ నెల 3వ తేదీ ఉదయం రైల్వే పోలీసులు గుర్తించారు. మృతదేహంపై ఉన్న గాయాలను బట్టి హత్య కేసుగా నమోదు చేశారు. ఈక్రమంలో సెల్ ఫోన్ డంప్ పెట్టి వచ్చిన అనుమానిత నెంబర్లను విచారించి ఎట్టకేలకు మృతుడు బిహారుకు చెందిన పప్పూ సహానీగా, నిందితుడు అతని తమ్ముడు సోనూకుమార్ సహానీగా గుర్తించారు. అసలు విషయానికి వస్తే.. బిహారుకు చెందిన పప్పూసహానీ మైసూరులో పని చేసుకుంటూ కుటుంబంతో జీవిస్తున్నాడు. అతని తమ్ముడు సోనూకుమార్ సహానీ గుడివాడ పామర్రు రోడ్డులో ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. అయితే వారి స్వగ్రామంలో అన్నదమ్ములిద్దరికీ ఓ 30 సెంట్ల ఆస్తి ఉంది. దాని విషయంలో వారి మధ్య తగాదాలు ఉన్నాయి. ఆర్థిక లావాదేవీలలో కూడా చిన్న గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో పప్పూసహానీ తన కంపెనీలో పనిచేయడానికి కూలీలు కావాలని తమ్ముడ్ని కోరగా.. గుడివాడలో ఉన్నారంటూ అన్నను రమ్మన్నాడు. దీంతో అతడు కూలీల కోసం ఈనెల 3వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుడివాడ వచ్చాడు. గంటకు పైగా గుడివాడ రైల్వే స్టేషన్‌లో నిద్రించాడు. అప్పటికే అతని సోదరుడు అన్నను చంపడానికి ప్రణాళిక రచించాడు. 4:47 గంటల ప్రాంతంలో దనియాలపేట వైపుగా రైలు పట్టాల వెంబడి అటు వైపు కూలీలు ఉన్నారు, మాట్లాడదామని తీసుకుని వెళ్లాడు. కొద్ది దూరం వెళ్లగానే పప్పూసహానీని వెనుక నుంచి కత్తితో పొడిచి హత్య చేసి రెండు పట్టాల మధ్య పడిపోయిన అతడిని వదిలి ఎవ్వరూ చూడకుండా వెళ్లిపోయాడు. అయితే పోలీసులు తొలుత టవర్ డంప్ ద్వారా మృతుని తమ్ముడు సోనూకుమార్ సహానీ నెంబరును గుర్తించారు. ఆ తర్వాత అతను రైల్వే స్టేషన్ వద్ద టీ తాగి ఫోన్ పే ద్వారా నగదు చెల్లించిన నేపథ్యంలో అతని సెల్ నెంబరుకు ఫోన్ చేసి విచారించగా అసలు నిజం బయట పడింది. దీంతో నిందితుడు సోనూకుమార్ సహానీను అరెస్టు చేసి విజయవాడ కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఈ కేసులో ఎస్ఐలు మహమ్మద్ షరీఫ్, శివన్నారాయణ, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1

"ఇ" ప్రొక్యూర్ మెంట్ షార్ట్ టెండరు ప్రకటన NIT NO.07/EE-2/2025-26, Dt:09-11-2025

శ్రీ అమ్మవారి దేవస్థానమున నందు సాంకేతిక విభాగమునకు సంబంధించి భవాని దీక్షలు విరమణ- 2025-26 సందర్భముగా కొండ పైన మరియు కొండ క్రింద వివిధ తాత్కాలిక పనులు చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తికలవారు https://tender.apeprocurement.gov.in లో Endowments department వర్క్స్ నందు దర్శించవచ్చును. **టెండరు డౌన్ లోడు ది:11-11-2025 మ.03.00 గం.ల నుండి ది:18-11-2025 ఉ.11.00 గం.ల వరకు. టెండరు దాఖలు చేయు చివరి తేదీ:18-11-2025 మ.03.00 గం.లు.** పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలో లేదా ఫోను నెం.0866-2423800 ద్వారా సంప్రదించగలరు.

ఆర్జిత సేవ మరియు పరోక్షసేవ టికెట్లను https://kanakadurgamma.org నందు పొందగలరు.

శ్రీ బొర్రా రాధాకృష్ణ, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

సం/- వి.కె.శీనా నాయక్, యం.ఎ., స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ - కార్యనిర్వహణాధికారి

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం, శ్రీశైలం-518101, నంద్యాల జిల్లా-ఆంధ్రప్రదేశ్

SRISAILA DEVASTHANAM

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

ఆర్.సి.నం. SBMSD-ADMN0TMP/44/2025-TEMP(G2)-SBMSDSLM తేది: 09-11-2025

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం, శ్రీశైలం, నంద్యాల జిల్లా ఆలయ విభాగం-శ్రీశైల మహాక్షేత్రము నందు శ్రీ స్వామి అమ్మ వార్ల దర్శనార్థము విచ్చేయు ముఖ్య అతిథులకు మరియు అతిథులకు సమర్పించుటకు గాను అవసరమైన సాఫ్ట్ సిల్క్ శాలువాలను (విత్ గోల్డ్ జరి) ఒక సంవత్సరం కాల పరిమితికి అనగా తేది: 01-12-2025 నుండి 30-11-2026 సరఫరా చేయుటకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు కోరబడుచున్నది. ఇతర వివరముల కొరకు www.apeprocurement.ap.gov.in నందు చూడవచ్చును.

శ్రీ స్వామి అమ్మ వార్ల సేవలో...

యం.శ్రీనివాస రావు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి

91.9FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 95537 86677/96404 96677

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

TO LET

COMMERCIAL

TO.LET

విద్యా సంస్థలకు, ఆఫీసులకు

12000 వేలు చ॥అ కమర్షియల్ స్పేసు అద్దెకు ఇవ్వబడును.

దాసరి కమర్షియల్ కాంప్లెక్సు

జె.పి.రోడ్,భీమవరం-2

94408 70986
94403 56099

SECOND SALE

24 గుమ్మములు, 55 కిటికీలు, డోర్స్‌తో సహా (10 సం॥ముల పాతవి) అమ్మబడును. Contact: ✆ 94408 70986, 94403 56099.

JOBS

Req. of DRA & Non DRA Banking Collections, Field Exec: 16K- 22K, Telecaller: 11K- 15K+ Incen. @ Vijayawada ✆ 63040 56516.

Wanted Real Estate Door to Door Field Marketing Executives in Nandigama (Freshers) Contact: 94324 54545.

Wanted B.Com /M.Com / MBA Finance / CA IPCC Droupouts To be work as Field / Back end Executive in Vijayawada in a Reputed Audit Firm. Interested Persons. Cont: 70135 11502 or Mail To kowthahr@gmail.com

Wanted Experienced Godown Incharge for Medical Agencies @ Srinivasa Drugs, Bhavanipuram, VJA. Ph: 970407 1271.

Teachers for 6 to 10th Telugu, Hindi, English & Social, Study Hours, Spoken English, Computer faculty, Art Craft & Drawing Teachers. ✆ 80745 28582.

ప్రముఖ నిర్మాణసంస్థకు టెలీకాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ స్టాఫ్, సైట్ ఇంజినీర్, సూపర్‌వైజర్, అకౌంటెంట్ కావలెను. ✆ 77024 66003, 89777 59919.

కరీంనగర్ జిల్లా వేములవాడలో ఒక్కరి కోసం బ్రాహ్మణ వంటమనిషి కావలెను. పిల్లలుంటే స్కూలు విద్య ఉచితం. ఉచిత వసతి, భోజనం. సెల్: 92469 32088.

DTP ఆపరేటర్స్ (F) కావలెను. పేజిమేకర్ / అడోబ్ ఇన్‌డిజైన్ / కొరల్‌డ్రాలో బుక్‌వర్క్ చేయుగల వారికి ప్రాధాన్యత. ✆ 77028 02426, 98484 07654.

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ:23000 టు 29000. వ: 18-35. ✆ 77309 58410.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణ తగదు

డీఈవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

మచిలీపట్నం(కోనేరు సెంటరు), న్యూస్‌టుడే : సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గతంలో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఆదివారం డీఈవో కార్యాలయం వద్ద జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు సాయికిరణ్ బాబు, నాని తదితరులు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల అక్రమాలపై ఫిర్యాదు చేసే చర్యలు తీసుకోవాల్సిన డీఈవో తమనే దుర్భాషలాడటం గర్హనీయమన్నారు. ఇప్పటికైనా నిబంధనలు అతిక్రమిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకుంటే జిల్లా స్థాయిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

❖ నగరంలోని బైపాస్ రోడ్డులో పబ్లిక్ కుళాయి ట్యాప్ పాడైపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులు 'ఈనాడు' 'మేమున్నాం'.. మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వారు సంబంధిత సిబ్బందిని పంపి కుళాయికి కొత్త ట్యాప్ ఏర్పాటు చేయించారు.

❖ నగరంలోని పరాసుపేటలో రూదారి పక్కన వేసిన చెత్తను తొలగించక పోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. స్థానికులు ఈ సమస్యను 'మేమున్నాం'.. మీకు తోడుగా ద్వారా అధికారులకు వివరించారు. వారు వెంటనే స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

ఆలయ పునఃనిర్మాణానికి విరాళాలు

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదమద్దాలి లోని శ్రీ ఉద్దండ వేణుగోపాల స్వామి ఆలయ పునఃనిర్మాణానికి దాతల నుంచి రూ.1,05,232 విరాళాలు అందాయని అధికారి జక్కు వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామానికి చెందిన మిక్కిలినేని మధుసూదనరావు భార్య ప్రవద రూ.1,00,116, కృష్ణవేణి జ్ఞాపకార్థం భర్త మిక్కిలినేని శివ రామకృష్ణప్రసాద్ రూ.5,116 విరాళంగా అందించారన్నారు.

టమాట ధర వరలు

టమాట 27, వంగ 62, బెండ 36, పచ్చిమిర్చి 30, కాకర 46, క్యాబేజీ 28, క్యారెట్ 78, దొండ 47, బంగాళదుంప 34, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 54, దోస 24, సొర 35/30, అరటికాయ 5/6, చిక్కుడు 80, బీర 48, చామదుంప 30, మునగ 10/08, కంద 48, బీట్‌రూట్ 50, కీరదోస 40, బీన్స్ 80, క్యాప్సికం 68, అలసందలు 60, చిలకడదుంప 44, కొత్తిమీర 30/15, పుదీనా 20/5 సోమవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలే వర్తిస్తాయి. ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఎస్టేట్ అధికారిని ఫోన్ నంబరు: 91823 61295లో సంప్రదించవచ్చు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

సినిమాలు

రేవతి : జటాధర
మినీరేవతి : కృష్ణలీల
సిరికృష్ణ : డిగ్రీఫ్రెండ్
సిరివెంకట్ : మాస్ జాతర
- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

రుణాలు పొందండి.. జీవనోపాధి పెంచుకోండి

పెడన, న్యూస్‌టుడే

మహిళలను ఆర్థికంగా పటిష్ఠం చేయాలన్న లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోంది. స్వయం ఉపాధిని ప్రోత్సహించి జీవనోపాధులను పెంపొందించేందుకు డ్వాక్రా ద్వారా రుణాలు అందిస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ప్రగతి సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెడన మండలంలో ఇప్పటికే పలువురు మగువలు పాడి పరిశ్రమను స్థాపించి స్వయం ఉపాధి పొందుతున్నారు.

పెడనలో గేదెల పెంపకం చేపట్టిన మహిళలు

సంస్కరణలు చేపట్టి..

గతంలో స్త్రీలు తీసుకున్న రుణాలను ఇంటి అవసరాలకు వినియోగించడంతో తిరిగి చెల్లించేందుకు కొన్ని ఇబ్బందులు అనివార్యమయ్యాయి. ఫలితంగా గ్రూపు సభ్యుల్లో విభేదాలు పొడచూపి అధికారులకు ఫిర్యాదులు అందేవి. కొంతమంది తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించలేని పరిస్థితులు కూడా వెలుగుచూశాయి. అయితే దీనిలో లోపాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ద్వారా సంస్కరణలు చేపట్టింది. డ్వాక్రా సభ్యురాలు రుణం తీసుకుంటే యూనిట్ ప్రారంభించాలన్న నిబంధన తీసుకొచ్చింది. వీటి తనిఖీకి నలుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. ఇందులో తహసీల్దార్, ఎంపీడీవో, వెటర్నరీ అధికారి, వెలుగు ఏపీఎం సభ్యులుగా ఉంటారు. ప్రతి యూనిట్‌ను తనిఖీ చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసే బాధ్యతను ఈ కమిటీ చేపడుతోంది.

ముందుకొస్తున్నారు..

మండలంలోని గ్రామ పంచాయతీల్లో పలువురు మహిళలు యూనిట్ల స్థాపనకు ముందుకొచ్చారు. ఒక్కో మహిళకు రూ.లక్ష, పది మంది సభ్యులకు రూ.10 లక్షల వంతున బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్‌ల నుంచి రుణాలిస్తున్నారు. ఇప్పటి వరకు 9 మంది పాడి పరిశ్రమ స్థాపించారు. కట్టపల్లో కొర మేను పెంపకం చేపట్టేందుకు పలువురు ముందుకొచ్చారు. నందమూరులో 216 జాతీయ రహదారి పక్కగా అరకు కాఫీ స్టాల్ త్వరలో ఏర్పాటు చేయనున్నారు. పచ్చళ్లు, విస్తర్ల తయారీ, కలంకారీ ప్రింటింగ్ యూనిట్ల స్థాపనకు మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు.

చైతన్య పరుస్తున్నాం

రుణం తీసుకున్న ప్రతి మహిళ యూనిట్లు ఏర్పాటు చేసేలా చైతన్య పరుస్తున్నాం. అవసరమైతే రుణాన్ని పెంచేందుకు సిద్ధంగా ఉన్నాం. పాడి పరిశ్రమ ద్వారా మహిళల ఆదాయం గణనీయంగా పెరిగింది. రానున్న రోజుల్లో కలంకారీ ప్రింటింగ్ యూనిట్ల స్థాపనకు చర్యలు చేపడుతున్నాం. - శ్రీదేవి, ఏపీఎం, వెలుగు

నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, పలువురు ప్రముఖులు

రాఘవయ్య సేవలు స్ఫూర్తిదాయకం

గూడూరు, న్యూస్‌టుడే : రాఘవయ్య సేవలు స్ఫూర్తిదాయకమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గూడూరు మండలం ముక్కొల్లుకు చెందిన సమ్మెట రాఘవయ్య సంతాప సభను ఆదివారం మచిలీపట్నంలోని ఆయన ఇంటి వద్ద నిర్వహించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆప్కోస్ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ దిలీప్ కుమార్, ఉమ్మడి డైరెక్టర్ లంకె నారాయణ ప్రసాద్, గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు, నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బొర్రపోతుపాలెం(మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి సోమశేఖర్ విజ్ఞప్తి చేశారు. బొర్రపోతుపాలెం, బుద్దాలపాలెం గ్రామాలకు సంబంధించి బొర్రపోతుపాలెం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. నీటి సంఘం అధ్యక్షుడు కేపీ రామస్వామి, పీఏసీఎస్ ఛైర్మన్ కొక్కు లక్ష్మణ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ కొక్కు ప్రభావతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాటా వద్ద సోమశేఖర్, నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

తోట్లవల్లూరు: జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి నెక్కలపూడి బాంధవిక, నెక్కలపూడి నిహారిక రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని మండల తెలుగు రైతు అధ్యక్షుడు నెక్కలపూడి మురళీ తెలిపారు. అక్కచెల్లెలు ఆటల పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అంబేడ్కర్ ఆశయాలు ఆచరిద్దాం

విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, న్యూస్‌టుడే : అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని కొప్పల్లలో డా.బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు జీవిత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకట నగేశ్, కూటమి నాయకులు కమ్మగంటి వెంకటేశ్వరరావు, కాగిత వాసు, గ్రామస్థులు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, పాల్గొన్న భక్తులు

మోపిదేవి ఆలయం కిటకిట

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవిలో స్వయంభుగా వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించటానికి ఆదివారం 40వేల మంది భక్తులు తరలిరావటంతో ఆలయ ప్రాంగణం, మోపిదేవి పురవీధులు కిక్కిరిశాయి. కార్తిక మాసం, సెలవు రోజు కావటంతో భక్తుల తాకిడి పెరిగింది. వివిధ సేవల రూపేణా రూ.12,24,960 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్లు నిండుగా ఉన్నాయి. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్.ఐ సత్యనారాయణ, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు భక్తులకు సేవలు అందించారు.

ఎస్ఎన్.గొల్లపాలెంలో..

సోమేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

గోపువానిపాలెంలో..

శివాలయాల్లో కార్తిక వైభవం

మచిలీపట్నం రూరల్, న్యూస్‌టుడే : కార్తిక మాసంలో శివాలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. ఎస్ఎన్.గొల్లపాలెంలోని శ్రీఉమా సమేత సోమేశ్వర స్వామికి ప్రాతఃకాలంలో మహన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం నిర్వహించారు. మంగినపూడిలో నగరేశ్వర స్వామికి, పోతేపల్లిలో విజయ కనకదుర్గ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

❖ గోపువానిపాలెం శివారు సంపత్‌కుమారపురం(దావాల సెంటర్)లోని విజయ కోదండ రామాలయంలో భక్తులు కార్తిక దీపాలతో శివలింగాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు.

గోకవరం(మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే : గోకవరం గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకె నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మైథిలి, స్థానికులు

గోమాతకు సీమంతం

మచిలీపట్నం రూరల్, న్యూస్‌టుడే : మచిలీపట్నం మండలం గోపువానిపాలెనికి చెందిన కట్టె మైథిలి శనివారం బంగారం, సీతమ్మ అనే గోమాతకు పలువురు మహిళలతో కలిసి సీమంతం చేశారు. మూగజీవులంటే తనకు ఇష్టమని, పవిత్రమైన గోమాతకు సీమంతం చేయాలనే నిర్ణయంతో ఎనిమిది పర్యాయాలు గోవులకు సీమంతం జరిపానని మైథిలి తెలిపారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

చల్లపల్లి, న్యూస్‌టుడే: మేకావారిపాలెంలో రావెళ్ల కృష్ణ సేవాసమితి ఛైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ కన్నుల పండువగా జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్-విజయలక్ష్మి దంపతులు, మండలి వెంకట్రామ్-సాయి సుప్రియ దంపతులు విచ్చేసి అయ్యప్ప స్వామికి పూజలు చేశారు. ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, చల్లపల్ల సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పీఏసీఎస్ ఛైర్మన్ గుత్తికొండ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఇకనైనా పూర్తి చేస్తారా... వదిలేస్తారా?

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

పిల్లర్ల దశలో జిల్లా రవాణా శాఖ కార్యాలయ భవనం

నగరంలో అసంపూర్తిగా వదిలేసిన వివిధ కార్యాలయాల భవనాలు గత పాలకుల తీరుకు అద్దం పడుతున్నాయి. కనీసం మొదలు పెట్టిన పనులను పూర్తి చేయకుండా వదిలేయడంతో ఇంకా శిథిల, అద్దె భవనాల్లో కార్యాలయాలు నిర్వహించాల్సిన దుస్థితి. వాటిల్లో విధులు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్డీవో కార్యాలయంలోకి నీరు చేరడంతో సిబ్బంది విధులు మానేసి నీళ్లల్లోనే కూర్చున్న సంఘటనలున్నాయి.

★ మచిలీపట్నం కలెక్టరేట్ పరిధిలో ఆర్డీవో కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో తెదేపా హయాంలో నూతన భవనం నిర్మించాలని రూ.2.25 కోట్ల నిధులు కేటాయించారు. పనులు సాగుతున్నప్పుడు ప్రభుత్వం మారడంతో పునాదుల దశలో ఆగిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు దాన్ని పూర్తి చేయలేదు.

★ బందరు తహసీల్దారు కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో తెదేపా హయాంలో భవన నిర్మాణానికి రూ.90 లక్షలు కేటాయించి కొంత మేర పనులు చేసి వదిలేశారు. వైకాపా ప్రభుత్వంలో దీన్ని పూర్తి చేయాలని పలుమార్లు పాలకులకు విజ్ఞప్తి చేసినా స్పందించలేదు. ప్రస్తుతం మచిలీపట్నంను ఉత్తర, దక్షిణ మండలాలుగా విభజించారు. ఉత్తర మండలం శిథిలభవనంలో కొనసాగుతుండగా, దక్షిణ మండలం నీటి పారుదల శాఖ కార్యాలయ ప్రాంగణంలోని ఓ గదిలో సాగుతుంది.

★ గతంలో నగరపాలక సంస్థ కార్యాలయానికి రూ.5 కోట్లు వెచ్చించి మచిలీపట్నం రైల్వే స్టేషన్ ప్రాంతంలో పనులు చేపట్టారు. పునాదుల దశకు చేరిన తర్వాత నిధుల విడుదలలో జరిగిన జాప్యంతో పనులు నిలిచాయి.

★ జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి వలందపాలెం ప్రాంతంలో స్థలం కేటాయించి పదేళ్లు దాటింది. వైకాపా హయాంలో కొంతమేర పనులు చేపట్టి వదిలేశారు. ప్రాంగణమంతా మురుగు చేరి తటాకంలా తయారయ్యింది. దీంతో ఇక్కడికి వచ్చే ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు.

★ సుకర్లాబాద ప్రాంతంలో నిర్మించిన డీఎస్పీ కార్యాలయ భవనాన్ని అసంపూర్తిగా వదిలేశారు. ఇలా వైకాపా పాలకులు పట్టించుకోకపోవడంతో అనేక భవనాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. ఇటీవల వరకు సీపీవో కార్యాలయ ప్రాంగణంలో సాగుతున్న జిల్లా పౌర సంబంధాల శాఖ, పర్యాటక శాఖ కార్యాలయాలను తరలించాల్సి రావడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకుని ఆయా భవన నిర్మాణాలను పూర్తి చేస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారు.

పెడనలో వ్రతం ఆచరిస్తున్న భక్తులు

బందరు: సహపంక్తి భోజనాల్లో ప్రజలు

గోపూజ చేస్తున్న మంత్రులు పార్థసారథి, రవీంద్ర

వన సమారాధనలు.. ఐక్యతకు ప్రతీకలు

కార్తిక మాసంలో నిర్వహించే వన సమారాధనలు సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో ఆదివారం వివిధ సంఘీయులు, సంస్థల ఆధ్వర్యంలో సమారాధనలు ఏర్పాటు చేశారు. పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే, బృందం

చిన్నారుల సందడి

కమ్మ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్‌కు సన్మానం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గోపీచంద్ తదితరులు

అలరించిన కళాకారుల నృత్యం

మహిళల కోలాట ప్రదర్శన

ఫణికుమార్ దంపతులను సత్కరిస్తున్న నాయకులు, ప్రముఖులు

డివిజన్ ప్రజల సంక్షేమానికి కృషి

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే : బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి రావడానికి కారణమైన 45వ డివిజన్ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తానని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ.ఫణికుమార్ అన్నారు. స్థానిక సిడింబి అగ్రహారంలోని గొర్రెపాటి గోపీచంద్ నివాసంలో ఆదివారం ఫణికుమార్ దంపతులను తెదేపా నాయకులు, ప్రముఖులు ఘనంగా సత్కరించారు. తెదేపా నాయకులు పుప్పాల ప్రసాద్, మాదివాడ వెంకట నరసింహారావు, గంజాల రవికుమార్, కొనకళ్ల భాను ప్రసాద్, పాలపర్తి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం రేపు

నాగాయలంక, న్యూస్‌టుడే : మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11వ తేదీ మంగళవారం ఉదయం బర్రంకుల గ్రామంలోని పీఏసీఎస్ కార్యాలయం ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం, అన్నదానం జరుగుతుందని నిర్వహణ కమిటీ అధ్యక్షులు తలశిల స్వర్ణలత, తెదేపా మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని కూటమి నాయకులు విరివిగా తరలి రావాలని వారు కోరారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

చిత్రలేఖనం నిశ్శబ్ద కవిత్వం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : చిత్రలేఖనం అంటే నిశ్శబ్ద కవిత్వం లాంటిదని డీవైఈవో శేఖర్ సింగ్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని సన్ స్టార్ పాఠశాల ప్రాంగణంలో సన్ హెల్పింగ్ హబ్, మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వీటిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిత్రలేఖనం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెంపొందుతుందని, అది చదువులో కూడా ఉత్తమ ఫలితాలు సాధించడానికి దోహదపడుతుందన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు బీఎస్‌వీ రమేష్, స్టార్ విద్యాసంస్థల నిర్వాహకులు పి.శ్రీరామ్, అయ్యప్ప స్వామి, ప్రిన్సిపల్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా బాడీబిల్డింగ్ పోటీల్లో సత్తా చాటిన ప్రశాంత్‌ను సత్కరించి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.10 వేలు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న శేఖర్ సింగ్ తదితరులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: ఏలూరు సెయింట్ జేవియర్ హైస్కూల్‌లో 1981-82లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బొమ్ములూరులోని ఓ ఉద్యానవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి, నేటి మధుర స్మృతులను ఒకరినొకరు పంచుకున్నారు. ఈ ఆనవాయితీని ఏటా కొనసాగించాలని తీర్మానించారు. పోలిమెట్ల మోజెస్, తణుకు వెంకట సుబ్బారావు, బట్టు శుభాకర్, మల్లంపాటి అమర్‌కుమార్, గుండాబత్తుల రామ్మూర్తి, తాళ్లూరి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

ఉత్సాహంగా నడక పోటీలు

అవనిగడ్డ: దివి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకింగ్, రన్నింగ్, సైక్లింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ తొలుత జెండా ఊపి వాకింగ్ పోటీలను ప్రారంభించారు. పురుషులు, మహిళలు విభాగాలలో వయో విభాగాల వారీగా నిర్వహించిన పోటీలలో వాకర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాకర్స్ సంఘం గౌరవ అధ్యక్షుడు ఆర్.రాఘవరావు, అధ్యక్షుడు పర్చూరి రాఘవేంద్రరావు, కోశాధికారి వడ్లమూడి శశికుమార్ పాల్గొన్నారు.

పాముకాటుతో గీత కార్మికుడి మృతి

నిడుమోలు(కూచిపూడి), న్యూస్‌టుడే: నిడుమోలు శివారు వీరాయిలంక గ్రామస్థుడు, కల్లుగీత కార్మికుడు నారగాని వెంకటేశ్వరరావు (55) పాముకాటుకు చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. కొద్దిరోజుల క్రితం ఇంటిలో నిద్రిస్తున్న నారగానిని మునుగుడు పాము కాటువేయగా బంధువులు మచిలీపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కల్లుగీత సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామచంద్రరావు, సంఘ నాయకులు పామర్తి శ్రీనివాసరావు, అచ్చేశ్వరరావు, తదితరులు కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

అధ్వానం.. అపరిశుభ్రం

స్థానిక రామలక్ష్మి వీవర్సు కాలనీలో అంతర్గత రహదారి దుస్థితిది. కాలనీలోకి వెళ్లే ఈ రోడ్డును చెత్త సగానికి పైగా ఆక్రమించింది. ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డుకు బదులు ఇలా కాలనీలో డంప్ చేస్తున్నారు. ఫలితంగా ఈ ప్రాంతంలో తీవ్ర పారిశుద్ధ్య సమస్య ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, పెడన

ప్రమాదకరంగా రహదారి అంచులు

మండల కేంద్రం బంటుమిల్లి మండల పరిషత్ కార్యాలయం నుంచి జాతీయ రహదారిపైకి చేరుకునే మార్గం ప్రమాదకరంగా తయారయ్యింది. సింగిల్ రోడ్డు, అందులోను రహదారి అంచులు ఇరువైపులా గుంతలమయంగా, బురదమయంగా తయారు కావడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకోవడానికి వీలు లేకుండా పోయింది. దీంతో రాత్రి వేళ వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి అంచులు సరి చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి

రోడ్డు పొడవునా వ్యర్థాలు.. రాకపోకలకు ఇక్కట్లు

మచిలీపట్నంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చెట్ల కొమ్మల వ్యర్థాలను చల్లపల్లి బైపాస్ రోడ్డులో రహదారి పొడవునా వేసి వదిలేశారు. దీంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. చెట్ల కొమ్మలను గుట్టలుగా వేయడంతో అవి జారి రహదారిపైకి చేరుతున్నాయి. ఇలాగే వదిలేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటిని అక్కడ నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

భగవద్గీతతో జ్ఞాన సమూపార్జన

ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

హనుమాన్‌జంక్షన్: మానవ జీవన విధానంలో భగవద్గీత గ్రంథం ఎంతో ఉత్కృష్టమైందని, దీని ద్వారా జ్ఞానం చేకూరుతుందని త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. వారి ఆధ్వర్యంలో ఆదివారం మడిచర్లలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కర్మయోగం విశిష్టతను తెలుసుకొని నడుచుకోవాలన్నారు. అరుణ్‌కుమార్, కోటేశ్వరరావు, రామాంజనేయులు, శ్రీకాంత్, అశోక్, సుందరరావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

✤ పెనమలూరు హిందు శ్మశానం రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు పెరిగిపోయాయి. విష పురుగులు, పాములు సంచరిస్తున్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి అహ్మద్ స్పందించి.. యంత్రంతో శుభ్రం చేయించి.. ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించారు. ✤ పెనమలూరు పొట్టిశ్రీరాములు రహదారి, వెంకటాద్రిగార్డెన్స్‌లో కొన్ని వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి అహ్మద్ స్పందించి.. ఆయా ప్రాంతాల్లో 12 కొత్త దీపాలను ఏర్పాటు చేయించారు. ✤ గంగూరులోని ముఖ్య కూడళ్లలో సిమెంటు బల్లలు ఏర్పాటు చేయించాలని గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి.. 15 సిమెంట్ బల్లలను కొనుగోలు చేయించారు. వాటిని సోమవారం ఏర్పాటు చేయించనున్నట్లు తెలిపారు. ✤ గంగూరులో నలంద పాఠశాల వెనుక కట్టపై వీధి దీపాలు వెలగడం లేదని 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి.. ఆయా ప్రాంతాల్లో 8 కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు. ✤ గంగూరు మసీదు కూడలి, ఉర్దూ పాఠశాల, రజకపేటల్లోని డ్రెయిన్లలో పూడిక తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి.. సమస్య పరిష్కరించారు. -పెనమలూరు, న్యూస్‌టుడే

✤ పోరంకి రామాపురం కాలనీలో వాటర్ ట్యాంకు వద్ద నీరు రావడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. పురపాలక ఈఈ భూషణం స్పందించారు. మోటార్లకు మరమ్మతులు చేయించి.. సమస్య పరిష్కరించారు.

- పోరంకి, న్యూస్‌టుడే

మాతృత్వ వందనం.. ఆర్థిక ప్రయోజనం!

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పౌష్టికాహారం లోపం లేకుండా పురిటి ఖర్చులు, పోషణ నిమిత్తం గర్భిణులకు ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన(పీఎంఎంవీవై) ఆర్థికంగా అండగా నిలుస్తోంది. గతంలో పథక నిర్వహణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అమలయ్యేది. తాజాగా ఆ బాధ్యతలను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించారు. మూడు విడతలుగా అందించే పథకం నగదు రూ.5వేలను ప్రస్తుతం రెండు విడతలుగా అందిస్తారు. మొదటి కాన్పునకు సంబంధించి గర్భం దాల్చిన అనంతరం పేర్లను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న తర్వాత రూ.3 వేలు, ప్రసవం అనంతరం మూడు టీకాలు తీసుకున్నాక మిగిలిన రూ.2వేలను బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. రెండో కాన్పులో ఆడబిడ్డ పుడితే మూడు టీకాలు తీసుకున్నాక ఒకేసారి రూ.6వేల నగదును జమచేయనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో మంగమ్మ తెలిపారు. అర్హులైన గర్భిణులు ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ పద్మావతి సూచించారు.

గన్నవరం ఐసీడీఎస్ పరిధిలో వివరాలు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	ఆరేళ్లలోపు చిన్నారులు
గన్నవరం	81	404	305	4744
బాపులపాడు	82	336	279	3783
ఉంగుటూరు	67	204	168	2488

కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆదరణ

కరపత్రాలు అందజేస్తున్న దండమూడి చౌదరి

పెదఓగిరాల (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆదరణ పొందుతోందని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. ఉయ్యూరు మండలం పెద ఓగిరాలలో 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. జీఎస్టీ తగ్గించడంతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ రెడ్డి, పోతురెడ్డి, వసంత్‌కుమార్, జయరాజు, సోమేశ్వరరావు, హరీష్ పాల్గొన్నారు.

కుంతీదేవి ఉత్సవాలు

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే: తాడిగడపలో కుంతీదేవి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. మొత్రపు విశ్వనాథ్ యూత్ ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కొండా ప్రవీణ్, అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్, బోడె మనోజ్, మేడసాని రత్నకుమారి, మౌళి, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: ఏలూరు సెయింట్ జేవియర్ హైస్కూల్‌లో 1981-82లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బొమ్ములూరులోని ఓ ఉద్యానవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి, నేటి మధుర స్మృతులను ఒకరినొకరు పంచుకున్నారు. ఈ ఆనవాయితీని ఏటా కొనసాగించాలని తీర్మానించారు. పోలిమెట్ల మోజెస్, తణుకు వెంకట సుబ్బారావు, బట్టు శుభాకర్, మల్లంపాటి అమర్‌కుమార్, గుండాబత్తుల రామ్మూర్తి, తాళ్లూరి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం తీసుకోవాలి

నూతన పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: దాతల సహకారంతో ఆలయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో పేరంటాలమ్మ ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెంకట్రావు ముఖ్యఅతిథిగా హాజరై.. ఛైర్మన్ పట్టపు వెంకటేశ్వరరావుతో పాటు మరో పది మంది కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నూతన పాలకవర్గం శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. రూ.28 లక్షలు నిధులు అందుబాటులో ఉన్నాయని వాటితో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నిధులు సరిపోకపోతే ప్రైవేట్ సంస్థలు, దాతల సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అవసరమైన నిధుల తాను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, దాసరి బాలవర్ధన్‌రావు, గన్నవరం ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి, కూటమి నాయకులు సూర్యం, దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, సర్నాల బాలాజీ, కొల్లా ఆనంద్, బొప్పన హరికృష్ణ, కొంగనరవి, గుజ్జర్లపూడి బాబురావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

విరాళం అందిస్తున్న దాతలు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు దర్శనేరు చెరువు వద్ద ఉన్న శివాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న మాలికాపురత్తమ్మ ఉపాలయ నిర్మాణానికి బాపులపాడుకు చెందిన వర్మనేని మధుసూదనరావు, జయ దంపతులు రూ.4 లక్షలు విరాళం అందజేశారు. ఆ మొత్తాన్ని ఆలయ నిర్మాణకర్తలు గూడపాటి రత్నశేఖర్, గూడవల్లి చిన్నా, తమిరి రమేష్, పిరమాచనేని నాగయ్య, కొల్లి వెంకట్రావు, వడ్డమాడి అంజనేయులు తదితరులకు ఆదివారం అందజేశారు. నూజివీడు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన లావు రాజేంద్రప్రసాద్ రూ.10,116 విరాళంగా అందజేశారు.

విజయ డెయిరీ ప్రగతికి చలసాని కృషి

ఆంజనేయులను సత్కరిస్తున్న నిర్వాహకులు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: స్వచ్ఛ విభాగంలో వీరవల్లి విజయ డెయిరీ యూనిట్‌కు రాష్ట్ర స్థాయి పురస్కారం లభించిన నేపథ్యంలో సంస్థ ఛైర్మన్ చలసాని ఆంజనేయులను ఆదివారం పలువురు ఘనంగా సత్కరించారు. వేలేరులో ఓ తోటలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకులపాడు సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చలసాని పూర్ణబ్రహ్మయ్య దంపతులు, లయన్స్ క్లబ్ నాయకులు నందిగం స్వామి, అక్కినేని రాఘవేంద్రరావు, యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, మిక్కిలినేని ఈశ్వరరావు, చలసాని రాజా, హనుమంతు నాగేశ్వరరావు, తిపిర్నేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. విజయ డెయిరీని అన్ని విధాలా ప్రగతి పథంలో నడిపిస్తున్నారంటూ ఆంజనేయులను అభినందించారు.

మురుగు.. రహదారిపై పరుగు!

వీరవల్లిమోఖాసా (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: కడవకొల్లు శివారు వీరవల్లిమోఖాసాలో వినాయకుని ఆలయం వద్ద డ్రెయిన్ పొంగి రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యంగా ఉంది. దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు.

నిధులు చాలక.. నిర్మాణాలు సాగక

నున్న, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆర్బీకేలకు అనుసంధానంగా ధాన్యం నిల్వ కేంద్రాల నిర్మాణాలకు అనుమతి ఇచ్చింది. ఆ సమయంలో సరిపడా నిధులు మంజూరు చేయకపోవడంతో వాటి నిర్మాణం సగంలోనే ఆగిపోయింది. రూ.25 లక్షల వరకు నాబార్డు నిధులను వినియోగించారు. అప్పటి నుంచి పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. దీంతో ఆ ప్రాంతమంతా పిచ్చి మొక్కలు మొలిచాయి. విషసర్పాలు దర్శనమిస్తున్నాయి. మార్క్‌ఫెడ్ సొసైటీ ద్వారా నున్న ధాన్యం నిల్వ కేంద్రాలు నిర్మించేందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

లాకుల రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు

కంకిపాడు, న్యూస్‌టుడే: వాహనాల రాకపోకలు అధికంగా ఉండే కంకిపాడు లాకుల రోడ్డులో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. పంచాయతీ కార్యాలయం, కూరగాయల మార్కెట్లు, సినిమా హాళ్లు, దుకాణ సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు విస్తరించడంతో పాటు రొయ్యూరు, వల్లూరుపాలెం, బొడ్డపాడు, చినపులిపాక తదితర గ్రామాలకు వెళ్లే ఆటోలు, ఇతర వాహనాలు, ప్రయాణికులు ఇక్కడే కేంద్రీకృతమవుతున్నారు. మద్దూరు, రొయ్యూరు క్వారీల నుంచి వందల సంఖ్యలో ఇసుక వాహనాలు వెళ్లి వస్తుంటాయి. దీనికి తోడు అంచులు ఆక్రమణకు గురవడంతో విశాలమైన రహదారి ఇరుకుగా మారింది. రోజులో ఒకసారైనా అరగంట పాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఘనంగా అన్నాభిషేకం

యనమలకుదురు రామలింగేశ్వరుడు

పెరికీడు ముక్తేశ్వరస్వామి

ప్రత్యేక అలంకరణలో పెనమలూరు భీమేశ్వరస్వామి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పెరికీడు శ్రీముక్తికాంత ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకించారు. అన్నాభిషేకం చేశారు. అనంతరం విశేష పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు నక్కా బాబు, మెరుగుమాల వేణు, పుట్టి వీర్రాజు, పుట్టి కోటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కానుమోలు సోమేశ్వర స్వామి ఆలయంలోనూ అన్నదానం నిర్వహించారు.

యనమలకుదురు, న్యూస్‌టుడే: ఆరుద్ర నక్షత్రం సందర్భంగా యనమలకుదురు రామలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి.. అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భవానీ, అర్చకులు జీఆర్వీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరు భీమేశ్వరాలయంలో భక్తుల సందడి నెలకొంది. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీ గోపాలరావు

పోరంకి, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వీ గోపాలరావు అన్నారు. పోరంకి విజ్ఞాన్ భారత్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సంఘ మహాసభ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించాలన్నారు. సంఘ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పిల్లి నరసింహారావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలన్నారు. సమావేశంలో ఆదినారాయణ, షేక్ ఖాశిం పాల్గొన్నారు. అనంతరం పెనమలూరు మండల కమిటీని ఎన్నుకున్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

వ్రతంలో పాల్గొన్న భక్తులు

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే: కార్తిక పంచమిని పురస్కరించుకుని తాడిగడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని అర్చకులు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొత్తం 50 జంటలు పాల్గొన్నాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో పేటతుల్లి


అయ్యప్పస్వామి వారి రథం

గ్రామోత్సవంలో మహిళల కోలాటం

కంకిపాడు, గ్రామీణ, న్యూస్‌టుడే: అయ్యప్పస్వామి పేటతుల్లి గ్రామోత్సవం ఆదివారం రాత్రి కంకిపాడులో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక శివాలయం నుంచి బయలుదేరిన స్వామివారి రథాన్ని భక్తిగీతాలు, కోలాటం, నృత్యాలతో అయ్యప్ప, భవానీదీక్షాధారులు అనుసరించారు. కంకిపాడు అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సందడిగా కార్తిక వన సమారాధనలు

వేలేరులో హౌసీ ఆడుతున్న మహిళలు

మాట్లాడుతున్న వైఖానస యూత్ ఫోరం ప్రతినిధులు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా ఆదివారం పలుచోట్ల నిర్వహించిన కార్తిక వన సమారాధనలు సందడిగా సాగాయి. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ఉదయపు నడక మిత్ర బృందం ఆధ్వర్యంలో వేలేరులో కుటుంబాల సమేతంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత మహిళలు శాస్త్రోక్తంగా కార్తిక పూజ చేశారు. అనంతరం ఆట, పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించారు. విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, అక్కినేని రాఘవేంద్రరావు, నందిగం స్వామి, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉయ్యూరు ఏఎంసీలో పద్మశాలీల బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆటల పోటీలు నిర్వహించారు. ✤ కడవకొల్లు శివారు వీరవల్లి మోఖాసాలో రామాలయం వద్ద వన సమారాధన నిర్వహించారు.

వన సమారాధనలతో ఐక్యత పెంపు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక వన సమారాధనలు ఐక్యతను పెంచుతాయని వైఖానస యూత్ ఫోరం ప్రతినిధులు అన్నారు. గన్నవరం పట్టణ శివారు దావాజీగూడెం ఎస్వీఆర్ కల్యాణ మండపంలో సంఘ కార్తిక వన సమారాధన ఆదివారం నిర్వహించారు. అన్నిరంగాల్లో సంఘం ఎదగాలని ప్రతినిధి రామాచార్యులు తెలిపారు. తొలుత ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో దీవి రామకృష్ణమాచార్యులు, పరాశరం శ్రీరామ్, కేవీఆర్ కిశోర్, అగ్నిహోత్రం సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడులో దంపతుల పూజ చేస్తున్న బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: బ్రాహ్మణ సామాజికవర్గ ఐక్యత, ఉన్నతికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఆ సంఘ పెద్దలు తీర్మానించారు. ఆదివారం కంకిపాడులోని పావన గాయత్రీ ధ్యాన మందిరంలో నిర్వహించిన కార్తిక వన సమారాధనలో పెద్ద సంఖ్యలో బ్రాహ్మణ సామాజిక వర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దలను సత్కరించి, సామాజికవర్గ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులు, క్రీడాకారులు, కళాకారులను ప్రోత్సాహక బహుమతులతో సత్కరించారు. కార్యక్రమాన్ని సంఘ ప్రతినిధులు రాధాకృష్ణ శ్రీనివాసు, గంగాధరరావు, భాస్కరరావు, రోహిణికుమార్ తదితరులు పర్యవేక్షించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కంకిపాడు, న్యూస్‌టుడే: కంకిపాడు బస్టాండ్ మలుపులో ఆదివారం రాత్రి త్రుటిలో ప్రమాదం తప్పింది. గొడవర్రు రోడ్డు నుంచి విజయవాడ-మచిలీపట్నం రహదారిపైకి వస్తున్న ఇసుక టిప్పరు వెనుక భాగం పూల దుకాణంపైకి చొచ్చుకొచ్చింది. అదే సమయంలో బస్టాండ్ నుంచి ప్రయాణికులు బయటకు వస్తున్నారు. స్థానికులు, పోలీసులు అప్రమత్తం చేయడంతో డ్రైవర్ టిప్పర్‌ను ఒక్కసారిగా ఆపాడు. ఈలోగా ప్రయాణికులు వెనుకకు తప్పుకొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.4వేలు, ఓ కోడిపుంజు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఫిరోజ్ తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

వైభవంగా శివకల్యాణం

దీప కాంతుల్లో ఆలయ పరిసరాలు

మద్దూరు (కంకిపాడు), న్యూస్‌టుడే: కంకిపాడు మండలం మద్దూరు గంగానమ్మ ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ఆదివారం రాత్రి శివుని కల్యాణం, మహాలింగార్చన, లక్షదీపోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రదర్శనలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కానూరు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయం ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కానూరులో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల స్వచ్ఛభారత్ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి జూడో పోటీలు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ జూడో 69వ ఛాంపియన్‌షిప్ అండర్-17 బాలబాలికల పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో ఈ నెల 7న ప్రారంభమై ఆదివారంతో ముగిశాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు సుధారాణి, శ్రీనివాసరావు తెలిపారు. బాలుర విభాగంలో అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో, కృష్ణా జిల్లా ద్వితీయ స్థానంలో, కర్నూలు జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయన్నారు.

వాహనం నడపాలంటే సాహసం చేయాల్సిందే

వీరవల్లి-వట్టిగుడిపాడు రహదారి దుస్థితి

కానూరు మహదేవపురంలో ఇలా..

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే

వీరవల్లి నుంచి వట్టిగుడిపాడు వెళ్లే ప్రధాన రహదారి దారుణంగా పాడైపోయింది. గత ప్రభుత్వ హయాంలో సరైన నిర్వహణ లేకపోవడం, ఇటీవల వర్షాలకు ఎక్కడికక్కడ మార్గం మొత్తం ఛిద్రమై.. గుంతలేర్పడ్డాయి. ముఖ్యంగా వీరవల్లి కూడలి నుంచి రైల్వేస్టేషన్ వరకు రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో గోతుల్లో పడి ప్రమాదాలకు సైతం గురవుతున్నారు. పైగా రాకపోకలు సాగించే సమయంలో ఎక్కడ గొయ్యి ఉందో తెలియక మెలికలు తిరుగుతూ సాహసకృత్యాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్అండ్‌బీ అధికార్లు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

మహదేవపురంకాలనీ (కానూరు), న్యూస్‌టుడే: కానూరు మహదేవపురంకాలనీ నుంచి మాణిక్యనగర్‌కు వెళ్లే రోడ్డు గోతులమయంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అటుగా నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. గోతులు, కంకరతేలి ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు

తీరు మారని చింతలకట్ట..!

పెనమలూరు, న్యూస్‌టుడే: గోసాల-చింతలకట్ట రహదారి అభివృద్ధికి గ్రామ పంచాయతీలో తీర్మానం చేసినా నిధుల కొరతతో పనులు ముందుకు సాగడం లేదు. మూడేళ్ల కిందట రహదారి అధ్వాన స్థితికి చేరింది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర పాదచారులు కూడా

కాలుమోపలేని రీతిలో గోతులు పడ్డాయి. బందరు కాలువ కట్టగా ఉన్న ఈ మార్గానికి ఇరువైపులా వెయ్యి మందికి పైగా నివసిస్తుంటారు. వారంతా ఈ మార్గాన్నే ఆశ్రయించాల్సి ఉంది. వృద్ధులు, చిన్నారులు రాకపోకలు సాగించాలంటే అవస్థలు పడుతున్నారు

(c) eenadu

వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం

చరణ్ రుత్విక్‌ను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

గుడివాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారునికి కాంస్య పతకం లభించిందని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగ ప్రసాద్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో విజేత చరణ్ రుత్విక్‌ను ఆదివారం అభినందించారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

పాముకాటుతో గీత కార్మికుని మృతి

నిడుమోలు(కూచిపూడి), న్యూస్‌టుడే: నిడుమోలు శివారు వీరాయిలంక గ్రామస్థుడు, కల్లుగీత కార్మికుడు నారగాని వెంకటేశ్వరరావు (55) పాముకాటుకు చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. కొద్దిరోజుల క్రితం ఇంటిలో నిద్రిస్తున్న నారగానిని మునుగుడు పాము కాటువేయగా బంధువులు మచిలీపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కల్లుగీత సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామచంద్రరావు, సంఘ నాయకులు పామర్తి శ్రీనివాసరావు, అచ్చేశ్వరరావు, తదితరులు కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679

☛ పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామం బీసీ కాలనీలో వాటర్ పైపులైనుకు లీక్ పడటంతో స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి సాగరరాణి స్పందించి వెంటనే పైపులైనుకు మరమ్మతులు చేయించారు. ☛ పులవర్తిగూడెంలో డ్రైనేజీ పేరుకుపోవడంతో పూడిక పనులు చేయించారు. ☛ జటీవల వీధిలైట్లు వెలగక పోవడంతో బాగు చేయించారు. ☛ పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామంలోని రజకపాలెంలో మంచినీటి పైపులైనులు పగిలిపోయాయి. స్పందించిన కార్యదర్శి చైతన్య శ్రీనివాస్ పగిలిన పైపులైన్లను బాగు చేయించారు. - పెదపారుపూడి, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

మురుగు కాల్వలోని పైపుల తొలగింపు

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: గుడివాడ పట్టణం జగన్నాథపురం సమీపంలోని అడుసుమిల్లి టవర్స్ వద్ద మురుగు కాలువలో తాగునీటి పైపులైన్లు కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. మురుగు కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించి, తాగునీటి పైపులైన్ల సమస్యను పరిష్కరించారు.

ఈనాడు కథనానికి స్పందన

చెట్టు కొమ్మల ..

గుడివాడ(సత్యనారాయణపురం): గుడివాడ పట్టణం పాటిమీద దిట్టకవి శ్రీరాములు రోడ్డులో 'ప్రమాదకరంగా చెట్టుకొమ్మలు' శీర్షికతో ప్రచురించిన సమస్యపై విద్యుత్ అధికారులు స్పందించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్న చెట్టుకొమ్మలను తొలగించారు.

తెల్లవారుజాము నుంచే కార్యకర్తల సేవలు

చల్లపల్లి, న్యూస్‌టుడే:

చల్లపల్లి గ్రామాభివృద్ధికి, ప్రజారోగ్యం మెరుగుదలకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యమని స్వచ్ఛ సుందర చల్లపల్లి రథ సారథి డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్ అన్నారు. ఆదివారం 'స్వచ్ఛ సుందర చల్లపల్లి' వార్షిక వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ వృత్తులలో ఉన్నవారందరూ గ్రామం అభివృద్ధికి తెల్లవారుజాము 4.30గంటల నుంచి 6 గంటల వరకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారన్నారు. గ్రామంలో అన్ని పారిశుద్ధ్య కార్యక్రమాలను స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు స్వచ్ఛందంగానే చేపట్టారని తెలిపారు. 2014 నవంబరు 12న తనతో 15మంది వచ్చారని, మూడు శ్మశాన వాటికలు, డంపింగ్‌యార్డును సుందరంగా అభివృద్ధి పరిచామన్నారు. ఇంట్లో చెత్త వీధిలో వేయకుండా ప్రతిఒక్కరూ తడి, పొడిగా వేరు చేసి పంచాయతీ వారికి అందించేలా కృషి చేశామని చెప్పారు.

★ స్వచ్ఛ కార్యకర్త ప్రాతూరి ఉదయశంకరశాస్త్రి మన కోసం మనం ట్రస్టుకు రూ.10వేలు విరాళం అందించారు. కార్యకర్త శ్రీనివాస్ చెట్ల ఆవశ్యకతను తెలియ చేస్తూ పాటలను పాడారు.

స్వచ్ఛ పారిశుద్ధ్య కార్యక్రమం ప్రారంభించిన తొలిరోజు ఉన్నవారితో డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్

★ చల్లపల్లిలో జరుగుతున్న ఈ స్వచ్ఛయజ్ఞంలో పాల్గొనడం ఒక గౌరవంగా భావిస్తాను. నిరంతరం ఈ సేవా కార్యక్రమంలో పనులు చేస్తూనే ఉంటాను. -వేములు శ్రీనివాసరావు

★ చీపురు పట్టుకుని చల్లపల్లిలో అపరిశుభ్ర ప్రదేశాలను శుభ్రం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్న డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్ ఆలోచనతో ఆయన వెంటే ఉంటున్నాను. పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొంటూ నా వంతు నేను చేస్తున్నాను. - నల్లూరి రామారావు

★ కార్యకర్తలతో కలసి ప్రతి రోజూ పారిశుద్ధ్య సేవలో పాల్గొంటున్నాను. దీనివల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. నా వంతుగా గ్రామానికి కొంత చేశానన్న తృప్తి కలుగుతుంది. నాకు వచ్చే పెన్షన్‌లో ప్రతి నెలా రూ.5వేలు ట్రస్ట్‌కి అందచేస్తాను. -ప్రాతూరి ఉదయశంకర శాస్త్రి

★ తెల్లవారుజామున 4.30 గంటలకు నిద్ర లేవడం, వీధులను శుభ్రం చేయడం ఒక అలవాటుగా మారింది. ఏదైనా ఒక్కరోజు బద్ధకించామంటే ఏమీ తోయదు. మనం మరో పది మందికి సేవ చేసే అదృష్టం దక్కింది. -మెండు శ్రీనివాసరావు

★ ఎంతోమంది స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల సేవా కార్యక్రమాలతో చల్లపల్లి ఇప్పుడు సుందరంగా మారింది. ఇందులో తోటి స్వచ్ఛ కార్యకర్తలతో కలసి మొక్కలు నాటడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. - వేల్పూరి ప్రసాద్

మోపిదేవి ఆలయం కిటకిట

కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవిలో స్వయంభుగా వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించటానికి ఆదివారం 40వేల మంది భక్తులు తరలిరావటంతో ఆలయ ప్రాంగణం, మోపిదేవి పురవీధులు కిక్కిరిశాయి. కార్తిక మాసం, సెలవు రోజు కావటంతో భక్తుల తాకిడి పెరిగింది. వివిధ సేవల రూపేణా రూ.12,24,960 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్లు నిండుగా ఉన్నాయి. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్.ఐ సత్యనారాయణ, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు భక్తులకు సేవలు అందించారు.

పాల్గొన్న భక్తులు

పులిగడ్డలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళల సందడి

ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మండల విశ్వబ్రాహ్మణ సంఘీయులు

పూజల్లో ఆర్యవైశ్య సంఘ నాయకులు

వన భోజనాల సందడి

పులిగడ్డ (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : పులిగడ్డలోని జలవనరుల శాఖ అతిథి గృహం ఆదివారం రేపల్లె వంశస్థుల కార్తిక వనభోజనాలకు వేదికైంది. రాష్ట్ర నలుమూలలా ఉద్యోగ, వ్యాపారాలు, పనుల రీత్యా స్థిరపడిన వారితో మురిసిపోయింది. మురళీ కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. కలిసి వనభోజనాలు చేశారు. గత మూడేళ్లుగా రేపల్లె వంశస్తులు కమిటీగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 2025లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులను సత్కరించారు.

విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో..

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక పాలశీతలకేంద్రం ఆవరణలో ఆదివారం మండల విశ్వబ్రాహ్మణ సంఘీయులు కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఉసిరిచెట్టు వద్ద సంఘ అధ్యక్షులు వేముల వెంకటరత్నాచార్యులు, వై.ధనుంజయ్ దంపతులు పూజలు చేయగా అనంతరం అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. విజయవాడ జడ్జి దేవు నరసింహారావు పాల్గొని వారితో కలసి భోజనం చేశారు. సంఘ పెద్దలు పెంటపాటి చిట్టిబాబు, శంభాన నాగమల్లేశ్వరరావు, సుధీర్, కాశీ తాతారావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కూచిపూడిలో

కూచిపూడి, న్యూస్‌టుడే: కూచిపూడిలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వనసమారాధన జరిగింది. బొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు ఉమాదేవి దంపతులు సత్యనారాయణ వ్రత పూజలు నిర్వహించారు. అయ్యప్ప, భవానీ స్వాములు భజన కార్యక్రమాలు జరిపారు. మొవ్వ ఏఎంసీ మాజీ ఛైర్మన్ చీకటిమర్ల శివరామప్రసాద్, ఆర్యవైశ్య సంఘ నాయకులు ఏచూరి ఉమాశంకర్, చీకటిమర్ల బాలభాస్కరరావు, కోట వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్‌తో మేలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్‌తో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఆదివారం మండలంలోని చాగంటిపాడు, కళ్లంవారిపాలెం గ్రామాలకు చెందిన మణికంఠకు రూ.62,816లు, విజయలక్ష్మికి రూ.50,028ల చెక్కులను లబ్ధిదారుల గృహాలకు స్వయంగా వెళ్లి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి విరాళాలు

పామర్రు గ్రామీణం: మండలంలోని పెదమద్దాలిలోని శ్రీ ఉద్దండ వేణుగోపాలస్వామి ఆలయ పునఃనిర్మాణానికి దాతల నుంచి రూ.1,05,232 విరాళాలుగా అందాయని అధికారి జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామానికి చెందిన మిక్కిలినేని మధుసూదనరావు భార్య ప్రవడ రూ.1,00,116, కృష్ణవేణి జ్ఞాపకార్థం భర్త మిక్కిలినేని శివరామకృష్ణప్రసాద్ రూ.5,116 విరాళంగా అందించారన్నారు.

వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక వాసవీ వృద్ధాశ్రమంలో ఎన్ఆర్ఐలు వెంట్రప్రగడ రామకృష్ణ, మానస దంపతుల వితరణలతో వృద్ధులకు నూతన వస్త్రాలు, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు ఘంటసాల భరతుడు, గోపి, వీరనాగసీతారత్నం, దివ్వెల శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

11న మెగా ఉచిత వైద్య శిబిరం

నాగాయలంక, న్యూస్‌టుడే: మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలలో భాగంగా ఈనెల 11వ తేదీ మంగళవారం ఉదయం బర్రంకుల గ్రామంలోని పీఏసీఎస్ కార్యాలయం ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం, అన్నదానం జరుగుతుందని నిర్వహణ కమిటీ అధ్యక్షులు తలశిల స్వర్ణలత, మండల తెదేపా అధ్యక్షులు మెండు లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని కూటమి నేతలు విరివిగా తరలి రావాలని వారు కోరారు.

80 మందికి ఉచిత కంటి పరీక్షలు

నాగాయలంక: స్థానిక మారుతీ విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకినీడు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో సుదర్శి మానవతా సేవా సంస్థ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ అపర్ణ, శృతిక వైద్య పరీక్షలు నిర్వహించి 60 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని శస్త్రచికిత్సల కోసం శంకర కంటి ఆసుపత్రి పెదకాకానికి ప్రత్యేక వాహనం ద్వారా పంపుతామని నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ తెలిపారు. శిబిరం ఇన్‌ఛార్జి ప్రసన్నకుమార్, తలశిల లీలా మనోహర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు

పోటీని ప్రారంభిస్తున్న మండలి వెంకట్రామ్

అవనిగడ్డ: దివి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకింగ్, రన్నింగ్, సైక్లింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ తొలుత జెండా ఊపి వాకింగ్ పోటీలను ప్రారంభించారు. పురుషులు, మహిళలు విభాగాలలో వయో విభాగాల వారీగా నిర్వహించిన పోటీలలో వాకర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాకర్స్ సంఘం గౌరవ అధ్యక్షుడు ఆర్.రాఘవరావు, అధ్యక్షుడు పర్చూరి రాఘవేంద్రరావు, కోశాధికారి వడ్లమూడి శశికుమార్ పాల్గొన్నారు.

నెమ్మలూరులో లక్ష బిల్వార్చన

పామర్రుగ్రామీణం: నెమ్మలూరులోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ ఈవో జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేదపండుతులు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి సహస్ర దీపోత్సవం నిర్వహించారు. విశ్రాంత ఈవో సుబ్రహ్మణ్యం, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నెమ్మలూరులో శివలింగం ఆకారంలో దీపాలంకరణ

నెక్కలపూడి బాంధవిక

నెక్కలపూడి నిహారిక

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి నెక్కలపూడి బాంధవిక, నెక్కలపూడి నిహారిక రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని మండల తెలుగు రైతు అధ్యక్షుడు నెక్కలపూడి మురళి తెలిపారు. అక్కచెల్లెలు ఆటల పోటీల్లో ప్రతిభ కనబర్చటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్ల పక్కనే వ్యర్థాలు

జేపీగూడెం వచ్చే మలుపులో ఇలా..

పామర్రు గ్రామీణం: మండలంలోని రిమ్మనపూడి పంచాయతీ పరిధిలో సేకరించిన వ్యర్థాలను కార్మికులు రోడ్ల వెంబడే వేస్తుండటంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. స్థానిక చెరువు గట్టుపై చెత్తనుంచి సంపద కేంద్రం ఉన్నప్పటికీ దీనిపై సిబ్బంది అజమాయిషీ సరిగా లేకపోవడంతో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడే పడేస్తున్నారు. దీంతో కుక్కలు చేరి వాటిని చెల్లాచెదురు చేస్తుంటంతో వ్యర్థాలన్నీ రోడ్లపైకి వస్తున్నాయి. అధికారులు స్పందించి పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలు డంపింగ్ కేంద్రానికి చేరేలా చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలుకోరుతున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో కూచిపూడి విద్యార్థినికి షీల్డ్

కూచిపూడి: పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా ఆశ్రమంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లాపరిషత్తు సంస్కృత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని టి.చరిష్మకు ప్రదర్శన నిర్వాహకులు షీల్డ్ బహూకరించారు. సనాతనధర్మం-శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై మానవదేహం-దివ్యత్వం గురించి ఇచ్చిన ప్రదర్శనకు ఈ షీల్డ్ బహూకరించినట్టు ప్రధానోపాధ్యాయిని అమిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి తెలిపారు.

దశాబ్దాల రహదారి సమస్య తీరింది

కూడేరు(పమిడిముక్కల): తమ గ్రామానికి సరైన రహదారి లేక గత ఇరవై ఏళ్లుగా పడుతున్న అవస్థలకు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదేశాలతో తెదేపా నాయకులు రాజులపాటి శ్రీనివాసరావు కృషితో పక్కా రహదారి ఏర్పడిందని కూడేరు శివారు నమ్మితాల గుంట వాసులు హర్షం వ్యక్తం చేశారు. అలీనఖీపాలెం నుంచి గ్రామంలోకి వచ్చే జిల్లాపరిషత్తు రహదారి బాగుచేతకు గత ప్రభుత్వంలో ఎంతచెప్పినా ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే రహదారి దుస్థితి చూసి స్పందించి సత్వరం బాగుచేతకు హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు 2 కిలోమీటర్ల రహదారిని రూ.15 లక్షలతో పటిష్టంగా అభివృద్ధి చేసినందుకు స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

అభివృద్ధి పరచిన రహదారి

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు

కొత్తపల్లి వీర్లంకమ్మ ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రత పూజలు చేస్తున్న భక్తులు

కోడూరు (అవనిగడ్డ): స్థానిక శిర్డీసాయి దివ్యజ్ఞాన మందిరంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. తొలుత ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. అన్న సమారాధనలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పలువురు భక్తులు పాల్గొని వ్రతం ఆచరించారు.

వేకనూరు(అవనిగడ్డ గ్రామీణం): వేకనూరులో గల సూర్యదేవాలయంలో సూర్యదేవుడి కల్యాణోత్సవం ఆదివారం నయనానందకరంగా సాగింది. కార్తిక భోజనాలు నిర్వహించారు.

మోపిదేవి: పెదకళ్లేపల్లిలో స్వయంభుగా వెలసిన శ్రీదుర్గాపార్వతి సమేత నాగేశ్వర స్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు.

చల్లపల్లి: చల్లపల్లి మండలం లక్ష్మీపురంలోని శ్రీదుర్గా పార్వతీ సమేత శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

ఘంటసాల: శ్రీకాకుళంలో ఏకరాత్రి ప్రసన్న మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం వన సమారాధన నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సర్పంచి ముప్పనేని రవిప్రసాద్ పర్యవేక్షించారు.

కోడూరు (అవనిగడ్డ): సహస్ర దీపాలంకరణ సందర్భంగా స్థానిక గంగానమ్మ తల్లి గుడివద్ద తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు.

దోకిపర్రులో మహాసుదర్శన యాగం

దోకిపర్రు(గుడ్లవల్లేరు): మండలంలోని దోకిపర్రు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహాసుదర్శన యాగం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పీవీ సుబ్బారెడ్డి, పి.నాగిరెడ్డి దంపతులు హోమంలో పాల్గొని పూజాదికాలు చేశారు.

శ్రీగంగానమ్మ సంబరాలు

గుడ్లవల్లేరు: శ్రీగంగానమ్మ అమ్మవారికి మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక సంబరాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం అమ్మవారి ఎదుట పాలవెల్లి కట్టి మహిళలు పాలపొంగళ్లు వండి నైవేద్యాలు సమర్పించారు.

వేమవరం(గుడ్లవల్లేరు): మండలంలోని ప్రసిద్ధ వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానాన్ని ఆదివారం 6 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తలనీలాలు, మొక్కుబడులు తీర్చుకుని బంధుమిత్రులకు అన్నసమారాధనలు చేసుకున్నారు.


శిర్డీసాయి మందిరంలో సత్యనారాయణస్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం పుష్కర ఘాట్‌లో రామలింగేశ్వరుడిని అన్నంతో అభిషేకిస్తున్న భక్తులు

చల్లపల్లి, న్యూస్‌టుడే: మేకావారిపాలెంలో రావెళ్ల కృష్ణ సేవాసమితి ఛైర్మన్ రావెళ్ల ఉదయ్ కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడి పూజ కన్నుల పండువగా జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్-విజయలక్ష్మి దంపతులు, మండలి వెంకట్రామ్-సాయి సుప్రియ దంపతులు విచ్చేసి అయ్యప్పస్వామికి పూజలు చేశారు. ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, చల్లపల్ల సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పీఏసీఎస్ ఛైర్మన్ గుత్తికొండ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పామర్రు కరుమారి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రేణుకా పరమేశ్వరునికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

వైభవంగా గంగానమ్మ జాతర

చాగంటిపాడు(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే : మండలంలోని చాగంటిపాడు శివారు కళ్లంవారిపాలెంలో ఆదివారం వైభవంగా గంగానమ్మ జాతర నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ప్రత్యేక పూజలు చేశారు. డప్పు వాయిద్యాలతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్, కళ్లం వంశీకృష్ణరెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్లంవారిపాలెంలో గంగానమ్మతల్లికి కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అవనిగడ్డ బ్రాంచ్ (0811), అవనిగడ్డ, కృష్ణాజిల్లా

ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్థుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఇ-వేలం (**SARFAESI** చట్టం 2002 క్రింద) **"ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే"** మరియు **"అక్కడ ఏమున్నదో అదే"** పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు): శ్రీ వర్రె బసవ రావు, తండ్రి : వెంకటేశ్వర్లు, డి.నెం.2-379/3, 2వ వార్డు, అవనిగడ్డ, కృష్ణాజిల్లా - 521121.

బకాయి మొత్తం: తేదీ.04-01-2025 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.20,87,790/- +** తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి.

షెడ్యూల్ ఆస్తి వివరములు: కృష్ణాజిల్లా, అవనిగడ్డ ఎస్.ఆర్.ఓ, అవనిగడ్డ మండలం, అవనిగడ్డ గ్రామం & గ్రామ పంచాయితీ, అసెస్మెంట్ నెం.927, సమీప డోర్ నెం.2-379/3, ఆర్.ఎస్.నెం.30/7 లోని ఎ.0.39 సెంట్ల ఇంటి స్థల విస్తీర్ణం మొత్తంలో 222 చ॥గ॥లు లేదా 4587 చ॥లింకులు లేదా 182.592 చ॥మీ॥ల ఇంటి స్థల విస్తీర్ణంలో నిర్మించిన ఆర్‌సిసి రూఫ్‌డ్ క్రింది, మొదటి & రెండవ అంతస్తులతో గల యావత్తు ఆస్తి రిజిస్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.407/2009, తేది.21.03.2009 ప్రకారం శ్రీ వర్రె బసవరావు, తండ్రి : వెంకటేశ్వర్లు గారికి చెందినది. **హద్దులు : ఉత్తరం :** మతి సీతా సత్య గోపాల ప్రసాద్ గారి భవనం, స్థలం-66 లింకులు, **దక్షిణం :** గరికిపాటి శ్రీమన్నారాయణ గారి భవనం, స్థలం-66 లింకులు, **తూర్పు :** పంచాయితీ రోడ్డు-75 లింకులు, **పడమర :** జంపాన వీరయ్య గారి భవనం, స్థలం - 64 లింకులు.

రిజర్వు ధర : రూ.57,15,000/-	ధరావత్తు : రూ.5,71,500/-	బిడ్ పెంపుదల : రూ.25,000/-

ఇ-వేలం తేదీ : 10-12-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 03.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది: 10-11-2025 నుండి 09-12-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

అత్యధిక బిడ్డరునకు ఆస్తి అమ్మకం గురించి అధీకృత అధికారి వారు నిర్ధారణచేయుదురు. విజేత అయిన బిడ్డరు యొక్క ధరావత్తు (ఇఎమ్‌డి) సొమ్మును అమ్మకం విలువలో భాగంగా ఉంచెదరు. విజేత కాని బిడ్డరు ధరావత్తు సొమ్ము తిరిగి చెల్లించెదరు. సదరు ధరావత్తు పై ఏ విధమైన వడ్డీ చెల్లించబడదు. అధీకృత అధికారిచే బిడ్డుధర అంగీకరించబడిన 24 గంటల లోపుగా ముందుగా చెల్లించిన బయానా సర్దుబాటుతో విజయము పొందిన బిడ్డరు అమ్మకపు ధరలో 25% ను వెంటనే జమ చేయవలెను. మరియు మిగిలిన 75% అమ్మకము ధరను అమ్మకపు తేదీ నుండి 15వ దినము లోపు చెల్లించవలెను. విజయము పొందిన బిడ్డరు చెల్లింపులో విఫలమైనచో ఆఫరుద్వారా ఇంతకు ముందుగా ధరావత్తు చేసిన మొత్తము స్వాధీనము చేసుకొనబడును మరియు ఆస్తి తిరిగి వేలము వేయబడును ఆస్తి/మొత్తమునకు సంబంధించి విఫలుడైన ఋణగ్రహీతకు ఎట్టి క్లెయిము/హక్కు ఉండబోదు.

అమ్మకము బ్యాంకు సూచించిన నియమాలు/షరతులకు లోబడి ఉంటుంది మరియు ఎలాంటి కారణములు చూపకుండా ఏ ఒక్క లేదా అన్ని ఆఫర్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు లేదా రద్దుచేయుటకు బ్యాంక్ వారికి హక్కు కలదు.

తమ బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలములో పాల్గొనుటకు ముందుగా సర్వీసు ప్రొవైడర్ **M/s. PSB Alliance & M/s. Baanknet** యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, **Mail ID :** support.baanknet@psballiance.comను సంప్రదించవచ్చును మరియు ఈ ఆస్తికి చెందిన విచారణకు **అధీకృత అధికారి : శ్రీ ఉబ్బాని వీరదాస్, మొబైల్ నెం.9440383010, చీఫ్ మేనేజర్ మొబైల్ నెం.9908524821,** ఇ-మెయిల్ ఐడి: **sbi.0811@sbi.co.in** మరియు బ్యాంక్ ఆమోదం పొందిన రిజల్యూషన్ ఏజెన్సీ : మెస్సర్స్ మురాల ఏజెన్సీస్, మొబైల్ నెం.: **9959831538, 9290166166** వారిని ఆఫీసు పనిదినములలో సంప్రదించవచ్చును.

ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కోనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం ప్రకటన

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత/సహాబాధ్యత గల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని 8 (6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది: 04-11-2025, ప్రదేశం: అవనిగడ్డ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కార్తికమాసం ఆదివారం సందర్భంగా పెద్దలు, పిల్లలు కలిసి ప్రకృతి బాట పట్టారు. పచ్చని చెట్ల కింద సరదాగా గడిపారు. మ్యూజికల్ ఛైర్స్, లెమన్ స్పూన్, అంత్యాక్షరి వంటి పోటీల్లో ఆనందంగా పాల్గొన్నారు. అందరూ ఒకచోట కూర్చుని వన భోజనాలు చేశారు. నున్న మామిడితోటలో కనిపించిన సందడి ఇది. -ఈనాడు, అమరావతి

మామిడితోటలో వన భోజనాలు చేస్తూ..

బెజవాడలో అద్దె ఖాతాల జాడలు

- ఇద్దరు నగరవాసుల్ని అరెస్టు చేసిన తెలంగాణ పోలీసులు
- మోసగాళ్లకు సాయం చేసిన షణ్ముక శ్రీనివాస్, శ్రీధర్

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరంలో మరోసారి అద్దె ఖాతాల జాడలు బయటపడ్డాయి. ఇటీవలి కాలంలో తరచూ విజయవాడకు చెందిన వారి ప్రమేయం ఈ వ్యవహారంలో వెలుగులోకి వస్తోంది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో తాజాగా అరెస్టు చేసిన నిందితుల్లో ఇద్దరు నగరానికి చెందినవారు ఉన్నారు. వ్యాపారి అయిన కోదూరి నాగ సాయి శ్రీధర్‌తో పాటు ఫెడరల్ బ్యాంకు ఉద్యోగి షణ్ముఖ ఆంజనేయులును ఇటీవల తెలంగాణ సైబర్ పోలీసులు వచ్చి విచారణ నిమిత్తం తీసుకెళ్లినట్లు తెలిసింది. అక్కడ నమోదైన కేసుల్లో వీరి పాత్ర ఉండడమే ఇందుకు కారణం.

చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సాయం

నగరానికి చెందిన **షణ్ముఖ ఆంజనేయులు..** స్థానిక ఫెడరల్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌లో నమోదైన సైబర్ కేసులో అక్కడి పోలీసులు విచారణ చేస్తుండగా కొన్ని బ్యాంకు ఖాతాల ద్వారా డబ్బులు బదిలీ అయినట్లు దర్యాప్తులో తేలింది. ఆ ఖాతాదారులను అదుపులోకి తీసుకుని విచారించగా ఆంజనేయులు డబ్బుకు ఆశపడి చట్టవిరుద్ధంగా ఆర్థిక వ్యవహారాలు నిర్వహించినట్లు బయటకు వచ్చింది. అమాయకులను తీసుకువచ్చి, వారితో ఖాతాలు తెరిపించడం, ఆ పాస్ పుస్తకాలు, చెక్కు పుస్తకాలను ఏజెంట్లకు చేర్చడం వంటి వాటిలో క్రియాశీలక పాత్ర పోషించినట్లు వెలుగుచూసింది. నగదు, చెక్కుల ద్వారా విత్‌డ్రాయల్స్ కోసం సాయం చేసినట్లు గుర్తించారు.

★ ఇంజినీరింగ్ చదువుకుని వ్యాపారం చేస్తున్న మరో నిందితుడు **కోదూరి నాగసాయి శ్రీధర్** కూడా అరెస్టు అయ్యాడు. మొబైల్ నంబర్లు, సిమ్ కార్డులు సమకూర్చేవాడని తెలంగాణ సైబర్ పోలీసుల దర్యాప్తులో బయటకు వచ్చింది. అమాయకులను గుర్తించి, వారికి డబ్బు ఆశచూపించి వారి పేరుతో ఖాతాలు తెరిపించాడు. వారి పేరున సిమ్ కార్డులు తీసుకుని మోసగాళ్లకు చేర్చేవాడని తెలిసింది. వీటికి సంబంధించి శ్రీధర్‌కు 5 శాతం వరకు కమీషన్ అందేది.

తరచూ వెలుగుచూస్తున్న కేసులు

మూడు నెలల కిందట తెలంగాణ సైబర్ పోలీసులు విజయవాడకు చెందిన శరణ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. సైబర్ నేరాల్లో కొట్టేసిన సొమ్మును పలు మార్గాల్లో బదిలీ చేసేందుకు మ్యూల్ ఖాతాలు తెరవడంలో కీలక సూత్రధారి. పలు ప్రాంతాల్లో డబ్బు ఆశచూపి బ్యాంకు ఖాతాలను తెరిపించి కమీషన్ ముట్టజెప్పేవాడని తెలిసింది. శరణ్‌కు పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు హైదరాబాద్ పోలీసుల విచారణలో వెల్లడైంది. కంబోడియా, చైనా, మలేషియా, దుబాయ్, తదితర దేశాల్లో సైబర్ నేరగాళ్లకు అద్దె ఖాతాలను సమకూర్చేవాడు.

కృష్ణా వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదిలో వరద ప్రవాహం ఆదివారం తగ్గుముఖం పట్టింది. ఉదయం ఆరు గంటలకు 60,150 క్యూసెక్కులను సముద్రంలోకి, 8,473 క్యూసెక్కులను కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు విడుదల చేశారు. సాయంత్రానికి క్రమేపీ వరద ప్రవాహం తగ్గింది. రాత్రి 7 గంటలకు 60 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. మిగతా 10 గేట్లను మూసివేశారు. 43,500 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. పంట కాల్వలకు 8,850 క్యూసెక్కులు వదిలారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 3,615, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 5,009, గుంటూరు ఛానల్‌కు 226 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 1,705, ఏలూరు 1,110, కేఈబీ 500, బందరు కాల్వలకు 300 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు.

కృష్ణా జలాలొచ్చేశాయ్!

ఈనాడు, అమరావతి

ఎ.కొండూరు పరిధిలోని కిడ్నీ బాధిత గిరిజన తండాల్లో ఇంటింటికీ స్వచ్ఛ జలాలను ట్రయల్ రన్‌లో భాగంగా అందించే కార్యక్రమం ఆరంభమైంది. కూటమి ప్రభుత్వం చెప్పినట్లుగానే అత్యంత త్వరగా ప్రాజెక్టు పూర్తి చేసి గిరిజనులకు కృష్ణా జలాలు అందిస్తోంది. కేంద్ర జలజీవన్ మిషన్, రాష్ట్ర సంయుక్త ఆధ్వర్యంలో రూ.49.94కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారు. సిలికా, ఫ్లోరైడ్ కలిసిన నీటిని తాగడం వల్లే తాము కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నామంటూ గిరిజనులు గత కొన్నేళ్లుగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే.. 300 మందికి పైగా కిడ్నీ వ్యాధుల బారినపడి చనిపోయారు.

నీటిని తీసుకెళుతున్న మహిళలు

ఇవే ఎనిమిది: ఈస్ట్ మాదవరం, వెస్ట్ మాదవరం, రేపూడితండా, మెట్లతండా, ఎల్‌బీజీకాలనీ, పాత రేపూడి, కొత్త రేపూడి, కమ్మవారిపల్లె గ్రామాలు.. ట్రయల్‌రన్‌లో భాగంగా నీటి సరఫరా ఆరంభమైంది. స్వచ్ఛ జలాలు ఇంటింటికీ అందుతూ సమస్యలు ఎక్కడెక్కడున్నాయో గుర్తిస్తున్నారు.

డిసెంబరులోగా అందరికీ

మరోవైపు ఎ.కొండూరు పరిధిలోని మాన్‌సింగ్‌తండా, పెదతండా, కేసియాతండా, భీమలపాడు, దీప్లానగర్, కృష్ణారావుపాలెం గ్రామాలకు ట్రయల్‌రన్‌లో భాగంగా నీటిని అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తాజాగా కృష్ణారావుపాలెంలో పర్యటించి ప్రాజెక్టు పురోగతిని పరిశీలించారు. డిసెంబరులోగా పనులన్నీ పూర్తి చేసి అన్ని గ్రామాలకూ నీటి సరఫరాను ఆరంభించాలని సూచించారు.

38 గిరిజన తండాలకు జలాలు..

★ ఎ.కొండూరు పరిధిలోని 38 గిరిజన తండాల్లోని 30వేల మందికి ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధి చేకూరబోతోంది. ప్రస్తుతం ఎనిమిది తండాల్లో ఇంటింటికీ నీళ్లిస్తున్నారు. మిగతా వాటికి డిసెంబరులోగా పనులన్నీ పూర్తిచేసి.. నీటిని అందించే ప్రక్రియ ఆరంభిస్తారు. ★ ఎ.కొండూరుకు 10కి.మీ దూరంలోని కుదప సంప్ వద్ద పంప్‌హౌస్, 1.20లక్షల లీటర్ల ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఆ ట్యాంక్ నుంచే నీటిని గిరిజన తండాలకు తీసుకెళ్లే పైప్‌లైన్ వేశారు. ★ కుదప ట్యాంక్ నుంచి గిరిజన తండాల్లోని.. 36 ట్యాంకులకు నీటిని సరఫరా చేసి.. అక్కడి నుంచి ఇంటింటికీ పంపిణీ చేస్తారు. ఈ ట్యాంకుల్లో ఎక్కువ భాగం నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మిగిలినవి కూడా తుదిదశలో ఉన్నాయి.

"మాకు ఏమీ వద్దు తాగడానికి కృష్ణా జలాలు అందించాలంటూ గత ఐదేళ్ల వైకాపా హయాంలో వేడుకున్నా పట్టించుకోలేదు. స్వయంగా ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ వచ్చి హామీ ఇచ్చినా నిలబెట్టుకోలేకపోయారు. చంద్రబాబు సర్కారు కొలువుదీరిన వెంటనే ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి చేయిస్తోంది."



కుదప వద్ద నిర్మించిన పంప్‌హౌస్, ట్యాంకు

పతకాల మోత.. స్వారీలో ప్రత్యేకత!

సాధారణంగా గుర్రపు స్వారీలో సవారీ చేసే వాళ్లనే విజేతలుగా చూస్తుంటాం. కానీ అసలైన విజేతలు తామేనని.. తమకూ కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయంటున్నాయి గుర్రాలు. గన్నవరం మండలం కేసరపల్లి ఎన్టీఆర్ వెటర్నరీ ఏరియాలో డీవీ ఎన్‌సీసీ యూనిట్ ఆవరణలోని గుర్రాలు ఎన్‌సీసీ గ్రూప్, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నాయి. క్యాంటీనుకు చెందిన నీల్‌ఖాజా, గోల్డెన్ స్టార్, గూగుల్ పేర్లు గల గుర్రాలు.. గణతంత్ర వేడుకల్లో వివిధ పతకాలు సాధించాయి. 15 ఏళ్ల వయసున్న నీల్ ఖాజా మూడు పర్యాయాలు వేడుకల్లో పాల్గొనగా రెండు బంగారు పతకాలు, 18 ఏళ్లున్న గోల్డెన్‌స్టార్ రెండు పర్యాయాలు పాల్గొనగా ఒక సారి.. ఒక్కసారే పాల్గొన్న ఏడేళ్ల వయసున్న గూగుల్ కూడా బంగారు పతకం సాధించింది. యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తీర్థప్రసాద్, సిబ్బంది అటల్‌తివారీ, బాబూరావు, గాలయ్య, సుజీత్‌కుమార్‌ల పర్యవేక్షణలో తర్ఫీదు పొందుతున్నాయి.

-ఈనాడు, అమరావతి- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

తిరుపతమ్మ అలంకారం.. శోభాయమానం

పెనుగంచిప్రోలులోని గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని పలు రకాల పండ్లతో అలంకరించారు. కార్తికమాసం మూడో ఆదివారం సందర్భంగా గన్నవరానికి చెందిన చిలకపాటి లక్ష్మీగణేష్, గోపినేనిపాలెం గ్రామానికి చెందిన కామినేని రాంబాబు, అనిల్‌కుమార్‌ల సహకారంతో అమ్మవారికి పండ్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో కిశోర్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

జీవన ధ్రువపత్రం అందుకోండిలా..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు ద్వారా జీవన ధ్రువపత్రాన్ని పింఛనుదార్లు వారివారి సంస్థలకు ఆన్‌లైన్‌లో సమర్పించేలా భారతీయ తపాలాశాఖ ఏర్పాట్లు చేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వారందరూ తమ పింఛన్లను పునరుద్ధరించుకునేందుకు తాము విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన కార్యాలయాల్లో ఏటా నవంబరులో జీవన ధ్రువపత్రం ఇవ్వాల్సి ఉంది. వృద్ధులైన, కుటుంబ పింఛనుదారులు ఆయా కార్యాలయాలకు వచ్చి ఈ పత్రం సమర్పించడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు భారతీయ తపాలాశాఖ తన అనుబంధ సంస్థ ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు ద్వారా బయోమెట్రిక్ ఆధారిత ఆధార్ నంబరు అనుసంధానించి లైఫ్ సర్టిఫికేట్ అందించనుంది.



ఎలా చేయాలంటే.. గూగుల్ ప్లేస్టోర్ నుంచి పోస్టు ఇన్ఫో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి..యాప్‌లో చరవాణి నంబరు, పేరు, పిన్‌కోడ్ చిరునామాలు నమోదు చేసి సంబంధిత సంస్థకు సమర్పించాల్సి ఉంది. ఓటీపీ వచ్చిన తర్వాత నిర్ధారించుకుని వారు సంబంధిత తపాలా కార్యాలయానికి పంపుతారు. అనంతరం వారి సమీప తపాలా కార్యాలయానికి చెందిన ఉద్యోగి వారి ఇంటి వద్దకు వచ్చి అతని వద్ద ఉన్న మొబైల్ కిట్ ద్వారా వేలిముద్రలు స్వీకరించి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ అందిస్తారు. బయోమెట్రిక్ విధానంలో ఆధార్‌తో అనుసంధానమై ఉంటుంది. పింఛనుదారుల సంస్థ నుంచి సర్టిఫికెట్ అందినట్లు వారి చరవాణికి సమాచారం వస్తుంది. ఇంటి వద్దనే అత్యంత సులభమైన సురక్షితమైన ఈ సేవలను వినియోగించుకోవాలని తపాలశాఖ అధికారులు సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

పాయకాపురం, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్‌లో పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం (నేడు) ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని తెలిపారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పైసలిస్తేనే.. పాస్‌పుస్తకం

- ★ రూ.5వేల నుంచి రూ.20వేల వరకు వసూళ్లు
- ★ అడ్డంగా దోచేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఈనాడు, అమరావతి

★ **పామర్రు** నియోజకవర్గ పరిధిలోని ఓ తహసీల్దార్, ముగ్గురు వీఆర్వోలు, ఓ ప్రైవేటు వ్యక్తిని వసూళ్లు చక్కబెట్టేందుకు నియమించుకున్నారు. అన్నీ సవ్యంగా ఉన్నా కొర్రీలు పెట్టి ఒక్కో పాస్ పుస్తకం మంజూరుకు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారు. తాజాగా ఓ రైతు పాస్ పుస్తకం కోసం డబ్బులు డిమాండ్ చేయగా సదరు రైతు విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో తహసీల్దార్ బండారం బయటపడింది.

★ **ఇబ్రహీంపట్నం, జి.కొండూరు** మండలాల పరిధిలో ఆరుగురు వీఆర్వోలు వసూళ్లే పరమావధిగా పని చేస్తున్నారు. ఆరు నెలల్లో 5 పాస్ పుస్తకాలు ఇప్పించేందుకు రైతుల నుంచి ముక్కుపిండి రూ.70వేలు వసూలు చేశారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని రైతులు అంటే ఇదంతా మా కోసమే కాదు..చాలా మంది చేతులు తడపాలంటూ చెప్పడం గమనార్హం.

★ **తిరువూరు** నియోజకవర్గంలోని ఓ తహసీల్దార్ రైతులను దోచేస్తున్నారు. పాస్ పుస్తకం కోసం వస్తే సంబంధిత వీఆర్వోతో మాట్లాడండి అని చెబుతారు. రైతులు వీఆర్వోలకు ముడుపులు సమర్పిస్తేనే దస్త్రం కదులుతుంది. పుస్తకానికి రూ.10వేలు చొప్పున వసూలు చేస్తున్నారు.

పాస్ పుస్తకాల మంజూరులో రెవెన్యూ సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. పైసలిస్తే తప్ప పాస్ పుస్తకం మంజూరు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అవసరమైతే ఓ ధర, అత్యవసరమైతే మరో ధర అన్నట్లు వసూళ్లు సాగుతున్నాయి. వీఆర్వోలు కొందరు తహసీల్దార్లు కుమ్మక్కయి కథ నడిపిస్తున్నారు. రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు.

దరఖాస్తుకు ముందే ముడుపులు..

నిబంధనల ప్రకారం పాస్‌పుస్తకాల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. అన్నీ సవ్యంగా ఉంటే నెలలో మంజూరు చేయాలి. చాలా మంది రైతులకు అవగాహన లేక దరఖాస్తు చేయకుండా వీఆర్వోను కలుస్తున్నారు. వారు దరఖాస్తు చేయించకుండా బేరం తెగ్గొడుతున్నారు. ముడుపులు కూడా ముందే తీసుకుంటున్నారు. ఒక్కో పాస్ పుస్తకానికి అవసరాన్ని బట్టి రూ.5వేల-రూ.20వేల వరకు వసూలు చేసుకుంటున్నారు.

తహసీల్దార్లే సూత్రధారులు..

ముడుపులు తీసుకొస్తేనే దస్త్రం కదులుతుందని కొందరు తహసీల్దార్లు వీఆర్వోలకు అనధికారిక నిబంధనలు పెడుతున్నారు. తెలంగాణ సరిహద్దులోని ఓ మండలంలో తహసీల్దార్ లక్ష్యాలు పెట్టి మరీ వేధిస్తున్నారని కొందరు వీఆర్వోలు తలబాదుకుంటున్నారు. రైతులు నేరుగా దరఖాస్తు చేసినా..సిఫార్సులు చేయించినా చుక్కలు చూపిస్తున్నారు. విచారణ, సర్వే, కొలతల్లో వ్యత్యాసాలంటూ తిప్పలు పెడతారు. ★ 'విచారణ చేసి రైతులను ఇబ్బందులు పెట్టే రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని' కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

పచ్చని ఛత్రం..

చెట్టే ఛత్రంగా మారి..ఎండ నుంచి రక్షణ ఇస్తున్న ఈ చిత్రం చూశారా. కడియం నుంచి తెచ్చిన పొగడ చెట్టు ఇది. ఈ మొక్కను అందంగా కత్తిరిస్తూ ఇలా గొడుగు ఆకారంలో తీర్చిదిద్దారు విజయవాడ గురునానక్‌కాలనీ సమీపంలోని కనకదుర్గా గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీకి చెందిన విద్యాసాగర్. మొక్కలు పెంచాలనుకోవడం మంచిదే కానీ ఎప్పటికప్పుడు వాటి నిర్వహణ చేపడితేనే అందంగా కనిపించడంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతాయని ఆయన తెలిపారు. –ఈనాడు, అమరావతి

నిర్యాణము

జననం 15-07-1939

మరణం 09-11-2025

శ్రీ RGKV ప్రసాద్ గారు

Rtd: Loyola College Lecturer

మా తండ్రిగారు ది. 09-11-2025 ఆదివారం ఉదయం 6 గం॥ లకు స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము. శోకతప్త హృదయాలతో...

కుమారుడు: R.S. ప్రవీణ్ మరియు కుటుంబసభ్యులు

అంతిమయాత్ర: ది.11-11-2025 మంగళవారం ఉదయం 10.గం.లకు విజయవాడ సాయిబాబాగుడి రోడ్డు, RTC కాలనీ 1వలైన్, అరుణ అపార్ట్‌మెంట్స్‌లోని మా స్వగృహము నుండి బయలుదేరును. ✆ 98494 71909

ఆనంద ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

వాకథాన్‌లో కలెక్టర్ లక్ష్మీశ వాస్క్యులర్ సర్జన్లు, వైద్యులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : స్వర్ణాంధ్ర విజన్- 2047 లక్ష్యంతో హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. అందరూ ఆరోగ్యంగా ఉంటేనే స్వర్ణాంధ్ర సాధించగలమని తెలిపారు. వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఐ.ఎం.ఎ. హాలు నుంచి వాస్క్యులర్ వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. దీన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వాస్క్యులర్ వ్యాధులు, సర్జరీల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు వాక్‌థాన్ నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కలిగే ఇబ్బందులు గురించి ప్రజలకు వివరిస్తే.. తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రముఖ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ కిరణ్ మాకినేని మాట్లాడుతూ. . వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియాలో 800 మంది వరకు సభ్యులు ఉన్నారని, నేడు దేశవ్యాప్తంగా 22 ప్రాంతాల్లో ఈ వాక్‌థాన్ నిర్వహించినట్లు తెలిపారు. జాగ్రత్తలు పాటించటం, రక్తనాళాలకు చికిత్స చేయడం ద్వారా చాలా వరకు తగ్గించవచ్చన్నారు. మధుమేహాన్ని ముందు నుంచి నియంత్రించుకోవాలని, రక్తనాళాల సమస్యలకు మందులు వాడాలని, కాలికి పుండు ఉంటే ముందే డ్రస్సింగ్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాస్క్యులర్ సర్జన్లు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకానికి.. ఒక్క టెండర్

- ✦ ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఓఅండ్ఎం విధానానికి ఆహ్వానం
- ✦ విజయవాడ క్లస్టర్ పరిధిలోని నాలుగింటికి ఒక్కటే

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) ఆధ్వర్యంలోని పర్యాటక ప్రదేశాల నిర్వహణకు ప్రైవేటు సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించగా.. విజయవాడ క్లస్టర్ పరిధిలోని నాలుగు ప్రాంతాలకు కలిపి కేవలం ఒకే ఒక్క టెండర్ దాఖలవడం గమనార్హం. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను.. ఆపరేషన్, మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఏపీటీడీసీ సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా.. విజయవాడ క్లస్టర్ పరిధిలోని భవానీ ద్వీపం, బరంపార్కు, సూర్యలంక బీచ్, నాగార్జునసాగర్ ఈ నాలుగు ప్రదేశాలకు ప్రైవేటు సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానించగా.. స్పందన చాలా తక్కువగా వచ్చింది. కేవలం ఒకే ఒక్క టెండర్ దాఖలైంది. పర్యాటక ప్రదేశాల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని ఇప్పటికే.. సంస్థలోని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల సంస్థ కార్యాలయం వద్ద నిరసన కూడా చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు సంస్థలు సైతం.. పర్యాటక ప్రదేశాల నిర్వహణను తీసుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపించడం లేదని స్పష్టమవుతోంది.

ఆదర్శమూర్తికి అశ్రునివాళి

జననం 10-09-1932

మరణం 06-11-2025

కీ॥శే॥ మండవ జానకిరామయ్య గారు

కృష్ణా జిల్లా మిల్క్ యూనియన్ మాజీ ఛైర్మన్

ఆంధ్రా కురియన్

నిస్వార్థమైన ప్రజాసేవ, అజరామరమైన కీర్తి, అపారమైన ప్రేమ, అంతులేని ఆప్యాయత, అందరి యెడల ఆదరణ.. అన్నీ కలగలిపిన అరుదైన వ్యక్తిత్వం వారిది.. మొవ్వ గ్రామాభివృద్ధికి వారు చేసిన సేవ ఎప్పటికీ మరువలేము.. అందరి మంచి కోరే వ్యక్తి, విద్యాప్రదాత, ఆంధ్రా కురియన్ అవార్డు గ్రహీత, కృష్ణా మిల్క్ యూనియన్ మాజీ ఛైర్మన్ శ్రీ మండవ జానకిరామయ్య గారి మరణం మాకు, గ్రామమునకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు సద్గతి ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ...

మండవ గోపి చంద్రశేఖరరావు, అధ్యక్షులు & పాలకవర్గ సభ్యులు

మండవ జానకిరామయ్య - సులోచన గార్ల క్షేత్రయ్య కళ్యాణ మండపం - మొవ్వ

మరియు మొవ్వ గ్రామస్తులు

(c) eenadu

సృజనాత్మక ప్రాజెక్టులతో ఉపాధి అవకాశాలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఎంతో సృజనాత్మకంగా ఉన్నాయని సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.రజనీకుమారి అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్కిల్ కాంపిటేషన్స్‌ను ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి డాన్ బాస్కో పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి వైజ్ఞానిక కార్యక్రమాలతో విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయవచ్చునన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 41 ఒకేషనల్ పాఠశాలల విద్యార్థులు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ కనబరచడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఈ ప్రదర్శనలు ఆలోచనాత్మకంగా ఉండడంతో పాటు ఇవే భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పిచ్చేశ్వరరావు, గౌతం, ఎన్ చంద్రశేఖర్, నారాయణ, చక్రవర్తి, ప్రసాద్‌బాబు, రవి, రమేష్ వివిధ పాఠశాలల వృత్తి విద్యా ట్రైనర్స్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న రజనీకుమారి

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

సిరిపంచని మామిడి.. పామాయిల్‌కు త్వరపడి

ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరిగిన ఆయిల్‌పామ్

మైలవరం, న్యూస్‌టుడే

దాదాపు ఐదు దశాబ్దాలుగా రైతుల ఆదాయానికి వెన్నుదన్నుగా ఉన్న మధురఫలం మామిడి సాగులో రైతులు భారీగా నష్టాలు చవిచూస్తున్నారు. కలిసిరాని కాలం, ప్రతికూల వాతావరణంతో ఎనలేని కష్టాలు పడ్డారు. సాగుభారంగా మారుతున్న తరుణంలో, ప్రత్యామ్నాయంగా పామాయిల్‌పై దృష్టి సారిస్తున్నారు. దీర్ఘకాలం ఇష్టంతో పెంచుకున్న తోటలను నిలువునా నరికేస్తున్నారు. ప్రస్తుతం పామాయిల్‌కు గిరాకీ నేపథ్యంలో, మామిడి నష్టాలను పూడ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఏటా ప్రతికూల పరిస్థితులే..: రాష్ట్రంలో నూజివీడు తర్వాత అత్యధికంగా మామిడి సాగుకు మైలవరం నియోజకవర్గం పేరు గాంచింది. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల పరిధిలో ఐదారు దశాబ్దాల కిందటి నుంచి సాగు చేస్తున్న రైతులను మోతుబరులను చేసింది. రారాజుగా, అధిక విస్తీర్ణంలో సాగు చేసిన పంటగా ఘనత దక్కించుకున్న మామిడి నేడు రైతులను నిరాశలో ముంచెత్తుతోంది. గడిచిన నాలుగైదేళ్లుగా సగానికి పైగా సాగు రైతులు కనీస ఆదాయాన్ని చూడలేదంటే అతిశయోక్తి కాదు. ఏయేటికాయేడు అనుకూల పరిస్థితుల కోసం ఆశగా ఎదురుచూసినా, ఈ ఏడాది ఎదురైనా ప్రతికూల పరిస్థితులు వారి ఆశలపై పూర్తిగా నీళ్లు చల్లాయి. కొన్నేళ్లుగా మామిడి కర్రను ఇటుక బట్టీలకు కలపగా, వంట చెరకుగానే ఉపయోగిస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో దాదాపు 5 వేల ఎకరాల వరకు మామిడి తోటలను నరికేసినట్లు అధికారులు చెబుతున్నారు.

తోడుగా కూటమి ప్రభుత్వం: నాలుగైదేళ్ల కిందటి వరకు గోదావరి జిల్లాలకే పరిమితమైన పామాయిల్ సాగు క్రమేపీ ఎన్టీఆర్ జిల్లాకు ప్రవేశించింది. ప్రభుత్వ మద్దతు ధర ఉండడంతో పాటు, కరోనా సమయంలో, మద్దతు ధర కంటే రెట్టింపు ధరలు పలకడంతో రైతుల్లో ఈ సాగుపై మక్కువ పెరిగింది.. అయితే వైకాపా హయాంలో ప్రభుత్వ సహకారం లేకపోవడంతో రైతులు సొంతగా మొక్కలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే సాగుకు ప్రోత్సాహం అందించింది. మొక్కలను ఉచితంగా ఇవ్వడమే గాక, అంతర పంటలకు ప్రోత్సాహం, రాయితీపై బిందు సేద్య పరికరాలు, ఉపాధిహామీ పథకానికి అనుసంధానించడంతో రైతుల్లో మరింత ఆసక్తి పెరిగింది.

మైలవరంలో సాగవుతున్న పామాయిల్ తోట

మామిడి, పామాయిల్ సాగులో వ్యత్యాసమిదీ..

	మామిడి	పామాయిల్
సాగు విస్తీర్ణం(జిల్లాలో)	60వేల ఎకరాలు	23వేల ఎకరాలు
మద్దతు ధర	లేదు	రూ.13,650
మార్కెట్ ధర	నిలకడ లేదు	రూ.19,700 (ప్రస్తుతం)
మార్కెటింగ్ సౌకర్యం	వ్యాపారుల దయ	విత్తన కంపెనీలే తీసుకుంటాయి

న్యాయవాదుల ఆటల పోటీలు విజయవంతం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బీబీఏ హాల్లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న న్యాయవాదుల క్యారమ్స్, చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని బార్ అసోసియేషన్లకు చెందిన 400 మంది పైగా న్యాయవాదులు పాల్గొన్నారు. విజేతలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులందరూ ఒకే చోట కలసి క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా మాట్లాడుతూ.. వివిధ బార్ అసోసియేషన్ల నుంచి పెద్ద ఎత్తున న్యాయవాదులు వచ్చి పోటీలను విజయవంతం చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

మ్యాచింగ్ గ్రాంట్ విడుదలపై హర్షం..: మృతి చెందిన న్యాయవాదుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వచ్చే మ్యాచింగ్ గ్రాంట్ కోసం కృషి చేసిన ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్ కుమారుడు వెంకటేష్‌ను న్యాయవాదులు అభినందించారు. రూ.48కోట్ల ఫండ్ విడుదల చేయిస్తూ హైకోర్టులో ఆర్డర్ వచ్చేలా చేశారని కొనియాడారు. జస్టిస్ నైనాల జయసూర్య ప్రత్యేకంగా వెంకటేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి గుట్టల గోపి, రెండో అదనపు జిల్లా జడ్జి వి.సత్యానంద్, భాస్కర్‌రావు, సునీల్, ఆర్.వి.ఎస్.శర్మ, ఏపీ బార్ ఫెడరేషన్ సెక్రటరీ కె.సీతారాం, చలసాని అజయ్‌కుమార్, వేములు హజరత్తయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో జస్టిస్ జయసూర్య, న్యాయమూర్తులు గోపి, సత్యానంద్, భాస్కర్‌రావు, సునీల్, శర్మ తదితరులు

మదిలో నిలిచిన ఇళయరాజా గీతాలు

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఇళయరాజా గీతాలు ప్రజల మనసుల్లో మెలోడి మంత్రాలుగా నిలిచిపోయాయని ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మైదానంలో నిర్వహించిన సంగీత విభావరికి హాజరైన లబ్బీపేటలోని ఓ హోటల్లో ఉన్న ఇళయరాజాను ఆదివారం ఉప సభాపతి, ఎంపీ వెళ్లి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతీయ సంగీత చరిత్రలో అజరామరమైన స్వరకర్త ఇళయరాజా గుర్తింపు పొందారని తెలిపారు. భారతీయ సంగీతాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన లెజెండరీ కంపోజర్ ఇళయరాజాకు సంగీత ప్రపంచం ఎప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. వెయ్యికి పైగా సినిమాలకు సంగీతం సమకూర్చిన సంగీత మాంత్రికుడు అని కొనియాడారు. ఎంపీ సోదరి కేశినేని శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇళయరాజాకు జ్ఞాపిక అందజేస్తున్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, ఎంపీ శివనాథ్

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు. గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో రూ.కోటి 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న రహదారుల నిర్మాణానికి ఎంపీ, శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్, బొండా ఉమామహేశ్వరరావులతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో మార్కెట్‌యార్డులు నిర్వీర్యమయ్యాయని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకవర్గాలను ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ.. రైతులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా మార్కెట్‌యార్డులను తీర్చిదిద్దుతున్నామన్నారు. రైతుబజారు నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని.. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని కోరారు. మధ్య నియోజకవర్గం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేసేలా ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ నర్రా వాసు, తెదేపా నాయకులు బొమ్మసాని సుబ్బారావు, వడ్డమూడి జగన్మోహనరావు, నారాయణ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపీ చిన్ని, ఎమ్మెల్యేలు వసంత, బొండా

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ "రాష్ట్రంలో సర్వీస్‌లో ఉన్న 1.3 లక్షల మంది ఉపాధ్యాయులు టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులవ్వాలనే నిర్ణయంలో మినహాయింపు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. విద్యాహక్కు చట్టంలోని నిబంధనలను పార్లమెంట్‌లో సవరించాలి" అని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో టెట్ ఉత్తీర్ణులవ్వాలనే తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. 12వ వేతన సవరణ కమిటీ నియామకం ఆలస్యమైనందున, ఈ లోగా 29% మధ్యంతర భృతి ఇవ్వాలని పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎక్కువ సమయం బోధనకే కేటాయించేలా, బోధనేతర పనులు అప్పగించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు ఎం.కృష్ణయ్య, కె.శ్రీనివాసరావు, సుందరయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసాద్, వేదికపై కృష్ణయ్య, శ్రీనివాసరావు, సుందరయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు

ఐక్య పోరాటాలతోనే బీసీలకు న్యాయం

కృష్ణలంక(రాఘవయ్య పార్క్ కూడలి), న్యూస్‌టుడే: ఐక్య పోరాటాలకు బీసీలు సిద్ధం కావాలని ఆ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు పిలుపునిచ్చారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. శంకరరావు మాట్లాడుతూ "రాష్ట్రవ్యాప్తంగా జనగణనతో పాటు సమగ్ర కులగణననూ శాస్త్రీయంగా చేపట్టాలి. జనాభా దామాషా ప్రకారం బీసీల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలి. కూటమి ఎన్నికల వాగ్దానమైన చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలంటే ముందుగా కులగణన తప్పనిసరి. అందుకు ఆటంకాలు తలెత్తకుండా దాన్ని సమగ్రంగా నిర్వహించాలి" అని పేర్కొన్నారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ "బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి. ఓబీసీల రిజర్వేషన్ల అమలుకు, వారి అభ్యున్నతికి ఆటంకంగా ఉన్న క్రీమిలేయర్‌ను పూర్తిగా ఎత్తివేయాలి" అని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సోము మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న శంకర్రావు. చిత్రంలో క్రాంతికుమార్, మూర్తి, మహేశ్వరరావు తదితరులు

ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పసిడి పతకం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : విజయవాడకు చెందిన లింగం రవీంద్రరావు ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటి పసిడి పతకంతో మెరిశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 5 నుంచి 9 వరకు జరిగిన 23వ ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 70+ పురుషుల విభాగంలో తలపడిన రవీంద్రరావు 10 కి.మీ. రోడ్డు రేసును 50 నిమిషాల, 34.70 సెకన్లలో పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచారు. 5 వేల మీటర్ల పరుగులో త్రుటిలో పతకం చేజారిందని రవీంద్రరావు తెలిపారు. ఈ విజయానికి కోచ్, ట్రైమెట్రిక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ రుషీల్, వారి బృందం కారణమని చెప్పారు. ఈ ప్రతిభ ద్వారా వచ్చే ఏడాది ఆగస్టు నెలలో దక్షిణ కొరియాలో జరిగే వరల్డ్ మాస్టర్స్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించినట్లు వెల్లడించారు.



రవీంద్రరావు

ద్వీపం.. ఆహ్లాదకరం..

పున్నమిఘాట్ వద్ద స్పీడ్ బోట్‌లో పర్యాటకులు

భవానీ ద్వీపంలో ఆడుతున్న చిన్నారులు

కార్తికమాసం పురస్కరించుకుని కృష్ణానది మధ్యలో ఉన్న భవానీద్వీపానికి ఆదివారం సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పున్నమి బోటింగ్ పాయింటు వద్ద నుంచి వారంతా బోటులో ద్వీపానికి వెళ్లారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. సందర్శకుల రాకతో ద్వీపం సందడిగా మారింది. కొత్తూరు తాడేపల్లిలోని మామిడితోటల్లోను వనసమారాధనలు నిర్వహించారు.

- ఈనాడు అమరావతి,
- న్యూస్‌టుడే, భవానీపురం

ధర వరలు

వంకాయలు-50/60/62, టమాటా-26, బెండ-36, పచ్చిమిర్చి-30, కాకర-46, బీర-48/50, క్యాలీ ఫ్లవర్-20/22/25, క్యాబేజీ-28, క్యారెట్-50/78, దొండ-46, బంగాళదుంప-30, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుళ్లు-54, దోస-24, సొర-35/30, పొట్ల-28/30, అరటికాయ-5/6, చామదుంప-28, అల్లం-80, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-4/10, కంద-48, బీట్‌రూట్-50, కీరదోస-40, బీన్స్-80/70, క్యాప్సికమ్-68, చింతకాయలు-70, నిమ్మ (డజను)-24/28, కొత్తిమీర-14/28, పుదీనా-5/20, ముల్లంగి-10, పచ్చిమామిడి-20/15 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
"ఇ" ప్రొక్యూర్ మెంట్ షార్ట్ టెండరు ప్రకటన NIT NO.07/EE-2/2025-26, Dt:09-11-2025

శ్రీ అమ్మవారి దేవస్థానమున నందు సాంకేతిక విభాగమునకు సంబంధించి భవాని దీక్షలు విరమణ- 2025-26 సందర్భముగా కొండ పైన మరియు కొండ క్రింద వివిధ తాత్కాలిక పనులు చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తికలవారు https://tender.apeprocurement.gov.in లో Endowments department వర్క్స్ నందు దర్శించవచ్చును. **టెండరు డౌన్ లోడు ది:11-11-2025 మ.03.00 గం.ల నుండి ది:18-11-2025 ఉ.11.00 గం.ల వరకు. టెండరు దాఖలు చేయు చివరి తేది:18-11-2025 మ.03.00 గం.లు.** పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలో లేదా ఫోను నెం.0866-2423800 ద్వారా సంప్రదించగలరు.
ఆర్జిత సేవ మరియు పరోక్షసేవ టికెట్లను https://kanakadurgamma.org నందు పొందగలరు.

శ్రీ బొర్రా రాధాకృష్ణ, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు
సం/- వి.కె.శీనా నాయక్, యం.ఎ., స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ - కార్యనిర్వహణాధికారి

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం, శ్రీశైలం-518101, నంద్యాల జిల్లా-ఆంధ్రప్రదేశ్
SRISAILA DEVASTHANAM
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
ఆర్.సి.నం. SBMSD-ADMN0TMP/44/2025-TEMP(G2)-SBMSDSLM తేది: 09-11-2025

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం, శ్రీశైలం, నంద్యాల జిల్లా ఆలయ విభాగం-శ్రీశైల మహాక్షేత్రము నందు శ్రీ స్వామి అమ్మ వార్ల దర్శనార్థము విచ్చేయు ముఖ్య అతిథులకు మరియు అతిథులకు సమర్పించుటకు గాను అవసరమైన సాఫ్ట్ శిల్క్ శాలువాలను (విత్ గోల్డ్ జెరి) ఒక సంవత్సరం కాల పరిమితికి అనగా తేది: 01-12-2025 నుండి 30-11-2026 సరఫరా చేయుటకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు కోరబడుచున్నది. ఇతర వివరముల కొరకు www.apeprocurement.ap.gov.in నందు చూడవచ్చును.

శ్రీ స్వామి అమ్మ వార్ల సేవలో...
యం.శ్రీనివాస రావు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) ...విశ్వాసానికి మరోపేరు
అస్సెట్ రికవరీ మోనిటరింగ్ బ్రాంచ్ : విశాఖపట్నం
డి.నెం.30-15-169, 1వ అంతస్తు, కె.యస్ టవర్స్, సరస్వతి పార్క్ దగ్గర, దాబా గార్డెన్స్, విశాఖపట్నం-530020.
ఈ-మెయిల్ : cs8333@pnb.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన / ఛార్జిలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / లాంఛనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారిగారు సెక్యూర్డు క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వాటిని "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై" దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు/సెక్యూర్డు క్రెడిటార్ గారు సదరు ఋణగ్రహీత(లు), హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

ఇ-వేలం తేది, సమయం : 26-11-2025 ఉ॥ గం॥ 11.00 నుండి సా॥ గం॥ 4.00 వరకు
బయానా చెల్లింపునకు ఆఖరు తేది : 26.11.2025, మధ్యాహ్నం గం॥ 03.00ల లోపు
బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-

1) ఋణగ్రహీత పేరు / బ్యాంకుకు మొత్తం బకాయిలు : పరిమి వెంకట నారాయణ రావు (ఖాతా నెం. : 52716016000108)
& 9-66-10, అల్లాడి వారి వీధి, కొత్తపేట, విజయవాడ, కృష్ణా-520009
& శ్రీ సాయి నివాసం, ఫ్లాటు నెం.101, గ్రౌండ్ ఫ్లోర్, ఆర్.యస్.నెం.501/1ఎ, రాయనపాడు గ్రామం, విజయవాడ రూరల్ మండలం, కృష్ణా జిల్లా-521225
బ్రాంచ్ ఆఫీస్ : 527110 - విజయవాడ - వన్ టౌన్ డిమాండ్ నోటీసు తేది. : 12-11-2024
బకాయి : తేది.31-12-2024 నాటికి బకాయి రూ.35,07,273,88 పై. + తదుపరి వడ్డీ, ఛార్జీలు, వ్యయాలు మరియు ఇతర ఖర్చులు.
స్వాధీనత తేది : 05-02-2025 స్వాధీనత స్వభావం : లాంఛనాత్మక
తనఖా చేసిన సెక్యూరిటీ / ఆస్తి వివరాలు / యజమాను(లు) పేరు (తనఖా చేసిన ఆస్తి(లు) : శ్రీ పరిమి వెంకట నారాయణ రావు, తండ్రి. పరిమి పేరయ్య గారి పేరున గల రిజిష్టర్డ్ అమ్మకం దస్తావేజు నెం. 1169/2017, తేది.10.04.2017& రిజిష్టర్డ్ ఎమ్ఓడి నెం.4654/2023, తేది.27.07.2023 ప్రకారం : ఐటమ్ నెం.1 : కృష్ణా జిల్లా, విజయవాడ రూరల్ మండలం, రాయనపాడు గ్రామం, రాయనపాడు గ్రామ పంచాయితీ, సర్వే నెంబర్ ఆర్.ఎస్.నెం.50/1ఎ లోని 904.00 చ॥గ॥ లులోని మెస్సర్స్ శ్రీ సాయి నివాసం అపార్ట్‌మెంట్ యొక్క డోర్ నెం.7-112తో కలదు. హద్దులు : తూర్పు : ఎస్. పరం ధామమ్ మరియు ఎస్. కొండల్ రావు నాయుడు గార్ల ఆస్తి, ఉత్తరం : ఆర్. కాంతా రావు, ఎస్.వి ఫణీంద్ర, కె.ఎమ్.ఎస్. శెట్టి గార్ల ఆస్తి, పడమర : 33 అ॥ల వెడల్పు పంచాయితీ బజార్, ఉత్తరం : శ్రీరామ్ వెంకటేశ్వర్లు మరియు పి. ఆంథోని గార్ల ఆస్తి.
ఈ హద్దుల యందు మొత్తం విస్తీర్ణం 904.00 చ॥గ॥ లులోని అవిభాజ్యమైన మరియు నిర్ధిష్టపరచని విస్తీర్ణం 60.00 చ॥గ॥ లులోని స్థలం మాత్రమే అన్ని ఈజిమెంట్ హక్కులతో కలదు.
ఐటమ్ నెం.2 : ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్, విజయవాడ రూరల్ మండలం, రాయనపాడు గ్రామం, రాయనపాడు గ్రామ పంచాయితీ, ఆర్.ఎస్.నెం.50/1ఎ, డోర్ నెం.7-112 దగ్గర పైన చెప్పబడిన శ్రీ సాయి నివాసం అపార్ట్‌మెంట్ నందు గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియా 1550 చ॥అ॥లుతో (కామన్ ఏరియాతో కలిపి) మరియు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్‌తో ఒక నివాసయోగ్యమైన ఫ్లాట్ నెం.101 తో కలదు. హద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : మెట్లు మరియు ఓపెన్ టు స్కై.
సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు తెలిసిన మేరకు ఋణభారముల వివరాలు : ఋణ భారములు ఏమి లేవు.
రిజర్వు ధర : రూ.36,70,000/- ధరావత్తు : రూ.3,67,000/-

ఇ-వేలం నియమ నిబంధనలు :
1) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును.
2) ఆస్తులను 'ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి.
3) అధీకృత అధికారి గారి వద్దగల షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారు సమాధానం తెలుపవలసిన అవసరం లేదు.
4) అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://ebkray.in & www.pnbindia.in. ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది.26-11-2025, ఉదయం గం.11-00 ల నుండి సాయంత్రం గం.4-00 ల వరకు నిర్వహించెదరు.
5) అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయజేసి https://ebkray.in & www.pnbindia.in వెబ్‌సైటులు చూడవలెను.
సర్ఫేసి చట్టం 2002 లోని రూలు 8(6) r/w 9(1) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన
తేది : 10-11-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 95537 86677/96404 96677

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

TO LET

COMMERCIAL

TO.LET
విద్యా సంస్థలకు, ఆఫీసులకు
12000 వేలు చ॥అ కమర్షియల్ స్పేసు అద్దెకు ఇవ్వబడును.
దాసరి కమర్షియల్ కాంప్లెక్స్
జె.పి.రోడ్,భీమవరం-2
94408 70986
94403 56099

SECOND SALE

24 గుమ్మములు, 55 కిటికీలు, డోర్స్‌తో సహా (10 సం॥ముల పాతవి) అమ్మబడును. Contact: ✆ 94408 70986, 94403 56099.

JOBS

Req. of DRA & Non DRA Banking Collections, Field Exec: 16K- 22K, Telecaller: 11K- 15K+ Incen. @ Vijayawada ✆ 63040 56516.

Wanted Real Estate Door to Door Field Marketing Executives in Nandigama (Freshers) Contact: 94324 54545.

Wanted B.Com /M.Com / MBA Finance / CA IPCC Droupouts To be work as Field / Back end Executive in Vijayawada in a Reputed Audit Firm. Interested Persons. Cont: 70135 11502 or Mail To kowthahr@gmail.com

Wanted Experienced Godown Incharge for Medical Agencies @ Srinivasa Drugs, Bhavanipuram, VJA. Ph: 970407 1271.

Teachers for 6 to 10th Telugu, Hindi, English & Social, Study Hours, Spoken English, Computer faculty, Art Craft & Drawing Teachers. ✆ 80745 28582.

ప్రముఖ నిర్మాణసంస్థకు టెలీకాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ స్టాఫ్, సైట్ ఇంజినీర్, సూపర్‌వైజర్, అకౌంటెంట్ కావలెను. ✆ 77024 66003, 89777 59919.

కరీంనగర్ జిల్లా వేములవాడలో ఒక్కరి కోసం బ్రాహ్మణ వంటమనిషి కావలెను. పిల్లలుంటే స్కూలు విద్య ఉచితం. ఉచిత వసతి, భోజనం. సెల్: 92469 32088.

DTP ఆపరేటర్స్ (F) కావలెను. పేజిమేకర్ / అడోబ్ ఇన్‌డిజైన్ / కొరల్‌డ్రాలో బుక్‌వర్క్ చేయగల వారికి ప్రాధాన్యత. ✆ 77028 02426, 98484 07654.

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ:23000 టు 29000. వ: 18-35. ✆ 77309 58410.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఇబ్రహీపట్నం గ్రామీణం 9773300487 గొల్లపూడి 8008574638

? జూపూడి గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకును నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో తాగునీటిలో నలకలు వస్తున్నాయి. - **భూక్య రామానాయక్**

✔ ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి ట్యాంకును శుభ్రం చేస్తున్నాం. ఒకటి రెండు రోజుల్లో ట్యాంకును శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - **భాగ్యలక్ష్మి, గ్రామ కార్యదర్శి** – న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

? విస్సన్నపేట చింతల బజారు, తిరుపతమ్మ గుడి ఏరియాలో రోజుల తరబడి చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. **-స్థానికులు**

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం - **కేశవ హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి**– న్యూస్‌టుడే, విస్సన్నపేట

స్పందనకు వందనం

✦ స్థానిక చెరువు బజారు, గుడి సెంటర్‌లోని మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయి దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను ఈ నెల 9న 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురించగా పంచాయతీ కార్యదర్శి బసవలింగేశ్వరరావు స్పందించారు. సిబ్బందితో పూడిక తీయించి దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించారు. – **న్యూస్‌టుడే, జి.కొండూరు**

✦ పట్టణంలోని 8వ వార్డులో ఉన్న డ్రెయినేజీల్లో మట్టి, బురద పేరుకుపోయి మురుగు పారుదలకు ఇబ్బందిగా ఉందని స్థానికుడు కుటుంబరావు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. – **న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

కబడ్డీలో సత్తా

మైలవరం, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక ఎస్వీఆర్‌జీఎన్నార్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి ఇనపనూరి చరణ్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్.సతీష్ తెలిపారు. విద్యార్థిని పలువురు అభినందించారు.

వ్యవసాయ కనెక్షన్ల విద్యుత్తు సరఫరా వేళల్లో మార్పు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని కనుమూరు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని కనుమూరు, వినగడప తండా పరిధిలోని వ్యవసాయ కనెక్షన్లకు సోమవారం ఉదయం 4 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు త్రీఫేస్ విద్యుత్తు సరఫరా చేస్తామని డిస్కం ఏఈ సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్తు లైన్ల మరమ్మతుల నిమిత్తం వ్యవసాయ కనెక్షన్ల సరఫరా వేళల్లో మార్పు జరిగినట్లు వివరించారు.

సాగర్ జలాలను వినియోగించుకోవాలి

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఆదివారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం వద్ద 72వ కి.మీ నియంత్రిక నుంచి 690 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 411 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు-1కి 45, పెదకొమర 30, మధిర 40, నిదానపురం 60 క్యూసెక్కులు సరఫరా చేసినట్లు వివరించారు. కాల్వలకు విడుదలైన సాగర్‌జలాలను మిరప తోటలకు నీటి తడులు అందించేందుకు వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.

శిక్షణ పూర్తయింది.. కొనడమే మిగిలింది

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాలు సిద్ధమయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. మండల పరిధిలో ఈ ఏడాది 9 వేల ఎకరాల్లో వరి సాగు చేసిన రైతులు అకాల వర్షాలు, ఎరువులు, విత్తనాల కొరత, తెగుళ్లను అధిగమించి పంటకాలం పూర్తిచేశారు. మరో పది రోజుల్లో వరి కోతలు ఊపందుకోనున్నాయి. మూలపాడు, ఈలప్రోలు, గుంటుపల్లి గ్రామాలతో పాటు మరో మూడు గ్రామాల్లో కూడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ముఖ్యంగా దళారుల ప్రమేయం లేకుండా చేసేందుకు వ్యవసాయాధికారులు కృషి చేస్తున్నారు. ఈ క్రాప్ బుకింగ్ నవంబరు చివరి నాటికి సాగుదారులందరూ చేయించుకోవాలని గ్రామ వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు అవగాహన కలిపిస్తున్నారు. మిల్లులకు ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ పరికరాన్ని తప్పనిసరిగా అమర్చాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. దీని ధర మార్కెట్‌లో రూ.2700 లుగా ఉంది.

గత ఏడాది కంటే....

ఖరీఫ్ సాగుచేసిన రైతులకు కనీస మద్దతు ధర పెంచింది. గత ఏడాదితో పోల్చితే రూ.69 పెరిగింది. ఇలా సాధారణ రకం75 కేజీలు రూ.1,792, క్వింటాకు రూ.2,369, ఏ గ్రేడ్ రకం క్వింటాకు రూ.2,389, 75 కేజీలు రూ.1,777లుగా మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది.

మూలపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పరపతి కేంద్రం ఛైర్మన్ శ్రీనివాసరావు

సద్వినియోగం చేసుకోవాలి - వై. రజని, మండల వ్యవసాయాధికారిణి

వరి సాగుదారులు వ్యవసాయ పరపతి కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. గోనె సంచులు సైతం సిద్ధం చేసి అక్కడే అందజేస్తున్నాం. ఈ క్రాప్ బుకింగ్ రైతులకు తప్పనిసరిగా ఉండాలి. అధికారులు అనుమతి ఇచ్చిన వాహనాల్లోనే ధాన్యం రవాణా చేయాల్సి ఉంటుంది. హమాలీ ఛార్జీలు క్వింటాకు రూ.రూ.22 చెల్లించనున్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుడికి అవార్డు

ఇర్ఫాన్ పాషా

ఇబ్రహీంపట్నం గ్రామీణం: జాతీయ విద్యా దినోత్సవం, భారతరత్న అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమి ఏటా ఇస్తున్న జీవితకాల సాఫల్య అవార్డు ఈ ఏడాది ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కాచవరం మండల పరిషత్తు పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషాకు లభించింది. ఈ నెల 11వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా అవార్డు అందుకోనున్నారు. ఈయన విద్యారంగంలో చేసిన సేవలు, విద్యార్థుల భాషా అభివృద్ధి, సామాజికసేవ, విద్యార్థుల నమోదు, పాఠశాల అభివృద్ధిలో దాతలను భాగస్వాములను చేయడం తదితర సేవా కార్యక్రమాలను గుర్తించిన రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఈ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న తెదేపా నాయకుడు మధుసూదనరావు

స్థానిక సంస్థల ఎన్నికల విజయానికి కృషి

కొండపల్లి, న్యూస్‌టుడే: తారతమ్యాలు మరచి పార్టీ కేడర్ అంతా స్థానిక ఎన్నికలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని తెదేపా నాయకుడు మధుసూదనరావు అన్నారు. తెదేపా సర్వసభ్య సమావేశాన్ని కొండపల్లి పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యులనుద్దేశించి ఆయన మాట్లాడారు. చైర్మన్ చిట్టిబాబు మాట్లాడుతూ.. బూత్ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను తెలియజేయాలని సూచించారు. వైస్ చైర్మన్ శ్రీను మాట్లాడుతూ... బూత్ కమిటీలకు బాధ్యులను ఇప్పటికే నియమించామన్నారు. బూత్ కన్వీనర్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంగా ఓటర్ వెరిఫికేషన్ చేయాలన్నారు. మృతి చెందిన వారి వివరాలతో పాటు డబుల్ ఎంట్రీలను గుర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, బూత్ కన్వీనర్లు, ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు

మైలవరం, న్యూస్‌టుడే: ప్రముఖ ఆస్పత్రులు నిర్వహించే వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వివేకానంద హైస్కూల్‌లో ఆదివారం పెద్దేశ్వర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శివాలయంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న మహా అన్నదాన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ద్వారకా తిరుమల దేవస్థాన చైర్మన్ ఎన్ని సుధాకరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు ఉదయభానులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన వెంట పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ధ్వజస్తంభం.. విగ్రహాల ప్రతిష్ఠోత్సవం నేడు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు మండలం రోలుపడిలో కోదండ రామాలయంలో ధ్వజస్తంభం, గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి, నాభిశిల ప్రతిష్ఠోత్సవం సోమవారం నిర్వహించేందుకు గుడి అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం, సామూహిక కుంకుమార్చన, హోమం ఆదివారం నిర్వహించారు. పురోహితులు జక్కేపల్లి నరసింహమూర్తి, వేదపండితులు కేతముక్కల శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠోత్సవం జరుగుతుంది.

హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఎస్సైకి సన్మానం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ఎ.కొండూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జి.మహాలక్ష్ముడును మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఎం.ఏలియాబాబు, వి.డైమండ్, రత్నాకర్, కె.శౌరి, వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బాధ్యతల స్వీకరణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా నియమితులైన ఎస్.శ్రీను ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గంపలగూడెం ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై బి.మోహనరావు నందిగామకు బదిలీ అయ్యారు.

ఎస్సై శ్రీను

అడ్డుగా ఆవులు.. పట్టించుకోరెవరు..

పట్టణంలోని ప్రధాన రహదారులపై పశువుల అడ్డంగా తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా బోసుబొమ్మ సెంటర్, ప్యాలెస్ సెంటర్, బీరాల సెంటర్, కూరగాయల మార్కెట్ వద్ద రోడ్లపైనే పడుకుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా, ఎటువంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు వాపోతున్నారు. ఈ ఆవులను రోడ్లపైకి వదిలేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

పట్టుతప్పితే పడిపోవడమే..

మండలంలోని దాసుళ్లపాలెం వద్ద బుడమేరు వాగుపై వంతెనపక్కన రెయిలింగ్ విరిగి నామరూపాల్లేకుండా పోయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. 50 మీటర్ల పొడవునా ఏర్పాటు చేసిన డిమ్మెల్లో ఒకట్రెండే మిగిలాయి. విరిగిన వాటి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన ఎవరూ పట్టించుకోవడంలేదు. జాతీయ రహదారి నుంచి దాసుళ్లపాలెం గ్రామానికి వెళ్లేందుకు ప్రధాన మార్గం కావడంతో నిత్యం స్థానికులతో పాటు, పాఠశాలల బస్సులు కూడా తిరుగుతుంటాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే, తప్పుకునే క్రమంలో అంచుకు వెళ్తే వాగులో పడి కొట్టుకుపోవడమేనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. **-న్యూస్‌టుడే, మైలవరం**

ఎండిన చెట్టు కొమ్మల తొలగింపు

ఈనాడు స్పందన

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ వద్ద ఎండిన చెట్టు కొమ్మలు ప్రమాదకరంగా ఉన్నాయని 'తొలగిస్తే విద్యార్థులను కాపాడినట్లే' శీర్షికన ఈనాడులో శనివారం చిత్ర వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు ఆదివారం సిబ్బందితో ఆయా కొమ్మలను తొలగింపజేశారు. ఉప సర్పంచి కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు, ఆర్ఐ జి.పుల్లయ్య, వీఆర్వో రమేష్ నాయక్‌లు పర్యవేక్షించారు. - **న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

జి.కొండూరు, న్యూస్‌టుడే: కట్టుబడిపాలెం గ్రామ శివారులోని ఎన్‌సీఎల్ (నాగార్జున సిమెంట్స్ లిమిటెడ్) లైట్ వెయిట్ బ్రిక్ కంపెనీలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. దాదాపు 250 టన్నుల బరువు కలిగిన ట్యాంకు కింద పడింది. కార్మికులంతా భోజనానికి వెళ్లిన సమయంలో ఘటన జరగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గత ఆరేళ్లలో రెండు ఘటనలు జరిగి ప్రాణ నష్టం వాటిల్లుతున్నా.. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే యూనిట్ నిర్వహణ చేపట్టి ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కట్టుబడిపాలెం శివారులో ఎన్‌సీఎల్ కంపెనీలో కూలిన ట్యాంకు

శిరస్త్రాణమే ప్రాణాలకు రక్ష

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: శిరస్త్రాణం ధరిస్తే వ్యక్తికే కాదు కుటుంబానికి రక్ష అన్న సంగతి ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు గుర్తించాలని ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణరావు అన్నారు. ఇబ్రహీంపట్నం రింగుకూడలిలో ఆదివారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చిన్న నిర్లక్ష్యం కుటుంబాన్ని కుంగదీస్తున్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. ఏమైందిలే అని వాహనంతో రహదారిపైకి రావడం.. అనుకోకుండా ప్రమాదానికి గురికావడం.. ఆ తర్వాత కుటుంబాన్ని పోషించాల్సిన వ్యక్తి భారంగా మారడం జరిగిపోతుందన్నారు. ఇటువంటివి రోజులో ఎన్నో చూస్తున్నా.. అలవాటుల్లో మార్పు రాకపోవడం విచారకరమన్నారు. వాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరూ నేను-నా కుటుంబం-సమాజం అనే ఆలోచన అనుక్షణం ఉండాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు.

యువకులకు అవగాహన కలిగిస్తున్న ఎస్సై లక్ష్మణరావు

నెమలి కృష్ణాలయానికి విరాళం

నగదు, వాటర్ కూలర్ అందజేసిన దాతలు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి గుడికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం వాస్తవ్యులు కోటి రామకృష్ణ, పద్మావతి, వీరి కుమారుడు చరణ్‌తేజ, సాయి నాగవినీల దంపతులు ఆదివారం రూ.75వేలు వితరణగా అందించినట్లు ఆలయ ఉద్యోగులు తెలిపారు. ఆలయంలో భక్తులకు నిర్వహించే అన్నప్రసాదం కార్యక్రమానికి రూ.40వేలతో పాటు రూ.35వేల విలువైన వాటర్ కూలర్ దాతలు అందజేసినట్లు చెప్పారు. స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకున్న దాత కుటుంబ సభ్యులను అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి, ప్రసాదం, చిత్రపటం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

97 మందికి వైద్యం

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరు గ్రామంలో ధన్వంతరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండవ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 97 మంది రోగులు రాగా డా.ఈశ్వర్, డా.పీ.శ్రీవాణి వైద్యులు మధుమేహం, రక్తపోటు, సాధారణ జ్వరం తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ట్రస్టీ జువ్వా వెంకటేశ్వరరావు రోగులకు నెలరోజులకు సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. వాలంటీర్‌గా యేసు, రామారావు, నవీన్, దుర్గా గాయత్రి తదితరులు సేవలందించారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

'జోగి అరెస్టు హేయం'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: జోగి రమేష్ అరెస్టు అక్రమం అని వైకాపా రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసురాజు అన్నారు. జోగి రమేష్ కుటుంబ సభ్యులను ఎస్సీ సెల్ సభ్యులు ఆదివారం సాయంత్రం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఆధారాలు లేని ఆరోపణలపై ఆధారపడి జోగిని అరెస్టు చేయడం హేయమన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, శ్యాంబాబు, శరత్, జక్రిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి వాయు భక్త దాసాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో మైలవరం జనసేన నాయకులు అక్కల రామ్మోహనరావు పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గోతుల సమస్య తీర్చారు

చదును చేస్తున్న జేసీబీ

గణపవరం(మైలవరం), న్యూస్‌టుడే: మండలంలోని గణపవరంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతుల సమస్యకు ఆ గ్రామ తెదేపా నాయకులు తాత్కాలిక ఉపశమనం కలిగించారు. ఆదివారం ఇటుక బట్టీల ముక్కలతో గోతులను పూడ్చించారు. ఇప్పటికే పలుమార్లు ఆ గ్రామంలో నాయకుల సహకారంతో తాత్కాలిక చర్యలు చేపట్టగా, వర్షాలతో తిరిగి సమస్య పునరావృతం అవ్వడంతో తాత్కాలికంగా పూడ్చివేసినట్లు తెదేపా నాయకులు బుజ్జిరెడ్డి, శ్యాంప్రసాద్ తెలిపారు.

శాంతిభద్రతలు కాపాడడం అందరి బాధ్యత

తిరువూరు టౌన్: సమాజంలో శాంతిభద్రతలు కాపాడడం ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని ఎస్సై సత్యనారాయణ సూచించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నేర కార్యక్రమాల్లో పాల్గొన్నవారు తీరు మార్చుకుని మంచి జీవన విధానాన్ని ప్రారంభించాలని పేర్కొన్నారు. తిరిగి నేరప్రవర్తనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

తమ్ముడిపై అన్న దాడి

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని వెల్వడంలో తమ్ముడిపై అన్న దాడి చేసిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై కే.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్వడానికి చెందిన కోట రాంబాబు అతని తమ్ముడు రాంపండుల మధ్య కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. శనివారం ఒక కార్యక్రమంలో తమ్ముడు అనుచితంగా మాట్లాడాడంటూ..తెలిసిన వ్యక్తులు చెప్పడంతో ప్రధాన రహదారి వద్ద ఓ దుకాణంలో ఉన్న తమ్ముడి తలపై బీరు సీసాతో కొట్టాడు. దీంతో తీవ్ర గాయంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేరిన రాంపండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జూదరుల అరెస్టు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మూడు చోట్ల జూద మాడుతున్నట్లు సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్సై కే.సతీష్‌కుమార్ ఆదివారం తన సిబ్బందితో దాడులు చేసి 16 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వెల్లటూరు గ్రామ శివారులో నిర్వహిస్తున్న జూద శిబిరంలో ఓ చోట 5 మంది నుంచి రూ.11,200, మరో చోట నలుగురి నుంచి రూ.620, జి.కొండూరు శివారు గొల్లగూడెంలో మరో 7 మంది వద్ద రూ.4,900 చొప్పున నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండలం నాయకులగూడెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న జూద శిబిరంపై స్థానిక పోలీసులు దాడి చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.38,000 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై జి.రామకృష్ణ తెలిపారు.

ఉత్సాహంగా కార్తిక వనసమారాధనలు

మైలవరం : పూజల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు

గుంటుపల్లి: వాయులింగేశ్వర స్వామికి అభిషేకాలు

మైలవరం, న్యూస్‌టుడే: కార్తిక వనసమారాధన, వనభోజనాల కార్యక్రమాలను ఆదివారం మైలవరంలో పలు సామాజిక వర్గాల ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. కాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన వనసమారాధనలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, జనసేన నాయకులు ఉదయభాను, అక్కల గాంధీ పాల్గొన్నారు. పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో తోటలో కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

అభిషేకాలు.. అల్పాహారాలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా గుంటుపల్లి సిమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటుపల్లి పుష్కర ఘాట్ వద్ద వాయు లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి పంచామృత అభిషేకాలు చేశారు. అనంతరం కృష్ణానదికి పూజలు చేసి భక్తులతో పాటు నదీతీరానికి వచ్చిన వారికి నదీ సమారాధన పేరుతో అల్పాహారం అందజేశారు.

సామూహిక వనభోజనాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా ఆదివారం గంపలగూడెం ఆర్యవైశ్య సంఘీయులు వనసమారాధన ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా తోటమూల సమీప మామిడి తోటకు వెళ్లి సత్యనారాయణస్వామి వ్రతం చేశారు. అనంతరం సామూహిక వనభోజనం చేశారు. మహిళలకు ఆటలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నాయకులు కె.నరసింహారావు, బి.నరసింహారావు, కె.శ్రీనివాసరావు, కె.రాంబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గంపలగూడెం: సత్యనారాయణస్వామి వ్రతం

यूनियन बैंक ऑफ इंडिया యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
కంభంపాడు బ్రాంచి-18981
మెయిన్ రోడ్డు, కంభంపాడు, ఏ.కొండూరు మండలం, ఎన్.టి.ఆర్ జిల్లా, ఏపి-521227.

ఈ వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(1) నిబంధనతో పాటు చదవబడిన సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 కింద స్థిరాస్తుల అమ్మకానికి ఈ-వేలం అమ్మకపు నోటీసు.

ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కంభంపాడు బ్రాంచి (18981) కు తనఖా/ఛార్జ్ చేయబడిన, దిగువ వివరించబడిన స్థిరాస్తులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు. దిగువ స్థిరాస్తులను ఈ-వేలం అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి రావలసిన దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఖర్చులు/ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారిచే ఈ-వేలం అమ్మకం ద్వారా ది.11-12-2025న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేది: ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు.

ఈ వేలం తేది మరియు సమయం: 11-12-2025, మ॥ 12.00 గం. నుండి సా॥ 05.00 గం. వరకు (10 ని॥ల అపరిమిత స్వీయ పొడిగింపులతో)

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: శ్రీ బంకా విజయ్ కుమార్, ప్రొప్రయిటర్: మెస్సర్స్ దివ్య ఆటో కన్సల్టెన్సీ, తండ్రి: బంకా రవి కుమార్, హెచ్.నెం.2-94, హరిజనవాడ, కొమ్మిరెడ్డిపల్లి గ్రామం, తిరువూరు మండలం, ఎన్.టి.ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్-521235.

బకాయి మొత్తం: రూ.8,17,733/- (అక్షరాలా ఎనిమిది లక్షల పదిహేడు వేల ఏడు వందల ముప్పై మూడు రూపాయలు మాత్రమే) మరియు ది. 25.03.2025 నుండి ఒప్పంద రేటు ప్రకారం మరింత వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు

ఆంధ్రప్రదేశ్-521227, ఎన్.టి.ఆర్ జిల్లా, తిరువూరు గ్రామం మరియు మండలం, శ్రీనివాస జగన్నాథపురం ఫేజ్-2, వెల్లంకి ఎస్టేట్, ఆర్.ఎస్. నెం. 126/1బి1, ప్లాట్ నెం. 64 లో ఉన్న 215.62 చదరపు గజాల విస్తీర్ణం గల నివాస ఖాళీ ప్లాట్ శ్రీ బంకా విజయ్ కుమార్ గారి పేరున కలదు. **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 51 యొక్క స్థలం, **దక్షిణం:** ప్లాట్ నెం. 65 యొక్క స్థలం, **పడమర:** 30 లింకుల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ప్లాన్ ప్రకారం ప్లాట్ నెం. 63 యొక్క స్థలం.

రిజర్వు ధర (రూ.) : రూ. 14,66,000/-, ధరావత్తు ధర (రూ.) : రూ. 1,46,600/-, బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://baanknet.com మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్: https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తి గల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేదీ నందు బ్రాంచి హెడ్ కాంటాక్ట్ నెం. 8886551985 (బి.ఎం), మెయిల్ ఐడి: ubin0818984@unionbankofindia.bank లలో సంప్రదించవచ్చు.

తేది: 04.11.2025 అధీకృత అధికారి
ప్రదేశము: కంభంపాడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

విజయవాడ తూర్పు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగర ప్రజలు తమ సమస్యలను పరిష్కరించేందుకు అనువుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరవాసులు తమ సమస్యలను వేదికలో ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సకాలంలో వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం, రహదార్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు, తాగునీరు, ఆక్రమణలు, మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

నగర అభివృద్ధిలో ప్రణాళికా విభాగం కీలకం

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, పక్కన ప్లానింగ్ అధికారులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగర, పట్టణాల అభివృద్ధిలో ప్రణాళికా విభాగం కీలకమని ఏపీ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. ప్లానింగ్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఆదివారం నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు క్షేత్రస్థాయి విధుల నిర్వహణలో ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. టౌన్ ప్లానింగ్‌కు క్షేత్రస్థాయి సిబ్బంది కొరత ఉందని, ఉమ్మడి ఏపీ నుంచి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు భర్తీ కాలేదని, ఫలితంగా వార్డు ప్లానింగ్ సెక్రటరీలు ఇన్‌ఛార్జి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోందని తెలిపారు. వార్డు ప్లానింగ్ సెక్రటరీల సర్వీసు రూల్స్‌ను సవరించాల్సి ఉందని, ఫలితంగా పూర్తి స్థాయి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పించి, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌బాబు, అసోసియేషన్ జోనల్ అధ్యక్షుడు వసీంబేగ్ మాట్లాడుతూ విజయవాడకు 25 ఏళ్ల కిత్రం మాస్టర్ ప్లాన్ రూపొందించారని, ప్రస్తుతం మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు, సభ్యులు అబ్దుల్ సత్తార్, నాయుడు, రమణమూర్తి, వెంకటేశ్వరరావు, జి.కృష్ణ, రతన్ రాజు, సునీత, మతీన్ పాల్గొన్నారు.

అసమానతలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అరుణ, మాల్యాద్రి తదితరులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హింస, అసమానతలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్ అన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో 15న సున్నపుబట్టీల కూడలిలోని పులే అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే 'మహిళలు- సామాజిక న్యాయం' సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను ఆదివారం మొగల్రాజపురంలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశంలో మహిళలపై ప్రతి ఐదు నిమిషాలకు ఒక అత్యాచారం జరుగుతోందని జాతీయ నేర రికార్డు బ్యూరో నివేదిక తెలియజేసిందని, ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ మహిళలపై ఇవి జరుగుతున్నాయని చెప్పారు. వీటికి వ్యతిరేకంగా మహిళలను సంఘటితం చేసేందుకు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించి.. వారిలో చైతన్యం తీసుకునేందుకు సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు అరుణ, చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులు వినియోగించండి

కరపత్రాలు పంచుతున్న భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు స్వదేశీ వస్తువులను వినియోగించుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ సూచించారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని స్వదేశీ వస్తువుల వినియోగంపై కరపత్రాల పంపిణీని భాజపా, ఆర్ఎస్ఎస్ నాయకులు ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వదేశీ ఆధారిత జీవన విధానంతో దేశ భద్రత ముడిపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలకమండలి సభ్యుడు ఎ.శ్రీనివాసరావు, సాంబశివరావు, హరిప్రసాద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కర్మల భవనం.. దయనీయం

పిచ్చిమొక్కలతో పరిసరాలు

నెహ్రూనగర్ (కృష్ణలంక), న్యూస్‌టుడే : అంత్యక్రియల అనంతరం పవిత్ర కార్యంగా భావించి నిర్వహించే కర్మకాండ, పిండ ప్రదానాలు.. ఇత్యాది క్రతువులు చేసేందుకు ఏర్పాటు చేసిన నగర పాలక సంస్థ కర్మల భవనంలో తగిన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణలంక జాతీయ రహదారికి పక్కనే ఉన్న బందరు కాలువ గట్టు ప్రదేశంలో అమెరికన్ ఆసుపత్రి వంతెనకు అనుకుని నగరపాలక సంస్థ 2008లో కర్మల భవనాన్ని ఏర్పాటు చేయగా వీఎంసీ ఎస్టేటు విభాగం నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షిస్తోంది. పర్యవేక్షణ లోపంతో భవనం పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రత నెలకొంది. భవనం నిర్మాణ సమయంలో మోటార్, ట్యాంకు ఏర్పాటు చేయగా దీర్ఘకాలంగా మోటారు చెడిపోయినా.. పట్టించుకునే వారు లేరు. భవనం వెనుక పిండ ప్రదానాల నిమిత్తం నిర్మించిన హాల్ చెత్తతో నిండి ఉంది. భవనం పరిసరాలు అడవిని తలపించేలా ఉన్నాయి. ఖాళీ మద్యం సీసాలు పడేశారు. మరుగుదొడ్డి, మూత్రశాలలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఎన్నిసార్లు సంబంధిత విభాగానికి ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విభాగం స్పందించి భవనాన్ని ప్రజలు ఆవసరాలకు తగినట్లుగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు ఆటపాటల్లోనూ రాణించాలి

విజేతలతో కమిషనర్ కృష్ణతేజ, విజయబాబు, పద్మజ

బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ అన్నారు. పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని నలంద విద్యానికేతన్‌లో చిన్నారులకు ప్రతిభా పోటీలు ఆదివారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చిన్నారుల్లో దాగి ఉన్న సృజన, నైపుణ్యాలను పెంపొందించడానికి ఇలాంటి పోటీలు దోహద పడతాయని సూచించారు. పట్టుదల, లక్ష్యంతో విద్యార్థులు చదవాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎ.విజయబాబు, ప్రిన్సిపల్ మాదల పద్మజ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలతో అలరించారు. హెల్త్ బేబి షో, టాలెంట్ పరేడ్, కాస్ట్యూమ్స్ పార్టీ, ఒలింపియాడ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు కమిషనర్ బహుమతులు అందజేశారు.

సమాజ వికాసానికి కళలు దోహదం

హజరత్తయ్య గుప్తాకు పురస్కారం అందజేస్తూ..

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కళలు సమాజ వికాసానికి దోహద పడాలని కళాకారుడు, న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు. తుమ్మపల్లి కళాక్షేత్రంలో జేఎన్ఎస్ ఫౌండేషన్, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో నిపుణులకు అవార్డులను అందజేశారు. ఈసందర్భంగా హజరత్తయ్య గుప్తాకు 'కళా రత్న' పురస్కారంతో నిర్వాహకులు సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహించి సత్కరించడం అభినందనీయమన్నారు. శేషసాయి, శ్రీనివాసరెడ్డి, గుణలక్ష్మి, సుమిత్ర, నాగేశ్వరరావులను నిర్వాహకులు ఎన్.ఝాన్సీ, బి.దాసు సత్కరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కొండ చుట్టూ కాలువ నిర్మాణం

☛ రూ.30 కోట్లు కేటాయింపు ☛ పరిష్కారం కానున్న మురుగు, ముంపు సమస్య


ఆరు, ఏడు డివిజన్‌లో కొండ ప్రాంతంపై నివాసాలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

చిన్నపాటి వర్షం కురిస్తే కొండలపై నుంచి ఒక్కసారిగా నీరు కిందకు వస్తోంది. మురుగు కాలువలు పొంగి పొర్లి రహదారుల పైకి మురుగు పారుతుంది. దీంతో మొగల్రాజపురం ప్రాంతం ముంపునకు గురవుతోంది. ఈ సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కొండ చుట్టూ కాలువ నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేసింది. ఇందుకు డీపీఆర్ సిద్ధం అవుతోంది. ఇది పూర్తవగానే టెండర్లు పిలవనున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే కొండతో పాటు దిగువన నివసిస్తున్న మూడు లక్షల మందికి మురుగు, ముంపు సమస్య తొలగే అవకాశం ఉంది.

సీఎం దృష్టికి వెళ్లగా..

తూర్పు నియోజకవర్గంలోని మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, గుణదల, మాచవరం ప్రాంతాల్లోని కొండలపై సుమారు 30 వేలు మందికి పైగా నివసిస్తున్నారు. గతంలో నిర్మించిన కాలువలు శిథిలావస్థకు చేరడం, కొన్ని పూడిపోవడం, కొన్ని చోట్ల లేక మురుగు సమస్య తలెత్తుతోంది. వైకాపా ప్రభుత్వంలో పలుసార్లు సమస్య తెలిపినా పట్టించుకోలేదు. దీని వల్ల భారీ వర్షాలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివరించడంతో ఆయన నిధులు కేటాయించారు.

కొండ కింద భాగంలో మ్యాన్‌హోల్స్ తరచూ పొంగడంతో సిబ్బంది శుభ్రం చేయాల్సిందే..

పలు ప్రాంతాల్లో రాకపోకలకు అసౌకర్యం

వర్షం కురిసే సమయంలో కొండలపై నుంచి దిగువ ప్రాంతాలైన మొగల్రాజపురం ప్రాంతానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. దీని వల్ల జమ్మిచెట్టు కూడలి, మధు చౌక్, ఏఎస్ రామారావు రోడ్డు, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, ఎంజీరోడ్డు, నిర్మలా కాన్వెంట్, ఐదో నంబరు రూట్, సిద్ధార్థ పబ్లిక్ పాఠశాల ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. నగరపాలక సంస్థ సిబ్బంది వచ్చి కాలువలను బాగు చేసే వరకు నీరు నిలుస్తాయి. దీని వల్ల రాకపోకలకు అసౌకర్యం కలుగుతోంది. ఇక్కడ నివసిస్తున్న కాలనీల ప్రజలు, వర్తక, వ్యాపార, విద్యాసంస్థలకు వచ్చేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరోవైపు మట్టి, రాళ్లు వంటివి దిగువ ప్రాంతాల్లోని రోడ్లు, కాలువల్లో చేరుతున్నాయి. వీటి వల్ల భూగర్భ మురుగు వ్యవస్థ నిత్యం ఏదో చోట పొంగి పొర్లుతోంది. కొండపై డ్రెయిన్ నిర్మిస్తే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

గుంత పూడ్చరే..?

మూడో డివిజన్ కరెన్సీనగర్ శాఖమూరి శివయ్య వీధిలో తాగునీటి పైపు లీకేజీ అవుతోంది. ఈ విషయాన్ని కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మరమ్మతులు చేపట్టారు. పైపు లీకేజీని కట్టడి చేసినా గుంత పూడ్చక పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలోని మురుగు నీరు పైపుల్లోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **-కరెన్సీనగర్, న్యూస్‌టుడే**

భూగర్భ డ్రైనేజీలో పూడికతీత

ఈనాడు వార్తకు స్పందన

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : 4వ డివిజన్ కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ మొదటి రోడ్డు పార్కు ఎదురుగా భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు బయటకు వస్తోందని 'ఎవరికీ పట్టక.. పూడిక తొలగించక' శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. బయటకు వచ్చిన వ్యర్థాలను తొలగించి మ్యాన్‌హోల్‌లో పూడికను యంత్ర సాయంతో తీశారు. బ్లీచింగ్ చల్లించారు.

సాయిబాబాకు పల్లకి సేవ

భవానీపురం, న్యూస్‌టుడే: పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని జక్కంపూడిలో పల్లకిసేవను ఆదివారం నిర్వహించారు. కోదండ రామాలయం నుంచి భక్తులు పల్లకి సేవ నిర్వహించారు. గుప్తా, ఎల్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో కార్తిక వన సమారాధనలు

సహపంక్తి భోజనాలు చేస్తున్న కాలనీవాసులు

కాలనీల్లో కార్తిక వన సమారాధనలు నిర్వహిస్తున్నారు. కొన్ని కాలనీవాసులు నగర పరిసరాల్లో మామిడి తోటలకు వెళ్లారు. నాలుగో డివిజన్ సుబ్బారావు కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చెట్లకు పూజలు చేసి.. సహపంక్తి భోజనాలు చేశారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారని కాలనీ కమిటీ అధ్యక్షుడు పి.రామచంద్రరావు, కార్యదర్శి ఆర్.సుబ్బారావు, కోశాధికారి ఎన్.రవికుమార్, వెలగపూడి సుబ్బారావు, జె.రాజారావు, చిట్టిబాబు తెలిపారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. **-కరెన్సీనగర్, న్యూస్‌టుడే**

వానొస్తే ఇంతే.. రాకపోకలు చింతే

శిథిలావస్థలో కాలువ రక్షణ గోడలు

చిన్నపాటి వర్షం కురిస్తే రహదారిపై నీరు నిలిచి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పటమట పంట కాలువ రోడ్డులోని ఆర్టీసీ కాలనీలో రోడ్డు నంబరు 4 లో వర్షం కురిసినప్పుడు డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. రహదారి జలమయమవుతోంది. ఏ మాత్రం గమనించక పోయినా కాలువలోకి పడిపోయే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తరచూ ముంపు వల్ల కాలువల రక్షణ గోడలు శిథిలావస్థకు చేరాయి. సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **-విజయవాడ సిటీ, న్యూస్‌టుడే**

చిన్న పాటి వర్షం కురిసినా.. రహదారి ఇలా ముంపునకు గురికావాల్సిందే

తవ్వారు.. వదిలేశారు

రహదారి పక్కన గొయ్యి

ఎనిమిదో డివిజన్ ఆచార్య రంగా నగర్ లోని ప్రధాన రహదారి పక్కన తాగునీటి పైపులైన్‌కు వాల్ ఏర్పాటు చేసేందుకు తవ్వారు. కొన్ని రోజులైనా పనులు పూర్తి చేయకుండా వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యపై పలుసార్లు నగరపాలక సంస్థ అధికారులు దృష్టికి తీసుకెళ్లామని కాలనీవాసులు తెలిపారు. దీన్ని వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు. రహదారి పక్కన నెలకొనడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. **- బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే**

జిల్లా స్థాయి ఓపెన్ చెస్ విజేత మల్లేశ్వరరావు

విజేతతో అతిథులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : ది విజయవాడ చెస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భవానీపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో జె.మల్లేశ్వరరావు విజేతగా నిలిచారు. మొత్తం 120 మంది తలపడగా.. ఆరు రౌండ్ల పాటు పోటీ నిర్వహించినట్లు సంఘ కార్యదర్శి ఎం.రాజీవ్ తెలిపారు. డి.బద్రీనారాయణ ద్వితీయ, వై.రాజేష్ తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరితో పాటు తొలి పది స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకంతో పాటు బహుమతులు అందజేశారు. పోటీలను ఆచార్య ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ జి.రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముగింపు కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు ఎండీ అక్బర్ పాషా అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

విద్యాధరపురం, న్యూస్‌టుడే: అప్రమత్తతతోనే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని భవానీపురం ఎస్సై అనూష సూచించారు. విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్లో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. తెలియని నంబర్ల నుంచి కాల్స్ వచ్చినప్పుడు ఓటీపీలు చెప్పడం, బ్యాంక్ వివరాలు ఇవ్వడం సైబర్ నేరాలు చేసే వారికి మార్గం సులభం అవుతుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారం పోస్టు చేయడం కూడా ఇలాంటి నేరస్థులకు అవకాశంగా మారిందని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపల్ కె.ఎల్ ప్రసన్న పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వెటరన్ క్రికెట్ విన్నర్ విజయవాడ జట్టు

కప్పు అందుకుంటున్న విజయవాడ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : నున్నలోని గ్రీన్ హిల్స్ మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన చుక్కపల్లి పిచ్చయ్య స్మారక రాష్ట్ర స్థాయి వెటరన్ క్రికెట్ టోర్నీలో విజయవాడ ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టు విన్నర్ ట్రోఫీ సాధించింది. విజయవాడ సెక్రటరీస్ ఎలెవన్ జట్టు రన్నరప్ ట్రోఫీ సొంతం చేసుకుంది. ఆదివారం ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన విజయవాడ ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. జట్టులో సుధాకర్ 75 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ప్రత్యర్థి బౌలర్ రాము నాలుగు వికెట్లు కూల్చారు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన సెక్రటరీస్ ఎలెవన్ జట్టు 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. జట్టులో లెనిన్ 48, సీహెచ్ శ్రీకాంత్ 54 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ సోము మూడు వికెట్లు పడగొట్టాడు. దీంతో తొమ్మిది పరుగుల ఆధిక్యంతో ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. మ్యాచ్‌లో సుధాకర్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా, టోర్నీలో బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా రంగ, బెస్ట్ బౌలర్‌గా తాతారావు ప్రత్యేక బహుమతులు గెలుపొందారు. ముగింపు కార్యక్రమానికి ఏసీఏ సీఏవో వై.జైకిషన్ ముఖ్య అతిథిగా, పీపుల్స్ మ్యాచువల్లి ఎయిడెడ్ కో- ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ ఎ.యల్లారావు, కేడీసీఏ కార్యదర్శి ఎం.రవీంద్ర చౌదరి, పాపుల్ షూ మార్ట్ ఎండీ చుక్కపల్లి అరుణ్‌కుమార్ అతిథుగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు.

సెపక్ తక్రా క్రీడాకారులకు అభినందనలు

క్రీడాకారులతో అతిథులు రవీంద్రనాథ్, కోటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : పటమటలోని కోనేరు బుచ్చయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సెపక్ తక్రా క్రీడాకారులను ఆదివారం పాఠశాల మైదానంలో పలువురు అభినందించారు. ఈ నెల 2, 3 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్- 19, ఈ నెల 6, 7వ తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా దుద్దుకూరులో జరిగిన రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్- 17 బాల, బాలికల సెపక్ తక్రా పోటీల్లో తమ పాఠశాల క్రీడాకారులు జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించి విజేతలుగా నిలిచారని స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అండర్- 15, 19 బాల, బాలికల సెపక్ తక్రా ఛాంపియన్ షిప్‌లో పసిడి పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారని వివరించారు. ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్, డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఎండీ పైజున్నీసా, జిల్లా స్కూల్ గేమ్స్ కార్య నిర్వాహక కార్యదర్శులు ఎల్.దుర్గారావు, ఎం.రాంబాబు పాల్గొని విజేతలను, కోచ్ సింహాద్రి రమేష్‌ను అభినందించారు.

దుర్గమ్మ దర్శనం.. భక్తజన పరవశం ★ కిక్కిరిసిన క్యూలైన్లు

సీసీ కెమెరాల్లో వీక్షిస్తూ సిబ్బందికి సూచనలిస్తున్న ఈవో శీనానాయక్

భక్తులకు తాగునీటి సీసాలు అందిస్తున్న దేవస్థాన సిబ్బంది

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో భక్తులు ఇంద్రకీలాద్రి బాట పట్టారు. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల వాహనాలతో ఘాట్ రోడ్డు మార్గం, మల్లికార్జున మహామండప మెట్ల మార్గం నిండిపోయింది. జాతీయ రహదారిపై వాహనాలు హెడ్‌వాటర్ వర్క్స్ వరకు నిలిచిపోయాయి. అమ్మవారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. మధ్యాహ్నం అమ్మవారి నివేదన సందర్భంగా దర్శనాలు నిలిపి వేయడంతో భక్తులు క్యూలైన్లో ఉక్కపోతకు గురయ్యారు. దేవస్థానం ఈవో శ్రీనానాయక్ సీసీ కెమెరాల్లో ఈ విషయాన్ని పరిశీలించి భక్తులకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్నం అంతరాలయ దర్శనం నిలిపి వేశారు. అన్ని క్యూలైన్లలో టిక్కెట్ల విక్రయాలను నిలిపి వేసి భక్తులకు ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు.

రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం

చిట్టినగర్, న్యూస్‌టుడే: పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. కొత్తపేట బ్రాహ్మణవీధిలోని యాదవపురంవీధిలో నివాసం ఉండే పీతల వెంకట నాగేంద్ర వడ్డేశ్వరంలోని కేబుల్‌లో పని చేస్తారు. ఈనెల 7న రాత్రి ఇంటి ముందు రోడ్డు మీద ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి దాటిన అనంతరం ఇంటి బయట పొగలు వస్తుండడంతో వచ్చి చూడగా.. అప్పటికే ద్విచక్ర వాహనం మంటల్లో కాలిపోతుంది. ఆ వాహనం పక్కనే మరో బ్యాటరీ వాహనం కూడా కాలుతుండగా మంటలు ఆర్పారు. ఈ మేరకు వెంకట నాగేంద్ర ఆదివారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

స్పందనకు వందనం

★ నాలుగో డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ మూడో రోడ్డులో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని స్థానిక నివాసి రాజేష్ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్ర సాయంతో పూడిక తీయించారు. ★ మూడో డివిజన్ కరెన్సీనగర్ ప్రాంతంలో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి ప్రణీత్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల మందులు, పొగ పెట్టించారు. ★ 11వ డివిజన్ పటమట పంటకాలువ రోడ్డులో 11-41/60 వీధి దీపం వెలగడం లేదని స్థానిక నివాసి నాగేశ్వరరావు ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.

– న్యూస్‌టుడే, కరెన్సీనగర్

వృద్ధుడిపై పోలీసులమంటూ దాడి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: భవానీపురం లారీ స్టాండ్‌లో గర్రె సూర్యచంద్రరావు కూలి పనులు చేస్తుంటారు. విధులు ముగించుకొని సైకిల్‌పై అంబాపురం వెళ్తుండగా.. మార్గమధ్యలో గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులమని చెప్పి దాడి చేశారు. జేబులోని నగదు లాక్కొని పారిపోయారని సూర్యచంద్రరావు వాపోయిన వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధితుడు తెలిపారు.

జూదరుల అరెస్టు .. రూ.18,870 స్వాధీనం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాత రాజరాజేశ్వరి పేటలో జూదమాడుతున్న తొమ్మిది మందిపై టూటౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.18,870 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

వంకాయల సత్యనారాయణ (లేటు) గారి కుమారుడు వంకాయల చంద్రగుప్త అను నేను మా తల్లిగారైన వంకాయల రూపవతి (లేటు) గారి పేరుతో గల ప్రకాశం జిల్లా, కొత్తపట్నం మండలం, ఆలూరు గ్రామము తాలూకా పట్టా నెం. 387 రు, రీ.సర్వే నెం. 86రు దాఖలాయ. 5-25లు భూమికి సంబంధించిన ఒంగోలు సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయములో 1వ పుస్తకం, 932 వాల్యూం, 474ల 476 పుటలలో దస్తావేజు నెం. 911/1983 రుగా రిజిష్టరు కాబడిన ఒరిజినల్ దస్తావేజును నేను ది. 20-10-2025వ తేదీన మా స్వగృహము డోర్ నెం. 45-1-81, శాంతి నగర్, ఏలూరు రోడ్, పడవలరేవు, గుణదల, విజయవాడ నుండి జిరాక్స్ నిమిత్తం చుట్టుగుంట వైపుగా వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

వంకాయల చంద్రగుప్త : 94401 64042, 73963 96711

(c) eenadu

లక్ష బిల్వార్చన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: అడవి రావులపాడు శివాలయంలో భ్రమరాంబికా సమేత చెన్న మల్లికార్జునస్వామి దేవాలయంలో ఈనెల 10న లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మహన్యాస, పంచకారక పారాయణం, లక్ష బిల్వార్చన, రుద్రహోమం, ఆకాశదీపం, జ్యోతిర్లింగార్చన, రామాలయంలో రామ భక్తాంజనేయస్వామికి తమలపాకులతో అర్చన, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, శివాలయంలో కార్తిక అన్నసమారాధన నిర్వహిస్తామని వివరించారు.

నేడు

విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

తిరువూరు, గంపలగూడెం : తిరువూరు మండలం రోలుపడిలో కోదండ రామాలయంలో ధ్వజస్తంభం, ముత్యాలమ్మ, నాభిశిల ప్రతిష్ఠోత్సవం సోమవారం నిర్వహించేందుకు గుడి అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం, సామూహిక కుంకుమార్చన, హోమం ఆదివారం నిర్వహించారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

రహదారికి మోక్షమెప్పుడో?

వత్సవాయి మండలం కొత్తరేగులగడ్డ నుంచి పెనుగంచిప్రోలు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. పక్క రాష్ట్రమైన తెలంగాణ నుంచి వత్సవాయి మండలం పెనుగంచిప్రోలు అమ్మవారి గుడికి రోజూ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సుమారు రెండు కిలోమీటర్లు రోడ్డు పూర్తిగా పాడైంది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈ రోడ్డు గురించి పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వత్సవాయి**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

✦ నందిగామ శివారు అనాసాగరంలో పైపులైన్ల పనులతో తాగునీటి సరఫరా నిలిచింది. స్థానికులు మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించారు. ఏఈ ఫణీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పైపులైన్లకు మరమ్మతులు చేశారు. ✦ ఐతవరం వద్ద నుంచి నందిగామకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్ నందిగామ వై జంక్షన్ సమీపంలో పగిలింది. విషయాన్ని పురపాలక సంఘ కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేయించారు. ✦ మునేరుకు వరదలు రావటంతో స్థానిక పెద్ద వంతెన వద్ద రెండు బోర్లు మోటార్లు, వైర్లు దెబ్బతిన్నాయి. ఛైర్‌పర్సన్ ఆదేశాల మేరకు బోర్లకు మరమ్మతులు పూర్తి చేసి తాగునీరు సరఫరా పునరుద్ధరించారు. ✦ స్థానిక గాంధీ సెంటర్ నుంచి రథం సెంటర్ వరకు రహదారిపై చెత్తతో అధ్వానంగా ఉంది. విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. **– న్యూస్‌టుడే, నందిగామ**

ప్రజా ఉద్యమానికి గోడపత్రికల ఆవిష్కరణ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో వైకాపా తలపెట్టిన ప్రజా ఉద్యమం సందర్భంగా ఆదివారం పార్టీ కార్యాలయంలో గోడపత్రికలు విడుదల చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ ప్రజా ఉద్యమం విజయవంతం అయ్యేలా కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

అందరికి ఆరోగ్యమే ధ్యేయం

✪ కొత్తగా మరిన్ని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ✪ గతంలో నిలిచిన భవన నిర్మాణాల పూర్తికి నిధులు

కంచికచర్ల, న్యూస్‌టుడే

గ్రామాల్లో సరైన వైద్య వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో గ్రామీణులకు బాసటగా నిలిచేందుకు 2019- 24 మధ్య కేంద్రం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ నిధులతో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి సంకల్పించింది. అందుకు అనుగుణంగా పలు చోట్ల వీటి నిర్మాణం ప్రారంభించింది. నాటి వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు సకాలంలో నిధులు విడుదల చేయక, పనులు నిలిచాయి. ★ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి బాసటగా నిలిచేలా కొత్తగా విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించింది. గతంలో అసంపూర్తిగా ఉన్న కొన్ని కేంద్రాల పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య కృషితో

పరిటాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నియోజకవర్గంలో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎంఏబీహెచ్ఐఎం) కింద ఒక్కో కేంద్రానికి రూ.42 లక్షల అంచనా వ్యయంతో వీరులపాడు మండలం జుజ్జూరు, కంచికచర్ల మండలంలోని కంచికచర్ల, పరిటాల, మోగులూరులో నూతన కేంద్రాలను నిర్మించనున్నారు. గతంలో నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా మిగిలిన చందర్లపాడు, కంచికచర్ల, దొడ్డ దేవరపాడు కేంద్రాల నిర్మాణం పూర్తి చేయనున్నారు. వీటితో పాటు ఉపాధి హామీ పథకం కింద ఒక్కో కేంద్రానికి రూ.36 లక్షల అంచనా వ్యయంతో నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తగా 18 ఆరోగ్య కేంద్రాలు నిర్మించనున్నారు.

నూతనంగా మండలాల్లో మంజూరైనవి ఇలా..

వీరులపాడు : కొణతాలపల్లి, బోడవాడ, పొన్నవరం, నరసింహారావుపాలెం, అల్లూరు- 1.
నందిగామ: అంబారుపేట, చందాపురం, రాఘవాపురం, పల్లగిరి. **కంచికచర్ల :** కీసర, పెండ్యాల -2, పరిటాల-2, కునికినపాడు, కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు. **చందర్లపాడు:** ముప్పాళ్ల-2, గుడిమెట్ల.
నూతన కేంద్రాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను అధికారులు పరిశీలిస్తున్నారు. స్థల సేకరణ చేసి కేంద్రాల నిర్మాణం మొదలు పెడతామని పంచాయతీ రాజ్ ఇన్‌ఛార్జి డీఈ పి.రమేష్ తెలిపారు. నూతన కేంద్రాలను వచ్చే ఏప్రిల్ నాటికి అందుబాటులోకి తెస్తామని ఆయన చెప్పారు.

వేడుకలో నూతన పాలకవర్గం, అర్చకులు

ఘనంగా చంద్రమౌళీశ్వరుడి రథోత్సవం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. ట్రస్టీ ఛైర్మన్ మహంకాళి జయప్రకాష్ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గ ప్రతినిధులు, అర్చకులు పల్లికూన కేశవప్రసాద్, స్థానాచార్యులు పిల్లలమర్రి నాగకృష్ణ శర్మ, పలువురు ప్రముఖులు రథోత్సవంలో పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 5గంటలకు పట్టణంలో నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

కంచికచర్ల, న్యూస్‌టుడే : పరిటాల విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తున్నందున సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరిటాల, నక్కలంపేట గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆ శాఖ ఏఈ దిబ్బయ్య ఆదివారం తెలిపారు.

సేవాభావానికి కట్టుబడి ఉందాం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సమాజానికి ఆరంభం నుంచి గుర్తింపుగా ఉన్న సేవాభావానికి కట్టుబడి ఉండాలని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య తెలిపారు. ఆదివారం తెలంగాణ వాసవీ ఆర్య వైశ్య ఐక్య వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్.సి.పురం కమ్యూనిటీ సెంటర్‌లో నిర్వహించిన వనసమారాధనలో మంత్రి టీజీ భరత్‌తో కలిసి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య పాల్గొన్నారు. అనంతరం ఆయన్ను సత్కరించారు.

ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్యను సన్మానిస్తున్న నాయకులు

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : పల్లగిరిపై అభయ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలోని భవానీ శంకరుడి వాయులింగానికి ఆదివారం స్వామి జన్మ నక్షత్రం ఆరుద్ర పురస్కరించుకుని దంపతులు సామూహికంగా రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. భవానీ శంకరుడి వాయులింగానికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. వెయ్యి మంది భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదం వితరణ చేశారు. రాఘవాపురం భక్తాంజనేయస్వామి దేవాలయంలో గోపు కుటుంబీకులు సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. గోళ్లమూడి శివాలయంలో శంభులింగేశ్వరస్వామికి, రాఘవాపురం శివాలయంలో రామలింగేశ్వర స్వామికి, దాములూరు శివారు కూడలి శివాలయంలో సంగమేశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించి పుష్పాలతో అలంకరణ చేశారు.

పల్లగిరిపై పుష్పాలంకరణలో భవానీశంకరుడు

ప్రమాదకరం.. తాకితే ప్రాణాపాయం

తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్

స్థానిక శివాలయం ఎదురుగా రహదారి వెంబడి ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. విద్యుత్తు స్తంభానికి బిగించిన ఇది భూమి నుంచి తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. శివాలయం, రామాలయాలకు భక్తులు వస్తూ పోతూ ఉంటారు. పిల్లలు ఆడుతూ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి పట్టుకుంటే ప్రమాదం సంభవిస్తుందని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఓ ఆవు మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగిలి మృత్యువాత పడింది. దీంతో సంబంధిత శాఖ సిబ్బంది నాలుగు కర్రలు చుట్టూ ఏర్పాటు చేసి మిన్నకున్నారు. ప్రస్తుతం అవి ఊడిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **– చందర్లపాడు, న్యూస్‌టుడే**

వచ్చారు.. ఆటలు నేర్పిస్తున్నారు

బాలికలతో వాల్‌వాల్ సాధన చేయిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయిని

నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న నాలుగు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఇటీవల డీఎస్సీలో భర్తీ చేశారు. గతంలో ఫిజికల్ డైరెక్టర్ లేక విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదు కరవైంది. ప్రస్తుతం నలుగురు రావడంతో నిత్యం పాఠశాల ఆట స్థలంలో వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. దీంతో పాఠశాల మైదానం సందడిగా మారింది. **– నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే**

కష్టానికి ప్రతిఫలం దక్కదాయే

ఐతవరంలో మొక్కజొన్నలు ఆరబోసిన రైతులు

మొక్కజొన్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అధిక వర్షాలకు దిగుబడి సగానికి తగ్గి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి రావాలి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఎకరాకు 15- 20 క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. మార్క్‌ఫెడ్ మద్దతు ధర క్వింటా రూ.2400 ఉండగా గ్రామాల్లో దళారులు రూ.1800కు కొంటున్నారని, ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా రావని ఆవేదన చెందుతున్నారు. ఐతవరం, అంబారుపేటలో కలాల్లో మొక్కజొన్నలు ఆరబోసిన రైతులు దళారులకు విక్రయిస్తున్నారు. **– నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే**

ప్రయాణం.. మహా ప్రయాస

అనాసాగరం వద్ద ప్రమాదకరంగా చప్టాపై రోడ్డు

నందిగామ నుంచి శనగపాడు మీదుగా పెనుగంచిప్రోలు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. అనాసాగరం వద్ద వాగు చప్టా, ఆర్అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. అనాసాగరం నుంచి శనగపాడు మీదుగా పెనుగంచిప్రోలు చెరువు వరకు 15 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు ఉంది. అనాసాగరం వద్ద వాగు వరదకు చప్టా, రోడ్డు కోతకు గురయ్యాయి. దీంతో జనం ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే మార్గంలో శనగపాడు వాగు వద్ద రోడ్డు అధ్వానంగా ఉంది. శనగపాడులో ఎస్సీకాలనీ వద్ద మురుగు నీరు ఆర్అండ్‌బీ రోడ్డుపై పారుతోంది. దీంతో గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పెనుగంచిప్రోలు చెరువు అలుగు వరదలకు సుబ్బాయిగూడెం రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, నందిగామ, పెనుగంచిప్రోలు**

వరదొస్తే.. గొంతు ఎండాల్సిందే

నందిగామ గ్రామీణం, వత్సవాయి, న్యూస్‌టుడే

మునేటికి వరదొస్తే ఏటిపట్టు గ్రామాల ప్రజల గొంతెండుతోంది. సామూహిక రక్షిత నీటి పథకం మోటార్లు మునిగి నెలల తరబడి తాగునీటి సరఫరా నిలుస్తున్నా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదు. రూ.కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన పథకం నిరుపయోగంగా ఉన్నా అధికారుల్లో చలనం లేదు. ఏటి ఒడ్డున ఫిల్టరు బెడ్లు నిర్మిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు కోరుతున్నారు.
✦ మునేటి ఒడ్డున రాఘవాపురం సామూహిక రక్షిత తాగునీటి పథకం పరిధిలో 13 గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలి. పథకం నుంచి నిత్యం ఆయా గ్రామాల్లోని ట్యాంకుల ద్వారా 8 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయాలి. ఈ ఏడాది మునేటికి వరదనీరు రావడంతో మునేటిలో ఏర్పాటుచేసిన బోర్లు మునిగి తాగునీటి సరఫరా నిలిచింది. తాజాగా వచ్చిన వరదతో మునేటిలో నిర్మించిన ఇన్‌ఫిల్టరేషన్ బావి వరదనీటిలో మునిగింది. దీంతో రాఘవాపురం, కమ్మవారిపాలెం, పల్లగిరి, గోళ్లమూడి, రుద్రవరం, సోమవరం, దాములూరు, కొణతమాత్మకూరు, జొన్నలగడ్డ, రామిరెడ్డిపల్లి, కొండూరు, తొర్రగుడిపాడు, మాగల్లు గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచింది. వత్సవాయి మండలం పోలంపల్లి, పెంటేలవాగూడెంలో తాగునీటి సరఫరా కావడం లేదు. లింగాల బ్రిడ్జిపై ఉన్న మంచినీటి పైప్‌లైన్లు కొట్టుకుపోయాయి. దీంతో 15 రోజుల నుంచి వత్సవాయి, డబ్బాకుపల్లిలో నీటి సరఫరా నిలిచింది.

ఇన్‌ఫిల్టరేషన్ బావి చుట్టూ నీరు

వత్సవాయి మండలంలో బోరుకు మరమ్మతులు

కదలని ట్యాంకర్లు

గ్రామాల్లో పంచాయతీ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలి. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు వీటిని కదలనీయడం లేదు. దీనికి అవసరమైన కార్మికులు, డీజిల్ ఖర్చుకు పంచాయతీ సాధారణ నిధులను వినియోగించాలి.

ప్రతిపాదన పంపాం..

రాఘవాపురం సామూహిక రక్షితనీటి పథకం వద్ద ఫిల్టర్ బెడ్ నిర్మించడానికి ప్రతిపాదన పంపాం. నిధులు మంజూరు కాగానే నిర్మించడానికి కృషి చేస్తాం. మునేటిలో నిరుపయోగంగా ఉన్న ఇన్‌ఫిల్టరేషన్ బావిలో పూడిక తీయించి ఉపయోగిస్తాం. ప్రస్తుతం వరద తగ్గలేదు. తగ్గాక బోర్లకు మరమ్మతులు చేయించి నీటి సరఫరా పునరుద్ధరిస్తాం.
–ఎంవీవీఎస్ శాస్త్రి,
ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ

డిజిటలైజేషన్‌తో లాభాలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణాల్లో డిజిటలైజేషన్ చేయడం ద్వారా పాలనకు, ప్రజలకు సౌలభ్యంతో పాటు పెట్టుబడులను ఆకర్షించవచ్చని జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. దిల్లీలో నిర్వహిస్తున్న 'జాతీయ అర్బన్ కాన్‌క్లేవ్-2025'లో ఆయన హాజరై ఆదివారం 'ల్యాండ్ టోకనైజేషన్ సిస్టమ్' అనే అంశంపై సదస్సులో ప్రసంగించారు. పట్టణాలను కూడా అంతర్జాతీయ వ్యాపారాలకు వేదికగా మార్చేందుకు అవసరమైన పాలన ఉండాలని చెప్పారు. ప్రజల్లో, పరిపాలన సంస్థల్లోనూ పారదర్శకత అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు అవకాశాలను కల్పించే ఒక స్థానిక పరిపాలన సంస్థగా పురపాలక సంఘాలు ఎదగాలని ఆకాంక్షించారు. అందుకు డిజిటలైజేషన్, ఆధునిక విధానాలు అవసరమవుతాయని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి తోఖన్ సాహూ ముఖ్యఅతిథిగా పాల్గొన్న సదస్సులో తన ఆలోచనలపై ఆయనతో రాఘవేంద్ర చర్చించారు. ✦ రాష్ట్రానికి గుర్తింపు: సదస్సులో ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న వినూత్న, పురోగమన విధానాలకు మంచి గుర్తింపు లభించడం సంతోషాన్ని కలిగించదని రాఘవేంద్ర పాత్రికేయులతో హర్షం వ్యక్తం చేశారు.

ప్రసంగిస్తున్న ఛైర్మన్ రాఘవేంద్ర

రాములును సత్కరించిన సంఘ నాయకులు

యాదవ కార్పొరేషన్ అభివృద్ధి చేయాలి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర యాదవ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేయాలని జాతీయ యాదవ హక్కుల సమితి అధ్యక్షుడు మేకల రాములు డిమాండ్ చేశారు. ఆదివారం నియోజకవర్గ యాదవ సామాజిక సమావేశంలో పాల్గొన్న ఆయన కూటమి ప్రభుత్వం యాదవ కార్పొరేషన్‌పై నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. తగినన్ని నిధులు కేటాయించి.. వర్గీయుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. సంఘటితంతో సమస్యలు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. పచ్చిపాల నాగేశ్వరరావు, మెట్టెల వీరాంజనేయులు, మార్తి వీరకృష్ణ, గొట్టెనాగరాజు, పేరం సైదేశ్వరరావు పాల్గొని రాములును సత్కరించారు.

విలువలతో కూడిన వైద్య సేవలే లక్ష్యం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: విలువలతో కూడిన వైద్య సేవలందించడమే లక్ష్యంగా జయప్రద ఫౌండేషన్ పని చేస్తుందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఫౌండేషన్ ఛైర్మన్ తొండపు దశరథ జనార్దన్ తెలిపారు. శనివారం మండలంలోని నవాబుపేటలో నిర్వహించిన వైద్య శిబిరంలో 214 మందికి ఆయన కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 1058 మందికి విజయవాడలో శంకర నేత్ర చికిత్సాలయంలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయించామన్నారు. 23 వేల మందికి వైద్య సేవలందించామని వీరిలో 13 వేల మందికి కంటి పరీక్షలు చేశారని చెప్పారు. వీరిలో 7329 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామని తెలిపారు. సాధారణ వైద్య పరీక్షలు 9949 మందికి చేయించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహరావు, నాయకులు చింత వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాస్, చెన్నారావు, ఎ.గోపాలరావు, డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

కాశీవిశ్వేశ్వరాలయంలో దీపోత్సవం

జగ్గయ్యపేట : పట్టణంలోని బ్రాహ్మణ బజార్‌లోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన దీపోత్సవం కనుల పండువగా సాగింది. మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తిక దీపాలను వెలిగించారు. అర్చకులు నరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ భక్తులు లింగాకృతిలో దీపారాధనలు చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో సందడి నెలకుంది.

దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఉదయభానుతో శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి పాలకవర్గం

నూతన పాలక వర్గానికి అభినందనలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: స్థానిక శ్రీకృష్ణదేవరాయ సేవా సమితికి నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని ఆదివారం జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను అభినందించారు. తన స్వగృహంలో కలిసిన పాలకవర్గ సభ్యుల నుంచి ఆత్మీయ సత్కారం అందుకున్న ఆయన సేవా సమితి కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. ప్రతినిధులు కామిశెట్టి అమర్‌నాథ్, గుంటక లక్ష్మీనారాయణ, యర్రపోతు వెంకటేశ్వరరావు, గొగిశెట్టి మహేష్, చిట్టిపోతుల సత్యనారాయణ, గుత్తి విజయభాస్కర్, వట్టెం మనోహర్ పాల్గొన్నారు.

పలువురికి కంటి వైద్య పరీక్షలు

నందిగామ, న్యూస్‌టుడే : స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దీనిలో రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వీరిలో 46 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్సలు చేయాలని వైద్యులు నిర్ణయించారు. వీరికి మంగళవారం పెదకాకానిలోని శంకర కంటి వైద్యశాలలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని చెప్పారు. నందిగామ నుంచి సోమవారం ప్రత్యేక బస్సులో వైద్యశాలకు తీసుకెళ్తామని సేవా సమితి కన్వీనర్ వాసుదేవరావు తెలిపారు. ప్రతి నెలా రెండో ఆదివారం శిబిరం నిర్వహిస్తామని చెప్పారు.
పెనుగంచిప్రోలు : జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు తొండెపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలులో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి రోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. 300 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశామని ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహరావు తెలిపారు. మిగిలిన వారికి కూడా అందజేస్తామని చెప్పారు. కంటి శుక్లాలు శస్త్రచికిత్సలు చేయాలని గుర్తించిన వారికి విజయవాడలోని శంకర నేత్ర వైద్యాలయంలో ఉచితంగా చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేగినేటి గోపాలకృష్ణమూర్తి, తెదేపా మండల అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య, కాకాని బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కళ్లు పరీక్షిస్తున్న వైద్యురాలు

సంప్రదాయంగా కార్తిక వన సమారాధన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మునేటి తీరాన పల్లగిరి శివారు మామిడితోటలో ఆదివారం మండల, పట్టణ విశ్వ బ్రాహ్మణుల కార్తిక వన సమారాధన సంప్రదాయంగా నిర్వహించారు. మహిళలు ఉసిరిచెట్ల వద్ద కార్తిక దీపాలు వెలిగించారు. చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తునికిపాటి శివను సత్కరించారు. తెదేపా నాయకులు ఏచూరి రాము, కత్రోజు శ్రీనివాసాచారి అతిథులుగా హాజరయ్యారు. సంఘ నాయకులు మునగంటి కామేశ్వరరావు, కనగాల మోహనరావు, కనపర్తి శరత్, అక్కిస్వామి, శివాజీ, గోపీనాథ్ పాల్గొన్నారు. కార్తిక వన సమారాధకులు పల్లగిరిపై దేవాలయాలను దర్శించుకున్నారు.

శివను సన్మానిస్తున్న సంఘ నాయకులు

పోలంపల్లిలో కుంకుమ గౌరివ్రతం..

వత్సవాయి : మండలంలోని పోలంపల్లిలో కార్తిక మాసం సందర్భంగా ఆదివారం గంగా, పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో యువతులు, మహిళలు కుంకుమ గౌరివ్రతం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

వ్రతంలో మహిళలు

గొడవలకు దిగితే కఠిన చర్యలు

నందిగామ, న్యూస్‌టుడే : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. స్థానిక సీఐ వైవీవీఎల్ నాయుడు ఆధ్వర్యంలో రౌడీషీటర్లు, కేడీ, సస్పెక్ట్ షీట్లు ఉన్నవారికి ఎస్సై సూర్యవంశీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై వివాదాలు, గొడవలకు దూరంగా ఉంటామని వారు ప్రమాణం చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా.. వివాదాలకు దిగినా.. వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

చోరీ జరిగిన ఇల్లు పరిశీలన

జయంతి (వీరులపాడు): ఎన్టీఆర్ జిల్లా రూరల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. లక్ష్మీనారాయణ సాధారణ పర్యటనలో భాగంగా వీరులపాడు పోలీస్ స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. స్టేషన్‌లోని పలు దస్త్రాలను పరిశీలించారు. అనంతరం 08న మండల పరిధిలోని జయంతిలో బంగారం చోరీ చేసిన ఇంట్లోని బీరువా పరిశీలించారు. సాంకేతికత ఉపయోగించి దొంగలను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై అభిమన్యు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీరువా పరిశీలిస్తున్న రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

గ్రామస్థాయిలో శిక్షణకు ట్రైనీ ఐఏఎస్‌లు

పెనుగంచిప్రోలు, చందర్లపాడు, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రామస్థాయిలో శిక్షణకు ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఆదివారం వచ్చారు. నందిగామ డివిజన్‌లో చందర్లపాడు మండలం ముప్పాళ్లకు ఆరుగురు, పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాలకు ఏడుగురు, ఇబ్రహీంపట్నానికి ఏడుగురిని కేటాయించారు. సోమవారం నుంచి బుధవారం వరకు కేటాయించిన గ్రామాల్లో గ్రామస్థాయిలో పాలన, ప్రభుత్వ పథకాలు, సమస్యల గురించి తెలుసుకుంటూ శిక్షణ పొందుతారు. ముచ్చింతాలకు కేటాయించిన ఏడుగురు ఆదివారం రాత్రి పెనుగంచిప్రోలులోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో కిశోర్‌కుమార్, ఆర్డీవో కె.బాలకృష్ణ, తహసీల్దారు శాంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి తిరుపతమ్మ ఆలయంలో శిక్షణ ఐఏఎస్‌లు

పట్టాదారు పాస్‌బుక్ పోయినది
మందూరి మహాలక్ష్మి, W/o వెంకటరత్నం, వీరులపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెం. 328/2A లో య॥ 1-79 సెంట్లు ఖాతా నెంబర్ 334కు సంబంధించి పట్టాదారు పాస్‌బుక్ కంచికచర్ల నుండి వీరులపాడు ఆటోలో వెళుతుండగా జారి పడిపోయినది. ఎవరికైనా దొరికినయెడల ఈ క్రింది ఫోన్ నెంబరుకు సంప్రదించగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.
Cont: 93816 18858

(c) eenadu

విజయవాడ పశ్చిమ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం

★ చిట్టినగర్ గొల్లపాలెం గట్టు ఆర్ఎంపీ పాఠశాల వద్ద మురుగు కాలువలో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు.

★ ఏకలవ్యనగర్ మూడో లైన్‌లో రోడ్డుపై చెత్త తరలించడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్తను తరలించారు. - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? ఊర్మిళానగర్ ఏడో లైన్‌లో చెత్త కుప్పలను సిబ్బంది తరలించడం లేదు. - సుజాత, సాంబశివరావు. ✔ పరిశీలించి చెత్త తరలిస్తాం. - వెంకటేశ్వరరావు, స్థానిక శానిటరీ అధికారి

? కేదేశ్వరపేట కూడలి నుంచి సీవరేజ్‌పై వంతెనకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. - రాజేష్, స్థానికుడు.

✔ పరిశీలించి వాటిని పూడ్చి వేస్తాం. - శ్రీనివాస్, సర్కిల్-1, ఈఈ - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

కాలనీల్లో కార్తీక వన సమారాధనలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: కాలనీల్లో కార్తీక వన సమారాధనలు నిర్వహిస్తున్నారు. కొన్ని కాలనీవాసులు నగర పరిసరాల్లో మామిడి తోటలకు వెళ్లారు. నాలుగో డివిజన్ సుబ్బారావు కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చెట్టుకు పూజలు చేసి.. సహపంక్తి భోజనాలు చేశారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారని కాలనీ కమిటీ అధ్యక్షుడు పి.రామచంద్రరావు, కార్యదర్శి ఆర్.సుబ్బారావు, కోశాధికారి ఎన్.శివకుమార్, వెలగపూడి సుబ్బారావు, జె.రాజారావు, చిట్టిబాబు తెలిపారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

కూల్చేశారు.. వదిలేశారు..

పట్టించుకోని అధికారులు

భవానీపురం, న్యూస్‌టుడే

దుకాణాలు నిర్మించాల్సిన ప్రాంతం

భవానీపురం పశ్చిమ తహసీల్దారు కార్యాలయం వెంట ఖాళీ స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మాణానికి నోచుకోవడం లేదు. గతంలో ఆ స్థలంలో రేకుల షెడ్లతో కూడిన దుకాణాలు ఉండేవి. అవి శిథిలావస్థకు చేరడంతో నగరపాలక సంస్థ అధికారులు.. నూతనంగా రెండు అంతస్తుల వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తామని ఉన్న దుకాణాలు కూల్చేశారు. వాణిజ్య సముదాయం నిర్మించేందుకు 30 జనవరి 2021న శంకుస్థాపన చేశారు. రూ.2.80 కోట్లతో నిర్మించేందుకు అంచనాలు తయారు చేశారు. శంకుస్థాపన చేసి ఐదేళ్లు దాటుతున్నా భవన నిర్మాణం మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. నేటికీ శిలాఫలకానికే పరిమితమైంది. ✦ భవానీపురం 40వ డివిజన్‌లోని పశ్చిమ తహసీల్దారు కార్యాలయం వెంట నగరపాలక సంస్థకు చెందిన వాణిజ్య సముదాయాన్ని నాలుగు దశాబ్దాల కిందటే నిర్మించారు. హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ కోసం రేకుల షెడ్లతో నిర్మాణం చేశారు. ప్రస్తుతం రేకుల షెడ్లలో కొన్ని దుకాణాలు శిథిలావస్థకు చేరాయి. ✦ జాతీయ రహదారి వెంట కనకదుర్గ పైవంతెన సమీపంలో ఉండడంతో ఆధునికీకరించి నూతన వాణిజ్య సముదాయం నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ✦ పాత దుకాణాలను కూల్చేసి పట్టించుకోవడం మానేశారు. ఏళ్లు గడుస్తున్నా నూతన వాణిజ్య సముదాయం నిర్మాణానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం కొందరు ఆక్రమణదారులు ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. విలువైన వాణిజ్య సముదాయం స్థలానికి రక్షణ కరవైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

✦ వాణిజ్య సముదాయం నిర్మాణం చేపడితే అద్దెల రూపంలో నగరపాలక సంస్థకు ఆదాయం సమకూరేందుకు అవకాశం ఉంటుందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వాణిజ్య సముదాయం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అనువుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరవాసులు తమ సమస్యలను వేదికలో అధికారుల దృష్టికి తెచ్చి సకాలంలో వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం, రహదార్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు, తాగునీరు, ఆక్రమణలు, మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

జిల్లా భౌగోళిక స్వరూపం తెలుసుకోండి

పాయకాపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల భౌగోళిక స్వరూపం, సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ జి.లక్ష్మీశ శిక్షణ అధికారులకు సూచించారు. ముస్సోరి నుంచి 20మంది శిక్షణ ఐఏఎస్ అధికారులు ఈ నెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం వారు నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మీశ, జేసీ ఎస్.ఇలక్కియాలు వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. క్షేత్ర పర్యటనలో ఏయే అంశాలు పరిశీలించాలో తెలియజేశారు. మండలాలు, గ్రామాల వివరాలు, సంప్రదాయాలు, పర్యాటక ప్రాంతాల గురించి వివరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, పోలీస్, విద్య, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులతో సమావేశమవ్వాలని సూచించారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధన, అమలవుతున్న అభివృద్ధి పథకాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. పాఠశాలలు, ఆసుపత్రుల సందర్శనతో పాటు స్వయం సహాయక సంఘాలు, హస్త కళాకారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల తదితరులతో మాట్లాడాలని పేర్కొన్నారు. సామాజిక ఆర్థిక పరిస్థితులు, సహజ వనరుల నిర్వహణ తదితరాలు తెలుసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో, పీడీ నాంచారరావు, డీపీవో పి.లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనం.. భక్తజన పరవశం ★ కిక్కిరిసిన క్యూలైన్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో భక్తులు ఇంద్రకీలాద్రి బాట పట్టారు. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల వాహనాలతో ఘాట్ రోడ్డు మార్గం, మల్లికార్జున మహామండప మెట్ల మార్గం నిండిపోయింది. జాతీయ రహదారిపై వాహనాలు హెడ్‌వాటర్ వర్క్స్ వరకు నిలిచిపోయాయి. అమ్మవారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. మధ్యాహ్నం అమ్మవారి నివేదన సందర్భంగా దర్శనాలు నిలిపి వేయడంతో భక్తులు క్యూలైన్లో ఉక్కపోతకు గురయ్యారు. దేవస్థానం ఈవో శీనానాయక్ సీసీ కెమెరాల్లో పరిశీలించి భక్తులకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్నం అంతరాలయ దర్శనం నిలిపి వేశారు. అన్ని క్యూలైన్లలో టికెట్ల విక్రయాలను నిలిపి వేసి భక్తులకు ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు.

సీసీ కెమెరాల్లో వీక్షిస్తూ సిబ్బందికి సూచనలిస్తున్న ఈవో శీనానాయక్

భక్తులకు తాగునీటి సీసాలు అందిస్తున్న దేవస్థానం సిబ్బంది

స్వదేశీ వస్తువులు వినియోగించాలి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు స్వదేశీ వస్తువులను వినియోగించుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ సూచించారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని స్వదేశీ వస్తువుల వినియోగంపై కరపత్రాల పంపిణీని భాజపా, ఆర్ఎస్ఎస్ నాయకులు ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వదేశీ ఆధారిత జీవన విధానంతో దేశ భద్రత ముడిపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలకమండలి సభ్యుడు ఎ.శ్రీనివాసరావు, సాంబశివరావు, హరిప్రసాద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంచుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ తదితరులు

శిరస్త్రాణమే ప్రాణాలకు రక్ష

ఇబ్రహీంపట్నం: శిరస్త్రాణం ధరిస్తే వ్యక్తికే కాదు కుటుంబానికి రక్ష అన్న సంగతి ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు గుర్తించాలని ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణరావు అన్నారు. ఇబ్రహీంపట్నం రింగుకూడలిలో ఆదివారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చిన్న నిర్లక్ష్యం కుటుంబాన్ని కుంగదీస్తున్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. ఇటువంటివి రోజులో ఎన్నో చూస్తున్నా.. ఆలోచనల్లో మార్పు రాకపోవడం విచారకరమన్నారు. వాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరూ నేను-నా కుటుంబం-సమాజం అనే ఆలోచన అనుక్షణం ఉండాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు.

నేత్రపర్వం.. ఆది దంపతుల దీపార్చన

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఆది దంపతులకు కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తులు నేత్రపర్వంగా ఆదివారం దీపార్చన చేశారు. గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను సహస్రదీపాలంకృత స్టాండ్‌లో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. మల్లేశ్వరాలయంలో స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రలింగార్చన కార్యక్రమాలను రుత్వికులు నిర్వహించారు.

సహస్ర దీపాలంకృత స్టాండ్‌లో ఉత్సవమూర్తులు

పాత శివాలయంలో..

విజయవాడ వన్‌టౌన్, విద్యాధరపురం న్యూస్‌టుడే: వన్‌టౌన్‌లోని భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన చేశారు. అర్చకులు మల్లేశ్వరస్వామికి మహాలింగార్చన నిర్వహించారు.

దుర్గాదేవిగా అలంకరణలో భ్రమరాంబ

జగన్మాత సేవలో గాయకుడు ఎస్.పి.చరణ్

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను గాయకుడు ఎస్.పి.చరణ్ ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

చరణ్‌కు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామికి ఆహ్వానం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాతను దర్శించుకునేందుకు రావాలని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామిని ఆదివారం దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాద శర్మ ఆహ్వానించారు. తాడేపల్లి సమీపంలోని ఇస్కాన్ దేవాలయానికి వచ్చిన స్వామిని దేవస్థానం అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో జగన్మాతను దర్శించుకుంటామని చెప్పినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. ఈసందర్భంగా భక్తులతోపాటు దేవస్థానం పాలకమండలి ఛైర్మన్, ఈవోలకు ఆయన అనుగ్రహ భాషణం చేశారు.

పీఠాధిపతి అనుగ్రహ భాషణం స్వీకరిస్తున్న దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ తదితరులు

సాయిబాబాకు పల్లకీ సేవ

భవానీపురం, న్యూస్‌టుడే: పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని జక్కంపూడిలో పల్లకీ సేవను ఆదివారం నిర్వహించారు. కోదండ రామాలయం నుంచి భక్తులు పల్లకి సేవ నిర్వహించారు. విజయవాడ సీతారాంపురంలోని శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పుట్టపర్తి నుంచి తీసుకొచ్చిన పాదుకలను వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. వృద్ధులు, వికలాంగులు 25 మందికి నూతన వస్త్రాలు అందజేశారు. గుప్తా, ఎల్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానంలో ఆహ్లాదం కరవు..

పెజ్జోనిపేట, న్యూస్‌టుడే

స్థానిక సీకే రెడ్డి రోడ్ ప్రధాన రహదారి వద్ద ఉన్న నగరపాలక సంస్థ బాబూ జగ్జీవన్ రామ్ ఉద్యానానికి గ్రహణం పట్టింది. రూ.లక్షలతో చేసిన అభివృద్ధి నిరుపయోగంగా మారింది. ఈ పార్కును ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసంగా మారింది.

◆ 35వ డివిజన్ పరిధిలోని ఈ పార్కు గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉండగా గత వైకాపా ప్రభుత్వంలో దాదాపు కోటి రూపాయిలు కేటాయించారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. మీసాల రాజారావు వంతెన నుంచి ఏలూరు లాకుల సెంటర్ వరకు పెద్ద వాకింగ్ ట్రాక్ నిర్మించి, చుట్టూ ఫెన్సింగ్, మొక్కలు కూడా వేశారు.

◆ అప్పట్లో పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చేవారు. ప్రస్తుతం పర్యవేక్షణ లోపించడంతో నిరుపయోగంగా మారింది. నగరపాలక సంస్థ కమిషనర్ స్పందించి ఈ పార్కును వినియోగంలోకి తేవాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

◆ సందర్శించే వారి సంఖ్య: సుమారు 200 మంది

◆ ప్రాంతాలు: పెజ్జోనిపేట, పూర్ణానందంపేట, హార్టుపేట, బాప్టిస్టుపాలెం, బొగ్గులైను రైల్వే కాలనీ.

◆ ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు

పార్కును వినియోగంలోకి తేవాలని అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ఈ పార్కు వాకింగ్‌కు ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. ఇప్పుడు వాకింగ్ చేసేందుకు చాలా దూరం వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలి.

- వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగి

పట్టణాభివృద్ధిలో ప్రణాళికా విభాగం కీలకం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగర, పట్టణాల అభివృద్ధిలో ప్రణాళికా విభాగం కీలకమని ఏపీ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. ప్లానింగ్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఆదివారం నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు క్షేత్రస్థాయి విధుల నిర్వహణలో ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. టౌన్ ప్లానింగ్‌కు క్షేత్రస్థాయి సిబ్బంది కొరత ఉందని, ఉమ్మడి ఏపీ నుంచి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు భర్తీ కాలేదని, ఫలితంగా వార్డు ప్లానింగ్ సెక్రటరీలు ఇన్‌ఛార్జి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోందని తెలిపారు. వార్డు ప్లానింగ్ సెక్రటరీల సర్వీసు రూల్స్‌ను సవరించాల్సి ఉందని, ఫలితంగా పూర్తిస్థాయి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పించి, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌బాబు, అసోసియేషన్ జోనల్ అధ్యక్షుడు వసీంబేగ్ మాట్లాడుతూ విజయవాడకు 25 ఏళ్ల క్రితం మాస్టర్ ప్లాన్ రూపొందించారని, ప్రస్తుతం మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, పక్కన ప్లానింగ్ అధికారులు

కార్మికుల ఆశయ సాధనకే సీఐటీయూ

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎం.డేవిడ్ యూనియన్‌కు ఎంతో సేవలు చేశారని, నేడు ఆయన మన వద్ద లేకపోవడం బాధాకరమని సీఐటీయూ నగర అధ్యక్షుడు జ్యోతిబసు అన్నారు. ఆదివారం మల్లికార్జునపేటలో డేవిడ్ రెండో వర్ధంతి నిర్వహించారు. జ్యోతిబసు మాట్లాడుతూ.. మున్సిపల్ రంగానికి ఎంతో కృషి చేశారని, విజయవాడలో యూనియన్ రంగానికి ఆయన ఎంతో త్యాగం చేశారని తెలిపారు.

జిల్లా స్థాయి ఓపెన్ చెస్ విజేత మల్లేశ్వరరావు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : ది విజయవాడ చెస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భవానీపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో జె.మల్లేశ్వరరావు విజేతగా నిలిచారు. మొత్తం 120 మంది తలపడగా.. ఆరు రౌండ్ల పాటు పోటీ నిర్వహించినట్లు సంఘ కార్యదర్శి ఎం.రాజీవ్ తెలిపారు. డి.బద్రీనారాయణ ద్వితీయ, వై.రాజేష్ తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరితో పాటు తొలి పది స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకంతో పాటు బహుమతులు అందజేశారు. పోటీలను ఆచార్య ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ జి.రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించగా.. ముగింపు కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎండీ అక్బర్ పాషా అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు.

విజేతలతో అతిథులు

సమాజ వికాసానికి కళలు దోహదం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కళలు సమాజ వికాసానికి దోహద పడాలని కళాకారుడు, న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు. తుమ్మపల్లి కళాక్షేత్రంలో జేఎన్ఎస్ ఫౌండేషన్, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో నిపుణులకు అవార్డులను అందజేశారు. ఈసందర్భంగా హజరత్తయ్య గుప్తాకు 'కళా రత్న' పురస్కారంతో నిర్వాహకులు సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహించి సత్కరించడం అభినందనీయమన్నారు. శేషసాయి, శ్రీనివాసరెడ్డి, గుణలక్ష్మి, సుమిత్ర, నాగేశ్వరరావులను నిర్వాహకులు ఎన్.ఝాన్సీ, బి.దాసు సత్కరించారు.



హజరత్తయ్యకు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

రైలు కింద పడి ప్రయాణికుడి ఆత్మహత్య

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విజయవాడ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని ప్రయాణికుడు ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సి.హెచ్.రాజా అరవింద నాథ్ తెలిపారు. రైలు నంబరు 22504 వివేక్ ఎక్స్‌ప్రెస్ ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపైకి వస్తుండగా ఆ వ్యక్తి ఎదురుగా వెళ్లి రైలు కింద తల పెట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటాయని ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు విజయవాడ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీస్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

సినిమాలు

◆ **ది గర్ల్ ఫ్రెండ్, జటాధర, డ్యూడ్:** జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ◆ **జటాధర:** అలంకార్. ◆ **ది గర్ల్ ఫ్రెండ్, జటాధర:** మిరాజ్. ◆ **ఆర్యన్:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు).

◆ **ప్రేమిస్తున్నా:** జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు).

◆ **కె-ర్యాంప్:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), రాజకుమారి, సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ◆ **మాస్ జాతర:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), రాజకుమారి, సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

'శ్వేతపత్రం విడుదల చేయాలి'

విజయవాడ వన్‌టౌన్: కూటమి ప్రభుత్వం రెండుసార్లు ప్రవేశపెట్టిన మైనార్టీల బడ్జెట్‌లో నిధులు కేటాయింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలని వైకాపా రాష్ట్ర కార్యదర్శి బాజీ బాబా డిమాండ్ చేశారు. ఆదివారం పంజా సెంటర్‌లోని ఆయన కార్యాలయంలో మాట్లాడారు. మైనార్టీలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

విద్యాధరపురం, న్యూస్‌టుడే: అప్రమత్తతోనే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని భవానీపురం ఎస్సై అనూష సూచించారు. విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలియని నంబర్ల నుంచి కాల్స్ వచ్చినప్పుడు ఓటీపీలు చెప్పడం, బ్యాంక్ వివరాలు ఇవ్వడం సైబర్ నేరాలు చేసే వారికి మార్గం సులువు అవుతుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారం పంచుకోవడం కూడా ఇలాంటి నేరస్థులకు అవకాశంగా మారిందని చెప్పారు. విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా ఛైల్డ్‌లైన్ నంబరు 1930లో సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.ఎల్ ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్సై అనూష

రెండు ద్విచక్ర వాహనాల దగ్ధం

చిట్టినగర్, న్యూస్‌టుడే: పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. కొత్తపేట బ్రాహ్మణవీధిలోని యాదవపురంవీధిలో నివాసం ఉండే పీతల వెంకట నాగేంద్ర వడ్డేశ్వరంలోని కేబుల్‌లో పని చేస్తారు. ఈనెల 7న రాత్రి ఇంటి ముందు రోడ్డు మీద ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి దాటిన అనంతరం ఇంటి బయట పొగలు వస్తుండడంతో వచ్చి చూడగా.. అప్పటికే ద్విచక్ర వాహనం మంటల్లో కాలిపోతుంది. ఆ వాహనం పక్కనే మరో బ్యాటరీ వాహనం కూడా కాలుతుండగా మంటలు ఆర్పారు. ఈ మేరకు వెంకట నాగేంద్ర ఆదివారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు గాయాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: చనుమోలు వెంకట్రావ్ పైవంతెన సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనంపై వస్తున్న కందుకూరి జోత్స్నరాణిని ఎదురుగా వస్తున్న మరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహన చోదకుడిపై టూటౌన్ పోలీసులు కేసును నమోదు చేశారు.

వృద్ధుడిపై నకిలీ పోలీసుల దాడి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: భవానీపురం లారీ స్టాండ్‌లో గర్రె సూర్యచంద్రరావు కూలీగా పనులు చేస్తుంటారు. విధులు ముగించుకొని సైకిల్‌పై అంబాపురం వెళ్తుండగా.. మార్గమధ్యలో గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులమని చెప్పి దాడి చేశారు. జేబులోని నగదు లాక్కొని పారిపోయారని సూర్యచంద్రరావు వాపోయిన వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధితుడు తెలిపారు.

9 మంది జూదరులపై కేసు నమోదు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాతరాజరాజేశ్వరిపేటలో జూదమాడుతున్న తొమ్మిది మందిపై టూటౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.18,870 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

అభివృద్ధికి నోచని సింహం కాటేజీ

పట్టించుకోని అధికారులు

భవానీపురం, న్యూస్‌టుడే

భవానీద్వీపంలోని సింహం ఆకారంలోని కాటేజీ పనులు ముందుకు సాగడం లేదు. ద్వీపానికి వచ్చే పర్యాటకులు, సందర్శకులను ఆకట్టుకునేలా గత తెదేపా ప్రభుత్వ హయాంలో సింహం ఆకారంలో కాటేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.20 లక్షలతో పనులను ప్రారంభించారు. వినూత్నంగా ఉండాలనే ఉద్దేశంతో భారీ ఎత్తులో రూపొందించారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం కాటేజీ పూర్తి చేసేందుకు శ్రద్ధ చూపలేదు. ఆకారం పూర్తయినప్పటికీ కాటేజీ మాదిరిగా తీర్చిదిద్దే పనులు మాత్రం పూర్తి చేయలేదు. కనీసం ఎక్కేందుకు మెట్లను కూడా ఏర్పాటు చేయలేదు. గుత్తేదారుకు కొంత మేర డబ్బులు ఇచ్చినా పనులను మాత్రం పూర్తి చేయడం లేదు. చెట్ల మధ్యలో ఉన్న సింహం ఆకారంలోని కాటేజీలో బస చేయడం కొత్త అనుభూతిని కలిగిస్తుంది. కాటేజీ పనులను పూర్తి చేస్తే ద్వీపానికి కొత్తరూపు వచ్చే అవకాశం ఉంటుంది. ద్వీపానికి వచ్చే సందర్శకులు ఈ సింహం ఆకార కాటేజీపై చర్యలు తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

మెట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కలేని పరిస్థితి

శిథిలావస్థలో..

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
సీతారామపురం-63036 11232, పాయకాపురం- 90631 44761

రహదారికి మరమ్మతు పనులు

పాయకాపురం, న్యూస్‌టుడే: కండ్రిక నుంచి పాతపాడు వెళ్లే రోడ్డు గుంతలమయంగా దర్శనమిస్తోందని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. సర్కిల్‌-2 ఏఈ మాధవ్‌ స్పందించారు. ఇంజినీరింగ్‌ అధికారులు.. గుంతలను పూడ్చారు. ఆదివారం ప్యాచర్‌ పనులు నిర్వహించారు. సిబ్బంది సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం, న్యూస్‌టుడే: వాంబేకాలనీ నుంచి రవీంద్ర భారతి పాఠశాలకు వెళ్లే దారిలో శ్మశానాల వద్ద చెత్త అధికంగా ఉంటోంది. దీనిపై స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. రోడ్డుపై చెత్త కుప్పలను తరలించారు.

★ కండ్రిక నుంచి డీ-మార్ట్‌ వెళ్లే దారిలో ఖాళీస్థలాల్లో రాత్రి వేళ కొందరు యువకులు కూర్చుని మద్యం తాగుతున్నారు. ఇబ్బందిగా ఉందని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు తెలియజేశారు. స్పందించిన నున్న పోలీసులు.. పలువురు యువకుల్ని పట్టుకుని కౌన్సెలింగ్‌ ఇచ్చారు.

? రాధానగర్‌ ప్రాంతంలో రంగుమారిన మంచినీరు సరఫరా అవుతోంది. - సూర్యకుమారి, స్థానికురాలు
✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. - మాధవ్‌, ఏఈ, సర్కిల్‌-2
? అజిత్‌సింగ్‌నగర్‌ అయ్యప్పస్వామి ఆలయం వీధిలో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదు. - భాస్కర్‌రావు, స్థానికుడు
✔ పారిశుద్ధ్య సిబ్బంది చెత్త సేకరించేలా చూస్తాం. - బాబూ శ్రీనివాసన్‌, ఏఎంవో హెచ్‌, సర్కిల్‌-2 - న్యూస్‌టుడే, పాయకాపురం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయవాడ నగరపాలక సంస్థ: నగర ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఆనవాయితీ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్‌ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్‌ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరవాసులు తమ సమస్యలను వేదికలో ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సకాలంలో వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం, రహదార్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు, తాగునీరు, ఆక్రమణలు, మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

శివపార్వతుల కల్యాణం

గాంధీనగర్‌, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం సందర్భంగా ధర్మరక్షిత సంస్థ ఆధ్వర్యంలో తాళ్లాయపాలెంలోని శైవక్షేత్రంలో సోమవారం (నేడు) వివిధ శివలింగాలకు రుద్రహోమం, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆధ్యాత్మికవేత్త వేములు హజరత్తయ్య గుప్తా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం కృష్ణానదికి పంచహారతులు, శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

తాగునీటి వెతలు.. తీరేదెన్నడో...

రైల్వే కాలనీవాసులకు తప్పని కష్టాలు

సత్యనారాయణపురం(గాంధీనగర్‌), న్యూస్‌టుడే: సత్యనారాయణపురం రైల్వే కాలనీలో తాగునీటి సమస్యలతో ఉద్యోగుల కుటుంబాలు సతమతమవుతున్నాయి. సామాజిక భవనం వద్ద ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్‌ ప్లాంట్‌ మూతపడింది. గతంలో ఇక్కడ పని చేసిన సీనియర్‌ డీపీవో ముత్యాల బాలమురళీధర్‌ హయాంలో.. రూ.లక్షల ఖర్చుతో ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. గత కొంతకాలంగా అది మూతపడటంతో రైల్వే ఉద్యోగులు.. ఎక్కువ ఖర్చు చేసి మినరల్‌ వాటర్‌ను కొనుగోలు చేస్తున్నారు. దీనిపై అనేక సార్లు సంబంధిత అధికారులకు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. ప్లాంట్‌ ద్వారా ప్రతి రోజూ వేల లీటర్ల శుద్ధి నీరు సరఫరా చేసే వారు. కాలనీ వాసుల తోపాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. లీటర్‌ కేవలం రూ.2కే సరఫరా చేసేవారు. బాలమురళీధర్‌ బదిలీ అయిన తర్వాత ఎవరూ పట్టించుకోలేదు.

సత్యనారాయణపురం రైల్వే కాలనీ

మొత్తం క్వార్టర్లు	సుమారు 500
కుటుంబాల సంఖ్య	సుమారు రెండు వేలు
మహిళా ఉద్యోగులు	సుమారు 100 మంది
నిత్యం ఆర్వో వాటర్‌ ప్లాంట్‌కి వచ్చే వారు	300 మంది

చివరికి మూత పడింది. దానిని పునఃప్రారంభిస్తే కష్టాలు తీరతాయని ప్రజలు పేర్కొంటున్నారు.

పనిచేయని మహిళల జిమ్‌

ఇదే ప్రాంగణంలో పురుషులతో పాటు మహిళల కోసం ప్రత్యేకంగా జిమ్‌ ఏర్పాటు చేశారు. అందులో లక్షల విలువ చేసే పరికరాలు ఉన్నాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చి ఇక్కడ సాధన చేసేవారు. సంబంధిత సిబ్బంది పర్యవేక్షణ లోపించడంతో అది కూడా మూతపడింది. పరికరాలన్నీ తుప్పుపట్టిపోయాయి. వినియోగంలో లేకపోవడంతో.. వేల రూపాయలు చెల్లించి బయటి జిమ్‌లకు వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూతపడిన ఆర్వో వాటర్‌ ప్లాంట్‌తో పాటు మహిళల జిమ్‌ను అందుబాటులోకి తేవాలని కాలనీ వాసులు, రైల్వే కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేం

గాంధీనగర్‌, న్యూస్‌టుడే: అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని, వారి ఆశయసాధనకు కృషి చేయాలని ఐప్సా నగర కార్యదర్శి ఎం.రామకృష్ణ అన్నారు. ఆదివారం ప్రెస్‌ క్లబ్‌లో నిర్వహించిన సభలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వేచ్ఛ, సమానత్వం, నూతన ప్రజాస్వామిక వ్యవస్థ కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరుల పోరాటాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.హరిప్రసాద్‌రెడ్డి, షేక్‌ మీరావలి, పెద్దిరాజు, రవీంద్ర, ఆసియా తదితరులు పాల్గొన్నారు.

అసమానతలకు వ్యతిరేకంగా పోరాటాలు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హింస, అసమానతలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని కేవీపీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్‌ అన్నారు. కేవీపీఎస్‌ ఆధ్వర్యంలో 15న సున్నపుబట్టీల కూడలిలోని పులే అంబేడ్కర్‌ భవన్‌లో నిర్వహించే 'మహిళలు- సామాజిక న్యాయం' సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను ఆదివారం మొగల్రాజపురంలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశంలో మహిళలపై ప్రతి ఐదు నిమిషాలకు ఒక అత్యాచారం జరుగుతోందని జాతీయ నేర రికార్డు బ్యూరో నివేదిక తెలియజేసిందని, ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ మహిళలపై ఇవి జరుగుతున్నాయని చెప్పారు. వీటికి వ్యతిరేకంగా మహిళలను సంఘటితం చేసేందుకు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించి, వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ, చింతల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం

సత్యనారాయణపురం(గాంధీనగర్‌), న్యూస్‌టుడే: శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నియమితులైన పెనుమత్స రామరాజును ఆదివారం ముత్యాలంపాడులోని గోకరాజు గంగరాజు కల్యాణ మండపంలో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం, గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ.. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరాజు, కార్యదర్శి పి.హరిబాబు, కోశాధికారి డీజేపీఎస్‌ రాజు, పీవీ సుబ్బరాజు, ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్కార కార్యక్రమంలో రఘురాజు, కమిటీ సభ్యులు

సేవలు ఆదర్శప్రాయం

అజిత్‌సింగ్‌నగర్‌, న్యూస్‌టుడే: అజిత్‌సింగ్‌నగర్‌లోని హోలీ క్రాస్‌ చర్చిలో మిషన్‌ సండే వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హాజరై మాట్లాడారు. హోలీ క్రాస్‌ చర్చి కేవలం ప్రార్థనా స్థలం మాత్రమే కాదని, సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉంటుందని కొనియాడారు. విద్య, నిరుపేదలకు ఆర్థిక సహాయం చేయడంలో ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. చర్చి నూతన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. చిన్నారులకు బైబిల్‌ ఫ్యాషన్‌ షో, ఆటల పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో వారు సందడి చేశారు. కార్యక్రమంలో నండేటి ప్రేమ్‌, సంఘం పెద్దలు జాన్‌ పీటర్‌, ఆంథోని, బుజ్జి, అమర్‌ నాథన్‌, రాజేష్‌ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమా

జిల్లా భౌగోళిక స్వరూపం తెలుసుకోండి

పాయకాపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల భౌగోళిక స్వరూపం, సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్‌ జి.లక్ష్మీశ శిక్షణ అధికారులకు సూచించారు. ముస్సోరి నుంచి 20మంది శిక్షణ ఐఏఎస్‌ అధికారులు ఈ నెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం వారు నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను లక్ష్మీశను కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మీశ, జేసీ ఎస్‌.ఇలక్కియాలు వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. క్షేత్ర పర్యటనల్లో ఏయే అంశాలు పరిశీలించాలో తెలియజేశారు. మండలాలు, గ్రామాల వివరాలు, సంప్రదాయాలు, పర్యాటక ప్రాంతాల గురించి వివరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్‌, మున్సిపల్‌, పోలీస్‌, విద్య, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులతో సమావేశమవ్వాలని సూచించారు. స్వర్ణాంధ్ర, వికసిత్‌ భారత్‌ లక్ష్యాల సాధన, అమలవుతున్న అభివృద్ధి పథకాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. పాఠశాలలు, ఆసుపత్రుల సందర్శనతో పాటు స్వయం సహాయక సంఘాలు, హస్త కళాకారులు, రైతులు, పారిశ్రామికవేత్తల తదితరులతో మాట్లాడాలని పేర్కొన్నారు. సామాజిక ఆర్థిక పరిస్థితులు, సహజ వనరుల నిర్వహణ తదితరాలు తెలుసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నారాయణ, డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ఐఏఎస్‌లకు సూచనలు ఇస్తున్న కలెక్టర్‌ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా

ఆలయం.. పరిశుభ్రం

పాయకాపురం, న్యూస్‌టుడే: స్థానిక పైపుల రోడ్డులోని ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ఆధ్వర్యంలో కార్తిక మాసం సందర్భంగా సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయాన్ని శుభ్రం చేశారు. ఆదివారం సాయంత్రం ఆలయాన్ని శుభ్రం చేసి.. కార్తిక దీపాలు వెలిగించారు. ప్రిన్సిపల్‌ ఎస్‌.జగదీశ్వరి, ఎన్‌ఎస్‌ఎస్‌ పీవో పి.హేమంత్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

దీపాలు వెలిగించిన విద్యార్థులు

వెంకట్రావుకు ఘన నివాళి

గవర్నర్‌పేట: కాపునాడు వ్యవస్థాపకుడిగా మిరియాల వెంకట్రావు కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్థులకు చేసిన సేవలు మరువలేనివని తెదేపా ఫ్లోర్‌లీడర్‌ నెల్లిబండ్ల బాలస్వామి పేర్కొన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని ఆనందవి రెసిడెన్సీ హోటల్‌లో రాయల్‌ సేన భారతీయుల ట్రస్టు, రాధా రంగా రాయల్‌ అసోసియేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక ఉద్యమ కుల బ్రహ్మ మిరియాల వెంకట్రావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలస్వామి మాట్లాడుతూ.. తెలగ, కాపు, బలిజ మహాసభతో కాపుల్లో చైతన్యం వెల్లివిరిసిందని చెప్పారు. ఆయన స్ఫూర్తితో ఆనేక మంది కాపునాయకులు రాజకీయ పార్టీల్లో చేరి, పేరు ప్రఖ్యాతులు సాధించారని తెలిపారు. ఆయనను నేటి తరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. బలిజ, కాపు తెలగ ఐంటి పేద్ద, గోళ్లల కృష్ణ బాబు ఆవిష్కరించారు. పోరుమామిళ్ల ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గాళ్ల సుబ్రహ్మణ్యం, చెల్లూరు శ్రీనివాసరావు, నవనీతం సాంబశివరావు, బుద్ధా శ్రీనివాసనాయుడు, బెజ్జెం ప్రసాద్‌, ఆకుల తిరుమలరావు, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న బాలస్వామి తదితరులు

బాబాకు పల్లకీ సేవ

భవానీపురం: పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను పురస్కరించుకుని జక్కంపూడిలో పల్లకీ సేవ ఆదివారం నిర్వహించారు. కోదండ రామాలయం నుంచి భక్తులు పల్లకీ సేవ నిర్వహించారు. విజయవాడ సీతారాంపురంలోని శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పుట్టపర్తి నుంచి తీసుకొచ్చిన పాదుకలను వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

ప్రయాణికులు ఇక్కడ.. బస్సు ఆగేది అక్కడ!

విజయవాడ బస్‌స్టాండ్‌ నుంచి నూజివీడు, ఆగిరిపల్లి, సత్తుపల్లి ఇలా సుమారు 50కి పైగా బస్సులు అజిత్‌ సింగ్‌నగర్‌ మీదుగా ప్రయాణిస్తుంటాయి. అయితే డాబా కొట్లు సెంటర్‌లోని బస్‌షెల్టర్‌ ముందు ఆపడం లేదు. దీని వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గంటకు ఒకసారి వచ్చే సర్వీసులు అందకపోవడంతో.. సమయం అంతా వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా పక్కనే తోపుడు బళ్లు ఉండడంతో.. బస్సులు కనిపించడం లేదు. అవి అడ్డుగా ఉండడం వల్ల.. కొత్తగా వచ్చిన డ్రైవర్లు ఆయితే ప్రయాణికులను గమనించకుండా వెళ్లి పోతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్‌

వాహనాలు రాకుండా.. నీరు చిందకుండా..

సూర్యారావుపేట నక్కలరోడ్డులో నిలిచిన నీరు.. స్థానికులకు చుక్కలు చూపిస్తోంది. ఈ రహదారి ఇరుకుగా ఉండటంతో కార్లు, ద్విచక్రవాహనాలు అంచు వరకు వస్తున్నాయి. ఇవి వేగంగా వెళుతుండటంతో.. నీరు చిందిమీద పడుతున్నాయి. దీంతో వ్యాపారులు.. ముఖ్యం పక్క వరకు వాహనాలు రాకుండా స్తూలు పెడుతున్నారు. రోడ్డు పల్లంగా ఉండడంతో వర్షం వచ్చిన ప్రతి సారి ఇదే పరిస్థితి నెలకొంటోందని వ్యాపారులు వాపోతున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సూర్యారావుపేట

నీటి మధ్యలో స్టూలు ఉంచారిలా..

వ్రతాలు ఆచరిస్తే సకల శుభాలు

సత్యనారాయణపురం(గాంధీనగర్‌), న్యూస్‌టుడే: కార్తిక మాసంలో వ్రతాలు ఆచరిస్తే సకల శుభాలు కలుగుతాయని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.వి.ఎస్‌.రాజు అన్నారు. ఆదివారం ముత్యాలంపాడులోని ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను భక్తులు సత్యనారాయణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎంతో విశేషమైన ఈ మాసంలో ఏటా కమిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి డి.శివరామరాజు, బడేటి ధర్మారావు, ఐవీఎస్‌ రాజు, జె.వి.సుబ్బరాజు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సామూహిక వ్రతం పాటిస్తున్న భక్తులు

అలరించిన సినీ గీతాలాపన

పాటలు పాడుతున్న జోషి, హేమమాలిని

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: సువర్ణమణి రిథమ్స్‌ సమర్పణలో ఆదివారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కాంప్లెక్స్‌లో కళాకారుల సినీ గీతాలాపన ఆద్యంతం అలరించింది. సంస్థ అధ్యక్షుడు, గాయకుడు మారేపల్లి జోషి నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. కారుమంచి రాజు పర్యవేక్షించారు. శ్యామ్‌ ఆనంద్‌ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. గాయకులు రసూల్‌ బాబు, హేమమాలిని, మల్లీశ్వరి తదితరులు హిందీ, తెలుగు పాటలు పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రధాన రమణ, పరుచూరి విజయలక్ష్మి, బి.వి.వీరభద్రరావు, డేవిడ్‌ రాజు, రావూరి మహేశ్వరరావు తదితరులు అతిథులుగా హాజరై ప్రసంగించారు. సినిమా పాటలు భాష, సంగీత విశిష్టతను తెలిపేవని చెప్పారు.

సమాజ వికాసానికి కళలు దోహదం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కళలు సమాజ వికాసానికి దోహదపడాలని కళాకారుడు, న్యాయవాది వేములు హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు. ఉమ్మలపల్లి కళాక్షేత్రంలో జేవీఎస్‌ ఫౌండేషన్‌, హల్వాపురం నైట్స్‌ ఫౌండేషన్‌ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో నిపుణులకు అవార్డులను అందజేశారు. ఈసందర్భంగా హజరత్తయ్య గుప్తాకు 'కళా రత్న' పురస్కారంతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. శేషసాయి, శ్రీనివాసరెడ్డి, గుణలక్ష్మి, సుమిత్ర, నాగేశ్వరరావులను నిర్వాహకులు ఎమ్‌. యూన్నిస్‌ బి.దాసు సత్కరించారు.

అభివృద్ధిలో ప్రణాళికా విభాగం కీలకం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర, పట్టణాల అభివృద్ధిలో ప్రణాళికా విభాగం కీలకమని ఏపీ మున్సిపల్‌ టౌన్‌ ప్లానింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. ప్లానింగ్‌ అసోసియేషన్‌ ఎగ్జిక్యూటివ్‌ కమిటీ సమావేశం ఆదివారం నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు క్షేత్రస్థాయి విధుల నిర్వహణలో ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. టౌన్‌ ప్లానింగ్‌ క్షేత్రస్థాయి సిబ్బంది కొరత ఉందని, ఉమ్మడి ఏపీ నుంచి బిల్డింగ్‌ ఇన్‌స్పెక్టర్ల పోస్టుల భర్తీ జరగలేదని, పదేళ్లుగా వార్డు ప్లానింగ్‌ సెక్రటరీలు ఇన్‌ఛార్జ్‌ బిల్డింగ్‌ ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోందని తెలిపారు. వార్డు ప్లానింగ్‌ సెక్రటరీల సర్వీసు రూల్స్‌ను సవరించాల్సి ఉందని, పదోన్నతుల ద్వారా బిల్డింగ్‌ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పించి, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అసోసియేషన్‌ కార్యదర్శి మోహన్‌బాబు, అసోసియేషన్‌ జోనల్‌ అధ్యక్షుడు పసింపకీర్‌ మాట్లాడుతూ విజయవాడకు 25 ఏళ్ల కిత్రం మాస్టర్‌ ప్లాన్‌ రూపొందించారని, ప్రస్తుతం మాస్టర్‌ ప్లాన్‌ రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అసోసియేషన్‌ నాయకులు, సభ్యులు బబ్బుల్‌ సత్తార్‌, నాయుడు, రమణమూర్తి, వెంకటేశ్వరరావు, జి.కృష్ణ, రతన్‌రాజు, సునీత, మహీన్‌ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, పక్కన ప్లానింగ్‌ అధికారులు

ఉచిత వైద్య శిబిరం

మధురానగర్‌, న్యూస్‌టుడే: సామాజిక సేవలో భాగంగా రామకృష్ణాపురంలో ఆదివారం ఉదయం చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వైద్య నిపుణులు డాక్టర్‌ రామకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈఎన్‌టీ వ్యాధులపై ఉచిత వినికిడి పరీక్షలు, నాసికా ఎండోస్కోపీ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 40 మంది రోగులను పరీక్షించి వారికి వైద్యసలహాలు, సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యసేవలు అందించాలన్న లక్ష్యంతో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై అవగాహన పెంచి, ముందస్తు నిర్ధారణ పరీక్షల ద్వారా రోగాలు తగ్గించటమే లక్ష్యమని చెప్పారు. ఆడియోలజిస్ట్‌ శ్రీకాంత్‌ 18 మందికి వినికిడి పరీక్షలు చేశారు.

పరీక్షిస్తున్న వైద్యుడు రామకృష్ణ

కాలనీల్లో కార్తిక వన సమారాధనలు

కరెన్సీనగర్‌, న్యూస్‌టుడే: కాలనీల్లో కార్తిక వన సమారాధనలు నిర్వహిస్తున్నారు. కొన్ని కాలనీవాసులు నగర పరిసరాల్లో మామిడి తోటలకు వెళ్లారు. నాలుగో డివిజన్‌ సుబ్బారావు కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చెట్లకు పూజలు చేసి.. సహపంక్తి భోజనాలు చేశారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారని కాలనీ కమిటీ అధ్యక్షుడు పి.రామచంద్రరావు, కార్యదర్శి ఆర్‌.సుబ్బారావు, కోశాధికారి ఎన్‌.రవికుమార్‌, వెలగపూడి సుబ్బారావు, జి.రాజారావు, బిట్టిబాబు తెలిపారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

ఉత్సాహంగా చిత్రకళా పోటీలు

రాఘవయ్యపార్క్‌ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే: నవంబరు 14 బాలల దినోత్సవం, ప్రజాశైలి ఉద్యమ నాయకుడు అనుమకొండ సురేష్‌ జయంతిని పురస్కరించుకుని పోరం ఫర్‌ ఆర్టిస్ట్స్‌ ఆధ్వర్యంలో ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం బాలబాలికలకు చిత్రకళా పోటీలు నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 450 మంది విద్యార్థులు మూడు విభాగాలుగా పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మ్యాజిక్‌ షో నిర్వహించారు. మెరుగైన చిత్రాలను గీసిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన చిత్రకారులు అరసవల్లి గిరిధర్‌, మల్లికేలు మాట్లాడుతూ.. బాలబాలికలు గీసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. వైద్యులు మన్నే సంజయ్‌దత్‌, 'హిందూకేష్‌'తో పాటు మధుసూదనరావు, సుంకర కిషోర్‌ బాబు, తమ్మ సురేష్‌, యు.వి.రామరాజు బహుమతులు అందజేశారు. పోరం ఫర్‌ ఆర్టిస్ట్స్‌ అధ్యక్షుడు అనుమకొండ సునీల్‌, సభ్యులు రమేష్‌, సంధ్య, స్వాతి పూర్ణిమ, రజియా, లోకేష్‌, ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

తాము గీసిన చిత్రాలు చూపుతున్న విద్యార్థులు

ప్రపంచ కప్‌ గెలుపు.. సమానత్వానికి మలుపు

రామవయ్య పార్క్‌ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే: మహిళా క్రికెట్‌ ప్రపంచకప్‌లో భారత జట్టు అద్భుతమైన విజయం స్ఫూర్తితో రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని వక్తలు పిలుపునిచ్చారు. డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవ భవన్‌లో ఆదివారం మహిళా క్రికెట్‌ ప్రపంచ కప్‌ విజేతలకు అభినందనలు-క్రీడాభివృద్ధిపై చర్చ అనే అంశంపై చర్చా వేదికను నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి జె.రామన్న మాట్లాడుతూ.. ప్రపంచ కప్‌ గెలుపు దేశ సామాజిక సమానత్వానికి మలుపు అన్నారు. జట్టులో ఉన్న ప్రతి క్రీడాకారిణికి ఒక్కో చరిత్ర ఉందని చెప్పారు. బాధలు, అవమానాలు ఎదుర్కొన్నారని చెప్పారు. వాటిని జయించి కోట్లాది భారతీయుల హృదయాలను గెలిచారని కొనియాడారు. సత్తా ఉన్నప్పటికీ ప్రోత్సాహం లేక ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. యువతను మత్తు, మాదకద్రవ్యాల నుంచి కాపాడాలంటే క్రీడలను ప్రోత్సహించాలన్నారు. క్రీడల వైపు మళ్లించాలని కోరారు. ప్రతి జిల్లాలో క్రీడా పాఠశాలలు, వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కోరారు. పీడీ పోస్టులు భర్తీ చేయాలని, మైదానాలు కల్పించాలని డిమాండ్‌ చేశారు. మాజీ కోచ్‌ ప్రసాద్‌, అధ్యాపకుడు ఎస్‌.లెనిన్‌ బాబు మాట్లాడుతూ.. యువతకు క్రీడల పట్ల అవగాహన కల్పించాలని, ప్రాథమిక స్థాయి నుంచే ప్రోత్సహించాలని సూచించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణ, శివ, పి.కృష్ణ, శ్రీను, శోభన్‌ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామన్న, పక్కన లెనిన్‌, ప్రసాద్‌ తదితరులు

ప్రకటన

నా క్లయింటు విజయవాడ, గాంధీనగర్‌, రజపుపేట, ప్లాటు నెం.ఈ/51, కార్తిక నివాసం కాపురస్తుడు వెంకటేశ్వరరావు గారి కుమారుడు కార్తిక్‌ కుమార్‌ గారి సంతాయన్లే పొంది యున్నారని తెలియజేయడమైనది... [illegible]

ప్ర. రామమోహనరావు, దామ లక్ష్మణ కుమార్‌, అడ్వకేట్స్‌, డోరు నెం.23-2-1, సత్యనారాయణపురం, విజయవాడ-11, సెల్‌: 9392114922

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్‌) కొరకు
Cell: 98496 97616

అదే లోడు.. అదే వేగం
యథేచ్ఛగా రాకపోకలు

రావికమతం మండలం మరుపాక మెటల్ క్వారీ నుంచి పరిమితికి మించిన లోడుతో బండరాళ్ల తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. పెద్ద బండరాళ్లను టిప్పర్లతో రాంబిల్లి మండలంలోని ప్రత్యామ్నాయ నావికా స్థావరానికి రవాణా చేస్తున్నారు. అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనతో గ్రామీణ రోడ్లు ధ్వంసమవుతూ నామరూపాల్లేకుండా పోతున్నాయి. ఈ రోడ్లపై 40 టన్నులకు మించిన బరువుతో వెళ్లకూడదు. 60 నుంచి 70 టన్నులకు పైగా బరువున్న బండ రాళ్లను తరలిస్తుండటంతో ఆర్‌అండ్‌బీ రోడ్డు ముక్కలవుతోంది. దాసరయ్యపాలెం వద్ద పెద్ద గొయ్యి పడి బండరాళ్ల లారీలు దిగబడుతున్నాయి. ఈ క్రమంలో రాళ్లు రోడ్డుపై పడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి క్వారీ లారీల దూకుడుకు కళ్లెం వేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రావికమతం

నేడు శూలాల ఉత్సవం

మునగపాక, న్యూస్‌టుడే: నాగులాపల్లి, మూలపేట గ్రామాల్లో సోమమూర్తి దేవుని శూలాల ఉత్సవం సోమవారం జరగనుంది. ఏటా కార్తిక మాసం మూడో సోమవారం ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వేడుకలో భాగంగా ఆలయంలో జరిగే ప్రత్యేక పూజలకు వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. సాయంత్రం శూలాలతో ఆలయ ప్రాంగణంలో నృత్యాలు చేస్తారు. నాగులాపల్లిలో 360 మంది భక్తులు మొక్కులు చెల్లిస్తారు. రామాలయం నుంచి గౌరీపరమేశ్వరుల ఆలయం వరకు ఊరేగింపు సాగనుంది. ఈ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

మారని తీరు.. తీరని ఇక్కట్లు

నిబంధనలు పాటించాలని వాహన చోదకులకు అమలు చేయాల్సిన ట్రాఫిక్ అధికారులు లేకపోవడంతో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో కనిపించే ట్రాఫిక్ సమస్య అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట వంటి పట్టణాల్లోనూ నిత్యకృత్యమవుతోంది. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న పేటలో ఉదయం నుంచి రాత్రి వరకు పలుమార్లు ట్రాఫిక్ స్తంభించి వాహనాలు నిలిచిపోతున్నాయి. పాండురంగస్వామి దేవస్థానం ఎదురుగా తాండవ వంతెనపై నడిరోడ్డుపై చేపల విక్రయాలు, అడ్డగోలుగా వాహనాలను నిలుపుతుండటంతో సమస్య జటిలమవుతోంది. రహదారికి ఇరువైపులా చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తుని, పాయకరావుపేట జంట పట్టణాల ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. హోం మంత్రి అనిత ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించే పేట నియోజకవర్గ కేంద్రంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆమే దృష్టిసారించాలేమో. – న్యూస్‌టుడే, పాయకరావుపేట

వీర గాథలు.. విద్యార్థుల్లో ధీరత్వం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: వీరగాథలు తెలుసుకొని, దాన్ని అందరికీ చాటి చెప్పే విధంగా విద్యార్థులకు అవకాశం వచ్చింది. వీరిలో దేశభక్తి తోడు సృజనను పెంపొందించేందుకు వీరగాథ ప్రాజెక్టు 5.0 పేరిట పోటీలు చేపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మూడో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే వారంతా దీనికి అర్హులు. ఇందులో అన్ని రకాల పోటీలు ఉండటం విశేషం.

★ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని గ్యాలంట్రీ అవార్డ్స్ పోర్టల్ 2021 నుంచి వీటిని నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో దేశాభిమానానికి తోడు సాహసం, వీరత్వం, నైతిక విలువలు, సృజనాత్మకత వృద్ధి చెందేలా ఇవి ఏర్పాటు చేశారు. కేంద్రరక్షణ, విద్యాశాఖలు సంయుక్తంగా పాఠశాల విద్యార్థులను మూడు కేటగిరీలుగా విభజించి నిర్వహించేలా మార్గదర్శకాలు రూపొందించాయి. గతంలో కేవలం స్వాతంత్య్ర సమరయోధుల గురించి మాత్రమే ఇవి చేపట్టేవారు. ఇప్పుడు కొత్తగా చరిత్రలో నిలిచిపోయిన రాజుల గురించి వక్తృత్వం, వ్యాసరచన ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తున్నారు.

చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

★ పోటీలో విజేతలకు ఆన్‌లైన్ విధానంలో వెంటనే ధ్రువపత్రాలు జారీ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. 3, 4, 5 తరగతుల వారికి చిత్రలేఖనం, 6, 7, 8 తరగతులకు వ్యాసరచన, 9, 10, ఇంటర్ విద్యార్థులకు వక్తృత్వం, ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని మొత్తం 1957 స్కూళ్లలో ఇప్పటికే 460 బడుల్లో పాఠశాల స్థాయి పోటీలు పూర్తిచేశామని జిల్లా నోడల్ అధికారి కోసూరు రాము తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ ఇవి ఏర్పాటు కానున్నాయి. మల్టీ మీడియా, వీడియోల రూపంలో ఇవి తెలియజేయాల్సి ఉంది.

★ విద్యార్థులు చిరునామాతో కూడిన తమ ప్రాజెక్టును https:////www.mygov.in/ampaigns/veer-gatha వైబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి జిల్లా ప్రాజెక్టుకు రూ.5 వేలు, రాష్ట్రస్థాయికి రూ.20 వేలు, జాతీయ ప్రాజెక్టుకు రూ.1.20 లక్షల నగదు బహుమతులను వచ్చే జనవరి నెల 26న, దిల్లీలో అందజేయనున్నారు. ఈ నెల 10వ, తేదీ వీటికి తుది గడువుగా నిర్ణయించినప్పటికీ సమయం పొడిగించవచ్చు. ఈ అవకాశాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలని సమగ్ర శిక్షా ఏఎంఓ కెజియా కోరారు.

సైకిల్‌పై బడికొస్తారా..
పది విద్యార్థులకు పంపిణీకి సన్నద్ధం

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే బాలబాలికలకు హోం మంత్రి అనిత తీపి కబురు అందించారు. వీరందరికీ ఉచితంగా సైకిళ్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. పేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 2500 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరిలో చాలా మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే. పదో తరగతి పూర్తయ్యాక ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అందరికీ సైకిళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. స్థానికంగా ఓ కంపెనీతో మాట్లాడి 2500 సైకిళ్లను సిద్ధం చేసే కాంట్రాక్టు అప్పగించారు. ఆ కంపెనీకి చెందిన గుత్తేదారు లూధియానా నుంచి విడి భాగాలు తీసుకువచ్చి నక్కపల్లిలోని బాలుర ఉన్నత పాఠశాలలో సైకిళ్లను బిగిస్తున్నారు. ఇప్పటికే 500 సైకిళ్లను సిద్ధం చేశారు. మిగిలిన వాటిని యుద్ధప్రాతిపదికన తయారు చేస్తున్నారు. బాలబాలికలకు వేర్వేరు మోడల్స్ సైకిళ్లు ఇవ్వనున్నారు. ఇవన్నీ పంపిణీకి సిద్ధమయ్యేందుకు రెండు వారాల సమయం పట్టే అవకాశముంది. పేట నియోజకవర్గ స్థాయిలో భారీ కార్యక్రమం ఏర్పాటు చేసి పంపిణీ చేయాలని మంత్రి యోచిస్తున్నారు. – న్యూస్‌టుడే నక్కపల్లి

బిగి అల్లిక.. వాలుజడ పోలిక..!

పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యానవనంలోని స్నేక్‌ప్లాంట్స్ ఇవి. మునగకాడల ఆకారంలో ఉంటాయి. వీటిని కుండీల్లో పెంచుతారు. మూడు మొక్కలను కలిపి ఇలా జడలా అల్లుతారు. అవి పదిహేను రోజుల్లో కలిసిపోయి ఆకర్షణీయంగా మారడంతోపాటు ఏపుగా పెరుగుతాయి. వీటిని ఎడారి మొక్కలు అని కూడా పిలుస్తారు. ఇవి కాండాల్లో నీటిని నిల్వ ఉంచుకొని బతుకుతాయి. రాత్రి వేళల్లో ప్రాణవాయువును వదులుతాయని ఉద్యానవనం వ్యవస్థాపకులు డాక్టర్ రామమూర్తి తెలిపారు. – ఈనాడు, విశాఖపట్నం

రామచిలుకల 'రాణి'వాసం..!

నగరంలో రణగొణధ్వనుల మధ్యలో ఉన్న ఓ ఇంటికి నిత్యం రామచిలుకలు గుంపులుగా రావడం ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తోంది. గోపాలపట్నం నాయుడు క్వార్టర్స్‌లో బెహరా ఉషారాణి ఇంటి అవసరాల కోసం బియ్యం నానబెట్టి డాబాపై ఆరబెట్టేవారు. వాటిని తినడానికి తరచూ రామచిలుకలు వస్తుండేవి. దీన్ని గమనించిన ఆమె రోజూ పెట్టడం మొదలుపెట్టారు. దీంతో తినడానికి వచ్చే రామచిలుకల సంఖ్య పెరిగింది. ఇప్పుడు రోజూ 100 వరకు చిలుకలు వస్తున్నాయి. వాటిని చూసి కొన్ని పావురాలూ రావడం ప్రారంభించాయి. క్రమంగా ఉషారాణికి వాటితో విడదీయరాని బంధం ఏర్పడింది. ప్రస్తుతం రోజుకు రెండున్నర కిలోల బియ్యం నానబెట్టి డాబాపై పెడుతున్నారు. ఆహారం తినడానికి వచ్చే రామచిలుకలు, పావురాల కిలకిలారావాలతో ఆ ఇల్లు నిత్యం సందడిగా ఉంటోంది. – న్యూస్‌టుడే, విశాఖపట్నం

బతుకును దిద్దే భగవద్గీత

అవధూత దత్త పీఠం, భగవద్గీత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో ఆదివారం సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వేలాది మంది భక్తులు ఇందులో పాల్గొని భగవద్గీతలోని శ్లోకాలను పఠించారు. మైసూరు దత్త పీఠం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. – న్యూస్‌టుడే, విశాఖపట్నం.

సీతమ్మ కొండకు చేరుకునేదెలా?

భక్త రామదాసు సీతమ్మ చింతాకు పతకం చేయించినట్లు.. ఆధ్యాత్మిక కేంద్రం సీతమ్మ కొండపైకి చేరుకునేందుకు భక్తులే రహదారి నిర్మాణానికి పూనుకోవాలేమో. గోపాలపట్నంలో చారిత్రక ఆనవాళ్లు, శివాలయం సహా ఎనిమిదికి పైగా ఆలయాలున్న ప్రాంతంగా సీతమ్మ కొండకు పేరుంది. ఇక్కడకు చేరుకునేందుకు మెట్ల దారి ఉంది. మెట్లు ఎక్కుతూ కొండపైకి చేరుకునేందుకు యువతీ యువకులే ఆపసోపాలు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు ఆయాసంతో మధ్యలోనే ఆగిపోతున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొండపైకి వాహనాలు వెళ్లేందుకు వీలుగా కొంత చదును చేశారు. కొండ ప్రాంతం, పూర్తిగా గ్రావెల్ కావడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు వెళ్లేందుకు వీలు పడటం లేదు. మొండిగా ముందుకు వెళ్తే ఒక్కోసారి ప్రమాదాల బారిన పడే ఆస్కారముంది. పర్వదినాలు, సోమవారాల్లో వేలాదిగా భక్తులు ఇక్కడకు వస్తుంటారు. ప్రజాప్రతినిధులు దృష్టిసారించి తారు రోడ్డు నిర్మాణానికి కృషి చేయాల్సిన అవసరముంది. – న్యూస్‌టుడే, పాయకరావుపేట

శత శాతం.. ముందస్తు సన్నద్ధం
'పది'ంతల ఫలితాలకు పక్కా ప్రణాళిక

నర్సీపట్నం, న్యూస్‌టుడే

పదో తరగతి విద్యార్థులందరూ శత శాతం ఉత్తీర్ణత సాధించేలా జిల్లాలో ప్రత్యేక కార్యాచరణ అమలవుతోంది. ఏటా వంద రోజుల ప్రణాళిక చేపడుతుండగా.. ఈ ఏడాది ముందస్తుగా సన్నద్ధం చేస్తున్నారు. వంద రోజుల ప్రణాళిక డిసెంబరు మొదటి వారం నుంచి ప్రారంభమవుతుంది. జిల్లాలో నెల రోజుల కిందటే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 20 వేల మంది ఈ ఏడాది పరీక్షలకు హాజరు కానున్నారు. రోజూ పని వేళలకు అదనంగా ఒక గంట కేటాయిస్తున్నారు.

★ విద్యా శాఖాధికారులతో కలెక్టర్ తరచూ సమావేశమవుతూ ప్రగతిపై సమీక్షిస్తున్నారు. జిల్లా పర్యటనకు వెళ్లిన సమయంలో పాఠశాలలను సందర్శిస్తూ ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్నారు. ఉపాధ్యాయులు పాత ప్రశ్నపత్రాలు, మోడల్ పేపర్లతో గ్రాండ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాటిలో వచ్చే మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రేడ్లుగా విభజిస్తున్నారు. ★ చదువులో బాగా వెనుక బడిన వారికి 'డి' గ్రేడు కేటాయిస్తూ వారిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారు. వీరికి నెల రోజుల పాటు చదవడం, రాయడంపై పట్టు సాధించేలా తర్ఫీదు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. రెండు, నాలుగు మార్కుల ప్రశ్నలకు, బిట్లకు సమాధానాలు రాసేలా సానపడుతున్నారు.

వసతిగృహంలో ప్రత్యేక తరగతులు

వసతిగృహ విద్యార్థులపై..

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. ఇప్పటికే సిలబస్ పూర్తి చేసే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. కొన్నిచోట్ల పూర్తి చేసి పునశ్చరణ ప్రారంభించారు. చదువుతో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పాఠశాలల్లోనే కాకుండా వసతి గృహాల్లోనూ ట్యూటర్లను ఏర్పాటు చేసి తరగతులు నిర్వహిస్తున్నారు.

★ జిల్లాలో బీసీ సంక్షేమ వసతిగృహాలు 36 ఉన్నాయి. వీటిలో ఉంటూ ఈ ఏడాది 757 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. గతేడాది 90.01 శాతం ఉత్తీర్ణత నమోదుకాగా.. ఈ ఏడాది నూరు శాతం లక్ష్యంపై గురిపెట్టారు.

★ చదువులో వెనకబడిన వారికి గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. కొన్నిచోట్ల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వసతిగృహాలకు వచ్చి తరగతులు చెబుతున్నారు. వార్డెన్లు పర్యవేక్షణతోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి అభ్యసన సామగ్రి తెప్పించి విద్యార్థులకు ఇస్తున్నాం.
– శ్రీదేవి, బీసీ సంక్షేమ శాఖాధికారిణి

★ గణితం, సైన్సు, ఇంగ్లిష్ ట్యూషన్లు చెప్పేందుకు ఒక్కో సబ్జెక్టుకు ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ మొత్తం తక్కువగా ఉండటంతో ఎవరూ ముందుకు రావడం లేదు. 36 వసతిగృహాల్లో ప్రస్తుతం 34 మందే ట్యూటర్లు ఉన్నారు. ఈ సమస్యను అధిగమించేలా సచివాలయం సంక్షేమ సహాయకులతో వసతి గృహ విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. సచివాలయాల పరిధిలోని వసతిగృహాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో గంటపాటు సచివాలయ సంక్షేమ సహాయకులు బోధన చేసేలా చర్యలు చేపడుతున్నారు.

మే.. మే.. బొప్పాయి

మటన్ షాపులో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మేక తల అనుకుంటే పొరపాటే. అనకాపల్లికి చెందిన జయవరపు శ్రీనివాసరావు ఇంటి పెరట్లో బొప్పాయి చెట్టుకు కాసిన కాయ మేక తలను పోలి ఉంది. జన్యుపరమైన కారణాలతో బొప్పాయి కాయలు పలు ఆకారాల్లో ఉంటాయని ఉద్యాన శాఖ అధికారి శరగడం పైడిరాజు చెప్పారు. – న్యూస్‌టుడే, నెహ్రూచౌక్ (అనకాపల్లి)

19 నుంచి పుట్టపర్తికి ప్రత్యేక సర్వీసులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి బాబా జయంత్యుత్సవాల సందర్భంగా అనంతపురం జిల్లా పుట్టపర్తికి ఈ నెల 19 నుంచి 23 వరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆర్.ఎం. అప్పలనాయుడు తెలిపారు. ద్వారకా బస్‌స్టేషన్ వద్ద ఆదివారం జెండా ఊపి పంచారామాలకు సూపర్‌లగ్జరీ, ఇంద్ర ఏసీ సర్వీసులను పంపించారు. శబరిమల యాత్రకు సైతం ఆర్టీసీ సర్వీసులు నడపడానికి సిద్ధంగా ఉన్నామని, ఆన్‌లైన్‌లో అయ్యప్ప భక్తులు టికెట్లు తీసుకోవచ్చన్నారు. బృందంగా వచ్చి ఆర్టీసీ అధికారులను సంప్రదిస్తే ప్రత్యేకంగా బస్సు కేటాయిస్తామని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న పదో అదనపు జిల్లా న్యాయమూర్తి నరేష్

విద్యతోనే ఉజ్వల భవిత

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఉజ్వల భవిష్యత్తు విద్యతోనే సాధ్యమవుతుందని పదో అదనపు జిల్లా జడ్జి నరేష్ చెప్పారు. పట్టణంలోని బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో ఆదివారం న్యాయ సేవ అవగాహన సదస్సు నిర్వహించారు. అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. హక్కులతోపాటు బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా న్యాయ సలహాలు, సేవలు ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.ధర్మారావు, వసతిగృహ వార్డెన్ సబిత పాల్గొన్నారు.

ఈత పోటీల్లో బాలికల విజేత విశాఖ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఈత పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. వివిధ జిల్లాల నుంచి 650 మంది హాజరుకాగా బాలబాలికలకు అండర్-14, అండర్-19 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విశాఖ జిల్లా బాలికల బృందం, నెల్లూరు జిల్లా బాలుర జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచాయి.

చిన్నా.. కన్ను జాగ్రత్త

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

పాఠశాల స్థాయిలోనే చిన్నారుల కంటి చూపు మసకబారుతోంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, విటమిన్ల లోపం, సెల్‌ఫోన్ తెరకు అతుక్కుపోవడం తదితర కారణాలతో బాల్యంలోనే కంటి సంబంధ సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. దృష్టి లోపాన్ని ముందే గుర్తించి చికిత్స అందించాలన్న ఉద్దేశంతో రెండేళ్ల నుంచి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో ఆరు నుంచి 16 ఏళ్ల లోపు చిన్నారులకు నేత్ర పరీక్షలు చేస్తున్నారు.

★ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 36 వేల మందికిపైగా విద్యార్థులకు ఈ ఏడాది ఆగస్టు నుంచి కంటి పరీక్షలు చేశారు. దృష్టిలోప సమస్యలపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీరిలో 3,200 మందికి అద్దాలు అవసరం అవుతాయని నిర్ధారించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

★ చిన్నారుల ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించకపోవడంతో నేత్ర సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. పోషకాహార లోపంతో ఈ సమస్య మరింత పెరుగుతోంది. బోర్డును చూసి చదివే సమయంలో వారి దృష్టి లోపాన్ని ఉపాధ్యాయులు ముందుగా గుర్తించొచ్చు. తద్వారా చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

★ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. పెద్ద తెరలపై ఎక్కువగా చూడటం వల్ల కంటి సమస్యలు పెరుగుతున్నాయి. దీనికి తగ్గట్లు జాగ్రత్తలు తీసుకుంటే చిన్నారుల్లో కంటి సంబంధ సమస్యలను తగ్గించవచ్చు.

3200 మంది గుర్తింపు



కంటి సమస్యతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించాం. 3,200 మందికి ఉచితంగా కళ్లద్దాలు ఇస్తాం. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలున్నాయి. పిల్లలకు పోషక విలువలు, విటమిన్లు ఉన్న ఆహారం అందించాలి.
– డాక్టర్ డేవిడ్ వసంత్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్, అంధత్వ నివారణ సంస్థ

టార్చిలైట్ వెలుగులో రహదారి పనులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు పనుల పర్యవేక్షణ గాలికొదిలేశారు. నాణ్యతను పట్టించుకునే నాథుడే లేరు. రాత్రి సమయంలో టార్చిలైట్ వెలుగులో పనులు చేస్తున్నారంటే అధికారుల నిర్లక్ష్యం ఎంతుందో అర్థమవుతుంది. సుమారు రూ.300 కోట్ల విలువైన పనులు చీకట్లో నిర్వహించడం విమర్శలకు దారితీస్తోంది. పరిశ్రమల వ్యర్థాలతో రోడ్డు వేస్తున్నా, చీకట్లో పనులు చేస్తున్నా ప్రశ్నించే వారే లేకపోవడం గమనార్హం.

నిర్మాణ పనులకు టార్చిలైట్ చూపుతున్న కార్మికుడు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

అక్రమ క్వారీల ఇష్టారాజ్యం

జెడ్.చింతువ కొండ ప్రాంతంలో తవ్వకాలు

రాంబిల్లి, న్యూస్‌టుడే: కొండలను పట్టపగలే దర్జాగా తవ్వేస్తున్నా అధికారులు అటు చూడడం లేదు. లాలంకోడూరు, జెడ్.చింతువ గ్రామాల్లో కాడిమెట్ల కొండల్లో అక్రమ క్వారీలు సాగుతున్నాయి. రోజూ ట్రాక్టర్లపై రాయి, కంకర తవ్వి తరలిస్తున్నారు. జెడ్.చింతువలో సర్వేనంబరు-115లో ఉన్న కొండ ప్రాంతంలో నిత్యం తవ్వకాలు సాగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. పూడిమడక-కొత్తపట్నం ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఈ కొండపై కొన్ని రోజులుగా రాయి, కంకర తవ్వకాలు జరుగుతున్నాయి. రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చినా స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై తహసీల్దారు శ్రీనివాసరావును వివరణ కోరగా మండలంలో ఎక్కడా క్వారీలకు అనుమతులు లేవన్నారు. అక్రమ క్వారీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

OFFICE OF THE DISTRICT BLINDNESS CONTROL SOCIETY
ANAKAPALLI DISTRICT
RC No: 9/DBCS/Anakapalli/2025-26
Dated:10-11-2025.

SHORT TENDER NOTIFICATION

The sealed tenders are invited from the standard agencies/manufactures and registered suppliers for supply of SPECTACLES with following specifications to District Programme Manager, District Blindness Control Society, ANAKAPALLI District for supply to **SCHOOL CHILDREN EYE SCREENING PROGRAMME.**

Spectacles Quality Specifications:

1.Frame: TR-90/Polycarbonate full frame (Boys and Girls with different colours) with spring **2. Lenses:**CR- 39 (Plastic Lenses) **3. Frame Size(s):** 32/34/36/38 /40/42/44/46. **4.** good quality cleaning cloth for cleaning the lens **5.** Hard case fixed with sticker on front side of the frame box along with logo, **జాతీయ అంధత్వ మరియు దృష్టిలోప కార్యక్రమం** with following details

District Name Name of the school, Village/Town, Name of the student, Student ID, Class and Power of the Lens RE...LE..

The tender application forms will be issued from 10-11-2025 to 20-11-2025 up to 2.00 PM at the office of the DPM, DBCS Office, District Hospital, Anakapalli and available to download in **anakapalli. ap.gov.in** website. Last date to submit filled application is on 20.11.2025 by 4.00 PM. Cost of tender Application is Rs. 1000 (One Thousand Only) each. EMD Amount will be Rs.18000/- (Eighteen Thousand Only) per bidder to be paid through Demand Draft in any Union bank in favour of District Programme Manager, District Blindness Control Society (DBCS), Anakapalli while submitting tender. No correspondence will be entertained in this regard. The District Procurement Committee decision is final in deciding the Spectacles as per standards.

Date of opening of sealed tenders on 21-11-2025 3 PM O/o Joint Collector, Anakapalli Dist.

DPM, DBCS, ANAKAPALLI DISTRICT

నూకాలమ్మకు రైల్వే జీఎం పూజలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి నూకాలమ్మను ఆదివారం సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సందీప్ ఠాగూర్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ ఆంకుష్ గుప్తా దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి దేవస్థానం ఛైర్మన్ పీలా నాగశ్రీను అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ సుధారాణి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

నూకాలమ్మను దర్శించుకుంటున్న రైల్వే ఉన్నతాధికారులు

మెండుగా అవకాశాలు.. నైపుణ్యాలే అస్త్రాలు..!

పెట్టుబడులకు గమ్యస్థానంగా విశాఖ | **యువతను సన్నద్ధం చేస్తున్న ప్రభుత్వం**

ఈనాడు, విశాఖపట్నం

జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే అనేక ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో లక్షలాది మంది ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రైవేటులోనూ వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. భవిష్యత్తులో అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. వీటిని యువత అందిపుచ్చుకునేలా ప్రభుత్వం సన్నద్ధం చేస్తోంది. ఆయా రంగాల్లో ఉద్యోగాలకు తగ్గట్టుగా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా పలు కోర్సులు అందిస్తోంది.

పర్యాటకం, ఆతిథ్య రంగం..: గమ్య నగరంగా పేరుగాంచిన విశాఖ పర్యటకులను ఆకర్షిస్తోంది. ప్రముఖ సంస్థలు నిర్మించనున్న స్టార్ హోటళ్లు, రీఫ్రెష్‌మెంట్, కన్వెన్షన్ సెంటర్లు, రిసార్టుల్లో అవకాశాలున్నాయి. పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయి. అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ ఏర్పాటుతో క్రూయిజ్ నౌకలు నగరానికి వస్తున్నాయి.

గ్రీన్ హైడ్రోజన్ ఆధారంగా..: పూడిమడక వద్ద ఎన్టీపీసీ, జెన్‌కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ పార్కును ఏర్పాటు చేయనున్నాయి. రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకు గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వాటికి అనుబంధంగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

ఐటీ, డేటా సెంటర్లు..: ఐటీ రంగంలో ప్రస్తుతం 10కి పైగా సంస్థలున్నాయి. వాటిలో 15 వేల మందికి పైగా పనిచేస్తున్నారు. ఐటీ హిల్స్‌పై వివిధ సంస్థలు ఏర్పాటు కానున్నాయి.
● టీసీఎస్, కాగ్నిజెంట్, సత్త్వ తదితర సంస్థల్లో 50 వేలకు పైగా ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి.

ఫార్మా, మెడ్‌టెక్..: ఉమ్మడి జిల్లాలో పరవాడ, అచ్యుతాపురంలోని ఫార్మా సిటీల్లో 150కు పైగా సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఆయా సంస్థల్లో ఖాళీలున్నా.. బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన అభ్యర్థులు దొరకడం కష్టంగా మారింది. మెడ్‌టెక్ జోన్‌లో 150కు పైగా సంస్థలు వివిధ రకాల ఉత్పత్తులు తయారుచేస్తున్నాయి. భవిష్యత్తులో ఆయా చోట్ల ఉపాధికి అవకాశాలు ఉన్నాయి.

ఆటోమొబైల్, సేవా రంగం..: వేగంగా విస్తరిస్తున్న నగరంలో ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ టెక్నీషియన్లు, తదితరుల కొరత ఎక్కువగా ఉంది. స్థానికంగా ఆటోమొబైల్ ఉత్పత్తి లేకపోయినా.. ద్విచక్ర వాహనాలు, కార్ల సర్వీసు టెక్నీషియన్లకు మంచి డిమాండ్ ఉంది. వీటిని అందిపుచ్చుకోవచ్చు.

★ ఏపీఎస్ఎస్‌డీసీ నిర్వహిస్తున్న కోర్సులకు సంబంధించి మరిన్ని వివరాలు కావాలంటే **naipunyam.ap.gov.in** వెబ్‌సైట్‌ను సంప్రదించొచ్చు. ఇందులో పేరు నమోదు చేసుకుంటే కొత్త కోర్సులు, జాబ్ మేళాల సమాచారం తెలుసుకోవచ్చు.

వివిధ కోర్సులకు ప్రతిపాదనలు: విశాఖలో భవిష్యత్తు ఉపాధి అవసరాలకు తగ్గట్టుగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ద్వారా యువతకు నైపుణ్యాలు నేర్పిస్తున్నాం. ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతిపాదన మేరకు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ కోర్సులు కేటాయిస్తోంది. పీఎం కేవైలో భాగంగా ఐటీ, ఫార్మా, సర్వీసు టెక్నీషియన్స్ కోర్సులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించాం.
– చాముండేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

వైభవంగా బండిమాంబ జాతర

అమ్మవారి ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు

ఎలమంచిలి: ఏటికొప్పాక బండిమాంబ అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వద్ద భక్తులతో రద్దీ పెరిగింది. పరిసర గ్రామాల నుంచి వచ్చిన వారితో ప్రధాన రోడ్లన్నీ రద్దీగా మారాయి. రాత్రి రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ స్తంభించి పోయింది. జాతర సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్తు అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. వరాహనది ఒడ్డున భారీగా బాణసంచా కాల్చారు. దీన్ని చూడటానికి యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో వీరికి ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలు చాలలేదు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపివేశారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ చింతలపాటి దేవీప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా ఏర్పాట్లు చేశారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, కాండ్రకోట చిరంజీవి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు ఉన్నతస్థాయిలో బోధన

రమణాజీని సత్కరిస్తున్న డిగ్రీ కళాశాలల యాజమాన్య సభ్యులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జెర్రిపోతుల రమణాజీ అన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను అనకాపల్లిలోని సంయుక్త కళాశాలలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాలల ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్యాబోధన అందిస్తున్నామన్నారు. యాజమాన్య సభ్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపుతామన్నారు. సభ్యులు పైడాకృష్ణప్రసాద్, దాడి రత్నాకర్, దొడ్డి గోవిందరావు, రామారావు పాల్గొన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్
...విశ్వాసానికి మరో పేరు !
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)

అస్సెట్ రికవరీ మోనిటరింగ్ బ్రాంచ్
డి.నెం. 9-13-45/2/9/1, 5వ అంతస్తు, ఎమ్‌వీఆర్ వినాయగర్ ట్రేడ్ సెంటర్, విఐపి రోడ్డు, విశాఖపట్నం - 530003.
మొబైల్ : 98312 00669, 96409 33383

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూలు 9(1)తో చదువుకోవలసిన రూలు 8(6) ప్రకారం సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

[illegible]

ఇ-వేలం తేది మరియు సమయం : 26-11-2025 ఉ 11.00 గం|ల నుండి సా 4.00 గం|ల వరకు

బిడ్ పెంపుదల మొత్తం : 50,000/-

ఋణగ్రహీత పేరు/హామీదారుల పేరు మరియు మొత్తం బకాయిలు: మెస్సర్స్ కమల్ కాఫీ వర్క్స్ (అకౌంట్ నెం.046200IN00000018 & 046200IL00000144) [illegible]

సెక్యూరిటీ / ఆస్తుల వివరాలు మరియు ఆస్తుల యజమాని / తనఖా పెట్టిన వ్యక్తి పేరు	రిజర్వు ధర	ధరావతు (ఇఎమ్‌డి)
(ఎ) [illegible]	రూ. 191.52 లక్షలు	రూ. 19.15 లక్షలు
(బి) [illegible]	రూ. 123.48 లక్షలు	రూ. 12.35 లక్షలు

నియమ నిబంధనలు: [illegible] ...తేది.26.11.2025న ఉదయం 11.00 గం|ల నుండి సా|| 4.00 గం|ల వరకు... https://BAANKNET.COM & www.pnbindia.in వెబ్‌సైటులు చూడవలెను.

SARFAESI చట్టం 2002 లోని రూలు 8(6) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

తేది : 10-11-2025, ప్రదేశం : విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

స్థానికులతో మాట్లాడుతున్న దొరస్వామి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని బ్రాండిక్స్ భారతీయ బాగస్వామి దొరస్వామి సూచించారు. బ్రాండిక్స్ ఆవరణలో ఆదివారం 144వ ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 600 మంది హాజరుకాగా 400 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి మందులు, అద్దాలను జారీ చేశారు. శిబిరంలో 45 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. 330 మందికి కళ్లద్దాలు, 146 మందికి మందులు అందజేశారు. శిబిరానికి వచ్చిన వారికి మజ్జిగ, తాగునీరు, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు.

భువనేశ్వరీదేవికి క్షీరాభిషేకం

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును సన్మానిస్తున్న శాప్ డైరెక్టర్ పీవీజీఎన్ రాజు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం ఆరిపాక శివారు మణిపురంలో ఆదివాస మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భువనేశ్వరీ దేవి అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. తన స్వహస్తాలతో అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ పీవీజీఎన్ రాజు ఎమ్మెల్యేను శాలువతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సబ్బవరం తెదేపా కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పాపికొండలు చుట్టొచ్చారు!

పాపికొండల విహారయాత్రకు వచ్చే పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గండిపోశమ్మ ఆలయం నుంచి ఆదివారం ఐదు బోట్లలో 345 మంది పర్యాటకులు గోదావరిలో విహరిస్తూ పాపికొండలను చుట్టొచ్చారు. తొలుత పోశమ్మగండి చేరుకున్న పర్యాటకులు కొండపై నుంచి గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారికి బోటు సిబ్బంది లైఫ్ జాకెట్లు అందించి అవగాహన కల్పించారు. పోలీసుల తనిఖీలు పూర్తయ్యాక అధికారులు బోట్లకు పచ్చజెండా ఊపారు. పోచవరం పర్యాటక రేవు నుంచి 11 బోట్లలో 840 మంది పర్యాటకులు వెళ్లారు.
– న్యూస్‌టుడే, దేవీపట్నం, వీఆర్ పురం

మంచు కొండల్లో కోలాహలం

మన్యంలోని పర్యాటక ప్రాంతాలకు సందర్శకులు పోటెత్తారు. చింతపల్లి మండలం చెరువులవేనం కొండ, పాడేరు మండలం వంజంగి సమీపంలోని మేఘాల కొండ కోలాహలంగా మారాయి. మంచు దుప్పటి కప్పుకుని పర్యాటకులకు కనువిందు చేశాయి. ●చెరువులవేనం, తాజంగి, లంబసింగి, బోడకొండమ్మ ఆలయం వద్ద ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. మేఘాలకొండను 1200 మంది సందర్శించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ కుటుంబ సభ్యులతో మంచు అందాలను వీక్షించారు. ఎకో టూరిజం ద్వారా అటవీ శాఖకు రూ.65,080 ఆదాయం వచ్చిందని వన సంరక్షణ సమితి సభ్యులు తెలిపారు. కొండకు వచ్చే మార్గం వాహనాలతో నిండిపోయింది.
– న్యూస్‌టుడే, చింతపల్లి, పాడేరు

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్ట్‌గేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్ట్‌గేజ్ లోన్, సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, ✆ 93969 99669.

REAL ESTATE

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

North East Corner House for Sale (Cellar+ G+1) Very Good Rental Property. Immediate Sale. Good Location ✆ 9885824528.

SUJATHANAGAR

వేపగుంట BRTS రోడ్డుకి అతి చేరువలో తక్కువ ధరకే Indp. హౌస్ & గ్రూప్ హౌస్‌లు 2BHK, 3BHK ఇళ్లు అమ్మకమునకు కలదు. ✆ 8374373299.

PLOT FOR SALE

BHOGAPURAM

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లో స్విమ్మింగ్‌పూల్, క్లబ్‌హౌస్, బ్యాంక్‌లోన్ సదుపాయంతో VUDA అప్రూవల్ ప్లాట్లు అమ్మకం. ✆ 8686997700.

TO LET

KURMANNAPALEM

3BHK Spacious flat, fully furnished Acs, Beds, Fridge, close to K'palem main road. ✆ 9866182944

RAMATALKIES

1425 SFt, Pent House 3B/R, 4th Floor Lift, Car Parking with Cup Boards. Srinagar, Nr. Ramatakies, VSP. Cont: 9710947109.

COMMERCIAL

GENERAL

Looking for a individual House of 2000 Sft around Yendada for a Play School of Educational Institution. ✆ 8143143750.

SECOND SALE

మిథున్ ఏజన్సీ, కొనబడును: పాత A/Cలు, సెంట్రల్ A/Cలు, ఇన్వర్టర్, బ్యాటరీలు, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్స్, ఫర్నిచర్, ఆన్‌లైన్ UPSలు కొనబడును. Cont:6309745364

JOBS

Kotak Life Insurance (Life Advisor) NAD Branch, VSP Hiring Rtd./ VRS/ Employees of PSU/ Govt/ Pvt. Sector & also Educated Housewives. Sal: 20 K - 70 K. ✆ 8790189686.

Wanted Accountant Cum Computer Operator (Word, Excel, Internet, Speed Typing) to join immediately 8:30 AM to 6 PM 18K apx. WONWORLD SCHOOL, Behind Baba Bazar, Lawsonsbay, Pedawaltair. ✆ 8235123123.

AUTOCAD designer reputed interior Office seeks skilled AutoCAD designer (2D&3D) for our projects proficient in detailed working ✆9849332399.

Special Recruitment for Retired Persons to Work Marketing Support for Financial Growth M/F, Part/ Full Excellent Package for Suitable Candidates. Call: 9553021026, 7702999763.

Wanted Supervisor & Admin for Laxmi Exports, VSP Graduates & MBA, Good Communication Fluency English ✆ 9393422622.

Restaurant Waiter Jobs కొరకు బాయ్స్&గర్ల్స్ కావలెను. ఇంటర్వ్యూ: హోటల్ విన్నర్‌పార్క్, KGH ఎదుట,వైజాగ్. బాయ్స్‌కు వసతి భోజనం. 9849581868

అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, వైజాగ్‌లో పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్ కావలెను. నో టార్గెట్స్, జీతం: 18,000 to 25,000 + ఇన్సెంటివ్. Contact Cell: 70932 67891.

ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్ all (డిగ్రీ, B.Tech., Dip. & ITI) కావలెను. Sal:18-25k, Age 35లోపు, స్పాట్ జాయిన్. ✆ 7995439539.

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ:23000 టు 29000. వ: 18-35. ✆ 77309 58410.

SECURITY GUARDS

వైజాగ్, విజయనగరంలో పనికొరకు ఆఫీస్‌స్టాఫ్, ఫైర్‌మేన్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, గార్డ్సు (M/F), జీతం: 20వేలు, 36 వేలు, రూమ్, భోజనం. ✆ 6300071128.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పోలీసుస్టేషన్లో యువతి ఆత్మహత్యాయత్నం

విశాఖపట్నం (గాజువాక), న్యూస్‌టుడే : ప్రేమించిన యువకుడితో పెళ్లి చేయాలంటూ విశాఖ గాజువాక పోలీసుస్టేషన్లో ఓ యువతి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. దీనికి సంబంధించి గాజువాక సీఐ అళహరి పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం దరి పెనుగల్లుకు చెందిన యువతి (23) అదే జిల్లా మునగపాక మండలం తిమ్మరాజుపేటకు చెందిన వీరయ్య స్వామి(27)లు అయిదేళ్ల నుంచి ప్రేమలో ఉన్నారు. అయితే వీరయ్యస్వామి తనను పెళ్లి చేసుకోకుండా తాత్సారం చేస్తున్నాడని.. అతన్ని ఒప్పించి వివాహం చేయాలంటూ 15 రోజుల క్రితం యువతి గాజువాక పోలీసులను ఆశ్రయించింది. అయినా దీనిపై ఎలాంటి పురోగతి లేదని భావించిన ఆమె ఆదివారం ప్రియుడితో కలిసి పోలీసుస్టేషన్‌కు వచ్చింది. పోలీసులు తన విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని మనస్తాపానికి గురై తన వెంట తెచ్చుకున్న రసాయనాన్ని (నెయిల్ పాలిష్ రిమూవర్) తాగింది. అపస్మారక స్థితికి చేరుకోవడంతో గాజువాకలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేయవద్దని, ప్రియుడితో తన పెళ్లి చేయాలంటూ ఆమె ఫిర్యాదు సైతం ఇవ్వలేదని సీఐ పార్థసారథి తెలిపారు. వీరయ్య స్వామిని విచారిస్తున్నామని, చట్టపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనకు శిక్షణ ఐఏఎస్‌లు

శిక్షణ ఐఏఎస్‌ల బృందంతో కలెక్టర్

పాడేరు, రంపచోడవరం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో పరిపాలనపై అధ్యయనం చేసేందుకు వచ్చిన శిక్షణ అధికారులకు సమగ్ర సమాచారం అందించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన శిక్షణ ఐఏఎస్‌లు ఆదివారం పాడేరు చేరుకున్నారు. ముందుగా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామీణ పరిపాలన, ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలిస్తారని కలెక్టర్ చెప్పారు. క్షేత్రస్థాయి పరిశీలనతో ప్రభుత్వ పథకాల అమలుపై లోతైన అవగాహన ఏర్పడుతుందన్నారు. ఈ చామగెడ్డ, దల్లిపాడు గ్రామాలను సందర్శించి నెల 16 వరకు అధ్యయనం చేస్తారని ఇన్‌ఛార్జి ఆర్డీవో లోకేశ్వరరావు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలపై శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అవగాహన కల్పించారు. పలు రాష్ట్రాలకు చెందిన 12 మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు నాలుగు రోజుల శిక్షణ నిమిత్తం రంపచోడవరం వచ్చారు. ఐటీడీఏలో సెక్టోరల్ అధికారులు వారితో సమావేశమై పలు శాఖల ప్రగతిని వివరించారు. క్షేత్రస్థాయిలోనూ అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఆర్డీవో అంబేడ్కర్, ఏపీవో రమణ, డీడీ రుక్మాంగదయ్య, ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీఆర్‌కు అచ్యుతాపురం సీఐ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: స్థానిక సీఐ గణేష్‌ను వీఆర్‌కు పంపుతూ పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో అనకాపల్లి దిశా పోలీసుస్టేషన్ సీఐ చంద్రశేఖరరావును నియమించారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. స్థానికంగా నెలకొన్న ఓ భూవివాదమే సీఐ గణేష్‌ను వీఆర్‌కు పంపడానికి కారణమని సమాచారం.

రూ. 6.03 లక్షలతో సైబర్ మోసం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని ఆశ చూపించి సైబర్ మోసానికి గురైన బాధితుడు అనకాపల్లి పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. దీనికి సంబంధించి పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ కథనం ప్రకారం.. అనకాపల్లిలోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న ఎన్.పాండురంగ చరవాణిలో వాట్సాప్‌కు ఈ ఏడాది మార్చి 24న లింక్ వచ్చింది. దీన్ని ఓపెన్ చేయగా రెండు రోజుల అనంతరం గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. గ్రూపులో 65 మంది ఉన్నారని వీరంతా పెట్టుబడులు పెట్టి లాభాలు పొందారని నమ్మించారు. ఇది నమ్మిన పాండురంగ ఈ ఏడాది మే 6 నుంచి 25 వరకు రూ.6.03 లక్షలు పెట్టుబడి పెట్టారు. పెట్టుబడితో పాటు లాభాలు కూడా రాకపోవడంతో ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై గోకులపాడు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై విభీషణరావు తెలిపిన వివరాల ప్రకారం... ఎలమంచిలి మండలం పెదపల్లికి చెందిన **ఊడి రంజిత్** (28) స్నేహితులతో కలిసి తలుపులమ్మ లోవ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురూ ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గోకులపాడు సమీపంలో ముందు వెళ్తున్న కారును అధిగమించేందుకు యత్నించి అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఆ సమయంలో వెనుక వస్తున్న లారీ రంజిత్ మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ఇద్దరు గాయాలతో బయటపడ్డారు. స్థానికులు వీరిని నక్కపల్లి ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రంజిత్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని..

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: లింగరాజుపాలెం వద్ద ద్విచక్ర వాహనం విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్.రాయవరానికి చెందిన **గింజాల హరీష్** (20) శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై లింగరాజుపాలెం వెళ్తుండగా అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడ్ని స్థానికులు నక్కపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై విభీషణరావు తెలిపారు.

విశాఖజట్టు విజయవిహారం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు సెమీ ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. సోమవారం విశాఖ, తూర్పుగోదావరి జిల్లా జట్ల మధ్య తొలి సెమీఫైనల్ జరగనుంది. ఆదివారం విశాలాక్షినగర్ బీవీకే పాఠశాల మైదానంలో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విశాఖ జట్టు 82-51తో అనంతపురం జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు 52-20తో కర్నూలుపై గెలుపొందింది. మహిళల విభాగంలోనూ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	108	105
లైవ్	135	125
డ్రెస్డ్	196	220
స్కిన్‌లెస్	223	230

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: మాస్ జాతర, సత్యనారాయణ స్క్రీన్2: బేడ్‌లాండ్స్, పర్తిసాయి: కృష్ణలీల, షిర్డిసాయి: గర్ల్‌ఫ్రెండ్, రామచంద్ర: ప్రేమిస్తున్నా, సత్య నారాయణ స్క్రీన్1: జటాధర, వెంకటేశ్వర: ఆర్యన్, అచ్యుతాపురం: ఎస్‌టీబీఎల్ సినీవరల్డ్ స్క్రీన్-1 జటాధర, స్క్రీన్-2: గర్ల్‌ఫ్రెండ్

విద్యార్థులకు పోటీలు

పాయకరావుపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నామని గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు తెలిపారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో పోటీల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. యోగా, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలు, వక్తృత్వం, వ్యాసరచన తదితర విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

తీరంలో సందడి

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రం రేవుపోలవరం తీరంలో పర్యాటకుల సందడి నెలకొంది. కార్తిక మాసం మూడో ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి వివిధ ప్రాంతాల పర్యాటకులు సాయంత్రం వరకు తీరంలో సందడి చేశారు. ఇక్కడి కొబ్బరి, జీడిమామిడి తోటల్లో వనభోజనాలు చేసి సేదతీరారు. సాయంత్రం తీరంలో పలువురు పర్యాటకులు సముద్ర స్నానాలు చేశారు.

పోలీసుల చొరవ.. దొరికిన వాహనం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: చోరీకి గురైన వాహనం పోలీసుల చొరవతో దొరికింది. పట్టణంలోని దొర చికెన్ సెంటర్‌కు చెందిన వాహనాన్ని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకుపోయిన విషయం తెలిసిందే. దీనిపై యజమాని సత్యనారాయణ ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. ఎలమంచిలి మండలంలోని కొక్కిరాపల్లిలో జాతీయ రహదారిపై ఉన్న సీసీ కెమెరాల పుటేజీ పరిశీలించారు. శుక్రవారం రాత్రి పాయకరావుపేట నుంచి వై కూడలి మీదుగా కాగిత టోల్‌గేట్ వద్దకు అగంతకుడు బొలెరో వాహనాన్ని తీసుకువెళ్లాడు. ఆ తర్వాత తుని వైపు వెనక్కి వచ్చేశాడు. తుని జాతీయ రహదారి పై వంతెనపై ఉన్న కెమెరాలో బ్రిడ్జిపైకి వెళుతున్న వాహనాన్ని గుర్తించారు. ఆ తర్వాత వాహనం కనిపించలేదు. దీంతో పాయకరావుపేట, తుని మధ్య ఉన్న జాతీయ రహదారిని పరిశీలించారు. తుని ఆర్టీసీ కాంప్లెక్సు దాటిన తర్వాత రహదారిపై ఉన్న వాహనాన్ని గుర్తించారు. దీనిలో ఇంధనం అయిపోవడంతో రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయాడు. వాహన యజమానికి ఆదివారం పోలీసులు అందజేశారు.

అందనంత దూరంలో జెట్టీ నిర్మాణం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

జెట్టీ నిర్మాణానికి అధికారులు సూచించిన ప్రాంతం

మండలంలోని వెంకటనగరం తీరంలో పంపానదికి అనుకుని మినీ జెట్టీ నిర్మాణం చేపట్టేందుకు మత్స్యశాఖ అధికారులు గతంలో ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. రాజవరం, గజపతి నగరం, రాజానగరం, వెంకటనగరం తదితర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు సులువుగా వేట చేసునేందుకు అనువైన ప్రదేశమని రెండేళ్ల క్రితం మత్స్యశాఖ అధికారులు గుర్తించారు. ఇక్కడ జెట్టీ సౌకర్యం ఉంటే బోట్లకు నేరుగా కెరటాల తాకిడి లేకుండా సముద్రంలోకి వెళ్లేందుకు వీలుగా ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు సూచించారు. దీంతో సముద్రంపై వేటచేసే మత్స్యకారులు చేపల వేటకు అవస్థలు తీరుతాయని ఆనందం వ్యక్తం చేశారు. కాని ఈ పనులు నేటికి కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రాంతంలో జెట్టీ అందుబాటులోకి తీసుకు వస్తే నేరుగా చేపలవేటతోపాటు మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రధాన రహదారికి అటూ తీరానికి అనువైన ప్రదేశం కావడంతో రవాణా ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు. దీంతోపాటు వేటకు వెళ్లే సమయంలో బోట్లు బోల్తాపడి ప్రమాదాల బారిన పడడం, వలలు నష్టపోవడం వంటివి జరుగుతున్నాయి. ఈ కారణంగా ఆర్థికంగా నష్టపోతున్నారు. జెట్టీ సౌకర్యం ఉంటే ఇలాంటివి జరిగేందుకు ఆస్కారం ఉండవని, సంబంధిత అధికారులు జెట్టీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సమీప గ్రామాల మత్స్యకారులు కోరుతున్నారు.

అనుమతి లేని ఫ్లెక్సీలపై కొరడా!

సందర్భం ఏదైనా ఫ్లెక్సీలు ఏర్పాటు ఆనవాయితీగా మారింది. అనకాపల్లి ప్రధాన కూడళ్లతో పాటు పట్టణంలో ఎటుచూసినా ఫ్లెక్సీలే కనిపిస్తున్నాయి. వీటి ఏర్పాటుకు అనుమతులు తీసుకోవడంలేదు. ఇకపై ఇది కుదరదు. అనుమతి లేని ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, అనకాపల్లి

రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

వాస్తవానికి ఎవరైనా ఫ్లెక్సీ పెట్టాలంటే ముందుగా జీవీఎంసీ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. సైజు, ఎన్ని రోజులు పెడుతున్నామనే దాన్ని బట్టి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏ ఒక్కరూ చెల్లించడం లేదు. వీటి వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జాతీయ రహదారి ఇరువైపులా కడుతున్న భారీ ఫ్లెక్సీలతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

రహదారుల మూత

కొంతమంది వివిధ సందర్భాల్లో ఏర్పాటు చేసే భోజనాలను ఇంటి ముందు రహదారిపైనే పెడుతున్నారు. దీని కోసం ఏకంగా రోడ్లు మూసేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఆ ప్రాంతాల్లోని అన్ని రహదారులకు అడ్డంగా కర్రలు, వాహనాలను నిలిపివేస్తున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కూడా స్థలం ఉండడం లేదు.

అనుమతి తీసుకోవాలి

అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు పెట్టినా, రహదారులు మూసి వేసినా చర్యలు తీసుకుంటాం. రహదారి మూసి వేయాలంటే ప్రణాళికా విభాగం, పోలీసుల అనుమతి విధిగా తీసుకోవాలి. ప్రత్యామ్నాయ మార్గం ఉంటేనే అనుమతి ఇస్తారు. – కె.చక్రవర్తి, జోనల్ కమిషనర్

ఉచిత వైద్య శిబిరం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: క్రమశిక్షణతో కూడిన జీవనంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరరావు కోరారు. అనకాపల్లి సీఐటీయూ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. రోగులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. శిబిరంలో సుమారు 60 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ డి.సాంబమూర్తి, డాక్టర్ మీనేంద్ర కుమార్, డాక్టర్ వేపా కామేశ్వరరావు, నిర్వాహకులు మళ్ల చంద్రశేఖర్, కొణతాల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

14న పరిషత్తు నాటిక ప్రదర్శన

మునగపాక: మునగపాకలో ఈనెల 14న గుంటూరు అభినయా ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'ఇది అతని సంతకం' పరిషత్తు నాటిక ప్రదర్శించనున్నట్లు వెలగా వీరునాయుడు మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు వెలగా శ్రీనివాసరావు తెలిపారు. మునగపాకలో ఆదివారం ఈ కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రతినిధులు ప్రసాదు, ముసిలినాయుడు, బద్దెం సూర్యనారాయణ, ఆడారి గణపతి అచ్చింనాయుడు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాయం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు సాయం అందించడానికి క్షత్రియ సేవా సమితి కృషి చేస్తోందని ఎలమంచిలి క్షత్రియ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు బీవీఎస్ఎస్ఎన్ రాజు అన్నారు. ఆయన అధ్యక్షతన ఆదివారం ఎలమంచిలిలో సంఘ సమావేశం జరిగింది. ఆయన చేతుల మీదుగా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షులుగా బీవీఎస్ఎస్ఎన్ రాజు, అధ్యక్షులుగా దంతులూరి విశ్వనాథరాజు, సహాయ కార్యదర్శిగా పెన్మెత్స జానకి రామరాజు తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కాకర్లపూడి వర్మ, రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆటోలు..

పేట ఆర్టీసీ కాంప్లెక్సులో అడ్డగా ఆటోలు ఉంచడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు వస్తున్నాయి. తుని, అనకాపల్లి నుంచి పల్లెవెలుగు బస్సులు పదుల సంఖ్యలో వస్తుంటాయి. ముఖద్వారం వద్ద, ఆవరణలోను ఆటోలు అడ్డగా ఉంచుతున్నారు. దీంతో బస్సులు లోనికి వెళ్లడానికి వీలుండటం లేదు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులను ప్రధాన రహదారిపై దించుతున్నారు. ఆ తర్వాత లోనికి వెళ్లి వస్తున్నాయి. రోడ్డుపై అడ్డగా బస్సులు ఉండటంతో రెండు వైపుల వాహనాలు నిలిచిపోతున్నాయి. అధికారులు స్పందించి ఆటోలను బస్టాండులో పెట్టకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పాయకరావుపేట

తుప్పలు తొలగించరూ..

సత్యవరం - పెదరామభద్రపురం ప్రధాన రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోయాయి. దీంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చే సమయంలో తప్పించుకోవడానికి వీలులేకుండా ఉంది. ఒక్కోసారి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని చోదకులు చెబుతున్నారు. ఈ మార్గం నుంచి సత్యవరం, తుని, శ్రీరాంపురం, సమీప గ్రామాలకు అధికసంఖ్యలో రైతులు పొలాలకు, విద్యార్థులు కళాశాలు, పాఠశాలలకు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉంటోంది. సంబంధిత అధికారులు రహదారికిరువైపులా అడ్డంకిగా ఉన్న తుప్పలు, ముళ్ల పొదలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే:

శిథిలావస్థలో మంచినీటి ట్యాంక్

సుంకపూరు ఎస్సీ, బీసీ కాలనీలోని తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. సుమారు 800 మంది ప్రజలకు తాగునీరు అందించాలని 10 వేల లీటర్ల సామర్థ్యమున్న నీటి ట్యాంకును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నాలుగేళ్ల నుంచి ఈ ట్యాంక్ శిథిలావస్థలో ఉందని మరమ్మతులు చేపట్టాలని కోరినా, గత ప్రభుత్వం మరమ్మతులు చేపట్టకుండా, రంగులు వేయించారని ఆ కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ట్యాంకు స్తంభాల నుంచి, శ్లాబ్ నుంచి సిమెంటు పెచ్చులు కిందకు జారి పడుతున్నాయని చెబుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నామని ఆ కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. – న్యూస్‌టుడే, కోటవురట్ల

అంకితభావంతో పనిచేయాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పార్టీ కోసం అందరూ అంకితభావంతో పనిచేయాలని భాజపా జిల్లా అధ్యక్షులు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. పూడిమడక, రామన్నపాలెం, సెజ్‌కాలనీ నుంచి వందలసంఖ్యలో పలువురు భాజపాలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోరుపోలు చిన్నారావు, నాయకులు కొండ్రపు నాయుడుబాబు, జిల్లా ఉపాధ్యక్షులు రాజాన సన్యాసినాయుడు, గొంతిని భక్తసాయిరాం, అగ్గాల హనుమంతరావు పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న పరమేశ్వరరావు

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

పాయకరావుపేట: ఆర్డీఎస్ఎస్ పనుల్లో భాగంగా సోమవారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. కుమారపురం, రాజగోపాలపురం, పాల్మన్‌పేట, పాల్తేరు, కొత్తూరు గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

ఎలమంచిలి గ్రామీణం: మండలంలో రేగుపాలెం, కొక్కిరాపల్లి గ్రామాలకు సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

హిందూ సేన కమిటీ ఏర్పాటు

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల మండలంలో ఛత్రపతి శివాజీ హిందూ సేన ఏర్పాటైంది. తంగేడు కాటా వద్ద ఆదివారం హిందువులంతా సమావేశమై ఓ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. నక్కా సత్యనారాయణ అధ్యక్షుడిగా, శ్రీదరాల తేజ కార్యదర్శిగా నియమించారు. సింగంపల్లి స్వామినాయుడు, మడ్డు జోగిరాజు, యండమూరి రాజుబాబు, కేతవరపు రమేష్ సభ్యులుగా నియమించినట్లు తెలియజేశారు. డిసెంబరుల ఒకటిన హిందూ మహా సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుతున్నామని, అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

యువతి అదృశ్యం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలోని తులసీనగర్‌కు చెందిన 22 ఏళ్ల యువతి అదృశ్యమైందని ఆదివారం ఎలమంచిలి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రాంతానికి చెందిన మహిళ విధి నిర్వహణకు వెళ్లి అదృశ్యమైందని తల్లిదండ్రుల ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు.

నేడు పెద్దజాగారం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: వేములపూడి వాసుల ఆరాధ్యదైవం వేమాలమ్మ పండగ సందర్భంగా సోమవారం రాత్రి పెద్దజాగరం వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవకమిటీ ఏర్పాట్లు చేసింది. మూడేళ్లకోసారి జరిగే ఈ జాతర కోసం ప్రధాన వీధులన్నింటినీ విద్యుత్తుదీపాలు, తోరణాలతో అలంకరించారు. కూడళ్లలో స్వాగత ద్వారాలను, అమ్మవారి దర్శనానికి భక్తులు సాఫీగా వెళ్లేలా క్యూలైన్లను ఏర్పాట్లు చేశారు. రాత్రి ఎనిమిది గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

అఖండ పూజలు.. రుద్రాభిషేకాలు

అనకాపల్లి/ పట్టణం, లక్ష్మీదేవిపేట, కొత్తూరు, నెహ్రూచౌక్, కశింకోట, న్యూస్‌టుడే: గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి ఆరుద్ర జన్మనక్షత్రం సందర్భంగా రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. 302 మంది దంపతులు పాల్గొన్నారు. దేవస్థానం ఛైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, ధర్మకర్తలు ఎలమంచిలి బంగారురాజు, రాపేటి సంతోష్ కుమార్, దూలం సత్యవతి పాల్గొన్నారు. గౌరీ పరమేశ్వరుల ఆలయంలో 216 పార్థివ లింగాలకు లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా నేత దాడి రత్నాకర్ ప్రత్యేక పూజలు చేశారు. కశింకోట త్రిపురాంతకస్వామికి అభిషేకాలు చేశారు. సత్యనారాయణపురం హేమగిరిపై నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అప్పికొండ గణేష్ తదితరులు నిర్వహించారు. లక్ష్మీదేవిపేటలో గౌరీపరమేశ్వరుల శాలాల ఉత్సవంలో భాగంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఎలమంచిలి గ్రామీణం, రాంబిల్లి, న్యూస్‌టుడే: రుక్మిణీపురం, వెల్చూరు ఉమా నాగలింగేశ్వరస్వామి ఆలయాల్లో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సత్యసాయి సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సిరిదెల్ల శ్రీనివాస్, రేబాక ఆనందరావు, రమేశ్‌రాజు పాల్గొన్నారు. పంచదార్లలో భక్తులు రాధామాధవస్వామి ఆలయం వద్ద పుణ్యధారల వద్ద స్నానాలు ఆచరించారు. క్షేత్రపాలకుడు శ్రీఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

శివలింగానికి అభిషేకం

రుక్మిణీపురంలో రుద్రాభిషేకంలో భక్తులు

అనకాపల్లిలో లక్ష బిల్వార్చన

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ

అచ్యుతాపురం, రాంబిల్లి, న్యూస్‌టుడే: హరిపాలెం, పెదపాడు గ్రామాల్లో భారీ అంబలంపూజలు జరిగాయి. హరిపాలెంలో శ్రీలక్ష్మీ గణపతి అయ్యప్పస్వామిపీఠం ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలకు వివిధ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. ఈ గ్రామాల్లో ప్రత్యేక మండపాలను తీర్చిదిద్ది పూజలు నిర్వహించారు. వాడనర్సాపురంలో ఆదివారం ఆంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భజనలు, కోలాటం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచి కారె రామారావు, మాజీ సర్పంచి చింతకాయల ఎర్రయ్య, భాజపా మండల అధ్యక్షుడు కారె రాముడు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. స్వామి ప్రాంగణాన్ని విద్యుత్తు దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లిలో ఆదివారం రాత్రి నిర్వహించిన అయ్యప్ప అంబలం పూజ భక్తి శ్రద్ధలతో సాగింది. గ్రామానికి చెందిన నున్న గణేష్ స్వామి ఈ పూజ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుబల్లి చంటి గురుస్వామి పూజా క్రతువు చేపట్టారు. పలు గ్రామాల నుంచి వందలసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముఖ్యంగా అరటి బోదెలతో స్వామి వారికి తయారుచేసిన గుడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు పాటలు పాడి, నృత్యాలు చేసి స్వామివారికి హారతులు పట్టారు. కార్యక్రమంలో స్వాములు వీసం రామకృష్ణ, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరంలోని వైభవ వేంకటేశ్వరస్వామి 10వ దివ్య లీలా కల్యాణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు చక్రవర్తి స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలో పుట్టమన్ను సేకరించారు. ధర్మకర్త దంపతులు బొలిశెట్టి గోవిందరావు, శారదా కుమారి, సభ్యులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు.

నక్కపల్లిలో మండపం

పర్యాటకులతో బొజ్జన్న కొండ

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పర్యాటక కేంద్రం బొజ్జన్న కొండ ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు, విద్యార్థులు బస్సుల్లో తరలివచ్చారు. కొండపైన ఉన్న ప్రాచీన బౌద్ధ విగ్రహాలను, లింగాలకొండ వద్ద స్తూపాలను తిలకించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు కొండ చరిత్రను వివరించారు. ప్రాచీన విగ్రహాల వద్ద సెల్ఫీలు తీసుకున్నారు. కొండ దిగువ భాగంలో ఆటపాటలతో సాయంత్రం వరకూ గడిపారు.

వనసమారాధనలో సత్కారం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘ కార్తిక వన సమారాధన కార్యక్రమం ఆదివారం జరిగింది. అనకాపల్లి ఏఎంఏఎల్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అన్ని రంగాల్లో గుర్తింపు పొందిన నిపుణులను సత్కరించారు. వీరిలో చాగంటి సర్వారావు, పేరూరి బుజ్జి, వేదుల సూర్యప్రభ, కొడుకుల సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు. గంటి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ డీఈఓ కేవీ గౌరిపతి, రేజేటి రామాచార్యులు, డాక్టర్ ధర్మాల సాంబమూర్తి, ఆడిటర్ శర్మ, తమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక పల్లపువీధికి దాడి కుటుంబీకులు వనసమారాధనను ఆదివారం కొత్తమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. 50 కుటుంబాల సభ్యులు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. దాడి నాయుడు, రామచంద్రరావు, పరదేశినాయుడు, శ్రీరామమూర్తి, సూర్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న ప్రతినిధులు

ఆత్మరక్షణకు కరాటే

శిక్షణ పొందిన విద్యార్థులు

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆపద కాలంలో ఆత్మరక్షణకు కరాటే ఉపయోగపడుతుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి పేర్కొన్నారు. ఆదివారం ఎలమంచిలిలో విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టులను కోచ్‌లు నరసింగరావు, నక్కా వెంకటరమణ నిర్వహించారు.

ఆదివారం ఆటలకు కేటాయించండి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఆటలపైనా దృష్టి సారించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి కోరారు. ఎలమంచిలి గాంధీనగరంలో ఆదివారం హాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న రమాకుమారి

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726	

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: అనకాపల్లి సంత ప్రాంతంలో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. – మళ్ల రామకృష్ణ, అనకాపల్లి, ✓: పందులు లేకుండా చూస్తాం. – రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: అనకాపల్లి ప్రధాన రహదారిలో చేపల మార్కెట్ సమీపంలో వ్యర్థాలు శుభ్రం చేయడం లేదు. – రాజ్యలక్ష్మి, అనకాపల్లి, ✓: వ్యర్థాలు తొలగించి సమస్య పరిష్కరిస్తాం. – రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: ఎలమంచిలి పాతజాతీయ రహదారిపై ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి. వాహనాల పార్కింగ్‌కు స్థలం లేక ఇబ్బంది పడుతున్నాం. – ఎం.శరత్ ఎలమంచిలి, ✓: ఆక్రమణలన్నీ గతంలో తొలగించాం. మళ్లీ ఆక్రమణలు గుర్తించి తొలగిస్తాం. – ప్రసాదరాజు, కమిషనర్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ?: అచ్యుతాపురం వారపుసంతలో వ్యర్థాలను సక్రమంగా తొలగించడంలేదు. – సత్యవతి, అచ్యుతాపురం, ✓: వ్యర్థాలను పూర్తిగా తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నాం. – శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేటలోని న్యూ కాలనీలో వీధి కుళాయిలు ఏర్పాటు చేయాలి. రక్షిత మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. – ఎన్.శ్రీను, స్థానికుడు, ✓: కొత్తగా కుళాయిల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. – కె.డేవిడ్, ఈవో

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: మండలంలోని శ్రీరాంపురంలో ఉన్న దాబాల వద్ద అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. దాబాల్లో మిగిలిన వ్యర్థాలను రోడ్డు పక్కన వేస్తున్నారు. వీటికోసం కుక్కలు ఎక్కువగా వస్తున్నాయి. వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. – జి.మూర్తి, గ్రామస్థుడు, ✓: వ్యర్థపదార్థాలు వేయకుండా చర్యలు చేపడతాం. దాబాల యజమానులకు తాఖీదుల జారీ చేస్తున్నాం. – జి.కృష్ణప్రసాద్, సర్పంచి

పాయకరావుపేట గ్రామీణం: శ్రీరాంపురంలో పెట్రోల్ బంకు పక్కనే ఉన్న సాగునీటి కాలువలో పూడిక పెరిగిపోయింది. దీంతో నీటి సరఫరాకు అడ్డంకులు ఏర్పడ్డాయి. – రైతులు, ✓: త్వరలో పూడికతీత పనులు చేసేలా చర్యలు తీసుకుంటాం. – సురేష్‌కుమార్, జల వనరుల శాఖ డీఈ

?: సీతారాంపురం జాతీయ రహదారి వద్ద వాహనచోదకులను అప్రమత్తం చేసేలా స్టాపర్లు ఏర్పాటు చేయాలి. ఈ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. – గ్రామస్థులు, ✓: జాతీయ రహదారి భద్రత అధికారులతో చర్చించి రక్షణ చర్యలు చేపడతాం. – అప్పన్న, సీఐ

పేద విద్యార్థులకు విద్యాదానం చేయండి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని భాజపా నాయకుడు విజయ్‌నాయుడు కోరారు. సంపతిపురంలో ఆదివారం వెలమ ఉద్యోగులు, కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వెలమ భవనానికి ఉచితంగా స్థలాన్ని ఇచ్చిన మిరియాల రాజేంద్రప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు. వెలమ ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కూండ్రపు భీమ, లాలం కన్నాజీ, ఉదయశ్రీ, సంఘ ప్రతినిధులు రాజాన అప్పారావు, బైరాగి నాయుడు, డాక్టర్ పూడి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్ర ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న విజయ్ తదితరులు

కొనసాగుతున్న మత్స్యకారుల ఆందోళన

నక్కపల్లి, న్యూస్‌టుడే: బల్క్ డ్రగ్ పార్క్ వ్యతిరేకిస్తూ రాజయ్యపేటలో మత్స్యకారులు చేపట్టిన ఆందోళన ఆదివారంతో 57వ రోజుకు చేరుకుంది. శిబిరం వద్ద మత్స్యకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ రద్దుచేసి ప్రాణభిక్ష పెట్టాలంటూ వేడుకున్నారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ కేసులో అరెస్ట్ అయిన పిక్కి తాతాజీ, పిక్కి కోటి బెయిల్‌పై విడుదలయ్యారు. వీరిని కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైకాపా మండల శాఖ అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, సూరకాసుల గోవింద వేర్వేరుగా పరామర్శించారు. అనంతరం ఆందోళనకారులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోసల కాసులమ్మ, సత్తియ్య, మహేష్ బాబు, సోమేశ్వరరావు, పైడితల్లి, రాంబాబు, స్వామి, కాశి, నల్ల తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, KARANAM HARITHA (New name) previously called GANDREDDI HARITHA (Old name), Resident of H. No. 3-63, Gandivanipalem, Pedamusidivada, Anakapalli, Visakhapatnam District. Now changed my name from GANDREDDI HARITHA (Old name) to KARANAM HARITHA (New name). Henceforth I will be called as KARANAM HARITHA (New name) for all purposes

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి 1:** డియాస్ ఈరే బాహుబలి,ఆర్యన్ **ఆడి 2:** మాస్ జాతర, **ఆడి 3:** ది గర్ల్ ఫ్రెండ్ **ఆడి 4:** ప్రిడేటర్: బ్యాడ్ ల్యాండ్స్, జటాధార, **బంగార్రాజు:** మాస్ జాతర **రాజు:** ది గర్ల్ ఫ్రెండ్ **చోడవరం:** **శ్రీసాయిలక్ష్మి:** కె.ర్యాంప్ **సాయిలక్ష్మి:** బాహుబలి, **పూర్ణ:** జటాధర

శివాలయానికి వెండి నాగాభరణం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: విజయరామరాజుపేటలో శివాలయానికి భక్తులు వెండినాగాభరణాన్ని సమర్పించారు. శిల్పరశెట్టి విశ్వనాథం దంపతులు రూ.4.50 లక్షలతో నాగాభరణాన్ని చేయించి ఆదివారం ఆలయ పూజారికి అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అదుపుతప్పితే ప్రమాదమే !

చీడికాడ మండలం కోనాం-గుడివాడ పంచాయతీరాజ్ రోడ్డులో ప్రమాదకరంగా ఉంది. జలాశయం పక్కనుంచి నిర్మించిన రహదారిలో మెట్ట వద్ద రక్షణ గోడ లేకపోవడంతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఏమాత్రం పక్కకు వెళ్లినా.. ప్రమాదం తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో చీడికాడ, హుకుంపేట, అనంతగిరి గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. - చీడికాడ, న్యూస్‌టుడే

సాగు చూపు.. సాంకేతికత వైపు

డ్రోన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే

వ్యవసాయంలోనూ సాంకేతికతను అన్నదాతలు అందిపుచ్చుకుంటున్నారు. నాట్లువేసే సమయం నుంచి కోతలు కోసే వరకు యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. పురుగుమందులు, ఎరువులు పిచికారీ చేసేందుకు డ్రోన్లను వినియోగిస్తుండటంతో కూలీల కొరత, సమయం వృథా వంటి అవరోధాలను అధిగమిస్తున్నారు.

▼ ఎక్కువగా వర్షాలు కురిసినప్పుడు పొలాల్లోకి నీరుచేరి నిల్వ ఉంటుంది. అలాంటి సమయాల్లో అందులోకి దిగి నీటిని పిచికారీ చేయడానికి రైతులు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. ప్రస్తుతం ఈ ఆధునిక యంత్రాలు సాయంతో ఇబ్బందిగా ఉన్న పరిస్థితుల్లోనూ సస్య రక్షణ చర్యలు తీసుకోవడం సులువుగా మారింది.

తక్కువ ఖర్చుతో.. వాస్తవానికి వ్యవసాయాధికారులు సూచనలు ప్రకారం ఎకరా వరిపైరుపై తైవాన్ స్ప్రేయర్‌తో మందు చల్లించాలంటే 120 నుంచి 140 లీటర్ల నీటిలో మందును చల్లాల్సి వచ్చేది. దీనికి తోడు మరోవ్యక్తి సాయం తప్పక అవసరమయ్యేది. దీనికి రూ.1000 వరకు ఖర్చవుతుంది. అదేపనికి డ్రోన్లు వినియోగిస్తే 10 నుంచి 20 లీటర్ల నీటితో ఎకరాకి సరిపడా పురుగుమందు పిచికారీ చేయవచ్చు. ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుంది. పురుగు మందు మోతాదు కూడా తగ్గుతుందని అన్నదాతలు చెబుతున్నారు.

మాయ దారులు

చోడవరం, న్యూస్‌టుడే

గుంతల రోడ్లతో నియోజకవర్గ వాసులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఏ దారిలో వెళ్లాలన్నా, ఎటుచూసినా అన్నిచోట్లా అదే పరిస్థితి. ఇంత అధ్వానంగా ఉన్న ఈ రహదారులను పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు, వాహనదారుల నుంచి తీవ్రంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెట్టింట్లో సైతం బహిరంగంగా నిలదీస్తున్నారు. ఇప్పటికే ఆప్ నాయకులు ఓ అడుగు ముందుకేసి స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేస్తున్నారు.

◆ చోడవరం, బుచ్చెయ్యపేట, రోలుగుంట, రావికమతం మండలాల్లోని దారులన్నీ ప్రయాణానికి అనువుగా లేవు. బండి నడుపుతున్నప్పుడు అటోఇటో అయితే ప్రాణాలు పోవాల్సిందేనని ఆందోళన చెందుతున్నారు. కొత్తరోడ్లు సంగతి పక్కన పెడితే కనీసం మరమ్మతులైనా చేయాలని కోరుతున్నారు.

అధ్వానంగా పి.ఎస్.పేట - చాకిపల్లి వెళ్లే మార్గం

◆ చోడవరం నియోజకవర్గంలో 225కి.మీ. మేర పంచాయతీరాజ్, 112 కి.మీ మేర ర.భ.శాఖ పరిధిలో రోడ్లు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా బి.ఎన్.రోడ్డు అంతా ప్రస్తుతం గోతులమయంగా దర్శనమిస్తోంది. విజయరామరాజుపేట, వడ్డాది వద్ద వంతెనలు కూలిపోయాయి. చెరువులను తలపించేలా గుంతలు పడ్డాయి. అనకాపల్లి-చోడవరం మార్గం కూడా ఇలాగే దారుణంగా ఉంది. చోడవరం నుంచి ఫకీరుసాహెబ్ పేట నుంచి చాకిపల్లి వరకు వెళ్లే రహదారిని పట్టణ శివారు వరకు సీసీ రోడ్డు ఎమ్మెల్యే రాజు అభివృద్ధి చేశారు. ఆ తర్వాత నుంచి నుంచి చాకిపల్లి వరకు ప్రయాణించాలంటే నరకప్రాయమనే చెప్పాలి.

✦ చెరకు తూనిక కేంద్రం వద్ద గుంతలో పడి పలువురు క్షతగ్రాతులవుతున్నారు. గవరవరం రహదారి గోతులతో నిండింది. లక్ష్మీపురం వెళ్లే పలుచోట్ల మార్గంలో తరచూ నీరుపారుతుండటంతో నాచు పేరుకుపోయి ద్విచక్రవాహనలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. చోడవరం నుంచి అంకుపాలెం మార్గంలో కొంత వరకు రాళ్లు వేసి వదిలేశారు. పెదమదీనా రోడ్డులోనూ ఇదే పరిస్థితి.

ఆగని దాహం కేకలు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: చౌడువాడలోని ఇందిరమ్మకాలనీ వాసులు దాహార్తితో సతమతమవుతున్నారు. గతనెలలో మొంథా తుపాను కారణంగా శారదానది పొంగి ప్రవహించడంతో ఒడ్డున ఉన్న పంప్‌హౌస్, విద్యుత్తు మోటార్లు ధ్వంసమయ్యాయి. దీంతో అప్పటి నుంచి దాదాపు 12 రోజులుగా సుమారు 350 మందికి పైగా కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కార్యదర్శి సురేష్‌బాబు, గ్రామస్థులు

నీటిముంపులో ఉద్యాన పంటల సంరక్షణ

రోలుగుంట, న్యూస్‌టుడే: తుపాను అధికవర్షాల్లో ఉద్యానవన పంటలకు సంబంధించి సస్య రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అనకాపల్లి డివిజన్ అధికారిణి ఎ.లావణ్య సూచించారు. భారీవర్షాల కారణంగా తోటల్లో వర్షపునీరు నిలిచిపోతే మొక్కల వేర్లకు అవసరమైన ఆక్సిజన్ అందదు. దీనివల్ల వేర్లు కుళ్లిపోయి, ఆకులు పండుబారి వాడిపోతాయి. ప్రధానంగా కూరగాయలు పంటల్లో ఆకుపచ్చ తెగులు సోకకుండా వర్షాలు ఆగిపోయిన తరువాత సీఓసీ (కాపర్ ఆక్సీ క్లోరైడ్) లేదా కార్బండిజమ్ 1గ్రాము లేదా మాంకోజెబ్ 2.5గ్రాము శిలీంధ్ర నాశని ముందులను లీటరు నీటికి కలిపి వర్షం తగ్గిన తరువాత పిచికారీ చేయాలి. ఈ పంటల్లో వచ్చే వేరుకుళ్లు, ఎండుతెగులు నివారణకు 'కాపర్ ఆక్సీ క్లోరైడ్' 30గ్రాములు, ప్లాంట్లో మైసన్ 1గ్రాము 10లీటర్ల నీటికి కలిపి మొక్క మొదల్లో 4రోజుల వ్యవధిలో రెండుసార్లు వేయాల్సి ఉంటుంది. కూరగాయలు, బొప్పాయి తోటలకు సంబంధించి ఆకులు పండుబారటం, సూక్ష్మపోషక లోపాల నివారణకు 'మల్టీ-కె' 5గ్రాములు ఫార్ములా-6 5గ్రాములు లీటరు నీటికి కలిపి 2-3సార్లు పిచికారీ చేయాలి. మిరప, బొప్పాయిలలో కాయకుళ్లు నివారణకు ప్రొపినెట్ 2-3గ్రాములు లేదా ప్రొపికొనజోల్ 1 ఎం.ఎల్ లేదా కార్బండిజమ్ 1 గ్రాము చొప్పున లీటరు నీటిలో పిచికారీ చేయాలి. నారుమళ్లలో నారు కుళ్లు నివారణకు 'కాపర్ ఆక్సీ క్లోరైడ్' 3గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి బెడ్‌లను తడపాల్సి ఉంటుందని ఉద్యానాధికారి లావణ్య వివరించారు.

సాగులోఉన్న కూరగాయలు

దాతలను అభినందించాల్సిందే!

చోడవరం, న్యూస్‌టుడే: అన్నిదానాల కన్నా.. రక్తదానం మిన్న అని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు అన్నారు. రక్తదాతలను తప్పకుండా గౌరవించాలని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని వెంకన్నపాలెంలో మాజీ ఎంపీపీ ఉరిగిటి పెద రామునాయుడు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య పరీక్షలు, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ ఆరోగ్యంపై అప్రమత్తత పెరిగిందన్నారు. 150 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సర్పంచి మొల్లి ఈశ్వరరావు, ట్రస్టు ఛైర్మన్ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు ఎం.రమణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, మండల తెదేపా అధ్యక్షుడు కనిశెట్టి సన్యాసిరావు, కొట్టాపు చిన్న, గుమ్మిడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నపాలెంలో ఉచిత నేత్రవైద్య పరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

ఆర్యవైశ్యులు ఆదుకుంటారు

చోడవరం, న్యూస్‌టుడే: ఆర్యవైశ్యులు వ్యాపారమే కాకుండా సేవాతత్పరులని వాసవీక్లబ్ పూర్వపు గవర్నర్లు నర్సింగరావు, వరహాలరావు పేర్కొన్నారు. ఆర్యవైశ్య కార్తిక ఆదివారం సమారాధన వనభోజన కార్యక్రమం జరిగింది. వాసవీక్లబ్, యూత్‌క్లబ్, వనతిక్లబ్‌ల చోడవరం శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనకు భారీ సంఖ్యలో ఆర్యవైశ్యులు కుటుంబాలతో వచ్చి సరదాగా గడిపారు. ప్రాజెక్టు ఛైర్మన్ పసుమర్తి మల్లిక్, వాసవీక్లబ్ అధ్యక్షుడు పసుమర్తి లక్ష్మణ్, కార్యదర్శి వరద కామరాజు, పసుమర్తి శేష వెంకట లక్ష్మణరావు, పూసర్ల సతీష్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో.. చోడవరంలో పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు హాజరై సంఘ పురోభివృద్ధికి తన సహాయ సహకారాలుంటాయని తెలిపారు. సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యేను సత్కరించారు.

వడ్డాదిలో 200 మందికి వైద్యసేవలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాదిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. రాష్ట్రహౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. 200 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసి వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. గుండె సంబంధిత ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్లు శ్రీనివాస్, ఛాందిని, ఇందిర తదితరులు వైద్యసేవలు అందించారు. వీఎస్సార్ ఛారిటిబుల్ ట్రస్టు ఛైర్మన్ సత్యారావు, వడ్డాది పట్టణ తెదేపా అధ్యక్షుడు దొండా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు చేయించుకుంటున్న తాతయ్యబాబు

మళ్లీ నాటారు

చీడికాడ మండలంలోని అర్జునగిరి-పెదగోగాడ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరు వైపులా కొన్నేళ్ల క్రితం మొక్కలు నాటి వాటిని సంరక్షించారు. పెద్దవై పాదచారులకు నీడనిచ్చే సమయానికి ఏడాది క్రితం ఓ రియలెస్టేట్ వ్యాపారి స్థలానికి ఏర్పాటు చేసిన విద్యుత్తు లైన్‌కు అడ్డంగా ఉన్నాయని భారీ సంఖ్యలో చెట్లను నరికించారు. ఇదే మార్గంలోనే మళ్లీ రెండు వైపులా కొత్తగా మొక్కలు నాటారు. ముందస్తు ఆలోచన లేకుండా మొక్కలు నాటడంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, చీడికాడ

అర్జునగిరి-పెదగోగాడ రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు

కళకళలాడిన పుణ్యక్షేత్రాలు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపట్నంలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం, ఎగువ కొండపరి వైకుంఠగిరి ఆలయాలకు భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్తిక మాసంతో పాటు వారాంతం కావటంతో అధిక సంఖ్యలో జనాలు మన్యానికి చేరుకున్నారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో దర్శనమిచ్చాయి. గోస్తనీ నది వద్ద పవిత్ర స్నానాల అనంతరం కాశీపట్నం శివాలయంలో పూజలు చేశారు. వైకుంఠగిరి దేవాలయాన్ని ఒక్క రోజే సుమారు 5వేల మంది వరకు సందర్శించినట్లుగా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నిండుగొండలో అన్నసమారాధన నేడు

రోలుగుంట, న్యూస్‌టుడే: ఈ నెల 10న కార్తికమాస మూడోసోమవారం సందర్భంగా స్థానిక ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం జరగనుంది. అంతకు ముందు జరిగే ప్రత్యేక పూజాకార్యక్రమాల్లో భక్తులు తరలిరావాలని కోరారు.

తుప్పల తొలగింపు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: పాతవలస సర్పంచి జామి శ్రావణ్ ఆదివారం సొంత నిధులతో పొక్లెయిన్‌ను ఏర్పాటుచేసి పాతవలస నుంచి సూదివలస రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న తుప్పలు తొలగించారు. ఈ కార్యక్రమంలో జామి నారాయణమూర్తి, మతల కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల చొరవ.. దొరికిన వాహనం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: చోరీకి గురైన వాహనం పోలీసుల చొరవతో దొరికింది. పట్టణంలోని దొర చికెన్ సెంటర్‌కు చెందిన వాహనాన్ని శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకుపోయిన విషయం తెలిసిందే. దీనిపై యజమాని సత్యనారాయణ ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. ఎలమంచిలి మండలంలోని కొక్కిరాపల్లిలో జాతీయ రహదారిపై ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించారు. శుక్రవారం రాత్రి పాయకరావుపేట నుంచి వై కూడలి మీదుగా కాగిత టోల్‌గేట్ వద్దకు అగంతకుడు బొలెరో వాహనాన్ని తీసుకువెళ్లాడు. ఆ తర్వాత తుని వైపు వెనక్కి వచ్చేశాడు. తుని జాతీయ రహదారి పై వంతెనపై ఉన్న కెమెరాలో బ్రిడ్జిపైకి వెళుతున్న వాహనాన్ని గుర్తించారు. ఆ తర్వాత వాహనం కనిపించలేదు. దీంతో పాయకరావుపేట, తుని మధ్య ఉన్న జాతీయ రహదారిని పరిశీలించారు. తుని ఆర్టీసీ కాంప్లెక్సు దాటిన తర్వాత రహదారిపై ఉన్న వాహనాన్ని గుర్తించారు. దీనిలో ఇంధనం అయిపోవడంతో రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయాడు. వాహన యజమానికి ఆదివారం పోలీసులు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

రోలుగుంట, న్యూస్‌టుడే: రోలుగుంట మలుపు కొత్తచెరువు సమీపంలో అమర్చిన విద్యుత్తు స్తంభాలకు తీగజాతి మొక్కలు చుట్టేశాయి. ఇటీవల వర్షాలకు విపరీతంగా పెరిగిపోయాయి. - నర్సింగరావు, రోలుగుంట ✓: ఈ స్తంభాలకు అమర్చిన వైర్ల ద్వారా విద్యుత్తు సరఫరా ఉండదు. అత్యవసర సమయాల్లో ఉపయోగించేందుకు అమర్చాం. త్వరలోనే తొలగించే ఏర్పాట్లు చేస్తాం. - రమేష్, జేఈ, రోలుగుంట

పర్యావరణ రక్షణకు మొక్కల పంపిణీ

రోలుగుంట, న్యూస్‌టుడే: గ్రామీణప్రాంతాల వాణిజ్య పంటలను పండించే రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని బుచ్చెంపేటకు చెందిన జనసేన కార్యకర్తలు ఉచితంగా మొక్కల పంపిణీకి శ్రీకారం చుట్టారు. వీటిని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్.రాజు ఆర్థిక సహకారంతో వీరమహిళా అధ్యక్షురాలు అనిమిరెడ్డి మహేశ్వరి ఆధ్వర్యంలో జీడిమామిడి రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చెంపేట జనసేన పార్టీ అధ్యక్షురాలు గాలి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందజేస్తున్న కార్యకర్తలు

ఉచిత వైద్య శిబిరంతో సాంత్వన

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్(నవ్య) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పెదబొడ్డేపల్లి థెరిసా కాలనీలో నిర్వహించిన ఉచిత మధుమేహ వైద్య శిబిరం సాంత్వన చేకూర్చింది. మధుమేహ వైద్య నిపుణుడు ఆర్.రవికృష్ణ శిబిరంలో సేవలు అందజేశారు. అవసరమైన వారికి వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 250 మంది శిబిరానికి హాజరయ్యారు. మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకునేలా శారీరక ఆరోగ్య పరిరక్షణపై వారందరికీ సూచనలిచ్చారు. 11వవార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం శిబిరాన్ని ప్రారంభించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి రామగోపాల్, బేతిరెడ్డి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో సేవలు అందిస్తున్న డాక్టర్ రుత్తల రవికృష్ణ

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: మోటారు మెకానిక్‌ల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. వరసిద్ధి వినాయక మోటారు వర్కర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తరవాహిని వద్ద ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రవాణా రంగంలో మెకానిక్‌ల పాత్ర కీలకమైందని అన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వీరి కృషివల్ల ప్రభుత్వాలకు పన్నుల ద్వారా రూ.కోట్లు ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ ఆదాయం నుంచి ఒకశాతం సొమ్మును సంక్షేమనిధిగా ఏర్పాటు చేయాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఏకా రామకృష్ణ, కార్యదర్శి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల మండలం లువ్వాసింగి పంచాయతీ శివారు ప్రాంతాల్లో జూద శిబిరంపై పోలీసులు దాడి చేశారు. జూదం, కాయిన్ ఆట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. దీంతో కొందరు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు వారి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఆట స్థలంలో రూ.3350 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొన్నారు.

నిర్లక్ష్య ధోరణికి తప్పదు.. భారీ మూల్యం

వినాయకస్వామి గుడి వద్ద ప్రమాదకరంగా ఉన్న నియంత్రిక

చీడికాడ, న్యూస్‌టుడే: ఏళ్ల క్రితం నిర్మించిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల సిమెంటు దిమ్మెలు ప్రస్తుతం శిథిలమై ప్రజలను వణుకు పుట్టిస్తున్నాయి. వాటిని చూసిన స్థానికులు ఏ క్షణంలో కూలిపోతాయోనని భయాందోళన చెందుతున్నారు. చీడికాడ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం, పోలీస్‌స్టేషన్ సమీపంలోని కొండవీధి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ఒకటి, మరొకటి చీడికాడ-చోడవరం రోడ్డులోని వినాయకస్వామి ఆలయం వద్ద విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కొండవీధి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సిమెంటు దిమ్మ శిథిలమై పగుళ్లు రావడంతో కూలిపోకుండా విద్యుత్తు సిబ్బంది తీగలతో కట్టారు.

✦ వినాయక గుడి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ప్రమాదాలు జరగకుండా తాత్కాలికంగా తెరలను రక్షణగా చుట్టారు. ఇటీవల వర్షాలకు ఇవి చిరిగిపోయాయి. ఇక్కడ తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. పశువులకు గడ్డి మేతకు వచ్చి విద్యుదాఘాతానికి గురవుతున్నాయి. విద్యుత్తు సంస్థ అధికారులు స్పందించి చీడికాడలోని కొండవీధి రోడ్డు, వినాయకగుడి వద్ద ఉన్న రెండు విద్యుత్తు నియంత్రిక దిమ్మెలను తొలగించి, ఎత్తుపెంచి నిర్మించాలని స్థానిక ప్రజలు, ఈ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు కోరుతున్నారు.

✦ దీనిపై చీడికాడ విద్యుత్తు ఏఈ వెంకటరావు వద్ద ప్రస్తావించగా.. ట్రాన్స్‌ఫార్మర్ల సిమెంటు దిమ్మెల నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, అనుమతులు రాగానే తక్షణమే పనులు చేపడతామన్నారు.

హిందీ నేర్చుకుంటే మేలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వివిధ రాష్ట్రాలు, భిన్న సంస్కృతులు ఉన్న భారతదేశంలో హిందీభాష సామాన్య భాషగా దేశ ప్రజలను కలుపుతోందని హిందీ అధ్యాపకుడు కోట ప్రసాద్ అన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం హిందీ ప్రాధాన్యంపై వక్తృత్వ పోటీ నిర్వహించారు. ఏడు మండలాల్లోని 23 పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. దేశంలో కోట్ల మంది మాట్లాడే ఈ భాషలో విద్యార్థులు తప్పనిసరిగా నైపుణ్యం సాధించాలని సూచించారు. పలువురు హిందీ ఉపాధ్యాయులు న్యాయనిర్ణేతలుగా పాల్గొన్నారు. విజేతకు ఈనెల 14న బహుమతులు అందజేస్తారు.

వక్తృత్వ పోటీకి హాజరైన విద్యార్థులు

ముగిసిన అఖండనామ సంకీర్తన

దేవరాపల్లి, న్యూస్‌టుడే : సత్యసాయి శతవర్ష జయంతి వేడుకల సందర్భంగా శనివారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన అఖండ సత్యసాయి నామసంకీర్తన కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6గంటలకు ముగిసింది. దేవరాపల్లి భజన మండలి ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి ధ్యాన మందిరంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో సత్యసాయి అఖండ నామసంకీర్తన అద్భుతంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇన్‌ఛార్జి సీహెచ్ వి.రవిశంకర్, జిల్లా భజన ఇన్‌ఛార్జి స్వామినాయుడు, జగన్నాథం, పెంటారావు, రమణమూర్తి, రొబ్బి శ్రీను, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

కె.కోటపాడు, న్యూస్‌టుడే : కె.కోటపాడులో శనివారం రాత్రి ప్రారంభమైన సత్యసాయి అఖండ నామసంకీర్తన ఆదివారం రాత్రితో ముగిసింది. సత్యసాయి శతవర్ష జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రపంచవ్యాప్త అఖండభజనల్లో భాగంగా స్థానిక సేవాసమితి ఆధ్వర్యంలో భజనలు నిర్విరామంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, బండారు నారాయణపాత్రుడు, కన్నూరు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ, న్యూస్‌టుడే: నీటంపేటలో సోమవారం శ్రీసాయి సత్యనారాయణ సామూహిక వ్రతాలను నిర్వహించనున్నట్లు చీడికాడ మండల ఇన్‌ఛార్జి కె.లక్ష్మణనాయుడు చెప్పారు. రామాలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు సామూహిక వ్రతాలు జరుగుతాయని, ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రజలు అందరూ పాల్గొనవచ్చున్నారు.

నేడు పెద్దజాగారం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: వేములపూడి వాసుల ఆరాధ్యదైవం వేమాలమ్మ పండగ సందర్భంగా సోమవారం రాత్రి పెద్దజాగరం వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవకమిటీ ఏర్పాట్లు చేసింది. మూడేళ్లకో సారి జరిగే ఈ జాతర కోసం ప్రధాన వీధులన్నింటినీ విద్యుత్తుదీపాలు, తోరణాలతో అలంకరించారు. కూడళ్లలో స్వాగత ద్వారాలను, అమ్మవారి దర్శనానికి భక్తులు సాఫీగా వెళ్లేలా క్యూలైన్లను ఏర్పాట్లు చేశారు. రాత్రి ఎనిమిది గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

వేములపూడి వేమాలమ్మ తల్లి

ఘనంగా లక్ష బిల్వార్చన

మాకవరపాలెం, న్యూస్‌టుడే : కార్తిక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం పైడిపాల శ్రీవామలింగేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజా ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పరమేశ్వరుని అభిషేకాలు చేశారు. ఆలయప్రాంగణంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కుంకుమ, హోమ పూజా కార్యక్రమాల్లో వివిధ గ్రామాలకు చెందిన దంపతులు పాల్గొన్నారు. భక్తుల సహకారంతో రాత్రి భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు దొరబాబు ఏర్పాటు చేశారు.

ఆనందంలో చిన్నారిలోకం

నాతవరం, న్యూస్‌టుడే: బాలల దినోత్సవం ముందస్తు వేడుక చిన్నారిలోకాన్ని అలరించింది. హెల్పింగ్‌హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఆదివారం మండల కేంద్రం నాతవరం ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన జిల్లాస్థాయి కార్యక్రమం ఆద్యంతం ఆనందం, విజ్ఞానం అందించింది. చిన్నారుల నృత్యాలు, సందేశాత్మక నాటికలు వక్తలు చురుకైన ఉపన్యాసాలతో వేదిక ఆనందాన్ని పంచింది. సావిత్రిబాయ్‌పులే ట్రస్టు ఛైర్‌పర్సన్ గూడూరు సీతామహలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై హెల్పింగ్ హార్ట్స్ సేవలను కొనియాడారు. సంస్థ వ్యవస్థాపకుడు హరికృష్ణ స్థానిక ఎస్సై తారకేశ్వరరావు, ఫుడ్‌ప్రొడక్టు ఎండీ కృష్ణారావు, జనసేన నాయకులు సూర్యచంద్ర, పోతురాజు, స్పందన , చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.

సైన్స్ ప్రాజెక్టులకు స్పందన: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నాతవరం, గొలుగొండ, రౌతులపూడి మండలాల జడ్పీ పాఠశాలల విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఇందులో మొదటి బహుమతి ఎంబీ.పట్నం, ద్వితీయం మన్యపురట్ల, తృతీయం నాతవరం విద్యార్థులు పొందారు. వీరికి రూ.3500, 2500, 2000 నగదు బహుమతి అందించారు. జిల్లాలోని ఆరు మండలాల నుంచి 600 మంది చిన్నారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిరునవ్వుతో బాలలు

పఠనంపై ఆసక్తి పెంచేవి కథలే..

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: కథలు చదవడం.. చెప్పడం వల్ల పిల్లల్లో పఠనంపై మరింత ఆసక్తి పెరుగుతుందని గ్రంథాలయ అధికారిణి పి.దమయంతి అన్నారు. 'చదవడం మాకు ఇష్టం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం పిల్లలతో ప్రత్యేకంగా కథలు చదివించారు. వాటిలోని ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. ప్రతిభచూపిన వారికి బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ కథ ఆధారంగా ప్రశ్నలు వేయడం వల్ల పిల్లల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు.

రోలుగుంట, న్యూస్‌టుడే: గ్రామీణులకు చేరువలో పుస్తకరూపంలో విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల ప్రాధాన్యం పాఠకుల్లోకి వెళ్లాల్సిన అవసరం మరింత ఉందని స్థానిక గ్రంథాలయాధికారి రాజబాబు పేర్కొన్నారు. ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పుస్తకాలు చదివించారు.

(c) eenadu

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 మాస్ జాతర
స్క్రీన్-2 గర్ల్‌ఫ్రెండ్

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు అమ్మవార్ల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు.

పెందుర్తి

నేడు తెదేపా కార్యకర్తల సమావేశం

పరవాడ, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గ తెదేపా పరవాడ మండల స్థాయి తెదేపా కార్యకర్తల సమావేశాన్ని గొర్లెవానిపాలెం తెదేపా కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు అనకాపల్లి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు, తెదేపా సీనియర్ నేత కన్నూరు వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఛార్జి గండి బాబ్జీ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అందరూ ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు. ★ సమావేశం అనంతరం గండి బాబ్జీ ప్రజల నుంచి వచ్చే వివిధ సమస్యలపై వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ.10 నుంచి మ. ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం సాయినగర్ కాలనీకి వెళ్లే దారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. – టి.శేఖర్. ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – వై.రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

వేపగుంట, న్యూస్‌టుడే: ?: కృష్ణరాయపురం 80 అడుగుల రహదారిలో కంకర తేలి గొయ్యి ఏర్పడడంతో ప్రమాదకరంగా మారింది. – రాజేశ్వరరావు. ✓: మరమ్మతులు చేయిస్తాం. – శంకర్రావు, జోన్-8 ఇన్‌ఛార్జి కమిషనర్.

స్పందనకు వందనం

శ్మశానవాటికలో శుభ్రతకు చర్యలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ శ్మశానవాటికలో ఎట్టకేలకు పరిశుభ్రత పనులు చేపట్టారు. కొంతకాలంగా శ్మశానవాటిక లోపల, బయట పరిసరాల్లో పెద్దఎత్తున పిచ్చిమొక్కలు, తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతో దహన సంస్కారాల సమయంలో ఇబ్బందిపడేవారు. పాముల నుంచి శ్మశాన వాటికకు వెళ్లే మార్గానికి ఇరువైపులా పొదలు పెరిగిపోయాయి. ఈ మేరకు శ్మశానవాటిక పరిస్థితిపై 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. దీంతో సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్ స్పందించారు. పొక్లెయిన్‌తో శ్మశానవాటిక పరిసరాల్లోని పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ దారులు.. తప్పని ప్రయాసలు

శ్రద్ధ చూపితే వేలాది మందికి ప్రయోజనం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి రెవెన్యూ మండలం గ్రామీణ, అర్బన్ ప్రాంతాల కలయిక. అర్బన్ కాలనీలు నివాసయోగ్యమైన ప్రాంతాలు కావడంతో నగర వాసులను ఆకర్షిస్తున్నాయి. దీంతో అర్బన్ కాలనీలు రోజురోజుకు అభివృద్ధి దిశగా దూసుకుపోతున్నాయి. అభివృద్ధికి నోచుకోని గ్రామీణ ప్రాంతాలు పాలకుల కరుణ కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే రహదారులను విస్తరించడంతో పాటు పాడైన దారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సరిపల్లి రోడ్డు దుస్థితి

సరిపల్లి - రాయవరపువానిపాలెం మార్గం ఛిద్రం..

పెందుర్తి మండలం సరిపల్లి - రాయవరపువానిపాలెం రహదారి పూర్తిగా ఛిద్రమైపోయింది. రాయవరపువానిపాలెం మీదుగా రాజయ్యపేట, గుర్రమ్మపాలెం గ్రామాలను అనుసంధానించే ఈ రహదారి సుమారు 3 కిలోమీటర్లు ఉంటుంది. అలాగే బొడ్డునాయుడుపాలెం, ముదపాకను అనుసంధానిస్తూ సుమారు 4 కిలోమీటర్లు ఉంటుంది. ఆయా గ్రామాల్లో సుమారు 12వేల మందికి పైగా జనాభా నివాసం ఉంటున్నారు. వీరంతా ఈ రహదారుల మీదుగా పెందుర్తి మండల కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది.

ప్రమాదాలకు నిలయంగా జుత్తాడ రహదారి

పెందుర్తి మండలం గుర్రమ్మపాలెం పంచాయతీ పరిధిలోని అక్కిరెడ్డిపాలెం కూడలి నుంచి జుత్తాడ ప్రాథమిక పాఠశాల వరకు సుమారు 2 కిలోమీటర్ల రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. దారంతా గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళ పలువురు ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. జుత్తాడ గ్రామం నుంచి పులగానిపాలెం వెళ్లే రహదారి దుస్థితి ఇలానే ఉంది. ఈ మార్గాలు పెందుర్తి మండల కేంద్రాన్ని జుత్తాడ, ఎస్‌ఆర్.పురం, అడివివరం, సింహాచలం ప్రాంతాలను అనుసంధానించడంతో పాటు హనుమంతవాక మీదుగా నగరంలోకి వెళ్లే వెసులుబాటు కల్పిస్తాయి.

అధికారులు దృష్టి సారించాలి..

రాంపురం గ్రామం- పెదగాడి మార్గంలో సుమారు 2కిలోమీటర్లు గుంతలతో నిండిపోయింది. పెదగాడి - చింతగట్ల గ్రామానికి వెళ్లే రహదారి సగంలో నిలిచిపోయి సుమారు ఒక కిలోమీటరు మేర రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ రహదారులు అభివృద్ధి చేస్తే పెదగాడి గ్రామస్థులతో పాటు చింతగట్ల, జెర్రిపోతులపాలెం ప్రజలకు ఎంతో మేలు చేసినట్లవుతుంది. సుమారు 15వేల మంది జనాభాకు ఉపశమనం కలుగుతుంది. ప్రస్తుతం చింతగట్ల, జెర్రిపోతులపాలెం ప్రజలు అటు నరవ, ఇటు సబ్బవరం మీదుగా ప్రయాసకు ఓర్చి పది కిలోమీటర్లు పైగా ప్రయాణించి పెందుర్తి మండల కేంద్రానికి రావాల్సి వస్తోంది. పెదగాడి రహదారి పూర్తయితే ఆ దూరం సగానికి తగ్గిపోతుంది. అలాగే రవాణా సదుపాయం కూడా మెరుగవుతుంది. ఈ నేపథ్యంలో పాలకులు, అధికారులు ఆయా రహదారుల అభివృద్ధిపై దృష్టిసారించి బాగు చేసి మేలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

11 నుంచి శ్రీఅభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం కూడలిలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 11నుంచి 15 వరకు అయిదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవాలకు చెందిన గోడపత్రికను ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 11న గణపతిపూజ, రక్షాబంధనం, పంచగవ్య ప్రాసన, మండప దేవతా పూజలు, నీజారన మంత్ర పుష్పములు, 12న మనోన్యాసపూర్వక రుద్రాభిషేకం, చండి పారాయణం, శ్రీరుద్రచండీహోమాలు, 13న మహాసౌరహోమం, మహాపూర్ణాహుతి ఉంటుందన్నారు. ఈ నెల 14న శాంతి కల్యాణం, పరమశివ తాండవం, స్వామి వారి ఊరేగింపు, కోలాటం ప్రదర్శన, 15న స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మాదాసు శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ పచ్చికోరు రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి మడక రమేశ్‌నాయుడు, వాసుదేవరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

చెక్కును అందిస్తున్న పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం నుంచి పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ ఆదివారం మొగలిపురంలోని తన నివాసంలో పంపిణీ చేశారు. వైద్య సేవల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న అప్పలకొండకు రూ. 48,350, దాసరి నాగరాజుకు రూ. 30,000, దంగేటి నాగేశ్వరరావుకు రూ. 43,887 చొప్పున మంజూరైన నగదును చెక్కు రూపంలో అందజేశారు. అదే విధంగా ప్రమాద బీమా కింద దుంగల లక్ష్మికి మంజూరైన రూ. 5లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో సబ్బవరం మండల తెదేపా అధ్యక్షుడు గండి ముత్యాలునాయుడు, గండి దేముడు, కె. గెడ్డయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గేయం వారోత్సవాలు

వేపగుంట, న్యూస్‌టుడే : జాతీయ గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేపగుంట ఓపెన్ జిమ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పార్కులో వాకర్స్ అంతా కలిసి జాతీయ గేయాన్ని ఆలపించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగుర వేసి వందనం తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు బీ.ఎన్.కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాకర్స్ పాల్గొని గేయం ప్రత్యేకతలను వివరించారు. వారం రోజులు పాటు జాతీయ గేయం విశిష్టతను చర్చిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఓపెన్ జిమ్ పార్కులో జాతీయ గేయం ఆలపిస్తున్న వాకర్స్

తండ్రి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు

కోలా సత్యనారాయణ

పెందుర్తి, న్యూస్‌టుడే: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తండ్రి తిరిగి రాలేదని ఓ యువతి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన కోలా సత్యనారాయణ (48) పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో ఆయన సక్రమంగా నడవలేరు, మాట్లాడలేరు. ఈ నెల 6న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని కుమార్తె పూజిత పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. దర్యాప్తు బాధ్యతలు హెచ్‌సీ సత్యనారాయణకు అప్పగించారు.

శిథిలావస్థకు చేరిన ట్యాంకు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధి జాలారిపేటలోని రక్షిత మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం నిధులు వెచ్చించి దశాబ్దాల క్రితం దీన్ని నిర్మించింది. అప్పటి నుంచి ట్యాంక్‌కు మరమ్మతు పనులు చేపట్టలేదు. దీంతో ప్రస్తుతం ట్యాంకు మెట్లు దెబ్బతిన్నాయి. ట్యాంకు పై నుంచి పెచ్చులూడి పడడంతో పాటు ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో బిక్కుబిక్కుమనాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ట్యాంకును తొలగించాలని పలు మార్లు అధికారులను కోరినా ప్రయోజనం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం నుంచి చోడవరం వెళ్లే రహదారి దారుణంగా మారింది. రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. రోడ్డుకు అంచుల్లో ప్రయాణం చేసే వారికి ముళ్లు గుచ్చుకొని ఇబ్బంది పడుతున్నారు. ఎదురుగా బారీ వాహనాలు వస్తే సమస్య ఇంకా తీవ్రంగా ఉంటుందని వాపోతున్నారు. రోడ్డు అంచులకు వెళ్లేందుకు పలువురు ఇష్టపడడం లేదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రతీ ఏడాది రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను ఆర్అండ్‌బీ అధికారులు తొలగించేవారు. కానీ ప్రస్తుతం తొలగించకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు వెంటనే దీనిపై చర్యలు తీసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైళ్లలో పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు వాల్తేర్ రైల్వే పోలీసులు తెలిపారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఆపరేషన్‌లో భాగంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఐదుగురు బాలల్ని రక్షించినట్లు తెలిపారు. ఆర్పీఎఫ్ ఎస్సై కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో ఒక బృందం రైళ్లలో భిక్షాటన చేస్తున్న బృందాన్ని గుర్తించారు. విచారణ చేపట్టగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పుర్ జిల్లాలోని పలు గ్రామాల నుంచి చిన్నారులను డబ్బుతో ప్రలోభపెట్టి విశాఖకు తీసుకొచ్చి జన్మభూమి, రత్నాచల్ రైళ్లలో భిక్షాటన చేయిస్తూ ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. వారి నుంచి కాపాడిన బాలలను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచి బాలల సంరక్షణ వసతి గృహానికి తరలించినట్లు తెలిపారు. కేసును పూర్తి దర్యాప్తు కోసం రాయ్‌పుర్‌లోని ఖరోరా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం

ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

చీమలాపల్లి(వేపగుంట), న్యూస్‌టుడే : డెంగ్యూ, మలేరియా, అంటు వ్యాధుల నివారణపై గోపాలపట్నం ఆదిత్య కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం చీమలాపల్లి పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి గణపతిరావు ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొని పలు వీధుల్లో ర్యాలీ చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేశారు. వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మరుగుదొడ్ల శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకంతో వచ్చే అనర్థాలను వివరించారు.

హద్దు మీరితే బైండోవర్లు తప్పవు

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై భాస్కరరావు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై భాస్కరరావు హెచ్చరించారు. ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే స్టేషన్ పరిధిలో 29మంది రౌడీషీటర్లపై ఒక్కొక్కరికీ రూ.3లక్షల చొప్పున బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రవర్తన మార్చుకోకుంటే మిగిలిన వారికీ ఇదే పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు. పరివర్తనతో మెలిగి మంచిగా జీవించాలని సూచించారు.

వేడుకగా గౌరీ సేవా సంఘం వన భోజనాలు

ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావును గజమాలతో సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి గౌరీ సేవా సంఘం వన భోజనాల కార్యక్రమం ఆదివారం పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెంలో ఘనంగా జరిగింది. సేవా సంఘం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, పెందుర్తి గౌరీ సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, గౌరీ సంఘం పెద్దలు బుద్ధా శివాజీ, వేగి దివాకర్, ఆళ్ల సత్యనారాయణ, శరగడం నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచి మడక అప్పలరాజు

జెర్రిపోతులపాలెం (వేపగుంట), న్యూస్‌టుడే: అనిల్‌నీరుకొండ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాన్ని జెర్రిపోతులపాలెంలో ఆదివారం ఏర్పాటు చేసింది. గ్రామ సర్పంచి మడక అప్పలరాజు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆసుపత్రి యాజమాన్యం కంటి, రక్తపోటు, మధుమేహం, ఈసీజీ వంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేసింది.

కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్యాయత్నం

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ చాణక్యనగర్‌కు చెందిన గుగ్గిలపు గణేశ్ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తుంటారు. అతని భార్య భాగ్యలక్ష్మీ (24) గృహిణి. కుటుంబ కలహాల కారణంగా తరచుగా భార్యాభర్తల మధ్య వాదులాట జరిగేది. అయితే ఆదివారం ఉదయం గణేశ్ బయటకు వెళ్లిపోయిన సమయంలో భాగ్యలక్ష్మీ ఇంటి తలుపులు వేసుకుని ఓ ద్రావణం తాగేసింది. ఎంతకూ తలుపులు తీయకపోవడంతో బంధువులు గణేశ్‌కు సమాచారం అందించారు. ఆయన 112ద్వారా పోలీసులకు విషయం తెలియజేశారు. ఈ మేరకు బ్లూకోల్ట్ కానిస్టేబుల్ వెంకటేశ్ సంఘటన ప్రాంతానికి చేరుకొని స్థానికుల సహకారంతో తలుపు గడియ విరగ్గొట్టి ఆమెను బయటకు తీసుకొచ్చారు. అనంతరం భర్త సాయంతో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని సీఐ తెలిపారు.

రుద్ర స్వరూపుడికి.. ఆరుద్ర నక్షత్ర అర్చనలు

శ్రమశక్తినగర్‌లో రామలింగేశ్వరుడికి జలాభిషేకం నిర్వహిస్తున్న పూజారులు

హరిహర క్షేత్రంలో కేదారేశ్వరుడికి అన్నాభిషేకం

పెందుర్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని రుద్రస్వరూపుడైన పరమేశ్వరుడికి ఆదివారం విశేష అర్చనలు, అభిషేకాలు వైభవోపేతంగా జరిగాయి. పెందుర్తి మండలంలోని పలు శివాలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆయా వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ★ జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ పోర్టు కాలనీలో కొలువైన పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి జలాభిషేకం నిర్వహించారు. భక్తులు జల కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. గర్భాలయ ప్రవేశ ద్వారం వద్ద తాత్కాలిక గోడ నిర్మించి పార్వతీ పరమేశ్వరులను జలాధివాసం చేశారు. ★ 97వ వార్డు సుజాతనగర్ హరిహర క్షేత్రంలోని కేదారేశ్వర స్వామి దేవాలయంలో కేదారేశ్వర స్వామికి అర్చకులు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. ★ 96వ వార్డు పెందుర్తి ప్రశాంతినగర్‌లోని స్వయంభూలింగాల మల్లికార్జున స్వామి ఆలయంలో శివపార్వతుల వార్షిక కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల తిరువీధి వేడుకగా నిర్వహించారు.

బాధిత బాలుడికి రూ.10లక్షల సాయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి నుంచి అగనంపూడికి చెందిన రిషిపాల్ అనే చిన్నారికి రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు. గాజువాక క్యాంపు కార్యాలయంలో బాలుడి తల్లిదండ్రులు కుమార్, సంగీతలకు చెక్కు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పసితనంలోనే పుట్టి చెముడుతో బాధపడుతున్న బాలుడికి కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని చెప్పారు. ఏపీఐఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, తెలుగుయువత జిల్లా కార్యదర్శి మొల్లి పెంటిరాజు పాల్గొన్నారు.

జాతీయ ఈత పోటీలకు ఎంపిక

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: బీచ్ రోడ్డు ఆక్వా స్విమ్మింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈత పోటీల్లో ఎంవీపీలోని ఎస్3 అరేనాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-14 బాలుర విభాగంలో యశ్మిత్ 50, 100, 200 మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో కాంస్యం, రజతం, స్వర్ణం. . బాలికల విభాగంలో ఎస్.సమన్విత 50, 100, 200 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో కాంస్యం, రెండు రజతాలు.. ధ్రుతి 200 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్యం గెలిచారన్నారు. అండర్-17 బాలికల విభాగంలో జ్ఞానశ్రీ 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజతం.. అండర్-19లో హిమశ్రీ 50, 100, 200 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో మూడు స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారన్నారు. వీరంతా వచ్చే నెల దిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేలకొరిగిన భారీ చెట్టు

వేపగుంట, న్యూస్‌టుడే : జోనల్ కార్యాలయం వెనుక భారీ వేప చెట్టు ఆదివారం నేలకొరిగింది. ప్రమాద సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తుపాను సమయంలో చెట్టు బాగా కిందకు ఒరిగిందని... ఇప్పుడు పడిపోయిందని స్థానికులు చెబుతున్నారు. సీసీ రోడ్లు వేసే సమయంలో జీవీఎంసీ సిబ్బంది ఆ చెట్టు ఉన్న భాగాన్ని పూర్తిగా వదిలేసి రహదారిని నిర్మించిందని తెలిపారు. దీంతో రహదారి విస్తరణకు నోచుకోకపోవడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందన్నారు. పడిపోయిన చెట్టుని తొలగించి ఆ స్థలంలో సీసీ రోడ్డుని నిర్మించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

జోనల్ కార్యాలయం వెనుక రహదారిలో..

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న యలమంచిలి రాజేశ్, నిర్వాహకులు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి నమ్మిదొడ్డికూడలిలో ఆదివారం శ్రీ కృష్ణా యాదవ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో యాదవ్స్ ప్రీమియర్ లీగ్ (వైపీఎల్-1) క్రికెట్ పోటీలు ప్రారంభించారు. జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడు యలమంచిలి రాజేశ్ చేతుల మీదుగా ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ..యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. మొత్తం 8 టీంలు ఈ పోటీలో పాల్గొంటాయాని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.35వేలు, రెండో బహుమతి రూ.20వేలు నగదు, జ్ఞాపికలు అందిస్తారన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి బెస్టు బ్యాట్స్‌మెన్, బౌలర్, క్యాచర్ తదితర అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు యలమంచిలి పైడిరాజు, ఈశ్వరపు వెంకటరావు, తాతాజీ, బంధం నరేశ్, బొట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

47 మంది రక్తదానం

సబ్బవరం, న్యూస్‌టుడే: జవానుగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన సబ్బవరం మండలం బాటజంగాలపాలెంనకు చెందిన గొర్లి శంకర్ జయంతి సందర్భంగా గ్రామంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గొర్లి మణిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువత పాల్గొని రక్తదానం చేశారు. గాజువాక వందే భారత్ ఆసుపత్రి సిబ్బంది 47 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సర్పంచి పడాల వెంకటరమణ, కాపుశెట్టి వెంకట్, పందిరిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ విశాఖ



విజేతలకు బహుమతులు అందిస్తున్న అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ఉన్నత పాఠశాలలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించిన పాఠశాలల క్రీడల సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో బాలబాలికల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో అన్ని రంగాల్లో ఛాంపియన్ షిప్ అవార్డు విశాఖ జిల్లాకు చెందిన క్రీడాకారులకే దక్కింది. రాష్ట్రం నుంచి బాలుర విభాగంలో 22 మంది, బాలికల విభాగంలో 22 మంది వచ్చేనెల మొదటి వారంలో ఇండోర్(మధ్యప్రదేశ్)లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు తవిటయ్య తెలిపారు.

రెండో రోజు విజేతలు..

డిస్కస్‌త్రో..: బాలుర విభాగంలో.. మల్లికార్జునరావు (గుంటూరు), రాజేష్ (విశాఖపట్నం), రాజు (విశాఖపట్నం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.
బాలికల విభాగంలో.. కె.నందిత (విశాఖపట్నం), కావ్య (శ్రీకాకుళం), యమునాసాయి (చిత్తూరు), **200మీ. పరుగు పందెం..:** బాలికలు: హాసిని (గుంటూరు), నిత్యసంతోషి (తూర్పు గోదావరి), ఉషశ్రీ సాయిదుర్గ (విశాఖపట్నం), **600మీ. పరుగు పందెం..:** బాలురు: కృష్ణమోహన్ దొర (విశాఖపట్నం), హారం (పశ్చిమ గోదావరి), శివప్రసాద్ (ప్రకాశం), **లాంగ్‌జంప్:** బాలురు: రాజేష్ (విశాఖపట్నం), రంజిత్ (శ్రీకాకుళం), వికాస్ (విశాఖపట్నం), బాలికలు: విశాల బొమ్మరెడ్డి (విశాఖపట్నం), చంద్రకళ (విజయనగరం), వైష్ణవి (ప్రకాశం), **4×100 రిలే:** బాలురు: విశాఖపట్నం, కర్నూలు, కడప, బాలికలు: శ్రీకాకుళం, విశాఖపట్నం, కడప, **బాలికల, బాలుర జట్టు, వ్యక్తిగత, ఓవరాల్ ఛాంపియన్:** విశాఖపట్నం

(c) eenadu

ఈనాడు
అనంతపురం
సోమవారం నవంబరు 10, 2025

ఆరోగ్యంతోనే ఆనందం

ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని, అదే అత్యంత సంతృప్తినిస్తుందని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం ఈనాడు-ఈటీవీ, జిల్లా సర్వజన ఆసుపత్రి ఆధ్వర్యంలో అనంతపురంలోని అరవిందనగర్‌లో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ బాలికల సంక్షేమ వసతి గృహ సముదాయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, గైనకాలజిస్టు డాక్టరు సుచిత్ర, చర్మ సంబంధిత వ్యాధుల నిపుణురాలు డాక్టరు చల్లా నీలిమ, బీసీ సంక్షేమ శాఖ డీడీ ఖుష్బూ కొఠారి హాజరై విద్యార్థినులకు ఆరోగ్య సూచనలు చేశారు. అనంతరం పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఈనాడు అనంతపురం యూనిట్ మేనేజర్ చంద్రశేఖర్‌ప్రసాద్ పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, అనంత సంక్షేమం, వైద్యం** (వివరాలు 6వ పేజీలో)

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. డిస్కం పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన వినియోగదారులు ఫోన్‌చేసి విద్యుత్తుకు సంబంధించిన సమస్యలు తెలియజేయవచ్చని, సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని సీఎండీ పేర్కొన్నారు. సంప్రదించాల్సిన చరవాణి నం. 89777 16661.

పీఎంఏవై గ్రామీణ ఇళ్ల నిర్మాణాలకు
దరఖాస్తుకు అవకాశం

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేని పేదలకు సొంతిల్లు సాకారం కానుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) ద్వారా ఇల్లు లేని పేదలు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు శైలజ తెలిపారు. అర్హులైన వారు సంబంధిత సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయంతో ఆవాస్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 2.50 లక్షలు అందిస్తారు. అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

సంతల ఆదాయం
రూ.3.59 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం రూ. 3,59,250 ఆదాయం వచ్చింది. అందులో శనివారం గొర్రెలు, మేకల సంతలో రూ. 2,19,050 ఆదాయం రాగా, ఆదివారం పశువుల సంతలో రూ. 1,40,200 ఆదాయం వచ్చింది. వచ్చిన ఆదాయాన్ని సోమవారం ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని యార్డు ఎంపిక శ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్ర కుమార్ తెలిపారు.

మాతృవందన
➠ లబ్ధిదారుల నమోదులో నిర్లక్ష్యం ➠ ఐసీడీఎస్‌లో అధ్వాన పురోగతి

అమ్మలకందేనా!

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి మాతృవందన యోజన (పీఎంఎంవీవై) పేద గర్భిణులకు ఒక వరం. కేంద్రం రూ. 5 వేలు, రాష్ట్ర ప్రభుత్వం జననీ సురక్ష యోజన (జేఎస్‌వై) కింద మరో రూ. వెయ్యి కలిపి మొత్తం రూ. 6 వేలు ప్రోత్సాహకం కింద చెల్లిస్తారు. తల్లీబిడ్డకు మెరుగైన ఆరోగ్యాన్ని కల్పించడం.. పోషణ లోపాన్ని నివారించడమే ఏకైక లక్ష్యంగా అమలు చేస్తున్నారు. ఈ పథకంపై ఐసీడీఎస్ యంత్రాంగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అర్హత కలిగిన ప్రతి గర్భిణికి రూ. 6 వేలు ప్రోత్సాహకం అందని ద్రాక్షలా మారింది. లబ్ధిదారుల పేర్ల నమోదులోనే నిర్లిప్తత ఆవహించింది. ఈ ఏడాది మేలో జిల్లా వైద్యారోగ్య శాఖ నుంచి ఐసీడీఎస్ శాఖకు బదలాయించిన తర్వాత పథకం అమలు బాలారిష్టాలను దాటడం లేదు. ఈ ఏడాది జులై నుంచి గర్భిణి, నిర్దేశిత తల్లుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గందరగోళంగా మారింది. అన్ని స్థాయిల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినా నమోదులోనే తప్పటడుగులు వేస్తున్నారు. నిజమైన లబ్ధిదారుల పేర్లు ఈ పథకంలో నమోదు కావడం లేదు.

పోషణ్ ట్రాకర్ ప్రకారం లబ్ధిదారుల వివరాలు	
మొత్తం లబ్ధిదారులు	32,924
ఎంపికైన వారు	2,102
తిరస్కరణ	17,700
మిగులు	13,122

ఎంపికలో అస్తవ్యస్తం

తొలి ప్రసవానికి ఆడ, మగ ఎవరైనా సరే నిర్దేశిత ప్రోత్సాహకం సొమ్ము లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. రెండో కాన్పులో ఆడపిల్ల పుడితేనే పీఎంఎంవైవీ వర్తించనుంది. మగబిడ్డ అయితే ఆ ప్రోత్సాహక మొత్తాన్ని ఇవ్వరు. ఈ ఏడాది జులై నుంచి గర్భిణి లేదా అప్పటికే ప్రసవం పొందినా సరే ఈ పథకంలో నమోదు చేస్తున్నారు. ఎంపిక ప్రక్రియ అస్తవ్యస్తం నడుస్తోంది.

శింగనమల ప్రాజెక్టు భేష్!

జిల్లా ఐసీడీఎస్ శాఖలో 11 ప్రాజెక్టుల్లో.. పీఎంఎంవీవై పురోగతిలో శింగనమల ప్రాజెక్టు 78.7 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచింది. కళ్యాణదుర్గం 76.9, నార్పల 75 శాతంతో ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. లబ్ధిదారుల ఎంపిక/నమోదులో వెనుకపడిన ప్రాజెక్టుల్లో కంబదూరు, కణేకల్లు, తాడిపత్రి, ఉరవకొండ ఉండటం గమనార్హం. కంబదూరు ప్రాజెక్టులో ఇప్పటి దాకా కేవలం 77 మంది మాత్రమే లబ్ధిదారులను తేల్చారు. పురోగతి సాధనలో చూస్తే.. అనంత అర్బన్ 44.3 శాతం, అనంత గ్రామీణం 46.6, తాడిపత్రి 50.9, కంబదూరు 52.6 శాతం నమోదుతో చాలా వెనుకపడ్డాయి. ఈ ఏడాది మే నుంచి ఈ పథకం కింద ఏ ఒక్క గర్భిణికి ప్రోత్సాహకం అందలేదంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అవగతం అవుతోంది.

ప్రత్యేక దృష్టి సారించాం - అరుణకుమారి, పీడీ, ఐసీడీఎస్

పథకంలో లబ్ధిదారుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాం. వారం రోజుల్లో పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. అంగన్‌వాడీ కార్యకర్త వద్ద నమోదు చేసుకుంటే.. సూపర్‌వైజర్లు, సీడీపీఓలు ఆమోదం పొందిన తర్వాత పీడీ లాగిన్‌కు వస్తాయి. ఇక్కడి నుంచి రాష్ట్ర కార్యాలయానికి సిఫార్సు చేస్తున్నాం. ఈ ప్రక్రియపై వేగం పెంచాం. తరచూ సమీక్షలు చేస్తున్నాం. వెనుకపడిన వారితోనూ ప్రత్యేకంగా మాట్లాడుతున్నాం.

చదును చేసిన ఆలయ స్థలం

వైకాపా నాయకుడి దుశ్చర్య
అనుమతుల్లేకుండా ఆలయ స్థలం చదును

కుందుర్పి, కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : పురాతన ఆలయాల స్థలాలు కబ్జాకు గురవుతున్నా ఎవరికీ పట్టడం లేదు. కుందుర్పి గ్రామ శివారులోని పురాతన శ్రీకణేబసప్ప ఆలయం చుట్టూ ఉన్న ఖాళీ సల్థంలో అదే గ్రామానికి చెందిన ఓ వైకాపా నాయకుడు రెండు రోజులుగా తవ్వకాలు చేపడుతున్నారు. గ్రామస్థులకు అనుమానం వచ్చి ఎందుకని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదు. ఆలయాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఇలా చేసినట్లు పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుందుర్పి - కళ్యాణదుర్గం మార్గంలోని ప్రధాన రహదారి నుంచి దయ్యాలదిబ్బ వరకు ఆలయానికి సంబంధించిన 35 సెంట్ల కొండ పోరంబోకు భూమి ఉంది. ఈ స్థలాన్ని ఆలయానికి అప్పగించారు. ఆలయానికి పడమర వైపు గత మూడు నెలలుగా అక్రమ కట్టడాలు వెలిశాయి. గతంలో కొందరు చిల్లర దుకాణాలు ఏర్పాటు చేసుకోగా పంచాయతీ అధికారులు తొలగించారు. ఇదే అదునుగా భావించి సదరు వైకాపా నాయకుడు ఆ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నాడు. కుందుర్పి మండల కేంద్రంలోని పలు పురాతన ఆలయాలకు సంబంధించి స్థలాలు, పొలాలు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా స్థలాల్లో నాలుగేళ్లుగా వైకాపా నాయకుల అండదండలతో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. దీనిపై తహసీల్దారు ఓబులేసును వివరణ కోరగా ఆలయ భూముల ఆక్రమణల విషయంలో గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికీ ఎలాంటి అనుమతులు లేవని, ఎలాంటి కట్టడాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను ఆయాశాఖల ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

రెవెన్యూ శిక్షణ అకాడమీ ఏర్పాటు చేస్తాం

➤ తిరుపతిలో స్థల సేకరణ పూర్తి
➤ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్. వేదికపై మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, కాలవ శ్రీనివాసులు, కలెక్టరు ఆనంద్, క్రీడాకారుడు శ్రీకాంత్ తదితరులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ చట్టాలపై శిక్షణ ఇవ్వడానికి రెవెన్యూ అకాడమీ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ అకాడమీ నిర్మాణానికి సంబంధించి తిరుపతిలో స్థల సేకరణ కూడా పూర్తయిందని నిధులు కేటాయించగానే పనులకు అంకురార్పణ చేస్తామని వెల్లడించారు. ఆదివారం అనంతపురం ఆర్డీటీ మైదానంలో రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడలు, సాంస్కృతిక పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రయోగాత్మకంగా అనేక జిల్లాల్లో 22(ఎ) జాబితాల్లో ఉన్న భూముల సమస్యలు దశల వారీగా పరిష్కారం చేస్తోందన్నారు. రీసర్వే సమస్యలను కూడా పరిష్కారం చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులకు ప్రొటోకాల్ విధులు తగ్గించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. ఏ శాఖ మంత్రి పర్యటిస్తే ఆ శాఖ అధికారులే ప్రొటోకాల్ విధులు చూసుకునే విధంగా నూతన విధానాన్ని అమల్లోకి తేవాలని ఆలోచిస్తున్నామని వివరించారు. **మంత్రి సవిత మాట్లాడుతూ** క్రీడలతో ఒత్తిడి తగ్గి ఉత్తేజం పెరిగి విధుల్లో రెవెన్యూ ఉద్యోగులు మరింత అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి క్రీడాపోటీల నిర్వహణ అద్వితీయమన్నారు. కలెక్టర్, సంయుక్త కలెక్టర్, జిల్లా రెవెన్యూ ఉద్యోగులు, క్రీడల సంఘం ఎంతో శ్రమపడి ఏలోటూ రాకుండా విజయవంతం చేశారని కితాబిచ్చారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పల్లె సింధూరరెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కలెక్టర్ ఓ. శ్రీధర్, సంయుక్త కలెక్టర్ శివనారాయణశర్మ, అంతర్జాతీయ క్రీడాకారులు కిదాంబి శ్రీకాంత్, సాకేత్ మైనేనిలు క్రీడల నిర్వహణపై ప్రసంగించారు. తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, రెవెన్యూ క్రీడా పోటీల రూపకర్త లక్ష్మయ్య, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

టీటీ డబుల్స్, సింగిల్స్ ట్రోఫీ అందుకుంటున్న డిప్యూటీ కలెక్టర్ జి.రామకృష్ణారెడ్డి (అనంతపురం)

కలెక్టరేట్‌లో ప్రజావేదిక నేడు

జిల్లా సచివాలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ఈనెల 10వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట దాకా అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. తనతోపాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారు. ఏ సమస్య అయినా సరే అర్జీ ఇవ్వడానికి బాధితులు రావచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గతంలో అర్జీలు ఇచ్చినట్లు రసీదులు ఉంటే వెంట తీసుకుని రావాలని చెప్పారు. సకాలంలో అర్జీలు ఇవ్వడానికి ప్రజలు రావాలన్నారు. నిర్దేశిత గడువు తీరిన తర్వాత వస్తే ఉపయోగం ఉండదన్నారు.

నట్టేట ముంచిన నాసిరకం విత్తనం
39 ఎకరాల్లో పత్తి పంట తొలగింపు

ఉరవకొండ, వజ్రకరూరు, న్యూస్‌టుడే: పత్తి రైతులను నాసిరకం విత్తనం కుదేలు చేసింది. వజ్రకరూరు మండలం ధర్మపురి గ్రామానికి చెందిన కేశవరెడ్డి 14 ఎకరాల్లో, రామిరెడ్డి, ఆయన సోదరుడు హనుమంతురెడ్డి నీటి కుంటల ఆధారంగా 25 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కాయ దశలో ఉంది. ఇప్పటి వరకు ఎకరాకు రూ. 60 వేలు చొప్పున 39 ఎకరాలకుగాను రూ. 24 లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెప్పారు. పంట బాగా పెరిగి, ఒక్కో మొక్కకు 60-70 కాయలు రావడంతో సంతోషించారు. అయితే కాయ పగలకుండా నల్లగా మారి, ఎండిపోతోంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం కానరాలేదు. ఏమి చేయాలో అర్థం కాక, పెట్టుబడి పెట్టలేక రైతులు 39 ఎకరాల్లో పత్తి పంటను ట్రాక్టర్లతో దున్ని తొలగించారు. చేతికి వచ్చిన పంట నోటికి అందకుండపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉరవకొండ వ్యవసాయ శాఖ ఏడీ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా రైతులు పూర్తి వివరాలు తెలిపితే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. పంట నష్టానికి ప్రధాన కారణాన్ని అన్వేషించే ప్రయత్నం చేస్తాం. నాసిరకం విత్తనం అని తేలితే చర్యలకు ప్రతిపాదిస్తామన్నారు.

దెబ్బతిన్న కాయలను చూపుతున్న రైతు కేశవరెడ్డి

పత్తి పంటను ట్రాక్టరుతో తొలగిస్తున్న రైతు

కోటి దీపోత్సవం

పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు విశేషసంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. మహిళలు కోటి దీపాలు వెలిగించారు. **- న్యూస్‌టుడే, ఆత్మకూరు**

దర్గాహొన్నూరు స్వామికి దీపారాధన

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు గ్రామంలో వెలిసిన దర్గాహొన్నూరుస్వామి ఉత్సవాల్లో బాగంగా ఆదివారం రెండో దీపారాధన వైభవంగా జరిపారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత వన్నళ్లి గ్రామంలోని మాజీ ఎంపీటీసీ కేపీ వన్నూరప్ప ఇంటి నుంచి స్వామి గుర్రంను ఊరేగింపుగా తీసుకురానున్నారు. అనంతరం దర్గా నుంచి హొన్నూరుస్వామి దేవుడి సవారీ ప్రారంభం కానుంది.

మొక్కజొన్న ధర నేలచూపు

➠ అన్నదాతల ఆందోళన ➠ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఎదురుచూపులు

కణేకల్లు, కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో మొక్కజొన్నకు గిట్టుబాటు ధర దక్కక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బహిరంగ విపణిలో ధరలు లేక, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కాక అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో ఖరీఫ్ కింద రాయదుర్గం, కళ్యాణదుర్గం, శింగనమల, తాడిపత్రి, ఉరవకొండ, రాప్తాడు, గుంతకల్లు ప్రాంతాల్లో 75 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైనట్లు అధికారులు నివేదిస్తున్నారు. 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్నట్లు అంచనా. గత 45 రోజులుగా దిగుబడి చేతికందుతున్నా.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

✦ కోతల ఆరంభంలో 2,100 పలికిన క్వింటాలు మొక్కజొన్నలు, ప్రస్తుతం రూ. 1,700కు పడిపోయాయి. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ. 2,400 ప్రకటిస్తే.. మార్కెట్‌లో క్వింటా రూ. 700 తగ్గించారని పంటను ఎలా విక్రయించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎకరాకు రూ. 35 వేలు ఖర్చు చేసినా, 20 క్వింటాళ్ల దిగుబడి అమ్మితే పెట్టుబడి రాక, కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ఈలెక్కన ప్రతి రైతు ఎకరాకు రూ. 15 వేలు చొప్పున నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు జిల్లా రైతులకు 105 కోట్ల మేర నష్టం వాటిల్లనుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం - పెన్నేశ్వరి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఇది వరకే ప్రభుత్వానికి నివేదించాం. అనుమతులు మంజూరు కాగానే క్షేత్రస్థాయిలో కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

మొక్కజొన్నలు ఆరబెట్టుకొంటున్న రైతులు

రైతుకు భరోసా ఏదీ? - గోవిందప్ప, కురాకులతోట, కళ్యాణదుర్గం మండలం



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగుకు రూ. 1.5లక్షలు పెట్టుబడి వ్యయం చేశా. దళారులు రూ. 1,500కు అడుగుతున్నారు. అన్ని ధరలు పెరుగుతున్నా మొక్కజొన్న ధరలు తగ్గుతున్నాయి. ఇలాగైతే పంటలు ఎలా సాగు చేయాలి.

ముగిసిన సత్యసాయి అఖండ భజన

పుట్టపర్తి, న్యూస్‌టుడే: విశ్వశాంతిని కాంక్షిస్తూ చేపట్టిన సత్యసాయి గ్లోబల్ అఖండ భజన ఆదివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. 24 గంటల పాటు ప్రపంచ నలుమూలలా ఉన్న సత్యసాయి సేవాసంస్థలు చేపట్టిన ఈ కార్యక్రమంలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరంలో బాబా మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదమంత్రోచ్చారణల నడుమ అఖండ భజన ముగించారు. భక్తులు సాయి గీతాలను ఆలపించారు. అన్న ప్రసాద వితరణ చేశారు. వేలాది మంది భక్తులతో మందిరం కిటకిటలాడింది.

సాయి గీతాలను ఆలపిస్తున్న భక్తులు

రూ.5 వేల కోట్లతో రెండు వరుసల రైల్వేలైన్

● ప్రయాణికులు, సరకుల రవాణాకు వేర్వేరు ఏర్పాట్లు ● బోర్డుకు నివేదిక పంపిన డివిజన్ అధికారులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అత్యవసర పనుల జాబితాలో చేర్చి మరో రెండు వరుసల రైల్వేలైన్ల నిర్మాణానికి సంబంధించి సర్వేను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి పంపాలని ఆదేశించింది. దీంతో గుంతకల్లు డివిజన్ అధికారులు ఆయా సర్వే నివేదికను పూర్తి చేసి నాలుగు రోజుల కిందట రైల్వే బోర్డుకు పంపారు. లైన్ల నిర్మాణానికి రూ. 5 వేల కోట్లు అవసరమవుతాయని అధికారులు సర్వే నివేదికలో పొందుపర్చారు.

✦ రైల్వే లైన్ల పనులకు సంబంధించి గుంతకల్లులోని గేజ్‌కన్వర్షన్ (నిర్మాణాలు) డిప్యూటీ చీఫ్ ఇంజినీరు కార్యాలయానికి చెందిన ఇంజినీర్లు సర్వే చేశారు. గుంతకల్లు డివిజన్ పరిధిలోని గుంతకల్లు- వాడి, గుంతకల్లు - రేణిగుంట, గుంతకల్లు - బళ్లారి సెక్షన్లలో ప్రస్తుతం రెండు వసుల లైన్లు ఉన్నాయి. వీటికి సమాంతరంగా మరో రెండు నిర్మించాలన్న యోచనలో ఉన్నారు. తద్వారా ప్రయాణికుల రైళ్లు, సరకులు, ఖనిజాలను రవాణా చేసే గూడ్సుల రాకపోకల కోసం వేర్వేరుగా ఏర్పాట్లు సమకూరుతాయి.

గుంతకల్లు-రేణిగుంట మధ్యనున్న రైల్వేలైన్

ప్రయాణికుల రైళ్లకు వెసులుబాటు

డివిజన్‌లో గుంతకల్లు- వాడి మధ్య (228.32 కి.మీ.లు), గుంతకల్లు - రేణిగుంట (305.24 కి.మీ.లు), గుంతకల్లు-బళ్లారి మధ్య (48.66 కి.మీ.లు) పొడవునా ప్రస్తుతం రెండు వరుసల లైన్లు ఉన్నాయి. ఈ మార్గాల్లోనే మరో రెండు లైన్లను ఏర్పాటు చేయబోతున్నారు. ప్రస్తుతం రెండు లైన్లు మాత్రమే ఉండడంతో ప్రయాణికుల రైళ్లు, గూడ్సులు సకాలంలో వెళ్లడానికి అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీన్ని అధిగమించడానికే రైల్వే బోర్డు సమాయత్తమవుతోంది. ప్రభుత్వం ఆయా పనులను త్వరగా ప్రారంభించాలన్న ఉద్దేశంతో సర్వే పూర్తి చేయాలని సూచించడంతో అధికారులు నివేదిక పంపారు. అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

ఆధునిక సాంకేతికతతో రహదారి నిర్మాణం

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల భద్రతే ధ్యేయంగా డానిస్ ఫైబర్ టెక్నాలజీని ఉపయోగించి రోడ్లు నిర్మిస్తున్నట్లు ఏపీ నేషనల్ హైవే ఇంజినీర్ చీఫ్ రామచంద్ర పేర్కొన్నారు. ఆదివారం వెంకటగారిపల్లి వద్ద ఆయన మాట్లాడుతూ గోతులు లేని రహదారుల నిర్మాణమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం డానిస్ ఫైబర్ టెక్నాలజీ ద్వారా వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పద్ధతి ద్వారా రహదారులపై భారీ వాహనాలు వెళ్లినా కుంగకుండా పదేళ్లపాటు మన్నికగా ఉంటాయన్నారు. పుట్టపర్తి నుంచి కోడూరు వరకూ నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్-342 నాలుగు వరుసల రహదారిపై ప్రయోగాత్మకంగా ఈ పద్ధతిలో రోడ్డు వేశామన్నారు. మొదటిసారిగా నంద్యాలలో ఈ విధానాన్ని ప్రయోగించామని, ఇక్కడ విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఈ సాంకేతికతను ఉపయోగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ విశ్రాంత నేషనల్ హైవే ఇంజినీరింగ్ చీఫ్ నయిముల్లా, డెన్మార్క్ దేశీయులు జోష్ సెబాస్టియన్, మైక్ గ్లోవర్, ఆర్అండ్‌బీ ఈఈ సంజీవయ్య, నేషనల్ హైవే డీఈఈ గిడ్డయ్య, ఏఈ కావ్య, డీఈ నాగపుల్లమరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీరు రామచంద్ర, అధికారులు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి



పూర్తి వివరములకు: 8008709784

(c) eenadu

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు(సోమవారం) ఉదయం పది గంటలకు శ్రీవారికి ఆర్జిత కల్యాణోత్సవం ఉంటుంది. ఉదయం ఆరు గంటలకు సాధారణ దర్శనం. ఏడు గంటల నుంచి తొమ్మిది మధ్య స్వర్ణకవచ, అభిషేక పూజలు ఉంటాయి. తర్వాత 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

EDUCATION

DMLT 2 సం॥ల కోర్సుకు అడ్మిషన్లు జరుగుచున్నవి. కొన్ని సీట్లు మాత్రమే కలవు. Q: ఇంటర్ (ఏ గ్రూపైన) SEEDS కాలేజ్, కమలానగర్, ATP. 9440255034

REAL ESTATE

హిందూపురంలో అద్భుతంగా డెవెలప్ చేసిన KVR రియాల్టీ ప్రాజెక్ట్స్‌లో ప్లాట్లు & 37 లక్షలకే డబుల్‌బెడ్ రూమ్ హౌసెస్ కలవు. సంప్ర: 6281824204.

PLOT FOR SALE

ATP Kadiri Rd.,Vinsent Depaul School Opp రోడ్ నుంచి 3rd Bit AHUDA అప్రూవ్డ్, North 40ft West 30ft రోడ్, Corner 10 Cents Sale 9581196786.

ఉరవకొండ నందు అనంతపురం - బళ్లారి హైవే ప్రక్కన కస్తూరిబా స్కూల్ ముందర DTCP అప్రూవల్ 40x55 సైజ్ గల 15 ప్లాట్లు అమ్మబడును. Cont: 9440006008.

JOBS

Urgent Civil Site Supervisors Required with or without Experience. Location Karnataka. Contact: 9347083151.

Required ITI/ Diplomain Electricals /Electronics Candidates with without Exp. for UPS & Stabilizer Service Engineers & Marketing Executives At Anantapur, Tirupathi, Kadapa. Cont: Techser Power Solutions Pvt. Ltd., Cell: 9849770651

ATP టౌన్ శ్రీనగర్ కాలనీ, 80 Fts రోడ్, అయ్యప్ప స్వామి టెంపుల్ దగ్గర ఉన్న దరూర్ లైఫ్ స్టూడియో (జిమ్ సెంటర్/ స్విమ్మింగ్ అకాడమీ) నందు సూపర్‌వైజర్స్/ రిసెప్షనిస్ట్/ క్లీనర్స్/ సెక్యూరిటీ స్టాఫ్‌గా పనిచేయడానికి ఆసక్తి కల్గినవారు సంప్రదించండి. ✆ 9381625959, 7013173562.

ప్రభుత్వ సంస్థల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేయుటకు కం. ఆపరేటర్లు, అటెండర్స్, సూపర్‌వైజర్లు కావలెను. జీతం. 16500. ✆ 98487 71117.

FACULTY/ TEACHERS

Wanted Experienced Female Staff for Science and English Subject (3 to 5 Classes) to Work in Blossoms School, Aravinda Nagar, ATP. Mob: 9030777676.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి దబ్బును వసూలు చేయరాదు. దబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Eenadu Classifieds — 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ఆరోగ్యంగా లేకుంటే.. ఎన్ని కోట్లు ఉన్నా వ్యర్థం

- ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన
- ఈనాడు-ఈటీవీ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహణ

విద్యార్థినులను పరీక్షిస్తున్న డాక్టర్ హేమలత

వైద్య శిబిరానికి హాజరైన విద్యార్థినులు

అనంత సంక్షేమం, వైద్యం, న్యూస్‌టుడే: ఆరోగ్యంగా లేకుంటే ఎన్ని లక్షల కోట్లు ఉన్నా ఏం చేయలేమని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం ఈనాడు, ఈటీవీ, జిల్లా సర్వజన ఆసుపత్రి ఆధ్వర్యంలో అనంతపురం అరవిందనగర్‌లో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ బాలికల సంక్షేమ వసతి గృహసముదాయంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 8వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థినులు వైద్యసేవలు వినియోగించుకున్నారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. బాలికలు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరం అన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండి ఒత్తిడిని అధిగమించాలంటే ఈ వయసులోనే ఆ శక్తి రావాలన్నారు. ఐఐటీ, ఎన్ఐటీల్లో ఎంపిక అయి కూడా ఒత్తిడిని తట్టుకోలేక కొందరు యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. పాల నుంచి మొదలైన అన్ని ఆహార పదార్థాల్లో కల్తీ ఉంటోందన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు జంక్‌ఫుడ్ అలవాటు చేసుకుంటున్నారు. సాధ్యమైనంత వరకు ఇంట్లో వండిన ఆహారాన్నే తీసుకోవాలన్నారు. చిన్న వయసు నుంచే చరవాణికి అలవాటు పడితే రేడియేషన్ ఎక్కువ అవుతుందన్నారు.

వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారిణి ఖుష్బూ కొఠారి మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరం వసతి గృహంలోని విద్యార్థినులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పలు రంగాలకు సంబంధించిన నిష్ణాతులైన మహిళా డాక్టర్లు రావడంతో ఏ తరహా సమస్య ఉన్నా సందేహం లేకుండా చెప్పి అవసరం అయిన వైద్యసేవలు పొందాలన్నారు. బయటకు చెప్పలేని అంశాలు ఏమున్నా డాక్టర్ల వద్ద చెబితే మందులతో పోతాయని ఎక్కువ సంవత్సరాలు చెప్పకుండా మొహమాటంతో ఉంటే శస్త్ర చికిత్స వరకు వెళ్లాల్సి ఉంటుందన్నారు.

అనంతపురం ఈనాడు యూనిట్ మేనేజరు చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత 51 సంవత్సరాలుగా మొదటి స్థానంలో ఈనాడు ఉందంటే దానికి కారణం విశ్వసనీయత, బాధ్యతాయుతంగా ఉండడమేనన్నారు. వార్తలతోపాటు సమాజసేవే లక్ష్యంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పత్రికా రంగంలో మహిళల కోసం ప్రత్యేకంగా వసుంధర పేజీని ప్రారంభించిన పత్రిక ఈనాడు అని గుర్తు చేశారు. కొవిడ్ సమయంలో దాతలు, సేవలు పొందే వారి వివరాలు ఈనాడు మీతోడు ద్వారా అనుసంధానం చేసి సహాయం అందే విధంగా చేశామన్నారు. విద్యార్థులకు ఏవైనా చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉంటే ఈ వేదికను ఉపయోగించుకోవాలని సూచించారు.

ఉచితంగా మందుల పంపిణీ

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యనిపుణులు హేమలత, చర్మ సంబంధిత వైద్య నిపుణులు చల్లా నీలిమా, గర్భ సంబంధిత వైద్యనిపుణులు సుచిత్ర విద్యార్థినులకు ఉచితంగా వైద్యసేవలు అందించారు. విద్యార్థినులు ఆరోగ్య సమస్యలను వైద్యుల వద్దకు వెళ్లి విన్నవించారు. ఈ సందర్భంగా వైద్యులు సూచించిన మేరకు అక్కడే ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మరికొందరు విద్యార్థినులకు రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. సంక్షేమ వసతి గృహ అధికారులు ఆదిలక్ష్మి, శహంతాజ్, సుజాత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

హక్కులు, బాధ్యతలపై అవగాహన ముఖ్యం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రాథమిక హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. విజయనగర న్యాయ కళాశాలలోని ఆదివారం మూడో కోర్టు హాలులో జాతీయ న్యాయసేవా దినోత్సవం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులతో ఆయన మాట్లాడారు. చదువులతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం లభించని సందర్భాల్లో సివిల్, క్రిమినల్ కేసులు దాఖలు చేయవచ్చన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఉచితంగా న్యాయసేవలు అందుతాయన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, న్యాయ కోర్సు విద్యార్థులు హాజరయ్యారు.

రైతు నాగరాజుకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న విశ్వవిద్యాలయ అధికారులు, ప్రముఖులు

ప్రకృతి వ్యవసాయ రైతుకు డాక్టరేట్

బసంపల్లి (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు నాగరాజు డాక్టరేట్ అందుకున్నారు. బెంగళూరు నగరానికి చెందిన భారత వర్చువల్ విశ్వవిద్యాలయ అధికారులు, పలువురు ప్రముఖులు డాక్టరేట్ ప్రదానం జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో విశేష సేవలు అందిస్తున్న వారిలో కొంతమందిని ఎంపిక చేసి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు, డాక్టరేట్లు ప్రదానం చేశారని, 30 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తనకు ఈ గుర్తింపు దక్కిందని నాగరాజు పేర్కొన్నారు. నగరంలోని ఏజే ఇంటర్ నేషనల్ కన్వెన్షన్ హాలులో ఈ అవార్డు అందించారన్నారు. విశ్వవిద్యాలయ డీన్ టీఎం స్వామి, నవయుగ గ్రూప్ ఛైర్మన్ వెంకటరామరాజు, ఎయిర్ ఫోర్స్ విశ్రాంత అధికారి షణ్ముగం, కర్ణాటక రాష్ట్ర పర్యాటక శాఖ ఛైర్మన్ వెంకటరెడ్డి పాల్గొన్నట్లు వివరించారు.

లక్ష్యంపై గురి.. కొలువుదీరి

ఆదర్శంగా నిలిచిన శిక్షణ ఎస్సై ఉమాదేవి

గోరంట్ల, న్యూస్‌టుడే: తండ్రి ఆటోడ్రైవర్, తల్లి గృహిణి. ఉన్నత చదువుకు వెళ్లాలన్నా సహకరించని ఆర్థిక పరిస్థితి. ఇలాంటి తరుణంలో కుటుంబ స్థితిగతులు మారాలన్నా, సమాజంలో గౌరవం దక్కాలన్నా కష్టపడి చదివి మంచి అధికారిగా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో అడుగేసి విజయతీరాన్ని అందుకుంది. కష్టం ముందు ప్రతిభ తలవంచాల్సిందేనని నిరూపించి చిన్నవయసులోనే ఎస్సైగా ఉద్యోగం సాధించి, యువతకు ఆదర్శంగా నిలుస్తోంది కర్నూలు నగరానికి చెందిన ఉమాదేవి. 2024 బ్యాచ్ ఎస్సై శిక్షణలో భాగంగా గోరంట్ల పీఎస్‌లో విధులు నిర్వహిస్తోంది.

కర్నూలు నగరానికి చెందిన రాజన్న, పద్మావతిల రెండో సంతానం ఉమాదేవి. నగరంలోని వివిధ విద్యాసంస్థల్లో విద్యాభ్యాసం సాగించింది. బీఎస్సీ మైక్రోబయాలజీ అనంతరం 2022- 23లో బీఈడీ పూర్తిచేశారు. పదోతరగతిలో పాఠశాల టాపర్‌గా నిలిచారు. వైద్యురాలి కావాలన్న కోరికతో ఇంటర్‌లో బైపీసీ తీసుకున్నారు. నీట్‌లో మధ్య స్థాయి ర్యాంకు వచ్చింది. మెడిసిన్‌లో చేరడానికి అవకాశం ఉన్నా ఆర్థిక పరిస్థితి లేక బీఎస్సీలో చేరారు. బీఈడీ పూర్తయిన వెంటనే

ఎస్పీ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న ఉమాదేవి

ఎస్సై ఉద్యోగ ప్రకటన వెలువడడంతో ఇంటి వద్దే చదివి మొదటి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకుంది.

అవార్డు అందుకున్న స్ఫూర్తితో..

డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న సమయంలో కర్నూలు నగరంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది ఉమాదేవి. ఆప్పటి కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంది. ఆహోదా చూసిన ఆమె తనూ కలెక్టర్ కావాలన్న లక్ష్యంగా ఎంచుకుంది. ప్రసుత్తం ఎస్సై ఉద్యోగానికి ఎంపికైన తన ఆశయం సివిల్స్ సాధించడమే అంటోంది యువ ఎస్సై.

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి

ప్రతి విద్యార్థి 18వ ఏట నుంచి 25 ఏళ్ల వరకు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకుంటే జీవతాంతం సుఖంగా ఉంటారు. ఆ సమయంలో సామాజిక మాధ్యమాలకు, దురలవాట్లకు, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి. సమయాన్ని వృథాచేయకుండా చదవాలి. లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే అనుకున్నది సులభంగా సాధించవచ్చు. సమాజంలో అబ్బాయిలు, అమ్మాయిలు సమానం అన్న భావన ఉండాలి. **-ఉమాదేవి, శిక్షణ ఎస్సై**

మద్యం మత్తులో ఆటో చోదకుడు.. ఆగ్రహించిన మంత్రి

చోదకుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ, న్యూస్‌టుడే: పూటుగా మద్యం తాగి ఓ ఆటో చోదకుడు అడ్డదిడ్డంగా నడపుతూ మంత్రి కాన్వాయికి అడ్డు రావడంతో గమనించిన రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత చోదకుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మంత్రి అనంతపురం నుంచి పెనుకొండకు వస్తున్న సమయంలో పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో కాన్వాయ్ సైరన్ మోగించినా ఆటో చోదకుడు ఇష్టారాజ్యాంగా నడపడం గమనించిన మంత్రి ఆటోను ఆపి చోదకుడిని తీవ్రస్థాయిలో మందలించారు. ధర్మవరానికి చెందిన ఆటోచోదకుడు బాలన్న పెనుకొండ నుంచి ప్రయాణికులతో ధర్మవరం వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పలువురు చోదకులు మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా అమాయకులైన ప్రయాణికులు, పాదచారుల ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి జూడో పోటీలు

మొదటి స్థానంలో నిలిచిన అనంతపురం జట్టుతో ముఖ్య అతిథులు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ జూడో 69వ ఛాంపియన్‌షిప్ అండర్-17 బాలబాలికల పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో ఈ నెల 7న ప్రారంభమై ఆదివారంతో ముగిశాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు సుధారాణి, శ్రీనివాసరావు తెలిపారు. బాలుర విభాగంలో అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో, కృష్ణా జిల్లా ద్వితీయ స్థానంలో, కర్నూలు జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. బాలికల విభాగంలో అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో, చిత్తూరు జిల్లా ద్వితీయ స్థానంలో, గుంటూరు జిల్లా తృతీయస్థానంలో నిలిచాయన్నారు. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా కాకినాడ రూరల్ మండల విద్యాశాధికారి టీవీఎస్ రంగారావు, ఎంఈవో-2 శ్రీనివాసకుమార్, డీఎస్‌డీవో సతీష్‌కుమార్ హాజరై విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం జూడో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా పీఈటీ సంఘం కార్యదర్శి మాచరరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, సీనియర్ పీడీ, హాకీ కోచ్ రవిరాజు, పీడీలు గిరి, ప్రసాద్‌రెడ్డి, మూర్తి, శ్రీహరిరాజు పాల్గొన్నారు.

సత్వర న్యాయమే లక్ష్యం

మాట్లాడుతున్న ఏడీజే శైలజ

హిందూపురం, న్యూస్‌టుడే: కక్షిదారులకు సత్వర న్యాయం అందించటం న్యాయసేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశమని అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ అన్నారు. న్యాయ సేవాధికార దినోత్సవం సందర్భంగా ఏడీజే ఆదివారం కేజీబీవీ, ఎస్సీ బాలుర వసతి గృహంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్నచిన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని వీటి కోసం కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగితే అన్నివిధాలా నష్టపోవాల్సి వస్తోందన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమని, ఎవ్వరికి ఎలాంటి మినహాయింపు ఉండదన్నారు. విద్యార్థులు విద్యలో రాణిస్తూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సదస్సులో ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య చట్టాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. న్యాయవాదులు సుదర్శన్, మురళి, రవిచంద్ర, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ సిబ్బంది, ప్యారా వాలంటీర్లు సదస్సుల్లో పాల్గొన్నారు.

చెస్ ఛాంపియన్లుగా అనంతపురం జట్లు

ఛాంపియన్‌గా నిలిచిన అనంతపురం జిల్లా బాలబాలికలు

సీతానగరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి చదరంగం క్రీడా పోటీల్లో అనంతపురం జిల్లా బాలబాలికలు సత్తా చాటారు. అండర్-19 విభాగంలో బృంద పోటీల్లో అనంతపురం బాలురు, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. సీతానగరం మండలం జోగింపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలోని మినీ ఆడిటోరియంలో ఆదివారం పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. విజేతలకు పతకాలు అందజేశారు. అండర్-14, 17, 19 వ్యక్తిగత విభాగాల్లో బాలికలు 15 మంది, బాలురు 15 మంది జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.మురళి తెలిపారు.

చీర సంచుల పంపిణీ

సంచులు అందజేస్తున్న అశ్రిత, ట్రస్టు ప్రతినిధులు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : అనంతపురం నగరంలో ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ కుమార్తె దగ్గుపాటి అశ్రిత పిలుపునిచ్చారు. దగ్గుపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనంతపురం గడియార స్తంభం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర ప్రజలకు చీర బ్యాగులను ఉచితంగా అశ్రిత పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నగర ప్రజలు ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని సూచించారు. మానవాళికి ప్లాస్టిక్ అన్నది ప్రమాదకరమని, ప్రజల సహకారం లేకపోతే ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యం కాదన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరు కదలిరావాలన్నారు. ఫౌండేషన్ తరపున 9999 బ్యాగులు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఇంట్లో పాత చీరలు ఉంటాయని, వాటితో బ్యాగులు తయారు చేసుకోవాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వచ్చే ప్రతి ఒక్కరు బ్యాగు వెంట తెచ్చుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు.

అమ్మోనియం నైట్రేట్ పట్టివేత

పోలీసులు పట్టుకున్న అమ్మోనియం నైట్రేట్

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, పామిడి: ప్రమాదకర పేలుడు పదార్థమైన అమ్మోనియం నైట్రేట్ అక్రమ నిల్వలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పామిడి మండలం నీలూరు వద్ద ఉన్న లక్ష్మీ వెంకటేశ్వర కంకర క్రషర్‌లో 50 కిలోల పరిమాణంలోని 100 బస్తాలను స్పెషల్ బ్రాంచి పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. తాడిపత్రికి చెందిన కంబగిరి రాముడు ఈ క్రషర్ యూనిట్ నిర్వహిస్తున్నారు. అందులోకి కావాల్సిన పేలుడు పదార్థాలను తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా కొండాపురం నుంచి అక్రమంగా తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. తమిళనాడు వేలూరు జిల్లా వెప్పన్‌కుప్పంలోని సుప్రీం ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఆర్డర్ ద్వారా అమ్మోనియం నైట్రేట్‌ను అక్రమంగా తరలిస్తూ వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పామిడి పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

అంజలీకుమారి

పెనుకొండ, న్యూస్‌టుడే: మద్యానికి బానిసైన భర్త ఎంతచెప్పినా మానుకోవడం లేదని మనస్తాపం చెందిన ఓ ఇల్లాలు చివరకు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కియా ఇండస్ట్రీయల్ ఏరియా పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ పీరా తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని గోపాల్‌గంజ్ జిల్లా కర్మణి గ్రామానికి చెందిన ప్రిన్స్‌కుమార్‌రాయ్ కియా అనుంధ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ పెనుకొండ మండలంలోని గుట్టూరులో నివాసం ఉంటున్నాడు. ఇతడికి రెండేళ్ల క్రితం అంజలీకుమారి(23)తో వివాహం జరిగింది. భర్త మద్యం మానుకోవడం లేదని మనస్తాపంతో శనివారం అర్ధరాత్రి ఆమె ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి శవపరీక్షలు నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని లోనికోట కాలనీలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుడు శివ (36) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మవరం 1వ పట్టణ పోలీసుల కథనం మేరకు.. భవన నిర్మాణ పనులు చేస్తూ మృతుడు జీవనం సాగించేవాడు. రోజూ మద్యం తాగుతుండేవాడు. మొత్తం డబ్బు తాగుడుకే ఖర్చు చేస్తే కుటుంబం గడిచేది ఎలా అని భార్య నవనీత ప్రశ్నించేది. ఈ క్రమంలో వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేసుకొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కదురప్ప

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మణూరు గ్రామానికి చెందిన కదురప్ప(46) కానుగచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌హెచ్‌ఓ సత్యరాజ్ అందించిన వివరాల మేరకు.. కదురప్ప పదేళ్ల క్రితం బెంగళూరుకు కూలీ పనులకు వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కాలు జారీ కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. శస్త్ర చికిత్స చేసినా కోలుకోలేదు. అప్పటి నుంచి గ్రామంలోనే ఉంటూ మతిస్థితిమితం లేక తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్తుండేవాడు. ఈ నెల 4న వెళ్లిన వ్యక్తి సాయంత్రమైన రాకపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం గాలించారు. 8న గ్రామం బయట పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని అటువైపు వెళ్లేవారు గమనించి మృతుని భార్య, బంధువులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

స్థలం విషయంలో తెదేపా, వైకాపా కార్యకర్తల ఘర్షణ

నలుగురుకి గాయాలు

దాడిలో గాయపడిన తెదేపా కార్యకర్త వెంకటరాముడు

నార్పల, న్యూస్‌టుడే : మండల పరిధిలోని నాయనపల్లి గ్రామంలోని అంబేడ్కర్‌కాలనీలో ఓ స్థలం విషయంలో తెదేపా, వైకాపా కార్యకర్తల మధ్య వివాదం చెలరేగింది. అది కాస్త పరస్పరం దాడులు చేసుకునే వరకూ వెళ్లింది. ఈ దాడుల్లో తెదేపా, వైకాపా కార్యకర్తలకు గాయాలయ్యాయి. నాయనపల్లి ఆర్డీటీ పాఠశాల పక్కనే తెదేపా కార్యకర్త ఓబులేసు నివాస గృహం ఉంది. దీనిపక్కనే ఉన్న స్థలంలో పశువుల పాక వేయడానికి యత్నించడంతో కాలనీకి చెందిన పలువురు వైకాపా కార్యకర్తలు శ్రావణ కుమార్, శశికుమార్, నారాయణమ్మలు ఇది ఆర్డీటీ స్థలం అంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల కిందట రెవెన్యూ అధికారులొచ్చి స్థలాన్ని సర్వే చేశారు. ఆదివారం ఓబులేసు తన కుమారులతో కలిసి పశువుల పాక వేయడానికి యత్నించడంతో వైకాపా కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఓబులేసు కుటుంబానికి వైకాపా కార్యకర్తలకు వాగ్వాదం జరిగింది. చివరకు రాళ్లతో సరస్పరం దాడులు చేసుకున్నారు. ఈఘటనలో ఓబులేసు కుమారుడు వెంకటరాముడుతో పాటు వైకాపా కార్యకర్తల్లో ముగ్గురూ గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంకటరాముడిని తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి నరసానాయుడు పరామర్శించారు. దాడిచేసిన వైకాపా కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. వైకాపా కార్యకర్తలను ఆపార్టీ నాయకుడు సాకే శైలజానాథ్ పరామర్శించారు. నార్పల పోలీసులు ఇరువైపుల బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి విచారణ చేపట్టారు.

లాటరీ పేరుతో డబ్బు వసూలు

మోసపోయిన మూడు గ్రామాల ప్రజలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : లాటరీ ద్వారా వేలాది రూపాయలు విలువ చేసే ఎలక్ట్రికల్ వస్తువులు సొంతం చేసుకోవచ్చని మాయమాటలు చెప్పి ఓ మోసగాడు ప్రజల నుంచి సొమ్ము వసూలు చేసుకొని ఉడాయించాడు. ఈఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. కళ్యాణదుర్గం, బెళుగుప్ప మండలాల పరిధిలోని పాతచెరువు, బోరంపల్లి, గంగవరం తదితర గ్రామాల్లో లాటరీ పేరు చెప్పి ప్రజల నుంచి వసూలు చేశాడు. ముందుగా ఒక రోజు ముందు ఒక్కొక్కరి నుంచి లాటరీ కింద రూ.2 వేలు వసూలు చేశాడు. ఉదయాన్నే వచ్చి లాటరీ నిర్వహించి రూ.22 వేలు విలువ చేసే టీవీ, రూ.20 వేల వాషింగ్ మిషన్, రూ.20 వేల చరవాణి, రూ.25 వేల రిఫ్రిజిరేటర్‌తో పాటు ఎలక్ట్రికల్ పరికరాలు ఇస్తామని నమ్మబలికాడు. దాదాపుగా 60 మందికి పైగానే నమ్మి డబ్బులు ఇచ్చారు. ఉదయాన్నే వస్తానన్న సదరు వ్యక్తి రాకపోవడంతో లబోదిబోమంటూ వాపోయారు. బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మరిన్ని వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

బావను హతమార్చిన బావమరిది

మలాన్‌బాషా

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో బావను బావమరిది హతమార్చిన ఉదంతం వెలుగుచూసింది. రెండో పట్టణ సీఐ రెడ్డెప్ప వివరాల మేరకు.. ఆదివారం మలాన్‌బాషా (40)ను అతడి బావమరిది రామచంద్ర పూలకుండీతో తలపై కొట్టడంతో మృతి చెందాడు. వైఎస్సార్ కాలనీకి చెందిన బాషా మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పట్టణంలోని బోయవీధికి చెందిన రాధను 16 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇటీవల భార్య మరో యువకుడితో సన్నిహితంగా ఉంటోందని అనుమానించి ఆమెను బాషా దండించాడు. ఈ విషయాన్ని ఆమె సోదరుడు రామచంద్ర తెలుసుకున్నాడు. అతడి స్నేహితులతో కలసి బావ ఇంటికి వెళ్లి గొడవకు దిగాడు. పూలకుండీతో బాషా తలపై కొట్టడంతో అతడు మృత్యువాత పడ్డాడు. ఘటనా స్థలిని సీఐ పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రామచంద్ర అతడి స్నేహితులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

(c) eenadu

జ్యోతులను మోసుకొస్తున్న మహిళలు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం

కుందుర్పి: శ్రీఆంజనేయస్వామి ఆలయంలో నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. కలిగులిమి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజలు భక్తిశ్రద్ధలతో కలశాలు తీసుకొచ్చి పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. మహిళలు ఊరేగింపుగా జ్యోతులు తలపై పెట్టుకుని ఆలయానికి తీసుకొచ్చారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ఘనంగా కార్తిక వన మహోత్సవం

ఉసిరి చెట్టు పూజల్లో ఆర్యవైశ్యులు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని కోనాపురం గ్రామం శ్రీ లక్ష్మి నరసింహస్వామి గుడి సమీపంలోని ఆర్యవైశ్యులు శ్రీ సద్గురు కుటుంబ సభ్యులైన నామా నాగేంద్రప్రసాద్, నామా సత్యనారాయణ సోదరుల వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం కార్తిక వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా తోటలోని ఉసిరి చెట్టును పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి, మహిళలు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు తోటలో వివిధ రకాల వంటకాలు తయారు చేసి సహపంక్తి కార్తిక వనభోజనాలు చేశారు.

మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా తిమ్మప్ప

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఇన్‌ఛార్జి మున్సిపల్ ఛైర్మన్‌గా హరిజన తిమ్మప్పను నియమిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్న రాజ్‌కుమార్‌ను తొలగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వైస్ ఛైర్మన్‌గా ఉన్న తిమ్మప్పను ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా నియమించారు. ఎన్నికలు జరిగి కొత్త ఛైర్మన్ ఎన్నిక అయ్యే వరకు ఛైర్మన్‌గా తిమ్మప్పే కొనసాగుతారని ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులో పేర్కొన్నారు.

గోనేహాళ్‌లో యువతుల నృత్య కోలాహలం

తీరనున్న తాగునీటి సమస్య

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి లేకుండా చేయాలన్న ఉద్దేశంతో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం

జలజీవన్ మిషన్ కింద నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న తాగునీటి అభివృద్ధి పనులను మరో నాలుగు నెలల్లో పూర్తి చేయడానికి మంత్రి సూచించిన ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నాం. వాటిని పూర్తి చేసి, గ్రామాల్లో రోజూ తాగునీటి సరఫరా చేయాలన్నది లక్ష్యం. ఆ దిశగా పనులు వేగంగా సాగేలా చొరవ చూపుతున్నాం.

- అంజుమన్ షఫ్రీన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఉరవకొండ

● రెండు ప్యాకేజీల్లో రూ.32 కోట్లతో పనులు

ఇందులో భాగంగా ఈ నియోజకవర్గానికి మంజూరైన జలజీవన్ మిషన్ పనులు రద్దు కాకుండా సీఎంను ఒప్పించడంతో తాగునీటి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఐదు మండలాల్లో రెండు ప్యాకేజీల్లో రూ. 32 కోట్లతో పనులు చేపట్టారు. వాటిలో దాదాపు 60 కిలో మీటర్ల మేర కొత్త పైపులైన్ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో ఇప్పటికే రూ. 12 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. మిగతా మొత్తంలో భాగంగా మరో పది గ్రామాల్లో 10 ఓహెచ్ఎస్ఆర్‌ల నిర్మాణం కొనసాగుతోంది. ఆయా గ్రామాల్లో జనాభాను బట్టి 40 వేల నుంచి 90 వేల లీటర్ల నీటి సామర్థ్యంతో వాటిని నిర్మిస్తున్నారు. మరిన్ని గ్రామాల్లో పైపులైన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

ఉరవకొండ మండలం బూదగవిలో పూర్తి కావచ్చిన ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం

గత ప్రభుత్వంతో కష్టాలు

గత ప్రభుత్వంలో వైకాపా పాలకుల వైఫల్యం కారణంగా నియోజకవర్గంలో విపరీతమైన తాగునీటి ఎద్దడిని ప్రజలు ఎదుర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో మరింత ఇబ్బందిని చవి చూశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్న తాగునీటి అభివృద్ధి పనులతో పూర్తి స్థాయిలో నీటి సమస్య తీరనుంది.

జొన్న పంటను దున్నేశారు

● న్యాయం చేయాలంటూ మహిళా రైతు ఫిర్యాదు

నేలకొరిగిన పంటను చూపుతున్న బాధితులు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : మండలంలోని కురువళ్లి గ్రామానికి చెందిన రత్నమ్మ అనే మహిళా రైతుకు సంబంధించిన ఎనిమిది ఎకరాల జొన్న పంటను ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు దున్నేసి నష్ట పరిచినట్లు బాధితురాలు వాపోయారు. ఆమె ఫిర్యాదు మేరకు వివరాలిలా.. కురువళ్లి గ్రామ సర్వే నంబరు 18 ఎస్-1లో తమకు ఉన్న 8 ఎకరాల భూమిలో జొన్నపంటను సాగు చేశామన్నారు. ప్రస్తుతం జొన్న పంట కంకిదశలో ఉండగా ట్రాక్టర్ సాయంతో జొన్న పంటను అంతా కూడా దున్నేశారని రత్నమ్మ, కుమారుడు అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 2.40 లక్షల వరకు పెట్టుబడి పెట్టామన్నారు. నెల రోజుల్లో పంట చేతికి అందనున్న సమయంలో ఇలా జరగడంతో తమకు రూ. 6 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. భూమి విషయంలో కొంతకాలం నుంచి తగాదాలు ఉన్నాయని, తమ బంధువులే పైరును ధ్వంసం చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయాలని బొమ్మనహాళ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైభవంగా గజగౌరి నిమజ్జనోత్సవం

కణేకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని 43 ఉడేగోళం, కణేకల్లు, హులికెర గ్రామాల్లో ఆదివారం గజగౌరి నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. యువతీ, యువకుల నృత్యాలు చేస్తూ గజగౌరి దేవిని ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు.

మద్యం దుకాణానికి రీ నోటిఫికేషన్

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 127 నంబరు మద్యం దుకాణానికి రీ- నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని ఎక్సైజ్ సీఐ సోమశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని, 12న అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

ఐక్యత చాటుతున్న సంఘం ప్రతినిధులు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోవచ్చని సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జీవో హోమ్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార జాతుల్లో 34 కులాలు ఉన్నప్పటికీ తీవ్ర అన్యాయం జరుగుతోందని, 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, భారత రాజ్యాంగంలో 3వ షెడ్యూల్‌లోకి చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తాలూకా నూతన కమిటీను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగాధర, ఉపాధ్యక్షులుగా రవి, నగేశ్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశులు, సహాయ కార్యదర్శులుగా ఆంజనేయులు, లక్ష్మన్న కోశాధికారిగా హనుమంతులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కుళ్లాయప్ప, రుద్రప్ప, గాలెప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యాదవులు కలిసికట్టుగా సాగాలి

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న యాదవులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని యాదవులందరూ సంఘటితమై ఐక్యతతో ముందుకు సాగుదామని జిల్లా యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు జయరాములు పిలుపునిచ్చారు. ఆదివారం రింగురోడ్డులోని శ్రీశ్రీనివాస కల్యాణ మండపంలో యాదవ ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడారు. డిసెంబర్ 21న నియోజకవర్గం స్థాయిలో గీతా జయంతి, యాదవ మహాసభను నిర్వహిస్తామన్నారు. పట్టణంలో యాదవుల కోసం ప్రత్యేక ఫంక్షన్ హాల్ నిర్మాణం, నియోజకవర్గంలో ఐదు మండలాలకు సామూహిక భవనాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో యాదవ కులానికి ప్రాధాన్యం కల్పించడం, పేద విద్యార్థులకు వసతి కల్పించడంపై తీర్మానాలు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో గొర్ల వెంకటేశులు, సత్యనారాయణయాదవ్, గోపాలప్ప, కిరీటి, ఓంకార్, నరసింహ, వీరు, ఓబులేష్, సురేష్, నాగరాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వేడుకగా గౌరమ్మ గ్రామోత్సవం

ఉరవకొండ: ప్రత్యేక అలంకరణలో కడ్లే గౌరమ్మ విగ్రహం

ఉరవకొండ, న్యూస్‌టుడే: కడ్లే గౌరమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉరవకొండలో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. గాంధీ బజారులోని అమ్మవారి ఆలయంలో కొలువుదీరిన విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో అమ్మవారి విగ్రహాన్ని గవిమఠం ప్రాంగణంలోని బావిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్ర స్వామి పాల్గొన్నారు.

బొమ్మనహాళ్ : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గజగౌరీ దేవి రథోత్సవాలు అత్యంత వైభవంగా జరిగియి. మండలంలోని కొలగానహళ్లి, బందూరు, బొమ్మనహాళ్, కలహోళ, గోనేహాల్, మైలాపురం, ఏళంజి తదితర గ్రామాల్లో రథోత్సవాలను నిర్వహించారు.

అల్లుకొన్న నిర్లక్ష్యం

కళ్యాణదుర్గం పట్టణంలోని బళ్లారి బైపాస్‌లో గాంధీ విగ్రహం సమీపాన విద్యుత్తు స్తంభాన్ని, ఎత్తులో ఉన్న హైఓల్టేజీ గల మరో స్తంభం విద్యుత్తు తీగలను చెట్టు తీగ అల్లుకొంది. గాలి వీస్తున్నప్పుడు చెట్లు, తీగ జాతి మొక్కల వల్ల ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు శాఖ ఏఈ విజయకృష్ణను వివరణ కోరగా ఆ ప్రాంతంలో పెరిగిన చెట్లు, తీగలను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2001-02 పదో తరగతి ఐదేళ్లు చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో కలుసుకున్నారు. తమ పూర్వ ఉపాధ్యాయులను పాఠశాల వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాలలో భోజన షెడ్డు నిర్మాణానికి రూ. 1.05లక్షలు విరాళం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడు వీరాంజనేయులుకు రూ. 15వేలు ఆర్థిక సాయం చేశారు. పూర్వ ఉపాధ్యాయులు మల్లికార్జున, చలమయ్య, రాంభూపాల్‌రెడ్డి, మంజులవాణి, అలివేలమ్మ, శ్రీనివాసులు, విజయ్ కుమార్, శంకర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పడకేసింది

ఓబుళాపురంలోని బళ్లారి ప్రధాన రహదారికి ఇరువైపులా ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలతో పారిశుద్ధ్యం పేరుకుపోయింది. ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. కాలనీవాసులు, వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు శుభ్రతకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, డి.హీరేహాళ్

జ్యువెలరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథ్

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: జ్యువెలరీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన జయం విశ్వనాథ్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం అనంతపురంలో జరిగిన జిల్లా నూతన కమిటీ ఎంపికలో విశ్వనాథ్‌కు స్థానం దక్కింది. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఏఎం. శివప్రసాద్, అధ్యక్షుడిగా గొంది జనార్దనగుప్తా, ప్రధాన కార్యదర్శిగా జయం విశ్వనాథ్, కోశాధికారిగా అనిల్ అటర్వాల్ తదితరులతో కమిటీని ఎంపిక చేశారు.

పాఠశాల స్థాయిలోనే పోటీతత్వం ఉండాలి

పోటీల్లో భాగంగా నృత్యం చేస్తున్న బాలికలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే పోటీతత్వాన్ని కలిగి ఉండటం వల్ల భవిష్యత్తులో వివిధ అంశాల్లో విజయం సాధించడానికి మార్గం ఏర్పడుతుందని నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట్ పేర్కొన్నారు. ఉగాద్రి బాలోత్సవ్‌లో భాగంగా ఆదివారం పట్టణంలోని కరిబసవస్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చదరంగం, గానం, నృత్యం, నాటిక అంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నిర్మల, పద్మావతి, నీలిమ, రాధ, చంద్రమోహన్, శర్మాస్ పృథ్వీ, మల్లేశ్, రజని, యుగంధర్ పాల్గొన్నారు.

ఉరవకొండలో వనభోజనాల సందడి

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండలోని సాయిభీమానగర్, లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఆదివారం కార్తిక మాస వనభోజనాల కార్యక్రమాన్ని చేపట్టింది. అక్కడ మహిళలకు, పురుషులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమానికి లయన్స్‌క్లబ్ రీజియన్ ఛైర్మన్ గణేశ్ బాబు, కార్యదర్శి కృష్ణమోహన్, రిషి దాతలుగా నిలిచారు.

లీకేజీ.. ఆపై కలుషితం

తాగునీటి పైపులైన్ల నిర్వహణలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల అలసత్వం పెరుగుతోంది. ఉరవకొండ మండలం నింబగల్లు నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ పట్టణ శివారు కణేకల్లు రహదారిలోని వంకలో పగిలిపోయింది. దీని కారణంగా చాలా వరకు నీరు వృథాగా పోతోంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అంజుమన్ షఫ్రీన్‌ను వివరణ కోరగా, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- న్యూస్‌టుడే, ఉరవకొండ

భక్తిశ్రద్ధలతో అఖండ భజన

బెళుగుప్ప : మండల కేంద్రంలోని స్థానిక సాయిబాబా సన్నిధానంలో పుట్టపర్తి సాయిబాబా చిత్రపటానికి ఆదివారం గ్రామస్థులు ఘనంగా పూజలు నిర్వహించారు.

జూదరుల అరెస్టు

కంబదూరు, న్యూస్‌టుడే : మండలంలోని నూతిమడుగు శివర్లలో ఆదివారం జూద స్థావరంపై ఎస్సై లోకేశ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. తొమ్మిది మంది జూదరులకు గాను ముగ్గుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు. జూదరుల రూ. 2.500 వేల నగదు, 4 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

12న వైకాపా నిరసన ర్యాలీ

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న నియోజకవర్గం కేంద్రంలో చేపట్టనున్న వైకాపా ప్రజా ఉద్యమ నిరసన ర్యాలీకి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని వైకాపా సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో నిరసనకు సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ దొడగట్ట నారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలివీస్తే హడల్

పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో పాఠశాల ముందు ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు ఉన్నాయి. గాలి వీచినపుడు చెట్టు కొమ్మలు తగిలి నిప్పు రవ్వలు ఎగిరిపడుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ బాలుచంద్రను వివరణ కోరగా చెట్ల కొమ్మలు నరికి ప్రమాదాలు జరగకుండా చూస్తామన్నారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

ప్రమాదం జరిగితే.. ప్రథమ చికిత్స ఏదీ ?

ఆర్టీసీ బస్సులో ఖాళీగా దర్శనమిస్తున్న పెట్టె

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని చెబుతుంటారు.. అందుల్లో ప్రథమ చికిత్స కిట్లకు దిక్కులేకుండా పోయింది. ఇటీవల జరుగుతున్న ప్రమాదాలను చూస్తే అందరిలో వణుకు వస్తోంది. ప్రయాణ సమయంలో అనుకోకుండా ఏదైనా జరిగితే పరిస్థితి ఏంటన్నదే అందరిలోనే మెదులుతున్న ప్రశ్న. ● మోటారు వాహనాల చట్టం ప్రకారం ప్రతి ఆర్టీసీ బస్సులో ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) కిట్లు కచ్చితంగా ఉండాల్సిందే. అలాంటిది ఆర్టీసీ బస్సుల్లో ఎక్కడా కనిపించడం లేదు. కళ్యాణదుర్గం డిపోలో ఆర్టీసీ బస్సులు 60, అద్దె బస్సులు 12, పరికరాలు తరలించే బస్సు ఒకటి ఉంది.

కిట్లల్లో ఉండాల్సినవి: గాయపడిన వారికి ప్రథమ చికిత్స నిర్వహించాలంటే అయోడిన్ ద్రావణం, దూది, కత్తెర, కట్టుకట్టే కాటన్ బ్యాండ్, యాంటీ సెప్టిక్ మందు, స్టిక్‌వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్ తప్పకుండా ఉండాలి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు లేవు. ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని ఏర్పాటు చేసేలా చూస్తా. ప్రయాణ సమయంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటాం. దీనిపై ఇటీవలే చర్చించాం. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుంది. **- రామచంద్ర, డీఎం, కళ్యాణదుర్గం**

క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి

కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని కన్నేపల్లి మార్గంలో రాత్రి బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతల్లోకి దూసుకెళ్లింది. ఇందులో ప్రయాణిస్తున్న వారికి చిన్నచిన్న గాయాలు కాగా వారి వద్దే ఉన్న చేతిరుమాళ్ళ, చిన్న వస్త్రంతో కట్టుకోవాల్సి వచ్చింది.

✦ గతంలో గూబనపల్లి- మల్లికార్జునపల్లి వద్ద రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనగా పలువురు గాయపడ్డారు. 108 వాహనం వచ్చేంత వరకు క్షతగాత్రులు ఇబ్బందులు పడ్డారు.

✦ కళ్యాణదుర్గం - అనంతపురం మార్గంలో బస్సు వెళ్తుండగా అనుకోకుండా ఎనుము ఎదురు రావడంతో బ్రేక్ వేయగా కొందరు ప్రయాణికులకు చిన్నచిన్న గాయలయ్యాయి. అప్పుడూ వారికి ఎలాంటి వైద్యం అందలేదు.

✦ చాపిరి గ్రామం వద్ద ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీకొనగా బస్సుల్లో ఉన్న ఐదారు మంది ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి.

రస్తా విషయంలో ఇరువర్గాల ఘర్షణ

వజ్రకరూరు, న్యూస్‌టుడే: రస్తా విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వజ్రకరూరు మండలం గూళపాళ్యం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెద్దల కాలం నుండి ఎప్పుడు వెళ్లే దారిలోనే పొలాలకు మల్లికార్జున వెళ్తుండగా ఆ దారిలో రెండేళ్ల క్రితం భూమిని కొన్న సంజప్ప దారిలేదని ముళ్ల కంపలు అడ్డం వేశాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. అక్కడున్న రైతులు అడ్డుపోగా వారిపై విరుపాక్షి, శంకరమ్మ, నగ్మా రాళ్లతో దాడి చేశారు. మునిస్వామి, పెద్దన్న, లాలెప్ప, సూరప్పకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మల్లికార్జున ఫిర్యాదుతో దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగస్వామి పేర్కొన్నారు.

కల్లుదేవనహళ్లిలో దాహం కేకలు

● పండగ వేళ తాగునీటి ఇక్కట్లు

వేదవతి హగరిలో నీటిని ఎద్దుల బండ్లలో తీసుకుని వస్తున్న ప్రజలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : మండలంలోని గోవిందవాడ పంచాయతీ పరిధిలోని కల్లుదేవనహళ్లిలో తాగునీటి బోరు పనిచేయక పోవడంతో గ్రామంలో ఎద్దడి తీవ్ర రూపం దాల్చింది. గ్రామంలో నాలుగు రోజు నుంచి దాహం కేకలు మొదలయ్యాయి. మండలంలో కడ్లేగౌరమ్మ, గజగౌరీ ఉత్సవాలు మూడు రోజుల పాటు వైభవంగా జరుగుతాయి. పండగ వేళ గ్రామ ప్రజలు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సమీపంలోని వేదవతి హగరిలో పారుతున్న బీటీపీ నీటిని ఎద్దుల బండ్లు, ద్విచక్రవాహనాల్లో తెచ్చుకొని తాగుతున్నారు. హగరిలో పారుతున్న నీరు కలుషితం అయ్యాయని దీంతో ప్రజలు రోగాలు బారిన పడుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నీరు కూడా సక్రమంగా రావడం లేదని వాపోయారు. నాలుగు రోజులైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, అధికారులు వెంటనే తాగునీటి ఎద్దడిని నివారించాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శీనూనాయక్‌ను వివరణ కోరగా పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామన్నారు.

ఏపీటీఎఫ్ మండల నూతన కమిటీ ఏర్పాటు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరులోని మండల పరిషత్ పాఠశాల వద్ద ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ అధ్యక్షతన నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో మండల శాఖ నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా వాల్మీకి వెంకటేసులు, అధ్యక్షుడిగా విజయ్‌కుమార్ యాదవ్, కార్యదర్శిగా ధనుంజయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆదిరాజేష్, రామాంజినేయులు, లింగమూర్తి, కుళ్లాయప్ప, లాలుసాబ్, అబ్దుల్‌ఖాదర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రహదారులు ఛిద్రం

రాయదుర్గం, బొమ్మనహాళ్, డిహీరేహాళ్ మండలాల మీదుగా నిత్యం భారీ టన్నేజీలతో వాహనాలు సంచరించడంతో ర.భ రహదారులు ఛిద్రం అవుతున్నాయి. టిప్పర్లు, పెద్ద లారీలలో మైనింగ్, ఇనుప కడ్డీలు, గరండాలు, పైపులు రవాణా కావడంతో తారు రోడ్లు కొద్ది రోజులకే పాడైపోతున్నట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రవాణా శాఖ అధికారులు అధిక టన్నేజీ వాహనాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, రాయదుర్గం గ్రామీణం

దుర్గంలో రెండు స్టీలు పరిశ్రమల ఏర్పాటు

కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం,న్యూస్‌టుడే: కర్ణాటక సరిహద్దున వెనకబడిన రాయదుర్గం నియోజకవర్గంలో రూ. వెయ్యి కోట్లతో రెండు స్టీలు పరిశ్రమలను త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డులో చర్చి ప్రాంగణంలో సుధీర్‌సాగర్ అనే వ్యక్తి తన తల్లి జ్ఞాపకార్థం నిర్మిస్తున్న సామాజిక భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదివారం భూమి చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 5వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడుపై నమ్మకంతో పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారన్నారు. స్టీలు పరిశ్రమలతో పాటు పట్టణంలో భారీ వస్త్ర పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బీటీ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తీసుకురావటానికి ఇటీవల కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబుతో కలిసి ఇటీవల పనులు ప్రారంభించినట్లు గుర్తుచేశారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ఇప్పటికే రూ. 4.5కోట్లతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుధీర్ సాగర్, కుటుంబ సభ్యులు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పొరాళు పురుషోత్తం, పట్టణ తెదేపా అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, కౌన్సిలర్ ప్రశాంతి, వై. వెంకటేశులు, నాగరాజు నాయక్‌లు పాల్గొన్నారు.

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

కృష్ణాపురంలో కనకదాస విగ్రహం ఊరేగింపు

ఘనంగా భక్త కనకదాస జయంతి

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో భక్త కనదాస జయంతి పురస్కరించుకొని ఆదివారం గ్రామంలో ప్రజలు ఉత్సవ విగ్రహానికి పూల మాలలు వేసి జయంతి వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం ట్రాక్టరులో విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ భక్త కనకదాసు తన రచనల ద్వారా సమ సమాజ నిర్మాణానికి దోహదపడ్డారన్నారు.

నార్పల పంచాయతీలో అవినీతి ఆరోపణలు

నార్పల, న్యూస్‌టుడే : నార్పల మేజర్ పంచాయతీకి సంబంధించి సామాజిక మధ్యమాల్లో ఆదివారం అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. కొందరు నార్పల గ్రామస్థులు కార్యదర్శి పేరుతోనే గతేడాది కాలంగా పంచాయతీలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ పెట్టిన పోస్టులు వైరల్‌గా మారాయి. గ్రామంలో వీధి దీపాల కొనుగోళ్లకు సంబంధించి భారీగా నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. నార్పలలో 70 శాతం వీధి దీపాలు వెలగడం లేదన్నారు. మురుగు కాలువల నిర్వహణ గాలికి వదిలేశారని పోస్టులు పెట్టారు. పంచాయతీలో 42 అద్దె దుకాణాల నిర్వహణ విషయంలో అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. దీనిపై నార్పల ఎంపీడీవో మమతను వివరణ కోరగా ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేస్తామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: గుంతకల్లులోని ఆంథోని స్ట్రీట్‌లో మూడో వీధిలో జేఏ/6 నంబరు గల విద్యుత్తు స్తంభం పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. - **ఖలందర్**

సమాధానం: సిబ్బందిని పంపి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- ప్రసన్నకుమార్, ఏఈ, డీ, ట్రాన్స్‌కో

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

వాల్టా.. కాసులిస్తే ఉల్టా!

◆ యథేచ్ఛగా చెట్ల నరికివేత
◆ చోద్యం చూస్తున్న అటవీ శాఖ అధికారులు

గుత్తి పట్టణంలో తరలిపోతున్న వృక్ష సంపద

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : ఎంతో విలువైన అటవి సంపద తరలిపోతోంది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ప్రభుత్వ అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక వైపు ప్రభుత్వం లక్షల్లో మొక్కలను పెంచాలని లక్ష్యం పెట్టుకున్నా కొందరు అధికారులు కాసులకు కక్కుర్తి పడుతున్నారు. * గుత్తి అటవీశాఖ రేంజ్ పరిధిలో దాదాపు 9 మండలాలు ఉన్నాయి. ఈ తొమ్మిది మండలాల పరిధిలో అటవీ శాఖ బీట్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా అక్రమంగా చెట్లను నరికేస్తున్నారు.

ప్రత్యేక నిఘా ఉంచుతాం..

గుత్తి అటవీశాఖ పరిధిలో అక్రమంగా మొక్కలు నరికితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. చెట్లను నరికేటప్పుడు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. ఎక్కడైనా నిబంధనలు ఉల్లఘించినట్లైతే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తాం. **-మధుబాబు, అటవీశాఖ రేంజర్, గుత్తి**

అడ్డదారుల్లో కలప రవాణా

గుత్తి అటవీ శాఖ సెక్షన్ పరిధిలో గుత్తి, రాయలచెరువు, యాడికి మండలాలు వస్తాయి. యాడికి, గుత్తి మండలంలోని కొంత చిన్నపాటి అడవులు ఉండటంతో చెట్లు ఏపుగా పెరిగాయి. కొందరు అడ్డదారుల్లో చెట్లను కొట్టేసి కలపను తరలిస్తున్నారు. గత నెల 22న యాడికి మండలంలో అటవీశాఖ అధికారులు తనిఖీలు చేస్తుండగా ఓ ఐచర్ వాహనాన్ని పట్టుకోవడంతో అందులో వందల సంఖ్యలో సండ్ర దుంగలను పట్టుబడ్డాయి. వీటిని గుత్తి అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.

● గుత్తితో పాటు చుట్టు పక్కల మండలాల్లో అధిక మొత్తంలో ఇటుకల బట్టీలు ఉండటంతో వాటికి కూడా కలపను తరలిస్తున్నారు. మూడు నెలల కిందట గుత్తి మండలంలోని యంగన్నపల్లి గ్రామ సమీపంలోని కుంటలో పెరిగిన తుమ్మ, వేప చెట్లను కొట్టేసి సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చింత, కానుగ, వేప మొక్కలను నరికితే చట్టరీత్యా నేరం. ఇవేవీ పట్టించుకోకుండా చెట్లను కొట్టేస్తున్నారు.

నిబంధనలకు తూట్లు

ప్రధానంగా గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల్లో ఎక్కువ టింబర్ డీలోలు, బొగ్గుల బట్టీలు అధికంగా ఉండటంతో చింత, వేప, తుమ్మ చెట్లకు డిమాండ్ పెరిగింది. కొందరు టింబర్ డిపోల నిర్వాహకులు అటవీశాఖ అధికారులను ప్రసన్నం చేసుకొని చెట్లను కొట్టేస్తూ రూ. లక్షలు గడిస్తున్నారు. ఈక్రమంలో నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు.

జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని శోభారాణి ఆదివారం తెలిపారు. ఈ నెల 7,8,9 తేదీల్లో పార్వతీపురంలో జరిగిన ఎస్‌జీఎఫ్ చెస్ పోటీల్లో వెంకట శ్రీచేతన్‌రెడ్డి, అనిమి అస్మిత ప్రతిభ చాటినట్లు తెలిపారు. వీరిని ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈ నెల ఆఖరులో త్రిపురలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు

కబడ్డీ పోటీల్లో సత్తా

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని సంజీవనగర్‌లో ఉన్న సాయి చైతన్య అకాడమీకి చెందిన విద్యార్థిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు శిక్షకుడు లక్ష్మీనరసింహా తెలిపారు. ఆదివారం పులివేందులలో ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటారు. అనంతపురం జట్టు ద్వితీయస్థానంలో నిలిచిందని, గెలుపునకు అర్షియా ప్రధాన పాత్రపోషించడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికనట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మండలంలోని గన్నెవారిపల్లి కాలనీలో అనారోగ్యంతో నడిపి రాముడు కుటుంబసభ్యులకు తెదేపా సీనియర్ నాయకులు చింబిలి వెంకటరమణ ఆర్థికసాయం అందించారు. పూసలు అమ్ముకుంటూ నడిపి రాముడు జీవనం సాగించేవాడని, ప్రస్తుతం ఆయన మృతి చెందారని, ఖననం చేసేందుకు ఆ కుటుంబం ఇబ్బంది పడకూడదని రూ.15వేలు నగదు అందించినట్లు ఆయన తెలిపారు.

12న మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి, పామిడి, పెద్దవడుగూరు మండలాల్లోని నాలుగు మద్యం దుకాణాలకు ఈనెల 12న లాటరీ నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఉమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి లాటరీ వేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు స్పందించాలన్నారు.

17న చలో దిల్లీ

గుత్తి, న్యూస్‌టుడే : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని నిరసనగా ఈనెల 17న తలపెట్టిన చలో దిల్లీ కార్యక్రమానికి దళితులు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఈరన్న కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో దిల్లీకి వెళుతున్నట్లు పేర్కొన్నారు. నిరసన కార్యక్రమానికి దళితులు తరలిరావాలన్నారు.

దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు ఇవ్వాలి

గుత్తి, న్యూస్‌టుడే : సమాజంలో 50, 70 శాతం వికలత్యం ఉన్న దివ్యాంగులకు ప్రభుత్వం మూడు చక్రాల సైకిళ్లను ఇవ్వాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ కోరారు. డిగ్రీ చదివే వారికి మాత్రమే సైకిళ్లను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఆయన గుత్తిలో దివ్యాంగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలను సడలించి నడవలేని దివ్యాంగులందరికీ త్రి చక్ర సైకిళ్లు ఇవ్వాలని డిమాండు చేశారు. మూడు చక్రాల సైకిళ్లు లేక చాలామంది ఉపాధికి పనులకు వెళ్లలేకపోతున్నట్లు చెప్పారు.

మానవతా విలువలను కాపాడుకుందాం

గుంతకల్లు, న్యూస్‌టుడే : సమాజంలో పరస్పరం గౌరవించుకోవడం చాలా అవసరమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త విద్వాన్ సుస్వరం నాగరాజాచార్యులు అన్నారు. పట్టణంలోని హనుమేశ్‌నగర్‌లో ఎస్ఎస్‌జీఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం సమాజంలో అడుగంటి పోతున్న మానవతా విలువలను కాపాడుకోవాలన్నారు. వేద పండితుడు శ్రీకాంత్‌శర్మ ధాత్రి పూజ, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు, బాలికలు భరతనాట్యం, కోలాటాలు ప్రదర్శించారు. వక్తలు ప్రదర్శించిన వారికి బహుమతులను అందజేశారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామమూర్తి, ఉపాధ్యక్షుడు బండారు రమేశ్, కార్యదర్శి దామోదర్, కోశాధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

బహుమతులు అందుకుంటున్న విజేతలు

రోగులకు వైద్యశిబిరం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో నారాయణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్ గ్రూప్ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 50 మందికి రక్తపోటు, చక్కెర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు నారాయణ నాయక్ పేర్కొన్నారు. ప్రజల కోసం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

పేదలకు ఉచిత న్యాయం

గుత్తి, న్యూస్‌టుడే : సమాజంలో ఆర్థికంగా వెనుక బడిన పేదలకు ఉచితంగా న్యాయసేవను అందిస్తామని గుత్తి జేఎఫ్‌సీఎం శ్వేత పేర్కొన్నారు. కేసుల్లో కూరుకుపోయి న్యాయవాదులను పెటుకోలేని పేదలకు ఉచితంగానే న్యాయ సేవా సాయాన్ని అందిస్తామన్నారు. ఆదివారం గుత్తిలోని ఏపీఆర్ పాఠశాలలో జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ 1995 పేదలకు ఉచిత న్యాయసేవను ప్రారంభించారని 1987లో అమలులోకి వచ్చిందన్నారు. ప్రతి పౌరుడు న్యాయం పొందే హక్కు ఉందని గుర్తు చేశారు. అనంతరం పాఠశాలలోని వంట గది, భోజనం తినే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో న్యాయవాది గంగాధర్‌కుమార్, ఏడీజే కోర్టు ఉద్యోగి సాధిక్‌వలి, పారాలీగల్ వాలంటీర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్వేత

కంటి జబ్బులతో జాగ్రత్త

పామిడి, న్యూస్‌టుడే : కంటి సంరక్షణ ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలి పట్టణ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు పేర్కొన్నారు. ఆదివారం భావసార క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణుడు డాక్టర్ షిప్ప 240 మందిని పరీక్షించారు. వీరిలో 75 మందిని శస్త్ర చికిత్సలకు సూచించారు. అనంతరం కంటి సంరక్షణకు తీసుకోవాలని జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమువీర్ వైద్య శిబిరానికి వచ్చిన వారికి అల్పాహార సదుపాయం కల్పించారు. పామిడి పట్టణ లయన్స్ క్లబ్ సభ్యులు, శంకర కంటి ఆసుపత్రి, లక్ష్మీ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ షిప్ప, పక్కన లయన్స్ క్లబ్ సభ్యులు

నేత్రపర్వం.. లక్ష దీపోత్సవం

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గంగి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో కార్తిక మాసం మూడో ఆదివారాన్ని పురస్కరించుకొని లక్ష దీపోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు ఉదయం స్వామికి రుద్రాభిషేకం, అభిషేకాలు, అర్చనలు, ఆకుల పూజ వంటి విశేష పూజలు చేశారు. సాయంత్రం 6.00 గంటలకు లక్షదీపోత్సవాన్ని ప్రారంభించారు. ఓంకారం, స్వస్తిక్, స్వాగత అలంకారం తదితర ఆకృతుల్లో ముగ్గులు వేసి మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు.

ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వైభవంగా కార్తిక మాస పూజలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని పెన్నానది ఒడ్డున ఉన్న బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస పూజలు చేశారు. స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. మూడో సోమవారానికి సంబంధించి భక్తులకు సౌకర్యంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బుగ్గరామలింగేశ్వరునికి పాలాభిషేకం

అశ్వర్థ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధి చెందిన అశ్వర్థ ఆలయంలో కార్తిక ఆదివారాన్ని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. అశ్వర్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామివారికి వేద పండితులు అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

చక్రభీమలింగేశ్వరస్వామి

విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

కోలాహలంగా దేవాంగుల వనమహోత్సవం

అనంత సాంస్కృతికం: దేవాంగ సంక్షేమ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో రెడ్డిపల్లి చౌడేశ్వరీదేవి దేవాంగ వృద్ధాశ్రమంలో ఆదివారం కార్తిక వన మహోత్సవం ఉల్లాస భరితంగా జరిగింది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంపావతి కృష్ణమూర్తి, నిమ్మల సదాశివన్, బల్లా రామ్మూర్తి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో చౌడేశ్వరీదేవి అమ్మవారి పూజా కార్యక్రమాలు చేపట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన దేవాంగ ప్రముఖులతో సమావేశం, వృద్ధాశ్రమంలో ఉత్తమ సేవలు అందించిన సేవాకర్తలకు సన్మానం, ఉమ్మడి అనంత జిల్లా స్థాయిలో 'విద్యాదీవెన' కార్యక్రమంగా పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 25 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసాపత్రాలు ఇచ్చారు.

గొర్రెల దొంగల అరెస్టు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో ఆదివారం ఇద్దరు గొర్రెల దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రామారావు, ఎస్ఐ సురేశ్ తమ సిబ్బందితో గుత్తి ఫోర్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో టి.కొత్తపల్లికి చెందిన శ్రీనివాసులు, నారాయణలను అరెస్టు చేసి వారి నుంచి రూ.1.92 లక్షలు విలువైన 16 గొర్రెలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

శ్మశాన వాటిక దారి.. గుంతలతో నిండి!

గుంతకల్లులోని సత్యనారాయణ పేట, వాల్మీకి నగర్ కాలనీలకు దగ్గర ఉండే శ్మశాన వాటికకు వెళ్లే దారిలో గుంతలు దర్శనమిస్తున్నాయి. అంత్యక్రియలకు తీసుకెళ్లే సమయంలో శ్మశానవాటిక దగ్గర గుంతలు ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలను పూడ్చివేత కార్యక్రమం చేపట్టాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

వ్యాయామ పరికరాలకు తుప్పు

గుంతకల్లు, న్యూస్‌టుడే : రైల్వే నిధులతో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాల నిర్వహణ గాడి తప్పింది. ఫలితంగా రూ.లక్షల నిధులకు సార్థకత లేకుండాపోయింది. వ్యాయామ పరికరాలను రైల్వే సిబ్బందితో పాటు అధికారులు నివాసముంటున్న ప్రభాత్‌నగర్ రైల్వే కాలనీలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పరిస్థితి అధ్వానంగా ఉంది. రైల్వే మైదానంలోని వ్యాయామపరికరాలదీ ఇదే పరిస్థితి. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. -న్యూస్‌టుడే, గుంతకల్లు

దుస్థితిలో శుద్ధజల పథకం

రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో మొట్టమొదట ఏర్పాటైన గుంతకల్లు మున్సిపాలిటీలోని పాతగుంతకల్లు శుద్ధ జల నీటి పథకం మూలనపడటంతో పథకానికి చెందిన యంత్రాలు చిలుంపట్టి పాడైపోతున్నాయి. పథకాన్ని పది సంవత్సరాల కిందట ప్రారంభించారు. కొంత కాలంగా అధికారులు పట్టించుకోవడం లేదు. పథకాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తెస్తామని మున్సిపల్ ఈఈ ఇంతియాజ్ తెలిపారు. -న్యూస్‌టుడే, గుంతకల్లు

ప్రధాన రహదారి.. కంకరతేలి

పుట్లూరు, న్యూస్‌టుడే: పుట్లూరుకు వెళ్లే ప్రధాన దారి కంకర రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. కడవకల్లు నుంచి పుట్లూరుకు వెళ్లే దారిలో పలుచోట్ల గుంతలు, కంకర తేలి ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉంది. ఇక వాహనదారులు భయంగా ప్రయాణం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఈ దారిలో ప్రమాదాలు జరిగాయి. గత కొన్నేళ్లుగా ఎవరూ పట్టించుకోలేదు. సుమారు 10 గ్రామాల ప్రజలు ఈ దారిలో మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి అఖండ భజన

అనంత సాంస్కృతికం: సత్యసాయి బాబా శత వర్ష జయంత్యుత్సవాలు పురస్కరించుకుని అరవిందనగర్ సత్యసాయి భజన మందిరంలో సత్యసాయిని కీర్తిస్తూ అఖండ భజన నిర్వహించారు. ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రేమ ద్వారా ఏదైనా సాధించవచ్చని, సాయి ఉద్బోధన ద్వారా బాబా ప్రేమతత్వం తెలుస్తుందన్నారు. సత్యసాయి జయంతి వేడుకలను ప్రభుత్వం ఎంతో ఘనంగా నిర్వహించనుందన్నారు. సత్యసాయి సేవా సంఘం అనంత జిల్లా అధ్యక్షుడు రామచంద్రమూర్తి, నగర సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు, నగర ప్రముఖులు, సత్యసాయి బాలవికాశ్ విద్యార్థులు సత్యసాయిబాబా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయసేవలు సద్వినియోగం చేసుకోండి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: ఉచిత న్యాయ సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం జాతీయ న్యాయ సేవ దినోత్సవాన్ని జిల్లా న్యాయ సేవాసదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్మికుల జాబ్‌కార్డు, వారికి ఉన్న చట్టాలు వివరించారు. మహిళలకు వన్‌స్టాప్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. విజయనగర న్యాయకళాశాల విద్యార్థులకు న్యాయ సేవ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఐసీడీఎస్ అధికారి శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనరు సూర్యనారాయణ, అధికారులు రమాదేవి, సుజాత, మధ్యవర్తిత్వం న్యాయవాది హరి కృష్ణ పాల్గొన్నారు.

ఊర్లు.. మౌలిక వసతులు ఎరుగవు!

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : రేగడికొత్తూరు గ్రామంలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీనికి తోడు కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురుగు ఏరులై పారుతోంది. ప్రస్తుతం గ్రామంలో 500 కుటుంబాల్లో 1600 మందికి పైగా ప్రజలు నివాసం ఉంటున్నారు. గ్రామంలో మురుగు కాలవలు నిర్మించకుండానే అధికారులు కొన్నిచోట్ల సీసీ రహదారులు వేశారు. దీంతో ఇళ్లలోని మురుగంతా రోడ్లపైకి వచ్చిచేరుతోంది. ప్రభుత్వ పాఠశాల వద్ద భారీ గొయ్యి ఏర్పడింది. మురుగుపై దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని రాత్రిసమయంలో ప్రజలపై దాడులు చేయడంతో గ్రామంలో విష వ్యాధులు ప్రబలుతున్నాయి. డిప్యూటీ ఎంపీడీవో సదాశివను వివరణ కోరగా గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించి, మురుగు సమస్యను పరిష్కరిస్తామన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కరవయ్యాయి. ప్రధానంగా అంతర్గత రహదారులు, కాలువలు లేక జనం పడరాని పాట్లు పడుతున్నారు. మురుగు రహదారులపై ప్రవహిస్తున్నా ఎవరికీ పట్టడం లేదు. జనం పలు సమస్యల నడుమే కష్టంగా జీవనం సాగిస్తున్నారు.

రేగడికొత్తూరు.. ప్రధాన దారుల్లో మురుగు ప్రవాహం

అంతర్గత రహదారులు అధ్వానం

● బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో జగనన్న కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పంచాయతీ పరిధిలో 1500 మందికి ఇళ్లపట్టాలు ఇచ్చారు. ఇంటి ఇర్మాణం పూర్తయిన లబ్ధిదారులు ఇప్పటికే ఇళ్లలో నివాసం ఉంటున్నారు. మరికొందరు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు చేస్తున్నారు. రహదారులు అధ్వానంగా ఉండటంతో నిర్మాణ సామగ్రి తరలించడానికి ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తుశాఖ అధికారులు రహదారి మధ్యలో స్తంభాలు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాలనీల్లో సీసీ రహదారులు ఏర్పాటు చేసి, ప్రజలకు కష్టాలు తప్పించాల్సిన అవసరం ఉంది.

విద్యుత్తు వినియోగదారులకు తక్షణ సేవలు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి సబ్‌డివిజన్‌లోని విద్యుత్తు వినియోగదారులకు తక్షణ సేవలను అందిస్తామని డీఈఈ సాయిశంకర్ తెలిపారు. గృహోపయోగ, వాణిజ్య కనెక్షన్లకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగితే వెంటనే స్పందిస్తామన్నారు. గుత్తిలో ఫ్యూజ్‌ఆఫ్‌కాల్ కేంద్రం చరవాణి : 91548 22833, గుత్తిఆర్.ఎస్. కేంద్రం చరవాణి : 91547 89689కు ఫోన్ చేసి సమస్యను తెలిపితే సిబ్బంది వెంటనే స్పందించి నేరుగా వచ్చి సేవలను అందిస్తారన్నారు. ప్రజలు ఫ్యూజ్‌ఆఫ్ కేంద్రాల నుంచి తక్షణ సేవలను పొందాలని కోరారు.

రైల్వే ప్రయాణికుడి మృతి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఎగ్మోర్-చెన్నై రైలులో రాకేశ్(44) అనే ప్రయాణికుడు ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. భార్య విద్య, రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మహారాష్ట్రలోని షోలాపుర్ చెందిన రాకేశ్, ఆయన భార్య విద్య, పిల్లలతో కలిసి తిరుపతికి వెళ్లాలని షోలాపురలో శనివారం రాత్రి రైలులో ఎక్కారు. రాయచుర్ దగ్గరకు రాగానే ఛాతిలో నొప్పిరావడంతో భర్త భార్యకు చెప్పాడు. రైల్వే అధికారులకు ఆమె సమాచారం ఇచ్చారు. రాయచురు రైల్వే స్టేషన్‌లో డాక్టర్లు ఎవరూ రాలేదని భార్య కన్నీటి పర్యంతమయ్యారు. ఆదోని దాటుగానే భర్త మాట్లాడటం లేదని, అక్కడ ఉన్న టీసీకి చెప్పారన్నారు. టీసీ గుంతకల్లు రైల్వే అధికారులకు, జీఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వేకువ జామున రైలు గుంతకల్లుకు చేరుకోవడంతో అప్పటికే సిద్ధంగా ఉన్న అంబులెన్సులో రైల్వే ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు అతనికి పరీక్షలు నిర్వహించి మృతి చెందినట్లు నిర్ధారించారని రైల్వే జీఆర్‌పీ ఎస్సై చంద్ర పేర్కొన్నారు.

ఆస్తి ఇవ్వలేదని అత్తపై అల్లుడి దాడి

పుట్లూరు, న్యూస్‌టుడే : తనకు రావాల్సిన ఆస్తిని ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అత్తపై అల్లుడు దాడి చేశాడు. వెంగన్నపల్లి గ్రామంలోని గుర్రమ్మ తన కూతురిని అప్పేచర్ల గ్రామానికి చెందిన నాగపుల్లయ్యకు ఇచ్చి వివాహం చేసింది. కొన్నేళ్ల కిందట గుర్రమ్మ కూతురు మృతిచెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో అల్లుడు నాగపుల్లయ్య తన భార్యకు రావాల్సిన ఆస్తిని తమకు ఇవ్వాలని వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలో చివరకు ఆవేశంతో నాగపుల్లయ్య అత్తపై దాడి చేసి గాయపరిచాడు. స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ జిల్లా, శేరిలింగంపల్లి సిటీ, అర్జున్‌రెడ్డి కాలనీ, నియర్ సురక్ష ఎన్‌క్లేవ్ ప్లాట్ నంబరు 20, H.No 2-32/2/3/2/20 నివాసి అయిన నా క్లయింట్ కుంభ వంశీకృష్ణ, తండ్రి కుంభ శ్రీధర్ అనువారు అనంతపురం RD, యాడికి SRDలో చేరిన అనంతపురం జిల్లా, తాడిపత్రి మండలం, వెంకటాంపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని క్రింద కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనగోలు చేయ నిర్ణయించుకున్నారు. బి.యం.యం. సిమెంట్స్ పేరున రెవెన్యూ రికార్డుల్లో నమోదైన ఈ షెడ్యూలు దాఖలా ఆస్తిని GPA పొందిన సాగర్ సిమెంట్స్ ద్వారా కొనుగోలు చేయ నిర్ణయించుకున్నారు. కావున క్రింద కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తి కొనుగోలుపై ఎవర్కైనా అభ్యంతరాలుంటే ఈ ప్రకటన తేదీ నుంచి 15 రోజుల లోపు ఈ క్రింది కార్యాలయమునందు తెలియజేయవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో ఈ భూములకు సంబంధించి తదుపరి చర్యలకు మా క్లయింటు బాధ్యులు కాదని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

షెడ్యూలు దాఖలా ఆస్తి

సర్వేనం	ఖాతా నం.	LPM No.	విస్తీర్ణం	యజమాని
104, 105ఎ 105బి, 106, 78బి	6001	275	7.78	బి.యం.యం సిమెంట్స్ లిమిటెడ్

కార్యాలయ చిరునామా

జి.విజయభాస్కర్, అడ్వకేట్, # 8/1075, SBI వెనుక వైపు, అనంతపురం రోడ్డు, గుత్తి-515401, అనంతపురం జిల్లా, ఫోన్ నం: 9441074591

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం ఆర్టీసీ: స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురంలో సదరు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. స్త్రీ శక్తి పథకం విజయవంతంగా నడిచేందుకు అన్ని స్థాయిల్లోని ఉద్యోగులు కృషి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మాత్రం పట్టించుకోకుండా ఉండటం బాధాకరం అన్నారు. కనీసం 3వేల బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. 10 వేల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి ఖాన్, జిల్లా అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామాంజినేయులు, కోశాధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

అనంతేశ్వరుడికి అన్నాభిషేకం

శారదానగర్ శివ బాలయోగి మహారాజ్ ఆశ్రమంలోని శ్రీఅనంతేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి అన్నాభిషేకం వైభవంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని స్వామివారికి భక్తుల సహకారంతో అన్నాభిషేకం చేయించారు. ఆశ్రమం ట్రస్టు నిర్వాహకులు జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించారు. - అనంత సాంస్కృతికం

మేమున్నాం.. మీకు తోడుగా

ఎస్సీ, జీఎస్‌టీయూ: 8008573005
శారదానగర్: 8008573049
అశోక్‌నగర్: 8008573011

సమస్య: హౌసింగ్‌బోర్డు సుగుణ హోమ్స్ అపార్ట్‌మెంట్ కాలనీలో వీధిదీపం వెలగడం లేదు. - గోవిందబాబు
సమాధానం: వెంటనే చర్యలు తీసుకుంటాం.
సమస్య: అశోక్‌నగర్ నుంచి ఎస్కే డిగ్రీ కళాశాలకు వెళ్లే దారి వంతెన వద్ద చెత్తతో అధ్వానంగా ఉంది. - ప్రదీప్‌కుమార్
సమాధానం: వెంటనే శుభ్రం చేయిస్తాం.
(పై ప్రశ్నలకు నగరపాలక ఇన్‌ఛార్జి ప్రజారోగ్య అధికారి నరసింహ సమాధానాలు ఇచ్చారు.) - న్యూస్‌టుడే, అశోక్‌నగర్

నగర శివారు.. చీకట్లతో బేజారు

వీధిలైట్ల ఏర్పాటులో తీవ్ర జాప్యం

న్యూస్‌టుడే, అశోక్‌నగర్

భాగ్యనగర్‌లో భవంతుల వద్ద వీధి లైటు లేక ఖాళీగా స్తంభం

ప్రజలకు నగరపాలక అందించే కనీస సేవల్లో వీధిలైట్లు సమకూర్చడం అత్యంత ప్రాధాన్య అంశం. నగరం రోజు రోజుకు విస్తరిస్తోంది. ఖాళీ ప్రదేశాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నా వీధి లైట్లు ఏర్పాటులో తీవ్ర జాప్యం అవుతోంది. 30 ఏళ్ల క్రితమే ఏర్పడిన శివారు కాలనీల్లో ప్రతి సంవత్సరం కొత్తగా ఇళ్ల నిర్మాణాలు చేసుకొని ప్రజలు నివసిస్తున్నారు. శివారుతోపాటు కొత్తగా ఇళ్ల నిర్మాణాలు సాగే ప్రాంతాల్లో చీకట్లు విస్తరిస్తున్నాయి. సంవత్సరాలుగా చీకట్లోనే మగ్గిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎక్కువగా ఇబ్బంది ఇక్కడే

భాగ్యనగర్, భవానీనగర్, నారాయణరెడ్డి కాలనీ, వేణు గోపాల్‌నగర్, రాజనగర్, సోమనాథ్‌నగర్, జనశక్తినగర్, తిరుమలనగర్, శ్రీనగర్ కాలనీ, నాయక్‌నగర్, ఆదర్శనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, హమాలీకాలనీ, ఎస్‌బీఐ కాలనీ, శారదానగర్, విజయనగరకాలనీ

త్వరలోనే సమస్యలకు పరిష్కారం

శివారు ప్రాంతాల్లోనూ, ట్రాన్స్‌ఫార్మర్లు పెండింగ్ ప్రాంతాల్లో వీధి లైట్లు అవసరం అని గుర్తించాం. టెండర్లు పిలవడంతో ఆయా ప్రాంతాల్లో త్వరలో లైట్లు ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే ఉన్న వీధి లైట్లు అన్ని వెలిగేలా చర్యలు చేపట్టాం. -దాక్షాయిణి, డీఈ

ఏడు దాటితే

శివారు ప్రాంతాల్లో ఎక్కువగా ఖాళీ ప్రదేశాలు ఉంటాయి. రాత్రి ఏడు దాటితే చాలు ఖాళీ ప్రదేశాల నుంచి విషపురుగులు, పాములు బయటకు వస్తుండటంతో భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రాత్రివేళల్లో ముళ్ల పొదల మధ్య పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో బిక్కుబిక్కు మనాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు ప్రతిపాదనలు చేసి టెండర్లు పిలిచినా పనుల్లో జాప్యం అవుతోంది.

ఎల్ఈడీ లైట్లు: 18,720
ఏర్పాటు చేయాల్సిన వీధి లైట్లు: 1,150
అవసరమైన సెంట్రలైజ్డ్ కంట్రోల్ బాక్సులు: 150

❑ సెంట్రలైజ్డ్ విధానంలో లైట్లు ఆన్, ఆఫ్ ఉండగా కొన్ని ప్రాంతాల్లో బాక్సులు లేక వర్కర్లు సమయానికి ఆఫ్ చేయక విద్యుత్తు దుబారా అవుతోంది.
❑ నగరంలో ప్రతి సచివాలయం పరిధిలో వీధి లైట్లు ఏ మేరకు అవసరమో మౌలిక సదుపాయాల ఇంజినీరింగ్ విభాగం సర్వే చేపట్టింది. 74 సచివాలయాల్లో ఇంకా లైట్లు వేయాల్సి ఉందని గుర్తించారు.

గొందిరెడ్డిపల్లి దారి నిర్మాణానికి చర్యలు

మట్టి రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ డీఈతో నారాయణస్వామి, తెదేపా మండల సమన్వయకర్త ధర్మవరపు మురళి

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు నుంచి గొందిరెడ్డిపల్లి వరకు ఉన్న మట్టి దారిని తారు రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరైనట్లు పీఆర్ డీఈ నారాయణ స్వామి, తెదేపా మండల సమన్వయకర్త ధర్మవరపు మురళి పేర్కొన్నారు. మండల కేంద్రం నుంచి గొందిరెడ్డిపల్లి వరకు శిథిలమైన దారిని వారు ఆదివారం పరిశీలించారు. దారి నిర్మాణంపై గ్రామస్థులు, దారి పక్కనున్న పొలాల రైతులతో చర్చించారు. రోడ్డంతా గుంతలమయం కావడంతో ఇబ్బందులు పడేవాళ్లమని, త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, రైతులు విన్నవించారు. తెదేపా హయాంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ వైకాపా అధికారంలోకి రావడం, పనులు పట్టించుకోక వాహనదారులు, ప్రయాణికులు ఐదేళ్లు ఇబ్బందులు పడ్డారని మురళి అన్నారు. ఎమ్మెల్యే సునీత చొరవతో రూ.1.04 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. పనులు ప్రారంభించి పూర్తిచేసేలా కృషి చేస్తామన్నారు.

తెరపై ఈనాడు

కమలానగర్: గంగ : **ఫోనిక్స్,** గౌరి : **మాస్ జాతర,** గాయత్రి : **కృష్ణలీల, కె-ర్యాంప్,** తరంగిణి : **జటాధర,** ఎస్వీ సినిమా : **ఆర్యన్,** నీలిమ : **ప్రీడియేటర్ బ్యాడ్‌ల్యాండ్స్,** త్రివేణి, శాంతి : **ది గర్ల్‌ఫ్రెండ్,** తేజస్విని, సుధా : **ప్రీ వెడ్డింగ్ షో, డైస్ ఏరియా.**

సెలవులో డీఈవో

అనంతపురం విద్య : జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. ఈ నెల 10 నుంచి 5 రోజులపాటు సెలవుపెట్టారు. ఇన్‌ఛార్జి బాధ్యతలు ఉపవిద్యాశాఖాధికారి మల్లారెడ్డికి అప్పగించారు.

సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ముఖ్య అతిథులు

దక్షిణ భారత పోటీలకు విద్యార్థుల ఎంపిక

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: దక్షిణ భారత స్థాయి క్విజ్ పోటీలకు అనంతకు చెందిన విశ్వభారతి పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం విజయనగర న్యాయ కళాశాలలో భారత్ కోజానో అనే అంశంపై క్విజ్ పోటీలు జరిగాయి. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయసేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, క్రియేటర్ కృష్ణ, క్విజ్ మాస్టర్ జీఎస్ఎన్ ప్రసాద్, ప్రణతి, భారత్ వికాస్ పరిషత్తు జిల్లా అధ్యక్షుడు కోరాడ రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, హరికృష్ణ పాల్గొన్నారు.

నగరాభివృద్ధితోనే వికసిత్ భారత్ సాకారం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధిస్తేనే 2047కి వికసిత్ భారత్ సాకారం అవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. కేంద్ర గృహ నిర్మాణం పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దిల్లీలో రెండు రోజులపాటు జరిగిన అర్బన్ కాన్‌క్లేవ్ సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పురపాలక అనుబంధ విభాగాల నుంచి పురపాలక సంచాలకులు సంపత్‌కుమార్, మెప్మా ఎండీ తేజ్‌భరత్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి రాష్ట్రం నుంచి ఐదుగురు కమిషనర్లలో అనంతపురం నగర కమిషనరు బాలస్వామికి అవకాశం కల్పించారు.

'రెవెన్యూ, పోలీసు వ్యవస్థను దిగజార్చారు'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు, రెవెన్యూ వ్యవస్థను దిగజారే విధంగా చేశారని శింగనమల నియోజకవర్గం వైకాపా బాధ్యులు శైలజానాథ్ విమర్శించారు. ఆదివారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. భ్రమల్లో పడేసి పరిపాలన చేస్తున్నారన్నారు.

బస్సెనక బస్సు.. వాహనదారులు కస్సుబస్సు

అనంతనగరంలో శ్రీకంఠం కూడలి నిత్యం వేలాది వాహనాలతో అత్యంత రద్దీగా ఉంటుంది. జిల్లాలో పలు ప్రాంతాలు నుంచి వచ్చే బస్సులన్నీ సూర్యానగర్ కూడలి మీదుగా శ్రీకంఠం కూడలి చేరుకుని బస్టాండ్‌కు వెళ్తుంటాయి. శ్రీకంఠం కూడలికి చేరుకునే మధ్యలోనే బస్సులను రోడ్డు పక్కన ఆపుతున్నారు. అసలే ఇరుకు రోడ్డు ఇది దీంతో వెనుకన వాహనాలన్నీ వరుస కట్టి ఆగిపోతున్నాయి. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా ముందుకు పోలేని పరిస్థితి ఏర్పడుతోంది. సూర్యానగర్ కూడలి వరకు బస్సులు లైన్‌గా ఆగిపోతుండటంతో వాహనాలకు వెళ్లేదారిలేక వాగ్వాదానికి దిగుతున్నారు. బస్టాండ్ నుంచి వచ్చే బస్సులు శ్రీకంఠం కూడలి నుంచి సూర్యానగర్ వైపు వస్తుండగా మధ్యలో ప్రయాణికులు బస్సులు ఆపి ఎక్కుతుండడంతో వారి కోసం ఆపాల్సి వస్తోండటం కూడా సమస్యగా మారుతోంది. **- ఈనాడు అనంతపురం**

కోలాహలంగా దేవాంగుల వనమహోత్సవం

బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

అనంత సాంస్కృతికం: దేవాంగ సంక్షేమ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో రెడ్డిపల్లి చౌడేశ్వరీదేవి దేవాంగ వృద్ధాశ్రమంలో ఆదివారం కార్తిక వన మహోత్సవం ఉల్లాస భరితంగా జరిగింది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంపావతి కృష్ణమూర్తి, నిమ్మల సదాశివన్, బల్లా రామ్మూర్తి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో చౌడేశ్వరీదేవి అమ్మవారి పూజా కార్యక్రమాలు చేపట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన దేవాంగ ప్రముఖులతో సమావేశం, వృద్ధాశ్రమంలో ఉత్తమ సేవలు అందించిన సేవాకర్తలకు సన్మానం, ఉమ్మడి అనంత జిల్లా స్థాయిలో 'విద్యాదీవెన' కార్యక్రమంగా పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 25 మంది విద్యార్థులకు ప్రోత్సాహకర బహుమతులు, ప్రశంసాపత్రాలు ఇచ్చారు.

ఒరిగిన సూచిక.. సరిచేయాలి త్వరగా

నగర శివారులోని టీవీ టవర్ సమీపంలో బెంగళూరు జాతీయ రహదారిపై సూచిక స్తంభం డివైడర్‌పై ప్రమాదంగా ఒరిగింది. ఇటీవల వీచిన గాలులకు సూచిక పూర్తిగా వాలటంతో రాయిని అడ్డుపెట్టారు. ఏ మాత్రం పెద్దగా గాలి వీచినా వాహనాలపై పడే ఆస్కారం ఉంది. అధికారులు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కమలానగర్

రోడ్లపైకి మందలు.. అవస్థలు

నగరంలోనే కాదు శివారు కాలనీల్లో కూడా ఆవుల మందలు నడిరోడ్డుపై సంచరిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు వస్తున్నాయి. జేఎన్‌టీయూ సమీపంలోని శారదానగర్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి కూడలిలో తరచూ ఆవులు రోడ్డుపైకొస్తున్నాయి. వాటిని తప్పించబోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు తగిలి గోవులూ ప్రమాదాలకు గురవుతున్నాయి. రుద్రంపేట సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారి, విజయనగర కాలనీ సమీపంలోని చెన్నైకి వెళ్లే జాతీయ రహదారుల్లోనూ ఈ సమస్య తీవ్రంగా ఉంది.

- న్యూస్‌టుడే, జేఎన్‌టీయూ

అల్లుకున్న తీగలు.. రాలుతున్న నిప్పురవ్వలు

నగర శివారు విజయనగర్ కాలనీ శివకోటి ఆలయ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద విద్యుత్తు తీగలకు చెట్టు తీగలు అల్లుకున్నాయి. నిత్యం గాలి వీచిన సమయంలో నిప్పురవ్వలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. పెట్రోల్ బంకు సమీపంలోనే ఉండటంతో భయాందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కమలానగర్**

దిగుతున్న వేర్లు.. గోడలకు బీటలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని మార్కెట్ యార్డు విశ్రాంతి ఉద్యోగుల భవనానికి మర్రి చెట్టు చెట్టు మొలిచింది. పాత భవనానికున్న దోని వద్ద మర్రిచెట్లు మొదళ్లతో పైకి చిన్న కొమ్మలు వేసింది. దిగువన గోడ పొడవునా వేర్లు దిగాయి. వేర్లు పొడవుగా ఉన్నా.. మొక్క మాత్రం పెరగలేదు. వేసవిలో మొక్క ఎండిపోయింది. ఇలానే కొనసాగితే గోడలకు బీటలు వచ్చి భవనం దెబ్బదినే ప్రమాదం ఉంది. అధికారులు దీన్ని తొలగించాలని అక్కడి కి వచ్చే సిబ్బంది కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాంనగర్**

ఉచిత న్యాయసేవలు సద్వినియోగం చేసుకోండి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: ఉచిత న్యాయ సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం జాతీయ న్యాయసేవ దినోత్సవాన్ని జిల్లా న్యాయ సేవాసదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్మికుల జాబ్‌కార్డు, వారికి ఉన్న చట్టాలు వివరించారు. మహిళలకు వన్‌స్టాప్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. విజయనగర న్యాయకళాశాల విద్యార్థులకు న్యాయసేవ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఐసీడీఎస్ అధికారి శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనరు సూర్యనారాయణ, అధికారులు రమాదేవి, సుజాత, మధ్యవర్తిత్వం న్యాయవాది హరికృష్ణ పాల్గొన్నారు.

5 విభాగాల్లో ఛాంపియన్‌షిప్ టైటిల్స్

ట్రోఫీలు అందుకున్న విజేతలతో క్రీడల సమాఖ్య ప్రతినిధులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల ఖురాష్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను అనంతపురం జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకుని రెండురోజులపాటు మాంటిస్సోరి పాఠశాలలో జరిగిన ఈ పోటీల్లో అనంతపురం జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ పాటవాలు ప్రదర్శించారు. అండర్-14 బాలబాలికలు, అండర్-17 బాలబాలికలు, అండర్-19 బాలికల ఛాంపియన్‌షిప్ టైటిళ్లను అనంతపురం జట్లు సొంతం చేసుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి ఉప డీఈఓ మల్లారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ భరత్, పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు శ్రీవాస్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీదేవి, లీలారాణి, రామాంజనమ్మ పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

కోటి దీపోత్సవం.. భక్తుల తన్మయం

అనంత సాంస్కృతికం: నగరంలోని బెంగళూరు రోడ్డు శివబాలయోగి ఆశ్రమంలో ఆదివారం రాత్రి కోటి దీపోత్సవం వైభవోపేతంగా జరిగింది. 162 జంటలు ఉత్సవంలో పాల్గొనగా ఒక్కో జంటకు ఒత్తులతో చేసిన దీపాన్ని, శాలిగ్రాం లింగాన్ని, పూజా సామగ్రిని నిర్వాహకులు అందించినట్లు ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు అరవింద, సురేశ్, మల్లికార్జున, దేవరాజ్ తెలిపారు.

దీపాలు వెలిగిస్తున్న భక్తులు

స్వర్ణ కవచ అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరునికి కార్తిక పూజలు విశేషంగా నిర్వహించారు. 10వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం స్వామి వారికి పల్లకీసేవ, స్వర్ణ కవచ సేవ, రథోత్సవ సేవ చేశారు. స్వామి వారికి సాయంత్రం మహామంగళ హారతి, నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం ఆలయంలోని ధ్వజ స్తంభంపై దీపాలను వెలిగించారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి అఖండ భజన

అనంత సాంస్కృతికం: సత్యసాయి బాబా శత వర్ష జయంత్యుత్సవాలు పురస్కరించుకుని అరవిందనగర్ సత్యసాయి భజన మందిరంలో సత్యసాయిని కీర్తిస్తూ అఖండ భజన నిర్వహించారు. ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రేమ ద్వారా ఏదైనా సాధించవచ్చని, సాయి ఉద్బోధన ద్వారా బాబా ప్రేమతత్వం తెలుస్తుందన్నారు. సత్యసాయి సేవా సంఘం అనంత జిల్లా అధ్యక్షుడు రామచంద్రమూర్తి, నగర సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

ద్విచక్ర వాహనం అదుపుతప్పి రైతు మృతి

రాప్తాడు: కుక్కను తప్పించబోయి బైక్‌మీద నుంచి కింద పడి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన రాప్తాడు మండలం జన్మభూమి నగర్‌లో జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాప్తాడు మండలం పాలబావి గ్రామానికి చెందిన రైతు శివయ్య ఆదివారం ఉదయం విత్తనాలు తీసుకొచ్చేందుకు ద్విచక్ర వాహనంపై అనంతపురం వెళ్లాడు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో జన్మభూమి నగర్ సమీపానికి రాగానే.. అకస్మాత్తుగా కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. శివయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

గాయపడిన విద్యార్థికి కాలు తొలగింపు..

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగర శివారులోని కళ్యాణదుర్గం రోడ్డులో గత నెల 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు కాలు కోల్పోయాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కంబదూరు మండలం పాళ్లూరు పంచాయతీలోని కొత్త మిద్దెల గ్రామానికి చెందిన రామ్‌చరణ్ నగరంలో చదవుతున్నాడు. గత నెల 23న ద్విచక్ర వాహనంపై విద్యార్థి నగరంలోకి వస్తుండగా, నగరం నుంచి కళ్యాణదుర్గం వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థికి కాలికి తీవ్రగాయాలు కాగా.. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. కాగా ఇన్‌ఫెక్షన్ సోకడంతో ఆదివారం కాలిని వైద్యులు తొలగించారు. బాధితుని తండ్రి రమేశ్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వమే వైద్యవిద్యను నిర్వహించాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: వైద్యవిద్యను ప్రభుత్వమే నిర్వహించాలని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ విజ్ఞప్తి చేసింది. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆ సంఘం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రజా విజ్ఞప్తి అంటూ కరపత్రాలు ఆదివారం విడుదల చేశారు. వైద్య విద్యను పీపీపీ విధానంలో అమలు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కమలానగర్, న్యూస్‌టుడే : అనంతపురం బంగారు వ్యాపారస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది జనార్దనగుప్తా పేర్కొన్నారు. ఆదివారం పాతూరులోని ఆ అసోసియేషన్ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా గొంది జనార్దనగుప్తా, ప్రధాన కార్యదర్శి జయం విశ్వనాథ్, కోశాధికారి అనిల్ అగర్వాల్, సహాయ కార్యదర్శి బద్రీనాథ్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ ఇలియాస్, టీవీ సురేష్‌బాబు, రంగాచారి, సోమశేఖర్‌ను ఎంపిక చేశారు.

విచారణపై నిర్లక్ష్యం ఎందుకు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా కార్యాలయంలో సెక్టోరియల్ ఉద్యోగాల నియామకంపై జరిగిన విచారణలో వాస్తవాలు వెల్లడించడానికి ఉన్నత అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని రిజర్వేషన్ల సాధికారిక పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఉజ్వల్ పేర్కొన్నారు. నియామకాలపై అనేక ఆరోపణలున్నాయి. ఆరోపణలపై త్రిసభ్య బృందం విచారణ చేసింది. నివేదిక సమర్పించి వారం రోజులు గడచినా ఎలాంటి విషయాలు గానీ, చర్యలు గానీ లేవు. విచారణ ఏమైందని ఆయన ప్రశ్నించారు.

కోడలు, ఆమె కుటుంబ సభ్యులపై అత్త ఫిర్యాదు

అనంత నేరవార్తలు: తన కుమారుడి నుంచి విడిపోయిన కోడలు, ఆమె కుటుంబ సభ్యులు తమ ఇంటిని కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని బాధితురాలు సుశీలాబాయి ఆదివారం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అతడికి లలితాబాయితో కొంతకాలం క్రితం వివాహమైంది. వీరు నగరంలోని భైరవ నగర్ 17వ క్రాస్‌లో సొంత ఇంటిలో నివశించేవారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. కోడలు లలితాబాయి తన అత్త సుశీలాబాయి కట్టించిన ఇంట్లోనే ఉంటోంది. ఖాళీ చేయాలని అత్త కోరినా చేయకపోగా, కుటుంబ సభ్యులతో కలిసి బెదిరింపులకు పాల్పడుతోంది. ఆమె అత్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నీరు కలుషితం.. ప్రజారోగ్యం ప్రశ్నార్థకం!

శారదానగర్, రుద్రంపేట: నగరంలో, గ్రామీణ మండలంలో తాగునీటి కలుషితం ఎవరికీ పట్టని వ్యవహారంగా మారిపోయింది. నిత్యం పర్యవేక్షిస్తున్న వారే నాకెందుకులే అనే ధోరణితో ఉండటంతో ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది.

నగర శివార్లలోని కళ్యాణదుర్గం రోడ్డు మైసూరు నరిగమ్మ తల్లి ఆలయ సమీపంలోని నీటి వాల్వ్ పిట్ మురికి కాలువగా మారింది. వాల్వు పిట్‌కు భద్రత కొరవడి గుంతగా మారి అస్తవ్యస్తంగా తయారైంది. పక్కనే ఉన్న వాటర్ ట్యాంకు నుంచి నీరు వస్తున్న సమయంలో గుంతలో చేరి మురికి కూపంగా మారింది. అక్కడే స్పిండిల్ రాడ్ తిప్పడంతోనే పని అయిపోయిందని భావిస్తున్నారు. ఫలితంగా ఆ మురికి పైపుల్లోకి చేరుతోంది.

కోవూర్‌నగర్ సాయిబాబా దేవాలయ సమీపంలో భూమిలో ఏర్పాటు చేసిన పైపులు లీక్ అవుతుండటంతో తాగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ కలుషితమవుతోంది.

కత్తి పద్మారావుకు జీవిత సాఫల్య పురస్కారం

అనంత సాంస్కృతికం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాహిత్య సేవా కార్యక్రమాలు చేస్తున్న 'విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవిత సాఫల్య పురస్కారం 2025ను దళిత మహాసభ అధ్యక్షుడు డా. కత్తి పద్మారావు దక్కించుకున్నారు. సాహితీ రంగంలో చేసిన సేవకు ఆయనకు ఈ గుర్తింపు దక్కింది. సభకు అధ్యక్షత వహించిన సాహిత్య విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. కత్తి పద్మారావు తమ సాహిత్యం, ఉద్యమాల ద్వారా దళితుల జాగృతికి జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా పేర్కొన్నారు. పురస్కార ప్రదాత డా. శాంతినారాయణ ఏటా ఇస్తున్న పురస్కారం నేపథ్యాన్ని వివరించారు. ప్రధాన వక్త డా. కోటేశ్వరరావు మాట్లాడుతూ.. చుండూరు, కారంచేడు గ్రామాల్లో దళితుల మీద జరిగిన దాడుల వల్ల కత్తి పద్మారావు ఉద్యమాన్ని ప్రారంభించి, దళితుల్లో అస్తిత్వ స్పృహ కలిగించారన్నారు.

డా.కత్తి పద్మారావు కుమారుడు కత్తి చేతన్‌కు పురస్కారాన్ని అందిస్తున్న నిర్వాహకులు

పిల్లలతో వివాహిత అదృశ్యం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి అదృశ్యమైంది. సదరు మహిళ ఈ నెల 7న మూడేళ్లు, 11 నెలల వయసున్న పిల్లలతో సహా బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి వెళ్లలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, సన్నిహితుల వద్ద గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

(c) eenadu

ఆహా.. ఇదేం గుహ

హార్సిలీహిల్స్‌లో ప్రకృతి అందాలకు కొదవలేదు. . అందుకే ఆ సుందర దృశ్యాలను తిలకించేందుకు అనేక మంది పర్యాటకులు వస్తుంటారు. కొండపై ఉన్న పోలీసు అతిథి గృహం వెనుక వైపున్న ఓ కొండపై పెద్ద బండరాయి ఉంది.. దూరం నుంచి చూస్తే ఇది బండలా కనిపించినా దాని కింద దాదాపు 20 మంది కూర్చునే విధంగా విశాలమైన గుహ ఉంది. వర్షాకాలంలో ఇటుగా వచ్చిన వారు రక్షణగా ఇక్కడ కూర్చోవటం.. తెచ్చుకున్న ఆహారాన్ని ఆరగించడం చేస్తున్నారు. కొత్తవారికి ఇది వింత అనుభూతిని కలిగిస్తోంది.

- ఈనాడు, చిత్తూరు - న్యూస్‌టుడే, మదనపల్లె

హాం.. భూం.. ఫట్

అబ్రకదబ్ర.. అబ్రకదబ్ర.. అబ్రకదబ్ర.. అరెరె అదేంటి చేతిలో ఉండే వస్తువు మాయమైందే.. కళ్లు మూసి తెరిచే లోపు కనికట్టు కట్టినట్లు మాయం చేసేశారే.. అరెరె గాల్లో పూల గుత్తులు సృష్టించారేంటి చెప్మా! ఇలాంటి ఇంద్రజాల, మహేంద్రజాల ప్రదర్శనలకు ఆదివారం రాజంపేట వేదికైంది. ఏపీ మ్యాజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాయాలోకం-2025 పేరిట 41వ ఇంద్రజాల వేడుకలో కన్పించినవీ దృశ్యాలు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 148 మంది ఇంద్రజాలికులు, జూనియర్, సీనియర్ విభాగాల మధ్య పోటీలు జరిగాయి. ఇంద్రజాలికుడి ప్రదర్శనను చిత్రంలో చూడవచ్చు.

- న్యూస్‌టుడే, రాజంపేట

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజావేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌కు వివరాలు చెబుతున్న కలెక్టరు నిశాంత్‌కుమార్, అధికారులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: ఈ నెల 12న చిన్నమండెంలో జరిగే సీఎం నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, తెదేపా నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డితో కలిసి వచ్చి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. అక్కడే ఉన్న జిల్లా కలెక్టరు నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌లు పెందుర్తి వెంకటేష్‌కు ప్రజావేదిక ఇతర స్థలాల గురించి మ్యాప్ ద్వారా వివరించారు. అక్కడి నుంచి రాజీవ్ కాలనీలో పక్కా గృహాలు, రోడ్లు, ఇతర ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం హెలిప్యాడ్, తెదేపా నాయకులు, కార్యకర్తలతో నిర్వహించే సమావేశానికి స్థలాన్ని పరిశీలించారు. ఉదయం నుంచి రాజీవ్ కాలనీలో సీఎం ప్రారంభించనున్న పక్కా గృహాలను ఆ శాఖ పీడీ రమేష్‌రెడ్డితో పాటు రాజంపేట, మదనపల్లె సబ్ కలెక్టర్లు భావన, చల్లా కల్యాణి, ఆర్డీవో శ్రీనివాసులు తనిఖీ చేసి దిగువ శ్రేణి అధికారులకు పలు సూచనలు చేశారు. డీఎస్పీ కృష్ణమోహన్, జిల్లా, మండల స్థాయి అధికారులు, స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గుట్ట నక్కలు.. ఇసుకాసురులు

మట్టి తవ్వకాలతో గుట్ట మాయం

- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

ఈ చిత్రం గమనించారా.. ఇక్కడేదో ఖనిజ నిక్షేపాలు, ఖరీదైన అవశేషాల కోసం తవ్వకాలు జరిగాయనుకుంటే పొరపాటే. కొందరు స్వార్థపరులు సహజ వనరులను దోపిడీ చేస్తూ వాటి ఆనవాళ్లు కూడా కనిపించకుండా చేస్తున్నారు. వేల సంవత్సరాల నాటి కొండలను మట్టి కోసం తవ్వేస్తూ వాటి రూపురేఖలనే మార్చేస్తున్నారు. తవ్విన మట్టిని స్థిరాస్తి వ్యాపారులకు అమ్ముకుంటూ రూ.కోట్లు దోచుకుంటున్నారు. కళ్లెదుటే ఇంత జరుగుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. రాజంపేట మండలం పోలి చెరువు వద్ద ఉన్న కొండలు గుల్ల చేసి ఆ మట్టితో చెయ్యేరులోకి రోడ్లేసి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు.

మట్టి తవ్వకాలు సాగించేందుకు సిద్ధంగా ఉన్న యంత్రం

● **తవ్వకాలు జరిగే ప్రాంతాలివే:** రాజంపేట, పెనగలూరు మండలాల పరిధిలో మట్టి తవ్వకాలు అడ్డూ అదుపు లేకుండా సాగిస్తున్నారు. రాజంపేట మండలం పోలి, హత్యరాల, కడియాలపల్లి, బోయనపల్లి చెరువు వద్ద ఉన్న కొండ, రామాపురం, బాలరాజుపల్లి, పెనగలూరు మండలంలో నారాయణ నెల్లూరు, నల్లపురెడ్డిపల్లి, వెలగచెర్ల గ్రామాల్లో ఈ మట్టి తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు.

● **ఏట్లోకి రోడ్లు:** రాష్ట్ర ప్రభుత్వం చెయ్యేరులో ఇసుక తవ్వకాలకు నూతనంగా అనుమతిచ్చింది. ప్రస్తుతం చెయ్యేరులో నీటి ప్రవాహం ఉండడం వల్ల ఇసుక తరలించడానికి ఇబ్బందిగా మారడంతో కొండలను తవ్వేసి చెయ్యేరులో రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. రాజంపేట మండలం హత్యరాల వద్ద నూతనంగా మంజూరైన ఇసుక రేవులో రోడ్ల కోసం పోలి, హత్యరాల వద్ద మట్టిని తరలిస్తున్నారు. నదిలోకి రోడ్లేస్తున్నారు.

● **స్థిరాస్తి వ్యాపారం కోసం ఇలా:** రాజంపేట పట్టణం పరిధిలోని పోలి చెరువు కింద ఉన్న వ్యవసాయ భూముల్లో స్థిరాస్తి వ్యాపారం సాగించేందుకు కొండలను తవ్విన మట్టితో వ్యవసాయ భూములను ఇంటి స్థలాలుగా మారుస్తున్నారు. రైతుల అవసరాల కోసమని అధికారుల వద్ద అనుమతులు తీసుకుని అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు.

● **చర్యలు నామమాత్రం:** రాజంపేట, పెనగలూరు మండలాల పరిధిలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగిస్తుంటే గనులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఊటుకూరు వద్ద అక్రమ తవ్వకాలు చేపట్టిన వాహనాలను పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినా వదిలేశారని గ్రామస్థులు వెల్లడించారు.

పుట్ట శీర్షాసనం.. పిట్ట నిర్మాణ కౌశలం

ఈ చిత్రం చూశారా.. పుష్కరిణి మధ్యలో మండపం పైభాగం మీద పుట్ట తిరగబడినట్లుంది కదూ! ఇవి చీమలు పెట్టినవి కాదండోయ్.. పిట్టలు కట్టిన అపురూపమైన గూళ్లు.. ఏటా వర్షాకాలంలో బురద మట్టిని సేకరించి ఇలా గూళ్లు కడతాయి.. స్థానికంగా వీటిని వాన గువ్వలని పిలుస్తారు. రామసముద్రం సమీపంలోని ముళబాగల్ పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ పుష్కరిణి వద్ద కనిపించిందీ దృశ్యం. వేల సంఖ్యలో గువ్వలు ఇక్కడ నివాసం ఉంటూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. మనుషులకే కాదండోయ్ పక్షులకు అద్భుత పరిజ్ఞానం ఉందని తెలిపేలా ఉంది కదూ! - న్యూస్‌టుడే, రామసముద్రం

81% ఉపాధిలో ఈకేవైసీ

చిన్నమండెం, న్యూస్‌టుడే: ఉపాధి పథకంలో వేతనజీవులకు పనులు కల్పించాలన్నా, చేసిన పనికి బిల్లులు చెల్లించాలన్నా తప్పనిసరి ఈకేవైసీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. గత నెల నుంచి జిల్లావ్యాప్తంగా కూలీలకు ఈకేవైసీ ఉపాధి సిబ్బంది చేస్తున్నారు. ఇప్పటికీ 56,581 మంది పెండింగ్‌లో ఉన్నారు. జిల్లా మొత్తం పరిశీలిస్తే 81 శాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

ఈకేవైసీ చేయిస్తున్న ఏపీడీ మధుబాబు

● ఉపాధిలో ఈకేవైసీ అమలు చేయనుండడంతో అక్రమాలకు చెక్ పడనుంది. ఇప్పటి వరకు పనికి రాని వారికి కూడా కొన్ని చోట్ల సిబ్బంది బిల్లులు పంచుకున్నట్లు సమాచారం. అలాంటి వారి ఆటలు ఇక సాగవని ఉన్నతాధికారులు అంటున్నారు. పనికి వెళ్లిన సమయంలో ఉదయం, సాయంత్రం రెండుసార్లు పని దగ్గర ఫొటో తీసుకోవాలన్న నిబంధన కూడా అక్రమాలకు తావివ్వదంటున్నారు.

జిల్లా వివరాలు ఇలా...

మండలాలు	వేతనదారులు:	ఈకేవైసీ చేసిన సంఖ్య:
30	3,06,847	2,50,266
ఇంకా చేయాల్సిన సంఖ్య	80 శాతం కన్నా తక్కువ మండలాలు	91 శాతం నమోదైన మండలం:
56,581	06	రైల్వేకోడూరు

● ఈకేవైసీ చేసేందుకు ఇళ్లకు వెళ్లిన కొందరు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో కాకుండా పట్టణాల్లో నివాసం ఉండడం, గల్ఫ్‌కు వలస వెళ్లడం, మరికొందరు మృతి చెందడం వంటి కారణాలు కనిపిస్తున్నాయి. కొందరి జాడ తెలియకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు.

వందేమాతరం.. ప్రణాళిక ఘనం

పదిలో సీ, డీ గ్రేడ్లతో పాటు టాపర్లకూ శిక్షణ

ఓబులవారిపల్లె, పుల్లంపేట, న్యూస్‌టుడే : వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధన దిశగా యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. అందుకు వంద రోజుల ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఈ మేరకు ఇప్పటి నుంచే జిల్లా, మండల అధికారులు, ఉపాధ్యాయులకు ఉన్నతాధికారులు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో వివిధ యాజమాన్యాల కింద 503 ఉన్నత పాఠశాలలుండగా వీటిలో పదో తరగతి విద్యార్థులు 23,138 చదువుతున్నారు. ఇప్పటికే అదనపు తరగతులు ఉదయం 8.15 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం పాఠశాల పని వేళల అనంతరం మరో గంట అదనంగా చదివిస్తున్నారు. సెలవు దినాల్లోనూ సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని పునశ్చరణ చేయిస్తున్నారు. మరికొందరు తమ సబ్జెక్టుల్లో శత శాతం ఉత్తీర్ణత వీలుగా లఘు పరీక్షలు (స్లిప్ టెస్టులు) నిర్వహిస్తూ విద్యార్థుల ప్రతిభను మదింపు చేస్తున్నారు. దీనికితోడు ఈ ఏడాది సైతం జిల్లా పరిషత్తు ఆధ్వర్యంలో విజయ కేతనం పేరుతో అధ్యయన సామగ్రి (స్టడీ మెటీరియల్) పుస్తకాలను అందజేయనున్నారు. ● ఈ ఏడాది నుంచి వెనకబడిన విద్యార్థుల ఉత్తీర్ణత సాధనకు ప్రత్యేక కార్యాచరణతో పాటు బాగా రాణించే విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించేలా తీర్చిదిద్దే శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని డీఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు.

స్టడీఅవర్‌లో పాఠాలు చవుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

జిల్లాలో పదో తరగతి విద్యార్థుల వివరాలు	జిల్లాలో మొత్తం ఉన్నత విద్యాలయాలు : 503	ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 14,430	ప్రైవేట్ బడుల్లో చదివే వారు 8,708

ముక్కంటి మురవంగ.. అభిషేకించె గంగ

కార్తిక మాసాన ముక్కంటిని అభిషేకించడానికి ఆకాశ గంగ కదలి వచ్చినట్లు వెలిగొండల జలపాతం కనువిందు చేస్తోంది. దట్టమైన శేషాచలం కొండల్లో కురిసే వర్షాలకు కొండ కోనలు దాటుకుని గంగమ్మ కర్కటేశ్వరుని రూపంలో ఉన్న శివయ్యను అభిషేకిస్తుంది. చిట్వేలి మండలం పెద్దూరుకు 11 కిలోమీటర్ల దూరంలో కర్కటేశ్వర కోనుంది. శివుడు ఎండ్రకాయ రూపంలో పూజలందుకోవడం ఇక్కడి ప్రత్యేకత. వెలిగొండల మధ్యలో ఉన్న ఈ ఆలయం చుట్టూ రెండు జలపాతాల సవ్వడితో ఆ ప్రాంతం మార్మోగుతోంది. కార్తిక సోమవారం రోజుల భక్తులు విశేషంగా తరలి వస్తారని ఇక్కడి ఏర్పాట్లు చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, పుల్లంపేట

నిర్వహణ లేని వీరభద్రాలయంలోని చేదబావి

చేదబావిలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్న బావి నీరు

బావి భద్రం.. నీరు అశుభ్రం!

శివుని జటాజూటం నుంచి ఉద్భవించిన వీరభద్రుడు వెలసిన దివ్యక్షేత్రం శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయం. స్వామి వారి కైంకర్యాలకు అవసరమైన పవిత్ర జలాలకు వందల ఏళ్ల క్రితమే ప్రాంగణంలో చేద బావి తవ్వారు. అర్చామూర్తిగా పేరొందిన వీరభద్రుడికి ఎలాంటి ఉత్సవాలు ప్రారంభమైనా మేళ తాళాలతో బావి వద్ద గంగ పూజ నిర్వహించి ఆ జలాన్ని సేకరించి ఆలయ ప్రదక్షిణ అనంతరం అభిషేకించడం ఆనవాయితీ. ఇంతటి పవిత్రత కలిగిన చేద బావి నిర్వహణ నేడు అస్తవ్యస్తంగా మారింది. నీటిని తోడేందుకు పైభాగంలో గిలకలు ఏర్పాటు చేశారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో బావి గోడలు శిథిలావస్థకు చేరాయి. నీటిలో చెత్తాచెదారం వేయడంతో అవి కుళ్లి దుర్వాసన వస్తోంది. కార్తిక మాసంలో ఎంతో భక్తితో స్నానాలు ఆచరించి పూజకు వచ్చే భక్తులు బావి దుస్థితిని చూసి అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతున్నారు.

- న్యూస్‌టుడే, రాయచోటి

అవనిలో సగం.. అండగా ఉందాం!

కంభంవారిపల్లి, నందలూరు, న్యూస్‌టుడే : సమాజంలో మహిళలు వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటిని పరిష్కరించడానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో జెండర్ రీసోర్స్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో మూడు జీఆర్‌సీ కేంద్రాలు ప్రారంభించారు. నాలుగో కేంద్రం అతి త్వరలో ఏర్పాటు చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులే ఈ కేంద్రాల ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. వారి సాధికారతకు అమలు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెలుగు అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో జెండర్‌పై అవగాహన సదస్సులు నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

● **ఎక్కడెక్కడంటే:** ● జిల్లాలో తొలి విడతలో రాయచోటి, పీలేరు, మదనపల్లెలో జీఆర్‌సీ కేంద్రాలు ప్రారంభించారు. లక్కిరెడ్డిపల్లెలో జీఆర్‌సీ కేంద్రాన్ని ప్రారంభించడానికి అధికారులు అన్ని ఏర్పాటు సిద్ధం చేశారు. తంబళ్లపల్లె, రాజంపేట, ఓబులవారిపల్లె, సుండుపల్లెల్లో జీఆర్‌సీ కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ● ఆపదలో ఉన్న మహిళలను ఆదుకోవడానికి, అండగా నిలిచి తగు సూచనలు ఇచ్చి, అవసరమైన చేయూత ఇచ్చి భరోసా కల్పించడానికి కూటమి ప్రభుత్వం జెండర్ రీసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే మహిళలు ఎదుర్కొనే పలు సమస్యలపై సంఘటితంగా పోరాడే అవకాశం ఉంటుందని అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న జెండర్ అధికారి

● **కమిటీ ఏర్పాటు ఇలా..** ● ప్రతి మండలంలో గ్రామ సమాఖ్య నుంచి ఇద్దరు చొప్పున సభ్యులను ఎంపిక చేసి, గ్రామస్థాయి కమిటీలను నియమిస్తారు. ఈ కమిటీల నుంచి ముగ్గురు లేదా ఐదుగురు సభ్యులతో మండల స్థాయి కమిటీని ఎంపిక చేస్తారు. వీరే జీఆర్‌సీ కేంద్రాలకు (జెండర్ రీసోర్స్ కేంద్రాలు) ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. ● మండల కమిటీ వారానికి ఒకసారి సమావేశమై, గ్రామ కమిటీల ద్వారా గుర్తించిన బాధితుల ఆర్థిక, సామాజిక, చట్టపరమైన సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తారు. అవసరమైతే బాధితులతో కలసి సంబంధిత వ్యక్తులు, అధికారుల వద్దకు వెళ్లి చర్చిస్తారు.

● **రూ.5 లక్షలు కేటాయింపు :** ఒక్కో కేంద్రం ఏర్పాటు, నిర్వహణకు ప్రభుత్వం రూ.5 లక్షల నిధులు విడుదల చేస్తోంది. ఇప్పటికే పీలేరు, రాయచోటి, మదనపల్లె, లక్కిరెడ్డిపల్లె జీఆర్‌సీ కేంద్రాలకు నిధులు విడుదల చేసింది. వెలుగు కార్యాలయాల్లో సరిపడా గదులుంటే, అక్కడే ఈ కేంద్రాలను నిర్వహిస్తారు. లేకుంటే భవనాలను అద్దెకు తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంత మహిళలకు అండగా ఈ జీఆర్‌సీ కేంద్రాలు ఉంటాయని, లక్కిరెడ్డిపల్లెలో త్వరగా ప్రారంభిస్తామని వెలుగు పీడీ నాగేశ్వరరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. అర్జీదారులు మండల, డివిజన్ స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా అర్జీలు సమర్పించవచ్చునన్నారు. పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి తీసుకు రావాలని ఆయన తెలిపారు. గతంలో ఇచ్చిన సమస్యలపై సమర్పించిన అర్జీల ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు 1100 నంబరును సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

ధైర్య సాహసాలకు ప్రతీక గైడ్ కెప్టెన్లు

రాయచోటి, న్యూస్‌టుడే: బాలికల ఎదుగుదలకు ప్రేరణగా నిలుస్తున్న గైడ్ కెప్టెన్లు ధైర్య సాహసాలకు ప్రతీకలని కస్తూర్బా విద్యాలయాల రాష్ట్ర సంచాలకులు డి.దేవానందరెడ్డి తెలిపారు. డైట్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావం, క్రమశిక్షణ, ధైర్య సాహసాలు, మానవీయ విలువలను పెంపొందించడంలో గైడ్ కెప్టెన్ల పాత్ర ఎనలేనిదన్నారు. పీటీఎం మండలం కమ్మచెరువు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత రూ.10 వేలు చెల్లించి స్కౌట్ జీవిత సభ్యురాలిగా చేరారు. ప్రకృతి వైపరీత్యాలపై భువనేశ్వర్‌లో 21 రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న వెంకటరమణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో లీడర్ ఆఫ్‌ది పోస్టు కస్తూరి సుధాకర్, జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, ఆపద మిత్ర నోడల్ అధికారి గురునాథరెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కస్తూర్బా విద్యాలయాల రాష్ట్ర సంచాలకులు దేవానందరెడ్డి

కొండెక్కిన కొత్తిమీర



కొత్తిమీర ధరలు ఆకాశానికి ఎగబాకాయి. తోటల వద్దే 50 కట్టల కొత్తిమీర బస్తా రూ.1,500 ధర పలుకుతోంది. ఇటీవల ఎడతెరిపిలేని వర్షాలకు తోటల్లో అధిక తేమశాతానికి పంటలు దెబ్బతిన్నాయి. విత్తనాలు మొలకెత్తలేదు. తోటలను కంటికి రెప్పలా కాపాడుకున్న రైతులకు మాత్రం కాసుల వర్షం కురుస్తోంది. ఎకరం విస్తీర్ణంలో రూ.50 వేల పెట్టుబడితో సాగు చేస్తే 200 నుంచి 250 బస్తాల వరకు దిగుబడి రావాల్సి ఉంది. వర్షాల వల్ల ప్రస్తుతం 150 నుంచి 175 బస్తాల దిగుబడి వస్తోంది. ప్రస్తుతం ఎకరం దిగుబడికి రూ.2.5 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. జిల్లాలోని రామసముద్రం, మదనపల్లె, కురబలకోట, పీటీఎం, రాయచోటి, మొలకలచెరువు మండలాల్లో వెయ్యి ఎకరాలకు పైగానే సాగు ఉంది. ఎక్కువ శాతం రామసముద్రంలోనే సాగవుతోంది. రోజూ చెన్నై, విజయవాడ, రాజమండ్రి, బెంగళూరు మార్కెట్లకు ఎగుమతులు జరుగుతున్నాయి.

- న్యూస్‌టుడే, రామసముద్రం

కోస్తే చూడలేరు.. చూస్తే తినలేరు!

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: మాంసం లేనిదే ముద్ద దిగదు కొందరికి.. వారాంతం వచ్చిందంటే చాలు మాంసం విక్రయించే దుకాణాలన్నీ కిటకిటలాడుతుంటాయి. కానీ అది పరిశుభ్రంగా ఉందా.. నిబంధనలు పాటించి వధిస్తున్నారా? అన్నది చూసుకోవడం లేదు. అపరిశుభ్ర వాతావరణంలో కోళ్లు, మేకలు, పొట్టేళ్లను వధించి అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో తిన్న వాళ్లు ఆసుపత్రి పాలవుతున్నారు. మామూళ్ల మత్తులో అధికారులు వీటిని గుర్తించినా పట్టించుకోవడమే మానేశారు. ● జిల్లా కేంద్రమైన రాయచోటిలో వందల సంఖ్యలో మాంసం విక్రయ దుకాణాలు ఉన్నాయి. రోజూ వేల కిలోల మాంసం విక్రయాలు సాగుతున్నాయి. వారాంతంలో టన్నుల కొద్దీ మాంసం విక్రయాలు సాగుతున్నాయి.

● రోడ్లపైనే అపరిశుభ్ర వాతావరణంలోనే జీవాలను వధిస్తున్నారు. రహదారులపై వాహనాలు వెళ్తున్నప్పుడు లేచిన దుమ్ము, ధూళి రహదారుల పక్కన ఉన్న దుకాణాల్లో బహిరంగంగా వేలాడదీసిన మాంసంపై పడి కలుషితమవుతోంది. ● కోసిన మాంసంపై ఎలాంటి వస్త్రం కప్పి ఉంచకపోవడం వల్ల ఈగలు, దోమలు వాలుతున్నాయి. కలుషిత వాతావరణంలో కోయడం, అమ్మడం చేస్తుండడంతో ఆ మాంసాన్ని తిన్న జనం అనారోగ్యం బారినపడుతున్నారు.

గాలివీడు రోడ్డులో మాంసం విక్రయాలిలా..

కేంద్రం :	రాయచోటి
దుకాణాలు:	వందల్లో
మాంసం విక్రయాలు :	టన్నుల్లో
మటన్ :	12 టన్నులు
చికెన్ :	21 టన్నులు

● నడి రోడ్లే జంతు వధశాలలు

ఎక్కడెక్కడంటే: ఠాణా, బంగ్లా, మదనపల్లె రోడ్డు మార్గం, గాలివీడు రోడ్డు మార్గం, చిత్తూరు రోడ్డు మార్గం, బస్టాండు ప్రాంతం, కొత్తపేట తదితర ప్రాంతాల్లో మాంసం విక్రయ కేంద్రాలు ప్రధాన రోడ్డు పక్కనే ఉన్నాయి. రహదారుల పక్కనే మురుగు కాలువల పైన దుకాణాలు ఏర్పాటు చేశారు. ● చికెన్ విక్రయ కేంద్రాల్లో ఇనుప బోన్లు ఏర్పాటు చేసి కోళ్లను పెంచుతున్నారు. ఈ కోళ్లను ఎలుకలు కొరికి గాయపరుస్తున్నాయి. ఆ గాయపడిన, చనిపోయిన కోళ్లనే వధించి ప్రజలకు విక్రయిస్తున్నారు. ఇలాంటి మాంసం తిన్న ప్రజలు రోగాలబారినపడుతున్నారు.

నిబంధనలు ఇవి : జంతు వధ శాలలో పశువైద్యుడి సమక్షంలో ఆరోగ్యకర మేకలు, పొట్టేళ్లు, గొర్రెలను గుర్తించి సీలు వేసిన తర్వాత వధించాల్సి ఉంటుంది. ఇది అమలు కావడం లేదు.

జరుగుతున్నదిలా.. : అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు వ్యాపారులు అత్యాశకు పోయి రోగాలబారినపడినవి, చచ్చిన జీవాలను కోసి విక్రయిస్తున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయింది.

పరిష్కారం : పురపాలికల్లో ప్రత్యేకంగా మాంసం మార్కెట్లు ఒకచోట ఉండాలన్న నిబంధన అమలు చేయడం. ● జిల్లాలో రాయచోటి, మదనపల్లె, రాజంపేట పురపాలికల పరిధిలో మాంసం విక్రయాలకు ఓ పద్ధతి లేకపోవడంతో ఎవరికి వారు దుకాణాలు తెరిచి, మాంసం విక్రయిస్తున్నారు.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్డ్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు. ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

ప్రకటనల కొరకు సంప్రదించండి : కడప : 99899 97626 మదనపల్లి : 80080 01768

(c) eenadu

ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్

రాయచోటి, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని సెకండ్ గ్రేడ్ టీచర్లకు, లాంగ్వేజ్ పండిట్లకు వెంటనే పదోన్నతులు కల్పించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాసరాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని అర్చనా విద్యా సంస్థలలో రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అన్ని రకాల పండితులకు పాఠశాల సహాయకులుగా పదోన్నతులు కల్పించిందన్నారు. వాటిలో ఇంకా మిగిలి ఉన్న లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులను సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయుల ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం అనేక సమస్యల పరిష్కారం, విద్యా వ్యవస్థ బలోపేతం, ఉపాధ్యాయ సంక్షేమ చర్యలు అమలుకు సంబంధించిన ముఖ్య తీర్మానాలు ఆమోదించారు. కేజీబీవీ కళాశాలల డైరెక్టర్ దేవానందరెడ్డి మాట్లాడుతూ తాను ఉపాధ్యాయ వృత్తి నుంచి విద్యా వ్యవస్థలోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు సంఘం కార్యకలాపాలపై సమగ్ర నివేదికను ప్రవేశ పెట్టారు. ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టగా పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డిరమేశ్ బాబు, అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరావు, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరాజు

ప్రకృతి సేద్యం.. పర్యావరణ హితం

తక్కువ పెట్టుబడితో ఆదాయం

ఆదర్శంగా నిలుస్తున్న రైతులు

ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : జిల్లాలో రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలు ఉద్యానవన పంటల సాగుకు పేరొందాయి.. వరి, అరటి, బొప్పాయి, పసుపు, జామ, తదితర వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో పండించే బాసుమతి రకం వరిని ఇక్కడిదాకా తీసుకురావడమే కాకుండా శ్రీవరి పద్ధతిలో సాగు చేసి సఫలీకృతులయ్యారు. ఖరీఫ్‌లో వరి, అరటి సాగులో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించిన రైతులు రబీలో పసుపు, బొప్పాయి, వరి వంటి పంటల సాగును చేపట్టి అదే ఒరవడిని కొనసాగిస్తున్నారు. రసాయనాల జోలికి పోకుండా ప్రకృతి సేద్య పద్ధతిలో సాగు చేస్తున్నారు.

ఎవరెవరు? ఏమేం చేస్తున్నారు?

గాదెల చెందిన బుల్లయ్య, కొత్తపల్లె దేగల శ్రీను, ఎద్దులవారిపల్లెకు చెందిన ఎద్దుల బాలాజీ, మరి కొందరు రైతులు ప్రకృతి సేద్యంలో కీలకమైన ఘన జీవామృతాన్ని ఇంటి దగ్గరే పైసా ఖర్చు లేకుండా తయారు చేస్తున్నారు.

★ గోమూత్రం 5 నుంచి 10 లీటర్లు తీసుకుని పేడ 10 కిలోలు, వేపాకులు, వేపకాయలు, 2 కిలోల నల్ల బెల్లం, పొలంలో మట్టిని కలిపి డ్రమ్ముల్లో నింపుతారు. ఈ మిశ్రమాన్ని వారం రోజుల పాటు నిల్వ చేసి కర్రతో మిశ్రమాన్ని కలియతిప్పుతూ ఉండాలి. ★ ఈ మిశ్రమాన్ని ముద్దలుగా చేసి నీడలోనే ఆరబెట్టాలి. ఈ ముద్దలు ఆరిన తర్వాత పొడిగా చేసుకుని వేసవి దుక్కుల్లో, నాట్లు వేసే ముందు ఎకరానికి 25 కిలోల జీవామృతాన్ని పొలంలో చల్లుతారు. దీంతో పాటు పశువుల పేడ ఎకరానికి మరో 20 కిలోలు పొలంలో చల్లుతారు. ★ ఇలా చేయడం వల్ల ఎలాంటి రసాయన ఎరువులు అవసరం లేకుండా వరిపైరు ఏపుగా పెరిగి, పంట దిగుబడి పెరుగుతుంది. జీవామృతం, పేడ ఎరువుల కోసం స్వయంగా తమ తోటలోనే రైతులు గేదెలు, ఆవులను పోషిస్తున్నారు. ★ వీటితో పాల ఉత్పత్తితో పాటు పేడ, ఎరువులు, జీవామృతం తయారు చేస్తున్నారు. ఈ రైతులు ఐదు సంవత్సరాలుగా సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ వరి సాగులో ఎకరాకు 50 బస్తాల దిగుబడి సాధిస్తూ జిల్లాలో ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.


సేంద్రియ ఎరువులతో ఏపుగా వచ్చిన అరటి గెలలు

పూర్వీకుల నుంచి ఇదే పద్ధతి

నేను కొత్తగా ప్రకృతి వ్యవసాయం చేపట్టడం లేదు. ఇలాంటి సేద్యాన్ని మన పూర్వీకులు ఎప్పుడో చేసి చూపించారు. చిన్నతనంలో మా తల్లిదండ్రులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులనే అవలంబించారు. ఇటీవల వ్యవసాయంలో కార్పొరేట్ శక్తులు చొరబడి రసాయన, క్రిమిసంహారక మందుల విక్రయం ప్రారంభించడంతో రైతులు వాటి వ్యామోహంలో పడి ప్రకృతి వ్యవసాయాన్ని పూర్తిగా మరిచిపోయారు. ఆసక్తిగల రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా. **- బాలాజీ, జిల్లాస్థాయి ఉత్తమ రైతు, ఎద్దలవారిపల్లె**

వినూత్నంగా పంట సాగు

ప్రకృతి వ్యయం చేయుటకు రైతు అవలంబిస్తున్న పద్ధతులను చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. ప్రకృతి వ్యవసాయంలో ఓబులవారిపల్లె మండల రైతులు జిల్లా స్థాయి ఉత్తమ కర్షకులుగా పురస్కారం అందుకోవడం సంతోషం. ప్రకృతి వ్యవసాయంతో పంటల సాగు లాభసాటిగా మారుతున్నాయి. ఈ రైతుల వద్దకు వ్యవసాయ, ఉద్యాన అధికారులు వచ్చి పంటలను సందర్శించడం జరిగింది. చాలా మంది మార్పు ఇది. అందరూ అనుసరించాలి. **- భాస్కర్, ఉద్యానశాఖ అధికారి, ఓబులవారిపల్లె**

కుంగిన దారి.. మింగేలా మారి!

సంబేపల్లె మండల పరిధిలో జాతీయ రహదారి దాదాపు 23 కిలోమీటర్ల మేర విస్తరించింది. 2017లో ఈ రహదారిని రాయచోటి నుంచి పీలేరు వరకు రెండు వరుసలుగా అభివృద్ధి చేశారు. ఇప్పటికే 8 ఏళ్లు గడిచినా రోడ్డు మరమ్మతులను పట్టించుకోవడం లేదు. అడపా దడపా ప్యాచ్ వర్కులు చేసి వదిలేశారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. భారీ వాహనాలు ప్రయాణించి పలుచోట్ల రోడ్డుపై పగుళ్లు ఏర్పడి రహదారి అక్కడక్కడ కుంగిపోయింది. దీంతో వాహనాలు పట్టుతప్పుతున్నాయి. ప్రతి రెండు మూడు కిలోమీటర్లకు రోడ్డు దెబ్బతింది. **- న్యూస్‌టుడే, సంబేపల్లి**

ఏపీఆర్‌డీసీ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

కలసపాడు, న్యూస్‌టుడే: కలసపాడు మండలంలోని చింతలపల్లెకు చెందిన తెదేపా నాయకుడు సాధనకారి రంతూ ఆదివారం అమరావతిలో ఏపీ రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ) డైరెక్టరుగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి తెదేపా నాయకులు, కార్యకర్తలు అక్కడికి తరలి వెళ్లారు. ఈయన ప్రస్తుతం తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. గతంలో బద్వేలు మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా పనిచేశారు.

నిండుకుండలా వెలిగల్లు జలాశయం

రాయచోటి - కదిరి ప్రధాన మార్గం గాలివీడు సమీపంలో పాపఘ్ని నదిపై నిర్మించిన వెలిగల్లు జలాశయంలోని సమృద్ధిగా నీరు చేరాయి. జలాశయం గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా ఆదివారానికి 4.1 టీఎంసీల నీటిమట్టం చేరినట్లు ఏఈ సాంబశివుడు తెలిపారు. ఎగువ నుంచి 130 క్యూసెక్కులు వరద చేరుతుండగా.. కుడి కాలువకు 110 క్యూసెక్కులు, గాలివీడు, రాయచోటి రక్షిత మంచినీటి పథకాలకు ఆరు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం భద్రత దృష్ట్యా రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నీటి పెరుగుదల వివరాలు సేకరిస్తున్నారు. నది దిగువ పరీవాహక ప్రాంతాల్లో సంచారం చేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి మట్టం పెరిగితే స్పిల్‌వే గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, గాలివీడు**

విద్యార్థులను సన్మానిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

వైభవంగా క్షత్రియ వన మహోత్సవం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : రాజంపేట తెదేపా నియోజకవర్గ బాధ్యుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం వనంగా క్షత్రియ వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం వేద పండితులచే పాళెంస్వామి ఆలయం వద్ద రుద్రాభిషేకం, చండీయాగం, గోపూజ, ఉసిరి చెట్టుకు పూజ, వన భోజన మహోత్సవం వంటి కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. నియోజకవర్గంలోని సుండుపల్లి, వీరబల్లి, నందలూరు, పెనగలూరు, చిట్వేలి, కోడూరు మండలాలకు చెందిన క్షత్రియ కుటుంబాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ బాధ్యుడు చమర్తి జగన్ మోహన్‌రాజు, రామరాజు క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సూర్యనారాయణ రాజు, రఘురామరాజులు మాట్లాడారు. మాట్లాడుతూ క్షత్రియులందరూ కలిసికట్టుగా పని చేయాలి, ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారిని ఆదుకునేందుకు ముందుకు రావాలన్నారు. కార్తిక వన మహోత్సవంతోపాటు వినోదం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్థిపల్లి ప్రతాప్‌రాజు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శరత్‌కుమార్ రాజు, చమర్తి మహేశ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించండి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని మదనపల్లె జూనియర్ సివిల్ జడ్జి కీర్తన అన్నారు. ఆదివారం మదనపల్లె పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెట్టే భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఏఏ సౌకర్యాలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ... విద్యార్థులకు ప్రత్యేక చట్టాలున్నాయని వాటి గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీ ఎస్.వెంకటేష్, గంగిరెడ్డి, వసతి గృహాల వార్డెన్లు వెంకటేష్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి కీర్తన

రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం

● భార్యకు తీవ్ర గాయాలు

సంబేపల్లె, న్యూస్‌టుడే : మండలంలోని కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామం రామావాండ్ల పల్లెకు చెందిన గురిగింజకుంట కొండయ్య నాయుడు (51), ఆయన భార్య రత్నమ్మ ద్విచక్ర వాహనంపై సంబేపల్లె మండలం నాగిరెడ్డిగారిపల్లె గ్రామం అన్నప్పగారిపల్లెకు సొంత పని నిమిత్తం బయలుదేరారు. మండలంలోని మొటుకువాండ్ల పల్లె క్రాస్ వద్ద వీరి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కొండయ్య నాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు. రత్నమ్మను 108 వాహనంలో రాయచోటి ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వడ్డీ వ్యాపారి దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

● హత్య కేసుగా నమోదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: వడ్డీ వ్యాపారి దాడిలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ తిరుపతిలో మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం బసినికొండకు చెందిన శ్రీనివాసులు(47), ప్రభావతి దంపతులు అదే ప్రాంతానికి చెందిన వడ్డీ వ్యాపారి రవి వద్ద కొంత డబ్బు తీసుకున్నారు. అయితే సకాలంలో అప్పు తీర్చలేని ప్రభావతిని వడ్డీ వ్యాపారి అసభ్యకరమైన మాటలతో దూషించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె గత నెల 30న పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. భార్యను తిట్టిన వడ్డీ వ్యాపారిని గత నెల 31న శ్రీనివాసులు నిలదీశారు. దీంతో ఆగ్రహించిన రవి, అనుచరులతో కలిసి అతనిపై దాడి చేయడంతో తలకు బలమైన గాయమైంది. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతిలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై దాడి కేసును హత్యకేసుగా మార్పు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మృతుడి భార్య ప్రభావతి ఇప్పటికీ మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ఎస్వీయూలో 2004-05 బీఎస్సీ చదివిన పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడికి అండగా నిలిచారు. తాడిపత్రికి చెందిన అల్లాది శ్రీనివాసులు ఇటీవల జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తన కుమారుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని స్నేహితులకు చెప్పారు. దీంతో వారంతా కలిసి రూ.1.06 లక్షలు సాయం చేశారు. ఈ మేరకు ఆ నగదును ఆదివారం మదనపల్లెలో ఆ బాలుడి తండ్రికి అందజేశారు.

బాలుడికి నగదు అందజేస్తున్న ఫ్యాప్టో నాయకుడు శ్రీనివాసులు, మిత్రులు

లారీ చోరీ చేసిన క్లీనర్

తొట్టంబేడు, న్యూస్‌టుడే: లారీని క్లీనర్ తస్కరించిన ఘటనపై శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పీలేరు ప్రాంతానికి చెందిన మధుసూదన్ శ్రీకాళహస్తిలో లారీ సర్వీసు నడుపుతున్నారు. ఈ క్రమంలోనే పట్టణంలోని కాసాగార్డెన్ సమీపంలో శుక్రవారం రాత్రి లారీని నిలిపి డ్రైవర్ ఇంటికెళ్లగా, క్లీనర్ వాహనంలోనే పడుకున్నాడు. తర్వాతి రోజు డ్రైవర్ వచ్చి చూడగా లారీతో పాటు క్లీనర్ జయచంద్ర ఆచూకీ లేదు. ఈ మేరకు వాహన యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజంపేటలో రాష్ట్రస్థాయి ఇంద్రజాల ప్రదర్శన

రాజంపేట, న్యూస్‌టుడే : ఇంద్రజాలకుల విన్యాసాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కళ్ల ముందే మాయ చేసి మ్యాజిక్ మైమరిపించింది. ఏపీ మ్యాజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పద్మశ్రీ కళ్యాణ మండపంలో మ్యాజిక్ ఫెస్టివల్-2025 పేరుతో 41వ మ్యాజిక్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 148 మంది ఇంద్రజాల కళాకారుల మధ్య జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరిగాయి. జూనియర్ విభాగంలో మొదటి మూడు స్థానాల్లో సుభాని, మహమ్మద్ ఇబ్రహీం, అభిషేక్, సీనియర్ విభాగంలో మొదటి మూడు స్థానాల్లో సురేశ్, శంకర్, బాచి నిలిచారు. ఇంద్రజాలంలో అద్భుతమైన ప్రతిభ పాటవాలు చూపుతూ వస్తున్న రాజంపేట పట్టణానికి చెందిన జాదూరత్న అవార్డు గ్రహీత యు.పి.రాయుడు మ్యాజిక్ స్టార్ బోస్ అవార్డును అందుకున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రజల సమక్షంలో మ్యాజిక్ విన్యాసాలను ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ఒకరికి మించి మరొకరు తమ ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా ఇంద్రజాల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి సుజనకుమార్, కోశాధికారి నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ స్టార్ బోస్ అవార్డు అందుకుంటున్న జాదూ రత్న యు.పి.రాయుడు

పాతకక్షలతో ఒకరిపై దాడి

● ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: పాత కక్షలతో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన సంఘటన మదనపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... సరస్వతినగర్‌కు చెందిన రామ్మూర్తినాయక్‌కు ఇదే ప్రాంతానికి చెందిన కోసూరి భవానికి మధ్య గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రామ్మూర్తినాయక్ వాకింగ్‌కు వెళ్తుండగా కోసూరి భవాని, దీప దంపతులు ఆయన్ను మార్గం మధ్యలో అడ్డగించి కులం పేరుతో దూషించడంతో పాటు దాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా బెదిరించారాన్నరు. ఈ విషయమై ఫిర్యాదు చేసేందుకు ఇరువర్గాలు సాయంత్రం స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో మరోసారి ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. పోలీసులు అడ్డుకునేందుకు యత్నించగా వారిపై గొడవకు దిగారు. అనంతరం రామ్మూర్తినాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోసూరి భవానిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేస్తున్నట్లు రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

స్టేషన్ వద్ద పోలీసులతో గొడవ పడుతున్న నక్కలదిన్నె తాండా వాసులు

గాండ్ల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

చిన్నమండెం, న్యూస్‌టుడే : మండలంలోని వండాడి గ్రామం గాండ్లపల్లె సమీపంలో గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉసిరి చెట్టుకు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పది గంటలకు సమావేశం జరిపారు. మధ్యాహ్నం సామూహిక కార్తిక వనభోజనాలు చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా వండాడి గణేశ్ ఆధ్వర్యంలో చేసిన కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకొంది. గెలుపొందిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. పలువురు పెద్దలను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడుతూ రాయచోటిలో గాండ్ల సంక్షేమ భవనం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వచ్చే ఏడాది గాలివీడులో వన భోజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. గాండ్ల సంక్షేమ సంఘ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుమ్మల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా నారు శ్రీధర్, కోశాధికారిగా బోద నపు ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శాశ్వత సంఘం ఈసీ సభ్యులు మల్లూరు రెడ్డివరప్రసాద్ తెలిపారు. గాండ్ల కులస్తులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దలను సన్మానిస్తున్న సంక్షేమ సంఘ నాయకులు

జాతీయ స్థాయి పోటీలకు కన్నెమడుగు విద్యార్థినులు

ములకలచెరువు, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె మండలం, కన్నెమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రితిక, ప్రయాప్రవల్లికలు ఏపీ షూటింగ్ బాల్ జట్టులో స్థానం సాధించారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థినిలు ఆదివారం నుంచి 12వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని ఘాజియాబాద్ పట్టణంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని రాష్ట్ర షూటింగ్ బాల్ కార్యదర్శి పరుశురాం, జిల్లా కన్వీనర్ నరేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిలను హెచ్‌ఎం మదన్‌మోహన్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

కలల కొలువుకు ప్రాంగణ ఎంపికలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 182 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డా.రామనాథన్ శనివారం తెలిపారు. ప్రపంచ ఐటీ కంపెనీల్లో ఒక్కటైనా కాగ్నిజెంట్ సంస్థ నిర్వహించిన ఈ ఎంపికల్లో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో సీఎస్‌ఈ 72, సీఏఐ 38, సీఎస్‌టీ 35, సైబర్ సెక్యూరిటీ 9, డేటా సైన్స్ 13, ఈసీఈ 11, ట్రిపుల్ ఈ 2, ఎంటెక్ సీఎస్‌ఈ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. వీరికి ఏడాదికి రూ.4 లక్షల నుంచి రూ.6.75 లక్షల వరకు వేతనం వస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ విజయభాస్కర్‌చౌదరి, ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల, వీసీ డాక్టర్ సి.యువరాజ్, డీన్లు, విభాగాధిపతులు, ప్లేస్‌మెంట్ అధికారులు అభినందించారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

10న ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 10న జిల్లా ఫెన్సింగ్ క్రీడా జట్లను ఎంపికలు జరుగనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.చంద్రకళావతి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఈ నెల 11న నిర్వహించే 12వ ఏపీ అంతర్ జిల్లాల ఫెన్సింగ్ పోటీలకు వెళ్లే జిల్లా బాల బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఫెన్సింగ్ క్రీడా పరికరాలతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Union Bank of India A Government of India Undertaking
అసెట్ రికవరీ బ్రాంచి- తిరుపతి
1వ అంతస్తు, ఎస్వీ క్యాంపస్ శాఖ, ఎస్వీ విశ్వవిద్యాలయ పాలనా భవనం వెనుక, ఎస్వీ విశ్వవిద్యాలయ శాఖ, ఇ-మెయిల్: arb.tirupathi@unionbankofindia.bank, ఫోన్: 8328565422.

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద హామీగల స్థిరాస్తుల అమ్మకం కొరకు 15 రోజుల నోటీసు. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1) లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.
సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు గ్యారంటర్లకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ చార్జి చేయబడిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) యొక్క అధీకృత అధికారిచే స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తి, దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) & గ్యారంటార్(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావల్సిన దిగువ తెలుపబడిన విధంగా బకాయిలను రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తేదీన "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే" స్థితిలో విక్రయించబడును. రిజర్వు ధర, ధరావతు మరియు బిడ్ పెంపుదలలు దిగువ తెలుపబడినవి:

ఇ వేలం తేది & సమయం: 28-11-2025 మ. 12.00 గం. నుండి సా. 5.00 గం. వరకు.
(10 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపులతో)

రుణగ్రహీతలు/ తనఖారుణగ్రస్తులు/ గ్యారంటర్లు: శ్రీ తటిగొట్ల మోహన్ రాజు తండ్రి తటిగొట్ల గురుస్వామి రాజు, 7/757-5-1, బి వినాయక నగర్, రైల్వే కోడూరు, అన్నమయ్య జిల్లా 516101.
హామీగల స్థిరాస్తులను విక్రయించి రాబట్టుకోవల్సిన హామీగల రుణం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఉన్న బకాయి 30-09-2025 నాటికి రూ.36,36,331.55/- (ముప్పై ఆరు లక్షల ముప్పై ఆరు వేల మూడు వందల ముప్పై ఒక్క రూపాయల యాభై ఐదు పైసలు మాత్రమే)తోపాటు తదుపరి వ్యయాలు, ఖర్చులు మరియు దానిపై వడ్డీ.

విక్రయించబడనున్న స్థిర సెక్యూర్డ్ అసెట్స్ వివరం: ఎస్.ఆర్.ఓ పుల్లంపేట అధికార పరిధిలో కోడూరు రెవిన్యూ గ్రామం, కోడూరు గ్రామ పంచాయతీ, కోడూరు గ్రామం, సర్వే నెం.729/2లో డోర్ నెం.7/518 సమీపాన, న్యూ కృష్ణానగర్ ఇంటీరియర్ ఏరియా, వార్డు నెం.7లో "సంజీవ సాయి గెలాక్సీ" వద్ద పార్కింగ్ జోన్‌లో ఏర్పాటు చేయబడిన 100 చ.అడుగుల కార్ పార్కింగ్ ఏరియా మరియు మూడవ అంతస్తులో ఫ్లాట్ నెం.302 యొక్క కామన్ ఏరియా ప్లాట్ కలుపుకొని 1000 చ.అడుగులతోపాటు 400 చ.గజాలు లేదా 334.45 చ.మీటర్ల మొత్తం విస్తీర్ణంలో ఖాళీ స్థలం మొత్తంలో అవిభాజ్యవాటాగా ఉన్న 22.86 చ.గజాల విస్తీర్ణం యావత్తు, సరిహద్దులు: తూర్పు: పి.పృథ్వీరాజు ఇల్లు & టి.వి రమణారెడ్డి స్థలం, పడమర: పంచాయతీ రోడ్, ఉత్తరం: ఎస్.చెంగమ్మ & అరుణ స్థలం, దక్షిణం: సి. జయచంద్ర రాజు ఇల్లు & ఎస్ సుబ్బరాజు స్థలం. 400 చ.గజాల మొత్తం విస్తీర్ణంతో సదరు సరిహద్దులలో ఉన్నది. తటిగొట్ల మోహన్ రాజుకు చెందిన కామన్ ఏరియా కలుపుకొని 1000 చ.అడుగులు విస్తీర్ణపు మూడవ అంతస్తులో అసంపూర్తి ఈ ఫ్లాట్ నెం.302తో 22.86 చ.గజాల విస్తీర్ణంగా తెలియజేయబడింది. సరిహద్దులు: తూర్పు: కారిడార్ & ఫ్లాట్ నెం.303, పడమర: ఖాళీ, ఉత్తరం: ఖాళీ, దక్షిణం: డక్ట్, ఫ్లాట్ నెం.301.

రిజర్వు ధర: రూ.31,00,000/-, ఇఎండి: రూ.3,10,000/-, బిడ్ పెంపుదల మొత్తం: రూ.50,000/-

సెక్యూర్డు క్రెడిటార్‌కు తెల్సిన ఏవేని ఎన్కంబ్రెన్సుల వివరాలు: సెక్యూర్డు క్రెడిటార్ యొక్క ఉత్తమ పరిజ్ఞానం మేరకు ఆస్తుల మీద ఎలాంటి ఎన్కంబ్రెన్సులు లేవు. కోర్టులు/ ట్రిబ్యునల్స్ వగైరాలలో సెక్యూర్డు క్రెడిటార్‌కు తెల్సిన, సదరు ఆస్తిమీద పెండింగ్‌లో ఉన్న ఏవేని స్టే, స్టేటస్‌కో/ లిటిగేషన్ వివరాలు.: లేవు.
ఇఎండి దాఖలుకు చివరి తేది: ఇ-వేలం ముగింపులోపు. ఏదేని సాంకేతిక లోపాన్ని అధిగమించుటకు తగినంత ముందుగా ఆస్తి ఐడితో ఇఎండి సొమ్మును డిపాజిట్ మరియు లింక్/ మ్యాప్ చేయవలెను.
రిజిస్ట్రేషన్, లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు ఈ క్రింది సైట్లను చూడగలరు:
ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్/ వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా 10 నిమిషాల అపరిమిత పొడిగింపుతో పైన తెలిపిన తేదీన, సమయానికి నిర్వహించబడును. https://baanknet.com (వెబ్‌సైట్ హోమ్ పేజీలో ఇవ్వబడిన బయర్ రిజిస్ట్రేషన్ లింక్)ద్వారా ఔత్సాహిక బిడ్డర్లు/ కొనుగోలుదార్లు తమ మొబైల్ నెంబరు మరియు చెల్లుబాటగు ఇమెయిల్ ఐడిని ఉపయోగించడం ద్వారా రిజిస్టర్ కావల్సి ఉంటుంది. ఔత్సాహిక బిడ్డర్లు/ కొనుగోలుదార్లు కెవైసి డాక్యుమెంట్లు మరియు బ్యాంక్ వివరాలను అప్‌లోడ్ చేయవల్సి ఉంటుంది. వెబ్‌సైట్ యొక్క హోమ్‌పేజీలో ఇవ్వబడిన బయర్ మ్యాన్యువల్‌చే ఔత్సాహిక బిడ్డర్లు/ కొనుగోలుదార్లు మార్గదర్శనం చేయబడవచ్చును. ● సందేహనివృత్తి కొరకు సంప్రదించవల్సిన నెంబరు: 8291220220 మరియు ఇమెయిల్ ఐడి support.baanknet@psballiance.com. ● వేలం సంబంధిత సందేహాల కొరకు sarfaesi@unionbankofindia.comకు ఇమెయిల్ చేయండి లేదా పైన తెలిపిన చిరునామాలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్రాంచ్ ARB-తిరుపతి (86730)ను మరియు ఆస్తి తనిఖీ మరియు వేలం వివరాలు పొందుటకు అధీకృత అధికారి (8328565422)ని కూడా సంప్రదించండి. ● బిడ్డర్లు వారి బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనుటకు ముందు వేలం అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ https://baanknet.com మరియు https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx చూడవల్సిందిగా సూచించడమైనది. ఇ-బిడ్డింగ్ ప్రాసెస్ ముగిసిన తర్వాత కృతార్థుడైన బిడ్డరుకు పిఎస్‌బి అలయెన్స్ ప్రై.లి., చే ఇ-మెయిల్ ద్వారా తెలియజేయబడును.
తేది: 06-11-2025, ప్రదేశం: తిరుపతి సం/- చీఫ్ మేనేజర్ మరియు అధీకృత అధికారి, అసెట్ రికవరి బ్రాంచి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

ప్రముఖ కూల్ డ్రింక్స్ ఏజన్సీలో టాటా ఏస్, అశోక్‌లైలాండ్ దోస్త్ వాహనములలో లోడ్ వేసుకొని కడప టౌన్‌లో సప్లయ్ చేయుటకు డ్రైవర్లు కావలెను. జీతం : Rs 14,000. ఆసక్తి గలవారు సంప్ర Cell: 9490048347, 9248006645.

ప్రముఖ కంపెనీకి అడ్మినిస్ట్రేషన్ వర్క్ (ఎక్స్‌పీరియన్స్ Male) అభ్యర్థులు కావలెను. Exp: 5 Years, Qly: డిగ్రీ / పీజీ. Contact ✆ 89857 17076

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I Shaik Ayesha D/o Shaik Ghouse Basha, H.No. 5/680, Suddagunthala Street, Rajampet Town & Mandal, Annamayya District, AP -516115. Old Name: Shaik Shabhana, New Name: Shaik Shabana.

JOBS

Required ITI/ Diplomain Electricals / Electronics Candidates with without Exp.for UPS & Stabilizer Service Engineers & Marketing Executives At Anantapur, Tirupathi, Kadapa. Cont: Techser Power Solutions Pvt. Ltd., Cell:9849770651

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

చెత్త తొలగించి.. అవస్థలు తీర్చండి

మండలంలోని రామచర్లపల్లె గ్రామం గంగన్నగారి పల్లె క్రాస్‌రోడ్డులో ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అయితే వాటి ప్రాంగణంలో చెత్త కుండీలు ఏర్పాటు చేయడంతో స్థానికులు అంతా అక్కడే చెత్తను వేస్తున్నారు. దీంతో కుండీ నిండి దుర్వాసన వస్తుండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు రోగాల బారిన పడతారని తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

దారంతా గుంతలు.. పడితే అంతే సంగతులు

కలికిరి, న్యూస్‌టుడే: కలికిరి నుంచి నగరివాండ్లపల్లె క్రాస్ మధ్య పల్లె కింద వేసిన తారురోడ్డు గతుకులమయంగా మారింది. ఈ మార్గంలో అక్కడక్కడ లోతైన గుంతలు పడటంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నగరివాండ్లపల్లె రహదారికి మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనులు

పీలేరు (గ్రామీణ), న్యూస్‌టుడే: పీలేరు పట్టణం కామాటంపల్లె వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో చెత్త పేరుకుపోయి ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని ఈ నెల 7న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పారిశుద్ధ్య అధికారి నౌషాద్ ఇక్కడ పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

● పీలేరు పట్టణం బండ్లవంక ప్రాంతంలో మురుగు కాలువలు శుభ్రం చేశారు. వీధుల్లోని మురుగు కాలువల్లో మురుగు పారడం లేదు. ఈ సమస్యపై ఈ నెల 7న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పీలేరు ఈవో బ్రహ్మారెడ్డి ఇక్కడ పంచాయతీ కార్మికులతో మురుగు కాలువలు శుభ్రం చేయించారు.

● పీలేరు పట్టణం ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా పడేసిన కూరగాయల వ్యర్థాలను తొలగించారు. స్థానిక కూరగాయల మార్కెట్ నుంచి వచ్చే వ్యర్థాలను ఇక్కడ పడేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. ఈ సమస్యపై ఈ నెల 7న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు పంచాయతీ కార్మికులతో వ్యర్థాలను తొలగించారు.

చెరువు కట్టలు బలహీనం.. మరమ్మతులు శూన్యం

●15 ఏళ్లుగా నిర్వహణ లేక పారని నీరు

మదనపల్లె (గ్రామీణ), న్యూస్‌టుడే: చెరువుల నిర్వహణ లేక చిట్టడవులను తలపిస్తున్నాయి. వంకల్లో ముళ్లకంపలు తప్ప చుక్కనీరు కనిపించడం లేదు. చెరువు కట్టలపై భారీ వృక్షాలు, ముళ్ల కంపతో మట్టికట్టలు బలహీనపడుతున్నాయి. వర్షాలు కురిసినా చెరువుకు నీరు చేరని పరిస్థితి. మదనపల్లె డివిజన్‌లోని ప్రస్తుతం కురిసిన వర్షాలకు 20శాతం చెరువులకు మాత్రమే వందశాతం నీరు వచ్చి చేరింది. మిగిలిన చెరువులకు 15 ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో చుక్క నీరు లేక చిట్టడవిని తలపిస్తున్నాయి.

★ మదనపల్లె డివిజన్ పరిధిలో 1,959 చెరువులుండగా వీటిలో 357 చెరువులతో పాటు నిమ్మనపల్లెలోని బాహుదా, తంబళ్లపల్లెలోని పెద్దేరు ప్రాజెక్టులకు మాత్రమే 100శాతం నీరు వచ్చింది. 362 చెరువుల్లో 50శాతం నీరుండగా మిగిలిన చెరువులు చుక్క నీరు లేక చిట్టడవులను తలపిస్తున్నాయి. నీటి వనరులైన వంకలు, కాలువలు నిర్వహణ లేక పూడిపోయాయి. భారీ వర్షాలు కురిసి చెరువులకు నీరు చేరినా మొరవ చుట్టూ, వంకల్లో చెట్లతో నీరు ప్రవహించే పరిస్థితి లేదు. దీంతో మట్టి కట్టలు గండిపడే అవకాశాలున్నాయి.

★ మదనపల్లె నియోజకవర్గంలో 406 చెరువులుండగా వీటిలో 60 మాత్రమే నీటితో నిండాయి. 98 చెరువుల్లో 50శాతం వరకు నీరుండగా, మిగిలిన చెరువుల్లో చుక్కనీరు లేదు. మదనపల్లె ప్రాంతంలో వర్షాలు తక్కువ కురవడంతో కేవలం బొమ్మచెరువు, పెంచుపాడు, చీకలబైలు పంచాయతీ పరిధిలోని చెరువులకు మాత్రమే నీరు చేరింది. వలసపల్లెలోని చెరువులకు హంద్రీ-నీవా కాలువ నుంచి నీరు నింపారు.

పిచ్చి మొక్కలతో నిండిన చెరువు

భారీ వృక్షాలతో బలహీనం

గత వైకాపా ప్రభుత్వంలో చెరువుల ఎలాంటి నిర్వహణ పనులు చేపట్టలేదు. దీంతో మట్టికట్టలపై ముళ్ల కంపతో పాటు భారీ వృక్షాలు పెరిగాయి. ఫలితంగా మట్టి కట్టలు బలహీనంగా మారాయి. అలాగే చెరువులకు అనుసంధానంగా ఉన్న కాలువల పరిస్థితి కూడా ఇలానే ఉంది. జలవనరుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని చర్యలు చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

చెరువుల నిర్వహణ పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే పనులు చేపట్టి చెరువులకు నీరుచేరేలా, మరమ్మతు పనులు చేయిస్తాం. - సురేశ్‌బాబు, ఈఈ, జలవనరులశాఖ, మదనపల్లె

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 7989663199

?: మండలంలోని వేంపల్లె గ్రామ పంచాయతీ కేంద్రంలోని పాఠశాల ఎదుట వంకలో చెత్తవేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోంది. - రమణ, వేంపల్లె

✓: వెంటనే పంచాయతీ కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - తాజ్‌మసూర్, ఎంపీడీవో, మదనపల్లె

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: పోతబోలు పంచాయతీ ఉప్పరపల్లె వద్ద మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసన వచ్చి దోమలు నిలయంగా మారింది. - నాగరాజు, పోతబోలు

✓: వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపి చర్యలు తీసుకుంటాం. - పవన్‌కుమార్, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ, మదనపల్లె

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: పట్టణంలోని లచ్చన్న వీధిలో మట్టి, చెత్త దిబ్బలతో అధ్వానంగా మారింది. మురుగు కాలువలపైనే చెత్తను వేస్తున్నారు. - సురేంద్ర, లచ్చన్నవీధి

✓: పారిశుద్ధ్య కార్మికులను పంపి మట్టిదిబ్బలు లేకుండా చర్యలు తీసుకుంటాం. - ప్రమీల, కమిషనర్, పురపాలక సంఘం, మదనపల్లె

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

దేశాభివృద్ధికి ఐదు సంస్కరణలు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: దేశాభివృద్ధికి పంచ పరివర్తనలను తీసుకొచ్చే లక్ష్యంతో అడుగులు వేస్తున్నామని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) తిరుపతి విభాగ్ ప్రముఖ్ ముద్దు కొండారెడ్డి తెలిపారు. ఆదివారం బి.కొత్తకోటలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాజిక సమరత, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ ప్రబోధన, స్వఆధారిత జీవన విధానం, పౌర విధులు అన్న అంశాలపై తమ దృష్టిని కేంద్రీకరించినట్లు వివరించారు. తాము చేపట్టిన సంస్కరణలను సమాజం స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ బి.కొత్తకోట సంఘచాలక్ సతీష్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు

సాహితీ ప్రపంచంలో ధ్రువతార ఇక్బాల్

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: సాహితీ ప్రపంచంలో ధ్రువతార విశ్వకవి అల్లామ ఇక్బాల్ అని పీలేరు తెదేపా సీనియర్ నాయకులు మల్లికార్జునరెడ్డి అన్నారు. సారే జహాసే అచ్చా గేయ రచయిత ఇక్బాల్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక నాయక్ వీధిలో ఉర్దూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... హృదయాలను కలిపే భాష ఉర్దూ అని అన్నారు. ఉర్దూ మన దేశంలో పుట్టి పెరిగిన భారతీయ భాష అన్నారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, విండోడైరెక్టర్ చాను, తెదేపా నాయకులు ఆనంద్, అలమ్, గౌస్‌పీర్, సాహెబ్, చాను, అబిద్‌హుస్సేన్, ఉర్దూ సాహితీ ప్రియులు, భాషాభిమానులు, మైనార్టీయువత పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెదేపా, మైనార్టీ నాయకులు

నిరుపేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అండ

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: నిరుపేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దండువారిపల్లెలో తెదేపా సీనియర్ నాయకుడు కంభం నిరంజన్‌రెడ్డి, విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రమోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.10లక్షల విలువైన చెక్కులను 12 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి రాజేంద్రచారి, మండల పార్టీ అధ్యక్షుడు దాము రెడ్డి, తెదేపా నాయకులు మల్లికార్జున రెడ్డి, మురళి, తదితరలు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌ను సందర్శించిన శిక్షణ ఐపీఎస్‌లు

పర్యాటక శాఖ ప్రాంగణంలో ట్రైనీ ఐపీఎస్‌ల బృందం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌ను ఆదివారం ట్రైనీ ఐపీఎస్ అధికారుల బృందం సందర్శించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల పరిశీలనలో భాగంగా జిల్లాకు వచ్చిన 12మంది ట్రైనీలు కొండకు వచ్చారు. ఈ సందర్భంగా కొత్త, పాత వ్యూపాయింట్లతో పాటు గాలిబండను, పర్యాటక, అటవీశాఖల ప్రాంగణాలను పరిశీలించారు. అనంతరం ఏనుగుమల్లమ్మకొండ హార్సిలీహిల్స్‌గా రూపాంతరం చెంది అభివృద్ధి చెందిన విషయాన్ని స్థానికులు ట్రైనీలకు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వీరాంజనేయులు, వీఆర్ఓ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

నీటి శుద్ధి కేంద్రం... ఎప్పుడు ప్రారంభం!

మహల్ (కలికిరి), న్యూస్‌టుడే: కలికిరి మండలం మహల్ బైపాస్ రోడ్డులో ఏపీఎండీసీ గ్రాంటు కింద మంజూరైన నిధులతో రెండేళ్ల కిందట నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నాటి నుంచి దాన్ని ప్రారంభించ లేదు. అయితే కేంద్రానికి నీటి సౌకర్యం ఉన్నా.. వృథా నీరు వెళ్లే మార్గంలేక పోవడంతో ప్రారంభంలో జాప్యం జరుగుతోంది. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి వృథా నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకుని వినియోగంలోకి తెస్తామని చెప్పారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

మదనపల్లెలోని బుగ్గకాలువపై వంతెన ప్రమాదకరంగా మారింది. 2016 సంవత్సరంలో కురిసిన వర్షాలతో ఈ వంతెన దెబ్బతింది. అయితే అప్పటి ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇదే నిత్యం ఎంతో మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక మునుపే చరలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

మురుగు నిలిచి.. అవస్థలు పెంచి

మండలంలోని కొత్తవారిపల్లె పంచాయతీ యనుమలవారిపల్లెలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. గ్రామంలో పూర్తిస్థాయిలో కాలువలు లేకపోవడంతో మురుగంతా రహదారిపై నిలుస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై, ఇళ్ల మధ్య మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

శిథిల భవనం.. భయం భయం

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: నిమ్మనపల్లె మండలం బాహుదా జలాశయం వద్ద నిర్మించిన అతిథి భవనం శిథిలావస్థకు చేరింది. జలాశయం నిర్మించినప్పుడు ఇక్కడికి ముఖ్య అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించేవారు. అయితే క్రమంగా వర్షాలు లేక జలాశయం నిండకపోవడంతో పర్యాటకుల సందడి తగ్గింది. నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆకతాయిలకు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

సూచిక.. కనిపించక తికమక

కలికిరి, న్యూస్‌టుడే: కలికిరి ఆర్టీసీ బస్టాండులో అస్తవ్యస్థంగా ఉన్న మరుగుదొడ్లను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. అయితే వాటికి మహిళలు, పురుషులు అనే సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రయాణికులు ఎందులోకి వెళ్లాలో తెలీక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అట్టహాసంగా అస్మిత ఖేలో ఇండియా పోటీలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం అస్మిత ఖేలో ఇండియా అండర్-14 ఫుట్‌బాల్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో మదనపల్లె దీక్ష ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల జట్టు, పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టులు పోటీ పడగా 2-1 తేడాతో దీక్ష పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. వీరికి చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండల ఎంఈఓ తిరుమలమ్మ ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళీ, క్రీడా భారతి జిల్లా కార్యదర్శి నరేష్‌బాబు, న్యాయవాది సోమశేఖర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో నిర్వాహకులు

వాల్మీకిపురం తెదేపా మండల అధ్యక్షుడిగా దాము రెడ్డి

వాల్మీకిపురం: వాల్మీకిపురం తెదేపా మండల అధ్యక్షుడిగా మండలంలోని అయ్యవారిపల్లెకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు దామురెడ్డిని నియమించినట్లు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. ఆదివారం తెదేపా మండల పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడారు. మండలంలో తెదేపాను బలోపేతం చేసే దిశగా తనవంతు కృషిచేస్తానన్నారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయనని, బాధ్యతో పనిచేసి పార్టీకి లాభం చేకూరుస్తానన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు తెదేపానాయకులు దామురెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కబ్జా కోరల్లో బాహుదా కాలువ

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని బసినికొండ పంచాయతీ పరిధిలోని బాహుదానది కాలువ వంతెనను గుర్తు తెలియని వ్యక్తులు మట్టివేసి చదునుచేశారు. ఆ భూమిని తమది అంటూ కొందరు వంతెనలోపలికి మట్టివేసి చదును చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఏఈ బాబురాజేంద్రప్రసాద్ వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

వయో వృద్ధుల సమస్యలు పరిష్కరించండి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: వయో వృద్ధుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.మునిగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెను జిల్లాగా ప్రకటించేందుకు ముందడుగు పడటం గొప్ప విషయమన్నారు. ప్రజల చిరకాల కోరికను నెరవేర్చేందుకు కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి కరుణాకర్, ఉస్మాన్ సాహెబ్, మాజీ సైనికుడు కె.శ్రీనివాసులునాయుడు, మిట్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మంజుప్రీతమ్, చింటు, ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్, నాయకులు చంద్రశేఖర్, తిరుపతిరావు, టీఎస్ఏ కృష్ణమూర్తితో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ

అయ్యప్ప స్వామికి అన్నాభిషేకం

ప్రతేక అలంకరణలో అయ్యప్ప స్వామి

అయ్యప్పస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట పట్టణంలో శ్రీఅయ్యప్పస్వామి ఊరేగింపు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆలయం నుంచి పట్టణవీధుల గుండా మేళ, తాళాలతో ఉత్సవ పల్లకీలో అయ్యప్పస్వామి ఊరేగుతుండగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్ష ధరించిన స్వాములకు జ్ఞానోదయ పాఠశాల ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దీక్ మాట్లాడుతు గత 11ఏళ్లుగా అయ్యప్ప స్వాములకు తమ సంస్థ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అయ్యప్ప ఆలయంలో ఆలయ శాశ్వత గురుస్వామి నెమలి వేంకట రమణరావు ఆధ్వర్యంలో స్వామి వారికి ఆదివారం అన్నాభిషేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే): మండలంలోని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం అరబిందో కంటి ఆసుపత్రి తిరుపతి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 121 మందికి పరీక్షలు నిర్వహించి, వారిలో 25 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు ప్రత్యూష, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

వన భోజనాన్ని విజయవంతం చేయాలని వినతి

పీలేరు, న్యూస్‌టుడే: ఈ నెల 16న సదుం మార్గంలో పీలేరు బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన భోజన కార్యక్రమానికి హాజరు కావాలని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు బలిజ బంధువుల ఇళ్లకు, దుకాణాలకు వెళ్లి ఆహ్వాన పత్రికలను అందజేశారు. సంఘం ఏర్పడిన తర్వాత మూడో పర్యాయం జరుగుతున్న వనభోజన కార్యక్రమంలో ప్రతి బలిజ బంధువు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వనభోజన కార్యక్రమానికి ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

సీపీఎస్ రద్దయ్యే వరకు పోరాటాలు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: సీపీఎస్ రద్దు అయ్యే వరకు పోరాటాలు చేస్తామని ఏపీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాలాజి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం పీలేరులో జరిగిన ఆపస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడంలో ఆపస్ కృషి ఉందన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐపై ఉన్న సాంకేతిక సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆపస్ జిల్లా అధ్యక్షుడిగా పచ్చార్ల సుధాకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆపస్ నాయకులు నరసింహులు, వీరాంజనేయ ప్రసాద్, రమణారెడ్డి, మధుమతి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాలాజి

పవన్ కల్యాణ్‌కు సమస్యలపై వినతి

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వినతిని అందజేస్తున్న శివరామ్

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను మదనపల్లె మార్కెట్‌యార్డు ఛైర్మన్ జంగాల శివరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలోని ముసలి మడుగు అటవీప్రాంతంలోని కుంకి ఏనుగుల శిక్షణ కేంద్రానికి వచ్చిన డీసీఎంని కలిసి పుస్తకాన్ని అందజేశారు. అనంతరం ఈ నెల 13న జరుగనున్న మదనపల్లె మార్కెట్ యార్డు పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని కోరారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిని కూడా ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ములకలచెరువు: రోడ్డు దాటుతున్న మహిళను ద్విచక్ర వాహనం ఢీ కొన్న సంఘటన ములకలచెరువు మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అనంతపురం జిల్లాకు చెందిన ప్రశాంత్, సింహాద్రి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో సొంత పనుల నిమిత్తం మదనపల్లెకు వెళ్లి తిరిగి వెళ్తున్నారు. మార్గం మధ్యలో వేపూరికోట వద్ద రోడ్డు దాటుతున్న మామిళ్లవారిపల్లికి చెందిన సుజాతను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

విద్యుత్తు కార్యాలయంలో ఆక్రమణలు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు డివిజన్ కార్యాలయ ఆవరణలో ఆక్రమణ జోరు కొనసాగుతోంది. ట్రాన్స్‌కో అనుమతి లేకుండా ఐదేళ్లుగా ఆవరణలో ఆక్రమణలు పెరిగాయి. అధికారులు పట్టించుకోక పోవడంతో రాత్రికి రాత్రే జోరుగా దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆవరణలో సుమారు వంద దుకాణాలు ఏర్పాటు కావడంతో ఆవరణం కనిపించకుండా పోయింది. దీంతో ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యాలయం బోర్డు సైతం కనపడకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. సమస్య తీవ్రతను తెలిపే ఈ అంశాన్ని స్థానిక ఇంజినీర్లు పట్టించుకోకపోవడంతో వినియోగదారులు ఇబ్బందికి గురవుతున్నారు. జాతీయ రహదారిలో 50ఏళ్ల క్రితం పట్టణంలోని సీటీఎం రోడ్డులో ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజినీరు కార్యాలయం ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో ఆవరణలోని దుకాణాలతో ఆదాయం సమకూర్చుకోక పోగా, సమస్యను నిర్లక్ష్యంగా వదిలేశారు. ఆవరణలో కార్యాలయం వివరాలు తెలిపే బోర్డు సైతం ఏర్పాటు చేయాలనే ఆలోచన రాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రహరీని ఆనుకుని వెలసిన దుకాణాలు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

పింఛలో కొనసాగుతున్న ప్రవాహం

చిన్నబిడికి సమీపంలో లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు

సుండుపల్లి, న్యూస్‌టుడే: పింఛా నదిలో నీటి ప్రవాహం తగ్గని కారణంగా లోలెవల్ వంతెన పునరుద్ధరణ పనులకు అంతరాయం ఏర్పడింది. వరద ప్రవాహం తగ్గుతున్న నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు అల్పపీడన ప్రభావంతో నది పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు నీటి ప్రవాహం పెరిగింది. జలాశయం నుంచి శనివారం 1,600 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుంది. ప్రవాహం మరింత తగ్గితే వంతెనపై రాకపోకలకు మరమ్మతులు పూర్తి చేసే వీలు ఉంటుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పెద్దమాలపల్లెలో వెలగని వీధి దీపాలు

గాలివీడు మండలం అరవీడు పంచాయతీ పెద్దమాలపల్లెలో వీధి దీపాలు లేక రాత్రుల్లో అంధకారం నెలకొంటోంది. రాత్రి రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో వ్యవసాయ కూలీలు, రైతులు, పశు సంపద అధికంగా ఉంది. వీధిలో ఏర్పాటు చేసిన దీపాలు వెలగక చీకటి కారు ప్రాయంగా మారాయి. పొలాల నుంచి విషపురుగుల బెడద అధికంగా ఉందని మహిళలు వాపోతున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా దీపాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, గాలివీడు మండలం

విధుల్లో నిర్లక్ష్యం.. వీధుల్లో అంధకారం

రాయచోటి పట్టణంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై మాండవ్య నది మీద వంతెన ఉంది. ఈ వంతెనపై గత ఆరు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ఈ ప్రాంతంలో అంధకారం అలుముకుంటోంది. వంతెనపై వెళ్లే పాదచారులు, వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి దీపాలకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. - న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ



రోడ్డెక్కుతున్న దుకాణాలు.. రాకపోకలకు ఆటంకాలు

పుల్లంపేట నాలుగు రోడ్ల కూడలి ప్రాంతంలో దుకాణాలను రోడ్డును ఆక్రమించి నిర్మించుకోవడంతో వాహనాల రాకపోకలు సాగించేందుకు చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో దుకాణదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రహదారిపై బల్లలు వేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై నిర్మించిన దుకాణాలను తొలగించి, రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పుల్లంపేట

దారిని కమ్మేసిన చెట్లు.. చోదకులకు ఇక్కట్లు

రాజంపేట మండల పరిధిలోని పెద్దకారంపల్లి నుంచి మిట్టపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చెట్లు విపరీతంగా పెరిగాయి. రోడ్డంతా కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు గుర్తించడం కష్టంగా ఉందని చోదకులు వాపోతున్నారు. వాహనాల్లో వెళ్లే ప్రయాణికులకు కంపచెట్లు తగిలి గాయాలవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెట్లు తొలగిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం తగ్గుతాయని గ్రామస్థులు, చోదకులు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

దుమ్ము చెలరేగి ప్రజలకు అవస్థలు

కడప - చెన్నై జాతీయ రహదారిపై ఉన్న రైల్వేకోడూరు పట్టణం శివాలయం సమీపంలో ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అది మరింత లోతుగా మారుతోంది. దీంతో కొందరు ఆ గుంతలో ఇటుకరాళ్లు వేశారు. భారీ వాహనాలు తిరగడంతో అవి నలిగిపోయి మట్టిలా మారిపోయాయి. గుంత కొంత పూడినా వాహనాలు వెళ్లిన ప్రతిసారీ భారీగా దుమ్ము చెలరేగి ఆ ప్రాంతాన్ని కమ్మేస్తోంది. దుమ్ముతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికార యంత్రాంగం స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరారు. - న్యూస్‌టుడే, రైల్వేకోడూరు

మండల పరిషత్తు సమావేశం వాయిదా

గాలివీడు, న్యూస్‌టుడే : గాలివీడు మండల పరిషత్తు సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం జరగాల్సిన సమావేశం జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వాయిదా వేస్తున్నామన్నారు. సభ్యులు, అధికారులు, సిబ్బందికి సమాచారం ఇవ్వనున్నారు. తర్వాత తేదీ ప్రకటిస్తామన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

సంబేపల్లె, న్యూస్‌టుడే : ఈ నెల 12న చిన్నమండెంలో ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను ఆదివారం పరిశీలించినట్లు రాష్ట్ర పాల ఏకిరి ఛైర్మన్ కందారి నాగేశ్వర నాయుడు సంబేపల్లెలో తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేశ్వర రావు, తెదేపా సీనియర్ నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డితో కలిసి ఆయన పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడారు.

మౌలిక వసతులు కరవు.. సమస్యల నెలవు

చిట్వేలి (పుల్లంపేట), న్యూస్‌టుడే : స్వచ్ఛ పథకంతో రాష్ట్రంలోని బస్టాండులకు మౌలిక వసతులు కల్పించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నా క్షేత్రస్థాయిలో మార్పు కనిపించడం లేదు. బస్టాండుల్లో ప్రధానంగా మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రంగా ఉండడంపై నేటికీ దృష్టి సారించడం లేదు. జిల్లా సరిహద్దుల్లో ఉన్న చిట్వేలి బస్టాండు అందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఇక్కడి బస్టాండుకు బస్సులు సక్రమంగా రాకపోవడంతో కొందరు ఫిర్యాదు చేయడంతో ఇప్పుడిప్పుడే వస్తున్నాయి. బస్టాండు ఆవరణమంతా చెత్తచెదారం నిండిపోయింది.

చిట్వేలి బస్టాండులో ఆగిన బస్సు

ప్రస్తుతం చెత్తను తొలగించి బస్సులు బస్టాండులోకి వచ్చే ఏర్పాటు చేశారే తప్ప మౌలిక వసతులు కల్పించడంలో విఫలమౌతున్నారు. దూరం నుంచి మహిళా ప్రయాణికులు మరుగు లేక ముప్పుతిప్పలు పడుతున్నారు. పూర్వం నిర్మించిన వాటిని సక్రమంగా వినియోగించకపోవడంతో పాడైపోయాయి. ఆవరణం ఆక్రమణకు గురవుతోంది. ప్రధానంగా మహిళల సమస్యలు పట్టించుకునే వారు కరవయ్యారు. నెల్లూరు-రాజంపేట, చిట్వేలి-కోడూరు,

బస్టాండులో మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్డు

చిట్వేలి-రాజంపేట బస్సులు ఎక్కువగా తిరుగుతుంటాయి. వందలాది మంది ప్రయాణికులు ఈ మార్గంలో ప్రయాణం చేస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక వసతులను కల్పించడంతో పాటు ప్రధానంగా మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకుని రావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అత్యవసరమైతే అగచాట్లే

ప్రయాణికులకు మరుగుదొడ్ల సమస్య ప్రధానంగా మారింది. గ్రామీణులు, దూర ప్రాంతాల నుంచి ప్రయాణించే వారు బస్టాండులో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నవి వృథాగా మారాయి. ఈ సమస్యను అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకుని రావాలి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- సునీత, ప్రయాణికురాలు, చిట్వేలి

నైపుణ్యం.. సృజనాత్మకం

పుల్లంపేట, న్యూస్‌టుడే: జిల్లా స్థాయిలో జరిగిన వృత్తి విద్యా నైపుణ్య పోటీల్లో పుల్లంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు 'డైండ్ స్టిక్ డెకరేటర్' ప్రాజెక్టుకు ద్వితీయ స్థానం లభించిందని ప్రిన్సిపల్ లీలా శ్రీహరి తెలిపారు. ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థులు కార్తిక్, చైతన్య, లావణ్య, రేష్మాలను అభినందించారు. విద్యార్థుల ప్రతిభ కృషికి నిదర్శనంగా నిలిచిందని కొనియాడారు. ఈ విజయానికి భాగస్వాములైన వృత్తి విద్య శిక్షకులు గంగిరెడ్డి తేజలను ఆయన అభినందించారు.

జిల్లా స్థాయి అధికారుల నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న పుల్లంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు

గంగమ్మకు పూజలు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు చెల్లు సురేంద్ర, గంగన్న అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అలంకరణలో గంగమ్మ

రాష్ట్ర స్థాయి పోటీలకు బాలికలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: బోయినపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఆర్యా రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపిక అయిందని పాఠశాల హెచ్‌ఎం కె.భారతి శనివారం తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఉమ్మడి జిల్లా తరఫున జరిగే అండర్-14 కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. క్రీడల్లో వరుసగా విద్యార్థులు ఎంపిక కావడం, క్రీడలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్న పీడీ ప్రణవిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థిని ఆర్యతో హెచ్‌ఎం కె.భారతి, పీడీ ప్రణవి

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని జంగంపల్లె ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎ.గౌతమి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ఆదివారం ప్రధానోపాధ్యాయుడు సిద్ధయ్యనాయుడు తెలిపారు. శనివారం కడప పట్టణంలోని మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. తమ పాఠశాల విద్యార్థిని ఎంపికపై పీఈటీ చక్రపాణి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

గౌతమి

ఖోఖోలో గొట్టివీడు విద్యార్థుల ఎంపిక

ఎగువగొట్టివీడు (గాలివీడు), న్యూస్‌టుడే : మండలంలోని ఎగువగొట్టివీడు జడ్పీ ఉన్నత పాఠశాల ఇద్దరు పదో తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కడప మున్సిపల్ హైస్కూల్ (ఉర్దూ)లో శనివారం జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్-17 విభాగంలో కె.శివ, ఎస్.సనాకౌసర్ ఖోఖో క్రీడా పోటీలో పాల్గొని ప్రతిభ కనపరచడంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేశారన్నారు. జాతీయ స్థాయిలో రాణించేందుకు తగిన తర్ఫీదు ఇప్పిస్తామని శ్రీనివాసులు తెలిపారు.

కె.శివ

ఎస్.సనాకౌసర్

తైక్వాండో క్రీడాకారుల ప్రతిభ

బెల్ట్‌లను అందుకున్న తైక్వాండో క్రీడాకారులతో శిక్షకులు, తదితరులు

రాజంపేట, న్యూస్‌టుడే : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఆదివారం తైక్వాండో క్రీడాకారుల నైపుణ్య ప్రదర్శన మాస్టర్ సిరిగాల సిద్ధేశ్వర ఆధ్వర్యంలో నిర్వహించారు. తైక్వాండో శిక్షణ పొందుతున్న క్రీడాకారుల మధ్య పోటీ నిర్వహించి వారి శక్తి సామర్థ్యాలు, నైపుణ్య ప్రతిభ ఆధారంగా బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జాతీయ రెఫరీ ఎస్.రిజ్వానా, శిక్షకులు జాహిద్‌అలీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు వినియోగదారులు సహకరించాలి

రాజంపేట, న్యూస్‌టుడే : ఈ నెల 10 నుంచి 12 వరకు రాజంపేట, రైల్వేకోడూరు, చిన్నంపల్లి 220 కేవీ విద్యుత్తు లైన్ల పనుల కారణంగా ఆ సబ్‌స్టేషన్ల నుంచి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సమయంలో విద్యుత్తు సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడవచ్చన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లోని అన్ని మండలాల ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

పిల్లలు నిబంధనలు అతిక్రమిస్తే తల్లిదండ్రులదే బాధ్యత

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : పట్టణ పరిధిలో కొందరు యువకులు తమ ద్విచక్ర వాహనాలకు విపరీతమైన శబ్దాలు వచ్చేలా సైలెన్సర్లను ఏర్పాటు చేసుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా తిరుగుతున్నారని సీఐ హేమసుందర్‌రావు, ఎస్సై లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అలాంటి వాహనాల సైలెన్సర్లను తొలగించి పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రదర్శించారు. యువకులు, పిల్లలు చేసే పనులకు వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరికలు చేశారు. ఇంటర్మీడియట్ చదువుతున్న వారికి కూడా ద్విచక్ర వాహనాలను కొనిస్తున్నారని, వారు ఏదైనా ప్రమాదాలకు పాల్పడితే కన్న వారే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. వికృత శబ్దాలు చేస్తూ తిరిగే వాహనదారులపై చట్టపరమైన చర్యలు చేపడతామని వివరించారు.

ద్విచక్ర వాహనాల నుంచి తొలగించిన సైలెన్సర్లను ప్రదర్శిస్తున్న ఎస్సై లక్ష్మీప్రసాద్‌రెడ్డి సిబ్బంది

భక్తి శ్రద్ధలతో జలాభిషేకం

మలకాటిపల్లె(ఒంటిమిట్ట), న్యూస్‌టుడే: మండలంలోని మలకాటిపల్లెలో కొలువైన హనుమంతుడికి ఆదివారం భక్తిశ్రద్ధలతో 108 బిందెల నీటితో మహిళలు జలాభిషేకం పూజలు నిర్వహించారు. గ్రామం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఆనందంగా జీవనం సాగించేలా అనుగ్రహించాలని ఇష్ట దైవాన్ని ఆధ్యాత్మిక చింతనతో ఆరాధించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆంజనేయస్వామి

రాములోరి సేవలో శిక్షణ ఐఏఎస్ అధికారులు

రంగ మండపంలో శిక్షణ ఐఏఎస్‌లకు వేదాశీర్వచనం చేస్తున్న అర్చకుడు పవన్‌కుమార్

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని శిక్షణ ఐఏఎస్ అధికారులు ఆదివారం సందర్శించారు. రాములోరి సన్నిధికి హర్షిత అగర్వాల్, స్వాతి ఫాగోట్, సుమిత కుమార్‌సింగ్, సుఖరామ్, ప్రశాంత్ సింగ్, మంజునాథ్ సిద్ధప్ప విచ్చేయగా వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణమూర్తులను దర్శించారు. అనంతరం ఆలయ ప్రాచీన వైభవం, చారిత్రక ప్రాశస్త్యాన్ని అర్చకులు వారికి వివరించారు. వేదాశీర్వచనం చేసి సత్కరించారు.

రామయ్యను దర్శించుకున్న హీరో సుమన్

ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని తెలుగు చలన చిత్ర కథానాయకుడు సుమన్ ఆదివారం సందర్శించారు. రాములోరి సన్నిధికి విచ్చేసిన హీరోకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన సీతారామలక్ష్మణమూర్తులను దర్శించి దివ్యానుభూతి పొందారు. ఆలయ చారిత్రక వైభవం, ప్రాశస్త్యాన్ని అర్చకులు వివరించారు. అనంతరం వేదశ్వీరచనం చేసి సత్కరించారు. అనంతరం భక్త సంజీవరాయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అపస్ నూతన కార్యవర్గం ఎన్నిక

సంబేపల్లె, న్యూస్‌టుడే : అపస్ మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రెడ్డిశేఖర్, మండల అధ్యక్షుడిగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగభూషణ్ రాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడు చంద్రశేఖర్ బాబు, ఆర్థిక కార్యదర్శిగా నాగేంద్రప్రసాద్, మండల కార్యదర్శిగా అన్నయ్య నాయక్, సంయుక్త కార్యదర్శిగా ఓబులేశులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు.

నూతన కార్యవర్గ సభ్యులు వీరే...

నాగారపమ్మకు బోనాలు

సుండుపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ బండవంక ఈడిగపల్లి సమీపంలోని నాగారపమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బోనాలు సమర్పించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నాగారపమ్మ

ఘనంగా భవానీ శంకరుడి ఊరేగింపు

చిట్వేలి (పుల్లంపేట): చిట్వేలి మండలంలోని నక్కలపల్లెలో వెలసిన భవానీ శంకర్‌స్వామి ఆలయంలో కార్తిక మాసోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామి వారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేక అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

భవానీ శంకరుడు

ఆలయ ప్రాంగణంలో స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

చట్టాలపై అవగాహన అవసరం

పెన్నపేరూరు (ఒంటిమిట్ట), న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాది భవనాశి రామదాసు అన్నారు. మండలంలోని పెన్నపేరూరులో గ్రామ సచివాలయంలో ఆదివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్థులకు చట్టాలపై అవగాహన కల్పించడానికి ర్యాలీ చేశారు. న్యాయవాది రామదాసు మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం బాధితులకు బాసటగా నిలుస్తుందని తెలిపారు. న్యాయస్థానాలు కల్పిస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్.ఐ. ప్రణయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది రామదాసు, పక్కన ఎస్సై ప్రణయ్‌కుమార్‌రెడ్డి

నిత్యపూజ స్వామి ఆలయ రహదారికి మరమ్మతులు

సిద్దవటం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీనిత్యపూజస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో దెబ్బతిన్న ప్రాంతాలకు ఆదివారం మరమ్మతులు చేశారు. సిద్దవటం మండలం వంతాటిపల్లె శివారు లంకమల అభయారణ్యంలో ఈ ఆలయం ఉంది. కోవెలకు వెళ్లే రహదారిలో దేవదాయ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతాటిపల్లె శివారు నుంచి పంచలింగాల గుడి వరకు ఉన్న రహదారి దెబ్బతింది. దీంతో రాకపోకలుసాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ క్రమంలో మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఛైర్మన్ రాజేంద్రప్రసాద్, ఇన్‌ఛార్జి ఈవో శ్రీధర్, అటవీ శాఖ, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారుల సహకారం తీసుకుని దెబ్బతిన్న రహదారికి మట్టితో మరమ్మతులు చేశారు. ఫలితంగా భక్తుల ఇబ్బందులుతొలిగాయి. అదేవిధంగా ఇతర రహదారుల్లో ఏర్పడిన గుంతలు పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై మురుగు.. పడేదెలా అడుగు?

వీరబల్లి, న్యూస్‌టుడే : వీరబల్లిలో పోలీస్‌స్టేషన్ వీధిలో మురుగు రోడ్డుపై పారుతోంది. మురుగును దాటి పోలీస్‌స్టేషన్‌కు, తపాలా కార్యాలయానికి, కె.ఎం పల్లి, కమ్మపల్లి గ్రామాలకు వెళ్లాల్సి ఉంది. అసంపూర్తిగా కాలువలు ఉండడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. మురుగు పోయేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టాలని అధికారులకు విన్నవిస్తున్నా ఏ మాత్రం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ నిర్మాణానికి సమీప భూముల వారు అంగీకరించక పోవడంతో సర్పంచి మధ్యలోనే పనులు ఆపేశారు. సంబంధిత అధికారులు కేవలం మురుగు కాలువ శుభ్రం చేయడం తప్ప శాశ్వత పరిష్కారంపై చర్యలు తీసుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. సమీప గృహాల వారు దుర్వాసనతో ఉండలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలుతున్నాయని, తమ గోడు పట్టించుకోండి అంటూ సమీప గృహాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి అసంపూర్తిగా ఉన్న కాలువ నిర్మాణ పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతానికి రోడ్డుపైకి మురుగు రాకుండా చర్యలు తీసుకోవాలని వారు విన్నవిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ వీధి రోడ్డులో మురుగు నీరు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ

సుండుపల్లి : వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వైకాపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం సుండుపల్లి మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి, పెదినేని కాలువ, ముదుంపాడు, సొంతంవారిపల్లి, జి.రెడ్డివారిపల్లి, తిమ్మసముద్రం గ్రామ పంచాయతీల్లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. దీనికి వ్యతిరేకంగా రచ్చబండ కార్యక్రమాలు చేపట్టి కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి వైకాపా శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో వైకాపా పరిశీలకుడు సురేశ్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు అజంతమ్మ, జడ్పీటీసీ సభ్యులు ఇస్మాయిల్, వైకాపా మండల కన్వీనర్ ఎం.రామస్వామిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వై.ఆరంరెడ్డి, వైకాపా నాయకులు హకీంసాబ్, రహమాన్‌ఖాన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రాజంపేట : ప్రజా ఉద్యమంలో భాగంగా ఈనెల 12న రాజంపేటలో నిర్వహిస్తున్న ర్యాలీని విజయవంతం చేయాలని వైకాపా నాయకుడు ఆకేపాటి అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆకేపాటి భవనంలో ర్యాలీ గోడపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, నవీన్‌కుమార్, గోపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఈనాడు
బాపట్ల
సోమవారం నవంబరు 10, 2025

తీరం పిలిచె.. జనం మురిసె..

రెండు ఆదివారాల అనంతరం జిల్లాలోని బీచ్‌ల్లో సందడి నెలకొంది. సూర్యలంక తీరానికి పెద్దసంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. నిర్దేశిత ప్రాంతాల్లో సముద్ర స్నానాలు చేశారు. కార్తిక మాసం సందర్భంగా మహిళలు సైకత శివలింగాలకు పూజలు చేశారు. అటవీ శాఖ తోటల్లో వన సమారాధనలు ఏర్పాటు చేసుకుని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. **- న్యూస్‌టుడే, బాపట్ల**

బీచ్‌ల్లో సీసీ కెమెరాలతో నిఘా

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలోని బీచ్‌ల వద్ద 40 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పర్యాటకుల భద్రతకు పటిష్ఠ నిఘా ఏర్పాటుచేసినట్లు ఎస్పీ ఉమామహేశ్వర్ చెప్పారు. సూర్యలంక బీచ్‌ను ఆయన ఆదివారం సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. డ్రోన్ల ద్వారా తీరంలో పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం తాగి సముద్రంలోకి దిగడం, ఈతకొట్టడం నేరమన్నారు. పోలీసు శాఖ సూచనలు పాటిస్తూ సురక్షితంగా సముద్ర స్నానాలు ఆచరించాలని సూచించారు. సోమవారం స్నానాలు చేయడానికి వచ్చే భక్తుల భద్రతకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. డీఎస్పీ రామాంజనేయులు, సీఐలు శ్రీనివాసరావు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

లలిత కళారాధనలో వెలిగిన చిరుదివ్వెలు

ఘనంగా ముగిసిన బాలోత్సవం

గుంటూరు సాంస్కృతికం, పెదకాకాని, న్యూస్‌టుడే: మేధోమధనం.. కళారాధనం.. రెండూ కలగలిపి నిండైన బాల్యాన్ని విరబూయిస్తున్నారు నేటి బాలలు. ఈ విషయాన్ని రుజువు చేసింది వీవీఐటీయూ బాలోత్సవం. ప్రపంచ పిల్లల పండగ పేరుతో మూడు రోజులు ముచ్చటగా నిర్వహించిన బాలోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. గుంటూరు జిల్లా నంబూరులోని వీవీఐటీయూ ప్రాంగణం ఇందుకు వేదికైంది. సామాజికంగా కాలుష్యం, ప్లాస్టిక్ లాంటి వాటిని అరికట్టి, మద్యపానం, ఇతర మత్తుపదార్థాల వంటి వాటిని దూరంగా తరిమేయాలన్న ఆకాంక్ష ఏకపాత్రలు, లఘు నాటికలు, కథా రచనల్లో స్పష్టంగా కనబర్చారు.

బాలల జానపద నృత్యాభినయం

కాగితపు ముక్కలు.. ఊహలకు రెక్కలు.. వీవీఐటీయూ పోటీ అంశాల్లో పేపర్ కొలేజ్ ఒకటి. పనికిరానివనుకున్నవి, పక్కన పడేసిన కాగితపు, అట్ట ముక్కలతో బాలలు తమ ఊహకు తగ్గ పలు రకాల బొమ్మలను తయారు చేశారు.

మట్టితో బొమ్మలు.. మట్టి ముద్దలతో ఎలాంటి అచ్చులు వాడకుండా చిట్టి చేతులతో దేవతా మూర్తులు, ఇతర అందమైన బొమ్మలను రూపొందించి తమ కళాకౌశలాన్ని రుజువు చేసుకున్నారు.

మట్టిబొమ్మల తయారీలో బాలలు

ఆప్తులు దూరమై.. ఆత్మీయత కరవై..

మలివయసులో తల్లిదండ్రుల వేదన

బాపట్ల, సత్తెనపల్లి, న్యూస్‌టుడే

జీవిత చరమాంకంలో ఉన్న తల్లిదండ్రుల్ని చిన్నపిల్లల్లా చూసుకోవాల్సిన బిడ్డలు కాయకష్టంతో వారు కూడగట్టిన ఆస్తుల్ని లాక్కుని రోడ్డుపైకి నెడుతున్నారు. దూరం పెట్టకు కన్నా.. ఆ బాధ భరించలేం నాన్నా.. అంటూ వారు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఏమీ చేయలేని పరిస్థితుల్లో.. పిల్లలు తమను నిర్లక్ష్యం చేస్తున్నారని వయోవృద్ధులు పలువురు అధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్నారు.

✦ బాపట్ల చిల్లర గొల్లపాలేనికి చెందిన గవిని పెద వెంకటేశ్వర్లు దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారికి పెళ్లిళ్లు చేశారు. వృద్ధాప్యంలో తమ బాగోగుల్ని కుమారుడు, కుమార్తె చూడటం లేదని బాపట్ల ఆర్డీవో ట్రైబ్యునల్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఫిర్యాదు విచారణ దశలో ఉంది.

✦ బాపట్ల డీఎస్పీ కార్యాలయం రోడ్డులో ఉంటున్న ఓ వృద్ధుడు తన కుమారుడు మరణించారని, కోడలు పట్టించుకోవడం లేదని, పూట గడవక ఇబ్బందులు పడుతున్నట్లు పట్టణ పోలీసులకు రెండు నెలల కిందట ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదును ఆర్డీవో ట్రైబ్యునల్‌కు పంపించారు.

వృద్ధుల రక్షణకు.. నిర్లక్ష్యం చేయడం, దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడటం.. ఆర్థిక దోపిడీ తదితరాల నుంచి వృద్ధులను రక్షించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పిల్లలు పట్టించుకోకుంటే తల్లిదండ్రులు తమ ఆస్తిని తిరిగి పొందే అవకాశం ఉన్నట్లు సీనియర్ సిటిజన్ చట్టంతో కల్పిస్తోంది. చట్టాన్ని పకడ్బందీగా అమలుచేసేందుకు ఆర్డీవోలు చర్యలు తీసుకుంటున్నారు.

పిల్లలు సరిగా చూడటంలేదని ఫిర్యాదు చేయడానికి కలెక్టరేట్‌కు వచ్చిన పెద వెంకటేశ్వర్లు దంపతులు

ఫిర్యాదులకు సత్వర స్పందన

వృద్ధుల హక్కులు, భద్రత, పోషణకు సంబంధించి సీనియర్ సిటిజన్ చట్టం- 2007 అమల్లో ఉంది. దీనిద్వారా పిల్లలు, వారసుల నుంచి పోషణ పొందే హక్కు వృద్ధులకు ఉంటుంది. ❖ 60 ఏళ్లు దాటిన వృద్ధులకు పిల్లల నుంచి ఇబ్బందులు ఎదురైతే తెల్ల కాగితంపై తమ సమస్యను రాసి ఆర్డీవోకు అందజేయాలి. ఆర్డీవో ఛైర్మన్‌గా ఉన్న ట్రైబ్యునల్ వివరాలను పరిశీలిస్తుంది. ❖ క్షేత్రస్థాయిలో విచారణ, కౌన్సెలింగ్ అనంతరం 90 రోజుల్లోపు సమస్య పరిష్కరిస్తారు. ❖ అవసరమైతే గిఫ్ట్ డీడ్‌లు రద్దు చేస్తారు. జీవనభృతి అందేలా చూస్తారు.

బాధితులు సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబరు : 14567

వయోవృద్ధుల సంరక్షణ చట్టం కింద తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోపు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని జేసీ భావన తెలిపారు. వృద్ధాప్యంలో అమ్మానాన్నల సంరక్షణ, పోషణ చూడాల్సిన బాధ్యత బిడ్డలపై ఉందన్నారు. ఆస్తిపాస్తులు రాయించుకుని తర్వాత పట్టించుకోకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.



శివకేశవమూర్తి.. కార్తిక దీప్తి

పిట్టలవానిపాలెం మండలం గోకరాజు నల్లిబోయినవారిపాలెం పంచాయతీ పరిధి శ్రీనివాసపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తిక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని శివకేశవమూర్తిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. **- న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం**

నారీ.. సవారీ!

పొదుపు మహిళలకు ర్యాపిడో వాహనాలు

చీరాల అర్బన్, బాపట్ల, న్యూస్‌టుడే

స్వయం సహాయక సంఘాల సభ్యుల్లోని వాహన చోదకులకు జీవనోపాధి కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నారీ.. సారధిగా సవారీ చేస్తూ ఉపాధి పొందేందుకు, ఆర్థిక ప్రగతి సాధించేందుకు తోడ్పాటు అందించనుంది. పింక్ మొబిలిటీ పేరుతో పొదుపు మహిళలకు వాహనాలు ఇవ్వనున్నారు. ఇప్పటికే ర్యాపిడో సంస్థతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఒప్పందం చేసుకుంది. జిల్లాలో 364 మందికి ర్యాపిడో వాహనాలు అందజేసి ఉపాధికి భరోసా కల్పించనుంది.

పట్టణ స్వయం సహాయ సంఘాలు	5,398
ఆయా సంఘాల్లో సభ్యుల సంఖ్య	45,238
ర్యాపిడో వాహనాల పంపిణీ లక్ష్యం	216

❖ ఆసక్తి, లైసెన్సు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకుంటే ర్యాపిడో వాహనం అందజేస్తారు.

❖ తక్కువ ధరకే వాహనాలు కొనుగోలు చేసేలా వివిధ సంస్థలతో ర్యాపిడో ఒప్పందం చేసుకుంది. వాహన చోదకులకు రుణం ఇస్తారు. ఆ సొమ్ముతో నచ్చిన వాహనాన్ని కొనుక్కోవచ్చు.

❖ నెలకు 300 వరకు బుకింగ్స్ వచ్చేలా.. రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం లభించేలా చూస్తారు.

❖ ర్యాపిడో పట్టణాల్లో పికప్, డ్రాపింగ్ పాయింట్లను ప్రారంభించి.. నిర్దేశిత ప్రదేశాల్లో వాహనాలు నిలిపేందుకు అవకాశం కల్పిస్తారు.

❖ ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరించి త్వరితగతిన ఎంపిక ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మెప్మా అధికారులు తెలిపారు.

భట్టిప్రోలు బౌద్ధ స్తూపం.. పర్యాటకానికి ప్రత్యేకం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: కృష్ణానది పరీవాహక ప్రాంతానికి దగ్గర్లో ఉన్న భట్టిప్రోలులో బౌద్ధ స్తూపం ఉండటంతో పర్యాటకంగా గుర్తింపు ఉంది. స్తూపం లోపల బుద్ధుని ధాతువు (పన్ను) ఉంచారని పర్యాటక శాఖ అధికారుల పరిశోధనల్లో వెల్లడైంది. క్రీస్తు శకం

1870లో బౌద్ధ స్తూపం బయటపడింది. అప్పటి నుంచి పర్యాటకులు వస్తున్నారు. స్తూపం శిథిలావస్థకు చేరడంతో 20 ఏళ్ల క్రితం పురావస్తు శాఖ అధికారులు రూ.కోటికిపైగా వెచ్చించి అభివృద్ధి చేశారు. పర్యాటకులను ఆకర్షించేలా స్తూపం పక్కనే చెరువు కట్టపై 50 అడుగుల బుద్ధుని ధ్యాన విగ్రహం ఏర్పాటు పనులు పూర్తయితే పర్యాటకుల సంఖ్య పెరగనుంది.

మొక్కే.. పెళ్లి కానుక

ఆయన పర్యావరణ ప్రేమికుడు. వయసు 55 ఏళ్లు. గత 30 సంవత్సరాలుగా నూతన వధూవరులకు మొక్కలు కానుకగా అందజేయడం ఆనవాయితీగా మార్చుకున్నారు. మొక్కల మాదిరి వారి కుటుంబం వృద్ధి చెందాలనేది ఆయన ఉద్దేశం. స్నేహితులనూ మొక్కలు పంచాలని, నాటాలని ప్రోత్సహిస్తుంటారు. ఆయనే అద్దంకికి చెందిన మన్నం త్రిమూర్తులు. పట్టణంలో ఎక్కడ, ఎవరు మొక్కలు నాటాలన్నా ఆయన సలహాలు పాటిస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ విషయమై విద్యార్థులెవరైనా బాగా మాట్లాడితే వెంటనే జేబులో నుంచి డబ్బులు తీసి ఇస్తూ ప్రోత్సహిస్తుంటారు. ఇప్పటి వరకు 22 వేల మొక్కలు అందజేయడంతో పాటు నాటారు. **- న్యూస్‌టుడే, అద్దంకి**

వరద ముంపు పొలాల పరిశీలన

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం మండలంలో మొంథా తుపాను కారణంగా వరద ముంపునకు గురై, దెబ్బతిన్న వరి పొలాలను జిల్లా సంయుక్త కలెక్టర్ భావన ఆదివారం పరిశీలించారు. రెండు నెలల పంట దెబ్బతిని సర్వం కోల్పోయామని కడవకుదురు రైతులు జేసీకి వివరించారు. అనంతరం కొమ్మమూరు కాలువను పరిశీలించారు. తహసీల్దార్ కె.ప్రభాకరరావు, ఏవో చంద్రశేఖర్, ఉద్యాన, రెవెన్యూ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు. సోమవారం మధ్యాహ్నం వరద ముంపునకు గురైన పొలాలు, గండ్లు పడ్డ కాలువల పరిశీలనకు కేంద్ర బృందం రానున్నట్లు తహసీల్దార్ ప్రభాకరరావు తెలిపారు.

ఆనందవల్లి.. భక్తితో ప్రణమిల్లి..

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే

ప్రముఖ శైవక్షేత్రాల్లో నరసరావుపేట మండలం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయం ఒకటి. ఇక్కడికి వచ్చే భక్తులు తొలిగా ఆనందవల్లి (గొల్లభామ) అమ్మవారిని దర్శించుకుంటారు. అంత భాగ్యం ఆమెకు ఎలా దక్కింది. శివయ్య కంటే ముందుగా ఆమెను భక్తులు ఎందుకు కొలుస్తారు అన్నది స్థానికులకు తెలిసిందే అయినా.. దూర ప్రాంత భక్తులు ఆనందవల్లి అంటే పార్వతీదేవి అని పొరబడుతుంటారు.

ఆనందవల్లి దేవాలయం, అమ్మవారు

కాకులు వాలని కొండ

బ్రహ్మ, రుద్ర, విష్ణు మూడు శిఖరాలు ఉండటంతో త్రికూట పర్వతమని అంటారు. ఇక్కడ వెలసిన త్రినేత్రుడిని త్రికోటేశ్వర స్వామి అని పిలుస్తారు. కొండకు దక్షిణాన కొండకావూరులో యాదవ వంశంలో జన్మించిన ఆనందవల్లి యుక్తవయసులో ఆవులు కాయడానికి వెళ్లేది. ఓ ఆవు వెళ్లి రుద్ర శిఖరంపై పరమేశ్వరుని ఆకలి తీర్చేది. ఆ ఆవు పాలు దూడకు సరిపోయేవి కావు. ఆనందవల్లికి అనుమానం వచ్చి ఒకరోజు ఆవు వెంట వెళ్లగా పరమశివునికి పాలిస్తుండటం చూసి ఆశ్చర్యపోయింది. మహిమ కలిగిన వ్యక్తిగా భావించి రోజూ ఆవుపాలు తెచ్చి ఇస్తానని చెప్పింది. అలా రోజూ మట్టి ముంతలో ఆవు పాలు తీసుకొచ్చి పరమశివునికి ఇచ్చేది. ఒకరోజు పాలను కాకి దొర్లించగా కోపంతో కొండపై వాయసం అరుపు వినిపిస్తే నాలుగు దిక్కుల్లో ఒక దిక్కుకు నష్టం కలుగుతుందని శపించింది. అప్పటి నుంచి కొండపై కాకులు వాలవని స్థానికులు చెబుతున్నారు.

భక్తురాలై.. శిలగా మారి..

కొన్ని రోజుల తర్వాత కొండపైకి పాలు తీసుకురాలేనని చెప్పిన ఆనందవల్లి స్వామినే కొండకావూరు వచ్చి పాలు స్వీకరించాలని కోరింది. సంతోషించిన పరమశివుడు నీ వెనుకే వస్తాను.. నీవు మాత్రం తిరిగి చూడకూడదు అని చెప్పారు. ఆనందవల్లి నడుచుకుంటూ రుద్రశిఖరం, బ్రహ్మశిఖరం దాటిన తర్వాత పెద్ద శబ్దం రావడంతో తిరిగి చూసింది. అక్కడే ఆమె శిలగా మారింది. బ్రహ్మశిఖరం మీద పరమశివుడు శిలగా మారారు. ఆనందవల్లి కొండకావూరు ఎప్పుడు వెళ్తామని స్వామిని అడగగా.. భక్తులందరూ భక్తితో కోటి ప్రభలతో ఎప్పుడు కొండకు వస్తారో అప్పుడు వెళ్తామని చెప్పారన్నది చరిత్ర. అప్పటినుంచి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు నడక మార్గంలో ముందుగా ఆనందవల్లికి పూజలు చేస్తున్నారు. ఆనందవల్లి వారసులు ఇప్పటికీ కొండకావూరులో నివసిస్తున్నారు.

వైద్యశాల నిర్వహణ, మెరుగైన వైద్య సేవలు, సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత ప్రామాణికంగా 2024-25 సంవత్సరానికి ప్రభుత్వ ఆసుపత్రులను కాయకల్ప పురస్కారాలకు అధికారులు ఎంపిక చేశారు. విభాగాల వారీగా నగదు ప్రోత్సాహకాలు అందించనున్నారు.

సేవల్లో మెరిసి.. స్వచ్ఛంగా నిలిచి..

పురస్కారాలకు ప్రభుత్వ ఆసుపత్రుల ఎంపిక

అద్దంకి, చీరాల అర్బన్, న్యూస్‌టుడే

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల విభాగంలో అద్దంకి గాజులపాలెం యూపీహెచ్‌సీ ఎంపికైంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బాపట్ల మండలం వెదుళ్లపల్లి, విశ్వేశ్వరం, ఇంకొల్లు. . ఆరోగ్య ఉప కేంద్రాల్లో మేదరమెట్ల-3, ఖాజీపాలెం, పాతనందాయపాలెం వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

అద్దంకి పురపాలక సంఘం పరిధిలోని గాజులపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రథమ స్థానంలో నిలిచింది. ఆరు పడకల ఆసుపత్రిలో రోజుకు సగటున 60-70 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. ఒక వైద్యుడు, ఏడుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. ఆసుపత్రికి ప్రహరీ లేకపోయినా వైద్యులు, సిబ్బంది సొంతంగా ఇనుప కంచె ఏర్పాటు చేసుకున్నారు. ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా చూసుకుంటున్నారు. మెరుగైన సేవలు అందిస్తున్న కారణంగానే కాయకల్ప అవార్డుకు ఎంపికైనట్లు వైద్యుడు జి.జయసింహ తెలిపారు.

ఎంపికైనవి.. కేటాయించే నిధులు (రూపాయల్లో)

గాజులపాలెం (యూపీహెచ్‌సీ)	లక్ష
వెదుళ్లపల్లి పీహెచ్‌సీ	లక్ష
విశ్వేశ్వరం పీహెచ్‌సీ	50 వేలు
ఇంకొల్లు పీహెచ్‌సీ	25 "
మేదరమెట్ల-3	50 "
ఖాజీపాలెం	35 "
పాతనందాయపాలెం	20 "

అద్దంకి గాజులపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఆదివారం.. ఆటవిడుపు

విధుల్లో నిరంతరం తీరిక లేకుండా గడుపుతున్న అధికారులు రెండు జట్లుగా విడిపోయి ఆదివారం సరదాగా క్రికెట్ ఆడారు. ఓ జట్టుకు కలెక్టర్ వినోద్‌కుమార్, మరో జట్టుకు పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి నేతృత్వం వహించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో తొలుత బ్యాటింగ్ చేసిన పురపాలక ఉద్యోగుల జట్టు 16 ఓవర్లలో 92 పరుగులు చేసి ఆలౌటైంది. కలెక్టర్ జట్టు 14.3 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసి విజయం సాధించింది. కలెక్టర్ వినోద్‌కుమార్ బ్యాటింగ్ చేసి పరుగులు తీశారు. **- బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే**

ఆహ్లాదంగా అంతిమ ప్రస్థానం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

రేపల్లె పురపాలక సంఘానికి చెందిన రెండు హిందూ శ్మశాన వాటికలు ఉద్యానవనాల్ని తలపిస్తున్నాయి. పూల మొక్కలు, పచ్చని చెట్లతో ఆహ్లాదానికి నిలువెత్తు నిదర్శనంగా ఉన్నాయి. దాతల సహకారంతో వీటిల్లో అన్ని సదుపాయాలు సమకూరాయి.

18వ వార్డులోని హిందూ స్వర్గధామంలో పచ్చదనం

రేపల్లె 18వ వార్డు శివారులో 5.95 ఎకరాల్లో జొన్నలగడ్డ కోదండరామయ్య, వెంకట సుబ్బమ్మ హిందూ స్వర్గధామాన్ని రూ.1.10 కోట్లతో అభివృద్ధి చేశారు. దీనికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం రూ.35 లక్షల విరాళంతోపాటు పలువురు దాతల తోడ్పాటుతో నందనవనంలా తీర్చిదిద్దారు.

26వ వార్డు శివారులోని హిందూ మహాప్రస్థానాన్ని రూ.92 లక్షలతో అభివృద్ధి చేశారు. ముఖ్యదాత డాక్టర్ మైనేని సుబ్బారావుతోపాటు పలువురి ఆర్థిక చేయూతతో సుందరంగా తీర్చిదిద్దారు. 3.60 ఎకరాల ప్రాంగణంలో సుమారు 2 వేల మొక్కలు నాటి పచ్చదనంతో నింపారు. వాటికల్లో దహన సంస్కారాలు, పిండ ప్రదాన భవనాలు, స్నానగదులు, కట్టెల నిల్వకు ప్రత్యేక గదులున్నాయి. మహాశివుడు, సత్యహరిశ్చంద్రుడు విగ్రహాలు ఏర్పాటు చేశారు.

2013లో మైనేని హిందూ మహాప్రస్థానం, 2017లో జొన్నలగడ్డ కోదండరామయ్య, వెంకటసుబ్బమ్మ స్వర్గధామాన్ని పుర ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని, వాటి నిర్వహణ బాధ్యతలు చేపట్టామని రేపల్లె లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం

న్యూస్‌టుడే, బాపట్ల

రైతుల నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణకు పౌరసరఫరాల శాఖ సిద్ధమైంది. జిల్లాలో 114 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్‌ఎస్‌కేలు, సహకార సంఘాలు, జీడీసీఎంఎస్ సిబ్బందికి జిల్లా స్థాయిలో శిక్షణ పూర్తి చేశారు. సోమవారం నుంచి మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తేమ శాతం నిర్ధారించే యంత్రాలు, గోనెసంచులు సిద్ధం చేస్తున్నారు. వేమూరు నియోజకవర్గంలో ఈ నెల 20న కేంద్రం ప్రారంభించి కొనుగోళ్లు చేపట్టాలని నిర్ణయించారు.

❖ జిల్లాలో సేకరణ లక్ష్యం: 1.35 లక్షల మెట్రిక్ టన్నులు
❖ గ్రేడ్ 'ఏ' రకం క్వింటాకు మద్దతు ధర : రూ.2389
❖ సామాన్య రకం క్వింటాకు మద్దతు ధర : రూ.2369

జిల్లాలో 2.82 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. వాయుగుండాలు, తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతింది. దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ధాన్యం సేకరణ లక్ష్యాన్ని గత సంవత్సరముకన్నా ఈసారి 85 వేల మెట్రిక్ టన్నులు పెంచారు. చిన్న, సన్నకారు రైతులు ఆర్‌ఎస్‌కేలు, జీడీసీఎంఎస్ కేంద్రాలకు ధాన్యం నమూనా తెచ్చి తేమ శాతం పరీక్ష చేయించుకోవాల్సి ఉంటుంది. తేమ శాతం 17లోపు ఉంటే ఆన్‌లైన్లో వివరాలు నమోదు చేసి కేటాయించిన రైస్ మిల్లుకు వాహనాల్లో ధాన్యాన్ని పంపిస్తారు.

టెయిల్‌పాండ్‌కు వరద నీరు రాక

రెంటచింతల, న్యూస్‌టుడే: ఎగువనున్న నాగార్జునసాగర్ జలాశయం నుంచి సత్రశాల టెయిల్‌పాండ్‌కు వరద నీటి రాక కొనసాగుతోంది. ఆదివారం 34,185 క్యూసెక్కులు వచ్చి చేరింది. నాలుగు క్రస్టు గేట్లు ఎత్తి దిగువ పులిచింతల ప్రాజెక్టుకు 22,640 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తికి 31,101 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు జెన్‌కో ఎస్‌ఈ వెంకటరమణ తెలిపారు.

(c) eenadu

జిల్లాలో కేంద్ర బృందం పర్యటన రేపు

పంట నష్ట నివేదికలు సిద్ధం చేసిన అధికారులు

బాపట్ల, న్యూస్‌టుడే: మొంథా తుపాను వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించటానికి పౌసుమి బసు నేతృత్వంలో కేంద్ర బృందం మంగళవారం జిల్లాలో పర్యటించనుంది. సోమవారమే బృందం జిల్లాలో పర్యటించాల్సి ఉండగా ముందుగా ప్రకాశం జిల్లాకు వెళ్తోంది. సోమవారం రాత్రి చీరాలకు చేరుకుని అక్కడే బస చేస్తారు. రామాపురం, వాడరేవులో మంగళవారం ఉదయం పది గంటలకు పర్యటించి తుపాను వల్ల దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, ఇళ్లను కేంద్రం బృందం పరిశీలిస్తుంది. అనంతరం ఉదయం 11 గంటలకు బాపట్ల కలెక్టరేట్‌కు చేరుకుని తుపాను వల్ల జిల్లాలో జరిగిన నష్టంపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్రాలను పరిశీలిస్తారు. కలెక్టర్, జేసీ జిల్లా అధికారులతో సమావేశమై మొంథా వల్ల తీవ్రంగా ప్రభావితమైన రంగాలు, జరిగిన నష్టం వివరాలు తెలుసుకుని మధ్యాహ్నం 12 గంటలకు అమరావతి సచివాలయానికి పయనమవుతారు. భారీ వర్షాలకు 39 వేల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు పెట్టుబడి రాయితీ కింద రూ.75 కోట్లకు పైగా సాయం అందాల్సి ఉంది. నల్లమడ వాగు, పర్చూరు, ఆలేరు, నక్కల వాగు, కొమ్మమూరు కాలువకు పెద్దసంఖ్యలో గండ్లు పడి రూ.కోట్లలో నష్టం సంభవించింది. తాత్కాలిక మరమ్మతులకే రూ.15 కోట్లకు పైగా కావాల్సి ఉంది. శాశ్వత మరమ్మతులకు రూ.వంద కోట్లకు పైగా నిధులు అవసరం అవుతాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 389.13 కి.మీ.లలో రహదారులు, 11 వంతెనలు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. తాత్కాలిక మరమ్మతులకు రూ.4 కోట్లు, శాశ్వతంగా పునరుద్ధరించటానికి రూ.139 కోట్లు కావాలని ప్రతిపాదనలు రూపొందించి నివేదిక సిద్ధం చేశారు. విద్యుత్తు శాఖకు రూ.5 కోట్ల వరకు నష్టం జరిగింది. అన్ని రంగాలకు జరిగిన నష్టంపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయించిన కలెక్టర్ వినోద్‌కుమార్ కేంద్ర బృందానికి మంగళవారం సమర్పించనున్నారు.

అయ్యవార్లకు ఆటవిడుపు

15 నుంచి మండలస్థాయిలో శ్రీకారం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే

నిత్యం విద్యాబోధనలో తలమునకలై ఉండే అయ్యవార్లకు ఆటవిడుపుగా క్రీడలు నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు నిర్వహించినట్లే గురువులకు వీటిని నిర్వహించనున్నారు. ఈనెల 15న మండల స్థాయిలో వీటికి శ్రీకారం చుట్టేలా పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. దీనికి సంబంధించిన షెడ్యూల్ సైతం ఖరారు చేశారు. ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు జరపనున్నారు. ఇటువంటి పోటీలతో అందరి మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొనడమే కాకుండా శారీరక ఆరోగ్యం, ఒత్తిడిని అధిగమించడానికి అవకాశం ఏర్పడుతోందనే అభిప్రాయాన్ని ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయిలో పోటీల బాధ్యత మండల కో-ఆర్డినేటరుకు అప్పగించారు. ఎంఈవో 1, 2 నిర్వహణాధికారులుగా ఉంటారు. డివిజన్ స్థాయిలో డివిజన్ కో-ఆర్డినేటరు, డీవైఈవో, ఇక జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి, ఏడీ, జేడీ పర్యవేక్షించనున్నారు.

క్రికెట్ పోటీలు

క్రికెట్ జట్టులో 16 మంది

క్రికెట్ జట్టులో ఒక ఎంఈవో లేదా ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు పాఠశాల సహాయకులు (లాంగ్వేజ్), నలుగురు స్కూల్ అసిస్టెంట్లు (నాన్ లాంగ్వేజ్), పీడీ లేదా పీఈటీ, ఏడుగురు ఎస్జీటీలు ఉంటారు.

త్రోబాల్‌లో 12 మంది

జట్టులో ఎంఈవో లేదా ప్రధానోపాధ్యాయిని, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు(లాంగ్వేజ్), ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు (నాన్ లాంగ్వేజ్), ఒక పీడీ లేదా పీఈటీ, అయిదుగురు ఎస్జీటీలు ఉంటారు.

రహదారుల అభివృద్ధికి కృషి

కృష్ణారావుకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి జనార్దనరెడ్డి, ఆర్డీసీ ఛైర్మన్ నాగేశ్వరరావు

పర్చూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్డీసీ) డైరెక్టర్‌గా పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామానికి చెందిన కారుమంచి వెంకట కృష్ణారావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఆర్డీసీ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావులు వెంకట కృష్ణారావుతో ప్రమాణ స్వీకారం చేయించి, జ్ఞాపికను అందజేశారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కారుమంచి చెప్పారు.

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి

చీరాల, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని ఒక అనుభవంగా తీసుకొని భవిష్యత్తులో రాణించాలని, గెలిచిన వారు దీన్ని ఒక అవకాశంగా మరిన్ని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య సూచించారు. చీరాల ఎన్‌ఆర్‌పీఎం మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు ఆదివారం ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడికి గెలుపోటములు సహజమని, అప్పుడే క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ కె.జనార్దన్, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీఎస్ సత్యనారాయణ, కోశాధికారి కె.రమేష్, బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివరావు, కొల్లయ్య, ఎ.అలేఖ్య, తాడివలస దేవ రాజు, రిఫరీలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికల విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానం విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానం విజేతలు

విజేతలు సుప్రియా, పవన్

బాలికల సింగిల్స్‌లో అనంతపురానికి చెందిన జి.సుప్రియా ప్రథమ స్థానం సాధించగా అదే జిల్లాకు చెందిన జ్యోతిక ద్వితీయస్థానం సొంతం చేసుకుంది. బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పవన్‌కుమార్ మొదటిస్థానం కైవసం చేసుకోగా కాకినాడకు చెందిన శివ రెండో స్థానంలో నిలిచాడు. ఈసందర్భంగా ఈనెల 26 నుంచి జమ్మూలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును ప్రకటించారు.

విజ్ఞాన క్షేత్రం.. భవితకు ఛత్రం

కళాశాలలో పాఠాలు.. పంటచేలో వాస్తవాలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

గదిలో నేర్చుకోవడమే కాదు.. క్షేత్రస్థాయిలో వాస్తవాలు ఏమిటో తెలుసుకునే అవకాశం వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు కల్పిస్తున్నారు. ఉదయాన్నే అన్నదాతలతోపాటు పొలాల బాట పడుతున్నారు. సాయంత్రం వరకు పంట పొలాల్లో పనిచేస్తూ రైతులు చేస్తున్న పనులను పరిశీలిస్తూ తెలుసుకుంటున్నారు. తరగతి గదుల్లో అధ్యాపకులు, వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకున్న పాఠ్యాంశాల ద్వారా వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులు పాటించేలా సూచనలు చేస్తున్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నారు. సాగులో ఎదురయ్యే సమస్యలు, విత్తనం నుంచి దిగుబడుల వరకు క్షేత్రస్థాయిలో శిక్షణ పొందుతున్నారు. వివిధ రకాల పంటల సాగు పద్ధతులు నేర్చుకోవడం, పశువుల పెంపకంపై అవగాహన, ఎరువులు, పురుగు మందుల వాడకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా అన్ని అంశాలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నారు. పంటచేలో పాఠాలు నేర్చుకుంటున్న చిలకలూరిపేట మండలం మద్దిరాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లో..

పొలంలో కలుపు తీస్తున్న విద్యార్థులు

నాన్న కష్టాన్ని చూసి

మాది వ్యవసాయ కుటుంబం. నాన్న కష్టాన్ని స్వయంగా చూశా. ఇప్పుడు క్షేత్రస్థాయిలో స్వయంగా పనులు చేస్తూ తెలుసుకున్నా. రైతులకు నూతన వ్యవసాయ పరిజ్ఞానం పద్ధతులను తెలియజేస్తున్నా. రసాయన ఎరువులు ఎక్కువగా వాడటం ద్వారా కలిగే అనర్థాలను వివరిస్తూ సేంద్రియ ఎరువు వాడకాన్ని పెంచేలా కృషి చేస్తున్నా. – చెరుకూరి ఉషశ్రీ

శాస్త్రవేత్త కావాలని..

వివిధ పంటల సాగులో రైతులు అనుసరిస్తున్న పద్ధతులను క్షేత్రస్థాయిలో గమనిస్తున్నా. రైతులను ఇంకా చైతన్యపరచాల్సిన అవసరం ఉంది. మట్టి పరీక్షల ప్రాధాన్యతను వివరిస్తున్నా. తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్నా. సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై వివరిస్తున్నా. వ్యవసాయ యంత్ర పరికరాలు వాడుకోవడం ద్వారా ఖర్చు తగ్గించుకొని దిగుబడులు పెంచుకునేలా సూచనలు ఇస్తున్నా. చదువు, ఈ అనుభవాలతో వ్యవసాయ శాస్త్రవేత్త అవుతాను. – పి.మాలశ్రీ

క్షేత్ర స్థాయిలో శిక్షణలో భాగం

వ్యవసాయ విద్యలో పాఠ్యాంశాలు బోధించడమే కాకుండా క్షేత్రస్థాయిలో పంటల సాగులో విద్యార్థులను నిమగ్నమయ్యేలా చూస్తున్నాం. కళాశాల ప్రాంగణంలో ఉన్న పొలాల్లో పత్తి, చామంతి రకరకాల పంటలను విద్యార్థుల ద్వారానే సాగు చేయిస్తున్నాం. చుట్టుపక్కల రైతులకు నేరుగా అంశాల ద్వారా సూచనలు చేసేలా శిక్షణ ఇస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వాడకం, జాగ్రత్తలతో పాటు యంత్ర పరికరాల వినియోగంపై అవగాహన కలిగిస్తున్నాం. శిక్షణ పూర్తయిన విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి.
– డాక్టర్ పి.శివప్రసాద్, డైరెక్టర్, ప్రిన్సిపల్, మద్దిరాల సాదినేని చౌదరయ్య వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

చివరి దశలో దోర్నపు వాగు వంతెన మరమ్మతులు

పేరాయపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే: పేరాయపాలెం సమీపంలోని దోర్నపువాగే వంతెన అప్రోచ్ రహదారి మరమ్మతులు చివరిదశకు చేరాయి. మొంథా తుపాను ప్రభావంతో దాదాపు 20 అడుగుల లోతులో గోతులు ఏర్పడ్డాయి. రాకపోకలు నిలిచిపోయాయి. పొలాలకు వెళ్లాలనుకునే వ్యవసాయ కూలీలు అతి కష్టం మీద వెళుతున్నారు. విషయం తెలుసుకున్న ర.భ.శాఖ ఉన్నతాధికారులు వంతెన అప్రోచ్ రహదారిని పరిశీలించారు తక్షణం మరమ్మతులు జరిపించాలని ఏఈ శివన్నారాయణకు సూచించారు. తదనుగుణంగా చీమకుర్తి నుంచి గ్రానైట్ రాళ్లు తెచ్చి గోతుల్ని పూడ్చారు. వాటిపై కొండమట్టిని తోలి, చదును చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం తరువాత పని చేస్తున్న యంత్రాలు మరమ్మతులకు గురవడంతో పనులు నిలుపుదల చేశారు. సోమవారం మధ్యాహ్నం తరువాత రాకపోకలు సాగించేందుకు వీలు కలుగుతుందని ఏఈ తెలిపారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు వెళ్లే విధంగా మార్గం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

దోర్నపువాగు గండ్లు పూడుస్తూ..

నిలిచిన ట్రావెల్ బస్సు.. ఇబ్బంది పడ్డ ప్రయాణికులు

ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు వెళుతున్న వి.కావేరి ప్రైవేటు ట్రావెల్ బస్సు సాంకేతిక లోపంతో సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో నిలిచిపోయింది. ఉదయం 7.30 గంటల వరకు అందులోని ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. నెల్లూరుకు చెందిన ఈ బస్సు చిత్తూరు నుంచి 28 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలు దేరింది. ఏల్చూరు వద్దకు రాగానే నిలిచిపోయింది. డ్రైవర్లు, సిబ్బంది తక్షణం స్పందించకపోవడం, నిర్లక్ష్య వైఖరితో తెల్లవారే వరకు మహిళలు, వృద్ధులు, పిల్లలతో ఇబ్బంది పడ్డట్లు శ్రీకాళకాస్తిలో ముగ్గురు కుటుంబ సభ్యులతో కలిసి బస్సు ఎక్కిన సంగారెడ్డికి చెందిన బి.రాజేష్ తెలిపారు. ప్రయాణికులు ఎవరికి వారు గమ్యస్థానానికి వెళ్లిపోవాలని, టికెట్టు డబ్బులు తరువాత ఇప్పిస్తామని వాగ్వాదానికి దిగినట్లు ప్రయాణికులు తెలిపారు. దీంతో అందులోని ప్రయాణికుల్లో 15 మందికి పైగా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లిపోయారు. మిగిలినవారు బస్సు వద్దే పడిగాపులు కాస్తూ ఇబ్బంది పడ్డారు. సమస్యను ప్రయాణికుల్లో కొందరు స్థానిక 'న్యూస్‌టుడే'కు చరవాణిలో తెలిపారు. 'న్యూస్‌టుడే' సమస్యను స్థానిక సీఐ కె.వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన స్థానిక ఎస్సై ఎం.పట్టాభిరామయ్యను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఏఎస్సై శ్రీనివాసరావు బస్సు వద్దకు వెళ్లి ఫోన్‌లో యాజమాన్యంతో మాట్లాడి బస్సు వద్ద వేచి ఉన్న 13 మంది ప్రయాణికులకు టికెట్ల డబ్బులు తిరిగి ఇప్పించి, ప్రైవేటు కారు మాట్లాడి వారిని గమ్య స్థానానికి పంపించే ఏర్పాట్లు చేశారు.

రూపు మారి.. సేవలు మెరుగుపడి..

అత్యవసర సమయంలో సేవలందించడంలో 108 వాహనం గుర్తింపు పొందింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 108 వాహనాలు సమకూర్చింది. మండల కేంద్రం చెరుకుపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద పాతతరం వాహనాల పక్కనే నూతన వాహనాన్ని నిలిపి ఉంచారు. గతంలో సేవలందించిన వాహనాల పక్కనే ప్రస్తుత వాహనాన్ని ఉంచారు.

-న్యూస్‌టుడే, చెరుకుపల్లిగ్రామీణ

నిలిపిన 108 వాహనాలు

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును(స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FOR SALE

నరసరావుపేట, Prime ఏరియా రన్నింగ్‌లో ఉన్న కిడ్స్ క్లాత్ & టాయ్స్ షాపు మెటీరియల్, గుడ్‌విల్‌తో సహా అమ్మకానికి కలదు. 91118 79555.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9553786677/9640496677.

REAL ESTATE

PROPERTY FOR SALE

GENERAL

Gunter Skamala Nagar House Site Of 960 Yards Located Opp Sairam Water Plant Beside Dimond Towers is for sale. Genuine Buyers Contact: 7382621835, 7799580787, 9848049588.

TO LET

COMMERCIAL

గుంటూరు, అరండల్‌పేట, 11/1వ లైను D.No:6-11-39, 1st Floor Backside Office/Residence అద్దెకు కలదు. Ph.No: 93983 26564, 73828 92714.

TO.LET
విద్యా సంస్థలకు, ఆఫీసులకు
12000 వేలు చ॥అ కమర్షియల్ స్పేసు అద్దెకు ఇవ్వబడును.
దాసరి కమర్షియల్ కాంప్లెక్సు
జె.పి.రోడ్,భీమవరం-2
94408 70986
94403 56099

SECOND SALE

24 గుమ్మములు, 55 కిటికీలు, డోర్స్‌తో సహా (10 సం॥ముల పాతవి) అమ్మబడును. Contact: ✆ 94408 70986, 94403 56099.

JOBS

Req. of DRA & Non DRA Banking Collections, Field Exec: 16K- 22K, Telecaller: 11K-15K+ Incen. @ Vijayawada ✆ 6304056516.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజినందు Computer Operator గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Any Degree, 55 WPH Typing Speed, MS Office Skills, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్ర: 8978480429.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు SR Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35,000/- నుండి 45,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering. వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్: 8978480429.

ఆర్మీ శ్రీను బ్యాటరీస్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన హెల్పర్స్ (5) మరియు సేల్స్‌పర్సన్స్ (5) కావలెను. ✆ 62814 94701, 73820 30370.

గుంటూరులోని ప్రముఖ కంపెనీ నందు అకౌంటెంట్ కావలెను. GST & TDS నాలెడ్జ్ must. రెజ్యూమ్ వాట్సాప్. 90528 77789. goodharvestspices@gmail.com

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తా

మాజీ మంత్రి దగ్గుబాటి

కారంచేడు, న్యూస్‌టుడే: కొమ్మమూరు కాలువపై తలపెట్టిన ఎత్తిపోతల పథకాన్ని నిలుపుదల చేయాలంటూ ఆదివారం కారంచేడులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కాలువ పరిధిలోని పలు గ్రామాల రైతులు సమావేశయ్యారు. మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేశారని తెలుసుకుని, రైతులు ఆయనను సమావేశానికి ఆహ్వానించారు. కొమ్మమూరు కాలువపై తలపెట్టిన పథకం వల్ల రైతులకు వచ్చే నష్టాన్ని వివరిస్తూ నిలుపుదల చేయాలని ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. దీనివల్ల కాలువ చివరి ఆయకట్టు భూములకు, ప్రజలకు సాగు, తాగునీరు కొరత ఏర్పడుతుందని పలువురు రైతులు వెంకటేశ్వరరావు దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. స్పందించిన ఆయన ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి, రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారని కర్షకులు తెలిపారు.

రైతులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నాలుగు తరాల అపూర్వ కలయిక

బల్లికురవ, న్యూస్‌టుడే: గుంటుపల్లి వంశానికి చెందిన వేద బ్రాహ్మణుల అపూర్వ కలయికకు మండలంలోని చెన్నుపల్లి గ్రామం వేదికైంది. నాలుగు తరాలకు చెందిన సుమారు 100 మంది కుటుంబ సభ్యులు కలిశారు. వీరంతా వివిధ చోట్ల ఇంజినీర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారి ఆత్మీయ సమ్మేళనంతో సంతోషాలు వెల్లివిరిశాయి. పెద్దల ఆశీర్వచనాలు, చిన్నారుల పలకరింపులతో సందడి వాతావరణం నెలకొంది.

గుంటుపల్లి వంశస్థులు

కబడ్డీ విజేతకు అభినందనలు

చినగంజాం, న్యూస్‌టుడే: కడప జిల్లా పులివెందులలో ఈనెల 7, 8, 9 తేదీల్లో అంతర్ జిల్లాల సబ్ జూనియర్ కబడ్డీ పోటీలు జరిగాయి. వీటిలో బాపట్ల జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్ బాపట్ల, శ్రీకాకుళం జిల్లా జట్ల మధ్య హోరాహోరీగా జరిగింది. ఆంధ్ర కబడ్డీ సంఘం కార్యదర్శి యలమంచలి శ్రీకాంత్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు నక్కల అర్జునరావు, బాపట్ల జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు, కోచ్ కోటా హరి ప్రసాద్‌రెడ్డి క్రీడాకారులను అభినందించారు.

విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న శ్రీకాంత్ తదితరులు

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 – ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 – ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 – మ. 2
సత్యభామ	మ. 2 – సా. 5
లైట్ తీస్కో	సా. 5 – రా. 9
సరదాగా కాసేపు	రా. 9 – రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 – తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

లారీ ఢీకొని యువకుడి మృతి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి మార్గంలో ఆదివారం లారీ ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన మహమ్మద్ వలి(27)తో గూడవల్లికి చెందిన ఓ మహిళకు వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. అత్తగారింటికి వచ్చిన వలి రేపల్లెలోని ఓ స్నేహితుడు ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా, జాతీయ రహదారి మార్గంలోని రైల్వేవంతెన సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై శివయ్య సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద కారణాలు తెలుసుకొన్నారు. లారీని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మానవత్వం చాటి.. అంత్యక్రియలు చేసి

పర్చూరు, న్యూస్‌టుడే: మూడు నెలల క్రితం భార్య మృతిచెందింది. . అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన భర్త అక్కడే మరణించాడు.. అండగా ఉంటానుకున్న కుమారుడు మద్యానికి బానిసై ఆవైపు కన్నెత్తి చూడలేదు. దీంతో అధికారులే స్పందించి ఆ మృతదేహానికి అంత్యక్రియలు చేసి, మానవత్వాన్ని చాటారు. మండలంలోని నూతలపాడు గ్రామానికి చెందిన చీరాల శ్రీనివాసరావు(60) అన్నపూర్ణ దంపతులు. వీరికి సురేష్‌బాబు కుమారుడు ఉండగా వివాహమై భార్య దూరంగా ఉంటుంది. మూడునెలల క్రితం అన్నపూర్ణ మరణించింది. ఈక్రమంలో ఈనెల 6న శ్రీనివాసరావు అనారోగ్యానికి గురికావడంతో కుమారుడు పర్చూరు సీహెచ్‌సీలో చేర్పించగా 7వ తేదీన చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోవడంతో వైద్యశాల డాక్టర్లు పర్చూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై జీవీ చౌదరి నూతలపాడు గ్రామంలో విచారించగా సురేష్‌బాబు పూర్తిగా మద్యానికి బానిసయ్యాడని, బంధువులు చీరాల హస్తినాపురంలో ఉంటారని స్థానికులు తెలిపారు. దీంతో బంధువులకు సమాచారం ఇచ్చి సురేష్‌బాబు కోసం వెతుకులాట ప్రారంభించారు. ఆదివారం కుమారుడ్ని గుర్తించి బంధువుల ఆధ్వర్యంలో మృతదేహాన్ని అప్పగించారు. దహన సంస్కారాలకు తమ వద్ద నగదు లేవని కుటుంబ సభ్యులు తెలపడంతో పోలీసులు, పంచాయతీ అధికారులు, గ్రామస్థులు తమవంతు సాయంగా నగదు అందజేసి, మానవత్వాన్ని చాటారు. అనంతరం పర్చూరు హిందూ శ్మశాన వాటికలో పోలీసులు, పంచాయతీ అధికారుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.

శ్రీనివాసరావు మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తీసుకువెళ్తున్న బంధువులు, పోలీస్, పంచాయతీ సిబ్బంది

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

దుర్గి, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆదివారం హరిహర బాల నాగేంద్రస్వామి తిరునాళ్ల పురస్కరించుకుని సబ్‌జూనియర్ విభాగంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్ల జత నిర్ణీత సమయానికి 4200 అడుగులు బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్లజత, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జతలు రెండోస్థానం కైవసం చేసుకున్నాయి.

బండ లాగుతున్న వేటపాలెం ఎడ్ల జత

బ్రాయిలర్ ధరలు

(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, 129, 140 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 238.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

విద్యార్థి మృతదేహం లభ్యం

ఇడుపులపాడు (ఇంకొల్లు), న్యూస్‌టుడే: ఈతకు వెళ్లి గల్లంతైన విద్యార్థి సుమంత్ మృతదేహం లభ్యమైంది. ఇడుపులపాడు గ్రామానికి చెందిన బండారు సుమంత్, మరి కొందరు శనివారం మధ్యాహ్నం గ్రామ చెరువులో ఈతకు దిగారు. చెరువు లోతుగా ఉండటంతో మిగతా వారు బయటకు వచ్చేయగా సుమంత్ నీటిలో మునిగి బయటకు రాలేదు. వీఆర్వో ప్రకాశం ఫిర్యాదు మేరకు సీఐ రమణయ్య, తహసీల్దార్ శ్రీనివాస్ ప్రమాద స్థలానికి వెళ్లి, బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లను, అగ్నిమాపక సిబ్బందిని రప్పించి వెతికించారు. పడవలు, వలలతో గాలించగా అర్ధరాత్రి సమయంలో బాలుడి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మృతదేహానికి పంచనామా జరిపి పరీక్ష కోసం చీరాల ఏరియా ఆస్పత్రికి తరలించారు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: ? అల్లూరు పంచాయతీ పరిధి లక్ష్మీపురంలో గృహాల మధ్య ఖాళీ స్థలంలో చెత్త వేస్తున్నారు. **-వెంకటరావు, అల్లూరు.** ✔ స్థానికులతో మాట్లాడి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. **-పద్మావతి, కార్యదర్శి, అల్లూరు.**

వేమూరు, న్యూస్‌టుడే: ? వేమూరు ఎస్సీ కాలనీలోని 12వ వార్డులో రహదారులకు ఇరువైపులా ఉన్న కాల్వల్లో పూడిక తీయడం లేదు. మురుగు రోడ్లపైకి చేరుతుంది. **-స్థానికులు, వేమూరు.** ✔ వెంటనే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతా. **-రవి, ఎంపీడీవో**

కొల్లూరు, న్యూస్‌టుడే: ? పోతార్లంక దళితవాడలో నివాసాల సమీపంలో రహదారి పక్కన రోజులు తరబడి చెత్త పేరుకుపోతోంది. **-ప్రభు, స్థానికుడు**
✔ చెత్తను వెంటనే తొలగించి సమస్య పరిష్కరిస్తాం.
-హరిబాబు, పంచాయతీ కార్యదర్శి, పోతార్లంక

చెరుకుపల్లి న్యూస్‌టుడే: ? చెరుకుపల్లి చెన్నకేశవనగర్‌లో తరచూ వీధి దీపాలు వెలగటం లేదు. **-ఆర్.నారాయణ**
✔ సమస్య ఇటీవలే మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపి వెలగని దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. **-మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి, చెరుకుపల్లి**

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ? రేపల్లె మండలం నల్లూరు సాతోలో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **-భాగ్యారావు, స్థానికుడు.** ✔ వెంటనే వీధిదీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. **-శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, నల్లూరు సాత్**

10 వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె 25వ వార్డు శేషావతారం వీధిలో వీధిదీపాలు వెలగడం లేదు. సమస్యను ఈనెల 5న మేమున్నాం.. మీకుతోడుగా శీర్షికన ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన మున్సిపల్ ఏఈ శామ్యూల్ ఈనెల 8న కార్మికులను పంపి పదిచోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

రోడ్డుపై నీరు తొలగింపు

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: ఖాజీపాలెం ప్రధాన రహదారి నుంచి నాంచారమ్మ ఆలయానికి వచ్చే సీసీ రోడ్డుపై నీరు నిల్వటంతో ఇబ్బందిగా ఉంది. సమస్యను మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన 'ఈనాడు' అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ స్పందించి యంత్రం సాయంతో కాల్వలు తీసి నీరు నిల్వకుండా చర్యలు తీసుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

చెరుకుపల్లి గ్రామీణ: రాంభొట్లపాలెంలో వాసిరెడ్డి సుబ్బారావు వైద్యశాల వద్ద ఆదివారం ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 200మంది శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందారని వైద్యుడు వాసిరెడ్డి విష్వక్‌సేన్ తెలిపారు. వైద్యపరీక్షలు ఉచితంగా అందించామన్నారు.

ఘనంగా వనసమారాధనలు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె ఆర్టీసీ డిపో, ఉప్పూడి రోడ్డు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, బాబాజీతోటలో ఆదివారం కార్తికమాస వనసమారాధన నిర్వహించారు. వెంకటేశ్వరస్వామికి నిర్వహించిన పూజల్లో తెదేపా నేత అనగాని శివప్రసాద్ పాల్గొన్నారు. గుడి ప్రాంగణంలో జరిగిన రమాసహిత సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబాజీతోటలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వ్రతం

కూలిపోయే వరకు కళ్లకు గంతలేనా!

వంతెన దెబ్బతిని మూడేళ్లు అవుతున్నా పట్టించుకోని అధికారులు

న్యూస్‌టుడే, వేమూరు, చుండూరు

వంతెన దెబ్బతిని మూడేళ్లు కావస్తున్నా ఆర్‌అండ్‌బీ అధికారుల్లో చలనం లేదు. ప్రమాదం జరిగే వరకు పట్టించుకునేలా లేరు. వాస్తవానికి వంతెన దెబ్బతిన్న వెంటనే మరమ్మతులు చేస్తామని గత ప్రభుత్వ పాలకులు, సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. కాని వంతెన బాగు చేయకుండా వదిలేశారు. దీంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

★ భట్టిప్రోలు నుంచి బ్రాహ్మణకోడూరు వెళ్లే దారిలో చుండూరు వద్ద తుంగభద్ర ప్రధాన మురుగు కాలువపై వంతెనను పురాతన కాలంలో నిర్మించారు. వాస్తవానికి దశాబ్దం క్రితమే శిథిలావస్థకు చేరింది. అయితే అప్పుడు అధికారులు దెబ్బతిన్న చోట వంతెన శ్లాబును తొలగించి, మళ్లీ కొత్తగా వేసి వదిలేశారు. అయితే మూడేళ్ల క్రితం వంతెనపై ఇసుక లోడుతో లారీ వెళుతుండగా శ్లాబు కుంగిపోయింది. అక్కడే ఇరుక్కున్న లారీని క్రేన్ సాయంతో బయటకు తీయాల్సి వచ్చింది. అప్పట్లో హడావుడి చేసిన అధికారులు రూ. 35 లక్షలతో అదే వంతెనపై శ్లాబు వేయడానికి ప్రతిపాదనలు పంపారు. అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.

★ వంతెనపై ప్రమాదకర స్థితిలోనే రాకపోకలు కొనసాగుతున్నాయి. శిథిలావస్థకు చేరిన వంతెన

బీబీఆర్ రోడ్డులో చుండూరు వద్ద తుంగభద్ర వంతెనపై రంధ్రం

ఎప్పుడు కూలుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దెబ్బతిన్న వంతెనపై నుంచి భారీ వాహనాలు వెళ్లకుండా అధికారులు ఆదేశాలు జారీ చేసినా తప్పని పరిస్థితిలో రాకపోకలు సాగిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకుని వెంటనే వంతెనకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా వాహనాల రాకపోకలు

ప్రతిపాదనలు పంపాం

భట్టిప్రోలు-బ్రాహ్మణ కోడూరు రహదారి అభివృద్ధి, చుండూరు వద్ద తుంగభద్ర మురుగు కాలువపై వంతెన మరమ్మతుల కోసం ఇటీవల రూ.5 కోట్ల నిధులు అవసరమని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు మొదలుపెడతాం.
-అరుణ, డీఈ ఆర్‌అండ్‌బీ శాఖ

శుద్ధజల కేంద్రం ప్రారంభం

అమృతలూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యంతో సంస్థ పనిచేస్తుందని కమ్యూనిటీ పవర్ వాటర్ ఫౌండేషన్ సీఈవో లక్ష్మి అన్నారు. ఆమె ఆదివారం ఉదయం అమృతలూరు మండలంలోని తురుమెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన సామాజిక నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ, గ్రామస్థుల సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, గ్రామస్థులు ప్రతిఒక్కరూ నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు.

శుద్ధ జలం అందిస్తున్న లక్ష్మి

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

అమృతలూరు, న్యూస్‌టుడే: మహాదేవుని జన్మ నక్షత్రం ఆరుద్ర పురస్కరించుకుని ఆదివారం అమృతలూరు మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమృతలూరు శివాలయంలో స్వామికి అభిషేకం చేసి చందనంతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చందన అలంకరణలో శ్రీరామలింగేశ్వరస్వామి

కరదీపిక.. ప్రగతి సూచిక

న్యూస్‌టుడే, ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), కర్లపాలెం

కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తోంది. నూతన సంస్కరణలతో సత్ఫలితాలు తీసుకొస్తోంది. సర్కారు బడుల్లో చేపడుతున్న మార్పులు విద్యాభివృద్ధికి దోహదపడుతున్నాయి. తొలిసారిగా ఉపాధ్యాయులకు కరదీపిక (హ్యాండ్ బుక్) పేరిట పుస్తకాలు అందజేసింది. ఎన్సీఈఆర్టీ సహకారంతో సమగ్రశిక్ష ద్వారా 'సామర్థ్య ఆధారిత బోధన- ఉపాధ్యాయ వనరు పేరుతో' రూపొందించింది. బోధనలో కొత్తదనాన్ని ప్రోత్సహించేలా, మూస విధానానికి స్వస్తి పలికేలా వీటిని రూపొందించింది.

సబ్జెక్టుల వారీగా..: ఒకటి నుంచి పదో తరగతి వరకు సబ్జెక్టుల వారీగా కరదీపికలు రూపొందించారు. ఒక్కో ఉపాధ్యాయుడు వారి తరగతులు ఆధారంగా ప్రతి పీరియడ్‌లోనూ బోధన సమయం, ఉపయోగించిన టీఎంఎల్, అభ్యసన కృత్యాలు, రిమార్కులను వీటిలో పేర్కొంటున్నారు. అకడమిక్ క్యాలెండర్‌లోని పనిదినాలతో దీన్ని అనుసంధానం చేశారు. ఏ రోజు ఏయే సబ్జెక్టులు, అంశాలు ఎలా చెప్పాలో వీటిలో తేదీలతో సహా వివరించారు.

యాజలిలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

బోధన మెరుగు..

గతంలో ముందుగా పాఠ్య ప్రణాళిక వేసుకుని విద్యార్థులకు బోధించాల్సి వచ్చేది. ఇప్పుడు అందుబాటులో ఉన్న ప్రణాళికలతో ప్రభుత్వం రూపొందించిన కరదీపికలు చదువుకొని చక్కగా విద్యార్థులకు బోధించడం సులువుగా ఉంటుంది. ఉపాధ్యాయులకు ఇవి ఎంతో దోహదపడతాయి. -శివబాబు, ఎంఈవో, పీవీపాలెం

బండ్లమ్మ ఆలయాల్లో పూజలు

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు బండ్లమ్మ అమ్మవారికి కార్తికమాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణ ముత్యాల ఆభరణాలు, కాసులహారం, రజత కవచంతో అలంకరించగా ఐశ్వర్య ప్రదాయినిగా దర్శనమిచ్చారు. పిట్టలవానిపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెంలోని బండ్లమ్మ అమ్మవార్లకు పూజలు చేశారు.

ఐశ్వర్య ప్రదాయినిగా బండ్లమ్మ

అనంతభోగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

కొల్లూరు, న్యూస్‌టుడే: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీఅనంతభోగేశ్వరస్వామి వారికి ఆదివారం అర్చకులు లక్షబిల్వార్చన నిర్వహించారు. స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. బిల్వార్చన అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు.

బిల్వార్చన నిర్వహిస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో ఆరుద్రోత్సవం

గూడవల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: ఆరుద్రోత్సవం సందర్భంగా గూడవల్లి బాదవ పాలెంలోని శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

చెరుకుపల్లి, న్యూస్‌టుడే : చెరుకుపల్లి బాలాత్రిపురసుందరీ సమేత బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని విశేష పూజలు జరిగాయి. ఆదివారం ఉదయం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. శనివారం రాత్రి ఆలయకమిటీ ఛైర్మన్ అన్నపరెడ్డి సాంబశివరావు, కమిటీ సభ్యులు రాచంశెట్టి నాగాంజనేయులు, తదితరులు మహాగణపతి హోమం నిర్వహించారు.

ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని తితిదే కల్యాణ మండపంలో ప్రముఖ చిత్రకారుడు నల్లి శ్రీనివాసరావు గీసిన చిత్రాలతో ఆదివారం ప్రదర్శన ఏర్పాటు చేశారు. జానపద, గ్రామీణ సంస్కృతులను ప్రతిబింబిస్తూ గీసిన చిత్రరువులు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా జెండా ఎగరాలి

కనగాల (చెరుకుపల్లి గ్రామీణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా జెండా ఎగురవేయాలని, ఆ దిశగా నేతలు, కార్యకర్తలు ఇప్పటి నుంచే గ్రామాల్లో పర్యటించాలని ఆ పార్టీ సీనియర్ నేత రాంపల్లి జగన్నాథశాస్త్రి అన్నారు. ఆదివారం మండలంలోని కనగాలలో ఆత్మనిర్భర్ భారత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో భాజపా ప్రభుత్వం దేశాన్ని ప్రగతి చక్రాలపై పరుగులు తీయిస్తోందన్నారు. కరపత్రాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందించారు. గౌతమ్ సాయిరాం శర్మ, అంకెమ్ శివనాగేశ్వరరావు, పొన్నపల్లి సత్యనారాయణ, టి.యోగేంద్రకుమార్, శ్రీరామ చంద్రప్రభు తదితరులు పాల్గొన్నారు.

దారి ఇలా.. ధాన్యం చేరేదెలా!

పిట్టలవాని పాలెం, న్యూస్‌టుడే: మండలంలోని కోమలి, సంగుపాలెం, భవనంవారిపాలెం రైతులు సుమారు 300 ఎకరాల్లో ధాన్యం తీసుకెళ్లే కోమలి పంచాయతీ పరిధిలోని తూర్పు డొంక ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా మారింది. పదేళ్ల నుంచి ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో రైతులు పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పొలాల్లో ధాన్యంతో పాటు రబీలో అపరాల పంట ఉత్పత్తులు ఈ మార్గంలోనే తరలించాల్సి ఉంది.

వంతెనకు మరమ్మతులు కరవు

విరిగిపోయిన రక్షణ గోడ

జిల్లెళ్లమూడి(బాపట్లటౌన్) న్యూస్‌టుడే: మండల పరిధిలోని జిల్లెళ్లమూడి నల్లమడవాగు పంటకాలువ వంతెన రక్షణ గోడ ప్రమాదకరంగా ఉంది. గతంలో వాహనాలు ఢీకొట్టడంతో రక్షణ గోడ విరిగిపోయింది. అధికారులు స్పందించి వంతెనకు రక్షణ గోడను నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

అధ్వానంగా బస్‌షెల్టర్

జమ్ములపాలెం (బాపట్ల టౌన్) న్యూస్‌టుడే: మండల పరిధిలోని జమ్ములపాలెం పంచాయతీ చెరువు ఉప్పరపాలెంలో రోడ్డు వెంబడి ఉన్న బస్‌షెల్టర్ అధ్వానంగా ఉంది. మందుబాబులకు అడ్డాగా మారింది. వర్షాకాలంలో ప్రాంగణంలో నీళ్లు నిలుస్తున్నాయి. పిచ్చిచెట్లు అల్లుకుపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్‌షెల్టర్‌కు మరమ్మతులు నిర్వహించి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎన్నాళ్లకు పూర్తి చేస్తారో!

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం రెండేళ్లుగా అసంపూర్తిగా నిలిచింది. 2022 సెప్టెంబరులో ఎంపీ నిధులు రూ.కోటితో గత ప్రభుత్వ నేతలు పనులకు శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరులో జాప్యం జరగడంతో 2023లో గుత్తేదారుడు పనులు ప్రారంభించి పైకప్పు వేయించి వదిలేశాడు. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. స్టేడియం అందుబాటులోకి వస్తే రేపల్లె, చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం మండలాల్లోని క్రీడాకారులకు ఉపయుక్తంగా ఉంటుంది.

రేపల్లెలో అసంపూర్తిగా నిలిచిన ఇండోర్ స్టేడియం

చట్టాలపై అవగాహన అవసరం

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని న్యాయవాది డి.కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని వెనకబడిన వర్గాల వసతి గృహంలో ఆదివారం జాతీయ లీగల్ సర్వీస్ డే సందర్భంగా విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ సర్వీస్ అథారిటీ సంస్థ ద్వారా బలహీన వర్గాలు, దివ్యాంగులు, మహిళలకు ఉచితంగా న్యాయం అందుతుందన్నారు. న్యాయవాది భీమా లీలా కృష్ణ పాల్గొన్నారు.

పరిమిత వేగంతో వాహనాలు నడపండి

బాపట్ల, న్యూస్‌టుడే : పరిమిత వేగంతో వాహనాలు నడపాలని పట్టణ సీఐ రాంబాబు అన్నారు. గడియార స్తంభం కూడలిలో ద్విచక్ర వాహనదారులకు ఆదివారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ ధరించి తమప్రాణాలు కాపాడుకోవాలన్నారు. పలువురికి జరిమాన విధించారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాంబాబు

శిరస్త్రాణం తప్పనిసరి

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనచోదకులు విధిగా శిరస్త్రాణం ధరించాలని చందోలు ఎస్సై శివకుమార్ చెప్పారు. జాతీయ రహదారిపై రెడ్డిపాలెం కూడలిలో ఆదివారం వాహనచోదకులతో ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా రాకపోకలు సాగిస్తున్న వారిని ఆపి అవగాహన కల్పించారు. ఏఎస్సై రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్సై శివయ్య అన్నారు. భట్టిప్రోలులో శిరస్త్రాణధారణపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి రోజూ వాహనాలు తనిఖీ చేస్తుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుం విధిస్తామన్నారు. వేగంగా ప్రయాణించవద్దని, మైనర్లకు వాహనాలు ఇస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రధాన కూడలిలో పోలీసులు శిరస్త్రాణం ధరించి ప్రదర్శన నిర్వహించారు.

నైపుణ్య పోటీల్లో ఉల్లిపాలెం విద్యార్థుల ప్రతిభ

నగరం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం బాపట్లలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి నైపుణ్య పోటీల్లో ఉల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారని ప్రధానోపాధ్యాయరాలు రాజేశ్వరి తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నాగచైతన్య, కార్తిక్, లోకేష్, నిషాలు తయారు చేసిన నమూనా ప్రాజెక్ట్‌కు ద్వితీయ బహుమతి లభించిందన్నారు.

బహుమతులు అందుకున్న వారితో ఉపాధ్యాయులు

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్మించాలని డిమాండ్

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్మించాలని ఏపీ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో ఆదివారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ మెడికల్ మాఫియాకు కట్టబెట్టాలనే కుట్రను అడ్డుకోవాలని చెప్పారు. విద్య, వైద్య రంగాలు సేవా రంగాలుగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలన్నారు. వివిధ పార్టీల నాయకులు ఆలా వెంకటేశ్వర్లు, రమాదేవి, పి. లక్ష్మణరెడ్డి, జి.అంజిబాబు, పి.రాజేంద్రబాబు, సింగరకొండ, గంగయ్య, విద్యాసాగర్, మేద శ్రీనివాసరావు, వసుంధర, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మస్తాన్‌వలి

LOSS OF PASSPORT
I, GOLLAMUDI VAZRAMMA W/o SINGIPOGU RAMESH BABU, R/o. Modukuru Village, Tsundur Mandal, Bapatla District. A.P. I lost my Passport No.F9918600 while travelling from Modukuru to Tsundur to take Xerox Copies Premises on Date:- 05-11-2025. If anybody found please Cont:9959342466.

అవగాహనతో మెలిగి.. విజేతలుగా నిలిచి

రాజ్యాంగంపై పోటీల్లో కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

న్యూస్‌టుడే, కావూరు (చెరుకుపల్లి గ్రామీణ)

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు కళాశాల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని రాజ్యాంగంపై పోటీలు నిర్వహించింది. విజేతలకు బహుమతులు అందించింది. జిల్లాస్థాయిలో వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం పోటీల్లో కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం

స్నేహితులతో చర్చించేదాన్ని..

కళాశాలలో పోటీలపై అధ్యాపకులు ముందుగానే తర్ఫీదు ఇచ్చారు. నిత్యం రాజ్యాంగంపై స్నేహితులతో చర్చించేదాన్ని. వారు అడిగే ప్రశ్నలకు జవాబు వెంటనే చెప్పేదాన్ని. క్విజ్, వక్తృత్వం పోటీల్లో బహుమతి సాధించా. ఈ పోటీల కోసం రాజ్యాంగ పీఠికలో కొన్ని అంశాలు చదివా. చట్టాలపై అవగాహన పొందాను. రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తే తప్పకుండా విజయం సాధిస్తా.
-పి.దివ్య, ద్వితీయ ఏడాది బైపీసీ విద్యార్థిని

ప్రథమ స్థానం రావడం సంతోషంగా ఉంది

రాజ్యాంగంపై వ్యాసరచనలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది. 8వ తరగతిలోనూ ఇదే అంశంపై పాఠశాల స్థాయిలో విజేతగా నిలిచా. ప్రతిఒక్కరూ రాజ్యాంగం గురించి తెలుసుకోవాలి. అప్పుడే పౌరులుగా మనం ఏది చేయాలి..ఏది చేయకూడదనే విషయాలు తెలుస్తాయి. ఇప్పటికీ రాజ్యాంగం గురించి చదువుతా. ఖాళీ సమయంలో కళాశాలలోని గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతా.
-పి.ప్రసన్న, జూనియర్ ఎంపీసీ విద్యార్థిని

అంబేడ్కర్ స్ఫూర్తితో

పోటీల కోసం రాజ్యాంగ పీఠికను చదవడం మొదలుపెట్టా. అంబేడ్కర్ గురించి తెలుసుకుని ఆయన స్ఫూర్తితో విద్య, పోటీ పరీక్షలు ఇతర అంశాల్లో విజయం సాధించాలనే ధ్యేయంగా ముందుకెళుతున్నా. వ్యాసరచనలో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచా. జిల్లా అధికారులు అభినందించడం సంతోషంగా ఉంది. గ్రంథాలయ అధ్యాపకుడు, ఇతర అధ్యాపకుల కృషితో కొత్త విషయాలు తెలుసుకుంటున్నా.
-ఎం.శశాంక్, వృత్తివిద్య కోర్సు విద్యార్థి

కొడాలి శత జయంత్యుత్సవం

వెదుళ్లపల్లి (బాపట్ల టౌన్) న్యూస్‌టుడే: కొడాలి గోపాలరావు రచనలు, నాటకాలు నేటి తరానికి అవసరమని వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని వెదుళ్లపల్లి వివేకా సర్వీస్ సొసైటీలో కొడాలి శతజయంత్యుత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాహిత్య రంగంలో కొడాలి చేసిన సేవలు అందరికీ తెలియజేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఆయన రచనలు సరళంగా, అర్థవంతంగానూ ఉంటాయన్నారు. కె.హరినాథరెడ్డి, చంద్రశేఖర్‌రాజా, జి.శ్రీనివాసరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మురళీకృష్ణ

45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఆరుంబాక శాఖ
చెరుకుపల్లి ప్రాంత రైతులకు, వ్యాపార, వాణిజ్య సంస్థలకు, ఖాతాదారులకు విశిష్ట సేవలు అందిస్తున్న
'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆరుంబాక' శాఖ 45 సం॥లు పూర్తిచేసుకుని 46వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా బ్రాంచి మేనేజర్ దాసరి నాగార్జున గారికి మరియు బ్యాంకు సిబ్బందికి మా హార్దిక శుభాకాంక్షలు
ప్రొ॥ దాసరి శ్రీనివాసచౌదరి (పండుబాబు)
శ్రీ దుర్గ స్టీల్స్, గుళ్ళపల్లి, సెల్: 99488 99498
శ్రీ శ్రీకృష్ణ మార్బుల్స్, గ్రానైట్స్ & టైల్స్
బాపట్ల రోడ్, చెరుకుపల్లి. M.V.S.N.రాజు 99590 70334
శ్రీ విజయసాయి గణేష్ మెడికల్స్ (చిన్ని)
గుళ్ళపల్లి, 98499 61976, 247012
శ్రీ లక్ష్మి మురళీమోహన్ రైస్ & ఫ్లోర్‌మిల్, చెరుకుపల్లి
గ్రంధి వెంకటసుబ్బారావు, 94908 97849
శ్రీ వెంకట రమణ టింబర్ డిపో & సామిల్
ప్రొ॥ పడితపు వెంకటరమణ, తెనాలిరోడ్, చెరుకుపల్లి. 93936 63369, 80192 26204
శ్రీ సాయిదుర్గ జ్యూయలర్స్
తెనాలి రోడ్, చెరుకుపల్లి. ప్రొ॥ జి.సుధీర్‌కుమార్, 94402 48596

(c) eenadu

చీరాల
• చీరాల • అద్దంకి • పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

వేటపాలెం,న్యూస్‌టుడే: ✤ ఓరుగంటిరెడ్డి వీధి నుంచి మార్కెట్ వరకు ఉన్న మురుగు కాలువలో చెత్త పేరుకుపోయింది. దీనివల్ల పారుదల లోపించి దుర్వాసన వస్తోంది.
- శ్రీనివాసరావు, స్థానికుడు,
✤ వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపి బాగుచేయిస్తా.
- బాలిగ సురేంద్ర, పంచాయతీ కార్యదర్శి, వేటపాలెం

నేడు కార్తిక సమారాధన

కారంచేడు, న్యూస్‌టుడే: గ్రామంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో సోమవారం కార్తిక సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు అమరా ఆంజనేయులు ఆదివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్యదర్శి మువ్వల కాశీ విశ్వనాథం కోరారు.

సత్యనారాయణస్వామి వ్రత పూజలు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం శ్రీగంగా పార్వతీ సమేత చిదంబరేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తికమాస సత్యనారాయణస్వామి వ్రత పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు.

అర్జీలు త్వరితగతిన పరిష్కరించండి

ఇంకొల్లులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఇంకొల్లు, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని త్వరితగతిన పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశించారు. ఏ సమస్యను పెండింగ్‌లో ఉంచకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం మార్టూరు, ఇంకొల్లు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలు, అభ్యర్థనలను స్వయంగా స్వీకరించారు. వెంటనే ఉన్నతాధికారులకు పంపి చర్యలు తీసుకునేలా చూడాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకటరావు, పారిశ్రామికవేత్త విక్రం నారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

సీనియర్ సివిల్ జడ్జి సుధకు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ న్యాయసేవా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. చీరాల కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ ఎం.సుధ ముఖ్య అతిథిగా హాజరై పోక్సో, బాల కార్మిక నిర్మూలన, బాల్య వివాహాల నియంత్రణ, గృహ హింస తదితర చట్టాలపై వివరించారు. విద్యాలయం ఎస్‌వో ఎం.సుమాంజలి, శిక్షణ ఎస్సై అనూష, చీరాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎ.రామకృష్ణారెడ్డి, సయ్యద్ మతీన్, ఎంవీ రామారావు, సాయికృష్ణ పాల్గొన్నారు.

కుక్క.. పిల్లి.. కోతి.. కాటు ఏదైనా ప్రమాదమే

రోడ్డుపై వీధి కుక్కలు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి నియోజకవర్గంలో వివిధ రకాల జంతువుల కాట్లు పెరిగాయి. పెంపుడు జంతువులైన కుక్క, పిల్లితో పాటు ఎలుక, కోతులు ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. ఎలాంటి జంతువు కరిచినా నిర్ణీత గడువు లోపు వైద్యం చేయించుకోవాలి. లేకుంటే ఆయా జీవుల లక్షణాలతో ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంది.

ఇళ్లలో పెంపుడు జంతువులుగా కుక్క, పిల్లి ఉంటాయి. వీటికి సంతానం కలిగినపుడు వాటి బిడ్డల జోలికి ఎవరైనా వస్తే విపరీతమైన ఆగ్రహం ప్రదర్శిస్తాయి. తమ బిడ్డలకు హాని తలపెడతారేమోననే భ్రమలో దాడులకు వెనుకంజ వేయవు. ఒక్కోసారి పెంపుడు జంతువుల కాలి, చేతి గోర్లతో గీకిన కారణంగా గాయాలు అవుతుంటాయి. కుక్క, పిల్లి, ఎలుక, కోతి కాటుకు గురైనవారు వెంటనే గాయాన్ని సబ్బు నీళ్లతో కడిగాలి. ప్రభుత్వ వైద్యశాలకు వెళితే 'యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్' అందిస్తారు. ఈ మందును తొలిరోజు, మూడు, ఏడు, 14, 28 రోజుల్లో డోసు మాదిరిగా వేసుకోవాలి. మనల్ని కరిచిన జంతువును కనీసం 20 రోజులపాటు గమనిస్తుండాలి. మంచిదా, పిచ్చిదా అనే విషయాలు గమనిస్తూ సమాచారాన్ని వైద్యులకు తెలియజేయాలి. తదనుగుణంగా వైద్యం అందిస్తారు.

పట్టుకుని తరలిస్తున్నా.. తరగని కుక్కలు

పురపాలక సంఘంలోని వీధి కుక్కల్ని పట్టుకునేందుకు నిపుణులను నియమించారు. వీరికి ఒక్కో కుక్కకు రూ.600 పైగానే ఇస్తున్నారు. పైపెచ్చు అన్ని పురపాలక సంఘాల్లో ఈ ఏజెన్సీ శునకాల్ని పట్టుకుంటుంది. ఇలా పట్టుకున్న వాటిని ఎక్కడ వదులుతున్నారు అనేది పరిశీలించాలి.

నిర్లక్ష్యంతో జీవితమే కోల్పోతారు

కుక్క, ఎలుక, పిల్లి, కోతి కాటును నిర్లక్ష్యం చేయరాదు. ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా వీటి కాట్లకు టీకాలు వేస్తారు. పాము కాటుకు ఇస్తారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.
- డాక్టర్ కె.వాహెలా చౌదరి, పర్యవేక్షకురాలు, సీహెచ్‌సీ, అద్దంకి

జనవరి నుంచి ఇప్పటి వరకు బాధితుల వివరాలు

నెల	కుక్కకాటు	పిల్లి	ఎలుక	కోతి
జనవరి	107	02	04	10
ఫిబ్రవరి	122	03	06	11
మార్చి	125	05	04	03
ఏప్రిల్	112	04	04	07
మే	105	04	07	08
జూన్	108	04	04	05
జులై	81	06	11	08
ఆగస్టు	102	08	12	08
సెప్టెంబరు	93	10	15	15
అక్టోబరు	119	19	18	01
మొత్తం	1084	65	85	76

ఏలూరి ట్రస్ట్ సేవలకు ప్రశంస

మార్టూరు, న్యూస్‌టుడే: పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రిలో శనివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ స్వామీజీ కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా స్వామీజీ, ఎమ్మెల్యే ఏలూరికి ఆశీస్సులు అందించారు. శంకర కంటి వైద్యశాల సౌజన్యంతో ఏలూరి ఛారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రిగ్రూప్, గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ సహకారంతో నెల నెలా నిర్వహిస్తున్న కంటి వైద్యశిబిరాల కార్యక్రమాలను ఎమ్మెల్యే ఏలూరి, స్వామీజీకి వివరించారు. లక్ష మందికి కంటి చూపు అందించటమే ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు.
✤ కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ స్వామీజీని ఆదివారం రాత్రి మార్టూరులో భక్తులు ఘనంగా స్వాగతించారు. జాతీయ రహదారిపై డేగరమూడి నుంచి మార్టూరు ఎస్‌బీఐ వరకు భక్తిప్రపత్తులతో ప్రదర్శనగా తోడ్కొని వచ్చారు. అనంతరం స్వామి ప్రవచనాలు చేసి, ఆశీస్సులు అందించారు. మార్టూరు ప్రజలు ఎస్‌బీఐ వద్ద స్వామీజీని చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి

చినగంజాం, న్యూస్‌టుడే: పర్చూరు నియోజకవర్గం మాజీ సైనికుల సంఘం నూతన అధ్యక్షుడిగా గొల్లమూరి విఠల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక ఆదివారం చినగంజాంలో జరిగింది. కార్యదర్శిగా వేణుబాబు (ఇంకొల్లు) ఎన్నికయ్యారు. చినగంజాం మండల సంఘం అధ్యక్షుడిగా యెహూశవ, ఉపాధ్యక్షుడిగా బి.స్వామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.కొండలరెడ్డి ఎన్నికయ్యారని విఠల్‌రెడ్డి తెలిపారు.

విఠల్‌రెడ్డి, సభ్యులు

సుబ్బారావుకు నివాళి

వేటపాలెం: ఆంధ్రాతాన్‌సేన్ బిరుదాంకితులు, సత్యహరిశ్చంద్ర పాత్రధారి డి.వి.సుబ్బారావు వర్ధంతిని రామన్నపేట కొత్త ఇళ్ల వద్ద ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

ఎన్నికల హామీలు నిలుపుకోవాలి

రామ్‌నగర్(అద్దంకి), న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. రామ్‌నగర్ లో ఆదివారం ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామన్న హామీ నిలబెట్టుకోవాలన్నారు. నేతలు ముస్తఫా, కె.ఎల్.డి.ప్రసాద్, పిచ్చయ్య, గురవయ్య, శ్రీనివాసు, నిమ్మల అప్పారావు, రమణయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి శింగరకొండపాలేనికి చెందిన ఎర్రిబోయిన బాబూరావు, ఎస్‌బీఐ ఉద్యోగి కె.వెంకటసుబ్బారెడ్డిలు చెరి రూ.10,116 విరాళం అందించారు. నగదును పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకర్‌కు అందించగా తగు రసీదు అందించారు. తెదేపా నేతలు రంగిశెట్టి సాంబశివరావు(లహరి), మన్నం త్రిమూర్తులు, అంకం నాగరాజు పాల్గొన్నారు.

వాన నీటిలో 'చెత్త సంపద' కేంద్రం

వేటపాలెం, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో చేరిన వర్షపు నీరు నేటికి చాలా చోట్ల అలాగే ఉంది. కుందేరులో నిర్మించిన చల్లారెడ్డిపాలెం చెత్త సంపద కేంద్రం చుట్టూ ఆనాడు చేరిన వాన నీరు ప్రస్తుతం నిలిచి ఉంది. ఫలితంగా సంపద తయారీకి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి ఆ నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలి.

పర్చూరు వాగులో వ్యర్థాలు

పర్చూరు, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో ఎగువ నుంచి వరద నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో పర్చూరు వాగులో చెత్తాచెదారం తిష్ఠవేశాయి. పర్చూరు నుంచి కారంచేడు మండల శివారులోని కప్పలవాగు వరకు వాగులోని ముళ్లచెట్లకు ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్దఎత్తున అల్లుకున్నాయి. అంతేగాక వాగుకు ఒకవైపు ఎప్పటి నుంచో ఆటంకంగా ఉన్న ముళ్లచెట్లు వరద నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. దీంతో వీటి అడ్డంకి తొలగగా మరోవైపు చెత్తాచెదారం నెలకొనడంతో ప్రజలు ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు.

శివపార్వతుల లీలా కల్యాణం

కల్యాణ క్రతువును దంపతులచే నిర్వహింపజేస్తున్న అర్చకులు

రామన్నపేట(వేటపాలెం), న్యూస్‌టుడే: శ్రీరామలింగేశ్వరస్వామి(చౌడేశ్వరి) ఆలయాన్ని దాతల సాయంతో ఆధునికీకరించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా రెండు రోజుల క్రితం ముఖ మండపం, కల్యాణ వేదికను దాతలు ప్రారంభించారు. ఆదివారం గుడిలో స్వామివారి లీలా కల్యాణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం

చెక్కు అందజేస్తున్న నాగేశ్వరరావు, ఇతర సభ్యులు

కారంచేడు, న్యూస్‌టుడే: అమెరికాలో విద్యాభ్యాసం నిమిత్తం వెళ్లి అకాలమరణం చెందిన యార్లగడ్డ రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులను ఆదివారం గ్రామానికి చెందిన సిద్ధార్థ వృద్ధ శరణాలయం సభ్యులు పరామర్శించారు. తండ్రి రామకృష్ణకు తమవంతు సాయంగా రూ.50 వేల నగదు చెక్కును అందజేశారు. శరణాలయం అధ్యక్షుడు దగ్గుబాటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కార్యదర్శి చాగంటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి సన్నిధిలో దగ్గుబాటి పూజలు

కారంచేడు, న్యూస్‌టుడే: గ్రామంలోని శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామిని మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆదివారం సందర్శించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. పూజలు చేశారు. యార్లగడ్డ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో దగ్గుబాటి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం పరిధిలోని మహాలక్ష్మి ఎస్టీ కాలనీకి చెందిన కత్తుల రత్తమ్మ (57) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. ఉప ఎంపీపీ తుమ్మలపెంట ప్రసన్నలక్ష్మి, తోటవారి ధర్మసత్రం మాజీ ఛైర్మన్ తుమ్మలపెంట శ్రీనివాసరావులు ఆదివారం వారి కుటుంబ సభ్యులకు రూ.5వేల నగదును అందజేశారు.

ఘనంగా మంత్రి గొట్టిపాటి పుట్టినరోజు వేడుక

అద్దంకి, సంతమాగులూరు, మేదరమెట్ల, బల్లికురవ, జె.పంగులూరు, న్యూస్‌టుడే: న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పుట్టినరోజు వేడుకల్ని అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. అభిమానులు ప్రత్యేకంగా తయారు చేయించిన కేకును వ్యవసాయ మిషన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సభ్యులు నాగినేని రామకృష్ణ, చిన్ని శ్రీనివాసరావు నేతృత్వంలో కోసి అందరికీ పంచారు. పార్టీ నేతలు మానం మురళీమోహన్‌దాస్, గోగులమూడి రాజశేఖర్, అరిగల నాగరాజు, చెన్నుపాటి వీరాంజనేయులు, కరి పరమేష్, గార్లపాటి శ్రీనివాసరావు, అట్లా పెదవెంకటరెడ్డి, సన్నెబోయిన ఏడుకొండలు, గమిడి కోటేశ్వరరావు, వాసురెడ్డి, కామాను శ్రీనివాసరావు, బెల్లంకొండ ఏడుకొండలు, మక్కెన జగదీష్, కాశీవిశ్వనాథం, పెరుమాళ్ల వీరయ్య, పసుపులేటి కోటేశ్వరరావు, దూపాటి ఏసోబు పాల్గొన్నారు ✤ కొరిశపాడు మండలంలో జరిగిన వేడుకల్లో నేతలు సింబోతు సత్యనారాయణ, మేదరమెట్ల శ్రీనివాసరావు, చెన్నుపాటి హరిబాబు, జాగర్లమూడి జయకృష్ణ, కొట్టె రవీంద్ర, కోటేశ్వరరావు, కరిచేటి రాంబాబు, శేషయ్య, రాజేష్, బ్రహ్మయ్య, భవన్నారాయణ పాల్గొన్నారు. ✤ బల్లికురవ మండలం గుంటుపల్లి సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు. నేతలు మల్లినీడి గోవిందరావు, ధూళిపాళ్ల హనుమంతరావు, అశోక్‌బాబు, దేవినేని నరేంద్ర, మందలపు సుధాకర్, దర్శి రామస్వామి, కోయి పేరయ్య, గొట్టిపాటి లక్ష్మయ్య పాల్గొన్నారు. ✤ జె.పంగులూరు మండలం ముప్పవరం బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పండ్లను పంపిణీ చేశారు. నేతలు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, బాలిన రామసుబ్బారావు, గుర్రం ఆదిశేఖర్, బత్తుల బ్రహ్మానందం, రావుల శింగరకొండ, బత్తుల వెంకట్రావు, గొల్లపూడి ఆంజనేయులు, జాగర్లమూడి శ్రీనివాసరావు, కాజా స్వామి, వలపర్ల సుబ్బారావు, యోహోన్, జక్రయ్య, కాటా అంజయ్య, నార్నె సుబ్బారావు, ధూళిపాళ్ల వీరనారాయణ, నాగిరెడ్డి, బాచిన సురేష్, గడ్డం నాగేశ్వరరావు పాల్గొన్నారు. చందలూరులో కర్రి వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో జరగ్గా పెండ్యాల కృష్ణారావు, ఎర్రమనేని శేషారావు, రావూరి సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కేకు తినిపించుకుంటున్న కూటమి నేతలు

ఏల్చూరులోని మంత్రి అతిథి గృహంలో..

శ్రీనివాసరావు, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, కాకాని అశోక్, చుండూరి మురళీ సుధాకరరావు, గుంజి శ్రీనివాస్, సందిరెడ్డి రమేష్, చాగంటి రాజేంద్రప్రసాద్, పెంట్యాల రామాంజనేయులు, కుందారపు రామారావు, రంగిశెట్టి సాంబశివరావు, చింతా వెంకటేశ్వరరెడ్డి, కోనేటి అనిల్, దామా సురేంద్ర, బండారుపల్లి శ్రీనివాసరావు, యర్రాకుల రామాంజనేయులు, చిన్ని హనుమ పాల్గొన్నారు. సంతమాగులూరు మండలం ఏల్చూరు అతిథి గృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కోసి పంచారు. నేతలు తేలప్రోలు రమేష్, ఆలూరి

వడ్లమూడి కోటయ్య చౌదరి ఛారిటబుల్ ట్రస్ట్ దాతృత్వం

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ట్రస్ట్ ప్రతినిధులు, అతిథులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వడ్లమూడి కోటయ్య చౌదరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 122 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.22.12 లక్షల విలువైన ఉపకార వేతనాలు అందించారు. తెనాలిలోని ఎన్జీవో కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ వడ్లమూడి గోవర్ధనరావు మాట్లాడారు. 'దివంగత వడ్లమూడి కోటయ్య చౌదరి ఈ ట్రస్ట్‌ను నెలకొల్పి ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమానికి పునాది వేశారు. గత 29 సంవత్సరాలుగా ఈ ట్రస్ట్ సేవలు అందిస్తుంది. ఇప్పటి వరకు 485 మంది విద్యార్థులకు రూ.2.07 కోట్లను అందించాం' అని పేర్కొన్నారు. గౌరవ అతిథులుగా హాజరైన విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఆచార్యులు ఘంటా సుధావాణి మాట్లాడుతూ.. 'విద్యార్థి దశను సద్వినియోగం చేసుకున్న వారు జీవితాల్లో ఉన్నత లక్ష్యాలను సాధిస్తారు. ఉత్తమ పౌరులుగా అటు దేశానికి ఇటు తమ కుటుంబాలకు, సమాజానికి సేవలు అందించగలుగుతారు. ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుని తర్వాతి తరంలోని విద్యార్థులకు చేయూతనిచ్చే స్థాయికి చేరాలి' అని ఆకాంక్షించారు. ట్రస్ట్ సభ్యులు వడ్లమూడి బసవప్రసాద్, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, కుటుంబ సభ్యులు, ట్రస్ట్ శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

దీక్షాపరులకు అన్నదానం

అద్దంకి, జె.పంగులూరు, బల్లికురవ, సంతమాగులూరు, న్యూస్‌టుడే: నాగులపాడు తెలుగు యువత ఆధ్వర్యంలో వేయి స్తంభాల గుడిలో దీక్షాపరులకు ఆదివారం అన్నసంతర్పణ చేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఇది చేపట్టినట్లు తెదేపా నేత పెంట్యాల రామాంజనేయులు తెలిపారు. అయ్యప్ప, భవానీ, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, శివమాల దీక్షలు చేపట్టిన సుమారు 800 మందికి అన్నదానం చేశారు.

✤ జె.పంగులూరు మండలం ముప్పవరం పోలేరమ్మ తల్లి ఆలయంలో దీక్షాపరులకు అన్నదానం నిర్వహించారు. తెదేపా అద్దంకి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు గరిమిడి జగన్మోహనరావు ఆధ్వర్యంలో ఇది చేశారు.
✤ బల్లికురవ మండలం వైదనలో నేతలు పోగుల చంద్రశేఖర్, పోగుల కృష్ణ ఆధ్వర్యంలో దీక్షాపరులకు అన్నదానం అందజేశారు. సంతమాగులూరు మండలం కొమ్మాలపాడులో 150 మందికి పైగా భవానీ భక్తులకు తెదేపా మైనారిటీ సెల్ ప్రతినిధులు మసూద్, చెన్నుపల్లి నాగూర్, మన్నెపల్లి ఖాదర్‌మస్తాన్, మిన్నెకల్లు బాషా, పఠాన్ ఇసా, సయ్యద్ కాశింలు అన్నదానం నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్ హాజరయ్యారు.

నూతన కౌన్సిల్ నియామకం

మార్టూరులో ప్రతిజ్ఞ చేస్తున్న సభ్యులు

మార్టూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం మార్టూరులో నిర్వహించారు. దీనిలో నూతన కమిటీని ఎన్నుకోగా ఎన్నికల అధికారిగా కె.శ్రీనివాసరావు, పరిశీలకులుగా చెంచు రామారావు వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా షేక్ జాన్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా మువ్వల సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు.


అధ్యక్షుడు జాన్‌బాషా

ప్రధాన కార్యదర్శి మువ్వల సుబ్రహ్మణ్యం

బల్లికురవ, న్యూస్‌టుడే: యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రామ్‌నాయక్ ఎన్నికయ్యారు. బల్లికురవ విద్యా వనరుల భవనంలో ఆదివారం యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనిలో అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌ను ఎన్నుకున్నారు. తొమ్మిది మందిని జిల్లా, 17 మందిని మండల కౌన్సిలర్లుగా ఎన్నుకున్నారు. రామాంజనేయులు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, అచ్యుత్ మోహన్ పర్యవేక్షించారు. ఉపాధ్యాయుల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

బాల్య వివాహాలతో నష్టం

అద్దంకి, న్యూస్‌టుడే: బాల్యవివాహాలతో సర్వత్రా నష్టం వాటిల్లుతుందని న్యాయవాది మహమ్మద్ రఫీ అన్నారు. జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల న్యాయసేవా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బీసీ బాలికల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఉచిత న్యాయ సహాయం అందిస్తున్న న్యాయవాదులు టి.ఎం.శ్రీను, కె.సుమలత పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1984-85 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా నాలుగు దశాబ్దాల తరువాత ఒకచోట చేరి, క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. పాఠశాలలో జరిగిన పాత సంఘటనలు గుర్తుచేసుకున్నారు. 32 మంది పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు.

వ్యాయామం, ఆహార నియమాలు పాటించాలి

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు రమేష్‌బాబు, సాంబయ్య

2గంగవరం (ఇంకొల్లు), న్యూస్‌టుడే: నిత్యం వ్యాయామం, ఆహార నియమాలతో వ్యాధులు దరిచేరవని మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ ఎం.రమేష్‌బాబు పేర్కొన్నారు. గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం గంగవరం మంచాల రంగమ్మ వెంకట్రామయ్య కల్యాణ మండపంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దీనిలో 250 మందికి పరీక్షలు నిర్వహించి, రెండు నెలలకు సరిపడా మందులు అందజేశారు. శిబిరం నిర్వహణకు బోడెంపూడి సురేంద్ర కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. డాక్టర్ సాంబయ్య, రైతు సంఘం, సీపీఎం నాయకులు రామకోటేశ్వరరావు, వెంకట్రావు, స్థానిక ప్రముఖులు బాలచంద్ర, సౌజన్య, రాంబాబు, సుబ్బయ్య, సాంబయ్య తదితరులు సహకారం అందించారు.

పండ్లు పంపిణీ

మార్టూరు: రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక వెంకయ్య ఆశ్రమంలోని వృద్ధులకు ఆదివారం అన్నదానం చేశారు. మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులకు సత్కారం

కొత్తపాలెం (చినగంజాం), న్యూస్‌టుడే: కొత్తపాలెం శివాలయంలో కార్తిక వనభోజనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చినగంజాం, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, మూలగానివారిపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 15 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. సుమారు నాలుగు వేల మందికి అన్నదానం చేసినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

వేటపాలెం, న్యూస్‌టుడే: చీరాల-వేటపాలెం బైపాస్ రోడ్డులో అక్కాయిపాలెం వద్ద శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒంగోలు నుంచి వెళుతున్న లారీ ఒకటి ముందు వెళుతున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో వెనుక లారీ క్యాబిన్‌లో డ్రైవరు ఇరుక్కుపోయాడు. ముందు వెళుతున్న వాహనం సడన్‌గా బ్రేకు వేయడంతో ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్సై జనార్దన్ అతి కష్టం మీద క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవరు మురళీని బయటకు తీసి, ఏరియా వైద్యశాలలో చికిత్సకు తరలించారు.

సామూహిక రుద్రాభిషేకాలు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గోలి సదాశివరావు కల్యాణ మండపంలో కార్తిక మాస సామూహిక రుద్రాభిషేకాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం కార్తిక సమారాధన చేశారు.

గోడపత్రికల ఆవిష్కరణ

పర్చూరు, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న చేపట్టబోయే ప్రజా ఉద్యమం గోడపత్రికలను ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి ఆవిష్కరించారు.

రేపు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

చిత్తూరు నగరం: కార్తిక మాసం శివకేశవులిద్దరికీ ప్రీతికరమైంది. ఈ మాసంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యత ఉంది. ఇంతటి పవిత్రమైన నెలలో దీపారాధన చేస్తే తెలియక చేసిన పాపాలు కూడా నశిస్తాయని శాస్త్ర వచనం. అపార పుణ్య సముపార్జనకు ఇదో మార్గమని భక్తుల విశ్వాసం. జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఈనెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్ ఆధ్యాత్మిక ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం జరగనుంది. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆతిథ్యంలో జరుగనున్న ఈ కార్యక్రమంలో మహిళలకు మాత్రమే దీపారాధన అవకాశం ఉంది. ప్రవేశం, పూజా సామగ్రి ఉచితం.

వేద పఠనం: కాణిపాక ఆలయ వేద పండితులు

వైదిక నిర్వహణ: బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణికుమార్‌శర్మ బృందం

ప్రవచనకర్త: శ్రీ ఉప్పల దడియం భరత్ శర్మ

అష్టోత్తరం: వినాయక అష్టోత్తరం

సమయం: మంగళవారం సాయంత్రం 5గంటలకు

స్థలం: పాత న్యూట్రిన్ కర్మాగారం ప్రాంగణం

ప్రత్యక్ష ప్రసారం సాయంత్రం 6-8

నేడు పాసుల పంపిణీ : సోమవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు న్యూట్రిన్ కర్మాగారం పరిమిత సంఖ్యలో ఎంట్రీ పాసులు పంపిణీ చేయబడును.

ఈటీవీ ఆంధ్ర ప్రదేశ్ | ఈటీవీ తెలంగాణ | ఈటీవీ Life

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల్లో, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు మూడుగంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 80,560 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.22 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

12వేల టోకెన్ల జారీ : శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు ఆదివారం 12 వేల సర్వదర్శన టోకెన్లు జారీచేశారు. వీరికి సోమవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు మార్గంలోని భక్తులకు మరో రెండువేల టోకెన్లు జారీచేశారు.

విద్యుత్తు సమస్యలున్నాయా..?

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ 'సీఎండీ'

సంప్రదించాల్సిన నంబరు: 89777 16661

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లేతేటి తెలిపారు. డిస్కం పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని వినియోగదారులు సమస్యలు చెబితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.

ఇన్‌ఛార్జి డీఎఫ్‌వోగా శ్రీనివాసులు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: జిల్లా అటవీశాఖ అధికారి (ఎఫ్ఏసీ)గా శ్రీనివాసులు నియమితులయ్యారు. ఇటీవల జిల్లాకు డీఎఫ్‌వోగా వచ్చిన సుబ్బురాజు రెండు నెలల పాటు శాఖాపరమైన శిక్షణ కోసం సెలవుపై వెళ్లారు.

పెరిగిన ధరలు.. వ్యాధుల బెంబేలు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్‌లో ప్రస్తుతం ధరలు అనూహ్యంగా పెరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గూళ్ల ధర ప్రస్తుతం కిలో రూ.720 పలుకుతోంది. వారం రోజుల నుంచి ఈ ధరలో ఏమాత్రం తగ్గుదల లేదు. ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇటీవల వాతావరణ మార్పులతో పట్టుపురుగులకు తెగుళ్లు సోకడంతో చనిపోతున్నాయని.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

9కి 3 మాత్రమే.. ధర ఆశాజనకంగా ఉన్నా.. పట్టు పురుగులకు మాత్రం వ్యాధుల బాధ తప్పటం లేదు. ప్రస్తుతం మస్కాడిన్ అనే(సున్నపు కట్టు) వ్యాధి పురుగులకు సోకుతోంది. చాలా చోట్ల ఈ వ్యాధి కారణంగా పట్టు పురుగులు చనిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాలు చూస్తున్నారు. పలమనేరు మార్కెట్‌కు నిత్యం 9 టన్నులు రావాల్సి ఉండగా. . ప్రస్తుతం మూడు టన్నులకే పరిమితమైంది.

జాగ్రత్త పాటించాలి.. షెడ్లలో తగిన ఉష్ణోగ్రత ఉండేలా చూసుకోవాలని.. పట్టు పురుగులున్న బెడ్లలో తేమ లేకుండా చూడాలని ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు.

పెద్దపులి.. గాండ్రిస్తుందా?

- గతంలో చిట్వేలి అడవుల్లో గుర్తింపు
- శేషాచలంలో గణనకు సన్నద్ధం

జీవకోన, న్యూస్‌టుడే: శేషాచలం అడవులకు పులుల రాకపై ఉత్కంఠ నెలకొంది. రెండేళ్ల కిందట టైగర్ కారిడార్ పనుల కారణంగా ఉమ్మడి కడప జిల్లా శేషాచలం పరిధిలోని చిట్వేలి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం రికార్డు చేసినట్లు అటవీశాఖ అధికారులు గతంలో ప్రకటించారు. తదనంతరం ఎన్ని వచ్చాయి.. మిగతా ప్రాంతాల్లోకి ప్రవేశించాయా.. లేదా? తిరిగి నల్లమలకు చేరుకున్నాయా..? వంటి ప్రశ్నలకు నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు (ఎన్ఎస్‌టీఆర్) నేతృత్వంలో జరిగే పులుల గణన సమాధానం ఇవ్వనుంది.

ఎక్కడెక్కడ (చ.కి.మీ.)

నల్లమల: 3296.31

శేషాచలం: 4755.97

నల్లమలలో సంతతి

2018: 62 | 2022: 73

అవొక్కటే కాదు..

- గణనలో పెద్ద పులులతో పాటు చిరుతలు, దుప్పులు, జింకలు, తోడేళ్లు, అడవి కుక్కలతో పాటు మంసాహార, శాకాహార జంతువుల పెరుగుదలను సైతం పరిశీలిస్తారు. అటవీ విస్తీర్ణంలో ఏదైనా మార్పు వచ్చిందా, పచ్చదనం తీరు ఎలా ఉందన్న వివరాలూ సేకరిస్తారు.

పులి, చిరుతల సంఖ్యా నమోదు

ఈనెలలోనే డబ్ల్యూఐఐ, నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీల నిపుణుల ఆధ్వర్యంలో గణన ప్రారంభమవుతుంది. ఐదు నెలల పాటు జరిగే ఈ గణనలో శేషాచలం అడవుల్లోని మాంసాహార జంతువుల గణన మొత్తం జరుగుతుంది. పెద్దపులి, చిరుతల సంఖ్యపైనా స్పష్టత వస్తుంది. **– సాయిబాబ, జిల్లా అటవీ అధికారి, తిరుపతి**

టైగర్ కారిడార్ లక్ష్యం ఇలా..

- ఒకప్పుడు శేషాచలం అడవులను ఏలిన పెద్దపులి ఇప్పుడు కనిపించడం లేదు. వందేళ్ల కిందట నల్లమల చేరుకుని అక్కడ స్థావరంగా మార్చుకుంది.
- అక్కడ సంతతి పెరగడం, ఒకే సమూహం మధ్య లైంగిక సంపర్కం జరుగుతున్న కారణంగా జన్యుపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అధికారులు గుర్తించారు.
- వాటి నివాసాల పరిధిని శేషాచలం వరకు విస్తరించేందుకు అటవీశాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగానే శేషాచలం, నల్లమల అడవులను కలుపుతూ టైగర్ కారిడార్‌ను 2023లో తెరపైకి తెచ్చారు. కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా అండర్ పాస్‌ల ఏర్పాటు, రాత్రివేళ వాహనాల రాకపోకలపై నిషేధం వంటి చర్యల దిశగా అడుగులు వేశారు.
- తదనంతరం ఆ పరిస్థితులు వేగంగా కల్పించకపోవడం, మౌలిక ఏర్పాట్లు చేయకపోవడంతో ఫలితాలు పెద్దగా కనిపించనట్లు సమాచారం.

గణన ఎప్పుడంటే..

2025 నవంబరు నుంచి **2026** మార్చి వరకు

సంస్థల భాగస్వామ్యం: వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ), నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ శాస్త్రవేత్తలు, నిపుణులు

నాలుగు దశల్లో లెక్కింపు

దేశవ్యాప్తంగా పెద్ద పులుల సంఖ్య తేల్చేందుకు పది నెలల సమయం పడుతుంది. మొత్తం నాలుగు దశల్లో ఈ ప్రక్రియ జరుగుతుంది.

1. పెద్ద పులుల పాదముద్రలను సేకరిస్తారు. వాటి పెంటికలు, చెట్లపై అవి గీసిన చారలు ఇలా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేస్తారు. వారం రోజుల పాటు ఈ ప్రక్రియ సాగుతుంది.
2. శాటిలైట్ల సాయంతో అటవీ ప్రాంతంలో ఫొటోలు తీస్తారు.
3. తరువాతి దశలో అవి సంచరించే ప్రదేశాల్లో ప్రతి నాలుగు చ.కి.మీ పరిధిలో ఎదురెదురు చెట్లకు రెండు ట్రాప్ కెమెరాల చొప్పున బిగించి... వాటిలో నమోదైన చిత్రాలు సేకరిస్తారు.
4. పైమూడు స్థాయిల్లో గుర్తించిన అంశాలను... నాలుగో దశలో విశ్లేషించి వాస్తవ సంఖ్యను లెక్కగడతారు.

వన్యప్రాణుల సమాచారం తెలిసేలా యాప్

అటవీ శాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచన

ఈనాడు– చిత్తూరు, న్యూస్‌టుడే, పలమనేరు: జిల్లాలో ఏనుగుల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. గజరాజులు సంచరించే ప్రాంతాల్లో మామిడి సాగు అధికంగా ఉండటంతో అవి అక్కడే తిష్ఠ వేస్తున్నందున రైతులు ప్రత్యామ్నాయంగా మిరప, లెమన్ గ్రాస్ సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వన్యప్రాణుల సంచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు వీలుగా రూపొందించిన యాప్‌ను వచ్చే ఏడాది మార్చి 3వ తేదీలోపు అందుబాటులోకి తేవాలన్నారు. హనుమాన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే అంశంలో అటవీశాఖతోపాటు పంచాయతీ రాజ్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులూ సహకరించాలని కోరారు. ఆదివారం ఆయన పలమనేరు మండలం ముసలిమడుగు వద్ద కుంకీ ఏనుగుల క్యాంపును ప్రారంభించారు. పెంగరగుంట హెలిప్యాడ్ వద్ద ప్రజలు ఆయనకు వినతులు సమర్పించగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఏనుగులకు మత్తు ఇచ్చే గన్ పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

కర్ణాటక ప్రభుత్వానికి మాట ఇచ్చా

'కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకొచ్చే సమయంలో వాటిని బాగా చూసుకుంటామని ఆ ప్రభుత్వానికి మాట ఇచ్చా. మావటీలు ఈవిషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నారు.' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కితాబిచ్చారు. వారి కృషిని మెచ్చి రూ.50వేలు బహుమతిగా అందించారు.

20 నిమిషాలు ఆసక్తిగా గమనించి

కుంకీ ఏనుగులు జయంత్, వినాయక్, అభిమన్యు, దేవా, కృష్ణ, రంజన్ చేసిన విన్యాసాలను పవన్ కల్యాణ్ ఆసక్తిగా గమనించారు. బరువైన దుంగలను ఎత్తి క్రమశిక్షణగా చివర్లో పడేశాయి. కుంకీలు ఏవిధంగా ఆపరేషన్లను నిర్వహిస్తాయన్నది చూపించారు. 20 నిమిషాలపాటు సాగిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే, పీసీసీఎఫ్ చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్‌డూడీ పాల్గొన్నారు.

చరవాణిలో చిత్రీకరించి

కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రం వద్ద 250 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న మియావాకీ ప్లాంటేషన్‌ను పవన్ కల్యాణ్ పరిశీలించారు. మీటరుకు ఒకటి చొప్పున నాటిన ప్లాంటేషన్‌ను మొబైల్‌లో చిత్రీకరించారు. మొక్కల మధ్యలో ఎప్పుడు పొదలు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. అధునాతన సోలార్ కంచె పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు.

పవన్‌కల్యాణ్‌ని చూసేందుకు వచ్చిన జనం

ఏనుగుల విన్యాసాలు

సీఐడీ విచారణకు పోలీసులు, అధికారులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుమల పరకామణిలో చోరీ కేసు విచారణ సోమవారం నుంచి మరింత వేగం పుంజుకోనుంది. రెండు రోజుల సెలవుల నేపథ్యంలో విచారణను పక్కనపెట్టి.. సేకరించిన ఆధారాలు నిర్ధారణకు ప్రయత్నించారు. అందులో భాగంగా ఆదివారం సాంకేతిక సహకారంతో సంప్రదింపులు.. ఫోన్ సంభాషణలను, కొన్ని దస్త్రాలను పరిశీలించారు. ఇప్పటికే నిందితుడు రవికుమార్, వారి కుటుంబ సభ్యులను విచారించారు. వారు వెల్లడించిన విషయాలను వీడియో రికార్డింగ్ చేసి ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నారు. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ సమక్షంలో సోమవారం జరిగే విచారణకు హాజరుకావాలని పరకామణిలో పనిచేసే కొందరు తితిదే ఉద్యోగులు, ఇతర అధికారులకు నోటీసులు ఇచ్చారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ.. విచారణ జరిపిన సీఐలతోపాటు అప్పటి డీఎస్పీని విచారణకు పిలిచారు. సుమారు పది మంది వరకు విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

గిజిగాడి గూడు.. అందమెంతో చూడు

తిరుపతి నుంచి రేణిగుంటకు వెళ్లే మార్గంలో వెంకటాపురం వద్ద ఓ పొలంలో తాటిచెట్టుకు పదుల సంఖ్యలో గిజిగాడు పక్షులు గూళ్లు కట్టుకున్నాయి. కొమ్మకొమ్మకో అంతస్తు అన్నట్లు ముచ్చటగొలుపుతున్నాయి. **– ఈనాడు, తిరుపతి**

రండి.. రూ.43.54 కోట్లు మీవే

బ్యాంకులో ఖాతాదారుల రద్దీ

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లో ఉన్న సొమ్మును తిరిగి పొందడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అవకాశం కల్పించింది. ఇందుకోసం 'మీ డబ్బు- మీహక్కు' పేరుతో మూడు నెలలపాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. అర్హులు తమ సొమ్ము తీసుకోవాలని సూచిస్తున్నారు. జిల్లాలో అలాంటి సొమ్ము రూ. 43.54 కోట్లు ఆయా ఖాతాల్లో ఉంది. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఏ బ్యాంకులో ఎంత..? (రూ.కోట్లలో..)

బ్యాంకు	ఖాతాదారుల నగదు	ప్రభుత్వ శాఖలు
ఎస్‌బీఐ	10.73	7.98
యూబీఐ	10.33	3.21
సప్తగిరి గ్రామీణ	3.23	2.89
ఇండియన్	2.74	0.91
కెనరా	0.75	0.11
డీసీసీబీ	0.15	---

ఎందుకిలా..

ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు, నామిని వివరాల్లో లోపం వంటి కారణాలతో ఆయా ఖాతాల్లో నిల్వలు అలాగే ఉండిపోతున్నాయి. పదేళ్లు, అంతకుమించి లావాదేవీలు జరగని ఖాతాల్లో సొమ్ములను తిరిగి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఖాతాదారులు సరైన పత్రాలు చూపించి నగదు తీసుకోవచ్చని లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.హరీష్ తెలిపారు.

ధ్రువపత్రాలు చూపితే చాలు.. ఖాతాల్లో క్లెయిమ్ చేయని నిధులకు సంబంధించి సరైన పత్రాలు సమర్పించాలి. బ్యాంకు అధికారులను సంప్రదించి, ఈకేవైసీ పూర్తి చేసి సొమ్మును తిరిగి పొందొచ్చు.

ఉపాధి ఉసూరు

పెద్దపంజాణి మండలం పెద్దారికుంటలో ఫారం పాండు

పలమనేరు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మందకొడిగా సాగుతోంది. ప్రభుత్వం కూలీలకు పనులు కల్పించాలనే ఉద్దేశంలో వివిధ రకాల పథకాలను మంజూరు చేసింది. వీటిలో ఫారం పాండ్లు, సప్లై ఛానల్స్, మామిడి మొక్కలు నాటడం, క్యాటిల్ షెడ్లు నిర్మించుకోవడం వంటివి ఉన్నాయి. ఇందులో సగం కూడా పనులు సాగలేదు. వర్షాల కారణంగా ఉపాధి పనులు బాగా మందగించాయి. కూలీలకు పనులు కల్పించాలని పెట్టుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. గత మూడు నెలలుగా వర్షాలు కురవడంతో కూలీలకు పనులు చేసుకునే అవకాశం కలగలేదు. కూలీలు ఉపాధి లేక ఆర్థికంగా నష్టపోతున్నారు. బిల్లులు సక్రమంగా అందలేదు. ఆగస్టు వరకు కొన్ని బిల్లులు మంజూరైనా తర్వాత బకాయిలు రాలేదు. మరో వారం గడిస్తే వరి కోతలు, వేరుసెనగ నూర్పిడి పనులు మొదలవుతాయి. ఇది ఉపాధి పనులకు అడ్డంకిగా మారనుంది.

వివరాలు	మంజూరు	గ్రౌండింగ్	పూర్తయినవి
పశువులు, గొర్రెలు, కోళ్లషెడ్లు	2171	2111	1658
ఫారం పాండ్లు	18155	7940	6612
నీటి తొట్టెలు	1796	1000	776

వివిధ రకాల మొక్కలు నాటడానికి

- పంచాయతీలు: 700
- పనులు: 1624
- విస్తీర్ణం: 2434 ఎకరాలు
- నాటిన విస్తీర్ణం: 2063 ఎకరాలు

ఈ ఏడాదిలో వివరాలిలా. (రూ.కోట్లలో..)

- పనుల విలువ: 183.95
- వేతనాలు: 99.50
- బకాయిలు: 14.60
- జాబ్‌కార్డులు: 2.39 లక్షలు
- పనులు చేసిన వారు: 1.95 లక్షలు

104FM Tirupati ఈ FM 104 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008555167, 9154991499

రేపు తిరుచానూరులో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి ప్రారంభంకానున్నాయి. ఉత్సవాలకు ముందు వచ్చే మంగళవారం రోజున ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు గర్భాలయం గోడలు, ధ్వజస్తంభం, ఆనంద నిలయం, అనుబంధ ఆలయాలను సుగంధ పరిమళ ద్రవ్యాలతో శుభ్రం చేయనున్నారు.

ఐదంచెలు.. కొలువుకు నిచ్చెనలు

ప్రాంగణ ఎంపికల్లో నైపుణ్యానికే కంపెనీలు మొగ్గు

రాష్ట్రంలో పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయి. దీంతో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కళాశాలల్లోనూ వచ్చే ఏడాదిలోగా ప్రాంగణ ఎంపికలు నిర్వహించడానికి కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఏటా వేలాది మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తి చేసుకొని బయటకు వస్తున్నా కొలువులకు అవసరమైన నైపుణ్యాలను సాధించలేకపోతున్నారు. కంపెనీలు నిర్వహించే రాత పరీక్షల్లోనూ గట్టెక్కలేకపోతున్నారు. కొన్ని అంశాలపై దృష్టిసారిస్తే కొలువు సులువేనని నిపుణులు చెబుతున్నారు. ఇంకేం ఆలస్యం.. క్యాంపస్ ఇంటర్వ్యూకు ఇక సన్నద్ధమవుదామా..! –న్యూస్‌టుడే, పుత్తూరు,



5. చివరిగా హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ చేస్తారు. మేనేజింగ్, సాఫ్ట్‌స్కిల్స్, సైకలాజికల్ టెస్ట్, కుటుంబ నేపథ్యం తదితర విషయాలు తెలుసుకుంటారు.
4. ఎక్కువ మంది ఎంపికైతే బృంద చర్చలు నిర్వహిస్తారు. ఆంగ్లంపై పరిజ్ఞానం, నడవడిక, సమయస్ఫూర్తిని గమనిస్తారు.
3. మూడో దశలో సాంకేతికత అంశాలపై పరీక్ష పెడతారు. ఇదే సమయంలో విద్యార్థి విషయం పరిజ్ఞానాన్ని అంచనా వేస్తారు. బ్రాంచి సబ్జెక్టుతో పాటు ఏదైనా ప్రాజెక్టులు చేస్తే వాటిని అడుగుతారు.
2. రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి కోడింగ్, కార్యనిర్వహణ నైపుణ్యాలపై పరీక్ష ఉంటుంది. సి, జావా, పైథాన్‌పై ప్రశ్నలు అడగడంతో పాటు ప్రోగ్రాం రాయాలి.
1. తొలుత ఆన్‌లైన్, రాత పరీక్ష నిర్వహిస్తారు. ఆప్టిట్యూడ్, రీజనింగ్, వెర్బల్ పజిల్స్, లాజిక్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రశ్నలు అడుగుతారు.

సాధనెంతో ముఖ్యం

గతంలో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారి అనుభవాలు తెలుసుకోవాలి. వారిని ఎలాంటి ప్రశ్నలు అడిగారు.. ఎలా సన్నద్ధం కావాలో అడిగి ఆ దిశగా సాధన చేయాలి. సాఫ్ట్ స్కిల్స్, భావవ్యక్తీకరణ, ఆంగ్లంపై పట్టు పెంచుకోవాలి. నిత్యం దినపత్రికలు చదవడంతోపాటు మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతికతపై అవగాహన అవసరం. పత్ర సమర్పణ ఉద్యోగాల ఎంపికకు ఎంతగానో ఉపకరిస్తుందని ఎంపికల అధికారులు పేర్కొంటున్నారు.

ఇవి తెలుసుకోండి..

- ఇంజినీరింగ్ విద్యతో పాటు గ్లోబల్ సర్టిఫికేషన్, కోడింగ్ పరీక్షలు, హ్యాకథాన్‌పై నైపుణ్యాలు పెంచుకోవాలి.
- ప్రాంగణ ఎంపికలు నిర్వహించే కంపెనీల పూర్వోపరాలు ముందే తెలుసుకోవాలి.
- కంపెనీకి దేశంతో పాటు రాష్ట్రంలో బ్రాంచీలుంటే బహుళజాతి కంపెనీగా, వందలోపు ఉద్యోగులుంటే చిన్న కంపెనీగా పరిగణించాలి.

(c) eenadu

శునకాలు.. ఇక షెల్టర్లకే

● మార్గదర్శకాలు జారీ చేసిన సుప్రీంకోర్టు
● రెండు వారాల్లో గడువు

● తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణంలో గతేడాది డిసెంబరు 19న విష్ణుమహల్ థియేటర్ నుంచి కార్వేటినగరం రోడ్డు వరకు 27మందిని పిచ్చికుక్క కరిచింది. కుక్కకాటుకు గురైన వారంతా ఆస్పత్రికి వచ్చి ఏఆర్‌వీ, హిమినోగ్లోబిన్ ఇంజెక్షన్లు వేయించుకున్నారు. కొందరికి గాట్లు పెద్దవి కావడంతో రెండు, మూడు కుట్లు వేశారు.

● తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి మండలం కయ్యూరు ఎస్సీ కాలనీకి చెందిన రెండేళ్ల బాలుడు సుమన్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధికుక్కలు దాడి చేశాయి. ముఖంపై గాట్లు పడటంతో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం.

● చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలో రోజుకు నాలుగైదు కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్నారు.

● దేశ అత్యున్నత న్యాయస్థానం విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్సు, రైల్వే స్టేషన్‌లోకి శునకాలు రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఆయా సంస్థల ప్రాంగణంలోకి అవి చొరబడకుండా కంచెలు ఏర్పాటు చేయాలని సూచించింది. నోడల్ అధికారులు క్రమం తప్పక తనిఖీలు నిర్వహించి సమస్య తలెత్తకుండా చూడాలని ఉత్తర్వులు ఇచ్చింది. నోడల్ అధికారుల వివరాలు ఆయా ప్రాంగణాల్లో ప్రవేశ ద్వారం వద్ద ప్రదర్శించాలని సూచించింది. అదే సమయంలో జన సమర్థ, బహిరంగ ప్రదేశాల్లో సంచరించకుండా చూడాలని ఆదేశించింది.

పుత్తూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, తిరుపతి నగర పాలికలు, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, నగరి, కుప్పం, పుంగనూరు, పలమనేరు మున్సిపాలిటీల్లో 27,350 కుక్కలు ఉన్నాయి. ఏటా నగరపాలక, పురపాలికల అధికారులు వాటి సంతతి పెరగకుండా వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేపడుతున్నట్లు లెక్కలు చూపుతున్నారు. అయితే నగరాలు, పట్టణాల్లో వీటి సంతతి మాత్రం తగ్గక పోగా పెరుగుతుంది.

మందులు పర్వాలేదు..

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు ఉన్నాయి. ఒక్కో సమయంలో కుక్కకాటు అధికంగా జరిగిన సందర్భంలో పక్కనున్న ఆసుపత్రుల నుంచి తెప్పించుకోవాల్సిన పరిస్థితి.

పుత్తూరులో వీధి కుక్కలు

బాలాయపల్లి : ఇటీవల కయ్యూరు ఎస్సీకాలనీలో గాయపడ్డ బాలుడు

నగరాలు, పురపాలికల్లో కుక్కల వివరాలు

చిత్తూరు జిల్లా:	తిరుపతి జిల్లా:
9,250	18,100

విధిగా పాటించాల్సిందే..

వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి అన్ని నగర, పురపాలికలు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాల్సిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని నగర, మున్సిపాలిటీల్లో పునరుత్పత్తి జరగకుండా స్టెరిలైజేషన్ ప్రక్రియ కోసం కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. త్వరలోనే అన్ని కేంద్రాల్లో వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. -నాగరాజు, ఆర్డీ, అనంతపురం

ఆలయ దర్శిని

కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో సేవలు

సుప్రభాతసేవ, గోపూజ: వేకువజామున 4.00
బిందుతీర్థ అభిషేకం: 4.30 గంటలు
పంచామృతాభిషేకాలు: ఉదయం 5.30 (ప్రథమ కాల), 9.00 (ద్వితీయకాల), 11.00 (తృతీయకాల)
క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45
ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు.
నిత్య కల్యాణం: 11.30 గంటలకు
హోమాలు: ఉదయం 7 నుంచి 10 గంటల వరకు

నిజరూప దర్శనం: ఉ. 7-7.30, 8.30-9.00, 10.30-11.00
సాయంత్రం: 4.30- 5.00
సర్వదర్శనం: ఉ. 6-7, 8-8.30, 9.30 -10.30 గంటల వరకు
మ. 12.00, **సా.** 4.30, **రా.** 7-9

– న్యూస్‌టుడే, కాణిపాకం



శ్రీవారి ఆలయంలో

నిత్యోత్సవాలు: తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతం, మంగళ, బుధ, గురువారాలు ఉ.3.45 గంటలకు తోమాలసేవ, 4.45 గంటలకు అర్చన, మ.12 గంటలకు కల్యాణోత్సవం, 2 గంటలకు డోలోత్సవం, 3 గంటలకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సాయంత్రం 5 గంటలకు సహస్ర దీపాలంకారసేవ.

సర్వదర్శనం: తెల్లవారి 3.30-5.45, ఉ.8-9.30కు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. గురువారం, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి సర్వదర్శనం.

వారోత్సవాలు: ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9కి నిర్వహిస్తారు. బుధవారం సహస్రకలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం ఉదయం 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, తిరుమల

ముక్కంటి ఆలయంలో

ఉదయం: 5.30: సుప్రభాత సేవ. 5.45: గోమాత పూజ 6.30: ప్రథమ కాలాభిషేకం 7.30: ద్వితీయ కాలాభిషేకం 11.00: నిత్యోత్సవం, చండీ, రుద్రహోమాలు 11.30: నిత్య కల్యాణం **సాయంత్రం:** 3.30: ప్రదోష కాలాభిషేకం **రాత్రి:** 7.00: నీరాజన మంత్రపుష్పం 9.00: ఏకాంతసేవ **సర్వదర్శనం:** ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.

రాహు, కేతు పూజలు: ఉదయం 6 నుంచి సాయంత్రం 5 వరకు. **అభిషేకాలు:** మృత్యుంజయ (సోమవారం), శివలింగానికి (మంగళ), శ్రీమేధాదక్షిణామూర్తికి (గురు), శనీశ్వరునికి (శని), సూర్యనారాయణుడికి (ఆది). మనస్మృతికి ఊంజల్‌సేవ(శుక్రవారం). ● సోమవారం సాయంత్రం భరద్వాజతీర్థంలో లక్ష దీపోత్సవం.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

కమ్మవారి వనభోజన కార్యక్రమం

కమ్మవారి అభ్యుదయ సేవాసంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, కమ్మ సంఘం గౌరవాధ్యక్షుడు చెన్న కేశవులునాయుడు, ప్రముఖులు

తవణంపల్లె, న్యూస్‌టుడే: కె.పట్నం సమీపంలోని మామిడి రిసార్ట్‌లో కమ్మవారి అభ్యుదయ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. కమ్మవారి సంక్షేమానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులు, కళాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. సంఘం గౌరవాధ్యక్షుడు చెన్నకేశవులు నాయుడు, రజని దంపతులను నిర్వాహకులు సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, సంఘం రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి నాయుడు, జిల్లా అధ్యక్షులు కేశవులు నాయుడు, ప్రధాన కార్యదర్శి సతీష్, ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు భీమనేని చిట్టిబాబు నాయుడు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి

పేదలకు ఉచిత న్యాయసేవలు

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: పేదలు, వెనుకబడిన తరగతుల వారికి ఉచిత న్యాయసేవలు అందిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.ఎస్.భారతి పేర్కొన్నారు. జాతీయ న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక తితిదే కల్యాణ మండపంలో కార్మికులకు న్యాయసేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎం.ఎస్.భారతి మాట్లాడుతూ న్యాయం.. ఏ కొందరికో పరిమితమయ్యే ప్రత్యేక గౌరవం కాదని.. ఇది ప్రతిఒక్కరి హక్కు అని అన్నారు. న్యాయవాదిని పెట్టుకునే శక్తి లేని వారు.. ఆధార్, బియ్యం కార్డు తీసుకుని న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయసేవలు అందజేస్తామన్నారు. డిసెంబరు 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. టూటౌన్ సీఐ నెట్టి కంఠయ్య, ఏఎస్ఓ సౌందర్‌రాజన్, వడ్రంగి వర్కర్స్ యూనియన్, శ్రీవిశ్వకర్మ కార్పెంటర్స్ అసోసియేషన్ నాయకులు, కార్పెంటర్లు, కార్మికులు పాల్గొన్నారు.

నిండి.. అడుగంటి

● పదేళ్లుగా తుంబ ప్రాజెక్టు వివాదం
● అన్నదాతలకు తప్పని సాగునీటి కష్టాలు

వర్షాలకు నిండిన తుంబ ప్రాజెక్టు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే : తుంబ ప్రాజెక్టు నిండినా.. రైతన్నలకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.. ఆ ప్రాజెక్టు మరమ్మతులకు అటవీశాఖ దశాబ్ద కాలంగా మోకాలడ్డుతోంది.. బంగారుపాళ్యంలోని తుంబపాళ్యం అటవీ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టు రెండువేల ఎకరాల విస్తీర్ణంలోని ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.

తుంబపాళ్యం అటవీ ప్రాంతంలో పదేళ్ల క్రితం తుంబ ప్రాజెక్టు(కొత్తచెరువు) నిర్మించారు. దీనికి రెండు వైపులా సుమారు రెండు కిలోమీటర్ల పైగా కాలువలు నిర్మించారు. అప్పట్లో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టు తూము(గేట్) కొట్టుకుపోయింది. అప్పటి నుంచి వర్షాలకు వచ్చిన నీరు ఈ ప్రాజెక్టులో నిల్వ ఉండక వృథాగా పోతోంది. తెదేపా హయాంలో ప్రాజెక్టు మరమ్మతులకు జపాన్ నిధులు రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. తర్వాత అధికారంలోని వచ్చిన వైకాపా ప్రభుత్వం హయాంలో కడపకు చెందిన గుత్తేదారు. . మరమ్మతులు చేపట్టగా ఇది తమ పరిధిలో ఉందని అటవీ శాఖ అభ్యంతరం తెలిపింది. అప్పటి అటవీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ సమస్యను అసలు పట్టించుకో లేదు. నిధులు మంజూరైనా ప్రయోజనం లేకపోయింది.

కుప్పకూలిన ప్రాజెక్టు గేటు (పాత చిత్రం)

మరమ్మతులు చేపడితేనే..

తుంబపాళ్యం, ఈచనేరపల్లె, పెరుమాళ్లపల్లె, తుంబకుప్పం, నల్లంగాడుకోటూరు సదకుప్పం గ్రామ పంచాయతీల పరిధిలోని ఆయకట్టు భూములతో పాటు చెరువుల్లో నీటిమట్టం పెరుగుతోంది. ఎమ్మెల్యే మురళీమోహన్ చొరవ చూపి అటవీశాఖ అటవీశాఖ సమన్వయంతో తుంబ ప్రాజెక్టు మరమర్మతులు చేపట్టాలని, తద్వారా తమ కష్టాలు తీర్చాలని అన్నదాతలు కోరుతున్నారు.

దర్శనానికి బారులు తీరిన భక్తులు

వరసిద్ధుడి దర్శనానికి నాలుగు గంటలు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దర్శనానికి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. వరుస సెలవుల నేపథ్యంలో ఆలయంలో ఒక్కసారిగా భక్తుల రద్దీ పెరిగింది. దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. భక్తులకు కావాల్సిన వసతులను ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ● **నేడు ఆలయంలో పవిత్రోత్సవాలు :** శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో కార్తిక బహుళ షష్ఠి సోమవారం నుంచి మూడ్రోజుల పాటు వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఈ నెల 12న స్వామివారి హుండీల లెక్కింపు చేపట్టనున్నట్లు ఈవో పేర్కొన్నారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ

ఉమ్మడి సర్వీస్ రూల్స్‌తో విద్యావ్యవస్థ బలోపేతం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుచేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీరమణ కోరారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు ఉమ్మడి సర్వీస్ రూల్స్ లేకపోవడంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 73, 74 ప్రకారం ఉమ్మడి సర్వీస్ అమలు చేయాలన్నారు. డీఈవో, డీవైఈవో, పాఠశాలల తనిఖీ అధికారుల పోస్టులను ఉద్యోగోన్నతి ద్వారా ఉపాధ్యాయులు పొందలేక పోవడం బాధాకరమని చెప్పారు. ఎంఈవో-1 నియామకాల్లో సర్వీస్ రూల్స్ లేక 400కు పైగా మండలాల్లో విద్యాధికారులు లేకనే విద్యాసంవత్సరం గడిచిపోతోందని వాపోయారు. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న 1,043 పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర నాయుడు, మణిగండన్, నాయకులు రెడ్డెప్పనాయుడు, సరిత, రెహానాబేగం, ఎస్పీ బాషా, కృష్ణమూర్తి, పార్థసారథి, సురేష్, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 షటిల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆటగాళ్ల ఎంపిక పోటీలు ఆదివారం చిత్తూరులోని మెసానికల్ మైదానంలో ఉత్సాహంగా సాగాయి. బాలికల విభాగంలో ఆయేష్నా, సిరిచందన, గుహిక, పూజిత(తిరుపతి), మోక్షిత(చిత్తూరు) మొదటి ఐదు స్థానాలు కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో తేజేష్(చిత్తూరు), హరిసోనాల్ (తిరుపతి), నితీష్, శశాంక్(చిత్తూరు), మోత్విక్ (తిరుపతి) వరుస స్థానాల్లో విజేతలుగా నిలిచారు. పది మంది ఆటగాళ్లు త్వరలో గన్నవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిథ్యం వహిస్తారని ఎస్‌జీఎఫ్ చిత్తూరు అడ్మిన్ కార్యదర్శి శారద, కోచ్ గోపిరెడ్డి తెలిపారు.

పద్మశాలి ఉద్యోగుల నూతన కార్యవర్గం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం చిత్తూరు నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా నూతన గౌరవాధ్యక్షుడిగా నారాయణ పద్మనాభం, అధ్యక్షుడిగా తులసీరామ్, కార్యదర్శిగా శ్రీరాములును, కోశాధికారిగా మురళీమోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర కోశాధికారి తాడూరు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, తిరుపతి జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ సభ్యులతో నాయకులు

గణనాథుడి సేవలో ప్రముఖులు

కాణిపాకం, తవణంపల్లె: వరసిద్ధి వినాయక స్వామి వారిని, అర్ధగిరి వీరాంజనేయస్వామిని ఏపీ ఉప లోకాయుక్తా రజని దర్శించుకున్నారు. శిక్షణ కలెక్టర్ కలెక్టర్ నరేంద్ర పాడల్ దంపతులు ఆదివారం వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్నారు. ఏఈవోలు రవీంద్రబాబు, ధనపాల్, అర్చకులు రాజగోపురం వద్ద వీరికి స్వాగతం పలికారు. మూలవిరాట్టు దర్శన అనంతరం ప్రముఖులకు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, తహసిల్దార్ లోకేశ్వరి, ఎస్సై నరసింహులు పాల్గొన్నారు.

శిక్షణ కలెక్టర్ నరేంద్ర పాడల్ దంపతులకు చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

వరసిద్ధుడి సేవలో విదేశీ భక్తులు

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వారిని రష్యన్ దేశానికి చెందిన 10 మంది భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు, అర్చకులు రాజగోపురం వద్ద వీరికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం విదేశీ భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు.

వినాయకుడిని దర్శించుకున్న రష్యన్ దేశస్థులు

జాతీయస్థాయి పోటీలకు అర్హత

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: కాకినాడలో జరిగిన 37వ అంతర జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. ప్రత్యేక కేటగిరిలో కె.ధర్మిక్ నాగేశ్వర రింక్-1లో స్వర్ణం, రింక్-2లో రజతం, సిద్ధార్థ్ రింక్-1,2లో స్వర్ణ పతకాలు కైవసం చేసుకొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

శిక్షకుడితో ధర్మిక్ నాగేశ్వర, సిద్ధార్థ్

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు.. వజ్రపుకొత్తూరు గ్రామీణం: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ఉన్నత పాఠశాలలో పాఠశాలల క్రీడల సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. విశాఖ జిల్లాకు ఛాంపియన్‌షిప్ దక్కింది. **డిస్కస్‌త్రోలో** యమునా సాయి (చిత్తూరు) తృతీయ స్థానంలో నిలిచింది.

20లోగా మామిడి బకాయిలు చెల్లించాలి

మాట్లాడుతున్న జిల్లా మామిడి రైతు సంఘం అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: గుజ్జు పరిశ్రమలు ఈనెల 20లోపు తోతాపురి మామిడి రైతులకు కిలోకు రూ.8 చెల్లించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని జిల్లా మామిడి రైతు సంఘం అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా మామిడి రైతుల సంఘం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లా పర్యటనకు విచ్చేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మామిడి రైతులు కలవడానికి అవకాశం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. నాయకులు హేమలత, బంగారు మురళి, మునిరత్నంనాయుడు, ఉమాపతి నాయుడు, సంజీవరెడ్డి, భారతమ్మ, బెల్లంకొండ శ్రీనివాసులు, మోహన్‌రెడ్డి, త్యాగరాజులురెడ్డి పాల్గొన్నారు. ● గుజ్జు పరిశ్రమలు సత్వరమే మామిడి రైతులకు బకాయిలు చెల్లించాలని జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు హరిబాబుచౌదరి, ఆనందనాయుడు డిమాండ్ చేశారు.

చూసైనా మారుదాం.. ప్రత్యామ్నాయం వాడుదాం



అలిపిరి గరుడ కూడలి నుంచి ఎస్వీ జూకు వెళ్లే మార్గంలోని రీజినల్ సైన్స్ సెంటర్‌కు నిత్యం వందలో సంఖ్యలో విద్యార్థులు, సందర్శకులు, యాత్రికులు, స్థానికులు వస్తుంటారు. ఆవరణలో సందర్శకులు తాగి పడేసిన ప్లాస్టిక్ తాగునీటి బాటిళ్లను స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇక్కడి సిబ్బంది సేకరించి 600 సీసాలతో 11 అడుగుల ఎత్తయిన నమూనాను తీర్చిదిద్ది ఆవరణలో ఉంచారు.. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ఎదురవుతున్న ఇబ్బందులు విశదీకరిస్తూ ప్రత్యామ్నాయ పద్ధతులు అనుసరించేలా సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు. **- ఈనాడు, తిరుపతి**

భక్తి భావనలే క్షేత్రయ్య పదాలు

పురస్కార గ్రహీతలతో దేవేంద్రరావు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: భక్తి భావనలతో మహాకవి క్షేత్రయ్య రచించిన పదాలు దైవలీలల్ని చాటాయని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య గౌరవాధ్యక్షులు దేవేంద్రరావు అన్నారు. చిత్తూరు నగరం పలమనేరు రోడ్డులోని సమాఖ్య కార్యాలయంలో ఆదివారం మహాకవి క్షేత్రయ్య సాహితీ వైభవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిద్ధేంద్ర యోగి సూచనలతో క్షేత్రయ్య.. అనేక పుణ్యస్థలాల్ని దర్శించి దేవతలపై గీతాలు రచించి మహాకవిగా కీర్తి గడించారని కొనియాడారు. అనంతరం కవులు క్షేత్రయ్య సాహితీ వైభవంపై గీతాలాపన, కవితార్చన నిర్వహించారు. రచయితలు, సామాజిక సేవకుల్ని సత్కరించారు. ఎంవీ కేశవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, నారాయణస్వామి, మరుపూడి కన్నయ్యనాయుడు, మునీంద్ర, రాజు, జగదీష్, వరలక్ష్మమ్మ, మంజులాదేవి, కోటీశ్వర మొదలియార్, ప్రవళిక, చంద్రమోహన్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

నగరి,న్యూస్‌టుడే: మండలంలోని ఓ.జి.కుప్పంలో గంజాయి విక్రయిస్తున్న లింగేశ్వరి అలియాస్ జ్యోతి(47)ని ఆదివారం అదుపులోకి తీసుకున్నామని సీఐ విక్రమ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడి చేసి, ఆమె నుంచి 1.25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆమెపై గతంలో నగరిలో 5 గంజాయి కేసులు, పుత్తూరులో ఒక గంజాయి కేసు ఉందని చెప్పారు. డీటీ మేఘవర్ణం, ఎస్సై విజయ్‌నాయక్ పోలీసులు పాల్గొన్నారు.

బస్సును ఓవర్‌టేక్ చేయబోయి..

పుత్తూరు, న్యూస్‌టుడే: బస్సును అధిగమించే ప్రయత్నంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కల్వర్టు గొయ్యిలో పడిపోవడంతో ఓ వ్యక్తికి ఇనుప చువ్వ గుచ్చుకుని తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం జరిగింది. ఎస్సై ఓబయ్య కథనం మేరకు.. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం బుర్నాగుంటకు చెందిన షేక్ వలీ(44) శ్రీకాళహస్తి పరిధిలోని గ్రామాల్లో దుస్తులు విక్రయిస్తుంటారు. ఆదివారం శ్రీకాళహస్తి నుంచి నగరికి ద్విచక్రవాహనంపై బయలుదేరిన ఆయన.. పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం-వేపగుంట క్రాస్ రోడ్డు మధ్యలో ముందు వెళ్తున్న బస్సును అధిగమించే ప్రయత్నంలో అదుపుతప్పి తిరుపతి-చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపడుతున్న కల్వర్టు గొయ్యిలో పడిపోయాడు. కల్వర్టు ఇనుప చువ్వ గుచ్చుకుంది. సుమారు గంట పాటు శ్రమించి ఇనుప చువ్వను కత్తిరించి స్థానిక అన్నగౌరీ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి తిరుపతి రుయాకు అతడిని తరలించారు. రుయాలో వైద్యులు సర్జరీ చేసి ఇనుప చువ్వ తొలగించారు.

కల్వర్టులో పడిపోయిన షేక్‌వలీకి ఇనుక కమ్మీలు గుచ్చుకోవడంతో తొలగిస్తున్న స్థానికులు

EENADU Classifieds

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL

తిరుపతి- చంద్రగిరి టౌన్‌లో మెయిన్‌రోడ్డుకు ఆనుకొని హౌస్ - విల్లా - హోమ్‌స్టే & అపార్ట్‌మెంట్ కట్టుకునే TUDA అప్రూవల్ కొత్త వెంచర్‌లో కమర్షియల్ - రెసిడెన్షియల్ - ఇన్వెస్ట్‌మెంట్ కొరకు 100% వాస్తు Plots అమ్మబడును. సంప్ర 9505502346.

LEASE
GENERAL

గ్రానైట్ ఫ్యాక్టరీ లీజుకు - చిత్తూరుకు సమీపంలో వేలూరులో 4 బ్లేడ్లు గల గ్రానైట్ ఫ్యాక్టరీ & చిత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గల 2 బ్లేడ్లు గల ఫ్యాక్టరీ లీజుకు ఇవ్వబడును. సంప్ర: 88808 77111, 99451 00777.

TO LET

చిత్తూరు టాణాకు సమీపంలో తిరుత్తణి మెయిన్ రోడ్డులో 4 షాపులు 18.5x27.5 (2షాపులు), 20x35 (1షాపు)& 13.5x14.5 (1షాపు) బాడుగకు ఇవ్వబడును. సంప్ర: 99451 00777, 88808 71111.

JOBS

ప్రభుత్వ సంస్థల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేయుటకు కం. ఆపరేటర్లు, అటెండర్స్, సూపర్‌వైజర్లు కావలెను. జీతం. **16500.** ✆ 98487 71117.

శ్రీరామదూత కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేయుటకు అకౌంటెంట్స్ మరియు టెలికాలర్స్ (స్త్రీలు మాత్రమే) కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆ 93904 14081

E-Kartలో స్త్రీ/పు కావలెను. Inter, Any Degree. జీః 15,000/-. Online are available. Ph: 9704146558, 9550312466.

THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

కళత్తూరు నిర్వాసితులను ఆదుకోవాలి

వస్తువులు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

పుత్తూరు: కేవీబీపురం మండలం కళత్తూరు ఎస్సీ కాలనీవాసులు జలప్రళయంతో నిరాదరణకు గురయ్యారని, వారిని దాతలు ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జనార్దన్, పుత్తూరు ప్రాంతీయ కార్యదర్శి వెంకటేష్ కోరారు. పుత్తూరు పట్టణంలో ఆదివారం పార్టీ కార్యకర్తలతో కలిసి వస్తు సేకరణ చేపట్టారు. దాతలు దుస్తులు, ప్లాస్టిక్ బకెట్లు అందజేశారన్నారు. నాయకులు రమేష్, మునిశంకర్, మురుగేష్, అముద, నందయ్య పాల్గొన్నారు.

స్తంభాన్ని సరిచేశారు

కాటప్పగారిపల్లెకు వెళ్లే మార్గంలో వాలిన విద్యుత్తు స్తంభాన్ని సరిచేశామని విద్యుత్తుశాఖ లైన్‌మెన్ సురేంద్ర తెలిపారు. - న్యూస్‌టుడే, బంగారుపాళ్యం

స్పందనకు వందనం

పిచ్చిమొక్కల తొలగింపు

పట్టణంలోని పార్కు వద్ద పెరిగిన పిచ్చిపొదలతో పాముల బెడద సమస్యపై అధికారులు స్పందించి వాటిని తొలగింపజేశారు. ● హైవే పనుల్లో భాగంగా నిర్మించిన ఎత్తుగా ఉన్న డ్రైన్‌ను దాటేందుకు గ్రావెల్ తోలి రాకపోకలకు మార్గం సుగమం చేసి అధికారులు ప్రజల సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, నగరి

బడుగు, బలహీన వర్గాలకు న్యాయ సహాయం అందించాలి

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: న్యాయ విద్యార్థులు న్యాయవాదులుగా బాధ్యతలు చేపట్టాక బడుగు, బలహీన వర్గాలకు న్యాయ సహాయాన్ని అందించాలని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. పుత్తూరు మండలం పరమేశ్వరమంగళంలోని కేకేసీ న్యాయ కళాశాలలో ఆదివారం న్యాయసేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తి చాలా గొప్పదని, న్యాయవిద్య ప్రజల హక్కులను, మానవ హక్కులకు రక్షణ ఇస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఉచిత న్యాయాన్ని అందించడానికి న్యాయసేవాధికార సంస్థల చట్టం 1987లో తెచ్చారన్నారు. దీనిలో భాగంగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఎంతో ఉందన్నారు. పుత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాలి సురేష్‌బాబు, కేకేసీ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, కేకేసీ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ నరసింహారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరం.. మారుతోంది

● రహదారుల విస్తరణ
● నిర్మాణ పనుల వేగవంతం
● శివారులో సిద్ధమవుతున్న హైవేలు

రిజర్వు అటవీ ప్రాంతంలో పూర్తయిన రోడ్డు నిర్మాణం

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి.. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, పలు రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. చిత్తూరు-తచ్చూరు, చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ మార్గాలు నగర శివారు మీదుగా వెళ్లడంతో రవాణా సదుపాయాలు మెరుగుపడటం సహా నగరానికి నూతన శోభ సంతరించుకోనుంది.

ముందుకురాని గుత్తేదారులు..

గత వైకాపా పాలనలో పనులు చేసేందుకు నగరపాలిక పరిధిలో 9, 10 సార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. కొందరు అప్పులు చేసి పనులు ప్రారంభించినా బిల్లులు విడుదల కాక వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి. దీంతో అసలు పనులు చేపట్టేందుకు ఎవరూ అంత సుముఖంగా లేరని చెప్పక తప్పదు.

రోడ్లు, దీపాలకు మోక్షం..

చిత్తూరు కట్టమంచి బైపాస్ రోడ్డు రెండు కిలోమీటర్ల మేర పాడైంది. దీన్ని ఏళ్ల తరబడి అసలు పట్టించుకోలేదు. ఇటీవల రూ. 2.50 కోట్లతో పనులు చేపట్టారు. కలెక్టర్ బంగ్లా కూడలి, ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే మార్గంలో రూ.50 లక్షలతో సీసీరోడ్ల పనులు ప్రారంభించారు. రూ.25 లక్షలతో పుత్తూరు రోడ్డులో, రూ.50 లక్షలతో సంతపేట మార్గంలో హైమాస్ట్ దీపాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు.

కట్టమంచిలో తవ్వుతున్న బోరు

పనుల వివరాలు..

● నగరపాలిక: చిత్తూరు
● పనులు: 138
● ఖర్చు: రూ.17.51 కోట్లు
● నిధులు: నగరపాలిక సాధారణ, 15వ ఆర్థిక సంఘం, ఎన్‌సీఏపీ, ఎంపీ ల్యాడ్స్
● చేసిన పనులు: సీసీ, బీటీ రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ భవనాలు, నీటి పైపులైన్ విస్తరణ, శ్మశానాలకు ప్రహరీలు, బోర్ల తవ్వకం తదితరాలు

ప్రారంభమైన విస్తరణ పనులు..

2017లో వివిధ కారణాలతో ఆగిన హైరోడ్ విస్తరణ పనులు ఇటీవల ప్రారంభించారు. స్థలాలు కోల్పోయిన భవన యజమానులకు టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. కట్టమంచి వెంకటసాయి కల్యాణ మండపం నుంచి కలెక్టరేట్ వరకు ఆరు కిమీ పొడవున భవనాలు కూల్చివేసి రోడ్డు విస్తరించారు. జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న గాంధీ రోడ్డు విస్తరణ, బాగుకు రూ.50 లక్షలు కేటాయించారు.

అందిరానున్న ఎస్టీపీ ప్లాంట్లు..

నగరంలోని ఇళ్ల నుంచి వచ్చే మురుగు వీధి కాలువల ద్వారా నీవా నదిలో కలుస్తోంది. ఇక్కడ నీరు శుద్ధి చేసి సమీప పొలాల్లోకి పంపించేందుకు సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) నిర్మాణానికి అధికారులు ప్రతిపాదించగా రెండు మంజూరయ్యాయి. మామిడి కాయల మార్కెట్ యార్డు ప్రాంతంలో దీని నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, పాలసముద్రం: సమస్య: వనదుర్గాపురం పంచాయతీ ఆదిఆంధ్రవాడ గ్రామానికి వెళ్లే రహదారిలో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి అడవిని తలపిస్తోంది.
-ఈశ్వర్, గ్రామస్థుడు

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులచే వెంటనే తొలగింపజేస్తాం. **- రాజు, పంచాయతీ కార్యదర్శి**

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం: సమస్య: సంతపేట బొజ్జయ్య నాయుడు వీధిలో నివాసాల మధ్య కాలువలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. **-స్థానికులు**

సమాధానం: డ్రైనేజీ కాలువలో పూడికతీత పనులు చేపడతాం. పిచ్చిమొక్కలు తొలగింపజేస్తాం. **- లోకేష్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ**

న్యూస్‌టుడే, పుత్తూరు: సమస్య: ఎస్వీపీసెట్ వద్ద రోడ్డు పక్కనే చెత్త పేరుకుపోతోంది. **-బాబు, స్థానికులు**

సమాధానం: ప్రతి రోజు చెత్త తొలగింపజేస్తాం.
-మోహన్‌కృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం: సమస్య: సంతపేట ఇంద్రానగర్‌లోని కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. **-స్థానికులు**

సమాధానం: కాలువలో పూడికతీత పనులు, దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.
-లోకేష్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

న్యూస్‌టుడే, పాలసముద్రం: సమస్య: శ్రీకావేరిరాజుపురం పంచాయతీ సీఎంకండ్రిగ గ్రామంలోని ప్రధాన వీధుల్లోని కాలువలలో మురుగు పేరుకుపోయి ఇబ్బంది పడుతున్నాం. **- గ్రామస్థుడు**

సమాధానం: మురుగు తొలగింపజేసి దుర్వాసన లేకుండా చూస్తాం. **- సతీష్, ఎంపీడీవో**

స్పందించి.. వేగనిరోధకానికి రంగులేసి

వేగనిరోధకానికి రంగులు వేస్తున్న తెదేపా కార్యకర్తలు

పుత్తూరు మున్సిపాలిటీలోని 19వ వార్డు జీజేఎన్ నగర్ వద్ద ఏఎండీ ఫంక్షన్ హాల్ పక్కన హిమజ జూనియర్, డిగ్రీ కళాశాలకు వెళ్లే మార్గంలో స్థానికులు వేగనిరోధకాలు ఏర్పాటు చేశారు. నిత్యం కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులవుతున్నారు. ఆ వార్డు తెదేపా అధ్యక్షుడు కృష్ణకుమార్, రవి, పెంచలయ్య, మురళీ, మోహన్‌కృష్ణ తదితరులు సామాజిక బాధ్యతగా గుర్తించి తమ సొంత నగదుతో పెయింట్లు కొని ఆదివారం వేగనిరోధకాలకు రంగులు వేశారు. వీరి సేవలను పలువురు కొనియాడారు. **- న్యూస్‌టుడే, పుత్తూరు**

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, న్యూస్‌టుడే: పేద రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. ఆదివారం అప్పలాయగుంట చెంగమ్మకు రూ.20వేలు, టీసీఅగ్రహారానికి చెందిన మునికుమార్‌కు రూ. 1,25960, ఎనమళపాళ్యంకు చెందిన మునస్వామికి రూ.25 వేలు, బట్టీకండ్రిగకు చెందిన మణికి రూ.35,900 ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కులను ఆయన ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు ఉన్నా రోగులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. పార్టీ నాయకులు ధనంజేయులునాయుడు, జానా వెంకటయ్య, దామూయాదవ్, రఘు, హేమావతి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

జ్ఞానమ్మకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే థామస్

కార్వేటినగరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్ అన్నారు. మండలంలోని చౌటూరులో ఇటీవల తుపాను ప్రభావంతో ఇల్లు కోల్పోయిన జ్ఞానమ్మకు రూ.50 వేలు చెక్కును ఆయన ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని వినతిపత్రాలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పరిశ్రమ ఏర్పాటుచేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు చెంగల్రాయులుయాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు జనార్దన్‌రాజు, జిల్లా నాయకులు మురళీకృష్ణ, రాజా పాల్గొన్నారు.

కామాక్షమ్మ చెరువు కట్ట బలోపేతం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: ఊటువంక సమీప కామాక్షమ్మ చెరువు కట్ట మరమ్మతులు పూర్తయ్యాయని జలవనరుల శాఖ ఏఈ విజయకుమార్ తెలిపారు. రెండు వారాల క్రితం కురిసిన వర్షాలకు చెరువు నిండి కట్ట గండి పడి తెగి పోయే స్థితికి చేరింది. చెరువులోని నీరు కట్టనుంచి లీకవడాన్ని రైతులు గుర్తించి మండల తెదేపా గౌరవాధ్యక్షులు జయప్రకాష్‌నాయుడు, అధ్యక్షులు ధరణీప్రసాద్ నాయుడికి సమాచారం చెప్పడంతో వారు.. ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. యుద్ధప్రాతిపదికన చెరువు కట్టను బలోపేతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో జలవనరుల శాఖ అధికారులు రూ.మూడు లక్షలతో కట్ట ప్రమాదకరంగా ఉన్నచోట ఇసుక బస్తాలు వేసి, మట్టి నింపారు.

రానున్న నిధులు.. తొలగనున్న బాధలు

నగరి దళితవాడలో మురుగు కాలువ దుస్థితి

నగరి, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలో మురుగు కాలువల ఆధునికీకరణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు రూ. 4కోట్లు మంజూరు చేయనున్నట్లు ఇటీవల ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రకటించారు. పురపాలక సంఘంలో మొత్తం 29 వార్డులు ఉన్నాయి. అందులో 16 మురికివాడలు ఉన్నాయి. ఆయా వాడలలో కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎప్పుడో పంచాయతీ కాలంలో అంటే.. పాతికేళ్ల క్రితం నిర్మించిన పాత మురుగు కాలువలో పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. పలు వీధుల్లో మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. వర్షం వస్తే పరిస్థితి మరీ దయనీయం. ప్రధానంగా ఏకాంబరకుప్పం దళితవాడ, నగరి దళితవాడ, నగరిపేట, చింతలపట్టడ, ఇందిరమ్మ కాలనీ, రామ్‌నగర్, కృష్ణానగర్, పద్మావతి నగర్‌లో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. పట్టణ నడిబొడ్డున రామానాయుడు కాలనీ, ఆదమ్ కాలనీ, తలారీ వీధిలో డ్రైన్లు దెబ్బతిన్నాయి. పలుచోట్ల వీటిని విస్తరించకపోవడంతో చెత్తకుప్పలతో నిండాయి. ఫలితంగా దోమల బెడద అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పట్టణంలో మురుగు బయటకు పూర్తి స్థాయిలో వెళ్లడం లేదు.

ప్రతిపాదనలు సిద్ధం చేశాం..

కాలువల ఆధునికీకరణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయనున్నారు. 39 పనులు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.
- కె.వి.కృష్ణారెడ్డి, పురపాలక కమిషనర్

తవ్వేశారు.. వదిలేశారు

పచ్చికాపల్లంలోని కార్వేటినగరం మార్గంలో ఓ ప్రైవేటు టెలికాం రంగ సంస్థ కేబుళ్లు మార్చే క్రమంలో రహదారి పక్కన గొయ్యి తీసింది. ఈ మార్గంలో నిత్యం వాహన రాకపోకలు అధికంగా ఉంటాయి. రహదారి పక్కన గొయ్యి కారణంగా గత ఆరు రోజులుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, వెదురుకుప్పం

చుట్టుతిరుగుడు ఆగేనా..?

నింద్ర మండల కేంద్రం నుంచి డీకేబేడు వెళ్లే మార్గంలో తాత్కాలిక కల్వర్టు కోతకు గురైంది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఎదురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీంతో అదనంగా 6 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తోందని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నింద్ర**

దోమల బెడద నివారించండి

పాలసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ దళితవాడ గ్రామంలో వీధులు పిచ్చిమొక్కలతో అల్లుకున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయక పోవడంతో వీధుల్లోకి విషపురుగులు, దోమలు అధికంగా పెరిగి గ్రామస్థులపై దాడి చేస్తున్నాయి. ఫలితంగా వారు జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధుల్లో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు తొలగించి దోమలను నివారించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు కోరుతున్నారు.

గృహిణులు.. సేవామణులు

బాలింతకు దుస్తులు అందిస్తున్న మహిళలు

న్యూస్‌టుడే, చిత్తూరు(సంతపేట)

ఇంటిని చక్కబెట్టుకోవడం ఇల్లాలికి పెద్ద బాధ్యత. ఆడవారు ఇంటి పనులకే పరిమితమనే మాటలు ఒకప్పుడు.. మహిళలు ఇంటి పనులకే పరిమితం కావడం లేదు.. సమాజం కోసం కొంత సమయాన్ని కేటాయిస్తున్నారు.. చిత్తూరు నగరంలోని సత్యసాయి సేవా సమితిలో మహిళా విభాగం ద్వారా గత కొన్నేళ్లుగా సేవానిరతిని చాటుకుంటున్నారు.

సమాజ సేవలో మమేకం

మాస మహిళా దినోత్సవాన..

ప్రతి నెలా 19న సమితి మాస మహిళా దినోత్సవంగా నిర్దేశించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలకు తల్లిలా వెన్నంటి నిలిచి ఆరోగ్య సూచనలు చేస్తున్నారు. చంటి బిడ్డలకు దుస్తులు, ఆహారం అందిస్తున్నారు.

నైతిక విలువలు బోధిస్తూ..

నైతిక విలువలు సాధారణ వ్యక్తిని మహోన్నతంగా మలుస్తుంది. ఇదే స్ఫూర్తితో రేపటి పౌరులైన పిల్లలకు బాలవికాస్ కేంద్రం ద్వారా నైతిక విలువలు బోధిస్తున్నారు. క్రమశిక్షణ, మంచి అలవాట్లు, ఆధ్యాత్మికం, యోగా ఇతర అంశాలపై అవగాహన కలిగిస్తున్నారు.

పిడికెడు బియ్యంతో అన్నదానం..

ఆహారం లేక అలమటించే అభాగ్యులు ఎందరో ఉన్నారు. వీరికి ఒక్కపూటైనా ఆహారం అందించాలన్న ఆలోచన. మహిళల్ని ఏకతాటిపైకి తెచ్చింది. సభ్యులు తమ ఇంట్లో ప్రతిరోజూ పిడికెడు బియ్యాన్ని అన్నదానానికి కేటాయిస్తున్నారు. సేకరించిన బియ్యంతో వారే స్వయంగా తయారు చేసిన ఆహారాన్ని వారానికోసారి వంద మందికి చొప్పున నెలలో నాలుగుసార్లు దీన నారాయణులకు మూడేళ్లుగా అన్నదానం చేస్తున్నారు.

సేవ చేయాలన్న ఆలోచనతో..

పెళ్లయిన తర్వాత పిల్లల కోసం గృహిణిగా ఉండిపోయా. సమాజానికి సేవ చేయాలన్న ఆలోచనతో పిడికెడు బియ్యం కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. అందరి సహకారంతో సేవను ముందుకు తీసుకెళ్తున్నాం.
- కమలప్రభ

చిన్ననాటి నుంచే నేర్పించాలి..

పిల్లలకు చిన్ననాటి నుంచి నైతిక విలువల్ని నేర్పడం ద్వారా ఉత్తమ పౌరులుగా తయారవుతారు. ఈ శిక్షణ పిల్లల్లో దాగున్న సృజనాత్మకత వెలికి తీసుకు రావడానికి దోహదం చేస్తోంది. **- యామిని**

సీకే లావణ్య పుట్టినరోజు వేడుకలు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: కట్టమంచి శ్రీ షిరిడీ విశ్వ సాయిబాబా ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ సీకే లావణ్యబాబు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తుంటి సుధాయాదవ్, పలువురు నాయకులు, అభిమానులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు.

సీకే లావణ్యకు కేకు తినిపిస్తున్న తుంటి సుధాయాదవ్

నూతన కార్యవర్గం ఎన్నిక

సత్కారం అందుకున్న నూతన కార్యవర్గ ప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పరంజ్యోతి ఎన్నికయ్యారు. చిత్తూరులోని ప్రైవేట్ హాల్‌లో ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య నేతృత్వంలో నూతన కమిటీ ప్రకటించారు. సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడిగా నాగరాజ, ప్రధాన కార్యదర్శిగా చిట్టిబాబు, కోశాధికారిగా విజయ్, ఉపాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, వేలాయుధం, సంయుక్త కార్యదర్శిగా పవన్‌కుమార్, వెంకటేశులు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఆదాము, మాధవన్, వజ్రవేలుని ఎన్నుకున్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ అవసరం

నగరి: చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ ఆత్మరక్షణకు చాలా అవసరమని సీఐ విక్రమ్ పేర్కొన్నారు. నగరిలో కరాటే శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో బాలికలు సైతం మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాలన్నారు. మొత్తం 30 మంది విద్యార్థులకు వివిధ స్థాయిల్లో ధ్రువపత్రాలు అందజేశారు. మాస్టర్లు అన్నాదొరై, సురేష్, గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సీఐ విక్రమ్

కోటి సంతకాల సేకరణ

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం నిర్ణయించిన వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా ముంగరమడుగులో ఆదివారం మండల వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, లలితకుమారి, జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆగితే.. కదలదు

● తీరుమారని ఆర్టీసీ
● ప్రయాణికులకు తప్పని పాట్లు

పెద్దరాజుపల్లె వద్ద నిలిచిపోయిన ఆర్టీసీ అద్దె బస్సు(పాత చిత్రం)

పెనుమూరు, న్యూస్‌టుడే: పెనుమూరు-చిత్తూరు మార్గంలో నడుస్తున్న డొక్కు బస్సులతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. తరచూ ఏదో ఒక బస్సు ఎక్కడో ఓచోట ఆగిపోతోంది. ఈ మార్గంలో చిత్తూరు నుంచి పెనుమూరుకు తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం ఉందని బస్టాండులో ప్రచార బోర్డు మాత్రం ఏర్పాటు చేశారు. ఇక సమయ పాలన పాటించడమే లేదు. ఇంతవరకు బాగానే ఉన్నా నడిచే బస్సులు చాలావరకు కాలం చెల్లినవి కావడంతో తరచూ కదలక మొరాయిస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ మార్గంలో అద్దె బస్సులు మూడు, ఆర్టీసీ బస్సులు రెండు సర్వీసులు ఉన్నాయి.

ఏదోఒకచోట తిప్పలే..

ఈ మార్గంలో నిత్యం వేలాది మంది ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు. వారు నిర్ణీత సమయానికి తమ గమ్యాన్ని చేరుకోవాలన్న తపనతో బస్సుల కోసం వస్తుంటారు. రోజూ నడుస్తున్న బస్సులు తరచూ ఏదో ఒకచోట మరమ్మతుకు గురై నిలిచిపోతున్నాయి. ఈ సమయంలో ప్రయాణికుల పాట్లు అన్నీఇన్నీ కావు. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. మూడ్రోజుల క్రితం ఉదయం 7.15 గంటల నుంచి 8.45 వరకు బస్సులు లేక విద్యార్థులు, ఉద్యోగులు సమయానికి చేరుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో వారు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

సమయపాలనా.. అదెక్కడ..?

చిత్తూరు-పెనుమూరు మార్గంలో ఉదయం ఐదు గంటలకు మొదటి బస్సు ప్రారంభమవుతుంది. తరవాత 5.30, ఆరు గంటలకు ఇలా ప్రతి అరగంటకు బస్సు బయలు దేరాలి. సిబ్బంది సమయ పాలన పాటించక పోగా ఒక్కోసారి ముందుగానే వెళ్లిపోతున్నారు. దీంతో అనుకున్న సమయానికి చేరుకోలేక పోతున్నామని ప్రయాణికులు చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

పెనుమూరు-చిత్తూరు మార్గంలో అద్దె బస్సులు ఆగిపోతే వాటి స్థానంలో ఆర్టీసీ బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. సమయ పాలన పాటించాలని ఇప్పటికే సిబ్బందిని ఆదేశించాం.
- రూపశ్రీ, మేనేజర్, చిత్తూరు రెండో డిపో

తెదేపా నేత చంద్రశేఖర్‌రాజు హఠాన్మరణం

చంద్రశేఖర్‌రాజు (పాత చిత్రం)

పుత్తూరు, వడమాలపేట: వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం గ్రామానికి చెందిన తెదేపా నేత, పుత్తూరులోని శాంతి థియేటర్ యజమాని పీసీ చంద్రశేఖర్‌రాజు(63) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన మృతికి సర్పంచి మణిరాజు, పలువురు తెదేపా నాయకులు వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన 2024 ఎన్నికల్లో తెదేపా గెలుపునకు కృషి చేశారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

కారును ఢీకొని తీవ్రగాయాలు

పుత్తూరు: పట్టణంలోని వాటర్ ట్యాంకు వీధిలో నివసిస్తున్న జాన్‌నిఖిల్(33) ఆదివారం పిల్లారిపట్టు రోడ్డు వద్ద బుల్లెట్‌పై వస్తూ కారును ఢీకొన్నాడు. గాయపడిన అతడిని తిరుపతికి తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్సై ఓబయ్య తెలిపారు.

న్యాయం జరగడం లేదు

సదుం: మండల ప్రభుత్వ పింఛనుదారుల ఆత్మీయ సమావేశం ఆదివారం సదుంలో జరిగింది. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి నెల హెల్త్ స్కీమ్ పేరిట రూ.300 వసూలు చేస్తున్నా.. న్యాయం జరగడం లేదని వాపోయారు.

వివాహిత అదృశ్యం

బంగారుపాళ్యం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత గత నెల 30న ఇంటి నుంచి వెళ్లి మళ్లీ రాలేదని ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - అటవీశాఖ
రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినం
STATE FOREST MARTYRS DAY
Dt : 10-11-2025
విధి నిర్వహణలో అసువులుబాసిన అటవీ అమరవీరులకు మీకిదే మా అశ్రునయన భాష్పాంజలి... ఇట్లు
Forest Range Office Staff - Puttur
Tirupati (Dist)

(c) eenadu

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు

రాష్ట్రస్థాయికి తీర్థం విద్యార్థిని ఎంపిక

లోకేశ్వరి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని లోకేశ్వరి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని లక్ష్మీపతి తెలిపారు. విజయనగరంలో ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-19 ఖోఖో పోటీల్లో లోకేశ్వరి తలపడనున్నట్లు వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు, పాఠశాల కమిటీ ఛైర్మన్ మోహన్, గ్రామ పెద్దలు గోవిందస్వామి, రమేష్, శ్రీనివాసమూర్తి విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

పలమనేరు, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని విద్యార్థుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన 50 దుప్పట్లను పంపిణీ చేశారు.

అంకిశెట్టివీధిలో పారిశుద్ధ్య పనులు

స్పందనకు వందనం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని అంకిశెట్టివీధిలో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ సిబ్బంది ఆదివారం చేపట్టారు. కాలువలు అధ్వానంగా ఉన్నాయని 'ఈనాడు'లో మేమున్నాం మీకు తోడుగాలో వార్త రావడంతో అధికారులు స్పందించారు.

మొక్కకు నీరు పోస్తూ..

కుంకీ ఏనుగుల విన్యాసాలు చిత్రీకరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ❖ ఏనుగుల ఆశీర్వాదం తీసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

కుంకీల విన్యాసాలు ఆసక్తిగా తిలకించి

పలమనేరు, న్యూస్‌టుడే: మండలంలోని ముసలిమడుగులో కుంకీ ఏనుగుల శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదివారం సందర్శించారు. ఏనుగుల విన్యాసాలను ఆసక్తిగా తిలకించి వాటి పనితీరు.. అడవి ఏనుగుల కట్టడికి ఎలా ఉపయోగిస్తున్నారనే సమాచారాన్ని అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే, పీసీసీఎఫ్ చలపతిరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్‌డూడి పాల్గొన్నారు.

కంకర తేలి.. గుంతలమయమై..!

▶ గ్రామీణ రోడ్ల మరమ్మతులో జాప్యం
▶ ప్రజలకు తప్పని అసౌకర్యం

శాంతిపురం, పుంగనూరు, న్యూస్‌టుడే: కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామీణ రహదారులు ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోలేదు. ఏటా వర్షాలకు కంకర తేలి.. ఇరువైపులా మట్టి కోసుకుపోయి ముళ్ల బాటలను తలపిస్తున్నాయి. కంకర, ఇసుక, మట్టి తరలింపు లారీలు, టిప్పర్లు టన్నులకొద్దీ బరువుతో రాకపోకలు సాగిస్తున్నందున రోడ్లు రూపుకోల్పోతున్నాయి.

కుప్పం నియోజకవర్గం.. గుడుపల్లె మండలంలోని.. కుప్పం-పలమనేరు జాతీయ రహదారి నుంచి నలగాంపల్లె, కప్పలనత్తం మీదుగా కుప్పం-గెసికపల్లె మార్గం వరకు సుమారు 4 కి.మీ. బీటీ రోడ్డు కంకర తేలి ముళ్లబాటను తలపిస్తోంది. ఈ దారిలో రాకపోకలు సాగించేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు.

పుంగనూరు నియోజకవర్గంలో రాగానిపల్లె బీటీ రహదారి గుంతలమయమైంది. సుమారు 3 కి.మీ. పరిధి రోడ్డు కనీస మరమ్మతుకు నోచుకోలేదు. వర్షాలకు గుంతల్లో నీరు నిలుస్తోంది. దీంతో ప్రయాణాలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లద్దిగం, బోయకొండ, వనమలదిన్నెతో పాటు సోమల మండలంలోని పెద్ద ఉప్పరపల్లె గ్రామీణ రహదారులు దాదాపు 50 కి.మీ. మేర దెబ్బతిన్నాయి.

వైకాపా పాలనలో నిర్లక్ష్యం

ఐదేళ్ల వైకాపా పాలనలో రహదారుల బాగుకు ఆ పార్టీ నాయకులు చొరవ తీసుకోలేదు. ఫలితంగా గ్రామీణ రోడ్లు దుస్థితికి చేరాయి. కనీసం తట్టెడు మట్టి వేయకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి పాలనలో రోడ్ల మరమ్మతులకు నిధులు కోరుతూ ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీటీ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని హెచ్‌పీ రోడ్డు గుంతలమయమై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. – గజేంద్ర, కుప్పం
సమాధానం: గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు చేయిస్తాం. – శ్రీనివాసరావు, కమిషనర్

పుంగనూరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణ పరిధిలోని నక్కబండ కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. – నజీర్, నక్కబండ
సమాధానం: వీధి దీపాలకు మరమ్మతు చేయిస్తాం. – మహేష్, డీఈఈ

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సమస్య: లక్ష్మీనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద పంచాయతీ తాగునీటి పైపులైను దెబ్బతిని నీరు వృథా పోతోంది. – స్థానికులు
సమాధానం: తాగునీటి సరఫరా పైపులైను మరమ్మతు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం. – ప్రభావతి, కార్యదర్శి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమస్య: పూజగాని పల్లె-నేతిగుట్లపల్లె మధ్య దారి అధ్వానంగా మారింది. – సుబ్రహ్మణ్యం, నల్లగుట్లపల్లె
సమాధానం: పరిశీలించి రోడ్డు బాగు చేయిస్తాం. – జగదీష్‌కుమార్, కార్యదర్శి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమస్య: గుడిసెబండలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. – నాగరాజు, గుడిసెబండ
సమాధానం: గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. – లోకేష్, కార్యదర్శి

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని సూరప్ప వీధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. – స్థానికులు
సమాధానం: సిబ్బందిని పంపి పనులు చేయిస్తాం. – ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

మైనార్టీల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

పుంగనూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెదేపా పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అంజుమన్ జామియత్ ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక మసీదులకు స్థలాల క్రమబద్ధీకరణ పత్రాలు, పలమనేరులో విద్యుత్ మిస్త్రీ ఆత్మహత్యకు పాల్పడటంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రూ.6 లక్షల ఆర్థిక సాయం, మూడు సెంట్ల భూమి పట్టా ఇచ్చి ఆదుకున్నట్లు చెప్పారు. అనంతరం బోడినాయునిపల్లెలో రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఏఎంసీ ఛైర్మన్ సమీవుల్లాయాదవ్, నాయకులు ఇబ్రహీం, షామీర్, సుహేల్‌బాషా పాల్గొన్నారు.

మతపెద్దలకు పత్రాలు అందిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కంచుకోటకు పూర్వవైభవం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వి.కోట, న్యూస్‌టుడే: అంతరాష్ట్ర సరిహద్దు కూడలిలోని వి.కోట తెదేపా కంచుకోట అని ఇక్కడ తిరిగి పూర్వ వైభవం తీసుకురావడానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కల్యాణ మండపంలో మండల కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెదేపా కార్యకర్తలు, నాయకులు క్రమశిక్షణకు మారుపేరన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పని చేయాల్సి ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌బాబు, బాలాజీ, రంగనాథ్, రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

నేత్రాలు జాగ్రత్తగా కాపాడుకోవాలి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: జ్ఞానేంద్రియాల్లో ప్రధానమైన నేత్రాలను ప్రజలు జాగ్రత్తగా కాపాడుకోవాలని చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రి వైద్య నిపుణులు మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మిషన్ ఫర్ విజన్ ట్రస్టు, ఆరోగ్య సేవా సంస్థ సహకారంతో చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు 42 మందికి పరీక్షలు జరిపారు.. 26 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించిందని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ వరదారెడ్డి తెలిపారు. ప్రతి నెల రెండో ఆదివారం ఇక్కడ నేత్ర సమస్యలపై పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు అవసరమైన వారిని మదనపల్లెలోని లయన్స్ కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. నాయకులు బాలసుబ్రహ్మణ్యం, ముత్యాలు, సుదాకర్, ఇనాయతుల్లా పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యుడు అనిల్

తెదేపా మండల అధ్యక్షుడిగా రాంబాబు

వి.కోట, న్యూస్‌టుడే: వి.కోట మండల తెదేపా అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు రాంబాబును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్‌గౌడు, బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా దామోదరం, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా నాసిర్, మహిళా అధ్యక్షురాలిగా సుకన్యతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

నూతన కమిటీల ప్రమాణ స్వీకారం

పుంగనూరు, న్యూస్‌టుడే: మండలంలోని సుగాలిమిట్ట వద్ద అన్నమయ్య జిల్లా బంజారా సేవా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు బానావత్ చక్రినాయక్ ఆధ్వర్యంలో జిల్లా, మండల కమిటీ నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా అధ్యక్షుడిగా నాగునాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా శంకర్‌నాయక్, కోశాధికారిగా రవీంద్రనాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రెడ్డి నాయక్ ఇతర కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. నాయకులు రాంబాబు నాయక్, చౌహాన్, వెంకటరమణనాయక్, రామచంద్రనాయక్ పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న నాయకులు

పంటలపై ఆగని ఏనుగుల దాడులు

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పంటలపై ఏనుగుల గుంపు బీభత్సం సృష్టిస్తోంది. శనివారం రాత్రి కమ్మపల్లె పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లెకు చెందిన మనోజ్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రామిరెడ్డి, సిద్ధారెడ్డి పొలాల్లో పడ్డ ఏనుగులు వరి, మామిడి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: బండ్లపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం శ్రీసరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ తెలిపారు.

నిర్మాణం చేపట్టారు.. వదిలేశారు

పుంగనూరు మండలం రాంపల్లెలో గత ప్రభుత్వం నాడు-నేడులో భాగంగా పాఠశాలలో భవన నిర్మాణం చేపట్టారు. పూర్తి చేయకనే వదిలేయడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. రాంపల్లె ప్రాథమిక పాఠశాలలో 105 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మూడు గదులు మాత్రమే ఉండటంతో.. ఉపాధ్యాయులు రెండు తరగతులను వరండాల్లో కూర్చొబెట్టి బోధిస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో నటరాజరెడ్డిని వివరణ కోరగా.. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడతామని పేర్కొన్నారు. - **న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ**

ఆక్రమణలు తొలగించరూ

పుంగనూరులోని వారపు సంతకు వెళ్లే మార్గంలో రోడ్డుపై వ్యాపారాలు సాగించకుండా ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఇరుకైన మార్గంలో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడంతో.. సంతలోకి, ఆ ప్రాంతంలోని నివాస గృహాల వెళ్లే వారు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక దుకాణాలను తొలగించాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, పుంగనూరు**

స్పందించి.. కాస్త రోడ్డు వేయండి

పట్టణ సమీపంలోని గూడూరుపల్లె లేఅవుట్‌లో సీసీ రోడ్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీ ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా సీసీ రోడ్లు, కాలువల సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. మట్టి రోడ్లు కావడంతో వర్షాకాలం బురద, వేసవిలో దుమ్మురేగుతోందని తెలిపారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, పుంగనూరు**

ప్రైవేటుకే ఆర్టీసీ బస్టాండు..!

గుడుపల్లె ఆర్టీసీ బస్టాండు అలంకారప్రాయంగా మారింది. రూ.20లక్షలతో నిర్మించిన బస్టాండులోకి ఆర్టీసీ బస్సులు వెళ్లకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. మండల కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ప్రధాన రహదారిపై బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. గుడుపల్లె-కర్ణాటక మధ్యలో రాకపోకలు సాగించే ప్రైవేటు బస్సులు మాత్రమే ఆర్టీసీ ప్రాంగణంలోకి వెళ్తున్నాయి. సదరు బస్టాండు ఆర్టీసీకి చెందినదా..? ప్రైవేటుకు ఇచ్చేశారా..? అన్న సందేహం కలుగుతోందని స్థానికులు అంటున్నారు. - **న్యూస్‌టుడే, కుప్పం**

వినియోగించుకుంటే.. సంపదేగా..?

రూ.లక్షలు వ్యయం చేసినా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. సంపద సృష్టించేందుకు ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు గుడుపల్లెలో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఎంతో ఉన్నతాశయంతో ఉపాధి హామీ నిధుల కింద రూ.పది లక్షలు వ్యయం చేసి నిర్మాణాలు చేపట్టారు. చెత్తను కేంద్రాలకు తరలించకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది. - **న్యూస్‌టుడే, గుడుపల్లె**

టెర్రాకోట బొమ్మల బహూకరణ

పలమనేరు, న్యూస్‌టుడే: మండలంలోని ముసలిమడుగు కుంకీ ఏనుగుల శిబిరాన్ని సందర్శించడానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అభిమానులు టెర్రాకోట బొమ్మలను బహూకరించారు. ఈ ప్రాంత రైతుల ఇబ్బందులను తొలగించడానికి కుంకీ ఏనుగులను తెప్పించడంతో దానికి గుర్తుగా టెర్రాకోట కళాకారులు తయారు చేసిన ఏనుగు బొమ్మలను అందజేశారు.

డిప్యూటీ సీఎంను కలిసిన రమణ

పుంగనూరు, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆదివారం పలమనేరు పర్యటనలో పుంగనూరు సింగిల్ విండో ఛైర్మన్, జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి పగడాల రమణ కలిశారు. రైతులను ఆదుకోవడానికి తీసుకుంటున్న చర్యలపై రైతులు హర్షిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

పవన్ పర్యటనలో మహిళకు గాయాలు.. పలమనేరు, న్యూస్‌టుడే: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటనలో హేమ అనే మహిళ గాయపడ్డారు. ఆదివారం కుంకీ ఏనుగుల శిబిరానికి పవన్‌కల్యాణ్ రావడంతో చూడటానికి వచ్చిన మహిళ జనం తాకిడికి కిందపడ్డారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.

పశుగ్రాసం కొరత.. రైతన్నకు వెత

యంత్రాల వినియోగంతో గడ్డి వృథా

పుంగనూరు, న్యూస్‌టుడే: వ్యవసాయంలో యాంత్రీకరణ నేపథ్యంలో సాగు ఖర్చులు తగ్గించడానికి యంత్రాలు ఉపయోగిస్తున్నా పాడిరైతులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. రైతులు వరి కోతకు వచ్చిన సమయంలో యంత్రాల ద్వారా నూర్పిడి చేస్తుడంటంతో పశువులకు గడ్డి దొరకని పరిస్థితి ఉంటోంది. గడ్డిని పొలంలోనే ట్రాక్టర్లతో తొక్కించడం.. యంత్రాలు వినియోగంతో గడ్డిలో ఎక్కువ భాగం వృథా అవుతుండటంతో కొరత వస్తోంది.

జిల్లాలో ఎక్కువ శాతం రైతులు పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడ్డారు. పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 6 లక్షల పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు ఉన్నాయి. దాణా ఇతర పోషక పదార్థాల ధరలు పెరగడంతో పశుపోషకులు వరిగడ్డి కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సాధారణంగా ట్రాక్టర్ లోడ్ గడ్డి రూ.5 వేల నుంచి రూ.6 వేలు ఉంది. ప్రస్తుతం స్థానికంగా రూ.9 వేల నుంచి 10వేలు ఉంటోంది. అదే శ్రీకాళహస్తి, నాయుడుపేట ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాలంటే రూ.15వేల నుంచి రూ.16వేలు వెచ్చించాల్సి వస్తోందని రైతుల ఆవేదన చెందుతున్నారు. ఎగుమతులు, దిగుమతులు, రవాణా ఖర్చులు ఎక్కువ కావడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

పుంగనూరు, పలమనేరు, కుప్పంలో రైతన్నలను ఆదుకోవడానికి పశుగ్రాస క్షేత్రాల పెంపకానికి చేయూత ఇవ్వాలి, దాణా, మేలైన పశుగ్రాస విత్తనాలు రాయితీ ధరలకు అందించాలని రైతన్నలు కోరుతున్నారు. ప్రస్తుతం ఒక్కో పశువుకు రోజుకు నాలుగైదు కిలోల గడ్డి తప్పనిసరి కావడంతో ఒక్కో పశువుకు రూ.100లు వెచ్చించి కొనుగోలుచేస్తున్నామని రైతులు వాపోతున్నారు.

ప్రైవేటీకరణ వద్దు

పుంగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా నెలకొల్పుతున్న మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయరాదని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని వైకాపా చేపడుతున్న కోటి సంతకాల గోడప్రతులను ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 12న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప, నాయకులు అనీషారెడ్డి, శ్రీనాథరెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయ కమిటీ ఎంపిక

వి.కోట: మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయానికి నూతన పాలకవర్గాన్ని పుర ప్రజలు ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన ధర్మకర్తగా రఘుపతి, సహ ధర్మకర్తలుగా కృష్ణారెడ్డి, నరహింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జగన్మోహన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రమేష్, జనార్దన్, బాలాజీతో పాటు పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

న్యాయం జరగడం లేదు

సదుం, న్యూస్‌టుడే: మండల ప్రభుత్వ పెన్షన్‌దారుల ఆత్మీయ సమావేశం ఆదివారం సదుంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి నెల హెల్త్ స్కీమ్ పేరిట రూ.300 వసూలు చేస్తున్నా.. న్యాయం జరగడం లేదని వాపోయారు. పెన్షన్‌దారులు నటరాజ, రాజారెడ్డి, కృష్ణారెడ్డి, మల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్తయిన భవనాలకు మోక్షమెప్పుడో..?

✦ అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలు

రామకుప్పం, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాలకు మోక్షం కలగడం లేదు. వీటికి గతంలో నిధులు మంజూరైనా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడంలో జాప్యం ఏర్పడుతోంది. ఇప్పటికే కొన్ని చోట్ల పనులు పూర్తయ్యాయి. కొన్ని కేంద్రాలకు సొంత భవనాలు లేక సామాజిక కేంద్రాలు, అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి.

కుప్పం నియోజకవర్గం పరిధిలో మొత్తం 428 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వాటిలో 228 పక్కా భవనాలున్నాయి. 100 అద్దె భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. మరో వంద కమ్యూనిటీ భవనాల్లో కొనసాగుతున్నాయి. అసంపూర్తి పనులతో 20కు పైగా భవనాలున్నాయి. ఈ భవనాలు అందుబాటులోకి వస్తే స్థానికంగా ఇబ్బందులు తప్పుతాయని ప్రజలు పేర్కొంటున్నారు.

రామకుప్పంలో ప్రారంభానికి నోచుకోని భవనం

త్వరలో అందుబాటులోకి..

ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న భవనాలకు సంబంధించి అవసరమైన నిధులపై ఉన్నతాధికారులకు నివేదించాం. ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పూర్తి చేశారు. మిగిలిన వాటిని త్వరలో అందుబాటులో తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.
- **కల్పన, సీడీపీవో, శాంతిపురం**

ఆదమరిస్తే ప్రమాదమే

మండలంలోని చెన్నపట్నండ్యాం వయా మేటిమంద-కందూరు మార్గంలో కొత్తపల్లె వద్ద మూడేళ్ల కిందట కల్వర్టు నిర్మించేందుకు గాడి తవ్వారు. నిర్మాణం చేపట్టకనే అలాగే వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతలో నీరు నిల్వ ఉండటంతో మరీ ప్రమాదంగా మారింది. వాహదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కల్వర్టు నిర్మించేందుకు చొరవ తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.
- **న్యూస్‌టుడే, సోమల**

శిథిల భవనం.. సిబ్బందికి గండం

పెచ్చులూడుతున్న భవనం కింద విధుల్లో విద్యుత్తు సిబ్బంది

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలు వర్షాలకు ఉరుస్తున్నాయి. కొన్ని భవనాల్లో పైకప్పు పెచ్చులూడటంతో సిబ్బంది భయం.. భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. పట్టణంలోని విద్యుత్తు కార్యాలయంలో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కూర్చోవాల్సిన పరిస్థితి. పైగా రికార్డులు, కంప్యూటర్లు తడవకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పడం గమనార్హం. అధికారులు ఈ పరిస్థితి చూస్తున్నా మరమ్మతు చేయడానికి చొరవ చూపడం లేదు.

వీటి పరిస్థితి అంతే..

పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం, ఏడీ భవనం కూడా ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో ఉన్నాయి. ఒక గది గోడ పునాదుల నుంచి బీటలు వచ్చాయి. అందులోనే సిబ్బంది ఓ మూలన కూర్చుని విధులు నిర్వర్తిస్తున్నారు. భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించినట్లు విద్యుత్తు రెవెన్యూ సబ్ డివిజన్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

(c) eenadu

ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం నవంబరు 10, 2025

షికారు.. ఉత్సాహం జోరు

కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రంలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. పిల్లలు, పెద్దలు, విద్యార్థులు చెక్కల వంతెనలపై నడుచుకుంటూ మడ అడవులను సందర్శించారు. ఊయల ఊగుతూ, జారుడు బల్లలపై జారుతూ ఉల్లాసంగా గడిపారు. సముద్ర మొగ వరకు ఏడు నిమిషాల పాటు స్పీడ్ బోటులో కొందరు పర్యాటకులు షికారు చేశారు.

-న్యూస్‌టుడే, తాళ్లరేవు

కాళికల రూపం రౌద్ర విన్యాసం

అమలాపురం వాసర్ల గార్డెన్స్‌లో ఆదివారం కోనసీమ శెట్టిబలిజ కార్తిక వనసమారాధన నిర్వహించారు. పిల్లలు, మహిళలకు నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. సంగీత విభావరి, బోనాల నృత్యప్రదర్శనలు అలరించాయి. పలు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

-న్యూస్‌టుడే, కోనసీమ

శ్రీమంతుల ఊరు.. వేళంగి దాని పేరు

ఈ ఊరిలో ఏ ఇంటిని చూసినా అరెకరా నుంచి ఎకరా విస్తీర్ణంలో రాజభవంతులను పోలి ఉంటాయి. చాలావరకు స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించినవే ఉంటాయిక్కడ. వీటన్నింటికీ కాకినాడ జిల్లా కరప మండలంలోని వేళంగి గ్రామం నిలయంగా ఉండడం ప్రత్యేకత.

ఓ నివాసం లోపల కలపతో ఇలా..

ఈ గ్రామంలో దాదాపు అంతా 100 ఎకరాలు పైబడిన భూస్వాములే ఉంటారు. గతంలో ఇక్కడి ప్రజలు ఎక్కువగా వడ్డీ వ్యాపారాలు చేస్తుండేవారు. తాము సంపాదించిందంతా భూములు కొనేందుకు, విశాల గృహ నిర్మాణాలకే వెచ్చించడంతో ఊరే ప్రత్యేకమైంది. ప్రస్తుతం మాత్రం ఆయా ఇళ్లను పనివాళ్లకు, భూములను కౌళ్లకు ఇచ్చి.. యజమానులంతా ఇతర నగరాల్లో ఉంటున్నారు. దసరా, సంక్రాంతిలాంటి ప్రధాన పండగలకు వచ్చి వెళ్తుంటారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో జాతిపిత మహాత్మా గాంధీ ఇక్కడకు వచ్చి బస చేసిన నివాసం గ్రామంలో ఇప్పటికీ పదిలంగా ఉండటం విశేషం.

- ఈనాడు, కాకినాడ
న్యూస్‌టుడే, కరప

మహాత్మా గాంధీ సేదతీరిన నివాసం

తక్కువ బరువు.. నాణ్యత కరవు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

లబ్ధిదారులకు పంపిణీ చేసే గుడ్లు తీరిది..

- అంబాజీపేట మండలం నందంపూడి గురుకుల పాఠశాలలో ఆహార కమిటీ సభ్యులు తనిఖీలు చేసే సమయంలో దుర్వాసనతో కూడిన కోడిగుడ్లు గమనించారు. వెంటనే వాటిని పారబోయించారు.
- అమలాపురం పట్టణం పరిధిలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతకు ఇచ్చిన గుడ్డు ఉడకబెట్టేందుకు ప్రయత్నించగా వాటి నుంచి దుర్వాసన రావడంతో ఫిర్యాదు చేశారు.
- అల్లవరం మండలంలోని ఓ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకంలో విద్యార్థులకు నాసిరకం గుడ్లు పెడుతున్నారనే సమాచారంతో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు వెళ్లి నిలదీశారు.

పరిశీలన

అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు సరఫరా చేస్తున్న కోడి గుడ్లు నాణ్యత, బరువులో తేలిపోతున్నాయి. గత ప్రభుత్వంలో లోపాలను అధిగమించేందుకు కూటమి అధికారంలోకి వచ్చాక ఏకీకృత టెండర్ విధానాన్ని అమలు చేస్తోంది. జిల్లాలోని అన్ని విభాగాలకు ఒకే గుత్తేదారు నుంచి సరఫరా జరిగితే నాణ్యతలో తేడాలు ఉండవనే భావనతో ఈ విధానం తెచ్చారు.

అల్లవరం మండలం పరిధిలో లబ్ధిదారునికి పోషకాహారం అందిస్తున్న కార్యకర్త

తూకంలో తేలిపోతూ..

ప్రభుత్వ విభాగాలకు సరఫరా చేసే గుడ్లు 45 నుంచి 52 గ్రాముల వరకు ఉండాలనేది నిబంధన. ఒక ట్రేలో ఉండే 30 గుడ్లు కలిపి 1.5కేజీల బరువు ఉండాలి. వాస్తవానికి చాలాచోట్ల 1.2 కేజీలకు దాటడం లేదు. విడివిడిగా బరువు తూస్తే 35 నుంచి 40 గ్రాములు మాత్రమే ఉంటున్నాయి. గుత్తేదారులు అధిక బరువు ఉన్న వాటిని మార్కెట్‌కు తరలించి, చివరి గ్రేడ్ ప్రభుత్వ విభాగాలకు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులను వివరణ కోరగా నాణ్యతలేని, బరువు తక్కువ ఉన్నవాటిని తక్షణం వెనక్కి పంపిస్తున్నట్లు చెబుతున్నారు.

గుడ్ల వివరాలు ఇవీ (లక్షల్లో)

విభాగం	నెలకు
పాఠశాలలు	18.72
అంగన్‌వాడీలు	17.50
గురుకులాలు	3.26
సాంఘిక సంక్షేమ	0.66
బీసీ వసతి గృహాలు	0.21

నెలకు రూ.2.60 కోట్లు

జిల్లాలో 1,726 అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరు గురుకుల పాఠశాలలు, 1,585 ప్రభుత్వ బడులు, 22 బీసీ, 33 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు రెండు లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారు. ఒక్కొక్కరికి నెలకు 25 గుడ్లు చొప్పున ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. వీటికి ప్రతి నెలా 40.35 లక్షల గుడ్లు సరఫరా చేయాల్సి ఉంది. ఒక్కొక్క గుడ్డుకు రూ.6.45 చొప్పున గుత్తేదారుకు ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.2.60 కోట్లు చెల్లిస్తున్నారు.

అవిగవిగో గోదారి జలాలు..!

పట్టాలెక్కనున్న రూ.1650 కోట్ల పనులు

ధవళేశ్వరంలో భూమిని పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

ఈనాడు, అమలాపురం: చెంతనే గోదారి.. నీటికి మాత్రం చింత. తాగేందుకు బోరుపైనే ఆధారపడుతున్న పల్లెలెన్నో. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్‌తో పాటు.. గోదావరి జలాలు అందించాలన్న లక్ష్యంతో వాటర్‌గ్రిడ్ పథకాన్ని తెరపైకి తెచ్చారు. కానీ వైకాపా హయాంలో దీనిని పూర్తిగా అటకెక్కించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దీనికి ఊపిరినిస్తోంది.

చకచకా భూసేకరణ

ధవళేశ్వరంలో 12 ఎకరాలు జలవనరుల శాఖ భూములు, ఆత్రేయపురంలో 9 ఎకరాలు ఈ పథకానికి సేకరించారు. ఈ నెలాఖరుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేయించే దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండు దశల్లో..

- జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.1,650 కోట్లు ఈ పథకానికి కేటాయించారు. ఈ పనులు రెండు దశలుగా చేపట్టనున్నారు. మొదటి దశలో కోనసీమ, రెండో దశలో ఉమ్మడి జిల్లాలోని గ్రామాలకు జలాలు అందిస్తారు. ధవళేశ్వరం, ఆత్రేయపురం మండలంలోని బొబ్బర్లంక వద్ద ఒక్కో ఆర్ఎస్ఎఫ్ నిర్మించి, దాదాపు 2615 కిమీ మేర పైపులైన్లు వేస్తారు.
- ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 880 గ్రామాలకు స్వచ్ఛ జలాలు అందనున్నాయి. దీని వల్ల ప్రయోజనం పొందే మండలాలు ఎక్కువగా కోనసీమలో ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి, బిక్కవోలు, రాజమహేంద్రవరం గ్రామీణం, కడియం మండలాల్లోని 109 గ్రామాలకు మేలు చేకూరుతుంది. ఉమ్మడి జిల్లాలో 14.16 లక్షల మందికి స్వచ్ఛ జలాలు అందుతాయి.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

ఆత్రేయపురం : కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయం కార్తిక ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. వేలాది మంది స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించాయి. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రక్షణ కవచంపై కడలి ఖడ్గం

అంతర్వేది తీరంపై కడలి ఖడ్గం ఝుళిపిస్తోంది. ఇటీవల మొంథా తుపాన్ ఇక్కడే తీరం దాటడంతో కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడటమే కాకుండా రాత్రి సమయంలో ముందుకు చొచ్చుకు వచ్చి సమీపంలోని పల్లిపాలెం గ్రామాన్ని ముంచెత్తాయి. దీపస్తంభం వద్దకు కెరటాలు దూసుకొస్తున్నాయి. ఉద్యానం సగభాగం, కాంక్రీట్ గోడ, సరుగులు చెట్లు కడలిలో కలిసిపోయాయి. అధికారులు స్పందించి రక్షణగట్టు నిర్మించి లైట్‌హౌస్, సమీప గ్రామాలు, విలువైన భూములను కాపాడాలని అంతా కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

చేప కోసం ఎంతసేపైనా..

ఏదైనా దక్కాలంటే ఎంత ఓపిక, సహనంతో ఎదురుచూడాలో.. ఈ కొంగల్ని చూస్తే అర్థమవుతుంది. వేగంగా ప్రవహించే గోదావరి నీటిలో తేలే, ఒడ్డుకు వచ్చే చేపల్ని వేటాడడానికి ఎంతో ఓర్పుతో అవి వేచి ఉంటున్నాయి. యానాం శివం స్నానఘట్టం సమీపంలోని చేపల వేలం కేంద్రం వద్ద గౌతమి నదిలో బోట్లు నిలిపేందుకు కొబ్బరి కాండాలు ఏర్పాటు చేశారు. కొంగలు వాటిపై వరుసగా కూర్చుని చేపల కోసం ఎదురుచూసే దృశ్యాలు వాటి జీవన నైపుణ్యానికి నిదర్శనం.

-న్యూస్‌టుడే, యానాం

వేరుచేసి ఒత్తిడి పెంచం

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

- ప్రైవేటు పాఠశాలలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- పదో తరగతి పరీక్షలపై డీఈవో షేక్ సలీంబాషా

ముఖాముఖి

పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో వెనుకబడి విద్యార్థులపై మానసిక ఒత్తిడి పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) షేక్ సలీంబాషా తెలిపారు. పదో తరగతి పరీక్షలపై ప్రభుత్వ కార్యాచరణ, ప్రైవేటు పాఠశాలల బాధ్యతలపై ఆయన 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో మాట్లాడారు.

మనమే ముందు ప్రారంభించాం..

జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల నుంచి 12,818, ప్రైవేటు నుంచి 6917 మంది పరీక్షలు రాయనున్నారు. రాష్ట్రంలోనే ముందుగా జిల్లాలో వంద రోజుల ప్రణాళిక ప్రారంభించాం. రోజూ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ నెల 10 నుంచి 19 వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్ష ఉంది. ఇప్పటికే ప్రీ సమ్మేటివ్ పరీక్షలు పూర్తి చేశాం. పీడీ, డ్రాప్టు ఉపాధ్యాయుల సేవలు సైతం వినియోగించుకుంటున్నాం.

తల్లిదండ్రుల సహకారం బాగుంది..

ఉదయం 8 గంటల నుంచి నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యార్థులు పాఠశాలల్లోనే ఉంటున్నారు. ఉదయం గంట, సాయంత్రం గంటన్నర చొప్పున రోజూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు తల్లిదండ్రుల కంటే ఉపాధ్యాయులతో గడిపే సమయమే ఎక్కువ. వీరిని పాఠశాలలకు పంపించడంలో తల్లిదండ్రుల సహకారం బాగానే ఉంది. ఇంటి వద్ద సమయం వృథా చేయడకుండా చదువుకునేలా వారికి సూచిస్తున్నాం.

మెటీరియల్ అందజేత

జిల్లా కామన్ పరీక్షల బోర్డు(డీసీఈబీ) నిపుణులైన సబ్జెక్టు ఉపాధ్యాయులతో ప్రత్యేక మెటీరియల్‌ను తయారు చేసింది. వీటిని విద్యార్థులకు అందజేశాం. వీడియో పాఠాల ద్వారా వారికి అర్థమయ్యేలా బోధన జరుగుతోంది.

ఓ పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈవో

ఆ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ఫార్మెటివ్ అసెస్‌మెంట్ 1, 2 (ఎఫ్ఏ-1, 2) పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు వచ్చిన మార్కులపై క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలన చేస్తున్నాం. గణితం, సైన్సు సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచిస్తున్నాం. వారిని ప్రత్యేకించి వేరు చేయడం వల్ల అభద్రతా భావం పెరుగుతుంది. బాగా చదివే విద్యార్థుల పక్కన ఉంచి మెరుగుపడడానికి చర్యలు తీసుకుంటున్నాం.

అవగాహన అవసరం

పదో తరగతి పరీక్షలంటే విద్యార్థులకు కొంత ఒత్తిడి ఉంటుంది. దీని నుంచి వారు బయట పడేలా పాఠశాలల యాజమాన్యాలు కృషి చేయాలి. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పాటు ఒత్తిడిని జయించే విధంగా అవగాహన కల్పించాలి. వీటిపై ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు సూచనలు ఇస్తున్నాం.

ఈ నష్టానికి బాధ్యులెవరు...?

పంటల బీమాకు రైతులు దూరం

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయానికి విపత్తులు విరుచుకుపడి అన్నదాత కుదేలవుతున్నాడు. వీటి నుంచి ఎంతో కొంత ఉపశమనం పొందడానికి ఉద్దేశించిన పంటల బీమాకు సైతం నోచుకోలేకపోతున్నారు. గతంలో ఉచిత పంటల బీమా అమలు చేసేవారు. ఈ ఏడాది నుంచి రైతుల భాగస్వామ్యంతో బీమా అమలు చేయాలని నిర్ణయించారు. వివిధ కారణాలతో రైతులు ప్రీమియం చెల్లించ లేదు. దీంతో మొంథా తుపాను కారణంగా నష్టపోయినా బీమా పరిహారానికి దూరమయ్యారు.

నేలవాలిన వరిని కట్టలు కడుతున్న రైతు

43,900 ఎకరాలకు మాత్రమే..

జిల్లాలో 1.61 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరిగితే కేవలం 43,900 ఎకరాలు మాత్రమే పంటల బీమా పరిధిలోకి వచ్చాయి. ఎకరాకు రూ.76 చొప్పున స్వల్ప ప్రీమియం చెల్లిస్తే సరిపోయేది. దీనికి ఆగస్టు 15 వరకు మాత్రమే అవకాశం కల్పించారు. ప్రీమియం చెల్లించాలంటే పంట ఈ క్రాప్‌లో నమోదై ఉండాలి. అప్పటికీ ముమ్మరంగా వరినాట్లు సాగడంతో రైతులు గడువులోగా ప్రీమియం చెల్లించలేకపోయారు. ప్రస్తుతం మొంథా తుపాను కారణంగా జిల్లాలో 73 వేల ఎకరాలకు పైగా వరి పంటకు నష్టం వాటిల్లింది. దీంట్లో కేవలం 20-25 వేల ఎకరాల విస్తీర్ణం మాత్రమే బీమా పరిధిలోకి వచ్చింది.

జిల్లాలో పరిస్థితి ఇదీ.. (ఎకరాల్లో..)

ఖరీఫ్ విస్తీర్ణం	1,61,139
మొంథా నష్టం	73,822.22
బీమా ప్రీమియం చెల్లించినది:	43,900

అప్పుడు ముంచిన మిచౌంగ్

2023 ఖరీఫ్ సీజన్‌లో మిచౌంగ్ తుపాను తీవ్ర నష్టం మిగిల్చింది. పంట చేతికొచ్చిన తర్వాత భారీ వర్షాలు, గాలులకు వరి నేలకొరిగి ముంపుబారిన పడింది. జిల్లాలో రైతులకు పెట్టుబడి సాయం మినహా పంటల బీమా పరిహారం నేటికీ అందలేదు. అప్పటి ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రైతులు రూ.కోట్లలో నష్టపోయారు.

చేతి చమురు వదులుతోంది..!

డీజిల్ చోరీలతో వాహనచోదకుల లబోదిబో

న్యూస్‌టుడే, అంబాజీపేట

అంబాజీపేటలో ఆయిల్ దొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రి సమయాల్లో ఆరుబయట నిలిపి ఉంచిన లారీలు, ప్రైవేటు పాఠశాలల బస్సుల నుంచి డీజిల్ చోరీకి పాల్పడుతున్నారు. ఈ చోరీల గురించి యజమానుల గురించి చెప్పినా.. వినడంలేదని ఆ నష్టం తామే భరించాల్సి వస్తోందని కొందరు చోదకులు వాపోతున్నారు.

ఇక్కడే ఎందుకిలా..

అంబాజీపేట నుంచి ఇతర రాష్ట్రాలకు కొబ్బరికాయలు, అరటి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు నిత్యం పెద్దఎత్తున రవాణా అవుతుంటాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భారీ లారీలు, వ్యాన్‌లు అధిక సంఖ్యలో తిరుగుతుంటాయి. వాటిల్లో డీజిల్‌ను ఫుల్‌ట్యాంకు చేయిస్తుంటారు. ఇక్కడ రాత్రి సమయాల్లో నిలుపుదల చేసి మరుసటి రోజు పొరుగు రాష్ట్రాలకు ప్రయాణం సాగిస్తుంటారు.

తొలగించిన లారీ డీజిల్ ట్యాంక్ మూత

భారీగా లాగేస్తూ..

ప్రస్తుతం మార్కెట్‌లో లీటరు డీజిల్ ధర రూ.97 ఉంది. ఒక్కో వాహనం నుంచి 40 నుంచి 50 లీటర్ల మేర దొంగిలిస్తున్నారు. ఇటీవల కె.పెదపూడిలోని కుడిపూడివారిపాలెం వద్ద నిలిపి ఉంచిన ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు, అంబాజీపేటలో ఓ లేఔట్ వద్ద ఉంచిన కొబ్బరి కాయల లోడు లారీ నుంచి ఆయిల్‌ను దొంగిలించారు. మరోచోట ఉంచిన రెండు లారీల నుంచి ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. గ్రామాల్లోనూ చోరీలు జరుగుతున్నాయని వాహన యజమానులు వాపోతున్నారు.

నిఘా పెడతాం

ఇప్పటి వరకు ఫిర్యాదులు అందలేదు. నిఘా ఏర్పాటు చేసి దొంగలను పట్టుకుంటాం. లారీలు, బస్సులను ఆరుబయట నిలిపినప్పుడు డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- రుద్రరాజు భీమరాజు, సీఐ, పి.గన్నవరం

కరకరగా.. రుచికరంగా

న్యూస్‌టుడే, మామిడికుదురు

పొయ్యిలో బాగా వేగిన కాస్తాలను కరకర నములుతూ తింటుంటే ఎంతో రుచి.. వేడి కుండలో వేయించిన రొట్టెలను ఆరగిస్తుంటే ఆ కమ్మదనమే మేరు. 216 జాతీయ రహదారి మీదుగా అమలాపురం నుంచి పాలకొల్లు, నర్సాపురం వైపు వెళ్లే వాహన చోదకులు, ప్రయాణికులు మామిడికుదురు మండలం నగరం గ్రామంలో రహదారి చెంత పలు దుకాణాల్లో విక్రయించే వీటి కోసం ఆగి మరీ రుచులు ఆస్వాదిస్తారు. వాటి మాధుర్యాన్ని తమ కుటుంబ సభ్యులకు రుచి చూపేందుకు ఇళ్లకు తీసుకువెళ్తుంటారు.



పళ్లేల్లోని కాస్తాలను బయటకు తీస్తున్న మహిళ

వంటకం ఇలా తయారీ..

మైదా, పంచదార, కొద్దిగా సెనగపిండి, ఉప్పుతో ముద్దగా చేసిన మిశ్రమాన్ని కాస్తాలు, నాన్‌రోటీలుగా తయారు చేస్తారు. వారం రోజుల పాటు నిల్వ ఉండే వీటిని సరదాగా మాట్లాడుకుంటూ తినడానికి ఎక్కువ మంది ఇష్టపడుతుంటారు. ఇవి పలు రకాల ప్యాకింగ్‌ల్లో స్థానికంగా లభ్యమవుతున్నాయి. కాస్తాలు నాలుగైదు అంగుళాల వరకు పొడవుంటాయి. గుండ్రని నాన్ రోటీలను మటన్ పాయాతో అల్పాహారంగా తినేందుకు మాంసాహార ప్రియులు ఎంతో ఇష్టపడతారు. తియ్యదనం కోరుకునే వారు పంచదారను మైదా మిశ్రమం మధ్యలో పెట్టి వేడి కుండలో వేయించిన రోటీలను చక్కగా లాగించేస్తారు.

ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్తూ..

ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులకు ఇక్కడి నుంచి వీటిని తీసుకువెళ్తుంటారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వెళ్లే వారు ఇక్కడ్నించి కాస్తాలు, నాన్‌రోటీలను తీసుకువెళ్తుంటారు. గల్ఫ్, ఇతర దేశాలకు ప్రత్యేకంగా ప్యాక్ చేసిన కాస్తాలను తీసుకు వెళ్తుంటారు.

నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

అమలాపురం కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గాలు పొందాలని సూచించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

తెలిసిన యువకుడే చంపేశాడు

బాలిక రంజిత కేసులో వీడిన మిస్టరీ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణం త్యాగరాజునగర్‌లో బాలిక చిర్రా రంజిత (10) మృతి కేసులో మిస్టరీ వీడింది. ఆ కుటుంబానికి తెలిసిన ఎలక్ట్రీషియన్, యూట్యూబర్.. రామచంద్రపురం మండలం ఎ.అగ్రహారానికి చెందిన పెయ్యల వీరవెంకట శ్రీనివాస్ హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో అతడిని ఆదివారం సాయంత్రం రామచంద్రపురంలో అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. శవపరీక్ష నివేదిక ప్రకారం బాలిక ముఖం, నోటి భాగంలో గాయాలు ఉన్నాయని, ఊపిరాడక పోవడం వల్ల చనిపోయిందని వెల్లడైంది. హెడ్‌నర్స్‌గా పనిచేస్తున్న చిర్రా సునీత ఈ నెల 4వ తేదీన విధులకు వెళ్లగా, కుమార్తె రంజిత మాత్రమే ఇంట్లో ఉంది. వీరికి పరిచయం ఉన్న వీరవెంకట శ్రీనివాస్ సాయంత్రం 5.20 గంటల సమయంలో బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను దొంగిలించేందుకు ఆ ఇంటికి వెళ్లాడు. ఫ్యాన్ మరమ్మతు చేయడానికి వచ్చానని బాలికకు చెప్పాడు. ఆమెకు అనుమానం రావడంతో తల్లికి ఫోన్ చేసి చెబుతుందేమోనన్న భయంతో చున్నీని బాలిక మెడకి చుట్టి ముఖాన్ని మంచంపై అదిమి పెట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేశాడు. మృతదేహాన్ని చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసి ఆత్మహత్యగా కనిపించేలా చేసి తలుపు లోపల గడియ పడేలా వేసి వెళ్లిపోయాడు. ఏరియా ఆసుపత్రి వద్ద పాప బంధువులు ధర్నా చేస్తున్న సమయంలోనూ శ్రీనివాస్ అక్కడే తిరిగాడు. విజయవాడ నుంచి ఫోరెన్సిక్ బృందం వచ్చినప్పుడు ఇంటి ఎదుట ఉండి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. దర్యాప్తులో పోలీసుల వెంటే తిరుగుతూ తప్పుదారి పట్టించాడు. అప్పుల పాలైన నిందితుడు బంగారం, డబ్బు కోసం వచ్చి బాలికను హత్య చేసినట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. కేసును నాలుగు రోజుల్లోనే ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్, సీఐలు ఎం.వెంకటనారాయణ, పి.దొరరాజు, ఎస్.ఐలు నాగేశ్వరరావు, ఎం.లక్ష్మణ్, జానీ బాషా, సురేష్‌బాబు, హరీష్ పాల్గొన్నారు.

నిందితుడు శ్రీనివాస్

విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా, ముసుగులో నిందితుడు

(c) eenadu

ఊరంతా ఉత్సాహం..

అమలాపురంలోని ఆదివారం గౌడ కార్తిక వనసమారాధన నిర్వహించారు. అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులను సంఘ నాయకులు సత్కరించారు. మహిళలకు మ్యూజికల్ ఛైర్స్, పిల్లలకు ఫ్యాన్సీడ్రెస్ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలు సందడి చేశారు.

– న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

సైకిల్‌పై రయ్.. వ్యాయామానికి సై..

శారీరక, మానసిక ఆరోగ్యానికి మంచి జీవనశైలి అవసరమని జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా అమలాపురం పట్టణంలో ఎస్పీ రాహుల్‌మీనా ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు ఆదివారం 'సైక్లోథాన్ 5కె' నిర్వహించారు. ఎస్పీ కార్యాలయం నుంచి పేరూరు వైజంక్షన్ వరకు వెళ్లి వెనక్కి వచ్చారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్యంపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను ప్రతి నెలా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఏవీఆర్ పీబీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, ఎస్బీ సీఐ పుల్లారావు, ఏఆర్ఐ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

కొంకాపల్లి ప్రధాన రహదారిలో సైకిల్‌పై ఎస్పీ రాహుల్‌మీనా, పోలీస్ అధికారులు

కోనసీమ దర్శిని.. ఆలయాల సందర్శిని

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: కోనసీమలోని వివిధ దేవాలయాలను చుట్టివచ్చేలా రావులపాలెం ఆర్టీసీ బస్టాండ్ నుంచి కోనసీమ దర్శిని సేవలను నిత్యం అందుబాటులో తీసుకువచ్చినట్లు రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్.కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన బస్టాండ్‌లో మాట్లాడుతూ రావులపాలెం నుంచి కోనసీమ పుణ్యక్షేత్ర దర్శనానికి మూడు, ఉత్తరాంధ్ర క్షేత్ర దర్శనాలకు ఒకటి, పంచారామ క్షేత్రాలకు ఒక బస్సు చొప్పున ఆదివారం బయలుదేరి వెళ్లాయన్నారు. కోనసీమ దర్శిని కోసం బస్సులు అవసరమైన ప్రయాణికులు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

రావులపాలెం నుంచి పుణ్యక్షేత్రాలకు బయలుదేరుతున్న బస్సులు

వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం

రాజోలు: శెట్టిబలిజ సంఘ అభివృద్ధికి దివంగత నేత దొమ్మేటి వెంకటరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. తాటిపాక కూడలిలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జాతి ఐక్యతకు ఎనలేని సేవలు చేశారన్నారు. అనంతరం పొదలాడ జీఎస్ గార్డెన్స్‌లో నిర్వహించిన శెట్టిబలిజ వనసమారాధనకు హాజరై మాట్లాడుతూ సంఘీయులు ఐక్యంగా ఉండాలన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, తెదేపా ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, రెడ్డి సుబ్రహ్మణ్యం, సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల రాము, పీఎంఆర్‌కే రెడ్డి, చెల్లుబోయిన రాంబాబు, గుబ్బల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాటిపాక కూడలిలో మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

కాలువల కళకళకు.. కాసుల కటకట

న్యూస్‌టుడే, పి.గన్నవరం

● జిల్లాలో పి.గన్నవరం, ముక్తేశ్వరం, అమలాపురంలో ప్రధాన పంట కాలువలు సుమారు 180 కిలోమీటర్ల మేర ఉన్నాయి. వీటికి అనుసంధానంగా వందల కిలోమీటర్ల మేర పిల్లకాలువలు విస్తరించి ఉన్నాయి. అందులో చాలాచోట్ల వృక్షాలు పేరుకుపోగా, తాజాగా భారీ వర్షాలకు చెట్లు పడిపోయాయి. వీటిని తొలగిస్తేనే ప్రవాహం బాగుంటుంది. కానీ నిధులు ప్రధాన సమస్యగా ఉన్నాయి.

మొంథా తుపానులో వీచిన బలమైన గాలులకు జిల్లాలో అనేకచోట్ల చెట్లు నేలకొరిగాయి. అగ్నిమాపక, విద్యుత్తు శాఖ, పంచాయతీ సిబ్బంది వెంటనే స్పందించి చెట్లను తొలగించారు. చాలాచోట్ల పక్కకు నెట్టేసి ట్రాఫిక్, విద్యుత్తు సరఫరా పునరుద్ధరించారు. కాలువల్లో పడిపోయిన చెట్లను మాత్రం తొలగించలేదు. అలాగే చాలాచోట్ల పడిపోయిన చెట్లను కాలువల్లోకి నెట్టేశారు. ఈ సమస్యపై 'కాలువల్లో చెట్లు.. ఏం చేద్దాం' శీర్షికన ఈ నెల 1న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఒక చెట్టు తొలగించేందుకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతుందని సాగునీటి సంఘాల ప్రతినిధులు అంటున్నారు. రబీ తరువాత కాలువల్లో పూడిక తొలగించిన పనులకు ఇంతవరకు బిల్లులు ఇవ్వలేదని, తమ వద్ద నిధులు లేకపోవడంతో చెట్లు తొలగించలేమని జలవనరులశాఖ అధికారులకు తెలిపినట్లు పి.గన్నవరం సాగునీటి సంఘ అధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణ మూర్తి తెలిపారు. విపత్తుల నివారణ సంస్థ నుంచి నిధులు మంజూరు కోసం జలవనరుల శాఖ అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు ఎదురుచూస్తున్నారు.

వై.వి.పాలెం వద్ద రహదారిపై పడిన చెట్టును కాలువలోకి నెట్టేశారిలా..

రూ.రెండు లక్షలు మంజూరు

కాలువల్లో పడిపోయిన చెట్లను తొలగించేందుకు పి.గన్నవరం, అమలాపురం సబ్‌డివిజన్లకు కలెక్టర్ రూ.రెండు లక్షలు మంజూరు చేశారు. ఈ మొత్తం సరిపోదు. సుమారు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. ముందుగా ఇచ్చిన నిధులతో చెట్లు తొలగించే పనులు చేపడతాం.

- కె.వెంకటేశ్వరరావు, ఈఈ, జలవనరుల శాఖ, గోదావరి మధ్యడెల్టా, అమలాపురం

శ్రీవారి సేవలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారిని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు స్వాగతం పలికి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం వసంత మండపంలో వేదపండితులు శేషవస్త్రం కప్పి వేదాశీర్వచనం చేశారు. స్వామివారి జ్ఞాపికను దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు, తెదేపా నాయకుడు బండారు సంజీవ్ అందజేశారు. తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, లొల్ల సర్పంచి కాయల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో, ఛైర్మన్ తదితరులు

ఆలయాభివృద్ధికి భక్తుడిలా కృషి..

ఆలయ అభివృద్ధికి ఒక భక్తుడిగా తనవంతు కృషి చేస్తానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు విలేకరులకు తెలిపారు. ఉత్తరాంధ్ర నుంచి 20 శాతం మందికిపైగా భక్తులు ఇక్కడికి వస్తున్నారన్నారు. ఆలయానికి వెళ్లేందుకు ప్రత్యేక వాహనాలు వేయించాలని కొంత మంది భక్తులు కోరారని, ఈలోగా స్త్రీశక్తి పథకం రావడంతో ఇబ్బందులు తప్పాయన్నారు. దేవాలయానికి ఏటా రూ.35 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు ఆదాయం రావడం చూస్తే భక్తుల తాకిడి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇక్కడి స్వామివారు ఎర్రచందనం కొయ్యతో ఉద్భవించిన తీరు మంత్రముగ్ధులను చేసిందన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి జూడో పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ జూడో 69వ ఛాంపియన్‌షిప్ అండర్-17 బాలబాలికల పోటీలు కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో ఈ నెల 7న ప్రారంభమై ఆదివారంతో ముగిశాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు సుధారాణి, శ్రీనివాసరావు తెలిపారు. బాలుర విభాగంలో అనంతపురం జిల్లా ప్రథమ స్థానం, కృష్ణా జిల్లా ద్వితీయ స్థానం, కర్నూలు జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. బాలికల విభాగంలో అనంతపురం జిల్లా ప్రథమ స్థానం, చిత్తూరు జిల్లా ద్వితీయ స్థానం, గుంటూరు జిల్లా తృతీయస్థానంలో నిలిచాయన్నారు. ఈ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథులుగా కాకినాడ రూరల్ మండల విద్యాశాఖాధికారి టీపీఎస్ రంగారావు, ఎంఈవో-2 శ్రీనివాసకుమార్, డీఎస్‌డీవో సతీష్‌కుమార్ హాజరై విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం జూడో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా పీఈటీ సంఘం కార్యదర్శి మాచరరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, సీనియర్ పీడీ, హాకీ కోచ్ రవిరాజు, పీడీలు గిరి, ప్రసాద్‌రెడ్డి, మూర్తి, శ్రీహరిరాజు పాల్గొన్నారు.

బాలుర విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన అనంతపురం జట్టు

బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన చిత్తూరు జట్టు

అంతర్వేదిలో పోటెత్తిన భక్తజనం

అంతర్వేది: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తిక మాసం ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్థానిక బీచ్‌లో ఉల్లాసంగా గడిపారు.

అంతర్వేది ఆలయంలో భక్తులు

దీపకాంతుల్లో అభయహస్తుడు

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. పరిసరాలు, క్యూలైన్లు కిటకిటలాడాయి. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. వివిధ రుసుముల ద్వారా రూ.5,36,220 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

సిద్ధివినాయకస్వామి

గణపతి దర్శనానికి బారులుదీరిన భక్తులు

భీమేశ్వరాలయంలో నివేదన సమయం కుదింపు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో నివేదన సమయాన్ని అరగంట కుదిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో ఏపీ దుర్గాభవాని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు నివేదనకు ఆలయ తలుపులు మూసివేస్తామని చెప్పారు. వర్తమానంలోనూ మధ్యాహ్నం సమయంలో నివేదన కోసం అధిక సమయం భీమేశ్వరాలయాన్ని మూసివేయడంపై భక్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆదివారం దూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు నివేదన కోసం తలుపులు మూసివేయడంతో ఒక భక్తుడు దేవాదాయ శాఖ మంత్రికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. మంత్రి ఆదేశాలతో ప్రాంతీయ సంయుక్త కమిషనరు వేంద్ర త్రినాధరావు ఆదివారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించారు. భక్తుల నుంచి వస్తున్న వినతుల మేరకు నివేదన సమయం తగ్గించేందుకు అర్చకులతో మాట్లాడారు. దీని ప్రకారం 12 గంటల వరకు దర్శన టిక్కెట్లు విక్రయించి వారిని 1 గంట వరకు దర్శనాలకు అనుమతించాలని, తిరిగి ఆలయాన్ని 2.30 గంటలకు తెరవాలని నిర్ణయించారు. జిల్లా సహాయ కమిషనరు సత్యనారాయణ, ముఖ్య ఉత్సవ నిర్వహణాధికారి కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాడపల్లి క్షేత్రంలో నేటి పూజలు

● కోనసీమ తిరుమల వాడపల్లిలో సోమవారం ఉదయం 5 గంటలకు ప్రభాతసేవ, మేలుకొలుపు, వేంకటేశ్వర సహిత లక్ష్మీఐశ్వర్య హోమం, ద్రవిడ వేదపారాయణం, నివేదన. ● 6 గంటలకు గోపూజ, అష్టోత్తర నామార్చన పూజలు, దర్శనాలు ప్రారంభం. 11 గంటలకు నిత్య కల్యాణం, 12 గంటలకు అర్చన. ● మధ్యాహ్నం 1 గంట నుంచి విరామం, సాయంత్రం 4 నుంచి మళ్లీ దర్శనాలు ప్రారంభం. ● 6 గంటలకు అర్చన, రాత్రి 7.30 గంటలకు నైవేద్యం. ● 8 గంటలకు పవళింపు సేవ.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

సైబర్ నేరాల్లో ప్రైవేటు ఉద్యోగుల ప్రమేయం

ఈనాడు, రాజమహేంద్రవరం : తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఛేదించిన అతిపెద్ద సైబర్ నేరాల్లో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 81 మందిని అరెస్టు చేయగా, అందులో రాష్ట్రానికి చెందిన 10 మందిలో ఇద్దరు జిల్లాకు చెందినవారున్నారు. రాజమహేంద్రవరంలోని బంధన్ బ్యాంక్ మేనేజర్ సత్తిరాజు దత్తాత్రేయ నేరగాళ్ల అనధికారి ఆర్థిక లావాదేవీలకు సహకారం అందినట్లు గుర్తించారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన నదికొల్ల సురేష్‌కుమార్, ఐటీ హెచ్‌ఆర్‌గా విధులు నిర్వర్తిస్తూ సైబర్ నేరాలకు సహరించినట్లు నిర్ధారించి అరెస్టు చేశారు.

రెవెన్యూ కాకినాడ జిల్లా జట్టు ప్రతిభ

కాకినాడ కలెక్టరేట్: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్) 7వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా జట్లు ప్రతిభ చూపాయి. ఈ నెల 7, 8, 9 తేదీల్లో అనంతపురంలో నిర్వహించిన పోటీలకు జిల్లానుంచి 60 మంది రెవెన్యూ ఉద్యోగులు వివిధ క్రీడాంశాల్లో ప్రాతినిధ్యం వహించారు. జిల్లా జట్లు ప్రతిభచూపి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచాయి.

ఆయుష్ పోసేవారేరీ..? కేంద్రాలకు తాళాలు

వైద్యులు లేక రోగుల అవస్థలు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: భారతీయ సంప్రదాయ వైద్యం ప్రజలకు దూరమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఆయుష్ శాఖను ఏర్పాటుచేసి హోమియోపతి, ఆయుర్వేదం, యునాని వంటి వైద్య సేవలను అందులో చేర్చింది. అప్పట్లో ఆయుష్ శాఖకు నిధులు కేటాయింపుతో పాటు ఆసుపత్రులు ఏర్పాటుచేశారు. వైద్యుల నియామకంతో పాటు అన్ని మందులు సరఫరా అయ్యేవి. ప్రజల్లో హోమియో వైద్యంపై ఆసక్తి పెరిగిన దశలో వైద్య సేవలు మొక్కుబడిగా మారుతున్నాయి. ఆసుపత్రులకు వెళితే వైద్యులు అందుబాటులో ఉండడం లేదు.

కోనసీమ జిల్లాలో హోమియో ఆసుపత్రులు 13, ఆయుర్వేద ఆసుపత్రులు 9 ఉండగా వీటి పరిధిలో అయిదు కేంద్రాల్లో వైద్యుల కొరత నెలకొంది. జిల్లావ్యాప్తంగా 22 మంది సిబ్బంది ఉండాలి. అయితే 10 మందే విధులు నిర్వహిస్తున్నారు. కొంతమంది వైద్యులు రెండు వైద్యశాలల్లో సేవలందిస్తున్నారు. దీంతో ఆసుపత్రులకు వచ్చేవారికి సకాలంలో వైద్యం అందడంలేదు. సిబ్బంది రెండు, మూడు ఆసుపత్రుల్లో విధులు నిర్వహించాల్సి రావడంతో పూర్తిస్థాయిలో పనిచేయలేకపోతున్నారు. పాశర్లపూడి, అంబాజీపేట, తాటిపాక, కేశనకుర్రు ప్రాంతాల్లో సిబ్బంది కొరతతో పాటు భవనాలకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

● తాపేశ్వరం, కోటిపల్లి, ద్రాక్షారామ, వెంటూరు గ్రామాల్లో ఆయుష్ ఆసుపత్రులు ఉండగా వీటిలో నాలుగు చోట్ల పూర్తిస్థాయిలో వైద్యులు లేరు. ఒక్కొక్కరు మూడు రోజులు ఒకచోట, మిగిలిన రోజులు మరోచోట సేవలందిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వైద్యులు లేక ఆసుపత్రులు మూతపడుతున్నాయి.

● తాపేశ్వరంలోని హోమియో వైద్యశాలకు జిల్లా నలుమూలల నుంచి రోగులు తరలివస్తారు. దాదాపు 12 సంవత్సరాలుగా వైద్యురాలు అంజమ్మ సేవలు అందించి రెండేళ్ల క్రితం బదిలీపై వెళ్లడంతో అప్పటి నుంచి వైద్యశాల మూతపడింది. మొక్కుబడిగా నెలకో రోజు మరో వైద్యురాలు వచ్చి సేవలందిస్తున్నారు.

ఎక్కడెక్కడ ఏయే ఆస్పత్రులు ఉన్నాయంటే..

హోమియో	ఆయుర్వేదం
తాపేశ్వరం	కె.జగన్నాథపురం
కోటిపల్లి	నరేంద్రపురం
ద్రాక్షారామ	అంబాజీపేట
వెంటూరు	అనాతవరం
గోపాలపురం	ముమ్మిడివరం
జొన్నాడ	పల్లంకుర్రు
కేశనకుర్రు	పాశర్లపూడి
కొమరగిరిపట్నం	తాటిపాక
లక్కవరం	ఆత్రేయపురం
అంతిర్వేదిపాలెం	
బండారులంక	
పి.గన్నవరం	
అమలాపురం	

తాపేశ్వరంలో తాళంవేసిన హోమియో వైద్యశాల

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

హోమియో, ఆయుర్వేద ఆసపత్రుల్లో వైద్యులతో పాటు సిబ్బంది కొరత ఉంది. ఎక్కడెక్కడ ఖాళీ పోస్టులు ఉన్నాయో గుర్తించి దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. వారి నుంచి అనుమతి రాగానే నియమించడానికి చర్యలు తీసుకుంటాం.

- శ్యామ్, జిల్లా ఆయుష్ నోడల్ అధికారి

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శాఖాహార(వెజిటేరియన్) వంటలు చేయుటకు కాకినాడలో ఇంట్లో ఉంటూ ఇంటిపని చేయు ఏ బాదరబందీ లేని 35 సం||ల లోపు స్త్రీ కావలెను. Contact Cell: 99853 57819.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: రూ.15,000/-, 40 సంవత్సరాలలోపు వారు మాత్రమే. Cont: శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. సెల్: 94909 98888.

JOBS

Kakatiya Constructions Hiring now! Inviting Applications for Project Manager (Min 8-10 Yrs Exp.) and Junior Engineers (0-3yrs Exp.) Qualification Polytechnic/ B.Tech Civil / Degree. Mail: hrkakatiyaconshyd@gmail.com. ✆ 79813 18373.

Wanted Female Telecallers Qualification Any Degree, Age Limit: 25 to 45 Years (Must be Married) Salary upto 12,000/-. working Location: Master Minds College, Rajahmundry, Contact: 9248733370.

Sahasra Jr. College Were Hiring Positions Hostel Wardens (Girls Intermediate Hostel) Location Kakinada. Attractive Salaries. Cont: 94406 91781, 98588 95999.

శ్రీనివాస గ్రూప్ VJA ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంట బేబీ కేర్‌కు వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం. ✆ 92814 52843, 92814 52827

రామకృష్ణ గ్రూప్, Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు, ఇంటిపని, వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+ వ+, జీతం: 16 - 18K. ✆ 9705297788, 9515108830.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-00 పైॱ

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	22,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	22,000-23,000
కొత్త (పచ్చి) కాయ	23,000-24,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	106-00
రిటైల్ లైవ్	133-00
డ్రెస్డ్	193-00
స్కిన్‌లెస్	219-00

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

యమపాశాలవుతున్న మృత్యుతీగలు..

● ఆ శాఖ తీరు మారదు.. ప్రమాదాలు ఆగవు..

గండేపల్లి, న్యూస్‌టుడే: ఒక ప్రమాదం జరగగానే భవిష్యత్తులో మళ్లీ అవి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడం కనీస ధర్మం. కానీ ఆ శాఖలో ఇవేవీ పట్టవు. అదే విద్యుత్తు శాఖ. ఫలితంగా రెండు ప్రాణాలు పోయాయి. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై శివనాగబాబు తెలిపిన వివరాలివీ.. పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన కరిపెట్టి సింహాద్రి అప్పన్న(57), అదే మండలం రాపాక గ్రామానికి చెందిన గెడ్డం సందీప్(17) వరి కోత యంత్రంపై పనిచేస్తారు. వీరు ఆదివారం ఉదయం గండేపల్లి మండలం రామయ్యపాలెం మీదుగా సింగరంపాలెం వాహనంపై యంత్రాన్ని తరలిస్తున్నారు. రామయ్యపాలెం శివారుకు వచ్చేసరికి యంత్రానికి ఉన్న పైపు 11 కేవీ విద్యుత్తు తీగలు తగిలాయి. యంత్రం యజమాని, డ్రైవర్ సింహాద్రి అప్పన్న గమనించి కిందకి దిగుతున్నాడు. ద్విచక్ర వాహనంపై ముందు వెళ్తున్న సందీప్ తీగలు తగలడం గమనించి, ద్విచక్రవాహనం దిగి వాహనం దగ్గరకు వచ్చాడు. డ్రైవర్ సీటులో నుంచి కిందకి దిగుతున్న సింహాద్రి అప్పన్నను, వాహనం దగ్గరకు వచ్చిన సందీప్‌నకు విద్యుత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను జడ్.రాగంపేట సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరిపెట్టి సింహాద్రి అప్పన్న, గెడ్డం సందీప్ (పాత చిత్రాలు)

ప్రమాద స్థలం వద్ద గుమిగూడిన స్థానికులు

కుటుంబాలకు పెద్ద దిక్కు

కరిపెట్టి సింహాద్రి అప్పన్న(57)కు భార్య, పెళ్లికాని ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో కోళ్లఫాం నిర్వహించేవారు. అందులో ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా వరి కోత యంత్రాన్ని ఆరునెలల కిందట కొన్నారు. గెడ్డం సందీప్‌నకు తల్లిదండ్రులు, ఇద్దరు అక్కలు ఉన్నారు.

గతంలోనూ ఇద్దరూ మృతి

రామయ్యపాలెం గ్రామంలో కొన్నేళ్ల కిందట ఓ శుభకార్యానికి టెంట్లు వేస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. గ్రామంలో వేలాడుతున్న విద్యుత్తు తీగలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవిస్తున్న పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రెండు టన్నుల చౌక బియ్యం స్వాధీనం

రాజోలు, న్యూస్‌టుడే: మొంథా తుపాను బాధితులకు అందాల్సిన రెండు టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి రాజోలు మండలం తాటిపాకలో రెవెన్యూ, పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ములికిపల్లి నుంచి ఆలమూరులోని రొయ్యల చెరువుల వద్దకు తరలిస్తున్నట్లు గుర్తించారు. ములికిపల్లికి చెందిన వ్యాపారి పరంశెట్టి కృష్ణార్జునరావు, వాహన యజమాని, డ్రైవర్ పసలపూడి గంగరాజుపై కేసు నమోదు చేశామని ఎస్సై రాజేష్‌కుమార్, ఎంఎస్‌వో పూర్ణిమ తెలిపారు. బి.సావరంలో సైతం మామిడికుదురు చెందిన ఓ వ్యాపారి వద్ద నుంచి 500 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

కాట్రేనికోన, న్యూస్‌టుడే: గెద్దనపల్లి పరిధిలోని లచ్చిరాజుచెరువుకు చెందిన బడుగు వెంకటరమణ (48) కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు సంతానం. భార్య అనారోగ్య సమస్యతో బాధపడుతుండగా పెద్దకుమార్తెకు వివాహం జరిగింది. చిన్నకుమార్తె శ్రావణి తీవ్ర దుఃఖాన్ని దిగమింగుకుని తండ్రికి తలకొరివి పెట్టింది.

తండ్రి అంత్యక్రియల నిర్వహణలో శ్రావణి

విషాదం నింపిన విహారయాత్ర

● గోదావరిలో మునిగి పదోతరగతి విద్యార్థి మృతి

అంగర, అంబాజీపేట, న్యూస్‌టుడే: స్నేహితుడి జన్మదిన వేడుకల్లో సరదాగా గడపడానికి వచ్చిన అంబాజీపేట మండలం పుల్లేటికుర్రుకు చెందిన నామాడి బన్ను (15) గోదావరి నదిలో మునిగి మృతిచెందిన విషాద ఘటన ఆదివారం కపిలేశ్వరపురం మండలంలో చోటుచేసుకుంది. అంగర ఎస్సై జి.హరీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కేదార్లంక శివారు ధనమ్మమర్రిలో ధనమ్మ ఆలయం వద్ద పుట్టినరోజు వేడుకలు చేసుకునేందుకు పుల్లేటికుర్రుకు చెందిన కొంత మంది యువకులు వచ్చారు. ముగ్గురు స్నేహితులు గోదావరిలో స్నానానికి దిగారు. బన్నుకు ఈత రాకపోవడంతో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న అంగర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. శవ పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బన్ను తండ్రి అబ్రహాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

నామాడి బన్ను (పాతచిత్రం)

నూరేళ్లు నిండిపోయాయా బిడ్డా..

బన్ను తండ్రి నామాడి అబ్రహాం ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి సునీత గృహిణి. వీరికి ఇద్దరు మగపిల్లలు. బన్ను పెద్ద కుమారుడు. పుల్లేటికుర్రు ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఇతని మృతితో పుల్లేటికుర్రులో విషాదఛాయలు అలముకున్నాయి. 15 ఏళ్లకే నూరేళ్లు నిండిపోయాయా అని తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సర్పంచి జల్లి బాలరాజు, ఉపసర్పంచి వీరా రవి, మాజీ సర్పంచి నూకపెయ్యి చిన్న, ఎంపీటీసీ సభ్యులు కుసుమ వెంకటేష్, వడలి కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎన్ఎస్ఎన్ వర్మ, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

(c) eenadu

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

వీరవల్లిపాలెంలో ఉచిత వైద్యశిబిరం

అయినవిల్లి, న్యూస్‌టుడే: వీరవల్లిపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచి సలాది బుచ్చిరాజు ప్రారంభించారు. అమలాపురానికి చెందిన రవి ఈఎన్‌టీ ఆసుపత్రి వైద్యుడు రవికుమార్ 150 మంది రోగులకు చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మలికిపురంలో తాగునీటి ఇక్కట్లు

మలికిపురం: మలికిపురం పద్మజ సినిమా హాలు కూడలిలో తాగునీటి సమస్యతో సతమతమవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. రోజు విడిచిరోజు కొళాయి నీరు సరఫరా చేస్తున్నారని, పైగా మురికి వాసన వస్తోందని అంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబును వివరణ కోరగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు.

ఆర్టీసీ బస్టాండులో మెరక పనులు

ఈనాడు కథనానికి స్పందన

అంబాజీపేట ఆర్టీసీ బస్టాండు ఆవరణలో అధికారులు మెరక పనులు చేపట్టారు. ఇక్కడ పల్లంగా ఉండటంతో వర్షంనీరు రోజుల తరబడి నిల్వ ఉండిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈ నెల 5న 'అధ్వానం.. బస్టాండు ఆవరణ' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన అమలాపురం ఆర్టీసీ డిపో ఆర్‌ఎం ఎస్‌టీపీ రాఘవకుమార్ పనులు చేయించారు. మట్టివేసి మెరక చేయించారు.
– న్యూస్‌టుడే, అంబాజీపేట

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
ఉ॥ 10 - మ॥ 1 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

వీధి దీపాలకు మరమ్మతులు

స్పందనకు వందనం

ఆత్రేయపురం: రాజవరంలో వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను సర్పంచి జాన మంగాయమ్మ వద్ద ప్రస్తావించగా సిబ్బందితో లైన్లకు మరమ్మతులు చేయించారు.

డ్రెయిన్‌లో పూడికతీత

రావులపాలెం గ్రామీణం: రావులపాడు డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోవడంతో మురుగు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందితో పూడిక తీయించారు.

పైపు లైను ఏర్పాటు

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురం వినాయక ఆలయ సమీపంలో డ్రెయినేజీ పైపు ధ్వంసమై దుర్వాసన వ్యాపిస్తోంది. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబు దృష్టికి తేగా స్పందించి సిబ్బందితో కొత్తది ఏర్పాటు చేశారు.

నిధులు అందక.. మరమ్మతులు లేక!

– న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు

రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో 491 అంగన్‌వాడీ, 38 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పలుచోట్ల భవనాలు శిథిల స్థితికి చేరడం, ఆధునికీకరణ పనులు చేపట్టిన చోట్ల అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఇబ్బందులు వెంటాడుతున్నాయి. వీటికి నిధులు అందకపోవడంతో ఏళ్లకాలంగా వినియోగానికి దూరమవుతున్నాయి. రాజోలు నియోజకవర్గంలో 6 నెలల నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 10,428 మంది, పి.గన్నవరం నియోజకవర్గంలో 10,241 మంది పిల్లలు ఉన్నారు.

కొమరాడలో స్లాబు దెబ్బతినడంతో నిరుపయోగంగా అంగన్‌వాడీ భవనం

అసంపూర్తిగా నిలిచి..

● రాజోలు మండలం అరవపాలెంలోని అంగన్‌వాడీ భవనం స్లాబు దశలో నిలిచిపోయింది. దాదాపు మూడేళ్లుగా దీనిని పట్టించుకోకపోవడంతో అవస్థలు ఎదురవుతున్నాయి.

● మోరి పరిధిలోని రెండు చోట్ల భవనాలు నిర్మాణ దశలోనే నిధులు లేక ఆగిపోవడంతో ఆశించిన ప్రయోజనం కరవైంది. దీనికి నిధులు నిలిచిపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది.

● మామిడికుదురు మండలం ఆదుర్రుగరువులోని భవనం ఏడేళ్లుగా స్లాబు దశలోనే ఆగిపోయింది. దీని పునాదులు క్రమేణా నిర్వీర్యంగా మారుతుండటంతో ఆందోళన రేగుతోంది.

● మొగలికుదురు, జగ్గన్నపేటలోని రెండు చోట్ల దాదాపు 9 ఏళ్ల క్రితం స్లాబు దశలో నిలిచిపోయిన భవనాల పునాదులు బలహీనంగా మారుతున్నాయి. వీటికి పలుసార్లు ప్రతిపాదనలు చేసి పంపినా నిధుల జాడ లేదు.

● మలికిపురం మండలం దిండి, గుడిమెళ్లంక, చింతలమోరిలోని భవనాలు శిథిల స్థితికి చేరడంతో అలానే వదిలేసి అద్దె భవనాల్లో కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

● పాలగుమ్మి, తాటిపాకలోని భవనాలు శిథిలమయ్యాయి. కొమరాడలోని భవనం స్లాబు పెచ్చులు రాలుతుండటంతో కేంద్రాన్ని స్థానిక పాఠశాలలోకి తరలించారు.

కార్యాచరణ చేపడతాం

మరమ్మతులు చేయాల్సిన భవనాలకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే కార్యాచరణ చేపడతాం. అసంపూర్తిగా నిలిచిపోయిన వాటికి కూడా నిధులు మంజూరైతే వెంటనే పనులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకొస్తాం. ఎక్కడా ఇబ్బందులు రానీయం.
– సీహెచ్ ఇందిర, సీడీపీవో, రాజోలు

మామిడికుదురులో గోవింద మాలధారుల పాదయాత్ర

స్వామివార్లకు లక్ష బిల్వార్చనలు

అంబాజీపేట, అయినవిల్లి, ఆత్రేయపురం, మామిడికుదురు, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని పరమశివుడి ఆలయాల వద్ద ఆదివారం లక్ష పత్రి, లక్ష బిల్వార్చనలు చేశారు. మహిళలు దీపాలను వెలిగించారు. ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. రాజోలు మండలం తాటిపాక నుంచి అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయానికి 60 మంది గోవింద మాలధారులు ఆధ్యాత్మిక కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర చేశారు.

అలంకరణలో రుక్మిణీ సత్యభామ సమేత కృష్ణారాయుడుస్వామి

వాడపల్లిలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి

నేదునూరులో ఏకాదశరుద్రుడు చెన్నమల్లేశ్వరస్వామికి అభిషేకం

సింగపూర్‌లో అధ్యయనానికి ఎంపిక

ఆలేటి దుర్గాప్రసాద్

కొత్తపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. విద్యార్థుల్ని ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి విదేశాలకు పంపి అక్కడి విద్యా విధానం, బోధన నైపుణ్యాల వినియోగంపై అధ్యయనం చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. జిల్లా నుంచి కొత్తపేట మండలం అవిడిలోని మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుడు ఆలేటి దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు. ఆయన విద్యార్థులకు తనదైన శైలిలో బోధిస్తూ, వినూత్న ప్రయోగాలతో ప్రతిభను పెంచడం వంటి సేవలందించడంతో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఆయన ఈ నెల 27 నుంచి డిసెంబరు 2 వరకు సింగపూర్ పర్యటనకు వెళ్తున్నట్లు దుర్గాప్రసాద్ తెలిపారు.

పరిశోధనలతో డెల్టాలో వెతలకు పరిష్కారం

పాలకొల్లు, న్యూస్‌టుడే: పరిశోధనల ద్వారా గోదావరి డెల్టాలో పలు సమస్యలకు పరిష్కార మార్గాలు చూపవచ్చని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేశనపల్లిలో ఉప్పునీటి ప్రభావంపై అదే ప్రాంతానికి చెందిన ఎర్రంశెట్టి విజయసత్యప్రసాద్ చేసిన పరిశోధనలకు ఇంటర్నేషనల్ జనరల్ ఆఫ్ రిసెర్చ్ ఇంజినీరింగ్ సైన్స్ గుర్తింపు లభించింది. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ద్వారా లవణ జలాలు ప్రవేశించడం వల్లే కేశనపల్లిలో కొబ్బరి, వరి పంటలకు నష్టం వాటిల్లుతున్నట్లు ఈ పరిశోధనల్లో తేలింది. దీనికి సంబంధించిన ప్రతులను విజయ్‌సత్యప్రసాద్ ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి నిమ్మలకు అందజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ కేశనపల్లి సమస్య పరిష్కారానికి వ్యూహాత్మక ప్రణాళిక అవసరమని.. ఈ పరిశోధనలో గుర్తించిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

కార్తిక వనసమారాధన సందడి

నరేంద్రపురంలో ఉసిరిచెట్టు వద్ద శెట్టిబలిజ వర్గీయుల పూజలు

రాజోలు, మలికిపురం, రావులపాలెం గ్రామీణం, అంబాజీపేట, పి.గన్నవరం, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లో ఆదివారం కార్తిక వనసమారాధన సందడి నెలకొంది. చిన్నాపెద్దా ఆటపాటలతో సందడి చేశారు. ● రాజోలు మండలం శివకోటిలో తెలగా వర్గీయుల కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, తెదేపా సీనియర్ నాయకుడు మెట్ల రమణబాబు, ఏలూరు డీసీసీబీ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, తాలూకా తెలగా సంఘం గౌరవాధ్యక్షుడు సోమిశెట్టి అంజనేయులు, అధ్యక్షుడు కొమ్ముల మధుమూర్తి, ఉపాధ్యక్షుడు కంపట్ల చిన్నారి తదితరులు పాల్గొన్నారు. ● అలమూరులోని వంటిపల్లి వారి తోటలో నియోజకవర్గ కాకతీయ కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, జిల్లా కమ్మ సంఘం అధ్యక్షుడు కెప్టెన్ జొన్న మూర్తి, మాజీ ఎమ్మెల్సీ వి.వి.వి.చౌదరి, గన్ని భాస్కరరావు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి, కంటిపూడి సర్వారాయుడు, మార్ని వాసు తదితరులు పాల్గొన్నారు. ● అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధి శ్రీరామ్‌నగర్‌లో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, కూటమి నేత వానపల్లి దినబాబు హాజరయ్యారు. ● లొల్ల లాకుల వద్ద ఆత్రేయపురం మండల ఆధ్వర్యంలో, వెలిచేరులో శ్రీ వెంకటేశ్వర రాయ యూత్ ఆధ్వర్యంలో కాపు వనసమారాధనలు జరిగాయి. ● రాజోలు తీరిదే కట్టాల మండపంలో నియోజకవర్గ యాదవ కార్తిక వనసమారాధన సంఘ అధ్యక్షుడు మండపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పాల్గొన్నారు.

శివకోటిలో మాట్లాడుతున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారాయుడు

వెలిచేరులో బండారు శ్రీనివాసరావు, సంజీవ్ తదితరులు

పనులు పూర్తికాక.. ప్రారంభానికి నోచుకోక

కేశనపల్లి పంచాయతీ, సచివాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. గతంలో పంచాయతీ భవన నిర్మాణం చేపట్టారు. అది పూర్తికాకుండానే పైఅంతస్తుగా సుమారు రూ.30 లక్షలతో సచివాలయ నిర్మాణం ప్రారంభించారు. 20 శాతం పనులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కార్యాలయాన్ని పాత పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్నారు. కింది భాగంలో పంచాయతీ కార్యాలయానికి సంబంధించి ఫ్లోరింగ్, ప్లాస్టరింగ్ పూర్తికాలేదు. కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయాలి. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎల్.శ్రీరామారావును వివరణ కోరగా పనులు పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం - అంతర్వేది

టెండరు - కం - బహిరంగ వేలం ప్రకటన

Rc. No. A1/152/2025 Dated: 08-11-2025

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం, అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానమునకు చెందిన భూమిని టెండరు-కం-బహిరంగ వేలం ది.19-11-2025వ తేదీ బుధవారం ఉదయం గం॥11-00 లకు కేశనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద నిర్వహించబడును.

భూమి షెడ్యూల్

వివరము	కాలపరిమితి	డిపాజిట్ (ధరావత్తు)
కేశనపల్లి (మలికిపురం) గ్రామము సర్వే నెం. 23 లో గల ఎ.13-08 సెంట్లు ఉండు చెరువు	ది.01-01-2026 నుండి 31-12-2030 వరకు 5 సంవత్సరముల కాలపరిమితి	50,000/-

ముఖ్య షరతులు:
1. [illegible]
2. [illegible]
3. హెచ్చుపాట దేవదాయ ధర్మదాయశాఖ, విజయవాడ వారి ఆమోదము ఉత్తర్వులు మేరకు ఖాయపరచబడును.
4. రూ.5,00,000/-లు విలువగల సాల్వేన్సీ ధ్రువపత్రము యం.ఆర్.ఓ. వారి నుండి పొంది పాట సమయమునందు దాఖలు చేయవలెను.
5. దేవస్థానమునకు బకాయి గల వారు గాని, వారి బంధువులు గాని పాటలో పాల్గొనరాదు.
6. ఏ కారణము తెలుపకయే పాట వాయిదా వేయుటకుగాని, నిలుపుదల చేయుటకు గాని కార్యనిర్వహణాధికారి వారికి పూర్తి అధికారము కలదు.
7. ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళలయందు సంప్రదించి తెలుసుకొనవచ్చును.

ఫోన్ : 8919801289, 9989030520

అంతర్వేది : ది. 08-11-2025 చైర్మన్ & ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కార్యనిర్వహణాధికారి & సహాయ కమీషనర్

బస్‌షెల్టర్ నిర్మించండి మహాప్రభో..

వాడపల్లిలో గోవిందనగర్ వద్ద ర.భ.రోడ్డు చెంతన బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు, భక్తులు యాతన పడుతున్నారు. రాజమహేంద్రవరం, రావులపాలెం వైపు వెళ్లేవారు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిరీక్షించాల్సి వస్తోంది. ఈ విషయాన్ని దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు వద్ద ప్రస్తావించగా దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో సంప్రదించి షెల్టర్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.
– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

అధ్వాన రోడ్డుతో అవస్థలు

రాజోలు ప్రధాన రహదారి నుంచి బి.సావరం వరకు 1.5 కిలోమీటర్ల రోడ్డు దుర్భరంగా మారింది. పెద్దపెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డును ఆనుకుని గ్యాస్ కంపెనీ, ఆసుపత్రులు, విద్యుత్తు శాఖ కార్యాలయం ఉన్నందున నిత్యం రద్దీగా ఉంటుంది. వర్షాలకు నీరుచేరి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జేఈ రవికుమార్‌ను వివరణ కోరగా గ్యాస్ కంపెనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరైందని, త్వరలో పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

పేరుకుపోయిన డెక్క.. రైతుల యాతన

బి.సావరంలో మురుగు కాలువ గుర్రపు డెక్కతో నిండిపోయింది. సోంపల్లి నుంచి చింతలపల్లి వరకు 7 కిలోమీటర్ల మేర డెక్క, వ్యర్థాలు పేరుకుపోవడంతో నీరు పారడం లేదు. దీనిని ఆనుకుని ఉన్న ఆయకట్టు రైతులు యాతన పడుతున్నారు. పరిసరాలు దోమలకు నిలయంగా మారాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఏఈ ఆనంద్‌ను వివరణ కోరగా బాగుజేసేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

రక్షణగోడ విరిగి.. ఊచలు తేలి

ఈదరాడ-కొమరాడ కూడలిలోని పంట కాలువపై ప్రధాన రహదారి మధ్యలోని కల్వర్టు గోడ కొంతమేర శిథిలమై ఊచలు బయటకు తేలడంతో వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలు తలెత్తే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మామిడికుదురు, రాజోలు మండలాల్లోని ఏడు గ్రామాలకు చెందిన వారికి ఇదే ప్రధాన మార్గం కావడంతో వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉంటోంది. రక్షణగోడ, కమ్మీలను చక్కదిద్దేందుకు చర్యలు చేపడతామని ర.భ.శాఖ ఏఈఈ కె.సురేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

టెండరు-కం-బహిరంగ వేలంపాట ప్రకటన

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం నందు ది.01-01-2026 నుండి 31-12-2027 వరకు అనగా 2 సంవత్సరముల కాలపరిమితికి తిలదానం పట్టుకొను లైసెన్సు హక్కునకు టెండరు-కం-బహిరంగ వేలంపాట మరియు దేవస్థానమునకు అవసరమైన ప్రింటింగ్ సామాగ్రి ది.01-12-2025 నుండి 15-07-2026 వరకు సప్లయి చేయు లైసెన్సు హక్కునకు సీల్డు టెండరు ప్రక్రియ ది.27-11-2025 గురువారం ఉదయం 10 గంటల నుండి దేవస్థానం వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున జరుగును.

ఇతర టెండరు-కం-పాట షరతులు మరియు సీల్డు టెండరు వివరములకు దేవస్థానం పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును. సంప్రదించవలసిన సెల్ నెం. 9491000721 మరియు టెలిఫోన్ నెం.08855 243208.

గౌ॥ శ్రీ పూసపాటి అశోక గజపతిరాజు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ & ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి — సహాయ కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారి

మందపల్లి, ది.10-11-25

బాధిత కుటుంబానికి సాయం అందజేత

మామిడికుదురు, న్యూస్‌టుడే: లూటుకుర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన కాగితాలపల్లి నరసింహారావు కుటుంబానికి యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం ద్వారా రూ.3 లక్షల చెక్కును జిల్లా కార్యదర్శి బేతినీడి శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు. జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు, మండల అధ్యక్షుడు జి.నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో రెండు వర్గాల ఘర్షణ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం ప్రధాన రహదారిలో పెదరామాలయం సమీపంలో పడమర వైపు ఉన్న వివాదాస్పద స్థలం విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడటంతో బాహాబాహీకి దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. వైకాపాకు చెందిన కొంతమంది మహిళలు స్థలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను కొంతమేర తొలగించి రహదారిపై బైఠాయించారు. పూర్వకాలం నుంచి రామాలయం చెంతన నడక మార్గం ఉందని, దీనికి సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్, తెదేపా నాయకుడు ముదునూరి వెంకటరాజు ఆక్రమించి రాకపోకలు లేకుండా చేశారంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్‌రావు, ఎస్సై ఎస్.రాము, సిబ్బంది రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. సమస్య ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలిగాని ఇలా రోడ్డుపైకి వచ్చి శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదన్నారు. దీనిపై వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ వెంకటరాజు మాట్లాడుతూ వైకాపా నాయకులు కావాలని అల్లర్లు సృష్టిస్తున్నారన్నారు. స్థలంపై వారికి ఎటువంటి హక్కులు లేవన్నారు. కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. రోడ్డు ఉందన్న పత్రాలుంటే దారి ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు చెప్పారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

● రెండు తాటాకిళ్లు దగ్ధం

అంబాజీపేట, న్యూస్‌టుడే: కె.పెదపూడి పంచాయతీ పరిధి తిరుమనాథవారిగరువు శివారులో రెండు తాటాకిళ్లు దగ్ధం కాగా నాలుగు కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. ఆదివారం ఉదయం జరిగిన ఈ సంఘటనలో ఈతకోట సుబ్బారావు, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, మంగాయమ్మలకు చెందిన ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించగా వంటగ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో భయపడి దూరంగా వెళ్లిపోయారు. సుబ్బారావు ఇంటిస్థలం కొనుగోలు చేసేందుకు దాచుకున్న రూ.1.50 లక్షలు, 12 గ్రాముల బంగారం, శ్రీనివాసరావుకు చెందిన రూ.2.50 లక్షలు, 18 గ్రాముల బంగారం, మంగాయమ్మకు చెందిన రూ.1.50 లక్షలు, 18 గ్రాముల బంగారం, ఈశ్వరరావుకు చెందిన రూ.2.70 లక్షలు, 14 గ్రాముల బంగారంతో పాటు ఇళ్లలోని సమస్త సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. రూ.14 లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు అమలాపురం అగ్నిమాపకాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బాధితులను పరామర్శించి ప్రభుత్వ సాయం అందజేశారు. అంబాజీపేటలోని భవాని సేవాసమితి ఆధ్వర్యంలో గురుభవానీలు దంగేటి సాయిబాబు, మల్లేశ్వరి దంపతులు, మట్టపర్తి శ్రీను, శ్రీనివాస్, పాటి శేఖర్, గుత్తుల పండు, పితాని శ్రీను ఆధ్వర్యంలో బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు.

గొల్లపల్లికి శాసనమండలి ఛైర్మన్ పరామర్శ

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, రాజోలు వైకాపా ఇన్‌ఛార్జి గొల్లపల్లి సూర్యారావును అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో శాసన మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు ఆదివారం పరామర్శించారు. సూర్యారావు కుమారుడు శ్రీధర్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, వైకాపా రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు తదితరులు ఉన్నారు.

రేడియాలజీ సేవలు కీలకం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ఆధునిక వైద్యరంగంలో చేపట్టే చికిత్సల్లో రేడియాలజీ సేవలు కీలకమని కిమ్స్ ఆసుపత్రి డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య అన్నారు. కామనగరువు కిమ్స్ వైద్య కళాశాలలో ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేడియాలజీ ప్రాధాన్యం, రోగుల నిర్ధారణ చికిత్సల గురించి వివరించారు. రేడియాలజిస్ట్ డాక్టర్ టి.రాజేష్‌కుమార్, వైద్యులు భరత్, లక్ష్మీ క్రాంతి, రోజా, లోహిత్, రేడియేషన్ సేఫ్టీ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల గురుకులం

– న్యూస్‌టుడే, పి.గన్నవరం

పి.గన్నవరం మండలం నరేంద్రపురం సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల పాఠశాల(బాలురు)లో అనేక సమస్యలు తిష్ఠ వేశాయి. పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో విద్యార్థులు, సిబ్బంది ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ అయిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 470 మంది చదువుతున్నారు.

అధ్వానంగా క్రీడా మైదానం

నాలుగేళ్లుగా ఇంతే..

గురుకుల పాఠశాలలో వివిధ సమస్యల పరిష్కారానికి నాలుగేళ్ల క్రితం రూ.70 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపారు. అవన్నీ బుట్టదాఖలయ్యాయి. దీంతో సమస్యలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

ప్రధానంగా ఇవీ..

● భవనానికి సంబంధించి కిటికీలకు తెరలు లేకపోవడంతో రాత్రి సమయంలో దోమలతో సహవాసం చేయాల్సి వస్తోంది. ● రోజువారీ వాడకంతో పాటు వర్షంనీరు నిలిచిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. ● అంతర్గత సిమెంటు రహదారులు ఏర్పాటు చేయాలి. ● విశాలమైన క్రీడా మైదానం ఉన్నప్పటికీ అలంకారప్రాయమే. దీనిని మెరక చేసి ఆడుకునేందుకు వివిధ కోర్టులతో తీర్చిదిద్దాలి. పల్లంగా ఉండటంతో వర్షాకాలంలో నీరు నిలిచిపోయి పిచ్చిమొక్కలు, గడ్డి మొలిచిపోయి అధ్వానంగా మారింది. ● డైనింగ్ హాలులో ఇన్వర్టర్ ఉన్నా బ్యాటరీ ఛార్జింగ్ దిగిపోయి పనిచేయడం లేదని సిబ్బంది తెలిపారు.

రూ.25 లక్షలతో ప్రతిపాదనలు

అత్యవసర పనులు చేసేందుకు తాజాగా రూ.25 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ నిధులు మంజూరైతే పనులు చేస్తాం. గత ఏడాది, ఈ సంవత్సరం విద్యార్థులకు తువ్వాళ్లు ఇవ్వలేదు.
– పి.వేణు, ప్రిన్సిపల్, గురుకుల పాఠశాల, నరేంద్రపురం

అమృతమూర్తికి అశ్రునివాళి

మాకు అత్యంత ఆప్తులు, మిత్రులు శ్రీ తాడి శ్రీనివాస్‌రెడ్డి (బట్టి శ్రీను), కొత్తపేట నియోజకవర్గ TNTUC అధ్యక్షులు వారి తండ్రి గారు శ్రీ తాడి సూర్యనారాయణరెడ్డి గారి అకాల మరణానికి చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

ఇట్లు
గాడవర్తి దుర్గాప్రసాద్ (బాబి)
టీడీపీ నాయకులు, జొన్నాడ

శ్రీ తాడి సూర్యనారాయణరెడ్డి గారు
జననం: 1946 మరణం: 03-11-2025

పెద్దకర్మ : ది. 13-11-2025 గురువారం జొన్నాడలోని వారి స్వగృహమునందు జరుగును.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

ఒత్తిడి నియంత్రణపై అవగాహన

అల్లవరం, న్యూస్‌టుడే: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కొమరగిరిపట్నంలో విద్యార్థులకు ఒత్తిడి నియంత్రణ- భావోద్వేగాల అదుపు అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మానసిక నిపుణుడు శ్రీధర్ రామకృష్ణ మాట్లాడారు.

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాట - 30, వంకాయలు (నలుపు)- 68, తెలుపు- 48, బెండకాయలు - 52, పచ్చిమిర్చి - 37, కాకరకాయ - 42, బీరకాయలు - 58, క్యాబేజీ - 40, క్యారెట్ - 60, దొండకాయలు - 50, బంగాళదుంపలు - 26, ఉల్లిపాయలు - 27, గోరుచిక్కుడు - 45, దోసకాయలు -35, చిక్కుడుకాయలు -120, చేమదుంపలు - 43, కంద - 55, బీట్‌రూట్- 52, కీరదోసకాయలు -39, అల్లం - 82, క్యాప్సికం -90, చిలకడదుంపలు - 50, గుమ్మడి -30, ముల్లంగి -45, ఉసిరి -80, నిమ్మకాయలు -30. ఒక్కొక్కటి చొప్పున: అనపకాయ -44, పొట్లకాయ -25, అరటికాయ -6, ఆకుకూరలు కట్ట -10, కొత్తిమీర కట్ట -30, కొబ్బరికాయ - 25.

కుండలేశ్వరంలో మంత్రి పూజలు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: పార్వతీసమేత కుండలేశ్వరస్వామిని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం పూజలు చేశారు. ఈవో దుర్గ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి చిత్రపటం అందించారు. జి.సాయి, నాగిడి నాగేశ్వరరావు, సుధీర్, నాగు, పీఎస్ఎన్ రాజు, భద్రరావు, రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మంత్రికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో

చెయ్యేరులో.. కాట్రేనికోన, న్యూస్‌టుడే: చెయ్యేరు ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. నడింపల్లి సూర్యనారాయణరాజు, సుబ్బరాజు దంపతులు, భారీగా భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామికి.. ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తంలోని పార్వతీ మల్లేశ్వరస్వామికి ఆదివారం ఆరుద్ర పూజలు ఘనంగా నిర్వహించారు. రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

రుద్రహోమం.. ఐ.పోలవరం: కార్తిక మాసంలో ఆరుద్ర నక్షత్రం మహాప్రదోషాన్ని పురస్కరించుకుని ఐ.పోలవరం మండలం మురముళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రుద్రహోమం నిర్వహించారు. అర్చకులు పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ప్రతి నెల ఆరుద్ర నక్షత్రం రోజు భక్తుల గోత్ర నామాలతో దేవస్థానం తరఫున రుద్రహోమం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. ఆలయ ఛైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షించారు. ఈవో మాట్లాడుతూ నిత్య, మాస, వార్షిక పూజలు, 'ఈ హుండీ' డొనేషన్, 'ఈ-విరాళాల' వేదాదాయ వెబ్‌సైట్ aptemples.ap.gov.in, www.sriveereswaraswamytemple.com ద్వారా నమోదుచేసుకోవచ్చన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అమలాపురం పట్టణం: పారిశుద్ధ్య కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, సమ్మె కాలంలోని అంశాలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు కె.సత్యనారాయణ తెలిపారు. ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో అమలాపురం పురపాలక సంఘ కార్యాలయం ఎదుట మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో నాయకులు ఒక్క రోజు సత్యాగ్రహ దీక్షను ఆదివారం నిర్వహించారు. విధుల నుంచి తొలగించిన కార్మికులను తీసుకోవాలని నినాదాలు చేశారు.

తీరం.. కాలుష్యమయం

పేరుకు పోతున్న వ్యర్థాలు..

న్యూస్‌టుడే, అల్లవరం

- అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో టన్నుల కొద్దీ చెత్త, ఇతర వ్యర్థాలు వెంబడి పేరుకుపోయాయి.
- అంతర్వేది నదీ సంగమం సమీపంలో చెత్త పేరుకు పోయింది. సముద్రంలో స్నానాలు చేసే సందర్శకులు ఇబ్బందికి గురవుతున్నారు.
- ఉప్పలగుప్తం మండలంలోని ఎస్.యానాం, కాట్రేనికోన మండలం పరిధిలో చిర్రాయానం బీచ్‌లు అధ్వానంగా ఉన్నాయి. వ్యర్థాలు ముంచెత్తుతున్నాయి.
- ప్లాస్టిక్, చెత్త, ఇతర వ్యర్థాలు సముద్రతీరాన్ని కాలుష్యమయం చేస్తున్నాయి. ఇటీవల వచ్చిన వరదలకు గోదావరి నుంచి నేరుగా ఆయా వ్యర్థాలు సముద్రంలోకి కొట్టుకొస్తున్నాయి. సముద్రంలో కాలుష్యం పెరిగి మత్స్య సంపదకు ముప్పువాటిల్లుతోందని మత్స్యకారులు వాపోతున్నారు.

అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరంలో వ్యర్థాలు

మత్స్య సంపదపై ప్రభావం

సముద్రంలోకి చేరుతున్న వ్యర్థాల వల్ల జలాలు కాలుష్యమయంగా మారడంతో మత్స్య సంపద సన్నగిల్లి దొరకని పరిస్థితి ఏర్పడుతుందని గంగపుత్రులు వాపోతున్నారు. జూన్‌లో వేట నిషేధం ముగిసిన తర్వాత నుంచి అక్టోబరు నెలాఖరు వరకు సరైన వేట సాగలేదని మత్స్యకారులు తెలిపారు.

దుర్వాసనతో ఇబ్బందులు

ఈ వ్యర్థాల గుట్టల్లో ఉన్న మృత కళేబరాలు కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతుండటంతో పర్యాటకులు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిళ్లుగా సముద్రంలోకి వేటకు వెళ్లే మత్స్యకారులు ఈ వ్యర్థాల వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

సముద్రతీరం వెంబడి పేరుకు పోతున్న వ్యర్థాల తొలగింపు అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతాం. తీరానికి వచ్చే సందర్శకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా పంచాయతీ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటాం. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన రావాలి.
- అన్వర్, పర్యాటక శాఖ అధికారి

ఆహ్లాదం కనుమరుగు

కోనసీమ వ్యాప్తంగా సముద్ర తీరాలను చూస్తే కాలుష్యకాసారాలు గుర్తుకు వస్తున్నాయి. సముద్రంలో అడుగు పెడుతుంటే వ్యర్థాల తెట్టు చుట్టుముడుతున్నాయి. దీంతో తీరం వెంబడి ఆహ్లాదం కరువైందని సందర్శకులు వాపోతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు పెంకులు, మద్యం సీసాలు, మృత కళేబరాలు, చెట్లు, బంద చెరకు, దుంగలు ఇలా టన్నుల కొద్దీ కిలోమీటర్ల మేర పేరుకుపోయాయి. గోదావరి నదీ పరివాహక ప్రాంతాల నుంచి డ్రెయిన్ల ద్వారా వ్యర్థాలు, మురుగు సముద్రంలోకి చేరుతున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718, ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

సమస్య: అమలాపురం వడ్డిగూడెం రోడ్డు ధ్వంసమై దూళితో నిండిపోయింది. అటు వైపు ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. శుభ్రం చేయాలి. - రాయుడు, ప్రయాణికుడు

సమస్య: కొంకాపల్లి ప్రధానరహదారి పక్కన చుట్టుపక్కల ప్రాంతాల వారు చెత్త వేస్తున్నారు. పందులు, ఆవులు చిందరవందర చేయడంతో అపరిశుభ్రంగా మారుతోంది. - మణి, వ్యాపారి

సమస్య: విద్యుత్తునగర్‌లో సరైన మురుగుకాలువ వ్యవస్థ లేక దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నాం. - పూర్ణిమ, స్థానికురాలు

సమస్య: అమలాపురం కాలేజ్ రోడ్డులో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వీటిని తొలగించాలి. - రామ, స్థానికుడు

పరిష్కారం: వడ్డిగూడెం రోడ్డు, కొంకాపల్లి, విద్యుత్తు నగర్, కాలేజీరోడ్డులలో సమస్యలపై సచివాలయ కార్యదర్శులు స్పందించారు. వారు సిబ్బందితో చెత్తను, వ్యర్థాలను తొలగించే చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

సత్యసాయి శతజయంతి వేడుకలు

అల్లవరం: సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను కొమరగిరిపట్నంలోని సేవా సదనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమితి కన్వీనర్ శ్రీనివాసరాజు, సుబ్బలక్ష్మి, గుర్రం అన్నవరం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం గ్రామీణం: యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రంలోని జి.ఎం.సి.బాలయోగి స్టేడియంలో రీజనల్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను యంగ్‌మెన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని అలవరుచుకోవాలని సూచించారు. 14 జట్లు పాల్గొన్నాయని అధ్యక్షుడు డాక్టర్ ఎ.బాలసామి, కార్యదర్శి డాక్టర్ యాళ్ల డేవిడ్‌సామ్యూల్‌రాజు తెలిపారు. సౌత్ఈస్ట్ ఇండియా రీజియన్ ఛైర్మన్ డాక్టర్ టి.సుమన్‌శ్యాంరాజ్, కార్యదర్శి ఎస్.ధనరాజ్, పూర్వపు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రోలాండ్ విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలను అల్లుకున్న నిర్లక్ష్యం

వర్షాకాలం పలుచోట్ల విద్యుత్తు స్తంభాలను పచ్చని పాదులు అల్లేస్తున్నాయి. విద్యుత్తు సిబ్బంది వీటిని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెడ్డిపల్లి కాలువగట్టు రోడ్డులో సింగరాయపాలెం వద్ద కనిపించిన దృశ్యమిది. విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుని తీగల పైకి పాకుతున్నాయి. అటుగా వెళ్లే పశువులు, మనుషులు వీటిని తాకితే ప్రమాదమే. - న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

మొక్కలు వదిలేశారిలా..!

ప్రభుత్వం పంపిణీ చేసిన మొక్కలను అమలాపురం పట్టణంలోని మంచినీటి సరఫరా కేంద్రం వద్ద ఇలా వదిలేశారు. పట్టణంలో నాటేందుకు గతంలో రూ.85వేలు విలువ చేసే మొక్కలను తెప్పించారు. తర్వాత వీటి గురించి అధికారులు, కౌన్సిలర్లు పట్టించుకోలేదు. దీనిపై మున్సిపల్ ఏఈ భాస్కరరావును వివరణ కోరగా.. త్వరలో చంద్రబాబునాయుడు పార్కులో నాటేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

సమన్వయలోపం.. ప్రయాణికులకు శాపం..

అమలాపురం ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఈదరపల్లి వంతెనకు వెళ్లే మార్గంలో మురుగు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. ఈ పరిస్థితి చాలా కాలంగా ఉన్నప్పటికీ పంచాయతీ, పురపాలక సంఘ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి ఓ వైపు పంచాయతీ.. మరోవైపు పురపాలక సంఘ పరిధి కావడంతో ఎవరికి వారు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో పంచాయతీ సిబ్బంది బాగు చేయించారు. పురపాలక యంత్రాంగం మాత్రం పట్టించుకోవడం లేదు. - న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

డంపింగ్ యార్డుగా మార్చేశారు..!

ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి పంచాయతీ పరిధిలోని సింగరాయపాలెం రహదారి చెంత కొందరు చెత్త వేస్తున్నారు. రోజుల తరబడి రహదారి పక్కన వ్యర్థాలు ఉండటంతో కుళ్లి చుట్టుపక్కలకు దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో వాహనచోదకులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

కృష్ణానదిలో అమలాపురం యువకుడి గల్లంతు

తుళ్లూరు: రాజధాని గ్రామం రాయపూడి సమీపంలోని కృష్ణా నదిలో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నేలపాడు సమీపంలో ఎన్‌సీసీ సంస్థ నిర్మిస్తున్న 'హ్యాపీ నెస్ట్ ప్రాజెక్ట్'లో పనిచేస్తున్న ఆరుగురు సిబ్బంది ఆదివారం రాయపూడి సమీపంలోని లంక వద్దకు వెళ్లారు. వారిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన పవన్ (24), ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన దినేష్ (23), మణికంఠ, పవన్ కల్యాణ్‌లు స్నానానికి దిగగా.. మిగిలిన ఇద్దరు గట్టుపైనే ఉన్నారు. ఈ క్రమంలో పవన్, దినేష్‌లు ప్రవాహ ఉద్ధృతికి నదిలో గల్లంతయ్యారు. స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. పోలీసులు జాలర్ల సాయంతో మరపడవలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు.

గొల్లపల్లికి శాసనమండలి ఛైర్మన్ పరామర్శ

సూర్యారావును పరామర్శిస్తున్న మోషేనురాజు

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, రాజోలు వైకాపా ఇన్‌ఛార్జి గొల్లపల్లి సూర్యారావును అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో శాసన మండలి ఛైర్మన్ మోషేనురాజు ఆదివారం పరామర్శించారు. సూర్యారావు కుమారుడు శ్రీధర్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన తోపాటు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, వైకాపా రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు తదితరులు ఉన్నారు.

జ్ఞాపిక అందుకుంటున్న గొల్లవిల్లి పాఠశాల విద్యార్థి సిద్ధార్థ

రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లవిల్లి విద్యార్థులు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల వృత్తి విద్యాకోర్సుల నైపుణ్య పోటీల్లో ఐటీ విభాగంలో గొల్లవిల్లి విద్యార్థులు ప్రత్యేక ప్రతిభ కనబరిచారు. శుక్రవారం అమలాపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థి సిద్ధార్థ రూపొందించి ఐటీ ప్రాజెక్టుకు ప్రథమ స్థానం లభించింది. జీసీడీవో ఎం.ఎ.కె.భీమారావు నుంచి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ నెల 14న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు అర్హత సాధించారు. ఆదివారం హెచ్‌ఎం కనకదుర్గ, ఒకేషనల్ ట్రైనర్స్ మధుబాల, విజయ తదితరులు విద్యార్థులను అభినందించారు.

రేడియాలజీ సేవలు కీలకం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ఆధునిక వైద్యరంగంలో చేపట్టే చికిత్సల్లో రేడియాలజీ సేవలు కీలకమని కిమ్స్ ఆసుపత్రి డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య అన్నారు. కామనగరువు కిమ్స్ వైద్య కళాశాలలో ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేడియాలజీ ప్రాధాన్యం, రోగుల నిర్ధారణ చికిత్సల గురించి వివరించారు. రేడియాలజిస్ట్ డాక్టర్ టి.రాజేష్‌కుమార్, వైద్యులు భరత్, లక్ష్మీక్రాంతి, రోజా, లోహిత్, రేడియేషన్ సేఫ్టీ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం వాసర్ల గార్డెన్స్‌లో శెట్టిబలిజ సంఘ నాయకులు

మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం, సంఘ నాయకులు

చంద్రబాబు ఉద్యానంలో పిల్లలకు బహుమతులు

కార్తిక వనసమారాధనల సందడి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: శెట్టిబలిజలు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో ఉన్నతి సాధించాలని కోనసీమ శెట్టిబలిజ సంఘం నాయకులు ఆకాంక్షించారు. అమలాపురం వాసర్ల గార్డెన్స్‌లో కోనసీమ శెట్టిబలిజ కార్తిక వనసమారాధన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోనసీమ సంఘ అధ్యక్షుడు మట్టపర్తి మీరాసాహెబ్, చెల్లుబోయిన శ్రీను, కౌన్సిలర్లు సంసాని నాని ఆధ్వర్యంలో ఉసిరిచెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం తెదేపా నాయకుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణలను సన్మానించారు. గార్డెన్స్‌లో పిల్లలు, మహిళలు నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

అమలాపురంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పట్టణ గౌడ సంఘం నాయకులు

సూర్యబలిజ సంఘీయుల ఆధ్వర్యంలో..

అమలాపురం మంచినీటి చెరువుగట్టు చంద్రబాబు ఉద్యానంలో సూర్యబలిజ సంఘ అధ్యక్షుడు భాస్కర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి అధికసంఖ్యలో హాజరైన పిల్లలకు, మహిళలకు ఆటలు, పాటలు, నృత్య పోటీలు నిర్వహించారు.

గౌడ సంఘం..

అమలాపురం పట్టణం: గౌడ సంఘీయులు ఐకమత్యంగా ఉండి అన్ని రంగాలలో రాణించాలని పట్టణ గౌడ సంఘం నాయకులు పేర్కొన్నారు. శ్రీరామపురం శివారులో గౌడ కార్తిక వనసమారాధన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టుకు, గౌడల మూలపురుషుడు కౌండిన్య మహర్షిలకు పూజలు నిర్వహించారు. రేలంగి కుమార్ అంకరగౌడ్ కార్తిక మాస విశిష్టతపై ప్రవచన చేశారు. అధ్యక్షుడు మట్ట కిషోర్, దాసరి శ్రీనివాస్, వెలిగట్ల రామలక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వాసర్ల గార్డెన్స్‌లో పిల్లల కేరింతలు

పదో తరగతి విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

అడపా కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా అడపా కుటుంబీకుల ఆత్మీయ కలయికను ఈదరపల్లిలోని అలవైకుంఠపురంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్, గుంటూరు, విశాఖపట్టణం, హనుమాన్ జంక్షన్, అవనిగడ్డ, బూరుగుపూడి, విజయవాడ, మంగవరం, కాకినాడ, ప్రతిపాడు, రామానుజపురంతోపాటు ఈదరపల్లికి చెందిన అడపా కుటుంబీకులు ఒకేచోట చేరి సందడి చేశారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో అడపా ట్రస్ట్ అధ్యక్షుడు అడపా శివయ్య, అమలాపురం వైస్ ఎంపీపీ అడపా సుబ్బయ్య, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు అడపా బాబులు, అడపా రాజా, కల్యాణ్, మాణిక్యాలరావు, భాస్కరరావు, ఉదయభాస్కరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలో యానాం విజయం

యానాం, న్యూస్‌టుడే: మాహేలో నిర్వహించిన పుదుచ్చేరి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఆటల పోటీలో యానాం బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు సత్తాచాటి ప్రథమ స్థానం సాధించారు. జోనల్ గేమ్స్ కార్యదర్శి కొప్పనాతి భాస్కర్ నేతృత్వంలో 50 మంది క్రీడాకారులు బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీలలో పాల్గొనేందుకు కేరళలోని మాహే ప్రాంతానికి మంగళవారం బయల్దేరి వెళ్లారు. అండర్-19 బాలుర విభాగంలో ఫైనల్లో పుదుచ్చేరి జోన్-4పై విజయం సాధించినట్లు కోచ్ బొట్టా శ్రీనివాస్ తెలిపారు. విజేతలను ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ అభినందించారు.

మాహేలో జరిగిన పోటీలో గెలుపొందిన యానాం క్రీడాకారులు

నూతన కార్యవర్గం ఎన్నిక

సమావేశంలో కార్యవర్గ సభ్యులు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: జిల్లా ఎలైడ్ హెల్త్ జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నిక ముమ్మిడివరంలోని అంబేడ్కర్ కన్వెన్షన్ హాలు వద్ద షేక్ మదీనా బాషా అధ్యక్షతన ఆదివారం జరిగింది. జిల్లా కన్వీనర్‌గా గూటం అరుణకుమారి, కో కన్వీనర్‌గా నక్కా శ్రీనివాస్, గాలిదేవర శ్రీహరి, కార్యదర్శిగా షేక్ మదీనా బాషా, సంయుక్త కార్యదర్శులుగా ఉందుర్తి అచ్యుతవల్లి, దుగ్గిరాల సుగుణ లక్ష్మి, పసుపులేటి మాణిక్యాంబ, కోశాధికారిగా పెంటపాటి సూర్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టి.చాందిని, సునంద, విజయలలిత, త్రినాథ్, ఆలీ, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ పరిహారానికి వినతి

యానాం: గ్యాస్ సరఫరా, అన్వేషణలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, దరియాలతిప్ప పైపులైన్ ప్రమాదానికి పరిహారం ఇవ్వాలని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్‌ను పుదుచ్చేరి ప్రభుత్వం ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆదివారం కోరారు. ప్రజాప్రతినిధులతో కలిసి ఇప్పటికే నాలుగు పర్యాయాలు కలెక్టర్‌ను కలిసినట్లు మల్లాడి విలేకరులకు తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన చమురు సంస్థల ప్రతినిధులతో ఈ నెల 14న సమావేశం జరగనుందన్నారు.

ఆకాశం మేఘావృతం.. అన్నదాత ఆందోళన

ఆదివారం ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో చేలన్నీ ముంపు భారీన పడ్డాయి. శ్రమకోర్చి చేలల్లో నీటిని బయటకు తోడారు. పలుచోట్ల రైతులు వరిని కోసి ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. తిరిగి వర్షం పడితే చేతికొచ్చిన పంట చేజారిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

పాడైన ట్రాక్టరు

అద్దం దెబ్బతిన్న చెత్తసేకరణ వాహనం

టైర్లలో గాలి తగ్గి, చుట్టూ చెత్తతో..

చెదలు పట్టిస్తున్నారు..!

స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పంచాయతీలలో చెత్త తొలగింపు, పారిశుద్ధ్య పనుల నిమిత్తం గత ప్రభుత్వం పంపిణీ చేసిన ట్రాక్టరు, చెత్త తరలింపు వాహనాలు నిరుపయోగంగా మారాయి. బ్రహ్మసమేధ్యం పంచాయతీ పరిధి బలుసుతిప్పలో వీటిని మూలకు చేర్చారు. పంపిణీ చేసిన నుంచి స్థానిక తుపాను రక్షిత భవనంలోనే ఉంచారు. కొన్ని పరికరాలు చోరీకి గురయ్యాయని చెబుతున్నారు. ఆకతాయిలు అద్దాలు పగలగొట్టారు. టైర్లలో గాలి తగ్గి పాడయ్యే పరిస్థితి ఏర్పడింది. స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివాస్‌లో భాగంగా వీటిని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కాట్రేనికోన

కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా కాటంశెట్టి

యానాం, న్యూస్‌టుడే: యానాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా కాటంశెట్టి వెంకట రామమూర్తిని నియమిస్తూ పుదుచ్చేరి పీసీసీ అధ్యక్షుడు వి.వైథిలింగం ఉత్తర్వులు జారీ చేశారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు వచ్చే వేసవిలో జరుగనున్న నేపథ్యంలో పార్టీని బలోపేతం చేయడానికి వివిధ కమిటీల నియామక ప్రక్రియ పీసీసీ మొదలుపెట్టింది. 28 నియోజకవర్గాలకు ఇద్దరి నుంచి నలుగురు వరకు ఇన్‌ఛార్జిలను నియమించారు. యానాం, మాహే ప్రాంతాలకు మాత్రం ఒక్కరు చొప్పునే నియమించడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

వివాహిత ఆత్మహత్య

మండపేట గ్రామీణం: కుటుంబ కలహాలతో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండపేట మండలం ద్వారపూడి గ్రామ పంచాయతీ పరిధి వేములపల్లి శివారులో ఆదివారం జరిగింది. మండపేట గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామానికి చెందిన మట్టా రేఖ(24)కు వేణుతో వివాహంకాగా అదే గ్రామంలో కాపురం ఉంటున్నారు. వీరికి నాలుగు నెలల కుమారుడు ఉన్నాడు. ప్రసవం కోసం ద్వారపూడిలో నివసిస్తున్న తండ్రి నేదునూరి శ్రీను ఇంటికి వచ్చింది. తరచూ భార్యభర్తలు ఫోన్‌లో గొడవలు పడేవారు. భర్తతో కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది ఆదివారం ఉదయం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై వి.కిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాలుగు నెలల కుమారుడు ఉన్నాడు.

(c) eenadu

పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా శివపార్వతుల కల్యాణం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని కుమ్మర వీధిలో గోపిశెట్టివారి రామాలయం వద్ద జె.కె. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సినీ దర్శకుడు, నిర్మాత శక్తి రామారెడ్డి దంపతులు ఆదివారం శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు.

మండపేట

•మండపేట •రామచంద్రపురం

పార్థివ లింగానికి అన్నాభిషేకం

మండపేట: స్థానిక పెదకాలువ సమీపంలోని ఏకాదశరుద్రులు ద్వాదశ జ్యోతిర్లింగాలు ఆలయ సముదాయం వద్ద ఏర్పాటు చేసిన ఉమాపార్థివలింగేశ్వరం వద్ద పార్థివ లింగానికి ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. శివస్వామి వేగుళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో శివదీక్ష చేపట్టిన 40 మంది స్వాములు కందర్ల ప్రసాద్, ఆర్వీ గణేష్, కేశవరపు శ్రీనివాస్, బండి దుర్గారావు, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

అన్నాభిషేకం నిర్వహిస్తున్న శివస్వాములు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు | మండపేట: 80085 74183 | రామచంద్రపురం: 80085 74191

వ్యర్థాలు తొలగించారు..

సమస్య: మండపేట మండలం ఏడిద సీతానగరం రామాలయం వీధిలో రహదారి పక్కన వ్యర్థాల కారణంగా దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - హెచ్.శాస్త్రి

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి స్వామిరెడ్డి తెలియజేయగా స్పందించిన సిబ్బంది దిని పంపించి వ్యర్థాలు తొలగింపజేశారు. - న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

చెత్త శుద్ధికి శ్రీకారం

▲నేటి నుంచి మూడు రకాలుగా సేకరణ ▲హరిత ట్రైబ్యునల్ ఆదేశాలు

న్యూస్‌టుడే, మండపేట

పట్టణాల్లో ఇంటి నుంచే చెత్త శుద్ధికి శ్రీకారం చుట్టారు. గతంలో మున్సిపాలిటీ ఇచ్చిన ఎరుపు, నీలం, ఆకుపచ్చ రంగుల చెత్తబుట్టలను తప్పనిసరిగా ఉపయోగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంత కాలం ఇంటింటికి వ్యర్థాల సేకరణ కేవలం మొక్కుబడి తంతుగా ఉండేది. చెత్తబుట్టలు వినియోగిస్తున్నప్పటికీ అన్ని వ్యర్థాలను కలిపి అందులో వేసి సిబ్బందికి అందజేస్తున్నారు. దానిని నేరుగా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ప్రస్తుతం పట్టణానికి ఇటీవల స్వచ్ఛ మండపేట అవార్డు రావడంతోపాటు హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు.

తడి, పొడి, ఈ-వ్యర్థాల సేకరణ..

తడి, పొడి వ్యర్థాలతోపాటు ఈ-వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి తరలించాల్సి ఉంది. ప్రస్తుతం మండపేట పట్టణంలో డంపింగ్ యార్డు సమీపంలో వ్యర్థాలు వేరుచేసేందుకు యంత్రాలు ఏర్పాటు చేశారు. వ్యర్థాలను వేర్వేరుగా తరలిస్తే త్వరితగతిన తడి, పొడి, రీసైకిల్ వ్యర్థాల నిర్వహణ సులభమవుతుంది.

పలు విధానాలు.. దక్కని ఫలితం

సుమారు దశాబ్దం క్రితం 2015లో ప్రైవేటు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టారు. పట్టణాన్ని క్లస్టర్లుగా విభజించి ఇంటింటికి రేడియో ట్యాగ్‌లు ఏర్పాటు చేశారు. 5 వార్డులు కలిపి క్లస్టరుగా చేసి సిబ్బంది నిత్యం రహదారులతో పాటు డ్రైనేజీల్లో వ్యర్థాల నిర్మూలనకు మైక్రో శానిటేషన్ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టారు. శానిటరీ మేస్త్రీకి 4జి మొబైల్ పరికరం అందజేశారు. క్లస్టర్ పరిధిలో ఏ వీధిలో శుభ్రం చేసిందీ రేడియో స్టిక్కర్‌తో స్కాన్ చేస్తారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం చేసినట్లు క్లస్టర్ ఇన్‌ఛార్జికి సమాచారం అందుతుంది. ఎక్కడైనా ఫిర్యాదు వస్తే శుభ్రం చేసిన 2 గంటల్లోగా ఇన్‌ఛార్జి ఫోటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. ఈ విధానం మూడేళ్లపాటు నిర్వహించినా క్షేత్ర స్థాయిలో అనుకున్న ఫలితం రాకపోవడంతో మళ్లీ మార్పు చేసి కొత్తగా మూడవ కన్ను విధానం అమలు చేశారు. ఈ విధానంతో శానిటరీ మేస్త్రీకి మొబైల్‌ఫోన్ అందజేశారు. ఆ ప్రాంతం శుభ్రం చేసిన వెంటనే వాట్సాప్ వీడియో ద్వారా చూపించాల్సి ఉంది. ఇలా ఎన్ని రకాలుగా ప్రయోగాలు చేసినా సమస్య మళ్లీ మొదటికే వచ్చింది.

సిబ్బంది ఇంటి నుంచి సేకరిస్తున్న వ్యర్థాలు

తప్పనిసరిగా అమలు చేయాలి

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు గతంలో పురపాలక సంఘం ఇచ్చిన చెత్తబుట్టలను తప్పనిసరిగా వినియోగించాల్సి ఉంది. తడి, పొడి, ఈ-వ్యర్థాలను వేరుగా అందజేస్తే త్వరితగతిన నిర్మూలనకు, రీసైకిల్ చేయడానికి ఉపయోగపడుతుంది. సోమవారం నుంచి తప్పనిసరిగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
- టీవీ రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట

నేటి నుంచి స్వామిత్వ గ్రామసభలు

పామర్రు, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సోమవారం నుంచి స్వామిత్వ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ వెల్లడించారు. గ్రామకంఠాల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలపై ప్రజలకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు ఈ పథకం నిర్దేశించారన్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే చేశారని, వాటి మీద గ్రామ సభల్లో అభ్యంతరాలు స్వీకరిస్తారని చెప్పారు. ఈ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భజన కళాకారుడికి సత్కారం

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగర మార్కెట్ వద్ద కొలువైన సిద్ధివినాయక స్వామి ఆలయానికి భక్తులు రూ.30,000 విలువైన భజన సామాగ్రిని అందజేశారు. గ్రామానికి చెందిన భజన కళాకారుడు మావూరి బాబీ ఆలయానికి మైకుసెట్, హార్మోనియం, తదితర వస్తువులను వితరణ చేశారు. కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. గంగుమళ్ల కృష్ణ, చక్రవర్తి, సుబ్రహ్మణ్యం, కొల్లాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో చిన్న పరిశ్రమలకు చేయూత

రాయవరం, న్యూస్‌టుడే: వ్యాపారులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు రాయితీపై కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రుణ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లా జనరల్ మేనేజర్ పత్రి శ్రీనివాస్ సూచించారు. రాయవరంలో బీఎం మేనేజర్ వి.సత్యనారాయణ అధ్యక్షతన చిరువ్యాపారులకు నిర్వహించిన ఎంఎస్ఎంఈ అవగాహన సమావేశంలో జీఎం మాట్లాడుతూ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారులకు చేయూతనిచ్చేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాన్ని ప్రకటించారన్నారు. రాజమహేంద్రవరం జోన్ డిప్యూటీ హెడ్ శంకరరావు మాట్లాడుతూ 90 శాతం రాయితీతో వివిధ వ్యాపారాలకు రుణాల మంజూరు సరళతరం చేశారన్నారు. రీజనల్ కార్యాలయ డిప్యూటీ ఆఫీసర్ ప్రసన్నరాజు, జిల్లా డీపీఎం పి.శివరామప్రసాద్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవరావు పవర్ ప్రజెంటేషన్ ద్వారా పథకాలకు దరఖాస్తు చేసే విధానంపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఢిల్లీ నుంచి కేంద్రమంత్రి సీతారామన్, ఇతర మంత్రులు పథకాలపై దూరదృశ్య విధానంలో ఖాతాదారులతో నేరుగా మాట్లాడుతూ వ్యాపార అవకాశాలను కేంద్రం అందిస్తున్న రుణాలు పొందేందుకు ముందుకు రావాలన్నారు. రామచంద్రపురం, మండపేట, అనపర్తి నియోజకవర్గాల వ్యాపారులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధనలతో డెల్టా వెతలకు పరిష్కారం

పాలకొల్లు, న్యూస్‌టుడే: పరిశోధనల ద్వారా గోదావరి డెల్టాలో పలు సమస్యలకు పరిష్కార మార్గాలు చూపవచ్చని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేశనపల్లిలో ఉప్పునీటి ప్రభావంపై అదే ప్రాంతానికి చెందిన యర్రంశెట్టి విజయ్‌సత్యప్రసాద్ చేసిన పరిశోధనలకు ఇంటర్నేషనల్ జనరల్ ఆఫ్ రీసెర్చ్ ఇంజినీరింగ్ సైన్స్ గుర్తింపు లభించింది. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ద్వారా లవణ జలాలు ప్రవేశించడం వల్లే కేశనపల్లిలో కొబ్బరి, వరి పంటలకు నష్టం వాటిల్లుతున్నట్లు ఈ పరిశోధనల్లో తేలింది. దీనికి సంబంధించిన ప్రతులను విజయ్‌సత్యప్రసాద్ ఆదివారం పట్టణంలో మంత్రి నిమ్మలకు అందజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ కేశనపల్లి సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని, ఈ పరిశోధనలో గుర్తించిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

గొల్లపల్లికి శాసనమండలి ఛైర్మన్ పరామర్శ

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, రాజోలు వైకాపా ఇన్‌ఛార్జి గొల్లపల్లి సూర్యారావును అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో శాసన మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు ఆదివారం పరామర్శించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, వైకాపా రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు ఉన్నారు.

వన సమారాధనలతో ఐక్యత

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వనసమారాధనలు సందడిగా జరిగాయి. కపిలేశ్వరపురంలోని నాలుగు శెట్టిబలిజ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్తిక వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకలన్నారు. ఎంపీపీ శ్రీనివాస్, కడపూడి సురేష్, జె.మల్లిఖార్జునుడు, కొప్పిశెట్టి వాసు, కట్టా మురళి, తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: కె.గంగవరం మండలం ఆముజూరులో కాకతీయ సంఘాల ఆధ్వర్యంలో వనసమారాధన చేపట్టారు. సంఘ సభ్యులందరూ ఐక్యంగా ఉంటూ పరస్పర సహకారం అందించుకోవాలని నిర్ణయించుకున్నారు. తొలుత ఉసిరి చెట్టు కింద శ్రీకృష్ణుని పూజలు చేశారు. జిల్లా కాకతీయ సంఘ అధ్యక్షుడు వి.వి.ఎస్. చౌదరి, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, మాజీ ఎమ్మెల్సీ వి.వి.వి.చౌదరి (ఖర్వాధ్యక్షుడు), మరి వాడ సూర్యనారాయణ, చిన్నికృష్ణ, వై.గోపాలకృష్ణ, పెద్దలు కోడూరి వీరవెంకట సత్యనారాయణ, నేమాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

అముజూరులో కాకతీయ వనసమారాధనలో ఉసిరి చెట్టుకు పూజలు

ఆటపాటలతో ఆర్యవైశ్యుల సందడి

రామచంద్రపురం: రామచంద్రపురం శ్రీకన్యకాపరమేశ్వరి సేవాసమితి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనభోజనాలు మండపంలోని కల్యాణ మండపం వద్ద ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు పట్నాల గంగాధరం, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్, పి.వి, స్థల దాత భవానీశంకర్, దొరబాబు, నగేష్, చెల్లూరు చిన్ని తదితరులను సత్కరించారు. నూతన అధ్యక్షుడిగా పి.సత్తిబాబు, సంయుక్త కార్యదర్శిగా ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా వీరబాబును ఎన్నుకున్నారు. నగేష్ దంపతులు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఆటపాటలతో వనభోజనాలు జరిగాయి.

రేడియాలజీ సేవలు కీలకం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆధునిక వైద్యరంగంలో రేడియాలజీ సేవలు కీలకమని కిమ్స్ ఆసుపత్రి డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య అన్నారు. కామనగరువు కిమ్స్ వైద్య కళాశాలలో ప్రపంచ రేడియోగ్రాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేడియాలజీ ప్రాధాన్యం, రోగుల నిర్ధారణ చికిత్సల గురించి వివరించారు. రేడియాలజిస్ట్ డాక్టర్ టి. రాజేష్‌కుమార్, వైద్యులు భరత్, లక్ష్మీక్రాంతి, రోజా, లోహిత్, రేడియేషన్ సేఫ్టీ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

కాకినాడ జిల్లాలోనే కాజులూరు మండలం

• జేఏసీ నాయకులకు మంత్రి సుభాష్ హామీ

కాజులూరు, న్యూస్‌టుడే: కాజులూరు మండలాన్ని కాకినాడ జిల్లాలోనే కొనసాగించాలని కోరుతూ కాజులూరు మండల జేఏసీ సభ్యులు సీహెచ్‌వీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో జిల్లాల పునర్విభజనలో భాగంగా ఎన్నో పోరాటాల ఫలితంగా కాజులూరు మండలాన్ని కాకినాడ జిల్లాలో చేర్చారన్నారు. ఇప్పుడు మళ్లీ అదే మండలాన్ని తిరిగి అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో చేర్చే అవకాశం ఉందన్న సమాచారంతో మండల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రి స్పందిస్తూ కాజులూరు మండల ప్రజల ఆకాంక్ష మేరకు కాకినాడ జిల్లాలోనే కొనసాగించాలనే అభిప్రాయాన్ని ప్రభుత్వానికి పంపుతామని స్పష్టం చేశారు. మంత్రి హామీతో మండల జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు చువ్వాకుల నారాయణమూర్తి, పేపకాయల నారాయణమూర్తి, వనుం వీరబ్రహ్మం, మేడిశెట్టి వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

కాలనీలోకి వెళ్లాలంటే ఎలా..?

మండపేటలో పెదకాలువ వంతెన నుంచి కాలేరు కాలువ గట్టు మీదుగా బ్యాంకు కాలనీకి వెళ్లే దారి అధ్వానంగా మారింది. కొద్దిపాటి వర్షానికే చెరువులా మారుతోంది. సమీపంలోని వ్యర్థ జలాలతో కలుషితమై నీరు నిలిచిపోతోంది. లింకురోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యను మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు దృష్టికి తీసుకువెళ్లగా సర్వే చేయించి రహదారి నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, మండపేట

అరకొర నిర్వహణ.. తొలగని చెత్త

రామచంద్రపురం 23వ వార్డు పరిధి చల్లావారి వీధిలో నిత్యం చెత్త పేరుకుపోతోంది. ఏనాడూ సక్రమంగా శుభ్రం చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. పురపాలక సంఘ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై శానిటరీ తనిఖీదారు డేవిడ్ రాజును వివరణ కోరగా సోమవారం ఉదయాన్నే శుభ్రం చేయిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, రామచంద్రపురం

శునకాల సంచారంతో బెంబేలు

ద్రాక్షారామలో శునకాలు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని తరుముతుండటంతో పలువురు అదుపుతప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. గీతా మందిరం వీధి సెంటర్లో కుక్కల గుంపుతో ఆ దారిన వెళ్లేందుకు భయపడుతున్నారని, వాటిని అరికట్టే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, ద్రాక్షారామ

స్నానాల రేవు అపరిశుభ్రం

ద్వారపూడిలో ప్రసిద్ధి చెందిన అయ్యప్పస్వామి దేవాలయం ఎదుట భక్తులు స్నానాలు చేసే రేవు వ్యర్థాలతో అపరిశుభ్రంగా తయారైంది. అక్కడ బస్సుల కోసం వేచి చేసే భక్తులు, ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. వ్యర్థాలకు కొంతమంది నిప్పు పెడుతుండటంతో పొగతో సతమతమవుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఆకుల వి.వి.రమణను వివరణ కోరగా ఆలయ నిర్వాహకులకు చాలాసార్లు నోటీసులు జారీ చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జలవనరుల శాఖ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేసి రుసుము వసూలు చేస్తున్నారని, పంచాయతీకి పన్నులు చెల్లించడం లేదన్నారు. - న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

కుండలేశ్వర క్షేత్రంలో మంత్రి సుభాష్

కాట్రేనికోన, న్యూస్‌టుడే: పార్వతీసమేత కుండలేశ్వరాలయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం పూజలు చేశారు. ఈవో దుర్గ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి చిత్రపటాలను అందించారు. జి.సాయి, నాగిడి నాగేశ్వరరావు, సుధీర్, నాగు, పీఎస్ఎన్ రాజు, భద్రరావు, రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మట్టా రేఖ

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండపేట మండలం ద్వారపూడి గ్రామ పంచాయతీ పరిధి వేములపల్లి శివారులో ఆదివారం జరిగింది. మండపేట గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామానికి చెందిన మట్టా రేఖ(24)కు వేణుతో వివాహంకాగా అదే గ్రామంలో కాపురం ఉంటున్నారు. వీరికి నాలుగు నెలల కుమారుడు ఉన్నాడు. ప్రసవం కోసం ద్వారపూడిలో నివసిస్తున్న తండ్రి నేదునూరి శ్రీను ఇంటికి వచ్చింది. తరచూ భార్యభర్తలు ఫోన్‌లో గొడవలు పడేవారు. భర్తతో కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది ఆదివారం ఉదయం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై వి.కిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాలుగు నెలల కుమారుడు ఉన్నాడు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగర ఊరచెరువు గట్టు వద్ద శనివారం రాత్రి మహాపడిపూజ వైభవంగా జరిగింది. కోరుమిల్లికి చెందిన వేద పండితులు ముక్కామల కామేశ్వరశర్మ, బవిరిశెట్టి శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మహా పడిపూజ, లక్ష బిల్వార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక, టేకి, కోరుమిల్లి, మాచర, తదితర గ్రామాల నుంచి సుమారు 400 మంది అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు. ఏడిదకు చెందిన శివ స్వామి తన భజన బృందంతో కలిసి ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

మండపేట: స్థానిక ఆలమూరు రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా స్వామి రథోత్సవం, ఊరేగింపు నిర్వహించారు. దేవతల వేషధారణతో చిన్నారులు వాహనాలపై ప్రదర్శన, మహిళలు కోలాట నృత్యం ఆకట్టుకుంది. భారీ సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

అంగరలో బిల్వార్చన చేస్తున్న అయ్యప్ప దీక్షాపరులు

భక్తిశ్రద్ధలతో బిల్వార్చనలు

రాయవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం పసలపూడిలో 142 పార్థివ లింగాలకు సామూహిక పూజలు నిర్వహించారు. మాణిక్యాంబ సమేత రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శాంతి కల్యాణం నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు.

రాయవరం: వెదురుపాకలో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన నిర్వహించారు. సాయంత్రం కార్తిక దీపోత్సవం అనంతరం సామూహిక అన్నదానం జరిగింది.

పామర్రు: దంగేరు, యండగండిలో సోమేశ్వరస్వామివారి ఆలయాల్లో లక్షబిల్వార్చన నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన చేశారు.

పార్థివ లింగాలకు సామూహిక పూజలు

యండగండిలో ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరుడు

భక్తులకు అల్పాహారం పంపిణీ

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి విచ్చేసే పంచారామ యాత్రికులకు స్థానిక పీవీఆర్ ఉన్నత పాఠశాల 1988-89 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం రాత్రి అల్పాహారాన్ని (ప్రసాదం) వితరణ చేశారు. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు దాదాపు రెండు వేల మందికి అల్పాహారం అందించారు. పూర్వ విద్యార్థులు వాసంశెట్టి శ్యామ్, ఆకుల అచ్యుతరామరాజు, చిక్కాల నాగబాబు, పసుమర్తి రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయం వద్ద యాత్రికులకు అల్పాహారం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కేశవరంలో స్థల వివాదం

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కేశవరంలో ప్రభుత్వ స్థల విషయమై ఆదివారం వివాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవరం పశువుల ఆసుపత్రి పక్కన గ్రామ కంఠానికి చెందిన స్థలంలో శనివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులు సుమారు రేకుల షెడ్డు వేయడానికి ప్రయత్నించారు. పంచాయతీ అధికారులు చేరుకొని అడ్డుకున్నారు. మాలధారులు వంట చేసుకోవడానికి గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కేటాయించారని వారు, రామాలయం నిర్మాణానికి పెరికి కులస్థులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్థలం కేటాయించారని కూటమి నేతలు చెబుతున్నారు. అక్కడ రెండు వర్గాలు బైఠాయించడంతో వివాదం మరింత పెరిగింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎన్.సుబ్బారావును వివరణ కోరగా, పంచాయతీకి చెందిన స్థలం సెంటు భూమి కోసం వివాదం జరిగిందన్నారు. గతంలో పంచాయతీ తీర్మానం చేయకుండా మాలధారులకు కేటాయించారని, రేకుల షెడ్డు వేయడానికి ప్రయత్నం చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి స్థలంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతం మండపేట రూరల్ ఎస్సై వి.కిశోర్, సిబ్బందితో పికెటింగ్ నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టారు.

మాట్లాడుతున్న రూరల్ ఎస్సై కిషోర్

సంగమేశ్వర క్షేత్రం.. సదుపాయాలు కనం

• కార్తికంలో భక్తుల ఇక్కట్లు

న్యూస్‌టుడే – మండపేట గ్రామీణం

మండపేట మండలం ఏడిద గ్రామంలో 14వ శతాబ్దంలో నిర్మించిన శ్రీస్వయంవర పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేదని గగ్గోలు పెడుతున్నారు. ఈ క్షేత్రంలో 14వ శతాబ్దం నాటి సిద్ధి వినాయకస్వామి, శ్రీరామపాదాలు, కదంబ వనం, సప్తమాతృకా వారాహి అమ్మవారు, సప్త మహర్షులు, పార్వతి అమ్మవారు కొలువై ఉన్నారు. ప్రస్తుత కాలంలో నిర్మించిన కల్యాణ నాగేంద్రస్వామి, సంతాన నాగేంద్రస్వామి, అభయ ఆంజనేయస్వామి కొలువై ఉన్నారు.

● ప్రస్తుతం కార్తిక మాసం కావడంతో స్వామి వారి దర్శనానికి వెళ్లే భక్తులు సతమతమవుతున్నారు. క్షేత్రానికి వెళ్లే దారిలో తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కార్తికమాసం, శివరాత్రి, షష్ఠి, మాఘమాసం తదితర పర్వదినాల్లో భక్తులు వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ప్రసిద్ధి చెందిన క్షేత్రాన్ని చేరుకోవడానికి వెంటనే రహదారి నిర్మించి పరిసర ప్రాంతాలను ఆధునీకరించాలని భక్తులు కోరుతున్నారు. సంగమేశ్వరలింగాన్ని ఇంద్రుడు ప్రతిష్ఠించినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. శ్రీరాముడు వనవాసం చేసిన సమయంలో ఈ క్షేత్రాన్ని దర్శించారని, పావంచా రేవు గట్టుపై శ్రీరామపాదాలు ఉన్నాయని చెబుతున్నారు. సంగమేశ్వరంలో కదంబ వృక్షాలు కనువిందు చేస్తుంటాయి.

శ్రీరామపాద క్షేత్రానికి దారి ఇదే..

ఆధునికీకరణ పనులు చేపడతాం..

శ్రీరామ పాద క్షేత్రం అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. క్షేత్రం చుట్టూ ఉన్న తుప్పలు, పిచ్చిమొక్కలను తొలగిస్తాం. రహదారి నిర్మాణానికి పంచాయతీకి లేఖ రాశాం. సమస్యను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. - ఎం.శోభారాణి, ఈవో, సంగమేశ్వరస్వామి దేవస్థానం, ఏడిద

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No. 38/2023 O.S.No.246/2018

Between:

దొంతంశెట్టి శ్రీనివాసరావు, S/o వీరభద్రరావు, 53 సం॥లు, గతంలో వ్యాపారం, D.No: 4-107, మాచవరం, రాయవరం మండలం, అనపర్తి JCJC ...DHR

And

వల్లూరి సూర్య సుగుణ, W/o శ్రీనివాస్, 33 సంవత్సరాలు, వ్యాపారం, ఇంటి నెం. 5-172, వెంటూరు, రాయవరం మండలం, అనపర్తి JCJC ...JDR

పై నెంబరు గ్రంథంలో ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని ది.26-11-2025న ఉదయం గం॥ 10.30 లగాయితు సైకోర్టు వారి ఎదుట బహిరంగంగా వేలం వేయబడును. ఆసక్తి కలవారు ఈ వేలంలో పాల్గొని సదరు ఆస్తిని పాడుకొనవలసిందిగా తెలియజేయడం అయినది. వివరములకు శ్రీ కోర్టు వారి నజారత్ వారిని గాని లేదా వాది/డిహెచ్ఆర్ యొక్క అడ్వకేట్ గారిని కలిసి తెలుసుకొనవలెను.

క్రియాస్తికి షెడ్యూలు

ప్రస్తుతం డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పూర్వం తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం, రామచంద్రపురం సబ్-రిజిస్ట్రారులో చేరిన వెంటూరు గ్రామ పంచాయతీ ఏరియాలోని వెంటూరు గ్రామం తాలూకు జిరాయితీ సర్వే నెం.477రు పూరా య.13.31ట్లులో ఉత్తరం వైపు య.7.31ట్లులో దక్షిణం వైపు య.2.60 సెంట్లలో దక్షిణం వైపు య.1.40ట్లులో దక్షిణం వైపు య.1.20ట్లు (హె.0.484ర్లు) భూమికి హద్దులు. తూర్పు: వల్లూరి సత్యనారాయణ గారి యీ నెంబరు భూమి. పడమర: పంటబోదె. ఉత్తరం: వల్లూరి శ్రీదేవి మాణిక్యాంబ గారి యీ నెంబరు భూమి. దక్షిణం: పుట్టా సూర్యభాను గారి తాలూకు యీ నెంబరు భూమి. సదరు హద్దుల మధ్య Ac.1-20 Cents= 0.484 Hectors Land, అందలి మామూలు నీటి వసరులు, నడక మార్గములు, యావత్తు యీజిమెంట్ హక్కులు సర్వంసహా వేలం వేయబడును.

డిహెచ్ఆర్ విలువ: రూ.8,00,000/-, కోర్టు అమీన విలువ: రూ. 12,00,000/-

ఎస్ఆర్ఓ విలువ: 32,20,000/-, జేడిఆర్ విలువ: ఇచ్చియుండలేదు

వేలం తేది: 26-11-2025 తదుపరి వాయిదా: 3-12-2025

// కోర్టు వారి అనుమతిని //

తంత్రవహి సుబ్బారావు, బి.ఎస్‌సి, బి.ఎల్

SVV Satyanarayana Reddy

ఆర్‌వీజి సుబ్బారావు (మణీబాబు)

అనపర్తి, అడ్వకేట్స్,

ది.9-11-2025. 99480 19388, 98496 21028, అనపర్తి

(c) eenadu

శివోహం.. లక్ష దీపోత్సవం

అంతరాలయంలో చంద్రమౌళీశ్వరుడు

బొమ్మూరు గౌరీచంద్రమౌళీశ్వర ఆలయంలో ఆదివారం లక్షదీపోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకగా జరిగింది. మహాదేవునికి మల్లిక్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తులు పాల్గొని లక్ష దీపాలను వెలిగించారు. చంద్రమౌళీశ్వరుడుని వెండి కవచాలతో అలంకరించారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

లక్ష దీపాలతో గౌరీచంద్రమౌళీశ్వర ఆలయం

నిడదవోలు-తాడేపల్లిగూడెం రహదారిపై అడ్డంగా వేసిన మట్టిగుట్ట

పై వంతెన ఏమో గానీ.. ప్రాణాలు పైపైకి..!

నిడదవోలు పట్టణంలో ఆర్వోబీ (పైవంతెన) నిర్మాణ పనులు ప్రయాణికులకు చుక్కలు చూపుతున్నాయి. నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం వెళ్లేవారికి అవస్థలు తప్పడం లేదు. నిడదవోలు-తాడేపల్లిగూడెం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో రైల్వే పాత నడక వంతెన సమీపంలో వాహనాలు రాకపోకలు సాగించకుండా మట్టిగుట్ట అడ్డు వేశారు. ఈ విషయం తెలియక చాలా మంది సరాసరి ఇక్కడ వరకు వచ్చేస్తున్నారు. మట్టిగుట్ట దాటేందుకు నానా అవస్థలు పడుతున్నారు. దీనిని దాటే క్రమంలో కొందరు అదుపు తప్పి పడిపోతున్నారు. –న్యూస్‌టుడే, నిడదవోలు

క్వారీ.. నిబంధనలకు గోరీ..!

అనుమతులు గోరంత.. అక్రమాలు కొండంత

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, గోపాలపురం, దేవరపల్లి : అనుమతులు తీసుకుంది గోరంత.. అక్రమంగా తవ్వి తరలించేది కొండంత అన్న చందంగా జిల్లాలో క్వారీల నిర్వహణ సాగుతోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప జిల్లాలోని భూగర్భ గనుల శాఖ అధికారులు తనిఖీలు చేసే పరిస్థితి లేదు. క్షేత్ర స్థాయిలో పట్టించుకోవాల్సిన రెవెన్యూ, ఇతర శాఖలు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి.

దేవరపల్లి మండలంలోని ఓ క్వారీ

● నిబంధనలకు విరుద్ధంగా రిగ్ బ్లాస్టింగ్ చేయడంతో సమీపంలో దుద్దుకూరులోని పలు ఇళ్ల గోడలు బీటలువారుతున్నాయి.

మొక్కుబడిగా ప్రజాభిప్రాయ సేకరణ

✦ దేవరపల్లి మండల పరిధిలో ఇటీవల రెండు చోట్ల కంకర క్వారీల తవ్వకంపై ప్రజా అభిప్రాయ సేకరణ చేపట్టారు. వీటిపై అదే గ్రామానికి చెందిన కొందరు బహిరంగంగా విమర్శించారు. అధికారులు, క్వారీ యజమానులు ఒక్కటై సమావేశం నిర్వహించారు. క్వారీ చుట్టు పక్కల ఉన్న వారికి కలిగే ఇబ్బందులు తెలుసుకోకుండా, అసలు వారికి సమాచారం ఇవ్వకుండా సమావేశాలు నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ✦ లక్ష్మీపురానికి సంబంధించి క్వారీ అనుమతికి దుద్దుకూరులో సమావేశం నిర్వహించడంపై గ్రామస్థులు అధికారులను నిలదీశారు.

ఈ ప్రాంతంలోనే అధికం...

జిల్లాలో గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాలతో పాటు గోకవరంలో క్వారీల నిర్వహణ యథేచ్ఛగా సాగుతోంది. గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల పరిధిలో దుద్దుకూరు. గౌరీపట్నం, పంగిడి, దేచర్ల, లక్ష్మీపురం రెవెన్యూలో 40 వరకు క్వారీలుండగా, వీటిలో దాదాపు 60 శాతం మేర నిబంధనలు అతిక్రమించినవే. అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తున్నారన్నది బహిరంగ రహస్యం. వీటి నిర్వహణలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఉండడంతో ఏ పార్టీ అధికారంలో ఉంటే, ఆ పార్టీకి చెందిన వారు దందా సాగిస్తారన్న విమర్శలున్నాయి.

పరిమితికి మించి రవాణా...

అక్రమ క్వారీలు ఓ వైపు నిర్వహిస్తూనే.. పరిమితికి మించి లారీల్లో ఇష్టారాజ్యంగా తరలిస్తున్నా వాటిపై పెద్దగా కేసులు నమోదు చేస్తున్న దాఖలాలు లేవు. కేవలం జిల్లా స్థాయి అధికారులకు ఎవరైనా సమగ్ర ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేయడం మినహా ఇతర సందర్భాల్లో అడ్డుకునే పరిస్థితి లేదు. 'మైన్స్ కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంటుంది. లీజు పూర్తయినా నిర్వహిస్తున్న ఓ క్వారీ గుర్తించి సీజ్ చేసి భారీ జరిమానా విధించాం.' అని జిల్లా భూగర్భ గనులశాఖ అధికారి ఫణిభూషణ్‌రెడ్డి అన్నారు.

అవిగవిగో గోదారి జలాలు..!

పట్టాలెక్కనున్న రూ.1650 కోట్ల పనులు

ఈనాడు, రాజమహేంద్రవరం: చెంతనే గోదారి.. నీటికి మాత్రం చింత. తాగేందుకు బోరుపైనే ఆధారపడుతున్న పల్లెలెన్నో. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్‌తోపాటు.. గోదావరి జలాలు అందించాలన్న లక్ష్యంతో వాటర్ గ్రిడ్ పథకాన్ని తెరపైకి తెచ్చారు. కానీ వైకాపా హయాంలో దీనిని పూర్తిగా అటకెక్కించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దీనికి ఊపిరినిస్తోంది.

ధవళేశ్వరంలో భూమిని పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

చకచకా భూసేకరణ

ధవళేశ్వరంలో 12 ఎకరాలు జలవనరుల శాఖ భూములు, ఆత్రేయపురంలో 9 ఎకరాలు ఈ పథకానికి సేకరించారు. ఈ నెలాఖరుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేయించే దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండు దశల్లో..

● జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.1,650 కోట్లు ఈ పథకానికి కేటాయించారు. ఈ పనులు రెండు దశలుగా చేపట్టనున్నారు. మొదటి దశలో కోనసీమ, రెండో దశలో ఉమ్మడి జిల్లాలోని గ్రామాలకు జలాలు అందిస్తారు. ధవళేశ్వరం, ఆత్రేయపురం మండలంలోని బొబ్బర్లంక వద్ద ఒక్కో ఆర్‌ఎస్ఎఫ్ నిర్మించి, దాదాపు 2615 కిమీ మేర పైపులైన్లు వేస్తారు.

● ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 880 గ్రామాలకు స్వచ్ఛ జలాలు అందనున్నాయి. దీని వల్ల ప్రయోజనం పొందే మండలాలు ఎక్కువగా కోనసీమలో ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి, బిక్కవోలు, రాజమహేంద్రవరం గ్రామీణం, కడియం మండలాల్లోని 109 గ్రామాలకు మేలు చేకూరుతుంది. ఉమ్మడి జిల్లాలో 14.16 లక్షల మందికి స్వచ్ఛ జలాలు అందుతాయి.

ఉద్యోగం వచ్చిందోచ్..

యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందని మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కనకరాజు తెలిపారు. మెప్మా, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంటు సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సుబ్రహ్మణ్య మైదానంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. కనకరాజు మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. స్వయం ఉపాధికి ప్రోత్సహించేందుకు రాయితీలు కల్పిస్తోందన్నారు. మేళాలో 18 సంస్థలు పాల్గొన్నాయి. 2,165 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోగా 645 మంది ముఖాముఖిలకు హాజరయ్యారు. 239 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఆపరేషన్ మేనేజరు ఎన్.కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, ఏవీఏ రోడ్డు

కంటి 'పాప'లపై వలపు వల..!

ఆరేళ్లలో 706 పోక్సో కేసులు

● కాకినాడకు చెందిన బాలిక రాజమహేంద్రవరంలోని ఓ వసతి గృహంలో చదువుతోంది. తనకు పరిచయమున్న ఓ యువకుడు ఇటీవల నగరంలోని ఓ లాడ్జికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు.

● లలితానగర్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినిని ప్రేమ పేరుతో కొందరు వేధిస్తున్నారు. దీనిపై బాధితురాలు మూడోపట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

● ఇటీవల తునిలో తాత వయసున్న వ్యక్తి బాలికకు మాయమాటలు చెప్పి అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

● గత ఆరేళ్లలో 706 పోక్సో కేసులు నమోదయ్యాయి. 312 మంది బాలికలపై అత్యాచారం జరిగింది. వీటిలో దాదాపు 50 కేసులు మినహాయిస్తే మిగిలిన అన్ని ఘటనల్లోనూ బాలికలపై మాయమాటలతో అఘాయిత్యం చేసిన కేసులే అధికంగా ఉండడం ఆందోళన కలిగించే అంశం.

కంబాల చెరువు : చిన్నారుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఒకరు.. మాయమాటలతో నమ్మించి మరొకరు.. వయసుతో సంబంధం లేకుండా అమ్మాయిలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవల పెరుగుతున్నాయి. పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న కేసుల్లో దాదాపు 80 శాతం మేర అత్యాచారాలకంటే, మోసపోతున్న ఘటనలే ఉంటున్నాయి. – ఈనాడు, రాజమహేంద్రవరం

నమోదైన కేసులు పరిశీలిస్తే..

ఏడాది	పోక్సో కేసులు	అత్యాచారాలు (అక్టోబరు వరకు)
2025	92	36
2024	114	45
2023	100	51
2022	158	63
2021	124	63
2020	118	54

అప్రమత్తతే శ్రీరామరక్ష

చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నిపుణులు సూచిస్తున్నారు. వారితో స్నేహపూర్వకంగా ఉంటూ.. తమకు ఎదురవుతున్న ఇబ్బందులను జాగ్రత్తగా తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఎవరైనా తన చేష్టలతో జీవించే హక్కు హరించినా.. శారీరకంగా, మానసికంగా వేధించినా పోక్సో చట్టం కింద కేసు నమోదవుతుందని అవగాహన కల్పించాలి.

◗ 'చిన్నారులపై పెద్దల పర్యవేక్షణ ఉండాలి. అవగాహన లేకపోవడం వల్ల 15 నుంచి 16 ఏళ్ల బాలికలు ఎక్కువగా ప్రేమ పేరిట ఆకర్షణకు గురై మోసపోతున్నారు. వీరిపై కొన్ని సామాజిక మాధ్యమాల ప్రభావం అధికంగా ఉంటోంది. వీటికి దూరంగా ఉండాలి. ఇప్పటికే పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం' అని ఎస్పీ నరసింహకిశోర్ అన్నారు.

వనిత: అతివకు అండగా..!

గృహహింస, వరకట్నం, లైంగిక వేధింపులు వంటి సమస్యలు ఎదుర్కొనే గ్రామీణ మహిళలకు బాసటగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో మండలానికి ఒక జెండర్ రిసోర్సు సెంటరు ఏర్పాటుకు నిర్ణయించింది. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

మండలానికొక జీఆర్‌సీ

రూ.5 లక్షల చొప్పున నిధులు..

ఒక్కో కేంద్రం ఏర్పాటు, వసతుల కల్పనకు రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం కేటాయిస్తుంది. దేవరపల్లి, కోరుకొండ, రంగంపేట, పెరవలి మండలాల్లో జీఆర్‌సీ ఏర్పాటుకు రూ.20 లక్షలు విడుదల అయ్యాయి. దేవరపల్లి, రంగంపేట మండలాల్లో అద్దె భవనాల్లో, మిగతా చోట్ల సమాఖ్య భవనాల్లో నెలకొల్పనున్నారు.

ఎక్కడ ఏర్పాటు చేస్తారంటే..

దేవరపల్లి, కోరుకొండ, రంగంపేట, పెరవలి, కొవ్వూరు, కడియం, గోకవరం, ఉండ్రాజవరం.

ప్రతినిధుల ఎంపిక ఇలా...

● సంఘాల్లోని సభ్యుల్లో విద్యావంతులు, చురుగ్గా ఉండే, మహిళా సమస్యలపై అవగాహన ఉన్నవారిని ప్రతినిధులుగా తీసుకుని, శిక్షణ ఇవ్వనున్నారు.

● గ్రామ సమాఖ్యల నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి గ్రామస్థాయిలో సామాజిక యాక్షన్ కమిటీలు ఏర్పాటు చేస్తారు.

● గ్రామ కమిటీ నుంచి అయిదుగురు సభ్యులతో మండల స్థాయి కమిటీని నియమిస్తారు.

ఏం చేస్తారంటే..

● గృహహింస, వేధింపులు వంటి సమస్యలు పరిష్కరిస్తారు.
● బాధితుల్లో ధైర్యం నింపుతారు. తాత్కాలిక వసతి కల్పిస్తారు. చట్టపరమైన సహాయం అందిస్తారు.
● బాల్య వివాహాలకు అడ్డుకట్ట. ఆర్థిక సాధికారతపై అవగాహన.

జిల్లాలో ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్‌హెచ్‌జీలు	30,920
సభ్యులు	3,03,958
గ్రామ సమాఖ్యలు	897
మండల సమాఖ్యలు	18
మంజూరైన జీఆర్‌సీలు	8

ఉచిత బియ్యం.. వీధుల్లో విక్రయం..!

● ఈ నెల 7న నల్లజర్ల మండలం వీరవల్లి వద్ద విజిలెన్సు తనిఖీల్లో 7వేల కిలోల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు.

● ఈనెల 3న సీతానగరంలో అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్లు పట్టుకున్నారు.

ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా రేషన్ బియ్యం అక్రమ తరలింపు అడ్డుకట్ట పడటం లేదు. క్షేత్ర స్థాయిలో నిఘా కొరవడటంతో ప్రజాపంపిణీ వ్యవస్థ గాడితప్పుతోంది. పేదలకు ఉచితంగా ప్రతి నెలా ప్రభుత్వం అందిస్తున్న పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. జిల్లాలోని ప్రతి మండలం నుంచి యథేచ్ఛగా నల్లబజారుకు తరలిపోతున్నాయి. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

ద్విచక్ర వాహనాలపై అక్రమ తరలింపు

తనిఖీలు శూన్యం **పరిశీలన**

క్షేత్రస్థాయిలో రేషన్ సరకుల పంపిణీ ప్రక్రియ పర్యవేక్షించాల్సిన మండల సరఫరా అధికారులు (సీఎస్‌డీటీ)లు ఎక్కడా కన్పించడంలేదు. దీంతో ప్రతినెలా 1 నుంచే దళారులు ద్విచక్రవాహనాలపై వీధివీధికి తిరుగుతూ లబ్ధిదారుల నుంచి కేజీ బియ్యం రూ.16 చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో ఇలా...

మండలాలు	చౌక దుకాణాలు	రేషన్ కార్డులు	ప్రతి నెలా కేటాయించే బియ్యం
19	871	5,63,094	8,200 టన్నులు

ఏం చేస్తారంటే

● కొనుగోలు చేసిన బియ్యాన్ని మూటలుగా కట్టి ఒకచోట నిల్వ చేసి, తర్వాత మిల్లులకు తరలిస్తారు.

● పాలిష్ పెట్టి సన్న బియ్యంలో కలిపి తిరిగి మార్కెట్‌కు పంపుతారు.

● రంగంపేట, బిక్కవోలు, అనపర్తి, పెద్దాపురం తదితర మిల్లులకు ఎక్కువగా బియ్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

మొక్కుబడి కేసులతో..

కొన్ని చోట్ల విజిలెన్సు అధికారులు తనిఖీలు నిర్వహించి, 6ఏ కేసులతో సరిపెడుతున్నారు. మండల స్థాయి అధికారులు కొందరు లంచాలకు అలవాటు పడి దళారులతో కుమ్మక్కవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో తొమ్మిది మంది సీఎస్‌డీటీలు ఉన్నారు. వీరు ప్రతినెలా రేషన్ పంపిణీ ప్రక్రియ పర్యవేక్షించాలి. పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆ దిశగా ప్రయత్నాలు జరగడం లేదు. 'బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టి పూర్తిస్థాయిలో నియంత్రిస్తాం' అని డీఎస్‌వో పార్వతి అన్నారు.

సింగపూర్‌కు.. మన గురువులు..!

అక్కడి విద్యా విధానంపై అధ్యయనం

న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్ : మన గురువులకు అరుదైన గౌరవం దక్కనుంది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 78 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సింగపూర్‌కు పంపించాలని సర్కారు నిర్ణయించింది. వీరిలో జిల్లా నుంచి మోటూరి మంగారాణి (రాజమహేంద్రవరం), బత్తిన రాజరాజేశ్వరి, (రాజమహేంద్రవరం గ్రామీణం), నక్కిన వీర రాఘవరావు (అనపర్తి) ఉన్నారు. ఇప్పటికే తత్కాల్‌లో పాస్‌పోర్టులు చేయించుకుని సిద్ధంగా ఉండాలని సూచించింది. వీరు ఈ నెల 27నుంచి డిసెంబరు 2 వరకు సింగపూర్‌లో పర్యటించనున్నారు.

ఏం చేస్తారంటే..

● వారంరోజుల పాటు సింగపూర్‌లోని విద్యావిధానాలు అధ్యయనం చేస్తారు. అక్కడి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను సందర్శించి బోధన, బోధనేతర పద్ధతులు, కరికులం, తరగతి గదుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య వాతావరణ పరిస్థితులు తెలుసుకుంటారు.

● విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా ఆట, పాటలతో విద్యను ఏ విధంగా అభ్యసిస్తున్నారు. వారి భవిష్యత్తుకు అవసరమయ్యే విధంగా కరికులంలో తీసుకొచ్చిన మార్పులపై ఆరా తీస్తారు.

పిల్లలూ.. ఉత్తరం రాద్దామా..!

బుడత

స్టాంపుల సేకరణ, ఉత్తరాలు రాయడంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో తపాలాశాఖ "ఢాయి అఖర్" ఉత్తరాల పోటీ నిర్వహిస్తోంది. 'లెటర్ టు మై రోల్ మోడల్' అంశంపై ఆంగ్లం, హిందీ, తెలుగు అన్ని ప్రాంతీయ భాషల్లో ఉత్తరాలు రాసి బహుమతులు గెలుచుకోవచ్చు.

ఇదీ విధానం.. ఇన్‌ల్యాండ్ లెటర్లపై సొంత దస్తూరీతో 500పదాలు లేదా ఏ4 సైజ్ పేపరుపై 1000 పదాలు మించకుండా రాసి ఎన్వలప్ కవరు ద్వారా రాజమహేంద్రవరం ప్రధాన కార్యాలయంలోని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ చిరునామాకు పంపించాలి.

బహుమతులు: జాతీయ, రాష్ట్రస్థాయిలో రూ.50 వేల నుంచి రూ.5 వేల వరకు నగదు బహుమలు ఇస్తారు. డిసెంబరు 8లోగా ఉత్తరాలు పంపించాలి ..మరి ఇంకేందుకు ఆలస్యం అందుకోండి కలం. – న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) జిల్లాలో సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించే జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మున్సిపల్, మండల కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ అర్జీలు స్వీకరిస్తామన్నారు. ప్రజలు తమ సమీపంలోని కార్యాలయంలో అర్జీలు సమర్పించవచ్చునన్నారు..

నేటి నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు

రాజానగరం: పాఠశాల విద్యార్థులకు 10 నుంచి ఎస్ఏ-1 (అర్ధ సంవత్సర పరీక్షలు) ప్రారంభంకానున్నాయి. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 11 నుంచి ప్రారంభమవుతాయి. 19 వరకు జరిగే పరీక్షల ప్రశ్నపత్రాలను విద్యాశాఖ ఇప్పటికే ఎంఆర్‌సీలకు చేర్చింది. ప్రధానోపాధ్యాయులు సంబంధిత ఎంఆర్‌సీ, స్కూల్ కాంప్లెక్స్‌ల నుంచి గంట ముందుగా పాఠశాలకు తీసుకువెళ్తారు. వచ్చే నెల 5న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 25 నాటికి మూల్యాంకనం పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

సాంకేతిక సాగు.. ఉపాధి బాగు..!

3,000 ఎకరాల్లో స్ప్రే చేశా..

పదోతరగతి వరకు చదివా. సొంతంగా ఎకరా, కౌలుకు ఏడెకరాలు సాగు చేస్తున్నా. డ్రోన్‌తో స్ప్రే చేయడం నేర్చుకుని ఆదాయ వనరుగా మార్చుకున్నా. ఎకరాకు రూ.350 నుంచి రూ.400 వరకు తీసుకుంటున్నా. సీజన్‌లో రోజుకు 25 ఎకరాల వరకు మందు పిచికారీ చేస్తున్నా. ఇప్పటి వరకు దాదాపు 3,000 ఎకరాల్లో డ్రోన్‌తో పిచికారీ చేశా. - వాసు, సంపతనగరం

ప్రభుత్వ సాయంతో...

బీటెక్ చదివా. ప్రభుత్వం రాయితీతో మా సంఘానికి సుమారు రూ.2 లక్షలకు డ్రోన్ ఇచ్చారు. రెండు నెలలుగా డ్రోన్ వినియోగిస్తున్నా. ఎకరాకు దూరం ఆధారంగా రూ.350 నుంచి రూ.400 వసూళ్లు చేస్తున్నా. అయిదేళ్లుగా డ్రోన్‌తో సాగు చేసి, ఇప్పుడు సొంతంగా నిర్వహిస్తున్నా. - యలమాటి ఆదిరాజశేఖర్, చిట్యాల

సంప్రదాయ సాగు విధానాల నుంచి యాంత్రీకరణ దిశగా అడుగులు వేస్తున్న అన్నదాతకు యువతరం సాంకేతికత అందిస్తూ చేయూతనిస్తోంది. సేద్యానికి పెట్టుబడి వ్యయం తగ్గేలా చేస్తున్నారు.

యువ

ఉమ్మడి జిల్లాలో సర్కారు సుమారు 120 డ్రోన్లు రైతు సంఘాలకు అందించింది. దాదాపు అయిదేళ్లుగా కొందరు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు. ఉన్నత విద్యనభ్యసించిన కొందరు యువకులు సొంతంగా కౌలుకు సాగు చేస్తూనే, డ్రోన్లతో పురుగు మందుల పిచికారీ చేస్తూ ఆదాయం పొందుతున్నారు.

ఇదీ ఉపయోగం..

➤ ఇటీవల మొంథా తుపాను, భారీ వర్షాలకు పంటలు నీట మునిగాయి. నేలవాలిన చేల నుంచి మొలకలు రాకుండా కూలీలతో ఉప్పు నీటి ద్రావణం పిచికారీ చేయడం కష్టసాధ్యంది. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది రైతులు డ్రోన్ల సేవలు వినియోగించుకున్నారు.

➤ ఎకరా పొలం మందు పిచికారీ కూలీలతో చేయిస్తే రైతుకు దాదాపు అయిదు గంటల సమయం, రూ.500 వరకు కూలీ, 100 నుంచి 120 లీటర్ల నీరు అవసరం. డ్రోన్‌తో పిచికారీ చేయడం వల్ల రూ.350 ఖర్చు, గరిష్ఠంగా 5 నిమిషాల సమయం, 10 లీటర్ల నీరు సరిపోతుంది. పిచికారీ చేసే మందు కూడా దాదాపు 30 శాతం ఆదా అవుతుంది.

➤ కూలీలతో పిచికారీ చేసిన మందు ప్రభావం గరిష్ఠంగా 15 రోజులు ఉంటే, డ్రోన్‌తో చేస్తే 25 రోజుల వరకు ఉంటుంది.

ఆదాయం ఇలా

◗ డ్రోన్ నిర్వాహకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలో సుమారు రూ.1.80 లక్షలకే యూనిట్ ఇస్తుంటే, ప్రైవేటు వ్యక్తులు రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షలకు కొనుగోలు చేస్తున్నారు.

◗ ఏటా రెండు సీజన్లలో ఆరు నెలల మాత్రమే పని ఉంటుంది. ఎకరాకు స్ప్రే చేస్తే బ్యాటరీకి రూ.50 ఖర్చు, రోజుకు సహాయకుడికి ఆరు నెలలకు సుమారు రూ.1.50 లక్షలు వ్యయం అవుతుంది. ఎకరాకు సగటున రూ.350 వరకు అందుకుంటున్నారు. – ఈనాడు, రాజమహేంద్రవరం

బాబోయ్ మంటలు..

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలోని ఓ పెట్రోలు బంకులో పెను ప్రమాదం తప్పింది. గోకవరం బస్టాండ్ సమీపంలోని ఓ బంకులో ట్యాంకర్ నుంచి ఆయిల్ దిగుమతి చేస్తుండగా మంటలు వ్యాపించడంతో అగ్ని ప్రమాదం జరిగింది. అక్కడి సిబ్బంది, ప్రజలు బయటకు పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సమీపంలోనే అగ్నిమాపక కేంద్రం ఉండడంతో హుటాహుటిన వచ్చి, మంటలను అదుపు చేశారు. అసలే రద్దీ ప్రాంతం, ఆపై పెట్రోలు బంకులో మంటలు రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

(c) eenadu

చిటికెలో న్యాయసేవలు

● సత్ఫలితాలిస్తున్న ఈ-సేవా కేంద్రాలు

– న్యూస్‌టుడే, కంబాలచెరువు, కోటగుమ్మం (రాజమహేంద్రవరం)

అన్ని సేవలను ఉన్న చోట నుంచే పొందుతున్న ఈ రోజుల్లో న్యాయసేవలు సైతం సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సుప్రీంకోర్టు భావించింది. ఇందులో భాగంగా కొన్ని మార్గదర్శకాలతో ఈ-కమిటీ నియమించింది. దాని సిఫార్సుల మేరకు ప్రతి హైకోర్టు, జిల్లా కోర్టుల ఆవరణలో ఈ-సేవా కేంద్రాలు కక్షిదారులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. దీనికి ఈ-కోర్టు మొబైల్ యాప్‌ను అనుసంధానించడంతో సమయం ఆదా చేయడంతో పాటు మరెన్నో సేవలు ఇక్కడ లభ్యమవుతున్నాయి.

నిమిషంలో చేతిలోకి వివరాలు..

చేతిలో ఉన్న చరవాణితో ఈ-కోర్టు సేవల ఆనవ ర్లను తెరచి న్యాయసేవలు తెలుసుకోవడంతో పాటు చాలావరకు ఇందులోనే దరఖాస్తులు పెట్టుకోవచ్చు. ఎక్కడ ఉన్నా కేసు వివరాలు, ములాఖత్ తదితర అన్ని వివరాలను ఈ-సేవా అనువర్తనంలో తెలుసుకోవచ్చు. ఈ సేవా కేంద్రాలు రాక ముందు కక్షిదారుడు అతని కేసు స్థితి తెలుసుకోవాలంటే చాలా ప్రయాసగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. కేసు పూర్వాప రాలతో పాటు తర్వాత వాయిదా తేదీలు సైతం ఈ సేవలో లభిస్తోంది.

ఇవీ ఉపయోగాలు..

● ఈ-దరఖాస్తు, ఈ-స్టాంపు పేపర్ల వివరాలు తెలుసుకోవచ్చు. ● కేసు స్థితి, తదుపరి విచారణ తేదీ వివరాలు ఉంటాయి. ● న్యాయపరమైన ఆదేశాలు తీర్పు సాఫ్ట్ కాపీలను ఈ-మెయిల్ లేదా వాట్సాప్ ద్వారా అందిస్తుంది. ● వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు విచార ణను ఎలా ఏర్పాటు చేయాలో, ఎలా నిర్వహించాలో తెలుసుకో వచ్చు. ● కోర్టులో కేసును విచా రణకు స్వీకరించారా లేదా అనే తెలుస్తుంది. ● జిల్లా న్యాయసే వాధికార సంస్థ, హైకోర్టు న్యాయసేవల కమిటీ, సుప్రీం కోర్టు న్యాయసేవల కమిటీ నుంచి ఉచిత న్యాయసేవలను వివరిస్తుంది. ● సెలవుల్లో ఉన్న న్యాయమూర్తుల వివరాలు ఉంటాయి.

ముగిసిన రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలు

పాడేరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాడేరులో మూడు రోజులపాటు జరిగిన అండర్-14, 17, 19 బాలబాలికల రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలు ఆదివారంతో ముగిశాయి. క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సూరిబాబు చెప్పారు. విజేతలకు జిల్లా క్రీడా సాధికార అధికారి జగన్మోహనరావు బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే..

● అండర్-14 విభాగంలో నెల్లూరు బాల, బాలిక జట్లు ప్రథమ, చిత్తూరు జట్లు ద్వితీయ, కృష్ణా జిల్లా జట్లు తృతీయ స్థానాల్లో నిలిచాయి. ● అండర్-17 విభాగంలో కృష్ణా, తూర్పు గోదావరి, విశాఖ జిల్లాల బాల బాలికల జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ● అండర్-19 విభాగంలో: శ్రీకాకుళం, చిత్తూరు, అనంతపురం బాలబాలికల జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

భవిష్యత్తు అవకాశాలపై అవగాహన

మాట్లాడుతున్న పాఠశాల ఛైర్మన్ రవికుమార్ సుంకర

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే ఉన్నత విద్యపై అవగాహన కల్పించేందుకు లారెల్ హై గ్లోబల్ పాఠశాల నిర్వహించిన యూనివర్సిటీ ఫెయిర్-2025 విజయవంతమైందని ఆ పాఠశాల ఛైర్మన్ సుంకర రవికుమార్ పేర్కొన్నారు. దేశ విదేశాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చామన్నారు. ఈ ప్రాంతంలోని విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో లభించే ఉన్నత విద్యావకాశాలు, భవిష్యత్తు అవకాశాల గురించి తెలుసుకోవడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. 43 వర్సిటీలు పాల్గొని విద్యార్థులతో మాట్లాడి ఉన్నత విద్య, స్కాలర్‌షిప్, అడ్మిషన్ల వివరాలపై అవగాహన కల్పించాయన్నారు. 9 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్దఎత్తున ఇందులో పాల్గొన్నారు.

సఫాయి కర్మచారి వృత్తిదారుల నుంచి దరఖాస్తులు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: సఫాయి కర్మచారి వృత్తిలోని యువతకు ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకంలో రాయితీపై సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకురాలు జె.సత్యవతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు అయిదుగురు కలిసి బృందంగా ఏర్పడాలని, ప్రతి సభ్యుడు సఫాయి కర్మచారి సర్టిఫికెట్ తప్పని సరిగా కలిగి ఉండాలన్నారు. గ్రూపులో కనీసం ఒకరికి హెవీమోటారు వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని, ప్రధాన సభ్యుడు ఇద్దరి ప్రభుత్వ ఉద్యోగుల ష్యూరిటీలు సమర్పించాలన్నారు. ఈ పథకం కింద రాయితీ మినహా మిగిలిన రుణాన్ని ఆరు శాతం వడ్డీతో 72 నెలసరి వాయిదాల్లో (ప్రతినెల రూ.33,064 చొప్పున) చెల్లించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను కాకినాడ ప్రగతిభవన్‌లోని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా పోస్టులో సమర్పించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 62818-17023 నంబరులో సంప్రదించాలన్నారు.

ఆటపాటలతో సందడి

రాజానగరంలోని పుష్కరవనంలో ఆదివారం డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మూలస్థానం పీఎంశ్రీ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు సందడి చేశారు. సహపంక్తి భోజనాల అనంతరం ఆటపాటలతో ఆనందంగా గడిపారు. – న్యూస్‌టుడే, రాజానగరం

సత్యదేవుని సన్నిధిలో పోటెత్తిన భక్తులు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని సన్నిధి భక్తులతో పోటెత్తింది. పవిత్ర కార్తిక మాసం ఆదివారం కావడంతో వేలాది భక్తులు తరలివచ్చారు. రద్దీ నేపథ్యంలో తెల్లవారు జామున ఒంటిగంట నుంచే వ్రతాలు, సర్వ దర్శనాలు ప్రారంభించారు. ఉదయం 8 గంటల తర్వాత రద్దీ పెరిగింది. బ్రాహ్మీకల తీవ్ర అంతరాయం ఏర్పడింది. రత్న, సత్యగిరులపై ఉన్న పార్కింగ్ స్థలాలు ఎటూ సరిపోలేదు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కొండ దిగువున కళాశాల ప్రాంగణంలో వాహనాలు నిలిపివేశారు. అక్కడ నుంచి దేవస్థానం బస్సుల్లో భక్తులను కొండపైకి తరలించారు. అంతరాలయం, యంత్రాలయం దర్శనాలు కూడా అధికారులు నిలిపివేశారు. రూ.300 వ్రత మండపాల ప్రాకారంలో క్యూలైన్ల నిర్వహణ సరిగాలేక గందరగోళం ఏర్పడింది. రూ.1,000 వ్రత మండపాల క్యూలైన్ల వద్ద తాగునీటి సరఫరా సరిగా జరగలేదు. ఛైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు ఆలయ ప్రాంగణంలో పరిశీలన చేశారు. సోమవారం దేవస్థానంలో రద్దీ ఉండే అవకాశమున్న నేపథ్యంలో వసతి గదులకు డిమాండ్ పెరగనుంది.

రెవెన్యూ క్రీడల్లో జిల్లా జట్టు ప్రతిభ

సాధించిన పతకాలు, జ్ఞాపికలతో కాకినాడ జిల్లా రెవెన్యూ ఉద్యోగులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) 7వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ చూపింది. ఈ నెల 7, 8, 9 తేదీల్లో అనంతపురంలో నిర్వహించిన పోటీలకు జిల్లానుంచి 60 మంది రెవెన్యూ ఉద్యోగులు వివిధ క్రీడాంశాల్లో ప్రాతినిధ్యం వహించారు. జిల్లా జట్టు ప్రతిభచూపి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచాయి. ఆదివారం అనంతపురంలో పతకాలు అందుకున్నారు. వారిని కలెక్టర్ షాన్‌మోహన్, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథరావు, కార్యదర్శి సాధనాల రామ్మోహనరావు అభినందించారు.

కరదీపిక... బోధన సులువిక

ఉపాధ్యాయులకు పాఠ్యప్రణాళిక పుస్తకాలు పంపిణీ

కరదీపిక పుస్తకాలను చూపిస్తున్న ఉపాధ్యాయులు

గండేపల్లి, న్యూస్‌టుడే: కూటమి రాకతో విద్యావ్యవస్థ కరదీపంగా ప్రగతిపథాన దూసుకెళుతోంది. గతంలో ఉపాధ్యాయులు ఎప్పుడు ఏ పాఠాన్ని బోధించాలో తామే పాఠ్యప్రణాళిక సిద్ధం చేసుకుని ఆ దిశగా సిలబస్ పూర్తిచేసేవారు. కూటమి ప్రభుత్వం కూడా ఆ రీతిలో ఎస్‌సీఈఆర్టీ సహాయంతో సమగ్ర శిక్ష ద్వారా సబ్జెక్టుల వారీగా కరదీపిక (టీచర్ హ్యాండ్ పుస్తకాలు) తయారుచేసింది.

సమయం వృథా కాదు..

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అన్ని తరగతులకు సబ్జెక్టుల వారీగా పుస్తకాలు ఈ విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయులకు అందజేశారు. ప్రస్తుత విద్యావ్యవస్థలో ఈ కరదీపిక పుస్తకాల ద్వారానే ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్నారు. ఈ విధానంతో జ్ఞాన, బోధనా నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు, సరైన బోధన పద్ధతిలో బోధించేందుకు ఈ విధానం దోహదం చేస్తుంది.

కాకినాడ జిల్లాలో ఇలా..

ప్రాథమిక పాఠశాలలు:1,109
ప్రాథమికోన్నత పాఠశాలలు:253
ఉన్నత పాఠశాలలు:525
విద్యార్థులు:2,87,477
ఉపాధ్యాయులు:7,081

ఉత్తమ బోధనకు ప్రాధాన్యం

ఈ విద్యాసంవత్సరం నుంచి ఏ రోజున ఏం బోధించాలో తరగతులు, సబ్జెక్టుల వారీగా ఈ కరదీపిక పుస్తకాలు వచ్చాయి. వీటికి అనుగుణంగా ప్రస్తుతం ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు.
- కేవీవీ సత్యనారాయణ, డీవైఈవో కాకినాడ

వాడపల్లి క్షేత్రంలో నేటి పూజలు

● కోనసీమ తిరుమల వాడపల్లిలో సోమవారం ఉదయం 5 గంటలకు ప్రభాతసేవ, మేలుకొలుపు, వేంకటేశ్వర సహిత లక్ష్మీ నృసింహ హోమం, ద్రవిడ వేదపారాయణం, నివేదన. ● 6 గంటలకు గోపూజ, అష్టోత్తర శతనామ పూజలు, దర్శనాలు ప్రారంభం. 11 గంటలకు నిత్య కల్యాణం, 12 గంటలకు అర్చన. ● మధ్యాహ్నం 1 గంట నుంచి విరామం, సాయంత్రం 4 నుంచి మళ్లీ దర్శనాలు ప్రారంభం. ● 6 గంటలకు అర్చన, రాత్రి 7.30 గంటలకు నైవేద్యం. ● 8 గంటలకు పవళింపు సేవ.
– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

శ్రీవారి సేవలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

స్పీకర్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో, ఛైర్మన్ తదితరులు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారిని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు స్వాగతం పలికి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం వసంత మండపంలో వేదపండితులు శేషవస్త్రం కప్పి వేదాశీర్వచనం చేశారు. స్వామివారి జ్ఞాపికను దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు, తెదేపా నాయకుడు బండారు సంజీవ్ అందజేశారు. తహసీల్దార్ టేకి రాజేశ్వరరావు, లొల్ల సర్పంచి కాయల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి భక్తులదేల కృషి..

ఆలయ అభివృద్ధికి ఒక భక్తుడిగా తనవంతు కృషి చేస్తానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు విలేకరులకు తెలిపారు. ఉత్తరాంధ్ర నుంచి 20 శాతం మందికి పైగా భక్తులు ఇక్కడికి వస్తున్నారన్నారు. ఆలయానికి వెళ్లేందుకు ప్రత్యేక వాహనాలు వేయించాలని కొంత మంది భక్తులు కోరారని, ఈలోగా స్త్రీశక్తి పథకం రావడంతో ఇబ్బందులు తప్పాయన్నారు. దేవాలయానికి ఏటా రూ. 35 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు ఆదాయం రావడం చూస్తే భక్తుల తాకిడి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇక్కడి స్వామివారు ఎర్రచందనం కొయ్యతో ఉద్భవించిన తీరు మంత్రముగ్ధులను చేసిందన్నారు.

భీమేశ్వరాలయంలో నివేదన సమయం కుదింపు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో నివేదన సమయాన్ని అరగంట కుదిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో ఏవీ దుర్గాభవాని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు నివేదనకు ఆలయ తలుపులు మూసివేస్తామని చెప్పారు. పర్వదినాల్లోనూ మధ్యాహ్నం సమయంలో నివేదన కోసం అధిక సమయం భీమేశ్వరాలయాన్ని మూసివేయడంపై భక్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆదివారం దూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు నివేదన కోసం తలుపులు మూసివేయడంతో ఒక భక్తుడు దేవాదాయ శాఖ మంత్రికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. మంత్రి ఆదేశాలతో ప్రాంతీయ సంయుక్త కమిషనరు వేండ్ర త్రినాథరావు ఆదివారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించారు. భక్తుల నుంచి వస్తున్న వినతుల మేరకు నివేదన సమయం తగ్గించేందుకు అర్చకులతో మాట్లాడారు. దీని ప్రకారం 12 గంటల వరకు దర్శన టిక్కెట్లు విక్రయించి వారిని 1 గంట వరకు దర్శనాలకు అనుమతించాలని, తిరిగి ఆలయాన్ని 2.30 గంటలకు తెరవాలని నిర్ణయించారు. జిల్లా సహాయ కమిషనరు సత్యనారాయణ, ముఖ్య ఉత్సవ నిర్వహణాధికారి కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాల్లో ప్రైవేటు ఉద్యోగుల ప్రమేయం

ఈనాడు, రాజమహేంద్రవరం : తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఛేదించిన అతిపెద్ద సైబర్ నేరాల్లో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 81 మందిని అరెస్టు చేయగా, అందులో రాష్ట్రానికి చెందిన 10 మందిలో ఇద్దరు జిల్లాకు చెందినవారున్నారు. రాజమహేంద్రవరంలోని బంధన్ బ్యాంక్ మేనేజర్ సత్తిరాజు దత్తాత్రేయ నేరగాళ్ల అనధికారి ఆర్థిక లావాదేవీలకు సహకారం అందినట్లు గుర్తించారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన నదికొల్ల సురేష్‌కుమార్, ఐటీ హెచ్‌ఆర్‌గా విధులు నిర్వర్తిస్తూ సైబర్ నేరాలకు సహరించినట్లు నిర్ధారించి అరెస్టు చేశారు.

కాకి లెక్కలతో నిధులు స్వాహా..!

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

గత వైకాపా సర్కారు హయాంలో జిల్లా నీటి యాజమాన్య సంస (డ్వామా)లో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో బాధ్యులపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అప్పట్లో ఇక్కడ పనిచేసిన అధికారి (పీడీ) కొనుగోలు చేసిన కార్యాలయ ల్యాప్‌టాప్‌ను తన వెంట తీసుకెళ్లిపోవడం గమనార్హం.

ఏం జరిగిందంటే

బొమ్మూరులోని గిరిజన యువత శిక్షణ కేంద్రం(వైటీసీ) భవన సముదాయంలోని డ్వామా కార్యాలయానికి మరమ్మతులతోపాటు కొన్ని సౌకర్యాలు సమకూర్చేందుకు రూ.5 లక్షల నిధులు కేటాయించారు. 2023 జనవరిలో కొన్ని వస్తువులు కొనుగోలు చేసినట్లు కాకిలెక్కలు చూపారు. టైల్స్, సీలింగ్ పనులు చేయించినందుకు రూ.లక్ష, కంప్యూటర్, ఇన్వెర్టర్, ఏసీ, ల్యాప్‌టాప్ కొనుగోలు చేసినందుకు రూ.4 లక్షలు ఖర్చు చూపారు. పాత కంప్యూటర్, ఇన్వెర్టర్, ఏసీ తీసుకొచ్చి పెట్టించారు. అప్పట్లో ఈ ఖర్చు చూపిన పీడీ కాకినాడ జడ్పీ కార్యాలయంలో పోస్టింగ్ తెచ్చుకొని అక్కడ విధుల్లో చేరారు. అయినా ల్యాప్‌టాప్‌ను తిరిగి అప్పగించలేదు.

● తమ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అతడి సర్వీసు రిజిస్టార్(ఎస్ఆర్) పంపించాలని కోరుతూ గతేడాది జడ్పీ సీఈవో కార్యాలయం నుంచి ఇక్కడి డ్వామా కార్యాలయానికి లేఖ రావడంతో నిధుల గోల్‌మాల్ బండారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఎస్ఆర్ ఇవ్వకుండా అప్పటి ఇన్‌ఛార్జి పీడీ నిలిపివేశారు. ఇన్‌ఛార్జి పీడీ మారిన తర్వాత పాత పీడీకి చెందిన ఎస్ఆర్ ఇచ్చేశారు. కానీ నిధులు రికవరీ చేయలేదు. ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకోకపోవడం గమనార్హం.

తెలిసిన యువకుడే చంపేశాడు

బాలిక రంజిత కేసులో వీడిన మిస్టరీ

నిందితుడు శ్రీనివాస్

విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా, ముసుగులో నిందితుడు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణం త్యాగరాజునగర్‌లో బాలిక చిర్రా రంజిత (10) మృతి కేసులో మిస్టరీ వీడింది. ఆ కుటుంబానికి తెలిసిన ఎలక్ట్రీషియన్, యూట్యూబర్.. రామచంద్రపురం మండలం ఎ.అగ్రహారానికి చెందిన పెయ్యల వీరవెంకట శ్రీనివాస్ హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో అతడిని ఆదివారం సాయంత్రం రామచంద్రపురంలో అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. శవపరీక్ష నివేదిక ప్రకారం బాలిక ముఖం, నోటి భాగంలో గాయాలు ఉన్నాయని, ఊపిరాడక పోవడం వల్ల చనిపోయిందని వెల్లడైంది. హెడ్‌నర్స్‌గా పనిచేస్తున్న చిర్రా సునీత ఈ నెల 4వ తేదీన విధులకు వెళ్లగా, కుమార్తె రంజిత మాత్రమే ఇంట్లో ఉంది. వీరికి పరిచయం ఉన్న వీరవెంకట శ్రీనివాస్ సాయంత్రం 5.20 గంటల సమయంలో బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను దొంగిలించేందుకు ఆ ఇంటికి వెళ్లాడు. ఫ్యాన్ మరమ్మతు చేయడానికి వచ్చానని బాలికకు చెప్పాడు. ఆమెకు అనుమానం రావడంతో తల్లికి ఫోన్ చేసి చెబుతుందేమోనన్న భయంతో చున్నీని బాలిక మెడకి చుట్టి ముఖాన్ని మంచంపై అదిమి పెట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేశాడు. మృతదేహాన్ని చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసి ఆత్మహత్యగా కనిపించేలా చేసి తలుపు లోపల గడియ పడేలా వేసి వెళ్లిపోయాడు. ఏరియా ఆసుపత్రి వద్ద పాప బంధువులు ధర్నా చేస్తున్న సమయంలోను శ్రీనివాస్ అక్కడే తిరిగాడు. విజయవాడ నుంచి ఫోరెన్సిక్ బృందం వచ్చినప్పుడు ఇంటి ఎదుట ఉండి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. దర్యాప్తులో పోలీసుల వెంటే తిరుగుతూ తప్పుదారి పట్టించాడు. అప్పుల పాలైన నిందితుడు బంగారం, డబ్బు కోసం వచ్చి బాలికను హత్య చేసినట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. కేసును నాలుగు రోజుల్లోనే ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్, సీఐలు ఎం.వెంకటనారాయణ, పి.దొరరాజు, ఎస్.ఐలు నాగేశ్వరరావు, ఎం.లక్ష్మణ్, జానీ బాషా, సురేష్‌బాబు, హరీష్ పాల్గొన్నారు.

బలి తీసుకున్న బతుకుదెరువు

● రెండు కుటుంబాల్లో విషాదం నింపిన విద్యుదాఘాతం

కరిపెట్టి సింహాద్రి అప్పన్న, గెద్దం సందీప్ (పాత చిత్రాలు)

గండేపల్లి, తణుకు, న్యూస్‌టుడే: చేతికందొచ్చిన ఏకైక కుమారుడు కుటుంబాన్ని ఆదుకుంటాడనుకునేలోపే ఇక లేడనే వార్త ఆ కుటుంబాన్ని అంతులేని విషాదంలో ముంచింది. జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్న నేపథ్యంలో ఇంటి యజమాని ఇక తిరిగి రాడనే సమాచారంతో మరో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఇరగవరం మండలం రాపాకాలో కొడుకును, పేకేరులో ఇంటి యజమానిని కోల్పోయి రెండు కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన కరిపెట్టి సింహాద్రి అప్పన్న (53) వరి కోత యంత్రాలతో పలు ప్రాంతాల్లో కోతలకు వెళ్తూ జీవనం సాగిస్తుంటారు. అదే మండలానికి చెందిన గెద్దం సందీప్ (20) కొద్ది నెలల నుంచి సింహాద్రి వద్ద వరి కోత యంత్రం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా పరిసర ప్రాంతాల్లో వరి కోతలకు బయలుదేరారు. గండేపల్లి మండలం రామయ్యపాలెం వద్ద వాహనానికి విద్యుత్తు తీగలు అడ్డు వస్తున్నాయని వాటిని తప్పించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందిన హృదయవిదారకర ఘటన చూపరుల్ని కలచివేసింది.

పెద్ద దిక్కును కోల్పోయి..

సింహాద్రి అప్పన్నకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. చిన్న కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నారు. కుమారులకు పెళ్లి చేయాల్సిన తండ్రి ఇక రారని తెలుసుకొని తమను ఎవరు పట్టించుకుంటారని కుటుంబసభ్యులు బోరుమంటున్నారు.

అందొచ్చాడనుకుంటే అందనంత లోకాలకు..

సందీప్‌కు నాన్న లాజర్, అమ్మ ప్రేమలత, ఇద్దరు అక్కలు ఉన్నారు. పెద్ద అక్కకు వివాహం కాగా, మరో అక్క డిగ్రీ చదువుతోంది. నాన్న స్థానికంగా వ్యవసాయ పనులు చేస్తుండగా, అమ్మ ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లారు. సందీప్ పదో తరగతి అనంతరం చదువు మానేసి డ్రైవర్‌గా చేరాడు. రెండు రోజుల కిందటే స్నేహితుడి జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆనందంగా గడిపాడని, ఆ క్షణాలు మరువక ముందే తమను విడిచి వెళ్లాడంటూ మిత్రులు కుమిలిపోతున్నారు. ఏకైక వారసుడు తిరిగిరాని లోకాలకు చేరుకొని తమను దిక్కులేని వారిని చేశాడంటూ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటున్నారు. తమ్ముడు లేడనే విషయాన్ని జీర్ణించుకోలేక అక్కలిద్దరూ తల్లడిల్లిపోతున్నారు.

శోకసంద్రంలో గ్రామాలు

కొడుకును కోల్పోయి ఓ కుటుంబం, తండ్రిని దూరం చేసుకొని మరో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆదివారం వారి మరణ వార్త వినగానే ఆయా గ్రామాలు శోకసంద్రంలో మునిగాయి. ఉభయ కుటుంబీకులు గుండెలు పగిలేలా రోదిస్తున్న తీరు చూసి స్థానికులు కన్నీటి పర్యంత మయ్యారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	22,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	22,000-23,000
కొత్త (పచ్చి) కాయ	23,000-24,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	106-00
రిటైల్ లైవ్	133-00
డ్రెస్డ్	193-00
స్కిన్‌లెస్	219-00

విషాదం నింపిన విహారయాత్ర

● గోదావరిలో మునిగి పదో తరగతి విద్యార్థి మృతి

నామాడి బన్ను (పాతచిత్రం)

అంగర, అంబాజీపేట, న్యూస్‌టుడే: స్నేహితుడి జన్మదిన వేడుకల్లో సరదాగా గడపడానికి వచ్చిన అంబాజీపేట మండలం పుల్లేటికుర్రుకు చెందిన నామాడి బన్ను (15) గోదావరి నదిలో మునిగి మృతిచెందిన విషాద ఘటన ఆదివారం కపిలేశ్వరపురం మండలంలో చోటుచేసుకుంది. అంగర ఎస్సై జి.హరీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కేదార్లంక శివారు ధనమ్మమర్రిలో ధనమ్మ ఆలయం వద్ద పుట్టినరోజు వేడుకలు చేసుకునేందుకు పుల్లేటికుర్రుకు చెందిన కొంత మంది యువకులు వచ్చారు. ముగ్గురు స్నేహితులు గోదావరిలో స్నానానికి దిగారు. బన్నుకు ఈత రాకపోవడంతో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న అంగర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. శవ పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బన్ను తండ్రి అబ్రహాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

నూరేళ్లు నిండిపోయాయా బిడ్డా..

బన్ను తండ్రి నామాడి అబ్రహం ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి సునీత గృహిణి. వీరికి ఇద్దరు మగపిల్లలు. బన్ను పెద్ద కుమారుడు. పుల్లేటికుర్రు ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఇతని మృతితో పుల్లేటికుర్రులో విషాదఛాయలు అలముకున్నాయి. 15 ఏళ్లకే నూరేళ్లు నిండిపోయాయా అని తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సర్పంచి జల్లి బాలరాజు, ఉపసర్పంచి వీరా రవి, మాజీ సర్పంచి నూకపెయ్యి చిన్న, ఎంపీటీసీ సభ్యులు కుసుమ వెంకటేష్, వడలి కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎన్ఎస్ఎన్ వర్మ, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

Kakatiya Constructions Hiring now! Inviting Applications for Project Manager (Min 8-10 Yrs Exp.) and Junior Engineers (0-3yrs Exp.) Qualification Polytechnic/ B.Tech Civil / Degree. Mail: hrkakatiyaconshyd@gmail.com. ✆ 79813 18373.

Wanted Female Telecallers Qualification Any Degree, Age Limit: 25 to 45 Years (Must be Married) Salary upto 12,000/-. working Location: Master Minds College, Rajahmundry, Contact: 9248733370.

Sahasra Jr. College Were Hiring Positions Hostel Wardens (Girls Intermediate Hostel) Location Kakinada. Attractive Salaries. Cont: 94406 91781, 98588 95999.

శ్రీనివాస గ్రూప్ VJA ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంట బేబి కేర్‌కు పర్మనెంట్లు కావలెను. భో+ వ+ జీతం. ✆ 92814 52843, 92814 52827

రామకృష్ణ గ్రూప్, Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు, ఇంటిపని, వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+ వ+, జీతం: 16 - 18K. ✆ 9705297788, 9515108830.

శాఖాహార(వెజిటేరియన్) వంటలు చేయుటకు కాకినాడలో ఇంట్లో ఉంటూ ఇంటిపని చేయు ఏ బాదరబందీ లేని 35 సం॥ల లోపు స్త్రీ కావలెను. Contact Cell: 99853 57819.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: రూ.15,000/-, 40 సంవత్సరాలలోపు వారు మాత్రమే. Cont: శ్రీదేవి హోండా. ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. సెల్: 94909 98888.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-00 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజమహేంద్రవరం

పుష్కరవనంలో సందడే సందడి

రాజానగరం: రాజమహేంద్రవరం శివారు పుష్కరవనంలో ఆదివారం వన సమారాధనలతో సందడి వాతావరణం నెలకొంది. వివిధ కులాల, ఉద్యోగ సంఘాలు, క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టారు. పిల్లలు, పెద్దలు కలిసి ఆడిపాడారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఉసిరి చెట్టు కింద పూజలు చేశారు. రాజమహేంద్రవరం నగరానికి చెందిన రాజకీయ నాయకులు, ప్రముఖులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అర్జీలు ఇవ్వొచ్చు..

టి.నగర్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో పీజీఆర్ఎస్ జరగనుంది. కమిషనర్ రాహుల్ మీనా పాల్గొని బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు.

నేడు బ్రౌన్ జయంతి

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్(సి.పి.బ్రౌన్) జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో సి.పి.బ్రౌన్ జయంతి నిర్వహించనున్నట్లు ఆదివారం డీఆర్వో సీతారామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ 138వ జయంతి సందర్భంగా ఈనెల 11న మంగళవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి ఎం.సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

- వి.ఎల్.పురం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: **83282 39927, 80089 02897**

సమస్య: స్థానిక ఆర్యాపురంలోని రెడ్డీలపేట జంక్షన్ వద్ద డ్రెయిన్‌లో పూడిక తీసి రోడ్డుపై గుట్టలుగా వేసి నెలరోజులు అవుతోంది. ఇప్పటివరకు వాటిని అక్కడి నుంచి తరలించ లేదు. పూడిక మట్టి గుట్టలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలి.

- కామేశ్వరరావు, స్థానికుడు

సమస్య: స్థానిక లాలాచెరువు సాయిదుర్గానగర్ మొదటి వీధిలో 20 రోజుల కిందట డ్రెయిన్‌లో పూడిక మట్టి తీసి రోడ్డుపై గుట్టలుగా వేసి వదిలేశారు. దుర్వాసనతో పాటు రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు.

- శంకర్, స్థానికుడు

సమస్య: కంబాల చెరువు నుంచి కోరుకొండ వెళ్లే మార్గంలో పలుచోట్ల చెత్త పేరుకుపోయింది.
* లాలాచెరువు నుంచి క్వారీ మార్కెట్‌కు వెళ్లే దారిలో కుక్కల బెడద అధికంగా ఉంది. అక్కడ చర్చి సమీపంలో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

సమాధానం: పూడిక తరలింపునకు చర్యలు తీసుకుంటాం.

- వినూత్న, ఎంహెచ్‌వో

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

నేలవాలిన పంటలు.. కొండెక్కిన ధరలు

దేవీచౌక్, న్యూస్‌టుడే: మొంథా తుపాను, కార్తిక మాసం కారణంగా కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడంతో తుపానుకు ముందుతో పోల్చితే ధరలు రెండు, మూడు రెట్లు పెరిగాయి. నగరంలోని రైతుబజార్లలో కిలో రూ.40లకు తక్కువ ఏదీ దొరకట్లేదు. నాలుగు, అయిదు రోజులుగా ఆనపకాయ అందుబాటులో లేదు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న సొరకాయలు విక్రయిస్తున్నారు. అది కూడా చిన్నకాయే రూ.40 పలుకుతోంది. బహిరంగ మార్కెట్లో ఆనపకాయ ఒక్కటీ రూ.100కు విక్రయిస్తున్నారు. వంకాయలు కేజీ రూ.70కు చేరుకున్నాయి.

రైతుబజారులో కూరగాయల విక్రయాలు

50 శాతం దిగుబడి తగ్గడంతో..

నగరంలో తొమ్మిది రైతుబజార్లు ఉండగా ఆల్కాట్ తోట, మార్కెట్‌యార్డు మినహా మిగతావాటికి అన్నిరకాల కూరగాయలు కలిపి రోజుకు 150 నుంచి 300 క్వింటాళ్ల వరకు అవసరం అవుతాయి. తుపాను కారణంగా పంటలు దెబ్బతిని దిగుబడి 50 శాతం వరకు తగ్గింది. స్థానిక పంటలు దిగుబడి లేకపోవడంతో రైతుబజార్లలోని రైతులు టోకు మార్కెట్‌పై ఆధారపడుతున్నారు. దీంతో దళారులదే ఇష్టారాజ్యంగా మారింది. బహిరంగ మార్కెట్లో ధరలు కేజీకి మరో రూ.20 ఎక్కువగా ఉన్నాయి.

స్థానిక పంటలు అప్పుడే..

బెండ, దొండ, వంకాయ వంటి రకాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండట్లేదు. నిత్యం సామాన్యులు ఉపయోగించే దొండ, బెండ, వంకాయ, బీర వంటివి సమీప జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. పచ్చిమిర్చి కడప జిల్లా మైదుకూరు, టమాట చిత్తూరు జిల్లా మదనపల్లి, చిక్కుడు జగదల్‌పూర్ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. సొరకాయలను తమిళనాడు నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. తుపానుకు పాదులు ఎక్కువగా దెబ్బతిన్నాయని, మళ్లీ అవి పూత దశకు రావాలంటే రెండు, మూడు నెలలు పడుతుందని రైతులు అంటున్నారు. డిసెంబరు నెలాఖరు నాటికి స్థానిక పంటలు అందుబాటులోకి వచ్చి ధరలు తగ్గుముఖం పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

నెల వ్యవధిలో ధరల్లో తేడా

కిలో(రూ.ల్లో)	9-10-25	9-11-25
వంకాయ	40/46	70
బెండ	20	46
కాకర	24	36
బీర	30	56
క్యాబేజీ	26	32
దొండ	28	48
క్యారెట్	46	60
ఆనప	27/28	38/40
చిక్కుడు	84	88/110
టమాట	21	23
దోస	22	32

జలపుంజం కాదు.. వృథార..!

బొమ్మూరు: బొమ్మూరు కూడలిలో జాతీయ రహదారి మార్గంలో ఆదివారం సాయంత్రం పైపులైన్ లీకయ్యి నీరు వృథాగా పోయింది. హెవీ పైపులైన్ కావడంతో నీరు ఉధృతంగా బయటకు వచ్చి ఎగిసిపడింది. 33 కేవీ తీగలకు నీరు తాకుతుండటంతో విద్యుత్తు శాఖ ఏఈ శ్రీను బాబు సరఫరాను నిలుపుదల చేయించారు. రోడ్డంతా జలమయం అయ్యింది. రోడ్డుకు అడ్డంగా పైపుల నీరు పడటంతో వాహనచోదకులు ఆగిపోయారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది చర్యలు చేపట్టారు.

'తెలుగు'కు బ్రౌన్ సేవలు విలువైనవి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: తెలుగు భాషకు వెలుగు నింపిన సూరీడు సి.పి.బ్రౌన్ అని ప్రముఖ వైద్యులు డాక్టర్ టి.వి.నారాయణరావు పేర్కొన్నారు. బ్రౌన్ 227వ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ (రాకా), గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా బ్రౌన్ జయంతి నిర్వహించారు. ఎస్.పి.బాలు సాంస్కృతిక మందిరంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణ రావు మాట్లాడుతూ ఆంగ్లేయుడైన బ్రౌన్ ఎంతో కష్టపడి తెలుగు, ఆంగ్ల నిఘంటువును రూపొందించారన్నారు. రాజమహేంద్రవరం, మచిలీపట్నం, గుంటూరు, కడప తదితర ప్రాంతాల్లో ఉద్యోగం చేసిన ఆయన భాషకు అందించిన సేవలు మరువలేనివన్నారు. విశ్రాంత అధ్యాపకుడు అరిపిరాల నారాయణరావుకు బ్రౌన్ పురస్కారంతో సత్కరించారు. తోట సుబ్బారావు, జి.వి.రమణ, సూరపురెడ్డి తాతారావు తదితరులు పర్యవేక్షించారు.

సి.పి.బ్రౌన్ పురస్కారంతో నారాయణరావును సత్కరించిన సభ్యులు

డ్రోన్ కన్ను.. భద్రతకు దన్ను

ప్రజల భద్రత, నేర నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టామని ఎస్పీ డి.నరసింహకిశోర్ పేర్కొన్నారు. బహిరంగంగా మద్యం, గంజాయి తాగడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ఆదివారం డ్రోన్లతో పర్యవేక్షణ చేపట్టామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. - న్యూస్‌టుడే, కంబాలచెరువు(రాజమహేంద్రవరం)

నదీమ తల్లికి.. నిత్యహారతి

గోదారమ్మకు హారతి వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం పుష్కరఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 14 రకాల హారతులను సమర్పించారు. సెలవుదినం కావడంతో పెద్దసంఖ్యలో తిలకించారు. - న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

సెమీస్‌లో విశాఖ, తూర్పుగోదావరి జట్లు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు సెమీ ఫైనల్స్‌కు చేరాయి. సోమవారం విశాఖ, తూర్పుగోదావరి జట్లు మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఆదివారం విశాలాక్షి నగర్ బీచ్ పాఠశాల మైదానంలో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విశాఖ జట్టు 82-51తో అనంతపురం జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు 52-20తో కర్నూలుపై గెలుపొందింది. మహిళల విభాగంలోనూ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

సత్య స్వాముల గ్రామోత్సవం

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: ధవళేశ్వరం ఎర్రకొండ వద్ద సత్యదేవ ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో ఆదివారం సత్య స్వాముల గ్రామోత్సవం జరిగింది. పెద్దదుర్గతల్లి ఆలయం నుంచి ప్రధాన వీధుల్లో స్వామి వారి పల్లకి సేవ వైభవంగా సాగింది.

మూర్ఛరోగులకు ప్రత్యేక వైద్య శిబిరం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: జి.బి.ఆర్ ఫౌండేషన్, రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో మూర్ఛరోగులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గోదావరి గట్టున ఉన్న రామకృష్ణ మిషన్ ఆసుపత్రిలో ఆదివారం జరిగిన శిబిరంలో డాక్టర్ గోపాలం శివన్నారాయణ మూర్తి, పక్షవాతం, రక్తపోటు, మధుమేహం వ్యాధితో బాధపడుతున్న రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. శిబిరానికి హాజరైన స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ మాట్లాడుతూ 511 మందిని పరీక్షించి మందులు అందించారు. 2026 మార్చి 8న ఉచిత వైద్య శిబిరం మళ్లీ జరుగుతుందని వివరించారు.

కోయ భాషలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: గిరిజన నాయకుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా జన జాతీయ గౌరవ్ దివస్‌ను పురస్కరించుకుని కోయ భాషలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు గిరిజన సంక్షేమ అధికారిణి ఎస్.ఎస్.లక్ష్మీ కాంతి పేర్కొన్నారు. ఆదివారం గిరిజన సంక్షేమ కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోయ భాషకు బిర్సా ముండా అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. బిర్సా జీవితం.. పోరాట స్ఫూర్తి అంశంపై నిర్వహించిన పోటీలకు న్యాయనిర్ణేతగా ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగు శాఖాధిపతి పి.వి.బి.సంజీవరావు వ్యవహరించారు. పోటీల్లో మొదటి బహుమతి కారం సరిత, ద్వితీయ బహుమతి సాయం మణి, తృతీయ బహుమతి సున్నం స్రవంతి, ప్రత్యేక బహుమతులు ఎం.శ్రీజ, రవ్వ నాగేశ్వరి విజేతలుగా నిలిచారని తెలిపారు.

వన సమారాధనలతో ఆహ్లాదం

టి.నగర్, న్యూస్‌టుడే: వన సమారాధనలతో ఆహ్లాదం, ఆనందం సొంతమవుతాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నామవరం గొర్రెల వీర సూర్య అప్పారావు తోటలో ఆదివారం వెలమ సంఘీయుల కార్తిక సమారాధన నిర్వహించారు. తొలుత వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మికత వేదికగా కార్తిక సమారాధనలు జరుగుతాయన్నారు. చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించారు. వెలమ సంఘీయుల్లో ప్రముఖులను సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ మేయర్ ఆదిరెడ్డి వీర రాఘవమ్మ, చల్లా శంకరరావు, అల్లు బాబీ, హారిక తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులను సత్కరిస్తున్న సంఘీయులు, వేదికపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి

ఆదమరిస్తే అపాయం..

రాజమహేంద్రవరంలో గోరక్షణ పేట నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో డ్రెయిన్‌పై పలక విరిగి ప్రమాదకరంగా మారింది. రోడ్డు తవ్వేసి వదిలేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆదమరిస్తే పడిపోయే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కొత్త రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

– నూస్‌టుడే, కోటగుమ్మం

అసంపూర్ణం.. అవస్థలమయం..

జాంపేట గాంధీ బొమ్మ సెంటర్ నుంచి సిటీ హాస్పటల్ రోడ్డు ప్రవేశంలో చివరి దాకా కల్వర్టు నిర్మించలేదు. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానికులు చెక్కలు ఏర్పాటు చేసినా అవి కొంతకాలానికే దెబ్బతింటున్నాయి. కల్వర్టు మరమ్మతులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోటగుమ్మం

హెచ్చరించినా లెక్కేలేదు..

నగరంలో రోడ్లపై చెత్తవేస్తే జరిమానా విధిస్తామని నగరపాలక సంస్థ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేసినా కొంతమంది లెక్క చేయట్లేదు. వీరభద్రపురంలోని ఒక వీధిలో హెచ్చరిక బోర్డు ఉన్న ప్రాంతంలోనే రోడ్లపై చెత్త వేస్తున్నారు. సీసీటీవీ పర్యవేక్షణ ఉందని హెచ్చరించినా పట్టించుకోవట్లేదు. నిత్యం చెత్త తరలించడంతో పాటు, వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, దేవీచౌక్

భయపెడుతున్న గుంత

ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో పాత రామకృష్ణ థియేటర్ వద్ద పెద్ద గుంతలు భయపెడుతున్నాయి. ప్రధాన రహదారి కావడంతో ద్విచక్రవాహనదారులు, బస్సులతో నిత్యం రద్దీగా ఉంటోంది. దగ్గరకు వచ్చే వరకు గుంతను గుర్తించకపోవడంతో హఠాత్తుగా బ్రేకులు వేసి జారిపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పరిస్థితి చక్కదిద్దాలని నగరవాసులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

కళాగౌతమి కవి సమ్మేళనం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: విద్యార్థులు ప్రాచీన కవుల సాహిత్యం అధ్యయనం చేయడం ద్వారా భాష ఔన్నత్యం తెలుస్తుందని తెలుగు అధ్యాపకురాలు బి.రమాదేవి పేర్కొన్నారు. ఆదివారం కళాగౌతమి ఆధ్వర్యంలో లలితానగర్ భార్గవ కల్యాణ మండపంలో విద్యార్థుల సమక్షంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కవిత్వం అంటే ఏమిటి? ఏ విధంగా రాయాలి? తదితర అంశాలను ఆమె వివరించారు. పద్యం నుంచి మొదలుకుని నేడు వస్తున్న హైకోలు, నానీలు, అష్టపదులు తదితర అంశాలను తెలిపారు. వరాహగిరి కృష్ణమోహన్, ముంగండ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

నా క్లయింటు, విశ్వనాథ్ రెడ్డి గురుబిల్లి, తండ్రి : సత్యనారాయణ రెడ్డి, డోరు నెం.2-11-20, గొందేశి వారి వీధి, ఆల్కాట్ గార్డెన్స్, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా వారు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం.

నా క్లయింటు యొక్క ఒరిజినల్ లింకు క్రియ దస్తావేజు నెం.6152/1988, తేది.27-08-1988, ఎస్ఆర్ఓ., రాజమండ్రి, ది.05-11-2025వ తేదిన ఇ.సి. అప్లయ్ చేయుటకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని వారి ఇంటినుండి రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసుకి వెళ్ళి, అక్కడ ఆఫీసు నందు దస్తావేజులు బయటకు తీసి పరిశీలిన చేయగా, ఒరిజినల్ లింకు క్రియ దస్తావేజు నెం.6152/1988 కనిపించలేదు. అది దారిలో వస్తుండగా మిస్స్ అయింది. ఎంత వెతికిన కనిపించలేదు. కనుక ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియపర్చవలిసిందిగా కోరుచున్నాను.

సం/- డి.వి.కె.యస్.యమ్.ప్రసాద్, బి.ఎ., బి.ఎల్.
అడ్వకేట్, జాంపేట, రాజమండ్రి.
సెల్ : 9440 890912

ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలి

విలువలు బోధిస్తున్న రామకృష్ణ మఠం స్వామీజీ

వి.ఎల్.పురం: విలువలను పాటిస్తూ ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని రామకృష్ణ మఠం స్వామీజీలు సూచించారు. కలెక్టర్ సూచనలతో స్థానిక కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని సమీకృత బీసీ బాలికల వసతిగృహంలో 'ఉత్తమ విద్య - సన్మార్గం' అనే అంశంపై ఆదివారం ప్రేరణాత్మక సమావేశం నిర్వహించారు. స్వామి అర్చనానంద, స్వామి శశికాంతానందజీ మహారాజ్, స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ పాల్గొని ప్రసంగించారు. సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు వివేకానంద సూక్తుల పుస్తకాలు, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. సహాయ బీసీ సంక్షేమాధికారి ముత్యాల సుబ్బారావు, వసతిగృహ సంక్షేమాధికారిణి సూర్యకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: నగరంలో జరుగుతున్న మద్యం, ఇసుక సిండికేట్ వ్యవహారాలు, భూకబ్జాలపై మౌనం వహించడం సరికాదని మాజీ ఎంపీ భరత్‌రామ్ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మోరంపూడి ఫ్లైఓవర్‌పై విద్యుత్తు దీపాల ఏర్పాటు, కింద సర్వీసు రోడ్ల అభివృద్ధి వంటి పెండింగ్ పనులు ఇప్పటి వరకు పూర్తి చేయలేదన్నారు.

రయ్..రయ్.. ప్రమాదమేనోయ్..

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని అతి ముఖ్యమైన ప్రాంతాల్లో ఒకటైన ఆనాల వెంకట అప్పారావు రోడ్డులో పలు సమస్యలు నెలకొన్నాయి. జాతీయ రహదారి నుంచి ఏవీ అప్పారావు రోడ్డును కలిపే మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. మూడు కూడళ్లు ఉండగా రోజూ వేలమంది ప్రయాణిస్తుంటారు. వాహనాల వేగం నిరోధించేందుకు వేగ నియంత్రికలు లేకపోవడంతో పలువురు అధిక వేగంతో ప్రయాణిస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఏవీ అప్పారావు రోడ్డు కూడలిలో అధిక వేగంతో రాకపోకలు

వార్డు సమస్యలు

గుంతలమయం..

పలు వీధుల్లో అంతర్గత రహదారులు గుంతలతో ఉన్నాయి. రహదారి వెంబడి విరిగిన పలకలు, ఊచలు తేలిన డ్రెయిన్లు వంటివి ప్రమాదకరంగా ఉన్నాయి. వీధి మలుపులోని ప్రధాన రహదారిలో కాలువపై పలక లేకపోవడంతో రాత్రి సమయంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్న అవస్థలు తప్పట్లేదు.

పందులతో అవస్థలు..

ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పేరుకుపోయి గుంపులుగా పందులు సంచరిస్తున్నాయి. ఒకేసారి రహదారిపైకి వస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడినప్పుడు నీరు నిలిచిపోతోంది. వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న సీఐ మంగాదేవి తదితరులు

చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని రాజమహేంద్రవరం మహిళా పోలీసుస్టేషన్ సీఐ మంగాదేవి పేర్కొన్నారు. నగరంలోని శాంతినగర్‌లో ఆదివారం శక్తి, ఈగల్ టీంల ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శక్తి యాప్ వినియోగం గురించి వివరించారు. పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై అమీనాబేగం, ఈగల్ టీఎం ఎస్సై నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

CAUTION NOTICE

The General Public are hereby informed that My client M/s. Eswarsankalp Developers, represented by Mr. Arimanda Durga Rama Krishna Reddy filed case **S.No.359 of 2024 against the Canara Bank E-auction notices** regarding schedule property and Canara Bank also filed **O.A554 of 2024** before DRT VSP and also filed number of suits, all are pending.

That my client hereby caution to General Public, if anybody participate in the **auction fixed by Canara Bank/ PSB Alliance (banknet) on 11-11-2025** they will not bind my client's right and they may be faced to legal consequences.

SCHEDULE

All that part and parcel of site measuring **3200** sq. yards being an undivided and unspecified share of out of builder/developer share 5967.36 sq. yards in the total extent of 10288.55 sq.yards with 69 flats (unfinished flats) thereon with super Built up area of 89045 sft including common areas and balconies in CDEF and Amenities blocks and car Parking of 5520 sft (for 69 flats car parking with 80 sft each) and stilt floors in CDEF and amenities blocks of Eswarsankalp Homes covered by S.No.306/1 of VL puram, Rajahmundry Municipal Corporation area and S.No.308 of VL puram Pidimgoyya Gram Panchayat, Rajahmundry rural area in the registration district area of Pidimgoyya joint sub registrar office, East Godavari district and total site bounded as follows: Out of total 110 flats of builders share in ABCDEF and amenities Blocks following 69 flats in CDEF and amenities blocks are mortgaged to bank In **Block C:** Ground Floor flat No.101,102,103,104,106.
In Fist Floor Flat No.201,202,203,204,206.
In fourth Floor Flat No.501,502,503,504,505,506.
In Block D. First Floor Flat No.201,203,204,206.
In third Floor: Flat No.401,402,403,404,405,406,
In Block E: GF flat No.101,102,103,104,105,106, In First Floor Flat No.202,205, In Second Floor Flat No.301,306, In third Floor Flat No.401, 402,403, 404, 405,406 in Fourth Floor Flat No.501, 502, 503,504, 505,506. **In Block F:** First Floor Flat No.201, 202, 203, 204, 206 in Second Floor Flat No. 301, 303, 304, 306: in Third Floor Flat No. 401, 402, 403, 404, 405, 406: In Fourth Floor Flat No.503. In Amenities Block: Ground Floor Flat No.102, in First Floor Flat No.201 In Second Floor Flat No.302 in Third Floor Flat No.401 in Fourth Floor Flat No.502.

CH.V.S.SIVARAMAKRISHNA
ADVOCATE
49-07-8, LALITHANAGAR, VISAKHAPATNAM-16
Mobile: 9848433779,7093897799

కాలిబాటలో తడబాటు

జవహర్‌లాల్ నెహ్రూ కూడలిలో జాతీయ రహదారిపై డ్రెయిన్ తెరిచి ఉంది. ఇక్కడ సూపర్ మార్కెట్ మార్గంలోని సర్వీస్ రోడ్డు, కాలిబాటపై పలకలు లేవు. వాహనదారులు, పాదచారులు అప్రమత్తంగా లేకపోతే పడిపోయే అవకాశం ఎక్కువగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి పలకలు ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

నిర్వహణ కొరవడి భద్రత తడబడి

మహా నగరాల్లో మాదిరిగా రాజమహేంద్రవరంలోని స్థానిక తితిదే కల్యాణ మండపం రోడ్డులోని మహిళా కళాశాల సమీపంలో ఉమెన్ సేఫ్ హెవెన్ విశ్రాంతి గది ఏర్పాటు చేశారు. మహిళలు, యువతుల కోసం నిర్మించిన ఈ గది అధ్వానంగా ఉంది. ఏసీలు, సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో తెలియదు. నిర్వహణ లేక దుమ్ము పట్టి దయనీయంగా ఉంది. గది బయట పూల కుండీల్లో మొక్కలు లేవు. సుమారు 10 రోజుల క్రితం గ్లాసు తలుపు పగిలిపోయింది. వాటర్ ప్లాంట్ చాలాకాలంగా పనిచేయట్లేదు. రోజూ ఈ మార్గంలో వేలమంది ప్రయాణిస్తారు. అతివలు ఎదురు చూసేందుకు నిర్మించిన ఈ గదిని బాగు చేసి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

వెలవెలబోతున్న పూల కుండీ

పగిలిపోయిన గ్లాసు డోరు

పాడైన వాటర్ ఫిల్టర్

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

బ్రౌన్ జయంతి నేడు

వి.ఎల్.పురం: చార్లెస్ ఫిలిప్ బ్రౌన్(సి.పి.బ్రౌన్) జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో జయంతి నిర్వహించనున్నట్లు ఆదివారం డీఆర్వో తెలిపారు.

ఉచితంగా మందులు పంపిణీ

కోరుకొండ: నిడిగట్లలో లోటస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేశారు. సుమారు 120 మందికి కిడ్నీ, లివర్, మధుమేహం పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. బత్తుల వెంకటసాయిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వైద్యులు కె.ప్రదీప్, కె.శ్రావణి వైద్య పరీక్షలు చేశారు. నాగేంద్ర, అఖిల్, జెర్రీ, ప్రశాంత్, సత్యనారాయణ, నవీన్, ప్రేమ్, శేఖర్, సురేష్ పాల్గొన్నారు.

శివస్వాముల బిక్షాటన

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తిలో శివ మాలధరించిన భక్తులు ఆదివారం జోలె పట్టి బిక్షాటన చేశారు. శివుని చిత్రపటాన్ని ఊరేగిస్తూ ఇంటింటికి వెళ్లి బియ్యం, కూరగాయలు సేకరించారు. శివదీక్షలో భాగంగా బిక్షాటన చేస్తున్నామని వారు తెలిపారు.

శివుడి చిత్రపటంతో శివమాలధరించిన భక్తులు

శాసనసభాపతి పర్యటన..

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి మండలంలో శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం పర్యటించనున్నారు. ఉదయం పెడపర్తి గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం కుతుకులూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, అనపర్తిలో అనపర్తి- అర్తమూరు బీటీ రోడ్డును ప్రారంభించనున్నారు.

కుతుకులూరులో మెగా వైద్యశిబిరం

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి మండలం కుతుకులూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామానికి చెందిన పులగం తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి శిబిరాన్ని ప్రారంభించనున్నారు. దంత, కంటి తదితర సమస్యలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తిరుమల రెడ్డి తెలిపారు.

జలపాతం కాదు.. పైపు లైను లీకు

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరు కూడలిలో జాతీయ రహదారి మార్గంలో ఆదివారం సాయంత్రం పైపులైన్ లీకయ్యి నీరు వృథాగా పోయింది. హెవీ పైప్‌లైన్ కావడంతో నీరు ఉధృతంగా బయటకు వచ్చి ఎగిసిపడింది. 33 కేవీ తీగలకు నీరు తాకుతుండటంతో విద్యుత్ శాఖ ఏఈ శ్రీనుబాబు సరఫరాను నిలుపుదల చేయించారు. రోడ్డంతా జలమయం అయ్యింది. రోడ్డుకు అడ్డంగా పైనుంచి నీరు పడటంతో వాహనచోదకులు అవస్థపడ్డారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది చర్యలు చేపట్టారు.

ర్యాలీగా పశుగ్రాసం తరలింపు

పెదపూడి, న్యూస్‌టుడే: దోమాడ గ్రామానికి చెందిన అయ్యప్ప స్వామి మాలధారులు, రైతులు పశుగ్రాసాన్ని ద్విచక్రవాహనాలపై ర్యాలీగా రమణయ్యపేటలోని గోశాలకు ఆదివారం తీసుకెళ్లారు. గతంలో గడ్డిని ట్రాక్టరుపై తరలించేవారు. ఈ సారి రైతులే గాంధీస్మారక్‌లోని పొలాలలో ఉన్న గడ్డిని మొత్తం కోసి ద్విచక్రవాహనానికి కట్టుకుని 30 కిలోమీటర్లు తీసుకెళ్లారు.

సత్య స్వాముల గ్రామోత్సవం

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: ధవళేశ్వరం ఎర్రకొండ వద్ద సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో ఆదివారం సత్యస్వాముల గ్రామోత్సవం జరిగింది. పెద్దపుల్ల తల్లి ఆలయం నుంచి ప్రధాన వీధుల్లో స్వామివారి పల్లకి సేవ వైభవంగా సాగింది.

డిజిటల్ చెల్లింపుల్లో ఇబ్బందులు

✦ అవగాహన లేమి, సాంకేతిక సమస్యలు
✦ వసూలు కాని పన్నులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: పంచాయతీల ద్వారా అవినీతి రహిత, పారదర్శక పాలన అందించాలనే మంచి ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో పంచాయతీల్లో పన్నుల వసూళ్లు డిజిటల్ చెల్లింపుల ద్వారా జరగాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో ఈ ఏడాది అన్ని పంచాయతీల్లోను వీటిని అమలు చేస్తున్నారు. ఈ చెల్లింపులపై అవగాహన లేమి, సాంకేతిక సమస్యలతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒక్క బిక్కవోలు మండలంలోనే పన్నులు ద్వారా రూ.3,92,22,773 వసూలు కావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 20 శాతం కూడా వసూలు కాకపోవడం సమస్యకు అద్దంపడుతోంది.

మూడు విధాలుగా..

స్వర్ణ పంచాయతీ పోర్టల్ ఏర్పాటు చేసి పన్నుల చెల్లింపును ఆన్‌లైన్ చేశారు. దీనికోసం ప్రతి ఇంటి నంబరు, వారి ఫోన్ నంబర్లు పొందుపరుస్తూ యాప్‌ను తయారు చేశారు. ● మొదటి పద్ధతి ప్రకారం పన్ను చెల్లింపుదారులకు ముందుగా సంక్షిప్త సమాచారం వస్తుంది. దాన్ని తెరిస్తే అందులో మన వివరాలు పొందుపరచి పన్నులు చెల్లించవచ్చు. చరవాణి నంబర్లు సక్రమంగా ఇవ్వకపోవటంతో చెల్లింపుదారులకు సమాచారం రావటం లేదు. ● రెండో విధానంలో పంచాయతీ బిల్లు కలెక్టరు వచ్చి తమ చరవాణిలో యాప్ తెరచి పన్ను చెల్లించుకుంటారు. ఆ సమయాల్లో ఈ యాప్ త్వరగా తెరచుకోకపోవడంతో పన్ను కట్టడం ఆలస్యం అవుతోంది. ● మూడో విధానంలో పంచాయతీ కార్యాలయానికి వెళ్తే అక్కడ క్యూఆర్‌కోడ్ ఉంటుంది. స్కాన్ చేసి యూపీఐ ద్వారా పన్ను చెల్లించవచ్చు. సిబ్బంది ఇంటింటికి తిరిగి అడిగితేనే రేపు, మాపు అంటారు. స్వతహాగా పంచాయతీలకు వచ్చి పన్నులు కట్టడానికి సుముఖత చూపడం లేదు.

పందలపాక పంచాయతీ కార్యాలయం

సాధారణ చరవాణులే..

పల్లెల్లో కొందరు ఇప్పటికీ సాధారణ చరవాణులే వాడుతున్నారు. దీనివల్ల వారు డిజిటల్ చెల్లింపులు చేయలేక పోతున్నారు. అలాంటి వారు తమ బంధువులు, స్నేహితుల ద్వారా చెల్లించాల్సి వస్తుంది. ఇవే కాకుండా మరికొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. గతేడాది కూడా డిజిటల్ చెల్లింపులే చేయాలని ఆదేశాలున్నా నగదు తీసుకోవటానికి కొంత వెసులుబాటు కల్పించారు.

నగదు స్వీకరించటానికి వీలులేదు..

ఏ పంచాయతీలోను కూడా నగదు స్వీకరించి పన్నులు చెల్లించకూడదు. అంతా డిజిటల్ ద్వారానే చెల్లించాలి. అలాగని చెల్లింపుదారు నుంచి నగదు తీసుకుని తన చరవాణి ద్వారా బిల్లు కలెక్టర్లు డిజిటల్ చెల్లింపులు చేయకూడదు. ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. అన్నీ సర్దుకుంటున్నాయి. డిజిటల్ చెల్లింపులు తప్పనిసరి.

– జాన్ మిల్టన్, పంచాయతీ విస్తరణ అధికారి

చంద్రశేఖరస్వామికి వెండి కిరీటం బహూకరణ

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: దుప్పలపూడిలోని చంద్రశేఖర స్వామికి గ్రామానికి చెందిన వాద్రేవు చంద్రశేఖర్ రావు రూ.6 లక్షల విలువైన వెండి కిరీటాన్ని తయారు చేయించారు. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు, చంద్రశేఖర్‌రావు దంపతులు ఆలయ అర్చకుడికి ఈ కిరీటాన్ని అందజేశారు. గ్రామ ఇన్‌ఛార్జి సర్పంచి శివపద్మిని, నాయకులు రామసతీష్, రామకృష్ణారెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటాన్ని అందజేస్తున్న దాత, మాజీ ఎమ్మెల్యే

ఘనంగా పేటతుళ్లు

స్వామివారి రథం లాగుతున్న భక్తులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: బలభద్రపురంలో అయ్యప్ప మాలధారులు ఆదివారం పేటతుళ్లు నిర్వహించారు. దాదాపు 30 రోజులుగా దీక్షలో ఉన్న స్వాములు కొండకు వెళ్లే రోజులు దగ్గర పడటంతో ఈ కార్యక్రమం జరిపారు. ఆటపాటలతో నృత్యాలు చేస్తూ, పురాణ పురుషుల వేషధారణతో స్వామివారి రథం లాగుతూ గ్రామంలో పర్యటించారు.

సామూహిక లక్ష బిల్వార్చన

పూజాకార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: కొంకుదురు బుడతలమిల్లి వద్ద గల బాల త్రిపుర సుందరి సమేత త్రిమూర్తి లింగేశ్వరస్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని పండితులు రమణ శర్మ ఆధ్వర్యంలో 12 మంది పండితులు పాల్గొని ఈ పూజా కార్యక్రమం జరిపించారు. గణపతి పూజతో ప్రారంభమై రుద్రాభిషేకం, హోమాలు, సూర్యమండప ఆరాధన, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు కొనసాగాయి. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పడాల వెంకటరామా రెడ్డి, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్తికం.. ప్రకృతితో మమేకం

వనభోజనాలతో సందడే సందడి

ఉసిరిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న గోకవరపు వారి కుటుంబసభ్యులు

రంగంపేట: జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం: శాస్త్రీయ నృత్యం చేస్తున్న చిన్నారి

రాజానగరం, రంగంపేట, అనపర్తి గ్రామీణం, కడియం, బిక్కవోలు, న్యూస్‌టుడే: కార్తికమాసం, అందునా ఆదివారం కావడంతో ఆదివారం వనసమారాధనలతో సందడి నెలకొంది. పండ్ల తోటలు, ఆలయాలు సందర్శకులతో కళకళలాడాయి. కుటుంబ సమేతంగా వచ్చి ఆట పాటలతో ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. ● దివాన్‌చెరువు పండ్ల తోటలో కాపునాడు సామాజికవర్గ వనభోజనాలు జరిగాయి. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఉభయగోదావరి జిల్లాల కాపునాడు అధ్యక్షుడు జి. రఘునదేవ్, యుద్దా వేణుగోపాలరావు, అనుశ్రీ సత్యనారాయణ, సానా సతీష్ పాల్గొన్నారు. మరో తోటలో శ్రీశక్తి సేవ సమితి, పుష్పదళ సంఘంలో బ్రాహ్మణ ఉద్యోగుల సేవ సమూహం, రాజానగరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనసమారాధనలు జరిగాయి. ● రంగంపేటలో కాపు వన సమారాధనలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వైకాపా నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి వేర్వేరు సమయాల్లో పాల్గొన్నారు. ● అనపర్తిలో మామిడితోటల్లో గాయత్రి బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో సందడిగా జరిగాయి. పొలమూరు డీఎన్ఆర్ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో తెదేపా నేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు. ● కడియపులంక విశ్వేశ్వరా హైటెక్ నర్సరీలో నక్షత్ర కాశీ అమ్మిరాజు ఆధ్వర్యంలో గణపతి పూజ, చండీహోమం, రుద్ర హోమాలు జరిగాయి. ● సోమిని కొండపై దత్త పీఠం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో తెదేపా రాష్ట్ర ఆరోగ్య విభాగాధ్యక్షుడు గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎంపీపీ సత్యప్రసాద్ పాల్గొన్నారు. ● కొండపల్లిలో రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ఆటపాటలతో సందడి చేశారు.

అనపర్తి గ్రామీణం: మనోజ్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

కడియపులంక నర్సరీలో రుద్ర హోమంలో భక్తులు..

బిక్కవోలు: వేదికపై పాటలు ఆలపిస్తున్న చిన్నారులు..

అత్యవసరమైనా ఉగ్గపట్టాల్సిందే..!

కడియపులంక నర్సరీల్లో నిత్యం వందలాది మంది కార్మికులు పనిచేస్తుంటారు. నర్సరీల మధ్య అందరి అత్యవసరాలకు మరుగుదొడ్లను పంచాయతీ నిర్మించింది. కొన్నాళ్ల పాటు వాటిని బాగానే శుభ్రపరిచి వినియోగించారు. కొంత కాలంగా దాని నిర్వహణ పట్టించుకోక పోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో రమేశ్‌ను వివరణ కోరగా సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, కడియం

గుంత.. రాకపోకలకు చింత

అనపర్తి నుంచి రాజానగరం వెళ్లే రహదారి దుప్పలపూడి నుంచి ముక్కినాడ వరకు గుంతలమయం అయ్యింది. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వాన్నంగా తయారయ్యింది. రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ రాంబాబును వివరణ కోరగా ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరుకాగానే రోడ్డు అభివృద్ధి చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, అనపర్తి గ్రామీణం

అంతా వ్యర్థాలమయం

బొమ్మూరు నేతాజీనగర్ కాలువ మలుపు ప్రాంతం వ్యర్థాలతో అధ్వానంగా మారింది. దుర్వాసన, పందుల సంచారంతో ఇబ్బందిగా ఉంటుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులు మురుగుపై తేలుతున్నాయి. ఈ సమస్యపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కార్యదర్శి కాశీ స్పందిస్తూ తరచూ శుభ్రం చేస్తున్నా కొందరు అక్కడే వ్యర్థాలు వేస్తున్నారని, వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

ప్రమాదకరంగా మలుపు

కొత్తతుంగపాడు నుంచి జి.యర్రంపాలెం వెళ్లే రహదారిలో మలుపు ప్రమాదకరంగా మారింది. రాళ్లు లేచిపోయి ద్విచక్రవాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కొత్తతుంగపాడు శివారున కొండల నుంచి గ్రావెల్‌ను టిప్పర్లపై తరలిస్తున్నారు. అధిక సంఖ్యలో టిప్పర్లు ఈ రహదారిపై మలుపు మీదుగా తిరుగుతుండడంతో రహదారి ఛిద్రమైంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రాజానగరం

అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు స్వాధీనం

సీతానగరం(కోరుకొండ): సీతానగరంలోని కైలాసగిరి ర్యాంపు నుంచి అనుమతులు లేకుండా బొండు మట్టిని రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్సై సురేష్ తెలిపారు.

డాక్యుమెంట్స్ పోయినవి

నా క్లయింటు, విశ్వనాథ్ రెడ్డి గురుబిల్లి, తండ్రి : సత్యనారాయణ రెడ్డి, డోరు నెం.2-11-20, గొండేశి వారి వీధి, ఆల్కాట్ గార్డెన్స్, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా వారు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం.

నా క్లయింటు యొక్క ఒరిజినల్ లింకు క్రియ దస్తావేజు నెం.6152/1988, తేది.27-08-1988, ఎస్ఆర్ఓ, రాజమండ్రి, ది. 05-11-2025వ తేదిన ఇ.సి. అప్లయ్ చేయుటకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని వారి ఇంటినుండి రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసుకి వెళ్ళి, అక్కడ ఆఫీసు నందు దస్తావేజులు బయటకు తీసి పరిశీలిన చేయగా, ఒరిజినల్ లింకు క్రియ దస్తావేజు నెం.6152/1988 కనిపించలేదు. అది దారిలో వస్తుండగా మిస్స్ అయింది. ఎంత వెతికిన కనిపించలేదు. కనకు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

సం/- డి.వి.కె.యస్.యమ్.ప్రసాద్, బి.ఎ.,బి.ఎల్.
అడ్వకేట్, జాంపేట, రాజమండ్రి.
సెల్ : 9440 890912

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని గాదరాడ గ్రామంలో పలు కుటుంబాలకు ఆదివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. బత్తుల ధన్వంతరికి రూ.86 వేలు, మారపట్ల రిబ్కాకు 51 వేలు, దివసం రాజుకు రూ.25 వేలు, పిన్నమరెడ్డి పెంటయ్యకి రూ.41 వేలు, అప్పనబాబుకు రూ.70 వేలు, వంక కుశాక్‌కు రూ.57 వేలు చొప్పున సంబంధిత చెక్కులను అందజేశారు.

గాదరాడలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: భారత్ స్వయం సమృద్ధిగా ఎదిగేందుకు, ఆత్మనిర్భర భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు స్వదేశీ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్ర రెడ్డి అన్నారు. అనపర్తి కూటమి కార్యాలయం వద్ద ఆదివారం ఆత్మనిర్భర్ భారత్ - ఇంటింటి స్వదేశీ వస్తువుల కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ఇన్‌ఛార్జి సూర్యప్రభావతి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కరపత్రాలను, స్టికర్లను ఆవిష్కరించి ఇంటింటికి పంచారు. నాయకులు హేమతులసి, గంగాభవాని, సత్యనారాయణరెడ్డి, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు, స్టికర్లను ఆవిష్కరిస్తున్న భాజపా నాయకులు

ఎలా వెళ్లాలి.. ఎంత దూరం వెళ్లాలి?

కడియం, న్యూస్‌టుడే: కడియం మండలం కడియపులంక పరిధి దోశాలమ్మకాలనీ వద్ద కూడలిలో ఏర్పాటు చేసిన సూచికబోర్డుపై వివరాలు కనిపించడం లేదు. దీంతో ఏ దారి ఎటుపోతుందో అన్న మీమాంశలో వాహనదారులు ఉంటున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సూచికలో గ్రామాల పేరు, వాటిని చేరుకునేందుకు దూరం వంటి వివరాల్లో స్పష్టత లేక ఇబ్బందులు తప్పడం లేదని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ర.భ అధికారి సత్యనారాయణను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు.

CAUTION NOTICE

The General Public are hereby informed that My client M/s. Eswarsankalp Developers, represented by Mr. Arimanda Durga Rama Krishna Reddy filed case **S.No.359 of 2024 against the Canara Bank E-auction notices** regarding schedule property and Canara Bank also filed **O.A554 of 2024** before DRT VSP and also filed number of suits, all are pending.

That my client hereby caution to General Public, if anybody participate in the **auction fixed by Canara Bank/ PSB Alliance (banknet) on 11-11-2025** they will not bind my client's right and they may be faced to legal consequences.

SCHEDULE

All that part and parcel of site measuring **3200** sq. yards being an undivided and unspecified share of out of builder/developer share 5967.36 sq. yards in the total extent of 10288.55 sq.yards with 69 flats (unfinished flats) thereon with super Built up area of 89045 sft including common areas and balconies in CDEF and Amenities blocks and car Parking of 5520 sft (for 69 flats car parking with 80 sft each) and stilt floors in CDEF and amenities blocks of Eswarsankalp Homes covered by S.No.306/1 of VL puram, Rajahmundry Municipal Corporation area and S.No.308 of VL puram Pidimgoyya Gram Panchayat, Rajahmundry rural area in the registration district area of Pidimgoyya joint sub registrar office, East Godavari district and total site bounded as follows: Out of total 110 flats of builders share in ABCDEF and amenities Blocks following 69 flats in CDEF and amenities blocks are mortgaged to bank In **Block C:** Ground Floor flat No.101,102,103,104,106. In Fist Floor Flat No.201,202,203,204,206. In fourth Floor Flat No.501,502,503,504,505,506. **In Block D.** First Floor Flat No.201,203,204,206. In third Floor: Flat No.401,402,403,404,405,406, **In Block E:** GF flat No.101,102,103,104,105,106, In First Floor Flat No.202,205, In Second Floor Flat No.301,306, In third Floor Flat No.401, 402,403, 404, 405,406 in Fourth Floor Flat No.501, 502, 503,504, 505,506. **In Block F:** First Floor Flat No.201, 202, 203, 204, 206 in Second Floor Flat No. 301, 303, 304, 306: in Third Floor Flat No. 401, 402, 403, 404, 405, 406: In Fourth Floor Flat No.503. In Amenities Block: Ground Floor Flat No.102, in First Floor Flat No.201 In Second Floor Flat No.302 in Third Floor Flat No.401 in Fourth Floor Flat No.502.

CH.V.S.SIVARAMAKRISHNA
ADVOCATE
49-07-8,LALITHANAGAR, VISAKHAPATNAM-16
Mobile: 9848433779,7093897799

మూగజీవాలకు వైద్యం ఎలా?

ఒక్కో వైద్యునికి రెండు ఆసుపత్రుల బాధ్యతలు

రంగంపేట, న్యూస్‌టుడే: మూగజీవాలకు వైద్య సేవలు సక్రమంగా అందక పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యుల కొరతతో పశువులు కొన్నిసార్లు మృత్యువాత పడుతున్నాయని వాపోతున్నారు. పశువుల కోసం అమలు చేస్తున్న పథకాల విషయంలోను ఇబ్బందులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని కోరుతున్నారు. నియోజకవర్గంలోని రంగంపేట, బిక్కవోలు, అనపర్తి మండలాల్లో పశు వైద్యుల కొరత ఉంది. పెదపూడి మండలంలో మాత్రమే పూర్తిస్థాయిలో వైద్యులు ఉన్నారు.

మండలాల వారీగా ఇవీ పరిస్థితులు..

✦ రంగంపేట మండలం రంగంపేట, వడిశలేరులో పశువుల ఆసుపత్రులు ఉండగా ఇక్కడ పని చేసే ఇద్దరు వైద్యులు బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత ఎవరూ రాకపోవడంతో ఇతర ఆసుపత్రుల వైద్యులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ✦ బిక్కవోలు మండలంలోని నాలుగు పశువుల ఆసుపత్రులు ఉండగా నలుగురు వైద్యులు ఉన్నారు. వీరిలో బిక్కవోలు వైద్యునికి వడిశలేరు ఆసుపత్రి బాధ్యతలు, పందలపాక వైద్యునికి రంగంపేట ఆసుపత్రి బాధ్యతలను అదనంగా అప్పగించారు. ✦ అనపర్తి మండలం కుతుకులూరు పశువుల ఆసుపత్రిలో వైద్యుని కొరత ఉంది. ఇక్కడ అదనపు బాధ్యతలను పొలమూరు వైద్యునికి అప్పగించారు. ✦ పెదపూడి మండలంలో నాలుగు ఆసుపత్రులు ఉండగా నలుగురు వైద్యులు ఉన్నారు.

పశువుని కోల్పోయాను..

రంగంపేట పశువుల ఆసుపత్రిలో వైద్యుని కోసం పలు మార్లు వెళ్లినా అక్కడ లేకపోవడంతో అనారోగ్యంతో ఉన్న గేదెను కోల్పోయాను. పశువుల కోసం అందించే గడ్డి విత్తనాలు, ఇతర పథకాలపై మాకు అవగాహన కల్పించే వారు కరవయ్యారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలి. - కొనుజుల గోవింద, పశువుల యజమాని, రంగంపేట

రంగంపేటలో మూసి ఉన్న పశువుల ఆసుపత్రి

పోస్టుల భర్తీకి ప్రయత్నిస్తున్నాం..

పశు వైద్యుల కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏజెన్సీలో ఉన్న ఇద్దరు వైద్యులు ఇక్కడకు రావాల్సి ఉంది. వారిని అక్కడ నుంచి ఉన్నతాధికారులు పంపించగానే వచ్చి చేరతారు. ఖాళీగా ఉన్న అన్ని చోట్ల రెండు నెలల్లోనే వైద్యులను నియమిస్తాం. – శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ ఏడీ, అనపర్తి

ముంచుకొస్తున్న ముప్పు

తూడుతో మూసుకుపోతున్న కాలువలు

పెదపూడి, అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: మురుగునీటి కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో అవి గుర్రపుడెక్క, తూడు, ఇతర వ్యర్థాలతో నిండిపోతున్నాయి. పెదపూడి మండలంలోని శివారు గ్రామాలైన పెదపూడి, దోమాడ, అచ్యుతాపురత్రయం, రామేశ్వరం, కరకుదురు గ్రామాల పంటపొలాల్లోని మురుగునీరు బిక్కవోలు డ్రెయిన్ ద్వారా వెళ్లాల్సి ఉంది. ఈ గ్రామాల్లోని సుమారు 12 వేల ఎకరాలు వరదల సమయంలో నీటమునిగే ప్రమాదముంది. బిక్కవోలు డ్రెయిను, అచ్యుతాపురత్రయం వద్ద పశ్చిమ ఏలేరు కాలువలు రెండూ కలిసి ఉంటాయి. ఈ రెండు కాలువల ద్వారా వచ్చే పంట పొలాల్లోని వృథా నీరు కాకినాడ గ్రామీణ మండలం ఇంద్రపాలెం వద్ద ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తుంది. ఈ మధ్యలో ఉన్న కాలువ కాస్తా గట్లు దిగజారి, కొంత దూరం తూడు, వ్యర్థాలు చేరడంతో నీరు పోయే దారి లేకుండా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బిక్కవోలు డ్రెయిను, ఏలేరు కాలువ కలిసే ప్రాంతంలో సుమారు 100 మీటర్లు ఉండాల్సిన కాలువ ప్రస్తుతం 50 మీటర్లకు చేరింది.

గుర్రపుడెక్కతో మూసుకున్న బిక్కవోలు కాలువ

వ్యర్థాలు తొలగిస్తున్నాం..

ఈ కాలువలో నీటి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో వ్యర్థాలను తొలగిస్తున్నాం. పూర్తి స్థాయి ఆధునికీకరణకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. – వరప్రసాదరావు, డ్రెయిన్లశాఖ ఏఈ, పెదపూడి

(c) eenadu

కొవ్వూరు
•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

'కళాగౌతమి' కవి సమ్మేళనం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రాచీన కవుల సాహిత్యం అధ్యయనం చేయడం ద్వారా భాష ఔన్నత్యం తెలుస్తుందని తెలుగు అధ్యాపకురాలు బి.రమాదేవి పేర్కొన్నారు. ఆదివారం కళాగౌతమి ఆధ్వర్యంలో లలితానగర్ భార్గవ కల్యాణ మండపంలో విద్యార్థుల సమక్షంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత్వం అంటే ఏమిటి? ఏ విధంగా రాయాలి? తదితర అంశాలను ఆమె వివరించారు. పద్యం నుంచి మొదలుకుని నేడు వస్తున్న హైకూలు, నానీలు, అష్టపదులు తదితర అంశాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వరాహగిరి కృష్ణమోహన్, ముంగండ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సీఐ మంగాదేవి తదితరులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని రాజమహేంద్రవరం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ మంగాదేవి పేర్కొన్నారు. నగరంలోని శాంతినగర్‌లో ఆదివారం శక్తి, ఈగల్ టీంల ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శక్తి యాప్ వినియోగం గురించి వివరించారు. పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై అమీనాబేగం, ఈగల్ టీం ఎస్సై నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతాభావంతో మెలగాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కార్తిక వనసమారాధనలు సమాజంలో ఐక్యతాభావాన్ని పెంపొందిస్తాయని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కొవ్వూరు శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వేములూరు తోటలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్తిక వనసమారాధనలో మంత్రి హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం శెట్టిబలిజ సంక్షేమానికి, అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ భావన రత్నకుమారి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, తెదేపా పట్టణ నాయకుడు సూరపనేని చిన్ని మాట్లాడారు.

మాట్లాడుతున్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

అపూర్వ సమ్మేళనం.. సంతోషాల సమయం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. 45 ఏళ్ల తరువాత కలిసిన వారంతా ఆత్మీయంగా గడిపారు. ఆనాటి తీపిజ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం గురువులను సత్కరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తాడిపర్రు విద్యార్థిని

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: గోవనపాలెంలో ఈనెల 8న నిర్వహించిన ఖోఖో పోటీల్లో తాడిపర్రు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పీతా లక్ష్మీగణేశ్వరి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. విద్యార్థినితో పాటు శిక్షణిచ్చిన వ్యాయామోపాధ్యాయులు పి.దుర్గను కూటమి నాయకులు, పెద్దలు అభినందించారు.

కార్తికమాసం విశిష్టతపై ప్రవచనం

ప్రవచనం చెబుతున్న కృష్ణబాబు

నిడదవోలు, న్యూస్‌టుడే: ఏడాదిలో వచ్చే మాసాలలో ఉత్తమమైనది కార్తికమాసమని ప్రవచనకర్త పొన్నా కృష్ణబాబు అన్నారు. నిడదవోలు పట్టణంలోని పురాతన బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసం విశిష్టత అనే అంశంపై ఆదివారం సాయంత్రం జరిగిన ప్రవచనంలో ఆయన మాట్లాడారు. నదీ స్నానం, దీపారాధనలు చేసుకోవడంతో పాటు దానాలు, ఉపవాసాలు చేసుకున్న వారికి అక్షయమైన పుణ్యాలు కలుగుతాయన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సోమేశ శివ, ఆలయ అర్చకుడు శ్రీకాకుళపు ఆదినారాయణ, వి.మల్లికార్జునరావు, చంద్రశేఖర్, జ్యోతి, కుమారి, భాగ్యలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

సేంద్రియ సాగు.. దిగుబడి బాగు

నల్లజర్ల, న్యూస్‌టుడే: రసాయనాలు, క్రిమిసంహారక మందులు అధికంగా వాడడం వల్ల పంటల్లో దిగుబడి తగ్గడమే కాకుండా ఆయా ఉత్పత్తులను తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ముప్పువాటిల్లే ప్రమాదముందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ప్రకృతిపరంగా సాగయ్యే పంటలకు ప్రతికూల వాతావరణాన్ని సైతం తట్టుకునే శక్తి ఉంటుందని, చీడపీడలు దరిచేరవని, నాణ్యమైన ఉత్పత్తుల దిగుబడి ఉంటుందని మాస్టర్ ట్రైనీలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. బీజామృతం, జీవామృతం, బ్రహ్మాస్త్రం తదితర కషాయాల తయారీపై వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది రైతులు ప్రకృతి సాగుపై మక్కువ చూపుతున్నారు.

సింగరాజపాలెంలో జీవామృతం తయారుచేస్తున్న మహిళలు

ప్రయోగాత్మకంగా

● అధికారులు అవగాహన కల్పించడం వల్ల గోపాలపురం నియోజకవర్గంలో 6,500 మంది రైతులు సుమారు 5500 ఎకరాల్లో సేంద్రియ విధానంలో కూరగాయలతో పాటు వరి, ఆయిల్‌పాం, నిమ్మ, మొక్కజొన్న, కోకో వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్జీనియా పొగాకు సైతం చేపట్టారు.

● నల్లజర్ల మండలంలోని సింగరాజుపాలెం, మారెళ్లమూడి, ముసుళ్లకుంట, పుల్లలపాడు, నల్లజర్ల గ్రామాల్లో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టారు. వరి, కూరగాయలు, ఆయిల్‌పాం, నిమ్మ, మొక్కజొన్న సాగు 500 మంది రైతులు 300 ఎకరాల్లో ప్రారంభించారు.

తక్కువ ఖర్చుతో

సేంద్రియ సాగు వల్ల ఖర్చులు చాలా వరకు తగ్గాయి. రూ.10 వేలు ఖర్చుచేసి రసాయన ఎరువులు కొని చేసే వ్యవసాయంలో రూ. వెయ్యితో సేంద్రియ వ్యవసాయం చేయవచ్చు. పైగా ఆరోగ్యకరమైన దిగుబడి వస్తుంది.

- మారం కనకదుర్గ, రైతు, సింగరాజుపాలెం

రైతుల ఆసక్తి

ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. జీవామృతం భూసారాన్ని పెంచుతుంది. తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయి. ఈ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ధరలు లభిస్తాయి.

- శ్రీనివాసరావు, మాస్టర్‌ట్రైనర్, ప్రకృతి వ్యవసాయం

మధుమేహ నిర్ధారణ శిబిరం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆధునిక సమాజంలో ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పెనుమాక జయరాజు అన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఆదివారం మధుమేహ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వాత్సల్య వృద్ధాశ్రమంలో అన్నదానం చేసి కేక్ కోసి పంచారు. క్లబ్ ప్రతినిధులు పాలెంపాటి చినబాబు చౌదరి, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మహ్మద్ హుస్సేన్, పట్టణ ప్రముఖుడు సూరపనేని సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కార్తికమాస శోభ

కొవ్వూరు పట్టణం, తాళ్లపూడి, నిడదవోలు, ఉండ్రాజవరం, తాళ్లపూడి, బచాగల్లు, పెరవలి, న్యూస్‌టుడే : శివ పంచాక్షరీ మంత్రంతో ఆంధ్రగీర్వాణ విద్యాపీఠ ప్రాంగణం ప్రతిధ్వనించింది. కార్తిక మాసం సందర్భంగా లలితా పార్వతీదేవి సమేత గోష్పదేశ్వరుడికి సహస్ర ఘటాభిషేకాన్ని ఆదివారం వేదోక్తంగా నిర్వహించారు. ● తాళ్లపూడిలోని పార్వతి సమేత ఉమామహేశ్వర స్వామి ఆలయంలో తాళ్లపూడి పట్టణ కాపుసంఘం ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ నిర్వహించారు. ● నిడదవోలు పట్టణంలోని గోలింగేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షాధారులు పూజ నిర్వహించారు. ● కె.సావరంలో కొలువైన దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో దీపారాధన, ప్రత్యేక పూజలు చేశారు. ● ప్రక్కిలంక శివాలయంలో లక్షపత్రి కలశపూజ నిర్వహించారు. అన్నపూర్ణాసమేత విశ్వేశ్వరస్వామికి పలు రకాల పుష్పాలతో అలంకరించారు. ● అయ్యప్ప స్వామి పేటతుళ్ల ఉత్సవ వేడుక చాగల్లు మండలం ఊనగట్ల గ్రామంలో నిర్వహించారు. ● కానూరులో ప్రసిద్ధి చెందిన వల్లభ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ●దొమ్మేరులోని మల్లిఖార్జునస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజాను నిర్వహించారు.

నిడదవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో పూజ

కె.సావరంలో పూజలందుకున్న దుర్గామల్లేశ్వరస్వామి

ప్రక్కిలంక: పుష్పాలంకరణలో విశ్వేశ్వరస్వామి

కానూరులో పూజలందుకున్న వల్లభస్వామి


గోష్పదేశ్వరునికి జలాభిషేకం

రాజ్యాంగంపై అవగాహన అవసరం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులను అందరూ తెలుసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి. సాయికృష్ణ సూచించారు. జాతీయ న్యాయసేవల దినోత్సవం సందర్భంగా కొవ్వూరు పురపాలక సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సత్వర న్యాయం, కేసుల పరిష్కారంలో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో న్యాయ సేవాధికార సంస్థ అమలు చేస్తున్న కార్యాచరణను వివరించారు. రాజీమార్గం ద్వారా లోక్ అదాలత్‌తో న్యాయ సాయం పొందడం, ఉచిత న్యాయ సేవలు పొందే అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వర్రే మురళి అధ్యక్షతన నిర్వహించిన సభలో అసోసియేషన్ కార్యదర్శి రాజ్‌నాథ్‌సింగ్, న్యాయవాదులు ఎం.హరీష్, ఎం.శ్రీవల్లి, ఎం.రఘు, పురపాలక ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాయికృష్ణ

ఘనంగా అయ్యప్ప పూజలు

నిడదవోలు: నిడదవోలు పట్టణ, మండలంలోని పందలపర్రులో అయ్యప్ప స్వామి పూజా వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, నైపుణ్యాభివృద్ధి సంస్థ రాష్ట్ర ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆదివారం పాల్గొన్నారు. సమిశ్రగూడెంలో నిర్వహించిన ఆర్యవైశ్య కార్తిక వనసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పందలపర్రులో అయ్యప్ప స్వాములతో శేషారావు

కోయ భాషలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: గిరిజన నాయకుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా జన జాతీయ గౌరవ్ దివస్‌ను పురస్కరించుకుని కోయ భాషలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు గిరిజన సంక్షేమ అధికారిణి ఎస్.ఎస్.లక్ష్మి కాంతి పేర్కొన్నారు. ఆదివారం గిరిజన సంక్షేమ కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోయ భాషకు బిర్సా ముండా అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. బిర్సా జీవితం.. పోరాట స్ఫూర్తి అంశంపై నిర్వహించిన పోటీలకు న్యాయనిర్ణేతగా ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగు శాఖాధిపతి పి.వి.బి.సంజీవరావు వ్యవహరించారు. పోటీల్లో మొదటి బహుమతి కారం సరిత, ద్వితీయ బహుమతి సాయం మణి, తృతీయ బహుమతి సున్నం స్రవంతి, ప్రత్యేక బహుమతులు ఎం.శ్రీజ, రవ్వ నాగేశ్వరి విజేతలుగా నిలిచారని తెలిపారు.

ఉద్యాన పనులు ప్రారంభం

ఈనాడు కథనానికి స్పందన

నిడదవోలు గణపతికూడలిలో ఏర్పాటు చేసిన పార్కుకు మరమ్మతులు అధికారులు చేపట్టారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో గణపతికూడలిలో ఆక్రమణలు తొలగించి రుడా నిధులు రూ.67 లక్షలతో పార్కును అభివృద్ధి చేసినా.. నిర్వహణ లేక పార్కు అధ్వానంగా మారింది. దీనిపై గతంలో పలుసార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన అధికారులు నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. –న్యూస్‌టుడే, నిడదవోలు

పొంచి ఉన్న ప్రమాదం

తీపర్రు, తాడిపర్రు ప్రాంతంలో ప్రధాన కాలువకు నిర్మించిన వంతెన కమ్మెలు దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ వారధి మీదుగా నిడదవోలు, రాజమహేంద్రవరం వైపు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సమస్యను ఇరిగేషన్ ఏఈ మురళి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి మరమ్మతులు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

సందడిగా వనసమారాధన

తాళ్లపూడి, చాగల్లు, తాళ్లపూడి, న్యూస్‌టుడే: అందరూ ఐక్యంగా సాగడానికి కార్తిక వనసమారాధన ఎంతగానో దోహదపడుతుందని విశ్వబ్రాహ్మణసంఘం ప్రముఖులు తెలిపారు. మండలంలోని గజ్జరం నుంచి గోపవరం వెళ్లే మామిడితోటలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ● మండల సమాఖ్య ఆధ్వర్యంలో చాగల్లు గ్రామంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ● ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక, పాలంగిలో కమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు.

చాగల్లులో వన సమారాధనలో మండల సమాఖ్య సభ్యులు

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

నల్లజర్ల : ఆర్యవైశ్యులు విద్య, వైద్యం, వ్యాపార, రాజకీయ రంగాలలో రాణించినప్పుడే అభివృద్ధి సాధిస్తారని దూబచర్ల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు చీమకుర్తి కిశోర్ పేర్కొన్నారు. కార్తికమాసం పురస్కరించుకుని ఆదివారం ఆ సంఘ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పలువురు దంపతులు పాల్గొని పూజలు చేశారు.

తాళ్లపూడి: బహుమతి అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు

ముళ్లపూడి రేణుకకు మొక్క అందజేస్తున్న కమ్మ సభ్యులు

వ్రతమాచరిస్తున్న ఆర్యవైశ్యులు

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కార్తిక వనసమారాధనలతో ఆధ్యాత్మిక సందడితో పాటు ఆత్మీయ భావన వ్యక్తమవుతుందని ప్రవచనకర్తలు మేడూరి సూర్యనారాయణ, టీవీనారాయణరావు అన్నారు. కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యా పీఠం సంస్కృత కళాశాల ప్రాంగణంలో సహస్ర బ్రాహ్మణ కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వన సమారాధనలో కొవ్వూరు బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా రంగావఝ్జల నాగభూషణశర్మ, ప్రధాన కార్యదర్శిగా శనివారపు భరద్వాజ్‌సాయి, ఉపాధ్యక్షులుగా కప్పగంతుల ఫణీంద్ర, చర్ల ధర్మలింగశాస్త్రి, గజవల్లి నాగు, కార్యదర్శులుగా చివుకుల ఆదిత్య, క్రొవ్వి యశ్వంత్, దశిక రామకృష్ణలను ఎన్నుకున్నారు. అనంతరం ప్రవచనకర్తలను సన్మానించారు.

ప్రవచనకర్త మేడూరి సూర్యనారాయణను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

'స్టేట్‌టూ బూత్' కార్యక్రమం

నిడదవోలు: ప్రతి నెల జరిగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమాలు అన్ని మై టీడీపీ యాప్‌లో అప్లోడ్ చేయాలని నిడదవోలు పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. నిడదవోలు పట్టణ తెదేపా కార్యాలయంలో ఆదివారం స్టేట్ టూ బూత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు ప్రతిఒక్కరూ మై టీడీపీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు దాసరి సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి తిరుపతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భాజపా నాయకులు

స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: భారత్ స్వయం సమృద్ధిగా ఎదిగేందుకు, ఆత్మనిర్భర భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు స్వదేశీ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి అన్నారు. అనపర్తి కూటమి కార్యాలయం వద్ద ఆదివారం ఆత్మనిర్భర్ భారత్ - ఇంటింటి స్వదేశీ వస్తువుల కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ఇన్‌ఛార్జి సూర్యప్రభావతి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కరపత్రాలను, స్టిక్కర్లను ఆవిష్కరించి ఇంటింటికి పంచారు. నాయకులు హేమతులసి, గంగాభవాని, సత్యనారాయణరెడ్డి, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌లో విశాఖ, తూర్పుగోదావరి జట్లు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు సెమీ ఫైనల్స్‌కు చేరాయి. సోమవారం విశాఖ, తూర్పుగోదావరి జిల్లా జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఆదివారం విశాలాక్షినగర్ బీవీకే పాఠశాల మైదానంలో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విశాఖ జట్టు 82-51తో అనంతపురం జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు 52-20తో కర్నూలుపై గెలుపొందింది. మహిళల విభాగంలోనూ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలి

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయటానికి నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చేయాలని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.గంగాధరరావు అన్నారు. ఆ పార్టీ మండల స్థాయి సమావేశాన్ని ఉండ్రాజవరంలో ఆదివారం నిర్వహించారు. స్థానికంగా పార్టీ తరఫున ఎంపీ, ఎమ్మెల్సీ అందుబాటులో ఉండటం వల్ల ప్రజలకు విశేష సేవలు చేయటానికి అవకాశం ఉందన్నారు. బూత్, క్లస్టర్ కమిటీలపై చర్చించారు. మండల అధ్యక్షుడు కె.సత్యనారాయణ, అక్కిన గోపాలకృష్ణ, ఆకెళ్ల శ్రీనివాసరావు, బూరుగుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరరావు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తాళ్లపూడి: 80085 74498 ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

సమస్య : రాష్ట్ర రహదారి నుంచి ఏటిగట్టుకు చేరే కూడలిలో దీపాలు వెలగడం లేదు. వాహనాల చీకటిలో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. **- కె.రత్నసాయి, కొవ్వూరు**

సమాధానం : రాష్ట్ర రహదారి ఏటిగట్టు కూడలిలో దీపాలను వెలిగించేందుకు చర్యలు తీసుకుంటాం.

- సీహెచ్ వెంకటేశ్వర్లు, పురపాలక కమిషనర్, కొవ్వూరు

–న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

సమస్య: ప్రధాన రహదారి నుంచి కాలింగుల కాలనీకి వెళ్లే మార్గంలో మురుగుకాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. రాకపోకలు సాగించేవారు పలు ఇబ్బందులు పడుతున్నారు. **-స్థానికుడు**

సమాధానం: కాలువను బాగు చేసేలా చర్యలు తీసుకుంటాం

-వీరన్న, పంచాయతీ కార్యదర్శి, తాళ్లపూడి

– న్యూస్‌టుడే, తాళ్లపూడి

సమస్య: దేవరపల్లి పంచాయతీ పరిధిలోని కడియాలమ్మ తల్లి గుడి వెనుక ఆర్యవైశ్య కల్యాణ మండపం సమీపంలో వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. దుర్వాసన వస్తూ దోమలు విజృంభిస్తున్నాయి. **-స్థానికుడు**

సమాధానం: సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- వై.రాజారావు, ఈవోపీఆర్డీ, దేవరపల్లి – న్యూస్‌టుడే, దేవరపల్లి

విషసర్పాలు బుసకొడుతున్నాయ్..

నిడదవోలు, న్యూస్‌టుడే: తూర్పు, పశ్చిమ, ఏలూరు ఈ మూడు జిల్లాల పరిధిలోని 29 మండలాల రైతులకు సాగునీరు, తాగునీటి నియంత్రణ చేపట్టే నిడదవోలు మండలం శెట్టిపేట వద్ద ఉన్న జలవనరుల కార్యాలయం ప్రస్తుతం అధ్వానంగా మారింది. ఈ మూడు జిల్లాల పరిధిలో 5.29 లక్షల ఎకరాలకు నిత్యం సాగునీరు అందించడంతో పాటు, తాగునీటి నిర్వహణ అంతా ఈ కార్యాలయం నుంచే జరుగుతుంది. దీనిని 1892లో కాటన్ నిర్మించారు. ఇప్పటివరకు 153 మంది ఈఈలు పనిచేశారు. పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఇక్కడే జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించేవారు.

శెట్టిపేట వద్ద జలవనరుల శాఖ కార్యాలయం

కార్యాలయ ఆవరణలో పెరిగిన పుట్ట

బిక్కుబిక్కుమంటూ విధులు

ప్రస్తుతం చుట్టూ పిచ్చి మొక్కలు, పుట్టలు పెరిగి ప్రమాదకరంగా మారడంతో కార్యాలయ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కోసారి కార్యాలయంలోకే విషసర్పాలు వచ్చేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఆవరణం చుట్టూ శుభ్రపరచాలని పలువురు కోరుతున్నారు.

ర్యాలీగా పశుగ్రాసం తరలింపు

పెదపూడి, న్యూస్‌టుడే: దోమాడ గ్రామానికి చెందిన అయ్యప్ప స్వామి మాలధారులు, రైతులు పశుగ్రాసాన్ని ద్విచక్రవాహనాలపై ర్యాలీగా రమణయ్యపేటలోని గోశాలకు ఆదివారం తీసుకెళ్లారు. గతంలో గడ్డిని ట్రాక్టరుపై తరలించేవారు. ఈ సారి రైతులే గాంధీస్మారకోన్నత పాఠశాలలో ఉన్న గడ్డిని మొత్తం కోసి ద్విచక్ర వాహనానికి కట్టుకుని 30 కిలోమీటర్లు తీసుకెళ్లారు.

మహారాజశ్రీ తణుకు సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P. 39/2025

పిటీషనర్: బుద్ధన నాగలక్ష్మి
రెస్పాండెంట్లు: 1.కొయ్య లక్ష్మి, W/O మల్లేశ్వరరావు, తణుకు
2.చింతపల్లి కోదండరామయ్య, పిల్లివారిపాలెం
3.సమ్మెట లక్ష్మి, W/o కృష్ణ పెరవలి
4.అఫీషియల్ రిసీవర్, WEST GODAVARI DIST, ఏలూరు.

పై నెంబర్‌లో 1వ రెస్పాండెంటు తూ.గో. జిల్లా, సజ్జాపురం SRO, పెరవలి గ్రామం తాలూకు RS No 332/1, D.No. 2-120/1, ASSESMENT No. 1412 గల చ॥గ॥ 57 స్థలం అందలి డాబా ఇల్లు 2, 3 రెస్పాండెంట్లు పేర ది.23-06-2025న వ్రాయించి ఇచ్చిన క్రియ దస్తావేజు రద్దు పరచుటకును, 1వ రెస్పాండెంటును INSOLVENTగా EDJUDICATE చేయుటకును, వగైరా పరిహారములు కోరుతూ పిటీషనర్ పై నెంబర్ IP దాఖలు చేసియున్నారు. ఎవరికయినా ఏ విధమయిన అభ్యంతరములు వున్నను ది.24-11-2025 ఉదయం 10.30 గంటలకు పై కోర్టువారి ఎదుట హాజరు అయి విన్నవించుకోవలసినదిగా తెలియపరచడమయినది.

R.JANARDHANA RAO, M.Com, B.L
TANUKU, ADVOCATE & Notary
09-11-2025 Tanuku, Cell:99850 17218

(c) eenadu

ఈనాడు కర్ణాటక
సోమవారం నవంబరు 10, 2025

రికార్డు సాధన

బీదర్‌లోని గురునానక్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు అరుదైన ఘనతను సాధించారు. ఆదివారం పాఠశాల ఆవరణలో ఒకే వేదికపై వేలాది మంది విద్యార్థులు ఒకేసారి పజిల్ క్యూబ్స్‌ను విజయవంతంగా పూర్తి చేసి రికార్డు సృష్టించారు. ఇందుకుగాను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నిర్వాహకులు ప్రమాణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రమాణ పత్రాన్ని చూపుతున్న నిర్వాహకులను చిత్రంలో చూడవచ్చు.
- బెంగళూరు, న్యూస్‌టుడే

అప్రమత్తమైన అధికారులు

మంగళూరు, న్యూస్‌టుడే: కేరళలో ఆఫ్రికన్ స్వైన్ ఫ్లూ (పంది జ్వరం) కేసులు తీవ్రం కావడంతో దక్షిణ కన్నడ జిల్లా సరిహద్దుల్లో ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సరిహద్దులకు ఆవల కోడంబేరిలో విపిన్ వర్గీస్ అనే వ్యక్తికి చెందిన పందుల ఫారంలో 37 పందులు మరణించాయి. వైద్య పరీక్షల నివేదికలో వాటి మరణానికి ఆఫ్రికన్ స్వైన్ ఫ్లూ కారణమని గుర్తించారు. ఆ ఫారం నుంచి పంది మాంసం దక్షిణ కన్నడ, కొడగు జిల్లాల్లోని పలు హోటళ్లకు సరఫరా అవుతోంది. అక్కడి నుంచి పంది మాంసం ఇక్కడికి రాకుండా కొన్ని రోజులు నిర్బంధం విధించామని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

అబద్ధమే భాజపా ఇంటి దేవుడు

అధికారం దక్కకనే విమర్శలు

కుండలో చిరుధాన్యాలు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

హొసపేటె, న్యూస్‌టుడే: అధికారం దక్కక అసహనానికి గురవుతున్న భాజపా నాయకులు చెబుతున్నవన్నీ అసత్యాలేనని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. అబద్ధం వారి ఇంటిదేవుడని ఎద్దేవా చేశారు. విజయనగర జిల్లా కూడ్లిగిలో ఆదివారం ఏర్పాటు చేసిన చెరువులు నింపే పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ నుంచి మొదలుకొని, రాష్ట్ర నాయకులు వరకు ఆ పార్టీ నాయకులు రోజూ అసత్యాలు పలుకుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్ర సాయం అరకొరే అయినా రాష్ట్రం అభివృద్ధి దిశలో దూసుకుపోతుండడంతోనే తమపై భాజపా లేనిపోని ఆరోపణలు చేస్తోందని విరుచుకుపడ్డారు. అధికారం చేపట్టే ముందు రాష్ట్ర ప్రజలకు సుమారు 513 హామీలను ఇచ్చాం, రెండున్నరేళ్లలో 240 పూర్తిచేశామని చెప్పారు. ఇప్పటి వరకూ గ్యారంటీలకు రూ.లక్ష కోట్లు కేటాయించామని వివరించారు.

సీఎం.. డిప్యూటీ.. ఎడమొహం

- ముఖ్యమంత్రి సిద్ధు మధ్యాహ్నం రెండు గంటలకు వేదిక పైకి చేరుకున్నారు.
- తర్వాత వచ్చిన ఉప ముఖ్యమంత్రి డీకే..సీఎం పక్కనే కూర్చున్నారు.
- ఇద్దరూ కార్యక్రమం అయ్యే వరకు పక్కపక్కనే కూర్చున్నా పలకరించుకోలేదు. కనీసం ఒకరి మొహం ఒకరు చూసుకోలేదు.

కూడ్లిగి పంట పండింది..

కరవు నేల కూడ్లిగి ఇకమీదట సస్యశ్యామలంగా మారనుందని సీఎం ధీమా వెలిబుచ్చారు. తాలూకాలోని 74 చెరువులను నింపే పథకం నేటి నుంచి ప్రారంభమైంది. దీంతో 1.70 లక్షల మంది లబ్ధి పొందుతారు. పాడిపశువుల దాహార్తి తీరుతుంది. భూగర్భ జలాలు కూడా మెరుగుపడతాయని వివరించారు. రెండున్నరేళ్లలో కూడ్లిగి నియోజకవర్గ అభివృద్ధికి రూ.1200కోట్లు విడుదల చేశామన్నారు. ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశామన్నారు. తుంగభద్రకు కొత్త గేట్ల బిగింపు పనులు ఈనెల్లోనే ప్రారంభం కానున్నట్లు చెప్పారు.. దీనికోసం రైతులు రెండోపంటను వదులుకుని కొంత త్యాగం చేయాలని కోరారు.

మహిళా లబ్ధిదారుకు ధ్రువపత్రం అందిస్తున్న సీఎం

కార్యక్రమానికి హాజరైన ప్రజలు

నాలుక కరుచుకున్న సిద్ధు

ముఖ్యమంత్రి తన ప్రసంగంలో రాబోయే రెండున్నరేళ్లూ తానే సీఎం అనేసి.. వెంటనే సర్దుకుని రెండున్నరేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు వేదికపైకి వచ్చిన హొసపేటె ఎమ్మెల్యే గవియప్ప తర్వాత కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. మంత్రులు సతీశ్ జార్కిహొళి, సంతోష్‌లాడ్, జమీర్ అహ్మద్‌ఖాన్, ఎంపీ తుకారామ్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌లు మాట్లాడారు. ప్రభుత్వ గ్యారంటీలపై ఏర్పాటు చేసిన వస్తుప్రదర్శన ఆకట్టుకుంది. మంత్రులు బోసరాజు, డాక్టర్ సుధాకర్, ఎమ్మెల్యేలు ఎన్.వై.గోపాలకృష్ణ, లతా మల్లికార్జున, బి.ఎం.నాగరాజ్, రఘుమూర్తి, బళ్లారి జిల్లా పరిషత్ కటియార్, విజయనగర డీసీ కవితా మన్నికేరి తదితరులు పాల్గొన్నారు.

ఏమార్చుతారా..!

చేరువ అవుతున్న గడువు తేదీ

సిద్ధు,శివుడి దారెటు?

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: నవంబరు 20 అనంతరం రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు వస్తాయని అధికార పార్టీ నేతలే ఎక్కువ మంది విశ్వసిస్తున్నారు. హస్తినకు తన వర్గానికి చెందిన నేతలను పంపించడం ద్వారా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రయత్నాలు కొనసాగించారు. నవంబరు 15 అనంతరం సతీశ్ జార్కిహొళి, మహదేవప్ప, రాజణ్ణ తదితరులను పంపించి, సిద్ధును కొనసాగించవలసిన అవసరాన్ని గుర్తు చేయాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ముఖ్యమంత్రి పీఠాన్ని మరొకరికి అప్పగించకూడదని కోరే అవకాశం ఉంది. మార్పులు చేర్పులు, ముఖ్యమంత్రి మార్పునకు సంబంధించి ఎవరూ వ్యాఖ్యలు చేయవద్దని అధిష్ఠానం ఆదేశించడంతో ఈ నెల మూడో వారం వరకు మంత్రులు, ఎమ్మెల్యేలు నోటికి తాళం వేసుకున్నా, తమ వర్గం నాయకులు, అనుచరుల వద్ద తమకు మంత్రి పదవి దొరుకుతుందని, లేదా మండలి కార్పొరేషన్ బాధ్యతలు లభిస్తాయని చెప్పుకుంటున్నారు.

ఒప్పందం ప్రకారమే మార్పా?

ముందుగా ఇచ్చిన హామీకి అనుగుణంగా పార్టీ తనకు ఏ క్షణంలో అయినా ముఖ్యమంత్రిగా అవకాశం కల్పిస్తారని డీకే శివకుమార్ భావిస్తున్నారు. తొలివిడత కార్యాలో ముఖ్యమంత్రికి మద్దతుగా ఉన్న నాయకులకే మంత్రివర్గంలో చోటు దక్కింది. ఈసారి కార్యాలో తనకు మద్దతుగా ఉండే నాయకులకు అగ్రాసనం వేసే దిశలో ఉపముఖ్యమంత్రి పావులు కదుపుతున్నారు. బిహార్ ఫలితాలు వచ్చిన వెంటనే రాహుల్ విదేశాలకు వెళ్లనని ప్రకటించారు. రాహుల్ లేకుండా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు లేకపోవడంతో అంతకు మునుపే జాబితాను పార్టీ అధిష్ఠానానికి పంపించాలని డీకే భావిస్తున్నారు. మహాత్ముడి స్మరించుకుంటూ రాష్ట్రంలో 100 చోట్ల గాంధీభవనాలు నిర్మించాలని కోరుకుంటే, ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు భూములను సమకూర్చడంలో విఫలమయ్యారని శివుడు ఆరోపించారు. భూమి అందించలేని నాయకులకు మంత్రి పదవులు ఎలా ఇవ్వాలని ప్రశ్నించినట్లు సమాచారం.

మంటగలిసిన మానవత్వం

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: మైక్రోలేఅవుట్ ఠాణా పరిధిలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బోల్తా పడిన గూడ్సు వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులను కొందరు వాహనదారులు బయటకు తీసుకువచ్చి సపర్యలు చేశారు. వారిలో ఒక యువకుని పరిస్థితి విషమంగా మారడంతో అతనితో ఉన్న వ్యక్తి తన స్నేహితుడ్ని పాదచారి మార్గం వరకు లాక్కొని వెళ్లి, అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అతను పరారీ కావడంతో వాహనదారులు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు. పోలీసులకు సమాచారం అంది, అక్కడికి వచ్చేలోగా ఆ యువకుడు మరణించాడు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలో ఈ ఘటన రికార్డయింది. సుమారు అరగంటకు పైగా ఆ వ్యక్తి ప్రాణాలతో పోరాటం చేసి చేతులు ఎత్తేశాడు. వాహనంలో వచ్చిన వ్యక్తిగాని, సాయం చేసిన వాహనదారులైనా పోలీసులు, అంబులెన్సును ఫోన్ చేసి ఉంటే, అతని ప్రాణాలు దక్కేవని మైకోలేఅవుట్ ఠాణా పోలీసులు తెలిపారు.

సహ్యాద్రి సిందూర.. దిగుబడి భళిరా!

● హెక్టారుకు 55 క్వింటాళ్ల ఉత్పత్తి ● మధుమేహులకు ఎక్కువ ప్రయోజనం

పాలు పోసుకున్న వడ్ల గింజలు

శివమొగ్గ, న్యూస్‌టుడే: సహ్యాద్రి పర్వత సానువుల్లోని శివప్ప నాయక వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయంలో 'సహ్యాద్రి సిందూర' రకం వంగడాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. సన్నగా, తేలికపాటి ఎరుపు వర్ణంలో ఉండే ఈ బియ్యంతో వండే అన్నం మధుమేహ సమస్యలు ఎదుర్కొనే వారికి ప్రయోజనకారి. హెక్టారుకు 55 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది. విశ్వవిద్యాలయంలో అభివృద్ధి చేసిన పలు వరి వంగడాలను రైతులకు ఇస్తూ వస్తోంది. ప్రయోగాత్మకంగా సహ్యాద్రి సిందూరను ఎక్కువ మంది రైతులకు చేర్చే లక్ష్యంతో ఎక్కువ వంగడాలను సిద్ధం చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి తెలిపారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎర్రరంగు బియ్యంతో పోల్చితే ఇందులో ఎక్కువ పోషకాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. మధుమేహులకు ఈ బియ్యం మరింత ప్రయోజనకారి అని గుర్తించారు. ఈ రకం బియ్యానికి మేధోహక్కులు పొందేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. సాధారణంగా ఎరుపు రంగులో ఉండే బియ్యం లావుగా ఉంటుంది. సహ్యాద్రి సిందూర ఎర్రగా ఉన్నప్పటికీ సోనా మసూరి తరహాలో సన్నగా ఉంటుంది. ఐదేళ్లలో విడుదల చేసిన జ్యోతి, బిళియ రకం వంగడాల జన్యువులు ఉపయోగించి, పలు ప్రయోగాల అనంతరం దీన్ని రూపొందించామని విశ్వవిద్యాలయంలో వరి పరిశోధన విభాగం డైరెక్టర్ డాక్టర్ దుశ్యంత్ కుమార్ తెలిపారు. ప్రతికూల పరిస్థితులు లేకపోతే 120 రోజుల్లోనే 55 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వివరించారు. ప్రొటీన్, ఐరన్, జింక్, విటమిన్లు, యాంటీ ఆక్సైడ్లు ఎక్కువగా ఉంటాయి. ప్రారంభం నుంచి ఈ రకం వరిసాగును సీతారాం అనే రైతు పొలంలో సేంద్రియ విధానంలో సాగు చేస్తూ వస్తున్నారు. చీడ పీడలను తట్టుకోవడంతో పాటు, వర్షాకాలంలో ఎక్కువ నీరు పొలంలో నిలిచినా, మొక్కలు దాన్ని తట్టుకుని దిగుబడి వస్తుందని వివరించారు.

సహ్యాద్రి సిందూర బియ్యం

ధాన్యం రాసిలో ఉంచిన సహ్యాద్రి సిందూర రకం బియ్యం

నరభక్షక పులి చిక్కింది

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: చామరాజనగర జిల్లా సరగూరు తాలూకాల్లోని వివిధ గ్రామాల్లో దాడులకు పాల్పడుతూ ప్రజలు, పశువులను చంపిన మగ పులినిసిబ్బంది బంధించారని అటవీ శాఖామంత్రి ఈశ్వర్ బి.ఖండ్రె తెలిపారు. ఆదివారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నెలరోజుల్లో ముగ్గురిని ఆ పులి పొట్టనబెట్టుకున్నట్లు గుర్తు చేశారు. పులి దాడిలో చనిపోయిన వ్యక్తుల మృతదేహాలకు వైద్య పరీక్షలు నిర్వహించామని, బంధించిన పులి డీఎన్‌ఏనూ పరీక్షించినట్లు తెలిపారు. బండీపుర, నాగరహొళె అటవీ సరిహద్దుల్లోని గ్రామాల్లోకి పులులు సంచరిస్తున్నాయని, ప్రజలు పశువులపై దాడులకు పాల్పడుతున్న సంఘటనలు ఎక్కువ అవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా సఫారీ నిలుపుదల చేశామని గుర్తు చేశారు. నరభక్షక పులులను గుర్తించి బంధించే కార్యక్రమంలో అటవీ సిబ్బంది నిమగ్నమైనట్లు తెలిపారు.

కాలువలోకి కారు దూసుకెళ్లి ఇద్దరి మృతి

దావణగెరె, న్యూస్‌టుడే: చెన్నగిరి తాలూకా హోసూరు గ్రామంలో భద్రా కాలువలోకి కారు దూసుకువెళ్లడంతో ఇద్దరు మరణించారు. మరో నలుగురు ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. మల్లికార్జున (29), సిద్ధేశ్ (38)లను మృతులుగా గుర్తించారు. దావణగెరెకు చెందిన ఆరుగురు మంగళూరు వైపు పర్యటనకు వెళుతున్న సమయంలో కారు అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోవడంతో ప్రమాదం సంభవించింది. సంతెబెన్నూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు..

రామనగర న్యూస్‌టుడే: మాగడి తాలూకా రస్తెపాళ్య గ్రామం వద్ద ఆదివారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో కేశవ్ (19), మయూర్ (19) అనే యువకులు మరణించారు. వీరిద్దరూ వెళుతున్న ద్విచక్ర వాహనం రహదారి విభాజకాన్ని ఢీకొట్టింది. కిందపడినప్పుడు తలకు తీవ్ర గాయాలు కావడంతో బాధితులను చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. కుదూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. 2020లో బెంగళూరు, చుట్టుపక్కల ప్రాంతాలలో 1,928 రోడ్డు ప్రమాదాల్లో 344 మంది మరణించారు. గత ఏడాది 3,969 ప్రమాదాల్లో 723 మంది కన్నుమూశారు. రోడ్డు ప్రమాదాలలో మృతులు, గాయపడుతున్న వారి సంఖ్య ఇతర రాష్ట్రాలతో పోల్చితే కర్ణాటక ప్రస్తుతం ఐదవ స్థానంలో ఉందని అధికారులు వెల్లడించారు.

కాషాయ పీఠంపై సోమణ్ణ గురి

సోమణ్ణ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: భాజపా అధ్యక్షుడి స్థానాన్ని దక్కించుకునేందుకు సీనియరు నాయకుడు వి.సోమణ్ణ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మరో కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె, ఎమ్మెల్సీ సీటీ రవి కూడా పార్టీ పగ్గాలను అందుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. లింగాయత సముదాయానికి చెందిన బీవై విజయేంద్రను తప్పిస్తే పార్టీలో చీలికలు రాకుండా అదే సామాజిక వర్గానికి చెందిన సోమణ్ణకు పార్టీ బాధ్యతలు అప్పగించేందుకు కమలనాథులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే లింగాయత సముదాయానికి చెందిన మఠాధిపతులతో సోమణ్ణ భేటీ అవుతూ వస్తున్నారు. తాను ఖాళీ చేస్తున్న మంత్రి పదవిని బీవై రాఘవేంద్రకు కేటాయించే అవకాశం ఉందని తన ఆప్త వర్గాల వద్ద ఆయన వ్యాఖ్యలు చేశారు. భాజపా అధ్యక్షుడి స్థానానికి మరో లింగాయత సముదాయం నాయకుడు బసవరాజ బొమ్మై కూడా ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల సమయానికి వారిద్దరూ యడియూరప్పకు చేరువగా ఉన్నప్పటికీ, తమ ఆలోచనలు మాత్రం ఆయన నిర్ణయానికి దూరంగా ఉన్నాయి. విజయేంద్రను కొనసాగిస్తే పార్టీకి భవిష్యత్తు ఉండదని బహిరంగ వ్యాఖ్యలు చేసిన యత్నాళ్, సోమశేఖర్, శివరాం హెబ్బార్‌లను కమలనాథులు ఇప్పటికే దూరం పెట్టారు. సోమణ్ణకు బాధ్యతలు అప్పగిస్తే యత్నాళ్‌తో పాటు ఆయనకు మద్దతుగా నిలిచిన పలువురు నాయకులు మళ్లీ పార్టీలోకి వచ్చే అవకాశం ఉంటుంది. విపక్ష నాయకుని స్థానాన్ని ఒక్కలిగ నాయకుడు అశోక్‌కు ఇవ్వడం, విధాన పరిషత్తులో విపక్ష నాయకుని స్థానాన్ని దళిత సామాజిక వర్గానికి చెందిన నారాయణస్వామికి కేటాయించారు. అధ్యక్షుని స్థానంలో లింగాయత నేతనే కొనసాగించాలని పార్టీ భావిస్తోంది. రాష్ట్ర అధ్యక్షునిగా ఎవరు ఉంటారనే అంశమే 2028లో అసెంబ్లీ ఎన్నికల్లో కీలకపాత్ర కానుంది. అధ్యక్షునిగా ఉంటూ, పార్టీని విజయపథంపై నడిపిస్తే ముఖ్యమంత్రిగా అవకాశం దక్కించుకోవచ్చన్నది సోమణ్ణ ఆలోచన. యడియూరప్ప, ఆయన కుటుంబంపై ప్రత్యక్షంగా విమర్శలు చేసిన వారిలో సోమణ్ణ కూడా ఉన్నారు. బిహారు ఎన్నికల అనంతరం పార్టీ అధ్యక్షుని మార్పు ఉంటుందని పార్టీ వర్గాలు ధీమాతో ఉన్నాయి.

రామానుజ తపోభూమి అభివృద్ధికి సహకారం

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

మండ్య, న్యూస్‌టుడే: రామానుజాచార్యుని తపోభూమి మేలుకోటె అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తానని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. చెలువనారాయణ స్వామి దివ్యక్షేత్రం మేలుకోటెను సమగ్రంగా అభివృద్ధి చేయాలని పారుపత్తేగార్ శ్రీనివాస నరసింహన్ గురూజీ మనవిని ఆలకించి ఆయన స్పందించారు. ఆదివారం మేలుకోటెకు వచ్చిన ఉప రాష్ట్రపతికి మంత్రి చెలువనారాయణ స్వామి, జిల్లాధికారి డాక్టర్ కుమార్ ఆహ్వానం పలికారు. ఆలయం ఆవరణలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం తలకు పాగా కట్టి రాజాశీర్వాదం చేశారు. గవర్నర్‌గా తాను గతంలో మేలుకోటెకు వచ్చినప్పుడు తులసి మొక్కను నాటిన చోట ఇప్పుడు తులసితోట అభివృద్ధి చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. తిరుమల, శ్రీరంగం, కంచి, మేలుకోటె తనకు ఇష్టమైన ఆధ్యాత్మిక క్షేత్రాలని గుర్తు చేశారు. ఆలయంలో 45 నిమిషాలు ఉన్న రాధాకృష్ణన్, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో శ్రావణబెళగొళకు వెళ్లారు. గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్, మాజీ మంత్రి సీఎస్ పుట్టరాజు, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఉపరాష్ట్రపతితో కలిసి ఆలయంలో దర్శించుకున్నారు. అనంతరం మైసూరులో జేఎస్ఎస్ ఏహెర్ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 8 నుంచి 12 వరకు భక్తులకు దర్శనాలను నిలిపివేశారు. భక్తులు ఇచ్చిన సహకారానికి ఎస్పీ మల్లికార్జున బాలదండి కృతజ్ఞతలు తెలిపారు.

శాంతికి సంకేతం:

హాసన, న్యూస్‌టుడే: 'కర్ణాటక పవిత్ర భూమి. శాంతి, త్యాగాలకు సంకేతం. సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసే ప్రజలు ఇక్కడ ఉన్నారు' అని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ పేర్కొన్నారు. శ్రావణ బెళగొళలో జైన సన్యాసి ప్రథమాచార్య శాంతిసాగర మునిమహారాజ స్మరణార్థం ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కన్నడిగులు తాము వెళ్లిన ప్రతి చోటా తమ సంస్కృతి, సంప్రదాయాలను స్థానికులకు పరిచయం చేస్తుంటారని పేర్కొన్నారు. జైన ధర్మానికి సంబంధించిన సత్యం, శాశ్వత వెలుగులను శ్రావణ బెళగొళ ప్రసరిస్తోందని కొనియాడారు.

ఆలయ ఆవరణలో సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ గహ్లోత్, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య తదితరులు

మైసూరు జేఎస్ఎస్ ఏహెర్ స్నాతకోత్సవంలో విద్యార్థినికి పతకాన్ని ప్రదానం చేస్తున్న ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ గహ్లోత్, శివరాత్రి దేశికేంద్ర స్వామీజీ

ఉద్యాన నగరి.. ఉక్కిరి బిక్కిరి

● సంచార రద్దీలో దేశంలో మొదటి స్థానం ● పారిశ్రామికవేత్తల ఆందోళన

రద్దీకి విసిగిపోయి ద్విచక్ర వాహనాన్ని నిలిపి రోడ్డుపై కూర్చొని చరవాణి తిలకించడంలో నిమగ్నం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: వాహన సంచార రద్దీలో దేశంలో బెంగళూరు మొదటి స్థానంలో ఉండగా, అంతర్జాతీయ స్థాయిలో ఆరో స్థానంలో ఉంది. నగర సంచార రద్దీ సమస్య మరింత జటిలమవుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఐటీ బీటీ కారిడార్ ప్రాంతాల్లో వాహన సంచారం గంటల తరబడి స్తంభించడంపై అవుటర్ రింగ్ రోడ్డు కంపెనీల పారిశ్రామిక వేత్తల సంస్థ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే కంపెనీలు మూసివేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. సంచార రద్దీ నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని ఆ సంస్థ సూచించింది. చిన్నవానకు రహదారుల్లో సంచార రద్దీ విపరీతంగా పెరుగుతోంది. దానికి తోడుగా పాడైన రహదారులు వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

రద్దీలో ప్రపంచ పోటీ

కేంద్ర వాణిజ్య ప్రదేశాలు (సీబీడీ) ఇతర ప్రాంతాల్లో అతిసంచార రద్దీ కలిగిన దేశంలోని నగరాల్లో బెంగళూరు మొదటి స్థానంలో ఉండగా పుణె రెండో స్థానం, న్యూదిల్లీ, ముంబయి మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచంలోని అతి వాహన సంచార రద్దీ నగరాల్లో బెంగళూరు ఆరో స్థానంలో ఉన్నట్లు టామ్‌టామ్ సంస్థ నివేదికలో వెల్లడించింది. లండన్, డబ్లిన్ మొదటి, రెండో స్థానాల్లో ఉన్నాయి. 2022లో ప్రపంచ నగరాల్లో సంచార రద్దీ నగరాల్లో బెంగళూరు రెండో స్థానంలో ఉండేది. సంచార రద్దీ సంచారం కాలపరిమితి నిమిషం తక్కువ కావడంతో ఆరోస్థానంలోకి వచ్చింది.

నగరంలో ఏ రహదారి చూసినా సంచార రద్దీ

గంటల తరబడి.. చిక్కుల్లో పడి

2022లో బెంగళూరు నగరంలో గంటకు 14 కిలోమీటర్ల సంచరించే అవకాశం ఉండగా 2024 అది కాస్త 18 కిలోమీటర్లకు 2025లో 24కిలోమీటర్లకు పెరిగింది. నగరంలో వారం ఆఖరి రోజులో ఉదయం పది కిలోమీటర్ల దూరం సంచరించేందుకు 46 నిమిషాలు, సాయంత్రం 54 నిమిషాల సమయం తీసుకుంటుందని సంస్థ నిపుణుల అధ్యయనంలో వెల్లడైంది. సాధారణ రోజుల్లో పది కిలోమీటర్లకు 24 నిమిషాల సమయం కావాలి. ప్రస్తుతం నగరంలో 1.38 కోట్ల వాహనాలు ఉన్నాయి. సంచార రద్దీ నియంత్రణకు పాలికె, బీడీఏ, నగర పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా సమస్య అదుపులోకి రావడం లేదు. సమస్య పరిష్కారం కోసం సొరంగ మార్గాల నిర్మాణం, సబర్బన్ రైలు మార్గం, మెట్రో మార్గం విస్తరణ తదితర కార్యక్రమాలను చేపడుతున్నారు.

క్రిప్టో పేరిట వంచన

హుబ్బళ్లి, న్యూస్‌టుడే: క్రిప్టో కరెన్సీపై మదుపు చేస్తే చక్కని లాభాలు వస్తాయని వాట్సప్‌లో వచ్చిన సందేశాన్ని నమ్మి జీఎం అబ్రహం అనే వ్యక్తి రూ.1.30 కోట్లు పోగొట్టుకున్నాడు. ఫేస్‌బుక్‌లో పరిచయమైన దియాఖాన్ అనే వ్యక్తి పంపించిన సందేశాన్ని నమ్మి దశల వారీగా నగదు మదుపు చేశాడు. ఇటీవల కొంత కాలం నుంచి దియాఖాన్ నుంచి ఫోన్లు రాకపోవడం, తాను ఫోన్ చేస్తే స్పందన రాకపోవడంతో తాను మోసపోయానని గుర్తించి దావణగెరె సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

రూ.21 కోట్ల ఆస్తి జప్తు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: కార్వార కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్ సైల్‌కు చెందిన రూ.21 కోట్ల విలువైన స్థిరాస్తులను తాత్కాలికంగా జప్తు చేశామని ఈడీ అధికారులు ప్రకటించారు. సైల్‌కు ఇచ్చిన బెయిలును చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం ఇప్పటికే రద్దు చేసింది. కర్ణాటక, గోవా, దిల్లీ, ముంబయిల్లోని 15 చోట్ల ఈడీ అధికారులు సోదాలు కొనసాగించారు. బెయిలు రద్దు కావడంతో ఈడీ అధికారుల ఎమ్మెల్యేను ఏ సమయంలో అయినా అరెస్టు చేసే అవకాశం ఉంది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

ఘన చరితం.. మన పర్యాటకం

సందర్శనకు విదేశీయుల ఆసక్తి

కె.ఆర్.ఆనకట్ట అందాలు

అరేబియా సముద్రతీరంలో వెలసిన సోమేశ్వర దేవస్థానం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: దేశంలో తిలకించాల్సిన పర్యాటక ప్రదేశాల్లో కర్ణాటకలో ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా మైసూరు, ఉడుపి, విజయనగర, కొప్పళ, బీదర్ జిల్లాల్లో ఉన్న పర్యాటక ప్రదేశాలు విదేశీయులను ఆకట్టుకుంటున్నట్లు పర్యాటక శాఖ అధికారులు చెబుతున్నారు. ఆయా పర్యాటక ప్రదేశాలను తిలకించేందుకు విదేశీయులు పోటీపడుతున్నారని తెలియజేశారు. మిగతా ప్రాంతాల్లో విదేశీ, స్వదేశీ పర్యాటకుల సంఖ్య కరోనా తరువాత తక్కువైనట్లు గుర్తించారు. 'ఒక రాష్ట్రం.. అనేక ప్రదేశాలు' అనే నినాదానికి తగ్గినట్లుగా కర్ణాటక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. ప్రాచీనమైన దేవాలయాలు, గిరిధామాలు, సముద్రతీరం, మహారాజులు కోటలు, నదులు, జలపాతాలు విదేశీ పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకున్నట్లు తెలిపారు. మైసూరు ప్యాలెస్, కె.ఆర్. ఆనకట్ట బృందావన్‌గార్డెన్, ఉడుపిలో ఉన్న శ్రీకృష్ణుడి కోవెల, అన్నపూర్ణేశ్వరి ఆలయం, అరేబియా సముద్రతీరం, లైట్‌హౌస్ ప్రదేశం, విజయనగరలో ఉన్న హంపీ, ఐహోళె దుర్గాంబా ఆలయం, బాదామి జైన్ ఆలయం, హళేబీడు చెన్నకేశవ ప్రాచీనాలయం, వైష్ణవ గుహలు, యునెస్కో జాబితాలో చేరిన గోల్ గుంబజ్, ఇబ్రహీం కోట, రౌజా, లక్కుండి ఆలయం, బళ్లారి కోట, బెంగళూరు టిప్పు సుల్తాన్ ప్యాలెస్, చిత్రదుర్గ కోట, దరియా దౌలత్, బీదర్ సుల్తాన్‌లు కోటలు తదితర ప్రదేశాలు విదేశీయులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. 2023లో 4.09 లక్షల మంది, 2024లో 4.85 లక్షల మంది విదేశీయులు వచ్చినట్లు పర్యాటక శాఖ వెల్లడించింది. విదేశీయులు ఆకట్టుకునే ప్రధాన పర్యాటక ప్రదేశం మైసూరును 1.37 లక్షల మంది, ఉడుపి 89 వేల మంది, కొప్పళ జిల్లాలో ప్రదేశాలను 50 వేల మంది, బెంగళూరు నగరంలోని పర్యాటక ప్రాంతాలను ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు 45,782 మంది విదేశీయులు సందర్శించారని అధికారులు వివరించారు. ఉత్తర కర్ణాటకలోని ప్రదేశాలు విదేశీయులను ఆకట్టుకుంటున్నాయని వాటిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం గుర్తించింది. దేశీయ పర్యాటకుల సంఖ్య 28.41 లక్షల నుంచి 30.46 లక్షలకు పెరిగారు. అమెరికా పర్యాటకులు మొదటిస్థానంలో ఉండగా రెండో స్థానంలో బంగ్లాదేశ్, మూడోస్థానంలో బ్రిటన్, ఆస్ట్రేలియా, మలేసియా, జర్మనీ, ఫ్రాన్స్, సింగపూర్ పర్యాటకులు ఉన్నారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పర్యాటక విధానాన్ని అమల్లోకి తేవడంతో పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నారు.

విదేశీయులను ఆకట్టుకుంటున్న మైసూరు ప్యాలెస్

హాళేబీడు ప్రాచీన చెన్నకేశవ ఆలయం

అద్భుతమైన అరేబియా సముద్రతీర దృశ్యం

నీట మునిగి బాలురు విషాదాంతం

బెంగళూరు (గ్రామీణం): అత్తిబెలె సమీపంలోని బళ్లూరు గ్రామం వద్ద చెరువులో ఆడుకునేందుకు దిగిన అనికేత్ కుమార్ (12), రెహమత్ బాబా (11) నీట మునిగి మరణించారు. అనికేత్ బిహారుకు, రెహమత్ బాబా ఆంధ్రప్రదేశ్‌లోని కదిరికి చెందిన వాడు. వారి తల్లిదండ్రులు వలస కార్మికులని గుర్తించారు. శనివారం సాయంత్రం ఆడుకుంటూ బయటకు వచ్చిన వారిద్దరూ మళ్లీ ఇంటికి తిరిగి వెళ్లలేదు. నీటిలో తేలుతున్న మృతదేహాలను ఆదివారం ఉదయం గుర్తించి వెలికి తీశారు. అత్తిబెలె ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గొలుసు కోసం వృద్ధురాలి హత్య

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే: గొలుసు కోసం భద్రమ్మ (70) అనే వృద్ధురాలిని దీప (38) అనే మహిళ హత్య చేసింది. మృతదేహాన్ని రెండు రోజులపాటు తన ఇంట్లోనే ఉంచుకుని, అనంతరం నిర్జన ప్రదేశంలో పడేసింది. సర్జాపుర ఠాణా పోలీసుల కథనం మేరకు. . భద్రమ్మకు, దీపకు మొదటి నుంచి పరిచయం ఉంది. నీకు అరిసెలు ఇస్తానంటూ అక్టోబరు 30న తన ఇంటికి తీసుకువెళ్లింది. ఆమెకు ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసింది. ఒంటిపై ఉన్న గొలుసును తీసుకుని, రెండు రోజులు ఇంట్లోనే మృతదేహాన్ని ఉంచుకుంది. మృతదేహం దుర్వాసన వస్తోందని గుర్తించి, గోనెసంచిలో మూటగట్టింది. చెత్తను పారేసి వద్దామని తన కుమారుడ్ని తీసుకుని ద్విచక్ర వాహనంపై దొడ్డ తిమ్మసంద్రకు వచ్చి అక్కడి చెరువులోకి మూటను విసిరి వేసింది. భద్రమ్మ కనిపించడం లేదని అక్టోబరు 31న ఆమె కుటుంబ సభ్యులు సర్జాపుర ఠాణాలో ఫిర్యాదు చేశారు. కరపత్రాలు ముద్రించి చుట్టుపక్కల పంచారు. చివరి సారిగా ఆమె దీప ఇంటికి వెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఆమెను అదుపునకు తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో తాను చేసిన హత్యను అంగీకరించింది. చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీసి, మరణోత్తర పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాలుడిపై తోటి విద్యార్థుల దాడి

మైసూరు, న్యూస్‌టుడే: జయలక్ష్మిపురంలోని ప్రతిష్ఠిత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలుని (13)పై సహాధ్యాయులు దాడి చేశారు. క్లాస్ లీడరుగా ఉన్న బాలుడిపై ఆతాయి విద్యార్థులు దాడి చేసి మర్మాంగాలపై కొట్టడంతో అతని పరిస్థితి విషమించింది. బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. దాడి చేసి పరారైన బాలుర కోసం జయలక్ష్మిపురం ఠాణా పోలీసులు గాలింపు చేపట్టారు.

విరిగిన భీముని దంతం

హాసన: కొద్ది రోజులుగా గ్రామాలపై దాడులకు పాల్పడి, తోటలను ధ్వంసం చేస్తున్న భీమ ఏనుగును పట్టుకునే కార్యాచరణను అటవీ శాఖ అధికారులు కొనసాగించారు. రెండు కుమ్కీ ఏనుగులతో జరిగిన గొడవలో భీమ ఏనుగు దంతం ఒకటి విరిగిపోయింది. రక్తం కారుతున్నా, ఆగకుండా అడవిలోకి పరుగెత్తింది. దాన్ని గుర్తించి పట్టుకునేందుకు కార్యాచరణ కొనసాగింది.

అనుమతి ఇవ్వని కేంద్రం

బెంగళూరు (మారతహళ్ళి), న్యూస్‌టుడే: ఉత్తర కన్నడ జిల్లాలో శరావతి నదిపై ఆనకట్ట కట్టి 2200 మెగావాట్ల పంప్ స్టోరేజ్ జల విద్యుత్తు పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే పర్యావరణానికి హాని కలుగుతోందని పర్యావరణవేత్తలు గత కొంత సమయంగా ఆందోళన చేస్తూ వస్తున్నారు. ప్రాజెక్టుకు కేటాయించిన భూమి అన్యుల పాలయ్యే అవకాశం ఉందని, పర్యావరణ, అటవీ నిబంధనలు గాలికి వదిలివేశారంటూ గత కొద్ది నెలలుగా పర్యావరణవేత్తలు చేస్తున్న ఆందోళనకు కేంద్రం ఇచ్చిన ఆదేశాలు ఊరట కలిగించాయి.

వేరుసెనగ జాతరకు సన్నాహాలు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : చారిత్రక బసవనగుడిలో ఏటా నిర్వహించే వేరుసెనగ జాతర ఈనెల 15 నుంచి 19 వరకు ఐదు రోజుల పాటు కొనసాగుతుందని మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ జాతర ఈసారి ఐదు రోజులపాటు జరుగుతుందన్నారు. కార్తిక మాసం చివరి సోమవారం బసవనగుడి వద్ద ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఘనంగా ప్రారంభించనున్నారు. జాతరకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. 21 బసవన్నలను (ఎడ్లను) తీసుకువచ్చి వాటికి ప్రత్యేక పూజలు చేసి జాతరకు శ్రీకారం చుట్టనున్నారు. బుల్ టెంపుల్ రోడ్డు, గాంధీబజార్, ఎన్‌ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో కళ్లు మిరుమిట్లు గొలిపే రీతిలో విద్యుద్దీపాలంకరణలు ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్నారు. ఐదు లక్షల మంది వరకు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

ప్లాస్టిక్ సంచుల నిషేధం..

ఈ జాతరలో ప్లాస్టిక్ సంచుల వాడకం పూర్తిగా నిషేధించారు. కాగితపు సంచులు, వస్త్ర సంచులను తెచ్చుకోవాలని వ్యాపారులు, వినియోగదారులకు సమాచారం ఇచ్చారు. స్వచ్ఛంద సంస్థల నేతృత్వంలో 'సంచులతో రండి' అంటూ ప్రచారం చేస్తున్నారు. గతంలో ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారుల నుంచి పన్నులు వసూలు చేసేవారు. ఈ ఏడాది ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు.

సంచులను ప్రదర్శిస్తున్న మంత్రి రామలింగారెడ్డి, తదితరులు

జాతరలో వేరుసెనగ వ్యాపారులు

ఇంట్లోకి చొరబడిన కొండచిలువ

బెంగళూరు (మారతహళ్ళి), న్యూస్‌టుడే: మారతహళ్ళిలోని ఒక ఇంట్లోకి రాక్ పైథాన్ (కొండచిలువ) వచ్చింది. మొదట్లో దాన్ని రక్త పింజరిగా భావించారు. సమాచారం అందుకుని అక్కడకు వచ్చిన దొడ్డ బొమ్మసంద్రకు చెందిన 'స్నేక్ కార్తిక్' అక్కడకు వచ్చి కలుగులో దాగిన కొండచిలువను బయటకు తీశారు. నగర మధ్య భాగంలో ఉన్న ఈ కొండ చిలువ ఇంటి ఆవరణ వరకు ప్రమాదం బారిన పడకుండా ఎలా వచ్చిందని స్థానికులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

పసికందును వదిలి వెళ్లారు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: వారం క్రితం జన్మించిన మగ బిడ్డను దొడ్డబళ్లాపుర సమీపంలోని తిరుమగొండనహళ్లిలో నిర్జన ప్రదేశంలో వదిలి వెళ్లారు. బిడ్డ ఏడుపును గుర్తించిన స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు అక్కడకు వచ్చి పరిశీలించగా, మగబిడ్డ కనిపించింది. బాబును చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అతని ఆరోగ్యం బాగుందని వైద్యులు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు త్వరలో బిడ్డను అప్పగిస్తామని దొడ్డబళ్లాపుర నగర ఠాణా పోలీసులు తెలిపారు.

వ్యవసాయంలో పరికరాలు కీలకం

లబ్ధిదారుడికి ట్రాక్టర్ తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

మాన్వి, న్యూస్‌టుడే : రైతులు వ్యవసాయం చేయటం కష్టసాధ్యంగా మారిందని, ఇందుకు అనేక కారణాలున్నప్పటికీ ప్రధానంగా కూలికార్మికుల కొరత ఏర్పడిందని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ వాపోయారు. ఎస్సీ అభివృద్ధి నిగమం స్వావలంబన సారథి యోజన కింద ఎమ్మెల్యే ట్రాక్టర్ మంజూరు చేయించారు. లబ్ధిదారుడు మల్లయ్యకు ట్రాక్టర్ తాళాలు అందించి మాట్లాడారు. రైతులు వ్యవసాయానికి యంత్రాలను అవలంబించాల్సిన అనివార్య పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వ్యవసాయ పరికరాలను సరిగా చేసుకోవాలని సూచించారు. చిలుకూరి రవికుమార్, సీహెచ్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏటా లోకాయుక్త ఆస్తి ప్రకటించాలి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: కర్ణాటక లోకాయుక్త, ఉప లోకాయుక్త, సిబ్బంది, ఏటా తన ఆస్తులను ప్రకటించే వ్యవస్థను జారీలోకి తీసుకురావలసిన అవసరం ఉందని ఎమ్మెల్సీ రమేశ్ బాబు పేర్కొన్నారు. దీనికి సంబంధించి చట్టంలో సవరణలు అవసరమని అన్నారు. ఇదే డిమాండ్‌తో తాను న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్‌కు లేఖ రాశానని చెప్పారు. లోకాయుక్త చట్టాలకు అనుగుణంగా చట్టసభ ప్రతినిధులు ప్రతి ఏటా తప్పనిసరిగా తమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను పంపించవలసి ఉంటుందని, అదే విధంగా లోకాయుక్త కూడా తమ ఆస్తులను ప్రకటించడం ద్వారా పారదర్శకతను మరింత కాపాడవచ్చని పేర్కొన్నారు.

కాల్పులు జరిపి అరెస్టు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: భూవ్యాపారి బాలప్పరెడ్డి, మాదేశ అనే వ్యక్తులను హత్య చేసి పరారీలో ఉన్న రవిప్రసాద్‌రెడ్డి అనే నిందితుడిపై హెబ్బగోడి ఠాణా పోలీసులు కాల్పులు జరిపారు. నిందితుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాడు. హత్య కేసులో అరెస్టు చేసి మహజరుకు బొమ్మసంద్ర శ్మశానవాటికకు తీసుకువచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌పై దాడి చేసి పరారయ్యేందుకు ప్రయత్నించిన నిందితుని కాళ్లపైకి ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్ కాల్పులు జరిపి పట్టుకున్నారు. ఎలక్ట్రానిక్ సిటీ విభాగం డీసీపీ నారాయణ్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కాళ్లలోకి రెండు తూటాలు వెళడంతో గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. నవంబరు ఆరున హెబ్బగోడికి చెందిన బాలరెడ్డిని అపహరించిన నిందితుడు తాను కోరినంత నగదు ఇవ్వలేదని గొంతు చీల్చి హత్య చేశాడు. ఈ నెల నాలుగో తేదీన మాదేశ్ అనే వ్యక్తిని కిత్తగానహళ్లిలోని ఇంట్లో హత్య చేశాడని నారాయణ్ తెలిపారు.

ఇంట్లోకి ప్రవేశించి దాడి

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే: యలహంక మునేశ్వర లేఅవుట్‌లోని శ్రీనివాస్, ప్రమీళా దంపతుల ఇంటిపై 50 మంది యువకులు దాడి చేసి విధ్వంసానికి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న సామగ్రిని పగలగొట్టి, దంపతులపై దాడి చేసి వెళ్లారు. వీరంతా స్థానిక పేయింగ్ గెస్టుకు చెందిన యువకులని గుర్తించారు. వీరి పొరుగింట్లో ఉంటున్న కేరళకు చెందిన మోహన్, రక్షిత్ అనే మలయాళీలు ఉండేవారు. వారింట్లో వేడుక జరుగుతున్న సమయంలో కేకలు వేస్తుండగా, ప్రమీల అక్కడకు వెళ్లి వారిని మందలించింది. మోహన్, రక్షిత్‌ను ఆమె మందలింపును హెచ్చరికగా భావించి, పీజీలో ఉంటున్న మలయాళీ యువకులకు చెప్పడంతో దాడి జరిగిందని గుర్తించారు. దంపతుల ఫిర్యాదుతో యలహంక ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి ఎఫ్ఎన్‌డబ్ల్యుఎఫ్-2025 సమావేశం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను గురించి చర్చించేందుకు ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు వైట్‌ఫీల్డ్‌లో ఫ్యూచర్ నెట్‌వర్క్ ఫోరమ్-2025 సమావేశం జరగనుంది. కేంద్ర విజ్ఞాన సాంకేతిక శాఖ కార్యదర్శి డాక్టర్ అభయ్ కరుణాధికర్‌తో పాటు గూగుల్, టీసీఎస్, వెర్‌లైస్, నేతాజిసుభాష్ సాంకేతిక విశ్వవిద్యాలయం, బెల్‌ల్యాబ్ తదితర సంస్థల ప్రతినిధులు సమావేశానికి హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఇంజినీరింగ్, విజ్ఞాన సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలు, పరిశోధనలు తదితర అంశాలపై చర్చించి తీర్మానాలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

జనవరి 11న బహుభాషా కవుల సమ్మేళనం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య అధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి11న బహుభాషా కవుల సమ్మేళనం-2026 నగరంలోని ఇండో ఏషియన్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బొగ్గవరపు మాల్యాద్రి తెలిపారు. సమ్మేళనంలో తెలుగు, కన్నడ, తమిళ, మలయాళం, హిందీతో పాటు ఇతర భాషలకవులు పాల్గొని తమకవితా సృజనలను పంచుకుంటారని తెలియజేశారు. భాషల వైవిధ్యం, సాహిత్య సౌందర్యం, సాంస్కృతిక ఐక్యతను ప్రతిబింబించే వేదిక కానున్నదన్నారు. పాల్గొనదలచిన వ్యక్తులు డిసెంబరు 15లోగా తమ వివరాలను పంపించాలని కోరారు.

కొనసాగుతున్న వాగ్యుద్ధం

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: సంఘపరివార్‌ను ప్రారంభించిన సమయంలో దేశంలో బ్రిటిష్ పాలన ఉందని, అందుకే తమ సంఘాన్ని రిజిస్టరు చేసుకోలేదని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ పేర్కొన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సంఘ పరివార్ కార్యకర్తలు కూడా పోరాటం చేశారని చెప్పారు. ఆదివారం ఇక్కడ కొందరు విలేకరులతో మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పేరు నమోదు చేసుకోవలసిన అవసరం కూడా రాలేదన్నారు. ఆదాయ పన్ను శాఖ కూడా తమను గుర్తించి, పన్ను చెల్లించాలని సూచించిందన్నారు. వచ్చే ఆదాయం వివరాలను ప్రతి ఏటా దాఖలు చేసి, పన్నులు చెల్లిస్తున్నామని చెప్పారు. తమ సంఘం రిజిస్టరు కానట్లే హిందూ మతం కూడా ఎక్కడా పేరు నమోదు చేసుకోలేదని వివరించారు. సంఘానికి భగవాధ్వజమే గుర్తింపు అని, అందుకే తమ కార్యాలయాలపై దాన్ని ఎగురవేస్తామని తెలిపారు. జాతీయ పతాకంగా భగవాధ్వజాన్ని ఉంచాలని తాము మహాత్మునికి ప్రతిపాదించగా, ఆయన అంగీకరించలేదన్నారు. దీనితో తాము జాతీయ పతాకాన్ని అంగీకరించి, గౌరవిస్తూ వస్తున్నామని తెలిపారు. హిందువులు ఎవరైనా సంఘ పరివార్‌లో చేరవచ్చని, ఇతర ధర్మాలకు చెందిన వారు తమతో కలిసి వస్తే ముందుగా తమ ధర్మాన్ని పక్కన పెట్టి, భారత మాత బిడ్డలుగా ఉంటామని ప్రమాణం చేయవలసి ఉంటుందని తెలిపారు. పాకిస్థాన్‌తో ప్రతిసారీ శాంతిని కోరుకుంటూ వస్తున్నా, వారు మాత్రం కయ్యానికి కాలుదువ్వుతూ వస్తుంటారని అందుకే వారిని కట్టడి చేయాలని కోరుకుంటామని తెలిపారు. మనదేశంతో 1971లో చేసిన యుద్ధంలో పాకిస్థాన్ 90 వేల మంది సైనికులను కోల్పోయినా దాని బుద్ధి మారలేదని, ఏదో ఒక రోజు వారికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

- భాగవత్ ఇచ్చిన వివరణను మంత్రి ప్రియాంక్ ఖర్గే ఖండించారు. తాను అడిగే పదకొండు ప్రశ్నలకు బదులివ్వాలని కోరారు. స్వయం సేవకులు ఎవరు, వారిని ఎలా గుర్తిస్తారు, వారు విరాళం ఇస్తారా, దాన్ని ఎలా స్వీకరిస్తారు, పారదర్శకంగా పని చేస్తే సంఘం పేరును ఎందుకు నమోదు చేసుకోలేదు, పూర్తిస్థాయిలో పని చేసే వారు ఉంటారా, మీ కార్యకలాపాలకు వచ్చే నిధులకు సంబంధించిన వివరాలు ఎక్కడ ఉంటాయి, మౌలిక సదుపాయాలను ఎవరు కల్పిస్తారు, ప్రతి ధార్మిక సంస్థ తమ ఆర్థిక లావాదేవీలను పారదర్శకంగా ఉంచాలన్న నిబంధన మీకు వర్తించదా అని ప్రశ్నించారు. పారదర్శకత కాపాడుకుంటూ వస్తే తాను కూడా ఆర్ఎస్ఎస్‌కు విరాళం ఇస్తానని పేర్కొన్నారు.

ప్రియాంక్ ఖర్గే

EENADU Classifieds

JOBS

Experienced South Indian Cook is Required for a Hotel/ Restaurant in Raipur, Chhattisgarh to make tiffins, Coffee, tea etc. Good salary. Free accommodation, food and free educations for their children will be provided. Con: 9425296305, 9329027580.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జీ.ఎస్.టీ. 5% వర్తించబడును

ఐటీ విప్లవంతో ఎగిరిన తెలుగు పతాక

కార్తిక వనభోజనాల్లో వక్తలు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించిన అతిథులు, కమిటీ సభ్యులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: పట్టణంలో ఆదివారం వనభోజనాల సందడి నెలకొంది. సిరుగుప్ప కమ్మ సంఘం కల్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన కార్తిక వన సమారాధన కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదంగా సాగింది. కమిటీ సభ్యులు అతిథులతో కలిసి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బళ్లారి కమ్మ సంఘం ఉపాధ్యక్షుడు ముల్లంగి చంద్రశేఖర చౌదరి మాట్లాడుతూ పిల్లలకు క్రమశిక్షణ నేర్పిస్తే వారు ఉత్తమ పౌరులుగా ఎదిగి కుటుంబానికి, దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు దశాబ్దాల నాడు చేపట్టిన ఐటీ విప్లవం దేశవిదేశాల్లో తెలుగువారి కీర్తి పతాకను ఎగురవేసిందన్నారు. అఖిల కర్ణాటక కమ్మవారి సంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ మాట్లాడుతూ కమ్మ సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు కావడం వల్ల మూడు దశాబ్దాలుగా సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇంజినీరింగ్, వైద్యం, పీయూసీ, డిగ్రీ చదువుతున్న పేద ప్రతిభావంత విద్యార్థులకు కమ్మ సంఘం నుంచి 23 మందికి రూ.3.80 లక్షలు, దాతల నుంచి 21 గురికి రూ.2.10 లక్షలు మొత్తం రూ.5.10 లక్షలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం తులసి దామోదర పూజ, సహస్రనామ పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం తెలుగువారి పసందైన వంటకాలతో కార్తిక వనభోజనాన్ని ఆరగించారు. మాన్వి కమ్మ సంఘం మాజీ అధ్యక్షుడు వెల్లంకి రవీంద్రబాబు, బళ్లారికి చెందిన పిన్నమనేని అజయ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడు జాలాది రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు తాతినేని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పోతుగుంట సత్యనారాయణ, నిర్దేశకులు కాజా సురేశ్‌బాబు, ఎం.ప్రసాదరావు, మేకా శ్రీనివాసరావు, ద్రోణవల్లి సత్యనారాయణ, నర్రా మురళి, ఇతర సభ్యులు, సిరుగుప్ప, తెక్కెలకోటల నుంచి తెలుగు క్యాంపుల నుంచి విచ్చేసిన మహిళలు, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

ప్రేమం మధురం ప్రేమం అమరం టీజర్ రాక

కన్నడ చిత్రసీమకు 'ప్రేమం మధురం ప్రేమం అమరం' చిత్రం ద్వారా నూతన నటులు పరిచయం కానున్నారు. కొత్తనటులతో నిర్మిస్తున్న చిత్రం టీజర్ ఇటీవల విడుదల కావడంతో ప్రేక్షకుల నుంచి ఉత్తమస్పందన వచ్చిందని దర్శకుడు గాంధీ ఎ.బి. తెలిపారు. మూడు పాటలకు విశాల్ అలాప సంగీతం అందించారు. యుక్త వయస్సులో కళాశాల సమయంలో యువతీ, యువకులు ఏర్పడే ప్రేమ అనంతరం ప్రేమికులు ఎదుర్కొన్న కష్టాలు ఎలా ఉంటాయనేది చిత్రకథ అని దర్శకుడు తెలిపారు. గాంధీ, ఐశ్వర్యదినేశ్, అనుషాజైన్, సిహికహిచంద్రు, రాజేశ్వరి, లపంగ్‌రాజ్, అనూప్ అగస్త్య తదితరులు నటిస్తుండగా అరగూండశేఖర్‌రెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

చిత్రటీజర్ విడుదల కార్యక్రమంలో గాంధీ, ఐశ్వర్యదినేశ్, అనుషాజైన్ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర) న్యూస్‌టుడే

డిసెంబరులో మైనేమ్ ఈజ్ కేడీ

బాలుడు సాయం కోసం ఎమ్మెల్యే వద్దకు వెళ్లిన తరువాత జరిగిన సంఘటనలు ఆధారంగా ఎస్ఎస్‌కేబీ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'మై నేమ్ ఈజ్ కేడీ' చిత్రం డిసెంబరులో విడుదలకు సిద్ధమవుతోంది. హాస్యభరితమైన చిత్రమని, బాలుడు ఆఖరికి ఎలా ఎమ్మెల్యే అవుతారన్న అంశాన్ని తెరపైకి చూస్తే థ్రిల్‌గా ఉంటుందని దర్శకుడు కేజే చిక్కు తెలిపారు. కనకపుర, హెసరుఘట్ట, ఆనేకల్ తదితర ప్రాంతాల్లో వివిధ సన్నివేశాలను చిత్రీకరించారు. ఆర్యన్‌వెంకటేశ్, భవాని, హొన్నహళ్లికృష్ణ, గిరీశ్‌జత్తి, విశ్వ, యతిరాజ్, అరసు మహారాజ్, సుప్రీత్‌కాటి, రోహిణి, మాస్టర్ లక్ష్ తదితరులు నటిస్తున్నారు.

మై నేమ్ ఈజ్ కేడీచిత్ర బృందం

ఇనియన ఆత్మ పాటలు వచ్చాయ్

కార్యక్రమంలో పాల్గొన్న ఇనియన ఆత్మ చిత్రం నటీనటులు

కోలారుజిల్లాలకు చెందిన మంది నటులు కలిసి నిర్మిస్తున్న 'ఇనియన ఆత్మ' చిత్రం పాటలను ఇటీవల విడుదల చేశారు. వినాయక వెంకటేశ్వర ఫిలిమ్స్ బ్యానర్‌పై బి.కళావతి నిర్మిస్తున్నారు. ఏడుగురు పర్యాటక యాత్ర చేపడతారు. ఆ సమయంలో నెలకొన్న సమస్యలు ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు నరేశ్ సిద్ధఘట్ట తెలిపారు. కోలారు, చిక్కబళ్లాపుర ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరించారు. సిద్ధార్థహరి, నిశారెడ్డి, కోలారుసూర్య, రాజ్‌వీర్, కిట్టితాళికోటె, ఆదిమధుగిరి, సుష్మిత, నయన తదితరులు నటిస్తున్నారు.

1979 చిత్రం పోస్టర్ విడుదల

సినీనటుడు చేతన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న 1979 చిత్రం నటీనటులు, తదితరులు

ప్రముఖ సినీనటుడు చేతన్ '1979' చిత్రం పోస్టర్ విడుదల చేశారు. మనం మూవీస్‌మేకర్స్ బ్యానర్‌పై డాక్టర్ బి.ఎం.శ్రీనివాస్, బీరమానహళ్లి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 1904 నుంచి 1979 మధ్యకాలంలో పశ్చిమబెంగాల్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు పుష్పరాజ్ తెలిపారు. సమాజంలో ఓ వర్గం ఏవిధంగా తమ రక్షణ కోసం పోరాడుతుందనే అంశాన్ని తెరపై చూపిస్తున్నట్లు తెలియజేశారు. అజ్జు, ప్రాణ్వి, సుజిత్, అమృత, దుర్గ, ప్రీతి, తక్షరామ్, నిరంజన్ తదితరులు కలిసి నటిస్తున్న ఈ చిత్రానికి జస్వంత్ పసుపులేటి సంగీతం అందిస్తున్నారు.

(c) eenadu

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

ఘనంగా స్వామికి తులాభారం

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మాన్వి, న్యూస్‌టుడే: తాలూకాలోని కరేగుడ్డ మహాతేశ్వర మఠంలో మహంతలింగ శివాచార్య స్వామీజీ పట్టాభిషేక మహోత్సవాలకు ముగింపు పలికారు. శనివారం రాత్రి స్వామీజీకి భక్తులు వెండితో తులా భారం నిర్వహించారు. హాజరైన మఠాధిపతులు మఠం ఆచార వ్యవహా రాలను కొనియాడారు. మఠం చరిత్రను భక్తుల కళ్లకు గట్టారు. మఠం ఆధ్వర్యంలో వకీలభల్లి సువర్ణగిరి విరక్తమఠం సిద్ధలింగ మహాస్వామీ జీకి గురువందనను భక్తిశ్రద్ధలతో జరిపారు. వివిధ మఠాల స్వామీజీలు, మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్, తిమ్మారెడ్డి భోగావతి, శరణేగౌడ నక్కుంది, ఆల్దాళ వీరభద్రప్పగౌడ పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ

చెళ్లకెర, న్యూస్‌టుడే: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు సకాలంలో శుచి, రుచితో కూడిన ఆహార పదార్థాలను అందించాలని ఎమ్మెల్యే రఘుమూర్తి ఆదేశించారు. ఆదివారం ఆయన పరశు రాంపురంలోని వసతిగృహాలను తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాలూకాలోని పలు విద్యార్థుల వసతి గృహాల నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నా యని, నిర్వాహకులు వాటిని సరిదిద్దుకుని నాణ్యతతో కూడిన ఆహారంతో పాటు చక్కటి వసతి కల్పించా లని కోరారు. వార్డెన్లపై ఇక నుంచి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్రస్థాన ప్రభుత్వం రూ.వేల కోట్లను హాస్టళ్ల నిర్వహణకు ఖర్చు చేస్తున్నాయని గుర్తుచేశారు.

విద్యార్థుల ద్వారానే సామాజిక మార్పు

శిబిరంలో మాట్లాడుతున్న మహంతేష్ బీళగి, విద్యార్థులు

బళ్లారి, న్యూస్‌టుడే: సామాజిక మార్పులో విద్యార్థుల పాత్ర చాలా ముఖ్యమైనది. విద్యార్థులకు చదువుతో పాటు వ్యక్తిత్వం ముఖ్యమని ఏఐడీఎస్‌వో కార్యాలయం రాష్ట్ర కార్యదర్శి మహంతేష్ బీళగి అన్నారు. ఏఐడీఎస్‌వో నేతృత్వంలో రెండో రోజు కురుగోడు తాలూకా దమ్మూరు సమీపంలోని వెంకటాపుర మఠంలో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమ లక్ష్యం అంగ్లేయు లను పారద్రోలడమే కాదు. కులం, మతం, లింగం, ఆర్థిక వ్యవస్థ పేరుతో దోపిడీ, సామాజిక అసమానతలను అంతం చేయడం కూడా చాలా ముఖ్యమన్నారు. ఈ లక్ష్యాలు నేటికీ నెరవేరలేదని వాస్తవాన్ని కూడా విద్యార్థులు తెలుసుకోవాలని కోరారు. ఆ భావజాలం ఆధారంగా ఏఐడీఎస్‌వో విద్య, సంస్కృతి, మానవత్వాన్ని కాపాడాలని నినాదంతో దేశ వ్యాప్తంగా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో సభ్యులు ఈరణ్ణ, కంబళి మంజునాథ్, శాంతి, సమీర్, తిప్పేస్వామి, కాంతేష్, సుహాస్, రంజిత్, అర్జున్, హరీష్, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

రైతుల నోట..ఒక్కటే మాట

కొనసాగుతున్న వరి కోతలు

- కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఎప్పుడు?
- కొనసాగుతున్న దళారుల హవా!

లక్ష ఎకరాల వరి సాగు

తుంగభద్ర జలాశయం కింద జిల్లాలో బళ్లారి, సిరుగుప్ప, కురుగోడు, కంప్లి తాలూకాలు వస్తాయి. ఈ తాలూకాల్లో సుమారు లక్ష ఎకరాలకుపైగా వరిని సాగు చేశారు. ఈ ఏడాది వాతావరణం సహకరించడంతో మంచి వరి దిగుబడి సాధిం చారు. ఎకరాకు 45 బస్తాల నుంచి 60 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఆయకట్టు కింద ప్రధానంగా గంగాకా వేరి, ఆర్.ఎన్.ఆర్, సోనా రకాలను సాగు చేశారు.

బళ్లారి, న్యూస్‌టుడే: వరి ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి గోదాములు, ఇంటి ఆవరణలో జాగా లేక రైతులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. పొలాల వద్దనే దళారీ ధరకు విక్రయిస్తు న్నారు. తుంగభద్ర జలాశయం ఆయకట్టు, నదీ పరివాహక ప్రాంత రైతులు అందరి నోట ప్రస్తుతం ఒక్కటే మాట వినిపి స్తోంది. ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకారం ప్రారంభిస్తామన్న కొనుగోలు కేంద్రాల్ని నేటికీ ఎందుకు తెరవలేదని ప్రశ్నిస్తున్నారు.

నవంబరులోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



ప్రభుత్వం నవంబరులో కనీస మద్దతు ధర ప్రకారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే, నెలాఖరుకు రైతులు కొనుగోలు కేంద్రాల్లో నమోదు చేసుకుని డిసెంబరు నుంచి విక్ర యించడానికి అనుకూలం. - మాధవరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

తక్కువ ధరలకే విక్రయాలు

కాలువ గట్టుపై రాసులు

గంగాకావేరి, ఆర్.ఎన్.ఆర్ రకాల ధాన్యాలను క్వింటాలు రూ.1800 నుంచి రూ.2వేలకు విక్ర యిస్తున్నారు. సోనా కూడా ఇదే ధరకు అమ్మే యాల్సి వస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిస్తే ప్రైవేట్ వ్యాపారులు కూడా పోటీగా ఎక్కువ ధర ఇస్తారని రైతుల ఆశ.

ఆర్.ఎన్.ఆర్, గంగాకావేరి కోతలు ముగిశాయి

నేటికీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవ డంతో ఆర్.ఎన్.ఆర్, గంగాకా వేరి రకాలు తక్కువ ధరకు విక్ర యిస్తున్నారు. గత ఏడాది కూడా ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిం చిన రైతులు సుమారు రూ.2కోట్లు మోసపో యారు. - దరూరు పురుషోత్తమగౌడ, తుంగ భద్ర రైతు సంఘం అధ్యక్షుడు

బీడీసీసీ అధ్యక్షుడికి సన్మానం

బళ్లారి వాల్మీకి, పరిశ్రమ మండలి (బీడీసీసీ) అధ్యక్షుడు అయ్యారు మంజునాథను జిల్లా పద్మశాలి సంఘం సభ్యులు సన్మానించి, అభినందించారు. సంఘం సభ్యులు డా.శ్రీనివాసులు, ఎస్. వి.వెంకటేశులు, విశ్రాంత వ్యాయామ ఉపా ధ్యాయులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, బళ్లారి

సాధకులకు నృపతుంగ ప్రశంసలు

రాయచూరు, న్యూస్‌టుడే : కన్నడ మాతకు హోసమని ప్రకాశన అధ్యక్షుడు బసవేశ్వర్ నిరుపమానమైన సేవలంది స్తున్నారని ప్రముఖ సాహితీవేత్త, రాజ్యో త్సవ పురస్కార గ్రహీత రాములు హసరి పేర్కొన్నారు. రాజ్యోత్సవాల సందర్భంగా హోసమని ప్రకాశన సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సాధకులకు నృపతుంగ పురస్కారాలను ఆదివారం ఇక్కడి కన్నడ భవన్‌లో ప్రదానం చేశారు.

మహిళా వైద్యుల్ని నియమించకుంటే ధర్నా

సమావేశంలో మాట్లాడుతున్న వసంతరాజ కహళె

కంప్లి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా వైద్యురాలిని నియమించాలని డిమాండు చేస్తూ ఈనెల 12న ఆసుపత్రి ముందు ధర్నా జరుపనున్నట్లు జనశక్తి సంఘటన రాష్ట్ర సమితి సభ్యుడు వసంత రాజ కహళె తెలిపారు. కంప్లి ప్రభుత్వ అతిథి గృహంలో ఆదివారం ఏర్పా టైన వివిధ సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసు పత్రిలో మహిళా డాక్టర్ లేక గర్భిణులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమస్యను తెలిపినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. అందువల్ల ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించనున్నామన్నారు. వివిధ సంఘాల నాయకులు మల్లూర రవి, సి.బసవరాజ్, కె.లక్ష్మణ, మరి స్వామి, హెచ్.బసప్ప, రాజా బక్ష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు

దివ్యాంగులకు స్కూటీలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కష్టాలు గుర్తి స్తుంది, అట్టడుగు వ్యక్తికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తుంది. పంచ గ్యారంటీ పథకాలు పక్కాగా అమలౌతుండటానికి కారణం మా ప్రభుత్వ అంకితభావమేనని సింధనూరు సీనియర్ ఎమ్మెల్యే బాదర్లి హంప నగౌడ పేర్కొన్నారు. శాసనసభ్యుల ప్రాదేశిక అభివృద్ధి యోజనలో సింధనూ రులోని 19 మంది దివ్యాంగులకు ఆయన ఆదివారం మూడు చక్రాల స్కూటీ లను పంపిణీ చేశారు. ఆయన ఇంటి ఎదుట ఏర్పాటు చేసిన ఈ కార్యక్ర మంలో లబ్ధిదారులకు స్కూటీ తాళాలు అందించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీరు భగవంతులతో సమానం, ఈ వాహనాలు మీకు చక్కని ఆసరా కాగలవని అభిలషించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

విస్తరణ పనుల పరిశీలన

పరశురాంపురంలో రోడ్డు విస్తరణ పనులను తిలకిస్తున్న ఎమ్మెల్యే రఘుమూర్తి

చెళ్లకెర(చిత్ర దుర్గం),న్యూస్ టుడే: తాలూకాలో మేజర్ గ్రామపం చాయతీ అయిన పరశురాంపురంలో వాహన సంచారా నికి అనువుగా చేప ట్టిన రహదారి విస్త రణ పనులను గుత్తేదారు నిర్ణ యించిన వ్యవధిలో పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే రఘుమూర్తి సూచిం చారు. ఆదివారం ఆయన ఇక్కడ పర్యటించి రహదారి, రోడ్డు అభివృద్ధి పను లను పరిశీలించారు. గ్రామ ప్రజలకు అవసరమయిన సదుపాయాలను కల్పిం చడానికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దున గల ఈ గ్రామం అనంతపురం జిల్లాకు చెందిన కుందిర్పి మండలంలోని సుమారు 15 గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలకు ప్రముఖ వాణిజ్య, వ్యాపార కేంద్ర మన్నారు. ఎమ్మెల్యే వెంట గ్రామపంచాయతీ అధ్యక్షుడు రుద్రేశ్, గ్రామ ప్రము ఖులు కేశవ, ప్రకాశ్, నాగభూషణ, కృష్ణప్ప తదితరులు ఉన్నారు.

ఐదు రోజుల తర్వాత..బాలుడి మృతదేహం

విష్ణుసాయి (దాచిన చిత్రం)

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి తాలూకా హగరినది (వేదావతి)లో మునిగిపోయిన బాలుడి మృతదేహం ఐదు రోజులు తర్వాత ఆదివారం బయటపడింది. హగరి గ్రామానికి చెందిన విష్ణుసాయి (14), కిరణ్(16) ఐదు రోజుల క్రితం హగరినదిలోకి ఈతకు వెళ్లారు. నదిలో ప్రవాహం ఎక్కువగా ఉండడంతో నీటిలో కొట్టు కొనిపోయారు. ఈనెల 6న కిరణ్ మృతదేహం లభిం చింది. విష్ణుసాయి మృతదేహం కోసం పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది, హోంగార్డులు గాలించారు. చివరికి జిందాల్‌కు చెందిన ప్రత్యేక నిపుణులు బోటుతో పాటు డ్రోన్ కెమెరాలతో గాలించారు. ఆదివారం ఉదయం తాలూకా బ్యాలిచింత గ్రామ సమీపంలోని నదిలో మృతదేహం తేలియాడుతుండడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించి బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రానికి తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

120 గొర్రెలు చోరీ..నిందితుడి అరెస్టు

నిందితుడు లక్ష్మీకాంత్ నుంచి గొర్రెలను స్వాధీనం చేసుకొన్న పోలీసులు

చెళ్ల కెర(చిత్ర దుర్గం),న్యూస్‌టుడే: హిరియూరు తాలూకా సక్కర గ్రామానికి చెందిన గుండప్ప అనే వ్యక్తికి చెందిన సుమారు రూ.10 లక్షలు విలువ చేసే 120 గొర్రెలు చోరీకి గుర య్యాయి. రొప్పం ప్రాంతంలో గొర్రెలను మేతకు వదిలి అతను భోజనానికి ఇంటికి వచ్చిన సమయంలో లక్ష్మీకాంత్ అనే వ్యక్తి వాటిని తోలుకొని పోయినట్లు పోలీ సులు తెలిపారు. శనివారం ఈ మేరకు అబ్బినహొళె పోలీసులు బాధి తుడు గుండప్ప నుంచి అందిన ఫిర్యాదు మేరకు గాలింపు చేపట్టారు. కొన్ని గంటల వ్యవధిలోనే నిందితుణ్ని గుర్తించిన పోలీసులు అతని వద్ద నుంచి గొర్రెలను స్వాధీనం చేసుకొని గుండప్పకు అప్పగించారు. లక్ష్మీకాం త్‌ను అరెస్టు చేసి హిరియూరు కోర్టులో హాజరు పరచగా అతణ్ని న్యాయ నిర్బంధానికి పంపారు. పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు అభినందించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కార్పొరేటర్లు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికెలో వివిధ అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి భూమిపూజ చేశారు. నగర పాలికె 35వ వార్డు పరిధిలోకి వచ్చే ఇందిరానగరలో రూ.40లక్షలతో 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలకు భూమి పూజ చేశారు. 37వ వార్డు పరి ధిలోకి వచ్చే మారుతీనగర, బసవనకుంటలో రూ.40లక్షలతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణానికి, 29వ వార్డు పరిధిలోకి వచ్చే మహా నంది కొట్టంలో రూ.కోటితో సిమెంట్ రహదారి అభివృద్ధి పనులకు 17వ వార్డు పరిధిలోకి వచ్చే దర్గా కాలనీలో రూ.20లక్షలతో అంగన్ వాడీ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా నిర్దిష్ట సమయం లోపు పూర్తి చేయాలని అధి కారులకు సూచించారు. కార్పొరేటర్లు మించు శ్రీనివాస్, కుబేర, గాదెప్ప, రాజేశ్వరి ప్రభంజన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యేతర అంశాలతో సృజనాత్మకత

రాయచూరు, న్యూస్‌టుడే : పాఠ్యేతర కార్యకలాపాలతో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించవచ్చని వ్యంగ్య చిత్రకారుడు, సాహితీవేత్త ఈరణ్ణ బెంగాలి పేర్కొన్నారు. పిల్లలను పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం చేయవద్దని, వారిలో దాగిన ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కోరారు. సామాజిక సేవలో భాగస్వాములయ్యేందుకు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, భారత సేవా దళ్‌లో చేరాలని విద్యార్థులకు సూచించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

9-11-2025 (ఉ.8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1625.48	1631.93
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,263	8,567
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8,537	10,016
నీటి నిల్వ (టి.ఎం.సి)	78.073	101.500

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ముఖ్యమంత్రిని కలిసిన కుడతిని రైతులు

ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: కుడతిని, చుట్టుపక్కల గ్రామాల రైతులు నుంచి వివిధ పరిశ్రమలకు వ్యవసాయ భూమిని తక్కువ ధరకు స్వాధీనం చేసుకున్నారు. రైతులకు జరిగిన అన్యాయాన్ని సరి చేసి ఆదుకోవాలని కర్ణాటక ప్రాంత రైతు సంఘం, హసిరు సేనె రాష్ట్ర అధ్యక్షుడు, వామపక్ష నేత యు.బసవరాజు, సీపీఐయం జిల్లా అధ్యక్షుడు సత్యబాబు, సభ్యులు జంగ్లిసాబ్, తిప్పేస్వామి తదితరులు ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వినతిపత్రం అందజేసి వివరించారు. ఉమ్మడి బళ్లారి జిల్లా కూడ్లిగిలో ఆదివారం జరి గిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, మంత్రి సంతోష్ ఎస్.లాడ్, లోక్‌సభ సభ్యుడు ఇ. తుకారామ్‌ను కలిసి సమస్యను వివరించారు. 1059 రోజులుగా రైతులు నిరవధిక సత్యాగ్రహం చేస్తున్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. 12,500 ఎకరాల భూమిని 15 ఏళ్ల క్రితం స్వాధీనం చేసుకున్నారు. నేటికి పరిశ్ర మలు రాలేదు. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాల్లో ఉద్యోగాలు లభించలేదు. కోర్టు ఆదేశాల ప్రకారం ధర ఇవ్వాలి. లేకుంటే మా భూములు వెనక్కి ఇవ్వాలని సీఎంను కోరారు.

విశ్వవ్యాప్తంగా అఖండ భజన

ప్రసాదం స్వీకరణకు పిల్లలతో వచ్చిన తల్లులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి ఈశ్వరాంబ శ్రీస త్యసాయి సేవ ట్రస్టు ఆధ్వర్యంలో నగర మంది రంలో 24 గంటలపాటు విశ్వవ్యాప్త అఖండ భజన నిర్వహించారు. పుట్టపర్తి శ్రీసత్యసాయి జయంతి ఈనెల 23న ఉండడంతో ప్రపంచ వ్యాప్తంగా 149 దేశాల్లో అఖండ భజన శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభించారు. బళ్లారి మందిరంలో భక్తులు భజన పాటల్లో మునిగితేలారు. ట్రస్టు అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి, సభ్యులు విరూపాక్షప్ప, పార్థసారథి తదితరులు ఆదివారం బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రంలో రోగులు, సంబంధికులకు అన్నప్రసాదం అందజేశారు. గత 13 ఏళ్లుగా శ్రీసత్యసాయి ట్రస్టు ద్వారా బీఎంసీఆర్‌సీలో అన్నదానం చేస్తున్నారు.

కొనసాగుతున్న సత్యాగ్రహం

కుడతినిలో నిరవధిక సత్యాగ్రహంలో పాల్గొన్న రైతులు

బళ్లారి, న్యూస్‌టుడే: కుడతిని భూ పోరాట సమితి చేస్తున్న నిరవధిక సత్యాగ్రహం ఆదివారానికి 1059వ రోజుకు చేరుకుంది. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన విరమించే ప్రశక్తే లేదని కుడతిని, వేణివీరాపురం, జానెకుంటె, హరగినడోణి, సిద్ధమ్మన హళ్లి, యరంగలి, కొళగల్లు తదితర గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాలు మద్దతు ప్రకటించారు.

కొత్త వంతెనకు ఎదురుచూపులు


దడేసుగూరు వద్ద నిర్మాణంలో ఉన్న నూతన వారధి

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు-సిరుగుప్పలను కలిపే దడేసుగూరు కొత్త వంతెన ఎప్పుడు అందుబాటులోకి వస్తుందా అని అందరూ ఎదురుచూస్తున్నారు. రాయచూరు, బళ్లారి జిల్లాలకు వారధిగా సరిగ్గా సింధనూరు తాలూకా చిట్టచివరి గ్రామం దడేసుగూరులో తుంగభద్ర నదీపాయపై ఈ వంతెనను దాదాపు 75 ఏళ్ల కిందట నిర్మించారు. తుంగభద్ర జలాశయం 1950ల్లో నిర్మాణం కాగా అంతకు ముందే ఈ వంతెన ఏర్పడింది. సింధనూరు నుంచి బళ్లారి, బెంగళూరు, ఆంధ్రప్రదేశ్‌లోని ఆధోని, కర్నూలు వైపు వెళ్లే వాహనాలన్నీ ఈ వంతెన మీదుగానే వెళ్లాలి. బెంగళూరు నుంచి కల్యాణ కర్ణాటక జిల్లాలకు చేరవేసే వస్తు సామగ్రి భారీ వాహనాలన్నీ దీనిపైనే సంచరిస్తుంటాయి. సిరుగుప్ప చక్కెర కర్మాగారానికి తరలే చెరకు లోడ్లు కూడా దీనిపై వెళ్లాల్సిందే. భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు సంచరించే సమయంలో దీని నుంచి వచ్చే శబ్దాలు భయంకరంగా వినిపిస్తున్నాయి. ఉన్నపళంగా వంతెన కూలిపోతుందా అని ప్రయాణికులు భీతిల్లుతున్నారు. దాదాపు కిలోమీటరు పొడవుండే కొత్త వంతెన నిర్మాణం పనులు ఇంకా 30 శాతం మిగిలి ఉన్నాయి. ఏడు పిల్లర్లపై మరో అయిదు సిమెంటు శ్లాబులు కూర్చోబెట్టాల్సి ఉంది. వెంకటేశ్వ క్యాంపు నుంచి దడేసుగూరు వరకూ రూ.147 కోట్లతో హైవే అభివృద్ధి నిగమ నిర్మిస్తున్న 14 కిలోమీటర్ల నాలుగు దారుల రహదారి మార్గం కూడా ఈ కొత్త వంతెన వేపై సాగుతోంది. ఊహించలేని ప్రమాదం ఏదీ సంభవించకుండానే త్వరితగతిన కొత్త వంతెన పనులు పూర్తి చేయిస్తే పురాతన వంతెనకు విశ్రాంతినివ్వొచ్చని జనం ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

దళితులకు మేయర్ స్థానం

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్ హెగ్డే, చిత్రంలో ఎరుకుల స్వామి తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె 4వ విడత మేయర్ జనరల్, ఉపమేయర్ జనరల్ మహిళకు రిజర్వేషన్ కేటాయించారు. ఈసారి మేయర్ అవకాశం దళిత కార్పొరేటర్‌కు కల్పించాలని కేపీసీసీ వ్యాఖ్యాత వెంకటేశ్ హెగ్డే డిమాండ్ చేశారు. పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, గ్రామీణ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, జిల్లా బాధ్యమంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్, రాజ్యసభ సభ్యుడు డా.సయ్యద నాసిర్ హుసేన్, పార్టీ నేతలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దళితలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరలో జరిగే తాలూకా, జిల్లా పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపునకు శ్రమిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఎరుకుల స్వామి, హుసేనప్ప, వీరేంద్ర, గౌతమ్, బుజ్జి, పృథ్వి, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పైకప్పు కూలి..బాలింతకు గాయాలు

గదిలో ఊడి పడిన పైకప్పు పెంకులు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హిరియూరు తాలూకా ప్రభుత్వ ఆసుపత్రి తల్లి, పిల్లల వార్డు గది పైకప్పు సిమెంటు పెంకులు ఊడిపడడంతో బాలింతరాలు గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుందని బాధితులు పేర్కొన్నారు. ఆదివారం బాధిత కుటుంబసభ్యులు ఈ ఘటనను వివరించారు. హిరియూరు నివాసితురాలు అబ్జకౌర్ (36) అనే గృహిణి పురుడు పోసుకొని తల్లి,పిల్లల వార్డు గదిలో విశ్రమిస్తుండగా సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో పెద్ద పైకప్పు సిమెంటు పెంకులు ఊడి నేలపై పడ్డాయి. ఈ పెంకులు రెండు మంచాల మధ్యన ఉన్న ఖాళీ జాగాలో పడటంతో తల్లి పిల్లలకు పెద్ద ప్రమాదం తప్పిందని చెప్పారు. ఆ తర్వాత మంచంపై కొన్ని పెంకులు పడడంతో అబ్జకౌర్ చేతికి గాయాలయ్యాయి. వెంటనే బాలింతను, పిల్లలను మరో గదికి తరలించి చికిత్స అందించారని తెలిపారు. జిల్లా బాధ్య మంత్రి డి సుధాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హిరియూరు నియోజకవర్గంలోనే పరిస్థితి ఇలా ఉందంటే ఇంకెంటని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. 1976లో నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరుకొంటోందని వారు తెలిపారు. ఈ భవనం నుంచి రోగులను మరో చోటికి తరలించాలని పలు కన్నడ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

విద్యార్థినుల శ్రమదానం

రాయచూరు, న్యూస్‌టుడే : నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు లింగసూగూరు తాలూకాలోని పర్యాటక కేంద్రమైన జలదుర్గలో శ్రమదానం చేశారు. ప్లాస్టిక్ వస్తువులను ఏరి వేశారు. చెత్తా చెదారాన్ని, దేవాలయాల చుట్టూ, ఉద్యానవనంలో పెరిగిన మొక్కలను తొలగించారు. వ్యర్థాలను సంచుల్లో నింపి వాహనాల్లో డంపింగ్ కేంద్రానికి తరలించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ సంచులను విక్రయించొద్దని వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. వాడిన వస్తువులను డస్ట్‌బిన్‌లో వేయాలని పర్యాటకులను కోరారు. స్వయం సేవకులు నరసమ్మ, అన్నపూర్ణ, జమునా, నాగమ్మ, స్వప్నా, మహేశ్వరి, రేఖా, రేణుకా, గాయత్రి, సుమిత్రా, కస్తూరి సేవల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జయంత్యుత్సవం

బళ్లారి నగర పాలికె బండిహట్టిలో భక్త కనకదాసు జయంతిని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక కార్పొరేటర్ మంజుల, సంఘం ప్రముఖులు వెంకోబి, గుజరి బసవరాజ్, దొడ్డ హనుమంతప్ప, ఈశ్వర్, మల్లికార్జున, డా.లోహిత్‌కుమార్, శివశరణ, శివ శంకర్, సోమశేఖర్, ఆలంబాషా, రఘు తదితరులు బండిహట్టి శ్రీరామ దేవ స్థానం ముందు ఉన్న కనకదాసు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ప్రసంగించారు. – న్యూస్‌టుడే, బళ్లారి

సందడిగా కార్తిక వనభోజనాలు

వివిధ పోటీల్లో పాల్గొన్న మహిళలు, పిల్లలు

సింధనూరు, న్యూస్‌టుడే: ఐకమత్యంతో అభివృద్ధిని సాధించగలం..చక్కని చదువులు చదివించి మన తదుపరి తరానికి ఉన్నత హోదాలు అందించగలం..ఆ దిశలో సాగి అభ్యున్నతి సాధిద్దామని సింధనూరు తాలూకా కాపు, బలిజ సంఘాల పెద్దలు అన్నారు. స్థానిక గంగావతి మార్గంలోని గోశాల కల్యాణ మండపంలో ఆదివారం పవిత్ర కార్తిక వనభోజన మహోత్సవాన్ని తాలూకా కాపు, మున్నూరుకాపు, బలిజ సంఘాలు వేడుకగా ఆచరించాయి. పసందైన వంటలతో కార్తిక వనభోజనాలు పెద్దఎత్తున సాగాయి. కార్యక్రమంలో సమాజం పెద్దలు కాంద్ర సతీష్, కాశీ జగన్నాథ్, ఎస్.శివ, పి.శ్రీనివాస్, ఆనంద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమాజం అభివృద్ధికి పాటుపడుతున్న పెద్దలకు సన్మానం

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి ఫిర్కా కమ్మ వారి సంఘం ఆదివారం కార్తిక వన భోజనాలు ఏర్పాటు చేసింది. కమ్మ సముదాయ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం తులసీ పూజ జరిగింది. మహిళలకు రంగోలి, పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మధ్యాహ్నం వన భోజనాలు జరిగాయి. కమ్మ సంఘం నాయకులు, మహిళలు, యువకులు, పిల్లలు పాల్గొన్నారు.

(c) eenadu

ఘన చరితం.. మన పర్యాటకం

■ సందర్శనకు విదేశీయుల ఆసక్తి

కె.ఆర్.ఆనకట్ట అందాలు


అరేబియా సముద్రతీరంలో వెలసిన సోమేశ్వర దేవస్థానం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: దేశంలో తిలకించాల్సిన పర్యాటక ప్రదేశాల్లో కర్ణాటకలో ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా మైసూరు, ఉడుపి, విజయనగర, కొప్పళ, బీదర్ జిల్లాల్లో ఉన్న పర్యాటక ప్రదేశాలు విదేశీయులను ఆకట్టుకుంటున్నట్లు పర్యాటక శాఖ అధికారులు చెబుతున్నారు. ఆయా పర్యాటక ప్రదేశాలను తిలకించేందుకు విదేశీయులు పోటీపడుతున్నారని తెలియజేశారు. మిగతా ప్రాంతాల్లో విదేశీ, స్వదేశీ పర్యాటకుల సంఖ్య కరోనా తరువాత తక్కువైనట్లు గుర్తించారు. 'ఒక రాష్ట్రం.. అనేక ప్రదేశాలు' అనే నినాదానికి తగ్గినట్లుగా కర్ణాటక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. ప్రాచీనమైన దేవాలయాలు, గిరిధామాలు, సముద్రతీరం, మహారాజులు కోటలు, నదులు, జలపాతాలు విదేశీ పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకున్నట్లు తెలిపారు. మైసూరు ప్యాలెస్, కె.ఆర్. ఆనకట్ట బృందావన్‌గార్డెన్, ఉడుపిలో ఉన్న శ్రీకృష్ణుడి కోవెల, అన్నపూణేశ్వరి ఆలయం, అరేబియా సముద్రతీరం, లైట్‌హౌస్ ప్రదేశం, విజయనగరలో ఉన్న హంపీ, ఐహుళె దుర్గాంబా ఆలయం, బాదామి జైన్ ఆలయం, హళేబీడు చెన్నకేశవ ప్రాచీనాలయం, వైష్ణవ గుహలు, యునెస్కో జాబితాలో చేరిన గోల్ గుంబజ్, ఇబ్రహీం కోట, రౌజా, లక్కుండి ఆలయం, బళ్లారి కోట, బెంగళూరు టిప్పు సుల్తాన్ ప్యాలెస్, చిత్రదుర్గ కోట, దరియా దౌలత్, బీదర్ సుల్తాన్‌లు కోటలు తదితర ప్రదేశాలు విదేశీయులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. 2023లో 4.09 లక్షల మంది, 2024లో 4.85 లక్షల మంది విదేశీయులు వచ్చినట్లు పర్యాటక శాఖ వెల్లడించింది. విదేశీయులు ఆకట్టుకునే ప్రధాన పర్యాటక ప్రదేశం మైసూరును 1.37 లక్షల మంది, ఉడుపి 89 వేల మంది, కొప్పళ జిల్లాలో ప్రదేశాలను 50 వేల మంది, బెంగళూరు నగరంలోని పర్యాటక ప్రాంతాలను ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు 45,782 మంది విదేశీయులు సందర్శించారని అధికారులు వివరించారు. ఉత్తర కర్ణాటకలోని ప్రదేశాలు విదేశీయులను ఆకట్టుకుంటున్నాయని వాటిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం గుర్తించింది. దేశీయ పర్యాటకుల సంఖ్య 28.41 లక్షల నుంచి 30.46 లక్షలకు పెరిగారు. అమెరికా పర్యాటకులు మొదటిస్థానంలో ఉండగా రెండో స్థానంలో బంగ్లాదేశ్, మూడోస్థానంలో బ్రిటన్, ఆస్ట్రేలియా, మలేసియా, జర్మనీ, ఫ్రాన్స్, సింగపూర్ పర్యాటకులు ఉన్నారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పర్యాటక విధానాన్ని అమల్లోకి తేవడంతో పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నారు.

విదేశీయులను ఆకట్టుకుంటున్న మైసూరు ప్యాలెస్

హళేబీడు ప్రాచీన చెన్నకేశవ ఆలయం

అద్భుతమైన అరేబియా సముద్రతీర దృశ్యం

నీట మునిగి బాలురు విషాదాంతం

బెంగళూరు (గ్రామీణం): అత్తిబెలె సమీపంలోని బళ్లూరు గ్రామం వద్ద చెరువులో ఆడుకునేందుకు దిగిన అనికేత్ కుమార్ (12), రెహమత్ బాబా (11) నీట మునిగి మరణించారు. అనికేత్ బీహారుకు, రెహమత్ బాబా ఆంధ్రప్రదేశ్‌లోని కదిరికి చెందిన వారు. వారి తల్లిదండ్రులు వలస కార్మికులని గుర్తించారు. శనివారం సాయంత్రం ఆడుకుంటూ బయటకు వచ్చిన వారిద్దరూ మళ్లీ ఇంటికి తిరిగి వెళ్లలేదు. నీటిలో తేలుతున్న మృతదేహాలను ఆదివారం ఉదయం గుర్తించి వెలికి తీశారు. అత్తిబెలె రాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గొలుసు కోసం వృద్ధురాలి హత్య

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే: గొలుసు కోసం భద్రమ్మ (70) అనే వృద్ధురాలిని దీప (38) అనే మహిళ హత్య చేసింది. మృతదేహాన్ని రెండు రోజులపాటు తన ఇంట్లోనే ఉంచుకుని, అనంతరం నిర్జన ప్రదేశంలో పడేసింది. సర్జాపుర రాణా పోలీసులు కథనం మేరకు.. భద్రమ్మకు, దీపకు మొదటి నుంచి పరిచయం ఉంది. నీకు అరిసెలు ఇస్తానంటూ అక్టోబరు 30న తన ఇంటికి తీసుకువెళ్లింది. ఆమెకు ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసింది. ఒంటిపై ఉన్న గొలుసును తీసుకుని, రెండు రోజులు ఇంట్లోనే మృతదేహాన్ని ఉంచుకుంది. మృతదేహం దుర్వాసన వస్తుండటంతో గుర్తించి, గోనెసంచిలో మూటగట్టింది. చెత్తను పారేసే వ్యక్తిని పిలిపించి ద్విచక్ర వాహనంపై దొడ్డ తిమ్మసంద్రకు వచ్చి అక్కడి చెరువులోకి మూటను విసిరి వేసింది. భద్రమ్మ కనిపించడం లేదని అక్టోబరు 31న ఆమె కుటుంబ సభ్యులు సర్జాపుర రాణాలో ఫిర్యాదు చేశారు. కర్నపర్రాలు ముద్దించి మట్టువెక్కలు పంపారు. చివరి సారిగా ఆమె దీప ఇంటికి వెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో తాను చేసిన హత్యను అంగీకరించింది. చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీసి, మరణోత్తర పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జనవరి 11న బహుభాషాకవుల సమ్మేళనం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య అధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి11న బహుభాషా కవుల సమ్మేళనం-2026 నగరంలోని ఇండో ఏషియన్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బొగ్గవరపు మాల్యాద్రి తెలిపారు. సమ్మేళనంలో తెలుగు, కన్నడ, తమిళ, మలయాళం, హిందీతో పాటు ఇతర భాషలకవులు పాల్గొని తమకవితా సృజనలను పంచుకుంటారని తెలియజేశారు. భాషల వైవిధ్యం, సాహిత్య సౌందర్యం, సాంస్కృతిక ఐక్యతను ప్రతిబింబించే వేదిక కానున్నదన్నారు. పాల్గొనదలచిన వ్యక్తులు డిసెంబరు 15 లోగా తమ వివరాలను పంపించాలని కోరారు.

వేరుసెనగ జాతరకు సన్నాహాలు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : చారిత్రక బసవనగుడిలో ఏటా నిర్వహించే వేరుసెనగ జాతర ఈనెల 15 నుంచి 19 వరకు ఐదు రోజుల పాటు కొనసాగుతుందని మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ జాతర ఈసారి ఐదు రోజులపాటు జరుగుతుందన్నారు. కార్తిక మాసం చివరి సోమవారం బసవనగుడి వద్ద ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఘనంగా ప్రారంభించనున్నారు. జాతరకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. 21 బసవన్నలను (ఎద్దును) తీసుకువచ్చి వాటికి ప్రత్యేక పూజలు చేసి జాతరకు శ్రీకారం చుట్టనున్నారు. బుల్ టెంపుల్ రోడ్డు, గాంధీబజార్, ఎన్‌ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో కళ్లు మిరుమిట్లు గొలిపే రీతిలో విద్యుద్దీపాలంకరణలు ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్నారు. ఐదు లక్షల మంది వరకు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

సంచులను ప్రదర్శిస్తున్న మంత్రి రామలింగారెడ్డి, తదితరులు

ప్లాస్టిక్ సంచుల నిషేధం..

ఈ జాతరలో ప్లాస్టిక్ సంచుల వాడకం పూర్తిగా నిషేధించారు. కాగితపు సంచులు, వస్త్ర సంచులను తెచ్చుకోవాలని వ్యాపారులు, వినియోగదారులకు సమాచారం ఇచ్చారు. స్వచ్ఛంద సంస్థల నేతృత్వంలో 'సంచులతో రండి' అంటూ ప్రచారం చేస్తున్నారు. గతంలో ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారుల నుంచి పన్నులు వసూలు చేసేవారు. ఈ ఏడాది ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు.

జాతరలో వేరుసెనగ వ్యాపారులు

బాలుడిపై తోటి విద్యార్థుల దాడి

మైసూరు, న్యూస్‌టుడే: జయలక్ష్మీపురంలోని ప్రతిష్ఠిత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలుని (13)పై సహాధ్యాయులు దాడి చేశారు. క్లాస్ లీడరు ఉన్న బాలుడిపై ఆకతాయి విద్యార్థులు దాడి చేసి మర్మావయాలపై కొట్టడంతో అతని పరిస్థితి విషమించింది. బాధితుడ్ని చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. దాడి చేసిన పిల్లలపై బాలుని కోసం జయలక్ష్మీపురం రాణా పోలీసులు గాలింపు చేపట్టారు.

ఇంట్లోకి చొరబడిన కొండచిలువ

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: మారతహళ్లిలోని ఒక ఇంట్లోకి రాక్ పైథాన్ (కొండచిలువ) వచ్చింది. మొదట్లో దాన్ని రక్త పింజరిగా భావించారు. సమాచారం అందుకుని అక్కడకు వచ్చిన దొడ్డ బొమ్మసంద్రకు చెందిన 'స్నేక్ కార్తిక్' అక్కడకు వచ్చి కటురులో దాగిన కొండచిలువను బయటకు తీశారు. నగర మధ్య భాగంలో ఉన్న ఈ కొండ చిలువ ఇంటి ఆవరణ వరకు ప్రమాదం బారిన పడకుండా ఎలా వచ్చిందని స్థానికులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

పసికందును వదిలి వెళ్లారు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: వారం క్రితం జన్మించిన మగ బిడ్డను దొడ్డబళ్లాపుర సమీపంలోని తిరుమగొండనహళ్లిలో నిర్జన ప్రదేశంలో వదిలి వెళ్లారు. బిడ్డ ఏడుపును గుర్తించిన స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు అక్కడకు వచ్చి పరిశీలించగా, మగబిడ్డ కనిపించింది. బాబును చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అతని ఆరోగ్యం బాగుందని వైద్యులు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు త్వరలో బిడ్డను అప్పగిస్తామని దొడ్డబళ్లాపుర నగర రాణా పోలీసులు తెలిపారు.

ఇంట్లోకి ప్రవేశించి దాడి

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే: యలహంక మునేశ్వర లేఅవుట్‌లోని శ్రీనివాస్, ప్రమీళా దంపతుల ఇంటిపై 50 మంది యువకులు దాడి చేసి విధ్వంసానికి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న సామగ్రిని పగలగొట్టి, దంపతులపై దాడి చేసి వెళ్లారు. వీరంతా స్థానిక పేయింగ్ గెస్టుకు చెందిన యువకులని గుర్తించారు. వీరి పొరుగింట్లో ఉంటున్న కేరళకు చెందిన మోహన్, రక్షిత్ అనే మలయాళీలు ఉండే వారు. వారింట్లో వేడుక జరుగుతున్న సమయంలో కేకలు వేస్తుండగా, ప్రమీల అక్కడకు వెళ్లి వారిని మందలించింది. మోహన్, రక్షిత్‌ను ఆమె మందలింపును హెచ్చరికగా భావించి, పీజీలో ఉంటున్న మలయాళీ యువకులకు చెప్పడంతో దాడి జరిగిందని గుర్తించారు. దంపతుల ఫిర్యాదుతో యలహంక రాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కారాగారంలో మద్యంతో విందు

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్): పరప్పన అగ్రహారలో గంజాయి, ఫోన్లు సాధారణం అన్నట్లు పరిస్థితులు మారిపోయాయి. ఖైదీలకు రాజాతిథ్యం ఇచ్చిన ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో కొందరు ఖైదీలు మద్యం తాగి నృత్యం చేయడం, విందు చేసుకుంటున్న వీడియోలు బయటకు వచ్చాయి. రేణుకాచార్య హత్య కేసులో కారాగారంలో ఉన్న దర్శన్ సిగరెట్టు తాగుతూ, రౌడీలతో ముచ్చటిస్తున్న వీడియోలు బయటకు రావడంతో ఆయనను అప్పుడు బళ్లారి కారాగారానికి మార్చారు. బెయిలు రద్దు కావడంతో మళ్లీ పరప్పన అగ్రహార కారాగారానికి వచ్చిన ఆయనకు ఎలాంటి సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బంది పడుతున్నానని న్యాయస్థానం ముందు మొరపెట్టుకున్నాడు. కరుడు గట్టిన నేరగాడు ఉమేశ్ రెడ్డి, బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన కేసుకు సంబంధించి తరుణ్ రాజ్‌కు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్న వీడియోలు గతవారం వెలుగులోకి వచ్చాయి. వాటిపై దర్యాప్తు ప్రారంభమైన సమయంలోనే కొత్తగా కొన్ని వీడియోలు రావడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. తిలక్‌నగరలో పట్టుబడిన అనుమానిత ఉగ్రవాది జుహాద్ హమీద్ షకీల్ మరికొందరు పార్టీలు చేసుకుంటున్న వీడియోల్లో ఉన్నారు.

పోటుజలాల్లో మునిగి ఏనుగులు మృతి

రామనగర, న్యూస్‌టుడే: కనకపుర తాలూకా సాతనూరు అటవీ విభాగంలోని కున్నూరు వద్ద అరాకవతి నది వెనుకజలాల్లో పడి రెండు ఏనుగులు మృతి చెందాయి. నీటిపై తేలుతున్న ఏనుగు కళేబరాలను చూసి అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందజేశారు. నీటిలోకి దిగిన అనంతరం ఊబిలో చిక్కుకుని బయటకు రాలేక నీట మునిగి మరణించి ఉంటాయని అనుమానిస్తున్నారు. అటవీ శాఖ సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా మరణోత్తర పరీక్షలు చేసి కళేబరాలను ఖననం చేశారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు	
(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)	
బీన్స్-	100
క్యారెట్-	105
బీరకాయలు-	60
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	50
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	185
కాకర కాయలు-	50
టమాటా(నాటు)-	25
టమాటా(సాధారణ)-	20
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	25
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	185
బీట్‌రూట్-	55
వంకాయలు-	70
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	170
పండ్లు, ఫలాలు ధరలు	
వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	135
గ్రీన్ ఆపిల్-	295
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	65
బత్తాయి-	55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

నేటి నుంచి ఎఫ్ఎన్‌డబ్ల్యూఎఫ్-2025 సమావేశం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను గురించి చర్చించేందుకు ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు వైట్‌ఫీల్డ్‌లో ఫ్యూచర్ నెట్‌వర్క్ ఫోరమ్-2025 సమావేశం జరగనుంది. కేంద్ర విజ్ఞాన సాంకేతిక శాఖ కార్యదర్శి డాక్టర్ అభయ్ కరుణాధికర్‌తో పాటు గూగుల్, టీసీఎస్, వెర్‌లైస్, నేతాజిసుభాష్ సాంకేతిక విశ్వవిద్యాలయం, బెల్‌ల్యాబ్ తదితర సంస్థల ప్రతినిధులు సమావేశానికి హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఇంజినీరింగ్, విజ్ఞాన సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలు, పరిశోధనలు తదితర అంశాలపై చర్చించి తీర్మానాలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

ఏటా లోకాయుక్త ఆస్తి ప్రకటించాలి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: కర్ణాటక లోకాయుక్త, ఉప లోకాయుక్త, సిబ్బంది, ఏటా తన ఆస్తులను ప్రకటించే వ్యవస్థను జారీలోకి తీసుకురావలసిన అవసరం ఉందని ఎమ్మెల్సీ రమేశ్ బాబు పేర్కొన్నారు. దీనికి సంబంధించి చట్టంలో సవరణలు అవసరమని అన్నారు. ఇదే డిమాండ్‌తో తాను న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్‌కు లేఖ రాశానని చెప్పారు. లోకాయుక్త చట్టాలకు అనుగుణంగా చట్టసభ ప్రతినిధులు ప్రతి ఏటా తప్పనిసరిగా తమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను పంపించవలసి ఉంటుందని, అదే విధంగా లోకాయుక్త కూడా తమ ఆస్తులను ప్రకటించడం ద్వారా పారదర్శకతను మరింత కాపాడవచ్చని పేర్కొన్నారు.

కాల్పులు జరిపి అరెస్టు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: భూవ్యాపారి బాలప్పరెడ్డి, మాదేశ అనే వ్యక్తులను హత్య చేసి పరారీలో ఉన్న రవిప్రసాద్‌రెడ్డి అనే నిందితుడిపై హెబ్బగోడి రాణా పోలీసులు కాల్పులు జరిపారు. నిందితుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాడు. హత్య కేసులో అరెస్టు చేసి మహజరుకు బొమ్మసంద్ర శ్మశానవాటికకు తీసుకువచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌పై దాడి చేసి పరారయ్యేందుకు ప్రయత్నించిన నిందితుని కాళ్లపైకి ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్ కాల్పులు జరిపి పట్టుకున్నారు. ఎలక్ట్రానిక్ సిటీ విభాగం డీసీపీ నారాయణ్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కాళ్లలోకి రెండు తూటాలు వెళడంతో గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. నవంబరు ఆరున హెబ్బగోడికి చెందిన బాలరెడ్డిని అపహరించిన నిందితుడు తాను కోరినంత నగదు ఇవ్వలేదని గొంతు చీల్చి హత్య చేశాడు. ఈ నెల నాలుగో తేదీన మాదేశ్ అనే వ్యక్తిని కిత్తగానహళ్లిలోని ఇంట్లో హత్య చేశాడని నారాయణ్ తెలిపారు.

విరిగిన భీముని దంతం

హాసన: కొద్ది రోజులుగా గ్రామాలపై దాడులకు పాల్పడి, తోటలను ధ్వంసం చేస్తున్న భీమ ఏనుగును పట్టుకునే కార్యాచరణను అటవీ శాఖ అధికారులు కొనసాగించారు. రెండు కుమ్కీ ఏనుగులతో జరిగిన గొడవలో భీమ ఏనుగు దంతం ఒకటి విరిగిపోయింది. రక్తం కారుతున్నా, ఆగకుండా అడవిలోకి పరారైంది. దాన్ని గుర్తించి పట్టుకునేందుకు కార్యాచరణ కొనసాగించారు.

అనుమతి ఇవ్వని కేంద్రం

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: ఉత్తర కన్నడ జిల్లాలో శరావతి నదికి అడ్డుకట్ట కట్టి 2200 మెగావాట్ల పంప్ స్టోరేజ్ జల విద్యుత్తు పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే పర్యావరణానికి హాని కలుగుతోందని పర్యావరణవేత్తలు గత కొంత సమయంగా ఆందోళన చేస్తూ వస్తున్నారు. ప్రాజెక్టుకు కేటాయించిన భూమి అన్యుల పాలయ్యే అవకాశం ఉందని, పర్యావరణ, అటవీ నిబంధనలు గాలికి వదిలివేశారంటూ గత కొద్ది నెలలుగా పర్యావరణవేత్తలు చేస్తున్న ఆందోళనకు కేంద్రం ఇచ్చిన ఆదేశాలు ఊరట కలిగించాయి.

కొనసాగుతున్న వాగ్యుద్ధం

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: సంఘపరివార్‌ను ప్రారంభించిన సమయంలో దేశంలో బ్రిటిష్ పాలన ఉందని, అందుకే తమ సంఘాన్ని రిజిస్టరు చేసుకోలేదని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ పేర్కొన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సంఘ పరివార్ కార్యకర్తలు కూడా పోరాటం చేశారని చెప్పారు. ఆదివారం ఇక్కడ కొందరు విలేకరులతో మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పేరు నమోదు చేసుకోవలసిన అవసరం కూడా రాలేదన్నారు. ఆదాయ పన్ను శాఖ కూడా తమను గుర్తించి, పన్ను చెల్లించాలని సూచించిందన్నారు. వచ్చే ఆదాయం వివరాలను ప్రతి ఏటా దాఖలు చేసి, పన్నులు చెల్లిస్తున్నామని చెప్పారు. తమ సంఘం రిజిస్టరు కానట్లే హిందూ మతం కూడా ఎక్కడా పేరు నమోదు చేసుకోలేదని వివరించారు. సంఘానికి భగవాధ్వజమే గుర్తింపు అని, అందుకే తమ కార్యాలయాలపై దాన్ని ఎగురవేస్తామని తెలిపారు. జాతీయ పతాకంగా భగవాధ్వజాన్ని ఉంచాలని తాము మహాత్మునికి ప్రతిపాదించగా, ఆయన అంగీకరించలేదన్నారు. దీనితో తాము జాతీయ పతాకాన్ని అంగీకరించి, గౌరవిస్తూ వస్తున్నామని తెలిపారు. హిందువులు ఎవరైనా సంఘ పరివార్‌లో చేరవచ్చని, ఇతర ధర్మాలకు చెందిన వారు తమతో కలిసి వస్తే ముందుగా తమ ధర్మాన్ని పక్కన పెట్టి, భారత మాత బిడ్డలుగా ఉంటామని ప్రమాణం చేయవలసి ఉంటుందని తెలిపారు. పాకిస్థాన్‌తో ప్రతిసారీ శాంతిని కోరుకుంటూ వస్తున్నా, వారు మాత్రం కయ్యానికి కాలుదువ్వుతూ వస్తుంటారని అందుకే వారిని కట్టడి చేయాలని కోరుకుంటామని తెలిపారు. మనదేశంతో 1971లో చేసిన యుద్ధంలో పాకిస్థాన్ 90 వేల మంది సైనికులను కోల్పోయినా దాని బుద్ధి మారలేదని, ఏదో ఒక రోజు వారికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

● భాగవత్ ఇచ్చిన వివరణను మంత్రి ప్రియాంక్ ఖర్గే ఖండించారు. తాను అడిగే పదకొండు ప్రశ్నలకు బదులివ్వాలని కోరారు. స్వయం సేవకులు ఎవరు, వారిని ఎలా గుర్తిస్తారు, వారు విరాళం ఇస్తారా, దాన్ని ఎలా స్వీకరిస్తారు, పారదర్శకంగా పని చేస్తే సంఘం పేరును ఎందుకు నమోదు చేసుకోలేదు, పూర్తిస్థాయిలో పని చేసే వారు ఉంటారా, మీ కార్యకలాపాలకు వచ్చే నిధులకు సంబంధించిన వివరాలు ఎక్కడ ఉంటాయి, మౌలిక సదుపాయాలను ఎవరు కల్పిస్తారు, ప్రతి ధార్మిక సంస్థ తమ ఆర్థిక లావాదేవీలను పారదర్శకంగా ఉంచాలన్న నిబంధన మీకు వర్తించదా అని ప్రశ్నించారు. పారదర్శకత కాపాడుకుంటూ వస్తే తాను కూడా ఆర్ఎస్ఎస్‌కు విరాళం ఇస్తానని పేర్కొన్నారు.

ప్రియాంక్ ఖర్గే

నవంబరు వచ్చినా కుర్చీ దక్కలేదు

● డీకేపై భాజపా ఫన్నీ వీడియో

ఇంటర్నెట్ డెస్క్: కర్ణాటకలో కొంతకాలంగా సీఎం మార్పుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇటీవల తన తండ్రి రాజకీయ భవిష్యత్తుపై సీఎం సిద్ధరామయ్య కొడుకు చేసిన వ్యాఖ్యలతో ఈ వార్తలు మళ్లీ తెరపైకి వచ్చాయి. దీంతో నవంబరులో సీఎం మార్పు ఉండొచ్చన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీఎం మార్పు ప్రక్రియపై కర్ణాటక రాష్ట్ర భాజపా యూనిట్ వ్యంగ్యంగా విమర్శలు గుప్పించింది. నవంబరు వచ్చినా డీకేకు సీఎం సీటు మాత్రం దక్కలేదని పేర్కొంటూ హాస్యభరిత (ఫన్నీ) ఏఐ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది.

వీడియోలో ఏముందంటే..

భాజపా పోస్టు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారిత వీడియోలో డీకే శివకుమార్, రాహుల్ గాంధీకి వాట్సాప్‌లో హాయ్ అనే సందేశం పంపగా.. ఒకే దగ్గర ఉన్న రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య దానిని చూసి నవ్వుకుంటారు. తర్వాత వారు డీకేకు హాయ్ అని సందేశం పంపి.. ఓ స్క్రాచ్ కార్డును పంపుతారు. తనకు ఏదో శుభవార్త చెప్పారనే ఆనందంతో డీకే దానిని స్క్రాచ్ చేయగా..'నో ఛైర్ నవంబరు' అనే సందేశం చూసి షాక్ అవుతారు. దీంతో రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య నవ్వుకుంటారు. అనంతరం స్క్రీన్‌పై హస్కీ డ్యాన్స్‌ను దీనికి జోడించారు. భాజపా ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. శివకుమార్‌కు ఇది కుర్చీలేని నవంబరు అని వ్యంగ్యాస్త్రాలు విసిరింది.

డీకే శివకుమార్

రెండున్నరేళ్ల అనంతరం ముఖ్యమంత్రి పీఠంలో మార్పు ఉంటుందని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా దాన్నే విశ్వసిస్తున్నారు. ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య బాధ్యతలు చేపట్టి నవంబరు చివరికి రెండున్నరేళ్లు పూర్తవుతుండడంతో ఈ నెలలోనే అధికార మార్పిడి ఉంటుందనే వార్తలు జోరందుకున్నాయి. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రినని ప్రస్తుత సీఎం సిద్ధరామయ్య చెబుతున్నా.. తన చేతుల్లో ఏమీ లేదని డీకే శివకుమార్ అంటున్నా దీనిపై ఇప్పటికీ పలు ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే, సిద్ధరామయ్యను గద్దె దించితే పార్టీ రెండుగా చీలిపోతుందని అధిష్ఠానం భయపడుతోంది. ఈ పరిణామాల వేళ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

EENADU Classifieds

JOBS

Experienced South Indian Cook is Required for a Hotel/ Restaurant in Raipur, Chhattisgarh to make tiffins, Coffee, tea etc. Good salary. Free accommodation, food and free educations for their children will be provided. Con: 9425296305, 9329027580.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ప్రేమం మధురం ప్రేమం అమరం టీజర్ రాక

కన్నడ చిత్రసీమకు 'ప్రేమం మధురం ప్రేమం అమరం' చిత్రం ద్వారా నూతన నటులు పరిచయం కానున్నారు. కొత్తనటులతో నిర్మిస్తున్న చిత్రం టీజర్ ఇటీవల విడుదల కావడంతో ప్రేక్షకుల నుంచి ఉత్తమస్పందన వచ్చిందని దర్శకుడు గాంధీ ఎ.బి. తెలిపారు. మూడు పాటలకు విశాల్ అలాప సంగీతం అందించారు. యుక్త వయస్సులో కళాశాల సమయంలో యువతీ, యువకులు ఏర్పడే ప్రేమ అనంతరం ప్రేమికులు ఎదుర్కొన్న కష్టాలు ఎలా ఉంటాయనేది చిత్రకథ అని దర్శకుడు తెలిపారు. గాంధీ, ఐశ్వర్యదినేశ్, అనుషాజైన్, సిహికహిచంద్రు, రాజేశ్వరి, లపంగ్‌రాజ్, అనూప్ అగస్త్య తదితరులు నటిస్తుండగా అరగూండశేఖర్‌రెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

చిత్రటీజర్ విడుదల కార్యక్రమంలో గాంధీ, ఐశ్వర్యదినేశ్, అనుషాజైన్ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర) న్యూస్‌టుడే

డిసెంబరులో మైనేమ్ ఈజ్ కేడీ

బాలుడు సాయం కోసం ఎమ్మెల్యే వద్దకు వెళ్లిన తరువాత జరిగిన సంఘటనలు ఆధారంగా ఎస్ఎస్‌కేబీ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'మై నేమ్ ఈజ్ కేడీ' చిత్రం డిసెంబరులో విడుదలకు సిద్ధమవుతోంది. హాస్యభరితమైన చిత్రమని, బాలుడు ఆఖరికి ఎలా ఎమ్మెల్యే అవుతారన్న అంశాన్ని తెరపైకి చూస్తే థ్రిల్‌గా ఉంటుందని దర్శకుడు కేజే చిక్కు తెలిపారు. కనకపుర, హెసరుఘట్ట, ఆనేకల్ తదితర ప్రాంతాల్లో వివిధ సన్నివేశాలను చిత్రీకరించారు. ఆర్యన్‌వెంకటేశ్, భవాని, హొన్నహళ్లికృష్ణ, గిరీశ్‌జత్తి, విశ్వ, యతిరాజ్, అరసు మహారాజ్, సుప్రీత్‌కాటి, రోహిణి, మాస్టర్ లక్ష్ తదితరులు నటిస్తున్నారు.

మై నేమ్ ఈజ్ కేడీచిత్ర బృందం

ఇనియన ఆత్మ పాటలు వచ్చాయ్

కోలారుజిల్లాలకు చెందిన మంది నటులు కలిసి నిర్మిస్తున్న 'ఇనియన ఆత్మ' చిత్రం పాటలను ఇటీవల విడుదల చేశారు. వినాయక వెంకటేశ్వర ఫిలిమ్స్ బ్యానర్‌పై బి.కళావతి నిర్మిస్తున్నారు. ఏడుగురు పర్యాటక యాత్ర చేపడతారు. ఆ సమయంలో నెలకొన్న సమస్యలు ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు నరేశ్ సిద్ధఘట్ట తెలిపారు. కోలారు, చిక్కబళ్లాపుర ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరించారు. సిద్ధార్థహరి, నిశారెడ్డి, కోలారుసూర్య, రాజ్‌వీర్, కిట్టితాళికోటె, ఆదిమధుగిరి, సుశ్మిత, నయన తదితరులు నటిస్తున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఇనియన ఆత్మ చిత్రం నటీనటులు

1979 చిత్రం పోస్టర్ విడుదల

ప్రముఖ సినీనటుడు చేతన్ '1979' చిత్రం పోస్టర్ విడుదల చేశారు. మనం మూవీస్‌మేకర్స్ బ్యానర్‌పై డాక్టర్ బి.ఎం.శ్రీనివాస్, బీరమానహళ్లి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 1904 నుంచి 1979 మధ్యకాలంలో పశ్చిమబెంగాల్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు పుష్పరాజ్ తెలిపారు. సమాజంలో ఓ వర్గం ఏవిధంగా తమ రక్షణ కోసం పోరాడుతుందనే అంశాన్ని తెరపై చూపిస్తున్నట్లు తెలియజేశారు. అజ్జు, ప్రాణ్వి, సుజిత్, అమృత, దుర్గ, ప్రీతి, తక్షరామ్, నిరంజన్ తదితరులు కలిసి నటిస్తున్న ఈ చిత్రానికి జస్వంత్ పసుపులేటి సంగీతం అందిస్తున్నారు.

సినీనటుడు చేతన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న 1979 చిత్రం నటీనటులు, తదితరులు

(c) eenadu

బెంగళూరు
● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

మంగళాదేవి దేవస్థానంలో లక్ష దీపోత్సవం

మంగళమాత దివ్యరథం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : ఈనెల 19న పరంపరా క్షేత్రమైన మంగళూరులో మంగళాదేవి లక్షదీపోత్సవాలను భారీఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైవిధ్యమైన దివ్యదీపాలయ్యు భవ్యమైన రథంలో దేవతామూర్తి విహరిస్తుంది. రథం పై భాగం ఎంతో సుందరంగా తీర్చిదిద్దుతూ ఉంటుంది. ఇలాంటి రథం రాష్ట్రంలో ఇదే ప్రథమం. రథంలో అమ్మవారిని కూర్చోబెట్టి ప్రత్యేక పూజలు చేసి ఊరేగిస్తారు. లక్ష దీపోత్సవాల వీక్షణకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారు.

కమ్మగుండనహళ్లిలో కనకదాసు జయంతి

కమ్మగుండనహళ్లిలో నిర్వహించిన కనకదాసు జయంతిలో మాజీ సీఎంసీ అధ్యక్షుడు కె.సి.అశోక్ పాల్గొన్నారు. ఆయన కనకదాసుల చిత్రపటానికి పూల మాల సమర్పించి నివాళులర్పించారు. కనకదాసుని సేవలను ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, భారతీ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, బెంగళూరు (కెంగేరి)

హో సూ రు క బు ర్లు

ఎమ్మెల్యే, మేయర్‌ను ప్రశంసించిన ముఖ్యమంత్రి

స్టాలిన్‌కు నమస్కరిస్తున్న హోసూరు నాయకులు

హోసూరు, న్యూస్‌టుడే : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అందుకు కార్యకర్త స్థాయి నుంచి ఎమ్మెల్యేలు, మంత్రుల వరకు కృషి చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్దేశించారు. హోసూరు డీఎంకే నాయకులు ముఖ్యమంత్రిని కలిసి పార్టీ వ్యవహారాలపై చర్చించారు. బలహీనంగా ఉన్న జిల్లా కార్యదర్శులను స్టాలిన్ హెచ్చరించారు. హోసూరు యూనియన్ కార్యదర్శి డాక్టర్ లోకేశ్‌రెడ్డి స్టాలిన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ ఎస్.ఎ.సత్యల పనితీరును ముఖ్యమంత్రి ప్రశంసించి అభినందించారు.

అలంకారంలో కుంభేశ్వరుడు

మహిళా భక్తులు

వైభవంగా లలితా సహస్రనామ పారాయణం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు పట్టణం కంబారపేటలోని కుంభేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయంలో మహా లలిత సహస్రనామ పారాయణం మహిళా భక్తుల నేతృత్వంలో వైభవంగా కొనసాగింది. శివపార్వతులను ఆకర్షణీయంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యం

సమావేశంలో మాట్లాడుతున్న సుందరమూర్తి

వేపనపల్లి, (బేకెఠ), న్యూస్‌టుడే : భాజపాతోనే అభివృద్ధి సాధ్యమని, వేపనపల్లి నియోజకవర్గ ప్రజలు 2026లో జరిగే ఎన్నికల్లో భాజపాను ఆదరించి గెలిపిస్తే ఉచిత సంక్షేమ పథకాలు పొందవచ్చని కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి కె.సుందరమూర్తి పేర్కొన్నారు. వేపనపల్లి సమీపంలోని కుందారపల్లిలో భాజపా నియోజకవర్గం కార్యాలయంలో బూత్ ఏజెంట్లు, కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సీనియర్ నాయకుడు డాక్టర్ అన్బురసన్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో భాజపా అభ్యర్థుల విజయానికి సహకరించాలని నాయకులు పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మునిరాజు, డాక్టర్ ఎన్.వరదరాజన్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త చిక్కులకు.. చక్కటి కిటుకు


ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పని చేసే కేంద్రంలో సీనియర్ ఇంజినీర్లు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: చెత్త నుంచి విద్యుత్తు ఉత్పాదన ప్రారంభం కావడంతో నగరంలో చెత్త సమస్య నిదానంగా అదుపులోకి వస్తుంది. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ), కేపీసీఎల్ కలిసి బిడది వద్ద 11.5 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నగరంలో పోగవుతున్న ఆరువేల టన్నుల చెత్తలో 15 వందల టన్నుల పొడి చెత్త విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని తరలిస్తున్నారు. అందులో నిత్యం ఆరువందల టన్నులు విద్యుత్తు ఉత్పత్తికి వినియోగిస్తున్నారని బెంగళూరు చెత్త నిర్మూలన నిర్వహణ ప్రాధికార సీఈవో కరిగౌడ తెలిపారు. ఐదు నగరపాలికెలు పొడి చెత్తను బిడది విద్యుత్తు కేంద్రానికి సరఫరా చేస్తున్నాయి. మండూరు చెత్త డంపింగ్ యార్డులో ఉన్న చెత్తలో నాలుగు వందల టన్నుల చెత్తను ఈ కేంద్రానికి సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారు. రెండు సంస్థలు కలిసి రూ. 314.74 కోట్ల వ్యయంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించాయి. ప్లాస్టిక్, పొడి చెత్తతో విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నామని కేపీటీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ కేంద్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్తును 25 వేల ఇళ్లకు 24 గంటలు సరఫరా చేసే సామర్థ్యం ఉంది. చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం రాష్ట్రంలో మొదటిది. వాయు, నీటి మాలిన్యం నియంత్రించే అవసరం ఉందని ఆయన తెలిపారు. కేంద్రంలో విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోకుండా పొడి చెత్త ఆరునెలలపాటు నిల్వ చేసుకుంటున్నట్లు తెలిపారు.

కేంద్రంలో చెత్త నిల్వలు

18 వేల గుంతలు పూడ్చివేత

వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ కమిషనర్, అధికారులు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : నగర రహదారుల్లో పడిన గుంతలు పూడ్చివేతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) చీఫ్ కమిషనర్ మహేశ్వర్‌రావు తెలిపారు. ఆదివారం ఐదు నగర పాలికె కమిషనర్లు, చీఫ్ ఇంజినీర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగర వ్యాప్తంగా ఇప్పటి వరకు 18 వేల గుంతలు పూడ్చామని, ఇంకా మూడు వేల గుంతలను పూడ్చాల్సిన అవసరం ఉందన్నారు. నగర శివార్లలోని రహదారుల మరమ్మతులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు బాగా పాడైన రహదారులను సిమెంట్ దారులుగా మార్చుతున్నామని, గుంతల సమస్య దాదాపు అదుపులోకి వస్తుందని తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల్లో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు గుర్తు చేశారు. గుంతల గురించి వచ్చే ఫిర్యాదులు నానాటికీ తక్కువవుతున్నట్లు తెలిపారు. మిగతా గుంతలను పది రోజుల్లో పూడ్చుతామని, దాంతో పాటు తారు పనులు కూడా ప్రారంభించినట్లు చీఫ్ కమిషనర్ వివరించారు.

ఉదయోన్ముఖ నృత్య ప్రదర్శన

నగరంలోని నృత్యదిశా ట్రస్టు నృత్య శిక్షణా సంస్థ విద్యార్థినుల నృత్య ప్రదర్శన నృత్యాభిమానులను అలరించనుంది. ఈ సంస్థ డైరెక్టర్ దర్శినీ మంజునాథ్ శిక్షణలో ఆరితేరిన ఆర్.అమూల్య, ఎమ్.దర్శిని, డి.మౌల్య, ఎస్.శ్రీనిధి తమ కళా పాటవాలను వేదికపై అలరించనున్నారు. కళాగ్రామ ఆడిటోరియంలో సోమవారం జరిగే ఈ సుందర నాట్య ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా జనావనీ విద్యామందిర్ డైరెక్టర్ పద్మా, ఎస్‌డబ్ల్యూ మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ నాగశ్రీ శ్లోక, విదుషి వందనా ఎస్ ప్రభు, కళాకృత సంస్థ ఫౌండర్ అపూర్వ ముక్తాలికలు పాల్గొంటారని దర్శినీ మంజునాథ్ తెలిపారు.
- న్యూస్‌టుడే, బెంగళూరు (సాంస్కృతికం)

వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలి

సి.హెచ్.పాళ్యలో జయంతి ప్రారంభిస్తున్న స్వామీజీ, ప్రముఖులు

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని సి.హెచ్.పాళ్య, బ్యాడనూరు గ్రామాల్లో ఆదివారం వాల్మీకి జయంతిని వైభవంగా జరుపుకొన్నారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వెళ్లి వాల్మీకి విగ్రహానికి ప్రదక్షిణలు చేశారు. నిడిగల్లు ఆశ్రమ పీఠాధ్యక్షుడు వాల్మీకి సంజయ్ కుమార్ స్వామీజీ మాట్లాడుతూ వాల్మీకి సముదాయ ప్రజలు తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. శ్రీరాముడు ఆంజనేయుడితో సమానంగా వాల్మీకిని పూజించాలని నాయకుడు చకువేలి రాజణ్ణ తెలిపారు. జిల్లా నాయకుడు కపూరు రంగప్ప గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో అఖిల కర్ణాటక వాల్మీకి నాయక మహాసభ జిల్లా అధ్యక్షుడు పాళెగార్ లోకేశ్, వాల్మీకి జాగృతి వేదిక నిడిగల్లు హోబళి అధ్యక్షుడు ఓంకారనాయక, మదకరి నాయక బ్యాంకు అధ్యక్షుడు అంజన్ నాయక, ఉపాధ్యక్షుడు బళ్లేనహళ్లి రామణ్ణ, విశ్రాంత సైనికుడు అనంతయ్య, గ్రామ పంచాయతీ సభ్యులు సంజీవప్ప, ఆనందప్ప, గ్రామపెద్దలు స్వర్ణ వెంకటేశ్, భీమప్ప, హనుమంతరాయ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడనూరులో జ్యోతులు మోస్తున్న మహిళలు

పుస్తకాలను విడుదల చేస్తున్న ప్రముఖులు, రచయితలు

పుస్తక పఠనం తగ్గింది

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలో అంకిత పుస్తక ప్రచురణ సంస్థ బుక్ బ్రహ్మ సంస్థ సహకారంతో ఆరుగురు ప్రముఖ రచయితల రాసిన ఆరు పుస్తకాలను విడుదల చేసింది. బనశంకరి రెండో స్టేజీలోని సుచిత్రా ఫిల్మ్ ఆడిటోరియంలో గణనన కృష్ణ-కరిరంత కవే, ప్రతిభానందకుమార్-జెన్మి, బెక్కే, ముద్దు తీర్థ-ప్రవాసి, ప్రవీణ్-పద్య ఇప్పొట్టెల ఆదర హేగె స్వామి, బేలూరు రామమూర్తి-అవళి ఎంబ మాయె, శరత్‌భట సెరాజ్-హుచ్చు మనస్సిన పెచ్చు ముఖగళు, సదాశివ సొరటూరు-హగలెందరే బెళకల్ల పుస్తకాలను సాహిత్యకారుడు జోగి, తదితరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాల విక్రయాలు జరుగుతున్నా..వాటిని చదివేవారు తక్కువగా ఉన్నట్లు గుర్తు చేశారు. రచయితలు పాఠకుల కోసం వెతికే పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిలు పాత్రికేయుడు ఎన్.ఎస్.శ్రీధరమూర్తి, పాత్రికేయురాలు టీనా శశికాంత పుస్తకాల గురించి వివరించారు.

క్రీడలు, క్రీడాకారులకు పెద్దపీట

విజేతలతో మంత్రులు పరమేశ్వర్, దినేశ్‌గుండూరావు, గోవిందరాజు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : క్రీడారంగంలో మనం కొత్త కర్ణాటకను చూస్తున్నామని, కర్ణాటక ఒలింపిక్ సంఘం క్రీడాకారుల ప్రతిభలను ప్రోత్సహించేందుకు కొత్త వేదికను ఏర్పాటు చేసినట్లు హోం మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర తెలిపారు. ఆదివారం సాయంత్రం రాష్ట్ర యువజన సేవా క్రీడాశాఖ, కర్ణాటక క్రీడాప్రాధికార, కర్ణాటక ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కర్ణాటక క్రీడోత్సవాల ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పరమేశ్వర పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, క్రీడాకారులు కూడా చక్కని ప్రతిభను చూపాలన్నారు. మంత్రి దినేశ్‌గుండూరావు మాట్లాడుతూ ఈ క్రీడోత్సవాలు యువ క్రీడాకారులకు చక్కని వేదికైందన్నారు. క్రీడల్లో సాధించిన ప్రతిభతో ఉద్యోగ రాయితీ పొందవచ్చునన్నారు. సిద్ధరామయ్య నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కఠోర శిక్షణతో తమ కలలను సాకారం చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. కర్ణాటక ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.గోవిందరాజు మాట్లాడుతూ నాలుగో మినీ కర్ణాటక గేమ్స్ చక్కని యశస్సును సాధించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదువేల మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. 27 విభాగాల్లో జరిగిన ఈ క్రీడోత్సవాలు కంఠీరవ, నగరంలోని పలు ప్రాంగణాల్లో జరిగినట్లు వెల్లడించారు. పోటీల్లో బెంగళూరు జట్టు 135 బంగారు, 128 వెండి, 141 కాంస్యపతకాలను సాధించి అగ్రస్థానంలో నిలిచారు. బెళగావీ క్రీడాకారులు వంద పతకాలు, మైసూరు క్రీడాకారులు 57 పతకాలను సాధించారు. ఉత్తర కన్నడ జిల్లాకు చెందిన టి.పూర్వి బాలికల విభాగంలో ఉత్తమ క్రీడాకారిణిగా, బాలుర విభాగంలో ఉడుపికి చెందిన ప్రకుల్ ఆర్.కుందర్ బెస్ట్ అథ్లెట్‌గా వ్యక్తిగత బహుమతులు అందుకున్నారు. ముగింపు వేడుకల్లో క్రీడాప్రాధికార ఉపాధ్యక్షుడు సి.ఎస్.అరుణ్‌మాచయ్య, క్రీడాశాఖ కమిషనర్ ఆర్.చేతన్, నవీన్‌రాజ్‌సింగ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ముగింపు వేడుకల్లో విజేతల సందడి

కొనసాగుతున్న రైతుల ఆందోళన

బెళగావి : టన్ను చెరకుకు రూ.3500 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు తమ ధర్నాను కొనసాగించారు. ప్రభుత్వం రూ.3300 ఇచ్చేందుకు అంగీకరించగా, తమకు ఆ మొత్తం సరిపోదని మరో రూ.200 పెంచాలని రైతులు డిమాండ్ చేశారు. ముధోళలోని సంగొళ్లి రాయణ్ణ కూడలిలో వందలాది మంది రైతులు ఆందోళనకు దిగారు. మొలాసిస్, ఇతర అనుబంధ ఉత్పత్తులపై లాభాలు వస్తుండగా, ఆ మొత్తం తమకు ఇచ్చేందుకు అభ్యంతరం ఏముందని ప్రశిస్తూ నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు.

పొలాల్లో సంచరిస్తున్న ఎలుగుబంటి

కరియమ్మనపాళ్యంలో ఎలుగుబంట్ల సంచారం

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని కరియమ్మనపాళ్య గ్రామం అనగానే ఎలుగుబంట్లు గుర్తుకొస్తాయి. ఈ గ్రామంలో ఎలుగుబంట్లు పలుమార్లు ప్రజలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సందర్భాలు అనేకం. గ్రామానికి సమీపంలో దట్టమైన అడవి ఉండడంతో సాయంత్రం కొండల్లో నుంచి కిందికొస్తాయి. గతచ నెలలో పొలం కాపలాకు వెళుతున్న రైతు ఈరణ్ణపై దాడి చేయడంతో ఆయన ఇప్పటికీ తుమకూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం ఉదయమే గ్రామంలో ఎలుగుబంటి గ్రామస్తులకు కనిపించింది. గొర్రెల కాపరులు, పొలాలకు వెళ్లే రైతులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పనులు చేసుకొంటున్నారు. అటవీశాఖ అధికారులు తగు చర్యలు తీసుకొని ఎలుగుబంట్లు సంచరించకుండా నివారించాలని గ్రామానికి చెందిన ఓంకారనాయక విజ్ఞప్తి చేశాడు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామచంద్రన్

డీఎంకే మిత్రపక్షాలదే విజయం

హాజరైన సీపీఐ కార్యకర్తలు, ప్రజలు

డెంకణీకోట, న్యూస్‌టుడే : భాజపా మతవాద రాజకీయాన్ని ఓడించి, సమానత్వాన్ని పెంపొందించాలని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు, తళి ఎమ్మెల్యే రామచంద్రన్ పలుపునిచ్చారు. ఆదివారం డెంకణీకోటలో జరిగిన నవంబర్ విప్లవం మహాసభ జరిగింది. మహోన్నత పాఠశాల నుంచి బస్సు నిలయం వరకు భారీ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా రామచంద్రన్ మాట్లాడుతూ రష్యాలో 1917 నవంబర్ 7న కార్మికులకు వ్యతిరేక ప్రక్రియ మొదలైందన్నారు. ఇదే నవంబర్ విప్లవం అన్నారు. ఈ కార్యక్రమాన్ని దేశమంతటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రారంభంలోనే ఓడిపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం మహాసభ నిర్వహించడానికి డిపాజిట్లు కట్టాలని నిబంధన పెట్టడాన్ని సీపీఐ వ్యతిరేకిస్తోందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో డీఎంకే మిత్రపక్షాలే గెలుస్తావని ధీమా వ్యక్తం చేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ సీపీఐ పార్టీ వందేళ్ల సంబరాలు జరుపుకుంటోందని, ఖమ్మంలో జరిగే వేడుకలకు ఇక్కడి నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప కార్యదర్శి రవి, లగుమయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు సుందరవల్లి, జిల్లా కౌన్సిలర్లు పళణి, బూదయప్ప, చిన్నస్వామి, మాదయ్యన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మినీ కర్ణాటక గేమ్స్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కంఠీరవ క్రీడాప్రాంగణంలో జరుగుతున్న నాలుగో కర్ణాటక మినీ గేమ్స్. బాస్కెట్‌బాల్ బాలుర విభాగంలో ఎంసీహెచ్‌ఎస్, బాలికల గ్రూపులో బీగల్స్ జట్లు ఛాంపియన్స్‌గా నిలిచి బంగారు పతకాలను సాధించాయి. ఫైనల్ పోటీలో వరుస విజయాలను సాధించిన ఎంసీహెచ్‌ఎస్ జట్టు ఐదు పాయింట్ల తేడాతో సదరన్ బ్లూస్‌పై గెలుపొందింది. బాలికల గ్రూపులో బీగల్స్ జట్టు 51-31 పాయింట్ల తేడాతో మండ్య జట్లపై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకొంది. హాకీలో బాలుర గ్రూపులో హాసన్ జట్టు 4-0 గోల్స్‌తో బళ్లారి జట్టుపై గెలుపొంది బంగారు పతకాన్ని చేజిక్కించుకుంది.

ప్రభుత్వ కళాశాలకు బంగారు పతకం

విజేతలతో ప్రిన్సిపల్, తదితరులు

చిత్రదుర్గం: దావణగెర విశ్వవిద్యాలయం నిర్వహించిన 14వ అంతర కళాశాలల అథ్లెటిక్స్ పరుగు పోటీలో ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ రవికాంత్ తెలిపారు. ఆదివారం కళాశాలలో గెలుపొందిన విద్యార్థినులు హర్షిత, సుచిత్ర, అనురాధ, లక్ష్మీ, రేవతిలను అభినందించారు. మహిళలకు క్రీడారంగంలో ఎన్నో అవకాశాలను ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువతులు ధైర్యంగా సాధన చేస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చునన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువతా.. ఆరోగ్యం జాగ్రత్త

చిత్రదుర్గం: పంటల సాగులో రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులతో పండించిన ఆహారం వల్ల తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని ఎమ్మెల్సీ కేఎస్ నవీన్ పేర్కొన్నారు. ఆదివారం ఇక్కడ స్వదేశీ జాగరణ మంచ్ చేపట్టిన జనజాగృతి జాతాను ప్రారంభించి మాట్లాడారు. జంక్ ఫుడ్‌కు ఇష్టపడే యువత నేడు ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోక పోవడంతో వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. స్వదేశీ వస్తువుల వినియోగం, స్థానిక, సేంద్రియ ఎరువులతో పండించిన ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లను వాడాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్కే బసవరాజన్, జడ్పీ మాజీ అధ్యక్షురాలు సౌభాగ్య, కార్యదర్శి సంపత్‌కుమార్, వెంకటేశ్ యాదవ్, శశికళ, రేఖ, బసమ్మ పాల్గొన్నారు.

జాతాను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్

క్రీడలతో శారీరక దృఢత్వం, స్వీయరక్షణ

పోటీలను ప్రారంభిస్తున్న శోభాకరంద్లాజే, తదితరులు

బెంగళూరు (బ్యాటరాయణపుర), న్యూస్‌టుడే : ఆటలతో క్రీడాకారుల్లో శారీరక దృఢత్వంతో పాటు స్వీయరక్షణ పొందవచ్చని కేంద్ర మంత్రి శోభాకరంద్లాజే తెలిపారు. దొడ్డబొమ్మసంద్ర పార్కులో ఆమె క్రీడోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. జె.పి.పార్కు తైక్వాండో శిక్షణ కేంద్రంలో తర్ఫీదు పొందుతున్న క్రీడాకారులను అభినందించారు. తైక్వాండో వల్ల భవిష్యత్తులో ఉపయోగాలు ఉంటాయన్నారు. శిక్షకుడు సి.పి.పెంచలయ్యను మంత్రి అభినందించారు. పెంచలయ్య మాట్లాడుతూ టోర్నమెంట్‌లో ప్రతి క్రీడాకారుడు చక్కని ప్రతిభ చూపాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు, శిక్షకులు పాల్గొన్నారు.

ఏడుగురు నిందితుల అరెస్ట్

ముళబాగిలు: ముళబాగిలు, శ్రీనివాసపుర, రాయల్పాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన కేసులను పోలీసులు భేదించారు. ఆంధ్రప్రదేశ్‌లోని వి.కోటకు చెందిన సుబ్రమణి (28) అరుణ్ (25)లను అరెస్టు చేసి ద్విచక్ర వాహనం, రూ.10 లక్షల విలువైన 105 కిలోల గంధపు చెక్కలు స్వాధీనం చేసుకున్నారు. రైతుల నుంచి ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని విక్రయిస్తున్న ముళబాగిలు తాలూకా మండికల్ గ్రామానికి పురుషోత్తం రెడ్డి (41)ని అరెస్టు చేసి 10 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాసపుర పరిధిలో జరిగిన మూడు సంఘటనలలో చింతామణి, మొగలహళ్లికి చందిన ప్రేమ్‌కుమార్(19), బాబా(27) విజయ్(29) రోజా(36)లను అరెస్ట్ చేసి 171 గ్రాముల బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ నిఖిల్ తెలిపారు.

జాగృతి జాతాకు చక్కని స్పందన

జాతాను ప్రారంభిస్తున్న సీమంత్‌కుమార్, ప్రతినిధులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : 'యాంప్యుటేషన్ రహిత భారత్' పేరిట జాగృతి కల్పించేందుకు ఆదివారం ఇక్కడ నిర్వహించిన వాస్కార్ వాకథాన్ 2025కు చక్కని స్పందన లభించింది. నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్‌తో కలిసి సంఘం ప్రతినిధులు జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్ణాటక వాస్క్యులార్ సర్జన్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె.వెంకటేశ్‌రెడ్డి మాట్లాడుతూ సకాలంలో వైద్య పరీక్షలు, వ్యాయామం తదితరాలతో కాళ్లను, ఇతర అవయవాలను తొలగించుకోవలసిన అవసరం లేదని తెలిపారు. స్వాతంత్ర ఉద్యానం నుంచి విధానసౌధ వరకు నిర్వహించిన జాతాలో 500 మందికి పైగా వాస్క్యులార్ సర్జన్లు, వైద్యులు విష్ణు, ఎన్.మురళీ కృష్ణ, సుదర్శన్ బళ్లాల్, రాజీవ్ గాంధీ వైద్య విశ్వ విద్యాలయం బీసీ భగవాన్, ఔషధ రంగ నిపుణులు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతకు దోహదం

ప్రదర్శనను పరిశీలిస్తున్న అశోక్, తదితరులు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : విద్యార్థుల్లో నిద్రాణమై ఉన్న ప్రతిభను వెలికితీయడానికి విజ్ఞాన ప్రదర్శనలు ఉపకరిస్తాయని అశోక్ గ్రూప్ ఛైర్మన్ కె.సి.అశోక్ తెలిపారు. యంగ్ ఇన్నోవేటర్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నూతన సాంకేతిక, ఆధునిక సృజన్మాకతను ప్రతిబింబిస్తూ శాస్త్రీయంగా నమూనాలు, కళాత్మక ప్రాజెక్టులను తయారు చేస్తున్నారన్నారు. నూతన ఆవిష్కరణలు చేస్తు పాఠశాల, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకువస్తున్నారన్నారు. విద్యార్థులతో కలిసి ప్రదర్శనలను పరిశీలించారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండోలో బంగారు పతకాలు

క్రీడాకారులతో రాఘవేంద్ర ప్రతాప్‌సింగ్

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే : పట్టుదలతో పాటు కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని కేజీ హళ్లి తైక్వాండో క్రీడకారులు నిరూపించారు. కెంపేగౌడ ఇండోర్ స్టేడియంలో జరిగిన తైక్వాండో పోటీల్లో షెన్‌షైన్ శిక్షణ కేంద్రం క్రీడాకారులు రాజు, యాదుకృష్ణ, జయంత్, పవన్‌కుమార్, సందీప్, రఫిక్, తిరుమలకృష్ణ, అనన్యరెడ్డి, ఖషాకాసాహు, మనోగ్‌సింగ్ బంగారు పతకాలు సాధించారు. శ్రేయస్, లక్ష్మీషా, పునీత్‌రెడ్డి, జయకృష్ణ, అజయ్, అర్జున్, యశ్వంత్, అఫ్తాబ్, ప్రదీప్, హస్పర్ భాను, జోయా, రేస్మా, లక్ష్మి, నిసర్గ, యశ్విగౌడ, వాల్మీకి, ఆదిత్య, చైతన్, పవన్, సిహరికా సిల్వర్ పతకాలను సాధించినట్లు శిక్షకుడు రాఘవేంద్ర ప్రతాప్‌సింగ్ తెలిపారు.

బాలుడిపై వీధి కుక్క దాడి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: దొడ్డ బెళవంగల గ్రామంలో దుకాణం వెలుపల నిలబడి ఉన్న నాలుగేళ్ల బాలునిపై వీధి కుక్క దాడి చేసింది. కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలైన బాధిత బాలుడ్ని చికిత్స కోసం దొడ్డబళ్లాపుర లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

విశ్వవ్యాప్తంగా అఖండ భజన

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి ఈశ్వరాంబ శ్రీసత్యసాయి సేవ ట్రస్టు ఆధ్వర్యంలో నగర మందిరంలో 24 గంటలపాటు విశ్వవ్యాప్త అఖండ భజన నిర్వహించారు. పుట్టపర్తి శ్రీసత్యసాయి జయంతి ఈనెల 23న ఉండడంతో ప్రపంచ వ్యాప్తంగా 149 దేశాల్లో అఖండ భజన శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభించారు. బళ్లారి మందిరంలో భక్తులు భజన పాటల్లో మునిగితేలారు. ట్రస్టు అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి, సభ్యులు విరూపాక్షప్ప, పార్థసారథి తదితరులు ఆదివారం బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రంలో రోగులు, సంబంధికులకు అన్నప్రసాదం అందజేశారు. గత 13 ఏళ్లుగా శ్రీసత్యసాయి ట్రస్టు ద్వారా బీఎంసీఆర్‌సీలో అన్నదానం చేస్తున్నారు.

1959వ రోజుకు చేరిన నిరవధిక సత్యాగ్రహం

కుడతినిలో నిరవధిక సత్యాగ్రహంలో పాల్గొన్న రైతులు

బళ్లారి, న్యూస్‌టుడే: కుడతిని భూ పోరాట సమితి చేస్తున్న నిరవధిక సత్యాగ్రహం ఆదివారానికి 1959వ రోజుకు చేరుకుంది. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన విరమించే ప్రశక్తే లేదని కుడతిని, వేణీవీరాపురం, జానెకుంటె, హరగినడోణి, సిద్ధమ్మన హళ్లి, యరంగలి, కొళగల్లు తదితర గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాలు మద్దతు ప్రకటించారు.

రామానుజ తపోభూమి అభివృద్ధికి సహకారం


ఆలయ ఆవరణలో సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ గహ్లోత్, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య తదితరులు

మండ్య, న్యూస్‌టుడే: రామానుజాచార్యుని తపోభూమి మేలుకోటె అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తానని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. చెలువనారాయణ స్వామి దివ్యక్షేత్రం మేలుకోటెను సమగ్రంగా అభివృద్ధి చేయాలని పారుపత్తేగార్ శ్రీనివాస నరసింహన్ గురూజీ మనవిని ఆలకించి ఆయన స్పందించారు. మేలుకోటెకు వచ్చిన ఉప రాష్ట్రపతికి మంత్రి చెలువనారాయణ స్వామి, జిల్లాధికారి డాక్టర్ కుమార్ ఆహ్వానం పలికారు. ఆలయం ఆవరణలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం తలకు పాగా కట్టి రాజాశీర్వాదం చేశారు. గవర్నర్‌గా తాను గతంలో మేలుకోటెకు వచ్చినప్పుడు తులసి మొక్కను నాటిన చోట ఇప్పుడు తులసితోట అభివృద్ధి చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. తిరుమల, శ్రీరంగం, కంచి, మేలుకోటె తనకు ఇష్టమైన ఆధ్యాత్మిక క్షేత్రాలని గుర్తు చేశారు. ఆలయంలో 45 నిమిషాలు ఉన్న రాధాకృష్ణన్, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో శ్రావణబెళగొళకు వెళ్లారు. గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్, మాజీ మంత్రి సీఎస్ పుట్టరాజు, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, తదితరులు ఉపరాష్ట్రపతితో కలిసి ఆలయంలో దర్శనాలు చేసుకున్నారు. ఆదివారం ఉదయం 8 నుంచి 12 వరకు భక్తులకు దర్శనాలను నిలిపి వేశారు. భక్తులు ఇచ్చిన సహకారానికి ఎస్పీ మల్లికార్జున బాలదండి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా స్వామీజీకి తులాభారం

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకాలోని కరేగుడ్డ మహంతేశ్వర మఠంలో మహంతలింగ శివాచార్య స్వామీజీ పట్టాధికార మహోత్సవాలకు ముగింపు పలికారు. శనివారం రాత్రి స్వామీజీకి భక్తులు వెండితో తులాభారం నిర్వహించారు. హాజరైన మఠాధిపతులు మఠం ఆచార వ్యవహారాలను కొనియాడారు. మఠం చరిత్రను భక్తుల కళ్లకు గట్టారు. మఠం ఆధ్వర్యంలో వళబళ్లారి సువర్ణగిరి విరక్తమఠం సిద్ధలింగ మహాస్వామీజీకి గురువందనను భక్తిశ్రద్ధలతో జరిపారు. వివిధ మఠాల స్వామీజీలు, మాజీ ఎమ్మెల్యే రాజా వెంకప్పనాయక్, తిమ్మారెడ్డి భోగావతి, శరణేగౌడ నక్కుంది, ఆల్దాళ వీరభద్రప్పగౌడ పాల్గొన్నారు.

స్వామీజీకి తులాభారం నిర్వహిస్తున్న భక్తులు

ప్రత్యేక రైళ్లకు ప్రచారం కొరత

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ పండగల వేళ, సీజన్లలో ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. అయితే వాటికి ప్రచారం కల్పించడంలో అధికారులు వెనుకబడ్డారు. దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు విభాగం అధికారులు కర్ణాటక పరిధిలోని రాయచూరు, యాదగిరి జిల్లా వాసులకు తెలిసేలా మీడియాకు విడుదల చేయలేదు. ఫలితంగా అదనపు రైళ్ల సమాచారం సామాన్య ప్రజలకు తెలియడం లేదు. అవసరాలకు నడుపుతున్నా ఉపయోగపడటం లేదు. దీంతో ప్రయాణికుల సంఖ్య పల్చగా ఉన్నందున రైళ్లను పొడగించడం లేదు.

కర్ణాటక-తెలంగాణ సరిహద్దులోని కృష్ణా స్టేషన్

కాకినాడ-మైసూరుకు ..

నర్సాపూరు ఎక్స్‌ప్రెస్‌ను నర్సాపూరు నుంచి కాకుండా కాకినాడ-మైసూరు మధ్య సంచరించేలా వారం క్రితం షెడ్యూల్ విడుదలైంది. ఈ విషయం చాలా మందికి తెలియదు. దీంతో రద్దీ ఉండటం లేదు. కాకినాడ-మైసూరు (రైలు సంఖ్య 07033) రైలు సోమవారం, శుక్రవారం ఉదయం 9 గంటలకు కాకినాడలో బయలుదేరుతుంది. సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం, ఆకివీడు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్లు, మిర్యాలగూడెం, నల్లగొండ మీదుగా సికింద్రాబాద్‌కు రాత్రి 10.05 గంటలకు చేరుతుంది.

బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, యాదగిరి, కృష్ణా మీదుగా రాయచూరుకు తెల్లవారుజామున 3.38 గంటలకు వస్తుంది. మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక, బెంగళూరు కంటోన్మెంట్, బెంగళూరు కేఎస్ఆర్, కెంగేరి, మండ్య మీదుగా మైసూరుకు సాయంత్రం 4 గంటలకు వెళుతుంది. తిరుగు ప్రయాణంలో మైసూరులో మంగళవారం, శనివారం సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరి రాయచూరుకు వేకువ జామున 3.43 గంటలకు చేరుతుంది. సికింద్రాబాద్‌కు ఉదయం 10.10 గంటలకు వెళుతుంది.

ప్రతి రోజు రైలు నడపాలి



రాయచూరు, యాదగిరి ప్రయాణికులు హైదరాబాద్ రాకపోకలకు అనుకూలమైంది. ఈ ప్రాంతంలో నివసిస్తున్న విజయవాడ, కోస్తా జిల్లాలకు వెళ్లటానికి ప్రస్తుతం వారానికి ఒక టాటా ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఉంది. మైసూరు-కాకినాడ, కాకినాడ-మైసూరు రైలును ప్రతి రోజు సంచరించేలా మార్చాలి. తద్వారా ఆదాయం సమకూరుతుంది. రాయచూరు ఎంపీ కుమారనాయక్ రైల్వేశాఖ మంత్రి వైష్ణవ్‌పై ఒత్తిడి తేవాలి. - **సూర్యదేవర నాగేశ్వరావు (ప్రవాసాంధ్రుడు, రాయచూరు)**

జలదుర్గలో విద్యార్థినుల శ్రమదానం

వ్యర్థాలను సంచుల్లో వేస్తున్న సేవకులు

రాయచూరు, న్యూస్‌టుడే : నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు లింగసూగూరు తాలూకాలోని పర్యాటక కేంద్రమైన జలదుర్గలో శ్రమదానం చేశారు. ప్లాస్టిక్ వస్తువులను ఏరి వేశారు. చెత్తా చెదారాన్ని, దేవాలయాల చుట్టూ, ఉద్యానవనంలో పెరిగిన మొక్కలను తొలగించారు. వ్యర్థాలను సంచుల్లో నింపి వాహనాల్లో డంపింగ్ కేంద్రానికి తరలించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ సంచులను విక్రయించొద్దని వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. వాడిన వస్తువులను డస్ట్‌బిన్‌లో వేయాలని పర్యాటకులను కోరారు. స్వయం సేవకులు నరసమ్మ, అన్నపూర్ణ, జమునా, నాగమ్మ, స్వప్నా, మహేశ్వరి, రేఖా, రేణుకా, గాయత్రి, సుమిత్రా, కస్తూరి సేవల్లో పాల్గొన్నారు. మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభభాయి జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేపట్టినట్లు రాజనీతి శాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ సంతోశ్‌కుమార్ రేవూరి తెలిపారు.

అసాధారణ బాలల ప్రశస్తులకు ఆహ్వానం

రాయచూరు: అసాధారణ ప్రతిభ కనబరచిన బాలలను (0 నుంచి 18 ఏళ్ల లోపు) హొయ్సళ, కెళది చెన్నమ్మ పురస్కారాలకు ఎంపిక చేయటానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. క్రీడలు, కళలు, సాంస్కృతిక, సంగీత రంగాల్లో రాణించిన వారు అర్హులు. పత్రికల్లో వచ్చిన వార్తల క్లిప్పింగ్‌లు, ప్రమాణ పత్రాన్ని దరఖాస్తుకు జత చేసి ఈ నెల 15 లోపు రాయచూరులోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయానికి పంపుకోవాలని అధికారులు సూచించారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కనకదాసు కర్ణాటక చైతన్యమూర్తి

కనకదాసుకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

రాయచూరు, న్యూస్‌టుడే : భక్త కనకదాసు కర్ణాటక చైతన్యమూర్తి అని శృతి సాహిత్యమేళా అధ్యక్షుడు మురళీధర్ కులకర్ణి అభివర్ణించారు. శనివారం రాత్రి నగరంలోని బయలు ఆంజనేయ దేవాలయంలో కనక జయంతిని ఆచరించారు. ప్రముఖులతో కలసి కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కులకర్ణి మాట్లాడుతూ ఐదు శతాబ్దాల క్రితమే మూఢ నమ్మకాలు, విశ్వాసాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చారని, హేతుబద్ధత లేని విధానాలను, పౌరోహిత శాహి దౌర్జనాలను ప్రశ్నించారని వివరించారు. ఆయన వచనాలు, బోధనలు నిత్య సుభాషితాలని, నిత్య జీవితంలో ఆచరించేందుకు యోగ్యమైనవని తెలిపారు. విశ్రాంత ప్రిన్సిపల్ వెంకటరావ్ కులకర్ణి ప్రసంగిస్తూ సమాజంలోని చిట్ట చివరి వ్యక్తిని భక్తి మార్గం వైపు మళ్లించిన ఆధ్యాత్మికవేత్త అని ప్రశంసించారు. పాత్రికేయుడు జయకుమార్ దేసాయి, గాయకుడు సురేష్ కల్లూరు, సుస్మా కరణం, కేశవమూర్తి కులకర్ణి, కృష్ణమూర్తి, నాగరత్న కల్లూరు హాజరయ్యారు.

కాల్పులు జరిపి అరెస్టు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: భూవ్యాపారి బాలప్ప రెడ్డి, మాదేశ అనే వ్యక్తులను హత్య చేసి పరారీలో ఉన్న రవిప్రసాద్‌రెడ్డి అనే నిందితుడిపై హెబ్బగోడి ఠాణా పోలీసులు కాల్పులు జరిపారు. నిందితుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాడు. హత్య కేసులో అరెస్టు చేసి మహజరుకు బొమ్మసంద్ర శ్మశానవాటికకు తీసుకువచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌పై దాడి చేసి పరారయ్యేందుకు ప్రయత్నించిన నిందితుని కాళ్లపైకి ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్ కాల్పులు జరిపి పట్టుకున్నారు. ఎలక్ట్రానిక్ సిటీ విభాగం డీసీపీ నారాయణ్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కాళ్లలోకి రెండు తూటాలు వెళడంతో గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. నవంబరు ఆరున హెబ్బగోడికి చెందిన బాలరెడ్డిని అపహరించిన నిందితుడు తాను కోరినంత నగదు ఇవ్వలేదని గొంతు చీల్చి హత్య చేశాడు. ఈ నెల నాలుగో తేదీన మాదేశ్ అనే వ్యక్తిని కిత్తగానహళ్లిలోని ఇంట్లో హత్య చేశాడని నారాయణ్ తెలిపారు.

కాలువలోకి కారు దూసుకెళ్లి ఇద్దరి మృతి

దావణగెరె, న్యూస్‌టుడే: చెన్నగిరి తాలూకా హోసూరు గ్రామంలో భద్రా కాలువలోకి కారు దూసుకువెళ్లడంతో ఇద్దరు మరణించారు. మరో నలుగురు ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. మల్లికార్జున (29), సిద్ధేశ్ (38)లను మృతులుగా గుర్తించారు. దావణగెరెకు చెందిన ఆరుగురు మంగళూరు వైపు పర్యటనకు వెళుతున్న సమయంలో కారు అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోవడంతో ప్రమాదం సంభవించింది. సంతెబెన్నూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు..

రామనగర న్యూస్‌టుడే: మాగడి తాలూకా రస్తెపాళ్య గ్రామం వద్ద ఆదివారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో కేశవ్ (19), మయూర్ (19) అనే యువకులు మరణించారు. వీరిద్దరూ వెళుతున్న ద్విచక్ర వాహనం రహదారి విభాజకాన్ని ఢీకొట్టింది. కిందపడినప్పుడు తలకు తీవ్ర గాయాలు కావడంతో బాధితులను చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. కుదూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బెంగళూరు, చుట్టు పక్కల ప్రాంతాలలో 2020లో 1928 రోడ్డు ప్రమాదాల్లో 344 మంది మరణించారు. గత ఏడాది 3969 ప్రమాదాల్లో 723 మంది కన్ను మూశారు. రోడ్డు ప్రమాదాలలో మృతులు, గాయపడుతున్న వారి సంఖ్య ఇతర రాష్ట్రాలతో పోల్చితే కర్ణాటక ప్రస్తుతం ఐదవ స్థానంలో ఉందని అధికారులు తెలిపారు.

మంటగలిసిన మానవత్వం

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: మైక్రోలేఅవుట్ ఠాణా పరిధిలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బోల్తా పడిన గూడ్సు వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులను కొందరు వాహనదారులు బయటకు తీసుకు వచ్చి సపర్యలు చేశారు. వారిలో ఒక యువకుని పరిస్థితి విషమంగా మారడంతో అతనితో ఉన్న వ్యక్తి తన స్నేహితుడ్ని పాదచారి మార్గం వరకు లాక్కొని వెళ్లి, అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అతను పరారీ కావడంతో వాహనదారులు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు. పోలీసులకు సమాచారం అంది, అక్కడికి వచ్చేలోగా ఆ యువకుడు మరణించాడు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలో ఈ ఘటన రికార్డయింది. సుమారు అరగంటకు పైగా ఆ వ్యక్తి ప్రాణాలతో పోరాటం చేసి చేతులు ఎత్తేశాడు. వాహనంలో వచ్చిన వ్యక్తిగాని, సాయం చేసిన వాహనదారులైనా పోలీసులు, అంబులెన్సును ఫోన్ చేసి ఉంటే, అతని ప్రాణాలు దక్కేవని మైకోలేఅవుట్ ఠాణా పోలీసులు తెలిపారు.

నరభక్షక పులి చిక్కింది

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: చామరాజనగర జిల్లా సరగూరు తాలూకాల్లోని వివిధ గ్రామాల్లో దాడులకు పాల్పడుతూ ప్రజలు, పశువులను చంపిన మగ పులిని అటవీశాఖసిబ్బంది బంధించారని ఆశాఖమంత్రి ఈశ్వర్ బి.ఖండ్రె తెలిపారు. ఆదివారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నెలరోజుల్లో ముగ్గురిని ఆ పులి పొట్టనబెట్టుకున్నట్లు గుర్తు చేశారు. పులి దాడిలో చనిపోయిన వ్యక్తుల మృతదేహాలకు వైద్య పరీక్షలు నిర్వహించామని, బంధించిన పులి డీఎన్ఏనూ పరీక్షించినట్లు తెలిపారు.

రూ.21 కోట్ల ఆస్తి జప్తు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: కార్వార కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్ సైల్‌కు చెందిన రూ.21 కోట్ల విలువైన స్థిరాస్తులను తాత్కాలికంగా జప్తు చేశామని ఈడీ అధికారులు ప్రకటించారు. సైల్‌కు ఇచ్చిన బెయిలును చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం ఇప్పటికే రద్దు చేసింది. కర్ణాటక, గోవా, దిల్లీ, ముంబయిల్లోని 15 చోట్ల ఈడీ అధికారులు సోదాలు కొనసాగించారు. బెయిలు రద్దు కావడంతో ఈడీ అధికారుల ఎమ్మెల్యేను ఏ సమయంలో అయినా అరెస్టు చేసే అవకాశం ఉంది.

విరిగిన భీముని దంతం

హాసన: కొద్ది రోజులుగా గ్రామాలపై దాడులకు పాల్పడి, తోటలను ధ్వంసం చేస్తున్న భీమ ఏనుగు పట్టుకునే కార్యాచరణను అటవీ శాఖ అధికారులు కొనసాగించారు. రెండు కుమ్కీ ఏనుగులతో జరిగిన గొడవలో భీమ ఏనుగు దంతం ఒకటి విరిగిపోయింది. దంతం విరిగి రక్తం కారుతున్నా, ఆగకుండా అడవిలోకి పరారైంది. దాన్ని గుర్తించి పట్టుకునేందుకు కార్యాచరణ కొనసాగించారు.

లబ్ధిదారుడికి ట్రాక్టర్ తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

వ్యవసాయంలో పరికరాలు కీలకం

మాన్వి, న్యూస్‌టుడే : రైతులు వ్యవసాయం చేయటం కష్టసాధ్యంగా మారిందని, ఇందుకు అనేక కారణాలున్నప్పటికీ ప్రధానంగా కూలికార్మికుల కొరత ఏర్పడిందని ఎమ్మెల్యే హంపయ్య నాయక్ వాపోయారు. ఎస్సీ అభివృద్ధి నిగమం స్వావలంబన సారథి యోజన కింద ఎమ్మెల్యే ట్రాక్టర్ మంజూరు చేయించారు. లబ్ధిదారుడు మల్లయ్యకు ట్రాక్టర్ తాళాలు అందించి మాట్లాడారు. రైతులు వ్యవసాయానికి యంత్రాలను అవలంబించాల్సిన అనివార్య పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వ్యవసాయ పరికరాలను సరిగా చేసుకోవాలని సూచించారు. చిలుకూరి రవికుమార్, సీహెచ్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సహ్యాద్రి సిందూర.. దిగుబడి భళిరా!

పాలు పోసుకున్న వడ్ల గింజలు

శివమొగ్గ, న్యూస్‌టుడే: సహ్యాద్రి పర్వత సానువుల్లోని శివప్ప నాయక వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయంలో 'సహ్యాద్రి సిందూర' రకం వంగడాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. సన్నగా, తేలికపాటి ఎరుపు వర్ణంలో ఉండే ఈ బియ్యంతో వండే అన్నం మధుమేహ సమస్యలు ఎదుర్కొనే వారికి ప్రయోజనకారి. హెక్టారుకు 55 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది. విశ్వవిద్యాలయంలో అభివృద్ధి చేసిన పలు వరి వంగడాలను రైతులకు ఇస్తూ వస్తోంది. ప్రయోగాత్మకంగా సహ్యాద్రి సింధూరను ఎక్కువ మంది రైతులకు చేర్చే లక్ష్యంతో ఎక్కువ వంగడాలను సిద్ధం చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి తెలిపారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎర్రరంగు బియ్యంతో పోల్చితే ఇందులో ఎక్కువ పోషకాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. మధుమేహులకు ఈ బియ్యం మరింత ప్రయోజనకారి అని గుర్తించారు. ఈ రకం బియ్యానికి మేధోహక్కులు పొందేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. సాధారణంగా ఎరుపు రంగులో ఉండే బియ్యం లావుగా ఉంటుంది. సహ్యాద్రి సిందూర ఎర్రగా ఉన్నప్పటికీ సోనా మసూరి తరహాలో సన్నగా ఉంటుంది. ఐదేళ్లలో విడుదల చేసిన జ్యోతి, బిళియ రకం వంగడాల జన్యువులు ఉపయోగించి, పలు ప్రయోగాల అనంతరం దీన్ని రూపొందించామని విశ్వవిద్యాలయంలో వరి పరిశోధన విభాగం డైరెక్టర్ డాక్టర్ దుశ్యత్ కుమార్ తెలిపారు. ప్రతికూల పరిస్థితులు లేకపోతే 120 రోజుల్లోనే 55 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వివరించారు. ప్రొటీన్, ఐరన్, జింక్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ప్రారంభం నుంచి ఈ రకం వరిసాగును సీతారాం అనే రైతు పొలంలో సేంద్రియ విధానంలో సాగు చేస్తూ వస్తున్నారు. చీడ పీడలను తట్టుకోవడంతో పాటు, వర్షాకాలంలో ఎక్కువ నీరు పొలంలో నిలిచినా, మొక్కలు దాన్ని తట్టుకుని దిగుబడి ఇస్తాయని వివరించారు.

సహ్యాద్రి సిందూర బియ్యం

ధాన్యం రాసిలో ఉంచిన బియ్యం

సాధకులకు నృపతుంగ ప్రశస్తుల ప్రదానం

పురస్కారాలు స్వీకరించిన సాధకులు

రాయచూరు, న్యూస్‌టుడే : కన్నడమాతకు హొసమని ప్రకాశన అధ్యక్షుడు బషీర్‌అహ్మద్ నిరుపమానమైన సేవలందిస్తున్నారని ప్రముఖ సాహితీవేత్త, రాజ్యోత్సవ పురస్కార గ్రహీత రామణ్ణ హవళె పేర్కొన్నారు. రాజ్యోత్సవాల సందర్భంగా హొసమని ప్రకాశన సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సాధకులకు నృపతుంగ పురస్కారాలను ఆదివారం ఇక్కడి కన్నడభవన్‌లో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రామణ్ణ మాట్లాడుతూ వివిధ రంగాల్లో సేవలందించే వారిని ప్రభుత్వం, స్వచ్ఛంద, జాగృతి సంస్థలు గుర్తించాల్సిందని, కన్నడపై అభిమానంతో చేస్తున్న బషీర్‌ను మనమంతా ప్రోత్సహించాలన్నారు. ఇతడి మాతృభాష ఉర్దూ అయినా కుటుంబ సభ్యులంతా కన్నడమాత సేవలో తరించడం స్ఫూర్తిదాయకమన్నారు. ముఖ్య అతిథి జి.ఎల్.గోపి ప్రసంగిస్తూ 17 ఏళ్లుగా క్రమం తప్పకుండా పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. అణ్ణప్ప మేటిగౌడ, భేరి, విక్రమరాజా, మహబూబ్ పాషా, రఘునాథరెడ్డి, వేణు, సోనమ్మ, పద్మావతి ప్రశస్తులు స్వీకరించారు. ప్రకాశన సంస్థ ప్రధాన కార్యదర్శి శిఫా, ఉపాధ్యక్షురాలు పర్వీన్‌బేగం, కోశాధ్యక్షురాలు ఖుషి, రాజ్యరైతు సంఘం గౌరవాధ్యక్షుడు చామరస్ మాలిపాటిల్, ఉపాధ్యాయురాలు శంశాద్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

దళితులకు మేయర్ స్థానం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె 4వ విడత మేయర్ జనరల్, ఉపమేయర్ జనరల్ మహిళకు రిజర్వేషన్ కేటాయించారు. ఈసారి మేయర్ అవకాశం దళిత కార్పొరేటర్‌కు కల్పించాలని కేపీసీసీ వ్యాఖ్యాత వెంకటేశ్ హెగ్డే డిమాండ్ చేశారు. పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, గ్రామీణ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, జిల్లా బాధ్యమంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్, రాజ్యసభ సభ్యుడు డా.సయ్యద నాసిర్ హుసేన్, పార్టీ నేతలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దళితలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరలో జరిగే తాలూకా, జిల్లా పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపునకు శ్రమిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఎరుకుల స్వామి, హుసేనప్ప, వీరేంద్ర, గౌతమ్, బుజ్జి, పృథ్వి, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యేతర అంశాలతో సృజనాత్మకత

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

రాయచూరు, న్యూస్‌టుడే : పాఠ్యేతర కార్యకలాపాలతో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించవచ్చని వ్యంగ చిత్రకారుడు, సాహితీవేత్త ఈరణ్ణ బెంగాలి పేర్కొన్నారు. పిల్లలను పాఠ్యాంశాలను చదివేందుకు మాత్రమే పరిమితం చేయవద్దని, వారిలో దాగిన ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కోరారు. సామాజిక సేవల్లో భాగస్వామ్యమయ్యేందుకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, భారత సేవా దళ్‌లో చేరాలని విద్యార్థులకు సూచించారు. బలరామ పాఠశాల, కళా తపస్వి సంస్థ సంయుక్తంగా పాఠశాల విద్యార్థులకు చిత్రకళా పోటీలను నిర్వహించింది. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు దండిన్ శివకుమార్, అశోక్, ఉమాకాంత్, వెంకటేష్, వీరేశ్, చంద్రశేఖర్ ఫిరంగి, నవీన్ పాల్గొన్నారు.

ఊపందుకున్న మెట్ట సేద్యం పనులు

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో మెట్ట సేద్యం పనులు ఊపందుకున్నాయి. జిల్లా వ్యవసాయ శాఖ రైతు సహకార కేంద్రాల ద్వారా ఇప్పటికే విత్తనాల పంపిణీని ప్రారంభించింది. అన్నదాతలు వారం రోజుల నుంచి ప్రాథమిక పనుల్లో నిమగ్నయ్యారు. అనేక గ్రామాల్లో జొన్న, శనగ, వేరుసెనగ, కుసుమ, సూర్యకాంతిని సాగు చేసేందుకు విత్తు నాటడం జోరుగా కొనసాగుతోంది. అత్యధిక వర్షపాతం నమోదు కావడంతో లక్ష్యాల కంటే ఏడు శాతం విస్తీర్ణం పెరగవచ్చని అధికారులు అంచనా వేశారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం

1.33 లక్షల హెక్టార్లలో సాగుకు అవకాశం

రెండో పంటలో భాగంగా 1.33 లక్షల హెక్టార్లలో పంటలను సాగు చేస్తారని వ్యవసాయ శాఖ భావిస్తోంది. జొన్న 55 వేలు, శనగ 50 వేలు, వేరుసెనగ 17 వేలు, కుసుమ, సూర్యకాంతి 350 హెక్టార్ల చొప్పున, ఇతర పంటలు 4 వేల హెక్టార్లలో పండించగలరని లెక్కించింది.

37 రైతు సహకార కేంద్రాల ద్వారా..

ఏడు తాలూకాల్లో 37 కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 5595 క్వింటాళ్లను సరఫరా చేశారు. 7017 క్వింటాళ్లను నిల్వ చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విత్తనాలు అందజేస్తోంది. రబీలో ఏ పంటలు పండించాలో శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు.

ఐసీసీ తర్వాతనే కాల్వ రైతాంగం

తుంగభద్ర నీటిపారుదల సలహా సమితి సమావేశం తీర్మానాన్ని చూసే రెండో పంటకు సిద్ధం కానున్నారు. అవసరమయ్యేంత నీటిని విడుదల చేసేందుకు మొగ్గు చూపితే ఎగువ భాగం రైతులు వరి నాట్లు వేయనున్నారు. వర్షాలు కురవడం వల్ల చివరి ఆయకట్టు రైతులు తొలి పంటలో గట్టెక్కారు. రెండో పంటకు సక్రమంగా నీరు రావడం కష్టమేనని టేలండ్ కర్షకులు సందేహిస్తున్నారు.

క్రిప్టో పేరిట వంచన

హుబ్బళ్లి, న్యూస్‌టుడే: క్రిప్టో కరెన్సీపై మదుపు చేస్తే చక్కని లాభాలు వస్తాయని వాట్సప్‌లో వచ్చిన సందేశాన్ని నమ్మి జీఎం అబ్రహం అనే వ్యక్తి రూ.1.30 కోట్లు పోగొట్టుకున్నాడు. ఫేస్‌బుక్‌లో పరిచయమైన దియాఖాన్ అనే వ్యక్తి పంపించిన సందేశాన్ని నమ్మి దశల వారీగా నగదు మదుపు చేశాడు. ఇటీవల కొంత కాలం నుంచి దియాఖాన్ నుంచి ఫోన్లు రాకపోవడం, తాను ఫోన్ చేస్తే స్పందన రాకపోవడంతో తాను మోసపోయానని గుర్తించి దావణగెరె సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

అట్టడుగు వ్యక్తికీ ప్రభుత్వ ఫలాలు

దివ్యాంగులకు స్కూటీలు పంపిణీ చేస్తున్న సింధనూరు ఎమ్మెల్యే బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కష్టాలు గుర్తిస్తుంది, అట్టడుగు వ్యక్తికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తుంది, పంచ గ్యారంటీ పథకాలు పక్కాగా అమలౌతుండటానికి కారణం మా ప్రభుత్వ అంకితభావమేనని సింధనూరు సీనియర్ ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ పేర్కొన్నారు. శాసన సభ్యుని ప్రాదేశిక అభివృద్ధి యోజనలో సింధనూరులోని 19 మంది దివ్యాంగులకు ఆయన ఆదివారం మూడు చక్రాల స్కూటీలను పంపిణీ చేశారు. ఆయన ఇంటి ఎదుట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు స్కూటీ తాళాలు అందించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీరు భగవంతులతో సమానం, ఈ వాహనాలు మీకు చక్కని ఆసరా కాగలవని అభిలషించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

(c) eenadu

ఈనాడు ఒడిశా
సోమవారం నవంబరు 10, 2025

ష్.. నిశ్శబ్దం

● నువాపడలో మూగబోయిన మైకులు

విలేకరులతో మాట్లాడుతున్న మన్మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నువాపడలో మైకులు మూగబోయాయి. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి నిశ్శబ్దం ఆవహించింది. నువాపడ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక నేపథ్యంలో హోరా హోరీగా సాగిన ప్రచారానికి తెరపడింది. ఎన్నికల యంత్రాంగం మంగళవారం జరగనున్న పోలింగ్‌కు గట్టి బందోబస్తు చేసింది. ప్రచారానికి చివరి రోజు కావడంతో భాజపా, బిజద, కాంగ్రెస్ అభ్యర్థులు పార్టీల నేతలతో కలిసి ఓటర్లకు వినతులు చేశారు. అన్ని పార్టీలూ గెలుపు తమదంటే తమదని చెబుతున్నాయి.

నువాపడలో వైద్య కళాశాల ఆసుపత్రి

ఆదివారం నువాపడలో విలేకరుల సమావేశం చేపట్టిన భాజపా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ త్వరలో ఇక్కడ వైద్య కళాశాల ఆసుపత్రి ఏర్పాటవుతుందని, దీనిపై ఇది వరకే ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నువాపడ నియోజకవర్గం నుంచి అన్ని ప్రాంతాలకు విశాలమైన రోడ్లు, మంచినీటి సరఫరా, సేద్యానికి నీరు, పర్యాటక కేంద్రాలకు సొబగులు కల్పిస్తామని చెప్పారు. భాజపా చెప్పింది చేస్తుందన్న సామల్ పార్టీ అభ్యర్థి జయడొల్కియా భారీ ఆధిక్యతతో గెలుస్తారన్నారు.

నవీన్ సందేశం..



మరోవైపు బిజద అధినేత, మాజీ ముఖ్యమంత్రి **నవీన్ పట్నాయక్** నువాపడ వాసులకు ఆదివారం సందేశమిచ్చారు. ప్రజల్ని నమ్మించి వంచించిన భాజపాకు బుద్ధి చెప్పడానికి ఈ ఉప ఎన్నిక సరైన సాధనమని, ఓటర్లు విజ్ఞతతో ఆలోచించాలని, బిజద తరపున పోటీ చేస్తున్న సోదరి స్నేహాంగిని చురియాకు పట్టం కట్టాలని కోరారు. ఓటర్లు ఎవరి ప్రలోభాలకు గురికాకుండా విచక్షణతో ఓట్లేయాలన్నారు.

విజయం మాదే..

పీసీసీ అధ్యక్షుడు **భక్తచరణ్‌దాస్** ఆదివారం సాయంత్రం నువాపడలో విలేకరులతో మాట్లాడుతూ తమ అభ్యర్థి ఘసిరామ్ మాఝి భారీ ఆధిక్యతతో గెలుస్తారని, ఇది జోస్యం కాదని ఓటర్లంతా ఆయనను ఆశీర్వదిస్తున్నారన్నారు. ఆదివాసీలంతా ఆయన పక్షాన ఉన్నారని, ఇతర వర్గాల ఆదరణను పొందారని, ఫలితం కాంగ్రెస్ పక్షాన ఉందని కచ్చితంగా చెబుతున్నారన్నారు.

నిర్లక్ష్యం చేసినవారిపై చర్యలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రథయాత్ర ఘటన దర్యాప్తు నివేదికలో ఏడుగురు పోలీసు అధికారులు విధులు సక్రమంగా నిర్వహించకుండా నిర్లక్ష్యం చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని న్యాయశాఖ మంత్రి **పృథ్వీరాజ్ హరిచందన్** చెప్పారు. ఆదివారం భువనేశ్వర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశించినట్లు తెలిపారు.

శిథిల భవనాలు కూల్చేస్తాం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రముఖ నగరాలు, పట్టణాల్లో శిథిలావస్థలో ఉన్న అపార్ట్‌మెంట్లు, భవనాలను కూల్చేస్తామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి **కృష్ణచంద్ర మహాపాత్ర్** చెప్పారు. ఆదివారం భువనేశ్వర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కటక్ జిల్లాలోని బక్షీ బజార్ ప్రాంతంలో అపార్టుమెంటు బాల్కనీ కూలిన ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందడం అత్యంత దురదృష్టకరమని, శిథిలావస్థలో భవనాలన్నీ తొలగించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

అట్టహాసంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ వేడుకలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ పట్టణంలోని కొత్తకోళి ఆంధ్రా భవన్ పాఠశాల ఆవరణలో ఆదివారం ఆంధ్రరాష్ట్ర అవతరణ వేడుకలు జరిగాయి. ఆంధ్ర యువజన సంఘం, పశ్చిమబెంగాల్ తెలుగువారి ఐక్యవేదిక సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ముందుగా ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని చీఫ్ కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ టి.శాంతారాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా తెలుగు సంప్రదాయం ప్రకారం వన భోజనాలు సందడిగా సాగాయి.

పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శాంతారాం

చిన్నారుల నృత్య ప్రదర్శన

గజపతి జిల్లా నుంచి ఝార్ఖండ్‌కు గంజాయి అక్రమ రవాణా

160 కిలోలు స్వాధీనం: ఒకరి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గజపతి జిల్లా చంద్రగిరి నుంచి గంజాం జిల్లా దిగపహండి మీదుగా రాంచీ జిల్లా (ఝార్ఖండ్)కు కారులో అక్రమంగా రవాణా చేస్తున్న 160 కిలోల గంజాయిను ఆదివారం స్థానిక అస్కా రోడ్డు మొదటి గేటు సమీపంలో ఆబ్కారీ బ్రహ్మపుర జిల్లా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాంచీ జిల్లా అంగర థాణా పరిధిలోని బనడాగ్ గ్రామానికి చెందిన మనోజ్ గొశాయి (35) అనే యువకుడ్ని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించామని ఆ విభాగం అధికారి ప్రబీణ్ ప్రధాన్ మధ్యాహ్నం ఒక ప్రకటనలో తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారయ్యారని, వారి కోసం గాలిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు విలువ రూ.22 లక్షలుంటుందని ప్రధాన్ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు, కారు, అరెస్టయిన నిందితుడు (కూర్చున్న వ్యక్తి). చిత్రంలో ఆబ్కారీ అధికారులు

అందాలకు నెలవు కళింగ నేల

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రకృతి ప్రసాదించిన అందాలకు నెలవు కళింగ అని, ఈ రాష్ట్ర సంస్కృతి గొప్పదని గవర్నరు కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో ఉన్న ఆయన శనివారం సర్దార్ జిల్లాలోని ఏక్తా నగర్‌లో జరిగిన 'భారత్ పర్వ్-2025' ఉత్సవాల్లో సతీసమేతంగా పాల్గొన్నారు. ఆలయాల నగరి భువనేశ్వర్, రథయాత్ర, తూర్పు తీరధామం పూరీ జగన్నాథ క్షేత్రం, కోణార్క్, శిల్ప కళారామం, చిలికా, గోపాల్‌పూర్, చాందిపూర్ తీర సొయగాలు, కొరాపుట్, సిమిలిపాల్ అటవీ సౌందర్యాల గురించి వివరించారు. 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' లక్ష్య సాధనకు ప్రధాని నరేంద్రమోదీ ఉద్యమిస్తున్న నేపథ్యంలో దేశ అఖండత, సమగ్రతలకు కట్టుబడాలన్నారు. దీనికి నిలువుటద్దమైన సర్దార్ సరోవర్ వంతెన గురించి, సర్దార్ వల్లభాయ్‌పటేల్ దేశానికి చేసిన సేవల గురించి చెప్పారు. ఈ వేడుకల్లో శాసన సభాపతి సురమా పాడి, సాంస్కృతిక శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, గుజరాత్ ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమాలు అందరూ కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా హరిబాబును సత్కరించారు.

భువనేశ్వర్‌లో గవర్నర్‌ను సత్కరించిన అతిథులు

గుజరాత్ గవర్నరు, సీఎంలను కలిసిన హరిబాబు

హరిబాబు దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న ఆచార్య దేవవ్రత

గవర్నరు కంభంపాటి హరిబాబు శనివారం రాత్రి గుజరాత్ రాజధాని గాంధీనగర్ రాజ్‌భవన్‌లో గవర్నరు ఆచార్య దేవవ్రతను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ భేటీలో హరిబాబు భార్య జయశ్రీ కూడా ఉన్నారు. ఆదివారం గాంధీనగర్‌లో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర భాయ్ పటేల్‌ను హరిబాబు కలుసుకొని జగన్నాథుని ఫొటో అందజేశారు. –న్యూస్‌టుడే, భువనేశ్వర్

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం: ఇద్దరి దుర్మరణం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కొదలా సమీపాన మఠ బ్రహ్మపుర-ఖొజాపల్లి ప్రధాన మార్గంలో ఆదివారం ఉదయం రహదారి ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. దిగాపడ పంచాయతీలోని జగన్నాథపూర్ గ్రామానికి చెందిన కాశీనాథ శెఠి అనే వ్యక్తి ఉదయం గ్రామం నుంచి ఉదయపు వ్యాహ్యాళి (మార్నింగ్ వాక్)కి వెళుతుండగా, పొలసరా సమితిలోని రాణిపడ గ్రామానికి చెందిన మిటు పరిడా ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళుతూ అదుపుతప్పి శెఠిని ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. మిటు శుక్రవారం రాత్రి ఉస్తాలి గ్రామంలో జరిగిన మహాభారతం నాటకంలో దుశ్శాసన పాత్రలో నటించి, ఉదయం ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో ఇద్దరూ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. శెఠిని కొదలా ఆరోగ్య కేంద్రానికి, మిటును పొలసరా ఆరోగ్య కేంద్రంలో చేర్పించగా అప్పటికే ఇద్దరూ మృతిచెందినట్లు ఆయా ఆరోగ్య కేంద్రాల వైద్యులు తెలిపారు. ఆయా ఆరోగ్య కేంద్రాల వద్ద బాధిత కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలతో పరిసరాలు హృదయ విదారకంగా మారాయి.

కాశీనాథ సెఠి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఆరోగ్య కేంద్రంలో మిటు పరిడా మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

రక్త పరీక్ష కేంద్రాలపై దాడులు

★ ఆరింటికి తాళాలు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం సబ్ డివిజన్‌లో నడుస్తున్న ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రాలు, ప్రైవేటు ఆసుపత్రిలో అధికారులు దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వాటిని సీజ్ చేశారు. గుణుపురం పట్టణం, సబ్‌డివిజన్‌లో పలుచోట్ల అనుమతులు లేకుండా పలు రక్త పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు గుణుపురం సబ్ కలెక్టర్ దిలీప్ అభిషేక్ దుధాల్ దృష్టికి వెళ్లడంతో పోలీసులు, వైద్య బృందం సహకారంతో పట్టణంలో దాడులు నిర్వహించారు. ఈ కేంద్రాలతోపాటు ఔషధ దుకాణాలను కూడా తనిఖీ చేశారు. మరోవైపు రాయగడ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సరోజినీ దేవి, ప్రైవేటు వైద్య కేంద్రాలపై దాడులు నిర్వహించారు. మేజిస్ట్రేట్‌గా రామన్నగూడ తహసీల్దార్ ప్రాణ కృష్ణ పాణిగ్రహి సమక్షంలో ఆరు కేంద్రాలకు తాళాలు వేసి సీజ్ చేశారు. సబ్ డివిజన్‌లో అన్నిచోట్ల సోదాలు చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. రామన్నగూడ సమితిలో రాయగడ ఏడీఎం ఆధ్వర్యంలో రెండు చోట్ల సోదాలు చేసి పత్రాలు సరిగ్గాలేని వాటిని సీజ్ చేశారు.

ఓ కేంద్రాన్ని సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారి, రామన్నగూడ తహసీల్దార్

పారా బ్యాడ్మింటన్‌లో ప్రమోద్‌కు మూడు పసిడి పతకాలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: జపాన్‌లోని టోక్యోలో ఈ నెల 5 నుంచి నిర్వహించిన ప్రతిష్ఠాత్మక హులిక్ దైహత్సు జపాన్ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో ఒడిశా క్రీడాకారుడు ప్రమోద్ భగత్ మూడు పసిడి పతకాలతో మెరిశాడు. పోటీల్లో పురుషుల విభాగం ఎస్ఎల్-3 కేటగిరీలో సింగిల్స్ తుది పోరులో ఆయన జపాన్‌కు చెందిన దైసుకె పుజిహారపై గెలుపొంది విజేతగా నిలిచారు. వివిధ కేటగిరీల్లో మరో రెండు స్వర్ణాలు సాధించాడు. ఒడిశా పారా క్రీడల సంఘం ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు. సంఘం కార్యదర్శి సునీల్ ప్రధాన్ ఆయా వివరాలను ఆదివారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

పసిడి పతకాలతో ప్రమోద్ భగత్

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళనలు చేద్దాం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలో సీపీఐని మరింత పటిష్ఠం చేద్దామని, భాజపా ఆధ్వర్యంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై ముమ్మర ఆందోళనలు నిర్వహిద్దామని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్కు వీధిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గంజాం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సీహెచ్.జనార్దన రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత మిశ్ర, రాష్ట్ర సంపాదక మండలి సభ్యులు ఆశీష్ కానుంగో, ఎన్.నారాయణ రెడ్డి, ప్రకాష్ పాత్ర్, జిల్లా కార్యదర్శి శ్రీహర్ష రథ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. పార్టీ శత వార్షికోత్సవాల సమావేశం డిసెంబరులో ఛత్రపురంలో నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. నీలకంఠ దాస్, ప్రదీప్ సెఠి, సత్య మహాపాత్ర, రంకొనిధి స్వయిన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు

11 మంది వేటగాళ్ల అరెస్టు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: అడవి పందులను వేటాడుతున్న 11 మంది నిందితులను దేవగఢ్ అటవీ అధికారులు అరెస్టు చేశారు. అటవీశాఖ వర్గాల సమాచారం మేరకు దేవగఢ్ రేంజ్ పరిధిలో వేటగాళ్లు విద్యుత్తు తీగలను అమర్చి అడవి పందులను వేటాడుతున్నారు. ఇందుకోసం 11 కేవీ విద్యుత్తు లైనుకు తీగలు తగిలిస్తున్నారు. రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది తీగలు అమర్చి ఉండటాన్ని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారిలో ఇద్దరిపై ఇది వరకు కేసులు పెండింగులో ఉండగా, మరి కొందరు పరారీలో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. వేటగాళ్ల నుంచి మూడు అడవి పందుల కళేబరాలు, విద్యుత్తు తీగలు, ఇతర వేట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. విచారణ కొనసాగుతుందని, పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

పితబాస కుటుంబానికి పోలీసు భద్రత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'హత్య కేసును ఉపసంహరించుకోవాలంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోను చేసి బెదిరిస్తున్నారని, తమ ప్రాణాలకు ముప్పు ఉందని దివంగత న్యాయవాది, పితబాస పండా భార్య సుస్మితా పండా శనివారం విలేకరుల వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో బ్రహ్మపుర పోలీసు జిల్లా యంత్రాంగం పండా కుటుంబానికి పోలీసు భద్రత కల్పించింది. స్థానిక వైకుంఠనగర్‌లోని పండా నివాస భవనం వద్ద ఓ హవల్దారు, నలుగురు కానిస్టేబుళ్లను శనివారం నియమించారు. వీరు 24 గంటలూ పండా ఇంటి వద్ద గట్టి నిఘా ఉంచుతారు. అక్టోబరు 6న పితబాస హత్యకు గురవగా, ఈ కేసులో పోలీసులు ఇంతవరకూ బ్రహ్మపుర మాజీ ఎమ్మెల్యే బిక్రం కుమార్ పండా, బీఈఎంసీ మాజీ మేయరు శివశంకర దాస్ (పింటు దాస్), వార్డు కార్పొరేటరు మళయ బిశోయి తదితర 16 మందిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

'సురభి' ఉత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, వారిలో దాగి ఉన్న ప్రతిభ 'సురభి' వంటి ఉత్సవాలతో వెలుగులోకి వస్తున్నాయని బ్రహ్మపుర ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రహి అన్నారు. గంజాం జిల్లా విద్యాధికారి (డీఈవో) కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి 'సురభి' ఉత్సవాలు శనివారం సాయంత్రం ముగిశాయి. స్థానిక గిరి రోడ్డులోని వి.వి.గిరి ప్రభుత్వ మహిళా మాధ్యమిక శిక్షణా కేంద్రం పాఠశాల ఆవరణలో జరిగిన ముగింపు వేడుకలకు ఎంపీ పాణిగ్రహి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఈవో అజయ కుమార్ పాత్ర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అదనపు డీఈవోలు ప్రభాతి కుమారి మహాపాత్ర్, బసంతకుమార్ పండా, ఎస్.ధనుంజయ, ఇతర అధికారులు అవినాష్ శత్పథి, ప్రధానోపాధ్యాయిని చాందిని పండా తదితరులు అతిథులుగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని వివిధ సమితుల నుంచి వచ్చిన 814 మంది విద్యార్థులకు మూడు విభాగాల్లో చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన, సృజనాత్మక రచనలు, సంగీతం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి వేడుకల్లో వివిధ అంశాల్లో విజేతలైన 37 మంది విద్యార్థులు ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకూ భువనేశ్వర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి సురభి ఉత్సవాల్లో పాల్గొంటారని డీఈవో కార్యాలయం అధికారులు తెలిపారు.

వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేసిన బ్రహ్మపుర ఎంపీ ప్రదీప్ పాణిగ్రహి. చిత్రంలో అతిథులు, విద్యాధికారులు

పూరీలో 14 నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా హ్యాండ్‌బాల్ సంఘం తరపున పూరీలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు 32వ రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు జరగనున్నాయి. పూరీలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న పోటీల్లో పురుషుల విభాగంలో 22 జిల్లాల జట్లు, మహిళా విభాగంలో 14 జిల్లాల జట్లకు చెందిన మొత్తం 760 మంది క్రీడాకారులు తలపడనున్నట్లు గంజాం జిల్లా హ్యాండ్‌బాల్ కార్యదర్శి సురేష్ పాఢి ఆదివారం సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ఈ నెల 13వ తేదీలోపు పూరీలోని ఝుడేశ్వరి క్లబ్‌లో తమ జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఇందులో ఉత్తమ ఆట ప్రదర్శించిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి వచ్చే డిసెంబరులో జరగనున్న జాతీయ పోటీలకు పంపుతారని పాఢి పేర్కొన్నారు.

కదళీ... లాభాలవైపు రైతు కదిలి

పుట్‌సీల్‌లో అరటి తోట

– న్యూస్‌టుడే, సిమిలిగుడ

కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితిలో మారుమూల ప్రాంతమైన కంటి పంచాయతీలో అరటి పంట రైతులను ఆదుకుంటోంది. వ్యవసాయానికి అనుకూలమైన ప్రాంతం అయినప్పటికీ, నీటి వనరుల కొరతతో రైతులు కేవలం వర్షాధార పంటలపైనే దృష్టి సారించారు. అన్నదాతల్లో ఉన్న ఉత్సాహాన్ని గమనించిన ప్రభుత్వం వాటర్ షెడ్ విభాగం ద్వారా చెక్ డ్యాములు నిర్మించాలని నిర్ణయించింది. పర్వత ప్రాంతాల నుంచి వచ్చే ఊట నీటిని నిల్వచేసి, డ్యామ్‌ను నిర్మించి పంటలకు మళ్లించేందుకు మూడేళ్ల కిందట చెక్ డ్యామ్‌ను నిర్మించింది. దీంతో ఇతర పంటలతోపాటు అదనంగా అరటి పంటపై రైతులు ఆసక్తి చూపారు.

★ గత రెండేళ్లలో రైతులను అరటి పంట బాగా ఆదుకుంది. ఎక్కువ విస్తీర్ణంలో పండించి సిమిలిగుడ, కుందిలి ప్రాంతాల్లో విక్రయించి లాభాలు ఆర్జించారు. కంటి ప్రాంతంలో పండే అరటికి బాగా గిరాకీ ఏర్పడింది. పుట్‌సీల్‌లోనూ ఎక్కువ ప్రాంతంలో పంట సాగు చేస్తున్నారు. ఒక అరటి గెలను రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతానికి ఆంధ్రా నుంచి అరటి దిగుబడి అవుతుండేది. కంటి రైతులు పండించడం ప్రారంభించాక అక్కడి నుంచి దిగుబడి కొంతమేర తగ్గింది.

★ ఈ ప్రాంతంలో అరటి పంటకు అనుకూలమైన వాతావరణం ఉన్నప్పటికీ, రైతులకు సరైన ప్రోత్సాహం అందడం లేదని పుట్‌సీల్‌కు చెందిన బినోడ్ జానీ వాపోయారు. రైతులను ప్రోత్సహించి, సహకారం అందిస్తే ఇతర ప్రాంతాల వారు సైతం పంట వేస్తారని, ఆంధ్రాపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని కంటి రైతులు చెబుతున్నారు. ఒక్కొక్క రైతు ఏడాదికి సుమారు 5 లక్షల రూపాయల వరకు ఆదాయం పొందుతున్నట్లు రైతు సునామ్ పేర్కొన్నారు.

సిమిలిగుడ మార్కెట్‌లో అమ్మకానికి తరలిస్తున్న అరటి గెలలు

బిడ్డకు నేనవుతా అమ్మ... నీవు పరీక్ష రాసి రా అమ్మా..

తల్లి దగ్గర నుంచి బిడ్డను తీసుకుంటున్న కానిస్టేబుల్

బిడ్డను ఎత్తుకొని విధులు నిర్వహిస్తున్న రజని

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: ఆమె ఓ పోలీసు కానిస్టేబుల్. డ్యూటీకి వెళ్లామా.. పూర్తయ్యాక తిరిగి ఇంటికి వెళ్లిపోదామా అని అనుకోలేదు. ఓ పోటీ పరీక్షకు మూడు నెలల చంటి బిడ్డతో వచ్చిన మహిళకు అండగా నిలిచారు. పరీక్ష అయ్యేంత వరకు చిన్నారిని లాలించారు. ఓ పక్క విధులు నిర్వర్తిస్తునే అమ్మగా బిడ్డను చూసుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు. వివరాల్లోకెళితే.. మల్కాన్‌గిరి పట్టణానికి చెందిన బైరవి మండల్ అనే మహిళ తన బిడ్డతో శనివారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరీక్షకు బిబిడిగుడ ప్రాథమిక పాఠశాలకు వచ్చారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ రజని మాఝి ఆ చిన్నారిని తాను చూస్తానని, ప్రశాంతంగా పరీక్ష రాయమని పంపారు. మూడు గంటలపాటు పరీక్ష జరిగిన సమయంలో ఒకవైపు విధులు నిర్వర్తిస్తూనే మరోవైపు చిన్నారి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను ప్రశంసించారు. ఈ విషయంపై రజని మాఝి మాట్లాడుతూ తాను కూడా ఒక తల్లినే అని, పరీక్ష రాసేందుకు వచ్చిన మహిళ పరిస్థితిని అర్థం చేసుకుని ఆ సమయంలో బిడ్డను చూసుకునే బాధ్యత తీసుకున్నానని చెప్పారు.

చిత్రం గీసి.. అబ్బురపరిచి

రాయగడ పట్టణంలోని స్పందన సాహితి సాంస్కృతిక సంస్థ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించింది. రామలింగేశ్వర ఆలయ కల్యాణ మండపంలో జరిగిన పోటీలకు విద్యార్థులు హాజరై సృజనాత్మక చిత్రాలు గీసి ఆకట్టుకున్నారు. ప్రముఖ చిత్రకారుడు ఎమ్.జనార్దన్ ఆచారి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. విజేతలకు వార్షికోత్సవ సభలో బహుమతులు అందజేయనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు గుడ్ల గౌరీప్రసాద్, పతివాడ తులసీదాస్ తెలిపారు. సాంస్కృతిక కార్యదర్శి కొండవలస కృష్ణమూర్తి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, రాయగడ

(c) eenadu

డుడుమాలో పర్యాటకుల సందడి

డుడుమా జలపాతం వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు

మాచ్‌ఖండ్, న్యూస్‌టుడే: కార్తికమాసం పూర్తవుతున్న సందర్భంగా జిల్లాలోని డుడుమా జలపాతం వద్ద పర్యాటకుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో వందల సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. వనభోజనాలు ఏర్పాటుచేసుకుని సందడి చేశారు. తమ చరవాణుల్లో స్వీయ చిత్రాలను తీసుకునేందుకు జలపాతం వద్ద పోటీలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఏడాది ఇద్దరు పర్యాటకులు గల్లంతైన విషయం తెలిసిందే. వారిలో బ్రహ్మపురకు చెందిన యూట్యూబర్ ఆచూకీ నేటికీ దొరకలేదు. డుడుమా జలపాతం దగ్గరకు వెళ్లే మార్గాన్ని పోలీసులు మూసినా దానిని దాటుకుని మరీ పర్యాటకులు వెళ్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. జనవరి వరకు రద్దీ కొనసాగనున్న నేపథ్యంలో పోలీసులు భద్రత పర్యవేక్షించాలని కోరుతున్నారు.

గోసేయ్‌దొర జలపాతం అభివృద్ధికి సన్నాహాలు

నవరంగపూర్ జిల్లా జొరిగావ్ సమితి గోసేయ్‌దొర జలపాత ప్రాంతాన్ని పర్యాటక స్థలం అభివృద్ధి చేసేందుకు యంత్రాంగం సన్నాహాలు ప్రారంభించనున్నట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి ఘస్సీయా హరిజన్ తెలిపారు. జలపాతం ప్రాంగణంలో మరుగుదొడ్లు, ఆరోగ్య కేంద్రం, విశ్రాంతి గది, రహదారి నిర్మాణాలు చేస్తామని, అందుకు రూ.35 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ ఏడాది పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని త్వరలో అభివృద్ధి పనుల చేపట్టనున్నట్లు తెలిపారు. - న్యూస్‌టుడే, నవరంగపూర్

రక్తదానానికి ముందుకు రండి

స్వచ్ఛంద సంస్థలు ప్రతి నెలా రక్తదాన శిబిరాలు నిర్వహించడంతోపాటు కొత్త దాతలు ముందుకు వచ్చేలా చూడాలని వక్తలు అన్నారు. లయన్స్ క్లబ్ సమావేశ భవనంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో అదనపు కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్, వైద్యుపు వి.ఎల్.ఎన్.రాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు. అధ్యక్షుడు లాల్ బిహారి లెంక, కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఎ.వి.ఎస్.గిరి, డి.కె.మహంతి, బాబురావు మహంతి తదితరులు పాల్గొన్నారు. 50 యూనిట్ల రక్తం సేకరించినట్లు రక్తనిధి ఇన్‌ఛార్జ్ గౌతమ్ పట్నాయక్ తెలిపారు. జెమ్స్ విద్యార్థులు సహకారం అందించారు. - న్యూస్‌టుడే, రాయగడ

పింఛను అందించాలని వృద్ధురాలి వేడుకోలు

సబ్జాన్ బీబీ

సిమిలిగుడ, న్యూస్‌టుడే: పింఛను కోసం నందపూర్ సమితి తుబా గ్రామ పంచాయతీ పాత్రపొండి గ్రామానికి చెందిన సబ్జాన్ బీబీ అనే 80 ఏళ్ల వృద్ధురాలు తీవ్ర అవస్థలు పడుతోంది. ఆధార్‌కార్డులో 84, ఓటర్ కార్డులో 80 సంవత్సరాలు అని ఉండటంతో అధికారులు పింఛన్ మంజూరు దరఖాస్తును తిరస్కరిస్తున్నారు. 2024లో ఒకసారి, తాజాగా ఈ ఏడాది జూన్‌లో మరొకసారి దరఖాస్తు పెట్టిన వయసు తేడా కారణంగా మంజూరు కాలేదు. దీంతో బాధితురాలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. నడవలేని స్థితిలో ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పింఛన్ మంజూరు కావడం లేదని వృద్ధురాలు వాపోతున్నారు. దీనిపై సమితి అభివృద్ధి అధికారి దుర్గా ప్రసాద్ దొర వద్ద ప్రస్తావించగా తన దృష్టికి వచ్చిందని, సమితి సంక్షేమ అధికారి, పీఈవోలను గ్రామానికి పంపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

పట్టాలు ప్రదర్శిస్తున్న లబ్ధిదారులు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుడారి సమితిలో 26 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. గుడారి తహసీల్దార్ ఎ.స్నేహలత, ఇతర అధికారులు సమితిలో ఎమ్.కె.రాయి పంచాయతీలో 14 మందికి, కొడమా పంచాయతీ పరికుపడా గ్రామానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు.

మహిళా సంఘాలకు మండీ బాధ్యతలు అప్పగించొద్దు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా మల్కాన్‌గిరి సమితి, కలిమెల సమితి పరిధిలో మండీల్లో ధాన్యం కొనుగోలు బాధ్యతలను మహిళా సంఘ సభ్యులకు అప్పగించొద్దని ఎనిమిది పంచాయతీల సర్పంచులు, రైతులు జిల్లా పాలనాధికారికి సోమేష్‌కుమార్ ఉపాధ్యాయకి శనివారం వినతి పత్రం అందజేశారు. ఒక మండీలో కేవలం ముగ్గురు మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నా 15 మంది ధాన్యం బస్తాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మండీ పరిపాలన బాధ్యత ల్యాంప్స్‌కు మాత్రమే అప్పగించాలని కోరారు.

ప్రపంచ బాడీబిల్డింగ్ పోటీలకు బ్రహ్మపుర రిఫరీలు

రిఫరీలు ఎస్.రాజేష్‌బాబు ఆచారి, ఉమాచరణ్ శత్పథి

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఇండోనేషియాలోని బటమ్ సిటీలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న 16వ డబ్ల్యూబీపీఎఫ్ ప్రపంచ బాడీబిల్డింగ్, ఫిజిక్ స్పోర్ట్స్ పోటీలకు రాష్ట్రం నుంచి ఇద్దరు రిఫరీలు ఎంపికయ్యారు. భారత జట్టుతో ఇతర అఫీషియల్స్, కోచ్‌లతోపాటు రిఫరీలుగా బ్రహ్మపురకి చెందిన ఎస్.రాజేష్‌బాబు ఆచారి, ఉమాచరణ్ శత్పథి పోటీలకు వెళ్తున్నారు. వీరు ఆదివారం రాత్రి పూరీ నుంచి చెన్నైకి రైలులో పయనమై అక్కడి నుంచి విమానంలో ఇండోనేషియాకు బయలు దేరుతున్నారు.

అంతర్జాతీయ జు జిత్సు పతక విజేతకు ఘన స్వాగతం

విమానాశ్రయంలో అనుపమకు స్వాగతం పలికి అభినందిస్తున్న క్రీడాశాఖ అధికారులు, సంఘం ప్రతినిధులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: థాయిలాండ్‌లో జరిగిన అంతర్జాతీయ జు జిత్సు పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం గెలుచుకున్న రాష్ట్ర క్రీడాకారిణి అనుపమ స్వయిన్‌కు ఘన స్వాగతం పలికారు. శనివారం రాష్ట్రానికి చేరుకున్న ఆమెకు భువనేశ్వర్ విమానాశ్రయంలో రాష్ట్ర క్రీడాశాఖ అధికారులు, ఒడిశా జు జిత్సు సంఘం ప్రతినిధులు పుష్పగుచ్ఛాలందజేసి అభినందించారు. వివిధ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో 52 కిలోల కేటగిరీలో కాంటాక్ట్ ఫైట్ అంశంలో అనుపమ ఉక్రెయిన్ క్రీడాకారిణితో తలపడి ద్వితీయస్థానం పొందిన సంగతి తెలిసిందే.

జిల్లా అంతర పాఠశాలల క్రీడల్లో బాలల సత్తా

వందమీటర్ల పరుగులో బాలుర పోటీ

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా అంతర పాఠశాలల బాలబాలికల క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. స్థానిక గుసానినువాగాంలోని డీఏవీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న ఇందులో బ్రహ్మపుర, ఛత్రపురం, గోపాలపూర్, అస్కా, భంజనగర్, గంజాం, కొణిసి, రొంగాయిలొండా తదితర ప్రాంతాలకు చెందిన 29 పాఠశాలలకు చెందిన సుమారు 1500 మంది బాలబాలికలు వివిధ కేటగిరీలలో క్రీడాంశాల్లో పోటీపడుతూ ప్రతిభ ప్రదర్శిస్తున్నారు. పోటీల్లో 100, 200 మీటర్ల పరుగు, రిలే రేస్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్, డిస్కస్‌త్రోలు, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్ అంశాల్లో వివిధ ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల బాలలు క్రీడాస్ఫూర్తితో ఆడుతున్నారు. నిర్వాహక క్లబ్ అధ్యక్షుడు ఈ.వెంకట్ ఆనంద్, కార్యదర్శి టి.రాహుల్, ఇతర సభ్యులు, పాఠశాలల పీఈటీలు వీటిని పర్యవేక్షిస్తున్నారు.

లాంగ్‌జంప్ చేస్తున్న బాలుడు

సురభితో ప్రతిభకు పదును

అతిథుల నుంచి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థుల బృందం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న వివిధ కళలకు సంబంధించి ప్రతిభను వెలికితీసేందుకు సురభి వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అదనపు కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్ అన్నారు. బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సురభి పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, నృత్య, వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీలను నిర్వహించారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచినవారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కానున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రామచంద్ర నాహక్ తెలిపారు. గతంలో సమితి స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. విజేతలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఈవో భజన్‌లాల్ మాఝి తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ మీట్‌లో సుశాంత్‌కు స్థానం

సుశాంత్ కుమార్

జయపురం, న్యూస్‌టుడే: ఉత్తరాఖండ్ రాష్ట్రంలో డెహ్రాడూన్‌లో ఈ నెల 12వ తేదీ నుంచి 16 వరకు జరగనున్న ఆల్ ఇండియా ఫారెస్ట్ మీట్‌కు ఫారెస్టర్ సుశాంత్ పాల్గొనున్నాడు. ఈయన రాష్ట్ర హాకీ జట్టు తరపున హాజరుకానున్నాడు. అవిభక్త కొరాపుట్ జిల్లా నుంచి ఈయన పాల్గొనడంపై పలువురు అభినందనలు తెలియజేశారు.

కొత్తకోళీలో సత్యసాయి గ్లోబల్ అఖండ భజన

పట్టణంలోని కొత్తకోళీ శ్రీసత్యసాయి సేవా కేంద్రంలో శనివారం సాయంత్రం 5 గంటలకు సత్యసాయి గ్లోబల్ అఖండ భజన కార్యక్రమం ప్రారంభమైంది. ఆదివారం సాయంత్రం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఖరగ్‌పూర్ నలుమూలల నుంచేకాక ఇతర ప్రాంతాలకు చెందిన సాయి భక్తులు హాజరయ్యారు. - న్యూస్‌టుడే, ఖరగ్‌పూర్

నేడు శివరాజ్ భువనేశ్వర్ రాక

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం భువనేశ్వర్ వస్తున్నారు. లోక్ సేవా భవన్‌లో 'మండియా దివస్'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. తరువాత కటక్ సదర్ ప్రాంతానికి వెళ్లి అన్నదాతతో సమావేశమై ఇబ్బందులపై అధ్యయనం చేస్తారు. ఐసీఏఆర్, సీఆర్ఆర్ కేంద్రాలు సందర్శించి సాయంత్రం విజయవాడ ప్రయాణమవుతారు.

నువాపడలో అఖిలేష్ యాదవ్ ప్రచారం

అఖిలేష్‌కు పార్టీ నేతలు గజమాలతో సత్కారం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఆదివారం నువాపడలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ ఉప ఎన్నికలో నువాపడ నుంచి ఎస్పీ అభ్యర్థిగా రమాకాంత్ హొత్తా పోటీ చేస్తున్నారు. ఓటర్లు ఈ ప్రాంతాభివృద్ధి కోరి రమాకాంత్‌ను గెలిపించాలని, చిత్తశుద్ధితో అభివృద్ధి పనులు చేస్తారని యాదవ్ చెప్పారు.

వచ్చే నెల 13న జాతీయ ప్రజాకోర్టు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: వచ్చే నెల 13న పర్లాఖెముండి జిల్లా కోర్టుతోపాటు కాశీనగర్, ఆర్.ఉదయగిరి, మోహన న్యాయ స్థానం ఆవరణలో నాలుగో జాతీయ ప్రజా కోర్టు నిర్వహించనున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్, బ్యాంకు రుణాలు, వాహన ప్రమాద పరిహారం, కార్మిక, కుటుంబ వివాదాలు భూసేకరణ వ్యాజ్యాలపై తీర్పు ఇవ్వనున్నట్లు జిల్లా న్యాయసేవల అథారిటీ కార్యదర్శి బిమల్ రౌల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆల్ఫా కప్ క్రికెట్ పోటీలు

మ్యాచులో తలపడిన ఆల్ఫా జూనియర్, కళ్లికోట జట్ల క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఆల్ఫా స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో మూడోవిడత క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. స్థానిక కళ్లికోట కళాశా క్రీడామైదానంలో ఈ నెల 13వ తేదీవరకు నిర్వహిస్తున్న ఇందులో కళ్లికోట స్పోర్టింగ్ క్లబ్, జేసీసీ, లీడ్స్ అకాడమీ, ఆక్స్‌ఫర్డ్ క్రికెట్ క్లబ్, రామేశ్వర స్పోర్టింగ్ క్లబ్, ఆల్ఫా జూనియర్, రాయల్ క్రికెట్ క్లబ్, ఆల్ఫా స్పోర్టింగ్, పానాసోనిక్ క్రికెట్ క్లబ్, స్వరాజ్ క్రికెట్ క్లబ్ జట్లు తలపడుతున్నాయి.

ఘనంగా కార్తిక దీపోత్సవం

కార్తిక దీపోత్సవం-2025లో భాగంగా గజపతి రక్తదాతల సంఘం ఆధ్వర్యంలో సహస్ర దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. పర్లాఖెముండి పట్టణంలోని గుండిచా మందిరం వద్ద ధవళేశ్వర ఆలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు. - న్యూస్‌టుడే, పర్లాఖెముండి

భక్తిశ్రద్ధలతో గాయత్రీ యజ్ఞం

కలశ యాత్రలో పాల్గొన్న మహిళలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సమితి దుగరంచి పంచాయతీలో ఆదివారం నుంచి గాయత్రి మహా యజ్ఞం ప్రారంభమైంది. వందలాది మహిళలు కొలాబ్ నది నుంచి పవిత్ర జలాలను సేకరించి కలశాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారిని అభిషేకించారు. 1,008 దీపాలు వెలిగించి భక్తిగీతాలతో భజనలు చేశారు. యజ్ఞం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం జరిపినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నిరంజన్ పాణిగ్రహి తెలిపారు.

రాయగడలో మోడల్ పార్లమెంట్

కార్యక్రమంలో ఎంపీ ఉలక, ఏడీఎం, డీఈవో తదితరులు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడలో జిల్లా స్థాయి మోడల్ పార్లమెంట్ కార్యక్రమం జరిగింది. శనివారం సాయంత్రం స్థానిక జీసీడీ మైదానంలో ఏడీఎం (అదనపు జిల్లా మేజిస్ట్రేట్) అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక హాజరయ్యారు. పార్లమెంట్‌లో నిర్వహించే ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకారం, బిల్లులు, బడ్జెట్ సమర్పణ, శూన్య గంటలో జరిగే ప్రశ్నోత్తరాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. మొత్తం 11 సమితుల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామస్థులే రోడ్డు నిర్మించుకున్నారు..

గ్రామానికి రోడ్డు లేక రాకపోకలకు ఇబ్బంది పడుతున్నా, పాలకులకు గోడు వినిపించిన ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానికులే చందాల ద్వారా శ్రమదానంతో రహదారి నిర్మించుకున్నారు. రాయగడ జిల్లా కల్యాణసింగుపూర్ సమితి సెరిగుమ పంచాయతీలో మారుమూల గ్రామం కురుకుటి. వంద కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామానికి సరైన రహదారి లేదు. దీంతో రోగులు, గర్భిణులను సైతం ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డోలి కట్టి ప్రధాన రోడ్డు వరకు మోసుకొని వెళ్తున్నామని పేర్కొంటున్నారు. పాలకుల తీరుతో విసుగెత్తిన గ్రామస్థులు చందాలు వేసుకుని 1 కి.మీ. పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పక్కా రహదారిని నిర్మించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాయగడ గ్రామీణం

సైబర్ మోసాలపై అవగాహన అవసరం

ర్యాలీ చేపడుతున్న పోలీసులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పోలీసులు అన్నారు. గజపతి జిల్లాలోని వివిధ ఠాణా పరిధిలో సైబర్ మోసాలపై ఆదివారం సెరంగో ఠాణా పరిధిలోని నువాగడ సమితిలో ర్యాలీ చేపట్టారు. సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ పరిచయాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత నేరస్థుల మాదిరిగానే కొత్తవారు ఆన్‌లైన్లో డేటాను సులభంగా సేకరిస్తున్నారని జాగ్రత్త వహించాలని సూచించారు.

ఉచిత న్యాయ సేవలపై ప్రచారం

ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యనారాయణ

రాయగడ, న్యూస్‌టుడే: జాతీయ న్యాయ సహాయతా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆదివారం జిల్లా కోర్టు వద్ద ప్రధాన న్యాయమూర్తి సత్యనారాయణ షడంగి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. విద్యార్థులతోపాటు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

జయపురం, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జయపురం సమితి పంపుణి పంచాయతీ కుములిపుట్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హరిగౌడ్ (40) శనివారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చి స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పరీక్షల అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

జయపురం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కొరాపుట్-జయపురం ఘాటి రహదారిపై ఆదివారం ఉదయం జరిగింది. ఠాణాధికారి సచ్చింద్ర ప్రధాన్ తెలిపిన వివరాలు మేరకు.. ఠాకురాణి మందిరం వద్ద జరిగిన ప్రమాదంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి(35) మృతిచెందాడు. మృతదేహాన్ని జయపురం జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ సమితి దేదాసపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఇంద్రావతి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజులు కిందట ఓ వ్యక్తి మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మృతదేహాన్ని జిల్లా ప్రధాన ఆసుపత్రి శవాల గదిలో భద్రపరిచామని, 96 గంటల తరువాత ఆచూకీ తెలియకుంటే పోలీసు శాఖ తరపున అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు.

అత్యాచారం కేసులో యువకుడి అరెస్టు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం సౌరాగూడ ప్రాంతానికి చెందిన ఓ బాలికపై అత్యాచారం చేసిన కేసులో పోలీసులు నిందితుడిని ఆదివారం అరెస్టు చేశారు. ఐఐసీ ఉల్లాస్‌చంద్ర రౌత్ తెలిపిన వివరాలు ప్రకారం.. బాలిక(14)తో బుడు హరిజన్ అనే యువకుడు పరిచయం పెంచుకున్నాడు. ఈ నెల 7న బయటకు తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని ఆదివారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

చేపల వేటకు వెళ్లి మహిళ మృత్యువాత

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లి ఓ మహిళలు మృతి చెందిన ఘటన పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా నారాయణఘడ్ పరిధిలోని చీల్‌కుండీ ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చీల్‌కుండీకి చెందిన **ఆరతి బారిక్** (53) తన ఇంటి సమీపంలో ఏరు వద్ద శుక్రవారం చేపలు పట్టడానికి వెళ్లింది. శనివారం వరకూ ఆమె ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే గాలింపు చేపట్టగా మధ్యాహ్నం నాటికి మృతదేహం కొంత దూరంలో ఏటి ఒడ్డున లభించింది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

3 వేల గంజాయి మొక్కలు ధ్వంసం

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుడారి సమితిలో పోలీసు, ఆబ్కారీశాఖ అధికారులు గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. సమితిలో ముడుకుని గ్రామం సమీపంలో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం రావడంతో రాయగడ ఎస్పీ ఆదేశాల మేరకు గుణుపురం ఎస్డీపీవో బబుల్లి నాయక్ ఆధ్వర్యంలో బృందాలు వెళ్లి గంజాయి మొక్కలకు నిప్పు పెట్టారు. గుడారి, పద్మపురం సమితులలో గంజాయి సాగుపై నిఘా ఉంచినట్లు నాయక్ పేర్కొన్నారు. గుడారి ఐఐసీ సమర్పితా స్వయి ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో చోరీ నిందితులు

బ్రహ్మపుర నగరం, నవరంగపూర్, న్యూస్‌టుడే: గంజాం జిల్లా గొళంత్రా ఠాణా పరిధిలోని సుర్లా గ్రామంలో ఇటీవల జరిగిన ఓ చోరీ కేసులో పోలీసులు ఇద్దర్ని అరెస్టు చేసి ఆదివారం వారిని న్యాయస్థానానికి తరలించారు. నిందితులు గొళంత్రా ఠాణా పరిధిలోని సుర్లా గ్రామానికి చెందిన కన్హా అలియాస్ చూడామణి బెహర (20), కె.జోగేశ్వర ఆచారి (60)లని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడు కన్హా నుంచి రూ.70 వేలు నగదు, మరో నిందితుడు జోగేశ్వర నుంచి 16 గ్రాములు కరిగించిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సుర్లా గ్రామానికి చెందిన పుని బెహర (60) అనే వృద్ధురాలు అక్టోబరు 22న ఉదయం గ్రామంలోని చెరువుకు స్నానానికి వెళ్లగా, ఆమె ఇంట్లోకి ప్రవేశించిన గుర్తు తెలియని వారు ఇంట్లో పడుకుని ఉన్న ఆమె కుమార్తె మెడలోని 16 గ్రాముల బంగారం గొలుసు చోరీ చేశారని బాధితురాలు ఠాణాలో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి గ్రామానికి చెందిన కన్హాను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, తన నేరాన్ని అంగీకరించాడు. పుని బెహర ఇంట్లో చోరీ చేసిన బంగారం గొలుసును అదే గ్రామంలోని స్వర్ణకారుడు జోగేశ్వర ఆచారికి విక్రయించినట్లు పేర్కొన్నాడు. దీంతో జోగేశ్వరను అరెస్టు చేసి కరిగించిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ శరవణ వివేక్ తెలిపారు.

● **నవరంగపూర్ జిల్లాలో..** నవరంగపూర్ జిల్లా డాబుగావ్‌లో ఉన్న దుకాణంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలో ఓ ఫ్యాన్సీ షాపులో శనివారం చోరీ జరిగిందని యజమాని సోనియా దొళాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.90 వేలు అపహరణకు గురైనట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సారా బట్టీలపై ఆబ్కారీ దాడులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సమితి కలాగూడ ప్రాంతంలో సారా బట్టీలపై ఆదివారం ఆబ్కారీ అధికారులు దాడులు నిర్వహించారు. ఓఐసీ సుబ్రత్ కేసరీ నేతృత్వంలో అధికారులు 8 బట్టీలపై దాడులు చేసి 3,120 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. అధికారుల రాకను గమనించిన యజమానులు ముందుగానే అక్కడి నుంచి పరారయ్యారు.

ఎస్ఐఆర్ దరఖాస్తులు ఇవ్వాలి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: బెంగాళేతరులకు ఆంగ్ల ఎస్ఐఆర్ దరఖాస్తులు ఇవ్వాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు వి.శేషగిరిరావు గుర్తు చేశారు. దీని వల్ల ఓటరు సంశోధన్ ప్రక్రియ సవ్యంగా జరుగుతుందని, లేదంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఓ ప్రకటనలో కోరారు.

పరబ్‌లో స్థానిక కళాకారులకు అవకాశమివ్వండి

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా లోకోత్సవం పరబ్‌లో స్థానికులకు అవకాశం ఇవ్వాలని కోరుతూ జిల్లా కళాకారుల సంఘ సభ్యులు కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్‌కు వినతిపత్రం అందజేశారు. ఉత్సవాల లక్ష్యం పక్కదోవ పట్టకుండా చర్యలు చేపట్టాలని అందులో పేర్కొన్నారు.

మిడ్నాపూర్ పురపాలికకు వైస్ ఛైర్‌పర్సన్ నియామకం

నియామక పత్రాన్ని చూపిస్తున్న మౌరాయ్, పక్కన సోమెన్‌ఖాన్

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మిడ్నాపూర్ పురపాలిక కొత్త వైస్‌ఛైరపర్సన్‌గా మౌరాయ్ శనివారం సాయంత్రం నియమితులయ్యారు. ఆమె ఐదో వార్డుకు తృణమూల్ కాంగ్రెస్ మహిళా విభాగపు అధ్యక్షురాలుగా ఉన్నారు. ఆమె చేసిన సేవలకుగాను వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తున్నట్లు పురపాలక సంఘ అధ్యక్షుడు సోమెన్‌ఖాన్ పేర్కొన్నారు.

పాఠశాలలో డిజిటల్ గ్రంథాలయం ప్రారంభం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమమిడ్నాపూర్ జిల్లా సాల్బోని ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన శ్రీ జైన్ డిజిటల్ గ్రంథాలయాన్ని బ్యాంకు కన్వీనర్ సుశీల్ గెలరా ప్రారంభించారు. కోల్‌కతా ఎస్.ఎస్.జైన్ సభ ఆధ్వర్యంలో జైన్ బుక్ బ్యాంక్ నడుస్తోంది. జంగల్ మహల్ జిల్లా కన్వీనర్ గౌతమ్‌కుమార్ బోస్, యూఎస్ శాస్త్రితోపాటు పాఠశాల కమిటీ అధ్యక్షుడు అనుపమ సహా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ శేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ గ్రంథాలయం విద్యార్థులకు విజ్ఞానాన్ని అందజేస్తుందని వక్తలు పేర్కొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కోసం సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

సందడిగా చిత్రలేఖనం పోటీలు

ఖరగ్‌పూర్ పట్టణంలోని ఇందా ప్రాంతంలో ఉన్న ఖరగ్‌పూర్ ప్రెస్‌క్లబ్ పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఆధ్వర్యంలో ఆదివారం క్లబ్ భవనంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సుప్రసిద్ధ కార్యదర్శి సైకత్ సంత్రా తెలిపారు. పలువురు చిన్నారులు ఈ పోటీలో పాల్గొని విజేతలు నిలిచారు. నిర్వాహకులు వారికి జ్ఞాపికలు అందజేసి ప్రోత్సహించారు. - న్యూస్‌టుడే, ఖరగ్‌పూర్

నిత్యావసరాల పంపిణీ

సోంపేట, న్యూస్‌టుడే: తుపాను పరిస్థితులతో వేట సాగపోవడంతో ఇబ్బందుల్లో ఉన్న మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని నిత్యావసరాలను కూటమి నాయకులు పంపిణీ చేస్తున్నారు. ఆదివారం వాడపాలెం-కొత్తూరులో ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, కిలో చొప్పున కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు తెదేపా మండలాధ్యక్షుడు కుమార్, నాయకులు ఎం.జోగారావు, మోహన్‌రావు, ఉమాపతి, ప్రేమ్ పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

వాడపాలెం-కొత్తూరు మత్స్యకారులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

చిత్రాలు పంచుకోకు.. చిక్కుల్లో పడకు

మార్ఫింగ్ ఫొటోలతో యువతకు బెదిరింపులు

జిల్లాలో నమోదైన కేసుల వివరాలు ఇలా..		
సంవత్సరం	2023	2024
సంఖ్య	23	17
2025 (సెప్టెంబరు వరకు)	08	

★ శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ యువతికి ఆన్‌లైన్‌లో విద్యార్థిగా చెందిన యువకుడు పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నట్టు నమ్మబలికి.. ఆమె ఫొటో అను 'పేక్' చేయాలని కోరాడు. ఆమె పంపిన కొన్ని గంటల్లోనే వాటిని మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెట్టాడు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. నిందితుడికి సహకరించిన కడప జిల్లాకు చెందిన మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.

జిల్లాలో ఇటీవల ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. చాలా మంది సామాజిక మాధ్యమాల్లో చిత్రాలను అప్‌లోడ్ చేస్తున్నారు. అగంతకులు వాటిని అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి.. బెదిరించి.. డబ్బులు దండుకుంటున్నారు. కొందరు ఎవరికీ చెప్పుకోలేక మనోవేదనకు గురవుతుంటే.. మరికొందరు ప్రాణాలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

★ కాశీబుగ్గకు చెందిన ఓ వివాహిత రీల్స్ చేయడం అలవాటు. సామాజిక మాధ్యమాల్లో వాటికి లైక్‌లు, షేర్లు వస్తుంటే మురిసిపోయేది. ఓరోజు ఆమెకు ఫోన్ కాల్ వచ్చింది. రూ.5 లక్షలు పంపాలని, లేకుంటే అసభ్యకర చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని అవతలి వ్యక్తి బెదిరించాడు. భయపడిన ఆమె తన వద్ద ఉన్న బంగారాన్ని తాకట్టుపెట్టి రూ.3 లక్షలు పంపించింది. మిగతా మొత్తం కోసం వేధింపులు పెరగడంతో కుటుంబీకుల సాయంతో పోలీసులను ఆశ్రయించింది. నిందితుల కోసం సైబర్ పోలీసులు వేట సాగిస్తున్నారు.

అలాంటప్పుడు ఏం చేయాలి..?

- బాధితులు నేరుగా పోలీసులను ఆశ్రయిస్తే.. వారు నిందితులను గుర్తించి క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.
- అనంతరం సామాజిక మాధ్యమాల్లో వచ్చిన మార్ఫింగ్ చిత్రాలను www.stopncii.org వెబ్‌సైట్‌కు పంపాలి.
- వాటితో పాటు ఇతర వివరాలు పొందుపరిస్తే మెటా డేటా ఆధారంగా ఆ చిత్రాలను తొలగిస్తారు.
- ఫిర్యాదు చేసేందుకు 112, 1930 నంబర్లను సంప్రదించవచ్చు.

బ్లాక్ లిస్ట్‌లో పెట్టండి..

సామాజిక మాధ్యమాల్లో ప్రొఫైల్ చిత్రాలను ఇతరులు డౌన్‌లోడ్ చేసే వీలు లేకుండా లాక్ చేయాలి. అపరిచితుల నుంచి రిక్వెస్టులను ఆమోదించవద్దు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే ఆ నంబర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి.

– పి.శ్రీనివాసరావు, ఏఎస్పీ క్రైం, శ్రీకాకుళం

ఔరా.. నాటిక భళా!

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద సత్యక్లైమాక్స్ పాఠశాల ఆవరణలో మేరంగి నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం రాత్రి జరిగిన ప్రదర్శనలో తెలుగు చైతన్య కళాస్రవంతి, విశాఖ వారి పి.బాలాజీ నాయక్ దర్శకత్వం వహించిన అసత్యం నాటిక, ఉషోదయ కళానికేతన్, గుంటూరు కళాకారులు చెరుకూరి సాంబశివరావు దర్శకత్వంలో గారడీ, అభినయ, విశాఖపట్నం కళాకారులు కవి ప్రసాద్ దర్శకత్వంలో ఓ కాశీనాసి రావయ్య అన్న నాటికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు వాసుదేవరావు, ఆర్.అజయ్‌కుమార్, వివిధ జిల్లాల కళాకారులు ఉన్నారు.

గారడీ నాటికలో ఓ సన్నివేశం

సామూహిక వంటశాలలు వద్దంటూ నిరసన

సాలూరు, న్యూస్‌టుడే: పాఠశాలల్లో సామూహిక వంటశాలల నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పట్టణ ప్రధాన రహదారిలో ర్యాలీ చేశారు. అనంతరం బోసుబొమ్మ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఏళ్లుగా విద్యార్థులకు రుచికరమైన భోజనాలు వండిపెడుతున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నేత ఎన్‌వై నాయుడు అన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కు తీసుకోవాలని కోరారు.

శబ్దం చేయడం.. అదో సంప్రదాయం..!

నోటిని గుండ్రని ఆకృతిలోకి మార్చి.. నాలుకను లయబద్ధంగా కదుపుతూ.. శ్వాసను వదులుతూ చేసే వింతైన శబ్దాలను ఉలాలుగా పిలుస్తారు. ఒడియా సంప్రదాయంలో దీనికెంతో ప్రత్యేకత ఉంది. బాలికల నుంచి వృద్ధుల వరకు మహిళలు పెళ్లిళ్లు, పేరంటాల్లో తప్పనిసరిగా ఈ శబ్దాలు చేస్తారు. ఈ కార్తిక మాసంలోనూ నదీ స్నానం, ఆలయాలు, ఇళ్లల్లో పూజల సమయంలో ఈ పవిత్ర ధ్వనిని వినిపిస్తారు. జిల్లాలోనూ ఒడిశాతో సరిహద్దులు పంచుకుంటున్న ప్రాంతాల్లో నేటికీ ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇటుక ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం కొజ్జిరియా కూడలి సమీపంలోని కల్వర్టు వద్ద ఇచ్ఛాపురం రత్తకన్న నుంచి జమేదరపుట్టుగ గ్రామానికి వస్తున్న ఇటుక ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా హింజిలిఘాట్ గ్రామానికి చెందిన కార్తీక్‌దాస్ (16) రత్తకన్నలో వాలి ఇటుక బట్టీలో పని చేస్తున్నాడు. ఆదివారం జమేదరపుట్టుగకు ఇటుక లోడు తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో వాహనం బోల్తా పడింది. తీవ్ర గాయాల పాలైన యువకుడిని ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రిలో చేర్పించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనకు అతి వేగమే కారణమని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని, సోమవారం ఇటుక బట్టీకి వెళ్లి తనిఖీలు నిర్వహించి యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఎస్సై రవివర్మ తెలిపారు.

బోల్తా పడిన ఇటుక ట్రాక్టర్

ఆలయాల భద్రతపై ఉదాసీనత వద్దు

సోంపేట, న్యూస్‌టుడే: ఆలయాల భద్రత, ఇతర నిర్వహణ పరమైన అంశాలపై కమిటీలు ఉదాసీనత ప్రదర్శించొద్దని, అప్రమత్తంగా ఉండాలని సోంపేట ఎస్సై లోవరాజు సూచించారు. ఆదివారం సోంపేట సత్యదేవుడు, పోలమ్మ, పోలమాంబ తదితర ఆలయాలు పరిశీలించి నిర్వహణ కమిటీ సభ్యులతో మాట్లాడారు. దర్శనాలు, అన్నసమారాధన తదితర కార్యక్రమాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

వీడని చిక్కులు.. అన్నదాతకు తిప్పలు

రెవెన్యూ డివిజన్	టెక్కలి
మండలాలు	9
వైకాపా హయాంలో రీసర్వే జరిగిన గ్రామాలు	215
ఎల్పీఎంలు	2,08,379
ఉమ్మడి ఎల్పీఎంలు	4,250
విభజన చేసినవి	2,974
పరిష్కారం కానివి	858
తిరస్కరించినవి	385
పెండింగ్‌లో ఉన్నవి	33

– న్యూస్‌టుడే, హిరమండలం, టెక్కలి పట్టణం

★ హిరమండలం పరిధి లోకొండ గ్రామంలో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు గతంలో భూహక్కు పత్రాలు మంజూరు చేశారు. వైకాపా పాలనలో రీసర్వే పేరుతో భూములు కొలిచారు. అనంతరం వారికి జగన్ ఫొటోతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశారు. సగం మంది రైతులకు ఉన్న భూమి కంటే తక్కువ విస్తీర్ణం నమోదు చేశారు.

★ కొత్తూరు మండలం ఇరపాడు రెవెన్యూ పరిధిలో వంశధార నిర్వాసితులకు చెందిన మిగులు భూమి గత ప్రభుత్వం రీసర్వే చేసింది. చాలా మంది రైతులకు కలిపి ఒకే ఎల్పీఎం సంఖ్య కేటాయించడంతో ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సంతబొమ్మాళి: హనుమంతుపురంలో రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

● సమస్యలు ఇలా..

గతంలో సర్వే సంఖ్య, వాటి సబ్ డివిజన్ల వారీగా భూముల వివరాలు ఉండేవి. రీసర్వే సమయంలో ఉమ్మడి ఎల్‌పీఎం (జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్) సంఖ్యలు ఇచ్చే విధానం తీసుకొచ్చారు. సర్వే సంఖ్యల్లో ఎంతమంది రైతులు ఉంటే అంత మందికి కలిపి ఒకే ఎల్పీఎం సంఖ్య కేటాయించారు. దీంతో వెబ్‌ల్యాండ్‌లో వ్యక్తిగతంగా వివరాలు కనిపించడం లేదు. పంట రుణాలు అందటం లేదు. అవసరాలకు పొలం అమ్మడానికి వీలుపడటం లేదు. ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలకు అన్నదాతలు దూరమయ్యారు. క్షేత్రస్థాయిలో ఇలాంటి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా.. అప్పటి చిక్కులు వీడటం లేదు.

ఇబ్బందులు రెట్టింపు

భూ సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపుతామని వైకాపా హయాంలో శాశ్వత భూహక్కు, భూ రక్షిత పథకాన్ని తీసుకొచ్చారు. ఆర్భాటంగా ప్రారంభించినా.. రీసర్వేలో లోపాలు రైతుల పాలిట శాపాలుగా మారాయి. విస్తీర్ణం తక్కువగా నమోదు కావడం, భూయజమాని పేర్లు మారిపోవడం వంటి సమస్యలతో అన్నదాతలు ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు.

★ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం

ఉమ్మడి ఎల్పీఎంలు సబ్ డివిజన్ చేసుకునేందుకు రూ.550 రైతులు ఆన్‌లైన్‌లో చెల్లించేవారు. వారి ఇబ్బందులను గుర్తించి రూ.50లకు ప్రభుత్వం తగ్గించింది. దరఖాస్తులు పరిశీలించి వ్యక్తిగత ఎల్పీఎంల సంఖ్య కేటాయిస్తాం. కొన్ని నెలలుగా టెక్కలి డివిజన్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, సమస్యలు పరిష్కరిస్తున్నాం. రైతులు గ్రామ సచివాలయాల్లో వీఆర్వోల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

– ఎం.కృష్ణమూర్తి, ఆర్డీవో, టెక్కలి

ప్రయోగం వికటించింది.. మొదటికే మోసం వచ్చింది..

★ కనీస సౌకర్యాలు లేని కాంప్లెక్స్ వరకే ఆర్టీసీ బస్సులన్నీ ★ ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ప్రయోగాలు చేస్తే.. అది సంస్థకు లాభదాయకంగా ఉండాలి. అంతే తప్ప అధికారులు ఏం చేసినా చెల్లుతుందని అనుకుంటే అసలుకే మోసం వస్తుంది. ప్రజలు వేరే మార్గాలు అన్వేషిస్తారు. ఇచ్ఛాపురంలో ఇదే జరిగింది. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఊరికి కాస్త దూరంగా ఉంది. జిల్లాలో ఏర్పడిన రెండో కాంప్లెక్స్‌గా గుర్తింపు ఉన్నా, నేటికీ కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు.

★ ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలోని ఖాళీ స్థలాలను లీజుకిచ్చి సంస్థ ఆర్థికంగా బలపడింది. కానీ ప్రయాణికుల వెతలు మాత్రం పట్టించుకోవడం లేదు. ఏ బస్సు ఎక్కడకు వెళ్తుందో, ఎప్పుడు వస్తుందో చెప్పే నాథుడు లేరు. ప్రధానంగా సుమారు కిలోమీటరు దూరం వరకు ప్రయాణ సామగ్రితో నడవాల్సిన పరిస్థితి. ఇన్ని అవస్థల మధ్య ఉన్న ఈ కాంప్లెక్స్‌ను వినియోగానికి తీసుకురావాలని యోచించిన ఆర్టీసీ అధికారులు ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారు. పట్టణానికి వచ్చే బస్సులు గతంలో పాత బస్టాండు వరకు వచ్చి, వెళ్లేవి. ఇప్పుడు ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే, కాంప్లెక్స్‌కు అపసోపాలు పడి చేరాల్సిందే.

★ ఇచ్ఛాపురం నుంచి ప్రతి మండలానికి అన్ని మార్గాల్లోనూ ప్రైవేటు బస్సులున్నాయి. ఇవి కాకుండా మ్యాక్సీ క్యాబ్‌లు, ఆటోలు ప్రతి గ్రామానికీ పరుగులు తీస్తున్నాయి. విశాఖ, ఆపై సుదూర ప్రాంతాలు ప్రైవేటు బస్సులు నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఇన్ని కష్టాలు పడటమెందుకని ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలు చేరుతున్నారు.

ఇదే ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్

ఇవీ సమస్యలు

తాగునీరు లేదు. కొనుక్కుందామన్నా దుకాణమూ లేదు. కుర్చీలు, పంకాలు లేవు. రాత్రిపూట అరకొర వెలుగులు. మరుగుదొడ్డి కూడా సక్రమంగా నిర్వహించడం లేదు. కాంప్లెక్స్ ఆవరణ అంతా బురదమయం. బస్సులు రాకపోకలు సాగించే రోడ్డుపైనే ప్రయాణికులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సాగాలి.

ఆదేశాలిస్తాం..

పాత బస్టాండు వరకు బస్సులు నడిపేలా ఆదేశాలిస్తాం. ప్రయాణికుల సురక్షిత ప్రయాణమే తమ లక్ష్యం. కాంప్లెక్స్‌లో సమస్యల పరిష్కారానికి ప్రణాళికను రూపొందిస్తున్నాం. – ఎస్‌వీవీ నాయుడు, డిపో మేనేజర్, పలాస

బరువులు ఎత్తి.. పతకాలు కొల్లగొట్టి

పేదింటి బిడ్డలు పెద్దబరువులెత్తేందుకు సన్నద్ధమవుతున్నారు. ఆలిండియా విశ్వవిద్యాలయ, రాష్ట్ర, జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ప్రత్యేక షెడ్యూల్ రూపొందించుకుని కసరత్తు చేస్తున్నారు. కుటుంబ పోషణ భారంగా ఉన్నా, తమ పిల్లలను విజేతలుగా చూడాలని తల్లిదండ్రులు సైతం వీరిని ప్రోత్సహిస్తున్నారు. దశాబ్దకాలంగా గ్రామాల్లో మసకబారుతున్న క్రీడను వెలుగులోకి తీసుకువచ్చేందుకు చిన్నారులు కృషి చేస్తున్నారు. పెద్దపాడు రెయ్యిమ్మతల్లి వ్యాయామశాలలో వెయిట్‌లిఫ్టింగ్ సాధన చేస్తున్న క్రీడాకారుల మనోగతంపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

దేశం తరఫున ఆడాలని...

నా తల్లిదండ్రులు విజయ, రాంబాబు టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటారు. ప్రస్తుతం డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. డీఎస్‌ఏ శిక్షకుడు ఇప్పిలి అప్పన్న పర్యవేక్షణలో గత ఏడేళ్లుగా వెయిట్‌లిఫ్టింగ్ సాధన చేస్తున్నాను. సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పసిడి పతకం, రాష్ట్రస్థాయి సీనియర్, జూనియర్ పోటీల్లో ఛాంపియన్‌షిప్ సాధించాను. రాష్ట్రస్థాయి పోటీల్లో 5 స్వర్ణాలు, 7 రజతాలు, 4 కాంస్య పతకాలు సొంతం చేసుకున్నాను. దేశం తరఫున ఆడాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నాను. – దూబ హేమశ్రీ, బూరవల్లి(గార)

వర్సిటీ పోటీల్లో రాణించాలని..

నాన్న రాజారావు తాపీ మేస్త్రీ, అమ్మ అపర్ణ ఇస్త్రీ చేస్తుంటారు. డిగ్రీ చదువుతున్నా. అండర్-19 ఎస్‌జీఎఫ్ పోటీల్లో రజత, సబ్‌జూనియర్, జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో మరో రజతం సాధించాను. అంతర విశ్వవిద్యాలయ, జాతీయస్థాయి పోటీల్లో రాణించాలన్న లక్ష్యంతో అయిదేళ్లుగా కసరత్తు చేస్తున్నాను.

– తాలాడ కావ్య, ఆడవరం(అంపోలు)

రైల్వే కొలువే ధ్యేయం..

నాన్న తులసీరాం కళాసీ, అమ్మ హేమలత రైతుకూలీ. ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను. అండర్-19 ఎస్‌జీఎఫ్ పోటీల్లో రజత పతకం సాధించాను. క్రీడా కోటాలో రైల్వేలో కొలువు సాధించలనే ధ్యేయంతో మూడేళ్లుగా సాధన చేస్తున్నాను. తొలిసారి వర్సిటీ పోటీలకు సన్నద్ధమవుతున్నాను.

– బిన్నాడ యోగేశ్వరరావు, శ్యాంపాలెం(వప్పంగి)

తొలిసారి అయిదుగురి ఎంపిక

జిల్లా క్రీడాకారుల్లో అంతర్జాతీయ, కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాణించగలిగే సామర్థ్యం ఉంది. ఆర్థిక వెనకబాటు అడ్డంకిగా మారుతోంది. ప్రభుత్వం వెయిట్‌లిఫ్టింగ్ అకాడమీలు నిర్వహిస్తే దేశం గర్వించదగిన క్రీడాణిముత్యాలు వెలుగులోకి వస్తారు. ప్రభుత్వం, దాతలు అన్ని రకాలు సాహకరిస్తే అనతికాలంలో విజయాలు సాధిస్తారు.

– ఇప్పిలి అప్పన్న, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ వెయిట్‌లిఫ్టింగ్ శిక్షకుడు

రోడ్డు ఇలా.. ప్రయాణించేది ఎలా..?

డి.గొనపపుట్టుగ నుంచి నెలవంక వెళ్లే రోడ్డు అంతా గుంతలు ఏర్పడటంతో వాహనదారులతోపాటు కాలినడకన వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేపట్టి గుంతలు పూడ్చేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఏఈ ధనంజయను వివరణ కోరగా నిధులు రాగానే మరమ్మతు పనులు చేపడతామని తెలిపారు.

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

శిథిలం.. భయం.. భయం

ముచ్చింద్రలో చాలా ఏళ్ల కిందట నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం పగుళ్లతో పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శిథిల భవనాలు తొలగించి, కొత్తది నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏవో కె.రామారావును వివరణ కోరగా త్వరలోనే చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ఇక్కడో కాలువ ఉండాలే..

ఎంఎస్‌పల్లి ఆదర్శ పాఠశాల ప్రహరీ పక్కనే వైకాపా హయాంలో వరదనీటి కాలువ నిర్మించారు. వర్షాకాలంలో కొండల నుంచి వచ్చే వరద గ్రామంలోకి వెళ్లకుండా పంట పొలాలకు మళ్లించటానికి దీన్ని నిర్మించారు. నాణ్యత లోపంతో నిర్మించిన ఏడాదిలోనే పూర్తిగా శిథిలమైంది. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి గురుమూర్తి వద్ద ప్రస్తావించగా సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

ట్యాంకు ఎక్కాలంటే గజగజ

మందస మండలం డిమిరియాలోని రక్షిత మంచినీటి పథకం ట్యాంకు మెట్లు కొన్ని విరిగి పాడయ్యాయి. దీంతో ట్యాంకు క్లోరినేషన్ చేసే అవకాశం లేకుండా పోయింది. విరిగిన మెట్లపై నుంచి వెళ్లడానికి ఎవరూ సాహసించడం లేదు. సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రసన్నకుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, మందస

మురుగుతో అవస్థలు

ఇచ్ఛాపురం పట్టణంలో పలువీధుల మీదుగా వచ్చిన మురుగు నీరు, దాంతోపాటు కొట్టుకొచ్చిన చెత్త స్వేచ్ఛావతి అమ్మవారి ముఖద్వారం దాటిన తర్వాత నివాసాల వద్ద తిష్ఠ వేస్తోంది. దీంతో రవాణాశాఖ, వెలుగు, విద్యాశాఖ కార్యాలయాల అధికారులు, సిబ్బందితోపాటు తారకేశ్వరవీధి వాసులు అవస్థలు పడుతున్నారు. పుర కమిషనర్ నల్లి రమేష్ స్పందిస్తూ అవి ప్రైవేటు స్థలాలు కాకుంటే చర్యలు తీసుకుంటామని, లేని పక్షంలో మురుగును వేరే ప్రాంతానికి చేరేలా నిర్మాణాలకు ప్రతిపాదిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

చదువు.. తెగువ.. తీసిపోదు మగువ..!

పలాస, న్యూస్‌టుడే

విద్యాబుద్ధులు నేర్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉద్దేశంతో డిగ్రీ విద్య అభ్యసించే యువతులు ఒకవైపు చదువుతూనే నేషనల్ క్యాడెట్ కోర్సు(ఎన్‌సీసీ) మూడేళ్లలో పూర్తిచేస్తూ ఔరా అనిపిస్తున్నారు.

➤ క్రమశిక్షణ అలవాటు అవుతుంది. యువకులతో పాటు సమానంగా విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారు' అని కేర్‌టేకర్ రాజు తెలిపారు. 'విద్యార్థినులకు చదువుతోపాటుగా ఆత్మస్థైర్యం పెంచుకునేలా నేషనల్ క్యాడెట్ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుంది.' అని కాశీబుగ్గ శ్రీబాల శివ యోగీంద్రా మహారాజ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

➤ శిక్షణలో భాగంగా ట్రెక్కింగ్, బేస్‌క్యాంపు వంటి ప్రత్యేక క్యాంపుల్లో అవకాశం ఇస్తారు. శారీరక ధృఢత్వంతోపాటు రైఫిల్, డ్రిల్, జాతీయసమైక్యత, నాయకత్వ పటిమ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఆరోగ్యం పెంపొందించేలా అవగాహన కల్పించడంతోపాటు విపత్తుల వేళ సాయం చేసేలా శిక్షణ ఇస్తారు. ప్రతిభ చూపితే దిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనే అవకాశం సైతం వస్తుంది.

➤ జిల్లాలో కాశీబుగ్గ, పాతపట్నం, శ్రీకాకుళం, గురజాడ విద్యాసంస్థల్లో మహిళా ఎన్‌సీసీ యూనిట్లు ఉండటంతో అదే కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు అవకాశం దక్కుతోంది. ప్రాథమిక, ఫిజికల్ పరీక్షల్లో ఎంపికైన వీరికి సుబేదార్, మేజర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో రెండేళ్ల పాటు శిక్షణ ఇస్తారు. రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన అనంతరం శ్రీకాకుళం కేంద్రంగా రాత పరీక్ష, ఫిజికల్ పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి 'బి' సర్టిఫికెట్ అందజేస్తారు. ఏడాది శిక్షణ పొందితే 'సి' ధ్రువపత్రం అందిస్తారు.

పర్యాటకుల కోలాహలం

సీతంపేట, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సీతంపేటకు భారీగా తరలివచ్చారు. కుటుంబాలు, స్నేహితులతో వచ్చి వన భోజనాలు చేశారు. పలు పర్యాటక ప్రాంతాల్లో తిరుగుతూ సందడి చేశారు. ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కులో ఆనందంగా గడిపారు. ఆనంద వేదిక వద్ద వివిధ పాటలకు నృత్యాలు చేశారు. మెట్టుగూడ, దోనుబాయి దరి సున్నపుగెడ్డ, మల్లి, బెనరాయి జలపాతాలు, ఆడలి వ్యూ పాయింట్, జగతిపల్లి హిల్ రిసార్ట్సు ప్రదేశాలను సందర్శించారు.

ఆనంద వేదిక వద్ద పర్యాటకులు

ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు



(c) eenadu

ఈనాడు తమిళనాడు

సోమవారం నవంబరు 10, 2025 5

వంద అడుగులు వెనక్కెళ్లిన కడలి

బయటపడిన పాచిపట్టిన రాళ్లు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తూత్తుక్కుడి జిల్లా తిరుచ్చెందూరు మురుగన్ ఆలయం ముందు సముద్రం కొన్ని రోజులుగా కల్లోలంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం దాదాపు వంద అడుగులు వెనక్కి వెళ్లింది. దీంతో పాచిపట్టిన రాళ్లు బయటపడ్డాయి. వాటిపై నిలబడి భక్తులు సెల్ఫీలు, ఫొటోలు దిగి ఉత్సాహంగా గడిపారు. ఆలయం కూడా భక్తులతో కిక్కిరిసింది.

రాష్ట్రంలో 4 రోజులపాటు భారీ వర్షాలకు అవకాశం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నాలుగు రోజులపాటు కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది. ఉత్తర తమిళనాడు, పరిసర ప్రాంతాలలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో సోమ, మంగళవారాలు రాష్ట్రంలోని కొన్నిచోట్ల, పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని కొన్ని ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 12వ తేదీ తంజావూర్, పుదుకోట్టై, రామనాథపురం, విరుదునగర్, తూత్తుకుడి, తిరునెల్వేలి, కన్నియాకుమరి, నీలగిరి, కోయంబత్తూర్, తిరుప్పూర్, తేని, తెన్‌కాశి జిల్లాల్లోని కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. 13న కోయంబత్తూర్ జిల్లాలోని కొండప్రాంతాలు, నీలగిరి, దిండుక్కల్, తేని, తెన్‌కాశి, కన్నియాకుమరి, తూత్తుకుడి జిల్లాలోని కొన్నిచోట్ల పడతాయని పేర్కొంది. చెన్నైలో సోమవారం ఆకాశం మేఘావృతమై కొన్నిచోట్ల మోస్తరు జల్లులు పడతాయని, రానున్న నాలుగు రోజులు మత్స్యకారులకు ఎలాంటి హెచ్చరికలు లేవని వెల్లడించింది.

తీర అందాలు.. విహరిస్తూ వీక్షిద్దాం!

మెరీనా తీరంలో సోలార్ రోప్‌కార్ (ఊహాచిత్రం)

- మెరీనాలో రానున్న సోలార్ రోప్‌కార్ ప్రాజెక్టు
- వడివడిగా ఏర్పాట్లు చేస్తున్న జీసీసీ
- చెన్నైకి మరో సరికొత్త ఆకర్షణ

చెన్నై మెరీనా బీచ్ మరింత ముస్తాబయ్యేందుకు సిద్ధమవుతోంది. బ్లూఫ్లాగ్ ధ్రువీకరణ పొందేందుకు వినూత్న హంగులద్దుకున్న ఈ తీరంలో మరో ఆకర్షణీయ ప్రాజెక్టు రాబోతోంది. సౌరశక్తితో నడిచే పర్యావరణహిత రోప్‌కార్‌లో పర్యాటకులు ప్రయాణిస్తూ బీచ్ అందాలు వీక్షించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- ఈనాడు-చెన్నై

25 మీటర్ల ఎత్తులో..

13 కి.మీ మేర రోప్‌కార్ ప్రాజెక్టును తీసుకురావాలనేది ఆలోచన. దీన్ని పూర్తిస్థాయిలో సౌరశక్తితో నడిచేలా చేయాలని ప్రతిపాదించారు. ఇందులోభాగంగా తొలివిడతగా బీచ్‌రోడ్డులోని లైట్‌హౌస్, అన్నాస్క్వేర్ మధ్య 5 కి.మీ మేర తీసుకురావాలనే నిర్ణయానికి వచ్చారు. అన్నాస్క్వేర్, కన్నగి విగ్రహం, వివేకానంద హౌస్, లైట్‌హౌస్. ఇలా మధ్యలో వివిధ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. సర్వాంగ సుందరంగా ఉన్న సముద్ర తీరాన్ని వీక్షించేందుకు ఉపరితలం నుంచి 25 మీటర్ల ఎత్తులో ఈ రోప్‌కార్ వ్యవస్థ ఉండేలా చూస్తున్నారు.

8మంది కూర్చునేలా..

రోప్‌కార్ డిజైన్ ఎలా ఉండాలనేదానిపై ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయి. ఒక కార్ కనీసం 8మంది కూర్చునేలా ఉండాలనేది ప్రధాన ప్రతిపాదనగా ఉంది. ఇందుకోసం ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోని ప్రాజెక్టుల్నీ పరిశీలిస్తున్నారు.

బీచ్‌కు సందర్శకుల తాకిడి ఇలా..

వారాంతాల్లో	లక్ష మంది
రోజుకు సగటున	30 నుంచి 50 వేలు
వేసవిలో రోజుకు	12 నుంచి 20 వేలు

2022లోనే ప్రతిపాదన

మెరీనా బీచ్‌లో రోప్‌కార్ ప్రాజెక్టును తేవాలని 2022లోనే ప్రతిపాదించారు. అప్పటి కౌన్సిల్‌లో కౌన్సిలర్ టి.వి.సెమ్మొళి దీన్ని సభ దృష్టికి తెచ్చారు. ఈ ప్రాజెక్టు రావడం ద్వారా పర్యాటకులు తీర అందాల్ని మరింత కొత్తదనంతో చూస్తారని, పైగా పర్యాటకం మరింత పెరుగుతుందని వివరించారు. ఈ ఆలోచన బాగుండటంతో అప్పటి నుంచి ఈ ప్రాజెక్టు అమలుపై జీసీసీ దృష్టి పెట్టింది. 2024 డిసెంబర్‌లో ఓ ప్రైవేటు ఏజెన్సీకి సాధ్యాసాధ్యాలపై సర్వేచేసే బాధ్యత ఇచ్చింది.

రోజువారీ ప్రయాణాలకు వీలుగా..

పర్యాటక ఆకర్షణతో పాటు రవాణా సాధనంగానూ ఈ వ్యవస్థను వినియోగించాలని చూస్తున్నారు. దీనికి తగ్గట్లు టికెటింగ్ విధానాన్ని తేనున్నారు. ఫలితంగా ఈ మార్గంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులకు, క్వీన్స్ మేరీ, మద్రాస్ యూనివర్సిటీ విద్యార్థులకు ఉపయుక్తంగా ఈ ప్రాజెక్టు ఉండనుంది. బీచ్‌లో సర్వీసు రోడ్డుకు అనుకుని ఈ వ్యవస్థను నిర్మించే అవకాశాలున్నాయి. రోప్‌కార్ ప్రాజెక్టు అమలు సాధ్యాసాధ్యాలపై ఈ మధ్యే నిపుణుల బృందం పరిశీలనలు చేసి నివేదిక సమర్పించింది. దీనిపై తుది నిర్ణయం తీసుకుని టెండర్లను పిలిచేందుకు జీసీసీ సిద్ధమైంది. వచ్చేఏడాదిలో ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు సూచాయిగా చెబుతున్నారు.

సర్ వ్యవహారంలో అప్రమత్తంగా ఉండండి

- రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ కాకుండా కాపాడవచ్చు
- జిల్లా కార్యదర్శులకు స్టాలిన్ పిలుపు

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగిస్తున్న స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్.ఐ.ఆర్) వ్యవహారంలో అప్రమత్తంగా ఉంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ కాకుండా కాపాడవచ్చని డీఎంకే జిల్లా కార్యదర్శులకు ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పార్టీ జిల్లా కార్యదర్శులతో ఆదివారం ఉదయం స్టాలిన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సరైన, నిజమైన ఓటర్ల జాబితానే న్యాయమైన ఎన్నికలకు ఆధారమన్నారు. 'సర్'ను వ్యతిరేకించడం లేదని, తగిన సమయం ఇవ్వకుండా, ఎన్నికలకు కొన్ని నెలలే ఉన్న నేపథ్యంలో దాని అమలుకు తొందరపాటు చూపిస్తే సరిగా ఉండదన్నదే తమ వైఖరి అని తెలిపారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా దీనిని తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. 'సర్' ప్రక్రియలో భాగంగా అందించిన ఫారంలో అడిగిన ప్రశ్నల్లో స్పష్టత లేదని, ఫారంలో వెల్లడించిన వివరాల్లో చిన్నపాటి పొరపాటు జరిగినా ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగే ప్రమాదం ఉందని తెలిపారు. 'సర్' ప్రక్రియ ప్రారంభమైన రోజు నుంచి చోటుచేసుకున్న పరిణామాలను పార్టీ శ్రేణులు తన దృష్టికి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు రావడంలేదని, వచ్చినా తగిన సంఖ్యలో ఫారాలు తీసుకురావడంలేదని, రోజుకు 30కు మించి ఫారాలు ఇవ్వడంలేదని తెలిపారు. ఈ పరిస్థితుల్లో తక్కువ కాలంలో ఆ పనులు ముగుస్తాయా? అని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల ఓటు హక్కుకు ఏర్పడిన ముప్పును ఎదిరించడానికి డీఎంకే తరఫున ఏర్పాటు చేసిన వార్ రూమ్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, 080654 20020 అనే హెల్ప్‌లైన్ నంబరును సంప్రదించి తమ అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. మన ఓటుహక్కును హరించే ముప్పు గుమ్మం వరకు వచ్చిందని, అందరూ కలిసికట్టుగా వ్యవహరించి అప్రమత్తంగా ఉంటే ప్రజాస్వామ్యం ఖూనీ కాకుండా కాపాడవచ్చని పిలుపునిచ్చారు.

స్టాలిన్ అబద్ధాల పుట్ట: ఎడప్పాడి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ అబద్ధాల పుట్ట అని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. నాలుగున్నరేళ్లలో పలు పథకాలు ప్రవేశపెట్టినట్లు స్టాలిన్ పదేపదే పేర్కొనడంలో వాస్తవం లేదన్నారు. గత శాసనసభ

హాజరైన కార్యకర్తలు, ప్రజలు

ఎన్నికల ముందు విద్యార్థులు పొందిన విద్యా రుణాలను మాఫీ చేస్తామని, పాత పింఛను విధానం ప్రవేశపెడతామని, పోలీసుశాఖలో సంస్కరణలు తీసుకొస్తామని, రవాణా కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, రెవెన్యూశాఖలో ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పడం ప్రజలు మరచిపోలేదన్నారు. అంతేకాకుండా ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని మోసపూరిత హామీ ఇచ్చిన స్టాలిన్‌కు వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

డీఎంకేకి సొంత బలం లేదు

టీనగర్: డీఎంకే సొంత బలం కోల్పోవడంతో 'ఓరణియిల్ తమిళనాడు' పేరుతో

ఓమలూరు సభలో ప్రసంగిస్తున్న పళనిసామి

ప్రభుత్వ ఉద్యోగులను ఉపయోగించి ఇంటింటికీ వెళ్లి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తోందని పళనిసామి విమర్శించారు. శనివారం రాత్రి సేలం జిల్లా ఓమలూరు బస్ స్టేషన్ ప్రాంగణంలో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో పాల్గొని ప్రసంగించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీకి కార్యకర్తల అంకితభావం ఎంతో ముఖ్యమన్నారు.

ఈపీఎస్ ఇల్లు, పీఎంకే కార్యాలయానికి బాంబు బెదిరింపులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై గ్రీన్‌వేస్ రోడ్డులోని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ఇంటికి, చెన్నై టీనగర్‌లోని తిలక్ వీధిలో ఉన్న పీఎంకే కార్యాలయానికి ఆదివారం ఈ-మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ తనిఖీ చేపట్టారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు.

సింగపూర్ విమానానికి...

చెన్నై విమానాశ్రయ డైరెక్టర్ కార్యాలయానికి శనివారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. అందులో.. సింగపూర్ నుంచి చెన్నైకు వచ్చే విమానంలో శక్తివంతమైన బాంబు పెట్టినట్లు, ఉదయం 8.20గంటలకు విమానం ల్యాండ్ అయ్యే సమయంలో పేలిపోతుందని ఉంది. అప్రమత్తమైన అధికారులు భద్రతా దళాలు, బాంబ్ స్క్వాడ్‌కు సమాచారం అందించారు. వారు విమానం ల్యాండ్ కాగానే అందులో సోదాలు జరిపారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదు. ఈ ఘటనతో ఉదయం 10గంటలకు చెన్నై నుంచి సింగపూర్‌కు వెళ్లాల్సిన విమానం 15నిమిషాలు ఆలస్యంగా వెళ్లింది.

జయలలిత మార్గంలోనే పయనం: సెంగోట్టయన్

విల్లివాక్క, న్యూస్‌టుడే: శ్రామికులను పడగొట్టడం ఎవరితరం కాదని, జయలలిత మార్గంలోనే తన పయనమని మాజీ మంత్రి, అన్నాడీఎంకే బహిష్కృత నేత కేఏ సెంగోట్టయన్ తెలిపారు. ఆయన ఆదివారం ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాలయంలో విలేకరులతో మాట్లాడారు. అన్నాడీఎంకే ఎంజీఆర్, జయలలిత ద్వారా అభివృద్ధి చెందిన పార్టీ అని, పలు ఒడిదుడుకుల మధ్య పార్టీని అభివృద్ధిపరిచారని, పలువురు తమ కృతజ్ఞతను మరచి వెళ్లిపోయారని వాపోయారు. క్షమాగుణం కలిగిన జయలలిత 1989లో నగలు, వస్తువులు అందజేసి పార్టీని బలోపేతం చేశారని గుర్తుచేశారు. జయలలిత మార్గంలోనే తన ప్రయాణం కొనసాగుతుందని చెప్పారు. కార్యకర్తలను కాపాడుకోడానికి ఆమె ఆసక్తి కనబరిచారని, త్వరలో శోధనలను సాధనలుగా మార్చుతామన్నారు.

మహిళలు అనవసరంగా బయట తిరగొద్దు: నటి కస్తూరి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: మహిళలు అనవసరంగా బయట తిరగడాన్ని తగ్గించుకోవాలని, రాత్రిపూట ఒంటరిగా వెళ్లడం శ్రేయస్కరం కాదని సినీనటి, భాజపా నాయకురాలు కస్తూరి సూచించారు. కోయంబత్తూరులో ఈనెల 2న కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన ఘటన రాష్ట్రంలో కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నటి కస్తూరి కోయంబత్తూరులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళలు అనవసరంగా బయట తిరగడాన్ని మానుకోవాలని హితవుపలికారు.

200 కిలోల క్రిస్మస్ కేక్

మహాబలిపురం, న్యూస్‌టుడే: వచ్చే నెలలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం బీచ్ ప్రాంతంలోని ఓ స్టార్ హోటల్‌లో ఆదివారం 200 కిలోల భారీ కేక్ తయారీ కార్యక్రమాన్ని చేపట్టారు. తయారీలో అనేక మంది ప్రముఖ షెఫ్‌లు, పర్యాటకులు పాల్గొన్నారు. తయారీకి అవసరమైన 120 కిలోల ఎండు ఫలాలను ఓ పడవలో తీసుకొచ్చి వైన్, విస్కీ, బ్రాందీ సహా 70 లీటర్ల మద్యం కలిపారు. తరువాత అవసరమైన పిండి, స్వీట్లు కలిపి 200 కిలోల బరువైన కేకును తయారు చేశారు.

కేక్ తయారీలో షెఫ్‌లు, పర్యాటకులు

అదరగొట్టిన అన్నామలై

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: గోవాలో ట్రైయాథ్లాన్ పోటీలు జరుగుతున్నాయి. దేశ, విదేశాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈత 1.9 కి.మీ, సైక్లింగ్ 90 కి.మీ, పరుగుల పందెం 21.1 కి.మీ దూరానికి నిర్వహిస్తారు. ఈ క్రమంలో భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై పోటీల్లో పాల్గొంటున్నారు. ఆదివారం జరిగిన సైక్లింగ్ పోటీలో 90 కి.మీ దూరాన్ని 3 గంటల 14 నిమిషాల 33 సెకన్లలో చేరుకున్నారు. మిగతా పోటీలు జరగనున్నాయి.

సైకిల్ పోటీల్లో అన్నామలై

భయపెట్టిన బాహుబలి ఏనుగు

అటవీశాఖ సిబ్బంది వాహనంపై దాడి చేస్తున్న ఏనుగు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరు సిరుముగై అటవీ ప్రాంతం నుంచి 'బహుబలి' అనే ఏనుగు కోత్తగిరి రోడ్డులో ఉన్న అటవీశాఖ కళాశాలలోకి శనివారం రాత్రి ప్రవేశించింది. అటవీశాఖ సిబ్బంది గస్తీ వాహనంతో తరిమికొడుతుండగా ఏనుగు వాహనంపై దాడికి యత్నించింది. వెంటనే సిబ్బంది పెద్దగా కేకలు వేయడంతో ఏనుగు వెనక్కు తిరిగి పరుగులు తీసింది. ఈ క్రమంలో ఏనుగు వెనుక కాలిని వాహనం ఢీకొంది. తర్వాత ఏనుగు అడవిలోకి వెళ్లిపోయింది.

ఏడు తరాలు.. 101వ జన్మదిన వేడుకలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తమిళనాడులోని తిరుప్పూర్‌కు చెందిన రామత్తాల్ వందేళ్లు పూర్తి చేసుకున్నారు. తన ఏడు తరాల కుటుంబీకులతో కలిసి 101వ జన్మదిన వేడుకను ఘనంగా జరుపుకున్నారు. తిరుప్పూర్ పట్టణంలోని కాంగయం రోడ్డు ఉన్న ఓ ప్రైవేట్ హోటల్‌లో రామత్తాల్ పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఆమెతో కేక్ కోయించి ఆడిపాడారు.

కేక్ కట్ చేస్తున్న రామత్తాల్

కుటుంబ సభ్యులతో..

గర్భాశయ క్యాన్సర్ నివారణకు చర్యలు

త్వరలో బాలికలకు టీకాలు వేసే పథకం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణకు రూ.36కోట్ల వ్యయంతో త్వరలో 14ఏళ్లలోపు బాలికలకు టీకాలు వేసే పథకాన్ని ప్రారంభిస్తామని ఆరోగ్య శాఖ మంత్రి మా.సుబ్రమణియన్ తెలిపారు. చెన్నై అన్నా వేలాంగణ్ణి కళాశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి బాలికా సంరక్షణ పథకం కింద దక్షిణ చెన్నై జిల్లాలో అర్హత కలిగిన 259మంది బాలికలకు తలా రూ.25వేల విలువైన ప్రభుత్వ పొదుపు బాండ్లను, సైదాపేట అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 118 మంది యువతులకు రూ.50వేల ఆర్థికసాయం చెక్కులను మంత్రి అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మహిళలు



పొదుపు బాండ్లు అందజేస్తున్న మంత్రి మా.సుబ్రమణియన్

గర్భాశయ, రొమ్ము తదితర 8 రకాల క్యాన్సర్ల బారినపడకుండా పూర్తి పరీక్షలు చేసేందుకు ఓ పథకం త్వరలో ప్రారంభం కానుందని పేర్కొన్నారు. అదేవిధంగా బాలికల సంరక్షణకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.36కోట్ల వ్యయంతో 14ఏళ్లలోపు బాలికలకు గర్భాశయ క్యాన్సర్ టీకాలు వేసే పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ టీకాలు వేసేందుకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధికంగా ఖర్చవుతుందని వివరించారు.

45.98 మెట్రిక్ టన్నుల నిరుపయోగ సామగ్రి తొలగింపు

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై నగరవాసులు చెత్తతో పాటు ఇంట్లోని పనికిరాని సోఫాలు, పరుపులు, చెక్క సామగ్రి, దుస్తులు వంటివాటిని బహిరంగ ప్రదేశాల్లో పారవేయడాన్ని నివారించడానికి చెన్నై మహానగర పాలకసంస్థ చర్యలు చేపట్టింది. ఆ మేరకు ప్రజలు ముందుగానే అందించే సమాచారం ప్రకారం వారి ఇళ్ల నుంచి ప్రతి శనివారం నిరుపయోగ సామగ్రిని తొలగించే చర్యలను అక్టోబరు 11న ప్రారంభించింది. ఆ మేరకు అక్టోబరు 11, 18, 25 తేదీలు, నవంబరు 1న 584మంది నుంచి 225.76 మెట్రిక్ టన్నుల ఘనవ్యర్థాలను సేకరించి తొలగించింది. ఈ శనివారం 131 మంది నుంచి 45.98 మెట్రిక్ టన్నుల నిరుపయోగ సామగ్రిని సేకరించి కొడుంగైయూర్‌లోని దహన కేంద్రంలో వైజ్ఞానిక విధానంలో దహనం చేసింది.

ఎళిల్ నగర్‌లో ఘన వ్యర్థాలు సేకరిస్తున్న కార్మికులు

ఆకాశ తత్వం బోధించే అద్భుత క్షేత్రం

- చిదంబరం నటరాజస్వామి ఆలయం

- న్యూస్‌టుడే, టీనగర్

ఆధ్యాత్మిక భూమిగా పేరొందిన తమిళనాడులో చరిత్ర, కళలు, తత్వశాస్త్రాల సంగమంగా వెలుగొందుతున్న అద్భుత క్షేత్రం చిదంబరం నటరాజస్వామి ఆలయం. పంచభూత క్షేత్రాలలో ఆకాశ తత్వానికి ప్రతీకగా నిలిచిన ఈ ఆలయం.. శైవుల ఆరాధ్య దైవమైన నటరాజస్వామికి నిలయం. కేవలం ఇది ఒక దేవాలయమే కాకుండా జీవన విశ్వాసం, కాలాతీత ఆధ్యాత్మిక వైభవం.

నటరాజస్వామి ఆలయ గోపురం, కోనేరు

చోళుల కాలంలో నిర్మాణం

వేల సంవత్సరాల క్రితం చోళుల కాలంలో నిర్మితమైంది ఈ ఆలయం. వివిధ రాజవంశాల పోషణలో వృద్ధి చెందింది. చోళులు, పల్లవులు, పాండ్యులు, విజయనగర రాజులు ఆలయ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు. ఆలయ నిర్మాణం ద్రావిడ శైలికి చక్కని ఉదాహరణ. ప్రతీ గోపురం, ప్రతీ స్తంభం అద్భుతమైన శిల్పాలతో అలరారుతోంది. నటరాజస్వామి 'ఆనంద తాండవం' భంగిమలు, అసంఖ్యాకమైన దేవతా విగ్రహాలు, పురాణ గాథలను తెలిపే చిత్రాలు ఆలయ ప్రాంగణమంతటా కనిపిస్తాయి. ముఖ్యంగా వేయి స్తంభాల మండపం శిల్పకళా సంపదకు నిదర్శనం.

తెర వెనుక చిదంబర రహస్యం

ఆలయం తెలియజేప్పే అత్యంత లోతైన అంశం 'చిదంబర రహస్యం'. గర్భగుడిలో నటరాజస్వామి విగ్రహం పక్కన ఒక తెర ఉంటుంది. ఆ తెర వెనుక ఏ విగ్రహమూ ఉండదు. కేవలం ఖాళీ స్థలం, కొన్ని బంగారు బిల్వ పత్రాలు మాత్రమే ఉంటాయి. ఈ రహస్యం శివుడు నిరాకారుడు, అనంతమైన ఆకాశ తత్వానికి ప్రతీక అని సూచిస్తుంది. తెర మాయకు ప్రతీక కాగా, దానిని తొగించినప్పుడు నిరాకార దైవత్వాన్ని దర్శించడం అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానోదయాన్ని పొందడాన్ని సూచిస్తుంది. ఇది మానవుడి అంతర్గత ప్రయాణానికి, అహంకారాన్ని విడిచిపెట్టి పరమాత్మతో ఏకం కావడానికి మార్గదర్శకం.

వివాదాలూ లేకపోలేదు

ఆలయం నిత్యం భక్తులతో నిండి ఉంటుంది. సాధారణ రోజులతో పోలిస్తే సెలవు దినాల్లో రద్దీ ఉంటుంది. మాసికం, ఆరుద్ర దర్శనం వంటి ప్రత్యేక ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఆలయ నిర్మాణంలో మానవ శరీరంలోని భౌతిక ధర్మాలు ప్రతిబింబిస్తాయి. ఆలయం చరిత్ర, సంప్రదాయాల పరంగా ఎంత గొప్పదో, అదేవిధంగా నిర్వహణపరంగా వివాదాలకు కేంద్ర బిందువు. కొన్నేళ్లుగా ఆలయ నిర్వహణ, సంపద లెక్కింపుపై ప్రభుత్వం, ఆలయ దీక్షితుల మధ్య వివాదాలు నడుస్తూ ఉన్నాయి.

ఆనంద తాండవం అర్థం అదే..

చిదంబరంలో శివుడు నటరాజ రూపంలో కొలువై ఉన్నాడు. నటరాజు అంటే నృత్యానికి అధిపతి. ఆయన చేసే 'ఆనంద తాండవం' కేవలం ఒక నృత్యం మాత్రమే కాదు.. అది సృష్టి, స్థితి లయ, తిరోధానం, అనుగ్రహం అనే పంచకృత్యాలను సూచిస్తుంది. నటరాజు తన కుడిచేతిలో ఢమరుకాన్ని ధరించి సృష్టిని, ఎడమచేతిలో అగ్నిని ధరించి లయాన్ని, పై కుడిచేతితో అభయముద్రను చూపి స్థితిని, కింద ఎడమ చేతిని పైకెత్తి అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. ఆయన కుడికాలి కింద ఉన్న పురుషుడు అజ్ఞానానికి ప్రతీక. ఈ తాండవం విశ్వం నిరంతర చలనాన్ని, దైవశక్తి అంతులేని కార్యకలాపాలను వెల్లడిస్తుంది.

ఆలయంలోని చోళుల కాలం నాటి నటరాజర్ విగ్రహం

(c) eenadu

మెట్రో రైల్లో సకాలంలో అవయవాల రవాణా

రైల్లో అవయవాలున్న బాక్సుతో వైద్య బృందం

వడపళని, న్యూస్‌టుడే: ప్రాణాలు రక్షించే అవయవాల రవాణాకు మంచి సహకారాన్ని అందించడంలో చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ కీలకపాత్రను పోషిస్తోంది. అవయవాలతో కూడిన బృందం బెంగళూరు నుంచి ఎయిర్ అంబులెన్స్ ద్వారా శనివారం మధ్యాహ్నం 2.07 నిమిషాలకు చెన్నై విమానాశ్రయానికి చేరుకుంది. చెన్నై మెట్రో రైలు అధికారులు, స్టేషన్ సిబ్బంది అందించిన తక్షణ సమన్వయ సహకారంతో బృందం మధ్యాహ్నం 02.28 గంటలకు మెట్రో రైలులో ఏజీ డీఎంఎస్‌కు సురక్షితంగా చేరుకుంది. వైద్య బృందం అక్కడి నుంచి అంబులెన్స్ ద్వారా ఊపిరితిత్తుల మార్పిడి కోసం గ్రీమ్స్ రోడ్డులో ఉన్న అపోలో ఆసుపత్రికి బయలుదేరిందని సీఎంఆర్ఎల్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

సిబ్బందితో ముచ్చటిస్తున్న విజయకుమార్ గార్గ్

మాట వినకుంటే వేటు ఖాయం!

❖ 'అమ్మ'ను అనుసరిస్తున్న అన్నాడీఎంకే బాస్ ❖ శశికళ నుంచి సెంగోట్టయన్ వరకు ఇదే తీరు ❖ పార్టీపై ఆధిపత్యం చెలాయిస్తున్న ఈపీఎస్

– న్యూస్‌టుడే, సైదాపేట

ఎడప్పాడి పళనిసామి

దివంగత ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం అన్నాడీఎంకేలో ఏర్పడిన విభేదాలతో జయలలిత నెచ్చెలి శశికళ నుంచి తాజాగా సీనియర్ నేత సెంగోట్టయన్ వరకు 14 మంది ముఖ్య నేతలను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి పార్టీ నుంచి తొలగించారు. మొదటి నుంచీ దూకుడు రాజకీయాలకు పేరొందిన పళనిసామి చర్యలు అన్నాడీఎంకేకు సానుకూలమా, ప్రతికూలమా, అనే సందేహాలు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్పన్నమయ్యాయి. అదే సమయంలో ఈపీఎస్ తొలగించిన వారితో పార్టీకి ఎలాంటి నష్టం ఉండబోదని కొందరు రాజకీయ విశ్లేషకులు చెబుతుండగా, తప్పకుండా ఇది ప్రతికూలమేనని మరికొందరు నిపుణులు చెబుతున్నారు.

క్రమేణా పార్టీపై పట్టు

జయలలిత మరణం అనంతరం పార్టీని తన వశం చేసుకున్న ఎడప్పాడి తన మాటే వేదవాక్కు అనేంతగా ఆధిపత్యాన్ని పెంచుకున్నారు. ఈ క్రమంలో 2017లో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి ప్రధాన కార్యదర్శిగా మారారు. మొదట తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ఉన్న శశికళ, దినకరన్‌లను పార్టీ నుంచి తొలగించారు. ఆ తర్వాత ద్వంద్వ నాయకత్వానికి సంబంధించి ఏర్పడిన పోరులో 2020లో మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం, ఆయన కుమారుడు రవీంద్రనాథ్ కుమార్‌ను పార్టీ నుంచి తొలగించారు. పిమ్మట పన్నీర్‌సెల్వం మద్దతుదారులుగా మారిన సీనియర్ నేత బన్రుట్టి రామచంద్రన్, మాజీ మంత్రి వైద్యలింగం, సంస్థాగత కార్యదర్శులుగా ఉన్న మనోజ్ పాండియన్, జేసీటీ ప్రభాకర్‌తో పాటు బెంగళూరు పుగళేంది, మరుదు అళగురాజ్, కేసీ పళనిసామి, వెల్లమండి నటరాజన్ తదితర ముఖ్య నేతలనూ వెల్లగొట్టారు. ఆ కోవలో తాజాగా పార్టీ నుంచి వేరుపడినవారిని మళ్లీ చేర్చుకోవాలని మాట్లాడిన సీనియర్ నేత సెంగోట్టయన్‌కు కూడా అదే పరిస్థితి ఎదురవడం గమనార్హం.

పన్నీర్ సెల్వం

శశికళ

టీటీవీ దినకరన్

సెంగోట్టయన్

శశికళకు మద్దతుగా ఉన్నారనే..

మొదటి నుంచి దూకుడు రాజకీయాలకు పేరొందారు పళనిసామి. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి అయినప్పటి నుంచీ మరింత దూకుడుగా వ్యవహరించారు. జయలలిత ఉన్నప్పుడు పార్టీకి విరుద్ధంగా వ్యవహరించిన ఎవరినైనా సరే నిర్దాక్షిణ్యంగా పదవుల నుంచో, పార్టీ నుంచో తొలగించేవారు జయలలిత. ప్రస్తుతం అదే పద్ధతిని ఈపీఎస్ అవలంబిస్తున్నారనే చెప్పాలి. సెంగోట్టయన్‌ను పార్టీ నుంచి తొలగించటానికి ముఖ్య కారణం శశికళకు మద్దతుగా వ్యవహరించడమే. ఇటీవల ఓపీఎస్, టీటీవీ దినకరన్‌లతో కలిసి ముత్తురామలింగ దేవర్ విగ్రహానికి నివాళులర్పించటమేనని తెలుస్తోంది. దీనిపై అన్నాడీఎంకే కార్యకర్తల్లో కూడా అసంతృప్తి ఉందనేది తెలుసుకునే ఈపీఎస్ ధైర్యంగా సెంగోట్టయన్‌ను పార్టీ నుంచి తొలగించారని సమాచారం.

ఇతర నేతలకు హెచ్చరిక సంకేతం

సెంగోట్టయన్‌ను పార్టీ నుంచి తొలగించటం ద్వారా తనకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా ఇదే గతి అనే సందేశాన్ని పార్టీ నేతలకు ఈపీఎస్ పంపారని చెప్పాలి. అయితే సెంగోట్టయన్‌ను తొలగించడం ద్వారా పార్టీకి ఎలాంటి నష్టం జరగదని, ఓపీఎస్‌తో కలిసి ధర్మయుద్ధం చేయాల్సిందేనని చెబుతున్నారు అన్నాడీఎంకే సీనియర్లు. ఓపీఎస్, సెంగోట్టయన్, శశికళ, టీటీవీ దినకరన్ కలిసి పనిచేస్తేనే పార్టీ వర్గాలు వస్తున్నా దానివల్ల ఇబ్బందేమీ లేదని చెబుతున్నారు. అదే సమయంలో ఈపీఎస్ చర్యలు తప్పకుండా అన్నాడీఎంకేకు నష్టమేనని కొందరి వాదన. ఓపీఎస్, దినకరన్, శశికళకు ఆయా సామాజికవర్గ ప్రజల మద్దతు కొంతమేర ఉందని, దాంతో స్వల్పంగా ఓట్లు చీలే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల అంచనా. అయితే అదంతా ఓ బింబమని, వారికి ప్రజల మద్దతు, కార్యకర్తల మద్దతు లేదని చెబుతున్నారు అన్నాడీఎంకే నేతలు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించినందున కార్యకర్తల్లో వారిపైన వ్యతిరేకతే ఉందని, కావున పార్టీకి ఎలాంటి నష్టం ఉండదని అంటున్నారు.

ఆవడి ఎయిర్‌ఫోర్స్ స్టేషను సందర్శించిన ఎయిర్ మార్షల్

వడపళని, న్యూస్‌టుడే: భారత వైమానిక దళం మెయింటెనెన్స్ కమాండ్, ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ ఎయిర్ మార్షల్ విజయ కుమార్ గార్గ్ శనివారం ఆవడి వైమానిక దళ స్టేషనును విచ్చేసినట్లు పీఐబీ శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. అక్కడ జరుగుతున్న పనుల గురించి అధికారులు ఆయనకు వివరించారు. స్టేషను డిపోలు, విభాగాలను సందర్శించారు. సిబ్బందితో సంభాషించి, మంచి లాజిస్టిక్ నిర్వహణ పద్ధతుల ఆవసరాల గురించి తెలియజేశారు. ఎయిర్‌ఫోర్స్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఎఫ్‌ఎఫ్‌డబ్ల్యూఏ) ప్రాంతీయ అధ్యక్షురాలు రీతు గార్గ్ ఆధ్వర్యంలో స్టేషనులో నిర్వహిస్తున్న వివిధ సంక్షేమ కార్యకలాపాల గురించి విజయకుమార్ గార్గ్ అడిగి తెలుసుకున్నారు.

బైక్ కంపెనీకి రూ.63 వేల జరిమానా

అరక్కోణం, న్యూస్‌టుడే: తూత్తుకుడి జిల్లా తూత్తుకుడి నగరం సమీపంలోని నిల్లనపండల్ గ్రామానికి చెందిన సేతురామలింగం అనే వ్యక్తి తూత్తుకుడి గణేశ్‌నగర్ వద్ద ఉన్న ఎలక్ట్రిక్ బైక్ షోరూంకు వెళ్లారు. తన పాత ద్విచక్ర వాహనం ఎక్స్ఛేంజ్‌లో కొత్త బైక్ కొనుగోలుచేశారు. షోరూం సిబ్బంది కొంత డబ్బు కట్టించుకుని అప్పు పుస్తకాన్ని అందచేశారు. మిగిలిన డబ్బు (ఫైనాన్స్) అందిన తరువాత బైక్ తీసుకెళ్లాలని సేతురామలింగానికి చెప్పారు. దీంతో ఆయన వెళ్లిపోయారు. కొన్నిరోజుల తరువాత షోరూంకి వచ్చి ఫైనాన్స్ సదుపాయం దొరకలేదని, తన పాత వాహనాన్ని తిరిగివ్వాలని అడిగారు. దీంతో సిబ్బంది వాహనం అమ్మేశామని, డబ్బు కంపెనీ తిరిగిస్తుందని చెప్పారు. దీంతో సేతురామలింగం న్యాయవాది ద్వారా సదరు బైక్ కంపెనీకి నోటీసు పంపారు. దానికి సరైన స్పందన రాకపోవడంతో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో కేసు దాఖలు చేశారు. విచారించిన కమిషన్ ఛైర్మన్ చక్రవర్తి, సభ్యులు శంకర్, నమశివాయం.. పాత బైక్ అమ్మగా వచ్చిన డబ్బు, సేవా లోపం కింద రూ.28వేలు, పిటిషనుదారుని మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.25వేలు, కేసు ఖర్చులకు రూ.10వేలు కలిపి మొత్తం రూ.63వేలు ఆరు వారాల్లోగా చెల్లించాలని బైక్ కంపెనీని ఆదేశించారు.

పట్టెడన్నం పెడితే.. పుట్టెడు పుణ్యం

ఆహ్వానపత్రిక ఆవిష్కరణలో ముఖ్య అతిథి, నిర్వాహకులు

వడపళని, న్యూస్‌టుడే: ఆకలితో ఉన్న వారికి పిడికెడు అన్నం పెడితే పుట్టెడు పుణ్యం వస్తుందని ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రేమ్ ఫార్మా అధినేత బీఎల్ కుమార్ వేల్ అభివర్ణించారు. కోడంబాక్కంలోని శ్రీకాళహస్తి వాసవీ నిత్యాన్న సంతర్పణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దాతల సత్కార సమావేశం టీనగర్‌లోని పీఆర్సీసీ సెంటినరీ హాలులో జరిగింది. ఈ సంవత్సరం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నాలుగు రోజులపాటు నిర్వహించిన తదియారాధనకు విరాళాలు ఇచ్చిన దాతలను జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం ముఖ్య అతిథి మాట్లాడుతూ.. భక్తులను సేవించడం భగవంతుని సేవించినట్టేనన్న సంకల్పంతో శ్రీకాళహస్తిలో సత్రాన్ని నిర్మించిన చెన్నై వాస్తవ్యులు వంకాయల కుప్పయ్య శెట్టి దాతృత్వం ఆదర్శనీయమని తెలిపారు. గత 57 ఏళ్లుగా ఏటా ఆయన ఆశయాల మేంకు ప్రస్తుత పాలక మండలి సభ్యులు తదియారాధన నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం 2026లో నిర్వహించనున్న 58వ వార్షిక తదియారాధన ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన నాదస్వర కచేరి అలరించింది. ముఖ్య అతిథి, కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. సంస్థ సంక్షిప్త చరిత్రను తెరపై ప్రదర్శించారు. డాక్టర్ టి.మోహనశ్రీ, పేర్ల బద్రీనారాయణ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఎం.శ్రీనివాసులు, ఎం.కుమారస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాలకమండలి సభ్యుడు ఏఎస్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హోసూర్ విమానాశ్రయ నిర్మాణానికి వడివడిగా అడుగులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా హోసూర్‌లో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయ ప్రాజెక్టు ప్రాముఖ్యత సంతరించుకుంది. పారిశ్రామికాభివృద్ధి లక్ష్యంగా హోసూర్‌లో విమానాశ్రయ నిర్మాణానికి స్థలాన్ని ఎంపికచేశారు. ఆ స్థలంలో నిర్మాణానికి అనుమతి పొందేందుకు రెండు వారాల్లోగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి దరఖాస్తు చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కృష్ణగిరి జిల్లాలో సుమారు 2వేల ఎకరాల విస్తీర్ణంలో అమలుకానుంది. రానున్న శాసనసభ ఎన్నికలకు ముందు భూసేకరణ చేపట్టాలన్న లక్ష్యంతో ప్రాజెక్ట్‌ని శరవేగంగా అమలు పరచడానికి చర్యలు చేపట్టారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు

నిందితుల బెయిల్ పిటిషన్లపై నేడు తీర్పు

చెన్నై, న్యూస్‌టుడే: బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు నిందితుల్లో ముగ్గురు బెయిల్ పిటిషన్లపై సోమవారం తీర్పు వెలువడనుంది. ఆర్మ్‌స్ట్రాంగ్ గత ఏడాది హత్యకు గురికాగా 27 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో రౌడీషీటర్ నాగేంద్రన్ కుమారుడు అశ్వత్థామన్ సహా 12 మంది బెయిల్ కోసం మద్రాసు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిగింది. తమకు బెయిల్ ఇస్తే కోర్టు విధించే షరతులకు లోబడతామని పిటిషన్‌దారుల తరఫున వెల్లడించారు. దీనికి ఆర్మ్‌స్ట్రాంగ్ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసును సీబీఐ దర్యాప్తునకు మార్చిన నేపథ్యంలో నిందితులకు బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. నిందితుల్లో ఒకరైన నాగేంద్రన్ మరణించలేదని, ఆయనకు ప్లాస్టిక్ సర్జరీ చేసి రాష్ట్ర ప్రభుత్వమే తప్పించిందని ఆరోపించారు. వాదనలు పూర్తయిన సందర్భంగా అశ్వత్థామన్, హరిహరన్, అంజలై బెయిల్ పిటిషన్లపై తీర్పును సోమవారం ప్రకటించనున్నట్లు కోర్టు తెలిపింది. ఇదే కేసులోని మిగతా వారి బెయిల్ పిటిషన్లపై విచారణనూ ఆదే రోజుకు వాయిదా వేసింది.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పల్లావరం, ఎగ్మూరు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ మేరకు విద్యుత్తు శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.

● **రెడ్‌హిల్స్:** తిరువళ్లూరు జిల్లా పెరియపాళ్యం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి 5 గంటల వరకు పెరియపాళ్యం, బండికావనూరు, పాలవాక్కం, తండలం, వెంగల్, కన్నిగైప్పేర్, నెల్వాయ్, ఎ.పాక్కం, తుంబాక్కం, వడమదురై, ఎర్రాంకుప్పం, అత్తింగకావనూరు, కల్పట్టు, నైవేలి, పనపాక్కం, అత్తివాక్కం, ఏనంబాక్కం, తొళవేడు తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

టీవీకే కార్యకర్త కుటుంబానికి గృహ నిర్మాణం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా విక్రవాండిలో టీవీకే తరఫున గతేడాది నిర్వహించిన మొదటి మహానాడులో చెన్నై కీళ్పాక్కంకు చెందిన కార్యకర్త చార్లెస్ పాల్గొన్నారు. అప్పుడు జరిగిన రోడ్డు ప్రమాదంలో చార్లెస్ మృతి చెందాడు. ఆయన కుటుంబానికి పార్టీ అధ్యక్షుడు విజయ్ ఆర్థికసాయం అందజేశారు. తమకు ఇల్లు లేదని, నిర్మించి ఇవ్వాలని వారు కోరడంతో ఆదివారం గృహ నిర్మాణానికి పార్టీ నిర్వాహకులు భూమిపూజ నిర్వహించారు.

విజయ్ ఏవిధంగా మానవతావాది?: దురైమురుగన్

వేలూరు: కరూర్ దుర్ఘటనకు కారణమైన విజయ్ మానవతావాది, తాము మాత్రం మానవత్వం లేనివాళ్లమా? అని మంత్రి దురైమురుగన్ ప్రతిపక్షాలను ప్రశ్నించారు. వేలూరు జిల్లా కాట్పాడి గాంధీనగర్‌లోని తన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. కొడనాడు అంశంలో తాను ఎవరి బెదిరింపులకు భయపడబోనన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ముఖ్యమంత్రిపై టీవీకే అధ్యక్షుడు విజయ్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. కరూర్ ఘటనకు కారణమైన విజయ్ మానవతావాది, తాము మాత్రం మానవత్వం లేనివాళ్లమా? అని ప్రశ్నించారు.

నాగమలై కుండ్రులో పెరిగిన విదేశీ పక్షుల సంఖ్య

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లా నంబియూర్ సమీపం నాగమలై కుండ్రుని గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం 4వ జీవవైవిధ్య వారసత్వ ప్రదేశంగా ప్రకటించింది. ఇటీవల ఇక్కడ నిర్వహించిన పక్షుల సర్వేలో తూర్పు యూరప్, మధ్య ఆసియా నుంచి ఎక్కువ దూరం పయనించే పక్షుల సంఖ్య పెరిగినట్టు తేలింది. ముఖ్యంగా గత వారం నిర్వహించిన సర్వేలో బూడిద మెడతో ఉన్న హూపో, నీలిగొంతు పిచ్చుక, చెక్క పిచ్చుక, మట్టిపిల్లి పక్షి, తెల్లగొంతుతో ఉండే అడవి పిచ్చుకలను గుర్తించారు. వీటితో పాటు బంగారు గద్ద, రాబందు, పంచురుట్టన్, ఫిల్లింగ్, కొండలటి, తవిటి పావురం, ఉజవరన్, తెల్లబొడ్డు కరిచాన్ వంటి 50కి పైగా స్థానిక పక్షులు కూడా ఇక్కడ జీవిస్తున్నట్లు కనుగొన్నారు. నాగమలై కుండ్రులో ఇప్పటివరకు 136 జాతి పక్షులు, 136 జాతుల మొక్కలు, 106 జాతుల కీటకాలు, 23 జాతుల ఆక్టోపస్‌లు, 17 జాతుల సరిస్రుపాలు, 10 జాతుల క్షీరదాలు, 8 జాతుల ఇతర జీవులు మొత్తం 438 జాతుల జీవులు నివసిస్తున్నట్టు గుర్తించారు.

విద్యార్థులను విమానం ఎక్కించిన ప్రధానోపాధ్యాయురాలు

విద్యార్థులతో ముచ్చటిస్తున్న జిల్లా కలెక్టర్ ఇళం భగవత్

అరక్కోణం, న్యూస్‌టుడే: సాధారణంగా విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులు మంచి పుస్తకాలు ఇవ్వడమో, లేదంటే చిన్నచిన్న వస్తువులను బహుమతులుగా ఇవ్వడమో చేస్తుంటారు. కానీ తూత్తుకుడికి చెందిన ఓ ప్రధానోపాధ్యాయుడు ఏకంగా 17మంది విద్యార్థులను తన సొంత ఖర్చులతో విమానంలో చెన్నైకి తీసుకెళ్లారు. తూత్తుకుడి సమీపం బండారంపట్టి ప్రాంతంలోని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో పుదుకోట్టై ప్రాంతానికి చెందిన నెల్సన్ పొన్రాజ్ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈమె ఉత్తమ ఉపాధ్యాయినిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు పొందారు. పాఠశాలలో చదువుతున్న పేద పిల్లలకు డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా తన సొంత ఖర్చులతో పలు కొత్త భవనాలను నిర్మించారు. ఇదిలా ఉండగా పాఠశాల్లో చదువుతున్న 11మంది సహా పూర్వ విద్యార్థులు మరో ఆరుగురు తమకు తూత్తుకుడి నుంచి చెన్నై వరకు విమానంలో ప్రయాణం చేయాలనే కోరిక ఉందని నెల్సన్ పొన్రాజ్‌కు చెప్పారు. వారి కలను నెరవేర్చేందుకు ఆమె రూ.1.5లక్షలు ఖర్చు చేసి 17మంది విద్యార్థులను తాజాగా తూత్తుకుడి నుంచి చెన్నై వరకు విమానంలో తీసుకెళ్లారు. వెళ్లడానికి ముందుగా విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఇళంభగవత్ పాఠశాలకు వచ్చి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయురాలిని ప్రశంసించారు.

విమానాశ్రయంలో విద్యార్థులతో హెచ్‌ఎం నెల్సన్ పొన్‌రాజ్

పుదుకోట్టై, తిరుచ్చిలో నేడు సీఎం పర్యటన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహిస్తున్న నేపథ్యంలో రెండ్రోజుల పర్యటనలో భాగంగా పుదుకోట్టై, తిరుచ్చికి విచ్చేయనున్నారు. పుదుకోట్టై జిల్లా కీరనూర్‌లో సోమవారం జరగనున్న ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని కొత్త ప్రాజెక్టు పనులను ప్రారంభించి సంక్షేమ సాయం పంపిణీ చేస్తారు. అదేవిధంగా తిరుచ్చిలోని కోట్టపట్టు ప్రాంతంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛంద సంస్థల సహకారంతో రెండుచోట్ల ఏర్పాటైన అన్బుచోలై కేంద్రాలను ప్రారంభించనున్నారు. అనంతరం తిరుచ్చి శ్రీరంగం నియోజకవర్గ ఎమ్మెల్యే పళనియాండి ఇంటి వివాహ వేడుకలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా తిరుచ్చిలో రెండ్రోజులపాటు డ్రోన్లు ఎగురవేసేందుకు పోలీసులు నిషేధం విధించారు.

బీఎల్‌వోగా పండ్లరసం దుకాణంలో పనిచేసే మహిళ

● రిటర్నింగ్ అధికారికి భాజపా ఫిర్యాదు

చెన్నై, న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ పనుల గురించి ఎలాంటి అవగాహనలేని పండ్లరసం దుకాణంలో పనిచేసే వ్యక్తిని బూత్‌స్థాయి అధికారిగా నియమించారంటూ చెన్నై జిల్లా రిటర్నింగ్ అధికారియైన జీసీసీ కమిషనరు కుమరగురుభరన్‌కు భాజపా రాష్ట్ర కార్యదర్శి కరాటే త్యాగరాజన్ ఫిర్యాదు చేశారు. అందులో... వేళచ్చేరి శాసనసభ నియోజకవర్గంలోని 87వ నంబరు బూత్‌కు బీఎల్‌వోగా నియమితులైన సుభాషిని తన పరిధిలో ఫారాలను అందించలేదని తెలిసిందన్నారు. దీని గురించి ఆమెను సంప్రదించగా తనకు దంత సమస్య ఉండటంతో ఫారాలు అందించాలని తన కుమారుడిని పురమాయించానని, అంతకు మించి తనకేమీ తెలియదన్నారని పేర్కొన్నారు. ఆమె ఓ పండ్లరసం దుకాణంలో పనిచేస్తున్నారని తెలిపారు. 'సర్' గురించి ఎలాంటి అవగాహనలేని వ్యక్తిని నియమిస్తే ఆ పనులు నిజాయతీగా, సజావుగా ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై చర్యలు చేపట్టాలని కోరారు.

ఘనంగా దువ్వూరి రామిరెడ్డి జయంతి

రామిరెడ్డి చిత్రపటానికి అంజలి ఘటించిన అతిథులు, నిర్వాహకులు

టీనగర్, న్యూస్‌టుడే: జనని సాంఘిక, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి 130వ జయంతి వేడుకలు ఆదివారం చెన్నై మైలాపూరులోని పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో జరిగాయి. సమితి అధ్యక్షురాలు డా.నిర్మలా పళనివేలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నెల్లూరులోని దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి ట్రస్ట్ కార్యదర్శి సురేంద్రనాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా, శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ అధ్యక్షులు కాకుటూరు అనిల్‌కుమార్ రెడ్డి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. కవయిత్రి ఆతుకూరి మొల్ల అవార్డును ఈ సంవత్సరం డా. నిర్మలా పళనివేలుకు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జననీ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, ఆచార్య ఎల్బీ శంకరరావు, మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు, వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జలదంకి కోదండ రామిరెడ్డి, గాయిని ఎస్పీ వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds
REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
22 సెంట్లు వ్యవసాయ భూమి 92 మొక్కలతో 8 లక్షల 50 వేలు మాత్రమే. 5 సం. నుండి సుమారు 40 సం. వరకు ఆదాయం. ✆ 89781 62222.

టీవీకే నిర్వాహకులు 8 మందికి ముందస్తు బెయిల్

చెన్నై, న్యూస్‌టుడే: కరూర్ తొక్కిసలాట దుర్ఘటన పరిణామాల నేపథ్యంలో కేసు నమోదైన టీవీకే నిర్వాహకులు 8 మందికి మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కరూర్ తొక్కిసలాట జరిగినప్పుడు సహాయ చర్యల కోసం వెళ్లిన అంబులెన్స్ డ్రైవరు, వాహనంపై దాడి చేసినట్లు టీవీకే నిర్వాహకులు సహా పలువురిపై కరూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ సేలం జిల్లాకు చెందిన టీవీకే నిర్వాహకులు మణికంఠన్, తమిళముదన్, పెరియసామి, హరిసుధన్, గౌతమ్ ధనశేఖర్, అన్బుమణి, సెంథిల్ కుమార్, సుబ్రమణి తదితరులు మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేశారు. తమపై తప్పుడు కేసు నమోదు చేశారని ఆరోపించారు. దర్యాప్తునకు సహకరిస్తామని, కావున ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. న్యాయమూర్తి జస్టిస్ శ్రీమతి సమక్షంలో పిటిషన్ విచారణకు రాగా.. పిటిషన్‌దారులను పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన ఆవశ్యకత ఉందని, వారికి ముందస్తు బెయిల్ ఇవ్వకూడదంటూ ప్రభుత్వం తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. ఈ కేసులో మిగతా కొందరికి ముందస్తు బెయిల్ ఇవ్వడాన్ని దృష్టిలో ఉంచుకుని పిటిషన్‌దారులకు ముందస్తు బెయిల్ ఇస్తున్నామని, వారు సేలం పట్టణ పోలీస్ స్టేషన్‌లో 2 వారాలపాటు హాజరై సంతకం చేయాలంటూ న్యాయమూర్తి ఆదేశించారు.

విద్యాభివృద్ధికి శ్రీ హయగ్రీవ ఇష్టి

ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న చినజీయర్ స్వామి

టీనగర్, న్యూస్‌టుడే: సకల జీవరాసులను పరమాత్మ రూపంగా భావించి ఆదరించడమే ఈ మహాయజ్ఞం ముఖ్య ఉద్దేశమని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి పేర్కొన్నారు. ఆయన దివ్య సంకల్పంతో చెన్నై పెరంబూరులోని ఎస్‌పీఆర్ సిటీ వేదికగా జరుగుతున్న సాప్తాహ్నిక పంచకుండాత్మక సమతా ఇష్టి మహాయజ్ఞం నాలుగో రోజు ఆదివారం వైభవోపేతంగా జరిగింది. సర్వవిధ విద్యాభివృద్ధిని కాంక్షిస్తూ శ్రీ హయగ్రీవ ఇష్టిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8 గంటలకు తీర్థ గోష్ఠితో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 10 గంటలకు గో పూజ, భగవద్ రామానుజులు, పెరుమాళ్, తాయార్ అర్చా మూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి సమర్పించారు. తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఐదు గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. 6.30 గంటలకు చినజీయర్ స్వామి దివ్య ప్రవచనం ప్రారంభమైంది. రాత్రి 8.30 గంటలకు పూర్ణాహుతితో కార్యక్రమం ముగిసింది. **నేటి కార్యక్రమం:** సాప్తాహ్నిక పంచకుండాత్మక సమతా ఇష్టి మహాయజ్ఞంలో భాగంగా సోమవారం సర్వ వ్యాధి నివారణ కోసం ప్రత్యేకమైన శ్రీ పరమేష్ఠి శ్రీ ధన్వంతరి హోమం నిర్వహిస్తారు.

'సర్' కుట్రను సమర్థవంతంగా ఎదుర్కొంటాం: ఎంపీ కనిమొళి

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అర్హులైన ఓటర్లను తొలగించడానికి జరుగుతున్న 'సర్' కుట్రను కూడా సమర్థవంతంగా ఎదుర్కొంటామని డీఎంకే ఉప ప్రధానకార్యదర్శి, ఎంపీ కనిమొళి తెలిపారు. డీఎంకే యువజన విభాగం తరఫున నుంగంబాక్కంలోని వళ్లువర్‌కోట్టంలో ఆదివారం రెండో రోజుగా జరిగిన 'డీఎంకే75-అరివు తిరువిళా' వేడుకలో కనిమొళి పాల్గొని మాట్లాడారు. శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో డీఎంకేపై పలు వైపుల నుంచి దాడి జరుగుతోందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచీ ఈ తరహా దాడులు జరుగుతూనే ఉన్నాయని, అనాదిగా వస్తున్న అణచివేతకు వ్యతిరేకంగా పోరాడామని పేర్కొన్నారు.

వీఆర్‌ఏ నియామక పరీక్షలు

మూడోసారి వాయిదా

మహాబలిపురం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 2,299 గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ) పోస్టుల భర్తీకి జిల్లాల వారీగా నోటిఫికేషన్లు జారీ చేశారు. అధికారులు ఆయా జిల్లాల్లో పరీక్షలను నిర్వహించి ఎంపిక చేస్తున్నారు. కానీ చెంగల్పట్టు జిల్లాలో 26 పోస్టులకు పరీక్షలను నిర్వహించి ఎంపిక చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా మూడోసారి వాయిదా పడ్డాయి. విషయం తెలియని అనేక మంది అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి వచ్చి అసంతృప్తితో వెనుదిరిగారు.

తేజస్వి యాదవ్‌కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

చెన్నై, న్యూస్‌టుడే: బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు ముఖ్యమంత్రి స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. తన 'ఎక్స్' పేజీలో... బిహార్‌లో ఉత్తేజితమైన సామాజిక న్యాయ ఉద్యమ చోదకశక్తిగా తేజస్వి యాదవ్ ఉద్భవించారని, కోట్లాది మందికి నమ్మకం కలిగించే వ్యక్తిగా ఉన్నారని తెలిపారు. ఆయన నాయకత్వంలో ఓ కొత్త అధ్యాయం అంచున బిహార్ నిలిచిందన్నారు. సమానత్వం, నాణ్యమైన విద్య, ఉద్యోగావకాశాలు, విలువలు అంటూ అందరి ఆకాంక్షలను ఆయన పూర్తి చేస్తారని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చారిత్రక మార్గంలో దృఢస్థైర్యం, ఆరోగ్యం, తెగువతో ముందుకు సాగాలంటూ శుభాకాంక్షలు తెలిపారు.

'విజయ్ పగటి కలలు నెరవేరవు'

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కావాలని టీవీకే అధ్యక్షుడు విజయ్ కంటున్న పగటి కలలు నెరవేరవని అన్నాడీఎంకే మాజీ మంత్రి నత్తం విశ్వనాథన్ పేర్కొన్నారు. ఆయన దిండుగల్‌లో ఆదివారం మాట్లాడారు. చెన్నైలో జరిగిన టీవీకే రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో విజయ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధాలు లేని ఆయన ఎలా ముఖ్యమంత్రి కాగలరని ప్రశ్నించారు. కరూర్ దుర్ఘటనలో 41మంది మృతికి ప్రధాన కారణం విజయ్ అని ఆరోపించారు. కనీసం మృతుల కుటుంబీకులను పరామర్శించని ఆయన ప్రజల కష్టనష్టాలను ఎలా తెలుసుకోగలరని ప్రశ్నించారు.

కార్ల్ మార్క్స్ విగ్రహం తయారీ

విగ్రహాన్ని పరిశీలిస్తున్న మంత్రి సామినాథన్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: జర్మన్ శాస్త్రవేత్త, సోషలిస్టు విప్లవకారుడు కార్ల్ మార్క్స్‌కు చెన్నై ఎగ్మూర్‌లోని మ్యూజియంలో విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల శాసనసభలో ప్రకటించారు. ఆ మేరకు తిరువళ్లూరు జిల్లా పూందమల్లిలో కార్ల్ మార్క్స్ విగ్రహం నిర్మితమవుతోంది. మంత్రి సామినాథన్ విగ్రహ నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు.

'హ్యుందాయ్' క్యాన్సర్ చికిత్సా కేంద్రం ప్రారంభం

వడపళని, న్యూస్‌టుడే: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన 'హ్యుందాయ్ మోటార్ ఇండియా ఫౌండేషన్(హెచ్‌ఎంఐఎఫ్)' ఐఐటీ మద్రాస్‌తో కలిసి 'హ్యుందాయ్ హోప్ ఫర్ క్యాన్సర్' కేంద్రాన్ని ప్రారంభించింది. ఇందుకోసం రూ.56 కోట్లు కేటాయించినట్టు సంస్థ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. తమిళనాడు, మహారాష్ట్ర, హరియాణాలో రానున్న నాలుగేళ్లలో 225 క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకున్నామని ఆదివారం ప్రకటనలో తెలిపారు. పిల్లల్లో క్యాన్సర్ లక్షణాలను గుర్తించడానికి శిబిరాలు కీలకంగా మారనున్నాయి. దీనిపై హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పునీత్ ఆనంద్ మాట్లాడుతూ.. రూ.3 కోట్ల క్యాన్సర్ సంరక్షణ నిధితో పాటు రూ.56 కోట్ల నిబద్ధతతో హెచ్‌ఎంఐఎఫ్ ముందస్తు గుర్తింపు, పరిశోధన, చికిత్స, కమ్యూనిటీ ఔట్‌రీచ్ ప్రయత్నాలకు కేంద్రం కృషి చేస్తుందని తెలిపారు.

(c) eenadu

'రెట్ట తల' డిసెంబరు 18న విడుదల

చెన్నై, న్యూస్‌టుడే: తిరుకుమరన్ దర్శకత్వంలో అరుణ్ విజయ్, సిద్ధి ఇద్నానీ జంటగా నటించిన చిత్రం 'రెట్ట తల'. ఇందులో తన్యా రవిచంద్రన్ ముఖ్యపాత్రలో నటించారు. బీటీజీ యూనివర్సల్ పతాకంపై నిర్మితమైన ఈ చిత్రానికి శ్యామ్ సి.ఎస్ సంగీతం అందించారు. చిత్రంలో అరుణ్ విజయ్ రెండు విభిన్నమైన పాత్రల్లో నటించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిత్రం డిసెంబరు 18న విడుదల కానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

'అంగమ్మాళ్' టీజర్...

చెన్నై: రచయిత పెరుమాళ్ మురుగన్ రాసిన కథానిక ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'అంగమ్మాళ్'. విపిన్ రాధాకృష్ణన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో గీతా కైలాసం, చరణ్ శక్తి, భరణి తదితరులు ముఖ్యపాత్రల్లో నటించారు. స్టోన్ బెంచ్ ఫిలిమ్స్, ఎన్‌జాయ్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మించాయి. ముహమదు మన్సూర్ సంగీతం అందించారు. ఈ నెల 21న చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది.

టీజర్‌లోని ఓ సన్నివేశ దృశ్యం

24 నుంచి 'అరసన్' చిత్రీకరణ

చెన్నై: వెట్రిమారన్ దర్శకత్వంలో తొలిసారిగా శింబు నటిస్తున్న చిత్రం 'అరసన్'. కలైపులి ఎస్.థాను నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఉత్తర చెన్నై నేపథ్యంతో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. చిత్రం ప్రోమో వీడియో విడుదలై చిత్రంపై అభిమానుల అంచనాలను మరింత పెంచింది. ఈ నేపథ్యంలో చిత్రీకరణ పనులు ఈ నెల 24న ప్రారంభం కానున్నట్లు సమాచారం.


శింబు

నేడు జేసన్ సంజయ్ చిత్రం టైటిల్ వెల్లడి

చెన్నై: నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ దర్శకత్వం వహిస్తున్న తొలి చిత్రంలో సందీప్ కిషన్ ప్రధానపాత్రలో నటిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్, జేసన్ సంజయ్‌కు చెందిన జేఎస్‌కే మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. చిత్రం టైటిల్‌ను సోమవారం ఉదయం 10 గంటలకు వెల్లడించనున్నట్లు లైకా ప్రొడక్షన్స్ ప్రకటించింది.

మాస్క్ ట్రైలర్...

చెన్నై: వర్ధమాన దర్శకుడు విక్రనన్ అశోక్ దర్శకత్వంలో కవిన్, ఆండ్రియా ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మాస్క్'. రుహానీ శర్మ కథా నాయిక. చార్లీ, బాలా శరవణన్, వీజే అర్చన, సంతోష్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు. వెట్రిమారన్‌కు చెందిన గ్రాస్ రూట్ ఫిలిమ్స్, బ్లాక్ మెడ్రాస్ సంస్థ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించారు. ఈ నెల 21న చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో ట్రైలర్‌ను ఆదివారం మధ్యాహ్నం విడుదల చేశారు.

ట్రైలర్‌లోని ఓ సన్నివేశ దృశ్యం

12ఏళ్ల తర్వాత తమిళ సినిమాలో కనిపించనున్న రోజా

చెన్నై: నట దిగ్గజం దివంగత శివాజీ గణేశన్ పెద్ద కుమారుడు రామ్‌కుమార్ రెండో సంతానం దర్శన్ గణేశన్ ప్రధానపాత్రలో నటిస్తున్న చిత్రం 'లెనిన్ పాండియన్'. దీనిని సత్యజ్యోతి ఫిలిమ్స్ పతాకంపై టీజీ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. వర్ధమాన దర్శకుడు బాలచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంగీత దర్శకుడు గంగై అమరన్, సీనియర్ నటి రోజా ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. 12ఏళ్ల తర్వాత మళ్లీ తమిళచిత్ర పరిశ్రమకు రోజా రీఎంట్రీ ఇస్తుండటం గమనార్హం. కథాపాత్రలకు సంబంధించిన వీడియోలను చిత్రబృందం విడుదల చేసింది. మారవర్మన్ సుందరపాండియన్ అనే పోలీసు కథాపాత్రలో దర్శన్ గణేశన్ నటించగా ఆ వీడియోను నటుడు కార్తి, సంతానం అనే కథాపాత్రలో రోజా నటించగా ఆ వీడియోను నటి ఖుష్బూ విడుదల చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఓ సన్నివేశంలో రోజా

నకిలీ వైద్యుల అడ్డుకట్టకు పకడ్బందీ చర్యలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో సరైన విద్యార్హతలు లేకుండా కొందరు ప్రజలకు వైద్యం చేస్తున్నారు. ముఖ్యంగా వేలూర్, రాణిపేట జిల్లాల్లో ఎక్కువగా నకిలీ వైద్యులు పట్టుబడుతున్నారు. ఇలాంటి వారికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రోగులకు చికిత్స అందించే వైద్యుడిపై అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వైద్యారోగ్య విభాగ డైరెక్టరేట్ సూచించింది. రాష్ట్రంలోని ఆస్పత్రులు, ప్రయోగశాలలు, క్లినిక్‌లు తమిళనాడు వైద్య సంస్థల చట్టం 1997 కింద రిజిస్టరు చేసుకోవాలని, అలా చేసుకోని వాటిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఒకసారి నమోదు చేసుకున్న తర్వాత లైసెన్స్ ఐదేళ్లు చెల్లుతుందని, ఆ తర్వాత మళ్లీ www.tncea.dmrhs.tn.gov.in వెబ్‌సైట్‌లో లైసెన్సు పునరుద్ధరించుకోవచ్చని సూచించింది. ఇంకా నమోదు చేసుకోని సంస్థలు, ఆస్పత్రులు 2026 జూన్‌లోగా సంబంధిత జిల్లా అధికారి వద్ద నమోదు చేసుకోవాలని పేర్కొంది.

బహుమతులందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

ఘనంగా కార్తిక వనభోజనాలు

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నై తెలుగు అసోసియేషన్ వలసరవాక్కం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనభోజనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. చెన్నై శివారులోని చెంబరంబాక్కంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి వెంకయ్య నాయుడు, ఉపాధ్యక్షులు విజయేంద్ర రావు, సాంస్కృతిక విభాగ కార్యదర్శి శివకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం జరిగిన క్రీడా పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

సాహితీ సేవకులకు పురస్కారాలు

టీనగర్: సాహితీ సేవ, పారిశ్రామిక రంగంలో రాణిస్తున్న పద్మభూషణ్ నల్లి కుప్పుస్వామి శెట్టి 86వ జన్మదినోత్సవం సందర్భంగా చెన్నైలోని నారద గాన సభలో ఆదివారం సాహితీ సేవకులకు 'నల్లి దిసై ఎట్టుం' పురస్కారాల ప్రదానం జరిగింది. భారతీయ భాషల్లో అనువాద సాహిత్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఏడుగురు అనువాదకులకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులను అందజేశారు. అనువాదకులు నందం వెంకట సుబ్బారావు, గౌరి కృపానందన్, శ్రీనివాస రామానుజం, సయ్యద్ రఫీక్ బాషా, అనురాధ ఆనంద్, జమున కృష్ణరాజ్, రాజేంద్రన్, సుకుమారన్ తదితరులు ఈ సందర్భంగా అవార్డులు అందుకున్నారు. వేదికపై నల్లి కుప్పుస్వామి శెట్టి రచించిన ఏడు పుస్తకాలను ఆవిష్కరించారు.

నల్లికుప్పుస్వామి శెట్టి నుంచి అవార్డు అందుకుంటున్న నందం వెంకట సుబ్బారావు

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరవు: ఖుష్బూ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మహిళలకు భద్రత కరవైందని భాజపా నాయకురాలు, సినీనటి ఖుష్బూ ఆరోపించారు. ఆమె చెన్నై మీనంబాక్కం విమానాశ్రయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నాలుగున్నరేళ్ల డీఎంకే పాలనలో మహిళలపై నేరాలను అరికట్టడంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. కోవై, పొల్లాచ్చి, అన్నా వర్సిటీల్లో జరిగిన ఘటనలకు మత్తుపదార్థాలు, మద్యం దుకాణాలే కారణమని ఆరోపించారు. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత కూడా మద్యం దుకాణాలు తెరచి ఉంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వీటన్నింటికీ రానున్న ఎన్నికల్లో డీఎంకే మూల్యం చెల్లించుకోనుందన్నారు. 'సర్' దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ప్రక్రియని, ఒక్క తమిళనాడులోనే అమలు చేస్తున్నట్టు స్టాలిన్ గగ్గోలు పెట్టడం సరికాదన్నారు. టీవీకే అధ్యక్షుడు విజయ్ వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

మారథాన్ పోటీలు ప్రారంభం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్‌లో సీఐఐ, యంగ్ ఇడియన్స్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన 'కరూర్ విజన్-2030' మారథాన్. వాకథాన్ పోటీలను కరూర్ నగరంలోని తిరువళ్లువర్ మైదానంలో మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ ప్రారంభించారు. సీఐఐ అధ్యక్షుడు ప్రభు స్వాగతం పలికారు. పోటీల సందర్భంగా కరూర్ తిరువీకా సాలైలో వాహనాలను నిషేధించడంతో ట్రాఫిక్ స్తంభించింది. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

ప్రశాంతంగా ముగిసిన పోలీసు నియామక రాత పరీక్షలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తమిళనాడు యూనిఫామ్డ్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు తరపున పోలీసుశాఖలో 2,833 పోస్టుల భర్తీకి రాతపరీక్ష రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం జరిగింది. ఇందులో గ్రేడ్-2 కానిస్టేబుల్స్ (సాయుధ దళాలు, ప్రత్యేక విభాగం), గ్రేడ్-2 జైలు గార్డు, అగ్నిమాపక సిబ్బంది పోస్టులు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 45 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. తమిళం ఓ సబ్జెక్టుగా తీసుకొని ఉత్తీర్ణత పొందినవారే పోస్టులకు అర్హులు. చెన్నైలోని 10 కేంద్రాలలో 9వేల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. అన్ని కేంద్రాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించినవారికి దేహదారుఢ్య పరీక్షలు ఉంటాయి.

హాల్‌టిక్కెట్లు పరిశీలిస్తున్న పోలీసులు

యువతికి సాయం చేసిన కానిస్టేబుల్

వేళచ్చేరి: విళుపురం, కడలూర్ జిల్లాల్లో 16 కేంద్రాల్లో నిర్వహించారు. విళుపురం వీఆర్పీ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి వచ్చిన ఓ యువతి గుర్తింపు కార్డు తీసుకురాలేదు. దీంతో ఆమెను కేంద్రంలోకి అనుమతించలేదు. విషయాన్ని యువతి అక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ కరుణాకరన్‌కు చెప్పడంతో ఆయన వెంటనే తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని ఆమె ఇంటికి తీసుకెళ్లారు. గుర్తింపు కార్డు తీసుకొచ్చిన తర్వాత కేంద్రంలోకి పంపడంతో అక్కడివారు హెడ్ కానిస్టేబుల్‌ను ప్రశంసించారు.

ద్విచక్ర వాహనంపై యువతిని తీసుకెళ్తున్న కానిస్టేబుల్ కరుణాకరన్

అన్నాడీఎంకే బూత్ కమిటీలకు వాట్సప్ గ్రూపులు

ఎన్నికలకు సంబంధించి అందులో సూచనలు

రెడ్హ ఇల్స్: రాష్ట్రవ్యాప్తంగా 68,019 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ప్రతి బూత్‌కు 9 మందితో కూడిన కమిటీలను అన్నాడీఎంకే ఏర్పాటు చేసింది. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఐటీ వింగ్ నిర్వాహకులు బూత్ కమిటీ సభ్యులకు వచ్చే ఏడాది రానున్న శాసనసభ ఎన్నికలకు సంబంధించి సూచనలిస్తున్నారు. ఇందుకోసం ఐటీ వింగ్ ఆధ్వర్యంలో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు వాట్సప్ గ్రూపులను ప్రారంభించేందుకు నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు బూత్ కమిటీ సభ్యులకు అధిష్ఠానం ఖరీదైన సెల్‌ఫోన్లను అందజేసేందుకు నిర్ణయించినట్లు వెల్లడించాయి.

వృద్ధ దంపతులను గౌరవించేందుకు ప్రత్యేక పథకం

నేడు ప్రారంభించనున్న ఉదయనిధి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చెన్నై తిరువళ్లిక్కేణి పార్థసారథి ఆలయంలో సోమవారం 70ఏళ్లు నిండిన దంపతుల కోసం ప్రత్యేక పథకాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభిస్తారని దేవాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... ముఖ్యమంత్రి స్టాలిన్ మార్గదర్శకాల మేరకు సోమవారం చెన్నై తిరువళ్లిక్కేణిలోని పార్థసారథి ఆలయంలో 70ఏళ్లు నిండి ఆధ్యాత్మిక నిబద్ధత కలిగిన వృద్ధ దంపతులను గౌరవించే విధంగా దేవాదాయశాఖ తరపున ప్రత్యేక పథకాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభిస్తారని, అదేవిధంగా పార్థసారథి ఆలయం తరపున రూ.3.40 కోట్ల వ్యయంతో నిర్మించిన గృహాలను కూడా ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 20 జోన్లలో 2వేల మందిని గౌరవిస్తారని తెలిపారు. ఒక్కో జంటకు రూ.2,500 విలువైన ధోవతి, చొక్కా, చీర, జాకెట్, పండ్లు, పసుపు కుంకుమ, గాజులు, దేవుడి చిత్రపటాన్ని అందజేస్తారని పేర్కొన్నారు.

'బిగ్‌బాస్' షోను నిషేధించాలి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: విజయ్ టీవీలో అక్టోబర్ 5వ తేదీ నుంచి 'బిగ్‌బాస్' షో సీజన్-9 ప్రసారమవుతోంది. ఇదిలా ఉండగా ఈ కార్యక్రమం తమిళ సంస్కృతికి వ్యతిరేకమని, యువత మనస్థత్వాన్ని ప్రభావితం చేస్తుందని పేర్కొంటూ వాల్‌వురిమై కట్చి తరపున ఆదివారం చెన్నై కుత్తంబాక్కంలో ఆందోళన చేశారు. వెంటనే బిగ్‌బాస్ షోపై నిషేధం విధించాలని నినాదాలు చేశారు. దీంతో షో జరుగుతున్న ప్రాంతంలో పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.

వీఏవోను హత్య చేసిన ఇద్దరు హిజ్రాల అరెస్టు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నాగపట్నం జిల్లా వాలక్కరై ప్రాంతానికి చెందిన రాజారామన్(37) తిరువాయిమూర్ వీఏవోగా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య, ఓ కుమారుడున్నారు. గతేడాది ఎడుక్కుడి పంచాయతీ వల్లం వీఏవోగా రాజారామన్ పనిచేస్తున్నప్పుడు లంచం తీసుకున్నందుకు అవినీతి నిరోధకశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. తర్వాత బెయిల ్పై విడుదలయ్యారు. కొన్ని నెలల తర్వాత ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అనంతరం తిరువాయిమూర్ వీఏవోగా విధుల్లో చేరారు. ఇదిలా ఉండగా గతంలోని లంచం కేసు విచారణ నిమిత్తం శుక్రవారం రాజారామన్ ద్విచక్ర వాహనంపై నాగపట్నం వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి బయలుదేరారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల గాలించారు. ఈ క్రమంలో శనివారం నాగపట్నం వెళ్లే ఈస్ట్ బీచ్ రోడ్డులో ముఖం, తలపై తీవ్ర గాయాలతో రాజారామన్ మృతిచెంది ఉన్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టానికి తరలించారు. దర్యాప్తులో.. రాజారామన్ సెల్లూర్‌లో మద్యం మత్తులో పడుకొని ఉండగా నివేద, శ్రీకవి అనే హిజ్రాలు నగదు, సెల్‌ఫోన్, ఉంగరం లాక్కొని తలపై బండరాయితో కొట్టి చంపినట్లు తేలింది. దీంతో నిందితులను అరెస్టు చేశారు.

రాజారామన్ (పాతచిత్రం)

పాఠశాల బస్సును అడ్డుకుని యువకుల హల్‌చల్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: మైలాడుతురై జిల్లా పొరైయార్ పోలీసు స్టేషన్ పరిధి అరసలంకుడిలో శనివారం సాయంత్రం పాఠశాల బస్సు విద్యార్థులను ఇళ్ల వద్ద దించడానికి వెళ్తుండగా ముగ్గురు యువకులు మద్యం మత్తులో బస్సును అడ్డుకుని డ్రైవరుతో వాగ్వాదానికి దిగారు. కిటికీ అద్దాలను ధ్వంసం చేసి బెదిరించారు. దీంతో విద్యార్థులు భయంతో కేకలు వేశారు. కాసేపటికి యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఘటనపై పాఠశాల యాజమాన్యం పొరైయార్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టి ఎడుత్తుక్కాట్టుకి చెందిన తామరైసెల్వన్‌ను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

నగ కోసం మహిళను చంపిన ఆటో చోదకురాలు...

పళ్లిపట్టు: తిరువణ్ణామలై జిల్లా కీల్‌పెన్నాత్తూర్ సమీపం కళికులం గ్రామానికి చెందిన శక్తివేల్ భార్య హంస(29) పది రోజుల క్రితం తన రెండున్నరేళ్ల కుమార్తె అనారోగ్యానికి గురవడంతో తిరువణ్ణామలైలోని ఆస్పత్రికి తీసుకెళ్లడానికి నగరంలోని పెరియార్ విగ్రహం వద్ద బస్సు దిగింది. ప్రభుత్వ ఆసుపత్రికి నడుచుకుంటూ వెళ్తుండగా రైల్వే గేటు వద్ద కీల్‌పెన్నాత్తూర్ గొల్లకొట్టాయి ప్రాంతానికి చెందిన నేత్ర అనే యువతి ఆమెను తన ఆటోలో ఎక్కించుకుంది. నేరుగా ఆసుపత్రికి వెళ్లకుండా వేంగికాల్ ప్రాంతంలో ఆమెకు తెలిసిన వ్యక్తి తిరుపతి ఇంటికి తీసుకెళ్లింది. అక్కడ నేత్ర, తిరుపతి కలిసి హంస మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసును లాక్కొని ఆమెను గొంతునులిమి చంపేశారు. తర్వాత మృతదేహాన్ని గోనె సంచిలో కట్టి దగ్గరలో ఉన్న ఓ చెరకు తోటలో విసిరేశారు. హంస కుమార్తెను దిండివనం ప్రయివేట్ కళాశాల వద్ద రోడ్డులో వదిలి వెళ్లిపోయారు. స్థానికులు పాపను పోలీసులకు అప్పగించారు. పోలీసులు బాలికను తండ్రి చెంతకు చేర్చారు. అప్పుడు తన భార్య కనిపించట్లేదని శక్తివేల్ ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసి నేత్ర, తిరుపతిని అరెస్టు చేశారు.

అరెస్టయిన నేత్ర

విద్యార్థిని లైంగికంగా వేధించిన ఉపాధ్యాయుడు...

ఆర్కేనగర్: తంజావూర్ జిల్లా స్వామిమలై సమీపం పాపనాశనంలోని ప్రైవేట పాఠశాలలో తిరుప్పొత్తురై ప్రాంతానికి చెందిన బాలసుబ్రమణియన్(29) అనే వ్యక్తి ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఇతన్ని రెండు నెలల క్రితం పాఠశాల యాజమాన్యం విధుల నుంచి తొలగించింది. ఈ క్రమంలో ఆ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని బాలసుబ్రమణియన్ తరచూ లైంగికంగా వేధిస్తున్నాడు. విషయాన్ని బాలుడు తల్లిదండ్రులు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి బాలసుబ్రమణియన్‌ను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు.

పోక్సో కేసులో పోలీస్ కానిస్టేబుల్...

వేళచ్చేరి: విళుపురం జిల్లా ఆరోవిల్ ప్రాంతానికి చెందిన పదో తరగతి చదువుతున్న 17ఏళ్ల బాలిక, కిళియనూర్ సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 12వ తరగతి చదువుతున్న బాలుడు రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈనెల 5వ తేదీ ఇద్దరూ ఇళ్లు విడిచి వెళ్లిపోయారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆరోవిల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. 6వ తేదీ వేకువజామున దిండివనం-మరక్కాణం రోడ్డులో బాలిక ఒంటరిగా నడిచి వెళ్తుండగా బ్రహ్మదేశం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఇలంగో(40) అడ్డుకుని లైంగిక వేధింపులకు గురిచేశాడు. విద్యార్థిని ప్రతిఘటించడంతో ఇలంగో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. రెండు రోజుల క్రితం బాలికను ఆరోవిల్ పోలీసులు చెన్నైలో అదుపులోకి తీసుకొని విచారించారు. ఇలంగో వేధించిన విషయం చెప్పడంతో దిండివనం పోలీసులు ఇలంగోను శనివారం పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

ఇలంగో

రైలులో మహిళ మెడలో గొలుసు దోపిడీ చేసిన యువకుడు...

వేలూరు: తిరుపత్తూరు జిల్లా సోమనాయకన్‌పట్టి రైల్వే స్టేషన్ సమీపంలో రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును ఓ యువకుడు లాక్కొని పారిపోయాడు. వెంటనే బాధితురాలు సోమనాయకన్‌పట్టి స్టేషన్‌లో దిగి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడి కోసం గాలించారు. ఈ క్రమంలో స్టేషన్‌లో మరో రైలు ఎక్కడానికి నిందితుడు ప్రయత్నిస్తుండగా పట్టుకుని జోలార్‌పేట రైల్వే పోలీస్టేషన్‌కు తీసుకెళ్లారు. అతను గుడియాత్తం ప్రాంతానికి చెందిన పెరుమాళ్(18)గా తెలిసింది. అప్పులు తీర్చేందుకు దోపిడీకి పాల్పడ్డానని, విడిచిపెట్టాలని ఏడుస్తూ పోలీసుల ముందు ప్రాధేయపడ్డాడు.

నగదు మోసం కేసులో ఐటీ ఉద్యోగి...

శ్రీపెరుంబుదూర్: కాంచీపురం జిల్లా మాంగాడు సమీపం గెరుకంబాక్కానికి చెందిన శ్రీవత్స్(44) చెన్నైలోని ఓ ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతనికి గెరుకంబాక్కం, ఆవడి ట్యాంక్ ఫ్యాక్టరీ ప్రాంతాల్లో రెండు ఇళ్లు ఉన్నాయి. వాటిని లీజుకు ఇస్తానని ఆన్‌లైన్‌లో ప్రకటన ఇచ్చాడు. అది చూసి కొందరు శ్రీవత్స్‌ను సంప్రదించి రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు లీజు కింద అడ్వాన్స్ ఇచ్చారు. అలా 20మంది నుంచి రూ.60 లక్షల వరకు తీసుకున్నాడు. అయితే శ్రీవత్స్ ఎవరికీ ఇళ్లను లీజుకు ఇవ్వకుండా కాలయాపన చేశాడు. తర్వాత మోసపోయామని గ్రహించిన బాధితులు మాంగాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రీవత్స్ నలుగురు సహోద్యోగులతో కలిసి రూ.కోటి పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించారని, నష్టం రావడంతో స్నేహితులు మోసం చేశారని, శ్రీవత్స్ కూడా గతంలో ఓ మోసం కేసులో జైలుకు వెళ్లినట్లు తెలిసింది. మొదట పనిచేస్తున్న కంపెనీలో ఉద్యోగం పోవడంతో తరువాత పలు కంపెనీల్లో పనిచేస్తూ ఇళ్లు లీజు పేరుతో మోసగిస్తున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో పోలీసులు నిందితుడిని ఆదివారం అరెస్టు చేశారు.

ఖైదీకి సెల్‌ఫోన్ ఇచ్చిన న్యాయవాదిపై కేసు నమోదు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: చెన్నై వ్యాసర్‌పాడికి చెందిన నాగేంద్రన్ రౌడీషీటర్. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో ప్రధాన నిందితుడు. ఈయన ఇటీవల మృతి చెందాడు. ఈయన కుమారుడు రాజ్ గంజాయి తరలిస్తుండగా కొడుంగయూరు పోలీసులు ఇటీవల అరెస్టు చేసి పుళల్ జైల్లో ఉంచారు. అతన్ని కలిసేందుకు తిరువళ్లూరు సమీపం పుట్లూరుకు చెందిన న్యాయవాది అజిత్ శనివారం సాయంత్రం జైలుకు వచ్చారు. రాజ్‌కు సెల్‌ఫోన్ ఇస్తుండగా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. న్యాయవాదిపై పుళల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదానికి గురైన బియ్యం లారీ

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లాకి చెందిన విల్సన్ అనే వ్యక్తికి సొంతమైన లారీకి స్థానికుడైన కృష్ణమూర్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇదిలా ఉండగా ఆదివారం చెన్నై మాధవరం నుంచి 16 టన్నుల బియ్యం లోడుతో లారీ కోయంబత్తూరు సిరియన్ చర్చ్ రోడ్డులో వస్తోంది. డ్రైవరు పక్కన ఆపడానికి యత్నించగా వెనుక ఉన్న ఓ చక్రం గుంతలో దిగింది. దీంతో లారీ ఓ పక్కకు ఒరిగి పక్కనున్న ప్రహరీకి ఆనుకుంది. ఆర్.ఎస్.పురం పోలీసులు పరిశీలించారు. లారీలోంచి బియ్యాన్ని తీసి మరో లారీలోకి ఎక్కించి క్రేన్ సాయంతో పక్కకు తీయడానికి చర్యలు చేపట్టారు.

పక్కకు ఒరిగిన లారీ

డివైడర్‌ని ఢీకొని దగ్ధమైన కారు.. డ్రైవర్ సజీవదహనం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి డివైడర్‌ని ఢీకొని మంటలు చెలరేగడంతో డ్రైవరు సజీవ దహనమైన ఘటన తిరువారూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తిరువారూర్ జిల్లా తిరుత్తురైపూండి బైపాస్ రోడ్డులో ఆదివారం ఉదయం అతివేగంగా వచ్చిన ఓ కారు డివైడర్‌ని ఢీకొంది. దీంతో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. ఘటనలో డ్రైవర్ సజీవ దహనమయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టానికి తరలించారు. మృతిడి వివరాలు తెలియలేదు. దర్యాప్తు చేస్తున్నారు.

పూర్తిగా కాలిపోయిన కారు

క్రైం కార్నర్

హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తూత్తుక్కుడి జిల్లా పుదుకోట పోలీసు స్టేషన్ పరిధిలోని కులైయన్‌కరిసల్ ప్రాంతానికి చెందిన పొన్‌నిమేశ్ (35) 2015లో పాతకక్షలతో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అదే ప్రాంతానికి చెందిన పొన్‌శేఖర్, అతని కుమారుడు సుభాకర్, రమేశ్, సురేశ్, మాడసామిని పుదుకోట పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ తూత్తుక్కుడి మొదటి అదనపు సెషన్ కోర్టులో జరుగుతోంది. ఈ నేపథ్యంలో తుది విచారణ శనివారం జరిగింది. నేరం రుజువు కావడంతో ఐదుగురికి జీవిత ఖైదు, రూ.15వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

శిక్ష పడిన దోషులు

బాలుడిని లైంగికంగా వేధించిన మహిళకు 54ఏళ్లు...

రెడ్‌హిల్స్: తిరువారూరు జిల్లా ఏరవాంజేరి సమీపం వడుగర్‌పాళ్యంలోని అంగన్‌వాడీ కేంద్రంలో లలిత(39) అనే మహిళ పనిచేశారు. ఈమె 2021 అక్టోబరు 26న పదో తరగతి చదువుతున్న 14ఏళ్ల బాలుడిని ఊటీకి తీసుకెళ్లి లైంగికంగా వేధించింది. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఏరవాంజేరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి లలితను పోక్సో చట్టం కింద అరెస్టు చేసి తిరువారూరు మహిళా కోర్టులో కేసు దాఖలు చేశారు. శుక్రవారం విచారణ ముగిసింది. నేరం రుజువు కావడంతో లలితకు 54ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.18 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బాధితుడికి రూ.6 లక్షల పరిహారం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

పెరియపాళ్యం: తిరువళ్లూరు జిల్లా పెరియపాళ్యం సమీపం వెంగల్‌కు చెందిన నీలా వితంతువు. ఈమె శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. వెంగల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బెలూన్ మింగిన మూడేళ్ల బాలుడి మృతి

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా కావేరిపాక్కానికి చెందిన శ్యామ్(3) ఆదివారం నోటిలో బెలూన్ పెట్టుకొని ఆడుకుంటూ ప్రమాదవశాత్తు మింగేశాడు. శ్వాస తీసుకోలేక స్పృహకోల్పోవడంతో తల్లి వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

మీనం.. మనం చూడం..!

ఉప్పుటేరు కలుషితంతో అంతరిస్తున్న మత్స్య సంపద

కాలుష్య కోరల్లో..

కలిదిండి, న్యూస్‌టుడే ఏలూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో విస్తరించిన ఉప్పుటేరు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఫలితంగా అందులోని మత్స్య సంపద నశించిపోతోంది. ఏళ్ల తరబడి ఉప్పుటేరు ప్రక్షాళనకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో దీనికి ఆనుకుని ఉన్న మత్స్యకార కుటుంబాలు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని ఉప్పుటేరు వాసులు కోరుతున్నారు.

ఉప్పుటేరుకు రెండు వైపులా సుమారు 1400 ఎకరాల్లో ఆక్రమణలు ఉన్నాయి. వీటిని తొలగించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టినా.. ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఏటిగట్టుకు ఆనుకుని ఉన్న రొయ్యల చెరువుల్లో వాడిన మందులు, నిల్వ నీరు, చనిపోయిన రొయ్యలు నేరుగా ఉప్పుటేరులో కలుస్తుండటంతో మీనాలకు ముప్పు వాటిల్లుతోంది. ఉప్పుటేరుకు సమీపంలో ఏర్పాటు చేసిన రొయ్యల పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు దీనిలోనే కలుస్తున్నాయి. దీంతో సమస్య మరింత జటిలంగా మారుతుంది.

ప్రక్షాళన చేపట్టాం.. ఉప్పుటేరు పరిరక్షణలో భాగంగా ప్రక్షాళన చేపట్టాం. ఇప్పటికే ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఏరులోకి వ్యర్థాలు కలవకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు.

శ్రీనివాసా.. శ్రీవేంకటేశా..

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ ఆదివారం కొనసాగింది. కార్తిక మాసం, సెలవు రోజు రెండూ కలిసి రావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తుల విశేష సంఖ్యలో తరలివచ్చారు. దీంతో శ్రీవారి క్షేత్ర పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. సామాన్య భక్తులు స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో ఎదురు చూడాల్సి వచ్చింది.

ఈనాడు ఏలూరు

సోమవారం నవంబరు 10, 2025

ఎలుకలకలం!

సర్వజన ఆసుపత్రిలో హడలెత్తిస్తున్న మూషికాలు

గుత్తేదారుకు ప్రతినెలా రూ.4.68 లక్షల చెల్లింపు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో మూషికాలు హడలెత్తిస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు, గుత్తేదారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. తాజాగా ఆసుపత్రి ప్రాంగణంలోని వైద్య విద్యార్థినుల వసతి గృహంలో ఎలుకలు ఆరుగురు విద్యార్థినులను కరవడం కలకలం రేపింది. దీనిపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

హడావుడిగా.. విద్యార్థినులపై ఎలుకల దాడి విషయం తెలుసుకున్న వైద్య కళాశాల ప్రధానాచార్యురాలు సావిత్రి ఆదివారం వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. సిబ్బందితో ఎలుకల బోనులు పెట్టించారు. అక్కడక్కడా కిటికీలు, తలుపులకున్న కొన్ని రంధ్రాలు మూయించారు. సావిత్రి మాట్లాడుతూ.. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గుత్తేదారుతో గతంలో కొన్ని ర్యాట్‌మ్యాట్‌లు పెట్టించామని, మందులు పిచికారీ చేయించామని వెల్లడించారు.

కొన్నాళ్లుగా సంచరిస్తున్నా.. వైద్య కళాశాల వసతి గృహంలో కొన్నాళ్లుగా ఎలుకలు తిరుగుతున్నాయి. వీటిని కట్టడి చేయకపోవడంతో.. రాత్రివేళ నిద్రిస్తున్న విద్యార్థినులపై దాడి చేశాయి. ఈ ఘటన నేపథ్యంలో మిగతా విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత నెల నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వెయ్యి ర్యాట్ ప్యాడ్‌లు సిద్ధం చేసి ఎలుకలను కట్టడి చేయాలని గుత్తేదారుకు వైద్యాధికారులు సూచించినా, ఆచరణలో పెట్టలేదని తెలిసింది.

చర్యలు శూన్యం.. ఆసుపత్రుల్లో ఎలుకలు, ఇతర క్రిమికీటకాలను నియంత్రించేందుకు ప్రభుత్వం గుత్తేదారులను నియమించింది. సర్వజన ఆసుపత్రిలో మూషికాల నియంత్రణకు గుత్తేదారుకు ప్రతి నెలా సుమారు రూ.4.68 లక్షలు చెల్లిస్తున్నట్లు సమాచారం. గుత్తేదారు నలుగురు సిబ్బందిని నియమించుకున్నారు. వారు అరకొర పనులతో నెట్టుకొస్తున్నారు. వైద్యాధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలోనూ మాతా శిశు విభాగంలో ఓ శిశువు చేతిని ఎలుకలు కొరికాయి. మార్చురీలోని ఓ మృతదేహం కళ్లు, ముక్కు తినేసిన ఘటనలూ ఉన్నాయి.

సర్కారు దక్ష.. మొక్కవోని దీక్ష!

చెత్త వేసే ప్రాంతాల్లో పచ్చదనం పెంపకం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం పల్లెల ప్రగతిని పట్టించుకోకపోవడంతో భ్రష్టు పట్టిపోయాయి. ఏ మూలన చూసినా అపరిశుభ్ర వాతావరణమే. కూటమి అధికారం చేపట్టాక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించింది.

ప్రతి గ్రామంలో పరిసరాలు శుభ్రంగా ఉండాలన్న ఉద్దేశంతో 'చెత్త కుప్ప వద్దు- చెట్టులెంతో ముద్దు' నినాదంతో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు ఈ నెల 15 వరకు నిర్వహించాలని ఆదేశించింది.

జియో ట్యాగింగ్ చేసి.. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, కార్యదర్శులు గ్రామాల్లో చెత్త కుప్పలను తొలగించి, అక్కడ మట్టితో మెరక చేసి మొక్కలు నాటాలి. రోజూ ఎన్ని కుప్పలు గుర్తించారు, ఎన్ని తొలగించారనే వివరాలను జియో ట్యాగింగ్ చేసి పీఆర్ వన్ యాప్‌లో ఉదయం 8 గంటల్లోపు అప్‌లోడ్ చేసి, ఛాయా చిత్రాలు గ్రూప్‌లో పెట్టాలని సూచించింది. డీఎల్‌పీవోలు పనులు పర్యవేక్షణ చేయాలి.

ఇళ్ల నుంచి.. చెత్త లేని గ్రామంగా ఉంచేందుకు రోజూ హరిత రాయబారుల ద్వారా ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి నేరుగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు తరలించి వర్మీ తయారీ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. 'స్వచ్ఛ గ్రామాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ నెల 15 తర్వాత గ్రామాల్లో చెత్త కుప్పలు కనిపిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. పంచాయతీ కార్యదర్శులకు ముందస్తు నోటీసులు జారీ చేయకుండానే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం' అని జిల్లా పంచాయతీ అధికారిణి అనురాధ తెలిపారు.

నేడు జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మొంథా తుపాను నష్టాల పరిశీలనకు కేంద్రం నియమించిన పరిశీలన బృందం సోమవారం జిల్లాలో పర్యటించనుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు గన్నవరం నుంచి బయల్దేరి సాయంత్రం 4 గంటలకు ఉంగుటూరు చేరుకుంటుంది. క్షేత్రస్థాయిలో తుపాను నష్టాల పరిశీలన అనంతరం జిల్లా యంత్రాంగం చేపట్టిన పునరుద్ధరణ పనులపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన తిలకిస్తారు. 4.30 గంటలకు బయల్దేరి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం వెళ్లనున్నారు. బృందంలో కేంద్ర వ్యవసాయశాఖ సంచాలకుడు పొన్నుసామి, సెంట్రల్ వాటర్ కమిషన్ సంచాలకుడు శ్రీనివాసు బాల్రి, కేంద్ర విద్యుత్తు అథారిటీ ఉపసంచాలకుడు ఆర్తి సింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ సంచాలకుడు మనోజ్‌కుమార్ మీనా సభ్యులుగా ఉన్నారని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

నేడు యథావిధిగా మీకోసం

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'(మీ కోసం) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మండల, పురపాలక, డివిజనల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. 'మీ కోసం' వినతుల పరిష్కార స్థితి తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించవచ్చని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముడుపు గట్టి.. శ్రీకారం చుట్టి!

పాల్గొన్న ఎమ్మెల్యే చంటి దంపతులు

ఏలూరు పవరుపేట గంగానమ్మ జాతర ప్రారంభ సూచిగా.. కొలుపుల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి ముడుపు కట్టి, పందిరి రాట నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే బడేటి చంటి, మీనా దంపతులు విజయగణపతి ఆలయంలో పూజలు చేశారు. ఆపై ముడుపు తలపై పెట్టుకొని గానుగపేటలోని అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. గంగానమ్మ, పోతురాజుబాబుకు ప్రత్యేక పూజలు చేశారు. జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, మేయర్ నూర్జహాన్, పెదబాబు దంపతులు, ఆర్టీసీ ప్రాంతీయ ఛైర్మన్ అప్పలనాయుడు, కమిటీ ఛైర్మన్ పార్థసారథి పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం**

కష్టాలు దూరం.. తీరనున్న భారం!

క్లస్టర్ల వ్యవస్థ రద్దుకు ఉత్తర్వులు ● పల్లె పాలన ప్రక్షాళనకు అడుగులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంచాయతీ వ్యవస్థ ప్రక్షాళనకు నడుం కట్టింది. ఆదాయం, జనాభా ప్రాతిపదికన ప్రస్తుతం పంచాయతీలు అయిదు రకాల క్లస్టర్లు కొనసాగుతున్నాయి. ఎక్కువ కారణంగా వివిధ సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని అధిగమించేందుకు తాజాగా ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ క్లస్టర్ల వ్యవస్థను రద్దు చేస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

విభజన ఇలా..

గ్రేడ్	పంచాయతీలు	జనాభా	గ్రాంటు(రూ.)
ప్రత్యేక	15	10 వేలు	కోటికి పైగా
I	99	4-10 వేలు	50 లక్షలు
II	211	వెయ్యికి పైగా	5లక్షలకు పైగా
III	221	వెయ్యి లోపు	5 లక్షల్లోపు

పంచాయతీకో కార్యదర్శి.. పంచాయతీల్లో గ్రేడ్‌లకు ఆమోదం తెలిపిన ప్రభుత్వం.. పల్లెల్లో కొత్త పాలనకు శ్రీకారం చుట్టింది. గ్రామ కార్యదర్శులను ఇక పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారులు (పీడీవో)గా వ్యవహరిస్తారు. ప్రతి పంచాయతీకో కార్యదర్శి తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. 'క్లస్టర్ వ్యవస్థ రద్దయింది. త్వరలోనే గ్రేడ్‌ల విధానం అందుబాటులోకి రానుంది. ఇక అన్ని వేళలా సేవలు అందిస్తారని' డీపీవో అనురాధ తెలిపారు.

మూడింటికే పరిమితం.. ఉద్యోగులపై భారం తగ్గనుంది. ప్రజల చెంతకే పాలన రానుంది. ఆదాయం, జనాభా మేరకు ప్రస్తుతమున్న అయిదు రకాల పంచాయతీలను మూడింటికే పరిమితం చేయనున్నారు. కీలక రూర్బన్ పంచాయతీలు చిన్నపాటి పురపాలికలుగా మారనున్నాయి. పట్టణాలను తలపించేలా గ్రామాలు తయారు కానున్నాయి.

ఆహార శుద్ధి పరిశ్రమలకు శంకుస్థాపన రేపు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రెండు ఆహార శుద్ధి పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ద్వారకాతిరుమల మండలంలో రూ.208 కోట్లతో ఏర్పాటు కానున్న గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థకు, నూజివీడు మండలంలో రూ.110 కోట్లతో స్థాపించనున్న రమణసింగ్ గ్లోబల్ ఫుడ్ పార్కుకు సీఎం శంకుస్థాపన చేయనున్నారన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కును సైతం వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. ద్వారకాతిరుమలలో ఏర్పాటు చేసే యూనిట్ ద్వారా 366 మందికి, నూజివీడు యూనిట్ ద్వారా 1500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పట్టిసీమ పంపుల ద్వారా నీటి విడుదల

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ ఎత్తిపోతల పథకంలోని రెండు పంపుల నుంచి ఆదివారం 700 క్యూసెక్కులు ప్రాజెక్టు కుడి కాలువలోకి విడుదల చేశారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా గోదావరితోపాటు కృష్ణానదికి వరదలు భారీగా రావడంతో ఎత్తిపోతల పథకం అప్పుడప్పుడు నడిపారు. అక్టోబర్ 8న రెండు పంపులు ప్రారంభించి మొంథా తుపాను హెచ్చరికలతో అక్టోబర్ 19న నిలిపివేశారు. తాజాగా జలవనరుల శాఖాధికారుల ఆదేశాల మేరకు తిరిగి పంపులు ప్రారంభించినట్లు పర్యవేక్షణ డీఈ సురేశ్ తెలిపారు. ప్రస్తుతం గోదావరిలో నీటి మట్టం 15.60 మీటర్లు ఉందన్నారు. కుడి కాలువపై నిర్మించిన డెలివరీ సిస్టమ్ నుంచి గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువకు ప్రవహిస్తోంది.

(c) eenadu

పత్తి అమ్మకాలు బంద్

రైతులు, వ్యాపారుల మధ్య కుదరని సయోధ్య

కుక్కునూరు, న్యూస్‌టుడే: పత్తి ధరలో నష్టపోతున్నందున మద్దతు ధర కోరుతూ రైతులు ఆదివారం కుక్కునూరు పత్తి వ్యాపారులతో సమావేశమయ్యారు. సీపీఐ (ఎంఎల్ ప్రజాపంథా) మాస్‌లైన్ నాయకులు ఈ సయోధ్య చర్చలకు సారథ్యం వహించారు. మద్దతు ధర క్వింటాలుకు రూ.8,110 చెల్లించాలని రైతులు, ఎంఎల్ నాయకులు చేసిన ప్రతిపాదనను వ్యాపారులు తిరస్కరించారు. దీంతో పత్తి అమ్మకాలు నిలిపివేయాలని రైతులు తీర్మానించారు. పత్తి ధరతో పాటు పెట్టుబడుల్లోనూ వ్యాపారులు రైతులను భారీగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. పెట్టుబడులపై రూ.100కు రూ.3 వడ్డీ తీసుకుంటున్నారని, దానిని రూ.2కు తగ్గించాలని కోరారు. పురుగుమందుల ధరలు అధికంగా అమ్ముతూ, దానిపై మళ్లీ వడ్డీ వేయడం అన్యాయమన్నారు. ఇక నుంచి రైతులకు అప్పు రూపేణా పెట్టే పెట్టుబడి, పంటపై వచ్చిన సొమ్ము, పంట ధర తదితర వివరాలన్నీ ఓ నోటు పుస్తకంలో రాసి, రైతులకు ఇవ్వాలని ఎంఎల్ పార్టీ నాయకులు కోరారు. రైతులు, ఎంఎల్ పార్టీ నాయకులు చేసిన ప్రతిపాదనలను వ్యాపారులు అంగీకరించకపోవడంతో పత్తి అమ్మకాలు నిలిపివేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు ఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి గోస్ తెలిపారు.

మహిమాన్వితుడు.. వీరేశ్వరుడు!

దక్షిణకాశీగా తాడువాయి

తాడువాయి (జంగారెడ్డిగూడెం (గ్రామీణ), న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలో ఎర్రకాలువ ఒడ్డున కొలువైన శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని మహిమాన్వితుడిగా భక్తులు కొలుస్తున్నారు. జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటైన ఈ ఆలయానికి కార్తిక మాసంలో విశేషంగా భక్తులు తరలివస్తారు. ఏటా మహాశివరాత్రికి 5 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా ఆలయానికి తరలి వస్తుంటారు.

తాడువాయి భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం

ఆలయ చరిత్ర.. 11వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని రెడ్డిరాజులు పరిపాలించే కాలంలో కామవరపుకోటలో ఓ బ్రహ్మరాక్షసి ప్రజలను పీడించేది. ఆ రాక్షస పీడ విరగడ కోసం మహారాజు ఆదేశాల మేరకు ఇద్దరు బ్రాహ్మణులు కాశీ నుంచి శివలింగాన్ని తీసుకొస్తూ.. తాడువాయి సమీపంలోకి వచ్చేసరికి దాన్ని ఓ తాటి బొత్తపై ఉంచి స్నానమాచరించేందుకు వెళ్లారు. తిరిగి వచ్చి దానిని తీసుకునే ప్రయత్నం చేయగా అక్కడి నుంచి స్వామి కదలలేదు.

కార్తికం.. దర్శనీయం

రాజు కలలో స్వామివారు సాక్షాత్కరించి తాను అక్కడే కొలువై ఉంటానని, తనకు ఆలయం నిర్మించాలని చెప్పారు. తన దృష్టి కామవరపుకోట వైపు ఉంటుందని, బ్రహ్మరాక్షసిని హతమారుస్తానని చెప్పారట. శివలింగం తాటి బొత్తపై ఉండటంతో గ్రామానికి తాడువాయి అని.. కామవరపుకోటకు ఉత్తరంగా వెలిసి దక్షిణం వైపు చూస్తుండటంతో దక్షిణ కాశీగా పేరొందినట్లు పురాణాలు చెబుతున్నాయి. కాలక్రమంలో శివలింగం వెనుక వీరేశ్వరుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఇలా వెళ్లొచ్చు ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం మీదుగా తాడువాయి 70 కి.మీ. దూరంలో ఉంది. కొవ్వూరు నుంచి జంగారెడ్డిగూడెం మీదుగా 75 కి.మీ., తాడేపల్లిగూడెం నుంచి తాడువాయికి 65 కి.మీ ప్రయాణించి స్వామిని దర్శించవచ్చు. ఈ ఆలయానికి 40 కి.మీ. దూరంలో ద్వారకాతిరుమల, 20 కి.మీలో మద్ది క్షేత్రాలు ఉన్నాయి.

పేదలకు న్యాయ సహాయం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పేదలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని ఏడో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక న్యాయస్థానం ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో ఆదివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాలు, ఆపదలోని వృద్ధులు, మహిళలు, బాలలు, విభిన్న ప్రతిభావంతులకు న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయసహాయం అందజేస్తోందన్నారు. సంస్థ తరఫున ఇప్పటికే పలువురికి సాయం అందజేశామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందున్నామని పేర్కొన్నారు. ఏపీపీ నక్కా సూర్యచంద్రరావు, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

ఆదుకునేనా.. ఆదరవయ్యేనా!

- తుపానుతో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- పరిశీలనకు నేడు కేంద్ర బృందం రాక

పెదవేగి, పెదపాడు- న్యూస్‌టుడే

తుపానులు, ప్రకృతి విపత్తుల కారణంగా ఆరుగాలం కష్టించి పండించిన పంటలు అన్నదాతల చేతికందడం లేదు. ఏటా నష్టాలు ఎదురైనా, పెట్టుబడులు దక్కకున్నా.. ప్రత్యామ్నాయ ఆలోచన లేకుండా సాగు వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ ఏడాది అక్టోబరు చివరి వారంలో విరుచుకుపడిన మొంథా తుపానుతో స్వర్ణ రకం వరి పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు చేశారు.

నేలవాలిన స్వర్ణ వరి పంట కోస్తున్న కూలీలు

అత్యధికంగా ఉంగుటూరులో..

తుపాను కారణంగా ఉంగుటూరు మండలంలో అత్యధికంగా సుమారు వెయ్యి ఎకరాల్లో వరి దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. దెందులూరు 629, పెదపాడు 336, పెదవేగి 255 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు తేల్చారు. క్షేత్ర స్థాయిలో నష్ట తీవ్రత మరింత ఎక్కువే ఉందని రైతులు చెబుతున్నారు. 33 శాతం కంటే ఎక్కువ నష్టం వాటిల్లితేనే నష్టపరిహారం దక్కుతుందని అధికారులు చెబుతుండటంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఆశలన్నీ వారిపైనే..

జిల్లాలో సోమవారం కేంద్ర బృందం పర్యటిస్తున్న నేపథ్యంలో.. రైతులు ఆశలన్నీ వారిపైనే పెట్టుకున్నారు. షెడ్యూల్ ప్రకారం కేవలం అరగంట మాత్రమే పంట నష్టాన్ని పరిశీలించనున్నారు. కేంద్ర బృందం రైతులను ఆదుకొని ఆదరవుగా నిలవాలని అన్నదాతలు కోరుతున్నారు.

ముప్పు పసిగట్టేలా.. ప్రాణాలు నిలబెట్టేలా!

- హెచ్చరిక వ్యవస్థ రూపొందించిన దొడ్డిపట్ల విద్యార్థులు
- రాష్ట్ర స్థాయి వృత్తి విద్య నైపుణ్య పోటీలకు ఎంపిక

పాలకొల్లు, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేలా జిల్లా విద్యార్థులు రూపొందించిన హెచ్చరిక వ్యవస్థ నమూనా జిల్లా స్థాయి వృత్తి నైపుణ్య పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. యలమంచిలి మండలం దొడ్డిపట్ల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.కార్తీక్ మరో ఇద్దరు విద్యార్థులు కె.శ్యామ్‌కిశోర్, ఎన్.దుర్గాజగదీశ్ భాగస్వామ్యంతో ఒకేషనల్ ఉపాధ్యాయుడు డి.సంతోష్‌కుమార్ మార్గదర్శకంలో ఈ నమూనాను రూపొందించారు.

ఇలా పనిచేస్తుంది.. 'యాక్సిడెంట్ అలర్ట్ సిస్టం' పేరుతో రూపొందించిన ఈ నమూనా ప్రయాణం సురక్షితంగా కొనసాగేలా సూక్ష్మ పరిశీలన చేస్తుంది. మనకు సంబంధించిన వాహనం ఎక్కడైనా ప్రమాదానికి గురైతే దానిలో అమర్చిన సెన్సార్ ద్వారా చరవాణికి సందేశం వచ్చి అప్రమత్తం చేస్తుంది. జీపీఎస్ వ్యవస్థ ద్వారా ప్రమాదం ఎక్కడ జరిగింది, ఆ సమయంలో వాహనం ఎంత వేగంలో వెళ్తుందో కూడా తెలుసుకోవచ్చు. అదే సందేశం 108 వాహనం, సమీప ఆసుపత్రి, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేలా ఈ వ్యవస్థను రూపొందించారు. దీనివల్ల క్షతగాత్రులకు వెంటనే వైద్య సహాయం అందుతుంది.

★ చోదకుడు మద్యం తాగి ఉంటే వాహనం నిలిచిపోయేలా ఈ పరికరంలో డ్రంక్ డిటెక్టర్ అమర్చవచ్చు. వాహనం ప్రయాణంలో ఉండగా ఎక్కడైనా నిప్పు రాజుకున్నా, పొగ వెలువడుతున్నా పర్యవేక్షకులను అప్రమత్తం చేయడంతో పాటు సమీప అగ్నిమాపక కార్యాలయానికి సందేశం పంపవచ్చు. వాహనాలకు ఏ ముప్పు పొంచి ఉన్నా ఈ వ్యవస్థ ద్వారా గుర్తించి ప్రమాదాన్ని నివారించే అవకాశం ఉందని రూపకర్తలు కార్తీక్, శ్యామ్, జగదీశ్ తెలిపారు. భవిష్యత్తులో ఇంజినీరింగ్ పూర్తిచేసి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు రూపొందించడమే తమ లక్ష్యమని వీరు చెబుతున్నారు.

నమూనాతో కార్తీక్, శ్యామ్

మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వేణు

విద్యతోనే అభ్యున్నతి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సమాజంలోని అన్ని వర్గాలకు విద్యనందించడమే లక్ష్యమని పేరెంట్స్, టీచర్స్, స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వేణు అన్నారు. నగరంలో సంఘ జిల్లా స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. వేణు మాట్లాడుతూ.. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా బడులకు పంపాలని ఆయన కోరారు. అనంతరం సంఘ జిల్లా అధ్యక్షుడిగా షేక్ అసిన్, కార్యదర్శిగా ఎం.సింగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో కె.రాజ్‌కుమార్, ఎస్.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించండి: ఏపీటీఎఫ్

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిదొర

ఏలూరు విద్యావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర డిమాండ్ చేశారు. నగరంలో సంఘ జిల్లా ఉప కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు టి.రామారావు అధ్యక్షత వహించారు. రెడ్డిదొర మాట్లాడుతూ.. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. అపరిష్కృత 3 డీఏలు విడుదల చేయాలని కోరారు. రామారావు మాట్లాడుతూ.. మూడేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సంపాదిత సెలవుల నగదును వెంటనే మంజూరు చేయాలన్నారు. హైస్కూల్ ప్లస్‌ల్లో ఖాళీగా ఉన్న పీజీటీ కొలువులు భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. జడ్పీ పీఎఫ్ ఖాతాలు ఆన్‌లైన్ చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘ నాయకులు నరసింహరాజు, జేఎస్ శాస్త్రి, ఎస్.దొరబాబు, జేపీ నారాయణ, రమాదేవి, వి.గణేశ్, ఎస్‌కే రంగావలి తదితరులు పాల్గొన్నారు.

క్షీర మథనం లేదు.. సిరి రాలేదు..

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరంలో రూ.లక్షల వ్యయంతో 15 సంవత్సరాల కిందట ప్రారంభించిన గోదావరి మిల్క్‌గ్రిడ్ పాలశీతలీకరణ కేంద్రం పర్యవేక్షణ లోపంతో రెండేళ్లకే మూతపడింది. దీంతో అందులోని పాల ట్యాంకర్, జనరేటర్, తదితర పరికరాలు తప్పుపడుతున్నాయి. 2008లో డీఆర్డీఏ, ఐకేపీ, డైరీడెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్, పశుసంవర్ధకశాఖల పర్యవేక్షణలో కేంద్రానికి రూ.25 లక్షల చొప్పున ఖర్చు చేసి జిల్లాలో పలు చోట్ల వీటిని నిర్మించి ఐకేపీ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. పాలసేకరణ కోసం మహిళా గ్రూపులు ఏర్పాటు చేసి వారికి పరికరాలు అందజేశారు. కేంద్రాలకు వచ్చిన పాలు పాలశీతలీకరణ కేంద్రానికి తీసుకెళ్లేందుకు ఆటోలు ఏర్పాటు చేశారు. మహిళలు నిలదొక్కుకునే వరకు నిర్వహణ కోసం మరో రూ.5లక్షలు అందజేశారు. నిర్వహణ కోసం ఇచ్చిన నిధులు అయిపోవడంతో 2010 నాటికి కేంద్రం మూతపడింది. గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని రైతులు కేంద్రాలకు పాల సరఫరా నిలిపివేశారు. సంవత్సరాల తరబడి విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడంతో ఆ శాఖ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్లారు. చివరకు ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనం, కొద్ది పాటి సామగ్రి మిగిలాయి. ప్రస్తుతం అవి కూడా తుప్పుపట్టి మట్టిలో కలిసిపోయేలా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

పోలవరంలో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్ర భవనం

ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఏపీ రైతు సంఘం జిల్లా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంఘం జిల్లా మహాసభలు శనివారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా సిరిత్తుల సీతారామయ్య, కోర్స జలపాలు, జిల్లా సహాయ కార్యదర్శులుగా బొడ్డు రాంబాబు, కోన శ్రీనివాసరావు మరో 18తో నూతన కమిటీ ఎన్నికైంది.

పోలవరం నిర్వాసితుల సమస్యకు పరిష్కారం

జాబ్ కార్డులు చూపుతున్న ఉపాధి శ్రామికులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితులకు ఉపాధి హామీ జాబ్ కార్డుల జారీలో నెలకొన్న సమస్యను పరిష్కరించినట్లు ఎంపీ మహేశ్ కుమార్ తెలిపారు. ముంపు మండలాల నుంచి ఆర్ అండ్ ఆర్ కాలనీలు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన నిర్వాసితులకు జాబ్ కార్డులు జారీ చేయడం లేదన్న విషయం ఇటీవల తన దృష్టికొచ్చినట్లు చెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపినట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వివిధ వేషధారణల్లో చిన్నారులు

హేలాపురి బాలల సంబరాలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: హేలాపురి బాలోత్సవంలో భాగంగా స్థానిక జేవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం తొలి దశ బాలల సంబరాలు నిర్వహించారు. ఆధునిక వస్త్రధారణ, చిత్రలేఖనం, పద్యాలు తదితరాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. మిగతా కార్యక్రమాలను వచ్చే నెల 12, 13 తేదీల్లో స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తొలి దశ పోటీలను ఎ.నిర్మల, ఎ.నాగేశ్వరరావు, అజయ్‌బాబు తదితరులు పర్యవేక్షించారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలు నడుపుతున్న చోదకులకు ఈ-చలానాలు విధించారు. పలువురు వాహనదారులకు శ్వాస నిర్ధారణ పరీక్షలు చేసి, మద్యం తాగిన వారిపై కేసులు నమోదు చేశారు.

చోదకుడికి శ్వాస నిర్ధారణ పరీక్ష చేస్తున్న పోలీసులు

బలి తీసుకున్న బతుకుదెరువు

రెండు కుటుంబాల్లో విషాదం నింపిన విద్యుదాఘాతం

గండేపల్లి, తణుకు, న్యూస్‌టుడే: చేతికందొచ్చిన ఏకైక కుమారుడు కుటుంబాన్ని ఆదుకుంటాడనుకునేలోపే ఇక లేడనే వార్త ఆ కుటుంబాన్ని అంతులేని విషాదంలో ముంచింది. జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్న నేపథ్యంలో ఇంటి యజమాని ఇక తిరిగి రాడనే సమాచారంతో మరో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఇరగవరం మండలం రాపాకలో కొడుకును, పేకేరులో ఇంటి యజమానిని కోల్పోయి రెండు కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన కరిపెట్టి సింహాద్రి అప్పన్న (53) వరి కోత యంత్రాలతో పలు ప్రాంతాల్లో కోతలకు వెళ్తూ జీవనం సాగిస్తుంటారు. అదే మండలానికి చెందిన గెడ్డం సందీప్ (20) కొద్ది నెలల నుంచి సింహాద్రి వద్ద వరి కోత యంత్రం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా పరిసర ప్రాంతాల్లో వరి కోతలకు బయలుదేరారు. గండేపల్లి మండలం రామయ్యపాలెం వద్ద వాహనానికి విద్యుత్తు తీగలు అడ్డు వస్తున్నాయని వాటిని తప్పించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందిన హృదయవిదారకర ఘటన చూపరుల్ని కలచివేసింది.

సింహాద్రి అప్పన్న, సందీప్ (పాత చిత్రాలు)

పెద్ద దిక్కు కోల్పోయి..

సింహాద్రి అప్పన్నకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు అమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. చిన్న కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నారు. కుమారుల్ని పెళ్లి చేయాల్సిన తండ్రి ఇక రారని తెలుసుకొని తమను ఎవరు పట్టించుకుంటారని కుటుంబ సభ్యులు బోరుమంటున్నారు.

అందొచ్చాడనుకుంటే అందనంత లోకాలకు..

సందీప్‌కు నాన్న లాజరు, అమ్మ ప్రేమలత, ఇద్దరు అక్కలు ఉన్నారు. పెద్ద అక్కకు వివాహం కాగా, మరో అక్క డిగ్రీ చదువుతోంది. నాన్న స్థానికంగా వ్యవసాయ పనులు చేస్తుండగా, అమ్మ ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లారు. సందీప్ పదో తరగతి అనంతరం చదువు మానేసి డ్రైవర్‌గా చేరాడు. రెండు రోజుల కిందటే తామందరితో స్నేహితుడి జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆనందంగా గడిపాడని, ఆ క్షణాలు మరువక ముందే తమను విడిచి వెళ్లాడంటూ మిత్రులు కుమిలిపోతున్నారు. ఏకైక వారసుడు తిరిగిరాని లోకాలకు చేరుకొని తమను దిక్కులేనివారిని చేశాడంటూ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటున్నారు. తమ్ముడు లేడనే విషయాన్ని జీర్ణించుకోలేక అక్కలిద్దరూ తల్లడిల్లిపోతున్నారు.

శోకసంద్రంలో గ్రామాలు

కొడుకును కోల్పోయి ఓ కుటుంబం, తండ్రిని దూరం చేసుకొని మరో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆదివారం ఉదయం వారి మరణ వార్త వినగానే ఆయా గ్రామాలు శోకసంద్రంలో మునిగాయి. ఉభయ కుటుంబీకులు గుండెలు పగిలేలా రోదిస్తున్న తీరు చూసి ఆయా గ్రామస్థులు, స్నేహితులు, కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు.

డిస్పోజబుల్ సామగ్రి గదిలో అగ్ని ప్రమాదం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఓ ఇంట్లో నిల్వ ఉంచిన సరకు ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతైన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక పొట్టి శ్రీరాముల విగ్రహం సమీపంలో శంకర్ అనే వ్యక్తి కొద్ది కాలంగా డిస్పోజబుల్స్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. అయితే దుకాణం సమీపంలోని కొంకిమళ్ల రాజ్‌కుమార్‌కు చెందిన ఇంట్లో అద్దెకు ఉంటూ.. అదే భవనంలోని కింద అంతస్తులో కొంత భాగాన్ని పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ఇతర డిస్పోజబుల్స్ సామగ్రిని భద్రపరిచే గోడౌన్‌గా వినియోగిస్తున్నారు. అయితే ఆదివారం సాయంత్రం సామగ్రి నిల్వ చేసిన గది నుంచి పొగ రావడాన్ని అటుగా వెళ్తున్న ఫాజిల్ అనే వ్యక్తితో పాటు పలు దుకాణదారులు గుర్తించారు. వెంటనే వారంతా పైకి వెళ్లి చూడగా.. సామగ్రికి మంటలు అంటుకోవడాన్ని గుర్తించి ప్లాస్టిక్ గొట్టం సహాయంతో నీటిని చల్లి మంటలను ఆర్పేందుకు యత్నించారు. అయినా అదుపు కాకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న సిబ్బంది సుమారు 3 గంటలకు పైగా శ్రమించి మంటలు అదుపు చేశారు. అలాగే ఘటనా ప్రదేశానికి సీఐ సుభాష్, ఎస్సై వీరప్రసాద్ చేరుకుని స్థానిక యువకుల సహాయంతో గోడౌన్‌లో నిల్వ చేసిన సామాన్లను కిందకు పడేశారు. సరకు నిల్వ చేసిన గదిలో నుంచి మంటలు ఎగసి పడటం, దట్టమైన పొగ రావడంతో ఆ భవనంలో ఉంటున్న పలు కుటుంబాల వారు భయంతో బయటకు పరుగులు తీశారు. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తినష్టం ఉంటుందని, విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయా.. లేక మరేదైనా కారణం ఉందా.. అనేది తెలియాల్సి ఉందని అగ్నిమాపక అధికారి జి.అబ్రహం తెలిపారు.

కిటికీ నుంచి వెలువడుతున్న పొగ

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీనివాస గ్రూప్ VJA ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంట బేబి కేర్‌కు వర్కర్లు కావలెను. భో+వ+జీతం ✆ 92814 52843, 92814 52827

రామకృష్ణ గ్రూప్ Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవకు, ఇంటిపని, వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+వ+ జీతం 16- 18K ✆ 9705297788, 9515108830.

జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట రోడ్‌లో గల ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షోరూం నందు పనిచేయుటకు బాయ్స్(హెల్పర్స్), సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ESI + PF కలదు. Contact: 93923 99545, 99895 30260.

TO LET

COMMERCIAL

TO.LET
విద్యా సంస్థలకు, ఆఫీసులకు
12000 వేలు చ॥అ కమర్షియల్ స్పేసు అద్దెకు ఇవ్వబడును.
దాసరి కమర్షియల్ కాంప్లెక్సు
జె.పి.రోడ్,భీమవరం-2
94408 70986
94403 56099

SECOND SALE

24 గుమ్మములు, 55 కిటికీలు, జోర్నాలతో సహా (10 సం॥ముల పాతవి) అమ్మబడును. Contact: ✆ 94408 70986, 94403 56099.

JOBS

Kakatiya Constructions Hiring now! Inviting Applications for Project Manager (Min 8-10 Yrs Exp.) and Junior Engineers (0-3yrs Exp.) Qualification Polytechnic/ B.Tech Civil / Degree. Mail: hrkakatiyaconshyd@gmail.com. ✆ 79813 18373.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.00 పై॥

తణుకు ఆఫీసు: 08819-224254

తమ్మిలేరులో చేపల వేటకు వెళ్లి మృతి

చింతలపూడి, న్యూస్‌టుడే: తమ్మిలేరు జలాశయంలో చేపలు పట్టేందుకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ముసునూరు మండలం లోపూడి గ్రామానికి చెందిన బొల్లికొండ కేశవులు(55) శనివారం జలాశయంలో చేపలు పట్టేందుకు మరో వ్యక్తి చెన్నారావుతో కలిసి వచ్చారు. చేపలు పడుతుండగా.. ప్రమాదవశత్తూ కేశవులు నీటిలో జారి పడిపోయారు. ఆయన్ను చెన్నారావు వెంటనే బయటకు లాగినా.. నోటి, ముక్కు ద్వారా నీరు శరీరంలోకి వెళ్లడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శవపరీక్షకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కేశవులు (పాతచిత్రం)

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

ట్రాక్టర్ ట్రక్కును ఢీకొన్న కారు.. వృద్ధుడి దుర్మరణం

వేంసూరు, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ట్రాక్టర్ ట్రక్కును కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఖమ్మం జిల్లా వేంసూరు మండలం లింగపాలెం వద్ద శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఏలూరు జిల్లా పెద్దపాడు మండలం ఏపూరు గ్రామానికి చెందిన బెజవాడ వెంకటేశ్వరరావు(60), అతని భార్య సావిత్రి, వదిన జయమ్మ, కుమారుడు అజయ్, మరో పాపతో కలిసి కారులో సత్తుపల్లి మండలం బేతుపల్లిలోని ఓ శుభకార్యంలో శనివారం ఉదయం పాల్గొన్నారు. అనంతరం భద్రాచలం వెళ్లి దైవ దర్శనం తర్వాత స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యలో లింగపాలెం వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ట్రాక్టర్ ట్రక్కును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. కారులోని నలుగురికి స్వల్ప గాయాలవగా సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. హెడ్ కానిస్టేబుల్ జి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదానికి గురైన కారు

చీటీల పేరుతో మోసం చేశాడంటూ ఆందోళన

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలోని తూర్పుపేటకు చెందిన చంటి అనే వ్యక్తి తమను చీటీల వ్యాపారం పేరుతో మోసం చేశాడంటూ పలువురు బాధితులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. సంవత్సరాలుగా తమకు ఇవ్వాల్సిన సొమ్ము ఇవ్వకుండా ముఖం చాటేస్తున్నాడని వాపోయారు. డ్వాక్రా రుణాలు తీసుకుని మరీ అతనికి ఇచ్చామని కొందరు, బయట నుంచి అప్పులు తెచ్చి మరీ చీటీల సొమ్ములు కట్టామని మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.10 కోట్లు వరకు దాదాపు చాలా మందికి ఇవ్వాలని, స్థానిక చేపలపేటలోని చీటీల నిర్వాహకుడికి చెందిన పొలంలో నిరసన తెలుపుతూ ఆరోపించారు. పొలం అమ్ముతున్నారని తెలిసి ఇక్కడకు వచ్చి నిరసన చేపట్టామని రౌతు శ్రీను అనే బాధితుడు తెలిపారు. తమ సొమ్ము తమకు ఇప్పించాలని వారు వేడుకున్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

ఖాతాలిస్తున్నారు.. ఖాళీ చేస్తున్నారు

అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లకు సహకారం

పట్టుబడిన వారిలో ఉమ్మడి జిల్లా వాసులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

అంతర్జాతీయ సైబర్ మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలిచ్చి సహకరిస్తున్నవారి జాబితాలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలువురి పేర్లు వెలుగు చూడడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ విధంగా ప్రత్యక్ష, పరోక్షంగా సహకరిస్తున్న 10 మందిని విశాఖ జిల్లా ఎండాడ సైబర్ క్రైం పోలీసులు ఈ నెల 7న అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన అయిదుగురు వ్యక్తులు ఉండడం ఆందోళన కలిగించగా తాజాగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో 84 మందిని పట్టుకోగా వారిలో కూడా జిల్లాకు చెందిన ఇద్దరు ఉండడంపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఇలాంటి కేసుల్లో దొరికినవారిలో నరసాపురం, మొగల్తూరు, కొవ్వలి, పెదఅమిరం, భీమవరం ప్రాంతాలకు చెందినవారి పేర్లు ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

స్థానికుల సహకారంతోనే..

స్థానికులు కొందరు సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలిచ్చి సహకరించడంతోనే సైబర్ నేరాలు కొనసాగుతున్నాయనేది పలువురి ఆరోపణ. ప్రస్తుతం పట్టుబడిన ఘటనలే దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎండాడకు చెందిన వ్యక్తికి వ్యాపార పెట్టుబడి పేరుతో వలపన్ని రూ.89 లక్షలు కాజేయగా బాధితుడు 1930 నంబరుకు కాల్ చేయడంతోపాటు ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడు ఇచ్చిన డేటా ఆధారంగా నగదు మొత్తం పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాకు చెందిన కొందరు వ్యక్తుల నుంచి ఇతర రాష్ట్రాల్లో ఉన్న కొంతమంది కరెంట్ ఖాతాలకు చేరింది. ఆపై క్రిప్టో కరెన్సీలోకి మారి నేరగాళ్లకు చేరుతోందని పోలీసు విచారణలో వెల్లడైంది. తాము ఇచ్చిన బ్యాంకు ఖాతా నంబర్లతో అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్నామనేది కొందరికి తెలియడం లేదనే వాదనలున్నాయి. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు పట్టుబడిన వారిలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సతీష్‌బాబు, సతీష్‌కుమార్ పేర్లు ఉన్నాయనే సమాచారంతో వారి సమగ్ర వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఇదే తీరులో బ్యాంకు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లకు నగదు చేరిన కొన్ని ఖాతాలను కేరళ పోలీసులు పరిశీలించగా ఆ కరెంట్ ఖాతాలు జిల్లాలోని పోడూరు, శివదేవుని చిక్కాల ప్రాంతాలకు చెందినవని తేలడంతో కేరళ పోలీసు బృందం ఇటీవల ఇక్కడికి వచ్చి విచారణ చేసి వెళ్లినట్లు తెలిసింది.

క్షీరారామంలో దెబ్బతిన్న ప్రహరీ

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో పడమర వైపు ఉన్న ప్రదక్షిణ మండపం సమీపాన పురాతన ప్రహరీలో వెలుపలి వైపు కొంత భాగం ఇటీవల వర్షాలకు దెబ్బతింది. ఆ భాగాన్ని ఆలయ ఛైర్మన్ మీసాల రామచంద్రరావు (రాము), ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులకు, పురావస్తుశాఖకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. కార్తికమాసం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నందున గోడ దెబ్బతిన్న ప్రాంతంలోకి ఎవరూ వెళ్లకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

(c) eenadu

ఏలూరు

• ఏలూరు • దెందులూరు • ఉంగుటూరు

చదరంగంతో మేధా శక్తి పెంపు

జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు చూపుతున్న విజేతలు

దెందులూరు, న్యూస్‌టుడే: చదరంగంతో మేధా శక్తి పెంపొందించుకోవచ్చని ప్రధానాచార్యుడు నతానియేలు అన్నారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ఆదివారం జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇటు చదువు, అటు క్రీడల్లో రాణించాలన్నారు. తద్వారా క్రీడా కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగాలు సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జి.యోహాన్, రాజేశ్, ఆది తదితరులు పర్యవేక్షించారు.

రెజ్లింగ్ పోటీలో రజతం

దెందులూరు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలో దెందులూరు మండలం మేదినరావుపాలెం విద్యార్థి బి.హిమ వంశీకృష్ణ రజత పతకం సాధించాడు. విద్యార్థి, వ్యాయామోపాధ్యాయుడు రవిబాబును ప్రధానోపాధ్యాయుడు సురేశ్‌కుమార్, పరిశీలకుడు రమేశ్ ఆదివారం అభినందించారు. వారు మాట్లాడుతూ.. నిరంతర సాధన, క్రమశిక్షణ, ఏకాగ్రతతో ఏ రంగంలోనైనా రాణించవచ్చని తెలిపారు.

ఏటా గుండె పరీక్షలు తప్పనిసరి

వైద్యులను సన్మానిస్తున్న వైఎంహెచ్‌ఏ సభ్యులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఏటా గుండె పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని గుండె వైద్యుడు రితేశ్ అన్నారు. స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో హిందూ యువజన సంఘం ఆధ్వర్యాన విజయ హాస్పిటల్స్ రితేశ్ కేర్ సహకారంతో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు జి.తేజస్వి, రాంబాబుతో కలిసి నగరవాసులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం వైద్యులను కమిటీ సభ్యులు సన్మానించారు. సోమలింగేశ్వరరావు, ముద్దు కృష్ణ, కె.వి.సత్యనారాయణ, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు గ్రామీణ: స్థానిక పంపుల చెరువు రోడ్డులో నారాయణ దత్త ఎడ్యుకేషన్ సొసైటీ సహకారంతో ఆశ్రం ఆసుపత్రి ఆధ్వర్యాన ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రం ఆసుపత్రి వైద్యులు పాల్గొని సుమారు 400 మందికి మధుమేహం, రక్తపోటు, కంటి, ఈసీజీ, ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ స్కాన్, మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ తదితర పరీక్షలు చేశారు. సొసైటీ అధ్యక్షుడు వీరంకి త్రినాథరావు పర్యవేక్షించారు. ఆర్టీసీ విజయవాడ ప్రాంతీయ ఛైర్మన్ అప్పలనాయుడు, నాయకులు పండు, విజయ్, ఈశ్వరి బలరామ్, శివశంకర్ సహకారం అందించారు.

11న కైకరంలో.. ఉంగుటూరు: కైకరంలోని ఈ నెల 11న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రాంతీయ ఛైర్మన్ పుప్పాల గోపి, మండలాధ్యక్షుడు కోనే వీర వెంకట సత్యనారాయణ తెలిపారు.

మాసూళ్లు.. ఏర్పాట్లు!

ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ చర్యలు

భీమడోలు, న్యూస్‌టుడే: ఖరీఫ్ సాగు మాసూళ్లు మొదలవుతున్నాయి. ఈ దఫా పంట బాగా పడింది. అధిక దిగుబడులొస్తాయని రైతాంగం భావించింది. చివర్లో మొంథా తుపాను అన్నదాతల వెన్నువిరిచింది. స్వర్ణ రకం వరి చేలు నేలకొరిగాయి. ఈ ప్రభావం దిగుబడిపై పడింది. ఎకరాకు సగటున పది బస్తాల ధాన్యం గింజలు రాలిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ వరి కోతలు మొదలవడంతో.. ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సిద్ధమయ్యారు. క్లస్టర్ విధానంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించారు. ఆయా గ్రామాల్లోని ఆర్ఎస్‌కేల్లో కేంద్రాలు తెరుస్తున్నారు.

ఇబ్బందులు పడకుండా.. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ధాన్యం తేమ 17 శాతం వరకు తీసుకుంటారు. రాళ్లు, తాలు గింజలు, ఇతరత్రా వ్యర్థాలు అయిదు శాతం వరకు అనుమతిస్తారు. ప్రస్తుత ఖరీఫ్‌నకు వరి మద్దతు ధర క్వింటా ఏ గ్రేడు రకానికి రూ.2,389, సాధారణానికి రూ.2,369 చెల్లించనున్నారు.

నియోజకవర్గ వివరాలిలా..

మండలం	సాగు విస్తీర్ణం	ఆర్ఎస్‌కేలు	దిగుబడి అంచనా (75 కిలోల బస్తాలు)
భీమడోలు	12,843	12	9,63,225
ఉంగుటూరు	24,440	23	18,33,000
నిడమర్రు	3,388	12	25,54,100
గణపవరం	11,700	14	8,77,500

ఎకరాకు 40 బస్తాలు.. ఖరీఫ్‌లో ఉంగుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 52,371 ఎకరాల్లో వరి సాగైంది. సగటున ఎకరాకు 40 బస్తాల(75 కిలోల) చొప్పున 62 లక్షల బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. 'ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందుల్లేకుండా ఆర్ఎస్‌కేల్లో విస్తృత ఏర్పాట్లు చేశాం. నాణ్యమైన గోనె సంచులు అందుబాటులో ఉంచాం. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంట నూర్పిడులు రైతులు చేసుకోవాలి' అని భీమడోలు ఏడీఏ సీహెచ్ ఉషారాజకుమారి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణ:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ? ఏలూరు పాత బస్టాండ్ నుంచి తూర్పులాకుల వరకున్న రోడ్డు అధ్వానంగా మారింది. దారంతా గుంతలమయం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. - వి.లలిత, జి.గాంధీ, క్రొవ్విడి

✔ రహదారి మరమ్మతుకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం - శేషుకుమార్, ర.భ.శా. ఏఈ

చెరువు పరిసరాలు శుభ్రం

ఈనాడు స్పందన

పెదపాడు, న్యూస్‌టుడే: పెదపాడు సబ్‌బజార్ దగ్గరున్న కొర్లమకుంట చెరువు పరిసరాలను ఆదివారం శుభ్రం చేశారు. 'నీరు నిలిచిపోయి.. రంగుమారిపోయి' శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ చల్లారు. చెరువులో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయించినట్లు ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి డి.వివేక్‌కుమార్ తెలిపారు.

పిచ్చిమొక్కల తొలగింపు.. పెదవేగి: వంగూరులో రోడ్డు పక్కన విద్యుత్తు స్తంభానికి అల్లుకుపోయిన పిచ్చిమొక్కలను సిబ్బంది ఎట్టకేలకు తొలగించారు. 'తీగలకు అల్లుకొని.. నిర్లక్ష్యం కమ్ముకొని' శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి విద్యుత్తు అధికారులు స్పందించారు. లైన్‌మ్యాన్ జె.మహేశ్ ఆధ్వర్యంలో స్తంభానికి అల్లుకున్న తీగలు తొలగింపజేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

✹ గుంతమయమైన వంగాయగూడెం రోడ్డును ఎప్పటిలానే పొక్లెయిన్‌తో చదును చేసి వదిలేశారు. ఈ మార్గం ఏళ్లుగా మరమ్మతులకే తప్ప రహదారి నిర్మాణానికి నోచుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చదును చేసేయ్.. ఎంచక్కా వదిలేయ్!

ఏళ్లుగా పూర్తవ్వని రహదారుల నిర్మాణాలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఛిద్రమైన రహదారులను మరమ్మతుల పేరిట యంత్రాలతో చదును చేస్తున్నారే తప్ప అభివృద్ధి మాత్రం చేయట్లేదు. పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయకపోవడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్‌డీబీ నిధుల రూ.కోట్లతో ఉమ్మడి జిల్లాలోని 11 రహదారుల అభివృద్ధి పనులను అయిదేళ్ల క్రితం చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో వీటిని ప్రారంభించింది.

సకాలంలో చెల్లించక.. కూటమి అధికారంలోకి వచ్చాక రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఏలూరు నుంచి కొత్తూరు మీదుగా వంగాయగూడెం వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. పెదపాడు నుంచి కొత్తూరు వరకు నల్ల మెటల్ వేసి వదిలేశారు. గుత్తేదారుకు రావాల్సిన రూ.కోట్ల బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. అయిదేళ్లయినా కొత్తూరు నుంచి వంగాయగూడెం వరకు పనులు చేపట్టలేదు. ర.భ.శా. ఏఈ శేషుకుమార్‌ను వివరణ కోరగా.. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చదును చేయిస్తున్నామని చెప్పారు.

కాపుల సంక్షేమానికి కృషి

ధర్మరాజును సత్కరిస్తున్న నాయకులు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: కాపుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నారాయణపురంలోని శ్రీరామ భక్తాంజనేయ కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తిక వన సమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్తిక వన సమారాధనతో ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. ఈ ఒరవడిని కొనసాగించాలని ఆయన సూచించారు. కాపులంతా ఐకమత్యంగా ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పిలుపునిచ్చారు. అంతకుముందు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. సంఘ నాయకులు అడపా శ్రీనివాసరావు, సూర్నీడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలపై నిర్లక్ష్యం తగదు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలపై నిర్లక్ష్యం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.లెనిన్ అన్నారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల వసతి గృహంలో నిద్రిస్తున్న విద్యార్థినులను ఎలుకలు దాడి చేయడం దారుణమన్నారు. వసతి గృహ నిర్వహణలో నెలకొన్న వైఫల్యానికి ఈ ఘటన నిదర్శనమన్నారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. వసతి గృహంలోని సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు డి.నాగేంద్రబాబు, కమిటీ సభ్యులు ఎం.శివ, ఎం.జయంత్, పి.నాని తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అత్యాధునిక వైద్య సేవలు

చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పేదలకు అత్యాధునిక వైద్య సేవలందిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల విడిది కార్యాలయంలో ఆయన ఆదివారం పలువురిని కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు అందజేశారు. చింతమనేని మాట్లాడుతూ.. ప్రాధాన్య క్రమంలో బాధితుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని ద్వారా మహిళా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు.

నరకప్రాయం.. వంతెన కింద ప్రయాణం!

ప్రమాదాల బారిన వాహనదారులు

పవరుపేట కింది వారధి వద్ద దెబ్బతిన్న రోడ్డు

పవరుపేట(ఏలూరు అర్బన్), న్యూస్‌టుడే: నగర నడిబొడ్డున ఉన్న పవరుపేట కింది వంతెన మీదుగా ప్రయాణం నరకప్రాయంగా మారింది. రాజీవ్ స్నేహవారధిగా పిలుస్తున్న కింది వంతెనలో నిత్యం భూగర్భం నుంచి నీళ్లు ఊరుతుంటాయి. ఈ జలాలను బయటకు తోడేందుకు రూ.వేలు వెచ్చించి మోటార్లు ఏర్పాటు చేశారు. అయినా, నీటి ఊట వంతెనలోకి చేరుతూనే ఉంటోంది. ఈ నీటిని ఏరోజుకారోజు దాటుకుని వంతెనపైకి చేరుకునే వాహన చోదకులకు పెద్దపాటి గోతులు సవాల్ విసురుతున్నాయి.

విభాజకాల ఏర్పాటుతో.. వారధి పైభాగాన ట్రాఫిక్ పోలీసులు విభాజకాలు ఏర్పాటు చేయడంతో దారి బాగా కుచించుకుపోయింది. ఈ చిన్నపాటి మార్గాన్ని దాటుకొని వెళ్లేందుకు చోదకులు అవస్థలు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయపడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. లోతట్టు వంతెన వద్ద రహదారికి మరమ్మతులు చేయిస్తామని కమిషనరు భానుప్రతాప్ తెలిపారు.

దివ్యాంగుల అభ్యున్నతికి పెద్దపీట

సరకులు ఇస్తున్న పత్సమట్ల, గన్ని

గుండుగొలను(భీమడోలు), న్యూస్‌టుడే: దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గుండుగొలనులోని శ్రీవిశ్వేశ్వర దివ్యాంగుల సేవా సమితి భవనంలో సుమారు 60 మంది దివ్యాంగులకు ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు సమకూర్చిన పండ్లు, సన్న బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం శ్రీవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్తిక వనసమారాధనలో వారు పాల్గొన్నారు. సొసైటీ అధ్యక్షుడు కొండబాబు, మదన్, పెద్దిరాజు, సీతారామరాజు, శ్యామలరాజు, శ్రీను, సోములు, గంగరాజు, రవి పాల్గొన్నారు.

ఉంగుటూరు: తెదేపా కార్యకర్తలే వెన్నెముక అని ఆప్కాబ్ ఛైర్మన్ వీరాంజనేయులు అన్నారు. నారాయణపురంలో పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన కార్తిక వనసమారాధనలో ఆయన మాట్లాడారు. తెదేపా మండలాధ్యక్షుడు సుధీర్, సర్పంచి అలకనంద, నాయకులున్నారు.

తంగెళ్లమూడి.. సమస్యల జడి!

ఏలూరు నగరం తంగెళ్లమూడి కండ్రిగగూడెం కూడలి నుంచి బీడీ కాలనీకెళ్లే ప్రధాన రహదారికిరువైపులా మురుగు కాలువలు నిర్మించలేదు. ఫలితంగా ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగు రోడ్డుపైకి చేరుతోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు

నడవాలా.. జారి పడాలా!

పెదవేగి మండలం వంగూరులో పేదల కాలనీకెళ్లే రహదారి బురదమయంగా మారింది. చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారడంతో.. వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు సాగించలేక పోతున్నారు. ఈ దారిలో నడవలేక పాదచారులు జారి పడిపోతున్నారు. పలువురు ఆసుపత్రులకెళ్లిన ఘటనలూ ఉన్నాయి. - న్యూస్‌టుడే, పెదవేగి

కుక్కలున్నాయ్.. కరుస్తున్నాయ్

గణపవరంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామ వీధుల్లో గుంపులుగా తిరుగుతూ.. వృద్ధులు, పిల్లలపై దాడులు చేస్తున్నాయి. రాత్రివేళ బస్టాండ్ నుంచి ఇంటికెళ్లే వారి వెంటపడి పరుగులు పెట్టిస్తున్నాయి. కుక్కల సంఖ్య పెరగకుండా సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయిస్తామని ఈవో ప్రసాద్ తెలిపారు. - న్యూస్‌టుడే, గణపవరం

రేవుల్లేవు.. తిప్పలు తప్పవు!

భీమడోలు మండలం సూరప్పగూడెం పంచాయతీ పాతూరు వద్ద ఏలూరు కాలువ వెంబడి రేవుల్లేక కొతకు గురవుతోంది. ప్రస్తుత కార్తిక మాసంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు స్థానికులు ప్రమాదకరంగా కాలువలోకి దిగుతున్నారు. దాతల సాయంతో రేవుల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ధర్మరాజు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, భీమడోలు

మురుగు.. శుభ్రత కనుమరుగు

నిడమర్రు మండలం పత్తేపురం జడ్పీ ఉన్నత పాఠశాల సమీప ప్రధాన కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్లాస్టిక్, చెత్తాచెదారం రోజుల తరబడి ముందుకెళ్లకపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెంది విజృంభిస్తుండటంతో విద్యార్థులు, స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. - న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం

తాగొద్దన్నందుకు ఆత్మహత్య

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పెదవేగి మండలం ముండూరు పంచాయతీ వెంగంపాలేనికి చెందిన చలపాటి వెంకటేశ్వరరావు(55) ఏలూరు రైతుబజారులో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన్ను నెల కిందట కుక్క కరిసింది. ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న వెంకటేశ్వరరావు.. రోజూ మద్యం తాగుతుండటంతో భార్య మందలించింది. మనస్తాపానికి గురైన ఆయన.. మందు తాగారు. కుటుంబ సభ్యులు అప్రమత్తమై ఏలూరు సర్వజన ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కె.ఫల్గుణ తెలిపారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. ఏలూరు నేరవార్తలు: స్థానిక కుమ్మరిరేవుకు చెందిన కృష్ణ, అతడి స్నేహితుడు రాజు ఆదివారం ద్విచక్ర వాహనంపై కెనాల్ రోడ్డు దాటి వసంత మహల్ కూడలిలో మలుపు తిరుగుతున్నారు. వారిని మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో చోదకులిద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో సర్వజన ఆసుపత్రికి తరలించారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	ది గర్ల్‌ఫ్రెండ్
అంబిక మినీ	ప్రిడేటర్ బ్యాండ్‌ల్యాండ్స్
సాయిబాలాజీ	తెలుసు కదా
బాలాజీ	కృష్ణలీల
సత్యనారాయణ స్క్రీన్ 1	ధామా
సత్యనారాయణ స్క్రీన్ 2	డ్యూడ్
సత్యనారాయణ స్క్రీన్ 3	మాస్ జాతర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	జటాధర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	కర్మణ్యే వాధికారస్తే
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	మాస్ జాతర
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	ప్రిడేటర్ బ్యాండ్‌ల్యాండ్స్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	జటాధర
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో

చోదకులపై కేసులు

పెదపాడు: కలపర్రు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కట్టా శారదా సతీశ్ తెలిపారు.

జూద స్థావరాలపై దాడి.. పెదవేగి(పెదపాడు): పెదవేగి ఎమ్మార్పీ కాలనీలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని.. వారి వద్ద నుంచి రూ.7,150 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.

నిడమర్రు గ్రామీణం: చానమిల్లిలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఎనిమిది మందిని జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.64,000 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

మమ్మేలు రాట్నాలమ్మ

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పెదవేగి మండలం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు చేసి.. పట్టువస్త్రాలు, ఆభరణాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులు రాట్నాలమ్మను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. పూజా ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయంతో రూ.1,02,235 ఆదాయం సమకూరిందని పాలకమండలి ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు, ఈవో ఎన్.సతీశ్‌కుమార్ తెలిపారు.

మల్లేశ్వరుడికి రుద్రాభిషేకం

గుండుగొలను(భీమడోలు): కార్తిక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా.. గుండుగొలనులోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గర్భగుడిలోని స్వామివారికి మహాన్యాసం, ఏకాదశ పంచామృత రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన చేశారు. అర్చకులు లంక శివకుమార్, శ్రీనివాసశర్మ పర్యవేక్షించారు.

సోమలింగేశ్వరుడికి విశేషాలంకరణ

ఏలూరు ఆధ్యాత్మికం: తూర్పువీధిలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు చేశారు. అనంతరం నెమలి పింఛాలతో నేత్రపర్వంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

విశ్వేశ్వరుడికి అన్నాభిషేకం

ఏలూరు గ్రామీణ: దొండపాడులోని శ్రీనం దత్తనాథ క్షేత్రంలో విశ్వేశ్వరస్వామికి ఆదివారం పంచామృతాలు, అన్నాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయినిగా జహాన్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: శనివారపుపేట పాఠశాల ఉపాధ్యాయిని ఎస్.కె.అన్వర్ జహాన్ ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏపీ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యాన ఈ నెల 11న నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నారు. ఆమెను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు, ఏలూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మణి, కనకదుర్గ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఆదివారం అభినందించారు. అంకిత భావంతో పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఎస్.కె.అన్వర్ జహాన్ మరిన్ని పురస్కారాలు వరించాలని వారు ఆకాంక్షించారు.

ప్రదర్శన.. ఆదరణ

రాష్ట్ర స్థాయికి పెదనింద్రకొలను విద్యార్థుల ప్రాజెక్టు

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనింద్రకొలను ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యింది. ఈ పాఠశాలను పీఎంశ్రీ పాఠశాలగా గతేడాది ఎంపిక చేయడంతో వృత్తి విద్యకు సంబంధించిన అపెరల్, ఆటోమోటివ్ కోర్సులు వచ్చాయి. ఈ నెల 7న ఏలూరు పీఎంశ్రీ పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి తయారు చేసిన ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించారు. ఈ పాఠశాల 10వ తరగతి విద్యార్థుల బృందం అపెరల్‌లో ప్రదర్శించిన టైఅండ్‌డైకు ప్రథమ స్థానం దక్కింది. బృందంలో కీర్తన, మేరీ మణి, గాయిత్రి, విశాలాక్షిలు ఉన్నారు. ఈ ప్రాజెక్టును రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించనున్నారు. ఉపాధ్యాయులు కీర్తి శర్మిల, సాయి దిలీప్‌లు సహకరించారు. హెచ్ఎం సత్యేంద్రకుమార్ రెడ్డి అభినందించారు.

తక్కువ సమయంలోనే..

మేం తయారు చేసిన టైఅండ్‌డై రాష్ట్ర స్థాయికి ఎంపికవుతుందని అనుకోలేదు. ఉపాధ్యాయుల సూచనలతో తక్కువ సమయంలోనే దీనిని తయారు చేశాం. ప్రాజెక్టుకు ఇంత ఆదరణ వస్తుందని ఊహించలేదు. - మేరీమణి

సంతోషంగా ఉంది..

మా బృందం తయారు చేసిన టైఅండ్‌డై ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికవడం చాలా సంతోషంగా ఉంది. తెలుపు రంగు వస్త్రంపై రూపొందించిన రకరకాల డిజైన్లు ఎక్కువ మొత్తంలో తయారు చేసి కుటీర పరిశ్రమగా మార్చుకోవచ్చు. ఇది లాభదాయకంగా ఉంటుంది. - కీర్తన

అమరవీరులను స్ఫూర్తిగా తీసుకుందాం

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సుధాకర్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: విప్లవోద్యమంలో ఎందరో ప్రాణ త్యాగం చేశారని, ఆ అమరవీరుల స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగుదామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ పిలుపునిచ్చారు. నగరంలో పార్టీ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు అధ్యక్షత వహించారు. సుధాకర్ మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో ఎందరో వీర మరణం పొందారని గుర్తు చేశారు. వారి ఆశయ సాధనకు శ్రేణులు కృషి చేయాలని కోరారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, నాయకులు యూవీ, సోమయ్య, శ్రీనివాసరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ చింతలపూడి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
EA.No. 100/2019 in E A 58/2004
EP.No. 20/2014 in OS.No. 4/2000

ఎదిరి :-
మలిశెట్టి ఉషశ్రీ --- పిటీషనరు / DHR
మరియు
బూసి బుజంగరావు (డైడ్) వగైరా --- రెస్పాండెంట్ / JDR

To,
1. బుసి మహేష్ S/o లేటు బుజంగరావు, , పురుషుడు, వయసు 30 సంవత్సరములు, ఉద్యోగి, C/0 బుసి జ్యోతి, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, పోనసానిపల్లి, భీమడోలు మండలం ఏలూరు జిల్లా, భీమడోలు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)
2. బూసి అనూష D/o లేటు బుజంగరావు, స్త్రీ, వయసు 22. సంవత్సరములు, రొపెర్తిఎస్స్,, C/o యెన్. వెంకట్రావు అడ్వకేట్, అశోక్ నగర్, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా, ఏలూరు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)

మీరు పైన తెలిపిన EP.No. 20/2014 in OS.No. 4/2000 లో 5 మరియు 6వ JDRs అయిన మీరు చనిపోయిన మొదటి JDR యొక్క వారసులు అయివున్నారు మిమ్ములను ఈ EP లో పార్టీగా జాయిన్ చేయమని కోరుచు మీకు ఎన్నిసార్లు నోటీసు పంపించిన తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) చింతలపూడి కోర్టు వారి ఎదుట ది. 26-11-2025 ఉ. 10.30 ని॥లకు హాజరు కావలెను. లేని యెడల సదరు విషయమై మీకు పరోక్షంగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
చింతలపూడి సం/- బలుసు నాగేశ్వరరావు
Dt: 09-11-2025 DHR తరపు అడ్వకేట్, చింతలపూడి
Cell: 9440391568

(c) eenadu

పోలవరం

•పోలవరం •చింతలపూడి

నేత్రపర్వం.. శివ కల్యాణం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ద్వారకా తిరుమల క్షేత్ర పాలకుడైన శ్రీభ్రమరాంబమల్లేశ్వరస్వామి కల్యాణం ఆదివారం కనులపండువగా జరిగింది. తొలుత ఆలయ ముఖ మండపంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. దీనిపై స్వామి, అమ్మవార్లను కల్యాణ మూర్తులుగా కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. అనంతరం కల్యాణ క్రతువును అర్చకులు వేదమంత్రాల నడుమ జరిపించారు. జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

స్వామి, అమ్మవార్లు

మద్ది క్షేత్రంలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కార్తిక ఆదివారం సువర్చలా హనుమత్ కల్యాణం, హనుమద్ హోమాలు కనులపండువగా జరిగాయి. వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజాదికాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాజమహేంద్రవరం బాల రాజరాజేశ్వరి కూచిపూడి నృత్యాలయం విద్యార్థుల భరతనాట్యం, కూచిపూడి నృత్యాలను చేశారు. ఆదివారం ఒక్కరోజే వివిధ సేవల రూపేణా రూ.2,68,740 ఆదాయం సమకూరినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపారు.

కమనీయం.. కామవరపుకోట, న్యూస్‌టుడే: తడికలపూడి అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పంచామృతాభిషేకం అనంతరం సువర్చలా హనుమత్ కల్యాణం నిర్వహించారు.

ముగిసిన ఉత్సవాలు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బొర్రంపాలెంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన బాటగంగానమ్మ ఆలయ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన జరిగింది.

పట్టిసీమకు పోటెత్తిన భక్తులు

పూజలందుకున్న అమ్మవారు

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలోని భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయానికి కార్తిక మాసం ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన భక్తుల రాక సాయంత్రం వరకు కొనసాగింది. లాంచీ ఒకటే కావడంతో నదికి ఇరువైపులా భక్తులు కొంత సమయం వేచి ఉండాల్సి వచ్చింది. ఎస్సై పవన్‌కుమార్ ఆలయం వద్ద, రేవుల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

గరిక అలంకరణలో భోగలింగేశ్వరుడు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం శివారు అంకాలగూడెంలోని ఉమా సమేత భోగలింగేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేకాభిషేకాల అనంతరం గరికతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

క్రీడల్లోనూ రాణిస్తున్నారు!

రాజవరం బాలికల ప్రతిభ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: రాజవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ.. రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. వ్యాయామోపాధ్యాయుడు శ్రీనివాస్ సహోపాధ్యాయుల సహకారంతో వారికి శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతున్నారు. పేద కుటుంబాలకు చెందిన వీరు నిత్యం సాధన చేస్తూ.. ప్రతిభ కనబరుస్తున్నారు. ఇటీవల జరిగిన ఖోఖో, త్రోబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన వీరు అందరి ప్రశంసలు పొందుతున్నారు.

చిన్నప్పటి కోరిక..

హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ తొలి ఏడాది చదువుతున్నా. నాలుగేళ్లుగా త్రోబాల్ ఆడుతున్నా. జిల్లా స్థాయిలో అనేక సార్లు ఆడాను. రాష్ట్ర స్థాయికి ఎంపికవ్వడం సంతోషంగా ఉంది. వెటర్నరీ డాక్టరు ఉద్యోగం చిన్నప్పటి కోరిక. ప్రోత్సాహం అందితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించగలనన్న నమ్మకం ఉంది. **- కోమల అనూష**

వైద్యురాలు కావాలని..

అమ్మానాన్న వ్యవసాయం చేస్తారు. హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్నా. నాలుగేళ్లుగా త్రోబాల్ ఆడుతున్నా. ఇటీవల జరిగిన పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాను. విజయం సాధిస్తామన్న నమ్మకం ఉంది. వైద్యురాలిని అవుతా. **- పదిలం రాణి**

ఖోఖో అంటే ఇష్టం..

తొమ్మిదో తరగతి చదువుతున్నా. నాన్న ... కుటుంబానికి జీవనాధారం. మూడేళ్లుగా ఖోఖో ఆడుతున్నా. రాష్ట్ర స్థాయిలో ఒకసారి ఆడాను. ఈ ఏడాది కూడా రాష్ట్ర స్థాయికి ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. ఖోఖో అంటే చాలా ఇష్టం. జాతీయ స్థాయిలో దేశం తరపున ఆడాలన్నది నా కోరిక. **- అందుగుల దేవకి**

పోలీసు అవుతా..

తొమ్మిదో తరగతి చదువుతున్నా. చదువుతో పాటు ఆటలంటే ఇష్టం. ఇటీవల జరిగిన పోటీల్లో వాలీబాల్ అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయికి అర్హత సాధించాను. పోలీసు అధికారిగా ఉద్యోగం చేయాలన్నది నా లక్ష్యం. **- సకినాల సుష్మ**

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

ఈనాడు స్పందన

వేలేరుపాడు, న్యూస్‌టుడే: పెదవాగు వరద ప్రవాహంలో వివిధ గ్రామాల్లో ఎత్తిపోతల తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. వాగు ప్రవాహానికి ఈ ఏడాది జూన్, జులై నెలల్లో పెదవాగులో మోటార్లు కొట్టుకుపోవడంతో గత అయిదు నెలలుగా పాతరెడ్డిగూడెం, కమ్మరిగూడెం, ఊటగుంపు, సొందెగొల్లగూడెం, మేడేపల్లి, అల్లూరినగర్, రామవరం గ్రామాల ప్రజలు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. దీనిపై 'పెదవాగు చెంత.. తాగునీటి చింత!' శీర్షికన గత నెల 19న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మేడేపల్లి, రామవరం పంచాయతీల కార్యదర్శులు పద్మజ, లక్ష్మీప్రసన్న స్పందించారు. ఈ మేరకు పెదవాగులో బోర్లు, మోటార్లు ఏర్పాటు చేయించి నీటి సరఫరా కల్పించారు.

అదుపు తప్పితే అంతే

రం కట్నత్రపుగూడెం కూడలిలో రహదారి అంచు కోతకు గురైంది. మద్దిగూడెం నుంచి వేగంగా వచ్చే వాహనాలు కిచ్చప్పగూడెం వైపు మలుపు తిరిగే క్రమంలో అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఎదురెదురయ్యే వాహనాలు తప్పించుకునే అవకాశం ఉండటం లేదని పేర్కొంటున్నారు. రహదారికి మరమ్మతులు చేసి ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ

సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసి రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించి మంచి ఆదాయాన్ని పొందాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. అంకన్నగూడెంలో ఏపీ ప్రజా భాగస్వామ్యం, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీవశాస్త్ర పరిశోధన కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచి పైదా ముత్యాలమ్మ, జడ్పీటీసీ సభ్యుడు మల్లం వసంతరావు, జీలుగుమిల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ సరిపల్లి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే దళితులకు మేలు

ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చింతలపూడి, న్యూస్‌టుడే: దళితులకు మేలు జరగాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు అన్నారు. తెదేపా దళితుల ఐక్య వేదిక కార్యక్రమాన్ని లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వ హయంలో పక్కదారి పట్టించారన్నారు. పల్లి శ్రీను, యాళ్ల సుజనరావు, కొత్తూరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్ల అందజేత

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమం జంగారెడ్డిగూడెం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించారు. జంగారెడ్డిగూడెం లయన్స్ అధ్యక్షుడు దాసరి శేషకుమార్ అధ్యక్షతన పంపిణీ జరిగింది. సుమారు 62 మందికి కృత్రిమ కాళ్లు అమర్చారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా లయన్స్ జిల్లా గవర్నర్ పాపారావు నాయుడు, ఉప గవర్నర్ డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం లయన్స్‌తో పాటు హేలాపురి లయన్స్ సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించామని, విజయలక్ష్మి ఆర్థిక సహకారం అందించారని శేషకుమార్ తెలిపారు.

విశ్రాంతికి పనికిరాని భవనం

వేలేరుపాడు మండలం అల్లూరినగర్ వద్ద ఉన్న విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరింది. గతేడాది పెద్దవాగు దీని పైనుంచి ప్రవహించడంతో పూర్తిగా పాడైంది. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత ప్రమాదకరంగా మారి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వేలేరుపాడు గ్రామీణ**

కుటుంబాలకు ఆసరాగా నిలవాలన్నదే లక్ష్యం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతి గృహిణి స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలన్నదే లయన్ సేవా సంస్థ వ్యవస్థాపకులు మనోజ్ జాంగ్రా లక్ష్యమని ఆ సంస్థ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు బోనేపల్లి సంధ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ద్వారకాతిరుమల వచ్చిన ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. లయన్ సంస్థను అట్టడుగు వర్గాలను ఉన్నత స్థితికి తేవాలనే లక్ష్యంతో స్థాపించారన్నారు. ప్రతి గృహ ఉపాధి పథకం ద్వారా గ్రామాల్లోని నిరుపేద గృహిణులకు కుట్టు మిషన్లు, వంట నూనెల తయారీ, కారం పొడి, మసాలాలు, గోధుమ పిండి తయారీ మిషన్లను రాయితీపై ఇచ్చి ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ద్వారకాతిరుమల నుంచి కూడా సంస్థ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు.

కంచె తొలగించాలని అభ్యర్థన

టి.నరసాపురం, న్యూస్‌టుడే: కొత్తగూడెంలో పేదల కాలనీకి వెళ్లే మార్గంలో రాకపోకలు నిలిపి వేస్తూ.. అడ్డుగా వేసిన కంచె తొలగించాలంటూ స్థానికులు అభ్యర్థిస్తున్నారు. ఆ కాలనీని 2022లో దారి లేకుండా నిర్మించారు. అయితే ప్రస్తుతం ప్రజలు రాకపోకలు సాగిస్తున్న భూమి తమదంటూ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దారిలో కంచె వేశారు. దీంతో రాకపోకలు లేక తాము ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ విషయమై స్థానిక వీఆర్వో దత్తు మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

పోలవరం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ స్థాయిలో జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన రగ్బీ పోటీల్లో పాల్గొని అండర్-14 బాలుర, బాలికల విభాగంలో ఎల్ఎన్డీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీవీ భాస్కరరావు తెలిపారు. గొన్నూరి రేష్మ, కాగిత వీరవెంకట సుబ్రహ్మణ్యం గన్నవరంలో నిర్వహించే పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

రేష్మ

వీరవెంకట సుబ్రహ్మణ్యం

వైద్య శిబిరానికి స్పందన

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: బయ్యనగూడెం ఆర్సీఎం చర్చి వద్ద జంగారెడ్డిగూడెం నిర్మల మల్టీ స్పెషాలిటీ, లాప్రోస్కోపిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. పలువురు వైద్య సేవలను పొందారు. రాజలపాటి రొసోరియో, పారేపల్లి నరేష్, మద్దు తేజ, ఆరేటి యేసు తదితరులు పాల్గొన్నారు.

గొలుసు దుకాణంపై దాడి

చింతలపూడి, న్యూస్‌టుడే: లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో గొలుసు దుకాణంపై ఆదివారం దాడి చేసి చిన్నం నాగమణి అనే మహిళ నుంచి నాలుగు బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ అశోక్ తెలిపారు. అనంతరం లింగపాలెం మండలంలోని లైసెన్స్ కలిగిన మద్యం దుకాణాలను తనిఖీ చేశారు.

మహిళ అదృశ్యం

టి.నరసాపురం, న్యూస్‌టుడే: మహిళ అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్లివారిగూడెనికి చెందిన కుశిని నాగమణి మక్కినవారిగూడెంలో వస్త్ర దుకాణం నడుపుతున్నారు. అప్పులు ఎక్కువగా ఉన్నాయి. దుకాణంలోకి అప్పు చేసి వస్త్రాలు తీసుకురావద్దని తన భర్త రాజు తరచూ మందలించేవారు. ఈ నేపథ్యంలో ఆమె ఈనెల 6న సాయంత్రం దుకాణానికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. తన ఆచూకీ కోసం పలు చోట్ల గాలించినా.. ఫలితం లేకపోవడంతో.. ఆమె తండ్రి మద్ది రాములు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జయబాబు తెలిపారు.

రాగి తీగల చోరీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం రామన్నగూడెం రైతుల పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్తు నియంత్రికలను పగలగొట్టి రాగి తీగలను దొంగిలించారు. సయ్యద్ బడే సాహెబ్, కోడవటి ఆనందరావు పొలాల్లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆదివారం ఉదయం రైతులు పొలాల్లోకి వెళ్లి చూసే సరికి ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి ఉన్నాయి. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

అనుకున్నది అనుకున్నట్లు!

• పోషణ వాటికలతో సంపూర్ణ ఆరోగ్యం

• నెరవేరిన ప్రభుత్వ లక్ష్యం

వేలేరుపాడు, న్యూస్‌టుడే: పోషకాహారం అందక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వివిధ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీనిని అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం గతేడాది అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలు ఏర్పాటు చేసింది. ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయంతో ఆయా కేంద్రాల్లో పండించిన కూరగాయలు, ఆకు కూరలు వండి వడ్డించడంతో వారంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారుతున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరుతోంది.

కమ్మరిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో కూరగాయల సాగు

నియోజకవర్గంలో 128..

నియోజకవర్గంలోని కొయ్యలగూడెం, పోలవరం, టి.నరసాపురం, కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో 573 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో సొంత భవనాలు ఉండి పక్కన విశాలమైన స్థలం కలిగిన 128 అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి పోషణ వాటికలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.10 వేలు మంజూరు చేశారు. వీటిలో తోటకూర, పాలకూర, కొత్తిమేర, మెంతికూర, చుక్కకూర, గోంగూరతో పాటు వంగ, బెండ, చిక్కుడు, ఆనబ, బీర, గోరుచిక్కుడు, పచ్చిమిరప, అరటి, టమాటా వంటి పలు రకాల పాదులు, మొక్కలను సేంద్రీయ పద్ధతిలో పెంచుతున్నారు. వాటి నుంచి సేకరించిన ఆకుకూరలు, కూరగాయలను ఆయా కేంద్రాల పరిధిలోని వారికి అందిస్తున్నారు.

పోషక విలువలు మెండు

అంగన్‌వాడీ కేంద్రాల్లో సహజ సిద్ధంగా పండిస్తున్న కూరగాయలు, ఆకుకూరల్లో పోషక విలువలు అధికంగా ఉండటంతో వాటిని స్వీకరించేందుకు గర్భిణులు, బాలింతలు ముందుకొస్తున్నారు. దీంతో పాటు కార్యకర్తలు, సిబ్బంది తమవంతు బాధ్యతగా రోజూ ఉదయం, సాయంత్రం తోట పనిలో నిమగ్నమై కూరగాయలు, ఆకు కూరలతో పాటు ఆవరణలో వివిధ రకాల పూల మొక్కలను పెంచుతూ ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తున్నారు.

అందించేందుకు చర్యలు

'పోషణ వాటికల్లో పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయలను ఆయా కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించేందుకు చర్యలు చేపట్టాం. దీనిలో భాగంగా తరచూ ఆయా కేంద్రాలను సందర్శించి సిబ్బందికి తగు సూచనలు ఇస్తున్నాం.' అని కుక్కునూరు సీడీపీవో అనంతలక్ష్మి తెలిపారు.

పట్టించుకోరు.. పరిష్కరించరు!

జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలోని ఎస్సీపేటలో పలు రోడ్లు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ కుంగిపోయి దర్శనమిస్తున్నాయి. మురుగు కాలువలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో మురుగు సక్రమంగా పారక దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. కొన్ని అంతర్గత రహదారుల మధ్య అనుసంధానం లేక రాకపోకలు సాగించేందుకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జంగారెడ్డిగూడెం గ్రామీణ**

గుబ్బల మంగమ్మకు పూజలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మను ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఉద్యోగ నియామక చట్ట సాధనకు కృషి

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతానికి ఉద్యోగ నియామక చట్టాన్ని సాధించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు తెలిపారు. సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు సరియం నాగేశ్వరరావు అధ్యక్షతన బుట్టాయగూడెంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాంబాబు పాల్గొని సంఘం పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తెల్లం రాములు, రాష్ట్ర కోశాధికారి వంజం ధర్మరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు సోదెం రాజు తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: మన్యంలో ఆదివాసీలకు మాత్రమే ఉపాధ్యాయ కొలువులు ఇవ్వాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏటీఏ) మండలాధ్యక్షుడు పాయం రమేశ్ అన్నారు. వేలేరుపాడు పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఏటీఏ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడారు.

కుక్కునూరు, న్యూస్‌టుడే: ఏజెన్సీలో ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాలన్నీ ఆదివాసీలతోనే భర్తీ చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏటీఏ) అధ్యక్షుడు వెంకటనారాయణ అన్నారు. ఆదివారం నెమలిపేట ప్రాథమిక పాఠశాలలో ఏటీఏ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నాయకులు కారం దారయ్య, వీరబాబు, వెంకటేశ్వర్లు, ముత్యాలరావు, రాధ, సీత, నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వన సమారాధన

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల కార్తిక వన సమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. 1997-1998 బ్యాచ్ విద్యార్థులందరూ ఒక చోట కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ సరదాగా గడిపారు. పాఠశాలలో చదివిన రోజుల్లో జరిగిన మధురమైన సంఘటనలను మరోసారి గుర్తు చేసుకున్నారు. ఆడుతూ పాడుతూ సందడి చేశారు. అనంతరం అందరూ కలిసి వన భోజనాలు చేశారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో కార్తిక వన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సామూహిక వన భోజనాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు వజ్రపు శేఖర్, కొనకళ్ల ప్రసాద్, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన నూతన కమిటీ

ఐక్యంగా వ్యాపారాల అభివృద్ధి

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: ఛాంబర్ పరిధిలోని వ్యాపారుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయనున్నట్లు కొయ్యలగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడు మద్దు మోహన్ అన్నారు. స్థానిక మేధా పాఠశాల వద్ద ఛాంబర్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. వ్యాపారులు ఐక్యంగా ఉండి.. తమ వ్యాపారాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఉపాధ్యక్షులుగా బొమ్మా దుర్గబాబు, నిమ్మ జగదీశ్, మాటూరు చంటి, కార్యదర్శిగా గొలిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారిగా కర్పూరం సత్యనారాయణ, కొందరు సభ్యులుగా ప్రమాణం చేశారు.

తాగొద్దనందుకు ఆత్మహత్య

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పెదవేగి మండలం ముండూరు పంచాయతీ వెంగంపాలేనికి చెందిన చలపాటి వెంకటేశ్వరరావు(55) ఏలూరు రైతుబజారులో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన్ను నెల కిందట కుక్క కరిసింది. ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న వెంకటేశ్వరరావు.. రోజూ మద్యం తాగుతుండటంతో భార్య మందలించింది. మనస్తాపానికి గురైన ఆయన.. మందు తాగారు. కుటుంబ సభ్యులు అప్రమత్తమై ఏలూరు సర్వజన ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కె.ఫల్గుణ తెలిపారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. ఏలూరు నేరవార్తలు: స్థానిక కుమ్మరిరేవుకు చెందిన కృష్ణ, అతడి స్నేహితుడు రాజు ఆదివారం ద్విచక్ర వాహనంపై కెనాల్ రోడ్డు దాటి వసంత మహల్ కూడలిలో మలుపు తిరుగుతున్నారు. వారిని మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో చోదకులిద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో సర్వజన ఆసుపత్రికి తరలించారు.

దోచేస్తున్నారు.. పత్తించుకోండి

• మద్దతు ధర రూ.8,110.. దక్కేది రూ.5,500

• రైతుల నిలువు దోపిడీ


గ్రామాల్లో కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

కుక్కునూరు, న్యూస్‌టుడే: పత్తి రైతును ప్రైవేటు వ్యాపారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. క్వింటాలుకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.8,110.. ప్రస్తుతం రైతుకు దక్కుతున్న ధర రూ.5000-5500. ప్రభుత్వాలు ప్రకటించే మద్దతు ధరలు రైతుకు అందుతున్న తీరుకు ఇదో నిలువుటద్దం. ఇదేమంటే తేమశాతం ఎక్కువ, నాణ్యత లోపం అనే కుంటిసాకులు చెబుతుంటారు. జిల్లాలోని పత్తి పండించే మండలాల్లో కుక్కునూరు, వేలేరుపాడు అగ్రస్థానంలో ఉంటాయి. ఇక్కడ దాదాపు 20 వేల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. అయితే ఈ ప్రాంతానికి సమీపంలో ఎక్కడా పత్తి కొనుగోలు కేంద్రం లేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకే పంటను అమ్ముకోక తప్పదు. ఇలా పంటను అమ్ముకొనే దిక్కులేక, ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తుండటంతో తేమ, నాణ్యత సాకుగా చూపి, అతి తక్కువ ధరకు పంటను కాజేస్తున్నారు.

100 కి.మీ. వెళ్తేనే..

కుక్కునూరు, వేలేరుపాడు రైతులు మద్దతు ధర కోసం సీసీఐ కేంద్రానికి వెళ్లాలంటే జంగారెడ్డిగూడెం వెళ్లాలి. ఈ రెండు మండలాల్లో చివరి గ్రామాలకు ఆ పట్టణం 100 కి.మీ.లు ఉంటుంది. అంత దూరం రవాణా ఛార్జీలు భరించి పంటను తీసుకెళ్తే, అక్కడ ఎన్ని కొర్రీలు వేస్తారో అనే భయం రైతుల్లో ఉంది. ఒక వేళ పంట అమ్ముడు కాకపోతే, మళ్లీ 100 కి.మీ.లు రవాణా ఛార్జీలు భరించి, వెనక్కి తీసుకురావాలి. ఈ శ్రమంతా ఎందుకని ఒక్కో క్వింటలుకు రూ.2500-3000 నష్టం భరిస్తూ.. గ్రామాల్లోనే పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

సీసీఐ నిబంధనలు

జాతీయ పత్తి సంస్థ(సీసీఐ) కూడా ఈ ఏడాది అనేక నిబంధనలు పెట్టింది. గతంలో ఒక్కో ఎకరాకు 12 క్వింటాళ్ల వరకూ కొనుగోలు చేసేది. ఈ ఏడాది ఎకరాకు 7 క్వింటాళ్ల వరకే కొనుగోలు చేస్తోంది. పత్తి గరిష్ఠంగా ఎకరాకు 15 క్వింటాళ్లు, కనిష్ఠంగా 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అటువంటిది 7 క్వింటాళ్ల పరిమితి విధించడం రైతుకు పెద్ద నష్టం. దీనికితోడు తేమ శాతం కూడా 20కు పెంచాలని రైతులు కోరుతున్నా.. సీసీఐ పట్టించుకోవడం లేదు.

శాఖా గ్రంథాలయం ఛైర్మన్‌గా కొప్పాక

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం శాఖా గ్రంథాలయం ఛైర్మన్‌గా కొప్పాక శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈయన గ్రంథాలయాధికారులతో ఆదివారం సమావేశమయ్యారు. గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చదరంగం పోటీలు నిర్వహించాలని సూచించారు. డైరెక్టర్లు దోసూరి సుబ్బారావు, చింతల శ్రీను, గుళ్లపూడి వెంకట కామరాజు, ఇనుముల వెంకట పాపారావు, వెంకటలక్ష్మి, గాయత్రి, లైబ్రేరియన్ దుర్గారావు పాల్గొన్నారు.

చదరంగంతో మేధా శక్తి పెంపు

దెందులూరు, న్యూస్‌టుడే: చదరంగంతో మేధా శక్తి పెంపొందించుకోవచ్చని ప్రధానాచార్యుడు నతానియేలు అన్నారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ఆదివారం చదరంగం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇటు చదువు, అటు క్రీడల్లో రాణించాలన్నారు. తద్వారా క్రీడా కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

(c) eenadu

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

శ్యామలాంబకు కుంకుమ పూజలు

కైకలూరు, న్యూస్‌టుడే: కార్తిక మాహోత్సవాలను పురస్కరించుకుని కైకలూరు బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో శ్యామలాంబ అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి అష్టోత్తర శతనామావళి, సహస్ర నామార్చన, పలు అభిషేకాలు, నీరాజన మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు వైభవోపేతంగా జరిపారు. ఈవో వీఎన్‌కే.శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బడుగు బలహీన వర్గాలకు అండగా చట్టం

మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండటమే చట్టం ముఖ్యోద్దేశమని, వారికి ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.లక్ష్మీపార్వతి తెలిపారు. నూజివీడు సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీపార్వతి మాట్లాడుతూ ధనికులతో పాటు పేదలకు సమాన న్యాయం అందాలనే లక్ష్యంతో 1987లో లీగల్ సర్వీసెస్ యాక్ట్‌ను రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎస్‌కేడీ.ప్రసాద్, వసతిగృహ సంక్షేమాధికారిణి ఆర్.సంధ్యారాణి పాల్గొన్నారు.

ఆలయాల్లో పంచామృతాభిషేకాలు

శివలింగాకారంలో దీపాలంకరణ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి ఆలయాల్లో కార్తిక మాస సంకట హరచతుర్థి సందర్భంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృత, ఫలామృత అభిషేకాలను ఆలయ ఈవో సీహెచ్ సాయి పర్యవేక్షణలో అర్చకులు దేవులపల్లి శ్రీనివా సమూర్తి వైభవంగా నిర్వహించారు. ఆకాశ దీపం వెలిగించారు.

పెద్దింట్లమ్మకు.. కైకలూరు, న్యూస్‌టుడే: పాపహారిణి పెద్దింట్లమ్మ పాహిమాం అంటూ కొల్లేటి ప్రజల ఇలవేల్పు పెద్దింట్లమ్మవారిని భక్తులు వేడుకొన్నారు. కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింట్లమ్మవారి దర్శనానికి ఆదివారం పలు జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అమ్మవారి మాలధారులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, సహస్ర నామార్చన, పంచహారతులు, ధూప సేవ వంటి పూజలను జరిపి ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ భక్తులకు సౌకర్యాలను పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటరులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. పంచామృతాభిషేకాలు చేశారు. పుట్టలో పాలుపోసి మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

సర్వ మాలధారులకు భిక్ష.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లిలోని శ్రీ సాయిబాబా మందిరం వద్ద సర్వమాలధారుల భిక్ష కార్యక్రమం వైభవంగా కొనసాగుతోంది. ఆదివారం దాతలు పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ సోమా సత్యనారాయణ ఆర్థిక వితరణతో భిక్ష ఏర్పాటు చేశారు. సుమారు 350 మంది సర్వమాలధారులు పాల్గొన్నారు. గురుస్వామి వేల్పూరి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

మకర తోరణాల అందజేత.. మండవల్లి, న్యూస్‌టుడే: లోకుమూడిలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో వినాయకస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్లకు కండబోయిన శ్రీనివాస్ రూ.30 వేల విలువైన మకరతోరణాలను అందజేశారు. ఆదివారం అప్పారావు గురుస్వామితో కలిసి వీటిని ఆలయ నిర్వాహకులకు అందించారు.

నేడు గుర్రాలయ్య, గుర్రాలమ్మ కల్యాణోత్సవం.. ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం కొర్లగుంటలో గుర్రాలయ్య, గుర్రాలమ్మ కల్యాణోత్సవం సోమవారం ఉదయం 10 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు.

ఈ-శ్రమ్‌తో కార్మికులకు భరోసా

'న్యూస్‌టుడే'తో సహాయ కార్మిక అధికారి శ్యామ్‌బాబు

ముఖాముఖి

నూజివీడు, న్యూస్‌టుడే: అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ కార్డులతో భరోసా కలుగుతోందని, సామాజిక భద్రత లభిస్తుందని నూజివీడు సహాయ కార్మిక అధికారి కె.శ్యామ్‌బాబు పేర్కొన్నారు. కార్మిక శాఖ తరపున నియోజకవర్గంలో చేపట్టే వివిధ కార్యక్రమాలను ఆయన 'న్యూస్‌టుడే'కు వివరించారు.

బాధిత కుటుంబాలకు అండగా..

నూజివీడు నియోజకవర్గంలోని ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, నూజివీడు మండలాల్లో 83 వేల మంది కార్మికులు ఉన్నారు. వీరిలో 52 వేల మంది ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని కార్డులు పొందారు. ఇందులో నమోదైన వారు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.2 లక్షల సాయం అందుతుంది. ఏదైనా ప్రమాదంలో 50 శాతానికి మించి అంగవైకల్యం సంభవిస్తే రూ.లక్ష వరకు అందిస్తారు.

బాల కార్మిక వ్యవస్థపై అవగాహన

బాల కార్మిక వ్యవస్థపై అవగాహన పెంపొందించే దిశగా అడుగులు వేస్తున్నాం. ఏటా జూన్ 12న బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించి తనిఖీలు చేస్తున్నాం. ప్రతి బుధవారం బాలకార్మికులను గుర్తించి యజమానులపై కేసులు నమోదు చేస్తున్నాం. గత రెండేళ్లలో 12 కేసులు నమోదు చేశాం. పిల్లలను పనిలో పెట్టుకుంటే రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

చట్టాలను తెలియజేసేలా..

ప్రతి దుకాణానికి లేబర్ లైసెన్సు, వెల్ఫేర్ ఫండ్ తప్పనిసరిగా ఉండాలనే నిబంధన పాటించాలి. ప్రధానంగా కార్మిక చట్టాలపై అవగాహన పెంచేలా కృషి చేస్తున్నాం. నియోజకవర్గంలోని దుకాణదారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తున్నాం. తనిఖీలకు వెళ్లే సమయాల్లోనూ లైసెన్సుల గురించి వివరిస్తున్నాం.

బొమ్మినంపాడు చెరువు తవ్వకానికి ప్రతిపాదనలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పూడిపోయిన బొమ్మినంపాడు మంచినీటి చెరువు తవ్వకానికి ప్రతిపాదనలు పంపించామని సర్పంచి దారం సుధ తెలిపారు. ఆదివారం ఆమె కూటమి నాయకులతో కలిసి మంచినీటి చెరువు పరిశీలించి మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం చెరువు తవ్వకపోగా గుర్రపుడెక్క, తూడు తీయకపోవడంతో అధ్వానంగా మారిందన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, వైకాపా నాయకులతో కలిసి చెరువు తవ్వకంపై మాట్లాడటం దారుణమన్నారు. తెదేపా గ్రామాధ్యక్షుడు యర్రా రాంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు లైన్ల పునరుద్ధరణ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: హనుమాన్ జంక్షన్ రోడ్డులో సోమవారం గత 30 సంవత్సరాలుగా ఉన్న పాత విద్యుత్తు లైన్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటరు, ద్వారకా, చిన్నగాంధీ బొమ్మ సెంటర్, హనుమాన్ జంక్షన్ రోడ్డులో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బీమాతో బాధిత కుటుంబాలకు భరోసా: మంత్రి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: తెదేపా ప్రమాద బీమాతో బాధిత కుటుంబాలకు భరోసా లభిస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడుకు చెందిన తెదేపా కార్యకర్త ఆళ్ల సందీప్ రహదారి ప్రమాదంలో మరణించారు. తెదేపా కార్యకర్తల ప్రమాద బీమా పథకం ద్వారా మంజూరైన రూ.5 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు మంత్రి ఆదివారం అందజేశారు. ఆపదలోని కార్యకర్తలకు తెదేపా అన్ని విధాల అండగా ఉండి ఆదుకుంటుందని ఆయన భరోసా కల్పించారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, బీజేపీ మండల అధ్యక్షుడు కాట్ర రమేశ్, సాదం ఏసుకొండలు, పార్టీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాలకు సంస్కృతి సంప్రదాయాలను తెలపాలి

పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి పార్థసారథి, వేదికపై రచయిత తదితరులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నిత్యం కంప్యూటర్లు, చరవాణులతో కుస్తీ పట్టే భవిష్యత్తు తరాలకు సంస్కృతి సంప్రదాయాలను తెలపాల్సిన ఆవశ్యకత ఉందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం నూజివీడులోని న్యూ ఎంప్లాయీస్ కాలనీవాసులు ఏర్పాటు చేసిన వనసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు ఎంఎన్‌వీ ప్రసాద్ రచించిన శ్రీనివాస శతకం పుస్తకాన్ని న్యూఎంప్లాయీస్ కాలనీ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. 110 పద్యాలతో వెంకటేశ్వరుడి వైభవం రచించడం అభినందనీయమన్నారు. రచయితను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పర్వతనేని వెంకట కృష్ణారావు, కార్యదర్శి అత్తులూరి చంద్రశేఖర్, కుబేర కౌన్సిలర్ వైవీ ఆర్డీ ప్రసాద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సీహెచ్.దుర్గాప్రసాద్, కె.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

★ నియోజకవర్గ యాదవ, పద్మశాలి సంఘాలు ఏర్పాటు చేసిన వన సమారాధన కార్యక్రమాల్లో మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. బీసీ యువత రాజకీయంగా వ్యాపార పరంగా ఎదగాలని, వారికి బ్యాంకుల నుంచి రుణాలు అందించడంలో తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం యాదవ సంఘం ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సత్కరించారు. కోలాట నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గోళ్ల లోకేశ్వరరావు, లాకా వెంకటరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



గంగరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని, క్షత్రియ సంఘం నాయకులు

సమాజ హితం కోసం పాటుపడాలి

కైకలూరు, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తూ తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎంపీ, గోకరాజు గంగరాజు అన్నారు. క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని భుజబలపట్నంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కామినేని, గంగరాజు మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి అండగా ఉంటూ పేదలకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు, సంఖురాతి వెంకట రామరాజు, సయ్యపరాజు కృష్ణంరాజు, జంపన రామ పాల్గొన్నారు.

'బలహీనవర్గాల ద్రోహి జోగి'

ముదినేపల్లి, న్యూస్‌టుడే: బలహీనవర్గాల ద్రోహి మాజీ మంత్రి జోగి రమేశ్ అని తెలుగుయువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు విమర్శించారు. అల్లూరులో ఆదివారం ఆయన మాట్లాడారు. కల్తీ మద్యం కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన జోగి రమేశ్ విజయవాడ కనకదుర్గపై దొంగప్రమాణం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పేదలకో కోతముక్క నిర్వహించి రూ.లక్షలు దండుకున్నారని ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో చిన్నసన్నకారు రైతుల భూములను బలవంతంగా లాక్కొని కట్టబెట్టి రూ.కోట్లు ముడుపులు తీసుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇన్ని అక్రమాలు చేసిన జోగి చంద్రబాబు నాయుడు, లోకేశ్‌లు కుట్రతో కేసులో ఇరికించారని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.

ఐకమత్యంతో ముందుకు సాగుదాం

జ్యోతి వెలిగిస్తున్న పాకా సత్యనారాయణ తదితరులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గౌడ సంఘీయులంతా ఐకమత్యంగా ఉండి, సంఘటితంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేయాలని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ సూచించారు. వడాలిలోని జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం కైకలూరు నియోజకవర్గ గౌడసంఘ క్షేమ సంఘ కార్తిక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. నాయకులు బొర్రా చలమయ్య అధ్యక్షత వహించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, తెలంగాణా ఐజీ వెలివెల సత్యనారాయణ, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, రాష్ట్ర నాయకులు కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య), పోసిన చెంచురామారావు, తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమలు నరసింహారావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన అయిదుగురు విద్యార్థులకు మోదుగుమూడి మదన్‌మోహన్ రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సమారాధన కమిటీ ఛైర్మన్ బొర్రా శేషబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు

చాట్రాయి, న్యూస్‌టుడే: వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారతాయని వైద్యులు సూచించారు. చిన్నంపేటలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల్లో ప్రజలకు సూచించారు. చిన్నంపేటలో వైద్యుడు మహమ్మద్ సైఫన్ నేత్ర పరీక్షలు, చనుబండలో సాధారణ పరీక్షలను వైద్యులు ఆజ్మీర్, భరత్, భానుతేజ నిర్వహించి మందులను అందించారు. శిబిరాల్లో పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి, వనమా కేశవరావు, అత్తులూరి శ్రీనివాసరావు, కొమ్ము సృజనరావు, పరసా వెంకటేశ్వరరావు ప్రజలు పాల్గొన్నారు.

రైతు సేవలకు దూరం

నిరుపయోగంగా కియోస్క్ యంత్రం

ముసునూరు, న్యూస్‌టుడే: అన్నదాతలకు మెరుగైన సేవలందిస్తామని గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా వినియోగంలోకి తెచ్చిన కియోస్క్ యంత్రాలు మున్నాళ్ల ముచ్చటగానే మారాయి. రైతులకు రాయితీలపై ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు వీలుగా ఈ యంత్రాలను అప్పటి ఆర్బీకేల్లో ఏర్పాటు చేశారు. ఇది పని చేయాలంటే అంతర్జాల సౌకర్యం ఉండాలి. కానీ గత ప్రభుత్వం యంత్రాలిచ్చి ఈ సదుపాయాన్ని విస్మరించింది. దీంతో సిబ్బంది తమ చరవాణుల నుంచే అంతర్జాలాన్ని ఉపయోగించుకుని నెట్టుకొస్తున్నారు. కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సిబ్బంది పరిష్కరించలేక వదిలేశారు. ముసునూరు మండలంలో 12 యంత్రాలను అందజేశారు. అప్పట్లో ఒక్కో యంత్రానికి రూ.75 వేలు వెచ్చించారు. నిర్వహణ లేక కొన్ని నెలలకే అవి మూలకు చేరాయి. దీనిపై ఏవో చాముండేశ్వరిని వివరణ కోరగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రమాదకర ప్రయాణం.. గాల్లో ప్రాణం..

చేపల లారీపై కూలీలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: బతుకుపోరాటంలో నిత్యం ప్రమాదకర ప్రయాణం చేస్తుండటంతో వారి ప్రాణాలు గాల్లో దీపాల్లా మారాయి. చేపలు, రొయ్యల రవాణా, ప్యాకింగ్ పనులకు వెళ్లే కూలీలు నిత్యం ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. చెరువుల వద్దకు, ప్యాకింగ్ ప్లాంట్లకు లోడైన లారీలపై కూర్చుని ప్రయాణిస్తున్నారు. ఏ మాత్రం ఆదమరిచి ఉన్నా, నిద్ర వచ్చినా ప్రమాదానికి గురవ్వాల్సిందే. అధికారులు స్పందించి ప్రమాదకరమైన ప్రయాణాలపై అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే!

రహదారిపై చెట్ల మొద్దులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: నూజివీడు- విజయవాడ ప్రధాన రహదారిలో ఆగిరిపల్లి-చొప్పరమెట్ల మధ్యలో రహదారిపైకి వచ్చేలా చెట్ల మొద్దులను వేశారు .దాంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో చీకటిలో కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ డీఈ బాబూరావు, డిప్యూటీ ఎంపీడీవో బి.ఆనంద్‌బాబు మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా రహదారిపై మొద్దులను తీయిస్తామని స్పష్టం చేశారు.

గ్రామీణం.. అంధకారం

➤ కైకలూరు 19వ వార్డు ఎంపీపీ పాఠశాల సమీపంలో, బైపాస్ రోడ్డులోని 4వ వార్డు, రైల్వేస్టేషన్ రోడ్డులో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు.

➤ మండవల్లి, లోకుమూడి, దెయ్యంపాడు ప్రధాన రోడ్డు మార్గాలపై 4 వీధిదీపాలు నెల రోజులుగా వెలగడం లేదు.

➤ ముదినేపల్లి మండలం పెదకామనపూడి-చిగురుకోట రోడ్డు వెంబడి 3 దీపాలు పది రోజుల క్రితం మరమత్తులకు గురయ్యాయి

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: పల్లెల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన రహదారులు, కాలనీలకు చేరుకునే మార్గాల్లో సక్రమంగా వెలుగులు లేక అంధకారంగా దర్శనమిస్తున్నాయి. కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల ఆర్థిక సంఘం నిధులు పంచాయతీ ఖాతాల్లో జమైనా వీధి దీపాల నిర్వహణపై అధికార యంత్రాంగం శ్రద్ధ చూపడం లేదు. మైనర్ పంచాయతీల మాట అటుంచితే పూర్తి ఆదాయ వనరులు ఉన్న మేజర్ పంచాయతీల్లోనూ ఇదే ఒరవడి కొనసాగుతోంది. దీంతో మండల కేంద్రాల్లోనూ చీకట్లు కమ్ముకుంటున్నాయి.

లోకుమూడి ప్రధాన మార్గంలో ఇలా..

కైకలూరు 19వ వార్డులో వెలగని వీధి దీపం

స్పందన అంతంతమాత్రమే..

వీధి దీపాలు లేక అవస్థలు పడుతున్నామని అధికారులకు పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నా స్పందించడం లేదన్న ఆరోపణలున్నాయి. సర్పంచులకు మొరపెట్టుకున్నా.. ఇంకా రెండు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయి. ఇంకా మా బాధ్యతేముందని కొందరు బహిరంగంగానే చెప్పడం విడ్డూరం. రాత్రివేళలో వీధి కుక్కలు వాహనాల వెంట పరుగులు పెడుతూ దాడి చేస్తుండటంతో ప్రమాదాలబారిన పడుతున్నామని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు నెలకు ఒకసారే మాత్రమే వీధి దీపాలకు మరమ్మతులు చేసే సంస్కృతి చాలా గ్రామాల్లో పరిపాటిగా వస్తోంది. దీనిపై ఎంపీపీ అడవికృష్ణను సంప్రదించగా వీధిదీపాల సమస్య ఉన్న చోట వెంటనే పరిష్కరించేలా పంచాయతీ కార్యదర్శులకు సూచిస్తామని తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం కాట్రేనిపాడులో ఆదివారం కోడి పందేల స్థావరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. వారినుంచి రూ.2500 నగదు, ద్విచక్ర వాహనం, కోడి పుంజు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలంలో ఎస్సై కె.శుభశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం జూద శిబిరాలపై దాడులు నిర్వహించారు. చొప్పరమెట్ల సమీపంలో అయిదుగురిని అదుపులోకి తీసుకుని వారినుంచి రూ.4,100, సింహాద్రి అప్పారావు పేటలో ఇద్దరి వద్ద రూ.4,400 నగదు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చోదకులపై కేసులు.. పెదపాడు: కలపర్రు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కట్టా శారదా సతీశ్ తెలిపారు.

ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు

కలిదిండి, న్యూస్‌టుడే : ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి శివరామమూర్తి తెలిపారు. ఏవో విద్యాసాగర్‌తో కలిసి భాస్కరరావుపేటలోని రైతు సేవాకేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకు లాగిన్ ఈ కేంద్రంలో ఉందని, ఈ ప్రాంతంలో వరి సాగు లేనందున మండల కేంద్రమైన కలిదిండి నుంచి గ్రామ వ్యవసాయ సహాయకుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. వెంకటాపురం రైతు సేవాకేంద్రం నుంచి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. మేజర్ పంచాయతీ కోరుకొల్లు నుంచి ధాన్యం సేకరించాలని ఆప్రాంత రైతులు కోరుతున్నారని, ఈ విషయాన్ని జేసీ దృష్టిలో పెడతామని వివరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

చాట్రాయి, న్యూస్‌టుడే: ప్రతి రైతుకూ మద్దతు ధర అందించేలా కూటమి ప్రభుత్వం పటిష్ఠమైన ఏర్పాట్లు చేసినట్లు తెదేపా న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు తెలిపారు. చిన్నంపేటలో ఆదివారం ఆయన రైతుల సమక్షంలో కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు తేమ శాతాన్ని సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నాయకులు కందుకూరి అప్పారావు, పరసా వెంకటేశ్వరరావు, చిన్నం పుల్లయ్య, కొమ్ము సృజనరావు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

ఆటపాక(కైకలూరు), న్యూస్‌టుడే: కైకలూరు మండలం ఆటపాక-వరహాపట్నం ప్రధాన రోడ్డు మార్గం అధ్వానంగా మారింది. మొంథా తుపాను నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలకు నీరు మరలే మార్గం లేక రోడ్డుపైనే తిష్ఠ వేసింది. దీంతో ఆటపాక శివారు ప్రాంతం, అగ్రహారం, వరహాపట్నం ప్రారంభంలో రోడ్డంతా గుంతల మయమైంది. వైకాపా ప్రభుత్వం హయాంలో ఈ రోడ్డు అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో మూడేళ్ల పాటు వాహనదారులు అవస్థల ప్రయాణం సాగించారు.

ఏడాదిలోపే ...

వీరి కష్టాలను గుర్తించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి కష్టాలకు స్వస్తి చెప్పింది. అయితే రోడ్డుకు ఇరువైపుల ఉన్న పంట కాలువ అనుబంధ కాలువలు పూడుకు పోవడంతో నీరు ముందుకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. వరహాపట్నం పంటకాలువ సమీపంలో రోడ్డుపై నేటికీ రెండు అడుగుల మేర నీరు నిలిచి మరో కాలువను తలపిస్తోంది. కైకలూరు చేరుకునేందుకు ఇదే దగ్గరి మార్గం కావడంతో కైకలూరు, కలిదిండి మండలాలకు చెందిన సుమారు 12 గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇక వరహాపట్నం- సీతనపల్లి రోడ్డు మార్గం కూడా ఇదే కోవకు వస్తుంది. దీనిపై కంకర రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. ఈ రెండు రోడ్లు మరమ్మతులు చేసి ఏడాది కూడా కాకపోవడంతో ప్రభుత్వం మరోసారి నిధుల అందిస్తుందా.. లేదా అనే మీమాంసలో అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ డీఈఈ అనిల్ కుమార్‌ను సంప్రదించగా.. తుపాను నేపథ్యంలో ఇలా జరగడంతో నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించామని, నూతన రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

గృహ యోగానికి లేదు చింత

30వ తేదీ వరకు గడువు పెంపు

అసంపూర్తిగా నిలిచిన నిర్మాణం

చాట్రాయి, న్యూస్‌టుడే: పేదలు సొంతింటి కల నెరవేర్చేందుకు అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పెంచారు. దీనిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. ఈ పథకానికి నవంబరు 5 వరకు దరఖాస్తులు స్వీకరించారు. మొంథా తుపాను ఇతర ప్రకృతి వైపరీత్యాలను దృష్టిలో పెట్టుకుని గడువు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్రం గడువును పొడిగించింది.

నియోజకవర్గంలో వివరాలు

మండలం	డిమాండ్	అర్హులు
నూజివీడు	2500	1200
చాట్రాయి	2590	1500
ఆగిరిపల్లి	1300	1100
ముసునూరు	1150	850

దరఖాస్తు ఇలా..

- ఇళ్లు లేని పేదలను సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను కలిసి అధికారిక వెబ్‌సైట్ pmay-g ద్వారా దరఖాస్తు చేయాలి.
- సొంత స్థలంలో ఇంటి పట్టా తీసుకుని ఉండాలి. లేదంటే ఈ నెలాఖరులోపు అందించేలా చూడాలి.
- ఖాళీ స్థలంలో లబ్ధిదారు ఫొటో తీసుకోవాల్సి ఉంటుంది. ఇల్లు ఉన్నట్లయితే ఫొటో జత చేయాలి. ఈ స్థలాన్ని జియో ట్యాగ్ చేస్తారు.
- వ్యక్తిగత వివరాల కింద పేరు, లింగం, ఆధార్ కార్డు, చరవాణి నంబర్లను పూరించాలి.
- బ్యాంకు ఖాతా నంబరు, పేరు నమోదు, నరేగా జాబ్‌కార్డు నంబరు వివరాలు అందించాలి. ఆధార్ నంబరును ఉపయోగించే అధికారం ఇవ్వడానికి సమ్మతి పత్రం అప్‌లోడ్ చేయాలి.
- గృహ నిర్మాణ సంస్థ వద్ద ఉన్న డిమాండ్ జాబితాలోని ఇళ్లను అధికారులు సందర్శించి పరిశీలిస్తారు. ఆపై అర్హుల జాబితా సిద్ధం చేస్తారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పార్వతమ్మను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

సందడిగా వనసమారాధన

నూజివీడు, ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: నూజివీడులో నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘ వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ అధ్యక్షతన నూజివీడు నియోజకవర్గ సంఘ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆగిరిపల్లికి చెందిన అరిగే పిచ్చయ్యాచారి, కార్యదర్శిగా నూజివీడుకు చెందిన బెజ్జంకి గంగాధర్ ఎన్నికయ్యారు.

నిర్యాణము



జననం 15-07-1939

మరణం 09-11-2025

శ్రీ RGKV ప్రసాద్ గారు

Rtd: Loyola College Lecturer

మా తండ్రిగారు ది. 09-11-2025 ఆదివారం ఉదయం 6 గం॥ లకు స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము. శోకతప్త హృదయాలతో...

కుమారుడు: R.S. ప్రవీణ్ మరియు కుటుంబసభ్యులు

అంతిమయాత్ర: ది.11-11-2025 మంగళవారం ఉదయం 10.గం.లకు విజయవాడ సాయిబాబాగుడి రోడ్డు, RTC కాలనీ 1వలైన్, అరుణ అపార్ట్‌మెంట్స్‌లోని మా స్వగృహము నుండి బయలుదేరును. ✆ 98494 71909

(c) eenadu

స్వాతంత్ర్యోద్యమ సమయంలో మహాత్మాగాంధీ సేదదీరిన నివాసం

ఔరా

శ్రీమంతుల ఊరు.. వేళంగి దాని పేరు

ఈ ఊరిలో ఏ ఇంటిని చూసినా అరెకరా నుంచి ఎకరా విస్తీర్ణంలో రాజభవంతులను పోలి ఉంటాయి. చాలావరకు స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించినవే ఉంటాయిక్కడ. వీటన్నింటికీ కాకినాడ జిల్లా కరప మండలంలోని వేళంగి గ్రామం నిలయంగా ఉండడం ప్రత్యేకత. ఈ గ్రామంలో దాదాపు అంతా 100 ఎకరాలు పైబడిన భూస్వాములే ఉంటారు. గతంలో ఇక్కడి ప్రజలు ఎక్కువగా వడ్డీ వ్యాపారాలు చేస్తుండేవారు. తాము సంపాదించిందంతా భూములు కొనేందుకు, విశాల గృహ నిర్మాణాలకే వెచ్చించడంతో ఊరే ప్రత్యేకమైంది. ప్రస్తుతం మాత్రం ఆయా ఇళ్లను పనివాళ్లకు, భూములను కౌళ్లకు ఇచ్చి.. యజమానులంతా ఇతర నగరాల్లో ఉంటున్నారు. దసరా, సంక్రాంతిలాంటి ప్రధాన పండగలకు వచ్చి వెళ్తుంటారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో జాతిపిత మహాత్మాగాంధీ ఇక్కడకు వచ్చి బస చేసిన నివాసం గ్రామంలో ఇప్పటికీ పదిలంగా ఉండటం విశేషం.

- ఈనాడు, కాకినాడ-న్యూస్‌టుడే, కరప

ఓ నివాసం లోపల కలపతో ఇలా..

త్రయంబకేశ్వరుడికి అన్నాభిషేకం

కాకినాడ అర్బన్ ఆర్టీసీ కాలనీ ఆలయ సముదాయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తిక మాసం పురస్కరించుకుని పార్వతీ సమేత త్రయంబకేశ్వరస్వామి వారికి అలంకరణ చేశారు. ప్రధాన అర్చకులు చైతన్య, ఆలయ కమిటీ ఛైర్మన్ ఇంటి నందిబాబు దంపతుల ఆధ్వర్యంలో అన్నాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు కమిటీ ప్రతినిధులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. - న్యూస్‌టుడే, సర్పవరం

మీ బస్సు భద్రమేనా..!

మరోసారి తనిఖీలకు ఆదేశం

ఈనాడు, కాకినాడ: కర్నూలు బస్సు ప్రమాదం తర్వాత రవాణాశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా మీదుగా ప్రయాణించే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులన్నింటినీ తనిఖీలు చేసి 30 వరకు కేసులు నమోదు చేశారు. ఎనిమిది బస్సులు సీజ్ చేశారు. తాజాగా బడి బస్సుల భద్రతపై మరోసారి తనిఖీలకు సిద్ధమవుతున్నారు. అయితే బడి బస్సులను తనిఖీల పేరుతో ఒకేసారి నిలిపితే ఇబ్బందులు వస్తాయని ముందుగా ఆయా యాజమాన్యాలు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. బస్సులో ఉండాల్సిన సదుపాయాలు వివరించారు. లోపాలను వారే గుర్తించి 15 రోజుల్లో సరిదిద్దుకునే అవకాశం ఇచ్చారు.

రవాణాశాఖ కార్యాలయంలో బడి బస్సు యాజమాన్య ప్రతినిధులు, డ్రైవర్లకు సూచనలు చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

తప్పనిసరిగా అమలు చేయాల్సిందే..

● బస్సులో ప్రవేశ ద్వారానికి వ్యతిరేక దిశలో అత్యవసర ద్వారం ఉండాలి. ఆ తలుపును లోపల, బయట నుంచి తెరిచే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. కిటికీల వద్ద అత్యవసర సమయంలో అద్దాలను పగలుగొట్టేందుకు వీలుగా సుత్తిని అమర్చుకోవాలి. ● బడి బస్సు 60 కి.మీ వేగం మించి వెళ్లకుండా లాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి. ● 2019కు ముందు తయారైన బడి బస్సులో అగ్ని ప్రమాదాన్ని గుర్తించే పరికరాలు, అప్రమత్తం చేసే వ్యవస్థ ఉండాలి. ● 2020 తర్వాత తయారైన బస్సుల్లో ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లోను, 2023 తర్వాత తయారీ బస్సుల్లో ఇంజిన్‌తో పాటు ప్రయాణికుల కంపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాదం గుర్తించడంతో పాటు వాటిని నియంత్రించే వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి. ● ప్రతి బస్సులో రెండు అగ్నిమాపక నియంత్రణ పరికరాలుండాలి. హ్యాండ్ బ్రేక్, సర్వీస్ బ్రేక్ వర్కింగ్‌లో ఉండాలి. ● బస్సు పైభాగంలో నలువైపులా నాలుగుచోట్ల ఫ్లాషింగ్ లైట్లు ఉండాలి.

'జిల్లాలో 1200 పాఠశాల, కళాశాల బస్సులున్నాయి. వాటిలో విద్యార్థులు భద్రత కోసం రవాణశాఖ సూచించిన అంశాలన్నింటిని అమలుచేయాల్సిందే లేకుంటే రోడ్లపైకి అనుమతించే పరిస్థితి ఉండదు' అని రవాణాశాఖ ఉప కమిషనర్ శ్రీధర్ చెప్పారు.

షికారు.. ఉత్సాహం జోరు

కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రంలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. పిల్లలు, పెద్దలు, విద్యార్థులు చెక్కల వంతెనలపై నడుచుకుంటూ మడ అడవులను సందర్శించారు. ఊయల ఊగుతూ, జారుడు బల్లలపై జారుతూ ఉల్లాసంగా గడిపారు. సముద్ర మొగ వరకు ఏడు నిమిషాల పాటు స్పీడ్ బోటులో కొందరు పర్యాటకులు షికారు చేశారు.

-న్యూస్‌టుడే, తాళ్లరేవు

నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌కు రాలేనివారు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదులు దాఖలు చేయవచ్చని తెలిపారు.

వనిత

రూ.2 వేల కోట్ల పారిశ్రామిక వేత్త..!

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

కాకినాడ నగరంలో ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్

జిల్లాలోని డ్వాక్రా సంఘాలు ఏడాదిలో రూ.2 వేల కోట్ల ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. బ్యాంకు లింకేజీ, ప్రభుత్వ పథకాల సహకారంతో స్వయం ఉపాధిపొందుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది డ్వాక్రా మహిళలు అవకాశాలు వినియోగించుకుంటూ ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు. బ్యాంకు రుణాల మంజూరు, చెల్లింపుల్లో ఆర్థిక అక్షరాస్యతవైపు అడుగులేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో డీఆర్‌డీఏ-సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. గతేడాది రూ.1,800 కోట్ల వరకు రుణాలు కల్పించగా, పెద్ద సంఖ్యలో మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పి, మినీ పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలోని 385 గ్రామాల్లోని డ్వాక్రా సంఘాల సభ్యులు, కాకినాడ నగరం, పెద్దాపురం, పిఠాపురం, తుని, సామర్లకోట, ఏలేశ్వరం, గొల్లప్రోలు పట్టణ స్థానిక సంస్థల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళాశక్తిని చాటుతున్నారు.

వివరాలు ఇలా..	గ్రామీణం	పట్టణాలు
డ్వాక్రా సంఘాలు	39,980	12,736
మహిళలు సంఖ్య	3,99,800	1,27,360
బ్యాంకు లింకేజీ రుణం	రూ.7,100 కోట్లు	రూ.250 కోట్లు

మరిందరికి ఉపాధి..

● పిఠాపురం మండలం కందరాడలో జయంతి డ్వాక్రా సంఘ సభ్యురాలు గనిలక్ష్మి 20 ఏళ్ల కిందట డ్వాక్రా సభ్యురాలిగా చేరారు. బ్యాంకు రుణం, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రుణం పొంది మినీ పారిశ్రామికవేత్తగా ఎదిగారు. ఏడాదికి రూ.15 లక్షల టర్నోవర్ చేస్తూ వ్యాపారం విస్తరించారు. ఇక్కడ 30 మంది మహిళలకు రోజూ పని కల్పిస్తున్నారు.

● తుని మండలం డి.పోలవరంలో రామలక్ష్మి గ్రూప్ సభ్యురాలు పి.ధనలక్ష్మి 18 ఏళ్లుగా దీపారాధన వత్తుల తయారీ యూనిట్ నిర్వహిస్తూ 100 మందికి పని కల్పిస్తున్నారు. ఏటా రూ.70 లక్షల వరకు టర్నోవర్ చేస్తున్నారు.

● కాకినాడ నగరంలో శ్రీసాయి బాలాజీ మహిళా స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను నిర్వహిస్తున్నారు. 20 మందికి ఉపాధి కల్పిస్తూ.. సాలీనా రూ.20 లక్షల టర్నోవర్ చేస్తున్నారు.

యువత

నైపుణ్యంతో ఉజ్వల భవిత

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, గాంధీనగర్

కళాశాలల్లో చదువుకు.. పరిశ్రమల్లో అవసరాలకు అంతరం పెరిగిపోవడంతో యువత ఉద్యోగావకాశాలను అందుకోలేకపోతోంది. విద్యార్థి దశలోనే నైపుణ్యం సాధించేలా తీర్చిదిద్దగలిగితే వారి భవితకు బంగారుబాట వేసినట్లే. ఆ దిశగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రధాన మంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయిబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐ (పీఎం సేతు) పథకాన్ని గత నెలలో అమల్లోకి తీసుకువచ్చారు. తొలివిడత దేశవ్యాప్తంగా 15 ఐటీఐలను ఉన్నతీకరించేందుకు ఎంపిక చేశారు. రెండో విడత జాబితా కూడా సిద్ధం చేశారు. అందులో కాకినాడ ప్రభుత్వ ఐటీఐకి చోటు కల్పించడం విశేషం.

ఐటీఐలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ట్రేడ్‌లు	13
రెండేళ్ల కోర్సులు	9
ఒక ఏడాది వ్యవధి కోర్సులు	4
విద్యార్థుల సంఖ్య	640

హబ్ ఐటీఐ ఏర్పాటుకు వ్యయం	స్పోక్ ఐటీఐ అభివృద్ధికి ఖర్చు
రూ.92 కోట్లు	రూ.40 లక్షలు

ప్రభుత్వ ఐటీఐలో సాంకేతిక అంశాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

సమకూరనున్న ప్రయోజనాలు ఇవీ..

కాకినాడ ప్రభుత్వ ఐటీఐ హబ్‌గా అవతరించబోతోంది. దీనిలో ప్రభుత్వాలతో పాటు ఒక పెద్ద పరిశ్రమ(యాంకర్ ఇండస్ట్రీ)ను భాగస్వామ్యం చేస్తారు. పరిశ్రమలకు తగ్గ కొత్త కోర్సులను అందుబాటులోకి తెస్తారు. ఐటీఐలో బోధన, ప్రయోగాలు, అత్యాధునిక పరికరాలు, ఇతర కళాశాలలు, కంపెనీలతో అనుసంధానం అయ్యేలా నెట్‌వర్క్ అభివృద్ధికి భారీగా నిధులు వెచ్చించనున్నారు.

నాలుగు కొత్త కోర్సులకు అవకాశం..

హబ్ ఐటీఐలో అదనంగా నాలుగు కొత్త కోర్సులు ప్రవేశపెడతారు. దాంతో 80 సీట్లు పెరుగుతాయి. డ్రోన్ టెక్నాలజీ, సోలార్ ప్యానల్స్ తదితర కోర్సులు తెస్తారు. కాకినాడలో ఓఎన్‌జీసీ, రిలయన్స్ వంటి సంస్థలను యాంకర్ ఇండస్ట్రీలుగా గుర్తించే అవకాశం ఉంది.

నాలుగు స్పోక్ ఐటీఐలు..

కాకినాడ ప్రభుత్వ ఐటీఐకి అనుబంధంగా నాలుగు ఐటీఐలను ఉన్నతీకరించనున్నారు. అందులో జగ్గంపేటకు చోటు దక్కింది. ఇక్కడ కొత్తగా రెండేసి కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తారు. మౌలిక సదుపాయాలు మెరుగుపర్చనున్నారు.

మంచి భవిష్యత్తు..

పీఎం సేతు పథకం ద్వారా ఐటీఐలకు మంచి భవిష్యత్తు ఉంటుంది. ఈ ఏడాది నుంచి హబ్, స్పోక్ ఐటీఐల పేరుతో ఉన్నతీకరించి ఉద్యోగ విద్యను నేర్పించడమేకాదు ఉపాధి అవకాశాలను కల్పించే కార్యాలయాలుగా అభివృద్ధి చేయడం చాలా మంచి ఆలోచన.

- వేణుగోపాలవర్మ, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల



శబరిమల.. నమూనా భళా..

శబరిమలలోని అయ్యప్ప ఆలయంలా కనిపిస్తున్న ఇది కొత్తపల్లిలో ఉంది. గ్రామస్థుడైన వడ్రంగం మేస్త్రీ పట్నాల సీతాంబరం 26 రోజులపాటు శ్రమించి చెక్కతో దీనికి రూపమిచ్చారు. మరో విశేషం ఏంటంటే.. స్వాములు ఎక్కడ పడిపూజ పెట్టుకున్నా.. అక్కడికి దీనిని తీసుకువెళ్లేలా చక్రాలు అమర్చారు. అయ్యప్ప ఆలయం, పద్దెనిమిది మెట్లు, రెండు వైపులా వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరి, ఈశ్వరుడి ఆలయాలు, ఎదురుగా ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఆలయ నమూనాతో పూజలు నిర్వహించేందుకు భక్తులు, మాలధారులు పోటీపడుతున్నారు. - న్యూస్‌టుడే, కొత్తపల్లి

బుడత

కొత్తగా మెనూ.. తృప్తిగా తినూ..

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి విద్యార్థుల ఆదరణ పెరుగుతోంది. రోజురోజుకూ పాఠశాలల్లో భోజనం తినే పిల్లల సంఖ్య పెరుగుతోంది. గత వైకాపా ప్రభుత్వంలో బడుల్లో అమలు చేసే భోజన పథకంపై తీవ్ర అలసత్వం నెలకొంది. నిధులు సరిపోకపోగా, నాసిరకం బియ్యం ఇవ్వడంతో సరిగా ఉడక్క పిల్లలు తినేవారు కాదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మెనూ ఛార్జీలు పెంచటంతోపాటు సన్న బియ్యం అందిస్తుండడంతోపాటు స్థానిక వంటకాలతో పిల్లలకు రుచిగా భోజనం వండి వడ్డిస్తున్నారు. ఫలితంగా బడుల్లో భోజనాలు చేసేవారి సంఖ్య గతంలో పోలిస్తే మరింత మెరుగుపడింది.

– న్యూస్‌టుడే, కాకినాడ నగరం

గతంలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు భోజనానికి రూ.5.45 చొప్పున ఇచ్చేవారు. దానిని ఇప్పుడు రూ.6.19కు పెంచారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.8.17 ఉండగా, దానిని రూ.9.29కు పెంచారు. జిల్లాలను జోన్‌లుగా విభజించి స్థానిక పరిస్థితులను బట్టి మెనూ అమలు చేసుకునే స్వేచ్ఛ కల్పించారు. దాంతో స్థానికంగా అందుబాటులో ఉండే కూరగాయలు, ఇతర సామగ్రితో రుచికరమైన భోజనాన్ని పాఠశాలల్లో వడ్డిస్తున్నారు. దాంతో గత ప్రభుత్వంలో పాఠశాలల్లో భోజనం తినేవారు 65 నుంచి 70 శాతం ఉండగా ప్రస్తుతం 92 శాతం మంది తింటున్నారు.

జిల్లా విద్యా వ్యవస్థ ఇదీ..

ప్రాథమిక పాఠశాలలు	1,259
ప్రాథమికోన్నత పాఠశాలలు	104
ఉన్నత పాఠశాలలు	256
మొత్తం విద్యార్థులు	1,0,20,99
బడులకు హాజరయ్యే విద్యార్థులు (సగటున)	99,811
భోజనం తినేవారి సంఖ్య	91,702

పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరీక్షిస్తున్న విద్యాశాఖ ఏడీ షరీఫ్

నిరంతర పర్యవేక్షణ..

మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యాశాఖ నిరంతరం పర్యవేక్షణ చేస్తోంది. డీఈవో నుంచి ఎంఈవోల వరకు నిత్యం ఏదో ఒక పాఠశాలను సందర్శించి అక్కడి మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును పరీక్షించేలా ఆదేశాలిచ్చారు.

పథకం ఫలిస్తోంది..

ప్రభుత్వ బడుల్లో భోజనం చేసే పిల్లల సంఖ్య మెరుగ్గానేఉంది. గతంలో పోలిస్తే భోజనం తినేవారి సంఖ్య పెరిగింది. ఇందుకు ప్రభుత్వ ప్రోత్సాహమే కారణం. నాణ్యమైన బియ్యం అందించటం, మెనూ ఛార్జీలు పెంచటం ఇందుకు దోహదపడింది. మొత్తానికి పథకం చక్కని ఫలితాలు ఇస్తోంది.

– పిల్లి రమేష్, డీఈవో, కాకినాడ

అనుమానితులు కనిపిస్తే చెప్పండి

పిఠాపురం: పిఠాపురంలో పోలీసులు ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం, డ్రోన్ కెమెరాలతో తెల్లవారుజామునే ఇంటింటా సోదాలు చేశారు. పత్రాలులేని 45 ద్విచక్ర వాహనాలు, ఒక వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. అనుమానితులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

జిల్లాలో పంట కాలువలకు 42 గండ్లు

గొల్లప్రోలు: తుపాను, ఏలేరు వరద కారణంగా జిల్లాలోని పంట కాలువలకు 42 గండ్లు పడినట్లు జలవనరులశాఖ ఈఈ శేషగిరిరావు తెలిపారు. గండ్లు తాత్కాలికంగా పూడ్చేందుకు రూ.2.44 కోట్లు, పూర్తి మరమ్మతులకు రూ.21.38 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. గొల్లప్రోలు, కిర్లంపూడి, యు.కొత్తపల్లి, తొండంగి, పిఠాపురం, పెదపూడి మండలాల్లోని గ్రామాల్లో కాలువలకు పనులు చేపట్టాల్సిఉందన్నారు.

నివేదన సమయం కుదింపు

ద్రాక్షారామ: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో నివేదన సమయాన్ని అరగంట కుదిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో దుర్గాభవానీ తెలిపారు. నిత్యం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2.30 గంటల వరకు నివేదనకు ఆలయ తలుపులు మూసివేస్తామన్నారు. పర్వదినాల్లో నివేదనకు అధిక సమయం ఆలయాన్ని మూసివేయడంపై భక్తుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆదివారం దూరప్రాంతాల నుంచి వేలాది మంది స్వామి వారి దర్శనానికి తరలివచ్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు నివేదన కోసం తలుపులు మూసివేయడంతో ఒక భక్తుడు దేవాదాయశాఖ మంత్రికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

బాల్ ఇదిగో.. గోల్ అదిగో..

కార్తిక మాసంలో మహిళలు పూజలే కాదు.. ఇలా ఆటలూ ఆడారు. బాస్కెట్‌లో బాల్ వేసి తమ సత్తా చాటారు. ఒకరి తరువాత మరొకరు ఆటలో ఆనందం పంచుకున్నారు. కాకినాడ గ్రామీణం శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి-పెనుమర్తి మార్గంలోని మామిడి తోటలో ఆదివారం నిర్వహించిన కార్తిక వనసమారాధనలో సరదా చిత్రమిది. - ఈనాడు, కాకినాడ

స్ఫూర్తి

సెలవున శ్రమదానం.. సుందర ఉద్యానం

– న్యూస్‌టుడే, సర్పవరం

ఉద్యానం బాలేదని ఊరుకోలేదు. కాలనీవాసులంతా కలిసి కదిలారు. శ్రమదానంతో శుభ్రంగా మార్చారు. ఆకర్షణీయంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. అంతే ప్రస్తుతం కాకినాడ రెండో డివిజన్ పరిధి దుర్గా విద్యుత్తునగర్‌లోని ఝాన్సీ లక్ష్మీబాయి ఉద్యానంలో సొంత నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించారు. స్థానిక రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల చొరవ ఇతరులందరికీ ఆహ్లాదం పంచుతోంది. అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి వీవీఎస్ మూర్తి, కోశాధికారి ఎస్ఆర్‌కే రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.భాస్కర్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ప్రతి ఆదివారం కాలనీలోని ఉద్యానంలో మూడు గంటల పాటు శ్రమదానం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. బెంచీలకు చిన్నారులు, పెద్దలు కలిసి రంగులేశారు. ఆట వస్తువులు బాగు చేయించారు. వాకింగ్ ట్రాక్‌లో గ్రావెల్, ఇసుక వేయించారు. షటిల్ బ్యాడ్మింటన్ కోర్టుతోపాటు యోగాంధ్ర స్ఫూర్తితో వేదిక నిర్మాణం చేపట్టగా మహిళలు నేర్చుకుంటున్నారు. పార్కును కాకినాడ నగరంలోనే ఆదర్శ ఉద్యానంగా తీర్చిదిద్దుతామని కాలనీ సంఘ కార్యదర్శి మూర్తి వివరించారు.

వేదికపై యోగా సాధనలో మహిళలు

భక్తజనులకు ఆహ్వానము

కాకినాడలోని భానుగుడి వద్ద గల శ్రీ అయ్యప్ప స్వామివారి దేవాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన శ్రీ వారాహి అమ్మవారికి నేటి నుండి ప్రత్యేక పూజలను నిర్వహించుచున్నాము. అంతేగాక పవిత్రమైన ఈ కార్తీక మాసంలో ప్రతిభక్తుడు ప్రతీరోజు తమ స్వహస్తాలతో స్ఫటిక లింగానికి "జలాభిషేకం" చేసుకునే అవకాశమును కల్పించుచున్నాము. కావున భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భగవదనుగ్రహాన్ని పొందాలని కాంక్షిస్తూ... మీ అందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నాము.

ఇట్లు: వేలు గురుస్వామి, నాట్యాచార్య డా॥ కృష్ణకుమార్ & పిల్లి కృష్ణకళ్యాణ్ స్వామి



(c) eenadu

సత్యదేవుని సన్నిధిలో పోటెత్తిన భక్తులు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని సన్నిధి భక్తులతో పోటెత్తింది. పవిత్ర కార్తిక మాసం ఆదివారం కావడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. రద్దీ నేపథ్యంలో తెల్లవారు జామున ఒంటిగంట నుంచే వ్రతాలు, సర్వ దర్శనాలు ప్రారంభించారు. ఉదయం 8 గంటల తర్వాత రద్దీ పెరిగింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రత్న, సత్య గిరులపై ఉన్న పార్కింగ్ స్థలాలు ఎటూ సరిపోలేదు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కొండ దిగువన కళాశాల ప్రాంగణంలో వాహనాలు నిలిపివేశారు. అక్కడ నుంచి దేవస్థానం బస్సుల్లో భక్తులను కొండపైకి తరలించారు. అంతరాలయం, యంత్రాలయం దర్శనాలు కూడా అధికారులు నిలిపివేశారు. రూ.300 వ్రత మండపాల ప్రాకారంలో క్యూలైన్ల నిర్వహణ సరిగాలేక గందరగోళం ఏర్పడింది. రూ.1,000 వ్రత మండపాల క్యూలైన్ల వద్ద తాగునీటి సరఫరా సరిగా జరగలేదు. ఛైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు ఆలయ ప్రాంగణాల్లో పరిశీలన చేశారు. సోమవారం దేవస్థానంలో రద్దీ ఉండే అవకాశమున్న నేపథ్యంలో వసతి గదులకు డిమాండ్ పెరగనుంది.

రెవెన్యూ క్రీడల్లో జిల్లా జట్టు ప్రతిభ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) 7వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ చూపాయి. ఈ నెల 7, 8, 9 తేదీల్లో అనంతపురంలో నిర్వహించిన పోటీలకు జిల్లా నుంచి 60 మంది రెవెన్యూ ఉద్యోగులు వివిధ క్రీడాంశాల్లో ప్రాతినిధ్యం వహించారు. జిల్లా జట్టు ప్రతిభచూపి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచాయి. ఆదివారం అనంతపురంలో పతకాలు అందుకున్నారు. వారిని కలెక్టర్ షాన్‌మోహన్, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథరావు, కార్యదర్శి సాధనాల రామ్మోహనరావు అభినందించారు.

సాధించిన పతకాలు, జ్ఞాపికలతో కాకినాడ జిల్లా రెవెన్యూ ఉద్యోగులు

70 ఏళ్ల వయసు.. తలలు రెండు

సాధారణంగా కొబ్బరి, తాటి చెట్టు ఒక తలతో నిటారుగా పెరగటం చూస్తుంటాం.. కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఎదురుగా సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి స్థలంలో ఉన్న కొబ్బరి చెట్టుకు మాత్రం రెండు తలలు ఉండటం విశేషం. దీంతో ఆ మార్గంలో వెళ్లే ప్రజలు ఈ కొబ్బరి చెట్టును ఆసక్తిగా తిలకిస్తున్నారు. మొదట్లో ఒక తలతో ఉన్న ఈ చెట్టుకు కొంత వయసు వచ్చిన తరువాత మరో తల వచ్చిందని, ప్రస్తుతం దీని వయస్సు 70 ఏళ్లు అంటూ సదరు స్థల యజమాని తెలిపారు.

– ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, కరప

అవయవదానంతో మరొకరికి జీవితం

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ తదితరులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: అవయవదానం ద్వారా మరొకరి జీవితాన్ని కాపాడటం అత్యున్నత సేవ అని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం జీవన్‌దాన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడలో 'అవయవ దానమే జీవనదానం' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్థానిక అపోలో ఆసుపత్రి నుంచి వందలాది మంది వైద్యులు, నర్సులు, విద్యార్థులు, సామాజిక సేవకులు, ప్రజలు వాకథాన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, గౌరవ అతిథులుగా ఎమ్మెల్సీ పద్మశ్రీ, ప్రత్యేక ఆహ్వానితులుగా ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డా. ఎ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. లావణ్యకుమారి, హెల్త్ వర్సిటీ మాజీ వీసీ డా.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, అవయవదాత కుటుంబాలకు సన్మానాలు, అవగాహన ప్రసంగాలు జరిగాయి. డా. కె.రాంబాబు, ట్రస్ట్ ఆసుపత్రి వైద్యులు డా. రామకృష్ణ, డా.సోమయాజులు, శుభాకర్, డా.జీవీరావు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు

ఈ నెల 11 నుంచి వైకల్య నిర్ధారణ పరీక్షలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: వైకల్యంతో బాధపడుతున్న పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు అందించేందుకు సమగ్ర శిక్షా అధికారులు చర్యలు చేపట్టారు. వారి వైకల్యాన్ని బట్టి వారికి అవసరమయ్యే సామగ్రి పంపిణీ చేస్తారు. ఇందుకోసం ఈ నెల 11 నుంచి జిల్లాలో వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు.

అర్హులు: ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు.

ఏం ఇస్తారంటే: వీల్‌ఛైర్లు, మోటారు ట్రైసైకిళ్లు, చంక కర్రలు, బ్రెయిలీ కిట్లు, ఎంఆర్ కిట్లు, వినికిడి యంత్రాలు

కావాల్సిన పత్రాలు: ఆధార్ కార్డు, సదరం ధ్రువపత్రం, యూడీఐడీ కార్డు, రేషన్ కార్డు, కుల,ఆదాయ ధ్రువపత్రాలు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం (పాత చిత్రం)

సద్వినియోగం చేసుకోవాలి

వైకల్య నిర్ధారణ పరీక్షలు చేసి, అర్హులైన వారికి రూ.5వేల నుంచి రూ.30 వేలకు పైగా విలువ చేసే ఉపకరణాలను ఉచితంగా అందిస్తాం. తల్లిదండ్రులు తమ పిల్లలను వైకల్య నిర్ధరణ కేంద్రాలను తీసుకురావాలి. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. - పి.వేణుగోపాలరావు (సమగ్ర శిక్ష ఏపీసీ), గిరిప్రసాద్ (సహిత విద్య జిల్లా సమన్వయకర్త)

ఏ మండలాలకు ఎక్కడ పరీక్షలు చేస్తారంటే..

11న.. కాజులూరు, కరప, కాకినాడ అర్బన్, కాకినాడ గ్రామీణం, పెదపూడి: కాకినాడ వాదు రోడ్డులోని పగోడ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రం

12న.. గొల్లప్రోలు, పిఠాపురం, యు.కొత్తపల్లి, పెద్దాపురం, సామర్లకోట: బీసీబార్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, పిఠాపురం

13న.. కోటనందూరు, తుని, రౌతులపూడి, తొండంగి, శంఖవరం: జడ్పీ బాలికోన్నత పాఠశాల, తుని

14న.. గండేపల్లి, జగ్గంపేట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి: జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రత్తిపాడు

ప్రతిభచూపిన వారికి జ్ఞాపికలు అందిస్తున్న ఆర్జేడీ నాగమణి

పాఠశాల స్థాయి నుంచే వృత్తి నైపుణ్యాలు

కాకినాడ నగరం: పాఠశాల స్థాయి నుంచే వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని పాఠశాల విద్య ఆర్జేడీ నాగమణి అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో వృత్తి విద్య కోర్సులు అందిస్తున్న 44 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఆదివారం నైపుణ్య పోటీలు నిర్వహించారు. స్థానిక గాంధీనగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో పోటీలను డీఈవో రమేష్ ప్రారంభించారు. 360 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చాటిన 10 మందిని ఈ నెల 21 విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఏపీసీ వేణుగోపాలరావు, జీసీడీవో ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కరదీపిక... బోధన సులువిక

ఉపాధ్యాయులకు పాఠ్యప్రణాళిక పుస్తకాలు పంపిణీ

గండేపల్లి, న్యూస్‌టుడే: కూటమి రాకతో విద్యావ్యవస్థ శరవేగంగా ప్రగతిపథాన దూసుకెళుతోంది. గతంలో ఉపాధ్యాయులు ఎప్పుడు ఏ పాఠాన్ని బోధించాలో తామే పాఠ్యప్రణాళిక సిద్ధం చేసుకుని ఆ దిశగా సిలబస్‌ను పూర్తిచేసేవారు. కూటమి ప్రభుత్వం కూడా ఆ రీతిలో ఎస్ఈఆర్టీ సహాయంతో సమగ్ర శిక్ష ద్వారా సబ్జెక్టు వారీగా కరదీపిక (టీచర్ హ్యాండ్ పుస్తకాలు) తయారుచేసింది.

కరదీపిక పుస్తకాలను చూపుతున్న ఉపాధ్యాయులు

సమయం వృథా కాదు..

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అన్ని తరగతులకు సబ్జెక్టుల వారీగా పుస్తకాలు ఈ విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయులకు అందజేశారు. ప్రస్తుత విద్యావ్యవస్థలో ఈ కరదీపిక పుస్తకాల ద్వారానే ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్నారు. ఈ విధానంతో జ్ఞాన, బోధనా నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు, సరైన బోధన పద్ధతిలో బోధించేందుకు ఈ విధానం దోహదం చేస్తుంది.

కాకినాడ జిల్లాలో ఇలా..

ప్రాథమిక పాఠశాలలు:1,109

ప్రాథమికోన్నత పాఠశాలలు:253

ఉన్నత పాఠశాలలు:525

విద్యార్థులు:2,87,477

ఉపాధ్యాయులు:7,081

ఉత్తమ బోధనకు ప్రాధాన్యం

ఈ విద్యాసంవత్సరం నుంచి ఏ రోజున ఏం బోధించాలో తరగతులు, సబ్జెక్టుల వారీగా ఈ కరదీపిక పుస్తకాలు వచ్చాయి. వీటికి అనుగుణంగా ప్రస్తుతం ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు.

- కేవీవీ సత్యనారాయణ, డీవైఈవో కాకినాడ

దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు కొనసాగిస్తాం

శెట్టిబలిజ కార్తిక వనసమారాధనలో మంత్రి సుభాష్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: శెట్టిబలిజల జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళతామని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాకినాడలోని మెక్లారిన్ పాఠశాల ఆవరణలో జిల్లా శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి సంఘ నాయకులతో కలిసి దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శెట్టిబలిజ సోదరుల మధ్య ఆత్మీయ ఐక్యత కోసమే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా సంఘీయుల్లో నిరుపేద విద్యార్థుల చదువుకు తాను వ్యక్తిగతంగా సహకరిస్తారన్నారు. బీసీలను రాజకీయంగా ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పార్టీలు, వర్గాలకు అతీతంగా సోదరభావంతో ఇలాంటి కార్యక్రమాలు జరుపుకోవటం మంచిదన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, నాయకులు పిల్లి సత్తిబాబు, నులకుర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా, డా. చప్పిడి వెంకటేశ్వరరావు, మేడిశెట్టి శేషరావు, గుత్తుల శ్రీనివాస్, వాసంశెట్టి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌ను గజమాలతో సత్కరిస్తున్న సంఘీయులు

బాధితులకు అండగా 'పోక్సో ఈ-బాక్స్'

న్యూస్‌టుడే, తుని

రోజూ ఏదోఒక చోట మైనర్లపై లైంగిక దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయి. అనేక మంది వివిధ కారణాలతో ఫిర్యాదు చేసేందుకు ముందుకురారు. దీంతో కొందరు తప్పుచేసినా తప్పించుకుని తిరుగుతూ, మరొకరిని ఇబ్బంది పెడుతున్నారు. ఇలాంటి సంఘటనలను నిలువరించేందుకు బాధితులు, ఫిర్యాదుదార్ల వివరాల్లో గోప్యత పాటిస్తూ కేంద్ర ప్రభుత్వం 'పోక్సో ఈ-బాక్స్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.



యాప్ ముఖచిత్రం

మీ కోసం

ఫిర్యాదు చేయొచ్చు ఇలా..

ఆండ్రాయిడ్ ఫోన్లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి 'పోక్సో ఈ-బాక్స్' యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి. తర్వాత ఎరుపు రంగులో ఉండే బటన్‌పై క్లిక్ చేయాలి. దీనిలో షాపు, రోడ్డు, ప్లేగ్రౌండ్, స్కూలు ఇలా అనేక వివరాలతో ఉన్న ఆరు బాక్సులు కనిపిస్తాయి. బాధితులు తమకు కలిగిన ఇబ్బందికి సంబంధించిన అంశంపై క్లిక్ చేసి పేరు, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడీ నమోదు చేసి జరిగిన సంఘటన వివరాలు పొందుపరచాలి.

దిల్లీ నుంచి ప్రత్యేక పర్యవేక్షణ

జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో ఈ యాప్ పని చేస్తుంది. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను దిల్లీలోని ప్రత్యేక బృందం పర్యవేక్షిస్తుంది. ఘటనకు సంబంధించి రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారులకు సమాచారం ఇస్తారు. అనంతరం పారదర్శకంగా విచారణ చేసి, నేరం చేసిన వారిపై కేసులు నమోదు చేసి, శిక్ష పడేలా చూస్తారు.

పంచ్ పడితే పతకమే

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ జూనియర్ కళాశాలలో కాకినాడ జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పోటీల్లో 300 మంది క్రీడాకారులు తలపడ్డారు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలను బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, పోటీల నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు, రగ్బీ అసోసియేషన్ ఛైర్మన్ వియ్యపు రామన్నరాజు ప్రారంభించారు. పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా పిఠాపురం (ప్రథమ స్థానం), కరప మండలం భావారం (ద్వితీయ స్థానం), పత్తిపాడు మండలం కత్తిపూడి (తృతీయస్థానం)లో నిలిచాయి. వారికి బహుమతులను ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా లోవరాజు, శివప్రసాద్, అచ్చురాజు, సతీష్ వ్యవహరించారు.

బాక్సింగ్ పోటీల్లో తలపడుతున్న బాలికలు

వాడపల్లి క్షేత్రంలో నేటి పూజలు

● వాడపల్లిలో సోమవారం ఉదయం 5 గంటలకు ప్రభాతసేవ, మేలుకొలుపు, వేంకటేశ్వర సహిత లక్ష్మీఐశ్వర్య హోమం, ద్రవిడ వేదపారాయణం, నివేదన. ● 6 గంటలకు గోపూజ, అష్టోత్తర నామార్చన పూజలు, దర్శనాలు ప్రారంభం. 11 గంటలకు నిత్య కల్యాణం,

తెలిసిన యువకుడే చంపేశాడు

బాలిక రంజిత కేసులో వీడిన మిస్టరీ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: డా. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణం త్యాగరాజునగర్‌లో బాలిక చిర్రా రంజిత (10) మృతి కేసులో మిస్టరీ వీడింది. ఆ కుటుంబానికి తెలిసిన ఎలక్ట్రీషియన్, యూట్యూబర్.. రామచంద్రపురం మండలం ఎ.అగ్రహారానికి చెందిన పెయ్యల వీరవెంకట శ్రీనివాస్ హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో అతడిని ఆదివారం సాయంత్రం రామచంద్రపురంలో అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. శవపరీక్ష నివేదిక ప్రకారం బాలిక ముఖం, నోటి భాగంలో గాయాలు ఉన్నాయని, ఊపిరాడక పోవడం వల్ల చనిపోయిందని వెల్లడైంది. హెడ్‌నర్స్‌గా పనిచేస్తున్న చిర్రా సునీత ఈ నెల 4వ తేదీన విధులకు వెళ్లగా, కుమార్తె రంజిత మాత్రమే ఇంట్లో ఉంది. వీరికి పరిచయం ఉన్న వీరవెంకట శ్రీనివాస్ సాయంత్రం 5.20 గంటల సమయంలో బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను దొంగిలించేందుకు ఆ ఇంటికి వెళ్లాడు. ఫ్యాన్ మరమ్మతు చేయడానికి వచ్చానని బాలికకు చెప్పాడు. ఆమెకు అనుమానం రావడంతో తల్లికి ఫోన్ చేసి చెబుతుందేమోనన్న భయంతో చున్నీని బాలిక మెడకి చుట్టి ముఖాన్ని మంచంపై అదిమి పెట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేశాడు. మృతదేహాన్ని చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసి ఆత్మహత్యగా కనిపించేలా చేసి తలుపు లోపల గడియ పడేలా వేసి వెళ్లిపోయాడు. ఏరియా ఆసుపత్రి వద్ద పాప బంధువులు ధర్నా చేస్తున్న సమయంలోను శ్రీనివాస్ అక్కడే తిరిగాడు. విజయవాడ నుంచి ఫోరెన్సిక్ బృందం వచ్చినప్పుడు ఇంటి ఎదుట ఉండి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. దర్యాప్తులో పోలీసుల వెంటే తిరుగుతూ తప్పుదారి పట్టించాడు. అప్పుల పాలైన నిందితుడు బంగారం, డబ్బు కోసం వచ్చి బాలికను హత్య చేసినట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. కేసును నాలుగు రోజుల్లోనే ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్, సీఐలు ఎం.వెంకటనారాయణ, పి.దొరరాజు, ఎస్.ఐలు నాగేశ్వరరావు, ఎం.లక్ష్మణ్, జానీబాషా, సురేష్‌బాబు, హరీష్ పాల్గొన్నారు.

నిందితుడు శ్రీనివాస్

కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా, ముసుగులో నిందితుడు

బలి తీసుకున్న బతుకుదెరువు

రెండు కుటుంబాల్లో విషాదం నింపిన విద్యుదాఘాతం

తణుకు, గండేపల్లి, న్యూస్‌టుడే: చేతికందొచ్చిన ఏకైక కుమారుడు కుటుంబాన్ని ఆదుకుంటాడనుకునేలోపే ఇక లేడనే వార్త ఆ కుటుంబాన్ని అంతులేని విషాదంలో ముంచింది. జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్న నేపథ్యంలో ఇంటి యజమాని ఇక తిరిగి రాడనే సమాచారంతో మరో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఇరగవరం మండలం రాపాకాలో కొడుకును, పేకేరులో ఇంటి యజమానిని కోల్పోయి రెండు కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన కరిపెట్టి సింహాద్రి అప్పన్న (53) వరి కోత యంత్రాలతో పలు ప్రాంతాల్లో కోతలకు వెళ్తూ జీవనం సాగిస్తుంటారు. అదే మండలానికి చెందిన గెడ్డం సందీప్ (20) కొద్ది నెలల నుంచి సింహాద్రి వద్ద వరి కోత యంత్రం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా పరిసర ప్రాంతాల్లో వరి కోతలకు బయలుదేరారు. గండేపల్లి మండలం రామయ్యపాలెం వద్ద వాహనానికి విద్యుత్తు తీగలు అడ్డు వస్తున్నాయని వాటిని తప్పించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందిన హృదయవిదారకర ఘటన చూపరుల్ని కలచివేసింది.

పెద్ద దిక్కును కోల్పోయి.. సింహాద్రి అప్పన్నకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. చిన్న కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నారు. కుమారులకు పెళ్లి చేయాల్సిన తండ్రి ఇక రారని తెలుసుకొని తమను ఎవరు పట్టించుకుంటారని కుటుంబసభ్యులు బోరుమంటున్నారు.

అందొచ్చాడనుకుంటే అందనంత లోకాలకు.. సందీప్‌కు నాన్న లాజర్, అమ్మ ప్రేమలత, ఇద్దరు అక్కలు ఉన్నారు. పెద్ద అక్కకు వివాహం కాగా, మరో అక్క డిగ్రీ చదువుతోంది. నాన్న స్థానికంగా వ్యవసాయ పనులు చేస్తుండగా, అమ్మ ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లారు. సందీప్ పదో తరగతి అనంతరం చదువు మానేసి డ్రైవర్‌గా చేరాడు. రెండు రోజుల కిందటే స్నేహితుడి జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆనందంగా గడిపాడని, ఆ క్షణాలు మరువక ముందే తమను విడిచి వెళ్లాడంటూ మిత్రులు కుమిలిపోతున్నారు. ఏకైక వారసుడు తిరిగిరాని లోకాలకు చేరుకొని తమను దిక్కులేని వారిని చేశాడంటూ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటున్నారు. తమ్ముడు లేడనే విషయాన్ని జీర్ణించుకోలేక అక్కలిద్దరూ తల్లడిల్లిపోతున్నారు.

కరిపెట్టి సింహాద్రి అప్పన్న, గెడ్డం సందీప్ (పాత చిత్రాలు)

శోకసంద్రంలో గ్రామాలు

కొడుకును కోల్పోయి ఓ కుటుంబం, తండ్రిని దూరం చేసుకొని మరో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆదివారం వారి మరణ వార్త వినగానే ఆయా గ్రామాలు శోకసంద్రంలో మునిగాయి. ఉభయ కుటుంబీకులు గుండెలు పగిలేలా రోదిస్తున్న తీరు చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

104 ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

గాంధీనగర్: గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తూ ప్రజా సంజీవనిగా పేరుతెచ్చుకున్న 104 వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల వలయంలో చిక్కుకున్నారని వక్తలు వాపోయారు. చాలీచాలని జీతాలతో ఉద్యోగాలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కాకినాడలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జిల్లా 104 సంఘ సమావేశం గౌరవాధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి త్రిమూర్తులు, కోశాధికారి శ్రీను మాట్లాడుతూ 104 సిబ్బందికి అరబిందో నుంచి రావాల్సిన బకాయిలు, గ్రాట్యుటీ, ఎర్న్‌డ్ లీవ్‌ల విషయంలో అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు ఇప్పించాలన్నారు. ప్రస్తుత భవ్య హెల్త్‌కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగుల సంక్షేమం పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు హరిప్రసాద్, ఈశ్వర్ పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శాఖాహార(వెజిటేరియన్) వంటలు చేయుటకు కాకినాడలో ఇంట్లో ఉంటూ ఇంటిపని చేయు ఏ బాదరబందీ లేని 35 సం||ల లోపు స్త్రీ కావలెను. Contact Cell: 99853 57819.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: రూ.15,000/-, 40 సంవత్సరాలలోపు వారు మాత్రమే. Cont: శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. సెల్: 94909 98888.

JOBS

Kakatiya Constructions Hiring now! Inviting Applications for Project Manager (Min 8-10 Yrs Exp.) and Junior Engineers (0-3yrs Exp.) Qualification Polytechnic/ B.Tech Civil / Degree. Mail: hrkakatiyaconshyd@gmail.com. ✆ 79813 18373.

Wanted Female Telecallers Qualification Any Degree, Age Limit: 25 to 45 Years (Must be Married) Salary upto 12,000/-. working Location: Master Minds College, Rajahmundry, Contact: 9248733370.

Sahasra Jr. College Were Hiring Positions Hostel Wardens (Girls Intermediate Hostel) Location Kakinada. Attractive Salaries. Cont: 94406 91781, 98588 95999.

శ్రీనివాస గ్రూప్ VJA ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంట బేబి కేర్‌కు వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం. ✆ 92814 52843, 92814 52827

రామకృష్ణ గ్రూప్, Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు, ఇంటిపని, వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+ వ+, జీతం: 16 - 18K. ✆ 9705297788, 9515108830.

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-00 పైౘ

అనపర్తి ఆఫీసు: 08857-226908

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	22,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	22,000-23,000
కొత్త (పచ్చి) కాయ	23,000-24,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	106-00
రిటైల్ లైవ్	133-00
డ్రెస్డ్	193-00
స్కిన్‌లెస్	219-00

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

శతాధిక వృద్ధుడు మృతి

ఆండ్రేయ (పాత చిత్రం)

కరప: కరప మండలం కూరాడలో శతాధిక వృద్ధుడు మోర్త ఆండ్రేయ (104) ఆదివారం మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. నరసరావుపేటకు చెందిన ఆయన సుమారు యాభై ఏళ్ల నుంచి కూరాడలో నివాసం ఉంటూ మతబోధకుడుగా సువార్తను అందిస్తున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అనారోగ్యంతో ఆండ్రేయ ఆదివారం మృతిచెందడంతో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

భూగర్భ వంతెనల్లేక.. ప్రాణాలు పోతున్నాయి..!

కిర్లంపూడి, జగ్గంపేట గ్రామీణం-న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై రోజూ ప్రమాదాలే. ముఖ్యంగా గ్రామ కూడళ్లలో ప్రజలు సురక్షితంగా రోడ్డుదాటేలా కింది వంతెనలు (అండర్‌పాస్) నిర్మించాల్సి ఉన్నప్పటికి వాటి ఊసే లేదు. దీంతో రోడ్డుపైకి రావాలంటే ప్రజలు జంకుతున్నారు. కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో శనివారం ఉదయం రోడ్డుపైకి వచ్చిన నిమిషాల వ్యవధిలోనే వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొని ముగ్గురు బలయ్యారు. ఇటువంటి ఘటనలు కూడళ్లలో అనేకం జరుగుతున్నా పాలకుల్లో, అధికారులలో స్పందన కరవు.

బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు

సోమవరం గ్రామాన్ని ఆనుకుని ఉన్న హైవేకి అవతల 200 కుటుంబాల వారు నివసిస్తున్నారు. వారికోసం ప్రాథమిక పాఠశాలను నిర్మించి ఇద్దరు ఉపాధ్యాయులను నియమించారు. ఈ పాఠశాలను విద్యాశాఖ అధికారులు నాలుగేళ్లగా మూసేశారు. ఈ ప్రాంతానికి చెందిన సుమారు 50 మంది విద్యార్థులు రోజూ హైవే దాటి బడికి రావాలి. వీరు అవస్థలు చూసి స్థానికులు రూ. వేలు చెల్లించి పిల్లలను వ్యాన్ ద్వారా కార్పొరేట్ స్కూళ్లకు పంపుతున్నారు.

హైవేపై రక్షణ చర్యలు శూన్యం

సోమవరం గ్రామంలో ప్రమాదకరంగా హైవేను దాటుతున్న విద్యార్థులు

రోడ్డెక్కితే గండమే: గ్రామం నుంచి అడుగు బయట పెట్టాలంటే హైవేను దాటాలి. బయటకు వెళ్లిన వారు సురక్షితంగా ఇంటికి చేరే వరకు కుటుంబీకులు ఆందోళన చెందుతున్న పరిస్థితి. జాతీయరహదారిపై గ్రామ కూడలి వద్ద కనీస రక్షణ చర్యలు లేకపోవడంతో డైవర్షన్ తీసుకునే సందర్భాల్లో ప్రమాదాలు జరిగి గ్రామస్థులు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ఏఐ, జిల్లా అధికారులు స్పందించి సోమవరం కూడలిలో అండర్‌పాస్ వంతెన నిర్మించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాటా- 20, వంకాయలు- 54, 60, బెండకాయలు- 58, పచ్చిమిర్చి- 34, 38, కాకరకాయ- 56, బీర- 60, క్యాలీఫ్లవర్- 25, 30, క్యాబేజీ- 36, క్యారెట్- 58, దొండకాయలు- 56, బంగాళాదుంపలు- 23, 27, ఉల్లి- 22, 28, గోరుచిక్కుళ్లు- 36, దోసకాయలు- 34, చిక్కుళ్లు- 110, 130, చేమదుంపలు- 30, 36, బీట్‌రూట్- 46, కీరదోస- 40, బీన్స్‌కాయలు- 80, అల్లం- 70, క్యాప్సికం- 76, బొబ్బర్లు- 56, చిలకడదుంపలు- 40, ఒకటి చొప్పున ఆనపకాయ- 45, 50, పొట్లకాయ- 18, 20, అరటికాయ- 6, 8, మునగకాడ- 8, 10, మామిడికాయ- 10, 14, నిమ్మకాయలు(డజన్)- 24, 30.

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్- కృష్ణలీల, ఆర్యన్, ప్రిడేటర్, ఫినెక్స్, బాహుబలి ది ఎపిక్, దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్- ఫినెక్స్, మాస్ జాతర, ది గర్ల్‌ఫ్రెండ్, కాంతారా 1, లక్ష్మి- ది గ్రేటెస్ట్ ప్రీ వెడ్డింగ్ షో(ఉ, సా), డైస్ ఐరే(మ, రా), సత్యగౌరి- ప్రిడేటర్, తిరుమల- ఆర్యన్, సీఅండ్‌సీ 1- జటాధర, సీఅండ్‌సీ 2- కె.ర్యాంప్, శ్రీప్రియ- మాస్ జాతర, పద్మప్రియ- ది గర్ల్‌ఫ్రెండ్, బాహుబలి దిఎపిక్(మ), సూర్య1(వాకలపూడి) - మాస్ జాతర, సూర్య 2 - జటాధర.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

వృథాను అరికట్టరూ..

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ శాంతినగర్‌లోని ఓ వీధిలో రహదారిపై పైపులైను పగిలిపోవడంతో మంచినీరు వృథాగా పక్కనే ఉన్న కాలువలోకి పోతోంది. కొంతకాలంగా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులైను మరమ్మతులు చేపట్టి మంచినీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

వీధి దీపం వెలగడం లేదు..

కాకినాడ ఎల్‌బీనగర్ మారుతీ టెంపుల్ ఎదురుగా ఉన్న వీధి దీపం కొన్ని రోజులుగా వెలగడం లేదు. రాత్రి చీకటి కారణంగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెట్ల కొమ్ములు తొలగించండి..

కాకినాడ ప్రతాప్‌నగర్ రహదారిలో శిశుగృహ ఎదురుగా చెట్ల కొమ్ములు నరికి అక్కడే వదిలేశారు. రోజులు గడుస్తున్నా వాటిని తొలగించడం లేదు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం, అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇనుపచట్రం ఏర్పాటు చేయండి..

కాకినాడ లక్ష్మీనారాయణనగర్ నుంచి పోస్టల్ కాలనీ వెళ్లే దారిలో మూడు రోడ్ల కూడలి వద్ద మ్యాన్‌హోల్‌పై ఇనుప చట్రం లేక ప్రమాదకరంగా ఉంది. నగరపాలక అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

కొలనులో దిగితే.. పతకమే

– న్యూస్‌టుడే, మసీదు సెంటర్

చిరుప్రాయంలోనే చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తూ దూసుకుపోతున్నారు కాకినాడకు చెందిన బాలబాలికలు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోపాటు క్రీడలపై వారికున్న మక్కువతో స్విమ్మింగ్‌లో రాణిస్తున్నారు. ఈ నెల 2న కాకినాడ డీఎస్‌ఏలోని స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన జిల్లా స్థాయి ఈత పోటీల్లో కాకినాడ చిన్నారులు ప్రతిభచాటారు. తద్వారా ఈ నెల 16 నుంచి విజయవాడలో జరిగే 10వ వింటర్ సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

స్విమ్మింగ్ చేస్తున్న క్రీడాకారులు

క్రీడలపై మక్కువతో..

అయిదో తరగతి చదువుతున్నా. నాన్న గోవిందరాజు ఉద్యోగి. అమ్మ శ్రవంతి సచివాలయ ఉద్యోగిని. క్రీడలపై మక్కువతో ఏడాదిగా డీఎస్‌ఏలో ఈత నేర్చుకుంటున్నా. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. సాయంత్రం 3 గంటలపాటు సాధన చేస్తా. భరతనాట్యం కూడా నేర్చుకుంటున్నా.

- స్నిగ్ధ, క్రీడాకారి

నాలుగు పతకాలు సాధించా..

నాన్న మోహన్ వ్యాపారి. అమ్మ జయలక్ష్మి గృహిణి. నాన్న ప్రోత్సాహంతో మూడేళ్ల నుంచి ఈత నేర్చుకుంటున్నా. ఇప్పటివరకు నాలుగు జిల్లాస్థాయి పతకాలు సాధించా. ప్రతిరోజు సాయంత్రం మూడు గంటల పాటు స్విమ్మింగ్ పూల్‌లో సాధన చేస్తా. ఇటీవల జిల్లా స్థాయి పోటీల్లో పతకం సాధించడం ద్వారా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. - ఆద్యశ్రీ, క్రీడాకారిణి

రెండు పూటలా సాధన..

నేను 5వ తరగతి చదువుతున్నా. నాన్న విజయప్రసన్నకుమార్ వ్యాపారి. అమ్మ ప్రశాంతి గృహిణి. మూడేళ్ల నుంచి డీఎస్‌ఏలో ఈత నేర్చుకుంటున్నా. సాయంత్రం 3 గంటల పాటు నిత్యం సాధన చేస్తా. అమ్మ దగ్గరుండి నన్ను స్విమ్మింగ్‌పూల్‌కు తీసుకువెళ్తుంది. ఇప్పటికి మూడు జిల్లా, రెండు రాష్ట్ర స్థాయి పతకాలు సాధించా. గతేడాదిగా క్రికెట్ కూడా నేర్చుకుంటున్నా. ఉదయం వేళ క్రికెట్, సాయంత్రం స్విమ్మింగ్‌కు సమయం కేటాయిస్తున్నా.

- సీమంత్ రాధాకుమార్

అమ్మ ప్రోత్సాహంతో..

మాది కాకినాడ. నేనిప్పుడు అయిదో తరగతి చదువుతున్నా. నాన్న రవికుమార్ ప్రైవేటు ఉద్యోగి. గృహిణిగా ఉన్న అమ్మ మోనిక ప్రోత్సాహంతో గత ఏడాది నుంచి డీఎస్‌ఏలో ఈత నేర్చుకుంటున్నా. రెండు జిల్లా స్థాయి పతకాలు సాధించా. సాయంత్రం 6-9 గంటల వరకూ సాధన చేస్తా. ప్రతి రోజు సాయంత్రం అమ్మ నన్ను ద్విచక్ర వాహనంపై స్విమ్మింగ్‌పూల్‌కు తీసుకెళ్లి తీసుకొస్తుంది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. - అన్విత్, క్రీడాకారుడు

ప్రశంసాపత్రాలు అందుకున్న వైద్యులు, వైద్యవిద్యార్థులు

సేవలకు గుర్తింపు

మసీదు సెంటర్: కాకినాడ ఐఎంఏ హాల్‌లో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సేవా తత్పరత కలిగిన వైద్యులు, వైద్య విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ఆదివారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీప్రకాష్ విద్యాసంస్థల ఛైర్మన్ విజయప్రకాష్, సర్జరీ విభాగానికి చెందిన డా. హేమంతి, శర్మ విచ్చేసి మాట్లాడారు. అనంతరం ఈ ఏడాది పలు ప్రాంతాల్లో సేవలందించిన వైద్యులు, ఎన్ఎంవో కాకినాడ అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు డా. అడ్డాల సత్యనారాయణ, డా. హర్షవర్ధన్, డా. ప్రశోబ్, డా. నర్సింగ్, డా. వెంకటేశ్వరరావు, డా. లింగోలు, డా. రేఖిత్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు.

సామాజిక సేవలు అభినందనీయం

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ విద్యుత్‌నగర్‌లోని బాష్యం స్కూల్లో మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ శాఖ స్నేహ ఉమెన్స్ ఆధ్వర్యంలో కొమరగిరిలోని విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు పాటిల ఉషారాణి మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్య అవగాహన కల్పించామన్నారు. సుశీలదీక్షితులు, చంద్రకళాదేవి, డా. రమాదేవి, పాఠశాల ప్రిన్సిపల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి సాయం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: హృద్రోగంతో బాధపడుతున్న కాకినాడ వెంకటేశ్వరనగర్‌కు చెందిన నర్సాన కృష్ణారావు కుటుంబానికి మంత్రి సుభాష్ ఆర్థిక సాయం అందించారు. ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటూ కుటుంబ పెద్ద మంచానపడటం, తల్లి కూడా అనారోగ్య కారణంతో వారి కుమార్తె సంజన చదువు మధ్యలో మానేసి స్థానిక స్వీట్ దుకాణంలో పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తోంది. విషయాన్ని స్థానికంగా కార్తిక వనసమారాధనలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రికి పెద్దలు వివరించారు. స్పందించిన మంత్రి తక్షణ సాయంగా రూ.20 వేల చెక్కును అందజేశారు. సంజన చదువు కొనసాగించేందుకు తన వంతు తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు.

సంజనకు ఆర్థిక సాయం చెక్కు అందిస్తున్న మంత్రి సుభాష్

సమావేశంలో మాట్లాడుతున్న హరీష్

చిన్నారులకు పోష్టికాహారం కిట్ల అందజేత

మసీదు సెంటర్(కాకినాడ): వ్యాధిగ్రస్త చిన్నారులకు దాతల సహకారంతో ప్రతి నెలా పోష్టికాహార కిట్లు అందిస్తున్నట్లు రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు గాంధీ సేవల అమ్ములయ్య సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ శాంతినగర్‌లోని రామకృష్ణ సేవాసమితి ఆడిటోరియంలో క్యాన్సర్ బాధిత చిన్నారులకు మోహనరావు ఆర్థిక సహకారంతో కిట్లు పంపిణీ చేశారు. సభ్యులు రామకృష్ణా, స్కూల్ హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, గురి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు

గాంధీనగర్: బాలాజీచెరువు రిజర్వుపోలీస్ లైన్‌లోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో ఉన్న వారాహి అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరుగుతాయని అయ్యప్పస్వామి ఆలయ కొత్త కమిటీ ముఖ్య కార్యదర్శి నాట్యాచార్య కృష్ణకుమార్ తెలియజేశారు. ఆలయంలో కొత్తగా ప్రతిష్ఠించిన స్ఫటిక శివలింగానికి భక్తులు తమ స్వహస్తాలతో జలాభిషేకం చేసుకోవచ్చున్నారు.

ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఎన్నిక

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ నగర ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం బాలాజీచెరువు సెంటర్ వద్దనున్న పీఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు వాసుదేవ్ ఎస్ఎఫ్ఐ జెండా ఎగురవేసి సభను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి గంగాసూరిబాబు మాట్లాడుతూ నేటి విద్యార్థులు భయాన్ని వదిలి, ధైర్యంగా ప్రశ్నించాలంటే ఎస్ఎఫ్ఐ వంటి సంఘాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. కాకినాడ నగర శాఖ నూతన అధ్యక్షుడిగా వాసుదేవ్, కార్యదర్శిగా పగడాల సత్యం, నగర ఉపాధ్యక్షులుగా అమృత, సాహిత్, తేజ, ఘమినివేలు, సహాయ కార్యదర్శిగా మణికంఠ, కరుణ్, హాసిని ఎన్నికయ్యారు.

విద్యార్థులకు అండ.. అభినందనీయం

గాంధీనగర్, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు, తండ్రిని కోల్పోయిన నిరుపేద చిన్నారులను దత్తత తీసుకుని, వారి విద్యా బాధ్యతలు స్వీకరిస్తూ శ్రీయువసేన అండగా నిలవడం అభినందనీయమని, అలాంటి మహత్తర కార్యక్రమంలో తాను భాగస్వామి కావడం ఆనందంగా ఉందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఎంపీ కార్యాలయంలో శ్రీయువసేన సహాయ నిధి ద్వారా ఆరుగురు విద్యార్థులకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ఎంపీ చేతుల మీదుగా అందజేశారు. జోన్నలగడ్డ రామ్‌చరణ్(6వ తరగతి), మేఘన శిరీష(5వ తరగతి)లకు రూ.30 వేలు, బీఫార్మసీ విద్యార్థిని రంపం దేవికి రూ.20 వేలు, డిగ్రీ విద్యార్థిని దుర్గాభవానికి రూ.10 వేలు, విజయవాడలో బీఫార్మసీ చదువుతున్న సమీనాకు రూ.20 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా శ్రీయువసేన అధ్యక్షుడు బొల్లం సతీష్ మాట్లాడుతూ ఎంపీ ఉదయ్ కొన్ని రోజుల క్రితం శ్రీయువసేన సహాయనిధికి రూ.లక్ష విరాళం అందజేశారని, ఆ మొత్తాన్నే అర్హతగల విద్యార్థులకు ఎంపీ చేతుల మీదుగా పంపిణీ చేయించామన్నారు. నాయకులు నున్న దొరబాబు, రాజ్‌కుమార్, బాబూ పెరల్స్ హరీష్, దీపిక, కోన సతీష్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం పొందిన విద్యార్థులతో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, సతీష్ తదితరులు

రహదారి ధ్వంసం

కాకినాడ పల్లంరాజు నగర్‌లోని ఓ వీధిలో కూడలి వద్ద రహదారి ధ్వంసమైంది. దాంతో ఆ దారి గుండా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాలు దెబ్బతినడంతోపాటు ప్రమాదాలబారిన పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్

అల్లుకున్న తీగలు

కాకినాడలోని శ్రీనగర్ ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి, పక్కనే ఉన్న తీగలకు పిచ్చి పాదులు, తీగలు అల్లుకున్నాయి. వర్షాల సమయంలో ప్రమాదం పొంచిఉందని స్థానికులు వాపోతున్నారు. గాలులు వీచినప్పుడల్లా విద్యుత్తుకు అంతరాయం ఏర్పడేలా ఉందంటున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్

చీకట్లు.. ఇక్కట్లు..

కాకినాడలోని కోకిల సెంటర్ వెనుక వీధిలో రహదారి పక్కనున్న వీధి దీపం వెలగడం లేదు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఆ దారిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. దాంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్

రక్షణ చర్యలేవీ..?

కాకినాడ రెండో డివిజన్ పరిధి శశి కాంత్‌నగర్ శివారు సౌజన్యనగర్‌లో ఓ విద్యుత్తు నియంత్రిక వద్ద ఉన్న ఫ్యూజు బాక్సు ప్రమాదకరంగా మారింది. బాక్సుకు రక్షణగా ఎలాంటి తలుపు లేకపోవడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఫ్యూజు బాక్సుకు మూత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

ఆదమరిచారో.. అంతే సంగతులు

కాకినాడ శశి కాంత్‌నగర్ బైపాస్‌లోని బొందగుంట రహదారిలో భూగర్భ కేబుళ్ల నిమిత్తం తవ్వకాలు చేపట్టారు. రహదారి అంచున గుంత ఉండటంతో వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రక్షణ చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా గుంతలో పడే ప్రమాదం ఉందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

ఈనాడు కథనాలకు స్పందన

వెలిగిన వీధి దీపం..

కాకినాడ శ్రీనగర్ ప్రధాన రహదారి పక్కన వీధి దీపం వెలగడం లేదు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఆ దారిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో అలముకున్న చీకట్లు. శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు.

మీటర్ బాక్సుకు మూత ఏర్పాటు..

కాకినాడ రెవెన్యూకాలనీలో ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి ఉన్న మీటర్ బాక్సుకు మూత లేకుండా ప్రమాదకరంగా ఉంది. వాటికున్న తీగలు బయటకు కనిపిస్తున్నాయి. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో తగిలితే అంతే.. శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు.

- న్యూస్‌టుడే, మసీదుసెంటర్

తాగునీటి సరఫరా పెంచారు

బాలాజీచెరువు: నగరంలోని 48వ డివిజన్ ఎస్.అచ్యుతాపురం, మధురానగర్, జనచైతన్యకాలనీ, రాజీవ్‌గృహకల్ప ప్రాంతాల్లో ఆదివారం నుంచి తాగునీటి సరఫరాను పెంచారు. 'సరఫరా తగ్గించారు.. వెతలు పెంచారు' శీర్షికతో ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి నగరపాలక వాటర్‌వర్క్స్ అధికారులు స్పందించారు. డీఈ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎస్. అచ్యుతాపురం వార్డు సచివాలయాల వద్ద ఉన్న ఈఎల్ఎస్ఆర్ ట్యాంకును పరిశీలించారు. ఈ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను తనిఖీ చేశారు. ట్యాంకు నింపేందుకు ప్రధాన పైపులైను నుంచి నేరుగా పంపింగ్ చేసే ప్రక్రియ చేపట్టారు. దీంతో ఈ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం నుంచి పూర్తి స్థాయిలో ఇక్కడి ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యింది.

తాగునీటి సరఫరాను తనిఖీ చేస్తున్న సిబ్బంది

వైద్యుడి అదృశ్యంపై కేసు

సర్పవరం: డా. మరణాసి సతీష్‌కుమార్ కాకినాడ నాగమల్లితోట కూడలిలోని న్యూరోస్టార్ ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నారు. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భార్య ఇచ్చిన ఫిర్యాదుపై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సైనాగేశ్వరరావు తెలిపారు.

విజేతలతో అతిథులు

ఉత్సాహంగా భగవద్గీత కంఠస్థ పోటీలు

గాంధీనగర్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం జగన్నాథపురం ప్రఖండ ఆధ్వర్యంలో సామా పబ్లిక్ స్కూల్‌లో భగవద్గీత కంఠస్థ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. కన్వీనర్ శ్రీకృష్ణవాణి ఆధ్వర్యంలో జరిగిన పోటీలను ముఖ్యఅతిథి సామా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సామా ఈశ్వరరావు, విశిష్ట అతిథి సామా రాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్త విజ్ఞాన విషయాలు భగవద్గీతలో ఉన్నాయన్నారు. గీతాసారం అర్థం చేసుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరవచ్చన్నారు. సబ్ జూనియర్ విభాగంలో ఎల్‌కేజీ నుంచి 3వ తరగతి వరకు, జూనియర్ విభాగంలో 4 నుంచి 7 వరకు, సీనియర్ విభాగంలో 8 నుంచి 10వ తరగతి వరకు, కళాశాల, మహిళా విభాగాల్లో జరిగిన పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగింది. వీహెచ్‌పీ జిల్లా కోశాధికారి ఉదయభానోజీరావు, న్యాయ నిర్ణేతలు శ్రీదేవి, సృజన, ప్రవీణ, జగన్నాథపురం ప్రఖండ అధ్యక్షురాలు మహాలక్ష్మి పాల్గొన్నారు.

మన క్రికెట్ జట్లు భేష్

మాట్లాడుతున్న సత్యనారాయణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: సమర్థ నాయకత్వంతో దేశ ప్రగతి అన్ని రంగాల్లో సాధ్యపడుతోందని, ఈ కోవలోనే ప్రపంచ మేటిగా మన మహిళా, పురుష క్రికెట్ జట్లు ఉండటం భారతీయులకు గర్వకారణమని భాజపా రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యుడు గట్టి సత్యనారాయణ అన్నారు. ఆదివారం భానుగుడిసెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత మహిళా జట్టు ప్రపంచకప్ సాధించడం ద్వారా 140 కోట్ల భారతీయుల్లో ఉత్సాహం నింపిందన్నారు. 11 ఏళ్లుగా భారత ప్రధానిగా మోదీ క్రికెట్ సహా ఇతర క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారన్నారు. విశ్వవిజేతగా నిలిచిన భారత మహిళా క్రికెటర్లకు ప్రధాని ఆత్మీయ విందు ఇచ్చి అందరిలో నూతనోత్తేజం నింపారన్నారు. ఈ జట్టులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన రాష్ట్రానికి చెందిన శ్రీచరణికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.రెండున్నర కోట్ల పారితోషకం, ఇంటిస్థలం, గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చి ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ

సాంబమూర్తినగర్(కాకినాడ): వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని న్యూరోస్టార్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఛైర్మన్, న్యూరోసర్జన్ డా. అశోక్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతుల సతీష్‌కుమార్ సూచించారు. మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ రామకృష్ణారావుపేటలోని చందూస్ న్యూస్కూల్ ఆవరణలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎండీ హలీమ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా అశోక్‌కుమార్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు. శిబిరంలో 6 రకాల వైద్యులు సేవలందించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య నిపుణులు విజయబాబు, శివసాయికుమార్, సాబెరా, నవీదుల్ హుస్సేన్, శాస్త్రులు, పవన్‌కుమార్, సతీష్‌రాజా సేవలు అందించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరవు

సర్పవరం: తిమ్మాపురం గ్రామంలోని అనుమతులు లేని నిర్మాణాలపై జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు స్పందించడం లేదని సర్పంచి బెజవాడ సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం తిమ్మాపురంలో మాట్లాడారు. రాజీవ్‌గాంధీ ఎంబీఏ కళాశాలను ఏళ్ల క్రితం నాన్ లేఅవుట్‌లో 5 అంతస్తులు అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించారు. గ్రామంలో అనుమతి లేకుండా అక్షయ ఫంక్షన్ హాలు నిర్మించారు. రెండింటిపై చర్యలు లేవు. వారంలో చర్యలు తీసుకోకపోతే పాలకవర్గంతో పాటు కళాశాల ఎదుట ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.

నిర్వహణ చెత్తగా ఉంది

న్యూస్‌టుడే, బాలాజీచెరువు

నగరంలో వ్యర్థాల తరలింపు ప్రహసనంగా మారింది. వాహనాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఉన్నవాటితోనే రాత్రిపూట చెత్త తరలింపు అనివార్యమవుతోంది. ఎప్పటికప్పుడు వ్యర్థాలను యార్డుకు పంపించడం గగనంగా మారింది. ఆదివారం పరిస్థితి మరీ దయనీయం. చెత్త తరలింపులో కీలక భూమిక పోషించే కాంపాక్టర్ వాహనాలు పాడైపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణకు అష్టకష్టాలు పడుతున్నారు. ఉన్న వాహనాలను వంతులవారీ విధానంలో సర్దుబాటు చేయాల్సిన దుస్థితి నెలకొంది. నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో రోజువారీ వచ్చే వ్యర్థాలను తరలించడానికి 15 కాంపాక్టర్లు, 16 ట్రాక్టర్లు నిర్వహిస్తున్నారు. ఈ డివిజన్ల పరిధిలోని 14 శానిటేషన్ సర్కిళ్లకు ఒక్కోటి చొప్పున కాంపాక్టర్‌ను కేటాయించి వ్యర్థాలు తరలిస్తున్నారు. ఒక్కో సర్కిల్ పరిధిలో 3 నుంచి 4 డివిజన్‌లు ఉన్నాయి. కొన్ని రోజులుగా ఆరు కాంపాక్టర్లు మూలకు చేరడంతో అష్టకష్టాలు పడుతున్నారు. సుమారు 20 డివిజన్ల పరిధిలో 50 టన్నుల చెత్తను సకాలంలో తరలించడం లేదు. కొన్నిచోట్ల రోజుల తరబడి వ్యర్థాలు డంపరు బిన్‌లలోనే ఉండిపోవడంతో దుర్వాసన, దోమలు విజృంభిస్తున్నాయి. వెరసి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వాహన యార్డుకు చేరిన కాంపాక్టర్

ప్రతిసారీ ఇంతే..

ఏడాదిగా నగరపాలక సంస్థ పరిధిలోని కాంపాక్టర్ వాహనాలు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి. 15 వాహనాల్లో మూడు, నాలుగు ఆగిపోతున్నాయి. వీటికి వెంటనే మరమ్మతులు చేయక, మరింత పాడైపోతున్నాయి. వాహనాలను యార్డుకు పరిమితం చేయడంతో నగరంలో చెత్త తరలింపునకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం 4, 6, 7, 10, 11, 12 శానిటేషన్ సర్కిళ్లకు సంబంధించివి మూలకు చేరాయి. వీటిపై అధికారులు దృష్టిసారించి, వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది. వాహనయార్డు నిర్వాహకులను 'న్యూస్‌టుడే' సంప్రదించగా మూడు కాంపాక్టర్‌లను ఒకటిరెండు రోజుల్లో వినియోగంలోకి తెస్తామని చెప్పారు. మిగతావి వీలైనంత త్వరగా బాగు చేస్తామన్నారు.

వివరాలు ఇవీ..

డివిజన్లు	50		
నగర జనాభా	4 లక్షలు	ట్రాక్టర్లు	16
రోజు వచ్చే వ్యర్థాలు (టన్నుల్లో)	140		
శానిటేషన్ సర్కిళ్లు	14	కాంపాక్టర్‌లు	15

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కాకినాడ
E.P. No.35/2025 in O.S. No.10/2023
Between:
Dantu Satyanarayana, S/o Dantu Nagaraju, Hindu, Aged 51 years, R/o D.No.2-184, Rayudupakala Road, Kolamuru, Konthamuru, Rajahmundry Rural, East Godavari District DHR/PLAINTIFF
and
Vanga Rajasekhar, S/o Venkata Trinadh, Hindu, Aged 42 years, R/o D.No.37-2-22, Market Street, Near Shivalayam Kakinada City, Kakinada District. JDR/DEFENDANT
పై నెంబర్ EP లో జెడిఆర్/డిఫెండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పివేయుచున్నారు. కావున ది. 24-11-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై E.P.లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు E.P. మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
కాకినాడ అవధానుల సుబ్బారావు,
10-11-2025 అడ్వకేట్, రాజమండ్రి
9440749548

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

తీరంలో ఆదివారం సందడి

కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట సముద్రతీరం ఎన్టీఆర్ బీచ్ పార్కులో ఆదివారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు సందడి చేశారు. కార్తిక మాసం కలిసి రావడంతో కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలు చేశారు. చిన్నారులు, పెద్దలు తేడా లేకుండా ఆట పాటలతో కాలక్షేపం చేశారు. - న్యూస్‌టుడే, సర్పవరం

స్నేహమేరా జీవితం..

గొల్లప్రోలులో 1964-65 సంవత్సరంలో ఎస్ఎస్ఎల్‌సి చదువుకున్న పూర్వ విద్యార్థులు

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని శేర్ పేరాజీ లుంబాజీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1964- 65వ సంవత్సరంలో ఎస్ఎస్ఎల్‌సి చదువుకున్న చిన్ననాటి స్నేహితుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఏర్పాటుచేశారు. 61 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితులంతా ఒకచోట చేరి నాటి సంగతులు గుర్తుకు తెచ్చుకుంటూ కుటుంబ, సామాజిక పరిస్థితులపై చర్చించుకున్నారు.

తుపాను వారియర్స్‌కు ఎమ్మెల్యే సన్మానం

సర్పవరం, తాళ్లరేవు: మొంథా తుపాను సమయంలో బాధిత ప్రజలకు సేవలందించిన అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య సిబ్బందికి ఎమ్మెల్యే పంతం నానాజీ చేతులమీదుగా సన్మానం చేసి జ్ఞాపికలు అందించారు. ఆదివారం జరిగిన కార్తిక వనమహోత్సవం కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు నగదు బహుమతులు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ● పి.మల్లవరంలో తుపాను బాధితులకు ప్రభుత్వం అందించిన బియ్యం, నిత్యావసరాలను తెదేపా మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వుంగరాల వెంకటేశ్వరరావు ఆదివారం పంపిణీ చేశారు.

వంతెన అందుబాటులోకి తేవాలి

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పి.దొంతమూరులో సుద్దగెడ్డ కాలువపై నిర్మాణంలో వదిలేసిన వంతెనను అందుబాటులోకి తేవాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో తెలెప్పెన నిరసన దీక్ష ఆదివారానికి మూడోరోజుకు చేరుకుంది. 12 ఏళ్లగా వంతెన పూర్తి చేయక దాదాపు ఆరు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో బస్సు కూడా తిరిగేదని, వంతెన లేక నిలిపేశారన్నారు.

ఉచితన్యాయ సహాయం పొందొచ్చు

పిఠాపురం: సామాజిక, ఆర్థిక ఇబ్బందుల ఎదుర్కొనేవారు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని ఆదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకట అప్పర తెలిపారు. ఆదివారం పిఠాపురం బాలికల బీసీ వసతి గృహంలో న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ 1987లో ఉచిత న్యాయం కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం అమల్లోకి తెచ్చారన్నారు. బాలికలకు ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ అండగా ఉంటుందన్నారు. న్యాయవాదులు కేవీఎల్ బాస్కర్, జీవీఎస్ భాస్కరాచార్యులు, వాణిశ్రీ, గుబ్బల సత్యనారాయణ పాల్గొన్నారు.

కాకినాడ జిల్లాలోనే కాజులూరు మండలం

కాజులూరు: కాజులూరు మండలాన్ని కాకినాడ జిల్లాలో కొనసాగించాలని కోరుతూ కాజులూరు మండల జేఏసీ నాయకుడు సిహెచ్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మంత్రి స్పందిస్తూ కాజులూరు మండలాన్ని ఏ జిల్లాలో ఉంచాలనే అంశాన్ని ప్రభుత్వం తమ అభిప్రాయం కోరిందని తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు కాకినాడ జిల్లాలోనే కొనసాగించాలనే అభిప్రాయాన్ని ప్రభుత్వానికి పంపుతామని స్పష్టం చేశారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక నిఘా

▲'ఈనాడు' ఫోన్‌ఇన్‌లో సీఐ శ్రీనివాస్

పిఠాపురం నియోజకవర్గంలో గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెంచాం. డ్రోన్ కెమెరాలతో నిత్యం అసాంఘిక కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నాం. శాంతి భద్రతలపై పరిరక్షణకు కృషి చేస్తున్నాం. ముఖ్యంగా ర్యాగింగ్, చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిత్యం పోలీసు వ్యవస్థ పని చేస్తుందని 'ఈనాడు ఫోన్‌ఇన్'లో పిఠాపురం సీఐ (సర్కిల్ ఇన్‌స్పెక్టర్) జి.శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు నుంచి వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

ఈనాడు మీ తోడు

❓ ప్రశ్న: పిఠాపురం జగ్గయ్యచెరువులో యువత రాత్రులు మత్తుపదార్థాలు తీసుకుని రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. ద్విచక్రవాహనాలు వేగంగా నడుపుతున్నారు. - లక్ష్మి

✅ సమాధానం: రాత్రి వేళల్లో రెండు, మూడు సార్లు పోలీసులు పెట్రోలింగ్ చేయిస్తాం.

❓ గొల్లప్రోలు మండలం చెందుర్తి, కొడవలి ప్రాంతాల్లోని పోలవరం కాలువ గట్టుపై అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. - చంద్రరావు

✅ ఈ విషయంపై ఇప్పటికే రెండు రోజులకోసారి గొల్లప్రోలు ఎస్సై రాత్రులు పెట్రోలింగ్ నిర్వహించి, పలువురిని అరెస్టు చేశారు.

❓ గొల్లప్రోలు మండలం చెందుర్తిలో అనధికార కబేళాలు పెరిగిపోతున్నాయి. గట్టు వెంబడి పశువుల రక్తంతో కలుషితమవుతున్నాయి. - నారాయణ

✅ కబేళాలు నిర్వహించేవారిపై ఇప్పటికే ఛైర్మన్‌తో కేసులు నమోదు చేశాం. మరోసారి అవగాహన కల్పించి, నివారిస్తాం.

❓ కొత్తపల్లి మండలం సెజ్ ఏరియాలో సారా తయారీ కేంద్రాలు ఉన్నాయి. విక్రయాలు కూడా అరికట్టాలి. - రమేష్

✅ ఎక్సైజ్ అధికారులు ఇప్పటికే అటువంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేసి, నిత్యం దాడులు చేస్తున్నారు.

❓ పిఠాపురం జూనియర్ కళాశాల, గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాల, కొత్తపల్లి వీవీఎస్ కళాశాలల వద్ద బాలికలను ఏడిపిస్తూ యువత వాహనాలపై పదేపదే తిరుగుతున్నారు. - సతీష్, రాజు, కుమార్

✅ కళాశాలల వద్ద ర్యాగింగును అరికట్టేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో కళాశాలల వద్ద పోలీసులు కూడా కాపలా ఉంటున్నారు.

❓ పిఠాపురం భీమ్‌నగర్ జంక్షన్ కూడలిలో రాత్రుళ్లు చీకటిగా ఉంటుంది. దీపాల్లేక అటుగా రాకపోకలు చేసేవారు అవస్థలు పడుతున్నారు. - గోవిందరాజులు

✅ పురపాలక సంఘ అధికారులతో మాట్లాడి విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయిస్తాం. ప్రమాదాలు జరగకుండా స్టాపర్‌బోర్డులు సిద్ధం చేస్తాం.

❓ రాపర్తి జిల్లా పరిషత్ పాఠశాలకు 5 గ్రామాల బాలికలు వస్తున్నారు. కొందరు యువత వారిని వేధిస్తున్నారు. రాపర్తి కూడలి వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. - శ్రీనివాస్‌రెడ్డి

✅ పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహించి, ర్యాగింగ్‌ను కంట్రోల్ చేయిస్తాం. రోజుకోసారి పోలీసులు గస్తీ ఏర్పాటు చేస్తాం.

❓ ఉప్పాడ బీచ్‌రోడ్డులోని జగనన్న కాలనీలో చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. - దాంబాబు

✅ గస్తీ ముమ్మరం చేసి, ఎక్కువగా పోలీసులు బీట్ల వేళల్లో ప్రజాశాంతి సిద్ధం చేస్తాం.

గొల్లప్రోలులోని పంట పొలాల్లో నాగేంద్ర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పున్నమి చవితి పూజలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలులో పున్నమి చవితి పూజలు ఆదివారం నిర్వహించారు. ప్రజలు పంట పొలాల్లో పుట్టలకు పూజలు చేశారు. నాగేంద్రస్వామికి గుడ్లు, పాలు, చలివిడి, చిమ్మిడి నైవేద్యంగా సమర్పించారు. బాణసంచా కాల్చారు. అనంతరం ఉసిరిచెట్టుకు పూజలు చేసి సహ పంక్తి భోజనాలు చేశారు.

అమ్మవారి గుడిలో అన్నదానం

పెద్దాపురం: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ విజయలక్ష్మి, ఆలయ పండితులు నాగ దేవర వేణుగోపాలకృష్ణ, ఐద్దరైంది ప్రసాదశర్మ, నాని, విజయ్, భక్తులు పాల్గొన్నారు.

ర్యాలీగా పశుగ్రాసం తరలింపు

పెద్దాపురం: దోమాడ గ్రామానికి చెందిన అయ్యప్ప స్వామి మాలధారులు, రైతులు పశుగ్రాసాన్ని ద్విచక్రవాహనాలపై ర్యాలీగా రమణయ్యపేటలోని గోశాలకు ఆదివారం తీసుకెళ్లారు. గతంలో గడ్డిని ట్రాక్టర్లపై తరలించేవారు. ఈ సారి రైతులే గాంధీసాగర్ నగర పాలకులు సుమారు గడ్డిని మొత్తం కోసి ద్విచక్రవాహనానికి కట్టుకుని 30 కిలోమీటర్లు తీసుకెళ్లారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది పేపకాయల గోపాలకృష్ణ

న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి

కరప: న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాది పేపకాయల గోపాలకృష్ణ సూచించారు. కరప మండలం పెదకొత్తూరులో ఆదివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయసేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందించడంతో పాటు సత్వర పరిష్కారానికి న్యాయసేవాధికార సంస్థ కృషి చేస్తోందన్నారు. లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కాపు లక్ష్మీనారాయణ, చింతా బుజ్జి పాల్గొన్నారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాడా కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని పీడీ చైత్రవర్షిణి ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు అర్జీల స్వీకరణ ప్రారంభమవుతుందన్నారు. సమస్యలపై మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వీ డాట్ ఇన్‌లో ఆన్‌లైన్‌లో అర్జీలు చేసుకోవచ్చన్నారు. డివిజనల్, నియోజకవర్గ స్థాయి అధికారులంతా హాజరుకావాలని కోరారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి

నూతన కార్యవర్గ సభ్యులు

పిఠాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) పని చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి తెలిపారు. ఆదివారం పిఠాపురం విలాకా భవనంలో సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా పప్పు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సూరిబాబు, జిల్లా కార్యదర్శి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్త దానంతో ప్రాణదానం

తాళ్లరేవు, కరప: పోలేకుర్రు పంచాయతీ సుంకరపేటలో మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరాలను తెదేపా మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, పోలేకుర్రు, పి.మల్లవరం సర్పంచులు వెంపటి సునీల్‌ కుమార్, పంపన రామకృష్ణ, మండల ఎస్సై సెల్ అధ్యక్షుడు జక్కుల ప్రసాద్‌బాబు ప్రారంభించారు. ● కరపకు చెందిన రెడ్డి లక్ష్మిశివజ్యోతికి శస్త్రచికిత్స నిమిత్తం మూడు యూనిట్లు అరుదైన రక్తం అత్యవసరమవగా పి.ఆనందపురుషోత్తం, వై.సతీష్ అనే యువకులు రక్తదానం చేశారు.

సంస్మరణ సభ విజయవంతం చేయాలి

గొల్లప్రోలు: ఈనెల 15న జరగనున్న అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐయూటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచే అంజిబాబు పిలుపునిచ్చారు. చేబ్రోలులో నారాయణమూర్తి అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో సభ నిర్వహణ సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. గుణ్ణం చార్లెస్, గొర్జ శివ, వీరన్న, శ్రీధర్, సత్తిబాబు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఏకాదశ మహా రుద్రాభిషేకం

గొల్లప్రోలు: దుర్గాడ శివాలయంలో రామలింగేశ్వరస్వామికి ఆదివారం ఏకాదశ ద్రవ్య మహా రుద్రాభిషేకం అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు నిర్వహించారు. ● గొల్లప్రోలులోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆలయంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి నిర్వహించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరవు

సర్పవరం: తిమ్మాపురం గ్రామంలోని అనుమతులు లేని నిర్మాణాలపై జిల్లా కలెక్టరుకు పీజీఆర్ఎస్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు స్పందించడం లేదని సర్పంచి జిబావారా సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం తిమ్మాపురంలో మాట్లాడారు. రాజీవ్‌గాంధీ ఎంపీపీ కళాశాలకు ఎదురుగా ఎల్ క్రితం నాన్ లేఅవుట్‌లో 5 అంతస్తులు అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించారు. గ్రామంలో అనుమతి లేకుండా అక్షయ ఫంక్షన్ హాలు నిర్మించారు. రెండింటిపై చర్యలు లేవు. వారంలో చర్యలు తీసుకోకపోతే పాలకవర్గంతో పాటు కళాశాల ఎదుట ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.

వైద్యుడు అదృశ్యంపై కేసు నమోదు



డా.మరణాసి సతీష్‌కుమార్ (దాచిన చిత్రం)

సర్పవరం: సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ప్రైవేటు వైద్యుడు అదృశ్యంపై కేసు నమోదు చేశారు. సర్పవరం ఎస్సై నాగేశ్వరరావు ప్రకారం కాకినాడ గ్రామీణం వలసపాకల గ్రామం పోస్టాఫీస్ వీధిలో నివాసం ఉంటున్న డా.మరణాసి సతీష్‌కుమార్ కాకినాడ నాగమల్లి తోట కూడలిలోని న్యూరోస్టార్ ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. శనివారం (8/11/25) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

కార్తికం.. కలుసుకున్నాం..

సర్పవరం, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం: కాకినాడ గ్రామీణం పెనుమర్తి రహదారిలోని మామిడితోటల్లో ఎమ్మెల్యే పంతం నానాజీ, కుమారుడు పంతం సందీప్ ఆధ్వర్యంలో ఆదివారం కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా నిర్వహించిన వన సమారాధనలో మంత్రి వాసంశెట్టి సుభాష్, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే నానాజీ అరుణ దంపతులు పూజలు చేసి ప్రారంభించారు. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, పిడుగు హరిప్రసాద్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్‌లు కుడిపూడి సత్తిబాబు, తోట సుధీర్, వేగుళ్ల లీలాకృష్ణ రెడ్డి అనంతకుమారి తదితరులు పాల్గొన్నారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు టీవీలు, ఏసీలు, వాషింగ్ మిషన్లు తదితర బహుమతులు అందించారు.

● పెద్దాపురం నుంచి కట్టమూరు వెళ్లే ప్రధాన రహదారిలోని రాజుల జామ తోటలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు ఎన్.సురేష్ వనసమారాధన నిర్వహించారు. ముప్పనవారి గాలి బంగ్లాలో చేనేత వర్గాల సమారాధన జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, తుమ్మల రామస్వామి, బిక్కిన విశ్వేశ్వరరావు, రాజాసూరిబాబురాజు, దవులూరి దొరబాబు, ముప్పన వీర్రాజు పాల్గొన్నారు. ● సామర్లకోట గ్రామీణం మండలంలోని ఉండూరులో పేపకాయల ఫ్యామిలీస్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ● సామర్లకోట తంబూరవాని గొయ్యి ప్రాంతం వద్ద పైడ్ని శ్రీనివాస్ పొలంలో ఫ్రెండ్స్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్, సత్యనారాయణపురం సత్తెమ్మ ఆలయం వద్ద రెడ్డిపల్లి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో, భీమేశ్వరాలయం సమీపంలో నిర్వహించారు. ● పిఠాపురం మండలంలోని మాధవపురం రోడ్డులో కాపు ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనలో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు బుర్ర అనుబాబు పాల్గొన్నారు.

కాకినాడ గ్రామీణంలో నిర్వహించిన వనసమారాధనలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే పంతం నానాజీ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు

పెద్దాపురం: కార్తిక వన సమారాధనలో ఆటలు ఆడుతున్న మహిళలు

పిఠాపురం: నాట్య బృందానికి బహుమతి అందిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

ఆదమరిస్తే షాక్ కొడుతోంది..

● సామర్లకోట పట్టణంలో నియంత్రికలకు రక్షణగోడలు కరవు

పరిశీలన

సామర్లకోట, న్యూస్‌టుడే: ప్రజలు నిత్యం ఆధారపడే విద్యుత్తు నియంత్రికలు ప్రమాదభరితంగా దర్శమిస్తున్నాయి. సామర్లకోట పట్టణంలో ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద నియంత్రికలు ఏర్పాటు చేశారు. వాటికి రక్షణగోడ, ఫెన్సింగ్ వంటివి ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు కోరలు సాచి ఎదురు చూస్తున్నాయి. పిఠాపురం రోడ్డులోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నియంత్రిక ఉంది. సాయిబాబా ఆలయం వద్ద ట్రాన్స్‌ఫారం వద్ద చిరువ్యాపారి పండ్ల వ్యాపారం చేస్తున్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బడ్డీ కొట్టు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారు.

సామర్లకోటలోని సాయిబాబా ఆలయం నియంత్రిక వద్ద వ్యాపారం చేస్తున్న చిరువ్యాపారి

నియంత్రికల వద్ద వ్యాపారాలు

రైల్వేస్టేషన్ ఎదురుగా జయలక్ష్మి థియేటర్ రోడ్డులో ప్రమాదకరంగా నియంత్రిక

సామర్లకోట స్టేషన్‌సెంటర్‌లో విద్యుత్తు నియంత్రికల వద్ద చిరు వ్యాపారులు తోపుడు బండ్లు, బడ్డీలు ఏర్పాటు చేసి అక్కడే వ్యాపారాలు చేస్తున్నారు. ప్రమాదమని తెలిసి వ్యాపారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ప్రమాదం జరగకముందే మేల్కొని ప్రమాదాలు అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

వ్యాపారులను తొలగిస్తాం..

పట్టణంలో విద్యుత్ నియంత్రికల వద్ద ప్రమాదభరితంగా వ్యాపారాలు చేస్తున్న వారిని ఇతర ప్రాంతాలకు తొలగిస్తాం. గతంలో పలుమార్లు హెచ్చరించాం. విద్యుత్తు నియంత్రికల వద్ద రక్షణ గోడ, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విద్యుత్తు శాఖ అధికారులకు వినతి పంపిస్తాం.

- శ్రీవిద్య, పురపాలిక కమిషనర్ సామర్లకోట

పుంత రోడ్డుతో చింత

గొల్లప్రోలు శివారు జడ్పీ బాలురు ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న పుంత రోడ్డు గుంతలతో అధ్వానంగా ఉంది. నిత్యం నీరు నిలిచి ఛిద్రమై ఉన్న ఈరోడ్డుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పొలాలకు ద్విచక్ర వాహనాలపై సైతం వెళ్లేందుకు పుంత రోడ్డు అనువుగాలేదని పేర్కొంటున్నారు. పుంత రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పాడా అధికారులను కలిసి వినతిపత్రం అందజేసినట్లు రైతులు తెలిపారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ప్రమాదం.. తొలగించాలి

వాకతిప్ప జడ్పీ పాఠశాల నిర్వహణ గత కొన్నేళ్లుగా తుపాను రక్షిత భవనంలో జరుగుతుంది. ప్రస్తుతం ఈ భవనం పూర్తిగా శిథిలానికి చేరుకుని ప్రమాదకరంగా మారింది. పాఠశాలకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఈ భవనంలో కూడా నిర్వహణ జరుగుతుంది. అధికారులు ప్రమాదాన్ని గుర్తించి ముందుగానే భవనాన్ని తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొత్తపల్లి

వాహనాలిలా.. రాకపోకలు ఎలా?

జి.రాగంపేట రోడ్డులోని ఐఎంఎల్ డిపో వద్ద మద్యం ఎగుమతులు, దిగుమతుల నిమిత్తం వచ్చిన లారీలు జగనన్న కాలనీ వద్ద రోడ్డుకు రెండువైపులా నిలుపుదల చేస్తున్నారు. కాలనీల నుంచి బయటకు వచ్చే ప్రజలు, వాహనదారులకు రాకపోకలు సాగించే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. సీఐ కృష్ణభగవాన్‌ను అడగ్గా ఐఎంఎల్ డిపో అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, సామర్లకోట

మెరక పనులు ఇలాగేనా..?

బొల్లంగిపేట డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం బాలికల పాఠశాల మైదానాన్ని చెత్త కలిసిన మట్టితో మెరక చేస్తున్నారు. కాకినాడలోని చెత్త నుంచి సంపద కేంద్రంలోని చెత్త, మట్టిని లారీల్లో ఇక్కడికి తరలించారు. విద్యార్థులను సమస్యలను దృష్టిలో పెట్టుకుని తాత్కాలికంగా మెరక పనులు ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పనులు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రశాంతి ఆదివారం తెలిపారు. - న్యూస్‌టుడే, తాళ్లరేవు

సుప్రీంకోర్టు ఆదేశాలు ఎంత వరకు అమలు..?

పెద్దాపురం, న్యూస్‌టుడే: కుక్కకాటు ఘటనలు తీవ్ర ఆందోళనలు కలిగిస్తుండటంతో ప్రజల ప్రాణాల భద్రత, ఆరోగ్యం దృష్ట్యా సర్వోన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. విద్యా సంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఆసుపత్రులు, తదితర జనసమ్మర్ద బహిరంగ ప్రదేశాల్లో వీధి శునకాలు సంచరించకుండా చేయాలని స్పష్టం చేసింది. ఆయా ప్రాంగణాల్లోకి అవి చొరబడకుండా కంచెలు నిర్మించాలని తెలిపింది. సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన నేపథ్యంలో అధికారులు ఏంచర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

నువ్వులగుంటవీధి ప్రధాన రహదారిపై శునకాల గుంపు

వీధుల్లో స్వైరవిహారం..: రెండు పురపాలికల్లో ఎక్కడపడితే అక్కడ వీధుల్లో పది నుంచి 15 వరకు గుంపులుగా శునకాలు సంచరిస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే పిల్లలు సైతం వాటిని తప్పించుకుని వెళ్లాల్సిన పరిస్థితి. ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులపై, ఆసుపత్రులు, విద్యాసంస్థల్లో స్వైరవిహారం చేస్తూ భయందోళనలకు గురిచేస్తున్నాయి. అధికారులు చాలా వరకు కు.ని శస్త్రచికిత్సలు చేయించామంటూ చెబుతున్నా కేవలం పది శాతం మేరకు జరిగినట్లు సమాచారం.

ఏబీసీ, ఏఆర్‌వీకి చర్యలు..: రెండు పట్టణాల్లో సుమారు 1450 కుక్కలకు ఒక్కొక్కదానికి రూ.1,500 ఖర్చుచేసి ఏబీసీ, ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించాం. వీధుల్లో ఉన్న కుక్కలను జనావాసాలకు దూరంగా విడిచిపెడతాం. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు పాఠశాలలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ఉన్నవాటిని పట్టుకొని వ్యాక్సిన్లు వేయించడానికి చర్యలు తీసుకుంటాం.

- కె.శ్రీకాంత్‌రెడ్డి, శ్రీవిద్య, కమిషనర్లు పెద్దాపురం, సామర్లకోట

పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో వార్డులు: 60 జనాభా: సుమారు లక్షా 5 వేలు వీధి కుక్కలు: సుమారు 6,500 కు.ని చికిత్సలు పూర్తయినవి: కేవలం 10 శాతం

వృద్ధ దంపతులకు సాయం

తాళ్లరేవు: పాత కోరింగలో తాటాకిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన చేకూరి అమ్మన్న, కళావతి వృద్ధ దంపతులకు తాళ్లరేవు జడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ బియ్యం, కొత్త వస్త్రాలు, వంట సామగ్రి, రూ.3వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. పి.మల్లవరం మాజీ సర్పంచి కుడుపూడి శివన్నారాయణ రూ.5వేలు, నిత్యావసరాలను అందించారు. తాళ్లరేవు, కురంగేశ్వర లయన్స్ క్లబ్ సభ్యులు వృద్ధ దంపతులకు బియ్యం, నిత్యావసరాలు, రూ.7వేలు నగదు అందచేశారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: సీతారామపురం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కోరింగ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . తాళ్లరేవుకు చెందిన పుప్పాల సాయి, తల్లి మాధవి కాకినాడ నుంచి తాళ్లరేవుకు ద్విచక్రవాహనంపై వస్తుండగా, యానాం నుంచి కాకినాడ వైపు వెళ్తున్న కారు సీతారామపురం వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ద్విచక్రవాహనంపై ఉన్న పుప్పాల సాయి, తల్లి మాధవి తీవ్రగాయపడ్డారు. వారిని వాహనంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

यूनियन बैंक Union Bank of India — యానం బ్రాంచి, విష్ణాలయం వీధి, యానం

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూల్ 6(2)/8(6) క్రింద అమ్మకం గురించి తెలియజేస్తూ ఋణగ్రహీతలకు ప్రకటన (30 రోజుల అమ్మకపు ప్రకటన)

దిగువ వారికి : ఋణగ్రహీత: 1)మెసర్స్: లెమొనెల బేవరేజెస్(యాజమాన్య సంస్థ), యాజమాని:శ్రీమతి నిమ్మకాయల దుర్గాభవాని, పి. మల్లవరం గ్రామం మరియు పంచాయితీ, తాళ్ళరేవు మండలం, కాకినాడ జిల్లా-533464, 2)యాజమాని:శ్రీమతి నిమ్మకాయల దుర్గాభవాని, డో.నెం. 2-146,దుర్గ గుడి దగ్గర, జార్జ్ పేట, తాళ్ళరేవు మండలం, కాకినాడ జిల్లా-533464, 3)హామీదారు: శ్రీమతి నిమ్మకాయల విజయలక్ష్మి (మరణించినందున వారి చట్టపరమైన వారసులకు) డో.నెం. 2-146,దుర్గ గుడి దగ్గర, జార్జ్ పేట, తాళ్ళరేవు మండలం, కాకినాడ జిల్లా-533464.

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు వారికి బకాయిపున్న మొత్తాన్ని రాబట్టుకొనుట కొరకు క్రింది తెలిపిన ఆస్తుల అమ్మకం. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారము అందులో నిర్దేశించిన సమయంలోగా బకాయిలను చెల్లించవలసినదిగా సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సెక్షన్ 13(2) క్రింద 18.03.2023 తేదీ గల డిమాండ్ నోటీసులు ద్వారా మిమ్మల్ని కోరినారు. నిర్ణీత వ్యవధిలోగా మీరు నోటీసులో పేర్కొన్న బకాయిలనుచెల్లించడంలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూల్ 6(2)/8(6)తో చదవబడే చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అధీకృత అధికారి సెక్యూర్డ్ ఆస్తులను 29.08.2023 తేదీన స్వాధీనం చేసుకున్నారు.

ఆస్తులను స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయిలను చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు తేదీ నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తిని విక్రయించుట తప్పనిసరి అవుతుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు రిజర్వుధర మరియు ఇ-వేలం నిర్వహించవలసిన సర్వీస్ ప్రొవైడర్ వివరాలు మీకు విడిగా తెలియజేయబడతాయి.

ఆస్తి బ్యాంక్‌కు అంగీకారయోగ్యమైన నియమ నిబంధనలకు లోబడి ప్రైవేట్ అమ్మకం లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కోరుట ద్వారా ఎవరికైనా ఆస్తిని విక్రయించు ప్రతిపాదన ఏదైనా మీకు ఉంటే ఈ నోటీసు/ లెటర్ స్వీకరణ తేది నుండి మాకు తెలియజేయవలెను. విఫలమైనచో ఎటువంటి ప్రతిపాదన మీకు ఏదీ లేనట్లుగా భావించబడును మరియు మేము ఇ-వేలం ద్వారా ఆస్తుల విక్రయంతో ముందుకు సాగుతాము.

కావున, మీరు బ్యాంక్‌కు డిమాండ్ నోటీసు నాటికి చెల్లించాల్సిన మొత్తాన్ని తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు సేల్ నోటీసును ప్రచురించే తేదీకి ముందు బ్యాంక్ చేసిన ఖర్చులతో కలిపి చెల్లిస్తే ఆస్తి అమ్మకం కోసం తదుపరి చర్య తీసుకోబడదు మరియు చట్టంలోని సెక్షన్ 13(8)లో నిర్దేశించిన విధంగా మీరు మీ ఆస్తిని తిరిగి పొందవచ్చు.

ఆస్తి వివరములు

1)పూర్వం తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా,తాళ్ళరేవు మండలం,పి. మల్లవరం గ్రామం మరియు పంచాయితీ,ఆర్.ఎస్.నెం. 1-1 నందు శ్రీమతి నిమ్మకాయల దుర్గాభవాని పేరున గల 484.00 చ॥గ॥ విస్తీర్ణంలోని ఆర్‌సిసి రూఫ్ మరియు ఏసి షీట్ రూఫ్ షెడ్‌కు సంబంధించిన యావదాస్తి ఈ దిగువ హద్దులలో: తూర్పు :మానేపల్లి సత్యనారాయణ యొక్క భూమి పడమర : ఇతరులకు అమ్మిన కోట అచ్చియమ్మ యొక్క భూమి ఉత్తరం : పోలేకుర్రు గ్రామము యొక్క ఆస్తి హద్దు, దక్షిణం :రోడ్డు

2)పూర్వం తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా,తాళ్ళరేవు మండలం, జార్జ్‌పేట గ్రామం ,ఆర్.ఎస్.నెం. 12/9 నందు శ్రీమతి నిమ్మకాయల విజయలక్ష్మి పేరున గల 242.00 చ॥గ॥ (దస్తావేజు ప్రకారం) 220.00 చ॥గ॥ (వాస్తవ ప్రకారం) విస్తీర్ణంగల రెసిడెన్షియల్ ఖాళీ స్థలమునకు సంబంధించిన యావదాస్తి ఈ దిగువ హద్దులలో: తూర్పు : కడియం వెంకటరమణ మరియు ఇతరుల యొక్క ఆస్తి పడమర : కడియం వెంకటరమణ మరియు ఇతరుల యొక్క ఆస్తి ఉత్తరం :చోడవరపు సూర్యావతి మరియు ఇతరుల యొక్క ఆస్తి దక్షిణం :పుంత (ప్రస్తుతం సిసి రోడ్డు)

ప్రదేశం : యానం
తేది : 06.11.2025

సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి

(c) eenadu

తుని
• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

తీరంలో సందర్శకుల సందడి

దానవాయిపేట సముద్ర తీరంలో సందడి చేస్తున్న సందర్శకులు

తొండంగి, న్యూస్‌టుడే: కార్తీకమాసం ఆదివారం సెలవు రోజు కావడంతో దానవాయిపేట సముద్ర తీరం సందర్శకులతో కళకళలాడింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి కుటుంబమంతా తీరానికి వచ్చి సముద్రంలో స్నానాలు చేస్తూ సందడిగా గడిపారు. యువత స్వీయచిత్రాలు తీసుకున్నారు. తీరంలో సందడి వాతావరణం నెలకొంది.

కౌన్సిల్ సమావేశం

నేడు

తుని: అభివృద్ధి పనులు, సమస్యలను చర్చించేందుకు 10న ఉదయం 11 గంటలకు ఛైర్‌పర్సన్ భువనసుందరి అధ్యక్షతన తుని కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు పురపాలక కమిషనర్ ఎ.వెంకట్రావు తెలిపారు.

గోనేడలో మెగా వైద్యశిబిరం

కిర్లంపూడి: గోనేడ గ్రామంలో కోరమండల్ ఫెర్టిలైజర్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు సర్పంచి అల్లు విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు అల్లు శివరామకృష్ణ తెలిపారు. గోనేడ గ్రామాన్ని కోరమండల్ ఫెర్టిలైజర్ సంస్థ దత్తత తీసుకున్నారు. గ్రామస్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఉద్దేశంతో గ్రామంలోని దుకాణ సముదాయం వెనక ఆవరణలో మెగా వైద్యశిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఉచిత పరీక్షలు మందులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

చురుగ్గా పైపులైను పనులు

తుని గ్రామీణం: నక్కపల్లి ఉక్కు కర్మాగారానికి నీటిని సరఫరా చేసేందుకు పైపులైను నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. తుని నియోజకవర్గంలోని కోటనందూరు, తుని మండలాల ద్వారా పాయకరావుపేట నియోజకవర్గం మీదగా నక్కపల్లికి ఉక్కుకు చేపట్టిన పైపులైను నిర్మాణ పనులు ఆదివారం నందిఒంపు వద్ద చురుగ్గా సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేసి ఉక్కు కర్మాగారానికి ఏలేరు నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

జరుగుతున్న పైపులైను పనులు

అక్రమమా.. సక్రమమా..!

• కొండ దిగువన గ్రావెల్ దోపిడీ

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: కొండకు చిల్లు పెట్టి గ్రావెల్‌ను దోచేస్తున్నారు. క్వారీ కొండ దిగువ భాగంలో ఉన్న ప్రకృతి సంపదను యంత్రాలతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. వాహనం తెచ్చి యంత్రంతో తవ్వేస్తూ గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. మండలంలోని జె.అన్నవరంలో ప్రధాన రహదారికి సమీపాన ఉన్న క్వారీలో కింది ప్రాంతంలో ఉన్న నాణ్యమైన గ్రావెల్‌ను ఇష్టారాజ్యంగా రవాణాచేస్తున్నా.. అధికారులకు పట్టింపు లేదు. రేయింబవళ్లు యథేచ్ఛగా గ్రావెల్ మాయమవుతోంది. సెలవు దినాల్లో ఈ తెంపరితనం మరీ ఎక్కువగా ఉంటోంది. రైత్వారీ, పోరంబోకు, ప్రభుత్వం ఇలా ఏ రీతిన ఉన్న భూమిలోనైనా మట్టి, గ్రావెల్ తీసుకెళ్లాలంటే అధికారుల అనుమతి తప్పనిసరి. కాని రాజకీయ అండదండలతో ఎవరిష్టం వచ్చినట్టు వారు ప్రకృతి సంపదను విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు.

జె.అన్నవరంలో కొండ దిగువ భాగంలో గ్రావెల్‌ను తవ్వేసిన వైనం

పర్యావరణానికి హాని

ప్రత్తిపాడు నియోజకవర్గం లోని పలు ప్రాంతాలు కొండలు, పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉంటాయి. ఈ ప్రాంతాల్లో విష సర్పాలు తదితర జాతులు నివాసం ఉంటాయి. యథేచ్ఛగా కొండలను కొట్టేస్తూ జీవరాశులకు చోటే లేకుండా చేస్తున్నారు. ఈ క్రమంలో మూగజీవాలు, విష పురుగులు జనావాసాల చెంతకు చేరుతున్నాయి. జె.అన్నవరం పరిధిలోని ఈ కొండ పై భాగంలో పలు రకాల వృక్షజాతులు ఉన్నాయి. కింద నుంచి గుల్ల చేస్తూ పోతుండడంతో కొన్నాళ్లకు కొండ ఆనవాళ్లే ఉండవు. ఈ తరహా అక్రమ తవ్వకాలతో పర్యావరణానికి తీరని హాని జరుగుతుంది. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అక్రమార్కులు మాత్రం ట్రాక్టర్ గ్రావెల్‌ను రూ.1500 నుంచి రూ.1800 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జె.అన్నవరంలో కొండ దిగువ భాగంలో ప్రధాన రహదారికి కూతవేటు దూరంలో పది అడుగుల లోతులో యంత్రంతో తవ్వేశారు. ఈ తరహా తవ్వకాలకు ఎవరు అనుమతి ఇచ్చారో... రెవెన్యూ గనుల శాఖ అధికారులే చెప్పాలి. మేతకు వచ్చే పశువులు ఈ గోతుల్లో పడిపోయే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. అనధికార తవ్వకాలను పరిశీలించి అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత

చెక్కులను అందిస్తున్న నవీన్‌కుమార్

జగ్గంపేట,న్యూస్‌టుడే: జగ్గంపేట నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన 14 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం అందజేశారు. స్థానిక రావులమ్మ నగర్‌లో ఉన్న తెదేపా కార్యాలయంలో జిల్లా తెదేపా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ చేతుల మీదుగా రూ.7.11లక్షల చెక్కులను అందజేశారు. జగ్గంపేట మండలానికి సంబంధించి ఐదు కుటుంబాలకు, గండేపల్లి మండలానికి చెందిన నాలుగు కుటుంబాలకు, గోకవరం మండలానికి చెందిన నాలుగు కుటుంబాలకు, కిర్లంపూడి మండలంలో ఒక కుటుంబానికి చెక్కులను అందజేశారు. జగ్గంపేట మండల తెదేపా అధ్యక్షులు జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తొండంగి, న్యూస్‌టుడే: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని ఒంటిమామిడిలో ఆదివారం గ్రామస్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసులు పాండు, మణికంఠ, సత్యన్నారాయణ తదితరులున్నారు.

తుప్పలు.. తేలిగ్గా తీసుకోవద్దు..!

పల్లె దారుల్లో ప్రమాదాలకు హేతువులివీ..

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు, రౌతులపూడి

చింతలూరు చెరువు మలుపు..

వేసవి మూడు నెలలు మినహా రహదారులపై ప్రధాన సమస్య దట్టంగా పెరిగే తుప్పలే..! అటూ ఇటూ కప్పేస్తూ రోడ్డును సన్నని సందులా మార్చేస్తుంటాయి. నియోజకవర్గంలో గ్రామాలను కలిపే రహదారుల పొడవు 150 కి.మీ. ర.భ, పంచాయతీరాజ్ ఆధీనంలోని ఈ రహదారులపై కీలకమైన మలుపులు 42 ఉన్నాయి. రౌతులపూడి, శంఖవరం, ప్రత్తిపాడు మండలాల దారుల్లో ఇలాంటివి మండలానికి కనీసం పది చొప్పున ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకోలేక పోవడం, మలుపుల్లో దట్టంగా కమ్మేసిన తుప్పల వల్ల ప్రమాదాలు జరుగుతున్న ఘటనలు పోలీసుల రికార్డులకు ఎక్కనివి ఎన్నో. నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లపై జరిగిన ప్రమాదాలు ఏడాదిలో 20 పైనే ఉన్నాయి. ఇద్దరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు.

కొన్ని ప్రమాద ప్రాంతాలివీ..

ప్రత్తిపాడు-లంపకలోవ దారి, బవురువాక-తాడువాయి మార్గం, రౌతులపూడి- శంఖవరం రోడ్డు, ఒమ్మంగి-చింతలూరు, వెంకటనగరం-యూజే పురం, శంఖవరం-పెదమల్లాపురం ఇలా కీలకమైన 9 రహదారులపై ఉన్నట్టుండి అడ్డుపడే మలుపులకు తోడు దారిని కప్పేసే దట్టమైన ముళ్లకంపలు రాకపోకలకు సవాలు విసురుతున్నాయి. వీటి వల్ల రహదారి స్పష్టంగా తెలిని పరిస్థితి ఉంటోంది. రాత్రి వేళల్లో భద్రతలేని ప్రయాణం చేస్తున్నారు. విష జంతువులు సంచారం, అడవిపందులు, ఇతర వన్యప్రాణులు దారికి అడ్డం పడటం వంటి సవాళ్లు ఉంటున్నాయి.

ఏం చేయాలంటే..

ఆయా పంచాయతీలు తమ పరిధిలోని రహదారుల వెంబడి దట్టంగా అల్లుకునే తుప్పలను తొలగించాలని పలువురు సూచిస్తున్నారు. ప్రమాదకరంగా ఉండే కూడళ్లలో సూచీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గ్రామీణ రహదారుల నిర్వహణపై దృష్టి నిలపాలి.

పూజలు చేస్తున్న సంఘ నాయకులు

జగ్గంపేటలో వడ్డన చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

అహో.. వనభో'జనం'

కిర్లంపూడిలో కళాకారులకు మెమెంటోలు అందజేస్తున్న నిర్వాహకులు

జగ్గంపేట,న్యూస్‌టుడే: కాపు కల్యాణ మండపం వద్ద కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొని వడ్డన చేశారు. నాయనార్ల చరిత్రకారిణి రాచపల్లి అంజలతేశ్వర మాధవి ప్రవచనాలు నిర్వహించారు. కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.10 లక్షలు కాపు సామాజిక భవనం అభివృద్ధికి నిధులు సమకూరుస్తామన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ● జగ్గంపేటలో ఉన్న భైరవకృష్ణ పామాయిల్ తోటలో స్థానిక ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వనస మారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే నెహ్రూ, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ డైరెక్టర్ కొత్త కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

తుని, రౌతులపూడి, కిర్లంపూడి: వివిధ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పెంటకోట రోడ్డులో ఉన్న తోటలో వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సమేతంగా సభ్యులు హాజరై వివిధ పోటీల్లో ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ● రౌతులపూడిలో శ్రీవాణి చిన్న వర్తకుల సంఘం ఆధ్వర్యంలో, బంగారయ్యపేటలో గంగాలమ్మతల్లి ఆలయం, బలరామపురంలో దుర్గమ్మ ఆలయం వద్ద వనసమారాధన సందడి నెలకొంది. ● కిర్లంపూడిలో విశ్వబ్రాహ్మణులు దొరగారి కోట ఆవరణలో వనసమారాధనను నిర్వహించారు.

భక్తితత్వం.. తన్మయత్వం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : నిత్యం దైవ నామస్మరణతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ఆలమూరి సుబ్బారావు అన్నారు. గ్రామంలోని ఆంజనేయుని మందిరంలో ఆదివారం ఆయన అఖండ దీపారాధన చేశారు. భజన బృందాలు భక్తిగీతాలను ఆలపించారు. మాజీ సర్పంచి వెంకటలక్ష్మి, సీబీయూ నాయకుడు పిల్లా రాంబాబు స్వామిని దర్శించి పూజలు చేశారు.

జగ్గంపేటలో శివకల్యాణం

శంఖవరం, రౌతులపూడి, జగ్గంపేట: పున్నమివేళ పూజలు జరుపుకొన్నారు. పుట్టల వద్ద నాగేంద్రుడికి పూజలు చేశారు. ● ఎం.చామవరం, శృంగవరం గ్రామాల్లోని నందనవనంలో శ్రీఉమావర్ధిని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, సహస్ర రుద్రాక్ష అర్చన, మృత్యుంజయ సహిత రుద్రహోమం నిర్వహించారు. ● జగ్గంపేటలో శ్రీరామ నగర్‌లో సీతారామ, శివరామ కల్యాణం నిర్వహించారు. లక్ష కుంకుమార్చన పూజ, కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.

లింగంపర్తిలో హనుమాన్ మందిరంలో దీపాలు

ప్రత్తిపాడు : రాచపల్లి శ్రీరమణ సేవాశ్రమంలోని అరుణాచలేశ్వరునికి ఆరుద్ర నక్షత్ర పూజలు, సూర్యనారాయణ స్వామికి పంచామృతాభిషేకాలు, పరివార దేవతలకు పూజలు అనంతరం ద్వాదశ ఆదిత్య హోమం జరిగింది.

బసవేశ్వర మండపంలో భక్తజనం

లోవ ధారాకిటకిట.. భక్తుల నిండా..

తుని గ్రామీణం : లోవ తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో నిండిపోయింది. 6 వేలకు పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో దేవస్థానానికి రూ.2.50 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయాధికారులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

కాలువలను శుభ్రం చేయించాలి.

సమస్య : మండలంలోని లింగంపర్తిలో మురుగు కాలువలు అపరిశుభ్రంగా ఉన్నాయి. వ్యర్థాలు నిలిచిపోవడంతో మురుగు ముందుకు పోవడం లేదు. దోమల బెడద అధికమవుతోంది. **- రామారావు, లింగంపర్తి.**

సమాధానం : పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తాం. మురుగు కాలువల్లోని చెత్తను తొలగించేందుకు పనులు చేయిస్తాం. **- ఏఎస్ఎన్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి, లింగంపర్తి.**

సమస్య: కత్తిపూడి హైవే సర్వీస్ రహదారి పక్కనే ఉన్న దుకాణాల ముందు రోజూ మురుగు ప్రవహిస్తుంది. **- సత్యానందం, చిరువ్యాపారి.**

సమాధానం: కత్తిపూడి గ్రామంలో హైవే డ్రైయినేజీ సమస్య ఉంది. అధికారులకు నివేదించి సమస్య పరిష్కరిస్తాం. **- మధుశేఖర్, కార్యదర్శి, కత్తిపూడి.**

– న్యూస్‌టుడే, ఏలేశ్వరం, శంఖవరం

కల్వర్టుకు రక్షణగోడ నిర్మించారు

ఈనాడు కథనానికి స్పందన

కిర్లంపూడి, న్యూస్‌టుడే : కిర్లంపూడి మండలం రాజుపాలెం నుంచి గొల్లప్రోలు వెళ్లే ర.భ.రహదారిలో ఉన్న కల్వర్టుకు ఏలేరు వరదకాలువ చెంతన రక్షణగోడ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు వెలువడిన కథనాలపై ర.భ.శాఖ అధికారులు స్పందించారు. రాజుపాలెంలో కల్వర్టుకు కాలువచెంతన గురువారం రక్షణగోడ నిర్మించారు.

అడుగేయాలంటే..అడుసు తొక్కక తప్పదు..!

రామవరం ప్రాథమిక పాఠశాల వీధి మురుగునీటితో అధ్వానంగా తయారైంది. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్డుపైనే ఉంటుంది. పాఠశాలలో మరుగుదొడ్లలో ఉపయోగించిన నీటిని బయటకు వదిలేయడంతో రోడ్లపై పారుతోంది. కాలనీవాసులు ఈ మార్గం మీదుగా ప్రయాణించాలంటే తొక్కుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. పంచాయతీ అధికారులు స్పందించి నీరుపోయేందుకు కాలువలు ఏర్పాటు చేయాలి. – న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొళ్లపారం కాలనీలోని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలంలో స్థానికంగా ఉన్న ఒక వ్యక్తి నాయకుల అండదండలతో ఇంటి నిర్మాణం చేపట్టడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామపరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో స్థానికంగా ఉన్న పాఠశాల ప్రాంగణం సర్వే నంబరు 491 బై 1ఏ2బీ సర్వే నంబరులో అయిదు సెంట్లు కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం ఇచ్చారు. ప్రస్తుతం ఆదే స్థలాన్ని అక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇంటి నిర్మాణ పనులు మాత్రం చురుగ్గా సాగుతుండటంతో స్థానిక అధికార పార్టీ అండదండలు మెరుగ్గా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు.

కోళ్లఫారం కాలనీలో ప్రభుత్వస్థలంలో నిర్మాణం

'కూటమిలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు'

తునిలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

తుని, న్యూస్‌టుడే: కొందరు నాయకులు కూటమిలో అలజడి సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని జనసేన నాయకులు అన్నారు. పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో నాయకులు బోణం చినబాబు, దండెం రామకృష్ణ, అద్దేపల్లి బాలాజీ, పలివెల లోవరాజు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జనసైనికులు, వీరమహిళలకు నియోజకవర్గంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే దివ్య ద్వారా మంచి గుర్తింపు, పదవులు దక్కాయన్నారు. వ్యక్తిగత అజెండాలతో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు.సమావేశంలో లట్టాల నాగేశ్వరరావు, బొప్పన రాంబాబు, షేక్ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమిద్దాం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : రోజూ ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని వైకాపా నియోజకవర్గ ఇంఛార్జి ముద్రగడ గిరిబాబు కోరారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ యత్నాలను నిరసిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రికలను ఆదివారం ప్రదర్శించారు. 12న ప్రత్తిపాడులో నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. వైకాపా నాయకులు ఒమ్మి రఘురాం, శిడగం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

యర్రవరంలో ఆర్ఎస్ఎస్ ఇంటింటి ప్రచారం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : ప్రతి ఇంటిపై ఆర్ఎస్ఎస్ జెండాని ఎగరవేయాలనే లక్ష్యంతో మండలంలోని యర్రవరంలో నాయకులు ఆదివారం పర్యటించారు. గృహ సంపర్క్ కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలను అందజేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో నాయకులు బండారు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవరంలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న కార్యకర్తలు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

జగ్గంపేట,న్యూస్‌టుడే: వసతిగృహాల్లో చదువుకునే విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని స్థానిక సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జగ్గంపేటలో ఉన్న బాలుర వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్డెన్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



పొట్టకూటి ప్రయాణం.. మార్గ మధ్యలోనే నడిరోడ్డుపై భోజనాలు చేయాల్సిన దుస్థితి. ఇది తుని, కోటనందూరు తదితర మండలాల నుంచి మహిళా కార్మికులను ఉప్పాడ సమీపంలోని రొయ్యల పరిశ్రమల యజమాన్యాలు రోజూ పనికి ప్రత్యేక బస్సులో తీసుకొస్తారు. ప్రయాణం దూరం కావడంతో మధ్యాహ్న సమయంలో తుని మండలం హంసవరం సమీపంలోనినడిరోడ్డుపైనే భోజనాలు చేసి వారి ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. మూలమలుపులు.. వేగంతో వచ్చే వాహనాలు.. ఈ క్రమంలో కాస్త నీడ ఉండేలా షెడ్డులో భోజనాలు చేసే ఏర్పాట్లు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

ఐదుగురు జూదరుల అరెస్టు

గండేపల్లి, న్యూస్‌టుడే: జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలివీ.. గండేపల్లి మండలం తాళ్లూరు శివారు జూదం ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,390 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

నాణ్యత బేజారు.. ధర దిగాలు

నియోజకవర్గంలో 2,952 ఎకరాల్లో పత్తి సాగు

న్యూస్‌టుడే, తుని గ్రామీణం:

పత్తి రైతులు ఆది లోనే విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ప్రారంభంలో పరిస్థితి ఆశాజనకంగా ఉన్నప్పటికి మొంథా రైతులను నిండా ముంచేసింది. దీంతో నాణ్యత లేని నల్లని పత్తి దిగుబడిగా రావడంతో ధర తగ్గడం, మరో పక్క పొలంలోని పత్తికాయలు రాలిపోయి, మొక్కలు గిడసబారిపోవడంతో రైతు కుదేలయ్యారు. మరో పక్క కూలీల వేతనాలు పెరగడంతో ఈ ఏడాది పెట్టిన పెట్టుబడి సైతం చేతికొచ్చే పరిస్థితి లేదు.

ఇదీ పరిస్థితి..

నియోజకవర్గంలో 2,952 ఎకరాల్లో పత్తి సాగవుతోంది. ప్రారంభంలో పరిస్థితి ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఉత్సాహంతో సాగులో మెలకువలు పాటించి దిగుబడి వచ్చే విధంగా పంటను తీర్చిదిద్దారు. చేతికి పంట వచ్చే సమయంలో మొంథాతో పత్తిపంటలో మూడు నాలుగు రోజులపాటు నీళ్లునిల్వఉండిపోవడంతో పొలం మొత్తం ఊటబారిపోయి మొక్కలు మాడిపోయి చనిపోవడం, కాయలు నల్లగా మారిపోయి రాలిపోవడంతో రైతులను తుపాను కష్టాల్లోకి నెట్టేసింది.

తిమ్మాపురంలో మొంథాతో దెబ్బతిన్న పంట

నాణ్యత లేక.. తగ్గిన ధర

ప్రస్తుతం పత్తి పంటలో నల్లగా మారిన పత్తిని సేకరించే రైతులు విక్రయాలు చేస్తున్నారు. ప్రారంభంలో కిలో సుమారు రూ.55 వరకు ఉండగా ప్రస్తుతం నాణ్యత లేని పత్తిని వ్యాపారులు కేవలం రూ.40 నుంచి 45 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతోపాటు దిగుబడి సైతం తగ్గింది. ఏటా ఎకరాకు సుమారు 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని ఈ ఏడాది కేవలం 6 నుంచి 8 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చే పరిస్థితి ఉంది.

కూలీ ఖర్చులు రావడం లేదు

పత్తిని సేకరించేందుకు పెట్టుకునే మహిళా కూలీలకు రోజుకు రూ.300 ఇవ్వాలి. ఒక్కో కూలీ కేవలం 10 నుంచి 12 కిలోల పత్తిని ఏరుతున్నారు. మొత్తం అమ్మితే వచ్చే ఆదాయంలో కూలీలకు సగానికి పైగా చెల్లించాల్సివస్తుంది. దీంతో రైతుకు మిగిలేది లేక కొందరు పత్తిని పొలంలోనే వదిలేస్తున్నారు.

- సింహాద్రి, రైతు, చామవరం, తుని మండలం.

ప్రభుత్వం ఆదుకోవాలి..

దిగుబడి, ధర తగ్గిపోవడంతో పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం మద్దతు ధరను వెంటనే ప్రకటించి రైతుల నుంచి నేరుగా పత్తిని కొనుగోలు చేస్తే కాస్తోకూస్తో నష్టం తగ్గుతుంది.

- సూర్యచక్రం, రైతు, చామవరం, తుని మండలం.

విద్యుత్తు తీగలు, నియంత్రికలతో జాగ్రత్త..!

గండేపల్లిలో ఇళ్ల సమీపంలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్, వైర్లు

గండేపల్లి, న్యూస్‌టుడే: వేలాడుతున్న, ఇళ్లపై నుంచి వెళ్లే 11 కేవీ విద్యుత్తు తీగలను తొలగించాలి. కనీసం వాటితో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులకు విన్నవించిన పట్టడం లేదు. ఫలితంగా ఎన్నో ప్రాణాలు మృత్యువాత పడుతున్నాయి. ప్రమాదం జరిగినా ఆ శాఖ అధికారుల్లో స్పందన కొరవడుతోంది. ప్రమాదం జరగకుండా ముందే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలో ఘటనలు ఇవీ..

ఆదివారం రామయ్యపాలెంలో వరి కోత యంత్రం 11 కేవీ తీగలకు తగిలి ఇద్దరు మృతి చెందారు. గతంలో ఇదే గ్రామంలో ఓ శుభ కార్యానికి టెంట్లు వేస్తుండగా తీగలు తగిలి ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతిచెందారు. జడ్.రాగంపేట ఎస్సీ కాలనీలో చర్చి పక్కన ఇళ్ల మధ్య నుంచి 11కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని అధికారులకు విన్నవించిన నేటికి చర్యలు లేవు. ఉప్పలపాడు, మురారి గ్రామాల్లో పామాయిల్ తోటల్లో కిందికి వేలాడిన వైర్లు తగిలి గెలలు కోస్తున్న కూలీలు మృత్యువాత పడిన ఘటనలు ఎన్నో. జగ్గంపేట నెహ్రూకాలనీ, శెట్టిబలిజ కాలనీల్లోనూ, కిర్లంపూడి మండలాల్లోనూ ఇవే సమస్యలున్నాయి.

మండలాల్లో వ్యవస్థ ఇలా:

మండలం	ఉపకేంద్రాలు	ట్రాన్స్‌ఫార్మర్లు
గండేపల్లి	6	3443
జగ్గంపేట	5	1616
కిర్లంపూడి	3	1492
రౌతులపూడి	1	1091
ఏలేశ్వరం	3	945
ప్రత్తిపాడు	2	1608
తుని	3	404

అంచనా రుసుము కడితే మారుస్తాం

వేలాడే విద్యుత్తు తీగలతో ఎక్కడ సమస్యలు ఉంటే అక్కడ మీ సేవాలో రిజిస్ట్రేషన్ చేసుకుని, అంచనా ఛార్జీలు చెల్లిస్తే తీగలు మారుస్తాం. తోటల్లో ప్రమాదాలు చోటుచేసుకోకుండా తీగలను సరి చేస్తాం. **- కిరణ్‌కిషోర్, ఏఈ, గండేపల్లి**

(c) eenadu

మాసుమాన్‌దొడ్డి కొండపై జరిగిన తవ్వకాలు (ఎర్రమట్టి తరలించడంతో ఇలా..)

కొండ కరిగింది.. మట్టి తరలింది

మండల పరిధిలోని మాసుమాన్‌దొడ్డి, కె.నాగలాపురం ప్రాంతాల్లో ఉన్న కొండపై అక్రమార్కులు పెద్దఎత్తున ఎర్రమట్టి తరలించి సొమ్ము చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని భారీగా మట్టిని వాహనాల్లో తరలించేశారు. ఫలితంగా ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన కొండ ప్రస్తుతం గుంతలతో నిండిపోయింది. అధికారులు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

విద్యుత్తు సమస్యలా.. ఫోన్ చేయండి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ కృషి చేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల సమయంలో డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను నేరుగా ఏపీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

1800 425 155333 టోల్‌ఫ్రీ నంబరు, 89777 16661కు ఫోన్ చేయాలని లేదా 9133331912 వాట్సప్ నంబరుకు సమస్య వివరాలు పంపాలని కోరారు.

ఉల్లాస్‌భరితమే

● సంపూర్ణ అక్షరాస్యత వైపు అడుగులు

ఆదోని పాత పట్టణం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల్లో పొదుపు మహిళలను అక్షరాస్యత వైపు అడుగులు వేయించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. 'అక్షర ఆంధ్ర' పేరుతో చదువు చెప్పేలా అధికారులు శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇది కొనసాగుతుండగా.. ఈ ఏడాది నుంచి నగరాలు, పట్టణాల్లో ప్రారంభిస్తున్నారు. 'అక్షర ఆంధ్ర సాధన పత్రాలు' పేరుతో పుస్తకాలు ముద్రించి మెప్మా కార్యాలయాలకు అందించారు.



సభ్యులకు అందించే అక్షర ఆంధ్ర పుస్తకం

ముందుగా నిరక్షరాస్యులను గుర్తిస్తారు. ప్రతి పది మందిని జట్టుగా ఎంపిక చేసి ఒక వాలంటీరును నియమిస్తారు. రాయడం, చదవడం, కూడికలు, తీసివేతలు తదితరాలపై శిక్షణ ఇస్తారు. ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటలపాటు చదువు చెబుతారు.

నెలాఖరు నుంచి తరగతులు

- ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు తొమ్మిది పురపాలక సంఘాలున్నాయి. 874 ఎస్ఎల్ఎఫ్ (స్లమ్ లెవల్ ఫెడరేషన్)లు ఉన్నాయి.
- 2.25 లక్షల మందికిపైగా పొదుపు మహిళలుండగా.. వీరిలో ఎనభై శాతం మంది అక్షర జ్ఞానులున్నారు. మిగిలినవారిని సైతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వాలు చొరవ చూపుతున్నాయి.
- ఫోన్‌పే, గూగుల్‌పే, అంతర్జాల బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పిస్తారు.
- తరగతులు ఈనెలాఖరులోపు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించారు. మూడు నెలలపాటు బోధిస్తారు. మార్చి, ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహిస్తారు.

ఆదారం తెగుతోంది

▶▶ నేతన్నలపై ధరల పిడుగు ▶▶ మూలకు చేరుతున్న మగ్గాలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : నేత కార్మికులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. పట్టు మగ్గాలపై ఆధారపడిన కార్మికులు, మాస్టర్ వీవర్లకు ఇప్పుడు కొత్త సమస్య ఎదురైంది. పట్టు చీరల తయారీకి ఉపయోగించే వార్పు, సప్పూరి ధరలు మూడు నెలల వ్యవధిలో కిలోకు రూ.1,200కుపైగా పెరిగింది. పట్టు ఉత్పత్తి తగ్గడంతో ముడి పట్టుకు డిమాండు ఏర్పడింది.

జిల్లాలో చేనేత మగ్గాలకు అవసరమైన ముడిసరకు రాక తగ్గిపోయింది. వాస్తవంగా ధర్మవరం, హిందూపురం, బెంగళూరు నుంచి ఎమ్మిగనూరు, కోడుమూరుకు చెందిన వ్యాపారులు పట్టు దారాలను అధికంగా దిగుమతి చేసుకునేవారు. పెరిగిన ధరల నేపథ్యంలో ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో ఉత్పత్తయ్యే చోటు నుంచి మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్రంలో ధర్మవరం తర్వాత ఎమ్మిగనూరులో ఎక్కువమంది నేతన్నలు ఉన్నారు.

మగ్గం నేస్తున్న చేనేత కార్మికులు

జీవనంపై ప్రభావం

జిల్లాలో అత్యధికంగా ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని, నందవరం, నాగలదిన్నె, కోసిగి గుడేకల్లు, శ్రీరాంనగర్ నగర్ ప్రాంతాల్లో పట్టుతో నేసే మగ్గాలు ఉన్నాయి. వీరంతా మాస్టరు వీవర్స్ కింద నేస్తున్నారు. తెలంగాణలోని గద్వాల, ఎమ్మిగనూరు, కోడుమూరు పరిధిలో 400 మంది వ్యాపారులు ఉన్నట్లు అంచనా. వీరంతా ముడి సరకును బెంగళూరు, చీరాల, ధర్మవరం తదితర ప్రాంతాల నుంచి తీసుకొస్తుంటారు. జిల్లాలో 17 వేలకుపైగా పట్టు మగ్గాలు ఉన్నట్లు అంచనా. ధరలు పెరగడంతో మగ్గాల సంఖ్య తగ్గుతోంది. కార్మికులకు ఒక చీర నేసేందుకు వారం నుంచి 16 రోజులు పడుతుంది. కూలీ రూ.1,200 నుంచి రూ.8 వేల వరకు అందుతుంది. జిల్లాలో 300కుపైగా మగ్గాలు తగ్గినట్లు అంచనా. ఈ నేపథ్యంలో కార్మికుల జీవనం దయనీయంగా మారుతోంది.

17 వేలు	700 గ్రాములు	68 వేల కిలోలు	సరాసరిన 6	38,250 కిలోలు	రూ.6,400	రూ.5,200
జిల్లాలో మొత్తం మగ్గాలు	ఒక చీరకు అవసరమైన పట్టు	నెలకు అవసరమైన ముడి పట్టు	నెలకు ఒక మగ్గంపై పట్టుచీరల ఉత్పత్తి	నెలకు అవసరమైన పట్టుదారం	ప్రస్తుతం కిలో ముడిపట్టు ధర	మూడు నెలల కిందటి ధర

జాలువారుతూ.. మైమరపిస్తూ

నంద్యాల జిల్లా అవుకు మండల పరిధి.. మంగంపేట గ్రామ సమీపంలోని జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతం పరవళ్లు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో దీనిని చూసేందుకు పర్యాటకులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఆదివారం కావడంతో భారీగా తరలివచ్చారు. జలపాతం వద్దకు రహదారి నిర్మించడంతోపాటు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగే అవకాశముంది. – న్యూస్‌టుడే, అవుకు, బనగానపల్లి గ్రామీణం


హత్తిబెళగల్ గ్రామాన్ని ఆనుకుని ఉన్న కొండ

ఆ పేరు ఎలా వచ్చిందంటే..

ఆలూరు మండల పరిధిలో హత్తిబెళగల్ గ్రామముంది. ఇక్కడ సుమారు 8 వేల మంది నివసిస్తున్నారు. దాదాపు 80 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. హత్తిబెళగల్ అనేది కన్నడ పదం. కర్ణాటక రాష్ట్రాన్ని ఆనుకుని ఉంటుంది. ఈ నేపథ్యంలో అక్కడి ఆచార వ్యవహారాలను ఎక్కువమంది పాటిస్తూ ఉంటారు. హత్తి అంటే పత్తి (గతంలో ఇక్కడ ఎక్కువ మంది సాగు చేసేవారు). బెళే అంటే తెల్లని, కల్ అంటే రాయి అని.. హత్తిబెళగల్ అంటే పత్తిలా వికసించిన తెల్లని కొండ అని అర్థం. గ్రామానికి ఆనుకుని తెల్లని కొండలు ఉన్నాయి. గ్రామానికి దగ్గరగా ఉన్న గుట్టను.. కొండను ఆధారంగా చేసుకుని గ్రామానికి ఆ పేరు పెట్టారు. – న్యూస్‌టుడే, ఆలూరు గ్రామీణం

నేత్రానందం.. నృత్యాభినయం

కన్నడ భరతనాట్య కళాకారులు ప్రదర్శించిన ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. బెంగళూరుకు చెందిన గెజ్జెన నృత్య మందిర్ నిర్వాహకురాలు భువన నిఖిల్ ఆధ్వర్యంలో శ్రీమఠంలోని యజ్ఞ మండపంలో దాదాపు 130 మంది భరతనాట్య కళాకారులు సంప్రదాయ నృత్యంతో ఆదివారం అలరించారు. రాఘవేంద్ర స్వామి గీతాలకు చేసిన నృత్య ప్రదర్శన అబ్బురపరిచింది. కళాకారులను పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. శ్రీమఠం సాంస్కృతిక నిర్వాహకులు పద్మనాభాచార్ కళాకారులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. – న్యూస్‌టుడే, మంత్రాలయం

11న పలు ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో ఏర్పాటు చేయనున్న పలు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 11వ తేదీన వర్చువల్‌గా శంకుస్థాపనలు చేయనున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై జేసీ, ఆర్డీవోలు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, పరిశ్రమల శాఖ అధికారి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్, పర్యాటకశాఖ అధికారులతో ఆదివారం టెలీ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఏపీఐఐసీ, విమానాశ్రయం, పర్యాటక శాఖలకు సంబంధించిన ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నారని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టుల్లో ఒకటైన సీఎం నేరుగా సంబంధిత లబ్ధిదారులు తదితరులతో మాట్లాడనున్నారు, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం అందరినీ ఆహ్వానించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఖాళీగా ఉంచారు.. రూ.కోట్లు మింగారు

■ గత ప్రభుత్వ హయాంలో నేతల పన్నాగం ■ ఏళ్లుగా ఎస్‌డబ్ల్యూసీ గోదాముల నిరుపయోగం

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలోని బళ్లారి రోడ్డులో రేడియో స్టేషన్ వద్ద రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (ఏపీ ఎస్‌డబ్ల్యూసీ) గోదాములు గత ఐదేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. సుమారు 6 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ గోదాములను గత ప్రభుత్వ హయాంలో అద్దెకు కూడా ఇవ్వకుండా నిరుపయోగంగా మార్చారు. రేషన్ బియ్యం నిల్వకు అవకాశం ఉన్నా.. వీటిలో తరలించకుండా ప్రైవేటు గోదాములకు పావులు కదిపారు. ఈ గోదాము సమీపంలోనే ఓ ప్రైవేటు గోదామును పౌర సరఫరాల సంస్థ అద్దెకు తీసుకుని రేషన్ బియ్యం బఫర్ స్టాక్ నిల్వ చేస్తోంది. పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన దీనికి నెలకు రూ.10 లక్షల మేర అద్దె చెల్లిస్తున్నట్లు సమాచారం. ఐదేళ్ల పాటు గోదాములను ఖాళీగా ఉంచడంతో ఎస్‌డబ్ల్యూసీకి రూ.3.60 కోట్ల నష్టం జరిగింది.

ఐదేళ్లుగా ఖాళీగా ఉన్న ఎస్‌డబ్ల్యూసీ గోదాములు

ప్రైవేటులో నిల్వ చేసి..

ప్రైవేటు గోదాముల్లో రేషన్ బియ్యం నిల్వ చేయడంతో గతంలో అనేక అక్రమాలు జరిగాయి. బియ్యాన్ని పెద్దఎత్తున బయటకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఆదోనిలోని ఓ ప్రైవేటు గోదాములో బఫర్ స్టాక్ నిల్వలు ఉండగా... ఎస్‌డబ్ల్యూసీ గోదాములున్నా... వైకాపా ప్రభుత్వంలో నేతల అండదండలతో ప్రైవేటు గోదాముల్లోనే బియ్యం నిల్వలు ఉంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థ గోదాముల్లోనే రేషన్ బియ్యం నిల్వ ఉంచాలని ఆదేశించింది. ఇకపై ఎస్‌డబ్ల్యూసీ గోదాములను వినియోగించనున్నారు. ఫలితంగా రేషన్ పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్టపడే అవకాశం ఉంది.

ఎట్టకేలకు వినియోగించుకునేలా..

జిల్లాకు ప్రతినెలా నాలుగు వ్యాగన్ల రేషన్ బియ్యం వస్తోంది. వీటిలో రెండు వ్యాగన్లను ప్రైవేటు గోదాముల్లో, మరో రెండు వ్యాగన్ల బియ్యాన్ని ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో నిల్వ చేసేందుకు రంగం సిద్ధమైంది. రేడియోస్టేషన్ సమీపంలోని ఎస్‌డబ్ల్యూసీ గోదాము ఆవరణను ఆదివారం శుభ్రం చేయించారు. ఇటీవల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. వారం రోజుల్లో ఈ గోదాముల్లో 5 నుంచి 6 వేల టన్నుల నిల్వలు ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు చెందిన 6 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను నెలకు రూ.6 లక్షల అద్దె ప్రాతిపదికన పౌర సరఫరాల సంస్థకు ఇచ్చినట్లు సమాచారం.

విజయ మనోహరమే

నంద్యాల జిల్లా వెలుగోడు మండలం తిమ్మనపల్లె గ్రామానికి చెందిన మనోహర్‌కుమార్‌కు చిన్నతనం నుంచి క్రీడలంటే మక్కువ. అతను ప్రస్తుతం నంద్యాలలో ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గత మూడేళ్లుగా బేస్‌బాల్‌లో కఠోర శిక్షణ పొందుతున్నాడు. ప్రతిరోజూ రెండు గంటల పాటు తర్ఫీదు తీసుకుంటూ అవకాశాలను మెరుగులు నేర్చుకుంటున్నాడు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తూ జాతీయ స్థాయి పోటీలపై దృష్టి పెట్టాడు.

ప్రశంసా పత్రం అందుకుంటున్న మనోహర్‌కుమార్

● గతేడాది నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అదే ఏడాది నిర్వహించిన అండర్-19 విభాగంలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటాడు. ఈ ఏడాది ఆగస్టులో నంద్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి జట్టులో స్థానం సాధించడం విశేషం. అనంతరం కదిరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ సందర్భంగా మనోహర్‌కుమార్ మాట్లాడుతూ మరింత కష్టపడి జాతీయ స్థాయిలో రాణిస్తానని పేర్కొన్నాడు. – న్యూస్‌టుడే, వెలుగోడు, నంద్యాల పాతపట్టణం

కూలి అందుకుని.. గుట్టుగా జారుకుని

● ఉపాధి పథకంలో అక్రమార్కులు

ఉపాధి పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో నమోదైన పలువురు దీనికి దూరంగా ఉంటున్నారు. గుట్టు బయటపడుతుందన్న ఉద్దేశంతో రావడం లేదు. – న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

■ జాబ్‌కార్డులు తీసుకున్న కుటుంబాలు ■ హాజరవుతున్న కుటుంబాలు ■ పనులు చేస్తున్నవారు (లక్షల్లో)

	కర్నూలు	నంద్యాల
జాబ్‌కార్డులు తీసుకున్న కుటుంబాలు	3.34	2.63
హాజరవుతున్న కుటుంబాలు	2.66	1.86
పనులు చేస్తున్నవారు	4.80	3.25

క్షేత్రస్థాయిలో కానరాక..

ఉమ్మడి జిల్లాలో సుమారు 4 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇచ్చారు. కర్నూలు జిల్లాలో 66, నంద్యాల జిల్లాలో 72 శాతం ఈకేవైసీ పూర్తైనట్లు చెబుతున్నా వాస్తవాలు అంతకన్నా తక్కువగానే ఉంది. గ్రామాలు దస్త్రాల్లో చూపినవారి జాడ క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. వీరు పనులకు రాకున్నప్పటికీ వేతనాలు మాత్రం అందుకోవడం గమనార్హం.

రూ.కోట్లు పక్కదారి

కర్నూలు జిల్లాలో పత్తికొండ, కోసిగి, మద్దికెర, నందవరం, కోడుమూరు, హాలహర్వి, దేవనకొండ, కృష్ణగిరి తదితర మండలాల్లో, నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, కోవెలకుంట్ల, గోస్పాడు, వెలుగోడు, ఆత్మకూరు, గడివేముల తదితర మండలాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి.

ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులు చేసినట్లు కొన్నిచోట్ల మాయ చేశారు. పనికి రాకున్నప్పటికీ వచ్చినట్లు చాలా ప్రాంతాల్లో దొంగ మస్టర్లు వేశారు. పని ప్రదేశంలో అందరినీ గ్రూపుగా నిలబెట్టి ఫొటో తీసి హాజరు వేసే విధానం అమలులోకి తెచ్చినప్పటికీ దొంగ మస్టర్లకు మాత్రం అడ్డుకట్ట పడలేదు. ఐదేళ్ల కిందట

ఈకేవైసీ పూర్తైతేనే..

● ఈకేవైసీ పూర్తైన తర్వాత వీరికి పనులు కల్పిస్తారు. పని జరిగే ప్రాంతంలో ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది.

● జాబ్‌కార్డు ఉండి పనులకు రాని కొందరు ఈకేవైసీ చేయించుకునేందుకు ముందుకు రావడం లేదు. ఈకేవైసీ చేయించుకుంటే గతంలో చేసిన తప్పులు బయటకు వస్తాయన్న ఉద్దేశంతో గుట్టుగా జారుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈకేవైసీ పూర్తి కానివారు 2 లక్షల మందికిపైగా ఉన్నారు. వీరి వివరాలు సేకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

విషయం బయటపడుతుందని..

కేవలం హాజరు పట్టీక మాత్రమే ఉండగా... అక్రమాలు భారీగా జరిగాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చేస్తున్నవారి పేర్లతోనూ రెండు జిల్లాల్లోని పలు గ్రామాల్లో నమోదు చేసి వేతనాలు స్వాహా చేశారు. సోషల్ ఆడిట్‌లో పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

ఆన్‌లైన్ పెట్టుబడులపై అప్రమత్తం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : తక్కువ పెట్టుబడితో అధిక లాభాలొస్తాయని ఆశచూపి సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ పెట్టుబడులు, ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. పెట్టుబడి పెట్టే ముందు సదరు సంస్థ సెబీలో రిజిస్ట్రేషన్ చేసుకుని అనుమతి పొందిందో లేదో నిర్ధారించుకోవాలన్నారు. త్వరపడి అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు చెప్పవద్దన్నారు. ఓటీపీ, యూపీఐ పిన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు ఎవరితో పంచుకోవద్దన్నారు. మోసపోయిన బాధితులు ఆలస్యం చేయకుండా టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

శ్రమజీవులకు ఆర్థిక భరోసా

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల చిరు ఉద్యోగుల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపింది. గత ప్రభుత్వ హయాంలో చాలీచాలని జీతాలతో కార్మికులు కాలం వెళ్లదీస్తూ వచ్చారు. పనికి తగ్గ వేతనాలివ్వాలని ఆందోళన చేసినా ప్రయోజనం లేకపోయింది. కూటమి ప్రభుత్వం వీరి సేవలను గుర్తించి జీతాల పెంపుతోపాటు మేలు కలిగేలా చర్యలు తీసుకుంది.

ఉపయోగాలు..

కార్మికులు, చిరు ఉద్యోగులు దురదృష్టవశాత్తు చనిపోతే రూ.2 లక్షల సాయం అందుతుంది. వారి పిల్లల చదువుకొనేందుకు.. ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఇద్దరికి రూ.8 లక్షలు ఇవ్వనుంది. ప్రమాదవశాత్తు చనిపోతే రూ.20 లక్షల పరిహారం ఇస్తుంది. రూ.4 లక్షల వరకు రుణ సాయం అందేలా చర్యలు తీసుకుంటుంది.

ఆదోనిలో రాంజల చెరువును శుభ్రం చేస్తున్న కార్మికులు

వినతులను పట్టించుకోక..

2019లో అప్పటి ప్రభుత్వం కార్మికులను ఆప్కాస్ పరిధిలోకి చేర్చింది. సంక్షేమ పథకాలు దూరం చేసింది. ఒప్పంద ఉద్యోగులకు గతంలో రూ.15 వేల జీతం ఇచ్చేవారు. కత్తిరింపులు పోగా రూ.13,074 మాత్రమే వచ్చేది. కొవిడ్ సమయంలో ప్రజారోగ్య కార్మికులకు అదనంగా రూ.6 వేలు పెంచి ఇచ్చారు. తమకు జీతాలు పెంచాలని సాంకేతిక, సాంకేతికేతర ఉద్యోగులు కోరినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సాంకేతిక ఉద్యోగులకు ఈ ఏడాది ఆగస్టు నుంచి రూ.3 వేలు, సాంకేతికేతర ఉద్యోగులకు రూ.3,500 పెంచింది. యాక్సిస్ బ్యాంకుతో ఒప్పందం చేసుకుని శూన్య ఖాతాలను తెరిపించింది. ఏదైనా ప్రమాదం జరిగితే ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకుంది.

శ్రీగిరిలో భక్తుల రద్దీ

దర్శనానికి వేచి ఉన్న జనం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రం ఆదివారం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో శ్రీగిరికి తరలివచ్చారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే భ్రమరాంబాదేవి, మల్లికార్జునస్వామి దర్శనానికి బారులుదీరారు. ఉచిత దర్శనానికి 3 గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటలు పట్టింది.

నేడు లక్ష దీపోత్సవం

కార్తిక మాసోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం సాయంత్రం ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం జరగనుంది. ఉత్సవమూర్తులకు అర్చకులు వివిధ హారతులు సమర్పించనున్నారు.

కాపాడితేనే.. కర్షకులకు అండ

● ఆర్ఎస్‌కేలను వేధిస్తున్న మందుల కొరత

రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా పశువైద్యాన్ని పాడి రైతుల ఇంటి ముంగిటకు తెచ్చామని గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసింది. మందుల సరఫరాలో నిర్లక్ష్యం చేసింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రైతు భరోసా కేంద్రాలను.. రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. కానీ మందులు సరఫరా కావడం లేదు. చివరికి పాడి రైతులపై భారం తప్పడం లేదు.

–న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ఉమ్మడి జిల్లాలోని ఆర్ఎస్‌కేల్లో పశుసంవర్ధక సహాయకుల పోస్టులు.. పనిచేస్తున్నవారు

■ ఆర్ఎస్‌కేలు ■ పోస్టులు ■ పనిచేస్తున్నవారు

	ఆర్ఎస్‌కేలు	పోస్టులు	పనిచేస్తున్నవారు
నంద్యాల	411	191	186
కర్నూలు	466	192	190


దేవనకొండ మండలంలో ఆర్ఎస్‌కే వద్ద వృషభాలకు టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయకులు

రైతుల జేబుకు చిల్లు

● ఆర్ఎస్‌కేల్లోని పశుసంవర్ధక సహాయకుల వద్దకు పశువులను తీసుకొస్తే మందులు తీసుకురావాలంటూ పశు పోషకులను ప్రైవేటు దుకాణాలకు పంపుతున్నారు. పొదుగు వాపు వ్యాధి మందులకు ఒక్కో రైతు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది పాడి రైతుకు భారంగా మారుతోంది. జ్వరాలు, పారుడు రోగం, మేత మేయకపోవడం, నులి పురుగులు తదితర సమస్యలు తరచూ వస్తుంటాయి. ఆర్ఎస్‌కేల్లో ప్రాథమిక చికిత్స అందించేందుకు మందులు అందుబాటులో లేకపోవడంతో రైతులు బయట కొనుగోలు చేస్తున్నారు.

● మందులు లేక కేవలం టీకాలు, కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు ఇచ్చేందుకే పశుసంవర్ధక సహాయకులు పరిమితమయ్యారు.

నాటి నుంచి నేటి వరకు రెండుసార్లే..

● 2019-20లో అప్పటి ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పశువులు, మూగజీవాలకు పశు వైద్యం అందించడం.. అవసరమైన మందులను ఉచితంగా సరఫరా చేయడంతోపాటు టీకాలు వేయించేలా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు.

● గతంలో ఆర్బీకే పరిధిలో రూ.28 వేల నుంచి రూ.32 వేల వరకు పశువుల మందుల కోసం ఇండెంట్ పెట్టుకునేందుకు అవకాశం ఉండేది. 2021, 2022లో ఏహెచ్ఏలు మందులకు ఇండెంట్ పెట్టుకుంటే కొందరికి రూ.5 వేలు, మరికొందరికి రూ.20 వేల విలువైన మందులను అరకొరగా సరఫరా చేశారు. 2023 నుంచి ఇప్పటివరకు గత 35 నెలలుగా మూడేళ్లవుతున్నా మందుల సరఫరా జరగలేదు.

(c) eenadu

పచ్చదనంపై పట్టింపేది?

ఆళ్లగడ్డ పురపాలికలో ఎక్కడా ఉద్యానవనం, పచ్చదనం లేదు. కనీసం మొక్కలు నాటి పచ్చదనం పెంచడంలోనూ మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పచ్చదనం కోసం నాటాల్సిన మొక్కలను వృథాగా పడేశారు. 10 నెలలకు పైగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు సంచుల్లోనే వృథాగా పడి ఉన్నాయి. వాటిలో కొన్ని ఇప్పటికే ఎండిపోగా, కొన్ని మొక్కలు నాటినా ఫలితం లేని స్థితికి చేరుకున్నాయి. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

రక్షణ గోడలు శిథిలం.. రాకపోకలకు భయం

బనగానపల్లి మండలం అప్పలాపురం గ్రామ సమీపంలో వంతెనకు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారింది. వంతెన లోతుగా ఉండటంతో వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదం తప్పదు. పేరుకే జాతీయ రహదారి(544-డి) అయినప్పటికీ చర్యలు చేపట్టడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఈ దారిలోనే బనగానపల్లి నుంచి నంద్యాలకు వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, అప్పలాపురం (బనగానపల్లి గ్రామీణం)

రోడ్డు పగిలి.. ప్రయాణికుల ఇబ్బంది

నంద్యాల పట్టణం నుంచి పెసరవాయి వెళ్లే దారిలో పీవీనగర్ వద్ద సిమెంటు రోడ్డు రెండు చోట్ల పగిలిపోయింది. భీమవరం, యరగుంట్ల, కరిమద్దెల, పెసరవాయి వంటి గ్రామాల నుంచి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రద్దీగా ఉండే ఈ మార్గంలో సీసీ రోడ్డు ఓ వైపు విరిగిపోయింది. రాత్రిళ్లు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు సరిగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం,

ప్రమాదాలకు అడ్డదారి

హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిని ద్విచక్ర వాహనదారులు విభాగినుల మీదుగా ప్రమాదకరంగా దాటుతున్నారు. వేగంగా దూసుకొస్తున్న వాహనచోదకులు హఠాత్తుగా అడ్డొచ్చే వీరిని చూసి అదుపు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్నటేకూరు- చెట్లమల్లాపురం మధ్య గతనెల రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కాలిపోయిన దుర్ఘటనలో 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఆ ప్రమాద స్థలానికి సమీపంలోనే చిన్నటేకూరు శాంతి ఆశ్రమం వద్ద నిత్యం పలువురు జాతీయ రహదారిని ఇష్టానుసారం దాటుతున్నారు. ఎన్‌హెచ్‌ఏ అధికారులు చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. – ఈనాడు, కర్నూలు

సమాజ సేవలో ముందుంటాం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమాలను అందించడలో కమ్మసేవా సంఘం ముందు వరుసలో నిలుస్తుందని కాకతీయ కమ్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావ్ పేర్కొన్నారు. కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో పత్తికొండలోని ఆదోని రోడ్డులో ఓ కల్యాణ మండపంలో ఆదివారం కార్తిక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జ్యోతి వెలిగించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి వ్యవసాయ రంగం మొదలుకొని అంతర్జాతీయ స్థాయిలో వ్యాపార వాణిజ్య రంగాలతోపాటు రాజకీయ, సినిమా రంగాల్లో కమ్మ సామాజిక వర్గానికి చెందిన వేలాది మంది రాణిస్తున్నారన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా అనేక ప్రాంతాల్లో నిరుపేద పిల్లలకు ఉచిత విద్యనందిస్తూ వారి ఉన్నతికి దోహదపడుతున్నామన్నారు. నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వేలూరు రామప్ప, జరగల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, ఆయా మండలాల నాయకులు మనోహర్‌చౌదరి, వైకుంఠం మల్లికార్జున చౌదరి, పారా రామచంద్రప్రసాద్, రవికుమార్, సురేశ్‌చౌదరి, వైకుంఠప్రతాప్, అశోక్, చల్లారవీంద్రనాథ్‌చౌదరి, సుధాకర్‌చౌదరి, ఆయా గ్రామాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బెజవాడ వెంకట్రావ్

ఆదోనిలో కమ్మ సంఘం ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని చేకూరి ఫంక్షన్ హాల్లో కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన భోజన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బహుమతులు ప్రదానం చేశారు. వైద్యులకు, వివిధ శాఖల్లో సేవలు అందించిన ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమ్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకటరావు, తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, సంఘం పట్టణ అధ్యక్షుడు దీప్తి మురళీ, నాయకులు రఘురామయ్య, బసాపురం రామస్వామి, మారుతినాయుడు, వెంకటేశుచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే కార్గో సేవలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) కార్గో సేవల ద్వారా పార్శిళ్లు, సరకులను తక్కువ ధరకు రవాణా చేస్తోంది. ప్రైవేటు కొరియర్ సేవలతో పోలిస్తే ఈ సేవలు చౌకగా ఉంటాయి. ఇంటి వద్దకే డెలివరీ, బీమా సౌకర్యం వంటి అదనపు సౌకర్యాలు అందిస్తుంది. బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తూ ఆదాయం ఆర్జిస్తున్న ఆర్టీసీ.. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల పెంపుపై దృష్టి సారించింది. నష్టాలను పూడ్చుకోవడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా కార్గో సేవలను విస్తరిస్తోంది.

2017లో ప్రారంభం

ఆర్టీసీ సంస్థ 2017లో సరకు రవాణాకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని నంద్యాల, డోన్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు డిపోల్లో డోర్ డెలివరీ సేవలు అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే మిగతా డిపోలకూ ఈ సేవలు విస్తరించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కార్గో సేవలపై ప్రజలు ఆసక్తి కనబరుస్తుండడంతో ఆర్టీసీకి ఆదాయం సమకూరుతోంది. ఈ సేవలకు ప్రభుత్వరంగ సంస్థలు, విభాగాలు సహకరిస్తుండడంతో పార్శిల్ సర్వీసు విజయవంతమవుతోంది.

ఇతర రాష్ట్రాలకు సైతం

ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సరకులను డోర్ డెలివరీ చేస్తున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, బళ్లారి, రాయచూరు వంటి ఇతర రాష్ట్రాలకు విత్తనాలు, విడిభాగాలు, ఔషధాలు, పూలు, పండ్లు, కూరగాయలు, టైర్లు, అరటి ఆకులు వంటి సరకులను వేగవంతంగా సరఫరా చేస్తూ కార్గో ప్రత్యేకత సంతరించుకుంది. మనం పంపిన పార్శిల్‌ను ట్రాకింగ్ చేసుకునే అవకాశం ఉంది. పార్శిల్ ఎక్కడ ఉందో, ఎప్పుడు డెలివరీ అవుతుందో ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రజలు కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

గత మూడేళ్లలో ఆదాయ వివరాలు (రూ.కోట్లలో)

జిల్లా	2023	2024	2025 (ఇప్పటి వరకు)
కర్నూలు	6.03	6.79	3.55
నంద్యాల	4.14	4.67	2.52

నంద్యాల ఆర్టీసీ బస్టాండులో పార్సిల్ కార్యాలయం

వనభోజన వేడుక.. సంతోషాల వేదిక

నగర శివారులోని ఓ వేడుకల మందిరంలో కర్నూలు పద్మశాలి సంఘం వన మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ డా.సంజీవ్‌కుమార్ దంపతులను సంఘం అధ్యక్షుడు కస్తూరి వేమయ్య, సభ్యులు సత్కరించారు.

స్థానిక సంకల్‌బాగ్ హరిహరక్షేత్రంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం నిర్వహించారు. సంఘం నగర అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శ్రీశైల దేవస్థాన పాలకమండలి సభ్యుడు భరద్వాజశర్మను సన్మానించారు.

నగర శివారులోని జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వర ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన భోజనోత్సవం ఉత్సాహంగా జరిగింది. డీసీఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు యాదవ్‌ను సత్కరించారు.

పాతబస్తీలోని లలితాపీఠంలో గంగపుత్ర (బెస్త) సంఘం వారి కార్తిక వనమహోత్సవం సందడిగా సాగింది.

మెడికల్ కళాశాల ఆవరణలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో గౌడ సంఘం కార్తిక వనభోజనోత్సవాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌ను సంఘం సభ్యులు సత్కరించారు.

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలో ఆదివారం వివిధ సామాజిక వర్గాల కార్తిక వనభోజన మహోత్సవాలు సందడిగా జరిగాయి. ఆయా సామాజిక వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉసిరి చెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

నగర శివారులోని ఓ ఫంక్షన్ హాల్లో రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనభోజనం జరిగింది. సంఘం గౌరవ అధ్యక్షుడు పులకుర్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ 25 ఏళ్లుగా సంఘం ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేద రెడ్డివర్గ విద్యార్థులకు విద్యానిధి పేరుతో ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, జి.రాఘవరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, కేజే రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడిగా నాగిరెడ్డి

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇ.నాగిరెడ్డిని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణనాయుడు తెలిపారు. కర్నూలు జడ్పీ కార్యాలయ ఆవరణలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆదివారం పీఆర్ ఇంజినీర్ల జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఆర్.సతీష్‌కుమార్, కోశాధికారిగా ఎం.మహదేవప్ప, కార్యనిర్వాహక కార్యదర్శిగా జోత్స్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రవీంద్రరెడ్డి, కర్నూలు ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ మహేశ్వరరెడ్డి తదితరులు అభినందించారు.



నూతన కార్యవర్గ ప్రతినిధులతో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణనాయుడు, జిల్లా గౌరవాధ్యక్షుడు రవీంద్రరెడ్డి

ఎస్సార్బీసీకి మంచి రోజులు

రూ.1.06 కోట్లతో మరమ్మతులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లాలో ప్రధాన సాగునీరు ప్రాజెక్టు ఎస్సార్బీసీ కాల్వ. సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ప్రధాన కాల్వలో పుష్కలంగా నీరుంటే సుమారు 40వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ కాల్వ నుంచి పాములపాడు, గడివేముల, పాణ్యం, బనగానపల్లి, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ మండలాల రైతులు వరితో పాటు ఆరుతడి పంటలు సాగు చేసుకుంటున్నారు.

బనగానపల్లి శివారులో ప్రధాన కాల్వ కట్టపై పూడ్చిన గుంతలు

వైకాపా హయాంలో నిర్లక్ష్యం

ప్రధాన కాల్వ నుంచి పంట కాల్వ వరకు గత వైకాపా హయాంలో నిర్వహణ నిధులు మంజూరు కాలేదు. అధికారులు ప్రతిపాదనలు పంపినా ఫలితం లేకుండా పోయింది. ఏడాదికి రూ.30లక్షల నుంచి రూ.50లక్షల వరకు నిధులు ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది. పంట కాల్వలు అభివృద్ధికి నోచుకోక రైతులు అవస్థలు పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో రూ.30కోట్ల ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నత స్థాయి అధికారులకు పంపిన నిధులు మంజూరు కాలేదు.

కూటమి ప్రభుత్వం చొరవ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1.06 కోట్లతో వివిధ పనులు చేపట్టారు. దీంతో ముళ్లకంపలు తొలగించడం, ప్రధాన కట్టపై గుంతలు లేకుండా మట్టి వేసి బలం వచ్చేలా చేశారు. ప్రధాన కాల్వ మట్టి పనులు, 8వ బ్లాకు నుంచి 11వ బ్లాకు వరకు మైనర్ రిపేర్లు చేశారు. ప్రధాన కాల్వ 90 కి.మీ. నుంచి 91 కి.మీ మధ్య రూ.8.39 లక్షలతో మట్టి పనులు చేశారు. అలాగే బ్లాకుల వద్ద దెబ్బతిన్న లైనింగ్ పనులు చేశారు. కొన్ని చోట్ల మట్టి వేసి కట్టకు బలం చేకూరేలా చేశారు.

మంత్రి సహకారంతో పనులు - మల్లికార్జున, ఎస్సార్బీసీ ఈఈ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంజూరైన నిధులతో పనులు పూర్తి చేశాం. మరో రూ.23 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపించాం. నిధులు వస్తే వెంటనే పనులు చేపడతాం. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరయ్యాయి. భవిష్యత్తులో ప్రతిపాదించిన నిధులు వస్తాయని ఆశతో ఉన్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా కాల్వలు బాగు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

భరత్‌కుమార్ (పాతచిత్రం)

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని విఠల్‌నగర్‌కు చెందిన భరత్‌కుమార్ (20) ఆత్మహత్యకు పాల్పడినట్లు నాలుగో పట్టణ పోలీసులు తెలిపారు. వారు వెల్లడించిన వివరాల మేరకు.. మెడికల్ రెప్‌గా పనిచేసే కె.శ్రీరాములు కుమారుడైన భరత్‌కుమార్ కేవీసుబ్బారెడ్డి కళాశాలలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతుండేవాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకోగా కుటుంబ సభ్యులు గుర్తించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఒత్తిడికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నక్కి లెనిన్ ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం డోన్ పట్టణానికి చేరుకుంది. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సూర్య ప్రతాప్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనతో పాటు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వలరాజు, నాసర్‌జీలు మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాకు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు రవిమోహన్, నాగభూషణం, మస్తాన్, బండి చలపతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నక్కి లెనిన్

రెండ్రోజుల్లో వర్ష సూచన

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: భారత వాతావరణశాఖ సమాచారం మేరకు ఉమ్మడి జిల్లాకు రానున్న రెండు రోజుల్లో తేలికపాటి వర్షసూచన ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి ఆదివారం తెలిపారు. పలు ప్రాంతాల్లో జల్లులు లేదా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.

ఘనంగా తాహెర్‌షా ఉరుసు

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారు కొండ ప్రాంతంలో వెలసిన సయ్యద్ తాహెర్‌షా దర్గా ఉరుసు మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. దర్గా పీఠాధిపతి సయ్యద్ మహమూద్ ఖాద్రి ఆధ్వర్యంలో గంధం, పూలచాదర్‌ను భక్తులు దర్గాకు తీసుకొచ్చి సమర్పించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. అన్నదానం చేశారు.



గంధం తీసుకొస్తున్న దర్గా పీఠాధిపతి

మహానందీశునికి ప్రముఖుల పూజలు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రానికి ఆదివారం కర్నూలు జిల్లా డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ రాజగోపాల్‌రెడ్డి, జిల్లా వెలుగు డీపీఎం నవీన్‌కుమార్, అనిల్‌కుమార్‌లు దర్శనార్థం వచ్చారు. గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. వారికి మండల ఐకేపీ ఏపీఎం తిరుపాల్‌రెడ్డి అలంకార మండపంలో జ్ఞాపిక ఇచ్చారు. పండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

ఉన్నతాధికారులకు జ్ఞాపిక ఇస్తున్న తిరుపాల్‌రెడ్డి

రెండు వాహనాలు ఢీకొని.. ఒకరి దుర్మరణం

మహానందిఫారం(మహానంది), న్యూస్‌టుడే: పాల కోసం వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మహానంది పోలీసుల కథనం ప్రకారం.. మహానంది మండలం గాజులపల్లె ఆర్.ఎస్.గ్రామంలోని మరకత లింగేశ్వర, నవగ్రహ దేవాలయ సముదాయంలో ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పవన్‌మండల్(26) సేవకుడిగా పని చేస్తున్నారు. నిత్యం మహానంది ఫారంలోని ఒంగోలు జాతి పశు పరిశోధనా స్థానం నుంచి ఆవు పాలు తీసుకువస్తుంటారు. పాల కోసం ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. బుక్కాపురం గ్రామానికి చెందిన బొలేరో వాహనం ఎదురు వచ్చింది. మహానంది క్షేత్రం-బోయిలకుంట్లమెట్ట మధ్యనున్న రహదారి మలుపులో పొదల కారణంగా ఒకరికొకరు కనిపించకపోవడంతో ఢీకొన్నారు. పవన్‌మండల్ తలకు తీవ్ర గాయం కావడంతో నంద్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ ప్రాణాలొదిలాడు. మహానంది ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పవన్‌మండల్ (పాత చిత్రం)

నర్సరీలో అగ్ని ప్రమాదం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారు ఎమ్మిగనూరు రహదారిలో మధు నర్సరీలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గుర్తించిన నర్సరీ నిర్వాహకులు, స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా అదుపు చేశారు. దాదాపు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిన్నట్లు బాధితురాలు గంగాలమ్మ తెలిపారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మూడో అంతస్తు నుంచి పడి.. యువకుడి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని ధనలక్ష్మీనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్తు నుంచి పడి కాటెపోగు కిరణ్(24) మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. కర్నూలు మండలం పడిదెంపాడుకు చెందిన కాటెపోగు బక్కన్నకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. ఇంటర్ వరకు చదివిన కుమారుడు కిరణ్ చదువు మానుకుని ఓ పాఠశాల బస్సు క్లీనర్‌గా పనిచేస్తుండేవాడు. ధనలక్ష్మీనగర్‌లో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌కు బక్కన్న వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. రోజూ భవనాన్ని క్యూరింగ్ చేసేవారు. బక్కన్న తన బంధువుల ఇంటికి వెళ్లడంతో కిరణ్ పనికి వెళ్లాడు. ఆదివారం భవనం మూడో అంతస్తులో క్యూరింగ్ చేస్తూ అదుపుతప్పి నేలపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కర్నూలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

MARRIAGE SERVICES

మనోజ్ఞ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. మా ప్రత్యేకత రెడ్డి కులాల వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. ఆసక్తి గల వారు సంప్ర: 94900 04404.

PERSONAL CLASSIFIEDS

MISSING

కనబడుట లేదు

సి.లింగన్న, వీకర్‌సెక్షన్ కాలనీ, కర్నూలు జిల్లా, వయస్సు: 80 సం॥లు, కలర్: నలుపు

పై ఫొటోలోని వ్యక్తి ది: 11/09/2025 రోజు ఉదయం 8 గం॥ నుండి కనిపించడం లేదు. ఆచూకి తెలిపినవారు క్రింది ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వగలరు. ఆచూకీ తెలిపినవారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

సి.రామకృష్ణ (కుమారుడు) 96528 26184 98666 43043

JOBS

యాక్సెస్ డెవలప్మెంట్ సర్వీసెస్ అగ్రికల్చర్ సంస్థలో పనిచేయుటకు రిసోర్స్‌పర్సన్స్ కావలెను. Q: ఇంటర్, డిగ్రీ. టూవీలర్. మహానంది, బండిఆత్మకూరు, ఆళ్ళగడ్డ, పాణ్యం, రుద్రావరం, సెరివెల్లి & గోస్పాడు గ్రామీణ యువతకు మొదటి ప్రాధాన్యం ✆ 88972 37555.

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్ లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్వైజర్స్ కావలెను. జీ: 23000 టు 29000. వ: 18-35. ✆ 77309 58410.

E-Kart లో స్త్రీ/పు కావలెను. Inter, Any Degree. జీ: 15,000/-. Online are available. Ph: 77022 37945, 91542 87830.

EENADU THE e Way CLASSIFIEDS అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని
• ఆదోని • ఆలూరు • పత్తికొండ

మాళమల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

హొళగుంద, న్యూస్‌టుడే: కార్తిక మాసం మూడో ఆదివారం సందర్భంగా దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, బండారు అర్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, అమ్మవారికి, కుంకుమార్చన, ఆకు పూజ, మహా మంగళహారతి చేపట్టారు. కర్ణాటక, తెలంగాణ, రాష్ట్రాల నుంచే కాకుండా పలు మండలాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం కావడంతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఔషధం పంపిణీ 11న

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 11వ తేదీన ఉదయం 7గంటల నుంచి ఆవోపా ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాసన ఔషధం పంపిణీ చేస్తున్నట్లు సంఘం అధ్యక్షులు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు.

కుట్టుమిషన్ల పంపిణీ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: గ్రామాల్లో నిరుపేద మహిళలకు రాయితీపై కుట్టుమిషన్లు అందజేస్తున్నట్లు శ్రీగిరి గోవర్ధనగిరి ఛారిటబుల్ ట్రస్టు జ్ఞానేశ్వర్‌గౌడ్ తెలిపారు. వెల్దుర్తి గ్రామంలో ఆదివారం నిరుపేద మహిళలకు రాయితీపై కుట్టుమిషన్లు అందించారు. గ్రామ స్వరాజ్యం స్వచ్ఛంద సేవా సంస్థ, పత్తికొండ శాసనసభ్యులు కేఈ. శ్యాంబాబు సహకారంతో తక్కువ ధరకు ఇస్తున్నామన్నారు. రూ. 13,200 విలువ చేసే మిషన్‌ను 50శాతం రాయితీతో రూ. 6,700 అందిస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు తమను సంప్రదించాలన్నారు.

దేశంలో ఓబీసీ జనగణన చేపట్టాలి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: దేశంలో ఓబీసీ జనగణన చేపట్టాలని బాంసేఫ్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు డాక్టరు హరిప్రసాద్ డిమాండు చేశారు. ఆదోని పట్టణంలోని బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో ఆదివారం ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు అధ్యక్షతన బీసీ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డిసెంబరు 14వ తేదీన కర్నూలు జిల్లాలో ఓబీసీ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. సభలకు సంబంధించిన గోడపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, ఖదీరుల్లా, పట్నం రాజేశ్వర, సాయిబాబా, షేక్షావలి, చెన్నబసప్ప, నల్లారెడ్డి, ఈరన్నయాదవ్, వీరభద్ర, మల్లేశ్వరప్ప, కుంకుమరావు వీరేశ్, హరికృష్ణ, ఆకుల, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం నేడు

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నారు. ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఛైర్మన్‌గా బిల్లేకల్లు వెంకటేశ్, వైస్ ఛైర్మన్ రంగడుతో పాటు మరో 13 మంది డైరెక్టర్లు ప్రమాణం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: న్యాయ వ్యవస్థలో భాగంగా రాజ్యాంగం చిన్నపిల్లలకు కల్పిస్తున్న చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని పత్తికొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మధుబాబు అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా పత్తికొండ సమీకృత వసతి గృహంలో ఆదివారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయించుకుంటే పోలీసులు, కోర్టును ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహ అధికారి నాగరాజు, న్యాయవాదులు భాస్కర్, సూరజ్‌నబీ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దులబండిని ఢీకొన్న కారు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలం ఢణాపురం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు మంగళి కర్రెప్పకు తీవ్రగాయాలయ్యాయి. ఆదోని పట్టణం కల్లుబావికి చెందిన రైతు కర్రెప్ప, తన భార్య మల్లమ్మ, కుమారుడు రాజశేఖర్ కలిసి ఉదయం పొలానికి వెళ్లారు. పత్తి దిగుడి సంచులు ఎడ్ల బండిపై వేసుకొని కరెప్ప ఇంటికి బయల్దేరారు. ఢణాపురం సమీపంలోకి రాగానే.. వెనుకవైపు నుంచి వస్తున్న కారు ఎడ్ల బండిని ఢీకొనడంతో రైతు కర్రెప్పతో పాటు రెండు ఎద్దులకు గాయాలయ్యాయి. చికిత్స కోసం క్షతగాత్రుడిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు మంత్రాలయానికి చెందిన వైకాపా నాయకుడి ప్రధాన అనుచరుడిదని స్థానికులు పేర్కొంటున్నారు.

అపరిశుభ్రంగా పల్లెలు.. చుట్టుముడుతున్న వ్యాధులు

☛ కనిపించని మురుగు కాల్వలు ☛ అధ్వానంగా పరిసరాలు

ఆలూరు నియోజకవర్గంలో 108 గ్రామ పంచాయతీలు.. 166 గ్రామాలు ఉన్నాయి. సుమారు నాలుగు లక్షల జనాభా ఉంది. మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. మురుగు రహదారులపైనే నిలుస్తోంది. దేవనకొండ మండలంలో పది వేల జనాభా ఉన్న గ్రామాలు మూడు ఉన్నాయి. దేవనకొండ, తెర్నేకల్, పి.కోటకొండ గ్రామాల శివారు ప్రాంతాల్లో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, మురుగు కాల్వలు, రహదారులు. . తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండు చేస్తున్నారు. పందులు, కుక్కలు, దోమల స్వైర విహారంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా కాలనీలో ఖాళీ స్థలాల్లో మురుగు నిల్వ ఉండి దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు తాఖీదులు ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, దేవనకొండ

దేవనకొండ మండలం తెర్నేకల్ ప్రధాన రహదారిలో మురుగు నీటి పారుదల డ్రైనేజీ వ్యవస్థ లేక పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. గ్రామంలో 9వేల జనాభా ఉంది. గ్రామంలో శ్మశాన వాటిక సమీపంలో కుంటలో మురుగు నిలుస్తోంది. దోమల బెడద, దుర్వాసనతో స్థానిక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పశువైద్యశాల సమీపంలో మురుగు ముందుకు పారడం లేదు.

ఆసుపత్రులకు పరుగులు

పారిశుద్ధ్య లోపంతో ప్రజలు జ్వరాలబారిన పడుతుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోజూ సుమారు 200 నుంచి 350 వరకు ఓపీ నమోదవుతోంది. గత వారం రోజులుగా 50 నుంచి 100 మంది వరకు నిత్యం జ్వర బాధితులు చికిత్స పొందారు.

ఫాగింగ్ యంత్రాలు

దోమల నివారణకు 15 రోజులకోసారి ఫాగింగ్ చేయాల్సి ఉండగా.. ఎక్కడా ఆ ఊసు లేదు. గ్రామ పంచాయతీలకు సమకూర్చిన ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరాయి. దీంతో దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నెలకోసారైనా ఫాగింగ్ చేయాలని కోరుతున్నారు.

కాలనీలో వెలుగులు

స్పందనకు వందనం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని క్రాంతినగర్‌లోని వంకగడ్డపై పురపాలక సంఘం ఆధ్వర్యంలో వీధి దీపాల ఏర్పాటు చేశారు. వీధి దీపాలు వెలగకపోవడంపై ఈ నెల 8వ తేదీన 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పురపాలక కమిషనర్ కృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో.. సిబ్బంది అహ్మద్, బషీర్ వీధిదీపాలు అమర్చారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాలు పరిశుభ్రం

చిప్పగిరి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన చిప్పగిరిలో ఆదివారం పరిసరాలను సర్పంచి దాసరి గోవిందరాజులు, పంచాయతీ కార్యదర్శి ప్రమీల శుభ్రం చేయించారు. ఆలూరు-గుంతకల్లు ప్రధాన రహదారిలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండేది. దీనిపై 'ఈనాడు' లో 'మేమున్నాం-మీకు తోడుగా' ద్వారా సర్పంచి, పంచాయతీ కార్యదర్శికి దృష్టికి తీసుకెళ్లడంతో.. పొక్లెయిన్‌తో చెత్తాచెదారం తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామ సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్యవిద్య కళాశాల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉద్యమ ర్యాలీకి భారీగా తరలిరావాలని ఆలూరు వైకాపా ఎమ్మెల్యే బి.విరుపాక్షి అన్నారు. ఆలూరులో ఈనెల 12వ తేదీన వైకాపా నిర్వహించే ప్రజా ఉద్యమం ర్యాలీ పోస్టర్‌ను విడుదల చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీలో నీటిపైపు వాల్వు నుంచి నీరు లీకేజీ అవుతోంది. దీంతో రహదారిపై నీరు వృథాగా పారుతోంది. – ఖాజా, ఆదోని
✔: నీటి విభాగం ద్వారా సమస్యను పరిష్కరిస్తాం. – కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మండలంలోని ముద్దనగేరి గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల సమీపాన కొత్త కాలనీలో మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలి.
– రంగస్వామి, గ్రామస్థుడు
✔: ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే కాల్వలు ఏర్పాటు చేస్తాం.
– విశ్వేశ్వరయ్యస్వామి, ఎంపీడీవో ఆలూరు

యడవలి, (మద్దికెర), న్యూస్‌టుడే: ?: యడవలి కాలనీ ఎదుట గ్రామంలోని మురుగంతా వచ్చి చేరుతోంది. చర్యలు తీసుకోవాలి.
– వేణుగోపాల్, యడవలి
✔:పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
– విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో, మద్దికెర

ఆత్మీయ కలయిక.. ఆనందాల వేడుక

గురువులతో పూర్వ విద్యార్థులు

చిప్పగిరి, న్యూస్‌టుడే: ఎన్ని అవాంతరాలు ఎదురైనా విడిపోనిది.. స్నేహ బంధమొక్కటేనని ఉపాధ్యాయులు మల్లన్నగౌడ్, రంగన్న, టిప్పుఖాన్, ఏకంబరం, రంగనాయకులు, బసవరాజు, రాధిక, సుభాషిణి అన్నారు. చిప్పగిరి ఉన్నత పాఠశాలలో ఆదివారం 2014-15 బ్యాచ్ విద్యార్థులు 'ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించారు. చదువులు చెప్పిన గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులు కోరారు. పూర్వ విద్యార్థులు సుల్తాన్, రియాజ్, రాజు, రంగస్వామి, దివాకర్, స్వాతి, మౌలిక, మల్లిక, షమీరా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించడమే జాతీయ న్యాయ సేవ సంస్థ లక్ష్యమని ఆదోని జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్ పి.జె.సుధ అన్నారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం జాతీయ న్యాయ సేవా సంస్థ దినోత్సవం పురస్కరించుకొని అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అక్తర, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ లీలా సాయిసుభాష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహన్‌రెడ్డి, సీఐలు రాజశేఖర్‌రెడ్డి, నల్లప్ప, న్యాయవాది లోకేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పి.జె.సుధ

జలాశయాలకు నిధులు కేటాయించాలి

పాదయాత్రగా వెళుతున్న సీపీఎం నాయకులు

ఆలూరు, న్యూస్‌టుడే: జలాశయాల నిర్మాణంతో పంట పొలాలు సస్యశ్యామలం అవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అంజిబాబు, ఆలూరు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి హనుమంతు, సీనియర్ నాయకులు నారాయణ స్వామి తెలిపారు. నగరడోణ, వేదవతి జలాశయాలకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఆలూరు నుంచి ఆదోనికి పాదయాత్ర చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. పశ్చిమ ప్రాంతంలో రైతులు వర్షాధారంపైనే పంటలు పండించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శకీర్, మైన, వెంకటేశ్వర్లు, కృష్ణ, అగ్రహారం ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం.. ఆరోగ్యం పదిలం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విషతుల్యంగా మారుతున్న ఆహార ఉత్పత్తుల నుంచి ఆరోగ్యం కాపాడుకోవాలంటే ప్రకృతి వ్యవసాయం తప్ప మరో మార్గంలేదని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు గంగాధరం పేర్కొన్నారు. ఆర్.మండగిరి రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆదివారం రైతు కార్తిక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, ఆయా పార్టీల రైతు సంఘం నాయకులు, ప్రతినిధులు పి.భీమలింగప్ప, యు.కారుమంచి, నాగేంద్రయ్య, పంపన్నగౌడ్, రాజాసాహెబ్, ఉమాపతి, కాకర్ల లక్ష్మీనారాయణ, సురేంద్రకుమార్, రామాంజినేయులు, గురుదాసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గంగాధరం

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మద్దికెర, న్యూస్‌టుడే: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే అన్ని రంగాల్లో రాణించాలని శిక్షణ ఐఏఎస్ అధికారులు అంకిత్ రాజ్‌పుత్, మోహిత్ మంగల్, భరత్‌దత్, తన్మయి మెగ్వాల్, అమర్‌బాగిల్, అతుల్‌సోనీ తదితరులు సూచించారు. తహసీల్దారు గుండాలనాయక్, ఎంపీడీవో కొండయ్య, ఎంఈవోలు రంగస్వామి, మోహన్ తదితరులతో కలిసి మద్దికెరలోని కస్తూర్బా పాఠశాలను ఆదివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి వ్యాపారులతో మాట్లాడారు.

హొళగుంద, న్యూస్‌టుడే: నీతి ఆయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ విభాగంలో ఎంపికైన శిక్షణ ఐఏఎస్‌లు శివంసింగ్, శివాని, శివనేందరన్, మైఖేల్, నిధియా, అల్ఫ్రెడ్ హొళగుంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను, మందులను, ల్యాబోరేటరీ, ప్రసూతి విభాగాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బిందు మాధవి, రాధ, భరత్, సిబ్బంది, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రహదారి పనులు చేయిస్తున్న నాయకులు

రహదారికి మరమ్మతులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలో దెబ్బతిన్న రహదారికి వెల్దుర్తి సహకార సొసైటీ ఛైర్మన్ రమాకాంత్‌రెడ్డి, మండల తెదేపా నాయకులు బలరాంగౌడ్ మరమ్మతులు చేయించారు. దెబ్బతిన్న రహదారిపై ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడటంతో వారు స్పందించారు. ఎర్రమట్టిని తరలించి గుంతలను పూడ్చివేశారు. వాహనదారులకు ఇబ్బందులు తొలగాయన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు గోపాల్‌గౌడ్, బజారి, రామచంద్రుడు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కుల రక్షణ

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: చేతి వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న విశ్వబ్రాహ్మణుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోందని, వారి హక్కుల పరిరక్షణకు అందరూ ఐకమత్యంగా ఉండాలని విశ్వబ్రాహ్మణుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.హరికృష్ణాచారి సూచించారు. పత్తికొండలో ఆదివారం సమితి సమావేశం నిర్వహించారు. జిల్లా, మండలాల నూతన కమిటీలను ఎంపిక చేశారు. సమావేశంలో సమితి నాయకులు బ్రహ్మయ్య ఆచారి, శంకరయ్య ఆచారి, వేణు తదితరులు పాల్గొన్నారు.

పల్లె కబుర్లు

గజ్జహళ్లి (హొళగుంద), న్యూస్‌టుడే: గజ్జహళ్లి గ్రామాన్ని పెద్దహరివాణం మండలంలోకి కలపొద్దని ఆ గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు డిమాండు చేశారు. గ్రామంలో ఆదివారం పార్టీలకతీతంగా సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ.. హొళగుంద మండలంతోనే గజ్జహళ్లి గ్రామం అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు తిమ్మారెడ్డి, సర్పంచి నాగమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కెంచప్ప, గిరి మల్ల, ఇమామ్ హుస్సేన్, కురవ భీమా, తిమ్మయ్య, రామలింగ, నజీర్, లింగప్ప, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ యుగంధర్, ఎస్సై నరేష్ హెచ్చరించారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు మంత్రణ చేశారు. మంచి ప్రవర్తనతో జీవనం సాగించాలన్నారు. గ్రామాభివృద్ధికి సహకారం అందించాలన్నారు.

పెద్దతుంబళం (ఆదోని ఎస్కేడీ కాలనీ), న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గం పరిధిలో సాగు, తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండు చేస్తూ ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామం నుంచి ఆదివారం మండల సీపీఎం నాయకులు ఆదోనికి పాదయాత్ర ప్రారంభించారు. యాత్రను సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశులు, మాజీ సర్పంచి కృష్ణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం మహాధర్నా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.మల్లయ్య, లింగన్న, ఈరన్న, రామాంజనేయులు, ఉచ్చీరప్ప, జి.రామాంజినేయులు, పాండురంగా, అయ్యప్ప, బాషా, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దహరివాణం(ఆదోని నేరవార్తలు), న్యూస్‌టుడే: ఆదోనిని జిల్లాగా నిర్ణయించకపోవడాన్ని నిరసిస్తూ పెద్దహరివాణం రహదారిపై శనివారం రాస్తారోకో చేసిన ఆ గ్రామస్థులపై అక్రమంగా క్రిమినల్ కేసులు నమోదు చేయడం సరికాదని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.జి.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు ఉరుకుందప్ప ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వంకరకంకర పనులు

ఆస్పరి నుంచి ఆదోనికి వెళ్లాలంటే 21 కి.మీ ప్రయాణించాలి. ఆ దారిలో సుమారు 240కి పైగానే పెద్ద, చిన్న గుంతలు ఉన్నాయి. ఇటీవలే గుంతల్లో గుత్తేదారులు సిమెంట్, కంకర కలిపిన మిశ్రమంతో పూడ్చారు. భారీ వాహనాల రాకపోకలతో సిమెంట్ అంతా గాలికి లేచి పోయి, మిలిగిన కంకర రహదారికి ఇరువైపులా చేరింది. సిమెంట్, కంకర వేసిన దానిపై తారు వేయాల్సి ఉండగా.. అలాగే వదిలేశారు. గుంతలు పూడ్చి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆస్పరి

పల్లె వీడి పట్నానికి పయనం

దేవనకొండ మండలం నుంచి వందలాది మంది ఉపాధి వెతుక్కుంటూ కుటుంబంతో సహా పట్నానికి బయల్దేరారు. సంక్రాంతి పండగ వరకు అక్కడే పనులు చేసుకొని తిరిగొస్తామన్నారు. దేవనకొండ సమీపంలో ఆదివారం వాహనాన్ని నిలిపి అల్పాహారం తీసుకున్నారు. ఖరీఫ్ పనులు పూర్తికావడంతో. . ఉపాధి లేక పంటలకు పెట్టుబడులు, కుటుంబ పోషణకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నట్లు వారు తెలిపారు. – న్యూస్‌టుడే, దేవనకొండ



(c) eenadu

హోమం చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

వైభవంగా చండీహోమం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున చండీహోమం నిర్వహించారు. స్థానిక వీవర్స్‌కాలనీ మైదానంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొని చండీహోమం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం రాత్రి స్వామికి పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. రాత్రి పట్టణంలో ప్రత్యేక పూజలు జరిపారు.

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,170

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,170, మధ్యస్థ ధర రూ.5,890 కనిష్ఠ ధర రూ.2,866లకు వ్యాపారులు కొన్నారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,850 మధ్యస్థ ధర రూ.5,690 కనిష్ఠ ధర రూ.4,830 పలికింది.

విహార యాత్రలతో విద్యార్థుల్లో ఉత్సాహం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విజ్ఞాన, విహార యాత్రలతో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి దూరమవుతుందని ప్రిన్సిపల్ దిల్షాద్ బేగం అన్నారు. జూలకల్లు ఆదర్శ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఆదివారం నంద్యాల జిల్లాలోని బెలూన్ గుహలను సందర్శించారు.

గుహల సందర్శనలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

జల్ జీవన్ పనులు ప్రారంభం

సి.బెళగల్, న్యూస్‌టుడే: జలజీవన్ పథకంలో భాగంగా సి.బెళగల్‌లో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సదుపాయం కల్పించే పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. పొక్లెయిన్‌తో రహదారి వెంబడి తవ్వకం పనులు చేపట్టారు. ఆర్ అండ్‌బీ డీఈఈ రమణ ఆధ్వర్యంలో లెవలింగ్ పనులు కొనసాగుతున్నందున.. ఉన్నత పాఠశాల నుంచి చర్చి వరకు రహదారి వెంట తవ్వి గొట్టం మార్గాలు అమర్చే పనులు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్ తెలిపారు. జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరయినట్లు చెప్పారు.

సి.బెళగల్‌లో ఆర్‌అండ్‌బీ రహదారి వెంట పొక్లెయిన్‌తో గొట్టం మార్గాలు అమర్చుతున్న సిబ్బంది

ఎవరికి చెప్పుకొన్నా పట్టాదాయె?

■ పునరావాస కాలనీలో యథేచ్ఛగా ఆక్రమణలు ■ అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితులు

నాగలదిన్నె(నందవరం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని నాగలదిన్నెలో సర్వే నంబరు 135లోని పునరావాస కాలనీలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలో 2009లో పునరావాస కాలనీ ఏర్పాటు చేసి 85 ఎకరాల్లో 1955 మందికి స్థలాలు మంజూరు చేసి.. 1686 మందికే పట్టాలు ఇచ్చారు. మిగిలిన వారికి ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్థానికుల ఫిర్యాదుతో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆ ప్రాంతంలోని అక్రమ కట్టడాలను పరిశీలించారు. అక్రమణదారులకు తక్షణమే నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడటం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. దీంతో పలువురు యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని వాపోతున్నారు. ఏడాదవుతున్నా కేవలం నోటీసులతోనే సరిపెట్టారని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

నాగలదిన్నెలో ఆక్రమణకు గురైన స్థలంలో నిర్మించిన షెడ్లు

నేతల అండదండలతో..

ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. సర్వే నంబరు 401లో సరోజమ్మ, ఆమె భర్త రంగారెడ్డి, సర్వే నెంబరు 402లో తెలుగు నరసమ్మ, భర్త వేమారెడ్డి పట్టాలు పొంది షెడ్లు నిర్మించుకున్నారు. వాస్తవంగా ఆ కాలనీలో సరోజమ్మకు సర్వే నం.1123లో, నరసమ్మకు 1490లో ప్రభుత్వం ఇది వరకే పట్టాలిచ్చింది. ఈ విషయంపై బాధితులు స్థానిక పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు లేవు.

★ తాగునీటి ట్యాంకు సమీపంలో ఓ వైకాపా నేత అక్రమించుకొని ఏకంగా రెండతస్తుల భవనాన్ని నిర్మించడం గమనార్హం. దీనిపై స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి గ్రామస్థులు ఫిర్యాదు చేసినా.. విచారణ పేరుతో తహసీల్దారు కాలయాపన చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

ఇంటిని ఆక్రమించేశారు – జంగం వీరయ్య స్వామి



నా భార్య జంగం కవిత పేరిట ఇంటి పట్టా మంజూరు చేయగా ఇల్లు కట్టుకున్నాం. మా వృత్తిరీత్యా కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో ఉంటున్నాం. మేము లేని సమయంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మా ఇంటిని ఆక్రమించి వేరొకరికి విక్రయించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ఇల్లే మాకు ఉన్న ఏకైక ఆస్తి.

విచారణ చేయిస్తాం – శ్రీనివాసులు, తహసీల్దారు

అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేశాం. 15 రోజుల్లో స్వచ్ఛందంగా తొలగించకుంటే సిబ్బందితో కూల్చివేస్తాం. బాధితులకు న్యాయం చేస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం 80085 73794
కోసిగి 9550434095

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: మిలటరి కాలనీ ఐదో లైన్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. – నరసింహులు

?: గుంహళ్లి రహదారి గుంతలమయంగా మారింది. **- సురేష్, కాలనీవాసి**

✔: వీధి దీపాలకు మరమ్మతులు చేస్తాం, టెండర్లు పూర్తి చేశాం. రహదారి పనులు చేపడతాం. **- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్**

?: మల్లారవీధి ఒకటోలైన్‌లో పైపునకు లీకేజీతో నీరు వృథా అవుతుంది. **- మల్లికార్జున, కాలనీవాసి**

✔: నీటి వృథా అరికడతాం. - నీరజా, డీఈ

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పెద్ద కల్లు పెంట వీధిలో కుళాయిల నీరు కలుషితం అయ్యింది. **- మద్దిలేటి, కోడుమూరు**

✔: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. **- వెంటేశ్వర్లు, పారిశుద్ధ్య అధికారి**

కోసిగి, న్యూస్‌టుడే: ?: కోసిగిలోని శాంతి నగర్ కాలనీలో డ్రైనేజీ కాల్వ నిండి దుర్వాసన వస్తోంది. **- ఎరిగేరి రాము, స్థానికుడు**

✔: సిబ్బందిని పంపి డ్రైనేజీ కాల్వ శుభ్రం చేయిస్తాం. - చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి

మంత్రాలయం, న్యూస్‌టుడే: ?: మంత్రాలయం ప్రధాన వీధుల్లో ఆటోలను నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా వ్యాపారాలకు ఇబ్బంది కలుగుతోంది. **-ప్రధాన వ్యాపార దుకాణదారులు, మంత్రాలయం**

✔: ఆటో డ్రైవర్లకు మంత్రణం నిర్వహించి, రోడ్డపై ఆటోలు నిలపకుండా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తాం. - శివాంజల్, ఎస్సై

కోసిగి, న్యూస్‌టుడే: ?: కోసిగిలోని శాంతి నగర్ కాలనీలో కాలువ మురుగుతో నిండి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. **-ఎరిగేరి రాము, స్థానికుడు**

✔: పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువలు శుభ్రం చేయిస్తాం. **- చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, కోసిగి మేజర్ పంచాయతీ**

అడుసు తొలగక.. అవస్థలు తప్పక

పట్టణంలోని పడమర బీసీ కాలనీలో ఓ వీధిలో రహదారి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా సీసీ రహదారి, కాల్వలు నిర్మించకపోవడంతో మురుగు నీరు రహదారిపైకి చేరటంతో పాదచారులకు నడవడానికి కూడా వీల్లేకుండా ఉంది. దీనికి తోడు గుంత ఏర్పడ్డాయి. వర్షం వచ్చిందంటే పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సీసీ రహదారి, కాల్వలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

అదనపు గదులకు మోక్షమెప్పుడో!

మండలంలోని పోలకల్‌లో రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలకు 'నాడు- నేడు' రెండో విడతలో ఐదు అదనపు గదుల కోసం నిధులు మంజూరు చేశారు. పైఅంతస్తులో ఐదు గదులకు పైకప్పు వేసి మూడేళ్లు పూర్తయినా అసంపూర్తిగానే ఉన్నాయి. గత ప్రభుత్వంలో జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ పాఠశాలను 'నాడు- నేడు' మొదటి విడతలో రూ.కోటి వెచ్చించి 9 రకాల పనులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దారు. కూటమి ప్రభుత్వంలోనైనా నిధులు మంజూరు చేసి గదుల నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సి.బెళగల్

వీధి దీపాలు వెలగక ఇబ్బందులు

ఎమ్మిగనూరు పట్టణంలో ఓం శాంతి సర్కిల్ నుంచి వెంకటాపురం రహదారిలో దాదాపు 458 పైగానే విద్యుత్తు దీపాలు వేశారు. వాటికి దాదాపు రూ.25 లక్షలు పైగా ఖర్చు చేశారు. ఆ దీపాలు వెలగడం లేదు. ఆ ప్రాంతంలో సుమారు 12 వేల జనాభా ఉంది. ప్రధాన రోడ్డు కావడంతో చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ మార్గంలో ఇతర కాలనీలకు వెళ్లే ప్రయాణికులు సైతం అవస్థలు పడుతున్నారు. అధికారులు వీధి దీపాలు నిర్వహణపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

చెత్త తొలగింపుపై అధికారుల నిర్లక్ష్యం

ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన గురజాల శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం ఆవరణంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఆలయానికి వచ్చే భక్తులకు చెత్తాచెదారం నుంచి దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. దేవాలయం దగ్గర చెత్త కుప్పలు ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదు. సర్పంచి బాధ్యతారాహిత్యం వహిస్తూ.. ఆటు వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సర్పంచి నిర్లక్ష్యం వీడి చెత్తను తొలగించాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, నందవరం

ముళ్ల చెట్లు తొలగించేందుకు చర్యలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రకోట-పార్లపల్లి రహదారిలో ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. ఆ విషయమై ఈ నెల 6న 'ఏపుగా పెరిగాయి..దారిని కప్పేశాయి' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైంది. స్పందించిన అధికారి పీఆర్ ఏఈ జయన్న పంచాయతీ నిధులతో ముళ్ల కంపను వెంటనే తొలగిస్తామని చెప్పారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ మహేంద్ర డిమాండు చేశారు. గోనెగండ్ల మండలంలో కొంతమంది విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు కొట్టి ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. పీడీఎస్‌యూ నాయకులు నరసింహారెడ్డి, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

కూటమి పాలనతోనే గ్రామాల అభివృద్ధి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: కూటమి పాలనతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని తెదేపా నాయకులు హనుమంతు, మల్లయ్య, రామకృష్ణ, తిరుపతయ్య, రామాంజినేయులు, తిమ్మారెడ్డి అన్నారు. ఆదివారం గాజులదిన్నెలో ఎంపీ నిధులు రూ.95 లక్షలతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణాలకు వారు భూమి పూజ చేసి మాట్లాడారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలు ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.95 లక్షలతో సీసీరోడ్లు, కాల్వల నిర్మాణాలు చేపట్టునట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించినందుకు ఎంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రమణచౌదరి, కృష్ణమనాయుడు, సంజన్న, ప్రభాకర్‌నాయుడు, చంద్రన్న, యాకోబు, సీమన్, నాగన్న, రంగస్వామి నాయుడు, ముల్లబాషా, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెదేపా నాయకులు కార్యకర్తలు

ప్రజలకు అవగాహన

సి.బెళగల్, న్యూస్‌టుడే: గ్రామంలోని ప్రజలు ప్రశాంత జీవనం కొనసాగించాలని ఎస్సై వేణుగోపాల్ రాజ్ పేర్కొన్నారు. మండలంలోని పోలకల్ గ్రామంలో ఆదివారం బస్టాండు ఆవరణలో ప్రజలతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, మహిళ రక్షణ, రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కరించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు రమేష్ డిమాండు చేశారు. సీపీఎం జీపు యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని తిమ్మాపురం, ఇతర గ్రామాల్లో జీపుయాత్ర చేపట్టారు. రమేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువ పనుల పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. రాబోయే రోజుల్లో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, తాగునీటి సమస్య తీర్చే వరకు ఉద్యమాలు ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమేష్

పేదలకు వైద్యసౌకర్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పేదలకు వైద్యసేవలు అందించాలని లక్ష్యంతో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచితంగా అంబులెన్స్ సౌకర్యం కల్పించారని ప్రముఖ డాక్టర్ మాలకొండయ్య పేర్కొన్నారు. ఉచిత అంబులెన్స్‌ను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు.

కనుల పండువగా సీతారామ కల్యాణం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో విశ్వశాంతి మహాయాగం కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం సూర్య, సరస్వతి, చండీ హోమాలు నిర్వహించారు. భక్తులు కల్యాణోత్సవం, హోమాలు తిలకించేందుకు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఎస్టీయూ మండల నూతన కమిటీ ఎన్నిక

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరులో మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ 79వ వార్షిక కౌన్సిల్ సమావేశం రాష్ట్ర కౌన్సిలర్ బాబయ్య ఆధ్వర్యంలో నిర్వహించినట్లు యూనియన్ మండల నాయకులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా గోపాల్‌గౌడు, అధ్యక్షుడిగా గురుసాగర్, ప్రధాన కార్యదర్శిగా రమేష్, ఆర్థిక కార్యదర్శిగా వీరాంజినేయగౌడు, జిల్లా కౌన్సిలర్లుగా వెంకటేశ్వర్లు, భూషణ్‌గౌడు, నరసింహుడుతో పాటు మరికొందరు కౌన్సిలర్లు ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

104 ఉద్యోగులపై ప్రభుత్వం చిన్నచూపు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలు అందిస్తున్న 104 ఉద్యోగుల విషయంలో సర్కారు పూర్తిగా విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెద్దయ్య ఆరోపించారు. పట్టణంలో ఆదివారం 104 ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న సర్కారు కనీసం వేతనాలు పంపిణీ చేయడం లేదన్నారు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నా సెలవులు మంజూరు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో వెంకటేశు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

బోరు మరమ్మతు చేపట్టాలని నిరసన

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు మరమ్మతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఇందిరానగర్ కాలనీవాసులు వాపోయారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నీటి ట్యాంకు వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. ప్రతి రోజూ నీటి కోసం అవస్థలు పడుతున్నామన్నారు. తక్షణం నీటి ట్యాంకుకు మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈరమ్మ, మంగమ్మ, కృష్ణవేణి, హనుమంతమ్మ, మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో ప్రముఖులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీమఠాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు సందర్శించారు. భారత జంతు సంక్షేమ మండలి నోడల్ అధికారి శ్రీకృష్ణ మిట్టల్, తెలంగాణా రాష్ట్ర జంతు సంక్షేమ మండలి సభ్యుడు మహేశ్ అగర్వాల్ కుటుంబ సభ్యులతో కలిసి రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. శ్రీమఠం చేరుకున్న వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు స్వామి వారి శేష వస్త్రం, జ్ఞాపిక, ఫలమంత్ర అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు. వారి వెంట వీఎల్‌వో వరప్రసాద్ ఉన్నారు.

మఠం ప్రాకారంలో నోడల్ అధికారి శ్రీకృష్ణ మిట్టల్, మహేశ్ అగర్వాల్

కూచిపూడిలో భళా

■ సంప్రదాయ నృత్యం, ఆటల్లో రాణిస్తున్న బాలిక

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాలతో వీడియోలతో పాఠశాల విద్యార్థులు కాలక్షేపం చేస్తున్న నేటి రోజుల్లో ఆ బాలిక అటు ఆటలు, ఇటు నాట్యంలో భళా అనిపిస్తోంది. నిత్యం సాధన చేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటోంది. పలు వేదికలపై ప్రదర్శనలు ఇచ్చి మన్ననలు పొందింది ఎమ్మిగనూరులోని ఎంఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రాజేశ్వరి.

పలు వేదికలపై ప్రదర్శనలు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నప్పటి నుంచి సాంప్రదాయ నృత్యం సాధన చేసిన రాజేశ్వరి క్రమంగా ఆసక్తి పెంచుకుని పలు వేదికలపై ప్రదర్శనలిచ్చింది. తల్లిదండ్రులు వీరభద్ర, పార్వతి. కూచిపూడి నృత్యంలో 4 ఏళ్లుగా శిక్షణ తీసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన నాటక ప్రదర్శనలో పాల్గొంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు పోటీల్లో పాల్గొని శెభాష్ అనిపించుకుంది. హైదరాబాదులో జరిగిన పోటీలో 2024లో ఇచ్చిన ఉత్తమ ప్రదర్శనకు నాట్యకుమారి అవార్డు అందుకుంది. మూడేళ్లలో రాజమండ్రి, బెంగళూరు, కర్నూలు, రాయచూర్, హంపి, శ్రీశైలం, తిరుపతి, తిరువనంతపురం వంటి ప్రాంతాల్లో పోటీల్లో పాల్గొని ప్రశంసలు పొందింది. దాదాపు 46 ప్రదర్శనల్లో 15 ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందుకుంది.

రాజేశ్వరి

జాతీయ స్థాయిలో

ఆటల్లోనూ రాజేశ్వరి సత్తా చాటుతోంది. కర్నూలులో జరిగిన హర్డిల్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. లాంగ్ జంప్, రన్నింగ్ రేసులో ఎమ్మిగనూరు తాలుకాలో ప్రథమ స్థానం, డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా స్థాయిలో ఎంపికై రాష్ట్ర స్థాయిలో పతకం సాధించాలనే లక్ష్యంతో రోజూ మైదానంలో వ్యాయామ ఉపాధ్యాయుల సమక్షంలో రెండు గంటలు సాధన చేస్తున్నట్లు చెబుతోంది. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే తన లక్ష్యమని చెబుతోంది.

పార్టీని బలోపేతం చేస్తా

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పార్టీ క్యాడర్ అన్నది వైకాపా క్యాడర్ అవుతుందే కానీ, వ్యక్తిగత క్యాడర్ అవదని మాజీ ఎంపీ బుట్టా రేణుక అన్నారు. పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి వేరెవరికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినా వారి గెలుపునకు శ్రేణులు పనిచేస్తారన్నారు. ఆదివారం పట్టణంలో ఫుట్‌బాల్ క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ సమీకరణాల్లో భాగంగా తనను కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్తగా నియమించారని.. ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. కర్నూలులో పార్టీ కార్యాలయం ఏర్పాటుతో పాటు ఎమ్మిగనూరులో పార్టీ కార్యాలయం కొనసాగుతుందన్నారు. పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతూనే.. కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నాయకులు బుట్టా శివనీలకంఠ, శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జున, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు వెచ్చించి.. నిరుపయోగంగా వదిలేసి

■ తాగునీటి ట్యాంకులపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం ■ నీటి కోసం కాలనీవాసులకు తప్పని అవస్థలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: శివారు ప్రాంతాల్లో తాగునీరు రాని కాలనీలకు నీటి ట్యాంకులు ఏర్పాటు చేసి తాత్కాలికంగా సమస్య తీర్చే లక్ష్యంతో రూ.లక్షలు ఖర్చు చేశారు. ట్యాంకులు, బోర్లు, పైపులైన్లు వేసి ఆయా కాలనీల్లో చిన్న ట్యాంకులు పెట్టి సమస్య తీర్చాలని నిర్ణయించారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లుగా ట్యాంకులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రూ.లక్షల నిధులు వృథాగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినా ట్యాంకుల మరమ్మతులపై నిర్లక్ష్యం కొనసాగుతోంది.

మేల్కోకుంటే దాహార్తి తప్పదు

పట్టణంలో శివారు ప్రాంతం అభివృద్ధి చెందడంతో నీటి ట్యాంకుల కోసం గత ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. 34వ వార్డులో బోరు, పైపులైన్, ట్యాంకు ఏర్పాటు చేసే విధంగా నిర్మాణాలు చేపట్టారు. చిన్న నీటి ట్యాంకు నిర్మించారు. శివారులో నివసిస్తున్న దాదాపు 68 వేల మంది జనాభాకు తగ్గట్టుగా తాత్కాలిక అవసరాల కోసం దాదాపు 50కి పైగానే ట్యాంకులు ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు గురయ్యాయి. దీంతో కొన్ని ట్యాంకులను పూర్తిగా తొలగించారు. ఆయా కాలనీల్లో బోర్లు, మోటార్లు తొలగించారు. ఈ నేపథ్యంలో అధికారులు, పాలకులు ముందుగా మేల్కొకుంటే రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది.

★ ఎద్దుల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు వద్ద కుళాయిలు విరిగిపోయి వృథాగా మారాయి. సంతకు వచ్చే ప్రజలకు గుక్కెడు నీళ్లు అందని పరిస్థితి.

★ శారద కమిటీ ఏరియా ప్రాంతంలో నీటి సమస్య ఉండడంతో ఇక్కడ మోటారు ద్వారా ట్యాంకు నీరు సరఫరా చేశారు. బోరు చెడిపోవడంతో రంధ్రం మాత్రమే మిగిలింది.

★ ఎన్టీఆర్ కూరగాయల మార్కెట్‌లో ట్యాంకు, పైపులు, బోరు కోసం రూ.2 లక్షలు ఖర్చు చేశారు. బోరు పాడై పోవడంతో ట్యాంకు వృథాగా మారింది.

★ లక్ష్మీపేట మూడు, నాలుగు లైన్లలో ట్యాంకులు, బోరు నిరుపయోగంగా ఉన్నాయి. ఇంకా పలుచోట్ల ట్యాంకులను తొలగించారు.

శారద కమిటీ కాలనీలో వృథాగా నీటి ట్యాంకు

బోరు మూతకు బండరాయి వేసిన అధికారులు

మరమ్మతులు చేయిస్తాం –గంగిరెడ్డి, పురపాలక కమిషనరు, ఎమ్మిగనూరు

నీటి ట్యాంకుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం పట్టణంలో రెండు పూటలా తాగునీటిని విడుదల చేస్తున్నాం. నీటి వసతి లేక ఇబ్బందులు ఉన్న కాలనీలకు ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నాం. రెండు నెలల్లో ట్యాంకులకు మరమ్మతులు చేయించి సమస్య తీరుస్తాం.

మురుగు సమస్య పరిష్కారం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నగర పంచాయతీలోని ఒకటో వార్డు ఎస్సీ కాలనీలో మురుగు కాల్వల సదుపాయం లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే కాలనీలోకి వర్షపు నీరు చేరుతోంది. సమస్యను కాలనీ వాసులు తెదేపా పట్టణ యువ నాయకుడు సృజన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్ కు వివరించారు. ఆయన సూచనలతో కమిషనర్ జేసీబీతో కాలువల పనులను పూర్తిచేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ యువ నాయకుడు బొజుగు సృజన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, వినోద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులను పరిశీలిస్తున్న తెదేపా పట్టణ నాయకులు

మహిళ అదృశ్యంపై కేసు

కోడుమూరు, న్యూస్‌టుడే: కోడుమూరు మండలం కొత్తూరుకు చెందిన ఓ మహిళ శనివారం కోడుమూరులో సంతకు వచ్చి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహిళకు వివాహం కాగా భర్త కొన్నాళ్ల క్రితం మృతి చెందాడు. ఆరు నెలల నుంచి పుట్టింట్లో ఉంటోంది. శనివారం సాయంత్రం కోడుమూరు సంతకు రాగా.. తనను ఇద్దరు వ్యక్తులు వెంబడిస్తున్నట్లు బంధువులకు ఫోన్ చేసి చెప్పింది. మహిళ తల్లి ఫిర్యాదు మేరకు కోడుమూరు ఎస్సై డీవై స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నూతన ఎస్సైకి సన్మానం

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లో ఠాణాలో ఎస్సైగా వేణుగోపాల్ రాజ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు ఫరూక్, యువరాజ్, చాంద్‌బాషా, ఇమ్మానేయులు, మాణిక్యం, శాంతిరాజ్ ఆదివారం సన్మానించారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

గూడూరు గ్రామీణం: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దారు వెంకటేష్ నాయక్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామన్నారు.

పల్లె కబుర్లు

కోడుమూరు: పట్టణంలో గత కొన్నేళ్లుగా శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఆలయ సందర్శనకు రావాలని ఆదివారం హైదరాబాదులోని సినీ ప్రముఖులు హీరో శ్రీకాంత్, దర్శకుడు నాగేశ్వరరెడ్డి, నటి లయను ఆలయ కమిటీ ఛైర్మన్, ధర్మకర్త మహేశ్వరరెడ్డి ఆహ్వానించారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం వైద్యాధికారి మిధున్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీహెచ్‌వో ఉమామల్లేశ్వరి తెలిపారు. గ్రామాల్లో ఉప ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వెంకటలక్ష్మి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఉప తహసీల్దారు పురుషోత్తమ్ తెలిపారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వినతులు అందించి పరిష్కరించుకోవాలని కోరారు.

పోలకల్: గ్రామంలో శైవక్షేత్రమైన సోమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పురోహితుడు రామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు. భక్తులకు అన్నవితరణ చేపడతామన్నారు.

(c) eenadu

కర్నూలు
•కర్నూలు • పాణ్యం

విస్తరణ పనులు పూర్తి చేయాలి

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే :

మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ విశ్వనాథ్

నగరంలోని బుధవారపేటలో వైద్య కళాశాల వద్ద మలుపులో రహదారి విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. వైద్య కళాశాల వద్ద దుకాణాలు తొలగించిన ప్రాంతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దుకాణాలు తొలగించిన చోట రహదారి, మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ఇంజినీరింగ్ విభాగ అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర పరిధిలోని ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632,
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ?: వీకర్ సెక్షన్ కాలనీలో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. శుభ్రం చేయాలి. **- రాహుల్, స్థానికుడు**

?: నరసింహారెడ్డినగర్, ఇందిరాగాంధీనగర్‌లో దోమల బెడదకు ఫాగింగ్ చేయాలి. **- స్థానికులు**

?: బుధవారపేటలోని వీధుల్లో మురుగు కాలువలు వ్యర్థాలతో పూడిపోయాయి. **- మనోహర్, స్థానికుడు**

?: సంతోష్‌నగర్‌లో అంతర్గత సీసీరోడ్లు పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. **- రెహాన్**

✔: కాలువలను శుభ్రం చేయిస్తాం. రహదారులకు మరమ్మతులు చేయిస్తాం. - నగరపాలక అధికారులు

అభ్యసన సామగ్రి అందించడం అభినందనీయం

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: జాతీయ ప్రతిభా ఉపకార వేతనం (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగపడేలా రూపొందించిన అభ్యసన సామగ్రిని జన విజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య నాయకులు ఆదివారం నగరంలో ఆవిష్కరించారు. పాఠశాల విద్య ఏడీ నాగభూషణం మాట్లాడుతూ.. జవివే రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు రచించిన ఈ పుస్తకాన్ని రచించిట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ప్రభుత్వ పాఠశాలకు 250 పుస్తకాలను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఈ పుస్తకాన్ని బాగా చదివి విజయం సాధించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ ఆకాక్షించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఖాజాహుస్సేన్, యూటీఎఫ్ నాయకులు రవికుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పునాదులకే పదహారేళ్లు.. పూర్తవని ఇళ్లు

★ మౌలిక వసతుల్లేక ముందుకుసాగని నిర్మాణాలు
★ పట్టించుకోని నగరపాలక అధికారులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో సొంతిళ్లు లేని నిరుపేదలకు 2009లో పందిపాడు గ్రామ పరిధిలో స్థలాలు కేటాయించి, గృహాలు మంజూరు చేశారు. 2009లో ఇందిరమ్మకాలనీ పేరుతో లేఅవుట్ ఏర్పాటు చేశారు. నగరపాలక అధికారులు అక్కడ కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో నిర్మాణాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో ఇదే కాలనీని జగనన్న లేఅవుట్‌గా మార్చారు. పేరు మార్చారే తప్ప వసతులు మాత్రం కల్పించలేదు. దీంతో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కరవైంది. కూటమి ప్రభుత్వమైనా సౌకర్యాలు కల్పించి.. అదనపు సాయం అందించి సొంతింటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

2500కు నిర్మించింది 150

పందిపాడు ఇందిరమ్మకానీలో 2500 మంది పేదలకు స్థలాలు పంపిణీ చేశారు. పక్కాగృహాలు మంజూరు చేశారు. ఈ ప్రాంతం నగరానికి దూరం కావడం.. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. దీంతో ఇళ్లు కట్టుకునేందుకు లబ్ధిదారులు ముందుకురావడం లేదు. ముజఫర్‌నగర్, కల్లూరు పారిశ్రామికవాడ నుంచి ఈ కాలనీకి వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. దీంతో పదహారేళ్లలో 150 మంది పేద కుటుంబాలు మాత్రమే ఈ కాలనీలో ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారు. మరో 350 మంది నిర్మాణాలు చేపట్టారు.

దశాబ్దానికి పైగా పునాదుల దశలోనే ఆగిన నిర్మాణాలు

● రెండేళ్ల కిందటే కాలనీలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో అక్కడక్కడ బోర్లు వేయించి.. నీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు.

రాకపోకలకు ఇక్కట్లు

పెద్ద కాలనీ అయినప్పటికీ అంతర్గత రహదారులు ఏర్పాటు చేయలేదు. ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి వెళ్లేందుకు మట్టిరోడ్లే దిక్కయ్యాయి. వర్షాకాలం వచ్చిందంటే ద్విచక్ర వాహనాలు, ఆటోలు బురదలో ఇరుక్కుపోతున్నాయి. కంకర, ఎర్ర మట్టి రోడ్లయినా వేయాలని లబ్ధిదారులు కోరుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు.

● కల్లూరు చెన్నమ్మ కూడలి, ముజఫర్ నగర్ నుంచి ఈ కాలనీకి వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేదు. పాతబస్తీ, కల్లూరు ప్రాంతాల నుంచి లబ్ధిదారులు ఈ కాలనీకి రావాలంటే ఆటోకు రూ.100-200 ఖర్చవుతుంది. పదహారేళ్ల తర్వాత కల్లూరు పారిశ్రామికవాడ నుంచి ఈ కాలనీకి వెళ్లేందుకు ఇటీవల రూ.30 లక్షలతో మెటల్ రోడ్డు మంజూరు చేశారు. ఇంతవరకు పనులు చేపట్టలేదు.

అన్నింటికీ అవస్థే..

కాలనీలో తాగునీటి వసతి కూడా లేదు. ప్రస్తుతం ఇక్కడ నివసిస్తున్న వారు తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులకు అనేకమార్లు విన్నవించారు. కాలనీలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

● పీఎంఏవై అర్బన్ 2.0 కార్యక్రమం కింద ఆర్థిక సాయం అందేలా చూసి నిర్మాణాలు పూర్తి చేసుకునేలా సహకరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. కాలనీలో ముళ్లపొదలు తొలగించాలని, తాగునీటి పైపులైన్ల సౌకర్యం కల్పించాలని, అంతర్గత రహదారుల నిర్మాణాలు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

11న జాతీయ విద్యా దినోత్సవం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని నగరంలోని కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఈనెల 11వ తేదీన జాతీయ విద్య, మైనారిటీ సంక్షేమ దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సబిహా పర్వీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు 11వ తేదీన బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

గోవును రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే: విపత్తు స్పందన, అగ్నిమాపకశాఖ కర్నూలు కేంద్రం సిబ్బంది ఓ మూగ జీవిని రక్షించి మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక నరసింహారెడ్డినగర్‌లో శనివారం రాత్రి 12 అడుగుల గుంతలో గోవు పడిపోయింది. స్థానికులు గుర్తించి బయటకు తీసేందుకు విఫలయత్నం చేశారు. చివరకు అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు గుంతలోకి దిగి ఆవుకు తాళ్లు కట్టి బయటకు లాగారు.

బస్సులు ఆగక.. ప్రయాణం సాగక

నంద్యాల, నందికొట్కూరు, తిరుపతి వైపు వెళ్లే ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు సి.క్యాంపు షెల్టర్ వద్ద ఎదురు చూస్తుంటారు. బస్టాండులోనే నిండిపోయిన బస్సులను చోదకులు ఇక్కడ నిలపకుండా వెళ్లిపోతున్నారు. దీంతో కొన్నిసార్లు గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. నగరంలోని పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునేందుకు వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు సాయంత్రం సొంతూళ్లకు వెళ్లేందుకు బస్సుల కోసం ఇక్కడికే వస్తారు. చాలా బస్సులను ఆపకుండా వెళ్లడం.. ఒకట్రెండు ఆపినా వాటిలో సీట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

తొలగని చెత్త.. తీరని వ్యథ

నగరంలోని సంకల్‌బాగ్‌లో రహదారులపై చెత్త, వ్యర్థాలు రహదారులపై వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కాలువల్లో తీసిన పూడికను తొలగించడం లేదు. దీంతో పాటు చెత్త, వ్యర్థాలు రహదారులపైనే పేరుకుపోయాయి. స్థానికులు దుర్వాసనను భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక సంస్థ

మట్టిదారులు.. ప్రజలకు ముప్పుతిప్పలు

☛ కల్లూరు కాలనీల్లో బురదమయమైన రోడ్లు

▶▶ ఇది పెద్దపాడు రస్తాలోని రిచ్‌మండ్ హోమ్స్‌కు వెళ్లే దారి. ఈ ప్రాంతంలోని మట్టిరోడ్లు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి.

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కల్లూరు కాలనీల్లో రహదారులు అధ్వానంగా మారాయి. ఏళ్ల తరబడి మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతం నగరపాలకలోకి విలీనమై దశాబ్దం దాటినా మౌలిక వసతులు మాత్రం సమకూరలేదు. నగరపాలక సంస్థకు ఏటా రూ.కోట్లలో పన్నులు చెల్లిస్తున్నా సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని ఈ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

● కల్లూరు పట్టణ పరిధిలోని 16 వార్డుల్లో సుమారు 2.5 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. కాలనీలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. కానీ నగరపాలక సంస్థ ఈ కాలనీల్లో సీసీరోడ్లు ఏర్పాటుపై దృష్టిపెట్టడం లేదు. చాలా కాలనీల్లో మట్టిరోడ్లే దిక్కుగా మారాయి. చిన్నపాటి వర్షం కురిసినా ఈ దారులు బురదమయంగా మారుతున్నాయి.

● కృష్ణానగర్, వీకర్‌సెక్షన్ కాలనీ, నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని కాలనీలు, ఎఫ్‌సీఐ కాలనీ, లక్ష్మీపురం, పందిపాడు, పెద్దపాడు రస్తాలోని కాలనీల్లో మట్టిరోడ్లు ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● కొన్ని కాలనీల్లో ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన సీసీరోడ్లు ప్రస్తుతం ఛిద్రమయ్యాయి. నెర్రలిచ్చి గుంతలమయం అయ్యాయి. ఈ దారులపై వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారినపడుతున్నారు.

▶▶ ఈ రోడ్డు కల్లూరు పరిధిలోని పరిమళనగర్‌లోనిది. ఈ కాలనీలో చాలావరకు మట్టిరోడ్లే ఉన్నాయి. ఒకట్రెండు వీధుల్లో సీసీరోడ్లు నిర్మించినా అవి నెర్రలిచ్చి అధ్వానంగా మారాయి.

ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యం

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : సామాజిక సమస్యల పరిష్కారానికి కృషిచేసేలా ప్రజలను చైతన్య పరిచేందుకే న్యాయవాదుల ప్రజా కూటమి (లాయర్స్ అండ్ పబ్లిక్ ఫ్రంట్)ని ఏర్పాటు చేసినట్లు కూటమి రాష్ట్ర కన్వీనర్ మద్దూర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం న్యాయవాదుల ప్రజా కూటమి ఆవిర్భావ సమావేశ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు చట్టాలపై అవగాహన కల్పిస్తామని, అన్యాయానికి గురైన బాధితులకు కూటమి తరపున అండగా నిలుస్తామని చెప్పారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి మూలింటి మారెప్ప మాట్లాడుతూ ఓట్లు కొని గెలిసిన ప్రజాప్రతినిధులు సంపాదనపై దృష్టి పెడుతున్నారు తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వి.నాగలక్ష్మీదేవి, సీనియర్ న్యాయవాదులు దేవపాల్, సుబ్బయ్య, నాగేంద్రనాథ్ కూటమికి మద్దతు తెలిపారు. హాజరైన న్యాయవాదులు ఎల్‌పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్‌గా మద్దూర్ సుభాష్‌చంద్రబోస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కోకన్వీనర్‌గా ముప్పసాని గాలి రాజు, జిల్లా కన్వీనర్‌గా గౌతంశేఖర్, జిల్లా కోకన్వీనర్లుగా సుమలత, లావణ్య, జ్యోతి, ఉపేంద్ర, శ్రవణ్‌కుమార్, మహేంద్రరెడ్డి, వినోద్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

ఎల్‌పీఎఫ్ ప్రచార బోర్డులతో మాజీ మంత్రి మారెప్ప, సుభాష్‌చంద్రబోస్, నాగలక్ష్మీదేవి తదితరులు

శివుడికి కార్తికమాస ఆరుద్ర పూజలు

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : కార్తిక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం కర్నూలులోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు శివలింగాలకు అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం కార్తిక దీపాలు వెలిగించారు. గోశాల కేంద్రంలో శివలింగానికి అన్నాభిషేకం చేశారు. ఇస్కాన్ ఆలయంలో బలభద్ర, సుభద్ర, జగన్నాథుని మూలవిరాట్టులకు ప్రత్యేక అలంకరణ చేశారు.

గోశాల కేంద్రంలో శివలింగానికి అన్నాభిషేకం చేస్తున్న భక్తులు

ముగిసిన అఖండ భజన

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శత జయంతి వేడుకల సందర్భంగా కర్నూలు సత్యసాయి మందిరంలో శనివారం సాయంత్రం ప్రారంభమైన ప్రపంచ వ్యాప్త అఖండ భజన ఆదివారం సాయంత్రం ముగిశాయి. 24 గంటల పాటు నిరంతరాయంగా సత్యసాయి సేవాదళ్, మహిళా సేవాదళ్, భక్తులు భజనలు చేశారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ మాకా అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 15 నుంచి 23 తేదీ వరకు సాయిబాబా వందేళ్ల జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఆధ్యాత్మిక, సేవా, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు హాజరుకావాలని కోరారు.

సత్యసాయి చిత్రపటానికి అలంకరణ

వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించనున్నట్లు జిల్లా శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ వెంకటహరినాథ్ తెలిపారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక న్యాయ సేవా సదన్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, బాలల రక్షణ అధికారిణి శారద, ఐసీడీఎస్ సీడీపీవో అనురాధ, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ వెంకటహరినాథ్

తైక్వాండో సాధనతో ఆత్మవిశ్వాసం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : తైక్వాండో క్రీడను నిత్యం సాధన చేస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని హైదరాబాద్ ఆంగ్ల పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఫయాజ్ అహమ్మద్ పేర్కొన్నారు. నగర శివారులోని ఎస్‌ఎన్‌ఏ నగర్‌లో హైదరాబాద్ ఆంగ్ల మీడియం పాఠశాలలో ఆదివారం 41వ కర్నూలు జిల్లా తైక్వాండో ఛాంపియన్‌షిప్-2025 పోటీలు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు తైక్వాండోను నిరంతరం సాధన చేస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. ఇందులో ప్రతిభ చూపిన చిన్నారులు ఈనెల 15 నుంచి 16వ తేదీ వరకు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్షుడు డిఎం.బిలాల్‌బాషా, వెంకటేశ్వర్లు, తైక్వాండో క్రీడాకారులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న షేక్ ఫయాజ్ అహమ్మద్

స్కేటింగ్ క్రీడాకారుల ర్యాలీ

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: వందేమాతరం గేయం 150 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు డీఎస్‌ఏ స్టేడియం నుంచి కొండారెడ్డి బురుజు వరకు స్కేటింగ్ క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వందేమాతర గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా స్కేటింగ్ సంఘం కార్యదర్శి అబూ బాకర్, కర్నూలు స్కేటింగ్ సంఘం సీఈవో సునీల్‌కుమార్, సభ్యులు శిరీష్‌బాబు, వీరేష్, నారాయణ, హనుమంతు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాతల సాయంతో గ్రంథాలయ అభివృద్ధి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి దాతల సహకారంతో కృషి చేస్తున్నట్లు సహాయ గ్రంథాలయాధికారి గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మూడో పట్టణ పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ నారాయణ ఆంగ్ల నవలలు, సాహిత్య పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది బాషా, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి న్యాయవాదుల కృతజ్ఞతలు

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా మరణించిన 1150 మంది న్యాయవాదుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున రూ.46 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్‌ప్రసాద్, జిల్లా కోశాధికారి దస్తగిరి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వ సాయం ఎంతో భరోసా ఇస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

బస్టాండులో మాటేసిన ప్రమాదం

కర్నూలు కొత్తబస్టాండులో బస్సులు లోపలికి ప్రవేశించే మార్గంలో మ్యాన్‌హోల్‌పై వేసిన కాంక్రీటు దిమ్మెలు విరిగిపోయి గుంత ఏర్పడింది. దీంతో చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది బస్సులు బస్టాండుకు వస్తుంటాయి. ఏమరుపాటుగా బస్సు నడిపితే ఈ గుంతలో టైర్లు ఇరుక్కుని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని చోదకులు చెబుతున్నారు. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని చోదకులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

స్తంభాలాట.. కాసుల వాటా

✧ వాడకముందే విరిగిపోతున్న విద్యుత్తు పోల్స్
✧ విద్యుత్తు శాఖకు ఏటా భారీ నష్టం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నగరంలో విద్యుత్తు స్తంభాల కొనుగోలులో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్తుశాఖ అవసరాల నిమిత్తం స్థానిక తయారీదారుల నుంచి స్తంభాలను కొనుగోలు చేస్తోంది. తయారీదారులు ఒకరిద్దరే ఉండటంతో ఏటా వారినే ఆశ్రయిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని వారు నాసిరకం స్తంభాలను సరఫరా చేస్తున్నారు. వీరితో గుత్తేదారులు, కొందరు సిబ్బంది కుమ్మక్కయ్యి నాణ్యతలేని స్తంభాలను అంటగడుతూ కమీషన్లు పంచుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఫలితంగా స్తంభాలు పెద్దఎత్తున విరిగిపోతున్నాయి. దీంతో విద్యుత్తుశాఖకు రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది.

రకాలు.. ధరలు

సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో ఎల్‌టీ లైన్లకు మూడు రకాల స్తంభాలను ఉపయోగిస్తారు. నగరంలో 8, 9.1, 11 మీటర్ల పొడవున్న స్తంభాలను వాడుతున్నారు. 8 మీటర్ల పొడవైన స్తంభం ధర సుమారు రూ.5 వేలు, 9.1 మీటర్ల స్తంభం రూ.8 వేలు, 11 మీటర్ల పొడవున్న స్తంభం ధర రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఉంటోంది. నగరంలో 90 శాతం 9.1 మీటర్ల పొడవున్న స్తంభాలనే వినియోగిస్తున్నారు.

నాణ్యత నాస్తి..

కర్నూలు డివిజన్‌లోని 12 సెక్షన్ల పరిధిలో నెలలో సుమారు 500 నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తుంటారు. వీటిలో సుమారు పదిశాతం రవాణాలో, పాతే సమయంలో విరిగిపోతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో స్తంభం 15 ఏళ్లకు పైగా మన్నాలి. ఎత్తుకు తగ్గట్టు కనీసం 140 కిలోల బరువు ఉండాలి. వీటి తయారీలో నిబంధనలు, నాణ్యత పాటించడం లేదు. కంకర, సిమెంటు మిశ్రమాన్ని సరిగా వేయడం లేదు. క్యూరింగ్ సైతం అంతంత మాత్రమే ఉండటంతో స్తంభాలు త్వరగా దెబ్బతింటున్నాయి. స్తంభం లోపల 5- 6 మి.మీ లావు కలిగిన ఇనుప కడ్డీలను వాడాల్సి ఉండగా 4 మి.మీ కడ్డీలను వాడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

హైదరాబాద్ హైవే పక్కన పాతకుండానే విరిగిపోయిన స్తంభం

నిల్వ చేసిన చోటే దెబ్బతింటున్నాయి

అత్యవసర పనుల కోసం కర్నూలు డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నూతన స్తంభాలను నిల్వ చేశారు. ఎక్కడైనా అవసరమైతే గుత్తేదారులు వాటిని తరలిస్తారు. ఇలా నిల్వ చేసిన స్తంభాలను 6 నెలల నుంచి ఏడాదిలోపు ఉపయోగించుకోవాల్సి ఉంది. కానీ నగరంలో చాలా ప్రాంతాల్లో వాటిని వాడకుండా వదిలేయడంతో వేసినచోటే కాంక్రీటు పెచ్చులు ఊడిపోయి కడ్డీలు తేలి ఎందుకూ కొరగాకుండా పోయాయి. మరికొన్ని రవాణా సమయంలోనే విరిగిపోతున్నాయి.

పనికిరాని వాటిని ఏర్పాటు చేయం

- శేషాద్రి, కర్నూలు డివిజన్ ఈఈ

విద్యుత్తు పనులు నిర్వహించే సమయంలో పనికిరాని, విరిగిపోయిన స్తంభాలను ఉపయోగించం. కొత్త స్తంభాలను రవాణా చేసే సమయంలో కొన్ని దెబ్బతింటూ ఉంటాయి. గుత్తేదారులు వాటిని మార్చి నూతన స్తంభాలను అందించాల్సి ఉంటుంది.

పెద్దాసుపత్రిలో చోరీ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ఫిజియోథెరపీ కేంద్రంలో చోరీ జరిగింది. శనివారం అర్ధరాత్రి దాటిన సమయంలో దొంగలు తాళాలు తొలగించి కేంద్రంలోకి చొరబడ్డారు. ఫిజియోథెరపీ యంత్రానికి సంబంధించిన ప్రోబ్ అనే విడిభాగాన్ని అపహరించారు. సిబ్బంది ఆదివారం ఉదయం చోరీ జరిగినట్లు గుర్తించి ఆసుపత్రి పర్యవేక్షణాధికారికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కర్నూలు మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫిజియోథెరపీ కేంద్రంలో పలు ఇనుప పరికరాలను ఎత్తుకెళ్లేందుకు కూడా దొంగలు విఫలయత్నం చేసిన ఆనవాళ్లను గుర్తించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ జొహరాపురంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టినట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షుడు నాగరాజు, సీఐటీయూ నగర కార్యదర్శి విజయ రామాంజినేయులు తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: కర్నూలు మార్కెట్ యార్డులో పనిచేసే కార్మికులకు రూ.10లక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని.. యార్డులో హమాలీగా పనిచేస్తున్న మహేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, యార్డు గౌరవాధ్యక్షుడు రాముడు డిమాండ్ చేశారు.

పోలకల్ : గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు. భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవము

విధి నిర్వహణలో అటవీ మరియు వన్యప్రాణుల సంరక్షణలో అశువులు బాసిన అటవీ అధికారులకు మరియు సిబ్బందికి మా శ్రద్ధాంజలి...



డా॥ A.సిరి, IAS
కర్నూలు జిల్లా కలెక్టర్.

B.V.A. క్రిష్ణమూర్తి, IFS
కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, కర్నూలు సర్కిల్.

P.శ్యామల, IFS
కర్నూలు జిల్లా అటవీ శాఖాధికారి మరియు సిబ్బంది

జలదరింపు

మండల పరిధిలోని రేపల్లె గ్రామంలో తాగునీటి ట్యాంకు అధ్వానంగా ఉంది. పాచి పట్టి భరింపరాని దుర్గంధం వస్తోంది. జనం ఈ నీటిని తాగలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి 15 రోజులకోసారి ట్యాంకును శుభ్రం చేసి స్వచ్ఛ జలం అందించాల్సి ఉంది. అధికారులు పట్టించుకోవడం లేదని జనం పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, బేతంచెర్ల

తగ్గిన నీటిమట్టం

అవుకు, న్యూస్‌టుడే : అవుకు జలాశయంలో నీటి మట్టం తగ్గింది. జలాశయం సామర్థ్యం 4.18 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.20 టీఎంసీలుగా నమోదైంది. తిమ్మరాజుచెరువు కట్ట వద్ద సమస్యతో నీటి మట్టాన్ని తగ్గించినట్లు డీఈ సాయికిరణ్ తెలిపారు.

కళావికాసం

శ్రీశైల మహాక్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య కళారాధనలో భాగంగా సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆదివారం ఆకట్టుకున్నాయి. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీవాయు కూచిపూడి నృత్యాలయం వారు ఆదివారం పలు ఆధ్యాత్మిక గీతాలకు సంప్రదాయ నృత్యాలు చేశారు. దేవస్థానం అధికారులు కళాకారులకు ప్రశంసాపత్రాలు, ప్రసాదాలు అందించి సత్కరించారు. – న్యూస్‌టుడే, శ్రీశైలం, నంది సర్కిల్

ఉల్లాస్‌భరితమే

● సంపూర్ణ అక్షరాస్యత వైపు అడుగులు



సభ్యులకు అందించే అక్షర ఆంధ్ర పుస్తకం

ఆదోని పాత పట్టణం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల్లో పొదుపు మహిళలను అక్షరాస్యత వైపు అడుగులు వేయించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. 'అక్షర ఆంధ్ర' పేరుతో చదువు చెప్పేలా అధికారులు శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇది కొనసాగుతుండగా.. ఈ ఏడాది నుంచి నగరాలు, పట్టణాల్లో ప్రారంభిస్తున్నారు. 'అక్షర ఆంధ్ర సాధన పత్రాలు' పేరుతో పుస్తకాలు ముద్రించి మెప్మా కార్యాలయాలకు అందించారు.

ముందుగా నిరక్షరాస్యులను గుర్తిస్తారు. ప్రతి పది మందిని జట్టుగా ఎంపిక చేసి ఒక వాలంటీరును నియమిస్తారు. రాయడం, చదవడం, కూడికలు, తీసివేతలు తదితరాలపై శిక్షణ ఇస్తారు. ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటలపాటు చదువు చెబుతారు.

నెలాఖరు నుంచి తరగతులు

- ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు తొమ్మిది పురపాలక సంఘాలున్నాయి. 874 ఎస్‌ఎల్‌ఎఫ్ (స్లమ్ లెవల్ ఫెడరేషన్)లు ఉన్నాయి.
- 2.25 లక్షల మందికిపైగా పొదుపు మహిళలుండగా.. వీరిలో ఎనభై శాతం మంది అక్షర జ్ఞానులున్నారు. మిగిలినవారిని సైతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వాలు చొరవ చూపుతున్నాయి.
- ఫోన్‌పే, గూగుల్‌పే, అంతర్జాల బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పిస్తారు.
- తరగతులు ఈనెలాఖరులోపు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించారు. మూడు నెలలపాటు బోధిస్తారు. మార్చి, ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహిస్తారు.

కూలి అందుకుని.. గుట్టుగా జారుకుని

● ఉపాధి పథకంలో అక్రమార్కులు

ఉపాధి పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో నమోదైన పలువురు దీనికి దూరంగా ఉంటున్నారు. గుట్టు బయటపడుతుందన్న ఉద్దేశంతో రావడం లేదు.
– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

■ జాబ్‌కార్డులు తీసుకున్న కుటుంబాలు
■ హాజరవుతున్న కుటుంబాలు
■ పనులు చేస్తున్నవారు

	కర్నూలు (లక్షల్లో)	నంద్యాల (లక్షల్లో)
జాబ్‌కార్డులు తీసుకున్న కుటుంబాలు	4.80	3.25
హాజరవుతున్న కుటుంబాలు	2.66	1.86
పనులు చేస్తున్నవారు	3.34	2.63

క్షేత్రస్థాయిలో కానరాక..

ఉమ్మడి జిల్లాలో సుమారు 4 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇచ్చారు. కర్నూలు జిల్లాలో 66, నంద్యాల జిల్లాలో 72 శాతం ఈకేవైసీ పూర్తైనట్లు చెబుతున్నా వాస్తవంగా అంతకన్నా తక్కువగానే ఉంది. శ్రామికులుగా దస్త్రాల్లో చూపినవారి జాడ క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. వీరు పనులకు రాకున్నప్పటికీ వేతనాలు మాత్రం అందుకోవడం గమనార్హం.

రూ.కోట్లు పక్కదారి

కర్నూలు జిల్లాలో పత్తికొండ, కోసిగి, మద్దికెర, నందవరం, కోడుమూరు, హాలహర్వి, దేవనకొండ, కృష్ణగిరి తదితర మండలాల్లో, నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, కోవెలకుంట్ల, గోస్పాడు, వెలుగోడు, ఆత్మకూరు, గడివేముల తదితర మండలాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి.

ఈకేవైసీ పూర్తైతేనే..

- ఈకేవైసీ పూర్తైన తర్వాత వీరికి పనులు కల్పిస్తారు. పని జరిగే ప్రాంతంలో ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది.
- జాబ్‌కార్డు ఉండి పనులకు రాని కొందరు ఈకేవైసీ చేయించుకునేందుకు ముందుకు రావడం లేదు. ఈకేవైసీ చేయించుకుంటే గతంలో చేసిన తప్పులు బయటకు వస్తాయన్న ఉద్దేశంతో గుట్టుగా జారుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈకేవైసీ పూర్తి కానివారు 2 లక్షల మందికిపైగా ఉన్నారు. వీరి వివరాలు సేకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఉపాధి హామీ పథకంలో భాగంగా చేయని పనులు చేసినట్లు కొన్నిచోట్ల నమోదు చేశారు. పనికి రాకున్నప్పటికీ వచ్చినట్లు చాలా ప్రాంతాల్లో దొంగ మస్టర్లు వేశారు. పని ప్రదేశంలో అందరినీ గ్రూపుగా నిలబెట్టి ఫొటో తీసి హాజరు వేసే విధానం అమలులోకి తెచ్చినప్పటికీ దొంగ మస్టర్లకు మాత్రం అడ్డుకట్ట పడలేదు. ఐదేళ్ల కిందట

విషయం బయటపడుతుందని..

కేవలం హాజరు పట్టిక మాత్రమే ఉండగా.. అక్రమాలు భారీగా జరిగాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చేస్తున్నవారి పేర్లతోనూ రెండు జిల్లాల్లోని పలు గ్రామాల్లో నమోదు చేసి వేతనాలు స్వాహా చేశారు. సోషల్ ఆడిట్‌లో పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

జాలువారుతూ.. మైమరపిస్తూ

నంద్యాల జిల్లా అవుకు మండల పరిధి.. మంగంపేట గ్రామ సమీపంలోని జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతం పరవళ్లు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో దీనిని చూసేందుకు పర్యాటకులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఆదివారం కావడంతో భారీగా తరలివచ్చారు. జలపాతం వద్దకు రహదారి నిర్మించడంతోపాటు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగే అవకాశముంది.
– న్యూస్‌టుడే, అవుకు, బనగానపల్లి గ్రామీణం

ఆ పేరు ఎలా వచ్చిందంటే..



హత్తిబెళగల్ గ్రామాన్ని ఆనుకుని ఉన్న కొండ

ఆలూరు మండల పరిధిలో హత్తిబెళగల్ గ్రామముంది. ఇక్కడ సుమారు 8 వేల మంది నివసిస్తున్నారు. దాదాపు 80 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. హత్తిబెళగల్ అనేది కన్నడ పదం. కర్ణాటక రాష్ట్రాన్ని ఆనుకుని ఉంటుంది. ఈ నేపథ్యంలో అక్కడి ఆచార వ్యవహారాలను ఎక్కువమంది పాటిస్తూ ఉంటారు. హత్తి అంటే పత్తి (గతంలో ఇక్కడ ఎక్కువ మంది సాగు చేసేవారు). బెళే అంటే తెల్లని, కల్ అంటే రాయి అని.. హత్తిబెళగల్ అంటే పత్తిలా వికసించిన తెల్లని కొండ అని అర్థం. గ్రామానికి ఆనుకుని తెల్లని కొండలు ఉన్నాయి. గ్రామానికి దగ్గరగా ఉన్న గుట్టను.. కొండను ఆధారంగా చేసుకుని గ్రామానికి ఆ పేరు పెట్టారు. – న్యూస్‌టుడే, ఆలూరు గ్రామీణం

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ఎంపీహెచ్‌వోల సంఘం కార్యవర్గ ఎన్నిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఎంపీహెచ్‌వోల అసోసియేషన్‌కు జిల్లా కార్యవర్గం ఏర్పాటైంది. ఎన్జీవో హోంలో తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బీసీ హుస్సేన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మణిశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.జగదీశ్వరప్ప, కార్యదర్శిగా జి.హరినాథ్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్.రామవిజయరెడ్డి, కోశాధికారిగా కె.నర్సప్ప, ఉపాధ్యక్షులుగా వి.దస్తగిరి, జి.వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులుగా సుబ్రహ్మణ్యం, ఎల్.ఓబులేసు, కార్యనిర్వాహణ కార్యదర్శిగా కె.వెంకటరమణను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డి.శివరామయ్య, పరిశీలకుడిగా నాగార్జునరెడ్డి వ్యవహరించారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు 30,397 క్యూసెక్కుల వరద

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం నీటి మట్టం ఆదివారం సాయంత్రం 6 గంటలకు 883.80 అడుగులు, నీటి నిల్వ 208.7210 టీఎంసీలుగా నమోదైంది. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 30,397 క్యూసెక్కుల నీరు వస్తోంది. జలాశయం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 44,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రాకపోకలకు ఆయకట్టమే

● పంట పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులే

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

బురదమయంగా గాజులపల్లె–బసాపురం ఆయకట్టు రహదారి

ఉమ్మడి జిల్లాలో పంట పొలాలకు వెళ్లే ఆయకట్టు రోడ్లు ఛిద్రమయ్యాయి. దశాబ్దాల తరబడి వీటిని పట్టించుకోకపోవడం.. నిర్వహణ కరవవడంతో అధ్వానంగా మారింది. కనీసం రైతులు నడిచేందుకు వీలులేని విధంగా మారింది. ఇటీవల మొంథా తుపానుతో కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి.

- తెలుగుగంగ ఆయకట్టు పరిధిలోని వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లోని వివిధ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లే రహదారులు రూపు కోల్పోయాయి. ప్రత్యేకించి నల్లరేగడి భూముల్లో సమస్య తీవ్రంగా ఉంది. లక్షకుపైగా ఎకరాలు సాగులో ఉండగా.. భారీ వర్షాల కారణంగా లింకు రోడ్లన్నీ దెబ్బతిన్నాయి.
- కేసీ కాలువ ఆయకట్టు పరిధిలోని బండిఆత్మకూరు, నంద్యాల, గోస్పాడు, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, చాగలమర్రి మండలాల్లో పెద్దఎత్తున వరి సాగవుతోంది. ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు తమ పొలాలకు ఎరువులు తరలించలేక ఇబ్బందులు పడుతున్నారు.
- ఎస్సార్బీసీ ఆయకట్టు పరిధిలోని పాణ్యం, బనగానపల్లి, కోవెలకుంట్ల, సంజామల, అవుకు మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. తెలుగుగంగ, కేసీ పరిధిలో వరి కోతకు సిద్ధమైంది. కొన్ని ప్రాంతాల్లో చివరి విడతగా ఎరువులు వేస్తున్నారు. పొలాలకు వెళ్లేందుకు ఉన్న ఏకైక మార్గం ఆయకట్టు రోడ్లే. ఇవి బురదతో నిండిపోయాయి.

అదనపు ఖర్చులతో...

తెలుగుగంగ ఆయకట్టు పరిధిలో గాజులపల్లె-బసవాపురం, మహానంది-శ్రీనగరం, తిమ్మాపురం-కృష్ణనంది మార్గంలో 9 వేల ఆయకట్టు ఉంది. పొలాలకు వెళ్లే లింకు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ పొలాల్లో పనులకు రావాలంటే కూలీలు ఎక్కువ అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగు వ్యయం పెరిగిందని.. ఈ క్రమంలో ఆయకట్టు రహదారులు అధ్వానంగా ఉండటంతో ఖర్చు మరింత ఎక్కువైందని పేర్కొంటున్నారు.

నిధుల్లేక.. నిర్వహణ కానరాక

మార్కెట్ యార్డులకు వసూలయ్యే సెస్సులో 10 శాతం నిధులను ఆయకట్టు రోడ్లకు కేటాయించాలన్న నిబంధన ఉంది. రెండు దశాబ్దాలుగా జరగడం లేదు. గ్రావెల్ తోలడంతోపాటు మెటల్ చిప్స్ లాంటివి వేస్తే గుంతలు పడడం.. వర్షాలకు రహదారులు కోతకు గురవడం లాంటివి ఉండవు. మరోవైపు ఇటీవల కేసీ కాలువ, తెలుగుగంగ, ఎస్సార్బీసీ, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సాగునీటి సంఘాలు ఏర్పడ్డాయి. ఈ కమిటీలకు నిధులు కేటాయించి పనులు చేయించొచ్చు.. ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

విజయ మనోహరమే

ప్రశంసా పత్రం అందుకుంటున్న మనోశివకుమార్

నంద్యాల జిల్లా వెలుగోడు మండలం తిమ్మనపల్లె గ్రామానికి చెందిన మనోశివకుమార్‌కు మొదటి నుంచి క్రీడలంటే మక్కువ. అతను ప్రస్తుతం నంద్యాలలో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. గత మూడేళ్లుగా బేస్‌బాల్‌లో కఠోర శిక్షణ పొందుతున్నాడు. ప్రతిరోజూ రెండు గంటల పాటు తర్ఫీదు తీసుకుంటూ అవసరమైన మెలకువలు నేర్చుకుంటున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తూ జాతీయ స్థాయి పోటీలపై దృష్టి పెట్టాడు.

● గతేడాది నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అదే ఏడాది నర్సరావుపేటలో అండర్-19 విభాగంలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటాడు. ఈ ఏడాది ఆగస్టులో నంద్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి జట్టులో స్థానం సాధించడం విశేషం. అనంతరం కదిరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జట్టు విజయానికి శ్రమించారు. ఈ సందర్భంగా మనోశివకుమార్ మాట్లాడుతూ మరింత కష్టపడి జాతీయ స్థాయిలో రాణిస్తానని పేర్కొన్నారు.
– న్యూస్‌టుడే, వెలుగోడు, నంద్యాల పాతపట్టణం

శ్రీగిరిలో భక్తుల రద్దీ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రం ఆదివారం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో శ్రీగిరికి తరలివచ్చారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే భ్రమరాంబాదేవి, మల్లికార్జునస్వామి దర్శనానికి బారులుదీరారు. ఉచిత దర్శనానికి గరిష్ఠంగా 3 గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. దర్శనం అనంతరం భక్తులు గంగాధర మండపం, శివాజీ గోపురం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు లక్ష దీపోత్సవం : కార్తిక మాసోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీశైల క్షేత్రంలో సోమవారం సాయంత్రం పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం జరగనుంది.

దర్శనానికి భక్తుల నిరీక్షణ

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి చెప్పారు. కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు ఆదివారం తెలిపారు. జిల్లా అధికారులు హాజరు కావాలని ఆమె చెప్పారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ అధికారులు వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తులు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు ఆన్‌లైన్ ద్వారా గానీ.. టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించొచ్చని చెప్పారు.

ఇంటి వద్దకే కార్గో సేవలు 6లో ఎస్సార్బీసీకి మంచి రోజులు

ఇంటి వద్దకే కార్గో సేవలు — 6లో
ఎస్సార్బీసీకి మంచి రోజులు — 6లో

శ్రమజీవులకు ఆర్థిక భరోసా

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల చిరు ఉద్యోగుల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపింది. గత ప్రభుత్వ హయాంలో చాలీచాలని జీతాలతో కార్మికులు కాలం వెళ్లదీస్తూ వచ్చారు. పనికి తగ్గ వేతనాలివ్వాలని పలుమార్లు ఆందోళన చేశారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వీరి సేవలను గుర్తించి జీతాల పెంపుతోపాటు ఆర్థిక ప్రయోజనం కలిగించేలా చర్యలు తీసుకుంది.

ఆదోనిలో రాంజల చెరువును శుభ్రం చేస్తున్న కార్మికులు

వినతులను పట్టించుకోక..

2019లో అప్పటి ప్రభుత్వం కార్మికులను ఆప్కాస్ పరిధిలోకి చేర్చింది. వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను దూరం చేసింది. పలు నిబంధనల కారణంగా ప్రభుత్వాలు అందించే ఆర్థిక ప్రయోజనాలు దూరమయ్యాయి. ఒక్కో ఉద్యోగికి గతంలో రూ.15 వేలు జీతం ఇచ్చేవారు. ఇందులో కత్తిరింపులు పోగా రూ.13,074 మాత్రమే వచ్చేది. కొవిడ్ సమయంలో ప్రజారోగ్య కార్మికులకు అదనంగా రూ.6 వేలు పెంచి ఇచ్చారు. తమకు జీతాలు పెంచాలని సాంకేతిక, సాంకేతికేతర ఉద్యోగులు కోరినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సాంకేతిక ఉద్యోగులకు ఈ ఏడాది ఆగస్టు నుంచి రూ.3 వేలు, సాంకేతికేతర ఉద్యోగులకు రూ.3,500 పెంచింది. యాక్సిస్ బ్యాంకుతో ఒప్పందం చేసుకుని శూన్య ఖాతాలను తెరిపించింది. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకుంది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 3-4 వేల మందికి ప్రయోజనం చేకూరింది.

ప్రయోజనాలివీ..

కార్మికులు, చిరు ఉద్యోగులు దురదృష్టవశాత్తు చనిపోతే రూ.2 లక్షల సాయం అందుతుంది. వారి పిల్లలు చదువుకొనేందుకు.. ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఇద్దరికి రూ.8 లక్షలు ఇవ్వనుంది. ప్రమాదవశాత్తు చనిపోతే రూ.20 లక్షల పరిహారం ఇస్తుంది. రూ.4 లక్షల వరకు రుణ సాయం అందేలా చర్యలు తీసుకుంటుంది.

సమగ్ర నీటి సమాచారం

ప్రతి జీవికి నీరు ప్రాణాధారమే. ఏటా ఒకవైపు వరదలు.. మరోవైపు కరవు పరిస్థితులు ఎదురవుతుంటాయి. ఈ నేపథ్యంలో సాగు, తాగునీటిపై కచ్చితమైన సమాచారం అందించేందుకుగాను రాష్ట్రంలోనే తొలిసారిగా నంద్యాల జిల్లాలో వాటర్ బులెటిన్ ఇవ్వడం ప్రారంభించారు. కలెక్టర్ రాజకుమారి సూచనలతో జలవనరుల శాఖ ప్రతి నెలా వాటర్ బులెటిన్లు ఇచ్చే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. భవిష్యత్తులో నీటి వనరుల నిర్వహణకు మార్గదర్శకంగా నిలిచేలా దీనికి రూపకల్పన చేసింది.
– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

కేవలం నీటి సంఖ్యలు, గణాంకాల సమాచారమేకాక రైతులు, ప్రజలు, అధికారులకు ఒక మార్గ సూచికగా బులెటిన్‌ను తీర్చిదిద్దారు. వరద హెచ్చరికలతోపాటు ముందస్తు సమాచారం, ప్రజల భద్రతకు సంబంధించిన సూచనలు ఉంటాయి. ప్రాజెక్టుల వారీగా నీటిమట్టాలు, జలాశయాలు, నదులు, చెరువుల్లో నీటి స్థితి, భూగర్భ జలాల వివరాలు పొందుపరిచారు. నెలవారీగా నీటి లభ్యత, సాగు, తాగునీరు, ఇతర అవసరాలకు అందుబాటులో ఉండే నీటి వివరాలు పొందుపరిచారు. కరవు పర్యవేక్షణ, నీటి కొరతను అంచనా వేయడం.. సంరక్షణపై అవసరమైన సూచనలు ఉంటాయి. ఉదాహరణకు శ్రీశైలం రిజర్వాయరులో ఎంత నీటి మట్టం ఉంది? నిల్వ సామర్థ్యం, ఎంత మేరకు డ్యాం నిండింది.. తాగు, సాగునీటి పరిస్థితి తదితర అంశాలు పొందుపరుస్తారు. ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు గత నెలలో ఎంత నీరు అందించారన్న వివరాలు ఉంటాయి. వర్షపాతం, భూగర్భజల మట్టం వివరాలు తెలుసుకోవచ్చు.

ఉపయోగాలెన్నో..

ప్రతి నెలా విడుదల చేసే నీటి బులెటిన్ల ద్వారా రైతులు నీటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చు. వరదల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవచ్చు. భూగర్భ జలాల నిల్వలను పెంచుకోవచ్చు. జిల్లా మొత్తాన్ని ఒకే వేదిక కిందకు తీసుకొచ్చి ప్రస్తుత నీటి పరిమాణం, రాబోయే వర్షాల అంచనాలను పరిగణలోనికి తీసుకోవడం ద్వారా నీటిని సక్రమంగా వినియోగించుకోవచ్చు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

పోలీసుస్టేషన్‌లో ఇసుక టిప్పర్లు

ఈనాడు, కర్నూలు: ప్యాపిలి మండల పరిధి.. జాతీయ రహదారి ప్రాంతంలోని పెద్దమ్మ దాబా సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. తాడిపత్రి నుంచి టిప్పర్లలో అక్రమంగా.. ఎలాంటి బిల్లులు లేకుండా, సరైన ధ్రువపత్రాలు లేకనే అధిక లోడుతో ఇసుక తరలిస్తుండగా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొదట వీటిని ప్యాపిలి పోలీసుస్టేషన్‌కు తరలించి మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించారు.

కాపాడితేనే.. కర్షకులకు అండ

● ఆర్‌ఎస్‌కేలను వేధిస్తున్న మందుల కొరత

రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా పశువైద్యాన్ని పాడి రైతుల ఇంటి ముంగిటకు తెచ్చామని గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసింది. మందుల సరఫరాలో నిర్లక్ష్యం చేసింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రైతు భరోసా కేంద్రాలను.. రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. కానీ మందులు సరఫరా కావడం లేదు. చివరికి పాడి రైతులపై భారం తప్పడం లేదు.
–న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ఉమ్మడి జిల్లాలోని ఆర్‌ఎస్‌కేల్లో పశుసంవర్ధక సహాయకుల పోస్టులు.. పనిచేస్తున్నవారు

	ఆర్‌ఎస్‌కేలు	పోస్టులు	పనిచేస్తున్నవారు
నంద్యాల	411	191	186
కర్నూలు	466	192	190



దేవనకొండ మండలంలో ఆర్‌ఎస్‌కే వద్ద వృషభాలకు టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయకులు

రైతుల జేబుకు చిల్లు

- ఆర్‌ఎస్‌కేల్లోని పశుసంవర్ధక సహాయకుల వద్దకు పశువులను తీసుకొస్తే మందులు తీసుకురావాలంటూ పశు పోషకులను ప్రైవేటు దుకాణాలకు పంపుతున్నారు. పొదుగు వాపు వ్యాధి మందులకు ఒక్కో రైతు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది పాడి రైతుకు భారంగా మారుతోంది. జ్వరాలు, పారుడు రోగం, మేత మేయకపోవడం, నులిపురుగులు తదితర సమస్యలు తరచూ వస్తుంటాయి. ఆర్‌ఎస్‌కేల్లో ప్రాథమిక చికిత్స అందించేందుకు మందులు అందుబాటులో లేకపోవడంతో రైతులు బయట కొనుగోలు చేస్తున్నారు.
- మందులు లేక కేవలం టీకాలు, కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు ఇచ్చేందుకు మాత్రమే పశుసంవర్ధక సహాయకులు పరిమితమయ్యారు.

నాటి నుంచి నేటి వరకు రెండుసార్లే..

- 2019-20లో అప్పటి ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పశువులు, మూగజీవాలకు పశువైద్యం అందించడం.. అవసరమైన మందులను ఉచితంగా సరఫరా చేయడంతోపాటు టీకాలు వేయించేలా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు.
- గతంలో ఆర్బీకే పరిధిలో రూ.28 వేల నుంచి రూ.32 వేల వరకు పశువుల మందుల కోసం ఇండెంట్ పెట్టుకునేందుకు అవకాశం ఉండేది. 2021, 2022లో ఏహెచ్‌ఏలు మందులకు ఇండెంట్ పెట్టుకుంటే కొందరికి రూ.5 వేలు, మరికొందరికి రూ.20 వేల విలువైన మందులను అరకొరగా సరఫరా చేశారు. 2023 నుంచి ఇప్పటివరకు గత 35 నెలలుగా మూడేళ్లవుతున్నా మందుల సరఫరా జరగలేదు.

(c) eenadu

పచ్చదనంపై పట్టింపేది?

ఆళ్లగడ్డ పురపాలికలో ఎక్కడా ఉద్యానవనం, పచ్చదనం లేదు. కనీసం మొక్కలు నాటి పచ్చదనం పెంచడంలోనూ మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పచ్చదనం కోసం నాటాల్సిన మొక్కలను వృథాగా పడేశారు. 10 నెలలకు పైగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు సంచుల్లోనే వృథాగా పడి ఉన్నాయి. వాటిలో కొన్ని ఇప్పటికే ఎండిపోగా, కొన్ని మొక్కలు నాటినా ఫలితం లేని స్థితికి చేరుకున్నాయి. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

రక్షణ గోడలు శిథిలం.. రాకపోకలకు భయం

బనగానపల్లి మండలం అప్పలాపురం గ్రామ సమీపంలో వంతెనకు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారింది. వంతెన లోతుగా ఉండటంతో వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదం తప్పదు. పేరుకే జాతీయ రహదారి(544-డి) అయినప్పటికీ చర్యలు చేపట్టడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఈ దారిలోనే బనగానపల్లి నుంచి నంద్యాలకు వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
– న్యూస్‌టుడే, అప్పలాపురం (బనగానపల్లి గ్రామీణం)

రోడ్డు పగిలి.. ప్రయాణికుల ఇబ్బంది

నంద్యాల పట్టణం నుంచి పెసరవాయి వెళ్లే దారిలో పీవీనగర్ వద్ద సిమెంటు రోడ్డు రెండుచోట్ల పగిలిపోయింది. భీమవరం, యర్రగుంట్ల, కరిమద్దెల, పెసరవాయి వంటి గ్రామాల నుంచి నిత్యం వందలాది వాహనాలు ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. రద్దీగా ఉండే ఈ మార్గంలో సీసీ రోడ్డు ఓ వైపు విరిగిపోయింది. రాత్రిళ్లు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు సరిగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

ప్రమాదాలకు అడ్డదారి

హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిని ద్విచక్ర వాహనదారులు విభాగినుల మీదుగా ప్రమాదకరంగా దాటుతున్నారు. వేగంగా దూసుకొస్తున్న వాహనచోదకులు హఠాత్తుగా అడ్డొచ్చే వీరిని చూసి అదుపు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్నటేకూరు- చెట్లమల్లాపురం మధ్య గతనెల రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కాలిపోయిన దుర్ఘటనలో 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఆ ప్రమాద స్థలానికి సమీపంలోనే చిన్నటేకూరు శాంతి ఆశ్రమం వద్ద నిత్యం పలువురు జాతీయ రహదారిని ఇష్టానుసారం దాటుతున్నారు. ఎన్‌హెచ్‌ఏ అధికారులు చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. – ఈనాడు, కర్నూలు

మల్లన్నకు ఆరుద్రోత్సవ పూజలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ మల్లికార్జున స్వామికి విశేష పూజలు జరిగాయి. తెల్లవారుజామున స్వామివారికి అర్చకులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వర్ణ రథంలో కొలువుదీరిన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు పూజలు చేశారు. దేవస్థానం ఛైర్మన్ పి.రమేష్‌నాయుడు, ఈవో ఎం.శ్రీనివాసరావు నారికేల కర్పూర హారతులు సమర్పించారు. ఉత్సవం ఎదుట మహిళలు, చిన్నారులు కోలాటం నృత్యాలతో సందడి చేశారు.

స్వర్ణ రథం ఎదుట నృత్యం చేస్తున్న కళాకారులు

పుణ్యక్షేత్రాల్లో భక్తుల సందడి

ఆళ్లగడ్డ గ్రామీణం, బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తిక మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎగువ, దిగువ ఆలయాలను దర్శించుకుని ఆలయ ఆవరణలో కార్తిక దీపాలు వెలిగించారు. తలనీలాలు, చిరుకానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కావడంతో భక్తుల కోలాహలం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వాహనదారులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు.

ఆళ్లగడ్డ గ్రామీణం: అహోబిలంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఇంటి వద్దకే కార్గో సేవలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) కార్గో సేవల ద్వారా పార్సిళ్లు, సరకులను తక్కువ ధరకు రవాణా చేస్తోంది. ప్రైవేటు కొరియర్ సేవలతో పోలిస్తే ఈ సేవలు చౌకగా ఉంటాయి. ఇంటి వద్దకే డెలివరీ, బీమా సౌకర్యం వంటి అదనపు సౌకర్యాలు అందిస్తుంది. బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తూ ఆదాయం ఆర్జిస్తున్న ఆర్టీసీ.. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల పెంపుపై దృష్టి సారించింది. నష్టాలను పూడ్చుకోవడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా కార్గో సేవలను విస్తరిస్తోంది.

2017లో ప్రారంభం

ఆర్టీసీ సంస్థ 2017లో సరకు రవాణాకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని నంద్యాల, డోన్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు డిపోల్లో డోర్ డెలివరీ సేవలు అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే మిగతా డిపోలకూ ఈ సేవలు విస్తరించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కార్గో సేవలపై ప్రజలు ఆసక్తి కనబరుస్తుండడంతో ఆర్టీసీకి ఆదాయం సమకూరుతోంది. ఈ సేవలకు ప్రభుత్వరంగ సంస్థలు, విభాగాలు సహకరిస్తుండడంతో పార్సిల్ సర్వీసు విజయవంతమవుతోంది.

ఇతర రాష్ట్రాలకు సైతం

ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సరకులను డోర్ డెలివరీ చేస్తున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, బళ్లారి, రాయచూరు వంటి ఇతర రాష్ట్రాలకు విత్తనాలు, విడిభాగాలు, ఔషధాలు, పూలు, పండ్లు, కూరగాయలు, టైర్లు, అరటి ఆకులు వంటి సరకులను వేగవంతంగా సరఫరా చేస్తూ కార్గో ప్రత్యేకత సంతరించుకుంది. మనం పంపిన పార్సిల్‌ను ట్రాకింగ్ చేసుకునే అవకాశం ఉంది. పార్సిల్ ఎక్కడ ఉందో, ఎప్పుడు డెలివరీ అవుతుందో ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రజలు కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

గత మూడేళ్లలో ఆదాయ వివరాలు (రూ.కోట్లలో)

జిల్లా	2023	2024	2025 (ఇప్పటి వరకు)
కర్నూలు	6.03	6.79	3.55
నంద్యాల	4.14	4.67	2.52

నంద్యాల ఆర్టీసీ బస్టాండులో పార్సిల్ కార్యాలయం

సోదర భావాన్ని పెంచేవి కార్తిక వన భోజనాలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫిరోజ్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: కార్తిక వన భోజనాలు సమాజంలో సోదరభావాన్ని పెంచుతాయని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. ఐక్యత, సంఘటితం, కార్తిక మాస పవిత్రతకు కార్తిక భోజనాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఉప్పర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జంబుల పరమేశ్వరి దేవస్థానంలో, బాలాజీ కాంప్లెక్స్ ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో ప్రథమనంది ఆలయంలో వేర్వేరుగా నిర్వహించిన కార్తిక వన భోజనాలకు ఫిరోజ్ హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లా ఉప్పర సంఘం అధ్యక్షుడు ఉప్పరి సురేశ్‌కుమార్, బూసన్న, ఉప్పరి రాధ, బాలాజీ, కౌన్సిలర్ కండే శ్యాంసుందర్‌లాల్, బింగుమల్ల సుబ్బలక్ష్మయ్య, మనోజ్‌కుమార్, నాగేంద్ర, చంద్రమౌళి, శ్రీధర్, కశెట్టి చంద్రశేఖర్, విజయకుమార్, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావనలు పెంపొందాలి

మహానంది, న్యూస్‌టుడే: కార్తిక వనభోజనం సమ్మిళిత జీవన సందేశానికి ప్రతీకని శాలివాహన అన్నదాన సత్రం ఏపీ అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్రుడు పేర్కొన్నారు. మహానంది సమీపంలోని శాలివాహన సత్రంలో ఆదివారం అశ్వర్థనారాయణ కల్యాణం, వనభోజన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావనలు పెంపొందాలని, సమాజ శ్రేయస్సు కోసం పరస్పర సహకారంతో ముందుకు నడవాల్సిన అవసరం ఉందన్నారు. శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మరి సుధాకర్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మద్దయ్య, హైదరాబాద్ భారాస నాయకులు శంకర్, మహానంది సత్రం అధ్యక్షుడు కే రామకృష్ణ, జీ శివశంకర్, కే శివయ్య తదితరులు పాల్గొన్నారు.

శాలివాహన అన్నదాన సత్రంలో ఏపీ అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర దంపతులు

భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవి

కార్యక్రమానికి హాజరైన రెడ్డి సంఘం నాయకులు

డోన్, న్యూస్‌టుడే: దేశ సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవని డోన్ రెడ్డి సంఘం అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, కార్యదర్శి జీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కోట్ల విజయభాస్కర్‌రెడ్డి భవన్ వద్ద రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనభోజనాలు కార్యక్రమం నిర్వహించారు. పలువురి నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు ధారా ప్రతాప్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, హనుమంతరెడ్డి, హేమసుందర్‌రెడ్డి, శివరామిరెడ్డి, తిమ్మారెడ్డి, శివశంకర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నందురెడ్డి, గోపిరెడ్డి, రామకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రజకులంతా ఏకతాటిపైకి రావాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: రజకులంతా ఒకే తాటిపైకి వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని రజక సంఘం నాయకుడు సురేష్ అన్నారు. పట్టణంలోని కుందూ నది ఒడ్డున గంగమ్మ దేవాలయంలో ఆదివారం రజక సేవా సమితి ఆధ్వర్యంలో గంగమ్మకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం కార్తిక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. రజకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు నాగభూషణం, లింగమూర్తి, నాగరాజు, రామకృష్ణ, శ్రీను, కుసుమాంబ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేష్

ఎస్సార్బీసీకి మంచి రోజులు

రూ.1.06 కోట్లతో మరమ్మతులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లాలో ప్రధాన సాగునీరు ప్రాజెక్టు ఎస్సార్బీసీ కాల్వ. సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ప్రధాన కాల్వలో పుష్కలంగా నీరుంటే సుమారు 40వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ కాల్వ నుంచి పాములపాడు, గడివేముల, పాణ్యం, బనగానపల్లి, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ మండలాల రైతులు వరితో పాటు ఆరుతడి పంటలు సాగు చేసుకుంటున్నారు.

బనగానపల్లి శివారులో ప్రధాన కాల్వ కట్టపై పూడ్చిన గుంతలు

వైకాపా హయాంలో నిర్లక్ష్యం

ప్రధాన కాల్వ నుంచి పంట కాల్వ వరకు గత వైకాపా హయాంలో నిర్వహణ నిధులు మంజూరు కాలేదు. అధికారులు ప్రతిపాదనలు పంపినా ఫలితం లేకుండా పోయింది. ఏడాదికి రూ.30లక్షల నుంచి రూ.50లక్షల వరకు నిధులు ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది. పంట కాల్వలు అభివృద్ధికి నోచుకోక రైతులు అవస్థలు పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో రూ.30కోట్ల ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నత స్థాయి అధికారులకు పంపిన నిధులు మంజూరు కాలేదు.

కూటమి ప్రభుత్వం చొరవ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1.06 కోట్లతో వివిధ పనులు చేపట్టారు. దీంతో ముళ్లకంపలు తొలగించడం, ప్రధాన కట్టపై గుంతలు లేకుండా మట్టి వేసి బలం వచ్చేలా చేశారు. ప్రధాన కాల్వ మట్టి పనులు, 8వ బ్లాకు నుంచి 11వ బ్లాకు వరకు మైనర్ రిపేర్లు చేశారు. ప్రధాన కాల్వ 90 కి.మీ. నుంచి 91 కి.మీ మధ్య రూ.8.39 లక్షలతో మట్టి పనులు చేశారు. అలాగే బ్లాకుల వద్ద దెబ్బతిన్న లైనింగ్ పనులు చేశారు. కొన్ని చోట్ల మట్టి వేసి కట్టకు బలం చేకూరేలా చేశారు.

మంత్రి సహకారంతో పనులు - మల్లికార్జున, ఎస్సార్బీసీ ఈఈ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంజూరైన నిధులతో పనులు పూర్తి చేశాం. మరో రూ.23 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపించాం. నిధులు వస్తే వెంటనే పనులు చేపడతాం. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరయ్యాయి. భవిష్యత్తులో ప్రతిపాదించిన నిధులు వస్తాయని ఆశతో ఉన్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా కాల్వలు బాగు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం,
శ్రీశైలం-518101, నంద్యాల జిల్లా-ఆంధ్రప్రదేశ్
SRISAILA DEVASTHANAM
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
ఆర్.సి.నం. SBMSD-ADMN0TMP/44/2025-TEMP(G2)-SBMSDSLM తేది: 09-11-2025
శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం, శ్రీశైలం, నంద్యాల జిల్లా ఆలయ విభాగం-శ్రీశైల మహాక్షేత్రము నందు శ్రీ స్వామి అమ్మ వార్ల దర్శనార్థము విచ్చేయు ముఖ్య అతిథులకు మరియు అతిథులకు సమర్పించుటకు గాను అవసరమైన సాఫ్ట్ శిల్క్ శాలువాలను (విత్ గోల్డ్ జరి) ఒక సంవత్సరం కాల పరిమితికి అనగా తేది: 01-12-2025 నుండి 30-11-2026 సరఫరా చేయుటకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు కోరబడుచున్నది. ఇతర వివరముల కొరకు www.apeprocurement.ap.gov.in నందు చూడవచ్చును.
శ్రీ స్వామి అమ్మ వార్ల సేవలో...
యం.శ్రీనివాస రావు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ &
కార్యనిర్వహణాధికారి

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నక్కి లెనిన్ ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం డోన్ పట్టణానికి చేరుకుంది. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సూర్య ప్రతాప్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనతో పాటు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వలరాజు, నాసర్‌జీలు మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాకు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు రవిమోహన్, నాగభూషణం, మస్తాన్, బండి చలపతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నక్కి లెనిన్

రెండ్రోజుల్లో వర్ష సూచన

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: భారత వాతావరణశాఖ సమాచారం మేరకు ఉమ్మడి జిల్లాకు రానున్న రెండు రోజుల్లో తేలికపాటి వర్షసూచన ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి ఆదివారం తెలిపారు. పలు ప్రాంతాల్లో జల్లులు లేదా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.

ఘనంగా తాహెర్‌షా ఉరుసు

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారు కొండ ప్రాంతంలో వెలసిన సయ్యద్ తాహెర్‌షా దర్గా ఉరుసు మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. దర్గా పీఠాధిపతి సయ్యద్ మహమూద్ ఖాద్రి ఆధ్వర్యంలో గంధం, పూలచాదర్‌ను భక్తులు దర్గాకు తీసుకొచ్చి సమర్పించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. అన్నదానం చేశారు.

గంధం తీసుకొస్తున్న దర్గా పీఠాధిపతి

మహానందీశునికి ప్రముఖుల పూజలు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రానికి ఆదివారం కర్నూలు జిల్లా డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ రాజగోపాల్‌రెడ్డి, జిల్లా వెలుగు డీపీఎం నవీన్‌కుమార్, అనిల్‌కుమార్‌లు దర్శనార్థం వచ్చారు. గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. వారికి మండల ఐకేపీ ఏపీఎం తిరుపాల్‌రెడ్డి అలంకార మండపంలో జ్ఞాపిక ఇచ్చారు. పండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.



ఉన్నతాధికారులకు జ్ఞాపిక అందజేస్తున్న తిరుపాల్‌రెడ్డి

రెండు వాహనాలు ఢీకొని.. ఒకరి దుర్మరణం

మహానందిఫారం(మహానంది), న్యూస్‌టుడే: పాల కోసం వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మహానంది పోలీసుల కథనం ప్రకారం.. మహానంది మండలం గాజులపల్లె ఆర్.ఎస్.గ్రామంలోని మరకత లింగేశ్వర, నవగ్రహ దేవాలయ సముదాయంలో ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పవన్‌మండల్(26) సేవకుడిగా పని చేస్తున్నారు. నిత్యం మహానంది ఫారంలోని ఒంగోలు జాతి పశు పరిశోధనా స్థానం నుంచి ఆవు పాలు తీసుకువస్తుంటారు. పాల కోసం ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. బుక్కాపురం గ్రామానికి చెందిన బొలేరో వాహనం ఎదురుగా వచ్చింది. మహానంది క్షేత్రం-బోయిలకుంట్ల మెట్ట మధ్యనున్న రహదారి మలుపులో పొదల కారణంగా ఒకరికొకరు కనిపించకపోవడంతో ఢీకొన్నారు. పవన్‌మండల్ తలకు తీవ్ర గాయం కావడంతో నంద్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ ప్రాణాలొదిలాడు. మహానంది ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పవన్‌మండల్ (పాత చిత్రం)

నర్సరీలో అగ్ని ప్రమాదం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారు ఎమ్మిగనూరు రహదారిలో మధు నర్సరీలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గుర్తించిన నర్సరీ నిర్వాహకులు, స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా అదుపు చేశారు. దాదాపు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు గంగాలమ్మ తెలిపారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మూడో అంతస్తు నుంచి పడి.. యువకుడి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని ధనలక్ష్మీనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్తు నుంచి పడి కాటెపోగు కిరణ్(24) మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. కర్నూలు మండలం పడిదెంపాడుకు చెందిన కాటెపోగు బక్కన్నకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. ఇంటర్ వరకు చదివిన కుమారుడు కిరణ్ చదువు మానుకుని ఓ పాఠశాల బస్సు క్లీనర్‌గా పనిచేస్తుండేవాడు. ధనలక్ష్మీనగర్‌లో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌కు బక్కన్న వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. రోజూ భవనాన్ని క్యూరింగ్ చేసేవారు. బక్కన్న తన బంధువుల ఇంటికి వెళ్లడంతో కిరణ్ పనికి వెళ్లాడు. ఆదివారం భవనం మూడో అంతస్తులో క్యూరింగ్ చేస్తూ అదుపుతప్పి నేలపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కర్నూలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

MARRIAGE SERVICES
మనోజ్ఞ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. మా ప్రత్యేకత రెడ్డి కులాల వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. ఆసక్తి గల వారు సంప్ర: 94900 04404.

PERSONAL CLASSIFIEDS

MISSING
కనబడుట లేదు
సి.లింగన్న, వీకర్‌సెక్షన్ కాలనీ, కర్నూలు జిల్లా, వయస్సు: 80 సం॥లు, కలర్: నలుపు
పై ఫొటోలోని వ్యక్తి ది: 11/09/2025 రోజు ఉదయం 8 గం॥ నుండి కనిపించడం లేదు. ఆచూకి తెలిపినవారు క్రింది ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వగలరు. ఆచూకీ తెలిపినవారికి తగిన పారితోషికం ఇవ్వబడును.
సి.రామకృష్ణ (కుమారుడు)
96528 26184
98666 43043

JOBS
యాక్సెస్ డెవలప్మెంట్ సర్వీసెస్ అగ్రికల్చర్ సంస్థలో పనిచేయుటకు రిసోర్స్‌పర్సన్స్ కావలెను. Q: ఇంటర్, డిగ్రీ. టూవీలర్. మహనంది, బండిఆత్మకూరు, ఆళ్ళగడ్డ, పాణ్యం, రుద్రావరం, సెరివెల్లి & గోస్పాడు గ్రామీణ యువతకు మొదటి ప్రాధాన్యం ✆ 88972 37555.
డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్ లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ॥ 23000 టు 29000. వ: 18-35. ✆ 77309 58410.
E-Kart లో స్త్రీ/పు కావలెను. Inter, Any Degree. జీ॥ 15,000/-. Online are available. Ph: 77022 37945, 91542 87830.

EENADU THE WAY CLASSIFIEDS
అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శివపురం తెదేపా కార్యకర్త హరికృష్ణా భార్య శ్రావణికి ఆదివారం రూ.5లక్షల బీమా చెక్కును అందజేశారు. శివపురం గ్రామ సర్పంచి చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు గ్రామీణం: బొల్లవరం గ్రామానికి చెందిన పగులయ్య, లక్ష్మిదేవీలకు రూ.2.48లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

వార్షికోత్సవ సభ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: సోషలిజానిదే భవిష్యత్తు అని జిల్లా సీపీఎం కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఏసురత్నం అన్నారు. సోషలిస్ట్ విప్లవ శత వార్షికోత్సవ సభను మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య 1946లో ప్రజాస్వామ్యం పేరుతో విజన్ గురించి ప్రస్తావించారని గుర్తుచేశారు. శక్తి కొద్ది పని.. పనికితగ్గ ఫలితం సోషలిస్ట్ నినాదమన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని సలీంనగర్‌లో, ఎస్బీఐ కాలనీలో కాల్వలు శుభ్రం చేయడం లేదు. మురుగు చేరి దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **- బాషా, రామయ్య, స్థానికులు**

?:నంద్యాల పట్టణం ఎస్బీఐ కాలనీలో వీధికుక్కలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. **- సలీం**

✔: సిబ్బందిని పంపి కాల్వలు శుభ్రం చేయిస్తాం. త్వరలోనే కుక్కల సమస్యలను పరిష్కరిస్తాం.

- లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?:ఇస్లాంపేటలో పెద్ద కమేళాకు వెళ్లే మార్గంలో ఉన్న వీధి దీపం వెలగడం లేదు. కంప చెట్లలో పాములు సంచరిస్తున్నాయి.

- నజీర్, స్థానికుడు.

✔: వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం.

- షాహీర్‌బాష, పురపాలక ఏఈ.

?: ఇందిరానగర్‌లో చర్చి పక్కగా ఉన్న ఖాళీ స్థలంలో వర్షపు నీళ్లు నిలిచి ఉన్నాయి. దోమలు వ్యాపిస్తున్నాయి.

- రాజు, స్థానికుడు.

✔:వర్షపు నీటిలో బ్లీచింగు పొడరు చల్లిస్తాం.

- జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు.

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ?: కొత్తపల్లి మండలంలోని ఎదురుపాడులోని బీసీ కాలనీలో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. **- రాము స్థానికుడు.**

✔:మురుగు పారకుండా చర్యలు తీసుకుంటాం.

- పురపాలక అధికారి

?:పాములపాడులో ఆరోగ్య ఉప కేంద్రం సమీపంలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారింది.

- రాజేష్ స్థానికుడు.

✔:నూతన స్తంభాన్ని ఏర్పాటు చేస్తాం.

- విద్యుత్తు శాఖ ఏఈ అబ్దుల్ అబీద్

చిత్రాలు గీసి.. బహుమతులు పొంది

నందికొట్కూరు, న్యూస్‌టుడే: చిత్రాలు వేయడంతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దయ్య తెలిపారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'మీకు ఇష్టమైన పండగ' అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అక్షిక, అల్‌మస్, ఇర్ఫాన్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అస్లామ్‌అలీ, రుద్రయ్య, గోవర్ధన్, వేణుమాదవ్ బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్రాలు గీస్తున్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

వరదొస్తే రాలేం.. పోలేం

★ వర్షాల సమయంలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

వడ్లరామాపురం దారిలో వంతెనపై నీరు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: భారీ వర్షాలు, వరదల సమయంలో ఆత్మకూరులో లోలెవల్ వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వంతెనలపై నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దాంతో చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏళ్ల తరబడి ఈ సమస్య వేధిస్తోంది. ఆటోలు, ద్విచక్రవాహనదారులు ప్రమాదకరంగా ప్రయాణిస్తూ.. వాగుల్లో కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వంతెనలు ఎత్తు పెంచాల్సి ఉంది.

ఆత్మకూరు-కొత్తపల్లి మండలాల మధ్య

ఆత్మకూరు నుంచి కురుకుంద రస్తాలో భవనాశి వాగుపై రెండు చిన్నపాటి వంతెనలున్నాయి. వాగు ఉప్పొంగితే వంతెనలపై నీరు ప్రవహిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే మూడు, నాలుగు సార్లు రాకపోకలు నిలిచాయి. ఆ దారిలో ఆత్మకూరు మండలంలోని కురుకుంద, కొట్టాలచెరువు, శివభాష్యం సాగర్ ప్రాజెక్ట్, కొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి, గువ్వలకుంట్ల, వీరాపురం, నందికుంట, బావాపురం, పాలెంచెరువు, ఎదురుపాడు, జెడ్‌వారిపల్లె, గోఖవరం, శివపురం, సింగరాజుపల్లె, ముసలిమడుగు, మాడుగుల, కపిలేశ్వరం గ్రామాలతో పాటు సంగమేశ్వరం, కొలను భారతి క్షేత్రాలకు వెళ్తారు.

● వడ్లరామాపురం రస్తాలో దశాబ్దాల క్రితం లోలెవల్ వంతెన నిర్మించారు. ఆ మార్గంలో వడ్లరామాపురం, కొట్టాల చెరువు గ్రామాలకు రాకపోకలు సాగిస్తారు. ఆత్మకూరులోని పలు కాలనీలకు తాగునీరు సరఫరా చేసే బావి వంతెన అవతలి వైపు ఉంది. వరదల్లో అటు వైపు వెళ్లడం కష్టం. మున్సిపాలిటీలో సేకరించిన చెత్తాచెదారం బ్రిడ్జి దాటి రహదారి పక్కన వేస్తున్నారు.

భవనాశి వాగుపై నిర్మించిన వంతెన మీదుగా పారతున్న వరద

చుట్టూ తిరిగి వెళ్లాలి

వరదల సమయంలో కొత్తపల్లి మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పాములపాడు మీదుగా ప్రయాణిస్తారు. 20-30 కి.మీలు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా

నందికొట్కూరులో అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరేంద్ర

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచామని ముచ్చుమర్రి ఎస్సై నరేంద్ర అన్నారు. పగిడ్యాల మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ఆదివారం కార్డన్ సర్చ్ నిర్వహించారు. అనుమానితులు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు చేశారు. సరైన పత్రాలు లేని ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎబీఎం, ఎస్పీజీపాలెంలో ఆదివారం కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అనుమానాస్పద వస్తువులు, నాటుసారా, పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సోదాల్లో 15 మద్యం సీసాలు, 600 కిలోల చౌక దుకాణం బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

బొల్లవరం, (మహానంది): శాంతియుత జీవనం మనిషికి ఆభరణమని ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉల్లిగడ్డల బొల్లవరంలో ఆదివారం సిబ్బందితో అనుమానిత ఇళ్లల్లో కార్డన్ సర్చ్ నిర్వహించారు. గ్రామ కూడలిలో ప్రజలతో సమావేశం ఏర్పాటే చేసి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు.

ఏడాది క్రితం నిర్మాణం.. నోచుకోని ప్రారంభం

మండలంలోని భీమవరం గ్రామంలో రూ.40 లక్షలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ సచివాలయాన్ని ఏడాది క్రితం నిర్మించారు. అప్పటి నుంచి ప్రజా ప్రతినిధులు నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించకపోవడంతో సచివాలయ ఉద్యోగులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా స్పందించి సచివాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, భీమవరం (నంద్యాల గ్రామీణం)

దారి ఇలా.. ప్రయాణం ఎలా

నంద్యాల పట్టణం ఎస్పీ కార్యాలయం సమీపంలోని ఆర్టీసీ కాలనీ రోడ్డు బీటలు వారింది. ఈ దారిపై ప్రయాణించడానికి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి నూతన రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

మురుగుతో రోగాలు

పౌర పాత్రికేయం

నంద్యాల పట్టణం జగజ్జననీనగర్‌లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో మురుగు చేరి దోమలు విజృంభిస్తున్నాయి. ఐదేళ్లుగా ఇలాగే ఉన్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఖాళీ స్థల యజమానులకు నోటీసులిచ్చి, పరిశుభ్రంగా ఉంచుకులేలా చర్యలు చేపట్టాలి.

- మహమ్మద్ షరీఫ్. జగ్గజ్జననీనగర్

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

ఫొటోలు పంపండి: 95334 54249

సంక్షిప్త సమాచారం

గడివేముల: అనితయ విద్యాబోధకులకు న్యాయం చేయాలని రాష్ట్ర కోఆర్డినేటర్లు సుబ్బారాయుడు, బిలకలగూడూరు కబీరుల్లా కోరారు.

నందికొట్కూరు గ్రామీణం: పగిడ్యాల మండల కేంద్రంలోని బీసీకాలనీలో న్యాయ సేవల దినోత్సవం నిర్వహించారు. న్యాయవాది మద్దయ్య న్యాయసేవలపై అవగాహన కల్పించారు.

పాములపాడు: కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి పోరాటం ఎనలేనిదని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. వేంపెంట గ్రామంలో చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా చంద్రపుల్లారెడ్డి స్థూపం వద్ద చిత్రపటాన్ని ఉంచి పూలమాల వేసి నివాళులర్పించారు.

నంద్యాల పట్టణం: మిడ్‌టౌన్ రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవమూర్తి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రుద్రవరం మండలం చిన్నకంబలూరు జడ్పీ పాఠశాలకు బీరువా వితరణ చేశారు.

నందికొట్కూరు గ్రామీణం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జూపాడుబంగ్లా ఎస్సై మల్లికార్జున అన్నారు. తాటిపాడు గ్రామంలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. దొంగతనాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు.

పాణ్యం గ్రామీణం: ఆలమూరు గ్రామానికి చెందిన మహిళ(40) అదృశ్యమైనట్లు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లి రాలేదని, ఆరా తీయగా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు.

పాణ్యం గ్రామీణం: గడ్డంపేటలోని పురాతన బావిని స్థానిక యువకులు శుభ్రం చేశారు. యువకులంతా కలిసి బావిలో పేరుకుపోయిన మట్టిని తొలగించారు. పురాతన ఆనవాళ్లు గుర్తుండాలని, భూగర్భ జలాల కోసం బావిని శుభ్రం చేసినట్లు తెలిపారు.

నంద్యాల నేరవిభాగం: పట్టణంలో ప్రయాణికులు ఆటోలో పొగొట్టుకున్న సంచిని ఆటో డ్రైవర్ నాగేశ్వర్‌రెడ్డి మూడో పట్టణ సీఐ కంబగిరి రాముడు ఆధ్వర్యంలో బాధితులకు అప్పగించారు. సంచిలో చరవాణి, ఇతర విలువైన వస్తువులు ఉన్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్‌ను సీఐ అభినందించారు.

నంద్యాల పట్టణం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చిత్రకారుడు చందు కుటుంబానికి నంద్యాల చిత్రకారుల సంఘం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసింది.

నందిపల్లె(మహానంది): నందిపల్లె వద్ద రైల్వేగేటును రెండు రోజుల పాటు మూసివేస్తున్నట్లు సంబంధిత నంద్యాల డివిజన్ అధికారులు తెలిపారు.

ఆత్మకూరు: కేవీకే స్టేడియంలో ఈ నెల 12 నుంచి 27 వరకు నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి వాలీబాల్, రాష్ట్రస్థాయిలో నిర్వహించే అండర్-14 విభాగంలో బాల, బాలికలకు ఖోఖో క్యాంపు నిర్వహిస్తున్నట్లు స్టేడియం ఇన్‌ఛార్జి జునైద్‌బాషా, వాలీబాల్ అసోషియేషన్ సెక్రటరీ, రైల్వే కోచ్ నిమ్మికృష్ణ, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఛైర్మన్ పస్పిల్‌మున్నా తెలిపారు.

బండిఆత్మకూరు: బండిఆత్మకూరులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. గ్రామానికి చెందిన యువత రోషన్ ఆధ్వర్యంలో నంద్యాల బ్లడ్ సెంటరు నిర్వాహకులు అచ్యూత్ ఆధ్వర్యంలో ఆదివారం శిబిరం ఏర్పాటు చేశారు. వందమందికి పైగా రక్తదానం చేశారు. శ్యామల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్కడే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

వాల్మీకి ఉద్యోగుల సమస్యలపై పోరాడుదాం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: వాల్మీకి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐకమత్యంతో పోరాడి పరిష్కరించుకోవాలని ఏపీ వాల్మీకి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి డా.బోయ లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని సంఘమిత్ర కార్యాలయంలో ఆదివారం వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధి చెందని వాల్మీకులను ఉద్యోగులంతా కలిసి ఉన్నత చదువులు చదివించాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. డా.బోయ మల్లన్న, జనార్దన్, శ్రీనివాసులు, శివుడు, రామ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో సంఘం నాయకులు

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో ప్రతిభ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో నంద్యాల వాసి కాశీపురం ప్రభాకర్ రెడ్డి మూడు పతకాలు సాధించారు. విజయవాడలో స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 50+విభాగంలో ఈయన రెండు బంగారు, ఒక రజత పతకం గెలుచుకున్నారు.

ఖబరస్తాన్‌కు నాలుగు ఎకరాల వితరణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: వక్ఫ్‌బోర్డ్‌కు చెందిన నాలుగు ఎకరాల స్థలాన్ని ఆత్మకూరు ఖబరస్తాన్‌కు ముల్లా కుటుంబ సభ్యులు ములాల ఖమ్మున్‌బీ, సలాం, మక్బుల్ అప్పగించారు. కొత్తపేట మసీదులో ఆదివారం ఆత్మకూరు మజ్లిసుల్, ఉలేమా, ఆత్మకూరు మస్జీద్ కమిటీల ముతవల్లీలు, మత పెద్దలు ముల్లా కుటుంబ సభ్యులను సన్మానించారు. 50ఏళ్లుగా వక్ఫ్ బోర్డ్‌కు చెందిన నాలుగు ఎకరాల స్థలాన్ని ఖబరస్తాన్‌కు వితరణ చేయడం సంతోషకరమని ఏపీ ముస్లిం పర్సనల్ లా బోర్డు కన్వీనర్ మౌలానా జాకీర్‌సాహెబ్‌రషాది అన్నారు. ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : ఐఎంఏ నంద్యాల శాఖకు అనుబంధంగా ఉన్న అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ తెలిపారు. అధ్యక్షురాలిగా డా.మల్లీశ్వరి, కార్యదర్శిగా డా.జి.లలితకుమారి, కోశాధికారిగా డా.శశికిరణ్, ఉపాధ్యక్షులుగా డా.హిందూమతి, డా.భారతి, సంయుక్త కార్యదర్శులుగా డా.గెలివి సిద్ధార్థ, డా.మణిదీప్, కార్యవర్గ సభ్యులుగా డా.దుర్గాప్రసాద్, డా.పాండురంగారావు, డా.ఎం.శ్రీనివాసులు, డా.నాగరాజరెడ్డి, డారాజశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, కార్యదర్శి మునెప్ప డిమాండు చేశారు. పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో ఆదివారం ఏఐటీయూసీ నంద్యాల జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు రఘురాంమూర్తి అధ్యక్షతన జరిగింది. బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ వంటి వాటిని కేంద్రం ప్రైవేటుపరం చేసి కార్పొరేటర్లకు కట్టబెట్టడానికి సిద్ధమైందని విమర్శించారు. నాయకులు రంగనాయుడు, రమేష్‌బాబు, లలితమ్మ, సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవీంద్రనాథ్

రాయల్టీలను ప్రైవేటుపరం చేయొద్దు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నాపరాయి గనుల పరిశ్రమ రాయల్టీపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వైఖరి స్పష్టం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో నాపరాయి పరిశ్రమ రాయల్టీలను ప్రైవేటుపరం చేయడంతో కార్మికులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించకపోతే రహదారులు దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ప్రసాద్, లక్ష్మీదేవి, సుశీలమ్మ పాల్గొన్నారు.

అల్లామ ఇక్బాల్ చిత్రపటాల విడుదల

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ఉర్దూ భాషా దినోత్సవం నిర్వహించారు. ముల్లాన్‌పేట ఉర్దూ ఉన్నత పాఠశాలలో అల్లామ ఇక్బాల్ జయంతిని పురస్కరించుకొని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజద్ షరీఫ్ అధ్యక్షతన వేడుకలు జరిగాయి. సంఘం రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ..ప్రజల్లో నైతిక విలువలు పెరిగేందుకు ఇక్బాల్ కవితలు ఉపయోగపడతాయన్నారు. అల్లామ ఇక్బాల్ చిత్రపటాలను విడుదల చేశారు. ఉర్దూ సాహిత్య కమిటీ నాయకులు మహ్మద్ ఇక్బాల్, నాసిర తదితరులు పాల్గొన్నారు.

భూమిపై హక్కులు కల్పించాలి

గోస్పాడు, న్యూస్‌టుడే: వ్యవసాయ కార్మికులకు భూమిపై హక్కులు కల్పించాలని బీకేఎంయూ వ్యకాస జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం కార్మికుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రోజువారీ కూలీ రూ.600 ప్రకారం 300 రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి బాబాఫకృద్దీన్, సీపీఐ మండల కార్యదర్శి హరినాథ్, నాగరాజు, చెన్నయ్య, దిబ్బన్న పలువురు పాల్గొన్నారు.

దేవాలయాల్లో కార్తిక శోభ

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంతోపాటు మండల కేంద్రం ఎం.తిమ్మాపురం, బుక్కాపురం, పుట్టుపల్లె, గాజులపల్లె తదితర గ్రామాల్లోని ఆలయాలు, ఆశ్రమాలు కార్తిక పూజలతో కళకళలాడాయి. కార్తికమాసం ఆదివారం సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు మహానందిలో వెలసిన గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లకు అభిషేకాలు, అర్చనలు చేసుకున్నారు. ఆలయాల్లోని శివలింగాలకు పంచామృతం, జలాభిషేకాలను చేసి తరించారు.

పుట్టుపల్లె శివాలయం వద్ద దీపాలతో భక్తులు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: ఓంకార పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో అధికంగా తరలివచ్చారు. పంచబుగ్గల కోనేరులో స్నానాలు ఆచరించి ఓంకార సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి చక్రపాణి శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తిక మాసం ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని క్షీరాభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

పూజలందుకున్న దుర్గాభోగేశ్వరుడు

ఆరుద్ర నక్షత్ర పూజలు

గడివేముల, న్యూస్‌టుడే: శ్రీదుర్గాభోగేశ్వరంలో ఆదివారం ఆరుద్ర నక్షత్ర పూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు శ్యాంసుందరశర్మ తెలిపారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేసినట్లు చెప్పారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నంద్యాల గాంధీచౌక్: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని నంద్యాల పట్టణం సంజీవనగర్ రామాలయంలో ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామికి భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపూజలు నిర్వహించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని సినిమా డైరెక్టర్ సురేందర్‌రెడ్డి సందర్శించారు. ఆదివారం ఆలయానికి చేరుకుని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నాగలింగేశ్వస్వామి వారిని దర్శించుకున్నారు. క్షీరాభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు.

అలరించిన జానపద జాతీయ కవి సమ్మేళనం

సన్మానం అందుకున్న డా.ఉషారాణి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో ఉషోదయ ఫౌండేషన్ తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చిన్నారుల్లో సృజనాత్మకత, దేశభక్తిని పెంచేందుకు జాతీయ కవి సమ్మేళనం నిర్వహించింది. శ్రీశైల పబ్లిక్ స్కూల్‌లో సంస్థ ఎండీ డా.యూవీ రత్నం, జాతీయ అధ్యక్షురాలు డా.ధనాశి ఉషారాణి నిర్వహణలో ఆదివారం 'పసిడి నవ్వులు వెలుగు దివ్వెలు' అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కవులు డా.గెల్వి సహదేవుడు, డా.కె.కిశోర్‌కుమార్, డా.మరియాదాస, అన్నెం శ్రీనివాసరెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు కేశవమూర్తి తదితరులు పాల్గొన్నారు. 100 మంది కవులు, కళాకారులు, బాలలు కవితా గానం చేశారు. వీరికి జానపద సేవా మంజరి, బాల చైతన్య సేవా పురస్కారాలతో సత్కరించారు.

ఆటో కారు ఢీ.. నలుగురికి గాయాలు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని బృందావన కాలనీ నుంచి నంద్యాలకు వస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొనడంతో ఆటోలో ఉన్న నలుగురికి గాయాలైనట్లు ఆదివారం ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వారిని జీజీహెచ్‌కు తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నందికొట్కూరు ఎన్టీఆర్ కాలనీలో విద్యుదాఘాతంతో సహదేవుడు, సావిత్రమ్మ ఇల్లు దగ్ధమైంది. శనివారం రాత్రి ఇంట్లో వారందరూ వేరే ఊరు వెళ్లడంతో ఫ్రిడ్జ్ తీగల్లో షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో మంటలు వ్యాపించి సామగ్రి దగ్ధమైంది.

అభివృద్ధి జాడలేని కాలనీలు

★ దశాబ్దాలు గడిచినా మౌలిక వసతులు కల్పించక ఇక్కట్లు

కాలనీ : నడిగడ్డ | వార్డు : 3, 5
జనాభా : దాదాపు 6 వేలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని జగజ్జననీనగర్, నడిగడ్డ కాలనీలు ఏర్పడి దశాబ్దాలు గడిచింది. కానీ, ఈ కాలనీల్లో మౌలిక వసతులు కరవై ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎటుచూసినా మురుగు కూపాలు, ఖాళీ స్థలాల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి. రోడ్లు దెబ్బతిని గుంతలమయంగా మారాయి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఇక్కడ అభివృద్ధి పనులు జరగలేదు. దెబ్బతిన్న రోడ్లపైనే ప్రజలు ప్రయాణాలు చేస్తున్నారు. ఇళ్ల మధ్య మురుగుతో దోమలు, విషపురుగుల సంచారం ఎక్కువై ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పాలకులు, అధికారులు సమస్యలు పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు: వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ పాదచారులు, ద్విచక్ర వాహనదారుల వెంటపడి గాయపరుస్తున్నాయి.

● విద్యుత్తు స్తంభాలను కేబుల్ వైర్లు అధిక సంఖ్యలో కట్టారు. ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని ప్రజలు భయపడుతున్నారు.

● రహదారుల పక్కన విద్యుత్తు నియంత్రికలకు రక్షణ గోడ, కంచె లేదు. దీంతో వాహనదారులు, పాదచారులు భయంగా రాకపోకలు సాగిస్తున్నారు.

● ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, కంపచెట్లు విపరీతంగా పెరిగి పాములు, విషపురుగులకు ఆవాసాలుగా మారాయి.

● రహదారుల పక్కనే చెత్తాచెదారం పడేస్తుండటంతో దుర్వాసన, అపరిశుభ్రత నెలకొంది.

రహదారి పక్కన స్తంభానికి కట్టిన తీగలు

ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

కాలనీ : జగజ్జననీనగర్ | వార్డు : 6
జనాభా : దాదాపు 4 వేలు

సమస్యలు: ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు, మురుగు చేరింది. దుర్వాసన, దోమలు, విషపురుగులతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

● రహదారులు దెబ్బతిన్నాయి. వీటిపై ప్రయాణించడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరికొన్ని చోట్ల మట్టి రహదారులు ఉన్నాయి.

● కాల్వలపై ఏర్పాటు చేసిన కల్వర్టులు దెబ్బతిన్నాయి. కల్వర్టులకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

● ఇళ్లను ఆనుకునే విద్యుత్తు స్తంభాలు, తీగలు ప్రమాదకరంగా ఉండటంతో ప్రజలు భయపడుతూ జీవనం సాగిస్తున్నారు.

● కాల్వల్లో పూడిక తొలగించకపోవడంతో దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

(c) eenadu

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

స్వదేశీ వస్తువులనే ప్రోత్సహిద్దాం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆదివారం భాజపా నాయకులు ఆదివారం పట్టణంలో 'ఆత్మ నిర్భర్ భారత్' కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. భాజపా మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పట్టణంలోని పలు దుకాణాలకు వెళ్లి స్వదేశీ వస్తువుల కొనుగోళ్లు, విక్రయాలతో దేశానికి కలిగే లాభాలను వివరించారు. ప్రజలు స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, దీని ద్వారా దేశ పురోగతి సాధ్యమవుతుందన్నారు. దేశీయంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ప్రధాని మోదీ కలగా ఉన్న 'మేకిన్ ఇండియా' సాకారం అవుతుందన్నారు. ప్రపంచంలో బలమైన ఆర్థిక వ్యవస్థగా మారేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. దుకాణదారులు కూడా స్వదేశీ వస్తువుల విక్రయానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు డి.మరియమ్మ, శ్రీరాములు, బాల ఓబులేసు పాల్గొన్నారు.

రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా పోరాటం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం పోరాడుతున్నామని వాల్మీకి సంఘం నాయకులు మురళీకృష్ణ, బ్రహ్మనాయుడు, స్వామినాయుడు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల జిల్లా కేంద్రంలో వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని చేపట్టిన మౌన దీక్ష కార్యక్రమానికి బేతంచెర్ల మండలం నుంచి భారీగా బయలుదేరి వెళ్లారు. మల్లికార్జున, నాగరాజు, నిరంజన్, కిరణ్, కేశాలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆళ్లగడ్డ: 8008 574916 డోన్ పట్టణం: 94408 57790 బనగానపల్లి: 80085 73763

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: కొలుములపల్లె గ్రామంలో పలు చోట్ల వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. ఆన్‌ఆఫ్ సౌకర్యం ఏర్పాటు చేయాలి.
- రమేష్, కొలుములపల్లె.
✔: విద్యుత్తు సిబ్బందితో సమస్యను పరిష్కరిస్తాం.
- మల్లికార్జున, ఈవోఆర్డీ.
?: కొలుములపల్లె గ్రామంలో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లకు ఇరువైపులా పెరిగిన గడ్డిని తొలగించాలి.
- నాగరాజు, కొలుములపల్లె.
✔: పెరిగిన గడ్డిని తొలగించి శుభ్రం చేయిస్తాం.
- మల్లికార్జున, ఈవోఆర్డీ.
అవుకు, న్యూస్‌టుడే: ?: అవుకులో పారిశుద్ధ్య లోపంతో దోమల ఉద్ధృతి పెరిగింది. **- రవీంద్ర, అవుకు.**
✔: కాలనీల్లో ఫాగింగ్ చేపడతాం.
- హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, అవుకు.
బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మీరాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో మురుగు రహదారిపై పారుతుంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.
- రాజు, మీరాపురం.
✔: గ్రామంలోని సమస్యను గుర్తించి చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య పనులు చేస్తాం.
- శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి, మీరాపురం.
శిరివెళ్ల, న్యూస్‌టుడే:?: మండలంలో శిరివెళ్ల నాయీబ్రాహ్మణ కాలనీలో మురుగునీరు తొలగించాలి. **- లక్ష్మయ్య.**
✔: పారిశుద్ధ్య సిబ్బందితో మురుగును తొలగిస్తాం.
- సాలమ్మ, సర్పంచి, శిరివెళ్ల.
నల్లగట్ల(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ?: ఆళ్లగడ్డ మండలంలోని నల్లగట్ల గ్రామంలో జాతీయ రహదారిపై వీధి దీపాలు వెలగడం లేదు. **- మద్దిలేటి, నల్లగట్ల.**
✔: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- నూర్జహాన్, ఎంపీడీవో.

అహోబిలంలో ఎమ్మెల్యే పూజలు

దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెను ఆలయ సీవో సుందరరాజన్, ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఎగువ, దిగువ ఆలయాల్లోని ఉగ్రనృసింహస్వామి, చెంచులక్ష్మి, లక్ష్మీనృసింహస్వామి, అమృతవల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెను అతిథి మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. ఆమె వెంట తెదేపా నాయకులు అంజి, గూడూరు సంజీవ రాయుడు, మండల కన్వీనర్ హరి, వంశీ ఉన్నారు.

విత్తన వెతలు.. అన్నదాత దిగులు

ఆళ్లగడ్డ, రుద్రవరం, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో వ్యవసాయ సబ్ డివిజన్‌తో పాటు, అవుకు మండలంలో రబీలో 3 వేల హెక్టార్లలో వేరుసెనగ సాగు చేస్తుంటారు. ఎంతో కీలకమైన ఈ పంట సాగుకు కావాల్సిన విత్తనం ధరలు భారీగా పెరిగిపోయాయి. క్వింటా విత్తనాలు రూ. 13 నుంచి 14 వేల వరకు పలుకుతున్నాయి. సాధారణంగా వేరుసెనగ బస్తా(42 కేజీలు) రూ.2500 పలుకుతుండగా దాని నుంచి వచ్చే బుడ్డ పప్పు(విత్తన పప్పు) 23 కేజీల వరకు వస్తుంది. ఈ లెక్క క్వింటా బుడ్డపప్పు రూ.10 నుంచి 11 వేల వరకు ఉండగా విత్తన పప్పు మాత్రం అధిక ధర పలకడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

వేరుసెనగ విత్తన పప్పు

రాయితీపై పంపిణీ చేస్తున్నా..

★ ప్రభుత్వం వేరుసెనగ విత్తనాన్ని రాయితీపై పంపిణీ చేస్తున్నా రైతులు మాత్రం ఈ విత్తనాన్ని కొనుగోలు చేసేందుకు సుముఖంగా లేరు. పైగా వ్యవసాయ శాఖ కూడా విత్తనపప్పు కోసం ఆర్గనైజర్లపైనే ఆధారపడుతుంది. వారు ఇచ్చే విత్తనాన్ని సరైన తనిఖీలు, జర్మినేషన్(అంకురోత్పత్తి) సరిగా గణన చేయకుండానే రైతులకు అంటగట్టే ప్రమాదం ఉందని రైతులకు అనుమానాలు వ్యక్తం చేస్తుంటారు.

★ ఎకరాకు రూ.70 నుంచి 75 వేల పెట్టుబడితో సాగయ్యే ఈ పంట విత్తన ఎంపికలో ఏమైనా లోపాలున్నా రైతు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. విత్తనానికి అదనంగా రూ.15 వేలకు పైగా ఖర్చు అవుతుంది. అందుకే కీలకమైన విత్తనాన్ని రైతులే నేరుగా మిల్లులకు వెళ్లి నేరుగా వేరుసెనగ పప్పును కొనుగోలు చేస్తున్నారు. పైగా ఈ ప్రాంతంలో ట్యాగ్-24 రకం వేరుసెనగ విత్తనం విత్తుకు ఉపయోగిస్తుంటారు. ఈ రకం వ్యవసాయ శాఖ రాయితీపై ఇవ్వకపోవడంతో గత్యంతరం లేక రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్దనే విత్తన పప్పును కొనుగోలు చేస్తున్నారు.

అందుబాటులో లేకపోవడంతో..

వేరుసెనగ సాగులో పెట్టుబడి అధికంగా ఉంటుంది. ఎకరాకు 120 కేజీల విత్తనపప్పు వేయాల్సి ఉంటుంది. ఇందుకు కనీసం రూ.15 నుంచి 16వేల పెట్టుబడి పెట్టాలి. రాయితీ వేరుసెనగ విత్తనం రూ.5000-5500 మధ్య ఉంటుంది. రాయితీ విత్తనం అందుబాటులో లేకపోవడంతో బయటి వ్యాపారుల వద్ద దాదాపు రెట్టింపు ధర పెట్టి రైతు విత్తనం కొనుగోలు చేసి ఆర్థిక భారం మోస్తున్నాడు. ప్రభుత్వం రాయితీపై ట్యాగ్-24 రకం విత్తనం అందించాలని రైతులు కోరుతున్నారు.

అధిక లోడు.. ప్రమాదం చూడు

అదొక చిన్న వాహనం. అయితేనేం ప్లాస్టిక్ నీటిని నిల్వ చేసుకొనే డ్రమ్ములతో అధిక లోడుతో ఆదివారం కొలిమిగుండ్లలో వెళ్లింది. చిన్న గాలి వీచినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. నంద్యాల పట్టణం నుంచి అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి వెళ్తున్న వాహనాన్ని ప్రజలు చూసి ఆందోళనకు గురయ్యారు. ఏమాత్రం అదుపుతప్పితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇలాంటి ఎక్కువ లోడుతో వెళ్తున్న వాహనాలను నిలువరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **– న్యూస్‌టుడే, కొలిమిగుండ్ల**

ప్రయాణానికి ముళ్ల గండం

జాతీయ రహదారి-44లో డోన్ పట్టణ సమీపంలో టిడ్కో ఇళ్ల సముదాయంతో పాటు, పలు ప్రాంతాల్లో, మలుపుల వద్ద ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి రహదారి మీదకు వస్తున్నాయి. మలుపుల వద్ద ఈ చెట్లు పెరగటంతో ఎదురుగా వెళ్లే వాహనాలు కనిపించటంలేదని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు. దీంతో 100 కి.మీ.ల వేగంతో వెళ్లే వాహనాలు ఏమాత్రం పట్టుతప్పినా పెద్ద ప్రమాదాలు తప్పవు. అధికారులు వీటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, డోన్**

కలుపుతో రైతులకు కలత

ఉయ్యాలవాడ మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో కలుపు మొక్కలు పెరిగాయి. రబీలో వర్షాధారం కింద 24 వేల ఎకరాల్లో విస్తీర్ణంలో శనగ సాగు చేయాలని మండల రైతులు ఆశించారు. పొలాల్లో తేమ శాతం అధికంగా ఉండటంతో విత్తనాలు విత్తుకోవటానికి వీలుపడలేదు. ఒక్కో కూలీకి రూ.300 చెల్లించి కలుపు తీయిస్తున్నారు. కలుపు తొలగింపు, సేద్యం చేసేందుకు రైతుకు అదనంగా ఎకరాకు రూ.6 వేలు ఖర్చు అవుతోంది. దీంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

– న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ

వంతెన రక్షణ గోడలు నిర్మించరూ..

బనగానపల్లి సమీపంలోని తమ్మడపల్లె రోడ్డులో ఎస్సార్బీసీ పదో బ్లాకు కాల్వ ప్రమాదకరంగా మారింది. ప్రధాన కాల్వ నుంచి ఇల్లూరుకొత్తపేట మీదుగా కోవెలకుంట్ల వెళ్లే ఉప కాల్వ వంతెన రక్షణ గోడలు కూలిపోయాయి. బనగానపల్లి నుంచి ఆకుమళ్ల వరకు 20 కి.మీ. మేర అధిక సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. కాలువ వద్ద రక్షణ గోడ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, బనగానపల్లి**

స్పందించారు.. పరిష్కరించారు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం గ్రామంలో ఇందిరమ్మ కాలనీలో నీటి సమస్య నెలకొనడంతో 'ఈనాడు'లో ఆదివారం 'నీటి సమస్య.. గ్రామస్థుల అవస్థ' కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎంపీడీవో నూర్జహాన్ కాలనీలో నీటి పైపులను మరమ్మతులు చేసి కుళాయిలకు నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల మండలం బిజనవేముల గ్రామంలో రాత్రి పగలు తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయంటూ ఈ నెల 7వ తేదీన ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు అధికారులు ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాట్లు చేశారు.

పేదింటి బిడ్డలు.. క్రీడా తేజాలు

ప్యాపిలి, న్యూస్‌టుడే: వ్యవసాయ కుటుంబంలో పుట్టిన విద్యార్థులు అటు చదువులోనూ ఇటు క్రీడల్లోనూ రాణిస్తూ ప్రతిభ చాటుకుంటున్నారు. త్రోబాల్ క్రీడపై ఆసక్తితో పాఠశాల స్థాయి నుంచే వ్యాయామ ఉపాధ్యాయుల వద్ద శిక్షణ పొందుతూ నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో పతకాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సాధించిన క్రీడా విజయాలపై కథనం.

సైన్యంలో చేరి సేవలందిస్తా – బి.మహేష్

ప్యాపిలి పట్టణానికి చెందిన కిరణ్‌కుమార్, వరలక్ష్మి దంపతుల కుమారుడు మహేష్ స్థానిక కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మహేష్ తొమ్మిదో తరగతి నుంచే త్రోబాల్ ఆటపై ఆసక్తితో పీడీ మధుసూదన్ వద్ద తర్ఫీదు పొందాడు. 2024 అక్టోబరులో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. కళాశాల ప్రధానాచార్యుడు సుబ్రహ్మణ్యం సహకారంతో అక్టోబరులో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో రజత పతకం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. భవిష్యత్తులో మరింత రాణించి సైన్యంలో చేరి దేశ సేవ నందిస్తానని చెబుతున్నాడు మహేష్.

జాతీయ స్థాయి పతకమే లక్ష్యం – కౌశిక్

ప్యాపిలి పట్టణానికి చెందిన రామాంజనేయులు, లక్ష్మి దంపతుల కుమారుడు కౌశిక్ స్థానిక కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. త్రోబాల్ క్రీడపై ఆసక్తితో పోటీలు ఎక్కడ జరిగినా పాల్గొని తన ప్రతిభ చాటుతున్నాడు. 2024 ఆగస్టులో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం సహకారంతో గత అక్టోబరులో కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాడు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో ఆడి రాణించాలన్నదే తన లక్ష్యం అంటున్నాడు కౌశిక్.

కార్తికం.. దేదీప్యమానం

ఆళ్లగడ్డ గ్రామీణం: పుట్టాలమ్మ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చాగలమర్రి రామలింగేశ్వరాలయంలో..

ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.కృష్ణాపురం గ్రామంలోని రామతీర్థం పుట్టాలమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ఆవరణలో బావుల వద్ద చన్నీటి స్నానాలు ఆచరించి ఉపవాస దీక్షలతో కార్తిక దీపాలు వెలిగించారు. కోవెలకుంట్లలోని సత్యసాయి మందిరంలో సత్యసాయి జయంతి ఆరాధనోత్సవాలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చాగలమర్రి పట్టణంలోని రామలింగేశ్వరాలయంలో ఆదివారం అన్నాభిషేకాలంకారం ఏర్పాటు చేశారు. బనగానపల్లి సమీపంలోని సాయిబాబా ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనభోజనం కార్యక్రమం నిర్వహించారు. డోన్ పాతబుగ్గ శివాలయంతో పాటు, సాంబశివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, దొర్నిపాడు, కోవెలకుంట్ల, కోవెలకుంట్ల గ్రామీణం, చాగలమర్రి, డోన్, కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లి గ్రామీణం, బనగానపల్లి.

డోన్: పాతబుగ్గ శివాలయంలో స్వామికి పూజలు

బనగానపల్లి: పూజలో పాల్గొన్న మహిళలు

బనగానపల్లి గ్రామీణం: యాగంటి పుణ్య క్షేత్రంలో..

ఆళ్లగడ్డ: వనభోజనాల్లో పాల్గొన్న బలిజ సంఘం నాయకులు

ఆలయాభివృద్ధికి విరాళం

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయాభివృద్ధికి హైదరాబాదుకు చెందిన భరత్‌కుమార్, సంగీత దంపతులు రూ.50 వేల విరాళాన్ని ఆలయ అర్చకులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను అర్చకులు సత్కరించి ప్రసాదాలు అందించారు.

అర్చకులకు విరాళం అందజేస్తున్న దాతలు

ముళ్లపొదలు తొలగిస్తాం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ముద్దవరం- వెల్దుర్తి, ముద్దవరం- సీతారాంపురం గ్రామాల మధ్య రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు పెరిగి వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రూ.2 లక్షలు ఖర్చుతో ముళ్లపొదలను తొలగిస్తున్నట్లు సర్పంచి తిమ్మయ్య తెలిపారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు

కరపత్రాలు విడుదల చేస్తున్న సంఘాల నాయకులు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పేరుతో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చేయడాన్ని ఆపాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మాణిక్యంశెట్టి, జిల్లా అధ్యక్షుడు రామమూర్తి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. జనవిజ్ఞాన వేదిక డోన్ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో డివిజన్ అధ్యక్షుడు సర్వజ్ఞమూర్తి అధ్యక్షతన కళాశాలల ప్రైవేటీకరణ వద్దని తెలిపే కరపత్రాలను జేవీవీ, యూటీఎఫ్ నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వి.సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, ఎన్ఎస్ బాబు, చంద్రమోహన్, బాషా, గోపాల్ పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

డోన్, న్యూస్‌టుడే: సీఐటీయూ 12వ మహాసభలను నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970లో ఏర్పడిన సీఐటీయూ ఎన్నో ఉద్యమాలకు వేదికైందన్నారు. మహాసభలను విజయవంతం చేసి అందులో భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

పేదలకు ఉచిత వైద్య శిబిరం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ ఆవోపా(ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థో, డెంటల్ వైద్యులు పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా

రోగి వివరాలు తెలుసుకుంటున్న వైద్యుడు

ఆవోపా అధ్యక్షుడు గంగిశెట్టి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఎంతో మంది ఎముకలు, దంత సమస్యలతో బాధపడుతున్నారని, వీరి కోసం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. 150 మందికి రూ.లక్ష విలువైన పరీక్షలు, మందులు ఉచితంగా అందించామన్నారు. ప్రజల కోసం 'ఆవోపా' అనునిత్యం సేవలు కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు డా.కె ప్రభాకర్‌రావు, గోవిందరాజు, సురేంద్ర, పోలయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీస్

మా క్లయింట్ అయిన REPCO HOME FINANCE LTD, ప్రొద్దుటూరు లోని బ్రాంచ్ వారి వలన పరియగు ఇన్‌స్ట్రక్షన్స్ పొంది యావత్ మందికీ తెలియజేయడం ఏమనగా, మా క్లయింట్ దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా ఆస్తిపైన మోమిన్ పెద్ద బీకాకి గారి కుమారుడు హుస్సేన్ పీరా గారికి కొనుగోలు లోను మంజూరు చేయుచున్నారు. దిగువ తెలిపిన [illegible]

అడ్వకేట్ : V.Sunil Kumar Reddy
Advocate, Proddatur.
Cell : 9885430399

ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

◆ కొరవడిన అధికారుల పర్యవేక్షణ

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ స్థలాలను గుర్తించడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఖాళీ స్థలాలను వాటి యజమానులు పట్టించుకోకపోవడంతో ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. ఫలితంగా విషపురుగులు, పందులు సంచరిస్తున్నాయి. ముఖ్యంగా నివాసాలుంటున్న ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడం, ఇళ్ల నుంచి వచ్చిన వ్యర్థ జలాలు కలుస్తుండటంతో దోమలకు ఆవాసంగా మారాయి. దీంతో రోగాల బారిన పడుతున్నామని పుర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలో ఎక్కడెక్కడంటే..

శ్రీనివాసనగర్‌లో ఇళ్ల చెంతనే పెరిగిన పిచ్చిమొక్కలు

★ శ్రీనివాసనగర్, ఆటోనగర్, త్రివర్ణకాలనీ, శ్రీరామానగర్, నల్లగుట్ట, పాతపేట, వెంకటేశ్వరనగర్, చిగురుమానుపేట, రైతుమిత్ర కాలనీ, తారకరామానగర్ శివారు, జంగాల కాలనీ శివారు, టీచర్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, సుజాతమ్మనగర్, కాకతీయ ట్యాంకు సమీపంలో, న్యూ స్వీపర్స్ కాలనీ తదితర కాలనీల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటిని గుర్తించి పన్నులు వేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పట్టణంలో 11 డెంగీ కేసులు నమోదయ్యాయి.

★ పట్టణంలో 1,500లకు పైగానే ఖాళీ స్థలాలున్నట్లు అంచనా. గతంలో మున్సిపల్ యంత్రాంగం 248 వరకు ఖాళీస్థలాలు గుర్తించి తూతూమంత్రంగా ముళ్లకంపలను తొలగించి మమ అనిపించారు. కొన్ని ప్రాంతాల్లో ఖాళీస్థలాలు ఎవరికి చెందినవో తెలుసుకోలేక పోయారు. పలు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు కానీ పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదు.

విఫలమవుతున్న యంత్రాంగం

★ ప్రస్తుత మున్సిపల్ కమిషనర్, అధికారులు ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగాయని, ఇళ్ల చెంతనే వర్షం నీరు నిల్వ ఉండి రోగాలకు నిలయంగా మారాయని జనాలు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. దీనికి తోడు దోమల ఉద్ధృతితో పాటు పందుల సంచారం అధికమైంది.

★వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండి కుంటలా మారింది. రాత్రి సమయంలో కంటి మీద కునుకు లేకుండా పోయిందని కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంటి పన్నులు చెల్లిస్తున్నా కాలనీల్లో పురోగతి లేకుండా పోయిందని వాపోతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదు. ఇటీవల కౌన్సిల్ సమావేశంలో వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లు దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఖాళీ స్థలాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయడం గానీ, ముళ్లకంపలను తొలగించడంలోనూ అధికారులు విఫలమవుతున్నారు.

సంక్షిప్త సమాచారం

అవుకు, న్యూస్‌టుడే: అవుకు మండలంలోని ఎర్రమల కొండల్లో వెలసిన లక్ష్మీకంబగిరిస్వామి ఆలయానికి అనంతపురం జిల్లా యాడికి గ్రామానికి చెందిన బాలరమేష్‌బాబు రూ.25 వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను విరాళంగా ఆదివారం అందించారు.

డోన్, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీరామనగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టామని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కిశ్రీకాంత్ అన్నారు. ఆదివారం శ్రీరామనగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆ ప్రాంత ప్రజలతో సంతకాల సేకరణ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏళ్ల గడుస్తున్నా కనీస సౌకర్యాలు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని కలువటాల గ్రామానికి సమీపంలో జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం చెప్పారు. వీరి వద్ద నుంచి రూ.20,620 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డోన్, న్యూస్‌టుడే: కొండపేటలోని ఎల్లమ్మ ఆలయం వద్ద కార్తిక వనభోజన కార్యక్రమంలో ఎల్లమ్మ జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు సీఐ ఇంతియాజ్‌బాషా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, మద్దులేటిస్వామి, ఈశ్వరయ్య, అమృతారెడ్డి పాల్గొన్నారు.

డోన్, న్యూస్‌టుడే: వాల్మీకుల కార్తిక వనభోజనాలు కలిసికట్టుగా విజయవంతం చేసేందుకు అందరూ కృషిచేయాలని వైద్యులు డా.మాధవకృష్ణ అన్నారు. ఆదివారం డోన్ వాల్మీకి సంఘం నాయకులు మాధవకృష్ణతో సమావేశమై వనభోజన కార్యక్రమ ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో చిన్నమద్ది, తిరుపాలు, నాయుడు పాల్గొన్నారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్సీ వచ్చే వరకు 30 శాతం మధ్యంతర భృతిని ఇవ్వాలని పింఛనర్ల సంఘం అధ్యక్షుడు కె.ఎన్.భానుసింగ్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. పింఛనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి బి.గాలయ్య అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కె.సుబ్బరాయుడు, ఎన్.నరసింహుడు, గోపాల్, జె.రామదాసురెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లిలో ఈ నెల 12న జరిగే ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణను వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమానికి పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొనాలన్నారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: ఉమెన్స్ రైట్స్ రాష్ట్ర సభ్యుడిగా దస్తగిరిని నియమించారు. ఈ మేరకు ఉమెన్స్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు రామచంద్రనాయుడు ఆదివారం ప్రకటించినట్లు దస్తగిరి తెలిపారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: గొర్విమానుపల్లె గ్రామ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గ్రామస్థులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల రైతు సంఘం నాయకుడు పుల్లయ్య, నరసింహుడు, పాల్గొన్నారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి డిమాండు చేశారు. స్థానిక వైకాపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీన వైకాపా ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

బేతంచెర్ల,న్యూస్‌టుడే: పట్టణంలోని బీఆర్‌పేట కాలనీలో ఆదివారం పరశురాం ఇంట్లో విద్యుదాఘాతంతో సామగ్రి, పరికరాలు కాలిపోయాయి. సుమారు రూ.లక్ష మేర నష్టం జరిగినట్లు బాధితులు పేర్కొన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనపై బస్సు డ్రైవర్ రామసుబ్బయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి ఆదివారం తెలిపారు. సౌదరదిన్నె గ్రామానికి చెందిన రాకేష్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కోవెలకుంట్ల డిపోనకు చెందిన బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు.

సంజామల, న్యూస్‌టుడే: సంజామల ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సంఘం మాజీ సీఈవో ఇంజేటి నాగరాజు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మృతిపట్ల గ్రామస్థులు, పలువురు నాయకులు నివాళి అర్పించారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు కలిసిరావాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎల్ఎం కాంపౌండ్‌లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

నేడు రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మన అడవుల్లోని వీరులను స్మరించుకుంటూ ఈ రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవం నాడు మన అమూల్యమైన పచ్చని అభయారణ్యాలను పరిరక్షించడంలో సర్వస్వం త్యాగం చేసిన వీరులకు నివాళులర్పిస్తున్నాం.

డోన్ మండల ప్రజలు

(c) eenadu

లలిత కళారాధనలో వెలిగిన చిరుదివ్వెలు

ఘనంగా ముగిసిన బాలోత్సవం

గుంటూరు సాంస్కృతికం, పెదకాకాని, న్యూస్‌టుడే: మేధోమథనం.. కళారాధనం.. రెండూ కలగలిపి నిండైన బాల్యాన్ని విరబూయిస్తున్నారు నేటి బాలలు. ఈ విషయాన్ని రుజువు చేసింది వీవీఐటీయూ బాలోత్సం. ప్రపంచ పిల్లల పండగ పేరుతో మూడు రోజులు ముచ్చటగా నిర్వహించిన బాలోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. గుంటూరు జిల్లా నంబూరులోని వీవీఐటీయూ ప్రాంగణం ఇందుకు వేదికైంది. సామాజికంగా కాలుష్యం, ప్లాస్టిక్ లాంటి వాటిని అరికట్టి, మద్యపానం, ఇతర మత్తుపదార్థాల వంటి వాటిని దూరంగా తరిమేయాలన్న ఆకాంక్ష ఏకపాత్రలు, లఘు నాటికలు, కథా రచనల్లో స్పష్టంగా కనబర్చారు.

బాలల జానపద నృత్యాభినయం

కాగితపు ముక్కలు.. ఊహలకు రెక్కలు.. వీవీఐటీయూ పోటీ అంశాల్లో పేపర్ కొలేజ్ ఒకటి. పనికిరానివనుకున్నవి, పక్కన పడేసిన కాగితపు, అట్ట ముక్కలతో బాలలు తమ ఊహకు తగ్గ పలు రకాల బొమ్మలను తయారు చేశారు.

మట్టితో బొమ్మలు.. మట్టి ముద్దలతో ఎలాంటి అచ్చులు వాడకుండా చిట్టి చేతులతో దేవతా మూర్తులు, ఇతర అందమైన బొమ్మలను రూపొందించి తమ కళాకౌశలాన్ని రుజువు చేసుకున్నారు.

మట్టిబొమ్మల తయారీలో బాలలు

నార్నెపాడు.. గులాబీలే తోడు

ముప్పాళ్ల మండలం నార్నెపాడు గ్రామ రైతులు భిన్నంగా ఆలోచించారు. సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి గులాబీ సాగుకు జత కట్టారు. గ్రామంలో 80 ఎకరాల్లో తోటలు సాగు చేస్తున్నారు. ఒకసారి మొక్కలు నాటితే మూడు, నాలుగేళ్ల దిగుబడి వస్తుంది. మూడేళ్లలో ఎకరాకు రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. పెట్టుబడి పోగా ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు లాభం వస్తోందని రైతులు చెబుతున్నారు. గులాబీలను గుంటూరు, సత్తెనపల్లి, నరసరావుపేట, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, మార్టూరు మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. వంద పూలు రూ.80 నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారు. వందల మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. – న్యూస్‌టుడే, ముప్పాళ్ల

ఆప్తులు దూరమై.. ఆత్మీయత కరవై..

మలివయసులో తల్లిదండ్రుల వేదన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

జీవిత చరమాంకంలో ఉన్న తల్లిదండ్రుల్ని చిన్నపిల్లల్లా చూసుకోవాల్సిన బిడ్డలు కాయకష్టంతో వారు కూడగట్టిన ఆస్తుల్ని లాక్కుని రోడ్డుపైకి నెడుతున్నారు. దూరం పెట్టకు కన్నా.. ఆ బాధ భరించలేం నాన్నా.. అంటూ వారు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఏమీ చేయలేని పరిస్థితుల్లో.. పిల్లలు తమను నిర్లక్ష్యం చేస్తున్నారని వయోవృద్ధులు పలువురు అధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్నారు.

- భర్తను కోల్పోయిన తనను కుమారుడు, కుమార్తె పట్టించుకోవట్లేదు. సెంటున్నర స్థలంలోని రేకుల ఇంట్లో తలదాచుకుంటుండగా కుమారుడు బయటకు వెళ్లగొట్టి తాళం వేసుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవట్లేదు.. అని పిడుగురాళ్ల మండలానికి చెందిన వృద్ధురాలు గురజాల ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.
- తనకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడికి ఆస్తులు రాసే సమయంలో నెలకు రూ.20 వేలు పోషణ ఖర్చుల కింద ఇచ్చేలా రాయించుకున్నా.. కొన్నేళ్లు సక్రమంగానే ఇచ్చాడు. ఇప్పుడు డబ్బులు ఇవ్వమంటే దౌర్జన్యం చేసి దాడికి దిగుతున్నాడు.. అని నరసరావుపేటకు చెందిన వృద్ధుడు ఆర్డీవోకు విన్నవించారు.

వృద్ధుల రక్షణకు.. నిర్లక్ష్యం చేయడం.. దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడటం.. ఆర్థిక దోపిడీ తదితరాల నుంచి వృద్ధులను రక్షించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పిల్లలు పట్టించుకోకుంటే తల్లిదండ్రులు తమ ఆస్తిని తిరిగి పొందే అవకాశం ఉన్నట్లు సీనియర్ సిటిజన్ చట్టంతో కల్పిస్తోంది. చట్టాన్ని పకడ్బందీగా అమలుచేసేందుకు ఆర్డీవోలు చర్యలు తీసుకుంటున్నారు.

వయోవృద్ధుల అర్జీలపై విచారిస్తున్న నరసరావుపేట ఆర్డీవో మధులత

ఫిర్యాదులకు సత్వర స్పందన

వృద్ధుల హక్కులు, భద్రత, పోషణకు సంబంధించి సీనియర్ సిటిజన్ చట్టం- 2007 అమల్లో ఉంది. దీనిద్వారా పిల్లలు, వారసుల నుంచి పోషణ పొందే హక్కు వృద్ధులకు ఉంటుంది. ❖ 60 ఏళ్లు దాటిన వృద్ధులకు పిల్లల నుంచి ఇబ్బందులు ఎదురైతే తెల్ల కాగితంపై తమ సమస్యను రాసి ఆర్డీవోకు అందజేయాలి. ఆర్డీవో ఛైర్మన్‌గా ఉన్న ట్రైబ్యునల్ వివరాలను పరిశీలిస్తుంది. ❖ క్షేత్రస్థాయిలో విచారణ, కౌన్సెలింగ్ అనంతరం 90 రోజుల్లోపు సమస్య పరిష్కరిస్తారు. ❖ అవసరమైతే గిఫ్ట్ డీడ్‌లు రద్దు చేస్తారు. జీవనభృతి అందేలా చూస్తారు.

బాధితులు సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబరు : 14567



సీనియర్ సిటిజన్ చట్టం కింద స్వీకరించిన వినతులకు నిర్దేశిత గడువులోపు పరిష్కారం చూపిస్తున్నామని నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లి ఆర్డీవోలు మధులత, మురళీకృష్ణ, రమణకాంత్‌రెడ్డి తెలిపారు. వృద్ధుల సంరక్షణ, పోషణ బిడ్డల బాధ్యత అన్నారు. ఆస్తిపాస్తులు లాక్కుని వృద్ధులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

నారీ.. సవారీ!

పొదుపు మహిళలకు ర్యాపిడో వాహనాలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

స్వయం సహాయక సంఘాల సభ్యుల్లోని వాహన చోదకులకు జీవనోపాధి కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నారీ.. సారథిగా సవారీ చేస్తూ ఉపాధి పొందేందుకు, ఆర్థిక ప్రగతి సాధించేందుకు తోడ్పాటు అందించనుంది. పింక్ మొబిలిటీ పేరుతో పొదుపు మహిళలకు వాహనాలు ఇవ్వనున్నారు. ఇప్పటికే ర్యాపిడో సంస్థతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఒప్పందం చేసుకుంది. జిల్లాలో 364 మందికి ర్యాపిడో వాహనాలు అందజేసి ఉపాధికి భరోసా కల్పించనుంది.

పట్టణ స్వయం సహాయ సంఘాలు: 10,423

ఆయా సంఘాల్లో సభ్యుల సంఖ్య: 1,04,230

ర్యాపిడో వాహనాల పంపిణీ లక్ష్యం: 364

- ❖ ఆసక్తి, లైసెన్సు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకుంటే ర్యాపిడో వాహనం అందజేస్తారు.
- ❖ తక్కువ ధరకే వాహనాలు కొనుగోలు చేసేలా వివిధ సంస్థలతో ర్యాపిడో ఒప్పందం చేసుకుంది. వాహన చోదకులకు రుణం ఇస్తారు. ఆ సొమ్ముతో నచ్చిన వాహనాన్ని కొనుక్కోవచ్చు.
- ❖ నెలకు 900 వరకు బుకింగ్స్ వచ్చేలా.. రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం లభించేలా చూస్తారు.
- ❖ ర్యాపిడో పట్టణాల్లో పికప్, డ్రాపింగ్ పాయింట్లను ప్రారంభించి.. నిర్దేశిత ప్రదేశాల్లో వాహనాలు నిలిపేందుకు అవకాశం కల్పిస్తారు.
- ❖ ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరించి త్వరితగతిన ఎంపిక ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మెప్మా అధికారులు తెలిపారు.

మొక్కే పెళ్లి కానుక

ఆయన పర్యావరణ ప్రేమికుడు. వయసు 55 ఏళ్లు. గత 30 సంవత్సరాలుగా నూతన వధూవరులకు మొక్కలు కానుకగా అందజేయడం ఆనవాయితీగా మార్చుకున్నారు. మొక్కలు మాదిరి వారి కుటుంబం వృద్ధి చెందాలనేది ఆయన ఉద్దేశం. స్నేహితులూ మొక్కలు పంచాలని, నాటాలని ప్రోత్సహిస్తుంటారు. ఆయనే అద్దంకికి చెందిన [illegible]. పట్టణంలో ఎక్కడ, ఎవరు మొక్కలు నాటాలన్నా ఆయన సలహాలు పాటిస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ విషయమై విద్యార్థులకు వివరిస్తుంటారు. డబ్బులు తీసి ఇచ్చి ప్రోత్సహిస్తుంటారు. ఇప్పటి వరకు 22 వేల మొక్కలు అందజేయడంతో పాటు నాటారు. – న్యూస్‌టుడే, అద్దంకి

త్రికోటేశ్వరునికి ప్రత్యేక పూజలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో భక్తజన సందోహం నెలకొంది. ఆదివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేకువజామునే తొలి అభిషేకం అనంతరం అలంకరణ చేసి దర్శనాలకు అనుమతించారు. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.4,05,700 ఆదాయం సమకూరినట్లు ఈవో చంద్రశేఖర రావు తెలిపారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

అలల ఒడి.. ఆధ్యాత్మిక సవ్వడి

రెండు ఆదివారాల అనంతరం బాపట్ల జిల్లాలోని బీచ్‌లో సందడి నెలకొంది. సూర్యలంక తీరానికి పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. నిర్దేశిత ప్రాంతాల్లో సముద్ర స్నానాలు చేశారు. కార్తిక మాసం సందర్భంగా మహిళలు సైకత శివలింగాలకు పూజలు చేశారు. – న్యూస్‌టుడే, బాపట్ల

'ముప్పాళ్ల' వేర్వేరయా!

ఉత్తర ప్రత్యుత్తరాల్లో తికమక

జిల్లాలో ముప్పాళ్ల పేరుతో రెండు గ్రామాలున్నాయి. ఉత్తర ప్రత్యుత్తరాల్లో తికమక పెడుతున్నాయి. సామాన్యులే కాకుండా ప్రభుత్వ శాఖలు కూడా పొరపాటు పడుతున్నాయి. మండల కేంద్రం ముప్పాళ్ల పీహెచ్‌సీకి అందాల్సిన నిధులు ఈపూరు మండలంలోని ఓ గ్రామమైన ముప్పాళ్లకు వెళ్లాయి. అక్కడి నుంచి నిధులు వెనక్కి సర్దుబాటు చేయడానికి ఆలస్యమైంది. బ్యాంకుల చెక్కులు, డీడీల విషయంలోనూ ఇలాగే జరుగుతోంది. తికమక లేకుండా ఉండాలంటే ఉత్తర ప్రత్యుత్తరాల సమయంలో తపాలా పిన్‌కోడ్ నమోదు ఒక్కటే సరైన మార్గం. మండల కేంద్రం ముప్పాళ్ల పిన్‌కోడ్ 522408 కాగా.. ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామ పిన్‌కోడ్ నంబరు 522661గా ఉంది. – న్యూస్‌టుడే, ముప్పాళ్ల

ఆనందవల్లి.. భక్తితో ప్రణమిల్లి..

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే

ప్రముఖ శైవక్షేత్రాల్లో నరసరావుపేట మండలం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయం ఒకటి. ఇక్కడికి వచ్చే భక్తులు తొలిగా ఆనందవల్లి (గొల్లభామ) అమ్మవారిని దర్శించుకుంటారు. అంత భాగ్యం ఆమెకు ఎలా దక్కింది. శివయ్య కంటే ముందుగా ఆమెను భక్తులు ఎందుకు కొలుస్తారు అన్నది స్థానికులకు తెలిసిందే అయినా.. దూర ప్రాంత భక్తులు ఆనందవల్లి అంటే పార్వతీదేవి అని పొరబడుతుంటారు.

ఆనందవల్లి దేవాలయం, అమ్మవారు

కాకులు వాలని కొండ

బ్రహ్మ, రుద్ర, విష్ణు మూడు శిఖరాలు ఉండటంతో త్రికూట పర్వతమని అంటారు. ఇక్కడ వెలసిన త్రినేత్రుడిని త్రికోటేశ్వర స్వామి అని పిలుస్తారు. కొండకు దక్షిణాన కొండకావూరులో యాదవ వంశంలో జన్మించిన ఆనందవల్లి యుక్తవయసులో ఆవులు కాయడానికి వెళ్లేది. ఓ ఆవు వెళ్లి రుద్ర శిఖరంపై పరమేశ్వరుని ఆకలి తీర్చేది. ఆ ఆవు పాలు దూడకు సరిపోయేవి కావు. ఆనందవల్లికి అనుమానం వచ్చి ఒకరోజు ఆవు వెంట వెళ్లగా పరమశివునికి పాలిస్తుండటం చూసి ఆశ్చర్యపోయింది. మహిమ కలిగిన వ్యక్తిగా భావించి రోజూ ఆవుపాలు తెచ్చి ఇస్తానని చెప్పింది. అలా రోజూ మట్టి ముంతలో ఆవు పాలు తీసుకొచ్చి పరమశివునికి ఇచ్చేది. ఒకరోజు పాలను కాకి దొర్లించగా కోపంతో కొండపై వాయసం అరుపు వినిపిస్తే నాలుగు దిక్కుల్లో ఒక దిక్కుకు నష్టం కలుగుతుందని శపించింది. అప్పటి నుంచి కొండపై కాకులు వాలవని స్థానికులు చెబుతున్నారు.

భక్తురాలై.. శిలగా మారి..

కొన్ని రోజుల తర్వాత కొండపైకి పాలు తీసుకురాలేనని చెప్పిన ఆనందవల్లి స్వామినే కొండకావూరు వచ్చి పాలు స్వీకరించాలని కోరింది. సంతోషించిన పరమశివుడు నీ వెనుకే వస్తాను.. నీవు మాత్రం తిరిగి చూడకూడదు అని చెప్పారు. ఆనందవల్లి నడుచుకుంటూ రుద్రశిఖరం, బ్రహ్మశిఖరం దాటిన తర్వాత పెద్ద శబ్దం రావడంతో తిరిగి చూసింది. అక్కడే ఆమె శిలగా మారింది. బ్రహ్మశిఖరం మీద పరమశివుడు శిలగా మారారు. ఆనందవల్లి కొండకావూరు ఎప్పుడు వెళ్తామని స్వామిని అడగగా.. భక్తులందరూ భక్తితో కోటి ప్రభలతో ఎప్పుడు కొండకు వస్తారో అప్పుడు వెళ్తామని చెప్పారన్నది చరిత్ర. అప్పటినుంచి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు నడక మార్గంలో ముందుగా ఆనందవల్లికి పూజలు చేస్తున్నారు. ఆనందవల్లి వారసులు ఇప్పటికీ కొండకావూరులో నివసిస్తున్నారు.

సేవల్లో మెరిసి.. పురస్కారాలతో మురిసి..

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

ఆసుపత్రి నిర్వహణ, పారిశుద్ధ్యం, స్వచ్ఛత, జీవ వ్యర్థాల నిర్వహణ, సదుపాయాలు, సేవల్ని ప్రామాణికంగా తీసుకుని 2024-25 సంవత్సరానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కాయకల్ప రాష్ట్ర, జిల్లాస్థాయి అవార్డులకు ప్రభుత్వ ఆసుపత్రులను ఎంపిక చేసింది. రాష్ట్రవ్యాప్తంలోని 174 సామాజిక వైద్యశాలలతో పోటీపడి వినుకొండ సీహెచ్‌సీ కాయకల్ప స్కోర్ 92.6, ఎకోఫ్రెండ్లీ స్కోర్ 96 మార్కులతో ప్రశంస అవార్డుకు ఎంపికైంది. దీనికి నజరానాగా ప్రభుత్వం రూ.75 వేలు అందించనుంది.

రాష్ట్రస్థాయి ప్రశంస అవార్డుకు ఎంపికైన వినుకొండ సామాజిక వైద్యశాల.. అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది

- ❖ ఆదర్శ సేవలతో జిల్లాస్థాయిలో మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రథమ స్థానంలో నిలిచింది. పీహెచ్‌సీకి రూ.లక్ష నగదు అందించనున్నారు. ద్వితీయస్థానంలో నిలిచిన రొంపిచర్ల పీహెచ్‌సీకి రూ.50 వేలు, ప్రశంస అవార్డుకు ఎంపికైన కారంపూడి పీహెచ్‌సీకి రూ.25 వేలు ఇవ్వనున్నారు.
- ❖ జిల్లాలోని 26 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వినుకొండ ఎన్నెస్పీ కాలనీ యూపీహెచ్‌సీ ప్రథమస్థానంలో నిలిచింది. దీనికి రూ.లక్ష ఇవ్వనున్నారు. ద్వితీయ స్థానంలో నిలిచిన చిలకలూరిపేట సుగాలికాలనీ యూపీహెచ్‌సీకి రూ.50 వేలు అందించనున్నారు.
- ❖ జిల్లాలోని 361 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో నరసరావుపేట మండలంలోని ఇక్కుర్తి విజేతగా నిలిచింది. దీనికి రూ.50 వేల నజరానా ఇవ్వనున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన పిడుగురాళ్ల మండలం కామేపల్లి కేంద్రానికి రూ.35 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విజయపురి సౌత్ కేంద్రానికి రూ.20 వేలు అందించనున్నారు.
- ❖ ఉత్తమ సేవలతో ఆదర్శంగా నిలిచిన ఆసుపత్రులకు ప్రభుత్వం అందించే నిధులను వైద్య సేవల మెరుగుకు సద్వినియోగం చేసుకోవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి సూచించారు.

తెలంగాణలో జిల్లావాసి అరెస్టు కలకలం

మ్యూల్ ఖాతాతో సైబర్ నేరగాళ్లకు సహకారం?

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: సైబర్ నేరగాళ్లకు సహకారం అందిస్తున్న వ్యక్తులు 81 మందిని తెలంగాణ పోలీసులు అరెస్టు చేయడం సంచలనమైంది. అందులో మన జిల్లా యువకుడు ఉండటం కలకలం రేపింది. సత్తెనపల్లికి చెందిన కొల్లిపర వెంకట రామదుర్గ నరేష్(22)ను అరెస్టు చేశారు. ఇతను పదో తరగతి వరకు చదివాడు. మొదట్లో మందుల దుకాణంలో గుమస్తాగా చేశాడు. తర్వాత సొంతంగా టీస్టాల్ నడిపాడు. నష్టాలు వస్తున్నాయని దాన్ని మూసేసి మళ్లీ గుమస్తాగా పని చేస్తున్నాడు. ఇతని బ్యాంకు ఖాతా నుంచి రూ.కోట్లలో లావాదేవీలు జరగడంతో అనుమానించి తెలంగాణ పోలీసులు నిఘా పెట్టారు. బ్యాంకు ఖాతాను సైబర్ నేరగాళ్లకు అమ్మినట్లు (మ్యూల్ ఖాతా).. అందుకు ప్రతిగా ప్రతీ లావాదేవీకి కొంత మొత్తం ఇతనికి ఇస్తున్నట్లు గుర్తించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ పోలీసుల దర్యాప్తులో ఈ విషయాలు వెలుగు చూశాయి. సత్తెనపల్లిలో మరికొందరు ఇదే విధంగా చేస్తుండటంతో బ్యాంకు అధికారులు నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిసింది.

సెల్‌గాటం వద్దు.. ధ్యానం ముద్దు

పిల్లలు సెల్‌ఫోన్‌కు అలవాటు పడి ఏకాగ్రతను కోల్పోతున్నారు. బడి నుంచి ఇంటికొచ్చాక చరవాణిలో ఆటలాడుతూ సమయాన్ని వృథా చేయడమే కాకుండా చదువుల్ని పట్టించుకోవడం లేదు. చరవాణి వ్యసనం బారినపడిన పిల్లల్ని మార్చడానికి పిరమిడ్ సంస్థ వారు ఇలా ధ్యానం చేయించి చదువులపై దృష్టి మళ్లేలా చేస్తున్నారు. ఆదివారం నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాలలో నిర్వహించిన వన సమారాధనకు వచ్చిన వారికి సంస్థ సిబ్బంది అవగాహన కల్పించారు. సాధారణంగా ధ్యానం చేయమంటే వినరని.. అందుకే ఇలా తలపై పిరమిడ్ క్యాప్‌లు పెట్టి చేయించడం ద్వారా ఫలితం కనిపిస్తోందని వారు వివరించారు. – ఈనాడు డిజిటల్, నరసరావుపేట

చేతులు కలిపారు.. దారి నిర్మించుకున్నారు!

వర్షం పడితే నడవడానికి కూడా అవకాశం లేకుండా పాడైపోయిన రహదారి నిర్మాణానికి ఎదురుచూశారు. అధికారులు స్పందించలేదు. కనీసం మట్టి కూడా తోలించలేదు. దీంతో విసుగు చెందిన నూజండ్ల తూర్పు వీధి ప్రజలు చేతులు కలిపారు. చందాలు వేసుకొని రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.5 లక్షల వరకు ఖర్చు చేసి దారిని నిర్మించుకున్నారు. వర్షపు నీరు కాలువల్లోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఈ మార్గం నుంచే కమ్మవారిపాలెం, దాట్లవారిపాలెం, ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులు, తలార్లపల్లె, ములకలూరు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్తుంటారు. ఆయా గ్రామాల ప్రజలు స్థానికులకు అభినందనలు తెలుపుతున్నారు. – న్యూస్‌టుడే, నూజండ్ల

టెయిల్‌పాండ్‌కు వరద నీరు రాక

రెంటచింతల, న్యూస్‌టుడే: ఎగువనున్న నాగార్జునసాగర్ జలాశయం నుంచి సత్రశాల టెయిల్‌పాండ్‌కు వరద నీటి రాక కొనసాగుతోంది. ఆదివారం 34,185 క్యూసెక్కులు వచ్చి చేరింది. నాలుగు క్రస్టుగేట్లు ఎత్తి దిగువ పులిచింతల ప్రాజెక్టుకు 22,640 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తికి 31,101 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు జెన్‌కో ఎస్ఈ వెంకటరమణ తెలిపారు.

హాయ్ అంటే.. అరచేతిలోనే..

నరసరావుపేట వ్యవసాయం, రొంపిచర్ల, న్యూస్‌టుడే : పరిపాలనలో కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. అందులో భాగంగా ప్రజలు స్మార్ట్ ఫోన్ ద్వారా సులభంగా ప్రభుత్వ సేవలు పొందేలా మనమిత్ర పేరుతో వాట్సప్ నంబరు 95523 00009 ఏర్పాటు చేసింది. ఈ నంబరుకు హాయ్ అని సందేశం పంపితే 700లకు పైగా పౌర సేవలు, ధ్రువపత్రాలు సులభంగా పొందొచ్చు.

గ్రామ పంచాయతీలు: 526

జనాభా: 20.42 లక్షలు (2011 లెక్కల ప్రకారం)

యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నది : సుమారు 5 లక్షల మంది

మన మిత్రతో సులభంగా సేవలు

దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలపై పీజీఆర్ఎస్ పోర్టల్‌లో ప్రజలు ఫిర్యాదు చేయెచ్చు. కలెక్టర్ పరిశీలించి.. సంబంధిత అధికారుల్ని క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలని కోరతారు.

ఎలా పొందాలంటే.. మన మిత్ర వాట్సప్ నంబరు(9552300009)కు హాయ్ అని సందేశం పంపాలి. అవసరమైన ఐచ్ఛికంపై క్లిక్ చేయాలి. ఏ సేవలు కావాలో ఎంచుకోవాలి. ఆధార్ సంఖ్య నమోదు చేయగానే ఓటీటీ వస్తుంది. దాన్ని నమోదు చేయాలి. పూర్తి సమాచారం, చెల్లింపులు పూర్తి చేశాక వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ధ్రువీకరణ పత్రాలు పొందొచ్చు. నమోదులో గందరగోళం అనిపిస్తే వాయిస్ కమాండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

(c) eenadu

ఉత్తర్వులు ఇచ్చారు.. అమలు మరిచారు..!

యడ్లపాడు, న్యూస్‌టుడే

ఘన చరిత్ర కలిగిన ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది ప్రవేశాలు సున్నాకు చేరటంతో అధికారులు మూసివేతకు నిర్ణయించారు. పాఠశాల రికార్డులను అప్పగించాలని ఆదేశించారు. అక్కడి ఉపాధ్యాయులను ఇతర ఎయిడెడ్ పాఠశాలలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. 50 రోజులు గడిచినా ఉపాధ్యాయులు పాఠశాలను వీడలేదు. రికార్డులు అప్పగించలేదు. పిల్లలకు చదువు చెప్పకుండా 5 నెలలుగా ఖాళీగా నలుగురు ఉపాధ్యాయులు, ముగ్గురు సిబ్బంది ప్రభుత్వం నుంచి జీతాలు పొందుతున్నారు. ఈనెల 3న క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి పాఠశాల ఆకస్మిక తనిఖీలో అక్కడ పిల్లలకు చదువు చెప్పటం లేదని గుర్తించారు. 5న ఉపాధ్యాయుల రిలీవింగ్ ఉత్తర్వులు నోటీసుబోర్డులో అంటించారు. వాటిని బేఖాతర్ చేస్తూ ఉపాధ్యాయుల నిష్క్రమణకు సరిపోయే విధంగా తమ సంస్థ పరిధిలో ఇతర పాఠశాలలోని 21 మంది స్థానికేతర విద్యార్థులు ఇక్కడ చేరినట్లు పాఠశాల యూడైస్‌లో నమోదు చేసి పిల్లలు లేకుండా ఉన్నట్లు, వారికి బోధన చేస్తున్నట్లు చూపించే ప్రయత్నంచేస్తున్నారు.

లూథరన్ ఉన్నత పాఠశాల

విచారించి చర్యలు తీసుకుంటాం

యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు సున్నాకు చేరుకోవటంతో ఆ పాఠశాలను మూసివేయాలని సెప్టెంబరులో ఉత్తర్వులు జారీ చేశాం. అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులను ఇతర ఎయిడెడ్ పాఠశాలలకు బదిలీ చేశాం. ఆమేరకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. బదిలీ చేసిన పాఠశాలలకు ఉపాధ్యాయులు వెళ్లని పక్షంలో వారికి జీతాలు నిలిపివేస్తాం. పాఠశాల రికార్డులు స్వాధీనం చేసుకుంటాం.

-రేణుక, గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అతిథులు, కమ్మ సంఘం ప్రతినిధులు

విజ్ఞాన క్షేత్రం.. భవితకు ఛత్రం

కళాశాలలో పాఠాలు.. పంటచేలో వాస్తవాలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

గదిలో నేర్చుకోవడమే కాదు.. క్షేత్రస్థాయిలో వాస్తవాలు ఏమిటో తెలుసుకునే అవకాశం వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు కల్పిస్తున్నారు. ఉదయాన్నే అన్నదాతలతోపాటు పొలాల బాట పడుతున్నారు. సాయంత్రం వరకు పంట పొలాల్లో పనిచేస్తూ రైతులు చేస్తున్న పనులను పరిశీలిస్తూ తెలుసుకుంటున్నారు. తరగతి గదుల్లో అధ్యాపకులు, వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకున్న పాఠ్యాంశాల ద్వారా వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులు పాటించేలా సూచనలు చేస్తున్నారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నారు. సాగులో ఎదురయ్యే సమస్యలు, విత్తనం నుంచి దిగుబడుల వరకు క్షేత్రస్థాయిలో శిక్షణ పొందుతున్నారు. వివిధ రకాల పంటల సాగు పద్ధతులు నేర్చుకోవడం, పశువుల పెంపకంపై అవగాహన, ఎరువులు, పురుగు మందుల వాడకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా అన్ని అంశాలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నారు. పంటచేలో పాఠాలు నేర్చుకుంటున్న చిలకలూరిపేట మండలం మద్దిరాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లో..

పొలంలో కలుపు తీస్తున్న విద్యార్థులు

నాన్న కష్టాన్ని చూసి

మాది వ్యవసాయ కుటుంబం. నాన్న కష్టాన్ని స్వయంగా చూశా. ఇప్పుడు క్షేత్రస్థాయిలో స్వయంగా పనులు చేస్తూ తెలుసుకున్నా. రైతులకు నూతన వ్యవసాయ పరిజ్ఞానం పద్ధతులను తెలియజేస్తున్నా. రసాయన ఎరువులు ఎక్కువగా వాడటం ద్వారా కలిగే అనర్థాలను వివరిస్తూ సేంద్రీయ ఎరువు వాడకాన్ని పెంచేలా కృషి చేస్తున్నా. - చెరుకూరి తనుశ్రీ

శాస్త్రవేత్త కావాలని..

వివిధ పంటల సాగులో రైతులు అనుసరిస్తున్న పద్ధతులను క్షేత్రస్థాయిలో గమనిస్తున్నా. రైతులను ఇంకా చైతన్యపరచాల్సిన అవసరం ఉంది. మట్టి పరీక్షల ప్రాధాన్యతను వివరిస్తున్నా. తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్నా. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై వివరిస్తున్నా. వ్యవసాయ యంత్ర పరికరాలు వాడుకోవడం ద్వారా ఖర్చు తగ్గించుకొని దిగుబడులు పెంచుకునేలా సూచనలు ఇస్తున్నా. చదువు, ఈ అనుభవాలతో వ్యవసాయ శాస్త్రవేత్త అవుతాను. - పి.మాలశ్రీ

క్షేత్ర స్థాయిలో శిక్షణలో భాగం

వ్యవసాయ విద్యలో పాఠ్యాంశాలు బోధించడమే కాకుండా క్షేత్రస్థాయిలో పంటల సాగులో విద్యార్థులు నిమగ్నమయ్యేలా చూస్తున్నాం. కళాశాల ప్రాంగణంలో ఉన్న పొలాల్లో పత్తి, చామంతి రకరకాల పంటలను విద్యార్థుల ద్వారానే సాగు చేయిస్తున్నాం. చుట్టుపక్కల రైతులకు నేర్చుకున్న అంశాల ద్వారా సూచనలు చేసేలా శిక్షణ ఇస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వాడకం, జాగ్రత్తలతో పాటు యంత్ర పరికరాల వినియోగంపై అవగాహన కలిగిస్తున్నాం. శిక్షణ పూర్తయిన విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి.

- డాక్టర్ పి.శివప్రసాద్, డైరెక్టర్, ప్రిన్సిపల్, మద్దిరాల సాదినేని చౌదరయ్య వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

విజయవాడ, న్యూస్‌టుడే : ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని రాష్ట్ర కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సర్వీసులో ఉన్న 1.3లక్షల మంది ఉపాధ్యాయులు టెట్ పరీక్ష తప్పనిసరిగా ఉత్తీర్ణులవ్వాలనే నిర్ణయంతో.. మినహాయింపు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. విద్యాహక్కు చట్టంలో ఉన్న నిబంధనలు సవరించేందుకు పార్లమెంటులో చట్టసవరణ చేయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో టెట్ ఉత్తీర్ణులవ్వాలనే తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. 12వ వేతన సవరణ కమిటీ నియామకంలో ఇప్పటికే ఆలస్యం అయిందని, ఈ లోగా 29 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ బడిని కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. తల్లిదండ్రులకు నమ్మకం కలిగించి విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రభుత్వం కూడా ఉపాధ్యాయులకు ఎక్కువ సమయం బోధనకే కేటాయించేలా చూడాలని, బోధన సమయంలో ఆన్‌లైన్ పనులు అప్పగించడం, కార్యాలయాల వెంబటి తిప్పడం వంటివి లేకుండా చేయాలని కోరారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: నరసరావుపేటలోని రావిపాడులోని కమ్మ బాలుర వసతి గృహంలో ఆదివారం కమ్మసంఘం ఆధ్వర్యంలో కమ్మజనుల కార్తిక వనసమారాధన నిర్వహించారు. తెదేపా రాష్ట్రప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరాం, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, సీఎస్‌ఐ ఐఎస్ అకాడమీ డైరెక్టర్ మల్లవరపు బాలలత, గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎన్టీఆర్, కోడెల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం కారణంగా విద్యాభ్యాసం చేసేందుకు ఇబ్బందులు పడుతున్న వారికి రూ.5లక్షలు సాయం ప్రకటించారు. కమ్మ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ ఏడాది నీట్ యూజీ, పీజీ, జేఈఈ పరీక్షల్లో రాణించి సీట్లు సాధించిన 12 మంది విద్యార్థులను సత్కరించి అభినందించారు. బాలబాలికల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నల్లపాటి రామచంద్రప్రసాద్, కడియాల వెంకటేశ్వరరావు, నలబోతు వెంకట్రావు, రావెల సత్యనారాయణ, నాగోతు శౌరయ్య, కడియాల లలిత్‌సాగర్, విద్యాసంస్థల డైరెక్టర్లు కోమటినేని నాగేశ్వరరావు, మైనేని శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

బడికెళ్లాలి.. బండి ఆపండయ్యా

ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడుగుతున్న విద్యార్థులు

మండలంలోని గంగవరం గ్రామం నుంచి సుమారు 30మంది విద్యార్థులు పులిపాడులోని ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు సమయానికి బస్సు సౌకర్యం లేదు. ఆ దారి వెంట వెళ్లే ద్విచక్ర వాహనదారులను ప్రాధేయపడాల్సి వస్తోంది. గురజాల నుంచి దైడకు వెళ్లే ఆర్టీసీ బస్సు 9 గంటల ఐదు ఐదేరి గంగవరానికి 9.20కి చేరుకుంటుంది. ఆ బస్సును పాఠశాల వేళకు అనుగుణంగా నడపాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

కోలాటమాడుతున్న బృందం

చిరునాటిక ప్రదర్శన

అలరించిన గురువులు

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: నిత్యం విద్యాబోధన, పరీక్షలు, విద్యార్థులను తయారు చేయడం, పర్యవేక్షణ తదితర పనుల్లో నిమగ్నమై ఉండే ఉపాధ్యాయులు తమలోని కళలను కలబోసి ప్రతిభను ప్రదర్శించారు. పల్నాడు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఆదివారం ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయిలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి 550 మంది ఉపాధ్యాయులు పోటీలకు హాజరై ప్రతిభను చాటారు. కోలాటం, జానపద, శాస్త్రీయనృత్యం, బుర్రకథలు, నాటికలు, ఏకపాత్రాభినయం, కవితలు, తక్షణ ప్రసంగం, సంగీత ప్రదర్శన తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే అరవిందబాబు హాజరై నిర్వాహకులను అభినందించారు.

ఉపాధ్యాయిని జానపద నృత్యప్రదర్శన

అరకొర వసతులు.. రోగుల అవస్థలు

- చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రిలో సమస్యల తిష్ఠ
- నిరుపయోగంగా రూ.50 లక్షల వైద్య పరికరాలు

కళామందిర్ సెంటర్ (చిలకలూరిపేట పట్టణం), న్యూస్‌టుడే

నిరుపయోగంగా పరికరాలు

చిలకలూరిపేట పట్టణం చీరాల రోడ్డులో ఉన్న 30 పడకల ఏరియా ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మూడు సంవత్సరాల క్రితం మార్పు చేశారు. అయినప్పటికీ ఆస్పత్రి సౌకర్యాలు మాత్రం కల్పించలేదు. దీంతో వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. చిలకలూరిపేటతో పాటు చుట్టుపక్కల పల్లెలు, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు ఈ ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటారు. 20 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండాల్సిన చోట 14 మంది మాత్రమే ఉన్నారు. 50 కేవీ సామర్థ్యం గల జనరేటర్ అవసరం కాగా ప్రస్తుతం 30 కేవీ జనరేటర్ మాత్రమే ఉంది. అది కూడా మరమ్మతులకు గురైంది. దీంతో కరెంటు పోయిన సమయంలో రోగులు ఇబ్బంది పడటంతో పాటు పరీక్షలు చేసే యంత్రాలు ఆగిపోతున్నాయి. అంబులెన్స్ సైతం మరమ్మతులకు గురైంది. ఆసుపత్రిలో రక్త నిల్వకేంద్రాన్ని బ్లడ్ బ్యాంక్‌గా మార్పు చేయడానికి రూ.50 లక్షల విలువైన పరికరాలు అందుబాటులో ఉన్నా నిర్వహించడానికి నిపుణులైన వైద్యులు, సిబ్బంది లేక నిరుపయోగంగా ఉన్నాయి.

ప్రభుత్వాసుపత్రిలో నిత్యం చికిత్సకు వచ్చే రోగుల సంఖ్య: 450
ఆసుపత్రిలో ఉండే ఇన్ పేషెంట్లు: 70
ల్యాబ్‌లో చేసే పరీక్షలు : 900

సౌకర్యాలు సమకూరుస్తాం

చిలకలూరిపేట 100 పడకల ఆసుపత్రిలో రూ.9.2 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కొత్త జనరేటర్‌కు ప్రతిపాదనలు పంపాం. పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంపు, బ్లడ్ బ్యాంక్, వైద్యులు, సిబ్బంది కొరత విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలో అన్ని సౌకర్యాలు సమకూరుస్తాం.

- శ్రీనివాసరావు, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును(స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FOR SALE

నరసరావుపేట, Prime ఏరియా రన్నింగ్‌లో ఉన్న కిడ్స్ క్లాత్ & టాయ్స్ షాపు మెటీరియల్, గుడ్‌విల్‌తో సహా అమ్మకానికి కలదు. 91118 79555.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9553786677/9640496677.

REAL ESTATE

PROPERTY FOR SALE

GENERAL

Gunter Skamala Nagar House Site Of 960 Yards Located Opp Sairam Water Plant Beside Dimond Towers is for sale. Genuine Buyers Contact: 7382621835, 7799580787, 9848049588.

TO LET

COMMERCIAL

గుంటూరు, అరండల్‌పేట, 11/1వ లైను D.No:6-11-39, 1st Floor Backside Office/Residence అద్దెకు కలదు. Ph.No: 93983 26564, 73828 92714.

TO.LET
విద్యా సంస్థలకు, ఆఫీసులకు
12000 వేలు చ॥అ కమర్షియల్ స్పేసు అద్దెకు ఇవ్వబడును.
దాసరి కమర్షియల్ కాంప్లెక్సు
జె.పి.రోడ్,భీమవరం-2
94408 70986
94403 56099

SECOND SALE

24 గుమ్మములు, 55 కిటికీలు, డోర్స్‌తో సహా (10 సం॥ముల పాతవి) అమ్మబడును. Contact: ✆ 94408 70986, 94403 56099.

JOBS

Req. of DRA & Non DRA Banking Collections, Field Exec: 16K- 22K, Telecaller: 11K-15K+ Incen. @ Vijayawada ✆ 6304056516.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజినందు Computer Operator గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Any Degree, 55 WPH Typing Speed, MS Office Skills, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్ర: 8978480429.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు SR Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35,000/- నుండి 45,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering. వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్: 8978480429.

ఆర్మీ శ్రీను బ్యాటరీస్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన హెల్పర్స్ (5) మరియు సేల్‌పర్సన్స్ (5) కావలెను. ✆ 62814 94701, 73820 30370.

గుంటూరులోని ప్రముఖ కంపెనీ నందు అకౌంటెంట్ కావలెను. GST & TDS నాలెడ్జ్ must. రెజ్యూమ్ వాట్సాప్. 90528 77789. goodharvestspices@gmail.com

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

బస్సును ఢీకొన్న లారీ: పలువురికి గాయాలు

మేడికొండూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ అద్దె బస్సును కంకర లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ప్రాణ నష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన మేడికొండూరు మండల పరిధిలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..పల్నాడు జిల్లా పిడుగురాళ్ల డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు విజయవాడ వెళ్తోంది. మండలంలోని కొర్రపాడు శివారు ఒక పెట్రోల్ బంకు వద్దకు వచ్చింది. అదే సమయంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న కంకర లారీ ఒక్కసారిగా బస్సును ముందు భాగంలో ఢీ కొట్టింది. భారీ శబ్దం రావడంతో ప్రయాణికులు అందరూ ఉలిక్కిపడ్డారు. ఆ ధాటికి సీట్లలో నుంచి ఒకరిపై ఒకరు పడిపోయారు. ప్రయాణికురాలు చిలకా రాణి ముఖానికి రక్తపు గాయమైంది. పలువురు అతి స్వల్పంగా గాయపడ్డారు. లారీ చోదకుడు బాబావలికి గాయాలు కావడంతో సత్తెనపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో రెండు వాహనాల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 66 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు చోదకుడు శ్రీను కాలికి తీవ్ర గాయమైంది. 108 వాహనంలో ఆయన్ను సత్తెనపల్లి ప్రాంతీయ ఆసుపత్రి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. జేసీబీ సాయంతో లారీ, బస్సును రోడ్డుపై నుంచి పక్కకు తీసి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

చికిత్స పొందుతూ మృతి

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: నరసరావుపేట మండలం ఉప్పలపాడు సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. అమరావతి మండలం దిడుగు గ్రామానికి చెందిన చరమచర్ల నాగబాబు(17) మల్లేశ్వరరావు (30) సొంత పనుల నిమిత్తం బాపట్ల జిల్లా అద్దంకికి బయల్దేరారు. నరసరావుపేట పట్టణ శివారు ఉప్పలపాడు జంక్షన్ వద్దకు చేరుకోగానే వినుకొండ వైపునుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగబాబు అక్కడికక్కడే మృతి చెందగా, మల్లేశ్వరరావు చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్ తెలిపారు.

క్రీడలతో గుర్తింపు

మాట్లాడుతున్న డీఈవో జగ్గారావు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్ర సీనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ 12వ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలోని ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజులు నిర్వహించిన పోటీలు ఆసక్తిగా సాగాయి. గుంటూరు, విజయనగరం, అనంతపురం జట్లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. డీఈవో ఎం.జగ్గారావు పాల్గొని ట్రోఫీ, బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. ఇటీవల డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో 49 పోస్టులు సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు దక్కాయని గుర్తు చేశారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రమణ, శ్రీనివాస్‌రెడ్డి, కొత్త సత్యం తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ట్రావెల్ బస్సు.. ఇబ్బంది పడ్డ ప్రయాణికులు

సంతమాగులూరు: చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న వి.కావేరి ప్రైవేటు ట్రావెల్ బస్సు సాంకేతిక లోపంతో సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో నిలిచిపోయింది. ఉదయం 7.30 గంటల వరకు అందులోని ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. నెల్లూరుకు చెందిన ఈ బస్సు చిత్తూరు నుంచి 28 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలు దేరింది. ఏల్చూరు వద్దకు రాగానే నిలిచిపోయింది. డ్రైవర్లు, సిబ్బంది తక్షణం స్పందించకపోవడం, నిర్లక్ష్య వైఖరితో తెల్లవారే వరకు మహిళలు, వృద్ధులు, పిల్లలతో ఇబ్బంది పడ్డట్టు శ్రీకాళహస్తిలో ముగ్గురు కుటుంబ సభ్యులతో కలిసి బస్సు ఎక్కిన సంగారెడ్డికి చెందిన బి.రాజేష్ తెలిపారు. ప్రయాణికులు ఎవరికి వారు గమ్యస్థానానికి వెళ్లిపోవాలని, టికెట్టు డబ్బులు తరువాత ఇప్పిస్తామని వాగ్వాదానికి దిగినట్లు ప్రయాణికులు తెలిపారు.

కేంద్ర బృందం పర్యటన రేపు

బాపట్ల, న్యూస్‌టుడే: మొంథా తుపాను వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించటానికి పౌసుమి బసు నేతృత్వంలో కేంద్ర బృందం మంగళవారం జిల్లాలో పర్యటించనుంది. సోమవారమే బృందం జిల్లాలో పర్యటించాల్సి ఉండగా ముందుగా ప్రకాశం జిల్లాకు వెళ్తోంది. సోమవారం రాత్రి చీరాలకు చేరుకుని అక్కడే బస చేస్తారు. రామాపురం, వాడరేవులో మంగళవారం ఉదయం పది గంటలకు పర్యటించి తుపాను వల్ల దెబ్బ తిన్న రహదారులు, వంతెనలు, ఇళ్లను కేంద్రం బృందం పరిశీలిస్తుంది. అనంతరం ఉదయం 11 గంటలకు బాపట్ల కలెక్టరేట్‌కు చేరుకుని తుపాను వల్ల జిల్లాలో జరిగిన నష్టంపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్రాలను పరిశీలిస్తారు. కలెక్టర్, జేసీ జిల్లా అధికారులతో సమావేశమై మొంథా వల్ల తీవ్రంగా ప్రభావితమైన రంగాలు, జరిగిన నష్టం వివరాలు తెలుసుకుని మధ్యాహ్నం 12 గంటలకు అమరావతి సచివాలయానికి పయనమవుతారు. భారీ వర్షాలకు 39 వేల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు పెట్టుబడి రాయితీ కింద రూ.75 కోట్లకు పైగా సాయం అందాల్సి ఉంది.

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

రూ.50 లక్షల సొత్తు చోరీ

తాళం పగలగొట్టి నగలు, నగదు దోచుకెళ్లిన దుండగులు

పగలగొట్టిన ఇనుపపెట్టె

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: ఎవరూలేని సమయం చూసి ఇంటి తాళాలు పగలగొట్టి రూ.50లక్షల విలువైన బంగారు నగలు, రూ.45వేల నగదు దోచుకెళ్లిన ఘటన నరసరావుపేట పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది. నరసరావుపేట పట్టణం ప్రకాష్‌నగర్‌కు చెందిన గడిపూడి సుబ్బారావు, అతని భార్య ఈ నెల 5న కుమార్తె ఇంట్లో శుభకార్యం నిమిత్తం సత్తెనపల్లి మండలం గణపవరం వెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చి చోరీ విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో ఇనుప పెట్టెలో సుమారు 70 సవర్ల బంగారు అభరణాలు, కబోర్డులో ఉంచిన రూ.45వేలు నగదు చోరీ అయ్యిందని పేర్కొన్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న సీఐ ఫిరోజ్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆన్‌లైన్‌లోనూ వినతులు నమోదు చేయొచ్చు

నరసరావుపేట అర్బన్: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను అందుబాటులోకి తెచ్చిందని, సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కారవేదిక సోమవారం నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. అర్జీదారులు కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి అర్జీ పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేయవచ్చని తెలిపారు. సమస్యల పరిష్కారానికి సంబంధించిన సమాచారం ఫోన్‌కు పంపబడుతుందని, గతంలో అర్జీలు ఇచ్చిన వారు సమస్య పరిష్కారం కాకుంటే పాత రసీదును వెంట తెచ్చుకోవాలని సూచించారు. అర్జీలపై పరిష్కారానికి సంబంధించిన అంశంపై సమాధానాలు, నోటీసులు వాట్సప్‌కు పంపుతామన్నారు

బండను లాగుతున్న వేటపాలెం ఎడ్ల జత

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

దుర్గి: మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆదివారం హరిహర బాలనాగేంద్రస్వామి తిరునాళ్ల పురస్కరించుకుని సబ్‌జూనియర్ విభాగంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్ల జత నిర్ణీత సమయానికి 4200 అడుగులు బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్లజత, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జతలు రెండోస్థానం కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా పెదకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, వీరసింహారెడ్డికి చెందిన ఎడ్లు మూడోస్థానంలో నిలిచాయి. పోటీలకు న్యాయనిర్ణేతలుగా శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి వ్యవహరించారు.

బ్రాయిలర్ ధరలు

(కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, 129, 140 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 238.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

44 మందికి ఉపకార వేతనాలు పంపిణీ

విద్యార్థులతో సంఘం సభ్యులు

వినుకొండ, న్యూస్‌టుడే: వెల్లటూరు రోడ్‌లోని యోగివేమారెడ్డి సేవా సమితి భవన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తిక వనసమారాధనలో 44 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. మహిళల కోలాటం, బాలికల భరత నాట్యం ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సుమారు 100 మంది రక్తదానం చేశారు. రెడ్ల సంఘం నాయకులు ఆర్.శివారెడ్డి, కార్యదర్శి పి.సుధాకరరెడ్డి, ఆర్థిక కార్యదర్శి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

విరాళం చెక్కు అందజేస్తున్న దాతలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: కోటప్పకొండ త్రికోటేశ్వరుని అన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. విజయవాడకు చెందిన యలవర్తి శశిధర్ ఆయన తల్లి పద్మజ పేరుతో రూ.1,01,116 చెక్కు ఆదివారం దేవాలయం అధికారులకు అందజేశారు. కుటుంబసభ్యులతో కలిసి వచ్చి ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు విరాళం అందజేసినట్లు ఈవో చంద్రశేఖరరావు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? చిలకలూరిపేట పట్టణంలోని సాలిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదురుగా చేతి బోరు పాడైపోయింది. బాగు చేయిస్తే ఆ ప్రాంత ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. **- రామకృష్ణ** ✔ చేతి పంపును బాగు చేయించి ఉపయోగంలోకి తీసుకువస్తాం. **- అన్సర్, పురపాలకసంఘ ఏఈ.** – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

గుంత పూడ్చారు

స్పందనకు వందనం

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: పట్టణంలో ఓ ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేసిన తీగల మరమ్మతుల పేరిట ఇష్టానుసారం గుంతలు తవ్వేస్తున్నారు. దీంతో వాహనచోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి లింగంగుంట్ల వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు పక్కనే గుంత తవ్వి వదిలేశారు. రోజులు గడుస్తున్నా పూడ్చలేదు. ఆదివారం రాత్రి ఓ ద్విచక్ర వాహచోదకుడు గుంతలో పడి గాయాలపాలయ్యారు. మరిన్ని ప్రమాదాలు సంభవించకముందే అధికారులు స్పందించాలని ఈనాడులో ప్రచురించగా స్పందించిన మున్సిపల్ ఏఈ జ్యోతి స్పందించారు. సిబ్బందిచేత గుంత పూడ్పించారు.

పూడిక తొలగింపు

వినుకొండ, న్యూస్‌టుడే: మార్కాపురం రోడ్‌లోని ప్రధాన డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన పూడికను తొలిగిస్తున్నారు. ఆదివారం యంత్రాలతో తీసి బయట పోస్తున్నారు. వర్షం కురిసినప్పుడు నీరు ముందుకు వెళ్లకుండా రోడ్డుపైకి వస్తోందని, పూడిక తొలగిస్తున్నామని మున్సిపల్ ఏఈఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ తెలిపారు.

మొక్కుబడి మరమ్మతులు.. తరచూ ఇబ్బందులు

❑ రూ.లక్షలు ఖర్చుచేస్తున్నా లభించని పరిష్కారం
❑ కలుషిత నీటితో పట్టణ ప్రజల అవస్థలు

నరసరావుపేట సెంట్రల్, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే:

జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మంచినీటి పైపులైన్లకు లీకుల వల్ల తాగునీరు వృథాగా పోతోంది. మరమ్మతులు చేయాలంటే ఒక రోజు పట్టణ జనాభాకు నీటి సరఫరా నిలిపివేయాల్సి వస్తుందని మొక్కుబడిగా పనులు చేస్తుండటంతో తరచూ ఇదొక తంతుగా మారింది. మరమ్మతుల పేరిట రూ.లక్షలు వెచ్చిస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

ఆ ప్రాంతాల్లో తరచూ లీకులు

పట్టణంలో 34 వార్డులు, 2 లక్షలకుపైగా జనాభా ఉన్నారు. పట్టణంలో 150 కిలో మీటర్ల మేర తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. 130 కిలో మీటర్ల పైపులైన్ల ద్వారా ప్రజలకు తాగునీరు అందుతోంది. మిగిలిన 20 కిలో మీటర్ల పరిధిలో అరకొరగా తాగునీరు సరఫరా అవుతోంది. అయితే రావిపాడు, పల్నాడు రోడ్డు, స్టేడియం, అరండల్‌పేట, కోటప్పకొండరోడ్డు, రామిరెడ్డిపేట, ఇస్లాంపేట, బాలయ్యనగర్, రెడ్డినగర్ ప్రాంతాల్లో తరచూ లీకులు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో మరమ్మతులు చేయాలంటే ఒక రోజు పట్టణానికి తాగునీటి సరఫరా నిలిపి వేయాలి. లేదంటే రెండు మూడు రోజుల సమయం పడుతుంది. దీనికితోడు చాలా వరకు పైపులైన్లు మురుగు కాలువల్లో ఉండటంతో తాగునీరు కలుషితమవుతోంది. వర్షం కురిసినప్పుడల్లా కత్వా వాగు పొంగుతోంది. ఆ సమయంలో వరద, మురుగునీరు లీకులున్న పైపుల్లోకి చేరుతోంది. దీంతో రంగుమారిన నీరు సరఫరా అవుతోంది.

లీకు అవుతున్న మంచినీటి పైపు లైను

నూతన పైపులు ఏర్పాటు చేస్తాం

పట్టణంలో తాగునీటి సరఫరా కోసం వేసిన పైపులైన్లు 25 సంవత్సరాల క్రితం వేశారు. కొన్ని పైపులు తరచూ లీకవుతున్నాయి. మరమ్మతులు చేసినా ఫలితం ఉండటంలేదు. కొత్త పైపులైన్లు వేస్తేనే లీకుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. నూతన పైపులైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- రఫీ, మున్సిపల్ డీఈ**

విహార యాత్రలతో విజ్ఞానం

విద్యుత్తు ఉత్పత్తి విధానం తెలుసుకుంటున్న విద్యార్థులు

నూజండ్ల, న్యూస్‌టుడే: విహార యాత్రలు విద్యార్థుల విజ్ఞాన వికాసానికి దోహదపడతాయని ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి అన్నారు. ఆదివారం నూజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండు బస్సుల్లో నాగార్జునసాగర్‌కు విహార యాత్రకు వెళ్లారు. ప్రాజెక్టు నిర్మాణం ఎలా జరిగిందో తెలుసుకున్నారు. నాగార్జున కొండ వైభవం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. నాడు బౌద్ధులు ఉపయోగించిన పరికరాలు, శిల్పాలను పరిశీలించారు. పవర్ హౌస్‌లో జలవిద్యుత్తు ఉత్పత్తి విధానం అడిగి తెలుసుకున్నారు. ఎత్తిపోతలు, పల్నాటి యుద్ధ ప్రదేశాలు, దేవాయాల చరిత్రను విహార యాత్ర ద్వారా తెలుసుకున్నట్లు విద్యార్థులు తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి లావణ్య

నరసరావుపేటలీగల్, న్యూస్‌టుడే: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అదనపు సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎన్.లావణ్య అన్నారు. స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల బాలికల వసతి గృహంలో ఆదివారం న్యాయసేవాసంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి లావణ్య న్యాయసేవా దినోత్సవం విశిష్టతను తెలియజేశారు. ఉచిత న్యాయసహాయం, లోక్‌అదాలత్, నల్సా పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్తిక వనసమారాధనలతో ఐక్యత

ఎమ్మెల్యే కన్నాను సన్మానిస్తున్న కాపు సంఘం సభ్యులు తదితరులు

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: కార్తిక వనసమారాధనలు ఐక్యతను చాటుతాయని ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, అరవిందబాబు అన్నారు. మండలంలోని కోటప్పకొండలోని శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కాపు వనసమారాధనలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ○ జనసేన పార్టీ వీరమహిళ మిరియాల వెంకట సుబ్బాయమ్మ ఆధ్వర్యంలో ఆయుర్వేద కోలాట కమిటీ నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాపు సంఘం అధ్యక్షుడు పోతుల శంకర్ ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, అరవిందబాబులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆమంచి స్వాములు, ఇమ్మడి హరిబాబు, రాయల శ్రీనివాసరావు, డేగల ప్రభాకర్, అల్లంశెట్టి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రతంలో దంపతులు

పట్టణంలో సామూహిక పూజలు

నరసరావుపేట అర్బన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్యవైశ్యుల కార్తిక వన సమారాధన మహోత్సవం నిర్వహించారు. ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవిందబాబు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మల్లమ్మ సెంటర్, వినుకొండ, న్యూస్‌టుడే: నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డులో శ్రీకృష్ణదేవరాయ కాపు యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన సమారాధన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్దసంఖ్యలో కాపు వర్గీయులు పాల్గొన్నారు. నిర్వాహకులు ఏలూరి ప్రసాద్ నేతృత్వంలో అన్నదానం జరిగింది.
◆ వినుకొండ వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఆవరణలో ఆదివారం విశ్వబ్రాహ్మణ కార్తిక వన సమారాధన నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి విశ్వబ్రాహ్మణులు తరలివచ్చారు.

సేవతోనే సంతృప్తి

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెంకటకుమారి, జయమ్మ, రాజశేఖర్ తదితరులు

బొప్పూడి(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: ఎంత సంపాదించినా సేవ చేయడం ద్వారానే నిజమైన సంతృప్తి లభిస్తుందని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తెలిపారు. చిలకలూరిపేట మండలం బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి కల్యాణమండపంలో ఆదివారం కాకతీయ సేవా సమితి కార్తిక వన సమారాధన మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఏపీ కాకతీయ సేవా సమాజ్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు కోడెల వెంకట సుబ్బారావు, డాక్టర్ ముత్తవరపు సురేష్, చిలకలూరిపేట సమితి అధ్యక్షులు పోట్రు పూర్ణచంద్రావు, ప్రధాన కార్యదర్శి దండా గోపి, రాష్ట్ర కోశాధికారి కె.అయోధ్య రామారావు, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కనుమూరి రాజ్యలక్ష్మి, జనసేన రాష్ట్ర నాయకులు బాలాజీ పాల్గొని మాట్లాడారు. 20మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు.

మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: చిలకలూరిపేట రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్, ఒమేగా ఆసుపత్రి గుంటూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో నరసరావుపేట రోడ్డులోని రోటరీ భవనంలో మహిళలకు వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేశారు. వైద్యురాలు సుబ్రహ్మణ్య ఆధ్వర్యంలో 70 మంది మహిళలకు టెస్టులు చేశారు. కార్యక్రమాన్ని ఒమేగా మార్కెటింగ్ మేనేజర్ లాల్ మహ్మద్, క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉప్పుటూరి ప్రసాద్, బోడి రామసుబ్బారావు, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు నార్నె జయలక్ష్మి, కార్యదర్శి చెన్నుపాటి చైతన్య, డాక్టర్ కందిమళ్ల పుష్పాల రమాదేవి, సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నిఘా నేత్రాలతో నేరాల నియంత్రణ

ఆలయం వద్ద పరిశీలిస్తున్న రూరల్ సీఐ బ్రహ్మయ్య

శావల్యాపురం,న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకారంతో గ్రామాల్లో నిఘా నేత్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు రూరల్ సీఐ బ్రహ్మయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన శావల్యాపురంలోని శ్రీ కనక దుర్గమ్మ దేవాలయం వద్ద గతంలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలను పరిశీలించారు. ఎక్కువ ప్రాంతాన్ని కవరేజ్ చేయడం లేదని, అదనంగా మరొకటి ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా మతుకుమల్లి కూడలి వద్ద ఏర్పాటు చేసినట్లయితే ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయనతోపాటు ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు, సిబ్బంది శ్రీనివాసరావు ఉన్నారు.

మురుగంతా పాఠశాల ముందుకే..!

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: పెదకంచర్ల గ్రామంలోని మురుగు నీరంతా జడ్పీ పాఠశాల వద్దకు వచ్చి ఆగుతోంది. రోజులపాటు నిల్వ ఉండటంతో అపరిశుభ్రంగా తయారైంది. నిత్యం వందమంది పిల్లలు మురుగు నీటిలో వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు దాతలు సమకూర్చిన స్థలంలో గదులు నిర్మిస్తుండగా, బాలుల మరుగుదొడ్లు అక్కడే ఉన్నాయి. నిల్వనీరు ముందుకు వెళ్లడానికి పైపుతోపాటు కొంత దూరం కాలువ ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డిని వివరణ కోరగా వెంటనే పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

చీకటి పడితే పాములొస్తున్నాయ్..!

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: సత్తెనపల్లి రోడ్డులోని సాయిబాబా దేవాలయం పక్క వీధిలో ఖాళీ స్థలాలు అడవులను తలపిస్తున్నాయి. చీకటి పడితే విషసర్పాలు రోడ్డుపై సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధిలో నడిచి వెళ్లాలంటే విషపురుగులు వస్తున్నాయని వాపోతున్నారు. వీధి దీపాలు కూడా లేకపోవటంతో మరింత ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కాలనీలో ఖాళీ స్థలాలు అడవులను తలపిస్తున్నాయన్నారు. ఈవిషయాన్ని శానిటరి ఇన్‌స్పెక్టర్ రమాదేవి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే తొలగిస్తామని చెప్పారు.

దుర్వాసన, పొగతో అవస్థలు

మనిషి జీవితంలో మహా ప్రస్థానం చివరి మజిలీ. కన్నుమూసిన వారికి గౌరవ ప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించటం కనీస ధర్మం. మండల కేంద్రమైన యడ్లపాడులో ఎర్రకొండ పక్కన గతంలో శ్మశానవాటిక నిర్మించారు. దాన్ని గ్రామ పంచాయతీ వారు డంపింగ్ యార్డుగా వాడుతున్నారు. ప్రహరీగోడ అసంపూర్తిగా నిర్మించటంతో కొందరు వాహనాల్లో వ్యర్థాలు తెచ్చి అక్కడ పడేసి నిప్పు పెడుతున్నారు. దీంతో మృతులకు దహన సంస్కారాలు నిర్వహించే సమయంలో దుర్వాసనతోపాటు పొగతో ఇబ్బంది పడుతున్నారు. పక్కనే ఉన్న సెయింట్ ఆన్స్ సైన్సు అండ్ ఆర్ట్సు మహిళా కళాశాల విద్యార్థులు సైతం అవస్థలు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, యడ్లపాడు**

అడుగడుగునా గండమే..!

వినుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని నడిగడ్డ చెరువు అలుగు నీటి ప్రవాహం దాటేందుకు గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. రైతునగర్, పేరూరీపాడుతో పాటు గ్రామస్థులు పొలానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. వర్షాకాలంలో ఎక్కువ రోజులు చెరువు అలుగు ప్రవహిస్తుండటంతో ఆదారిలోనే వెళ్లాల్సి వస్తోంది. దారి పాచిపట్టి జారుతుండటంతో భయంభయంగా వెళుతున్నారు. ఇటీవల ద్విచక్రవాహనంపై వెళుతూ ప్రమాదాలకు గురయ్యారు. అలుగుకు పైపులతో కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కారు బోల్తాపడి ఒకరికి గాయాలు

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం గణపవరం పరిధిలో బైపాస్ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఈడీ కళాశాల ప్రిన్సిపల్‌కు గాయాలయ్యాయి. గుంటూరు నుంచి రెడ్డి బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ చంద్రమోహన్ కారులో ఒంగోలుకు వెళ్తున్నాడు. నాదెండ్ల, గణపవరం మధ్యలో ముందుగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా నెమ్మదించడంతో కారు ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న చంద్రమోహన్‌కు గాయాలయ్యాయి. అతన్ని గుంటూరులోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెప్పుల దుకాణంలో చోరీ

శావల్యాపురం,న్యూస్‌టుడే: మండల కేంద్రమైన శావల్యాపురంలో వరుస చోరీలు జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి పక్కనే సంగం డెయిరీ కేంద్రం సమీపంలో మండలంలోని బొందిలి పాలేనికి చెందిన కాల్వ లాజర్ చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం చెక్కలు పగులగొట్టి రూ.3వేలు విలువగల చెప్పులను తీసుకుని వెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి పూట గస్తీని పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బస్సును ఢీకొన్న బొలేరో

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సును వినుకొండకు చెందిన బొలేరో వాహనం ఢీకొంది. ఈ ఘటన వినుకొండ మండలం పార్వతీపురం వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. ప్రమాదంలో బస్సు అద్దాలు పగిలి, ముందు భాగంలో రేకులు, డోరు విరిగిపోయాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

అప్రోజ్‌కు అభినందన

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : సర్వే ఉద్యోగుల సంఘం నరసరావుపేట డివిజన్ కార్యదర్శిగా నాదెండ్ల మండలం గణపవరం సచివాలయం-2 సర్వేయర్ షేక్ అప్రోజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గణపవరం ఈవో మారుతి బాబు, సచివాలయ ఉద్యోగులు అప్రోజ్‌ను ఆదివారం అభినందించారు.

వేల్పూరులో ఉచిత వైద్య శిబిరం

వేల్పూరు(శావల్యాపురం),న్యూస్‌టుడే: నరసరావుపేట పట్టణానికి చెందిన ప్రైవేటు వైద్యశాల ఆధ్వర్యంలో వేల్పూరులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 150 మందికి బీపీ, చక్కెర వ్యాధి, రక్తపరీక్షలు, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. అలాగే స్త్రీలకు గైనకాలజీ, ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించారు.

చువ్వలతో ప్రమాదం.. అయినా నిర్లక్ష్యం

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలోని లింగంగుంట్ల పరిధిలో ఉన్న గోవిందాపురం మైనర్ కాలువపై గత ప్రభుత్వంలో చప్టా నిర్మించారు. ఎన్ఎస్పీ కాలువపై చప్టా నిర్మాణం చేపట్టడం ఏంటని అప్పట్లో ప్రజలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. అసంపూర్తిగా పనులు చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. చప్టాకు ఇరువైపులా గోడల నిర్మాణం నిమిత్తం ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలు అడ్డదిడ్డంగా ఉండటంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ డీఈ రఫీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఇనుప చువ్వలు తొలగిస్తామని చెప్పారు.

వేలాడుతున్న విద్యుత్తు తీగలు

చిలకలూరిపేట పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ రోడ్డులో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్క బజారులో విద్యుత్తు సర్వీసు తీగ పూర్తిగా కిందకు జారిపోయింది. తగిలే ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. ఈ ప్రాంతంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. సమస్యను విద్యుత్తుశాఖ ఏఈ కరుణాకర్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.
- న్యూస్‌టుడే, గాంధీపేట (చిలకలూరిపేట పట్టణం)

సీఎం సమర్థతవల్లే రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, సమర్థతవల్లే ఏపీలో పారిశ్రామిక విప్లవం కొనసాగుతోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా అన్ని రంగాల్లో మేటిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, చంద్రబాబు భరోసా, ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలే పారిశ్రామిక వేత్తలను విశేషంగా ఆకర్షిస్తున్నాయన్నారు. వైకాపా ప్రభుత్వంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు రాష్ట్రాన్ని అడ్డాగా మార్చారని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు.

ఆహారం, దుప్పట్లు పంపిణీ

అంధుల పాఠశాలలో బాలబాలికలతో విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతిశ్రీనివాసరెడ్డి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జన్మదినం వ్యక్తిగత ఆనందం కోసం కాకుండా సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం సంతోషదాయకమని ఏఎంరెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆమె జన్మదినం సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. అంధుల పాఠశాలలో విద్యార్థులకు, అనాదాశ్రమంలో పండ్లు, దుప్పట్లు, ఆహారం పంపిణీ చేశారు. విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ ఫణిభూషణరావు, డాక్టర్ కృష్ణారెడ్డి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

నేలవాలి.. వేదన మిగిల్చి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: గుండ్లకమ్మ నది పరీవాహక ప్రాంతాల్లో సాగు చేసిన వరి పొలాలు నీటిపాలయ్యాయి. మూడు రోజుల పాటు ప్రవహించిన నీటి ఉధ్ధృతికి పంట పూర్తిగా నేలకు కరుచుకుని కోత కోసిన పొలంలా దర్శనమిస్తోంది. కోత దశలో పంట కోయాల్సిన అవసరం కూడా పోయిందని, పొలం వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినుకొండ, నూజండ్ల మండలాలకు చెందిన 15 గ్రామాల్లో రైతుల ఆవేదన ఇది.

యోగాతో ఆరోగ్యం, క్రమశిక్షణ

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఫిట్ పర్ ఇండియా కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చిలకలూరిపేట గ్రామీణ పోలీసుస్టేషన్‌లో సీఐ సుబ్బానాయుడు, ఎస్సైలు అనిల్‌కుమార్ (రూరల్), శివరామకృష్ణ (యడ్లపాడు)లు సిబ్బందితోపాటు యోగసనాలు వేశారు. యోగాతో ఆరోగ్యంగా ఉండటంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని అధికారులు తెలిపారు.

షటిల్ క్రీడాకారిణికి అభినందన

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలికల విభాగంలో తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి షటిల్ పోటీల్లో పట్టణానికి చెందిన బి.మృదుల జాయ్ ప్రతిభ కనబరిచారు. ఆమెను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్ తదితరులు ఆదివారం అభినందించారు.

నీరు నిలిచింది.. నారు ఎండుతోంది..!

నూజండ్ల, న్యూస్‌టుడే: ఐనవోలు మేజర్‌లో నీటి సరఫరా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వల్లేరు వాగుపై నిర్మాణం చేసిన పోలేరమ్మ చెక్ డ్యాం నీటిని ఐనవోలు మేజర్‌కు అనుసంధానం చేశారు. తుపాను తాకిడికి చెక్ డ్యాం దెబ్బతిని వచ్చేనీరు కాస్త లీకై పోతోంది. దీంతో కాలువలోకి నీరు సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడటంతో సాగునీటి సమస్య ఏర్పడింది. సాగర్ కాలువలకు నీటి సరఫరా నిలిపి వేయడం కూడా నీటి ఎద్దడికి కారణం అయింది. ఐనవోలు మేజర్‌లో నీరు సరఫరా కాలేదు. దీంతో యోగిరెడ్డి పాలెం, నాగిరెడ్డిపల్లెలు, పెద్దవరం, ఐనవోలు, చింతలచెరువు తదితర గ్రామాల రైతులు సాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మొదటి పంటగా ఆముదం సాగు చేసి పంట పూర్తయిన తర్వాత ఇక్కడ నార్లు పోశారు. చెక్ డ్యాం నుంచి నీరు రాకపోవడంతో పాటు సాగర్ కాలువల్లో నీరు సరఫరా లేకపోవడంతో తడులు లేక నారు ఎండిపోతోందని రైతులు వాపోతున్నారు. సమస్యను ఏఈ గణేష్ దృష్టికి తీసుకెళ్లగా సాగర్ కాలువలకు నీరు సరఫరా అయినా. . కిందకు రాలేదన్నారు. చెక్ డ్యాం మరమ్మతుల విషయాన్ని నీటి సంఘం అధ్యక్షుడు రావుల బుజ్జి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రతిపాదనలు పంపామని, పనులు చేయించి నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

నీళ్లు లేక వాడుముఖం పట్టిన నారుమడి

బహిరంగ ప్రకటన

నా క్లయింటు యస్ బ్యాంక్ గుంటూరు బ్రాంచి వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయడ మేమనగా

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి సయ్యద్ పకీర్ అహమ్మద్ మరియు వారి భార్య సయ్యద్ మహబూబి గార్లు సుశీల ఎ భూపాల, సంగీతా షాహ, మద్దుల దివాకర్, బిలేహాల్ మదన్ కుమార్, మాదుగులియ గోపాలుని జగన్నాధ్, గోపాలుని ప్రీత్ సాయి కనక వర్మ, ఉపాధ్యాయ రాజేష్, నూనె చంద్రశేఖర్ రెడ్డి, గోపాలుని నరసింహారావు మరియు బండారు వంశీమోహన్ గార్ల వద్ద కొనుగోలు చేసి విక్రయ దస్తావేజు.నెం.13302/2019 రు గా రిజిష్టరు చేయించుకొని సదరు ఆస్తిని తన అవిచ్ఛిన్న స్వాధీన అనుభవములో అనుభవించుచూ దిగువ షెడ్యూల దాఖల ఆస్తిని విక్రయించ దలచి సదరు ఆస్తిపై ఏటువంటి [illegible]

[illegible]

జి. శాయికృష్ణ శ్రీనివాస్, టి.విజయ్ మోహన్
అడ్వకేట్స్, డోర్ నెం.5-50-88, 5/13, బ్రాడీపేట, గుంటూరు
Date :09.11.2025

(c) eenadu

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

రక్తదానం గొప్పది

శిబిరంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, వైద్యులు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానమని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ కేపీచారి అన్నారు. సత్యసాయి శత జయంతి పురస్కరించుకుని ఆదివారం సామాజిక ఆరోగ్య సేవా కేంద్రంలో సత్యసాయి ఎడ్యుకేషనల్, సేవా సమితి ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 40 మంది రక్త దానం చేశారు. వైద్యులు దశరథ్‌నాయక్, లక్ష్మీప్రసన్న, అనిల్, శ్రీనివాసరావు, రమాదేవి, మధురవాణి తదితరులు పాల్గొన్నారు.

అందమైన చేతిరాతతో బంగారు భవిష్యత్తు

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: అందమైన చేతిరాత విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు దోహదపడుతుందని స్థానిక జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబూరావు అన్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో చేతి రాతపై శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చేతిరాత నిపుణులు జున్నుసాహెబ్, బురాన్ 200 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

మాట్లాడుతున్న జున్నుసాహెబ్

ముప్పాళ్ల ఎస్సైగా అనిల్‌కుమార్

ముప్పాళ్ల: ముప్పాళ్ల ఎస్సైగా పి.అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న సోమేశ్వరరావు పల్నాడు స్పెషల్ బ్రాంచికిబదిలీ అయ్యారు. సోమవారం నూతన ఎస్సై బాధ్యతలు తీసుకోనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? పాలువాయిజంక్షన్-సత్రశాల రహదారిపై గోతులు పడ్డాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. - **శ్రీనునాయక్, జెట్టిపాలెం** ✔ తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు చేపట్టే అవకాశం ఉంది. - **యూసఫ్, ఏఈ** - న్యూస్‌టుడే, రెంటచింతల

? గంగవరం నుంచి పులిపాడు పాఠశాలకు వెళ్లేందుకు సమయానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. - **గంగవరం వాసులు** ✔ తొలుత పల్లెగుంతలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులను తరలించిన తర్వాత బస్సు వస్తోంది. దీంతో సమయం పడుతుంది. - **వీరాస్వామి, డిపో మేనేజర్, మాచర్ల** - న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

? గ్రామ శివాలయం పరిసరాల్లో చెత్తాచెదారం వేస్తున్నారు. - **మండాది వాసులు** ✔ ఆలయ పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకుంటాం. - **ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి** ? గ్రామంలోని ప్రధాన వీధిలో దీపాలు వెలగడం లేదు. - **సాంబయ్య, ఉప్పలపాడు** ✔ వెలగని వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. - **చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, వెల్దుర్తి

రెవెన్యూ సమస్యలు బోలెడు

అమరావతి, పెదకూరపాడు, అచ్చంపేట, బెల్లంకొండ, న్యూస్‌టుడే: రెండు రోజుల కిందట ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాదర్బారులో ఎక్కువగా రెవెన్యూ సమస్యలపైనే ఫిర్యాదులు వచ్చాయి. ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది కొరత, సమస్యలపై చొరవ చూపకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రెండు, మూడు పంచాయతీల బాధ్యతలు ఒక వీఆర్వో చూడాల్సి వస్తోంది. పని భారం పెరిగి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

అమరావతి తహసీల్దార్ కార్యాలయం

రైతులకు అవస్థలు

ప్రధానంగా గ్రామాల్లో రైతుల మధ్య పొలం వివాదాలు తరచూ వస్తున్నాయి ఆన్‌లైన్ విధానం వచ్చినప్పటి నుంచి సమస్యలు తలెత్తుతున్నాయి. భూ వివరాల్లో తప్పులు, సరిహద్దు వివాదాలు, ఒకరి భూమి మరొకరి పేరుతో నమోదు చేయడం వంటివి ఎక్కువగా పల్లెల్లో కనిపిస్తున్నాయి. వాటి పరిష్కారానికి రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ★ రైతు తన భూమి తనఖా పెట్టి బ్యాంకుల్లో అప్పు తీసుకుంటున్నారు. అప్పు రెన్యూవల్ చేసుకునే సమయంలో బ్యాంకుకు అడంగళ్ సమర్పించాల్సి ఉంది. అడంగల్ కోసం వెళ్లిన రైతుకు ఆన్‌లైన్‌లో తన పేరు మీద భూమి వివరాలు కనిపించకపోవడంతో దిక్కుతోచని స్థితి ఎదురవుతోంది. సర్వే నంబరులోని భూమిలో మార్పులు, ఆన్‌లైన్ సమస్య వచ్చినప్పుడు ఎర్రర్ చూపుతోంది. దీనికి పరిష్కారం దొరకడం లేదు. ★ ఓ వైపు ఉద్యోగుల కొరత.. మరో వైపు ఉన్న సిబ్బంది కూడా సర్వేల పేరుతో ఇతర పనులు అప్పగిస్తున్నారు. దీర్ఘకాలిక సమస్య ఉందంటే వాటి జోలికి వెళ్లడం లేదు.

గ్రామ అధికారుల కొరత

అమరావతి మండలంలో 18 గ్రామాలకు గాను 10 మంది వీఆర్వోలే విధులు నిర్వహిస్తున్నారు. అచ్చంపేట మండలంలో 17 మందికి 12, పెదకూరపాడులో 14 మందికి 13, బెల్లంకొండ మండలంలో 10 గ్రామాలకు 8, క్రోసూరు మండలంలో 15 గ్రామాలకు 13 మందే ఉన్నారు. అన్నిచోట్ల సిబ్బంది కొరత కారణంగా రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్న వాదన వినిపిస్తోంది.

రామలింగేశ్వరునికి భస్మాభిషేకం

కార్తిక పూజల్లో భాగంగా ఆదివారం ఆకులగణపవరంలో రామలింగేశ్వరస్వామికి భస్మాభిషేకం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించారు. - న్యూస్‌టుడే, రాజుపాలెం

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

దుర్గి, న్యూస్‌టుడే: అడిగొప్పల నిదానంపాటి అమ్మవారిని ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బిందెతీర్థం, నక్షత్రహారతి, అభిషేకాలు, చండీహోమం, పల్లకిసేవ నిర్వహించారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, సిబ్బంది పర్యవేక్షించారు.

నాగమయ్య రథోత్సవం

దుర్గి: ధర్మవరంలో నాగమయ్యస్వామి తిరునాళ్ల పురస్కరించుకుని ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు వేడుకను తిలకించారు.

సత్రశాలలో కార్తిక వేడుకలు

రెంటచింతల, న్యూస్‌టుడే: సత్రశాలలో కార్తిక వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం జిల్లా కలెక్టరు కార్యాలయ ఉద్యోగినులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తిక దీపాలు వెలిగించారు. అయ్యప్ప, శివ స్వాములు పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించారు.

రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘంలో చోటు

దుర్గి, న్యూస్‌టుడే: రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘంలో దుర్గికి చెందిన ఉపాధ్యాయుడు అనంతరామయ్యకు చోటు దక్కింది. కార్యవర్గ సభ్యుడిగా ఆయనను ఎంపిక చేశారు. ఈ మేరకు ఆదివారం చిలకలూరిపేటలో జరిగిన ఆదిత్య బ్రాహ్మణ వనసమారాధన కార్యక్రమంలో నియామక పత్రం అందుకున్నారు.

గురజాలలో సంతకాల సేకరణ

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ సీఎం జగన్ ఇచ్చిన పిలుపుమేరకు కాసు మహేశ్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం కోటి సంతకాల కార్యక్రమాన్ని నాయకుడు చినకోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గురజాలలోని జీవీసీ కాలనీలో ఈ కార్యక్రమం చేపట్టారు.

మృతదేహం గుర్తింపు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని బుగ్గవాగు సమీపంలోని పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. మృతదేహం రైతుకు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని ఎస్సై శివనాగరాజు పరిశీలించారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉంటుందని ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యే యరపతినేనిని గజమాలతో సత్కరిస్తున్న గౌడ నాయకులు

గురజాల: ఇష్టకామేశ్వరి ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘ నాయకులు

సత్తెనపల్లి: బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బాలికలకు బహుమతుల అందజేత

సత్తెనపల్లి: ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ బాధ్యులు

భక్తిశ్రద్ధలతో కార్తిక వనసమారాధన

కార్తిక మాసం సందర్భంగా ఆదివారం పలు సామాజిక వర్గాల వన సమారాధన కార్యక్రమాలు సందడిగా సాగాయి. తొలుత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పిల్లలు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంఘీయులందరూ కలిసి వనభోజనాలు చేశారు. రోజంతా సరదాగా గడిపారు. - న్యూస్‌టుడే, బృందం

పిడుగురాళ్ల: మహిళల కోలాటం

గృహ నిర్మాణానికి దరఖాస్తు గడువు పెంపు

మాచవరం: 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ పథకం' కింద ఇళ్లు లేని నిరుపేదలు ఈనెల 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చని గృహ నిర్మాణ శాఖ ఏఈ రాంసైదా తెలిపారు. ఈనెల 5న గడువు ముగియగా, రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్రం ప్రభుత్వం మరోమారు గడువు పెంచినట్లు ఆయన చెప్పారు. గ్రామ సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షల సాయం అందుతుందని పేర్కొన్నారు.

మాచర్ల: మాచర్ల మండలంలోని బెల్లంకొండవారిపాలెం, సుబ్బారెడ్డిపాలెం, బోదనంపాడు గ్రామాల్లో ఇళ్లు లేని ఎస్టీలు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ మరియదాసు తెలిపారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

బెల్లంకొండ, న్యూస్‌టుడే: బెల్లంకొండ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తొలుత బెల్లంకొండలో రూ.16 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని తెదేపా సీనియర్ నాయకుడు వెన్నా సాంబశివారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం రూ.5 కోట్లతో మన్నెసుల్తాన్ పాలెం- వెంకటాయపాలెం బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. వెంకటాయపాలెంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. రూ.1.25 కోట్లతో రామాంజనేయ పురంలో సీసీ రోడ్లు, గుడిబండ శివాలయానికి వెళ్లే రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం కోళ్లూరు ఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ, నందిరాజుపాలెం సొసైటీ నూతన కమిటీ ఛైర్మన్‌లతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆసుల జగన్, ఓర్సు ఆనంద్, అక్కల సుబ్బారెడ్డి, శ్రీనునాయక్, మస్తాన్ షరీఫ్, జ్యోతి సముద్రం, శ్రీరామమూర్తి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాయపాలెంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు

రజకుల అభ్యున్నతికి ప్రాధాన్యం

సత్కారం అందుకున్న తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, రజక సంఘ నాయకులు

నీలేశ్వరపాలెం(అచ్చంపేట): రజకుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలోని నీలేశ్వరపాలెం నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం అచ్చంపేట, క్రోసూరు మండలాల రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గుర్రపుసాల రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని సందేశం ఇచ్చారు. సేవా సమితి నాయకులు బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, అక్కారావు, రోశయ్య, బొల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగించేదెవరు

అమరావతిలోని పాత మ్యూజియం వద్ద రోడ్డుపై మురుగు నిల్వ ఉండటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు వెళ్లే మార్గం లేక పాచి పట్టి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెంది ప్రజలపై దాడి చేస్తున్నాయి. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, అమరావతి

దాచేపల్లి మండలం పొందుగల గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కాలువల్లో పూడిక నిండటంతో మురుగు నీరు రోడ్డెక్కుతోంది. దుర్వాసనతోపాటు దోమల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తొలగించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, దాచేపల్లి

ఏ స్తంభం ఎప్పుడు పడుతుందో

సత్తెనపల్లి మండలం లక్ష్మీపురంలోని ప్రధాన వీధిలో పలు విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయాయి. గ్రామంతోపాటు గుడిపూడి నుంచి పణిదం వైపు వెళ్లే వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ప్రమాదం పొంచి ఉంది. కొద్దిపాటి గాలి వీచినా పడిపోయే ప్రమాదం ఉంది. సత్వరమే స్తంభాలను సరిచేసి, ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని విద్యుత్తు అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సత్తెనపల్లి గ్రామీణ

గుంత.. ప్రమాదాల చింత

గురజాల - కారంపూడి రహదారిలో చర్లగుడిపాడు సైదులుబాబా దర్గా వద్ద గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు గుంతల్లో చేరింది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక అదుపుతప్పి పడిపోతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చించాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చర్లగుడిపాడు (గురజాల గ్రామీణ)

పేదలకు అండగా నిలుద్దాం

మాచర్ల (కారంపూడి): ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు శ్రీనివాస్, అనిల్‌కుమార్‌లకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని దాత మండవ రవి అందించారు. ఆదివారం మాచర్లలోని నరిశెట్టి కల్యాణ మండపంలో కాకతీయ కమ్మ జన సేవా సమితి కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఇందులో భాగంగా పేద విద్యార్థులకు చేయూత అందించారు. ఈ క్రమంలో మాజీ ఐజీ వెంకటనర్సయ్య మాట్లాడుతూ తమవంతుగా సామాజిక సేవలు చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలకు రూ.10 లక్షల విలువైన బహుమతులను రవి, వేణుగోపాల్ మిత్ర బృందం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు బ్రహ్మం, మల్లికార్జునరావు, వేణుగోపాల్, ఆంజనేయులు, చెన్నకేశవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న దాత రవి, సేవాసమితి సభ్యులు

అన్నదానానికి విరాళం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: కోటప్పకొండ త్రికోటేశ్వరుని అన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. విజయవాడకు చెందిన యలవర్తి శశిధర్ ఆయన తల్లి పద్మజ పేరుతో రూ.1,01,116 చెక్కు ఆదివారం దేవాలయం అధికారులకు అందజేశారు. కుటుంబసభ్యులతో కలిసి వచ్చి ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు విరాళం అందజేసినట్లు ఈవో చంద్రశేఖరరావు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రసంగిస్తున్న ఎస్టీయూ నాయకుడు సుధీర్‌బాబు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఆ సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుధీర్‌బాబు అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక డిమాండ్లు నెరవేరాలంటే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం ఒక్కటే మార్గమని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామిరెడ్డి, చంద్రజిత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాని తెలిపారు. సత్తెనపల్లి మండలశాఖ నూతన అధ్యక్షుడిగా పి.వెంకయ్య, ప్రధాన కార్యదర్శిగా మహబూబ్ సుభాని, ఆర్థిక కార్యదర్శిగా బ్రహ్మేంద్రనాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆత్మవిశ్వాసంతో రాణించండి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పబ్లిక్ పరీక్షలపై భయం వద్దని.. ఆత్మవిశ్వాసంతో రాణించాలని పరీక్షల విభాగం జిల్లా సహాయ కమిషనర్ హుస్సేన్, ఉపవిద్యాశాఖాధికారి యేసుబాబు పదో తరగతి విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, సుగాలి ఉన్నత పాఠశాల, ముప్పాళ్ల, రాజుపాలెం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధతను ఆదివారం వారు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ తీరు చూశారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ నెలాఖరుకు సిలబస్ పూర్తిచేసి, డిసెంబరు 1 నుంచి 100 రోజుల ప్రణాళిక అమలు చేయాలని సూచించారు.

సూచనలిస్తున్న పరీక్షల విభాగం జిల్లా సహాయ కమిషనర్ హుస్సేన్

చట్టాలపై అవగాహన తప్పనిసరి

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

మాడుగుల (గురజాల గ్రామీణ), న్యూస్‌టుడే: సామాన్యులకు అందుబాటులో న్యాయ సేవలు ఉన్నాయని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు తెలిపారు. మాడుగుల గురుకుల పాఠశాలలో ఆదివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఉచిత న్యాయ సహాయం, ఎస్సీ, ఎస్టీ చట్టం, బాలల చట్టాలు, లోక్ అదాలత్ తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జానీబాషా, బార్ అసోసియేషన సెక్రటరీ చలమరాజు, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట: ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పారా లీగల్ వాలంటీర్ సుభాని పేర్కొన్నారు. ఆదివారం వేల్పూరులో జాతీయ న్యాయసేవల దినోత్సవం నిర్వహించారు. డిసెంబరు 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా సత్తెనపల్లి కోర్టు పరిధిలోని పెండింగ్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు.

విజయపురిసౌత్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జిలు శ్రీనివాస్ కల్యాణ్, ప్రశాంత్ అన్నారు. ఆదివారం విజయపురిసౌత్‌లోని పీటీజీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై రాంబాబు, ప్రిన్సిపల్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఒంటికి.. రెంటికి రోడ్డెక్కాల్సిందే

జాతీయ రహదారిపై విద్యార్థులు

దాచేపల్లి మండలం గామాలపాడు జడ్పీ ఉన్న పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2014-19 మధ్య నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. గత వైకాపా ప్రభుత్వం నాడు-నేడులో భాగంగా తరగతి గదులు నిర్మించినా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టలేదు. ఫలితంగా విద్యార్థులు పాఠశాల ఎదుట జాతీయ రహదారిపైకి వెళ్లి మలమూత్ర విసర్జన చేయాల్సి వస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, దాచేపల్లి

ఊరి దారిలో ఉక్కిరిబిక్కిరి

బ్రాహ్మణపల్లి (పిడుగురాళ్ల), న్యూస్‌టుడే: పల్లె చిత్రం.. సినిమాలో చూపినంత ఆహ్లాదంగా లేదు. చాలా ఊళ్లలో అడుగు పెడితే వ్యర్థాల కుప్పలే దర్శనమిస్తున్నాయి. దారికి ఇరువైపులా చెత్తాచెదారం వేసి, నిప్పు పెట్టే దృశ్యాలు కనిపిస్తున్నాయి. రాకపోకలకే కాదు ప్రజారోగ్యానికి ఇబ్బందిగా మారుతోంది. గ్రామాల బాగుకు పంచాయతీల ఆర్థిక సామర్థ్యం చాలడం లేదు. రూ.కోట్లతో నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలు దిష్టిబొమ్మల్లా ఉన్నాయి. తడి-పొడి చెత్త సేకరణ సంపద సృష్టి ప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. పారిశుద్ధ్య నిర్వహణ గతి తప్పి దోమల బెడద ఎక్కువై రోగాలు ముసురుతున్నాయి.

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు

బ్రాహ్మణపల్లి ప్రధానరోడ్డు పక్కన, బ్రాహ్మణపల్లి నుంచి కరాలపాడు వెళ్లే దారిలో చెత్త కుప్పలుగా వేసి తగలబెడుతున్నారు. అక్కడే చెరువు ఉంది.. మరో వైపు రోడ్డుకు అవతల ఎనిమిది వందల మంది విద్యార్థులు చదువుకునే పాఠశాల ఉంది. చెత్త నుంచి దుర్వాసన వస్తోంది. నిప్పు పెట్టినప్పుడు పొగ ప్రయాణికులు, విద్యార్థులను చుట్టుముడుతోంది. వ్యర్థాలు చెరువులో పడి నీరు కలుషితం అవుతోంది. కరాలపాడు, తుమ్మలచెరువు, పందిటివారిపాలెం, జూలకల్లు, జానపాడు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. గ్రామాల్లో చెత్త సేకరించి, సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలని జిల్లాస్థాయి అధికారులు చెబుతున్నా.. మండల, పంచాయతీ అధికారులు బేఖాతరు చేస్తున్నారు. ఇప్పటికైనా చెత్తతో సంపద సృష్టించి, పంచాయతీలకు ఆదాయం తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్రాహ్మణపల్లి వద్ద రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలు

వాగు ఆగదు.. ప్రయాణం సాగదు

పిల్లేరు వాగు ప్రవాహం

మండలంలోని లోలెవల్ చప్టాలు ప్రమాదకరంగా మారాయి. వర్షం పడితే చాలు.. వాగులు పొంగి రోడ్డెక్కుతున్నాయి. పిల్లేరు, గాంధీనగరం వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగుకు ఎగువ, దిగువ భాగంలో కంపచెట్లు, పూడికతో మూసుకుపోవడంతో సమస్య తలెత్తుతోంది. నాగేశ్వరపురం తండా సమీపంలోని పిల్లేరు వాగు ఉద్ధృతి అంతా ఇంతా కాదు. ఏడాదిలో సగం రోజులు లోలెవల్ చప్టాపై నీరు ప్రవహిస్తుంది. వాహనదారులు, రైతులు, కూలీల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెనలు నిర్మిస్తే, ప్రయాణం సాఫీగా సాగించవచ్చని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మాచవరం

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి అంజిరెడ్డి తెలిపారు. 16 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు ఉండి, పదో తరగతి ఆపై చదివిన యువతీయువకులు ఈనెల 15లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఫీల్డ్‌టెక్నీషియన్ అండ్ కంప్యూటర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ కస్టమర్ రిలేషన్, ఆటోమేటివ్ ఐఓటీ అప్లికేషన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వివరాలకు 77798 58789 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలి

రెంటచింతల, న్యూస్‌టుడే: తుపాను కారణంగా మృతి చెందిన మూగజీవాలకు ప్రత్యేక నిధి ద్వారా పరిహారం ప్రకటించాలని గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రావు కోరారు. ఆదివారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశుసంవర్ధకశాఖ అధికారులు తక్షణమే సర్వే చేసి, పెంపకందారులను ఆదుకోవాలన్నారు. మృతి చెందిన గొర్రెలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలన్నారు.

(c) eenadu

శిఖపరువు జలపాతం వద్ద సందర్శకులు

జలమంతా జనం

సాలూరు మండలంలోని శిఖపరువు, దళాయివలస గ్రామాల సమీపంలోని జలపాతాలకు ఆదివారం సందర్శకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మొంథా తుపాను అనంతరం నీటి ఉద్ధృతి పెరగడంతో ఎవరూ ఇటువైపు రాకుండా సాలూరు గ్రామీణ పోలీసులు కొద్ది రోజుల క్రితం హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు. ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో వారిని అనుమతించారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జలపాతం వద్ద పహారా కాశారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

జీవన ప్రమాణం.. అవసరం లేదు ప్రయాణం

పింఛనుదారులు ఇంటి నుంచి కాలు బయట పెట్టకుండా జీవన ప్రమాణ పత్రం(లైఫ్ సర్టిఫికెట్) సమర్పించే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. ఏటా పింఛనుదారులు ఈ పత్రం కోసం ప్రయాసపడేవారు. మీసేవ, నెట్ సెంటర్ల చుట్టూ తిరిగేవారు. చరవాణిలో ముఖ ఆధారిత గుర్తింపు ద్వారా ఇంటి నుంచే పత్రం పొందేలా యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. – న్యూస్‌టుడే, సాలూరు

రిజిస్ట్రేషన్ ఇలా..

- గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి జీవన్ ప్రమాణ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి.
- ఆధార్ సంఖ్య, చరవాణి నంబరు, ఈ-మెయిల్ ఐడీ అందులో నమోదు చేసి సబ్‌మిట్ నొక్కాలి.
- చరవాణికి ఓటీపీ వస్తుంది. అది ఎంటర్ చేస్తే ముఖ ఆధారిత గుర్తింపు నిర్ధారణ జరుగుతుంది.
- చరవాణిలో సర్కిల్ వస్తుంది. ముఖం కనిపించేలా స్పష్టంగా చరవాణి కెమెరా ఉంచాలి. పచ్చటి గీతతో సర్కిల్ వచ్చి సందేశం చేరితే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది.

క్షణాల్లో నమోదు..

★ రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే యాప్ క్లోజ్ చేసి మళ్లీ ఓపెన్ చేయాలి. తర్వాత ఆధార్ సంఖ్య, చరవాణి నంబరు, ఈ-మెయిల్ ఐడీ అడుగుతుంది. ఈ వివరాలు నమోదు చేసి సబ్‌మిట్ కొట్టిన వెంటనే పింఛను వివరాలు వస్తాయి.

గతంలో పత్రం పొందనివారైతే..

వివరాలను కొత్తగా నమోదు చేయాలి. పేరు, పీపీవో నంబరు, బ్యాంకు, డిపార్టుమెంట్, పింఛను మంజూరు ఏజెన్సీ వివరాలు ఎంటర్ చేయాలి. తర్వాత రౌండ్ సర్కిల్‌లో ముఖం స్పష్టంగా కనిపించేలా ఫొటో తీసుకుంటే ప్రక్రియ పూర్తయినట్లు సందేశం వస్తుంది.

రైలొచ్చేవరకు ఇంట్లో ఉన్నట్లే..!

న్యూస్‌టుడే, విజయనగరం రింగురోడ్డు

మనం ఎక్కాల్సిన రైలు గంటల తరబడి ఆలస్యమైనా.. ఏ అర్ధరాత్రి పూటో బండి దిగి ఆ సమయంలో ఇంటికి వెళ్లే పరిస్థితి లేకున్నా.. కాస్త రుసుము చెల్లించి స్టేషన్‌లోనే హాయిగా సేదతీరవచ్చు. ఇందుకు విజయనగరం స్టేషన్‌లో ఏసీ విశ్రాంతి గదులు.. సౌకర్యవంతమైన కుర్చీలు.. కాలకృత్యాలు తీర్చుకునే హైజెనిక్ వాష్‌రూమ్‌లు.. వేడి, చల్లని తాగునీటి సదుపాయాలు ప్రయాణికులకు అందుతున్నాయి. ప్రయాణం టికెట్ మాత్రం తప్పనిసరిగా ఉండాలండోయ్.

డీలక్స్ డబుల్ బెడ్ రూమ్ అయితే..

వ్యవధి (గంటల్లో)	అద్దె (రూ.లలో)
3	550
6	750
9	1,000
12	1,200
24	1,800
48	3,000

★ ఇందులో నలుగురు ఉండొచ్చు.

విజయనగరం రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశించగానే కుడి వైపున ఆ శాఖ ఏసీ విశ్రాంతి గదుల సముదాయం ఏర్పాటు చేసింది. 12 ఏళ్లు దాటిన వారికి గంటకు రూ.20, 12 ఏళ్లలోపు వారికి రూ.10 రుసుము వసూలు చేస్తారు.

విశ్రాంతి గదులు

సూట్ రూమ్‌లో డబుల్ కాట్ మంచంతో..

వ్యవధి (గంటల్లో)	అద్దె (రూ.లలో)
3	800
6	1,050
9	1,450
12	1,850
24	2,250
48	3,500

★ ఈ రూమ్‌లో అయిదుగురు వరకు ఉండొచ్చు.

ప్రత్యేక గదులతో వసతి రైల్వే శాఖ కొన్ని సేవలను నేరుగా నిర్వహిస్తుండగా.. మరికొన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. ఏసీ గదులతో హోటల్ సేవలనూ అందుబాటులోకి తెచ్చింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఈ సేవలు పొందొచ్చు.

డార్మెటరీ సింగిల్ బెడ్ రూమ్.. ఇందులో ఒకరు మాత్రమే ఉండాలి. 3 గంటలుంటే 300, ఆరైతే 400, 9 గంటలుంటే 500, ఒక పూటకు 600, రోజుకు 900, రెండు రోజులకు 1,400 రూపాయలు ఛార్జీ వసూలు చేస్తారు.

పార్టీలతో పనేముంది.. పంచేసుకుందాం!

అసైన్డ్ భూముల వ్యవహారంలో ఇదీ నాయకుల తీరు

ఈనాడు, విజయనగరం

పేదల జీవనోపాధికి ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములు కొందరు పెద్దల చేతుల్లోకి వెళ్లేందుకు పార్టీల కతీతంగా పావులు కదులుతున్నాయి. తొలుత వైకాపా నేతలు ఒప్పందం కుదుర్చుకున్న భూముల పంచాయితీ వ్యవహారం ఇప్పుడు కూటమి పార్టీల నేతల చెంతకు వచ్చింది. మిగతా వ్యవహారాల్లో ప్రత్యర్థులుగా కనిపించే పార్టీల నాయకులు భూముల విషయంలో మనం.. మనం.. బరంపురం అంటూ పల్లవి అందుకున్నారు. మీరు పని చేయించండి.. రైతులతో తొలుత మేము కుదుర్చుకున్న ఒప్పందం మేరకు మాకు ఇవ్వాల్సింది ఇచ్చేయండి.. ఆపై ఎంత తీసుకున్నా మీ ఇష్టం.. అంటూ కూటమి కీలక నాయకులతో వైకాపా నాయకులు పెద్ద మనషుల ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.

విజయనగరం జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ, కొత్తవలస, వేపాడ, ఎస్.కోట, మన్యం జిల్లాలో పార్వతీపురం, వీరఘట్టం, పాలకొండ మండలాల్లోని జాతీయ, రాష్ట్ర రహదారులకు సమీపంలోని డి-పట్టా భూములు పెద్ద ఎత్తున ఇలా చేతులు మారిపోయాయి. ఈ దశలో ఎన్నికల ప్రకటనతో వ్యవహారానికి బ్రేక్‌పడింది. మళ్లీ వైకాపా వస్తుందని. ఫ్రీ హోల్డ్ ఉత్తర్వులు జారీ తర్వాత భూములు తమ స్వాధీనమవుతాయని అక్రమార్కులు ఆశపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్రీహోల్డ్ వ్యవహారాన్ని ఎటూ తేల్చకుండా ఉంచింది.

భోగాపురం ప్రాంతంలో భూములకు సంబంధించి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని నాయకుల మధ్య ఈ వ్యవహారం నడుస్తోందని తెలిసింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పేదల భూములపై వైకాపా అధికారంలో ఉన్నప్పుడే ఆ పార్టీ నాయకుల కళ్లు పడ్డాయి. డి-పట్టాలు అందుకుని ఇరవై ఏళ్లు పూర్తయిన లబ్ధిదారులకు ఆ భూములపై ప్రభుత్వం హక్కు కల్పించనుందని ఉప్పందడంతో జీవో విడుదలకు ముందే పేదల భూముల్లో వాలిపోయారు. అప్పటి రాష్ట్ర ఉన్నతాధికారి కుమారుడు, అతడి మిత్రులు జల్లెడ పట్టి డి-పట్టాదారుల వద్దకు బినామీలను పంపి మాట్లాడించారు. బతిమాలి.. భయపెట్టి.. ఎకరానికి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలు ధర నిర్ణయించారు. ముందుగా ఎకరానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు చెల్లించారు. రిజిస్ట్రేషన్ సమయంలో మిగిలిన మొత్తం చెల్లిస్తామని ఒప్పంద పత్రాలు రాసుకున్నారు.

భోగాపురం మండలంలోని అసైన్డ్ భూములు

ఉభయ జిల్లాల వివరాలు (ఎకరాల్లో)

జిల్లా	ఫ్రీ హోల్డ్‌కు అనుమతి	రిజిస్ట్రేషన్లు జరిగినవి
విజయనగరం	5,618.36	191
పార్వతీపురం మన్యం	16,201.93	187

కూటమి నేతల కోర్టులో అసైన్డ్ బాల్

మాజీ మంత్రి ఒకరు విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పరిధిలో సుమారు 400 ఎకరాలకు ఇలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కొంత అడ్వాన్స్ చెల్లించారు. ఒప్పంద గడువు ముగియడంతో ఇప్పుడు కూటమి నేతలతో జట్టుకట్టారు. ఇందులో తామేమీ పెట్టుబడి పెట్టేది లేకపోవడంతో వారూ తలూపారు. అనధికారికంగా వందలాది డి-పట్టా భూములు కొనుగోలు చేసిన వైకాపా నాయకులు రైతుల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఈ వ్యవహారం నుంచి ఎలాగైనా బయటపడాలని ప్రయత్నిస్తున్నారు. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో బినామీ పేరిట 800 ఎకరాలకు పైగా కొనుగోలు చేసి తన కుమారుడి మిత్ర బృందం తరపున రిజిస్ట్రేషన్‌కు విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు పావులు కదిపారు. రిజిస్ట్రేషన్లు జరిగే సమయంలో ఆరోపణలు వెల్లువెత్తడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. డెంకాడ మండలంలో 200 ఎకరాలు, భోగాపురం మండలంలో 800 ఎకరాల వరకు రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి.

సంకల్పం మంచిదే.. నిధులే సరిపడలే!

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులకు రక్షిత జలం అందివ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నీటి శుద్ధి యంత్రాలు అందించింది. సాలూరు మండలంలోని సొంత భవనాలున్న 56 కేంద్రాలకు ఇలా యంత్రాలిచ్చారు. ఒక్కో యంత్రం ధర రూ.16 వేలు. భవనంపై ట్యాంకు ఏర్పాటు చేసి పైపు కనెక్షన్లు ఇచ్చారు. సమీపంలో పంచాయతీ కుళాయి అందుబాటులో లేకపోవడంతో ఇప్పటి వరకూ నీరందించలేకపోయారు. 56 భవనాలకు పనులు పూర్తిచేశామని, పంచాయతీ కుళాయిలు అందుబాటులోఉన్న నాలుగింటికి కనెక్షన్లు ఇచ్చామని ఆర్‌డబ్ల్యూఎస్ గౌస్ తెలిపారు. మిగిలిన వాటికి మోటారు ఏర్పాటు చేయాలంటే నిధులు సరిపడలేదని చెప్పారు.

చినబోరబంద కేంద్రంలో నిరుపయోగంగా శుద్ధియంత్రం

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

భవితపై సీఆర్టీల కలవరం

సీతంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసిన మెగా డీఎస్సీలో ఎంపికైన రెగ్యులర్ ఉపాధ్యాయులు గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో చేరడంతో ఇన్నాళ్లు ఆయా చోట్ల పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల(సీఆర్టీ)ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడకు వీరిని పంపించేలా గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో ప్రస్తుతం 34 మంది ఉన్నారు. రెండురోజుల క్రితం సీతంపేటలోని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయానికి సీఆర్టీలను రప్పించి, ఆప్షన్లు తీసుకున్నారు. దీనిపై సీతంపేట ఐటీడీఏలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సైతం వీరు అర్జీ ఇచ్చారు. విధులు నిర్వహిస్తున్న తమను డీ గ్రేడ్ చేయకుండా సీనియారిటీ ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్‌లుగా కొనసాగించాలని విన్నవించారు.

మెరుగైన వైద్యం.. మరింత ఊతం

ఆసుపత్రులకు త్వరలో ప్రత్యేక పరికరాలు

న్యూస్‌టుడే, శృంగవరపుకోట

ఉమ్మడి జిల్లాలో 15 జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో గైనకాలజీ, పీడియాట్రిక్, ఆప్తమాలజీ వైద్యసేవలు మెరుగు పర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.30 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గౌర్ కొద్ది రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో ఉన్న జిల్లా ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లోని ఈ విభాగాల్లో ఉన్న పరికరాలు గుర్తించి, అవసరమైనవి సమకూర్చాలని ఆదేశాలిచ్చింది.

★ పార్వతీపురం మన్యంలో 150 పడకల జిల్లా ఆసుపత్రి, 100 పడకల పాలకొండ, సీతంపేట, సాలూరు, 50 పడకల భద్రగిరి, కురుపాం, 30 పడకల చినమేరంగి ఆసుపత్రులకు పరికరాలు అందిస్తారు.

ఏం ఇస్తారంటే..

గైనకాలజీ : వ్యాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్లు, డబుల్ పౌచ్, లేబర్ టేబుల్, ఫీటల్ డాప్లర్, సీటీజీ మిషన్, బేబీ వార్మర్, ఎగ్జామినేషన్ లైట్

పీడియాట్రిక్: బేబీ వార్మర్, ఫొటోథెరపీ సింగిల్, బేబీ వేయింగ్ మిషన్

ఆప్తమాలజీ: కంటి పరీక్షలకు సంబంధించి పరికరాలు సమకూరుస్తారు.

- ఈ మూడు విభాగాల్లో వైద్య నిపుణుల పోస్టు ఉందా, ఎన్ని పడకలు, ముఖ్యమైన పరికరాలు ఉన్నాయా? అవసరమైనవి ఏమిటి.. తదితర వివరాలు సేకరించారు.

వెళ్లి రండి మాస్టారు.. విద్యా వ్యవస్థను మార్చండి

సింగపూర్‌కు ముగ్గురు గురువులు

విద్యా వ్యవస్థలో మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన పలువురిని.. అత్యుత్తమ విద్యా ప్రమాణాలు పాటిస్తున్న సింగపూర్‌కు పంపించేందుకు ఎంపిక చేసింది. విద్యా శాఖ మంత్రి లోకేశ్‌తోపాటు వీరు అక్కడ ప్రముఖ పాఠశాలల్లో విద్యా విధానాన్ని అధ్యయనం చేసి.. మన రాష్ట్రంలో ఉత్తమ ఫలితాల సాధనలో కీలక పాత్ర వహించనున్నారు. జిల్లా నుంచి యర్రా శంకరరావు, డి.లక్ష్మణరావు, బౌరోతు శంకరరావు ఈనెల 27న సింగపూర్ వెళ్లి.. డిసెంబర్ 2 వరకు పరిశీలించనున్నారు. – న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

అక్కడ చూసి.. ఇక్కడ పాటించేలా..

ఉత్తమ గురువులు సింగపూర్‌లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఆధునిక విద్యా విధానం, తరగతి గదిలో సాంకేతిక పరిజ్ఞానం, పాఠశాల వాతావరణం, కరికులం తదితరాలు తెలుసుకుని ఇక్కడ రాష్ట్రంలో వ్యవస్థ మెరుగుకు ఎలాంటి పద్ధతులు అవలంబించాలో అధ్యయనం చేయనున్నారు.

మంచి ఫలితాలు సాధిస్తాం

సింగపూర్‌లో విద్యా విధానాన్ని అధ్యయనం చేసి, మంచి ఫలితాలు సాధించగలమని భావిస్తున్నా. వారు పాటిస్తున్న పద్ధతులు, అంశాలు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నాం.

– యర్రా శంకరరావు, ఉపాధ్యాయుడు, పెదబుడ్డిడి (బీసీ) పాఠశాల, జియ్యమ్మవలస మండలం

గొప్ప అవకాశం

సింగపూర్ పర్యటనకు ఎంపిక చేయడం గొప్ప అవకాశం. ప్రభుత్వం మంచి ఆలోచన. అక్కడ పరిశీలన వల్ల మన బలహీనతలు, బలాలు తెలుస్తాయి. మార్పునకు అవకాశం ఏర్పడుతుంది. అధ్యయనం చేసిన అంశాల్ని పాటిస్తూ పూర్తిస్థాయిలో న్యాయం చేయడానికి కృషి చేస్తా.

– డి.లక్ష్మణరావు, ప్రిన్సిపల్, ఏపీటీడబ్ల్యూఆర్ఎస్, కొమరాడ

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

ఉత్తమ విద్యా విధానం అమలుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. నేటి సమాజానికి అనుగుణంగా విద్యా బోధన తీరు మార్చాల్సిన అవసరం ఉంది. దానికి సింగపూర్‌లో చదువుల అధ్యయనం శుభపరిణామం.

– బౌరోతు శంకరరావు, సంస్కృత పండితుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాలకొండ

వందేమాతరం.. తెలుగులో వందనం



తెలుగులో వందేమాతరం

సీరపాణి

స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో వీరులకు ఊపిరి పోసి, వారిలో పోరాట కాంక్షను రగిల్చిన గేయం వందేమాతరం. బంకించంద్ర ఛటోపాధ్యాయ రచించిన దీని భావం తెలుగు ప్రజలకు అర్థమయ్యేందుకు జిల్లాలోని పాలకొండకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బుడితి బలరామ్‌నాయుడు (సీరపాణి) వందేమాతర గేయాన్ని తెలుగులోకి అనువదించారు. ఈయన రచించిన డమరుధ్వని(2007) కవితా సంపుటి పుస్తకంలో పొందుపరిచారు. గీతం వెలువడి 150 ఏళ్లు అయిన సందర్భంగా జిల్లావాసులు ఆ ఘనత మరోసారి గుర్తుచేసుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

కన్నీరు పెడదామన్నా కంట్లో రాళ్లే తిరుగుతున్నాయ్..

రెప్ప తెరుద్దామంటే కంట్లో కరకర
నిలువెల్లా రాళ్ల గాయాలు
గుచ్చిగుచ్చి బాధిస్తున్నే ఉన్నాయి..
ఒళ్లంతా పచ్చిపుండు..
నొప్పి నుంచి ఉపశమనం లేదు..
బాధ భరించే ఓపిక లేదు..
చూపు వస్తుందో.. లేదో చెప్పలేం
గాయాలు ఎప్పటికి
తగ్గుతాయో తెలియదు..

చేతిపై గాయాలు...

తొలగించిన రాయి

...ఇదీ పార్వతీపురంలో గత నెల జరిగిన పార్సిల్ బాంబు పేలుడు ఘటనలో గాయపడిన ఓ బాధితుడి వేదన. పేలుడులో తీవ్రంగా గాయపడిన రెడ్డి రమేష్ నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికీ ఆయన శరీరానికి గుచ్చుకున్న నాటు బాంబు రాళ్లు బాధిస్తున్నాయి. కొద్దిరోజుల కిందట కాలికి శస్త్రచికిత్స చేసి మూడు రాళ్లు తొలగించగా.. ఆదివారం చేతికి శస్త్రచికిత్స చేసి పెద్ద పరిమాణంలో ఉన్న రాయిని తీసివేశారు. ఇంకా రాళ్లు ఉండే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. వీటి వల్ల పుండ్లు త్వరగా తగ్గడం లేదని, నొప్పి నుంచి ఉపశమనం కలగడం లేదని బాధితుడి సోదరి భాగ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పార్వతీపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆమె తెలిపారు. కేజీహెచ్‌లో సకాలంలో వైద్యం అంది ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని వాపోయారు.

22 రోజులుగా యాతన

రమేష్ గాయపడి 22 రోజులైనా నేటికీ కళ్లు తెరవలేని పరిస్థితి. వైద్యులు పరీక్షించి కంట్లోని అతి సున్నితమైన పొర దెబ్బతిందని, చూపు వచ్చే అవకాశాలు తక్కువే అన్న సందేహం వ్యక్తం చేసినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. బాధితుడు కూర్చోగలిగితే మరిన్ని కంటి పరీక్షలు చేసి, చూపుపై స్పష్టత ఇవ్వగలమని వైద్యులు అన్నట్లు వారు తెలిపారు.

(c) eenadu

ఆస్వాదిస్తూ.. ఆనందిస్తూ

పాచిపెంట మండలంలోని ఆలూరు గ్రామ సమీపంలో ఉన్న దారగెడ్డ జలపాతం వద్ద పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. పలు ప్రాంతాల నుంచి వాహనాల్లో పిల్లాపాపలతో తరలి వచ్చి అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ కేరింతలు కొట్టారు. జలపాతం వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై వెంకట సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, పాచిపెంట

చలో తాటిపూడి.. చేద్దాం సందడి

జిల్లాలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గంట్యాడ మండలంలోని తాటిపూడిలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. కార్తిక వనవిహారాల కోసం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో చేరి ఆటపాటలతో అలరించారు. జలాశయం వద్ద స్వీయ చిత్రాలు తీసుకొని, అందాలను ఆస్వాదించారు. బోటు షికారు చేసేందుకు పోటీపడ్డారు. మరోవైపు వాహనాలను రోడ్డు పక్కన నిలిపివేయడంతో రాకపోకలకు స్వల్ప అంతరాయం కలిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – న్యూస్‌టుడే, గంట్యాడ

పర్యాటకుల కోలాహలం

సాహస క్రీడలో చిన్నారి

సీతంపేటలోని ఎన్టీఆర్ ఉద్యానంలో ఆనంద వేదిక వద్ద చిన్నారుల నృత్యం

కార్తికమాసం కావడంతో ఆదివారం సీతంపేట మన్యం కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. వన భోజనాలు చేశారు. పలు పర్యాటక ప్రాంతాల్లో తిరుగుతూ సందడి చేశారు. ఐటీడీఏ కేంద్రంలోని ఎన్టీఆర్ సాహస ఉద్యానంలో ఆనందంగా గడిపారు. ఆనంద వేదిక వద్ద వివిధ పాటలకు చిన్నారులు నృత్యాలు చేస్తూ అలరించారు. మెట్టుగూడ, సున్నపుగెడ్డ, మల్లి, బెనరాయి జలపాతాలు, ఆదలి వ్యూ పాయింట్, జగతిపల్లి రిసార్టును సందర్శించారు. – న్యూస్‌టుడే, సీతంపేట

మాట దాటేశారు.. కాలువ దాటమన్నారు

ఈ చిత్రం చూశారా.. ఎంత ప్రమాదకరంగా ఉందో కదా. రోజూ ఇక్కడ పదుల సంఖ్యలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తిరుగుతుంటారు.. ఏ మాత్రం అదుపుతప్పినా ముప్పు తప్పదు. గంట్యాడ మండలంలోని గొడియాడ అంగన్‌వాడీ కేంద్రం వద్ద దుస్థితి ఇది. ఆరు నెలల కిందట ముందు నుంచి మూడు అడుగుల లోతున భారీ మురుగు కాలువ నిర్మించారు. పనులు జరగక ముందే ఏడాది క్రితం తీర్మానం జరిగింది. తప్పనిసరిగా వంతెన వేస్తామని గుత్తేదారు, పంచాయతీ అధికారులు చెప్పారు. కానీ ఇంతవరకు కానరావడం లేదు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు, సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని ఐసీడీఎస్ పీవో ఉమాభారతి తెలిపారు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

నారీ లోకానికి నైపుణ్య తోరణం

టీటీడీసీలో వివిధ రకాల శిక్షణలు

కుట్టు శిక్షణంటే ఇష్టమా.. అయితే చక్కగా నేర్చుకోవచ్చు. దాని ద్వారా ఉపాధి పొందాలనుకుంటున్నారా.. ఇంకెందుకు ఆలస్యం వారే మెటీరియల్ ఇస్తారు.. నచ్చిన దుస్తులు కుట్టి.. అమ్ముకోవచ్చు.. కంప్యూటర్ కోర్సుల్లో చేరి నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని ఉందా.. ఇంకేం అందుబాటులోని ల్యాబ్‌ను ఉపయోగించుకోవచ్చు.. మొక్కలంటే ఇష్టమా.. ఆలస్యమెందుకు నర్సరీకి రండి.. లేకుంటే చేపల పెంపకం చేపట్టాలని భావిస్తున్నారా.. అయితే కొరమీను పిల్లలను అందిస్తారు.. ఒక్కటేమిటి.. ఆసక్తి ఉన్న రంగాల్లో మహిళలు రాణించేందుకు కృషి చేస్తోంది డీఆర్‌డీఏ. ఈ మేరకు అన్నిరకాల శిక్షణలు అందిస్తోంది.

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

విజయనగరంలోని టీటీడీసీ మహిళా ప్రాంగణంలో ఇప్పటికే పెరటి కోళ్ల పెంపకం, అర్హులైన వారికి అందించారు. నర్సరీల ద్వారా మొక్కలను సరఫరా చేస్తున్నారు. ఇటీవల కంప్యూటర్, కుట్టు శిక్షణను ప్రారంభించారు. ఫ్యాషన్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్నారు. కొరమీను చేపల పెంపకంపై మెలకువలు నేర్పిస్తున్నారు. కూరగాయల పంటలు సైతం సాగు చేయిస్తూ ఉపాధి కల్పిస్తున్నారు.

మొక్కతో మేలు

2022 నుంచి ఇన్‌డోర్, అవుట్‌డోర్ మొక్కలను పెంచుతున్నారు. ఈ మేరకు ప్రత్యేకంగా నర్సరీని ప్రారంభించారు. ఎప్పటికప్పుడు కడియం నుంచి తెప్పిస్తున్నారు. ప్రత్యేక రోజుల్లో మండల కేంద్రాల్లో స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. రూ.50 నుంచి రూ.2500 విలువైనవి ఉంటాయి. స్నేక్‌ప్లాంట్, రెడ్‌వైన్, ఆంతూరియం, లక్కీబ్యాంబూ, అరేకాపామ్, చైనీస్ బనియన్ తదితర రకాలున్నాయి. ● కూరగాయలు, ఆకుకూరలు, సాగు చేస్తున్నారు. జిల్లా సమాఖ్యే క్యాంటీన్ నడుపుతోంది.

రాయితీపై కొరమీను..

చేపల పెంపకానికి సిద్ధం చేసిన కొలను

ప్రస్తుతం ఇక్కడ కొరమీను చేపలను పెంచుతున్నారు. పొదుపు సంఘాల్లోని మహిళలకు సొంత భూమి, బోరు, ఇతర వసతులుంటే అందిస్తారు. ఎకరా భూముంటే అందులో పది సెంట్లు కేటాయిస్తే సరిపోతుంది. అయిదు సెంట్ల చొప్పున ఆరడుగుల లోతులో రెండు గుంతలు తవ్వాలి. ఒక్కో దాంట్లో 15 వేల లీటర్ల నీటిని అందుబాటులో ఉంచాలి. యూనిట్‌కు రూ.4.50 లక్షల వరకు ఖర్చయితే.. ఇందులో 35 శాతం రాయితీ దక్కుతుంది. మిగిలిన సొమ్మును బ్యాంకుల నుంచి రుణంగా తీసుకోవచ్చు. జిల్లాలో ఇప్పటికే 40 మంది లబ్ధి పొందారు.

బ్యాచ్‌ల వారీగా..

డీడీయూ, జీకేవై, సీడాప్ ద్వారా కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. ప్రతి మూడు నెలలకో బ్యాచ్ వస్తుంది. ఒకే సారి 70 మంది వరకు చేరవచ్చు. భోజనం, వసతి ఉచితం. తర్ఫీదు అనంతరం ఆన్‌జాబ్ ట్రైనింగ్ కూడా ఉంటుంది. ప్రతిభ ఆధారంగా కొలువులిస్తారు. ప్రస్తుతం 40 మంది ఉన్నారు. ● 302 వరకు కుట్టు యంత్రాలను అందుబాటులో ఉంచారు. 45 రోజుల పాటు అవగాహన కల్పిస్తారు. కోర్సు పూర్తయ్యాక దుస్తులు కుట్టి అమ్ముకునేలా ప్రోత్సహిస్తారు. ప్రస్తుతం ఇలా 70 మంది ఉపాధి పొందుతున్నారు.

అందుబాటులో కుట్టు శిక్షణ కేంద్రం

కిచ్చాడలో కరిరాజుల తిష్ట

కురుపాం మండలంలోని కిచ్చాడ గ్రామ పరిసరాల్లో ఏనుగులు సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. గ్రామంలోని అరటి, చెరకు, వరి పంట పొలాల్లో తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించి, జనవాసాలకు దూరంగా వాటిని తరలించాలని కోరుతున్నారు. మరోవైపు పొలాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని, గజరాజులు కనిపిస్తే ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

గెట్ రెడీ.. ఇదిగో గారడీ

జియ్యమ్మవలస మండలం పెదమేరంగి కూడలిలోని సత్యసాయి కళామందిరం ఆవరణలో మేరంగి నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆసక్తి, గారడీ, అభినయ, ఓ కాకీ వాసి రావయ్య తదితర నాటికలు అలరించాయి. పరిషత్ అధ్యక్షుడు వాసుదేవరావు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

గారడీ నాటికలో ఓ సన్నివేశం

అరచేతిలోనే లెక్కాపత్రం

రాజాం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకుంటున్న బ్యాంకు రుణాలు, కడుతున్న పొదుపు మొత్తాలకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇక నుంచి ఆయా కార్యకలాపాలన్నింటినీ 'మన డబ్బులు- మన లెక్కలు' యాప్‌లో స్వయంగా చూసుకోవచ్చు. జిల్లాలో రెండు విడతల్లో పది గ్రామ సంఘాల్లో ప్రయోగాత్మకంగా పరిశీలించారు. విజయవంతం కావడంతో అన్ని ప్రాంతాల్లో దశలవారీగా అమలు చేసేందుకు రంగంలోకి దిగారు. ప్రతి పది సంఘాలకు ఒక ఈ-నారీని నియమించి, మండలాల వారీగా శిక్షణలు పూర్తి చేశారు. యాప్ ద్వారా లావాదేవీలకు పూర్తి పారదర్శకత ఉంటుందని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు. డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

ఇవీ ప్రయోజనాలు..

సభ్యులు తమ చరవాణిలో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రతిఒక్కరికీ 20 అంకెలతో కూడిన ఐడీ ఉంటుంది. చివరి నాలుగు అంకెలను పాస్‌వర్డ్‌గా ఉపయోగించి లాగిన్ అవ్వొచ్చు. వ్యక్తిగత, గ్రూపు లావాదేవీలన్నీ వెంటనే ప్రత్యక్షమవుతాయి. నెలకు ఎంత వాయిదా చెల్లిస్తున్నారు.. ఇంకెంత అప్పు మిగిలి ఉంది తదితర వివరాలను తెలుసుకోవచ్చు. నిరక్షరాస్య మహిళలు మైక్ ఆప్షన్ ద్వారా ఆడియో రూపంలో వినొచ్చు.

- ● జిల్లాలో గ్రామ సమాఖ్యలు: 1,023
- ● రిజిస్ట్రేషన్ పూర్తయినవి: 938
- ● వాటి పరిధిలోని సంఘాలు: 40,153
- ● అందులోని సభ్యులు: 4.32 లక్షలు
- ● నమోదు పూర్తయినవి: 3,894
- ● నియమితులైన ఈ-నారీలు: 4,016

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న న్యాయమూర్తి బబిత

డెంకాడ, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత కోరారు. జాతీయ న్యాయసేవల దినోత్సవం సందర్భంగా డి.కొల్లాంలో ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయకముందు న్యాయసేవా సంస్థను సంప్రదిస్తే సామరస్యంగా పరిష్కరించు కోవచ్చన్నారు. సివిల్ జడ్జి, న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రవిబాబు, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్సై సన్యాసినాయుడు, సర్పంచి ఎ.శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదో తరగతిలో మందలించారని..
ఆరేళ్లుగా వెంటాడుతున్న విద్యార్థి

రామభద్రపురం, న్యూస్‌టుడే: ఎన్నేళ్లయినా.. ఎక్కడున్నా చిన్నప్పుడు చదువు చెప్పిన ఉపాధ్యాయులను మాత్రం మరిచిపోలేము. కలిసినప్పుడల్లా నమస్కరించకుండా ఉండలేం. కానీ.. అల్లరి చేస్తున్న కారణంగా ఆరేళ్ల క్రితం తరగతి గదిలో మందలించిన గురువుపై ఓ విద్యార్థి కక్ష పెంచుకున్నాడు. అప్పటి నుంచి తరుచూ దాడికి యత్నిస్తున్నాడు. ఈ ఘటన రామభద్రపురం మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. జుమ్మువలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సువ్వాడ వెంకట అప్పలనాయుడు కోట శిర్లాం యూపీ పాఠశాలలో 2019లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ప్రవర్తన బాగోలేదని, సక్రమంగా చదువుకోవాలని అప్పట్లో ఎనిమిదో తరగతి విద్యార్థి చందాపురం గ్రామానికి చెందిన వై.దిలీప్‌ను మందలించారు. అప్పటి నుంచి కక్ష పెట్టుకున్న దిలీప్ గతేడాది అక్టోబరు 4న ప్రధానోపాధ్యాయుడిపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. అప్పట్లో యువకుడిపై కేసు కూడా నమోదైంది. అయినప్పటికీ అప్పుడప్పుడూ బెదిరిస్తున్నాడు. శనివారం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా.. మధ్యలో అడ్డగించాడు. స్థానికులు కొంతమంది తోడుగా వచ్చి హెచ్ఎంను పంపించారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడికి మతిస్థిమితం లేదని, తల్లిదండ్రులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఎస్సై ప్రసాదరావు తెలిపారు.

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

విజయనగరం-శ్రీయనగర్ కాలనీ D-నెం. డ్వార్ 167 (30x50) గజాలు G+2 ఉత్తర ఫేస్ ఇల్లు అమ్మకం. బ్రోకర్ లేనట్ సోక్రత్యం. సం|| 9441749727.

విజయనగరం జిల్లాలో గల రాజాం, పాలకొండ, వీరఘట్టం దూరంలో & అర్బన్ ప్రాంతాల నుండి ఫ్రెంచ్ టీస్ & లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నందు పనిచేయుటకు BDES, రెప్యూటెడ్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్, డిప్యూటీ Exe. ETS కావలెను. మీ ఊర్లోనే మంచి ఉద్యోగం ఇది. మినిమం శాలరీ 18,000/- PF, ESI, గ్రూప్ Ins, 28500/- ఏదైనా డిగ్రీ వయసు 35 సం||లోపు ఉండి అనుభవజ్ఞులైన మంచి జీతం కలదు. Salaried Do'ఈ 10th పాస్ పై KYC కలిగి ఉండి ప్రతి నెల శాలరీ & ORCతో రాయల్టీ కమీషన్ వస్తుంది. RMP, ఇన్సూరెన్స్ రిటైర్డ్ ఏజెంట్స్, లోన్స్ ఇతరులు 9849824071.

JOBS

Restaurant Waiter Jobs కొరకు బాయ్స్/గర్ల్స్ కావలెను. హోటల్ విస్సరింగ్స్, KGH ఎదురుగా, విశాఖపట్నం. వసతి భోజనం. 9849581863

VZM 90 రోజులు ఉచితంగా ఎలక్ట్రికల్ & హార్డ్‌వేర్ సెక్యూరిటీ ట్రైనింగ్‌తో ఉద్యోగం కల్పించబడును. SSC (పాస్) ఇంటర్, డిగ్రీ ITI (పాస్/ ఫెయిల్) Age:18 to 35 7036406699, 9493359472.

SECURITY GUARDS

వైజాగ్ సిటీ, విజయనగరం, శ్రీకాకుళం గల ప్రదేశాల సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ & గార్డ్స్ కావలెను, భోజనం. జీతం: 20వేలు, 26 వేలు. 9014709272.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు [illegible]

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

ఈనాడు క్లాసిఫైడ్స్

5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే

సంప్రదించండి: 8008597609

ప్రతిభను ప్రోత్సహిస్తే..
అపజయాలకు చెక్ పెడతా

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు విశాఖలోని గాజువాక పరిధిలోని కణితి జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పి.మిన్ను అమన్. మన్యం జిల్లాలోని సీతానగరం మండలం జోగింపేట ప్రతిభా పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు జరిగిన 69వ రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభ చాటాడు.

ఆన్‌లైన్‌లోనే..

మిన్ను అమన్

తండ్రి శాంతి రాజ్.. కుమారుడి ఆసక్తిని గమనించి చిన్నతనం నుంచి ప్రోత్సహిస్తున్నారు. మూడేళ్ల కిందట ఆన్‌లైన్‌లో శిక్షణ ఇప్పించారు. ఏడాదిగా విజయవాడ, విజయనగరం, విశాఖలో జరిగిన పలు పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొని సత్తాచాటాడు. ప్రస్తుతం జరుగుతున్న టోర్నీలో విశాఖ జిల్లా జట్టు తరఫున పాల్గొన్నాడు. వ్యక్తిగత విభాగంలో నాలుగో రౌండ్‌లో త్రుటిలో జాతీయ స్థాయి మీట్‌లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయాడు. వ్యక్తిగత శిక్షణ అందించే అవకాశం లేకపోవడంతో ఆన్‌లైన్ సేవలను వినియోగించుకుని సిద్ధమవుతున్నట్లు అమన్ చెప్పాడు. ఆర్థికంగా చేయూతనందిస్తే సత్తా చాటుతాననే ధీమాను వ్యక్తం చేస్తున్నాడు.

– న్యూస్‌టుడే, సీతానగరం

సంపూర్ణ పోషణ.. ఆరోగ్య రక్షణ

న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండేలా సమతుల ఆహారం అందించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. జిల్లాలో చాలామంది గర్భిణులు, చిన్నారులు అనారోగ్యం, రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరితో పాటు కౌమార బాలికలకు గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధికారులు పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సిబ్బంది కార్యక్రమాలు చేపడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జిల్లాలో వివరాలు ఇలా..

- ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 10
- అంగన్‌వాడీ కేంద్రాలు: 2,075
- గర్భిణులు: 4,981
- బాలింతలు: 5,037
- మూడేళ్లలోపు చిన్నారులు: 21,122
- 3-6 ఏళ్ల మధ్య పిల్లలు: 19,572

లోపాలు గుర్తించి.. బొమ్మలతో వివరించి..

● చిన్నారుల్లో వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు లేకపోయినా, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత కనిపిస్తే పోషకాహార లోపం ఉన్నట్లు గుర్తించి పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ● ఆకుకూరలు, కోడిగుడ్లు, పాలు తీసుకోవడం ద్వారా మానసికంగా, శారీరకంగా ఎలాంటి ఎదుగుదల ఉంటుందో బొమ్మల రూపంలో వివరిస్తున్నారు. ● చిన్నారులు ఒకేసారి ఎక్కువగా కాకుండా తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నారు. ● వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని చెబుతున్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి..

గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవాలి. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నెలరోజులపాటు పోషకాహార మాసోత్సవాల్లో అవగాహన కల్పించాం. షెడ్యూలు ప్రకారం రోజు వారీ చేసిన కార్యక్రమాలను పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశాలిచ్చాం. ఆమేరకు ఆహారం తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. సద్వినియోగం చేసుకోవాలి.

- కనకదుర్గ, పీడీ, ఐసీడీఎస్, మన్యం జిల్లా

ఎక్కడో పుట్టాం.. ఇక్కడే కలిశాం

కొత్తవలస మండలం వియ్యంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-08 వరకు చదువుకున్న 140 మంది విద్యార్థులు ఆదివారం ఇదే బడిలో కలుసుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో స్థిర పడిన వారంతా వచ్చారు. చిన్ననాటి మిత్రులను కలిసి, అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. గురువులను సత్కరించారు. పాఠశాలకు ప్రింటర్‌ను అందజేశారు. బడి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మొయ్యి ముత్యాల నాయుడు, కింతాడ పోలినాయుడు సారథ్యంలో కార్యక్రమం నిర్వహించారు.

– న్యూస్‌టుడే, కొత్తవలస

వియ్యంపేటలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వ్యవసాయం గిట్టుబాటు కాక ఆత్మహత్యలు

ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న నాయకులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: వ్యవసాయం గిట్టుబాటు కాక దేశంలో ఏటా వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అన్నారు. ఆదివారం ఎస్.కోటలో నిర్వహించిన రైతు సంఘం జిల్లా 9వ మహాసభలో ప్రసంగించారు. అంతకుముందు భారీ ర్యాలీ చేపట్టి, జెండా ఆవిష్కరించారు. అమరులైన రైతులకు, సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ అన్నారు. సింగిరెడ్డి గోపాలం, బి.రాంబాబు, ఎం.కృష్ణమూర్తి, కె.అప్పారావు, టి.సూర్యనారాయణ, నాయకులు లక్ష్మి, రెడ్డి శంకరరావు, కె.సురేష్, శ్రీనివాస్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

పావులు కదిపారు.. పతకం పట్టారు

జాతీయ స్థాయికి ఎంపికైన అండర్-19 బాల బాలికలు

సీతానగరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి చదరంగం క్రీడా పోటీల్లో అనంతపురం జిల్లా బాలబాలికలు సత్తా చాటారు. అండర్-19 విభాగంలో బృంద పోటీల్లో అనంతపురం బాలుర, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. సీతానగరం మండలం జోగింపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలోని మినీ ఆడిటోరియంలో ఆదివారం పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. వ్యక్తిగత, జట్ల విజేతలకు తహసీల్దారు ప్రసన్నకుమార్, ఎంపీడీవో వెంకటరావు, ఎంఈవోలు సూరిదేముడు, వెంకటరమణ, స్వచ్ఛాంధ్ర బోర్డు డైరెక్టరు బి.లక్ష్మణరావుల చేతుల మీదుగా పతకాలు అందజేశారు. అండర్-14, 17, 19 వ్యక్తిగత విభాగాల్లో బాలికలు 15 మంది, బాలురు 15 మంది జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.మురళి తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి దుర్మరణం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కాలి నడకన వెళ్తున్న ఓ వృద్ధుడిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతిచెందిన ఘటన పార్వతీపురం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సిపురానికి చెందిన దుర్గయ్య(65) ఆదివారం ఉదయం నడుచుకుంటూ పార్వతీపురానికి బయలుదేరారు. ఓలేటి ఫారం దాటిన తర్వాత వెనుకనుంచి వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు, మనవళ్లున్నారు. కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై సంతోషి తెలిపారు.

చికిత్స పొందుతూ విశ్రాంత ఉద్యోగి మృతి

మక్కువ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలిలో ఈనెల 4న బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విశ్రాంత ఉద్యోగి ఆకుల తవిటినాయుడు(78) ఆదివారం మృతి చెందారు. కిరాణా సామగ్రి కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వచ్చిన ఆయనను దుగ్గేరు వెళుతున్న బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఎడమకాలు విరిగి తీవ్ర రక్తస్రావం జరిగింది. పరిస్థితి విషమంగా ఉందని ఆయనను విశాఖపట్నం తరలించారు. అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మక్కువ ఎస్సై వెంకటరమణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృత్యువాత

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై శ్రీకాకుళం నగర సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి దుర్మరణం పాలైంది. పోలీసుల వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన ఎన్.వేణు(22) అనే యువతి, శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్లారు. కొత్త రహదారి వద్ద ఓ లారీ డ్రైవర్ నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా వాహనంతో ఢీకొన్నారు. ఘటనలో వేణు కిందపడి పోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. లారీ డ్రైవర్, శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు చేరుకుని సర్వజనాసుపత్రికి తరలించారు.

చికెన్ ధరలు

రకం	బ్యాగ్‌లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	125	220	230

(c) eenadu

అడ్డాపుశీల తోటలో వనభోజనాల సందడి

వనసమారాధన

కార్తిక మాసం సందర్భంగా వన సమారాధనలతో జలపాతాలు, ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు సందడిగా మారాయి. సంఘాలు, స్నేహితులు, కుటుంబాలతో భోజనాలు చేశారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో రోజంతా ఉత్సాహంగా గడిపారు.

కొమరాడ: కోటిపాం మామిడితోటలో శిష్టకరణాల సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించారు. కవులు, రచయితలు, విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులను, జిల్లా స్థాయి అవార్డు గ్రహీతలను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. సంఘ అధ్యక్షుడు కె.ఎస్.పి. పట్నాయక్, పీవీజీ రాజు, ఎ.సురేష్ పాల్గొన్నారు.

చిన్నారుల నృత్యం

అడ్డాపుశీల కళకళ

పార్వతీపురం గ్రామీణం: అడ్డాపుశీల ఆలయం, కొండ, తోటల్లో యువత, భక్తులతో కళకళలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మహానంది, నీలకంఠేశ్వర విగ్రహాలు, కొండగుహ ఆలయాలు దర్శించుకుని ఫొటోలు దిగారు. ఈవో నారాయణ, కమిటీ అధ్యక్షుడు తవిటినాయుడు ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఐక్యతతో ముందుకు సాగాలి

భామిని: అంతా సంఘటితంగా ఉంటే సమాజంలో తమ బలాన్ని చాటుకోగలమని కళింగ వైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు అన్నారు. భామిని మండలం ఆసంగిలోని తోటలో కళింగ వైశ్య సంఘం కార్తిక వన భోజన కార్యక్రమం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరమణ, జి.షణ్ముకరావు, జిల్లా నాయకుడు కోరాడ రాజేష్, బి.అనంతరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. మహిళలు, పిల్లలు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు.

బహుమతులు అందుకున్న వారితో కళింగ వైశ్య సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు

వేడుకగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని నర్సిపురంలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మం ఆలయంలో స్వామికి కాళికాంబ(శ్రీమాత)తో వివాహాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా చేయించారు. కార్యక్రమానికి స్థానిక పట్టణ, మండల విశ్వబ్రాహ్మణులు హాజరయ్యారు. వీరబ్రహ్మం గాథ, కవితలను కొందరు పాటలుగా వినిపించారు.

కల్యాణ సూత్రాలు భక్తులకు చూపుతున్న పురోహితుడు

ముగిసిన అఖండ నామసంకీర్తన

జియ్యమ్మవలస: చినమేరంగి సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో అఖండ నామ సంకీర్తన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగిందని సేవాసమితి కన్వీనర్ రామ్‌ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు సాయి భజన కార్యక్రమం 24గంటలపాటు చేపట్టామన్నారు.

బాలవికాస్ విద్యార్థులకు పోటీలు

జియ్యమ్మవలస: సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శతజయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం బాలవికాస్ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్విజ్, ఉపన్యాసం, స్పెల్లింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు ధ్రువపత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో సత్యసాయి కన్వీనర్ నాగరాజు, సేవాదళ్ సభ్యులు ఉన్నారు.

క్విజ్ పోటీలో పాల్గొన్న చిన్నారులు

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మండలం సామరెల్లి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు నిమ్మక నందిని, బిడ్డిక భాగ్య రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎ.భాస్కరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.జనార్దనరావు తెలిపారు. జన జాతీయ గౌరవ్ దివస్‌లో భాగంగా విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వీరు వెళ్తున్నారని తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

స్వయంభూ ఉమామహేశ్వరుని మహోత్సవం

వీరఘట్టం, న్యూస్‌టుడే: మండల కేంద్రం నుంచి సుమారు 10 కి.మీ. దూరంలో ఉన్న కుంబిడి ఇచ్ఛాపురంలో స్వయంభూగా వెలసిన ఉమామహేశ్వరస్వామి యాత్ర మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. స్వయంభూ శివలింగం కావడంతో పలు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఈ ఆలయానికి ప్రాకారం ఉండదు. నిత్యం ఎండలోనే ఉంటుంది. అందుకే ఎండల మల్లికార్జునుడిగా భక్తులు కొలుస్తారు. ప్రస్తుత, మాజీ సర్పంచులు గొర్లనాయుడు, దామోదరరావు ఆధ్వర్యంలో వేడుక కార్యాచరణ చేపట్టారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, తోటపల్లి ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ పాండురంగ పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఆలయానికి వెళ్లే మార్గం, పరిసరాలు స్థానిక యువకులు బాగు చేశారు. ఎస్సై జి.కళాధర్ ఆధ్వర్యంలో వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు చేపట్టారు. ప్రజలు వీరఘట్టం చేరుకొని అక్కడి నుంచి ఎం.రాజపురం కూడలి మీదుగా కుంబిడి ఇచ్ఛాపురం చేరుకోవాలి.

కుంబిడి ఇచ్ఛాపురంలో వెలిసిన స్వయంభూ శివలింగం

ఆలయం పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న యువకులు

పల్లెలకు రక్షితనీరు ఎప్పటికో!

న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

ప్రతి పల్లెకూ రక్షిత నీరు అందించడమే లక్ష్యంగా నిర్మించిన పథకాల నిర్వహణలో యంత్రాంగం నిర్లక్ష్యం చూపుతోంది. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ట్యాంకులు నిర్మించి పంచాయతీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అయిదారు గ్రామాలు మినహా క్లోరినేషన్ చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు.

నిబంధనలు బేఖాతరు..

కురుపాం రక్షిత నీటిపథకం సబ్‌డివిజన్ పరిధిలోని కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో 840 గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 269 తాగునీటి ట్యాంకులు ఉన్నాయి. వీటి ద్వారా ఆయా గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారు. గ్రామాల్లోని ట్యాంకులు చాలా వరకు శుభ్రతకు నోచుకోవడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయాలి. ఆ తేదీలు, వివరాలు నమోదు చేయాలి. ఎక్కడా అవి కనిపించడం లేదు. బోర్డులు అలంకారప్రాయంగా ఉంటున్నాయి.

మొక్కలు నిండి, శుభ్రతకు నోచుకోని కురుపాంలో ట్యాంకు

లీకులతో ఇక్కట్లు..

పలుచోట్ల వీధి కుళాయిలు ఏర్పాటు చేసిన పైపులు లీకవుతున్నాయి. దీంతో సరఫరాలో అంతరాయం ఏర్పడటమే కాక నీరు కలుషితం అవుతోంది. ఏడాదిలో రెండు, మూడు సార్లు పైపులైన్లు మార్చాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పాటు రక్షిత నీటి పథకాల నుంచి సరఫరా చేస్తున్న నీటిలో రసాయనాల పరీక్షలు చేయాల్సి ఉన్నా జరగడం లేదు. నీటిలో లోపాలుంటే గ్యాస్, కడుపునొప్పి తదితర అనారోగ్య సమస్యలు వస్తాయి. నైట్రైట్ శాతం ఎక్కువైతే గర్భిణులకు ఇబ్బందులు కలుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. గతంలో పరీక్షల కోసం పరికరాలను ప్రభుత్వం సచివాలయాలకు సమకూర్చినా వినియోగించడం లేదు.

కార్యదర్శులదే బాధ్యత.. గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలు శుభ్రం, క్లోరినేషన్ చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే. ఎక్కడైనా సమస్యలుంటే వాటిపై చర్యలు తీసుకుంటాం. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనులు చేయాలి. గ్రామాల్లో పథకాలను పరిశీలిస్తూ.. ఎప్పటికప్పుడు సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నాం. – కె.నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

నేడు లక్ష దీపారాధన

సీతంపేట, న్యూస్‌టుడే: మండలంలోని పులిపుట్టి ముక్కిడి దేవత ఆలయం వద్ద నేడు(సోమవారం) సాయంత్రం 5-30 గంటలకు కార్తీక లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు ఎస్.తోటముఖలింగం, జి.వరప్రసాద్‌నాయుడు, సర్పంచులు భాజన్న, సుజాత, సభ్యులు తెలిపారు.

శిథిల వంతెనపై సాగేదెలా ప్రయాణం

గురివినాయుడుపేట వట్టిగెడ్డ నదిపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. పలుచోట్ల బీటలు వారింది. అప్రోచ్ రోడ్డు కోతకు గురైంది. మొంథా తుపాను సమయంలో వరద ప్రవాహం కారణంగా రెవెన్యూ, పోలీసు అధికారులు రాకపోకలు నిలిపివేయడంతో మాతుమూరు, తాడూరు తదితర పంచాయతీల పరిధి గ్రామస్థులు ఇబ్బంది పడ్డారు. కొత్త వంతెన నిర్మించాలని వీరంతా కోరుతున్నారు. విషయాన్ని జేఈ విజయకుమార్ వద్ద ప్రస్తావించగా.. కొత్త వంతెన నిర్మాణానికి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. – న్యూస్‌టుడే, పాచిపెంట

కళాస్రవంతి.. ఏదీ ఆ కళ?

పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలో కళాస్రవంతి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. సంగీత, సాహిత్య కార్యక్రమాలతో పాటు ప్రజా సంఘాల సమావేశాలకు ఇది ప్రధాన వేదిక. గతంలో రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీలు సైతం ఇక్కడే జరిగేవి. ఏటా ఘంటసాల నిర్విరామ నీరాజన కార్యక్రమాలు, ప్రముఖుల జయంతి, వర్ధంతులు ఈ భవనంలోనే నిర్వహించేవారు. ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దాతల సహకారంతో కళాస్రవంతి అభివృద్ధికి కృషిచేస్తామని జర్జాపు రమేష్ మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు ఈశ్వరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, సాలూరు

వారపు సంతలు కనుమరుగు

పాలకొండ మండలం నవగాం కూడలిలో ప్రతి సోమవారం వారపుసంత నిర్వహిస్తారు. విక్రయాలకు అనుకూలంగా ఉండేందుకు గతంలో దుకాణ సముదాయం నిర్మించారు. ప్రస్తుతం వారపు సంతలు కనుమరుగవ్వడంతో రేకుల షెడ్లు పూర్తిగా పాడయ్యాయి. రహదారిని ఆనుకుని ఉన్న పంచాయతీ స్థలంలో దుకాణ సముదాయం కొత్తగా నిర్మిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని పలువురు అంటున్నారు. ఉన్నతాధికారులకు నివేదించి, చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రంగారావు తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

గుంతల రహదారితో ఇక్కట్లు

పాలకొండ పట్టణ పరిధిలోని కార్గిల్‌కూడలి వద్ద రహదారి గుంతలుగా మారింది. దీంతో వాహనాల రాకపోకల సమయంలో ధూళి రేగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొంత కాలంగా ఇదే పరిస్థితి ఉండడంతో పలువురు వ్యాపారులు గుంతల వద్ద ధూళి రాకుండా నీటిని చల్లి ఉపశమనం పొందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ జేఈ టి.కిరణ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

దుర్వాసన..దోమల బెడద

కురుపాం మండలం శివ్వన్నపేట ప్రధాన రహదారి పక్కన పక్కా డ్రైనేజీ లేకపోవడంతో ఇళ్లల్లో వాడుక నీరు రోడ్డుపై చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని, రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు, కాలువ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించామని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం పట్టణం: మెదడుకు సంబంధించిన సమస్య కారణంగా తీవ్ర మనస్తాపంతో నిద్ర మాత్రలు మింగడంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బాధితుడు ఓ బ్యాంకులో అటెండరుగా పనిచేస్తున్నాడు. కొన్నాళ్ల కిందట బ్రెయిన్ ఆపరేషన్ జరిగింది. నొప్పి తగ్గకపోవడంతో నిద్ర మాత్రలు మింగాడు. కుటుంబీకులు గమనించి అతన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

పార్వతీపురం పట్టణం, బలిజిపేట: బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి గాయపడిన ఘటన బలిజిపేట మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. సీతానగరం మండలం నిడగల్లుకు చెందిన పోలినాయుడు బైకుపై అజ్జాడలోని అత్తారింటికి వెళ్లి వస్తున్నాడు. బస్సు ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

ఆకతాయిల ఆగడాలు

పార్వతీపురం పట్టణం, పురపాలక: గూడ్స్‌షెడ్‌రోడ్డులోని ఎస్టీ వసతి గృహంలో ఆదివారం ఫ్రెషర్స్ డే నిర్వహిస్తుండగా ఓ యువకుడు వచ్చి విద్యార్థులు, సిబ్బందిపై దుర్భాషలాడినట్లు వారు ఆరోపించారు. కొంత మంది వారించి బయటకు పంపించగా, మరో పదిమందితో కలిసి వచ్చి గొడవకు దిగాడన్నారు. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. మద్యం, గంజాయి తాగుతున్న వారిపై పోలీసులు దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

బలిజిపేట: మండలానికి చెందిన యువతి (19) కనిపించడం లేదని ఆమె తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సింహాచలం తెలిపారు. 5వ తేదీన కళాశాలకు బయలుదేరిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీనిపై కుటుంబ సభ్యులు బొబ్బిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు బలిజిపేట స్టేషన్‌కు కేసు బదలాయించారు.

నదిలో మునిగిన బాలుడు: కాపాడిన భక్తులు

కొమరాడ: గుంప వద్ద నాగావళి, జంఝావతి నదుల సంగమ ప్రాంతంలో స్నానానికి వెళ్లి నదిలో మునిగిన 12 ఏళ్ల బాలుడిని ఆదివారం భక్తులు కాపాడారు. ఇదే మండలానికి చెందిన ఓ బాలుడు స్నానానికి నదిలో దిగగా, మునిగాడు. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో సోమేశ్వరుడి దర్శనానికి వచ్చి అక్కడే స్నానాలు చేస్తున్న శ్రీకాకుళం జిల్లా కళ్లేపల్లికి చెందిన శివ, అయ్యప్ప భక్తులు బాబును కాపాడి ఒడ్డుకు చేర్చారు. అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వచ్చింది సందేశం.. కట్టేద్దాం పన్ను

పాలకొండ, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆదాయం పెంచి మెరుగు పర్చేలా డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తూ ఇప్పటికే స్వర్ణ పంచాయతీలకు శ్రీకారం చుట్టింది. వాటికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఇంటింటా సర్వే చేసిన అధికారులు వివరాలు యాప్‌లో నమోదు చేశారు. నేడు పక్కాగా ఆస్తి పన్ను వసూళ్లకు చర్యలు ప్రారంభించారు.

పాలకొండ పట్టణం

జిల్లాలో ఇదీ పరిస్థితి..

మండలాలు	7
పంచాయతీలు	451
గృహాలు	1.87 లక్షలు
రావాల్సిన పన్ను	రూ.4.95 కోట్లు
బకాయి	రూ.70 లక్షలు

అక్రమాలకు చెక్

ఈ విధానం ద్వారా అక్రమాలకు తావుండదు. గతంలో కొందరు సిబ్బంది వసూలు చేసిన ఆస్తి పన్ను నగదు పక్కదారి పట్టించే వారు. ఆన్‌లైన్‌లో చెల్లింపులు కారణంగా దీనికి అడ్డుకట్ట పడనుంది. ప్రస్తుతం నేరుగా పంచాయతీ ఖాతాలకు జమ అవుతాయి. సచివాలయాల్లో ఇప్పటికే అందించిన క్యూఆర్ కోడ్ ద్వారా కూడా చెల్లించవచ్చు.

సులువుగా చెల్లించవచ్చు..

గతంలో కార్యదర్శులు గృహ యజమానులకు ఆస్తిపన్ను చెల్లించాలంటూ డిమాండు నోటీసులు అందించేవారు. పంచాయతీలకు వెళ్లి దాన్ని చెల్లించేవారు. ప్రస్తుతం స్వర్ణ పంచాయతీల్లో భాగంగా గృహ యజమాని చరవాణి నంబర్‌కు జియోట్యాగింగ్ చేశారు. దీంతో పన్ను డిమాండు ఫోన్ నంబర్‌కు సందేశం వస్తుంది. తద్వారా ఇంటివద్ద నుంచే చెల్లించవచ్చు. 15 రోజుల వరకు అవకాశం ఉంటుంది.

పంచాయతీల అభివృద్ధి

పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లు పక్కాగా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా స్వర్ణపంచాయతీలు అమలు చేస్తుంది. వారం రోజుల్లో వసూళ్లు ప్రారంభించాలని సిబ్బందికి ఆదేశించాం.

– రామ్‌ప్రసాద్, డీఎల్‌పీవో

గురువులకు అపూర్వ సత్కారం

బలిజిపేట, న్యూస్‌టుడే: మండలంలోని వంతరాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1972-73వ సంవత్సరం పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు కందాళ్ల సూర్యనారాయణకు పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారంతా జ్ఞాపకాలను గుర్తు చేసుకొంటూ, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు. విశాఖకు చెందిన ప్రముఖ న్యాయవాది బెవర సత్యనారాయణ, కందాళ నాగభూషణరావు ఆధ్వర్యంలో కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలని తీర్మానించారు.

వంతరాంలో గురువును సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

సామూహిక వంటలు వద్దంటూ నిరసన

సాలూరు, న్యూస్‌టుడే: పాఠశాలల్లో సామూహిక వంటశాలల నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పట్టణ ప్రధాన రహదారిలో ర్యాలీ చేశారు. అనంతరం బోసుబొమ్మ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఏళ్లుగా విద్యార్థులకు రుచికరమైన భోజనాలు వండిపెడుతున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నేత ఎన్‌వై నాయుడు అన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కు తీసుకోవాలని కోరారు.

పోలీసు దాడిలో జూదరుల అరెస్టు

పాలకొండ: పాలకొండ మండలంలోని సిరికొండ గ్రామ పరిధిలో జూదమాడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.ప్రయోగమూర్తి తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.55,600 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కురుపాం గ్రామీణం: కురుపాం మండలం సింగుపురం గ్రామం పరిసరాల్లో జూదం ఆడుతున్న 12 మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎల్విన్‌పేట సీఐ హరి తెలిపారు. వారి నుంచి రూ.68,920 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్సైలు పి.నారాయణరావు, శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: గత నెల 19న ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బాంబు పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కళాసీ రెడ్డి రమేష్‌కు జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర రూ.50 వేలు ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వంతెనల తక్షణ మరమ్మతులకు వినతి

కురుపాం గ్రామీణం: పలుచోట్ల రహదారి వంతెనలు శిథిలావస్థకు చేరాయని, వాటికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి రామస్వామి డిమాండు చేశారు. ఆదివారం మొండెంఖల్లు నుంచి నీలకంఠాపురం వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న వంతెలను పరిశీలించారు. ఇరువైపులా గోడలు లేకపోవడంతోపాటు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్లు అందివ్వాలి

కొమరాడ, న్యూస్‌టుడే: వరి కోతలు ఆరంభం అవుతున్నాయని.. ధాన్యం రాసులు ఆరబోయడానికి రైతుల వద్ద టార్పలిన్లు లేవని.. వాటిని ప్రభుత్వమే అందించాలని సిటు నాయకులు సాంబమూర్తి డిమాండు చేశారు. ఆదివారం కొమరాడలో నిరసన తెలిపారు.

ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి

కొమరాడ, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన పథక నిర్వహణను ప్రైవేటీకకణ చేసే ఆలోచనను విరమించుకోవాలని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు అన్నారు. ఆదివారం కొమరాడ జూనియర్ కళాశాల కూడలి వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. నాయకులు కె.సాంబమూర్తి, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజాఉద్యమానికి పిలుపు

పాలకొండ: వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న జరగనున్న ప్రజాఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పేర్కొన్నారు. ఆదివారం పాలకొండలో పోస్టరు ఆవిష్కరించారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికే ప్రాధాన్యం

పార్వతీపురం పురపాలక: రాష్ట్రంలో రహదారుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ పనిచేస్తుందని ఆ సంస్థకు డైరెక్టర్‌గా నియమితులైన భాజపా జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం విజయవాడలోని ర.భ.శాఖ పరిపాలన విభాగ కార్యాలయంలో కార్పొరేషన్ ఛైర్మన్‌తో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తామన్నారు. ఇప్పటి వరకు మంజూరైన రోడ్లు త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ర.భ. శాఖ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్ నాగేశ్వరరావు, ఎండీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ కార్యదర్శి ఎంకే బాబు పాల్గొన్నారు.

శ్రీనివాసరావును అభినందిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

తపాలా ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

సీతంపేట, న్యూస్‌టుడే: తపాలా ఉద్యోగులు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి అభివృద్ధికి పాటుపడాలని భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు అన్నారు. సీతంపేట సామాజిక భవనంలో ఆదివారం భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (పీ3, పీ4, జీడీఎస్) సంయుక్త ద్వితీయ మహాసభ నిర్వహించారు. సభ్యుల ఆమోదంతో అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్ తదితర పదవులకు ఎన్నిక నిర్వహించారు. నాయకులు ఆర్.శ్రీనివాసరావు, ఎ.రవిబాబు, శివరాం, అప్పలనాయుడు, పార్వతీపురం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

సీతంపేటలో మాట్లాడుతున్న డివిజన్ కార్యదర్శి

విద్యార్థులు సృజనాత్మకత పెంచుకోవాలి

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు సృజనాత్మకత పెంచుకోవాలని ఉప విద్యాశాఖాధికారి పి.కృష్ణమూర్తి పేర్కొన్నారు. పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సరదా చదువులు సంస్థ ఆధ్వర్యంలో సత్యసాయి టాలెంట్ హంట్ ప్రతిభా పరీక్ష ఆదివారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. రేగిడి మండలం అంబకండి పాఠశాలకు చెందిన జి.చైతన్య(ప్రథమం), ఎం.వంశీకృష్ణ(ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. వీరికి రేగిడికి చెందిన న్యాయవాది ఎం.వేణుగోపాలనాయుడు నగదు బహుమతులు అందజేశారు. తర్వాత స్థానాల్లో నిలిచిన ఏడుగురికి విశ్రాంత డీఈవో తిరుమలచైతన్య ఒక్కొక్కరికి సొంతంగా రూ.500 నగదు బహుమతులు అందజేశారు. వీరఘట్టం ఎంఈవో ఆనందరావు పర్యవేక్షించారు. నిర్వాహకులు ఎన్‌వీ రమణ, ఎం.సంపత్‌కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగించుకోండి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: సంతానలేమి సమస్యలతో బాధపడే మహిళలు కోసం అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. పార్వతీపురంలోని ఓ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో కుటుంబ్ ఐవీఎఫ్ కేంద్రం, సంతాన సాఫల్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో తొలిసారిగా ఇలాంటి శిబిరాన్ని ఏర్పాటు చేయడం గొప్పవిషయమన్నారు. వైద్యులు ధీరజ్, రాణి రోజా సూచనలు చేశారు. సీనియర్ వైద్యులు ప్రభాకరరావు, వివేక్, నాయకులు దొరబాబు, రామారావు, విశ్రాంత ఉపాధ్యాయులు హరిప్రసాద్ ఉన్నారు.

(c) eenadu

కరవు తీరాన.. చెరువు నజరానా

పశ్చిమ ప్రకాశం అంటేనే కరవుకాటకాలకు చిరునామా. అలాంటి వెనుకబడిన ప్రాంతంలోని చారిత్రక కంభం చెరువు పరిసరాలు ప్రకృతి రమణీయతను ముద్దాడుతున్నాయి. ఆసియాలోనే ఎంతో పేరొందిన ఈ తటాకం కిందనున్న వేలాది ఎకరాల ఆయకట్టు ఇలా పచ్చటి పంట పొలాలతో కళకళలాడుతూ కనిపిస్తోంది. ప్రకృతి ప్రేమికుల మనసును కట్టిపడేస్తున్న ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

–న్యూస్‌టుడే, అర్ధవీడు

అందంలో మేమూ తగ్గేదేలే

- సౌందర్య పోషణపై పురుషులు అమితాసక్తి
- జిల్లాలో విస్తరిస్తున్న అధునాతన సెలూన్లు

ఈనాడు, ఒంగోలు

గంటకో సెల్ఫీ.. రోజుకో రీల్.. నడుస్తున్న ప్రస్తుత రోజుల్లో అమ్మాయిలే కాదు... అబ్బాయిలు ముఖవర్చస్సు పెంచుకునేందుకు అమితాసక్తిని చూపుతున్నారు. రోజూ తాము చేస్తున్న విద్య, ఉద్యోగాలకు ఎంత ప్రాధాన్యమిస్తున్నారో ఎదుట వారిని ఆకర్షించేందుకు బాహ్యరూపం (ఫిజికల్ లుక్) బాగుండేందుకు ఖర్చు పెట్టేందుకు వెనుకాడడంలేదు. ప్రజల అభిరుచికి అనుగుణంగా మహానగరాల్లో ఉండే బ్యూటీ సెలూన్లు ఒంగోలు తదితర ప్రాంతాల్లో విస్తరిస్తున్నాయి.

◗ ఏ ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లినా 90 శాతం మంది 'లో ఫేడ్' హెయిర్ స్టైల్‌లో దర్శనమిస్తున్నారు. పోలీసు క్రాప్ మాదిరిగా చుట్టూ తక్కువ జుట్టులో ఉండే మోడల్‌ను ఇష్టపడుతున్నారు. ముఖ రూపం ఆధారంగా హెయిర్ స్టైల్‌ను మార్చుకుంటున్నారు. ఒకప్పుడు గడ్డం పూర్తిగా గీసుకోవడం అలవాటుగా ఉండేది. నేటి యువతలో గడ్డంతో కనిపించడం ఫ్యాషన్‌గా మారింది. గడ్డం విషయానికొస్తే 'వి కట్' ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉందని ఒంగోలు నగరంలోని అంజయ్య రోడ్డులో ఓ హెయిర్ స్టైల్ నిర్వాహకుడు అలీ చెబుతున్నారు.

ముఖం మెరవాల్సిందే..

ఏదైనా వివాహ కార్యక్రమాలకు వెళ్లే ముందు అమ్మాయిలు ఫేషియల్ చేయించుకోవడం చూస్తుంటాం. ఇప్పుడు ఫంక్షన్లతో సంబంధం లేకుండా అబ్బాయిలు డైమండ్, గోల్డు, పపయా. తదితర ఫేషియల్స్‌తో పాటు శరీర కాంతి (స్కిన్ బ్రైటెనింగ్)కు సెలూన్లు ఆశ్రయిస్తున్నారు. ముఖంపై నల్ల మచ్చలు పోయేలా 'డీ టాన్' క్లీన్ అప్ వంటి వాటికి ప్రాధాన్యం పెరిగింది. హెయిర్ కట్‌తో పాటే నెలకొకసారి ముఖ వర్చస్సు మెరుగుపరచుకుంటున్నారు. బాహ్యరూపం బాగుంటేనే మనతో కనెక్ట్ అవుతారు.. మనం చెప్పే విషయం ఆసక్తిగా వినాలన్నా, బాగా కనిపించాలనే ఉద్దేశంతో సెలూన్‌ను ఆశ్రయిస్తున్నట్లు ఓ కంపెనీ మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తున్న నవీన్ చెబుతున్నారు.

జిల్లాలోని పురుష సెలూన్లు 100
నెలవారీ టర్నోవర్ రూ. 2 కోట్లు

నడి వయసు వారిలోనూ..

సెలూన్లు తరచూ వచ్చే వారిలో మెజారిటీ కళాశాల విద్యార్థులుండడం సహజం. ఇప్పుడు వయసు తక్కువగా కనిపించాలనే తాపత్రయంతో నలభై దాటినవారు ఇటువైపు వస్తున్నారు. నెలకొకసారి హెయిర్ డై వేయించుకోవడం, ఫేషియల్స్ చేయించుకుంటున్నారు. వీటికి వాడేందుకు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసిన సౌందర్య ఉత్పత్తులు సైతం వినియోగిస్తుండడం గమనార్హం. ఒంగోలులో పని చేస్తున్న ఓ బ్యాంకు మేనేజరు 15 రోజులకొకసారి సెలూన్‌ను ఆశ్రయిస్తున్నారంటే మలి వయసులో అందంపై ఎంత ఆసక్తి ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్యాకేజీలు.. ఆఫర్లు..

హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ తదితర నగరాల్లో మాత్రమే కనిపించే పెద్దస్థాయి సెలూన్లు ఒంగోలు నగరంతోపాటు మార్కాపురం, కనిగిరి తదితర పట్టణాల్లోనూ వెలిశాయి. ఈ సెలూన్లలో మళ్లీ వీఐపీ రూములు సైతం ఉంటున్నాయి. పురుషుల అందాన్ని పెంచే ప్యాకేజీలు, ఆఫర్ల పేరుతో ఆకర్షిస్తున్నారు. రోజువారీ ముఖానికి రాసుకునే ఖరీదైన సౌందర్య ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. బాగా కనిపించాలని అనుకోవడంతోపాటు పరిశుభ్రత వంటి వాటికి ప్రాధాన్యమిస్తుండడంతో ఇటువైపు మొగ్గుచూపుతున్నారని ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డులో ఓ సెలూన్ నిర్వాహకుడు ప్రదీప్ చౌదరి చెబుతున్నారు.

దొనకొండకూ ఉందో ఘన చరిత్ర

దొనకొండలోని విమానాశ్రయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. 1934లో బ్రిటీష్ పాలకులు 136.5 ఎకరాల్లో విమానాశ్రయం నిర్మించారు. 3 వేల అడుగుల పొడవు, 100 అడుగుల వెడల్పుతో రన్‌వే ఉంది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో విమానాలకు ఇంధనం నింపేవారు. 1965-70 మధ్యకాలంలో విమానాల రాకపోకలు సాగాయి. ప్రస్తుతం రాకపోకలు లేకున్నా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలోనే ఉంది. క్షిపణి తయారీ యూనిట్, ప్రపంచస్థాయి క్యాన్సర్ సెంటర్ రానుండటంతో విమానాశ్రయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కేంద్రం యోచిస్తోంది.

–ఈనాడు, ఒంగోలు న్యూస్‌టుడే, దొనకొండ

ఇక్కడ పాఠాలు చెప్పేవారెక్కువ!

ఇటీవల మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైనవారు

కనిగిరి... ఈ పేరు వినగానే టక్కున గుర్తొచ్చేది కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలు, ఫ్లోరైడ్ నీరు. ఇక్కడ ఒకప్పుడు.. చదువు కూడు పెట్టదు. పనికెళితే పది రూపాయలు సంపాదించుకోవచ్చుననేవారు. ఎడారిని తలపించే ఈ ప్రాంతం నుంచి దేశాంతరాలకు వలసలుండేవి. ప్రస్తుతం తమలాగా ఊరికి దూరంగా వెళ్లకూడదనే సంకల్పం ఇక్కడ ప్రజల్లో కలిగింది. తమ పిల్లలను ప్రయోజకులను చేయాలన్న లక్ష్యంతో కష్టపడుతూ పిల్లలను చదివిస్తున్నారు. ఇక్కడ యువత ఉద్యోగమే లక్ష్యంగా... అందులోనూ ఉపాధ్యాయ వృత్తివైపు ఎక్కువగా మొగ్గ చూపుతున్నారు. ఎంతగా అంటే వేలాది మంది ఉపాధ్యాయులుండగా, వందలాది మంది ఇప్పటికే ఉద్యోగ విరమణ పొందారు.

◗ 2008 డీఎస్సీలో 71 మంది, 2012లో 66 మంది, 2014లో 97 మంది, 2025లో 110 మంది... ఇలా ప్రతి డీఎస్సీలో కనిగిరి ప్రాంత యువత సాధిస్తున్న ఘనత. ప్రతి డీఎస్సీలోనూ తొలి నాలుగైదు ర్యాంకులు సైతం ఇక్కడ యువతవే కావడం గమనార్హం. వ్యాపార, వ్యవసాయ రంగాలను కాదని ఉపాధ్యాయ వృత్తినే ఎంచుకుంటున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుమారు 14 వేల మంది ఉపాధ్యాయులుండగా, ఒక్క కనిగిరి ప్రాంతంలోనే 2 వేల మందికి పైగా ఉండడం విశేషం. –న్యూస్‌టుడే, కనిగిరి

పొట్టి చిత్రానికి గట్టి గుర్తింపు

తేజ నవోదయం జీఐఎఫ్‌సీకి ఎంపిక

గిద్దలూరు పట్టణానికి చెందిన యువకుడు తేజ కల్లూరి రూపొందించిన భావోద్వేగాత్మక, సామాజిక లఘుచిత్రం నవోదయం గోవా ఇంటర్నేషనల్ ఫిల్మ్ కాంపిటీషన్-2025కు ఎంపికైంది. రైతుల పరిస్థితి, భూమి, మనిషికి మధ్య మమకారం, తల్లీకొడుకుల అనుబంధాన్ని హృదయాన్ని తాకేలా చక్కగా చిత్రీకరించారు. నూతన వ్యవసాయ ఆవిష్కరణలపై చర్చిస్తూ రైతుల కష్టాలు, ఆశలు మానవీయంగా ప్రతిబింబించేవిధంగా కథను తెరకెక్కించారు. హృదయాన్ని తాకేవిధంగా ఉండడంతో జ్యూరీ తేజ కల్లూరి దర్శకత్వాన్ని ప్రత్యేకంగా ప్రశంసించింది. డిసెంబరులో తేజ పురస్కారం అందుకోనున్నారు.

–న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

నవోదయం లఘుచిత్రం గోడపత్రిక

తేజ కల్లూరి, దర్శకుడు

అద్వితీయం.. ఆదివారం ఆనందం

రెండో ఆదివారం వచ్చిందంటే ఆ బాలికల్లో ఎక్కడలేని ఆనందం. ఆ రోజున తమ తల్లిదండ్రులు వస్తారని, తినుబండారాలు తీసుకొస్తారనే సంతోషం కనిపిస్తుంది. ఆ రోజు రావడంతో తల్లిదండ్రులను చూడగానే వారిని గట్టిగా హత్తుకుని ఒక్కసారిగా భావోద్వేగాలకు గురై ఆనంద భాష్పాలు రాల్చారు. అమ్మానాన్నలు తెచ్చిన తినుబండారాలు తింటూ వారితో సరదాగా గడిపారు. సమయం ముగియడంతో తన పిల్లలను వదిలి వెళ్లలేక, అక్కడే ఉండలేక బిడ్డలను ముద్దులాడుతూ లోలోపల బాధపడుతూ తల్లిదండ్రులు కన్నీళ్లతో వెనుతిరిగారు. కొండపి బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం కనిపించిన ఈ ఘటనను చిత్రంలో చూడొచ్చు.

–న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

మంచికలపాడు ఊరు... పెట్రోల్ పంప్ బాయ్స్‌కు పెట్టింది పేరు

ఒంగోలు, చీమకుర్తి, సంతనూతలపాడు తదితర ప్రాంతాలతోపాటు నెల్లూరు జిల్లాలోని పలు పెట్రోలు బంకుల్లో పనిచేస్తున్న పంప్ బాయ్‌లను మీది ఏ ఊరని అడిగితే... టక్కున చీమకుర్తి మండలం మంచికలపాడు అని చెబుతారు. గ్రామానికి చెందిన 60 మందికి పైగా యువకులు పెట్రోలు బంకుల్లో పంప్‌బాయ్‌లుగా పనిచేస్తుండడం విశేషం. సుమారు 40 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన కోటిసింగ్, మరికొందరు నెల్లూరు జిల్లాలోని పలు పెట్రోలు బంకుల్లో పనిచేయడం ప్రారంభించారు. ఒకరోజు డ్యూటీ ఉంటే మరుసటి రోజు సెలవు ఉంటుందని, ఆ రోజున వ్యవసాయ పనులు చేసుకుంటామని వారంతా చెబుతున్నారు.

–న్యూస్‌టుడే, చీమకుర్తి

అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

పీసీపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. పీసీపల్లి మండలం లింగన్నపాలెంలో ఈ నెల 11న ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను ఆదివారం ఆయన ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజులతో కలిసి పరిశీలించారు. అనంతరం జిల్లా, స్థానిక అధికారులతో అక్కడే సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు.

స్వర్ణ పంచాయతీకి మకిలీ!

- వందలాది అసెస్‌మెంట్లకు ఒకటే చరవాణి సంఖ్య
- కార్యదర్శుల నిర్లక్ష్యంతో తప్పుల తడకగా వెబ్‌సైట్

గ్రామపంచాయతీల్లో సాధారణ నిధుల దుర్వినియోగమవుతున్న నేపథ్యంలో ఇంటి పన్నుల వసూళ్ల ప్రక్రియలో పారదర్శకత కోసం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. పంచాయతీల వారీగా ప్రతి ఆస్తికి కేటాయించిన ఇంటి పన్ను అసెస్‌మెంట్ నంబరుతోపాటు యజమాని చరవాణి సంఖ్యను అనుసంధానం చేయాలి. తద్వారా ఇంటి పన్ను బకాయిలు చెల్లించాల్సిన వివరాలు నేరుగా ఇంటి యజమాని చరవాణికి వాట్సాప్ ద్వారా సమాచారం పంపిస్తారు. అనంతరం పన్ను బకాయిలు చెల్లించాక కూడా రసీదు వాట్సాప్ ద్వారా వెళ్తుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా జమ చేసిన నగదు కూడా పంచాయతీ ఖాతాకు జమవుతుంది. ఈ విధానం పూర్తిగా అమల్లోకి వస్తే ఇంటి, నీటి పన్ను చెల్లింపు విధానంలో పారదర్శకత రానుంది. పోర్టల్‌లో నమోదు ప్రక్రియను గతేడాది కార్యదర్శులతోపాటు, సచివాలయ సిబ్బందికి అప్పగించారు. క్షేత్రస్థాయిలో కొన్ని గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించకుండానే అందుబాటులో ఉన్న చరవాణి సంఖ్యలను అనుసంధానం చేసేశారు. –న్యూస్‌టుడే, కలెక్టరేట్

చిత్రంలో కనిపిస్తోంది నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామ పంచాయతీ కార్యాలయం. ఈ పంచాయతీలో 933 అసెస్‌మెంట్లకు 628 అసెస్‌మెంట్లకు ఒకటే చరవాణి సంఖ్యను అనుసంధానం చేశారు.

వెలుగులోకి తప్పులు...

పంచాయతీరాజ్‌శాఖ 'స్వర్ణ పంచాయతీ' పోర్టల్‌లో పన్నుల చెల్లింపు వివరాలు పరిశీలిస్తోంది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన తప్పులు వెలుగులోకి వచ్చాయి. కార్యదర్శుల నిర్లక్ష్యంతో జిల్లాల వారీగా తప్పులను జిల్లా పంచాయతీ కార్యాలయానికి పంపించారు. జిల్లావ్యాప్తంగా వందలాది అసెస్‌మెంట్లకు ఒకే చరవాణి సంఖ్య లింక్ చేసినట్లు గుర్తించారు. ప్రతి జిల్లాలోనూ అత్యధికంగా తప్పులు చేసిన ఒక కార్యదర్శిని ఇప్పటికే సస్పెన్షన్ చేయగా, మరికొందరికి తాఖీదులు జారీ చేశారు. అసెస్‌మెంట్ల వారీగా అనుసంధానమైన చరవాణి సంఖ్యను పరిశీలించి దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు.

4,75,474 అసెస్‌మెంట్లు...

జిల్లాలోని 38 మండలాల పరిధిలో 729 గ్రామ పంచాయతీలున్నాయి. మొత్తం 4,75,474 అసెస్‌మెంట్లు ఉండగా; వీటికి సదరు యాజమాని చరవాణి సంఖ్య అనుసంధానం చేశారు. తాళ్లూరు మండలం తురకపాలెం పంచాయతీలో మొత్తం 608 అసెస్‌మెంట్లు ఉండగా, 583 ఆస్తులకు ఒకే చరవాణి సంఖ్యను అనుసంధానం చేసినట్లు అధికారులు గుర్తించారు. వైపాలెం మండలం వి.గంగపాలెంలో 891 అసెస్‌మెంట్లకు 505, తాళ్లూరు మండలం శివరాంపురంలో 954 అసెస్‌మెంట్లకు 476 అసెస్‌మెంట్లదీ ఇదే పరిస్థితి. పొదిలి మండలం మల్లవరంలో 340 అసెస్‌మెంట్లు ఉండగా, పోర్టల్‌లో మొత్తం వివరాలే తొలగించారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లును ఇప్పటికే సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇల్లే మ్యూజియం

పాతికేళ్లుగా 85 దేశాల నాణేలు, కరెన్సీ నోట్ల సేకరణ

అణా...దమ్మిడి.. బేడ.. వీటిని నేటితరం విని ఉండదు..చూసి కూడా ఉండదు. తాతలు ముత్తాతలు, అమ్మానాన్నల చిన్నతనంలో చలామణి అయిన నాణేలు, రాజుల కాలంనాటి నాణేలతో పాటు పలు దేశ కరెన్సీ నోట్లను సేకరిస్తూ తన ఇంటినే మ్యూజియంగా మార్చేశారు కనిగిరి పురపాలక సంఘం మాచవరం జడ్పీ ఉన్నత పాఠశాల సైన్సు ఉపాధ్యాయుడు భాస్కర్ నారాయణ. గత 25 ఏళ్లుగా దేశ విదేశాల నాణేలు తిరిగి నాణేలు, కరెన్సీ నోట్లు సేకరిస్తున్నారు. భారత దేశంతోపాటు ఇటలీ, శ్రీలంక, నేపాల్, థాయిలాండ్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, అమెరికా, ఇండోనేషియా, ఈజిప్ట్, కతార్, ఒమన్, యూఏఈ, చైనా, పాకిస్థాన్, రంగూన్ ఇలా ఒకటేమిటి 85 దేశాలకు చెందిన నాణేలు, కరెన్సీ నోట్లను సేకరిస్తూ తన అభిరుచిని చాటుకుంటున్నారు.

–న్యూస్‌టుడే, వెలిగండ్ల (కనిగిరి)

కోలాటం అందం... మూడు తరాల బంధం

గ్రామీణ సంప్రదాయ కళ కోలాటానికి మూడు తరాలుగా ప్రాణం పోస్తున్నారు కనిగిరి పట్టణానికి చెందిన చేజర్ల వంశీయులు. చేజర్ల పాపయ్య భాగవతార్ చుండి సంస్థానాధీశులు నాయక రాజుల కాలంలో హరికథలు చెప్పేవారు. అనంతరం బృందావన కోలాటం, కోలాటం గురువుగా పేరొందారు. ఆయన మరణానంతరం ఆయన కుమారుడు ఏరువారపల్లి ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడైన నాగరాజా ప్రసాద్ గత 40 ఏళ్లుగా 2 వేలకుపైగా కోలాట ప్రదర్శనలిస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నేర్పిస్తున్నారు. ఆయన శిష్యులు జిల్లావ్యాప్తంగా వందలాది మంది ఉన్నారు. ఈయన కుమారుడు నాగార్జున ప్రసాద్ సైతం తన తండ్రి నుంచి సంక్రమించిన కోలాటాన్ని కొనసాగిస్తున్నారు. గత 12 ఏళ్లుగా 700కుపైగా ప్రదర్శనలిచ్చారు. తండ్రీకొడుకులు ఎన్టీఆర్ కళాపరిషత్తు ద్వారా ఇప్పటివరకు నాలుగు సార్లు ఉత్తమ కోలాటం గురువులుగా ఎంపికయ్యారు. జిల్లాలోనే కాకుండా శ్రీశైలం, తిరుమల, మాలకొండ, భైరవకోన, తెలంగాణ ప్రాంతాల్లో తమ శిష్య బృందంతో కోలాట ప్రదర్శనలిస్తుండడం గమనార్హం. –న్యూస్‌టుడే, కనిగిరి

వారసత్వ సంపదకు రక్షణ!

చిత్రంలో కనిపిస్తోంది పొదిలి పోలీసు సర్కిల్ కార్యాలయ భవనం. సుమారు 85 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం నేటికీ చెక్కుచెదరక పోవడంతో పోలీసు అధికారులు ఆధునికీకరించి కార్యాలయంగా వినియోగించుకుంటున్నారు. భవనానికి ముందువైపు విశాలమైన స్థలం, ఇరువైపులా పచ్చని చెట్లతో ఆకట్టుకుంటోంది. ఇది మా వారసత్వ సంపదని పోలీసు అధికారులే కాదు ఇక్కడ ప్రజలు ఎంతో గర్వంగా చెప్పుకొంటుంటారు.

–న్యూస్‌టుడే, పొదిలి

నేడు కేంద్ర బృందం రాక

ఒంగోలు నగరం, గ్రామీణం, న్యూస్‌టుడే: గత నెలలో 'మొంథా' తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా అత్యధిక విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం 16,506 మంది రైతులకు చెందిన 12,196.30 హెక్టార్లకు నష్టపరిహారమివ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మరో పక్క నదులు, వాగులు, వంకల వరద ఉద్ధృతికి ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖ రహదారులు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. క్షేత్ర స్థాయిలో నష్ట అంచనాలను పరిశీలించేందుకు తొలుత ఈ నెల 11న కేంద్ర బృందం జిల్లాకు రానున్నట్లు ప్రకటించారు. తాజాగా ఒకరోజు ముందుగానే సోమవారం బృందం జిల్లాకు రానున్నట్లు కలెక్టరేట్‌కు సమాచారమందింది. ఉదయం 11.15 గంటలకు అమరావతి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 1.45 గంటలకు ఒంగోలుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.15 గంటల వరకు స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం, అనంతరం ఫొటో ప్రదర్శన తిలకిస్తారు. కొత్తపట్నం మండలం అల్లూరు వద్ద దెబ్బతిన్న పంటలు, పంట కుంటలు పరిశీలిస్తారు. నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం గ్రామానికి చేరుకుని నష్టపోయిన పంటల పరిశీలనతోపాటు స్థానిక రైతులతో సమావేశమవుతారు.

ప్రతిభ ఉంటేనే ప్యాకేజీ

- బీటెక్ చదువుతుండగానే నైపుణ్యాలకు మెరుగు
- ప్రారంభం నుంచే శిక్షణ తరగతులకు హాజరు

బీటెక్ పూర్తయిన వెంటనే హైదరాబాద్ నగరంలోని అమీర్‌పేటలోని ఏదొక ఇనిస్టిట్యూట్‌లో చేరిపోయి జావా, పైథాన్ వంటి కంప్యూటర్ కోర్సులు నేర్చుకుని ఉద్యోగం సాధించేవారు. ప్రస్తుతం ఈ కోర్సులు నేర్చుకోవడం కాదు.. పూర్తిస్థాయిలో ప్రావీణ్యంతోపాటు అడ్వాన్స్‌డ్ కోర్సులు అభ్యసిస్తేనే కొలువు సాధించగలం. దీంతో జిల్లాలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలలు తమ విద్యార్థులకు తరగతులు పూర్తయిన అనంతరం రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాయి. బీటెక్ పూర్తయిన వెంటనే ఉద్యోగ సాధనే ధ్యేయంగా విద్యార్థులు సాధన చేస్తున్నారు.

ఇంజినీరింగ్ కళాశాలల్లో వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలు నిర్వహించే ప్రాంగణ ఎంపికల్లో ఒకప్పుడు 100 మంది ఉద్యోగాలకు ఎంపికైతే.. ప్రస్తుతం 20 మందిని కూడా ఎంపిక కావడంలేదు. పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో 90 శాతం మార్కులు తెచ్చుకున్నా అదనపు సామర్థ్యాలున్నవారి వైపే కంపెనీలు మొగ్గుచూపుతున్నాయి. అది కూడా బీటెక్ చివరి సంవత్సరంలో ఉండగా ప్రతిభ చాటినవారికి పెద్ద ప్యాకేజీలతో పెద్దపీట వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీటెక్ విద్యార్థులు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

జావా, పైథాన్ ఫుల్‌స్టాక్ కోర్సులతోపాటు డేటా బేస్ కాన్సెప్ట్, వెబ్ టెక్నాలజీస్, నెట్‌వర్క్, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ బేసిక్స్ వంటివి నేర్చుకుంటున్నారు. మరోవైపు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ టెక్నిక్స్, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల హెచ్ఆర్‌లు వచ్చినప్పుడు సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారు. ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని వదిలిపెట్టకుండా ఇప్పటికే ఉద్యోగాలు సాధించినవారిని సంప్రదించి కొలువు సాధించాలంటే ఏం చేయాలి.? ప్రస్తుత పరిస్థితుల్లో ఏయే కోర్సులు నేర్చుకోవాలనే విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుంటున్నారు. –ఈనాడు, ఒంగోలు

సామర్థ్యాలుండాలి

అదనపు సామర్థ్యాలుంటేనే ఉద్యోగం వస్తుందని విద్యార్థులు గుర్తించారు. సాఫ్ట్‌వేర్ కొలువు సాధనే లక్ష్యంగా అన్ని కోర్సులు నేర్చుకుంటున్నారు. వీరికి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి ఒక కోర్సు పూర్తయిన తరువాత మరొకటి నేర్పుతున్నాం. ఏ కోర్సు చేస్తే ఉద్యోగానికి ఎంపిక కావచ్చో తెలుసుకుని నైపుణ్యం పెంచుకుంటున్నారు.

– జగదీష్, డీన్, ప్రాంగణ ఎంపిక విభాగం, క్విస్ కళాశాల

కొలువు సాధిస్తా

ప్రత్యేక శిక్షణ తరగతుల్లో నలుగురైదుగురు కలిసి ప్రాజెక్టులు చేస్తున్నాం. సందేహాలపై ఒకరికొకరు చర్చించుకుంటున్నాం. బీటెక్ రెండో సంవత్సరం వరకు ఇంటర్వ్యూలో మాట్లాడగలనా.. అనిపించేది. ఈ ఏడాది శిక్షణలో ఉద్యోగం తప్పక వస్తుంది. నా ప్రయత్నం ఆపకుండా మంచి కొలువు సాధిస్తాను. – వై.శివరాం, 4వ ఏడాది విద్యార్థి

(c) eenadu

నియోజకవర్గ కన్వీనర్ల వ్యవస్థ రద్దు: భాజపా

మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు. పక్కన నాయకులు కల్యాణ్ చక్రవర్తి, కృష్ణారెడ్డి

ఒంగోలు, న్యూస్‌టుడే: పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నియోజకవర్గ కన్వీనర్ల వ్యవస్థను భాజపా రాష్ట్ర కమిటీ రద్దు చేసిందనీ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శులకు నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ నిర్మాణంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అందులో భాగంగా ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల ఇన్‌ఛార్జిగా మాకినేని అమరసింహం వ్యవహరిస్తారన్నారు.
◗ దర్శి, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల బాధ్యతలను తంగిరాల అశోక్‌రెడ్డికి అప్పగించారు. ◗ గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల ఇన్‌ఛార్జిగా జె.వి.నారాయణను నియమించారు. జిల్లాలోని అన్ని మండలాలకు సైతం త్వరలోనే నూతన ఇన్‌ఛార్జిలను నియమిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ నిడమానూరి కల్యాణ్‌చక్రవర్తి, జిల్లా మాజీ అధ్యక్షుడు పి.వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పంట నష్టం.. లెక్కింపు ముఖ్యం

◗ కేంద్ర బృందం ఆదుకోవాలంటున్న ఉద్యాన రైతులు

న్యూస్‌టుడే, కంభం:

వెలగలపాయలో చెరువును తలపిస్తున్న మిరప చేను

మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు సోమవారం కేంద్ర బృందం జిల్లాలోని ఎన్‌కేపాడు, కొత్తపట్నంలలో పర్యటించబోతోంది. ఈ సందర్భంగా పశ్చిమ ప్రకాశంలో దెబ్బతిన్న ఉద్యాన పంటలను కూడా బృందం పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

27 మండలాల్లో 516.98 హెక్టార్లలో నష్టం

నాగులుప్పలపాడు, కొత్తపట్నం మండలాల్లో నష్టపోయిన పంటలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించి నష్టం అంచనా వేయనున్నారు. జిల్లాలోని 27 మండలాల్లో ఉద్యాన పంటలైన మిరప, టమాట, అరటి, పసుపు, కూరగాయలు, పూలు, ఉల్లి, జామ, బొప్పాయి, తదితర పంటలు 516.98 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 959 మంది ఉద్యాన రైతులు తీవ్రంగా నష్టపోయారు. అత్యధికంగా త్రిపురాంతకం మండలంలో 152.58, దోర్నాల 93.03, వై.పాలెం 43.59, పెద్దారవీడు 40 హెక్టార్లలో ఎక్కువగా పంటలకు నష్టం వాటిల్లింది.

4,5 తేదీల్లో కురిసిన వర్షానికి పొలాల్లోనే నీరు

అర్ధవీడు మండలంలోని వెలగలపాయ, గన్నేపల్లి, మాగుటూరు, కాకర్ల తదితర గ్రామాల్లో మొంథా తుపాను తర్వాత ఈ నెల 4, 5న కురిసిన వర్షానికి మిరప, టమాట పైర్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లోనే నీరు నిలిచి ఉంది. ఆయా గ్రామాల్లో మళ్లీ కురిసిన వానలకు సుమారు 150 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.
◗ గుండ్లకమ్మ ప్రవాహం కొనసాగుతుండడంతో పశ్చిమ ప్రాంతంలో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కంభం చెరువు అలుగు 13 రోజుల నుంచి పారుతుండడంతో పలు పంటల పైనుంచే ప్రవాహం వెళ్తోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ఈ నెల 4, 5 తేదీల్లో కురిసిన వర్షానికి సాగులో ఉన్న మిరప, టమాట పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. ఉన్నతాధికారులకు ఇప్పటికే ఈ విషయం తెలియజేశాం.– శ్వేత, ఉద్యానశాఖ అధికారిణి, కంభం, గిద్దలూరు

ఎంపికైన జిల్లా జట్లతో ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

సీనియర్ ఫెన్సింగ్ జట్ల ఎంపిక

ఒంగోలు క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా సీనియర్ ఫెన్సింగ్ జట్ల ఎంపిక ఒంగోలులోని డాక్టర్ పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో ఆదివారం జరిగింది. దీనికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఎంపిక పోటీలు నిర్వహించి అందులో చూపిన ప్రతిభ ఆధారంగా జట్లను ఎంపిక చేశారు. ఈ జట్లు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తాయని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. వీటికి బి.భరత్, టి.క్రాంతికిరణ్ కోచ్‌లుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఎంపిక జట్లను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, జిల్లా ఛైర్మన్ కోలా మనోహర్; జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కోలా మనోహర్ అభినందించారు.

పురుషుల, మహిళల విభాగంలో..

● **పురుషుల జట్టు:** కమ్మ జగదీష్ చౌదరి, వాటుపల్లి లోకేష్‌సాయి, పుత్తూరి అంబరీష్; అబ్దుల్ ముకీత్ ఇర్ఫాజ్ మహ్మద్(ఈపీ విభాగం), షేక్ అదిల్ అహ్మద్ మదీనే, మేడా రామ్‌చరణ్; తుళ్లిబిల్లి అక్షయ్ శ్రీనాథ్, తుళ్లిబిల్లి క్రాంతికుమార్ (ఫాయిల్ విభాగం (కోడూరి వెంకట సాయితేజ్ రెడ్డి, కోడూరి మధుసాయినందారెడ్డి, తుళ్లిబిల్లి అభినవ్ బుద్ధ, గడికొయ్యల శ్రీకాంత్ (సాబిరే విభాగం).
● **మహిళల జట్టు:** షేక్ ఆసిఫా తబుసుమ్, బెజవాడ నమ్రత, ముత్కాల మనస్విని, షేక్ ఫిర్దౌస్ తస్నీమ్ (ఈపీ విభాగం), కోడెల తనూజ, కూరపాటి బాలనాగసాయి స్నేహాంజలి, ఎద్దు భూమినర్సన, చుండూరి వర్షిణి (ఫాయిల్ విభాగం), పుత్తూరి వర్షిత, ఏలూరం వెంకటసాయి మహిత, మండిగ నందితాదేవి (సాబిరే విభాగం).

చంద్రమౌళీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలోని గంగా పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయంలో ఆదివారం కార్తిక వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తుల శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదే విధంగా పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి అన్నాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు స్వామి వారి దర్శనభాగ్యం కల్పించారు.

తీరం.. సందర్శకుల సంబరం

కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం సముద్ర తీరంలో ఆదివారం సందర్శకులు, పర్యాటకులు సందడి చేశారు. కార్తిక మాసం, శని, ఆదివారాల సెలవులు కావడంతో కుటుంబాలతో కలిసి జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు అధికంగా వచ్చారు. ఉదయం ఆరు గంటలకే తీరంలో సందర్శకుల సందడి మొదలైంది. ఎవరూ సముద్ర లోపలికి వెళ్లి స్నానాలు చేయకుండా, ఒడ్డునే చేసే విధంగా మెరైన్ పోలీసులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేశారు. – న్యూస్‌టుడే, కొత్తపట్నం

వాహనం బోల్తా

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల నుంచి గిద్దలూరు వైపు అరటికాయల లోడుతో వస్తున్న బొలెరో వాహనం ఆదివారం మధ్యాహ్నం గిద్దలూరు వివేకానంద కాలనీ వద్ద బోల్తా పడింది. టైరు పంక్చర్ కావడంతో వేగం అదుపుతప్పి బోల్తాపడగా, చోదకుడు సురక్షితంగా బయటపడ్డాడు. అనంతరం వాహనాన్ని పోలీసులు పక్కకు తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలు

◗ అన్ని రంగాల్లో ఛాంపియన్ షిప్ విశాఖపట్నం

విజేతలకు బహుమతులు అందిస్తున్న అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు (గ్రామీణం, న్యూస్‌టుడే): శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ఉన్నత పాఠశాలలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించిన పాఠశాలల క్రీడల సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో బాల బాలికల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో అన్ని రంగాల్లో ఛాంపియన్‌షిప్ అవార్డు విశాఖ జిల్లాకు చెందిన క్రీడాకారులకే దక్కింది. రాష్ట్రం నుంచి బాలుర విభాగంలో 22 మంది, బాలికల విభాగంలో 22 మంది వచ్చే నెల మొదటి వారంలో ఇండోర్(మధ్యప్రదేశ్)లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు తవిటయ్య తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పువ్వు ఈశ్వరరావు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, వ్యాయామోపాధ్యాయ సంఘ నాయకులు బహుమతులు అందించారు. సంఘ నాయకులు రామారావు, నాగరాజు, గజేంద్ర, పద్మలోచన, చంద్రశేఖర్, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.
● రెండో రోజు విజేతలు..: ◗ 600మీ. పరుగు పందెం.. బాలురు: శివప్రసాద్ (ప్రకాశం)
◗ లాంగ్‌జంప్.. బాలికలు: వైష్ణవి (ప్రకాశం)

తెదేపా నాయకుడు సుబ్బయ్యను హెచ్చరిస్తున్న వైకాపా నాయకులు

వైకాపా ఎమ్మెల్యే అనుచరుల వీరంగం

◗ తెదేపా నాయకుడిపై దాడి

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా ఎమ్మెల్యే అనుచరులు వీరంగం సృష్టించడమే కాక తెదేపా నాయకుడిపై దాడి చేశారు. ఈ సంఘటన యర్రగొండపాలెంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రముఖ వ్యాపారి, తెదేపా మాజీ మండల ఉపాధ్యక్షుడు, గ్రంధి శిల వెంకట సుబ్బయ్య పట్టణంలో దుర్గా లాడ్జి నిర్వహిస్తున్నారు. మురారిపల్లెకు చెందిన మల్లికార్జునరెడ్డి తన బంధువుల వివాహం నిమిత్తం యర్రగొండపాలెంలోని దుర్గా లాడ్జిలో ఓ గది బుక్ చేశారు. వైకాపాకు చెందిన స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అనుచరులు భూమిరెడ్డి చిన్న సుబ్బారెడ్డి, మద్దుల శ్రీనివాసరెడ్డి, మల్లారెడ్డి తదితరులు శనివారం ఆ రూమ్‌లో దిగారు. మద్యం మత్తులో ఉన్న ఆ ముగ్గురు అర్ధరాత్రి వేళ..మరో రూం కావాలంటూ లాడ్జిలో పనిచేస్తున్న హనుమంతునాయక్‌తో గొడవ పడుతుండగా, పక్క గదిలో నిద్రిస్తున్న లాడ్జి యజమాని, తెదేపా నాయకుడు గ్రంధిశిల వెంకటసుబ్బయ్య అక్కడికి వచ్చారు. రూములు ఖాళీ లేవని చెప్పడంతో వారు ఆయనపై దాడి చేశారు. సుబ్బయ్య వారి నుంచి తప్పించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చౌడయ్య ఆదివారం తెలిపారు. నిందితులు కారులో లాడ్జికి వచ్చేముందు స్థానిక కల్యాణ మండపం వద్ద మరో కారును ఢీకొన్నారు. అయితే ఈ విషయం తమ దృష్టికి రాలేదని ఎస్సై తెలిపారు. నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు.

పల్లె పాలన.. మరింత ప్రక్షాళన

రాష్ట్రంలో పల్లెపాలన గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) వ్యవస్థను బలోపేతం చేసేందుకు అడుగులు పడుతున్నాయి.

◗ ప్రారంభానికి సిద్ధమైన డీడీవో కార్యాలయం

జడ్పీ కార్యాలయ ఆవరణలోని డీడీవో కార్యాలయం

న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్:

ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ప్రస్తుతం అయిదు డివిజన్ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ డీడీవోలు స్థానికంగా అందుబాటులో ఉన్న కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా ఆయా డివిజన్ కేంద్రాల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన భవనాల్లో నూతనంగా డీడీవో కార్యాలయాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కొత్తగా గుర్తించిన కార్యాలయాల్లో ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు జిల్లా ప్రజా పరిషత్ నుంచి రూ.10 లక్షలు చొప్పున నిధులు విడుదల చేశారు. అందులో భాగంగా జిల్లా కేంద్రమైన ఒంగోలులోని పాత జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు నిమిత్తం వాటి ఆధునికీకరణకు జిల్లా ప్రజాపరిషత్ నిధుల నుంచి కేటాయించారు.

2020లో ప్రతి డివిజన్‌కు ఒక డీడీవో..

ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలోని ఆరు మండలాల్లో 117 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2020లో ప్రతి డివిజన్‌కు డీడీవోను నియమించినా వారికి కార్యాలయాలు కేటాయించలేదు. డివిజన్ కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఓ గదిని తీసుకుని విధులు నిర్వహించాలని మార్గదర్శకాలు ఇచ్చారు. అదే సమయంలో జడ్పీ నుంచి ప్రతి కార్యాలయానికి ఇద్దరు సిబ్బందిని సర్దుబాటు చేశారు. పలు చోట్ల డీడీవోలకు కార్యాలయాలు లేక ప్రభుత్వ కార్యక్రమాలు, పీజీఆర్ఎస్ వంటి సమీక్షల్లోనే వారు కనిపిస్తున్నారు. తాజాగా నూతనంగా ఏర్పాటు చేయనున్న కార్యాలయాల్లో అందుకు యుద్ధప్రాతిపదికన డీడీవో, డీఎల్‌పీవో, ఉపాధి ఏపీడీ ఛాంబర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో కార్యాలయంలో 15 మంది సిబ్బందిని సర్దుబాటు చేయనున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ షెడ్యూల్ ఖరారు చేయగానే ఒంగోలులో డీడీవో నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.

చిరు కారణాలకే ఉసురు తీసుకున్నారు!

◗ వేర్వేరుచోట్ల ముగ్గురి ఆత్మహత్య

కంభం, న్యూస్‌టుడే : చిరు కారణాలకే వారు మనస్తాపానికి గురయ్యారు. క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. జిల్లాలో వేర్వేరుచోట్ల ముగ్గురు బలవన్మరణానికి పాల్పడటం కలవరపెట్టింది. పోలీసుల కథనం మేరకు..స్థానిక పూసలబజారులో నివాసముండే శీలం రాజా (31) కార్ బెండింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆయన..ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గుర్తించిన స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా..దారిమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు.
● మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: వేర్వేరుచోట్ల ఇద్దరు యువకులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపిన వివరాల మేరకు..దోనకొండ మండలం మల్లంపేట గ్రామానికి చెందిన మెట్టల శ్రీనివాసరావు (20) కుటుంబ సమస్యల నేపథ్యంలో ఈ నెల 4న మార్కాపురంలోని కళాశాల రోడ్డులో గడ్డి మందు తాగాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో..

తర్లుపాడు మండలం గానుగపెంట గ్రామానికి చెందిన మాచూరి శివ కుమార్ (23) అనే యువకుడు ఈ నెల 6న పట్టణంలోని ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో అదేరోజు పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతన్ని గుంటూరు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్.ఐ. సైదుబాబు తెలిపారు.

నేటి నుంచి గ్రామ సభలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: భూముల సర్వేకి సంబంధించి ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో జరిగే సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు బ్రహ్మయ్య, మండల సర్వేయర్ మోజెస్‌లు తెలిపారు. సంయుక్త ఎల్‌పీఎంలను విభజించేందుకు నిర్వహిస్తున్న ఈ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10న రంగసాయి పురం, నేకునంబాదు, 11న బండ్లమూడి, టి.గుడిపాడు, వై.గుడిపాడు, 12న పి.నాయుడుపాలెం, కె.అగ్రహారం, 13న మంచికలపాడు, ఆర్ఎల్‌పురం, 14న పులికొండ, మైలవరం, 15న పిడతలపూడి, బూసరపల్లి, జీఎల్‌పురంలో ఈసభలు జరగనున్నాయని వారు తెలియజేశారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూ సమస్యలతో ఇక్కట్లు పడుతున్న వారు సభలకు హాజరై సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

భక్తకోటి ప్రీతిపాత్రం.. పునుగోడు సిద్దేశ్వరాలాయం

◗ ప్రత్యేకత చాటుతున్న పురాతన శివలింగం

అభిషేకాలందుకుంటున్న సహస్ర శివ లింగం

న్యూస్‌టుడే, కనిగిరి:

కనిగిరి మండలంలోని అతి ప్రాచీన దేవాలయాల్లో పునుగోడు సిద్ధేశ్వరాలయం (శివాలయం) ఒకటి. కార్తికం, శివరాత్రి మాసాల్లోనే అన్ని కాలాల్లోనూ ప్రత్యేకత చాటుతూ భక్తులకు ప్రీతిపాత్రమైనదిగా గుర్తింపు పొందింది. ప్రస్తుత కార్తిక మాసంలో నిత్యం భక్తుల రద్దీతో కళకళలాడుతోంది.

'తమ్మళ్లు' పేరుతో పురోహిత శాఖ: కాకతీయ ప్రతాప రుద్రుని పరిపాలన కాలంలో శైవ మతాన్ని పూజించే వారిలో 'తమ్మళ్లు' అనే ముఖ్య శైవపురోహిత శాఖ ఉండేది. వీరు ప్రత్యేకించి శివారాధన చేసేవాళ్లు. ఇలాంటి పేరుగాంచిన ఈశాఖ పురోహితులు పునుగోడు గ్రామంలో మాత్రమే నివసించేవారు. ఈశాఖలో ప్రధాన పురోహితుడైన మలిపూడి ఐబులయ్య కుటుంబానికి చెందిన విఫలం వేజ అనప్ప తన కుమార్తె వివాహం సందర్భంగా సహస్ర లింగాల్లో ఒకలింగాన్ని చెక్కించి ఆ లింగాన్ని ఈ శివాలయంలో ప్రతిష్ఠ చేసి దేవాలయాన్ని నిర్మించాడు.

ఆలయంలోని శిలా శాసనం

క్రీ.శ.1345లో శాసనం ఏర్పాటు: శివాలయానికి పది సింగముల చేను దానంగా ఇచ్చాడు. దీనికి ఎవరైనా ఆటంకం కలిగిస్తే గంగానదిలో గోవును చంపిన పాపాన పోతారని పేర్కొంటూ శివాలయంలో ఆనాటి నాగరిక లిపిలో 1345 రౌద్రినామ సంవత్సరం కార్తిక శుద్ధ శుక్రవారం శాసనాన్ని ప్రతిష్ఠించాడు. అత్యంత మహిమ గల ఈ లింగాన్ని పూజిస్తే సకల పాపాలు తొలగి కోరికలు నెరవేరతాయని భక్తుల విశ్వాసం. ప్రతి కార్తిక మాసంలో పునుగోడు సిద్ధేశ్వరాలయానికి భక్తులు వేలాదిగా వచ్చి శివున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని వెళ్తుంటారు. భక్తుల సౌకర్యం కోసం కనిగిరి డిపో నుంచి ప్రత్యేకంగా సిద్ధేశ్వరాలయానికి బస్సులను తిప్పుతున్నారు.

నకిలీ బంగారంతో వ్యాపారికి కుచ్చుటోపీ

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణ

కాటారం, న్యూస్‌టుడే: కిరాణా వ్యాపారికి నకిలీ బంగారం అంటగట్టి రూ.10 లక్షలు కాజేసిన ఐదుగురు నిందితులను ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ.3.48 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఠాణాలో ఆదివారం సీఐ నాగార్జునరావు, ఎస్సైలు శ్రీనివాస్, మహేష్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సూర్యనారాయణ ఈ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన దంపతులు పుణ్యబాలచంద్ రాథోడ్, మీనాపుణ్య రాథోడ్, వీరి అల్లుడు, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన రాజ సోలంకి, మహారాష్ట్రలోని కారేగావ్‌కు చెందిన శాంతి విజయసోలంకి, స్వప్న ఈశ్వర్‌లు ముఠాగా ఏర్పడి చోరీలు, మోసాలకు పాల్పడుతున్నారు. వీరు వారం క్రితం కాటారానికి వచ్చారు. తక్కువ ధరకు బంగారం విక్రయిస్తామని ఓ కిరాణ దుకాణం యజమానిని నమ్మించారు. వ్యాపారి వద్ద రూ.10 లక్షలు తీసుకొని నకిలీ బంగారం విక్రయించారు. మార్గం మధ్యలో నస్తూర్‌పల్లి వద్ద ఒకరిపై దాడి చేసి దోపిడీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశాల మేరకు పోలీసులు గాలింపు చేపట్టగా.. మండల పరిధిలోని చింతకాని శివారులో అనుమానాస్పదంగా కనిపించిన వీరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.3.48 లక్షల నగదు, 6 చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది తిరుపతి, హరికుమార్, గణేష్, లక్ష్మీరాజ్, హరీష్, జగన్ శిరీష, జ్యోతి, స్వాతి, తిరుపతి పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెంలో గత సెప్టెంబర్ 11న అదృశ్యమైన ఓ బాలిక కేసును పోలీసులు ఛేదించారు. పుల్లలచెరువు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక వై.పాలెంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. సెప్టెంబర్ 11న కళాశాలకు బయలుదేరిన తర్వాత ఆమె ఆచూకీ గల్లంతైంది. దీంతో ఆమె తల్లిదండ్రులు వై.పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీలో పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. ఓ యువకుడి మాయ మాటలు నమ్మి ఆమె హైదరాబాద్ వెళ్లిందన్న సమాచారం మేరకు పోలీసులు శనివారం అక్కడికి వెళ్లి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఆమెను గుర్తించారు. అనంతరం అక్కడి నుంచి వై.పాలెం తీసుకొచ్చినట్లు ఎస్సై చౌడయ్య ఆదివారం తెలిపారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 108, రిటైల్ లైవ్ - 135, చికెన్ విత్ స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్- 223

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి

మీ ఉన్నతికై శ్రమించిన, మీ కుటుంబ సభ్యుల / ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రచురణ కొరకు

వివరాలకు సంప్రదించండి

ఈనాడు ప్రకటనల విభాగం

ఈనాడు కార్యాలయము, పేర్నమిట్ట, ఒంగోలు

★ GST 5% అదనం

✆ 97011 12824

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

B.Pharmacy, Bachelor of Physiotherapy (BPT), B.Sc, Nursing, GNM Nursing మేనేజ్‌మెంట్ సీట్ల కొరకు సంప్ర: 98669 39320, 70134 48102.

REAL ESTATE

PLOT FOR SALE

ఒంగోలు, తూర్పుకమ్మపాలెం, కాకతీయ నగర్ నందు 100గదులు, 50గదులు, దక్షిణం ముఖం. 30అ|| రోడ్ గల స్థలము అమ్మబడును. ✆ 7032868706.

LEASE/ RENT

Commercial Property For Rent in Kurnool Road Prime Area 18X72 South Facing 3 Stairs Building OPP: Joy Alukkas Jewellery (Old Medal) Next to AMBICA LIFE STYLE. 9849115672, 9849119754.

1 ఎకరం ఓపెన్ ల్యాండ్ - అద్దెకు /లీజుకు కలదు. ఏడుగుండ్లపాడు NH-5 రోడ్డుని ఆనుకొని హైవే సిటీ - వెంచర్ ప్రక్కన గల ఖాళీస్థలం హోటల్స్, గోడౌన్స్, షోరూమ్స్‌కు అనుకూలమైనది. ఒంగోలు. 5KM. ✆ 98491 15524, 77299 39130.

PROPERTY FOR SALE

Gunter Skamala Nagar House Site Of 960 Yards Located Opp Sairam Water Plant Beside Dimond Towers is for sale. Genuine Buyers Contact: 7382621835, 7799580787, 9848049588.

TO LET

COMMERCIAL

ఒంగోలు కర్నూలురోడ్డు చీమకుర్తి హాస్పిటల్ ఎదురులైన్ గ్రౌండ్ ఫ్లోర్ 2000Sft 1వ ఫ్లోర్ 1000Sft బ్యాంకు హాస్పిటల్స్ ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును పార్కింగ్ కలదు ✆ 9989919347

JOBS

Wanted B.Com/M.Com/ MBA Finance/CA IPCC Dropouts To Be Work as Field Executive in Ongole in a Reputed Auditfirm. Interested Persons (Male Only). Cont ✆ 70135 11502 or mail to kowthahr@gmail.com

HDFC లైఫ్ ఇన్స్యూరెన్సు ఏజెంట్‌గా చేరండి ఆకర్షణీయమైన కమీషన్, జీతం, ప్రతినెల ఫారిన్ టూర్ లేదా క్యాష్ బహుమతులు పొందండి వివరములకు. ✆ 93813 41066.

టాటావారి జ్యువెలరీషోరూమ్ క్యారెట్ లైన్ నందు పనిచేయుటకు సేల్స్ పర్సన్స్ కావలెను. Q: ఇంటర్/ డిగ్రీ, అర్హులైన వారు తమ బయో డేటాతో క్యారెట్‌లైన్ షోరూమ్, కర్నూల్‌రోడ్, శుభమస్తు షాపింగ్ మాల్ ప్రక్కన, ఒంగోలు. ✆ 83408 21777

ప్రముఖ కంపెనీకి అడ్మినిస్ట్రేషన్ వర్క్ (ఎక్స్పీరియన్స్ Male) అభ్యర్థులు కావలెను. Exp: 5 Years, Qly: డిగ్రీ / పీజీ. Contact ✆ 89857 17076

FACULTY/ TEACHERS

English, Science and Social Teachers for 6th,7th, 8th Classes. Attractive Salary. A Historical Reputed School, Chimakurthy. ✆ 8309231003, 9849856656

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు 80087 09902
మార్కాపురం 80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

పేదలకు వస్త్రాల పంపిణీ

పొదిలి: పొదిలి ఎస్కేవీకే డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు దివంగత మువ్వల శ్రీహరిరావు జయంతి సందర్భంగా పొదిలిలో ఆదివారం ఆర్యవైశ్యసంఘం, అన్నపూర్ణసేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ముందుగా గునుపూడి చెంచయ్య సత్రంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు జి.సి.సుబ్బారావు, ఎం.సుబ్బయ్య, ఎస్.పద్మావతి, కె.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వస్త్రాలు అందజేస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

నేటి నుంచి పొదిలిలో జనగణన

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి నగర పంచాయతీలో సోమవారం నుంచి జన గణన ప్రారంభమవుతుందని నగర పంచాయతీ కమిషనరు కె.ఎల్.నారాయణరెడ్డి చెప్పారు. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు సహకరించి వారు అడిగిన విషయాలపై వాస్తవ సమాచారం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం జనగణనకు శ్రీకారం చుట్టిందని, రాష్ట్ర ప్రభుత్వం పొదిలి నగర పంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుందన్నారు. అక్కడి అన్ని ప్రాంతాలను కలిపి 21 బ్లాకులుగా చేశారని, వాటి కోసం 21 మంది ఎన్యుమరేటర్లు, ముగ్గురు సూపర్‌వైజర్లను ఎంపిక చేశారన్నారు. ఈ నెల 10 నుంచి 30 లోపు జనగణన పూర్తిచేస్తారన్నారు. దేశ ప్రగతిలో తీసుకునే నిర్ణయాల్లో జనాభా, ప్రజల ఆర్థిక పరిస్థితి సమాచారం కీలకమైనందున ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మార్కాపురం పట్టణం: పెద్దఎత్తున హాజరైన భక్తులు

కనుల పండువగా నాగమయ్య కల్యాణం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో నాగమయ్య స్వామిల కల్యాణం ఆదివారం కనుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు పొన్నలూరి శ్రీనివాసుల ఆధ్వర్యంలో నాగమయ్య ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక మండపంలో ఉంచి కల్యాణ క్రతువు జరిపించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై ఈ వేడుకను తిలకించారు. అనంతరం భారీఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మార్కాపురం పట్టణం: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ముద్దసానమ్మకు నీరాజనం

మార్కాపురం గ్రామీణం: కోలభీమునిపాడు శివారులో వెలసిన ముద్దసానమ్మతల్లి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు విశేష పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందించారు.

కోటా సత్యమాంబదేవికి కుంకుమార్చనలు

కంభం, న్యూస్‌టుడే : పట్టణ సమీపంలోని కోటా సత్యమాంబ దేవికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, చందనం, పుష్పాలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. కుంకుమబండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీచక్రం, శివుడు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, పుట్టాలమ్మ వద్ద పూజలు నిర్వహించారు. అమ్మకు బోనాలు, చీరలు, గాజులు సమర్పించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

పుష్పాలంకరణలో అమ్మవారు

పట్టణాల్లో వసతుల వెలుగు

❖ కేంద్ర, రాష్ట్ర నిధులతో పనులు

న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

గత వైకాపా ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనను విస్మరించడంతో పురపాలక సంఘాల్లో అభివృద్ధి పడకేసింది. ప్రధానంగా రహదారులు, మురుగు కాలువల నిర్మాణం నిలిచిపోయింది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన కూటమి ప్రభుత్వం.. ఓవైపు తాను నిధులు మంజూరు చేస్తూ, మరోవైపు కేంద్రం నుంచి మరిన్ని నిధులు రప్పిస్తూ ముందడుగు వేస్తోంది.

గత ప్రభుత్వం గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో పశ్చిమ ప్రాంతంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. తాము చేపట్టిన పనులను సైతం వారు నిలిపివేశారు. దీంతో మార్కాపురం, గిద్దలూరులో స్థానికులకు అవస్థలు తప్పలేదు. గిద్దలూరు పట్టణంలో డ్రైనేజీల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షాకాల మొస్తే మురుగంతా రోడ్లపై ప్రవహిస్తోంది.

శ్రీరామ్‌నగర్‌లో నిర్మించిన సిమెంట్ రహదారి

దీన్ని దృష్టిలో ఉంచుకున్న పాలకులు ఇప్పటికే వివిధ పద్దుల కింద పట్టణానికి రూ.11 కోట్లు మంజూరు చేశారు. వాటితో రహదారి, పక్కా కాలువల నిర్మాణం, నీటి ఎద్దడి లేకుండా డీప్‌బోర్లు, పైపులైను ఏర్పాటు, పార్కు అభివృద్ధి వంటివి చేపడుతున్నారు. ఎస్సీ, ఎస్టీల కాలనీల్లో వసతుల మెరుగుకు నిధులు మంజూరయ్యాయి.

ఆర్థిక సంఘం నిధులు మొదలు..

గిద్దలూరు పట్టణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.90 కోట్లు, బీపీఎస్ 2019, ఎల్ఆర్ఎస్ 2020 గ్రాంట్ రూ.3 కోట్లతో పనులు చేపడుతున్నారు. ఇవే కాక ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ నిధులు రూ.కోటితో 10 పక్కా కాలువల నిర్మాణం, జిల్లా ఖనిజాభివృద్ధి సంస్థకు చెందిన రూ.1.67 కోట్లతో రహదారులు, డ్రైనేజీల ఏర్పాటు, రూ.1.50 కోట్ల ఎస్సీ ఎస్టీ నిధులతో బడుగు బలహీన వర్గాల కాలనీల్లో రహదారుల మెరుగు పరుస్తున్నారు. కాశిరెడ్డికుంటను ఉద్యానవనంగా అభివృద్ధి చేసేందుకు బీపీఎస్, ఎల్ఆర్ఎస్ గ్రాంట్ కింద రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపట్టేందుకు పురపాలక అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, పురపాలక శాఖ కార్యాలయ కొత్త భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

మానవ మనుగడకు అడవులు కీలకం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : మానవ మనుగడకు అడవులు ఎంతో అవసరమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం దిగువమెట్ట గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అడవులు, వన్యప్రాణులను సంరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తుచేశారు. 2047 నాటికి 50 శాతం పచ్చదనం పెంపొందించే విధంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతోందన్నారు. నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో 80 పెద్ద పులులు ఉన్నాయన్నారు. దిగువమెట్టలో ఏర్పాటు చేసిన వనవిహారిని స్థానికులు, పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు ఆయన దిగువమెట్ట వనవిహారి అతిథిగృహాలను ప్రారంభించి అక్కడ మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో నంద్యాల సీసీఎఫ్ బి.విజయకుమార్, గిద్దలూరు, అత్మకూరు, నంద్యాల డిప్యూటీ డైరెక్టర్లు నిషా కుమారి, అప్పావు, అనురాగ్ మీనా, గుండ్లకమ్మ అటవీక్షేత్రాధికారి నరసింహారావు, డీఆర్వో వంశీకృష్ణ, భైలడుగు బాలయ్య, బుడతా మధుసూధన్ యాదవ్, గిద్దలూరు మాజీ సర్పంచ్ దప్పిలి విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు

విద్యుద్దీపాలంకరణలో నాసర్ మహమ్మద్ దర్గా

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం

పొదిలి, న్యూస్‌టుడే: మండలంలోని మాదాలవారిపాలెంలో ఆదివారం హజరత్ నాసర్ మహమ్మద్ వలీ గంధమహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తరలించారు. భక్తులు దర్గాను సందర్శించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కుల మతాలకతీతంగా అన్ని వర్గాల వారు పాల్గొని సామరస్యాన్ని చాటారు. దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రభలను ఏర్పాటు చేశారు. పాట కచేరీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కళాకారులు అలరించారు.

వైభవంగా నాసరయ్య ఉరుసు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: త్రిపురాంతకం శివారులోని నాసరయ్య ఉరుసు ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 10న కనుమ, 11న గురుపూజోత్సవ కార్యక్రమాలతో ఉరుసు ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

ఇక్బాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉర్దూ అసోషియేషన్ నాయకులు

ప్రభుత్వ సహకారంతో ఉర్దూ భాషాభివృద్ధి

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉర్దూ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ ఉర్దూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, రచయిత మహమ్మద్ ఇక్బాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉర్దూ ఉపాధ్యాయుల అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.అన్వర్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వం ఉర్దూ భాషాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. పోస్టుల భర్తీపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

పొదిలి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం గౌరవ అధ్యక్షులు సుబ్బారావు కోరారు. ఆదివారం పొదిలి ఎన్జీవో హాలులో ఆ సంఘం జిల్లాస్థాయి సమావేశం జరిగింది. పూర్తిస్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టి సిబ్బందిపై అదనపు భారం తగ్గించాలన్నారు. 104లో ఫార్మాసిస్ట్‌ను నియమించాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లా ఏర్పాటుతో మేలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లాను వెంటనే ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్ నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం బేస్తవారపేటలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుతో వెనుకబడిన పశ్చిమ ప్రాంతానికి మేలు కలుగుతుందన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు నీరందించాలన్నారు. ఈ నెల 18న భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం పేరుతో మార్కాపురంలో నిర్వహించే ధర్నాకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కేవీ రమణ, రైతుసంఘం కార్యదర్శి ఢాకాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్ నారాయణ

ఇలా..తెలివి తెల్లారింది !

పొదిలిలోని విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో ఉన్న విలేజీ హెల్త్ క్లినిక్ భవనం దుస్థితి ఇది ! వైకాపా పాలనలో నీటికుంట భూమిలోనే సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్‌క్లినిక్‌లు నిర్మించారు. అప్పట్లోనే నిబంధనలు గాలికొదిలేసి నిర్మాణాలు కానిచ్చారు. ఇటీవల చిరు వర్షాలకే భవనం ముంపునకు గురవ్వడంతో అటువైపు వెళ్లే వీలు లేకుండాపోయింది. దీంతో నిధులన్నీ ఇలా బురద పాలు చేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –న్యూస్‌టుడే, పొదిలి

రాచబాట పక్కనే ముప్పు

మార్కాపురం చెరువు అలుగు వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండడంతో అలుగులోకి నీరు చేరింది. ఆ పక్కనే ఒంగోలు - మార్కాపురం ప్రధాన రహదారి వెళుతోంది. అయితే గుంత సమీపంలో ఎలాంటి రక్షణ గోడ లేదు. దీంతో వాహనాలు అదుపుతప్పి ఆ గుంతలో పడే అవకాశముంది. సూచిక బోర్డులైనా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మార్కాపురం అర్బన్

చోదకుడు లేక వృథాగా..

గిద్దలూరు మండలంలోని కృష్ణంశెట్టిపల్లె పంచాయతీకి 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం పారిశుద్ధ్య పనుల నిమిత్తం ట్రాక్టర్ అందించింది. అప్పట్లో కొంతకాలం దాన్ని వినియోగించారు. ఆ తదనంతరం నిధులు లేవంటూ చోదకుడిని కేటాయించలేదు. దీంతో రూ.లక్షల విలువైన ఈ ట్రాక్టర్ నేడు కృష్ణంశెట్టిపల్లె - కంచిపల్లె రహదారి పక్కన నిరుపయోగంగా పడి తుప్పుపట్టి పోతోంది. – న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

ఎంఎస్ఎంఈ ఏర్పాటుతో యువతకు ఉపాధి

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 11న ముఖ్యమంత్రి చంద్రబాబు లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభించనున్నారు. ఈ పర్యటనను జయప్రదం చేయాలని భాజపా రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఎంఎస్ఎంఈల ద్వారా స్థానిక నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

కంభం చెరువుకు పర్యాటక కళ

కంభం : చారిత్రక కంభం చెరువుకు పర్యాటకులు పోటెత్తారు. పదమూడు రోజులుగా అక్కడ అలుగు పారుతుండటంతో చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల వారు పెద్దఎత్తున వచ్చారు. ఆదివారం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు వచ్చి అలుగుకు దూరంగా సెల్ఫీలు దిగారు. ప్రవాహ ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో నీటిలోకి దిగేందుకు పోలీసులు అనుమతించకపోవడంతో గట్టు వద్దే ఉండి పరిసర అందాలను తమ చరవాణుల్లో బంధించారు. కొంతమంది పక్కనే ఉన్న కొండపైకి ఎక్కి సేద తీరారు.

అలుగు వద్ద సెల్ఫీలు తీసుకుంటున్న పర్యాటకులు

బాధితులకు మొండి చెయ్యి

పెద్దదోర్నాల: మొంథా తుపాను ప్రభావంతో ఫీడర్ కాలువకు గండి పడి కొన్ని పంట పొలాలు కోతకు గురికాగా, మరికొన్ని పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయి. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పంట నష్టం అంచనా వేసి నమోదు చేయకుండా అనర్హుల పేర్లు నమోదు చేశారని కొత్తూరు రైతులు కొప్పుల పెద్ద వెంకటరెడ్డి, దుగ్గెంపుడి శంకర్‌రెడ్డి, గంజి వెంకటేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మిరప పంటలో వరద నీరు చేరి దెబ్బతిన్న ఆ పంటను నష్టపోయిన జాబితాలో చేర్చలేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వారు కోరుతున్నారు.

నష్టపరిహారం నమోదు కాని మిరపపంట

రహదారిని బాగు చేస్తున్న దృశ్యం

దారిని బాగు చేయించారు

ఈనాడు కథనానికి స్పందన

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: చిన్నగుడిపాడు బీసీ కాలనీలోని పెద్దబొమ్మలాపురం రహదారిలో గుంతలు పడి వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. గత నెల 12న ఇక్కడో.. దారుండాలే.. పేరుతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఆ గ్రామంలోని తెదేపా నాయకులు నేషనల్ హైవే పనులు చేయిస్తున్న గుత్తేదారుడు రవీంద్రారెడ్డిని కలిసి రహదారి దుస్థితిని వివరించారు. స్పందించిన ఆయన గుంతల్లో మొరస తోలి చదును చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

పశ్చిమంలో వన భోజనాల సందడి

కంభం, న్యూస్‌టుడే : పశ్చిమ ప్రాంతంలో కార్తికం సందడి నెలకొంది. పట్టణంలోని చిన్నకంభం వెళ్లే దారిలోని కాశీవిశ్వనాథ కోటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. సామూహిక గణపతి, రుద్ర, నవగ్రహ, సుదర్శన హోమాలు చేశారు. అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు ఇందులో పాల్గొన్నారు.

బేస్తవారపేట: బేస్తవారపేట రెడ్డి సంఘానికి చెందిన ఇండ్ల శంకర్‌రెడ్డి, నర్రా బసిరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పోలేరమ్మ గుడిలో వన భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం పెద్దలు శేఖర్ రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కొండా రఘునాథరెడ్డి, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

హోమాలు చేస్తున్న భక్తులు

వైభవంగా ...

పొదిలి: పొదిలి గోశాలలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా గోపూజ చేశారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుతూ కల్యాణం నిర్వహించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. అనంతరం గోశాల ఆవరణలోని ఉసిరిచెట్టు వద్ద కార్తికదీపాలు వెలిగించి పూజలుచేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎస్.శివకృష్ణామాచార్యులు, ఎస్.చంద్రశేఖర్, శ్యామలా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : ముస్తాబైన శివ పార్వతుల ఉత్సవ మూర్తులు

బేస్తవారపేట : కార్యక్రమంలో పాల్గొన్న రెడ్డి సంఘం సభ్యులు

గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సోదరుడు కృష్ణకిశోర్‌రెడ్డి, తదితరులు

'ఈ ఏడాది సిరుల పంట'

రాచర్ల, న్యూస్‌టుడే : అనుములపల్లి చెరువు ఏడేళ్ల తర్వాత నిండుకుండలా మారడంతో గ్రామస్థులు ఆదివారం గంగమ్మకు పూజలు చేశారు. ఆయకట్టు అధ్యక్షుడు సిరిగిరి శ్రీహరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సోదరుడు కృష్ణకిశోర్‌రెడ్డి గంగమ్మకు పసుపు, కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. ఈ ఏడాది సిరులు పండుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుప్పా రంగనాయకులు, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్, వెంకటపతి, వెంకటరంగయ్య, రంగస్వామి, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి భూపని కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

వృద్ధాశ్రమానికి రోటరీ క్లబ్ చేయూత

దర్శి, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటాచలంపల్లి సమీపంలోని కాశీనాయన వృద్ధాశ్రమానికి దర్శి రోటరీ క్లబ్ సభ్యులు రూ.40 వేల విలువైన వస్తువులు వితరణ చేశారు. క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బియ్యం, కంది పప్పు, నూనె, కూరగాయలు, పండ్లు, పంఖాలు, దుస్తులతో పాటు, వృద్ధులకు అవసరమయ్యే మందులను ఆదివారం అందజేశారు. సభ్యులు నారాయణరెడ్డి, భాస్కరరెడ్డి, శ్రీను, తిరుపతిరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిగురు అట్టలపై అవగాహన

ముండ్లమూరు, న్యూస్‌టుడే: చీడ పురుగుల వ్యాప్తి అధికంగా ఉంటే పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. ముండ్లమూరులో ఆదివారం పొలాలను పరిశీలించారు. వరిపొలంలో జిగురు అట్టలపై రైతులకు అవగాహన కల్పించారు.

250 మందికి నేత్ర పరీక్షలు

పామూరు, న్యూస్‌టుడే: నెల్లూరు మోడరన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పామూరులోని సత్యనారాయణ స్వామి కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో సుమారు 250 మందికి పైగా రోగులకు పరీక్షలు చేసి వైద్య సలహాలు, సూచనలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భారతి, విష్ణుతేజ, చిన్మయి, సురేంద్ర కుమార్, సాయిరాం చరణ్, తులసి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల రక్తదానం

దర్శి: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో యోగి వేమారెడ్డి సేవా సమితికి చెందిన ఆపద్బంధు రక్త కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం శిబిరం నిర్వహించారు. అయ్యప్ప స్వాములతోపాటు, ఇతర మాలధారణ చేసిన స్వాములు 100 మంది రక్తదానం చేశారు. ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడే రక్తాన్ని దానం చేయడం బాధ్యతగా భావించి ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యుడు శివకోటిరెడ్డి తెలిపారు.

వసతులు లేక.. అవస్థలు తీరక

▸ సీఎస్‌పురంలో ఇబ్బందులు పడుతున్న స్థానికులు

న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

యాదవ బజార్‌లో ఇదీ పరిస్థితి..

మండల కేంద్రమైన సి.ఎస్.పురం ఇటీవల అభివృద్ధి చెందుతోంది. పలు గ్రామాలకు చెందిన చాలా మంది స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుని వ్యాపారాలు, ఇతర పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటూ ఇక్కడ నివసిస్తున్నారు. ఇప్పటికీ పలు అంతర్గత రహదారులు అభివృద్ధికి నోచుకోకుండా మట్టి రోడ్లుగానే ఉన్నాయి. సీసీ రోడ్లు ఉన్న చోట్ల మురుగు కాలువలు లేవు. రహదారులు, మురుగు కాలువలు, పారిశుద్ధ్య నిర్వహణ లేమి, విద్యుత్తు తదితర సమస్యలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఏడాదికి జనరల్ ఫండ్ ద్వారా రూ.25 లక్షలు, ప్రభుత్వం నుంచి పలురకాల గ్రాంట్లు సుమారు రూ.50 లక్షలకు పైగా ఆదాయం వస్తున్నా.. ఆ స్థాయిలో అభివృద్ధి కానరావడం లేదు. పంచాయతీ పరిధిలో 7 కిలోమీటర్లకు పైగా సిమెంట్ రహదారులు నిర్మించాల్సి ఉంది.

- మండల కేంద్రం: సి.ఎస్.పురం
- కుటుంబాలు: 3,700
- జనాభా: 10 వేల మంది
- వీధి దీపాలు: 700

కానరాని మురుగు కాలువలు..

ఏనిమెట్లవీధి, యాదవబజార్, వడ్డెపాలెం, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి, ఎస్సీ కాలనీ, రహమత్‌నగర్ కాలనీ, పాముల, ఎస్టీ కాలనీలు తదితర ప్రాంతాల్లో మురుగు కాలువల నిర్మాణం జరగలేదు. గృహాల్లోని వృథా నీరు రోడ్లపైకి వస్తుంది. సి.ఎస్.పురంలో సులభ్ కాంప్లెక్స్ లేక మహిళలు, విద్యార్థినులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వి.బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ.. సి.ఎస్.పురంలో కొత్తగా రూ.3.10 కోట్ల నిధులతో 5.87 కిలోమీటర్ల మేర 14 సీసీ రహదారులను నిర్మించామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో అన్ని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నియోజకవర్గ కేంద్రం.. సమస్యల వలయం

న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

నియోజకవర్గ కేంద్రమైన కొండపిలో పారిశుద్ధ్య, ఇతర సమస్యలు స్థానికులను వేధిస్తున్నాయి. రోజూ వివిధ పనులపై గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పల్లెల నుంచి మండల కేంద్రానికి అనుసంధానంగా ఉన్న చాలా రహదారులు అధ్వానంగా మారాయి. మొంథా తుపాను దాటికి కురిసిన వర్షాలకు మరింత ఛిద్రమయ్యాయి. కొండపి నుంచి అనకర్లపూడి వెళ్లే రహదారిలో అట్లేరు వద్ద సిమెంట్ రోడ్డు కుంగిపోయింది. ఒంగోలు వెళ్లేందుకు ఇది ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు, విద్యార్థులు ఆర్టీసీ, ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు, ప్రైవేటు వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. చీమకుర్తి నుంచి గ్రానైట్ వాహనాలు కూడా ఇలాగే టంగుటూరు హైవే వైపు వెళ్తుంటాయి. ప్రస్తుతం ఇక్కడ చప్టా శిథిల స్థితికి చేరడంతో ఆ రోడ్డుపై వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈఈ దీప్తిని వివరణ కోరగా మరమ్మతులకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

కొండపి - అనకర్లపూడి మధ్య అట్లేరు వద్ద దెబ్బతిన్న రోడ్డు

కొండపి-టంగుటూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

చెత్త తరలింపు అంతంతమాత్రంగానే..

కొండపిలో ఎక్కడ పడితే అక్కడే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. తెల్లవారుజామున వచ్చే చెత్త సేకరణ ట్రాక్టర్ కూరగాయలు, చిల్లర దుకాణాల వద్ద ఉన్న వ్యర్థాలను మాత్రమే తీసుకెళ్తున్నారని, ఇళ్లలోని చెత్తను తీసుకెళ్లడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో దుర్వాసన వస్తుందని చెబుతున్నారు. స్థానిక ఆది ఆంధ్రా కాలనీలో ఒక విద్యుత్తు స్తంభం శిథిలావస్థకు చేరి ఊచలు బయట పడ్డాయి. ఏడాది కాలం నుంచి ఇలాగే ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళ అన్ని ప్రాంతాల్లో దోమలు విజృంభిస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌ను వివరణ కోరగా.. వెంటనే పరిశీలించి గ్రామంలో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పొన్నలూరు, న్యూస్‌టుడే: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని అగ్రహారం, పరుచూరివారి పాలెం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార రథం ద్వారా ప్రజలకు దీనిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తిక మాస విశిష్టతను, ఇతర ఆధ్యాత్మిక అంశాలను ప్రజలకు వివరించారు. కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గో ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

వివిధ ఉత్పత్తుల గురించి వివరిస్తున్న తిరుపతయ్య

తాళ్లూరు, న్యూస్‌టుడే: గో ఆధారిత ఉత్పత్తులు ఉపయోగించడం వల్ల ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు కలుగుతుందని గ్రామ వికాస్ రాష్ట్ర సంయోజక్ వడ్ల తిరుపతయ్య తెలిపారు. కుటుంబాలపై ఆర్థిక భారం కూడా తగ్గుతుందన్నారు. గుంటిగంగలోని గంగాభవానీ అమ్మవారి ఆలయం సమీపాన ఆదివారం గ్రామ వికాస్ జిల్లా సంయోజక్ శ్రీరాం వెంకట ఆధ్వర్యంలో గో ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపిక చేసిన ఎనిమిది జిల్లాల్లోని 25 గ్రామాలకు చెందిన 65 మంది వ్యక్తులు హాజరయ్యారు. గోసేవ రాష్ట్ర సంయోజక రాంజీ గోమాత ప్రాధాన్యతను తెలిపారు. రాష్ట్ర ప్రముఖ్ పత్తి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామికి ప్రత్యేక పూజలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణస్వామి మూలవిరాట్టును వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానంలో అర్చకులు గోపూజ చేశారు. ఆలయంలో స్వామికి అభిషేకం పూజలు, మహానివేదన, హారతి పూజలు జరిగాయి. నారాయణస్వామి పల్లకీసేవ జరిగింది. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ కె.చినఆదినారాయణ, దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆలయంలో ప్రదక్షిణలకు బయలుదేరిన భక్తులు

ఎంపికైన టంగుటూరు విద్యార్థులు

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు సై

టంగుటూరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్-17 డివిజనల్ అథ్లెటిక్స్ పోటీల్లో టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఒంగోలులోని పీవీఆర్ మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో జరిగిన పోటీల్లో షాట్‌పుట్, జావెలిన్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్, 800 మీటర్ల పరుగుపందెం, హార్డిల్స్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తులసీప్రభ, పీడీ అరుణ అభినందించారు.

ఆలయ కమిటీ ఎన్నిక

కొండపి గ్రామీణం: మండలంలోని ముప్పవరం రామలింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీని ఈవో సాంబశివరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ ఛైర్మన్‌గా నేలపట్ల నరసింహమూర్తి, వైస్ ఛైర్మన్‌గా పిడూరి రామ్మూర్తి, సభ్యులుగా రావులపల్లి ప్రసాద్, నన్నూరి వెంకయ్య, ఉప్పుటూరి వెంకాయమ్మ, కాకుమాణి పద్మ, మిట్టిపాటి ఈశ్వరమ్మ, నిడమానూరి అనూష, నర్రా రేఖ, బద్దపూడి సదాశివ శర్మ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గంధ మహోత్సవం.. వైభవంగా ఆరంభం

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో నాసర్‌బాబా గంధ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బాబా దండపాదుకలను జల్లిలో ఉంచి భక్తులు సమాధి వద్దకు తీసుకొచ్చారు. అనంతరం గుర్రంపై ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి పవిత్ర గంధం అందుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. బాబా సమాధిని అలంకరించి మహానైవేద్యం సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యుడు ముక్కు నాసర్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డితో పాటు కుటుంబ సభ్యులు, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు ఎస్.తిరుపతిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కుందురు నారాయణరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

నాసర్‌బాబా సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న తెదేపా నాయకులు, భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: సింగరాయకొండ మండలం పాకలలో ఏ వీధిలో చూసినా మద్యం గొలుసు దుకాణాలే కనిపిస్తున్నాయి. రాత్రి వేళ మందుబాబులు మద్యం మత్తులో రోడ్ల వెంబడి తిరుగుతూ నానాయాగీ చేస్తుండటంతో మహిళలు, చిన్నారులు అటువైపుగా వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. -అశోక్‌కుమార్, గ్రామస్థుడు

✓: రోజూ సిబ్బందితో పహారా నిర్వహించి గొలుసు దుకాణ నిర్వాహకులపై కఠిన చర్యలు చేపడతాం.
-శివకుమారి, ఎక్సైజ్ సీఐ

?: తాళ్లూరు మండలం తూర్పుగంగవరం నుంచి రామభద్రాపురం వెళ్లే రహదారిలో పాత రైసుమిల్లు వద్ద విద్యుత్తు దీపం వెలగడం లేదు. -కోటయ్య, తూర్పుగంగవరం

✓: రెండు, మూడు రోజుల్లో కొత్త దీపం వేయించి సమస్యను పరిష్కరిస్తాం. -మల్లీశ్వరి, పంచాయతీ కార్యదర్శి

?: మర్రిపూడి మండలంలోని కాకర్ల పంచాయతీ శివరాయునిపేట శివాలయం వీధిలోని కాలువ చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో దోమలకు నిలయంగా మారింది.
-కొండయ్య, స్థానికుడు

✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. -జగదీష్, ఎంపీడీవో

-న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం, తాళ్లూరు, మర్రిపూడి

పరివర్తకం వద్ద కంచె ఏర్పాటు

స్పందనకు వందనం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వెన్నూరులో ప్రధాన రహదారి పక్కనే విద్యుత్తు పరివర్తకం కింది స్థాయిలో ప్రమాదకరంగా ఉంది. ఈ విషయంపై 'ఈనాడు'లో ఆదివారం 'పల్లెలు..వీడని సమస్యలు' అనే శీర్షికను కథనం ప్రచురితమైంది. దీనిపై మండల విద్యుత్తు ఏఈఈ శ్రీనివాసరావు స్పందించారు. సిబ్బందిని పంపించి తాత్కాలికంగా పరివర్తకం చుట్టూ కర్రలతో కంచె ఏర్పాటు చేయించారు. త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు.

మలుపులు.. ఏవీ సూచికలు?

పీసీపల్లి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో మలుపుల వద్ద సూచికలు లేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కమ్మవారిపల్లి, ముద్దపాడు, పడమటపల్లి, వాకంవారిపల్లి, చిరుకూరివారిపల్లి, తలకొండపాడు, వరిమడుగు, పెదఇర్లపాడు, మారెళ్లతోపాటు మొత్తం 18 పంచాయతీల్లో కనీసం 30కి పైగా మలుపులు ఉండడంతో వాహనాలు కనిపించక చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇది పెద్దన్నపల్లి సమీపంలోని రహదారి మలుపు. ఈ విషయంపై ఎంపీడీవో జీవీ కృష్ణారావును వివరణ కోరగా.. సంబంధిత అధికారులతో చర్చించి బోర్డుల ఏర్పాటు చేస్తామన్నారు.
-న్యూస్‌టుడే, పీసీపల్లి

రహదారిపైకి మురుగునీరు

కనిగిరి పట్టణంలోని ఎన్జీవో కాలనీ నుంచి గార్లపేట రోడ్డు వెళ్లే మార్గంలో మురుగునీరు రహదారిపైనే పారుతోంది. ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సీసీరోడ్డు వేసినా కాలువలు నిర్మించకపోవడంతో ఇళ్లల్లోని వాడకపు నీరు మొత్తం రోడ్డుపైకి వస్తుంది. ఈ విషయమై మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావును వివరణ కోరగా.. కాలువలు నిర్మించి ఇబ్బందుల లేకుండా చేస్తామని తెలిపారు.
-న్యూస్‌టుడే, కనిగిరి

చెత్త తొలగదు.. వీధి దీపం వెలగదు

▸ జమ్ములపాలెంలో అరకొర వసతులతో స్థానికుల ఇక్కట్లు

న్యూస్‌టుడే, టంగుటూరు

గ్రామాల్లో మౌలిక సదుపాయాల లేమి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంటుంది. టంగుటూరు మండలంలోని జమ్ములపాలెం గ్రామమే ఇందుకు నిదర్శనం. ఈ గ్రామానికి తాగునీరు అందించాలనే సంకల్పంతో 2014-19 మధ్య కాలంలో తెదేపా నేతలు రామతీర్థం జలాలను మండలానికి తీసుకొచ్చారు. అదే క్రమంలో ప్రస్తుతం ఇక్కడికి కూడా పైపులైన్లు వేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. నీటి విడుదల మాత్రం వారానికి ఒక్కసారి మాత్రమే చేస్తున్నారు. మిగతా రోజుల్లో నీటి అవసరాలు తీర్చే చేతిపంపులు సైతం మూలకు చేరాయి. స్థానిక తూర్పుబజారు, చాకలి వీధి, చింతచెట్టు, ఎస్సీ కాలనీ శివారుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. ఇంటింటా చెత్త సేకరణ జరుగుతున్నా ఇంకా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామంలో లోటవోల్టేజీ సమస్య ఏళ్ల తరబడి వెంటాడుతోంది. వీధుల్లో ఏళ్లనాటి విద్యుత్తు స్తంభాలే ఉన్నాయి. కొన్ని దెబ్బతిని పక్కకు ఒరిగి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. దీని కారణంగా తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. వీధి దీపాలు సరిగా వెలగక కొన్ని ప్రాంతాల్లో చీకట్లు అలముకుంటున్నాయి. ఈ సమస్యలపై పంచాయతీ అధికారులను వివరణ కోరగా.. పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

ముస్లిం బజారులో వెలగని వీధి దీపాలు

తూర్పువీధిలో పని చేయని చేతిపంపు

కార్మికుల పక్షాన నిరంతర పోరాటం

దర్శి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం సీఐటీయూ పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. దర్శిలో సీఐటీయూ 13వ జిల్లా మహాసభలు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సీఐటీయూ బలోపేతానికి ప్రతినిధులు కృషి చేయాలన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని, గ్రానైట్ పరిశ్రమను రక్షించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలనే 40 తీర్మానాలను ఆమోదించారు. సీఐటీయూ జిల్లా నాయకులు సుబ్బారావు, రమేష్, కొండారెడ్డి, శ్రీనివాసరావు, ఆంజనేయులు, కల్పన, రంగారావు, 280 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

సైన్స్‌పై ఆసక్తి అవసరం

దర్శి, న్యూస్‌టుడే: విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి అన్నారు. దర్శి కేజీబీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మూఢ నమ్మకాలపై జేవీవీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రయోగపూర్వకంగా నిర్ధారణ అయిన విషయాలను, రుజువులు ఉన్నవాటిని మాత్రమే నమ్మాలన్నారు. సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు చదవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సందడిగా వన సమారాధనలు

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఏటీఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఆర్యవైశ్య కార్తిక వనసమారాధన వైభవంగా జరిగింది. శ్రీశైలం దేవస్థానం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన మరకత లింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు దేవకి వెంకటేశ్వర్లు దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవీమాత ఆలయ కమిటీ సభ్యులు దేవకి శ్రీనివాసులు, బచ్చు రమేష్, కొలిపర్తి వెంకటస్వామి, కోట కొండలు, నార్లపాటి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కనిగిరిలో హాజరైన ఆర్యవైశ్య కుటుంబాలు

కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో..

దర్శి: పట్టణ సమీపంలోని శివరాజ్‌నగర్ కొండ వద్ద సాయిదత్త ఆశ్రమంలో కాకతీయ కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఉదయం మహిళలు కార్తిక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో పలువురు వక్తలు వన సమారాధనల ప్రాధాన్యతను వివరించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అనసూయ, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు సూర్యనారాయణ, తిరుపతిస్వాములుకు సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు, కోలాట మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ప్రసాదరావు, మల్లికార్జున్, తిరుపతిస్వాములు తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో కోలాట ప్రదర్శన

గొట్టిపాటిని కలిసిన ఉప ఎంపీపీ

తాళ్లూరు: వైకాపా నాయకుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఐ.వెంకటేశ్వరరెడ్డి, ఆయన భార్య రమాదేవిలు ఆదివారం దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త కడియాల లలిత్ సాగర్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. వారు మండల తెదేపా నాయకులతో కలిసి నరసరావుపేటలోని లక్ష్మి నివాసానికి వెళ్లి కలిశారు. వారు కొంతకాలం నుంచి తెదేపాలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలు

కురిచేడు, న్యూస్‌టుడే: రైలు నుంచి జారిపడి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన పొట్లపాడు రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం వెలుగుచూసింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్‌కు చెందిన భువనేశ్వర్ భర్తీ అనే వ్యక్తి శనివారం విజయవాడలో హుబ్లీ వెళుతున్న రైలు ఎక్కాడు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో పొట్లపాడు రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు జారి ట్రాక్ పక్కన పడిపోయాడు. దీంతో అతడి తల, ఇతర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం ఏడు గంటల సమయంలో రైల్వే ట్రాక్‌మేన్ గుర్తించి 108 సిబ్బందికి తెలియజేయగా వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని కురిచేడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

కోడి పందేల శిబిరంపై దాడి

పొన్నలూరు, న్యూస్‌టుడే: మండలంలోని బాలిరెడ్డిపాలెం శివారులో కోడి పందేల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి ఒక పందెం కోడి, రూ.1,610 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనుక్ తెలిపారు.

పాకల.. నెరవేరని పర్యాటక కల

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

సింగరాయకొండ మండలంలోని పాకల సముద్ర తీరం ఆరేళ్లుగా అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉండిపోయింది. గత తెదేపా ప్రభుత్వంలో సుమారు రూ.4 కోట్ల నిధులు కేటాయించి పర్యాటకుల కోసం విశ్రాంతి భవనం, మరుగు దొడ్లు, సీసీ రోడ్లు, ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటుకు కృషి చేశారు. అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిధులు నిలుపుదల చేసింది. దీంతో పనులను అసంపూర్తిగానే గుత్తేదారులు వదిలేశారు. విశ్రాంతి భవనం అసంపూర్తిగా కనిపిస్తోంది. చుట్టూ నిర్మించిన ఇనుప కంచె తుప్పుపట్టి పడిపోవడంతో కొంతమేర దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. ప్రస్తుత ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

పాకల తీరం వద్ద అసంపూర్తిగా పర్యాటకుల విశ్రాంతి భవనం

సెలవు రోజుల్లో సందర్శకుల తాకిడి..

పాకల తీరానికి పర్వదినాలు, సెలవు రోజుల్లో కనిగిరి, కందుకూరు, కొండపి తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు వందల సంఖ్యలో తరలివచ్చి సేదతీరుతారు. వారి రాకపోకలతో చిరు వ్యాపారులకు జీవనోపాధి లభిస్తుంది. సందర్శకులు విశ్రాంతి తీసుకునేందుకు అద్దె గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయక పోవడంతో సముద్ర స్నానాలు ఆచరించి వెంటనే వెనుదిరగాల్సిన పరిస్థితి. తీరం వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త అపరిశుభ్రంగా ఉండటంతో దుర్వాసన వస్తోంది. సింగరాయకొండ నుంచి పాకల సముద్రతీరం వద్దకు రాకపోకలు సాగించేందుకు రహదారి అడుగులోతు గుంతలతో దర్శనమిస్తుంది. రాత్రి వేళల్లో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. గత నెలలో మంత్రి స్వామి, జిల్లా కలెక్టర్ రాజాబాబు ఈ ప్రాంతాన్ని పరిశీలించి పనులు పూర్తిచేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. దీనిపై మంత్రి స్వామి మాట్లాడుతూ.. పాకల తీరాన్ని రానున్న ఏడాది కాలంలో అభివృద్ధి చేసి పర్యాటకంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, కనీసం రహదారుల్లో ఏర్పడిన గుంతలకు తట్ట మట్టి కూడా పోయకపోవడంతో రోడ్లు ఛిద్రమయ్యాయని, త్వరలో మరమ్మతులు చేపడతామన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి పిలుపు

వెలిగండ్ల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 11న పీసీపల్లి మండలం లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపనకు వస్తున్నందున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీసీఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి కూటమి శ్రేణులను కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కనిగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు చేస్తున్న మంచి పనికి అందరూ సహకరించాలని సూచించారు. మండలంలోని 21 పంచాయతీల నుంచి కూటమి నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, నాయకులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, అక్కి శ్రీనివాసులరెడ్డి, కర్ణాటి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీసీఎంఎస్ ఛైర్మన్ కాశిరెడ్డి, పక్కన తెదేపా నాయకులు

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

కాలువల్లేక.. మురుగు దాటలేక..

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రాంనగర్ 11వ లైన్ అంబేడ్కర్ కాలనీ రోడ్డుపై మురుగు పారుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆ మార్గంలో మురుగు కాలువలు లేవు. అపార్ట్‌మెంట్ వాసులు రోడ్లను మట్టితో సమానంగా నింపడంతో వాటి నుంచి వచ్చే మురుగునీరు పక్కనున్న అంబేడ్కర్ కాలనీలో రోడ్డుపైకి వస్తోంది. దీనివల్ల ఇక్కడి వారు లోపలికి వెళ్లడానికి ఇబ్బంది ఉంటోంది. వృద్ధులు అవస్థ పడుతున్నారు. దుర్వాసనకు ఉండలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కమిషనర్ కె.వెంకటేశ్వరరావుకు స్థానికులు వినతి పత్రం సమర్పించారు.

రాంనగర్ 11వ లైన్ అంబేడ్కర్ కాలనీ రోడ్డులో మురుగు

ఒంగోలు ట్రాఫిక్ ఇన్‌ఛార్జి సీఐగా జగదీష్

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు ట్రాఫిక్ ఇన్‌ఛార్జి సీఐగా ఎస్.జగదీష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేస్తున్న వై.పాండురంగారావును ట్రాఫిక్ బాధ్యతల నుంచి తప్పించి వేకెన్సీ రిజర్వ్(వీఆర్)లో రిపోర్టు చేయాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంతో పాటు పలు అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపించినట్లు తెలిసింది. విచారణలో వెల్లడైన అంశాల ఆధారంగా పాండురంగారావును బాధ్యతల నుంచి తప్పించి ప్రస్తుతం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)లో పనిచేస్తున్న జగదీష్‌ను ఇన్‌ఛార్జిగా నియమిస్తూ తాకీదు జారీ చేశారు. ఈ మేరకు సీఐ జగదీష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం జిల్లా మహిళా పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న యు.సుధాకర్‌రావును సీసీఎస్ ఇన్‌ఛార్జిగా నియమించారు.

సాయం చేయడంలో వాసవీ క్లబ్ ముందంజ

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను గజమాలతో సత్కరిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఎటువంటి ఆపదలో ఉంటే సాయం చేయడంలో వాసవీక్లబ్ ముందు ఉంటుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు. ఆదివారం ఒంగోలులోని ఢిల్లీ హైవే హోటల్‌లో వాసవీక్లబ్ పురస్కారాల వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జనార్దన్‌తోపాటు చీరాల ఎమ్మెల్యే ఎమ్.కొండయ్య హాజరయ్యారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ నిరంతరం వాసవీక్లబ్ ద్వారా అందజేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. క్లబ్ గవర్నర్‌గా ఉత్తమ సేవలు అందజేసిన చుండూరి గాయిత్రిని ఘనంగా సత్కరించారు. క్లబ్‌లో వివిధ హోదాల్లో ఉత్తమ సేవలు అందజేసిన సభ్యులకు పురస్కారాలు అందజేసి ఘనంగా సన్మానించారు. వాసవీక్లబ్ నూతన గవర్నర్‌గా ఎన్నికైన అమరా వేణు ముందు రోజుల్లో ఉత్తమ సేవలు అందజేయాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సిద్ధా సూర్యప్రకాష్, కొంజేటి వెంకట సురేష్‌బాబు, కనమర్లపూడి హరిప్రసాద్, పులకణం రాజా, రాఘవేంద్ర, శైలజ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి ప్రగతి దీప్తి

న్యూస్‌టుడే, చీమకుర్తి:

‘గెలాక్సీపురి’.. చీమకుర్తి పురపాలక సంఘంలో రూ.4.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు కార్యరూపం దాల్చనున్నాయి. డీఎంఎఫ్, 15వ ఆర్థిక సంఘం, ఒడా, ఎస్సీ ఉప ప్రణాళిక తదితర నిధులతో చేపట్టనున్న పలు పనులకు టెండర్లు కూడా ఖరారైన నేపథ్యంలో ఆయా పనులు త్వరలోనే పట్టాలెక్కనున్నాయి.

◗ రూ.4.40 కోట్లతో పనుల అమలు

చీమకుర్తి పురపాలక సంఘ కార్యాలయ భవనం

ఒడా నుంచి రూ.75 లక్షల కేటాయింపు

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఒడా) నిధులు రూ.75 లక్షలు కేటాయించారు. వీటితో కీలకమైన మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టాల్సి ఉంది. అందులో భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పక్కా మురుగు కాలువల నిర్మాణ పనులు ప్రతిపాదించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.49 లక్షలు మంజూరు అయ్యాయి. ఆయా ప్రాంతాల్లో రహదారులు, కాలువల నిర్మాణ పనులు నిర్వహిస్తారు. ఎస్సీ ఉప ప్రణాళిక నిధులు రూ.35 లక్షలు వచ్చాయి. ఈ మొత్తాలతో ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన శ్మశాన వాటికలకు ప్రహరీ నిర్మాణం, తదితర పనులు ప్రతిపాదించారు.

మున్సిపల్ సమావేశంలో టెండర్ల ఖరారు

ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయా పనులకు సంబంధించిన టెండర్లను ఆమోదించారు. దీంతో పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్ చొరవతో జిల్లా మినరల్ ఫౌండేషన్ నిధులు రూ.2.65 కోట్లు పురపాలక సంఘానికి మంజూరయ్యాయి. వీటితో సిమెంటు రహదారులు, పక్కా మురుగు కాలువల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

శివారు ప్రాంతాలకు మరింత ప్రయోజనం

గత వైకాపా పాలనలో ప్రగతి పనులపై తగిన దృష్టి సారించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారిగా ఈరీతిలో రూ.4 కోట్లకు పైగా నిధులతో పనులు చేపట్టనున్నారు. దీంతో శివారు ప్రాంతాల్లో రహదారులు, పక్కా మురుగు కాలువల నిర్మాణ పనులు పెద్ద ఎత్తున జరగనున్నాయని అధికారులు వివరిస్తున్నారు.

స్తంభాలు వేశారు.. సరఫరా మరిచారు

పి.గుడిపాడు (సంతనూతలపాడు), న్యూస్‌టుడే: మండలంలోని పి.గుడిపాడు అంబేడ్కర్ నగర్‌లో విద్యుత్తు స్తంభాలు వేసి ఏళ్లు దాటుతున్నా నేటికీ విద్యుత్తు సరఫరా ఇవ్వలేదు. దీంతో ప్రజా ధనం వృథా అయినట్లయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. గ్రామంలో 2014లో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వైర్లు లాగలేదు, సరఫరాను సైతం ఇవ్వలేదన్నారు. విద్యుత్తు సౌకర్యం లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు నిర్లక్ష్యం వీడి విద్యుత్తు సరఫరా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సంకె సుబ్బారావు కోరారు.

తెదేపా అనుబంధ విభాగాల నియామకం

చలువాది జగదీష్

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి పట్టణ తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల కార్యవర్గాలను సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ప్రకటించారు. పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా చలువాది జగదీష్ కుమార్, పువ్వాడ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. తెలుగు యువత అధ్యక్ష కార్యదర్శులుగా గుడిపూడి అనిల్, షేక్ రఫీ, రైతు విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా కొన్నగంటి చినసుబ్బారావు, బొడ్డుబోయిన వెంకటేశ్వర్లు, మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా తోపూరి సుజాత, దండు సుశీల, గిరిజన విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా కె.దుర్గారావు, పేరం గోపీచంద్, మైనారిటీ విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ అహమ్మద్ జాన్, షేక్ కరీముల్లా, ఐటీడీపీ అధ్యక్ష కార్యదర్శులుగా పోకూరి పవన్ కుమార్, కోటా కృష్ణ సాయితేజలు నియమితులయ్యారు. సాంస్కృతిక విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా గొల్లపూడి వెంకటేశ్వర్లు, గొల్లపూడి శ్రీనివాసరావు, బీసీ విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా ఆరుద్ర రామారావు, ఏల్చూరి ఏడుకొండలు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా పూనాటి ధనలక్ష్మి, షేక్ ఫిర్‌దౌనాలు నియమితులయ్యారు.

దొడ్డవరంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

నిల్వ నీటిలో ఎబెట్ మందు వేస్తున్న వైద్య సిబ్బంది

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దొడ్డవరం గ్రామంలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మొంథా తుపాను ప్రభావంతో ఎస్సీ, బీసీ కాలనీలో పలు కాలువల్లో నీరు నిలిచింది. దీంతో దోమలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ ప్రజలు ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన పంచాయతీ అధికారులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో బీసీ, ఎస్సీ కాలనీల్లో డ్రమ్ముల్లో, తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. మురుగు కాలువల్లో దోమల నియంత్రణకు మలాథియాన్ ఆయిల్ బంతులను వేశారు. నీటి డ్రమ్ముల్లో ఎబెట్ మందు చల్లి గంట వరకు వినియోగించవద్దని సూచించారు. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచవద్దని, జలుబు, దగ్గు, జ్వరం వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కాలనీ వాసులకు వైద్య సిబ్బంది సూచించారు.

నేడు కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌ఛార్జి గౌతు సత్యేంద్రబాబు, ఇతర రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు.

కలశ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీమంత్రి సిద్దా రాఘవ రావు, తదితరులు

వేడుకగా అయ్యప్పస్వామి కలశ ప్రతిష్ఠాపన

చీమకుర్తి, న్యూస్‌టుడే: వేద పండితుల మంత్రోచ్ఛరణ, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య చీమకుర్తి హరిహర క్షేత్రంలో ఆదివారం అయ్యప్ప స్వామి కలశ ప్రతిష్ఠా మహోత్సవం వేడుకగా జరిగింది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు, శిద్దా ట్రస్టు సభ్యులు, అయ్యప్ప స్వామి మాల ధారణ భక్తులు కలశాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారి కలశానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్వ మాలధారణ భక్తులకు అన్న సంతర్పణ శిద్దా ట్రస్టు సభ్యులు ప్రారంభించారు. ట్రస్టు సభ్యులు వెంకటేశ్వరరావు, పాండురంగారావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, హనుమంతరావు, సాయిబాబు, సుధాకర్‌రావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మెగా ఉచిత వైద్య శిబిరం

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సేవా సంకల్ప ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ సహకారంతో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 103 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. చాపల వంశీకృష్ణ పర్యవేక్షణలో వైద్యులు సౌమిత్యా పల్లవ్ రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్, ఇలా పలు పరీక్షలు నిర్వహించారు. రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ శనగల వెంకటరమణ, వైస్ ఛైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, జాయింట్ కార్యదర్శి కంకణంపాటి వెంకటేశ్వర్లు, సభ్యులు వేమా నాగరాజు, ఆర్.జార్జి, కొత్తపల్లి ఆంజనేయులు, వైద్యశాల మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సాహెబ్, సిబ్బంది అనిల్, గోపీ, రజనీకాంత్‌లు పాల్గొన్నారు.

చెస్ ఛాంపియన్‌గా అనంతపురం జట్లు

సీతానగరం: రాష్ట్రస్థాయి చదరంగం క్రీడా పోటీల్లో అనంతపురం జిల్లా బాలబాలికలు సత్తా చాటారు. అండర్-19 విభాగంలో బృంద పోటీల్లో అనంతపురం బాలురు, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. సీతానగరం మండలం జోగింపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలోని మినీ ఆడిటోరియంలో ఆదివారం పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. వ్యక్తిగత, జట్ల విజేతలకు తహసీల్దారు ప్రసన్నకుమార్, ఎంపీడీవో వెంకటరావు, ఎంఈవోలు సూరిదేముడు, వెంకటరమణ, స్వచ్ఛాంధ్ర బోర్డు డైరెక్టరు బి.లక్ష్మణరావుల చేతుల మీదుగా పతకాలు అందజేశారు. అండర్-14, 17, 19 వ్యక్తిగత విభాగాల్లో బాలికలు 15 మంది, బాలురు 15 మంది జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.మురళి తెలిపారు. జాతీయ స్థాయికి అర్హత సాధించిన వారిలో కె.వెంకట దినేష్(ప్రకాశం) ఉన్నారు.

సంఘాలు.. కార్యవర్గాలు

కొత్తపట్నం: కొత్తపట్నం నల్లూరి గార్డెన్‌లో ది ఒంగోలు రిటైల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రెసిడెంట్ గణపతి వెంకటరెడ్డి, సెక్రటరీ కె.వి సత్యనారాయణ, ట్రెజరర్ వాజిగండ్ల ఏడుకొండలు ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ కామేపల్లి సీతారామయ్య, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ కొల్లా మధు, ఏపీసీడీఏ ఫౌండర్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంట పర్యటన

ఒంగోలు గ్రామీణం: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 10, 11 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం రాత్రి స్థానిక సంతపేటలోని సాయిబాబా గుడిలో నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొంటారు. 11న ఉదయం 10.30 గంటలకు పీసీపల్లి మండలం లింగన్నపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో పాల్గొంటారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో ‘ఈనాడు’ మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

మద్దిపాడు,న్యూస్‌టుడే:

?: మద్దిపాడులోని ఇస్లాం పేటలో కాలువలో మురుగు పేరుకు పోయి నీరు ముందుకు పోవడంలేదు. దీంతో రోడ్డుపై నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. మురుగు నీటివల్ల దుర్గంధం వ్యాపించి దోమల బెడద పెరిగిపోతోంది. దోమల వల్ల రాత్రి వేళల్లో నిద్ర పోలేక పోతున్నాయం. మురుగు కాలువల్లో పూడిక తీసి ఫాగింగ్ చేసి ప్రజలను దోమల నుంచి కాపాడాలని కోరుతున్నాం.

– షేక్ అల్లావుద్దీన్, మద్దిపాడు

✓: వెంటనే మా పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మురుగు కాలువల పూడికలు తీయిస్తాం. ఫాగింగ్ చేయడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

– నూరుల్లా మద్దిపాడు, గ్రామ పంచాయతీ కార్యదర్శి.

?: మద్దిపాడులో ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారిలో విద్యుత్ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. సాయంత్రం ఆరు గంటలు దాటితే ఆ ప్రాంతమంతా చీకటిమయంగా మారిపోతోంది. దారికి రెండు వైపులా వ్యవసాయ భూములుండడం వల్ల పాములు సంచరిస్తున్నాయి. దీంతో కాలనీ వాసులు భయాందోళనలో రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు విద్యుత్ వీధి దీపాల నిర్వహణ సక్రమంగా చేసి ప్రజల ఇబ్బందులు తొలగించండి

– మహానంది రామాంజనేయులు ఇందిరమ్మ కాలనీ మద్దిపాడు

✓: పంచాయతీ అధికారులతో చర్చించి విద్యుత్ దీపాల నిర్వహణ సక్రమంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం.

– చెన్నారెడ్డి ఏఈ మండల విద్యుత్ శాఖ, మద్దిపాడు

సామాజిక వనం.. దిగుబడులు ఆశాజనకం

☛ విస్తారంగా సరుగుడు తోటల పెంపకం

న్యూస్‌టుడే, చీమకుర్తి

దిగుబడులు ఆశాజనకంగా ఉండటం.. ఊరించే రీతిలో ధరలు పలుకుతుండటం, సాగు ఖర్చు తక్కువగా ఉండటం తదితర కారణాల నేపథ్యంలో ఒంగోలు డివిజన్‌లోని పలు మండలాల్లో సామాజిక వనాలను (సరుగుడు తోటల పెంపకం) విస్తారంగా సాగు చేస్తున్నారు.

చీమకుర్తి, మువ్వవారిపాలెం గ్రామాల మధ్య సరుగుడు తోటలు

రెండేళ్లుగా పెరిగిన మక్కువ

సాగరు ఒంగోలు బ్రాంచి కాలువ రామతీర్థం జలాశయం కింద సుమారుగా 80 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. గతంలో ఈభూముల్లో 15వేల నుంచి 20 వేల ఎకరాల్లో వరి పంట, 15వేల ఎకరాల్లో పొగాకు, కొంత మేర కూరగాయలు వేసేవారు. మిగిలిన భూముల్లో సుబాబుల్, జామాయిల్ సరుగుడు తోటలు సాగు చేసేవారు. రెండు సంవత్సరాలుగా సామాజిక వనాల కర్ర ధరలు ఆశాజనకంగా ఉంటుండటంతో అధిక శాతం రైతులు సరుగుడు, సుబాబుల్ తోటల సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. వరి సాగు గణనీయంగా తగ్గిపోగా సామాజిక వనాలు సాగు ఏడాదికేడాదికి పెరుగుతోంది. ఇందులో కూడా 80 శాతం సరుగుడే ఉంటోంది. టన్ను రూ.6,800 లెక్కన కొనుగోలు చేస్తుండగా అన్ని ఖర్చులు పోయి రైతు చేతికి రూ.6వేలు అందుతోంది.

◗ సుబాబుల్ టన్ను రూ.6,000కు కొనుగోలు చేస్తుండగా అన్ని ఖర్చులు పోగా రూ.5,400 చేతికి అందుతోంది. ◗ సాధారణంగా తోటలు మూడు సంవత్సరాలకు ఒక పర్యాయం కోతకు వస్తాయి. ఎకరాకు 40 టన్నుల వరకు దిగుబడి వస్తుండటంతో సరాసరిని ఏడాదికి ఎకరాకు రూ.లక్ష వరకు వస్తోంది.

విడతల వారీగా ఆదాయం వచ్చేందుకు..

పది ఎకరాల పొలం ఉన్న రైతులు విడతల వారీగా ఆదాయం వచ్చేవిధంగా మూడు ఎకరాల చొప్పున సాగుచేస్తూ ఆశాజనకమైన దిగుబడులు పొందుతున్నారు. చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు తదితర మండలాల్లో ప్రస్తుతం సరుగుడు విపరీతంగా సాగు చేస్తున్నారు. ఏపీ పేపర్‌మిల్లు, ఐటీసీ, సిర్‌పూర్ కాగజ్‌నగర్, తదితర అన్ని కంపెనీల వారు కర్ర కొనుగోలు చేస్తున్నారు.

మార్కాపురం జిల్లా ఏర్పాటుతో మేలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లాను వెంటనే ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్ నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం బేస్తవారపేటలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుతో వెనుకబడిన పశ్చిమ ప్రాంతానికి మేలు కలుగుతుందన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు నీరందించాలన్నారు. ఈ నెల 18న భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం పేరుతో మార్కాపురంలో నిర్వహించే ధర్నాకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, నియోజక వర్గ సీపీఐ కార్యదర్శి కేవీ రమణ, రైతు సంఘం కార్యదర్శి ఢాకాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పడి భజన

పూజల్లో పాల్గొన్న స్వాములు

మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడు మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రం పడమరపాలెంలో బొడ్రాయి సెంటర్‌లో అరటిబోదెలతో మండపం నిర్మించి విద్యుద్దీపాలంకరణ చేశారు. మాల ధరించిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయ్యప్ప గీతాలు ఆలపిస్తూ అభిషేకం చేశారు. భక్తులకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. గురుస్వామి కొలకలూరి నాగరాజు, యరగర్ల చైతన్య, అనిల్, యాసం కార్తీక్ మణి, చందు, శ్రీను తదితర స్వాములు నిర్వాహకులుగా వ్యవహరించారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడులో వేంచేసియున్న భూనీలా సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. శ్రీవారి పవిత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ క్రతువును రమణీయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం పారమాత్మిక హోమం, మహా పూర్ణాహుతి, బింబివాహన కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. తదుపరి రాత్రి గం.7లకు అలయ ప్రధానార్చకులు మద్దిపాటి వెంకటరమణ దీక్షితులు ఆధ్వర్యంలో పరాంకుశం సత్యనారాయణాచార్యులు ప్రధాన ఆచార్యులవారి పర్యవేక్షణలో వేదమంత్రాల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రవణా నక్షత్రం వారు ప్రధాన భూమిక పోషించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి అంజిరెడ్డి పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం

పొదిలి, న్యూస్‌టుడే: మండలంలోని మాదాలవారిపాలెంలో ఆదివారం హజరత్ నాసర్ మహమ్మద్ వలీ గంధమహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తరలించారు. భక్తులు దర్గాను సందర్శించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కులమతాలకతీతంగా అన్ని వర్గాల వారు పాల్గొని సామరస్యాన్ని చాటారు. దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రభలను ఏర్పాటు చేశారు. పాట కచేరీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కళాకారులు అలరించారు.

చదవడం మాకిష్టం.. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పుస్తకాలు చదివితే జ్ఞాపక శక్తి మెరుగు

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే: విద్యార్థులు సెలవుల సమయంలో ఇంటికే పరిమితం కాకుండా గ్రంథాలయాలకు రావాలని ఇన్‌ఛార్జి డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు చదవడం మా కిష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. అధికంగా విద్యార్థులు హాజరయ్యారు. వారికి బుక్ రీడింగ్ చేయించి, ఇండోర్ గేమ్స్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లకు అలవాటు పడకూడదని, పుస్తకాలు చదవడం వల్ల చదువులో ముందు ఉంటారన్నారు. చదవడం వల్ల జ్ఞాపక శక్తి పెరుగుతుందని, చురుగ్గా ఉంటారని జీవితంలో ఉన్నత స్థానాలకి చేరతారన్నారు. అనంతరం పోటీలలో విజేతకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, నాగేశ్వరరెడ్డి, డాక్టర్ మధుర శ్రీ, బాలకృష్ణ పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా మేదర సంఘం వన మహోత్సవం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగర మేదర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మంగమూరు రోడ్డులోని సదా రామనామ క్షేత్రంలో కార్తిక వనభోజన మహోత్సవం ఘనంగా జరిగింది. నగర అధ్యక్షుడు కేతా శేఖర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘీయులతోపాటు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. విష్ణు సహస్రనామ పారాయణం, రుద్రాభిషేకం పూజా కార్యక్రమాలు జరిగాయి. పిల్లలు, మహిళలకు మ్యూజికల్ ఛైర్, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేతా చలపతిరావు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, శ్రీహరి, నగర కార్యదర్శి పిల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం కూడలి.. సమస్యల లోగిలి

న్యూస్‌టుడే, కొత్తపట్నం

• ట్రాఫిక్ రద్దీతో నిలిచిపోతున్న వాహనాలు

కొత్తపట్నం సెంటర్ ప్రధాన రహదారి పనులు గత వైకాపా ప్రభుత్వ శాపంతో మధ్యలోనే ఆగిపోవడంతో, రాకపోకలు సాగించే వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో చొరవ చూపి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

హడావుడిగా పనుల నిర్వహణ..

2024లో ఎన్నికల ముందు పాలకులు హడావుడిగా రోడ్డు విస్తరణ భాగంగా ఆనుకుని ఉన్న ఇళ్లను పగులగొట్టారు. రోడ్డును విస్తరించి మార్గం మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంత వరకు బాగానే ఉన్నా.. హడావుడిగా పనులు చేపట్టి మధ్యలోనే వదిలేశారు. రోడ్డుకు రెండు వైపులా రోడ్డు వేసి మధ్యలో పనులు నిలిపివేశారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

మధ్యలో ఖాళీగా ఉండిపోయింది

రెండు వైపుల రోడ్డు వేసి మధ్యలో డివైడర్ పనులు వదిలేయడంతో ఖాళీగా ఉండిపోయింది. దీంతో వాహనాలు, ఆటోలు, కూరగాయలు, తినుబండారాలు, పళ్ల విక్రయాల బండ్లు అక్కడే నిలపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సాయంత్రం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు ఆ మార్గంలో రాకపోకలు సాగించాలంటే కష్టంగా ఉంటోందని పలువురు వాహనదారులు తెలిపారు. సెంటర్‌లో రెండు కూడళ్లు ఉండటంతో ఎటునుంచి వాహనాలు వస్తున్నాయో తెలియక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని కొందరు తెలిపారు.

కొత్తపట్నం కూడలి వద్ద ఇలా..

గ్రామాల రాకపోకలకు కీలక మార్గం

ఈ మార్గం నుంచే మోటుమాల, గుండమాల, రంగాయపాలెం, పాదర్తి, రాజుపాలెం, ఈతముక్కల, గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెంలకు ఇటు నుంచేరాక పోకలు సాగించాల్సి ఉంటుంది. ఆదివారం వస్తే చాలు ఈ మార్గం మీదుగానే బీచ్‌కి పోవాల్సి ఉంటుంది. రద్దీ వేళల్లో వాహనాలు వెళ్లేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోందని కొందరు వాహనదారులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పేర్నమిట్ట సాయిబాబా మందిరంలో ఆదివారం సాయంత్రం ఘనంగా శివపార్వతుల కల్యాణం జరిగింది. మఠంపల్లి దక్షిణామూర్తి శిష్య బృందంచే జరిగిన శివపార్వతుల కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రావూరి శ్రీనివాస రెడ్డి (వాసు), మాధవి దంపతులు ఉభయ దాతలు కాగా, సాయి సేవకులు హరిప్రసాద్ మాస్టారు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

(c) eenadu

నేడు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

కార్తిక మాసం శివకేశవులిద్దరికీ ప్రీతికరమైంది. ఈ మాసంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యత ఉంది. ఇంతటి పవిత్రమైన నెలలో దీపారాధన చేస్తే తెలియక చేసిన పాపాలు కూడా నశిస్తాయని శాస్త్రవచనం. అపార పుణ్య సముపార్జనకు ఇదో మార్గమని భక్తుల విశ్వాసం. నెల్లూరు నగరం వై.ఎం.సి.ఎ. గ్రౌండ్, ఎ.సి.సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ దగ్గర నేటి (సోమవారం) సాయంత్రం 5 గంటలకు ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్ ఆధ్యాత్మిక ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం జరగనుంది. రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో మహిళలకు మాత్రమే దీపారాధనకు అవకాశం ఉంది. ప్రవేశం, పూజా సామగ్రి ఉచితం.

వేద పఠనం: బ్రహ్మశ్రీ అవ్వారి రామకృష్ణ శర్మ అవధాని బృందం

ప్రధాన వైదిక నిర్వహణ: బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణికుమార శర్మ బృందం

ప్రవచన కర్త: బ్రహ్మశ్రీ ఆకెళ్ల విభీషణ శర్మ

అష్టోత్తరం : మృత్యుంజయ అష్టోత్తరం

సమయం: సోమవారం సాయంత్రం 5 గంటలకు

స్థలం: వై.ఎం.సి.ఎ. గ్రౌండ్స్, ఎ.సి. సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ దగ్గర, నెల్లూరు

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | ఈటీవీ తెలంగాణ | ఈటీవీ Life

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు.

కండలేరు @ 58 టీఎంసీలు

రాపూరు, న్యూస్‌టుడే: కండలేరు జలాశయం నీటిమట్టం ఆదివారం 58 టీఎంసీలు దాటింది. కండలేరు జలాలు ముంపు గ్రామాలను సమీపించడంతో రేగడపల్లి, గుండవోలు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పునరావాసం చూపితే.. అక్కడికి వెళ్లిపోతామని వారు తెలుగుగంగ అధికారులను కోరుతున్నారు.

కార్తిక దీపం.. కైలాస తేజం

వైభవంగా ఈటీవీ లైఫ్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ కార్తిక దీపోత్సవం

ఈనాడు, నెల్లూరు

ప్రమిదల వత్తుల జ్యోతి కళికల్లో ముత్తుకూరు గ్రామం దేదీప్యమానంగా వెలుగొందింది. శివ, కేశవుల నామస్మరణతో మార్మోగింది. మహిళలు, పిల్లలు వెలిగించిన దీప కాంతుల్లో అద్వితీయ కార్తికశోభ సంతరించుకుంది. సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరులోని మత్స్య కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి ఈటీవీ లైఫ్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ ఆధ్వర్యంలో.. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆతిథ్యంలో కార్తిక దీపోత్సవం నేత్రపర్వంగా సాగింది.

వేదపారాయణం చేస్తున్న పండితులు

పెద్ద సంఖ్యలో మహిళలు, యువతులు, బాలలు సంప్రదాయ వస్త్రధారణలో కార్యక్రమానికి తరలిరాగా- దీపోత్సవ ప్రాంగణమంతా హరిహరుల నామస్మరణ, కార్తిక దీప కాంతులతో శ్రీమహాలక్ష్మి నిలయంగా మారింది. తొలుత ఇసుకపల్లి వేద విద్యాలయానికి చెందిన బ్రహ్మశ్రీ దేవరకొండ నాగరాజశర్మ, బ్రహ్మశ్రీ అపారి వెంకట రామకృష్ణశాస్త్రి అవధాన బృందం వేదపారాయణం చేశారు. వేద ఘోష ప్రతిధ్వనించారు. గణపతి పూజ, జ్యోతి ప్రకాశనం, కలువ పూలతో లక్ష్మీపూజ, దీపలక్ష్మి పూజా సంకల్పం, వేద స్వస్తి కార్యక్రమాలు నిర్వహించారు. శాస్త్రబద్ధంగా దీపారాధన చేయించి.. దీప కాంతుల్లో లక్ష్మీపూజ, ఆంజనేయ అష్టోత్తరం పఠించారు. బ్రహ్మశ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ప్రవచనాలు భక్తులకు ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని కలిగించాయి. దీపం గొప్పదనం, కార్తిక మాసంలో వెలిగించడం వల్ల కలిగే లాభాలు, సూర్య భగవానుడికి ఉదయం నమస్కారాలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

కనుల పండువగా...

కార్తిక దీపోత్సవంలో భాగంగా జ్యోతి వెలిగించే కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి మార్కెట్ యార్డు ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, తెదేపా ముత్తుకూరు మండల అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, గొలగమూడి ఆశ్రమ కమిటీ సభ్యుడు, సీనియర్ నాయకుడు ఈదూరు రామ్మోహన్‌రెడి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, ఎనెల్ ఆసుపత్రి ఛైర్మన్ నాగేంద్ర ప్రసాద్, తెదేపా ముత్తుకూరు మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

జ్ఞాపికల ప్రదానం

కార్తిక దీపోత్సవ కార్యక్రమానికి సహకరించిన పలు వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, 'ఈనాడు' నెల్లూరు యూనిట్ ఇన్‌ఛార్జి దుర్గాప్రసాద్ జ్ఞాపికలు అందజేశారు. శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి స్టార్ సిటీ, శ్రేయా కంపెనీ, మదర్ ల్యాండ్ డెవలపర్స్ తరఫున ఆ సంస్థ ప్రతినిధులు, విజయలక్ష్మి ఫెర్టిలిటీ క్లినిక్ డాక్టర్ విజయలక్ష్మి, ఎనెల్ ఆసుపత్రి ఛైర్మన్ నాగేంద్రప్రసాద్, శరత్ ఇండస్ట్రీస్ జీఎం నారాయణరావులు జ్ఞాపికలు అందుకున్నారు. కృష్ణపట్నం శివాలయం ఛైర్మన్ మామిడాల శ్రీనివాసులు ప్రసాదం అందజేశారు. కార్యక్రమాన్ని ఈటీవీ డిప్యూటీ న్యూస్ కోఆర్డినేటర్ జి. అమరేశ్వరరావు పర్యవేక్షించారు.

ఆధ్యాత్మిక శోభ ఆనందకరం

కార్తిక మాసంలో ముత్తుకూరులో సామూహిక కార్తిక దీపోత్సవం ఈటీవీ సౌజన్యంతో చేసుకోవడం ఆనందకరమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. దీప కాంతులతో జ్ఞానాన్ని పెంపొందించేలా చెప్పిన ప్రవచనాలు ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయన్నారు. ముత్తుకూరులో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు.

దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

జ్ఞాపికలు అందుకున్న వారితో ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు

కార్తిక దీపాలతో దేదీప్యమానంగా ప్రాంగణం

మాలకొండపైకి వెళ్లే రోడ్డు

డీపీఆర్ దశలోనే.. మాలకొండ రెండో ఘాట్!

రాకపోకలకు భక్తుల అవస్థలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రసిద్ధ మాలకొండ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం రెండో ఘాట్ ప్రతిపాదన అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు అన్నట్లు ఉంది. ఒకే ఘాట్ రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. రెండో ఘాట్‌ను వీలైనంత త్వరగా సాకారం చేయాలని భక్తులు కోరుతున్నారు.

ప్రతి శనివారం.. వలేటివారిపాలెం మండలంలోని మాలకొండ క్షేత్రాన్ని వారంలో శనివారం మాత్రమే.. అదీ ఉదయం 5.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మాత్రమే తెరుస్తారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతి శనివారం స్వామి దర్శనానికి సుమారు 15 వేల నుంచి 20వేల మంది భక్తులు వస్తుంటారు. నరసింహస్వామి జయంతి, కార్తిక, శ్రావణ మాసాల్లో ఈ సంఖ్య రెట్టింపుగా ఉంటుంది. ప్రస్తుతం ఒకే ఘాట్ రోడ్డులో రాకపోకలు సాగించాల్సి వస్తుండగా.. ప్రయాసలు తప్పడం లేదు.

ఈ ఏడాది మొదట్లో.. రెండో ఘాట్ ఏర్పాటుకు జంగిల్ క్లియరెన్స్ చేయడంతో భక్తులు ఆనందించారు. జూన్‌లో మాలకొండలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.. ఒకే ఘాట్ రోడ్డు ఇబ్బందికరంగా, ప్రమాదకరంగా ఉందని ప్రస్తావించారు. వీలైనంత త్వరగా రెండో ఘాట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మొదట్లో ఆర్‌అండ్‌బీశాఖ ద్వారా ప్రాథమికంగా ప్రతిపాదనలు తయారు చేయించగా.. సుమారు రూ. 30 కోట్లు అవుతుందన్నారు. అది కాదని, దేవాదాయశాఖ ఇంజినీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. కాకినాడకు చెందిన ఓ కన్సల్టెన్సీ సంస్థకు మూడు నెలల కిందట ఆ బాధ్యతలు అప్పగించినా.. ఇప్పటికీ ఖరారు కాలేదు.

● దీనిపై మాలకొండ ఆలయ డీఈ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోపు డీపీఆర్ సిద్ధమయ్యే అవకాశం ఉందన్నారు. రెండో ఘాట్ ఏర్పాటుకు సుమారు రూ. 7 కోట్ల నుంచి రూ. 8 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు.

సాగు బాటలో సవాళ్లు

రూ. 14 కోట్లతో పనులెప్పుడు జరిగేనో!

సంగం, న్యూస్‌టుడే: సాగునీటి సలహా మండలి సమావేశంలో ఎట్టకేలకు తొలి పంటకు నీటి కేటాయింపులు జరిగినా.. కాలువల దుస్థితే అన్నదాతలను కలవరపెడుతోంది. ఓఅండ్‌ఎం నిధులతో చేపట్టాల్సిన పనులు కొలిక్కి రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

పడమటిపాళెం కాలువ దుస్థితి

వనరులు పుష్కలం

సోమశిల, కండలేరు జలాశయాలు నిండుకుండలా దర్శనమిస్తుండగా- 27.3 టీఎంసీల సామర్థ్యం ఉన్న 1007 చెరువుల్లో 23.6 టీఎంసీల నీటి నిల్వ చేరింది. ఎడగారులో మూడు లక్షల ఎకరాల్లో సాగు జరిగినా.. దిగుబడులు తగ్గడం, ధరల పతనంతో అన్నదాతలు నష్టపోయారు. తొలి పంటలోనైనా ఆ కష్టాలు, నష్టాలను అధిగమించాలన్న యోచనలో ఉన్న వారికి ఈ పరిస్థితులు ఇబ్బందిగా కనిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో...

జలాశయం	కాలువలు	ఆయకట్టు
పెన్నాడెల్టా	13	2,42,128
సోమశిల జలాశయం	3	2,23,000
మొత్తం	16	4,65,128
(నీటి కేటాయింపు: 46.51 టీఎంసీలు)		
తెలుగుగంగ	14	2,23,333
(కేటాయింపు: 23.333 టీఎంసీలు)		

అడుగులు పడితేనా?

మొత్తంగా 30 ప్రధాన, అనుబంధంగా మరో వంద సరఫరా కాలువలు, పెన్నా నది నుంచి నేరుగా తరలించే 20 ఏటి కాలువలు ఉండగా- బెజవాడ పాపిరెడ్డి కాలువ మినహా.. మిగిలిన వాటిల్లో నీరు ప్రవహించే పరిస్థితి లేదు. రూ. 14 కోట్ల ఓఅండ్‌ఎం నిధులతో 183 పనులు చేయాల్సి ఉన్నా.. కనిగిరి జలాశయం పరిధిలో తప్ప.. మిగిలిన చోట్ల ఆ దిశగా అడుగులు పడటం లేదు. ఈ నెల 15వ తేదీ విడుదల, సరఫరా ప్రారంభమైనా.. నాట్లు వేసేందుకు నెల రోజులు పడుతుంది. ఆ లోపు పూడికలైనా తీయించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై జలవనరులశాఖ ఎస్ఈ దేశీనాయక్ వివరణ కోరగా.. త్వరలో జాబితా ఖరారు చేసి.. తొలగిస్తామన్నారు.

రోడ్డు కోత.. ప్రయాణికులకు వెత

వెంకటాచలం మండలంలోని టోల్‌ప్లాజా సమీపంలో ఎర్రగుంట నుంచి చవటపాళెం వెళ్లే మార్గంలోని వంతెన వద్ద రోడ్డు ఇటీవలి వర్షాలకు దెబ్బతింది. ఇరువైపులా వరద ప్రవాహానికి కోసుకుపోవడంతో వాహన దారులు నరకయాతన పడుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే వెంకటాచలం

ప్రథమ వర్ధంతి

కీ॥శే॥ శ్రీ తాళ్ళూరు రమణయ్య నాయుడు గారు

మాజీ డైరెక్టర్ : ఎ.పి. మార్క్‌ఫెడ్, మాజీ ప్రెసిడెంట్ : కో-ఆపరేటివ్ మార్కెట్ సొసైటీ, నెల్లూరు

ప్రెసిడెంట్ : పి.ఎ.సి.ఎస్. దగదర్తి, నెల్లూరుజిల్లా.

డైరెక్టర్ : Sri SCL INFRATECH LIMITED

జననం : 27-06-1943

మరణం : 11-11-2024

అనురాగ మూర్తి... ఆత్మీయ దీప్తి.. మా నాన్న

శ్రీ తాళ్ళూరు రమణయ్య నాయుడు గారు

ఆయన ప్రేమానురాగాలే మాకు స్ఫూర్తి..

ఆయన నడిపించిన బాటే మాకు కీర్తి...

- కుటుంబసభ్యులు

ప్రథమ వర్ధంతి

తే 11-11-2025 ది దగదర్తి గ్రామములో తాళ్ళూరు పెద్ద వెంకయ్య నాయుడు కళ్యాణ మండపంలో ప్రథమ వర్ధంతి జరుగును. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం మరియు అన్నదాన కార్యక్రమం జరుగును.

చింతారెడ్డిపాళెం కూడలిలో అండర్ పాస్

స్పందనకు వందనం

నెల్లూరు(గ్రామీణం, జడ్పీ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరం నుంచి చింతారెడ్డిపాళెం వెళ్లే మార్గంలో.. జాతీయ రహదారి కూడలి వద్ద అండర్ పాస్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. విజయవాడ- చెన్నై జాతీయ రహదారి కావడం.. అటు నుంచి నగరంలోకి రద్దీ అధికంగానే ఉండటం.. జంక్షన్ సమీపంలో ఆసుపత్రి ఉండటం తదితరాలతో వాహనాల రాకపోకలు అధికంగానే ఉంటాయి. ముఖ్యంగా రోడ్ దాటే సమయంలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారి.. ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇక్కడి పరిస్థితులపై 'ఈనాడు' పలుమార్లు కథనాలు ప్రచురించగా.. స్పందించిన ప్రజాప్రతినిధులు నిధుల మంజూరుకు కృషి చేశారు. ఈ నేపథ్యంలో చింతారెడ్డిపాళెం క్రాస్ వద్ద హైవేపై అండర్ పాస్ నిర్మాణానికి రూ. 115 కోట్లతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వాహనదారులు, ప్రజల నిరీక్షణ ఫలించింది. ఇక్కట్లు తొలగనున్నాయన్న ఆనందం వ్యక్తమవుతోంది.

చింతారెడ్డిపాళెం జంక్షన్

● దీనిపై జాతీయ రహదారుల విభాగం పీడీ ఎం.కె.చౌదరి మాట్లాడుతూ.. 'జిల్లా ప్రజాప్రతినిధుల కృషితో చింతారెడ్డిపాళెం వెళ్లే కూడలిలో హైవేపై అండర్‌పాస్ మంజూరైంది. సుమారు రూ. 115 కోట్లు అందుబాటులోకి రానున్నాయి. సంబంధిత పత్రాలు అందగానే టెండర్లు పిలుస్తాం. ప్రక్రియ ప్రారంభించేందుకు సిద్ధమవుతాం' అన్నారు.

మణికంఠ.. ఈతలో పతకాల పంట

పతకాలతో మణికంఠ

సీతారామపురం, న్యూస్‌టుడే: అండర్ 19 రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఈత పోటీల్లో సీతారామపురానికి చెందిన పామనబోయిన మణికంఠ సత్తా చాటాడు. విశాఖపట్టణంలోని జీవీఎంసీ ఆక్వా కాంప్లెక్స్‌లో ఆదివారం ఈ పోటీలు జరిగాయి. 50, 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో మొదటిస్థానం, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించి రెండు బంగారు, ఒక రజత పతకం అందుకొని జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు.

ప్రోత్సాహం అందుకుంటే.. మీరే పారిశ్రామికవేత్త!

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

రాష్ట్రంలో డ్వాక్రా, మెప్మాలో సభ్యులుగా ఉన్న లక్ష మందిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందుకోసం ప్రత్యేక కార్యాచరణను ప్రకటించగా. . జిల్లా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపయుక్తమయ్యే 8 రకాల సేవలను తీసుకొచ్చారు.

స్వయం సహాయక సంఘాల సభ్యులు

8 రకాల సేవలు

ప్రజ్ఞ వర్చువల్ ట్రైనింగ్ అకాడమీ ద్వారా డిజిటల్, ఆర్థిక అక్షరాస్యత తదితర 12 రకాల ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు అందిస్తుండగా- స్వయం ఉపాధి అవకాశాలు ఉన్న వీటిని సంఘం సభ్యులకు అందుబాటులోకి తెచ్చారు. శిక్షణ అనంతరం బ్యాంకు రుణాలు మంజూరు చేస్తారు. వాటితో యూనిట్లు స్థాపించి తాము ఆర్థికంగా నిలదొక్కుకునేలా చూడటంతో పాటు.. మరో పది మందికి ఉపాధి కల్పించేలా ప్రోత్సహించనున్నారు. దీంతో పాటు లైవ్‌లీహుడ్ ప్రమోషన్స్ పేరుతో పుస్తకాన్ని ప్రచురించి.. పట్టణాల్లోని మహిళా సంఘాల సభ్యులు చేసుకునే అవకాశం ఉన్న వ్యాపారాలు, వివిధ వ్యాపార ఆలోచనలు పొందుపరుస్తారు. సంఘం సభ్యుల్లో ఇప్పటికే అత్యుత్తమంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న సభ్యుల విజయగాథలను ప్రచురించి.. మిగిలిన వారిని ప్రోత్సహించడం ఈ పుస్తకం లక్ష్యం.

ఎంఎస్‌ఎంఈ పార్కుల అభివృద్ధి

ఎంఎస్‌ఎంఈ పార్కులను అభివృద్ధి చేసి.. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా తర్ఫీదు ఇవ్వనున్నారు. మెప్మా సభ్యుల ఉత్పత్తులన్నింటికీ ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంలో ఏకరీతిగా బ్రాండింగ్, ప్యాకింగ్ విధి విధానాలు రూపొందించారు. ఆడిట్ నివేదికలను లీప్ పుస్తకంలో నమోదు చేయడం ద్వారా జీవనోపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకున్న మహిళలను నిర్ధారిస్తారు. సభ్యుల పొదుపు, అప్పు, ఎస్ఎల్ఎఫ్, టీఎల్ఎఫ్ వివరాలు, సంఘాల ఆడిట్ నివేదిక, సంఘం నిర్వహణ సిబ్బంది వివరాలను మనమిత్ర వాట్సాప్ ద్వారానూ పొందవచ్చు.

● దీనిపై మెప్మా పీడీ లీలారాణి మాట్లాడుతూ. . సంఘం సభ్యులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

జిల్లాలో సంఘాలు: 15,298 | సభ్యులు: 15,02,089 | గుర్తించిన ఉత్పత్తులు: 500

(c) eenadu

ఆక్రమించి.. ర్యాంపులు నిర్మించి

కోవూరు పట్టణ పరిధిలో శాంతి నగర్‌లో కాలువలు, రోడ్డు ఆక్రమించి ర్యాంపులు నిర్మిస్తున్నారు. పాఠశాలల వ్యాన్లు, ఇతర వాహనాలు వస్తే ఇబ్బందులు తప్పడం లేదు. బజారు కూడలి, గమళ్ల పాళెం, ఇనమడుగు, రైల్వేరోడ్డు ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్నారని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పంచాయతీ, మండల అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, కోవూరు

పరిమితికి మించి.. ప్రమాదం పొంచి

లింగసముద్రం మండలంలో అయిదారు రోజులు నుంచి పొగాకు నాట్లు ప్రారంభమయ్యాయి. కాగా కూలీలను పరిమితికి మించి వాహనాల్లో తరలిస్తున్నారు. అధ్వానంగా ఉన్న రోడ్లపై ఇలా రాకపోకలు చేస్తుండడంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఆదివారం అన్నెబోయినపల్లి నుంచి లింగసముద్రానికి పొగాకు నాట్లు వేసేందుకు బొలెరో ట్రక్కులో 70 మంది కూలీలు ప్రయాణిస్తుండగా.. 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. – న్యూస్‌టుడే, లింగసముద్రం

కల్వర్టు ధ్వంసం

తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాలెం సమీపంలోని కలుజు వద్ద కల్వర్టు దెబ్బతింది. నిత్యం వాహనాలు ఈ రోడ్డుపై తిరుగుతుంటాయి. కొన్ని నెలల క్రితం కుంగిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ధ్వంసమైతే తోటపల్లిగూడూరు, ఇస్కపాలెం, చిన్నచెరుకూరు తదితర గ్రామాలకు వెళ్లే వాహనదారులు అవస్థలు తప్పవు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

ఎనిమిదేళ్లుగా పునాదులకే పరిమితం

పొదలకూరులో ఉప ఖజానా కార్యాలయ భవనం ఎనిమిదేళ్లుగా పునాదులకే పరిమితమైంది. 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వంలో నూతన భవనం మంజూరవడంతో పనులు ప్రారంభించారు. 2019 ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత గుత్తేదారుడికి బిల్లులు సకాలంలో చెల్లించలేదు. ప్రస్తుతం ముళ్ల చెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తుండగా.. నిర్మాణ సామగ్రి తుప్పు పడుతోంది. ఇన్‌ఛార్జి ఏఈ నజీరుద్దీన్ మాట్లాడుతూ.. కోటి రూపాయలతో అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించామని, అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. –న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి.. డయల్ యువర్ సీఎండీ నేడు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలో విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు 89777 16661 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలపాలన్నారు.

రెండు పంటలకు సాగు నీరందిస్తాం: ఎమ్మెల్యే

లింగసముద్రం, న్యూస్‌టుడే: రాళ్లపాడు జలాశయం ఆయకట్టు పరిధిలో రెండు పంట కాలాలకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ప్రాజెక్టు వద్ద పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చి సాగునీటిని విడుదల చేశారు. కుడి కాలువకు 50 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 25 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమశిల నుంచి 1.5 టీఎంసీల నీటిని తీసుకురావడం జరుగుతుందన్నారు. రైతులు అధైర్యపడకుండా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. డీఈ వెంకటేశ్వర్లు, ఆయకట్టు సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

స్వచ్ఛతకు ప్రాధాన్యం..

పాఠశాల స్థాయి నుంచి అవగాహన కల్పిస్తూ ప్రోత్సాహకాలు

హరిత వికాసమే లక్ష్యం

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట

స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల స్థాయి నుంచే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచేందుకు స్టార్ రేటింగ్ విధానం ప్రవేశపెట్టింది. గతంలో ఉన్న స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు మార్పులు చేసి స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ రేటింగ్ (ఎస్‌హెచ్‌వీఆర్) పేరుతో ప్రోత్సాహకాలు అందజేస్తుంది. ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుని వాటిలో మెరుగ్గా ఉండే వాటికి వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.

ప్రస్తుత విద్యాసంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్వీయ పరిశీలన చేపట్టి రేటింగ్ ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. మొదటి విభాగంలో 8వ తరగతి వరకు, రెండో కేటగిరీలో తొమ్మిది నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠశాలలు, కళాశాలలకు అవకాశమిచ్చారు. 5, 4 స్టార్ రేటింగ్ పొందిన పాఠశాలలను జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు స్వయంగా పరిశీలిస్తాయి.

పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

3 స్టార్ పొందిన వాటికి జిల్లా స్థాయి, 4 స్టార్ వచ్చిన వాటికి రాష్ట్ర స్థాయి, 5 స్టార్ వచ్చిన వాటికి జాతీయ స్థాయిలో ప్రోత్సాహకాలు అందించనున్నారు.

ఎంపిక చేస్తారిలా...

గ్రామీణ ప్రాంతాల్లో ఎల్‌కేజీ నుంచి 8వ తరగతి వరకు మూడు పాఠశాలలు, 9 నుంచి ఇంటర్మీడియట్ వరకు మూడు బడులను పరిగణనలోకి తీసుకుంటారు. ఆన్‌లైన్ నమోదు చేసుకున్న పాఠశాలలను ప్రభుత్వం నియమించిన కమిటీ అప్‌లోడ్ చేసిన చిత్రాలను పరిశీలిస్తారు. ఎక్కువ మార్కులు వచ్చిన పాఠశాలలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. వాటినే జిల్లా కమిటీ పరిశీలిస్తుంది. మొదటి విడత సర్వే సమగ్ర శిక్షా అధికారులు పూర్తి చేసిన రేటింగ్ వివరాలు ఆన్‌లైన్‌లో పెట్టారు. రెండో విడతలో సీఆర్పీలు ఇతర సిబ్బంది మళ్లీ సర్వే చేసి మార్పులు, చేర్పులను నమోదు చేస్తారు. తరువాత వీటిని రాష్ట్ర కమిటీ సభ్యులు సర్వే చేసి విజేతలను ఎంపిక చేస్తారు.

జిల్లా పరిధిలో వివరాలు

నమోదైన పాఠశాలలు	2940
5 స్టార్ రేటింగ్	92
4 స్టార్	1106
3 స్టార్	1462
2 స్టార్	222
1 స్టార్	58

● సమగ్ర శిక్షా సీఎంవో రమణయ్య మాట్లాడుతూ రేటింగ్ వివరాలు నమోదు చేశామని, పరిశీలన తరువాత పురస్కారాలు ప్రకటించనున్నట్లు తెలిపారు.

అనుమతులు లేకుండా ప్రతిభ పరీక్ష

వింజమూరు, న్యూస్‌టుడే : గుర్తింపు లేకుండా నవోదయ పాఠశాలల్లో చేరేందుకు శిక్షణ ఇస్తామని వింజమూరుకు చెందిన ఓ ప్రైవేటు సంస్థ ఆదివారం నాలుగో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష నిర్వహించింది. గత నెల 19న జిల్లా స్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఇది తెలిసి మండల విద్యా శాఖాధికారి నోటీసు ఇవ్వగా నిలిపివేశారు. మళ్లీ ఆదివారం నిర్వహించారు. దీనికి 400 మంది నాలుగో తరగతి విద్యార్థులు హాజరైనట్లు సంస్థ వారే వాట్సాప్ గ్రూప్‌లో పెట్టారు. ఈ విషయమై ఎంఈవో మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా ఆ సంస్థకు గుర్తింపు లేదని అసలు తరగతులే నిర్వహించకూడదన్నారు. అలాంటిది ప్రతిభ పరీక్ష నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వివరించారు.

పరీక్షకు హాజరైన విద్యార్థులు వారి తల్లిదండ్రులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) జిల్లా అధ్యక్షుడు నాటకం తిరుమలయ్య కోరారు. ఆదివారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఎన్‌టీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర సమావేశంలో జిల్లా నుంచి చంద్రశేఖర్, భాస్కర్, సైమన్ కుమార్ పాల్గొని ప్రసంగించారు.

లేఅవుట్లలో అక్రమాలే అధికం.. అనుమతులు శూన్యం

250 మందికి నోటీసులిచ్చినా 53 దరఖాస్తులకే పరిమితం

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

గత పాలనలో కనీస అనుమతుల్లేకుండా పంట పొలాలు.. రోడ్డు పక్కన స్థలాలను ఆక్రమించి వెంచర్లు వేశారు. . పది శాతం స్థలం వదలాల్సి ఉన్నా ఎవరూ పాటించలేదు..! పలు చోట్ల గ్రావెల్, మట్టి తవ్వకాలు చేపట్టి లేఅవుట్లకు తరలించి వ్యాపారుల నుంచి వైకాపా నాయకులు కోట్ల రూపాయలు కొల్లగొట్టారు.. కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణకు ఆదేశించింది.. కొనుగోలు దారులకు ఇబ్బందులు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశమిచ్చినా దరఖాస్తులు అంతంతమాత్రంగా వచ్చాయని అధికారులు చెబుతున్నారు.

లేఅవుట్‌లో పరిశీలిస్తున్న అధికారులు

30 స్థిరాస్తి వెంచర్ల పరిధిలో....

రాష్ట్ర వ్యాప్తంగా జులై 26న ఎల్ఆర్ఎస్‌కు అవకాశమిచ్చారు. అక్టోబరు 2 వరకు గడువు విధించారు. స్పందన లేకపోవడంతో మూడు నెలలు పొడిగించారు. బుచ్చి పురపాలక పరిధిలో 30 అనధికార లేఅవుట్లలో 1500 మంది కొనుగోలు చేశారు. వీరిలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, నెల్లూరు ఇతర ప్రాంతాల్లో ఉన్న 250 మంది చిరునామాలు సేకరించి నోటీసులిచ్చారు. అయినా ఇప్పటి వరకు 53 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. వంద శాతం పూర్తయితే రూ.5 కోట్ల రూపాయలు ఖజానాకు జమవుతోంది. ఈ నిధులతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశముంది.

● పురపాలక కమిషనర్ బాలకృష్ణ మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ పథకం ద్వారా ప్రభుత్వం ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి అవకాశమిచ్చినా సద్వినియోగం చేసుకోవడం లేదని, ఇక్కడి పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

కనుపాప దూరమై.. కన్నపేగు శోకమై

జలదంకి, న్యూస్‌టుడే

బిడ్డా.. నువ్వు లేకుండా నేనెలా బతకాలి.. నాకు మందులు ఎవరు వేస్తారు.. నా ఆలనా పాలన ఎవరు చూస్తారు.. నేనైమైపోవాలి.. దేవుడా నాకెందుకయ్యా ఇంత అన్యాయం చేశావని ఆతల్లి విలపిస్తుంటే.. చూపరుల కళ్లు చెమ్మగిల్లాయి. కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తుంటే ఓదార్చడం ఎవరితరం కాలేదు. ఇదీ కుమారుడి మరణంతో హృద్రోగి అయిన తల్లి విలపిస్తున్న తీరు. ఈఘటన మండలంలోని హనుమకొండపాలెం సమీపంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై సయ్యద్ లతీఫున్నీసా వివరాల మేరకు. . బ్రాహ్మణక్రాక అగ్రహారం గ్రామానికి చెందిన షేక్ అలీమహ్మద్ (32) అవివాహితుడు. తండ్రి కొన్నాళ్ల క్రితం మృతిచెందగా.. గుండె వ్యాధితో బాధపడుతున్న తల్లి మీరాబీతో కలసి ఉంటున్నారు. కూలి పనులకు వెళ్లి ఆమెను పోషిస్తున్నారు.

అలీ మహ్మద్ (పాతచిత్రం)

శనివారం తొమ్మిదో మైలు ఎస్సీ కాలనీకి చెందిన జీవయ్య హనుమకొండపాలెం సమీపంలోని పొలాల్లో గడ్డి మోపులు మోసే పనికి అలీని తీసుకెళ్లారు. సాయంత్రం కూలి నగదు ఇచ్చేందుకు అలీ ఇంటికి జీవయ్య రాగా.. రాలేదని తల్లి చెప్పడంతో వెనుదిరిగారు. పొద్దుపోతున్నా రాకపోవడంతో గ్రామంలో పలువురిని విచారించినా జాడ తెలియలేదు. ఆదివారం ఉదయం పొలాల్లోకి వెళ్లిన రైతులు గట్టు పక్కన విగతజీవిగా పడి ఉన్న అలీని చూసి తల్లికి సమాచారం ఇవ్వగా కుప్పకూలిపోయింది. కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్సై లతీఫున్నీసా మృతదేహాన్ని పరిశీలించి కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. మృతుడు మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఆ వ్యాధికి గురై మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నయా మోసం.. నగదుతో పలాయనం

సంగం, న్యూస్‌టుడే: పెట్రోల్ బంకులను లక్ష్యంగా చేసుకుని కేటుగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరదీశారు. స్వైపింగ్ మిషన్ ద్వారా నగదు వేస్తామని, దానికి బదులుగా నోట్లు ఇవ్వాలని నమ్మబలికి.. లావాదేవీల అనంతరం నోట్ల కట్టలు, మిషన్లతో సహా ఉడాయించి.. తిరిగి తమ ఖాతాలోకి మళ్లించుకుంటున్నారు. పలుచోట్ల కొంత మేర కమిషన్ తీసుకుని, ఇలాంటి లావాదేవీలు చేస్తుండగా.. అదే అదనుగా మోసానికి పాల్పడిన ఉదంతం ఆదివారం సంగంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. ఇద్దరు వ్యక్తులు శనివారం సంగంలోని కొండ కూడలి సమీపంలో ఉన్న పెట్రోల్ బంకుకు వచ్చారు. తమకు రూ. 30వేలు నోట్లుగా కావాలని, స్వైపింగ్ యంత్రం ద్వారా ఆ మేరకు నగదు వేస్తామని నమ్మబలికారు. నోట్ల రూపంలో నగదు తీసుకుని.. ఆ వెంటనే యంత్రంతో సహా ఉడాయించారు. తిరిగి తమకే జమయ్యే విధంగా మెషిన్‌లోని రీఫండ్ సదుపాయాన్ని వినియోగించుకుని నగదు దోచేశారు. ఈ లావాదేవీ గురించి సదరు యంత్రానికి అనుసంధానమైన చరవానికి సమాచారం వచ్చినట్లు బాధితులు తెలిపారు. ఇదే రీతిలో వింజమూరు, ఆత్మకూరు, జలదంకి వద్ద ఉన్న పెట్రోల్ బంకుల్లోనూ ఇదే తరహా మోసానికి పాల్పడినట్లు సమాచారం. దీనిపై సంగం ఎస్సై పి.రాజేష్‌తో మాట్లాడగా.. తమ దృష్టికి రాలేదన్నారు.

నగదు రీ ఫండ్ చిత్రం

ద్విచక్రవాహనంపై వెళుతున్న నిందితులు

రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయురాలిగా హాజిరా

ఉదయగిరి, న్యూస్‌టుడే : మండలంలోని మాసాయిపేట మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ హాజిరా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఏటా నవంబరు 11న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను ఈ అవార్డుతో సత్కరిస్తోంది. అందులో భాగంగా విజయవాడలో మంగళవారం జరిగే అవార్డుల ప్రదానోత్సవ సభలో హాజిరా అవార్డును అందుకోనున్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉర్దూ అవార్డుకు ఎంపికైన హాజిరాకు ఎంఈవోలు, పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

117వ సారి అజయ్‌బాబు రక్తదానం

నెల్లూరు(నవాబ్‌పేట), మనుబోలు, న్యూస్‌టుడే: అత్యవసర సమయంలో రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని రెడ్ క్రాస్ రక్త నిధి కేంద్రం మాజీ కన్వీనర్ సీహెచ్ అజయ్‌బాబు పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ఆదివారం 117వ సారి రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌ఛైర్మన్ జనార్దన్‌రాజు, సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 11,520
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 92,160
వెండి గ్రాము :	రూ. 157.60

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	126
లేయర్	120
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	252
లేయర్ మాంసం	204

గంజాయి విక్రేతల అరెస్టు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: గంజాయి విక్రయించేందుకు యత్నిస్తున్న ఆరుగురు యువకులను సంతపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 6.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు హోటళ్లు, లాడ్జీలు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నగరంలోని సంతపేట పోలీసు స్టేషన్ పరిధి బృందావనంలోని రాజేష్ లాడ్జీలో పోలీసులు తనిఖీలు చేయగా, నగరానికి చెందిన ఆరుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా గంజాయికి అలవాటు పడిన వారికి పలాస నుంచి దిగుమతి చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వీరిలో హరనాథపురం సర్వేపల్లి కాలువ కట్టకు చెందిన శ్యాం సుందర్, సంతోష్, బీవీ నగర్‌కు చెందిన సాయి, ఆర్టీసీ బస్టాండు రైతుబజారు ప్రాంతానికి చెందిన అభిషేక్, మూలాపేటకు చెందిన జగదీష్, వేదాయపాలెంనకు చెందిన ముని రాజేష్ ఉన్నారు. వీరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల్లో గ్రేడ్ల వ్యవస్థ

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

ప్రక్షాళన అనంతరం జిల్లాలోని 722 పంచాయతీలు గ్రేడ్ల పరిధిలోకి వచ్చాయి. ఇందుకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2010లో అప్పటి ఉమ్మడి జిల్లాలను అనుసరించి క్లస్టర్లను ఏర్పాటు చేశారు. పాత ఉమ్మడి జిల్లాలో ఉన్న 46 మండలాల ప్రకారం 961 పంచాయతీలను 447 క్లస్టర్లుగా విభజించారు. ప్రస్తుతం వీటి స్థానంలో గ్రేడ్ల వ్యవస్థ తీసుకొచ్చింది. మూడుమాసాల క్రితం జిల్లాలోని 37 మండలాల పరిధిలోని దాదాపు 722 పంచాయతీలను జనాభా, ఆదాయం ఆధారంగా గ్రేడ్ల వారీగా పంచాయతీలను నిర్ణయించి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. మంత్రివర్గం చర్చించి ఆమోద ముద్ర వేసింది. వీటి ఆధారంగా మొత్తం నాలుగు గ్రేడ్ల వారీగా పంచాయతీలను విభజించారు.

ఆదాయం.. జనాభా ఆధారంగా..

స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు 15. వీటిలో 10వేలకు పైగా జనాభాగానీ, ప్రభుత్వ గ్రాంట్లు కాక కోటి రూపాయల ఆదాయం వచ్చేవిగా విభజించారు. గ్రేడ్-1 పంచాయతీలు 73. వీటి పరిధిలో 3వేల నుంచి 10వేల వరకు జనాభాగానీ, రూ.30 లక్షల నుంచి కోటి రూపాయలలోపు ఆదాయం వచ్చేవిగా నిర్ణయించారు. గ్రేడ్-2 పంచాయతీలు 183. వీటి పరిధిలో రెండు వేల నుంచి మూడు వేల మధ్య జనాభా ఉంటారు. గ్రేడ్-3 పంచాయతీలు 451. రెండువేల కన్నా తక్కువ జనాభా ఉన్నవాటిని గ్రేడ్-3 కింద ఎంపిక చేశారు.

47 మందికి ముందస్తు ఉద్యోగోన్నతులు

నూతన నిర్ణయం మేరకు జిల్లాలో గ్రేడ్ల వ్యవస్థతోపాటు ఉద్యోగుల కేటాయింపులతో మార్పులు రానున్నాయి. అందులో భాగంగా సీనియార్టీ ప్రకారం దాదాపు 47 మందికి ఒకేసారి ఉద్యోగోన్నతులు రానున్నాయి. కార్యదర్శులు, సీనియర్ సహాయకులకు డిప్యూటీ ఎంపీడీవో హోదా కలగనుంది.

నూతన విధానం అమల్లోకి..: ఎల్.శ్రీధర్‌రెడ్డి, డీపీవో

జిల్లాలోని పంచాయతీల పరిధిలో గతంలో ఉన్న క్లస్టర్ విధానాన్ని ప్రభుత్వం రద్దుచేసి గ్రేడ్ల విధానం తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించి జీవో విడుదలైంది. రాష్ట్ర అధికారుల సూచనలు తీసుకుంటాం. అన్ని పంచాయతీల పరిధిలో నూతన విధానం అమల్లోకి వస్తుంది.

కళుగోళ శాంభవికి బంగారు కళ్లు వితరణ

ఆలయ ఈవోకు బంగారు కళ్లు అందజేస్తున్న భక్తురాలు

కావలి, న్యూస్‌టుడే: కావలి గ్రామదేవత కళుగోళ శాంభవి అమ్మ వారికి ఓ భక్తురాలు రూ.5 లక్షల విలువైన బంగారు వస్తువులు కానుకగా సమర్పించారు. ఆదివారం బెంగళూరుకు చెందిన మాగాటి కృష్ణకుమారి 40 గ్రాముల బంగారు కళ్లు, బులాకి, తిలకం ఈవో అరవ రాధాకృష్ణకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని దేవాదాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రత్యేక పూజలు చేసి ఆమెకు తీర్థప్రసాదాలు అందజేశారు.

EENADU e Classifieds

TO LET

నెల్లూరు కస్తూరిబా కాలేజ్ పక్కన శాంతినగర్‌లో గ్రౌండ్ ఫ్లోర్ నందు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అన్ని వసతులతో అద్దెకు కలదు. సంప్ర||: Contact : 94914 59161

నెల్లూరు నడిబొడ్డున శివప్రియ లాడ్జి G.V.K. రెసిడెన్సీలకు దగ్గరగా యడ్లవారివీధి మధ్యలో II అంతస్తు,డబుల్ బెడ్‌రూమ్ సరసమైన అద్దెకు కలదు. 8309390824

JOBS

ప్రముఖ కంపెనీకి అడ్మినిస్ట్రేషన్ వర్క్ (ఎక్స్పీరియన్స్ Male) అభ్యర్థులు కావలెను. Exp:5 Years, Qly: డిగ్రీ / పీజీ. Contact ✆ 89857 17076

ప్రభుత్వ సంస్థల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేయుటకు కం. ఆపరేటర్లు, అటెండర్స్, సూపర్‌వైజర్లు కావలెను. జీతం. 16500. ✆ 98487 71117.

నెల్లూరులో ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు క్రింది డిపార్టుమెంట్‌లకు 40 సం||లోపు జెంట్స్ స్టాఫ్ కావలెను. అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్, డ్రైవర్లు, ఫోటోషాప్, మార్కెటింగ్‌ఎగ్జిక్యూటివ్స్. Contact ✆ 8555993478

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే వివరాలకు..

నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ముగ్గురు విద్యార్థులు అదృశ్యం కాగా.. పోలీసులు వారి ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వతరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు వైజాగ్ సమీపంలోని అరకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇంట్లో చెప్పకుండా వారి వద్ద ఉన్న పాకెట్‌మనీతో ఈనెల 7వ తేదీ సాయంత్రం బయల్దేరారు. రాత్రి 11గంటలైనా పిల్లలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. అప్రమత్తమై వారు విచారణ చేపట్టి అనకాపల్లిలో ఉన్నట్లు గుర్తించారు. ఆదివారం వారిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఆదివారం సబ్‌డివిజనల్ పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ అన్వర్‌బాషా తల్లిదండ్రులకు, పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీలింగ్ కూలి కార్పెంటర్ దుర్మరణం

కోవూరు, న్యూస్‌టుడే: ఇంట్లో పని చేస్తుండగా సీలింగ్ పడి కార్పెంటర్ అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి గాయాలైన ఘటన కోవూరులో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు కోవూరు పట్టణంలోని లక్ష్మీ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న గృహంలో శ్రీనివాస నగర్‌కు చెందిన పట్నం ధర్మలింగం అలియాస్ ప్రసాద్(48) కొయ్య పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఇటీవల వేసిన సీలింగ్ ఒక్కసారిగా కూలి ప్రసాద్‌పై పడింది. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బిట్రగుంట నాగులవరానికి చెందిన నాగూర్ బాషాకు గాయాలవడంతో వైద్యసేవలు పొందుతున్నారు. దీంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

భార్యపై అనుమానంతో ఆత్మహత్య

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త.. చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. నెల్లూరుగ్రామీణ పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు పొదలకూరు రోడ్డులోని శివాజీ నగర్‌లో వి.సురేంద్ర(29) భార్యతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆరు సంవత్సరాల క్రితం వీరికి వివాహమైంది. ఆటో డ్రైవరుగా పనిచేస్తుంటారు. కొంతకాలంగా మరో వ్యక్తితో ఫోనులో మాట్లాడుతోందని.. వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో భార్యతో తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో సురేంద్ర శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయారు. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. వెల్లంటి చెరువులో కొందరు చేపలు పడుతున్న సమయంలో మృతదేహం తేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివ రూపే.. అద్భుతః



మనుబోలు: కార్తిక మాసం మూడో సోమవారం పురస్కరించుకుని యాచవరానికి చెందిన రాము ఆచారి ఆదివారం సూక్ష్మ శివలింగం తీర్చిదిద్ది అబ్బురపరిచారు. బియ్యం గింజతో గోరుపై ఇమిడిపోయే శివలింగాన్ని రూపొందించడంతో పలువురు అభినందించారు.

బీటీఏ జిల్లా కార్యవర్గం ఎంపిక

నెల్లూరు(విద్య): బీటీఏ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక ఆదివారం నగరంలోని వేదాయపాలెం ఎంసీపీఎస్ స్కూల్లో జరిగింది. ఈ సందర్భంగా నూతన జిల్లా కార్యదర్శి మాస ప్రసాద్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీటీఏ అగ్రగామి సంఘంగా ఉంటుందని తెలిపారు. నూతన అధ్యక్షుడిగా మణి సుబ్బు, నిర్వహణ కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారి రాజశేఖర్, గౌరవాధ్యక్షుడిగా అనపల్లి శ్రీనివాసులు, మహిళా కార్యదర్శిగా భాగ్యమ్మ ఎంపికయ్యారు.

పేదింటి యువతులు.. క్రీడల్లో రాణులు

న్యూస్‌టుడే, కావలి

వారు పల్లెల్లో పుట్టారు. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారు. కన్నవారి ఆశలకు తీర్చేలా చదువుకుంటూ క్రీడల్లో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. పోటీల్లో సత్తా చాటుతున్నారు పట్టణంలోని కళాశాలల్లో చదువుతున్న యువతులు.

అపర్ణ.. జాతీయ స్థాయి ఘనత

జవహర్‌భారతి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బోటనీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వాయల **అపర్ణ** అథ్లెటిక్స్‌లో ప్రావీణ్యం సంపాదించారు. జాతీయ స్థాయికి ఎదిగారు. అండర్-19 అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు. దిల్లీలో 2023లో జరిగిన పోటీల్లో ట్రిపుల్‌జంప్, 1500 మీటర్ల పరుగులో ప్రతిభ చాటారు. అంతకుముందు 2022, 2021లో రాష్ట్రస్థాయిలో ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ, 1500 మీటర్ల పరుగులో తృతీయ స్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయిలో 2020లో జరిగిన కబడ్డీ పోటీల్లో కూడా సత్తా చాటారు. ఈమెది ప్రకాశం జిల్లా సూరారెడ్డిపాలెం వద్ద మడనూరు. పోలీసు అధికారి కావాలనే లక్ష్యంతో చదువుతున్నారు. తండ్రి యానాది మత్స్యకారుడు. తల్లి జయమ్మ కూలి పనులకు వెళుతుంటారు.

హేమలత.. అథ్లెటిక్స్

పట్టణంలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పీజీ కేంద్రంలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న **బొక్కా హేమలత** క్రీడల్లో మేటిగా నిలుస్తున్నారు. కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడల్లో సత్తా చాటుతున్నారు. కొద్ది రోజుల క్రితం జరిగిన కబడ్డీ పోటీల్లో ఈమె ప్రాతినిధ్యం వహించిన జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. గత ఏడాది కూడా విశ్వవిద్యాలయ స్థాయి పోటీల్లోనూ ఈమె సత్తా చాటారు. ఈమెది గుంటూరు జిల్లా పెద్దవడ్లపూడి గ్రామం. తండ్రి మృతి చెందగా.. తల్లి రేణుకాదేవి కుటుంబాన్ని పోషిస్తున్నారు. భవిష్యత్తులో ఫైనాన్స్ రంగంలో మేనేజర్ కావాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ దిశగా శ్రమిస్తున్నారు.

(c) eenadu

కావలి

•కావలి •ఉదయగిరి •కందుకూరు

రెవెన్యూ డివిజన్ సాధనకు ఉద్యమం

మాట్లాడుతున్న జిల్లా ఉద్యమ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్

ఉదయగిరి, న్యూస్‌టుడే : ఉదయగిరిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ ఉద్యమాన్ని ఉద్ధృతం చేద్దామని జిల్లా సాధన కమిటీ పిలుపునిచ్చింది. స్థానిక ఐటీఐ కళాశాలలో ఆదివారం జిల్లా ఉద్యమ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కె.వేణుగోపాల్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ ఉదయగిరిలో ర్యాలీ, బహిరంగ సభ ఏర్పాటుచేస్తామన్నారు. దీనికి పార్టీలకతీతంగా ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పడనున్నాయని, ప్రజలు ఉద్యమిస్తే మన డిమాండ్ తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు దస్తగిరిఅహ్మద్, ఖాదర్‌బాషా, వివిధ పార్టీల నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బాలకృష్ణారెడ్డి, జాషువా, సోమిరెడ్డి, షంషీర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జిలానీబాషా, షబ్బీర్, చెన్నకేశవరావు, శ్రీను, రంతుజానీ, రామిరెడ్డి, యస్దానీ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కావలి, న్యూస్‌టుడే: పుల్లారెడ్డినగర్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ ఏఈ ఎం.నాగార్జున తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచే పనులు చేస్తున్నందున ఉదయం ఆరు నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: మా గ్రామంలోని బాలకృష్ణానగర్‌లో బోరు వద్ద మురుగు చేరింది. రోగాలు ప్రబలే అవకాశం ఉంది. – వెంకట్, కొరుగుంట

సమాధానం: మురుగునీరు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – శిరోమణి, పంచాయతీ కార్యదర్శి –న్యూస్‌టుడే, దగదర్తి

? కావలి- తుమ్మలపెంట రహదారి చేరుకునే చోట పాపిరెడ్డి చెరువు కూడలిలో వేగనిరోధకాలు ఏర్పాటుచేయాలి. – బాలచందర్, సర్వాయపాలెం, కావలి మండలం

✓ ఈ విషయమై పరిశీలన చేయిస్తాం. –భరత్‌కుమార్‌రెడ్డి, ఏఈ,ర.భ – కావలి

? ఉలవపాడు వినాయక ఆలయం వెనుక వీధి దీపాలు వెలగడం లేదు. – శ్రీనివాసరావు

✓ పరిశీలించి వెలిగిస్తాం.- వీరయ్య, పంచాయతీ కార్యదర్శి– న్యూస్‌టుడే, ఉలవపాడు

? రాళ్లపాడు రామాలయం ఎదురు వీధిలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. – ఎం.లక్ష్మి

✓ సర్పంచితో చర్చించి చర్యలు తీసుకుంటాం. – గోపాల కృష్ణ, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, గుడ్లూరు

ఎక్కడున్నాయో.. ఏమయ్యాయో?

ఆచూకీ లేని విద్యార్థులకిచ్చిన ట్యాబ్‌లు

న్యూస్‌టుడే, దుత్తలూరు

గత వైకాపా ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం, సాంకేతిక విద్య పేరుతో అమలు చేసిన విద్యావిధానాలు ఆర్థికంగా నష్టాలు తీసుకొచ్చాయి. డిజిటల్ విద్య పేరుతో బైజూస్ లాంటి కొన్ని కంపెనీలకు మేలు చేసేలా ఒప్పందం చేసుకుని అప్పట్లో ట్యాబ్‌లను పంపిణీ చేశారు. వాటిపై అవగాహన లేకుండా, సక్రమంగా శిక్షణ ఇవ్వకుండా విద్యార్థులకు అందించారు. వీటిని పాఠశాలల్లో డిజిటల్ తెరలకు అనుసంధానం చేసే చర్యలు కూడా తీసుకోలేదు. ఎంతో ప్రచారం చేసి రూ. కోట్ల వ్యయంతో అందించిన ఇవి ప్రస్తుతం ఎక్కడున్నాయో.. ఏమయ్యాయో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తరగతి గదిలో విద్యార్థులు

నెరవేరని లక్ష్యం

వైకాపా ప్రభుత్వం 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు, వారికి బోధించే ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేసింది. నిబంధనల ప్రకారం అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యాంశాలు ట్యాబ్‌లలో అప్‌లోడ్ చేయాల్సి ఉన్నా కొన్నింటిని మాత్రమే చేసి చేతులు దులుపుకొన్నారు. నిక్షిప్తం చేసిన వాటిల్లో కూడా చాలా అంశాలు వాటిలో రాలేదు. తెలుగు, హిందీ వంటి సబ్జెక్టులు పూర్తిగా వీటిలో లేవు. కొన్నాళ్లకు అవి పనిచేయకపోవడంతో అటకెక్కించారు. విద్యార్థులు ఇళ్ల దగ్గర వీటిని సొంత అవసరాలకు వాడుకున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 51 ఉన్నత పాఠశాలలతోపాటు నాలుగు కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, నాలుగు ఏపీ ఆదర్శ పాఠశాలలుండగా రెండు విడతల్లో 4,701 మంది విద్యార్థులు, 757 మంది ఉపాధ్యాయులకు అందించారు. ప్రస్తుతం కొంతమంది విద్యార్థుల వద్ద ఉండగా కొన్ని ఉపాధ్యాయుల వద్ద ఉన్నట్లు సమాచారం.

వినియోగంలోకి తీసుకొచ్చే ప్రయత్నం

– బాలాజీరావు, డీఈవో

గతంలో ఇచ్చిన ట్యాబ్‌లను డిజిటల్ బోధనకు ఉపయోగపడేలా వాటిని సద్వినియోగం చేయాలని ప్రయత్నం చేస్తున్నాం. కొన్ని ఉపాధ్యాయుల వద్ద, మరికొన్ని విద్యార్థుల ఉన్న వాటిని తీసుకుని ఇప్పటి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చేయాలని ఆలోచనలో ఉన్నాం.

సందడిగా వన సమారాధనలు

కావలి: మండలంలోని ఆముదాలదిన్నెలో జరిగిన గౌడ సంఘం కార్తిక వన సమారాధన కార్యక్రమానికి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. గౌడవర్గీయులు మాట ఇస్తే తప్పరని ఎమ్మెల్యే వారిని కొనియాడారు. వారి సంక్షేమ భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం అందజేస్తానని ప్రకటించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించారు.

నీటి వృథా.. కనరే!

మండలంలోని కొత్తపాలెంలో రక్షిత నీటి సరఫరా పథకం పైపు లైనుకు స్థానిక బీసీ కాలనీ సమీపంలో లీకు పడింది. కొంత కాలంగా నీరు వృథాగా పోతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా కలుషితమై సరఫరా అవుతుందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈవిషయమై ఎంపీడీవో ఎం.బ్రహ్మయ్య మాట్లాడుతూ పైపు లైనుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. నీరు పోకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. – న్యూస్‌టుడే, జలదంకి

కందుకూరు ప్రకాశంలో కలవడం ఖాయం: ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కందుకూరు అతి త్వరలోనే ప్రకాశం జిల్లాలో కలవబోతోందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం నియోజకవర్గ ప్రజలను నిలువునా మోసం చేసి, ప్రజాభిప్రాయాలను ఏమాత్రం పట్టించుకోకుండా నెల్లూరులో కలిపిందని విమర్శించారు. జిల్లాల పునర్విభజన సబ్‌కమిటీ ప్రకాశంలో కలిపేలా నిర్ణయించిందని తెలిపారు. ఈ సందర్భంగా 48 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.37.21 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు దామామల్లేశ్వరరావు, జె.నాగరాజు, లక్ష్మీనరసింహం, పి.గురునాథం పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

బీమా పరిహారం చెక్కు అందిస్తున్న తెదేపా నాయకులు

దుత్తలూరు, న్యూస్‌టుడే : ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి బీమా పరిహారాన్ని తెదేపా నాయకులు ఆదివారం అందజేశారు. నర్రవాడకు చెందిన సవరం వెంగయ్య రెండు నెలల క్రితం దుత్తలూరు తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా వాహనం ఢీకొని మృతి చెందాడు. ఆయనకు తెదేపా సభ్యత్వం ఉండడంతో రూ. 5 లక్షల బీమా పరిహారం మంజూరైంది. దీన్ని మృతుడి భార్య లక్ష్మమ్మకు తెదేపా నాయకులు మాదాల తిమ్మయ్య, దారపనేని చెన్నకేశవులు, బ్రహ్మానందం, నాగభూషణం అందజేశారు.

కార్తిక సమారాధన బాధ్యత నాదే: ఎమ్మెల్యే

కావలి, న్యూస్‌టుడే: ఇకపై ప్రతి సంవత్సరం కార్తిక మాసంలో జరిగే రెడ్డి సంక్షేమ సంఘం వన సమారాధన నిర్వహణ బాధ్యత చూసుకుంటానని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం పట్టణంలోని ఏటూరి రామిరెడ్డి తోటలో వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం కావలి ప్రాంత అధ్యక్షులు వింత కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలికలు చేసిన నాట్యం, మహిళల కోలాటం అలరించాయి. అంతకుముందు జనతాపేటలో యోగా శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

నీరు పుష్కలం.. వరి సాగుకు సన్నద్ధం

గుడ్లూరు, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో డివిజన్‌లోని జలవనరుల్లో పుష్కలంగా నీరు చేరింది. దీంతో ఈ సంవత్సరం వరిసాగు చేపట్టేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు.

కుడికాలువ కింద సుమారు 25,000 ఎకరాలు: రాళ్లపాడు జలాశయం కింద సుమారు ఇరవై అయిదు వేల ఎకరాల ఆయకట్టు గుడ్లూరు, లింగసముద్రం మండలాల్లో ఉండగా రెండు సంవత్సరాలుగా పూర్తిస్థాయిలో వరిసాగు చేపట్టలేదు. గత ఏడాది కేవలం అయిదు వేల ఎకరాల్లో మాత్రమే వేశారు. ఈసారి సగానికిపైగా ఆయకట్టులో వరి వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. గుడ్లూరు మండలంలోని బసిరెడ్డిపాలెం, గుండ్లపాలెం, రాళ్లపాడు గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు.



గుండ్లపాలెంలో వేసిన నాట్లు

చెరువుల కిందే అధికం: నియోజకవర్గంలోని ప్రధాన చెరువులైన మాచవరం,మోపాడు, చేవూరు, అమ్మవారిపాలెం, గుడ్లూరు, పోకూరు, శాఖవరం,రాజుపాలెం, కరేడు చెరువులతో పాటు సుమారు 70 చెరువుల ఆయకట్టుపరిధిలో 30 వేల ఎకరాల్లో వరిసాగు చేపడుతున్నారు. గత సంవత్సరం కూడా ఇంతే మొత్తంలో సాగు చేశారు. డివిజన్‌లో రెండేళ్లుగా సక్రమంగా నీరందకపోవడంతో రాళ్లపాడు, చెరువుల కింద ఉన్న సుమారు ఇరవై శాతం మాగాణిలో రైతులు ప్రత్యామ్నాయంగా జామాయిల్, సుబాబులు, సరుగుడు తోటలను పెంచుతున్నారు. ప్రస్తుతం రెండు పంట కాలలకు రాళ్లపాడు జలాశయం నుంచి నీరందిస్తామని ప్రజాప్రతినిధులు చెపుతుండడంతో తిరిగి వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు.

వంతెనకు కోత.. ప్రయాణికుల అవస్థ

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని బుక్కాపురం నుంచి కొత్తపల్లి వెళ్లే రహదారిపై వంతెన కోతకు గురైంది. పదేళ్ల క్రితం ఎంపీ నిధులు రూ. 4 లక్షలతో నిర్మించారు. ఇది కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయమై ఎంపీడీవో కె. శ్రీనివాసులురెడ్డిని వివరణ కోరగా వంతెన దెబ్బతిన్న విషయం మా దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, వింజమూరు

నర్రవాడలో లోపించిన పారిశుద్ధ్యం

మండలంలోని నర్రవాడ పంచాయతీలో పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో ముళ్ల పెరగడంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. దీంతో దోమల ఉద్ధృతమవుతున్నాయి. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, దుత్తలూరు

'కంది'పోయి.. కుమిలిపోయి

వర్షాలకు మండలంలో కంది పైరు దెబ్బతింది. రోజుల తరబడి దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి నష్టపోయారు. వింజమూరుకు చెందిన మద్దూరు గోపాల్‌రెడ్డి, గణపం శ్రీనివాసులురెడ్డి, బి. కోటేశ్వరరావు, వైద్యుల సుబ్బారెడ్డి, పెంచలరెడ్డి తదితరుల భూముల్లో దెబ్బతింది. ఎకరానికి రూ.10 వేలకు పైగా ఖర్చు చేశామని, అంతా ఎండిపోయిందని వాపోయారు. మండలంలో 500 ఎకరాలకు పైగా దెబ్బతిన్నట్లు సమాచారం. – న్యూస్‌టుడే, వింజమూరు

వేలాడుతున్న తీగలు.. సరిచేయరూ!

మండలంలోని పూరేటిపల్లి సమీపంలోని రహదారి పక్కన పొలాల్లో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. కొందరు రైతులు విద్యుత్తు సిబ్బందికి తెలపడంతో కనెక్షన్లు తొలగించారు. అయితే వాటిని సరిచేసి సరఫరా పునరుద్ధరించకపోతే పలువురి పొలాల్లో ఉన్న బోర్లు పని చేయవని రైతులు చెబుతున్నారు. అధికారులు పరిశీలించి తీగల ఎత్తు పెంచాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గుడ్లూరు

ఇది ఇంకా.. ప్రమాదమే

బసిరెడ్డిపాలెం సమీపంలో రహదారి మధ్యలో పెద్ద గుంత పడింది. స్థానికులు గ్రావెల్‌తో సరిచేసినా.. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంకా పెద్దదయింది. కాగా కొందరు ప్రమాదం జరగకుండా చిల్లకట్టెను అడ్డుగా ఉంచారు. అయితే రాత్రిళ్లు కట్టెను తగిలి ప్రమాదాలు జరిగే అవకాశముంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గుడ్లూరు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కల్యాణం తిలకిస్తున్న భక్తులు

కలిగిరి, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా మండలంలోని శిద్ధనకొండూరు కొండపై ఉన్న శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక పూజలు, ఆ తర్వాత వేదపండితులు కల్యాణం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. సాయంత్రం గ్రామోత్సవం కనువిందుగా జరిగింది.

శివాలయంలో ప్రత్యేక పూజలు : **వరికుంటపాడు:** స్థానిక శివాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం తెల్లవారు జాము నుంచి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించి గోత్ర నామాలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో శివయ్య

అక్రమాలకు ప్రమాణంతో సరి

నిబంధనలకు 'నీళ్లు'.. ప్రజలకు రోగాలు

న్యూస్‌టుడే, కావలి

స్థానిక సంస్థల తరపున సరఫరా అయ్యే నీటిని ప్రజలు తాగేందుకు ఇష్టపడడం లేదు. క్యాన్ల నీరు కొనుగోలు చేసి వాడుకుంటున్నారు. దీంతో ఊరూరా పుట్టగొడుగుల్లా నీటి ప్లాంట్లు వెలిశాయి. ఆటోల్లో వాడవాడలా విక్రయిస్తున్నారు. ఆ ప్లాంట్ల నిర్వహణ, విక్రయిస్తున్న నీటిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈక్రమంలో ప్లాంట్ల నిర్వాహకులు నీటి నాణ్యతపై స్వీయ ప్రమాణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలని గత సెప్టెంబరులో రాష్ట్ర మున్సిపల్, అడ్మినిస్ట్రేషన్ నుంచి ఉత్తర్వులిచ్చింది.

ఉపయోగమేనా!

స్వీయ ప్రమాణంతో ప్రయోజనం ఏముంటుందని మున్సిపల్ అధికార వర్గాలే పెదవి విరుస్తున్నాయి. ర్యాండమ్‌గా తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తే కొంత ఫలితం ఉంటుంది. పట్టణ పరిధిలో 80కి పైగా నీటి విక్రయ ప్లాంట్లు ఉన్నాయి. వాటిలో 26కి పురపాలక అధికారులు నోటీసులు ఇవ్వడంతో ప్రమాణ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

నీటిని విక్రయిస్తున్న వాహనం

పీహెచ్, టీడీఎస్, హార్డ్‌నెస్, అల్కలినిటీ, కాల్షియం, మెగ్నీషియం, క్లోరైడ్, ఫ్లోరైడ్, సల్ఫేట్, నైట్రేట్, ఐరన్, ఈకోలి తదితర వాటిని ఆర్‌డబ్ల్యూఎస్ ప్రయోగశాలలో పరీక్షించినట్లు ధ్రువీకరణ పత్రాలు సమర్పించారు. పురపాలక సంఘంలో నీటి నాణ్యత ప్రయోగశాల లేదు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ప్రయోగశాలలో ఇవ్వగా, అంతా సవ్యంగా ఉన్నట్లే నివేదికలు అందజేశారు. ప్రయోగశాలకు సమర్పించిన నీటి నమూనాలు వారి ప్లాంట్లలోని నీరు కాకుండా ప్రముఖ కంపెనీల సీసాల జలం ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి.

నాణ్యతపై సందేహాలు: చాలాచోట్ల ప్లాంట్లు, పైపులు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. డబ్బాలు పాచి పట్టడం వంటి లోపాలు కనిపిస్తున్నాయి. ఫిల్టర్లను ఎప్పటికప్పుడు మార్చడంతోపాటు ప్లాంట్లను నిత్యం శుభ్రం చేయాలి. ఇందుకు ప్రత్యేకంగా మిషనరీ కూడా ఉంది. మెమరిన్ పరికరంతో శుద్ధి చేసిన జలం సరఫరా అవుతుంది. ఇందుకు రూ.30 వేల వరకు ఖర్చవుతుండగా. . దీనికి చాలామంది ప్లాంట్ల నిర్వాహకులు విముఖత చూపుతున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. స్వీయధ్రువీకరణతో ఇలాంటి లోపాలు వెలుగులోకి రావడం లేదు. దీనికి బదులు పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం లేక వార్డు సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులకు బాధ్యతలను అప్పగించి తనిఖీలు చేయిస్తే మేలని పలువురు సూచిస్తున్నారు.

రూ.1500 వరకు ఖర్చు

జి.శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి పురపాలక సంఘం

ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి నడుచుకుంటున్నాం. మేము పరీక్ష చేయించాలంటే రూ.1500 వరకు ఒక్కో నమూనాకు ఖర్చవుతుంది. ప్రతి నెలా రెండు సార్లు చేయాలనే ఉత్తర్వులున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చిస్తాం. ర్యాండమ్ తనిఖీలకు ప్రయత్నిస్తాం.

బిందెలతో నీరు పోస్తూ పొగనాట్లువేస్తున్న కూలీలు

చాలీచాలని వర్షం... కష్టాల సేద్యం

న్యూస్‌టుడే, దుత్తలూరు

పొగాకు నాట్ల పనులు మొదలయ్యాయి. కానీ పొలాల్లో పదును లేకపోవడంతో పొగ మొక్కలు నాటేందుకు రైతన్నలు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల జిల్లాలో తుపానుతో భారీ వర్షాలు కురిశాయి. కానీ మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో భూములు పదునెక్కే వానలు పడలేదు. దీంతో పొగాకు రైతులు నాట్లకు ఇబ్బందులు పడుతున్నారు. సీజను ముగుస్తుండడంతో దూర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి బిందెలతో నీరు పోయిస్తూ పొగనాట్లు వేస్తున్నారు. అయిదు రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో భూమిలో తేమ ఆవిరవుతోంది. దీంతో మొక్కలు నాటినా పెరుగుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజులుగా కష్టాల సేద్యం చేస్తున్నారు.

జూద స్థావరాలపై పోలీసుల దాడులు

వరికుంటపాడు, న్యూస్‌టుడే: జూద స్థావరాలపై పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎస్సై ఎం.రఘునాథ్ వివరాల మేరకు ఉదయగిరి సీఐ ఎన్.వెంకట్రావు ఆధ్వర్యంలో మండలంలోని ఇస్కపల్లె అన్నపూర్ణేశ్వరి కాలనీలో జూదస్థావరంపై దాడి చేశారు. అయిదుగురు జూదరులతోపాటు అయిదు చరవాణులు, రూ. 4710 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే విరువూరు కోటవర్ధిపల్లి అటవీ శాఖ ప్రాంతంలో కోడి పందేల స్థావరంపై దాడి చేసి మరో అయిదుగురిని అరెస్టు చేశారు. మూడు కోళ్లు, అయిదు చరవాణులు, మూడు ద్విచక్ర వాహనాలతోపాటు రూ. 5 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దాడుల్లో దుత్తలూరు, వరికుంటపాడు ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, ఆదిలక్ష్మి కూడా పాల్గొన్నారు.

ఉదయగిరి: దుత్తలూరు బీసీ కాలనీలో జూదమాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ. 6 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి: భాజపా

కందుకూరు పట్టణం: భాజపా శ్రేణులు త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని ఆపార్టీ సీనియర్ నాయకుడు పి.వెంకటకృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఎం.వరప్రసాదరావు, జి.హరిబాబు, రాఘవయ్య, సురేష్, వైకుంఠం పాల్గొన్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం తప్పదు

గుడ్లూరు: పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం కాక తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎం.మోహన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో గుడ్లూరు, లింగసముద్రం మండలాల కార్యకర్తలకు రాజకీయ అవగాహన తరగతులు నిర్వహించారు. నాయకులు జి.వెంకటేశ్వర్లు, జాలయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్లు ఛిద్రం

ఇది కావలి పట్టణం నుంచి మద్దూరుపాడు వైపు జాతీయ రహదారిపై వెళుతున్న పెద్ద పొక్లెయిన్. తరచూ ఇవి రహదారులపై ఇలా వెళుతున్నాయి. వీటి చెయిన్ల కారణంగా రోడ్డు దెబ్బతింటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై జాతీయ రహదారుల సంస్థ ఉపఇంజినీర్ బొర్రా నాగిరెడ్డి స్పందిస్తూ అదుపు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కావలి

దాడి చేశారంటూ ఫిర్యాదు

ఉలవపాడు: అన్న కుమారులు తన మీద దాడి చేసి గాయపరిచారంటూ ఓ వ్యక్తి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అంకమ్మ అందించిన వివరాల ప్రకారం చాకిచర్లకు చెందిన కె.జాలరావు దగ్గర తల్లి చిన్నమ్మ ఉంటోంది. ఆమె దగ్గర ఆస్తిని జాలరావుకు ఇస్తుందంటూ అన్న సోదరుల కుమారులు సాగర్, శివలు వాగ్వాదానికి దిగారు. మధ్యవర్తుల సమక్షంలో మాట్లాడుతుండగా వారు దాడి చేసి గాయపరిచారు. ఆ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

కావలి, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధనరెడ్డి జన్మదినం పురస్కరించుకుని గౌరవరం గ్రామ నాయకులు గోసల గోపాలరెడ్డి నేతృత్వంలో కావలి ప్రాంతీయాసుపత్రిలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు.

జాతీయ రహదారి.. ప్రమాదాల దరి

న్యూస్‌టుడే, వరికుంటపాడు

జిల్లాలో 565 జాతీయ రహదారి ప్రమాదకరంగా ఉంది. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అధ్వానంగా తయారైంది. నిర్మాణంలోనే లోపాలు జరిగాయి. దీంతో దెబ్బతింది. పలు ప్రాంతాల్లో గోతులు దర్శనమిస్తున్నాయి. అడుగడుగునా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వరికుంటపాడు మండలం నుంచి మర్రిపాడు మండలం వరకు సుమారు 36 కి.మీ మేర ఈ మార్గం విస్తరించింది. అడుగడుగునా పగుళ్లతో ప్రమాదకరంగా మారింది. ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా పేరాపిట్ గోడలకు సంబంధించిన రేకులు ధ్వంసమయ్యాయి. కూడళ్ల వద్ద సెంట్రల్ లైటింగు దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. మండలంలోని భోగ్యంవారిపల్లె వద్ద ఉప్పు వాగు వంతెనపై కంకర లేచిపోయి గోతులు పడ్డాయి. ఇనుప చువ్వలు బయటపడి ప్రమాదకరంగా ఉన్నాయి. రాత్రి

ఉప్పు వాగు వంతెనపై పడిన గుంతలు

నిర్వహణ లేక గోతులమయం

సమయంలో ద్విచక్రవాహనదారులు ఇవి కనిపించక పడిపోతున్నారు. టోల్ ఫీజు వసూలు చేస్తున్నా మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో రోడ్డు పక్కనే వాహనాలు నిలిపివేయడం, పశువులు అడ్డుగా వస్తుండడం, గోతులు తదితర కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు దెబ్బతిన్న ప్రాంతంలో పైపొరను తొలగించి కొత్త లేయర్ వేస్తున్నామని మెయింటినెన్స్ అధికారి తెలిపారు. కూడళ్లలో సెంట్రల్ లైటింగు దీపాలు వెలిగేలా చూస్తున్నామని, రోడ్డుకు ఇరువైపులా సిగ్నళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

గుర్రపుడెక్క.. నీరుపారేదెట్లా?

అల్లూరు డెల్టాలో గుర్రపుడెక్క ఆకుతో రైతులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. అల్లూరు చెరువులో విపరీతంగా పెరిగింది. పొలాలకు నీరు వదిలినప్పుడు ఇది కాలువల్లోకి రావడంతో ప్రవాహం సాగడం లేదు. ఇది రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై జల వనరుల శాఖ ఏఈ సుధీర్ స్పందిస్తూ త్వరలో తొలగిస్తామని వివరించారు. – న్యూస్‌టుడే, అల్లూరు

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

సోమశిలకు 11,515 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి ఎగువ ప్రాంతాల నుంచి 11,515 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 71.844 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. 327.251 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. ఆరోవ క్రస్ట్‌గేట్ ద్వారా 10,000, -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, పవర్ టన్నల్ ద్వారా 2,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 560, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 50 క్యూసెక్కులు తరలిస్తున్నారు. రోజుకు సగటున 280 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు వివరించారు.

కాకాణి పరామర్శ

వెంకటాచలం, న్యూస్‌టుడే: వెంకటాచలం మండల పరిషత్తు ఉపాధ్యక్షులు కనుపూరు కోదండ రామిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం సర్వేపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

జేవీవీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

పుస్తకాలు చూపుతున్న విద్యార్థులు

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణ పరిధిలోని జడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత ఎన్ఎంఎంఎస్ కోచింగ్ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జేవీవీ సభ్యులు విద్యార్థులకు పుస్తకాలు ఉచితంగా అందజేశారు. రిసోర్స్ పర్సన్ నరేంద్ర, మురళీధర్, రాము, జేవీవీ జిల్లా అధ్యక్షుడు చలపతిరావు, కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

పొదలకూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టేవారిని ప్రోత్సహిస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. పరిశ్రమల వల్ల యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పట్టణాలకు దగ్గర ఉండే గ్రామాల్లో ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఆదివారం మరుపూరు సమీపంలో పెట్రోలు బంకును ప్రారంభించారు. సోమిరెడ్డి మాట్లాడుతూ ముత్తుకూరు కృష్ణపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమలు ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వచ్చేలా ముందుకు వచ్చేవారిని ప్రోత్సహిస్తామన్నారు. నాయకులు హరేంద్రరెడ్డి, పెంచల నారాయణ పాల్గొన్నారు.

ప్రయాణికుడికి పర్సు అందజేత

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న నగదు పర్సును అధికారులు తిరిగి ప్రయాణికుడికి అందజేశారు.. ఆత్మకూరు డిపోనకు చెందిన బస్సులో ఆదివారం ఓ వ్యక్తి పర్సును మర్చిపోయి దిగిపోయారు. గమనించిన కండక్టర్ జయరామిరెడ్డి దానిని బస్టాండ్‌లోని కంట్రోల్ పాయింట్‌లో అప్పగించారు. అందులో రూ.3664 నగదు ఉన్నట్లు తెలిపారు. వివరాల ఆధారంగా ప్రయాణికుడికి సమాచారం ఇచ్చారు. ఏడీఎం వద్ద ఆధారాలు చూపి ఆయన తీసుకెళ్లారు. కండక్టర్‌ను పలువురు అభినందించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

కోవూరు, న్యూస్‌టుడే: పడుగుపాడు వద్ద రోడ్డు విస్తరణలో భాగంగా పనులు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు కోవూరు రూరల్ డిస్కం ఏఈ గిరిధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపడుగుపాడు, చంద్రమౌళి నగర్, ధాత్రి హోమ్స్, శ్రీనివాస నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులు

పల్లిపాలెం పొర్లుకట్ట పనులు పరిశీలిస్తున్న తెదేపా నాయకులు

విడవలూరు, న్యూస్‌టుడే: ఊటుకూరు-పల్లిపాలెం వద్ద జరుగుతున్న పెన్నా పొర్లుకట్ట పనులను తెదేపా నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి ఆదివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. వరదలు వచ్చిన ప్రతి సారీ ఊటుకూరు, పల్లిపాలెం పలుగ్రామాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామస్థులు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారన్నారు. పల్లిపాలెం వద్ద చింతపంటి ఏరుపై కోటి రూపాయలతో వంతెన నిర్మాణం పూర్తయిందని, అలాగే కంచరపాలెంలో రోడ్డు గుంతలు పూడ్చారన్నారు. ఊటుకూరు అరుంధతీవాడ నుంచి పెద్దపాలెం వరకు సిమెంట్ రోడ్డు నిర్మించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం..!

న్యూస్‌టుడే, విడవలూరు, కోవూరు

పేద, మధ్య తరగతి కుటుంబాల సొంతింటి కల సాకారానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) గ్రామీణ్ కింద అర్హులైన కుటుంబాలకు చేయూత అందించేందుకు సిద్ధమవుతోంది... గ్రామీణ ప్రాంతాల్లో సొంతిల్లు లేని కుటుంబాలు అధికంగా ఉన్నారని సర్వే ద్వారా గుర్తించి అర్హులైన పేదలకు సాయమందించాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. సానుకూలత రావడంతో రెండు నెలల క్రితం ఆగిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ తాజాగా మళ్లీ ప్రారంభించారు. ఈనెల 5న గడువు ముగియగా.. తాజాగా 30వ తేదీ వరకు పొడిగించారు. కేంద్రం నూతన లబ్ధిదారుల ఎంపికను ఆవాస్+ యాప్ ద్వారా చేపడుతోంది. ● గృహనిర్మాణ సంస్థ డీఈ వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ.. సొంత స్థలముండి లేదా లేఅవుట్లలో స్థలం ఉన్నా నిర్మాణానికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తుతో పాటు ఇతర ధ్రువపత్రాలతో మండలంలోని గృహనిర్మాణ సంస్థ కార్యాలయం లేదా సమీపంలోని సచివాలయాల్లో ఇంజినీరింగ్ సహాయకుడికి అందజేస్తే సాయం మంజూరవుతుందన్నారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సిబ్బంది వచ్చి యాప్‌లో వివరాలు నమోదు చేస్తారని పేర్కొన్నారు.

లబ్ధిదారులను సర్వే చేస్తున్న గృహనిర్మాణ శాఖ సిబ్బంది

గత పాలనలో లబ్ధిదారుల అవస్థలు..

గత ప్రభుత్వంలో పక్కా గృహాల నిర్మాణం సక్రమంగా జరగలేదు. శివారు ప్రాంతాల్లో వేసిన లేఅవుట్లలో నిర్మాణాలకే పరిమితమైంది. సొంత స్థలాలున్న వారు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదు. కోవూరు నియోజకవర్గంలో 81 పంచాయతీల పరిధిలో కొన్ని గ్రామాల్లో మాత్రమే నిర్మాణాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించింది. పీఎంఏవై 2.0 డిమాండ్ సర్వే ద్వారా గృహ నిర్మాణ సంస్థ ఇప్పటికే లబ్ధిదారులను గుర్తించింది. జిల్లాలో సుమారు 35 వేల మంది గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారని అధికారులు చెబుతున్నారు.

కోవూరు నియోజకవర్గ పరిధిలో వివరాలు

మండలం	అర్హులు
బుచ్చి (రూరల్)	1552
ఇందుకూరుపేట	1985
కోవూరు	1840
కొడవలూరు	1428
విడవలూరు	1565

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : తోటపల్లిగూడూరు మండలం సాలిపేటకు వెళ్లే రోడ్డు మార్గంలో కొత్తనక్కావారిపాళెం వద్ద రోడ్డు మలుపు ప్రమాదకరంగా మారింది. . - సుధాకర్, స్థానికుడు

సమాధానం: సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. - రమేశ్, పంచాయతీరాజ్ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాళెం కలుజు పారుదల కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. -శ్రీనివాసులు, స్థానికుడు

✓ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - అలీ, నీటిపారుదల శాఖ ఏఈ

? పొదలకూరు మండలం సూరాయపాళెం శ్మశాన వాటిక ఆక్రమణలకు గురైంది. ముళ్ల తీగ చుట్టూ ఏర్పాటు చేసి ఇబ్బందులు పెడుతున్నారు. - రవీంద్ర, స్థానికుడు

✓ ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటాం. - శివకృష్ణయ్య, తహసీల్దారు

? పొదలకూరు రూరల్ పరిధిలోని రామాపురం నుంచి దుగ్గుంట వెళ్లే దారిలో ముళ్ల చెట్లు పెరిగాయి. - సతీశ్, స్థానికుడు

✓ పరిశీలించి శుభ్రం చేయిస్తాం. - నరసింహారావు, ఎంపీడీవో

? అనంతసాగరంలోని ప్రధాన రోడ్డులో కుళాయి నుంచి నీరు వృథాగా పోతోంది.- అస్లామ్

✓ పరిశీలించి కుళాయికి డమ్మీ ఏర్పాటు చేస్తాం.- ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి

? సంగం మండల పరిధిలో వీర్లగుడిపాడులో పెన్నానది వరద ప్రవాహానికి రోడ్డు దెబ్బతింది. - శ్రీనివాసులు, గ్రామస్థుడు

✓వెంటనే పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.- మల్లికార్జున, ఏఈ, పంచాయతీరాజ్

? బుచ్చి నగర పంచాయతీలోని 23వ వార్డు వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు.- రాజేశ్

✓ పరిశీలించి వీధిదీపం వేయిస్తాం. - బాలకృష్ణ, పురపాలక కమిషనర్

? కొడవలూరు మండలం కమ్మపాళెం గిరిజనకాలనీలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.- పోలయ్య, స్థానికుడు

✓ పరిశీలించి దోమల నివారణా చర్యలు తీసుకుంటాం. - వెంకటసుబ్బారావు, ఎంపీడీవో

? పొదలకూరు మండలంలోని చాట్లగొట్ల-చెర్లోపల్లి రోడ్డుకు సూచిక బోర్డులు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. - శ్రీనివాసులు

✓ ఏర్పాటు చేస్తాం.- సుధాకర్, పీఆర్ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం పొట్లపూడి గ్రామం సమీపంలో కాలువకు ఇరువైపులా గోడ లేదు. - శ్రీనివాసులు, స్థానికుడు

✓ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. - రమేశ్, పంచాయతీరాజ్ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు ఎస్సీ కాలనీలో తాగునీటి కొళాయిలు సరిగా లేవు. - రమణయ్య, స్థానికుడు

✓ పరిష్కరిస్తాం.- విరిత, ఈవో

? పొదలకూరు రూరల్ పరిధిలోని రామమందిరం వీధిలో పలు చోట్ల చెత్త పేరుకుపోయింది. - చెంచయ్య, స్థానికుడు

✓ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. - నరసింహారావు, ఎంపీడీవో

భక్తిశ్రద్ధలతో శివునికి పూజలు

కలువాయి : పూజలో పాల్గొన్న మహిళలు

కలువాయి, సైదాపురం, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, కోవూరు, విడవలూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా కలువాయిలోని రాజరాజేశ్వరి సమేత నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో శివభక్త మండలి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కోవూరు, ముత్తుకూరు, విడవలూరు, తోటపల్లిగూడూరు, మండలాల పరిధిలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు ● సైదాపురం సమీపంలోని సిద్ధలకొండపై సోమవారం కార్తికమాసం పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ● సైదాపురం గంగమ్మతల్లి ఆలయంలో సామూహిక పొంగళ్లు నిర్వహించారు. మేళతాళాలతో మహిళలు పెద్దఎత్తున ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు పెట్టి పూజలు చేశారు. దాతల సహకారంతో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

కనుల పండువగా గంగమ్మతల్లి జాతర

చేజర్ల, ఆత్మకూరు : చేజర్లలో గంగమ్మ తల్లి జాతర చివరి రోజైన ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామస్థులు సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. మహిళలు పాల పొంగళ్లతో నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారిని ఎండు ఫలాలు, నాణేలతో ప్రత్యేకంగా అలంకరించారు. యువకుల వీరతాళ్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ● ఆత్మకూరు తిరునాళ్ల తిప్ప లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద నాగార్పమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించుకున్నారు.



తెలుగు పండితుడికి పురస్కారం

వెంకటరెడ్డికి బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

సంగం, న్యూస్‌టుడే: గాంధీజనసంఘం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు పండితులు వెంకటరెడ్డికి ఆదివారం నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల్లో ఒకే సారి రెండు ప్రథమ బహుమతులు దక్కించుకున్నారు. ఉపాధ్యాయులకు జరుగుతున్న పోటీల్లో భాగంగా ఏకపాత్రాభినయ విభాగంలో వృద్ధ విలాపం ముచ్చటగా మూడు నిమిషాల వక్తృత్వ పోటీల్లో సైనికుల గురించి ప్రసంగించడంతో ఆయన విజేతగా నిలిచారు. 600 మంది పోటీదారుల్లో వెంకటరెడ్డి అగ్రస్థానంలో నిలవడంతో ఆయనకు పురస్కారం లభించింది.

శిథిలావస్థలో కాలువలు

కోవూరులోని పంచాయతీ కార్యాలయం సమీపంలో మురుగు కాలువ శిథిలావస్థకు చేరి కొన్ని చోట్ల ధ్వంసమైంది. వర్షం పడితే రోడ్డుపై నీరు చేరుతోంది. కొన్ని రోజులు పేరుకుపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉందని పలువురు వాపోతున్నారు. మురుగు కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోవూరు

గుంతలమయం

వెంకటాచలం-కసుమూరు ప్రధాన రహదారిపై అక్కడక్కడ గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చింతలపాళెం, అనకాడి వడ్డిపాళెం, పాలిచెర్లపాడు మలుపు రోడ్డు తదితర ప్రాంతాల్లో గుంతలు రోడ్డు మధ్యలో ఉండడంతో ద్విచక్ర వాహనాలు రాత్రి వేళల్లో అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. ఈ మార్గంలో నిత్యం కసుమూరుకు వందలాది వాహనాలు వెళుతుంటాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వెంకటాచలం

బజారు కూడలి.. ప్రమాదాల లోగిలి

కోవూరు బజారు కూడలి నుంచి ఎక్కువ మంది నెల్లూరు, బుచ్చి వైపునకు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డంతా ఇరుకుగా ఉండడం, ద్విచక్రవాహనాలు దుకాణాల ఎదుట నిలుపుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు, బాలింతలు ఆటోల కోసం వేచి ఉండాలంటే నరకయాతన పడుతున్నారు. సమీపంలో మద్యం దుకాణం ఉండడంతో మందుబాబుల ఆగడాలు అధికమయ్యాయి. . పోలీసులు ఉన్నా పర్యవేక్షణ సరిగా లేక అవస్థలు తప్పడం లేదు.- న్యూస్‌టుడే, కోవూరు

పశు పోషకుల అవస్థలు

కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సరిగా తీయడం లేదని పాడి రైతులు వాపోతున్నారు. ఇనమడుగు, గుమ్మళ్లదిబ్బ, పోతిరెడ్డిపాళెం, కొత్తూరు వివిధ గ్రామాల నుంచి వచ్చినవారు మూసి ఉండంతో వెనుదిరిగి వెళుతున్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.- న్యూస్‌టుడే, కోవూరు

పాఠశాల ప్రాంగణంలో వ్యర్థాలు

అనంతసాగరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎంపీపీ పాఠశాల వద్ద చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే దారుణంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. రాత్రివేళల్లో మందు బాబులు పాఠశాల ఆవరణంలోనే మద్యం తాగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ వ్యర్థాలు వేయకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, అనంతసాగరం

నొప్పులు తాళలేక వృద్ధురాలి ఆత్మహత్య

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మోకాళ్ల నొప్పులు తాళలేక వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఆరవీడు జంగాలపల్లిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన హజరత్తమ్మ(65) కొన్ని రోజులుగా మోకాళ్ల సమస్యతో బాధపడుతున్నారు. వాటిని భరించలేని ఆమె ఆదివారం పొలంలో గడ్డి మందు తాగారు. వైద్యసేవల నిమిత్తం కుటుంబ సభ్యులు ఆత్మకూరుకి తరలించారు. అనంతరం నెల్లూరుకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భక్తులను అడ్డుకోవడంతో వివాదం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: జొన్నవాడ కామాక్షితాయి ఆలయం వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గేటు వద్ద భక్తులను ఆపడంతో వివాదం నెలకొంది. కార్తిక మాసం పురస్కరించుకొని ఆదివారం భక్తులు భారీగా హాజరయ్యారు. దేవస్థానం సమీపంలోని రథం వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ద్విచక్రవాహనంపై వస్తున్న భక్తుడితో పాటు లోపలికి వెళుతున్న సామన్య భక్తులు, సిబ్బందిని సైతం ఆపారు. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానికులు ఇరువురితో మాట్లాడడంతో వివాదం సద్దుమణిగింది.

పంచాయతీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

పరిశీలిస్తున్న అధికారులు

గాంధీజనసంఘం (సంగం), న్యూస్‌టుడే: గాంధీజనసంఘంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి రూ.32లక్షల నిధులు మంజూరయ్యాయి. దాంతో ఆదివారం పంచాయతీరాజ్ డీఈఈ సుధాకరరెడ్డి, ఏఈ రామయ్య స్థల పరిశీలన చేపట్టారు. తెదేపా నాయకులు శ్రీనివాసులురెడ్డి, కృష్ణమూర్తి హాజరయ్యారు.

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(రవాణా) : ప్రయాణికుల సమస్యలు, సూచనలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు రెండో డిపో మేనేజర్ షేక్ కరిమున్నీసా ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు సమస్యలు, సూచనలను 99592 25642 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

ప్రతిభ చూపి.. బహుమతి సాధించి

కేయాన్ పరికరంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంగం, న్యూస్‌టుడే: ప్రతిభతో గుర్తింపే కాదు.. బడికి అవసరమైన ఉపకరణాలు సాధించారు. నగదుతో పాటు ఉపకారవేతనాలు అందుకున్నారు. దుత్తలూరు సీడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన పోటీల్లో పాల్గొని.. రూ.అయిదు లక్షల విలువైన డిజిటల్ ప్రొజెక్టర్ విత్ కంటెంట్ పరికరాన్ని కానుకగా పొందారు సంగానికి చెందిన విద్యార్థులు. ఈ సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ వెలికి తీసేందుకు ఏటా పోటీలు నిర్వహించి.. ప్రోత్సాహకాలను అందజేస్తుంది. దీనికి పాఠశాల నుంచి జిల్లాస్థాయి వరకు ఎంపికలు చేపట్టి.. చివరగా ప్రతి మండలం నుంచి ఒక జట్టును ఎన్నుకుంటుంది. ఈ ఏడాది సంగం ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు స్వర్ణభారతి, సోఫియా, ఆర్.ఖుష్బూ, డి.యశ్వంత్, వి.లీలానందకుమార్‌రెడ్డిలు హాజరయ్యారు. ఎనిమిది రౌండ్లలో పాఠ్యాంశాలు, సాధారణ, మానసిక పరిజ్ఞానం వంటి అంశాల్లో ప్రతిభ చూపి ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. రూ.15వేల నగదుతో పాటు.. ఈ సంవత్సరం పదోతరగతి పూర్తయిన నలుగురు పై చదువులకు రూ.రెండు లక్షల వంతున యువ ఉపకారవేతనాలు అందుకున్నారు. వాటితో పాటు కేయాన్ అనే ప్రొజెక్టరు పరికరం లభించడం విశేషం. వీరు గత ఏడాది కూడా పాల్గొని.. అయిదో స్థానంలో నిలిచారు.

‘మీ వేధింపులు భరించలేకున్నా’

ఓ ఎస్సై ఆవేదన

సంగం, న్యూస్‌టుడే: మీ వేధింపులు భరించలేకున్నానంటూ సంగం సర్కిల్‌లో పని చేసే ఎస్సై ఒకరు. . తన పైఅధికారి తీరుపై సెట్ కాన్ఫరెన్స్‌లో ఆవేదన వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పోలీసుస్టేషన్ల పరిధిలో వ్యవహారాలు, కేసుల నమోదు, అరెస్టులు తదితర అంశాలపై రోజూ సాయంత్రం సమయంలో అధికారులు, ఎస్సైల మధ్య కాన్ఫరెన్స్ జరుగుతోంది. శనివారం కూడా ఇదే విధంగా జరగగా.. ఓ ఎస్సై తన ఆవేదన వెల్లబుచ్చినట్లు సమాచారం. తమస్టేషన్ పరిధిలో స్వయంగా వ్యవహరించలేకున్నామని, పరోక్ష నియంత్రణ అధికంగా ఉండటంతోపాటు, ఉన్నతాధికారులకు చాడీలు చెబుతూ వేధిస్తున్నారంటూ ఆరోపించినట్లు తెలిసింది. ఫిర్యాదుదారులకు ఒక రీతిలో చెప్పి, తనను అందుకు వ్యతిరేకంగా చేయాలని ఆదేశిస్తుండటంతో ఇబ్బందులకు గురవుతున్నామని, తనను ఇక్కడ నుంచి పంపించి వేయాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. కాగా ఈ వ్యవహారం ఉన్నతాదికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం.

వనభోజన మహోత్సవానికి ఆహ్వానం

ఆహ్వాన పత్రికలు చూపుతున్న నాయకులు

సంగం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా ఈ నెల 16న మర్రిపాడులో వనభోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా యాదవ సంఘ భవన ట్రస్టు అధ్యక్షులు నాగకిశోర్ తెలిపారు. యాదవులందరూ హాజరై.. విజయవంతం చేయాలని కోరారు. సంగం సహకార సంఘ అధ్యక్షులు శ్రీనివాసులతో కలిసి ఆదివారం పలు గ్రామాల్లో ఆహ్వానపత్రికలు పంపిణీ చేశారు.

సూచిక బోర్డు ఏర్పాటు చేయరూ..

తోటపల్లిగూడూరు మండల పరిధిలోని సాలిపేట నుంచి కాటేపల్లి గ్రామాలకు వెళ్లే మార్గంలో రోడ్డు వద్ద మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని నెలలుగా అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించడం లేదు. అధికారులు స్పందించి సూచిక బోర్డులతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, టి.పి.గూడూరు, ముత్తుకూరు

బ్యారేజీ గేటుకు మరమ్మతులు

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సంగం, న్యూస్‌టుడే: సంగం బ్యారేజీలో 13వ నంబరు ఇటీవల గేటుకు మరమ్మతులు చేశారు. అది మొరాయించడంతో ‘నిర్వహణ లోపించి, గేటు మొరాయించి’ శీర్షికతో 2న ‘ఈనాడు’లో కథనం ప్రచురితమైంది. తెలుగుగంగ విభాగం అధికారులు స్పందించి పనులు చేపట్టారు.

నిర్వహణ లేక.. మురుగు కదలక

అనంతసాగరంలోని రామాలయ వీధిలో మురుగు కాలువల నిర్వహణ కొరవడి అధ్వానంగా ఉన్నాయి. సకాలంలో పూడిక తీయక పోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి నీరు ముందుకు కదలడం లేదు. దుర్వాసన, దోమల ఉద్ధృతితో స్థానికులు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, అనంతసాగరం

పేదల బియ్యం.. అక్రమార్కుల భోజ్యం

సెప్టెంబరు 2న సంగం నుంచి నెల్లూరుకు అక్రమంగా తరలిస్తున్న 2700 కిలోల రేషన్ బియ్యాన్ని గుర్తించి బుచ్చి టోల్ ప్లాజా వద్ద పోలీసులు గుర్తించి పట్టుకున్నారు.

ఈనెల 7న వెంకటగిరి నుంచి నెల్లూరుకు 4170 కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పొదలకూరు మండలం మరుపూరు వద్ద పక్కా సమాచారంతో విజిలెన్స్, పౌరసరఫరాల అధికారులు అడ్డుకొని స్వాధీనం చేసుకున్నారు.

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, కోవూరు

పేదలకు ప్రభుత్వం నిత్యావసరాల రూపంలో అందజేసే సరకులు నిత్యం ఏదో ఒక చోట పట్టుబడుతున్నాయి. కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలో డీలర్లు, వ్యాపారులతో కుమ్మక్కై చౌక బియ్యాన్ని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. గతంలో జిల్లా పౌరసరఫరాల అధికారులు తరచూ రేషన్ దుకాణాలు తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. మూడు నెలల క్రితం సర్వేపల్లి సమీపంలో ఒక మిల్లులో రేషన్ బియ్యం పాలిష్ చేసి చెన్నైకు తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాల పరిధిలో రేషన్ బియ్యం అక్రమార్కులకు అడ్డాగా మారింది.

వెంకటగిరి నుంచి నెల్లూరుకు తరలిస్తున్న బియ్యం

కొరవడిన పర్యవేక్షణ..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పౌరసరఫరాల శాఖలో పలుమార్పులు చేసి సాంకేతికత జోడించారు. అయినా అక్రమార్కుల దందా మాత్రం ఆగడం లేదు. ఒక రేషన్ దుకాణం పరిధిలో ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారు.. ఎంత మంది తీసుకున్నారు.. ఎంత సరకు నిల్వ ఉంది. . ఇలా వివరాలు ప్రతి చోట్ల ప్రదర్శించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. డీలర్లకు సరకుల పంపిణీ అనంతరం పర్యవేక్షించాల్సిన పౌరసరఫరాల అధికారులు మమ అనిపిస్తున్నారు. రెవెన్యూ, పోలీసులు, పౌరసరఫరాల అధికారులు సమన్వయంతో తనిఖీలు చేస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. ● పౌరసరఫరాల డీటీ రవి మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు రేషన్ దుకాణాలను తనిఖీ చేస్తున్నామన్నారు. బియ్యం రవాణా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు పంపిణీలో ఎక్కడైనా అక్రమాలను పాల్పడితే లబ్ధిదారులు సమాచారమివ్వాలని పేర్కొన్నారు.

గ్రామాల్లో నిఘా ఏదీ..

కోవూరులో ఏడు నెలల క్రితం గిరిజనులు తమకు రేషన్ బియ్యం ఇవ్వలేదని ఆందోళన చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి జేసీతో మాట్లాడి వారికి అందేలా చొరవ చూపారు. ఇనమడుగు, పోతిరెడ్డిపాళెం, నార్తురాజుపాళెం, గుమ్మళ్లదిబ్బ, పాటూరు, పడుగుపాడు, నార్తురాజుపాళెం, రేగడిచెలిక, ఇందుకూరుపేట, నరుకూరు, మైపాడుతో పాటు పొదలకూరు, ముత్తుకూరు, విడవలూరు, మనుబోలు, రాపూరు, సైదాపురం, కలువాయి, అనంతసాగరం మండలాల నుంచి భారీగా తరలిపోతోంది. అనంతసాగరంలో ఒక్క నెలలో ఆరు సార్లు అధికారులకు సమాచారం రావడంతో పట్టుకున్నారు.

(c) eenadu

నెల్లూరు
•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వేడుకగా శివపార్వతుల కల్యాణం

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామస్వామి మందిరంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం వేడుకగా జరిగింది. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించగా, సాయంత్రం కల్యాణం కనులపండువగా సాగింది. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు మస్తాన్‌రావు, ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, కోశాధికారి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకి లక్ష బిల్వార్చన

నెల్లూరు(జడ్పీ): శివుని జన్మ నక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని నగరంలోని మూలాపేట భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భక్తులు లక్ష బిల్వపత్రాలు ఇవ్వగా, అర్చకులు స్వామి వారికి సమర్పించి పూజలు నిర్వహించారు. ఆ సమయంలో స్వామివారిని దర్శనం చేసుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ తోటలో వందలాదిమంది భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి ఏర్పాట్లు చేశారు.

మూలాపేటలో భస్మాభిషేకం

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని మూలాపేట శ్రీ అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి భస్మాభిషేకం నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఛైర్మన్ యడవల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఛైర్మన్లు జి.వెంకటేశ్వర్లు, రమణయ్య, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

మహాశివయ్య దర్శనానికి బారులు తీరిన భక్తులు

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(రవాణా), న్యూస్‌టుడే: ప్రయాణికుల సమస్యలు, సూచనలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు రెండో డిపో మేనేజర్ షేక్ కరిమున్నీసా ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు సమస్యలు, సూచనలను 99592 25642 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

ఏళ్లనాటి కల నెరవేరింది: మంత్రి, ఎంపీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని జాతీయ రహదారి చింతారెడ్డిపాళెం జంక్షన్ వద్ద అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి నిధులు మంజూరు చేసిందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కార్యాలయం ప్రకటనలో తెలిపింది. ఇక్కడ అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని ఎంపీ పలు దఫాలు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతి పత్రాలు అందజేశారని వివరించింది. అండర్ పాస్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని మంత్రి నారాయణ ప్రకటనలో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నెల్లూరు నగరంలోని కోటమిట్ట మెక్లిన్స్‌రోడ్డు హబీబుల్లావీధి నుంచి వీబీఎస్ కల్యాణ వరకు కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రతి వీధిలో గుంపులుగా తిరుగుతూ చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. - ఖలీద్, స్థానికుడు

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. — డాక్టర్ మదన్‌మోహన్, నగరపాలక సంస్థ వెటర్నరీ అధికారి

? బాలాజీనగర్ షష్ఠివీధిలో కాలువలు పూడికతో నిండిపోయాయి. వారం రోజులుగా శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. - శ్రీనివాసులు

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం. - డాక్టర్ చైతన్య, నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి

-న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

అడ్డుకునేదెవరు.. ఎక్కడైనా ఆపుతాం!

● ఐదు రోజుల క్రితం అయ్యప్పగుడి కూడలి వద్ద రెండు సిటీ బస్సు డ్రైవర్ల మధ్య వాగ్వాదం జరిగింది. బస్సులను నడి రోడ్డుపై ఆపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దాదాపు అర గంటపాటు వారి మధ్య గొడవ జరిగింది. బస్సుల్లో ప్రయాణికులు ఉన్నా.. పట్టించుకోలేదు. స్థానిక వ్యాపారులు మాట్లాడటంతో వివాదం సద్దుమణిగింది.

● నగరంలో ఎక్కడ పడితే అక్కడ సిటీ బస్సులు ఆపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వెనుకవచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టించుకునే అధికారి లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం)

నగరంలో ట్రాఫిక్ సమస్యకు ఆటోలు ఒక కారణం కాగా.. రెండోది సిటీ బస్సులు. ఇష్టారాజ్యంగా నగర రోడ్లపై తిరుగుతున్నాయి. ప్రయాణికులను గమ్యం చేర్చాల్సిన ఇవి ట్రాఫిక్‌కు కారణమవుతున్నాయి. నగరంలోని వెంకటేశ్వరపురం నుంచి అయ్యప్పగుడి వరకు, బుజబుజనెల్లూరు, కనుపర్తిపాడు, హౌసింగ్‌బోర్డు కాలనీ తదితర ప్రాంతాలకు నెల్లూరు నగరం, గ్రామీణ ప్రాంతాల్లో సిటీ బస్సులు తిరుగుతున్నాయి. అలాగే కోవూరుకు కూడా వెళుతుంటాయి. నగరంలో వాటిని నిలిపేందుకు పలు ప్రాంతాల్లో బస్టాండ్లు ఏర్పాటు చేశారు. అక్కడే నిలపాలన్న నిబంధన ఉంది.. క్షేత్రస్థాయిలో అలా జరగడం లేదు. ఎక్కడ పడితే అక్కడ ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

రోడ్డుపై అడ్డంగా ఆపిన సిటీ బస్సులు

నిబంధనలు తెలియవు

సిటీ బస్సుల్లో ఉన్న కొందరు డ్రైవర్లకు లైసెన్సులు లేవు. అయినా నడుపుతున్నారు. 18 నుంచి 23 సంవత్సరాల మధ్య యువకులే ఎక్కువమంది ఉండటం విశేషం. చాలామందికి నిబంధనలు తెలియవు. వాహన చట్టాలపై కనీస అవగాహన ఉండదు. కేవలం డ్రైవింగ్ వస్తే చాలు బస్సులు నడుపుతున్నారు. నిబంధనల ప్రకారం డ్రైవింగ్‌లో అనుభవం ఉన్నవారికే డ్రైవర్లుగా తీసుకోవాలి. ఇలా జరగడం లేదు. అధికారులు తరచూ తనిఖీలు చేస్తే నిబంధనలు పాటిస్తారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తాం

ఈ విషయంపై సౌత్ ట్రాఫిక్ సీఐ వెంకటరెడ్డిని వివరణ కోరగా వాహన చట్టంపై సిటీ బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. ట్రాఫిక్‌కు కారణమైన బస్సులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నెల్లూరు(మార్కెట్ సెంటర్): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఆయన కార్యాలయంలో ఆదివారం 21మంది లబ్ధిదారులకు రూ.15లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలోకి రాని పేదలు చికిత్సలు పొందగా.. వారికి సీఎం సహాయ నిధి ఎంతో మేలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, తెదేపా నాయకులు సుధాకర్, పెంచలనాయుడు, రఘు, షంషుద్దీన్ పాల్గొన్నారు.

విలువిద్య పోటీల్లో ప్రతిభ

పాడేరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాడేరులో మూడు రోజులపాటు జరిగిన అండర్-14, 17, 19 బాలబాలికల రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలు ఆదివారంతో ముగిశాయి. వివాదాలకు తావు లేకుండా క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సూరిబాబు చెప్పారు. విజేతలకు జిల్లా క్రీడా సాధికార అధికారి జగన్మోహనరావు బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే.. ● అండర్-14 విభాగంలో నెల్లూరు బాల, బాలికల జట్లు ప్రథమ, చిత్తూరు జట్లు ద్వితీయ, కృష్ణా జిల్లా జట్లు తృతీయ స్థానాల్లో నిలిచాయి.

అండర్-14 విలువిద్య పోటీల్లో గెలుపొంది బహుమతి అందుకుంటున్న నెల్లూరు జిల్లా బాలబాలికలు

ఓవరాల్ ఛాంపియన్ నెల్లూరు

పెదవాల్తేరు (విశాఖపట్నం), న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఈత పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి సుమారు 650 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలబాలికలను అండర్-14, అండర్-19 విభాగాలుగా విభజించి వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఎస్జీఎఫ్ రాష్ట్ర పరిశీలకుడు రాధాకృష్ణ, కార్యదర్శి భానుమూర్తి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విశాఖ జిల్లా బాలికల బృందం, నెల్లూరు జిల్లా బాలుర జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచాయి. విజేతలకు అతిథులు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ నాగేశ్వరరావుతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లా బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్జీఎఫ్ రాష్ట్ర పరిశీలకుడు రాధాకృష్ణ, సెక్రటరీ భానుమూర్తి రాజు తదితరులు

కూలిన వంతెన రక్షణ గోడలు

నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల వద్ద కనుపూరు కాలువపై నిర్మించిన వంతెన రక్షణ గోడలు కూలిపోయాయి. గతంలో నిర్మించిన వంతెన నేడు ఇరుకుగా మారింది. లోతైన కాలువపై ధ్వంసమైన రక్షణ గోడల వద్ద ప్రమాదకరంగా వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ప్రమాదం సంభవిస్తే భారీ నష్టం జరిగే ఆస్కారం ఉంది. తక్షణం రక్షణ గోడలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. –ఈనాడు, నెల్లూరు

మురుగునీటిలోనే రాకపోకలు

నగరంలోని కోటంరెడ్డి నగర్ నుంచి కార్పొరేషన్ కార్యాలయం తూర్పు వాకిలి మీదుగా నిత్యం దర్గామిట్ట, నిప్పో, వేదాయపాలెం తదితర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుమీదుగా కాలువ నుంచి వచ్చే మురుగు నీరు పారుతోంది. పాదచారులు, వాహనచోదకులు, స్థానికంగా అపార్ట్‌మెంట్లల్లో నివాసం ఉండేవారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించాల్సి ఉంది. – న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

రోడ్డు పక్కనే చెత్త నిల్వలు

నెల్లూరు పొదలకూరురోడ్డు క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలో ప్రధాన రహదారి పక్కనే చెత్త పేరుకుపోయింది. రోడ్డు మార్జిన్‌ను శుభ్రం చేసి ఓ చోట కుప్పలా పోశారు. నాలుగు రోజుల క్రితం వేసిన ఈ చెత్తను తొలగించకపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

కర్రే ప్రమాద హెచ్చరిక!

వేదాయపాలెం గాయత్రినగర్ మొదటి వీధిలో సిమెంటు రోడ్డు కుంగిపోయింది. గుత్తేదారు నాసిరకంగా నిర్మించడంతో రోడ్డు మధ్యలో రంధ్రం పడింది. రాత్రి వేళ ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాలు జరగకుండా స్థానికులు కర్రను అడ్డుగా పెట్టారు. అధికారులు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

కలుజుపై గుంతలు

నెల్లూరు రూరల్ మండలం ములుమూడి వద్ద కలుజుపై రోడ్డు ఛిద్రమై గుంతలు పడ్డాయి. సౌత్‌మోపూరు, ఎల్లంటి, గొల్లకందుకూరు తదితర గ్రామాల నుంచి నెల్లూరుకు కలుజు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాలకు చెరువు నుంచి నీరు పారే సమయంలో గుంతలు కనిపించక వాహనదారులు పడిపోతున్నారు. అధికారులు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు గ్రామీణ

అరకొర పని.. మతలబేమిటో మరి?

● కుంగుతున్న మార్జిన్లు
● పొదలకూరురోడ్డులో ఇదీ పరిస్థితి

పాత రోడ్డుపై పనులు పూర్తి చేయని గుత్తేదారుడు

న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)

నెల్లూరు నగరంలోని ప్రధానమైన రహదారుల్లో పొదలకూరు రోడ్డు ఒకటి. గత కొన్నేళ్లుగా గోతులు పడి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేసింది. అయితే పనులు పూర్తి స్థాయిలో జరగ లేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడి కొన్నిచోట్ల మార్జిన్లు కుంగి పోతున్నాయి.

నిర్మించింది తక్కువే.. పొదలకూరు రోడ్డును దాదాపు రూ.11 కోట్లతో తారు, సిమెంటుతో నిర్మించారు. రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు 50 అడుగుల మేర తొలగించారు. గుత్తేదారుడు కనీసం పాత రోడ్డుపై కూడా పనులు చేయలేదు. పాత రోడ్డు కన్నా.. తక్కువ వెడల్పు వేసి చేతులు దులుపుకొన్నాడు. పనులన్నీ ఒక్కరే దక్కించుకోవడం గమనార్హం. పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు మార్జిన్ పనులు సక్రమంగా చేయకపోవడంతో ఎక్కడికక్కడ కుంగిపోతోంది. డివైడర్ మధ్య పూలమొక్కలు పెంచేందుకు నాసిరకం మట్టి వేయడాన్ని గుర్తించిన గత కమిషనర్ సూర్యతేజ గుత్తేదారుడిపై ఆగ్రహం వ్యక్తం చేసి మళ్లీ నాణ్యమైన మట్టిని వేయించారు. ఇకనైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేయించాలని కోరుతున్నారు.

కుంగిన రోడ్డు

లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

నెల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నరసింహకొండ దేవస్థానం అభివృద్ధికి రూ.10కోట్లు ఇస్తామని మాట ఇచ్చారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండ శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ధర్మకర్త మండలి ఛైర్మన్‌గా ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఆలయం వద్ద జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో శ్రీనివాసులురెడ్డి, ఇప్పుడు ఆయన కుమారుడు అచ్యుత శంకర్‌రెడ్డి ఇలా.. తండ్రీకుమారులు ఛైర్మన్‌లుగా పనిచేయడం దేవస్థాన చరిత్రలో ఇదే మొదటిసారి అని అన్నారు. పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణానికి అతిత్వరలోనే శంకుస్థాపన చేసి త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నగర మాజీ మేయర్ భానుశ్రీ, ఆలయ ఈవో వేమూరి గోపి, ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది, పలువురు నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

స్వదేశీ వస్తువులనే వినియోగించాలి

నెల్లూరు(బృందావనం), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ దేశంలో తయారైన ఉత్పత్తులనే ఉపయోగించాలంటూ ఆదివారం నగరంలోని మూలాపేటలో భాజపా ఆధ్వర్యంలో కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో తయారైన వస్తువులను కొనడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, నాయకులు కందికట్ల రాజేశ్వరి, మిడతల రమేష్, స్థానిక నాయకులు పద్మావతి, నాగేంద్ర సింగ్, శ్రావ్య, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంచుతున్న భాజపా నాయకులు

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరామ్

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరామ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు రూరల్ మండలం కోడూరుపాడులోని ఆయన నివాసానికి వెళ్లి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, మస్తానయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ పథకంపై దృష్టి సారించండి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఎల్ఆర్ఎస్ పథకంపై సంబంధిత ఏసీపీలు పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించడం లేదని నగరపాలక సంస్థ కమిషనర్ వైవో నందన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో పట్టణ ప్రణాళిక విభాగంతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయ ప్లానింగ్, రెగ్యులైజేషన్ కార్యదర్శులను ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ఐపీఎల్‌పీ దరఖాస్తుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన సమయం ముగిసినా పూర్తి చేయకపోవడానికి కారణాలు అడిగారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు పథకం అమలుపై దృష్టి సారించి నూరు శాతం లేఅవుట్ల క్రమబద్ధీకరణ జరిగేలా కృషి చేయాలని సూచించారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు కార్యదర్శులు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో సిటీప్లానర్ హిమబిందు, డిప్యూటీ సిటీప్లానర్ రఘునాథరావు, సిటీప్లానర్లు వేణు, మురళి, టీపీబీవోలు, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ వైవో నందన్

చెస్‌లో క్రీడాకారుల రాణింపు

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: ఇటీవల చెన్నై, విజయవాడలో జరిగిన అంతర్జాతీయ ఫిడే చెస్ రేటింగ్ టోర్నమెంటులో నగరంలోని ఆర్ఎల్ చెస్ అకాడమీకి చెందిన మండవ ఆదిత్య హనుమ, దక్షిత, పసుపులేటి దీక్షితా రావు, అర్జున్ రెడ్డి రేటింగ్ సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం అకాడమీలో క్రీడాకారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. మండవ ఆదిత్య హనుమ రాపిడ్ రేటింగ్ 1469, బ్లిట్జ్ 1443, మండవ దక్షిత స్టాండర్డ్ రేటింగ్ 1414, పసుపులేటి దీక్షితా రావు బ్లిట్జ్ 1486, అర్జున్ రెడ్డి బ్లిట్జ్ రేటింగ్ 1549 ర్యాంకింగ్ సాధించి జిల్లాకు పేరు తీసుకువచ్చారు.

In the Court of the III Addl. Junior Civil Judge: Nellore
O.S.No.1015 / 2022
M/s. Canara Bank, Magunta Layout Branch, Nellore, rep.by its Senior Manager. - Plaintiff
Vs
Green Dairy, rep.by its Proprietor Andam Ramalinga Satish Gupta - Defendant
NOTICE TO DEFENDANT
Green Dairy, rep.by its Proprietor Andam Ramalinga Satish Gupta, S/o. Sudhakar, Resident of Plot No.102, 2nd Floor, NTR Nagar, near Theerdha School, Manumasiddi Nagar, Nellore City, SPSR Nellore District.
పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టు కొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసి యున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం తే 10-12-2025దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
దామా ధమరేశ్వర్, B.A., B.L., వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

మాట్లాడుతున్న సహావారస పీఠాధిపతి ఆంతోని దాస్

ఘనంగా మిషన్ సండే ప్రార్థనలు

నెల్లూరు(విద్యా), న్యూస్‌టుడే: సంతపేటలోని పునీత జోసఫ్ చర్చిలో వేద వ్యాపక ఆదివారపు ప్రార్థనలు క్రైస్తవ సోదరులు ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా రోమన్ క్యాథలిక్ సహావారస బిషప్ ఆంతోని దాస్ పాల్గొని భక్తుల నుద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో విచారణ గురువు వైడీ హృదయ రాజ్, సహాయక గురువులు పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యల పరిష్కారానికి పోరాటం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ప్రభుత్వం మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ అన్నారు. ఆదివారం నగరంలోని 54వ డివిజన్‌లోని టిడ్కో అపార్ట్‌మెంట్‌లో ఆవాజ్ ఐదో నగర మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఆవాజ్ ఆధ్వర్యంలో మైనార్టీ సమస్యల కోసం పోరాటాలు చేస్తున్నామన్నారు. దాడులు ఆపాలని, పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. 50 సంవత్సరాలు దాటిన వారికి పింఛను అందించాలని కోరారు. అనంతరం 13 మందితో నూతన కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రియాజ్, జిల్లా నాయకులు చాన్‌బాషా, సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, ఐద్వా నగర కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆవాజ్ జిల్లా కమిటీ నాయకులు

ఆహ్లాదవనం

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

అభివృద్ధి చెందుతున్న నగరాలు.. పట్టణాలకు పచ్చదనం అవసరం. ప్రతి చోట ప్రభుత్వ స్థలాలుంటాయి. ప్రజల సహకారంతో స్థానిక సంస్థలు, ప్రభుత్వ నిధులతో పార్కులుగా తయారు చేస్తే మంచి వాతావరణం ఉంటుంది. ఇలాంటి ఆలోచనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2014లోనే చేశారు. పురపాలకశాఖ మంత్రి నారాయణ కూడా అమలు చేసి నగరంలో పార్కుల ఏర్పాటుతోపాటు అభివృద్ధి చేశారు. నగర పార్కులపై 'ఈనాడు-ఈటీవీ' ప్రత్యేక కథనం.

ఈనాడు పరిశీలన

సర్వాంగసుందరంగా 47 పార్కులు: నెల్లూరు నగరంలో దాదాపు 10 లక్షల మంది జనాభా నివాసం ఉంటున్నారు. స్వచ్ఛ నగరంగా మార్చాలనే తపనతో 2014లోనే పార్కుల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఇటీవల కబ్జాకు గురైన విలువైన స్థలాల్లో ఆక్రమణలను తొలగించి అభివృద్ధి చేశారు. వైకాపా ప్రభుత్వం గత అయిదేళ్లలో నెల్లూరు కార్పొరేషన్‌లో పార్కులను నిర్లక్ష్యంగా వదిలేశారు. ప్రహరీలు పగులగొట్టి ఆక్రమించారు. చెత్తాచెదారంతో నింపేశారు. ప్రజలకు బదులుగా.. మూగజీవాలు పార్కుల్లో ఉండేవి. కూటమి ప్రభుత్వంలో నగరపాలకసంస్థ అధికారులు 47 పార్కులు అభివృద్ధి చేశారు. రాత్రి సమయాల్లో విద్యుత్తు కాంతులతో పార్కులు అందంగా కనిపిస్తున్నాయి. యువకులు, పెద్దలు, మహిళలు నడక కోసం వస్తున్నారు. రాత్రి 9 గంటల వరకు పార్కుల్లో పిల్లలు తల్లిదండ్రులతో ఉల్లాసంగా గడుపుతున్నారు. పిల్లల కోసం ఆట వస్తువులు, పరికరాలు ఏర్పాటు చేశారు.

పార్కులో పచ్చదనం మధ్య వాకింగ్ ట్రాక్‌లో నగరవాసులు

గతంలో కంటే బాగున్నాయి

– సరయూ

పార్కులు గతంలో కన్నా.. చాలా బాగున్నాయి. మొక్కలు, పచ్చదనంతో పాటు పెద్దలు కూర్చునేందుకు బెంచీలు వేశారు. ఆరోగ్యం కోసం వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఉన్నాయి. స్కూల్, కళాశాలల నుంచి వచ్చిన తర్వాత విద్యార్థులు సేదతీరవచ్చు.

కరాటే నేర్పిస్తున్నారు

– విక్రమ్

నేను ప్రతి రోజూ సాయంత్రం అయిదు గంటలకు పార్కుకు వస్తాను. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విశాలమైన ఆట స్థలం ఉంది. కరాటే కూడా నేర్పిస్తున్నారు. మంచి వాతావరణం కల్పించారు.

వంతెన పనులు ప్రారంభించాలి

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నగరంలోని చింతారెడ్డిపాళెం జంక్షన్‌లో జాతీయ రహదారిపై వెంటనే అండర్ పాస్ వంతెన నిర్మించాలంటూ ఈ నెల 16 మానవహారం చేపట్టనున్నట్లు అండర్ బ్రిడ్జి సాధన కమిటీ కన్వీనర్ కాయంబు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఆదిత్య కళాశాలలో ఆ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు సుధాకర్, ప్రసాద్, ఎం.నారాయణ, నారాయణరెడ్డి, సంపూర్ణమ్మ, పి.జనార్దన్, కట్టా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

"నేను మంచి పోరాటము పోరాడితిని.. నా పరుగు కడముట్టించితిని విశ్వాసము కాపాడుకొంటిని" - 2 తిమోతి 4:7
ఆదరణ కూడిక
మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన అమృతమూర్తి శ్రీమతి ఎవిలిన్ కోటపురి గారు 07.11.2025న దేవుని సన్నిధికి చేరినారు.

కీ॥ శే॥ శ్రీమతి ఎవిలిన్ కోటపురి గారు
జననం : 07.07.1937 మరణం : 07.11.2025
కుమార్తె - అల్లుడు
కుమారులు - కోడళ్లు
మనుమళ్లు, మనుమరాండ్రు
మునిమనుమరాలు
తేది: 10-11-2025 సోమవారం ఉ॥ 10 గం॥లకు మూలాపేట వాకర్స్ రోడ్డు, నియర్ వాటర్ ట్యాంక్, Door No. 24/714 కృపా నిలయంలోని మా స్వగృహము నందు జరుగును. Cell: 63095 94119.

రథాన్ని లాగుతున్న భక్తులు

ఘనంగా గుడ్డం రంగనాథుడి బ్రహ్మారథోత్సవం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని గుడ్డం రంగనాథుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో స్వామి వారికి అభిషేకార్చనలు, హోమాలు, పుష్పార్చన చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన రంగనాథుడి ఉత్సవమూర్తులను పూలపల్లకిలో ఆలయం నుంచి రథం వరకు తీసుకొచ్చారు. రథంలో ఉంచి వేదపండితులు మంత్రాలు వల్లిస్తుండగా అశేష భక్తజన సమూహం నడుమ బహ్మారథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న భక్తులందరికీ భోజన వసతి కల్పించారు. మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము, ఆలయ కార్యనిర్వహణాధికారి నాగేంద్రుడు, సభ్యులు మహదేవప్రసాద్, మోహన్‌కుమార్, వెంకటేశ్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యంతోనే ఆనందం

ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని, అదే అత్యంత సంతృప్తినిస్తుందని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం ఈనాడు-ఈటీవీ, జిల్లా సర్వజన ఆసుపత్రి ఆధ్వర్యంలో అనంతపురంలోని అరవిందనగర్‌లో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ బాలికల సంక్షేమ వసతి గృహ సముదాయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, గైనకాలజిస్టు డాక్టరు సుచిత్ర, చర్మ సంబంధిత వ్యాధుల నిపుణురాలు డాక్టరు చల్లా నీలిమ, బీసీ సంక్షేమ శాఖ డీడీ ఖుష్బూ కొఠారి హాజరై విద్యార్థినులకు ఆరోగ్య సూచనలు చేశారు. అనంతరం పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఈనాడు అనంతపురం యూనిట్ మేనేజర్ చంద్రశేఖర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, అనంత సంక్షేమం, వైద్యం

వివరాలు.. 6లో

ప్రజారోగ్య శాఖలో అవినీతి అధికారిదే పెత్తనం

■ సత్యసాయి శతజయంతి వేడుకల పనుల అప్పగింతపై విమర్శలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రజారోగ్య శాఖలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ అధికారికి శ్రీసత్యసాయి శతజయంతి వేడుకల పనులు అప్పగించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. సదరు అధికారి గతంలో పని చేసిన ప్రతిచోటా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ఎప్పటికప్పుడు ప్రసన్నం చేసుకుని తనపై చర్యలు లేకుండా జాగ్రత్త పడుతూ వస్తున్నారు. గతంలో ఆయన అక్రమాలకు పాల్పడినట్లు రుజువైనా రాజకీయ అండతో తప్పించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వ్యక్తికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో పెద్దపీట వేస్తూ రూ.కోట్లు విలువైన అభివృద్ధి పనులను అప్పగించడం గమనార్హం. ఉన్నతాధికారుల ఉదాసీనత వల్లే సదరు అవినీతి అధికారి ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది.

అవినీతి ప్రస్థానం ఇలా

పుట్టపర్తి మున్సిపాలిటీలో స్వచ్ఛభారత్ కింద 2014-15 వరకు మరుగుదొడ్లు నిర్మించారు. ఇందులో స్వచ్ఛంద సంస్థలు నిర్మించిన మరుగుదొడ్లతో పాటు సొంతంగా ఇళ్లలో నిర్మించుకున్న మరుగుదొడ్లకు సైతం బిల్లులు మంజూరు చేశారు. ఈ అవినీతి బాగోతంపై అప్పట్లోనే 'ఈనాడు' కథనాలు ప్రచురితమయ్యాయి. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక కమిటీని నియమించారు. కమిటీలో అప్పటి డీఈ దుశ్యంత్‌తోపాటు సభ్యులు విచారణ చేపట్టి రూ.1.36 కోట్లు అవినీతి జరిగినట్లు తేల్చి.. నివేదికను ప్రభుత్వానికి పంపారు. అప్పటి మంత్రి అండతో ఎలాంటి చర్యలు లేకుండా సదరు ఉద్యోగి జాగ్రత్త పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.

★ సదరు అధికారి పుట్టపర్తి మున్సిపాలిటీ నుంచి మడకశిరకు బదిలీ అయ్యారు. అక్కడ ఆరు నెలలు పాటు విధులు నిర్వర్తించారు. 2017-19 మధ్యలో పనులు చేయకుండానే దాదాపు రూ.21.50 లక్షల వరకు గుత్తేదారుల పేరుతో కాజేసినట్లు విశ్వసనీయ సమాచారం. రెండేళ్ల కిందట ఆయన పదోన్నతి పొందారు. ప్రస్తుతం సత్యసాయి శత జయంతి వేడుకల అభివృద్ధి పనులు అప్పగించారు. ఈ పనుల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు అతనిపై దృష్టి సారించకుంటే ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని ఆ విభాగంలోని ఉద్యోగులే చెబుతున్నారు.

పనులపై ప్రత్యేక దృష్టి

- రామ్మోహన్‌రెడ్డి, ప్రజారోగ్యశాఖ ఎస్ఈ

జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో నాణ్యత లోపం, అవినీతికి తావులేకుండా పర్యవేక్షణ చేస్తున్నాం. గతంలో జరిగిన అవినీతిపై ఇచ్చిన నివేదికను పరిశీలిస్తాం. రూ.40 లక్షల వరకు డీఈ స్థాయిలో బిల్లులు మంజూరు చేసే అవకాశం ఉంది. వాటిపైనా ప్రత్యేక దృష్టి పెడతాం.

టమాట పంట.. సగం దిబ్బకే..!

దిబ్బలో వేసేందుకు ట్రాక్టరులో నింపుతున్న ఊజీసోకిన కాయలు

టమాటా పంట రైతులను ఊరిస్తోంది. ధర ఉన్నప్పుడు లాభాలను చూసిన రైతులు ఆశ చావక తరచూ సాగు చేస్తూ వస్తున్నారు. దిగుబడి బాగా వచ్చినా ప్రస్తుతం కాయలకు ఊజీ, మచ్చలు సోకాయి. గుడిబండ మండలం సింగేపల్లి గ్రామానికి చెందిన రైతు రాజన్న మూడెకరాల్లో సాగు చేశాడు. దాదాపు రూ.6లక్షల ఖర్చయ్యింది. రెండెకరాల్లో నెల రోజుల క్రితం 1,500 బుట్టల కాయలు కోసి కోలార్‌కు తీసుకెళ్లాడు. బుట్ట రూ.300 నుంచి 350 ధరతో విక్రయించాడు. అప్పట్లో రెండెకరాల్లో సాగు ఖర్చుపోను రూ.లక్ష చేతికందింది. మరో ఎకరాలో ప్రస్తుతం 500 బుట్టల దిగుబడి వచ్చింది. కూలీలతో గ్రేడింగ్ చేయిస్తే సగం ఊజీ సోకినవి, మచ్చల కాయలు ఉన్నాయి. నాణ్యమైన కాయలు 300 బుట్టలు మాత్రమే రావడంతో మిగతా వాటిని ట్రాక్టరులో పారబోసేందుకు తీసుకెళ్లాడు.

- న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

కాలం చెల్లినా.. కిమ్మనరు

■ నోటీసులకే అధికారులు పరిమితం ■ శిథిల నిర్మాణాల కూల్చివేతలో అలసత్వం

కదిరి, ధర్మవరం పట్టణం, హిందూపురం, న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికలు.. తరచూ జడివానలు కురుస్తూనే ఉన్నాయి. ఆ సమయంలో అధికారులు పాత భవనాల్లో ఉండొద్దని ప్రజలను హెచ్చరిస్తున్నారు. కాలం చెల్లిన, శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చడంలో అలసత్వం వహిస్తున్నారు. కేవలం యజమానులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు.

నిర్మాణాలు కూలితే ఆ యజమానులకే కాకుండా ఇరుగు పొరుగు వారికి ప్రమాదం తప్పదు. నాలుగేళ్ల కిందట కదిరిలో ఓ భవనం కూలిన ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అలాంటి చేదు అనుభవం ఉన్నా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడకపోవడం శోచనీయం.

● ధర్మవరంలో 73 ప్రైవేటు, 5 ప్రభుత్వ భవనాలు శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించి, నోటీసులు ఇచ్చారు.

మున్సిపాలిటీల్లో ఇదీ పరిస్థితి

● కదిరి మున్సిపాలిటీలో 113 ప్రైవేటు భవనాలు పాతవిగా గుర్తించి 95 మంది యజమానులకు నోటీసులు ఇచ్చారు.

● హిందూపురంలో 57 శిథిల భవనాలను గుర్తించారు.

● కదిరిలో పది భవనాలు ఖాళీ చేయగా, ఒకటి స్వచ్ఛందంగా యజమానే పడగొట్టారు. మున్సిపాలిటీ పాత ఆఫీసు, ఉన్నత పాఠశాల భవనాలను కూల్చాల్సి ఉంది. పాఠశాల భవనం ఖాళీ చేసినా, పాత కార్యాలయంలో సచివాలయం, మెప్మా కార్యాలయాలు ఉన్నాయి. బడి భవనం రద్దీగా ఉండే హిందూపురం రోడ్డులో, నిత్యం ఆలయ భక్తులు రాకపోకలు సాగించే ప్రదేశంలో ప్రమాదకరంగా ఉంది. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హిందూపురం వెళ్లే ప్రధాన రహదారిపై శిథిలావస్థలో పాఠశాల భవనం

నోటీసులు ఇచ్చాం..

- సాయిప్రసాద్, మున్సిపల్ టీపీఓ

మున్సిపాలిటీకి చెందిన పాత ఆఫీసు, పాఠశాల భవనాలను కూల్చటానికి కలెక్టరు అనుమతి తీసుకున్నాం. పట్టణంలోని పలు ప్రైవేటు భవనాల యజమానులకు నోటీసులు ఇచ్చాం. భవన నిర్మాణం పటుత్వం ఉందని ఇంజినీరుతో ధ్రువీకరించుకోవాలి. లేనిపక్షంలో ఖాళీ చేసి సొంతంగా పడగొట్టాలి. అలా చేయకుంటే భవనాలను తామే పొక్లెయిన్‌తో కూల్చేలా చర్యలు తీసుకుంటాం.

రెవెన్యూ శిక్షణ అకాడమీ ఏర్పాటు చేస్తాం

■ తిరుపతిలో స్థల సేకరణ పూర్తి ■ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్. వేదికపై మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, కాలవ శ్రీనివాసులు, కలెక్టరు ఆనంద్, క్రీడాకారుడు శ్రీకాంత్ తదితరులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ చట్టాలపై శిక్షణ ఇవ్వడానికి రెవెన్యూ అకాడమీ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ అకాడమీ నిర్మాణానికి సంబంధించి తిరుపతిలో స్థల సేకరణ కూడా పూర్తయిందని నిధులు కేటాయించగానే పనులకు అంకురార్పణ చేస్తామని వెల్లడించారు. ఆదివారం అనంతపురం ఆర్డీటీ మైదానంలో రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడలు, సాంస్కృతిక పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రయోగాత్మకంగా అనేక జిల్లాల్లో 22(ఎ) జాబితాల్లో ఉన్న భూముల సమస్యలు దశల వారీగా పరిష్కారం చేస్తోందన్నారు. రీసర్వే సమస్యలను కూడా పరిష్కారం చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులకు ప్రొటోకాల్ విధులు తగ్గించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. ఏ శాఖ మంత్రి పర్యటిస్తే ఆ శాఖ అధికారులే ప్రొటోకాల్ విధులు చూసుకునే విధంగా నూతన విధానాన్ని అమల్లోకి తేవాలని ఆలోచిస్తున్నామని వివరించారు.

మంత్రి సవిత మాట్లాడుతూ ..

క్రీడలతో ఒత్తిడి తగ్గి ఉత్తేజం పెరిగి విధుల్లో రెవెన్యూ ఉద్యోగులు మరింత అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి క్రీడాపోటీల నిర్వహణ అద్వితీయమన్నారు. కలెక్టర్, సంయుక్త కలెక్టర్, జిల్లా రెవెన్యూ ఉద్యోగులు, క్రీడల సంఘం ఎంతో శ్రమపడి ఏలోటూ రాకుండా విజయవంతం చేశారని కితాబిచ్చారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పల్లె సింధూరరెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కలెక్టర్ ఓ.శ్రీధర్, సంయుక్త కలెక్టర్ శివనారాయణశర్మ, అంతర్జాతీయ క్రీడాకారులు కిదాంబి శ్రీకాంత్, సాకేత్ మైనేనిలు క్రీడల నిర్వహణపై ప్రసంగించారు. తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, రెవెన్యూ క్రీడా పోటీల రూపకర్త లక్ష్మయ్య, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

గుట్ట కబ్జాకు యత్నం.. అడ్డుకున్న గ్రామస్థులు

కదిరి పట్టణం, కదిరిగ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం సున్నపుగుట్ట తండా సమీపంలో సర్వేనంబరు 148-2లోని దాదాపు మూడెకరాల గుట్టను గుర్తుతెలియని వ్యక్తులు చదును చేసి కబ్జాకు యత్నించారు. ఆదివారం రాత్రి పొక్లెయిన్‌తో గుట్టను చదును చేస్తుండటాన్ని గుర్తించిన సున్నపుగుట్టతండా వాసులు పదుల సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. వారిని చూసి అక్రమార్కులు ద్విచక్రవాహనాల్లో పారిపోయారు. పొక్లెయిన్‌ను అడ్డుకున్న గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ భూమిని శ్మశానవాటికకు కేటాయించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇచ్చినట్లు వారు తెలిపారు. గతంలోనూ ఓ రాజకీయ పార్టీ నాయకుడు గుట్టను ఆక్రమించుకునేందుకు యత్నించగా అడ్డుకున్నామని చెప్పారు. కబ్జాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ విషయాన్ని తహసీల్దార్ మురళీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆధునిక సాంకేతికతతో రహదారి నిర్మాణం

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల భద్రతే ధ్యేయంగా డానిస్ ఫైబర్ టెక్నాలజీని ఉపయోగించి రోడ్లు నిర్మిస్తున్నట్లు ఏపీ నేషనల్ హైవే ఇంజినీర్ చీఫ్ రామచంద్ర పేర్కొన్నారు. ఆదివారం వెంకటగారిపల్లి వద్ద ఆయన మాట్లాడుతూ గోతులు లేని రహదారుల నిర్మాణమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం డానిస్ ఫైబర్ టెక్నాలజీ ద్వారా వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పద్ధతి ద్వారా రహదారులపై భారీ వాహనాలు వెళ్లినా కుంగకుండా పదేళ్ల పాటు మన్నికగా ఉంటాయన్నారు. పుట్టపర్తి నుంచి కోడూరు వరకూ నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్-342 నాలుగు వరుసల రహదారిపై ప్రయోగాత్మకంగా ఈ పద్ధతిలో రోడ్డు వేశామన్నారు. మొదటిసారిగా నంద్యాలలో ఈ విధానాన్ని ప్రయోగించామని, ఇక్కడ విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఈ సాంకేతికతను ఉపయోగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ విశ్రాంత నేషనల్ హైవే ఇంజినీరింగ్ చీఫ్ నయిముల్లా, డెన్మార్క్ దేశీయులు జోష్ సెబాస్టియన్, మైక్ గ్లోవర్, ఆర్అండ్‌బీ ఈఈ సంజీవయ్య, నేషనల్ హైవే డీఈఈ గిడ్డయ్య, ఏఈ కావ్య, డీఈ నాగపుల్లమరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీరు రామచంద్ర, అధికారులు

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కదిరి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీవో కార్యాలయాలతో పాటు మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారని, వాటిని కూడా పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలుగానే పరిగణించి పరిష్కరిస్తామన్నారు. ఫిర్యాదుదారుడు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. డిస్కం పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన వినియోగదారులు ఫోన్‌చేసి విద్యుత్తుకు సంబంధించిన సమస్యలు తెలియజేయవచ్చని, సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని సీఎండీ పేర్కొన్నారు. సంప్రదించాల్సిన చరవాణి నం. 89777 16661.

హడ్కో సాయం.. టిడ్కోలో కదలికలు

■ 2025 మార్చినాటికి లబ్ధిదారులకు ఇళ్ల అప్పగింత

"**హిందూపురం, న్యూస్‌టుడే:** ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లకు వచ్చే నెల నుంచి కదలికలు రానున్నాయి. ప్రస్తుతం జిల్లాలో మొదటి విడత కింద కదిరి, ధర్మవరం, పుట్టపర్తిలో పూర్తయిన ఇళ్లను ప్రభుత్వం త్వరలో లబ్ధిదారులకు అప్పగించనుంది. వీటికి అవసరమైన నిధులు అందించడానికి హడ్కో ముందుకు వచ్చింది. మొదటి విడత ఇళ్ల పంపిణీ పూర్తి కాగానే రెండో విడతలో హిందూపురంతోపాటు జిల్లాలో వివిధ దశల్లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టి మార్చిలోపు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించనున్నారు. ఏడేళ్లుగా టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. గత వైకాపా పాలనలో వీటిపై ఆశలు సన్నగిల్లినా.. కూటమి ప్రభుత్వం చొరవతో మళ్లీ లబ్ధిదారుల్లో చిగురించనున్నాయి."

మున్సిపాలిటీ : హిందూపురం

డబ్బు చెల్లించిన లబ్ధిదారులు	: 2,736
ఇళ్ల కేటాయింపు	: 2,516
బ్యాంకుల్లో రుణం పొందినవారు	: 380

హిందూపురం సమీపంలోని కొటిపి వద్ద జీప్లస్-3 విధానంలో టిడ్కో ఇళ్ల ప్రారంభం కాగా దాదాపు నాలుగు బ్లాకుల్లో 85 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికి కిటికీలు, తలుపులు, టైల్స్ ఏర్పాటు చేసి విద్యుత్తు, నీటి సౌకర్యం అందిస్తే వంద శాతం పనులు పూర్తవుతాయి. ఈమేరకు పురపాలక సంఘం అధికారులు మొదటి విడత ఇళ్ల పంపిణీ జరిగిన వెంటనే రెండో విడత కింద పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

కొటిపి సమీపంలో అసంపూర్తిగా టిడ్కో ఇళ్ల సముదాయం

వచ్చే నెల నుంచి పనులు - మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, హిందూపురం

ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూరైన చోట వచ్చే నెలలో వాటిని ప్రభుత్వం లబ్ధిదారులకు అందించనుంది. ఈ కార్యక్రమం పూర్తికాగానే రెండో విడత కింద అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. ఈ పనులు 2026, మార్చికి పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందిచనుంది.

రూ.5 వేల కోట్లతో రెండు వరుసల రైల్వేలైన్

● ప్రయాణికులు, సరకుల రవాణాకు వేర్వేరు ఏర్పాట్లు ● బోర్డుకు నివేదిక పంపిన డివిజన్ అధికారులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అత్యవసర పనుల జాబితాలో చేర్చి మరో రెండు వరుసల రైల్వేలైన్ల నిర్మాణానికి సంబంధించి సర్వేను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి పంపాలని ఆదేశించింది. దీంతో గుంతకల్లు డివిజన్ అధికారులు ఆయా సర్వే నివేదికను పూర్తి చేసి నాలుగు రోజుల కిందట రైల్వే బోర్డుకు పంపారు. లైన్ల నిర్మాణానికి రూ.5 వేల కోట్లు అవసరమవుతాయని అధికారులు సర్వే నివేదికలో పొందుపర్చారు.

✦ రైల్వే లైన్ల పనులకు సంబంధించి గుంతకల్లులోని గేజ్‌కన్వర్షన్ (నిర్మాణాలు) డిప్యూటీ చీఫ్ ఇంజినీరు కార్యాలయానికి చెందిన ఇంజినీర్లు సర్వే చేశారు. గుంతకల్లు డివిజన్ పరిధిలోని గుంతకల్లు- వాడి, గుంతకల్లు - రేణిగుంట, గుంతకల్లు - బళ్లారి సెక్షన్లలో ప్రస్తుతం రెండు వసుల లైన్లు ఉన్నాయి. వీటికి సమాంతరంగా మరో రెండు నిర్మించాలన్న యోచనలో ఉన్నారు. తద్వారా ప్రయాణికుల రైళ్లు, సరకులు, ఖనిజాలను రవాణా చేసే గూడ్సుల రాకపోకల కోసం వేర్వేరుగా ఏర్పాట్లు సమకూరుతాయి.

గుంతకల్లు-రేణిగుంట మధ్యనున్న రైల్వేలైన్

ప్రయాణికుల రైళ్లకు వెసులుబాటు

డివిజన్‌లో గుంతకల్లు- వాడి మధ్య (228.32 కి.మీ.లు), గుంతకల్లు - రేణిగుంట (305.24 కి.మీ.లు), గుంతకల్లు-బళ్లారి మధ్య (48.66 కి.మీ.లు) పొడవునా ప్రస్తుతం రెండు వరుసల లైన్లు ఉన్నాయి. ఈ మార్గాల్లోనే మరో రెండు లైన్లను ఏర్పాటు చేయబోతున్నారు. ప్రసుత్తం రెండు లైన్లు మాత్రమే ఉండడంతో ప్రయాణికుల రైళ్లు, గూడ్సులు సకాలంలో వెళ్లడానికి అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీన్ని అధిగమించడానికే రైల్వే బోర్డు సమాయత్తమవుతోంది. ప్రభుత్వం ఆయా పనులను త్వరగా ప్రారంభించాలన్న ఉద్దేశంతో సర్వే పూర్తి చేయాలని సూచించడంతో అధికారులు నివేదిక పంపారు. అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

సంతల ఆదాయం రూ.3.59 లక్షలు

అనంతపురం (వ్యవసాయం): అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు లోని వారం సంతల్లో మొత్తం రూ.3,59,250 ఆదాయం వచ్చింది. అందులో శనివారం గొర్రెలు, మేకల సంతలో రూ.2,19,050 ఆదాయం రాగా, ఆదివారం పశువుల సంతలో రూ.1,40,200 ఆదాయం వచ్చింది. వచ్చిన ఆదాయాన్ని సోమవారం ప్రభుత్వ ఖాజానాకు జమ చేస్తామని యార్డు ఎంపిక శ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్ర కుమార్ తెలిపారు.

ముగిసిన సత్యసాయి అఖండ భజన

పుట్టపర్తి, న్యూస్‌టుడే: విశ్వశాంతిని కాంక్షిస్తూ చేపట్టిన సత్యసాయి గ్లోబల్ అఖండ భజన ఆదివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. 24 గంటల పాటు ప్రపంచ నలుమూలలా ఉన్న సత్యసాయి సేవాసంస్థలు చేపట్టిన ఈ కార్యక్రమంలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరంలో బాబా మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదమంత్రోచ్ఛారణల నడుమ అఖండ భజన ముగించారు. భక్తులు సాయి గీతాలను ఆలపించారు. అన్న ప్రసాద వితరణ చేశారు. వేలాది మంది భక్తులతో మందిరం కిటకిటలాడింది.

సాయి గీతాలను ఆలపిస్తున్న భక్తులు

(c) eenadu

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు(సోమవారం) ఉదయం పది గంటలకు శ్రీవారికి ఆర్జిత కల్యాణోత్సవం ఉంటుంది. ఉదయం ఆరు గంటలకు సాధారణ దర్శనం. ఏడు గంటల నుంచి తొమ్మిది మధ్య స్వర్ణకవచ, అభిషేక పూజలు ఉంటాయి. తర్వాత 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

ఆరోగ్యంగా లేకుంటే.. ఎన్ని కోట్లు ఉన్నా వ్యర్థం

- ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన
- ఈనాడు-ఈటీవీ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహణ

విద్యార్థినులను పరీక్షిస్తున్న డాక్టర్ హేమలత

వైద్య శిబిరానికి హాజరైన విద్యార్థినులు

అనంత సంక్షేమం, వైద్యం, న్యూస్‌టుడే: ఆరోగ్యంగా లేకుంటే ఎన్ని లక్షల కోట్లు ఉన్నా ఏం చేయలేమని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం ఈనాడు, ఈటీవీ, జిల్లా సర్వజన ఆసుపత్రి ఆధ్వర్యంలో అనంతపురం అరవిందనగర్‌లో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ బాలికల సంక్షేమ వసతి గృహసముదాయంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 3వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థినులు వైద్యసేవలు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. బాలికలకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరం అన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండి ఒత్తిడిని అధిగమించాలంటే ఈ వయసులోనే ఆ శక్తి రావాలన్నారు. ఐఐటీ, ఎన్‌ఐటీల్లో ఎంపిక అయి కూడా ఒత్తిడిని తట్టుకోలేక కొందరు యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. పాల నుంచి మొదలై అన్ని ఆహార పదార్థాల్లో కల్తీ ఉంటోందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థులు జంక్‌ఫుడ్ అలవాటు చేసుకోవద్దన్నారు. సాధ్యమైనంత వరకు ఇంట్లో వండిన ఆహారాన్నే తీసుకోవాలన్నారు. చిన్న వయసు నుంచే చరవాణికి అలవాటు పడితే రేడియేషన్ ఎక్కువ అవుతుందన్నారు.

వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారిణి ఖుష్బు కొఠారి మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరం వసతి గృహంలోని విద్యార్థినులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పలు రంగాలకు సంబంధించిన నిష్ణాతులైన మహిళా డాక్టర్లు రావడంతో ఏ తరహా సమస్య ఉన్నా సందేహం లేకుండా చెప్పి అవసరం అయిన వైద్యసేవలు పొందాలన్నారు. బయటకు చెప్పలేని అంశాలు ఏమున్నా డాక్టర్ల వద్ద చెబితే మందులతో పోతాయని ఎక్కువ సంవత్సరాలు చెప్పకుండా మొహమాటంతో ఉంటే శస్త్ర చికిత్స వరకు వెళ్లాల్సి ఉంటుందన్నారు.

అనంతపురం ఈనాడు యూనిట్ మేనేజరు చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత 51 సంవత్సరాలుగా మొదటి స్థానంలో ఈనాడు ఉందంటే దానికి కారణం విశ్వసనీయత, బాధ్యతాయుతంగా ఉండడమేనన్నారు. వార్తలతోపాటు సమాజసేవే లక్ష్యంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పత్రికారంగంలో మహిళల కోసం ప్రత్యేకంగా వసుంధర పేజీని ప్రారంభించిన పత్రిక ఈనాడు అని గుర్తు చేశారు. కొవిడ్ సమయంలో దాతలు, సేవలు పొందే వారి వివరాలు ఈనాడు మీతోడు ద్వారా అనుసంధానం చేసి సహాయం అందే విధంగా చేశామన్నారు. విద్యార్థులకు ఏవైనా చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉంటే ఈ వేదికను ఉపయోగించుకోవాలని సూచించారు.

ఉచితంగా మందుల పంపిణీ

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యనిపుణులు హేమలత, చర్మ సంబంధిత వైద్య నిపుణులు చల్లా నీలిమా, గర్భ సంబంధిత వైద్యనిపుణులు సుచిత్ర విద్యార్థినులకు ఉచితంగా వైద్యసేవలు అందించారు. విద్యార్థినులు ఆరోగ్య సమస్యలను వైద్యుల వద్దకు వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా వైద్యులు సూచించిన మేరకు అక్కడే ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మరికొందరు విద్యార్థినులకు రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. సంక్షేమ వసతి గృహ అధికారులు ఆదిలక్ష్మి, శహంతాజ్, సుజాత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

హక్కులు, బాధ్యతలపై అవగాహన ముఖ్యం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రాథమిక హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. విజయనగర న్యాయ కళాశాలలోని ఆదివారం మూడో కోర్టు హాలులో జాతీయ న్యాయసేవా దినోత్సవం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులతో ఆయన మాట్లాడారు. చదువులతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం లభించని సందర్భాల్లో సివిల్, క్రిమినల్ కేసులు దాఖలు చేయవచ్చన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఉచితంగా న్యాయసేవలు అందుతాయన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, న్యాయ కోర్సు విద్యార్థులు హాజరయ్యారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

EDUCATION

DMLT 2 సం॥ల కోర్సుకు అడ్మిషన్లు జరుగుచున్నవి. కొన్ని సీట్లు మాత్రమే కలవు. Q: ఇంటర్ (ఏ గ్రూపైన) SEEDS కాలేజ్, కమలానగర్, ATP. 9440255034

REAL ESTATE

హిందూపురంలో అద్భుతంగా డెవలప్ చేసిన KVR రియాల్టీ ప్రాజెక్ట్స్‌లో ప్లాట్లు & 37 లక్షలకే డబుల్‌బెడ్ రూమ్ హౌసెస్ కలవు. సంప్ర: 6281824204.

PLOT FOR SALE

ATP Kadiri Rd.,Vinsent Depaul School Opp రోడ్ నుంచి 3rd Bit AHUDA అప్రూవ్డ్, North 40ft West 30ft రోడ్, Corner 10 Cents Sale 9581196786.

ఉరవకొండ నందు అనంతపురం - బళ్లారి హైవే ప్రక్కన కస్తూరిబా స్కూల్ ముందర DTCP అప్రూవల్ 40x55 సైజ్ గల 15 ప్లాట్లు అమ్మబడును. Cont: 9440006008.

JOBS

Urgent Civil Site Supervisors Required with or without Experience. Location Karnataka. Contact: 9347083151.

Required ITI/ Diplomain Electricals /Electronics Candidates with without Exp. for UPS & Stabilizer Service Engineers & Marketing Executives At Anantapur, Tirupathi, Kadapa. Cont: Techser Power Solutions Pvt. Ltd., Cell: 9849770651

ATP టౌన్ శ్రీనగర్ కాలనీ, 80 Fts రోడ్, అయ్యప్ప స్వామి టెంపుల్ దగ్గర ఉన్న దరూర్ లైఫ్ స్టూడియో (జిమ్ సెంటర్/ స్విమ్మింగ్ అకాడమీ) నందు సూపర్‌వైజర్స్/ రిసెప్షనిస్ట్/ క్లీనర్స్/ సెక్యూరిటీ స్టాఫ్‌గా పనిచేయడానికి ఆసక్తి కల్గినవారు సంప్రదించండి. ✆ 9381625959, 7013173562.

ప్రభుత్వ సంస్థల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేయుటకు కం. ఆపరేటర్లు, అటెండర్స్, సూపర్‌వైజర్లు కావలెను. జీతం. 16500. ✆ 98487 71117.

FACULTY/ TEACHERS

Wanted Experienced Female Staff for Science and English Subject (3 to 5 Classes) to Work in Blossoms School, Aravinda Nagar, ATP. Mob: 9030777676.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU Classifieds — 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ప్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

రైతు నాగరాజుకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న విశ్వవిద్యాలయ అధికారులు, ప్రముఖులు

ప్రకృతి వ్యవసాయ రైతుకు డాక్టరేట్

బసంపల్లి (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు నాగరాజు డాక్టరేట్ అందుకున్నారు. బెంగళూరు నగరానికి చెందిన భారత వర్చువల్ విశ్వవిద్యాలయ అధికారులు, పలువురు ప్రముఖులు డాక్టరేట్ ప్రదానం జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో విశేష సేవలు అందిస్తున్న వారిలో కొంతమందిని ఎంపిక చేసి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు, డాక్టరేట్లు ప్రదానం చేశారని, 30 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తనకు ఈ గుర్తింపు దక్కిందని నాగరాజు పేర్కొన్నారు. నగరంలోని ఏజే ఇంటర్ నేషనల్ కన్వెన్షన్ హాలులో ఈ అవార్డు అందించారన్నారు. విశ్వవిద్యాలయ డీన్ టీఎం స్వామి, నవయుగ గ్రూప్ ఛైర్మన్ వెంకటరామరాజు, ఎయిర్ ఫోర్స్ విశ్రాంత అధికారి షణ్ముగం, కర్ణాటక రాష్ట్ర పర్యాటక శాఖ ఛైర్మన్ వెంకటరెడ్డి పాల్గొన్నట్లు వివరించారు.

లక్ష్యంపై గురి.. కొలువుదీరి

ఆదర్శంగా నిలిచిన శిక్షణ ఎస్సై ఉమాదేవి

గోరంట్ల, న్యూస్‌టుడే: తండ్రి ఆటోడ్రైవర్, తల్లి గృహిణి. ఉన్నత చదువుకు వెళ్లాలన్నా సహకరించని ఆర్థిక పరిస్థితి. ఇలాంటి తరుణంలో కుటుంబ స్థితిగతులు మారాలన్నా, సమాజంలో గౌరవం దక్కాలన్నా కష్టపడి చదివి మంచి అధికారిగా ఉద్యోగం సాధించాలానే లక్ష్యంతో అడుగేసి విజయతీరాన్ని అందుకుంది. కష్టం ముందు ప్రతిభ తలవంచాల్సిందేనని నిరూపించి చిన్నవయసులోనే ఎస్సైగా ఉద్యోగం సాధించి, యువతకు ఆదర్శంగా నిలుస్తోంది కర్నూలు నగరానికి చెందిన ఉమాదేవి. 2024 బ్యాచ్ ఎస్సై శిక్షణలో భాగంగా గోరంట్ల పీఎస్‌లో విధులు నిర్వహిస్తోంది.

కర్నూలు నగరానికి చెందిన రాజన్న, పద్మావతిల రెండో సంతానం ఉమాదేవి. నగరంలోని వివిధ విద్యాసంస్థల్లో విద్యాభ్యాసం సాగించింది. బీఎస్సీ మైక్రోబయోలజీ అనంతరం 2022- 23లో బీఈడీ పూర్తిచేశారు. పదోతరగతిలో పాఠశాల టాపర్‌గా నిలిచారు. వైద్యురాలి కావాలన్న కోరికతో ఇంటర్‌లో బైపీసీ తీసుకున్నారు. నీట్‌లో మధ్య స్థాయి ర్యాంకు వచ్చింది. మెడిసిన్‌లో చేరడానికి అవకాశం ఉన్నా ఆర్థిక పరిస్థితి లేక బీఎస్సీలో చేరారు. బీఈడీ పూర్తయిన వెంటనే ఎస్సై ఉద్యోగ ప్రకటన వెలువడడంతో ఇంటి వద్దే చదివి మొదటి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకుంది.

ఎస్పీ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న ఉమాదేవి

అవార్డు అందుకున్న స్ఫూర్తితో..

డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న సమయంలో కర్నూలు నగరంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది ఉమాదేవి. ఆప్పటి కలెక్టర్ నుంచి ప్రశంసాప్రతం అందుకుంది. ఆహోదా చూసిన ఆమె తనూ కలెక్టర్ కావాలన్న లక్ష్యంగా ఎంచుకుంది. ప్రస్తుతం ఎస్సై ఉద్యోగానికి ఎంపికైన తన ఆశయం సివిల్స్ సాధించడమే అంటోంది యువ ఎస్సై.

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి

ప్రతి విద్యార్థి 18వ ఏట నుంచి 25 ఏళ్ల వరకు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకుంటే జీవతాంతం సుఖంగా ఉంటారు. ఆ సమయంలో సామాజిక మాధ్యమాలకు, దురలవాట్లకు, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి. సమయాన్ని వృథాచేయకుండా చదవాలి. లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే అనుకున్నది సులభంగా సాధించవచ్చు. సమాజంలో అబ్బాయిలు, అమ్మాయిలు సమానం అన్న భావన ఉండాలి. **-ఉమాదేవి, శిక్షణ ఎస్సై**

మద్యం మత్తులో ఆటో చోదకుడు.. ఆగ్రహించిన మంత్రి

చోదకుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ, న్యూస్‌టుడే: పూటుగా మద్యం తాగి ఓ ఆటో చోదకుడు అడ్డదిడ్డంగా నడుపుతూ మంత్రి కాన్వాయికి అడ్డు రావడంతో గమనించిన రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత చోదకుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మంత్రి అనంతపురం నుంచి పెనుకొండకు వస్తున్న సమయంలో పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో కాన్వాయ్ సైరన్ మోగించినా ఆటో చోదకుడు ఇష్టారాజ్యాంగా నడపడం గమనించిన మంత్రి ఆటోను ఆపి చోదకుడిని తీవ్రస్థాయిలో మందలించారు. ధర్మవరానికి చెందిన ఆటోచోదకుడు బాలన్న పెనుకొండ నుంచి ప్రయాణికులతో ధర్మవరం వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పలువురు చోదకులు మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా అమాయకులైన ప్రయాణికులు, పాదచారుల ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి జూడో పోటీలు

మొదటి స్థానంలో నిలిచిన అనంతపురం జట్టుతో ముఖ్య అతిథులు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ జూడో 69వ ఛాంపియన్‌షిప్ అండర్-17 బాలబాలికల పోటీలు కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో ఈ నెల 7న ప్రారంభమై ఆదివారంతో ముగిశాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు సుధారాణి, శ్రీనివాసరావు తెలిపారు. బాలుర విభాగంలో అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో, కృష్ణా జిల్లా ద్వితీయ స్థానంలో, కర్నూలు జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. బాలికల విభాగంలో అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో, చిత్తూరు జిల్లా ద్వితీయ స్థానంలో, గుంటూరు జిల్లా తృతీయస్థానంలో నిలిచాయన్నారు. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా కాకినాడ రూరల్ మండల విద్యాశాధికారి టీవీఎస్ రంగారావు, ఎంఈవో-2 శ్రీనివాసకుమార్, డీఎస్‌డీవో సతీష్‌కుమార్ హాజరై విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం జూడో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా పీఈటీ సంఘం కార్యదర్శి మాచరరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, సీనియర్ పీడీ, హాకీ కోచ్ రవిరాజు, పీడీలు గిరి, ప్రసాద్‌రెడ్డి, మూర్తి, శ్రీహరిరాజు పాల్గొన్నారు.

సత్వర న్యాయమే లక్ష్యం

మాట్లాడుతున్న ఏడీజే శైలజ

హిందూపురం, న్యూస్‌టుడే: కక్షిదారులకు సత్వర న్యాయం అందించటం న్యాయసేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశమని అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ అన్నారు. న్యాయ సేవాధికార దినోత్సవం సందర్భంగా ఏడీజే ఆదివారం కేజీబీవీ, ఎస్సీ బాలుర వసతి గృహంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్నచిన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని వీటి కోసం కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగితే అన్నివిధాలా నష్టపోవాల్సి వస్తోందన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమని, ఎవ్వరికి ఎలాంటి మినహాయింపు ఉండదన్నారు. విద్యార్థులు విద్యలో రాణిస్తూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సదస్సులో ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య చట్టాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. న్యాయవాదులు సుదర్శన్, మురళి, రవిచంద్ర, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ సిబ్బంది, ప్యారా వాలంటీర్లు సదస్సుల్లో పాల్గొన్నారు.

చెస్ ఛాంపియన్లుగా అనంతపురం జట్లు

ఛాంపియన్‌గా నిలిచిన అనంతపురం జిల్లా బాలబాలికలు

సీతానగరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి చదరంగం క్రీడా పోటీల్లో అనంతపురం జిల్లా బాలబాలికలు సత్తా చాటారు. అండర్-19 విభాగంలో బృంద పోటీల్లో అనంతపురం బాలురు, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. సీతానగరం మండలం జోగింపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలోని మినీ ఆడిటోరియంలో ఆదివారం పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. విజేతలకు పతకాలు అందజేశారు. అండర్-14, 17, 19 వ్యక్తిగత విభాగాల్లో బాలికలు 15 మంది, బాలురు 15 మంది జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్. మురళి తెలిపారు.

9999 చీర సంచుల పంపిణీ

సంచులు అందజేస్తున్న అశ్రిత, ట్రస్టు ప్రతినిధులు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : అనంతపురం నగరంలో ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ కుమార్తె దగ్గుపాటి అశ్రిత పిలుపునిచ్చారు. దగ్గుపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనంతపురం గడియార స్తంభం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర ప్రజలకు చీర బ్యాగులను ఉచితంగా అశ్రిత పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నగర ప్రజలు ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని సూచించారు. మానవాళికి ప్లాస్టిక్ అన్నది ప్రమాదకరమని, ప్రజల సహకారం లేకపోతే ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యం కాదన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరు కదలిరావాలన్నారు. ఫౌండేషన్ తరపున 9999 బ్యాగులు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఇంట్లో పాత చీరలు ఉంటాయని, వాటితో బ్యాగులు తయారు చేసుకోవాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వచ్చే ప్రతి ఒక్కరు బ్యాగు వెంట తెచ్చుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు.

పీఆర్ ఇంజినీరింగ్ శాఖ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశులు

వెంకటేశులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యవర్గ సభ్యులు

మడకశిర (గ్రామీణం), న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం పుట్టపర్తిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జి. మధుప్రకాశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా మడకశిర పీఆర్ డీఈ వెంకటేశులు, ఉపాధ్యక్షుడిగా కె. విజయశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఇషాక్ జమాలుబాషా, కోశాధికారిగా సి. రాజేంద్రప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సి. ఓబుళదాస్‌లను ఎన్నుకున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

అంజలీకుమారి

పెనుకొండ, న్యూస్‌టుడే: మద్యానికి బానిసైన భర్త ఎంతచెప్పినా మానుకోవడం లేదని మనస్తాపం చెందిన ఓ ఇల్లాలు చివరకు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కియా ఇండస్ట్రియల్ ఏరియా పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ పీరా తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని గోపాల్‌గంజ్ జిల్లా కర్మణి గ్రామానికి చెందిన ప్రిన్స్‌కుమార్‌రాయ్ కియా అనుంధ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ పెనుకొండ మండలంలోని గుట్టూరులో నివాసం ఉంటున్నాడు. ఇతడికి రెండేళ్ల క్రితం అంజలీకుమారి(23)తో వివాహం జరిగింది. భర్త మద్యం మానుకోవడం లేదని మనస్తాపంతో శనివారం అర్ధరాత్రి ఆమె ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి శవపరీక్షలు నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని లోనికోట కాలనీలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుడు శివ (36) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మవరం 1వ పట్టణ పోలీసుల కథనం మేరకు.. భవన నిర్మాణ పనులు చేస్తూ మృతుడు జీవనం సాగించేవాడు. రోజూ మద్యం తాగుతుండేవాడు. మొత్తం డబ్బు తాగుడుకే ఖర్చు చేస్తే కుటుంబం గడిచేది ఎలా అని భార్య నవనీత ప్రశ్నించేది. ఈ క్రమంలో వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేసుకొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కదురప్ప

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మణూరు గ్రామానికి చెందిన కదురప్ప(46) కానుగచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌హెచ్‌ఓ సత్యరాజ్ అందించిన వివరాల మేరకు.. కదురప్ప పదేళ్ల క్రితం బెంగళూరుకు కూలీ పనులకు వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కాలు జారీ కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. శస్త్ర చికిత్స చేసినా కోలుకోలేదు. అప్పటి నుంచి గ్రామంలోనే ఉంటూ మతిస్థిమితం లేక తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్తుండేవాడు. ఈ నెల 4న వెళ్లిన వ్యక్తి సాయంత్రమైన రాకపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం గాలించారు. 8న గ్రామం బయట పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని అటువైపు వెళ్లేవారు గమనించి మృతుని భార్య, బంధువులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

స్థలం విషయంలో తెదేపా, వైకాపా కార్యకర్తల ఘర్షణ

నలుగురుకి గాయాలు

దాడిలో గాయపడిన తెదేపా కార్యకర్త వెంకటరాముడు

నార్పల, న్యూస్‌టుడే : మండల పరిధిలోని నాయనపల్లి గ్రామంలోని అంబేడ్కర్‌కాలనీలో ఓ స్థలం విషయంలో తెదేపా, వైకాపా కార్యకర్తల మధ్య వివాదం చెలరేగింది. అది కాస్త పరస్పరం దాడులు చేసుకునే వరకూ వెళ్లింది. ఈ దాడుల్లో తెదేపా, వైకాపా కార్యకర్తలకు గాయాలయ్యాయి. నాయనపల్లి ఆర్డీటీ పాఠశాల పక్కనే తెదేపా కార్యకర్త ఓబులేసు నివాస గృహం ఉంది. దీనిపక్కనే ఉన్న స్థలంలో పశువుల పాక వేయడానికి యత్నించడంతో కాలనీకి చెందిన పలువురు వైకాపా కార్యకర్తలు శ్రావణ కుమార్, శశికుమార్, నారాయణమ్మలు ఇది ఆర్డీటీ స్థలం అంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల కిందట రెవెన్యూ అధికారులొచ్చి స్థలాన్ని సర్వే చేశారు. ఆదివారం ఓబులేసు తన కుమారులతో కలిసి పశువుల పాక వేయడానికి యత్నించడంతో వైకాపా కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఓబులేసు కుటుంబానికి వైకాపా కార్యకర్తలకు వాగ్వాదం జరిగింది. చివరకు రాళ్లతో సరస్పరం దాడులు చేసుకున్నారు. ఈఘటనలో ఓబులేసు కుమారుడు వెంకటరాముడుతో పాటు వైకాపా కార్యకర్తల్లో ముగ్గురూ గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంకటరాముడిని తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి నరసానాయుడు పరామర్శించారు. దాడిచేసిన వైకాపా కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. వైకాపా కార్యకర్తలను ఆపార్టీ నాయకుడు సాకే శైలజానాథ్ పరామర్శించారు. నార్పల పోలీసులు ఇరువైపుల బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి విచారణ చేపట్టారు.

లాటరీ పేరుతో డబ్బు వసూలు

మోసపోయిన మూడు గ్రామాల ప్రజలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : లాటరీ ద్వారా వేలాది రూపాయలు విలువ చేసే ఎలక్ట్రికల్ వస్తువులు సొంతం చేసుకోవచ్చని మాయమాటలు చెప్పి ఓ మోసగాడు ప్రజల నుంచి సొమ్ము వసూలు చేసుకొని ఉడాయించాడు. ఈఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. కళ్యాణదుర్గం, బెళుగుప్ప మండలాల పరిధిలోని పాతచెరువు, బోరంపల్లి, గంగవరం తదితర గ్రామాల్లో లాటరీ పేరు చెప్పి ప్రజల నుంచి వసూలు చేశాడు. ముందుగా ఒక రోజు ముందు ఒక్కొక్కరి నుంచి లాటరీ కింద రూ.2 వేలు వసూలు చేశాడు. ఉదయాన్నే వచ్చి లాటరీ నిర్వహించి రూ.22 వేలు విలువ చేసే టీవీ, రూ.20 వేల వాషింగ్ మిషన్, రూ.20 వేల చరవాణి, రూ.25 వేల రిఫ్రిజిరేటర్‌తో పాటు ఎలక్ట్రికల్ పరికరాలు ఇస్తామని నమ్మబలికాడు. దాదాపుగా 60 మందికి పైగానే నమ్మి డబ్బులు ఇచ్చారు. ఉదయాన్నే వస్తానన్న సదరు వ్యక్తి రాకపోవడంతో లబోదిబోమంటూ వాపోయారు. బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మరిన్ని వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

బావను హతమార్చిన బావమరిది



మలాన్‌బాషా

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో బావను బావమరిది హతమార్చిన ఉదంతం వెలుగుచూసింది. రెండో పట్టణ సీఐ రెడ్డెప్ప వివరాల మేరకు.. ఆదివారం మలాన్‌బాషా (40)ను అతడి బావమరిది రామచంద్ర పూలకుండీతో తలపై కొట్టడంతో మృతి చెందాడు. వైఎస్సార్ కాలనీకి చెందిన బాషా మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పట్టణంలోని బోయవీధికి చెందిన రాధను 16 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇటీవల భార్య మరో యువకుడితో సన్నిహితంగా ఉంటోందని అనుమానించి ఆమెను బాషా దండించాడు. ఈ విషయాన్ని ఆమె సోదరుడు రామచంద్ర తెలుసుకున్నాడు. అతడి స్నేహితులతో కలసి బావ ఇంటికి వెళ్లి గొడవకు దిగాడు. పూలకుండీతో బాషా తలపై కొట్టడంతో అతడు మృత్యువాత పడ్డాడు. ఘటనా స్థలిని సీఐ పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రామచంద్ర అతడి స్నేహితులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

సీఎంఆర్ఎఫ్ పేదల సంజీవని

పెనుకొండ, న్యూస్‌టుడే: పేద, మధ్యతరగతి ప్రజలు అనారోగ్యం బారిన పడి అప్పులపాలు కాకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) ఓ సంజీవనిలా నిలుస్తోందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి మాలవేసి నివాళులర్పించారు. 42 మంది లబ్ధిదారులకు రూ.38లక్షల విలువైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం అన్నిరంగాలలో అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. ఇప్పటికే అనేక పరిశ్రమలు వచ్చాయని, పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల్లో రాబోయే రోజుల్లోఅనేక పరిశ్రమలు వస్తున్నాయి. అందరికీ ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీభగత్‌సింగ్ సేవాసమితి సభ్యుల శ్రమదానం

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: శ్రీభగత్‌సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం కొడిగెనహళ్లి, మధుగిరి రోడ్డులో ఉన్న బస్టాండు ఆవరణాల్లో శ్రమదానం చేశారు. పిచ్చి మొక్కలను, పరిసరాల శుభ్రం చేశారు. సేవాసమితి అధ్యక్షుడు కార్తీక్, పలువురు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

శుభ్రం చేస్తున్న సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: గొరిగానిపల్లిలో కాలువలు శుభ్రం చేయడం లేదు. -వెంకటేష్
సమాధానం: రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తాం. -నిర్మల, సర్పంచి, మానేపల్లి
సమస్య: కల్లూరు పంచాయతీ భైరాపురంలో వీధి దీపాలు వెలగడం లేదు. -అవిలేమ్మ
సమాధానం: మూడు రోజుల్లోపు ఏర్పాటు చేయిస్తాం. -వసుంధర, సర్పంచి, కల్లూరు
సమస్య: గోరంట్లలోని పోలీసుస్టేషన్ ఎదురు వీధిలో వీధి దీపం వెలగడం లేదు. -మాధవి
సమాధానం: వెంటనే సిబ్బందిని పంపి ఏర్పాటు చేయిస్తాం.
-సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి
సమస్య: పీఎస్‌పాళ్యం నీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రత నెలకొంది. -ప్రభుకుమార్
సమాధానం: సత్వరమే శుభ్రపరుస్తాం.
-అమరీశ్, పంచాయతీ కార్యదర్శి, మద్దినకుంట
సమస్య: కల్లూరొప్పం బీసీకాలనీలో వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాం. -మంజునాథ్
సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం.
-లక్ష్మీనారాయణ, సర్పంచి, రాళ్లపల్లి
సమస్య: పరిగిలో మడకశిర వెళ్లే రహదారి వద్ద డ్రైనేజీ లీకేజీ అవుతోంది. -డి.గోవిందప్ప
సమాధానం: అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. -నారాయణ, పంచాయతీ కార్యదర్శి
-న్యూస్‌టుడే, లేపాక్షి, గోరంట్ల, గుడిబండ, పరిగి.

సమస్యల పరిష్కారం....

లేపాక్షి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను 'ఈనాడు'లో ప్రచురితమయ్యే 'మేమున్నాం...మీకు తోడుగా' దృష్టికి తీసుకు రావడంతో సంబంధిత బాధ్యులు స్పందించి వాటిని పరిష్కరించారు. మండలంలోని ఓబులాపురంలో ట్యాంకు నుంచి నీరు వృథాగా పోకుండా సర్పంచి నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అరికట్టారు. గోపిదేవపల్లిలో సర్పంచి నేత్రావతి ఆదేశాలతో సిబ్బంది డ్రైనేజీలను శుభ్రం చేశారు.

హిందూపురం అర్బన్: పట్టణంలోని రైల్వే రోడ్డు నుంచి సరస్వతి థియేటర్‌కు వెళ్లే రహదారిలో కాలువలను పరిశుభ్ర అధికారి శంకర్ మున్సిపల్ కార్మికులతో ఆదివారం శుభ్రం చేయించారు. అదేవిధంగా బ్లీచింగ్ చల్లించారు.

రొళ్ల: రొళ్ల మండలంలోని ఆవినకుంట ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలబడకుండా ఈఓఆర్డీ శ్రీనాథ్ కాలువను ఏర్పాటు చేయించారు. పన్నప్పహళ్లం గ్రామంలో పాడైన వీధి దీపాలు సర్పంచి హరికృష్ణ ఏర్పాటు చేయించారు. జీ.జీ.హట్టి గ్రామం పక్కన చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్తు తీగలను ఏఈ నిజాముద్దీన్ సరిచేయించారు. ఆర్.గొల్లహట్టిలో వృథా నీరు రోడ్డుపై వెళ్లకుండా కార్యదర్శి రచన బిరడాలు బిగించి సమస్యను పరిష్కరించారు.

ధరల మంటకు ఉడకని కూరలు

వారపు సంతలో గిరాకీ లేక ఖాళీగా కూర్చున్న వ్యాపారులు

లేపాక్షి, చిలమత్తూరు, న్యూస్‌టుడే: పెరుగుతున్న కూరగాయల ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. పదిహేను రోజుల్లో ధరలు రెండింతలు పెరగడంతో మార్కెట్‌కు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు స్థానికంగా కూరగాయల దిగుబడి తగ్గిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, దాంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ప్రతి శని, ఆదివారాల్లో వారపు సంత జరుగుతుంది. ఇక్కడికి కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల ధరలు పెరగడంతో ఏం కొనేటట్లు లేదని, ఇళ్లలో కూరలు ఉడికే పరిస్థితి లేదని కొనుగోలుదారులు వాపోతున్నారు.



కూరగాయలు కొనలేక సామాన్యులు విలవిల

ఘాటెక్కిన మిరప.. దారెత్తిస్తున్న క్యారెట్

పచ్చిమిర్చి ధర ఘాటెక్కిస్తుంటే.. క్యారెట్ సామాన్యులకు దారెత్తిస్తోంది. నెల రోజుల కిందట రూ.50 పలికిన పచ్చిమిర్చి ప్రస్తుతం రూ.80 పలుకుతోంది. అలాగే క్యారెట్ గతంలో రూ.60 ఉండగా ప్రస్తుతం రూ.100 పలుకుతోంది. ప్రస్తుతం కొత్తిమీర కట్ట ఒకటి రూ.10 ఉండగా, మెంతికూర, పాలకూర, పుదీనా, తోటకూర, గోంగూర తదితర ఆకుకూరల ధరలు పెరిగాయి.

భయమేస్తోంది..

ప్రస్తుతం కూరగాయలు కొనలేని పరిస్థితి. మా కుటుంబంలో నలుగురు ఉన్నాం. కూరగాయలకు వారానికి రూ.300 ఖర్చు అయ్యేది. ప్రస్తుతం సగం సంచికి కూడా రావడం లేదు. రోజూ కూలీకి వెళితే రూ.200 రావడం లేదు. పెరుగుతున్న ధరలతో ఇబ్బంది పడుతున్నాం. ధరలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **-రామక్క, కుర్లపల్లి, లేపాక్షి**

న్యాయసేవలపై అవగాహన

మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి టి.వాసుదేవన్

పెనుకొండ, న్యూస్‌టుడే: జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్‌జడ్జి టి.వాసుదేవన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.బుజ్జప్ప ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యం అందిస్తున్న విధంగానే మండల న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయసేవలు అందిస్తుందని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు, మధన్‌మోహన్‌రెడ్డి, న్యాయవాదులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవరాయల విగ్రహావిష్కరణకు ఆహ్వానం

సోమందేపల్లి : స్థానిక ఎన్టీఆర్ కూడలిలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ దేవరాయల విగ్రహ ఆవిష్కరణకు ఈనెల 16న ముఖ్య అతిథులుగా హాజరు కావాలని మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథిలకు ఆహ్వాన పత్రికలను బలిజ సంఘం నాయకులు, కులస్థులు ఆదివారం అందజేశారు. విగ్రహం ఆవిష్కరించిన అనంతరం నిర్వహించనున్న కార్తిక వన భోజన కార్యక్రమంలోనూ పాల్గొనాలని సంఘం నాయకులు రంగప్ప, గంగాధర్, శ్రీనివాసులు, అశ్వర్థప్ప మంత్రి, ఎంపీని ఆహ్వానించారు.

పేదల సొంతింటి కలకు భూమి కేటాయించాలని వినతి

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండ పట్టణంలోని నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల సాకారం చేయడానికి 30 ఎకరాల భూమి కేటాయించాలని, పట్టణాభివృద్ధి కోసం రూ.10కోట్లు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు తెదేపా పట్టణ కన్వీనర్ శ్రీరాములు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ గతవైకాపా పాలనలో 2020లో పెనుకొండ నగరపంచాయతీని వెంకటరెడ్డిపల్లి, కోనాపురం గ్రామపంచాయతీలను కలుపుతూ పెనుకొండ నగరపంచాయతీ ఏర్పాటు చేశారు. పట్టణాభివృద్ధికి సహకరించాలని, పట్టణంలోని పేదలు ఇంటి అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్నారని, వారి ఇళ్ల నిర్మాణాలకు భూమి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న తెదేపా శ్రేణులు, మంత్రి సవిత

కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వైభవంగా గిరిజా కల్యాణం

హిందూపురం అర్బన్(సూగూరు), న్యూస్‌టుడే: లోక కల్యాణార్థం, సకాలంలో వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆదివారం పట్టణంలోని సూగూరు సమీపంలో ఉన్న ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో 'పురం' గతిస్త్వం తిరుమల బృందం ఆధ్వర్యంలో గిరిజా కల్యాణం నిర్వహించారు.

ఘనంగా ఈడు పండగ

గుడిబండ: మద్దనకుంట, కురుబరపల్లి, కేకేపాళ్యం గ్రామాల్లో ఆదివారం ఈడుపండగ ఘనంగా జరుపుకొన్నారు. ప్రతి ఏటా దీపావళి అనంతరం చేసుకునే ఈ పండగలో గ్రామ పొలిమేరలో మంటలు వేసి పశువులను చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. ఆయా గ్రామాల్లోని అమ్మవార్లు, స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారు. విశేష పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు.

సత్యసాయి వాక్కులు అనుసరిద్దాం

హిందూపురం అర్బన్: ప్రతి సాయి భక్తుడు సత్యసాయి పలికిన వాక్కులను అనుసరిస్తూ ముందుకువెళ్లాలని, ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలని సత్యసాయిసేవా సమితి కో కన్వీనర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని పాండురంగనగర్‌లో ఉన్న సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం నుంచి ఆదివారం రాత్రి వరకు వివిధ ప్రాంతాల్లో ఉన్న సత్యసాయి మండళ్ల ఆధ్వర్యంలో అఖండ సాయిభజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అఖండ సాయిభజనను ఆలపిస్తున్న సాయిభక్తులు

భూసేకరణ చట్టం అమలు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: భూములను రైతుల నుంచి తీసుకోవడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నించే ముందు 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం చలివెందల గ్రామంలో రైతు సంఘం నాయకుడు రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో పరిశ్రమలు ఏర్పాటుచేయాలనే సాకుతో బాలంపల్లి, జంగాలపల్లి, రాచపల్లి, మలుగూరు తదితర గ్రామాల్లో రైతుల ద్వారా వేలాది ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు సేకరించడానికి ముందుకు వచ్చారన్నారు. రైతులు, ప్రభుత్వానికి సంబంధించిన భూములను కారుచౌకగా కొనుగోలు చేసి కార్పొరేటు కంపెనీలకు అప్పగించాలని ప్రభుత్వం ఆలోచించడం సమంజసం కాదన్నారు. రైతుల అనుమతి లేకుండా బలవంతంగా భూములు సేకరించరాదన్నారు. అభివృద్ధికి రైతు సంఘం ఎప్పటికీ వ్యతిరేకం కాదని, అయితే తక్కువ ధరకు రైతుల నుంచి కొని ఇతర సంస్థలకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకమన్నారు. భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతులందరికీ సమాన న్యాయం జరుగుతుందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు, నాయకులు రాజప్ప, రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచి వెంకటరెడ్డి, పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ఉద్యోగులను విస్మరిస్తున్న ప్రభుత్వం: యూటీఎఫ్

పెనుకొండ, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల కృషితో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను విస్మరిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రరెడ్డి విమర్శించారు. ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ ఆఫీస్ బేరర్ల సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శులు నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తిక అగ్నిహోమం

హిందూపురం గ్రామీణం,న్యూస్‌టుడే: రాచపల్లి గ్రామంలో విశ్రాంత పట్టుపరిశ్రమశాఖ ఉద్యోగి ఆదినారాయణరావు తోట ప్రాంగణంలో కార్తిక మాసం పురస్కరించుకొని ఆదివారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తులు, ప్రముఖల సమక్షంలో కార్తిక అగ్ని హోమం వైభవంగా నిర్వహించారు. ఉసిరిపూజ, గోపూజ, విశేష పూజలు నిర్వహించి వన భోజనాలు చేశారు. ఎంపీడీవో నరేంద్రకుమార్, ప్రముఖులు శంకరప్ప, నాగరాజు, కరే రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హోమంలో పూర్ణాహుతి చేస్తున్న వేదపండితులు

గ్రామాల్లో కలిసి మెలిసి సంతోషంగా ఉండాలి

రొద్దంవారిపల్లి(చిలమత్తూరు), న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలగకుండా ప్రజలందరూ కలిసి మెలిసి సంతోషంగా ఉండాలని హిందూపురం గ్రామీణం సీఐ జనార్దన్ సూచించారు. ఆదివారం రొద్దంవారిపల్లి, పి.కొత్తపల్లి, మాదిరెడ్డిపల్లి గ్రామాల్లో శాంతి భద్రతల సమస్యల గురించి ప్రజలకు వివరించారు. మహిళా భద్రత, మహిళలపై నేరాలు, ఆత్మహత్యల ధోరణి, పిల్లల రక్షణ గురించి తెలియజేశారు. మెరుగైన భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న హిందూపురం గ్రామీణం సీఐ జనార్దన్

గేటొచ్చినా భద్రత కరవే..

ఆర్చ్ నిర్మాణ పనులు చేపడుతున్న బేల్దార్లు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రహరీకి ఎట్టకేలకు గేటు అమర్చారు. ఎన్నాళ్లకెన్నాళ్లకో పాఠశాలకు నూతన శోభ సంతరించుకుంది. గత ప్రభుత్వ హయాంలో మొదటి, రెండో విడతల్లో మనబడి నాడు-నేడు కింద సుమారు రూ.3 కోట్లకు పైగా మంజూరు చేసినట్లు ప్రకటించినా.. అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అవసరమైన నిధులు విడుదల చేయకపోవడంతో తరగతి గదులు, ఇతర పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈనేపథ్యంలో రాత్రిళ్లు పాఠశాల ఆవరణలో అల్లరిమూకలు చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎంఈవోలు ఆంజనేయులు నాయక్, ఆనంద్‌బాబు, తెదేపా నాయకులు ఇచ్చిన ఈ సమాచారంతో మంత్రి సవిత ఆదేశంతో జిల్లా అధికారులు గుత్తేదారుతో ప్రస్తుతం రహదారివైపు పాఠశాలకు ప్రధాన గేటును అమర్చారు. పాఠశాల పేరు రాయించేందుకు చక్కని ఆర్చ్‌ను నిర్మిస్తున్నారు. దీంతో జడ్పీ పాఠశాలకు కొత్త కల సంతరించుకొంది. నాడు-నేడు పనుల ఇంజినీర్ క్రాంతి, ఇన్‌ఛార్జి హెచ్ఎం రామాంజనేయులు, గుత్తేదారు అశ్వర్థప్ప తదితరులు పనులను పరిశీలించారు. అయితే పాఠశాలకు క్రీడా మైదానం వైపు ప్రహరీ, గేటు ఏర్పాటు వంటి సౌకర్యం లేకపోవడంతో ప్రధాన గేటు అమర్చినా. .అల్లరి మూకల నియంత్రణకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోందని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెదవి విరుస్తున్నారు. పాఠశాల మైదానం చుట్టూ సగం మేర ప్రహరీ నిర్మాణం లేక అగంతకులు రాత్రిళ్లు చొరబడి బోరుబావి విద్యుత్తు మోటారు చోరీకి పాల్పడటంతో పాటు దిమ్మె, నీటి పైపులు, కుళాయిలు వంటివి పగుల గొడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఈమేరకు చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరారు. ఈ విషయంపై ఎంఈవో ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ఇక్కడి పరిస్థితిని మంత్రితో పాటు జిల్లా అధికారుల దృష్టికి తీసికెళ్లి తగిన చర్యలు చేపట్టాలని కోరనున్నట్లు చెప్పారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



చంద్రశేఖర్

అమరాపురం : అమరాపురం మండలం వలస గ్రామానికి చెందిన చంద్రశేఖర్ విభిన్న అంశాల్లో 10 డిగ్రీలు పూర్తి చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఇతను అనంతపురంలో బీఎస్సీ డిగ్రీతో పాటు ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. తరువాత మరో 8 డిగ్రీలను దూర విద్యా కేంద్రాల్లో ద్వారా పూర్తి చేశారు. బీఏ, బీఏఎస్ఎం. బీసీహెచ్ఎంఎస్, ఎండీ బయోటెక్, ఎండీ(ఏఎం), ఎంఏ, పీజీ సీజేఎంసీ డిగ్రీలు పూర్తి చేశారు. పది డిగ్రీలు నాలుగు అవార్డు సర్టిఫికెట్లతో ఇండియా బుక్‌ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు. వ్యవసాయమే ఆధారంగా తమ కుటుంబం జీవినం సాగిస్తుందని పట్టుదలతో చదివి ఈస్థాయికి వచ్చినట్లు తెలిపారు. తెలుగు, ఆంగ్లం, కన్నడ భాషల్లో నిర్వచనాలు, విశ్లేషణలు, అర్థాలను వివరించడం ద్వారా ఈ అరుదైన ఘనత సాధించినట్లు తెలిపారు. గిన్నిస్ బుక్‌లో స్థానం పొందడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.

బీటీ రోడ్డుగా మార్చండి

కురుబరపల్లి నుంచి ముత్తుకూరు వరకు ఉన్న మట్టి రోడ్డు గుంతలమయమై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. బీటీ రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిపాదనలు పంపామని, నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడతామన్నారు. **-న్యూస్‌టుడే, గుడిబండ**

కంపచెట్లు.. రాకపోకలకు అవస్థలు

కేతగానిచెరువు-సుద్దకుంటపల్లి గ్రామాల నడుమ రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఈ గ్రామాల మధ్య రెండున్నర కిలోమీటర్లు ఇలాగే ఉంది. స్థానిక ప్రజలతోపాటు మండ్లి, జూలుకుంట, బ్రహ్మసముద్రం గ్రామాల ప్రజలు, చోదకులు ఇబ్బంది పడుతున్నారు. మండల ఇంజినీర్ రవికుమార్‌ను వివరణ కోరగా వెంటనే పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. **-న్యూస్‌టుడే, సోమందేపల్లి**

ప్రముఖ వ్యాపారవేత్త మృతికి సంతాపం

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణం మెయిన్‌బజార్‌లో నివాసం ఉన్న ప్రముఖ వ్యాపారవేత్త సుంకు చెన్నకృష్ణయ్య(98) ఆదివారం ఉదయం తన ఇంటివద్ద మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హిందూపురం హోల్‌సేల్ మార్చెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 40 సంవత్సరాలు, ఎస్‌డీజీఎస్ కళాశాల స్థాపనకు కమిటీ కార్యదర్శిగా 40 ఏళ్లు సేవలు అందించినట్లు వివరించారు. ఆయన మృతికి పట్టణ ప్రముఖులు నివాళి అర్పించారు.

కమనీయం.. ఖాద్రీశుని కల్యాణం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీవారి ఆర్జిత కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. హోమం అనంతరం విశేష పూజలు జరిపారు. వేదమంత్రోచ్చారణలతో స్వామివారి కల్యాణ వేడుకను భక్తిశ్రద్ధలతో జరిపారు. వేడుకకు హాజరైన భక్తులు ఖాద్రీశుని దర్శించుకుని కృపకు పాత్రులయ్యారు. కల్యాణోత్సవానికి వచ్చి భక్తులు స్వామివారికి చదివింపులతో పెళ్లికానుకలు పెట్టారు.

అందరి కన్నూ జయమంగళి పైనే..

ఆనవాళ్లు కోల్పోతున్న నది

పరిగి, న్యూస్‌టుడే: ఓ వైపు ఇసుక అక్రమ రవాణా.. మరో వైపు నదీ పరివాహక ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా చెత్తను పారవేయడంతో జయమంగళి నది డంపింగ్ యార్డుగా మారుతోంది. మండల పరిధిలోని కాలువపల్లిలో ఓ వస్త్ర పరిశ్రమ నీటిని వేడి చేసేందుకు ఉపయోగించిన కలప వ్యర్థాలను నదిలో పారవేస్తున్నారు. మరో వైపు కొందరు ట్రాక్టరు నిర్వాహకులు చెత్తను తెచ్చి నదిలో వేస్తుండటం వల్ల జయమంగళి నది స్వరూపమే కోల్పోతోంది. దీనికి తోడు ఇసుకాసురుల చెరలో నలిగిపోతోంది. ఇంత జరుగుతున్నా జయమంగళి నదిని కాపాడాలన్న భావన ఏ నాయకుడికి గాని, అధికారికి గాని పట్టడం లేదు. ఈ విషయాన్ని డిప్యూటీ ఎంపీడీవో విజయభాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా నదిలో ఎవరైతే వ్యర్థాలు వేస్తున్నారో వారికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

కాలువపల్లి ఆశ్రమం వద్ద నదిలో వేసిన చెత్త

అద్దె భవనాల్లో రైతు సేవా కేంద్రాలు

పరిగిలో మూసేసిన అద్దె రైతు సేవా కేంద్రం

పరిగి, సోమందేపల్లి, లేపాక్షి, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా అందించాలని సచివాలయాల పరిధిలో రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. గతంలో మండల కేంద్రానికి తరలి వచ్చి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే వారు. ఖర్చులు, సమయం వృథా అయ్యేది. గత వైకాపా ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల పరిగి, లేపాక్షి, చిలమత్తూరు, సోమందేపల్లి తదితర మండలాల్లో అధిక శాతం రైతు సేవా కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల నిర్వహణ కోసం అప్పట్లో కొత్తగా భవన సముదాయాల నిర్మాణాలు చేపట్టినా నేటికీ పలు గ్రామాల్లో అసంపూర్తిగా ఆగిపోయాయి. ప్రస్తుతం ఒక్కో కేంద్రం నిర్వహణ కోసం రూ.3 వేలకు వరకు అద్దె చెల్లించాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వంపై ఆర్థిక పడుతోంది.

- పరిగి మండలంలో.. 14 సచివాలయ పరిధిలో 11 రైతు సేవా కేంద్రాలు ఉండగా యర్రగుంట, కొడిగెనహళ్లి 3 (పెద్దరెడ్డిపల్లి), ఎస్,ఆర్.పల్లి, పైడేటిలలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. శాసనకోటలో, పరిగిలో ఉన్న రైతు సేవా కేంద్రాలను రద్దు చేశారు.
- సోమందేపల్లి మండలంలో 13 ఉండగా ప్రస్తుతం 9 ఉన్నాయి. వాటిలో సిబ్బంది కొరత కారణంగా సోమందేపల్లి, 1.2,3, తుంగోడు కేంద్రాలను తాత్కాలికంగా తగ్గించారు. మండ్లి, చల్లాపల్లి, పందిపర్తి గ్రామాల్లో అద్దె భవనాల్లో కేంద్రాలను నిర్వహిస్తున్నారు.
- లేపాక్షి మండలంలో 12 ఉన్నాయి. వాటిలో 6 భవనాలు నిర్మాణాలు పూర్తికాగా, మరో ఆరు నిర్మాణ దశలో ఉన్నాయి.

నిర్మాణానికి అధికారులకు నివేదించాం

మూడు మండలాల్లో నిలిచిన రైతు సేవా కేంద్రాల భవన సముదాయాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు విడుదలైతే పూర్తి చేయిస్తాం.
- శ్రీకృష్ణ, శ్రీలత, విజయభారతి, -పరిగి, లేపాక్షి, సోమందేపల్లి వ్యవసాయ అధికారులు

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

మూడో స్థానం పొందిన బాలికల జట్టు

కబడ్డీలో జిల్లా బాలికల సత్తా

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి 35వ సబ్‌జూనియర్స్ కబడ్డీ పోటీల్లో సత్యసాయి జిల్లా బాలికల జట్టు సత్తాచాటింది. కడప జిల్లా పులివెందులలో జరిగిన రాష్ట్ర కబడ్డీ పోటీల్లో 26 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. ఇందులో జిల్లా జట్టు ఉత్తమ ప్రదర్శనతో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఉత్తమ ఆటతీరు కనబరిచిన క్రీడాకారులను హరీశ్ చౌదరి, కబడ్డీ అంతర్జాతీయ క్రీడాకారుడు విశ్వనాథచౌదరి, జిల్లా కబడ్డీ కార్యదర్శి సుహాసిని, కోచ్‌లు పృథ్వీ, నరసింహులు అభినందించారు.

సాంస్కృతిక మండలి ఉచిత వైద్యశిబిరం

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని సయ్యద్ మహమ్మద్‌షా ఖాదర్‌వలి, రహంతుల్లా అలై దర్గా ఆవరణలో ఆదివారం సాంస్కృతిక మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పట్టణంలోని గండికోట ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, వైద్యబృందం వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సాంస్కృతిక మండలి అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, వెంకటేశులు దర్గాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వోన్నత బాలుర పాఠశాలలో..

ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగభూషణ, క్యాంపు ఛైర్మన్ చంద్రశేఖర్ శిబిరాన్ని ప్రారంభించారు. 125 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 85 మందికి శస్త్రచికిత్సకు ఎంపిక చేశామని రోటరీక్లబ్ అధ్యక్షుడు తెలిపారు. వైద్యశిబిరానికి దాతలుగా గోరకాటి రఘునాథరెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. రోటరీక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: చెన్నేకొత్తపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో వైకాపా హయాంలో విద్యార్థులకు అందించిన బ్యాగులు, బూట్లు, వస్త్రం ఇతర సామగ్రి ఓ గదిలో ఉంచారు. పిల్లలకు అందిస్తే ఊరట కలుగుతుంది. - **రాజేష్, స్థానికుడు**

సమాధానం: విద్యార్థులకు అందించగా మిగిలిన సామగ్రిని గదిలో ఉంచాం.. బుక్కపట్నంలోని విద్యాకార్యాలయ సిబ్బంది సామగ్రి తీసుకెళ్లాల్సి ఉంది.

సమస్య: సీకేపల్లి మండలం చిన్నప్పేట గ్రామం ప్రాథమిక పాఠశాలలోని ఓ గది వర్షానికి కారడంతోపాటు, తేమతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అసౌకర్యానికి గురవుతున్నారు. - **నారాయణ, స్థానికుడు**

సమాధానం: విద్యాశాఖ ఇంజినీర్‌కు సమస్యను తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తాం.

(పై రెండు ప్రశ్నలకు ఎంఈఓ-2 ప్రసన్న కుమార్ నాయుడు సమాధానాలు ఇచ్చారు)

– న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

నిర్లక్ష్యంగా నీటి తొట్ల నిర్వహణ

పలు చోట్ల గ్రామాలకు దూరంగా నిర్మాణం

కదిరి గ్రామీణం, గాండ్లపెంట, కదిరి పట్టణం, న్యూస్‌టుడే: వేసవిలో ఎండలు పెరిగే కొద్దీ నీటి కుంటలు, చెరువులు ఎండిపోవడంతో పాటు, బోర్లు అడుగంటుతాయి. అలాంటి పరిస్థితుల్లో మూగజీవాల దాహార్తి తీర్చడానికి కూటమి ప్రభుత్వం గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో పల్లె పండుగ పథకం ద్వారా నీటి తొట్టెల నిర్మాణం చేపట్టింది. ఒక్కో నీటి తొట్టె నిర్మాణానికి రూ. 39,440 ఖర్చు చేశారు.

డివిజన్ పరిధిలోని నీటితొట్ల వివరాలు:
కదిరి మండలంలో 62 తొట్లు మంజూరు కాగా 33 పూర్తి చేశారు. గాండ్లపెంటలో 55కు 36, నల్లచెరువులో 70కి 34, ఎన్పీకుంటలో 68కి 52, తలుపులలో 78కి 21, తనకల్లులో 95కు 67 పూర్తిచేశారు. మొత్తం 89 పంచాయతీల్లో ఇప్పటికీ 185 వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

చుట్టూ పిచ్చిమొక్కలు..

ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన పశువుల నీటి తొట్ల నిర్వహణ బాధ్యతను పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి పారుదల, పశుసంవర్ధక శాఖలు సంయుక్తంగా చేపట్టాల్సి ఉంది. కొన్ని గ్రామాల్లో తొట్లకు నీటి సరఫరా లేదు. కొన్నింటికి సరఫరా ఉన్నా పర్యవేక్షణ కరవవడంతో నీరు వృథా అవుతోంది. నెలల పాటు నిర్వహణ చర్యలు చేపట్టకపోవడంతో నీరు రంగు మారి, తొట్ల గోడలకు పాచి పడుతోంది. కొన్ని చోట్ల గ్రామాలకు దూరంగా నిర్మించడంతో చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, తొట్లను కమ్మేస్తున్నాయి. ఫలితంగా అవి నిరుపయోగంగా మారుతున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని తొట్లకు నిర్వహణ చేపట్టి వినియోగంలోని తీసుకురావాలని పాడి రైతులు విన్నవిస్తున్నారు.

పోరెడ్డివారిపల్లిలో పిచ్చి మొక్కల నడుమ నీటితొట్టి

ఆదేశాలు జారీ..

- వెంకటరత్నం, ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో, కదిరి డివిజన్

డివిజన్ పరిధిలోని పశువుల తాగునీటి తొట్లన్నిటికీ నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, నిర్వహణ జరిగేలా ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తాం.

అపూర్వం.. విద్యార్థుల సమ్మేళనం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం 2022-25 డిగ్రీ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరిగింది. శివప్రసాద్, దాము, నరసింహులు, రమేష్, భాగ్యలక్ష్మిలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యాపకులు ఓబయ్య, రాజన్న, శశాంక్, ప్రశాంతిలు పాల్గొన్నారు. అధ్యాపకులను పూర్వవిద్యార్థులు ఘనంగా సత్కరించారు. తమ వంతు బాధ్యతగా కళాశాలలోని కొన్ని తరగతులకు రంగులు వేయించామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

పూర్వవిద్యార్థుల బృందం, ఉపాధ్యాయులు

104 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి డిమాండ్

పుట్టపర్తి పట్టణం: గ్రామాల్లో వైద్య సేవలు అందించే 104 సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎల్ నరసింహులు కోరారు. ఆదివారం పుట్టపర్తిలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అరబిందో సంస్థ నుండి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలన్నారు. 104 ఎంఎంయూ నాయకులు మోహన్, జయచంద్ర, అబ్దుల్లా, సీఐటీయు జిల్లా కార్యదర్శులు సాంబశివ, గంగాధర్ పాల్గొన్నారు.

తొలగిన మురుగు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: మురుగు ఇలా.. వెళ్లేదెలా శీర్షికన ఆదివారం ఈనాడులో ప్రచురితమైన వార్తకు మున్సిపల్ సిబ్బంది స్పందించారు. కదిరి రాయచోటి రోడ్డులోని రైల్వేవంతెన కింది మార్గంలోని మురుగును తొలగించారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి. పలు చోదకులు హర్షం వ్యక్తం చేశారు.

వాగుపై కబ్జాదారుల కన్ను

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: విలువైన స్థలం కనిపిస్తే చాలు కబ్జాదారులు ఆక్రమిస్తున్నారు. ఏకంగా మరవవాగుపైనే కన్నేశారు. కదిరిలోని జాతీయ రహదారి42పై నానాదర్గా సమీపంలోని విఠల్‌రాయునిచెరువు మరవవాగు పరీవాహక ప్రాంతంలో దుకాణాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ఏకంగా వాగునే పూడ్చేస్తున్నారు. రహదారికి ఆనుకుని ఉన్న సుమారు 2 సెంట్ల స్థలం కాజేసి వ్యర్థాలు, మట్టితో వాగును పూడ్చి చదునుచేస్తున్నారు. ఆక్రమణలు పెరగడం వల్ల భారీవర్షాలు కురిసిన ప్రతిసారీ ఈవాగుపై రోడ్డు తెగిపోవడం, నివాసాల్లోకి నీరు చేరి నష్టం జరిగినా అధికారులు దీనిపై దృష్టిపెట్టకపోవడం విమర్శలకు దారితీసింది. మున్సిపల్ అధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వాగును పూడ్చినవారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

వాగు పరివాహక ప్రాంతంలో దుకాణం కోసం ఏర్పాట్లు

వైభవంగా రామలింగేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ

బత్తలపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని అనంతసాగరంలో రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని గ్రామప్రజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం రామలింగేశ్వరస్వామి, పార్వతి, వినాయక, కుమారస్వామి, నంది, విగ్రహాలతో పాటు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయంలో ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామి

చెరువుకట్టపై కొలువుదీరిన సుంకులమ్మ

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని చెరువుకట్టపై ట్యాంక్ బండ్‌వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన బొజ్జకట్ట సుంకులమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాటమయ్య, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, తెదేపా, భాజపా పట్టణాధ్యక్షులు సుధాకర్, జింకా చంద్రశేఖర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్, ఆలయ కమిటీ నిర్వాహకులు న్యాయవాది ఎంపీ సుబ్బారావు, శివప్రసాద్, బీవీఆర్ చలపతి పాల్గొన్నారు.

బొజ్జకట్ట సుంకులమ్మ

ఘనంగా అయ్యప్ప విగ్రహ గ్రామోత్సవం

ఊరేగింపులో ఉత్సవ విగ్రహాలు

గాండ్లపెంట, న్యూస్‌టుడే : మండల పరిధిలోని చిన్నమిట్ట వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించేందుకు తయారు చేసిన విగ్రహాలకు ఆదివారం పంచామృతాలతో అర్చకులు అభిషేకాలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు కేరళవాయిద్యాల నడుమ అయ్యప్పలు భజనలు చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నారుల కోలాటం, వివిధ వేషధారణలు అకట్టుకున్నాయి. సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం మహాపడి పూజ, అయ్యప్ప భజన కార్యక్రమంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

కమనీయం.. ఖాద్రీశుని కల్యాణం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీవారి ఆర్జిత కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. హోమం అనంతరం విశేష పూజలు జరిపారు. వేదమంత్రోచ్చారణలతో స్వామివారి కల్యాణ వేడుకను భక్తిశ్రద్ధలతో జరిపారు. వేడుకకు హాజరైన భక్తులు ఖాద్రీశుని దర్శించుకుని కృపకు పాత్రులయ్యారు. కల్యాణోత్సవానికి వచ్చి భక్తులు స్వామివారికి చదివింపులతో పెళ్లికానుకలు పెట్టారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభులు

‘అపరిచితులతో జాగ్రత్త’

బుక్కపట్నం, న్యూస్‌టుడే: అపరిచిత వ్యక్తులతో మాట్లాడటం, చనువుగా ఉండటం సరికాదని ఎస్ఐ క్రిష్ణమూర్తి బుక్కపట్నం హాస్టల్ బాలికలకు తెలిపారు. ఆదివారం ఆయన హాస్టల్‌కు వెళ్లి సమాజంలో అమ్మాయిలకు జరుగుతున్న ఘటనల పట్ల పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానంగా కళాశాల విద్యార్థినులు సామాజిక మాధ్యమాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆకతాయిలు, అపరిచిత వ్యక్తులతో ఏదైనా సమస్య ఎదురైతే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని సయ్యద్ మహమ్మద్ ఖాదర్‌వలి రహంతుల్లా అలై ఉరుసు సందర్భంగా దర్గాలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి దర్గాను సందర్శించి ప్రార్థనలు చేశారు. దర్గా కమిటీకి రూ.10,116 విరాళం అందించారు. భక్తులకు దర్గాలో అన్నదానం చేశారు.

దర్గాలో ప్రార్థన చేస్తున్న మధుసూదన్‌రెడ్డి, ముస్లిం భక్తులు

చిత్రావతినది బైపాస్ వెడల్పునకు మోక్షం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీ సత్యసాయి శత జయంతి వేడుకలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. దశాబ్దాల కాలంగా రహదారికి వెడల్పునకు అడ్డంకిగా ఉన్న ఇళ్లను ఎట్టకేలకు తొలగించారు. హారతి ఘాట్ నుంచి కర్ణాటక నాగేపల్లి కాజ్‌వే వరకు రహదారి ఇరువైపులా ఇళ్లను తొలగించి, పనులు చేపట్టారు.

● ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రత్యేక చొరవతో ఇళ్ల యజమానులతో చర్చించి, సమస్యను పరిష్కరించడంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిత్రావతినది బైపాస్ రహదారితో పాటు, ఎనుములపల్లి కూడలి, మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో ఉన్న దుకాణాలను తొలగించాలని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. చిత్రావతినది పరిసరాలను పచ్చని పూల మొక్కలతో ముస్తాబు చేస్తున్నారు. చిత్రావతినది బ్రిడ్జిపై విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు.

చకచకా సాగుతున్న రోడ్డు పనులు

తలుపుల, న్యూస్‌టుడే: లక్కసముద్రం పంచాయతీ చెరువు కట్టపై రోడ్డు పనులను అధికారులు రెండు రోజుల కిందట చేపట్టారు. బట్రేపల్లి- మలకవేమల రహదారుల నుంచి లక్కసముద్రానికి దాదాపు కిలోమీటర్ ఉన్న రోడ్డు పలుచోట్ల ఘోరంగా దెబ్బతింది. చెరువుకట్టపై మరింత ప్రమాదకరంగా తయారైంది. ఈ రోడ్డు అభివృద్ధి కోసం గతంలో ‘ఈనాడు’లో పలు కథనాలు ప్రచురితం కావడంతో ప్రభుత్వం స్పందించింది. నాబార్డు నుంచి రూ.80 లక్షలు మంజూరు చేసి, టెండర్లు పిలిచింది. పనులను దక్కించుకొన్న సదరు గుత్తేదారు రెండు రోజుల నుంచి పనులు చేపడుతున్నారు. పీఐయు డీఈ హనుమంతయ్య మాట్లాడుతూ.. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

ఖాద్రీశుడి ఆలయంలో బహిరంగ వేలాలు

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆధీనంలోని హక్కులకు ఈనెల 13న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయా హక్కుల వేలంలో పాల్గొనేందుకు లగేజీ సెల్‌ఫోన్లను భద్రపరచే హక్కుకు రూ.3 లక్షలు, శివాలయం వద్ద టెంకాయల దుకాణానికి భక్తులు సమర్పించిన కలగలుపు బియ్యం పోగుచేసుకునే హక్కుకు రూ.లక్ష, పబ్లికేషన్ వస్తువుల సరఫరాకు, ఇతర దుస్తుల సరఫరాకు, లడ్డూ ప్రసాదం కవర్లు సమకూర్చటానికి, విద్యుత్తు సామగ్రి సరఫరా చేసే హక్కులకు రూ.25వేల చొప్పున ధరావతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలంలో షరతులు వర్తిస్తాయని ఈవో తెలిపారు

జాతీయస్థాయి జూడో పోటీలకు సీకేపల్లి విద్యార్థిని

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో జరిగే జూడో పోటీలకు చెన్నేకొత్తపల్లి కస్తూర్బా విద్యాలయ జూనియర్ ఇంటర్ విద్యార్థిని మౌనిక ఎంపికైంది. మండల కేంద్రంలోని విద్యాలయంలో ఎస్ఓ సువర్ణ, పీఈటీ మహేశ్వరి మాట్లాడుతూ.. ఈనెల 7 నుంచి 9 వరకు శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరిగాయన్నారు. 9న జరిగిన ఫైనల్ పోటీల్లో అండర్- 17 విభాగంలో విద్యార్థిని మౌనిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, ట్రోఫీ కైవసం చేసుకుందన్నారు. విద్యార్థిని మౌనికకు విద్యాలయ ఉపాధ్యాయిని బృందం, విద్యార్థినులు అభినందించారు.

సాధించిన ట్రోఫీ, బంగారు పతకంతో విద్యార్థిని మౌనిక

సత్యసాయి శతజయంతి భద్రతా ఏర్పాట్లపై సమీక్ష

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా పుట్టపర్తికి ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో అడిషనల్ డీజీ మధుసూదన్‌రెడ్డి ఆదివారం పుట్టపర్తిలోని పలు ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకున్న ఆయన మెదట విమానాశ్రయం, అనంతరం పట్టణంలో ప్రధాన రహదారులు, ప్రశాంతి నిలయంలో సాయి కుల్వంత్ మందిరం, శాంతిభవన్ ప్రాంతాల్లో పరిశీలించారు. ప్రముఖుల రాకతో వారి వాహనాల పార్కింగ్, బస, చెకింగ్ పాయింట్లు తదితర అంశాలపై సాయి హీరా కన్వెన్షన్ హాల్లో ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలతో సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. ఆయనను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి బాబా చిత్ర పటాన్ని అందచేశారు. అడిషనల్ డీజీ వెంట అనంతపురం రేంజ్ డీఐజీ షీమోషి, కలెక్టర్ శ్యాంప్రసాద్, సత్యసాయి, అనంతపురం ఎస్పీలు సతీష్‌కుమార్, జగదీష్, ఆర్డీవో సువర్ణ పాల్గొన్నారు.

అడిషనల్ డీజీ మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

ఎన్ఎంయూఏ నూతన కమిటీ ఏర్పాటు

ధర్మవరం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కృషి చేస్తోందని రీజినల్ కార్యదర్శి షబ్బీర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీవో సమావేశ భవనంలో ఎన్ఎంయూఏ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యదర్శి షబ్బీర్, గౌరవాధ్యక్షుడు డోలా రాజారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. షబ్బీర్ మాట్లాడుతూ.. ధర్మవరం డిపో నూతన కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కమిటీ కృషి చేయాలని సూచించారు. ఎన్ఎంయూఏ డిపో ఛైర్మన్‌గా కె.హనుమాన్, డిపో అధ్యక్షుడుగా బి.గోపాల్, కార్యదర్శిగా కె.మధుసూదన్, కోశాధికారిగా వైవిఎన్ రెడ్డి, గ్యారేజ్ అధ్యక్షుడుగా డీ.ఆర్.కుమార్, కార్యదర్శిగా హరికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రీజినల్ ఛైర్మన్ బి.ముత్యాలప్ప, జి.వై.నాగప్ప, దుర్గాప్రసాద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హండేరాజుల నాటి శాసనం గుర్తింపు

బుక్కపట్నం, న్యూస్‌టుడే: సిద్ధరాంపురం గ్రామ సమీపంలోని మల్లేకొండలో హండేరాజులు నిర్మించిన ప్రాచీన కోటలో రెండు శాసనాలను ఉపాధ్యాయుడు గోపి గుర్తించారు. ఆయన మాట్లాడుతూ 12వ హండేరాజు సిద్ధరామప్ప క్రీ.శ 1758 జులైలో శాసనాన్ని చెక్కించారని తెలిపారు. కోటలోని ఆంజనేయస్వామి, శివాలయాలను నిర్మించినట్లు శాసనంలో ఉందని తెలిపారు. అనంతపురం జిల్లాను 240 ఏళ్లు పాలించారని, వీరి మొదటి రాజధాని అనంతపురం కాగా రెండోరాజధాని సిద్ధరాంపురం కొండలో ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోందన్నారు. కోటకు రహదారి సదుపాయంతో ప్రభుత్వం అభివృద్ధి చేస్తే చారిత్రక పర్యాటక కేంద్రం అవుతుందని పేర్కొన్నారు.

సిద్ధరాంపురం కోటలో శాసనం వద్ద ఉపాధ్యాయుడు గోపి

కాలనీకి నీటి వెతలు

నల్లచెరువు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని రైల్వేగేటు సమీపంలో ఉన్న ట్యాంకుకు రంధ్రం పడి తాగునీరు వృథాగా పోతోంది. ఫలితంగా నల్లగుట్ట కాలనీ వాసులకు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. కాలనీలో దాదాపు 200 కుటుంబాలు ఉన్నాయి. ఈ కాలనీ వాసులు ఎక్కువ మంది రైల్వేగేటు సమీపంలో ఉన్న తాగునీటి ట్యాంకునే వినియోగిస్తారు. నీరు పారుతుండటంతో పాచి పట్టి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. అధికారులు స్పందించి నూతన ట్యాంకు ఏర్పాటుతో పాటు పరిసరాలను శుభ్రం చేయాలని కోరుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా నీటి ట్యాంకు మార్చి ప్రజలు ఇబ్బందులు తొలగించడంతో పాటు, ట్యాంకు పరిసరాలు శుభ్రం చేయిస్తాం.

తాగునీటి వృథాతో అపరిశుభ్రంగా మారిన పరిసరాలు

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

నల్లచెరువు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఉబిచెర్ల పంచాయతీలోని సుబ్బరాయని పల్లి చెరువుకట్ట సమీపంలోని చెట్టుకు ఊరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నడిమిపల్లి గ్రామానికి చెందిన సుకన్య (32) మొదటి భర్త మరణించడంతో తల్లిదండ్రులు సుబ్బరాయుని పల్లికి చెందిన ఓ వ్యక్తితో వివాహం చేశారు. మూడేళ్ల తరవాత అతనితోనూ విడిపోయి పుట్టింట్లో ఉండి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తోంది. ట్రాక్టర్ వేసుకుని బోరుబావి దగ్గర పొలంలో దుక్కి చేసి వస్తానని చెప్పిన సుకన్య సాయంత్రమైనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా సమీపంలోని చెరువు దగ్గర చెట్టుకు వేలాడుతూ కనిపించింది. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ధర్మవరం: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బత్తలపల్లి మండలం అప్పరాచెరువుకు చెందిన నరసింహానాయుడు, రుద్రమనాయుడు, సుధాకర్ గాయపడ్డారు. దైవదర్శనార్థం ద్విచక్రవాహనంలో రామగిరి మండలం నసనకోటకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఇందిరమ్మ కాలనీ మలుపు వద్ద రహదారిపైకి మరో ద్విచక్రవాహనం దూసుకు రావడంతో ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతపురం కేంద్రంగా కొందరు ముఠాగా ఏర్పడి నిత్యం గంజాయి కొనుగోలుచేసి ముదిగుబ్బ, చుట్టుపక్కల ప్రాంతాల్లో విక్రయించేవారు. ఈ క్రమంలో అనంతపురం నుంచి గంజాయి తీసుకుని ద్విచక్ర వాహనాల్లో తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు చాకచక్యంగా వారిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. సుమారు పదిమంది వరకు అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వారిలో ముదిగుబ్బకు చెందినవారు ఉన్నట్లు తెలిసింది.

వెల్దుర్తి రహదారి నిర్మాణానికి భూమి పూజ

వెల్దుర్తి (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి రహదారి నిర్మాణానికి పీఆర్ డీఈఈ లక్ష్మీనారాయణ, తెదేపా సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి ఆదివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎల్ నారాయణ చౌదరి మాట్లాడుతూ. . వైకాపా హయాంలో మండలంలో రహదారులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే పరిటాల సునీత రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టికి సారించారన్నారు. నిధులు మంజూరు చేయించడంతో ఇప్పటికే పలు బీటీ, సీసీ దారుల నిర్మాణం పూర్తి చేశామన్నారు. వెల్దుర్తి నుంచి ఎర్రోనిపల్లి గ్రామం వరకు రూ.3.34 కోట్ల గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 10 కి.మీ మేర బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. పనులు నాణ్యతగా, నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని గుత్తేదారుకు డీఈఈ లక్ష్మీనారాయణ సూచించారు.

వర్షాకాలంలోనూ చెరువులు వెలవెల

బీడు వారిన ఆయకట్టు భూములు

తలుపుల, న్యూస్‌టుడే: మండలంలో పలు చెరువులు వర్షాకాలంలోనూ వెలవెలబోతున్నాయి. ఈనెల గడిస్తే వర్షాలు రావడం కష్టమే, ఇక చెరువులు నిండే పరిస్థితి ఉండదని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల కింద ఉన్న ఆయకట్టు భూములన్నీ బీడువారాయి. వచ్చే వేసవికి సాగు, తాగునీటికి గడ్డుకాలం ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వం స్పందించి హంద్రీనీవా జలాలతో చెరువులు నింపకపోతే వేసవిలో ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కృష్ణాజలాలతో చెరువులను నింపేందుకు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అంతంత మాత్రంగానే నిల్వ..

మండలంలో ఈ ఏడాది అల్పవర్షం నమోదు కావడంతో చాలా చెరువుల్లోకి వర్షపునీరు చేరలేదు. కొద్దిపాటిగా వర్షం వచ్చినా చాలు, గలగలా పారే బట్రేపల్లి పంచాయతీలోని పలు చెరువుల్లో నీరు అంతంత మాత్రంగానే నిల్వ ఉన్నాయి. తంబళ్లపల్లి చెరువులో సగం నీరు కూడా లేవు. లక్కసముద్రం చెరువులో చూద్దామన్నా చుక్కనీరు కనిపించడం లేదు. మాడికవాండ్లపల్లి ఎర్రచెరువులో అరకొర నీరు ఉన్నాయి. బైరేవు సముద్రం పూర్తిగా ఎండిపోయింది. ఓదులపల్లి కొత్తచెరువుకూ కొద్దిగానే నీరు చేరాయి. ఇలా చాలా చెరువులకు నీరే లేవు.

చుక్కనీరు లేని లక్కసముద్రం చెరువు

కృష్ణా జలాలతో మూడు తటాకాలు

హంద్రీనీవా సుజలస్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న కృష్ణా జలాలతో మండలంలో ఇప్పటివరకు రెండు చెరువులను పూర్తిస్థాయిలో నింపారు. మరో చెరువు ఇంకో వారం రోజుల్లో పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకునే అవకాశం ఉంది. మిగిలిన నీరంతా లోతట్టుకు వెళ్లిపోతుంది. వాటిని సద్వినియోగం చేసుకుంటే రైతులకు, అనేక గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరిపై దాడి

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కాళసముద్రం ఎస్సీ కాలనీలో ఆదివారం ప్రశాంత్ ద్విచక్రవాహనం వేగంగా నడుపుతూ దారిలో వెళుతున్న చిన్నారికి తగిలించబోయాడు. వీధుల్లో ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడుపవద్దని బాలిక మేనమామ బుజ్జి, బాబాయి మహేష్ అతడిని మందలించారు. దీంతో ఆగ్రహించిన ప్రశాంత్ ఇంటికి వెళ్లి సోదరుడు యశ్వంత్ కలిసి కర్ర, ఇనుప రాడ్‌తో వారిపై దాడి చేశాడు. బాధితులిద్దరి తలలకు గాయాలయ్యాయి. వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఔట్ పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



32వ వర్ధంతి

మా జీవిత గమ్యాలకు మార్గదర్శకులు, జన్మజన్మలకు మరచిపోలేని మీ ఆత్మీయానురాగాలను మీ 32వ వర్ధంతి సందర్భంగా స్మరించుకుంటూ.. మీ..

భార్య: శ్రీమతి సి.చంద్రకళ

కుమారులు - కోడళ్లు
చల్లా రవికుమార్ - సి.జానకి
RTC కండక్టర్, కదిరి.
చల్లా సురేంద్రకుమార్ - సి.తులసి
మనుమరాళ్లు: సి.మధులిక, సి.మహిత

స్వర్గీయ శ్రీ వడియరాజులు చల్లా వెంకటస్వామి గారు
APSRTC కండక్టర్, కదిరి

సూరి ఇంటర్‌నెట్, కాలేజ్ రోడ్డు, కదిరి. సెల్: 9492222215

(c) eenadu

ఈనాడు శ్రీకాకుళం

సోమవారం నవంబరు 10, 2025

కిటకిటలాడిన ఆదిత్యాలయం

కార్తిక మాసం మూడో ఆదివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు కిటకిటలాడాయి. సాయంత్రం 4 గంటల వరకు రద్దీ కొనసాగింది. భారీగా వాహనాలు రావడంతో శ్రీకాకుళం-కళింగపట్నం రోడ్డులో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పార్కింగ్ స్థలం లేక ప్రైవేటు బస్సులను అసిరితల్లి ఆలయం వైపు మళ్లించారు. ఆలయానికి రూ.10.76 లక్షలు ఆదాయం సమకూరిందని ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

ఆదివారం.. ఆనంద తీరం..!

కార్తిక మాసం నేపథ్యంలో జిల్లాలోని తీర ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. సంతబొమ్మాళి మండలం భావనపాడు వద్ద సాగర తీరంలో ఆదివారం సందడి నెలకొంది. పాతపట్నం, టెక్కలి, పలాస నియోజకవర్గాలు, ఒడిశాలోని వివిధ జిల్లాలకు చెందిన ప్రజలు వనసమారాధనలకు తరలివచ్చారు. యువత, పిల్లలు, పెద్దలు సరదాగా గడిపారు. భావనపాడు మెరైన్ సీఐ రాము ఆధ్వర్యంలో సిబ్బంది పహారా కాశారు.

– న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

దందా.. ఆపేదుందా..?

పలాస మండలం కేదారిపురం, ఈదురాపల్లి మధ్య కొండను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. గ్రావెల్‌ను ట్రాక్టర్లలో ప్రైవేటు లేఅవుట్లకు తరలిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దందా సాగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ఇన్‌ఛార్జి ఆర్ఐ ప్రసాద్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

చెరువుల్లో విధ్వంసం..!

అక్రమ తవ్వకాలతో రూపు మారుతున్న నీటి వనరులు

ఆమదాలవలస పరిధిలో కొందరు అక్రమంగా సంపాదించడానికి ఎంతకైనా బరితెగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువుల్లో మట్టి తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగా పొక్లెయిన్లు వినియోగిస్తున్నా.. ట్రాక్టర్లలో తరలిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పెద్దఎత్తున ఏర్పడుతున్న గోతులతో ముప్పు పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈ ప్రాంతాల్లో ఇష్టారాజ్యం

◆ లక్ష్ముదుపేట, బొడ్డేపల్లిపేట, వెంకయ్యపేట, పార్వతీశంపేట, బొబ్బిలిపేట, కొర్లకోట, చీమలవలస, కొత్తవలస, హనుమంతుపురం, తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, దూసిపేట, వంజంగి, వంజంగిపేట, తోటాడ, చింతాడ, కనుగులవలస ప్రాంతాల్లో విధ్వంసం సృష్టిస్తున్నారు.

◆ కర్ర, రాళ్లు, బాగెన్న, పెద్ద, కొత్త, ఎర్ర, బమ్మిడి, ఊర, భక్తోడు, భీముడు, సమీపంలోని చెరువుల్లో పెద్దఎత్తున మట్టి తవ్వేస్తున్నారు.

◆ అనుమతులు లేకుండా పొక్లెయిన్లతో ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. మట్టికి గిరాకీ ఉండటంతో కొందరు ట్రాక్టర్ల యజమానులు దీనిపై దృష్టి సారించారు. చెరువుల్లో మట్టిని తవ్వి పంట పొలాలు ఎత్తు చేస్తున్నారు.

ఆమదాలవలస పురపాలక సంఘం పరిధి వెంకయ్యపేట వద్ద అక్రమ తవ్వకాలతో రూపు మారిన ఊర చెరువు

ఇదీ పరిస్థితి

◆ ఆమదాలవలస మండలం, పట్టణ పరిధిలో పంట పొలాలు, స్థలాలు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

◆ స్థలాలు ఎత్తు చేసుకోవడానికి మట్టి అవసరం కావడంతో నిర్మాణదారులు ట్రాక్టర్ యజమానులను సంప్రదిస్తున్నారు.

◆ ఎర్ర కంకర మట్టి కంటే తక్కువ ధర రావడంతో ఎక్కువగా చెరువుల మట్టిపై మొగ్గు చూపుతున్నారు.

◆ సమీపంలోని చెరువుల్లో యథేచ్ఛగా తవ్వి అవసరమైన చోటుకు తరలించి ఎత్తు చేస్తున్నారు.

◆ దూరం మేరకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు వసూలు చేస్తున్నారు.

పొంచి ఉన్న ముప్పు

◆ ప్రస్తుత చెరువు గర్భాలు ఎండిపోవడంతో తవ్వకాలు చేపట్టి పెద్ద గోతులు చేస్తున్నారు.

◆ వాటి నిండా నీరు చేరితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పల్లెల్లో రైతులు, పిల్లలు స్నానం చేయడానికి దిగితే బయటకు రాలేక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..: చెరువుల్లో అక్రమ తవ్వకాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకుంటాం. మట్టి అవసరమైన వారు సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి నిబంధనల మేరకు తప్పనిసరిగా అనుమతులు పొందాలి. ఇప్పటివరకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. అన్ని ప్రాంతాల్లోని చెరువులను పరిశీలిస్తాం. ఎక్కడైనా ఉల్లంఘనలు గుర్తిస్తే కేసులు నమోదయ్యేలా పర్యవేక్షిస్తాం. అక్రమ రవాణాకు వినియోగిస్తున్న వాహనాలను సీజ్ చేస్తాం.

- రాంబాబు, తహసీల్దారు, ఆమదాలవలస

వైభవంగా బాలియాత్ర

ప్రముఖ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఆదివారం నిర్వహించిన బాలియాత్ర వైభవంగా సాగింది. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం వంశధార నది వరకు యాత్ర సాగింది. కార్తిక పౌర్ణమి రోజు ఈ క్రతువుకు అంకురార్పణ చేశారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ భవిష్యత్తులో బాలియాత్రకు మరింత ప్రాముఖ్యం వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ కళింగ సామ్రాజ్య వైభవాన్ని పునరుద్ధరించేందుకే బాలియాత్ర నిర్వహిస్తున్నామన్నారు. యాత్ర ప్రారంభానికి ముందు ఎస్పీ మహేశ్వరరెడ్డి ఏర్పాట్లు పరిశీలించి పోలీసు బందోబస్తుపై సమీక్షించారు. జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ సభాపతి తమ్మినేని సీతారాం, కళింగ కార్పొరేషన్ అధ్యక్షుడు రోణంకి కృష్ణంనాయుడు, వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, బాలియాత్ర ఐకాస కన్వీనర్ బొడ్డేపల్లి శ్రీరామచంద్రమూర్తి, శ్రీముఖలింగం సర్పంచి తమ్మన్నగారి సతీష్‌కుమార్, ఈవో ఏడుకొండలు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, జలుమూరు, నరసన్నపేట

వంశధార నదికి హారతి ఇస్తున్న అర్చకులు

కరకట్టపై నుంచి వెళ్తున్న ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్, నాయకులు

న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

పురపాలక సంఘాల్లో పేద మహిళలను ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పని చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆంత్రప్రెన్యూర్లుగా ఎదిగేలా తోడ్పాటు అందించడానికి కార్యాచరణ రూపొందిస్తున్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ ఎస్.వెంకటరావు సూచించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల్లో మహిళా ఆంత్రప్రెన్యూర్ల సంఖ్య పెంచే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు.

మహిళలకు ఆర్థిక తోడ్పాటే లక్ష్యం!

'న్యూస్‌టుడే'తో మెప్మా పీడీ వెంకటరావు

ముఖాముఖి

అర్హత మేరకు రుణ సాయం

★ పట్టణ ప్రాంతాల్లో మహిళలకు లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు ఇస్తున్నాం. గతంలో ఒక్కో గ్రూపునకు రూ.10 లక్షల వరకు ఇచ్చాం.

★ సకాలంలో చెల్లించిన సంఘాలకు ఈ ఏడాది రూ.20 లక్షల వరకు చేయూత అందిస్తున్నాం.

★ 1,575 సంఘాలకు రూ.157 కోట్లు లక్ష్యంగా నిర్దేశిస్తే 1,256 సంఘాలకు రూ.230 కోట్ల మేర రుణాలు ఇచ్చాం.

★ మిగిలిన సంఘాలకు అర్హత ఉన్నప్పటికీ రుణం పొందడానికి..అవసరమైన యూనిట్లు నెలకొల్పడానికి ఆసక్తి చూపడం లేదు.

★ ఎక్కువగా దుస్తులు, తినుబండారాల దుకాణాలు, హోటళ్ల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు.

★ బియ్యం మిల్లులు, జీడి పరిశ్రమల ఏర్పాటుకు రుణం ఇచ్చే అవకాశం ఉంది. సంఘాలు సద్వినియోగం చేసుకోవాలి.

తృప్తి క్యాంటీన్ల ఏర్పాటు

★ సంఘంలో నలుగురు సభ్యులు సమష్టిగా తృప్తి క్యాంటీన్ ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం వీలు కల్పించింది.

★ పురపాలక అధికారులు వారికి స్థలం కేటాయిస్తున్నారు. కంటెయినర్‌లో క్యాంటీన్ నిర్వహణకు ఓ స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యం అందిస్తోంది. 75 శాతం బ్యాంకు రుణం, 25 శాతం ఆ సంస్థ ఆర్థిక సాయం అందించనున్నాయి.

★ శ్రీకాకుళంలో రెండు, మూడు పురపాలక సంఘాల్లో ఒక్కో క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నారు.

4 చోట్ల లేబర్ చౌక్‌లు

జిల్లా కేంద్రంలోని కూడళ్లలో కార్మికులు పని కోసం వేచి ఉంటున్నారు. వారికి సరైన చోటు కల్పించడానికి నగరంలో నాలుగు చోట్ల లేబర్ చౌక్‌లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనుమతించింది. త్వరలోనే స్థల పరిశీలన చేస్తాం.

1.50 ఎకరాల్లో స్మార్ట్ స్టోర్

★ పట్టణ ప్రాంతంలో అన్నీ ఒకేచోట లభ్యమయ్యేలా 1.50 ఎకరాల్లో స్మార్ట్ స్టోర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

★ శ్రీకాకుళం నగర పరిధి బలగ-కొత్తరోడ్డు మధ్య ప్రభుత్వ భూమిని గుర్తించి కలెక్టర్‌కు నివేదించాం.

★ అనుమతి రాగానే సముదాయం ఏర్పాటుకు సంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం.

డిజి లక్ష్మికి 78 మంది ఎంపిక

★ విద్యార్హత ఆధారంగా సీఎస్‌సీలను అనుసంధానిస్తూ డిజి లక్ష్మి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 78 మంది మహిళల్ని ఎంపిక చేశాం.

★ డిగ్రీ చదివిన మహిళలకు రూ.2 లక్షలు రుణమిచ్చి కియోస్క్, సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నాం. ఈ నెలలోనే వీటిని ప్రారంభించనున్నాం.

రయ్.. రయ్..!

చురుగ్గా పైవంతెన నిర్మాణ పనులు

న్యూస్‌టుడే, రణస్థలం

రణస్థలం సమీపంలో సర్వీసు రహదారి నిర్మాణానికి సన్నాహాలు

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రణస్థలం కూడలి వద్ద పైవంతెన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. రణస్థలం వద్ద బైపాస్ నిర్మించాలని గతంలో నిర్ణయించినప్పటికీ వివాదం నెలకొనడంతో నిలిచిపోయింది. కూడలిలో ఎలివేటెడ్ పైవంతెన నిర్మించడానికి ఎన్‌హెచ్ఏఐ నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.242 కోట్లు మంజూరు చేసి టెండరు ఖరారు చేసింది. గుత్తేదారు సంస్థ ఏప్రిల్‌లో పనులు ప్రారంభించినా వర్షాకాలంలో నెమ్మదిగా సాగాయి. ఇటీవల జోరు పెరిగింది. సర్వీసు రహదారికి ఇరువైపులా విభాగిని స్థలాన్ని కలిపి నిర్మాణాలు చేపట్టారు. రెండు వైపులా కాలువలు కడుతున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత పదేళ్ల పాటు పనులు దక్కించుకున్న ఆ సంస్థ నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షిస్తుంది.

ట్రాఫిక్ మళ్లింపు

◆ ఈ నెల 11 నుంచి శ్రీకాకుళం-విశాఖ మార్గంలో తహసీల్దారు కార్యాలయం నుంచి సీఐ కార్యాలయం వరకు, విశాఖ-శ్రీకాకుళం దారిలో పోలీసు స్టేషన్ నుంచి విద్యుత్తు ఉపకేంద్రం వరకు సర్వీసు రహదారుల్లో ట్రాఫిక్ మళ్లించనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రాజెక్టు మేనేజరు రాధాకృష్ణ తెలిపారు.

◆ ఆ ప్రాంతంలో వంతెన నిర్మాణం ప్రారంభించనున్నారు. పైవంతెనకు సంబంధించి గడ్డర్లు దన్నానపేట వద్ద ఏర్పాటు చేసిన యార్డులో నిర్మిస్తున్నారు.

◆ గడువుకు ముందే పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో సంబంధిత సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.

◆ ట్రాఫిక్ మళ్లింపు నేపథ్యంలో సర్వీసు రహదారిలో వాహనాలు నిలపొద్దని. కూడలిలో దుకాణదారులు సహకరించాలని కోరారు. ఇప్పటివరకు 15 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు.

రేపటి నుంచి సిక్కోలు పుస్తక మహోత్సవం

మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ నగరపాలకోన్నత పాఠశాల మైదానంలో మంగళవారం నుంచి ఈ నెల 20 వరకు నిర్వహించనున్న సిక్కోలు పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ కోరారు. యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కవులు, రచయితల పుస్తకాలు, కవితలు, ఆవిష్కరణలు, పరిచయాలు, సమీక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. పాఠకులు పెద్దఎత్తున హాజరై పుస్తకాలు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రజల్ని చైతన్యపరిచే శాస్త్రీయ ప్రయోగాలు, ఇతర ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కామేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు బి.మోహనరావు, చెకుముకి సంబరాల కన్వీనర్ కూర్మారావు, ఉన్నత విద్య జిల్లా కన్వీనర్ ఎం.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆశల పంటపై.. నష్టాల వేటు..!

వరుస వర్షాలు, మొంథా తుపానుకు బొప్పాయి తోటలు దెబ్బతినడంతో సాగు చేసిన రైతులు కుదేలయ్యారు. మరోవైపు తెగుళ్లు ఆశించి దిగుబడి తగ్గిపోయింది. లావేరు, రణస్థలం మండలాల్లో 450 ఎకరాల్లో పంట సాగు చేయగా 200 ఎకరాల్లో నాశనమైంది. పెట్టుబడి సైతం రాదని తెలుసుకున్న రైతులు సుమారు 80 ఎకరాల్లో చెట్లను నరికేశారు. వర్షాలతో ఊహించని నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. లావేరు మండలం సీతంవలసలో నరికేసిన బొప్పాయి చెట్లను చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, లావేరు

బకాయిలు చెల్లించాల్సిందే

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: అరబిందో సంస్థ నుంచి బకాయిలు ఇప్పించాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్.సురేష్‌బాబు డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలో ఆదివారం ఆ సంఘం జిల్లా ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫార్మసిస్ట్ చేయాల్సిన పని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అప్పగించడం తగదన్నారు. అయిదేళ్లుగా సేవలందిస్తున్నా వేతనాల్లో మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చల్ల నారాయణరావు, ధర్మాన కిరణ్ పాల్గొన్నారు.

ఈకేవైసీ ఉంటేనే రాయితీ..!

గ్యాస్ వినియోగదారులకు అధికారుల సూచన

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వంట గ్యాస్ సిలిండర్లకు కేంద్ర ప్రభుత్వం అందించే రాయితీ అందాలంటే ఈకేవైసీ, బయోమెట్రిక్ తప్పనిసరి. గృహ ఎల్పీజీ వినియోగదారులు ఏటా మార్చి 31 లోగా ధ్రువీకరించుకోవాలి. సిలిండర్ పొందడానికి ఎలాంటి ఇబ్బంది లేకున్నా.. రాయితీ పొందాలంటే ఈకేవైసీ చేయించుకోవాల్సిందేనని ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏజెన్సీల నిర్వాహకులు వినియోగదారులను చైతన్యపరుస్తున్నారు. ఇప్పటివరకు ఒకసారి చేస్తే సరిపోయేది. ఇకపై ఏటా చేయించుకోక తప్పదు.

జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు :	కనెక్షన్లు :	ఈకేవైసీ చేయాల్సినవి :
43	6,92,825	1,03,925

ఉచిత సేవ

❐ ఈకేవైసీ ధ్రువీకరణ సేవలను వినియోగదారులు ఉచితంగా పొందొచ్చు.

❐ సంబంధిత గ్యాస్ ఏజెన్సీ కేంద్రానికి వెళ్లి లేదా ఇంటికి సిలిండర్ తెచ్చిన డెలివరీ బాయ్ వద్ద యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు.

❐ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉంటే నేరుగా యాప్‌లో ధ్రువీకరణ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ 8, 9 సిలిండర్లు పొందేలోపే చేయాలి. మార్చి 31 లోగా చేయకుంటే చివరి విడత రాయితీ జమ కాదు. ఆ తర్వాత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే చేసుకోవాలి.

❍ కేంద్ర ప్రభుత్వం ఏడాదికి గరిష్ఠంగా 9 సిలిండర్లకు రాయితీ అందిస్తోంది. వినియోగదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా ఆ మొత్తం సంబంధిత కంపెనీలు జమ చేస్తున్నాయి. సాధారణ కనెక్షన్లకు అందే సొమ్ము తక్కువే. ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన కింద కనెక్షన్లు పొందిన వారికి రాయితీ ఎక్కువగా ఉంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం..: గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం తప్పనిసరి. వినియోగదారులందరూ అవకాశం ఉంటే గ్యాస్ ఏజెన్సీ కేంద్రానికి వెళ్లి వివరాలు ధ్రువీకరించుకుని రాయితీ పొందాలి. ఏజెన్సీ ప్రతినిధుల ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం.

- సూర్యప్రకాశరావు, డీఎస్‌వో, శ్రీకాకుళం

తెచ్చారు.. వదిలేశారు

సారవకోట మండలం గొర్రిబంద పంచాయతీ కోనవానిపేట గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా పైపులైన్లు ఏర్పాటు చేసి మూడు నెలలైంది. ఇంటింటా తాగునీరందించడానికి కుళాయిలు తెచ్చి గ్రామంలో ఒకచోట కుప్పగా వదిలేశారు. రెండు నెలలవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధును 'న్యూస్‌టుడే' సంప్రదించగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, సారవకోట

న్యూస్‌టుడే, లావేరు

లాభాల్లో మునగ తేలాలని..!

పైలట్ ప్రాజెక్టు కింద 7 మండలాల ఎంపిక

మునగ సాగుతో రైతులు లాభాలు ఆర్జించేలా కూటమి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. సాగు విస్తీర్ణం పెంచడంలో భాగంగా జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ప్రస్తుతం కాయలు, ఆకుకు విపరీతమైన గిరాకీ ఉంది. ఈ నేపథ్యంలో రైతుల ఎంపిక నుంచి నిర్వహణ బాధ్యతను డీఆర్‌డీఏ అధికారులు పర్యవేక్షించనున్నారు.



నిధుల మంజూరు ఇలా..

★ ఎకరా పొలంలో 4 వేల మొక్కలు నాటాలి.

★ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1.32 లక్షలు మంజూరు చేస్తారు.

★ విత్తనాలు, మొక్కల సరఫరా, ఇతర అవసరాలకు మరో రూ.31 వేలు సెర్ప్ సమకూరుస్తుంది.

★ జిల్లాలో 50 ఎకరాలు గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు.

★ డ్వాక్రా సభ్యుల కుటుంబాలను యూనిట్‌గా తీసుకోవాలని నిర్ణయించారు.

★ ఇప్పటికే ఎంపిక చేసిన మండలాల్లో రైతులకు సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు.

★ ఆయా ప్రాంతాల్లో విస్తీర్ణానికి అనుగుణంగా శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు సెర్ప్ రుణం మంజూరు చేయనుంది.

★ పంట కాలం పూర్తయ్యాక మార్కెట్ అందుబాటులో ఉండేలా అధికారులే చొరవ తీసుకుంటారు.

★ ఉపాధి హామీ పథకం కింద రెండేళ్ల పాటు ఈ సాగుకు ఆర్థిక సహకారం అందిస్తారు. ★ 25 సెంట్ల నుంచి గరిష్ఠంగా హెక్టారు వరకు ప్రోత్సాహకం అందుతుంది.

★ గుంతలు తీయడం, మొక్కలు నాటడం, నీరు పెట్టడం, ఎరువులు, పర్యవేక్షణకు ఉపాధి హామీ పథకం కింద డబ్బు చెల్లిస్తారు.

★ 25 సెంట్లలో 1,000, 50 సెంట్లలో 2 వేలు, 75 సెంట్లలో 3 వేలు, ఎకరానికి 4 వేల మొక్కలు పెంచాలి. ఒకసారి నాటితే 5 ఏళ్ల పాటు దిగుబడి ఉంటుంది. 4 నెలల్లో పంట చేతికొస్తుంది. ఆసక్తి గల రైతులు ఏపీఎంలను సంప్రదించాలి.

200 ఎకరాల్లో..

★ లావేరు, మెళియాపుట్టి, పాతపట్నం, వజ్రపుకొత్తూరు, ఎచ్చెర్ల, టెక్కలి, ఇచ్ఛాపురం మండలాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు.

★ 200 ఎకరాల్లో మునగ సాగుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

★ పంట సంరక్షణ, ఆకు శుద్ధి చేయడం ఇతర బాధ్యతలు సెర్ప్ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు.

రైతుల్ని ఎంపిక చేయాలని ఆదేశించాం..: మునగ సాగుకు ఎంపిక చేసిన మండలాల్లో డీఆర్‌డీఏ సిబ్బంది రైతుల్ని ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికి వచ్చిన వివరాల ఆధారంగా ప్రతిపాదనలు రూపొందించాం. త్వరతగతిన రైతుల్ని ఎంపిక చేయాలని ఏపీవోలు, ఏపీఎంలను ఆదేశించాం.

- సుధాకర్, పీడీ, డ్వామా, శ్రీకాకుళం

జ్ఞాపకాల మదిలో...

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి

మీరు చూపిన ఆత్మీయత.. అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట.. మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.. ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలు అక్షరరూపంలో నివేదించడం తప్ప..



నిర్యాణం, వర్ధంతి, జయంతి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ఈనాడు ప్రకటనల విభాగం

80085 97609

(c) eenadu

కడుపు కోత..!

● జిల్లాలో పెరుగుతున్న సిజేరియన్ ప్రసవాలు

న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

కడుపులోని నలుసు బయట పడే వరకు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. తరచూ వైద్యుల్ని సంప్రదిస్తూ.. వారి సూచనలు పాటిస్తారు. ప్రసవం విషయానికి వచ్చే సరికి గర్భిణులకు శస్త్రచికిత్స తప్పనిసరి అయిపోతోంది. జిల్లాలో సుఖ ప్రసవాల కంటే కడుపుకోతలే ఎక్కువ జరుగుతున్నాయి.

జిల్లావ్యాప్తంగా గతేడాది ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం సెప్టెంబరు వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 8,009, ప్రైవేటులో 23,223 సిజేరియన్ ప్రసవాలు జరిగాయి. పురిటి నొప్పులతో వెళ్తుంటే వైద్యులు కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందని, ఉమ్మనీరు తక్కువగా ఉందని.. ఇలా పలు కారణాలు చెప్పి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. కొందరు మూఢనమ్మకాలతో ముహూర్తాలు పెట్టించుకుని ఆ సమయానికే ప్రసవం చేయాలని వైద్యులను కోరుతున్నారు.

జరుగుతున్న నష్టం ఇదీ..

అనవసరంగా శస్త్రచికిత్సలు చేయడంతో తల్లులు అనారోగ్యం బారిన పడుతున్నారు. రక్తహీనత, ఇన్ఫెక్షన్లు, మానసిక ఆందోళనలు, గర్భధారణ సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం సుఖ ప్రసవాలను పెంచాలనే ఉద్దేశంతో బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందజేస్తున్నా ఫలితం ఉండట్లేదు.

అవగాహన కల్పిస్తున్నాం..

సుఖప్రసవాలు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. గర్భం దాల్చిన నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలపై ఏఎన్ఎం, ఆశా, వైద్యాధికారులు గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప సిజేరియన్లు వద్దని సూచిస్తున్నాం.

– కె.అనిత, జిల్లా వైద్యాధికారిణి

జిల్లాలో ప్రసవాల తీరు ఇలా..

ఆసుపత్రి	సాధారణ		సిజేరియన్	
	2024-25	2024-25	2024-25	2024-25
ప్రభుత్వ	4,717	1,859	5,605	2,404
ప్రైవేటు	2,466	1,173	16,058	7,165

పేదలకు ఊరట

● 30 వరకు 'ఆవాస్ ప్లస్' సర్వే గడువు పెంపు

న్యూస్‌టుడే, రణస్థలం

ఇచ్ఛాపురంలో సర్వే చేస్తున్న సిబ్బంది

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు కొత్త ఇళ్లు మంజూరు చేసేందుకు కేంద్రం ప్రధానమంత్రి ఆవాస్ యోజన ప్లస్ పథకాన్ని ప్రకటించింది. అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆవాస్ ప్లస్ యాప్‌లో నమోదు చేయాలని ఇటీవల సూచించింది. అందుకు సంబంధించిన డిమాండు సర్వేను గత నెలలోనే ప్రారంభించినా యాప్ పని చేయకపోవడంతో సర్వే సక్రమంగా సాగలేదు. ఈ నెల 5తో గడువు ముగిసిపోవడంతో అంతా ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం యాప్‌ను మళ్లీ పునరుద్ధరించి సర్వే గడువును 30 వరకు పెంచింది.

● గతంలో జిల్లా వ్యాప్తంగా డిమాండు సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించారు. ఆ తర్వాత కొందరు సొంతింటి కోసం అర్జీలు సమర్పించారు. మరికొందరు ఆన్‌లైన్‌లో నేరుగా నమోదు చేసుకున్నారు. వీరందరూ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి.

● ప్రస్తుతానికి స్థలం ఉన్న అర్హులకు ఇళ్లు మంజూరు చేయనున్నారు. సచివాలయ, గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది ఆయా లబ్ధిదారుల ఇంటికెళ్లి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఏఈఈ పరిశీలన అనంతరం వాటిని పీడీ ఆమోదిస్తారు.

జిల్లాలో వివరాలిలా...

లబ్ధిదారుల సంఖ్య	54,833
గ్రామీణప్రాంతాల్లో	52,755
పట్టణ పరిధిలో..	2,078
స్థలాలున్నవారు	4,7637
లేనివారు	7,196

● 'యాప్ రెండు రోజులు నుంచి పని చేస్తుంది. ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించినవారి విషయంలో ప్రభుత్వం నిర్ణయం ప్రకటించాల్సి ఉంది' అని హౌసింగ్ పీడీ రమాకాంత్ తెలిపారు.

కుష్ఠుతో జాగ్రత్త..!

● బాధితులను గుర్తించేందుకు కార్యాచరణ

న్యూస్‌టుడే, పొందూరు

కుష్ఠు వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జిల్లాలో బాధితులను గుర్తించేందుకు ఈ నెల 17 నుంచి 30 వరకు ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. ఆశా కార్యకర్తలు, వైద్యాధికారులకు ఇప్పటికే దీనిపై శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించేందుకు మొత్తం 2,234 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ఐదేళ్లలో ఇదీ పరిస్థితి..

సంవత్సరం	కేసులు
2020-21	198
2021-22	166
2022-23	206
2023-24	237
2024-25	187

ఏం చేస్తారు..

వైద్య సిబ్బందితో పాటు సచివాలయ ఉద్యోగులు కూడా సర్వేలో పాల్గొంటారు. ఎక్కడైనా వ్యాధి లక్షణాలు గుర్తిస్తే జిల్లా కుష్ఠు నివారణ అధికారికి సమాచారం ఇస్తారు. వారిలో భయాన్ని తొలగించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందు అవగాహన కల్పిస్తారు. క్రమం తప్పకుండా వారికి చికిత్స అందిస్తారు. అందరూ ఇంటికి వచ్చిన సిబ్బందికి అడిగిన వివరాలు తెలియజేసి సహకరించాలని జిల్లా కుష్ఠువ్యాధి నివారణ అధికారి శ్రీకాంత్ తెలిపారు.

అనుమానిత లక్షణాలివే..

● చర్మంపై స్పర్శలేని మచ్చలు ● చల్లదనం, వేడిని గుర్తించలేకపోవడం ● అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం ● కనురెప్పలు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం ● కాళ్లు, చేతులకు తిమ్మిర్లు ● ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం రావడం ● చేతి, కాలి వేళ్లు వంకర్లు తిరగడం ● చేతులు, కాళ్లపై బొబ్బలు ● కనురెప్పలు మూతపడకపోవడం వంటివి.

కవేరా పురస్కార ప్రదానోత్సవం

సన్మాన గ్రహీతలతో శ్రీవేన్ ఫౌండేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళా మందిరంలో ఆదివారం శ్రీవేన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రసిద్ధ కథా రచయిత కబుగుల వెంకటరావు(కవేరా) జయంతిని పురస్కరించుకుని కవేరా పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు దంపతులు, డాక్టర్ మధుకర్ మారోజు వివేకర్ తదితులకు పురస్కారాలు అందజేసి.. జ్ఞాపికలతో సత్కరించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ కె.సుధీర్ అధ్యక్షోపన్యాసం చేశారు. గాయకుడు భారతీరమేష్ నిర్వహణలో జరిగిన సినీ వినోదంలో మహర్షి శాస్త్రీయ నృత్యం, సునాద లక్ష్మీగణపతి శర్మ తదితరుల ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ కె.శ్రీనివాస్, జెమ్స్ ఆసుపత్రి డీన్ డాక్టర్ డి.లక్ష్మీ లలిత, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు పి.జగన్మోహనరావు, డాక్టర్ సింధూర తదితరులు పాల్గొన్నారు.

మంగోలియాలో చిక్కుకున్న మత్స్యకారుడు

గారయ్య

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం లక్ష్మీపురం పంచాయతీ పిట్టవానిపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు తూలు గారయ్య ఈ ఏడాది మేలో ఉపాధి నిమిత్తం మంగోలియా దేశానికి వెళ్లారు. అక్కడ ఓ కంపెనీలో పెయింటర్‌గా చేరారు. ఒప్పందం పూర్తికావడంతో ఈ నెల 7న తిరిగి స్వదేశానికి వచ్చే క్రమంలో మంగోలియా రాజధాని ఉలాన్‌బాతర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గారయ్యను అక్కడ పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయం సంబంధిత కంపెనీ మేనేజర్ కుటుంబ సభ్యులకు శుక్రవారం రాత్రి చరవాణి ద్వారా తెలియజేశారు. ఎందుకు అరెస్టు చేశారో తెలియక పోవడంతో భార్య ఎర్రమ్మ, ఆత్మీయులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని స్వదేశానికి తీసుకొచ్చేలా చూడాలని కోరుతున్నారు.

11న జాతీయ విద్యాదినోత్సవం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: దేశ తొలి విద్యాశాఖ మంత్రి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 128వ జయంతిని పురస్కరించుకుని 11న జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడండి: మంత్రి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: జిల్లాలోని శైవ క్షేత్రాలు, ప్రముఖ ఆలయాల వద్ద కార్తికమాసం మూడో సోమవారం దర్శనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులకు సూచించారు. శ్రీముఖలింగం, రావివలస, ఉమారుద్రకోటేశ్వరాలయం, శ్రీకూర్మం, అరసవల్లి ఆలయాల్లో రద్దీ దృష్ట్యా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	145	245	265

గ్రామ పంచాయతీ కార్యాలయం, సోంపేట

రేఖా నెం.74/2025 **టెండరు ప్రకటన** తే: 10-11-2025

గ్రామ పంచాయతీ, సోంపేట పరిధిలో అన్ని వీధుల్లో పారిశుద్ధ్యం పనులు నిర్వహణకు చెత్తలు ఎత్తి దూరంగా పారివేయుటకు రెండు ట్రాక్టర్లు అవసరం అయి ఉన్నందున, నెలవారి అద్దె చెల్లించుటకు రెండు ట్రాక్టర్లు సరఫరా చేయుటకు ఆసక్తిగల అసామీల నుండి సీల్డుకవరు టెండర్లు తే 17-11-2025 ది సోమవారం ఉదయం 11 గం॥ల నుండి సాయంత్రం 3గం॥ వరకు సీల్డు కవర్లు స్వీకరించబడును.

షెడ్యూలు–II

S.No.	గ్రామపంచాయతీ పేరు	టెండరు	పని పేరు	చెల్లించవల్సిన ధరావత్తు
1.	2.	3.	4.	5.
1.	సోంపేట	రెండు ట్రాక్టర్లు సరఫరా	పారిశుద్ధ్యం పనులు నిర్వహణ	5000–00

నోటు:
1) ట్రాక్టర్ ఆయిల్ గ్రామపంచాయతీ భరిస్తుంది
2) ట్రాక్టర్ రిపేర్లతో గ్రామపంచాయతీకి సంబంధం లేదు.

01-04-2026 నుండి 31-03-2027 వరకు ట్రాక్టర్లు సరఫరా చేయవలెను. గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు ఆమోదించబడును.

ఇట్లు
పంచాయతీ కార్యదర్శి, సోంపేట

పత్రికా ప్రకటన

గ్రామపంచాయితీ కార్యాలయము, సోంపేట

రేఖా నెం.74/2025 టెండరు ప్రకటన తేది: 04-11-2025

సోంపేట గ్రామపంచాయితీ కార్యాలయములో విధులు నిర్వహిస్తున్న 60 మంది కాంట్రాక్ట్ పారిశుద్ధ్య సిబ్బందికి 2025-2026 ఆర్థిక సంవత్సరానికి తల ఒక్కంటికీ రెండు యూనిఫారంలు, రెండు తువ్వాళ్లు, రెండు జతల చెప్పులు, కొబ్బరి నూనె మరియు సబ్బులను సరఫరా చేయడానికి తే 17-11-2025ది సోమవారం ఉదయం 11 గం॥ల నుండి సాయంత్రం 3 గం॥ల వరకు సీల్డు టెండరు కవర్లు స్వీకరించబడును.

షెడ్యూలు - 1

వ.నెం.	గ్రామపంచాయితీ పేరు	టెండరు అంశం	చెల్లించవలసిన ధరావత్తు
1	సోంపేట	ఒక జత యూనిఫాం ధర మరియు కుట్టుకూలి	15,000 /-
2	సోంపేట	ఒక జత చెప్పులు	5,000 /-
3	సోంపేట	ఒక జత తువ్వాళ్లు	1,000 /-
4	సోంపేట	ఒక లీటరు కొబ్బరి నూనె	2,000 /-
5	సోంపేట	సబ్బులు	2,000 /-

గ్రామ పంచాయితీ పని వేళల్లో టెండరు దరఖాస్తు మరియు మిగతా వివరాలు కొరకు సంప్రదించవలెను. స్వీకరించిన టెండర్లు గ్రామ పంచాయితీ తీర్మానం మేరకు ఆమోదించబడును.

ఇట్లు.. పంచాయితీ కార్యదర్శి, సోంపేట

కుమార్తెల కళ్లెదుటే తల్లి మృత్యువాత

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ఇద్దరు కుమార్తెలను బస్సు ఎక్కించేందుకు వచ్చిన తల్లి అదే బస్సు ఢీకొనడంతో కన్నుమూసిన ఘటన దంత గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకిపల్లి సుందరమ్మ (63) భర్త కొన్నాళ్ల కిందట చనిపోయారు. కుమార్తెలు నీలవేణి, రాములమ్మకు వివాహాలయ్యాయి. వారు శ్రీకాకుళం, తమ్మయ్యపేటలో ఉంటున్నారు. కుమార్తెలను బస్సు ఎక్కించేందుకు ఆదివారం గ్రామంలోని కొత్తమ్మతల్లి ఆలయం వద్దకు సుందరమ్మ వచ్చారు. మలుపు తిప్పుతున్న సమయంలో బస్సు ఆమెను వెనక నుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి తరలించారు.. అప్పటికే మృతి చెందారు. కళ్లెదుటే తల్లి మృత్యువాత పడటంతో కుమార్తెలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై శ్రీకాకుళం నగర సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి దుర్మరణం చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన నామాల వేణు(22) అదే ప్రాంతానికి చెందిన ఆమె స్నేహితుడు శ్రీనివాస్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వైపు వస్తున్నారు. కొత్త రహదారి వద్ద ఓ లారీ డ్రైవర్ నడుపుకుంటూ రోడ్డు దాటుతుండగా వాహనంతో ఢీకొన్నారు. ఘటనలో వేణు కిందపడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. లారీ డ్రైవర్, శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు.

అతి వేగానికి నిండుప్రాణం బలి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం కొజ్జిరియా కూడలి సమీపంలోని కల్వర్టు వద్ద ఇచ్ఛాపురం రత్తకన్న నుంచి జగదేవపుట్టుగ గ్రామానికి వస్తున్న ఇటుక ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా హింజలికాట్ గ్రామానికి చెందిన కార్తీక్‌దాస్ (16) రత్తకన్నలో ఇటుక బట్టీలో పని చేస్తున్నాడు. ఆదివారం జగదేవపుట్టుగకు ఇటుక లోడు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో వాహనం బోల్తా పడింది. తీవ్ర గాయాల పాలైన యువకుడిని ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రిలో చేర్పించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనకు అతి వేగమే కారణమని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని, సోమవారం ఇటుక బట్టీకి వెళ్లి తనిఖీలు నిర్వహించి యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఎస్సై రవివర్మ తెలిపారు.

ఆశా కార్యకర్త మృతి

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోటకు చెందిన ఆశా కార్యకర్త రేగు సింహాచలమ్మ (45) ఈనెల 5న దుస్తులు ఉతుకుతుండగా స్నానపు గది గోడ కూలడంతో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త కొద్ది సంవత్సరాల కిందట మృతి చెందారు. వివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు సారవకోట పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌమ్య తెలిపారు.

నాగావళి నదిలో యువకుడి గల్లంతు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నాగావళి నదిలో మరో యువకుడు గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. నగరంలోని మహిళామండలి వీధికి చెందిన ఉమ్మిడి ఉదయ్ ఆదివారం సాయంత్రం ముగ్గురు స్నేహితులతో కలిసి నదిలో స్నానానికి వెళ్లారు. వరద తాకిడికి అందరూ కొట్టుకుపోతుండగా.. స్థానికులు గమనించి ముగ్గురిని రక్షించారు. ఉదయ్ గల్లంతయ్యాడు. తండ్రి నారాయణ టాక్సీ డ్రైవరుగా పని చేస్తున్నారు. ఐటీఐ పూర్తి చేసిన యువకుడు ఓ ప్రైవేటు కంపెనీలో ప్రత్యేకంగా శిక్షణ పొందుతూ నెలరోజుల కిందటే ఇంటికి వచ్చాడు. రెండో పట్టణ ఎస్సైలు లక్ష్మి, రామారావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అగ్నిమాపక సిబ్బందితో కలిసి రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు.

కూర్మనాథ క్షేత్రానికి భక్తుల తాకిడి

గార మండలం శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం 11.30 గంటల నుంచి మూడు గంటల పాటు క్యూలైన్లు కిటకిటలాడాయి. రద్దీ కారణంగా అధికారులు ప్రత్యేక దర్శనాలు రద్దు చేశారు. ఈవో నరసింహనాయుడు, ఎస్సై గంగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, గార(శ్రీకూర్మం)

మేజర్ కవితకు సత్కారం

బ్రహ్మపుత్ర నదిలో సాహస రాఫ్టింగ్ యాత్ర సాగించి ప్రపంచ రికార్డు సాధించిన వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరుకు చెందిన మేజర్ కవిత వాసుపల్లి గ్రామస్థులు సత్కరించారు. ఆదివారం స్వగ్రామంలో ఆమెకు అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పలువురు వక్తలు మాట్లాడారు. ఆమె తల్లిదండ్రులు వాసుపల్లి రామారావు, రమ్యను సన్మానించారు. సంఘం ప్రతినిధులు దిలీప్, కృష్ణారావు, ప్రకాశ్, దుర్యోధన తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ఇంటి నుంచే విద్యుత్తు సేవలు

● అందుబాటులో ఏపీఈపీడీసీఎల్ యాప్



విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆండ్రాయిడ్ చరవాణుల్లో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తారు.

జిల్లా	శ్రీకాకుళం
కనెక్షన్లు	7,99,127
ప్రతినెలా బిల్లు	రూ.128 కోట్లు

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్, గురుద్వారా

బిల్లు చెల్లించొచ్చు: విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు బిల్‌పే ద్వారా సర్వీసు నంబరు, చరవాణి నంబరు పొందుపరిస్తే సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి.

సప్లయి పొజిషన్: వినియోగదారుడు సర్వీసుకు సంబంధించి విద్యుత్తు సరఫరా తీరును ఎప్పటికప్పుడు లైవ్‌లో చూసుకునే సదుపాయం ఉంది.

మొబైల్ లింకింగ్ : విద్యుత్తు వినియోగదారులు తమ విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించి చరవాణి నంబరును అనుసంధానిస్తే విద్యుత్తు బిల్లుల సమాచారం చరవాణికి అందుతుంది.

ఎనర్జీ కాలిక్యులేటర్ : ఏ ఏ ఉపకరణానికి ఎంత విద్యుత్తు ఖర్చవుతుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు వినియోగానికి సంబంధించిన మీటరు రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు సమాచారం కనిపిస్తుంది.

కస్టమర్ కేర్: వినియోగదారులు తమ సమస్యలను ఇందులో పొందుపరచొచ్చు. అందిన సప్లై వివరాలు, అవసరమైన అన్ని లింకులు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

లింక్ ఆధార్: వినియోగదారుడు విద్యుత్తు సర్వీస్‌కు తమ ఆధార్ వివరాలను జత చేసుకోవచ్చు.

కన్జంప్షన్: వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు అందుబాటులో ఉంటాయి.

లోడ్ కంప్లైంట్: విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు వంటి ఫిర్యాదులను వినియోగదారుడు నేరుగా ఫిర్యాదు చేయడమే గాక కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్య పరిష్కారం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు.

పే బిల్: సర్వీసు నంబరు నమోదు చేసుకుని నెలవారీ విద్యుత్తు బిల్లులకు సంబంధించిన నగదు చెల్లించొచ్చు.

అధికారుల వివరాలు : వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు లభ్యమవుతాయి. ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

టారిఫ్ : వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

క్విక్‌పే : సర్వీసు నంబరు, చరవాణి నంబరును నమోదు చేస్తే సంబంధిత బిల్లు వివరాలు వస్తాయి. అక్కడి నుంచి బిల్లు చెల్లించొచ్చు.

తండ్యాంలో ఇల్లు దగ్ధం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం తండ్యాం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో నేతల చిన్నమ్మడుకు చెందిన ఇల్లు దగ్ధమైంది. విలువైన ఫర్నీచర్, కొత్తగా కడుతున్న ఇంటి కోసం దాచిన కలప, గుమ్మాలు, ద్విచక్ర వాహనం, రూ.6 లక్షల నగదు కాలి బూడిదయ్యాయి. రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. ఆ సమయంలో ఇంట్లోని వారంతా పొలం పనులకు వెళ్లారు. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణమని అగ్నిమాపక సిబ్బంది నిర్ధారించారు.

మాజీ మంత్రి అప్పలరాజుకు మరో నోటీసు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: మాజీ మంత్రి డా.సీదిరి అప్పలరాజుకు కాశీబుగ్గ పోలీసులు ఆదివారం మరో నోటీసు ఇచ్చారు. జీఎంఈ కాలనీలోని నివాసానికి వెళ్లి ఎస్సై నరసింహమూర్తి ఆదివారం నోటీసు అందజేశారు. కల్తీ మద్యంపై గత నెల 13న వైకాపా ఆధ్వర్యంలో కాశీబుగ్గలో ర్యాలీ నిర్వహించారు. అందుకు సంబంధించి అప్పలరాజుతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేయగా.. దీని విచారణకు సోమవారం హాజరు కావాలని తెలియజేశారు.

విజేత జట్టు ట్రోఫీ అందిస్తున్న అతిథులు, నిర్వాహకులు

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. అన్ని విభాగాల్లో రాణించి విశాఖ జిల్లా క్రీడాకారులు ఛాంపియన్ షిప్ దక్కించుకున్నారు. బాలుర విభాగంలో 22 మంది, బాలికల్లో 22 మంది వచ్చే నెల మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా వ్యాయామోపాధ్యాయ సంఘ అధ్యక్షుడు తవిటయ్య తెలిపారు. విజేతలకు అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, తెదేపా నాయకులు బహుమతులు అందించారు.

కబడ్డీలో సిక్కోలు సత్తా

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తా చాటారు. సబ్ జూనియర్స్ విభాగంలో బాలికలు అనంతపురం జట్టుపై విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర జట్టు బాపట్ల టీం తలపడి ద్వితీయ స్థానంలో నిలిచిందని జట్టు మేనేజరు ఎం.వెంకటరావు తెలిపారు. శిక్షకులుగా డి.శ్యామ్, కాంతారావు, ఝాన్సీలు వ్యవహరించారు. విజేతలను జిల్లా కబడ్డీ సంఘ ప్రతినిధులు అభినందించారు.

జిల్లా బాలిబాలికల జట్లతో శిక్షకులు

జాతీయ స్థాయికి ఏడుగురి ఎంపిక

శ్రీకాకుళం అర్బన్; న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ఏడుగురు సిక్కోలు క్రీడాకారులు ప్రతిభ చూపారు. అండర్-14 విభాగంలో ఆరంగి కల్యాణ్, పంగ షణ్ముఖ శ్రీ, అండర్-19లో పైడి త్రివేణి, గోపిన తనీషా, వడిశ మేఘన, గోపిన లక్ష్మీతన్విక, పైడి లోకేశ్ పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరు ఉత్తరప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారని శిక్షకులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పతకాలు అందుకున్న విద్యార్థులు

విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండు

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పొందూరు కేజీబీవీ విద్యార్థిని వందనను దళిత సంఘ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘటనకు కారణమైన కేజీబీవీ ఎస్‌వో లలితకుమారి, ఇతర అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. వందన విద్యా సంవత్సరం కోల్పోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఆమెకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. దళిత సంఘాల ఐకాస జిల్లా కన్వీనర్ గణేష్, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, అంబేడ్కర్ యువజన సంఘ జిల్లా నాయకులు రాంబాబు, జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

EENADU Classifieds

JOBS

Airtel కంపెనీలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్(M/F) కావలెను జీతం16-22వేలు, సంప్ర:Airtel ఆఫీస్, కృష్ణాపార్క్ దగ్గర, శ్రీకాకుళం ✆9676988856

Restaurant Waiter Jobs కొరకు బాయ్స్ & గర్ల్స్ కావలెను. ఇంటర్వ్యూ: హోటల్ విన్సర్‌పార్క్, KGH ఎదుట,వైజాగ్. బాయ్స్‌కు వసతి భోజనం. 9849581868

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

శ్రీకాకుళం జిల్లాలో గల రూరల్ & అర్బన్ ప్రాంతాల నందు శ్రీరామ్ చిట్స్ & లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నందు పనిచేయుటకు BDES & రెన్యూవల్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్, డిపాజిట్స్ EXE.. ETS కావలెను. మీ ఊర్లోనే మంచి ఉద్యోగం ఇది పూర్తిగా ఆన్ రోల్ జాబ్, మినిమం శాలరీ 18,000/- PF, ESI, గ్రూప్ INS, సం.కు బోనస్ 28,500/- ఏదైనా డిగ్రీ చదివి 35 సం॥ లోపు ఉండి అనుభవాన్ని బట్టి శాలరీ కలదు. Salaried DO'sకు 10th పాసై KYC కలిగి ఉంటే, ప్రతీనెల శాలరీ & ORCలో రాయల్టీ కమిషన్ వస్తుంది. RMP, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్ ఏజెంట్స్, లోన్ ఇతరులు ✆ 9849824071.

SECURITY GUARDS

వైజాగ్ సిటీ, పైడిభీమవరం, తగరపువలస పనికొరకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ & గార్డ్స్ రూమ్, భోజనం. జీతం: 20వేలు, 36 వేలు. ✆ 9014709272.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

వంశధార కాలువ పొడిగించాలి

హరిపురంలో చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న వంశధార సాధన కమిటీ సభ్యులు

హరిపురం (మందస), న్యూస్‌టుడే: వంశధార కాలువను ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని వంశధార జలసాధన కమిటీ సభ్యులు డిమాండు చేశారు. ఈ మేరకు మందస మండలం హరిపురంలో ఆదివారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. సాధన కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎం.మన్మథరావు, డి.వెంకటరావు పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ

పలాస మండలం బ్రాహ్మణతర్లా కాటమ్మతల్లి ఆలయ ఆవరణలోని హరిహర సుతుడు అయ్యప్పస్వామి వారి సన్నిధానంలో ఆదివారం ఘనంగా పడిపూజ నిర్వహించారు. భక్తి పాటలతో పరిసరాలన్నీ మార్మోగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సన్నిధాన గురుస్వామి షణ్ముఖ స్వామి, పైల చిట్టి స్వామి, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు పతకాలు



ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం కాదా లక్ష్మీకాంతమ్మ పుర బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న **గాంద్రేటి చందన** రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రెండు పతకాలు కైవసం చేసుకుందని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పీఈటీ లత తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురంలో ఈ పోటీలు జరిగాయి. ఇందులో 4x100 రిలే పరుగులో స్వర్ణం, 100 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించింది. ఈ మేరకు విద్యార్థిని పాఠశాల ఎస్ఎంసీ అధ్యక్షుడు గిన్ని వెంకటరమణ (చిన్ని), కోఆప్షన్ సభ్యులు బి.కృష్ణయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈత పోటీలో రజతం

జాతీయ ఈత పోటీలకు ఎంపికైన శైలజతో భారతి, రామారావు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం కేజీబీవీ విద్యార్థిని గుమ్మడి శైలజ రాష్ట్రస్థాయి ఈత పోటీలో రజత పతకం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందింది. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో అండర్ 19 విభాగంలో 100 మీటర్ల బటర్‌ఫ్లై అంశంలో శైలజ రెండో స్థానంలో నిలిచిందని పాఠశాల పీఈటీ భారతి, కోచ్ బత్తుల రామారావు తెలిపారు. శైలజ గతేడాది నరసారావుపేటలో జరిగిన పోటీల్లో స్వర్ణ పతకం అందుకుంది. విజేతను కేజీబీవీ ప్రిన్సిపల్ డా.పి.శిరీష, ఉపాధ్యాయులు అభినందించారు.

వాగ్దేవి పురస్కారం అందజేత

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడు: రిట్టపాడుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, కవి బమ్మిడి సుబ్బారావుకు ఆదివారం సింహాచలంలో జాతీయ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో జాతీయ వాగ్దేవి పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు. సంస్కృతి, సాహితీ, సంప్రదాయాల పరిరక్షణకు చేస్తున్న కృషికి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ఇరుకు దారులు.. ఇక్కట్లు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం, పలాస గ్రామీణం

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలో వాహనాల రాకపోకలు పెరుగుతున్నా దానికి తగ్గట్టు రోడ్ల వెడల్పు చేయడం లేదు. పంచాయతీ కాలం నాటి రహదారులనే నేటికీ వినియోగించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చాలా ప్రాంతాల్లో ఇరుకు రోడ్లు ఉండటంతో నిత్యం ఎక్కడో చోట ప్రమాదం సంభవించి కొందరు మృతి చెందగా.. మరికొందరు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలవుతున్నారు.

రెండు నియోజకవర్గాల పరిధిలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, పలాస, మందస, వజ్రపుకొత్తూరు తదితర ప్రాంతాల్లో నేటికీ ఇరుకు రోడ్లతోపాటు మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు మండల కేంద్రాలకు రావాలంటే నరకం చూస్తున్నారు. ఆయా పరిధిలో అంతర్గత రహదారులతోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులూ అంతంత మాత్రంగానే ఉన్నాయి.

ఇరుకు రోడ్ల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఇచ్ఛాపురం, పలాస రోడ్లు, భవనాల శాఖ జేఈ విక్రమ్ తెలిపారు.

జరిగిన ఘటనలు

★ ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి నుంచి అరకభద్ర వెళ్లే రహదారిలో జగన్నాథపురం వద్ద నాలుగేళ్ల కిందట సాడి శివప్రసాద్ ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి మృత్యువాత పడ్డారు. అదే రోడ్డులో గతేడాది పాఠశాల బస్సు ఓ పక్కకు ఒరిగి చిన్నారులు ప్రమాదానికి గురయ్యారు. 2024 అక్టోబర్‌లో జగన్నాథపురం సమీపంలో ఓ ప్రయాణికుల బస్సు ప్రమాదానికి గురైంది.

★ పలాస పరిధిలో రెండేళ్ల కిందట రెంటికోటకు చెందిన జుద్దిష్టి మంత్ర (52) పొలం నుంచి వస్తుండగా గొప్పిలి నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో రైతు మృతి చెందారు.

జగన్నాథపురం.. ఇరుకు రోడ్డులో ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగిస్తున్న వాహనాలు

కారణాలివే.. చాలా చోట్ల వేగ నియంత్రికలు, ప్రమాద హెచ్చరికలు లేకపోవడం, మలుపులు, ఇరుకు దారుల్లోనూ సూచికలు కనిపించకపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

నియోజవర్గాల పరిధిలో వివరాలు..

మండలాలు	పంచాయతీలు	మొత్తం రోడ్లు	ఇరుకువి
ఇచ్ఛాపురం	21	57	47
కవిటి	23	112	82
కంచిలి	31	75	50
సోంపేట	23	47	39
పలాస	19	55	50
మందస	41	105	90
వజ్రపుకొత్తూరు	37	94	80

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పలాస : 80085 74279 ఇచ్ఛాపురం : 90631 44707

సమస్య : ఇచ్ఛాపురం పట్టణం బ్రాహ్మణవీధిలో వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నాం. – పి.బుజ్జి, ఇచ్ఛాపురం

సమాధానం : పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – ఐ.కిషోర్, ఏఈ, ఇచ్ఛాపురం

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పలాస-కాశీబుగ్గ పుర కమిషనర్‌గా శ్రీనివాసులు?

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పుర పాలక సంఘం కమిషనర్‌గా ఇ.శ్రీనివాసులును నియమిస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు పుర కమిషనర్‌గా పని చేస్తున్న ఎన్.రామారావును బదిలీ చేసింది. ఈయన స్థానంలో పొన్నూరు పురపాలక సంఘంలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు గ్రేడ్-3 కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఈనెల 6న ఉత్తర్వులు జారీ చేసింది. జీవో విడుదల చేసి మూడు రోజులు దాటుతున్నా సీడీఎంఏ నుంచి అధికారిక నియామక ఉత్తర్వులు పురపాలక సంఘానికి చేరకపోవడంతో కమిషనర్ బదిలీ ఉత్కంఠగా మారింది.

రోడ్డు మధ్యలో ప్రమాదం

ఇచ్ఛాపురం 23వ వార్డులో ఓ కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. నాలుగురోడ్ల కూడలి కావడంతో ఎవరైనా ఏమరపాటుగా వస్తే ప్రమాదం జరిగే అవకాశముందని వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నింటినీ కలిపి సిమెంటు పూత వేయాలని వారు కోరుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

రాకపోకలకు అవస్థలు

ఇటీవల సంభవించిన తుపాను వర్షాలకు పలాసపురం నుంచి జాతీయ రహదారి వైపు వెళ్లే రోడ్డు కల్వర్టు కొట్టుకుపోవడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలాసపురం గ్రామస్థులు, రైతులు పంటపొలాలు, ఇతర పనులకు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని జడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద తెలిపారు. – న్యూస్‌టుడే, సోంపేట

శిథిలం.. భయం భయం

పాత శాసనాంలో శిథిల భవనంలో ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల నిర్వహించగా శిథిలావస్థకు చేరడంతో మరో భవనానికి మార్చారు. అనంతరం దీంట్లో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సీడీపీవో రాజేశ్వరిని వివరణ కోరగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

దారి.. దారుణంగా మారి

మందస మండలం హరిపురంలోని అయ్యప్పనగర్‌కు వెళ్లే మార్గమిది. పెద్దచెరువు నుంచి వినియోగాని నీరు దిగువకు వెళ్లి ఈ రహదారిపై చేరుతుండటంతో బురదగా మారింది. సుమారు 70 కుటుంబాల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆ దారిపైకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకుంటామని సర్పంచి జె.పురుషోత్తం తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం(మందస)

నివాసాల నడుమ మురుగు ప్రవాహం

ఇచ్ఛాపురం పుర పరిధి 20వ వార్డు కేపీ కాలనీలో ప్రజల అవస్థలు ఇవి. రూ.లక్షలు వెచ్చించి నివాసాలు నిర్మించుకున్నా, మురుగునీటి పారుదల వ్యవస్థ లేక, దుర్గంధం నడుమ జీవనం సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా తమ దీనావస్థను గుర్తించి, పక్కా కాలువలు, రోడ్ల నిర్మించాలని కోరుతున్నారు. దీనిపై పుర కమిషనర్ రమేష్ స్పందిస్తూ కాలనీలో కొన్ని సమస్యలు పరిష్కరించామని, మిగిలినవి నిధుల మేరకు పూర్తిచేస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

భాజపా పట్టణ అధ్యక్షుడిగా ఢిల్లీరావు

సాలిన ఢిల్లీరావును సత్కరిస్తున్న వీకే ప్రసాద్

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పుర పరిధి భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా సాలిన ఢిల్లీరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోర్జివీధిలోని పైవేటు సామాజిక భవనంలో ఆదివారం జరిగిన భాజపా సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. పార్టీ జిల్లా కోశాధికారి వల్లంపాటి కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని పర్యవేక్షించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఢిల్లీరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు. పార్టీలో చేరిన వాసుదేవరావుకు కృష్ణప్రసాద్, ఢిల్లీరావు భాజపా కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం పార్టీని పుర పరిధిలో బలోపేతం చేసేందుకు నిర్ణయించారు.

కనకదుర్గ ఆలయ కమిటీ ఎన్నిక

కవిటిలో కనకదుర్గ ఆలయ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ బందరు జ్ఞానానందం, కార్యదర్శిగా బందరు శివప్రసాద్, కోశాధికారిగా బందరు విద్యాసాగర్, ఉపాధ్యక్షుడిగా తామాడ నరసింహమూర్తి, సహాయ కోశాధికారిగా అనుపోజు తారకేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా తులసీదాస్, బాన్నరావు, లక్ష్మీనారాయణ, పవన్ తదితరులు ఎంపికయ్యారు. విశ్వబ్రాహ్మణ పెద్దలు బందరు ఉమామహేశ్వరరావు, కిమ్మోజు కుమారస్వామి తదితరులు పాల్గొని కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

బాలియాత్రలో ప్రభుత్వ విప్

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీముఖలింగంలో ఆదివారం జరిగిన బాలియాత్రలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాత్ర ఏర్పాట్లు పరిశీలించారు. కమిటీ సభ్యులతో మాట్లాడి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దేవుడిని దర్శించుకున్నారు.

కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అశోక్

నేటి నుంచి ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు

ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగ విద్యార్థుల చైతన్య ప్రదర్శన

ఇచ్ఛాపురం/గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: సామాజిక సేవ, జన చైతన్యం, పర్యావరణ పరిరక్షణ ప్రతి విద్యార్థికి ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు కె.శ్రీనివాసరావు తెలిపారు. డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం సమన్వయకర్త వసంత ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం ఎన్‌ఎస్‌ఎస్ పీవో పాండవ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు సేవా శిబిరాన్ని నిర్వహించనున్నారు. సోమవారం నుంచి వచ్చే ఆదివారం (16వ తేదీ) వరకు తేలుకుంచిలో శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు 50మందితో గ్రామ పరిశుభ్రత, మొక్కలు నాటడం, ఐక్యత వేడుకలు, ఆరోగ్య శిబిరం నిర్వహణ, చైతన్య సదస్సులు జరుపుతున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు వివరించారు. ● కవిటిలోని ఎస్‌వీజే డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం నుంచి నెలవంక తదితర గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు మేనేజ్‌మెంట్ ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

మరదలిపై బావ దాడి

వజ్రపుకొత్తూరు/గ్రామీణం, న్యూస్‌టుడే: సుంకర జగన్నాథపురానికి చెందిన వంకల దానమ్మపై ఆమె బావ, విశ్రాంత వీఆర్వో లోహిదాసు, కుటుంబ సభ్యులు ఆస్తి విషయమై తగదా పడి కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. భర్తకు వారసత్వంగా వచ్చిన జీడితోటలో బావ లోహిదాసు దుక్కి పనులు చేస్తుండటంపై దానమ్మ నిలదీసింది. దీంతో బావతోపాటు కుటుంబ సభ్యులు సరస్వతి, ప్రసాదు కర్రలతో ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు శనివారం రాత్రి దానమ్మ ఫిర్యాదు చేశారు. క్షతగాత్రురాలికి తొలుత పలాస సామాజిక ఆసుపత్రిలో చికిత్స అందించగా ఆదివారం మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించారు. దాడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నిహార్ తెలిపారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలి

మందసలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

మందస, న్యూస్‌టుడే: మందసలోని జీడి పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కార్మికులు డిమాండు చేశారు. ఈ విషయమై మందసలో ఆదివారం నిరసన ర్యాలీ చేపట్టారు. కార్మికుల సమస్యలపై జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కేశవరావు, గణపతి, పలువురు మహిళా కార్మికులు పాల్గొన్నారు.

సమయం సద్వినియోగంతో విజయావకాశాలు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: సమయం సద్వినియోగం చేసుకుంటే విజయ అవకాశాలు పెరుగుతాయని స్వర్ణభారతి విద్యాసంస్థల అధ్యక్షుడు చాట్ల తులసీదాస్ అన్నారు. డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతోత్సవం ఆదివారం స్థానిక ప్రైవేటు వేడుకల మందిరంలో నిర్వహించారు. దీనికి సంస్థ సమన్వయకర్త మహేశ్వరీరెడ్డి అధ్యక్షత వహించి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అందరినీ ఉల్లాసపరిచారు. కళాశాల బాధ్యులు చాట్ల రాము, ప్రిన్సిపల్స్ కె.సందీప్, జె.జయప్రకాష్, కేవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైకాపా రచ్చబండ

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలం చినంచలలో వైకాపా ఆధ్వర్యంలో ఆదివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు సేకరించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, దువ్వాడ రవి, బమ్మిడి దుర్యోధనరావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల భద్రతపై ఉదాసీనత వద్దు

సోంపేట, న్యూస్‌టుడే: ఆలయాల భద్రత, ఇతర నిర్వహణ పరమైన అంశాలపై కమిటీలు ఉదాసీనత ప్రదర్శించొద్దని, అప్రమత్తంగా ఉండాలని సోంపేట ఎస్సై లోవరాజు సూచించారు. ఆదివారం సోంపేట సత్యదేవుడు, పోలమ్మ, పోలమాంబ తదితర ఆలయాలు పరిశీలించారు.

జీవన ప్రమాణాల సూచిక మెరుగే లక్ష్యం

వజ్రపుకొత్తూరు: ఉద్యాన రైతుల జీవనప్రమాణాల సూచిక మెరుగే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వెలుగు పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. కొండపల్లిలో ఏపీఎం ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆదివారం రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు, ఉద్యాన రైతులతో జీవనోపాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. జీడిపిక్కల కొనుగోళ్లు, సంబంధిత కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని రైతులు కోరారు. అనంతరం కొమరల్తాడలో జీవనోపాధుల సేవా కేంద్రాన్ని పరిశీలించారు. డీపీఎం నారాయణరావు, ఏపీఎం ఈశ్వరరావు, కోశాధికారి పద్మావతి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ.. సోంపేట: వాడపాలెం-కొత్తూరులో కూటమి నాయకులు మత్స్యకారులకు ప్రభుత్వం అందజేసిన నిత్యావసరాలు ఆదివారం పంపిణీ చేశారు. తెదేపా మండలాధ్యక్షుడు కుమార్, సొసైటీ అధ్యక్షుడు లోకనాథం, నాయకులు పాల్గొన్నారు.

రేపు జై భీమ్ యువజన సంఘం వార్షికోత్సవం.. పలాస గ్రామీణం: బొడ్డపాడులో జై భీమ్ యువజన సంఘం వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘ సభ్యులు ఆదివారం కరపత్రం ఆవిష్కరించారు. వైద్య శిబిరం, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

కవిటి/గ్రామీణం: కొండిపుట్టుగకు చెందిన కొర్రాయి నీలయ్య కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకుని, వైజాగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్థులు విరాళాలు సేకరించి రూ.14,600 ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ● పొందూరుపుట్టుగకు చెందిన రామ్మూర్తి, అతని కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఒడిశా గజపతి జిల్లా బాగుసోల గ్రామంలోని హెల్పింగ్ హాండ్స్ సభ్యులు ఆదివారం ఆ కుటుంబానికి రూ.4 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వై.వెంకటేశ్, జి.అనిల్, జి.రుద్రకుమార్ పాల్గొన్నారు.

పరామర్శ.. సోంపేట, న్యూస్‌టుడే: జింకిభద్రకు చెందిన జిణగ పురుషోత్తం కుటుంబ సభ్యులను ఎంపీపీ ఎన్.దాసు, ఎంపీటీసీ సభ్యురాలు లీలారాణి ఆదివారం పరామర్శించారు. పురుషోత్తం మాతృమూర్తి జిణగ అమ్మాయమ్మ రెండు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. సర్పంచి తామాడ పద్మావతి, ఉపసర్పంచి ఎస్.జానీ, జె.కృష్ణ, కె.సీతయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం బొగిడియాపుట్టుగలో నిమ్మాషి నమ్మ అమ్మవారి ఆలయం అసంపూర్తిగా ఉండటంతో దాన్ని పూర్తి చేసేందుకు బొరివంకకు చెందిన ఎన్ఆర్ఐ ఆనంద్ రౌళో ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం రూ.36 వేలు ఎంపీటీసీ సభ్యుడు సదుద్ది సతీష్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీకి అందజేశారు. గ్రామ పెద్దలు వెంకటేశ్, బాసు, శిల్పి తిరుపతి పాల్గొన్నారు.

గోపిని విచారించిన పోలీసులు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: వైకాపా పలాస-కాశీబుగ్గ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపిని కాశీబుగ్గ పోలీసులు ఆదివారం విచారించారు. రెండు రోజుల కిందట పలాసకు చెందిన వ్యాపారి రాజు కిడ్నాప్‌నకు గురైన విషయం విదితమే. అందుకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో గోపి పెట్టిన పోస్టునకు పోలీసులు వివరణ తీసుకున్నారు. ఇదే పోస్టునకు సంబంధించి ఇచ్ఛాపురం పోలీసులు శనివారం ఈయనను విచారించారు.

దీపాల సోయగం.. పట్టణానికి అందం..!

రూ.60లక్షలతో 65 స్తంభాలు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణానికి కొత్త వెలుగులు రానున్నాయి. శ్రీకాకుళం అర్బన్ డవలెప్‌మెంట్ అథారిటీ (సుడా) నిధులతో పట్టణ మధ్య దీపాల అమరిక పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఏనాడో వేసిన స్తంభాలకు అక్కడక్కడా బల్బులు వెలుగుతున్నాయి. చాలా వరకు అంధకారమే. అవీ కూడా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మాత్రమే వేశారు. మొత్తం 19 స్తంభాలకు ఆరేడు స్తంభాలు నేలకూలాయి.

ప్రస్తుతం ఇచ్ఛాపురం పట్టణంలో మధ్య దీపాల తీరు

● రూ.62కోట్లతో ఏఐబీ పథకం ద్వారా మంచినీటి పథకం అమలుకు ఒక వైపు కార్యాచరణలో ఉండగానే, మధ్య దీపస్తంభాల కోసం గత ఆగస్టులో ప్రతిపాదించి, రూ.60లక్షలతో టెండర్లు పిలిచారు. నగరాల్లో కనిపించే మధ్యదీప స్తంభాల నమూనాను ఆమోదించి, పనులకు శ్రీకారం చుట్టారు. సంతపేట మలుపులో భువనేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి బజారు కూడలి వరకు 65 స్తంభాలు ఏర్పాటు చేయనున్నారు.

● గతం కన్నా స్తంభాల సంఖ్య, వెలుగుల స్థాయి పెరగనున్నాయి. ఇవి కాకుండా మూడు చోట్ల హైమాస్ట్ దీపస్తంభాల అమరికకు కూడా ఆమోదించారు. ఈ మూడు స్తంభాలపై వృత్తాకార చక్రానికి దీపాలు అమర్చుతారు. ఇవి కనీసం కిలోమీటర్ దూరం వరకు వెలుగులు ఇస్తాయని అంచనా. గతంలో పురుషోత్తపురం, దాసన్నపేట, బెల్లుపడ, బంగ్లా రోడ్ కూడలి, బజారు కూడలిలో హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

● ఇచ్ఛాపురం పురాభివృద్ధిపై దృష్టి సారించిన ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అశోక్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో కలిసి పుర కార్యాలయంలో గతేడాది సమీక్షించారు. అందులో పుర మంచినీటి పథకం, దినవారీ బజారు, మధ్య దీప సమస్యలు చర్చకు వచ్చాయి. పురపాలకసంఘ ఆదాయం అంతంతమాత్రమే కావడంతో, సుడా పరిధిలోకి ఇచ్ఛాపురాన్ని చేర్చి, ఆ నిధులతో అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

త్వరితగతిన పనులు... ఇచ్ఛాపురంలో మధ్య దీపాల అమరిక పనులు త్వరితగతిన చేయిస్తున్నాం. తుపాను, భారీ వర్షాల వల్ల కాస్త ఆలస్యం జరిగింది. అనుకున్న విధంగా స్తంభాల అమరిక చేస్తాం. వీటికి అండర్ గ్రౌండ్ మార్గంలో తీగల అమరిక ఉంటుంది. – సుగుణాకర్, ఎస్ఈ, సుడా, శ్రీకాకుళం

అమృతమూర్తికి అశ్రునివాళి

మంచితనం మానవత్వం గల మహోన్నత వ్యక్తిగా అందరి మన్ననలు పొందిన మీరు అకస్మాత్తుగా దైవసన్నిధికి చేరినందుకు మిక్కిలి చింతిస్తూ... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని సదా భగవంతుని ప్రార్థిస్తూ...

కీ.శే. మల్లపురెడ్డి గోవిందరాజులు గారు
Rtd UDC, Govt. Degree College, బారువ
జననం: 18-08-1940, మరణం: 30-10-2025

భార్య: మల్లపురెడ్డి సరస్వతి
కుమారుడు - కోడలు
తారకేశ్వరరావు - సంధ్యారాణి

మనుమలు: బత్తుల లోహిత్, బత్తుల మోక్షిత, బవిరిశెట్టి ధృక్షిత, బవిరిశెట్టి రోషన్‌సాయి, మల్లపురెడ్డి సాయిహాసిని
కుమార్తెలు - అల్లుళ్లు: బత్తుల నిర్మలకుమారి - ఉమామహేశ్వరరావు; మల్లారెడ్డి గిరిజాకళ్యాణి - మోహనరావు; బవిరిశెట్టి ధరణిజ - వెంకటరావు

పెద్దకర్మ: 10-11-2025 సోమవారం సోంపేట తెలగవీధిలో గల మా స్వగృహం నందు జరుపుబడును. Cell: 7396929876

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

చేరేనా గమ్యం.. ప్రాణాలే పణం

కొత్తూరు నుంచి సీతంపేట, భామిని, ఒడిశా వెళ్లేందుకు ప్రజలు లగేజీ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్తూరు నుంచి పారాపురం మీదుగా వెళ్తున్న లగేజీ వాహనాన్ని చిత్రంలో చూడొచ్చు. ఈ విషయమై ఏఎస్‌ఐ రాజేశ్వరరావును వివరణ కోరగా.. తనిఖీలు నిర్వహిస్తామన్నారు. - న్యూస్‌టుడే, కొత్తూరు

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం నర్సిపురం నుంచి దేవళభద్ర మీదుగా జల్లపల్లి వరకు ఉన్న బీటీ రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. - లక్ష్మీనారాయణ, జల్లపల్లి

★ ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే తక్షణమే మరమ్మతులు చేపట్టి, ఇబ్బందులు తీరుస్తాం. - మోహన్, ఏఈ, పీఐయూ శాఖ, నందిగాం

- న్యూస్‌టుడే, నందిగాం

పెండింగు ప్రాజెక్టులు పూర్తిచేయండి

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

టెక్కలి, న్యూస్‌టుడే: జిల్లాలో పెండింగు ప్రాజెక్టులను పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండు చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.600 కోట్లు కేటాయిస్తే జిల్లా సస్యశ్యామలమవుతుందని చెప్పారు. నంబూరు షణ్ముఖరావు, పోలాకి ప్రసాదరావు, బగాది వాసుదేవరావు, ధర్మారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సేవాగుణంతో మెలగాలి

రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి, కళింగ వైశ్య సంఘం ప్రతినిధులు

నరసన్నపేట, న్యూస్‌టుడే: యువకులు సేవాగుణంతో మెలగాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేటలో కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు, జామి వెంకటరావు, తంగుడు జోగారావు, బోయిన సతీష్ పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో రద్దీ.. జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీముఖలింగేశ్వర స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఇరు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈవో ఏడుకొండలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చెరువు చెదిరింది.. వ్యర్థ మిగిలింది

- న్యూస్‌టుడే, జలుమూరు, నరసన్నపేట, సారవకోట, పోలాకి, నరసన్నపేట గ్రామీణం

జలుమూరు తామర చెరువు చప్టా పాడవటంతో రైతులు వేసిన ఇసుక బస్తాలు

గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగేందుకు, సాగునీటి ఇబ్బందులు తీరేందుకు చెరువులే ఆధారం. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో నరసన్నపేట నియోజకవర్గంలో కొన్నేళ్లుగా కాసారాలు నిర్వహణకు నోచుకోలేదు. దీంతో మదుములు, చప్టాలు మరమ్మతులకు గురయ్యాయి. 2014- 19 మధ్య తెదేపా హయాంలో నీరు- చెట్టు పథకం కింద చెరువులను అభివృద్ధి చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా వీటి గురించి ఒక్క పైసా ఖర్చు పెట్టలేదు.

సాగునీటికి తంటాలు

జలుమూరు మండలం తామరచెరువు చప్టా హుద్‌హుద్ తుపాను సమయంలో పాడైంది. అధికారులు పట్టించుకోక పోవడంతో అన్నదాతలే ఇసుక బస్తాలు వేసుకున్నారు. రూపుసాగరం, రావిపాడులో దాలయ్య, అప్పయ్య, పెద్ద చెరువులు, చింతల బంద, జోనంకి పంచాయతీలో అబ్బాయి, కోమిటివాని చెరువులు, జగన్నాథసాగరం అధ్వానంగా మారాయి. టెక్కలిపాడులో గవళమ్మ చెరువు, లింగాలపాడు, తలతరియా, సంతలబయలు, కృష్ణాపురం, రామచంద్రాపురం ప్రాంతాల్లో చప్టాలు, మదుములు మరమ్మతులకు నోచుకోలేదు.

నరసన్నపేట మండలం కంబకాయలో కూర్మసాగరం, తామరాపల్లిలో చిన్నమ్మికోనేరు, నరసన్నపేట పట్టణ పరిధిలోని నరసమ్మ, దేశవానిపేటలో రాజుగారి చెరువుల్లో నిర్వహణ లోపంతో చుక్క నీరు నిలవడం లేదు.

పోలాకి మండలంలో 132 చెరువులుండగా వాటిలో ఎక్కువ శాతం ఆక్రమణలకు గురయ్యాయి. 2018లో తెదేపా హయాంలో కాసారాల అభివృద్ధికి రూ.2 కోట్లు నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపించారు. ఇంతలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. నేటికీ తటాకాలు అలాగే దర్శనమిస్తున్నాయి.

పెద్దలంబ సమీపంలోని రాళ్లబంద చెరువు, వాబ దగ్గర వేప చెరువు చప్టాలు తిత్లీ తుపాను సమయంలో కొట్టుకుపోయాయి. దీంతో సాగునీరు వృథాగా పోతోంది. సారవకోట సమీపంలో ఉన్న చుప్పలకర్ర చెరువు, మదనాపురంలో పట్నాయక్ చెరువు మదుములు శిథిలావస్థకు చేరాయి.

నిర్వహణ లోపంతో అధ్వానంగా తామరాపల్లి కోనేరు

చర్యలు తీసుకుంటాం.. ఇప్పటికే చాలా చోట్ల పాడైన చెరువుల మదుములు, చప్టాలు గుర్తించాం. పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. నిధులు మంజూరైన వెంటనే చర్యలు తీసుకుంటాం. - శిమ్మ శ్రీనివాసరావు, యాళ్ల రవీంద్రనాయుడు, డీఈఈలు వంశధార, సూక్ష్మ నీటి పారుదల శాఖ

నరసన్నపేట నియోజకవర్గం వివరాలు

మండలం	జలుమూరు	నరసన్నపేట	పోలాకి	సారవకోట
చెరువులు	258	85	132	220

సాయంకాలం.. సాగరతీరం

రాజారాంపురం సముద్ర తీరంలో జన సందోహం

పోలాకి, న్యూస్‌టుడే: రాజారాంపురం సముద్రతీరానికి కార్తిక మాసం సందర్భంగా ఆదివారం సాయంత్రం పోలాకి, నరసన్నపేట, కోటబొమ్మాళి, మండలాల నుంచి పర్యాటకులు తరలి వచ్చారు. సమీప తోటల్లో వన భోజనాలు చేశారు. సముద్ర తీరంలో యువత, మహిళలు, చిన్నారులు స్నానాలు చేస్తూ సందడి చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ రంజిత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గుప్పిడిపేట, గుల్లవానిపేట, కొత్తరేవు గ్రామాల్లోనూ రద్దీ నెలకొంది.

నీరు రాలేదు.. నిరాశ వచ్చింది

పోలాకి మండలం అప్పారావుపేట కాలనీ వాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామానికి మూడు నెలల కిందట బోరు తీశారు. అవస్థలు తీరుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టించుకునే వారే లేకుండా పోవడంతో చివరికి వారికి నిరాశే మిగిలింది. సమస్యను ఎంపీడీవో రవికుమార్ ప్రస్తావించగా.. పనులు టెండర్ల దశలో ఉన్నాయని, గుత్తేదారు ఖరారు కాగానే చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, పోలాకి

అడ్డంకులు తొలగించండి..!

గోవర్ధనపురం, అర్లి మధ్య బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గుత్తేదారు రహదారి పనులు పూర్తి చేశారు. ఈ రెండు ఊర్ల మధ్య ఉన్న కనపల చెరువు నీరు దిగువకు వెళ్లే మార్గంలో పైపు కల్వర్టు నిర్మించి, మార్గాన్ని అనుసంధానించాల్సి ఉంది. పైపులు తెచ్చి 10 రోజుల కిందట రోడ్డుకు అడ్డంగా వేశారు. దీంతో ధాన్యం తీసుకెళ్లలేక పోతున్నామని రైతులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరిస్తామని పీఆర్ ఏఈ భార్గవి చెప్పారు. - న్యూస్‌టుడే, సారవకోట

అదే తీరు.. అవే అవస్థలు

టెక్కలి- తెంబూరు రహదారిని పదేళ్ల కిందట విస్తరించారు. ఆ సమయంలో సీతాపురం వద్ద ఇళ్లు కోల్పోతున్న పేదలకు వలేసాగరం వద్ద పట్టాలు మంజూరుచేశారు. వారిని తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించడంతో ఆ ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు నిలిపేసి, మిగతా భాగాన్ని పూర్తిచేశారు. దీంతో అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. లబ్ధిదారులతో మాట్లాడి, త్వరితగతిన ఖాళీ చేయిస్తామని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి చెప్పారు. - న్యూస్‌టుడే, టెక్కలి

పనిచేయని పథకం.. అందని ఉదకం

సంతబొమ్మాళి మండలం నరసాపురం పంచాయతీ ఎం.నరసాపురం ఎస్సీ కాలనీలో సౌర నీటి పథకం నిరుపయోగంగా మారింది. ఏడాది కిందట మరమ్మతులకు గురైనా ఇప్పటి వరకు పట్టించుకునే వారే కరవయ్యారని, తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలో 80 కుటుంబాలు నివసిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి, పథకాన్ని వినియోగంలోకి తీసుకొస్తామని పంచాయతీ కార్యదర్శి విద్య అన్నారు. - న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

బడిలో జ్ఞాపకాల ఒడిలో..!

తెంబూరు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

టెక్కలి పట్టణం, పాతపట్నం, న్యూస్‌టుడే: టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ చదువుకున్న 1977- 84 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం జరిగింది. పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరై పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల అవసరాల కోసం విరాళాలు అందించారు. పాతపట్నం మండలం తెంబూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1997- 98 సంవత్సరం పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, చదువు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

కార్తిక సోమవారానికి విస్తృత ఏర్పాట్లు

మల్లన్న క్షేత్రంలో పూజలు చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

టెక్కలి, న్యూస్‌టుడే: కార్తిక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని రావివలసలోని ఎండల మల్లికార్జునస్వామి శైవక్షేత్రం వద్ద విస్తృత ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉండటంతో అధికారులు అందుకు తగ్గట్లుగా బారికేడ్లు, చలువ పందిళ్లు, వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని సిద్ధంచేశారు. ఏర్పాట్లను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదివారం పరిశీలించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

శిష్టకరణ సంఘానికి వందేళ్లు పూర్తి

స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న శిష్టకరణ సంఘ ప్రతినిధులు

సారవకోట, జలుమూరు: జలుమూరులో శిష్టకరణ సంఘం ఏర్పాటు చేసి 100 సంవత్సరాలు పూర్తవడంతో ఆదివారం అఖిల భారత శిష్టకరణ సంఘ అధ్యక్షుడు డబ్బీరు వెంకటకృష్ణారావు శతాబ్ది ఉత్సవాల స్థూపాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిష్టకరణ సంఘ సభ్యులు ఐకమత్యంతో మెలగాలని సూచించారు. మెట్రో చీఫ్ జనరల్ మేనేజర్ యు.జె.ఎన్.రావు, కార్యదర్శి చౌదరి రవిప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జె.పి.నారాయణ, జిల్లా అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి ఎస్.కృష్ణ, సంఘ నాయకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

నందిగాం, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత ఈనెల 7న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంతవరకు రాలేదని ఆమె తండ్రి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ షేక్ మహ్మద్ ఆలీ చెప్పారు.

వాగ్దేవి పురస్కారం అందజేత

ఎల్‌ఎన్‌పేట: ఎంఈవో కుప్పిలి చంద్రమౌళి వాగ్దేవి పురస్కారం అందుకున్నారు. సింహాచలంలో జాతీయ తెలుగు సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో అవార్డు అందుకున్నారు. దేహమే దేవాలయం కవిత్వానికి గుర్తింపు వచ్చినట్లు చంద్రమౌళి చెప్పారు.

విశ్రాంత సైనికుడికి ఘన స్వాగతం

జలుమూరు, న్యూస్‌టుడే: దేశ సేవలో 30 ఏళ్లు విశేష సేవలందించి సుబేదార్‌గా ఉద్యోగ విరమణ చేసిన టెక్కలిపాడు గ్రామానికి చెందిన వాన జగ్గునాయుడికి గ్రామస్థులు ఆదివారం ఘనస్వాగతం పలికారు. రావాడపేట కూడలి నుంచి ప్రత్యేక వాహనంపై గ్రామం వరకు ర్యాలీ చేపట్టారు.

13 నుంచి మృత్యుంజయ మహోత్సవం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ఈనెల 13 నుంచి కొత్తమ్మతల్లి దేవస్థానంలో మహా మృత్యుంజయ మహోత్సవాలు మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు అర్చకుడు సుసరాపు గణపతిశర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద ఏర్పాట్లు చేపడుతున్నారు.

శివానంద కుటీర్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

పాతపట్నం, న్యూస్‌టుడే: కె.గోపాలపురంలోని శివానంద కుటీర్‌లో ఈ నెల 14 నుంచి డిసెంబరు నెల వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. గీతా జయంతి సందర్భంగా యజ్ఞం చేపట్టనున్నట్లు చెప్పారు. రోజూ ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయన్నారు.

రేపటి నుంచి సాఫ్ట్‌టెన్నిస్ పోటీలు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం గిరిజన సామాజిక భవనం ఆవరణలో ఈ నెల 11 నుంచి 13 వరకు రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14, 17, 19 విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

కొత్తూరు, న్యూస్‌టుడే: పారాపురం గ్రామంలో అయ్యప్ప స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి మునకాల అప్పలరాజు ఆధ్వర్యంలో అభిషేకాలు, అష్టోత్తర పూజ, భజనలు చేపట్టారు. కొత్తూరు, పారాపురం, మెట్టూరు, కలిగాం గ్రామాలకు చెందిన అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

తూర్పు కాపు సంఘ ఎన్నిక ఏకగ్రీవం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి నియోజకవర్గ తూర్పుకాపు సంఘ అధ్యక్షుడిగా వంకేల దివాకర్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం టెక్కలిలోని ఓ కల్యాణ మండపంలో సంఘ సమావేశం నిర్వహించారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పోలాకి వాసుదేవ్ నియమితులయ్యారు. సంఘ గౌరవాధ్యక్షుడు రెడ్డి చిన్నంనాయుడు, పోలాకి చంద్రశేఖర్, మోతికవలస శాంతారావు పాల్గొన్నారు.

న్యాయవాదులకు అండగా సర్కార్

ఎల్‌ఎన్‌పేట, న్యూస్‌టుడే: న్యాయవాదులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని జిల్లా తెదేపా న్యాయ విభాగం ఉపాధ్యక్షుడు శివ్వాల తేజేశ్వరరావు పేర్కొన్నారు. ఎల్‌ఎన్‌పేట మండలంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులు మృతి చెందితే బాధిత కుటుంబాలను ఆదుకొనేందుకు రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారని ఇందుకు రూ.46 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు.

చోరీకి గురైన విగ్రహాలకు సంప్రోక్షణ

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక సిద్ధాశ్రమంలోని గతనెల 18న ఐదు పంచలోహ విగ్రహాలు చోరీకి గురైన విషయం తెలిసిందే. వాటిని పోలీసులు ఇటీవల రికవరీ చేశారు. ఆదివారం విగ్రహాలకు సంప్రోక్షణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సిద్ధాశ్రమ ప్రతినిధులు శిమ్మ జగన్నాథం, ముద్దాడ శ్రీనివాసరావు, చిన్నప్పన్న, భక్తులు పాల్గొన్నారు.

నిబంధనలు మీరితే చర్యలు

పోలాకి: ఆటోలు డ్రైవర్లు నిబంధనలు మీరితే చర్యలు తీప్పవని ఎస్‌ఐ జి.రంజిత్ అన్నారు. ఆదివారం రాజారాంపురం గ్రామం వద్ద వాహన చోదకులకు పలు సూచనలను చేశారు. కేటాయించిన స్థలాల్లోనే ఆటోలు ఉంచాలన్నారు.

కోపతాపాలు దరి చేరనీయొద్దు

సారవకోట, న్యూస్‌టుడే: కోపతాపాలు దరి చేరనీయొద్దని లైసెన్స్‌డ్ ఇంజినీరింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముని శ్రీనివాసరావు (శ్రీకాకుళం) సూచించారు. సారవకోటలో సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన 100 గంటల అఖండ దివ్యనామ సంకీర్తన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్.జగదీశ్వరరావు, టి.వెంకటరమణ పాల్గొన్నారు.

కదిలించిన కథనాలు

నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల్లో ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడేవారు. వారి కష్టాలకు 'ఈనాడు' అక్షర రూపమిచ్చింది. పత్రికలో వార్తలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించి, పనులు చేపట్టారు.

గొట్టాలకు మరమ్మతులు

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని వాటర్ ట్యాంకు పైపులకు మరమ్మతులు చేశారు. గొట్టాలు పగిలి పోవడంతో నీరు వృథా అయ్యేది. దీనిపై ఈనెల 4న 'పైపులు పగిలి నీరు వృథా' శీర్షికతో వార్త వెలువడటంతో పంచాయతీ ఈవో దాక్షాయణి చర్యలు తీసుకున్నారు.

దారి బాగు చేశారు

పోలాకి, న్యూస్‌టుడే: డీపీఎన్ రోడ్డు పనులను ర.భ.శాఖ అధికారులు చేపట్టారు. గంగివలస వద్ద రహదారి గోతులమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సమస్యపై ఈనెల 1న 'రోడ్డా.. పిల్ల కాలువా?' పేరిట కథనం రావడంతో మార్గాన్ని బాగు చేశారు.

పగటి వెలుగుల నియంత్రణ

హిరమండలం, న్యూస్‌టుడే: ఎం.అవలంగి గ్రామంలోని కొన్ని వీధుల్లో పగటి పూట విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయని, రాత్రి పూట అంధకారం నెలకొంటోందని ప్రజలు వాపోయారు. సమస్యను డిప్యూటీ ఎంపీడీవో గోవిందరావు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా ఆయన సిబ్బందితో మాట్లాడి, పరిష్కారం చూపారు.

గుంతల బాధ తీరింది

నరసన్నపేట, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై గుంతలను ఎట్టకేలకు పూడ్చారు. జమ్ము కూడలి, తామరాపల్లి వద్ద రోడ్డు అధ్వానంగా మారడంపై ఈనెల 5న 'జాతీయ గుంతల రహదారి' శీర్షికన వార్త వెలువడిన విషయం తెలిసిందే. ఎస్‌ఐ దుర్గాప్రసాద్ స్పందించి, గుత్తేదారుతో మాట్లాడటంతో చర్యలు తీసుకున్నారు.

పూడిక తొలగింపు

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం మేజర్ పంచాయతీలో అలికాం- బత్తిలి రహదారికి ఇరువైపులా కాలువల్లో పూడిక తొలగించారు. పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారడంతో సమస్యను ఈనాడు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. దీంతో సర్పంచి డి.సుందరమ్మ, ఎంపీడీవో కాళీప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీవో గోవిందరావు, ఈవో భాస్కరరావు పనులు చేయించారు.

పింఛను సొమ్ము అందజేత

హిరమండలం పరిధి లోకొండకు చెందిన వృద్ధుడు పెద్దింటి రామయ్యకు గ్రామ సచివాలయ ఉద్యోగులు పింఛను అందజేశారు. గత నెల 8న 'ఏళ్లుగా నిరీక్షణ.. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ' శీర్షికతో కథనం వచ్చింది. స్పందించిన ఎంపీడీవో డీఆర్డీఏ అధికారులతో మాట్లాడి పింఛను మంజూరుకు ప్రతిపాదించడంతో సమస్య పరిష్కారమైంది. - న్యూస్‌టుడే, హిరమండలం

గ్రామాల్లోనే రేషన్ అందించాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ప్రతి నెల నిత్యావసర సరకులకు వ్యయప్రయాసలు పడుతున్నామని, గ్రామాల్లోనే రేషన్ అందించాలని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెళియాపుట్టి మండలం పెద్దకేదారి, దబ్బగుడ్డి, గేటుపేట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 15-20 కి.మీ. దూరంలో ఉన్న రామచంద్రాపురం దుకాణానికి ఆటోలతో వెళ్లి సరకులు తీసుకురావడానికి అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని తెదేపా నాయకుడు దినకర్ అన్నారు.

ఆగని అక్రమ రవాణా

పోలాకి, న్యూస్‌టుడే: పల్లిపేట గ్రామం వద్ద వంశధార నదిలో ఇసుకను పట్టపగలే ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. అధికారులు పట్టించుకోక పోవడంతో అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు పెదవి విరుస్తున్నారు. తక్షణమే చర్యలు తీసుకుంటామని వీఆర్వో లక్ష్మణరావు అన్నారు.

(c) eenadu

శ్రీకాకుళం

• శ్రీకాకుళం • ఆమదాలవలస • ఎచ్చెర్ల

ఉత్సాహంగా చదరంగం పోటీలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం తిలక్‌నగర్‌లోని స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీలో ఆదివారం జిల్లాస్థాయి ఓపెన్ చెస్ టోర్నీ నిర్వహించింది. ఐదు రౌండ్లలో జరిగిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా వై.వంశీ, బి.జయంత్, బి.జయసూర్య మొదటి మూడు స్థానాలను దక్కించుకున్నారు. వారికి ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు సూర శ్రీనివాసరావు ట్రోఫీతో పాటు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. టోర్నీని చెస్ చిన్నారావు పర్యవేక్షించారు.

ఆదిత్యాలయంలో యోగాసనాలు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో విశాఖ నగరానికి చెందిన యోగా సంస్థ ఆమ్ ఆధ్వర్యంలో 120 మంది సభ్యులు ఆదివారం యోగాసనాలు వేశారు. నిర్వాహకులు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

రెజ్లింగ్ పోటీల్లో పతకాల పంట

పతకాలు సాధించిన విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో కె.మురళీకృష్ణ బంగారు, టి.చైతన్య, టి.సంజు, పి.జగన్, టి.ధనుంజయ, కె.లాస్య, బి.జస్మిత, పి.మేఘన, ఎల్.జ్యోతి రజత, కాంస్య పతకాలను అందుకున్నారు. విజేతలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.మహేష్‌బాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, శిక్షకుడు గోవిందరావు అభినందించారు.

సత్యసాయి మందిరంలో అఖండ నామసంకీర్తన

రణస్థలం, న్యూస్‌టుడే: రణస్థలం మండలం జె.ఆర్.పురం గ్రామంలోని సత్య సాయి మందిరంలో 24 గంటలు అఖండ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు భజన, కీర్తనలతో అఖండ నామ సంకీర్తన కార్యక్రమం ఘనంగా చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని లయన్స్ క్లబ్ ప్రతినిధి పొన్నాడ రవికుమార్ అన్నారు. 'మన ఊరు - మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ డా.ప్ర.పోలినాయుడు, మానవతా సంస్థ కన్వీనర్ ఆచార్య డి.విష్ణుమూర్తి, అధ్యక్షుడు బరాటం లక్ష్మణరావు, లయన్స్ క్లబ్ కార్యదర్శి టి.రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ

పాతశ్రీకాకుళం ఏపీ హెచ్‌బీకాలనీలో ఆదివారం మునగవలస రాధాకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ, భజన కార్యక్రమం జరిగాయి. కేరళకు చెందిన నంబూద్రి ప్రసాద్ జ్యోతి ప్రజ్వలనతో

పూజ ప్రారంభమైంది. పరిసరాలు స్వాముల శరణుఘోషతో మార్మోగాయి.- న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

ప్రణాళికతో చదివితే.. పదిలమే..

100రోజుల ప్రణాళికకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

పొందూరు, సరుబుజ్జిలి, ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతం కన్నా ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో శత శాతం సాధించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

● నెలాఖరులోగా నియోజకవర్గాల వారీగా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షలు చేపట్టడం తోపాటు వచ్చే ఏడాది మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం తాత్కాలిక షెడ్యూల్ ప్రకటించింది.

సరుబుజ్జిలి మండలం కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులు

● నవంబరు నెలాఖరులోగా సిలబస్ పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది. డిసెంబరు 1వ తేదీ నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేయనున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రణాళికను పాఠశాలలకు పంపుతారు. వంద రోజుల్లో ముఖ్యమైన పాఠ్యాంశాలను చదివించి వారంతపు పరీక్షలు నిర్వహిస్తారు.

● పదో తరగతి విద్యార్థులు జవాబు పత్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించనున్నారు.

● ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో ప్రత్యేక తర్ఫీదు ఇవ్వడంతోపాటు ఎప్పటికప్పుడు వారికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది.

● పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక విద్యాశాఖ సూచనలు మేరకు సన్నద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రధానోపాధ్యాయులకు దీనిపై సూచనలు అందించాం. పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు చర్యలు తీసుకుంటాం అని శ్రీకాకుళం డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి

● పొందూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 10 ఉండగా ఇందులో పదో తరగతి పరీక్షలకు 695 మంది హాజరవుతున్నారు. ప్రైవేటు పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు 40 మంది హాజరవుతున్నారు. పొందూరు మండలంలో పొందూరు, కింతలి ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

● సరుబుజ్జిలి మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 8 కాగా ఇందులో 251 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతారు. మండలంలో సరుబుజ్జిలి, కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

● ఆమదాలవలస మండలంలో 9 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా ఇందులో 713 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు. తొగరాం, ఆమదాలవలస, ఎస్.వి.ఎస్. పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించారు.

తెరపై ఈనాడు

మారుతి: ఆర్యన్ కెన్నెడీ: కె-ర్యాంప్; కీర్తన: ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో; శ్రీకృష్ణ: ఫోనిక్స్, ప్రేమిస్తున్నా; ఎస్‌వీసీ(రామలక్ష్మణ): ది గర్ల్‌ఫ్రెండ్; సూర్యమహల్: జటాధర సన్‌మార్స్; శ్రైన్ జిరాయ్ సరస్వతి: మాస్ జాతర

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

స్పందనకు వందనం

మొక్కల తొలగింపు

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం మలకాం గ్రామంలో సబ్‌ స్టేషన్ పక్కన విద్యుత్తు నియంత్రిక చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగాయి. ఈ నెల 5న 'పొంచి ఉన్న ప్రమాదం..!' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో విద్యుత్తుశాఖ ఏఈ సుధీర్ స్పందించి మొక్కలు తొలగించారు.

స్తంభం సరి చేశారు

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం గోరింట గ్రామం నుంచి గోకర్నపల్లి వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభం పూర్తిగా ఒక వైపు వాలి ప్రమాదకరంగా మారింది. ఈ నెల 2న 'వాలింది.. కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది' శీర్షికన వార్త ప్రచురితంగా స్పందించిన అధికారులు స్తంభం సరి చేశారు.

తీరిన సమస్య

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం రెడ్డిపేట గ్రామంలో విద్యుత్తు నియంత్రిక దిగువన ఉండటంతో అందినంత ఎత్తులో ఉండటంతో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో అక్టోబరు 29న వార్త ప్రచురించాం. స్పందించిన అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజానికి ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం ఆమదాలవలస మండలం కొత్తరోడ్డు వద్ద ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు గురుగుబెల్లి శ్రీరంగ నాయకులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులను ఉన్నత శిఖరాలు చేరుకునే విధంగా పాఠ్యాంశాలు బోధించాలని కోరారు.

పంచారామాలకు బస్సు ప్రారంభం

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: పంచారామాలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరినట్లు శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ అమరసింహుడు తెలిపారు. ఆదివారం ఆయన జెండా ఊపి బస్సును ప్రారంభించారు. వచ్చే ఆదివారం కూడా ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఎం సంతోష్, ఎస్ఎం ప్రసాద్, భద్రతాధికారి కె.కె.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

మురుగుతో ఇబ్బందులు

జి.సిగడాం కస్తూర్బా పాఠశాల మైదానంలో మురుగు నీరు నిలిచి పోతోంది. నిర్వహణలో నిర్లక్ష్యం చూపితే వ్యాధుల బారిన పడతామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రిన్సిపల్ ప్రమీల వివరణ కోరగా మురుగు తొలగించి శుభ్రం చేయిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, జి.సిగడాం

ఎప్పటికి పూర్తవుతుందో..!

లావేరు మండల పరిధిలోని లావేటిపాలెంలో సచివాలయ నిర్మాణ పునాదులకే పరిమితమైంది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి. అధికారులు త్వరితగతిన పూర్తి చేస్తే సేవలు అందుబాటులో ఉంటాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండల ఇంజినీరింగ్ అధికారి పి.శ్రీపతి వద్ద ప్రస్తావించగా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. -న్యూస్‌టుడే, లావేరు

వేశారు.. మరిచారు

సరుబుజ్జిలి మండలంలోని చిన్నమటబల పేట గ్రామంలో తాగునీటి అవసరాల కోసం వేసిన బోరు నిరుపయోగంగా మారింది.

పూర్తయితే గ్రామ ప్రజల తాగునీటికి అవసరాలు తీరేవి. ఇప్పటికైనా.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎండీ అబ్బాస్ వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

మలుపు.. ప్రమాదానికి పిలుపు

సరుబుజ్జిలి మండలంలోని యరగాం రహదారిలో ఇప్పలపాలెం గ్రామానికి సమీపంలో మలుపు ప్రమాదకరంగా మారింది. రహదారికి ఇరు వైపులా పనికిరాని మొక్కలు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని వాహనదారులు తెలిపారు. వాటిని తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్‌అండ్‌బీ జేఈ అజయ్‌నాయక్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

బురద.. వ్యథ

లావేరు మండలం తాళ్లవలస నుంచి వేణుగోపాలపురం, పిట్టపాలెం, నారాయణపాలెం, గుమ్మడాం వెళ్లే రహదారి గోతుల్లో ఇటీవల కురిసిన వర్షం నీరు నిలిచి బురదమయంగా మారింది. వాహనదారులు, పాదచారులు రాకపోకలు చేయాలంటే అవస్థలు తప్పడం లేదు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. పంచాయతీరాజ్‌శాఖ పీఐయూ విభాగం ఏఈఈ పోలినాయుడు దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరైతే కొత్త రోడ్డు వేస్తామన్నారు. – న్యూస్‌టుడే, లావేరు

అందుబాటులోకి తీసుకు రండి

పొందూరు మండలం తండ్యాం గ్రామ పంచాయతీ పరిధిలో వైకాపా హయాంలో నిర్మించిన సచివాలయం భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ప్రస్తుతం చిన్న గదిలో కార్యకలాపాలు నిర్వహించడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. మిగతా పనులను పూర్తిచేయాలని కోరుతున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పనులు చేస్తామన్నారు.

– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

దుర్వాసన.. దోమల బెడద

పొందూరు మండలం తండ్యాం గ్రామంలో కాలువలో పూడిక ఉండటంతో మురుగు కదలడం లేదు. దుర్వాసన, దోమల బెడద ఎక్కువైందని స్థానికులు తెలిపారు. పూడిక తీసి, కాలువలపై పలకలు వేయాలని కోరుతున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

–న్యూస్‌టుడే, పొందూరు, పొందూరు గ్రామీణం

ఉపనిషన్మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచనం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం కోదండరామాలయం ప్రాంగణంలోని ఉపనిషన్మందిరంలో ఆదివారం కార్తిక మాసం 'శివవైభవం' అనే అంశంపై ఎల్.ఎన్.పేట మండలం మల్లికార్జున పురానికి చెందిన అవధాని రంప సాయికుమార్ శర్మ ప్రసంగించారు. కార్తిక మాసంలో శివారాధన, వనభోజనం తదితర అంశాలను వివరించారు.

కిటకిటలాడిన సాగర తీరాలు

గార: గార మండలం వత్సవలస పంచాయతీ మొగదాలపాడు, కళింగపట్నం-మత్స్యలేశం సాగర తీరాలు ఆదివారం కిటకిటలాడాయి. మెరైన్ సీఐ బి.ప్రసాదరావు, గార ఎస్సై సీహెచ్.గంగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది గస్తీ నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

మార్గమంతా నీరే

శ్రీకాకుళం గ్రామీణ మండలం పీజీ పేట నుంచి కుందువానిపేటకు వెళ్లే రహదారి దారుణంగా మారింది. ఇటీవల వర్షాలకు గోతుల్లో భారీగా నీరు నిలిచి ఇబ్బందిగా మారింది. పీఐయూ ఏఈ మహంతి వివరణ కోరగా చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

మధ్యలో చేతులెత్తేశారు

సరుబుజ్జిలి మండలంలోని మూలసవలాపురం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రం భవనం పనులు మధ్యలో నిలిచిపోయాయి. గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆటంకం కలిగింది. చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని త్వరితగతిన పూర్తి చేయాలి స్థానికులు కోరారు. పీవో గీత వద్ద న్యూస్‌టుడే వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

ఆ దారిలో వెళ్లలేం

పొందూరు మండలం బొడ్డేపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. మోస్తరు వర్షానికే వరదనీరు రోడ్డుపై నిలిచిపోవడంతో కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కారినికి కృషి చేస్తామన్నారు.–న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

విద్యార్థి మృతదేహం లభ్యం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం గుడి వీధికి చెందిన అంపోలు సాయితేజ(18) ఈ నెల 7న ఏడు రోడ్ల కూడలి సమీపంలోని నాగావళి నదిలో దూకాడు. ఆదివారం ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు పంచాయతీ పాతదిబ్బల పాలెం సముద్రం ఒడ్డున మృతదేహం లభ్యమైంది. ఎచ్చెర్ల ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయితేజ ప్రతి రోజూ రాత్రి ఇంటికి ఆలస్యంగా రావటంతో తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సందడిగా వనసమారాధన

గార(అంపోలు), న్యూస్‌టుడే: గార మండలం అంపోలులో ఆదివారం జిల్లా వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధన సందడిగా జరిగింది. పలువురు రాజకీయ నేతలు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, కింజరాపు ప్రభాకరరావు, కింజరాపు ప్రసాదరావు, గుండ లక్ష్మీదేవి, గొండు స్వాతి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బోరవానిపేటకు చెందిన బోర భాస్కరరావు సంఘానికి రూ.లక్ష వితరణగా అందజేశారు. కమిటీ సభ్యులు అంబటి రంగారావు, చక్కా నారాయణరావు, దుంగ సుధాకరరావు, చీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న వెలమ సంక్షేమ సంఘ నాయకులు

సంక్షేమ భవన నిర్మాణానికి సాయం చేయండి

రణస్థలం, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం, వన సమారాధన రణస్థలం ఐరిస్ సాకల్య స్కూల్ ప్రాంగణంలో కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే ఈశ్వరరావు తనయుడు తేజబాబు పాల్గొని గాండ్ల తెలికుల సంక్షేమం కోసం భవనం నిర్మాణానికి స్థలాన్ని ఇవ్వడంతోపాటు పలు వినతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో గాండ్ల తెలగల జిల్లా అధ్యక్షుడు కొమనాపల్లి లక్ష్మణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెప్పినా.. పట్టించుకోవట్లేదు..!

పొందూరు మండలం బురిడికంచరాం గ్రామంలో శ్రీకాకుళం వెళ్లే మార్గంలో కాలువల వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగునీరు రోడ్లపైకి వచ్చేస్తోంది. గ్రామస్థులతో పాటు ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు అధికారులు చెప్పినా.. పట్టించుకోలేదని పలువురు తెలిపారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

–పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

లావేరు,(బుడుమూరు), న్యూస్‌టుడే: లావేరు మండలం బుడుమూరు గ్రామంలో గత నెల 31న జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమైన విషయం తెలిసిందే. ఆదివారం స్థానిక బుడుమూరు యువజన సంఘం సభ్యులు స్పందించి రూ.56 వేలు నగదు, ఒక్కొక్క బియ్యం బస్తా 3 కుటుంబాలకు అందించారు.

తరలిస్తున్న పశువుల పట్టివేత

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండలం జాతీయ రహదారి బెజ్జిపురం కూడలి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున నరసన్నపేట మండలం తిలారి సంత నుంచి అలమండ సంతకు అక్రమంగా తరలిస్తున్న ఆరు గేదెలను ఎస్సై జి.లక్ష్మణరావు, సిబ్బంది పట్టుకున్నారు. తరలిస్తున్న ప్రభాకరరావు, నీలకంఠంలపై కేసు నమోదు చేయడంతోపాటు వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

అధ్వానానికి అద్దం

పొందూరు మండలం కొంచాడ గ్రామ సచివాలయానికి వెళ్లే దారి అధ్వానానికి అద్దంలా మారింది. ఇక్కడే శుభ్రం లేకపోతే గ్రామాన్ని ఎలా సిబ్బంది పరిశుభ్రంగా ఉంచుతారని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. నిలిచి నీటిని తొలగించాలని కోరుతున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా కార్యదర్శితో మాట్లాడి నీటిని తొలగిస్తామన్నారు. -న్యూస్‌టుడే, పొందూరు, పొందూరు గ్రామీణం

'భాజపా విధానాలు వ్యతిరేకించండి'

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగం విషయంలో భాజపా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని కులనిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య పిలుపునిచ్చారు. నగరంలోని సాంఘిక సంక్షేమశాఖ పోస్టు మెట్రిక్ వసతి గృహం వద్ద ఆదివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కేఎన్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కె.వి.జగన్నాథం, నాయకులు రాకోటి రాంబాబు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారంతోనే జీవాల మృత్యువాత

గార(కళింగపట్నం), న్యూస్‌టుడే: కలుషిత నీరు, ఆహారంతో పాటు రక్తహీనత పెరిగి జీవాలు మృతి చెందినట్లు పశుసంవర్ధకశాఖ జేడీ డా.కె.రాజగోపాలరావు తెలిపారు. గారలో గంగరాజు అనే రైతుకు చెందిన గొర్రెలు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో ఆయన ఆదివారం గ్రామానికి వెళ్లి పరిశీలించారు. జీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఏడీ డాక్టర్ పీఎస్‌జీ బాలకృష్ణ, వైద్యులు ప్రవీణ్, నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

ఘనంగా త్రినాథ మేళా వ్రతం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం బానాం గ్రామానికి వెళ్లే మార్గంలో త్రినాథ త్రివరి ధర్మక్షేత్రంలో భక్తులు త్రినాథ మేళా వ్రతాన్ని ఆచరించారు. ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం జరిగిన అన్న సంతర్పణ కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంత్యక్రియలకు అంతులేని కష్టాలు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస పురపాలిక పరిధిలోని మెట్టక్కివలసలో వాంబేకాలనీ ప్రాంతంలో శ్మశాన వాటిక 5, 9, 10, 11 వార్డుల ప్రజలు వినియోగిస్తున్నారు. ఇక్కడ ముళ్ల చెట్లు, పొదలు పెరగడంతో తుప్పలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు చెప్పినా.. శ్మశాన వాటిక అభివృద్ధి చేయడం లేదని వాపోతున్నారు.

● ఎవరైనా మృతి చెందితే పనికిరాని మొక్కలు, పొదల మధ్య దహన సంస్కారాలు చేయాల్సి వస్తోంది.

● వర్షాలు పడితే ఆ ప్రాంతమంతా నీటితో నిండిపోయి ఇబ్బందులు పడుతున్నారు.

● పొక్లెయిన్‌తో శ్మశాన వాటికలో మొక్కలు తొలగిచడంతోపాటు బావిని శుభ్రం చేయాలని, బోరు ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని, ఎమ్మెల్యే కూన రవికుమార్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇదీ శ్మశాన వాటిక పరిస్థితి

● వాంబే కాలనీలోని శ్మశాన వాటికను అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటాను. పరిశీలనకు అధికారులను అక్కడికి పంపిస్తాను' అని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు.

ఆహ్లాదం.. వ్యాయామం..!

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస పట్టనంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని ఉద్యానవనంలో వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు అక్కడికి వెళ్లి వ్యాయామం చేస్తున్నారు. పురపాలిక రూ.5 లక్షలు వెచ్చించి వ్యాయామ పరికరాలను తెదేపా హయాంలో కొనుగోలు చేయగా అమర్చేందుకు చర్యలు తీసుకోకపోవడంతో నెలల తరబడి నిరుపయోగంగా మారాయి. ఆమదాలవలస చిక్కోలు చేయూత సంఘం గుర్తించి వాటిని ఏర్పాటు చేసి, కొంత మొత్తం సేకరించి వసతులు కల్పించింది. దీంతో మహిళలు, పురుషుల వ్యాయామం,

పిల్లల ఆటపాటలతో సందడిగా ఉద్యానంలో ప్రతి రోజు సందడి నెలకొంటోంది. విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు కోరగా చర్యలు తీసుకుంటామని పుర కమిషనర్ టి. రవి తెలిపారు.



(c) eenadu

రేపు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

చిత్తూరు నగరం: కార్తిక మాసం శివకేశవులిద్దరికీ ప్రీతికరమైంది. ఈ మాసంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యత ఉంది. ఇంతటి పవిత్రమైన నెలలో దీపారాధన చేస్తే తెలియక చేసిన పాపాలు కూడా నశిస్తాయని శాస్త్ర వచనం. అపార పుణ్య సముపార్జనకు ఇదో మార్గమని భక్తుల విశ్వాసం. జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఈనెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్ ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం జరగనుంది. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆతిథ్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో మహిళలకు మాత్రమే దీపారాధన అవకాశం ఉంది. ప్రవేశం, పూజా సామగ్రి ఉచితం.

వేద పఠనం: కాణిపాక ఆలయ వేద పండితులు
వైదిక నిర్వహణ: బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణికుమార్‌శర్మ బృందం
ప్రవచనకర్త: శ్రీ ఉప్పల దడియం భరత్ శర్మ
అష్టోత్తరం: వినాయక అష్టోత్తరం
సమయం: మంగళవారం సాయంత్రం 5గంటలకు
స్థలం: పాత న్యూటెక్ కల్యాణం ప్రాంగణం
ప్రత్యక్ష ప్రసారం సాయంత్రం 6-8
వేదిక పాసుల పంపిణీ సోమవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు న్యూటెక్ కల్యాణం పరిమిత సంఖ్యలో ఎంట్రీ పాసులు పంపిణీ చేయబడును.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | ఈటీవీ తెలంగాణ | ఈటీవీ Life

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల్లో, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు మూడుగంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 80,560 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.22 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

12వేల టోకెన్ల జారీ: శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు ఆదివారం 12 వేల సర్వదర్శన టోకెన్లు జారీచేశారు. వీరికి సోమవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు మార్గంలోని భక్తులకు మరో రెండువేల టోకెన్లు జారీచేశారు.

879 పాఠశాలలు.. రూ.21.10 కోట్లు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: కూటమి సర్కార్ ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కుమ్మరించింది. మౌలిక సదుపాయాల కల్పన కోసం చర్యలు చేపట్టింది. తిరుపతి జిల్లాలోని 879 పాఠశాలల్లో ప్రహరీలు, ప్రధాన మరమ్మతులు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు కోసం ముందస్తుగా 40 శాతం నిధులు రూ.21.10 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో వచ్చే మూడు నెలల్లో నిర్ణయించిన పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని విద్యా శాఖ అధికారులు ఆదేశించారు.

విద్యుత్తు సమస్యలున్నాయా..?

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ 'సీఎండీ'

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. డిస్కం పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని వినియోగదారులు సమస్యలు చెబితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంప్రదించాల్సిన నంబరు: 89777 16661

పెరిగిన ధరలు.. వ్యాధుల బెంబేలు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్‌లో ప్రస్తుత ధరలు ఆశాజనకంగా పెరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గూళ్ల ధర ప్రస్తుతం కిలో రూ.720 పలుకుతోంది. వారం రోజుల నుంచి ఈ ధరలో ఏమాత్రం తగ్గుదల లేదు. ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇటీవల వాతావరణ మార్పులతో పట్టుపురుగులకు తెగుళ్లు సోకడంతో చనిపోతున్నాయని.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

9కి 3 మాత్రమే.. ధర ఆశాజనకంగా ఉన్నా.. పట్టు పురుగులకు మాత్రం వ్యాధుల బాధ తప్పటం లేదు. ప్రస్తుతం మస్కాడిన్ అనే(సున్నపు కట్టు) వ్యాధి పురుగులకు సోకుతోంది. చాలా చోట్ల ఈ వ్యాధి కారణంగా పట్టు పురుగులు చనిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాలు చూస్తున్నారు. పలమనేరు మార్కెట్‌కు నిత్యం 9 టన్నులు రావాల్సి ఉండగా.. ప్రస్తుతం మూడు టన్నులకే పరిమితమైంది.

జాగ్రత్త పాటించాలి.. షెడ్లలో తగిన ఉష్ణోగ్రత ఉండేలా చూసుకోవాలని.. పట్టు పురుగులున్న బెడ్లలో తేమ లేకుండా చూడాలని ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు.

పెద్దపులి.. గాండ్రిస్తుందా?

- గతంలో చిట్వేలి అడవుల్లో గుర్తింపు
- శేషాచలంలో గణనకు సన్నద్ధం

జీవకోన, న్యూస్‌టుడే: శేషాచలం అడవులకు పులుల రాకపై ఉత్కంఠ నెలకొంది. రెండేళ్ల కిందట టైగర్ కారిడార్ పనుల కారణంగా ఉమ్మడి కడప జిల్లా శేషాచలం పరిధిలోని చిట్వేలి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం రికార్డు చేసినట్లు అటవీశాఖ అధికారులు గతంలో ప్రకటించారు. తదనంతరం ఎన్ని వచ్చాయి.. మిగతా ప్రాంతాల్లోకి ప్రవేశించాయా.. లేదా? తిరిగి నల్లమలకు చేరుకున్నాయా..? వంటి ప్రశ్నలకు నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు (ఎన్ఎస్‌టీఆర్) నేతృత్వంలో జరిగే పులుల గణన సమాధానం ఇవ్వనుంది.

ఎక్కడెక్కడ (చ.కి.మీ.)
నల్లమల: 3296.31
శేషాచలం: 4755.97

నల్లమలలో సంతతి
2018: 62 | 2022: 73

గణన ఎప్పుడంటే.. 2025 నవంబరు నుంచి 2026 మార్చి వరకు
సంస్థల భాగస్వామ్యం: వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ), నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ శాస్త్రవేత్తలు, నిపుణులు

అవొక్కటే కాదు..

- గణనలో పెద్ద పులులతో పాటు చిరుతలు, దుప్పులు, జింకలు, తోడేళ్లు, అడవి కుక్కలతో పాటు మంసాహార, శాకాహార జంతువుల పెరుగుదలను సైతం పరిశీలిస్తారు. అటవీ విస్తీర్ణంలో ఏదైనా మార్పు వచ్చిందా, పచ్చదనం తీరు ఎలా ఉందన్న వివరాలూ సేకరిస్తారు.

పులి, చిరుతల సంఖ్యా నమోదు

ఈనెలలోనే డబ్ల్యూఐఐ, నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీల నిపుణుల ఆధ్వర్యంలో గణన ప్రారంభమవుతుంది. ఐదు నెలల పాటు జరిగే ఈ గణనలో శేషాచలం అడవుల్లోని మాంసాహార జంతువుల గణన మొత్తం జరుగుతుంది. పెద్దపులి, చిరుతల సంఖ్యపైనా స్పష్టత వస్తుంది. - సాయిబాబ, జిల్లా అటవీ అధికారి, తిరుపతి

టైగర్ కారిడార్ లక్ష్యం ఇలా..

- ఒకప్పుడు శేషాచలం అడవులను ఏలిన పెద్దపులి ఇప్పుడు కనిపించడం లేదు. వందేళ్ల కిందట నల్లమల చేరుకుని అక్కడ స్థావరంగా మార్చుకుంది.
- అక్కడ సంతతి పెరగడం, ఒకే సమూహం మధ్య లైంగిక సంపర్కం జరుగుతున్న కారణంగా జన్యుపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అధికారులు గుర్తించారు.
- వాటి నివాసాల పరిధిని శేషాచలం వరకు విస్తరించేందుకు అటవీశాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగానే శేషాచలం, నల్లమల అడవులను కలుపుతూ టైగర్ కారిడార్‌ను 2023లో తెరపైకి తెచ్చారు. కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా అండర్ పాస్‌ల ఏర్పాటు, రాత్రివేళ వాహనాల రాకపోకలపై నిషేధం వంటి చర్యల దిశగా అడుగులు వేశారు.
- తదనంతరం ఆ పరిస్థితులు వేగంగా కల్పించకపోవడం, మౌలిక ఏర్పాట్లు చేయకపోవడంతో ఫలితాలు పెద్దగా కనిపించనట్లు సమాచారం.

నాలుగు దశల్లో లెక్కింపు

దేశవ్యాప్తంగా పెద్ద పులుల సంఖ్య తేల్చేందుకు పది నెలల సమయం పడుతుంది. మొత్తం నాలుగు దశల్లో ఈ ప్రక్రియ జరుగుతుంది.

1. పెద్ద పులుల పాదముద్రలను సేకరిస్తారు. వాటి పెంటికలు, చెట్లపై అవి గీసిన చారలు ఇలా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేస్తారు. వారం రోజుల పాటు ఈ ప్రక్రియ సాగుతుంది.
2. శాటిలైట్ల సాయంతో అటవీ ప్రాంతంలో ఫొటోలు తీస్తారు.
3. తరువాతి దశలో అవి సంచరించే ప్రదేశాల్లో ప్రతి నాలుగు చ.కి.మీ పరిధిలో ఎదురెదురు చెట్లకు రెండు ట్రాప్ కెమెరాల చొప్పున బిగించి... వాటిలో నమోదైన చిత్రాలు సేకరిస్తారు.
4. పైమూడు స్థాయిల్లో గుర్తించిన అంశాలను... నాలుగో దశలో విశ్లేషించి వాస్తవ సంఖ్యను లెక్కగడతారు.

వన్యప్రాణుల సమాచారం తెలిసేలా యాప్

అటవీ శాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచన

ఏనుగులకు మత్తు ఇచ్చే గన్ పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

ఈనాడు- చిత్తూరు, న్యూస్‌టుడే, పలమనేరు: జిల్లాలో ఏనుగుల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. గజరాజులు సంచరించే ప్రాంతాల్లో మామిడి సాగు అధికంగా ఉండటంతో అవి అక్కడే తిష్ఠ వేస్తున్నందున రైతులు ప్రత్యామ్నాయంగా మిరప, లెమన్ గ్రాస్ సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వన్యప్రాణుల సంచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు వీలుగా రూపొందించిన యాప్‌ను వచ్చే ఏడాది మార్చి 3వ తేదీలోపు అందుబాటులోకి తేవాలన్నారు. హనుమాన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే అంశంలో అటవీశాఖతోపాటు పంచాయతీ రాజ్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులూ సహకరించాలని కోరారు. ఆదివారం ఆయన పలమనేరు మండలం ముసలిమడుగు వద్ద కుంకీ ఏనుగుల క్యాంపును ప్రారంభించారు. పెంగరగుంట హెలిప్యాడ్ వద్ద ప్రజలు ఆయనకు వినతులు సమర్పించగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

కర్ణాటక ప్రభుత్వానికి మాట ఇచ్చా

'కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకొచ్చే సమయంలో వాటిని బాగా చూసుకుంటామని ఆ ప్రభుత్వానికి మాట ఇచ్చా. మావటీలు ఈవిషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నారు.' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కితాబిచ్చారు. వారి కృషిని మెచ్చి రూ.50వేలు బహుమతిగా అందించారు.

20 నిమిషాలు ఆసక్తిగా గమనించి

కుంకీ ఏనుగులు జయంత్, వినాయక్, అభిమన్యు, దేవా, కృష్ణ, రంజన్ చేసిన విన్యాసాలను పవన్ కల్యాణ్ ఆసక్తిగా గమనించారు. బరువైన దుంగలను ఎత్తి క్రమశిక్షణగా చివర్లో పడేశాయి. కుంకీలు ఏవిధంగా ఆపరేషన్లను నిర్వహిస్తాయన్నది చూపించారు. 20 నిమిషాలపాటు సాగిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే, పీసీసీఎఫ్ చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్‌డూడీ పాల్గొన్నారు.

చరవాణిలో చిత్రీకరించి

కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రం వద్ద 250 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న మియావాకీ ప్లాంటేషన్‌ను పవన్ కల్యాణ్ పరిశీలించారు. మీటరుకు ఒకటి చొప్పున నాటిన ప్లాంటేషన్‌ను మొబైల్‌లో చిత్రీకరించారు. మొక్కల మధ్యలో ఎప్పుడు పొదలు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. అధునాతన సోలార్ కంచె పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు.

పవన్‌కల్యాణ్‌ని చూసేందుకు వచ్చిన జనం

ఏనుగుల విన్యాసాలు

నేడు సీఐడీ విచారణకు పోలీసులు, అధికారులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుమల పరకామణిలో చోరీ కేసు విచారణ సోమవారం నుంచి మరింత వేగం పుంజుకోనుంది. రెండు రోజుల సెలవుల నేపథ్యంలో విచారణను పక్కనపెట్టి.. సేకరించిన ఆధారాలు నిర్ధారణకు ప్రయత్నించారు. అందులో భాగంగా ఆదివారం సాంకేతిక సహకారంతో సంప్రదింపులు.. ఫోన్ సంభాషణలను, కొన్ని దస్త్రాలను పరిశీలించారు. ఇప్పటికే నిందితుడు రవికుమార్, వారి కుటుంబ సభ్యులను విచారించారు. వారు వెల్లడించిన విషయాలను వీడియో రికార్డింగ్ చేసి ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నారు. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ సమక్షంలో సోమవారం జరిగే విచారణకు హాజరుకావాలని పరకామణిలో పనిచేసే కొందరు తితిదే ఉద్యోగులు, ఇతర అధికారులకు నోటీసులు ఇచ్చారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ.. విచారణ జరిపిన సీఐలతోపాటు అప్పటి డీఎస్పీని విచారణకు పిలిచారు. సుమారు పది మంది వరకు విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

గిజిగాడి గూడు.. అందమెంతో చూడు

తిరుపతి నుంచి రేణిగుంటకు వెళ్లే మార్గంలో వెంకటాపురం వద్ద ఓ పొలంలో తాటిచెట్టుకు పదుల సంఖ్యలో గిజిగాడు పక్షులు గూళ్లు కట్టుకున్నాయి. కొమ్మకొమ్మకో అంతస్తు అన్నట్లు ముచ్చటగొలుపుతున్నాయి. - ఈనాడు, తిరుపతి

రండి.. రూ.86.31 కోట్లు మీవే

బ్యాంకులో ఖాతాదారుల రద్దీ

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లో ఉన్న సొమ్మును తిరిగి పొందడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అవకాశం కల్పించింది. ఇందుకోసం 'మీ డబ్బు- మీహక్కు' పేరుతో మూడు నెలలపాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. అర్హులు తమ సొమ్ము తీసుకోవాలని సూచిస్తున్నారు. జిల్లాలో అలాంటి సొమ్ము రూ.86.31 కోట్లు ఆయా ఖాతాల్లో ఉంది. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో చేపట్టనున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్‌డీఎం) గుంటూరు రవికుమార్ తెలిపారు.

ఎందుకిలా..

ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు, నామిని వివరాల్లో లోపం వంటి కారణాలతో ఆయా ఖాతాల్లో నిల్వలు అలాగే ఉండిపోతున్నాయి. పదేళ్లు, అంతకుమించి లావాదేవీలు జరగని ఖాతాల్లో సొమ్ములను తిరిగి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

జిల్లాలో ఇలా..

- వివిధ బ్యాంకుల్లో మొత్తం 5,14,468 ఖాతాల్లో క్లెయిమ్ చేయని సొమ్ము రూ.86.31 కోట్లు ఉంది.
- వీటిలో వ్యక్తిగత ఖాతాల్లో సుమారు రూ.60.2కోట్లు, వివిధ సంస్థలకు చెందిన 30,400 ఖాతాల్లో రూ.20.83కోట్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించి 5,764 ఖాతాల్లో రూ.5.28కోట్ల నిల్వలు ఉన్నాయి.

ధ్రువపత్రాలు చూపితే చాలు..

ఖాతాల్లో క్లెయిమ్ చేయని నిధులకు సంబంధించి సరైన పత్రాలు సమర్పించాలి. బ్యాంకు అధికారులను సంప్రదించి, ఈకేవైసీ పూర్తి చేసి సొమ్మును తిరిగి పొందొచ్చు.

పొర్లుకట్టలు తెంచి.. ప్రమాదాన్ని ఆహ్వానించి

నాయుడుపేట మండలం చిగురుపాడు వద్ద పొర్లుకట్టను తెంచేసి వేసిన రోడ్డు

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, నాయుడుపేట: తుస్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమరవాణా యథేచ్ఛగా సాగుతోంది. భారీ వర్షాలు వచ్చిన సందర్భంలో స్వర్ణముఖి నదికి ఆనుకుని ఉన్న గ్రామస్థులే కట్టల గురించి యంత్రాంగానికి సమాచారం ఇస్తూ తమ పొలాలు, ఇళ్లలోకి వరద పోటెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నదికి భారీ ప్రవాహం వస్తే ఆ నీరు పొలాలు, పల్లెల్లోకి రాకుండా, పశువులు నదిలోకి వెళ్లకుండా ఉండటానికి గతంలో పొర్లుకట్టలు కట్టారు. వైకాపా హయాంలో వీటిని తెంచేసి ఇసుకను కొల్లగొట్టారు. ఇప్పుడు కూటమి పాలనలోనూ కొందరు నాయకులు అదేబాటలో నడుస్తున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రధానంగా దందా జరుగుతోంది. నాయుడుపేట మండలం చిగురుపాడు, అయ్యపురెడ్డిపాళెం, మర్లపల్లి, పెళ్లకూరు మండలం కప్పగుంటకండ్రిగ, కల్వకూరు, ముమ్మారెడ్డిగుంట తదితర ప్రాంతాల్లో విధ్వంసం చోటుచేసుకుంది.

సెజ్, భవన నిర్మాణాలకు

స్వర్ణముఖిలో దోచేసిన ఇసుకను మేనకూరు సెజ్, భవన నిర్మాణాలకు తరలిస్తున్నారు. మరికొందరు రెడీ మిక్స్ కాంక్రీట్ వాహనాలకు సరఫరా చేస్తున్నారు. చిగురుపాడులో ఇటీవల మరింతగా పొర్లుకట్టలు తెంచడంతో స్థానికులు తహసీల్దారు, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు అటువైపు వెళ్లేందుకు సాహసించడంలేదు. ఇసుకను తమిళనాడుకు పంపిస్తున్నారు.

104FM Tirupati ఈ FM 104 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

రేపు తిరుచానూరులో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి ప్రారంభంకానున్నాయి. ఉత్సవాలకు ముందు వచ్చే మంగళవారం రోజున ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు గర్భాలయం గోడలు, ధ్వజస్తంభం, ఆనంద నిలయం, అనుబంధ ఆలయాలను సుగంధ పరిమళ ద్రవ్యాలతో శుభ్రం చేయనున్నారు.

ఐదంచెలు.. కొలువుకు నిచ్చెనలు

ప్రాంగణ ఎంపికల్లో నైపుణ్యానికే కంపెనీలు మొగ్గు

-న్యూస్‌టుడే, పుత్తూరు,

రాష్ట్రంలో పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయి. దీంతో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కళాశాలల్లోనూ వచ్చే ఏడాదిలోగా ప్రాంగణ ఎంపికలు నిర్వహించడానికి కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఏటా వేలాది మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తి చేసుకొని బయటకు వస్తున్నా కొలువులకు అవసరమైన నైపుణ్యాలను సాధించలేకపోతున్నారు. కంపెనీలు నిర్వహించే రాత పరీక్షలోనూ గట్టెక్కలేకపోతున్నారు. కొన్ని అంశాలపై దృష్టిసారిస్తే కొలువు సులువేనని నిపుణులు చెబుతున్నారు. ఇంకేం ఆలస్యం.. క్యాంపస్ ఇంటర్వ్యూకు ఇక సన్నద్ధమవుదామా..:

సాధనెంతో ముఖ్యం

గతంలో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారి అనుభవాలు తెలుసుకోవాలి. వారిని ఎలాంటి ప్రశ్నలు అడిగారు.. ఎలా సన్నద్ధం కావాలో అడిగి ఆ దిశగా సాధన చేయాలి. సాఫ్ట్ స్కిల్స్, భావవ్యక్తీకరణ, ఆంగ్లంపై పట్టు పెంచుకోవాలి. నిత్యం దినపత్రికలు చదవడంతోపాటు మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతికతపై అవగాహన అవసరం. పత్ర సమర్పణ ఉద్యోగాల ఎంపికకు ఎంతగానో ఉపకరిస్తుందని ఎంపికల అధికారులు పేర్కొంటున్నారు.

5. చివరిగా హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ చేస్తారు. మేనేజింగ్, సాఫ్ట్‌స్కిల్స్, సైకలాజికల్ టెస్ట్, కుటుంబ నేపథ్యం తదితర విషయాలు తెలుసుకుంటారు.
4. ఎక్కువ మంది ఎంపికైతే బృంద చర్చలు నిర్వహిస్తారు. ఆంగ్లంపై పరిజ్ఞానం, నడవడిక, సమయస్ఫూర్తిని గమనిస్తారు.
3. మూడో దశలో సాంకేతికత అంశాలపై పరీక్ష పెడతారు. ఇదే సమయంలో విద్యార్థి విషయం పరిజ్ఞానాన్ని అంచనా వేస్తారు. బ్రాంచి సబ్జెక్టుతో పాటు ఏదైనా ప్రాజెక్టులు చేస్తే వాటిని అడుగుతారు.
2. రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి కోడింగ్, కార్యనిర్వహణ నైపుణ్యాలపై పరీక్ష ఉంటుంది. సి, జావా, పైథాన్‌పై ప్రశ్నలు అడగడంతో పాటు ప్రోగ్రాం రాయాలి.
1. తొలుత ఆన్‌లైన్, రాత పరీక్ష నిర్వహిస్తారు. ఆప్టిట్యూడ్, రీజనింగ్, వెర్బల్ పజిల్స్, లాజిక్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రశ్నలు అడుగుతారు.

ఇవి తెలుసుకోండి..

- ఇంజినీరింగ్ విద్యతో పాటు గ్లోబల్ సర్టిఫికేషన్, కోడింగ్ పరీక్షలు, హ్యాక్‌థాన్‌పై నైపుణ్యాలు పెంచుకోవాలి.
- ప్రాంగణ ఎంపికలు నిర్వహించే కంపెనీల పూర్వాపరాలు ముందే తెలుసుకోవాలి.
- కంపెనీకి దేశంతో పాటు రాష్ట్రంలో బ్రాంచీలుంటే బహుళజాతి కంపెనీగా, వందలోపు ఉద్యోగులుంటే చిన్న కంపెనీగా పరిగణించాలి.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

ఆలయ దర్శిని

కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో సేవలు

సుప్రభాత సేవ, గోపూజ: వేకువజామున 4.00
బిందుతీర్థ అభిషేకం: 4.30 గంటలు
పంచామృతాభిషేకాలు: ఉదయం 5.30 (ప్రథమ కాల), 9.00 (ద్వితీయకాల), 11.00 (తృతీయకాల)
క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45
ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు.
నిత్య కల్యాణం: 11.30 గంటలకు
హోమాలు: ఉదయం 7 నుంచి 10 గంటల వరకు

నిజరూప దర్శనం: ఉ. 7-7.30, 8.30-9.00, 10.30-11.00
సాయంత్రం: 4.30- 5.00
సర్వదర్శనం: ఉ. 6-7,8-8.30, 9.30 -10.30 గంటల వరకు
మ. 12.00, **సా.** 4.30, **రా.** 7-9

– న్యూస్‌టుడే, కాణిపాకం

శ్రీవారి ఆలయంలో

నిత్యోత్సవాలు

తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతం, మంగళ, బుధ, గురువారాలు ఉ.3.45 గంటలకు తోమాలసేవ, 4.45 గంటలకు అర్చన, మ.12 గంటలకు కల్యాణోత్సవం, 2 గంటలకు డోలోత్సవం, 3 గంటలకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సాయంత్రం 5 గంటలకు సహస్ర దీపాలంకారసేవ.

సర్వదర్శనం: తెల్లవారి 3.30-5.45, ఉ.8-9.30కు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. గురువారం, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి సర్వదర్శనం.

వారోత్సవాలు: ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9కి నిర్వహిస్తారు. బుధవారం సహస్రకలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం ఉదయం 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, తిరుమల

ముక్కంటి ఆలయంలో

ఉదయం: 5.30: సుప్రభాత సేవ. 5.45: గోమాత పూజ
6.30: ప్రథమ కాలాభిషేకం
7.30: ద్వితీయ కాలాభిషేకం
11.00: నిత్యోత్సవం, చండీ, రుద్రహోమాలు
11.30: నిత్య కల్యాణం
సాయంత్రం: 3.30: ప్రదోష కాలాభిషేకం **రాత్రి :** 7.00: నీరాజన మంత్రపుష్పం
9.00: ఏకాంతసేవ
సర్వదర్శనం: ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.

రాహు, కేతు పూజలు: ఉదయం 6 నుంచి సాయంత్రం 5. వరకు. **అభిషేకాలు:** మృత్యుంజయ శివలింగానికి (సోమవారం), కాలభైరవునికి (మంగళ), శ్రీమేధాదక్షిణామూర్తికి (గురు), శనిభగవానునికి (శని), సూర్యనారాయణుడికి (ఆది). మనోన్మణికి ఊంజల్‌సేవ(శుక్రవారం). ● సోమవారం సాయంత్రం భరద్వాజతీర్థంలో లక్ష దీపోత్సవం.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

పట్టుపట్టి.. పతకాలు

శిక్షణలో తలమునకలైన క్రీడాకారిణులు

అండర్-19 విభాగంలో నిర్వహించే బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ముగ్గురు క్రీడాకారిణులు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో సత్తా చాటారు. జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులతోపాటు కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు ఇస్తున్న ప్రోత్సాహంతో ఇక్కడి క్రీడాకారులు సిద్ధమవుతున్నారు.

- న్యూస్‌టుడే ,శ్రీకాళహస్తి, తొట్టంబేడు,

క్రీడాకోటాలో ఉద్యోగం లక్ష్యం

ఈమె పేరు ఉమ. నివాసం శ్రీకాళహస్తి. ఇక్కడి కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతోంది. 2024లో జూనియర్ విభాగంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికైంది. విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తనదైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి నాగ్‌పూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొంది. ఈ ఏడాది జనవరిలో ఎస్వీ విశ్వవిద్యాలయం బాల్‌బ్యాడ్మింటన్ జట్టు సభ్యురాలిగా ఎంపికయ్యారు. తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీలో అంతర్ విశ్వవిద్యాలయాలు, ప్రకాశం జిల్లా చేవూరులో అంతర్‌రాష్ట్ర పోటీల్లోనూ రాణించింది. జాతీయ స్థాయిలో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడాకోటాలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకెళుతుంది.

గుర్తింపునిచ్చే ప్రదర్శనతో ఆడాలి

మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది నందిని. కర్నూలు జిల్లా. ఈ ఏడాది అనంతపురం జిల్లా రామాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచింది. జాతీయ స్థాయిలో రాణించి మంచి క్రీడాకారిణిగా గుర్తింపు సాధించాలన్న లక్ష్యంతో శ్రమిస్తుంది.

జాతీయస్థాయిలో సత్తా చాటాలి

అనంతపురం జిల్లా వజ్రకూరు ఆర్.లక్ష్మీదేవి స్వగ్రామం. ఇక్కడి కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తొలిసారి ఆగస్టులో జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ప్రకాశం జిల్లా చేవూరులో జరిగిన అంతర్ రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో తమదైన రీతిలో ప్రతిభ కనపరిచింది. జాతీయ స్థాయిలో సత్తాచాటి రాష్ట్రానికి ఖ్యాతిని తీసుకురావాలన్న లక్ష్యంతో శ్రద్ధగా క్రీడా నైపుణ్యాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తుంది.

సంకల్ప పూజలు నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన దీక్షా గురుకుల్

లక్ష బిల్వ, కుంకుమార్చనలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో లక్ష బిల్వ, కుంకుమార్చనలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ విశేషోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఆలయంలోని అలంకార మండపంలో శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కంద మూర్తితో పాటు పరివార దేవతామూర్తులకు విశేష అలంకరణలు చేపట్టారు. అనువంశీక ప్రధాన దీక్షా గురుకుల్ స్వామినాథన్, ప్రధాన అర్చకులు సంబంధం, కరుణా నేతృత్వంలో సంకల్ప పూజలు జరిగాయి.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు ఆదివారం దర్శించుకున్నారు. తెల్లవారుజామున సుప్రభాత సేవలో తమిళ సినీనటి నీలిమారాణి, వైకాపా మాజీమంత్రులు అంబటి రాంబాబు, కె.నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దర్శించుకున్నారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్‌తో విద్యావ్యవస్థ బలోపేతం

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుచేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీరమణ కోరారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు ఉమ్మడి సర్వీస్ రూల్స్ లేకపోవడంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 73, 74 ప్రకారం ఉమ్మడి సర్వీస్ అమలు చేయాలన్నారు. డీఈవో, డీవైఈవో, పాఠశాలల తనిఖీ అధికారుల పోస్టులను ఉద్యోగోన్నతి ద్వారా ఉపాధ్యాయులు పొందలేక పోవడం బాధాకరమని చెప్పారు. ఎంఈవో-1 నియామకాల్లో సర్వీస్ రూల్స్ లేక 400కు పైగా మండలాల్లో విద్యాధికారులు లేకనే విద్యాసంవత్సరం గడిచిపోతోందని వాపోయారు. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న 1,043 పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర నాయుడు, మణిగండన్, నాయకులు రెడ్డెప్పనాయుడు, సరిత, రెహానాబేగం, ఎస్పీ బాషా, కృష్ణమూర్తి, పార్థసారథి, సురేష్, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

వరద సాయంలో డీలర్ చేతివాటం

■ ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలో వరదముంపు గ్రామాలకు రాష్ట్రప్రభుత్వం తక్షణ సాయం కింద నిధులు మంజూరు చేసి వారికి పంపిణీ చేయాలని ఆదేశాలు జారీచేస్తే.. ఎస్ఎల్‌పురం చెరువు ఆయకట్టు ఛైర్మన్ కమీషన్‌కు కక్కుర్తిపడి బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటన ఎస్ఎల్‌పురంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని కళత్తూరు ఎస్సీకాలనీలో 494, పాతపాళెం 136, కళత్తూరు 60, ఎస్ఎల్‌పురంలో 32 కుటుంబాలు ముంపునకు గురైనట్లు సర్వే బృందాలు నిర్ధారించాయి. అయితే కుటుంబంలో ఒక్కరు ఉంటే రూ.వెయ్యి, ఇద్దరు ఉంటే రూ.రెండు వేలు, ముగ్గురు ఆపై ఎందరున్నా రూ.మూడు వేలు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ ఎస్ఎల్‌పురంలో ప్రతి మనిషి నుంచి రూ.200 మినహాయించుకుని బాధితులకు అందజేస్తున్నారు. దీనిపై బాధితులు ఎస్ఎల్‌పురం చెరువు ఆయకట్టు ఛైర్మన్ నిలదీస్తే అందరికీ పంచాలంటూ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి వరద బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

శునకాలు.. ఇక షెల్టర్లకే

● తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణంలో గతేడాది డిసెంబరు 19న విష్ణుమహల్ థియేటర్ నుంచి కార్వేటినగరం రోడ్డు వరకు 27మందిని పిచ్చికుక్క కరిచింది. కుక్కకాటుకు గురైన వారంతా ఆస్పత్రికి వచ్చి ఏఆర్‌వీ, హిమినోగ్లోబిన్ ఇంజెక్షన్లు వేయించుకున్నారు. కొందరికి గాట్లు పెద్దవి కావడంతో రెండు, మూడు కుట్లు వేశారు.

● తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి మండలం కయ్యూరు ఎస్టీ కాలనీకి చెందిన రెండేళ్ల బాలుడు సుమన్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధికుక్కలు దాడి చేశాయి. ముఖంపై గాట్లు పడటంతో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం.

● చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలో రోజుకు నాలుగైదు కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్నారు.

● దేశ అత్యున్నత న్యాయస్థానం విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్సు, రైల్వే స్టేషన్‌లోకి శునకాలు రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఆయా సంస్థల ప్రాంగణంలోకి అవి చొరబడకుండా కంచెలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. నోడల్ అధికారులు క్రమం తప్పక తనిఖీలు నిర్వహించి సమస్య తలెత్తకుండా చూడాలని ఉత్తర్వులు ఇచ్చింది. నోడల్ అధికారుల వివరాలు ఆయా ప్రాంగణాల్లో ప్రవేశ ద్వారం వద్ద ప్రదర్శించాలని సూచించింది. అదే సమయంలో జన సమర్థ, బహిరంగ ప్రదేశాల్లో సంచరించకుండా చూడాలని ఆదేశాలిచ్చింది.

● మార్గదర్శకాలు జారీ చేసిన సుప్రీంకోర్టు
● రెండు వారాలే గడువు

పుత్తూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, తిరుపతి నగరపాలికలు, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, నగరి, కుప్పం, పుంగనూరు, పలమనేరు మున్సిపాలిటీల్లో 27,350 కుక్కలు ఉన్నాయి. ఏటా నగరపాలక, పురపాలికల అధికారులు వాటి సంతతి పెరగకుండా వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేపడుతున్నట్లు లెక్కలు చూపుతున్నారు. అయితే నగరాలు, పట్టణాల్లో వీటి సంతతి మాత్రం తగ్గకపోగా పెరుగుతోంది.

మందులు పర్వాలేదు..

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు ఉన్నాయి. ఒక్కో సమయంలో కుక్కకాటు అధికంగా జరిగిన సందర్భంలో పక్కనున్న ఆసుపత్రుల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి.

పుత్తూరులో వీధి కుక్కలు



బాలాయపల్లి : ఇటీవల కయ్యూరు ఎస్టీకాలనీలో గాయపడ్డ బాలుడు

నగరాలు, పురపాలికల్లో కుక్కల వివరాలు

చిత్తూరు జిల్లా:	తిరుపతి జిల్లా:
9,250	18,100

విధిగా పాటించాల్సిందే..

వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి అన్ని నగర, పురపాలికలు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాల్సిందే. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని నగర, మున్సిపాలిటీల్లో పునరుత్పత్తి జరగకుండా స్టెరిలైజేషన్ ప్రక్రియ కోసం కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చాం. త్వరలోనే అన్ని కేంద్రాల్లో వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. **-నాగరాజు, ఆర్డీ, అనంతపురం**

చూసైనా మారుదాం.. ప్రత్యామ్నాయం వాడుదాం

అలిపిరి గరుడ కూడలి నుంచి ఎస్వీ జూకు వెళ్లే మార్గంలోని రీజినల్ సైన్స్ సెంటర్‌కు నిత్యం వందలో సంఖ్యలో విద్యార్థులు, సందర్శకులు, యాత్రికులు, స్థానికులు వస్తుంటారు. ఆవరణలో సందర్శకులు తాగి పడేసిన ప్లాస్టిక్ తాగునీటి బాటిళ్లను స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇక్కడి సిబ్బంది సేకరించి 600 సీసాలతో 11 అడుగుల ఎత్తయిన నమూనాను తీర్చిదిద్ది ఆవరణలో ఉంచారు.. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ఎదురవుతున్న ఇబ్బందులు విశదీకరిస్తూ ప్రత్యామ్నాయ పద్ధతులు అనుసరించేలా సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు. **- ఈనాడు, తిరుపతి**

తడిసిన రికార్డులు.. ఆందోళనలో విద్యార్థులు

కళత్తూరు ప్రాథమిక పాఠశాలలో బురద

బెంచీలపై రికార్డులు ఆరబెట్టిన విద్యాశాఖ అధికారులు

కేవీబీపురం, న్యూస్‌టుడే: సరస్వతి నిలయం బురదమయంగా మారింది.. విద్యార్థుల రికార్డులు తడిసి ముద్దయ్యాయి. . తిరుపతి జిల్లాలోని కేవీబీపురం మండలంలోని రాయలచెరువు ఇటీవల తెగి వరదముంపునకు కళత్తూరు ప్రాథమిక పాఠశాల భవనం ఐదు అడుగుల మేర బురదలో పేరుకు పోవడంతో విద్యా నిలయంలోకి వెళ్లలేని స్థితి నెలకొంది. గత మూడు రోజులుగా పాఠశాలలోని రికార్డులను బురదలో కూరుకు పోవడంతో అందులోని రికార్డులను పైకితీసి వాటిని కాపాడుకునేందుకు విద్యాశాఖ చూపిన ప్రయత్నంలో కొంత వరకు సఫలమైనా పూర్తిస్థాయిలో ఫలితం దక్కడంలేదు. దీంతో అడుసులోనే పలు రికార్డులు మాయమైనట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్న రికార్డులు చెల్లాచెదురుగా మారడంతో పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు అర్హత

శిక్షకుడితో ధర్మిక్ నాగేశ్వర, సిద్ధార్థ్

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: కాకినాడలో జరిగిన 37వ అంతర జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. ప్రత్యేక కేటగిరిలో కె.ధర్మిక్ నాగేశ్వర రింక్-1లో స్వర్ణం, రింక్-2లో రజతం, సిద్ధార్థ్ రింక్-1,2లో స్వర్ణ పతకాలు కైవసం చేసుకొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

అక్షరం.. ఆకట్టుకునే అందం

ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు చేతిరాత శిక్షణ అని వినగానే కాస్తంత ఆశ్చర్యం వేస్తోంది కదూ. నిజమే ఓ విద్యార్థి తన చేతిరాత మెరుగుపరచుకుంటే అతనొక్కడే లబ్ధి పొందుతాడు. అదే ఓ ఉపాధ్యాయుడు నేర్చుకుంటే వందమంది విద్యార్థుల చేతిరాతలో మార్పు తీసుకువచ్చే అవకాశముంది. దీన్ని గమనించిన బాబుఅగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి ఆమె నేర్చుకోవడంతో పాటు పురపాలక సంఘం పరిధిలోని సహచర ఉపాధ్యాయులకు రెండురోజుల శిక్షణకు సంకల్పించారు. ఇందుకు 70 మంది హాజరవడం విశేషం.

శిక్షణకు హాజరైన పురపాలక సంఘ ఉపాధ్యాయులు

నా వంతు బాధ్యత

దసరా సెలవుల్లో గుంటూరులో రెండ్రోజుల శిక్షణ తీసుకున్నా. ఎంతో మార్పు వచ్చింది. ఇదే శిక్షణ పిల్లలకు ఇస్తున్నా. శిక్షణ ఉపాధ్యాయులకు ఇస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని గుర్తించా. ఉపాధ్యాయుల సహకారం, కుటుంబీకుల ప్రోత్సాహంతో దాదాపు రూ.80 వేల వ్యయంతో శిక్షణకు సిద్ధపడ్డా. గుంటూరు నుంచి శిక్షకులను పిలిపించడంతో పాటు వసతులు కల్పించా.
- శ్రీదేవి, హెచ్‌ఎం, పురపాలక పాఠశాల

చేతిరాత బాగలేక సిగ్గుపడ్డా

మాది గుంటూరు. గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నా. 2016 జాతీయ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందా. అయినా నా చేతిరాత పిల్లలకు అంతగా అర్థమయ్యేది కాదు. దీంతో సిగ్గుపడ్డా. దీనిపై పలు దఫాలుగా పరిశోధనలు చేయడం, చేతిరాత మెరుగు పరుచుకునేందుకు ఎంతో శ్రమించడంతోపాటు ఆ కష్టాన్ని పుస్తకరూపంలోకి తీసుకువచ్చా. పలు జిల్లాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి మార్పు తీసుకువచ్చా. ఇప్పటి వరకు 77 వేల మందికి శిక్షణ ఇచ్చా. **- వి.రామ్మోహన్‌రావు, చేతిరాత శిక్షకులు, గుంటూరు**

అక్షరాలు అందంగా ఉండాలి

అక్షరాలు అందంగా ఉంటే ఆ గుర్తింపు వేరే విధంగా ఉంటుంది. నా అక్షరాలు బాగుంటాయని భావిస్తూ వచ్చా. శిక్షణ తీసుకున్నాక నేనే నమ్మలేని విధంగా మార్పు వచ్చింది. ఉపాధ్యాయుల అనుమతితో ఈ శిక్షణలో పాల్గొన్నా.
- శాంతి, ఏవో, ఆర్డీవో కార్యాలయం

జాతీయస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

సీతానగరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు సీతానగరం మండలం జోగింపేటలో ఆదివారం ముగిశాయి. అండర్-14, 17, 19 వ్యక్తిగత విభాగాల్లో బాలికలు 15 మంది, బాలురు 15 మంది జాతీయస్థాయికి అర్హత సాధించినట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎస్.మురళి తెలిపారు. అండర్-14లో తిరుపతికి చెందిన వి.త్రిపురాంబిక ఎంపికయ్యారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

ఎంపికైన క్రీడాకారులు

చిత్తూరు(క్రీడలు) : 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 షటిల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆటగాళ్ల ఎంపిక పోటీలు ఆదివారం చిత్తూరులో ఉత్సాహంగా సాగాయి. బాలికల విభాగంలో ఆయేష్నా, సిరి చందన, గుహిక, పూజిత(తిరుపతి), మోక్షిత(చిత్తూరు) మొదటి ఐదు స్థానాలు కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో తేజేష్(చిత్తూరు), హరిసోనాల్ (తిరుపతి), నితీష్, శశాంక్ (చిత్తూరు), మోత్విక్ (తిరుపతి) విజేతలుగా నిలిచారు. వీరు గన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని కార్యదర్శి శారద, కోచ్ గోపిరెడ్డి తెలిపారు.

EENADU Classifieds

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL

తిరుపతి- చంద్రగిరి టౌన్‌లో మెయిన్‌రోడ్డుకు ఆనుకొని హౌస్ - విల్లా - హోమ్‌స్టే & అపార్ట్‌మెంట్ కట్టుకునే TUDA అప్రూవల్ కొత్త వెంచర్‌లో కమర్షియల్ - రెసిడెన్షియల్ - ఇన్వెస్ట్‌మెంట్ కొరకు 100% వాస్తు Plots అమ్మబడును. సంప్ర 9505502346.

LEASE
GENERAL

గ్రానైట్ ఫ్యాక్టరీ లీజుకు - చిత్తూరుకు సమీపంలో వేలూరులో 4 బ్లేడ్లు గల గ్రానైట్ ఫ్యాక్టరీ & చిత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గల 2 బ్లేడ్లు గల ఫ్యాక్టరీ లీజుకు ఇవ్వబడును. సంప్ర: 88808 77111, 99451 00777.

TO LET

చిత్తూరు టాణాకు సమీపంలో తిరుత్తణి మెయిన్ రోడ్డులో 4 షాపులు 18.5x27.5 (2షాపులు), 20x35 (1షాపు)& 13.5x14.5 (1షాపు) బాడుగకు ఇవ్వబడును. సంప్ర: 99451 00777, 88808 71111.

JOBS

ప్రభుత్వ సంస్థల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేయుటకు కం. ఆపరేటర్లు, అటెండర్స్, సూపర్‌వైజర్లు కావలెను. జీతం. 16500. ✆ 98487 71117.

శ్రీరామదూత కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేయుటకు అకౌంటెంట్స్ మరియు టెలికాలర్స్ (స్త్రీలు మాత్రమే) కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆ 93904 14081

E-Kartలో స్త్రీ/పు కావలెను. Inter, Any Degree. జీ: 15,000/-. Online are available. Ph: 9704146558, 9550312466.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రాత్రుళ్లు పోలీసుల ప్రత్యేక నిఘా

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: అర్ధరాత్రుల్లో ఆకతాయిల ఆగడాలు.. మందుబాబుల వీరంగాలు.. దొంగల దోపిడీలను నిలువరించేందుకు పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. రాత్రి 11 నుంచి 2 గంటల వరకు రోడ్లపై తిరుగుతున్న వారిపై నిఘాపెట్టింది. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐల పర్యవేక్షణలో సిబ్బంది నగరంలో పహారా కాస్తున్నారు. అర్ధరాత్రి వేళ మత్తులో తిరుగుతుంటే అదుపులోకి తీసుకుంటున్నారు. బ్రీత్ అన్‌లైజర్‌తో పరీక్షచేసి కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెడుతున్నారు. పాపిలాన్ పరికరంతో అనుమానిత వ్యక్తుల వేలిముద్రలు పరిశీలించి నేరచరిత్ర తెలుసుకుంటున్నారు. భక్తుల తాకిడి ఉన్న బస్టాండు, రైల్వేస్టేషన్, వసతి సముదాయాల వద్ద.. ఎన్టీవీ నగర్, స్కావెంజర్స్ కాలనీ, రైల్వే కాలనీ, జీవకోన, చెన్నారెడ్డికాలనీ, శ్రీకృష్ణనగర్, కొత్తరోడ్లు, టీఎన్ పాళెం ప్రాంతాల్లో ఐడీ, క్రైమ్ పార్టీలతో ప్రత్యేక నిఘా పెట్టారు. తితిదే సముదాయాల్లో చరవాణులు కొట్టేసే ముగ్గురు యువకులను శనివారం రాత్రి పట్టుకున్నారు. రెండురోజుల కిందట కనకభూషణ్ లేఅవుట్‌లో కారు అద్దాలు ధ్వంసం చేసిన వారిలో ఇద్దరిని అప్పుడే అదుపులోకి తీసుకున్నారు. ఎన్టీవీనగర్‌లో రాత్రివేళ కొట్టుకుంటున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీనిపై డీఎస్పీ భక్తవత్సలం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. నగరం రాత్రివేళ ప్రశాంతంగా ఉండాలంటే పోలీసుల నిఘా పెంచాలన్న ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ టీమ్ పనిచేస్తోందని చెప్పారు. పదిరోజులుగా రాత్రివేళ రోడ్డెక్కి.. అలజడులు సృష్టించే వారిపై చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. యువకులు ఆలస్యంగా ఇంటికి వస్తుంటే తల్లిదండ్రులు దృష్టి సారించాలని, తిరుపతి ప్రశాంతతకు ప్రజల సహకారం అవసరమని కోరారు.

తను లేని నేను లేనని..

☛ భార్య మరణం తట్టుకోలేక భర్త ఆత్మహత్య

తొట్టంబేడు, న్యూస్‌టుడే: భార్య మరణాన్ని తట్టుకో లేక భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వారం రోజుల్లోనే భార్యాభర్తలు మృతిచెందిన హృదయవిదారక ఘటన శ్రీకాళహస్తిలో చోటుచేసుకుంది. పట్టణంలోని కవిత(44), చలపతి(46) దంపతులు. కవిత కొన్నాళ్లుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. ఆమెకు శస్త్రచికిత్స చేయించినా నయం కాకపోవడంతో ఈ నెల 4వ తేదీ ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. భార్య మృతి చెందడాన్ని తట్టుకోలేక భర్త చలపతి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చెన్నైలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుమార్తె యువశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని విద్యార్థి..

కేవీబీపురం, న్యూస్‌టుడే: పాఠశాలకు సక్రమంగా వెళ్లడం లేదని తండ్రి మందలించాడన్న మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నరేష్ ఆదివారం తెలిపారు. రంగయ్యగుంటకు చెందిన మునికృష్ణయ్యకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు అంకయ్య(19) స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్నాడు. పాఠశాలకు సక్రమంగా పోకపోవడంతో తండ్రి మందలించాడు. దీంతో శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో కుటుంబ సభ్యులు వేలూరు సీఎంసీకి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తిరుపతి

• తిరుపతి • చంద్రగిరి

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

తిరుపతి (కలెక్టరేట్) : జిల్లాలోని మండల, రెవెన్యూ డివిజన్, కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు అందరూ పాల్గొంటారని, అర్జీదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

న్యాయసేవా దినోత్సవం

తిరుపతి (లీగల్) : తిరుపతిలోని బీసీ విద్యార్థుల వసతిగృహం, మంగళంలోని ఆశ్రమంలో న్యాయ సేవా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. నాలుగో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వార్డెన్ అనీల, న్యాయవాదులు మునెయ్య, బి.మురళిమోహన్ పాల్గొన్నారు.

విలువిద్య పోటీల్లో రజతం

పాడేరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాడేరులో మూడురోజుల పాటు జరిగిన అండర్-14, 17, 19 బాలబాలికల రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలు ఆదివారంతో ముగిశాయి. అండర్-14 విభాగంలో నెల్లూరు బాల, బాలికల జట్లు ప్రథమ, చిత్తూరు జట్లు ద్వితీయ, కృష్ణా జిల్లా జట్లు తృతీయ స్థానాల్లో నిలిచాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: **సమస్య :** చిగురువాడ పరిధిలోని ఎగువపల్లికి మంచినీటిని సరఫరా చేసే పైపులు పగిలిపోయాయి. ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నా సరిపోవడంలేదు. పైపులు మరమ్మతు చేసి సరఫరాను పునరుద్ధరించాలి. **- సుకుమార్, స్థానికుడు.**

సమాధానం: వెంటనే మరమ్మతు చేయించి ఇబ్బంది లేకుండా చూస్తాం.

-లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, చిగురువాడ

చంద్రగిరి, న్యూస్‌టుడే: **సమస్య:** శ్రీనివాసమంగాపురం బస్టాండు నాలుగురోడ్ల కూడలిలో మ్యాన్‌హోల్ దెబ్బతిని గొయ్యి ఏర్పడింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డుపక్కన ప్రమాదంగా ఉన్న మ్యాన్‌హోల్‌ను సరిచేయాల్సిన అవసరం ఉంది. **- రాజారాయల్, తెదేపా గ్రామకమిటీ అధ్యక్షులు, శ్రీనివాసమంగాపురం**

సమాధానం: ఈ విషయం మా దృష్టికి వచ్చింది. రెండురోజుల్లో విరిగిపోయిన మూతను తొలగించి కొత్తది ఏర్పాటు చేయిస్తాం. **- హారతి, పంచాయతీ కార్యదర్శి, మిట్టపాలెం పంచాయతీ.**

కపిలేశ్వరాలయంలో వేడుకగా లక్ష బిల్వార్చన

ప్రత్యేక అలంకరణలో ఉత్సవర్లు

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 3 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకం, అలంకారం, అర్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 12 గంటల వరకు లక్ష బిల్వార్చన సేవ నిర్వహించారు. సాయంత్రం శ్రీచంద్రశేఖరస్వామివారి ఉత్సవమూర్తులు పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, రవికుమార్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జల.. కాసారాలు

☛ నగర పరిధిలో పెద్దఎత్తున కలుషితం
☛ విగ్రహాల నిమజ్జనం తోడు మురుగునీటితో సమస్యలు

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: తిరునగరి పరిధిలోని చెరువులు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. నగరం నుంచి నేరుగా చేరే మురుగుతో పాటు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేస్తున్న విగ్రహాలు పెద్దఎత్తున పోగుపడి చేపల వృద్ధి, సహజ ప్రవాహానికి అడ్డుగా మారుతున్నాయి.

మట్టిపేరు చెప్పి..

నగర పరిధిలో విగ్రహాల తయారీదారులు మట్టి విగ్రహాల పేరుతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు విక్రయిస్తూ మోసం చేస్తున్నారు. మట్టి, పేపరు, చాక్ పౌడర్‌తో తయారు చేస్తున్న విగ్రహాలు సులువుగా నీటిలో కరిగిపోతాయని, అలాగే సహజరంగులే వినియోగిస్తున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి వారు చెప్పే మాటలకు, చేతలకు పొంతన ఉండటం లేదు. వినాయక ఉత్సవ కమిటీలు, పోలీసులు, నగరపాలక అధికారులు సైతం మట్టి విగ్రహాలే తయారు చేయాలని ఆదేశిస్తున్నా అవి మట్టివేనా? కాదా? అన్న క్షేత్రస్థాయి పరిశీలన సక్రమంగా జరగడం లేదు. నిజం నిలకడ మీద తెలుస్తుందన్నట్టు..నిమజ్జన వేడుకలు ముగిసి మూడునెలలు గడుస్తున్నా కరగని విగ్రహాలే అందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

చెన్నాయగుంట చెరువులో నీటిలో కరగని విగ్రహాలు చూపుతున్న మత్స్యకారుడు

సమస్యాత్మకం ఎక్కడంటే..

తిరుపతి, రేణిగుంట పరిధిలో సుమారు పదికి పైగా చెరువుల్లో విగ్రహాలు నిమజ్జనం చేస్తున్నారు. ఇందులో వినాయకసాగర్, చెన్నాయగుంట, దామినేడు, తూకివాకం, వెంకటాపురం, కరకంబాడి, కొరమేనుగుంట, గొల్లవానిగుంట చెరువులు ప్రధానమైనవి. సగానికిపైగా విగ్రహాలు నీటిలో కరగకుండా చెరువుల అడుగు భాగంలో చేరాయి. మురుగు పెద్దఎత్తున నేరుగా చేరుతూ కంపుకొడుతోంది.

■ తిరుపతి, రేణిగుంట పరిధిలోని చెరువులు : 10
■ నిమజ్జనం చేస్తున్న విగ్రహాలు : 3,000

నష్టపోతున్న మత్స్యకారులు

నగర పరిధిలోని చెరువులను శ్రీసత్యసాయి మత్స్యకార సొసైటీ ప్రతినిధులతోపాటు మత్స్యకారులు చేపల పెంపకానికి ఉపయోగిస్తుంటారు. రూ.లక్షలు వెచ్చించి చెరువులను వేలంలో పాడుకుని చేపల పెంపకాన్ని చేపడుతుంటారు. నగరం నుంచి పెద్దఎత్తున వచ్చే మురుగునీటితోపాటు విగ్రహాల నిమజ్జనంతో చేపలు మృత్యువాత పడుతున్నాయని, వాటి ఎదుగుదలపైనా ప్రభావం పడుతున్నట్లు మత్స్యకారులు వాపోతున్నారు.

అబ్బురపరిచిన భరతనాట్య ప్రదర్శన

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన సందర్శకులను అబ్బురపరిచింది. ఆదివారం చెన్నైకు చెందిన ఆరుద్ర నృత్య అకాడమీ కళాకారుల భరతనాట్య ప్రదర్శన జరిగింది. ఇందులో భాగంగా చేసిన నృత్యాలు కనువిందు చేశాయి. ఏవో సుధాకర్, ఏఈ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగజాతర గోడపత్రికల ఆవిష్కరణ

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి పట్టణంలోని నాలుగు వారాల గంగమ్మజాతర ఉత్సవాలు ఈనెల 11 నుంచి ప్రతి మంగళవారం నిర్వహించనున్నారు. ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలు, గోడ పత్రికలను ఆదివారం ఎమ్మెల్యే పులివర్తి నాని ఆవిష్కరించారు. మొదటిరోజు శ్రీమూలస్థానమ్మతల్లి త్రిశూలం ఊరేగింపు, సాయంత్రం మిట్టగంగమ్మతల్లికి పొంగళ్లు ఉంటాయని తెలిపారు. 18, 25, డిసెంబరు 3వ తేదీన జాతర ఉత్సవాలు ఉంటాయని వివరించారు. తెదేపా సీనియర్ నాయకులు ఎ.ఈశ్వర్‌రెడ్డి, [illegible]రెడ్డి, జాతర పిసపెద్దలు పాకాల సతీష్‌కుమార్‌రెడ్డి, విరూపాక్ష శంకర్‌రెడ్డి, ముఖ్యల రాజారెడ్డి, నామాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తితిదే ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తితిదే ఉద్యోగుల సమస్యలు, సంక్షేమానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందని తితిదే ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చీర్ల కిరణ్ పేర్కొన్నారు. ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవస్థానంలో ఉద్యోగులు శ్రీవారి మీద భక్తితో విధులు నిర్వహిస్తున్నారని, దీర్ఘకాలంగా పెండింగులోని సమస్యలపై పాలకమండలి పెద్దలు, అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. నూతన కమిటీ త్వరలో ఈవోను కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి విశ్వనాథం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా చీర్ల కిరణ్, అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీహరి చౌదరి, ప్రధాన కార్యదర్శిగా వంకీపురం పవన్, కోశాధికారిగా గుంటూరు రేఖ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంట భరత్, మొత్తం 51 మందిని వివిధ హోదాల్లో ఎన్నుకున్నారు.

సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులు

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: వారధి ఇండియా ఫౌండేషన్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ఎస్వీయూ క్యాంపస్ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచి రూ.27 వేల పారితోషికాన్ని బహుమతిగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్, సమగ్రశిక్షా అదనపు కోఆర్డినేటర్ గౌరీశంకర్, మానిటరింగ్ అధికారి శివశంకరయ్య, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ ఆదివారం డీఈవో కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాలుగా విద్యార్థులను ప్రోత్సహించే నిమిత్తం వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తోంది. జిల్లా విద్యాశాఖ, వారధి సంయుక్తంగా ఈ ఏడాది సెప్టెంబరు 16వ తేదీన ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ధనుష్ కృష్ణ (ఎనిమిదో తరగతి), గగన్ కృష్ణ (9వ తరగతి) మొదటి స్థానంలో నిలిచారు. అక్టోబర్ 16న రాష్ట్రస్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి, జ్ఞాపిక, పారితోషకం అందుకున్నారు. వారికి గైడ్ టీచరుగా నిలిచిన రాధకు రూ.5వేలు అందజేశారు.

బహుమతి పొందిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో కేవీఎన్ కుమార్ తదితరులు

చిరుత ఉంది.. జాగ్రత్త

నగర పరిధిలోని ఎస్వీ, వేదిక్, వెటర్నరీ, వ్యవసాయ వర్సిటీల పరిధిలో చిరుతల సంచారంతో విద్యార్థులు.. సిబ్బంది హడలిపోతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఎస్వీయూలో చిరుత కనిపించడంతో అప్రమత్తం అయ్యారు. ఇప్పటికే అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. విద్యార్థులు, ఉద్యోగులు, పాదచారులు, సందర్శకులు జాగ్రత్తగా ఉండాలని.. రాత్రి 8:00 నుంచి ఉదయం 7:00 వరకు వర్సిటీ రోడ్లపైన సంచరించరాదని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎస్వీయూ, వేదిక్ మార్గంలో రహదారి పక్కన చెట్లపొదలు తొలగించారు. - **ఈనాడు, తిరుపతి**

ఫుట్‌పాత్‌పై గుంత.. ప్రమాదపు చింత

తిరుపతి ఆర్టీసీ సెంట్రల్ బస్టాండ్‌లో ప్రమాదం పొంచి ఉంది. బస్సులు బయటికి వచ్చే మార్గం వద్ద ఫుట్‌పాత్‌పై ఏర్పడిన గుంతను నిర్లక్ష్యంగా వదిలేశారు. ప్రయాణికులు, పాదచారులు, వాహనాలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి వదిలేశారు. అనుకోని ఘటనలు జరగకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు..
- **ఈనాడు, తిరుపతి**

ఆత్మీయ కలయిక.. ఆనంద వీచిక

దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాలుగు దశాబ్దాల అనంతరం కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలను పంచుకున్నారు. పత్తిపాటి దేవరాజులునాయుడు సమన్వయకర్తగా అలనాటి ఉపాధ్యాయులు గుడివాడ అన్నయ్యనాయుడు, కె.సీతాపతినాయుడు, డి.విశ్వనాథ రెడ్డి, టీవీఎస్, ఎన్.నందకుమార్, సులోచనాదేవి, రామకృష్ణమనాయుడు, సయ్యద్‌బాషాపీర్, మనోహర్‌లను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో బాబ్జీ, హెచ్‌ఎం సుమతమ్మ తదితరులు పాల్గొన్నారు. - **న్యూస్‌టుడే, పాకాల**

కళ.. భావితరాల సంపద

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే కళలను పరిరక్షించి ఆ కళా సంపదను భావితరాలకు అందించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్లోబల్ ఈవెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో జరుగుతున్న అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి సుమారు 300 మందికి పైగా పాల్గొని శాస్త్రీయ సంగీతాలాపన, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముగింపు సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ, తితిదే పాలకమండలి మాజీ సభ్యుడు పోకల అశోకుమార్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, గ్లోబల్ ఈవెంట్స్ అధినేత కదిరి వెంకటరమణరావు, ఇరముని శేఖర్ పాల్గొని బహుమతులు అందజేశారు.
- **న్యూస్‌టుడే, తిరుపతి (తితిదే)**

సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం తగదు

మాట్లాడుతున్న గుజ్జల ఈశ్వరయ్య, చిత్రంలో హరినాథరెడ్డి, మురళి

తిరుపతి (నగరం) : రాష్ట్ర ప్రభుత్వ సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య విమర్శించారు. ఆదివారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తే ప్రతి జిల్లాకు వంద టీఎంసీల వరకు నీటిని అందించే సామర్థ్యం ఉంటుందన్నారు. గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, సోమశిల-కండలేరు వంటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. రాయలసీమలో మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేస్తున్నారని విమర్శించారు. హరినాథరెడ్డి, మురళి, రాధాకృష్ణ, నదియా పాల్గొన్నారు.

రాష్ట్ర ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్టు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా, పురుషుల ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు ఫెన్సింగ్ సంఘం జిల్లా నిర్వాహకురాలు పి.గీత పేర్కొన్నారు. తిరుపతి తిలక్‌రోడ్డులోని శ్రీదేవి కాంప్లెక్స్‌లోని ఫెన్సింగ్ శిక్షణ కేంద్రంలో ఆదివారం జిల్లా జట్టు ఎంపిక పోటీలు జరిగాయి. పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి సుమారు 30 మంది క్రీడాకారులు తరలివచ్చారు. ఖేలో ఇండియా శిక్షకుడు ఎం.రాఘవ కార్తిక్, రవీంద్రనాథ్ పర్యవేక్షణలో జరిగిన ఎంపిక పోటీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11వ తేదీన రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాల వేదికగా జరిగే పోటీలో పాల్గొంటారన్నారు.

పతకాలతో జిల్లా క్రీడాకారులు

చదరంగంలో జిల్లా క్రీడాకారుల సత్తా

తిరుపతి(క్రీడలు) : రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ చదరంగం ఛాంపియన్‌షిప్‌లో జిల్లా బాలుర జట్టు సత్తాచాటినట్లు అండర్- 19 ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యదర్శి డాక్టర్ ఎస్.బాబు తెలిపారు. పార్వతీపురం వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ నిహాల్, పి. రెడ్డి దేదీప్, సిరిగిరి పార్థసాయి, తోట గౌరవ్ వెంకట్, సైక్ ఫర్హాన్ అహ్మద్ రజత పతకాలు కైవసం చేసుకున్నారు. వీరు త్వరలో జరగనున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.



కోర్టు విధుల బహిష్కరణ

తిరుపతి (లీగల్) : రెండురోజులపాటు కోర్టు విధులు బహిష్కరిస్తూ ఆదివారం తీర్మానం చేసినట్లు తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గొట్టి గజేంద్ర, ప్రధాన కార్యదర్శి వి.విద్యానాథరెడ్డి తెలిపారు. పుత్తూరు కోర్టు ప్రాంగణంలో సంఘం సభ్యుడు సీనియర్ న్యాయవాది ఎ.రాజశేఖర్‌పై ఓకక్షిదారు హత్యాయత్నం చేయడాన్ని నిరసిస్తూ సోమ, మంగళవారాల్లో విధులు బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు.

నేత్రపర్వం... త్రినేత్రునికి పుష్పయాగం

చంద్రగిరి, న్యూస్‌టుడే: రుద్రపాదాల ముక్కోటి మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు పుష్పయాగ మహోత్సవం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం రావణ వాహనంపై భక్తులకు అభయప్రదానం చేశారు.

పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

న్యూదిల్లీలో పురస్కారం అందుకుంటున్న డా.రమ్యశ్రీ

యువ పరిశోధక పురస్కారం

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: తిరుపతికి చెందిన రమ్యశ్రీ అనే విద్యార్థిని యువపరిశోధక అవార్డును ఆదివారం న్యూదిల్లీలో అందుకున్నారు. హార్టికల్చరల్ బయోటెక్నాలజీలో చేసిన కృషికిగాను డా.బి.ఆర్. బార్వాలే యంగ్ రీసెర్చర్ పురస్కారాన్ని (డాక్టోరల్ థీసిస్ రీసెర్చ్) ఇండియన్ అకాడమీ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్ ప్రదానం చేసింది. ఎస్వీయూలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న మూడే దామ్లా నాయక్ కుమార్తె అయిన రమ్యశ్రీ వై.ఎస్.ఆర్. హార్టికల్చరల్ యూనివర్సిటీ నుంచి హార్టికల్చర్‌లో బీఎస్సీ (ఆనర్స్) పట్టా పొందారు. అనంతరం కర్ణాటక బాగల్‌కోట్‌లోని హార్టికల్చరల్ సైన్సెస్ యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ (ఫ్రూట్‌సైన్స్), న్యూదిల్లీలోని ఐసీఏఆర్-ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి పీహెచ్‌డీ పొందారు.

రెండో వార్షికోత్సవం

తిరుపతి (వైద్యవిభాగం): అస్టర్ నారాయణాద్రి ఆసుపత్రిలోని 9 ఫెర్టిలిటీ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు ఆసుపత్రి సీఓఓ డా.శ్రీధర్‌ముని తెలిపారు. ఐవీఎఫ్, ఐయూఐ చికిత్సల ద్వారా తల్లులైన 28 మంది వారి పిల్లలతో కలసి కేకు కోసి సంబరాలు నిర్వహించారు. వైద్యులు ఇచ్చిన ధైర్యం, నమ్మకంతో తల్లితనం వరించిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. వైద్యులు స్వప్న శ్రీనాథ్, హరికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లులతో కలిసి కేకు కోస్తున్న వైద్యులు

వేడుకగా కాలభైరవ ఉత్సవాలు

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తి పీఠంలో శ్రీ కాలభైరవ స్వామి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యంతో పాటు తీర్థప్రసాదాలు అందించారు.

ఆవుపై చిరుత దాడి

తిరుపతి (ఎస్వీయూ) : ఎస్వీ వర్సిటీ ఆవరణలో ఆదివారం సాయంత్రం ఓ ఆవుపై చిరుత దాడి చేసింది. ఘటనలో ఆవు గాయాలతో బయటపడింది. విషయాన్ని అటవీశాఖ అధికారులకు వర్సిటీ భద్రతా సిబ్బంది తెలిపారు.

30 కిలోల గంజాయి స్వాధీనం

చంద్రగిరి, న్యూస్‌టుడే: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని చంద్రగిరి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన ఆదివారం గాదంకి టోల్‌ప్లాజా వద్ద చోటుచేసుకుంది. విశాఖపట్నం నుంచి తమిళనాడుకు బొలెరోలో తరలిస్తున్నారన్న సమాచారంతో చంద్రగిరి సీఐ సురేష్‌కుమార్ సిబ్బందిని అప్రమత్తం చేసి వాహనాలను తనిఖీ చేయించారు. వాహనంలోని డ్యాష్‌బోర్డు, గేర్‌బాక్స్, స్టెప్నీ టైర్, సైడ్ డోర్స్ ప్రాంతాల్లో దాచిన 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని వాహన డ్రైవర్‌ను విచారిస్తున్నారు.

(c) eenadu

శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు

ప్లాస్టిక్‌పై పోరాటం

పర్యావరణ పరిరక్షణకు ఐఐటీ శ్రీకారం

వస్త్ర సంచులతో గ్రామీణులు, విద్యార్థులు

శ్రీకాళహస్తి(గ్రామీణ(ఏర్పేడు), న్యూస్‌టుడే: రోజు రోజుకు ప్లాస్టిక్ వినియోగం అధికమవుతుండటంతో ఎటుచూసినా గుట్టలుగా పేరుకు పోయిన వ్యర్థాలతో వాతావరణం కాలుష్యమవుతోంది. దీన్ని నియంత్రించేందుకు తిరుపతి ఐఐటీ విద్యార్థులు శ్రీకారం చుట్టారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పల్లెలో పర్యటిస్తూ ప్లాస్టిక్ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. వ్యర్థాలను శుభ్రం చేయడంతో పాటు రోగాలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లడం, మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయడం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం వంటి ప్రక్రియను నిర్వహిస్తూ పల్లెప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ చదువుల్లోనే కాదు సమాజసేవలోనూ మాకెవ్వరు చాటిలేరని నిరూపిస్తున్నారు.

వ్యర్థాలతో విద్యార్థులు

ఉచితంగా సంచుల పంపిణీ

ఐఐటీ దత్తత గ్రామాలైన చిందేపల్లి, నాగంపల్లి, పంగూరు, జంగాలపల్లి, రాజులపాళెం, పాగాలిలో ప్రతినెలా రెండో శని, ఆది వారాలతో పాటు సెలవు రోజుల్లో ఐఐటీ విద్యార్థులు పర్యటిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాల గురించి గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇంటింటా తిరిగి వస్త్ర సంచులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పదేళ్ల కాలంలో సుమారు 50వేలకుపైగా ప్లాస్టిక్ రహిత సంచులను పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములుగా మారడం విశేషం.

స్వచ్ఛతకు పెద్దపీట

దత్తత గ్రామాలతో పాటు తిరుపతి, శ్రీకాళహస్తి, ఏర్పేడు వంటి ప్రాంతాల్లో ఐఐటీ విద్యార్థులు పర్యటిస్తున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, పాఠశాల, కళాశాల ఆవరణల్లో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం పరిశుభ్రంగా ఉండేలా అధికారులు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యమంగా చేపడుతున్న కార్యక్రమాలతో ఆదర్శ వంతులుగా నిలుస్తున్నారు.

మరెన్నో సేవా కార్యక్రమాలు

స్వచ్ఛంద సంస్థలతో కలిసి గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు అవసరమైన క్రీడా, విద్యా సామగ్రి పంపిణీ, ప్రత్యేక తరగతులు నిర్వహించడం, వ్యవసాయంలో సాంకేతిక వినియోగం, పంట కాలువల అభివృద్ధి, మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఐఐటీ ప్రాంగణంలోనూ పెరటి తోటలు, పూల మొక్కలు పెంపకం వంటివి చేపడుతుండటం గమనార్హం.

నేటి వృథా.. రేపటి కన్నీరు

రేణిగుంట పంచాయతీలోని అన్నదానసత్రం వీధిలోని కుళాయి నుంచి నీరు వృథాగా పోతుంది. ఈ నీటి వృథాను అరికట్టాల్సిన పంచాయతీ సిబ్బంది తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. వెంటనే పంచాయతీ వారు ఇక్కడ నీటి వృథాను అరికట్టే విధంగా మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు తెలిపారు. **- న్యూస్‌టుడే, రేణిగుంట**

చీమల పుట్టలకు నిలయం

విశ్వకర్మల సమీపంలోని శ్రీకాళహస్తి-పాపానాయుడుపేట ప్రధాన రహదారి పక్కన నిర్మించిన బస్‌షెల్టర్ దుస్థితికి చేరింది. కిటికీలు పగిలి పోవడంతో పాటు దిన్నెలు దెబ్బతిన్నాయి. దానికి తోడు చీమల పుట్టలు పెరగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులు, బస్సుకోసం వచ్చే విద్యార్థులు, ప్రయాణికులు ఎండకు, వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

మట్టి తొలచి.. ప్రమాదం పొంచి

సత్యవేడు-తడ మార్గం రాళ్లకుప్పం నుంచి ఆరూరుకి వెళ్లే రహదారి పక్కన కొల్లడం గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. కొల్లడం గ్రామ సమీపంలోని చెరువు మెత్త భూముల్లోని స్తంభాల చుట్టూ మట్టిని గత వైకాపా హయాంలో తరలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు స్తంభం చుట్టూ నీరుచేరి ప్రమాదకరంగా మారింది. **- న్యూస్‌టుడే, సత్యవేడు**

సువర్ణముఖి హారతులకు ఏర్పాట్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో ఈ నెల 19న తేదీన నిర్వహించనున్న సువర్ణముఖి నదీ హారతులకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. కార్తిక మాసం అమావాస్యను పురస్కరించుకుని ఈ విశిష్టమైన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సువర్ణముఖి నదీ తీరంలో భక్తులందరూ హారతుల కార్యక్రమాన్ని వీక్షించే విధంగా ఏర్పాట్లకు ఇంజినీరింగ్ శాఖ పనులు ప్రారంభించింది. జల వినాయకుని ఆలయం సమీపంలో స్నానఘట్టాల వద్ద సిమెంటు కాంక్రీటు వేయడంతో అక్కడి పరిసరాలు పరిశుభ్రం చేస్తున్నారు.

నదీ తీరంలో ప్రారంభమైన అభివృద్ధి పనులు

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం, వీడ్కోలు

రేణిగుంట, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం, వీడ్కోలు లభించాయి. పలమనేరు పర్యటన నిమిత్తం ఆదివారం ఉదయం ప్రత్యేక విమానంలో ఇక్కడ చేరుకున్నారు. ఇక్కడి నుంచి హెలికాప్టర్లో పలమనేరుకు వెళ్లిన ఆయన మధ్యాహ్నం తిరిగి ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఆయన గన్నవరం బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో ఆయనకు ఎస్పీ సుబ్బరాయుడు, ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి తదితరులు స్వాగతం వీడ్కోలు పలికారు.

‘అధిష్ఠానం దృష్టికి శంకర్‌రెడ్డి వైఖరి’

సత్యవేడు : తెదేపా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయాలతో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. శంకర్‌రెడ్డి వైఖరిపై ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో మండలాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. పార్టీలోకి వచ్చిన వైకాపా జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, భర్త చంద్రశేఖర్‌రెడ్డి వ్యవహార శైలితో నిజమైన కార్యకర్తలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కాలమనాయుడుపేటలో ఇళ్ల స్థలాలన్నీ వైకాపా వారికే చేరాయన్నారు. అంబాక్కం క్షేత్ర సహాయకుడు అక్రమాలకు పాల్పడితే జడ్పీటీసీ మద్దతు పలకడం దారుణమన్నారు. పట్టణ అధ్యక్షుడు షణ్ముగం, సింగిల్‌విండో ఛైర్మన్ మోహన్, సీనియర్ నాయకులు చంద్రయ్య, కాశి ప్రతాప్‌రెడ్డి, ఆసుపత్రి కమిటీ సభ్యులు హేమభూషణం, అమావాస్యరెడ్డి, చిట్టిరెడ్డి, శంకరయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

భోజనాలు పంపిణీ చేస్తున్న ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టేసాయిప్రసాద్, కోలా ఆనంద్ తదితరులు

ఘనంగా కార్తిక సమారాధన

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయానికి సమీపంలోని భరద్వాజతీర్థం వద్ద జంగమ కులస్థుల నేతృత్వంలో కార్తిక సమారాధన, వనభోజన కార్యక్రమం జరిగింది. సంఘం తరఫున ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముక్కంటి ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, బొజ్జల బృందమ్మ, కోలా ఆనంద్, ట్రస్టుబోర్డు సభ్యురాలు కోలా విశాలాక్షి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. వీరికి సంఘం పెద్దలు రవీంద్రబాబు దగ్గరుండి స్వాగతం పలికారు. జంగమ సంక్షేమానికి కృషి చేస్తామని ఆహ్వానితులు హామీ ఇచ్చారు. అనంతరం సంఘం తరపున ఘనంగా సత్కరించారు.

శత వార్షిక ఏర్పాట్లపై సమీక్ష

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రారంభించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శత వార్షికోత్సవాలు జరపనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీగల వెంకటయ్య తెలిపారు. ఇక్కడి పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులతో కలసి ఆయన ఆదివారం సమావేశం అయ్యారు. 104 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఏర్పాట్లు నిర్వహణపై పూర్వ విద్యార్థుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ వేడుక చేపట్టవలసిన అంశాలను చర్చించారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వవిద్యార్థుల సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. పురుషోత్తం, రామచంద్రయ్య, రంగయ్య, చిట్టిబాబు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ‘మండలి’ తొలి సమావేశం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యులందరూ తొలి దఫా బేటీ కానున్నారు. ఈ సందర్భంగా ముక్కంటి ఆలయ పరిపాలన భవనంలో సోమవారం జరిగే ట్రస్టుబోర్డు తొలి సమావేశానికి ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. భక్తులకు కల్పించాల్సిన వసతులు, బృహత్తర ప్రణాళిక అమలు, ఆలయ పరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులతో పాటు ఇటీవలి కాలంలో వస్తున్న విమర్శలకు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే మరి. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారు.

తామ్రశాసనాలు పదిలం

శాసనాలతో పరశురాంగురుకుల్, బాలసుబ్రహ్మణ్యంలు

విజయనగర సామ్రాజ్య రాజ ముద్రికలతో పాటు వారి వంశావళికి చెందిన తామ్ర పత్రాలు ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి. ముక్కంటి ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ ఇంట్లో ఏళ్ల చరిత్ర కల్గిన ఈ శాసనాలకు సంబంధించి 1971వ సంవత్సరంలో ‘శ్రీవిరూపాక్షా శ్రీరామ తామ్రశాసనాలు’ పేరుతో వడ్లమూడి గోపాలకృష్ణ పుస్తకాన్ని ప్రచురించారు. ఆ తామ్ర శాసనాలను ప్రధాన అర్చకులు కుటుంబానికి చెందిన ఎస్.ఎం.కె.పరశురామ్ గురుకుల్ అలియాస్ అచ్యుత, పురోహితులు సింగరాజు బాలసుబ్రహ్మణ్యంశాస్త్రిలు ఇటీవల వీటిని పరిశీలించారు. వీటిని పరిశీలించేందుకు పురావస్తుశాఖకు సంబంధించి మునిరెడ్డి త్వరలోనే ఇక్కడకు వస్తామని తెలియజేసినట్లు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక ఉత్సవాల్లో కళాకారులు తమదైన నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. తిరుపతిలోని పుష్పనృత్యాలయ, వరుణ్‌తేజ్ అకాడమీ, హైదరాబాదుకు చెందిన దుర్గాభవానీ అకాడమీకి చెందిన కళాకారులు ఆదివారం తమదైన నృత్య ప్రదర్శనతో రంజింపచేశారు. వీరికి ఆలయ ఈవో బాపిరెడ్డి ప్రశంసాపత్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కళాకారులతో ఆలయ ఈవో బాపిరెడ్డి తదితరులు

వాయులింగేశ్వరుని దర్శనార్థం క్యూలైన్లల్లో నిరీక్షిస్తున్న భక్తులు

జనం.. సర్వత్రా సంకటం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తజన సంద్రంగా మారింది. కార్తికమాసం, ఆదివారం సందర్భంగా ఉదయం నుంచి ఇసుకేస్తే రాలనంతగా జనం తరలివచ్చారు. అన్ని క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. సర్వదర్శనం కోసం భక్తులు నాలుగైదు గంటలు క్యూలైన్లల్లో నిరీక్షించాల్సి వచ్చింది. పూజలయ్యాక ఏ క్యూలైన్ల గుండా వెళ్లాలన్న విషయం తెలియక భక్తులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. వీఐపీల తాకిడితో సామాన్య భక్తులు మరింత ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టేసాయిప్రసాద్, ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డిలు క్యూలైన్లను పర్యవేక్షించినా ఇబ్బందులు తప్పలేదు. పట్టణ సీఐ ప్రకాష్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది క్యూలైన్లను నియంత్రించారు. ఇక 5,183 రాహు, కేతు పూజలు జరిగాయి. ప్రత్యేక దర్శనం 3,186, శీఘ్రదర్శనం 4,502, అంతరాలయ దర్శనం 588 టిక్కెట్లు అమ్ముడు పోయాయి.

ఆక్రమణలకు గురికాకుండా చూడాలి

ఆక్రమణలను పరిశీలిస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పురపాలక సంఘ పరిధిలో మహిళా ప్రాంగణానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమణలకు గురికాకుండా చూడాలని మాజీ మంత్రి గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ కోరారు. ఈ సందర్భంగా ఆదివారం అక్కడి స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణలను తొలగించి అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

నాగలాపురం, న్యూస్‌టుడే: సమస్య: నాగలాపురం నటరాజుగుంటలోని మొదటివీధిలో రాత్రుళ్లు అంధకారం అలముకుంటోంది. వీధి దీపాలు ఫ్యూజులు పోవడంతో వెలగటం లేదు. పాములు, విషకీటకాలతో ఇబ్బందులు పడుతున్నాం. **- శ్రీనివాసులు, నాగలాపురం**

సమాధానం: వీధి దీపాలను కొనుగోలు చేయాల్సి ఉంది. త్వరితగతిన నూతన వీధి దీపాలను ఏర్పాటు చేస్తాం.
- రాధిక, ఈవో, నాగలాపురం

సత్యవేడు, న్యూస్‌టుడే: సమస్య: చెరివి పంచాయతీ చిగురుపాళెం గ్రామ ప్రాథమిక పాఠశాల సమీపంలో స్థానికులు చెత్తా చెదారం రోడ్డుపై పడేస్తున్నారు. **- రవి**

సమాధానం: చెత్త చెదారాలు రోడ్డుపై వేయకుండా స్థానికులకు అవగాహన కల్పించి, వ్యర్థాలను తొలగిస్తాం.
- రత్నమ్మ, సర్పంచి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సమస్య: మిట్టకండ్రిగ పాఠశాల చెంత వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో దుర్గంధంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- శ్రీనివాసులు, మిట్టకండ్రిగ

సమస్య: పట్టణంలోని హౌసింగుబోర్డు కాలనీలో కాల్వల్లో వ్యర్థాలు పేరుకు పోవడంతో మురుగునీరు వెళ్లడం లేదు. రాత్రి, పగలు దోమలతో అవస్థలు పడుతున్నాం. **- సరోజ, హౌసింగుబోర్డు కాలనీ**

సమాధానం: పాఠశాల సమీపంలో వ్యర్థాలు పడేయవద్దని పలు దఫాలు సూచించాం. మురుగునీటి కాల్వలో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- దాము, పారిశుద్ధ్య అధికారి, పురపాలక సంఘం**

శ్రీకాళహస్తి(గ్రామీణ(ఏర్పేడు)): సమస్య: శ్రీకాళహస్తి మండలంలోని పుల్లారెడ్డికండ్రిగలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. నిత్యం దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. **- మునెయ్య, స్థానికుడు**

సమాధానం: సంబంధిత పంచాయతీ కార్యదర్శితో చర్చించి వెంటనే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. **- పద్మజ, ఈవోపీఆర్డీ, శ్రీకాళహస్తి**

హెచ్చరిక స్తంభాల ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రైల్వే శాఖ హెచ్చరిక స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో భారీ వాహనాల కారణంగా పలుమార్లు హెచ్చరిక స్తంభాలు కింద పడిపోవడంతో భారీ వాహనాలు దూరి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీనిపై ఈనాడులో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు వారం రోజులపాటు ఇక్కడ పనులు చేసి స్తంభాలు ఏర్పాటు చేశారు.

చేయి.. చేయి.. కలిపి.. బాధితులకు అండగా నిలిచి

విద్యుత్తు నియంత్రికను తీస్తున్న సిబ్బంది

కేవీబీపురం, న్యూస్‌టుడే: ఉప్పెనలా వచ్చిన వరద ముప్పునకు గురైన బాధిత గ్రామాలను అన్ని శాఖల అధికారులు, దాతలు చేయిచేయి కలిపి ఆదుకుంటున్నారు. కళత్తూరు, కళత్తూరు ఎస్సీ, పాతపాళ్లెం అరుందతి వాడలు ఈవరదలో సర్వం కోల్పోవడంతో వారికి మళ్లీ పూర్వవైభవనం తీసుకొచ్చేందుకు ఓప్రణాళికతో ముందుకు పోతున్న తీరు, అధికారుల శ్రమ, కూటమి ప్రభుత్వం చొరవను స్థానికులు కొనియాడుతున్నారు.

మేము సైతం..

బాధిత గ్రామంలో మేముసైతం అంటూ పారిశుద్ధ్య పనుల్లో ఉపాధిహామీ కూలీలు పోటీపడి పని చేస్తున్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో ఉపాధి పనులకు వెళ్లే కూలీలు బాధిత గ్రామాల్లో పని చేస్తున్నారు. వరదల్లో కొట్టుకు పోయిన వస్తువులు, వాహనాలను బయటకు తీస్తున్నారు. వరదల్లో కొట్టుకు పోయిన పశువుల కళేభరాలు బయట పడుతున్నాయి.

రెండు రోజుల్లో పాఠశాలల నిర్వహణ

వరదలకు పాఠశాలలో ఏడు అడుగుల మేర నీటి నిల్వలతో పాటు.. ఐదు అడుగుల బురద పేరుకు పోవడంతో జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్, సమగ్ర శిక్ష సమన్వయ అధికారి గౌరీశంకర్‌లు ఆదివారం పరిశీలించారు. రికార్డులు బురదలో చిక్కుకోవడం, తడిసిన రికార్డులను వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు బోధన, అభ్యసన పరికరాలతో పాటు మధ్యాహ్న భోజనం వస్తువులు, ఏకరూప దుస్తులన్నీ విద్యార్థులకు అందిస్తామని వివరించారు.

అన్నదానం ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

దాతల దాతృత్వం

వరదముంపు బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకొస్తున్నారు. తెదేపా సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి తన సొంత నిధులతో మూడు రోజులుగా మూడు పూటలా వెయ్యి మందికి భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. చెన్నైకు చెందిన సీఎస్‌ఐ చర్చి ప్రతినిధులు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. స్థానిక టీడీఆర్ భారత్‌గ్యాస్ యాజమాన్యం అన్నదానం చేస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల వారు దుస్తులు, చాపలు, వంట చేసుకునేందుకు వంట పాత్రలను పంపిణీ చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర హోమం

యాగ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని కన్యమూల గణపతి (అంజి అంజి వినాయక స్వామి) ఆలయం వద్ద సంకటహర చతుర్థిని పురస్కరించుకుని యాగపూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడున్న వినాయకస్వామికి ఆదివారం విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరిపారు. వేదోక్తంగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. వినాయక స్వామికి ధూప, దీప, నివేదనలు సమర్పించారు. ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షా పుస్తకాల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అయ్యప్ప స్వామి దీక్ష స్వీకరించిన భక్తులు ఆచరించాల్సిన విధి, విధానాలు, పూజాది కార్యక్రమాల పుస్తకాన్ని శ్రీశుక బ్రహ్మాశ్రమ పీఠాధిపతి శ్రీవిద్యాస్వరూపానందగిరి, దేవాదాయ శాఖ ధార్మిక పరిషత్ ఛైర్మన్ దాసరి శ్రీనివాసులు సంయుక్తంగా ఆవిష్కరించారు. పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పుస్తకాన్ని తయారు చేసిన గురుస్వామి మురళిని ఆశ్రమ పీఠాధిపతులు అభినందించారు. సర్వాత్మానంద స్వామి, భక్తులు, అయ్యప్ప సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులను సత్కరిస్తున్న మురళి

రేషన్ బియ్యం స్వాధీనం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యం పక్కదారి పడుతోంది. పేదల నుంచి తక్కువ ధరలకు సేకరించి తరలించేందుకు సిద్ధం చేసిన 3.5 టన్నుల రేషన్ బియ్యాన్ని వాహనంతో సహా స్వాధీనం చేసుకున్నట్లు శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి ఆదివారం తెలిపారు. పట్టణంలోని భక్త కన్నప్ప కూడలి సమీపంలో శనివారం అర్ధరాత్రి రేషన్ బియ్యాన్ని వాహనంలో లోడు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో కడప, తడ ప్రాంతాలకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి వాహనంతో సహా 74 (బస్తాల్లో) నిల్వ ఉంచిన 3550 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణలో వాహన యజమాని నాయుడుపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించి అరెస్టు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి తొట్టంబేడు ఆర్ఐ సుజాత సమక్షంలో పంచనామా నిర్వహించారు. ఈ మేరకు నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లారీని చోరీ చేసిన క్లీనర్

తొట్టంబేడు, న్యూస్‌టుడే: లారీని క్లీనర్ తస్కరించిన ఘటనపై శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పీలేరు ప్రాంతానికి చెందిన మధుసూదన్ శ్రీకాళహస్తిలో లారీ సర్వీసు నడుపుతున్నారు. ఈ క్రమంలోనే పట్టణంలోని కాసాగార్డెన్ సమీపంలో శుక్రవారం రాత్రి లారీని నిలిపి డ్రైవర్ ఇంటికెళ్లగా, క్లీనర్ వాహనంలోనే పడుకున్నాడు. తర్వాతి రోజు డ్రైవర్ వచ్చి చూడగా లారీతో పాటు క్లీనర్ జయచంద్ర ఆచూకీ లేదు. ఈ మేరకు వాహన యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతి

బీఎన్‌కండ్రిగ: వెళుతున్న ద్విచక్రవాహనం పైనుంచి పడి మహిళ మృతి చెందింది. బీఎన్ కండ్రిగ మండలం శ్రీకాళహస్తి-తడ రహదారి లక్ష్మీపురం ఎస్టీకాలనీ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన మునెయ్య తడ మండలంలోని అపాచీ పరిశ్రమలో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఆదివారం ద్విచక్రవాహనంపై శ్రీకాళహస్తి ఆలయానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. బీఎన్‌కండ్రిగ మండలం వెస్ట్‌వరత్తూరు గ్రామానికి చెందిన కళావతి(59) శ్రీకాళహస్తిలోని మున్సిపాలిటీ కార్యాలయ కూడలి వద్ద గ్రామానికి వచ్చేందుకు బస్సుకోసం వేచి ఉంది. ద్విచక్రవాహనంపై వెళుతున్న మునెయ్యను చూసి లిఫ్ట్ అడిగి వాహనంపై వస్తోంది. లక్ష్మీపురం ఎస్టీకాలనీద్దకు రాగానే వెనుక కూర్చుని ఉన్న కళావతి జారి కిందపడింది. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ప్రమాదంలో వృద్ధురాలు.. నాగలాపురం: ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సునీల్ కథనం మేరకు.. మండలంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన అజీమాబీ(70)కు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు న్నారు. అందరికీ పెళ్లిళ్లు కావడంతో ఆమె ఒంటరిగా రాజీవ్‌నగర్‌లో ఉంటున్నారు. అయిదు రోజుల కిందట ఆమె నాగలాపురంలో కూరగాయలు తీసుకునేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్సులో ఇంటికి వెళ్లారు. ఆమె బస్సు దిగే సమయంలో చేతికర్ర కిందపడి పోవడంతో దానిని తీసుకునేందుకు బస్సు చక్రాల వద్ద చేతిని చాచగా.. గమనించని బస్సు డ్రైవరు వాహనాన్ని నడపడంతో ఆమె చేయి నుజ్జయింది. ఆమెను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు ఆపై చెన్నై జీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శనివారం రాత్రి మరణించడంతో మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అజీమాబీ (పాత చిత్రం)

పరిహారమివ్వరు.. పనులు సాగవు

సీతా రాంపేట సమీపంలోని వ్యవసాయ భూములు

శ్రీకాళహస్తిగ్రామీణ(ఏర్పేడు), న్యూస్‌టుడే: సోమశిల-స్వర్ణముఖి కాలువ నుంచి మల్లిమడుగు రిజర్వాయర్‌కు ఏర్పాటు చేయాల్సిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఎస్‌ఎస్ కెనాల్‌కు అనుసంధానంగా ఏర్పేడు మండలంలోని మేర్లపాక చెరువును రిజర్వాయర్‌గా తీర్చిదిద్ది రేణిగుంట మండలంలోని మల్లిమడుగు రిజర్వాయర్‌కు నీరు సరఫరా చేసేందుకు గతంలో తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే తర్వాత కాలంలో వైకాపా అధికారంలోకి వచ్చి పట్టించుకోక పోవడంతో ఎత్తిపోతల పథకం కలగానే మారింది.

ప్రారంభానికి పచ్చజెండా

మేర్లపాక రిజర్వాయర్ నుంచి మల్లిమడుగు రిజర్వాయర్‌కు 8కి.మీ మేర 30మీటర్ల వెడల్పుతో కాలువ తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. అయితే కృష్ణాపురం సమీపంలో అటవీ భూములు ఉండటంతో తవ్వకాలు అనుమతులు వచ్చేందుకు ఆలస్యం కానున్నడంతో రెండు పైపు లైనులతో నీటిని సరఫరా చేయాలని అప్పట్లో శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించి 16మంది అధికారుల బృందంతో పర్యవేక్షించి నివేదికలు సైతం తయారు చేశారు. ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో అసరమైన భూములను సుమారు 40మంది రైతులు నుంచి సేకరించారు. కూటమి ప్రభుత్వంలో పనులు చేపట్టేందుకు పచ్చజెండా ఊపినా రైతులకు పరిహారం అందక పోవడంతో ప్రారంభానికి ఆటంకంగా మారింది.

అడ్డుకుంటున్న రైతులు

ఏర్పేడు మండలంలోని సీతారాంపేటలో సుమారు 13మందికి పరిహారం అందాల్సి ఉంది. అయితే గతంలో చేపట్టిన భూసేకరణ సమయంలో పరిహారం గురించి అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం, రైతులు పట్టాలు కలిగి ఉండటమే కాకుండా క్షేత్ర స్థాయిలో పంటలు సాగు చేస్తున్నప్పటికీ ప్రభుత్వ భూములుగా ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించడంతో ప్రస్తుతం లిఫ్ట్‌ఇరిగేషన్ పనులను రైతులు అడ్డుకుంటున్నారు. తమకు పరిహారమిచ్చాకే పనులు చేపట్టాలని రైతులు తేల్చిచెప్పడంతో నిర్మాణ పనులు ఆదిలోనే హంసపాదుగా మారుతున్నాయి.

సమన్వయంతోనే సమస్యకు పరిష్కారం

ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా రైతులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు మరలా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సి ఉంది. పూర్తి స్థాయిలో భూముల రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితిని వివరించడంతోనే సమస్యకు పరిష్కారం లభించనున్నది.

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

భీమలింగేశ్వర ఆలయంలో పూజలు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు మండలం పాలి చర్ల గ్రామంలోని శ్రీభీమలింగేశ్వర ఆలయంలో శ్రీమహాగణపతి, నందీశ్వర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆది వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, మహా గణపతి పూజ, హోమం, కలశ స్థాపన, అభిషేకాలు వైభ వంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాదాలు స్వీకరించారు.

మూలవిరాట్‌కి పూజలు చేస్తున్న భక్తులు

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 21 నుంచి రూ. 30 వరకు

రెండో రకం: కిలో రూ. 10 నుంచి రూ. 20 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్ (రైతు ధర)	126
లేయర్	120
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	252
లేయర్ మాంసం	204

ర్యాలీ విజయవంతం చేయండి

వెంకటగిరి, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 12న చేపట్టే ర్యాలీని విజయవంతం చేయాలని వైకాపా పట్టణాధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం నేదురుమల్లి నివాసంలో ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు.

బామ్‌సెఫ్ కార్యాలయం ప్రారంభం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ భవనం వద్ద మరో భవనంలో ఆదివారం బామ్‌సెఫ్(బ్యాక్‌వర్డ్ అండ్ మైనార్టీ కమ్యూనిటీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్) కార్యాలయాన్ని విశ్రాంత ఉద్యోగుల జిల్లా నాయకుడు పెర్నాటి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. జిల్లా బామ్‌సెఫ్ కన్వీనరు శ్రీనివాసులు సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో ఎన్.శ్రీనివాసులు, మోహన్, బామ్‌సెఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి పెర్నాటి రామకృష్ణ, డీవీ కృష్ణయ్యలు మాట్లాడారు. బామ్‌సెఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యాలయం ప్రారంభిస్తున్న నాయకుడు వెంకటేశ్వరరావు తదితరులు

సాగని సాగునీరు

● మరమ్మతులకు నోచుకోని పంట కాలువలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: సాగునీటి కాలువలు రూపు కోల్పోయాయి. ఆక్రమణలు పెచ్చుమీరాయి. పిచ్చిమొక్కలతో కనిపిస్తున్నాయి. పూడికతో పేరుకున్న దర్శనమిస్తున్నాయి. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో మీదుగా పారే స్వర్ణముఖినది నీరు గ్రామీణ చెరువులకు చేరేలా సప్లయ్ ఛానల్స్‌ను అమర్చారు. ఒక్కో మండలంలో రెండు మూడు కాలువలు చొప్పున అమర్చారు.

ఆక్రమణలతో రూపు కోల్పోయి

పెళ్లకూరు మండలంలో చిల్లకూరు, జీలపాటూరు, చావలి చెరువులకు చేరేలా కాలువ కనుమరుగైంది. పూడికతో రూపురేఖలు కోల్పోయింది. పెళ్లకూరు మండలంలోని చావాలి వాగు పెన్నేపల్లి తాళ్వాయిపాడు, కానూరు, నాయుడుపేట మండలం కొరమంచివారికండ్రిగ, జువ్వలపాళెం మీదుగా పుడూరు చేరాల్సి ఉంది. కానీ స్వర్ణముఖి వ్యాపారులతో కాలువ కుదించుకుపోయింది. జాతీయ రహదారి దాటే చోట కాలువకు ఎదురుగా కల్వర్టు నిర్మించి నీరు వచ్చేలా చేయాల్సి ఉంది. కానీ కాలువ ఒక వైపు ఉంటే మరో వైపు నకు కల్వర్టు చేపట్టారు. దీంతో నీరు సాఫీగా చేరడం లేదు. కాలువ మొత్తం పిచ్చిమొక్కలతో పూడిపోయింది. నాయుడుపేట విన్నమాల, అన్నమేడు కాలువలు పట్టణం మీదుగా విన్నమాల పరిసర చెరువులకు నీరు చేరాల్సి ఉంది. కానీ కాలువలు పూడిపోయాయి. చెట్లు పెరిగాయి.

సూళ్లూరుపేట నియోజకవర్గంలో వివరాలు

మొత్తం కాలువలు (సుమారు): 60

ఆక్రమణకు గురైనవి: 40

మరమ్మతులు చేయాల్సినవి: 55

పాలకులు పట్టించుకుంటేనే

ఓజిలి మండలంలోని మాచవరం కర్లబల్లవోలు, మానమాల చెరువులకు వెళ్లే కాలువలు దెబ్బతిన్నాయి. వర్షాల సమయంలో లోతట్టు నీరు ప్రాంతాలకు చేరుతోంది. అత్యంత ప్రాధాన్యం ఉన్న కలవకూరు డ్యాం నీరు వచ్చే సప్లయ్ ఛానల్ ద్వారా నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో 17 కిలోమీటర్లు దూరం 12 చెరువులకు నీరు చేరే అవకాశముంది. వరదల సమయంలో పారడం తప్పితే మిగిలిన సమయాల్లో ఎటువంటి ఆటు వెళ్లిపోయాయి. రూ. కోట్లది నిధులతో చేపట్టిన పనులు పూర్తి కాక కాలువలు గందరగోళంగా మారాయి. సాగునీటి కాలువలు బాగు చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది.

వద్దిగుంటకండ్రిగ పిచ్చిమొక్కలతో కాలువ

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు: 85002 02046 | నాయుడుపేట: 80085 73970 | సూళ్లూరుపేట: 96188 78782 | వెంకటగిరి: 80085 73966 | సమయం 10 AM TO 1 PM

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: రాజీవీధి ప్రాంతంలో కాలువల్లో మురుగు ముందుకు కదలడం లేదు. దుర్వాసన భరించలేకున్నాం. – రాము, గూడూరు

సమాధానం: సిబ్బందితో తొలగిస్తాం. మురుగు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. –వెంకటేశ్వర్లు, కమిషనర్

కోట, న్యూస్‌టుడే: సమస్య: ఉత్తమనెల్లూరులోని బస్సు షెల్టరు పరిసరాల అధ్వానంగా ఉన్నాయి. ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నారు. షెల్టరును శుభ్రం చేసే వినియోగంలోకి వస్తుంది. – శ్యామల, ప్రయాణికురాలు

సమాధానం: పరిశీలించి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. – కిరణ్, ఏఈ

రహదారి మరమ్మతులు

కోట, చిట్టమూరు, న్యూస్‌టుడే: ఇటీవల ‘ఈనాడు’ ‘మేమున్నాం మీకు తోడుగా’లో వచ్చిన సమస్యలు వార్తలకు అధికారులు తక్షణమే స్పందించారు. పరిశీలించి సమస్యలను పరిష్కరించారు. చిట్టమూరు- కొత్తగుంట రహదారి మరమ్మతులు చేపట్టారు. ✦ పంచాయతీ ఈవో రాజశేఖర్ కోట మండలం కాంప్లెక్స్ మార్గంలో పైపులైన్ మరమ్మతులు చేయించారు.

స్పందనకు వందనం

ఈవీ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు

✦ నియోజకవర్గంలో ఆరు స్టేషన్ల పరిశీలన

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్ వాహనాల(ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. వాహనదారులకు ఇంధన ఖర్చు లేకుండా ఉండడంతో ఎక్కువగా ఉండే దూరం ప్రయాణిస్తున్నారు. దీంతో ప్రజలు ఈవీ వాహనాలపై ఆసక్తి చూపిస్తున్నారు. అయితే వాహనాలకు సరిపడా ఛార్జింగ్ కేంద్రాలు లేక పోవడంతో వాహనదారులు ఇబ్బందిగా మారింది. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహక నిధులతో విద్యుత్తు శాఖ ఉప కేంద్రాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉప కేంద్రాల వద్ద నాలుగు చక్రాల వాహనాలు, ద్విచక్ర వాహనాలు, ట్రక్కులు వంటివి పార్కింగ్ చేసి ఛార్జింగ్ పెట్టుకొనే వెసులుబాటు ఉండే ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్నారు. ఇప్పటికే గూడూరు నియోజకవర్గంలో ఆరు కేంద్రాలను అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

విద్యానగర్‌లో ఏర్పాటు చేస్తున్న ఛార్జింగ్ యూనిట్

ఇక్కడే ఏర్పాటు:

నెల్లటూరు, తిప్పవరప్పాడు, గొల్లపల్లి, చెందోడు, కొత్తగుంట, చిట్టేడు ఉప కేంద్రాల వద్ద

మండల కేంద్రాలకు వంద మీ. దూరంలో

నియోజకవర్గంలోని గూడూరు గ్రామీణం, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో మొత్తం 33 ఉప కేంద్రాలు ఉన్నాయి. వాటిలో జాతీయ, రాష్ట్ర రహదారులకు దగ్గరలో ఉన్న మండల కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఉన్న ఉప కేంద్రాలను ఎంపిక చేస్తున్నారు. కేంద్రం వద్ద పార్కింగ్ కోసం ఐదు సెంట్ల ఖాళీ స్థలం ఉండేలా పరిశీలన జరుగుతోంది. ఇప్పటికే గూడూరు, కోట పరిధిలోని ఉప కేంద్రాలను ఎంపిక చేసి ప్రాథమిక పరిశీలనలో ఉంచారు.

నియమ నిబంధనలు తెలియజేస్తాం

ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఉప కేంద్రాలను గుర్తిస్తున్నాం. త్వరలో ఎన్ని ఎంపిక చేసింది వెల్లడిస్తాం. వాటి నియమ నిబంధనలను తెలియజేస్తాం. ప్రస్తుతానికి ఆరు ఉప కేంద్రాలను ప్రాథమికంగా గుర్తించాం.

- నరేంద్రరెడ్డి, డిస్కం గూడూరు ఈఈ

ముగిసిన అఖండ భజన

వెంకటగిరి, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా జయంతి సందర్భంగా వెంకటగిరి సంస్థానంలో నిర్వహించిన అఖండ భజన కార్యక్రమం ఆదివారం ముగిసింది. సంస్థానంలోని సత్య సాయిబాబా మందిరంలో 24 గంటల పాటు పలు భజన బృందాలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బాలసదనంలోని పలువురు చిన్నారులు భజన కార్యక్రమంలో పాల్గొని భగవద్గీత శ్లోకాలు, వేదపఠనం చేశారు. రాజ కుటుంబీకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

చిట్టమూరు, న్యూస్‌టుడే: చిట్టమూరు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదివే హర్ష రాష్ట్రస్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, పీడీ శివకుమార్ తెలిపారు. విద్యార్థిని వారు అభినందించారు.

ఇదేనా.. స్వచ్ఛ గూడూరు!

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛ గూడూరు అనే నినాదాలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. వార్డుల్లో పారిశుద్ధ్యంపై పుర అధికారులు దృష్టి పెట్టకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రతతో దుర్వాసన భరితంగా మారాయి. ఎక్కడ చూసినా భరించలేని కంపుతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటింటికి చెత్త సేకరణ కేవలం మాటలకే పరిమితమైంది. రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తాచెదారాలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. విలీన గ్రామాలైన చెన్నూరు, దివిపాలెంలోని గాంధీనగర్, టిడ్కో గృహాల వద్ద వ్యర్థాలు తొలగించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పుర పాలక అధికారులు స్పందించి పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని విన్నవిస్తున్నారు.

చెన్నూరులో పేరుకున్న చెత్త నిల్వలు

పురపాలిక: గూడూరు

వార్డులు: 34

గృహాలు: 25వేలకు పైగా

జనాభా: లక్షకు పైగా

రోజూ ఉత్పత్తయ్యే చెత్త: 34 టన్నులకు పైగా

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు: ఇద్దరు

వార్డు శానిటేషన్ సెక్రటరీలు: 18

పారిశుద్ధ్య సిబ్బంది: 250 మందికి పైగా

పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటాం

పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. సిబ్బందితో ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. పుర ప్రజలు చెత్తాచెదారాలు రోడ్లపై వేయకుండా సిబ్బందికి అందించేలా సహకరించాలి.

- వెంకటేశ్వర్లు, కమిషనర్, గూడూరు

నేడు పోలేరమ్మ ఆర్చికి భూమిపూజ

వెంకటగిరి, న్యూస్‌టుడే: పోలేరమ్మ ముఖద్వారం ఏర్పాటుకు సోమవారం భూమిపూజ నిర్వహిస్తున్నట్లు దాతలు కోనా వెంకటేశ్వరరావు, సరోజల్లి విజయశేఖర్ తెలిపారు. పాల కేంద్రం వద్ద ఈ భారీ ఆర్చి నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సింధు దంపతుల ఆధ్వర్యంలో భూమిపూజ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు హాజరు కావాలని కోరారు.

నేతలను పరామర్శించిన యువరాజా

వెంకటగిరి, న్యూస్‌టుడే: యువరాజా సర్వజ్ఞ కుమార యాచేంద్ర పలువురు నేతలను ఆదివారం పరామర్శించారు. అమ్మపాళెం గ్రామానికి చెందిన సీనియర్ నేత అక్కుపల్లి సుబ్బరామయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అతన్ని పరామర్శించి, ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. డక్కిలి మండలం పలుగోడు గ్రామానికి చెందిన సీనియర్ నేత మల్లిని కూడా పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డిల్లీబాబు, నేతలు వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెదేపా నేత జన్మదిన వేడుకలు

కోట, న్యూస్‌టుడే: కోటలో ఆదివారం డీసీఎంఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, తెదేపా సీనియర్ నేత నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. నాయకులు శాలువాలు కప్పి సన్మానాలు చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు వినోద్‌రెడ్డి, జలీల్‌అహ్మద్, మోహన్‌రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇది రైతుసేవా కేంద్రమే

నిండలి గ్రామ సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రం శిథిలావస్థలో ఉంది. దశాబ్దాల నాటి ఆ భవనం వర్షాలకు చిత్తడి అవుతోంది. నిల్వ ఉంచిన ఎరువులు కొంత తడిసిపోయినట్లు సమాచారం. యూరియా వంటివి ఈ భవనంలోనే నిల్వ చేసుకునే పరిస్థితి. నూతన భవన సదుపాయం చేకూర్చాలని సాగుదారుల విజ్ఞాపన.

-న్యూస్‌టుడే, నిండలి(బాలాయపల్లి)

రోడ్డు పొడవునా కాంక్రీట్ కుప్పలు

మేనకూరు సెజ్‌లోని ఏపీ ఐఐసీ కార్యాలయం రహదారి పొడవునా సిమెంటు, ఇసుక, కంకర మిశ్రమాన్ని రోడ్డు పక్కన కుప్పలుగా పోశారు. నిత్యం కంపెనీల వద్దకు వందలాది మంది రాత్రీ పగలూ రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాలు వెళ్తుంటాయి. ఈ క్రమంలో పొరపాటున పక్కకు వెళ్తే సిమెంటు బండల్ని ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశముంది. వీటిని తొలగించాల్సి ఉంది.

-న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

బురదమయంగా ఏనుగువాడ రోడ్డు

ఏనుగువాడ గ్రామానికి వెళ్లే రోడ్డు వర్షాలకు బురద మడుగుగా మారడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్డు కావడంతో వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. మండలంలో అన్ని గ్రామాలకు తారు, సీసీరోడ్లు నిర్మిస్తున్నారు. తమ గ్రామ రోడ్డును అభివృద్ధి చేయడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -న్యూస్‌టుడే, ఓజిలి

రేవులో దీపం వెలగదే

పర్యాటక ప్రదేశంగా గుర్తింపు పొందిన భీములవారి పాళెం పడవల రేవులో రాత్రిళ్లు చీకటి నెలకొంటోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు పక్షుల పండుగ సమయంలో మాత్రమే వెలుగుతాయి. ఆ తరువాత వెలగడం మానేస్తాయి. చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు రాత్రిళ్లు చిమ్మచీకట్లో అవస్థలు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి దీపాలు వెలిగేందుకు చర్యలు చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, తడ

కోతకు గురైన రహదారి

సూళ్లూరుపేట నుంచి పిండిపాళెం, చందనముడి, శ్రీధనమల్లి మీదుగా కోట, వాకాడు వెళ్లే రహదారి పిండిపాళెం రైల్వే గేటుకి సమీపంలో గతంలో కురిసిన వర్షాలకు కోతకు గురైంది. కాస్త ఆదమరిస్తే పక్కకు పడిపోయే ప్రమాదం ఉంది. ర.భ.శాఖ స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

భక్తజనం.. సర్వత్రా సంకటం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తజన సంద్రంగా మారింది. కార్తికమాసం, ఆదివారం సందర్భంగా ఉదయం నుంచి ఇసుకేస్తే రాలనంతగా జనం తరలివచ్చారు. అన్ని క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. సర్వదర్శనం కోసం భక్తులు నాలగైదు గంటలు క్యూలైన్లల్లో నిరీక్షించాల్సి వచ్చింది. పూజలయ్యాక ఏ క్యూలైన్ల గుండా వెళ్లాలన్న విషయం తెలియక భక్తులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. వీఐపీల తాకిడితో సామాన్య భక్తులు మరింత ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డిలు క్యూలైన్లను పర్యవేక్షించినా ఇబ్బందులు తప్పలేదు. పట్టణ సీఐ ప్రకాష్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది క్యూలైన్లను నియంత్రించారు. ఇక 5,183 రాహు, కేతు పూజలు జరిగాయి. ప్రత్యేక దర్శనం 3,186, శీఘ్రదర్శనం 4,502, అంతరాలయ దర్శనం 588 టిక్కెట్లు అమ్ముడుపోయాయి.

తాగునీరు మహాప్రభో!

❍ పైపులైన్ పగిలి గ్రామాల్లో దాహం కేకలు

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట గ్రామీణ మండలంలోని కుదిరి, కుదిరి తిప్పకండ్రిగ, తంగేడిదిబ్బ, దావాదిగుంట, కుదిరి హరిజనవాడ తాగునీటికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీరికి తాగునీరు సరఫరా కోసం కోటపోలూరులో తాగునీటి పథకం ట్యాంకు ఏర్పాటు చేశారు. దీని నుంచి నీళ్లు వెళ్లే పైపులైను మార్గమధ్యలో ఎక్కడో దెబ్బతింది. 20 రోజులుగా అధికారులు దీనిని గుర్తించలేదు. దీంతో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రైవేట్ ట్యాంకర్ నుంచి నీరు పట్టుకుంటున్న కుదిరి గ్రామస్థులు

ప్రైవేటు ట్యాంకర్లే దిక్కు

అధికారులు ట్యాంకర్ల ద్వారా అందిస్తామన్నారు. కానీ ఎవరు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ట్యాంక్‌కు గ్రామస్థుల నుంచి రూ.1000 తీసుకుంటున్నారు.

◆ ట్యాంకర్లు ఎప్పుడొస్తాయో తెలియవు. నాలుగు రోజులకో సారి వస్తాయి. పనులన్నీ మానుకుని పడిగాపులు కాస్తున్నారు. అవి వచ్చే సమయానికి కూలీలు పొలం పనులకు వెళ్తుండటంతో నీరు దొరకడం లేదు. ఇక ఇంటి అవసరాలకు దొరువుల్లో నీరు తెచ్చుకుని వాడుకుంటున్నారు. శుభకార్యాలు, ఆఖరికి అంత్యక్రియలకీ నీరు కొనాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కుదిరి తిప్పకండ్రిగలో దొరువులో నీరు తీసుకెళ్తున్న మహిళలు

వెంటనే పరిష్కరిస్తాం

ఇరవై రోజులుగా పరిశీలిస్తున్నాం. ఎక్కడ పైపులైన్ దెబ్బతిందో గుర్తించలేకపోతున్నాం. వీలైనంత త్వరగా గుర్తించి మరమ్మతులు చేస్తాం. సమస్య పరిష్కరిస్తాం.

-భవాని, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ

ద్విచక్ర వాహనం ఢీ: మత్స్యకారుడి మృతి

తడ, న్యూస్‌టుడే: రామాపురం కుప్పం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన మత్స్యకారుడు వాతియార్ వేలన్(48) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని హుటాహుటిన తమిళనాడు పరిధిలోని ఎళావూరు చెక్‌పోస్టు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. వేలన్ బంధువుల పెళ్లికి హాజరయ్యేందుకు జాతీయ రహదారిపై ఆటో కోసం నిలబడి ఉన్నాడు. తడ నుంచి చెన్నై వైపు వెళ్లే ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తడ ఎస్సై కొండపనాయుడు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. చేపల వేట సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్ద మృత్యువాత పడడంతో ఆ కుటుంబం ఇప్పుడు రోడ్డున పడింది. రామాపురం కుప్పంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

వేలన్ (పాతచిత్రం)

కోట: పోలీసులు స్వాధీనం చేసుకొన్న వాహనాలు

నిర్బంధ తనిఖీ: వాహనాలు స్వాధీనం

కోట, న్యూస్‌టుడే: శ్యామ్‌సుందరపురంలో ఆదివారం వాకాడు సీఐ హుసేన్‌బాషా పర్యవేక్షణలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఎస్సైలు, పోలీసు సిబ్బంది నిర్బంధ తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాల్లేని 24 ద్విచక్ర వాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకొన్నారు. ఎస్సైలు పవన్‌కుమార్, చినబలరామయ్య, నాగబాబు పాల్గొన్నారు. **నాయుడుపేట పట్టణం:** మునిరత్నంనగర్‌లో డీఎస్పీ చెంచుబాబు సిబ్బందితో కలిసి నిర్బంధ తనిఖీ నిర్వహించారు. పత్రాలు లేని తొమ్మిది వాహనాలను స్టేషన్‌కు తీసుకొచ్చారు. సీఐ బాబి, ఎస్సైలు అజయ్‌కుమార్, శ్రీకాంత్, ఆదిలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టుపై విచారణ

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని బొగ్గులమిట్ట ప్రాంతానికి చెందిన వైకాపా నేత చంద్రశేఖర్ సామాజిక మాధ్యమంలో అసభ్యకరమైన పోస్టులు పెట్టడంతో అతన్ని పెనమలూరు పోలీసులు విచారించారు. ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం నోటీసులు ఇచ్చి పంపారు.

క్రైం కార్నర్

ఐదుగురు జూదరుల అరెస్టు

చిట్టమూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు సమీపంలోని కోడిపందెం స్థావరంపై ఆదివారం ఎస్సై చినబలరామయ్య సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఐదుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రెండు కోళ్లు, ఐదు వాహనాలు, రూ.1,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత.. తొట్టంబేడు: పేదల నుంచి తక్కువ ధరలకు సేకరించి తరలించేందుకు సిద్ధం చేసిన 3.5 టన్నుల రేషన్ బియ్యాన్ని వాహనంతో సహా స్వాధీనం చేసుకున్నట్లు శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి ఆదివారం తెలిపారు. పట్టణంలోని భక్త కన్నప్ప కూడలి సమీపంలో శనివారం అర్ధరాత్రి రేషన్ బియ్యాన్ని వాహనంలో లోడు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో కడప, తడ ప్రాంతాలకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి వాహనంతో సహా 74 (బస్తాల్లో) నిల్వ ఉంచిన 3550 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణలో వాహన యజమాని నాయుడుపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించి అరెస్టు చేశారు.

రోడ్లు నిర్మించారు.. అంచులు మరిచారు

✦ ఆదమరిస్తే ప్రమాదాలే.. పట్టించుకోని అధికారులు

కోట, న్యూస్‌టుడే: రూ.కోట్ల వ్యయంతో ర.భ.శాఖ రోడ్లు నిర్మిస్తున్నారు. అయితే ఇరువైపులా రోడ్డు అంచులను అలాగే లెవలింగ్ చేయకుండా వదిలేస్తున్నారు. దీంతో రోడ్డు ఎత్తు పెరిగితే.. అంచులు మరింతగా కిందకు ఉండడంతో వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం వస్తే వాహనాలు జారిపోతున్నాయి. మెట్లు దిగినట్లుగా వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఐదేళ్లుగా లెవలింగ్‌కు అధికారులు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. నిధులు మాత్రం మంజూరు కాలేదు.

✦ విద్యానగర్ నుంచి కోట అడ్డరోడ్డు వరకు డబుల్ రోడ్డు ఐదేళ్ల క్రితం నిర్మించారు. రోడ్డు ఎత్తు పెరగడంతో అంచులు మరింత కిందకు ఉన్నాయి. అంతేకాకుండా చెందోడు సమీపంలోని కొత్తపాళెం మార్గంలోకి వెళ్లే రోడ్డు మలుపు వద్ద మెట్లపై నుంచి కిందకు దిగుతున్నట్లుగా ప్రమాదకరంగా ఉంది. ఇదే పరిస్థితి ఈ మార్గంలో పలుచోట్ల ఉంది.

✦ కోట మార్గంలో కొద్ది నెలలు కిందట రూ.1.82 కోట్లతో రోడ్డు పనులు చేశారు. రోడ్డు నుంచి ఎన్‌సీఆర్‌నగర్‌కు వెళ్లే మార్గాల్లో అంచులు కిందకు ఉండడంతో ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి అంచులకు లెవలింగ్ చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.


లెవలింగ్ లేని కొత్తపాళెం రోడ్డు

త్వరలో పనులు చేపడతాం

లెవలింగ్ పనులు చేసేందుకు ప్రతిపాదనలున్నాయి. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. - మల్లికార్జునరావు, ఇన్‌ఛార్జి ఏఈ

నేడు ‘మండలి’ తొలి సమావేశం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యులందరూ తొలి దఫా భేటీ కానున్నారు. ఈ సందర్భంగా ముక్కంటి ఆలయ పరిపాలన భవనంలో సోమవారం జరిగే ట్రస్టుబోర్డు తొలి సమావేశానికి ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. భక్తులకు కల్పించాల్సిన వసతులు, బృహత్తర ప్రణాళిక అమలు, ఆలయ పరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులతో పాటు ఇటీవలి కాలంలో వస్తున్న విమర్శలకు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే మరి. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారు.

(c) eenadu

భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు వేగవంతం

వాష్‌రూంకు రంగులు అద్దుతున్న కార్మికుడు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత పనులను సంయుక్త కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. 'జర్మన్ హ్యాంగర్లతో టెంట్లు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం వాటిల్లో గదులు నిర్మించడంతోపాటు కార్పెట్లు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో నిర్దిష్ట సమయం కంటే ముందుగానే పనులు పూర్తి చేయాల'ని సూచించారు. ప్రధాన వేదిక, స్వాగత ద్వారాలు, అతిథుల రాక, పార్కింగ్ తదితర అంశాలపై ఆయన నిశితంగా పరిశీలించి ఇంకా చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. డీసీపీ మణికంఠ, జీవీఎంసీ అధికారి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

సదస్సు ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

బిగి అల్లిక.. వాలుజడ పోలిక..!

పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యానవనంలోని స్నేక్‌ప్లాంట్స్ ఇవి. మునగకాడల ఆకారంలో ఉంటాయి. వీటిని కుండీల్లో పెంచుతారు. మూడు మొక్కలను కలిపి ఇలా జడలా అల్లుతారు. అవి పదిహేను రోజుల్లో కలిసిపోయి ఆకర్షణీయంగా మారడంతోపాటు ఏపుగా పెరుగుతాయి. వీటిని ఎడారి మొక్కలు అని కూడా పిలుస్తారు. ఇవి కాండాల్లో నీటిని నిల్వ ఉంచుకొని బతుకుతాయి. రాత్రి వేళల్లో ప్రాణవాయువును వదులుతాయని ఉద్యానవనం వ్యవస్థాపకులు డాక్టర్ రామమూర్తి తెలిపారు. – ఈనాడు, విశాఖపట్నం

రామచిలుకల 'రాణి'వాసం..!

నగరంలో రణగొణధ్వనుల మధ్యలో ఉన్న ఓ ఇంటికి నిత్యం రామచిలుకలు గుంపులుగా రావడం ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తోంది. గోపాలపట్నం నాయుడు క్వార్టర్స్‌లో బెహరా ఉషారాణి ఇంటి అవసరాల కోసం బియ్యం నానబెట్టి డాబాపై ఆరబెట్టేవారు. వాటిని తినడానికి తరచూ రామచిలుకలు వస్తుండేవి. దీన్ని గమనించిన ఆమె రోజూ పెట్టడం మొదలుపెట్టారు. దీంతో తినడానికి వచ్చే రామచిలుకల సంఖ్య కూడా పెరిగింది. ఇప్పుడు రోజూ 100 వరకు చిలుకలు వస్తున్నాయి. వాటిని చూసి కొన్ని పావురాలు కూడా రావడం ప్రారంభించాయి. క్రమంగా ఉషారాణికి వాటితో విడదీయరాని బంధం ఏర్పడింది. ప్రస్తుతం రోజుకు రెండున్నర కిలోల బియ్యం నానబెట్టి డాబాపై పెడుతున్నారు. ఆహారం తినడానికి వచ్చే రామచిలుకలు, పావురాల కిలకిలారావాలతో ఆ ఇల్లు నిత్యం సందడిగా ఉంటోంది. – గోపాలపట్నం, న్యూస్‌టుడే

బతుకును దిద్దే భగవద్గీత

అవధూత దత్త పీఠం, భగవద్గీత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో ఆదివారం సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వేలాది మంది భక్తులు ఇందులో పాల్గొని భగవద్గీతలోని శ్లోకాలను పఠించారు. మైసూరు దత్త పీఠం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. – న్యూస్‌టుడే, అక్కయ్యపాలెం

బాలలూ వింటారా.. సాహస గాథ!

ముంబయికి చెందిన ఆయన పేరు అభిషేక్ తల్వార్. ఆదివారం బీచ్ రోడ్డు హవామహల్‌లో జరిగిన వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్‌లో పాల్గొని పిల్లలకు కథలు చెప్పారు. పెంగ్విన్ పక్షి, తేనెటీగ సాహసాలు, మానవాళికి అవి చేస్తున్న ఉపకారం గురించి వివరిస్తుంటే పిల్లలు అన్నీ మరిచిపోయి విన్నారు. ఆ దృశ్యమే ఇది. –న్యూస్‌టుడే, పెదవాల్తేరు

మెండుగా అవకాశాలు.. నైపుణ్యాలే అస్త్రాలు..!

పెట్టుబడులకు గమ్యస్థానంగా విశాఖ

యువతను సన్నద్ధం చేస్తున్న ప్రభుత్వం

ఈనాడు, విశాఖపట్నం

జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే అనేక ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో లక్షలాది మంది ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రైవేటులోనూ వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. భవిష్యత్తులో అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. వీటిని యువత అందిపుచ్చుకునేలా ప్రభుత్వం సన్నద్ధం చేస్తోంది. ఆయా రంగాల్లో ఉద్యోగాలకు తగ్గట్టుగా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా పలు కోర్సులు అందిస్తోంది.

పర్యాటకం, ఆతిథ్య రంగం..: గమ్య నగరంగా పేరుగాంచిన విశాఖ పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రముఖ సంస్థలు నిర్మించనున్న స్టార్ హోటళ్లు, రిఫ్రెష్‌మెంట్, కన్వెన్షన్ సెంటర్లు, రిసార్టుల్లో అవకాశాలున్నాయి. పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయి. అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ ఏర్పాటుతో క్రూయిజ్ నౌకలు నగరానికి వస్తున్నాయి.

గ్రీన్ హైడ్రోజన్ ఆధారంగా..: పూడిమడక వద్ద ఎన్టీపీసీ, జెన్‌కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ పార్కును ఏర్పాటు చేయనున్నాయి. రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకు గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వాటికి అనుబంధంగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

ఐటీ రంగంలో ఇలా..: ఐటీ రంగంలో ప్రస్తుతం 10కి పైగా సంస్థలున్నాయి. వాటిలో 15 వేల మందికి పైగా పనిచేస్తున్నారు. ఐటీ హిల్స్‌పై వివిధ సంస్థలు ఏర్పాటు కానున్నాయి.
● టీసీఎస్, కాగ్నిజెంట్, సత్త్వ తదితర సంస్థల్లో 50 వేలకు పైగా ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి.

ఫార్మా, మెడ్‌టెక్..: ఉమ్మడి జిల్లాలో పరవాడ, అచ్యుతాపురంలోని ఫార్మా సిటీల్లో 150కు పైగా సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఆయా సంస్థల్లో ఖాళీలున్నాయి. బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన అభ్యర్థులు దొరకడం కష్టంగా మారింది. మెడ్‌టెక్ జోన్‌లో 150కు పైగా సంస్థలు వివిధ రకాల ఉత్పత్తులు తయారుచేస్తున్నాయి. భవిష్యత్తులో ఆయా పోస్టు ఉపాధి అవకాశాలు ఉన్నాయి.

ఆటోమొబైల్, సేవా రంగం..: వేగంగా విస్తరిస్తున్న నగరంలో ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ టెక్నీషియన్లు తదితరుల కొరత ఎక్కువగా ఉంది. స్థానికంగా ఆటోమొబైల్ ఉత్పత్తి లేకపోయినా.. ద్విచక్ర వాహనాలు, కార్ల సర్వీసు టెక్నీషియన్లకు మంచి డిమాండ్ ఉంది. వీటిని అందిపుచ్చుకోవచ్చు.

★ ఏపీఎస్‌ఎస్‌డీసీ నిర్వహిస్తున్న కోర్సులకు సంబంధించి మరిన్ని వివరాలు కావాలంటే naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించొచ్చు. ఇందులో పేరు నమోదు చేసుకుంటే కొత్త కోర్సులు, జాబ్ మేళాల సమాచారం తెలుసుకోవచ్చు.

వివిధ కోర్సులకు ప్రతిపాదనలు: విశాఖలో భవిష్యత్తు ఉపాధి అవకాశాలకు తగ్గట్టుగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) ద్వారా యువతకు నైపుణ్యాలు నేర్పిస్తున్నాం. ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రతిపాదనల మేరకు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ కోర్సులు కేటాయిస్తోంది. సీఎం కేవైలో భాగంగా ఐటీ, ఫార్మా, సర్వీసు టెక్నీషియన్స్ కోర్సులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించాం.
– చాముండేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి



నీటి అడుగులో.. ఊపిరి బిగబట్టి..!

డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కెడెట్లకు వారం రోజులుగా స్కూబా డైవింగ్ అడ్వెంచర్ కోర్సులో శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా ఆది వారం నీటి అడుగులో ఎలా ఈతకొట్టాలి.. పైకి ఎలా చేరుకోవాలి.. అడ్డంకులను అధిగమించడంపై తర్ఫీదు ఇచ్చారు. –న్యూస్‌టుడే, సీతంపేట

సిమ్‌కార్డు కొంటున్నారా.. జర జాగ్రత్త

పీఎంపాలెం, న్యూస్‌టుడే: సైబర్ నేరాల్లో సిమ్‌కార్డు మోసాలు రోజురోజుకీ పెచ్చుమీరుతున్నాయి. ఒక సిమ్ తీసుకునేందుకు సెల్ దుకాణానికి వెళ్లగా మనకు తెలియకుండానే మన పేరు మీద రెండో సిమ్ పుట్టుకొస్తోంది. సైబర్ నేరస్థులతో చేతులు కలిపిన కొందరు వ్యాపారులు మన ఆధార్, వేలిముద్రలు తీసుకుని రెండో సిమ్‌ను యాక్టివేట్ చేసి సైబర్ ముఠాకు చేరవేస్తున్నారు. ఈ తరహా మోసాలకు పాల్పడుతూ ఇటీవల ఇద్దరు వ్యక్తులు పోలీసులకు చిక్కడంతో ఇది వెలుగు చూసింది.

మోసగించేది ఇలా..: కొత్త సిమ్‌కార్డు తీసుకునేందుకు సెల్ దుకాణం వద్దకు వెళ్తే వినియోగదారుల నుంచి ఆధార్ వివరాలు, వేలిముద్రలు, ఐరిస్ స్కానింగ్ చేయడం తెలిసిందే. ఇదే సమయంలో కొందరు మోసగాళ్లు మనకు తెలిసి ఒకటి.. తెలియకుండా మరొక సిమ్‌కార్డు తీసుకుంటున్నారు. వేలిముద్రలు, ఐరిస్ సేకరించే సమయంలో స్కానింగ్ ప్రక్రియను ఒకటికి రెండుసార్లు చేస్తారు. దీంతో రెండు కంపెనీలకు చెందిన సిమ్ కార్డులు మన పేరు మీద నమోదవుతాయి. మనం అడిగిన సిమ్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోతాం. రెండోది మనకు తెలియకుండా వారి వద్ద ఉంచుకుంటున్నారు.

9 సిమ్‌లు వరకూ తీసుకోవచ్చు..: సిమ్ కార్డులు తీసుకునేందుకు ఆధార్ లింక్‌ను కేంద్ర టెలికాం రంగ సంస్థ తప్పనిసరి చేసింది. ఒక వ్యక్తి తన ఆధార్‌తో 9 సిమ్ కార్డులు తీసుకునే వెసులుబాటు కల్పించింది.

మన పేరు మీద ఎన్ని ఉన్నాయో తెలుసుకోవచ్చు..: ఆధార్, ఐడీలతో మన పేరు మీద ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో సులువుగా తెలుసుకునేందుకు ప్రభుత్వం 'సంచార్ సాథీ' మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్, వెబ్ తదితర సాంకేతిక విధానాల ద్వారా యాప్‌ను వినియోగించుకోవచ్చు. ముందుగా www.sancharsaathi.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి దానిపై క్లిక్ చేయాలి. ఆపై సిటిజన్ సెంట్రిక్ సేవలకు సంబంధించిన పలు ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో 'నో మొబైల్ కనెక్షన్స్ ఇన్ యువర్ నేమ్'పై క్లిక్ చేయాలి. అక్కడ సూచించిన చోట పది అంకెల చరవాణి నెంబర్, కింద క్యాప్చా నమోదు చేసి క్లిక్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఆపై మన పేరుతో నమోదైన సిమ్‌కార్డు నెంబర్లు కనిపిస్తాయి. పక్కన 'నాట్ మై నంబర్, నాట్ రిక్వైర్డ్' అంటూ రెండు ఎంపికలు ఉంటాయి. అవసరం లేని నెంబరుపై క్లిక్ చేస్తే ఫిర్యాదు ఆధారంగా సంబంధిత నెంబరును మన పేరుమీద లేకుండా తొలగిస్తారు.

సైబర్ నేరస్థులకు అందిస్తూ..: మనకు తెలియకుండా తీసుకున్న రెండో సిమ్‌కార్డు సైబర్ నేర ముఠా చేతుల్లోకి వెళ్తోంది. సంబంధిత సిమ్‌లు లింక్ చేసి యూట్యూబ్, జీమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం తదితరాలకు 'యూజర్' ఐడీలు తయారు చేసి అనధికార బెట్టింగ్ యాప్‌లు ప్రచారం చేస్తున్నారు. పలువురిని మోసగించి తీసుకున్న సిమ్‌ల ద్వారా సామాజిక మాధ్యమ ఖాతాలు తెరచి థాయిలాండ్, కంబోడియా దేశాల్లో ఉన్న సైబర్ నేరస్థులకు అందిస్తున్నారు. తద్వారా వారికి సహకారం అందించి అధిక మొత్తంలో నగదు ఆర్జిస్తున్నారు.

'కూడళ్లు' జిగేల్..

సంపత్‌వినాయక ఆలయం రోడ్డులో..

సిరిపురం సర్కిల్ డెక్ భవనం ఎదురుగా..

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈనెల 14, 15న జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు వడివడిగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సమయం తక్కువగా ఉండటంతో మైదానాన్ని ముస్తాబు చేయడానికి కార్మికులు రాత్రిపగలూ శ్రమిస్తున్నారు. అంతేకాకుండా నగరంలోని పలు కూడళ్లలో ఫౌంటెయిన్లు, వివిధ ఆకృతులను ఏర్పాటు చేసి రంగురంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు. రాత్రుళ్లు వెలుగులీనుతున్న ఆయా కూడళ్లు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. – ఈనాడు, విశాఖపట్నం

13 నుంచి ఏయూ ఇంజినీరింగ్ కళాశాలకు సెలవులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు జరగనున్నందున ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు ఇంజినీరింగ్ కళాశాల తరగతులు రద్దు చేస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఏయూలోని విద్యార్థులు, పరిశోధకులు, బోధన, బోధనేతర ఉద్యోగులు విధిగా ఏయూ ఇచ్చిన గుర్తింపు కార్డులు ధరించాలని ఆయన మరో ప్రకటనలో పేర్కొన్నారు.

'క్లాప్'లో గంప'గుత్త'గా అక్రమాలు..!

కార్మికుల సరఫరాలో మాయాజాలం

ఏటా రూ.2కోట్ల మేర నిధుల స్వాహా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాలకు కార్మికుల సరఫరాలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయి. గుత్తసంస్థ కార్మికులను సరిగా విధులకు పంపించకుండా నిధులు కాజేస్తుందనే ఆరోపణలు వస్తున్నాయి. కట్టడి చేయాల్సిన క్షేత్రస్థాయి అధికారులు డబ్బులు తీసుకుని సహకరిస్తుండటంతో గుత్తేదారు అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

గుత్త సంస్థ దోపిడీ ఇలా...: 2024 ఫిబ్రవరిలో ఓ జీవీఎంసీ అధికారి అండతో ఆ గుత్త సంస్థ క్లాప్ వాహనాలకు కార్మికుల సరఫరా టెండరు దక్కించుకుంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలోనూ ఇదే సంస్థ హవా కొనసాగింది. మాజీ ముఖ్యమంత్రి సతీమణి బంధువుగా చెప్పుకుంటున్న ఆ గుత్తేదారు ఎలా చెబితే అలా గతంలో అధికారులు వ్యవహరించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అతను కొనసాగడం గమనార్హం.

● టెండరు నిబంధనల ప్రకారం 655 మంది కార్మికులను ఏర్పాటు చేయాలి. కాని 590 మందిని మాత్రమే పంపుతున్నాడు. అంతేకాకుండా మరో 100 మందితో బలవంతంగా సెలవు పెట్టించి ఆయా నిధులను కాజేస్తున్నాడు. ఇలా ప్రతి నెలా జీవీఎంసీ ఇచ్చే రూ.69లక్షల బిల్లులో రూ.25లక్షలు, ఏటా రూ.2కోట్లకుపైగా గుత్తేదారు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

అనుమతుల్లేకుండానే..: గుత్తేదారుల ద్వారా కార్మికులను తీసుకుంటే ఆ విషయాన్ని స్థాయీ సంఘం లేదా, కౌన్సిల్ దృష్టికి తీసుకురావాలి. 2024 ఫిబ్రవరిలో 66 రోజులకు మాత్రమే అనుమతి తీసుకున్న అధికారులు, ఆ తరువాత ఇప్పటి వరకు స్థాయీ, కౌన్సిల్ దృష్టికి తీసుకురాలేదు. కొందరు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు గుత్తేదారు పెద్దఎత్తున నిధులు సమర్పిస్తుండటంతో ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగిపోతోంది.

22వ వార్డులో 40శాతం హాజరైనట్లు గుర్తింపు: కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సహాయ వైద్యాధికారులు గుత్తేదారుతో కుమ్మక్కయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల 22వ వార్డులో పది రోజులపాటు క్లాప్ వాహనాలతో వచ్చే కార్మికులను లెక్కకట్టగా కేవలం 40శాతం మాత్రమే హాజరవుతున్నట్లు కార్పొరేటర్ మూర్తియాదవ్ గుర్తించారు.

● సంబంధిత జోన్ సహాయ వైద్యాధికారి మాత్రం కార్మికులంతా హాజరైనట్లు ధ్రువీకరించడాన్ని గమనించిన ఆయన వివరణ కోరగా తప్పు జరిగిందని ఒప్పుకోవడంతోపాటు గుత్తేదారు నుంచి రికవరీ చేస్తామని తెలిపారు.

రెండు నోటీసులు ఇచ్చాం...: దుర్గా కన్సల్టెన్సీ సంస్థ సక్రమంగా కార్మికులను పంపించకపోవడం, తరచూ సమ్మెలు చేయిస్తుండటంతో గతంలో రెండు నోటీసులు జారీ చేశాం. అయినా తీరులో మార్పు రాకపోవడంతో బ్లాక్ లిస్టులో పెట్టాలని కమిషనర్ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు నోటీసులు జారీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం.
– డాక్టర్ ఈఎన్‌వీ నరేష్‌కుమార్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి

నేడు పీజీఆర్ఎస్ రద్దు

వన్‌టౌన్, జగదాంబ కూడలి, న్యూస్‌టుడే: కలెక్టరేట్, నగర పోలీస్ కమిషనరేట్‌లో ఈనెల 10వ తేదీ సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను రద్దు చేసినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖ కేంద్రంగా జరగనున్న భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున పీజీఆర్ఎస్‌ను తాత్కాలికంగా రద్దు చేశామని ఈ విషయాన్ని అర్జీదారులు గమనించి సహకరించాలని కోరారు. వచ్చే వారం యథావిధిగా కొనసాగుతుందన్నారు.

చూసొద్దాం.. ప్రకృతిని ఆస్వాదిద్దాం!

పర్యాటకులను ఆకర్షిస్తున్న భీమిలి

కార్తికమాసంలో వేలాది మంది సందర్శన

సముద్ర శిలా తోరణం వద్ద పర్యాటకుల సందడి

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: చారిత్రక పట్టణంగా ప్రసిద్ధిగాంచిన భీమునిపట్నంలో సహజసిద్ధ ప్రదేశాలు, ఆహ్లాదకర వాతావరణం పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. కార్తిక మాసంలో నిత్యం వేలాది మంది వీటి సందర్శనకు వస్తుంటారు. అదే విధంగా వనభోజనాలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆయా పర్యాటక ప్రాంతాల విశేషాలు ఇలా..

చారిత్రక బౌద్ధారామాలు..: భీమిలి మండలంలో తొట్లకొండ (మంగమారిపేట), బావికొండ (తిమ్మాపురం), పావురాల కొండ (భీమిలి) బౌద్ధారామాలున్నాయి. ఈ కొండలపై క్రీ.పూ.3వ శతాబ్దం నాటి బౌద్ధ కట్టడాలు, తటాకాలు, ఆరామాలు, చైత్యాలు ఉంటాయి. తొట్లకొండపై బీచ్‌వ్యూ పార్కు ఉంది. రింగురోడ్డు నుంచి చూస్తే సాగరతీర అందాలు కనువిందు చేస్తాయి.

ఎర్రమట్టి దిబ్బల అందం: నేర్లవలస రెవెన్యూ గ్రామ పరిధిలో దాదాపు 250 ఎకరాల్లో సహజసిద్ధమైన ఎర్రమట్టి దిబ్బలు ఉన్నాయి. ఇవి పర్యాటకులకు కొత్త అనుభూతిని కలిగిస్తాయి. యునెస్కో గుర్తించిన ఈ మొత్తం దిబ్బలను చూడాలంటే రోజంతా సరిపోదు. వీటి లోపలికి వెళ్లడం కూడా కష్టమే. పర్యాటకులు కొద్దిదూరం వెళ్లి అక్కడ నుంచే దీని అందాలను ఆస్వాదిస్తుంటారు. జేవీఅగ్రహారం గ్రామం నుంచి లేదా భీమిలి నేర్లవలస కాలనీ నుంచి రెండు కిలోమీటర్ల లోపలికి వెళ్తే ఎర్ర మట్టి దిబ్బలు మొత్తం కనపడేలా వీఎంఆర్‌డీఏ 40 అడుగుల వ్యూపాయింట్‌ను పదేళ్ల కిందట ఏర్పాటు చేసింది.

ఆకట్టుకుంటున్న బీచ్ శిలా తోరణం: భీమిలి బీచ్ సహజసిద్ధంగా ఉంటుంది. గోస్తనీ నదీ సాగర సంగమం ప్రాంతం మైమరిపిస్తుంది. ఇక్కడ బీచ్‌లో డచ్ సమాధులున్నాయి. మంగమారిపేట తొట్లకొండ వద్దనున్న సముద్ర శిలాతోరణం యునెస్కో గుర్తింపు పొందింది. నిత్యం వందలాది మంది ఇక్కడికి వచ్చి ఆస్వాదిస్తుంటారు.

ఇలా చేరుకోవచ్చు..: నగరంలోని రైల్వేస్టేషన్ నుంచి భీమిలికి 30కి.మీ. ఉంటుంది. ప్రతి 45 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుంది. ఈ మార్గంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలు కైలాసగిరి, జూ, సాగర్‌నగర్, రుషికొండ బీచ్‌లు ఉన్నాయి. దీంతో ఆర్కేబీచ్ నుంచి తొట్లకొండ వరకు డబుల్ డెక్కర్ బస్సులను నడుపుతున్నారు.

విశాఖ జట్టు విజయవిహారం

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో సెమీస్‌కు..

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. సోమవారం విశాఖ, తూర్పుగోదావరి జిల్లా జట్ల మధ్య తొలి సెమీఫైనల్ జరగనుంది. ఆదివారం విశాలాక్షినగర్ బీవీకే పాఠశాల మైదానంలో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విశాఖ జట్టు 82-51తో అనంతపురం జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు 52-20తో కర్నూలుపై గెలుపొందింది.

(c) eenadu

ఈత పోటీల్లో బాలికల విజేత విశాఖ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఈత పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి సుమారు 650 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలబాలికలను అండర్-14, అండర్-19 గ్రూపులుగా విభజించి వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఎస్జీఎఫ్ రాష్ట్ర పరిశీలకుడు రాధాకృష్ణ, కార్యదర్శి భానుమూర్తి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విశాఖ జిల్లా బాలికల బృందం, నెల్లూరు జిల్లా బాలుర జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచాయి. ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ నాగేశ్వరరావుతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ బాలికల బృందానికి ట్రోఫీ అందజేస్తున్న ఎస్జీఎఫ్ రాష్ట్ర పరిశీలకుడు రాధాకృష్ణ, సెక్రటరీ భానుమూర్తి రాజు

పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

రేంజ్ పరిధిలో 9మంది సీఐలకు బదిలీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విశాఖ రేంజ్ పరిధిలో తొమ్మిది మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ గోపినాథ్ జెట్టి ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. బొబ్బిలి సురేంద్ర విజయనగరం జిల్లా జీకే వీధి సర్కిల్‌కు, కె.కుమారస్వామి విశాఖ వీఆర్ నుంచి విజయనగరం జిల్లాకు, వానపల్లి రామారావు శ్రీకాకుళం మహిళా పి.ఎస్. నుంచి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు, సీలవలస లక్ష్మణరావు విశాఖ రేంజ్ నుంచి అల్లూరి జిల్లా ఎస్.డి.పి.ఎస్. టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. అలాగే సువ్వారి రాము అల్లూరి జిల్లా ఎస్.డి.పి.ఎస్. టాస్క్‌ఫోర్స్ నుంచి విశాఖ రేంజ్‌కు, నమ్మి గణేష్ అచ్యుతాపురం యూపీఎస్ నుంచి విశాఖ రేంజ్‌కు, ఆర్.వి.వి.ఎస్.ఎన్. హెచ్. శేఖరరావు అనకాపల్లి మహిళా పోలీసు స్టేషన్ నుంచి అచ్యుతాపురం యూపీఎస్‌కు, కండి నీలిమ విశాఖ రేంజ్ నుంచి అనకాపల్లి మహిళా పోలీసు స్టేషన్‌కు, బొంగు నారిమణి విశాఖ రేంజ్ నుంచి శ్రీకాకుళం మహిళా పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు వారంతా తక్షణమే సంబంధిత ప్రాంతాల్లో విధుల్లో చేరాలని డీఐజీ సంబంధిత ఉత్తర్వుల్లో ఆదేశించారు.

నలువైపులా నగరం అభివృద్ధి

- వరుస కట్టిన ప్రముఖ కంపెనీలు
- సేవా రంగంలో పెరుగుతున్న జోరు
- ఊపందుకున్న స్థిరాస్తి రంగం

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ నగరం శరవేగంగా విస్తరిస్తోంది. ఐటీ హబ్‌గా, ఏఐ సిటీగా రూపాంతరం చెందుతోంది. అమెరికా వెలుపల గూగుల్ భారీ డేటా సెంటర్‌ను ఇక్కడే ఏర్పాటు చేయనుంది. అనుబంధంగా అనేక బహుళజాతి ఐటీ కంపెనీలు, పర్యాటక, సేవారంగ సంస్థలు విశాఖ నుంచే తమ కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. దీంతో స్వదేశీ, విదేశీయులను నగరం ఆకర్షిస్తోంది. ఇక్కడ స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవాలని ఎంతో మంది ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు అనుగుణంగానే స్థిరాస్తి రంగం అన్ని వైపులా విస్తరిస్తోంది.

■ **మౌలిక వసతుల పెంపు దిశగా..:** ప్రశాంత నగరం, ఆర్థిక రాజధానిగా పేరున్న విశాఖలో మౌలిక వసతులు మెరుగవుతున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కార్యకలాపాలు త్వరలో ప్రారంభించే అవకాశం ఉంది. వీటన్నింటిని విశ్లేషించుకుంటున్న ప్రజలు స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. సొంతింటి కలలను నిజం చేసుకోవాలనుకుంటున్నారు. ఫలితంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో నిర్మాణ రంగం ఆశాజనకంగా ముందుకువెళ్తోంది. రిజిస్ట్రేషన్ల నమోదులో కనిపిస్తున్న వృద్ధే దీనికి నిదర్శనం.

■ **సిద్ధంగా 10వేలకు పైగా ఫ్లాట్లు:** నగరంలో అన్నివైపులా కొత్త నిర్మాణాలు జోరందుకున్నాయి. అపార్టుమెంట్లలో పది వేలకుపైగా ఫ్లాట్లు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో రూ.35 లక్షల నుంచి రూ.కోటి విలువైనవి ఉన్నాయి. విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు క్రమంగా పెరుగుతున్నాయి. సొంతంగా ఇల్లు నిర్మించుకోవాలనుకునేవారి కోసం ఉత్తరాంధ్రలో 50వేలకు పైగా ఖాళీ స్థలాలు సిద్ధంగా న్నాయి. నరెడ్కో (జాతీయ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) గుర్తింపుతో పలువురు బిల్డర్లు గృహ సముదాయాలను అందుబాటులోకి తెస్తున్నారు.

మాట్లాడుతున్న నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్. చిత్రంలో ఉత్తరాంధ్ర జోన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు వై. వెంకన్న చౌదరి, కోశాధికారి కేవీవీ సుబ్బారావు, విశాఖ అధ్యక్షుడు రాజశేఖర్

■ **పండగ వాతావరణంలో..:** సీఐఐ భాగస్వామ్య సదస్సు జరిగే రోజుల్లోనే మా ఎక్స్‌పో జరుగుతుంది. అందులో పాల్గొనేందుకు వచ్చే దేశ, విదేశీయులు ఇక్కడ స్థిరాస్తి రంగంపై ఒక అంచనాకు వచ్చేందుకు ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రదర్శనలో ఏయే ప్రాజెక్టులు ఉన్నాయో వివరిస్తాం. వాణిజ్య తరహాలో కాకుండా పండగ వాతావరణంలో నిర్వహిస్తాం. అందుకే ఎక్స్‌పో బదులుగా ఫెస్ట్ అని పేరు పెట్టాం. – వెంకన్న చౌదరి, కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర జోన్, నరెడ్కో

■ **మూడు రోజులపాటు**

నరెడ్కో సదస్సు: ఈ నెల 14, 15, 16 తేదీల్లో నరెడ్కో ఆధ్వర్యంలో గాదిరాజు ప్యాలెస్‌లో వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్-2025 నిర్వహిస్తున్నాం. ఒక భారీ స్టాల్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నమూనాను జీఎంఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నాం. భోగాపురం ఏరియా డెవలప్‌మెంట్ పేరుతో ఆ పరిసర ప్రాంతాల్లోని స్థిరాస్తి ప్రాజెక్టులతో మరొకటి ఉంటుంది. వీఎంఆర్‌డీఏ, మెట్రో ప్రాజెక్టులకూ స్థానం కల్పిస్తున్నాం. ప్రతి గంటకు లక్కీ డ్రాలు, ద్విచక్రవాహనాలు బహుమతులుగా అందజేస్తాం. ఎస్‌బీఐ, యూబీఐ, ఎల్ఐసీ, బ్యాంకు ఆఫ్ బరోడా ఇందులో పాల్గొంటున్నాయి. – గద్దె చక్రధర్, రాష్ట్ర అధ్యక్షుడు, నరెడ్కో

■ **60కిపైగా స్టాళ్లు:** నగరంలో గృహాలకు డిమాండ్ ఉంది. అన్నివర్గాలకు అందుబాటులో నిర్మాణాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రదర్శనలో 60కి పైగా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నాం. అందులో అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లు, ఖాళీ స్థలాలు, ఎలక్ట్రిక్, ఫర్నిచర్, టైల్స్‌కు చెందిన మెటీరియల్ స్టాళ్లు ఉంటాయి. ఉదయం 10గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. – పి.రాజశేఖర్, అధ్యక్షుడు, నరెడ్కో విశాఖ చాప్టర్

‘నా కార్యకర్త’కు తెదేపా శ్రీకారం

గాజువాక, న్యూస్‌టుడే: తెదేపా జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన ఆదేశాల మేరకు గాజువాకలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ‘నా కార్యకర్త..’ కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. గాజువాక తెదేపా కార్యాలయంలో కొందరు కార్యకర్తలను పిలిచి వారి సమస్యలను అడిగి తెలుసుకుని ప్రత్యేక ఫార్మెట్‌లో నమోదు చేశారు. పల్లా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పార్టీకి చిత్తశుద్ధితో పని చేసిన కార్యకర్తల మనోభావాలను తెలుసుకునేందుకు రోజుకు 50 మందితో ‘నా కార్యకర్త’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యకర్తల కుటుంబ అవసరాలు, ఉపాధి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మిగతా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

కార్యకర్తతో ముచ్చటిస్తున్న తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పోలీసుస్టేషన్‌లో యువతి ఆత్మహత్యాయత్నం

ప్రేమికుడు పెళ్లి చేసుకోలేదని మనస్తాపం

గాజువాక, న్యూస్‌టుడే: ప్రేమించిన యువకుడితో పెళ్లి చేయాలంటూ విశాఖ గాజువాక పోలీసుస్టేషన్‌లో ఓ యువతి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. దీనికి సంబంధించి గాజువాక సీఐ పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం దరి పెనుగొల్లుకు చెందిన యువతి (23) అదే జిల్లా మునగపాక మండలం తిమ్మరాజుపేటకు చెందిన వీరయ్యస్వామి(27)లు అయిదేళ్ల నుంచి ప్రేమలో ఉన్నారు. అయితే వీరయ్యస్వామి తనను పెళ్లి చేసుకోకుండా తాత్సారం చేస్తున్నాడు. అతన్ని ఒప్పించి వివాహం చేయాలంటూ 15 రోజుల క్రితం యువతి గాజువాక పోలీసులను ఆశ్రయించింది. అయినా దీనిపై ఎలాంటి పురోగతి లేదని భావించిన ఆమె ఆదివారం ప్రియుడితో కలిసి పోలీసు స్టేషన్‌కు వచ్చింది. పోలీసులు ఆ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని మనస్తాపానికి గురై తన వెంట తెచ్చుకున్న రసాయనాన్ని (నెయిల్ పాలిష్ రిమూవర్) తాగింది. అపస్మారక స్థితికి చేరుకోవడంతో గాజువాకలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేయవద్దని, ప్రియుడితో తన పెళ్లి చేయాలంటూ ఆమె ఫిర్యాదు సైతం ఇవ్వలేదని సీఐ పార్థసారథి తెలిపారు. వీరయ్యస్వామిని విచారిస్తున్నామని, చట్టపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్

... విశ్వాసానికి మరో పేరు !
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)

అస్సెట్ రికవరీ మోనిటరింగ్ బ్రాంచ్
డి.నెం. 9-13-45/2/9/1, 5వ అంతస్తు, ఎమ్‌వీఆర్ వినాయగర్ ట్రేడ్ సెంటర్, వీఐపి రోడ్డు, విశాఖపట్నం - 530003.
మొబైల్ : 98312 00669, 96409 33383

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 9(1)తో చదువుకోవలసిన రూలు 8(6) ప్రకారం సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన / ఛార్జిలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / లాంఛనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారిగారు సెక్యూర్డు క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వాటిని "ఎక్కడ ఎలా ఉన్నదీ అక్కడ అలానే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై" దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు / సెక్యూర్డు క్రెడిటార్ గారు సదరు ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

ఇ -వేలం తేది మరియు సమయం : 26-11-2025 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు

బయానా చెల్లింపునకు ఆఖరు తేది : 26-11-2025, మధ్యాహ్నం 3 గం॥ల లోపు | బిడ్ పెంపుదల మొత్తం : 50,000/-

ఋణగ్రహీత పేరు/బ్యాంకుకు మొత్తం బకాయిలు: మెస్సర్స్ కమల్ కాఫీ వర్క్స్, (అకౌంట్ నెం.046200IN00000018 & 046200IL00000144) డి.నెం.30-11-11/1డి, కమల్ నివాస్, లక్ష్మీ వీధి, డాబా గార్డెన్స్, విశాఖపట్నం - 530020. పార్ట్‌నర్స్: 1. శ్రీ ఎస్. కమల్ కుమార్, తండ్రి : శ్రీ సుడియా రామారావు, ఇందు ఎన్‌క్లేవ్, డి.నెం.45-58-17, నరసింహా నగర్, విశాఖపట్నం - 530024. 2. శ్రీ ఎస్. రామారావు, ఇందు ఎన్‌క్లేవ్, డి.నెం.45-58-17, నరసింహా నగర్, విశాఖపట్నం - 530024. 3. శ్రీమతి ఎస్. హారిణి, భర్త : శ్రీ సుడియా కమల్ కుమార్, ఇందు ఎన్‌క్లేవ్, డి.నెం.45-58-17, నరసింహా నగర్, విశాఖపట్నం - 530024. బ్రాంచ్ ఆఫీస్ : ఎల్ఐసి బిల్డింగ్, విశాఖపట్నం. డిమాండ్ నోటీసు తేది.01-10-2024, ఈ అమ్మకం నోటీసు జారీ చేసిన ప్రకారం తేది.30.09.2024 నాటికి బకాయి రూ.74,53,226.36 పై (అక్షరాల డెబ్బై నాలుగు లక్షల యాభై మూడు వేల రెండు వందల ఇరవై ఆరు రూపాయల ముప్పై ఆరు పైసలు మాత్రమే) + తేది.01-10-2024 నుండి తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు వ్యయాలు (డిమాండ్ నోటీసు తరువాత ఏవైనా చెల్లింపు ఉన్న యెడల మినహాయించబడును). లాంఛనాత్మక స్వాధీనతా తేది : 03-02-2025.

సెక్యూరిటీ / ఆస్తుల వివరాలు మరియు ఆస్తుల యజమాని / తనఖా పెట్టిన వ్యక్తి పేరు	రిజర్వు ధర	బయానా (ఇఎమ్‌డి)
శ్రీ ఎస్. కమల్ కుమార్ గారి పేరున గల ఆస్తి: (ఎ) విశాఖపట్నం, లంకెలపాలెం, పరవాడ మండలం, రావాడ గ్రామం మరియు పంచాయితీ ఎస్.నెం.18 పార్ట్ వద్ద ఎ.0-60.8 సెంట్లు విస్తీర్ణం గల భూమి. సేల్ డీడ్ నెం.948/2016, తేది.28.03.2016 ప్రకారం హద్దులు: తూర్పు: యల్లపు రఘురామ్ (అమ్మకందారు) గారు సుడియా కమల్ కుమార్ (కొనుగోలుదారు) గారికి ఈరోజు అమ్మిన భూమి, దక్షిణం : ఇతరులకు చెందిన భూమి, పడమర : ఇతరులకు చెందిన భూమి, ఉత్తరం : గెడ్డ.	రూ. 191.52 లక్షలు	రూ. 19.15 లక్షలు
(బి) విశాఖపట్నం, లంకెలపాలెం, పరవాడ మండలం, రావాడ గ్రామం మరియు పంచాయితీ ఎస్.నెం.18 పార్ట్ వద్ద ఎ.0-39.2 సెంట్లు విస్తీర్ణం గల భూమి. సేల్ డీడ్ నెం.949/2016, తేది.28.03.2016 ప్రకారం హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం : ఇతరులకు చెందిన భూమి, పడమర : యల్లపు రఘురామ్ (అమ్మకందారు) గారు సుడియా కమల్ కుమార్ (కొనుగోలుదారు) గారికి ఈరోజు అమ్మిన భూమి, ఉత్తరం : గెడ్డ.	రూ. 123.48 లక్షలు	రూ. 12.35 లక్షలు

నియమ నిబంధనలు:
1. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును.
2. ఆస్తులను ‘ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై” విక్రయించబడతాయి.
3. అధీకృత అధికారి గారి వద్దగల పైన తెలిపిన షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారి సమాధానం తెలుపవలసిన అవసరం లేదు.
4. అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://BAANKNET.COM ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది.26.11.2025న ఉదయం 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు నిర్వహించబడును.
5. అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయజేసి https://BAANKNET.COM & www.pnbindia.in వెబ్‌సైటులు చూడవలెను.

SARFAESI చట్టం 2002 లోని రూలు 8(6) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

తేది : 10-11-2025, ప్రదేశం : విశాఖపట్నం   సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

కొండచిలువ కలకలం

గోపాలపట్నం(ఆర్.ఆర్.వి.పురం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో శనివారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. స్థానిక జనావాసాల మధ్యలోకి వచ్చింది. దీంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్నేక్‌క్యాచర్స్ మణికంఠ, జగదీశ్‌లు చాకచక్యంగా కొండచిలువను పట్టుకున్నారు. గాజువాక ప్రాంతానికి చెందిన స్నేక్‌సొసైటీకి అప్పగించారు.

సందర్శకులతో జూ కిటకిట

ఎండాడ, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. నెమలి నాట్యాలు.. చింపాంజీల వయ్యారాలు.. వ్యాఘ్రాల గాండ్రింపులు వింటూ సందర్శకులు సందడి చేశారు. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల వారు తరలి వచ్చారు. వన్యప్రాణులతో పలువురు ఫొటోలు, సెల్ఫీలు దిగారు. జూ కు 7865 మంది రాగా రూ.6.76 లక్షల ఆదాయం వచ్చినట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ పేర్కొన్నారు. సమీప కంబాల కొండ పార్కుకు 500 మంది రాగా రూ.45 వేల ఆదాయం వచ్చిందని రేంజ్ అధికారి శాస్త్రి తెలిపారు.

పాముల ఎన్‌క్లోజర్ వద్ద..

అప్పన్న కొండ.. భక్తులు నిండా..

సింహాచలం, న్యూస్‌టుడే: కార్తిక మాసం, వారాంతం నేపథ్యంలో సింహాద్రి అప్పన్న స్వామి కొండపై భక్తుల రద్దీ ఆదివారం కూడా కొనసాగింది. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు సింహగిరికి తరలివచ్చారు. భక్తుల రాకతో క్యూకాంప్లెక్సు, మాడవీధుల్లోని క్యూలైన్లు కిక్కిరిశాయి. కేశఖండనశాల, ప్రసాదాల విక్రయశాల, బస్టాండ్లు భక్తులతో రద్దీగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 30 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానానికి వివిధ రూపాల్లో రూ.31.71 లక్షల ఆదాయం సమకూరగా టికెట్ల విక్రయం ద్వారా 20.18 లక్షలు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.8.86 లక్షలు ఆదాయం వచ్చింది. సుమారు 2,200 మంది భక్తులు తలనీలాల మొక్కుబడి చెల్లించుకున్నారు. ఏఈవోలు తిరుమలేశ్వరరావు, రమణమూర్తి ఆధ్వర్యంలో దర్శనాలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : నగర పరిధిలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. పోర్టు రోడ్డులో నుంచి షీలానగర్ కూడలిలో బైకుపై వ్యక్తి మలుపు తిరుగుతుండగా గాజువాక నుంచి ఎన్ఏడీ వైపు వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనదారుడిని బలంగా ఢీకొంది. ప్రమాదంలో ఆ వ్యక్తి తల నుజ్జయిపోవడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. ఢీకొట్టిన లారీని ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోవడంతో పోలీసులు లారీని పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షీలానగర్ కూడలిలో ప్రమాద దృశ్యం

ఆనందపురం, న్యూస్‌టుడే: వేములవలస సర్వీస్ రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆనందపురం పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. వేములవలస ఎస్సీబీసీ కాలనీకి చెందిన ఉప్పాడ అప్పలరాము (46) ప్రైవేటుగా విద్యుత్తు సంబంధిత పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి వేములవలస చేపలమార్కెట్ దాటాక సర్వీస్‌రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. బలమైన గాయాలు కావడంతో వెంటనే 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన కుమార్తె భార్గవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసునాయుడు తెలిపారు.

తప్పు ఎవరిది.. బాధ్యులెవరు..!

నివేదికలో తేల్చని కేజీహెచ్ అధికారులు ❑ నిర్లక్ష్యంతోనే విద్యుత్తుకు అంతరాయం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో ఇటీవల విద్యుత్తు సరఫరా అంతరాయానికి బాధ్యులెవరన్నది ఇంత వరకు నిర్ధారణ కాలేదు. వైద్య విద్యా సంచాలకులు(డీఎంఈ) ఆదేశాల మేరకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ఆధ్వర్యంలో ఏర్పడిన కమిటీ తూతూమంత్రంగా నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించినట్లు సమాచారం. ఈ కమిటీలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర నాయుడు, పరిపాలన విభాగం వైద్యుడు డాక్టర్ కిరణ్ తదితరులు సభ్యులు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పటి నుంచి పునరుద్ధరణ అయ్యే వరకు వీరు అక్కడే ఉండి పర్యవేక్షించారు. ఆ సమయంలో గమనించిన అంశాల ఆధారంగా నివేదికను సిద్ధం చేసి డీఎంఈకు నివేదించినట్లు సమాచారం. అయితే ఎక్కడ తప్పిదం చోటు చేసుకుంది? దీనికి బాధ్యులెవరు? అనే అంశాల జోలికి మాత్రం పోలేదు. గోతులు తవ్విన గుత్తేదారుడిని హెచ్చరించామని, భవిష్యత్తులో ఇలా జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించామని నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం.

హెచ్‌టీ కేబుల్ సరిదిద్దే పనులు చేపడుతున్న కార్మికులు(పాతచిత్రం)

★ **సచివాలయాల ఇంజినీర్లతో పనులా:** ఇటీవల ఆసుపత్రిలో రూ.5 లక్షల లోపు జరిగే నిర్వహణ పనులను వార్డు సచివాలయాల ఇంజినీర్లకు అప్పగిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలోనే తాగునీటి పైపు మళ్లింపు పనులను ఈనెల 6న చేపట్టారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా శవాగారం వద్ద రోడ్డు తవ్వేయడంతో హెచ్‌టీ కేబుల్ తెగిపోయింది. దీంతో కేజీహెచ్‌కు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కేబుల్‌ను సరిచేసి విద్యుత్తును పునరుద్ధరించే సరికి సుమారు 10 గంటల సమయం పట్టింది. సరైన పర్యవేక్షణ లేకపోవడం, అవగాహన లేని వ్యక్తులకు పనులు అప్పగించిన ఫలితంగా ఈ ఘటన చోటుచేసుకుందని పలువురు చెబుతున్నారు. దీనికి కారణమైన బాధ్యులపై కేజీహెచ్ వైద్యాధికారులు చర్యలు తీసుకోకుండా తూతూమంత్రంగా నివేదిక రూపొందించి చేతులు దులిపేసుకున్నారనే విమర్శలొస్తున్నాయి.

★ **జనరేటర్ లేకపోయి ఉంటే..:** జనరేటర్ ఉన్నందున వెంటిలేటర్లపై చికిత్స పొందుతున్న రోగులకు ఏమీ జరగలేదు. ఆసుపత్రిలో విద్యుత్తు తీగలు భూగర్భంలో వెళతాయి. వీటిని ఆనుకొనే తాగునీటి సరఫరా, ఆక్సిజన్ సరఫరా లైన్లు ఉన్నాయి. ఎక్కడ ఏ మాత్రం అవాంతరం ఏర్పడినా రోగులు విలవిల్లాడాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ఆసుపత్రిలో నిర్వహణ పనులను అనుభవం కలిగిన అధికారుల పర్యవేక్షణలో చేపట్టాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

ఘనంగా అదివాస మహోత్సవం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం ఆరిపాక శివారు మణిపురంలో అదివాస మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భువనేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. తన స్వహస్తాలతో అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు ఎమ్మెల్యేను శాలువతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సబ్బవరం తెదేపా కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అభిషేకం చేస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఉత్సాహంగా సాగిన లిటరరీ ఫెస్ట్

పెదవాల్తేరు, ఆరిలోవ, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు హవామహల్‌లో రెండు రోజులుగా జరిగిన వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ ఆదివారం ముగిసింది. ఈ ఫెస్ట్‌లో 25 మంది వక్తలు, నిపుణులు వివిధ అంశాలపై వివరించారు. సుమారు 2 వేల మంది చిన్నారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెలెన్‌గ్రేడీ సంస్థ నుంచి వచ్చిన సభ్యులు వివిధ నాటకాలు ప్రదర్శించారు. పిల్లలకు చదివించే అలవాటు ఎలా నేర్పించాలనే విషయంపై అమెరికాకు చెందిన శోభా థరూర్, కార్టూన్ బొమ్మలు ఎలా వేయాలో బాబ్, బాబీ వివరించారు. భారత దేశంలో దొరికే పండ్లపై విక్రమ్ శ్రీధర్; ఓ కుటుంబం రైలులో ప్రయాణించినపుడు ఎదురైన ఘటనలపై దీప్నా కథల రూపంలో ఆకట్టుకునేలా చెప్పారు. కథలకు బొమ్మలు ఎలా గీయాలనే విషయంపై అజిత్ నారాయణ్, సైనికుల త్యాగాల గురించి జ్యోతి పాండే వివరించారు. ఫెస్ట్ డైరెక్టర్లు సంధ్యా గోదె, ప్రియ ఉప్పలపాటి, సోనల్ శారద తదితరులు పాల్గొన్నారు. ★ ఈ సందర్భంగా చినగదిలి సంతపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తయారు చేసిన స్టోన్ పేపర్ వెయిట్స్‌ను ఫెస్ట్ నిర్వాహకులకు బహుమతిగా అందజేసినట్లు ఉపాధ్యాయులు విజయభాను తెలిపారు.

కార్యక్రమంలో చిన్నారుల కోలాహలం

త్రైమాసిక సమావేశంలో 100 తీర్మానాలకు ఆమోదం

మధురవాడ, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రెండో అతి పెద్ద ట్రేడ్ యూనియన్‌గా కెనరాబ్యాంక్ అధికారుల సంఘం దేశవ్యాప్త గుర్తింపు పొందడంలో అధికారుల ఐక్యత, కృషి ప్రధానమని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్ అన్నారు. బీచ్ రోడ్డు రాడిసన్‌బ్లూ రిసార్టులో జరుగుతున్న సంబంధిత సంఘం 20వ త్రైవార్షిక సమావేశాల్లో భాగంగా రెండో రోజు పలు అంశాలపై విస్తృత చర్చలు కొనసాగాయి. ముఖ్యంగా బ్యాంకు అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితరాలపై 100 తీర్మానాలు ప్రవేశపెట్టి సభ్యులంతా కలిసి ఆమోదించారు. ఆయా తీర్మానాలపై బ్యాంకు యాజమాన్యంతో సమీక్షించి తీర్మానాలను సఫలీకృతం చేసేందుకు కృషి చేస్తానని ప్రధాన కార్యదర్శి రవికుమార్ వెల్లడించారు. సోమవారం జరగనున్న మూడో రోజు సమావేశంలో అసోసియేషన్ జాతీయ కార్యవర్గం ఎన్నిక నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి కెనరాబ్యాంక్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవికుమార్

‘స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం’

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా వైకాపా సిద్ధంగా ఉందని మాజీ మంత్రి, ఆ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. మద్దిలపాలెం వైకాపా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రతి నియోజకవర్గంలో ఈనెల 12వ తేదీన శాంతియుత ర్యాలీలు చేపట్టి స్థానిక రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ విశాఖ, విజయనగరం జిల్లాల అధ్యక్షులు కె.కె.రాజు, మజ్జి శ్రీనివాసరావు, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	108	105
లైవ్	135	125
డ్రెస్డ్	196	220
స్కిన్‌లెస్	223	230

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్ట్‌గేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్ట్‌గేజ్ లోన్, సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, ✆ 93969 99669.

REAL ESTATE

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

North East Corner House for Sale (Cellar+ G+1) Very Good Rental Property. Immediate Sale. Good Location ✆ 9885824528.

SUJATHANAGAR

వేపగుంట BRTS రోడ్డుకి అతి చేరువలో తక్కువ ధరకే Indp. హౌస్ & గ్రూప్ హౌస్‌లు 2BHK, 3BHK ఇళ్ళు అమ్మకమునకు కలదు. ✆ 8374373299.

PLOT FOR SALE

BHOGAPURAM

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లో స్విమ్మింగ్‌పూల్, క్లబ్‌హౌస్, బ్యాంక్‌లోన్ సదుపాయంతో VUDA అప్రూవల్ ప్లాట్లు అమ్మకం. ✆ 8686997700.

TO LET

KURMANNAPALEM

3BHK Spacious flat, fully furnished Acs, Beds, Fridge, close to K'palem main road. ✆ 9866182944

RAMATALKIES

1425 SFt, Pent House 3B/R, 4th Floor Lift, Car Parking with Cup Boards. Srinagar, Nr. Ramatakies, VSP. Cont: 9710947109.

COMMERCIAL

GENERAL

Looking for a individual House of 2000 Sft around Yendada for a Play School of Educational Institution. ✆ 8143143750.

SECOND SALE

మిదున్ ఏజన్సీ, కొనబడును: పాత A/Cలు, సెంట్రల్ A/Cలు, ఇన్వర్టర్, బ్యాటరీలు, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్స్, ఫర్నిచర్, ఆన్‌లైన్ UPSలు కొనబడును. Cont:6309745364

JOBS

Kotak Life Insurance (Life Advisor) NAD Branch, VSP Hiring Rtd./ VRS/ Employees of PSU/ Govt/ Pvt. Sector & also Educated Housewives. Sal: 20 K - 70 K. ✆ 8790189686.

Wanted Accountant Cum Computer Operator (Word, Excel, Internet, Speed Typing) to join immediately 8:30 AM to 6 PM 18K apx. WONWORLD SCHOOL, Behind Baba Bazar, Lawsonsbay, Pedawaltair. ✆ 8235123123.

AUTOCAD designer reputed interior Office seeks skilled AutoCAD designer (2D&3D) for our projects proficient in detailed working ✆9849332399.

Special Recruitment for Retired Persons to Work Marketing Support for Financial Growth M/F, Part/ Full Excellent Package for Suitable Candidates. Call: 9553021026, 7702999763.

Wanted Supervisor & Admin for Laxmi Exports, VSP Graduates & MBA, Good Communication Fluency English ✆ 9393422622.

Restaurant Waiter Jobs కొరకు బాయ్స్&గర్ల్స్ కావలెను. ఇంటర్వ్యూ: హోటల్ విన్సర్‌పార్క్, KGH ఎదుట,వైజాగ్. బాయ్స్‌కు వసతి భోజనం. 9849581868

అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, వైజాగ్‌లో పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్ కావలెను. నో టార్గెట్స్, జీతం: 18,000 to 25,000 + ఇన్సెంటివ్. Contact Cell: 70932 67891.

ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్ all (డిగ్రీ, B.Tech., Dip. & ITI) కావలెను. Sal:18-25k, Age 35లోపు, స్పాట్ జాయిన్. ✆ 7995439539.

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ:23000 టు 29000. వ: 18-35. ✆ 77309 58410.

SECURITY GUARDS

వైజాగ్, విజయనగరంలో పనికొరకు ఆఫీస్‌స్టాఫ్, ఫైర్‌మేన్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, గార్డ్సు (M/F), జీతం: 20వేలు, 36 వేలు, రూమ్, భోజనం. ✆ 6300071128.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 **మాస్ జాతర**
స్క్రీన్-2 **గర్ల్‌ఫ్రెండ్**

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు అమ్మవార్ల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు.

పెందుర్తి

నేడు తెదేపా కార్యకర్తల సమావేశం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల స్థాయి తెదేపా కార్యకర్తల సమావేశాన్ని గొర్లెవానిపాలెం తెదేపా కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు అనకాపల్లి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు, తెదేపా సీనియర్ నేత కన్నూరు వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెందుర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అందరూ ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు. ★ సమావేశం అనంతరం గండి బాబ్జీ ప్రజల నుంచి వచ్చే వివిధ సమస్యలపై వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సబ్బవరం న్యూస్‌టుడే: ?: సబ్బవరం సాయినగర్ కాలనీకి వెళ్లే దారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- టి.శేఖర్.** ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- వై.రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం**

వేపగుంట, న్యూస్‌టుడే: ?: కృష్ణరాయపురం 80 అడుగుల రహదారిలో కంకర తేలి గొయ్యి ఏర్పడడంతో ప్రమాదకరంగా మారింది. - రాజేశ్వరరావు. ✓: మరమ్మతులు చేయిస్తాం. - శంకర్రావు, జోన్-8 ఇన్‌ఛార్జి కమిషనర్.

గ్రామీణ దారులు.. తప్పని ప్రయాసలు

శ్రద్ధ చూపితే వేలాది మందికి ప్రయోజనం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి రెవెన్యూ మండలం గ్రామీణ, అర్బన్ ప్రాంతాల కలయిక. అర్బన్ కాలనీలు నివాసయోగ్యమైన ప్రాంతాలు కావడంతో నగర వాసులను ఆకర్షిస్తున్నాయి. దీంతో అర్బన్ కాలనీలు రోజురోజుకు అభివృద్ధి దిశగా దూసుకుపోతున్నాయి. అభివృద్ధికి నోచుకోని గ్రామీణ ప్రాంతాలు పాలకుల కరుణ కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే రహదారులను విస్తరించడంతో పాటు పాడైన దారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సరిపల్లి రోడ్డు దుస్థితి

సరిపల్లి - రాయవరపువానిపాలెం మార్గం ఛిద్రం..

పెందుర్తి మండలం సరిపల్లి - రాయవరపువానిపాలెం రహదారి పూర్తిగా ఛిద్రమైపోయింది. రాయవరపువానిపాలెం మీదుగా రాజయ్యపేట, గుర్రమ్మపాలెం గ్రామాలను అనుసంధానించే ఈ రహదారి సుమారు 3 కిలోమీటర్లు ఉంటుంది. అలాగే బొడ్డునాయుడుపాలెం, ముదపాకను అనుసంధానిస్తూ సుమారు 4 కిలోమీటర్లు ఉంటుంది. ఆయా గ్రామాల్లో సుమారు 12వేల మందికి పైగా జనాభా నివాసం ఉంటున్నారు. వీరంతా ఈ రహదారుల మీదుగా పెందుర్తి మండల కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది.

ప్రమాదాలకు నిలయంగా జుత్తాడ రహదారి

పెందుర్తి మండలం గుర్రమ్మపాలెం పంచాయతీ పరిధిలోని అక్కిరెడ్డిపాలెం కూడలి నుంచి జుత్తాడ ప్రాథమిక పాఠశాల వరకు సుమారు 2 కిలోమీటర్ల రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. దారంతా గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళ పలువురు ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. జుత్తాడ గ్రామం నుంచి పులగవానిపాలెం వెళ్లే రహదారి దుస్థితి ఇలానే ఉంది. ఈ మార్గాలు పెందుర్తి మండల కేంద్రాన్ని జుత్తాడ, ఎస్ఆర్.పురం, అడివివరం, సింహాచలం ప్రాంతాలను అనుసంధానించడంతో పాటు హనుమంతవాక మీదుగా నగరంలోకి వెళ్లే వెసులుబాటు కల్పిస్తాయి.

అధికారులు దృష్టి సారించాలి..

రాంపురం గ్రామం- పెదగాడి మార్గంలో సుమారు 2కిలోమీటర్లు గుంతలతో నిండిపోయింది. పెదగాడి - చింతగట్ల గ్రామానికి వెళ్లే రహదారి సగంలో నిలిచిపోయి సుమారు ఒక కిలోమీటరు మేర రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ రహదారులు అభివృద్ధి చేస్తే పెదగాడి గ్రామస్థులతో పాటు చింతగట్ల, జెర్రిపోతులపాలెం ప్రజలకు ఎంతో మేలు చేసినట్లవుతుంది. సుమారు 15వేల మంది జనాభాకు ఉపశమనం కలుగుతుంది. ప్రస్తుతం చింతగట్ల, జెర్రిపోతులపాలెం ప్రజలు అటు నరవ, ఇటు సబ్బవరం మీదుగా ప్రయాసకు ఓర్చి పది కిలోమీటర్లు పైగా ప్రయాణించి పెందుర్తి మండల కేంద్రానికి రావాల్సి వస్తోంది. పెదగాడి రహదారి పూర్తయితే ఆ దూరం సగానికి తగ్గిపోతుంది. అలాగే రవాణా సదుపాయం కూడా మెరుగవుతుంది. ఈ నేపథ్యంలో పాలకులు, అధికారులు ఆయా రహదారుల అభివృద్ధిపై దృష్టిసారించి బాగు చేసి మేలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

11 నుంచి శ్రీఅభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం కూడలిలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 11నుంచి 15 వరకు అయిదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవాలకు చెందిన గోడపత్రికను ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 11న గణపతిపూజ, రక్షాబంధనం, పంచగవ్య ప్రాసన, మండప దేవతా పూజలు, నీజారన మంత్ర పుష్పములు, 12న మనోన్యాసపూర్వక రుద్రాభిషేకం, చండి పారాయణం, శ్రీరుద్రచండీహోమాలు, 13న మహాసౌరహోమం, మహాపూర్ణాహుతి ఉంటుందన్నారు. ఈ నెల 14న శాంతి కల్యాణం, పరమశివ తాండవం, స్వామి వారి ఊరేగింపు, కోలాటం ప్రదర్శన, 15న స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మాదాసు శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ పచ్చికోరు రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి మడక రమేశ్‌నాయుడు, వాసుదేవరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం నుంచి పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ ఆదివారం మొగలిపురంలోని తన నివాసంలో పంపిణీ చేశారు. వైద్య సేవల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న అప్పలకొండకు రూ.48,350, దాసరి నాగరాజుకు రూ.30,000, దంగేటి నాగేశ్వరరావుకు రూ.43,887 చొప్పున మంజూరైన నగదును చెక్కు రూపంలో అందజేశారు. అదే విధంగా ప్రమాద బీమా కింద దుంగల లక్ష్మీకి మంజూరైన రూ.5లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో సబ్బవరం మండల తెదేపా అధ్యక్షుడు గండి ముత్యాలునాయుడు, గండి దేముడు, కె.గెడ్డయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ

స్పందనకు వందనం

శ్మశానవాటికలో శుభ్రతకు చర్యలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ శ్మశాన వాటికలో ఎట్టకేలకు పరిశుభ్రత పనులు చేపట్టారు. కొంతకాలంగా శ్మశానవాటిక లోపల, బయట పరిసరాల్లో పెద్దఎత్తున పిచ్చిమొక్కలు, తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతో దహన సంస్కారాల సమయంలో ఇబ్బంది పడేవారు. పార్కు నుంచి శ్మశాన వాటికకు వెళ్లే మార్గానికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి పోయాయి. ఈ మేరకు శ్మశానవాటిక పరిస్థితిపై 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. దీంతో సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్ స్పందించారు. పొక్లెయిన్‌తో శ్మశానవాటిక పరిసరాల్లోని పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ గేయం వారోత్సవాలు

వేపగుంట, న్యూస్‌టుడే : జాతీయ గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేపగుంట ఓపెన్ జిమ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పార్కులో వాకర్స్ అంతా కలిసి జాతీయ గేయాన్ని ఆలపించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగుర వేసి వందనం తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు బీ.ఎన్.కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాకర్స్ పాల్గొని గేయం ప్రత్యేకతలను వివరించారు. వారం రోజులు పాటు జాతీయ గేయం విశిష్టతను చర్చిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఓపెన్ జిమ్ పార్కులో జాతీయ గేయం ఆలపిస్తున్న వాకర్స్

తండ్రి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు

కోలా సత్యనారాయణ

పెందుర్తి, న్యూస్‌టుడే: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తండ్రి తిరిగి రాలేదని ఓ యువతి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి జీఎన్ ఎన్‌ఎయాఆర్‌ఎం కాలనీకి చెందిన కోలా సత్యనారాయణ (48) పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో ఆయన సక్రమంగా నడవలేరు, మాట్లాడలేరు. ఈ నెల 6న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆయన కుమార్తె పూజిత పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. దర్యాప్తు బాధ్యతలను హెచ్‌సీ సత్యనారాయణకు అప్పగించారు.

శిథిలావస్థకు చేరిన ట్యాంకు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధి జాలారిపేటలోని రక్షిత మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం నిధులు వెచ్చించి దశాబ్దాల క్రితం దీన్ని నిర్మించింది. అప్పటి నుంచి ట్యాంకుకు మరమ్మతు పనులు చేపట్టలేదు. దీంతో ప్రస్తుతం ట్యాంకు మెట్లు దెబ్బతిన్నాయి. ట్యాంకు పై నుంచి పెచ్చులూడి పడడంతో పాటు ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో బిక్కుబిక్కుమంటున్న పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ట్యాంకును తొలగించాలని పలుమార్లు అధికారులను కోరినా ప్రయోజనం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం నుంచి చోడవరం వెళ్లే రహదారి దారుణంగా మారింది. రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. రోడ్డుకు అంచుల్లో ప్రయాణం చేసే వారికి ముళ్లు గుచ్చుకొని ఇబ్బంది పడుతున్నారు. ఎదురుగా బారీ వాహనాలు వస్తే సమస్య ఇంకా తీవ్రంగా ఉంటుందని వాపోతున్నారు. రోడ్డు అంచులకు వెళ్లేందుకు పలువురు ఇష్టపడడం లేదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రతీ ఏడాది రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను ఆర్అండ్‌బీ అధికారులు తొలగించేవారు. కానీ ప్రస్తుతం తొలగించకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు వెంటనే దీనిపై చర్యలు తీసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైళ్లలో పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు వాల్తేరు రైల్వే పోలీసులు తెలిపారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఆపరేషన్‌లో భాగంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఐదుగురు బాలల్ని రక్షించినట్లు తెలిపారు. ఆర్పీఎఫ్ ఎస్సై కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో ఒక బృందం రైళ్లలో తనిఖీలు చేస్తున్న బృందాన్ని గుర్తించారు. విచారణ చేపట్టగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ జిల్లాలోని పలు గ్రామాల నుంచి చిన్నారులను డబ్బుతో ప్రలోభపెట్టి విశాఖ తీసుకొచ్చి జన్మభూమి, రత్నాచల్ రైళ్లలో భిక్షాటన చేయిస్తూ ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. వారి నుంచి కాపాడిన బాలలను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచి బాలల సంరక్షణ వసతి గృహానికి తరలించినట్లు తెలిపారు. కేసును పూర్తి దర్యాప్తు కోసం రాయ్‌పూర్‌లోని ఖరోరా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

చీమలపల్లి(పెందుర్తి), న్యూస్‌టుడే: డెంగ్యూ, మలేరియా, అంటు వ్యాధుల నివారణపై గోపాలపట్నం ఆదిత్య కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం చీమలపల్లి పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి గణపతిరావు ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొని పలు వీధుల్లో ర్యాలీ చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేశారు. వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మురుగునీరు శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకంతో వచ్చే అనర్థాలను వివరించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

జెర్రిపోతులపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: అనిల్‌నీరుకొండ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాన్ని జెర్రిపోతులపాలెంలో ఆదివారం ఏర్పాటు చేసింది. గ్రామ సర్పంచి మడక అప్పలరాజు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆసుపత్రి యాజమాన్యం కంటి, రక్తపోటు, మధుమేహం, ఈసీజీ వంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేసింది.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచి మడక అప్పలరాజు

కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్యాయత్నం

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ వాణిజ్యనగర్‌కు చెందిన గుల్లిపల్లి గణేశ్ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్నారు. ఆయన భార్య భాగ్యలక్ష్మీ (24) గృహిణి. కుటుంబ కలహాల కారణంగా తరచుగా భార్యాభర్తల మధ్య వాదులాట జరిగేది. అయితే ఆదివారం ఉదయం గణేశ్ బయటకు వెళ్లిపోయిన సమయంలో భాగ్యలక్ష్మీ ఇంటి తలుపులు వేసుకుని ఓ ద్రావణం తాగేసింది. ఎంతకూ తలుపులు తీయకపోవడంతో బంధువులు గణేశ్‌కు సమాచారం అందించారు. ఆయన 112ద్వారా పోలీసులకు విషయం తెలియజేశారు. ఈ మేరకు బ్లూకోల్ట్ కానిస్టేబుల్ వెంకటేశ్ సంఘటన ప్రాంతానికి చేరుకొని స్థానికుల సహకారంతో తలుపు గడియ విరగ్గొట్టి ఆమెను బయటకు తీసుకొచ్చారు. అనంతరం భర్త సాయంతో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని సీఐ తెలిపారు.

హద్దు మీరితే బైండోవర్లు తప్పవు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై భాస్కరరావు హెచ్చరించారు. ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే స్టేషన్ పరిధిలో 29మంది రౌడీషీటర్లపై ఒక్కొక్కరికీ రూ.5లక్షల చొప్పున బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రవర్తన మార్చుకోకుంటే మిగిలిన వారికి ఇదే పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు. పరివర్తనతో మెలిగి మంచిగా జీవించాలని సూచించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై భాస్కరరావు

వేడుకగా గౌరీ సేవా సంఘం వన భోజనాలు

అక్కిరెడ్డిపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి గౌరీ సేవా సంఘం వన భోజనాల కార్యక్రమం ఆదివారం పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెంలో ఘనంగా జరిగింది. సేవా సంఘం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, పెందుర్తి గౌరీ సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, గౌరీ సంఘం పెద్దలు బుద్ధా శివాజీ, వేగి దివాకర్, ఆళ్ల సత్యనారాయణ, శరగడం నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావును గజమాలతో సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

జాతీయ ఈత పోటీలకు ఎంపిక

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: బీచ్ రోడ్డు ఆక్వా స్విమ్మింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈత పోటీల్లో ఎంవీపీలోని ఎస్3 అరేనాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-14 బాలుర విభాగంలో యశ్మిత్ 50, 100, 200 మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో కాంస్యం, రజతం, స్వర్ణం. బాలికల విభాగంలో ఎస్.సమన్విత 50, 100, 200 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో కాంస్యం, రెండు రజతాలు, ధృతి 200 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్యం గెలిచారన్నారు. అండర్-17 బాలికల విభాగంలో జాహ్నవి 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజతం.. అండర్-19లో హిమశ్రీ 50, 100, 200 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో మూడు స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారన్నారు. వీరంతా వచ్చే నెల దిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు.

రుద్ర స్వరూపుడికి.. ఆరుద్ర నక్షత్ర అర్చనలు

శ్రమశక్తినగర్‌లో రామలింగేశ్వరుడికి జలాభిషేకం నిర్వహిస్తున్న పూజారులు

హరిహర క్షేత్రంలో కేదారేశ్వరుడికి అన్నాభిషేకం

పెందుర్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని రుద్రస్వరూపుడైన పరమేశ్వరుడికి ఆదివారం విశేష అర్చనలు, అభిషేకాలు వైభవోపేతంగా జరిగాయి. పెందుర్తి మండలంలోని పలు శివాలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆయా వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ★ జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ పోర్టు కాలనీలో కొలువైన పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి జలాభిషేకం నిర్వహించారు. భక్తులు జల కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. గర్భాలయ ప్రవేశ ద్వారం వద్ద తాత్కాలిక గోడ నిర్మించి పార్వతీ పరమేశ్వరులను జలాధివాసం చేశారు. ★ 97వ వార్డు సుజాతనగర్ హరిహర క్షేత్రంలోని కేదారేశ్వర స్వామి దేవాలయంలో కేదారేశ్వర స్వామికి అర్చకులు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. ★ 96వ వార్డు పెందుర్తి ప్రశాంతినగర్‌లోని స్వయంభూలింగాల మల్లికార్జున స్వామి ఆలయంలో శివపార్వతుల వార్షిక కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల తిరువీధి వేడుకగా నిర్వహించారు.

బాధిత బాలుడికి రూ.10లక్షల సాయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి నుంచి అగనంపూడికి చెందిన రిషిపాల్ అనే చిన్నారికి రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు. గాజువాక క్యాంపు కార్యాలయంలో బాలుడి తల్లిదండ్రులు కుమార్, సంగీతలకు చెక్కు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పసితనంలోనే పుట్టి చెముడుతో బాధపడుతున్న బాలుడికి కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని చెప్పారు. ఏపీఐఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, తెలుగుయువత జిల్లా కార్యదర్శి మొల్లి పెంటిరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ విశాఖ

విజేతలకు బహుమతులు అందిస్తున్న అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ఉన్నత పాఠశాలలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించిన పాఠశాలల క్రీడల సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో బాలబాలికల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో అన్ని రంగాల్లో ఛాంపియన్ షిప్ అవార్డు విశాఖ జిల్లాకు చెందిన క్రీడాకారులకే దక్కింది. రాష్ట్రం నుంచి బాలుర విభాగంలో 22 మంది, బాలికల విభాగంలో 22 మంది వచ్చేనెల మొదటి వారంలో ఇండోర్(మధ్యప్రదేశ్)లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు తవిటయ్య తెలిపారు.

రెండో రోజు విజేతలు..

డిస్కస్‌త్రో..: బాలుర విభాగంలో.. మల్లికార్జునరావు (గుంటూరు), రాజేశ్ (విశాఖపట్నం), రాజు (విశాఖపట్నం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

బాలికల విభాగంలో.. కె.నందిత (విశాఖపట్నం), కావ్య (శ్రీకాకుళం), యమునాసాయి (చిత్తూరు), **200మీ. పరుగు పందెం..: బాలికలు:** హాసిని (గుంటూరు), నిత్యసంతోషి (తూర్పు గోదావరి), ఉషశ్రీ సాయిదుర్గ (విశాఖపట్నం), **600మీ. పరుగు పందెం..: బాలురు:** కృష్ణమోహన్ దొర (విశాఖపట్నం), హారం (పశ్చిమ గోదావరి), శివప్రసాద్ (ప్రకాశం), **లాంగ్‌జంప్: బాలురు:** రాజేశ్ (విశాఖపట్నం), రంజిత్ (శ్రీకాకుళం), వికాస్ (విశాఖపట్నం), **బాలికలు:** విశాల బొమ్మరెడ్డి (విశాఖపట్నం), చంద్రకళ (విజయనగరం), వైష్ణవి (ప్రకాశం), **4×100 రిలే: బాలురు:** విశాఖపట్నం, కర్నూలు, కడప, **బాలికలు:** శ్రీకాకుళం, విశాఖపట్నం, కడప, **బాలికల, బాలుర జట్టు, వ్యక్తిగత, ఓవరాల్ ఛాంపియన్:** విశాఖపట్నం

నేలకొరిగిన భారీ చెట్టు

వేపగుంట, న్యూస్‌టుడే : జోనల్ కార్యాలయం వెనుక భారీ వేప చెట్టు ఆదివారం నేల కొరిగింది. ప్రమాద సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తుపాను సమయంలో చెట్టు బాగా కిందకు ఒరిగిందని... ఇప్పుడు పడిపోయిందని స్థానికులు చెబుతున్నారు. సీసీ రోడ్లు వేసే సమయంలో జీవీఎంసీ సిబ్బంది ఆ చెట్టు ఉన్న భాగాన్ని పూర్తిగా వదిలేసి రహదారిని నిర్మించిందని తెలిపారు. దీంతో రహదారి విస్తరణకు నోచుకోకపోవడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందన్నారు. పడిపోయిన చెట్టుని తొలగించి ఆ స్థలంలో సీసీ రోడ్డుని నిర్మించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

జోనల్ కార్యాలయం వెనుక రహదారిలో..

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న యలమంచిలి రాజేశ్, నిర్వాహకులు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి నమ్మిదొడ్డికూడలిలో ఆదివారం శ్రీ కృష్ణా యాదవ యువ జన సేవా సంఘం ఆధ్వర్యంలో యాదవ్స్ ప్రీమియర్ లీగ్ (వైపీఎల్-1) క్రికెట్ పోటీలు ప్రారంభించారు. జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడు యలమంచిలి రాజేశ్ చేతుల మీదుగా ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. మొత్తం 8 టీంలు ఈ పోటీలో పాల్గొంటాయాని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.35వేలు, రెండో బహుమతి రూ.20వేలు నగదు, జ్ఞాపికలు అందిస్తారన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి బెస్టు బ్యాట్స్‌మెన్, బౌలర్, క్యాచర్ తదితర అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు యలమంచిలి పైడిరాజు, ఈశ్వరపు వెంకటరావు, తాతాజీ, బంధం నరేశ్, బొట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

47 మంది రక్తదానం

సబ్బవరం, న్యూస్‌టుడే: జవానుగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన సబ్బవరం మండలం బాటజంగాలపాలెంకు చెందిన గొర్లి శంకర్ జయంతి సందర్భంగా గ్రామంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గొర్లి మణిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువత పాల్గొని రక్తదానం చేశారు. గాజువాక వందే భారత్ ఆసుపత్రి సిబ్బంది 47 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సర్పంచి పడాల వెంకటరమణ, కాపుశెట్టి వెంకట్, పందిరిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

సినిమాలు
చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గజేశ్- బైసన్
రామయ్య- బాహుబలి ది ఎపిక్
తాతా- కె-ర్యాంప్
సప్తగిరి- మాస్ జాతర

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



ఆనందపురం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పరుగుపందెం పోటీల్లో శర్మ పాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని రేగాని ప్రతిభ రజత పతకం సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బుత్తల సత్యం తెలిపారు. గ్రామ సర్పంచి శర్మ అప్పలనాయుడు, ఎంపీటీసీ మాజీ ఉపాధ్యక్షుడు బోని అప్పలనాయుడు, గ్రామ పెద్దలు కోరాడ గౌరి, బుర్ర వెంకటరమణ, గ్రామస్థులు ఆమెను అభినందించారు.

భీమిలి

ఆధ్యాత్మికతకు ప్రతీక కార్తిక వనభోజనం


మాట్లాడుతున్న నిష్కించన భక్తదాస

ఆనందపురం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా వనాల్లో సామూహికంగా భోజనం చేయడం మన సంప్రదాయమని హరేకృష్ణ మూవ్‌మెంట్ విశాఖ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ నిష్కించన భక్తదాస అన్నారు. ఆనంద గంభీర ఐపాం రోడ్డులోని శ్రీరాధామదనమోహన్ స్వామి ఆలయ ఆవరణలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కార్తిక వనభోజన మహోత్సవం ఘనంగా జరిగింది. వివిధ కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు, కృష్ణ భక్తులు సందడిగా గడిపారు. ఉపాసనలతో హరినామ సంకీర్తనలతో ఉల్లాసంగా సాగింది. రకరకాల వంటకాలతో భోజనాలు ఆరగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట వరకు

ఎండాడ, పద్మనాభం, న్యూస్‌టుడే:

?: బక్కన్నపాలెం(మధురవాడ)లో 33 కాలనీ పరిసరాల్లో వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నాం. – మూర్తి, కెకెఆర్ నగర్ ✓: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – గాయత్రి, విద్యుత్ ఏఈ

?: పీఎంపాలెం పరిధి జీవీఎంసీ లేఅవుట్ దగ్గర కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. – లేఅవుట్ వాసులు. ✓: కాలువల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. – సాయికుమార్, శానిటరీ అధికారి

?: వైఎస్సార్‌లేఅవుట్ (ఎండాడ) దారిలో విద్యుత్ పోలు మరమ్మతులకు గురయ్యాయి. – పోలిరాజు. ✓: వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. – సాయిరాం, విద్యుత్ ఏఈ

?: సాగర్‌నగర్ కూడలిలో ట్రాఫిక్ పోలీసులు లేక వాహనాలు నిలిచిపోతున్నాయి. – కృష్ణారావు, స్థానికుడు. ✓: ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. – ప్రభాకర్, ట్రాఫిక్ సీఐ

?: బక్కన్నపాలెం (మధురవాడ) నుంచి రేవళ్లపాలెం వెళ్లే మార్గం గతుకులమయంగా ఉంది. – రేవళ్లపాలెం వాసులు. ✓: క్షేత్రస్థాయిలో దృష్టి సారించి రోడ్డు నిర్మాణం చేస్తాం. – శ్రీనివాస్, ఏఈ

?: ఓజోన్ వ్యాలీ (మధురవాడ) రోడ్డు గుంతలమయంగా ఉంది. – శ్రీకాంత్ వర్మ, స్థానికుడు. ✓: నెల రోజుల్లో తారు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, ఏఈ

స్పందనకు వందనం

దీపాలు వెలిగాయి

ఎండాడ, న్యూస్‌టుడే: మధురవాడ పరిధి రేవళ్లపాలెం, బక్కన్నపాలెం పరిసర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక స్థానికులు నిత్యం అవస్థలు పడుతున్నారని 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఏఈ గాయత్రి విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపట్టారు.

వ్యర్థాలు తొలగించారు

ఎండాడ, న్యూస్‌టుడే: ముబారక్‌కాలనీ (ఎండాడ) ప్రధాన దారిలో వ్యర్థాలు పేరుకుపోయి పరిసరాలు అధ్వానంగా ఉన్నాయని 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి జేసీబీ సహాయంతో వ్యర్థాలు తొలగించారు.

మెట్టుమెట్టుకూ గండం.. నిర్లక్ష్యానికో దండం

సింహాచలం, న్యూస్‌టుడే: అప్పన్న స్వామి నీపై భక్తితో కొండమెట్టెక్కి వస్తున్నాం.. అడుగడుగునా పాదాల.. నాచుపట్టిన మెట్లపై గండాల దాటుకుని నిన్ను చూడాలని సాగుతున్నాం.. ఏ ఆపద దరి చేరకుండా చూసే బాధ్యత నీదే స్వామి.. అంటూ భక్తజనం ప్రమాదకరంగా ఉన్న సింహగిరి మెట్లను ఎక్కుతున్నారు. సింహాద్రినాథుడికి పలువురు భక్తులు మెట్లమార్గంలో వచ్చి దర్శించుకుంటామని, మెట్టు మెట్టుకు పసుపు కుంకుమలు పూస్తామని మొక్కుకుంటారు. కుటుంబాలతో సహా మెట్టెక్కి స్వామిని దర్శించుకుని మొక్కు తీర్చుకుంటారు. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న మెట్లమార్గంపై అధికార యంత్రాంగం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని భక్తులు ఆవేదన చెందుతున్నారు.

నాచుపట్టిన మెట్లపై వెళ్తున్న భక్తులు

జారిపోయేలా..

సింహగిరిపై చాకిధార సమీపం నుంచి ఆలయం వరకు మెట్లు నాచుపట్టాయి. చాకిధార వద్ద సుమారు మెట్లపై అడుగుల మేర మార్గం జారిపడేలా మారింది. వందలాదిగా మెట్లమార్గంలో రాకపోకలు సాగిస్తున్న భక్తులు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. వృద్ధులు, చిన్నారులు భయపడుతున్నారు. యాతన నాచును దాటుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దఎత్తున వరద మెట్లపై నుంచి ప్రవహించింది. ఇప్పటికీ మెట్లపై భూమిలోని నీరు ఉబికి వస్తోంది.

చాకిధార సమీపంలో ఇలా..

బండరాళ్లు.. పిచ్చిమొక్కలు..

కొండపై నుంచి దిగువ వరకు మెట్లమార్గానికి ఇరువైపులా పిచ్చిమొక్కలు భారీగా పెరిగిపోయాయి. వర్షాలకు మెట్లపైకి జారిన బండరాళ్లు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పోగుపడ్డాయి. పిచ్చిమొక్కల నుంచి తరచూ పాములు, కీటకాలు వస్తున్నాయని భక్తులు చెబుతున్నారు. మెట్ల వెంబడి కనీసం పారిశుద్ధ్యం నిర్వహించకపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. ఏదైనా ఉత్సవాలు జరిగేటప్పుడు తప్ప మిగిలిన రోజుల్లో మెట్లమార్గాన్ని పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. అనుకోని ఘటనలు జరగకముందే జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శిల్పారామంలో పర్యాటకుల సందడి

కొమ్మాది, న్యూస్‌టుడే: కార్తికమాసం మూడో ఆదివారం కావడంతో మధురవాడ శిల్పారామం (జాతర)లో సందడి నెలకొంది. పలు సామాజిక వర్గాలకు చెందిన సంఘాలు వన భోజనాలు, ఆటపాటలతో సందడి చేశారు. సామాజిక సంఘటిత శక్తిని చాటేలా పలు ప్రణాళికలు రచించుకుని రాజకీయ భవితరాలకు ఉపయుక్తంగా ఉండేలా నిర్ణయాలు తీసుకున్నారు. జోష్ డాన్స్ అకాడమీ చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మాట్లాడుతున్న సంఘం నిర్వాహకులు

బాలలకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి బీచ్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలలకు ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. గత ఆరు నెలలుగా శిక్షణ తీసుకున్న 25 మంది బాలలు భీమిలి బీచ్ వద్ద సంఘం చీఫ్ కోచ్ ముగడ వెంకటరమణ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఐదుగురికి గ్రీన్ బెల్టులు, ముగ్గురికి ఎల్లో బెల్టులు, ఇద్దరికి ఆరెంజ్ బెల్టులు, ఇద్దరికి బ్లూబెల్టులు, ఇద్దరికి బ్రౌన్ బెల్ట్‌లతో పాటు ప్రశంసాపత్రాలను అందించారు. త్వరలో విశాఖలో జరగనున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు వీరిని పంపుతున్నట్లు పేర్కొన్నారు.

కరాటే పోటీల్లో వివిధ బెల్టులు సాధించిన బాలబాలికలు

ఉత్సాహంగా కార్తిక వన సమారాధన

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి బీచ్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ పార్క్ గార్డెన్స్‌లో కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమం కో-ఆర్డినేటర్ మైలపల్లి షణ్ముఖరావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు ఎం.ఉపేంద్ర, విశ్రాంత ఎస్.ఐ. ఎస్.తాతారావు, విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ ఎం.మహేశ్వరరావు ఉద్యోగ అనుభవాలను పంచుకున్నారు. 70 ఏళ్లు దాటిన విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. ముఖ్య అతిథి సాగర్ సీనియర్ అసోసియేషన్ ఆఫ్ వార్డ్స్ (సా) అధ్యక్షుడు కె.మల్లికార్జునరావు హాజరయ్యారు. ఇతర నిర్వాహకులు కె.సూర్యారావు, జి.మరియదాస్, కె.వెంకటరావు, పి.పార్వతీశ్వరరావు, బి.జోగారావు పాల్గొన్నారు.

పాటలను ఆలపిస్తున్న డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యుడు ఎం.ఉపేంద్ర

సామాజిక భవనం నిర్మించాలని వినతి

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని ఎర్రమట్టి కాలనీలో ప్రజల సౌకర్యార్థం సామాజిక భవనం మంజూరు చేయాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. ఈ మేరకు ఆదివారం కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. గత 25 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ కాలనీలో 80 కుటుంబాలు నివాసముంటున్నాయన్నారు. శుభకార్యక్రమాలు చేసుకోవటానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు పీతల అప్పారావు, దాటియ్యిన శ్రీను, అల్లిపిల్లి వెంకటబాబు, వాసుపల్లి వీరబాబు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు విఘాతం

కొమ్మాది, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 'టాప్ ర్యాంక్'లో నిలవాలని ప్రకటనలు గుప్పిస్తున్నారే తప్ప కనీసం మరుగుదొడ్ల గురించి ప్రజా మరుగుదొడ్లను ఆధునికీకరించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. బహిరంగ, మల, మూత్ర విసర్జన లేకుండా చేయాలనే లక్ష్యంతో రూ. లక్షలు వెచ్చించి సామాజిక మరుగుదొడ్లను 2017లో నిర్మించారు. ప్రస్తుతం సరైన నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్ రహదారిలో గాంధీనగర్‌లో ఉన్న ప్రజామరుగుదొడ్డి ద్వారాలకు తలుపులు ఊడిపోయి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి మరుగుదొడ్లను ఆధునికీకరించాలని కోరుతున్నారు.

గాంధీనగర్ వద్ద తలుపులు పడి ఉన్న మరుగుదొడ్డి

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామంలో లేదా నగరంలో అనువైన ప్రాంతంలో రాత్రివేళ ఉద్యోగుల కోసం త్వరలో రాత్రి బజారును ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మధురవాడ దుర్గాకన్వెన్షన్ ప్రాంగణంలో కాంచవి ఆర్ట్స్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో చేనేత వస్త్ర హస్త కళా ప్రదర్శనను ఆదివారం ఏర్పాటు చేశారు. నెల రోజుల పాటు సాగే ఈ ప్రదర్శనను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14, 15 తేదీల్లో భాగస్వామ్య సదస్సుకు రానున్న దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలు ఈ ప్రదర్శనను తిలకించేలా ప్రచారం ముమ్మరంగా సాగించాలన్నారు. కార్యక్రమంలో 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, వెంకటరావు, తెదేపా రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణ రావు, గరే గురునాథ్, నిర్వాహకులు ఎం.డి. సలీమ్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఉత్పత్తులను తిలకిస్తున్న ఎమ్మెల్యే గంటా తదితరులు

నూతన సంఘం ఏర్పాటు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెంలో శ్రీ ఆంజనేయ పేరుతో చిరు వర్తకుల తోపుడుబండ్ల నూతన సంఘం ఆదివారం ఏర్పాటైంది. అనంతరం సీఐటీయూ నాయకులతో కలిసి సంఘం అధ్యక్షుడు ప్రకాశరావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి డి.కిషోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ నాయకులు డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్‌లు చిరు వర్తకుల చట్టాలు, సమస్యల పరిష్కారం, సమైక్య పోరాటాలు తదితరాలపై మాట్లాడారు. డిసెంబర్ 31 నుంచి వచ్చే ఏడాది 4 వరకు నగరంలో మొదటిసారి జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, చిరు వర్తకులు

టెన్నిస్ విజేతలకు ట్రోఫీల అందజేత

కొమ్మాది, న్యూస్‌టుడే: టెన్నిస్ క్రీడలో మెలకువలతో సాధన చేసి నైపుణ్యాలను పెంచుకుంటే మరింతగా రాణించగలరని అంతర్జాతీయ టెన్నిస్ కోచ్, ప్రో టెన్నిస్ కోచింగ్ బార్సిలోన వ్యవస్థాపకులు గుంజాలో లోపస్ ఫ్యాబిరో అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు సాయి ప్రియాగార్డెన్స్ లే-అవుట్‌లో ఉన్న మైల్‌స్టోన్ టెన్నిస్ అకాడమీని ఆదివారం సందర్శించారు. మెన్స్ అండర్-35 విభాగంలో జరిగిన టెన్నిస్ పోటీల్లో విజేతలైన నితీష్ జాక్సన్, మహేష్‌లకు ట్రోఫీలు అందజేశారు. అనంతరం కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కన్వీనర్ ఆరిమిల్లి నాగరాజు, డైరెక్టర్ రవిశ్రీ, హెడ్‌కోచ్ నగేష్‌రెడ్డి, శిక్షకులు చందు, రాజా, శివ తదితరులు పాల్గొన్నారు.

విజేతలను అభినందిస్తున్న కోచ్ గుంజాలో లోపస్ ఫ్యాబిరో

ప్లాస్టిక్ భూతం అంతమయ్యేదెన్నడో..!

కొమ్మాది, న్యూస్‌టుడే

పర్యావరణానికి విఘాతంగా పరిణమించిన ప్లాస్టిక్ నిషేధం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. యంత్రాంగం ప్రకటనలకే పరిమితమవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విశాఖను ప్లాస్టిక్‌రహిత నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ★ జోన్-2 పరిధిలో 5 నుంచి 13 వార్డుల్లో వాణిజ్య దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, పండ్లు, ఫలహార దుకాణాలు, మాంసం విక్రయదారులతో పాటు హోటల్స్‌లో పాలిథీన్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, ప్లేట్లు విరివిగా ఉపయోగిస్తున్నారు. వాడి పడేసిన సంచులు వీధుల్లో, శివారు కాలనీల ఖాళీ స్థలాల్లో కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి. ఆదివారం వారపు సంతలో సైతం కూరగాయల నుంచి కిరాణా సరకుల వరకూ ప్రతీది ప్లాస్టిక్ సంచుల ద్వారానే జరుగుతోంది. మాంసం, చేపల దుకాణాల్లోనూ వినియోగం జోరుగా సాగుతోంది.

జోన్-2లో అమలుకాని నిషేధం

మధురవాడ పై వంతెన సమీపంలో ప్లాస్టిక్ సంచుల వినియోగం ఇలా..

కొరవడిన పర్యవేక్షణ..

పర్యావరణానికి పెను భూతంగా మారిన ప్లాస్టిక్ నిషేధంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. వాడి పడేసిన సంచులు కాలువల్లో చేరి మురుగు ముందుకు కదలడం లేదు. దీనికి తోడు ప్లాస్టిక్ వ్యర్థాలను మూగజీవాలు తిని అనారోగ్యానికి గురవుతున్నాయి. గతంలో పని చేసిన అధికారుల బృందం కఠినంగా వ్యవహరిస్తూ ప్లాస్టిక్ రహిత జోన్-2గా తీర్చిదిద్దేందుకు కృషి చేశారు. అందరూ నారసంచులు వాడేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టేవారు. దుకాణాలపై నిఘా పెట్టి సంచులు స్వాధీనం చేసుకుని అపరాధ రుసుము వసూళ్లు చేసేవారు. అవగాహన కల్పించేవారు. అరటి, విస్తరాకులు, బాదం ఆకులు వినియోగించేలా చర్యలు తీసుకునేవారు.

అభినందన పత్రాలు అందిస్తూ..

గతంలో ప్లాస్టిక్ నిషేధానికి సహకరించే వ్యాపారులకు అభినందన పత్రాలు అందించి ప్రత్యేకంగా అభినందించేవారు. ప్లాస్టిక్ సంచులు వినియోగించే వారికి జరిమానా విధించి స్వాధీనం చేసుకునేవారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ కొనసాగకపోవడంతో యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం పెరుగుతోంది.

తప్పక అమలు చేస్తాం..

జోన్-2లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించేలా చర్యలు తీసుకుంటాం. రోజూ బృందాలుగా ఏర్పడి ఉదయం, సాయంత్రం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ప్లాస్టిక్ సంచులు వాడకుండా చూస్తాం. ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై ప్రచారం చేస్తాం. ఎవరైనా ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే 7729995934 నంబర్‌కు సమాచారమిస్తే చర్యలు తీసుకుంటాం. – కె. కనకమహాలక్ష్మి, జెడ్సీ, జోన్–2

బోటు నుంచి జారిపడిన మత్స్యకారుడు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: సముద్రంలో చేపలవేట ముగించుకుని తిరిగి ఒడ్డుకు వస్తుండగా బలమైన కెరటం ధాటికి బోటులో నుంచి జారిపడిన ఓ మత్స్యకారుడు అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఆ వివరాలిలా.. భీమిలి ఎగువపేటకు చెందిన అయిదుగురు మత్స్యకారులు ఆదివారం ఉదయం ఫైబర్ బోటు మీద సముద్రంలోకి చేపలవేటకు వెళ్లారు. సాయంత్రం ఒడ్డుకు తిరిగి వస్తుండగా బలమైన కెరటం బోటును తాకింది. అంచులో నిలబడి ఉన్న పుక్కళ్ల అమ్మోరు (28) తూలి నీటిలోకి పడ్డాడు. తోటి మత్స్యకారులు అతికష్టం మీద సముద్రంలో దిగి అమ్మోరును వెతికి ఒడ్డుకు చేర్చారు. అప్పటికే నీరు తాగి అపస్మారక స్థితిలో ఉన్నాడు. స్థానిక సీహెచ్‌సీలో చేర్పించి అనంతరం సంగివలసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి ఇంకా పెళ్లి కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని భీమిలి పోలీసులు తెలిపారు.

CHANGE OF MY DAUGHTER NAME

I, Datti Prasada Rao Father of **DATTI RAAGHNA** (Old name). Resident of Door No. 7-153/12/4, SF-1, Vijaya Arcade, Revallapalem Madhurawada, Visakhapatnam. Changed my name as **DATTI KALYANI GAYATRI RAAGNYA** (new name). Henceforth my daughter name is **DATTI KALYANI GAYATRI RAAGNYA.**

జూద శిబిరంపై దాడి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మారికవలస ప్రాంతంలోని మామిడి తోటలో జూద శిబిరంపై ఆదివారం దాడి చేసి నలుగురిని అరెస్టు చేశామని పీఎంపాలెం పోలీసు స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఇక్కడ జూద కార్యకలాపాలు జరుగుతున్నట్లు పక్కా సమాచారంతో సీఐ ఆదేశాల మేరకు ఎస్సై కె.భాస్కర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన నలుగురు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. వారిని అరెస్టు చేసి రూ.25,100 నగదు స్వాధీనపర్చుకున్నామని సీఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెంలో సాయిఆదిత్య ఉమెన్స్ క్లినిక్, జననీ ఫార్మసీ సంయుక్తంగా ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యనిపుణులు ఎం.యమున, డి.దుర్గాభవాని, పి.అనూష మధుమేహం, రక్త పరీక్షలు, గర్భకోశ, ఉదరవ్యాధి, దంత పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

యువకులను రక్షించిన మెరైన్ పోలీసులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: సముద్రంలో స్నానాలకు దిగిన ఇద్దరు యువకులు కెరటాలకు కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న మత్స్యకారులు ఈదుకుంటూ వెళ్లి రక్షించారు. పద్మనాభం మండలం వెంకటాపురానికి చెందిన కర్రి జశ్వంత్(13), కర్రి అజయ్‌కుమార్(14) తోటి స్నేహితులతో కలసి ఆదివారం భీమిలి సముద్ర తీరానికి వచ్చారు. అక్కడ సముద్రంలో స్నానాలు చేస్తుండగా కెరటాలకు లోపలకు కొట్టుకు పోతుండగా అక్కడే ఉన్న ఫొటోగ్రాఫర్ల వృత్తిలో ఉన్న మత్స్యకారులు రక్షించి మెరైన్ పోలీసులకు అప్పగించారు. వీరికి మెరైన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు.

రక్షించిన యువకులను వారి తల్లిదండ్రులకు అప్పగిస్తున్న మెరైన్ పోలీసులు

రుషికొండ బీచ్‌లో కౌన్సెలింగ్..

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సముద్ర ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా రుషికొండ బీచ్ పరిసరాల్లో ఆదివారం స్నానాలు చేస్తున్న పలువురి యువకులకు మెరైన్ సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్సై జి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. లైఫ్‌గార్డుల హెచ్చరికలు, అలల తీవ్రతను లెక్కచేయకుండా స్నానాలు చేస్తున్న క్రమంలో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు.

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు అమ్మవార్ల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం గ్రామంలో కొలువుదీరిన శ్రీ నారాయణేశ్వర స్వామి, పార్వతీ అమ్మవారి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. సామూహికంగా పాల్గొన్న దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూటమి నాయకులు సందీప్, టి.అప్పారావు, బీర్‌బీ నాయుడు, కర్రోతు సత్యనారాయణ, కె.సత్యమూర్తి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణంలో పాల్గొన్న దంపతులు

జాతరలో నృత్యాలు అదరహో

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర)లో ఆదివారం కళావేదికపై నగరానికి చెందిన నృత్య కళాంజలి చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆద్యంతం అదరహో అనిపించాయి. చిన్నారులు దేవిజ్ఞ, రాధ, రాధిక, శిరీష, సహస్ర, సౌమ్య తదితర చిన్నారులు వారి హావభావాలతో నర్తించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించాయి. పి.రమ్య దర్శకత్వం వహించారు. పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

రుషికొండ బీచ్‌కు సందర్శకుల తాకిడి

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: కార్తిక మాసం నేపథ్యంలో ఆదివారం రుషికొండ బీచ్‌కు అధిక సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పిల్లాపాపలతో విచ్చేసిన వీరు మత్స్యరాశుల పార్కు, బోటింగ్ కేంద్రం, అటవీభూములు వంటి ఆహ్లాదకర ప్రదేశాల్లో సంతోషాల నడుమ సహపంక్తి భోజనాలు ఆచరించారు. ఇసుక తిన్నెలపై సాగర సోయగాలుల్ని ఆస్వాదిస్తూ ఉత్సాహంగా గడిపారు. సముద్ర స్నానాలు చేసేవారిని లోపలికి వెళ్లరాదంటూ మెరైన్ పోలీసులు, ఏపీటీడీసీ బ్లూఫ్లాగ్ బీచ్, జీవీఎంసీ లైఫ్‌గార్డులు ప్రచారమాధ్యమాల ద్వారా అప్రమత్తం చేశారు.

తీరంలో సందర్శకుల కోలాహలం

హైడ్రోజన్ ఇంధనంతో విప్లవాత్మక మార్పులు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస అవంతి ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఏఐసీటీఈ-వీఏఏఎన్ఐ ఆధ్వర్యంలో హైడ్రోజన్ ఎనర్జీ సిస్టం-ఫ్యూయల్ సెల్ ప్రిన్సిపల్స్ అనే అంశంపై మూడ్రోజుల పాటు నిర్వహించనున్న జాతీయస్థాయి కార్యశాల ఆదివారం ప్రారంభమైంది. విశాఖ ఎన్ఎస్‌టీఎల్, వరంగల్ ఎన్ఐటీలకు చెందిన శాస్త్రవేత్తలు డా.జి.నాగశ్రీనివాసులు, డా.ఎం.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. గ్రీన్, గ్రే, బ్లూ హైడ్రోజన్ ఉత్పత్తిలో మరిన్ని పరిశోధనలు జరగాలన్నారు. అవంతి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, ప్రిన్సిపల్ డా.మురళీకృష్ణ, డైరెక్టర్ డా.చంద్రశేఖర్, కార్యశాల కన్వీనరు డా.షరీఫ్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు తదితరులు

భవన నిర్మాణ కార్మికుల సమావేశం

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: ఏఐటీయూసీ అనుబంధ చిట్టివలస లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం ఆదివారం జరిగింది. భవన నిర్మాణ సంఘం రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక చట్టాల పరిరక్షణకు ఈనెల 18న నగరంలోని పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్న ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలన్నారు. లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పడాల రమణ

బహిరంగ హెచ్చరిక

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నాక్లయింట్లు అయిన విశాఖపట్నం బస్తీ, దొండపర్తి, డోర్ నెం.46/13-52 కాపురస్తులైన తోనంగి లేటు అప్పలసూరి భార్య తోనంగి అప్పయ్యమ్మ మరియు ఈమె కుమారుడు సర్వంగరావు నాకు ఇచ్చిన భోగట్టాపై ఈ క్రింది బహిరంగ ప్రకటన జారీచేయడమైనది.

నా క్లయింట్లకు భీమునిపట్నం మండలం, సంగివలస సర్వే నెం. 25/6లో మూడు ప్రతులుగా మొత్తం 35 సెంట్లు విస్తీర్ణం గల జిరాయితీ మెట్టు భూమి కలదు. సదరు ఆస్తిని నా క్లయింట్లు వారి పూర్వీకుల కాలం నుండి సర్వహక్కులతో అనుభవించుచున్నారు.

ఇదిలా వుండగా భీమునిపట్నం మండలం, సంగివలస గ్రామానికి చెందిన చోడిపిల్లి గంగాధరరావు, వలందపేటకు చెందిన వంక పైడిరాజు తప్పుడు ప్రచారం చేస్తూ సదరు భూమిలో కొంత భాగాన్ని రియల్‌ఎస్టేట్ వ్యాపారస్థులకు దారిగా చూపిస్తూ దీనిని ప్రభుత్వ భూమిగా మార్పు చేయమని స్థానిక తహశీల్దారు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో లాలూచీ పడుతున్నట్లు తెలియవచ్చినది. ఈ విషయం తెలిసి నా క్లయింట్లతో పాటు ఇతర భూ యజమానులు కూడా పై వ్యక్తులకు ప్రభుత్వ అధికారులకు వ్యతిరేకంగా ధర్నా చేయడం జరిగింది.

అంతేకాకుండా నా క్లయింట్లు పైన పేర్కొన్న చోడిపిల్లి గంగాధరరావు మరియు వంక పైడిరాజులపై భీమునిపట్నం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో O.S.336/2025 దావా వేసియున్నారు.

కనుక పై వ్యక్తులుగాని, వేరెవరుగాని సదరు భూమిలోనికి ప్రవేశించినయెడల నాక్లయింట్లు తీసుకోబోయే చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని ఈ ప్రకటన మూలముగా హెచ్చరించడమైనది.

N. JANARDHANA RAO, ADVOCATE
9-75, Souris Nagar, Nerallavalasa Colony
BHEEMUNIPATNAM, VISAKHAPATNAM-531163
తేది: 09-11-2025 Cell: 8332889953

(c) eenadu

విశాఖ తూర్పు

కొట్లాటకు పాల్పడిన ఇరువర్గాలపై కేసులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఏయూలో రెండు వర్గాలకు చెందిన విద్యార్థులు కొట్లాటకు పాల్పడినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. బీపీఏ, ఫిలాసఫీ కోర్సులకు చెందిన కొందరు ఈనెల 9వ తేదీ రాత్రి మద్యం తాగి ఆ మత్తులో వాగ్వాదానికి దిగారు. తర్వాత కొట్లాటకు పాల్పడ్డారు. తర్వాత ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పైడయ్య పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం:	పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ:
ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య	8008574769
	మద్దిలపాలెం: 9912120229

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వెనుక భాగంలో రహదారిపై వ్యర్థాలు తరలించక దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. –మహేష్, మద్దిలపాలెం ✓: వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. –సత్యనారాయణ, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: 19వ వార్డు పరిధి లాసన్స్‌బే కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి ఈగలు, దోమల బెడద వెంటాడుతోంది. –కనకమ్మ, స్థానికులు ✓: రెండు రోజుల్లో సిబ్బందిని పంపి చెత్త తొలగిస్తాం. –శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 12వ వార్డు పరిధి గణబాబునగర్ ప్రధాన రహదారిలోని భూగర్భ మురుగు కాలువ మ్యాన్‌హోల్ మూతలు దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. –కె.గోవిందరావు, గణబాబునగర్ ✓: పాడైన మ్యాన్‌హోల్ మూతలకు వెంటనే మరమ్మతులు చేయిస్తాం. –కె.శ్రీనివాసరావు, ఏఈ, యూజీడీ ఇన్‌ఛార్జి

శివాజీపాలెంలో సమస్యల తిష్ఠ

శివాజీపాలెం (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 20, 22 వార్డుల పరిధిలో సమస్యలు రాజ్యమేలడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా శివాజీపాలెం చినపోలమాంబ ఆలయ పరిసరాలు, ఆరు కుళాయిల వీధి సమీప ప్రాంతాల్లోని రహదారులను తాగునీటి పైపులైన్ల కోసం ధ్వంసం చేశారు. పనులు పూర్తయ్యాక గోతులను అసంపూర్తిగా వదిలేయడంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

★ డాక్టర్స్‌కాలనీ ప్రాంతంలో ఎక్కడిక్కడ వ్యర్థాలు పేరుకుపోవడంతో వీధులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. రామరాజునగర్ పార్కుకు నాలుగు వైపులా రోడ్లపై పడిన చెట్ల కొమ్మలు తరలించడం లేదు. ఇదే పార్కులో విద్యుత్తు దీపాలు పనిచేయడం లేదని స్థానికులు పేర్కొన్నారు.

★ ఇటీవల మొంథా తుపాను కారణంగా రామలక్ష్మీ అపార్టుమెంట్ ఏరియా, శివాజీపాలెం ప్రాంతాల్లో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలను తరలించకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

★ శివాజీపాలెం, ఆరుకుళాయిల వీధి, చినపోలమాంబ ఆలయం, రామరాజునగర్ ప్రాంతాల్లో వీధి దీపాలు మొరాయించాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితోపాటు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద అధికంగా ఉందని ఆయా ప్రాంతాల మహిళలు వాపోతున్నారు.

★ శివాజీపాలెం, పీతలవానిపాలెం, చినపోలమాంబ ఆలయ మార్గంలోని బోరుబావులు పనిచేయడం లేదు. వీటి వల్ల జీవీఎంసీ సరఫరా చేసే తాగునీటిపైనే చాలా మంది ఆధారపడుతున్నారు.

★ నౌకానగర్ ప్రాంతం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రాంతంలో చెట్ల కొమ్మలు నేలకొరిగి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ శివాజీపార్కు రహదారి, కృష్ణుడి ఆలయం, డాక్టర్స్‌కాలనీ ప్రాంతాల్లో కుక్కల బెడద వెంటాడుతోందని కాలనీవాసులు అంటున్నారు. రామలక్ష్మీ అపార్టుమెంట్ నుంచి రామరాజునగర్ పార్కుకు వెళ్లే మార్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఆయా ప్రాంతాలకు చెందిన వారు అంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి సంబంధిత సమస్యల పరిష్కారానికి

– చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చినపోలమాంబ ఆలయ సమీపంలోని ఓ వీధిలో రహదారి దుస్థితి

డాక్టర్స్‌కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలు

నడకతో సత్ఫలితాలెన్నో..

సన్మానం పొందిన అతిథులతో సీషోర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తిరుపతిరావు తదితరులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు వుడా పార్కులో ఆదివారం సీషోర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'నడకతో ఆరోగ్యం' అన్న అంశంపై సమావేశం నిర్వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి నడక ద్వారా ఏయే ప్రయోజనాలు పొందవచ్చో వివరించారు. ఈ సందర్భంగా సభ్యుల్లో ఇటీవల వివాహం చేసుకున్న వారిని, అతిథులను ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, కోశాధికారి భీమారావు, సీనియర్ సిటిజన్లు డాక్టర్ పెదసోములు, గుత్తేదారు ఎం.వెంకటరావు, వి.కన్వెన్షన్ సెంటర్ అధినేత పి.వి.జి.కె.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 4న వన సమారాధన

సమావేశంలో మాట్లాడుతున్న అప్పారి గిరిబాబు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విశాఖలోని గీత సామాజికవర్గ ఉపకులాల ముఖ్యనేతల సమావేశం వెంకోజీపాలెంలోని వుడా కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శెట్టిబలిజ సంఘం సభ్యులు అప్పారి గిరిబాబు మాట్లాడుతూ జనవరి 4న గీత సామాజికవర్గ వన సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సంబంధిత నాయకులంతా విజయవంతం చేయాలని కోరారు. వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ, సంపంగి శ్రీనివాస్, కె.మల్లేశ్వరరావు, పి.జయరాం తదితరులు పాల్గొన్నారు.

16వ వార్డు తెదేపా నూతన కమిటీ ఏర్పాటు

ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నూతన కమిటీ సభ్యులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు జీవీఎంసీ 16వ వార్డు తెదేపా నూతన కమిటీ ఏర్పడింది. ఈ మేరకు భానునగర్‌లో ఆదివారం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వార్డు అధ్యక్షుడుగా ముగడ వాసు, కార్యదర్శిగా కోట్ల శ్రీను, వైస్‌ప్రెసిడెంట్‌గా భరత్‌కుమార్, యువత అధ్యక్షుడిగా ఎం.అప్పారావు, కార్యదర్శిగా ఉదయ్‌కుమార్ ఎంపికయ్యారు. వీరితోపాటు ఎస్సీ, బీసీ సెల్ కమిటీల సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు వీరంతా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొట్టా వెంకటరమణ, బుగత సత్యనారాయణ, పల్లా ఉమారాణి, ఎం.రవి, శోభ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఓ కార్మికుడు విద్యుదాఘాతానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. కొమ్మాదిలో నివాసముంటున్న నడగట్ల నాగరాజు(49) ఈనెల 7వ తేదీన ఎంవీపీ సెక్టార్-4లోని ఓ భవన నిర్మాణ పనికి వెళ్లారు. అక్కడ పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై పైనుంచి కింద పడ్డారు. అతడిని విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 9వ తేదీ ఉదయం మృతి చెందారు. దీనిపై మృతుడి కుటుంబీకుల నుంచి అందిన సమాచారం మేరకు సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. మృతుడి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా రణస్థలం. ఉపాధి కోసం కొన్నేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో నగరానికి వచ్చి ఇక్కడ జీవనం సాగిస్తున్నారు.

మహిళలపై హింసకు పాల్పడితే కఠిన చర్యలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: మహిళలపై ఎవరైనా హింసకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని మహిళా, శిశు సంక్షేమ వన్‌స్టాప్ సెంటర్ పరిపాలనాధికారిణి శరణ్య అన్నారు. మహారాణిపేటలోని ఏయూ మహిళా వసతిగృహంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆమె విద్యార్థినుల భద్రతా చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య ఎస్.హరనాథ్, ఏయూ మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది, వసతిగృహ విద్యార్థులు పాల్గొన్నారు.

బోటు నుంచి జారిపడిన మత్స్యకారుడు

భీమునిపట్నం: సముద్రంలో చేపలవేట ముగించుకుని తిరిగి ఒడ్డుకు వస్తుండగా బలమైన కెరటం దాటికి బోటులో నుంచి జారిపడిన ఓ మత్స్యకారుడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆ వివరాలిలా.. భీమిలి ఎగువపేటకు చెందిన ఆరుగురు మత్స్యకారులు ఆదివారం ఉదయం ఫైబర్ బోటు మీద సముద్రంలోకి చేపలవేటకు వెళ్లారు. సాయంత్రం ఒడ్డుకు తిరిగి వస్తుండగా బలమైన కెరటం దాటికి బోటు తిరగబడింది. అందులో నిలబడి ఉన్న పుక్కళ్ల అమ్మోరు (28) తూలి నీటిలోకి పడ్డాడు. తోటి మత్స్యకారులు అతికష్టం మీద సముద్రంలో దిగి అమ్మోరును వెతికి ఒడ్డుకు చేర్చారు. అప్పటికే నీరు తాగి అపస్మారక స్థితిలో ఉన్నాడు. స్థానిక సీహెచ్‌సీలో చేర్పించి అనంతరం సంగివలసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి ఇంకా పెళ్లి కాలేదు.

పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరిపై కేసు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైళ్లలో పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు వాల్తేర్ రైల్వే పోలీసులు తెలిపారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఆపరేషన్‌లో భాగంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఐదుగురు బాలల్ని రక్షించినట్లు తెలిపారు. ఆర్పీఎఫ్ ఎస్సై కీర్తి రెడ్డి ఆధ్వర్యంలో ఒక బృందం రైళ్లలో భిక్షాటన చేస్తున్న బృందాన్ని గుర్తించారు. విచారణ చేపట్టగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పుర్ జిల్లాలోని పలు గ్రామాల నుంచి డబ్బుతో ప్రలోభపెట్టి చిన్నారులను విశాఖకు తీసుకొచ్చి జన్మభూమి, రత్నాచల్ రైళ్లలో భిక్షాటన చేయిస్తూ ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. వారి నుంచి కాపాడిన బాలలను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచి బాలల సంరక్షణ వసతి గృహానికి తరలించినట్లు తెలిపారు. కేసును పూర్తి దర్యాప్తు కోసం రాయ్‌పుర్‌లోని ఖరోరా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

ప్రకృతి ఆధారిత పంటలతో ప్రజారోగ్యానికి మేలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో ప్రతి ఒక్కరూ తప్పకుండా ఉసిరిక మొక్క నాటి పెంచాలని గో ఆధారిత ప్రకృతి రైతుల సంఘం విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆ హబ్‌లో ఆదివారం విద్యార్థులతో ఉసిరిక మొక్క నాటించారు. ప్రకృతి ఆధారిత పంటలు పండించి ప్రజల ఆరోగ్యానికి సహాయం పడాలన్నారు. ఆ హబ్‌లో నిర్వహించిన ప్రత్యేక ఆధారిత సంతలో ప్రకృతి ఆధారిత బియ్యం, పప్పులు, కూరగాయలు, నూనెలు, బెల్లం, ఖాదీ చేనేత వస్త్రాలు విక్రయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి అశోక్, గ్రీన్ క్లైమేట్ బృందం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో మొక్క నాటుతున్న అతిథులు, విద్యార్థినులు

19 నుంచి పుట్టపర్తికి ప్రత్యేక సర్వీసులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయిబాబా జయంత్యుత్సవాల సందర్భంగా అనంతపురం జిల్లా పుట్టపర్తికి ఈనెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆర్.ఎం. బి.అప్పలనాయుడు తెలిపారు. ద్వారకా బస్‌స్టేషన్ వద్ద ఆదివారం జెండా ఊపి పంచారామాలకు సూపర్‌లగ్జరీ, ఇంద్ర ఏసీ సర్వీసులను పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శబరిమల యాత్రకు సైతం ఆర్టీసీ సర్వీసులు నడపడానికి సిద్ధంగా ఉన్నామని, ఆన్‌లైన్‌లో అయ్యప్ప భక్తులు టికెట్లు తీసుకోవచ్చని, బృందంగా ముందుకొచ్చి ఆర్టీసీ అధికారులను సంప్రదిస్తే ప్రత్యేకంగా బస్సు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు.

పంచారామాలకు సిద్ధం చేసిన బస్సుల వద్ద ప్రయాణికులు

జాతీయ స్థాయి ఈత పోటీలకు ఎంపిక

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: బీచ్ రోడ్డు ఆక్వా స్విమ్మింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈత పోటీల్లో ఎంవీపీలోని ఎస్3 అరేనాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-14 బాలుర విభాగంలో యశ్విత్ 50, 100, 200 మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో కాంస్యం, రజతం, స్వర్ణం.. బాలికల విభాగంలో ఎస్.సమన్విత 50, 100, 200 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో కాంస్యం, రెండు రజతాలు.. ధ్రుతి 200 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్యం గెలిచారన్నారు. అండర్-17 బాలికల విభాగంలో జ్ఞానశ్రీ 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజతం.. అండర్-19లో హిమశ్రీ 50, 100, 200 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో మూడు స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారన్నారు. వీరంతా వచ్చే నెల దిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు.

యువకులను రక్షించిన మెరైన్ పోలీసులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: సముద్రంలో స్నానాలకు దిగిన ఇద్దరు యువకులు కెరటాలకు కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న మత్స్యకారులు ఈదుకుంటూ వెళ్లి రక్షించారు. పద్మనాభం మండలం వెంకటాపురానికి చెందిన కర్రి జశ్వంత్(13), కర్రి అజయ్‌కుమార్(14) తోటి స్నేహితులతో కలసి ఆదివారం భీమిలి సముద్ర తీరానికి వచ్చారు. అక్కడ సముద్రంలో స్నానాలు చేస్తుండగా కెరటాలకు లోపలకు కొట్టుకు పోతుండగా అక్కడే ఉన్న ఫొటోగ్రాఫర్ల వృత్తిలో ఉన్న మత్స్యకారులు రక్షించి మెరైన్ పోలీసులకు అప్పగించారు. వీరికి మెరైన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు.

రక్షించిన యువకులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న మెరైన్ పోలీసులు

రుషికొండ బీచ్‌లో కౌన్సెలింగ్..

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సముద్ర ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా రుషికొండ బీచ్ పరిసరాల్లో ఆదివారం స్నానాలు చేస్తున్న పలువురి యువకులకు మెరైన్ సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్సై జి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. లైఫ్‌గార్డుల హెచ్చరికలు, అలల తీవ్రతను లెక్కచేయకుండా స్నానాలు చేస్తున్న క్రమంలో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు.

స్కూబా డైవింగ్ కోర్సులో శిక్షణ

సీతంపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 105 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, సీనియర్ డివిజన్ బాలురు, 25 మంది సీనియర్ వింగ్ బాలికలకు నగరంలోని బుల్లయ్య కళాశాల ఆధ్వర్యంలో స్కూబా డైవింగ్ అడ్వెంచర్ కోర్సులో గత వారం రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం బీచ్‌లో కోర్సు కమాండర్ ఎ.నరసింహారావు ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. కోర్సు ప్రారంభానికి ముందు క్యాడెట్లకు ఐఎన్ఎస్ విరభు వద్ద ప్రీ-డైవింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ కోర్సు క్రమశిక్షణ విలువలను నేర్పిస్తుందని బుల్లయ్య కళాశాల ఎన్‌సీసీ అధికారి లక్ష్మణబాబు తెలిపారు.

డైవింగ్‌కు సిద్ధమవుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

బీచ్‌లో పరుగు సాధన చేస్తూ..

సేవలకు గుర్తింపు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: అతిథి అధ్యాపకుడుగా ఏయూలో విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్‌పై బోధిస్తున్న డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ అమెరికాలోని ఈ క్యూ ఫర్ పీస్ స్వచ్ఛంద సంస్థకు వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు సంబంధిత సంస్థ అధ్యక్షుడు ఆచార్య మాట్ ఫెరెల్ స్టెయిన్ ఆదివారం అధికారికంగా వెల్లడించినట్లు అభిషేక్ పేర్కొన్నారు. కోపం లేని జీవనం, ఆనందం తదితర వాటిపై ప్రోత్సహించడానికి సంబంధిత సంస్థ అంతర్జాతీయ స్థాయిలో కృషి చేస్తోందని ఆయన తెలిపారు.

మాట్ ఫెరెల్ స్టెయిన్‌తో చల్లా కృష్ణవీర్ అభిషేక్

బాధిత బాలుడికి రూ.10లక్షల సాయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి నుంచి అగనంపూడికి చెందిన రిషిపాల్ అనే చిన్నారికి రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు. గాజువాక క్యాంపు కార్యాలయంలో బాలుడి తల్లిదండ్రులు కుమార్, సంగీతలకు చెక్కు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పసితనంలోనే పుట్టి చెముడుతో బాధపడుతున్న బాలుడికి కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని చెప్పారు. ఏపీఐఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, తెలుగుయువత జిల్లా కార్యదర్శి మొల్లి పెంటిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ విశాఖ

విజేతలకు బహుమతులు అందిస్తున్న అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ఉన్నత పాఠశాలలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించిన పాఠశాలల క్రీడల సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో బాలబాలికల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో అన్ని రంగాల్లో ఛాంపియన్‌షిప్ అవార్డు విశాఖ జిల్లాకు చెందిన క్రీడాకారులకే దక్కింది. రాష్ట్రం నుంచి బాలుర విభాగంలో 22 మంది, బాలికల విభాగంలో 22 మంది వచ్చేనెల మొదటి వారంలో ఇండోర్(మధ్యప్రదేశ్)లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు తవిటయ్య తెలిపారు.

రెండో రోజు విజేతలు..

డిస్కస్‌త్రో..: బాలుర విభాగంలో.. మల్లికార్జునరావు (గుంటూరు), రాజేష్ (విశాఖపట్నం), రాజు (విశాఖపట్నం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

బాలికల విభాగంలో.. కె.నందిత (విశాఖపట్నం), కావ్య (శ్రీకాకుళం), యమునాసాయి (చిత్తూరు), **200మీ. పరుగు పందెం..: బాలికలు:** హాసిని (గుంటూరు), నిత్యసంతోషి (తూర్పు గోదావరి), ఉషశ్రీ సాయిదుర్గ (విశాఖపట్నం), **600మీ. పరుగు పందెం..: బాలురు:** కృష్ణమోహన్ దొర (విశాఖపట్నం), హారం (పశ్చిమ గోదావరి), శివప్రసాద్ (ప్రకాశం), **లాంగ్‌జంప్: బాలురు:** రాజేష్ (విశాఖపట్నం), రంజిత్ (శ్రీకాకుళం), వికాస్ (విశాఖపట్నం), **బాలికలు:** విశాల బొమ్మరెడ్డి (విశాఖపట్నం), చంద్రకళ (విజయనగరం), వైష్ణవి (ప్రకాశం), **4×100 రిలే: బాలురు:** విశాఖపట్నం, కర్నూలు, కడప, **బాలికలు:** శ్రీకాకుళం, విశాఖపట్నం, కడప, **బాలికల, బాలుర జట్టు, వ్యక్తిగత, ఓవరాల్ ఛాంపియన్:** విశాఖపట్నం

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన


స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు అమ్మవార్ల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం

కల్యాణంలో పాల్గొన్న దంపతులు

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం గ్రామంలో కొలువుదీరిన శ్రీ నారాయణేశ్వర స్వామి, పార్వతీ అమ్మవారి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. సామూహికంగా పాల్గొన్న దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూటమి నాయకులు సందీప్, టి.అప్పారావు, బీర్‌బీ నాయుడు, కర్రోతు సత్యనారాయణ, కె.సత్యమూర్తి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కైలాస్‌నగర్‌లో అన్నదానం

ఆరిలోవ, న్యూస్‌టుడే: 11వ వార్డు పరిధి కైలాసనగర్ గౌరీ శంకరుల ఆలయ ప్రాంగణంలో కార్తికమాసం సందర్భంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు, దీపారాధన నిర్వహించామని; మధ్యాహ్నం స్వామికి భోగం సమర్పించాక కాకి గంగరాజు తదితరుల ఆర్థిక సహాయంతో అన్నప్రసాద వితరణ చేపట్టినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బర్రి సూర్యనారాయణ తెలిపారు. వార్డు కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు వడ్డిస్తున్న స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు

జాతీయ చెస్ పోటీలకు ఎంపిక

సీతానగరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి చదరంగం క్రీడా పోటీల్లో అనంతపురం జిల్లా బాలబాలికలు సత్తా చాటారు. అండర్-19 విభాగంలో బృంద పోటీల్లో అనంతపురం బాలురు, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. సీతానగరం మండలం జోగింపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలోని మినీ ఆడిటోరియంలో ఆదివారం పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. వ్యక్తిగత, జట్ల విజేతలకు తహసీల్దారు ప్రసన్నకుమార్, ఎంపీడీవో వెంకటరావు, ఎంఈవోలు సూరిదేముడు, వెంకటరమణ, స్వచ్ఛాంధ్ర బోర్డు డైరెక్టరు బి.లక్ష్మణరావుల చేతుల మీదుగా పతకాలు అందజేశారు. అండర్-14, 17, 19 వ్యక్తిగత విభాగాల్లో బాలికలు 15 మంది, బాలురు 15 మంది జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.మురళి తెలిపారు.

జాతీయ స్థాయికి అర్హత సాధించిన వారు: అండర్-14 **బాలికలు:** ఎన్.హెమిష(విశాఖ), బి.కమలప్రియ(విశాఖ), **బాలురు:** కె.వినాయక్(విశాఖ) **అండర్-17: బాలికలు:** బి.లక్ష్మీప్రియ(విశాఖ), ఎం.మానసి(విశాఖ) **బాలురు:** జె.కార్తీక్(విశాఖ), సీహెచ్.తనీష్(విశాఖ)

నేటి పీజీఆర్ఎస్ రద్దు

కార్పొరేషన్: జీవీఎంసీ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో ప్రతి వారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం జరగదని కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. అధికారులంతా భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నందున సంబంధిత కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా కేబుల్ తీగలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రామ్‌నగర్‌లోని రహదారులపై చాలా స్తంభాలకు కేబుల్ వైర్లు ప్రమాదకరంగా, గుట్టలుగా వేలాడుతున్నాయి. వీటి కారణంగా ఆయా మార్గాల్లో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నెహ్రూ నగర్ పార్కు పరిసరాల్లోని స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లతో మరింతగా ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి వేళ ఇవి తగిలి ప్రమాదాలు జరగవచ్చునని ఇంటి ముందు స్తంభాలున్నవారు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వేర్వేరు చోట్ల 'కార్తిక' సందడి

ఆరిలోవ, న్యూస్‌టుడే: ముడసర్లోవ ఉద్యానవనంలో ఆదివారం సీతమ్మధార శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. సినీ సంగీత గాయకులు కె.రమేష్ కుమార్ ప్రార్థనా గీతంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉదయం బంధు, మిత్రుల పరిచయ కార్యక్రమాలు, పిల్లల ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం భోజనాల తరువాత వివిధ పోటీల్లో పాల్గొన్న వారికి, విజేతలకు బహుమతులు అందజేశారు. సుమారు 250 కుటుంబాలకు చెందిన వారంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మానవహక్కుల కౌన్సిల్ అధ్యక్షులు ఎం.శ్యామ్‌ప్రసాద్, సంఘం ప్రతినిధులు జి.గౌరీప్రభాకర్ దాస్, కె.రామశంకరరావు, కె.కరుణకుమార్, జి.ప్రేమకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు ఎంజీఎం పార్కులో మహిళల కోలాహలం

ముడసర్లోవ : కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, సంఘ సభ్యులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: నగరంలో ఆదివారం కార్తిక వనసమారాధనలు జరిగాయి. బీచ్‌రోడ్డు ఎంజీఎం పార్కులో 'సిరి మేక్ ఓవర్స్', 'వీరూమామా బ్రాండ్' సంయుక్తంగా నిర్వహించిన వనభోజనాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా రెట్రో ఫ్యాషన్ వాక్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ సాధించిన విజేతలను కొనియాడారు.

రుషికొండ బీచ్‌కు సందర్శకుల తాకిడి

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: కార్తికమాసం నేపథ్యంలో ఆదివారం రుషికొండ బీచ్‌కు అధిక సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పిల్లాపాపలతో విచ్చేసిన వీరు మత్స్యరాశుల పార్కు, బోటింగ్ కేంద్రం, అటవీభూములు వంటి ఆహ్లాదకర ప్రదేశాల్లో సంతోషాల నడుమ సహపంక్తి భోజనాలు ఆచరించారు. ఇసుక తిన్నెలపై సాగర సోయగాలుల్ని ఆస్వాదిస్తూ ఉత్సాహంగా గడిపారు. సముద్ర స్నానాలు చేసేవారిని లోపలికి వెళ్లరాదంటూ మెరైన్ పోలీసులు, ఏపీటీడీసీ బ్లూఫ్లాగ్ బీచ్, జీవీఎంసీ లైఫ్‌గార్డులు ప్రచారమాధ్యమాల ద్వారా అప్రమత్తం చేశారు.

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

మాధవధారలో వనభోజనాల సందడి

వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వనభోజనాలు చేస్తున్న భక్తులు

మాధవధార, న్యూస్‌టుడే: ఒకవైపు ఆహ్లాదం.. మరోవైపు ఆధ్యాత్మికత కలిగిన మాధవధారలో ఆదివారం వనభోజనాల సందడి నెలకొంది. ఇక్కడి జలధారలో స్నానమాచరించి మాధవ స్వామి, వేణుగోపాల స్వామి, శివాలయాల వద్ద స్వామి వారి దర్శనం కోసం ప్రజలు బారులు తీరారు. మాధవధారలో తోటల్లో, ఆలయాల వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలు అసోసియేషన్, మహిళా సంఘాలు, యువకులు పాల్గొని వన భోజనాలు చేశారు. చిన్నారులు ఆట, పాటలతో సందడి చేశారు.

కాలువలోని మురుగు రహదారిపైకి..

దర్పణం

కాలువలోని మురుగు రహదారులపైకి ప్రవహించడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి బిర్లా కూడలి నుంచి మాధవధార వెళ్లే సేవా మార్గంలోకి నేరుగా మురుగు నీరు చేరడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. దుర్వాసనతో పాటు దోమల బెడదతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది ఎగువ ప్రాంతంలోని కాలువల్లో పూడికలు సరిగా తొలగించకపోవడంతో ఈ దుస్థితి వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మురళీనగర్

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

మురళీనగర్, న్యూస్‌టుడే: ☎: సెక్టార్-8 వైభవపురి విద్యుత్తేజ్ సమీపంలోని 86ఎ/49 విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధి దీపం గత నెల రోజులుగా వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - కె.మాధవి ✓: వెంటనే మీ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. - అర్జున, వీధి దీపాల ఏఈ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ☎: జీవీఎంసీ 39వ వార్డు దాసన్నపేట వీధిలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. - అస్లాన్ ✓: పరిశీలించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - అన్నంనాయుడు, విద్యుత్తు దీపాల నిర్వహణ అధికారి

వీధుల్లో చీకట్లు.. తప్పని ఇక్కట్లు..

మాధవధార, న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధిలోని ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు వెలగడం లేదు. గత 15 రోజులగా ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా కనీసం పట్టించుకోవడం లేదు. కాలనీల్లో సైతం దీపాలు వెలగక వీధుల్లో అంధకారం అలముకుంటోంది. జీవీఎంసీ 50, 51, 53 వార్డుల పరిధిలోని మాధవధార, మురళీనగర్, రాజీవ్‌నగర్, పంజాబు హోటల్, సాయినగర్, వుడా కాలనీల్లోని చాలా దీపాలు వెలగకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీల్లో నిర్మానుష్య ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో రాత్రి సమయాల్లో రాకపోకలు సాగిస్తున్న ప్రజలపై వీధి కుక్కలతో పాటు, పలువురు ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించాలంటే భయపడుతున్నామని మహిళలు చెబుతున్నారు. సచివాలయంలో ఫిర్యాదు చేస్తే తక్షణమే మరమ్మతులు నిర్వహిస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ కనీస చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా కాలనీలో కనీసం ఒక్క వీధి దీపం కూడా వెలగడం లేదని వాపోతున్నారు.

పంజాబు హోటల్ నుంచి రాజీవ్‌నగర్ వెళ్లే రహదారిలో అలముకున్న చీకట్లు

★ 30 ఫిర్యాదులొస్తే 10 మాత్రమే పరిష్కారం: మూడు వారాల క్రితం వీధి దీపాలకు మరమ్మతులు చేస్తుండగా పైన ఉన్న హెచ్‌టీ తీగలు తగిలి అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందాడు. దీంతో అప్పటి నుంచి వీధి దీపాలకు మరమ్మతులు చేయాలంటే ఈపీడీసీఎల్, జీవీఎంసీ వీధి దీపాల నిర్వాహకులు సమన్వయంతో పూర్తి స్థాయిలో విద్యుత్తును నిలిపివేసి మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. అయితే ఇక్కడే సమస్య వస్తోంది. వీధి దీపాలపై ప్రతి రోజు ఫిర్యాదులు వస్తుంటాయి. వాటికి మరమ్మతులు చేయాలంటే ఈపీడీసీఎల్ సిబ్బంది ఆ సమయంలో అందుబాటులో ఉండి, విద్యుత్తును నిలిపివేయాల్సి ఉంటుంది. దీంతో వారంలో 30 ఫిర్యాదులు వస్తే, కేవలం 10 మాత్రమే పరిష్కరిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

స్కూబా డైవింగ్ కోర్సుల్లో శిక్షణ

డైవింగ్‌కు సిద్ధమవుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

సీతంపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 105 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, సీనియర్ డివిజన్ బాలుర, 25 మంది సీనియర్ వింగ్ బాలికలకు నగరంలోని బుల్లయ్య కళాశాల ఆధ్వర్యంలో స్కూబా డైవింగ్ అడ్వెంచర్ కోర్సులో గత వారం రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం బీచ్‌లో కోర్సు కమాండర్ ఎ.నరసింహారావు ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. కోర్సు ప్రారంభానికి ముందు క్యాడెట్లకు ఐఎన్ఎస్ విరాట్ వద్ద ప్రీ-డైవింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ కోర్సు ప్రముఖ్యత విలువలను నేర్పిస్తుందని బుల్లయ్య కళాశాల ఎన్‌సీసీ అధికారి లక్ష్మణబాబు తెలిపారు.

బీచ్‌లో పరుగు సాధన చేస్తూ..

పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైళ్లలో పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు వాల్తేర్ రైల్వే పోలీసులు తెలిపారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఆపరేషన్‌లో భాగంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఐదుగురు బాలల్ని రక్షించినట్లు తెలిపారు. ఆర్పీఎఫ్ ఎస్పై కిశోర్ ఆధ్వర్యంలో ఒక బృందం రైళ్లలో భిక్షాటన చేస్తున్న బృందాల్ని గుర్తించారు. విచారణ చేపట్టగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ జిల్లాలోని పలు గ్రామాల నుంచి డబ్బుతో ప్రలోభపెట్టి చిన్నారులను విశాఖ తీసుకొచ్చి జ్ఞానభూమి, రత్నాచల్ రైళ్లలో భిక్షాటన చేయిస్తూ ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. వారి నుంచి కాపాడిన బాలలను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచి బాలల సంరక్షణ వసతి గృహానికి తరలించినట్లు తెలిపారు. కేసును పూర్తి దర్యాప్తు కోసం రాయ్‌పూర్‌లోని జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

అలరించిన అర్ధ ఏకాహం భజనలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవం సందర్భంగా జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణాపురంలోని సాయిబాబా ధ్యాన మందిరంలో ఆదివారం అర్ధ ఏకాహం భజనలు చేశారు. సాయి ధ్యాన మందిర భక్తి భజన మండలి నిర్వాహకులు మంగవేణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 50 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా 2వ ఆదివారం అర్ధ ఏకాహం భజనలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాము(తబల), భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పోర్టులో జరిగిన లారీ ప్రమాదంలో మృతి చెందిన పూల్ కలాసీ శ్రీనివాసరావు కుటుంబానికి వీపీఏ పూల్ కలాసీ వెల్ఫేర్ అసోసియేషన్ అండగా ఉంటుందని సంఘం అధ్యక్షుడు కమిరెడ్డి అప్పారావు అన్నారు. ఆదివారం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను కలిసి తమ సంఘం తరఫున రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేసింది. ముందుముందు మరింత సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. పోర్టు నుంచి రావాల్సిన మొత్తం వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. సంఘం నాయకులు సీహెచ్.పోతురాజు, రాము, రాజీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి పీజీఆర్ఎస్ రద్దు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించనున్న పీజీఆర్ఎస్‌ను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. అధికారులంతా భాగస్వామ్య సదస్సు నిర్వహణ కోసం చేపడుతున్న పనుల పర్యవేక్షణలో నిమగ్నమై ఉన్నందున తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు.

ఘనంగా కార్తిక మాస దీపోత్సవం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ వద్ద ఉన్న అంకోసా ఫంక్షన్ హాలులో కార్తిక మాస దీపోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ విశాఖ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస కార్తిక మాస విశిష్టతను ప్రవచనాల ద్వారా వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు.

ఎట్టకేలకు క్రైం స్టేషన్ ఆధునికీకరణ

గురుద్వారా, న్యూస్‌టుడే: నాలుగో పట్టణ క్రైం పోలీస్‌స్టేషన్‌కు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో స్టేషన్ ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. ఇది వరకు స్టేషన్ రేకుల షెడ్డులో ఉండటంతో చిన్నపాటి వర్షానికే నీరంతా లోపలికి వచ్చి, రికార్డులన్నీ తడిసిపోయి సిబ్బంది నానా ఇబ్బందులు పడేవారు. పలు చోరీ కేసుల్లో తీసుకొచ్చే వారిని ఉంచేందుకు కూడా స్థలం లేకుండా ఇరుకుగా ఉండేది. ఇటీవల నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ స్టేషన్‌ను పరిశీలించారు. సీపీ పర్యటించిన కొద్ది రోజులకే స్టేషన్‌ను ఆధునికీకరించడంతో తమ కష్టాలు గట్టెక్కనున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్టేషన్ నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

శివుడికి ఏకవార రుద్రాభిషేకం

పూజల్లో పాల్గొన్న ఈజీ ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు

గురుద్వారా, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం శివలింగానికి నారికేళ, గంగాజలం, పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో విశిష్ట అభిషేకాలు జరిపారు. పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక హారతులు అందజేశారు. భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్, తెదేపా నాయకులు బర్ల బాలకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

కరాటేలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీజీఓఎస్‌కాలనీలోని ఉన్నత పాఠశాల ఆవరణలో రియల్ మార్షల్ ఆర్ట్స్ స్పోర్ట్స్ కరాటే డూ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం సాయంత్రం బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. చీఫ్ ఎగ్జామినర్ ఆర్.రవీంద్రకుమార్ పర్యవేక్షణలో చీఫ్ కోచ్, ఎగ్జామినర్ కె.యోగేంద్ర ప్రసాద్ పాల్గొని బెల్టులు అందజేశారు.

విద్యార్థులతో చీఫ్ కోచ్ కె.యోగేంద్ర ప్రసాద్

ముగిసిన అవగాహన సదస్సు

ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లకు ధ్రువపత్రాలు అందజేస్తున్న చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ బాల్యం కేంద్రాల్లో విద్యనభ్యసించే పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయాలని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం పేర్కొన్నారు. అక్కయ్యపాలెంలోని ఎన్‌జీజీఓఎస్‌కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన అవగాహన సదస్సు ఆదివారంతో ముగిసింది. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లలకు ఉపయుక్తంగా ఉండాలన్న సంకల్పంతో పెదబాల శిక్షలోని ఎనిమిది పర్వాలను ప్రామాణికంగా తీసుకుని పుస్తకాన్ని రూపొందించడం హర్షణీయమన్నారు. అనంతరం సదస్సులో పాల్గొన్న ఉపాధ్యాయులు సూపర్‌వైజర్లకు సీతారాం, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆవుపాటి మోహన్‌కుమార్, తెలుగు పండిట్ హైమావతి చేతులమీదుగా ధ్రువపత్రాలు అందజేశారు.

19 నుంచి పుట్టపర్తికి ప్రత్యేక సర్వీసులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయిబాబా జయంత్యుత్సవాల సందర్భంగా అనంతపురం జిల్లా పుట్టపర్తికి ఈనెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆర్.ఎం. బి.అప్పలనాయుడు తెలిపారు. ద్వారకా బస్‌స్టేషన్ వద్ద ఆదివారం జెండా ఊపి పంచారామాలకు సూపర్‌లగ్జరీ, ఇంద్ర ఏసీ సర్వీసులను పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శబరిమల యాత్రకు సైతం ఆర్టీసీ సర్వీసులు నడపడానికి సిద్ధంగా ఉన్నామని, ఆన్‌లైన్‌లో అయ్యప్ప భక్తులు టికెట్లు తీసుకోవచ్చని, బృందంగా ముందుకొచ్చి ఆర్టీసీ అధికారులను సంప్రదిస్తే ప్రత్యేకంగా బస్సు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు.

పంచారామాలకు సిద్ధం చేసిన బస్సుల వద్ద ప్రయాణికులు

జాతీయ ఈత పోటీలకు ఎంపిక

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: బీచ్ రోడ్డు ఆక్వా స్విమ్మింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈత పోటీల్లో ఎంవీపీలోని ఎస్3 అరేనాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-14 బాలుర విభాగంలో యశ్మిత్ 50, 100, 200 మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో కాంస్యం, రజతం, స్వర్ణం.. బాలికల విభాగంలో ఎస్.సమన్విత 50, 100, 200 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో కాంస్యం, రెండు రజతాలు.. ధ్రుతి 200 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్యం గెలిచారన్నారు. అండర్-17 బాలికల విభాగంలో జ్ఞానశ్రీ 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజతం.. అండర్-19లో హిమశ్రీ 50, 100, 200 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో మూడు స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారన్నారు. వీరంతా వచ్చే నెల దిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు కిట్లు అందజేత

గురుద్వారా, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అరుణాచల్‌ప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన మైక్ బాక్సింగ్ క్లబ్ క్రీడాకారులకు సింహాచలం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు ఆదివారం కిట్లు పంపిణీ చేశారు. టీపీటీకాలనీ ఎన్ఎంసీహెచ్ పాఠశాలలో వారిని అభినందించి కాంస్యం పతకం సాధించిన లోహిత్‌సాయి, పలువురికి కిట్లు, ట్రాక్‌షూట్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కోచ్ హరీశ్, దినేశ్, చిత్రానంద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో సంపంగి శ్రీనివాసరావు

పూర్వ విద్యార్థుల కలయిక

మాధవధార, న్యూస్‌టుడే: వారంతా మూడున్నర దశాబ్దాల క్రితం ఒకే చోట చదువుకున్నారు. వేర్వేరు చోట్ల వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. మళ్లీ ఒకే చోట కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధుల్లేవు. మాధవధార ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరంలో బ్యాచ్ చదువుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం మాధవధార తోటల్లో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఇక నుంచి ఏటా కలుసుకోవాలని, పేదలు, అనాథుల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులు సూర్యనారాయణమ్మ, నారాయణరావు, పొన్నాడ అప్పారావులను సత్కరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

మాధవధార, న్యూస్‌టుడే: కొట్లాటలో తలదూర్చి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని కంచరపాలెం సీఐ కె.రవికుమార్ రౌడీషీటర్లను హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రవర్తన మార్చుకొని, పరివర్తనతో నడుచుకోవాలని, మీపై ఎల్లప్పుడూ పోలీసుల నిఘా ఉంటుందని రౌడీషీటర్లకు సూచించారు. నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో భాగస్వామ్య సదస్సు జరుగుతుండటంతో వివిధ దేశాల నుంచి ప్రతినిధులు, పలువురు అధికారులు, రాజకీయ నాయకులు వస్తుండటంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న కంచరపాలెం సీఐ కె.రవికుమార్

విజేతలకు బహుమతుల ప్రదానం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరంలోని స్వామి వివేకానంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ట్యూషన్ విద్యార్థులకు శ్రీ కృష్ణ చైతన్య యోగా కేంద్రం వ్యవస్థాపకులు గణేశ్ ఆదివారం బహుమతులు అందజేశారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి వివిధ విభాగాల క్రీడల్లో పాల్గొని ఇక్కడి విద్యార్థులు విజేతలుగా నిలిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధమవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో యోగా టీచర్ గణేశ్

శోభన్‌బాబు అభిమానుల సంఘం అధ్యక్షుడి ఎన్నిక

సమావేశంలో పాల్గొన్న శోభన్‌బాబు అభిమానుల సంఘం సభ్యులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: సిటీ వైడ్ శోభన్‌బాబు అభిమానుల సంఘం అధ్యక్షుడి ఎన్నికను ఆదివారం డాబాగార్డెన్స్‌లోని నెల్లూరి మెస్ ఎదురుగా ఉన్న శోభన్‌బాబు విగ్రహం వద్ద ఆదివారం రాత్రి నిర్వహించారు. మువ్వల పోలారావును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే సంఘం పాలకవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు.

మూడు కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం

మాధవధార, న్యూస్‌టుడే: ఏజెన్సీ నుంచి మూడు కేజీల లిక్విడ్ గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఈగల్ టీం పట్టుకొని కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. కేరళకు చెందిన ఎం.సురేశ్(27) అరకు ప్రాంతంలో లిక్విడ్ గంజాయి దొరుకుతుందని సమాచారం రావడంతో మూడు రోజులు క్రితం అక్కడకు వెళ్లి లిక్విడ్ గంజాయిని కొనుగోలు చేశాడు. అనంతరం తనకు విశాఖపట్నం వెళ్లేందుకు మార్గం తెలియకపోవడంతో స్థానికంగా ఉంటున్న కిల్లు అప్పారావు సహాయం తీసుకొని విశాఖ వచ్చాడు. అక్కడ నుంచి బెంగళూరు వెళ్లేందుకు జ్ఞానాపురం వైపు వెళ్తుండగా తనిఖీలు నిర్వహిస్తున్న ఈగల్ టీం వీరిని పట్టుకుంది. వారి వద్దనున్న చేతి సంచిని పరిశీలించగా లిక్విడ్ గంజాయి ఉండటంతో వారిని అదుపులోకి తీసుకొని కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ కె.రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు అదుపులో నిందితులు

తమిళనాడు రవాణా చేస్తూ..

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ మీదుగా తమిళనాడుకు గంజాయిని అక్రమంగా రవాణా చేసేందుకు యత్నించిన వ్యక్తిని విశాఖలోని రైల్వే పోలీసులు అరెస్టు చేసినట్లు జీఆర్పీ సి.ఐ ధనుంజయనాయుడు తెలిపారు. తమిళనాడులోని తంజావూరుకు చెందిన ప్రశాంత్ చిన్నాదురై ఒడిశా మీదుగా విశాఖ స్టేషన్‌కు అక్రమంగా గంజాయితో చేరుకొని గస్తీలో ఉన్న పోలీసులకు చిక్కారు. విచారణ అనంతరం అతని వద్ద నుంచి 8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సనాతన సంప్రదాయాన్ని పరిరక్షించాలి

మురళీనగర్, న్యూస్‌టుడే: ఎన్‌జీజీఓస్ కాలనీ కప్పురాడ వైభవ వేంకటేశ్వరుడిని మైసూరు దత్త పీఠం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్, కమిటీ సభ్యులు స్వామీజీని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు వాసు, శేషస్వాములు ఆలయ చరిత్రను, నిర్మాణ కమిటీ సభ్యులు చేసిన కృషిని స్వామీజీకి వివరించారు. అనంతరం భక్తులకు స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. జ్యోతిష్యం, ఆగమశాస్త్రాన్ని అన్ని వేళలా గౌరవించి సనాతన సంప్రదాయ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ముందుకురావాలన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేసినట్లయితే మానసిక బలం చేకూరుతుందన్నారు. పిల్లలతో భగవద్గీత పఠనం చేయించినట్లయితే భవిష్యత్‌లో మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు.

అనుగ్రహ భాషణం చేస్తున్న సచ్చిదానంద స్వామీజీ, కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

చదరంగం ఆడుతున్న విద్యార్థులు

ముగిసిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార బాలయ్య శాస్త్రి లేఅవుట్ వేదికగా శ్రీనవోదయ జూనియర్ కళాశాల ఆదిత్య చెస్ అకాడమీ, విశాఖ చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి చదరంగం టోర్నమెంట్ ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. యువకుల విభాగంలో వెంకటేశ్వరావు, భాస్కరరావు, కృష్ణవరణ్య పొట్నూరు, సుధీర్ కుమార్, విజయ్ కుమార్ విజయం సాధించారు. అండర్-7 బాలుర విభాగంలో ప్రశాంత్, బాలికల విభాగంలో వేద సాయి, అండర్-9 లక్ష్మిత్ గుత్తి(బాలుర), అశ్రితి దూబే(బాలికల), అండర్-11 అమండు జిగ్నేష్(బాలుర) శ్రీనందన దత్తు(బాలికల), అండర్-13 అనిష్ షణ్ముఖ(బాలుర) ఇషా కాకర(బాలికలు), అండర్-15 లోకేష్ బొజ్జ(బాలుర), అంజన సౌమ్య కోనూరు(బాలికల) విజయం సాధించారు.

(c) eenadu

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

యాదవ సంఘ పటిష్టతకు చర్యలు

సింధియా(నెహ్రూనగర్), న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గ యాదవ సంఘ పటిష్టతకు చర్యలు చేపడుతున్నట్టు వ్యవస్థాపక అధ్యక్షులు మూర్తియాదవ్ అన్నారు. ఆదివారం 60వ వార్డు పవనపుత్రనగర్ రాధాకృష్ణ ఆలయంలో జరిగిన యాదవ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో కార్తిక వన సమారాధన, కొత్త కమిటీలకు కార్యవర్గాన్ని ప్రకటించడం వంటి అంశాలపై చర్చించేందుకు మరో పర్యాయం సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో పశ్చిమ యాదవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న పశ్చిమ కమిటీ ప్రతినిధులు

పూర్వ విద్యార్థుల వితరణ

సింధియా, న్యూస్‌టుడే: హిందుస్థాన్ షిప్‌యార్డు పూర్వ విద్యార్థులు ఆదివారం విశాఖపట్నం జవహర్‌లాల్ నెహ్రూ జంతు ప్రదర్శనశాలకు (జూ) 12 బెంచీలను అందించారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు వర్మ గణపతిరాజు, డాక్టర్ జీటీవీ రమేష్, ఆది, డాక్టర్ ఎస్‌కేఈ అప్పారావు, ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూపార్కులో బెంచీలను ఏర్పాటు చేసిన షిప్‌యార్డు పూర్వ విద్యార్థులు

‘మేహాద్రి’ ముంచుతోంది..

• గేట్లు తెరిస్తే.. కాలనీల మీదకు వరద నీరు
• కాలువలు ధ్వంసమే కారణం..

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గతంలో విజయవాడలో బుడమేరు పొంగి దిగువ ప్రాంతాల ప్రజలు ఎంత ఇబ్బంది పడ్డారో.. ఇంచుమించు నగరంలోని కొన్ని వార్డుల ప్రజలు కూడా అలాంటి ఇబ్బందులే పడుతున్నారు. మేహాద్రి రిజర్వాయరు నిండినపుడు గేట్లు ఎత్తితే ఆ నీరంతా కాలనీల మీదకు వస్తోంది.

ఇదీ పరిస్థితి..: మేహాద్రి రిజర్వాయర్ భారీ వర్షాలకు నిండితే అవసరమైన మేరకు గేట్లను ఎత్తి నీటిని కిందకు వదులుతారు. ఈ నీరంతా మేహాద్రినగర్ ఎంఈఎస్ పంపుహౌస్ నుంచి జగ్గయ్యపాలెం, శీలానగర్ మీదుగా డాక్‌యార్డ్ వద్దకు చేరుకుని సముద్రంలోకి వెళ్లాలి. అయితే రిజర్వాయర్ గేట్ల కింద నుంచి డాక్‌యార్డు వరకు కాలువ సరిగా లేకపోవడం వల్ల 60 శాతం మాత్రమే సముద్రంలోకి నీరు చేరుతోంది. మిగిలిన నీరంతా గ్రామాలపై వచ్చిపడుతోంది. ముఖ్యంగా భగత్‌సింగ్‌నగర్, వైఎస్సార్‌నగర్, కొత్తపాలెం-నరవ రోడ్డు, ఎస్సీకాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. పంట పొలాలపై మేహాద్రినీరు సెలయేరులా ప్రవహిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు.

ఇటీవల వర్షాలకు మునిగిన భగత్‌సింగ్ నగర్

గేట్లు వదిలినప్పుడు అస్తవ్యస్తంగా వరద ప్రవాహం

• శివారు ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. తక్కువ ధరకు లభిస్తున్నాయని ఎక్కువమంది కొనుగోలు చేశారు. ఇక్కడ పరిస్థితిని చూసి బిక్కుబిక్కుమంటున్నారు. ఇక్కడ వదులు మట్టి (పంట నేల) కావడం, దీనికితోడు మేహాద్రినీరు సెలయేరులా ప్రవహించడంతో అపార్ట్‌మెంట్ల యజమానులు భయపడుతున్నారు.

లోపాలెన్నో..

• మేహాద్రిగెడ్డ గేట్లు ఎత్తితే ఆ నీరు ప్రవహించాల్సిన కాలువ రూపురేఖలు లేవు. ఈ కాలువ ఆధునికీకరణ ఎప్పుడు జరిగిందో కూడా తెలియదు. కొన్నిచోట్ల అది కాలువ అన్న సంగతి కూడా తెలియనట్లు ఉంది.

• మేహాద్రిగెడ్డ కాలువను ఆనుకుని కాలువలు, గెడ్డలు ఆనవాళ్లు లేకుండా మారాయి. కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి లేవుట్లుగా మార్చారు. మేహాద్రిగెడ్డ వర్షపు నీరు వెళ్లే మార్గాలను భవన నిర్మాణ వ్యర్థాలతో నింపివేశారు. దీంతో ప్రవాహానికి మార్గం లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డు ఎక్కడంతో పాటు ఇళ్లను సైతం ముంచేస్తోంది.

• వ్యవసాయ భూమిని రెవెన్యూ, వుడా, జీవీఎంసీకి అనుసంధానం చేయాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులు ఎన్‌ఓసీ జారీ చేశాక భూమిని ప్లాట్లుగా మలిచి విక్రయించుకోవచ్చు. కానీ అనధికార లేఅవుట్లు వేసి కోట్లాది రూపాయలు ఆదాయం పొంది ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇలాంటి వాటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన చిన్ననీటి పారుదలశాఖ, రెవెన్యూ, జీవీఎంసీ పట్టించుకోవడం లేదు.

చాలా ఇబ్బందులు పడ్డాం..: జోరు తుపానులో కుటుంబ సభ్యులమంతా ఒకే ఇంటిలో తలదాచుకున్నాం. అర్ధరాత్రి తర్వాత ఇంటి చుట్టూ నీరు ఉంది. ఎటూ వెళ్లలేని పరిస్థితి. తెల్లవారు కిందకి దిగి వెళ్లడానికి పీకల్లోతులో వరకు నీరు వస్తోంది. ఇంట్లో సామాగ్రి వదిలేసి బయటకి రావడానికి భయమేసింది. రెండు రోజుల పాటు విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. దీంతో మరుసటిరోజు సాయంత్రం దాకా కంటిమీద కునుకులేదు.
– సత్యనారాయణ, కొత్తపాలెం

కాలనీ మొత్తం మునిగిపోతుంది: వర్షం వస్తే కాలనీ రహదారులు, మురుగుకాలువ ఏకమై ముంపునకు గురవుతున్నాయి. ఇళ్లల్లోకి నీరు వచ్చిపడుతోంది. కొత్తపాలెం-నరవ రోడ్డులో కాలువలను మూసివేయడంతో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీరు ఇటుగా ప్రవహిస్తోంది. కొన్ని రోజుల వరకు తిప్పలు తప్పడం లేదు.
– కె.జ్యోతి, భగత్‌సింగ్‌నగర్

గుట్టుగా తెచ్చి.. గెడ్డలో పోసి.. ఫోకస్

గాజువాక (పెదగంట్యాడ), న్యూస్‌టుడే: జనావాసాల మధ్యనున్న నడుపూరు గెడ్డ పరిశ్రమల వ్యర్థజలాలు, ఆయిల్‌తో కలుషితమవుతోంది. రాత్రికి రాత్రే ట్యాంకర్లు, వ్యాన్లతో గుట్టుగా తెచ్చి ప్రత్యేక పైపులైను వ్యవస్థ ద్వారా గెడ్డలోకి మళ్లిస్తున్నారు. దీనివల్ల పరిసరాలు దుర్గంధమవుతున్నాయి. గంగవరం పోర్టు రోడ్డులో వంతెనను ఆనుకుని ప్రైవేటు యార్డులకు వెళ్లే దారి ఉంది. ట్యాంకర్లను తీసుకెళ్లి అక్కడ పైపు ద్వారా గెడ్డలోకి అన్‌లోడ్ చేస్తున్నారు. గాజువాక ఎగువ ప్రాంతాల నుంచి మురుగునీరు పోర్టు మార్గం ద్వారా గంగవరం సముద్రంలోకి కలుస్తుంది. ఈ గెడ్డను పరిశీలిస్తే దారి పొడవునా ఆయిల్ తెట్టు తేలి ఉంటోంది. రాత్రి పూట ట్యాంకర్లు వస్తున్నాయని, స్థానిక యార్డు నిర్వాహకులకు డబ్బులు ముట్టజెప్పి గెడ్డను అక్రమంగా వాడుకుంటున్నారని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీల తాకిడి వల్ల రహదారి అధ్వానంగా తయారైంది. తగిన నిఘా ఉంచి ట్యాంకర్లకు అడ్డుకట్టవేయాలని పలువురు కోరుతున్నారు.

గెడ్డలో తేలుతున్న ఆయిల్ తెట్టు

లారీల తాకిడితో ధ్వంసమైన మార్గం

సీఎం సహాయనిధి అందజేత

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి నుంచి అగనంపూడికి చెందిన రిషిపాల్ అనే చిన్నారికి రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు. గాజువాక క్యాంపు కార్యాలయంలో బాలుడి తల్లిదండ్రులు కుమార్, సంగీతలకు చెక్కు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పసితనంలోనే పుట్టి చెముడుతో బాధపడుతున్న బాలుడికి కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని చెప్పారు. ఏపీఐఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, తెలుగుయువత జిల్లా కార్యదర్శి మొల్లి పెంటిరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సౌకర్యాలపై ఆరా

గోపాలపట్నం(ఆర్.ఆర్.వి.పురం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 92వ వార్డు మేహాద్రిగెడ్డలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సంయుక్త కార్యదర్శి ఎస్.రూపావతి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థినుల హాజరుపట్టిక, వంటగదిని పరిశీలించారు. భోజన, మంచినీటి సౌకర్యం పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ గ్రేసీ, పాఠశాల ప్రిన్సిపల్ ఎ.మృదులప్రియదర్శిని, సిబ్బంది పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న సంయుక్త కార్యదర్శి రూపావతి

ఘనంగా గ్యార్మీ షరీఫ్ ఉత్సవం

ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే పల్లా, తదితరులు

శ్రామికనగర్(గాజువాక), న్యూస్‌టుడే : గాజువాక 70వ వార్డు ఎల్‌వీనగర్‌లో నూర్-ఇ-ఇస్లాం మసీదులో ఆదివారం గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యేను ముస్లింలు సత్కరించారు. నాయకులు రెహమాన్, గోపి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సినర్జీస్ కార్మికుల నిరసనలకు సంఘీభావం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : వీసెజ్ పరిధిలోని సినర్జీస్ పరిశ్రమలో పనిచేసిన కార్మికుల నిరసనకు పలువురు సంఘీభావం తెలిపారు. ఆదివారం సంస్థ గేటు వద్ద ఏర్పాటు చేసిన వంటావార్పులో కార్మికుల కుటుంబ సభ్యులు, పిల్లలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గాజువాక మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్, 75వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు కోన చినఅప్పారావు ఆధ్వర్యంలో నాయకులు జ్యోతిరెడ్డిలు, ఏఐటీయూసీ నాయకులు బూసి వెంకటరావులు సంఘీభావం తెలిపారు. సంఘం నాయకులు రాంబాబు, శ్రీనివాస్, దాసు, వెంకటరమణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

సినర్జీస్ కార్మికులకు సంఘీభావం తెలిపిన గాజువాక మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చినఅప్పారావు, జ్యోతిరెడ్డి

కాలువపై గ్రిల్స్‌కు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి మార్గంలోని కాలువపై ఇనుప గ్రిల్స్ బయటకు వచ్చి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న వైనంపై ‘ఇనుప చువ్వ తొలగించరూ’ శీర్షికన ఈనాడులో వార్త వచ్చింది. దీనిపై స్థానిక పీఏసీఎస్ ఛైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్ స్పందించి.. సొంత ఖర్చులతో ఇనుప గ్రిల్స్‌ను తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి దాడి సురేశ్ పాల్గొన్నారు.

గ్రిల్స్‌కు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

ప్రతిభను ప్రోత్సహిస్తే.. అపజయాలకు చెక్ పెడతా

న్యూస్‌టుడే, సీతానగరం: ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు విశాఖలోని గాజువాక పరిధిలోని కణితి జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి పి.మిన్ను అమన్. జిల్లాలోని సీతానగరం మండలం జోగింపేట ప్రతిభా పాఠశాల ఆవరణలో మూడు రోజులపాటు జరిగిన 69వ రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభ చాటాడు.

ఆన్‌లైన్ శిక్షణతోనే..: గాజువాకలోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న తండ్రి శాంతిరాజ్ కుమారుడి ఆసక్తిని గమనించి చిన్నతనం నుంచి ప్రోత్సహించాడు. మూడేళ్ల కిందట ఆన్‌లైన్‌లో శిక్షణ ఇప్పించారు. ఏడాదిగా విజయవాడ, విజయనగరం, విశాఖల్లో జరిగే పలు పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొని సత్తాచాటాడు. ప్రస్తుతం జరుగుతున్న పోటీల్లో విశాఖ జిల్లా జట్టు తరపున పాల్గొన్నాడు. వ్యక్తిగత విభాగంలో నాలుగో రౌండ్‌లో త్రుటిలో జాతీయ స్థాయిలో పోటీలో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయాడు. వ్యక్తిగత శిక్షణ అందించే అవకాశం లేకపోవడంతో ఆన్‌లైన్ సేవలను వినియోగించుకుని పోటీలకు సిద్ధమవుతున్నట్లు అమన్ చెప్పాడు. ఆర్థికంగా చేయూతనందిస్తే సత్తా చాటుతాననే ధీమాను వ్యక్తం చేస్తున్నాడు.

మిన్ను అమన్

వైభవంగా షష్ఠిపూర్తి మహోత్సవం

వడ్లపూడి వాసవి ధ్యాన మండపంలో జరిగిన సామూహిక షష్ఠిపూర్తిలో దంపతులు

కూర్మన్నపాలెం (వడ్లపూడి), న్యూస్‌టుడే: అరవై ఏళ్లు పూర్తి చేసుకున్న ఆర్యవైశ్య దంపతులకు షష్ఠిపూర్తి మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వడ్లపూడి వాసవి ధ్యానమందిరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 99 మంది జంటలతో సామూహిక షష్ఠిపూర్తి కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వడ్లపూడి ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కారుమూరి మహేష్, వెంకటరమణ, మధుసూదనశెట్టి, మహిళా సంఘం ప్రతినిధులు కె.సుజాత, కె.సంధ్యారాధ, కె.రత్నమాల, జి.చంద్రకళ, ఎం.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణను నిలిపి వేయాలి

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ): ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణను నిలిపి వేయాలని, ఉక్కు పరిరక్షణకు కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోరాడాలని భెల్ సిటూ నాయకులు జీటీపీ ప్రకాశ్ అన్నారు. జీవీఎంసీ గాంధీ పార్కు ఆవరణలో 1686వ రోజు నిరసన దీక్షలో పలు పరిశ్రమల్లోని సిటూ కార్మిక నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో వివిధ పరిశ్రమల కార్మిక నాయకులు సీరందాసు ప్రసాద్, నారపురెడ్డి, ఆల్సి అప్పలనారాయణ, బీఎస్ఎన్ రాజు, పొన్నా శివరామ్, అచ్చిన్నాయుడు, సురేశ్, ఎస్.జగన్నాథరావు, కార్మికులు పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొన్న పలు పరిశ్రమల సిటూ నాయకులు

ఘనంగా నవచండి మహామృత్యుంజయ యాగం

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు సంతోష్‌నగర్‌లో శ్రీనవ చండీ సహిత మహామృత్యుంజయ యాగం ఆదివారం నిర్వహించారు. చండీహోమం, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో కొత్తపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ విజయ్‌కుమార్, డి.సురేశ్ పాల్గొన్నారు.

హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, సింధియా, న్యూస్‌టుడే : అచ్చెంనాయుడులోవ జనతాకాలనీలో ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో ఆదివారం ముఖ్యఅతిథిగా గణబాబు హాజరయ్యారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య	గాజువాక: 98494 65088
	పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: ఆటోనగర్ దరి తోకాడ చర్చి ప్రాంతాల్లో మురుగు సమస్య పీడిస్తోంది. అవసరమైన చర్యలు తీసుకోవాలి. అలాగే గాజువాక 70వ వార్డు ఎల్‌వీనగర్‌లోనూ వీధుల్లో మురుగునీరు నిలిచిపోతోంది. –సుబ్రహ్మణ్యం, తోకాడ, నాయుడు, 70వవార్డు

సమాధానం: సిబ్బందితో ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. –కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

గోపాలపట్నం, న్యూస్‌టుడే: **?:** జీవీఎంసీ 52వ వార్డు సంజీవయ్యకాలనీ శివారు వీధిలోని కాలువల్లో పూడికలు తీయడం లేదు. – నూకరాజు, సంజీవయ్యకాలనీ, **✓:** ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. – మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, **?:** జీవీఎంసీ 92వ వార్డు నాయుడుక్వార్టర్స్-ఉత్తర సింహాచలం రోడ్డులో ఎక్కడా కూడా వీధిదీపాల వెలగడం లేదు. – శ్రీనివాసరావు, గోపాలపట్నం **✓:** వీధిదీపాల మరమ్మతులు చేపడతాం. – గోవిందరావు, వీధిదీపాల నిర్వాహకులు

గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

శ్రీనగర్(గాజువాక), న్యూస్‌టుడే : శ్రీనగర్‌లోని గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మళ్ల బాపునాయుడు, పప్పు రాజారావు, సోమేశ్వరరావు, రఘురామ్, నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవమూర్తులకు సామూహిక అర్చనలు జరిపారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

కూర్మన్నపాలెం: కణితి కాళింగవీధిలో వేంచేసిన పంచముఖేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసంలో వచ్చిన శివుని జన్మనక్షత్రం సందర్భంగా ఆదివారం రుద్రాభిషేకం నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు రుద్రాభిషేకం తిలకించేందుకు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఆలయ ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. కోదండ ఆలయ కమిటీ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

భారీ అన్నసమారాధన

అక్కిరెడ్డిపాలెం (నాతయ్యపాలెం), న్యూస్‌టుడే: నాతయ్యపాలెం సీఎస్ఆర్ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం భారీ అన్నసమారాధన జరిగింది. నాతయ్యపాలెం-అక్కిరెడ్డిపాలెం గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం స్వామి వారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అతిథిలు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు, కార్పొరేటర్ దాడి వెంకట రమేశ్, కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో అన్న సమారాధన దృశ్యం

‘అర కిలోమీటరు’ అన్నీ అవస్థలే..

గోతులు, చీకటి, చైన్‌స్నాచింగ్‌తో బెంబేలు

రహదారిపై పెద్ద గొయ్యి..

అక్కిరెడ్డిపాలెం(శీలానగర్), న్యూస్‌టుడే : శీలానగర్ కూడలి నుంచి శీలానగర్‌కు వెళ్లే మార్గంలో ప్రయాణమంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సుమారు అర కిలోమీటరు రోడ్డుపై ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. శీలానగర్, వెంకటేశ్వరకాలనీ, కిమ్స్ ఆసుపత్రి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఆటోనగర్ వైపు వెళ్లే వారికి ఇదే ప్రధాన మార్గం. నిత్యం వేలాదిగా వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటువంటి రహదారిని పట్టించుకోకపోవడంతో అటుగా ప్రయాణించలేకపోతున్నామని వాపోతున్నారు.

రోడ్డంతా గుంతలే...: అర కిలోమీటరు మార్గం పూర్తిగా అధ్వానంగా తయారైంది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో గుంతల్లో పడిపోకుండా అక్కడక్కడ స్టాపర్లు ఏర్పాటు చేశారు. గోతులు ఉంటే పగటిపూట ప్రయాణమే కష్టంగా ఉన్నప్పుడు.. ఇక రాత్రి పూట ఆ గోతులు కనపడక తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ఆసుపత్రికి వెళ్లే అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారి పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంటోంది. ఐయాన్ డిజిటల్ కేంద్రం వద్ద పరీక్షలు రాసేందుకు వచ్చే వారు పార్కింగ్ లేక రోడ్డుపైనే పార్కింగ్ చేసేస్తుండడంతో మరింత ఇబ్బందిగా తయారయింది.



వీధి దీపాలు వెలగక చీకటిగా..

రాత్రయితే...: రోడ్డుపై వీధి దీపాలు ఉన్నప్పటికీ గత 15 రోజులుగా వెలగట్లేదు. దీంతో రోడ్డంతా అంధకారంతో రాకపోకలకు భయంగా ఉంటుంది. గుంతల రోడ్డు, చీకటితో అటుగా వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. ఇటీవల ఇదే రోడ్డులో చైన్ స్నాచింగ్ కూడా జరిగింది. దీంతో చీకటి పడితే ఇటుగా ప్రయాణమంటేనే బెంబేలెత్తిపోతున్నారు. చీకటి, గుంతలు, చైన్ స్నాచింగ్ ఇన్ని ఇబ్బందులను ఎదుర్కొని ప్రయాణించాలంటే కత్తి మీద సాములా ఉందని అధికారులు, నాయకులు స్పందించి రోడ్డును మరమ్మతులు చేసి, దీపాలు వెలిగేలా చూసి, రాత్రి పూట పోలీస్ గస్తీ ఉండేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పిండి వంటలతో గౌరమ్మకు సారె

ఏకేసీకాలనీలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న గౌరమ్మ సారె

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో శ్రీ గౌరీ పరమేశ్వరుల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో.. పలు రకాల పిండి వంటలతో శ్రీ గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు ఆదివారం కన్నులపండువగా సాగింది. కాలనీ మహిళలు తయారు చేసిన రకారకాల వంటలు ఊరేగింపుగా కాలనీలో తీసుకెళ్లి.. అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. మల్కాపురం లా అండ్ ఆర్డర్ సీఐ అప్పారావు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 63వ వార్డులో ఆదివారం వర్క్స్ విభాగం సిబ్బందితో కలిసి రెండుచోట్ల వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా గ్రామస్తులతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గూడేలా కృష్ణ, బాబూరావు, రమణ, ధనుంజయ్, పి.కృష్ణ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చిన్నా, గ్రామస్థులు

అఖిల భారత మహాసభలకు విరాళం

మల్కాపురం, న్యూస్‌టుడే : వచ్చే నెల జరగనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ.. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీకి చెందిన ఎం.లక్ష్మీకాంతం ఆదివారం సీఐటీయూ మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తికి రూ.50వేలు విరాళాన్ని ఆమె అందజేశారు. సీఐటీయూ నాయకులు ఎ.సత్యారావు, కె.పెంటారావు, పి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకులకు విరాళం అందజేస్తున్న ఎం.లక్ష్మీకాంతం

పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు

రైల్వేస్టేషన్: రైళ్లలో పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి ఐదుగురు బాలల్ని రక్షించినట్లు వాల్తేర్ రైల్వే పోలీసులు తెలిపారు. ఆర్పీఎఫ్ ఎస్సై కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో ఒక బృందం రైళ్లలో భిక్షాటన చేస్తున్న బృందాన్ని గుర్తించారు. విచారణ చేపట్టగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ జిల్లాలోని పలు గ్రామాల నుంచి డబ్బుతో ప్రలోభపెట్టి చిన్నారులను విశాఖకు తీసుకొచ్చి జన్మభూమి, రత్నాచల్ రైళ్లలో భిక్షాటన చేయిస్తూ ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. వారి నుంచి కాపాడిన బాలలను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచారు.

కాపు ఉద్యమానికి ఆద్యుడు ‘మిరియాల’

గాజువాక, న్యూస్‌టుడే : సమాజంలో కాపుల అభ్యున్నతికి అలుపెరగని పోరాటం చేసిన కాపునాడు వ్యవస్థాపకుడు మిరియాల వెంకటరావు స్ఫూర్తిప్రదాతగా నిలుస్తారని భాజపా, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివారం గాజువాక శ్రీకృష్ణదేవరాయ కన్వెన్షన్ హాల్లో కాపు రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో మిరియాల వర్ధంతి సభ నిర్వహించారు. కేఆర్‌పీఎస్ రాష్ట్ర ఛైర్మన్ చనమళ్ల ప్రసాదరావు అధ్యక్షత వహించారు. అఖిల భారత కాపు సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు, అడహక్ కమిటీ ఛైర్మన్ గుడివాడ అమ్మన్న, నాయకులు రావి శ్రీనివాస్, జి.అప్పలరామ్మూర్తి, గంధం వెంకటరావు, రామచంద్రరావు, కర్రి నాగేశ్వరరావు, వెంకటరమణ, నూకరాజు, రామారావు మాట్లాడారు.

మిరియాల వెంకటరావుకు నివాళులర్పిస్తున్న పీవీఎస్ మాధవ్, పల్లా శ్రీనివాసరావు తదితరులు

పార్కింగ్ సమస్య పరిష్కారానికి కృషి

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే: మర్రిపాలెం రైతుబజార్‌లో వాహన పార్కింగ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. విశాఖపట్నం వ్యవసాయ, మార్కెట్ శాఖ కమిటీ ఛైర్మన్ ఎలమంచిలి అపర్ణ, కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం స్థానిక రైతుబజార్‌ను సందర్శించారు. రైతులు, డ్వాక్రా, గృహమిత్ర దుకాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి నారాయణరావు, ప్రతాప్, వార్డు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

మంచిమనిషి, ది గోపాలపట్నం వర్తక సంఘం సభ్యులు, మా మిత్రులు శ్రీ సనపల బాబూరావు గారి కుమార్తె కీ॥శే॥ పి. హరీషా గారి అకాల మరణానికి చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

కీ॥శే॥ పి. హరీషా
జననం: 29-10-1991
మరణం: 06-11-2025

ది గోపాలపట్నం వర్తక సంఘం సభ్యులు

(c) eenadu

ఈనాడు
విజయనగరం
సోమవారం నవంబరు 10, 2025 5

న్యూస్‌టుడే– రాజాం

ర్యాపిడో.. ఇంకెప్పుడో?

పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం సరికొత్త ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. దీనిలో భాగంగా ర్యాపిడోతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఒప్పందం కుదుర్చుకుంది. ద్విచక్ర, త్రిచక్ర వాహనం నడపడం వచ్చి, లైసెన్సు ఉంటే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. బ్యాంకు నుంచి ఈ-ద్విచక్ర వాహనం కోసం రుణం ఇప్పిస్తారు. వచ్చిన ఆదాయంలో నెలనెలా వాయిదాలు చెల్లిస్తే సరిపోతుంది. ప్రతినెలా గరిష్ఠంగా రూ.30 వేల వరకు ఆదాయం వచ్చేలా మెప్మా తగిన ప్రోత్సాహం అందిస్తుంది. ప్రస్తుతం విజయనగరం వరకు పరిమితం చేయడంతో రాజాం, నెల్లిమర్ల, బొబ్బిలి పట్టణాల్లోని సభ్యులు తమకు అవకాశం దక్కడం లేదని వాపోతున్నారు.

పట్టణాల్లో మహిళల ఎదురుచూపు

ఇలా ఉపయోగం..

ర్యాపిడో విజయనగరం మినహా మిగిలిన మూడు పట్టణాలకు విస్తరించలేదు. రాజాం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రోజూ 500 ట్రిప్పులు బస్సులు నడుస్తున్నాయి. 25 వేల వరకు జనాభా రాకపోకలు సాగిస్తుంటారు. స్థానికంగా పలు ప్రాంతాలకు వెళ్లేందుకు ర్యాపిడో దోహదపడుతుంది.

★ నెల్లిమర్ల నుంచి 5 కి.మీల దూరంలో రామతీర్థం, 10 కి.మీల దూరంలో విజయనగరం ఉన్నాయి. ఎక్కువ మంది వెళ్తుంటారు.

★ బొబ్బిలి పట్టణంలోని పలు ప్రాంతాలకు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది.

దరఖాస్తు చేసుకోవాలి..

విజయనగరంతో పాటు రాజాం, బొబ్బిలి, నెల్లిమర్లలోని అర్హులైన మహిళా సంఘాల సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చు. ర్యాపిడో సంస్థ ప్రస్తుతం విజయనగరంలో అవకాశం ఇస్తోంది. ఇక్కడే వాహనాలు నడపాల్సి ఉంటుంది. క్రమేపీ మిగిలిన పట్టణాలకు విస్తరిస్తారు. దరఖాస్తులు మెప్మా పీడీ కార్యాలయంలో అందించాలి.

– జీవీ చిట్టిరాజు, మెప్మా పీడీ

చిక్కకుండా.. చిరుతల్లా పరుగు

విజయనగరం విజ్జీ మైదానంలో రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఖోఖో పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఉమ్మడి 13 జిల్లాల నుంచి తరలి వచ్చిన క్రీడాకారులతో మైదానంలో సందడి నెలకొంది. సోమవారం సాయంత్రం టోర్నమెంటు ముగుస్తుందని ఇంటర్ బోర్డు అధికారి తవిటి నాయుడు తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం క్రీడా విభాగం

బొబ్బిలిలో గ్రామీణ, ట్రాఫిక్ స్టేషన్లకు ప్రతిపాదన

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలిలోని పోలీసు స్టేషన్‌ను ఎస్పీ దామోదర్ ఆదివారం రాత్రి సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బొబ్బిలిలో గ్రామీణ, ట్రాఫిక్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. చిన్నపిల్లలపై అత్యాచారాలు, ప్రేమ పేరుతో మోసగించడం, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కొంతమంది బృందాలుగా ఏర్పడి భిక్షగాళ్లు, రహదారులపై తిరిగే అమాయకుల పేరుమీద సిమ్‌లు, ఆధార్‌కార్డులు తీసుకుని ఖాతాలు తెరుస్తున్నారన్నారు. అప్రమత్తంగా ఉండాలన్నారు.

న్యూస్‌టుడే, విజయనగరం రింగురోడ్డు

రైలొచ్చే వరకు.. ఇంట్లో ఉన్నట్లే..!

మనం ఎక్కాల్సిన రైలు గంటల తరబడి ఆలస్యమైనా.. ఏ అర్ధ రాత్రి పూటో బండి దిగి ఆ సమయంలో ఇంటికి వెళ్లే పరిస్థితి లేకున్నా.. కాస్త రుసుము చెల్లించి స్టేషన్ లోనే హాయిగా సేదదీరవచ్చు. ఇందుకు విజయనగరంలో ఏసీ విశ్రాంతి గదులు.. సౌకర్యవంతమైన కుర్చీలు.. కాలకృత్యాలు తీర్చుకునే హైజెనిక్ వాష్‌రూమ్‌లు.. వేడి, చల్లని తాగునీటి సదుపాయాలు ప్రయాణికులకు అందుతున్నాయి. ప్రయాణం టికెట్ మాత్రం తప్పనిసరిగా ఉండాలండోయ్.

విశ్రాంతి గదులు: విజయనగరం రైల్వే స్టేషన్ లోకి ప్రవేశించగానే కుడివైపున ఆ శాఖ ఏసీ విశ్రాంతి గదుల సముదాయం ఏర్పాటు చేసింది. 12 ఏళ్లు దాటిన వారికి గంటకు రూ.20, 12 ఏళ్ల లోపు వారికి రూ.10 రుసుము వసూలు చేస్తారు.

డార్మెటరీ సింగిల్ బెడ్ రూమ్.. ఇందులో ఒకరు మాత్రమే ఉండాలి. 3 గంటలుంటే రూ.300, ఆరైతే 400, 9 గంటలుంటే 500, ఒక పూటకు 600, రోజుకు 900, రెండు రోజులకు 1,400 రూపాయలు ఛార్జీ వసూలు చేస్తారు.

★ సూట్ రూమ్‌లో డబుల్ కాట్ మంచంతో..

వ్యవధి(గంటల్లో)	3	6	9	12	24	48
అద్దె(రూ.లలో)	800	1,050	1,450	1,850	2,250	3,500

★ ఈ రూమ్‌లో అయిదుగురు వరకు ఉండొచ్చు.

ప్రత్యేక గదులతో వసతి

రైల్వే శాఖ కొన్ని సేవలను నేరుగా నిర్వహిస్తుండగా.. మరికొన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. ఏసీ గదులతో హోటల్ సేవలనూ అందుబాటులోకి తెచ్చింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఈ సేవలు పొందొచ్చు.

★డీలక్స్ డబుల్ బెడ్ రూమ్ అయితే..

వ్యవధి(గంటల్లో)	3	6	9	12	24	48
అద్దె(రూ.లలో)	550	750	1,000	1,200	1,800	3,000

ఇందులో నలుగురు ఉండొచ్చు.

మెరుగైన వైద్యం మరింత ఊతం

న్యూస్‌టుడే, శృంగవరపుకోట

ఆసుపత్రులకు త్వరలో ప్రత్యేక పరికరాలు

ఉమ్మడి జిల్లాలో 15 జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో గైనకాలజీ, పీడియాట్రిక్, ఆప్తమాలజీ వైద్యసేవలు మెరుగుపర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.30 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గౌర్ కొన్ని రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో ఉన్న జిల్లా ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లోని ఈ విభాగాల్లో ఉన్న పరికరాలు గుర్తించి, అవసరమైనవి సమకూర్చాలని ఆదేశాలిచ్చింది.

★ విజయనగరం జిల్లాలో వంద పడకలున్న రాజాం, ఎస్.కోట, గజపతినగరం, 50 పడకలున్న బాడంగి, చీపురుపల్లి, బొబ్బిలి, 30 పడకలున్న నెల్లిమర్ల, భోగాపురం ఆసుపత్రులకు పరికరాలు సమకూర్చనున్నారు.

ఏం ఇస్తారంటే..

గైనకాలజీ : వ్యాక్యూమ్ ఎక్స్ట్రాక్టర్ డబుల్ పౌచ్, లేబర్ టేబుల్, ఫీటల్ డాప్లర్, సీటీజీ మిషన్, బేబీ వార్మర్, ఎగ్జామినేషన్ లైట్

పీడియాట్రిక్: బేబీ వార్మర్, ఫొటోథెరపీ సింగిల్, బేబీ వేయింగ్ మిషన్

ఆప్తమాలజీ: కంటి పరీక్షలకు సంబంధించి పరికరాలు సమకూరుస్తారు.

★ఈ మూడు విభాగాల్లో వైద్య నిపుణుల పోస్టులు ఉన్నాయా, పడకలు, ముఖ్యమైన పరికరాలు ఉన్నాయా? అవసరమైనవి ఏమిటి.. తదితర వివరాలు సేకరించారు.

ఈనాడు, విజయనగరం

అసైన్డ్ భూముల వ్యవహారంలో ఇదీ నాయకుల తీరు

పేదల జీవనోపాధికి ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములు కొందరు పెద్దల చేతుల్లోకి వెళ్లేందుకు పార్టీల కతీతంగా పావులు కదులుతున్నాయి. తొలుత వైకాపా నేతలు ఒప్పందం కుదుర్చుకున్న భూముల పంచాయితీ వ్యవహారం ఇప్పుడు కూటమి పార్టీల నేతల చెంతకు వచ్చింది. మిగతా వ్యవహారాల్లో ప్రత్యర్థులుగా కనిపించే పార్టీల నాయకులు భూముల విషయంలో మనం.. మనం.. బరంపురం అంటూ పల్లవి అందుకున్నారు. మీరు పని చేయించండి.. రైతులతో తొలుత మేము కుదుర్చుకున్న ఒప్పందం మేరకు మాకు ఇవ్వాల్సింది ఇచ్చేయండి. . ఆపై ఎంత తీసుకున్నా మీ ఇష్టం.. అంటూ కూటమి కీలక నాయకులతో వైకాపా నాయకులు పెద్ద మనషుల ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.

మనం మనం.. బరంపురం

ఉభయ జిల్లాల వివరాలు (ఎకరాల్లో)

జిల్లా	ఫ్రీ హోల్డ్‌కు అనుమతి	రిజిస్ట్రేషన్లు జరిగినవి
విజయనగరం	5,618.36	191
పార్వతీపురం మన్యం	16,201.93	187

విజయనగరం జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ, కొత్తవలస, వేపాడ, ఎస్.కోట, మన్యం జిల్లాలో పార్వతీపురం, వీరఘట్టం, పాలకొండ మండలాల్లోని జాతీయ, రాష్ట్ర రహదారులకు సమీపంలోని డి-పట్టా భూములు పెద్ద ఎత్తున ఇలా చేతులు మారిపోయాయి. ఈ దశలో ఎన్నికల ప్రకటనతో వ్యవహారానికి బ్రేక్‌పడింది. మళ్లీ వైకాపా వస్తుందని.. ఫ్రీ హోల్డ్ ఉత్తర్వులు జారీ తర్వాత భూములు తమ స్వాధీనమవుతాయని అక్రమార్కులు ఆశపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వ్యవహారాన్ని ఎటూ తేల్చకుండా ఉంచింది.

భోగాపురం మండలంలోని అసైన్డ్ భూములు

కూటమి నేతల కోర్టులో అసైన్డ్ బాల్

మాజీ మంత్రి ఒకరు విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పరిధిలో సుమారు 400 ఎకరాలకు ఇలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కొంత అడ్వాన్స్ చెల్లించారు. ఒప్పంద గడువు ముగియడంతో ఇప్పుడు కూటమి నేతలతో జట్టుకట్టారు. ఇందులో తామేమీ పెట్టుబడి పెట్టేది లేకపోవడంతో వారూ తలూపారు. అనధికారికంగా వందలాది డి-పట్టా భూములు కొనుగోలు చేసిన వైకాపా నాయకులు రైతుల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఈ వ్యవహారం నుంచి ఎలాగైనా బయటపడాలని ప్రయత్నిస్తున్నారు. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో బినామీ పేరిట 800 ఎకరాలకు పైగా కొనుగోలు చేసి తన కుమారుడి మిత్ర బృందం తరపున రిజిస్ట్రేషన్‌కు విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు పావులు కదిపారు. రిజిస్ట్రేషన్లు జరిగే సమయంలో ఆరోపణలు వెల్లువెత్తడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. డెంకాడ మండలంలో 200 ఎకరాలు, భోగాపురం మండలంలో 800 ఎకరాల వరకు రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. భూములు చేతులు మారిన వ్యవహారంలో వీఆర్వోలదే కీలకపాత్ర. భూదస్త్రాల్లో ఒకరి పేరుంటే కొత్త పేరు నమోదు చేసిన వ్యవహారం గత ఏడాది ఆగస్టులో అప్పటి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా పరిశీలనలో వెలుగు చూసింది. గుర్తించిన లోపాలపై ఆయన సమర్పించిన నివేదిక ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

భోగాపురం ప్రాంతంలో భూములకు సంబంధించి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని నాయకుల మధ్య ఈ వ్యవహారం నడుస్తోందని తెలిసింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పేదల భూములపై వైకాపా అధికారంలో ఉన్నప్పుడే ఆ పార్టీ నాయకుల కళ్లు పడ్డాయి. డి-పట్టాలు అందుకుని ఇరవై ఏళ్లు పూర్తయిన లబ్ధిదారులకు ఆ భూములపై ప్రభుత్వం హక్కు కల్పించనుందని ఉప్పందింది. ఆ జీవో విడుదలకు ముందే వారు పేదల భూముల్లో అప్పట్లో వాలిపోయారు. అప్పటి రాష్ట్ర ఉన్నతాధికారి కుమారుడు, అతడి మిత్రులు రంగంలోకి దిగారు. జల్లెడ పట్టి డి-పట్టాదారుల వద్దకు తమ అనుచరులు, బినామీలను పంపి మాట్లాడించారు. బతిమాలి.. భయపెట్టి.. ఎకరానికి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలు ధర నిర్ణయించారు. ముందుగా ఎకరానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు చెల్లించారు. వ్యవహారమంతా తామే చూసుకుంటామని, రిజిస్ట్రేషన్ సమయంలో మిగిలిన మొత్తం చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారు.

పింఛనుదారులు ఇంటి నుంచి కాలు బయట పెట్టకుండా జీవన ప్రమాణ పత్రం(లైఫ్ సర్టిఫికెట్) సమర్పించే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. ఏటా పింఛనుదారులు ఈ పత్రం కోసం ప్రయాస పడేవారు. మీసేవ, నెట్ సెంటర్ల చుట్టూ తిరిగేవారు. చరవాణిలో ముఖ ఆధారిత గుర్తింపు ద్వారా ఇంటి నుంచే పత్రం పొందేలా యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది.

– న్యూస్‌టుడే, సాలూరు

జీవన ప్రమాణం అవసరం లేదు ప్రయాణం

రిజిస్ట్రేషన్ ఇలా..

Jeevan Pramaan

★ గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి జీవన్ ప్రమాణ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి.

★ ఆధార్ సంఖ్య, చరవాణి నంబరు, ఈ-మెయిల్ ఐడీ అందులో నమోదు చేసి సబ్‌మిట్ నొక్కాలి.

★ చరవాణికి ఓటీపీ వస్తుంది. అది ఎంటర్ చేస్తే ముఖ ఆధారిత గుర్తింపు నిర్ధారణ జరుగుతుంది.

★ చరవాణిలో సర్కిల్ వస్తుంది. ముఖం కనిపించేలా స్పష్టంగా చరవాణి కెమెరా ఉంచాలి. పచ్చటి గీతతో సర్కిల్ వచ్చి సందేశం చేరితే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది.

క్షణాల్లో నమోదు..

రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే యాప్ క్లోజ్ చేసి మళ్లీ ఓపెన్ చేయాలి. తర్వాత ఆధార్ సంఖ్య, చరవాణి నంబరు, ఈ-మెయిల్ ఐడీ అడుగుతుంది. ఈ వివరాలు నమోదు చేసి సబ్‌మిట్ కొట్టిన వెంటనే పింఛను వివరాలు వస్తాయి.

గతంలో పత్రం పొందనివారైతే..

వివరాలను కొత్తగా నమోదు చేయాలి. పేరు, పీపీవో నంబరు, బ్యాంకు, డిపార్టుమెంట్, పింఛను మంజూరు ఏజెన్సీ వివరాలు ఎంటర్ చేయాలి. తర్వాత రౌండ్ సర్కిల్‌లో ముఖం స్పష్టంగా కనిపించేలా ఫొటో తీసుకుంటే ప్రక్రియ పూర్తయినట్లు సందేశం వస్తుంది.

న్యూస్‌టుడే, రాజాం

పల్లె పాలనకు పదును

గ్రామ పంచాయతీల పాలనకు ప్రభుత్వం పదును పెట్టింది. క్లస్టర్ వ్యవస్థను రద్దుచేసి, స్వతంత్ర పాలన యూనిట్లుగా పంచాయతీలను ప్రకటించింది. రూర్బన్ పంచాయతీ (స్పెషల్ గ్రేడ్), గ్రేడ్-1, 2, 3.. ఇలా నాలుగు విధాలుగా పాలన సాగుతుంది. జిల్లాలో రామభద్రపురం, ఎస్.కోట, కొత్తవలస, చీపురుపల్లి, జామి, గరివిడి మండలంలోని కొండపాలెం పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా గుర్తించారు. రామభద్రపురం, జామి పంచాయతీలు గ్రేడ్-2, మిగిలిన నాలుగూ గ్రేడ్-1లో ఉండగా వీటి స్థాయి పెరిగింది.

స్పెషల్ గ్రేడ్: పదివేల జనాభా, రూ.కోటి ఆదాయం పైబడి ఉండాలి. గిరిజన పంచాయతీలో 5 వేల పైచిలుకు జనాభా ఉండాలి.

గ్రేడ్–1: 4 వేల నుంచి 5 వేల జనాభా, రూ.50 లక్షల నుంచి రూ.కోటి ఆదాయం ఉండాలి. మండల కేంద్రం పంచాయతీలు, గిరిజన పంచాయతీల్లో 3 నుంచి 5 వేలు జనాభా. ఆదాయ పరిమితి లేదు

గ్రేడ్–2: 2 నుంచి 4 వేల జనాభా, గిరిజన పంచాయతీల్లో 1,500 నుంచి 3 వేల మంది.

గ్రేడ్–3: 2 వేల లోపు జనాభా, గిరిజన పంచాయతీల్లో 1,500 లోపు.

గ్రేడ్ల వారీగా పంచాయతీలు

జిల్లా	రూర్బన్	గ్రేడ్-1	గ్రేడ్-2	గ్రేడ్-3
విజయనగరం	06	110	154	507

మరింత మెరుగైన సేవలు..

పంచాయతీల్లో మరింత మెరుగైన సేవలు ప్రజలకు అందనున్నాయి. రూర్బన్‌తో పాటు మరో మూడు గ్రేడ్లుగా పంచాయతీలు ఉంటాయి. కార్యదర్శుల పదోన్నతి, ఖాళీల భర్తీ తరువాత కొత్త విధానం అమల్లోకి తెచ్చే వీలుంది. – మల్లికార్జునరావు, డీపీవో

న్యూస్‌టుడే– రాజాం, వంగర

కడచూపు దక్కేదాకా భద్రంగా.. బాధ్యతగా..

జీవితం క్షణికం.. ఎప్పుడు ఎవరికి ఏ ఆపద ముంచుకొస్తుందో తెలియదు.. ఉరుకులు, పరుగుల జీవితంలో కన్నవారికి, కుటుంబ సభ్యులకు దూరంగా ఉపాధి, ఉద్యోగాల్లో స్థిరపడిన వారు ఎందరో. అయినవారు దూరమైతే చివరిసారి చూసేందుకు ఎంతదూరంలో ఉన్నా రెక్కలు కట్టుకుని వస్తుంటారు. అంతవరకూ మృతదేహాలను ఉంచడం కష్టం కావడంతో ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి వారికి స్వచ్ఛంద సంస్థలు అండగా నిలుస్తున్నాయి.

రాజాంలో అందుబాటులో ఉంచిన ఫ్రీజర్

రాజాం పట్టణంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ 2023లో రెండు ఫ్రీజర్లను అందుబాటులోకి తెచ్చింది. ఉచితంగానే వీటిని అందిస్తున్నారు. ఫ్రీజర్ కావాలని ఎవరైనా ఫోనులో సంప్రదించి తీసుకెళ్లొచ్చు. దూరభారం, ఇతర దేశాల నుంచి కావాల్సిన వారు వచ్చేందుకు రెండు మూడు రోజులు సమయం పట్టినా.. దీంట్లో మృతదేహాలను భద్రపరచొచ్చు. రవాణా ఛార్జీ పెట్టుకుంటే సరిపోతుంది. తిరిగి అప్పగించాక శుభ్రం చేసేందుకు రూ.500 రుసుముగా పెట్టారు. ఇది ఇవ్వలేకున్నా పర్వాలేదని మానవతా సంస్థ ఛైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తెలిపారు. అవసరమైనవారు 94417 08120, 94400 35749 నంబర్లలో సంప్రదించాలన్నారు.

★ వంగరలో మరొకటి సమకూర్చామని, 94414 14966 నంబరుకు సంప్రదించాలన్నారు. సంతకవిటి, రేగిడిలోనూ వారంలో అందుబాటులోకి వస్తాయని నిర్వాహకులు చెప్పారు.

వెలుగుల పలకకు ఇదో వేదిక!

అమృత్‌భారత్ పథకంలో విజయనగరం రైల్వే స్టేషన్‌లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. 2, 3 ప్లాట్‌ఫామ్స్ షెడ్ల మీద ఇలా పలకలు అమర్చారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోయిన వెంటనే సోలార్ ఆటోమెటిక్‌గా ఆన్ అయ్యేలా రైల్వే ఇంజినీర్లు ఏర్పాట్లు చేశారు.

– న్యూస్‌టుడే, విజయనగరం రింగురోడ్డు

పశువైద్య కళాశాలకు నేడు వీసీఐ బృందం

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి పశువైద్య కళాశాలను పరిశీలించేందుకు భారత పశువైద్య మండలి (వీసీఐ) నియమించిన ప్రత్యేక ప్రతినిధుల బృందం సోమవారం రానుంది. మూడు రోజుల పాటు కళాశాలలో సదుపాయాలు, మౌలిక వసతులు పరిశీలిస్తుందని అసోసియేట్ డీన్ మక్కెన శ్రీను తెలిపారు. కళాశాలకు వీసీఐ బృందం రావడం ఇది అయిదోసారి. 2020-21 విద్యా సంవత్సరం నుంచి బీవీఎస్సీ ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఏటా సదుపాయాలు పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో అనుమతులిచ్చేందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు.



న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

అవకాశాలకు అప్రెంటిస్ దారులు

ఐటీఐ విద్యార్థులకు జిల్లాస్థాయిలో అప్రెంటిస్ అవకాశాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కువ కంపెనీలు ముందుకొచ్చేలా ప్రత్యేక దృష్టిసారించారు. జిల్లాలో చిన్న, పెద్ద కలిపి సుమారు 50 కంపెనీలున్నాయి. ఏటా ఒకటి, రెండు గరిష్ఠంగా 50 మందికే అవకాశం కల్పిస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు మ్యాట్రిక్స్ కంపెనీ 25 మందికి అవకాశమిచ్చింది. తాజాగా రాజాం మండలం సంకిలి ఈఐడీ పేరీస్(ఇండియా) ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎక్కువ సంఖ్యలో అవకాశాలు కల్పించేందుకు ముందుకొచ్చింది. ఈ నెల 12న ఇందుకోసం ప్రభుత్వం రాజాంలో అప్రెంటిస్ మేళా నిర్వహించనుంది.

నెలకు రూ.13 వేలు భృతి

విద్యార్థులకు జాతీయ అప్రెంటిస్ మేళాను కేంద్రం మూడు నెలలకోసారి నిర్వహిస్తోంది. ఇందులో రాష్ట్రేతర కంపెనీలే అధికం. కేంద్రం నిర్దేశించిన మేరకు వీరికి నెలకు భృతి రూ.8,500 మాత్రమే. కంపెనీలు ఇచ్చేది రూ.7 వేలు, రూ.1500 కేంద్రం డీబీటీ ద్వారా చెల్లిస్తోంది. ఎంపికవుతున్నా ఈ మొత్తాలకు అభ్యర్థులకు ఆసక్తిచూపని పరిస్థితి. సంకిలి కర్మాగారం అప్రెంటిస్ కింద అభ్యర్థులకు రూ.13 వేలు భృతిని ప్రకటించడంతో అభ్యర్థులకు ప్రయోజనం కలగనుంది.

200 మందికి అవకాశాలు: రాజాం ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 12న సంకిలి ఈఐడీ పేరీస్(ఇండియా) ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో అప్రెంటిస్ మేళా నిర్వహిస్తోంది. 200 ఖాళీలు భర్తీ చేయనుండడంతో అవసరమైతే విజయనగరంలోనూ మేళా నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

అర్హతలిలా..

★ ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్ ట్రేడుల్లో ఉత్తీర్ణత పొందినవారు. ★ apprentice-shipindia.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ★ లేని వారు నేరుగా మేళాకు హాజరై రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ★ ఇతర వివరాలకు 95735 74643, 81214 50657 నంబర్లను సంప్రదించాలి.

(c) eenadu

ఆస్వాదిస్తూ.. ఆనందిస్తూ

పాచిపెంట మండలంలోని ఆలూరు గ్రామ సమీపంలో ఉన్న ధారగెడ్డ జలపాతం వద్ద పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. పలు ప్రాంతాల నుంచి వాహనాల్లో పిల్లాపాపలతో తరలి వచ్చి అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ కేరింతలు కొట్టారు. జలపాతం వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై వెంకట సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, పాచిపెంట

చలో తాటిపూడి.. చేద్దాం సందడి

జిల్లాలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గంట్యాడ మండలంలోని తాటిపూడిలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. కార్తిక వనవిహారాల కోసం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో చేరి ఆటపాటలతో అలరించారు. జలాశయం వద్ద స్వీయ చిత్రాలు తీసుకొని, అందాలను ఆస్వాదించారు. బోటు షికారు చేసేందుకు పోటీపడ్డారు. మరోవైపు వాహనాలను రోడ్డు పక్కన నిలిపివేయడంతో రాకపోకలకు స్వల్ప అంతరాయం కలిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – న్యూస్‌టుడే, గంట్యాడ

సాహస క్రీడలో చిన్నారి

పర్యాటకుల కోలాహలం

సీతంపేటలోని ఎన్టీఆర్ ఉద్యానంలో ఆనంద వేదిక వద్ద చిన్నారుల నృత్యం

కార్తికమాసం కావడంతో ఆదివారం సీతంపేట మన్యం కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. వన భోజనాలు చేశారు. పలు పర్యాటక ప్రాంతాల్లో తిరుగుతూ సందడి చేశారు. ఐటీడీఏ కేంద్రంలోని ఎన్టీఆర్ సాహస ఉద్యానంలో ఆనందంగా గడిపారు. ఆనంద వేదిక వద్ద వివిధ పాటలకు చిన్నారులు నృత్యాలు చేస్తూ అలరించారు. మెట్టుగూడ, సున్నపుగెడ్డ, మల్లి, జెలిగుబడ్డ, ఆడలి వ్యూ పాయింట్, జగతపల్లి రిసార్ట్స్ సందర్శించారు. – న్యూస్‌టుడే, సీతంపేట

మాట దాటేశారు.. కాలువ దాటమన్నారు

ఈ చిత్రం చూశారా.. ఎంత ప్రమాదకరంగా ఉందో కదా. రోజూ ఇక్కడ పదుల సంఖ్యలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తిరుగుతుంటారు.. ఏ మాత్రం అదుపుతప్పినా ముప్పు తప్పదు. గంట్యాడ మండలంలోని గొడియాడ అంగన్‌వాడీ కేంద్రం వద్ద దుస్థితి ఇది. ఆరు నెలల కిందట ముందు నుంచి మూడు అడుగుల లోతున భారీ మురుగు కాలువ నిర్మించారు. పనులు జరగక ముందే ఏడాది క్రితం తీర్మానం జరిగింది. తప్పనిసరిగా వంతెన వేస్తామని గుత్తేదారు, పంచాయతీ అధికారులు చెప్పారు. కానీ ఇంతవరకు కానరావడం లేదు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు, సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని ఐసీడీఎస్ పీవో ఉమాభారతి తెలిపారు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

నారీ లోకానికి నైపుణ్య తోరణం

టీటీడీసీలో వివిధ రకాల శిక్షణలు

కుట్టు శిక్షణంటే ఇష్టమా.. అయితే చక్కగా నేర్చుకోవచ్చు. దాని ద్వారా ఉపాధి పొందాలనుకుంటున్నారా.. ఇంకెందుకు ఆలస్యం వారే మెటీరియల్ ఇస్తారు.. నచ్చిన దుస్తులు కుట్టి.. అమ్ముకోవచ్చు.. కంప్యూటర్ కోర్సుల్లో చేరి నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని ఉందా.. ఇంకెందుకు ఆలస్యం ఇక్కడే ల్యాబ్‌ను ఆశ్రయించవచ్చు.. మొక్కలంటే ఇష్టమా.. అలాంటివారికి నర్సరీ కోర్సు.. లేకుంటే చేపల పెంపకం చేపట్టాలని భావిస్తున్నారా.. అయితే కొలనులు పిల్లలను అందిస్తారు.. ఒక్కటేమిటి.. అనేక ఉన్న రంగాల్లో మహిళలు రాణించేందుకు కృషి చేస్తోంది టీటీడీసీ. ఈ మేరకు అన్నిరకాల శిక్షణలు అందిస్తోంది.

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

విజయనగరంలోని టీటీడీసీ మహిళా ప్రాంగణంలో ఇప్పటికే పెరటి కోళ్ల పెంపకం, అర్హులైన వారికి అందిస్తారు. నర్సరీల ద్వారా మొక్కలను సరఫరా చేస్తున్నారు. ఇటీవల కంప్యూటర్, కుట్టు శిక్షణను ప్రారంభించారు. ఫ్యాషన్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్నారు. కొరమీను చేపల పెంపకం మెలకువలు నేర్పిస్తున్నారు. కూరగాయల పంటలు సైతం సాగు చేయిస్తూ ఉపాధి కల్పిస్తున్నారు.

మొక్కతో మేలు

2022 నుంచి ఇన్‌డోర్, ఔట్‌డోర్ మొక్కలను పెంచుతున్నారు. ఈ మేరకు ప్రత్యేకంగా నర్సరీని ప్రారంభించారు. ఎప్పటికప్పుడు కడియం నుంచి తెప్పిస్తున్నారు. ప్రత్యేక రోజుల్లో మండల కేంద్రాల్లో స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. రూ.50 నుంచి రూ.2500 లలో వైవిధ్య మొక్కలు ఉంటాయి. స్నేక్‌ప్లాంట్, రెడ్‌పామ్, ఆంతూరియం, లక్కీబ్యాంబూ, అరేకాపామ్, చైనీస్ బనియన్ తదితర రకాలున్నాయి. ● కూరగాయలు, ఆకుకూరలు, సాగు చేస్తున్నారు. జిల్లా సమాఖ్యే క్యాంటీన్ నడుపుతోంది.

రాయితీపై కొరమీను..

చేపల పెంపకానికి సిద్ధం చేసిన కొలను

ప్రస్తుతం ఇక్కడ కొరమీను చేపలను పెంచుతున్నారు. పొదుపు సంఘాల్లోని మహిళలకు సొంత భూమి, బోరు, ఇతర వసతులుంటే అందిస్తారు. ఎకరా భూమిలో అందులో పది సెంట్లు కేటాయిస్తే సరిపోతుంది. అయిదు సెంట్ల చొప్పున అరడుగుల లోతులో రెండు గుంతలు తవ్వాలి. ఒక్కో దాంట్లో 15 వేల లీటర్ల నీటిని అందుబాటులో ఉంచాలి. యూనిట్‌కు రూ.4.50 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇందులో 35 శాతం రాయితీ దక్కుతుంది. మిగిలిన సొమ్మును బ్యాంకుల నుంచి రుణంగా తీసుకోవచ్చు. జిల్లాలో ఇప్పటికే 40 మంది లబ్ధి పొందారు.

బ్యాచ్ వారీగా..

డీడీయూ, జేకేవై, సీడాప్ ద్వారా కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. ప్రతి మూడు నెలలకో బ్యాచ్ వస్తుంది. ఒకే సారి 70 మంది వరకు చేరవచ్చు. భోజనం, వసతి ఉచితం. తర్వాత ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ● 302 వరకు కుట్టు యంత్రాలను అందుబాటులో ఉంచారు. 45 రోజుల పాటు అవగాహన కల్పిస్తారు. కోర్సు పూర్తయ్యాక దుస్తులు కుట్టి అమ్ముకునేలా ప్రోత్సహిస్తారు. ప్రస్తుతం ఇలా 70 మంది ఉపాధి పొందుతున్నారు.

అందుబాటులో కుట్టు శిక్షణ కేంద్రం

కిచ్చాడలో కరిరాజుల తిష్ఠ

కురుపాం మండలంలోని కిచ్చాడ గ్రామ పరిసరాల్లో ఏనుగులు సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. గ్రామంలోని అరటి, చెరకు, వరి పంట పొలాల్లో తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించి, జనావాసాలకు దూరంగా వాటిని తరలించాలని కోరుతున్నారు. మరోవైపు పొలాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని, గజరాజులు కనిపిస్తే ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

గెట్ రెడీ.. ఇదిగో గారడీ

జియ్యమ్మవలస మండలం పెద మేరంగి కూడలిలోని సత్యకాలనీ పాఠశాల ఆవరణలో మేరంగి నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆసక్తి, గారడీ, అభినయ, ఓ కాకీ వానీ రావయ్య తదితర నాటికలు అలరించాయి. పరిషత్ అధ్యక్షుడు వాసుదేవరావు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

గారడీ నాటికలో ఓ సన్నివేశం

అరచేతిలోనే లెక్కాపత్రం

రాజాం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకుంటున్న బ్యాంకు రుణాలు, కడుతున్న పొదుపు మొత్తాలకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇక నుంచి ఆయా కార్యకలాపాలన్నింటినీ 'మన డబ్బులు- మన లెక్కలు' యాప్‌లో స్వయంగా చూసుకోవచ్చు. జిల్లాలో రెండు విడతల్లో పది గ్రామ సంఘాల్లో ప్రయోగాత్మకంగా పరిశీలించారు. విజయవంతం కావడంతో అన్ని ప్రాంతాల్లో దశలవారీగా అమలు చేసేందుకు రంగంలోకి దిగారు. ప్రతి పది సంఘాలకు ఒక ఈ-నారీని నియమించి, మండలాల వారీగా శిక్షణలు పూర్తి చేశారు. యాప్ ద్వారా లావాదేవీలకు పూర్తి పారదర్శకత ఉంటుందని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు. డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

- జిల్లాలో గ్రామ సమాఖ్యలు: 1,023
- రిజిస్ట్రేషన్ పూర్తయినవి: 938
- వాటి పరిధిలోని సంఘాలు: 40,153
- అందులోని సభ్యులు: 4.32 లక్షలు
- నమోదు పూర్తయినవి: 3,894
- నియమితులైన ఈ-నారీలు: 4,016

ఇవీ ప్రయోజనాలు..

సభ్యులు తమ చరవాణిలో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రతిఒక్కరికీ 20 అంకెలతో కూడిన ఐడీ ఉంటుంది. చివరి నాలుగు అంకెలను పాస్‌వర్డ్‌గా ఉపయోగించి లాగిన్ అవ్వొచ్చు. వ్యక్తిగత, గ్రూపు లావాదేవీలన్నీ వెంటనే ప్రత్యక్షమవుతాయి. నెలకు ఎంత వాయిదా చెల్లిస్తున్నారు.. ఇంకెంత అప్పు మిగిలి ఉంది తదితర వివరాలను తెలుసుకోవచ్చు. నిరక్షరాస్య మహిళలు మైక్ ఆప్షన్ ద్వారా ఆడియో రూపంలో వినొచ్చు.

ఎనిమిదో తరగతిలో మందలించారని..
ఆరేళ్లుగా వెంటాడుతున్న విద్యార్థి

రామభద్రపురం, న్యూస్‌టుడే: ఎన్నేళ్లయినా.. ఎక్కడున్నా చిన్నప్పుడు చదువు చెప్పిన ఉపాధ్యాయులను మాత్రం మరిచిపోలేము. కలిసినప్పుడల్లా నమస్కరించకుండా ఉండలేం. కానీ.. అల్లరి చేస్తున్న కారణంగా ఆరేళ్ల క్రితం తరగతి గదిలో మందలించిన గురువుపై ఓ విద్యార్థి కక్ష పెంచుకున్నాడు. అప్పటి నుంచి తరుచూ దాడికి యత్నిస్తున్నాడు. ఈ ఘటన రామభద్రపురం మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. జుమ్మువలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సువ్వాడ వెంకట అప్పలనాయుడు కోట శిర్లాం యూపీ పాఠశాలలో 2019లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ప్రవర్తన బాగోలేదని, సక్రమంగా చదువుకోవాలని అప్పట్లో ఎనిమిదో తరగతి విద్యార్థి చందాపురం గ్రామానికి చెందిన వై.దిలీప్‌ను మందలించారు. అప్పటి నుంచి కక్ష పెట్టుకున్న దిలీప్ గతేడాది అక్టోబరు 4న ప్రధానోపాధ్యాయుడిపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. అప్పట్లో యువకుడిపై కేసు కూడా నమోదైంది. అయినప్పటికీ అప్పుడప్పుడూ బెదిరిస్తున్నాడు. శనివారం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా.. మధ్యలో అడ్డగించాడు. స్థానికులు కొంతమంది తోడుగా వచ్చి హెచ్‌ఎంను పంపించారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడికి మతిస్థిమితం లేదని, తల్లిదండ్రులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఎస్సై ప్రసాదరావు తెలిపారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి బబిత

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

డెంకాడ, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత కోరారు. జాతీయ న్యాయసేవల దినోత్సవం సందర్భంగా డి.కొల్లాంలో ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయకముందు న్యాయసేవా సంస్థను సంప్రదిస్తే సామరస్యంగా పరిష్కరించుకోవచ్చన్నారు. సివిల్ జడ్జి, న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రవిబాబు, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్సై సన్యాసినాయుడు, సర్పంచి ఎ.శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి దుర్మరణం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కాలినడకన వెళ్తున్న ఓ వృద్ధుడిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతిచెందిన ఘటన పార్వతీపురం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సిపురానికి చెందిన దుర్గయ్య(65) ఆదివారం ఉదయం నడుచుకుంటూ పార్వతీపురానికి బయలుదేరారు. ఓలేటి ఫారం దాటిన తర్వాత వెనుకనుంచి వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు, మనవళ్లున్నారు. కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై సంతోషి తెలిపారు.

చికిత్స పొందుతూ విశ్రాంత ఉద్యోగి మృతి

మక్కువ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలిలో ఈనెల 4న బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విశ్రాంత ఉద్యోగి ఆకుల తవిటినాయుడు(78) ఆదివారం మృతి చెందారు. కిరాణా సామగ్రి కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వచ్చిన ఆయనను దుగ్గేరు వెళుతున్న బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఎడమకాలు విరిగి తీవ్ర రక్తస్రావం జరిగింది. పరిస్థితి విషమంగా ఉందని ఆయనను విశాఖపట్నం తరలించారు. అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మక్కువ ఎస్సై వెంకటరమణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృత్యువాత

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై శ్రీకాకుళం నగర సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి దుర్మరణం పాలైంది. పోలీసుల వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన ఎన్.వేణు(22) అనే యువతి, శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్లారు. కొత్త రహదారి వద్ద ఓ లారీ డ్రైవర్ నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా వాహనంతో ఢీకొన్నారు. ఘటనలో వేణు కిందపడి పోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. లారీ డ్రైవర్, శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు చేరుకుని సర్వజనాసుపత్రికి తరలించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	125	220	230

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

విజయనగరం-ప్రియనగర్ కాలనీ D-మార్ట్ దగ్గర 167 (30x50) గజాలు G+2 ఉత్తరం ఫేస్ ఇల్లు అమ్మకం. బ్యాంక్ లోన్ సౌకర్యం. సం|| 9441749727.

JOBS

Restaurant Waiter Jobs కొరకు బాయ్స్&గర్ల్స్ కావలెను. ఇంటర్వ్యూ: హోటల్ విస్సర్‌పార్క్, KGH ఎదుట,వైజాగ్. బాయ్స్‌కు వసతి భోజనం. 9849581868

VZM 90 రోజులు ఉచితంగా ఎలక్ట్రానిక్స్ & హార్డ్‌వేర్ సెక్టారులో ట్రైనింగ్‌తోపాటు ఉద్యోగం కల్పించబడును. SSC (పాస్) ఇంటర్, డిగ్రీ, ITI (పాస్/ ఫెయిల్) Age:18 to 35 ✆ 7036406699, 9493359472.

విజయనగరం జిల్లాలో గల రాజాం, పాలకొండ, వీరఘట్టం రూరల్ & అర్బన్ ప్రాంతాల నందు శ్రీరామ్ చిట్స్ & లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నందు పనిచేయుటకు BDES, రెన్యువల్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్, డిపాజిట్ Exe. ETS కావలెను. మీ ఊర్లోనే మంచి ఉద్యోగం ఇది పూర్తిగా ఆన్ రోల్ జాబ్, మినిమం శాలరీ 18,000/- PF, ESI, గ్రూప్ Ins, సం||కు బోనస్ 28500/- ఏదైనా డిగ్రీ చదివి 35 సం||లోపు ఉండి అనుభవాన్ని బట్టి మంచి జీతం కలదు. Salaried Do'sకు 10th పాసై KYC కలిగి ఉంటే ప్రతి నెల శాలరీ & ORCలో రాయల్టీ కమీషన్ వస్తుంది. RMP, ఇన్సురెన్స్, చిట్‌ఫండ్ ఏజెంట్స్, లోన్స్ ఇతరులు ✆ 9849824071.

SECURITY GUARDS

వైజాగ్ సిటీ, పైడిభీమవరం, తగరపువలస పనికొరకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ & గార్డ్స్ రూమ్, భోజనం. జీతం: 20వేలు, 36 వేలు, ✆ 9014709272.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315 /-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609

ప్రతిభను ప్రోత్సహిస్తే..
అపజయాలకు చెక్ పెడతా

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు విశాఖలోని గాజువాక పరిధిలోని కణితి జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పి.మిన్ను అమన్. మన్యం జిల్లాలోని సీతానగరం మండలం జోగింపేట ప్రతిభా పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభ చాటాడు.

ఆన్‌లైన్‌లోనే..

మిన్ను అమన్

తండ్రి శాంతి రాజ్.. కుమారుడి ఆసక్తిని గమనించి చిన్నతనం నుంచి ప్రోత్సహిస్తున్నారు. మూడేళ్ల కిందట ఆన్‌లైన్‌లో శిక్షణ ఇప్పించారు. ఏడాదిగా విజయవాడ, విజయనగరం, విశాఖలో జరిగిన పలు పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొని సత్తాచాటాడు. ప్రస్తుతం జరుగుతున్న టోర్నీలో విశాఖ జిల్లా జట్టు తరపున పాల్గొన్నాడు. వ్యక్తిగత విభాగంలో నాలుగో రౌండ్‌లో త్రుటిలో జాతీయ స్థాయి మీట్‌లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయాడు. వ్యక్తిగత శిక్షణ అందించే అవకాశం లేకపోవడంతో ఆన్‌లైన్ సేవలను వినియోగించుకుని సిద్ధమవుతున్నట్లు అమన్ చెప్పాడు. ఆర్థికంగా చేయూతనందిస్తే సత్తా చాటుతాననే ధీమాను వ్యక్తం చేస్తున్నాడు.

– న్యూస్‌టుడే, సీతానగరం

సంపూర్ణ పోషణ.. ఆరోగ్య రక్షణ

న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండేలా సమతుల ఆహారం అందించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. జిల్లాలో చాలామంది గర్భిణులు, చిన్నారులు అనారోగ్యం, రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరితో పాటు కౌమార బాలికలకు గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధికారులు పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సిబ్బంది కార్యక్రమాలు చేపడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జిల్లాలో వివరాలు ఇలా..

- ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 10
- అంగన్‌వాడీ కేంద్రాలు: 2,075
- గర్భిణులు: 4,981
- బాలింతలు: 5,037
- మూడేళ్లలోపు చిన్నారులు: 21,122
- 3-6 ఏళ్ల మధ్య పిల్లలు: 19,572

లోపాలు గుర్తించి.. బొమ్మలతో వివరించి..

● చిన్నారుల్లో వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు లేకపోయినా, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత కనిపిస్తే పోషకాహార లోపం ఉన్నట్లు గుర్తించి పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ● ఆకుకూరలు, కోడిగుడ్లు, పాలు తీసుకోవడం ద్వారా మానసికంగా, శారీరకంగా ఎలాంటి ఎదుగుదల ఉంటుందో బొమ్మల రూపంలో వివరిస్తున్నారు. ● చిన్నారులు ఒకేసారి ఎక్కువగా కాకుండా తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నారు. ● వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని చెబుతున్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి..

గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవాలి. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నెలరోజులపాటు పోషకాహార మాసోత్సవాల్లో అవగాహన కల్పించాం. షెడ్యూలు ప్రకారం రోజు వారీ చేసిన కార్యక్రమాలను పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశాలిచ్చాం. ఆమేరకు ఆహారం తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. సద్వినియోగం చేసుకోవాలి.

- కనకదుర్గ, పీడీ, ఐసీడీఎస్, మన్యం జిల్లా

ఎక్కడో పుట్టాం.. ఇక్కడే కలిశాం

కొత్తవలస మండలం వియ్యంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-08 వరకు చదువుకున్న 140 మంది విద్యార్థులు ఆదివారం ఇదే బడిలో కలుసుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో స్థిర పడిన వారంతా వచ్చారు. చిన్ననాటి మిత్రులను కలిసి, అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. గురువులను సత్కరించారు. పాఠశాలకు ప్రింటర్‌ను అందజేశారు. బడి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మొయ్యి ముత్యాల నాయుడు, కింతాడ పోలినాయుడు సారథ్యంలో కార్యక్రమం నిర్వహించారు.

– న్యూస్‌టుడే, కొత్తవలస

వియ్యంపేటలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వ్యవసాయం గిట్టుబాటు కాక ఆత్మహత్యలు

ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న నాయకులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: వ్యవసాయం గిట్టుబాటు కాక దేశంలో ఏటా వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అన్నారు. ఆదివారం ఎస్.కోటలో నిర్వహించిన రైతు సంఘం జిల్లా 9వ మహాసభలో ప్రసంగించారు. అంతకుముందు భారీ ర్యాలీ చేపట్టి, జెండా ఆవిష్కరించారు. అమరులైన రైతులకు, సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ అన్నారు. సింగిరెడ్డి గోపాలం, బి.రాంబాబు, ఎం.కృష్ణమూర్తి, కె.అప్పారావు, టి.సూర్యనారాయణ, నాయకులు లక్ష్మి, రెడ్డి శంకరరావు, కె.సురేష్, శ్రీనివాస్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

పావులు కదిపారు.. పతకం పట్టారు

జాతీయ స్థాయికి ఎంపికైన అండర్-19 బాల బాలికలు

సీతానగరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి చదరంగం క్రీడా పోటీల్లో అనంతపురం జిల్లా బాలబాలికలు సత్తా చాటారు. అండర్-19 విభాగంలో బృంద పోటీల్లో అనంతపురం బాలురు, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. సీతానగరం మండలం జోగింపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలోని మినీ ఆడిటోరియంలో ఆదివారం పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. వ్యక్తిగత, జట్ల విజేతలకు తహసీల్దారు ప్రసన్నకుమార్, ఎంపీడీవో వెంకటరావు, ఎంఈవోలు సూరిదేముడు, వెంకటరమణ, స్వచ్ఛాంధ్ర బోర్డు డైరెక్టరు బి.లక్ష్మణరావుల చేతుల మీదుగా పతకాలు అందజేశారు. అండర్-14, 17, 19 వ్యక్తిగత విభాగాల్లో బాలికలు 15 మంది, బాలురు 15 మంది జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.మురళి తెలిపారు.

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి- 80085 74348

? కొప్పరవలస, రుషింగి గ్రామాల్లో కాలువల్లో పూడికలు పేరుకుపోయాయి. మురుగు నిలిచిపోతోంది. దుర్వాసన భరించలేకపోతున్నాం. - **స్థానికులు** ★ కార్యదర్శులతో మాట్లాడి, చర్యలు చేపడతాం. - **రామారావు, పంచాయతీ విస్తరణాధికారి** – వంగర

? బుడతనాపల్లి ఎస్టీ కాలనీలో కాలువలు పూడికతో నిండాయి. - **స్థానికులు** ★ పూడికలు తీయిస్తాం. - **లక్ష్మి, సచివాలయ కార్యదర్శి** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? రామభద్రపురం మేజర్ పంచాయతీలో రహదారి వద్ద తుప్పలు పెరిగిపోయాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. - **స్థానికులు** ★ చర్యలు తీసుకుంటాం. - **సూరిబాబు, ఈవో** – న్యూస్‌టుడే, రామభద్రపురం

? పెణసాం- గొడియాడ ప్రధాన రహదారి పైకి విద్యుత్తు నియంత్రిక స్తంభం ఒరిగింది. - **ప్రయాణికులు** ★ స్తంభాన్ని సరిచేస్తాం. - **శ్రీనివాసరావు, ఏఈ** – గంట్యాడ గ్రామీణం

పైపులైనుకు మరమ్మతులు

స్పందనకు వందనం

రామభద్రపురం: రామభద్రపురం మేజర్ పంచాయతీలోని రక్షిత తాగునీటి పైపులైను మరమ్మతులకు గురైంది. దీనిపై ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బాగుకు చర్యలు తీసుకున్నారు. ట్యాంకును శుభ్రం చేసి, రక్షిత నీరు పరీక్షించి, రెండు రోజుల్లో అందిస్తామని ఈవో సూరిబాబు తెలిపారు.

కళాశాల ప్రాంగణం బాగుపడింది

రాజాం పట్టణం న్యూస్‌టుడే: రాజాం పట్టణం పరిధిలోని సారథి వద్ద ఉన్న బాలికల జూనియర్ కళాశాల పరిసరాలు అధ్వానంగా మారాయి. దీనిపై ఈనెల 6న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించి, కళాశాల ప్రాంగణం మట్టితో చదును చేశారు.

పూడికల తొలగింపు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బుడతనాపల్లి ఉన్నత పాఠశాల రహదారిలో చేరిన మురుగును ఎట్టకేలకు తొలగించారు. కాలువలు పూడికలతో నిండి దుర్వాసన వచ్చేది. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల 'ఈనాడు'లో వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. పూడికలు తొలగించారు.

సహాయనిధితో పేదలకు మేలు

రాజాం: సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. రాజాంలోని పార్టీ కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర మండలాల్లోని 13 మందికి మంజూరైన రూ.6,62,782 విలువైన చెక్కులను ఆదివారం అందజేశారు. జి.నారాయణరావు, ఎన్.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు. ★ బాడంగి: గజరాయునివలసకు చెందిన పి.శ్రీనుకు రూ.50 వేల చెక్కు మంజూరైంది. సర్పంచి ఎం.సత్తిబాబు అందించారు.

తెరపై ఈనాడు

★ ఎస్‌వీసీ సీతారామా: **మాస్ జాతర** ★ ఎస్‌వీసీ సీతారామా మినీ: **జటాధర** ★ ఎస్‌వీసీ అప్సర: **ది గర్ల్ ఫ్రెండ్** – న్యూస్‌టుడే, రాజాం

బొబ్బిలిలో.. లక్ష్మీ: **జటాధర** ★ వాసవి: **మాస్ జాతర** ★ టీబీఆర్ స్క్రీన్-1: **ది గర్ల్ ఫ్రెండ్** – న్యూస్‌టుడే, బొబ్బిలి

కొండ.. ఆక్రమణలే నిండా

న్యూస్‌టుడే– గుర్ల, గరివిడి

పచ్చని హారం.. పాడి పశువుల మేతకు, పక్షుల కిలకిలరావాలకు ఆలవాలం గుర్ల మండలం కొండగండ్రేడు కొండ.. ఇదంతా ఒకప్పటిమాట. ఇప్పుడు ఆక్రమణదారులు ఆక్రమించి సాగుకు అనుకూలంగా మార్చేస్తున్నారు. ఏటా కొండ తరిగిపోతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనుమరుగయ్యే ప్రమాదముందంటున్నారు. ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

కొండను చదును చేసిన ప్రాంతం

కొండగండ్రేడు గ్రామంలోని కొండ విస్తీర్ణం 1,040 ఎకరాలు. దీన్ని గ్రామస్థులు పశువులు మేపేందుకు వినియోగిస్తున్నారు. పలువురు మాజీ సైనికులు కొండ వద్ద భూమిని కేటాయించాలని ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకోవడంతో రెవెన్యూ అధికారులు సుమారు 18 మందికి ఒక్కొక్కరికి ఐదు ఎకరాల చొప్పున 90 ఎకరాలు కేటాయించి పట్టాలు ఇచ్చారు. ఇటీవల ఒక మాజీ సైనికుడికి అయిదు ఎకరాలు కేటాయించగా.. ఇచ్చిన ప్రాంతానికి మించి అదనంగా చదును చేసేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు సర్వే జరిపించి, ఇచ్చిన అయిదు ఎకరాలకు హద్దులు చూపించారు. అంతకు మించి అదనంగా చదును చేసే పనులను నిలుపుదల చేయించారు. ఇక్కడ పట్టాదారులకు ఇచ్చిన భూములు కొంత్తేతే.. అదనంగా చదును చేసుకుని తోటలు సాగుచేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

11.50 ఎకరాల్లో మామిడి తోటలు..

కొండ దిగువున సుమారు 11.50 ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు పెత్తందారులు ఆక్రమించి, మామిడి తోటలను సాగుచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొండ పరివాహక ప్రాంతంలో రెవెన్యూ అధికారులు పట్టాదారులకు ఇచ్చిన మొత్తం భూముల విస్తీర్ణం ఎంత? సాగులో ఉన్న భూమి ఎంత? అన్నది సమగ్ర సర్వే జరిపి, అదనంగా సాగులో ఉన్న ఆక్రమణలన్నీ తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

కొండగండ్రేడు కొండను ఎవరు ఆక్రమించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. మాజీ సైనికులకు పట్టా ప్రకారం ఇచ్చిన భూములనే చదును చేసుకోవాలి. అంతకుమించి చేస్తే స్వాధీనం చేసుకుంటాం. పట్టాలు లేకుండా కొండ భూమిని సాగుచేయడంపై పరిశీలించి, తగిన చర్యలు చేపడతాం.
– పి.ఆదిలక్ష్మి, తహసీల్దారు, గుర్ల

రహదారే పార్కింగ్ స్థలమా..?

గజపతినగరం, పురిటిపెంట పంచాయతీల్లోని దుకాణాల వద్ద రోడ్డు పక్కన వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. స్థలం లేకపోవడంతో జాతీయ రహదారికి ఇరువైపులా, మెంటాడ రోడ్డు, గజపతినగరం ప్రధాన దారిలో పార్కింగ్ చేస్తున్నారు. సచివాలయం, ఆసుపత్రి రోడ్డు, తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే మార్గంలోనూ ఇదే పరిస్థితి. పంచాయతీ, రెవెన్యూ అధికారులతో మాట్లాడి, ప్రత్యామ్నాయ స్థలం పరిశీలిస్తామని ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు అన్నారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

భవనం ప్రారంభించేదెన్నడో

గంట్యాడ మండలం గొడియాడలో రూ.23.90 లక్షలతో నిర్మించ తలపెట్టిన రైతుసేవా కేంద్రం అయిదేళ్లుగా అసంపూర్తిగా ఉంది. స్లాబు వరకు పనులు చేసి వదిలేశారు. దీంతో చుట్టూ తుప్పలు పేరుకుపోయి అధ్వానంగా దర్శనమిస్తోంది. సిబ్బంది గ్రామ శివారులోని సామాజిక భవనంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అధికారులు స్పందించి, పూర్తిచేయించాలని కోరుతున్నారు. త్వరలో పూర్తిచేసేలా చర్యలు చేపడతామని పీఆర్ ఏఈ కృష్ణమూర్తి అన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

ఇంకెన్నాళ్లీ పాట్లు..?

బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి సమీపంలో బొబ్బిలి-తెర్లాం రహదారిలో ఆదివారం భారీ లారీ గుంతలో కూరుకుపోయింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇరువైపులా వాహనాలు బారులుదీరాయి. సీఐ సతీష్‌కుమార్, ఎస్సై జ్ఞానప్రసాద్ క్రేన్ సాయంతో లారీని బయటకు తీశారు. అప్పటికే తెర్లాం వైపు పిరిడి కూడలి పెట్రోల్ బంకు, బొబ్బిలి వైపు అమ్మిగారి కోనేరుగట్టు వరకు వాహనాలు ఆగిపోయాయి. పోలీసులు సకాలంలో స్పందించడంతో సమస్య తీరింది. – న్యూస్‌టుడే, బొబ్బిలి

పేదలకు ఉచిత న్యాయ సహాయం

మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

గజపతినగరం, న్యూస్‌టుడే: పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, దరఖాస్తు చేసుకుంటే న్యాయసేవా సాధికార సంస్థ సహకారం అందిస్తుందని గజపతినగరం కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా కాలంరాజుపేట గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గజపతినగరం ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు, సర్పంచి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతలు తెలుసుకోవాలి

మాట్లాడుతున్న న్యాయమూర్తి హేమస్రవంతి జానకీరామ్

బొబ్బిలి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలు తెలుసుకుంటే ఇతరులతో గొడవలు ఉండవని జూనియర్ సివిల్ జడ్జి హేమస్రవంతి జానకీరామ్ అన్నారు. ఆదివారం బొబ్బిలి న్యాయస్థానంలో న్యాయసేవల దినోత్సవం నిర్వహించారు. ఆమె హాజరై మాట్లాడారు. జాతీయ న్యాయసేవా అథారిటీ పథకాలపై అవగాహన కల్పించారు. మానవహక్కుల కమిటీ అధ్యక్షురాలు మానస, న్యాయవాదులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వనసమారాధన

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని తోటలో ఆదివారం కార్తిక వనసమారాధనలు సందడిగా జరిగాయి. చౌడే రామలింగేశ్వర దేవాంగ సంఘం, తూర్పుకాపు సంఘంతో పాటు పలు కుల సంఘాలు వనసమారాధన నిర్వహించాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిళలు, బాలికలు ఉత్సాహంగా నృత్యాలతో సందడి చేశారు.

వంతెన పనులు వేగవంతం చేయాలి

కాజ్‌వే పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పారాది వద్ద వేగావతి నదిపై నిర్మిస్తున్న వంతెన పనులు వేగవంతం చేయాలని, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూస్తానని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న కాజ్‌వేను, నిర్మాణంలో ఉన్న వంతెన పనులను ఆదివారం పరిశీలించారు. కాజ్‌వే మరమ్మతులకు రూ.12 లక్షలు మంజూరుకు కలెక్టర్ అంగీకరించారన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ర.భ.శాఖ ఏఈ రాజు, నాయకుడు అల్లాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం ప్రదానం

గజపతినగరం: మర్రివలస పాఠశాల ఉపాధ్యాయుడు కనకల చంద్రరావు ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో జాతీయస్థాయి గురుదేవోభవ అవార్డును స్వీకరించారు. ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతులమీదుగా అందించారు. చంద్రరావు సేవలను అభినందించారు.

జనసేన బలోపేతానికి కృషి చేయాలి.. తెర్లాం: గ్రామాల్లో జనసేన బలోపేతానికి కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. ఆదివారం తెర్లాంలో మండల నాయకుల సమావేశం నిర్వహించారు.

లక్ష్యంతో చదువులు సాగించాలి

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివినప్పుడే లక్ష్యాలను చేరుకుంటారని సుపథ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు యు.వి.ఎ.ఎన్ రాజు అన్నారు. ఆదివారం లక్కిడాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. 8 పాఠశాలలకు చెందిన 110 మంది పాల్గొన్నారు. లచ్చిరెడ్డి కృష్ణ తదితరులు ఉన్నారు.

గంజాయి రహిత జిల్లానే లక్ష్యం

తెర్లాంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ దామోదర్

రాజాం, బొబ్బిలి గ్రామీణం, తెర్లాం, సంతకవిటి, రామభద్రపురం, బాడంగి, న్యూస్‌టుడే: గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. రాజాం, సంతకవిటి, బొబ్బిలి, తెర్లాం, రామభద్రపురం, బాడంగి పోలీస్ స్టేషన్లను ఆదివారం సందర్శించారు. గంజాయి విక్రయించినా.. తాగినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. రాజాం పట్టణంలోని పాత పోలీస్ క్వార్టర్స్ స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. పెట్రోలు బంకు ఏర్పాటు చేసే వీలుందన్నారు. ట్రాఫిక్ వింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంతకవిటిలో శిథిలావస్థలో ఉన్న గృహాలను పరిశీలించారు. డీఎస్పీలు ఎస్.రాఘవులు, భవ్యారెడ్డి, సీఐలు కె.అశోక్‌కుమార్, సతీష్‌కుమార్, నారాయణరావు, ఎస్సైలు రమేష్, జ్ఞానప్రసాద్, బి.సాగర్‌బాబు, ప్రసాదరావు, ఆర్.గోపాలరావు, తారకేశ్వరరావు పాల్గొన్నారు. ★ దిబ్బగుడివలసలో ఎస్పీ రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.

టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక

ఎంపికైన జిల్లా జట్టు

గరివిడి, న్యూస్‌టుడే: విశాఖలో ఈనెల 17 నుంచి 19 వరకు జరగనున్న అండర్-11, 13, 15, 17, 19 రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు జిల్లా బాలబాలికల జట్లను ఆదివారం ఎంపిక చేశారు. గరివిడి శ్రీచైతన్య పాఠశాలలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన బాలబాలికల జట్లను రాష్ట్రస్థాయికి పంపుతున్నట్లు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.కృష్ణమూర్తి తెలిపారు.

విద్యార్థులకు పద్య పఠన పోటీలు

ప్రశంసాపత్రాలు పొందిన బాలలతో నిర్వాహకులు

రాజాం, న్యూస్‌టుడే: వికాస తరంగిణి ఆధ్వర్యంలో విద్యార్థులకు రాజాంలో పద్య పఠన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ఆదివారం వికాసతరంగిణి కార్యాలయంలో అందించారు. పిల్లల్లో నైతిక విలువలు, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని విజయ కోదండ రామాశ్రమం అధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి అన్నారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

రాజాం: రాజాం మండలం ఒమ్మి కూడలి వద్ద రాజాం- రామభద్రపురం ప్రధాన రహదారిలోని కూరగాయల దుకాణంలోకి ట్రాక్టర్ అదుపు తప్పి దూసుకెళ్లింది. ఒమ్మికి చెందిన కూరగాయల వ్యాపారి పి.నరసమ్మ, పెరుమాళికి చెందిన బి.శివరామినాయుడు, తెర్లాం మండలం నందిగాం గ్రామానికి చెందిన సీహెచ్ గణేష్‌కు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. క్షతగాత్రులను రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు.

రూ.9 వేలు పింఛను చెల్లించాలి

బొబ్బిలి: పరిశ్రమల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఈపీఎఫ్ పింఛనర్లకు ప్రభుత్వం కనీస పింఛనుగా నెలకు రూ.9 వేలు చెల్లించాలని అఖిల భారత రిటైర్డ్ పింఛనర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.శేషగిరి, గౌరవాధ్యక్షుడు పి.శంకరరావు డిమాండు చేశారు. బొబ్బిలిలో మాట్లాడారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

సంతకవిటి: తలతంపరలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం మండలానికి చెందిన నలుగురికి రూ.1,80,481 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు. కొల్ల అప్పలనాయుడు, గట్టి బాను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కమిషనర్

రాజాం: రాజాం కొత్త కమిషనర్ ఎ.రామచంద్రరావు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు.

క్రీడాకారుడికి చేయూత

రాజాం: జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున ఎంపికైన రాజాం పురపాలిక పరిధిలోని డోలపేటకు చెందిన టొంపల జగదీష్‌కు గ్రామస్థులు అండగా నిలిచారు. సీనియర్ రంగస్థల కళాకారుడు గులివిందల ఆదినారాయణ రూ.10 వేలు నగదు అందించి, సత్కరించారు. ఆటో డ్రైవర్ చీమల హరి మరో రూ.5 వేలు సమకూర్చారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

దత్తిరాజేరు: దత్తిరాజేరు మండలం మరడాం సమీపంలో జాతీయ రహదారిపై బొబ్బిలి నుంచి విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు ఉన్న లారీని ఢీకొట్టింది. ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. ★ మరడాం సమీపంలో ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ రెండు ఘటనలపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని, క్షతగాత్రులకు సంబంధించి సమాచారం రాలేదని ఎస్.బూర్జవలస ఎస్సై రాజేష్ పేర్కొన్నారు.

విద్యార్థుల వైజ్ఞానిక యాత్ర

విశాఖలో బౌద్ధ స్తూపాల వద్ద పాఠశాల బృందం

బాడంగి, న్యూస్‌టుడే: బాడంగి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల్లో విద్యా- వైజ్ఞానిక యాత్ర నిర్వహించారు. విజయనగరంలో రామనారాయణం, విశాఖలో కంబాలకొండ, సబ్ మెరైన్ మ్యూజియం, బౌద్ధస్తూపాలు, తేనేటి పార్కు, ఖగోళ పరిశీలన పరికరాలు, భీమిలి బీచ్ తదితర ప్రాంతాలు చూపించి, అవగాహన కల్పించారు.

యువకులకు సత్కారం

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: షికారుగంజి గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు యువకులను విజయనగరంలోని శాలివాహన సంఘం సభ్యులు ఆదివారం సత్కరించారు. డీఎస్సీలో మూడు ఉద్యోగాలు సాధించిన దేవరపు ఈశ్వరరావు, పేదలకు అండగా నిలుస్తున్న అమ్మా సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్, ఈ ఏడాది ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన దుర్గాప్రసాద్, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన లోకేష్‌ను సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: బుడతనాపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. పి.రుషిత (కబడ్డీ), వి.మహేంద్ర (ఈత), ఎస్.జీవా (నెట్‌బాల్), ఆర్.పవన్ (రగ్బీ) రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పీడీ చల్ల సూర్యనారాయణ తదితరులు అభినందించారు.



విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

వైభవం.. గౌరమ్మ అనుపోత్సవం

వేపాడ, న్యూస్‌టుడే: గౌరమ్మ అనుపోత్సవాన్ని శనివారం రాత్రి డీజే, నృత్యాలు, కోలాటాలు, బాణాసంచా నడుమ ఘనంగా నిర్వహించారు. నెలరోజులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

• ఎన్సీఎస్: జటాధర • శ్రీకృష్ణ: ప్రిడేటర్ • ఆదిత్య: కె- ర్యాంప్ • లీలామహల్: ది గర్ల్‌ఫ్రెండ్ • రంజనీ స్క్రీన్–1: ది గర్ల్‌ఫ్రెండ్ • శివరంజనీ స్క్రీన్–2: ఆర్యన్, ప్రిడేటర్ • హిమగిరి: మాస్ జాతర • సప్తగిరి: ద గ్రేట్ ప్రీవెడ్డింగ్ షో – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

క్షణాల్లో అందం.. పుత్తడి చందం

క్షణాల్లోనే యువతీ, యువకులతో పాటు పెద్దవారిని సైతం అందంగా మార్చేస్తామని చెబుతోంది హైదరాబాద్‌కు చెందిన బియాండ్ బ్యూటీ నెట్‌వర్క్ (బీబీఎన్). ఆదివారం విజయనగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఇన్‌స్టంట్ పార్టీ మేకప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న పలువురు యువతులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ముఖాలకు రంగులు పూసుకుని మురిసిపోయారు. పార్టీ మేకప్, హెయిర్ కటింగ్, స్టైల్స్ తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నామని సంస్థ ప్రతినిధి మోక్ష తెలిపారు. ఈ రంగానికి ప్రాధాన్యం పెరగడంతో ఉపాధి కల్పించే ఉద్దేశంతో ముందుకొచ్చామన్నారు. అనంతరం పాల్గొన్నవారికి ధ్రువపత్రాలు అందించారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ఆలయాల నిర్మాణానికి విరాళం.. భోగాపురం, న్యూస్‌టుడే: ముంజేరులో వెలసిన శ్రీ సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎంపీపీ మాజీ ఛైర్మన్ దంతులూరి సూర్యనారాయణరాజు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న ఈ ఆలయానికి రూ.50వేలు, కొంగవానిపాలెంలో రామాలయానికి రూ.10వేల విరాళాన్ని సూర్యనారాయణరాజు అందజేశారు. ఎంపీటీసీ పి.వెంకటసత్యం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డైరెక్టర్‌కు అభినందన.. జామి, న్యూస్‌టుడే: తాండ్రంగికి చెందిన బి.సాయిలక్ష్మి రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆదివారం విజయవాడలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా తెదేపా మండలాధ్యక్షుడు పి.స్వామినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు అప్పలరాజు, నాయకులు శ్రీనివాసరావు, కె.సూర్యారావు, సత్యనారాయణ, జగన్నాథం అభినందనలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	70959 54646

? జేఎన్‌టీయూ కూడలి నుంచి కొండకరకం వెళ్లే మార్గంలో వీధి దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికులు • పరిశీలించి, దీపాలు వేయిస్తాం. – కన్నబాబు, కార్యదర్శి

? కొండకరకంలో ఎత్తయిన ప్రాంతాలకు నీటి సరఫరా సక్రమంగా కావడం లేదు. – స్థానికులు • పరిశీలించి పరిష్కరిస్తాం. – కన్నబాబు – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

? సింహాద్రినగర్ ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. – స్థానికులు • సిబ్బందిని పంపించి, బాగు చేయిస్తాం. – రత్నాకర్, డీఈఈ, నగర పాలక సంస్థ. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

? కొత్తవలసలోని సబ్బవరం-కె.కోటపాడు మార్గాల నుంచి వెళ్లే అనుసంధాన రహదారిలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. – జి.ప్రణతి • క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతాం. – ఎం.ఎర్రయ్యా రామస్వామి, సర్పంచి. – న్యూస్‌టుడే, కొత్తవలస

సకాలంలో కడితే వడ్డీ మిగులు

• భారీగా పేరుకుపోయిన ఆస్తిపన్ను • వసూళ్లపై నగరపాలిక దృష్టి

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పట్టణాల అభివృద్ధికి ఆస్తిపన్నే కీలకం. వసూళ్ల ఆధారంగానే ప్రగతి కనిపిస్తుంది. ఆర్థికసంఘం నిధులు సైతం మంజూరవుతాయి. ఈ నేపథ్యంలో విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలో వసూళ్లపై అధికారులు దృష్టిసారిస్తున్నారు. ఇక్కడ బకాయిలు సైతం భారీగా పెరిగిపోతుండడంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సకాలంలో కట్టి, వడ్డీ భారాన్ని తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.

ఆస్తిపన్నుపై అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న నల్లనయ్య

రూ.2 చొప్పున..

ఏటా ఇక్కడ ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు(తొలి అర్ధ సంవత్సరం), అక్టోబరు నుంచి మార్చి వరకు(రెండో అర్ధ) రెండు దఫాల్లో కట్టాలి. తొలి దశలో మొదటి మూడు నెలల్లో చెల్లిస్తే వడ్డీ ఉండదు. ఆ తరువాత రూ.100కు రూ.2 చొప్పున కట్టాలి. పన్ను మొత్తం ఒకేసారి కడితే 5 శాతం రిబేట్ ఉంటుంది. గత ఆర్థిక ఏడాదిలో నగరపాలికకు ఈ విధంగా రూ.3 కోట్ల మేర సమకూరింది.

ఆదాయం వస్తున్నా..

వచ్చే ఆదాయాన్ని స్థానిక సంస్థలే ఖర్చు చేసుకునేలా కూటమి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో ఎక్కువ మొత్తంలో రాబట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ ఏటా ప్రకటనల పన్ను, నీటి ఛార్జీలు, అద్దె గదులు, ట్రేడ్ లైసెన్సులు, ఆక్రమణలు, ఖాళీస్థలాల నుంచి రూ.65 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. అయితే రూ.54 కోట్ల మేర ఖర్చు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఎప్పుడు కడతారో?

• నగరపాలిక పరిధిలో రూ.20 కోట్ల మేర మొండి బకాయిలున్నాయి. ఇప్పటికే కొందరికి రెడ్ నోటీసులు జారీ చేశారు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల నుంచి రూ.24.06 కోట్లు, కేంద్ర ప్రభుత్వ ఆస్తుల ద్వారా రూ.1.69 కోట్లు రావాలి • ప్రైవేటు అసెస్‌మెంటుదారులు సక్రమంగా చెల్లించడం లేదు. • విలీన పంచాయతీలు, శివారు ప్రాంతాల వారు వెనకడుగు వేస్తున్నారు. ఈ క్రమంలో మౌలిక సదుపాయాలు సైతం దూరమవుతున్నాయి. సకాలంలో చెల్లిస్తే ఇబ్బంది ఉండదని, ఈ మేరకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు.

ప్రస్తుతం ఇలా.. • అసెస్‌మెంట్లు: 71,890 • కట్టాల్సింది: రూ.89.51 కోట్లు • వచ్చింది: రూ.21.43 కోట్లు

సామాజిక భద్రత అవసరం

మాట్లాడుతున్న డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: పౌరులకు సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు అన్నారు. జెనీవా దేశంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ఆయన జిల్లాకు వచ్చిన నేపథ్యంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. అందరికీ అభివృద్ధి ఫలాలు అందాలన్నారు. వైట్ పైట్ ఫోరమ్ కన్వీనర్ భవిరెడ్డి శంకర్రావు, డీబీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక.. విద్యావిభాగం: భారత విద్యార్థి ఫెడరేషన్ నగర నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.సూరిబాబు, ఇ.వంశీ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన పట్టణ కమిటీ మహాసభల్లో 18 మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా జయ, సౌమ్య, ఉపాధ్యక్షులుగా రూప, కోశాధికారిగా గుణ నియమితులయ్యారు. * ఎస్.కోట: పట్టణంలో జరిగిన మహాసభల్లో రైతు సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.గోపాలం, కార్యదర్శిగా బి.రాంబాబు, ఉపాధ్యక్షులుగా సీహెచ్.జగన్, ఎల్.ఆదినారాయణమూర్తి, సభ్యులు ఎన్నికయ్యారు.

లీకులతో పొంచిఉన్న ముప్పు

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లకు లీకులు కనిపిస్తున్నాయి. దీంతో నీరు వృథాగా పోతోంది. ఎంఆర్ కళాశాల స్టేడియం దారిలోని కలువపువ్వు మేడ వద్ద ప్రధాన లైన్ దెబ్బతింది. కాలువ మీదుగా వెళ్తుండడంతో మురుగు నీరు కలిసే ప్రమాదముంది. ఇప్పటికే రంగుమారిన నీరు వస్తోందని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఏఈ రవి తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

దారి పొడవునా వ్యర్థాలు

నగరంలో వ్యర్థాల సమస్య తాండవిస్తోంది. శివారు ప్రాంతాలు, ప్రధాన రహదారుల పక్కన పెద్దఎత్తున చెత్త, చెదారం కనిపిస్తోంది. కొందరు వాహనాలతో తీసుకొచ్చి ఇక్కడ పడేస్తున్నారు. దీంతో అటుగా వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. నగరపాలక పరిధిలోని పాల్‌నగర్ నుంచి ఉడాకాలనీ వెళ్లే దారిలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య కార్మికులను పంపించి, తొలగింపజేస్తామని ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ఆదమరిస్తే ప్రమాదమే..!

కొత్తవలస- విజయనగరం రాష్ట్ర రహదారిలో చింతలదిమ్మకు సమీపంలోని డాబాలుగెడ్డపై నిర్మించిన వంతెనపై గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో గుంత ఉండడంతో ఆదమరిస్తే గోతిలో పడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పూడ్చాలని కోరుతున్నారు. సమస్యను జేఈ ఎల్లమ్మ దృష్టికి తీసుకువెళ్లగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కొత్తవలస

పూడిక పేరుకుంది.. మురుగు పారనంది

నగర పంచాయతీ పరిధి జరజాపుపేట ప్రాంతంలోని లక్ష్మీదేవిపేట వద్ద కాలువలో పూడిక పేరుకుపోయింది. మురుగు పారక రోడ్డెక్కుతోంది. దీంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీనిపై కమిషనరు టి.జయరాంను వివరణ కోరగా కాలువలో పూడిక తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

సాగు నీరందేదెలా?

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: రంగాపురం పంచాయతీ కూర్మవరం అప్పన్నబంద మదుము నుంచి సాగునీరు పారే కాలువను కొందరు తవ్వి, ఆక్రమించుకుంటున్నారని రైతులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ దీని నుంచి 50 ఎకరాలకు నీరందుతుందని, తవ్వేయడంతో పంటలు ఎలా పండించాలో తెలియడం లేదన్నారు. న్యాయం చేయాలని కోరారు. వీఆర్వో మల్లేశ్వరరావును అడగ్గా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

నిరంతర కవచం.. ఆత్మరక్షణ విద్య

కొత్తవలస, న్యూస్‌టుడే: బాలికలు తమను తాము కాపాడుకునేందుకు ఆత్మరక్షణ విద్య ఎంతగానో దోహదపడుతుందని కరాటే శిక్షకుడు ఎ.లక్ష్మణరావు అన్నారు. మేరకు రాణి రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ ఆధ్వర్యంలో ఆదివారం కేజీబీవీలో బాలికలకు శిక్షణ ఇచ్చారు. దెందేరు, వియ్యంపేట, కంటకాపల్లి మండలాల్లోని పలు పాఠశాలల్లోనూ నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో సమగ్రశిక్షా కింద తర్ఫీదు ఇస్తున్నామని తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి జారిపడి గాయాలు

నేరవార్తా విభాగం: నెల్లిమర్లలోని కొండవెలగాడ ప్రాంతానికి చెందిన చిన్నా ట్రాక్టర్ చోదకుడికి హెల్పర్‌గా పని చేస్తున్నారు. వాహనంపై వెళ్తూ ఆదివారం ఉదయం నగరంలోని అశోక్ నగర్ సమీపంలో జారి కింద పడ్డాడు. అటుగా వెళ్తున్న ఇద్దరు వైద్య విద్యార్థినులు ప్రాథమిక చికిత్స అందించారు. కుటుంబ సభ్యులు చేరుకుని కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేశామని రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

రెండేళ్ల పాపతో మహిళ అదృశ్యం

నేరవార్తా విభాగం: నగరంలోని వైఎస్ఆర్ నగర్ ప్రాంతానికి చెందిన ఓ వివాహిత తన రెండేళ్ల కుమార్తెతో అదృశ్యమైంది. ఈనెల 7వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణమూర్తి పేర్కొన్నారు.

దంపతులను ఢీకొట్టిన లారీ

నేరవార్తా విభాగం: నగరంలోని గెడ్డవీధికి చెందిన ఆదిరెడ్డి, లక్ష్మి దంపతులు శనివారం ఉదయం సింహాచలం దర్శనానికి వెళ్లి, రాత్రి వేళ తిరుగుపయనమయ్యారు. ధర్మపురి సమీపంలో వీరిని లారీ ఢీకొట్టడంతో ఆదిరెడ్డి కాలు విరిగిపోయింది. లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. నిందితుడు వాహనంతో పరారయ్యాడు. స్థానికులు లారీకి సంబంధించిన నంబరును పోలీసులకు తెలియజేశారు. తప్పుడు చిరునామాను చూపిస్తోందని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు.

పాదచారుడికి గాయాలు

నేరవార్తా విభాగం: పాలకొండకు చెందిన అనిల్ మరో వ్యక్తితో కలిసి నగరంలోని ట్యాంక్‌బండ్ రోడ్డులో నడిచి వెళ్తుండగా.. ఓ వ్యక్తి ద్విచక్రవాహనంతో వచ్చి ఢీకొట్టాడు. అనంతరం పరారయ్యాడు. అనిల్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు స్పందించి మహారాజా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు.

సృజన వెలికితీతకు పోటీలు దోహదం

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: బాలల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని హైకోర్టు న్యాయవాది, అంజనీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పువ్వల శ్రీనివాసరావు అన్నారు. గురజాడ పబ్లిక్ పాఠశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన బాలల ఆహ్వాన నాటిక పోటీలను ప్రారంభించారు. గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, జేవీవీ జాతీయ నాయకుడు ఎం.వి.ఆర్.కృష్ణాజీ, గేట్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ గురాన రాధిక, ఖాదర్ బాబా దర్గా నిర్వాహకుడు అహ్మద్‌బాబు, వాకర్స్‌క్లబ్ ఉప గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

జరజాపుపేటలో కుర్చీలాట ఆడుతున్న మహిళలు

వన మహోత్సవం

ఎల్.కోట, వేపాడ, నెల్లిమర్ల: కార్తికం సందర్భంగా ఆయా ప్రాంతాల్లో వనసమారాధన సందడిగా నిర్వహించుకున్నారు. ఎల్.కోట పరిధిలో జనసేన నాయకులు, వేపాడలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆర్య వైశ్యులు, జరజాపుపేటలో అవనాపువారు జరిపారు. చిన్నా, పెద్దా అంతా ఆటపాటలతో అలరించారు. పోటీలు నిర్వహించుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు.

చట్ట సవరణ చేయాలి

విద్యావిభాగం: టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష)పై విద్యాహక్కు చట్టంలో సవరణ చేయాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

పట్టణ ప్రణాళికా విభాగం కీలకం

విజయనగరం పట్టణం: అభివృద్ధిలో పట్టణ ప్రణాళికా విభాగం కీలకమైందని ఏపీ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

బాధ్యతల స్వీకరణ

విజయనగరం పట్టణం: నగరపాలక సంస్థ పరిధిలోని కస్పా ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎం.చంద్రశేఖర్ ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. హెచ్‌ఎం విశాలక్ష్మి, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

విజయనగరం పట్టణం: పార్వతీపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఇటీవల జరిగిన నాటుబాంబుల పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన రమేష్ కుటుంబానికి విజయనగరానికి చెందిన సిరి సహస్ర రూ.50 వేల నగదు అందించారు.

మద్యం తాగి నడిపితే కేసులు

లక్కవరపుకోట: మద్యానికి బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.

మైనర్లకు కౌన్సెలింగ్

నేరవార్తా విభాగం: నిబంధనలు పాటించకుండా.. ప్రమాదకరంగా వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన పలువురు మైనర్లకు ట్రాఫిక్ సీఐ సూరినాయుడు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం తన కార్యాలయంలో ట్రాఫిక్ నిబంధనలు, కేసులపై అవగాహన కల్పించారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ

వజ్రపుకొత్తూరు గ్రామీణం: శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన చంద్రకళ లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి అర్హత సాధించింది.

రాష్ట్రస్థాయికి జిల్లా జట్ల ఎంపిక

క్రీడావిభాగం: రాజమహేంద్రవరంలో ఈనెల 11 నుంచి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు జరగనున్నాయి. అందులో భాగంగా జిల్లా జట్ల ఎంపికలను ఆదివారం విజ్జీ మైదానంలో నిర్వహించారు. క్రీడా అధికారి ఎస్.వెంకటేశ్వరరావు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

న్యాయ సేవలు వినియోగించుకోండి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవ కమిటీ ఛైర్మన్ బి.కనకలక్ష్మి అన్నారు. జాతీయ న్యాయసేవ దినోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీవివేకానంద కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సమయాన్ని వృథా చేసుకోకుండా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. అనంతరం సబ్ జైలును సందర్శించారు. ప్రిన్సిపల్ భాస్కరరావు, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు బి.వెంకటరావు, న్యాయవాదులు అల్లు సత్యాజీ, బి.సత్యనారాయణ, వారాది ఈశ్వరరావు, శర్మ, రామకృష్ణ, అనురాధ, ఎస్సై సత్యనారాయణ తదితరు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ కనకలక్ష్మి

ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలి

విజయనగరం పట్టణం: రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు నిర్వహించాలని, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. ఆదివారం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని, మీరేం చేశారో చెప్పాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలన్నారు. ఈనెల 12న నిరసన ర్యాలీ చేపడతామని చెప్పారు. మేయరు వెంపడాపు విజయలక్ష్మి, ఆశపు వేణు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోలగట్ల

(c) eenadu

ఖాతాలిస్తున్నారు.. ఖాళీ చేస్తున్నారు
● అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లకు సహకారం ● పట్టుబడిన వారిలో ఉమ్మడి జిల్లా వాసులు 8 లో

ప్రథమ వర్ధంతి

కేంద్ర మంత్రి వర్యులు భూపతిరాజు శ్రీనివాసవర్మ (బిజెపి వర్మ) గారి తండ్రి గారైన

కీ॥శే॥ భూపతిరాజు సూర్యనారాయణరాజు గారు

జననం : 01-11-1935 నిర్యాణం : 21-11-2024

కల్మషమెరుగని నిష్కలంక హృదయులు, అందరినీ ఆప్యాయంగా పలుకరించే మంచి మనసున్న మనిషి, ప్రేమతో మిమ్ములను పెంచి పోషించి విద్య, విలువలను, విజ్ఞానాన్ని అందించి మహోన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దిన మూలపురుషులు మీరు. మీ మహోన్నత ఆశయాలకు, ఉదాత్త ఆదర్శాలకు అనుగుణంగా నడుస్తామని...మీరు మా నుండి దూరమై సంవత్సర కాలం గడిచినా...మీతో గడిపిన మీ మధురస్మృతులు మా మదిలో పదిలం...బాధాతప్త హృదయాలతో...

భార్య : **భూపతిరాజు సీత**

కుమారుడు, కోడలు :

భూపతిరాజు శ్రీనివాసవర్మ (బిజెపి వర్మ) - శ్రీమతి వెంకటేశ్వరీ దేవి

కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ మంత్రివర్యులు

కుమార్తెలు - అల్లుళ్ళు :

శ్రీమతి కలిదిండి అన్నపూర్ణాదేవి - సూర్యనారాయణరాజు (లేటు)
శ్రీమతి మంతెన నాగ శిరోమణి - సీతారామరాజు
శ్రీమతి వేగేశ్న జ్యోతిలక్ష్మి - రంగరాజు

సోదరులు

భూపతిరాజు రామరాజు-శ్రీమతి వి.యస్.యస్. కళావతి
భూపతిరాజు సత్యనారాయణ రాజు - శ్రీమతి అన్నపూర్ణ
భూపతిరాజు పేర్రాజు - శ్రీమతి పద్మ

సోదరీమణులు

బుద్ధరాజు ప్రభావతి (లేటు) - డా॥ నారాయణరాజు (లేటు)
కలిదిండి వరలక్ష్మి (లేటు) - వెంకట సుబ్బరాజు

మేనల్లుళ్ళు మరియు మేనకోడళ్ళు

మనవళ్ళు - మనుమరాండ్రు :

శ్రీమతి అడ్డాల శ్వేత రేఖ - నరశింహరాజు, మంతెన విజయరామరాజు - శ్రీమతి సింధు, వేగేశ్న పవన్‌కుమార్ వర్మ - శ్రీమతి జ్యోతి, కలిదిండి వినోద్‌కుమార్ వర్మ - శ్రీమతి శ్రావణి మీన

మునిమనవళ్ళు - ముని మనుమరాండ్రు :

అక్షర, అమూల్య, నిర్వాణ, శిశిర, యువాన్, ఆష్న, నిహిర

ప్రథమ వర్ధంతి : ది. 10-11-2025 సోమవారం ఉదయం 9 గంటలకు
కె.ఎస్.రాజు ఫంక్షన్ హాల్, మార్కెట్ యార్డు వద్ద, భీమవరం

ఈనాడు
పశ్చిమగోదావరి

సోమవారం నవంబరు 10, 2025

మీనం.. మనం చూడం..!

ఉప్పుటేరు కలుషితంతో అంతరిస్తున్న మత్స్య సంపద

కలిదిండి, న్యూస్‌టుడే

ఏలూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో విస్తరించిన ఉప్పుటేరు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఫలితంగా అందులోని మత్స్య సంపద నశించిపోతోంది. ఏళ్ల తరబడి ఉప్పుటేరు ప్రక్షాళనకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో దీనికి ఆనుకుని ఉన్న మత్స్యకార కుటుంబాలు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని ఉప్పుటేరు వాసులు కోరుతున్నారు.

కాలుష్య కోరల్లో..

ఉప్పుటేరుకు రెండు వైపులా సుమారు 1400 ఎకరాల్లో ఆక్రమణలు ఉన్నాయి. వీటిని తొలగించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టినా.. ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఏటిగట్టుకు ఆనుకుని ఉన్న రొయ్యల చెరువుల్లో వాడిన మందులు, నిల్వ నీరు, చనిపోయిన రొయ్యలు నేరుగా ఉప్పుటేరులో కలుస్తుండటంతో మీనాలకు ముప్పు వాటిల్లుతోంది. ఉప్పుటేరుకు సమీపంలో ఏర్పాటు చేసిన రొయ్యల పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు దీనిలోనే కలుస్తున్నాయి. దీంతో సమస్య మరింత జటిలంగా మారుతోంది.

ప్రక్షాళన చేపట్టాం.. ఉప్పుటేరు పరిరక్షణలో భాగంగా ప్రక్షాళన చేపట్టాం. ఇప్పటికే ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఏరులోకి వ్యర్థాలు కలవకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు.

ఉప్పుటేరు పొడవు **62 కి.మీ.**

వెడల్పు **236 మీటర్లు**

15 వేల క్యూసెక్కులు ప్రవాహ సామర్థ్యం (ఒక రోజుకు)

ఏలూరు, కృష్ణా, పశ్చిమ ప్రయోజనం పొందే జిల్లాలు

30 ఆనుకుని ఉన్న గ్రామాలు

10 వేలు ఆధారపడిన మత్స్యకార కుటుంబాలు

ఒడ్డుకు విత్తన పంట..!

ఉండి, న్యూస్‌టుడే: రాబోయే రబీ సీజన్‌లో నాటేందుకు ప్రస్తుత ఖరీఫ్‌లో పండించిన విత్తన పంటను రైతులు ఒడ్డుకు చేర్చే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. సాగునీటి కాలువలకు శివారున గల ఉండి, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల పరిధిలో వివిధ చోట్ల పండించిన వరి వంగడాల కోతలు మొదలయ్యాయి. ప్రధానంగా ఎంటీయూ 1318, 1121, 1293 తదితర రకాలు రబీ సీజన్‌లో సాగు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.

తేమ శాతం తగ్గించే ప్రయత్నాలు

జిల్లాలో 2.25 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఎకరానికి 20 కిలోల చొప్పున సుమారు 4,500 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని తేల్చింది. వర్షాలకు ముందు కొన్నిచోట్ల విత్తనాల సేకరణ పనులు జరిగాయి. మళ్లీ అయిదారు రోజుల నుంచి పొడి వాతావరణం నెలకొనడంతో పంట నూర్పిళ్లు చేసి.. వచ్చిన గింజలను ఆరబెడుతున్నారు. బాగా ఆరినచోట్ల విత్తనాలను ప్రోసెసింగ్ చేసే పనులు కొనసాగుతున్నాయి. రాబోయే రెండు వారాల్లో అవసరమైన విత్తనాల సేకరణ ప్రక్రియ అన్నిచోట్లా పూర్తవుతుందని అధికారులు వివరిస్తున్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అర్జీదారులు తమ ఫిర్యాదుల స్థితిని తెలుసుకునేందుకు 1100 నంబర్‌కు కాల్ చేయొచ్చని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల, పురపాలక కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ఉంటుందన్నారు.

కమనీయం.. కార్తిక దీపోత్సవం

వివిధ రంగవల్లులతో దీపాలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : భీమవరం జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి కార్తిక దీపోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ప్రాంగణంలో వివిధ ఆకృతులతో పుష్పాలంకరణలో ఓంకారం, వేంకటేశ్వరస్వామి ప్రతిమలు, రంగవల్లులతో దీపాలంకరణ, సహస్ర దీపోత్సవంలో గోదాదేవి, శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులు ఏర్పాటు చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, ఛైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు, సభ్యులు దీపోత్సవం ప్రారంభించినట్లు ఈవో ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

నైపుణ్యాలకు నెలవు..
పరిశోధనల కొలువు...

KL (DEEMED TO BE UNIVERSITY) VIJAYAWADA
KLH (DEEMED TO BE UNIVERSITY) HYDERABAD ● Azeez Nagar ● Bowrampet

ఆధునిక సాంకేతిక విద్యా సౌరభం
కెఎల్ విశ్వవిద్యాలయం

ప్రపంచ సాంకేతిక సవాళ్లకు అనుగుణంగా... సమగ్ర నైపుణ్యాల అభివృద్ధి దిశగా కెఎల్ యూనివర్సిటీ విద్యా ప్రణాళిక

ఉన్నత విద్యా రంగంలో మేరు శిఖరం
46 వసంతాల కెఎల్ యూనివర్సిటీ

PROUDLY ANNOUNCING 8000+ PLACEMENT OFFERS IN 2025

75 LAKHS CTC HIGHEST PACKAGE OFFERED BY TOP MNC

8.1 LAKHS CTC MEDIAN PAY PACKAGE

5000+ STUDENTS PLACED IN 500+ COMPANIES DURING 2024-25

IMPECCABLE PLACEMENT TRACK RECORD SINCE 2005

Marquee Companies with Salaries around	60 Lakhs
Super Dream Companies with Salaries around	40 Lakhs
Dream Companies with Salaries around	10 Lakhs

ENGINEERING PROGRAMS
CSE | CS&IT | AI&DS | ME | CE | EEE | ECE | IOT | BT
M.TECH PROGRAMS: ALL ENGINEERING PROGRAMS
B.TECH - LATERAL ENTRY : ALL ENGINEERING PROGRAMS

MHS PROGRAMS:
BBA | BCA (HONS) | B.COM (HONS) | BBA-LL.B.(HONS) | BA WITH CIVIL SERVICES ORIENTATION | B.ARCH | B.SC ANIMATION & GAMING, FOOD TECHNOLOGY (HONS) | B.SC (HONS) AGRICULTURE | B.PHARMACY | PHARM-D | MCA | MBA

నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పన దిశగా
క్యాంపస్‌లోనే పరిశ్రమల ఏర్పాటు..

- పరిశోధనలకు అగ్ర ప్రాధాన్యం
- 75 లక్షల అత్యధిక ప్యాకేజీతో రికార్డు
- 16 సంవత్సరాలుగా అర్హులైన విద్యార్థులకు 100% క్యాంపస్ ప్లేస్‌మెంట్స్
- 2025 విద్యా సంవత్సరంలో 8000 మందికి పైగా విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఆఫర్స్
- శాటిలైట్స్ ప్రయోగాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు..
- విద్యా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకులలో జాతీయ స్థాయిలో 26వ ర్యాంకు
- విద్యార్థులకు నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగాల కల్పన దిశగా క్యాంపస్ ప్రాంగణంలోనే కంపెనీల ఏర్పాటు..
- మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా 100 కోట్ల రూపాయల విలువైన స్కాలర్‌షిప్స్ ద్వారా ఫీజులో రాయితీ..
- జె ఇ ఇ మెయిన్స్ లో 90 పర్సెంటైల్ దాటిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ కింద 100% ఫీజు మినహాయింపు..
- విదేశాల్లోనూ ప్రఖ్యాత కంపెనీలలో ప్లేస్‌మెంట్స్ సాధిస్తున్న విద్యార్థులు..
- విద్యార్థులకు అనువైన, సౌలభ్యకరమైన విద్యా విధానం..
- పారిశ్రామిక, పరిశోధనాత్మక శిక్షణ
- విద్యా ప్రణాళిక, ప్లేస్‌మెంట్స్ అంశాల్లో విదేశీ యూనివర్సిటీలు, కంపెనీలతో ఒప్పందాలు



మెరిట్ విద్యార్థుల కోసం కె ఎల్ యూనివర్సిటీ నిర్వహించే ప్రవేశ పరీక్షల షెడ్యూల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కె ఎల్ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ పార్థసారథి వర్మ, అడ్మిషన్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు

నింగిలోకి 3 శాటిలైట్స్
కె ఎల్ యూనివర్సిటీ విద్యార్థుల ఆవిష్కరణ

Pre-Placement offer for 2026 batch
B. Lakshmi Sailaja
B.Tech-CSE
Secured Super Dream Offer in a reputed MNC with
CTC: 58 Lakhs
internship stipend of 1.25 Lakhs per month

RECOGNISED AS 1 CATEGORY UNIVERSITY BY UGC, STATUTORY BODY OF MHRD
nirf 26 AMONG ALL UNIVERSITIES

DIRECTOR OF ADMISSIONS 949 036 1111

KL Engineering Entrance Exam -Phase1 November 14th to 18th

100 CRORES SCHOLARSHIP FOR MERIT STUDENTS

Apply Now www.kluniversity.in

ADVERTISEMENT

(c) eenadu

బలి తీసుకున్న బతుకుదెరువు

రెండు కుటుంబాల్లో విషాదం నింపిన విద్యుదాఘాతం

సింహాద్రి అప్పన్న, సందీప్ (పాత చిత్రాలు)

గండేపల్లి, తణుకు, న్యూస్‌టుడే: చేతికందొచ్చిన ఏకైక కుమారుడు కుటుంబాన్ని ఆదుకుంటాడనుకు నేలోపే ఇక లేడనే వార్త ఆ కుటుంబాన్ని అంతులేని విషాదంలో ముంచింది. జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్న నేపథ్యంలో ఇంటి యజమాని ఇక తిరిగి రాడనే సమాచారంతో మరో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఇరగవరం మండలం రాపాకాలో కొడుకును, పేకేరులో ఇంటి యజమానిని కోల్పోయి రెండు కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన కరిపెట్టి సింహాద్రి అప్పన్న (53) వరి కోత యంత్రాలతో కోతలకు వెళ్తా జీవనం సాగిస్తుంటారు. పేకేరుకు చెందిన గెద్దం సందీప్ (20) కొద్ది నెలల నుంచి సింహాద్రి వద్ద వరి కోత యంత్రం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామయ్యపాలెం వెళ్లారు. ఆ గ్రామ శివారులో 11 కేవీ విద్యుత్తు తీగలు యంత్రానికి ఉన్న గొట్టానికి తగిలాయి. ద్విచక్ర వాహనంపై ముందు వెళ్తున్న సందీప్ గమనించి కోత యంత్రం వద్దకు వచ్చాడు. తీగలు తప్పించే క్రమంలో సింహాద్రి అప్పన్న, సందీప్‌లు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను జడ్.రాగంపేట సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై శివనాగబాబు తెలిపారు.

వాహనంపై వరి కోత యంత్రాన్ని తీసుకెళ్తుండగా విద్యుత్తు తీగలు తగిలి..

పెద్ద దిక్కు కోల్పోయి.. సింహాద్రి అప్పన్నకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. గతంలో కోళ్లఫాం నిర్వహించేవారు. అందులో ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఆరు నెలల కిందట వరికోత యంత్రం కొన్నారు. పెద్ద కుమారుడు అమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. చిన్న కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నారు. కుమారులకు పెళ్లి చేయాల్సిన తండ్రి ఇక రారని తెలుసుకొని తమను ఎవరు పట్టించుకుంటారని కుటుంబ సభ్యులు బోరుమంటున్నారు.

అందొచ్చాడనుకుంటే.. సందీప్‌కు తండ్రి లాజరు, తల్లి ప్రేమలత, ఇద్దరు అక్కలు ఉన్నారు. పెద్ద అక్కకు వివాహమైంది. మరో అక్క డిగ్రీ చదువుతోంది. తండ్రి స్థానికంగా వ్యవసాయ పనులు చేస్తుండగా, తల్లి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లారు. సందీప్ పదో తరగతి అనంతరం చదువు మానేసి డ్రైవర్‌గా చేరాడు. రెండు రోజుల కిందటే తామందరం స్నేహితుడి జన్మదిన వేడుకల్లో ఆనందంగా గడిపాడని, ఆ క్షణాలు మరువక ముందే సందీప్ తమను విడిచి వెళ్లాడంటూ మిత్రులు కుమిలిపోతున్నారు. ఏకైక వారసుడు తిరిగిరాని లోకాలకు చేరుకొని తమను దిక్కులేనివారిని చేశాడంటూ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటున్నారు. తమ్ముడు లేడనే విషయాన్ని జీర్ణించుకోలేక అక్కలిద్దరూ తల్లడిల్లిపోతున్నారు.

శోకసంద్రంలో గ్రామాలు కొడుకును కోల్పోయి ఓ కుటుంబం, తండ్రిని దూరం చేసుకొని మరో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆదివారం ఉదయం వారి మరణ వార్త వినగానే ఆయా గ్రామాలు శోకసంద్రంలో మునిగాయి. ఉభయ కుటుంబీకులు గుండెలు పగిలేలా రోదిస్తున్న తీరు చూసి ఆయా గ్రామస్థులు, స్నేహితులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

డిస్పోజబుల్ సామగ్రి గదిలో అగ్ని ప్రమాదం

కిటికీ నుంచి వెలువడుతున్న పొగ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఓ ఇంట్లో నిల్వ ఉంచిన సరకు ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతైన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక పొట్టి శ్రీరాముల విగ్రహం సమీపంలో శంకర్ అనే వ్యక్తి కొద్దికాలంగా డిస్పోజబుల్స్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. అయితే దుకాణం సమీపంలోని కొంకిమళ్ల రాజ్‌కుమార్‌కు చెందిన ఇంట్లో అద్దెకు ఉంటూ.. అదే భవనంలోని కింద అంతస్తులో కొంత భాగాన్ని పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ఇతర డిస్పోజబుల్స్ సామగ్రిని భద్రపరిచే గోడౌన్‌గా వినియోగిస్తున్నారు. అయితే ఆదివారం సాయంత్రం సామగ్రి నిల్వ చేసిన గది నుంచి పొగ రావడాన్ని అటుగా వెళ్తున్న ఫాజిల్ అనే వ్యక్తితో పాటు పలు దుకాణదారులు గుర్తించారు. వెంటనే వారంతా పైకి వెళ్లి చూడగా.. సామగ్రికి మంటలు అంటుకోవడాన్ని గుర్తించి ప్లాస్టిక్ గొట్టం సహాయంతో నీటిని చల్లి మంటలను ఆర్పేందుకు యత్నించారు. అయినా అదుపు కాకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న సిబ్బంది సుమారు 3 గంటలకు పైగా శ్రమించి మంటలు అదుపు చేశారు. అలాగే ఘటనా ప్రదేశానికి సీఐ సుభాశ్, ఎస్సై వీరప్రసాద్ చేరుకుని స్థానిక యువకుల సహాయంతో గోడౌన్‌లో నిల్వ చేసిన సామాన్లను కిందకు పడేశారు. సరకు నిల్వ చేసిన గదిలో నుంచి మంటలు ఎగసిపడటం, దట్టమైన పొగ రావడంతో ఆ భవనంలో ఉంటున్న పలు కుటుంబాల వారు భయంతో బయటకు పరుగులు తీశారు. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తినష్టం ఉంటుందని, విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయా..లేక మరేదైనా కారణం ఉందా.. అనేది తెలియాల్సి ఉందని అగ్నిమాపక అధికారి జి.అబ్రహం తెలిపారు.

విద్యార్థినికి చెక్కు అందిస్తున్న రామానాయుడు

ఎన్నటికీ తరగని నిధి విద్య

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఎన్నటికీ తరగని నిధి విద్య మాత్రమేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శ్రీకృష్ణ దేవరాయ కాపు, తెలగ, బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం పాలకొల్లు బైపాస్ రోడ్డులోని కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. అఖిల భారత తెలగ, బలిజ, కాపు సంఘం, మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఎంఏటీఏ) సంయుక్త ఆధ్వర్యంలో ఇరు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంబీబీఎస్, బీటెక్, ఎంబీఏ, డిగ్రీ విద్యార్థులు 80 మందికి రూ.13 వేల చొప్పున సుమారు రూ.10 లక్షలను ఉపకారవేతనాలుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్ఆర్ఐలు అందిస్తున్న చేయూతను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి వి.అద్దేపల్లిరావు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులను ఉపకార వేతనాలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సంస్థ సభ్యులు కొత్తపల్లి సుబ్బారాయుడు, తులసీ రామచంద్రప్రభు, అల్లు పీర్లస్వామి, పి.వినాయకస్వామి, పట్టణ సీఐ కె.రజనీకుమార్, చినిమిల్లి సత్యనారాయణ, వంగా నరసింహరావు, బోనం నరసయ్య, సీహెచ్ వెంకటదుర్గా ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతో డెల్టాలో సమస్యలకు పరిష్కారం

పాలకొల్లు, న్యూస్‌టుడే: పరిశోధనల ద్వారా గోదావరి డెల్టాలో పలు సమస్యలకు పరిష్కార మార్గాలు చూపవచ్చని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేశనపల్లిలో ఉప్పునీటి ప్రభావంపై అదే ప్రాంతానికి చెందిన యర్రంశెట్టి విజయ్ సత్యప్రసాద్ చేసిన పరిశోధనలకు ఇంటర్నేషనల్ జనరల్ ఆఫ్ రీసెర్చ్ ఇంజినీరింగ్ సైన్స్ గుర్తింపు లభించింది. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ద్వారా లవణ జలాలు ప్రవేశించడం వల్లే కేశనపల్లిలో కొబ్బరి, వరి పంటలకు నష్టం వాటిల్లుతున్నట్లు ఈ పరిశోధనల్లో తేలింది. దీనికి సంబంధించిన ప్రతులను విజయ్ సత్యప్రసాద్ ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి నిమ్మలకు అందజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ కేశనపల్లి సమస్య పరిష్కారానికి వ్యూహాత్మక ప్రణాళిక అవసరమని.. ఈ పరిశోధనలో గుర్తించిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

క్షీర మథనం లేదు.. సిరి రాలేదు..

పోలవరంలో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్ర భవనం

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరంలో రూ. లక్షల వ్యయంతో 15 సంవత్సరాల కిందట ప్రారంభించిన గోదావరి మిల్క్‌గ్రిడ్ పాలశీతలీకరణ కేంద్రం పర్యవేక్షణ లోపంతో రెండేళ్లకే మూతపడింది. దీంతో అందులోని పాల ట్యాంకర్, జనరేటర్, తదితర పరికరాలు తప్పుపడుతున్నాయి. 2008లో డీఆర్డీఏ, ఐకేపీ, డైరీడెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్, పశుసంవర్ధకశాఖల పర్యవేక్షణలో కేంద్రానికి రూ.25 లక్షల చొప్పున ఖర్చు చేసి జిల్లాలో పలు చోట్ల వీటిని నిర్మించి ఐకేపీ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. పాలసేకరణ కోసం మహిళా గ్రూపులు ఏర్పాటు చేసి వారికి పరికరాలు అందజేశారు. కేంద్రాలకు వచ్చిన పాలు పాలశీతలీకరణ కేంద్రానికి తీసుకెళ్లేందుకు ఆటోలు ఏర్పాటు చేశారు. మహిళలు నిలదొక్కుకునే వరకు నిర్వహణ కోసం మరో రూ.5లక్షలు అందజేశారు. నిర్వహణ కోసం ఇచ్చిన నిధులు అయిపోవడంతో 2010 నాటికి కేంద్రం మూతపడింది. గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని రైతులు కేంద్రాలకు పాల సరఫరా నిలిపివేశారు. సంవత్సరాల తరబడి విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడంతో ఆ శాఖ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్లారు. చివరకు ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనం, కొద్ది పాటి సామగ్రి మిగిలాయి. ప్రస్తుతం అవి కూడా తుప్పుపట్టి మట్టిలో కలిసిపోయేలా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

పేదలకు న్యాయ సహాయం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పేదలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని ఏడో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక న్యాయస్థానం ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో ఆదివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాలు, ఆపదలోని వృద్ధులు, మహిళలు, బాలలు, విభిన్న ప్రతిభావంతులకు న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయసహాయం అందజేస్తోందన్నారు. సంస్థ తరఫున ఇప్పటికే పలువురికి సాయం అందజేశామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందున్నామని పేర్కొన్నారు. ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

కరపత్రాల ఆవిష్కరణలో నిర్వాహకులు

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయాభివృద్ధి కమిటీ, వారోత్సవాల పూర్వ కమిటీ సంయుక్తంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ గౌరవాధ్యక్షుడు జగపతిరాజు తెలిపారు. ఆనంద ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు, గ్రంథాలయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి వెల్లడించారు. 20న ముగింపు వేడుకలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

14, 15 తేదీల్లో జిల్లా మహాసభలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పశ్చిమ గోదావరి జిల్లా మహాసభలు పాలకోడేరు మండలం మోగల్లులో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాసభకు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఆక్వా సంఘం నాయకుడు బి.బలరాం హాజరవుతారని తెలిపారు.

పంట నష్టం నమోదులో కౌలు రైతులకు అన్యాయం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పంట నష్టం నమోదు గడువు తేదీని పొడిగించి కౌలు రైతుల పేర్లు నమోదు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల మొంథా తుపాను ధాటికి జిల్లాలోని 20 మండలాల్లో 257 గ్రామాల్లో 24 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిందన్నారు. పంట నష్టం నమోదులో కౌలు రైతులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ నెల 18 వరకూ పంట నష్టం నమోదు గడువును పెంచి కౌలు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మహిమాన్వితుడు.. వీరేశ్వరుడు!

దక్షిణకాశీగా తాడువాయి

తాడువాయి భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం

తాడువాయి (జంగారెడ్డిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలో ఎర్రకాలువ ఒడ్డున కొలువైన శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని మహిమాన్వితుడిగా భక్తులు కొలుస్తున్నారు. జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటైన ఈ ఆలయానికి కార్తిక మాసంలో విశేషంగా భక్తులు తరలివస్తారు. ఏటా మహాశివరాత్రికి 5 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా ఆలయానికి తరలి వస్తుంటారు.

ఆలయ చరిత్ర.. 11వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని రెడ్డిరాజులు పరిపాలించే కాలంలో కామవరపుకోటలో ఓ బ్రహ్మరాక్షసి ప్రజలను పీడించేది. ఆ రాక్షస పీడ విరగడ కోసం మహారాజు ఆదేశాల మేరకు ఇద్దరు బ్రాహ్మణులు కాశీ నుంచి శివలింగాన్ని తీసుకొస్తూ.. తాడువాయి సమీపంలోకి వచ్చేసరికి దాన్ని ఓ తాటి బొత్తపై ఉంచి స్నానమాచరించేందుకు వెళ్లారు. తిరిగి వచ్చి దానిని తీసుకునే ప్రయత్నం చేయగా అక్కడి నుంచి స్వామి కదలలేదు. రాజు కలలో స్వామివారు సాక్షాత్కరించి తాను అక్కడే కొలువై ఉంటానని, తనకు ఆలయం నిర్మించాలని చెప్పారు. తన దృష్టి కామవరపుకోట వైపు ఉంటుందని, బ్రహ్మరాక్షసిని హతమారుస్తానని చెప్పారట. శివలింగం తాటి బొత్తపై ఉండటంతో గ్రామానికి తాడువాయి అని.. కామవరపుకోటకు ఉత్తరంగా వెలిసి దక్షిణం వైపు చూస్తుండటంతో దక్షణ కాశీగా పేరొందినట్లు పురాణాలు చెబుతున్నాయి. కాలక్రమంలో శివలింగం వెనుక వీరేశ్వరుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఇలా వెళ్లొచ్చు ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం మీదుగా తాడువాయి 70 కి.మీ. దూరంలో ఉంది. కొవ్వూరు నుంచి జంగారెడ్డిగూడెం మీదుగా 75 కి.మీ., తాడేపల్లిగూడెం నుంచి తాడువాయికి 65 కి.మీ ప్రయాణించి స్వామిని దర్శించవచ్చు. ఈ ఆలయానికి 40 కి.మీ. దూరంలో ద్వారకాతిరుమల, 20 కి.మీలో మద్ది క్షేత్రాలు ఉన్నాయి.

పట్టిసీమ పంపుల ద్వారా నీటి విడుదల

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ ఎత్తిపోతల పథకంలోని రెండు పంపుల నుంచి ఆదివారం 700 క్యూసెక్కులు ప్రాజెక్టు కుడి కాలువలోకి విడుదల చేశారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా గోదావరితోపాటు కృష్ణానదికి వరదలు భారీగా రావడంతో ఎత్తిపోతల పథకం అప్పుడప్పుడు నడిపారు. అక్టోబర్ 8న రెండు పంపులు ప్రారంభించి మొంథా తుపాను హెచ్చరికలతో అక్టోబర్ 19న నిలిపివేశారు. తాజాగా జలవనరుల శాఖాధికారుల ఆదేశాల మేరకు తిరిగి పంపులు ప్రారంభించినట్లు పర్యవేక్షణ డీఈ సురేశ్ తెలిపారు. ప్రస్తుతం గోదావరిలో నీటి మట్టం 15.60 మీటర్లు ఉందన్నారు. కుడి కాలువపై నిర్మించిన డెలివరీ సిస్టమ్ నుంచి గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువకు ప్రవహిస్తోంది.

ఆహార శుద్ధి పరిశ్రమలకు శంకుస్థాపన రేపు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రెండు ఆహార శుద్ధి పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ద్వారకాతిరుమల మండలంలో రూ.208 కోట్లతో ఏర్పాటు కానున్న గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థకు, నూజివీడు మండలంలో రూ.110 కోట్లతో స్థాపించనున్న రమణసింగ్ గ్లోబల్ ఫుడ్ పార్కుకు సీఎం శంకుస్థాపన చేయనున్నారన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కును సైతం వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. ద్వారకాతిరుమలలో ఏర్పాటు చేసే యూనిట్ ద్వారా 366 మందికి, నూజివీడు యూనిట్ ద్వారా 1500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సన్నాహాలు

శిక్షణ షెడ్యూలు విడుదల

మార్టేరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల నిర్వహణ కసరత్తు ముమ్మరం చేసింది. ఎన్నికల విధుల నిర్వహించే బాధ్యులకు ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జిల్లాల వారీగా వీడియో సమావేశాల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనుంది. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో అధికారులకు ఈ నెల 12న ఉదయం 11 గంటల నుంచి ఈ శిక్షణ జరగనుంది. ఈఆర్వో, ఏఈఆర్వోలు, బీఎల్వోలు, సూపర్‌వైజర్లు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచిస్తూ ఈసీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఓటర్ల మ్యాపింగ్, ఇతర ప్రక్రియలపై ఈ శిక్షణ నిర్వహించనున్నారు. తాజా పరిణామాలతో గ్రామాల్లో పంచాయతీ పోరుపై చర్చలు మొదలయ్యాయి.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

అర్హత పోటీల్లో 32 మంది ఎంపిక

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బుద్ధావతారం రాజు స్మారక జాతీయ సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీలో భాగంగా నిర్వహించిన అర్హత పోటీలు ఆదివారంతో ముగిశాయి. 45- 75 ఏళ్ల మధ్య వయసున్న క్రీడాకారులు 82 మంది తలపడగా 32 మంది ప్రధాన పోటీలకు ఎంపికయ్యారని కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్. రాజు తెలిపారు. సీనియర్స్ ర్యాంకింగ్ ఉన్న వివిధ రాష్ట్రాలకు చెందిన మరో 72 మంది క్రీడాకారులకు సోమవారం నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఈ పోటీలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

నేడు, రేపు వ్యకాసం సభలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాసం) 32వ జిల్లా మహాసభలను అత్తిలిలో సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1934లో నెల్లూరు జిల్లా అలగానిపాడులో పుచ్చలపల్లి సుందరయ్య వ్యకాసం స్థాపించినట్లు పేర్కొన్నారు. నాడు ఆయన స్థాపించిన వ్యకాసం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తోందన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీనివాస గ్రూప్ VJA ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంట బేబి కేర్‌కు వర్కర్లు కావలెను. భో+వ+జీతం ✆ 92814 52843, 92814 52827.

రామకృష్ణ గ్రూప్ Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవకు, ఇంటిపని, వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+వ+ జీతం॥ 16- 18K ✆ 9705297788, 9515108830.

TO LET

COMMERCIAL

TO.LET
విద్యా సంస్థలకు, ఆఫీసులకు
12000 వేలు చ॥అ
కమర్షియల్ స్పేసు
అద్దెకు ఇవ్వబడును.
దాసరి కమర్షియల్ కాంప్లెక్సు
జె.పి.రోడ్,భీమవరం-2
94408 70986
94403 56099

జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట రోడ్‌లో గల ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షోరూం నందు పనిచేయుటకు బాయ్స్(హెల్పర్స్), సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ESI + PF కలదు. Contact: 93923 99545, 99895 30260.

SECOND SALE

24 గుమ్మములు, 55 కిటికీలు, డోర్స్‌తో సహా (10 సం॥ముల పాతవి) అమ్మబడును. Contact: ✆ 94408 70986, 94403 56099.

JOBS

Kakatiya Constructions Hiring now! Inviting Applications for Project Manager (Min 8-10 Yrs Exp.) and Junior Engineers (0-3yrs Exp.) Qualification Polytechnic/ B.Tech Civil / Degree. Mail: hrkakatiyaconshyd@gmail.com. ✆ 79813 18373.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల్లారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.00 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

ప్రథమ వర్ధంతి



కీ॥శే॥ భూపతిరాజు సూర్యనారాయణరాజు గారు
జననం : 01-11-1935 నిర్యాణం : 21-11-2024

మాకు అత్యంత ఆప్తులు,
కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖామాత్యులు
శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ (బిజెపి వర్మ) గారి తండ్రి గారైన
శ్రీ భూపతిరాజు సూర్యనారాయణ రాజు గారి
ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయున్ని స్మరించుకుంటూ...
ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

JSN RAJU CONSTRUCTIONS

(c) eenadu

నిజమేంటో నోరులేని శునకాలకేం తెలుసు?

- రాష్ట్రంలో 43.14% శస్త్రచికిత్సలు, వ్యాక్సినేషన్ పూర్తి చేశారట
- ఏటా 2 లక్షలకు పైగా కుక్కకాట్ల కేసులు ఎందుకు నమోదవుతున్నట్లు?
- పుర, నగరపాలక సంస్థల లెక్కల్లో డొల్ల

ఈనాడు, అమరావతి: విశాఖలో 87% వీధి శునకాలకు సంతాననియంత్రణ శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ పూర్తి చేశారు. కర్నూలులో 11,970 శునకాల్లో 10,054 మేర శస్త్రచికిత్సలు పూర్తయ్యాయి. తిరుపతిలోనూ 74% పైగా సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ పూర్తయింది. వీధికుక్కల విషయంలో పుర, నగరపాలక సంస్థల లెక్కలు ఇలా ఉన్నాయి. ఇంత పటిష్ఠమైన చర్యలు తీసుకుంటే ఇంకా వాటి బెడద ఎందుకు ఉంది? కుక్కకాట్లతో ప్రజలు రోజూ ఆసుపత్రులకు ఎందుకు వస్తున్నారు? రాష్ట్రంలో ఏటా 2 లక్షలకు పైగా కేసులు ఎలా నమోదవుతున్నాయి? వీధికుక్కల విషయంలో పుర, నగరపాలక సంస్థలు తప్పుడు లెక్కలతో గారడీ చేస్తున్నాయి. శునకాలకు పెద్దఎత్తున శస్త్రచికిత్సలు చేసినట్లు నివేదికలు సృష్టిస్తున్నాయి. రేబిస్ టీకాలు వేయిస్తున్నట్లు చెబుతున్నాయి. ఈ నివేదికలను పరిశీలించే యంత్రాంగం లేకపోవడంతో కమిషనర్లు ఇచ్చిందే నివేదిక, చెప్పిందే వేదం అన్నట్లుగా తయారైంది. ఇలాంటి పరిస్థితిపైనే సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

చాలాచోట్ల సెంటర్లే లేవు... చికిత్సలెలా సాధ్యం?

★ రాష్ట్రంలో 123 పుర, నగరపాలక సంస్థల్లో, నగర పంచాయతీల్లో 4.94 లక్షల వీధి శునకాలు ఉన్నట్లుగా గుర్తించారు. వీటిలో 2,32,538కి సంతాననియంత్రణ శస్త్రచికిత్సలు, రేబిస్ వ్యాక్సినేషన్ పూర్తిచేసినట్లు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో కమిషనర్లు పేర్కొన్నారు. ఇంకా 2.02 లక్షల కుక్కలకు శస్త్రచికిత్సలు, వ్యాక్సినేషన్ చేయాల్సి ఉందని వివరించారు.

★ సగానికిపైగా పుర, నగరపాలక సంస్థల్లో శస్త్రచికిత్సలు నిర్వహించే కేంద్రాలు లేవు. వైకాపా ప్రభుత్వంలో శస్త్రచికిత్సల బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో చాలా కేంద్రాలు మూతపడ్డాయి. అయినా సగానికిపైగా శునకాలకు శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ పూర్తిచేశామంటూ అనుమానాలు వస్తున్నాయి.

★ శునకాలకు విధిగా శస్త్రచికిత్సలు చేయించాలని ప్రభుత్వం ఆదేశించినా చాలాచోట్ల కమిషనర్లకు పట్టడం లేదు. రేబిస్ టీకాలనూ వేయట్లేదు.

★ కుక్కల దాడిలో చిన్నారులు గాయపడినప్పుడు హడావుడి చేసి, తర్వాత మిన్నకుండిపోతున్నారు. ఇది ప్రధాన నగరాలైన విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, అనంతపురంలలో ఈ మధ్య మరీ ఎక్కువ కనిపించింది.

కొద్దిపాటి శస్త్ర చికిత్సల్లోనూ కమీషన్ల బాగోతం

★ శునకాలకు చేస్తున్న కొద్దిపాటి శస్త్ర చికిత్సలు, టీకాల్లోనూ పలు పుర, నగరపాలక సంస్థల్లో కమీషన్ల వ్యవహారాలపై ఆరోపణలున్నాయి. శస్త్రచికిత్సలు చేయకపోయినా చేసినట్లుగా రికార్డులు సృష్టించి బిల్లులు డ్రా చేస్తున్నారు. వ్యాక్సినేషన్ విషయంలోనూ ఇంతే.

★ అక్రమాల నిరోధించేందుకు గతంలో చేపట్టిన పలు విధానాలను పక్కన పెట్టారు. శస్త్రచికిత్సలు, వ్యాక్సిన్ వేసిన ప్రతి శునకాన్ని గుర్తించేలా చెవి కింద రంగు, రంధ్రం లాంటివి వేయడాన్ని 2014-19 మధ్య నిర్వహించి అమలు చేశారు. వైకాపా హయాంలో దీనికి తిలోదకాలిచ్చారు.

చిన్న పరిశ్రమలకు.. ఆధునిక సొబగులు!

- కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా సౌకర్యాల కల్పన
- రూ.200 కోట్లతో.. 100 సీఎఫ్‌సీల ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమలకు ఆధునాతన సాంకేతికత, అత్యాధునిక యంత్రాలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకే తరహా ఉత్పత్తులు చేసే పరిశ్రమలు ఉన్న క్లస్టర్లలో ప్రభుత్వ నిధులతో కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ) ఏర్పాటుకు నిర్ణయించింది. ఒక్కోదానికి రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం భరిస్తుంది. రూ.200 కోట్లతో ప్రాజెక్టును సిద్ధం చేసింది. రాష్ట్రంలో కనీసం 100 సీఎఫ్‌సీల ఏర్పాటును లక్ష్యంగా నిర్దేశించింది. చిన్న పరిశ్రమల నిర్వాహకులపై మూలధన పెట్టుబడి భారాన్ని తగ్గించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీపడేలా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ ఆలోచన.

గరిష్ఠంగా రూ.10 కోట్లు

ఒక్కో సీఎఫ్‌సీకి గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం ఇస్తుంది. దీనికోసం 10 మంది సూక్ష్మ, చిన్న పరిశ్రమల నిర్వాహకులు ప్రత్యేక వాహక నౌక (ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేయాలి. సీఎఫ్‌సీ నిర్వహణను ఎస్‌పీవీ పర్యవేక్షిస్తుంది. యంత్రాల కొనుగోలుకు చేసే ఖర్చులో 80 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. సీఎఫ్‌సీలోని యంత్రాలు, సాంకేతికత వినియోగించుకున్న యూనిట్ల నుంచి నామమాత్రంగా సర్వీసు ఛార్జీలు వసూలు చేసి, ఆ మొత్తాన్ని నిర్వహణకు ఎస్‌పీవీ వినియోగిస్తుంది. సీఎఫ్‌సీ ఏర్పాటుకు తక్కువ వ్యవధిలో అవసరమైన అనుమతులను ప్రభుత్వం ఇస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటైన తర్వాత యంత్రాలు, సాంకేతికతలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకునేందుకు ఆర్థిక పరిస్థితి వారికి సహకరించడం లేదు. నాణ్యమైన ఉత్పత్తులు సాధ్యం కావడం లేదు. పాత యంత్రాలతోనే ఉత్పత్తి చేస్తుండటం వల్ల నిర్వహణ వ్యయం పెరుగుతోంది. ఇదే సమయంలో అవే ఉత్పత్తులను కార్పొరేట్ సంస్థలు తక్కువ ధరకే మార్కెట్‌లో అందుబాటులోకి తెస్తున్నాయి. అవి అధునాతన యంత్రాలను (ఆటోమేషన్) వినియోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ వస్తు ఉత్పత్తి జరుగుతోంది. దీంతో కార్పొరేట్ సంస్థలతో ధరల్లో పోటీ పడే స్థాయి ఎంఎస్ఎంఈలకు ఉండటం లేదు. ఆ సమస్యలకు సీఎఫ్‌సీల ద్వారా పరిష్కారం లభించనుంది.

సీఎఫ్‌సీల్లో ఉండే సౌకర్యాలు

★ డిజైన్లు, పరిశోధన, అభివృద్ధి ★ అత్యాధునిక టెస్టింగ్ సదుపాయాలు, క్వాలిటీ కంట్రోల్ సెంటర్లు ★ నైపుణ్య శిక్షణ ★ ముడిసరకు డిపోలు, ఉత్పత్తుల విక్రయాలు.. మార్కెటింగ్ డిస్‌ప్లే సెంటర్లు

పరిశ్రమలకు వచ్చే మరికొన్ని ప్రయోజనాలు

★ డిజైన్లలో వచ్చే మార్పులు.. టెస్టింగ్, శిక్షణ సహా విస్తృతశ్రేణి సేవలు అందుబాటులో ఉంటాయి. ★ కామన్ నీటిశుద్ధి ప్లాంటు వ్యవస్థ ఉంటుంది. ★ అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీ పడేలా ఉత్పత్తుల తయారీకి అవకాశం.

వరికోత యంత్రానికి విద్యుత్తు తీగలు తగిలి ఇద్దరి మృతి

సంఘటనా స్థలం వద్ద మృతదేహాలు పరిశీలిస్తున్న ఎస్సై శివనాగబాబు

గండేపల్లి, న్యూస్‌టుడే: వరి కోత యంత్రాన్ని వాహనంపై తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసుల కథనం.. పశ్చిమగోదావరి జిల్లా పేకేరు, రాపాక గ్రామాలకు చెందిన కొపెల్లి సింహాద్రి అప్పన్న(57), గెడ్డం సందీప్(17)లు కాకినాడ జిల్లా సింగరంపాలెంలో వరి కోతలు కోసేందుకు యంత్రాన్ని వాహనంపై ఆదివారం తీసుకెళ్తున్నారు. రామయ్యపాలెం వద్ద 11 కేవీ విద్యుత్ తీగలు యంత్రానికి తగిలాయి. ఇది గమనించిన వ్యాన్ డ్రైవర్ సింహాద్రి అప్పన్న వాహనం దిగేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో వాహనానికి ముందు ద్విచక్ర వాహనంపై పైలట్‌గా వెళ్తున్న గెడ్డం సందీప్.. ఇది చూసి హెచ్చరించడానికి వ్యాన్ వద్దకు వచ్చాడు. వ్యాన్‌కు సైతం విద్యుత్తు ప్రసరించడంతో షాక్‌కు గురై ఇద్దరూ ఘటనాస్థలిలోనే మృతి చెందారు.

మొంథాతో భారీ వర్షాలంటూ.. భయపెట్టిన మెసేజ్‌లు

- ఆదివారం వేకువజామున ప్రజల ఫోన్లకు హెచ్చరికలు
- స్పష్టతనీయని విపత్తుల నిర్వహణ సంస్థ

ఈనాడు – అమరావతి

“కృష్ణానదికి వరద పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజ్ వద్ద సాయంత్రం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. నది ప్రయాణాలు, ఈతకు వెళ్లొద్దు” – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

“మొంథా తుపాను ప్రభావంతో ఈ రోజు మీ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉండండి. తగిన జాగ్రత్తలు తీసుకోండి” – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజల మొబైల్ ఫోన్లకు ఆదివారం వేకువజామున వచ్చిన హెచ్చరిక సందేశాలివి. దీంతో లంక గ్రామాల ప్రజలతో పాటు నదీ తీర ప్రాంతాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. తుపాను తీరం దాటి ఇన్ని రోజులవుతున్నా మొంథా ప్రభావంతో ఇప్పుడు వర్షాలేంటని మరికొందరు విస్మయపోయారు. సహజంగా తెల్లవారుజామున, అర్ధరాత్రి సమయాల్లో ఇలాంటి సందేశాలు వస్తే చాలా తక్కువ మందే చూస్తారు. ఆయా ప్రాంతాల్లోని బంధువులు, స్నేహితుల్ని నిద్రలేపి మరీ అప్రమత్తం చేస్తుంటారు. ఆదివారం తెల్లవారుజామున కూడా కొందరు ఇదే చేశారు. ఆదివారం వచ్చిన సందేశాలు ఎలా, ఎందుకు వచ్చాయో తెలియదు. విపత్తుల నిర్వహణ సంస్థ నివృత్తి చేసేందుకు ప్రయత్నించలేదు. మొబైల్ సందేశాల విషయాన్ని సంస్థ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్‌జైన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన కూడా స్పందించలేదు. చివరికి అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఆరా తీయగా మొబైల్ కంపెనీ నెట్‌వర్క్ సమస్య కారణమని తేలింది.



ఫోన్లకు వచ్చిన హెచ్చరిక సందేశాలు

సిబ్బంది మధ్య సమన్వయలోపం

వర్షాలు, వరదలు, పిడుగులు తదితర సమాచారాన్ని, హెచ్చరికల్ని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు చేరవేస్తుంది. ఎప్పటికప్పుడు అలర్ట్స్ ఇస్తుంది. ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలోని విభాగం వర్షాలు, వర్షపాత శాతం తదితర సమాచారాన్ని నమోదు చేస్తుంది. అయితే కొంతకాలంగా ఆర్టీజీఎస్‌లోని ‘అవేర్’ విభాగం కీలకంగా మారింది. విపత్తుల్ని అక్కడి నుంచే పర్యవేక్షిస్తున్నారు. విపత్తుల నిర్వహణ, ఆర్టీజీఎస్ శాఖల అధికారి ఒకరే అయినా సిబ్బంది మధ్య సమన్వయలోపం కన్పిస్తోంది.

జీఎంసీలో రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ఈనాడు, అమరావతి: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ)లో రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. డిసెంబరు 8 నుంచి జరపాలని ప్రాథమికంగా నిర్ణయించగా 10 నుంచి 15 రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకునే ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే నోడల్ అధికారి నియామకం జరగ్గా.. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పాథాలజీ, సైకియాట్రీ, డెంటల్, ఈఎన్‌టీ, ఎనస్థీషియా, రేడియాలజీ, కార్డియాలజీ, ఆప్తల్మాలజీ.. ఇలా వివిధ విభాగాలు ప్రాజెక్టులను ప్రదర్శించనున్నాయి. ప్రస్తుతం తుది రూపునకు వచ్చిన వాటిల్లో ఫ్లోరైడ్స్‌ను నీటి నుంచి వేరుచేసే పద్ధతులు, రక్త, ఇతర పరీక్షలు నామమాత్రపు రుసుముతో ఎలా చేయవచ్చు అనే పలు ఆసక్తిగొలిపే ప్రాజెక్టులున్నాయి. ఎగ్జిబిషన్‌కు వచ్చిన వారికి విజ్ఞానం పంచేలా, కార్యక్రమానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు జీఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

సెకండరీ ఆసుపత్రులకు 227 మంది స్పెషలిస్ట్ వైద్యులు

ఈనాడు, అమరావతి: సెకండరీ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత తీరనుంది. ఇన్ సర్వీస్ అభ్యర్థులుగా 12 సబ్జెక్టుల్లో పీజీ పూర్తి చేసిన 227 మంది స్పెషలిస్ట్ వైద్యుల్ని 142 సెకండరీ ఆసుపత్రుల్లో నియమిస్తూ వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 100 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 115 మంది, 33 ఏరియా ఆసుపత్రుల్లో 60 మంది, 7 జిల్లా ఆసుపత్రుల్లో 10 మంది, 2 ఎంసీహెచ్‌ల్లో ఇద్దరి చొప్పున త్వరలో విధుల్లో చేరనున్నారు.

500 కుటుంబాలకు కర్రల వంతెనే ఆధారం

కర్రల వంతెన తయారు చేసుకున్న గిరిజనులు

పదేళ్లుగా తాము పడుతున్న కష్టాలకు పరిష్కారం కనుగొనాలని గిరిజనులు సంకల్పించారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల సరిహద్దులో దేవాపురం పంచాయతీ శివారు అర్జాపురం, తుమ్మలపాలెం, మునగలపాలెం గ్రామాల్లో సుమారు 500 కుటుంబాలు ఉంటున్నాయి. వీరు బయట ప్రపంచానికి వెళ్లే మార్గం లేదు. వాగు దాటుకుని రహదారి వరకు రావాలి. వాగుపై చిన్నపాటి వంతెన నిర్మించాలని కొన్నేళ్లుగా అర్జీలు పెట్టినప్పటికీ ఏ ప్రభుత్వాలూ పట్టించుకోలేదు. దీంతో వాగుపై చెట్టు ఆధారంగా కట్టెలతో వంతెన నిర్మించుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదని వాపోయారు. ఇప్పటికైనా శాశ్వత వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పాడేరు

కనకాంబరాల పందిరిలో సోమేశ్వరుడికి అభిషేకాలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కార్తిక మాసం.. శివుని జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో స్వామికి ఆదివారం విశేషాభిషేకాలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, సాయంత్రం స్వామికి కనకాంబరం పుష్పాలతో అలంకరించి సహస్రనామ పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పంచారామ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 15 వేల మంది భక్తులు స్వామివార్లను దర్శించినట్లు ఆలయాధికారులు తెలిపారు. దర్శనం, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.3,55,000, అన్నప్రసాదం కానుకల రూపంలో రూ. 1,57,257 ఆదాయం వచ్చినట్లు ఈవో డి.రామకృష్ణ, ధర్మకర్తల మండలి ఛైర్మన్ చింతలపాటి బంగార్రాజు తెలిపారు.

ఖాతాలిస్తున్నారు.. ఖాళీ చేస్తున్నారు

అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లకు సహకారం

పట్టుబడిన వారిలో ఉమ్మడి జిల్లా వాసులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

అంతర్జాతీయ సైబర్ మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలిచ్చి సహకరిస్తున్నవారి జాబితాలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురి పేర్లు వెలుగు చూడడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ విధంగా ప్రత్యక్ష, పరోక్షంగా సహకరిస్తున్న 10 మందిని విశాఖ జిల్లా ఎండాడ సైబర్ క్రైం పోలీసులు ఈ నెల 7న అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన అయిదుగురు వ్యక్తులు ఉండడం ఆందోళన కలిగించగా తాజాగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో 84 మందిని పట్టుకోగా వారిలో కూడా జిల్లాకు చెందిన ఇద్దరు ఉండడంపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఇలాంటి కేసుల్లో దొరికినవారిలో నరసాపురం, మొగల్తూరు, కొవ్వలి, పెదఅమిరం, భీమవరం ప్రాంతాలకు చెందినవారి పేర్లు ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

స్థానికుల సహకారంతోనే.. స్థానికులు కొందరు సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలిచ్చి సహకరించడంతోనే సైబర్ నేరాలు కొనసాగుతున్నాయనేది పలువురి ఆరోపణ. ప్రస్తుతం పట్టుబడిన ఘటనలే దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎండాడకు చెందిన వ్యక్తికి వ్యాపార పెట్టుబడి పేరుతో వల పన్ని రూ.89 లక్షలు కాజేయగా బాధితుడు 1930 నంబరుకు కాల్ చేయడంతోపాటు ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడు ఇచ్చిన డేటా ఆధారంగా నగదు మొత్తం పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాకు చెందిన కొందరు వ్యక్తుల నుంచి ఇతర రాష్ట్రాల్లో ఉన్న కొంతమంది కరెంట్ ఖాతాలకు చేరింది. ఆపై క్రిప్టో కరెన్సీలోకి మారి నేరగాళ్లకు చేరుతోందని పోలీసు విచారణలో వెల్లడైంది. తాము ఇచ్చిన బ్యాంకు ఖాతా నంబర్లతో అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్నామనేది కొందరికి తెలియడం లేదనే వాదనలున్నాయి. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు పట్టుబడిన వారిలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సతీష్‌బాబు, సతీష్‌కుమార్ పేర్లు ఉన్నాయనే సమాచారంతో వారి సమగ్ర వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఇదే తీరులో బ్యాంకు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లకు నగదు చేరిన కొన్ని ఖాతాలను కేరళ పోలీసులు పరిశీలించగా ఆ కరెంట్ ఖాతాలు జిల్లాలోని పోడూరు, శివదేవుని చిక్కాల ప్రాంతాలకు చెందినవని తేలడంతో కేరళ పోలీసు బృందం ఇటీవల ఇక్కడికి వచ్చి విచారణ చేసి వెళ్లినట్లు తెలిసింది.

దాతృత్వానికి పశ్చిమ మారుపేరు: కలెక్టర్

కృత్రిమ కాలు అందజేస్తున్న నాగరాణి, కృష్ణతులసి

తణుకు, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా అంటేనే దాతృత్వానికి మారు పేరని కలెక్టర్ నాగరాణి అన్నారు. డాక్టర్ పీఎస్ఎన్ కిరణ్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కమ్మ కల్యాణ మండపం ఆవరణలో ఫౌండేషన్ ఛైర్మన్ బొల్లా సతీష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. స్నేహితుడి పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి దివ్యాంగుల అవసరాలను తీర్చడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. కృష్ణతులసి మాట్లాడుతూ దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఏర్పాటు చేసిన సంకల్పం-2025 కార్యక్రమం ద్వారా ఎంతో అద్భుతమైన అనుభూతిని పొందగలిగానన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ న్యూజిలాండ్ నుంచి దివ్యాంగులకు వీడియో సందేశాన్ని పంపారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 100 మందికి కృత్రిమ అవయవాలను అందించారు. ఫౌండేషన్ సభ్యులు వజావత్ కాన్‌రాజ్, షిర్మష్ట వీరన్న, సృష్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసా.. శ్రీవేంకటేశా..

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ ఆదివారం కొనసాగింది. కార్తిక మాసం, సెలవు రోజు రెండూ కలిసి రావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తుల విశేష సంఖ్యలో తరలివచ్చారు. దీంతో శ్రీవారి క్షేత్ర పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. సామాన్య భక్తులు స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో ఎదురు చూడాల్సి వచ్చింది.

కలిసి పనిచేస్తే ప్రగతి: మంత్రి నిమ్మల

పాలకొల్లు, న్యూస్‌టుడే: అంతా కలిసికట్టుగా పనిచేస్తే ప్రగతి పథంలో దూసుకెళ్లవచ్చని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు శివారు పూలపల్లిలో గౌడ శెట్టిబలిజ సామాజిక భవనం శ్లాబు పనుల్లో ఆయన ఆదివారం పాల్గొని శ్రమదానం చేశారు. నిర్మాణ కార్మికులతో కలిసి ఇసుక, కంకర, సిమెంటును పారతో కలిపి గమేళాతో స్వయంగా మోసుకెళ్లి మిక్సర్‌లో వేశారు. శ్లాబ్ నిర్మాణానికి కాంక్రీటు మిశ్రమాన్ని ట్రాలీతో తరలించారు.

కాంక్రీటు తరలిస్తున్న రామానాయుడు

ముప్పు పసిగట్టేలా.. ప్రాణాలు నిలబెట్టేలా!

- హెచ్చరిక వ్యవస్థ రూపొందించిన దొడ్డిపట్ల విద్యార్థులు
- రాష్ట్ర స్థాయి వృత్తి విద్య నైపుణ్య పోటీలకు ఎంపిక

పాలకొల్లు, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేలా జిల్లా విద్యార్థులు రూపొందించిన హెచ్చరిక వ్యవస్థ నమూనా జిల్లా స్థాయి వృత్తి నైపుణ్య పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. యలమంచిలి మండలం దొడ్డిపట్ల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.కార్తీక్ మరో ఇద్దరు విద్యార్థులు కె.శ్యామ్‌కిశోర్, ఎన్.దుర్గా జగదీశ్ భాగస్వామ్యంతో ఒకేషనల్ ఉపాధ్యాయుడు డి.సంతోష్‌కుమార్ మార్గదర్శకంలో ఈ నమూనాను రూపొందించారు.

ఇలా పనిచేస్తుంది.. ‘యాక్సిడెంట్ అలర్ట్ సిస్టం’ పేరుతో రూపొందించిన ఈ నమూనా ప్రయాణం సురక్షితంగా కొనసాగేలా సూక్ష్మ పరిశీలన చేస్తుంది. మనకు సంబంధించిన వాహనం ఎక్కడైనా ప్రమాదానికి గురైతే దానిలో అమర్చిన సెన్సార్ ద్వారా చరవాణికి సందేశం వచ్చి అప్రమత్తం చేస్తుంది. జీపీఎస్ వ్యవస్థ ద్వారా ప్రమాదం ఎక్కడ జరిగింది, ఆ సమయంలో వాహనం ఎంత వేగంలో వెళ్తుందో కూడా తెలుసుకోవచ్చు. అదే సందేశం 108 వాహనం, సమీప ఆసుపత్రి, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేలా ఈ వ్యవస్థను రూపొందించారు. దీనివల్ల క్షతగాత్రులకు వెంటనే వైద్య సహాయం అందుతుంది.

★ చోదకుడు మద్యం తాగి ఉంటే వాహనం నిలిచిపోయేలా ఈ పరికరంలో డ్రంక్ డిటెక్టర్ అమర్చవచ్చు. వాహనం ప్రయాణంలో ఉండగా ఎక్కడైనా నిప్పు రాజుకున్నా, పొగ వెలువడుతున్నా పర్యవేక్షకులను అప్రమత్తం చేయడంతో పాటు సమీప అగ్నిమాపక కార్యాలయానికి సందేశం పంపవచ్చు. వాహనాలకు ఏ ముప్పు పొంచి ఉన్నా ఈ వ్యవస్థ ద్వారా గుర్తించి ప్రమాదాన్ని నివారించే అవకాశం ఉందని రూపకర్తలు కార్తీక్, శ్యామ్, జగదీశ్ తెలిపారు. భవిష్యత్తులో ఇంజినీరింగ్ పూర్తిచేసి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు రూపొందించడమే తమ లక్ష్యమని వీరు చెబుతున్నారు.

నమూనాతో కార్తీక్, శ్యామ్

నేటి నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పాఠశాల విద్యార్థులకు అర్ధ సంవత్సర పరీక్షలు (సమ్మేటివ్-1) సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. (1- 5 తరగతుల విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, 6, 7 తరగతులకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.15 వరకు, 8- 10 తరగతులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. సబ్జెక్టుల వారీగా ఈ నెల 19వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రశ్నపత్రాలను ఇప్పటికే ఉన్నతాధికారులు స్థానిక ఎమ్మార్సీలకు చేర్చారు. వీటిని హెచ్‌ఎంలు పరీక్ష సమయానికి గంట ముందు మాత్రమే పాఠశాలలకు తీసుకెళ్లాలి. పరీక్షల నిర్వహణను జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. వచ్చే నెల 5న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించనున్న దృష్ట్యా ఈ లోపే మూల్యాంకనం పూర్తి చేసి ఫలితాలను సిద్ధం చేయాలని విద్యాశాఖ ఆదేశించింది.

పశ్చిమ గోదావరిలో ఇలా..	
పాఠశాలలు	1,368
విద్యార్థుల సంఖ్య	92,920

ఎలుకలకలం!

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో మూషికాలు హడలెత్తిస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు, గుత్తేదారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. తాజాగా ఆసుపత్రి ప్రాంగణంలోని వైద్య విద్యార్థినుల వసతి గృహంలో ఎలుకలు ఆరుగురు విద్యార్థినులను కరవడం కలకలం రేపింది. దీనిపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొన్నాళ్లుగా సంచరిస్తున్నా.. వైద్య కళాశాల వసతి గృహంలో కొన్నాళ్లుగా ఎలుకలు తిరుగుతున్నాయి. వీటిని కట్టడి చేయకపోవడంతో.. రాత్రివేళ నిద్రిస్తున్న విద్యార్థినులపై దాడి చేశాయి. ఈ ఘటన నేపథ్యంలో మిగతా విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత నెల నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వెయ్యి ర్యాట్ ప్యాడ్‌లు సిద్ధం చేసి ఎలుకలను కట్టడి చేయాలని గుత్తేదారుకు వైద్యాధికారులు సూచించినా, ఆచరణలో పెట్టలేదని తెలిసింది.

హడావుడిగా.. విద్యార్థినులపై ఎలుకల దాడి విషయం తెలుసుకున్న వైద్య కళాశాల ప్రధానాచార్యురాలు సావిత్రి ఆదివారం వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. సిబ్బందితో ఎలుకల బోనులు పెట్టించారు. అక్కడక్కడా కిటికీలు, తలుపులకున్న కొన్ని రంధ్రాలు మూయించారు. సావిత్రి మాట్లాడుతూ.. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గుత్తేదారుతో గతంలో కొన్ని ర్యాట్‌మ్యాట్‌లు పెట్టించామని, మందులు పిచికారీ చేయించామని వెల్లడించారు.

సర్వజన ఆసుపత్రిలో హడలెత్తిస్తున్న మూషికాలు

గుత్తేదారుకు ప్రతినెలా రూ.4.68 లక్షల చెల్లింపు

చర్యలు శూన్యం.. ఆసుపత్రుల్లో ఎలుకలు, ఇతర క్రిమికీటకాలను నియంత్రించేందుకు ప్రభుత్వం గుత్తేదారులను నియమించింది. సర్వజన ఆసుపత్రిలో మూషికాల నియంత్రణకు గుత్తేదారుకు ప్రతి నెలా సుమారు రూ. 4.68 లక్షలు చెల్లిస్తున్నట్లు సమాచారం. గుత్తేదారు నలుగురు సిబ్బందిని నియమించుకున్నారు. వారు అరకొర పనులతో నెట్టుకొస్తున్నారు. వైద్యాధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలోనూ మాతా శిశు విభాగంలో ఓ శిశువు చేతిని ఎలుకలు కొరికాయి. మార్చురీలోని ఓ మృతదేహం కళ్లు, ముక్కు తినేసిన ఘటనలూ ఉన్నాయి.

క్షీరారామంలో దెబ్బతిన్న ప్రహరీ

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పడమర వైపు ఉన్న ప్రదక్షిణ మండపం సమీపాన పురాతన ప్రహరీలో వెలుపలి వైపు కొంత భాగం ఇటీవల వర్షాలకు దెబ్బతింది. ఆ భాగాన్ని ఆలయ ఛైర్మన్ మీసాల రామచంద్రరావు (రాము), ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులకు, పురావస్తుశాఖకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. కార్తికమాసం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నందున గోడ దెబ్బతిన్న ప్రాంతంలోకి ఎవరూ వెళ్లకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కట్టడం, స్థలం పురావస్తు శాఖ పరిధిలో ఉందని.. సంబంధిత అధికారులు పరిశీలన అనంతరం వారి సూచనల మేరకు పునర్నిర్మాణ పనులు చేపడతామని వివరించారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మొంథా తుపాను నష్టాల పరిశీలనకు కేంద్రం నియమించిన పరిశీలన బృందం సోమవారం ఏలూరు జిల్లాలో పర్యటించనుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు గన్నవరం నుంచి బయల్దేరి సాయంత్రం 4 గంటలకు ఉంగుటూరు చేరుకుంటుంది. క్షేత్రస్థాయిలో తుపాను నష్టాల పరిశీలన అనంతరం జిల్లా యంత్రాంగం చేపట్టిన పునరుద్ధరణ పనులపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన తిలకిస్తారు. 4.30 గంటలకు బయల్దేరి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం వెళ్లనున్నారు. బృందంలో కేంద్ర వ్యవసాయశాఖ సంచాలకుడు పొన్నుసామి, సెంట్రల్ వాటర్ కమిషన్ సంచాలకుడు శ్రీనివాసు బాత్రి, కేంద్ర విద్యుత్తు అథారిటీ ఉపసంచాలకుడు ఆర్తి సింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ సంచాలకుడు మనోజ్‌కుమార్ మీనా సభ్యులుగా ఉన్నారని ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

(c) eenadu

భీమవరం
•భీమవరం •ఉండి

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

భీమవరం పట్టణం:	80085 74471	ఆకివీడు:	80085 74525
భీమవరం మండలం:	80085 74533	ఉండి:	80085 74526
పాలకోడేరు:	80085 74467	కాళ్ల	94401 04042
వీరవాసరం:	80085 74475		

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? ఒకటో పట్టణంలోని సుంకర పద్దయ్య వీధిలో వేగ నియంత్రికలు లేక వాహనాలు వేగంగా దూసుకెళ్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. - **సత్యనారాయణ, స్థానికుడు**

? భీమవరం తాలూకాఫీసు సెంటర్, ప్రకాశం చౌక్ పరిసరాల్లో వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపేస్తున్నారు. ప్రయాణాలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. - **డి.నరసింహారావు**

✔ వేగ నియంత్రికల ఏర్పాటుకు పరిశీలిస్తాం. పురపాలక అధికారులతో మాట్లాడి అడ్డదిడ్డంగా వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటాం. - **ఎం.నాగరాజు, ఒకటో పట్టణ సీఐ**

ఉండి, న్యూస్‌టుడే: ? కోలమూరు ఉప కేంద్రానికి సమీపంలో ఆర్అండ్‌బీ రహదారి అంచుల్లో ఇరువైపులా విద్యుత్తు స్తంభాలు వేశారు. దీంతో వాహన చోదకులు రాత్రి వేళ ప్రమాదాల బారిన పడుతున్నారు. - **కె.శివకృష్ణ, కోలమూరు**

✔ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. - **పి.శ్రీనివాసరావు, విద్యుత్తు ఏఈ, ఉండి**

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? కుముదవల్లి రైల్వే గేటు సమీపంలో కాలువ గట్టు పొడవునా చెత్త వేయడంతో కుప్పలుగా పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య సమస్యలు అధికమై ఇబ్బందులు పడుతున్నాం. - **రంగారావు, కుముదవల్లి**

✔ చెత్త తొలగింపజేస్తాం. - **అధికారులు**

రహదారి అంచుల్లో చెత్త తొలగింపు

స్పందనకు వందనం

ఉండి, న్యూస్‌టుడే: వాంద్రం నుంచి పెదపుల్లేరు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి అంచుల్లో సంపద కేంద్రం వద్ద ఇరువైపులా పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులను అధికారులు చేపట్టారు. 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో శనివారం ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి కె. శివాజీ స్పందించారు. రహదారి అంచుల్లో కూలీల సహాయంతో చెత్త తొలగింపు పనులు చేయించారు. దీంతో ఈ మార్గంలో రాత్రి వేళ రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తొలగాయని వాహనచోదకులు అభిప్రాయపడుతున్నారు.

రౌడీషీటర్లపై నిరంతర నిఘా

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంటుందని సీఐ జి.కాళీచరణ్ అన్నారు. రెండో పట్టణం పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎక్కడైనా అసాంఘిక, సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే చట్టపరంగా కఠిన చర్యలుంటాయన్నారు.

సిద్ధాపురంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

ఆకివీడు, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పేర్కొన్నారు. ఆకివీడు శ్రీవిద్యా వికాస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సిద్ధాపురంలో సేవా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామంలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ కొమ్మల సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ అధికారి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజా రక్షణ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పదో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్ పేట సామాజిక భవనంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుల, మత, వర్గ బేధాలు లేకుండా సమైక్యంగా జీవించాలన్నారు. పిల్లలకు క్రమశిక్షణ అలవర్చాలని, విద్యావంతులను చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఆర్.వరలక్ష్మి, వార్డు కౌన్సిలర్ సిరా కాంతమ్మ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, న్యాయవాదులు వల్లా దానయ్య నాయుడు, సతీశ్‌కుమార్, దాసరి శ్యామ్, ప్రగతి, పద్మజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

తాడేపల్లిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి పేదలకు వరమని పలవల బాబ్జీ అన్నారు. ఆదివారం తన విడిది కార్యాలయంలో నియోజకవర్గంలోని నలుగురికి సుమారు రూ. 5.5 లక్షల చెక్కులను అందజేశారు. ముందుగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిముక్కల రవికుమార్ జన్మదినం సందర్భంగా కేకును కోసి పంచి పెట్టారు.

ఆగిన కట్టడం.. అన్నదాతల్లో కలవరం

✪ నిర్మాణ దశలో నిలిచిన సర్‌ప్లస్ వియర్ ✪ శిథిలావస్థకు చేరిన పాత కట్టడంతో పొంచి ఉన్న ముప్పు

న్యూస్‌టుడే, ఉండి

మరో తుపాను వచ్చినా.. ఎగువున ఎప్పుడు అధిక వర్షాలు కురిసినా ఉండి, భీమవరం నియోజకవర్గాల్లో వివిధ పంటలకు ముప్పు పొంచి ఉందనే ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది. ఉండి ప్రధాన పంట కాలువపై నాలుగేళ్లుగా యండగండిలో సర్‌ప్లస్ వియర్ నిర్మాణ దశలో నిలిచిపోవడమే దీనికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త కట్టడం పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

వణికిస్తున్న పాత కట్టడం

సుమారు 140 ఏళ్ల కిందట డెల్టా వ్యవస్థ ఏర్పాటైంది. వందేళ్లపాటు మన్నిక ఉండేలా అప్పట్లో ప్రధాన కాలువల వెంబడి వివిధ చోట్ల లాకులు, వియర్లు నిర్మించారు. అనంతరం వాటి నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడంతో యండగండి, చిలకంపాడు, పరిమెళ్లలోని సర్‌ప్లస్ వియర్లు శిథిలావస్థకు చేరాయి. అంచనాలు వేసినా పనులు ముందుకెళ్లలేదు. ఈ కట్టడాల గోడలు వివిధ చోట్ల బీటలు వారాయి. అధిక వర్షాలు, వరదల్లో ఈ కట్టడాలపై నుంచి నీరు పొంగి పొర్లుతోంది. ఏక్షణంలోనైనా ఇవి కూలితే పంటలకు ఎక్కడ ముంపు బెడద ఎదురవుతుందోననే ఆందోళన అన్నదాతల్ని వెంటాడుతోంది. యండగండిలో అధిక వర్షాలు కురిసిన సమయాల్లో 15 ఏళ్లుగా సాగుదారులు తీవ్ర భయాందోళనతో వణికిపోతున్నారు.

బిల్లులు చెల్లించని గత వైకాపా ప్రభుత్వం

ఉండి పంట కాలువ నుంచి యనమదుర్రు డ్రెయిన్‌కు అధిక నీటిని విడుదల చేసే యండగండి ప్రాంతంలో పాత కట్టడానికి సుమారు అర కిలోమీటరు దూరంలో కొత్త కట్టడం నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. సుమారు రూ.1.91 కోట్ల అంచనాలతో పునాదులు వేశారు. ఆ పనులకు చెందిన బిల్లు నాటి ప్రభుత్వం చెల్లించ లేదు. దీంతో పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి బిల్లు చెల్లించింది. మిగిలిన పనులు పుంజుకుంటున్న దశలో వర్షాల వల్ల నిలిచిపోయాయి. మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో పనులు పునఃప్రారంభిస్తాం.. వర్షాలు ఇటీవలే తగ్గుముఖం పట్టాయి. త్వరలో ఆ ప్రాంతానికి నిర్మాణ సామగ్రి తరలించి పనులు పునఃప్రారంభించేందుకు కృషి చేస్తాం. - **సత్యనారాయణమూర్తి, జలవనరులశాఖ ఉండి డీఈఈ**

ఐక్యతకు ప్రతీక వన మహోత్సవం

సభలో ఎమ్మెల్యే రామాంజనేయులు, అతిథులు, నిర్వాహకులు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: కార్తిక వన మహోత్సవాలు భక్తి, స్నేహం, ఐక్యతను చాటుతాయని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. బ్యాంకు కాలనీ కాపు కల్యాణ మండపంలో కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (కోపా) వార్షికోత్సవం, కార్తిక వన మహోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సభకు ఆయన అధ్యక్షతవహించి మాట్లాడారు. ముందుగా ఉసిరి మొక్క వద్ద దామోదర పూజ చేశారు. అతిథిగా కంబాల వీరభద్రరావు (అమెరికా) పలువురు ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు కాగిత వీరమహంకాళి దంపతులను, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేట్ ట్రైబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్, డాక్టర్ చుండూరి మల్లీశ్వరిలను సత్కరించారు. అనంతరం వన సమారాధన నిర్వహించారు. విశ్వకాపు జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు, విశ్రాంత ప్రిన్సిపల్ డి.చంద్రాజీ, తెదేపా రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, కోపా అధ్యక్షుడు యర్రంశెట్టి హరనాథ్, కార్యదర్శి ఆరేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరాల జోలికెళ్లొద్దు

ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న న్యాయమూర్తి సురేష్‌బాబు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల హక్కుల పరిరక్షణకు చట్టాలున్నాయని.. వాటిని అతిక్రమిస్తే ఎంతటివారైనా శిక్షార్హులేనని భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), జి.సురేష్‌బాబు అన్నారు. జాతీయ సేవా దినోత్సవం సందర్భంగా భీమవరంలోని ప్రత్యేక ఉప కారాగారంలో ఆదివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. నిందితులు తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని సత్ప్రవర్తన కలిగి నేరాల జోలికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కారాగారాన్ని, ఆహార పదార్థాలను న్యాయమూర్తి పరిశీలించారు. కారాగార పర్యవేక్షకుడు డి.వెంకటగిరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.న్యూటన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలయాల ప్రతిష్ఠ పెంచుతాం : మంత్రి నిమ్మల

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఆలయాల కీర్తి ప్రతిష్ఠలు పెంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. పాలకొల్లులోని అష్ట భుజలక్ష్మీ నారాయణ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవ సభ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. మంత్రి పాల్గొని ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి మాట్లాడుతూ ధర్మకర్తలు సమన్వయంతో పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఛైర్మన్‌గా రేపాక నాగ వెంకట రత్న ప్రవీణ్ భాను, సభ్యులుగా శేషబట్టరు పవన్ విజయ్ కుమార్, గోనేటి నాగలీల, మైగాపుల పద్మజ, కాసాని శశిరేఖ, పాశం సీతామహాలక్ష్మి, మల్లవోలు సురేశ్, వరదా శేషుకుమార్, బుడితి నాగమాధురి ప్రమాణ స్వీకారం చేశారు. ఏఎంసీ ఛైర్మన్ కోడి విజయభాస్కర్, ఉన్నమట్ల కబర్ధి, కర్నేన గౌరునాయుడు, మహ్మద్ జానీ, పెచ్చెట్టి బాబు, తులా రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేద్దాం

నరసాపురం, న్యూస్‌టుడే: భవిష్యత్తు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించేందుకు కృషి చేయాలని తులసీ సంస్థల యజమాని తులసీ రామచంద్రప్రభు విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని గన్నాబత్తుల పెదతాత తులసమ్మ కల్యాణ మండపంలో ఆదివారం రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో కాపు, బలిజ సంఘీయుల కుటుంబాలకు చెందిన 200 మంది విద్యార్థులకు రామచంద్రప్రభు రూ.3 లక్షలు, సంఘ నాయకులు రూ.10.50 లక్షల మేర నగదు ప్రోత్సాహకాలను అందించారు.

వంతెన నిర్మిస్తేనే ముంపు సమస్య తీరేది

భీమవరం - నరసాపురం ఆర్అండ్‌బీ రహదారిలో తొక్కోడు తూము వంతెన కారణంగా ఏటా రైతులు పంటలు నష్టపోతున్నారు. నందమూరుగరువు, బాలేపల్లి, బొబ్బనపల్లి, మత్స్యపురి గ్రామాల్లోని సుమారు 3 వేల ఎకరాలకు సంబంధించిన మురుగు తొక్కోడు డ్రెయిను ద్వారా ప్రవహిస్తుంటుంది. తొక్కోడు తూము వంతెన వద్ద వ్యర్థాలు పేరుకుపోవడం, నీటి ప్రవాహానికి తగిన విధంగా తూముల సామర్థ్యం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. దశబ్దాలుగా ఇక్కడ కొత్త వంతెన నిర్మించాలని రైతులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, మత్స్యపురి (వీరవాసరం)**

భీమవరం - నరసాపురం మార్గంలో తొక్కోడు వద్ద ఇలా..

దస్తావేజులు పోయినవి

పశ్చిమగోదావరిజిల్లా, భీమవరం మున్సిపల్ ఏరియా భీమవరం, పి.యస్.ఆర్.నగర్, కాపురస్థులు చెంపాటి రామకృష్ణంరాజు గారి కుమారుడు చెంపాటి రామ్ మనోజ్ వర్మ చెందిన తూ॥గో॥జిల్లా, తాళ్ళరేవు సబ్‌రిజిష్ట్రారు వారి ఆఫీసులో రిజిష్టర్డు కాబడిన తాళ్ళరేవు మండలం, కోరంగి గ్రామం వాలుకు రి.స.నెం.401 రు య 1.00 ట్ల కు చెందిన ది.26.06.2014 సం॥తేది నాటి దస్తావేజు నెం. 2175/2014 రు గల ఒరిజినల్ దస్తావేజు 2) ది.19.09.2011 సం॥రం దస్తావేజు నెం. 5059/2011 రు గల రెండు లింకు దస్తావేజులను నేను ది.29.10.2025 సం॥రం తేదిన జిరాక్స్ నిమిత్తం మా ఇంటి వద్ద నుండి భీమవరం జువ్వలపాలెం రోడ్డుకు వెళ్ళుండగా మార్గమధ్యలో సదరు దస్తావేజు పెట్టిన కవరు జారిపడిపోయినది. ఎంత వెదికినను దొరకలేదు. దొరికినవారు పై అడ్రస్సుకు తెలియజేయగలరు.

చెంపాటి రామ్ మనోజ్ వర్మ
S/o.చెంపాటి రామకృష్ణంరాజు, భీమవరం, Cel. 94402 65688

In the Court of the IInd additional Civil Judge (Junior Division) / IInd Addl. Judl. First Class Magistrate, Bhimavaram

EP.No. 2/2022 in OS.No. 193/2021

D.H.R.: Bonu Nagamani

AND

JDR.: Gavidi Bala Krishna

JDR Address: Gavidi Bala Krishna S/o Appa Rao, Aged: 38 years, Javahar Pet, Near Church, Dumpagadapa RLY. gate, Akiveedu, W.G.Dt.,

పై నెంబరు గ్రంథములో పై కోర్టు వారి ఎదుట దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 26-11-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు బహిరంగ వేలం వేయబడును కావున సదరు ఆస్తి కావలసిన వారు స్వయంగా పాటలో పాల్గొని పాడుకొనవలెను. పాటలో పాల్గొనే వారు వారి యొక్క ఆధార్ కార్డు కాపీ కోర్టు వారికి ఇవ్వవలెను.

SCHEDULE

W.G.Dt., Akividu Mandal, Dumpagadapa Village, an extent of 96.88 Sq. Yards or 81 Sq. Metres of site nearest D.No. 2-1, in R.S.No. 213/7 Situated in Dumpagadapa Village, Akividu Mandal with all easementary rights, Rain Water, Drain Water usage and Joint way etc.,

East: site belongs to Thamma Siva Kesava 22'.9"
West: 16 feet width of Joint way (8Feet width of path way)
North: site belongs to Pyla Param Naidu 38'.4"
South: site belongs to Bhupathi Raju Ranga Raju and another 38'.4"

DHR Value: Rs. 3,00,000/-,
Amina Value: Rs. 12,00,000/-

Sd/- **P.Jaya Kumar** B.A., B.L.,
P.Preethi, B.A., B.L.,
Advocates, Bhimavaram

Bhimavaram
Dt. 07-11-2025

ప్రారంభిస్తున్న నరసింహారావు, శ్రీనివాస్ తదితరులు

అన్నప్రసాదం వితరణ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ప్యాడీ, రైస్ మర్చంట్స్ సంఘం ఆధ్వర్యంలో గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను జిల్లా రైస్ మిల్లర్ల సంఘ ఉపాధ్యక్షుడు చవాకుల నరసింహారావు ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. సంఘం జిల్లా కార్యదర్శి కొత్త శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి యిన్నమూరి నాగేశ్వరరావు, కోశాధికారి బాదరాల పుల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

✪ భీమేశ్వరస్వామి సన్నిధిలో పట్టణానికి చెందిన మరిడి చక్రధరరావు దంపతుల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించి మాట్లాడారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ గనిరెడ్డి త్రినాథ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు శాంతినగర్‌లోని నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకటరావు, నాయకులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన కార్తిక శోభ

రాయకుదురు (వీరవాసరం), న్యూస్‌టుడే: కార్తిక మాసం.. శివుడి జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా ఆదివారం రాయకుదురు ఉమా మూలేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన అడ్డాల వెంకటేశ్వరరావు, రమేష్ కుటుంబ సభ్యులచే వేద పండితులు లక్ష బిల్వార్చన, శాంతి హోమం చేయించారు. సాయంత్రం జ్యోతిర్లింగార్చన చేశారు.

పాందువ్వ (ఉండి), న్యూస్‌టుడే: పాందువ్వలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామికి పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు.

జ్యోతిర్లింగార్చన పూజ

మనోహరం.. మావుళ్లమ్మ పడిపూజ..

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మావుళ్లమ్మ దీక్ష స్వీకరించిన భక్తుల ఆధ్వర్యంలో ఆలయ కళా వేదిక ఎదుట ఏర్పాటు చేసిన భారీ మండపంలో ఆదివారం నయన మనోహరంగా పడి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అమ్మవారిని దర్శించారు. మండపానికి ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. ప్రధానార్చకుడు, గురు మాత మద్దిరాల మల్లికార్జునశర్మ, పండితులు పూజలు చేయించారు. అధిక సంఖ్యలో మాలాధారణ భక్తులు పాల్గొన్నారు.

మండప పూజ

వేడుక తిలకిస్తున్న భక్తజనం

తప్పిన పెను ప్రమాదం

రహదారి విభాజకాన్ని ఢీకొని ఆగిన బస్సు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణం ఉండి రోడ్డులో ఆర్టీసీ బస్సు రహదారి విభాజకంపైకి దూసుకెళ్లింది. భీమవరం నుంచి ప్రయాణికులతో ఏలూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలి ఆదివారం కావడంతో జన, వాహన రద్దీ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: మహదేవపట్నంలోని బొక్కావారిపాలెంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం మధ్యాహ్నం దాడి చేసి ఆరుగుర్ని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. వారి నుంచి రూ.5,230 నగదు స్వాధీనపరచుకొని కేసు నమోదు చేశామన్నారు.

12న నిరసన ప్రదర్శన

ఉండి, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ ఈ నెల 12న ఉండిలో నిర్వహించే నిరసన ప్రదర్శనకు పార్టీ శ్రేణులంతా తరలిరావాలని వైకాపా మండల కన్వీనర్ పీవీఆర్‌కే ఆంజనేయరాజు పిలుపునిచ్చారు. ఉండి రాజులపేటలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు నివాసంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరసన ప్రదర్శనకు చెందిన గోడపత్రికను విడుదల చేశారు. జడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గ మహంకాళి, పట్టణ అధ్యక్షుడు కరిమెరక మల్లికార్జున్, ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి బడుగు బాలాజీ పాల్గొన్నారు.

12వ వర్ధంతి

మా కుటుంబ మార్గదర్శకులు శ్రీ యిర్రింకి సీతారామయ్యగారు మమ్ములను వీడి 12 సంవత్సరాల కాలం గడిచినను మీ జ్ఞాపకాలు ఎప్పటికీ మాకు చిరస్మరణీయం. దివికేగిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ యిర్రింకి సీతారామయ్యగారు
దొడ్డనపూడి, కాళ్ళ మండలం
మరణం: 23-11-2013

కుమార్తె: కొల్లి వెంకటసీతామహాలక్ష్మి - (లేటు) వీరకోటి పాండురంగారావు
మనుమడు: కొల్లి మూలాస్వామి, బ్యాంక్ వాల్యూయర్ - సూర్యనాగబాలాత్రిపుర సుందరి
మరియు కుటుంబ సభ్యులు

12వ వర్ధంతి: ది. 10-11-2025 కార్తీకమాసం బహుళషష్ఠి

ప్రథమ వర్ధంతి

కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రివర్యులు, శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ (BJP వర్మ) గారి తండ్రి గారైన శ్రీ భూపతిరాజు సూర్యనారాయణరాజు గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మరించుకుంటూ... దివికేగిన ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

చాగంటి శంకరశాస్త్రి, చాగంటి హేమలత
అడ్వకేట్స్, భీమవరం

ప్రథమ వర్ధంతి

కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రివర్యులు, శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ (BJP వర్మ) గారి తండ్రి గారైన శ్రీ భూపతిరాజు సూర్యనారాయణరాజు గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మరించుకుంటూ... దివికేగిన ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

గుడాల ఈశ్వరచంద్ర - ఉమా నాగ పద్మావతి
HP గ్యాస్ ఏజన్సీ, పాలకొల్లు, ఫోన్: 08814 - 273799

ప్రథమ వర్ధంతి

శ్రీ భూపతిరాజు సూర్యనారాయణరాజు గారు
భీమవరం

కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రివర్యులు, శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ (BJP వర్మ) గారి తండ్రి గారైన శ్రీ భూపతిరాజు సూర్యనారాయణరాజు గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మరించుకుంటూ... దివికేగిన ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

P.విజయ్ (Vesper), హైదరాబాద్
చింతలపాటి శ్రీకాంత్, పత్తేపురం
గాదిరాజు ఆంజనేయవర్మ, భీమవరం
(Vesper Varma)

ఆహ్వానము

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము దేవదాయ ధర్మదాయ శాఖ నేతృత్వంలో
కార్తిక మాస శుభసందర్భంగా
ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్, భీమవరం వారిచే
పంచభూతాలలో వాయులింగమైన
జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీ కాళహస్తీశ్వరస్వామి
కల్యాణోత్సవం & కార్తిక దీపోత్సవం

నవంబర్ 10 సోమవారం 2025

మధ్యాహ్నం గం. 2-30లకు గునుపూడి, సోమేశ్వర ఆలయం నుండి	శ్రీ కాళహస్తి ధర్మప్రచార రథంతో శోభాయాత్ర
సాయంత్రం గం. 5-30 నుండి	కల్యాణోత్సవం
రాత్రి 7-00 గంటల నుండి	కార్తిక దీపోత్సవం

వేదిక: ఆనంద ఫంక్షన్ హాల్, జె.పి.రోడ్, భీమవరం
యావన్మంది భక్తులు ఈ వేడుకలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించ కోరుచున్నాము.

ఆధ్యాత్మిక, సామాజిక సేవలో.. ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్, భీమవరం

ప్రథమ వర్ధంతి

మాకు అత్యంత ఆప్తులు, కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ గారి తండ్రి గారైన శ్రీ భూపతిరాజు సూర్యనారాయణ రాజు గారి
ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మరించుకుంటూ... దివికేగిన ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ భూపతిరాజు సూర్యనారాయణరాజు గారు
భీమవరం
జననం: 01-11-1935 మరణం: 21-11-2024

iSPACE Inc., California, USA
iSpace
iSPACE SOFTWARE SOLUTIONS Hyderabad - 500 081
RAJESH KOTHAPALLI - President
SURESH KOTHAPALLI - CEO
RANGA RAJU KOTHAPALLI - Director
RAMESH MADDUKURI - Director

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

తీరంలో డ్రోన్లతో నిఘా

సీఐ, ఎస్సైలకు సూచనలిస్తున్న డీఎస్పీ

మొగల్తూరు, న్యూస్‌టుడే: సముద్రతీరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిఘా పెంచాలని డీఎస్పీ జి.శ్రీవేద అరవింద సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీపాలెం సౌత్ బీచ్‌లను ఆదివారం డీఎస్పీ సందర్శించారు. పర్యాటకుల రక్షణ తీసుకున్న చర్యలను డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై జి.వాసు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, మెరైన్ పోలీసులు బీచ్‌లో బందోబస్తు నిర్వహించారు.

నైపుణ్య పోటీల్లో తొలి స్థానం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఇటీవల భీమవరంలో జరిగిన సమగ్రశిక్షా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ జిల్లా స్థాయి నైపుణ్య పోటీల్లో పాలకొల్లు బీఆర్ఎంవీఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి తొలి స్థానంలో నిలిచారని హెచ్ఎం ఎస్.రూన్నీలక్ష్మీబాయి ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో 'బ్యాంకింగ్ రంగంలో లావాదేవీలు' అంశంపై పాఠశాల విద్యార్థులు వై.లాశ్రశ్రీ, జి.ఉమాదేవి, కె.విష్ణుతేజ దుర్గ (పదో తరగతి), హేమశ్రీ (తొమ్మిదో తరగతి) ప్రదర్శించిన నమూనా జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

సూర్య భగవానుడికి అభిషేకాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురంలోని గోదావరి తీరాన బాపు ఘాట్ వద్ద ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పంచహారతులు ఇచ్చారు.

నందీశ్వరస్వామికి.. పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతం గ్రామంలో కొలువైన నందీశ్వర స్వామికి ఆదివారం అన్నాభిషేకం చేశారు. తొలుత అర్చకులు తొలేటి ప్రసాద్ బ్రహ్మత్వంలో ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ బడేటి గణేశ్, భక్తులు పాల్గొన్నారు.

సోమేశ్వరుడికి లక్ష బిల్వార్చన.. యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలిలో కొలువైన ఉమా సోమేశ్వర స్వామి ఆలయంలో గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం లక్ష బిల్వార్చన చేశారు. ప్రధానార్చకుడు నరేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు.

చెన్నమల్లేశ్వరుడికి.. పోడూరు, న్యూస్‌టుడే: జిన్నూరులో కొలువైన పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో కార్తిక దీపాలు వెలిగించారు. ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ ఆచంట సూర్యనారాయణరాజు, ఈవో వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

గంగాలమ్మకు నైవేద్యాలు.. నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎల్బీచర్లలో కొలువైన గంగాలమ్మ ఆదివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం భగ్గేశ్వరం రామాలయం వద్ద అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గురుస్వామి కె. గణపతి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ భక్తులు అభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

పురదారులు.. తారుమారు!

తుపాను ధాటికి ధ్వంసమైన రోడ్లు

▲ నరసాపురం పట్టణ పరిధి చిన మామిడిపల్లి వద్ద రహదారి ఇలా గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం కురిస్తే గుంతల్లో నీళ్లు చేరి రోడ్డంతా బురదగా మారుతోందని.. ఎండ కాస్తే దుమ్ము రేగుతోందని వాహన చోదకులు వాపోతున్నారు.

పాలకొల్లు మార్కెట్, నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో పాలకొల్లు, నరసాపురం పట్టణాల్లో ప్రధాన, అంతర్గత రహదారుల్లో గుంతలు ఏర్పడి అధ్వానంగా మారాయి. గుంతలను తప్పించుకు వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, రద్దీ వేళల్లో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదని వాహన చోదకులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారులకు మరమ్మతులు చేయించడంతో వాహనదారులకు కాస్త ఊరట లభించింది. వర్షాకాలం మొదలయ్యాక కొన్ని రహదారులు మళ్లీ దెబ్బతినగా.. తుపాను ప్రభావంతో మిగిలినవి కూడా ధ్వంసమయ్యాయి.

ఇదీ పరిస్థితి..

● పాలకొల్లు పట్టణ పరిధిలో భీమవరం ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. దాదాపు 1.5 కిలోమీటర్ల మేర ఈ మార్గం మొత్తం అధ్వానంగా మారింది. కొద్దిపాటి వర్షం కురిసినా గుంతల్లోకి నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నరసాపురం రహదారిదీ ఇదే పరిస్థితి.

● నరసాపురం - భీమవరం మార్గం పట్టణ పరిధిలో సుమారు 2 కిలోమీటర్ల మేర అడుగడుగునా గుంతలమయంగా మారింది. ఈ మార్గంలో భారీగా దుమ్ము, ధూళి రేగుతోంది. దీనికి తోడు వీధిదీపాలు కూడా మరమ్మతులకు గురికావడంతో రాత్రి వేళ ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

● పాలకొల్లు పట్టణంలో కీలకమైన లాకుల కూడలి- పూలపల్లి రహదారిలో తారుపొర దెబ్బతిని ఇలా కంకర పైకి తేలడంతో వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేయించకుంటే గుంతలు పెద్దవై రోడ్డు పూర్తిగా ధ్వంసమయ్యే ప్రమాదముందని చెబుతున్నారు.

త్వరలో పనులు చేపడతాం..

పాలకొల్లు లాకుల నుంచి పూలపల్లి వరకు రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు వెళ్లాయి. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఆ వెంటనే పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడతాం. **- ఎస్ఎన్ మూర్తి, ఆర్అండ్‌బీ ఏఈ, పాలకొల్లు**

ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రామానాయుడు

ఆలయాల ప్రతిష్ఠ పెంచేలా కృషి: మంత్రి నిమ్మల

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఆలయాల కీర్తి ప్రతిష్ఠలు పెంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. పాలకొల్లులోని అష్టభుజలక్ష్మీ నారాయణ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవ సభ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. మంత్రి పాల్గొని ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి మాట్లాడుతూ ధర్మకర్తలు సమన్వయంతో పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఛైర్‌పర్సన్ రేపాక నాగ వెంకట రత్న ప్రవీణ్ బాను, సభ్యులుగా శేషుబాబు, పవన్ విజయ్ కుమార్, గోనేటి నాగలీల, మైగాపుల పద్మజ, కాసాని శశిరేఖ, పాశం సీతామహాలక్ష్మి, మల్లవోలు సురేష్, వి.శేషుకుమార్, బి.నాగమాధురి ప్రమాణ స్వీకారం చేశారు. ఏఎంసీ ఛైర్మన్ కె.విజయభాస్కర్, కబర్ధి, కె. గౌరునాయుడు, మహ్మద్ జానీ, పి. బాబు, రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం

యలమంచిలి, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సరఫరా మెరుగుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి నిమ్మల అన్నారు. కలగంపూడిలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ. 50 లక్షలతో చేపట్టిన తాగునీటి సరఫరా పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ పథకం ద్వారా యలమంచిలి మండలానికి రూ. 35 కోట్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. గతంలో రద్దయిన నిధులను తిగిరి తీసుకువచ్చేలా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు మంత్రివర్గ సహచరులు సహకరించారని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసంతి

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజా రక్షణ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని 10వ అదనపు జిల్లా జడ్జి ఎ. వాసంతి సూచించారు. పట్టణంలోని అరుంధతీపేట సామాజిక భవనంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుల, మత, వర్ణ భేదాలు లేకుండా సమైక్యంగా జీవించాలన్నారు. పిల్లలకు క్రమశిక్షణ అలవర్చాలని, విద్యావంతులను చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఆర్.వరలక్ష్మి, వార్డు కౌన్సిలర్ సిర్రా కాంతమ్మ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, న్యాయవాదులు చల్లా దానయ్యనాయుడు, సతీశ్‌కుమార్, చాముండేశ్వరి, ప్రగతి, పద్మజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా కూరగాయల ధరలు



పెనుగొండ గ్రామీణ, పెనుమంట్ర, న్యూస్‌టుడే: కొన్ని రకాల మినహా కూరగాయల ధరలు నిలకడగా కొనసాగుతున్నాయని పెనుగొండ మండలం దొంగరావిపాలెంలోని హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారులు తెలిపారు. ఆదివారం నాటి ధరలు (10 కిలోలకు రూపాయల్లో) ఇలా ఉన్నాయి. దొండ- 450, దోస- 400, నల్ల వంకాయ- 700, తెల్ల వంకాయ- 900, బెండ- 500, నాటు చిక్కుడు- 1100, బీట్‌రూట్- 450, క్యారెట్- 500, బంగాళాదుంప- 200, పచ్చిమిర్చి- 250, క్యాబేజీ- 250, ముల్లంగి- 600, ఉల్లి- 210 నుంచి 230, టమాటా (25 కిలోల ట్రే)- 550.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	:80085 74504	ఆచంట	:90631 44737
పాలకొల్లు	:80085 74510	పెనుగొండ	:80085 74469
పోడూరు	:90631 44741	పెనుమంట్ర	:91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? యర్రమిల్లి వారి వీధిలో రహదారి వెంబడి చెత్తను తగలబెడుతున్నారు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం.- జి. ఆంజనేయులు, నరసాపురం

✔ ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం. - అంజయ్య, పురపాలక కమిషనర్

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ? బియ్యపుతిప్ప పరిధి రాజీవ్‌నగర్ రహదారిలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. - తిరుమాని నాగేశ్వరరావు, స్థానికుడు

✔ మరమ్మతులు చేయిస్తాం. - నాగేంద్రకుమార్, ఈవోపీఆర్డీ, నరసాపురం

? లక్ష్మణేశ్వరం - దర్బరేవు రహదారిని పూర్తిస్థాయిలో వెడల్పు చేయలేదు. పేరుపాలెం బీచ్ రోడ్డులో కల్వర్టు శిథిలమై ప్రమాదకరంగా మారింది. - సూరిబాబు, వేములదీవి పడమర

✔ పుష్కరాల సందర్భంగా ఈ రహదారితో పాటు కల్వర్టు అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. - జీవీఎస్ కిరణ్‌కుమార్, ఆర్అండ్‌బీ డీఈఈ

నరసాపురం, న్యూస్‌టుడే: ? కోటలోవీధిలో రహదారి పక్కన చెత్త కుప్పలతో ఇబ్బంది పడుతున్నాం. - నాగేశ్వరరావు, నరసాపురం

✔ తరలింపునకు చర్యలు తీసుకుంటాం.- పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? కేపీపాలెంలో తాగునీటి పథకం వద్ద విద్యుత్తు స్తంభానికి తీగలు వేలాడుతున్నాయి. - రాము, స్థానికుడు

✔ తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి ఏఈ

డ్రెయిన్లలో పూడిక తొలగింపు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కొప్పర్రులోని పలు శివారు ప్రాంతాల్లో మురుగు నిలిచిపోయి పారిశుద్ధ్యం అధ్వానంగా మారిన తీరుపై 'ఎక్కడి మురుగు అక్కడే' శీర్షికతో ఈ నెల 8న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఈవోపీఆర్డీ కె.నాగేంద్రకుమార్ స్పందించారు. ఆయన సూచనలతో పంచాయతీ పాలకులు, గ్రామ కార్యదర్శి శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఆ ప్రాంతంలో డ్రెయిన్లను శుభ్రం చేసి మురుగు నిలిచిపోకుండా చర్యలు చేపట్టారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రైతు సంఘం జిల్లా మహా సభలు ఈ నెల 14, 15 తేదీల్లో జరుగుతాయని నాయకులు తెలిపారు. పెంటపాడులోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద ఆ సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి, నాయకులు రంగారావు, వెంకట్రావు మాట్లాడారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చే ముందు ఎన్నికల ప్రచారంలో రైతు సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారని వచ్చాక వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందన్నారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటల ఇన్‌పుట్ నేటికి సబ్సిడీ ఇవ్వలేదన్నారు. సుబ్బారావు, చీర వెంకన్న, పెనగంటి దుర్గ, సన్యాసమ్మ పాల్గొన్నారు.

మురుగుతో ఇక్కట్లు!

పోడూరు, న్యూస్‌టుడే: కవిటంలో కొత్త, పాత కాలనీ వాసులను మురుగు కష్టాలు తప్పడం లేదు. ఈ ప్రాంతంలో రహదారులన్నీ పల్లంగా ఉండటంతో వర్షాలు కురిసినప్పుడు ముంపు బారిన పడుతున్నాయి. రోజుల తరబడి మురుగు రహదారులపై, ఇళ్ల ముందు నిలిచిపోవడంతో కాలనీ వాసులు దోమల బెడద, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీల్లో సుమారు 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి సందిస్తూ కాలనీల్లో మురుగు బయటకు వెళ్లేలా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

ఎండిన చెట్టు.. కూలేట్టు!

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లు భార్గవీ నగర్‌లో రైస్‌మిల్లు సమీపాన ప్రధాన రహదారి పక్కన ఎండిన కొబ్బరిచెట్టు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఇది ఎప్పుడు ఏ వాహనం మీద పడి ప్రమాదానికి దారితీస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పురపాలక అధికారులు దృష్టి సారించి దీనిని తొలగించాలని కోరుతున్నారు.

అడ్డగోలుగా ఇసుక రవాణా

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పరిసర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్నారు. గ్రామాల్లో తవ్విన ఇసుకను ట్రాక్టర్ ట్రక్కుల్లో ఎత్తుగా నింపడంతో పాటు వాటిపై బరకాలు కప్పకుండా తరలిస్తున్నారు. పట్టణ రహదారుల్లో సైతం ఈ ట్రాక్టర్లు వేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు.

ఆక్రమణల తొలగింపు

మొగల్తూరు, న్యూస్‌టుడే: శేరేపాలెం నుంచి కొప్పర్రు వరకు రహదారి వెంబడి ఆక్రమణలను అధికారులు తొలగిస్తున్నారు. మొగల్తూరు నుంచి శేరేపాలెం మీదుగా నరసాపురం మండలం కొప్పర్రు వరకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల నాబార్డు ద్వారా రూ.3.20 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులకు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ శంకుస్థాపన చేశారు. రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న ఆక్రమణలు, మట్టి దిబ్బలను యంత్రంతో తొలగిస్తున్నారు.

వేంకన్నను దర్శించుకున్న పాదయాత్ర భక్తులు

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలం నుంచి అప్పనపల్లి క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లిన భక్తులు ఆదివారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం వారు స్వగ్రామాలకు చేరుకున్నారు. ఏటా పాదయాత్రలో పాల్గొనే వారి సంఖ్య పెరుగుతోందని నిర్వాహకులు తెలిపారు.

నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు

పెనుగొండ, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని దేవాదాయ శాఖ జిల్లా అధికారి వి. హరిసూర్యప్రకాశ్ అన్నారు. వడలిలో అగస్తేశ్వర స్వామి, వెంకట్రామపురంలో పట్టాభిరామయ్య ఆలయాల ఈవోగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన మన్నే శ్రీనివాస్ అభినందన సత్కార సభ ఆదివారం స్థానిక వాసవీ నివాస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, కృష్ణవేణి దంపతులను ఘనంగా సత్కరించారు.

'ఏకపక్ష నిర్ణయాలు సరికాదు'

పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా పెనుగొండ పంచాయతీ పేరు మార్పు చేయాలని నిర్ణయించడం సరికాదని హైకోర్టు న్యాయవాది ఇండుగపల్లి రామానుజరావు పేర్కొన్నారు. ఆదివారం పెనుగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యులు కోరితే గ్రామం పేరు మార్చేస్తారా అని ప్రశ్నించారు. వాసవీమాత స్ఫూర్తితోనే పెనుగొండ ప్రజల ఆత్మగౌరవం కాపాడేందుకు పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

మురుగు మళ్లింపునకు చర్యలు

పోడూరు, న్యూస్‌టుడే: మట్టపర్రులో కచ్చాడ్రెయిన్‌ల తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ గ్రామంలో ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. కొద్దిపాటి వర్షం కురిసినా రహదారిపై నీరు నిలిచిపోతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు మట్టపర్రు, చినపాలెం, పెదపాలెం, పలు దళిత వాడల్లో కచ్చాడ్రెయిన్‌లు తవ్వుతున్నారు. అవసరమైన ప్రాంతాల్లో సిమెంట్ పైపులు ఏర్పాటు చేసి మురుగును మళ్లించేలా చర్యలు చేపట్టినట్లు సర్పంచి దొమ్మేటి శ్రీను తెలిపారు.

నేటి నుంచి ఎన్ఎస్ఎస్ శిబిరం

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం వైఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వేములదీవి తూర్పు గ్రామంలో సోమవారం నుంచి ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు సేవా శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

వసతి గృహాల్లో కలెక్టర్ తనిఖీలు

తణుకు, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో చదువుకుని ఎంతో మంది ప్రయోజకులయ్యారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. ఆదివారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. లక్ష్యాన్ని ఏర్పరుచుకుని.. దానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. రూ.10 లక్షలతో హౌసింగ్ కార్పొరేషన్ పర్యవేక్షణలో వసతి గృహంలోని ఫ్లోరింగ్, ఫౌండేషన్ ఎత్తు పెంపు, టైల్స్ నిర్మాణం వంటి ఆధునికీకరణ పనులను ఆమె పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న వైద్య, విద్య, ఆహార సదుపాయాలపై ఆరా తీశారు.

మహిళ అదృశ్యం

మొగల్తూరు, న్యూస్‌టుడే: మహిళ అదృశ్యమైన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.వాసు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రామన్నపాలేనికి చెందిన మహిళ (26) తన తల్లితో కలిసి జీవిస్తున్నారు. ఆమె ఈ నెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆత్మీయ వేదికలు.. వన సమారాధనలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: కార్తిక వన సమారాధనలు బంధువులు, స్నేహితులు, సంఘీయులను ఒకే చోటకు చేర్చే ఆత్మీయ వేదికలుగా నిలుస్తున్నాయని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో వాసవీ గామాస్ కల్యాణ మండపంలో దేవాంగ సంఘీయుల వన సమారాధన ఆదివారం జరిగింది. మంత్రి నిమ్మల ఈ కార్యక్రమంలో పాల్గొన్ని మాట్లాడారు. చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు.

● నరసాపురం 12వ వార్డులో సాయిబాబా గుడి వద్ద చౌడేశ్వరి దేవి దేవాంగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, సంఘ నాయకులు నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం: సమావేశంలో పాల్గొన్న నాయకులు

పెనుగొండ: చిన్నారుల నృత్య ప్రదర్శన

● పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనసమారాధన ఘనంగా నిర్వహించారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలోని లక్ష్మీజనార్దన స్వామి కల్యాణ మండపంలో ఆర్యవైశ్యుల వన సమారాధన ఘనంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు పాల్గొని ఐక్యతను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ● పెనుగొండ లింగాలవీధి రెడ్డి కల్యాణ మండపంలో వేమన రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ● పెనుగొండ మార్కెట్ యార్డు ఆవరణలో కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. చిన్నారులు, మహిళలకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు ఏఎంసీ ఛైర్మన్ బడేటి బ్రహ్మాజీ బహుమతులు అందించారు.

ఐక్యతతో అభ్యున్నతి

ములపర్రు: మాట్లాడుతున్న వెంకట్

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సంఘీయుల ఐక్యత అభ్యున్నతికి దోహదపడుతుందని తెదేపా యువ నాయకుడు పితాని వెంకట్ అన్నారు. ములపర్రులో వెదుల్లమ్మ ఆలయం వద్ద శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు గుత్తుల లోకేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర, న్యూస్‌టుడే: వనంపల్లిలో శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, యాత, ఈడిగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. పెనుమంట్రలో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

నాయకర్, మాజీ మంత్రి వెంకటరమణలను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఇతర సామాజిక వర్గీయులతో సఖ్యతగా మెలుగుతూ.. సంఘీయుల అభ్యున్నతికి బాటలు వేసుకోవాలని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ సూచించారు. ముత్యాలపల్లిలో బండిముత్యాలమ్మ ఆలయ సమీపాన తోటలో ఆదివారం నిర్వహించిన అగ్నికులక్షత్రియ సంఘీయుల వనసమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలను విద్యావంతులను చేస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. నాయకత్వ లక్షణాలు పెంపొందిచుకొని రాజకీయంగా ఎదగాలని మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ సంఘీయులకు సూచించారు. మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, నరసాపురం పురపాలక ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మైలా వసంతరావు, అగ్నికుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేద్దాం

జ్యోతి వెలిగిస్తున్న తులసీరామచంద్ర ప్రభు

నరసాపురం, న్యూస్‌టుడే: భవిష్యత్తు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించేందుకు కృషి చేయాలని తులసీ సంస్థల యజమాని తులసీ రామచంద్రప్రభు విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని గన్నాబత్తుల పెదతాత తులసమ్మ కల్యాణ మండపంలో ఆదివారం రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో కాపు, బలిజ సంఘీయుల కుటుంబాలకు చెందిన 200 మంది విద్యార్థులకు రామచంద్రప్రభు రూ. 3 లక్షలు, సంఘ నాయకులు రూ.10.50 లక్షల మేర నగదు ప్రోత్సాహకాలను అందించారు. రాయల్ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు చినిమిల్లి సత్యనారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. రాయల్ సర్వీస్ ట్రస్టు ఛైర్మన్ సీతాలం రాంబాబు, మన అమెరికా తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపకుడు వి. రావు, క్లబ్ పట్టణ అధ్యక్షుడు మునుకోటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం జాబితాలు సిద్ధం

పెనుగొండ: రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

పెనుగొండ, పాలకొల్లు, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో వీచిన ఈదురు గాలులతో డెల్టాలో పలు ప్రాంతాల్లో వరి చేలు నేలనంటి దెబ్బతిన్నాయి. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వ్యవసాయాధికారులు గ్రామాల వారీగా పంట నష్టంపై సర్వే నిర్వహించారు. దీనికి సంబంధించిన జాబితాలను ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

హెక్టారుకు రూ.25 వేల వరకు పరిహారం: 33 శాతానికి పైగా దెబ్బతిన్న చేలకు హెక్టారుకు రూ.25 వేల వరకు బీమా పరిహారం అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తాన్ని త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకాలు, బ్యాంకుఖాతా వివరాలను ఇప్పటికే ఆన్‌లైన్లో నమోదు చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేలా కృషి చేస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంటకటేశ్వరరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8,902 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు.

మండలాల వారీగా నష్టం ఇలా..

మండలం	రైతులు	హెక్టార్లలో
పెనుగొండ	341	133
పెనుమంట్ర	773	353
ఆచంట	448	175
పోడూరు	678	272
పాలకొల్లు	1060	386
నరసాపురం	2,755	1,175

(c) eenadu

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

అఖండ నామ సంకీర్తనలు

గీతాలు ఆలపిస్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక డీసీ చెరువు సమీపంలోని సాయి మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయిబాబా శతవర్ష జయంతి వేడుకలో భాగంగా ఆదివారం అఖండ నామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 23 వరకు సాయిబాబా వారి శతవర్ష జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సేవా సమితి సభ్యులు నవీన్‌బాబు, శ్రీనివాస్, శోభనాద్రిరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన

పాల్గొన్న డైమండ్స్ లయన్స్ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం మధుమేహ వ్యాధిపై అవగాహన శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పేరిచర్ల మురళీకృష్ణంరాజు, జోన్ ఛైర్‌పర్సన్ షేక్ బాజీ మాట్లాడుతూ.. మధుమేహ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. లయన్స్ క్లబ్ క్యాన్సర్ వ్యాధిపై కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. క్లబ్ జిల్లా గవర్నర్ పాపారావు నాయుడు, ఆయుర్వేద వైద్యుడు లక్ష్మీనరసింహం, క్లబ్ ట్రెజరర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాటకేశ్వరస్వామికి లక్ష పత్రిపూజ

ఇరగవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా రేలంగిలోని శ్రీలలిత భ్రమరాంబ మహిళా మండలి ఆధ్వర్యంలో తాటకేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్ష పత్రి పూజ నిర్వహించారు. పండితులు బదరీనారాయణ, సూర్యనారాయణ శర్మ, అర్చకుడు వీరేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు చేశారు. మహిళా మండలి సభ్యులు లలితా పారాయణం, శివస్తోత్రం ఆలపించారు.

అర్చనలు నిర్వహిస్తున్న పండితులు

సోమలింగేశ్వరుడికి విశేషాలంకరణ

ఏలూరు ఆధ్యాత్మికం: తూర్పువీధిలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు చేశారు. అనంతరం నెమలి పింఛాలతో నేత్రపర్వంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

తరచూ మూలన.. తరలింపునకు యాతన

- మరమ్మతులకు గురవుతున్న యంత్రాలు
- వేధిస్తున్న కార్మికుల కొరత

తణుకు, న్యూస్‌టుడే: తణుకు మున్సిపాలిటీలో చెత్త సేకరణ రోజు రోజుకు భారంగా మారుతోంది. యంత్రాలు తరచూ మరమ్మతులకు గురి కావడంతో వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిచేందుకు సిబ్బంది సతమతమవుతున్నారు. రోజూ పట్టణంలో ఉత్పన్నమవుతున్న దాదాపుగా 45 వేల టన్నుల వ్యర్థాలను తరలించేందుకు అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థాయికి సరిపడా కార్మికులను నియమించి, యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని కార్మికులు కోరుతున్నారు.

మూలకు చేరిన బాబ్‌కాట్

500 మందికి..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ 500 మంది జనాభాకు ఒక పారిశుద్ధ్య కార్మికుడు ఉండాలి. తణుకు మున్సిపాలిటీలో ఉన్న 1,05,000 మందికి లెక్క ప్రకారం 210 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండాలి కానీ 163 మంది మాత్రమే క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు. ఇందులో పర్మినెంట్ కార్మికులు 27, కాంట్రాక్టు సిబ్బంది 149తో కలిపి 176 మంది ఉన్నప్పటికీ. సుమారు 13 మంది ఆఫీస్ సిబ్బంది, డ్రైవర్లుగా డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. రోజూ సుమారు 10 మంది సెలవు పెడుతుంటారని అధికారులు చెబుతున్నారు.

అద్దాలు పగిలిపోయి, తుప్పుపట్టి అధ్వానంగా ఉన్న పెద్ద కాంపాక్టర్

తుప్పు పట్టిన వాహనం..

వ్యర్థాలను సేకరించేందుకు ఒక పెద్ద కాంపాక్టర్, రెండు మినీ ఉండగా ఒకటి పూర్తిగా మూలకు చేరగా మరొకటి మరమ్మతులకు గురైంది. లోడర్‌కు బ్రేకులు సక్రమంగా లేకపోవడంతో పాటు అద్దాలు పగిలిపోయి, బాడీ తప్పు పట్టి ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి. మూడు బాబ్‌కాట్ మిషన్లు ఉండగా ఒకటి మాత్రమే సేవ లందిస్తుండగా, ఉన్న మూడు ట్రాక్టర్లు సైతం అంతంత మాత్రంగానే ఉన్నాయి. 'కార్మికుల కొరతను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాం.' అని తణుకు మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? కడకట్ల రామాలయం ఎదురు రహదారిలో మురుగు బోదె నిండి నీరు నిల్వ ఉండటంతో ఇబ్బందిగా ఉంది. - సతీశ్, స్థానికుడు
✔ మురుగు ముందుకు సాగేలా చర్యలు చేపడతాం. - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.
? స్థానిక జీవిత బీమా కార్యాలయానికి వెళ్లే రహదారిలోకి డంపర్ బిన్ రావడంతో ప్రమాదకరంగా మారింది. - శ్రీనివాస్
✔ సమస్య పరిష్కరిస్తాం. - ఏసుబాబు, పురపాలక కమిషనర్.

పిచ్చి మొక్కల తొలగింపు

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: పడమర విప్పరు వెలమపేట వద్ద ఉన్న విద్యుత్తు స్తంభానికి అల్లుకు పోయిన పాదులను ఎట్టకేలకు తొలగించారు. 'అల్లుకున్న పాదులు...ప్రమాద హేతువులు' శీర్షికన ఆదివారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి ఏఈ స్పందించారు. సిబ్బందిని పంపి పాదులను తొలగింపజేశారు.

ఆదిశంకరుడికి అర్చనలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏలూరు రోడ్డులోని శంకర మఠంలో కార్తిక ఆర్ద్ర నక్షత్ర పురస్కరించుకుని ఆదిశంకరాచార్య స్వామికి ఆదివారం విశేష అర్చనలు నిర్వహించారు. చంద్రమౌళీశ్వర స్వామి వారికి లక్ష బిల్వార్చన, సర్వ మంగళ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని అర్చనలు అందజేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మొదలైన శిర్డీ సాయి ఉత్సవాలు..

తణుకు, అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి నాయీ బ్రాహ్మణ సేవ సంఘం ఆధ్వర్యంలో శిర్డీ సాయిబాబా మహోత్సవాలు ఐదవ బంగారయ్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ నెల 17 వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బాబాను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

చెక్కు అందజేస్తున్న బాబ్జి తదితరులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని వలవల బాబ్జి అన్నారు. ఆదివారం తన విడిది కార్యాలయంలో నియోజకవర్గంలోని లబ్ధిదారులకు సుమారు రూ. 5.5 లక్షల చెక్కులను అందజేశారు. ముందుగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదినం సందర్భంగా కేకును కోసి పంచి పెట్టారు. తెదేపా పట్టణ, పెంటపాడు అధ్యక్షులు పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, నాయకులు అప్పన్న, గొర్రెల శ్రీధర్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, ధనరాజు, రాంబాబు తదితరులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వన సమారాధన

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పెదతాడేపల్లిలోని బ్రాహ్మణ కల్యాణ మండపం వద్ద బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో వన సమారాధనలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. భవన నిర్మాణ, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జి పాల్గొన్నారు. సభ్యులు బాబ్జిని సత్కరించారు. సర్పంచి పోతుల అన్నవరం, బీవీఆర్ కళాకేంద్ర వ్యవస్థాపకుడు వెంకటరామారావు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. ★ ఏపీ నిట్ సమీపంలో తాడేపల్లిగూడెం మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా భవన నిర్మాణ, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జి, జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేశ్‌లు పాల్గొన్నారు.

అవకాశాలు కల్పించేందుకు ముందుకు రావాలి: ఎమ్మెల్యే

తణుకు, న్యూస్‌టుడే: స్థానిక యువత ఉపాధే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని, వారికి విదేశాల్లో ఉన్న యువత అవకాశాలు కల్పించే దిశగా ముందుకు రావాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రవాసాంధ్రులను కోరారు. ఆదివారం న్యూజిలాండ్‌లో నిర్వహించిన ఎన్నారై తెదేపా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైకాపా పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిని భ్రష్టు పట్టించారని, తిరిగి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అమరావతికి పునర్జీవం పోశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అమలు చేస్తున్నారన్నారు.

లక్ష్యాన్ని ముందుగానే ఏర్పరుచుకోవాలి: కలెక్టర్

వసతిగృహ అధికారులతో మాట్లాడుతున్న నాగరాణి

తణుకు, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో చదువుకుని ఎంతో మంది ప్రయోజకుల య్యారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. ఆదివారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. లక్ష్యాన్ని ఏర్పరుచుకుని.. దానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. రూ.10 లక్షలతో హౌసింగ్ కార్పొరేషన్ పర్యవేక్షణలో వసతి గృహంలోని ఫ్లోరింగ్, ఫౌండేషన్ ఎత్తు పెంపు, టైల్స్ నిర్మాణం వంటి ఆధునికీకరణ పనులను ఆమె పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న వైద్య, విద్య, ఆహార సదుపాయాలపై ఆరా తీశారు.

చట్టం ముందు అందరూ సమానమే

మాట్లాడుతున్న న్యాయమూర్తి రంజిత్ కుమార్

తణుకు, న్యూస్‌టుడే: చట్టం ముందు అందరూ సమానమేనని తణుకు మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి.వి.ఎన్. రంజిత్ కుమార్ పేర్కొన్నారు. న్యాయసేవల దినోత్సవం పురస్కరించుకుని తణుకు 4వ అదనపు ఛైర్మన్ జిల్లా న్యాయమూర్తి డి.సత్యవతి ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక బీసీ వసతి గృహంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సివిల్, క్రిమినల్ కేసులలో న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేసే వెసులుబాటు ఉందని వివరించారు. మహిళా చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు పోణంగి శ్రావణి సమీరా, ఎస్కే మోతీ శ్రీ, కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, పారాలీగల్ వాలంటీర్లు కాకర్ల నరసన్న, ఎం.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్న 23వ జిల్లా మహా సభలు విజయవంతం చేయాలని కోరుతూ పెంటపాడు ప్రజా సంఘాల కార్యాలయం వద్ద ఆ సంఘ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి, నాయకులు రంగారావు, వెంకట్రావులు మాట్లాడారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చే ముందు ఎన్నికల ప్రచారంలో రైతు సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారని వచ్చాక వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందన్నారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటల ఇన్‌పుట్ నేటికి సబ్సిడీ ఇవ్వలేదన్నారు. సుబ్బారావు, చీర వెంకన్న, పెనగంటి దుర్గ, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు కథకు చిరునామా కాళీపట్నం

సత్యనారాయణను సత్కరించిన నిర్వాహకులు

తణుకు, న్యూస్‌టుడే: కాళీపట్నం రామారావు జయంతి సందర్భంగా సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో స్థానిక మారుతీ పాఠశాల ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరావు మాట్లాడుతూ తెలుగు కథకు చిరునామా కాళీపట్నం రామారావు అని కొనియాడారు. విశ్రాంత మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ మూర్తిని నిర్వాహకులు సత్కరించారు. మదనగోపాల్, శ్రీనివాసరావు, నరసింహరావు, శ్రీనివాస్, కుమార్, కుశల్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

అత్తిలి నుంచి పాలూరు వెళ్లే దారి దుస్థితి

తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కృషితో అత్తిలి పాలూరు డ్యాం నుంచి పాలూరు, కొమ్మర మీదుగా కోరుకొల్లు వరకు నూతనంగా రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. నిర్మాణం కోసం తీసిన గోతులు రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటున్నాయని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ర.భ.శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అత్తిలి గ్రామీణం

రెయిలింగ్ విరిగి.. ప్రమాదకరంగా మారి!

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి లక్ష్మీనరసింహస్వామి గుడికి వెళ్లే మార్గంలో రామేశ్వరం కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన ఇరువైపులా రెయిలింగ్ కొంత భాగం విరిగిపోయింది. ధాన్యం, కొబ్బరి వంటి ఉత్పత్తులు తరలించే సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏఈ యశ్వంత్ మాట్లాడుతూ.. వంతెనతో పాటు కావలిపురం వరకు బీటీ రహదారి నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

కుక్కలున్నాయ్.. కరుస్తున్నాయ్

గణపవరంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామ వీధుల్లో గుంపులుగా తిరుగుతూ.. వృద్ధులు, పిల్లలపై దాడులు చేస్తున్నాయి. రాత్రివేళ బస్టాండ్ నుంచి ఇంటికెళ్లే వారి వెంటపడి పరుగులు పెట్టిస్తున్నాయి. కుక్కల సంఖ్య పెరగకుండా సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయిస్తామని ఈవో ప్రసాద్ తెలిపారు. - న్యూస్‌టుడే, గణపవరం

గుంతలు.. ఎన్నాళ్లీ చింతలు..!

రహదారిపై చేరిన నీరు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి గణేశ్ నగర్‌కు వెళ్లే రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. పురపాలక సంఘం నిర్మాణం పేరుతో మూడు నెలలుగా వదిలేయడంతో హౌసింగ్‌బోర్డు, ఎఫ్‌సీఐ, గణేశ్ నగర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు. రహదారి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పురపాలక కమిషనర్ ఏసుబాబును సంప్రదించగా రహదారి విస్తరణకు విద్యుత్తు స్తంభాలను మార్చుతున్నారు. త్వరితగతిన నిర్మాణం పనులు చేపట్టేలా చర్యలు చేపడతామని తెలిపారు.

సంచార శకటంపై వైద్యం

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచార శకటం ద్వారా ఇంటింటికి వైద్యం కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు హుస్సేన్ అహ్మద్, నిమ్మగడ్డ అచ్యుత రామయ్య పట్టణంలో పర్యటించి మంచానికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. సభ్యులు ఆకుల వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఉచితంగా ముందులు అందజేశారు. వైద్య సేవలు కావాల్సినవారు 99853 43530, 90592 92717 నంబర్లను సంప్రదించాలన్నారు. సంఘ కోశాధికారి భాస్కరరావు, సభ్యులు నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శిశువు మృతదేహానికి అంత్యక్రియలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: చినతాడేపల్లిలో గుర్తు తెలియని మగ శిశువు మృతదేహాన్ని గ్రామీణ పోలీసులు ఆదివారం గుర్తించారు. మృతదేహం ఎవరిదని ఆచూకీ తెలియకపోవడంతో గ్రామీణ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం అంత్యక్రియలు చేశారు.

వ్యక్తిగత మరుగుదొడ్లకు ప్రాధాన్యం
నిర్మాణ పనులు చేపట్టాలని ఉత్తర్వుల జారీ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరోసారి ప్రత్యేక దృష్టి సారించాయి. దీని కోసం నిధుల కేటాయింపులో పురపాలక సంఘాలను భాగస్వామ్యం చేశాయి. 2014 తెదేపా ప్రభుత్వంలో పురపాలక సిబ్బంది మరుగుదొడ్లు లేని గృహాలను గుర్తించి.. నిర్మాణానికి రూ.15 వేల చొప్పున మంజూరు చేసి.. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని అధికారులు చైతన్య పరిచారు. తాజాగా మరోసారి వాటి నిర్మాణానికి ప్రాధాన్యమిస్తూ దృష్టి సారించనున్నారు.

గత ప్రభుత్వంలో.. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తిగా విస్మరించింది. వీటి మరుగుదొడ్డి నిర్మాణానికి నిధులు కేటాయించలేదు. కూటమి వచ్చాక మరోసారి గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. నిర్మాణ ఖర్చులో కేంద్రం రూ.4 వేలు, రాష్ట్రం రూ.2667 చెల్లించగా.. మిగిలిన రూ.8333 నగదు పురపాలక సంఘాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. 'మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి, నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటాం.' అని అత్తిలి మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేశ్ తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసంతి

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజా రక్షణ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పదవ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి సూచించారు. పట్టణంలోని అరుంధతీపేట సామాజిక భవనంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుల, మత, వర్గ బేధాలు లేకుండా సమైక్యంగా జీవించాలన్నారు. పిల్లలకు క్రమశిక్షణ అలవర్చాలని, విద్యావంతులను చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఆర్.వరలక్ష్మి, వార్డు కౌన్సిలర్ సిర్రా కాంతమ్మ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, న్యాయవాదులు చల్లా దానయ్యనాయుడు, సతీశ్‌కుమార్, చాముండేశ్వరి, ప్రగతి, పద్మజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలు

బ్రహ్మానందరెడ్డి మార్కెట్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో మొంథా తుపానుతో కూరగాయల పంటలు దెబ్బతినడంతో ధర పెరిగింది. గతంతో పోల్చితే బీర, చిక్కుళ్లు, దొండ, కాకర, దోస, ఆనబ రూ.10 నుంచి రూ.50 వరకు పెరిగాయి. మిగిలినవి స్థిరంగా ఉన్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే కూరలు కోసం పలు అగచాట్లు పడాల్సిందేనని ప్రజలు అంటున్నారు. ఇటీవల వర్షాల కారణంగా సరఫరా తక్కువగా వస్తుండటంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి.

కూరగాయ రకం	కిలోకి ధర (రూ.ల్లో)
బీర	100
వంకాయ	120
చిక్కుళ్లు	150
బంగాళా దుంప	30
పచ్చిమిర్చి	50
టమాటా	40
ఉల్లి (పాతవి)	20
దొండ	80
బెండ	80
క్యారెట్	80
అల్లం(కొత్తది)	100
కాకర	80
దోస	60
ఆనబ	60
కొత్తిమీర(కట్ట)	40

'ప్రభుత్వం చోద్యం చూస్తోంది'

తణుకు, న్యూస్‌టుడే: తుపాను కారణంగా రైతాంగం నష్టపోయి ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక వైకాపా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే వరిచేల గట్టు తొక్కలేదని రైతులు ఎలా ఉన్నారని అడిగిన పాపాన పోలేదని మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకంగా వైకాపా ప్రజా ఉద్యమం ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు, నాగేశ్వరరావు ఆవిష్కరించారు.

'వైద్యకళాశాలల ప్రైవేటీకరణ వద్దు'

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తన విడిది కార్యాలయం వద్ద ఆదివారం గోడ పత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రైవేటీకరణ నిలుపుదలకు కోటి సంతకాల కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిల నీడలో పశువైద్యశాలలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:

తణుకు నియోజకవర్గంలో పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరడంతో వైద్యానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తణుకు మండలంలో 4, ఇరగవరంలో 4, అత్తిలిలో 5 పశువైద్యశాలలు ఉన్నాయి. మొత్తం 13 భవనాల్లో సగం భవనాలు శిథిలావస్థకు చేరాయి. వేల్పూరు, మండపాక, దువ్వ, ముద్దాపురం, కొత్తపాడు, రేలంగి, కొమ్మర, కంచుమర్రులలో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. బోన్లు తుప్పుపట్టి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. * అత్తిలి మండలంలో కంచుమర్రు, కొమ్మర, తిరుపతిపురం గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. కంచుమర్రు, కొమ్మర పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. కంచుమర్రు పశువైద్యశాల భవనం బీటలువారి

భవనం నుంచి మొక్కలు మొలిచిన కంచుమర్రు పశువైద్యశాల

నియోజకవర్గంలో వివరాలు	
ఆవులు:	3,900
గేదెలు:	20,680
మేకలు, గొర్రెలు:	2,256
పందులు:	124
కుక్కలు:	2358

మొక్కలు మొలిచాయి. చిన్నపాటి వర్షానికే భవనం శ్లాబ్ నుంచి వర్షపు నీరు లోపలకు చేరుతోంది. కిటికీలు, తలుపులు ఊడిపోయి ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియక వైద్యశాలకు వచ్చే రైతులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవన నిర్మాణం చేపట్టాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

తుప్పుపట్టి విరిగిపోయిన బోను

ప్రతిపాదనలు పంపాం

'నూతన భవనాలకు నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే నిర్మాణాలు చేపడతాం' అని అత్తిలి డివిజన్ పశువైద్య సహాయ సంచాలకుడు రామాంజనేయులు తెలిపారు.

వరి కోతలకు అనుకూలం

నిర్వాహకుడితో మాట్లాడుతున్న మల్లికార్జునరావు

పరిమెళ్ల(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచనల మేరకు తుపాను నేపథ్యంలో రైతులకు అనుకూలంగా, నిర్ణయించిన ధరకు వరి కోతలు కోయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి జీవీకే మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం పరిమెళ్ల సచివాలయం వద్ద వరి కోత యంత్ర నిర్వాహకులతో మాట్లాడారు. గ్రామ కార్యదర్శి నాగదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు.. శుభ్రత కనుమరుగు

నిడమర్రు మండలం పత్తేపురం జడ్పీ ఉన్నత పాఠశాల సమీప ప్రధాన కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్లాస్టిక్, చెత్తాచెదారం రోజుల తరబడి ముందుకెళ్లకపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెంది విజృంభిస్తుండటంతో విద్యార్థులు, స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. - న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం

In The Court of the Hon'ble Principal Junior Civil Judge, Tadepalligudem
E.P.No. 34/2018 in O.S.No. 70/2016

Between
Sri Allada Satyanarayana ... Decree Holder
And
1. Sri Kotagiri Venkata Srinivas (Died)
2. Smt. Kotagiri Jyothi
3. Sri Kotagiri Anideep ... Judgment Debtors

2nd Judgment Debtor
Smt. Kotagiri Jyothi W/o Late Venkata Srinivas, Resident of Ravipadu, Pentapadu Mandal, TPG Additional District Court Jurisdiction

పై నెంబరు E.P. గ్రంథములో మీపై Sale Notice అమలు జరుపుటకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు Sale Notice లు మీకు పంపించియున్నప్పటికి మీరు తీసుకొనని కారణంగా శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీకు వాయిదా తెలియపర్చుటకు ది. 12-11-2025వ సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥ల లగాయితు మీరు స్వయంగా గాని లేక న్యాయవాది గారి ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీకు Sale Notice పై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించ బడునని ఈ ప్రకటన పూర్వకముగా తెలియ చేయడమైనది.

వాయిదా తేదీ: 12-11-2025

Sd/- Muddana Srinivasa Rao
Advocate, Tadepalligudem
Cell: 99483 37320
Tadepalligudem
8-11-2025

(c) eenadu

హార్స్లీహిల్స్‌లో ప్రకృతి అందాలకు కొదవలేదు. అందుకే ఆ సుందర దృశ్యాలను తిలకించేందుకు అనేక మంది పర్యాటకులు వస్తుంటారు. కొండపై ఉన్న పోలీసు అతిథి గృహం వెనుక వైపున్న ఓ కొండపై పెద్ద బండరాయి ఉంది.. దూరం నుంచి చూస్తే ఇది బండలా కనిపించినా దాని కింద దాదాపు 20 మంది కూర్చునే విధంగా విశాలమైన గుహ ఉంది. వర్షాకాలంలో ఇటుగా వచ్చిన వారు రక్షణగా ఇక్కడ కూర్చోవటం.. తెచ్చుకున్న ఆహారాన్ని ఆరగించడం చేస్తున్నారు. కొత్తవారికి ఇది వింత అనుభూతిని కలిగిస్తోంది. - ఈనాడు, చిత్తూరు - న్యూస్‌టుడే, మదనపల్లె

గౌరమ్మా.. పోయి రావమ్మా!

మైదుకూరు పట్టణంలో గౌరీమాత ప్రతిమల నిమజ్జన ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 6న అమ్మవారిశాలలో గౌరమ్మను ప్రతిష్ఠించి వ్రతం ఆచరించారు. మేళతాళాలతో ఎర్రచెరువు వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేసి కార్తిక వనభోజనాలు చేశారు. - న్యూస్‌టుడే, మైదుకూరు



కార్తిక మాసాన ముక్కంటిని అభిషేకించడానికి ఆకాశ గంగ కదలి వచ్చినట్లు వెలిగొండల జలపాతం కనువిందు చేస్తోంది. దట్టమైన శేషాచలం కొండల్లో కురిసే వర్షాలకు కొండ కోనలు దాటుకుని గంగమ్మ కర్కటేశ్వరుని రూపంలో ఉన్న శివయ్యను అభిషేకిస్తుంది. చిట్వేలి మండలం పెద్దూరుకు 11 కిలోమీటర్ల దూరంలో కర్కటేశ్వర కోనుంది. శివుడు ఎండ్రకాయ రూపంలో పూజలందుకోవడం ఇక్కడి ప్రత్యేకత. వెలిగొండల మధ్యలో ఉన్న ఈ ఆలయం చుట్టూ రెండు జలపాతాల సవ్వడితో ఆ ప్రాంతం మార్మోగుతోంది. కార్తిక సోమవారం రోజుల భక్తులు విశేషంగా తరలి వస్తారని ఇక్కడి ఏర్పాట్లు చేస్తున్నారు. - న్యూస్‌టుడే, పుల్లంపేట

భూతాల రాజ్యం.. చర్యలు పూజ్యం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: భూ బకాసురుల స్వార్థంతో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. వైకాపా పాలనలో అడ్డగోలుగా భూదందా సాగింది. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జమానాలో రాజకీయ భూచక్రం భూచోళ్ల చుట్టూ తిరిగింది. ఎకరాలకొద్దీ పరాధీనం చేశారు. అక్రమార్కుల చేతికి చిక్కిన భూములను స్వాధీనం చేసుకోవాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెదేపా నాయకులు ఎన్నోసార్లు తహసీల్దారు నుంచి కలెక్టర్ వరకు ఫిర్యాదు చేసినా ఎలాంటి కదలిక లేదు. కనీసం కంచెను కూడా తాకడానికి ధైర్యం చేయడం లేదు. నాడు దర్జాగా సాగిన కబ్జాల బాగోతాన్ని నిగ్గు తేల్చేందుకు టాస్క్‌ఫోర్సు బృందాలను ఏర్పాటు చేస్తామని బీరాలు పలికిన అధికారులు ఇటువైపు తొంగి చూడలేదు.

ఆక్రమిత భూమిలో సాగులో ఉన్న చీనీ తోట

● ఎక్కడంటే : ఓబులేసుకోన ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఆర్ఎస్ఆర్ ప్రకారం సర్వే సంఖ్య 659లో 89.74 ఎకరాలు ఉంది. ఇందులో 13.98 ఎకరాల్లో భూ బకాసురులు పాగా వేశారు. సర్వే నంబరు 661లో 1,778.23 ఎకరాలుంటే 19.65 ఎకరాలను ఆక్రమించారు. ఇక్కడే కాకుండా ఇదే రెవెన్యూ గ్రామం పరిధిలో ఎగువన ఉన్న కొండలోనూ మరో 30 ఎకరాలు పరాధీనమైంది.

● వైకాపా పాలనలో పునాది : నాటి వైకాపా పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూచోళ్లు గద్దల్లా వాలారు. కొండల్ని కొల్లగొట్టారు. గుట్టల్ని యంత్రాలతో చదును చేశారు. గొట్టపు బావులు తవ్వించారు. విద్యుత్తు కనెక్షన్లు పొందారు. ఆక్రమిత భూమి చుట్టూ కంచె కూడా వేశారు. మామిడి, బత్తాయి, ఇతర పంటలను సాగు చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో స్థానికులు స్పందించి మండలం నుంచి జిల్లా స్థాయి వరకు ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా ఎలాంటి చర్యల్లేవు.

ఇంకెన్నాళ్లీ చోద్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైకాపా ఏలుబడిలో సాగిన భూదందాను నిగ్గు తేల్చాలని సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. టాస్క్‌ఫోర్సు బృందాలను ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఇక్కడ యథేచ్ఛగా సాగిన భూమాయపై ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన నాయకులు, ప్రజలు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశారు. కనీసం కంచెను కూడా తొలగించడానికి ఎవరూ ముందుకురాలేదు. వైకాపా మద్దతుదారులే ఎక్కువగా ఆక్రమణలకు పాల్పడటంతో వారి జోలికి వెళ్లడానికి అధికారులు జంకుతున్నారు. జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూడా రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దనరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కూడా కబ్జాకోరుల భరతం పడతామని హెచ్చరించారు. ఇప్పటికే మూడు నెలల కాలం కరిగిపోయినా ఎలాంటి కదలిక లేదు. మాటలతో మమ అనిపించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అంతే!

వైకాపా జమానాలో అడ్డగోలుగా భూ కబ్జాలు జరిగాయి. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలని మేం చేస్తున్న పోరాటం ఫలించలేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వయంగా జిల్లా కలెక్టర్‌ను కలిసి పలుమార్లు ఫిర్యాదు చేశాం. అయినా కబ్జాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆర్డీవో, జేసీ కూడా మా గోడును పట్టించుకోలేదు. - మోరంరెడ్డి జయసింహారెడ్డి, ఇబ్రహీంపేట

భూ దోపిడీపై ఎందుకీ మొద్దునిద్ర

ప్రభుత్వ భూమి 60 ఎకరాలకు పైగా కబ్జాకు గురైంది. కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు మాత్రం మొద్దునిద్రలో జోగుతున్నారు. తహసీల్దారు, ఆర్డీవో, జేసీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా దురాక్రమణలపై మౌనంగా ఉంటున్నారు. వైకాపా పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని అడ్డగోలుగా దోచేశారు. భూ బకాసురులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రాధేయపడుతున్నా ఉలుకు పలుకు లేదు. ఇలాంటి చేతగాని అధికారులను చూసి సిగ్గుతో తలదించుకుంటున్నా. - పిడుగు సుబ్బారెడ్డి, ఇబ్రహీంపేట

ఘనంగా పెద్ద దర్గా పీఠాధిపతి ఊరేగింపు

రథంపై ఊరేగింపుగా వెళ్తున్న దర్గా పీఠాధిపతి అరిఫుల్లా హుస్సేనీ

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: ప్రసిద్ధిగాంచిన కడప పెద్ద దర్గా ఉరుసులో భాగంగా ఆదివారం రాత్రి 11 గంటలకు దర్గా పీఠాధిపతి అరిఫుల్లా హుస్సేనీ ఊరేగింపు ఘనంగా ప్రారంభమైంది. మాసాపేట కూడలి సమీపంలోని మై అల్లా దర్గా వద్ద పీఠాధిపతి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కూర్చొని వెళ్లి నగర వీధుల్లో ఊరేగింపు చేశారు. డప్పుచప్పుళ్లు, బాణసంచా పేలుళ్ల మధ్య ఊరేగింపు కొనసాగింది. ఇసుక వేస్తే రాలనంతగా భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈలలు, కేరింతలు, నృత్యాలతో ఆద్యంతం ఆకట్టుకుంది. పకీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మాసాపేట కూడలి, మాచుపల్లె బస్టాండు, కృష్ణాకూడలి, పాత మున్సిపల్ కార్యాలయం, ఏడురోడ్ల కూడలి, ఒకటో పట్టణ ఠాణా, గోశాల లాల్ల చౌరస్తా మీదుగా పెద్ద దర్గాకు చేరుకుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుమారు 300 మంది పోలీసు బందోబస్తు నిర్వహించారు.

స్వాగతం పలుకుతున్న శిష్యగణం, భక్తులు

అందరికీ ఉచిత న్యాయ సహాయం
జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: మహిళలు, దివ్యాంగులు, షెడ్యూలు కులాల, పిల్లలు, ప్రకృతి వైపరీత్యాల బాధితులందరూ ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని అన్నారు. జిల్లా కోర్టులో ఆదివారం జాతీయ న్యాయసేవల దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. గతేడాది నవంబరు నుంచి ఇప్పటి వరకు 1,761 న్యాయ సదస్సులు నిర్వహించామన్నారు. మూడు జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా 53,001 కేసులు పరిష్కరించి రూ. 36,92,42,487లు పరిహారం సంబంధిత కక్షిదారులకు చెల్లించాలని ఆదేశించామన్నారు. అనంతరం జిల్లా కోర్టు వద్ద నుంచి అర్బన్ పోలీస్ స్టేషన్ సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏడో అదనపు జిల్లా న్యాయమూర్తి రమేష్ కుమార్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి అసిఫా సుల్తానా, న్యాయమూర్తులు రేష్మా, ఈశ్వర్ వెంకట ప్రసాద్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జిహ్వాచేపల్యం

- న్యూస్‌టుడే, కొండాపురం

జిల్లాలోని జలాశయాలన్నీ నిండుకుండను తలపిస్తున్నాయి. వర్షాల రాకతో నేటికీ పెన్నా పరవళ్లు తొక్కుతూ పారుతోంది. పెన్నేటి చేపలకు రుచి ఎక్కువ అన్నది నానుడి. కొండాపురం వద్ద పెన్నానదిపై నిర్మించిన గండికోట జలాశయం ఉమ్మడి కడప జిల్లాలో పెద్దది కావటం ఇందులో పెన్నేరులో వర్షపాతాలు కలుస్తుంది. గాలేరు నగరి ద్వారా కృష్ణా జలాలు చేరుతుండటంతో అక్కడి నుంచి కూడా ఇక్కడి సంగమంలో అనేక జలచరాలు కలుస్తున్నాయి. కుందూ, పాపఘ్ని, చెయ్యేరు, బాహుదా, గుంజన, మాండవ్య, సగిలేరు ఇలా అనేక ఉప నదుల జలాలు చేరుతుంటాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే చేపలతో మీనరాశి జిహ్వ'చేప'ల్యాన్ని తీరుస్తోంది.

ఏ చేపలు చిక్కుతున్నాయంటే..: గండికోట జలాశయంలో బొచ్చ, రోహూ, జిలేబి, కొర్రమట్ట, వాలుగ, జెల్ల రకం చేపలు లభిస్తున్నాయి.

అరుదైన వాలుగ: ఏడాదిలో 20 నుంచి 30 రోజులు నీటిమీద కనిపించి.. ఆ తర్వాత సంతానోత్పత్తికి నదీజలాల లోపల జీవించే అరుదైన వాలుగ చేపలు గండికోటలో లభ్యమవుతున్నాయి. పది కిలోల చేపలు వలలకు దొరుకుతున్నాయి.

కిలో ఎంత: రకాన్ని బట్టి కిలో రూ.100 నుంచి రూ.120

ఎక్కడికి వెళ్తున్నాయి: చెన్నూరు, కోల్‌కతా, హైదరాబాద్

రోజూ పట్టేవి: 3 నుంచి 5 క్వింటాళ్లు

ముల్లుజెల్ల: కృష్ణా జలాల ప్రవాహానికి ముల్లురకం చేపలు నీటిలో కొట్టుకొస్తున్నాయి. ఇవి జలాశయంలో కనిపించడం తొలిసారని మత్స్యకారులు చెబుతున్నారు. సుమారు 2కిలోల వరకు ఉంటున్నాయి.

బొచ్చ: ఎక్కువగా లభించే చేప రకం. కిలో నుంచి 15 కిలోల వరకు లభ్యమైతోంది. ఒకే ముల్లు ఉండటంతో ఎక్కువ మంది ఇష్టపడతారు.

జిలేబి: గండికోట ప్రాజెక్టులో చాలా ఎక్కువ లభించే చేపల రకం ఇవి. ఎక్కువ వీటిని కొనుగోలు చేస్తారు. ఒకే ముల్లు ఉండటంతో చాలా మంది ఇష్టపడుతున్నారు. ఫ్రై, పకోడీలకు వీటిని వినియోగిస్తుంటారు.

అవనిలో సగం.. అండగా ఉందాం!

అవగాహన కల్పిస్తున్న జెండర్ అధికారి

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : సమాజంలో మహిళలు వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటిని పరిష్కరించడానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో జెండర్ రీసోర్స్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో మూడు జీఆర్సీ కేంద్రాలు ప్రారంభించారు. నాలుగో కేంద్రం అతి త్వరలో ఏర్పాటు చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులే ఈ కేంద్రాల ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. వారి సాధికారతకు అమలు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెలుగు అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో జెండర్‌పై అవగాహన సదస్సులు నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎక్కడెక్కడంటే: జిల్లాలో తొలి విడతలో రాయచోటి, పీలేరు, మదనపల్లెలో జీఆర్సీ కేంద్రాలు ప్రారంభించారు. లక్కిరెడ్డిపల్లెలో కేంద్రాన్ని ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. తంబళ్లపల్లె, రాజంపేట, ఓబులవారిపల్లె, సుండుపల్లెల్లో కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ● ఆపదలో ఉన్న మహిళలను ఆదుకోవడానికి, అండగా నిలిచి తగు సూచనలు, చేయూనిచ్చి భరోసా కల్పించడానికి కూటమి ప్రభుత్వం జెండర్ రీసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే మహిళలు ఎదుర్కొనే పలు సమస్యలపై సంఘటితంగా పోరాడే అవకాశం ఉంటుందని అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

కమిటీ ఏర్పాటు ఇలా..

● ప్రతి మండలంలో గ్రామ సమాఖ్య నుంచి ఇద్దరు చొప్పున సభ్యులను ఎంపిక చేసి, గ్రామస్థాయి కమిటీలను నియమిస్తారు. ఈ కమిటీల నుంచి ముగ్గురు లేదా ఐదుగురు సభ్యులతో మండల స్థాయి కమిటీని ఎంపిక చేస్తారు. వీరే జీఆర్సీ కేంద్రాలకు ప్రతినిధులుగా వ్యవహరిస్తారు.

రూ.5 లక్షలు కేటాయింపు

ఒక్కో కేంద్రం ఏర్పాటు, నిర్వహణకు ప్రభుత్వం రూ.5 లక్షల నిధులు విడుదల చేస్తోంది. ఇప్పటికే పీలేరు, రాయచోటి, మదనపల్లె, లక్కిరెడ్డిపల్లె జీఆర్సీ కేంద్రాలకు నిధులు విడుదల చేసింది. వెలుగు కార్యాలయాల్లో సరిపడా గదులుంటే, అక్కడే ఈ కేంద్రాలను నిర్వహిస్తారు. లేకుంటే భవనాలను అద్దెకు తీసుకోవాల్సి ఉంటుంది.

డయల్ యువర్ విద్యుత్తు సీఎండీ

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తమ సంస్థ పరిధిలో డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్తుపరమైన సమస్యలపై ఉదయం 10 నుంచి 12 వరకు 89777-16661కు ఫోన్ చేసి అడగవచ్చన్నారు. వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు.

సీపీ బ్రౌన్ జయంతి వేడుకలు నేడు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: తెలుగుభాషకు ఎనలేని సేవలందించిన సీపీ బ్రౌన్ జయంతి వేడుకలు సోమవారం కడప కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం అయిదు గంటలకు సభాభవనంలో జరిగే వేడుకలకు కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్ హాజరవుతారన్నారు. తెలుగుపండితులు సాయిప్రసాద్ రచించిన బ్రౌన్ ఉద్యోగ ప్రస్థానం జీవితం, బ్రౌన్ గ్రంథాలయంలో పనిచేస్తున్న భూతపరి గోపాలకృష్ణ బ్రౌన్ సాహితీ సేవపై ప్రసంగిస్తారన్నారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, తెలుగుభాషాభిమానులు, కళాశాల విద్యార్థులు అందరూ పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజావేదిక దగ్గర ఏర్పాట్లను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌కు వివరాలు చెబుతున్న కలెక్టరు నిశాంత్‌కుమార్, జేసీ ఆదర్శ్

చిన్నమండెం, న్యూస్‌టుడే: ఈ నెల 12న చిన్నమండెంలో జరిగే సీఎం నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, తెదేపా నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డితో కలిసి వచ్చి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. అక్కడే ఉన్న జిల్లా కలెక్టరు నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌లు పెందుర్తి వెంకటేష్‌కు ప్రజావేదిక ఇతర స్థలాల గురించి మ్యాప్ ద్వారా వివరించారు. అక్కడి నుంచి రాజీవ్ కాలనీలో పక్కా గృహాలు, రోడ్లు, ఇతర ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం హెలీప్యాడ్, తెదేపా నాయకులు, కార్యకర్తలతో నిర్వహించే సమావేశానికి స్థలాన్ని పరిశీలించారు. ఉదయం నుంచి రాజీవ్ కాలనీలో సీఎం ప్రారంభించనున్న పక్కా గృహాలను ఆ శాఖ పీడీ రమేష్‌రెడ్డితో పాటు రాజంపేట, మదనపల్లె సబ్ కలెక్టర్లు భావన, చల్లా కల్యాణి, ఆర్డీవో శ్రీనివాసులు తనిఖీ చేసి దిగువ శ్రేణి అధికారులకు పలు సూచనలు చేశారు. డీఎస్పీ కృష్ణమోహన్, జిల్లా, మండల స్థాయి అధికారులు, స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అమ్మో.. చిరుత

కాశినాయన, న్యూస్‌టుడే: జ్యోతి క్షేత్రానికి వెళ్లే భక్తులకు ఆదివారం చిరుత తారస పడింది. చెక్ పోస్ట్, జ్యోతిక్షేత్రానికి మధ్య మధ్యాహ్నం చిరుత పులి అటు ఇటు తిరుగుతుండడంతో వాహనాల్లో వెళ్లే వారు చరవాణుల్లో చిత్రీకరించి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సుమారు అరగంట పాటు రాకపోకలు ఆగిపోయాయి. భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. పోరుమామిళ్ల అటవీ క్షేత్రాధికారి రఘునాథరెడ్డి మాట్లాడుతూ దగ్గరలో పొలాలున్న రైతులు జాగ్రత్తగా ఉండాలని పాదాలను గుర్తించి నిర్ధారిస్తామని చెప్పారు.

కొండెక్కిన కొత్తిమీర

రామసముద్రం వద్ద ఎగుమతికి సిద్ధం చేస్తున్న కొత్తిమీర

రామసముద్రం, న్యూస్‌టుడే: కొత్తిమీర ధరలు ఆకాశానికి ఎగబాకాయి. తోటల వద్దే 50 కట్టల కొత్తిమీర బస్తా రూ.1,500 ధర పలుకుతోంది. ఇటీవల ఎడతెరిపిలేని వర్షాలకు తోటల్లో అధిక తేమశాతానికి పంటలు దెబ్బతిన్నాయి. విత్తనాలు మొలకెత్తలేదు. దిగుబడికి వచ్చిన తోటలకు తెగుళ్లు సోకి పాడయ్యాయి. తోటలను కంటికి రెప్పలా కాపాడుకున్న రైతులకు మాత్రం కాసుల వర్షం కురుస్తోంది. ఎకరం విస్తీర్ణంలో రూ.50 వేల పెట్టుబడితో సాగు చేస్తే 200 నుంచి 250 బస్తాల వరకు దిగుబడి రావాల్సి ఉంది. వర్షాల వల్ల ప్రస్తుతం 150 నుంచి 175 బస్తాల దిగుబడి వస్తోంది. ప్రస్తుతం ఎకరం దిగుబడికి రూ.2.5 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. జిల్లాలోని రామసముద్రం, మదనపల్లె, కురబలకోట, పీటీఎం, రాయచోటి, మొలకలచెరువు మండలాల్లో వెయ్యి ఎకరాలకు పైగానే సాగు ఉంది. అందులో ఎక్కువశాతం రామసముద్రంలోనే సాగవుతోంది. రోజూ రామసముద్రం నుంచి చెన్నై, విజయవాడ, రాజమండ్రి, బెంగళూరు మార్కెట్లకు ఎగుమతులు జరుగుతున్నాయి.

అధ్యక్షా! ఆర్థిక ప్రణాళిక ఏమైంది!

బడ్జెట్టు సమావేశాలు పట్టని పాలకవర్గం

చేయాల్సిందిలా: రూ.514.84 కోట్లు... 2025-26 ఆర్థిక సంవత్సరానికి నగరపాలక సంస్థ సిద్ధం చేసిన బడ్జెట్టు మొత్తం ఇది. ప్రతిపాదిత బడ్జెట్టును 2025 ఫిబ్రవరి 20లోపు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి మెజార్టీ సభ్యుల ఆమోదాన్ని తీసుకోవాలి. బడ్జెట్టుకు ఆమోదం లభించిన తర్వాత సమాచారనిమిత్తం రాష్ట్ర ప్రభుత్వానికి బడ్జెట్టు వివరాలు పంపించాలి. కానీ కడప నగరపాలక సంస్థ 2025 నవంబరు నెల 10వ తేదీ వరకు బడ్జెట్టు సమావేశాలను నిర్వహించలేదు.

చెప్పినా చెవికెక్కదు: బడ్జెట్టు సమావేశాలను నిర్వహించాలని కమిషనర్ మూడు పర్యాయాలు లిఖిత పూర్వకంగా, పలుమార్లు మౌఖికంగా పాలకవర్గం దృష్టికి తీసుకువచ్చినా బడ్జెట్టు సమావేశాలను నిర్వహించలేదు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్టు అంచనాలను రూపొందించాల్సిన సమయం వచ్చినా 2025-26 బడ్జెట్టుకు ఇప్పటి వరకు ఆమోదం లభించకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది.

నగరపాలక సంస్థ కార్యాలయం

పండగల నిర్వహణకు రూ.1.74 కోట్లు, సచివాలయాల అద్దెకు రూ.78 లక్షలు, కన్సల్టెన్సీ ఛార్జీలకు రూ.2.89 కోట్లు, కుక్కలు పట్టడానికి రూ.42 లక్షలు, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణకు రూ.22 లక్షలు, ఇంధనానికి రూ.4.88 కోట్లు, కాలువల నిర్వహణకు రూ.54 లక్షలు, పంపుసెట్ల మరమ్మతులకు రూ.1.19 కోట్లు, ఎన్నికల ఖర్చు రూ.65 లక్షలు, పార్కులు, గ్రీనరీ నిర్వహణకు రూ.1.09 కోట్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణాలకు రూ.3.36 కోట్లు, సీసీ దారులకు రూ.6.02 కోట్లు, రాజీవ్ మార్గ్ పచ్చదనానికి రూ.13 లక్షలు, సీసీ కెమెరాలకు రూ.1.13 కోట్లు, కార్పొరేషన్ స్థలాల రక్షణకు గోడల నిర్మాణానికి రూ.82 లక్షలు, మైక్రో కంపోస్టింగ్ సెంటర్లకు రూ.1.49 కోట్లు, కుడా మౌలిక వసతులకు రూ.82 లక్షల వ్యయంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిధులు పంచిపెట్టారని ఆరోపణల నేపథ్యంలో ఈ అంశాలు వెలుగులోకి రాకుండా సమావేశాన్ని నిర్వహించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. - న్యూస్‌టుడే, కడప నగరపాలక

ఎందుకు నిర్వహించలేదంటే..: 2024-25 బడ్జెట్టు అంచనా 575.93 కోట్లు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దీన్ని రూ.229.61 కోట్లకు సవరించారు. 2025-26 బడ్జెట్టు ఆమోదం కోసం నిర్వహించే సర్వసభ్య సమావేశంలో 2024-25 బడ్జెట్టు అంచనాలు - సవరణపై చర్చ చేపడతారు. ఈ నేపథ్యంలో టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాల నుంచి వసూలు చేయాల్సిన పన్నులపై వివాదం నెలకొనే అవకాశం ఉంది.

అక్రమాలు కొనసాగాలని...!

2025-26 బడ్జెట్టును కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ దాదాపు ఏడు నెలల క్రితం ఆమోదించింది. తర్వాత సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి సభ్యుల ఆమోదం తీసుకుని ప్రభుత్వానికి పంపాలి. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాతే రెవెన్యూ, క్యాపిటల్ అకౌంట్ల ద్వారా వచ్చిన నిధులను ఖర్చు చేయాలి. కానీ పాలకవర్గం సమావేశాన్ని ఏర్పాటు చేయని నేపథ్యంలో వేతనాల చెల్లింపు, ఇతర కీలక పనులకు నిధులు చెల్లించడానికి పురపాలక శాఖ నుంచి అధికారులు అనుమతి తీసుకున్నారు. కాగా బడ్జెట్టు కాలపరిమితి ముగిసిపోతున్నందున ఎలాంటి ఆమోదం లేకుండానే నిధులు ఖర్చు చేయడానికి కొందరు ప్రజాప్రతినిధులు పథకం వేసినట్టు ప్రచారం సాగుతోంది. ప్రతి పనికీ ఆ పనికయ్యే వ్యయంలో 6 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. బడ్జెట్టు సమావేశాలపై కమిషనర్ మనోజ్ రెడ్డిని వివరణ కోరగా సమావేశాలు నిర్వహించాలని కోరుతూ ఇప్పటికే పలుమార్లు లేఖలు రాశామన్నారు. పాలకవర్గం సమావేశం తేదీని ఖరారు చేస్తే నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.



(c) eenadu

వైభవంగా వన భోజన మహోత్సవం

పోరుమామిళ్లలో ర్యాలీ చేస్తున్న సంఘం నాయకులు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: రాయలసేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక మాసం వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయుల చిత్రపటంతో పోరుమామిళ్ల సాయిబాబా ఆలయం నుంచి పోరుమామిళ్ల చెరువు వరకు గ్రామోత్సవం చేశారు. అనంతరం అక్కడ కొండపైన ఉన్న కాలభైరవస్వామికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. వనభోజనానికి సహకరించిన దాతలను సన్మానించారు. మహిళలు కోలాటం ప్రదర్శించారు. కార్యక్రమంలో రాయలసేవా సమితి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు, దాతలు రామమోహన్, యనమల.సుధాకర్, వెంకటసుబ్బయ్య, కల్యాణ్‌చక్రవర్తి, రామకృష్ణ, ప్రభంజన్‌కుమార్, బద్వేలు మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ సుప్రజ, నరసింహులు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి విద్యార్థిని ఎంపిక

వీర ఉదయశ్రీ

మైదుకూరు, న్యూస్‌టుడే : అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి విద్యార్థిని పసల వీర ఉదయశ్రీ ఎంపికయ్యారు. ప్రొద్దుటూరులో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. కేశలింగాయపల్లె గ్రామానికి చెందిన ఉదయశ్రీ శెట్టివారిపల్లె పాఠశాలలో పదో తరగతి చదువుతోంది.

నారీమణులు.. లాభాల సిరులు

వ్యాపారంలో రాణిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు

నారీమణులు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరి ఆర్థికంగా బలోపేతం అవుతూ.. విజయ పథాన దూసుకెళ్తున్నారు. విభిన్న రంగాల్లో ప్రవేశించి ఆర్థికంగా రాణిస్తూ తోటి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. మార్కెటింగ్‌కు వెరవకుండా పట్టుదలే విజయమని నమ్మి ముందుకు సాగుతున్న అతివల నేపథ్యంపై ప్రత్యేక కథనం.

- న్యూస్‌టుడే, కడప గ్రామీణ

రమణమ్మ.. సూపర్ సక్సెస్ : నా పేరు రమణమ్మ. మాది కడప నగరం అంబా భవానీ నగర్‌లో ఉంటున్నాం. నేను 24 ఏళ్ల కిందట పొదుపు సంఘంలో చేరా. ప్రారంభంలో రూ.750 బ్యాంకులో రుణంగా ఇచ్చారు. అయిదు మందితో కలిసి టైలర్ షాపు నిర్వహించా. కొన్నేళ్ల పాటు కొనసాగించా. బ్యాంకు లింకేజీ కింద రూ.2 లక్షల రుణం, ఎస్ఎల్ఎఫ్ కింద మరో రూ.3 లక్షలు తీసుకుని ఆరేళ్ల కిందట సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసుకున్నా. నలుగురికి ఉపాధి కల్పించా. ప్రస్తుతం నెలకు రూ. లక్షల్లో వ్యాపారం జరుగుతోంది.

మిఠాయితో దూసుకెళ్తున్న శోభాబాయి : నా పేరు శోభాబాయి. మాది కడప నగరంలోని అంబావానీ నగర్. 15 ఏళ్ల కిందట పొదుపు సంఘంలో సభ్యురాలిగా చేరా. మొదట్లో బ్యాంకు లింకేజీ కింద రూ. 5 వేలు రుణం వచ్చింది. దాంతో మిఠాయి బ్యాక్సుల వ్యాపారం ప్రారంభించా. తొలి సంపాదన కింద రూ.10 వేలు వచ్చింది. ఆ మొత్తాన్ని మళ్లీ వ్యాపారానికే వెచ్చించా. అలా బ్యాంకు లింకేజీ కింద వచ్చే రుణం పెంచుకుంటూ వెళ్లా. ప్రస్తుతం నాకు రూ.2 లక్షల రుణం వచ్చింది. దానికి తోడు వ్యక్తిగత రుణం రూ.లక్ష, ఎస్ఎల్ఎఫ్ కింద మరో రూ.లక్ష రుణంగా తీసుకుని యంత్రాలు తెచ్చి వ్యాపారాన్ని విస్తరించా. మిఠాయిల వ్యాపారంలో రూ.5 వేలతో ప్రారంభించిన వ్యాపారం ఇప్పుడు నెలకు సుమారు రూ.5 లక్షల టర్నోవర్‌కు చేరింది. దాదాపు పది మందికి ఉపాధి కల్పిస్తున్నా.

సుకన్య.. తగ్గేదే లేదు : నా పేరు సుకన్య. మాది కడప నగరంలో నబీకోట. జయశ్రీ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఎనిమిదేళ్ల కిందట చేరా. అప్పట్లో నాకు బ్యాంకు లింకేజీ కింద రూ.5 వేలు తొలి సారి రుణం ఇచ్చారు. దాంతో తినుబండారాలు తయారీ ప్రారంభించా. అలా రుణం పెరిగే కొద్దీ వ్యాపారాన్ని విస్తరించా. మిల్లెట్స్‌తో తినుబండారాల తయారీ కేంద్రం ఏర్పాటు చేశా. బ్యాంకు లింకేజీ కింద రూ. 2 లక్షలు, పీఎంఈజీపీ కింద మరో రూ.7 లక్షలు రుణం తీసుకుని వ్యాపారాన్ని విస్తరించా. మెప్మా అధికారులు ప్రేరణ సఖి కింద ఉచితంగా రూ.50 వేలు ఇచ్చారు. అమృత హోం ఫుడ్స్ పేరిట తినుబండారాల వ్యాపారం విస్తరించా. ఒకప్పుడు నాకే పని లేక ఇబ్బంది పడిన నేను ఇప్పుడు ఆరుగురికి ఉపాధి కల్పిస్తున్నా.

బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనం స్వాధీనం

పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రేషన్ అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. రేషన్ దుకాణం నుంచి అక్రమంగా బియ్యం తరలిస్తుండగా ఎస్‌బీ పోలీసులు రామకృష్ణ, సత్యనారాయణలు వసంతపేట సమీపంలోని సాయిబాబా గుడి వద్ద పట్టుకుని అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న అక్రమార్కుడు అక్కడికి వెళ్లి వాహనాన్ని వదిలిపెట్టాలని కోరినా పోలీసులు ఒప్పుకోలేదు. కొద్దిసేపటికి అతని కుమారుడు అక్కడికి చేరుకుని వాహనాన్ని పక్కకు నిలుపుతానంటూ వాహనాన్ని పోలీసులపై ఎక్కించే యత్నం చేశాడు. భయంతో పోలీసులు పక్కకు తప్పుకోగా వాహనాన్ని తీసుకెళ్లాడు. ఈ ఘటనపై దృష్టి సారించిన పోలీసులు టీచర్స్ కాలనీకి చెందిన బియ్యం వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వాహనం తీసుకెళ్లిన అతని కుమారుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మరికొందరి పాత్ర ఉన్నట్లు తెలియడంతో పోలీసులు ఆ దిశగా విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

సాయి సంజయ్..సంతోష్ (పాతచిత్రాలు)

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు మండలం తువ్వపల్లె కూడలి సమీపంలో హుబ్లీ-కృష్ణపట్నం జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో కడపకు చెందిన కుందవరం సాయి సంజయ్(24), చింతల సంతోష్ (24) మృతి చెందారు. స్కూటీపై బద్వేలు వైపునకు వెళ్తుండగా ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. స్కూటీ ముందుభాగం దెబ్బతింది. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన పోలీసులు రహదారిపై నిలిచిన వాహనాన్ని ఢీకొట్టారా లేదా ఓవర్ టేక్ చేసే సమయంలో ప్రమాదం చోటు చేసుకుందా లేదా ఏదేని వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టిందా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. కడపలోని బెల్లంమండికి చెందిన సాయి సంజయ్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నచౌక్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన సంతోష్ డిగ్రీ పూర్తి చేశాడు. సంజయ్, సంతోష్‌లు ఇద్దరు ఇంటర్ నుంచి స్నేహితులు. అయితే కడప నుంచి వీరు బద్వేలు వైపునకు ఎందుకు వెళ్తున్నారనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ చిరంజీవి సిబ్బందితో కలిసి పరిశీలించారు. మృతదేహాలను ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై గండం.. రాకపోకలకు భయం

తుపాన్ ప్రభావంతో ఇటీవల వర్షం కురిసి వరదనీరు ప్రవహించడంతో రహదారులు దెబ్బతిన్నాయి. చాలా ప్రాంతాల్లో కోతలకు గురికావడంతో ఈ దారుల్లో రాకపోకలు సాగించే రైతులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. రాజుపాలెం మండలం కొర్రపాడు నుంచి పొట్టిపాడు గ్రామానికి అనుసంధానంగా ఉన్న రహదారి దుస్థితి ఇలాగే ఉంది. అక్కడక్కడ రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాజుపాలెం**

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు

మెయిన్ డ్రా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవిరెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి, వేదికపైన డీఎస్‌డీవో గౌస్ బాషా, ఇతర ప్రముఖులు

బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల అసలు సమరం ఆదివారంతో ఆరంభమైంది. శనివారం క్వాలిఫైయింగ్ రౌండ్లు నిర్వహించి అందులో ప్రతిభ కనబరచిన వారిని మెయిన్‌డ్రాకు ఎంపిక చేశారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. క్రీడా పోటీలకు విచ్చేసిన క్రీడాకారులతో ఆమె కొద్దిసేపు సందడి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడాకారులను మరింత ప్రోత్సహిస్తున్నారన్నారు. అందుకు నిదర్శనమే మహిళా క్రికెటర్ శ్రీచరణికి రూ. 2.5 కోట్ల నజరానా ప్రకటించడంతో పాటు గ్రూప్-1 జాబ్, ఇంటి స్థలాన్ని కేటాయించడమేనన్నారు. అంతర్జాతీయ అంపైర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఛైర్మన్ షేక్ జిలానీబాషా మాట్లాడుతూ... అన్ని ఫార్మెట్లకు సంబంధించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలను కడప కేంద్రంగా నిర్వహించామన్నారు. అండర్-11 విభాగానికి సంబంధించి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు కూడా కడప వేదికగా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. డీఎస్‌డీఓ షేక్ గౌస్‌బాషా, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ శివశంకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.నాగరాజు, రెఫరీ రామకృష్ణ, ఉపాధ్యక్షులు కె.విజయభాస్కర్, డా.బాలగంగ గంగాధర్, కోచ్ సిద్ధిక్, టెక్నికల్ అఫీషియల్స్ బాలగంగయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ❖ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు తొలి రోజు పోటాపోటీగా తలపడ్డారు. పదకొండేళ్లలోపు చిన్నారులు రాకెట్లు చేతపట్టి స్మాష్, కట్, డ్రాప్ షాట్లతో చిచ్చర పిడుగుల్లో చెలరేగి ఆడారు. పోటీల్లో ఏమాత్రం అలసిపోకుండా అద్భుత ప్రదర్శన కనబరిచారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చిన్నారులకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసింది.

రోలర్ స్కేటింగ్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన చిన్నారులను అభినందిస్తున్న డీఎస్‌డీవో గౌస్‌బాషా, ప్రక్కనే కోచ్ విలియం కేరీ

కడప క్రీడలు, న్యూస్‌టుడే: కాకినాడలో ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో కడపకు చెందిన సుచిత్‌రెడ్డి 8-10 వయసు విభాగంలో రెండు బంగారు పతకాలు, 6-8 వయసు విభాగంలో హర్షిత్‌రెడ్డి రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ మేరకు డీఎస్‌డీవో గౌస్‌బాషాను ఆదివారం కోచ్ విలియం కేరీ, పతకాలు సాధించిన చిన్నారులు కలిశారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో గౌస్‌బాషా వారిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలను సాధించి జాతీయస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాతీయస్థాయిలో కూడా సత్తాచాటి జిల్లాకు ఖ్యాతి తీసుకురావాలన్నారు.

క్రీడావని

ముగిసిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీ ఇండోర్‌స్టేడియంలో తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు జరిగిన జిల్లా స్థాయి పోటీలు ఆదివారం ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 200 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఇందులో రైల్వే కోడూరు, ప్రొద్దుటూరు, పులివెందుల మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఎస్ఐ వెంకటరెడ్డి ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విజేతలను నిర్వాహకులు అభినందించారు. అనంతరం జిల్లా నిర్వాహక కార్యదర్శి కమల్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మురళీమోహన్, మౌల, శివాజీ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలుగా నిలిచిన బాల బాలికలతో నిర్వాహకులు

డ్రాగా ముగిసిన అండర్-14 క్రికెట్ టోర్నీ

కడప-అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ సౌత్ జోన్ అండర్-14 అంతర్ జిల్లాల మూడో రౌండ్ క్రికెట్ పోటీలు ఆదివారం డ్రాగా ముగిశాయి. ఈ మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో తమ ఖాతాల్లో మూడేసి పాయింట్లను జమ చేసుకున్నాయి. మ్యాచ్‌ల వివరాలిలా ఉన్నాయి.

■ వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో 3 వికెట్ల నష్టానికి 54 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో రోజు (ఆదివారం) బ్యాటింగ్ ఆరంభించిన అనంతపురం జట్టు 71.5 ఓవర్లలో 147 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. కడప బౌలర్లలో వర్షిత్‌రెడ్డి, మునిజ్ఞానేశ్వర్‌రెడ్డి, మోనిష్‌రెడ్డి తలా మూడేసి వికెట్లు తీశారు. ఆపై కడప జట్టు తన రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించి మ్యాచ్ ముగిసే సమయానికి 46 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. కడప బ్యాట్స్‌మెన్ తాహీర్ 61 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లలో తేడ్రిక్, కార్తిక్ సాయి చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. కడప జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించడంతో ఈ మ్యాచ్‌లో మూడు పాయింట్లు సాధించాయి.

■ కేఓఆర్ఎం మైదానంలో జరుగుతున్న మరో మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 2 వికెట్ల నష్టానికి 78 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్‌ను ఆరంభించింది. మ్యాచ్ ముగిసే సమయానికి 81.2 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 289 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. చిత్తూరు జట్టులో మణిదీప్ అజేయంగా 102 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లలో యశ్వంత్ సూర్యతేజ 3, చేతన్ సాయి 2 వికెట్లు తీసుకున్నారు. ఆపై కర్నూలు జట్టు బ్యాటింగ్ చేసి మ్యాచ్ ముగిసే సమయానికి 32 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. జట్టులో శక్తి అజేయంగా 60 పరుగులు చేశారు. ఈ మ్యాచ్ కూడా డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం రావడంతో చిత్తూరు జట్టుకు 3 పాయింట్లు లభించాయి.

తాహీర్ (50)

మోక్షజ్ఞ రెడ్డి (63)

శబరిమలకు మరో ప్రత్యేక రైలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: అయ్యప్ప స్వాముల రద్దీని పురస్కరించుకుని నాందేడ్ నుంచి కొల్లాం కడప మీదుగా మరో ప్రత్యేక రైలును నవంబరు, డిసెంబరు, జనవరి మాసాల్లో నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ శబరిమల స్పెషల్ ట్రైన్ (07111) నవంబరు 20, 27, డిసెంబరు 4, 11, 18, 25, జనవరి 1, 8, 15 తేదీల్లో నాందేడ్‌లో గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై నిజామాబాద్, మేడ్చల్, కాచిగూడ, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూలు, డోన్, గుత్తి, తాడిపత్రి మీదుగా ఆదివారం అర్ధరాత్రి 2.08 గంటలకు ఎర్రగుంట్ల, 2.53కు కడప, 3.48 గంటలకు రాజంపేట చేరుకుని రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, విల్లుపురం, తిరుచ్చిరాపల్లి, మదురై, శివకాశి మీదుగా శుక్రవారం అర్ధరాత్రి (తెల్లవారితే శనివారం) 3 గంటలకు కొల్లాం చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో ప్రత్యేక రైలు (07112) ఈ నెల 22, 29, డిసెంబరు 6, 13, 20, 27 జనవరి 3, 10, 17 తేదీల్లో కొల్లాం నుంచి శనివారం తెల్లవారుజామున 5.40 గంటలకు బయలుదేరి ఆదివారం తెల్లవారుజామున 4.53 గంటలకు రాజంపేట, 5.38 గంటలకు కడపకు, 6.13 కు ఎర్రగుంట్లకు చేరుకుని ఆదివారం రాత్రి 9.30 గంటలకు నాందేడ్‌కు వస్తుందన్నారు. అయ్యప్పస్వామి భక్తులు, ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు (70) మృతి చెందినట్లు ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు స్థానిక వేంపల్లె రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో అక్టోబర్ 13న గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు గాయపడ్డాడు. ఆయన్ను ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు. ఆచూకీ తెలిసిన వారు ఎర్రగుంట్ల పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కడపలో యువకుడి దారుణ హత్య

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిని దారుణంగా కత్తితో పొడిచిన సంఘటన కడప రెండో పట్టణ ఠాణా పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప కుమ్మరికుంటవీధికి చెందిన షేక్ గౌస్‌బాషా (25) అలియాస్ అబూబకర్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కడపకు చెందిన అబుజర్ అనే వ్యక్తితో ఓ యువతి విషయంలో మనస్పర్ధలున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి షేక్ గౌస్‌బాషా తన తల్లిదండ్రులతో కలిసి పెద్ద దర్గా ఉరుసుకు వెళ్లారు. అక్కడే ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ వద్ద అబుజర్ తన స్నేహితులతో వారికి తారస పడ్డాడు. పాత గొడవను మనసులో పెట్టుకుని గౌస్‌బాషాతో వాగ్వాదానికి దిగారు. మరికొంతమందితో కలిసి అక్కడ నుంచి కొంత దూరం తీసుకెళ్లి కత్తులతో విచక్షణా రహితంగా పొడిచారు. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న రెండో పట్టణ సీఐ సుబ్బారావు, ఎస్సై హుస్సేన్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. మృతుడి తండ్రి మగ్బూల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారందరిపై హత్య కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండో పట్టణ ఠాణాకు కూతవేటంత దూరంలో యువకుడి హత్య జరగడం గమనార్హం.

ఏపీఆర్‌డీసీ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

కలసపాడు, న్యూస్‌టుడే: కలసపాడు మండలంలోని చింతలపల్లెకు చెందిన తెదేపా నాయకుడు సాధనకారి రంతూ ఆదివారం అమరావతిలో ఏపీ రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ) డైరెక్టరుగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి తెదేపా నాయకులు, కార్యకర్తలు అక్కడికి తరలి వెళ్లారు. ఈయన ప్రస్తుతం తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. గతంలో బద్వేలు మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా పనిచేశారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు జి.వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రోషిరెడ్డి, నాయకులు ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ Union Bank of India A Government of India Undertaking
అసెట్ రికవరి బ్రాంచి- తిరుపతి
1వ అంతస్తు, ఎస్‌వి క్యాంపస్ బ్రాంచి, ఎస్ వి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వెనుక, ఎస్‌వి యూనివర్సిటీ బ్రాంచి, ఇ-మెయిల్: arb.tirupathi@unionbankofindia.bank, ఫోన్ 8328565422

స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూలు 8 మరియు 9కింద హామీగా ఉంచబడిన స్థిరాస్తుల విక్రయానికి 30 రోజుల నోటీసు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1) నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.
సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు గ్యారంటర్లకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ ఛార్జిచేయబడిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) యొక్క అధీకృత అధికారిచే భౌతిక/ నిర్మాణాత్మక స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తి, **దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) & గ్యారంటార్(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావల్సిన దిగువ తెలుపబడిన విధంగా బకాయిలను రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తేదీన "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే" స్థితిలో విక్రయించబడును. రిజర్వు ధర మరియు ధరావతు మరియు బిడ్ హెచ్చింపు వివరాలు దిగువ తెలుపబడినవి:**

వేలం తేది మరియు సమయం: 11.12.2025 శుక్రవారం మ. 12.00 గం. నుంచి సా. 5.00 గం. మధ్య. (10 నిమిషాల అపరిమిత ఆటో ఎక్స్‌టెన్షన్లతో)

రుణగ్రహీతలు/తాకట్టుంచినవారు/గ్యారంటర్లు: శ్రీమతి షేక్ హుస్సేన్ బేగం భర్త పేరు షేక్ హైదర్ వలీ, డి.నం.37/1174-1-4-2, వార్డు నం.37, విద్యుత్ నగర్, గంగమ్మ గుడి వద్ద, చిన్నచౌక్ గ్రామం ఫీల్డ్, వైఎస్ఆర్ కడప-516002. శ్రీ షేక్ హైదర్ వలి తండ్రి పేరు ఎస్ ఇమామ్ సాహెబ్ (లేట్) డి.నం.37/1174-1-4-2, వార్డు నం.37, విద్యుత్ నగర్, గంగమ్మ గుడి వద్ద, చిన్నచౌక్ గ్రామం ఫీల్డ్, వైఎస్ఆర్ కడప-516002 **30.09.2025 నాటికి రూ.35,70,746.55 (రూపాయలు ముప్పైఐదు లక్షల డెబ్బైవేల ఏడువందల నలభైఆరు మరియు యాభైఐదు పైసలు మాత్రమే)లను అదనపు ఖర్చులు, వ్యయాలు మరియు దానిపై వడ్డీసహా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు** గల హామీగా గల రుణాన్ని రాబట్టుకోవడానికి హామీగా ఉంచబడిన స్థిరాస్తి విక్రయించబడును.

విక్రయించబోవు హామీగా గల స్థిరాస్తుల వివరణ: విద్యుత్‌నగర్, గంగమ్మ గుడి వద్ద, చిన్న చౌక్ గ్రామం ఫీల్డ్, వైఎస్ఆర్ కడప సర్వే నం.164/ఎ2, డి.నం.37/1174-1-42, వార్డు నం.37, ప్లాటు నం.10లో నివేశన స్థలం మరియు భవనంగా గల ఆస్తి. శ్రీ షేక్ హైదర్ వలి మరియు శ్రీమతి షేక్ హసీనా బేగం పేరిట (డీడ్ ప్రకారం) ఎ.0.03సెంట్లు / 145.20 చ.గజాలు విస్తీర్ణం గలది. డీడ్ ప్రకారం హద్దులు: **తూర్పు:** బొరుగువారి భూమి, **పడమర:** 30 లింకుల వెడల్పు రోడ్డు. **ఉత్తరం:** ప్లాటు నం.11లో సైటు. **దక్షిణం:** ప్లాటు నం.9లో సైటు. వాస్తవానికి: **తూర్పు:** ఇతరుల సైటు. **పడమర:** 30 లింకుల వెడల్పు రోడ్డు. **ఉత్తరం:** డి.నం.37/1174-1-4-3 ఇల్లు. **దక్షిణం:** ప్లాటు నం.9లో సైటు.

రిజర్వు ధర: 38,00,000/- ధరావతు: రూ.3,80,000/- బిడ్ హెచ్చింపు ధర: రూ.50,000/-

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసినంతవరకు ఎంకంబరెన్సు వివరాలు: సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసినంతవరకు ఆస్తులపై ఎంకంబరెన్సులు లేవు.
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసినంతవరకు కోర్టులలో/ ట్రిబ్యునల్స్ మొదలగువానిలో ఆస్తిపై పెండింగులో గల ఏవైనా స్టే/ స్టేటస్‌కో/ వ్యాజ్యాలు: లేవు.
ఇఎండి దాఖలుకు చివరి తేది: వేలం ముగింపు సమయంలోపు ఇఎండిని డిపాజిట్ చేయవలెను ఏదేని సాంకేతిక లోపాన్ని నివారించుటకు తగినంత ముందుగా ఇఎండిని డిపాజిట్ చేయవల్సిందిగా మరియు ఆస్తి ఐడితో లింక్/మ్యాప్ చేయవల్సిందిగా విజ్ఞప్తి.
రిజిస్ట్రేషన్, లాగిన్ మరియు బిడ్డింగ్ నియమాలకు దిగువ సైట్‌లను సందర్శించండి.

ఆన్‌లైన్ ఇ-వేలం పోర్టలు/ వెబ్‌సైట్- https://baanknet.com ద్వారా పైన తెలిపిన తేది మరియు సమయంలో 10 నిమిషాల అపరిమిత పొడిగింపుతో జరుపబడును. మొబైల్ నెంబరు మరియు చెల్లుబాటగు ఇమెయిల్ ఐడి ఉపయోగిస్తూ https://baanknet.com పై నమోదు చేసుకొనవలెను. (బయర్ రిజిస్ట్రేషన్ లింక్ వెబ్‌సైట్‌లోని హోంపేజీలో ఇవ్వబడింది). ఆసక్తి గల బిడ్డర్లు/ కొనుగోలుదారులు కేవైసీ డాక్యుమెంట్లను మరియు బ్యాంకు వివరాలను అప్‌లోడ్ చేయాలి. వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన హోంపేజీలో ఇవ్వబడిన బయర్ మాన్యువల్ ద్వారా మార్గదర్శకత్వం పొందవచ్చును. సందేహనివృత్తి కొరకు 8291220220పై సంప్రదించవచ్చును. ఇమెయిల్ ఐడి: support.BAANKNET@psballiance.com. వేలం సంబంధిత విచారణలకు ఇ-మెయిల్ చేయండి sarfaesi@unionbankofindia.bank లేదా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పై చిరునామా వద్ద గల బ్రాంచి ఏఆర్‌బి-తిరుపతి (86730)ని **లేదా అధీకృత అధికారి (8328565422)**ని వేలం వివరాలు మరియు ఆస్తి తనిఖీ కొరకు సంప్రదించండి. తమ బిడ్‌లను దాఖలు చేయుటకు మరియు ఇ-వేలం విక్రయ విధానంలో పాలుపంచుకొనుటకు ముందుగా వివరంగా గల వేలం నియమ నిబంధనలకొరకు బిడ్డర్లు వెబ్‌సైట్ https://baanknet.com and https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx ను చూడగలరు. ఇ-బిడ్డింగ్ విధానం ముగిసిన తరువాత పిఎస్‌బి అలయెన్స్ లిమిటెడ్ చేత ఇ-మెయిల్ ద్వారా గెలుపొందిన బిడ్డరుకు సమాచారం తెలుపబడుతుంది.

తేది 06.11.2025 ప్రదేశం: తిరుపతి. చీఫ్ మేనేజర్ మరియు అధీకృత అధికారి, అసెట్ రికవరి బ్రాంచి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,

సర్వేయర్ల సంఘం అధ్యక్షుడిగా శివకుమార్ ఎన్నిక

ఏకగ్రీవంగా ఎన్నికైన సర్వేయర్ల సంఘం ప్రతినిధులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: సర్వేయర్ల సంఘం ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. ఆదివారం కడపలో నిర్వహించిన సంఘం ప్రతినిధుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా కడప తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న కె.శివకుమార్‌ను అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా ఖాజీపేట పత్తూరు విలేజీ సర్వేయర్‌గా పనిచేస్తున్న ఎస్.ఖాదర్‌బాషా, కార్యదర్శిగా పెండ్లిమర్రి మండలం ఎల్లటూరు విలేజ్ సర్వేయర్ దేవనాథరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కడప మండల తహసీల్దారు సర్వేశన్, కోశాధికారిగా సర్వే శాఖ ఏడీ కార్యాలయంలో పర్యవేక్షకులుగా పనిచేస్తున్న ఎస్.అంజనమ్మ, ఈసీ సభ్యులుగా ఖాజా హుస్సేన్, సుమలత, హరిప్రసాద్, శివశంకర్, అబ్దుల్ సలీం, యశ్వంత్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రియాజుద్దీన్ ప్రకటించారు. కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు.

బ్రౌన్ గ్రంథాలయం వారసత్వ సంపద

లక్ష్మీనారాయణకు పుస్తకాలు అందిస్తున్న జానమద్ది విజయభాస్కర్, గ్రంథాలయ సిబ్బంది

మారుతీనగర్, న్యూస్‌టుడే: బ్రౌన్ స్మారక గ్రంథాలయం దేశానికి వారసత్వ సంపదను ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఇంటాక్ కన్వీనర్ సింగం లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో భద్రపరిచిన ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, చేతితో తయారు చేసిన రాత ప్రతులు, తామ్రపత్రం, నాణేలు, వంటి పలు ప్రాచీన సంపదను కాపాడటం ఎంతో అభినందనీయమన్నారు. జానమద్ది హనుమచ్ఛాస్త్రి లాంటి మహనీయుల కృషి ఫలితంగా వెలసిన గ్రంథాలయంలో అడుగిడటం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గ్రంథాలయ శాశ్వత సభ్యత్వాన్ని పొందడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో సీపీ బ్రౌన్ కేంద్రం సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్, సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి, సహాయకులు రమేష్‌రావు, హరిభూషణరావు, సిబ్బంది వెంకటరమణ, మౌనిక, ఇంటాక్ సభ్యులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

ప్రముఖ కూల్ డ్రింక్స్ ఏజన్సీలో టాటా ఏస్, అశోక్‌లైలాండ్ దోస్తు వాహనములలో లోడ్ వేసుకొని కడప టౌన్‌లో సప్లయ్ చేయుటకు డ్రైవర్లు కావలెను. జీతం : Rs 14,000. ఆసక్తి గలవారు సంప్రః Cell: 9490048347, 9248006645.

ప్రముఖ కంపెనీకి అడ్మినిస్ట్రేషన్ వర్క్ (ఎక్స్పీరియన్స్ Male) అభ్యర్థులు కావలెను. Exp: 5 Years, Qly: డిగ్రీ / పీజీ. Contact ✆ 89857 17076

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I Shaik Ayesha D/o Shaik Ghouse Basha, H.No. 5/680, Suddagunthala Street, Rajampet Town & Mandal, Annamayya District, AP -516115. Old Name: Shaik Shabhana, New Name: Shaik Shabana.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

JOBS

Required ITI/ Diplomain Electricals / Electronics Candidates with without Exp.for UPS & Stabilizer Service Engineers & Marketing Executives At Anantapur, Tirupathi, Kadapa. Cont: Techser Power Solutions Pvt. Ltd., Cell:9849770651

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ప్రొద్దుటూరు
• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు: డీఎస్పీ

ఠాణాలో దస్త్రాలు తనిఖీ చేస్తున్న మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్

దువ్వూరు, న్యూస్‌టుడే : దువ్వూరు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ సూచించారు. దువ్వూరు పోలీసు ఠాణాను ఆదివారం డీఎస్పీ తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. కేసుల పురోగతి, మండలంలో శాంతిభద్రతలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మైదుకూరు గ్రామీణ సీఐ శివశంకర్, ఎస్సై వినోద్‌కుమార్, ట్రైనీ ఎస్సై జితేంద్రరెడ్డి పాల్గొన్నారు.

సబ్ జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు

మాట్లాడుతున్న ప్రొద్దుటూరు రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యకుమారి

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా సబ్‌జైలులో ప్రొద్దుటూరు రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.సత్యకుమారి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. న్యాయ సేవలు, హక్కులపై అవగాహన కల్పించారు. న్యాయ సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, ఆర్థిక, ఇతర కారణాలతో న్యాయానికి దూరం కాకూడదన్నారు.

మాజీ సీఎం జగన్ చిత్రం తొలగింపు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పొన్నతోట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవనంపై నవరత్నాల లోగో, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్ పేరు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలవుతున్నా ఇప్పటికీ జగన్ చిత్రాలు తొలగించకపోవడంపై ఈ నెల 9న 'మారని అధికారుల తీరు..!' అన్న శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు వెంటనే భవనంపై ఉన్న చిత్రాలను తొలగించేశారు.

లంకమలకు ఆర్టీసీ బస్సు

బద్వేలు గ్రామీణ: బద్వేలు ప్రాంతంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన లంకమల్లేశ్వర స్వామి ఆలయ సందర్శనకు కార్తిక సోమవారం సందర్భంగా ఉదయం 7 గంటలకు, 10 గంటలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు బద్వేలు ఆర్టీసీ డీఎం తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఎక్స్‌ప్రెస్ బస్సు ఏర్పాటు చేశామని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్తు ఉప కేంద్రాల్లో సమస్యల వెల్లువ

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ఎస్పీడీసీఎల్ డివిజన్ పరిధిలో 33/11 కేవీ సామర్థ్యం కలిగిన 59 విద్యుత్తు ఉప కేంద్రాల్లో చాలా ప్రాంతాల్లో సమస్యలున్నాయి. దీంతో సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. ప్రొద్దుటూరు, కమలాపురం, జమ్మలమడుగు నియోజకవర్గాల్లోని విద్యుత్తు ఉపకేంద్రాలకు ప్రహరీ లేకపోవడం, ఫెన్సింగ్, గుంతలు ఉండటం, మరుగుదొడ్లు, మూత్రశాల గదులు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. సొంత జేబుల నుంచి రక్షిత నీటికి ఖర్చు పెడుతున్నారు. కాలం చెల్లి బీటలుబారిన గదులు, పెచ్చులూడుతున్న కాంక్రీటు స్లాబ్‌లు ఎప్పుడు మీదపడుతాయో భయాందోళన వారిలో ఉంది. ఉపకేంద్రాల పరిసరాల్లో ముళ్ల పొదలు విస్తరించడంతోపాటు గుంతల్లో వర్షపు నీటి మడుగులు నిల్వతో రాత్రి, పగలు తేడా లేకుండా విషపురుగుల సంచరిస్తున్నాయి. దెబ్బతిన్న గదుల్లో కిటికీలకు అద్దాలు లేక చలికాలంలో ప్రయాసపడుతున్నారు. గ్రామాల శివారుల్లో ఉన్న ప్రాంతాల్లో పచ్చదనం లేక పిచ్చి మొక్కలు, కంప చెట్లు గుబురుగా ఉంటున్నాయి.

● ప్రొద్దుటూరు మండల పరిధిలోని రంగసాయిపురం, మోడంపల్లె బైపాసు రోడ్డు, ఖాదరాబాదు తదితర ప్రాంతాల్లో ఈ తరహా పరిస్థితులున్నాయి. రామేశ్వరం ఉప కేంద్రానికి దిగువలోని ఖాళీ స్థలంలో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచింది. వర్షాలు కురిసిన సమయంలో విద్యుత్తు నియంత్రికలు మినహా చుట్టుపక్కల నీరు నిలుస్తోంది. ఈ విషయమై ఎస్పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా విద్యుత్తు ఉప కేంద్రాల్లో ఉన్న సమస్యలు గుర్తించామని, వీటి పరిష్కారానికి పంపిన ప్రతిపాదనలకు ఆమోదంరాగానే అభివృద్ధి పనులు చేయిస్తామన్నారు.

రామేశ్వరం విద్యుత్తు ఉప కేంద్రంలో వాననీరు

వాహనాల రాకపోకలపై నిషేధం

ఖాజీపేట, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం సందర్భంగా నాగనాదేశ్వర కోన ఆలయానికి కొండపైకి వెళ్లే వాహనాలు రాకపోకలు సాగించేందుకు అనుమతి లేదని సీఐ వంశీధర్ తెలిపారు. భక్తులు మెట్ల మార్గం ద్వారా స్వామిని దర్శించుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం కొండపైకి అనుమతి ఉన్న ఆటో సర్వీసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆలయానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా భద్రతా ఏర్పాటు చేశారు.

నర్మదేశ్వర స్వామి కల్యాణం 15న

బద్వేలు, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా ఈ నెల 15న లండన్‌లో ఎనిమిదో మఠాధిపతి వేదపండితులు శ్రీనివాసులు మీనాక్షి సమేత నర్మదేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నారు. బ్రహ్మంగారిమఠం మండలం పలుగురాళ్లపల్లె గోవిందస్వామి మఠం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది.

పాఠశాలలకు నిధుల మంజూరు

ఖాజీపేట ఆదర్శ పాఠశాల

చాపాడు, ఖాజీపేట, న్యూస్‌టుడే: చాపాడు మండలం సిద్దారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల గత నాలుగేళ్లుగా పంచాయతీ భవనంలో కొనసాగుతోంది. గత ప్రభుత్వం నాడు-నేడు కింద ఒక భవనం మంజూరు చేయగా పైకప్పు వరకు నిర్మాణంతో పనులు నత్తనడకన జరిగాయి. తాజాగా ప్రభుత్వం ఏడబ్ల్యుపీ కింద మరో అదనపు తరగతిగదికి రూ.14.65 లక్షలు మంజూరు చేసింది.

● ఖాజీపేట ఏపీ మోడల్ స్కూల్ భవనం మరమ్మతులకు పీఎంసీ నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. వర్షపు నీరు ఉరుస్తున్న చోట, మరుగుదొడ్లు మరమ్మతులు చేసి లైట్లు, ఫ్యాన్లు అమర్చనున్నారు. దయానందపల్లె బడికి ఏడబ్ల్యుపీ కింద అదనపు తరగతిగదికి రూ.14.65 లక్షలు, సి.కొత్తపల్లెలో మరుగుదొడ్లకు రూ.3.80 లక్షలు మంజూరయ్యాయి. పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలుగల విద్యార్థుల కోసం ర్యాంపు నిర్మాణానికి రూ.4.65 లక్షలు, తాగునీటి వసతికి రూ.3.65 లక్షలు వచ్చాయి. మరమ్మతులు త్వరలో పూర్తి చేస్తామని, గదుల నిర్మాణాలకు అనుమతులు రావల్సి ఉందని సమగ్రశిక్ష అభియాన్ డీఈ, ఏఈ గురివిరెడ్డి, నాగప్రసాద్ తెలిపారు.

శ్రీచరణికి వెల్లువలా అభినందనలు

శ్రీచరణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎర్రగుంట్ల జడ్పీటీసీ సభ్యుడు తమ్మిశెట్టి బాలయ్య

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మహిళల క్రికెట్ ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో సభ్యురాలు శ్రీచరణిని ఎర్రగుంట్ల జడ్పీటీసీ సభ్యుడు తమ్మిశెట్టి బాలయ్య ఆదివారం సన్మానించారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆర్టీపీపీలోని శ్రీచరణి నివాసం వద్ద జడ్పీటీసీ బాలయ్య కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఆర్టీపీపీ విద్యుత్తు ఉద్యోగుల సంఘం నాయకుడు గిరి, తదితరులు ఆమెను కలిసి సన్మానించారు.

దువ్వూరు : ప్రపంచకప్‌లో కీలకపాత్ర పోషించిన మహిళా క్రికెటర్ శ్రీచరణిను మైదుకూరు మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ పి.వి ప్రతాప్‌నాయుడు దంపతులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరి తెలుగుజాతి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సైకతలింగానికి అన్నాభిషేకం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం ముక్తి రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం సైకత లింగానికి అన్నాభిషేకం చేశారు. కార్తిక మాసోత్సవంలో భాగంగా సైకత లింగానికి ప్రత్యేక అలంకరణ చేసి అన్నాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసం పూజలు..

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: లోకకల్యాణం నిమిత్తం ఏకాదశ రుద్రాభిషేక పూజ నిర్వహిస్తున్నట్లు హంపీ విరూపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి అన్నారు. ఆదివారం రాత్రి ఆర్యవైశ్యసభ కన్యకాపరమేశ్వరి దేవస్థానం అమ్మవారిశాల తోటలో కార్తికమాసోత్సవం సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కలశస్థాపన, రుద్రాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టిరామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు రవీంద్రబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి ప్రతాప్, కోశాధికారి పరమేష్, కార్యవర్గసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న హంపీ విరూపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక ఉప్పరపల్లెలోని నారాయణ ఆశ్రమాన్ని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామీజీ ఆదివారం సందర్శించారు. దేవతామూర్తులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇక్కడి గోశాలను వెళ్లి పండ్లు, పళ్లు అందజేశారు. స్థానిక ఆశ్రమానికి సంబంధించి ఆధ్యాత్మిక వివరాలను నిర్వాహకులు తెలిపారు. బొజ్జవారిపల్లె మలుపు వద్ద వీరబ్రహ్మేంద్ర ఆలయంలో పూజలు చేశారు.

కుంకుమార్చన చేస్తున్న మహిళలు

దెబ్బతిన్న రోడ్డు.. రాకపోకలకు అవస్థలు

రాజుపాళెం మండల పరిధిలోని పాత కుందూ నదిపై ఉన్న వంతెనపై సీసీ రహదారి దెబ్బతింది. ఇటీవల కురిసన వర్షానికి ఈ దుస్థితి ఏర్పడింది. దీంతో వంతెనపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అలాగే రక్షణ గోడలు తెలియకపోవడంతో వాహనాదారులు నీటిలో పడే ప్రమాదం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, రాజుపాళెం**

స్తంభం శిథిలం.. ప్రమాదకరం

ఖాజీపేట మండలం కొత్త ఏటూరు ఎస్సీ కాలనీ ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. గ్రామంలో విద్యుత్తు స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలంలో స్తంభాలకు షాక్ కొడుతోంది. రహదారులపై మురుగు పారుతుండటంతో నడకదారికి కష్టంగా మారింది. ఇటీవల విద్యుత్తు శాఖ అధికారులు కొత్త స్తంభాలు, తీగలు మార్చే పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీనిపై గుత్తేదారుడు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని గ్రామస్థులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, ఖాజీపేట**

వీధిలా.. నడిచేదెలా?

మైదుకూరు పట్టణంలోని శ్రీరాంనగర్ వీధి చివరిలో దారి అధ్వానంగా మారింది. అడుగుతీసి అడుగేయలేని దుస్థితి నెలకొంది. ఇటీవల వీధి మధ్యలో తాగునీటి పైపులైనుకు రోడ్డు తవ్వి మట్టితో కప్పేశారు. వర్షం వచ్చిన సమయంలో ఆ ప్రాంతం బురదమయంగా మారింది. దీంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు కింద పడిన సందర్భాలున్నాయి. రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయమై ఏఈ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, మైదుకూరు**

దారి పక్కనే గండం.. రక్షణ పూజ్యం

పెద్దముడియం మండలం జె.కొట్టాలపల్లె సమీపంలో రహదారి పక్కన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ దారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారికి ఇరువైపులా ఇలాంటి గుంతలు చాలా ఉన్నాయి. ఎలాంటి రక్షణ కవచాలు లేవు. ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ అభిలాష్‌రెడ్డిని వివరణ కోరగా రహదారికి ఇరువైపులా రక్షణకవచాల ఏర్పాటుకు అంచనా వేసి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, పెద్దముడియం**

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న సీఐ నరేష్ బాబు, కృష్ణారెడ్డి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని పట్టణ సీఐ నరేష్ బాబు సూచించారు. రోటరీ క్లబ్ జమ్మలమడుగు అధ్యక్షుడు వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. భావి తరాల భవిష్యత్తుతోపాటు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, క్లబ్ సభ్యులు డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి, ఓబులరెడ్డి, పార్థసారథి, శ్రీనివాసులు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు పెద్ద చెరువుకు జలకళ

బద్వేలు పెద్ద చెరువు అలుగు వద్ద సందర్శకులు

బద్వేలు: మట్లి అనంతరాజు కాలంలో నిర్మితమైన బద్వేలు పెద్ద చెరువు నాలుగేళ్ల తర్వాత అలుగు పారింది. మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షంతో పాటు బ్రహ్మంసాగర్ నుంచి నీరు వదలడంతో 1.36 టీఎంసీలకు నీరు చేరింది. శనివారం నుంచి అలుగు పారడంతో జలకళ సంతరించుకుంది. సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. చెరువు పూర్తిస్థాయిలో నిండటంతో ఈ సారి పంటల సాగుకు ఇబ్బంది లేదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే బద్వేలు పెద్దచెరువు వద్ద ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. గతంలో ఈతకు దిగి ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటనలున్నాయి. అధికారులు స్పందించి బద్వేలు పెద్దచెరువు వద్ద భద్రత చర్యలు చేపట్టాల్సి ఉంది.

సౌర విద్యుత్తు ప్లాంట్‌లో చోరీ?

కొండాపురం: మండల పరిధిలోని టి.కోడూరు గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న సోలార్ ప్లాంటులో ఇటీవల కాలంలో వరుస చోరీలు చోటు చేసుకున్నాయి. గతంలో ప్లాంట్‌లో పలుసార్లు రూ.లక్షలు విలువైన వస్తువులను దొంగిలించిన సంఘటనలపై కేసులు నమోదయ్యాయి. తాజాగా మూడు రోజుల కిందట ప్లాంట్‌లో చోరీ జరిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై తాళ్లప్రొద్దుటూరు ఎస్సైని చరవాణి ద్వారా వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

కార్యక్రమానికి హాజరైన న్యాయవాదులు, విద్యార్థులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకుని ఉండాలని జమ్మలమడుగు బార్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్‌రెడ్డి చెప్పారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, మైలవరం గురుకుల పాఠశాల, పట్టణంలోని పలు స్కూళ్లకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. వారికి వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్, న్యాయ అవగాహన శిబిరాలు, జైలు లీగల్ సర్వీసెస్, శిశు రక్షణ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవతావాది మిరియాల వెంకటరావు

మిరియాల వెంకటరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలను ఒక గొడుగు కిందకు తెచ్చి సంఘటిత పరిచిన గొప్ప మానవతావాది మిరియాల వెంకటరావు అని బలిజ సంఘం నాయకులు కొనియాడారు. ఆదివారం వెంకటరావు వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక శ్రీసాయిప్లేస్కూల్ ఆవరణలో బలిజ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి నాగార్జున, శివకృష్ణ, బలిజ సంఘం మహిళా అధ్యక్షురాలు ఉషాదేవి, మిరియాల చలపతి, అరవింద్, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి శంకుస్థాపన

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు సమీపంలో నూతన మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ, తెదేపా నాయకుడు దేవగుడి నారాయణరెడ్డి హాజరయ్యారు. ముస్లిం మత పెద్దల ఆశీర్వాదంతో మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ముఫ్తి కరీముల్లా తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీని శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ముఫ్తి షేక్ అహ్మద్ సయీద్, రియాజ్, అన్సర్ ఆలీ, షబీల్ మౌలానా, షేక్ ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డిని సత్కరిస్తున్న ముస్లింలు

ఉపాధ్యాయులపై చర్యలకు డిమాండ్

మైదుకూరు, న్యూస్‌టుడే : విధులకు వెళ్లకుండా విహారయాత్రకు వెళ్లిన మైదుకూరు మండలం ఓ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.రాహుల్ డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్, ఆర్జేడీ, డీఈవో తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

ప్రొద్దుటూరు నేరవార్తలు: పట్టణానికి చెందిన టీ దుకాణ నిర్వాహకుడు వడ్ల లక్ష్మి నారాయణ మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో గ్రామీణ ఠాణా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.8,250 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఏఎన్ఎంపై దాడి చేశారని ఫిర్యాదు

కడప, న్యూస్‌టుడే: చాపాడు మండలంలో పనిచేస్తున్న ఓ ఏఎన్ఎంను స్థానిక అధికారులు, సిబ్బంది కలిసి ఓ ఎంఎల్ హెచ్‌పీ కాళ్లు పట్టించి, చెప్పుతో కొట్టించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 4న చాపాడు పీహెచ్‌సీలో ఆశాడే సమావేశం జరుగుతుండగా ఈ తంతు జరిగింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో, వైద్యాధికారులు, ఆరోగ్య విస్తరణాధికారులు, సూపర్‌వైజర్ల సమక్షంలో ఏఎన్ఎంకు అవమానం జరిగిందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ నెల 6న బాధితురాలితోపాటు మండలంలోని ఏఎన్ఎంలు కలిసి తమకు న్యాయం చేయాలని ఎంపీడీవో వీరకిశోర్‌కు, మండల వైద్యాధికారి శివప్రసాద్‌రెడ్డికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

రబీలో శనగ సాగు ప్రశ్నార్థకం..!

• వర్షం కురవడంతో భూమిలో అధిక తేమశాతం • వ్యవసాయ పనులకు ఆటంకం

ఇటీవల కురిసిన వర్షానికి పొలాల్లో నిలిచిన నీరు

పెద్దముడియం, రాజుపాళెం, న్యూస్‌టుడే: రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులవుతున్నా శనగ సాగుకు వర్షాలు అడ్డంకిగా మారాయి. పెద్దముడియంలో సాధారణ విస్తీర్ణం 55 వేల ఎకరాలు కాగా 40 వేల ఎకరాల్లో శనగ పంటను రైతులు సాగు చేస్తారు. రాజుపాళెం మండలంలో 30 వేల ఎకరాలకు పైగా సాగు చేస్తారు. రైతులు రసాయన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకున్నా తుపాన్ ప్రభావంతో ఇటీవల వర్షం కురవడంతో భూమిలో తేమశాతం అధికంగా ఉంది. అలాగే కొన్ని ప్రాంతాల్లోని పొలాల్లో నీరు నిలిచింది. మంచి అదునులో విత్తనం వేస్తే చిన్నపాటి వర్షాలు, చలి, మంచుతో శనగ పంట పండి మంచి దిగుబడులు వచ్చే ఆస్కారం ఉంటుంది. అనుకూలించని వాతావరణం, అధిక తేమ, తిరిగి వర్షాలు పడే అవకాశం ఉన్నందున రబీ సీజన్‌లో శనగ పంట సాగు ప్రశ్నార్థకం అయింది. ప్రతి ఏటా దసరా అనంతరం సాగు ప్రారంభించే రైతులు ఇప్పటికీ విత్తలేదు. ఆలస్యంగా సాగు చేస్తే ఆశించినంత దిగుబడులు రావన్న ఆందోళన రైతన్నల్లో నెలకొంది. పెద్దముడియం, చిన్నముడియం, బలపనగూడూరు, నెమళ్లదిన్నె, పాలూరు, పలు ప్రాంతాల పొలాల్లో నీరు నిలిచి పంట సాగుకు రైతులు దూరం అవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

● పెద్దముడియం మండలానికి 6,400 క్వింటాళ్ల రాయితీ శనగ విత్తనాలు మంజూరయ్యాయి. క్వింటా ధర రూ.7,800 కాగా 25 శాతం రాయితీ పోనూ రైతు క్వింటా ధర రూ.5,850లు చెల్లించాల్సి ఉంది. మార్కెట్‌లో రూ.5,700లకే దొరుకుతుండడంతో రైతులు రాయితీ శనగపై ఆసక్తి చూపడం లేదు. శనగ సాగుకు ఈ నెల కూడా అనుకూలమేనని ఏవో జాకీర్‌షరీఫ్ తెలిపారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

రబీలో 5 ఎకరాల్లో శనగ సాగు చేసేందుకు సిద్ధమయ్యాను. పెద్దముడియం కుందూ నీరు వెనక్కి వచ్చి పెద్దవాగులో ప్రవహించి మా పొలాలపై నిలవడంతో సకాలంలో విత్తనం వేయలేకపోయాం. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి. **- వెంకటరామిరెడ్డి, పెద్దముడియం**

దిగుబడులపై ప్రభావం

నాకున్న 3 ఎకరాల్లో ఏటా శనగ పంట సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాను. వర్షం అధికంగా పడటంతో భూమి తేమశాతం అధికంగా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో పంట సాగు చేయకపోతే దిగుబడులపై ప్రభావం చూపుతుంది. **- శివరామిరెడ్డి, జె.కొట్టాలపల్లె**

భాజపా బలోపేతానికి కృషి

మాట్లాడుతున్న భాజపా పట్టణ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: బద్వేలు పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో భాజపా బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవన్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం బద్వేలు పట్టణంలోని 13, 33 వార్డులకు చెందిన షేక్ దావూద్, సురేష్ బాబుతో పాటు మరికొందరు ఇతర పార్టీల నుంచి భాజపాలో చేరారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. భాజపా నాయకులు రమణయ్య, సతీష్‌కుమార్, ప్రసాద్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

మైదుకూరు, న్యూస్‌టుడే : వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న మైదుకూరులో నిర్వహిస్తున్న భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు.

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీ బుధవారం జమ్మలమడుగులో పెద్ద ఎత్తున ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు. ర్యాలీకి సంబంధించి 'వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం గోడపత్రాలను' ఆదివారం స్థానిక వైకాపా కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

కడప
.కడప .పులివెందుల .కమలాపురం

నృత్యం చేస్తున్న యువకులు

శిల్పారామంలో సందడే సందడి

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఆట విడుపులో భాగంగా శిల్పారామం కళావేదికపై ఆదివారం చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. ఈ సందర్భంగా కళాకారులతో నిర్వహించిన పలు సాంస్కృతిక, జానపద, పట్టెటూరు, సినీగీతాల కార్యక్రమాలు ప్రజలను ఎంతో ఉత్సాహపరిచాయి. వారాంతపు సెలవు రోజు కావడంతో నగర ప్రజలు, చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున శిల్పారామానికి చేరుకుని సేదతీరి సందడి చేశారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణప్రసాద్, శిల్పారామం సిబ్బంది, నగర ప్రజలు పాల్గొన్నారు.

కులగణన శాస్త్రీయంగా చేపట్టాలి

సమావేశంలో బీసీ సంఘం జిల్లా నాయకులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: కులగణన శాస్త్రీయంగా నిర్వహించి ఆ పై జనాభా ఉన్నంత మేరకు బీసీల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి డిమాండ్ చేశారు. విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేశారు. త్రివిక్రమ్, రామాంజనేయులు, నరసింహ, హరికుమార్, ఓబయ్య, రాణాప్రతాప్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల: 8008573466
కమలాపురం: 8008573475

?: ఎర్రిపేట కాలనీ ప్రధాన రహదారిలో మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకు సాగడం లేదు. దుర్వాసన వస్తోంది. సమస్యను పరిష్కరించాలి. - **రామస్వామి**

✓: త్వరలోనే సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. - **రమేష్, ఎంహెచ్‌వో, నగరపాలక సంస్థ కడప**

?: వాజ్‌పేయి కూడలిలో రాత్రి వేళలో వీధి కుక్కలు దాడి చేస్తున్నాయి. వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. - **నరసింహ, ద్విచక్ర వాహనదారుడు**

✓: సమస్య మా దృష్టికి వచ్చింది. వీధి కుక్కలను తరలించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తాం. - **రమేష్, ఎంహెచ్‌వో**

?: నారాయణ పాఠశాల వీధిలో దోమలు అధికంగా ఉన్నాయి. విష జ్వరాలు ప్రబలుతున్నాయి. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి. - **ఆదిలక్ష్మి, స్థానికురాలు**

✓: వెంటనే పారిశుద్ధ్య సిబ్బందితో ఫాగింగ్ చేయించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. - **రవీంద్ర, ఎన్‌ఎస్ నగరపాలక సంస్థ, కడప**

శివారు ప్రాంతాలు.. సమస్యల లోగిళ్లు

మురుగు నీటి పారుదల వ్యవస్థ అధ్వానం

చిన్న చౌకు, చెన్నూరు, న్యూస్‌టుడే: శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. సరైన మురుగు పారుదల వ్యవస్థ, సరైన దారులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగు నీరు, వ్యర్థాలు, చెత్తాచెదారంతో కాలువలు నిండిపోయాయి. నెలల తరబడి నుంచి కాలువలు శుభ్రం చేసే వారే కనుమరుగయ్యారు. మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నారు. ● ఉప్పరపల్లెలో మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. ఇక్కడ ఎక్కడ చూసినా కట్టడాలు లేవు. రోడ్డు పక్కనే మురుగు నెలల తరబడి నుంచి నిల్వ ఉన్నాయి. అటు వైపు అధికారులు, పాలకులు వెళ్లిన దాఖలాలు లేవు. మురుగు కుంట పక్కనే నివాసాలు, దుకాణాలున్నా మురుగు బయటికి వెళ్లే మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. ● నగర పరిధిలోని ఆలంఖాన్‌పల్లెలో మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి రోడ్లపైకి మురుగు వచ్చి చేరింది. ఇప్పటికీ పది రోజులైనప్పటికీ ఇంకా సుబ్బన్న కాలనీలోని పలు వీధుల్లో వర్షపు నీటి నిల్వలున్నాయి. కాలువలు పూర్తిగా నిండిపోయాయి. మురుగు నీరు ముందుకు సాగడం లేదు. స్థానికంగా ఉన్న వారు మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్నారు.

శివానందపురం.. సమస్యలతో సతమతం : మారుతీనగర్: రిమ్స్‌కు వెళ్లే మార్గంలో రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనున్న శివానందపురం కాలనీ ఏర్పాటై దాదాపు 30 ఏళ్లయింది. కనీస వసతులు లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరపాలకకు సక్రమంగా పన్నులు చెల్లిస్తున్నా మా ప్రాంతంలో కనీసం సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా కాలనీ మొత్తం చెరువుగా మారుతుందని నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

ఆలంఖాన్‌పల్లెలో నివాసాల ముందు వాన నీటి నిల్వలు

శివానందపురం వడ్డెర కాలనీలోని రహదారి దుస్థితి

ఇంట్లోకి వెళ్లలేకున్నాం : చిన్నపాటి వర్షం వస్తే చాలు ఈ ప్రాంతం మొత్తం మురుగు, బురదతో నిండిపోతోంది. కనీసం కాలు తీసి కాలు పెట్టలేని పరిస్థితి. బురద నీటిలో నడవడంతో చర్మ వ్యాధులు వస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా మా పరిస్థితి దయనీయంగా ఉంటోంది. అధికారులు కనీసం స్పందించడం లేదు. **- రమణయ్య, శివానందపురం**

విష పురుగులు సంచరిస్తున్నాయి : ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా ముళ్ల పొదలు దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతం మొత్తం అడవిని తలపిస్తోంది. ఈ ముళ్ల పొదల్లో నుంచి ప్రతి రోజూ ఏదో ఒకచోట విష పురుగులు తిరుగుతూనే ఉన్నాయి. అధికారులు మా కాలనీని సందర్శించి మౌలిక వసతులు కల్పించాలి. **- రోజమ్మ, శివానందపురం**

భక్తి శ్రద్ధలతో జలాభిషేకం


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

మలకాటిపల్లె(ఒంటిమిట్ట), న్యూస్‌టుడే: మండలంలోని మలకాటిపల్లెలో కొలువైన హనుమంతుడికి ఆదివారం భక్తిశ్రద్ధలతో 108 బిందెల నీటితో మహా జలాభిషేకం పూజలు నిర్వహించారు. గ్రామం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఆనందంగా జీవనం సాగించేలా అనుగ్రహించాలని ఇష్ట దైవాన్ని ఆధ్యాత్మిక చింతనతో ఆరాధించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



మారుతీనగర్, న్యూస్‌టుడే: రవీంద్రనగర్‌లోని శ్రీరామాంజనేయస్వామి ఆలయంలో వెలసిన చంద్రశేఖరస్వామికి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

సోమసుందరం.. భక్త మందిరం

మారుతీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని గడ్డబజార్‌లో బ్రహ్మసూత్రం కలిగిన పురాతన శ్రీకామాక్షి కోటి కళావతి సమేత శ్రీసోమసుందరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి వారికి మహా లింగార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. మృత్తికా లింగానికి (పుట్టమన్ను లింగానికి) భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రతిభావంతులకు ప్రశంసలు

కడప విద్య : నగరంలోని ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాల విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా లీగల్ సర్వీస్ అథారిటీ నిర్వహించిన ఈ పోటీలో పాఠశాలకు చెందిన కరుణాకర్ (10వ తరగతి), అమీనా (9వ తరగతి), బాబూరెడ్డి (8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచి ప్రతిభ కనబరిచారు. జిల్లా సెషన్స్ జడ్జి యామిని ఆదివారం విద్యార్థులు, జిల్లా సైన్స్ అధికారి వేపరాల ఎబినేజర్‌లను అభినందించారు.

పెన్నా నది వద్ద పోలీసుల ఆంక్షలు

నదిలో కర్రలతో హెచ్చరికలను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

కడప నేరవార్తలు, వల్లూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పుష్పగిరి వద్ద భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో పుష్పగిరి వద్దనున్న పెన్నా నదిలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఎర్రటి వస్త్రాన్ని కర్రల సాయంతో లోతు ఎక్కువగా ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేశారు. నదిలోని పలు ప్రాంతాల్లో సుడిగుండాలున్నాయని.. నదీ స్నానాలు చేసే భక్తులు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. గతంలో పలువురు సుడి గుండాల్లో చిక్కుకుని మృత్యువాత పడటంతో ముందు జాగ్రత్తగా ఆంక్షలు విధించారు.

పెద్ద దర్గాకు తారా తోరణం

పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న సినీనటుడు సుమన్

కడప చిన్నచౌకు : ప్రసిద్ధిగాంచిన కడప పెద్దదర్గాను ఆదివారం ప్రముఖ సినీనటుడు సుమన్ సందర్శించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయనకు ముస్లిం సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. దర్గా విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రముఖ హాస్యనటుడు అలీ, సంగీత కళాకారుడు శివమణి తదితరులు దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కవికోకిల రామిరెడ్డికి ఘన నివాళి

రామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి

మారుతీనగర్, న్యూస్‌టుడే: కవిగా, రచయితగా, విమర్శకులుగా, నాటకకర్తగా ప్రసిద్ధులైన కవికోకిల దువ్వూరు రామిరెడ్డి సంప్రదాయ రీతులను మిళితం చేసి కొత్త తరానికి బాటలు వేసిన రైతు కవి అని కడప రెడ్డి సేవాసమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి అన్నారు. దువ్వూరి రామిరెడ్డి జయంతి సందర్భంగా స్థానిక రెడ్డి సేవాసమితి కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, మధుర కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, నాగూరు రవీంద్రనాథరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, రెడ్డి సేవాసమితి వసతిగృహ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు

కడప విద్య, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా అన్ని ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్ 1 పరీక్షలు జరగనున్నాయి. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ తెలిపారు.

రైతుబజారులో కూరగాయల ధరలు



కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతు బజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా.. బంగాళదుంప-45, క్యాబేజీ-25, క్యారెట్-78, బీన్స్-60, బీట్‌రూట్-55, కీర-35, దోస-40, దొండకాయలు-58, ముల్లంగి-50, అల్లం-60, 80, కాలీఫ్లవర్-55, క్యాప్సికం-70, టమాట-15, 18, మిరపకాయలు 35, వంకాయలు-55, బెండకాయలు-35, బీర-45, కాకర- 50, మటిక్కాయ-50, చిక్కుడు-50, అలసందకాయలు-50, అనపకాయలు-60, ఉల్లిపాయలు-20, 25, మునగకాయలు-60.

ఘనంగా భట్రాజుల కార్తిక వన భోజన మహోత్సవం

ఆకట్టుకున్న యువతుల సంప్రదాయ నృత్యం

మారుతీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని చలమారెడ్డిపల్లెలో జిల్లా భట్రాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన భోజన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో భట్రాజు కుటుంబాలు తరలి వచ్చాయి. ఈ సందర్భంగా ఆ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వరికుంట చంద్రమోహన్‌రాజు మాట్లాడుతూ.. తమ సామాజిక వర్గ మంతా ఐక్యంగా ఉండి ఒకరికొకరు సహకారం అందించుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల కర్నూలు వద్ద జరిగిన బస్సు దగ్ధం ఘటనలో పది మంది ప్రాణాలను కాపాడిన ధర్మవరానికి చెందిన ఉపేంద్రం హరీష్‌రాజును సన్మానించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆ సంఘం ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఐక్యత చాటుతున్న భట్రాజు సంక్షేమ సంఘం నాయకులు

పాత పింఛన్ పునరుద్ధరణ తప్పనిసరి

ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కడప విద్య, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని ఏపీ కాంట్రిబ్యూటరీ పింఛన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ఆర్ వెంకటజనార్దన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర గ్రీవెన్స్ రీడ్రెస్సెల్ కమిటీ ఛైర్మన్ రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా అంకిరెడ్డిపల్లె మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హరేంద్ర, సహాధ్యక్షుడిగా ఓబులేసు, ఆర్థిక కార్యదర్శిగా నర్రా రజనీకాంత్, అదనపు ప్రధాన కార్యదర్శిగా రామిరెడ్డి హుస్సేన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎస్ఆర్ వెంకటజనార్దన్ రెడ్డి, ఖాదర్‌బాషా, హుస్సేన్‌పీరా, చాంద్‌బాషా, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ప్రభావతి, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా గజ్జల వెంకటలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులుగా పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీతో ప్రతిజ్ఞ చేయించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ప్రసంగిస్తున్న రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

వేంపల్లె, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆదివారం ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరుస్తామని గత ప్రభుత్వం చేసిన ఆర్థిక గాయాలను మాన్పుతామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి కూటమి ప్రభుత్వం 16 నెలలు సమయమవుతున్నా తమ సమస్యలు పరిష్కరించలేదన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, ప్రధాన కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు సురేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పాల్గొన్నారు.

వేతనాల చెల్లింపుల్లో అవకతవకలు

మారుతీనగర్, న్యూస్‌టుడే: యోగివేమన విశ్వవిద్యాలయంలో వేతనాల బిల్లుల చెల్లింపుల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని వాటిపై విచారణ జరిపి ఆర్థిక అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండు చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ.. వైవీయూ బోధన, బోధనేతర సిబ్బంది 2025 అక్టోబర్ నెల వేతన బిల్లుగా 2,94,82,153 మొత్తానికి 25 వ తేదీ రూపొందించారని.. అదే రోజు స్వయంగా ఆమోదం తెలిపినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయని తెలిపారు. ఈ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధమని ఉప కులపతి విచారించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు.

ఆయకట్టుకు సాగునీరందిస్తాం

వల్లూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని చెరువులను పూర్తి స్థాయిలో నీటితో నింపి ఆయకట్టులోని ప్రతి ఎకరానికి నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. మండలంలో అంబవరం చెరువు నుంచి ఆదివారం పొలాలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో డీఈ జగదీశ్వర్‌రెడ్డి, చెరువు నీటి సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

పులివెందుల : సమాజంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. పులివెందులలో ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం ఉపాధ్యాయుడు అజ్జుగుట్టు మురళీధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సన్మాన గ్రహీత దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

భాజపా బలోపేతానికి కృషి

పులివెందుల : గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్, భాజపా కడప జిల్లా మాజీ అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి అన్నారు. పులివెందులలో మండలాధ్యక్షుడు నవీన్ ఆధ్వర్యంలో ఆదివారం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రతి ఒక్కరూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు లక్ష్మయ్య, శ్రీరాములు, విజయలక్ష్మి, తిరుపాల్, అనిల్, తరుణ్ పాల్గొన్నారు.

అక్షరాన్ని ఆయుధంగా మలిచిన కవి సుబ్బరాయుడు

కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తదితరులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: సామాజిక అంశాలనే ప్రధాన వస్తువుగా తీసుకుని ప్రతి అక్షరాన్ని ఆయుధంగా చేసి విద్వాన్ సుబ్బరాయకవి ఇసుకలో దిద్దిన అ..ఆ..లు అనే పేరుతో కవితా సంపుటిని తీసుకురావడం సాహిత్య లోకానికి శుభ పరిణామమని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం విద్వాన్ సుబ్బరాయకవి కవితీకరించిన కవితా సంపుటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆచార్య నల్లపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, లయన్ చిన్నపరెడ్డి, మొగిలిచెండు సురేష్, వెంకటరెడ్డి, వెంకటేష్, దేవదానం, ఇతర రచయితలు పాల్గొన్నారు.

నేడు నాగేశ్వర స్వామి గ్రామోత్సవం

చెన్నూరు, న్యూస్‌టుడే: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని శ్రీనాగనాగేశ్వర స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వేడుకల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా చేపట్టాలని మత పెద్దలతో జిల్లా అధికారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, జేసీ అదితిసింగ్, ఆర్డీవో జాన్ ఇర్విన్, ఏఎస్పీ ప్రకాష్‌బాబు, డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విలువలతో జీవించాలి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మానవతా విలువలు కలిగి జీవించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి అన్నారు. కార్తిక మాసం సందర్భంగా ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నగరవనంలో వన భోజనాలు నిర్వహించారు. వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానవత సేవా సంస్థ కేంద్ర కమిటీ డైరెక్టర్ రామాంజనేయరెడ్డి, సభ్యులు గోపి, సహదేవరెడ్డి, సుబ్రహ్మణ్యం, సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంక్-ఏ కార్యశాల

మారుతీనగర్ : యోగివేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగంలో ఇంక్ ఏ పేరుతో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు ప్రింట్ మేకింగ్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఆ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయ రావు తెలిపారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వెడ్‌కట్ ప్రింటింగ్, ఇంటగ్లియో ప్రింట్ మేకింగ్ పద్ధతుల్లో శిక్షణ ఇస్తారన్నారు. తెలంగాణ తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు కృష్ణారెడ్డి, ప్రముఖ ప్రింట్ మేకింగ్ నిపుణులు చలపాక అప్పలాచారి, రీసోర్స్ పర్సన్లు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. వర్క్‌షాప్ అనంతరం విద్యార్థులు రూపొందించిన చిత్రాలతో చిత్రప్రదర్శన ఉంటుందన్నారు.

వారసత్వ సంపదను కాపాడుకుందాం

కడప విద్య, న్యూస్‌టుడే: ప్రపంచంలోనే అత్యంత విలువైన వారసత్వ సంపద దేశంలోనే ఉందని.. అలాంటి సంపదను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) రాష్ట్ర కన్వీనర్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం ఇంటాక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వారసత్వ సంపద పై రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్, కడప చాప్టర్ కన్వీనర్ చిన్నపరెడ్డి, అనంతపురం చాప్టర్ కన్వీనర్ రామ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ సలీంబాషా, ఇంటాక్ సభ్యులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కడప
ఐ.పి. నెం.69/2025

యల్.గణపతి ...పిటీషనర్

V/s

1. ఎ.అంకమ్మ, తండ్రి బాలనరసన్న, వయసు 40 సం॥లు, హిందూ, వ్యాపారం, డోర్ నెం.1/1573, యర్రముక్కపల్లి, కడప సిటీ & డిస్ట్రిక్ట్. 2. జి.సుబ్బరాయుడు, తండ్రి లేట్ మల్లయ్య, వయసు 38 సం॥లు, హిందూ, వ్యాపారం, డోర్ నెం.1/1688, యర్రముక్కపల్లి, కడప సిటీ, డిస్ట్రిక్ట్. 3. కె.నాగేంద్ర, తండ్రి బాబయ్య, వయసు 32 సం॥లు, హిందూ, వ్యాపారం, డోర్ నెం.2/2583, బాబా సాహెబ్ కాలనీ, రాయచోటి టౌన్, అన్నమయ్య జిల్లా. 4. పి.శ్రీహరి, తండ్రి పి.సిద్దయ్య, వయసు 55 సం॥లు, హిందూ, ఎంప్లాయ్, డోర్ నెం.1/1579, యర్రముక్కపల్లి, కడప సిటీ, డిస్ట్రిక్ట్. 5. యస్.రామచంద్రన్, తండ్రి రామస్వామి, వయసు 45 సం॥లు, హిందూ, వ్యాపారం, డోర్ నెం.3/14-5, రాజారెడ్డి వీధి, కడప సిటీ, డిస్ట్రిక్ట్ 6. డి.లక్షుమయ్య, తండ్రి కొండయ్య, వయసు 55 సం॥లు, హిందూ, వినాయక స్వామి టెంపుల్, మొదటి వీధి, ఇండస్ట్రియల్ ఎస్టేట్, యర్రముక్కపల్లి పోస్టు, కడప. 7. ఏటూరు రవి, తండ్రి పెంచలయ్య, వయసు 40 సం॥లు, సాయిబాబా టెంపుల్, యర్రముక్కపల్లి పోస్టు, కడప. 8. ఎ.ఆంజనేయులు, తండ్రి లేట్ ఎ.నారాయణ, వయసు 40 సం॥లు, హిందూ, ఐసగూరు గ్రామం, తొండూరు మండలం, కడప. 9. టి.హనుమమ్మ, భర్త టి.దేవప్రసాద్, వయసు 42 సం॥, డోర్ నెం.1/867, రామాలయం టెంపుల్ ప్రక్కన, యర్రముక్కపల్లి, కడప. 10. కె.హరినాథ్ బాబు, తండ్రి సుబ్బరాయుడు, వయసు 55 సం॥లు, కేరాఫ్ టైలర్ సుబ్బరాయుడు, రంగ కాంప్లెక్స్, యర్రముక్కపల్లి, కడప. 11. నాగెల్ల శ్రీనివాసులు, తండ్రి నాగ సుబ్బయ్య, వయసు 48 సం॥లు, డోర్ నెం.37/681, ఇందిరానగర్, మామిళ్లపల్లె పంచాయితీ, సి.కె.దిన్నె మండలం, కడప. 12. బి.శ్రీనివాసులు, తండ్రి తెలియదు, వయసు 50 సం॥లు, ప్రొప్రైటర్ ఆఫ్ ది హల్దీరామ్ డిస్ట్రిబ్యూటర్స్, ప్రధాన రహదారి మాయాన బీచ్, నెల్లూరు. 13. ఎ.నారాయణ, తండ్రి లేట్ చిన్నప్ప, వయసు 70 సం॥లు, డోర్ నెం.1/864, నాగలకట్ట వీధి, యర్రముక్కపల్లి, కడప. 14. ఇండియన్ బ్యాంక్, రెప్రజెంటెడ్ మేనేజర్, ఆఫీస్ ఆఫ్ యఫ్.ఆర్. 6జి+క్యూఆర్‌యం, రాజీవ్ పార్కు రోడ్, ఎ.పి.హెచ్.బి. కాలనీ, కడప. 15. లెండింగ్ కార్ట్, రెప్రజెంటెడ్ మేనేజర్, 4వ ఫ్లోర్, 401 ఐకానిక్ సింబల్, యన్.ఆర్.సింబల్ క్రాస్ రోడ్డు సాటిలైట్, అహ్మదాబాద్, గుజరాత్ రాష్ట్రం-380015. ఇండియన్ బ్యాంక్. 16. కినర క్యాపిటల్: యం.యస్.యం.ఇ. బిజినెస్ లోన్స్, రెప్రజెంటెడ్ మేనేజర్, ఆఫీస్ ఆఫ్ కార్పొరేట్ ఆఫీస్ 1, రిజిష్టర్డు ఆఫీస్ 50, సెకండ్ ఫ్లోర్, 100 అడుగుల రోడ్డు, హాల్-2 స్టేజ్, ఇందిర నగర్, బెంగుళూరు, కర్నాటక రాష్ట్రం. 17. బజాజ్ ఫైనాన్స్ కంపెనీ, రెప్రజెంటెడ్ మేనేజర్, ఆఫీస్ ఆఫ్ 4వ ఫ్లోర్, సర్వే నెంబరు 1/బి, విక్రీ ఫీల్డ్స్ ఎదురుగా, ఐ.టి. పార్కు, విమల్ నగర్, [illegible] రోడ్డు కూడలి, కడప సిటీ & జిల్లా. ...రెస్పాండెంట్లు

నోటీసు ప్రకటన

పై నెంబరు దావాలో పిటీషనరును ఇన్‌స్టాల్‌మెంట్లుగా తీర్మానించుమని రెస్పాండెంట్లు అయిన మీపైన ఐ.పి. పిటీషనను దాఖలుచేసి వున్నారు. సదరు పిటీషన్లో **18.11.2025** ఉదయం 10:00 గంటలకు ఇద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క అభ్యంతరాలు తెలుపుకోవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.
ఇట్లు: వై.ప్రసాద్, పిటీషనర్, అడ్వకేటు, కడప.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

కార్మిక చట్టాలు రద్దు చేయాల్సిందే

మాట్లాడుతున్న రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు

మారుతీనగర్, న్యూస్‌టుడే: కార్మికుల మెడకు ఉరితాడైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి ఏ రంగంలో పని చేసే కార్మికులకైనా కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించి, పని గంటలు పెంచకుండా ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని డిమాండు చేస్తూ ఈ నెల 25 న దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అధ్యక్షతన ఏఐటీయూసీ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేసి రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, ఉపాధ్యక్షురాలు మంజుల, శ్రీరాములు, చాంద్‌బాషా, మద్దిలేటి పాల్గొన్నారు.

10వ వర్ధంతి


స్వ.శే॥ బి.రాముడు
Rtd. PET, SV High School, బయనపల్లె, చింతకొమ్మదిన్నె (మం).
జననం : 1-7-1952 మరణం : 10-11-2015

మంచికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచిన మీరు మా అందరికీ ఆదర్శం. మీరు మా నుండి దూరమై నేటికి 10 సం॥లు గడిచినా మీ మధుర స్మృతులు మా మదిలో పదిలం. దివికేగిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. బాధాతప్త హృదయాలతో...

భార్య : ఎం.సుశీల, Rtd. HM, జిల్లా పరిషత్ హైస్కూల్, చెమ్ముమియాపేట, కడప మరియు కుటుంబ సభ్యులు

(c) eenadu